శ్రీవేదవ్యాస విరచితం

అగ్ని మహాపురాణం

ద్వితీయ భాగం

(తెలుగు అనువాదంతో)

అనువాదకులు

డా॥ అంబడిపూడి నాగభూషణం

డా॥ కేసాప్రగడ సత్యనారాయణ


సంపాదకులు

ఆచార్య సింగరాజు దక్షిణామూర్తి శర్మ

ప్రత్యేకాధికారి ఐ/సి

పురాణేతిహాస ప్రాజెక్టు

తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి



ప్రచురణ

తిరుమల తిరుపతి దేవస్థానములు

తిరుపతి

2021

AGNI MAHAPURANAM
SECOND PART
(with Telugu Translation)

Translaters
Dr. Ambadipudi Nagabhushanam
Dr. Kesapragada Satyanarayana

Editor
Prof. S. Dakshinamurthy Sarma

T.T.D. Religious Publications Series No.1397


First Print : 2021

Copies: 500


Published by:
Dr. K.S. Jawahar Reddy, I.A.S.,
Executive Officer,
Tirumala Tirupati Devasthanams,
Tirupati.

Cover Design
Type Setting
Office of the Special Officer, Purana Itihasa Project,
TTD,Tirupati.

Printed at
Tirumala Tirupati Devasthanams Press
Tirupati - 517 507.



శ్రీపద్మావతి అమ్మవారు　　　　　శ్రీవేంకటేశ్వరస్వామివారు



వ్యాసాయ విష్ణురూపాయ వ్యాసరూపాయ విష్ణవే ।
నమో వై బ్రహ్మనిధయే వాసిష్ఠాయ నమో నమః ॥

తిరుమల తిరుపతి దేవస్థానములు
పురాణ ఇతిహాస ప్రాజెక్టు
పండితపరిషత్తు
(సలహామండలి)

అధ్యక్షులు

డా॥ కె.యస్. జవహర్ రెడ్డి గారు ఐ.ఏ.యస్.

కార్యనిర్వహణాధికారి, తి.తి.దేవస్థానములు

సభ్యులు

శ్రీ ఎ.వి.ధర్మారెడ్డి గారు ఐ.డి.ఇ.యస్.
అదనపు కార్యనిర్వహణాధికారి
తి.తి.దే.,తిరుపతి

శ్రీమతి యస్. భార్గవి గారు ఐ.ఏ.యస్.
సంయుక్త కార్యనిర్వహణాధికారిణి
తి.తి.దే.,తిరుపతి

డా॥ కందాడై రామానుజాచార్యులు గారు
విశ్రాంత ప్రాచ్య కళాశాలాధ్యక్షులు
శ్రీవేంకటేశ్వర వేదాంతవర్ధినీ సంస్కృత కళాశాల
హైదరాబాద్

డా॥ శ్రీపాద సత్యనారాయణమూర్తిగారు
విశ్రాంత ఉపకులపతి
రాష్ట్రీయ సంస్కృత విద్యాపీఠం, తిరుపతి

డా॥ శ్రీపాద సుబ్రహ్మణ్యం గారు
విశ్రాంత సంచాలకులు,
ఓరియంటల్ మాన్స్క్రిప్ట్ లైబ్రరీ – హైదరాబాద్

డా॥ ధూళిపాళ మహదేవమణి గారు
విశ్రాంత కళాశాలాధ్యక్షులు
ఆంధ్ర యువతీ సంస్కృత కళాశాల, రాజమండ్రి

డా॥ సముద్రాల లక్ష్మణయ్య గారు
పూర్వ ప్రత్యేకాధికారి
పురాణేతిహాస ప్రాజెక్టు, తి.తి.దేవస్థానములు

డా॥ కొంపెల్ల రామసూర్యనారాయణ గారు
విశ్రాంత ఆచార్యులు
రాష్ట్రీయ సంస్కృత విద్యాపీఠం – తిరుపతి

డా॥ ఈ.ఏ.శింగరాచార్యులు గారు
విశ్రాంత కళాశాలాధ్యాపకులు
శ్రీవేంకటేశ్వర ప్రాచ్య కళాశాల – తిరుపతి

డా॥ కె. ప్రతాప్ గారు
విశ్రాంత ఆచార్యులు, సంస్కృత విభాగం
శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయం – తిరుపతి

కన్వీనర్

డా॥ యస్. దక్షిణామూర్తి శర్మ
ప్రత్యేకాధికారి ఐ/సి, పురాణేతిహాస ప్రాజెక్టు
తిరుమల తిరుపతి దేవస్థానములు

తిరుమల తిరుపతి దేవస్థానములు

పురాణేతిహాస ప్రాజెక్టు

పరిష్కరణ పరిషత్తు

డా॥ సముద్రాల లక్ష్మణయ్యగారు
పూర్వ ప్రత్యేకాధికారి, పురాణేతిహాస ప్రాజెక్టు,
తిరుమల తిరుపతి దేవస్థానములు,తిరుపతి.

డా॥ కందాడై రామానుజాచార్యులుగారు
విశ్రాంత ప్రాచ్య కళాశాలాధ్యక్షులు
శ్రీవేంకటేశ్వర వేదాంతవర్ధినీ సంస్కృతకళాశాల
హైదరాబాద్

డా॥ కొంపెల్ల రామసూర్యనారాయణగారు
విశ్రాంత ఆచార్యులు
రాష్ట్రీయ సంస్కృత విద్యాపీఠం, తిరుపతి

డా॥ ఈ.ఏ.శింగరాచార్యులుగారు
విశ్రాంత కళాశాలాధ్యాపకులు
శ్రీవేంకటేశ్వర ప్రాచ్యకళాశాల, తిరుపతి

డా॥ సూరం శ్రీనివాసులుగారు
విశ్రాంత ప్రాచ్య కళాశాలాధ్యక్షులు
శ్రీ గోరంట్ల వెంకన్న ఓరియంటల్ కాలేజ్
తిమ్మసముద్రం

డా॥ ధూళిపాళ ప్రభాకర కృష్ణమూర్తిగారు
విశ్రాంత డిస్ట్రిక్ట్ అకడమిక్ మానిటరింగ్ ఆఫీసర్
నిడదవోలు

డా॥ కలవకొలను కాశీ విశ్వేశ్వరశర్మగారు
సంస్కృతోపన్యాసకులు,
కె.ఎస్.ఎన్.ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల
అనంతపురం

డా॥ తూమాటి సంజీవరావు గారు
మేనేజింగ్ ట్రస్టీ – చెన్నపురి తెలుగు అకాడమి
చెన్నై, తమిళనాడు.

డా॥ వేదాల వేంకట సీతారామాచార్యులుగారు
విశ్రాంత కళాశాలాధ్యక్షులు
ఎస్.బి.ఎస్. సంస్కృతకళాశాల, పొన్నూరు

డా॥ ధూళిపాళ మహదేవమణిగారు
విశ్రాంత కళాశాలాధ్యక్షులు
ఆంధ్ర యువతీ సంస్కృత కళాశాల, రాజమండ్రి

డా॥ ధూళిపాళ అన్నపూర్ణగారు
విశ్రాంత కళాశాలాధ్యాపకురాలు
ఆంధ్ర యువతీ సంస్కృత కళాశాల, రాజమండ్రి

డా॥ శ్రీపాద సత్యనారాయణమూర్తిగారు
విశ్రాంత ఉపకులపతి
రాష్ట్రీయ సంస్కృత విద్యాపీఠం, తిరుపతి

డా॥ శ్రీపాద సుబ్రహ్మణ్యంగారు
విశ్రాంత సంచాలకులు,
ఓరియంటల్ మాన్స్క్రిప్ట్స్ లైబ్రరీ, హైదరాబాద్

డా॥ కె.నీలకంఠంగారు
విశ్రాంత ఆచార్యులు, సంస్కృత విభాగం,
ఉస్మానియా యూనివర్సిటీ, హైదరాబాద్.

డా॥ పి.పి.వి.డి నాగత్రిశూలపాణిగారు
విశ్రాంత కళాశాలాధ్యక్షులు
ఎస్.ఎస్.బి.ఎన్ డిగ్రీ&పిజి కళాశాల,అనంతపురం.

శ్రీ గార్లపాటి ప్రభాకరశర్మగారు
విశ్రాంత ప్రిన్సిపాల్, ధర్మప్రబోధ కళాశాల
హిందూ ధర్మప్రచారపరిషత్, తి.తి.దే

కన్వీనర్

డా॥ యస్. దక్షిణామూర్తి శర్మ

ప్రత్యేకాధికారి ఐ/సి, పురాణేతిహాస ప్రాజెక్టు,
తిరుమల తిరుపతి దేవస్థానములు.

విషయానుక్రమణిక

తొలిపలుకు



యద్యదాచరతి శ్రేష్ఠః తత్తదేవేతరో జనః ।
స యత్ప్రమాణం కురుతే లోకస్తదనువర్తతే ॥

పెద్దలు చేసిన పనులు పిన్నలు అనుకరిస్తారు, మహాత్ములు నడిచిన మార్గాన్నే లోకులనుసరిస్తారని భగవద్గీతా వచనం. మహాత్ముల జీవిత విధానాలను వివరించేవే పురాణాలు. ఒక ఆదర్శ సమాజం ఆవిర్భవించడానికి, ఇహపరాలను అర్థం చేసుకుని ఆచరణలో పెట్టడానికి పురాణ సాహిత్యమెంతగానో ఉపకరిస్తుంది.

సాక్షాత్తు మహావిష్ణువే అగ్నిదేవుని రూపంలో వసిష్ఠమహర్షికి ఉపదేశించిన పురాణం అగ్నిమహాపురాణం. ఈ పురాణమునకు కర్త, శ్రోత కూడా జనార్దనుడే. అందుకే ఇది సర్వ వేదమయం, సర్వ విద్యామయం, సర్వ జ్ఞానమయం. దీనిని చదివిన విద్యార్థులకు విద్య, ధనార్థులకు ఐశ్వర్యం, రాజ్యార్థులకు రాజ్యం, ధర్మకాములకు ధర్మం, స్వర్గకాములకు స్వర్గం, పుత్రకాములకు పుత్రులను ఇస్తుంది. జయాన్ని కలిగించి పాపాలను పోగొడుతుంది.

మూడువందల ఎనుబది మూడు అధ్యాయాలతో కూడుకున్న ఈ మహాపురాణం సర్గ, ప్రతిసర్గ, వంశాలు, మన్వంతరాలు, రాజుల చరిత్రలతోపాటు ప్రాపంచికమయిన రాజ్యపాలనా విధానాలు, యుద్ధరీతులు, ధనుర్వేదం, గజాశ్వగోచికిత్సలు, ఛందో వ్యాకరణ-కోశ-అలంకారాది శాస్త్రాలను కూడా విశేషంగా వివరిస్తుంది. అందుకే దీనిని భారతీయ విజ్ఞాన సర్వస్వమని పేర్కొనడం జరిగింది. అందుకే ఈ పురాణం మిక్కిలి విశిష్టమైనదన్న ఖ్యాతి కలిగింది.

ఇంతవరకు కూర్మ మహాపురాణం, విష్ణు మహాపురాణం, బ్రహ్మ మహాపురాణం (రెండు భాగాలు), మత్స్య మహాపురాణం (రెండు భాగాలు) ముద్రితమై ఆవిష్కరించబడినాయి. అగ్ని మహాపురాణం 1వ అధ్యాయం నుండి 209 అధ్యాయాల వరకు ఉన్న మొదటి భాగాన్ని డా॥ కె. ప్రతాప్ గారు అనువదించారు.

ప్రస్తుతం అగ్ని మహాపురాణంలోని రెండవ భాగంలో 210వ అధ్యాయం నుండి 300లవ అధ్యాయం వరకు డా॥ అంబడిపూడి నాగభూషణం గారు అనువదించారు. 301వ అధ్యాయం నుండి 383వ అధ్యాయం వరకు డా॥ కేసాప్రగడ సత్యనారాయణ గారు అనువదించారు. వీరిరువురికి నమోవాకములు.

ప్రత్యేక అధికారిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్న ఆచార్య సింగరాజు దక్షిణామూర్తి శర్మగారినీ మరియు పండితపరిషత్తు సభ్యులనూ, పరిష్కరణపరిషత్సభ్యులనూ, ఇతర విధాల సహకరిస్తున్నవారినీ అభినందిస్తున్నాము.

ఏడుకొండలవాని దయతో తక్కిన పురాణాల ప్రచురణ కూడా త్వరలో పూర్తి కాగలదని భావిస్తున్నాము.

డా॥ కే.యస్.జవహర్ రెడ్డి ఐ.ఏ.యస్.
కార్యనిర్వహణాధికారి,
తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి.

నివేదన

యథా పాపాని పూయంతే గంగావారి విగాహనాత్ ।
తథా పురాణశ్రవణాత్ దురితానాం వినాశనమ్ ॥

గంగాస్నానం పాపాలను హరించినట్లు పురాణశ్రవణం కూడా మానవుల దుష్కృతాలను నాశనం చేస్తుందని భారతీయుల విశ్వాసం. అటువంటి పురాణాలను గురించి తెలుసుకోవటం ప్రతిభారతీయుని యొక్క విధ్యుక్తధర్మం. భారతీయ సమాజం తన నీతినియమాలను పురాణాలనాధారం చేసుకునే నిర్దేశించుకుంటుంది. పురాణాలలో లేని విషయాలు ఏవీ లేవు అందువల్ల 'పురా నవం పురాణ'మనే యాస్కుని వివరణ పురాణ సాహిత్యానికి నిత్యనూతనత్వాన్ని ప్రసాదిస్తున్నది.

వేదవ్యాస మహర్షి సంస్కృతంలో రచించిన పదునెనిమిది మహాపురాణాలను సామాన్య పాఠకులకు అందుబాటులో ఉండేలా సరళమైన తెలుగులో అనువదించి అందించాలన్నది తి.తి.దేవస్థాన యాజమాన్యం వారి మహాసంకల్పం. ఆ సంకల్ప ఫలితమే పురాణ ఇతిహాస ప్రాజెక్టు ఆవిర్భావం. ఈ పవిత్రమైన సంకల్పం సాకారమై కూర్మ మహాపురాణం, విష్ణు మహాపురాణం, బ్రహ్మ మహాపురాణం (రెండు భాగాలు), మత్స్య మహాపురాణం (రెండు భాగాలు) ప్రచురించడం జరిగింది. దాదాపు పదునాలుగువేల పై చిలుకు శ్లోకాలతోనున్న అగ్నిపురాణంలో డా॥ కె. ప్రతాప్ గారు అనువదించిన మొదటిభాగం గూడా ప్రకటించడం జరిగింది.

ప్రస్తుతం అగ్ని మహాపురాణంలోని రెండవ భాగంలో 210వ అధ్యాయం నుండి 300లవ అధ్యాయం వరకు డా॥ అంబడిపూడి నాగభూషణం గారు అనువదించారు. 301వ అధ్యాయం నుండి 383వ అధ్యాయం వరకు డా॥ కేసాప్రగడ సత్యనారాయణ గారు అనువదించారు. వీరిరువురికి కృతజ్ఞతలు తెలియచేస్తున్నాం. ఈ పురాణంలో భారతీయ సంస్కృతీ సంప్రదాయాలకు, శాస్త్రీయవిజ్ఞానానికీ, ఇహపరాలకు సంబంధించిన అనేక విషయాలు నిక్షిప్తం చేయబడి ఉన్నాయి.

ఈ బృహత్కార్యక్రమం విజయవంతం కావడానికి సహకరించిన పండితులకు నమోవాకాలు. ఈ గ్రంథాన్ని ఓపికతో సరిచూచి అవసరమైన పరిష్కరణలు గావించి ముద్రణార్హంగా రూపొందించిన పరిష్కరణ పరిషత్తు సభ్యులకూ, ప్రాజెక్టు కార్యక్రమాన్ని ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ తగిన సూచనలిస్తున్న పండిత పరిషత్తు సభ్యులకూ కృతజ్ఞతలు తెలియజేస్తున్నాము.

ప్రాజెక్టు కార్యనిర్వహణకు తగినంత ప్రోత్సాహమిస్తూ ఈ పురాణ వాఙ్మయం ఈ రీతిగా వెలుగులోకి రావడానికి ముఖ్యకారణభూతులైన తిరుమల తిరుపతి దేవస్థానం ధర్మకర్తలమండలివారికీ, విశేషించి ధర్మకార్యనిరతులైన కార్యనిర్వహణాధికారి శ్రీమాన్ డా॥ కే.యస్. జవహర్ రెడ్డి, ఐ.ఏ.యస్. గారికీ, అదనపు కార్యనిర్వహణాధికారి శ్రీమాన్ ఎ.వి. ధర్మారెడ్డి, ఐ.డి.ఇ.యస్. గారికీ మరియు సంయుక్త కార్యనిర్వహణాధికారిణి శ్రీమతి సదా భార్గవి, ఐ.ఏ.యస్. గారికీ కృతజ్ఞతాపూర్వక వందనాలు.


పండితులు అనువదించిన పురాణ భాగాలను డి.టి.పి చేసిన తరువాత అక్షరశోధన, భాషను సవరించడం వంటి కార్యక్రమాలను నిర్వహిస్తున్న కన్సల్టెంట్స్ డా॥ కె. ప్రతాప్ గారికీ, శ్రీ యస్. బి. యస్. భట్టాచార్యులకూ, సహాయ పరిశోధకుడు డా॥ యస్. దశరథకూ అభినందనలు.

ప్రూఫ్‌లను సరిదిద్దుటలో సహకరించిన డా॥ యం. అనిల్‌కుమార్ సంస్కృతాధ్యాపకులు, ప్రాచ్యకళాశాల, హిందూ ధర్మప్రచారపరిషత్ నుండి డెప్యుటేషన్‌పై ప్రాజెక్టులో పనిచేస్తున్న డా॥ బి.నారాయణ, ప్రోగ్రాం అసిస్టెంట్, డా॥ యం. కల్యాణ్ శ్రీరామ్ జూనియర్ అసిస్టెంట్‌లకు అభినందనలు. డి.టి.పి ఆపరేటర్లు బి. వెంకట్రాయులుకూ, టి.పి.అశోక్ కుమార్‌కూ, శ్రీమతి టి.కోమలకు అభినందనలు.

మిగిలిన పురాణాల ప్రచురణ కార్యక్రమం త్వరలో నెరవేరేలా అనుగ్రహించవలసినదిగా కోనేటిరాయుని ప్రార్థిస్తున్నాము.

ఆచార్య సింగరాజు దక్షిణామూర్తి శర్మ
ప్రత్యేకాధికారి ఐ/సి
పురాణ ఇతిహాస ప్రాజెక్టు, తి.తి.దే., తిరుపతి

పురాణ పురుషుడు శ్రీమన్నారాయణుడు



బ్రాహ్మం మూర్ధా హరేరేవ హృదయం పద్మసంజ్ఞకమ్ । వైష్ణవం దక్షిణో బాహు: వాయుర్వామో మహేశితు: ॥
ఊరూ భాగవతం ప్రోక్తం నాభి: స్యాన్నారదీయకమ్ । మార్కండేయం చ దక్షాంఘ్రి: వామో హ్యాగ్నేయముచ్యతే ॥
భవిష్యం దక్షిణో జానుర్విష్ణోరేవ మహాత్మన: । బ్రహ్మవైవర్తసంజ్ఞం తు వామో జానురుదాహృత: ॥
లైంగం తు గుల్ఫకం దక్షం వారాహం వామగుల్ఫకమ్ । స్కాందం పురాణం లోమాని త్వగస్య వామనం స్మృతమ్ ॥
కౌర్మం పృష్ఠం సమాఖ్యాతం మాత్స్యం మేధ: ప్రకీర్త్యతే । మజ్జా తు గారుడం ప్రోక్తం బ్రహ్మాండం చాస్థి గీయతే ॥
ఏవమేవాభవద్విష్ణు: పురాణావయవో హరి: ।

పురాణప్రశస్తి
(అష్టాదశపురాణాలు)

మహామహోపాధ్యాయ డా॥ సముద్రాల లక్ష్మణయ్య

వ్యాసాయ విష్ణురూపాయ వ్యాసరూపాయ విష్ణవే ।
నమో వై బ్రహ్మనిధయే వాసిష్ఠాయ నమో నమః ॥
నారాయణం నమస్కృత్య నరం చైవ నరోత్తమమ్ ।
దేవీం సరస్వతీం వ్యాసం తతో జయముదీరయేత్ ॥

అతి ప్రాచీనకాలంలో గురుకులాలలో విద్యనభ్యసించే విద్యార్థులు పదునాలుగు విధాలైన విద్యల నభ్యసించేవారు. ఆ విద్యల నిలా పేర్కొనడం జరిగింది.

అంగాని వేదాశ్చత్వారో మీమాంసా న్యాయవిస్తరః ।
పురాణం ధర్మశాస్త్రం చ విద్యా హ్యేతాశ్చతుర్దశ ॥

శిక్ష, వ్యాకరణం, ఛందస్సు, నిరుక్తం, జ్యోతిషం, కల్పం–అనే ఆరు వేదాంగాలు, ఋగ్యజుస్సామాథర్వణము లనే నాలుగు వేదాలు, మీమాంస, న్యాయం, పురాణం, ధర్మశాస్త్రం–అనేవే పదునాల్గు విద్యలు.

'వేదోఽఖిలో ధర్మమూలం' అన్నట్లు వేదమంతా ధర్మమూలమైనది. వేదోక్తమైన ధర్మాలను గ్రహించడం అందరికీ సాధ్యంకాని పని. అందుచేత వేదాలను విభజించిన వేదవ్యాసుడే వేదార్థాలను సామాన్యులు గూడా గ్రహించడాని కనువుగా పురాణాలను రచించాడు. **అష్టాదశపురాణానాం కర్తా సత్యవతీసుతః** –అను ప్రమాణవచనం కూడా పదునెన్మిది పురాణాల రచయిత సత్యవతీ సుతుడైన వ్యాసుడే అని నిరూపిస్తున్నది.

ఇతిహాసపురాణాభ్యాం వేదం సముపబృంహయేత్ ।
బిభేత్యల్పశ్రుతాద్వేదో మామయం ప్రహరిష్యతి ॥

అల్పజ్ఞుడు తనకు హాని కల్గిస్తాడేమో అని వేదం భయపడుతుంది. అందువల్ల ఇతిహాసాలతోనూ, పురాణాలతోనూ వేదార్థాలను విస్తరింపజేయాలి. ఈ దృష్టితోనే, అనగా అల్పజ్ఞులను దృష్టిలో పెట్టుకొనే వ్యాసుడు వేదార్థాలను పురాణాలద్వారా విస్తరింపజేశాడు. అట్లని పురాణాలు అల్పజ్ఞులకు మాత్రమే పరిమితమైనవి కావు. అధికజ్ఞులు కూడా గ్రహించవలసిన విషయాలు పురాణాలలో ఎన్నో ఉన్నాయి.

వేదం ప్రభువుతో సమానమైనది. శబ్దప్రధానమైన వేదవాణి కర్తవ్యవిషయంలో రాజాజ్ఞను పోలి వుంటుంది. పురాణవచనం మిత్రతుల్యంగా వుంటుంది. అది అర్థప్రధానమై శ్రోతను కర్తవ్యానికి పురికొల్పుతుంది. కావ్యం కాంతాసమ్మితమై సరసంగా బోధించి పాఠకుణ్ణి కర్తవ్యోన్ముఖుణ్ణి చేస్తుంది అని ఆలంకారికులు వేదార్థాలను వివరించే పురాణాలకు మిత్రసాదృశ్యాన్ని ప్రతిపాదించారు.

యద్వేదాత్ప్రభుసమ్మితాదధిగతం శబ్దప్రధానాచ్చిరం
యచ్చార్థప్రవణాత్పురాణవచనాదిష్టం సుహృత్సమ్మితాత్ ।

కాన్తాసమ్మితయా యయా సరసతామాపాద్య కావ్యశ్రియా
కర్తవ్యే కుతుకీ బుధో విరచితస్తస్మై స్పృహాం కుర్మహే ॥ (ప్రతాపరుద్రీయం)

పురాణాలలో గూడా కావ్యశైలిని పాటించి రసవత్తరంగా కర్తవ్యబోధ కావించిన ఘట్టాలెన్నో ఎడనెడా కానవస్తాయి.

పురాణాలలో పూర్వకాలానికి చెందిన అనేక కథలున్నాయి. కథాకథనం ద్వారా ధర్మస్వరూపం అందులో నిరూపింపబడింది. పురాణకథలు వాగ్వైభవాన్ని ప్రదర్శించడానికి చెప్పినవి కావనీ, విజ్ఞాన వైరాగ్యాలను విస్తరించి చెప్పడానికే ఆ కథలను వివరించడమయిందనీ భాగవతపురాణంలో వ్యాసభగవానుడే చెప్పాడు.

కథా ఇమాస్తే కథితా మహీయసాం
వితాయ లోకేషు యశః పరేయుషామ్ ।
విజ్ఞానవైరాగ్య వివక్షయా విభో!
వచోవిభూతిర్న చ పారమార్థ్యమ్ ॥ (భాగవతం-12-3-14)

ఇక్కడ 'విజ్ఞాన' మంటే వేదవిజ్ఞానమనే గ్రహించాలి.

'వేదాః ప్రతిష్ఠితాస్సర్వే పురాణే నాత్ర సంశయః' పురాణాలలో వేదాలు ప్రతిష్ఠితాలై ఉన్నాయి. ఇందులో సందేహం లేదు. కథల ద్వారా అవి ఆవిష్కృతాలవుతాయి.

పురాణ ప్రాముఖ్యం

యన్నదృష్టం హి వేదేషు తత్సర్వం లక్ష్యతే స్మృతౌ ।
ఉభయోర్యన్న దృష్టం హి తత్పురాణే ప్రతీయతే ॥

వేదాలలో గోచరం కానిదంతా స్మృతులలో కనిపిస్తుంది. శ్రుతి స్మృతులు రెండింటిలో కనిపించనిది పురాణం ద్వారా అవగతం అవుతుంది అన్న ప్రమాణాన్ని బట్టి శ్రుతులలోనూ, స్మృతులలోనూ లేని విషయాలను సైతం విస్తృతరచనావిధానం కల పురాణాలద్వారా గ్రహించవచ్చునని తెలుస్తున్నది. **'పురాణం సర్వశాస్త్రాణాం ప్రథమం బ్రహ్మణా స్మృతమ్'** అన్నట్లు శాస్త్రాలన్నింటిలోను మొదటిదిగా పురాణాన్ని విధాత స్మరించాడని విదితమవుతున్నది. యాగానుష్ఠానసమయంలో పురాణాలు పఠించే సంప్రదాయం కద్దు. ఇంకా పురాణాలలో భగవన్మహిమ, భగవదవతారాలు, భక్తిప్రబోధం, నానావిధాలైన ఆచారాలు, ధర్మాధర్మాలు, సాంఘిక -చారిత్రకాంశాలు, కళలు, వేదాంతతత్త్వాలు, నీతి ఇత్యాదిగా ఎన్నో విషయాలు నిరూపితాలయ్యాయి.

పురాణం ఐహికాముష్మిక సుఖసాధనం. మన సంస్కృతి సంప్రదాయాలను గ్రహించడానికి పురాణజ్ఞానం అవసరం.

పురాణ శబ్ద నిర్వచనం

పురాణం అంటే - పురా భవం ప్రాచీనకాలంలో రచించబడినది అని అర్థం.

పురాఽపి నవం - ప్రాచీనమైనా విషయ విశిష్టతను బట్టి క్రొత్తది అని మరొక అర్థం.

పురా–అణతి–ఆగతానాగతే కథయతీతి పురాణం–అంటే జరిగిన, జరుగనున్న కాలానికి చెందిన విషయాలను వివరించునది అని వేరొక అర్థం.

పురా–పూర్వస్మిన్ జాతమితి పురాణమ్–పూర్వం ఎప్పుడో జరిగిన వృత్తాంతం పురాణం అని భావం.

పురా–అంటే పరంపరను వ్యక్తం చేసేది పురాణం అని మరొక వివరణ.

పురా–ప్రాచీన కాలోదంతం అనక్తీతి పురాణం – పురాతన కాలానికి చెందిన చరిత్రను చెప్పునది పురాణం.

ఇలా పురాణ శబ్దానికి పలు విధాల నిర్వచనం పెద్దలు చెప్పారు.

పురాణోత్పత్తి

అథర్వవేదంలో పురాణ శబ్దం ప్రయుక్తమైంది. యజ్ఞోచ్ఛిష్టంనుండి పురాణం పుట్టినదని అందులో చెప్పబడింది.

ఋచః సామాని ఛందాంసి పురాణం యజుషా సహ ।
ఉచ్ఛిష్టాజ్జజ్ఞిరే సర్వే దివి దేవా దివి శ్రితాః ॥ అథర్వ సంహిత (11-7-24)

నాల్గువేదాల తరువాత ఇక్కడ పురాణోత్పత్తి నిర్దేశించబడింది. పురాణాల ఉనికి వేద సమకాలికమని తెలుస్తున్నది.

అందుచేత వేదసంహితల కాలంలోనే పురాణాలకు చెందిన మూలస్వరూపం రూపొందిందని భావించవచ్చు. బృహదారణ్యకోపనిషత్తులోని ఈ క్రింది వాక్యం గమనార్హం.

"అస్య మహతో భూతస్య నిఃశ్వసితమేతత్ యదృగ్వేదో, యజుర్వేదస్సామవేదోఽథర్వాఙ్గిరసః పురాణం విద్యా ఉపనిషదః శ్లోకాః సూత్రాణి".(2-4-10)

ఈ ఉపనిషద్ వాక్యం వేదాదులతోపాటు పురాణం కూడా పరమాత్మయొక్క నిఃశ్వాసరూపమైనదని వ్యక్తం చేస్తున్నది. దీనివల్ల వేదం ఎంత ప్రాచీనమో పురాణం కూడా అంతే ప్రాచీనమని గ్రహించవచ్చు. ఇక్కడ పురాణ శబ్దం ఏకవచనంలో ప్రయుక్తమైనది. అందుచేత పూర్వం సంక్షిప్తంగా ఉండిన పురాణం కాలక్రమంలో విస్తృతరూపం సంతరించుకొని వివిధ పురాణాలుగా విస్తరించిందని భావించవచ్చు.

భారతీయసంస్కృతిని ప్రతిబింబించే దర్పణాలు పురాణాలు. సామాన్య జనానీకంలో సనాతన ధర్మతత్త్వాన్ని ప్రచారం చేయడంలో అవి ప్రముఖపాత్ర వహించాయి. ఆధునికకాలంలో ప్రాచ్య పండితులేకాక పాశ్చాత్య పండితులు కూడా పురాణాల విశిష్టతను గుర్తించారు. పురాణం అన్న వ్యవహారమే ఇది అతిప్రాచీన సాహిత్యమని తెలియజేస్తుంది.

పురాణాలకంటే భిన్నంగా ఇతిహాసాలను గూడా మన పెద్దలు పేర్కొన్నారు. గతకాలంలో జరిగిన సంఘటనలను తెలిపేవి ఇతిహాసాలు. ఇతి హ+ఆస = ఇతిహాసం అనగా ఇలా పూర్వం జరిగినది–అని అర్థం. పురాణంలోని విషయాలు ఇతిహాసంలోని అంశాలకంటె వ్యాపకంగానూ, విస్తృతంగానూ వుంటాయి.

సాధారణ పురాణాల నుద్దేశించి నిర్దేశించిన సర్గం, ప్రతిసర్గం మొదలైన లక్షణాల కంటె భిన్నమైన వివిధ విషయాలు పురాణాలలో గోచరిస్తాయి. ఉదా: అగ్నిపురాణాన్ని పరిశీలిస్తే వివిధ విద్యలు, పదార్థలక్షణాలు, స్వప్నాలు,

శకున ఫలితాలు, కావ్యనాటక లక్షణాలు, ప్రళయస్వరూపం, నరకం తీరుతెన్నులు, అద్వైత బ్రహ్మతత్త్వం మున్నగు అంశాలు అందులో ఉండడం గమనార్హం. అందుకే అగ్నిపురాణాన్ని 'జ్ఞానకోశం' అన్నారు.

సృష్ట్యారంభంనుండి నేటివరకు సమాజంలోని స్థితిగతులను చెప్పే పురాణాలను శ్రద్ధతో పఠించి పరిశీలించవలసిన అవసరం ఎంతైనా ఉన్నది. అంతేకాని అవేవో కల్పనాత్మకమైన కథలని ఉపేక్షించడం తగదు. పురాణాలను ఏ దృష్టితో వ్యాసభగవానుడు రచించాడు? అన్న ప్రశ్నకు ఈ క్రింది శ్లోకం సమాధానమిస్తున్నది.

విష్ణోరంశో మునిర్జాతః సత్యవత్యాం పరాశరాత్ ।
పురాణసంహితాం దధ్యౌ తేషాం ధర్మవిధిత్సయా ॥

విష్ణ్వంశంతో జనించిన సత్యవతీ పరాశరుల పుత్రుడగు వ్యాసుడు ధర్మస్వరూప నిరూపణకై పురాణసంహితను రూపొందించాడని భావం.

అంతేకాక శ్రీమన్నారాయణుడు స్వయంగా వ్యాసరూపుడై వేదార్థాల విస్తృతి నపేక్షించి భూతలములో పురాణాలు రచించాడని ఈ క్రింది శ్లోకం నిరూపిస్తున్నది.

విస్తారాయ చ వేదానాం స్వయం నారాయణః ప్రభుః ।
వ్యాసరూపేణ కృతవాన్ పురాణాని మహీతలే ॥

సూతుని ద్వారా ఈ పురాణవాఙ్మయం ప్రచారంలోకి వచ్చింది. నైమిశారణ్య నివాసులైన శౌనకాది మునులు సూతునినుండి ఈ పురాణాలను విన్నారు.

విష్ణువుయొక్క అవయవాలే పురాణాలు

త్రిమూర్తులలో ఒక్కడుగా, స్థితికారకుడుగా, దుష్టశిక్షకుడుగా, శిష్టరక్షకుడుగా, ధర్మసంస్థాపకుడుగా ప్రసిద్ధుడైన శ్రీమహావిష్ణుదేవుని యొక్క అవయవాలుగా పదునెన్మిది పురాణాలను పేర్కొనడం కద్దు. దీన్నిబట్టి ధర్మప్రభువైన అచ్యుతునికీ, ధర్మస్వరూప నిరూపకాలైన పురాణాలకూ కల సామ్యాన్ని గ్రహించవచ్చు. పురాణాలు ఈ క్రిందివిధంగా విష్ణుదేవుని అవయవాలుగా పేర్కొనబడ్డాయి.

బ్రాహ్మం మూర్ధా హరేరేవ హృదయం పద్మసంజ్ఞకమ్ ।
వైష్ణవం దక్షిణో బాహుః వాయుర్వామో మహేశితుః ॥

ఊరూ భాగవతం ప్రోక్తం నాభిః స్యాన్నారదీయకమ్ ।
మార్కండేయం చ దక్షాంఘ్రిః వామో హ్యాగ్నేయముచ్యతే ॥

భవిష్యం దక్షిణో జానుర్విష్ణోరేవ మహాత్మనః ।
బ్రహ్మవైవర్తసంజ్ఞం తు వామో జానురుదాహృతః ॥

లైంగం తు గుల్ఫకం దక్షం వారాహం వామగుల్ఫకమ్ ।
స్కాందం పురాణం లోమాని త్వగస్య వామనం స్మృతమ్ ॥

కౌర్మం పృష్ఠం సమాఖ్యాతం మాత్స్యం మేదః ప్రకీర్త్యతే ।
మజ్జా తు గారుడం ప్రోక్తం బ్రహ్మాండం చాస్థి గీయతే ॥
ఏవమేవాభవద్విష్ణుః పురాణావయవో హరిః ।

దీని తాత్పర్యం ఇది-శ్రీమహావిష్ణువునకు బ్రహ్మపురాణం-శిరస్సు, పద్మపురాణం-హృదయం, విష్ణుపురాణం-దక్షిణహస్తం, వాయుపురాణం-వామహస్తం, భాగవతపురాణం-తొడలు, నారదపురాణం-నాభి, మార్కేండయపురాణం-దక్షిణపాదం, అగ్నిపురాణం-వామపాదం, భవిష్యపురాణం-కుడి మోకాలు, బ్రహ్మవైవర్త పురాణం-ఎడమ మోకాలు, లింగపురాణం-కుడి చీలమండ, వరాహపురాణం-ఎడమ చీలమండ, స్కాంద పురాణం-కేశాలు, వామనపురాణం-చర్మం, కూర్మపురాణం-వీపు, మత్స్యపురాణం-మెదడు, గరుడపురాణం-మజ్జ, బ్రహ్మాండపురాణం-ఎముకలు. ఇలా శ్రీహరి పురాణాలే అవయవాలుగా కల్గి వున్నాడు.

పురాణ సంఖ్య

పురాణాలు మొత్తం పదునెనిమిది. వీటిని ఆ యా పురాణాల పేర్లలో మొదటి అక్షరాన్ని మాత్రం పేర్కొనే ఒక శ్లోకంలో ఇలా చెప్పడమయింది.

మద్వయం భద్వయం చైవ బ్రత్రయం వ చతుష్టయమ్ ।
అనాపలింగ కూస్కాని పురాణాని విదుర్బుధాః ॥

'మ' అనే అక్షరంతో ప్రారంభమయ్యే పురాణాలు రెండు-(1) మత్స్యపురాణం (2) మార్కండేయపురాణం. 'భ' అను అక్షరంతో ప్రారంభమయ్యేవి, రెండు -(1) భాగవతం (2) భవిష్యపురాణం -'బ్ర'తో ప్రారంభమయ్యేవి -మూడు (1) బ్రహ్మపురాణం (2) బ్రహ్మాండపురాణం (3) బ్రహ్మవైవర్త పురాణం -'వ' కారంతో ప్రారంభమయ్యేవి నాల్గు (1) విష్ణుపురాణం (2) వాయుపురాణం (3) వామనపురాణం (4) వరాహపురాణం -అ=అగ్నిపురాణం నా=నారదపురాణం-ప=పద్మపురాణం, లిం=లింగపురాణం, గ=గరుడపురాణం, కూ=కూర్మపురాణం, స్కా=స్కాందపురాణం ఇలా మొత్తం పురాణాల సంఖ్య పదునెన్మిది.

పురాణ విభాగం

పురాణాలను మహాపురాణాలనీ, ఉప పురాణాలనీ రెండు విధాలుగా విభజించడం కద్దు. పైన ప్రథమాక్షర నిర్దేశంతో పేర్కొన్నవన్నీ మహాపురాణాలే. ఈ క్రిందివిధంగా కూడా ఈ పురాణాలను పెద్దలు నిర్దేశించారు.

బ్రాహ్మం పాద్మం వైష్ణవం చ వాయవీయం తథైవ చ ।
భాగవతం నారదీయం మార్కండేయం చ కీర్తితమ్ ॥
ఆగ్నేయం చ భవిష్యం చ బ్రహ్మవైవర్తలింగకే ।
వారాహం చ తథా స్కాందం వామనం కూర్మసంజ్ఞకమ్ ।
మాత్స్యం చ గారుడం తద్వద్బ్రహ్మాండాఖ్యమితి త్రిషట్ ॥

ఈ పదునెన్మిది పురాణాలనూ పద్మపురాణం సాత్త్వికాలు, రాజసాలు, తామసాలు అని మూడు వర్గాలుగా విభజించింది.

సాత్త్వికాలు–

> **వైష్ణవం నారదీయం చ తథా భాగవతం శుభమ్ ।**
> **గారుడం చ తథా పాద్మం వారాహం శుభదర్శనే ॥**

రాజసాలు–

> **బ్రహ్మాండం బ్రహ్మవైవర్తం మార్కండేయం తథైవ చ ।**
> **భవిష్యం వామనం బ్రాహ్మం రాజసాని నిబోధత ॥**

తామసాలు–

> **మాత్స్యం కౌర్మం తథా లైంగం శైవం స్కాందం తథైవ చ ।**
> **ఆగ్నేయం చ షడేతాని తామసాని నిబోధత ॥**

ఇందులో (1) వైష్ణవం (2) నారదీయం (3) భాగవతం (4) గారుడం (5) వారాహం (6) పాద్మం –అనునవి సాత్త్వికపురాణాలు. (1) బ్రహ్మాండం (2) బ్రహ్మవైవర్తం (3) మార్కండేయం, (4) భవిష్యం (5) వామనం (6) బ్రాహ్మం–అనేవి రాజసాలు. (1) మాత్స్యం (2) కౌర్మం (3) లైంగం (4) వాయవీయం (శైవం) (5) స్కాందం (6) అగ్నేయం అనేవి తామసాలు.

ఇలా ఒక్కొక్క వర్గంలో ఆరేసి పురాణాలు లెక్కకు వస్తాయి.

సాత్త్వికపురాణాలు శ్రీమహావిష్ణువు యొక్క ప్రాధాన్యాన్నీ, రాజస పురాణాలు చతుర్ముఖ బ్రహ్మ ప్రాముఖ్యాన్నీ, తామస పురాణాలు శివునియొక్క ఆధిక్యాన్నీ వర్ణిస్తున్నాయి. ఈ ముగ్గురు దేవతలు త్రిమూర్తులుగా ప్రసిద్ధులు.

అన్ని పురాణాలూ ఈ దేవత లందరికీ సమప్రాధాన్యాన్ని ప్రతిపాదించక కొన్ని పురాణాలు ఒక దేవతను ఇతర దేవతల కంటె అధికుడని చెప్పడం యుక్తమా? అనే సంశయం కలుగవచ్చు.

వేదం **'ఏకం సత్ విప్రా బహుధా వదంతి'** అని చెప్పింది. అంటే సద్రూపుడైన పరమాత్మ ఒక్కడే, తత్త్వజ్ఞులు ఆయనను నానా నామరూపాలతో వర్ణిస్తారని భావం. పరబ్రహ్మానికి మూర్తమని, అమూర్తమని రెండు రూపాలు కలవనీ; అందులో మూర్తం క్షరం–అంటే నశించే స్వభావం కలిగినదనీ, అమూర్తం నాశం లేనిదనీ గ్రహించాలి. క్షరాక్షరాలు సకలభూతాలలోనూ సమంగా ఉన్నాయి. అక్షరం పరబ్రహ్మం కాగా, ఈ చరాచరజగత్తు క్షరం అవుతున్నది. ఈ విషయాన్ని విష్ణుపురాణం ఇలా వివరించింది. –

> **ద్వే రూపే బ్రహ్మణస్తస్య మూర్తం చామూర్తమేవ చ ।**
> **క్షరాక్షరస్వరూపే తే సర్వభూతేష్వవస్థితే ।**
> **అక్షరం తత్ పరం బ్రహ్మ క్షరం సర్వమిదం జగత్ ॥**

దీనినిబట్టి పురాణాలలో వర్ణింపబడిన త్రిమూర్తులలో ఒకరు పెద్ద, మరొకరు చిన్న అనే తేడాలు లేవు. ఒకే తత్త్వం మూడు రూపాలతో విరాజిల్లుతున్నది. ఆ దేవతలు నిర్వహించే క్రియలలోని భేదమే వారిని మూడు రూపాలతో నిర్దేశించడానికి హేతువైనది. ఈ సంగతినే విష్ణుపురాణం ఈ విధంగా వివరించింది.

సృష్టిస్థిత్యంతకరణాత్ బ్రహ్మవిష్ణుశివాత్మికామ్ ।
స సంజ్ఞాం యాతి భగవాన్ ఏక ఏవ జనార్దనః ॥

ఒక జనార్దనుడే సృష్టి, స్థితి, లయం – అనే మూడు కార్యాలు నిర్వహించడంవల్ల బ్రహ్మ, విష్ణువు, శివుడు అన్న మూడు సంజ్ఞలు పొందాడని భావం.

ఈ సత్యాన్ని గ్రహిస్తే ఆయా దేవతల పట్ల వైషమ్యం తొలగి సమత్వం నెలకొంటుంది. అందువల్ల త్రిమూర్తుల ప్రభావాలను సమయానుగుణంగా వర్ణించే పురాణాల పట్ల సమన్వయదృష్టినే కలిగివుండాలి.

మహాపురాణాల లాగానే ఉపపురాణాలు గూడా పదునెన్మిది ఉన్నాయని కూర్మపురాణం పేర్కొంటున్నది.

ఆద్యం సనత్కుమారోక్తం నారసింహం తథాఽపరమ్ ।
తృతీయం స్కంద ముద్దిష్టం కుమారేణ తు భాషితమ్ ॥

చతుర్థం శివధర్మాఖ్యం సాక్షాన్నందీశభాషితమ్ ।
దుర్వాససోక్తమాశ్చర్యం నారదోక్తమతః పరమ్ ॥

కపిలం వామనం చైవ తథోశనససేవితమ్ ।
బ్రహ్మాండం వారుణం చాథ కాలికాహ్వయమేవ చ ॥

మాహేశ్వరం తథా సాంబం సౌరం సర్వార్థ సంచయమ్ ।
పరాశరోక్తమపరే మారీచం భాస్కరాహ్వయమ్ ॥

ఉపపురాణాలు–(1) సనత్కుమారోక్తం (2) నారసింహం (3) స్కాందం (4) శివధర్మం (5) దౌర్వాసం (6) నారదోక్తం (7) కాపిలం (8) వామనం (మానవం) (9) ఉశనసఃప్రోక్తం (10) బ్రహ్మాండం (11) వారుణం (12) కాలికా పురాణం (13) మాహేశ్వరం (14) సాంబం (15) సౌరం (16) పరాశరోక్తం (17) మారీచం (18) భాస్కరం (భార్గవం).

కొందరి మతం ప్రకారం ఉపపురాణాల సంఖ్య ముప్పదినాల్గుగా నిర్దిష్టమయింది. వీటికి తోడుగా ఔపపురాణాలు అన్న పేరుతో మరొక పదునెన్మిది పురాణాలను గూడ నిర్దేశించడం కద్దు.

పురాణలక్షణం

సర్గశ్చ ప్రతిసర్గశ్చ వంశో మన్వన్తరాణి చ ।
వంశానుచరితం చేతి పురాణం పంచలక్షణమ్ ॥

సర్గం, ప్రతిసర్గం, వంశం, మన్వంతరాలు, వంశానుచరితం–అని పురాణం ఐదు లక్షణాలు గల్గి యుంటుంది. వీటి సంగ్రహవివరణ ఇది.

1. సర్గం – అవ్యాకృతతత్త్వం నుండి మహత్తత్త్వం, దానినుండి అహంకారతత్త్వం, దానినుండి సూక్ష్మభూతాల సృష్టి.
2. ప్రతిసర్గం – మరీచ్యాదులవల్ల జరిగిన చరాచరసృష్టి.
3. వంశం – ఆ యా ఋషుల, రాజుల వంశాలు.

4. మన్వంతరాలు - మనువుల పరిపాలనకాలంలో జరిగిన విషయాలు మరియు ఆ యా మన్వంతరాలలో సప్తఋషులు, మునులు మొదలగువారి వివరణ.

5. వంశానుచరితం—ఆ యా రాజవంశీయులైన రాజుల పరిపాలన మున్నగువాటికి చెందిన కథలను వివరించడం.

పక్షాంతరంలో పురాణాలకు పది లక్షణాలు గూడా నిర్దేశించడం కద్దు. పైన చెప్పిన ఐదు లక్షణాలు సాధారణ పురాణాల లక్షణం కాగా, క్రింద చెప్పబోయే పది లక్షణాలు మహాపురాణాలకు చెందినవని పెద్దల అభిప్రాయం.

అత్ర సర్గో విసర్గశ్చ స్థానం పోషణమూతయః ।
మన్వంతరేశానకథా నిరోధో ముక్తిరాశ్రయః ॥

సర్గం, విసర్గం, స్థానం, పోషణం, ఊతులు, మన్వంతరాలు, ఈశాన కథలు, నిరోధం, ముక్తి, ఆశ్రయం—అనేవే ఈ పది లక్షణాలు.

వీటి సంగ్రహ వివరణ ఇది—

(1) సర్గం: —భగవత్ప్రేరణతో సత్త్వరజస్తమోగుణాలలో క్షోభ ఏర్పడి పంచభూతాలు, పంచతన్మాత్రలు, ఇంద్రియాలు, అహంకారం, మహత్తత్త్వం జనించడాన్ని సర్గమంటారు.

2) విసర్గం:—విరాట్పురుషునినుండి ఉదయించిన బ్రహ్మ వివిధ చరాచరాలను సృష్టిస్తాడు. ఈ సృష్టినే విసర్గమంటారు.

3) స్థానం:—వినాశోన్ముఖమైన సృష్టిని ఒక మర్యాదలో నిల్పడమే స్థానం.

4) పోషణం:—భగవానుడు దుష్టశిక్షణ, శిష్టరక్షణ కావిస్తాడు. జగత్తుకు మేలు గల్గించే సందేశాన్ని అందిస్తాడు. నామరూపాలతో పుష్టిని కల్గిస్తాడు. దీనిని పోషణమంటారు.

5) ఊతులు:—కర్మవాసనలను ఊతులంటారు.

6) మన్వంతరాలు:—మనువులు మారినప్పుడు మన్వంతరకాలంలో తత్కాలానికి చెందిన అధిపతులు భక్తినీ,ధర్మాన్నీ ప్రబోధించే సంఘటనను మన్వంతరమంటారు.

7) ఈశానకథలు:— భగవదవతారాలు, భక్తులు—వీరికి సంబంధించిన చరిత్రలు.

8) నిరోధం:—జీవోపాధులను తనలో లీనం చేసుకొని భగవానుడు యోగనిద్రాముద్రితుడు కావడమే నిరోధం.

9) ముక్తి:—వేరే రూపాలు వదలి స్వస్వరూపంతో వుండడమే ముక్తి. ప్రకృతినుండి విముక్తి లభించే స్థితి ఇది.

10) ఆశ్రయం:— అధిష్ఠానమే ఆశ్రయం. దీని విశుద్ధికొరకే పై తొమ్మిది లక్షణాలనూ వివరించడం జరిగింది.

పై పది లక్షణాలూ మహాపురాణమైన శ్రీమద్భాగవతానికి చక్కగా అన్వయిస్తాయి. పెద్దలు వ్రాసిన గ్రంథాలలో వాటి సమన్వయాన్ని చూడవచ్చు.

పురాణశ్లోక సంఖ్య

భాగవతంలోని ద్వాదశస్కంధమందలి పదమూడవ అధ్యాయంలో ఆ యా పురాణాలలోని శ్లోకాల సంఖ్య ఈ క్రిందివిధంగా నిర్దేశించడమయింది.

బ్రాహ్మం దశ సహస్రాణి పాద్మం పఞ్చోనషష్టి చ ।
శ్రీవైష్ణవం త్రయోవింశచ్చతుర్వింశతి శైవకమ్ ॥
దశాష్టౌ శ్రీభాగవతం నారదం పఞ్చవింశతిః ।
మార్కండేయం నవాగ్నేయం దశ పఞ్చ చతుశ్శతమ్ ॥
చతుర్దశ భవిష్యం స్యాత్తథా పఞ్చ శతాని చ ।
దశాష్టౌ బ్రహ్మవైవర్తం లైఙ్గమేకాదశైవ తు ॥
చతుర్వింశతి వారాహమేకాశీతిసహస్రకమ్ ।
స్కాందం శతం తథా చైకం వామనం దశ కీర్తితమ్ ॥
కౌర్మం సప్తదశాఽఽఖ్యాతం మాత్స్యం తత్తు చతుర్దశ ।
ఏకోనవింశత్సౌపర్ణం బ్రహ్మాండం ద్వాదశైవ తు ॥
త్రయోదశే పురాణానాం సంఖ్యామాహ యథాక్రమమ్ । **(భాగవతం-12-13-2-9)**

1. బ్రహ్మపురాణం	-	10,000	శ్లోకాలు
2. పద్మపురాణం	-	55,000	,,
3. విష్ణుపురాణం	-	23,000	,,
4. వాయుపురాణం	-	24,000	,,
5. భాగవతపురాణం	-	18,000	,,
6. నారదపురాణం	-	25,000	,,
7. మార్కండేయపురాణం	-	9,000	,,
8. అగ్నిపురాణం	-	15,400	,,
9. భవిష్యపురాణం	-	14,500	,,
10. బ్రహ్మవైవర్తపురాణం	-	18,000	,,
11. లింగపురాణం	-	11,000	,,
12. వరాహపురాణం	-	24,000	,,
13. స్కందపురాణం	-	81,100	,,
14. వామనపురాణం	-	10,000	,,
15. కూర్మపురాణం	-	17,000	,,
16. మత్స్యపురాణం	-	14,000	,,
17. గరుడపురాణం	-	19,000	,,
18. బ్రహ్మాండపురాణం	-	12,000	,,
మొత్తం శ్లోకాలు	-	**4,00,0000**	

పురాణాలలో ముఖ్యాంశాలు

పురాణాలు మానవకర్తవ్యాలను నిర్దేశిస్తూ కొన్ని ముఖ్యమైన సందేశాత్మక ప్రబోధాలు కావించాయి. ధర్మాన్ని రక్షించవలసిన ఆవశ్యకత, దానివల్ల కలిగే ప్రయోజనాలను వివిధ కథల ద్వారా అవి విశదీకరించాయి.

విశ్వమంతా భగవన్మయమనీ, మోక్షప్రాప్తికి భక్తి ముఖ్యసాధనమనీ, వివిధ వ్రతాలను వాటికి తగిన కాలాలలో అనుష్ఠించి పవిత్రులు కావాలనీ, పుణ్యక్షేత్రాలను సందర్శించాలనీ, ఆ యా క్షేత్రాలలో ప్రతిష్ఠితులైన దేవతలను ఆరాధిస్తే శుభాలు సిద్ధిస్తాయనీ, పితృదేవతలకు శ్రాద్ధవిధిని తప్పక అనుష్ఠించాలనీ, కర్మఫలం అనుభవించక తప్పదనీ ఇత్యాదిగా పురాణాలు ప్రబోధించే అంశాలు అందరికీ గమనింపదగినవై యున్నాయి.

వర్ణనాశైలి

కవితా రూపంలో గల రచనలను కవులు ఆలంకారిక ప్రక్రియలో కొనసాగిస్తారు. ఈ ప్రక్రియ పాఠకులను ఆకర్షిస్తుంది. యథాతథంగా సాగే కథాకథనంతోపాటు అవసరమైనచోట అలంకార ప్రక్రియనాశ్రయించి కవులు వర్ణన నిర్వహిస్తారు. అతిశయోక్తులను గూడా మేళవిస్తారు. ఉన్నదున్నట్లు చెప్పడం యథాతథకథనం కాగా కథనంలో ఉపమా, రూపకాదులను ఆశ్రయించడం ఒక విశిష్టమైన పద్ధతి. వేదాలలో గూడ ఈ పద్ధతి కనిపిస్తుంది. ఉదాహరణకు కఠోపనిషత్తులో

ఆత్మానం రథినం విద్ధి శరీరం రథమేవ తు ।
బుద్ధిం తు సారథిం విద్ధి మనః ప్రగ్రహమేవ చ ॥

ఇత్యాదిగా శరీరానికి రథరూపకల్పన చేసి ఆత్మను రథికునిగా పేర్కొనడం జరిగింది. సూర్యుని కిరణాలలోని ఏడు రంగులను ఏడు గుర్రాలుగా వర్ణించడం గూడా ఈ ప్రక్రియకు చెందిన విషయమే.

పురాణాలు గూడా ఈ శైలిని విస్తృతంగా అనుకరించాయి. అతిశయోక్తిని గూడా విపులంగా వినియోగించాయి. ఈ పద్ధతి పురాణ వాఙ్మయానికి శోభావహమైం దనడంలో ఏ మాత్రం సందేహం లేదు.

పురాణ ప్రయోజనం

యథా పాపాని పూయన్తే గంగావారివిగాహనాత్ ।
తథా పురాణశ్రవణాద్దురితానాం వినాశనమ్ ॥

గంగాజలంలో స్నానం చేయడంవల్ల పాపాలు నశించినట్లే పురాణశ్రవణంవల్ల దురితాలు నశిస్తాయి.

సదాచారప్రబోధం

యజ్ఞాలు, దానాలు, తపస్సులు ఇత్యాదిగా ఎన్ని చేసినా – సదాచారం లేనివాడు ఆత్మోన్నతి పొందలేడు.

దురాచారో హి పురుషో నేహ నాముత్ర నందతి ।

అన్నట్లు దురాచారుడైన మనుజుడు ఇహపరలోకాలు రెండింటా సుఖానికి దూరమౌతాడు.

ఆచారహీనం న పునన్తి వేదా యద్యప్యధీతాః సహ షడ్భిరంగైః ।

సదాచారం లేనివాడిని వేదాలు గూడా పవిత్రుణ్ణి చేయజాలవు. దురాచారాలు, సదాచారాల స్వరూపాన్ని వివిధ కథల ద్వారా పురాణాలు చక్కగా నిరూపించాయి. రామాయణంలో రామాదివద్వర్తితవ్యం, న రావణాదివత్, –రామాదులవలె ప్రవర్తించాలి కాని, రావణాదులవలె ప్రవర్తించరాదు అన్న విధంగా నీతిప్రబోధం పురాణాలలో రమణీయంగా చేయబడింది.

అందువల్ల పురాణ పఠన శ్రవణాలు సమాజాభ్యున్నతి కల్గిస్తాయి. పూర్వం గ్రామసీమలలో గూడ రాత్రివేళల పౌరాణికులు పురాణ పఠనం కావించి, అందలి విశేషాలను సామాన్య జనులకు బోధించేవారు. ఈ బోధ ప్రజానీకానికి సముచితసంస్కారం కల్గించేది. తద్వారా వారు ఆత్మోన్నతి కల్గించే మార్గంలో నడిచేవారు.

కాలనిర్ణయం

పురాణాల కాలనిర్ణయం అంత సుకరం కాదు. శ్రీ శంకరభగవత్పాదులు మున్నగువారు తమ రచనల్లో పురాణాల నుదాహరించియున్నారు. బాణకవి (క్రీ.శ.625) తన హర్షచరిత్రలో **పురాణేషు వాయుప్రలపితం** అని చెప్పి వాయుపురాణాన్ని ప్రస్తావించాడు.

కలియుగరాజులను నిర్దేశించిన పురాణాలు గూడా ఉన్నాయి. విష్ణుపురాణంలో మౌర్యవంశం పేర్కొనబడింది. మాత్స్యపురాణం–దాక్షిణాత్యులైన ఆంధ్రరాజులను (క్రీ.శ 225) ప్రస్తావించింది. గుప్తరాజుల ప్రస్తావన వాయుపురాణంలో కనిపిస్తున్నది.

లక్ష శ్లోకాలుగల ఇప్పటి మహాభారతం రూపొందకముందే పురాణాల ఉనికిని పరిశోధకులు గుర్తించారు. మహాభారతవక్త అయిన రౌమహర్షణి పురాణాలలో పారంగతుడు. అతని తండ్రిగూడ పౌరాణికుడుగా ప్రసిద్ధుడే. మహాభారతంలో పెక్కు శ్లోకాలు పురాణాంతర్గత శ్లోకాలతో సామ్యం కల్గి వున్నాయి. మహాభారతంలోని కొన్ని ఆఖ్యానాల ప్రాచీన స్వరూపం పురాణాలలో గోచరిస్తున్నది. దీన్ని బట్టి మహాభారతం కంటె పురాణాలు ప్రాచీనమైనవని విశ్వసించవచ్చు.

కౌటిల్యుని అర్థశాస్త్రంలో పురాణ ప్రస్తావన ఉన్నది. అపమార్గగాములైన రాజకుమారులను పురాణోపదేశం ద్వారా సన్మార్గగాములను చేయాలని కౌటిల్యుడు వచించాడు. రాజుకు సంబంధించిన అధికారులలో పౌరాణికుడు గూడా ఒకడని కౌటిల్యుడు పేర్కొన్నాడు. అంచేత కౌటిల్యుని కంటె పురాణాలు ప్రాచీనాలని భావించడం సముచితం. కౌటిల్యుడు క్రీ.పూర్వం తృతీయ శతకం వాడని అనేకుల భావన. అందువల్ల ఆ కాలానికంటె ముందే పురాణాలుండేవని భావించాలి.

గౌతమ–ఆపస్తంబ సూత్రగ్రంథాలలో గూడ పురాణప్రస్తావన వస్తుంది. రాజు శాసనవ్యవస్థలో వేదంతోపాటు పురాణాన్ని గూడా ప్రముఖంగా గ్రహించాలని గౌతముడు చెప్పాడు. అతిప్రాచీన పురాణభాగాలనుండి మూడు శ్లోకాలను ఆపస్తంబ ధర్మసూత్రాలలో ఉదాహరించడం జరిగింది. ఆ శ్లోకాలతో సామ్యం కల శ్లోకాలు నేటి పురాణాలలో లభిస్తున్నాయి. కాబట్టి సూత్రకాలంలో గూడా పురాణ గ్రంథాలుండేవని బోధపడుతున్నది.

మరొక ముఖ్యాంశ మేమంటే అతిప్రాచీనములైన ఉపనిషత్తులలో గూడా పురాణ ప్రస్తావన కలదు, ఛాందోగ్యంలో నారద సనత్కుమారుల సంవాదంలో ఇతర శాస్త్రాలతోపాటు పురాణాలను పేర్కొన్నారు.

"ఋగ్వేదం భగవో౽ధ్యేమి యజుర్వేదం సామవేదమాథర్వణం చతుర్థమితిహాస పురాణం పంచమం వేదానాం వేదం" (ఛాందో 7-1-2).

అందుచేత క్రీ.పూ 600 సం॥ పూర్వం పురాణాల నిర్మాణం జరిగిందని పెద్దల భావన. వాటికి మూల భూతమైన పురాణా లిప్పుడు లభించవు.

పురాణాలు ఏ ఒక్క శతాబ్దానికో చెందిన రచనలు కావు. కాలక్రమములో వాటిలో క్రొత్తక్రొత్త అధ్యాయాలు చేర్చడం జరిగింది. గుప్తకాలానికి పురాణాలు నేటిరూపం సంతరించుకొన్నాయని చెప్పవచ్చు.

పురాణ వైశిష్ట్యం

పురాణాలు సామాన్యులకు దుర్బోధమైన వేదార్థాలను వారికవగతమయ్యే రీతిలో కథలు జోడించి చెప్పాయి. ప్రాచీన కాలానికి చెందిన భారతీయ సమాజ స్వరూప స్వభావాలను అర్థం చేసుకోవడానికి పురాణాలే ప్రామాణికమైన ఆధారాలు. ఆనాటి ఋషుల చరిత్రలను మనం పురాణాలనుండే సమగ్రంగా గ్రహించడానికి వీలవుతుంది.

భారతభౌగోళికస్థితి, నదీనదపర్వతాల ఉనికి, వివిధ తీర్థాల స్థితిగతులు, పలువృక్షాలు, జంతువులు- వీటిని గూర్చిన విజ్ఞానం కూడా పురాణాలలో లభిస్తుంది.

పురాణాలను, శిలాశాసనాదులగు ఇతర ప్రామాణికాధారాలతో తులనాత్మకంగా పరిశీలిస్తే గత చరిత్రకు చెందిన అనేక విషయాలు తేటతెల్లమవుతాయి.

కాబట్టి భారతీయులే కాక పాశ్చాత్యులు గూడా పురాణాలను శ్రద్ధతో పరిశోధించి మానవజాతి గతచరిత్రను సమగ్రంగా అవగతం చేసుకోవచ్చు.

ధార్మికంగానూ, ఆధ్యాత్మికంగానూ సామాన్యప్రజలను చైతన్యవంతులను చేయడంలో పురాణాలు నిర్వహించిన పాత్ర ఎంతో గణనీయమైనది. మొత్తం పదునెనిమిది పురాణాలలోని శ్లోకాల సంఖ్య నాల్గు లక్షలని ముందే చెప్పుకొన్నాం. ఇంత విస్తృతమైన గ్రంథరాశి సంస్కృతభాషానిబద్ధమై లభిస్తున్నది.

వేదాలలోని నిగూఢమైన వేదాంతతత్త్వాన్ని సామాన్య జనులకు గూడా అర్థం కావాలనే దృష్టితో ఆఖ్యానాలతోనూ, ఉపాఖ్యానాలతోనూ పురాణాలు వివరించాయి.

ప్రాచీనకాలంలో యజ్ఞాలు నిర్వహించే ప్రదేశాలలో పురాణపఠనం విధిగా నిర్వహింపబడేది. పురాణపఠనం పాపనివారకమనీ, పుణ్యప్రదమనీ ప్రశంసింపబడింది. పౌరాణికులు పురాణాలను పఠిస్తూ ప్రవృత్తి నివృత్తి రూపాలైన రెండు విధాల ధర్మాలనూ ప్రజలకు వివరించేవారు.

పురాణాలను ఆధారంగా చేసుకొని కవులు కావ్యనాటకాదులు విస్తృతంగా రచించారు. భారతీయుల జీవితాలకూ, విశ్వాసాలకూ పురాణాలు శతాబ్దాల తరబడి మార్గనిర్దేశకా లయ్యాయి. వేదార్థాలను అతివిస్తృతస్థాయిలో జనానీకానికి అందజేయడానికి పురాణాలు ముఖ్యసాధనా లయ్యాయి.

వేదాంతతత్త్వాన్ని బోధించడాని కవతరించిన శ్రీశంకర రామానుజాద్యాచార్యులు గూడా అవసరమైన చోట పురాణవచనాలను ప్రమాణాలుగా పేర్కొనియున్నారు.

కర్మ-భక్తి-ధ్యాన-జ్ఞాన యోగాలు మోక్షసౌధాన్ని అధిష్ఠించడానికి సోపానాలు. ఇందులో కలియుగంలో భక్తియొక్కటే సులభమైన తరణోపాయమని పెద్దలు పేర్కొన్నారు.

"కలౌ భక్తిః కలౌ భక్తిః భక్త్యా కృష్ణః పురః స్థితః" అన్నట్లు కలియుగంలో అనన్యభక్తిచేతనే భగవదనుగ్రహం కలుగుతుందన్న సత్యాన్ని భాగవతాది పురాణాలు ప్రహ్లాదచరిత్రాది కథల ద్వారా మనోజ్ఞంగా నిరూపించాయి.

అట్లే గృహస్థులు పాటించవలసిన పలురకాలైన కర్మవిధానాలూ, వ్రతాలూ, వాటివల్ల కలిగే ఫలితాలూ పురాణాలలో ఎడనెడా విశదంగా నిరూపించబడ్డాయి. ఈ విధంగా కర్మయోగ నిరూపణం గూడా పురాణాలలో కనిపిస్తుంది. వివిధ విషయాలతో కూడిన పురాణాలను విజ్ఞానసర్వస్వాలుగా, జ్ఞాననిలయాలుగా భావించవచ్చు.

పురాణాలలో వివిధ ప్రదేశాలలో గల నానాతీర్థాలు, ఆ తీర్థాల ప్రాముఖ్యం, తీర్థయాత్రలవల్ల కలిగే ప్రయోజనాలు మొదలైన విషయాలు పలుచోట్ల వివరింపబడివున్నాయి. తీర్థయాత్రలవల్ల ప్రజలలో ఏకజాతీయతాభావం పెంపొందుతుంది. గతచరిత్రకు సంబంధించిన విజ్ఞానం భావిపురోగతికి దోహదం చేస్తుంది. పురాణాలను క్షుణ్ణంగా పరిశీలిస్తే భారతదేశ గతచరిత్రకు చెందిన ఎన్నో విషయాలు గోచరిస్తాయి. "పురోఽభివృద్ధి గోరువారు పూర్వవృత్తాంతమును మరువరాదు" అని శ్రీమలయాళస్వామి సూక్తి. అందుచేత చారిత్రక పరిశోధకులు పురాణాలను పరిశీలనాత్మకమైన దృష్టితో అధ్యయనం చేయవలసిన అవసరం ఎంతైనా ఉన్నది. తమ పాలనలో ఎదురయ్యే సమస్యలను ఆనాటి పాలకులు పురాణ వృత్తాంతాలను ప్రమాణంగా పరిగ్రహించి పరిష్కరించేవారు. అందుచేత రాజధర్మ పరిజ్ఞానానికి గూడా పురాణ సారస్వతం ఉపకరిస్తుంది.

పురాణాలలో బోధింపబడిన నీతులను కేవలం హిందూజాతికి మాత్రమే పరిమితాలని భావించరాదు. ప్రపంచజను లందరికీ ఉపయోగపడే శాశ్వత నైతికబోధ లందులో ఉన్నాయి.

ఆధునిక విజ్ఞానశాస్త్రానికి సంబంధించిన పలు అంశాలు పురాణాలలో నిర్దిష్టములై యున్నాయని ఇప్పటి శాస్త్రజ్ఞులలో కొందరి భావన. అందుచేత వైజ్ఞానిక పరిశోధకులకు గూడా పురాణజ్ఞానం అవసరమే.

అతి ప్రాచీన కాలంనుండి నేటివరకూ అమూల్య సారస్వతరూపంలో మనకు ఉపలబ్ధమవుతున్న వాఙ్మయంలో పూర్వోక్తపద్ధతిలో పురాణాలకు గల ప్రాముఖ్యాన్ని గుర్తించి మానవజాతి పురోగతికి వాటిని వినియోగించుకొని సర్వతోముఖమైన శ్రేయస్సును పొందుదుము గాక!

సముద్రాల లక్ష్మణయ్య
పూర్వ ప్రత్యేకాధికారి
పురాణ ఇతిహాస ప్రాజెక్టు - తి.తి.దే.

అష్టాదశపురాణాల సంగ్రహపరిచయం

1. బ్రహ్మపురాణం

పురాణాలలో మొదటిది బ్రహ్మపురాణం. ఇది విష్ణుదేవుని మాహాత్మ్యాన్ని విశదీకరిస్తుంది. ఆ దేవుని శిరస్సుగా వర్ణింపబడిన ఈ పురాణం ధర్మార్థకామమోక్షాలనే చతుర్విధ పురుషార్థాల ప్రాప్తికి తగిన ఉపాయాలను వివరిస్తుంది.

14,000 శ్లోకాలు గల ఈ పురాణంలో పలు ఆఖ్యానాలు, ఉపాఖ్యానాలు ఉన్నాయి. నైమిశారణ్య వర్ణనం, ప్రళయస్వరూపం, హరిశ్చంద్ర సగరాదుల చరిత్రలు, సప్తద్వీపాలు, పార్వతీ స్వయంవరం, సాగరస్నానవిధి, గోదావరీ పవిత్రత, క్షీరసాగరమథనం, దధీచి వృత్తాంతం, వరాహాద్యవతారాలు–ఇత్యాదిగా అనేక విషయాలు ఇందులో నిబంధింపబడి వున్నాయి.

భారతావని, దండకారణ్యం, గంగాదినదుల ప్రాశస్త్యం విస్తృతంగా ఈ పురాణంలో వివరించడ మయింది.

ప్రతిపురాణంలోనూ తత్త్వాన్నీ, నీతినీ, ధర్మాన్నీ బోధించే కథలు ఉంటాయి. ఈ పురాణంలోని కథలలో 'కండు' మహర్షి కథ ఎంతో ఆసక్తిదాయకంగా ఉన్నది. అతని తపస్సుకు భంగం కల్గించడానికి దేవతలు పంపిన అప్సరస ప్రమ్లోచ దాదాపు 900 సంవత్సరాలు అతనితో విహరించి అతని నియమానికి భంగం కల్గిస్తుంది.

చివరికి తన పొరబాటు గుర్తించిన మహర్షి పురుషోత్తమ క్షేత్రమనే పూరీ జగన్నాథక్షేత్రానికి వెళ్ళి శ్రీ జగన్నాథుని సేవించి ముక్తుడవుతాడు.

తరువాతి కథలలో కార్తవీర్యార్జునుని వృత్తాంతం ప్రముఖమైనది. ఇది మిక్కిలి విస్తృతమైన చరిత్ర. దత్తాత్రేయుని అనుగ్రహంతో సహస్రబాహువులు కల్గి శిష్టరక్షణ కావిస్తూ రావణాదులను జయించి ధర్మబద్ధంగా రాజ్యపాలన గావించిన ఈ రాజు చివరికి తనకంటె బలవంతుడైన పరశురామునిచే వీరమరణం పొందుతాడు. ఏడువందల యాగాలు నిర్వహించినవాడుగా ఈతడు ప్రసిద్ధుడయ్యాడు. విష్ణుతత్త్వం బోధించే పలు విషయాలు ఇంకా ఎన్నో ఈ పురాణంలో గోచరిస్తాయి.

ఇదం యః శ్రద్ధయా నిత్యం పురాణం వేదసమ్మితమ్ ।
యః పఠేచ్ఛృణుయాన్మర్త్యః స యాతి భువనం హరేః ॥

వేదతుల్యమైన ఈ పురాణాన్ని శ్రద్ధతో చదివినవాడు, లేక విన్నవాడు హరినిలయమైన వైకుంఠం చేరుకుంటాడని ఫలశ్రుతి.

2. పద్మపురాణం

మహావిష్ణువుయొక్క హృదయస్థానంతో పోల్చబడిన పురాణమిది. సృష్టి ప్రక్రియ ఆ దేవుని నాభికమలంనుండి జన్మించిన బ్రహ్మద్వారా మొదలయింది. ఆ ప్రక్రియయే ఈ పురాణాని కాధారం. కాన ఇది 'పద్మపురాణ' మనబడింది. ఇందులో 55,000 శ్లోకాలున్నాయి.

సృష్టిఖండం, భూఖండం, స్వర్గఖండం, పాతాళఖండం, ఉత్తరఖండం – అని ఐదు ఖండాలుగా విభజింప బడిన ఇందులో మొత్తం 641 అధ్యాయాలున్నాయి.

కాలపరిమాణం, క్షీరసాగరమథనం, దక్షయాగధ్వంసం, చంద్రవంశం, వామనావతారం, తారకాసుర వృత్తాంతం, నృసింహావతారం, సదాచారం - ఇత్యాదిగా పలువిషయాలను ఈ పురాణం వివరిస్తున్నది.

శరీరవర్ణనం, ఆత్మస్వరూపం, విష్ణుభక్తి మహిమ, కార్తికమాస ప్రాశస్త్యం, దీపావళీమాహాత్మ్యం పూజావిధానాలు, యుగధర్మాలు మున్నగు విషయాలను విపులంగా ఇందులో చూడవచ్చు.

ప్రపంచమంతా శ్రీహరిమయమే అని ఈ పురాణం ఘోషిస్తున్నది. ఇందులో పేర్కొన్న సదాచారాలు అవశ్యం ఆచరింపదగి వున్నాయి.

తల్లిదండ్రుల విశిష్టతను ప్రశంసించి **"మాతరం పితరం తస్మాత్సర్వయత్నేన పూజయేత్"** -సకల ప్రయత్నాలతోనూ తల్లిదండ్రుల నర్చించాలి అని ఈ పురాణం బోధించింది. ఇది **'మాతృదేవో భవ, పితృదేవో భవ'** అన్న శ్రుతివచనానికి వివరణగా ఉన్నది.

ఇంకా ఉసిరికాయకు గల పవిత్రత, దాన్ని సేవించే విధానం విపులంగా ఇందులో పేర్కొనబడింది. అట్లే తులసికి గల ప్రాశస్త్యం కీర్తించబడింది.

పురాణపఠనావశ్యకత, దానివల్ల కలిగే ప్రయోజనం, కలియుగ ధర్మాలు, ఆ యుగంలో స్త్రీపురుషుల స్వభావాలు, జనుల విపరీతప్రవృత్తులు విశదంగా ఇందులో నిరూపింపబడి యుండడం గమనార్హం.

కలియుగంలో ధర్మాత్మకమైన కర్మను మనుజుడు భక్తితో భగవదర్పితంగా ఆచరిస్తే సర్వపాప నిర్ముక్తుడవుతాడని ఈ పురాణం ప్రతిపాదించింది. ఇలా ఏ పురాణాన్ని పరిశీలించినా నానావిధములైన, ఆత్మోన్నతి హేతువులైన, మానవ జీవితాని కవసరములైన పెక్కు విషయాలు విశదీకరింపబడి వున్నాయి.

ఈ పద్మపురాణాన్ని చదివేవారికి, వినేవారికి కోరిన కోర్కెలన్నీ శ్రియఃపతి అనుగ్రహంవల్ల సిద్ధిస్తాయని ఫలశ్రుతి.

యద్యదిష్టం పఠంత్యేతత్ శృణ్వంతి చ ముముక్షవః ।
లభన్తే తత్తదేవాశు ప్రసాదాత్కమలాపతేః ॥

3. విష్ణుపురాణం

శ్రీ మహావిష్ణువు యొక్క దక్షిణబాహువుగా విష్ణుపురాణం వర్ణించబడింది. ఆరు అంశాలుగా విభజింపబడిన ఈ పురాణంలో 126 అధ్యాయాలున్నాయి. విష్ణుధర్మోత్తరంతోగూడ కలుపుకొంటే ఇందలి మొత్తం శ్లోకాలు 23,000. పరాశరమహర్షి మైత్రేయునకు జెప్పిన పురాణ మిది.

ఇరవైనాలుగు తత్త్వాలు, జగదావిర్భావం, కాలస్వరూపం, వరాహావతారం, భూవిభజన, సనకాదుల జననం, స్వాయంభువమనువు పుట్టుక, దక్షపుత్రికల వివాహం, ధ్రువచరిత్ర, నృసింహావతారం, భరతవంశవర్ణన, జడభరతోపాఖ్యానం-ఇత్యాదిగా అనేకాంశాలు ఈ పురాణంలో విశదీకరింపబడ్డాయి.

మరియు బ్రహ్మజ్ఞాన ప్రాశస్త్యం, వేదవిభాగం, బ్రహ్మచర్యాద్యాశ్రమాలు, దేవాసురుల యుద్ధం, సగరవంశవర్ణన, శ్రీకృష్ణావతారం, కలి లక్షణాలు, నామసంకీర్తన ప్రభావం మొదలైన విషయాలు గూడ విపులంగా ఇందులో నిరూపించడమైనది.

వైష్ణవులకు మిక్కిలిగా ఆరాధనీయమైన పురాణమిది. వైష్ణవసిద్ధాంతాలకు మూలభూతమైన గ్రంథం గాన శ్రీభగవద్రామానుజాచార్యులు ఆ సిద్ధాంతప్రచారాన్ని ఈ పురాణాన్ని ఆధారంగా స్వీకరించి నిర్వర్తించారు.

శరణాగతి, భగవద్గుణ కర్మ నామాల గానం, విష్ణ్వర్పణంగా కర్మల ననుష్ఠించడం మొదలగు అంశాలకు ఈ పురాణంలో ప్రాముఖ్యం ఇవ్వడమయింది.

మరియు శ్రవణం, కీర్తనం మున్నగు నవవిధభక్తి మార్గాలు ఇందులో విస్తృతంగా ప్రతిపాదింపబడి వున్నాయి. భాగవతపురాణం లాగా ఈ పురాణం గూడా భక్తియోగానికి ప్రాధాన్యాన్ని ప్రతిపాదించింది.

దేవతలను ఆరాధించేవారిలో అనేకులు శివకేశవులలో భేదాన్ని చూస్తారు. అయితే ఈ పురాణంలో–

అవిద్యామోహితాత్మానః పురుషా భిన్నదర్శినః ।
వదంతి భేదం పశ్యన్తి చావయోరన్తరం హర! ॥

'అవిద్యామోహితులే నీకూ, నాకు భేదం పాటిస్తారు' అని కేశవుడు శివునితో చెప్పాడు. ఈ శివకేశవాభేద సిద్ధాంతం ఇక్కడ గమనార్హం.

ఈ పురాణంలో జడభరతుని వృత్తాంతం మిక్కిలి ఆసక్తిని రేకెత్తించేదిగా వర్ణితమై వున్నది. ఆతని మూడు జన్మలకు సంబంధించిన విశేషాలు గ్రహిస్తే మనలో జ్ఞానవిజ్ఞానాలు వికసిస్తాయి.

యో నరః పఠతే భక్త్యా యః శృణోతి చ సాదరమ్ ।
తావుభౌ విష్ణులోకం హి వ్రజేతాం భుక్తభోగకౌ ॥

అన్నట్లు – భక్తితో దీన్ని పఠించేవాడు, ఆదరంతో వినేవాడూ ఈ లోకంలో భోగాలనుభవించి తుదకు విష్ణుసాన్నిధ్యం చేరగలరని ఫలశ్రుతి.

4. వాయుపురాణం

వాయుదేవుడు శివలీలలను వివరించిన పురాణమిది. అందుచేత దీన్ని 'శివపురాణ' మని కూడా పేర్కొంటారు. **'చతుర్వింశతి సాహస్రం పురాణం'** –అనుటవల్ల ఇందులో 24,000 శ్లోకాలున్నాయని గ్రహించాలి. కాని ఇపుడు మనకు లభించేవి 11,000 శ్లోకాలు మాత్రమే. శ్లోకసంఖ్యలలో ఇట్టి వ్యత్యాసాలు కొన్ని పురాణాలలో కనిపిస్తున్నాయి. ఈ పురాణం మహావిష్ణువుయొక్క వామభుజంగా పేర్కొనబడింది.

ఇందులో (1) ప్రక్రియాపాదం (2) అనుషంగ పాదం (3) ఉపోద్ఘాత పాదం (4) ఉపసంహార పాదం–అని నాలుగు పాదాలున్నాయి.

భూగోళ–ఖగోళాలు, బ్రహ్మాండసృష్టి, యుగధర్మాలు మున్నగు విషయాలతోపాటు కైలాసవర్ణన, గంగావతరణవర్ణన మొదలగు వర్ణనలు గూడా ఇందు గోచరిస్తాయి.

ఇది శైవపురాణం. అయినా సందర్భానుగుణంగా మహావిష్ణువు గూడా ఇందు వర్ణింపబడినాడు.

వివేకవిజ్ఞానాలు కావాలంటే తప్పకుండా పురాణాల అధ్యయనం చేయాలని ఈ పురాణం చెబుతున్నది.

యో విద్యాచ్చతురో వేదాన్ సాంగోపనిషదో నరః ।
న చేత్పురాణం సంవిద్యాన్నైవ స స్యాద్విచక్షణః ॥

నాల్గువేదాలు, వేదాంగాలు, ఉపనిషత్తులు చదివినా పురాణం చదువనివాడు విచక్షణుడు కాలేదని భావం. కాబట్టి పురాణాధ్యయనం ఎంత ముఖ్యమైనదో గ్రహించాలి.

ఈనాడు మనం యోగాభ్యాసాని కెంతో ప్రాముఖ్యం ఇస్తున్నాము. వాయుపురాణంలో యోగాని కవసరమైన ప్రాణాయామాన్ని గూర్చి విపులమైన వివరణ ఉన్నది. బ్రహ్మప్రాప్తికది అవసరం. శాంతి, ప్రశాంతి, దీప్తి, ప్రసాదం–అనే నాల్గు ప్రయోజనాలు దానివల్ల కల్గుతాయని ఈ పురాణం చెబుతున్నది.

ఓంకారోపాసన గూడా ఇందులో చెప్పడమయింది. ఓంకారధ్యానపరులకు శివసాయుజ్యం కల్గుతుందని ఇందులో నిరూపించబడివున్నది.

'రమణకం' అనే దేశంలోని ప్రజలు పదివేల సంవత్సరాలు, 'హిరణ్యకం' లోనివారు పదకొండు వేల సంవత్సరాలు జీవిస్తారంటూ అక్కడి ప్రకృతివిశిష్టతను ఇక్కడ చెప్పడమయింది.

అక్కడి చెట్లు ఫలాలతోపాటు వస్త్రాలనూ, ఆభరణాలను గూడా ప్రసాదిస్తాయని చెప్పడం ఆశ్చర్యావహంగా ఉన్నది. కథాకథనంకంటే ఇట్టి వర్ణనలే ఈ గ్రంథంలో ఎక్కువగా గోచరిస్తాయి.

గయాక్షేత్రప్రాముఖ్యం గూడా ఇందు చెప్పడమయింది. గయను సందర్శించిన పుత్రుడు పితరులకు రక్షకుడనీ, అతణ్ణి చూచి పితరులు హర్షిస్తారనీ ఇక్కడ పేర్కొనబడింది.

ఈ పురాణకీర్తనం శ్రవణం,ధారణ–కీర్తినీ, పూర్ణాయువునూ, పాపనాశాన్నీ కల్గిస్తాయని ఫలశ్రుతి.

ధన్యం యశస్యమాయుష్యం పుణ్యం పాపప్రణాశనమ్ ।
కీర్తనం శ్రవణం చాస్య ధారణం చ విశేషతః ॥

5. శ్రీమద్భాగవతం

శ్రీమహావిష్ణుని ఊరువుగా వర్ణించబడిన శ్రీమద్భాగవతంలో పంద్రెండు స్కంధాలు, 18,000 శ్లోకాలున్నాయి. ఇది భక్తియోగ ప్రాముఖ్యాన్ని కథలతో, ఉపకథలతో వివరించే పురాణం.

'నిగమకల్పతరోర్గళితం ఫలం'–అన్నట్లు వేదమనే కల్పవృక్షంనుండి జారిపడిన పండుగా దీన్ని కీర్తించడమయింది. భక్తితోపాటు జ్ఞానవైరాగ్యాలు గూడా ఇందు నిర్దేశించబడి వున్నాయి.

వేదాలను విభజించిన వ్యాసుడు ధర్మనిరూపకమైన ఒక లక్షశ్లోకాలతో గూడిన మహాభారతం రచించాడు. అయినా మనశ్శాంతి లేక, చింతాక్రాంతు డయ్యాడు. నారదుడాయన చెంతకు వచ్చి 'నీ చింతకు కారణ మేమి?' అని ప్రశ్నించాడు! 'అదేదో నీవే చెప్పు' అని వ్యాసుడన్నాడు.

అపుడు నారదమహర్షి ఊరక ధర్మాలు చెప్పితే చాలదు, విష్ణుకథాప్రధానమైన గ్రంథం రచిస్తే కానీ నీకు మనశ్శాంతి లభించదంటాడు. ఆయన చెప్పినట్లు వ్యాసభగవానుడు భగవంతుని గుణ కర్మ నామాలను కీర్తించే విష్ణుకథలను వర్ణిస్తూ భాగవతం రచించాడు, మనశ్శాంతి పొందాడు. భాగవత రచనకు చెందిన వృత్తాంతమిది.

దీని కథాప్రారంభమిది–పాండవవంశంలో జన్మించిన పరీక్షిత్తు వేటకు వెళ్ళి, అలసిపోయి, తపోనిమగ్నుడైన శమీక మహర్షిని నీళ్ళిమ్మంటాడు. నిర్వికల్పధ్యానంలో ఉన్న ఆ ముని కతని మాట వినిపించదు. కోపించిన రాజు అతని మెడలో సర్పశవాన్ని వేసి శృంగిశాపానికి గురి అవుతాడు. వారం దినాలలో మరణించవలసిన దుఃస్థితి పాలవుతాడు.

అంతట రాజకార్యాలు త్యజించి ప్రాయోపవిష్టుడై ఏడు దినాలలో ముక్తి పొందే ఉపాయమేమి? అని విచారిస్తాడు. అపుడు శుకుడు వచ్చి అందుకు ఉపాయం భాగవత శ్రవణమే అని చెప్పి భాగవత ప్రవచనం కావిస్తాడు.

ఇందులో ధ్రువుడు, జడభరతుడు, అజామిళుడు, దధీచి, ప్రహ్లాదుడు, గజేంద్రుడు, అంబరీషుడు, రంతిదేవుడు మున్నగు భాగవతుల కథలు మనోజ్ఞంగా వివరింపబడివున్నాయి. ఆ కథల ద్వారా విజ్ఞానవైరాగ్యభక్తివిశేషాలు నిరూపితాలయ్యాయి.

దశమస్కంధం ఇందులో అతిముఖ్యమైనది. శ్రీకృష్ణావతార ప్రతిపాదకమైన ఇందులో శ్రీకృష్ణుని లీలలు, ఆయన కావించిన కంసాదుల సంహారం, రుక్మిణీ కల్యాణం, కుచేలాదుల ఉద్ధరణ–ఇత్యాదిగా పలు అంశాలు రసవత్తరంగా చిత్రించబడినాయి.

ముఖ్యంగా గోపికలు కృష్ణుణ్ణి ప్రేమించిన ఘట్టం మనోహరంగా ఉన్నది. మధురభక్తితత్త్వం ఇందులో ప్రతిపాదితమయింది.

పదకొండవ స్కంధంలోని ఉద్ధవగీత ప్రశస్తం. శ్రీకృష్ణుడు అవసానదశలో గావించిన ఆధ్యాత్మిక ప్రబోధమిది. చివరి స్కంధంలో కలి స్వరూపం నిరూపించబడింది. మార్కండేయ చరిత్రను గూడా ఇందులో చూడవచ్చు.

'విద్యావతాం భాగవతే పరీక్షా' అన్నట్లు విద్యావంతుల జ్ఞానవిజ్ఞానాలను భాగవతం ద్వారా పరీక్షించవచ్చు. భగవన్నామసంకీర్తనం సర్వపాపప్రణాశకమని భాగవతం చెప్పింది. భారతావనిలో జన్మించి గూడా భాగవతం విననివారు ఆత్మఘాతకులని పేర్కొనబడ్డారు.

భారతే మానవం జన్మ ప్రాప్య భాగవతం న యైః ।
శ్రుతం పాపపరాధీనైరాత్మఘాతస్తు తైః కృతః ॥

భాగవత శ్రవణ ఫలం ఈ క్రిందిశ్లోకంలో ఇలా పేర్కొనబడింది.

మత్కథావాచనే నిత్యం మత్కథాశ్రవణే రతమ్ ।
మత్కథాప్రీతమనసం నాహం త్యక్ష్యామి తం నరమ్ ॥

'నా కథలు పఠించేవాడు, వినేవాడు, నా కథలచే సంతోషించేవాడు అయిన జనుణ్ణి నేను వదలను' అని శ్రీకృష్ణుడు చెప్పాడు.

6. నారదపురాణం

మహావిష్ణువుయొక్క నాభిస్థానంగా కీర్తింపబడిన పురాణమిది. నారదుడు ఉపదేశించినది కావడం వల్ల 'నారద పురాణం' అనే పేరు దీనికి స్థిరపడింది. ఇందులో ఇరువదియైదువేల శ్లోకాలున్నాయి.

పూర్వఖండం, ఉత్తరఖండం అని ఈ పురాణం రెండు ఖండాలుగా విభక్తమై యున్నది. పూర్వఖండంలో 125, ఉత్తరఖండంలో 82 అధ్యాయాలు ఉన్నాయి.

పురాణాల ప్రశస్తి. శివకేశవుల అభేదం, భక్తికి గల ప్రాముఖ్యం, సదాచార ప్రాశస్త్యం, పౌరాణికుల గురుత్వం–ఇత్యాదులు ఇందులో చక్కగా కీర్తితాలయ్యాయి.

సత్యహరిశ్చంద్రుని గాథ ఇందులో ఉన్నది. అట్లే శ్రీకృష్ణుని ప్రభావం చక్కగా పేర్కొనబడివున్నది. బ్రహ్మాండోత్పత్తి ఎలా జరిగిందో ఇందులో చూడవచ్చు.

విష్ణుభక్తికి గల ప్రాముఖ్యాన్ని వర్ణించే ఈ పురాణంలోని క్రిందిశ్లోకం గమనార్హమై యున్నది–

లోకే స ధన్యః స శుచి స్స విద్వాన్ స ఏవ వక్తా స చ ధర్మశీలః ।
జ్ఞాతా స దాతా స చ సత్యవక్తా యస్యాస్తి భక్తిః పురుషోత్తమాఖ్యే ॥

పురుషోత్తమునిపై భక్తి గలవాడే లోకంలో ధన్యుడు, శుచి, విద్వాంసుడు, ధర్మశీలుడు, జ్ఞాత, దాత, సత్యవక్త అని భావం. భక్తిలేనివాని గుణాలు విలువలేనివని తాత్పర్యం.

ఒక్క భక్తినే కాక తీర్థయాత్రలో సేవించవలసిన తీర్థాల ప్రాశస్త్యాన్ని గూడా ఈ పురాణం విశదీకరించింది. అయోధ్య, మధుర, మాయ, కాశి, కంచి, అవంతిక, ద్వారక–ఈ ఏడు నగరాలు మోక్షప్రదాలని ఈ పురాణం ఉద్ఘాటించింది.

రాజధర్మాలను గూడా ఈ పురాణం వివరించింది. ప్రజారక్షణ, శత్రుసంహారం, న్యాయబద్ధంగా పన్నులు వసూలు చేయడం, గోరక్షణ, అన్న–వస్త్ర గృహాలు అనే కనీసపు సౌకర్యాలను ప్రజలకు కల్గించడం, మద్యనిషేధం–మున్నగు రాజుల కర్తవ్యాలు గూడా ఇందులో నిర్దేశింపబడివున్నాయి.

పరులపై దౌర్జన్యం, వారిని హింసించడం మున్నగు పది పాపాలు పరిహరణీయాలు. వాటి వినాశానికే, 'దశహరా' అని పేరు. దానికి ప్రతీకగానే నేటికీ 'దశరా' పండుగ జరుపుకొంటున్నాము.

భర్తృహరి సుభాషితంవంటి గ్రంథాలలో మనం ఎన్నో సుభాషితాలు చదువుతుంటాం. వాటిని పోలిన పలు సుభాషితాలను మనం ఈ నారదపురాణంలో గూడా చూడవచ్చు.

యః శృణోతి నరో భక్త్యా శ్రావయేద్వా సమాహితః ।
స యాతి బ్రహ్మణో ధామ నాత్ర కార్యా విచారణా ॥

అని ఫలశ్రుతి. ఎవడు భక్తితో ఈ పురాణాన్ని వింటాడో, లేదా వినిపిస్తాడో, అతడు బ్రహ్మలోకం చేరుతాడు. ఇందుకు సందేహం లేదు.

7. మార్కండేయ పురాణం

మునులు తమ సందేహాలను మార్కండేయ మహర్షికి తెల్పగా ఆయన వారి సంశయాలు తొలగిస్తూ చెప్పిన పురాణమిది. విష్ణు భగవానుని దక్షిణపాదంగా ఇది కీర్తింపబడింది. ఇందులో 134 అధ్యాయాలు, తొమ్మిదివేల శ్లోకాలు ఉన్నాయి.

బలరాముని తీర్థయాత్రలు, హరిశ్చంద్రుని వృత్తాంతం, పతివ్రతాస్త్రీల ప్రభావం, కార్తవీర్యార్జునుడు దత్తాత్రేయుని అనుగ్రహం పొందడం, రాజధర్మాలు, యోగశాస్త్రవిషయాలు, ఓంకారనిరూపణ, బ్రహ్మాండోత్పత్తి, దేవీమాహాత్మ్యం, సూర్యవంశవర్ణన ఇత్యాదిగా గల వివిధ విషయాలు ఈ పురాణంలో నిరూపించడమయింది.

దుర్గాదేవి జనుల ననుగ్రహించి వారి కోర్కెలు తీర్చే దేవత. ఆ దేవిని ఆరాధించడంలో సప్తశతీపారాయణం ముఖ్యకర్తవ్యం. ఆ సప్తశతి ఈ పురాణంలోని భాగమే. దేవీనవరాత్ర్యుత్సవాలలో సప్తశతిని పారాయణం చేస్తారు.

మహిళామణులలో కొందరు మహాయోగిను లున్నారు. వారిలో మదాలసాదేవి ఒకరు. ఈమెకు సంబంధించిన అద్భుతమైన చరిత్ర ఈ పురాణంలో అతి విపులంగానూ, రమణీయంగానూ నిరూపింపబడివున్నది.

ఋతధ్వజుడనే రాజుయొక్క ధర్మపత్ని మదాలస. ఈమెకు విక్రాంతుడు, సుబాహుడు, అరిమర్దనుడు, అలర్కుడు–అని నల్గురు కుమారులు. ఆమె ఉగ్గుబాలతోపాటు మొదటి ముగ్గురికీ బ్రహ్మవిద్యను గూడా బోధించింది. వారు అధ్యాత్మవిద్యలో ఆరితేరి సంసారవిరక్తులవుతారు. ఋతధ్వజుడు నాల్గవ కుమారుణ్ణి తల్లి వద్ద అధ్యాత్మవిద్యనభ్యసింపనీకుండా లౌకికవిద్యలు బోధించే ఏర్పాటు చేస్తాడు. అవసానదశలో ఆమె అతణ్ణి కూడా సత్సంగప్రభావముతో తత్త్వవేత్తగా రూపొందేటట్లు చేస్తుంది. ఇది ఆ కథా సంగ్రహ సారాంశం.

విష్ణువుయొక్క నాల్గు రూపాలు వాసుదేవ–శేష–ప్రద్యుమ్న–అనిరుద్ధములని ప్రసిద్ధాలు. వీటికి సంబంధించిన వివరణ కూడా ఈ పురాణంలో వస్తుంది.

ఇక ధర్మపక్షులుగా ప్రసిద్ధి వహించిన పక్షుల వృత్తాంతం గూడా మార్కండేయపురాణంలో పేర్కొనబడివున్నది. జైమినిమహర్షి తనకు గల్గిన సంశయాల నన్నింటినీ ఈ పక్షులద్వారానే తొలగించుకొంటాడు.

ఈ పురాణం పుత్రులను మూడురకాలుగా విభజించింది. తండ్రినుండి సంక్రమించిన కీర్తినీ, ధనాన్నీ పెంపొందించేవాడు ఉత్తముడు. పెంపొందించకున్నా పోగొట్టకుండా ఉండేవాడు మధ్యముడు. పోగొట్టుకొనేవాడు అధముడు. ఎంతో చక్కని ప్రబోధమిది.

తండ్రిపేరు చెప్పుకొని కాలం గడపువాడు వ్యర్థజన్ముడు. తండ్రికి కీర్తి తెచ్చేవాడు ఉత్తముడు. ఇలాంటి విషయాలు యుక్తియుక్తంగా ఆసక్తిజనకంగా ఇందులో వివరించబడి వున్నాయి.

శ్రుత్వా తత్పూజయేద్యస్తు పురాణం సప్తమం పునః ।
సర్వపాపవినిర్ముక్తః పునాత్యేవ నిజం కులమ్ ॥

అని ఫలశ్రుతి. ఇది విని దీనిని పూజించేవాడు సకలపాపవిముక్తుడై తన కులాన్ని పావనం చేస్తాడు.

8. అగ్నిపురాణం

అగ్నిదేవుడు వసిష్ఠమహర్షికి ఉపదేశించినదే అగ్నిపురాణం. ఇది విష్ణుదేవుని ఎడమపాదంగా వర్ణింపబడింది. ఇందులో 383 అధ్యాయాలు, 15,400 శ్లోకాలు ఉన్నాయి.

దశావతారాలు ఇందులో వర్ణింపబడ్డాయి. మరియు రామాయణ మహాభారతాలలోని కొన్ని ఘట్టాలు ఇందులో కనిపిస్తాయి.

దేవాలయ నిర్మాణం, సాలగ్రామలక్షణాలు, సూర్యపూజ, శివపూజ, వాస్తుపూజ, చతురాశ్రమధర్మాలు ఈ పురాణంలో పేర్కొనబడివున్నాయి. పలురకాల వ్రతాలు, రాజధర్మాలు, స్వప్న ఫలితాలు, స్త్రీ పురుష లక్షణాలు, ఆయుర్వేద విషయాలు, అద్వైతవేదాంతతత్త్వం ఇత్యాదిగా గల పలువిషయాలు ఈ పురాణంలో కనిపిస్తాయి.

కూర్మావతారవర్ణన సందర్భంలో విష్ణువు దేవతలకు ఎలా ఉపకరించాడో ఇక్కడ మనోజ్ఞంగా చెప్పడమయింది.

ఇక రామాయణ ఘట్టాలలో సుగ్రీవుడు సీతాన్వేషణ విషయంలో అశ్రద్ధ చూపినప్పుడు రాముడతనికి పంపిన తీక్ష్ణపదజాలంతో కూడిన సందేశం పాఠకులలో ఆసక్తిని రేకెత్తిస్తున్నది. రామాయణంలో సీతాపహరణకు రావణుడు మారీచుణ్ణి ప్రేరేపించినప్పుడు మారీచుడు చెప్పిన ఈ క్రిందిశ్లోకం గమనార్హం.

రావణాదపి మర్తవ్యం మర్తవ్యం రాఘవాదపి ।
అవశ్యం యది మర్తవ్యం వరం రామాన్న రావణాత్ ॥

"రావణుని ఆజ్ఞ పాటించకుంటే అతనినుండి చావు తప్పదు. పాటిస్తే రామునిచేత మరణం తప్పదు. రావణునికన్న రామునిచేత మరణించడమే మేలు" అని భావం. ఇలా రామాయణ భారతాదులలోని కొన్ని ఘట్టాలు ఈ పురాణాల్లో కనిపిస్తాయి.

భగవంతు డనే పదానికి ఈ క్రింది శ్లోకంలో ఇచ్చిన నిర్వచనం అర్థవంతంగా ఉంది.

ఉత్పత్తిం ప్రళయం చైవ భూతానామాగతిం గతిమ్ ।
వేత్తి విద్యామవిద్యాం చ స వాచ్యో భగవానితి ॥

సృష్టిస్థితిలయాలు, జీవుల జననమరణాలు, విద్యా విద్యల స్వరూపం సమగ్రంగా ఎరిగినవాడే భగవంతుడు.

ఇక దేవాలయ నిర్మాణానికి చెందిన విశేషాలు కూడా ఈ పురాణంలో లభిస్తున్నాయి. ఆలయనిర్మాణం వల్ల బ్రహ్మహత్యాది దోషాలు కూడా తొలగిపోతాయని చెప్పడం విశేషం.

ఈ పురాణంలో కథలకు అంతగా ప్రాముఖ్యం లేదు కాని విద్యలు, పదార్థ లక్షణాలు, శుభాశుభస్వప్నాలు, శకునాలు, ఇవి మొదలుగాగల అనేక విషయాలు నిరూపింపబడి వున్నాయి. వివిధ శాస్త్రాలకు చెందిన విషయాలు ఇందులో ఉండడం వల్ల ఇదొక విశిష్టమైన పురాణంగా ప్రశంసింపబడుతున్నది. దీని ఫలశ్రుతి యిది–

'ఆగ్నేయం పఠితం ధ్యాతం శుభం స్యాద్భుక్తిముక్తిదమ్'

ఈ ఆగ్నేయ పురాణాన్ని చదివినా, ధ్యానించినా భుక్తిముక్తులు చేకూరుతాయని, శుభం కలుగుతుందని చెప్పడమయినది.

9. భవిష్యపురాణం

విష్ణుదేవుని కుడిమోకాలితో పోల్చబడిన ఈ పురాణంలో 14,500 శ్లోకాలున్నాయి. ఇందలి అధ్యాయాల సంఖ్య 585.

సృష్టివివరణ, పురాణాల ఉత్పత్తి, షోడశసంస్కారాలు. సావిత్రీమాహాత్మ్యం, స్త్రీలక్షణాలు, వివిధ వ్రతాలు ఇందులో వివరించడమయినది. రథసప్తమీ మాహాత్మ్యం, సూర్యుని ప్రభావం, ప్రతిమాలక్షణాలు, ధర్మస్వరూపం, జీమూతవాహనాదుల చరిత్రలు, అన్నదానప్రశస్తి మున్నగు విషయాలు అతివిస్తృతంగా ఇందులో వర్ణించడం జరిగింది.

భర్తపట్ల భార్య, భార్యపట్ల భర్త ప్రవర్తించవలసిన తీరుతెన్నులు చక్కగా ప్రతిపాదింపబడినాయి. సూర్యప్రభావవర్ణనా సందర్భంలో రాజు, దొంగలు, గ్రహాలు, పాములు, పేదరికం, దుఃఖాలు–ఇవేవీ సూర్యానుగ్రహం పొందిన వారిని బాధించవు అని చెప్పడం విశేషం.

ఇక జీవితంలో అతిముఖ్యమైన వివాహాన్ని గురించి వివరిస్తూ సమస్థాయిగలవారిలో జరిగే వివాహాలు శుభకరాలని, తదితరవివాహాలు దుఃఖదాయకాలని ఈ పురాణం చెప్పింది. స్మృతులలో పేర్కొనబడిన వివిధ

వివాహభేదాలు ఇందులో ప్రతిపాదింపబడివున్నాయి. సామాజిక జీవితంలో అత్యావశ్యకాలైన వివాహాది విషయాలను ఈ పురాణంలో ప్రతిపాదించడంవల్ల సంఘశ్రేయస్సుపట్ల పురాణకర్తకు కల అభినివేశమెట్టిదో వ్యక్తమవుతున్నది.

అన్నదాన ప్రాశస్త్యాన్ని పేర్కొంటూ–

"అన్నం వై ప్రాణినాం ప్రాణా అన్నమోజో బలం సుఖమ్ ।
ఏతస్మాత్కారణాత్సద్భిరన్నదః ప్రాణదః స్మృతః ॥

ప్రాణులకు అన్నమే ప్రాణం. అన్నమే ఓజస్సు, బలం, సుఖం. అందుచేత అన్నదాత ప్రాణదాతగా పేర్కొనబడినాడు. ఈ పురాణంలో మరొక విశేషం విక్రమాదిత్యుడికీ, బేతాళునికీ సంబంధించిన కథలు. ఈ కథలు మిక్కిలి లోకప్రసిద్ధి వహించాయి. కథలలో జీవితంలో ఎదురయ్యే గడ్డు సమస్యలను పరిష్కరించే నైతికసూత్రాలు మనోజ్ఞంగా నిరూపింపబడివున్నాయి.

ఈ పురాణానికి ఫలశ్రుతిని వివరిస్తూ గ్రంథకర్త ఇలా అన్నాడు–

యచ్ఛ్రుత్వా సర్వపాపేభ్యో ముచ్యతే మానవో నృప! ।
అశ్వమేధఫలం ప్రాప్య గచ్ఛేద్భానుం న సంశయః ॥

ఈ పురాణం వింటే సకలపాపవిముక్తి చేకూరుతుంది. అశ్వమేధయాగఫలం లభిస్తుంది. చివరికి సూర్య సాయుజ్యప్రాప్తి కలుగుతుంది.

10. బ్రహ్మవైవర్తపురాణం

సావర్ణిమనువు నారదమునీంద్రునికి చెప్పిన పురాణమిది. ఇందులో వరాహమూర్తికి, శ్రీకృష్ణునికి సంబంధించిన విషయాలు ప్రధానంగా ప్రతిపాదించబడివున్నాయి. ఈ పురాణం శ్రీమహావిష్ణువుయొక్క ఎడమ మోకాలుగా కీర్తింపబడింది.

బ్రహ్మఖండం, ప్రకృతిఖండం, గణేశఖండం, శ్రీకృష్ణఖండమని నాలుగు ఖండాలుగా ఇది విభజింపబడివున్నది. అన్ని ఖండాలలోను కలిపి మొత్తం 18,000వేల శ్లోకాలున్నాయి. **'సారభూతం పురాణేషు బ్రహ్మవైవర్తముచ్యతే'** అన్నట్లు ఈ పురాణం పురాణా లన్నింటికీ సారభూతమైనదిగా ప్రశస్తి పొందింది.

బ్రహ్మఖండంలో పరబ్రహ్మవర్ణన చేయబడింది. ప్రకృతిఖండంలో దుర్గాదేవి మున్నగు స్వరూపాలతో ప్రకృతి ఆవిర్భవించడం నిర్దేశించబడింది. గణేశఖండంలో వినాయక చరిత్ర నిబద్ధమైనది. శ్రీకృష్ణఖండంలో దుష్టశిక్షణ, శిష్టరక్షణ, ధర్మస్థాపన మొదలగు అంశాలు పేర్కొనబడ్డాయి.

అతిథిని పూజించవలసిన అవశ్యకతను వివరిస్తూ ఈ పురాణం చెప్పిన విషయమిది–

అపూజితోఽతిథిర్యస్య భవనాద్వినివర్తతే ।
పితృదేవాగ్నయః పశ్చాద్గురవో యాన్త్యపూజితాః ॥

ఏ గృహస్థుని యింట అతిథి ఆదరింపబడడో ఆ యింటినుండి పితరులు, దేవతలు, అగ్నిదేవుడు, గురువులు పూజలను తిరస్కరించి వెళ్ళిపోతారని భావం.

ఇక జన్మకారణమైన తండ్రితోపాటు విద్యాదాత, అన్నదాత, భయమునుంచి కాపాడినవాడు, కన్యాదాత– ఈ నలుగురు కూడ తండ్రులుగానే పేర్కొనబడ్డారు. అట్లే సేవకుడు, శిష్యుడు, పోషితుడు, ఔరసుడు, శరణాగతుడు– ఈ ఐదుగురు పుత్రులుగానే పరిగణింపదగి ఉన్నారు.

ఈ గ్రంథంలో మొదటి పురుషార్థమైన ధర్మముయొక్క ప్రాశస్త్యం ఈ క్రిందివిధంగా ఉగ్గడింపబడింది–

నాస్తి ధర్మాత్పరో బన్ధుర్నాస్తి ధర్మాత్పరం ధనమ్ ।
ధర్మాత్ప్రియతరః కో వా స్వధర్మం రక్ష యత్నతః ॥

"ధర్మంకంటే శ్రేష్ఠుడైన బంధువు లేడు. మేలైన ధనం లేదు. ధర్మంకంటే ప్రియతరమైన దేదీ లేదు. కాన ప్రయత్నంతో ధర్మాన్ని రక్షించాలి." అని భావం. అట్లే మరొక చోట గురువులో సకలదేవతలూ ఉన్నారని గురుమహిమ ప్రశంసింప బడినది.

పై విషయాలతోపాటు భగవంతుని స్వరూపం, సరస్వతీపూజ, భూదానప్రాశస్త్యం, గంగావతరణం, సంక్షిప్త రామాయణం, తులసీమాహాత్మ్యం, దుర్గోపాఖ్యానం మొదలైన విషయాలు కూడా ఈ పురాణంలో వివరింపబడి వున్నాయి.

ఈ గ్రంథంలో పేర్కొన్న కథలలో ముఖ్యంగా పేర్కొనదగినది వేదవతీ చరిత్ర. కృతయుగంలో వేదవతిగా, త్రేతాయుగంలో సీతగా, ద్వాపరయుగంలో ద్రౌపదిగా వేదవతిని పురాణం వర్ణించింది. తదుపరి పురాణాల కథలలో ఈ వేదవతియే పద్మావతిగా అవతరించి విష్ణుని రూపాంతరమైన వేంకటేశ్వరుణ్ణి చేపట్టినట్లు చెప్పడమయినది.

కశ్యపమహర్షిమానసపుత్రిక జరత్కారువుయొక్క స్తుతి కూడా ఈ పురాణంలోనే లభిస్తున్నది.

శుభదం పుణ్యదం చైవ విఘ్ననిఘ్నకరం పరమ్ ।
హరిదాస్యప్రదం చైవ పరలోకే ప్రహర్షదమ్ ॥

ఇత్యాదిగా ఈ పురాణ పఠనం శుభాన్నీ, పుణ్యాన్నీ, విఘ్నవినాశాన్నీ, హరిదాస్యాన్నీ, పరలోకంలో సంతోషాన్నీ ప్రసాదిస్తుంది అని చెప్పడమైనది.

11. లింగపురాణం

అగ్నిలింగంలో అంతర్గతుడైవున్న శివుడు ఉపదేశించినదే లింగపురాణం. ఇది విష్ణుదేవుని కుడిచీల మండతో పోల్చబడింది. శివుని ప్రభావాన్ని వర్ణించే ఈ పురాణంలో 11,000వేల శ్లోకాలున్నాయి. ఇది పూర్వార్ధమనీ, ఉత్తరార్ధమనీ రెండు భాగాలుగా ఉన్నది. పూర్వార్ధంలో 108, ఉత్తరార్ధంలో 55 కలిపి మొత్తం 163 అధ్యాయాలున్నాయి.

శివుని అవతారాలను ఈ పురాణం విరివిగా వర్ణిస్తున్నది. అందుచేత శైవులు ఈ పురాణాన్ని ప్రముఖంగా ఆదరిస్తారు. అష్టాంగయోగ సహితమైన శివారాధన, విష్ణువు కావించిన శివస్తోత్రం, బ్రహ్మజననం, లింగార్చనావిధానం, శివునికి చెందిన మానసపూజ, యుగధర్మాలు, సప్తద్వీపాలు, సప్తసాగరాలు, దిక్పాలకుల నగరవర్ణన, చంద్రవంశరాజుల వృత్తాంతం, త్రిపురాసురసంహారం, కైలాసగిరివర్ణన, సదాచారం ఇత్యాదిగా పలు విషయాలు ఈ పురాణంలో అతివిస్తృతంగా ప్రతిపాదింపబడివున్నాయి.

ఇందలి ఉత్తరార్ధంలో పృథివి, జలం, అగ్ని, వాయువు మొదలగు అష్టవిధాలైన శివుని మూర్తుల వివరణ వున్నది. శివభక్తిని ప్రతిపాదించే కథలు కూడా ఈ పురాణంలో చోటు చేసుకొనివున్నాయి.

మృత్యువు సమీపించిన శ్వేతుడు అనే శివభక్తుడు శివుని అనుగ్రహంచేత మరణంనుంచి తప్పించుకొనిన కథ శివారాధనవల్ల కలిగే ఫలితాన్ని వివరిస్తున్నది.

ఇక కాశీక్షేత్రమహిమ ఇందులో విస్తారంగా ప్రతిపాదితమయింది.

కామం భుంజన్ స్వపన్ క్రీడన్ కుర్వన్ని వివిధాః క్రియాః ।
అవిముక్తే త్యజేత్ ప్రాణాన్ జంతుర్మోక్షాయ కల్పతే ॥

భుజిస్తూ, నిద్రిస్తూ, క్రీడిస్తూ, యథేచ్ఛగా వివిధక్రియలాచరిస్తూ కూడ ఈ క్షేత్రంలో మరణిస్తే మోక్షం సిద్ధిస్తుందని ఇందులో చెప్పడమయినది.

అష్టదిక్పాలకులుగా ఇంద్రాదులు ప్రసిద్ధులు. వారు నివసించే నగరాలు క్రమంగా 1. అమరావతి 2.తేజస్విని 3.వైవస్వతి 4.కృష్ణవర్ణ 5. శుద్ధవతి, 6.గన్ధవతి 7.అలక 8.యశోవతి – అనేవి ఈ పురాణంలో పేర్కొనబడ్డాయి.

ఇది శైవపురాణం కాన శివపూజామాహాత్మ్యాన్ని ఘనంగా కీర్తిస్తున్నది. శివానుగ్రహంతోనే పరాశరుడు ఎన్నడో మరణించిన తన తండ్రిని, పినతండ్రులను చూస్తాడు. ఇట్టి విశిష్టమైన కథలతోను, వర్ణనలతోనూ సాగిపోయే లింగపురాణం చాలా ప్రభావోపేతమైనది.

మంచినీతులు చెప్పిన సందర్భాలు కూడా ఈ పురాణంలో లేకపోలేదు. భోగాశను నిరోధించాలనీ, విషయ విచారణచేత అది సాధ్యమనీ, మనోవాక్కాయాలతో వైరాగ్యాన్ని పాటించాలనీ చెప్పే ఈక్రింది శ్లోకం గమనార్హం–

భోగేన తృప్తిర్నైవాస్తి విషయాణాం విచారతః ।
తస్మాద్విరాగః కర్తవ్యః మనసా కర్మణా గిరా ॥

ఈ పురాణపఠన ప్రయోజనాన్ని ఈ క్రిందిశ్లోకం ఇలా చెప్పింది–

యః పఠేచ్ఛృణుయాద్వాఽపి లైంగం పాపహరం నరః ।
స భుక్తభోగో లోకేఽస్మిన్నన్తే శివపురం వ్రజేత్ ॥

పాపహరమైన ఈ పురాణాన్ని చదివేవారు, వినేవారు ఈ లోకంలో ఉన్నంతకాలం సకల భోగాల ననుభవించి కడపట కైలాసం చేరుకోగలరు.

12. వరాహపురాణం

వరాహావతారధారియైన విష్ణుదేవుడు భూదేవికి చెప్పిన పురాణమే వరాహపురాణం. ఇందులో 24వేల శ్లోకాలున్నాయి. విష్ణువుయొక్క ఎడమ చీలమండతో ఈ పురాణాన్ని పోల్చడమయింది. ఇందలి అధ్యాయాల సంఖ్య 215.

నానావిధ సృష్టులు, నారదమునీంద్రుని పూర్వజన్మచరిత్ర, విష్ణుభగవానుని అష్టమూర్తులు, ధర్మవ్యాధుని చరిత్ర, దక్షయాగధ్వంసం, పార్వతీజననం, వినాయకుని పుట్టుక, వివిధవ్రతాలు, వాటి ఫలితాలు, నాలుగు యుగాలు,

అన్నదానప్రాశస్త్యం, వరాహస్వామి భూదేవిని ఉద్ధరించడం, నాచికేతుని వృత్తాంతం ఇత్యాదిగా పలువిషయాలు ఈ పురాణంలోని అంశాలుగా ఉన్నాయి.

అష్టాదశపురాణాల క్రమమూ, వివరణ గూడా ఇందులో నిర్దేశింపబడివున్నది. మహావిష్ణువు తన భక్తులకు అంగరక్షకుడై ఉంటాడన్న విషయం ఈ గ్రంథంలో చెప్పడమయింది.

శ్రీకృష్ణుడు గీతలో **'మమ మాయా దురత్యయా'** అని అంటాడు. 'నా మాయ దాటరానిది' అని దీని అర్థం. భూదేవి 'మాయ' అంటే ఏమిటి? దాని స్వరూపం వివరించుమని విష్ణువును అడుగుతుంది. అందుకా దేవుడు తన మాయాస్వరూపాన్ని ఈ పురాణంలో అతి విస్తృతంగా వివరిస్తాడు.

లోకంలో తరచు సంభవించే అతివృష్టి, అనావృష్టి మున్నగు విపరీత సంఘటనలు, మాయవల్లనే కల్గుతున్నాయనీ, సృష్టిలో క్రమబద్ధంగా జరిగే సూర్యోదయాదులు, పంచభూతాల ప్రవర్తన, మాయాప్రభావం వల్లనే ఏర్పడుతున్నాయనీ ఇక్కడ చెప్పడమయింది.

దానాలన్నింటిలో అన్నదానం ప్రశస్తమయింది. అట్లే మనం వాడే వివిధములైన లోహాలతో నిర్మించబడిన పాత్రలలో రాగిపాత్రలు మేలైనవి అని ఈ పురాణం నిరూపించింది.

ఇంకా ఈ పురాణంలో వివిధతీర్థాల ప్రభావం గూడా వర్ణింపబడివున్నది. ఏ తీర్థాన్ని ఎప్పుడు సేవిస్తే మంచిదో ఇక్కడ వివరించబడివున్నది.

విష్ణుమందిరాలలో సేవలు చేసే వారికి గలిగే ఫలమేమి? అన్న భూదేవి ప్రశ్నకు విష్ణువు అట్టి వివిధ సేవాఫలాలను వివరంగా పేర్కొంటాడు. సకల జగత్తుకు సత్యమే ఆధారం కాన, సత్యాన్ని తప్పక పాటించాలన్న సంగతి ఇందులో చెప్పడమయింది.

ఇక కఠోపనిషత్తులో నాచికేతుని వృత్తాంతం ఇందులో రమ్యంగా ప్రతిపాదితమయింది. ఇంకా ఎన్నో కథాంశాలు ఈ పురాణంలో కనిపిస్తాయి.

శ్రుత్వా తు పూజయేద్యస్తు శాస్త్రం వారాహసంజ్ఞితమ్ ।
సర్వపాపవినిర్ముక్తో విష్ణుసాయుజ్యమాప్రజేత్ ॥

అన్నట్లు దీన్ని ఎవరు శ్రవణం చేసి భక్తితో పూజిస్తారో, వారు సర్వపాపనిర్ముక్తులై విష్ణుసాయుజ్యం పొందుతారని ఫలశ్రుతి.

13. స్కాందపురాణం

స్కందుడనగా శివుని కుమారుడైన కుమారస్వామి. ఆ దేవుని పేరుతో ఈ పురాణం ప్రసిద్ధమయింది. శివుడు స్కందుణ్ణి ఉద్దేశించి చెప్పిన విషయమే ఈ స్కాందపురాణం. తండ్రినుండి విన్న ఈ పురాణాన్ని తరువాత స్కందుడు మునుల కుపదేశిస్తాడు.

'ఏకాశీతిసహస్రం తు స్కాందం సర్వాఘకృంతనం' – అన్నట్లు సకల పాపవిచ్ఛేదకమైన ఈ పురాణంలో 81,000 శ్లోకాలున్నాయి. దీన్ని బట్టి ఇతర పురాణాలకంటె ఇది ఆకృతిలో చాలా పెద్ద పురాణమని తెలుస్తున్నది.

మహావిష్ణుని వెన్నుకలతో పోల్చబడిన ఈ గ్రంథంలో మహేశ్వరఖండం, వైష్ణవఖండం, బ్రహ్మఖండం, కాశీఖండం, అవంతీఖండం, నాగరఖండం, ప్రభాసఖండం అని ఏడు ఖండాలున్నాయి.

మహేశ్వరఖండంలో కేదారఖండం, కౌమారీ ఖండం, అరుణాచలమాహాత్మ్యం మొదలైన అంశాలున్నాయి. వైష్ణవఖండంలో వేంకటాచల–జగన్నాథక్షేత్రాల మాహాత్మ్యం, బ్రహ్మఖండంలో సేతు మాహాత్మ్యం, ధర్మారణ్య, బ్రహ్మోత్తరఖండాలున్నాయి. కాశీఖండంలో కాశీక్షేత్రప్రభావం విస్తృతంగా వర్ణింపబడి వున్నది. నాగరఖండంలో వివిధ తీర్థాల వర్ణన ఉన్నది. విశ్వకర్మోపాఖ్యానాది కథలు గూడా ఉన్నాయి.

ప్రభాసఖండంలో ద్వారకానగర పరిసరాల ప్రభావం వివరించబడివున్నది. సంహితారూపంలో గూడా ఈ స్కాందపురాణం ప్రసిద్ధమైవున్నది.

సనత్కుమారసంహిత, సూతసంహిత, శంకరసంహిత, వైష్ణవసంహిత, బ్రహ్మసంహిత, సౌరసంహిత అనేవే ఈ సంహితలు.

సూతసంహితలో శివోపాసనాప్రాముఖ్యం కీర్తింపబడివున్నది. కాశీక్షేత్రప్రభావాన్ని వర్ణించే కాశీఖండంలో అయోధ్యాదిక్షేత్రాలలో మరణించినవారు స్వర్లోకసుఖం అనుభవించి తరువాత కాశిలో జన్మించి అక్కడ ముక్తులవుతారని చెప్పడం విశేషం. **'కాశ్యాం తు మరణాన్ముక్తిః'** అన్న మాట గూడా ప్రసిద్ధం.

జీర్ణదేవాలయోద్ధరణ చేసేవారికి కలిగే ఫలాన్ని గూడా ఈ పురాణం వివరించింది. సత్యనారాయణ వ్రతస్వరూపం ఇందలి రేవాఖండంలో నిరూపితమయింది.

ఇంకను రామావతారం, క్షీరసాగరమథనం, గిరిజా కల్యాణం, కుమారోత్పత్తి, ఓంకారప్రభావం, 14 మంది మనువుల వర్ణన ఇత్యాద్యంశాలు ఇందులో గోచరిస్తాయి. అంతే కాక వనభోజనం, కార్తికవైభవం, ఉసిరిక విశిష్టత, ఇత్యాదివిషయాలు గూడా గమనింపదగి వున్నాయి.

సర్వేషామేవ ధర్మాణాం గురుపూజా పరా మతా ।
గురుశుశ్రూషయా సర్వం ప్రాప్నోతి హి న సంశయః ॥

అన్ని ధర్మాలలోనూ గురుపూజ మేలైన ధర్మం. గురుసేవచేత అన్ని ఫలితాలూ పొందవచ్చు అని గురుసేవా ప్రాశస్త్యం పేర్కొనబడింది. రుద్రాక్ష మహిమ కథాకథన పూర్వాంకంగా ఇందులో వివరించబడింది.

పురాణ శ్రవణ ఫలాన్ని ఈ పురాణం 136 శ్లోకాలలో వివరించింది. జ్ఞానదీపాలుగా, భవరోగౌషధాలుగా పురాణాలిందులో కీర్తింపబడివున్నాయి.

14. వామనపురాణం

బ్రహ్మదేవుడు వామనావతార ప్రభావాన్ని కీర్తిస్తూ చెప్పినదే వామనపురాణం. మహావిష్ణుని చర్మంతో దీన్ని పోల్చారు. ఇందలి శ్లోకాలు పదివేలు, అధ్యాయాలు 95.

వైష్ణవధర్మ ప్రతిపాదకమైన ఈ పురాణంలో విష్ణుమందిరాలు, విష్ణుభక్తుల వృత్తాంతాలు అధికంగా కనిపిస్తాయి. ఉత్పత్తి ప్రళయాలు, కామదహనం, ప్రహ్లాదవరదానం, దేవీమాహాత్మ్యం, నానావిధ తీర్థాలు, వినాయక విజయం ఇత్యాద్యంశాలు ఈ పురాణంలో వర్ణించబడివున్నాయి.

వివిధ దేవతలకు చెందిన 25 స్తోత్రాలు ఈ పురాణంలో లభిస్తాయి. దేవతలలో మహావిష్ణువు, ఆయుధాలలో సుదర్శనం, పక్షులలో గరుడుడు, సర్పాలలో వాసుకి, ఈ రీతిగా ఆయా వర్గాలలో మేలైనవారినీ, వస్తువులను కీర్తించే ఇందలి ఘట్టం ఆసక్తిజనకంగా ఉంటుంది.

లోకంలో ఎన్నో పాపాలున్నాయి, కాని అన్నింటినీ మించిన పాపం కృతఘ్నుత్వమని ఈ పురాణం చెబుతున్నది.

నిత్యమూ ఉదయం లేవగానే త్రిమూర్తులు, గ్రహాలూ, సప్తర్షులూ, సప్తలోకాలూ తనకు శుభావహాలు కావాలని ప్రార్థించాలని ఈ గ్రంథం బోధిస్తున్నది.

జీవితంలో ఎన్ని విపత్తు లెదురైనా, షండుడు, మార్జారుడు, ఆఖువు, కుక్కుటుడు, పతితుడు, అపవిద్ధుడు, నగ్నుడు, చండాలుడు, అధముడు-ఇట్టివారిని ఆశ్రయించరాదని ఇందులో చెప్పడమయింది.

మనుజుడు అవశ్యం ఆచరించవలసిన సదాచారాలను 122 శ్లోకాలలో ఈ పురాణం వివరించింది.

పుత్రుడు - శిష్యుడు-వీరిరువురిలో శ్రేష్ఠు డెవరు? అన్న ప్రశ్నకు ఇందులో బ్రహ్మ పుత్రునికంటె శిష్యుడే శ్రేష్ఠుడని సమాధానం చెబుతాడు.

పున్నామ్నో నరకాత్త్రాతి పుత్రస్తేనేహ గీయతే ।
శిష్టపాపహరశ్శిష్య ఇతీయం వైదికీ శ్రుతిః ॥

'పుత్' అనే నరకం నుండి మాత్రమే రక్షించువాడు పుత్రుడు కాగా తక్కిన సకల పాపాలనుండీ కాపాడేవాడు శిష్యుడని భావం.

పాపాలను దూరం చేసుకొనే విధానాన్ని ప్రతిపాదిస్తూ దానికి ఉదాహరణంగా ఇందులో కోశకారుని వృత్తాంతం చక్కగా వర్ణించబడింది. పూర్వజన్మకృతపాపాలు తరువాతి జన్మలో స్మరణకు వస్తాయని ఈ కథ ద్వారా తెలుస్తున్నది.

యే పఠంతి చ శృణ్వంతి తేఽపి యాన్తి పరాం గతిమ్ ।

అన్నట్లు ఈ వామనపురాణం చదివేవారు, వినేవారు ఉత్తమగతిని పొందుతారని ఫలశ్రుతి.

15. కూర్మపురాణం

17000 శ్లోకాలు గల కూర్మపురాణం విష్ణువు యొక్క పృష్ఠంగా వర్ణించబడింది. పూర్వార్ధం, ఉత్తరార్ధం అని రెండు విభాగాలుగా ఉన్న ఈ పురాణంలో 53+46=99 అధ్యాయాలున్నాయి.

కూర్మరూపంలో ఉన్న విష్ణుదేవుడు మహర్షుల నుద్దేశించి చెప్పిన పురాణమిది. లక్ష్మి-ఇంద్రద్యుమ్నుల సంవాదం, విష్ణువు-మహర్షులకు జరిగిన సంవాదం, సృష్టివిధానం, వర్ణాశ్రమాలు, భృగువంశవర్ణన, యుగధర్మాలు, కాశీప్రయాగక్షేత్రాల మాహాత్మ్యం, సదాచారాలు, ద్వాదశాదిత్యుల వర్ణన-ఇత్యాదిగా గల అనేకాంశాలు ఈ పురాణంలో ఉన్నాయి.

మరీచి, భృగువు, అంగిరసుడు, పులస్త్యుడు. పులహుడు, క్రతువు, దక్షుడు, అత్రి, వసిష్ఠుడు–అనే తొమ్మిదిమంది బ్రహ్మపుత్రులుగా ఇందు పేర్కొనబడినారు. మొదటికాలంలో ప్రజలు సుఖసంతోషాలతో వుండేవారనీ, క్రమంగా రాగద్వేషాలు కారణంగా ప్రజలకు దుఃస్థితి ఏర్పడిందనీ ఈ పురాణం చెబుతున్నది.

ధర్మం ఆచరణీయమనీ, ధర్మంవల్లనే తక్కిన పురుషార్థాలు సిద్ధిస్తాయనీ ఈ పురాణం పేర్కొంటున్నది.

ధర్మాత్సంజాయతే హ్యర్థో ధర్మాత్కామోఽభిజాయతే ।
ధర్మ ఏవాపవర్గాయ తస్మాద్ధర్మం సమాశ్రయేత్ ॥

అనగా ధర్మంనుంచే అర్థ,కామ,మోక్షాలు సిద్ధిస్తాయి. కాన ధర్మాన్ని ఆశ్రయించాలి అని భావం.

శివకేశవులకు భేదం లేదని, భక్తులు ఏఏరూపాలను ఆరాధిస్తారో భగవంతుడు ఆయా రూపాలతోనే వారిని అనుగ్రహిస్తాడని ఈ పురాణంలో చెప్పిన విషయం భగవద్గీతలోని

'యే యథా మాం ప్రపద్యన్తే తాంస్తథైవ భజామ్యహం' అనే వచనానికి అనుగుణంగా ఉన్నది.

స్వధర్మాన్ని త్యజించి చేసే తీర్థయాత్రలవల్ల ప్రయోజనం శూన్యమనీ, దేవాలయాదులను మిక్కిలి పరిశుభ్రంగా ఉంచాలనీ, మూత్రవిసర్జనాదులతో అపరిశుద్ధం చేయరాదనీ, అలాచేయడం పాపహేతువనీ ఈ పురాణం హెచ్చరిస్తున్నది. పుణ్యక్షేత్రాల ప్రాశస్త్యం ఇందులో చక్కగా వివరించబడింది.

వేదాన్ని విభజించేవారు వేదవ్యాసు లనబడతారు. అట్టివారు 26మంది ఉన్నారనీ పరాశరపుత్రుడైన కృష్ణద్వైపాయనుడు చివరివాడనీ ఈ పురాణం చెప్పిన విషయం గమనార్హమై ఉన్నది.

ఇంకను సమాజంలో వున్నవారి కర్తవ్యాలు, గురువులవద్ద ఉండవలసిన తీరుతెన్నులు, పాపాత్ములతో చేసే సాంగత్యంవల్ల కలిగే దోషాలు–ఇత్యాది విషయాలు మిక్కిలి ఆసక్తిదాయకంగా ఈ పురాణంలో చెప్పడమయినది.

ఇందులో వామనావతారానికి సంబంధించిన చరిత్ర చాలా చక్కగా నిరూపించబడివున్నది. భక్తిప్రధానమైన దుర్జయు డనేవాని కథవంటి కొన్ని కథలు పాఠకులకు చక్కని చైతన్యం కలిగిస్తాయి. అట్టివి ఇందులో పలుకథలు వున్నాయి.

ఏతత్కూర్మపురాణం తు చతుర్వర్గఫలప్రదమ్ ।
పఠతాం శృణ్వతాం నృణాం సర్వోత్కృష్టగతిప్రదమ్ ॥

ఈ పురాణం చదివేవారికి, వినేవారికి చతుర్వర్గ ఫలాలు సిద్ధిస్తాయి. సర్వోత్కృష్టగతి కూడా కలుగుతుంది.

16. మత్స్యపురాణం

మహావిష్ణువు మత్స్యరూపుడై వైవస్వతమనువు నుద్దేశించి చెప్పిన పురాణమిది. విష్ణువుయొక్క మెదడుతో దీన్ని పోల్చడమైనది. ఇందులో 14,000 వేల శ్లోకాలున్నాయి. మొత్తం అధ్యాయాల సంఖ్య 283.

ఇందలి ముఖ్య విషయాలివి–మత్స్యావతారవర్ణన, అజాండసృష్టి, సూర్యచంద్రవంశాలు, గయాక్షేత్రవర్ణన, పురూరవుని చరిత్ర, కచదేవయానుల కథ, కార్తవీర్యార్జునుని వృత్తాంతం, కలిధర్మాలు మరియు కృష్ణాష్టమి, అక్షయ తృతీయ, కల్యాణసప్తమి మున్నగు పలువ్రతాల వర్ణన, సప్తద్వీపాల వివరణ, త్రిపురాసురవృత్తాంతం, తారక వృత్తాంతం

మున్నగు విషయాలే కాక రాజధర్మాలు, చతుర్విధ దండోపాయాలు, స్వప్నఫలాలు, వామన వరాహావతారాల వర్ణన ఇత్యాదిగా గల విషయాలు ప్రతిపాదితాంశాలై వున్నాయి.

పుట్టిన ప్రతివాడూ పురుషార్థసాధనకై ప్రయత్నించాలి. అలా చేయనివాని జన్మ వ్యర్థమని ఈ పురాణం నొక్కి వక్కాణిస్తున్నది.

లబ్ధ్వా జన్మ న యః కశ్చిద్ఘటయేత్పౌరుషం నరః ।
జన్మ తస్య వృథా భూతమజన్మా తు విశిష్యతే ॥

శ్రాద్ధకాలంలో పితృదేవతలకు అన్నపానాదులు సమర్పించడాన్ని గూర్చిన విశేషవివరణ యిందులో కనిపిస్తున్నది. శ్రాద్ధ కర్మలు అవశ్యాచరణీయాలని ఇక్కడ పేర్కొనడమైనది.

ఇక కాలమానం గురించి ప్రస్తావిస్తూ బ్రహ్మ, శివుడు, విష్ణువు అను త్రిమూర్తులకు చెందిన వివిధ కాలమానాల విశ్లేషణ ఇందులో చేయబడింది.

1. భృగువు 2. అత్రి 3. వసిష్ఠుడు 4. విశ్వకర్మ 5. మయుడు 6. నారదుడు 7. నగ్నజిత్తు 8. విశాలాక్షుడు 9. పురందరుడు 10. బ్రహ్మ 11. కుమారుడు 12. నందీశుడు 13. శౌనకుడు 14. గర్గుడు 15. వాసుదేవుడు 16. అనిరుద్ధుడు 17. శుకుడు 18. బృహస్పతి అనే ఈ పదునెనిమిది మంది వాస్తుశాస్త్రోపదేశకులుగా ఇందులో పేర్కొనబడినారు.

తల, లలాటం మున్నగు అవయవాల కదలికవల్ల కలిగే ఫలాన్ని కూడా భగవంతుడు ఈ పురాణంలో చెప్పియున్నాడు.

ఇక పితృశ్రాద్ధంవల్ల కలిగే ఫలాన్ని వివరించే కౌశికుడనే విద్యావంతుడు, అతని ఏడుగురు కుమారులకు చెందిన విస్తృతమైన కథ ఇందులో కనిపిస్తున్నది. భక్తిశ్రద్ధలతో ఆచరించిన పితృశ్రాద్ధం గోహత్యను కూడా పోగొడుతుందని ఈ కథలో నిరూపితమయినది. బ్రహ్మదత్తుని కథలో ఆడు చీమ, మగ చీమల మధ్య జరిగే సంభాషణ ఎంతో ఆసక్తిదాయకంగా ఉన్నది.

పతివ్రతల ప్రభావం గురించి చెప్పే ఈ క్రింది శ్లోకం వారిపట్ల గౌరవంతో వుండాలని హెచ్చరిస్తున్నది.

పతివ్రతానాం వచనం ప్రకృష్టం తాసాం తు వాక్యం భవతీహ మిథ్యా ।
న జాతు లోకేషు చరాచరేషు తస్మాత్సదా తాః పరిపూజనీయాః ॥

పతివ్రతల మాట శ్రేష్ఠమైనది. ఎప్పుడును వారి మాట మిథ్య కాదు. అందువల్ల వారు సదా పూజింపదగినవారు.

ఇక ఫలశ్రుతి –

అస్మాత్పురాణాదపి పాదమేకం పఠేత్తు యస్సోఽపి విముక్తపాపః ।
నారాయణాఖ్యం పదమేతి నూనమనంగవద్దివ్యసుఖాని భుంక్తే ॥

ఈ పురాణంలో ఒక్క పాదం చదివినా పాపనివృత్తుడై వైకుంఠం పొందగలడని, సకల దివ్యసుఖాలు అనుభవింపగలడని ఫలశ్రుతి చెబుతున్నది.

17. గరుడపురాణం

విష్ణువాహనమైన గరుడుడు అడిగిన ప్రశ్నలకు విష్ణుదేవుడు చెప్పిన సమాధానాలే గరుడపురాణం. ఇందులో 19వేల శ్లోకాలు గల పూర్వఖండం, ఉత్తరఖండం అనే రెండు ఖండాలున్నాయి.

పూర్వఖండంలో 229, ఉత్తరఖండంలో 35 కలిపి 264 అధ్యాయాలు గల పురాణమిది. విష్ణుదేవుని "మజ్జ" గా ఇది వర్ణించబడింది.

ఈ పురాణంలోని ఉత్తరఖండంలో ప్రేతకల్పం మిక్కిలి ప్రశస్తమైనది. మరణానంతరం జీవుని స్థితిగతులను విస్తృతంగా వివరించే ఘట్టమిది. అందువల్లనే మరణించిన వానియింట పదవ దినంలోగా ఈ పురాణాన్ని పఠించే సంప్రదాయమేర్పడింది.

గరుడపురాణం కేవలం యమలోకవృత్తాంతాన్ని మాత్రమే చెబుతుందని కొందరు భావించడం కద్దు. ఈ భావన తగదు. ఇందలి పూర్వఖండంలో ఈ క్రింద నిర్దేశించబడిన నానావిషయాలున్నాయి.

భగవదవతారాలు, సరస్వత్యుపాసన, విష్ణుదీక్ష, శివార్చనావిధి, సుదర్శనచక్ర పూజావిధానం, సూర్యార్చన, దేవతాప్రతిష్ఠ, నిత్యనైమిత్తిక కామ్యకర్మల వివరణ, పాపప్రాయశ్చిత్తవిధి, నవరత్నాల పరీక్ష, వివిధములైన వ్రతాలు, ఆయుర్వేద వైద్యవిధానాలు మున్నగు అనేక విషయాలు ఈ పురాణంలో గోచరిస్తాయి. పశువుల చికిత్సా విధానం కూడా ఇందులో నిర్దిష్టమైయున్నది.

మానవజీవితానికి అత్యవసరమైన పలు నీతులు గూడా ఈ గ్రంథంలో పేర్కొనబడివున్నాయి. యజమానులు నిష్కారణంగా సేవకులను నిందించరాదన్న ఉపదేశం ఇందులో ఉన్నది. ధనం, జ్ఞానం, రూపం, మిత్రులు–వీరి స్వభావా లెలా ఉండాలో ఇందులో సూచించబడింది.

అర్థేన కిం కృపణహస్తగతేన పుంసాం జ్ఞానేన కిం బహుశఠాకుల సంకులేన ।
రూపేణ కిం గుణ పరాక్రమవర్జితేన మిత్రేణ కిం వ్యసనకాలపరాఙ్ముఖేన ॥

కృపణుని చేతి ధనం, మొండి మనిషికి గల జ్ఞానం, గుణపరాక్రమాలులేని రూపం, వ్యసనకాలంలో కనిపించని మిత్రుడు ఉండీ ప్రయోజనం లేదని భావం. కష్టకాలంలో పరిచితవ్యక్తులు సైతం ఎలా తప్పించుకొంటారో సోదాహరణంగా ఈ పురాణం వివరించింది. గృహంలో వుంటూనే ముక్తిని సాధించే విధానం గూడా చెప్పడమయింది.

గరుడ పురాణంలో ఎన్నో కథలున్నాయి. కథలకంటె ఇందలి నీతివచనాలు మనోజ్ఞాలు. ఉదాహరణకు వేలకొలది గోవులలో దూడ తన తల్లిని గుర్తించి అనుసరించినట్లు మనమెంత దూరంగా ఉన్నా మనకర్మ మనల్ని విడువక వెంటాడుతూ వుంటుందని నీతిబోధ.

హయగ్రీవ పూజావిధి, పంచమహాయజ్ఞాలు, రాజలక్షణాలు, సేవకలక్షణాలు, రోగనివారణోపాయాలు మున్నగునవి కూడా ఈ పురాణంలో చూడవచ్చు.

'కీర్తితం పాపశమనం పఠతాం శృణ్వతాం నృణామ్' అనగా ఈ పురాణం చదివేవారు, వినేవారు సకల పాపాల నుండి విడుదల పొందుతారని దీనికి ఫలశ్రుతి చెప్పబడింది.

18. బ్రహ్మాండపురాణం

బ్రహ్మదేవుని సృష్టిని వివరించే పురాణమిది. **"బ్రహ్మాండం చాస్థి గీయతే"** అన్నట్లు విష్ణువుయొక్క ఎముకలుగా ఇది పేర్కొనబడింది. ఇందులో 12,000 శ్లోకాలున్నాయి. బ్రహ్మాండపురాణం పూర్వభాగం, మధ్యభాగం, ఉత్తరభాగమని మూడు భాగాలుగా వున్నది. పూర్వభాగంలో 38, మధ్యభాగంలో 74, ఉత్తరభాగంలో 44, మొత్తం కలిపి 156 అధ్యాయాల గ్రంథమిది. రోమహర్షణుడనే ముని కురుక్షేత్రంలో ఋషులకు చెప్పిన పురాణమిది.

ప్రక్రియాపాదం, అనుషఙ్గపాదం, ఉపోద్ఘాతపాదం, ఉపసంహారపాదమని నాలుగు భాగాలుగా ఈ పురాణం విభజింపబడింది. నైమిశారణ్యవర్ణన, చతుర్ముఖబ్రహ్మ వర్ణనం, వరాహావతారం మున్నగు విషయాలు ప్రక్రియాపాదంలో కనిపిస్తాయి.

తరువాతి పాదంలో చతురాశ్రమ ధర్మాలు, మునుల జన్మవృత్తాంతం, దక్షుడు గావించిన శివనింద, సతీదేవి అగ్నిప్రవేశం, దక్షుడు, శంకరుడు పరస్పరం శపించుకొనడం, ప్రియవ్రతవర్ణన మున్నగు విషయాలతోపాటు సప్తద్వీపాల వర్ణన, సూర్యుని మహిమ, సూర్యుని అధీనంలో ఉండి ఇతర గ్రహాలు సంచరించడం, రాత్రింబవళ్ళు, మాసాలు, ఋతువులు, సంవత్సరాలు, యుగాలు అనబడే కాలానికి సూర్యుడే మూలకారణమని నిరూపించడం, లింగజననం, యుగధర్మాలు, మొదలగు విషయాలు ఇందులో కనిపిస్తాయి.

మూడవదైన ఉపోద్ఘాతపాదంలో సప్తర్షులజననం, నృసింహావతార వర్ణన, కుమారసంభవం, పుణ్యప్రదేశవర్ణన, శ్రాద్ధాలకు ప్రశస్తమైన నదులు, తీర్థాలు, అన్నదానం, గయలో శ్రాద్ధం, మొదలగు విషయాలు నిరూపింపబడి వున్నాయి. పరశురాముని తపస్సు, జమదగ్నిని కార్తవీర్యార్జునుడు హతమార్చడం, జమదగ్నిపునర్జననం, సగర యయాతుల చరిత్ర మున్నగు విషయాలు కనిపిస్తాయి.

చివరిపాదంలో లలితాదేవి వర్ణన, కామాక్షీ మాహాత్మ్యం, దేవీదీక్ష, మొదలైన విషయాలు ఉన్నాయి. ఈ పురాణపఠనఫలం క్రింది విధంగా పేర్కొనబడింది.

య ఇదం కీర్తయేద్వత్స! శృణోతి చ సమాహితః ।
స విధూయేహ పాపాని యాతి లోకమనామయమ్ ॥

బ్రహ్మాండపురాణం పఠించేవాడు, ఏకాగ్రతతో వినేవాడు పాపరహితుడై సర్వోత్తమలోకాలను చేరుకుంటాడు అని భావం.

సముద్రాల లక్ష్మణయ్య
పూర్వ ప్రత్యేకాధికారి
పురాణ ఇతిహాస ప్రాజెక్టు – తి.తి.దే.

అగ్నిమహాపురాణం ద్వితీయభాగ కథాసంగ్రహం

ధర్మమంటే సన్మార్గ ప్రవృత్తి. లోకవ్యవహారాన్ని అస్తవ్యస్తం కాకుండా ఋజుమార్గంలో నిలబెట్టేది, సమాజాన్ని ధరించేది, భరించేది ధర్మం అని 'ధర్మ'పదానికి అర్థం. ఈ ధర్మం ప్రవృత్తిధర్మం నివృత్తిధర్మం అని రెండు విధాలు. మానవుడు చేయవలసిన దానిని, చేయకూడని దానిని వివరించేది ప్రవృత్తిధర్మం. అది అశాశ్వతమయినది. ఫలదృష్టితో కాకుండా చిత్తశుద్ధికోసం కర్మలననుష్ఠిస్తూ ఆత్మజ్ఞానం కోసం ఆచరించవలసింది నివృత్తిధర్మం. అది శాశ్వతమైనది. ఈ విధమైన ధర్మాలనుపదేశించడమే పురాణసాహిత్యంయొక్క ప్రధాన లక్ష్యం. అగ్నిమహాపురాణం ఈ రెండు విధాల ధర్మాలని ప్రతిపాదించినా, చాలవరకు ప్రవృత్తి ధర్మానికే ప్రాధాన్యమునిస్తుంది.

ఆరాధనా విధానాలయిన ఆలయార్చనాంశాలను ప్రథమభాగంలో వివరించిన అగ్నిమహాపురాణం దానవ్రత లక్షణాలను, వాటి ఫలితాలను వివరించడంతో రెండవభాగం ఆరంభమవుతుంది. దానాలు పదునారు; అవి: తులాపురుషదానం, కల్పవృక్షదానం, సహస్రగోదానం, స్వర్ణమయకామధేనుదానం, స్వర్ణమయాశ్వదానం, స్వర్ణమయాశ్వయుక్తరథదానం, స్వర్ణరచితహస్తిరథదానం, హలపంచకదానం, భూదానం, విశ్వచక్రదానం, కల్పలతాదానం, సప్తసముద్రదానం, రత్నధేనుదానం, జలపూర్ణకుంభదానం, మేరుదానం, పృథివీదానం. వీటిలో అవాంతరభేదాలనేకాలున్నాయి. వాటి ఫలితాలు కూడా అనేక విధాలుగా ఉంటాయి. సంధ్యావిధిలో భాగంగా మంత్రమాహాత్మ్యాన్ని వివరించి, విష్ణు, శైవ, శాక్తమంత్రాలతో పాటు గాయత్రీమంత్రాన్ని, మంత్రార్థాన్ని విశదీకరిస్తుంది ఈ పురాణం.

తరువాత రాజనీతికి సంబంధించిన రాజ్యాభిషేకం, సహాయసంపత్తి – అమాత్య, మంత్రి, సేనాపతి, సభాసద, భృత్య పరీక్షాదులు, వారి నియోజకాలు, భృత్యకృత్యాలు, దుర్గసంపత్తి, నిర్మాణరచన, దుర్గరక్షణ, రాజధర్మం, మిత్రలక్షణం, సప్తాంగాలు, రాజకృత్యాలు, సామాద్యుపాయప్రయోగాలు, దండనారీతి, యుద్ధయాత్ర, గమ్యాగమ్యదిశలు, శకునాలు, శుభాశుభ స్వప్నాలు, యాత్రలకు నిషిద్ధసమయాలు, రాజుల దినకృత్యాలు, రాజ్యలక్ష్మిని స్థిరంగా వుంచుకోవటం కోసం రాజు చేయవలసిన లక్ష్మీస్తోత్రంలాంటి అంశాలను ఈ పురాణం స్పష్టం చేస్తుంది.

సముద్రుడు గర్గమునికి చెప్పిన స్త్రీపురుషలక్షణాలు, చామరరత్నాది పరీక్షలు, వాస్తులక్షణాలు ఇందులో పరామర్శించబడినాయి. తరువాత రాజ్యపరిపాలనకు సంబంధించిన ధనుర్వేదం, వ్యవహార నిర్ణయాలు, దాయ విభాగం, సీమా వివాదం, కింకర వేతనాలు, పాతకాలు, తద్దండనలు, వాక్పారుష్యాది వివాదాలు, ఉత్పాతశాంతి భేదాలు వాటి పరిహారాలు కూడా సూచించడం జరిగింది.

తరువాత నాలుగు వేదాధ్యయన విధానాలను వివరించి, దేవతార్చనలో భాగంగా దేవాలయాలలో దిక్పాలక, వినాయక, మహేశ్వరాదుల స్నానఫలాలను, లక్షకోటి హోమవిధానాలను, నీరాజనావిధిని, ఛత్రాది ప్రార్థనా మంత్రాలను, విష్ణుస్తుతులను వేదశాఖల పరిరక్షణను, పురాణదానమాహాత్మ్యాన్ని, వివిధ పురాణాలలోని శ్లోక సంఖ్యలని తెలియచేస్తుంది.

వంశానుచరితమనే పురాణలక్షణానికి పూరకంగా సూర్య, సోమ, యదు, పురువంటి రాజవంశాలను

పేర్కొని, పంద్రెండు రకాలయిన సంగ్రామరీతులను సూచిస్తుంది. అలాగే ఆయుర్వేదానికి సంబంధించిన పలురకాలయిన సిద్ధౌషధాలను, రసకాషాయ నిర్మాణప్రక్రియలను, వాటికవసరమైన వృక్షాయుర్వేదాన్ని, మంత్రరూప ఔషధాలను, మృతసంజీవన ఔషధాలను, గజచికిత్స, అశ్వచికిత్స, గవాయుర్వేదం, సర్పలక్షణాలు, శేష, వాసుకి, తక్షకాదుల స్వరూపస్వభావాలు, సర్పదష్ట చికిత్స, బాలగ్రహాదిదోషాలను హరించే తంత్రాలను, మంత్రాలను వివరిస్తుంది.

గ్రహశాంతిలో భాగంగా వాసుదేవుని పూజావిధులు, పంచాక్షర్యాది మంత్రాలు, యాభై అయిదు విష్ణు నామాలు, నారసింహ మంత్రాలు, త్రైలోక్యమోహనమంత్రం, త్వరితా, వినాయక, మంత్ర, ధ్యాన, ముద్రా లక్షణాలు, వాటి ప్రయోగాలు, విద్యాప్రశంసలు, మంత్రోద్ధారపద్ధతులు, పంచాంగ శివ విద్యేశ్వర వర్ణనలు, గణపతి వాగీశ్వరీ పూజా - జప - హోమాదికాలు, సర్వతోభద్రాది మండలాలు, అఘోరాస్త్రాది శాంతి కల్పాలు, పాశుపతి శాంతి, వశీకరణాది మంత్రాలు, రుద్రశాంతి ప్రక్రియ, గౌరీ-మృత్యుంజయ-అర్చనలు, వాటి ఫలితాలు వివరించి దేవాలయాల ఆవశ్యకతని తెలియచేసి వాటి నిర్మాణాల అవసరాన్ని ఆదేశిస్తుంది.

పురాణలక్షణాలతో ఏ విధంగానూ సంబంధంలేని వివిధ శాస్త్రవిషయాలను ప్రస్తావించడం ఈ పురాణం యొక్క ప్రత్యేకత. సాహిత్యశాస్త్ర అంశాలయిన ఛందస్సును వివరించి గాయత్ర్యాది ఛందో భేదాలను, తద్దేవతలను, వాటి విశేషాలను పేర్కొంటుంది. విషవృత్తాలు, సమవృత్తాలు, అర్ధసమవృత్తాలు, ప్రస్తారాలను సోదాహరణంగా చూపెడుతుంది. వర్ణోచ్చారణా ప్రక్రియను విశదీకరించే శిక్షాశాస్త్రాన్ని పరామర్శిస్తుంది. అలాగే అభిధాప్రధానమయిన కావ్యం, గద్య-పద్య-మిశ్రమమని విభజించి, గద్యకావ్యం ఆఖ్యాయికా, కథ, ఖండకథ, పరికథ, కథానిక అనే అయిదు విధాలవుతుందని తెలుపుతుంది. కాశ్యపుననుసరించి చతుష్పది అయిన పద్యకావ్యం వృత్తం, జాతి అనే భేదాలను కలిగి వుంటుంది. అక్షరసంఖ్యా నియమమున్నది వృత్తం. మాత్రాగణనమున్నది జాతి అని వివరించి మహాకావ్య లక్షణాలను స్పష్టం చేస్తుంది.

నాటకాన్ని మిశ్రమకావ్యంగా భావించి, ధనంజయుడు పేర్కొన్న నాటకం, ప్రకరణం, భాణం, ప్రహసనం, డిమం, వ్యాయోగం, సమవకారం, వీథి, అంకం, ఈహామృగం అనే పది ప్రకరణాలకు అదనంగా త్రోటకం, నాటికా, సట్టకం, శిల్పకం, కర్ణ, దుర్మల్లికా, ప్రస్థానం, భాళిక, భాణి, గోష్ఠి, హల్లీశకం, కావ్యం, శ్రీగదితం, నాట్యరాసకం, రాసకం, ఉల్లాప్యం, ప్రేంఖణమనే పదిహేడు ప్రకరణాలను అదనంగా పేర్కొంటుంది.

కావ్య సామగ్రులయిన శృంగార-హాస్య-కరుణ-రౌద్ర-వీర-భయానక-బీభత్స-అద్భుత-శాంత రసాలను, వాటి స్థాయీభావాలను, విభావానుభావవ్యభిచారిభావాలను, ధీరోదాత్త, ధీరోద్ధత, ధీరలలిత, ధీరశాంత అనే చతుర్విధ నాయకులను, అష్టవిధనాయికలను, పాంచాలి, గౌడి, వైదర్భీ, లాటజ అనే రీతి చతుష్టయాన్ని, చేష్టాది అంగకర్మలను, సాత్త్విక, వాచిక, ఆంగిక, ఆహార్యములనే అభినయాలను, శబ్దాన్ని అలంకరించేదీ; ఛాయ, ముద్ర, ఉక్తి, యుక్తి, గుంఫన, వాకోవాక్యం, అనుప్రాసం, చిత్రం, దుష్కరమన్నవి శబ్దాలంకారాలనీ, అర్థాన్ని అలంకరించే-స్వరూప, సాదృశ్య, ఉత్ప్రేక్ష, అతిశయ, విభావనా, విరోధ, హేతుమతో సమమనేవి అర్థాలంకారాలనీ, ప్రశస్తి, కాంతి, ఔచిత్యం, సంక్షేమం, యావదర్థత, అభివ్యక్తి అన్నవి శబ్దార్థాలంకారాలనీ, కావ్యానికి శోభాతిశయాన్ని కలిగించే

గుణాలు మూడు విధాలని అవి శబ్ద–అర్థ–శబ్దార్థాలలో సంబంధం కలిగివుంటాయి గనుక అవి శబ్దగుణాలని, అర్థగుణాలని, శబ్దార్థగుణాలని, సహృదయునికి ఉద్వేగాన్ని కలిగించేవి దోషాలని, కావ్యము దోషరహితంగా వుండాలని, అలంకారశాస్త్రాన్ని సమగ్రంగా పరిచయం చేసిన తొలిపురాణం అగ్నిపురాణం. దీనితోపాటు వ్యాకరణశాస్త్రాన్నికూడా పరామర్శిస్తుంది.

ప్రత్యాహారాది సంజ్ఞలను, స్వరాది సంధులను, పుంలింగ, స్త్రీ, నపుంసకలింగాలలోని సుబంతాలను, తిజంతాలను, విభక్త్యర్థ సమన్వితాలయిన కారకాలను, చతుర్విధ అధికరణాలను, తత్పురుష, కర్మధారయ, బహువ్రీహి, ద్విగు, ద్వంద్వసమాసాలను, తద్ధితాలను, ఉణాది ప్రత్యయాలను, కృదంతరూపాలను వివరించే వ్యాకరణశాస్త్రం కుమారస్వామి చేత బోధించినట్టుగా ఉన్నందువల్ల దీనిని కుమారవ్యాకరణంగా పేర్కొంటున్నది.

కోశగ్రంథవిషయాలయిన నామాలను స్వర్గ, పాతాళ, అవ్యయ, నానార్థ, భూమి, వన, ఔషధ్యాది వర్గాలుగా విభజించి, మానవులను బ్రహ్మ, క్షత్ర, విట్శూద్ర వర్గాలుగా పేర్కొని వాటి స్వరూపస్వభావాలను వివరిస్తుంది.

తరువాత పురాణ లక్షణమయిన ప్రళయాన్ని, ప్రళయభేదమయిన ఆత్యంతికప్రళయాన్ని వివరిస్తూ, అంతిమ ప్రళయంలో శరీరావయవాలయిన కర్మేంద్రియాలు, జ్ఞానేంద్రియాలు, పంచభూతాలు, సప్తాశయాలు, పదునారు జాలాలు, నాడీమండలాలు ఎలా అంతర్లయమవుతాయో తెలుపుతుంది. దీనిలో భాగంగా ధర్మాచరణచేయనివాడు పొందే నరకాలను కూడా వర్ణిస్తుంది.

శాశ్వతమయిన నివృత్తిధర్మాన్ని సాధించదలచిన సాధకునికి అవసరమయిన యోగశాస్త్రాన్ని కూడా ఈ పురాణం పరిచయం చేస్తుంది. పతంజలి యోగశాస్త్రాన్ననుసరించి యమ, నియమ, ఆసన, ప్రాణాయామ, ప్రత్యాహార, ధ్యాన, ధారణ, సమాధి అనే అష్టాంగాలను నిర్దేశించి, వాటి ద్వారా సదాచారసంపన్నుడైన గృహస్థుడు మనసును జయించి, విష్ణువును ధ్యానించి, సూర్యమండలాన్ని భేదించి, బ్రహ్మలోకాన్ని దాటి నిర్వాణస్థితిని పొందే మార్గాన్ని విపులంగా వివరిస్తుంది.

అలాగే ఉత్తరమీమాంసాశాస్త్రంలో ప్రతిపాదితమయిన ఆత్మజ్ఞానాన్ని మూడు అధ్యాయాలలో పరామర్శించి అద్వైతవేదాంతసారాన్ని బోధిస్తుంది. తత్ప్రోద్బలకంగా ప్రస్థానత్రయంలోని భగవద్గీతా తాత్పర్యాన్ని, ఉపనిషత్సారమయిన యమగీతరహస్యాన్ని నిరూపించి ఆత్మానందప్రాప్తిని విశదీకరిస్తుంది.

ఇలా అగ్నిమహాపురాణమాహాత్మ్యాన్ని తెలుపుతూ పురాణశ్రవణ, పురాణపఠన, పురాణపూజన, పురాణ పుస్తకదానాది ఫలాల ప్రతిపాదనలతో పురాణం సమాప్తమవుతుంది.

ఆచార్య కె. ప్రతాప్
పూర్వభాగం అనువాదకులు

ఓమ్ శ్రీగురుభ్యో నమః

అగ్నిమహాపురాణమ్ – అగ్నిమహాపురాణం

ద్వితీయభాగః – ద్వితీయభాగం

దశాధికద్విశతతమోఽధ్యాయః – రెండువందల పదవ అధ్యాయం

మహాదానవర్ణనమ్ – మహాదానవర్ణనం

అగ్నిరువాచ – అగ్నిదేవుడు వసిష్ఠుడితో ఇలా చెప్తున్నాడు.

సర్వదానాని వక్ష్యామి మహాదానాని షోడశ ।
తులాపురుష ఆద్యం తు హిరణ్యగర్భదానకమ్ ॥1॥

బ్రహ్మాణ్డం కల్పవృక్షఇ్చ గోసహస్రం చ పఞ్చమమ్ ।
హిరణ్యకామధేనుశ్చ హిరణ్యాశ్వశ్చ సప్తమమ్ ॥2॥

హిరణ్యాశ్వరథస్తద్వద్ధేమహస్తిరథ స్తథా ।
పఞ్చలాఙ్గలకం తద్వద్ధరాదానం తథైవ చ ॥3॥

విశ్వచక్రం కల్పలతా సప్తసాగరకం పరమ్ ।
రత్నధేను ర్మహాభూతఘట శ్శుభదినేఽర్పయేత్ ॥4॥

ఇక సమస్త దానాలను గూర్చి చెప్తాను. మహాదానాలు పదహారు. వాటిలో 1. తులాపురుషదానం. 2. హిరణ్యగర్భదానం. 3. బ్రహ్మాండదానం, 4. కల్పవృక్షదానం, 5. వేయిగోవులను దానం చేయడం. 6. బంగారంతో చేసిన ఆవును (కామధేను) దానం చేయడం, 7. బంగారంతో చేసిన గుఱ్ఱాన్ని దానం చేయడం. 8. బంగారపు గుఱ్ఱాలను పూన్చిన బంగారు రథాన్ని దానం చేయడం, హిరణ్యాశ్వరథదానం. 9. బంగారు ఏనుగులను పూన్చిన బంగారు రథాన్ని దానం చేయడం. (హేమహస్తిరథదానం), 10. ఐదునాగళ్ళ దానం, 11. భూదానం, 12. విశ్వచక్రదానం, 13. కల్పలతాదానం, 14. సప్తసాగరదానం, 15. రత్నధేనుదానం, 16. మహాభూతఘటదానం, వీటిని మంచిరోజున దానం చేయాలి.

మణ్డపే మణ్డలే దానం దేవాన్ ప్రార్చ్యార్పయేద్ ద్విజే ॥5॥

మండలం ఆకారంలో అంటే గుండ్రంగా ఏర్పాటు చేసిన మండపంలో దేవతలను పూజించి, ఆ తరువాత బ్రాహ్మణులకు దానం చేయాలి.

మేరుదానాని పుణ్యాని మేరవో దశ తాన్ శృణు ।
ధాన్యద్రోణసహస్రేణ ఉత్తమోఽర్ధార్ధతః పరౌ ॥6॥

మేరుదానాలు చాల పుణ్యప్రదమైనవి. అవి పది విధాలుగా ఉన్నాయి. అందులో వెయ్యిద్రోణాల పరిమాణం కలిగినధాన్యం రాశి (1)ధాన్యమేరువు. (ద్రోణం అంటే నాలుగుకుంచాలు. కుంచం అంటే నాలుగుమానికలు. (18 శ్లో.) కాగా ధాన్యమేరువు అంటే పదహారువేలమానికలు. ఈ ధాన్యరాశి కొండంత పరిమాణంలో ఉంటుంది కదా. కాబట్టి ఇది ధాన్యమేరువు) ధాన్యమేరువు అంత ధాన్యం దానం చేయడం ఉత్తమం. మిగిలినవి మధ్యమం. అధమం. అవి సగం, అందులో సగం. ఉత్తమమేరువులో సగం అంటే ఐదువందలద్రోణాల ధాన్యదానం మధ్యమ ధాన్యమేరువు. అందులో సగం అంటే రెండువందలయాభై ద్రోణాల ధాన్యదానం అధమ ధాన్యమేరువు.

ఉత్తమః షోడశద్రోణః కర్తవ్యో లవణాచలః ।
దశభారై ర్గుడాద్రిస్స్యా దుత్తమోఽర్ధార్ధతః పరౌ ॥7॥

ఆ తరువాత పదహారుద్రోణాల (16×16= 196 మానికలు) ఉప్పు రాశి లవణాచలం (2. లవణమేరువు) అవుతుంది. దానిని దానం చేస్తే, అది ఉత్తమమైన దానం. తప్పక చేయవలసినది. (దానిలో సగం అంటే 8 ద్రోణాల ఉప్పుదానం మధ్యమం. దానిలో సగం అంటే నాలుగుద్రోణాల లవణదానం అధమం అని ఊహించవచ్చు.) పదిభారాల పరిమాణం కలిగిన బెల్లపురాశి గుడాద్రి. అంటే (3)గుడమేరువు. భారం అంటే రెండుతులాలు. తులం అంటే నూరు పలాలు. (18శ్లో) పలం అంటే నాలుగు సువర్ణాలు. సువర్ణం అంటే పదహారుమినపగింజలబరువు (18 శ్లోకం). అంత బెల్లం దానం చేస్తే అది ఉత్తమం. మిగిలినవి మధ్యమం, అధమం. గుడాద్రిలో సగం అంటే 8 భారాల బరువు గలిగిన బెల్లం దానం మధ్యమ(గుడాద్రిదాన)ం. అందులో సగం అంటే 4 భారాల బరువు కలిగిన గుడాన్ని దానం చేస్తే అది అధమం (గుడాద్రిదానం).

ఉత్తమః పలసాహస్రై స్స్వర్ణమేరు స్తథా పరౌ ।
దశద్రోణై స్తిలాద్రిస్స్యాత్ పఞ్చభిశ్చ త్రిభిః క్రమాత్ ॥8॥

వెయ్యిపలాలబరువు కలిగిన బంగారపుకుప్పకు (4)స్వర్ణమేరువు అని పేరు. అంతటిబంగారం దానం చేస్తే, అది ఉత్తమమైన దానం. దీనిలో సగం, దానిలో సగం దానం చేస్తే అవి క్రమంగా మధ్యమం, అధమం అవుతాయి. అంటే 500 పలాలదానం మధ్యమం(స్వర్ణమేరుదానం), 250 పలాలదానం అధమం (స్వర్ణమేరుదానం). పదిద్రోణాలపరిమాణం కలిగిననువ్వుల రాశి తిలాద్రి అంటే (5)తిలమేరువు. దానిని దానం చేయడం ఉత్తమం. ఐదు ద్రోణాలపరిమాణంలో దానం చేస్తే, అది మధ్యమం. మూడు ద్రోణాలనువ్వులు దానం చేస్తే అది అధమం.

కార్పాసపర్వతో వింశభారైశ్చ దశపఞ్చభిః ।
వింశత్యా ఘృతకుమ్భానాముత్తమస్స్యాద్ ఘృతాచలః ॥9॥

ఇరవైభారాల దూదిని పర్వతంలాగా పోసినరాశికి కార్పాసపర్వతం అంటే (6)కార్పాసమేరువు అని పేరు. అంతదూదిని రాశిగా పోసి దానం చేస్తే, అది ఉత్తమం. పదిభారాల దూదిరాశిని దానం చేస్తే, మధ్యమం. ఐదు భారాల పత్తిరాశిని దానం చేస్తే అధమం. నేతితో నింపిన 20 కుండలసమూహానికి (7)ఘృతమేరువు అని పేరు. దానిని దానం చేయడం ఉత్తమం. (పది నేతికుండల రాశిని దానం చేస్తే, అది మధ్యమం. 5 నేతికుండలరాశిని దానం చేస్తే అది అధమం)

దశభిః పలసాహస్రై రుత్తమో రజతాచలః ।
అష్టభారైః శ్శర్కరాద్రి ర్మధ్యో మన్దోఽర్ధతోఽర్ధతః ॥10॥

పదివేల పలాలవెండికి (8)రజతమేరువు అని పేరు. అది దానం చేయడం ఉత్తమం. (5 పలాలు దానం చేస్తే మధ్యమం, రెండు పలాలు దానం చేస్తే అధమం.)ఎనిమిదిభారాల చక్కెరరాశికి శర్కరాద్రి అంటే (9)శర్కరమేరువు అని పేరు. దానిలో సగం అంటే 5వేలపలాలపరిణామంలో ఉన్న వెండిని దానం చేయడం మధ్యమం. దానిలో సగం అంటే మూడుభారాలచక్కెరను దానం చేస్తే ఆ దానం అధమం. (పదవది?)

దశధేనూః ప్రవక్ష్యామి యా దత్త్వా ముక్తిభుక్తిభాక్ ।
ప్రథమా గుడధేనుస్స్యాద్ ఘృతధేను స్తథాపరా ॥11॥

ఇక పది ధేనుదానాలను గురించి చెప్తాను. ఆ దానాలు చేయడంవల్ల ముందుగా భోగమూ, తరువాత మోక్షమూ లభిస్తాయి. దశధేనువులలో మొదటిది గుడధేనువు. ఆ తరువాతిది ఘృతధేనువు.

తిలధేను స్తృతీయా చ చతుర్థీ జలధేనుకా ।
క్షీరధేనుర్మధుధేనుశ్శర్కరాదధిధేనుకే ॥12॥

మూడవది తిలధేనువు. నాలుగవది జలధేనువు. ఆ తరువాత వరుసగా ఐదవది క్షీరధేనువు, ఆరవది మధుధేనువు, ఏడవది శర్కరాధేనువు, ఎనిమిదవది దధిధేనువు.

రసధేను స్స్వరూపేణ దశమీ విధి రుచ్యతే ।
కుమ్భా స్స్యుర్ద్రవ్యధేనూనా మితరాసాం తు రాశయః ॥13॥

తొమ్మిదవది రసధేనువు. విధిధేనువు పదవది. ఇందులో ద్రవరూపంలో ఉండే ఘృతం (నెయ్యి), జలం (నీళ్లు), క్షీరం(పాలు), మధువు(తేనె), దధి (పెరుగు), రసం (పండ్లరసం మొ) అనేవాటిని కుండలలో ఉంచి దానం చేయాలి. ఘనరూపంలో ఉండే మిగిలినవాటిని, గుడం (బెల్లం), తిలలు (నువ్వులు), శర్కర (చక్కెర) అనేవాటిని రాశులుగా పోసి దానం చేయాలి.

కృష్ణాజినం చతుర్హస్తం ప్రాగ్గ్రీవం విన్యసేద్ భువి ।
గోమయేనానులిప్తాయాం దర్భానాస్తీర్య సర్వతః ॥14॥

నేలను ఆవుపేడతో అలకాలి. దానిపైన దట్టంగా దర్భలను పరచాలి. దానిపైన నాలుగుమూరల(హస్తం) పరిమాణం కలిగిన నల్లజింకతోలును పరచాలి. దానిలో జింకమెడ(ముఖం) తూర్పుదిక్కుగా ఉంచాలి.

లఘ్వైణకాజినం తద్వ ద్వత్సస్య పరికల్పయేత్ ।
ప్రాఙ్ముఖీం కల్పయేద్ ధేను ముదక్పాదాం సవత్సకామ్ ॥15॥

అదేవిధంగా అక్కడే ఆవుదూడకోసం ఒక చిన్నజింకచర్మాన్ని ఏర్పాటు చేయాలి. దూడతో సహా ఆవును ఆ జింకచర్మాలమీద ఉంచాలి. ఆ ఆవుముఖం తూర్పువైపుగా ఉండాలి. పాదాలు ఉత్తరం వైపుగా ఉండాలి.

ఉత్తమా గుడధేను స్స్యాత్ సదా భారచతుష్టయాత్ ।
వత్సం భారేణ కుర్వీత భారాభ్యాం మధ్యమా స్మృతా ॥16॥

నాలుగు భారాల(7శ్లోకం)బరువు గలిగిన బెల్లంతో నిర్మించిన ఆవు ఉత్తమం. దానిదూడను ఒక భారం బరువు గలిగిన బెల్లంతో నిర్మించాలి. (దూడబరువు ఆవుబరువులో నాలుగోవంతు ఉండాలి.) రెండు భారాల బరువు గల బెల్లంతో నిర్మించిన ఆవు మధ్యమం.

అర్ధభారేణ వత్సస్స్యాత్ కనిష్ఠా భారకేణ తు ।
చతుర్థాంశేన వత్సస్స్యాద్ గుడవిత్తానుసారతః ॥17॥

దూడను దానిలో సగం బరువు కలిగిన బెల్లంతో నిర్మించాలి. ఒకభారం బరువుబెల్లంతో నిర్మించిన ఆవు కనిష్ఠం. దీని దూడ భారంలో నాలుగోవంతు బరువు కలిగినబెల్లంతో నిర్మించాలి. (నాలుగుభారాలు, రెండుభారాలు, ఒకభారం అనే విధంగా ఉన్న రకాలలో తమ సంపదకు తగినవిధంగా ఆవును, (దానిలో నాలుగోవంతుబరువుతో) దూడను, ఏర్పాటు చేసుకోవాలి.

పఞ్చకృష్ణలకా మాషస్తే సువర్ణస్తు షోడశ ।
పలం సువర్ణాశ్చత్వార స్తులా పలశతం స్మృతమ్ ॥
స్యాద్ భారో వింశతితులా ద్రోణస్తు చతురాఢకః ॥18॥

అయిదు గురివెంద(కృష్ణల)గింజలఎత్తు పరిమాణం ఒకమాషం. పదహారు మాషాలు ఒకసువర్ణం. నాలుగుసువర్ణాలబరువు ఒకపలం. నూరుపలాలు ఒకతులం. ఇరవై తులాలు ఒకభారం. ద్రోణం అంటే నాలుగు ఆఢకాలు. (ఆఢకం అంటే కుంచం. అంటే నాలుగుమానికలు)

ధేనువత్సౌ గుడస్యోభౌ సితసూక్ష్మామ్బరావృతౌ ।
శుక్తికర్ణావిక్షుపాదౌ శుచిముక్తాఫలేక్షణౌ ॥19॥

బెల్లంతో నిర్మించిన ఆవుదూడలు రెండింటినీ తెల్లని, సన్ననివస్త్రంతో కప్పాలి. వాటికి చెవులు శంఖాలు. పాదాలు చెరుకుగడలు. కన్నులు స్వచ్ఛమైన ముత్యాలు.

సితసూత్రశిరాలౌ చ సితకమ్బలకమ్బలౌ ।
తామ్రగడ్డుకపృష్ఠౌ తౌ సితచామరరోమకౌ ॥20॥

తెల్లటినూలుపోగులు అలకలు. ఉన్నితో నేసిన తెల్లని ఉత్తరీయం గంగడోలు. రాగిగిన్నెలు వెనుకభాగం. తెల్లనిచామరలు వెంట్రుకలు.

విద్రుమభ్రూయుగావేతౌ నవనీతస్తనాన్వితౌ ।
క్షౌమపుచ్ఛౌ కాంస్యదోహౌ విన్ద్రనీలకతారకౌ ॥21॥

ఆ ఆవుదూడలకు కనుబొమ్మలు పగడాలు. పొదుగు వెన్న. తోక పట్టు. పాలుపిదికే పాత్ర కంచు. కనుగ్రుడ్లు ఇంద్రనీలమణులు.

సువర్ణశృఙ్గాభరణౌ రజతక్షురసంయుతౌ ।
నానాఫలమయా దన్తా గన్ధఘ్రాణప్రకల్పితౌ ॥
రచయిత్వా యజేద్ధేనుమిమైర్మన్త్రైర్ద్విజోత్తమ ॥22॥

బంగారం కొమ్ములకు అలంకారం. గిట్టలకు వెండి. ఆవుదూడలదంతాలు అనేకవిధమైన పండ్లతో కూడి ఉంటాయి. పరిమళద్రవ్యం ముక్కులు. బ్రాహ్మణోత్తమా! ఈవిధంగా ఆవునూ, దూడనూ ఏర్పాటుచేసి, దానిని ఈ క్రిందిమంత్రాలతో పూజించాలి.

యా లక్ష్మీ స్సర్వభూతానాం యా చ దేవేష్వవస్థితా ।
ధేనురూపేణ సా దేవీ మమ శాన్తిం ప్రయచ్ఛతు ॥23॥

బ్రాహ్మణోత్తమా! సమస్తమైన భూతాలలోనూ, దేవతలలోనూ నిలిచిఉన్న తేజస్సు ఈ ధేనువు రూపంలో ఉండి, నాకు శాంతిని గలిగించును గాక! (ఈ ధేనువు దేవాదుల తేజస్సు.)

దేహస్థా యా చ రుద్రాణీ శఙ్కరస్య సదా ప్రియా ।
ధేనురూపేణ సా దేవీ మమ పాపం వ్యపోహతు ॥24॥

పరమేశ్వరుడి శరీరంలో సగమై ఉన్నదీ, అతడికి చాల ఇష్ట మైనదీ అయిన పార్వతీదేవి ఈ ధేనువు రూపంలో నా పాపాన్ని పోగొట్టును గాక! (ఈ ధేనువు పార్వతీదేవి)

విష్ణువక్షసి యా లక్ష్మీ స్స్వాహా యా చ విభావసోః ।
చన్ద్రార్కఋక్షశక్తిర్యా ధేనురూపాస్తు సా శ్రియే ॥25॥

శ్రీమహావిష్ణువు వక్షస్స్థలంమీద ఉన్న లక్ష్మీదేవి, అగ్నిదేవుడికి సంబంధించిన స్వాహాదేవి, చంద్రుడు, సూర్యుడు, నక్షత్రాలలోనూ ఉన్న శక్తి ఈ ధేనువురూపంలో నాకు లక్ష్మిని కలిగించును గాక! (ఈధేనువు లక్ష్మీదేవి, స్వాహాదేవి, చంద్రసూర్యనక్షత్రకాంతి)

చతుర్ముఖస్య యా లక్ష్మీర్యా లక్ష్మీర్ధనదస్య చ ।
లక్ష్మీర్యా లోకపాలానాం సా ధేను ర్వరదాస్తు మే ॥26॥

బ్రహ్మదేవుడికి సంబంధించిన సరస్వతి, కుబేరుడికి చెందిన నిధి, లోకపాలురలో ఉన్న రక్షణశక్తి, ఈ ధేనువురూపంలో నాకు వరాలను ఇచ్చును గాక!

స్వధా త్వం పితృముఖ్యానాం స్వాహా యజ్ఞభుజాం యతః ।
సర్వపాపహరా ధేనుస్తస్మాచ్ఛాన్తిం ప్రయచ్ఛ మే ॥27॥

ఓ ధేనువా! నీవు పితృదేవతలకు కవ్యాన్ని అందించే స్వధాదేవివి. యజ్ఞఫలభోక్త లయిన దేవతలకు హవిస్సును అందించే స్వాహాదేవివి. సమస్తమైన పాపాలను హరించే ధేనువువి. అందుచేత నాకు చిత్తశాంతిని కలిగించు.

ఏవ మామన్త్రితాం ధేనుం బ్రాహ్మణాయ నివేదయేత్ ॥28॥

ఈమంత్రాలతో చక్కగా సత్కరించి, ఆ ధేనువును బ్రాహ్మణుడికి సమర్పించాలి.

సమానం సర్వధేనూనాం విధానం చైతదేవ హి ।
సర్వయజ్ఞఫలం ప్రాప్య నిర్మలో భుక్తిముక్తిభాక్ ॥29॥

ఉత్తమ, మధ్యమ, కనిష్ఠధేనువులు, అలాగే తిలధేనువు మొదలైనవాటిని దేనిని దానం చేస్తున్నా, ఈవిధానంగానే చేయాలి. ఈవిధంగా గోదానం చేసినవాడు సమస్తయజ్ఞాలు చేసినపుణ్యఫలితాన్ని పొందుతాడు. వాడిపాపాలు అన్నీ నశించిపోతాయి. ముందుగా భోగాలనూ, తరువాత మోక్షాన్నీ పొందుతాడు.

స్వర్ణశృఙ్గీ శఫై రౌప్యై స్సుశీలా రూప్యసంయుతా ।
కాంస్యోపదోహా దాతవ్యా క్షీరిణీ గౌ స్సదక్షిణా ॥
దాతాస్యా స్స్వర్గ మాప్నోతి వత్సరాన్ రోమసమ్మితాన్ ॥30॥

కొమ్ములకు బంగారం తొడిగి, గిట్టలకు వెండిని తగిలించి, సాధువయిన ఆవును దానం చేయాలి. ఆ ఆవు మంచి రూపసంపద కలగి ఉండాలి. పాలిచ్చేది కావాలి. (ఆవుదూడలతోపాటు) పాలు తీయడానికి కంచుపాత్రను గూడా ఇవ్వాలి. వీటితోపాటు గొప్పదక్షిణ కూడ సమర్పించాలి. ఇటువంటిఆవును దానం చేసినవాడు స్వర్గానికి వెళ్తాడు. దానం చేసిన ఆవుకు ఒంటిమీద ఎన్నివెంట్రుకలు ఉన్నాయో, అన్నిసంవత్సరాలు స్వర్గలోకంలో ఉంటాడు.

కపిలా చోత్తారయతి భూయశ్చాసప్తమం కులమ్ ॥31॥

ఈవిధంగా కపిలధేనువును దానం చేసినవాడు తమ వంశంలోని ఏడుతరాలవారిని నరకలోకాలనుండి ఉద్ధరిస్తాడు. (చేసినపాపాలు నశించడంతో, నరకలోకాలకు వెళ్లకుండా, పుణ్యసమృద్ధి కలిగి, స్వర్గలోకానికి వెళ్తారు.)

స్వర్ణశృఙ్గీం రూప్యఖురాం కాంస్యదోహనకాన్వితామ్ ।
శక్తితో దక్షిణాయుక్తాం దత్త్వా స్యాద్ భుక్తిముక్తిభాక్ ॥32॥

కొమ్ములకు బంగారం తొడిగి, గిట్టలకు వెండితొడుగులు వేసి, పాలు పితకడానికి కంచుపాత్రను, శక్తిమేరకు దక్షిణను కలిపి, కపిలధేనువును బ్రాహ్మణుడికి దానం చేసినవాడు భోగాలనూ, మోక్షాన్నీ పొందుతాడు.

సవత్సరోమతుల్యాని యుగా న్యుభయతోముఖీమ్ ।
దత్త్వా స్వర్గ మవాప్నోతి పూర్వేణ విధినా దదేత్ ॥33॥

ఆవు ప్రసవించేసమయంలో ముందు ఆవుముఖమూ, వెనక దూడముఖమూ ఉంటాయి. కాబట్టి ప్రసవిస్తున్న ఆవును ఉభయతోముఖి అంటారు. అటువంటిఆవును దానం చేసినవాడు స్వర్గలోకానికి వెళ్తాడు. దానిని ఇంతకు ముందు చెప్పినవిధానంగా బ్రాహ్మణుడికి దానం చేయాలి.

ఆసన్నమృత్యునా దేయా సవత్సా గౌస్తు పూర్వవత్ ॥34॥

మరణం సమీపానికి వచ్చినవాడు (చావడానికి సిద్ధంగా ఉన్నవాడు) దూడతో సహా, ఆవును ఇంతకు ముందు చెప్పిన ప్రకారంగా దానం చేయాలి. (అలా దానం చేసేటపుడు ఈక్రింది మంత్రం చెప్పాలి.)

యమద్వారే మహాఘోరే తప్తా వైతరిణీ నదీ ।
తాం తర్తుం చ దదా మ్యేనాం కృష్ణాం వైతరిణీం చ గామ్ ॥35॥

మహాభయంకరమైన యమపురానికి ముందుగా వైతరిణి అనే నది ఉన్నది. అందులో నీళ్లు ఎప్పుడూ బాగా కాగుతూ ఉంటాయి. ఆ వైతరిణీనదిని దాటడంకోసం వైతరణి అనే ఈ నల్లనిఆవును దానం చేస్తున్నాను.

ఇత్యాది మహాపురాణే ఆగ్నేయే మహాదానవర్ణనం నామ దశాధికద్విశతతమోऽధ్యాయః ॥210॥

అగ్నిమహాపురాణంలో మహాదానవర్ణనం అనే రెండువందల పదవ అధ్యాయం సమాప్తం.



ఏకా దశాధికద్విశతతమో உధ్యాయః – రెండువందల పదకొండవ అధ్యాయం

నానాదానమహిమవర్ణనమ్ – నానాదానమహిమవర్ణనం

అగ్నిరువాచ – వసిష్ఠమహర్షితో అగ్నిదేవుడు ఇలా చెప్తున్నాడు.

ఏకాఙ్గాం దశగుర్దద్యాద్దశ దద్యాచ్చ గోశతీ ।
శతం సహస్రగుర్దద్యాత్ సర్వే తుల్యఫలా హి తే ॥1॥

పదిఆవులు ఉన్నవాడు, ఒకఆవును దానం చేయాలి. నూరు ఆవులు కలిగినవాడు పదిఆవులను దానం చేయాలి. వెయ్యి ఆవులు ఉన్నవాడు నూరు ఆవులను దానం చేయాలి. వీళ్లందరికీ దానఫలం మాత్రం సమానంగానే ఉంటుంది. (ఉన్న దానిలో పదవవంతు దానం చేయాలి.)

ప్రాసాదా యత్ర సౌవర్ణా వసోర్ధారా చ యత్ర సా ।
గన్ధర్వాప్సరసో యత్ర తత్ర యాన్తి సహస్రదాః ॥2॥

వేయిఆవులను దానం చేసినవారు కుబేరుడి రాజధాని అయిన అలకాపురికి వెళ్తారు. ఆ నగరం అంతటా బంగారుమేడలు ఉంటాయి. బంగారం వర్షంలాగా కురుస్తుంటుంది. అక్కడ గంధర్వులు, అప్సరసలు విహరిస్తుంటారు.

గవాం శతప్రదానేన ముచ్యతే నరకార్ణవాత్ ।
దత్వా వత్సతరీం చైవ స్వర్గలోకే మహీయతే ॥3॥

నూరు గోవులను దానం చేస్తే నరకం అనే మహాసముద్రాన్ని దాటి బయటపడతారు (నరకానికి వెళ్లరు). దూడతో కూడ, ఆవును దానం చేస్తే, స్వర్గలోకంలో గౌరవం పొందుతారు.

గోదానాదాయురారోగ్యం సౌభాగ్యస్వర్గ మాప్నుయాత్ ॥4॥

గోవును దానం చేయడంవల్ల మానవుడు ఆయువు, ఆరోగ్యం, ఐశ్వర్యం, పొందుతాడు. ఆ తరువాత స్వర్గానికి చేరుకుంటాడు.

ఇన్ద్రాదిలోకపాలానాం యా రాజమహిషీ శుభా ।
మహిషీదానమాహాత్మ్యాదస్తు మే సర్వకామదా ॥5॥

(మహిషిని దానం చేసేటప్పుడు ఈమంత్రం చెప్పాలి.) ఇంద్రుడు మొదలైన లోకపాలురకు పట్టమహిషి అయినదీ, శుభాలను అనుగ్రహించేదీ అయిన కాంత మహిషిని దానం చేసినందువలన నాకు సమస్త మైన కోరికలను నెరవేర్చును గాక!

ధర్మరాజస్య సాహాయ్యే యస్యాః పుత్రః ప్రతిష్ఠితః ।
మహిషాసురస్య జననీ యా సాస్తు వరదా మమ ॥6॥

మహిషికుమారుడు యమధర్మరాజుకు సహాయంగా నియమింపబడ్డాడు. ఆమె మహిషాసురుడికి తల్లి. అటువంటి మహిషి నాకు వరాలను ప్రసాదించును గాక!

మహిషీదానాచ్చ సౌభాగ్యం వృషదానాద్దివం వ్రజేత్ ॥7॥

మహిషిని దానం చేస్తే సౌభాగ్యం కలుగుతుంది. వృషభాన్ని దానం చేస్తే స్వర్గానికి వెళ్తాడు.

సంయుక్తహలపఙ్త్యాఖ్యం దానం సర్వఫలప్రదమ్ ।
పఙ్క్తి ర్దశహలా ప్రోక్తా దారుజా వృషసంయుతా ॥
సౌవర్ణపట్టసన్నద్ధాన్ దత్త్వా స్వర్గే మహీయతే ॥8॥

సంయుక్తహలపంక్తి అనేపేరు గలిగినదానం సమస్తమైన పుణ్యఫలాలను ఇస్తుంది. హలపంక్తి అంటే పదినాగళ్లు. అవి చెక్కతో తయారు చేసినవి. ఎద్దులతో కూర్చినవి. వాటికి నుదుట బంగారపు ఫలకం అమర్చి దానం చేస్తే స్వర్గలోకంలో గౌరవం పొందుతాడు.

దశానాం కపిలానాం తు దత్తానాం జ్యేష్ఠపుష్కరే ।
తత్ఫలం చాక్షయం ప్రోక్తం వృషభస్య తు మోక్షణే ॥9॥

జ్యేష్ఠపుష్కరం అనే పుణ్యతీర్థంలో పదికపిలగోవులను దానం చేస్తే, శాశ్వతంగా నిలిచిఉండే పుణ్యం కలుగుతుంది. (జాతి అభివృద్ధికోసం ఊరికి) ఆబోతును విడిచి పెట్టినా, అదే విధమైన పుణ్యఫలం కలుగుతుంది.

ధర్మోఽసి త్వం చతుష్పాద శ్చతస్రస్తే ప్రియా ఇమాః ।
నమో బ్రహ్మణ్య దేవేశ పితృభూతర్షిపోషక ॥
త్వయి ముక్తేఽక్షయా లోకా మమ సన్తు నిరామయాః ॥10॥

(ఆబోతును ఊరికోసం విడిచిపెట్టేసందర్భంలో ఈమంత్రం చెప్పాలి.) ఓ వృషభమా! నీవు నాలుగు పాదాలు కలిగిన ధర్మదేవతవు. నీకు ఈ నాలుగు చాలా ప్రీతికరమైనవి. బ్రాహ్మణుల(వేదాల)చేత స్తుతింపబడేవాడా! దేవతాసార్వభౌమా! పితరులను, మహర్షులను, పెంచి, పోషించేవాడా! నీకు నమస్కారం. నిన్ను ఊరికై విడిచిపెట్టడంవలన, (వృషభమోక్షణంచేత) నాకు ఏదోషమూ లేని, శాశ్వతమైన పుణ్యలోకాలు సిద్ధించును గాక!

మా మే ఋణోఽస్తు దైవత్యో భౌతః పైత్రోఽథ మానుషః ।
ధర్మ స్త్వం త్వత్ప్రపన్నస్య యా గతి స్సాస్తు మే ధ్రువా ॥11॥

ఇంకా, దేవతలకు, భూతాలకు (చరాచరసృష్టి), పితరులకు, మానవులకు (ఋషులు) సంబంధించిన ఏవిధమయిన ఋణం కూడ నాకు లేకుండును గాక! (వృషోత్సర్జనంచేత పుట్టుకతో ఏర్పడిన దేవ, ఋషి, పితృ, భూత, ఋణాలనుండి విముక్తి లభిస్తుంది) నీవు ధర్మస్వరూపుడివి. నిన్ను ఆశ్రయించినవారికి కలిగే ఉత్తమ గతులు నాకు కలుగును గాక!

అఙ్కయేచ్చక్రశూలాభ్యాం మన్త్రేణానేన చోత్సృజేత్ ॥12॥

ఆ వృషభానికి చక్రం, శూలం ముద్రలు వేసి, పైమంత్రంతో ఆబోతును విడిచిపెట్టాలి.

ఏకాదశాహే ప్రేతస్య యస్య చోత్సృజ్యతే వృషః ।
ముచ్యతే ప్రేతలోకాత్తు షణ్మాసే చాబ్దికాదిషు ॥13॥

మరణించినవాడిని ఉద్దేశించి, మరణానంతరం పదకొండవనాడు గాని, ఆరునెలల(షాణ్మాసిక)శ్రాద్ధంనాడు గాని, సంవత్సరం చివర చేసే(సాంవత్సరిక) శ్రాద్ధం నాడు గాని, ఆబోతును విడిచిపెడితే, ఆ మరణించినవాడు ప్రేతలోకంనుండి విముక్తిని పొందుతాడు.

దశహస్తేన దణ్డేన త్రింశద్దణ్డాన్నివర్తనమ్ ।
తాన్యేవ దశవిస్తారాద్గోచర్మైతత్ ప్రదోఽఘభిత్ ॥14॥

పదిమూరలు(హస్తం అంటే మూర), నాలుగుమూరలు (దండం అంటే నాలుగుహస్తాలు. అంటే బార.) ముప్పైదండాలు అంటే 30×4=120 మూరలు(30 బారలు). ఇంత మేర కొలత కలిగినభూమికి నివర్తనం అని పేరు (ఇరవై బారలు నివర్తనం అని నిఘంటువు). ఇదే కొలత పదిరెట్లు అయితే (అంటే 1200మూరలు - 300 బారలు) దానిని గోచర్మం అంటారు. ఇంతటిభూమిని దానం చేసినవాడికి సమస్త పాపాలు నశిస్తాయి.

గోభూహిరణ్యసంయుక్తం కృష్ణాజినం తు యోఽర్పయేత్ ।
సర్వదుష్కృతకర్మాపి సాయుజ్యం బ్రహ్మణో వ్రజేత్ ॥15॥

ఆవుతోనూ, భూమితోనూ, బంగారంతోనూ, కలిపి నల్లజింకచర్మాన్ని దానం చేసినవాడు అన్నిరకాలపాపాలు చేసినప్పటికీ, బ్రహ్మైక్యం చెందుతాడు.

భాజనం తిలసమ్పూర్ణం మధునా పూర్ణమేవ చ ।
దద్యాత్ కృష్ణతిలానాం చ ప్రస్థమేకం చ మాగధమ్ ॥
శయ్యాం దత్త్వా తు సగుణాం భుక్తిముక్తి మవాప్నుయాత్ ॥16॥

నువ్వులతో నింపినపాత్రను గానీ, తేనెతో నింపినపాత్రను గానీ దానం చేయాలి. నాలుగు మానికల(ప్రస్థం) నల్లనువ్వులను జీలకఱ్ఱను (మాగధం) దానం చేయాలి. అదే విధంగా ఉత్తమమైన లక్షణాలు కలిగిన మంచాన్ని దానం చేయాలి. వీటిని దానం చేసినవాడు భోగాలనూ, మోక్షాన్నీ పొందుతాడు.

హైమీం ప్రతికృతిం కృత్వా దత్త్వా స్వర్గ స్తథాత్మనః ।
విపులం తు గృహం కృత్వా దత్త్వా స్యా ద్భుక్తిముక్తిభాక్ ॥17॥

బంగారంతో తనప్రతిమను నిర్మించి, దానం చేసినవాడు స్వర్గానికి వెళ్తాడు. విశాల మయిన ఇల్లు కట్టించి, దానం చేసినవాడు భోగమోక్షాలను పొందుతాడు.

గృహం మఠం సభాం స్వర్గీ దత్త్వా స్యా చ్చ ప్రతిశ్రయమ్ ।
దత్త్వా కృత్వా గోగృహం చ నిష్పాప స్స్వర్గ మాప్నుయాత్ ॥18॥

ఇల్లు, సన్న్యాసులు మొదలయినవారి నివాసం(మఠం), విశాల మయిన సభామంటపం, జనులకు నివాసాలు, ఆవులు నివసించడానికి కొట్టాలు నిర్మించి ఇచ్చినవాడికి పాపాలు సమస్తమూ నశించి, మరణానంతరం స్వర్గానికి చేరుకుంటాడు.

(యమమాహిషదానా త్తు నిష్పాప స్స్వర్గ మాప్నుయాత్ ॥19॥

యముడికి వాహనమైన దున్నపోతును దానం చేసినవాడు పాపాలు నశించి, స్వర్గానికి వెళ్తాడు.

బ్రహ్మా హరో హరి ర్దేవై ర్మధ్యే చ యమదూతకః ।
పాశీ తస్య శిర శ్ఛిత్వా తం దద్యాత్ స్వర్గభాగ్ భవేత్.) ॥20॥

దేవతలనడుమ బ్రహ్మ, శివుడు, విష్ణువు, పాశం ధరించిన యమదూత అవుతాడు. అతడితల నటికి దానిని దానం చేయాలి. దానివలన స్వర్గానికి వెళ్తాడు.

త్రిముఖాఖ్య మిదం దానం గృహీత్వా తు ద్విజోఽఘభాగ్ ॥21॥

ఈ దానం పేరు త్రిముఖం. దీనిని దానంగా పుచ్చుకున్న బ్రాహ్మణుడు పాపాన్ని పొందుతాడు.

చన్ద్రం రూపమయం కృత్వా కే ధృత్వా తత్ ప్రదాపయేత్ ।
హేమయుక్తం ద్విజాయైతత్ కాలచక్ర మిదం మహత్ ॥
ఆత్మతుల్యం తు యో లౌహం దదేన్న నరకం వ్రజేత్ ॥22॥

చంద్రుడి ప్రతిబింబాన్ని అందంగా నిర్మించి, నీటిలో ఉంచి, బంగారంతో కలిపి, దానిని బ్రాహ్మణుడికి దానం చేయాలి. ఈదానానికి కాలచక్రం అని పేరు. (ఇక్కడ చక్రం రూప్యమయం కృత్వాఙ్కే ధృత్వా అని ఒకపాఠం. వెండితో చక్రాన్ని నిర్మించి, ఒడిలో పెట్టుకుని దానం చేయాలి అని దీనికి అర్థం చెప్పవచ్చు. కాలచక్రం అనే పేరును బట్టి చక్రం రూప్యమయం అనేపాఠం సమంజసం కావచ్చు. కాల శబ్దానికి మూడు అనే అర్థం ఉంది. చంద్రుడు, నీళ్లు, బంగారం అనేవి మూడు దానం చేయడం అవే ఉద్దేశ్యంతో చన్ద్రం అనేపాఠం ఉచితం కావచ్చు. అస్పష్టం.) తన బరువుతో సమానమైన బరువు గలిగిన ఇనుమును దానం చేసినవాడు నరకానికి వెళ్లడు.

పఞ్చాశత్పలసంయుక్తం లౌహదణ్డం తు యోఽర్పయేత్ ।
వస్త్రేణాచ్ఛాద్య విప్రాయ యమదణ్డో న విద్యతే ॥23॥

50 పలాలబరువు గలిగిన ఇనుపగుదియను వస్త్రంతో కప్పి, బ్రాహ్మణుడికి దానం చేసినవాడిని యముడు శిక్షించడు. (వాడు నరకానికి వెళ్లడు).

మూలం ఫలాది వా ద్రవ్యం సంహతం వాథ చైకశః ।
మృత్యుఞ్జయం సముద్దిశ్య దద్యాదాయుర్వివృద్ధయే ॥24॥

చాలా కాలం జీవించి ఉండాలని కోరుకునేవాడు మృత్యుంజయుడైన పరమేశ్వరుడిని ఉద్దేశించి, వేళ్లు (చెట్టువేరువద్ద పండే కాయలు, దుంపలు), పండ్లు మొదలయిన వస్తువులను అన్నింటినీ కలిపి కానీ, లేదా విడివిడిగా కాని దానం చేయాలి.

పుమాన్ కృష్ణతిలైః కార్యో రౌప్యదన్త స్సువర్ణదృక్ ।
ఖడ్గోద్యతకరో దీర్ఘో జపాకుసుమమణ్డలః ॥25॥

నల్లనినువ్వులతో పురుషుడిప్రతిమను తయారుచేయాలి. దానికి వెండిదంతాలు, బంగారుకనుగ్రుడ్లు ఉంచాలి. అతడిచేతిలో కత్తిని ఉంచి, ఆ చేయి నరకడానికి పైకి లేచిఉన్నట్లుగా నిర్మించాలి. శరీరం పొడవుగా ఉండాలి. అతడిశరీరంరంగు దాసానిపువ్వు రంగులో ఉండాలి.

రక్తామ్బరధర స్రగ్వీ శఙ్ఖమాలావిభూషితః ।
ఉపానద్యుగయుక్తాఙ్ఘ్రిః కృష్ణకమ్బలపార్శ్వకః ॥
గృహీతమాంసపిణ్డశ్చ వామే వై కాలపూరుషః ॥26॥

ఎఱ్ఱనివస్త్రాలు ధరించి ఉండాలి. పూమాలను, శంఖమాలను అలంకరించుకుని ఉండాలి. రెండుపాదాలకు చెప్పులజతను ధరించిఉండాలి. ఒంటిమీద ఒకవైపున నల్లనికంబళి ధరించి ఉండాలి. అతడి ఎడమచేతిలో మాంసపుముద్ద ఉండాలి. ఈవిధంగా నిర్మింపబడినవాడు కాలపురుషుడు.

సమ్పూజ్య తం చ గన్ధాద్యైః బ్రాహ్మణాయోపపాదయేత్ ।
మరణవ్యాధిహీనస్స్యాద్ రాజరాజేశ్వరో భవేత్ ॥27॥

ఆ కాలపురుషుడిని గంధం, పుష్పం మొదలైనవాటితో చక్కగా పూజించాలి. ఆ తరువాత అతడిని బ్రాహ్మణుడికి దానం చేయాలి. ఇలా చేసినవాడికి మరణం ఉండదు. ఎప్పటికీ రోగం రాదు. అతడు రాజులకే రాజు అవుతాడు.

గోవృషౌ తు ద్విజే దత్త్వా భుక్తిముక్తి మవాప్నుయాత్ ।
రేవన్తాధిష్ఠితం చాశ్వం హైమం దత్త్వా న మృత్యుభాక్ ॥28॥

బ్రాహ్మణుడికి గోవును, ఎద్దును దానం చేసినవాడికి భోగమూ, మోక్షమూ కలుగుతాయి. గుఱ్ఱాలకు శిక్షణ ఇచ్చేవాడు ఎక్కికూర్చున్న గుఱ్ఱాన్ని బంగారంతో తయారు చేసి, దానం చేసినవాడికి మరణం లేదు.

ఘణ్టాదిపూర్ణమప్యేకం దత్త్వా స్యాద్భుక్తిముక్తిభాక్ ॥29॥

మెడలో గంటలు మొదలయినవాటితో సహా బంగారంతో చేసిన గుఱ్ఱాన్ని ఒక్కదానిని దానంచేసినవాడికి భోగమూ, మోక్షమూ కలుగుతాయి.

సర్వాన్ కామానవాప్నోతి యః ప్రయచ్ఛతి కాఞ్చనమ్ ।
సువర్ణే దీయమానే తు రజతం దక్షిణేష్యతే ॥30॥

బంగారం దానం చేసినవాడికి కోరికలన్నీ నెరవేరుతాయి. బంగారం దానం చేసేసందర్భంలో వెండిని దక్షిణగా ఇవ్వాలి. అప్పుడే సువర్ణదానఫలం సిద్ధిస్తుంది.

అన్యేషామపి దానానాం సువర్ణం దక్షిణా స్మృతా ।
సువర్ణం రజతం తామ్రం తణ్డులం ధాన్యమేవ చ ॥31॥

ఇతరమయిన దానాలన్నింటికీ ఆ దానఫలం సిద్ధించడానికి బంగారం దక్షిణగా ఇవ్వాలి. బంగారం, వెండి, రాగి, బియ్యం, ఇతరధాన్యాలు కూడ దక్షిణగా ఇవ్వవచ్చు.

నిత్యశ్రాద్ధం దేవపూజా సర్వ మేతదదక్షిణమ్ ।
రజతం దక్షిణా పిత్రే ధర్మకామార్థసాధనమ్ ॥32॥

నిత్యశ్రాద్ధాలలోనూ, దేవతార్చనలలోనూ దానాలన్నీ దక్షిణ లేకుండానే ఇవ్వవచ్చు. పితృకార్యాలలో వెండిని దక్షిణగా ఇవ్వడంవలన ధర్మం, కామం, అర్థం అనే మూడు పురుషార్థాలు సిద్ధిస్తాయి.

సువర్ణం రజతం తామ్రం మణిముక్తా వసూని చ ।
సర్వమేతన్మహాప్రాజ్ఞో దదాతి వసుధాం దదత్ ॥33॥

బుద్ధిమంతుడయినవాడు భూమిని దానం చేసే సందర్భంలో బంగారం, వెండి, రాగి, రత్నం, ముత్యం మొదలైన విలువయిన వస్తువులను అధికంగా దక్షిణగా ఇస్తాడు. (దానివలన భూదానఫలం సిద్ధిస్తుంది).

పితౄంశ్చ పితృలోకస్థాన్ దేవస్థానే చ దేవతాః ।
సన్తర్పయతి శాన్తాత్మా యో దదాతి వసున్ధరామ్ ॥34॥

భూమిని దానం చేయడంవలన మనస్సు ప్రశాంత మవుతుంది. ఇంక భూదానం చేసినవాడు పితృలోకంలో ఉన్న పితరులనూ, దేవలోకంలో ఉన్న దేవతలనూ చక్కగా తృప్తిపరుస్తాడు.

ఖర్వటం ఖేటకం వాపి గ్రామం వా సస్యశాలినమ్ ।
నివర్తనశతం వాపి తదర్థం వా గృహాదికమ్ ॥
అపి గోచర్మమాత్రాం వా దత్త్వోర్వీం సర్వభాగ్భవేత్ ॥35॥

ఖర్వటం (ఒకప్రక్క పల్లెగానూ, మరొకప్రక్క నగరంగానూ ఉండి; నది, కొండ రెండు కలిగినగ్రామం) గానీ, ఖేటకం (పంటకాపులు నివసించేపల్లె) గానీ, పంటపొలాలతో నిండినగ్రామం గానీ, మూడువేలబారలవైశాల్యం కలిగినది (నివర్తనం అంటే ముప్పై బారలు) లేదా, దానిలో సగం అంటే పదిహేనువందలబారల వైశాల్యం కలిగిన ఇల్లు గానీ, మూడువందలబారలనేల (గోచర్మం) గానీ, దానం చేసినవాడికి సమస్తమైనకోరికలూ చక్కగా నెరవేరుతాయి. (14వ శ్లోకం ప్రకారం లెక్క ఈవిధంగా ఉన్నది. నిఘంటువులు ఇరవైబారలు నివర్తనం అని చెప్తున్నాయి. దానివల్ల రెండువేలబారలు, వెయ్యిబారలు, మూడువందలబారలు అని ఇక్కడిలెక్కలు మారతాయి.)

తైలబిన్దుర్యథా చాప్సు ప్రసర్పేద్భూగతం తథా ।
సర్వేషామేవ దానానామేకజన్మానుగం ఫలమ్ ॥36॥

నీటిమీద గానీ, లేదా నేలమీద గానీ పడిన నూనెచుక్క ఏవిధంగా క్రమంగా వ్యాపిస్తుందో, ఆ విధంగా వివిధమయిన దానాలవల్ల కలిగే పుణ్యఫలం ఆజన్మ చివరివరకూ వ్యాపించి ఉంటుంది.

హాటకక్షితిగౌరీణాం సప్తజన్మానుగం ఫలమ్ ।
త్రిసప్తకులముద్ధృత్య కన్యాదో బ్రహ్మలోకభాక్ ॥37॥

బంగారం, భూమి, గౌరివంటికన్య వీటిని దానం చేసినపుణ్యఫలం ఏడుజన్మలవరకూ వ్యాపించి ఉంటుంది. ఇందులో కన్యాదానం చేసినవాడు తన వంశమూ, తన తల్లి, భార్యవంశాలు మూడింటిలోని ఏడుతరాలవారిని నరకలోకాలనుండి ఉద్ధరిస్తాడు. తాను బ్రహ్మలోకానికి వెళ్లే అర్హతను పొందుతాడు. (అంటే బ్రహ్మలోకానికి వెళతాడు.)

గజం సదక్షిణం దత్త్వా నిర్మలస్స్వర్గభాగ్భవేత్ ।
అశ్వం దత్త్వాయురారోగ్యసౌభాగ్యం స్వర్గ మాప్నుయాత్ ॥38॥

ఉత్తమమైన దక్షిణతో సహా, ఏనుగును దానం చేసినవాడు పాపాలన్నీ నశించి, స్వర్గలోకానికి వెళ్తాడు. ఆవిధంగా దక్షిణతో సహా గుఱ్ఱాన్ని దానం చేసినవాడికి దీర్ఘ మైన ఆయువు, మంచి ఆరోగ్యం, సౌభాగ్యం కలుగుతాయి. చివరికి స్వర్గానికి వెళ్తాడు.

దాసీం దత్త్వా ద్విజేన్ద్రాయ అప్సరో లోకమాప్నుయాత్ ॥39॥

ఉత్తముడైనబ్రాహ్మణుడికి దాసిని దానం చేసినవాడు అప్సరసలు ఉండే లోకానికి వెళ్తాడు. (స్వర్గంలో అప్సరసలతో భోగాలనుభవిస్తాడు)

దత్త్వా తామ్రమయీం స్థాలీం పలానాం పఞ్చభిశ్శతైః ।
అర్ధై స్తదర్ధైర్వా భుక్తిముక్తిమవాప్నుయాత్ ॥40॥

అయిదువందలపలాలు, లేదా రెండువందలయాభై పలాలు, లేదా నూటపాతికపలాలు బరువు కలిగిన రాగిపాత్రను దానం చేసినవాడు భోగాలనుభవించి, మోక్షం పొందుతాడు.

శకటం వృషసంయుక్తం దత్త్వా యానేన నాకభాక్ ॥41॥

బండికి ఎద్దును కట్టి, ఆ రెండింటినీ దానం చేసినవాడు సగౌరవంగా విమానంలో ప్రయాణిస్తూ స్వర్గలోకానికి చేరుకుంటాడు.

వస్త్రదానాల్లభేదాయురారోగ్యం స్వర్గమక్షయమ్ ।
ధాన్యగోధూమకలమయవాదీన్ స్వర్గభాగ్ దదత్ ॥42॥

వస్త్రాలను దానం చేయడంవలన ఆయువు, ఆరోగ్యం కలుగుతాయి. తరువాత స్వర్గంలో శాశ్వతనివాసం కలుగుతుంది. ధనియాలు, గోధుమలు, కలమం అనేపేరు కలిగినవరిధాన్యం (ఇది జ్యేష్ఠమాసంలో విత్తి, మార్గశీర్షమాసంలో కోతకు వస్తుం దట), యవలు అనే ధాన్యం మొద లయినవాటిని దానం చేసినవాడు స్వర్గానికి వెళ్తాడు.

ఆసనం తైజసం పాత్రం లవణం గన్ధచన్దనమ్ ।
ధూపం దీపం చ తామ్బూలం లోహం రూప్యం చ రత్నకమ్ ॥
(దివ్యాని నానాద్రవ్యాణి దత్త్వా స్యా ద్భుక్తిముక్తిభాక్.) ॥43॥

పీట వంటి కూర్చుండేసాధనం, బంగారం మొదలయిన ధాతువులతో చేసినపాత్ర, ఉప్పు, పరిమళభరిత మయిన చందనం, ధూపం, దీపం, తాంబూలం, ఇనుము, వెండి, రత్నం, ఇంకా అపురూపమయిన వివిధవస్తువులను దానం చేసినవాడు భోగాలనూ, మోక్షాన్నీ పొందుతాడు.

తిలాం తిలపాత్రం చ దత్త్వా స్వర్గ మవాప్నుయాత్ ॥44॥

నువ్వులనూ, నువ్వులగిన్నెను దానం చేసినవాడు స్వర్గాన్ని పొందుతాడు.)

అన్నదానాత్ పరం నాస్తి న భూతం న భవిష్యతి ।
హస్త్యశ్వరథదానాని దాసీదాసగృహాణి చ ॥
అన్నదానస్య సర్వాణి కలాం నార్హన్తి షోడశీమ్ ॥45॥

అన్నదానానికి మించినదానం ఏదీ లేదు. ఇంతకు పూర్వమూ లేదు. ఇంక ముందు కూడ ఉండదు. ఏనుగు, గుఱ్ఱం, రథం, స్త్రీపరిచారికలు, సేవకులు, ఇండ్లు, ఈదానాలు ఏవీ అన్నదానంలో పదహారవఅంశకు కూడ సాటిరావు.

కృత్వాపి సుమహత్పాపం యః పశ్చా దన్నదో భవేత్ ।
సర్వపాపవినిర్ముక్తో లోకా నాప్నోతి చాక్షయాన్ ॥46॥

మిక్కిలి ఘోరమయినపాపాలు చేసినవాడు కూడ అన్నదానం చేస్తే, వాడిపాపాలు సమస్తమూ నశించిపోతాయి. ఇంకా అతడికి ఉత్తమలోకాలు శాశ్వతంగా కలుగుతాయి.

పానీయం చ ప్రపాం దత్త్వా భుక్తిం ముక్తి మవాప్నుయాత్ ।
అగ్నిం కాష్ఠం చ మార్గాదౌ దత్త్వా సర్వమవాప్నుయాత్ ॥47॥

బాటసారులకు దాహానికి నీటినీ, దారిలో చలిపందిరులను ఏర్పరిచి ఇచ్చినవాడు భోగమోక్షాలను పొందుతాడు. బాటసారులకు దారిలో అక్కడక్కడా చలికాలంలో వేడికోసంగా నిప్పునూ, కట్టెలనూ ఇచ్చినవాడికి అన్నికోరికలూ నెరవేరుతాయి.

దేవగన్ధర్వనారీభిర్విమానే సేవ్యతే దివి ॥48॥

అతడు స్వర్గలోకానికి వెళ్తాడు. అక్కడ దేవకాంతలు గంధర్వస్త్రీలు విమానంలో ఉంచి అతడిని సేవిస్తారు.

ఘృతం తైలం చ లవణం దత్త్వా సర్వమవాప్నుయాత్ ।
ఛత్రోపానహకాష్ఠాది దత్త్వా స్వర్గే సుఖీ వసేత్ ॥49॥

నేయి, నూనె, ఉప్పులను దానం చేసినవాడికి అన్నీ సిద్ధిస్తాయి. గొడుగు, చెప్పులు, కఱ్ఱ మొదలైనవి దానం చేసినవాడు స్వర్గానికి వెళ్లి, సుఖాలనుభవిస్తాడు.

ప్రతిపత్తిథిముఖ్యేషు విష్కమ్భాదిషు యోగకే ।
చైత్రాదౌ వత్సరాదౌ చ హ్యశ్విన్యాదౌ హరిం హరమ్ ॥
బ్రహ్మాణం లోకపాలాదీన్ ప్రార్చ్య దానం మహాఫలమ్ ॥50॥

పాడ్యమి మొదలయిన ముఖ్యతిథులలోనూ, విష్కంభం మొదలయిన యోగాలలోనూ, చైత్రం మొదలైన నెలలలో, సంవత్సరప్రారంభంలోనూ, అశ్విని మొదలయిన నక్షత్రాలసమయంలోనూ శ్రీమహావిష్ణువునూ, పరమేశ్వరుడినీ, బ్రహ్మదేవుడినీ, ఇంద్రుడు మొద లయినలోకపాలకులనూ శ్రద్ధగా పూజించి దానాలు చేసినవాడికి అత్యంతమైన పుణ్యఫలం కలుగుతుంది.

వృక్షారామాన్ భోజనాదీన్ మార్గసంవాహనాదికాన్ ।
పాదాభ్యఙ్గాదికం దత్త్వా భుక్తిం ముక్తి మవాప్నుయాత్ ॥51॥

చెట్లు, ఉద్యానవనాలు, భోజనం మొదలయిన వాటినీ, దారివెంట తీసుకునివెళ్లడానికి వాహనాలు మొదలయిన వాటినీ, పాదాలను మర్దించడానికి తైలాలు మొదలయిన వాటినీ దానం చేసినవాడు భోగాలనూ, మోక్షాన్నీ పొందుతాడు.

త్రీణి తుల్యఫలానీహ గావః పృథ్వీ సరస్వతీ ।
బ్రాహ్మీం సరస్వతీం దత్త్వా నిర్మలో బ్రహ్మలోకభాక్ ॥52॥

ఈ లోకంలో గోదానం, భూదానం, విద్యాదానం అనేవి మూడు సమానమయిన పుణ్యఫలాన్ని ఇచ్చేవి. బ్రహ్మముఖం నుండి పుట్టినవాక్కును అంటే వేదవిద్యను దానం చేసినవాడు చేసినపాపాలన్నీ నశించిపోయి, బ్రహ్మలోకానికి వెళ్తాడు.

సప్తద్వీపమహీద స్స బ్రహ్మజ్ఞానం దదాతి యః ।
అభయం సర్వభూతేభ్యో యో దద్యాత్ సర్వభాఙ్నరః ॥53॥

బ్రహ్మజ్ఞానాన్ని తెలియజేసినవాడు, జంబువు మొదలయిన ఏడుద్వీపాలతో కూడిన భూమిని దానం చేసిన పుణ్యఫలాన్ని పొందుతాడు. అన్నిరకాలయిన ప్రాణులకు భయం పోగొట్టి, ఆదరించినవాడికి కోరికలు అన్నీ సిద్ధిస్తాయి.

పురాణం భారతం వాపి రామాయణమథాపి వా ।
లిఖిత్వా పుస్తకం దత్త్వా భుక్తిం ముక్తి మవాప్నుయాత్ ॥54॥

ఏ దయినా పురాణాన్ని గాని, మహాభారతాన్ని గాని, శ్రీమద్రామాయణాన్ని గాని, వ్రాసి దానం చేసినవాడు భోగాన్ని, మోక్షాన్ని పొందుతాడు.

వేదశాస్త్రం నృత్యగీతం యోఽధ్యాపయతి నాకభాక్ ॥55॥

వేదాలు, ఇతరమయిన శాస్త్రాలు, నాట్యం, సంగీతం, ఈవిద్యలను బోధించినవాడు స్వర్గానికి వెళ్తాడు.

విత్తం దద్యాదుపాధ్యాయే ఛాత్రాణాం భోజనాదికమ్ ।
కిమదత్తం భవేత్తేన ధర్మకామాదిదర్శినా ॥56॥

వేదవిద్యను ఉపదేశించిన గురువుకు దక్షిణలు ఇవ్వాలి. శిష్యులకు భోజనం మొదలయినవి ఇవ్వాలి. ఆ విధంగా చేసినవాడు చేయనిదానం అంటూ ఏదీ లేదు (సమస్తదానాలు చేసినట్లే). ఇంక అతడు ధర్మార్థకామమోక్షాలనేచతుర్విధపురుషార్థాలను సంపాదించడం తెలిసిన మహాత్ముడు.

వాజపేయసహస్రస్య సమ్యగ్దత్తస్య యత్ఫలమ్ ।
తత్ఫలం సర్వమాప్నోతి విద్యాదానాన్న సంశయః ॥57॥

విద్యాదానం చేయడంవలన వేయి (లెక్కలేనన్ని) వాజపేయయాగాలను యథావిధిగా (దానం) చేసిన పుణ్యఫలాన్ని పూర్తిగా పొందుతాడు. ఇందులో సందేహం లేదు.

శివాలయే విష్ణుగృహే సూర్యస్య భవనే తథా ।
సర్వదానప్రదస్సస్యాత్ పుస్తకం వాచయేత్తు యః ॥58॥

శివాలయంలోనూ, విష్ణుదేవాలయంలోనూ, సూర్యదేవాలయంలోనూ పురాణప్రవచనం చేసినవాడు సమస్తమైన దానాలను చేసిన పుణ్యఫలాన్ని పొందుతాడు.

త్రైలోక్యే చతురో వర్ణా శ్చత్వారశ్చాశ్రమాః పృథక్ ।
బ్రహ్మాద్యా దేవతా స్సర్వా విద్యాదానే ప్రతిష్ఠితాః ॥59॥

మూడులోకాలలోనూ బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్రులనే నాలుగువర్ణాలవారూ, బ్రహ్మచర్య, గృహస్థ, వానప్రస్థ, సన్యాసాలనే నాలుగు ఆశ్రమాలవారూ, బ్రహ్మ మొదలయిన దేవతలూ, అందరూ విద్యాదానంలోనే స్థిరంగా నిలిచి ఉన్నారు.

విద్యా కామదుఘా ధేను ర్విద్యా చక్షు రనుత్తమమ్ ।
ఉపవేదప్రదానేన గన్ధర్వై స్సహ మోదతే ॥60॥

విద్య అనేది కోరికలనన్నిటినీ తీర్చే కామధేనువు. విద్య సర్వోత్కృష్టమైన కన్ను. ప్రత్యక్షం, పరోక్షం అయిన పదార్థాల నన్నిటినీ దర్శింపజేస్తుంది. ఆయుర్వేదం, ధనుర్వేదం, గాంధర్వవేదం, స్థాపత్య, శస్త్రవేదం అనే నాలుగు ఉపవేదాలను దానం చేసినవాడు గంధర్వలోకంలో గంధర్వులతో కలిసి ఆనందిస్తాడు.

వేదాఙ్గానాం చ దానేన స్వర్గలోక మవాప్నుయాత్ ।
ధర్మశాస్త్రప్రదానేన ధర్మేణ సహ మోదతే ॥61॥

శిక్ష, వ్యాకరణం, ఛందస్సు, నిరుక్తం, జ్యోతిషం, కల్పం అనే ఆరు వేదాంగాలను దానం చేయడంవలన స్వర్గలోకానికి వెళ్తాడు. ధర్మశాస్త్రాన్ని దానం చేయడంవలన ధర్మరాజుతో కలిసి ఆనందిస్తాడు.

సిద్ధాన్తానాం ప్రదానేన మోక్ష మాప్నోత్యసంశయమ్ ।
విద్యాదాన మవాప్నోతి ప్రదానాత్ పుస్తకస్య తు ॥62॥

వాదప్రతివాదాలలో యథార్థపక్షాన్ని నిశ్చయించే శాస్త్రాన్ని దానం చేసినవాడు నిస్సందేహంగా మోక్షాన్ని పొందుతాడు. గ్రంథాలను దానం చేసినవాడు విద్యాదానం చేసిన పుణ్యఫలాన్ని పొందుతాడు.

శాస్త్రాణి చ పురాణాని దత్త్వా సర్వ మవాప్నుయాత్ ।
శిష్యాంశ్చ శిక్షయేద్యస్తు పౌణ్డరీకఫలం భవేత్ ॥63॥

శాస్త్రాలనూ, పురాణాలనూ దానం చేసినవాడికి కావలసినవి అన్నీ లభిస్తాయి. శిష్యులకు చక్కగా చదువు నేర్పినవాడికి పౌండరీకయాగం చేసినపుణ్యఫలం లభిస్తుంది.

యేన జీవతి తద్దత్త్వా ఫలస్యాన్తో న విద్యతే ॥64॥

బ్రదకడానికి కావలసినవృత్తి మొదలగుదానిని ఇచ్చినవాడికి కలిగేపుణ్యఫలానికి అంతు లేదు.

లోకే శ్రేష్ఠతమం సర్వ మాత్మన శ్చాపి యత్ప్రియమ్ ।
సర్వం పితౄణాం దాతవ్యం తేషామేవాక్షయార్థినా ॥65॥

తమపితరులకు శాశ్వతమైన పుణ్యలోకాలు కలగాలని కోరుకునేవారు, లోకంలో అన్నింటికంటె ఉత్తమమైన పదార్థాలనూ, తనకు చాల ఇష్టమైనపదార్థాలనూ అన్నిటినీ, పితరులకు ఇవ్వాలి.

విష్ణుం రుద్రం పద్మయోనిం దేవీం విఘ్నేశ్వరాదికాన్ ।
పూజయిత్వా ప్రదద్యాద్ యః పూజాద్రవ్యం స సర్వభాక్ ॥66॥

విష్ణుమూర్తినీ, రుద్రుడినీ, బ్రహ్మదేవుడినీ, గౌరీదేవినీ, వినాయకుడు మొదలయిన వారినీ పూజించి, పూజకు ఉపయోగించిన ద్రవ్యాలను బ్రాహ్మణుడికి దానం చేసినవాడు సమస్తమైన కోరికలను పొందుతాడు.

దేవాలయం చ ప్రతిమాం కారయన్ సర్వ మాప్నుయాత్ ।
సమ్మార్జనం చోపలేపం కుర్వన్ స్యాన్నిర్మలః పుమాన్ ॥
నానామణ్డలకార్యగ్రే మణ్డలాధిపతిర్భవేత్ ॥ 67॥

దేవాలయాలను కట్టించేవాడు, దేవతాప్రతిమలను నిర్మింపజేసేవాడు సమస్తమైన కోరికలను పొందుతాడు. దేవాలయాన్ని కడిగి తుడిచేవాడు, ఆవుపేడతో అలకడమూ, దేవాలయానికి సున్నం పూయడమూ మొదలయినపనులు చేసినవాడి పాపాలు అన్నీ నశించిపోతాయి. దేవుడి విగ్రహానికి ఎదురుగుండా, (దేవాలయంలో) రకరకాల మండపాలను నిర్మించినవాడు భూమండలానికి రాజు అవుతాడు.

గన్ధం పుష్పం ధూపదీపనైవేద్యం చ ప్రదక్షిణమ్ ।
ఘణ్టాధ్వజవితానం చ ప్రేక్షణం వాద్యగీతకమ్ ॥
వస్త్రాది దత్త్వా దేవాయ భుక్తిముక్తిమవాప్నుయాత్ ॥68॥

దేవుడికి గంధమూ, పూవులూ, ధూపమూ, దీపమూ, నైవేద్యమూ, ప్రదక్షిణలూ, గంట, పతాకం, జెండాకఱ్ఱలను, అద్దం, సంగీతవాద్యాలు, పాటలు, వస్త్రాలు మొద లైన ఉపచారాలు సమర్పించినవాడు భోగమోక్షాలను పొందుతాడు.

కస్తూరికాం సింహలకం చ శ్రీఖణ్డ మగరుం తథా ।
కర్పూరం చ తథా ముస్తం గుగ్గులుం విజయం దదేత్ ॥
ఘృతప్రస్థేన సంస్నాప్య సంక్రాన్త్యాదౌ స సర్వభాక్ ॥69॥

దేవుడికి, కస్తూరీ, సింహళదేశంలో పుట్టినమంచిగంధమూ, అగరూ, కర్పూరమూ, ముస్తమూ (ఇది ఒకజాతి గడ్డి), గుగ్గులూ, దివ్యమైనరథమూ(మొదలయినవాటిని) సమర్పించాలి. సంక్రమణం మొదలైన పర్వదినాలలో నాలుగుమానికల ఆవునేతితో దేవుడిప్రతిమను చక్కగా స్నానం చేయించినవాడు అన్నికోరికలను పొందుతాడు.

స్నానం పలశతం జ్ఞేయమభ్యఙ్గం పఞ్చవింశతిః ।
పలానాం తు సహస్రేణ మహాస్నానం ప్రకీర్తితమ్ ॥70॥

దేవుడికి నూరుపలాలపరిమాణం కలిగిన నీరు మొదలైన ద్రవ్యాలతో చేసినఅభిషేకానికి స్నానం అని పేరు. (32 పలాలు ఒకప్రస్థం. అంటే పలానికి ఎనిమిది మానికలు) ఇరవైఅయిదుపలాలపరిమాణం కలిగిన ద్రవ్యంతో అభిషేకిస్తే అభ్యంగం అంటారు. వెయ్యిపలాలద్రవ్యంతో అభిషేకిస్తే దానిని మహాస్నానం అంటారు.

దశాపరాధా స్తోయేన క్షీరేణ స్నాపనా చ్ఛతమ్ ।
సహస్రం పయసా దధ్నా ఘృతే నాయుత మిష్యతే ॥71॥

దేవుడికి నీటితో స్నానం చేయిస్తే పదిదోషాలు నశిస్తాయి. ఆవుపాలతో స్నానం చేయిస్తే నూరుదోషాలు పోతాయి. పాలు తోడుపెట్టినపెరుగు అంటే అప్పుడే తోడుకున్నపెరుగుతో స్నానం చేయిస్తే వెయ్యిదోషాలు పోతాయి. ఆవునేతితో స్నానం చేయిస్తే పదివేలపాపాలు నశిస్తాయి.

దాసీదాస మలఙ్కారం గోభూమ్యశ్వగజాదికమ్ ।
దేవాయ దత్త్వా సౌభాగ్యం ధనాయుష్మాన్ వ్రజేద్దివమ్ ॥72॥

దేవుడికి స్త్రీపరిజనాన్ని, పురుషసేవకులను, వివిధమైనఅలంకారాలను, ఆవులనూ, భూమినీ, గుఱ్ఱాలనూ, ఏనుగులనూ, మంగళద్రవ్యాలనూ సమర్పించినవాడికి గొప్పసంపదలు కలుగుతాయి. ఆయువు పెరుగుతుంది. మరణానంతరం అతడు స్వర్గానికి వెళ్తాడు.

ఇత్యాది మహాపురాణే ఆగ్నేయే నానాదానమహిమవర్ణనం నామ ఏకాదశాధికద్విశతతమో உధ్యాయః॥211॥

అగ్నిమహాపురాణంలో నానాదానమహిమవర్ణనం అనే రెండువందల పదకొండవ అధ్యాయం సమాప్తం.



ద్వాదశాధికద్విశతతమో ఽధ్యాయః – రెండువందల పన్నెండవ అధ్యాయం

మేరుదానవర్ణనమ్ – మేరుదానవర్ణనం

అగ్నిరువాచ – వసిష్ఠమహర్షితో అగ్నిదేవుడు ఇలా చెప్తున్నాడు.

కామ్యదానాని వక్ష్యామి సర్వకామప్రదాని తే ।
నిత్యపూజాం మాసి మాసి కృత్వాథో కామ్యపూజనమ్ ॥
వ్రతార్చ్ణణం గురోః పూజా వత్సరాన్తే మహార్చనమ్ ॥1॥

మహర్షీ! ఇక సమస్త మైనకోరికలను తీర్చే కామ్యదానాలను గురించి చెప్తాను. ప్రతినెలలోనూ నిత్యపూజను యథాపూర్వంగా చేస్తూ, ఆతరువాత కామ్యపూజ చేయాలి. ఈ వ్రతంలో గురువును పూజించడం ప్రధానం. సంవత్సరం చివరలో మహాపూజ చేయాలి.

అశ్వం వై మార్గశీర్షే తు కమలం పిష్టసమ్భవమ్ ।
శివాయ పూజ్య యో దద్యాత్ సూర్యలోకే చిరం వసేత్ ॥2॥

మార్గశిరమాసంలో శివుడిని పూజించి, పిండితో చేసిన గుఱ్ఱాన్నీ, తామరపూవునూ శివభావనతో బ్రాహ్మణుడికి దానం చేయాలి. అలా చేసినవాడు చాలకాలం సూర్యలోకంలో నివసిస్తాడు.

గజం పౌషే పిష్టమయం త్రిసప్తకుల ముద్ధరేత్ ।
మాఘే చాశ్వరథం పైష్టం దత్త్వా న నరకం వ్రజేత్ ॥
ఫాల్గుణే తు వృషం పైష్టం స్వర్గభుక్ స్యాన్మహీపతిః ॥3॥

పుష్యమాసంలో పరమేశ్వరుడిని పూజించి, అనంతరం పిండితో చేసిన ఏనుగును దానం చేసినవాడు ఇరవైయొక్కతరాల వారిని నరకాదులైన అధోలోకాలనుండి ఉద్ధరిస్తాడు. మాఘమాసంలో శివపూజ చేసి, పిండితో చేసిన గుఱ్ఱాలు పూన్చినరథం దానం చేసినవాడు నరకానికి వెళ్లడు. ఫాల్గుణ మాసంలో శివపూజానంతరం పిండితో చేసిన ఆబోతును దానం చేసినవాడు స్వర్గలోకానికి వెళ్లి అక్కడ సుఖాలను అనుభవిస్తాడు. తరువాతిజన్మలో భూలోకంలో మహారాజు అవుతాడు.

చైత్రే చేక్షుమయాగారం దాసదాసీసమన్వితమ్ ।
దత్త్వా స్వర్గే చిరం స్థిత్వా తదన్తే స్యా న్మహీపతిః ॥4॥

చైత్రమాసంలో దాసీజనంతోనూ, సేవకులతోనూ కూడినదీ, చెరకుతో నిండినదీ అయిన ఇంటిని దానం చేసినవాడు స్వర్గంలో చాలాకాలం నివసిస్తాడు. ఆతరువాత తిరిగి భూలోకంలో పుట్టి, మహారాజు అవుతాడు.

సప్తవ్రీహీం శ్చ వైశాఖే దత్త్వా శివమయో భవేత్ ।
బలిమణ్డలకం చాన్నైః కృత్వాషాఢే శివో భవేత్ ॥5॥

వైశాఖమాసంలో ఏడువిధాలయిన ధాన్యాలను దానం చేసినవాడు శివస్వరూపుడు అవుతాడు. ఆషాఢమాసంలో ఆహారపదార్థాలతో మండలాకారంలో బలిని ఇచ్చేవాడు శివుడు అవుతాడు.

విమానం శ్రావణే పౌష్పం దత్త్వా స్వర్గీ తతో నృపః ।
శతద్వయం ఫలానాం తు దత్త్వోద్ధృత్య కులం నృపః ॥6॥

శ్రావణమాసంలో పూవులతో చేసిన రథాన్ని దానం చేసినవాడు స్వర్గలోకంలో నివసిస్తాడు. తరువాతి జన్మలో భూలోకంలో మహారాజు అవుతాడు. రెండువందలపండ్లు దానం చేసినవాడు తన వంశాన్ని నరకలోకాలనుండి ఉద్ధరించి, స్వర్గానికి వెళ్తాడు. మరుజన్మలో మహారాజు అవుతాడు.

గుగ్గులాది దదేద్ భాద్రే స్వర్గీ స స్యాత్తతో నృపః ।
క్షీరసర్పిర్భృతం పాత్ర మాశ్వినే స్వర్గదం భవేత్ ॥7॥

భాద్రపదమాసంలో గుగ్గులం మొదలైనద్రవ్యాలను దానం చేసినవాడు స్వర్గంలో నివసిస్తాడు. తరువాత భూలోకంలో పుట్టి, మహారాజు అవుతాడు. ఆశ్వయుజమాసంలో ఆవుపాలతోనూ, ఆవునేతితోనూ నిండినపాత్రను దానం చేస్తే, స్వర్గలోకం కలుగుతుంది.

కార్తికే గుడఖణ్డాజ్యం దత్త్వా స్వర్గీ తతో నృపః ॥8॥

కార్తికమాసంలో బెల్లంముక్కలు, ఆవునేయి దానం చేసినవాడు స్వర్గంలో నివసిస్తాడు. తరువాత భూలోకంలో పుట్టి, మహారాజు అవుతాడు.

సర్వేషాం చైవ మేరూణాం ప్రమాణం క్రమశశ్శృణు ।
మేరుదానం ద్వాదశకం వక్ష్యేఽహం భుక్తిముక్తిదమ్ ॥9॥

మేరుదానం అనేదానం భోగమోక్షాలను ఇస్తుంది. ఆ దానం పన్నెండువిధాలు. ఇపుడు వాటిని గురించి చెప్తాను. పన్నెండువిధాలయిన ఆ మేరుదానాలలో వాటివాటిప్రమాణం ఎంతో క్రమంగా చెప్తాను. విను.

మేరువ్రతే తు కార్తిక్యాం రత్నమేరుం దదేద్ ద్విజే ।
వజ్రపద్మమహానీలనీలస్ఫటికసంజ్ఞితః ॥10॥

కార్తికమాసంలో పూర్ణిమనాడు మేరుదానవ్రతంలో బ్రాహ్మణుడికి రత్నమేరువును దానం చేయాలి. వజ్రాలు, పద్మరాగాలు, మహానీలాలు, నీలాలు, స్ఫటికాలు, (తరువాతి శ్లోకముతో అన్వయము)

పుష్పం మరకతం ముక్తా ప్రస్థమాత్రేణ చోత్తమః ।
మధ్యోఽర్ధ స్స్యా త్తదర్ధోఽధో విత్తశాఠ్యం వివర్జయేత్ ॥11॥

పుష్పాలు, మరకతాలు, ముత్యాలు వీటిని ఒకప్రస్థం (నాలుగుమానికలు) దానం చేస్తే అది ఉత్తమం. దానిలో సగం పరిమాణంలో అంటే రెండుమానికలు దానం చేస్తే అది మధ్యమం. దానిలో సగం అంటే ఒకమానెడు

దానం చేస్తే అది అధమదానం అవుతుంది. ఈ దానం విషయంలో ఎప్పుడూ సంపదను దాచుకోగూడదు. అంటే పిసినిగొట్టుతనం పనికిరాదు.

కర్ణికాయాం న్యసే న్మేరుం బ్రహ్మవిష్ణీశదైవతమ్ ।
మాల్యవాన్ పర్వతః పూజ్య స్తత్పూర్వే భద్రసంజ్ఞితః ॥12॥

అశ్వరక్ష స్తతః ప్రోక్తో నిషధో మేరుదక్షిణే ।
హేమకూటోఽథ హిమవాం స్త్రయం సౌమ్యే తథా త్రయమ్ ॥13॥

నీల శ్శ్వేతశ్చ శృఙ్గీ చ పశ్చిమే గన్ధమాదనః ।
వైకఙ్కః కేతుమాల స్స్యా న్మేరు ర్ద్వాదశసంయుతః ॥14॥

పూజ్యస్థలంలో తామరపూవును నిర్మించాలి. ఆ పూవుకర్ణికలో (నడిమిభాగంలో) మేరుపర్వతాన్ని ఉంచాలి. దానికి (నడుమ మూడు శిఖరాలు ఉండాలి. 19 శ్లో. ఆ శిఖరాలకు బ్రహ్మ, విష్ణువు, పరమేశ్వరుడు దేవతలు. ఆ మేరువుకు తూర్పుదిక్కున మూడురేకులలో క్రమంగా 1. మాల్యవంతం, 2. భద్రం, 3. అశ్వరక్షం, అనే పర్వతాలను ఉంచి పూజించాలి. మేరువుకు దక్షిణదిగ్భాగంలో ఉన్నమూడుదళాలలో 1. నిషధం, 2. హేమకూటం, 3. హిమవంతం అనే మూడుపర్వతాలను ఉంచి పూజించాలి. మేరువుకు ఉత్తరదిగ్భాగంలో ఉన్నమూడుదళాలలో కూడా అదే విధంగా మూడు పర్వతాలను పూజించాలి. అవి 1. నీలం, 2. శ్వేతం, 3. శృంగి అనే పర్వతాలు. మేరువుకు పశ్చిమదిగ్భాగంలో ఉన్నమూడుదళాలలో 1. గంధమాదనం, 2. వైకంకం, 3. కేతుమాలం అనేపర్వతాలను పూజించాలి. ఈవిధంగా మేరువు పన్నెండు పర్వతాలతో కూడిఉంటుంది.

సోపవాసోఽర్చయేద్ విష్ణుం శివం వా స్నానపూర్వకమ్ ।
దేవాగ్రే చార్చ్య మేరుం చ మన్త్రై ర్విప్రాయ వై దదేత్ ॥15॥

స్నానం చేసి, ఉపవాసం ఉండి, విష్ణువును గానీ, పరమేశ్వరుడిని గానీ పూజించాలి. ఆ దేవుడికి ఎదురుగా మేరువును పూజించి, ఆ మేరువును మంత్రపూర్వకంగా బ్రాహ్మణుడికి దానం చేయాలి.

విప్రాయాముకగోత్రాయ మేరుం ద్రవ్యమయం పరమ్ ।
భుక్త్యై ముక్త్యై నిర్మలత్వే విష్ణుదైవం దదామి తే ॥16॥

"నాకు ముందుగా భోగాలూ, తరువాత మోక్షమూ సిద్ధించడానికీ, నేను చేసినపాపా లన్నీ నశించిపోవడానికీ, మేరుద్రవ్యరూపంలో ఉన్న ఈవిష్ణుదేవుడిని ఈగోత్రానికి సంబంధించినవాడవూ, బ్రాహ్మణుడవూ అయిన నీకు ఇచ్చుచున్నాను" అని చెప్పి మేరుదానం చేయాలి.

ఇన్ద్రలోకే బ్రహ్మలోకే శివలోకే హరేః పురే ।
కుల ముద్ధృత్య క్రీడేత విమానే దేవపూజితః ॥17॥

ఈ విధంగా మేరుదానం చేసినవాడు తనకులంవారి నందరినీ, నరకలోకాలనుండి ఉద్ధరిస్తాడు. తాను దేవతలందరూ పూజిస్తుండగా, ఇంద్రలోకంలోనూ, బ్రహ్మలోకంలోనూ, శివలోకంలోనూ, విష్ణులోకంలోనూ విమానంమీద విహరిస్తాడు.

అన్యేష్వపి చ కాలేషు సంక్రాన్త్యాదౌ ప్రదాపయేత్ ॥18॥

కార్తికపూర్ణిమనాడు మాత్రమే కాక, సంక్రమణం మొదలైన ఇతరసమయాలలో కూడ ఈవిధంగా మేరుదానం చేయ(యించ)వచ్చు. (ఎప్పుడు చేసినా, ఫలితం పూర్వం చెప్పినవిధంగానే లభిస్తుంది)

పలానాం తు సహస్రేణ హేమమేరుం ప్రకల్పయేత్ ।
శృఙ్గత్రయసమాయుక్తం బ్రహ్మవిష్ణుహరాన్వితమ్ ॥19॥

వెయ్యిపలాలబరువు గలిగినబంగారంతో బంగారపుమేరుపర్వతాన్ని నిర్మించాలి. దానికి మూడు శిఖరాలు ఏర్పాటు చేయాలి. ఆశిఖరాలపై క్రమంగా బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులను స్థాపించాలి.

ఏకైకం పర్వతం తస్య శతైకైకేన కారయేత్ ।
మేరుణా సహ శైలాస్తు ఖ్యాతా స్తత్ర త్రయోదశ ॥20॥

మేరుపర్వతం చుట్టూ నాలుగుదిక్కులలోనూ ఉండే పర్వతాలను ఒక్కొక్కటి నూరుపలాల బంగారంతో నిర్మించాలి. మేరువుకు నాలుగుదిక్కులలోనూ మూడు చొప్పున ఉన్న పన్నెండుపర్వతాలతో కలిసి, మేరుపర్వతంతో సహా మొత్తం పదమూడుపర్వతాలు ఉంటాయి.

అయనే గ్రహణాదౌ చ విష్ణ్వగ్రే హరి మర్చ్య చ ।
స్వర్ణమేరుం ద్విజాయార్ప్య విష్ణులోకే చిరం వసేత్ ॥
పరమాణవో యావన్త ఇహ రాజా భవే చ్చిరమ్ ॥21॥

ఉత్తరాయణం మొదలయిన అయనాలు, సూర్యచంద్రగ్రహణాలు మొదలయిన సమయాలలో శ్రీమహావిష్ణుమూర్తినీ, స్వామికి ఎదురుగా బంగారుమేరువునూ స్థాపించుకుని పూజించాలి. తరువాత ఆమేరువును బ్రాహ్మణుడికి సమర్పించాలి. అలా చేసినవాడు చిరకాలం విష్ణులోకంలో నివసిస్తాడు. ఆ తరువాత భూలోకంలో పుట్టి, భూమండలంలో ఎన్ని పరమాణువులు ఉన్నవో అంతకాలం చిరస్థాయిగా మహారాజుగా ఉంటాడు. (ద్వాదశమేరువులలో స్వర్ణమేరువు మొదటిది)

రౌప్యమేరుం ద్వాదశాద్రియుతం సఙ్కల్పతో దదేత్ ।
ప్రాగుక్తం చ ఫలం తస్య విష్ణుం విప్రం ప్రపూజ్య చ ॥22॥

ఇదే విధంగా చుట్టూ పన్నెండు పర్వతాలను స్థాపించి, నడుమ వెండితో చేసినమేరువును ఉంచాలి. ఇంతకు ముందు చెప్పినవిధంగా విష్ణుమూర్తిని, వెండిమేరువునూ పూజించాలి. ఆ తరువాత బ్రాహ్మణుడిని

విష్ణుస్వరూపుడుగా పూజించి, వెండిమేరువును సంకల్పపూర్వకంగా (17 శ్లోకం) దానం ఇవ్వాలి. అలా చేసినవాడికి బంగారుమేరువు దానం చేసినవాడికి కలిగేఫలితమే కలుగుతుంది. (ద్వాదశమేరువులలో రజతమేరువు రెండవది)

భూమిమేరుం చ విషయం మణ్డలం గ్రామ మేవ చ ।
పరికల్ప్యాష్టమాంశేన శేషాంశాః పూర్వవత్ ఫలమ్ ॥23॥

దేశంలో గానీ, కొన్నిగ్రామాల సముదాయంలో గానీ, గ్రామంలో గానీ ఎనిమిదవభాగంతో భూమిమేరువును కల్పించుకోవాలి. దానిచుట్టూ పన్నెండుదళాలలోనూ పన్నెండుపర్వతాలను మిగిలిన అంశలతో నిర్మించాలి. దీనిని ఇంతకు ముందు లాగా విష్ణువుతో పూజించాలి. తరువాత దానిని బ్రాహ్మణుడికి దానం చేయాలి. ఇలా చేసినవాడికి పూర్వం చెప్పినపుణ్యఫలమే కలుగుతుంది. (ద్వాదశమేరువులలో భూమిమేరువు మూడవది)

ద్వాదశాద్రిసమాయుక్తం హస్తిమేరుస్వరూపిణమ్ ।
దదేత్ త్రిపురుషై ర్యుక్తం దత్త్వానన్తఫలం లభేత్ ॥24॥

చుట్టూ పన్నెండు పర్వతాలస్థానంలో ఏనుగులను ఏర్పాటు చేయాలి. వాటికి నడుమ బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులస్థానంలోనూ ఏనుగులను స్థాపించాలి. బ్రహ్మాదులను చక్కగా పూజించి, ఆ ఏనుగులమేరువును బ్రాహ్మణుడికి దానం చేయాలి. అలా చేసినవాడికి అంతులేని పుణ్యఫలం కలుగుతుంది. (ద్వాదశమేరువులలో హస్తిమేరువు నాలుగవది)

త్రిపఞ్చాశ్వై రశ్వమేరుం హయద్వాదశసంయుతమ్ ।
విష్ణ్వాదీన్ పూజ్య తం దత్త్వా భుక్తభోగో నృపో భవేత్ ॥25॥

అశ్వమేరువును పదిహేను గుఱ్ఱాలతో ఏర్పాటు చేయాలి. (నడుమ బ్రహ్మవిష్ణుశివాత్మకంగా మూడూ) చుట్టూ పన్నెండు గుఱ్ఱాలు ఉండాలి. శ్రీమహావిష్ణువునూ, మేరువులనూ పూజించి, ఇంతకు ముందు చెప్పినప్రకారంగా ఆ అశ్వమేరువును బ్రాహ్మణుడికి దానం చేసినవాడు స్వర్గసుఖాలు అనుభవించి, మహారాజు అవుతాడు. (ద్వాదశమేరువులలో అశ్వమేరువు ఐదవది)

అశ్వసంఖ్యాప్రమాణేన గోమేరుం పూర్వవద్దదేత్ ॥26॥

పూర్వం అశ్వమేరువులో గుఱ్ఱాలు ఉంచిన సంఖ్యలెక్కలోనే ఆవులను ఉంచితే, అది గోమేరువు అవుతుంది. దీనిని దానం చేస్తే పుణ్యఫలం పూర్వప్రకారంగా లభిస్తుంది. (ద్వాదశమేరువులలో గోమేరువు ఆఱవది)

పట్టవస్త్రైర్భారమాత్రై ర్వస్త్రమేరుశ్చ మధ్యతః ।
శైలై ర్ద్వాదశవస్త్రైశ్చ దత్త్వా తం చాక్షయం ఫలమ్ ॥27॥

రెండువేలపలాలబరువు కలిగిన పట్టువస్త్రాలతో వస్త్రమేరువును మధ్యలో ఏర్పాటుచేయాలి. దానికి చుట్టూ పన్నెండుపర్వతాల(దళాల)స్థానంలో పన్నెండు పట్టువస్త్రాలు ఉంచాలి. ఇక్కడ పూర్వంలాగా పూజాదానాదులు చేసినవాడికి శాశ్వతమైనపుణ్యఫలం లభిస్తుంది. (ద్వాదశమేరువులలో వస్త్రమేరువు ఏడవది)

ఘృతపఞ్చసహస్రైశ్చ పలానామాజ్యపర్వతః ।
శతం పఞ్చభి రేకైకః పర్వతేఽస్మిన్ హరిం యజేత్ ॥
విష్ణవే బ్రాహ్మణా యార్ప్యం సర్వం ప్రాప్య హరిం వ్రజేత్ ॥28॥

అయిదువేలపలాల పరిమాణం కలిగిన ఆవునేతితో ఆజ్యపర్వతం ఏర్పాటు చేయాలి. దానికి చుట్టూ పన్నెండు పర్వతాలను ఒక్కొక్కదానిని అయిదువందలపలాల పరిమాణం కలిగిన నేతితో ఉంచాలి. ఈ ఘృతమేరువులో శ్రీమహావిష్ణువును పూజించాలి. ఆ ఘృతమేరువుమొత్తం విష్ణుస్వరూపుడయిన బ్రాహ్మణుడికి దానం చేయాలి. అలా చేసినవాడు శ్రీహరిని చేరుకుంటాడు. (ద్వాదశమేరువులలో ఘృతమేరువు ఎనిమిదవది)

ఏవం చ ఖండమేరుం చ కృత్వా దత్త్వాప్నుయాత్ ఫలమ్ ॥29॥

ఇదే విధమయిన పరిమాణంలో పటికబెల్లంతో మేరువునూ, చుట్టూ పర్వతాలను సిద్ధం చేసి, పూర్వంలాగా పూజాదానాలు చేసినవాడికి కూడ ఘృతమేరుదానంవలన కలిగే పుణ్యఫలం కలుగుతుంది.(ద్వాదశమేరువులలో ఖండమేరువు తొమ్మిదవది)

ధాన్యమేరుః పఞ్చఖారోఽపర ఏకైకఖారకాః ।
స్వర్ణత్రిశృఙ్గకా స్సర్వే బ్రహ్మవిష్ణుమహేశ్వరాన్ ॥
సర్వేషు పూజ్య విష్ణుం వా విశేషా దక్షయం ఫలమ్ ॥30॥

అయిదుపుట్ల ధాన్యంతో నడుమ ఉండే మేరువును నిర్మించాలి. దాని చుట్టూ ఉండే పన్నెండుపర్వతాలను ఒక్కొక్కదానిని ఒక్కపుట్టిధాన్యంతో ఏర్పాటు చేయాలి. ఈ పర్వతాలు అన్నింటికీ మూడు శిఖరాలు ఉండాలి. వాటిని బంగారంతో నిర్మించాలి. ఆశిఖరాలపై బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులను పూజించాలి. శ్రీమహావిష్ణువును విశేషంగా పూజించాలి. ఇలా చేసినవాడికి ఎన్నటికీ తరగనిపుణ్యఫలం కలుగుతుంది. (ద్వాదశమేరువులలో ధాన్యమేరువు పదవది)

ఏవం దశాంశమానేన తిలమేరుం ప్రకల్పయేత్ ।
శృఙ్గాణి పూర్వవ త్తస్య తథైవాన్యనగేషు చ ॥
తిలమేరుం ప్రదాయాథ బన్ధుభి ర్విష్ణులోకభాక్ ॥31॥

పూర్వం చెప్పిన ధాన్యంలో పదవవంతు పరిమాణంతో అంటే, అరపుట్టినువ్వులతో తిలమేరువు నిర్మించాలి. దానికి శిఖరాలు పూర్వంలాగానే బంగారుమయం చేయాలి. దానికి చుట్టూఉండే పర్వతాలు కూడ ఇదే విధంగా పదవవంతు పరిమాణంలో నిర్మించాలి. వాటికీ మూడు శిఖరాలు ఉండాలి. అటువంటి తిలమేరువును పూజించి, బ్రాహ్మణుడికి దానం చేసినవాడు, బంధువులతో సహా విష్ణులోకానికి వెళ్తాడు. (ద్వాదశమేరువులలో తిలమేరువు పదకొండవది)

నమో విష్ణుస్వరూపాయ ధరాధరాయ వై నమః ।
బ్రహ్మవిష్ణీశశృఙ్గాయ ధరానాభిస్థితాయ చ ॥
నగద్వాదశనాథాయ సర్వపాపాపహారిణే ॥32॥

విష్ణుస్వరూపమయిన మేరుపర్వతానికి నమస్కారం. బ్రహ్మ, విష్ణువు, ఈశ్వరుడు శిఖరాలుగా కలిగి ఉన్న మేరువుకు నమస్కారం. భూమండలానికి నాభిస్థానంలో నడుమ ఉన్న మేరువుకు నమస్కారం. చుట్టూ ఉన్న పన్నెండుపర్వతాలకు అధిపతి అయిన మేరుపర్వతానికి నమస్కారం. సమస్తమయిన పాపాలను నాశనం చేసే మేరువుకు నమస్కారం.

విష్ణుభక్తాయ శాన్తాయ త్రాణం మే కురు సర్వదా ।
నిష్పాపః పితృభి స్సార్ధం విష్ణుం గచ్ఛామి ఓం నమః ॥33॥

నేను శ్రీమహావిష్ణువునందు భక్తి కలిగినవాడిని, రాగద్వేషాదులు లేనివాడిని. పాపాలు నశించినవాడిని. ఇటువంటినన్ను ఎల్లప్పుడూ నీవే రక్షించు. శ్రీమహావిష్ణువు అనుగ్రహంవలన నేను నాపితరులతో కలిసి విష్ణువును చేరుకుందును గాక! ప్రణవస్వరూపుడవైన మేరువా! నీకు నమస్కారం.

త్వం హరి స్తు హరే రగ్రే అహం విష్ణు శ్చ విష్ణవే ।
నివేదయామి భక్త్యా తు భుక్తిముక్త్యర్థహేతవే ॥34॥

ఓ మేరువా! నీవు విష్ణువువి. శ్రీమహావిష్ణువుసమక్షంలో ఉన్న నేను కూడా విష్ణువునే. విష్ణుస్వరూపు డయిన బ్రాహ్మణుడికి భక్తితో నిన్ను సమర్పించుకుంటున్నాను. దీనివలన నాకు భోగమోక్షాలు సిద్ధించును గాక!

ఇత్యాది మహాపురాణే ఆగ్నేయే మేరుదానవర్ణనమ్ నామ ద్వాదశాధికద్విశతతమో உధ్యాయః ॥212॥

అగ్నిమహాపురాణంలో మేరుదానవర్ణనం అనే రెండువందల పన్నెండవ అధ్యాయం సమాప్తం.



త్రయోదశాధికద్విశతతమోఽధ్యాయః - రెండువందల పదమూడవ అధ్యాయం

పృథ్వీదానవర్ణనమ్ - భూదానవర్ణనం

అగ్నిరువాచ - వశిష్ఠమహర్షితో అగ్నిదేవుడు ఇలా చెప్తున్నాడు.

పృథ్వీదానం ప్రవక్ష్యామి, పృథివీ త్రివిధా మతా ।
శతకోటి ర్యోజనానాం సప్తద్వీపా ససాగరా ॥
జమ్బూద్వీపావధి స్సా చ హ్యుత్తమా మేదినీరితా ॥1॥

మహర్షీ! ఇపుడు పృథ్వీదానం గురించి చెప్తాను. పృథివి మూడు విధాలు. నూరుకోట్లయోజనాల వైశాల్యం కలిగి, ఏడు ద్వీపాలతోనూ, (ఏడు) సముద్రాలతోనూ కూడి, జంబూద్వీపం వరకు ఉన్నది ఉత్తమం. దానిని మేదిని (పృథివి) అంటారు.

ఉత్తమాం పఞ్చభిర్భారైః కాఞ్చనైశ్చ ప్రకల్పయేత్ ।
తదర్ధాన్తరజం కూర్మం తథా పద్మం సమాదిశేత్ ॥2॥

అయిదుభారాలపరిమాణం కలిగిన బంగారంతో నిర్మించినది (పృథివి) ఉత్తమం. దానిలో సగం (రెండుభారాలు) బంగారంతో ఏర్పరచినదానికి కూర్మం అని పేరు. అందులో సగం (ఒకభారం) బంగారంతో నిర్మించిన దానిని పద్మం అని పేర్కొంటారు.

ఉత్తమా కథితా పృథ్వీ ద్వ్యంశే నైవ తు మధ్యమా ।
క న్యాసా చ త్రిభాగేన త్రిహాన్యా కూర్మపఙ్కజే ॥3॥

(అయిదు భారాల బంగారంతో ఏర్పడిన) ఉత్తమమైన దానికి పృథ్వి అని పేరు. రెండుభాగాలతో (రెండుభారాల బంగారంతో) నిర్మించినది మధ్యమం. దీనిని కూర్మం అంటారు. మూడవభాగంతో (ఒకభారం బంగారంతో) నిర్మించినది కనిష్ఠం. దీనిని పంకజం అంటారు.

పలానాం తు సహస్రేణ కల్పయేత్ కల్పపాదపమ్ ।
మూలదణ్డం సపత్రం చ ఫలపుష్పసమన్వితమ్ ॥
పఞ్చస్కన్ధం తు సఙ్కల్ప్య పఞ్చానాం దాపయేత్ సుధీః ॥4॥

వేయిపలాలబరువు కలిగిన బంగారంతో కల్పవృక్షాన్ని నిర్మించాలి. ఆ కల్పవృక్షానికి వేళ్లు, కాండం, ఆకులు, పండ్లు, పూలు, అయిదుకొమ్మలు ఉండాలి. బుద్ధిమంతుడు ఇలా ఉన్నకల్పవృక్షాన్ని (యజమానిచేత) సంకల్పపూర్వకంగా అయిదుగురు బ్రాహ్మణులకు దానం చేయించాలి.

ఏతద్దాతా బ్రహ్మలోకే పితృభి ర్మోదతే చిరమ్ ॥5॥

కల్పవృక్షాన్ని దానం చేసినవాడు చాలకాలం బ్రహ్మలోకంలో తనపితరులతో కూడి ఆనందంగా నివసిస్తాడు. (తనవంశంలో పూర్వులను కూడ అధోలోకాలనుండి ఉద్ధరించి, బ్రహ్మలోకానికి తీసుకునివెళ్తాడు)

విష్ణ్వగ్రే కామధేనుం తు పలానాం పఞ్చభిశ్శతైః ॥6॥

అయిదువందల పలాలబరువు కలిగిన బంగారంతో కామధేనువును నిర్మించి, దానిని శ్రీమహావిష్ణువు సన్నిధానంలో బ్రాహ్మణుడికి దానం చేయాలి.

బ్రహ్మవిష్ణుమహేశాద్యా దేవా ధేనౌ వ్యవస్థితాః ।
ధేనుదానం సర్వదానం సర్వదం బ్రహ్మలోకదమ్ ॥7॥

బ్రహ్మ, విష్ణువు, మహేశ్వరుడు మొదలుగా దేవతలందరు ఆవులో స్థిరంగా ఉంటారు. అందుచేత ఆవును దానం చేస్తే, సమస్తదానాలు చేసినట్లే. గోదానం సమస్త మైన కోరికలను నెరవేరుస్తుంది. పిదప బ్రహ్మలోకనివాసం కలిగిస్తుంది.

విష్ణ్వగ్రే కపిలాం దత్త్వా తారయేత్ సకలం కులమ్ ।
అలఙ్కృత్య స్త్రియం దద్యాదశ్వమేధఫలం లభేత్ ॥8॥

శ్రీమహావిష్ణువు సన్నిధిలో కపిలగోవును దానం చేస్తే, వాడివంశం అంతటినీ ఆ దానం తరింపజేస్తుంది. స్త్రీని చక్కగా అలంకరించి దానం చేస్తే అశ్వమేధయాగం చేసిన పుణ్యఫలం లభిస్తుంది.

భూమిం దత్త్వా సర్వభాక్ స్యాత్ సర్వసస్యప్రరోహిణీమ్ ।
గ్రామం వాథ పురం వాపి ఖేటకం చ దదత్ సుఖీ ॥9॥

అన్ని రకాలపంటలను పుష్కలంగా పండించే నేలను దానం చేస్తే, కోరినవన్నీ లభిస్తాయి. గ్రామం గానీ, పట్టణం గానీ, పల్లెను గానీ దానం చేసినవాడు సుఖపడతాడు.

కార్తిక్యాదౌ వృషోత్సర్గం కుర్వంస్తారయతే కులమ్ ॥10॥

కార్తికపూర్ణిమ మొదలయిన సమయాలలో ఊరికి ఆబోతును విడిచిపెడితే, వాడు తన వంశం అంతటికీ ఉత్తమలోకాలు కలుగజేస్తాడు.

ఇత్యాది మహాపురాణే ఆగ్నేయే పృథ్వీదానవర్ణనమ్ నామ త్రయోదశాధికద్విశతతమోఽధ్యాయః॥213॥

అగ్నిమహాపురాణంలో భూదానవర్ణనం అనే రెండువందల పదమూడవ అధ్యాయం సమాప్తం.



చతుర్దశాధికద్విశతతమో௨ధ్యాయః – రెండువందల పద్నాల్గవ అధ్యాయం

నాడీచక్రకథనమ్ – నాడీచక్రకథనం

అగ్నిరువాచ – వశిష్ఠమహర్షితో అగ్నిదేవుడు ఇలా చెప్తున్నాడు.

నాడీచక్రం ప్రవక్ష్యామి యజ్జ్ఞానాజ్ జ్ఞాయతే హరిః ।
నాభే రధస్తాద్యత్ కన్ద మఙ్కురా స్తత్ర నిర్గతాః ॥1॥

ఇక ఇప్పుడు నాడీచక్రం గురించి చెప్తాను. నాడీచక్రజ్ఞానం వలన శ్రీమహావిష్ణుజ్ఞానం కలుగుతుంది. శరీరంలో నాభికి క్రిందుగా మూలం (మూలాధారం) ఉంటుంది. దానినుండి నాడులు వెలువడుతాయి.

ద్వాసప్తతిసహస్రాణి నాభిమధ్యే వ్యవస్థితాః ।
తిర్యగూర్ధ్వమధశ్చైవ వ్యాప్తం తాభిస్సమన్తతః ॥2॥

బొడ్డునడుమ డెబ్భైరెండువేలనాడులు ఉంటాయి. అవి శరీరంలో ప్రక్కలకూ, పైకీ, క్రిందికీ నాభిచుట్టూ శరీరం అంతటా వ్యాపించి ఉంటాయి.

చక్రవత్ సంస్థితా హ్యేతాః ప్రధానా దశ నాడయః ।
ఇడా చ పిఙ్గలా చైవ సుషుమ్నా చ తథైవ చ ॥3॥

గాన్ధారీ హస్తిజిహ్వా చ పృథా చైవ యశా తథా ।
అలమ్బుసా హుహూ శ్చైవ శఙ్ఖినీ దశమీ స్మృతా ॥4॥

అవి చక్రం ఆకారంలో శరీరం అంతటా నిండిఉంటాయి. (అందుకే ఇది నాడీచక్రం) ఆ72వేలనాడులలోనూ పదినాడులు చాల ప్రధానమైనవి. అవి 1. ఇడ, 2. పింగళ, 3. సుషుమ్న, 4. గాంధారి, 5. హస్తిజిహ్వ, 6. పృథ, 7. యశ, 8. అలంబుస, 9. హుహువు, 10. శంఖిని అనేది పదవది.

దశ ప్రాణవహా హ్యేతా నాడయః పరికీర్తితాః ।
ప్రాణో௨పాన స్సమానశ్చ ఉదానో వ్యాన ఏవ చ ॥5॥

నాగః కూర్మో௨థ కృకరో దేవదత్తో ధనఞ్జయః ॥
ప్రాణస్తు ప్రథమో వాయు ర్దశానామపి స ప్రభుః ॥6॥

ఈ పదినాడులు కూడా ప్రాణ (మొద లయిన పది) వాయువులను శరీర మంతటా సంచరింపజేస్తాయి. 1. ప్రాణం, 2. అపానం, 3. సమానం, 4. ఉదానం, 5. వ్యానం, 6. నాగం, 7. కూర్మం, 8. కృకరం, 9. దేవదత్తం, 10. ధనంజయం అనేవి ఆ పదివాయువులు. వీటిలో ప్రాణం అనేవాయువు ప్రధాన మైనది. మొత్తం పదివాయువులకు ప్రాణవాయువు అధిపతి.

ప్రాణః ప్రాణాయతే ప్రాణం విసర్గాత్ పూరణం ప్రతి ।
నిత్య మాపూరయ త్యేషః ప్రాణినా మురసి స్థితః ॥7॥

ప్రాణవాయువు ప్రాణులకు జీవం కల్పిస్తుంది. అపానాదులద్వారా శరీరంనుండి వెడలిపోయిన వాయువు స్థానాన్ని ఈప్రాణం ఎల్లవేళలలోనూ పూరిస్తుంటుంది. ఈప్రాణవాయువు ప్రాణు లన్నింటిలోనూ హృదయభాగంలో ఉంటుంది.

నిఃశ్వాసోచ్ఛ్వాసకాసైస్తు ప్రాణో జీవసమాశ్రితః ।
ప్రయాణం కురుతే యస్మాత్ తస్మాత్ ప్రాణః ప్రకీర్తితః ॥8॥

జీవుడిని ఆశ్రయించిఉన్న ఈ ప్రాణవాయువు నిశ్శ్వాసం, ఉచ్ఛ్వాసం, కాస(తుమ్ము, దగ్గు) అనేవాటిద్వారా శరీరంలో (వెలుపలికీ, లోపలికీ) ప్రయాణం చేస్తూ ఉంటుంది. ఇలా నిత్యమూ ప్రయాణం చేస్తుంటుంది కాబట్టే దీనికి ప్రాణం అనేపేరు వచ్చింది.

అధో నయత్యపానస్తు ఆహారస్తు నృణామధః ।
మూత్రశుక్రవహో వాయురపానస్తేన కీర్తితః ॥9॥

అపానవాయువు ప్రాణులలో ఆహారాన్ని కిందకు తీసుకునివెళ్తుంది. అలాగే మూత్రాన్నీ, శుక్రాన్నీ గూడ శరీరంలో కిందివైపుగా తీసుకునివెళ్తుంది. ఆహారాదులను శరీరం నుండి వెలుపలికి పంపించేది కావడంచేత ఈవాయువుకు అపానం అనే పేరు కలిగింది.

పీతభక్షితమాఘ్రాతం రక్తపిత్తకఫానిలమ్ ।
సమం నయతి గాత్రేషు సమానో నామ మారుతః ॥10॥

సమానం అనేవాయువు త్రాగిన ద్రవపదార్థాలనూ, తిన్నఘనపదార్థాలనూ, వాసనచూసిన పదార్థాలనూ; రక్తం, పిత్తం, కఫం, వాతం అనేవాటినీ శరీరం అంతటా సమానంగా నడిపిస్తుంటుంది. అందువల్లనే ఆవాయువుకు సమానవాయువు అనేపేరు కలిగింది.

స్పన్దయత్యధరం వక్త్రం నేత్రరాగప్రకోపనమ్ ।
ఉద్వేజయతి మర్మాణి ఉదానో నామ మారుతః ॥11॥

ఉదానం అనే పేరు కలిగినవాయువు, పెదవులనూ, నోటినీ స్పందింపజేస్తుంది. కన్నులలో ఎఱ్ఱదనాన్ని పెంచుతుంది. మర్మస్థానాలను ప్రేరేపిస్తుంది.

వ్యానో వినామయ త్యఙ్గం వ్యానో వ్యాధిప్రకోపనః ।
ప్రతిదానం యథా కణ్ఠాద్ వ్యాపనాద్ వ్యాన ఉచ్యతే ॥12॥

వ్యానం అనే వాయువు శరీరంలోని అవయవాలను పీడిస్తుంది. రోగాన్ని రేపుతుంది. కంఠంనుండి తిప్పిపంపుతుంది. (మింగనీయకుండా అడ్డుపడి, వెనకకు నెడుతుంది). వ్యాపించేది కావడంచేత ఈ వాయువును వ్యానం అంటారు.

ఉద్గారే నాగ ఇత్యుక్తః కూర్మశ్చోన్మీలనే స్థితః ।
కృకరో భక్షణే చైవ దేవదత్తో విజృమ్భతే ॥13॥

నాగం అనే వాయువు వాంతి చేయిస్తుంది. కూర్మం అనే వాయువు కన్నులు మూసుకోవడం, తెరుచుకోవడం అనేపని చేస్తుంది. కృకరం అనేవాయువు తినడంలో (త్రేణుపులాగా) పనిచేస్తుంది. దేవదత్తం అనే వాయువు ఆవులించడంలో ఉపయోగిస్తుంది.

ధనఞ్జయః స్థితో ఘోషే మృతస్యాపి న ముఞ్చతి ।
జీవః ప్రయాతి దశధా నాడీచక్రం హి తేన తత్ ॥14॥

ధనంజయం అనే వాయువు అరుపులలో ఉంటుంది. ఇది చనిపోయిన తరువాత కూడ శరీరాన్ని విడిచిపెట్టదు. ఈవిధంగా పదివిధాలు అయిన ఈప్రాణవాయువుతోనే జీవుడు జీవనం సాగిస్తాడు. ప్రాణవాయుభేదాలు పదింటిచేతనే నాడీచక్రం కూడా పదివిధాలు అయింది.

సఙ్క్రాన్తిర్విషువం చైవ అహోరాత్రాయనాని చ ।
అధిమాస ఋణం చైవ ఊనరాత్రం ఘనం తథా ॥15॥

అదే విధంగా 1. సంక్రమణం, 2. విషువం, 3. పగలు, 4. రాత్రి, 5. ఉత్తరాయణం, 6. దక్షిణాయనం, 7. అధిమాసం, 8. ఋణం, 9. ఊనరాత్రం, 10. ఘనం, అనేవి కూడ పదివిధాలుగా ఏర్పడుతున్నాయి.

ఊనరాత్రం భవేద్ధిక్కా అధిమాసో విజృమ్భికా ।
ఋణం చాత్ర భవేత్ కాసో నిఃశ్వాసో ఘనముచ్యతే ॥16॥

ఎక్కిళ్లలోని వాయువు ఊనరాత్రం. ఆవులింతలో వాయువు అధిమాసం. తుమ్ము, దగ్గులలోని వాయువు ఋణం. నిశ్వాసంలోని వాయువు ఘనం.

ఉత్తరం దక్షిణం జ్ఞేయం వామం దక్షిణసంజ్ఞితమ్ ।
మధ్యే తు విషువం ప్రోక్తం పుటద్వయవినిస్సృతమ్ ॥
సఙ్క్రాన్తిః పున రస్యైవ స్వస్థానాత్ స్థానయోగతః ॥17॥

నాసికలో కుడివైపున ఉన్న వాయువు ఉత్తరాయణం. ఎడమవైపున ఉన్నవాయువు దక్షిణాయనం. ముక్కురంధ్రాల నడుమ ఉన్నవాయువును విషువం అంటారు. ఈవిషువమే ఉన్నచోటునుండి తరువాతి చోటికి మారడం సంక్రాంతి.

సుషుమ్ణా మధ్యమేహ్యఙ్గే ఇడా వామే ప్రతిష్ఠితా ।
పిఙ్గలా దక్షిణే విప్ర ఊర్ధ్వం ప్రాణోహ్యహః స్మృతమ్ ॥
అపానో రాత్రిరేవంస్యాదేకో వాయుర్దశాత్మకః ॥18॥

బ్రాహ్మణోత్తమా! వసిష్ఠమహర్షీ! శరీరంలో మధ్యమభాగంలో సుషుమ్న అనేనాడి ఉంటుంది. ఎడమవైపున ఇడ, కుడివైపున పింగల అనేనాడులు ఉంటాయి. పైకి ప్రయాణించేప్రాణవాయువు పగలు. క్రిందికి ప్రయాణించే అపానవాయువు రాత్రి. ఈవిధంగా ప్రాణవాయువు ఒక్కటే పదివిధాలు అవుతున్నది.

ఆయామో దేహమధ్యస్థ స్సోమగ్రహణ మిష్యతే ।
దేహాతితత్త్వమాయామమాదిత్యగ్రహణం విదుః ॥19॥

శరీరం మధ్యలో ప్రాణవాయువు నిలిచిఉండటం(ఆయామం) చంద్రగ్రహణం (గాలిని నిండుగా పీల్చి లోపల నిలిపి ఉంచడం) అని చెప్పబడుతుంది. ప్రాణవాయువు శరీరాన్ని దాటి వెలుపల నిలిచిఉండడం (గాలిని పూర్తిగా బయటకు విడిచిపెట్టి, తిరిగి గాలి పీల్చుకోకుండా బిగబట్టిఉండడం) సూర్యగ్రహణం అని గ్రహించారు.

ఉదరం పూరయేత్ తావద్ వాయునా యావదీప్సితమ్ ।
ప్రాణాయామో భవేదేష పూరకో దేహపూరకః ॥20॥

ఎంతవరకు అవకాశం ఉన్నదో అంతమేర కడుపును గాలితో నింపాలి. శరీరాన్ని గాలితో నింపడం పూరకం అనే ప్రాణాయామం అవుతుంది.

పిధాయ సర్వద్వారాణి నిశ్వాసోచ్ఛ్వాసవర్జితః ।
సమ్పూర్ణకుమ్భవత్ తిష్ఠేత్ ప్రాణాయామ స్స కుమ్భకః ॥21॥

శరీరం నుండి గాలి వెలుపలికి వెళ్లే మార్గాలన్నీ మూసి, ఊపిరి పీల్చకుండానూ, విడువకుండానూ నిండుకుండలాగా (పూరించిన)గాలిని లోపలే ఉంచడం కుంభకం అనే ప్రాణాయామం.

ముఞ్చేద్ వాయుం తతస్తూర్ధ్వం శ్వాసేనైకేన మన్త్రితమ్ ।
ఉచ్ఛ్వాసయోగయుక్తశ్చ వాయుమూర్ధ్వం విరేచయేత్ ॥22॥

లోపల ఉన్న ఆవాయువును ఒక్కముక్కురంధ్రంద్వారా మంత్రయుక్తంగా బయటకు విడిచిపెట్టాలి. ఉచ్ఛ్వాససంబంధం కలిగినవాడై, కడుపులో (ఊపిరితిత్తులలో) ఉన్నగాలిని పైగుండా బయటికి విడిచిపెట్టాలి. (ఇది రేచకం అనేప్రాణాయామం)

ఉచ్చరతి స్వయం యస్మాత్ స్వదేహావస్థిత శ్శివః ।
తస్మాత్ తత్త్వవిదాం చైవ స ఏవ జప ఉచ్యతే ॥23॥

ఈ సమయంలో తన దేహంలోపల ఉన్న శివపరమాత్మ స్వయంగా ఊర్ధ్వముఖంగా సంచరిస్తాడు. (ఊర్ధ్వంగా నడుస్తున్నవాయువే శివుడు) అందుచేతనే శివతత్త్వం తెలిసిన పండితులు దీనిని జపం అంటారు.

అయుతే ద్వే సహస్రైకం షట్శతాని తథైవ చ ।
అహోరాత్రేణ యోగీన్ద్రో జపసంఖ్యా కరోతి సః ॥24॥

శ్రేష్ఠుడైన యోగి ఈవిధమైన జపాన్ని ఒక పగలూ, రాత్రీ కలిపి, (ఒకరోజులో) ఇరవైఒక్కవేల ఆరువందలసార్లు చేస్తాడు.

అజపా నామ గాయత్రీ బ్రహ్మవిష్ణుమహేశ్వరీ ।
అజపాం జపతే యస్తాం పునర్జన్మ న విద్యతే ॥25॥

ఈవిధమైన జపానికి అజప అని పేరు. ఇది బ్రహ్మవిష్ణుమహేశ్వరులస్వరూప మైన గాయత్రి. ఈ అజపా గాయత్రిని జపించేవాడికి పునర్జన్మ ఉండదు.

చన్ద్రాగ్నిరవిసంయుక్తా ఆద్యా కుణ్డలినీ మతా ।
హృత్ప్రదేశే తు సా జ్ఞేయా అఙ్కురాకారసంస్థితా ॥26॥

మూలమునందు చంద్రుడు, అగ్ని, సూర్యుడు వీరితో కూడిఉన్నదానికి కుండలిని అని పేరు. ఇది హృదయప్రదేశంలో మొలక ఆకారంలో ఉంటుంది.

సృష్టిన్యాసో భవేత్ తత్ర స వై సర్గావలమ్బనాత్ ।
స్రవన్తం చిన్తయేత్ తస్మి న్నమృతం సాత్త్వికోత్తమః ॥27॥

సృష్టిక్రమాన్ని అనుసరించి, అక్కడ సృష్టిన్యాసం జరుగుతుంది. సత్త్వగుణంతో కూడిన ఉత్తముడైన సాధకుడు అక్కడ అమృతం స్రవిస్తున్నట్లుగా భావన చేయాలి.

దేహస్థ స్సకలో జ్ఞేయో నిష్కలో దేహవర్జితః ।
హంస హంసేతి యో బ్రూయాద్ధంసో నామ సదాశివః ॥28॥

శివుడు ఆకారం కలిగినసందర్భంలో సకలుడు. రూపం లేనిస్థితిలో నిష్కలుడు. సాధకుడు హంస జపం చేస్తాడు. హంస అంటే సదాశివుడు.

తిలేషు చ యథా తైలం పుష్పే గన్ధస్సమాశ్రితః ।
పురుషస్య తథా దేహే స బాహ్యాభ్యన్తరం స్థితః ॥29॥

నువ్వులలో నూనె, పూవులో పరిమళం అంతటా నిండి ఉన్నవిధంగా సదాశివుడు జీవుడిశరీరంలో లోపలా, బయటా అంతటా వ్యాపించి ఉంటాడు.

బ్రహ్మణో హృదయే స్థానం కణ్ఠే విష్ణు స్సమాశ్రితః ।
తాలుమధ్యే స్థితో రుద్రో లలాటే తు మహేశ్వరః ॥30॥

జీవుడి శరీరంలో బ్రహ్మ హృదయస్థానంలో ఉంటాడు. విష్ణువు కంఠంలో ఉంటాడు. తాలువు నడిమిభాగంలో రుద్రుడు ఉంటాడు. మహేశ్వరుడు నుదుటిప్రదేశంలో ఉంటాడు.

ప్రాణాగ్రం తు శివం విద్యాత్ తస్యాన్తే తు పరాపరమ్ ।
పఞ్చధా సకలః ప్రోక్తో విపరీత స్తు నిష్కలః ॥31॥

ప్రాణంలో ప్రధానస్థానంలో సదాశివుడు ఉంటాడు. దాని లోపలిభాగంలో మహత్తు, అణువు ఐన పరబ్రహ్మం ఉంటుంది. ఈవిధంగా సకలుడు బ్రహ్మ, విష్ణు, రుద్ర, మహేశ్వర, సదాశివ రూపంలో అయిదువిధాలుగా ఉంటాడు. ఈవిధమైన భేదం లేక అఖండంగా రూపరహితంగా ఉన్నవాడు నిష్కలుడు.

ప్రాసాదం నాద ముత్థాప్య సతతస్తు జపేద్ యది ।
షణ్మాసాత్ సిద్ధి మాప్నోతి యోగయుక్తో న సంశయః ॥32॥

యోగనిష్ఠుడు ప్రాసాదం అనేపేరు గలిగిన (34 శ్లో. ప్రసాదగుణయుక్త మయిన) నాదంతో నిరంతరంగా జపిస్తే, ఆరునెలలలో సిద్ధిని పొందుతాడు. ఇందులో సందేహం లేదు.

గమాగమస్య జ్ఞానేన సర్వపాపక్షయో భవేత్ ।
అణిమాదిగుణైశ్వర్యం షడ్భి ర్మాసై రవాప్నుయాత్ ॥33॥

జపంలో నాదంయొక్క ఉచ్చస్థితినీ, అల్పస్థితినీ చక్కగా గుర్తిస్తే, సాధకుడి పాపాలు సమస్తం నశిస్తాయి. పైగా ఆరునెలలలో అణిమ, మహిమ మొదలయిన గుణ(సిద్ధులను)సంపదను పొందుతాడు.

స్థూల సూక్ష్మః పరశ్చేతి ప్రాసాదః కథితో మయా ॥
హ్రస్వో దీర్ఘః ప్లుత శ్చేతి ప్రాసాదం లక్షయేత్ త్రిధా ॥34॥

ప్రాసాదం అనే నాదం స్థూలం, సూక్ష్మం, పరం అని మూడువిధాలుగా ఉంటుందని ఇంతకు ముందు చెప్పాను. ఇంకా ప్రాసాదనాదాన్ని హ్రస్వం, దీర్ఘం, ప్లుతం అని మూడువిధాలుగా గ్రహించాలి.

హ్రస్వో దహతి పాపాని దీర్ఘో మోక్షప్రదో భవేత్ ।
ఆప్యాయనే ప్లుతశ్చేతి మూర్ధ్ని బిన్దువిభూషితః ॥35॥

హ్రస్వం అయిన నాదం పాపాలను దహించివేస్తుంది. దీర్ఘం అయిన నాదం మోక్షాన్ని ఇస్తుంది. ప్లుతం అనే నాదం ఆహ్లాదాన్ని కలిగిస్తుంది. దీనికి శిరోభాగంలో అందంగా అనుస్వారం ఉంటుంది.

ఆదా వన్తే చ హ్రస్వస్య ఫట్కారో మారణే హితః ।
ఆదా వన్తే చ హృదయ మాకృష్టౌ సమ్ప్రకీర్తితమ్ ॥36॥

శత్రుమరణాదిఫలాన్ని ఉద్దేశించినపుడు హ్రస్వం అయిన ప్రాసాద నాదానికి ముందుగానూ, చివరలోనూ ఫట్ కారాన్ని (అస్త్రమంత్రాన్ని) కూర్చాలి. మిత్రులను ఆకర్షించడాన్ని ఉద్దేశించినపుడు హ్రస్వప్రాసాదనాదానికి ముందుగానూ, చివరలోనూ నమః అనే హృదయమంత్రం కూర్చాలి.

దేవస్య దక్షిణాం మూర్తిం పఞ్చలక్షం స్థితో జపేత్ ।
జపాన్తే ఘృతహోమ స్తు దశసాహస్రికో భవేత్ ॥37॥

సదాశివుని దక్షిణామూర్తిమంత్రాన్ని స్థిర మయిన ఆసనంలో కూర్చుండి (కదలకుండా) అయిదులక్షలసంఖ్యలో జపించాలి. జపం ముగిసిన తరువాత (జపసంఖ్యలో దశాంశంగా) పదివేలసంఖ్యలో ఆవునేతితో హోమం చేయాలి.

ఏవ మాప్యాయితో మన్త్రో వశ్యోచ్చాటాది కారయేత్ ॥38॥

జపహోమాలతో సంప్రీతిని పొందిన(సిద్ధించిన)మంత్రం సాధకుడికి ఇష్టమయినవాటిని వశం చేస్తుంది. ఇష్టం లేనివాటిని సాధకుడినుండి దూరంగా నెట్టివేస్తుంది.

ఊర్ధ్వే శూన్య మధ శ్శూన్యం మధ్యే శూన్యం నిరామయమ్ ।
త్రిశూన్యం యో విజానాతి ముచ్యతేఽసౌ ధ్రువం ద్విజః ॥39॥

పైన శూన్యం గలిగినా, క్రింద శూన్యం కలిగినా, మధ్యలో శూన్యం కలిగినా దోషం లేదు. మూడూ శూన్య మయినదానిని గ్రహించిన సాధకుడు నిశ్చయంగా మోక్షం పొందుతాడు.

ప్రాసాదం యో న జానాతి పఞ్చతన్త్రమహాతనుమ్ ।
అష్టత్రింశత్కలాయుక్తం న స ఆచార్య ఉచ్యతే ॥40॥

పంచతంత్రాలతో కూడినదీ, ముప్పైఎనిమిది కళలతో కూడినదీ అయిన ప్రాసాదం అనే ఈమహామంత్రాన్ని తెలియనివాడిని ఆచార్యుడు అనగూడదు.

తథోఙ్కారం చ గాయత్రీం రుద్రాదీన్ వేత్త్యసౌ గురుః ॥41॥

ఓంకారం, గాయత్రి, రుద్రమంత్రాలు మొదలయినవి తెలిసినవాడే గురువు అవుతాడు.

ఇత్యాది మహాపురాణే ఆగ్నేయే నాడీచక్రకథనం నామ చతుర్దశాధికద్విశతతమో ఽధ్యాయః॥214॥

అగ్నిమహాపురాణంలో నాడీచక్రకథనం అనే రెండువందల పద్నాల్గవ అధ్యాయం సమాప్తం.



పఞ్చదశాధికద్విశతతమో ఽ ధ్యాయః - రెండువందల పదిహేనవ అధ్యాయం

సన్ధ్యావిధికథనమ్ - సన్ధ్యావిధికథనం

అగ్నిరువాచ - వశిష్ఠమహర్షితో అగ్నిదేవుడు ఇలా చెప్తున్నాడు.

ఓఙ్కారం యో విజానాతి స యోగీ స హరిః పుమాన్ ।
ఓఙ్కారమభ్యసేత్ తస్మాన్మన్త్రసారం తు సర్వదమ్ ॥1॥

ఓంకారాన్ని తెలిసినవాడు యోగి. ఆతడే మహావిష్ణువు. అందుచేత ప్రణవాన్ని అభ్యాసం చేయాలి. ప్రణవం సమస్తమైన మంత్రాలకు సారభూతమైనది. సాధకుడికి సమస్తమైన కోరికలను నెరవేరుస్తుంది.

సర్వమన్త్రప్రయోగేషు ప్రణవః ప్రథమ స్స్మృతః ।
తేన సమ్పరిపూర్ణం యత్ తత్పూర్ణం కర్మ నేతరత్ ॥2॥

ఏమంత్రాన్ని ప్రయోగించాలన్నా, దానికి ముందుగా ప్రణవం తప్పక ఉండవలసిందే. ఏకర్మ అయినా, ప్రణవంతో కూడి ఉంటేనే పరిపూర్ణం అవుతుంది. (తగినఫలితాన్ని ఇస్తుంది). ప్రణవం లేనికర్మ ఏదీ పూర్ణం కాదు.

ఓఙ్కారపూర్వికా స్తిస్రో మహావ్యాహృతయోఽ వ్యయాః ।
త్రిపదా చైవ సావిత్రీ విజ్ఞేయం బ్రహ్మణో ముఖమ్ ॥3॥

మహావ్యాహృతులు మూడు. వాటికి మొదట్లో ఓంకారం ఉంటుంది. అటువంటి వ్యాహృతులు శాశ్వత మైనవి. సవితృదేవతకు సంబంధించినమంత్రం మూడు పాదాలు కలిగినది. అది వేదాలకు ముఖంవంటిది (ప్రధానం) అని తెలుసుకోవాలి.

యోఽ ధీతేఽ హన్యహ న్యేతా స్త్రీణి వర్షాణ్యతన్ద్రితః ।
స బ్రహ్మ పరమభ్యేతి వాయుభూతః ఖమూర్తిమాన్ ॥4॥

ఈ మూడుపాదాల సావిత్రీ(గాయత్రీ)మంత్రాన్ని మూడుసంవత్సరాలపాటు శ్రద్ధగా అనుష్ఠించినవాడు వాయురూపం చెంది, ఆకాశం రూపాన్ని పొంది, పరబ్రహ్మను చేరుకుంటాడు.

ఏకాక్షరం పరం బ్రహ్మ ప్రాణాయామః పరం తపః ।
సావిత్ర్యాస్తు పరం నాస్తి మౌనాత్ సత్యం విశిష్యతే ॥5॥

ఒకేఅక్షరం అయినప్రణవమే పరబ్రహ్మం. ప్రాణాయామమే ఉత్తమమైన తపస్సు. సావిత్రీ(గాయత్రి)మంత్రాన్ని మించినది లేదు. మౌనంగా ఉండడం కంటె సత్యం పలకటం మేలు.

సప్తావర్తా పాపహరా దశభిః ప్రాపయే ద్దివమ్ ।
వింశావర్తా తు సా దేవీ నయతేహీశ్వరాలయమ్ ॥6॥

ఏడుపర్యాయాలు ఆవృత్తి చేసినగాయత్రీమంత్రం సమస్తపాపాలను హరిస్తుంది. పదిసార్లు ఆవృత్తి (జపం) చేస్తే, గాయత్రీమంత్రం స్వర్గానికి చేరుస్తుంది. ఇరవైసార్లు ఆవృత్తి చేస్తే, శివలోకానికి తీసుకుని వెళ్తుంది.

అష్టోత్తరశతం జప్త్వా తీర్ణస్సంసారసాగరాత్ ।
రుద్రకూష్మాణ్డజప్యేభ్యో గాయత్రీ తు విశిష్యతే ॥7॥

గాయత్రీమంత్రాన్ని నూటయెనిమిదిసార్లు జపిస్తే, సాధకుడు సంసారం అనే సముద్రంనుండి బయటపడతాడు (ముక్తిని పొందుతాడు). రుద్రమంత్రం కంటె, కూష్మాండమంత్రం కంటె గాయత్రీమంత్రాన్ని జపించడం విశేషఫలాన్ని ఇస్తుంది.

న గాయత్ర్యాః పరం జప్యం న వ్యాహృతిసమం హుతమ్ ॥8॥

జపించదగినమంత్రాలలో గాయత్రీమంత్రాన్ని మించినమంత్రం మరొకటి లేదు. హోమం చేయడానికి వ్యాహృతులను మించినది లేదు.

గాయత్ర్యాః పాద మప్యర్ధ మృగర్ధమృచ మేవ వా ।
బ్రహ్మహత్యా సురాపానం సువర్ణస్తేయ మేవ చ ॥
గురుదారాగమశ్చైవ జప్యే నైవ పునాతి సా ॥9॥

గాయత్రీమంత్రంలోని ఒకపాదాన్ని గానీ, లేదా పాదంలో సగం గానీ, మంత్రంలో సగం గానీ, మంత్రం మొత్తం గానీ జపించినంతమాత్రంచేత బ్రహ్మహత్య, కల్లుతాగడం, బంగారాన్ని దొంగిలించడం, గురువుగారిభార్యను కలవడం, (ఈపాపాలు చేసినవాడితో చేరడం) అనే పంచమహాపాతకాలు నశించిపోతాయి. ఇంకా జపించినవాడు పవిత్రుడు అవుతాడు.

పాపే కృతే తిలై ర్హోమో గాయత్రీ జప ఈరితః ।
జప్త్వా సహస్రం గాయత్ర్యా ఉపవాసీ స పాపహా ॥10॥

ఎంతటిపాపం చేసినా, నువ్వులను హోమం చేయడంవలనా, గాయత్రిని జపించడంవలనా ఆపాపం నశిస్తుంది. ఉపవాసం ఉండి గాయత్రిని వేయిసార్లు జపిస్తే, ఆ జపం సమస్తమయిన పాపాలను హరించివేస్తుంది.

గోఘ్నః పితృఘ్నో మాతృఘ్నో బ్రహ్మహా గురుతల్పగః ।
బ్రహ్మఘ్న స్స్వర్ణహారీ చ సురాపో లక్షజప్యతః ॥
శుధ్యతే వాథ వా స్నాత్వా శత మన్తర్జలే జపేత్ ॥11॥

ఆవును చంపినవాడు, తండ్రిని చంపినవాడు, తల్లిని చంపినవాడు, బ్రాహ్మణుడిని చంపినవాడు, గురువుగారి భార్యను కలిసినవాడు, బ్రాహ్మణుడి జీవాధారాన్ని పోగొట్టినవాడు, బంగారాన్ని దొంగిలించినవాడు, కల్లు తాగినవాడు – గాయత్రీ మంత్రాన్ని లక్షసార్లు జపిస్తే, ఆపాపం తొలగి పరిశుద్ధుడు అవుతాడు. అలాగే చక్కగా స్నానం చేసి, నీటిలో నిలిచి వందసార్లు గాయత్రిని జపించినా, పాపాలు నశించి, పవిత్రత కలుగుతుంది.

అప శృతేన పీత్వా తు గాయత్ర్యాః పాపహా భవేత్ ॥12॥

నూరుసార్లు గాయత్రీమంత్రం ఉచ్చరిస్తూ, నీటిని అభిమంత్రించి, ఆనీటిని పుచ్చుకుంటే, పాపా లన్నీ నశించిపోతాయి.

శతం జప్తా తు గాయత్రీ పాపోపశమనీ స్మృతా ।
సహస్రం జప్తా సా దేవీ ఉపపాతకనాశినీ ॥
అభీష్టదా కోటిజప్తా దేవత్వం రాజతామియాత్ ॥13॥

నూరుసార్లు జపించినగాయత్రీమంత్రం మహాపాతకాలను నాశనం చేస్తుంది. వెయ్యిసార్లు జపిస్తే, ఉపపాతకాలను కూడా నశింపజేస్తుంది. కోటిసార్లు జపిస్తే సమస్తమయిన కోరికలు సిద్ధిస్తాయి. జపించినవాడు భూలోకంలో రాజు అవుతాడు. అనంతరం దేవుడు అవుతాడు. (దేవలోకానికి వెళ్తాడు)

ఓఙ్కారం పూర్వ ముచ్చార్య భూ ర్భువ స్స్వ స్తథైవ చ ।
గాయత్రీ ప్రణవ శ్చాన్తే జపే చైవ ముదాహృతమ్ ॥14॥

మొదట్లో ఓంకారాన్ని ఉచ్చరించి, దాని తరువాత భూః, భువః, స్వః అనే వ్యాహృతులను ఉచ్చరించాలి. వ్యాహృతులకు తర్వాత గాయత్రీమంత్రాన్ని ఉచ్చరించాలి. ఆతరువాత మళ్లీ ఓంకారాన్ని పలకాలి. జపం చేయడానికి గాయత్రీమంత్రాన్ని ఈక్రమంలో (ఓం భూ ర్భువ స్స్వః. తత్సవితుర్వరేణ్యం భర్గో దేవస్య ధీమహి, ధియో యో నః ప్రచోదయాత్. ఓమ్.) స్వీకరించాలి.

విశ్వామిత్ర ఋషి శ్ఛన్దో గాయత్రం సవితా తథా ।
దేవతోపనయే జప్యే వినియోగో హుతే తథా ॥15॥

గాయత్రీమంత్రానికి ఋషి (మంత్రాన్ని దర్శించినవాడు) విశ్వామిత్రుడు. ఛందస్సు – గాయత్రి. దేవత – సవితృడు. ఈమంత్రానికి ఉపనయనంలోనూ, జపంలోనూ, హోమంలోనూ వినియోగం.

అగ్ని ర్వాయూ రవి ర్విద్యుద్ యమో జలపతి ర్గురుః ।
పర్జన్య ఇన్ద్రో గన్ధర్వః పూషా చ తదనన్తరమ్ ॥16॥

1. అగ్ని, 2. వాయువు, 3. రవి (ఆదిత్యుడు), 4. విద్యుత్తు, 5. యముడు, 6. జలాధిదేవత, 7. బృహస్పతి, 8. మేఘుడు, 9. ఇంద్రుడు, 10. గంధర్వుడు, 11. పూష (ఆదిత్యుడు), ఆ తరువాత –

మిత్రోఽథ వరుణ స్త్వష్టా వసవో మరుత శ్శశీ ।
అఙ్గిరా విశ్వనాసత్యౌ కస్తథా సర్వదేవతాః ॥17॥

12. మిత్రుడు (ఆదిత్యుడు), 13. వరుణుడు, 14. త్వష్ట (ఆదిత్యుడు), 15. (అష్ట)వసువులు, 16. మరుత్తులు, 17. చంద్రుడు, 18. అంగిరుడు, 19. విశ్వేదేవతలు, 20. అశ్వినీదేవతలు, 21. ప్రజాపతి మొద లైన సమస్తదేవతలు,

రుద్రో బ్రహ్మా చ విష్ణుశ్చ క్రమశోఽక్షరదేవతాః ।
గాయత్ర్యా జపకాలే తు కథితాః పాపనాశనాః ॥18॥

22. రుద్రుడు, 23. బ్రహ్మ, 24. విష్ణువు అనేవారు గాయత్రీమంత్రంలోని (24)అక్షరాలకు క్రమంగా (24మంది) అధిదేవతలు. గాయత్రీమంత్రాన్ని జపించేసమయంలో వీరు జపిస్తున్నవాడి పాపాలనన్నిటినీ నశింపజేస్తారు.

పాదాఙ్గుష్ఠౌ చ గుల్ఫౌ చ నలకౌ జానునీ తథా ।
జఙ్ఘే శిశ్నశ్చ వృషణౌ కటిర్నాభిస్తథోదరమ్ ॥19॥

1. కాలిబొటనవ్రేళ్లు, 2. మడమలు, 3. పిక్కలు, 4. మోకాళ్లు, 5. శిశ్నము, 6. వృషణములు, 7. నడుము, 8. బొడ్డు, 9. పొట్ట, –

స్తనౌ చ హృదయం గ్రీవా ముఖం తాలు చ నాసికా ।
చక్షుషీ చ భ్రువో ర్మధ్యం లలాటం పూర్వ మాననమ్ ॥
దక్షిణోత్తరపార్శ్వే ద్వే శిర ఆస్య మనుక్రమాత్ ॥20॥

10. స్తనములు, 11. హృదయం, 12. మెడ. 13. నోరు, 14. తాలువు, 15. ముక్కు, 16. కన్నులు, 17. కనుబొమ్మల నడిమిప్రదేశం, 18. నుదురు, 19. పైపెదవి, 20. క్రిందిపెదవి, 21. శరీరంలో కుడివైపు, 22. ఎడమవైపు, 23. తల, 24. మొత్తం ముఖం ఈవిధంగా గాయత్రిమంత్రంలోని 24 అక్షరాలను తనశరీరంలోని 24 భాగాలలో సాధకుడు న్యాసం చేసుకోవాలి.

పీత శ్శ్యామశ్చ కపిలో మారకతోఽగ్నిసన్నిభః ।
రుక్మవిద్యుద్ధూమ్రకృష్ణరక్తగౌరేన్ద్రనీలభాః ॥21॥

1. పీతం, 2. శ్యామం, 3. కపిలం, 4. మరకతవర్ణం, 5. అగ్నివంటివర్ణం, 6. బంగారంవంటిరంగు, 7. విద్యుత్తురంగు, 8. బూడిదరంగు, 9. కారునలుపు, 10. ఎఱుపు, 11. గౌరవర్ణం, 12. ఇంద్రనీలమణులరంగు,–

స్ఫటికస్వర్ణపాణ్డ్వాభాః పద్మరాగోఽఖిలద్యుతిః ।
హేమధూమ్రరక్తనీలరక్తకృష్ణసువర్ణభాః ॥
శుక్లకృష్ణపలాశాభా గాయత్ర్యా వర్ణకాః క్రమాత్ ॥22॥

13. స్ఫటికమణులరంగు, 14. స్వర్ణవర్ణం, 15. పాండువర్ణం, 16. పద్మరాగమణులరంగు, 17. అఖిలద్యుతి, 18. హేమధూమ్రవర్ణం, 19. రక్తనీలవర్ణం, 20. రక్తకృష్ణవర్ణం, 21. సువర్ణంవంటివర్ణం, 22. శుక్లవర్ణం 23. కృష్ణవర్ణం, 24. పలాశవర్ణం అనేవి క్రమంగా 24 గాయత్రీమంత్రంలోని 24 అక్షరాలవర్ణాలు.

ధ్యానకాలే పాపహరా హుతైషా సర్వకామదా ॥23॥

ఈవిధంగా (ఆయావర్ణాలరూపంతో) ధ్యానం చేసేసమయంలోనే ధ్యానంచేసేవాడి పాపాలు సమస్తమూ గాయత్రి హరిస్తుంది. గాయత్రీమంత్రంతో హెూమం చేస్తే, ఆగాయత్రి సమస్తమయిన కోరికలను సిద్ధింపజేస్తుంది.

గాయత్ర్యా తు తిలై ర్హోమ స్సర్వపాపప్రణాశనః ।
శాన్తికామో యవైః కుర్యా దాయుష్కామో ఘృతేన చ ॥24॥

గాయత్రీమంత్రాన్ని నువ్వులతో హోమం చేస్తే, సమస్తమైన పాపాలూ నశిస్తాయి. శాంతిని కోరుకునేవాడు గాయత్రిని యవధాన్యంతో హోమం చేయాలి. దీర్ఘమైన ఆయువు కోరుకునేవాడు ఆవునేతితో హోమం చేయాలి.

సిద్ధార్థకైః కర్మసిద్ధ్యై పయసా బ్రహ్మవర్చసే ।
పుత్రకామ స్తథా దధ్నా ధాన్యకామస్తు శాలిభిః ॥25॥

తాను చేసేపనులు సఫలం కావాలని కోరుకునేవాడు తెల్లఆవాలతో హోమం చేయాలి. బ్రహ్మతేజస్సు కావాలని కోరుకునేవాడు ఆవుపాలతో హోమం చేయాలి. కొడుకులు పుట్టా లని కోరుకునేవాడు ఆవుపెరుగుతో హోమం చేయాలి. మంచిపంటలు కావాలనుకునేవాడు వడ్లతో హోమం చేయాలి.

క్షీరవృక్షసమిద్భిస్తు గ్రహపీడోపశాన్తయే ।
ధనకామస్తథా బిల్వై శ్రీకామః కమలై స్తథా ॥26॥

గ్రహబాధలు శాంతించడంకోసం రావిసమిధలతోనూ, సంపదలు కోరుకునేవాడు మారేడుదళాలతోనూ, లక్ష్మిని కోరుకునేవాడు తామరపూలతోనూ హోమం చేయాలి.

ఆరోగ్యకామో దూర్వాభిర్గురూత్పాతే స ఏవ హి ।
సౌభాగ్యేచ్ఛుర్గుగ్గులునా విద్యార్థీ పాయసేన చ ॥27॥

ఆరోగ్యం కావాలని కోరుకున్నా, పెద్దపెద్దకష్టాలు తొలగిపోవాలనుకున్నా, గరికలతో హోమం చేయాలి. సౌభాగ్యం కోరుకునేవాడు గుగ్గులుతోనూ, చదువు కోరుకునేవాడు పాయసంతోనూ హోమం చేయాలి.

అయుతే నోక్తసిద్ధి స్స్యాల్లక్షేణ మనసేప్సితమ్ ।
కోట్యా బ్రహ్మవధా న్ముక్తః కులోద్ధారీ హరి ర్భవేత్ ॥28॥

పైకోరికలు సిద్ధించడానికి ఆయాద్రవ్యాలతో పదివేలసంఖ్యలో హోమం చేయాలి. లక్షసంఖ్యలో హోమం చేస్తే, ఏది కోరుకుంటే అది సిద్ధిస్తుంది. కోటిసంఖ్యలో హోమం చేస్తే బ్రహ్మహత్య చేసినపాపంనుండి విముక్తు డవుతాడు. తనవంశంలోని వారి నందరినీ నరకాదిలోకాలనుండి ఉద్ధరిస్తాడు. అంతటినీ ఉద్ధరిస్తాడు. తాను విష్ణుస్వరూపుడు అవుతాడు.

గ్రహయజ్ఞముఖో వాపి హోమోఽ యుతముఖోఽ ర్థకృత్ ॥29॥

గ్రహపీడలు నశించడానికి హోమం ప్రారంభించినవాడు కూడ పదివేలసంఖ్యలో హోమం చేస్తే, ఉద్దేశించిన ప్రయోజనాన్ని పొందుతాడు.

ఆవాహనం చ గాయత్ర్యా స్తత ఓఙ్కార మభ్యసేత్ ।
స్మృత్వోఙ్కారం తు గాయత్ర్యా నిబధ్నీయాచ్ఛిఖాం తతః ॥30॥

తనలో గాయత్రీమాతను ఆహ్వానించుకుని, తరువాత ఓంకారాన్ని సాధన చేయాలి. ఓంకారాన్ని స్మరించి, గాయత్రిని ఉచ్చరిస్తూ, శిఖను ముడివేసుకోవాలి.

పున రాచమ్య హృదయం నాభిం స్కన్ధౌ చ సంస్పృశేత్ ॥31॥

ఆతరువాత తిరిగి ఆచమనం చేసి, హృదయాన్ని, నాభిని, భుజాలనూ తాకాలి.

ప్రణవస్య ఋషిర్ బ్రహ్మా గాయత్రీ ఛన్ద ఏవ చ ।
దేవో௨గ్నిః పరమాత్మా స్యాద్ యోగో వై సర్వకర్మసు ॥32॥

ప్రణవమంత్రాన్ని దర్శించినఋషి బ్రహ్మ. ఛందస్సు గాయత్రి. దానికి దేవత అగ్ని. (నిర్గుణోపాసనలో) నిర్గుణుడైన పరమాత్మ దేవత. ఏకర్మను ప్రారంభించినప్పటికీ, ఈవిధంగా గాయత్రిని ప్రయోగించాలి. క్రిందిమంత్రాలతో ధ్యానించాలి.

శుక్లా చాగ్నిముఖీ దివ్యా కాత్యాయనసగోత్రజా ।
త్రైలోక్యవరణా దివ్యా పృథివ్యాధారసంయుతా ॥
అక్షసూత్రధరా దైవీ పద్మాసనగతా శుభా ॥33॥

గాయత్రి శుక్లవర్ణ. అగ్ని ముఖంగా కలిగిన దివ్యస్వరూపిణి. కాత్యాయనమహర్షిగోత్రంలో పుట్టినది. మూడులోకాలూ గాయత్రిని అనుష్ఠిస్తాయి. ప్రణవానికి ఆధారం పృథివి. తామరపూవులో కూర్చుని చేతిలో అక్షమాలను ధరించి ఉంటుంది. శుభాలను అనుగ్రహిస్తుంది.

ఓం తేజో௨సి సహో௨సి బల మసి భ్రాజో௨సి దేవానాం ధామ నామాసి ।
విశ్వ మసి విశ్వాయుః సర్వ మసి సర్వాయుః ఓం అభి భూః ॥34॥

ప్రణవమా! నీవు తేజస్సువు. శత్రువులను పరాభవించే శక్తిస్వరూపానివి. బలానివి. ప్రకాశానివి. దేవతలకు నిలయమయిన తేజస్సే పేరుగా గలిగినదానివి. ఈ ప్రపంచం నీ స్వరూపమే. ప్రపంచానికి ఆయువు నీవే (నీ వలననే జగత్తు నిలిచి ఉన్నది) సమస్తమూ నీవే. నీవే ఈసమస్తాన్నీ నిలిపిఉంచుతావు. ఓ ప్రణవమా! సమస్త మైనపాపాలను తిరస్కరించే దానివి.

ఆగచ్ఛ వరదే దేవి జపే మే సన్నిధౌ భవ ।
గాయన్తం త్రాయసే యస్మాద్ గాయత్రీ త్వం తత స్స్మృతా ॥35॥

ఓ గాయత్రీ! వరాలను ప్రసాదించే దేవీ! మా సమీపానికి రావలసినది. జపిస్తున్న నాకు సాన్నిధ్యాన్ని అనుగ్రహించు. జపించేవారిని రక్షిస్తావు. కాబట్టి నీవు గాయత్రివి అయినావు.

వ్యాహృతీనాం తు సర్వాసా మృషి రేవ ప్రజాపతిః ।
వ్యస్తాశ్చైవ సమస్తాశ్చ బ్రాహ్మమక్షరమోమితి ॥36॥

సమస్తమైన వ్యాహృతులకూ ఋషి ప్రజాపతి. ఇవి విడివిడిగానూ, అన్నీ కలిసిఉండి పరబ్రహ్మమైన ఓంకారంలో నిలిచిఉంటాయి.

విశ్వామిత్రో జమదగ్ని ర్భరద్వాజోఽథ గౌతమః ।
ఋషి రత్రి ర్వసిష్ఠశ్చ కాశ్యపశ్చ యథాక్రమమ్ ॥37॥

వ్యాహృతులకు వరుసగా విశ్వామిత్రుడు (భూః), జమదగ్ని (భువః), భరద్వాజుడు (స్వః), గౌతముడు (మహః), అత్రి (జనః), వసిష్ఠుడు (తపః), కాశ్యపుడు (సత్యమ్) ఋషులు.

అగ్ని ర్వాయూ రవి శ్చైవ వాక్పతి ర్వరుణ స్తథా ।
ఇన్ద్రో విష్ణు ర్వ్యాహృతీనాం దైవతాని యథాక్రమమ్ ॥38॥

వ్యాహృతులకు వరుసగా అగ్ని (భూః), వాయువు (భువః), రవి (స్వః), బృహస్పతి (మహః), వరుణుడు (జనః), ఇంద్రుడు (తపః), విష్ణువు (సత్యమ్) దేవతలు.

గాయత్ర్యుష్ణిగనుష్టుప్ చ బృహతీ పఙ్క్తి రేవ చ ।
త్రిష్టుప్ చ జగతీ చేతి ఛన్దాంస్యాహు రనుక్రమాత్ ॥39॥

వ్యాహృతులకు వరుసగా గాయత్రి (భూః), ఉష్ణిక్ (భువః), అనుష్టుప్ (స్వః), బృహతి (మహః), పంక్తి (జనః), త్రిష్టుప్ (తపః), జగతి (సత్యమ్) ఛందస్సులు.

వినియోగో వ్యాహృతీనాం ప్రాణాయామే చ హోమకే ॥40॥

వ్యాహృతులకు ప్రాణాయామంలోనూ, హోమంలోనూ వినియోగం.

ఆపో హిష్ఠే త్యృచా చాపో ద్రుపదా దీతి వా స్మృతా ।
తథా హిరణ్యవర్ణాభిః పావమానీభి రన్తతః ॥41॥

ఆపోహి ష్ఠా మయో భువః, అనే మంత్రంతోనూ (ఇవి మూడు), ద్రుపదా దివ అనే మంత్రం(1)తోనూ, హిరణ్యవర్ణాశ్శుచయః అనే(4)మంత్రాలతోనూ, పవమానా స్సువర్జనః అనే పవమానసూక్తంతోనూ –

విప్రుషోఽష్టౌ క్షిపే దూర్ధ్వ మాజన్మకృతపాపజిత్ ।
అన్తర్జలం ఋతం చేతి జపేత్ త్రిరఘమర్షణమ్ ॥42॥

జలాన్ని ఎనిమిదిసార్లు శిరసుపై చల్లుకోవాలి. దానివలన పుట్టినప్పటినుండి చేసిన పాపాలు మొత్తం నశించిపోతాయి. నీటిలో ఉండి 'ఋతం చ సత్యం చ... అనే అఘమర్షణమంత్రాన్ని మూడు పర్యాయాలు జపించాలి.

ఆపోహిష్ఠేతిత్ర్యృచస్య సిన్ధుద్వీప ఋషి స్స్మృతః ।
బ్రాహ్మస్నానాయ ఛన్దోఽస్య గాయత్రీ దేవతా జలమ్ ॥
మార్జనే వినియోగోఽస్య హయావభృథకే క్రతోః ॥43॥

ఆపో హి ష్ఠా మయో భువః అనే మూడుమంత్రాలకు సింధుద్వీపుడు ఋషి. దీనిని బ్రహ్మ(దైవ)స్నానంలో వినియోగించాలి. దీనికి గాయత్రి ఛందస్సు. జలం దేవత. ఈమంత్రాలకు అశ్వమేధయాగంలో అవభృథస్నానంలో నీటిని శిరసుపై చల్లుకోవడంలో వినియోగం.

అఘమర్షణసూక్తస్య ఋషిరేవాఘమర్షణః ।
అనుష్టుప్ చ భవే చ్ఛన్దో భావవృత్తస్తు దైవతమ్ ॥44॥

'ఋతం చ సత్యం చ' అనే అఘమర్షణసూక్తానికి ఋషి అఘమర్షణుడే. ఛందస్సు అనుష్టుప్పు. దేవత భావవృత్తుడు.

ఆపో జ్యోతి రస ఇతి గాయత్ర్యా స్తు శిర స్స్మృతమ్ ।
ఋషిః ప్రజాపతి స్తస్య చ్ఛన్దోహీనం యజు ర్యతః ॥
బ్రహ్మాగ్నివాయుసూర్యాశ్చ దేవతాః పరికీర్తితాః ॥45॥

'ఆపో జ్యోతీ రసోఽమృతం బ్రహ్మభూర్భువస్సువరోమ్' అనేది గాయత్రీమంత్రానికి శిరస్సు అని చెప్పబడుతుంది. దానికి ప్రజాపతి ఋషి. ఆ యజుర్మంత్రానికి ఛందస్సు లేదు. గాయత్రీశిరోమంత్రానికి బ్రహ్మ, అగ్ని, వాయువు, సూర్యుడు దేవతలుగా కీర్తింపబడ్డారు.

ప్రాణరోధాత్తు వాయు స్స్యాద్ వాయోరగ్నిశ్చ జాయతే ।
అగ్నే రాప స్తత శ్శుద్ధి స్తత శ్చాచమనం చరేత్ ॥46॥

ప్రాణాన్ని (ప్రాణవాయువును) అడ్డగించడంవలన వాయువు ఏర్పడుతుంది. వాయువునుండి అగ్ని పుడుతుంది. అగ్నినుండి నీరు పుడుతుంది. ఆ నీటితో ఆచమనం చేయాలి. (దీనివలన శుద్ధి కలుగుతుంది)

అన్తశ్చరతి భూతేషు గుహాయాం విశ్వమూర్తిషు ।
తపో యజ్ఞో వషట్కార ఆపో జ్యోతి రసోఽమృతమ్ ॥47॥

తపస్సు, యజ్ఞం, వషట్కారం, నీరు, తేజస్సు, దేవతలకు ఆహారమైన అమృతం ఇవి అన్నీ ప్రణవస్వరూపాలు. ఆ ప్రణవం పరబ్రహ్మను తెలుపుతుంది. ఆ పరబ్రహ్మ జగత్తులోని స్థావరజంగమాత్మక మయినభూతా లన్నింటిలోనూ హృదయస్థానం లోపల సంచరిస్తుంది.

ఉదుత్యం జాతవేదస మృషిః ప్రస్కణ్వ ఉచ్యతే ।
గాయత్రీ ఛన్ద ఆఖ్యాతం సూర్య శ్చైవ తు దైవతమ్ ॥
అతిరాత్రే నియోగస్స్యాదగ్నీషోమో నియోగకః ॥48॥

ఉదుత్యం జాతవేదసం దేవం వహన్తి కేతవః అనేమంత్రానికి ప్రస్కణ్వుడు ఋషి. ఛందస్సు గాయత్రి అని చెప్పబడింది. సూర్యుడు దేవత. అతిరాత్రం, అగ్నీషోమం అనేయాగాలలో దీనికి వినియోగం.

చిత్రం దేవేతి చ ఋచ ఋషిః కౌత్స ఉదాహృతః ।
త్రిష్టుప్ ఛన్దో దైవతం చ సూర్యోఽస్యాః పరికీర్తితమ్ ॥49॥

'చిత్రం దేవానా ముదగా దనీకం' అనే మంత్రానికి కౌత్సుడు ఋషి అని చెప్పబడింది. ఛందస్సు త్రిష్టుప్పు. దేవత సూర్యుడు అని పేరుకొనబడింది.

ఇత్యాది మహాపురాణే ఆగ్నేయే సన్ధ్యావిధికథనం నామ పఞ్చదశాధికద్విశతతమోఽధ్యాయః॥215॥

అగ్నిమహాపురాణంలో సంధ్యావిధికథనం అనే రెండువందల పదిహేనవ అధ్యాయం సమాప్తం.

షోడశాధికద్విశతతమో௨ధ్యాయః – రెండువందల పదహారవ అధ్యాయం

గాయత్రీనిర్వాణకథనమ్ – గాయత్రీనిర్వాణకథనం

అగ్నిరువాచ – వశిష్ఠమహర్షితో అగ్నిదేవుడు ఇలా చెప్తున్నాడు.

ఏవం సన్ధ్యావిధిం కృత్వా గాయత్రీం చ జపేత్ స్మరేత్ ।
గాయన్ శిష్యాన్ యత స్త్రాయేత్ కాయః ప్రాణాం స్తథైవ చ॥1॥

ఈవిధంగా సంధ్యావందనం యథావిధిగా ఆచరించి, గాయత్రీమంత్రాన్ని జపించాలి. రూపాన్ని ధ్యానించాలి. తనను ధ్యానించి, జపించే శిష్యులశరీరాలనూ, ప్రాణాలనూ కాపాడుతుంది కాబట్టి –

తత స్స్మృతేయం గాయత్రీ సావిత్రీయం తతో యతః ।
ప్రకాశనాత్మా సవితుర్వాగ్రూపత్వాత్ సరస్వతీ ॥2॥

దీనికి గాయత్రి అనేప్రసిద్ధి కలిగింది. దీనికి దేవత సవిత. సవితృదేవతను ప్రకాశింపజేస్తుంది కాబట్టి గాయత్రికే సావిత్రి అని కూడ పేరు. ఈమంత్రం వాక్కు స్వరూపంలో ఉండడంచేత దీనిని సరస్వతి అని కూడ అంటారు.

తజ్జ్యోతిః పరమం బ్రహ్మ భర్గస్తేజో యత స్స్మృతమ్ ।
భా దీప్తా వితి రూపం హి భ్రస్జః పాకో௨థ తత్ స్మృతమ్ ॥3॥

గాయత్రీమంత్రంలోని తత్ అనేశబ్దానికి తేజస్సు అని అర్థం. ఆతేజస్సే పరబ్రహ్మ. భర్గ శబ్దానికి తేజస్సు అనేఅర్థం కదా. (తత్ భర్గః = ఆ తేజస్సు అని తచ్ఛబ్దం తేజస్సునే తెలుపుతుంది). భా దీప్తౌ అని దీప్తి అనేఅర్థాన్ని ఇచ్చే భా ధాతువునుండి (భాతి ఇతి భర్గః) భర్గ అనేరూపం ఏర్పడింది. ఇంకా భ్రస్జ – పాకే అని పాకం అనేఅర్థాన్ని తెలిపే భ్రస్జ ధాతువునుండి కూడ భర్గ శబ్దం ఏర్పడుతుంది.

ఓషధ్యాదికం పచతి భ్రాజృ దీప్తౌ తథా భవేత్ ।
భర్గ స్స్యాద్ భ్రాజత ఇతి బహులం ఛన్ద ఈరితమ్ ॥4॥

ఓషధులు మొద లయినవాటిని పచనం చేసేవాడు కాబట్టి, తేజస్వి అయినసూర్యుడు భర్గుడు. ఇంకా భ్రాజృ దీప్తౌ అని దీప్తి అనే అర్థాన్ని ఇచ్చే భ్రాజృ ధాతువునుండి కూడ భర్గ శబ్దం ఏర్పడుతుంది. భ్రాజతే ఇతి భర్గః అనేవ్యుత్పత్తితో దీనికి ప్రకాశించేవాడు కాబట్టి భర్గుడు అని అర్థం. బహుళం ఛన్దసి అనేవ్యాకరణలక్షణం ప్రకారం భర్గశబ్దం పైవిధంగా మూడు ధాతువులలో దేనినుండి అయినా ఏర్పడవచ్చును.

వరేణ్యం సర్వతేజేభ్య శ్శ్రేష్ఠం వై పరమం పదమ్ ।
స్వర్గాపవర్గకామైర్వా వరణీయం సదైవ హి ॥5॥

గాయత్రీమంత్రంలోని వరేణ్యం అనే శబ్దానికి సమస్త తేజస్సులలోనూ శ్రేష్ఠమయిన తేజస్సు అని అర్థం. అది పరమపదం. స్వర్గం లేదా మోక్షం కోరుకునేవారు నిత్యమూ ఆశ్రయించవలసినది అని కూడా, వరేణ్యశబ్దానికి అర్థం కావచ్చు. (ఉత్తమ మైన స్వర్గమోక్షాలను ఇచ్చేది కాబట్టి వరేణ్యం)

వృణోతేర్వరణార్థత్వా జ్జాగ్రత్స్వప్నాదివర్జితమ్ ।
నిత్యం శుద్ధం బుద్ధ మేకం సత్యం తం ధీమహీశ్వరమ్ ॥6॥

వృఞ్ ధాతువుకు వరించుట అని అర్థం. ఈశ్వరుడు (దేవుడు) అంటే పరమాత్మ – జాగ్రత్, స్వప్నం మొదలయిన అవస్థలు లేనిది. శాశ్వతమైనది, త్రిగుణరహితం, జ్ఞానస్వరూపం, రెండవది లేనిది. సత్యస్వరూపం. అటువంటిపరమాత్మను ధ్యానిస్తున్నాం.

అహం బ్రహ్మ పరం జ్యోతి ర్ధ్యాయేమహి విముక్తయే ।
తజ్జ్యోతి ర్భగవాన్ విష్ణుర్జగజ్జన్మాదికారణమ్ ॥7॥

పరమమైన తేజస్సు శ్రీవిష్ణుభగవానుడు. అతడే పరబ్రహ్మ. జగత్తు ఏర్పడడం (సృష్టి) మొద లయినవాటికి (స్థితిలయాలకు) విష్ణువే మూలకారణం. అటువంటి జ్యోతిస్స్వరూపు డయిన విష్ణుభగవానుడిని నేను ధ్యానిస్తాను.

శివం కేచిత్ పఠన్తి స్మ శక్తిరూపం పఠన్తి చ ।
కేచిత్ సూర్యం కేచి దగ్నిం వేదగా అగ్నిహోత్రిణః ॥8॥

ఆ తేజస్సును కొందరు శివుడు అని పేర్కొంటారు. మరి కొందరు శక్తిస్వరూపం అంటారు. ఇంక కొందరు సూర్యుడు అని చెప్తారు. వేదవిదులూ, యజ్ఞశీలులు అయినవారు ఆ తేజస్సును అగ్ని అని చెప్తారు.

అగ్న్యాదిరూపీ విష్ణుర్హి వేదాదౌ బ్రహ్మ గీయతే ।
తత్పదం పరమం విష్ణోర్దేవస్య సవితు స్స్మృతమ్ ॥9॥

నిజానికి అగ్ని మొదలయిన రూపాలలో ఉన్నవాడు విష్ణువే. వేదాలు మొదలయినవి విష్ణువునే పరబ్రహ్మ అని కీర్తించాయి. అందుచేత గాయత్రిమంత్రంలో దేవస్య సవితుః అని చెప్పబడిన ఉత్తమపదం విష్ణువునకు సంబంధించినదే(తేజస్సు).

మహదాద్యం సూయతే హి స్వయం జ్యోతి ర్హరిః ప్రభుః ।
పర్జన్యో వాయు రాదిత్య శ్శీతోష్ణాద్యైశ్చ పాచయేత్ ॥10॥

జగత్ప్రభువయినవిష్ణువు స్వయంగా జ్యోతిస్స్వరూపుడు. అతడే మహత్తు మొదలయినవానిని (వాటితో జగత్తును) సృష్టిస్తున్నాడు. మేఘం, గాలి, ఆదిత్యుడు, శీతం, ఉష్ణం మొదలైనవాటిద్వారా ప్రాణిసృష్టికి మూలమైన అన్నాదులను పచనం చేస్తున్నాడు.

అగ్నౌ ప్రాస్తాహుతి స్సమ్యగాదిత్య ముపతిష్ఠతే ।
ఆదిత్యా జ్జాయతే వృష్టి ర్వృష్టే రన్నం తతః ప్రజాః ॥11॥

అగ్నిలో చక్కగా అంటే యథాశాస్త్రంగా ఉంచబడిన ఆహుతి ఆదిత్యుడిని చేరుకుంటున్నది. సూర్యుడివలన మేఘం, దానివలన వర్షం కురుస్తున్నది. వర్షంవలన పంటలు పండి అన్నం ఏర్పడుతున్నది. అన్నంవలన ప్రాణులు ఏర్పడుతున్నారు.

దధతే ర్వా ధీమహీతి మనసా ధారయేమహి ॥12॥

ధీమహి అనేపదం దధతి (డు ధాఞ్ ధారణపోషణయోః) అనేధాతువునుండి కూడ ఏర్పడుతుంది. దానిప్రకారం ధీమహి అనే శబ్దానికి 'ఆతేజస్సును మేము మనసులో ధారణ చేస్తున్నాం' అని కూడ అర్థం చెప్పవచ్చు.

నోఽస్మాకం యశ్చ భర్గశ్చ సర్వేషాం ప్రాణినాం ధియః ।
చోదయాత్ ప్రేరయేద్ బుద్ధి ర్భోక్తౄణాం సర్వకర్మసు ॥
దృష్టాదృష్టవిపాకేషు విష్ణుసూర్యాగ్నిరూపవాన్ ॥13॥

(గాయత్రీమంత్రంలోని మూడవపాదానికి అర్థం ఇక్కడ వివరింపబడుతున్నది) నః (= అస్మాకం) అంటే మాయొక్క అని అర్థం. యః (= భర్గః) అంటే తేజస్సు. ధియః అంటే సమస్తమయినజీవులయొక్క బుద్ధులను, చోదయేత్ (= ప్రేరయేత్) ప్రేరణ చేయును గాక! ఆతేజస్సు సమస్త మైనప్రాణులబుద్ధులను ప్రేరేపించును గాక! (ఏవిషయంలో అంటే వివరిస్తున్నాడు.) గాయత్రీమంత్రాన్ని జపిస్తూ, తత్ఫలాన్ని అనుభవించే జాపకులబుద్ధి, ఫలితం తెలిసినదీ, తెలియనిదీ అయినఅన్ని కర్మలలోనూ ప్రేరేపించును గాక! అలా ప్రేరేపించే భర్గస్సు విష్ణు సూర్య అగ్ని రూపాలలో ఉన్నది. (విష్ణు,సూర్య,అగ్నిరూపంలో ఉన్న తేజస్సు ప్రాణులబుద్ధిని సమస్తమైన కర్మలయందు ప్రేరేపించును గాక! అని తాత్పర్యం)

ఈశ్వరప్రేరితో గచ్ఛేత్ స్వర్గం వా శ్వభ్రమేవ చ ॥14॥

పుణ్యకర్మల నయినా, పాపకర్మల నయినా, జీవుడు పరమేశ్వరుడి ప్రేరణవలననే చేస్తాడు. ఆ కర్మలఫలానికి అనుగుణంగా స్వర్గానికో నరకానికో వెళ్తాడు.

ఈశావాస్య మిదం సర్వం మహదాది జగద్ధరిః ।
స్వర్గాద్యైః క్రీడతే దేవో యో హంసః పురుషః ప్రభుః ॥15॥

ఈజగత్తు సమస్తమూ పరమాత్మకు నివాసస్థానం. మహత్తు మొదలైన రూపాలతో విష్ణువు జగ మంతటా నిండిఉన్నాడు. జగత్తు లన్నిటినీ సృష్టించిన విష్ణువు లోకాల కన్నిటికీ ప్రభువు. హంసస్వరూపంతో అన్నింటా నిండిఉంటాడు. స్వర్గం మొదలయిన అన్నిలోకాలలోనూ విహరిస్తూ ప్రకాశిస్తాడు.

ఆదిత్యాన్తర్గతం య చ్చ భర్గాఖ్యం వై ముముక్షుభిః ।
జన్మమృత్యువినాశాయ దుఃఖస్య త్రివిధస్య చ ॥
ధ్యానేన పురుషోఽయం చ ద్రష్టవ్యస్సూర్యమణ్డలే ॥16॥

ఆ పరమాత్మ సూర్యబింబం నడుమ తేజోరూపంలో ఉంటాడు. ఆతేజస్సుకే భర్గస్సు అని పేరు. చావుపుట్టుకలు లేకుండాపోవడానికీ, ఆధిభౌతికం, ఆధిదైవికం, ఆధ్యాత్మికం అనే మూడువిధాలైన దుఃఖాలను నిర్మూలించుకోవడానికీ,

సూర్యమండలం మధ్యలో భర్గరూపంలో ఆ పరమపురుషుడిని మోక్షాన్ని కోరుకునేవాళ్లు ధ్యానిస్తారు. ఆ పరమాత్మను అక్కడే దర్శించాలి.

తత్త్వం సదసి చిద్బ్రహ్మ విష్ణోర్యత్పరమం పదమ్ ।
దేవస్య సవితు ర్భర్గో వరేణ్యం హి తురీయకమ్ ॥17॥

తత్ పదార్థస్వరూపమే. సత్తు, చిత్తు. అదే పరబ్రహ్మం. అది విష్ణువుయొక్క ఉత్తమమైనస్థానం. సవితృదేవతయొక్క శ్రేష్ఠమైనతేజస్సు నాలుగవది.

దేహాదిజాగ్రదాబ్రహ్మ అహం బ్రహ్మేతి ధీమహి ।
యో౽సా వాదిత్యే పురుష స్సో౽సావహమనన్త ఓమ్ ॥
జ్ఞానాని శుభకర్మాదీన్ ప్రవర్తయతి య స్సదా ॥18॥

దేహం మొదలుగా జాగ్రదవస్థనుండి బ్రహ్మపర్యంతం సూర్యమండలాంతర్గత మైన భర్గస్సు అనే ఆ తేజస్సే బ్రహ్మ. ఆబ్రహ్మను నేనే అని ధ్యానిస్తాం. ఈ నేనే సూర్యమండలంలో ఉన్న పరబ్రహ్మ. అంతం లేని ప్రణవస్వరూపం నేను. నిత్యమూ (ప్రతిరోజూ) పుణ్యకర్మలను ఆచరింపజేస్తూ జ్ఞానమార్గంలో నడిపించేవాడు ఆదిత్యాంతర్గతు డైన తేజస్స్వరూపుడైన ఆ పరమాత్మే.

ఇత్యాది మహాపురాణే ఆగ్నేయే గాయత్రీనిర్వాణకథనం నామ షోడశాధికద్విశతతమో౽ధ్యాయః ॥216॥

అగ్నిమహాపురాణంలో గాయత్రీనిర్వాణకథనం అనే రెండువందల పదహారవ అధ్యాయం సమాప్తం.



సప్తదశాధికద్విశతతమోऽధ్యాయః – రెండువందల పదిహేడవ అధ్యాయం

గాయత్రీనిర్వాణకథనమ్ – గాయత్రీనిర్వాణకథనం

అగ్నిరువాచ – వశిష్ఠమహర్షితో అగ్నిదేవుడు ఇలా చెప్తున్నాడు.

లిఙ్గమూర్తిం శివం స్తుత్వా గాయత్ర్యా యోగమాప్తవాన్ ।
నిర్వాణం పరమం బ్రహ్మ వశిష్ఠోఽన్యశ్చ శఙ్కరాత్ ॥1॥

వశిష్ఠా! పూర్వం నీకంటె వేరయిన మరొకవశిష్ఠుడు లింగస్వరూపుడై ఉన్న పరమేశ్వరుడిని స్తుతి చేసి, గాయత్రితో యోగం పొందాడు. గాయత్రి అంటే నిర్వాణస్వరూపమైన ఆ పరబ్రహ్మమే. (ఆ వశిష్ఠుడు శివుడిని ఇలా స్తుతించాడు.)

నమః కనకలిఙ్గాయ వేదలిఙ్గాయ వై నమః ।
నమః పరమలిఙ్గాయ వ్యోమలిఙ్గాయ వై నమః ॥2॥

బంగారులింగానికి నమస్కారం. వేదలింగానికి నమస్కారం. పరమలింగానికి నమస్కారం. ఆకాశలింగానికి నమస్కారం.

నమ స్సహస్రలిఙ్గాయ వహ్నిలిఙ్గాయ వై నమః ।
నమః పురాణలిఙ్గాయ శ్రుతిలిఙ్గాయ వై నమః ॥3॥

సహస్రలింగస్వరూపుడికి నమస్కారం. అగ్నిలింగానికి నమస్కారం. పురాణలింగానికి నమస్కారం. వేదలింగానికి నమస్కారం.

నమః పాతాలలిఙ్గాయ బ్రహ్మలిఙ్గాయ వై నమః ।
నమో రహస్యలిఙ్గాయ సప్తద్వీపోర్ధ్వలిఙ్గినే ॥4॥

పాతాళలింగానికి నమస్కారం. బ్రహ్మలింగానికి నమస్కారం. రహస్యలింగానికి నమస్కారం. సప్తద్వీపాలకంటె ఉన్నతమైయున్న లింగానికి నమస్కారం.

నమ స్సర్వాత్మలిఙ్గాయ సర్వలోకాఙ్గలిఙ్గినే ।
నమోऽస్త్వవ్యక్తలిఙ్గాయ బుద్ధిలిఙ్గాయ వై నమః ॥5॥

సర్వస్వరూపమైన సర్వాత్మకలింగానికి నమస్కారం. సర్వలోకాలూ తనస్వరూపమే అయిన సర్వలోకలింగానికి నమస్కారం. వ్యక్తం కాకుండా ఉన్న లింగానికి నమస్కారం. బుద్ధిస్వరూపమైన బుద్ధిలింగానికి నమస్కారం.

నమోऽహఙ్కారలిఙ్గాయ భూతలిఙ్గాయ వై నమః ।
నమ ఇన్ద్రియలిఙ్గాయ నమ స్తన్మాత్రలిఙ్గినే ॥6॥

అహంకారలింగానికి నమస్కారం. సర్వభూతరూపమైన భూతలింగానికి నమస్కారం. ఇంద్రియలింగానికి నమస్కారం. పంచతన్మాత్రలరూపమైన లింగానికి నమస్కారం.

నమః పురుషలిఙ్గాయ భావలిఙ్గాయ వై నమః ।
నమో రజోర్ధ్వలిఙ్గాయ సత్త్వలిఙ్గాయ వై నమః ॥7॥

పురుషలింగానికి నమస్కారం. భావస్వరూపమైన లింగానికి నమస్కారం. రజోగుణస్వరూపమైన ఊర్ధ్వలింగానికి నమస్కారం. సత్త్వగుణరూపమైన లింగానికి నమస్కారం.

నమస్తే భవలిఙ్గాయ నమ స్త్రైగుణ్యలిఙ్గినే ।
నమోఽనాగతలిఙ్గాయ తేజోలిఙ్గాయ వై నమః ॥8॥

భవస్వరూపమైన లింగానికి నమస్కారం. సత్త్వ, రజస్, తమస్సులనే మూడు గుణాల రూపమైన లింగానికి నమస్కారం. ఇంకా ప్రత్యక్షం కాని (రాబోయే)రూపం కలిగిన లింగానికి నమస్కారం. తేజస్సు స్వరూపమైన లింగానికి నమస్కారం.

నమో వాయూర్ధ్వలిఙ్గాయ భావలిఙ్గాయ వై నమః ।
నమస్తేఽథర్వలిఙ్గాయ సామలిఙ్గాయ వై నమః ॥9॥

వాయువు ఉనికిని దాటిన ఉన్నతలింగానికి నమస్కారం. భవుడికి సంబంధించినరూపమైన లింగానికి నమస్కారం. అథర్వవేదం స్వరూపమైన లింగానికి నమస్కారం. సామవేదం స్వరూపమైన లింగానికి నమస్కారం.

తపోయజ్ఞాఙ్గలిఙ్గాయ యజ్ఞలిఙ్గాయ వై నమః ।
నమస్తే తత్త్వలిఙ్గాయ దేవానుగతలిఙ్గినే ॥10॥

తపస్సుకూ, యజ్ఞానికీ అంగమైన లింగానికి నమస్కారం. యజ్ఞమే రూపమైన లింగానికి నమస్కారం. పరమాత్మతత్త్వం రూపమైన లింగానికి నమస్కారం. దేవతలచే పొందబడిన (దేవతలను అనుగ్రహించిన) లింగానికి నమస్కారం.

దిశ నః పరమం యోగమపత్యం మత్సమం తథా ।
బ్రహ్మ చైవాక్షయం దేవ శమం చైవ పరం విభో ॥
అక్షయత్వం చ వంశస్య ధర్మే చ మతిమక్షయామ్ ॥11॥

ప్రభూ! పరమశివా! ఉత్తమమైన(జీవబ్రహ్మైక్య)యోగాన్ని నాకు అనుగ్రహించు. నాతో సమానమైన సంతానాన్ని ప్రసాదించు. శాశ్వతమైన పరబ్రహ్మతత్త్వాన్ని (బ్రహ్మజ్ఞానాన్ని)ఇవ్వు. ద్వంద్వాదిదోషరహితమైన శాంతిని అనుగ్రహించు. నావంశం ఎల్లకాలం ఉండేటట్లు చేయి. నాబుద్ధి ధర్మంలో స్థిరంగా లగ్నమై ఉండేవిధంగా చూడు.

అగ్నిరువాచ – వసిష్ఠమహర్షితో అగ్నిదేవుడు ఇలా చెప్తున్నాడు.

వసిష్ఠేన స్తుతశ్శమ్భు స్తుష్టశ్శ్రీపర్వతే పురా ।
వసిష్ఠాయ వరం దత్త్వా తత్రైవాన్తరధీయత ॥12॥

పూర్వం వసిష్ఠుడు ఈవిధంగా శివుడిని స్తుతింపగా, శ్రీశైలంమీద ఉన్న ఆ పరమేశ్వరుడు చాల సంతోషించాడు. వసిష్ఠుడికి వరం ఇచ్చాడు. తరువాత ఆ ప్రదేశంలోనే అంతర్ధానమైనాడు.

ఇత్యాది మహాపురాణే ఆగ్నేయే గాయత్రీనిర్వాణకథనం నామ సప్తదశాధికద్విశతతమోఽధ్యాయః ॥217॥

అగ్నిమహాపురాణంలో గాయత్రీనిర్వాణకథనం అనే రెండువందల పదిహేడవ అధ్యాయం సమాప్తం.

అష్టాదశాధిక ద్విశతతమోఽధ్యాయః - రెండువందల పద్దెనిమిదవ అధ్యాయం

రాజ్యాభిషేకకథనమ్ - రాజ్యాభిషేకకథనం

అగ్నిరువాచ - వశిష్ఠమహర్షితో అగ్నిదేవుడు ఇలా చెప్తున్నాడు.

పుష్కరేణ చ రామాయ రాజధర్మం హి పృచ్ఛతే ।
యథాదౌ కథితం తద్వద్ వసిష్ఠ కథయామి తే ॥1॥

వసిష్ఠమహర్షీ! పూర్వం పరశురాముడు పుష్కరుడిని రాజధర్మాలను గురించి అడిగాడు. అపుడు పుష్కరుడు పరశురాముడికి చెప్పినవిధంగా నేను నీకు చెప్తాను.

పుష్కర ఉవాచ - పరశురాముడితో పుష్కరుడు రాజధర్మాలను ఈ విధంగా చెప్తున్నాడు.

రాజధర్మం ప్రవక్ష్యామి సర్వస్మా ద్రాజధర్మతః ।
రాజా భవే చ్ఛత్రుహన్తా ప్రజాపాల స్సుదణ్డవాన్ ॥2॥

రామా! రాజధర్మాల నన్నింటినీ పరిశీలించి, వానిలోనుండి ప్రధానమైన ధర్మాలను నీకు చెప్తాను. రాజు శత్రువులను చంపివేయాలి. నేరానికి తగినదండన విధించాలి. ప్రజలను చక్కగా కాపాడాలి.

పాలయిష్యామి వస్సర్వాన్ ధర్మస్థాన్ వ్రతమాచరేత్ ।
సంవత్సరం స వృణుయాత్ పురోహితమథ ద్విజమ్ ॥3॥

రామా! 'మీరు ధర్మబద్ధంగా నడుచుకుంటే, నేను మిమ్మల్ని అందరినీ రక్షిస్తాను' అని చెప్పి ప్రజాపాలనం ఒకవ్రతంగా ఆచరించాలి. రాబోయే సంవత్సరకాలంవరకు (చాల సుదీర్ఘకాలంలో కూడ) రాజుకూ, రాజ్యానికీ మేలు జరిగేవిధంగా ఆలోచించగలిగిన బ్రాహ్మణుడిని పురోహితుడుగా స్వీకరించాలి.

మన్త్రిణశ్చాఖిలాత్మజ్ఞాన్ మహిషీం ధర్మలక్షణామ్ ।
సాంవత్సరం నృపః కాలే ససమ్భారోఽభిషేచనమ్ ॥4॥

ప్రజలు మొదలుగా అందరిమనసులు గ్రహించగలిగిన, ఆత్మజ్ఞానులయినవారిని మంత్రులుగా తీసుకోవాలి. ఉత్తమమైన ధార్మికలక్షణాలు కలిగిన స్త్రీని పట్టపురాణిగా స్వీకరించాలి. ఇలా ఒకసంవత్సరం గడిచిన తరువాత పుష్కలమైన సామగ్రితో ఘనంగా పట్టాభిషేకం చేసుకోవాలి.

కుర్యా న్మృతే నృపే నాత్ర కాలస్య నియమ స్స్మృతః ।
తిలై స్సిద్ధార్థకై స్స్నానం సాంవత్సరపురోహితైః ॥5॥

రాజు మరణించినప్పుడు (పట్టాభిషేకానికి) సంవత్సరం వేచిఉండడం అనే ఈ కాలనియమం లేదు. ఆ సంవత్సరకాలానికి నియోగింపబడిన పురోహితులు (సంవత్సరం తర్వాత) తెల్లనువ్వులతోనూ, తెల్లఆవాలతోనూ అభిషేకం చేయాలి.

ఘోషయిత్వా జయం రాజ్ఞో రాజా భద్రాసనే స్థితః ।
అభయం ఘోషయే ద్దుర్గాన్ మోచయే ద్రాజ్యపాలకే ॥6॥

పురోహితులు రాజు విజయాన్ని ప్రకటించాలి. తరువాత భద్రసింహాసనం అధిష్ఠించి, రాజు కోట(రాజ్యం)లోనివారి కందరికి భయం లేదని ప్రకటించాలి. రాజ్యాన్ని రక్షించగలిగినవారికి స్వేచ్ఛను ఇవ్వాలి.

పురోధసాభిషేకాత్ ప్రాక్ కార్యైన్ద్రీశాన్తి రేవ చ ।
ఉపవాస్యాభిషేకాహే వేద్యగ్నౌ జుహుయాన్మనూన్ ॥7॥

రాజ్యాభిషేకం చేయడానికి పూర్వమే పురోహితుడు ఐంద్రీశాంతిని నిర్వహించాలి. పట్టాభిషేకం నాడు ఉపవాసం ఉండి, అగ్నికుండంలో ఆయామంత్రాలతో హోమం చేయాలి.

వైష్ణవా నైన్ద్రమన్త్రాం స్తు సావిత్రాన్ వైశ్వదైవతాన్ ।
సౌమ్యాన్ స్వస్త్యయనం శర్మ ఆయుష్యాభయదా న్మనూన్ ॥8॥

విష్ణువు, ఇంద్రుడు, సవిత, విశ్వేదేవతలు, సోముడు అనేదేవతలకు సంబంధించిన మంత్రాలతోనూ, స్వస్తినీ, శుభాలనూ, ఆయువునూ, అభయాన్నీ కలిగించే మంత్రాలతోనూ హోమం చేయాలి.

అపరాజితాం చ కలశం వహ్నేర్దక్షిణపార్శ్వగమ్ ।
సమ్పూతవస్తం హైమం చ పూజయే ద్గన్ధపుష్పకైః ॥9॥

అగ్నిని స్థాపించిన వేదికకు కుడివైపున అపరాజిత అనే బంగారుకలశాన్ని స్థాపించాలి. అది శుభపరంపరలను కలిగిస్తుంది. దానిని గంధం, పుష్పం మొదలైనవాటితో పూజించాలి.

ప్రదక్షిణావర్తశిఖస్తప్తజామ్బూనదప్రభః ।
రథౌఘమేఘనిర్ఘోషో విధూమశ్చ హుతాశనః ॥10॥

అగ్నికుండంలోని అగ్నిజ్వాల కుడివైపుకు తిరిగిఉంటుంది. బాగా కాచిన బంగారంవంటి రంగులో ఉంటుంది. హోమకుండంలోని అగ్ని రథాలగుంపులు నడుస్తున్నట్లుగానూ, పిడుగులు పడుతున్నట్లుగానూ ధ్వని చేస్తుంటుంది. పొగ ఏమాత్రం ఉండదు.

అనులోమ స్సుగన్ధిశ్చ స్వస్తికాకారసన్నిభః ।
ప్రసన్నార్చి ర్మహాజ్వాల స్స్ఫులిఙ్గరహితో హితః ॥11॥

ఇంకా ఆ అగ్ని ఒకక్రమంలో జ్వలిస్తుంది. పరిమళాలు వెదజల్లుతుంటుంది. స్వస్తికం రూపంతో సమానంగా ఉంటుంది. అగ్ని ప్రశాంతంగా శుభంకరంగా జ్వలిస్తుంది. అందులోనుండి నిప్పురవ్వలు వెలువడవు. ఆ అగ్ని రాజ్యానికి మేలు చేస్తుంది.

న వ్రజేయుశ్చ మధ్యేన మార్జారమృగపక్షిణః ।
పర్వతాగ్రమృదా తావన్మూర్ధానం శోధయే న్నృపః ॥12॥

అగ్నిహోత్రానికీ, రాజుకూ నడుమనుండి పిల్లి గానీ, ఇతరజంతువులు గానీ, పక్షులు గానీ వెళ్లగూడదు. పట్టాభిషేకసమయంలో కొండఅంచుల పైన ఉండేమట్టితో రాజు శిరస్సును శుద్ధి చేయాలి.

వల్మీకాగ్రమృదా కర్ణౌ వదనం కేశవాలయాత్ ।
ఇన్ద్రాలయమృదా గ్రీవాం హృదయం తు నృపాజిరాత్ ॥13॥

పాముపుట్టపై మట్టితో రాజుగారి చెవులనూ, విష్ణ్వాలయంలోని మట్టితో ముఖాన్నీ, ఇంద్రుడి దేవాలయంలోని మట్టితో మెడనూ, రాజగృహం వాకిట్లో ఉన్నమట్టితో హృదయాన్ని శుద్ధి చేయాలి.

కరిదన్తోద్ధృతమృదా దక్షిణం తు తథా భుజమ్ ।
వృషశృఙ్గోద్ధృతమృదా వామం చైవ తథా భుజమ్ ॥14॥

ఏనుగుదంతంతో పైకి లేపిన (త్రవ్విన)మట్టితో కుడిభుజాన్నీ, ఎద్దుకొమ్ముతో లేపిన మట్టితో ఎడమభుజాన్నీ శుద్ధి చేయాలి.

సరోమృదా తథా పృష్ఠ ముదరం సఙ్గమమృదా ।
నదీతటద్వయమృదా పార్శ్వే సంశోధయే త్తథా ॥15॥

సరస్సులోని మట్టితో రాజువెనుకభాగాన్నీ, నది సముద్రంలో కలిసిన(సంగమ)స్థలంలోని మట్టితో రాజుపొట్టనూ, రెండునదులతీరంలో ఉన్నమట్టితో రాజుశరీరంలోని ప్రక్కభాగాలనూ శుద్ధి చేయాలి.

వేశ్యాద్వారమృదా రాజ్ఞః కటిశౌచం విధీయతే ।
యజ్ఞస్థానాత్తథైవోరూ గోస్థానాజ్జానునీ తథా ॥16॥

వేశ్యఇంటివాకిట్లో ఉన్నమట్టితో రాజుగారినడుముభాగాన్నీ, యజ్ఞం చేసినప్రదేశంలోని మట్టితో తొడలనూ, ఆవులకొట్టంలోని మట్టితో మోకాళ్లనూ శుద్ధి చేయాలి.

అశ్వస్థానాత్తథా జఙ్ఘే రథచక్రమృదాఙ్ఘ్రికే ।
మూర్ధానం పఞ్చగవ్యేన భద్రాసనగతం నృపమ్ ॥17॥

గుఱ్ఱాలు ఉండే(అశ్వశాల)చోటఉన్నమట్టితో పిక్కలనూ, రథచక్రం నడిచినచోట ఉన్నమట్టితో పాదాలనూ, పంచగవ్యాలతో శిరస్సునూ ఈవిధంగా భద్రాసనం మీద ఉన్నరాజు అవయవాలను ఆయాప్రదేశాలలోని మట్టితో శుద్ధి చేయాలి.

అభిషిఞ్చేదమాత్యానాం చతుష్టయమథోఘటైః ।
పూర్వతో హేమకుమ్భేన ఘృతపూర్ణేన బ్రాహ్మణః ॥18॥

నాలుగువైపులనుండి నలుగురు మంత్రులు రాజును అభిషేకించాలి. ముందుగా తూర్పుదిక్కుగా ఆవునేతితో నిండిన బంగారుకలశంలో బ్రాహ్మణుడైన అమాత్యుడు అభిషేకించాలి.

రౌప్యకుమ్భేన యామ్యే చ క్షీరపూర్ణేన క్షత్రియః ।
దధ్నా చ తామ్రకుమ్భేన వైశ్యః పశ్చిమగేన చ ॥
మృణ్మయేన జలేనోదక్ శూద్రామాత్యోఽభిషేచయేత్ ॥19॥

తరువాత క్షత్రియుడైన అమాత్యుడు దక్షిణదిక్కున ఉండి, ఆవుపాలతో నిండిన వెండికలశంతో అభిషేకించాలి. వైశ్యుడైన అమాత్యుడు పడమర వైపు ఉండి, ఆవుపెరుగుతో నిండిన రాగికలశంతో అభిషేకించాలి. శూద్రజాతికి చెందిన అమాత్యుడు ఉత్తరదిక్కుగా ఉండి, నీటితో నిండిన మట్టికుండతో రాజును అభిషేకించాలి.

తతోఽభిషేకం నృపతే ర్బహ్వృచప్రవరో ద్విజః ।
కుర్వీత మధునా విప్రశ్ఛన్దోగశ్చ కుశోదకైః ॥20॥

ఆ తరువాత ఋగ్వేదంలో దిట్ట అయిన బ్రాహ్మణుడు (ఋగ్వేదమంత్రాలతో) తేనెతోనూ, సామవేదపండితుడైన బ్రాహ్మణుడు దర్భోదకంతోనూ, రాజును అభిషేకించాలి.

సమ్పాతవన్తం కలశం తథా గత్వా పురోహితః ।
విధాయ వహ్నిరక్షాం తు సదస్యేషు యథావిధి ॥21॥

అప్పుడు పురోహితుడు శుభప్రదమైన అపరాజితాకలశం వద్దకు వెళ్లి, సదస్యులనడుమ అగ్నిరక్ష అనే కార్యక్రమాన్ని నడపాలి.

రాజశ్రియాభిషేకే చ యే మన్త్రాః పరికీర్తితాః ।
తైస్తు దద్యా న్మహాభాగ బ్రాహ్మణానాం స్వనై స్తథా ॥22॥

మహాత్మా! వశిష్ఠమహర్షీ! ఆ తరువాత పురోహితుడు రాజ్యాభిషేకానికి ఉద్దేశించిన మంత్రాలతో రాజుగారికి అభిషేకం ఆచరించాలి. ఆ సమయంలో సదస్సులోని బ్రాహ్మణులు వేదమంత్రాలను స్వరయుక్తంగా చక్కగా పఠించాలి.

తతః పురోహితో గచ్ఛేద్ వేదిమూలం తదేవ తు ।
శతచ్ఛిద్రేణ పాత్రేణ సౌవర్ణేనాభిషేచయేత్ ॥23॥

ఆ తరువాత పురోహితుడు ఆ వేదికవద్దకు వెళ్లాలి. నూరురంధ్రాలు కలిగిన బంగారుకలశంతో రాజును అభిషేకించాలి.

యా ఓషధీ త్యోషధీభీ రథేత్యుక్త్వేతి గన్ధకైః ।
పుష్పైః పుష్పవతీత్యేవ బ్రాహ్మణేతి చ బీజకైః ॥24॥

'యా ఓషధీః' అనేమంత్రంతో ఓషధులతోనూ, 'అథేత్యుక్త్వా' అనేమంత్రంతో చందనాదులతోనూ, 'పుష్పవతీ' అనే మంత్రంతో పూలతోనూ, 'బ్రాహ్మణాః' అనే మంత్రంతో వివిధబీజాలతోనూ రాజును అభిషేకించాలి.

రత్నైరాశుశ్శిశానశ్చ యే దేవాశ్చ కుశోదకైః ।
యజుర్వేద్యథర్వవేదీ గన్ధద్వారేతి సంస్పృశేత్ ॥
శిరః కణ్ఠం రోచనయా సర్వతీర్థోదకై ర్ద్విజాః ॥25॥

'ఆశుశ్శిశానః' అనే మంత్రంతో రత్నాలతోనూ, 'యే దేవాః' అనే మంత్రంతో దర్భజలంతోనూ, రాజును అభిషేకించాలి. యజుర్వేదవిద్వాంసుడూ, అథర్వవేదపండితుడూ 'గంధద్వారాం' అనేమంత్రంతో రాజుగారి శిరస్సుమీదనూ, మెడపైనా, గోరోచనంతో తిలకం దిద్దాలి. బ్రాహ్మణులు సమస్తనదీసాగరాదుల జలంతో రాజును అభిషేకించాలి.

గీతవాద్యాదినిర్ఘోషై శ్చామరవ్యజనాదిభిః ।
సర్వౌషధిమయం కుమ్భం ధారయేయుర్నృపాగ్రతః ॥26॥

పాటలూ, వివిధవాద్యాలు మొదలయినవి గొప్పగా ధ్వని చేస్తుండాలి. కొందరు చామరాలు, కొందరు వ్యజనాలు ధరించి ఉండాలి. సమస్తమైన ఓషధులతోనూ నిండిన కలశాన్ని రాజు ఎదుట ఉంచాలి.

తం పశ్యేద్దర్పణం రాజా ఘృతం వై మఙ్గలాదికమ్ ।
అభ్యర్చ్య విష్ణుం బ్రహ్మాణమిన్ద్రాదీంశ్చ గ్రహేశ్వరాన్ ॥27॥

రాజు విష్ణువునూ, బ్రహ్మదేవుడినీ, ఇంద్రుడు మొదలైన దేవతలనూ, గ్రహాధిపతులనూ చక్కగా పూజించాలి. తరువాత ఆ కలశాన్నీ, అద్దాన్నీ, ఆవునేయి మొదలయిన మంగళద్రవ్యాలనూ వరసగా చూడాలి.

వ్యాఘ్రచర్మోత్తరాం శయ్యా ముపవిష్టః పురోహితః ।
మధుపర్కాదికం దత్త్వా పట్టబన్ధం ప్రకారయేత్ ॥28॥

అన్నింటికంటె పైన పులిచర్మం పరిచిన శయ్యపై కూర్చుండి, పురోహితుడు రాజుకు మధుపర్కం, మొద లైనవాటిని ఇవ్వాలి. ఆ తరువాత రాజుకు పట్టం కట్టాలి.

రాజ్ఞో ముకుటబన్ధశ్చ పఞ్చ చర్మోత్తరం దదేత్ ।
ధ్రువాద్యైరితి చ విశేద్ వృషజం వృషభాంశజమ్ ॥
ద్వీపిజం సింహజం వ్యాఘ్ర జాతం చర్మ తదాసనే ॥29॥

రాజు శిరస్సుపై కిరీటాన్ని ఉంచాలి. రాజును 'ధ్రువాద్యైః' అనేమంత్రంతో ఒకదానిపై ఒకటిగా అయిదు చర్మాలతో సిద్ధం చేసిన ఆసనంమీద కూర్చోబెట్టాలి. ఆ ఆసనంలో గుఱ్ఱంచర్మం, ఎద్దుచర్మం, చిఱుతపులిచర్మం, సింహంచర్మం, పెద్దపులిచర్మం అనేచర్మాలు అయిదు, క్రమంగా ఉండాలి.

అమాత్యసచివాదీంశ్చ ప్రతిహారః ప్రదర్శయేత్ ॥30॥

అప్పుడు కార్యనిర్వాహకుడు అమాత్యులను, సచివులను రాజుకు ప్రదర్శించాలి.

గోజావిగృహదానాద్యై స్సాంవత్సరపురోహితౌ ।
పూజయిత్వా ద్విజాన్ ప్రార్చ్య హ్యన్యాన్ భూగోఽన్నముఖ్యకైః ॥31॥

రాజు ముహూర్తం పెట్టడంవంటివి చేసే జ్యోతిష్కుడికి, పురోహితుడికి ఆవులనూ, మేకలనూ, గొఱ్ఱెలనూ, ఇండ్లు మొదలయినవాటినీ దానం చేయాలి. బ్రాహ్మణులను పూజించాలి. అనంతరం వారికి భూమి, ఆవులు, అన్నం మొదలుగా ప్రధానమైన పదార్థాలను గౌరవంగా సమర్పించాలి.

వహ్నిం ప్రదక్షిణీకృత్య గురుం నత్వాథ పృష్ఠతః ।
వృషమాలభ్య గాం వత్సం పూజయిత్వాథ మన్త్రితమ్ ॥
అశ్వమారుహ్య నాగం చ పూజయే త్తం సమారుహేత్ ॥32॥

తరువాత అగ్నికి ప్రదక్షిణం చేయాలి. గురువులకు నమస్కరించాలి. ఆ తరువాత ఆబోతును వెనుకనుండి స్పృశించి, ఆవునూ దూడనూ చక్కగా పూజించాలి. ఆ పిదప మంత్రించబడిన గుఱ్ఱాన్ని అధిరోహించాలి. ఆ తరువాత పట్టపుటేనుగును పూజించి, ఆ ఏనుగును అధిరోహించాలి.

పరిభ్రమే ద్రాజమార్గే బలయుక్తః ప్రదక్షిణమ్ ।
పురం విశేచ్చ దానాద్యైః ప్రార్చ్య సర్వాన్ విసర్జయేత్ ॥33॥

ఆతరువాత చతురంగబలాలతో కూడి, రాజవీథులలో ప్రదక్షిణంగా ఊరేగాలి. అది అయిన తరువాత రాచనగరులో ప్రవేశించాలి. అక్కడ సమస్తమైన జనాన్ని గౌరవించి, సాగనంపాలి.

ఇత్యాది మహాపురాణే ఆగ్నేయే రాజ్యాభిషేకకథనం నామాష్టదశాధికద్విశతతమో ఽధ్యాయః॥218॥

అగ్నిమహాపురాణంలో రాజ్యాభిషేకకథనం అనే రెండువందల పద్దెనిమిదవ అధ్యాయం సమాప్తం.



ఏకోనవింశత్యధికద్విశతతమోఽధ్యాయః – రెండువందల పందొమ్మిదవ అధ్యాయం

అభిషేకమంత్రకథనమ్ – అభిషేకమంత్రకథనం

పుష్కర ఉవాచ – పరశురాముడితో పుష్కరుడు ఈవిధంగా చెప్తున్నాడు.

రాజదేవాద్యభిషేకమన్త్రాన్ వక్ష్యేఽఘమర్దనాన్ ।
కుమ్భాత్కుశోదకై స్సిఞ్చే త్తేన సర్వం హి సిధ్యతి ॥1॥

ఇక రాజులు, దేవతలు, మొదలయినవారిని అభిషేకించే మంత్రాలను చెప్తాను. ఇవి పాపాలను నశింపజేస్తాయి. కలశంలో దర్భలనూ, నీళ్లనూ ఉంచి, ఆ నీళ్లతో అభిషేకం చేస్తే, కావలసినవన్నీ లభిస్తాయి.

సురా స్త్వామభిషిఞ్చన్తు బ్రహ్మవిష్ణుమహేశ్వరాః ।
వాసుదేవ స్సఙ్కర్షణః ప్రద్యుమ్న శ్చానిరుద్ధకః ॥2॥

బ్రహ్మ, విష్ణువు, మహేశ్వరుడు, (త్రిమూర్తులు), వాసుదేవుడు, సంకర్షణుడు, ప్రద్యుమ్నుడు, అనిరుద్ధుడు (చతుర్వ్యూహాలు) అనే దేవతలు నిన్ను అభిషేకింతురు గాక!

భవన్తు విజయా యైత ఇన్ద్రాద్యా దశదిగ్గతాః ।
రుద్రో ధర్మో మనుర్దక్షో రుచి శ్శ్రద్ధా చ సర్వదా ॥3॥

పదిదిక్కులలో ఉండి, లోకాలను పరిపాలించే ఇంద్రుడు(తూర్పు), అగ్ని(ఆగ్నేయం), నిరృతి(నైరృతి), యముడు(దక్షిణం), వరుణుడు (పడమర), వాయువు (వాయవ్యం), కుబేరుడు (ఉత్తరం), ఈశానుడు (ఐశాన్యం) మొదలయిన (ఊర్ధ్వ, అధో) దిక్పాలకులు, రుద్రుడు, ధర్ముడు, మనువు, దక్షుడు, రుచి, శ్రద్ధ, అనేవారు నీకు విజయం కలిగింతురు గాక!

భృగు రత్రి ర్వసిష్ఠశ్చ సనకశ్చ సనన్దనః ।
సనత్కుమారోఽఙ్గిరాశ్చ పులస్త్యః పులహః క్రతుః ॥
మరీచిః కశ్యపః పాతు ప్రజేశం పృథివీపతిమ్ ॥4॥

ప్రజలను చక్కగా పరిపాలించే ఈ భూపాలుడిని భృగువు, అత్రి, వసిష్ఠుడు, సనకుడు, సనందనుడు, సనత్కుమారుడు, అంగిరుడు, పులస్త్యుడు, పులహుడు, క్రతువు, మరీచి, కశ్యపుడు రక్షింతురు గాక!

ప్రభాసురా బర్హిషద అగ్నిష్వాత్తాశ్చ పాన్తు తే ॥5॥

మిక్కిలిగా ప్రకాశించే బర్హిషదులు, అగ్నిష్వాత్తులు నిన్ను రక్షింతురు గాక!

క్రవ్యాదాశ్చోపహూతాశ్చ ఆజ్యపాశ్చ సుకాలినః ।
అగ్నిభిశ్చాభిషిఞ్చన్తు లక్ష్మ్యాద్యా ధర్మవల్లభాః ॥6॥

క్రవ్యాదులు, ఉపహూతులు, ఆజ్యపులు, సుకాలులు, లక్ష్మి మొదలైనదేవతలు, ధర్ముడిభార్యలు నిన్నభిషేకింతురు గాక!

అదిత్యాద్యాః కశ్యపస్య బహుపుత్రస్య వల్లభాః ।
కృశాశ్వ స్యాగ్నిపుత్రస్య భార్యా శ్చారిష్టనేమినః ॥
అశ్విన్యాద్యాశ్చ చన్ద్రస్య పులహస్య తథా ప్రియాః ॥7॥

పుత్రసంతానం అధికంగా కలిగిన కశ్యపప్రజాపతి భార్యలయిన అదితి మొదలయినవారు, కృశాశ్వుడి భార్యలు, అగ్నిపుత్రుడి భార్యలు, అరిష్టనేమి భార్యలు, చంద్రుడిభార్యలయిన అశ్విని మొదలయిన(నక్షత్రాలు)వారూ, పులహుడి భార్యలు,

భూతా చ కపిశా దంష్ట్రీ సురసా సరమా దనుః ।
శ్యేనీ భాసీ తథా క్రౌఞ్చీ ధృతరాష్ట్రీ శుకీ తథా ॥
ఏతా స్త్వా మభిషిఞ్చన్తు అరుణ శ్చార్కసారథిః ॥8॥

భూత, కపిశ, దంష్ట్రి, సురస, సరమ, దనువు, శ్యేని, భాసి, క్రౌంచి, ధృతరాష్ట్రి, శుకి, అదేవిధంగా సూర్యుడిరథానికి సారథి అయిన అరుణుడు వీరు అందరూ నిన్ను అభిషేకింతురు గాక!

ఆయతి ర్నియతీ రాత్రి ర్నిద్రా లోకస్థితౌ స్థితాః ।
ఉమా మేనా శచీ పాన్తు ధూమోర్ణా నిరృతి ర్జయా ॥9॥

లోకాలను రక్షించే ఆయతి, నియతి, రాత్రి, నిద్ర, ఉమ, మేన, శచి, ధూమ, ఊర్ణ, నిరృతి, జయ అనే దేవతలు నిన్ను రక్షింతురు గాక!

గౌరీ శివా చ ఋద్ధిశ్చ వేలా యా చైవ నడ్వలా ।
అసిక్నీ చ తథా జ్యోత్స్నా, దేవపత్న్యో వనస్పతిః ॥10॥

గౌరి, శివ, ఋద్ధి, వేలా, నడ్వల, అసిక్ని, జ్యోత్స్న, వనస్పతి, దేవకాంతలు నిన్ను రక్షింతురు గాక!

మహాకల్పశ్చ కల్పశ్చ మన్వన్తరయుగాని చ ।
సంవత్సరాణి వర్షాణి పాన్తు త్వా మయనద్వయమ్ ॥11॥

మహాకల్పాలు, కల్పాలు, మన్వంతరాలు, యుగాలు, సంవత్సరాలు, వర్షాలు, (ఉత్తర, దక్షిణ) అయనాలు రెండు నిన్ను రక్షించును గాక!

ఋతవశ్చ తథా మాసాః పక్షా రాత్ర్యహనీ తథా ।
సన్ధ్యా తిథి ర్ముహూర్తాశ్చ కాలస్యావయవాశ్చ యే ॥12॥

ఋతువులు, మాసాలు, (శుక్ల, కృష్ణ) పక్షాలు, రాత్రి, పగలు, సంధ్యాకాలాలు, తిథులు, ముహూర్తాలు, ఇంకా కాలంలో భాగాలయినవి అన్నీ నిన్ను రక్షించును గాక!

సూర్యాద్యాశ్చ గ్రహాః పాన్తు మను స్స్వాయమ్భువాదికః ॥13॥

సూర్యుడు మొదలయిన గ్రహాలు స్వాయంభువుడు మొదలయిన మనువులు నిన్ను రక్షింతురు గాక!

స్వాయమ్భువ స్స్వారోచిశ్చ ఉత్తమ స్తామసో మనుః ।
రైవత శ్చాక్షుష షష్ఠో వైవస్వత ఇహేరితః ॥14॥

సావర్ణి ర్బ్రహ్మపుత్రశ్చ ధర్మపుత్రశ్చ రుద్రజః ।
దక్షజో రౌచ్యభౌత్యౌ చ మనవస్తుచతుర్దశ ॥15॥

విశ్వభుక్చ విపశ్చిచ్చ సుచితిశ్చ శిఖీ విభుః ।
మనోజవ స్తథౌజస్వీ బలి రద్భుతశాన్తయః ॥16॥

ఆ మన్వంతరాలు – 1. స్వాయంభువుడు, 2. స్వారోచిషుడు, 3, ఉత్తముడు, 4. తామసుడు, 5. రైవతుడు, 6. చాక్షుషుడు, 7. వైవస్వతుడు, – 8. (మేరు)సావర్ణి, 9. బ్రహ్మపుత్రుడు (బ్రహ్మసావర్ణి), 10. ధర్మపుత్రుడు (ధర్మసావర్ణి), 11. రుద్రజుడు (రుద్రసావర్ణి), 12. దక్షజ (దక్షసావర్ణి), 13. రౌచ్యుడు, 14. భౌత్యుడు అని మనువులు మొత్తం పద్నాలుగుమంది. విశ్వభుక్కు, విపశ్చిత్తు, సుచితి, శిఖి, విభువు, మనోజవము, ఔజస్వి, బలి, అనే అద్భుతశాంతులు నిన్ను రక్షించును గాక!

వృషశ్చ ఋతధామా చ దివస్పృక్కవిరిన్ద్రకః ।
రైవన్తశ్చ కుమారశ్చ తథా వత్సవినాయకః ॥17॥

వీరభద్రశ్చ నన్దీ చ విశ్వకర్మా పురోజవః ।
ఏతే త్వామభిషిఞ్చన్తు సురముఖ్యా స్సమాగతాః ॥18॥

వృషుడు, ఋతధాముడు, దివస్పృక్కు, కవి, ఇంద్రుడు, రైవంతుడు, కుమారుడు, వత్సవినాయకుడు, వీరభద్రుడు, నంది, విశ్వకర్మ, పురోజవుడు దేవతలలో ప్రధానులు. వీరు ఇక్కడికి వచ్చి, నిన్ను అభిషేకింతురు గాక!

నాసత్యౌ దేవభిషజౌ ధ్రువాద్యా వసవోఽష్ట చ ।
దశ చాఙ్గిరసో వేదాస్త్వాభిషిఞ్చన్తు సిద్ధయే ॥19॥

దేవతల వైద్యులయిన అశ్వినీకుమారులు (ఇద్దరు), ధ్రువుడు మొదలయినవారు, ఎనిమిదిమంది వసువులు, పదిమంది అంగిరసులు, (నాలుగు) వేదాలు అన్నింటా విజయం కలిగేవిధంగా నిన్ను అభిషేకింతురు గాక!

ఆత్మా హ్యాయుర్మనో దక్షో మదః ప్రాణ స్తథైవ చ ।
హవిష్మాంశ్చ గరిష్ఠా చ ఋత స్సత్యశ్చ పాన్తు వః ॥20॥

ఆత్మ, ఆయువు, మనస్సు, దక్షత, మదం, ప్రాణం, హవిష్మంతం, గరిష్ఠం, సత్యం మిమ్ము రక్షించును గాక!

క్రతు ర్దక్షో వసు స్సత్యః కాలకామో ధురిర్జయే ।
పురూరవా ఆద్రివాశ్చ విశ్వేదేవాశ్చ రోచనః ॥21॥

అఙ్గారకాద్యా స్సూర్య స్త్వాం నిరృతిశ్చ తథా యమః ।
అజైకపాదహిర్బుధ్న్యో ధూమకేతుశ్చ రుద్రజాః ॥22॥

భరత శ్చ తథా మృత్యుః కాపాలి రథ కిఙ్కిణిః ।
భవనో భావనః పాన్తు స్వజన్య స్స్వజన స్తథా ॥23॥

క్రతువు, దక్షుడు, వసువు, సత్యం, కాలకాముడు, ధురి, అనేవారు, పురూరవుడు, ఆద్రి(ర్ద్ర)వుడు, (మొదలైన పదముగ్గురు) అనే విశ్వేదేవతలు, రోచనుడు, అంగారకుడు మొదలైనవారు, సూర్యుడు, నిర్రుతి, యముడు, అజుడు, ఏకపాత్తు, అహిర్బుధ్న్యుడు, ధూమకేతువు, రుద్రుడికుమారులు, వీరు నీకు జయం కలిగింతురు గాక! భరతుడు, మృత్యువు, కాపాలి, కింకిణి, భవనుడు, భావనుడు, స్వజన్యుడు, స్వజనుడు నిన్ను రక్షింతురు గాక!

క్రతుశ్రవాశ్చ మూర్ధా చ యాజనోఽభ్యుశనా స్తథా ।
ప్రసవశ్చావ్యయ శ్చైవ దక్షశ్చ భృగవ స్సురా ॥24॥

మనోఽనుమన్తా ప్రాణ శ్చ నవోఽపానశ్చ వీర్యవాన్ ।
వీతిహోత్రో నయ స్సాన్ధ్యో హంసో నారాయణోఽవతు ॥25॥

క్రతుశ్రవసుడు, మూర్ధుడు, యాజనుడు, అభ్యుశనుడు, ప్రసవుడు, అవ్యయుడు, దక్షుడు, భృగువులు, సురలు, మనస్సు, అనుమంత, ప్రాణం, నవం, శక్తిమంతమయిన అపానం, వీతిహోత్రుడు, నయుడు, సాంధ్యుడు, హంస, నారాయణుడు – వీరు నిన్ను రక్షింతురు గాక!

విభుశ్చైవ ప్రభుశ్చైవ దేవశ్రేష్ఠా జగద్ధితాః ।
ధాతా మిత్రోఽర్యమా పూషా శక్రోఽథ వరుణో భగః ॥
త్వష్టా వివస్వాన్ సవితా విష్ణు ర్ద్వాదశ భాస్కరాః ॥26॥

ఏకజ్యోతిశ్చ ద్విజ్యోతి స్త్రిశ్చతుర్జ్యోతి రేవ చ ।
ఏకశక్రో ద్విశక్రశ్చ త్రిశక్రశ్చ మహాబలః ॥27॥

ఇన్ద్రశ్చ మేత్యాదిశతు తతః ప్రతిమకృత్తథా ।
మితశ్చ సమ్మితశ్చైవ అమితశ్చ మహాబలః ॥28॥

విభుడు, ప్రభుడు నిన్ను రక్షింతురు గాక! భాస్కరులు దేవతలలో శ్రేష్ఠులు. లోకాలకు మేలు చేస్తారు. 1. ధాత, 2. మిత్రుడు, 3. అర్యముడు, 4. పూష, 5. శక్రుడు, 6. వరుణుడు, 7. భగుడు, 8. త్వష్ట, 9. వివస్వంతుడు, 10. సవిత, 11. విష్ణువు 12. భాస్కరుడు – వీరు ద్వాదశాదిత్యులు. ఏకజ్యోతి, ద్విజ్యోతి, త్రిజ్యోతి, చతుర్జ్యోతి, ఏకశక్రుడు, ద్విశక్రుడు, మహాబలుడైన త్రిశక్రుడు, ఇంద్రుడు, ప్రతిమకృత్తు, మితుడు, సమ్మితుడు, మహాబలుడైన అమితుడు నిన్ను రక్షింతురు గాక!

ఋతజిత్ సత్యజి చ్చైవ సుషేణ స్సేనజిత్ తథా ।
అతిమిత్రోఽనుమిత్రశ్చ పురుమిత్రోఽపరాజితః ॥29॥

ఋతశ్చ ఋతవా గ్ధాతా విధాతా ధారణో ధ్రువః ।
విధారణో మహాతేజా వాసవస్య పర స్సఖా ॥30॥

ఈదృక్షశ్చాప్యదృక్షశ్చ ఏతాదృగమితాశనః ।
క్రీడితశ్చ సదృక్షశ్చ సరభశ్చ మహాతపాః ॥31॥

ధర్తా ధుర్యో ధురి ర్భీమోఽ హ్యభిముక్తోఽ క్షపాత్ సహ ।
ధృతి ర్వసు రనాధృష్యో రామః కామో జయో విరాట్ ॥
దేవా ఏకోనపఞ్చాశ న్మరుత స్త్వా మవన్తు తే ॥32॥

ఋతజిత్తు, సత్యజిత్తు, సుషేణుడు, సేనజిత్తు, అతిమిత్రుడు, అనుమిత్రుడు, పురుమిత్రుడు, అపరాజితుడు, ఋతుడు, ఋతవాక్కు, ధాత, విధాత, ధారణుడు, ధ్రువుడు; మిక్కిలితేజస్వి, ఇంద్రుడికి ప్రియ మయినస్నేహితుడూ అయిన విధారణుడు, ఈదృక్షుడు, అదృక్షుడు, ఏతాదృశుడు, అమితాశనుడు, క్రీడితుడు, సదృక్షుడు, సరభుడు, మహాతపుడు, ధర్త, ధుర్యుడు, ధురి, భీముడు,అభిముక్తుడు, అక్షపాత్తు, ధృతి, వసువు, అనాధృష్యుడు, రాముడు, కాముడు, జయుడు, విరాట్టు, దేవతలు, నలభైతొమ్మిదిమంది మరుత్తులు, అందరూ నిన్ను రక్షింతురు గాక!

చిత్రాఙ్గద శ్చిత్రరథ శ్చిత్రసేనశ్చ వై కలిః ।
ఊర్ణాయు రుగ్రసేనశ్చ ధృతరాష్ట్రశ్చ నన్దకః ॥33॥

హాహా హూహూ ర్నారదశ్చ విశ్వావసుశ్చ తుమ్బురుః ।
ఏతే త్వామభిషిఞ్చన్తు గన్ధర్వా విజయాయ తే ॥34॥

చిత్రాంగదుడు, చిత్రరథుడు, చిత్రసేనుడు, కలి, ఊర్ణాయువు, ఉగ్రసేనుడు, ధృతరాష్ట్రుడు, నందకుడు, హాహా, హూహూ, నారదుడు, విశ్వావసువు, తుంబురుడు, అనే గంధర్వులు విజయం కలిగేవిధంగా నిన్నభిషేకింతురుగాక!

పాన్తు తే మునయో ముఖ్యా దివ్యాశ్చాప్సరసాం గణాః ॥35॥

శ్రేష్ఠులయిన మునులు, దేవజాతులయిన అప్సరసల సముదాయాలు నిన్ను రక్షింతురు గాక!

అనవద్యా సుకేశీ చ మేనకా సహజన్యయా ।
క్రతుస్థలా ఘృతాచీ చ విశ్వాచీ పుఞ్జికస్థలా ॥36॥

ప్రమ్లోచా చోర్వశీ రమ్భా పఞ్చచూడా తిలోత్తమా ।
చిత్రలేఖా లక్ష్మణా చ పుణ్డరీకా చ వారుణీ ॥37॥

ప్రహ్లాదో విరోచనోఽథ బలి ర్బాణోఽథ తత్సుతాః ।
ఏతే చాన్యేఽభిషిఞ్చన్తు దానవా రాక్షసా స్తథా ॥38॥

అనవద్య, సుకేశి, మేనక, సహజన్య, క్రతుస్థల, ఘృతాచి, విశ్వాచి, పుంజికస్థల, ప్రమ్లోచ, ఊర్వశి, రంభ, పంచచూడ, తిలోత్తమ, చిత్రలేఖ, లక్ష్మణ, పుండరీక, వారుణి అనే ఆ అప్సరసలు, ప్రహ్లాదుడు, విరోచనుడు, బలి, బాణుడు, బాణుడికుమారులు, ఇంకా ఇతరులయిన దానవులు, రాక్షసులు నిన్ను అభిషేకింతురు గాక!

హేతి శ్చైవ ప్రహేతిశ్చ విద్యుత్స్ఫూర్జథు రగ్రకాః ।
యక్ష స్సిద్ధాత్మకః పాతు మణిభద్రశ్చ నన్దనః ॥39॥

హేతి, ప్రహేతి, విద్యుత్తు, స్ఫూర్జథువు, అగ్రకులు, యక్షుడు, సిద్ధాత్మకుడు, మణిభద్రుడు, నందనుడు నిన్ను రక్షింతురుగాక!

పిఙ్గాక్షో ధృతిమాం శ్చైవ పుష్పవన్తో జయావహః ।
శఙ్ఖః పద్మశ్చ మకరః కచ్ఛపశ్చ నిధిర్జయే ॥40॥

పింగాక్షుడు, ధృతిమంతుడు, పుష్పవంతుడు, జయావహుడు, నిన్ను రక్షింతురు గాక! శంఖం, పద్మం, మకరం, కచ్ఛపం, అనే నిధులు నీకు జయప్రదంగా అభిషేకం చేయును గాక!

పిశాచా ఊర్ధ్వకేశాద్యా భూతా భూమ్యాదివాసినః ।
మహాకాలం పురస్కృత్య నరసింహం చ మాతరః ॥41॥

ఊర్ధ్వకేశం మొదలైన పిశాచాలు, భూమి మొదలైన ప్రదేశాలలో నివసించే భూతాలు, మాతృదేవతలు, మహాకాలుడిని, నరసింహస్వామిని పురస్కరించుకుని (నీకు జయం కలిగింతురు గాక!)

గుహ స్స్కన్దో విశాఖ స్త్వాం నైగమేయోఽభిషిఞ్చతు ।
డాకిన్యో యాశ్చ యోగిన్యః ఖేచరా భూచరాశ్చ యాః ॥42॥

గుహుడు, స్కందుడు, విశాఖుడు, నైగమేయుడు నిన్ను అభిషేకింతురు గాక! ఆకాశంలోనూ, భూమిమీదనూ సంచరించే డాకినులు, యోగినులు నిన్ను అభిషేకింతురు గాక!

గరుడ శ్చారుణః పాన్తు సమ్పాతిప్రముఖాః ఖగాః ।
అనన్తాద్యా మహానాగా శ్శేషవాసుకితక్షకాః ॥43॥

ఐరావతో మహాపద్మః కమ్బలాశ్వతరా వుభౌ ।
శఙ్ఖః కర్కోటక శ్చైవ ధృతరాష్ట్రో ధనఞ్జయః ॥44॥

గరుత్మంతుడు, అరుణుడు, సంపాతి మొదలయిన పక్షులు, అనంతుడు మొదలైన మహాసర్పాలు నిన్ను రక్షింతురు గాక! శేషుడు, వాసుకి, తక్షకుడు, ఐరావతం, మహాపద్మం, కంబలం, అశ్వతరం అనేవి రెండు, శంఖం, కర్కోటకం, ధృతరాష్ట్రం, ధనంజయం, మొదలైన మహాసర్పాలు నిన్ను రక్షించును గాక!

కుముదైరావణౌ పద్మః పుష్పదన్తోఽథ వామనః ।
సుప్రతీకోఽఞ్జనో నాగాః పాన్తు త్వాం సర్వద స్సదా ॥45॥

1. కుముదం, 2. ఐరావణ(త)ం, 3. పద్మం (పుండరీకం), 4. పుష్పదంతం, 5. వామనం, 6. సుప్రతీకం, 7. అంజనం, (8. సార్వభౌమం) అనే(అష్ట)దిగ్గజాలు కావలసినవి అన్నీ ఇచ్చి, ఎల్లవేళలలోనూ నిన్ను కాపాడును గాక!

పైతామహ స్తథా హంసో వృషభ శ్శఙ్కరస్య చ ।
దుర్గాసింహశ్చ పాన్తు త్వాం యమస్య మహిష స్తథా ॥46॥

బ్రహ్మదేవుని వాహనమైన హంస, పరమేశ్వరుని వాహనమైన వృషభం, దుర్గాదేవికి వాహనమైన సింహం, యముడి వాహనమైన దున్నపోతు నిన్ను రక్షించును గాక!

ఉచ్చైశ్శ్రవా శ్చాశ్వపతి స్తథా ధన్వన్తరి స్సదా ।
కౌస్తుభ శ్శఙ్ఖరాజశ్చ వజ్రం శూలం చ చక్రకమ్ ॥47॥

నన్దకో௨స్త్రాణి రక్షన్తు ధర్మశ్చ వ్యవసాయకః ।
చిత్రగుప్తశ్చ దణ్డశ్చ పిఙ్గలో మృత్యుకాలకౌ ॥48॥

గుఱ్ఱాలలో శ్రేష్ఠమైన ఉచ్చైశ్శ్రవం, ధన్వంతరి, కౌస్తుభమణి, పాంచజన్యం అనే ఉత్తమమైన శంఖం, ఇంద్రుడివజ్రాయుధం, శివుడిశూలం, సుదర్శనం అనే చక్రం, నందకం అనే కత్తి,(మొదలైనఆయుధాలు)నిన్ను రక్షించును గాక! ధర్మనిర్వహణలో అచంచలమైన పూనిక కలిగిన యమధర్మరాజు, చిత్రగుప్తుడు, దండుడు, పింగళుడు, మృత్యువు, కాలుడు నిన్ను రక్షింతురు గాక!

వాలఖిల్యాదిమునయో వ్యాసవాల్మీకిముఖ్యకాః ॥49॥
పృథు ర్దిలీపో భరతో దుష్యన్త శ్శత్రుజిద్ బలీ ।
మనుః కకుత్‌స్థ శ్చానేన యువనాశ్వో జయద్రథః ॥50॥

మాన్ధాతా ముచుకున్దశ్చ పాన్తు త్వాం చ పురూరవాః ।
వాస్తుదేవాః పఞ్చవింశ త్తత్త్వాని విజయాయ తే ॥51॥

వాలఖిల్యుడు మొదలయిన మునులు, వ్యాసుడు, వాల్మీకి, మొదలైన మహర్షులు, పృథుమహారాజు, దిలీపుడు, భరతుడు, దుష్యంతుడు, బలవంతుడయిన శత్రుజిత్తు, మనువు, కకుత్‌స్థుడు, యువనాశ్వుడు, జయద్రథుడు, మాంధాత, ముచుకుందుడు, పురూరవుడు, వాస్తుదేవతలు, ఇరవైఅయిదుతత్త్వాలు, నీకు విజయం కలిగించును గాక!

రుక్మభౌమ శ్శిలాభౌమః పాతాలో నీలమూర్తికః ।
పీతరక్తః క్షితి శ్చైవ శ్వేతభౌమో రసాతలమ్ ॥
భూ ర్లోకో௨థ భువ ర్ముఖ్యా జమ్బూద్వీపాదయ శ్శ్రియే ॥52॥

రుక్మభౌమం, శిలాభౌమం, నల్లనిఆకారం కలిగిన పాతాళం, పసుపు, ఎఱుపు కలిసినరంగులో ఉన్న భూలోకం, శ్వేతభౌమం, రసాతలం, భూలోకం, భువర్లోకం మొదలైన లోకాలు, జంబువు మొదలైన ద్వీపాలు నీకు సంపదలను కలిగించును గాక!

ఉత్తరాః కురవః పాన్తు రమ్యో హిరణ్యక స్తథా ॥53॥

ఉత్తరకురుభూములు, మనోహరమైన హిరణ్యభూమి నిన్ను రక్షించును గాక!

భద్రాశ్వః కేతుమాలశ్చ వర్షశ్చైవ బలాహకః ।
హరివర్షః కింపురుష ఇన్ద్రద్వీపః కశేరుమాన్ ॥54॥

తామ్రవర్ణో గభస్తిమాన్ నాగద్వీపశ్చ సౌమ్యకః ।
గాన్ధర్వో వారుణో యశ్చ నవమః పాతు రాజ్యదః ॥55॥

భద్రాశ్వం, కేతుమాలం, బలాహకవర్షం, హరివర్షం, కింపురుషవర్షం, ఇంద్రద్వీపం, కశేరుమంతం, తామ్రవర్ణం, గభస్తిమంతం, నాగద్వీపం, సౌమ్యకం, గాంధర్వం, వారుణం, రాజ్యాన్నిచ్చే నవమం నిన్ను రక్షించును గాక!

హిమవాన్ హేమకూటశ్చ నిషధో నీల ఏవ చ ।
శ్వేతశ్చ శృఙ్గవాన్మేరు ర్మాల్యవాన్ గన్ధమాదనః ॥56॥

మహేన్ద్రో మలయ స్సహ్య శ్శుక్తిమాన్ ఋక్షవాన్ గిరిః ।
విన్ధ్యశ్చ పారియాత్రశ్చ గిరయశ్శాన్తిదాస్తు తే ॥57॥

హిమవంతం, హేమకూటం, నిషధం, నీలం, శ్వేతం, మేరుపర్వతం, మాల్యవంతం, గంధమాదనం, మహేంద్రం, మలయం, సహ్యం, శుక్తిమంతం, ఋక్షవంతం, వింధ్యం, పారియాత్రం, అనేపర్వతాలు నీకు శాంతిని ఇచ్చు గాక!

ఋగ్వేదాద్యా ష్షడఙ్గాని ఇతిహాసపురాణకమ్ ।
ఆయుర్వేదశ్చ గాన్ధర్వ ధనుర్వేదోపవేదకాః ॥58॥

శిక్షా కల్పో వ్యాకరణం నిరుక్తం జ్యోతిషాం గతిః ।
ఛన్దోఽఙ్గాని చ వేదాశ్చ మీమాంసా న్యాయవిస్తరః ॥
ధర్మశాస్త్రం పురాణం చ విద్యా హ్యేతాశ్చతుర్దశ ॥59॥

సాఙ్ఖ్యం యోగః పాశుపతం వేదా వై పఞ్చరాత్రకమ్ ।
కృతాన్తపఞ్చకం హ్యేతద్ గాయత్రీ చ శివా తథా ॥
దుర్గా విద్యా చ గాన్ధారీ పాన్తు త్వాం శాన్తిదాశ్చ తే ॥60॥

ఋగ్వేదం మొదలైన నాలుగువేదాలు, శిక్ష, వ్యాకరణం మొదలైన ఆరువేదాంగాలు, ఇతిహాసాలు, పురాణాలు, ఆయుర్వేదం (ఋగ్వేదానికి), గంధర్వవేదం (సామవేదానికి), ధనుర్వేదం (యజుర్వేదానికి) మొదలైన(అథర్వవేదానికి

స్థాపత్యం) ఉపవేదాలు నీకు శాంతిని గలిగించును గాక! 1. శిక్ష, 2. కల్పం, 3. వ్యాకరణం, 4. నిరుక్తం, 5. జ్యోతిషం, 6. ఛందస్సు అనేవి ఆరు వేదానికి అంగాలు. వేదాలు నాలుగు, వేదాంగాలు ఆరు, మీమాంస, తర్కశాస్త్రం, ధర్మశాస్త్రం, పురాణం అనేవి నాలుగు కలిసి, చతుర్దశ(పద్నాలుగు)విద్యలు. ఇవి నిన్ను రక్షించును గాక! 1. సాంఖ్యం, యోగం, పాశుపతం, వేదాలు, పాంచరాత్రం, అనే అయిదింటికి సిద్ధాంతపంచకం అని పేరు. ఇవి నిన్ను రక్షించును గాక! గాయత్రి, శివ, దుర్గ, విద్య, గాంధారి నిన్ను రక్షించును గాక! అవి నీకు శాంతిని కలిగించును గాక!

లవణేక్షుసురాసర్పి ర్దధిదుగ్ధజలాబ్ధయః ।
చత్వార స్సాగరాః పాన్తు తీర్థాని వివిధాని చ ॥61॥

ఉప్పుసముద్రం, చెరుకురససముద్రం, కల్లుసముద్రం, నేతిసముద్రం, పెరుగుసముద్రం, పాలసముద్రం, నీళ్లసముద్రం అనే సప్తసముద్రాలు నిన్ను రక్షించును గాక! అలాగే భూమికి నాలుగుదిక్కులలోనూ ఉన్న జలరాశులు, వివిధ మయినపుణ్య తీర్థాలు నిన్ను రక్షించును గాక!

పుష్కరశ్చ ప్రయాగశ్చ ప్రభాసో నైమిషః పరః ।
గయాశీర్షో బ్రహ్మశిర స్తీర్థ ముత్తరమానసమ్ ॥62॥

కాలోదకో నన్దికుణ్డ తీర్థం పఞ్చనద స్తథా ।
భృగుతీర్థం ప్రభాసం చ తథా చామరకణ్టకమ్ ॥63॥

జమ్బూమార్గశ్చ విమలః కపిలస్య తథాశ్రమః ।
గఙ్గాద్వారకుశావర్తౌ విన్ధ్యకో నీలపర్వతః ॥64॥

వరాహపర్వతశ్చైవ తీర్థం కనఖలం తథా ।
కాలాఞ్జలశ్చ కేదారో రుద్రకోటి స్తథైవ చ ॥65॥

వారాణసీ మహాతీర్థం బదర్యాశ్రమ ఏవ చ ।
ద్వారకా శ్రీగిరి స్తీర్థం తీర్థం చ పురుషోత్తమః ॥66॥

శాలగ్రామోఽథ వారాహ స్సిన్ధుసాగరసఙ్గమః ।
ఫల్గుతీర్థం బిన్దుసరః కరవీరాశ్రమ స్తథా ॥67॥

నద్యో గఙ్గాసరస్వత్యౌ శతద్రుర్గణ్డకీ తథా ।
అచ్ఛోదా చ విపాశా చ వితస్తా దేవికా నదీ ॥68॥

కావేరీ వరుణా చైవ నిశ్చిరా గోమతీ నదీ ।
పారా చర్మణ్వతీ రూపా మన్దాకినీ మహానదీ ॥69॥

తాపీ పయోష్ణీ వేణా చ గౌరీ వైతరణీ తథా ।
గోదావరీ భీమరథీ తుఙ్గభద్రారణీ తథా ॥
చన్ద్రభాగా శివా గౌరీ అభిషిఞ్చన్తు పాన్తు చ ॥70॥

పుష్కరం, ప్రయాగ, ప్రభాసం, ఉత్తమమైన నైమిషం, గయాశీర్షం, బ్రహ్మశిరం, ఉత్తరమానసం, కాలోదకం, నందికుండం, పంచనదం, భృగుతీర్థం, ప్రభాసతీర్థం, అమరకంటకతీర్థం, జంబూమార్గం, విమలం, కపిలాశ్రమం, గంగాద్వారం, కుశావర్తం, వింధ్యపర్వతం, నీలపర్వతం, వరాహపర్వతం, కనఖలతీర్థం, కాలాంజలతీర్థం, కేదారతీర్థం, రుద్రకోటితీర్థం, ఉత్తమమైన వారాణసీతీర్థం, బదరికాశ్రమం, ద్వారక, శ్రీగిరితీర్థం, పురుషోత్తమతీర్థం, శాలగ్రామతీర్థం, వారాహతీర్థం, సింధుసాగరసంగమతీర్థం, ఫల్గుతీర్థం, బిందుసరం (తీర్థం,) కరవీరాశ్రమం, ఇంక నదులలో గంగ, సరస్వతి, శతద్రువు, గండకి, అచ్ఛోదం, విపాశ, వితస్త, దేవిక, కావేరి, వరుణ, నిశ్చిర, గోమతి, పార, చర్మణ్వతి, రూప, మందాకిని, మహానది, తాపి, పయోష్ణి, వేణ, గౌరి, వైతరణి, గోదావరి, భీమరథి, తుంగభద్ర, ఆరణి, చంద్రభాగ, శివ, గౌరి, అనే మహానదులు నిన్ను అభిషేకించి, రక్షించును గాక!

ఇత్యాది మహాపురాణే ఆగ్నేయే అభిషేకమన్త్రకథనం నామైకోనవింశత్యధికద్విశతతమోఽధ్యాయః ॥219॥

అగ్నిమహాపురాణంలో అభిషేకమంత్రకథనం అనే రెండువందల పందొమ్మిదవ అధ్యాయం సమాప్తం.



వింశత్యధికద్విశతతమో உధ్యాయః - రెండువందల ఇరవైయవ అధ్యాయం

సహాయసంపత్తివర్ణనమ్ - సహాయసంపత్తివర్ణనం

పుష్కర ఉవాచ - పరశురాముడితో పుష్కరుడు ఈవిధంగా చెప్తున్నాడు.

సోஉభిషిక్త స్సహామాత్యో జయేచ్ఛత్రూన్ నృపోత్తమః ।
రాజ్ఞా సేనాపతిః కార్యో బ్రాహ్మణః క్షత్రియోஉథవా ॥1॥

ఉత్తముడైన రాజు అభిషేకం అయినతరువాత, అమాత్యులతో కలిసి శత్రువులను జయించాలి. బ్రాహ్మణుడు లేదా క్షత్రియుడు అయినవాడిని సేనాపతిగా నియమించాలి.

కులీనో నీతిశాస్త్రజ్ఞః ప్రతీహారశ్చ నీతివిత్ ।
దూతశ్చ ప్రియవాదీస్యాదక్షీణోஉతిబలాన్వితః ॥2॥

సేనాపతి ఉత్తమమైన వంశంలో జన్మించినవాడు కావాలి. నీతిశాస్త్రం చక్కగా తెలిసినవాడు అయి ఉండాలి. ద్వారపాలకుడు కూడ నీతిశాస్త్రం తెలిసినవాడు కావాలి. (నీతిశాస్త్రం తెలిసినవాడినే రాజు ద్వారపాలకుడిగా నియమించాలి). దూతగా నియమింపబడేవాడు అందరికీ ప్రియం కలిగేవిధంగా మాట్లాడేవాడు కావాలి. ఉత్సాహవంతుడు కావాలి. మిక్కిలి బలవంతుడై ఉండాలి.

తామ్బూలధారీ నా స్త్రీ వా భక్తః క్లేశసహః ప్రియః ।
సన్ధివిగ్రహకః కార్య ష్షాడ్గుణ్యాదివిశారదః ॥3॥

తాంబూలంపెట్టె పట్టుకునిఉండేవాడు పురుషుడైనా, లేదా స్త్రీ అయినా కావచ్చు. కాని రాజుమీద భక్తి ఉండాలి. కష్టాలను ఓర్చుకోగలిగి ఉండాలి. రాజుకు ఇష్టమైనవాడు కావాలి. సంధి, విగ్రహం, యానం, ఆసనం, ద్వైధీభావం, సమాశ్రయం అనే ఆరుగుణాలలో నేర్పరి అయినవాడిని సంధివిగ్రహాలను నిర్వహించేవాడుగా రాజు నియమించుకోవాలి.

ఖడ్గధారీ రక్షక స్స్యాత్ సారథి స్స్యాద్బలాదివిత్ ।
సూదాధ్యక్షో హితో విజ్ఞో మహానసగతో హి సః ॥4॥

రాజు యొక్క అంగరక్షకుడు ఖడ్గం ధరించి ఉండాలి. (ఖడ్గవిద్యలో నేర్పుకాడయి ఉండాలి). రాజుగారి రథసారథి చతురంగబలాల సామర్థ్యం మొదలైన విషయాలు తెలిసినవాడై ఉండాలి. రాజుగారి వంటశాలకు అధిపతి అయినవాడు రాజుకు మేలు కోరేవాడు కావాలి. వివేకం కలిగి ఉండాలి. వంటశాలలో నిరంతరం అప్రమత్తుడై ఉండాలి.

సభాసదస్తు ధర్మజ్ఞా లేఖకోஉక్షరవి ద్ధితః ।
ఆహ్వానకాలవిజ్ఞా స్స్యు ర్హితా దౌవారికా జనాః ॥5॥

రాజసభలో ఉండేవారు ధర్మం తెలిసినవారై ఉండాలి. రాజపత్రాలు వ్రాసేవాడు వివిధదేశాలభాషలను వ్రాయడం తెలిసిఉండాలి. రాజుమేలు కోరేవాడు కావాలి. ద్వారపాలకులు ఎప్పుడూ రాజుగారికి మేలు జరగా

లని కోరుకోవాలి. తమను రాజు పిలిచేసమయం తెలిసిఉండాలి. (రాజు పిలవడానికి ముందే రాజువద్దకు వెళ్లడానికి సిద్ధంగా ఉండాలి).

రత్నాదిజ్ఞో ధనాధ్యక్షో హ్యర్థద్వారే హితో నరః ।
స్యాదాయుర్వేదవి ద్వైద్యో గజాధ్యక్షోఽథ హస్తివిత్ ॥6॥

రత్నాలు మొదలైన వాటిని గురించి చక్కగా తెలిసినవాడిని ధనాగారానికి అధిపతిగా నియమించాలి. అతడు ఆర్థిక విషయాలలో రాజుకు మేలు చేసేవాడు అయిఉండాలి. (కోశాగారాన్ని వృద్ధిచేసే తెలివితేటలు ఉండాలి) ఆయుర్వేదాన్ని క్షుణ్ణంగా తెలిసినవాడిని రాజవైద్యుడుగా నియమించాలి. ఏనుగులను గూర్చి చక్కగా తెలిసినవాడిని గజశాలకు అధిపతిగా నియమించాలి.

జితశ్రమో గజారోహే హయాధ్యక్షో హయాదివిత్ ।
దుర్గాధ్యక్షో హితో ధీమాన్ స్థపతి ర్వాస్తువేదవిత్ ॥7॥

తాను ఏనుగును అధిరోహించడంలో ఏమాత్రం శ్రమపడగూడదు (ఎటువంటి ఏనుగునైనా, సులువుగా లోబరచుకోగలగాలి). అలాగే గుఱ్ఱాలను గురించి చక్కగా తెలిసినవాడిని గుఱ్ఱాలకు (అశ్వశాలకు) అధిపతిగా నియమించాలి. కోటను రక్షించేవారికి నాయకుడుగా బుద్ధిమంతుడిని నియమించాలి. (రాజుకు మేలు చేసేబుద్ధి, దుర్గాన్ని రక్షించగలిగినతెలివితేటలు కలిగి ఉండాలి.) వాస్తుశాస్త్రాన్ని క్షుణ్ణంగా తెలిసినవాడిని రాజశిల్పిగా నియమించాలి.

యన్త్రముక్తే పాణిముక్తే హ్యముక్తే ముక్తధారితే ।
అస్త్రాచార్యో నియుద్ధే చ కుశలో నృపతే ర్హితః ॥8॥

అస్త్రవిద్యను నేర్పేవాడు వివిధాలైన ఆయుధాలను యంత్రాలద్వారా ప్రయోగించడలోనూ, చేతితో ప్రయోగించడంలోనూ, ప్రయోగింపకూడని సమయాలలో ప్రయోగించకపోవడంలోనూ, ప్రయోగించినదానిని అవసరమయితే ఆపడంలోనూ, ఆయుధప్రమేయం లేని బాహుయుద్ధాదులలోనూ నైపుణ్యం కలిగిఉండాలి.

వృద్ధ శ్చాన్తఃపురాధ్యక్షః పఞ్చాశద్వార్షికా స్త్రియః ।
సప్తత్యబ్దా స్తు పురుషా శ్చరేయు స్సర్వకర్మసు ॥9॥

అంతఃపురరక్షణకు అధికారిగా ముసలివాడిని నియమించాలి. అంతఃపురంలోని అన్నిపనులను నిర్వహించడానికి ఆడవాళ్లు అయితే యాభైఏళ్లవయసు కలిగినవాళ్లను, మగవా ళ్లయితే డెబ్బైఏళ్లవయసు గలిగినవారినీ నియమించాలి.

జాగ్రత్ స్యాదాయుధాగారే జ్ఞాత్వా వృత్తి ర్విధీయతే ।
ఉత్తమాధమమధ్యాని బుద్ధ్వా కర్మాణి పార్థివః
ఉత్తమాధమమధ్యాని పురుషాన్ వినియోజయేత్ ॥10॥

ఎప్పుడూ అప్రమత్తంగా ఉండేవాడినే ఆయుధశాలలో నియమించాలి. వ్యక్తుల సామర్థ్యాన్ని తెలుసుకుని, వారివారికి ఆ యా వృత్తులను ఏర్పాటుచేయాలి. చేయవలసినపనుల ఉత్తమత్వాన్ని, మధ్యమత్వాన్ని, అధమత్వాన్ని గ్రహించి, రాజు ఆయాకర్మలకు అనుగుణంగా తగినవ్యక్తులను నియమించాలి.

జయేచ్ఛుః పృథివీం రాజా సహాయా నానయేద్ధితాన్ ॥11॥

సర్వకార్యాలలోనూ విజయం కోరుకునేమహారాజు తనకు మేలు కోరుకునేవారిని సహాయకులుగా వెదికి తెచ్చుకోవాలి.

ధర్మిష్ఠాన్ ధర్మకార్యేషు శూరాన్ సఙ్గ్రామకర్మసు ।
నిపుణా నర్థకృత్యేషు సర్వత్ర చ తథా శుచీన్ ॥
స్త్రీషు షణ్ఢాన్నియుఞ్జీత తీక్ష్ణాన్ దారుణకర్మసు ॥12॥

ధర్మకార్యాలలో ధర్మపరాయణులయినవారినీ, యుద్ధకర్మలలో పరాక్రమవంతులనూ, ఆర్థికవ్యవహారాలలో (ధనవిషయంలో) నైపుణ్యం కలిగినవారినీ, అన్నిపనులలోనూ స్వచ్ఛమైన నడవడి కలిగినవారినే నియోగించాలి. అంతఃపురం మొదలైనచోట్ల ఆడవాళ్లను రక్షించేవిషయంలో నపుంసకులను నియమించాలి. కఠినమైన పనులలో కఠినంగా వ్యవహరింపగలిగినవారిని నియమించాలి.

యో యత్ర విదితో రాజ్ఞా శుచిత్వేన తు తన్నరమ్ ।
ధర్మే చార్థే చ కామే చ నియుఞ్జీతాధమేஉధమాన్ ॥13॥

ధర్మం, (ధర్మకార్యాలనిర్వహణం), అర్థం (ఆర్థికవ్యవహారాలననిర్వహణం) కామం (ప్రజలకోరికలను నెరవేర్చేపనులు) అనేవాటిలో ఏవిషయంలో ఎవడు నిష్కలంకమైన ప్రవర్తన కలిగిఉన్నాడని గ్రహిస్తాడో, అతడిని ఆవిషయంలో నియోగించాలి రాజు. నీచమయిన పనులలో నీచమయినవారినే నియోగించాలి.

రాజా యథార్హః కుర్యా చ్చ ఉపధాభిః పరీక్షితాన్ ।
స మన్త్రీ చ యథా న్యాయాత్ కుర్యా ద్ధస్తివనేచరాన్ ॥14॥

మంత్రిగా నియమించడానికి తగిన అర్హతలను గురించి చక్కగా పరీక్షించిన తరువాతనే రాజు మంత్రులను నియమించాలి. ఆవిధంగా రాజుచేత నియమింపబడిన మంత్రి కూడా, హస్తివనేచరన్యాయంతో ఆ యా పదవులలో యోగ్యులైనవారిని న్యాయమైనమార్గంలో నియమించాలి.

తత్పదాన్వేషణే యత్తా నధ్యక్షాం స్తత్ర కారయేత్ ।
యస్మిన్ కర్మణి కౌశల్యం యస్య తస్మిన్నియోజయేత్ ॥15॥

ఆయాపదవులకు తగినవారిని అన్వేషించడంలో సహకరించిన వారిని అధ్యక్షులుగా నియమించాలి. ఎవడికి ఏపనిలో నేర్పు ఉన్నదో, వాడిని ఆ పనిలో నియోగించాలి.

పితృపైతామహాన్ భృత్యాన్ సర్వకర్మసు యోజయేత్ ।
వినాదాయాదకృత్యేషు తత్ర తే హి సమా మతాః ॥16॥

తండ్రితాతలతరాలనుండి వస్తున్న సేవకులను అన్నిపనులలో నియోగించాలి. దాయాదుల పనులలో మాత్రం పెట్టగూడదు. ఆవిషయంలో తరతరాలుగా వచ్చిన సేవకులు, సామర్థ్యాన్నిబట్టి నియోగించినవారూ అందరూ సమానులే.

పరరాజగృహాత్ ప్రాప్తాన్ జనాన్ సంశ్రయకామ్యయా ।
దుష్టానప్యథవాఽదుష్టాన్ సంశ్రయేత ప్రయత్నతః ॥17॥

శత్రురాజుల ఇండ్లనుండి ఆశ్రయం కోరి తనవద్దకు వచ్చినవారు దుర్మార్గులైనా, మంచివారైనా, వారికి తమరాజ్యంలో ఏవిధంగానైనా, ఆశ్రయం కల్పించాలి.

దుష్టం జ్ఞాత్వా విశ్వసేన్న తద్వృత్తిం వర్తయే ద్వశే ।
దేశాన్తరాగతాన్ పార్శ్వే చారైర్ జ్ఞాత్వా హి పూజయేత్ ॥18॥

దుర్మార్గుడని తెలిస్తే వాడిని నమ్మగూడదు. వాడివృత్తిని తన అధీనంలో ఉంచుకోవాలి. ఇతరరాజ్యాలనుండి వచ్చి, తనఆశ్రయంలో ఉన్నవారిని తనకు సన్నిహితులైన గూఢచారులద్వారా గమనిస్తుండాలి. వారిలో యోగ్యులను తగువిధంగా సత్కరించాలి.

శత్రవోఽగ్ని ర్విషం సర్పో నిస్త్రింశమపి చైకతః ।
భృత్యం విశిష్టం విజ్ఞేయాః కుభృత్యాశ్చ తథైకతః ॥19॥

శత్రువులు, అగ్ని, విషం, పాము, కత్తి అనేవి మొత్తం ఒకఎత్తు అయితే, దుర్మార్గులైన సేవకులు మాత్రమే ఒక ఎత్తు. భృత్యులలో అదే విశేషం అని తెలుసుకోవాలి.

చారచక్షు ర్భవే ద్రాజా నియుఞ్జీత సదా చరాన్ ।
జనస్యావిహితాన్ సౌమ్యాం స్తథాజ్ఞాతాన్ పరస్పరమ్ ॥20॥

రాజుకు నిజమైనకళ్లు చారులే. అందుచేత రాజు అన్నివేళలలోనూ ఆ యా కార్యాలలో చారులను తప్పక నియోగించాలి. వారు చారులని ప్రజలకు తెలియగూడదు. చారులు సాధుప్రవర్తన కలిగిఉండాలి. ఒకరికి ఒకరు వారు చారు లని తెలియగూడదు.

వణిజో మన్త్రకుశలాన్ సాంవత్సరచికిత్సకాన్ ।
తథా ప్రవ్రజితాకారాన్ బలాబలవివేకినః ॥21॥

ఆ చారులు వ్యాపారులుగానూ, మంత్రవేత్తలుగానూ, జ్యోతిష్కులుగానూ, వైద్యులుగానూ, సంన్యాసులుగానూ, ఎదిటివారి సమర్థతనూ, అసమర్థతనూ తెలుసుకోగలిగినవారుగానూ ఉండాలి.

నైకస్య రాజా శ్రద్దధ్యాచ్ఛ్రద్దధ్యా ద్బహువాక్యతః ॥22॥

గూఢచారులలో ఏ ఒక్కడో చెప్పినమాటలను నమ్మగూడదు. చాలమంది చారులు ఒకేవిధంగా చెప్పిన మాటలపైన మాత్రమే శ్రద్ధ వహించాలి.

రాగాపరాగౌ భృత్యానాం జనస్య చ గుణాగుణాన్ ।
శుభానా మశుభానాం చ జ్ఞానం కుర్యా ద్వశాయ చ ॥23॥

సేవకులలోని అభిమానాన్ని, ద్వేషాన్నీ, ప్రజలమంచిగుణాలనూ, దుర్గుణాలనూ, మంచినీ, చెడునూ, తనబుద్ధిని అనుసరించి, వివేచనతో గ్రహించాలి.

అనురాగకరం కర్మ చరేజ్జహ్యా ద్విరాగజమ్ ।
జనానురాగయా లక్ష్మ్యా రాజా స్యాజ్జనరఞ్జనాత్ ॥24॥

రాజు తనప్రజలకు ప్రీతిని కలిగించేపనులను చేయాలి. ప్రజలకు ఇష్టం లేనిపనులను మానుకోవాలి. ప్రజల అభిమానసంపదతోనే రాజు అవుతాడు. ప్రజలను రంజింపజేయడంచేత యథార్థంగా రాజు అవుతాడు.

ఇత్యాది మహాపురాణే ఆగ్నేయే సహాయసమ్పత్తివర్ణనం నామ వింశత్యధికద్విశతతమో உధ్యాయః ॥220॥

అగ్నిమహాపురాణంలో సహాయసంపత్తివర్ణనం అనే రెండువందల ఇరవైయవ అధ్యాయం సమాప్తం.



ఏకవింశత్యధికద్విశతతమోఽధ్యాయః - రెండువందల ఇరవైఒకటవ అధ్యాయం

అనుజీవివృత్తకథనమ్ - అనుజీవివృత్తకథనం

పుష్కర ఉవాచ - పరశురాముడితో పుష్కరుడు ఈవిధంగా చెప్తున్నాడు.

భృత్యః కుర్యాత్తు రాజాజ్ఞాం శిష్యవత్ సుస్త్రియః పతేః ।
న క్షిపే ద్వచనం రాజ్ఞో హ్యనుకూలం ప్రియం వదేత్ ॥1॥

గురువుల ఆజ్ఞను శిష్యుడులాగా, భర్త ఆజ్ఞను ఉత్తమురాలైన (పతివ్రత) అయిన స్త్రీ లాగా, రాజుఆజ్ఞను సేవకుడు శిరసా వహించాలి. రాజుమాటను జవదాటగూడదు. రాజుకు ఇష్టమైన మాటలనే చెప్పాలి.

రహోగతస్య వక్తవ్య మప్రియం యద్ధితం భవేత్ ।
న నియుక్తో హరే ద్విత్తం నోపేక్షేత్తస్య మానకమ్ ॥
రాజ్ఞశ్చ న తథా కార్యం వేషభాషావిచేష్టితమ్ ॥2॥

రాజుకు మేలు చేసేమాటలు అతడికి ఇష్టం కాకపోయినా, తప్పకుండా చెప్పాలి. కాని, రహస్యంగా చెప్పాలి. ధనానికి సంబంధించిన కార్యాలలో నియమింపబడిన రాజసేవకుడు రాజధనాన్ని అపహరింపగూడదు. రాజును గౌరవించడంలో ఎప్పుడూ అశ్రద్ధగా ఉండగూడదు. వేషంలో గాని, మాటలలో గానీ, చేష్టలలో గానీ, రాజుగారిని అనుకరించగూడదు. (ఏవిషయంలోనూ రాజులాగా ప్రవర్తించగూడదు.)

అన్తఃపురచరాధ్యక్షో వైరభూతై ర్నిరాకృతైః ।
సంసర్గం న వ్రజేద్ భృత్యో రాజ్ఞో గుహ్యం చ గోపయేత్ ॥3॥

అంతఃపురంలో ఉండేవారిని కాపాడేవారికి నాయకుడు రాజుగారిశత్రువులతో గాని, రాజుగారు వెళ్లగొట్టినవారితో గానీ ఉన్నసంబంధాన్ని విడిచిపెట్టాలి, (సంబంధం పెట్టుకోగూడదు.) రాజుగారికి సంబంధించిన రహస్యాలు ఎవరికీ తెలియకుండా, రహస్యంగా ఉంచాలి.

ప్రదర్శ్య కౌశలం కిఞ్చిద్రాజానం తు విశేషయేత్ ।
రాజ్ఞా యచ్ఛ్రావితం గుహ్యం న తల్లోకే ప్రకాశయేత్ ॥4॥

ఏదో ఒకవిషయంలో తన నైపుణ్యాన్ని ప్రదర్శించి, ఎలాగైనా రాజుమెప్పు సంపాదించుకోవాలి. రాజుగారు తనతో చెప్పిన రహస్యాన్ని ఎటువంటి పరిస్థితులలోనూ లోకానికి తెలియనీయకూడదు.

ఆజ్ఞాప్యమానే వాన్యస్మిన్ కిం కరోమీతి వా వదేత్ ।
వస్త్రం రత్నమలఙ్కారం రాజ్ఞా దత్తం చ ధారయేత్ ॥
నానిర్దిష్టో ద్వారి విశేన్నాయోగ్యే భువి రాజదృక్ ॥5॥

ఇతరసేవకులకు ఏదైనా పనిని చెప్పినప్పుడు తానుగా నన్నేమి పని చేయమంటారు అని పని చెప్పించుకుని చేయాలి. వస్త్రాలు, రత్నాలు, ఇతరమైన అలంకారాలు, ఏ వైనా రాజు తనకు ఇచ్చినవాటిని తప్పకుండా ధరించాలి. రాజు నియోగించకుండా, రాజద్వారంవద్ద గానీ, రాజుదృష్టి పడే ఏఇతరమైనచోట గానీ సేవకుడు ఉండగూడదు.

జృమ్భాం నిష్ఠీవనం కాసం కోపం పర్యఙ్కికాశ్రయమ్ ।
భ్రుకుటీం వాత ముద్గారం తత్సమీపే వివర్జయేత్ ॥6॥

సేవకుడు రాజుగారి సమీపంలో ఆవులించగూడదు. ఉమ్మివేయగూడదు. దగ్గగూడదు. కోపించగూడదు. మంచంమీద ఉండగూడదు. కనుబొమ్మలు వికారంగా పెట్టగూడదు. అపానవాయువు విడువగూడదు. త్రేన్చగూడదు.

స్వగుణాఖ్యాపనే యుక్త్యా పరానేవ నియోజయేత్ ॥7॥

తనఘనతలను రాజుగారికి ఇతరులచేత చెప్పించాలి. తానై చెప్పుకోగూడదు.

శాఠ్యం లౌల్యం సపైశున్యం నాస్తిక్యం క్షుద్రతా తథా ।
చాపల్యం చ పరిత్యాజ్యం నిత్యం రాజానుజీవినా ॥8॥

రాజును ఆశ్రయించి బ్రతికేవాడు, ఎప్పుడూ మోసం చేయగూడదు. దేనినీ మిక్కిలిగా ఆశించగూడదు. చాడీలు చెప్పగూడదు. నాస్తికుడు కాగూడదు. నీచంగా ప్రవర్తించగూడదు. చపలచిత్తంగా ఉండగూడదు. ఈదుర్గుణాల నన్నిటినీ విడిచిపెట్టాలి.

శ్రుతేన విద్యాశిల్పైశ్చ సంయోజ్యాత్మానమాత్మనా ।
రాజసేవాం తతః కుర్యాద్ భూతయే భూతివర్ధనః ॥9॥

ముందుగా తాను వేదశాస్త్రవిజ్ఞానం, శిల్పం మొదలయినకళలలోనూ ప్రావీణ్యం సంపాదించుకుని, ఆ తరువాత రాజాశ్రయం పొందాలి. అప్పుడే అతడికి ఘనత లభిస్తుంది. సంపదలు అభివృద్ధి చెందుతాయి.

నమస్కార్యాస్సదా చాస్య పుత్రవల్లభమన్త్రిణః ।
సచివైర్నాస్య విశ్వాసో రాజచిత్తప్రియశ్చరేత్ ॥10॥

రాజు కుమారులను, రాజుకు ఇష్టమైనవారినీ, మంత్రులనూ నమస్కారాదులతో గౌరవించాలి. రాజుకు ఇష్టమైనవాళ్లతో కలిసి ఉన్నంతమాత్రంచేత రాజుకు తనపై నమ్మకం కలగదు. ఇంక రాజుకు ఇష్టం కలిగించేపనులను చేస్తూ ఉండాలి.

త్యజేద్విరక్తం రక్తా త్తు వృత్తి మీహేత రాజవిత్ ।
అపృష్టశ్చాస్య న బ్రూయాత్ కామం కుర్యాత్తథాపది ॥11॥

రాజనీతి తెలిసినవాడు తనంటే ఇష్టం లేనిరాజును విడిచిపెట్టాలి (అటువంటిరాజును సేవించగూడదు). తనపై ఇష్టం కలిగిన రాజువద్దమాత్రమే జీవికను సంపాదించుకోవాలి. తనను అడగకుండా రాజుకు సలహాలు ఇవ్వగూడదు. రాజు కష్టాలలో ఉన్నపుడు అతడికి మేలు కలిగించేపనులను (అడగకపోయినా) చేయాలి.

ప్రసన్నో వాక్యసఙ్గ్రాహీ రహస్యే న చ శఙ్కతే ।
కుశలాదిపరిప్రశ్నం సమ్ప్రయచ్ఛతి చాసనమ్ ॥12॥

అనుకూలమైనబుద్ధి కలిగినరాజు తనమేలు కోరే సేవకులు చెప్పినమాటలలోని ఔచిత్యం తెలుసుకుని వారిమాటలను మన్నిస్తాడు. అంతఃపురంవంటి రహస్యస్థలాలలో సంచరించినా, నిజాయితీ కలిగిన సేవకుడిని అనుమానించడు. కనబడినపుడు, కుశలప్రశ్నలు వేసి, ఆసనం కూడ ఇస్తాడు.

తత్కథాశ్రవణా ద్ధృష్టో హ్యప్రియాణ్యపి నన్దతే ।
అల్పం దత్తం ప్రగృహ్ణాతి స్మరేత్ కథాన్తరేష్వపి ॥13॥

ఆసేవకుడు చెప్పినమాటలను ఆదరిస్తాడు. అతడిప్రసంగం విని ఆనందిస్తాడు. అతడు తనకు ఇష్టం లేనిమాటలను చెప్పినా, మేలు కలిగించేఆమాటలకు ఆనందిస్తాడు. అటువంటిసేవకుడు తనకు కొంచెంగా సమర్పించినా, ప్రేమగా తీసుకుంటాడు. ఇతరుల ప్రసంగాలలో కూడ నమ్మకమైన సేవకుడిని తలుచుకుంటాడు.

ఇతి రక్తస్య కర్తవ్యా సేవాన్యస్య వివర్జయేత్ ॥14॥

ఈవిధంగా ప్రవర్తించేరాజు తనపై ఇష్టం కలిగినవాడని గ్రహించి, సేవకుడు అటువంటిరాజునే సేవించాలి. దీనికి భిన్నంగా ప్రవర్తించేరాజు తనంటే ఇష్టపడనివాడని తెలుసుకుని, అతడిని విడిచిపెట్టాలి.

ఇత్యాది మహాపురాణే ఆగ్నేయే ఽనుజీవివృత్తకథనం నామైకవింశత్యధికద్విశతతమోఽధ్యాయః ॥221॥

అగ్నిమహాపురాణంలో అనుజీవివృత్తకథనం అనే రెండువందల ఇరవైఒకటవ అధ్యాయం సమాప్తం.



ద్వావింశత్యధికద్విశతతమో உధ్యాయః – రెండువందల ఇరవైరెండవ అధ్యాయం

దుర్గసంపత్తివర్ణనమ్ – దుర్గసంపత్తివర్ణనం

పుష్కర ఉవాచ – పరశురాముడితో పుష్కరుడు ఈవిధంగా చెప్తున్నాడు.

దుర్గసమ్పత్తి మాఖ్యాస్యే దుర్గదేశే వసే న్నృపః ।
వైశ్యశూద్రజనప్రాయో హ్యనాహార్య స్తథా పరైః ॥1॥

రామా! ఆతరువాత దుర్గసంపదను గురించి చెప్తాను. రాజు దుర్గప్రదేశంలో నివసించాలి. అక్కడ వైశ్యులు, శూద్రులు అధికసంఖ్యలో ఉండాలి. దుర్గం శత్రువులు ఆక్రమించుకోవడానికి వీలులేనిదిగా ఉండాలి.

కిఞ్చి ద్బ్రాహ్మణసంయుక్తో బహుకర్మకర స్తథా ।
అదేవమాతృకో భక్తజలో దేశః ప్రశస్యతే ॥2॥

అక్కడ రాజుతోపాటుగా బ్రాహ్మణులు కూడ కొద్దిమంది మాత్రం ఉండాలి. కార్మికులు మాత్రం అధికసంఖ్యలో ఉండాలి. వర్షాలు మొదలుగా దైవికమైన నీటిపై ఆధారపడవలసిన అవసరం ఉండగూడదు. నదులు, సరస్సులు మొదలుగా నీరు పుష్కలంగా ఉండేచోట దుర్గం ఏర్పాటు చేసుకోవాలి.

పరై రపీడితః పుష్ప ఫలధాన్యసమన్వితః ।
అగమ్యః పరచక్రాణాం వ్యాలతస్కరవర్జితః ॥3॥

శత్రువుల బాధ ఉండకూడదు. (దుర్గం శత్రువులకు దూరంగా ఉండాలి). ఆప్రదేశంలో పూలు, పండ్లు, పైర్లు, సమృద్ధిగా ఉండాలి. శత్రువులసైన్యం ప్రవేశించడానికి వీలు లేకుండా ఉండాలి. పాములు, దొంగలు మొద లయినవాటి పీడ ఉండగూడదు.

షణ్ణా మేకతమం దుర్గం తత్ర కృత్వా వసేద్ బలీ ।
ధనుర్దుర్గం మహీదుర్గం నరదుర్గం తథైవ చ ॥4॥

వార్‌క్షం చైవామ్బుదుర్గం చ గిరిదుర్గం చ భార్గవ ।
సర్వోత్తమం శైలదుర్గ మభేద్యం చాన్యభేదనమ్ ॥5॥

దుర్గం ఆరువిధాలు. రాజు వాటిలో ఏదో ఒకదానిలో నివాసం ఏర్పాటు చేసుకోవాలి. రాజు బలవంతుడై ఉండాలి. సైన్యంగా పటిష్ఠంగా ఉండాలి. ఆరురకాలైన దుర్గాలు ఇవి. 1. ధనుర్దుర్గం, 2. మహీదుర్గం, 3. నరదుర్గం, 4. వృక్షదుర్గం, 5. జలదుర్గం, 6. శైలదుర్గం. పరశురామా! వీటిలో శైలదుర్గం అన్నింటికంటె శ్రేష్ఠ మైనది. దీనిని భేదించడానికి అవకాశం లేదు. ఇదే శత్రువులను నాశనం చేస్తుంది.

పురం తత్ర చ హట్టాద్యం దేవతాయతనాదికమ్ ।
అనుయన్త్రాయుధోపేతం సోదకం దుర్గముత్తమమ్ ॥6॥

ఆ దుర్గంలోనే అంగడివీథులతో కూడిన రాజధాని నిర్మించుకోవాలి. దేవాలయాలు మొదలయినవాటిని అక్కడే ఏర్పాటుచేయాలి. (అన్నిప్రదేశాలలో రకరకాలయిన ఆయుధాలనూ, ఆయుధప్రయోగానికి అవసరమైన యంత్రాలను ఏర్పాటు చేయాలి. ప్రవేశించడానికి వీలు లేకుండా (చుట్టూ కందకాలలో) జలం పుష్కలంగా ఉండాలి. ఈవిధంగా నిర్మించిన దుర్గం రాజనివాసానికి శ్రేష్ఠం.

రాజరక్షాం ప్రవక్ష్యామి రక్ష్యో భూపో విషాదితః ।
పఞ్చాఙ్గస్తు శిరీష స్స్యాన్మూత్రపిష్టో విషార్దనః ॥7॥

ఇక రాజును రక్షించే విషయం గురించి చెప్తాను. విషం మొదలైన మారకపదార్థాలనుండి రాజును జాగ్రత్తగా రక్షించాలి. శిరీషవృక్షానికి సంబంధించిన వ్రేళ్లు, బెరడు, ఆకులు, పూవులు, పండ్లు అనే అయిదు అంగాలను ఆవుమూత్రంతో కలిపి, నూరి పిండిలాగా చేసి, స్వీకరిస్తే అది విషాన్ని హరిస్తుంది.

శతావరీ ఛిన్నరుహా విషఘ్నీ తణ్డులీయకమ్ ।
కోషాతకీ చ కహ్లారీ బ్రాహ్మీ చిత్రపటోలికా ॥8॥

మణ్డూకపర్ణీ వారాహీ ధాత్ర్యానన్దకమేవ చ ।
ఉన్మాదినీ సోమరాజీ విషఘ్నం రత్నమేవ చ ॥9॥

శతావరి, ఛిన్నరుహా, విషఘ్ని, తండులీయకం, కోషాతకి, కహ్లారి, బ్రాహ్మి, చిత్రపటోలిక, మండూకపర్ణి, వారాహి, ధాత్రి, ఆనందకం,ఉన్మాదిని, సోమరాజి, విషాన్ని పోగొట్టేరత్నమూ, ఇవి కూడా విషప్రభావాన్ని నిర్మూలిస్తాయి.

వాస్తులక్షణసంయుక్తే వసన్దుర్గే సురాన్యజేత్ ।
ప్రజాశ్చ పాలయే ద్దుష్టాఞ్జయే ద్దానాని దాపయేత్ ॥10॥

అన్నివిధాలుగ వాస్తుకు అనుగుణంగా ఉన్నదుర్గంలోనే రాజు నివసించాలి. అక్కడ రాజు దేవతలను నిత్యమూ పూజించాలి. ప్రజలను ప్రేమగా కాపాడాలి. దుర్మార్గులను శిక్షించాలి (శత్రువులను జయించాలి). మంత్రిబ్రాహ్మణులు రాజుచేత బహుదానాలు చేయించాలి.

దేవద్రవ్యాదిహరణాత్ కల్పం తు నరకే వసేత్ ।
దేవాలయాని కుర్వీత దేవపూజారతో నృపః ॥11॥

రాజు దేవతల(దేవలయాల)ఆస్తులను కాజేస్తే, కల్పంకాలం నరకంలో నివసిస్తాడు. రాజు దేవాలయాలను నిర్మించాలి. నిత్యం శ్రద్ధగా దేవతాపూజలు చేయాలి.

సురాలయాః పాలనీయాః స్థాపనీయా శ్చ దేవతాః ।
మృణ్మయా ద్దారుజం పుణ్యం దారుజా దిష్టకామయమ్ ॥
ఐష్టకా చ్ఛైలజం పుణ్యం శైలజాత్ స్వర్ణరత్నజమ్ ॥12॥

దేవాలయాలను జాగ్రత్తగా కాపాడాలి. అందులో దేవతావిగ్రహాలను ప్రతిష్ఠింపజేయాలి. దేవవిగ్రహాలు మట్టితో చేసిన వాటికంటె చెక్కతో చేసినవి పుణ్యప్రదాలు. చెక్కతో చేసినవాటికంటె ఇటుకలతో నిర్మించినవి

అధికపుణ్యాన్ని ఇస్తాయి. ఇటుకలతో చేసినవాటికంటె రాతితో చేసినవిగ్రహం పుణ్యప్రదం. రాతిలో చెక్కినవాటికంటె బంగారంతోనూ, రత్నాలతోనూ చేసినవిగ్రహాలు ఉత్తమం.

క్రీడన్ సురగృహం కుర్వన్ భుక్తిముక్తి మవాప్నుయాత్ ॥13॥

దేవాలయాన్ని ఆనందంగా నిర్మించినవాడు భోగాలనూ, మోక్షాన్నీ పొందుతాడు.

చిత్రకృద్గీతవాద్యాది ప్రేక్షణీయాదిదానకృత్ ।
తైలాజ్యమధుదుగ్ధాద్యైస్స్నాప్య దేవం దివం వ్రజేత్ ॥14॥

దేవాలయాలలో రంగురంగులచిత్రాలను గీయించాలి. పాటలు పాడించాలి. వాద్యాలను ప్రయోగించాలి. మనోహరమయిన వస్తువులను దేవాలయానికి దానంగా ఇవ్వాలి. నువ్వులనూనె, ఆవునెయ్యి, తేనె, ఆవుపాలు, మొదలయిన ద్రవ్యాలతో దేవతలను అభిషేకించాలి. ఇలా చేసినవాడు స్వర్గానికి వెళ్తాడు.

పూజయేత్పాలయే ద్విప్రాన్ ద్విజస్వం న హరే న్నృపః ।
సువర్ణ మేకం గామేకాం భూమే రప్యేక మఙ్గులమ్ ॥
హరన్నరక మాప్నోతి యావదాభూతసంప్లవమ్ ॥15॥

రాజు బ్రాహ్మణులను సత్కరించాలి. వారిని చక్కగా పోషించాలి. బ్రాహ్మణులసొమ్ము కాజేయగూడదు. ఒకబంగారుకాసును గాని, ఒక్కఆవును గాని, ఒక్కఅంగుళం నేలను గాని బ్రాహ్మణులకు సంబంధించినదానిని కాజేసినవాడు మహాప్రళయం వచ్చేవరకు నరకంలో ఉంటాడు.

దురాచారం న ద్విషేచ్ఛ సర్వపాపేష్వపి స్థితమ్ ।
నైవాస్తి బ్రాహ్మణవధాత్ పాపం గురుతరం క్వచిత్ ॥16॥

ధర్మవిరుద్ధంగా ప్రవరిస్తున్నా, అన్నిరకాలపాపాలు చేస్తున్నా, బ్రాహ్మణుడిని ద్వేషించగూడదు. బ్రాహ్మణుడిని చంపడానికి మించిన మహాపాపం మరొకటి ఎక్కడా ఉండదు.

అదైవం దైవతం కుర్యుః కుర్యుర్దైవమదైవతమ్ ।
బ్రాహ్మణా హి మహాభాగాస్తాన్నమస్యేత్ సదైవ తు ॥17॥

బ్రాహ్మణులు మహానుభావులు. వాళ్లు తలుచుకుంటే సామాన్యులను కూడ దేవతలుగా చేయగలరు. దేవతలను సామాన్యులుగానూ చేయగలరు. అందుచేత బ్రాహ్మణులకు ఎల్లప్పుడూ నమస్కారం చేయాలి.

బ్రాహ్మణీ రుదతీ హన్తి కులం రాజ్యం ప్రజా స్తథా ।
సాధ్వీస్త్రీణాం పాలనం చ రాజా కుర్యాచ్చ ధార్మికః ॥18॥

బ్రాహ్మణస్త్రీని ఏడిపించిన రాజువంశం నాశనమవుతుంది. అతడిరాజ్యం కూలిపోతుంది. ప్రజలు నశిస్తారు. అందుచేత ధర్మపరాయణుడైన రాజు సాధువులైన స్త్రీలకు ఏకష్టం కలగకుండా కాపాడాలి.

స్త్రియా ప్రహృష్టయా భావ్యం గృహకార్యైకదక్షయా ।
సుసంస్కృతోపస్కరయా వ్యయే చాముక్తహస్తయా ॥19॥

స్త్రీలు ఎప్పుడూ సంతోషంగా ఉండాలి. ఇంటిపనులన్నిటినీ నేర్పుగా సమర్థవంతంగా చక్కబెట్టుకోవాలి. ఇంటిలోనివస్తువులన్నీ పరిశుభ్రంగా ఉంచుకోవాలి. ఇంటి అవసరాలకోసం ఖర్చులో చేయిజాడించగూడదు. (పరిమితంగా అవసరమైనమేరకే ఖర్చు పెట్టాలి).

యస్మై దద్యాత్పితాత్వేనాం శుశ్రూషేత్తం పతిం సదా ।
మృతే భర్తరి స్వర్యాయా ద్బ్రహ్మచర్యే స్థితాఙ్గనా ॥20॥

తండ్రి తనను ఎవరికి దానం చేస్తే, ఆతడిని భర్తగా గ్రహించి, అతడిని ఎల్లవేళలలోనూ శ్రద్ధగా సేవించుకోవాలి. భర్త మరణించిన తరువాత బ్రహ్మచర్యం పాటించిన స్త్రీ స్వర్గానికి వెళ్తుంది.

పరవేశ్మరుచి ర్నస్యాన్న స్యాత్కలహశాలినీ ।
మణ్డనం వర్జయేన్నారీ తథా ప్రోషితభర్తృకా ॥21॥

ఇతరులఇళ్లను ఇష్టపడగూడదు. ఎవరితోనూ తగవులు పెట్టుకోగూడదు. భర్త విదేశాలలో ఉన్నసమయంలో స్త్రీ అందంగా అలంకరించుకోగూడదు.

దేవతారాధనపరా తిష్ఠేద్ భర్తృహితే రతా ।
ధారయే న్మఙ్గలార్థాయ కిఞ్చిదాభరణం తథా ॥22॥

భర్తకు మేలు జరగాలని కోరుకుంటూ, దేవతలను పూజిస్తూ ఉండాలి. శుభప్రదంగా ఉండేందుకు మాత్రమే కొద్దిగా ఆభరణాలు ధరించాలి.

భర్త్రాగ్నిం యా విశే న్నారీ సాపి స్వర్గ మవాప్నుయాత్ ।
శ్రియ స్సమ్పూజనం కార్యం గృహసమ్మార్జనాదికమ్ ॥23॥

భర్త మరణించినపుడు అతడిచితిమీద అగ్నిలో ప్రవేశించిన స్త్రీ స్వర్గానికి వెళ్తుంది. స్త్రీ లక్ష్మీదేవిని పూజించాలి. ఇల్లు తుడవడం మొదలైన పనులతో ఇంటిని పరిశుభ్రంగా ఉంచాలి.

ద్వాదశ్యాం కార్తికే విష్ణుం గాం సవత్సాం దదే త్తథా ।
సావిత్ర్యా రక్షితో భర్తా సత్యాచారవ్రతేన చ ॥24॥

కార్తికమాసంలో ద్వాదశి తిథినాడు శ్రీమహావిష్ణువును పూజించి, దూడతో సహా ఆవును దానం చేయాలి. శ్రేష్ఠమైన వ్రతాలను శ్రద్ధగా ఆచరించిన మహిమతో సావిత్రి తనభర్తను యమధర్మరాజు(మృత్యువు) నుండి కాపాడుకుంది కదా!

సప్తమ్యాం మార్గశీర్షే తు సితేఽభ్యర్చ్య దివాకరమ్ ।
పుత్రా నాప్నోతి చ స్త్రీ హ నాత్ర కార్యా విచారణా ॥25॥

మార్గశిరమాసంలో శుక్లపక్షంలో సప్తమినాడు సూర్యనారాయణస్వామిని పూజించిన స్త్రీకి కొడుకులు పుడతారు. ఇందులో అనుమానించవలసినపనే లేదు.

ఇత్యాది మహాపురాణే ఆగ్నేయే దుర్గసమ్పత్తివర్ణనం నామ ద్వావింశత్యధికద్విశతతమోఽధ్యాయః ॥222॥

అగ్నిమహాపురాణంలో దుర్గసంపత్తివర్ణనం అనే రెండువందల ఇరవైరెండవ అధ్యాయం సమాప్తం.

త్రయోవింశత్యధికద్విశతతమో௨ధ్యాయః – రెండువందల ఇరవైమూడవ అధ్యాయం

రాజధర్మకథనమ్ – రాజధర్మకథనం

పుష్కర ఉవాచ – పరశురాముడితో పుష్కరుడు ఈవిధంగా చెప్తున్నాడు.

గ్రామస్యాధిపతిం కుర్యా ద్దశగ్రామాధిపం నృపః ।
శతగ్రామాధిపం చాన్యం తథైవ విషయేశ్వరమ్ ॥1॥

రాజు తనరాజ్యంలోని ప్రతిగ్రామానికి ఒకఅధికారిని నియమించాలి. మళ్లీ పదిగ్రామాలకు కలిపి ఒకఅధిపతిని నియమించాలి. ఆపైన నూరుగ్రామాలకు కలిపి ఒకఅధిపతిని నియమించాలి. వీరందరికి పైన దేశానికి ఒకఅధిపతిని నియమించాలి.

తేషాం భోగవిభాగశ్చ భవేత్కర్మానురూపతః ।
నిత్యమేవ తథా కార్యం తేషాం చారైః పరీక్షణమ్ ॥2॥

ఆ యా అధికారులకు వారు నిర్వహించేపనులకు అనుగుణంగా సుఖపడడానికి అవసరమైన వేతనాలను ఏర్పాటు చేయాలి. వారు తమకర్తవ్యాలను ఏ విధంగా చేస్తున్నారో, గూఢచారులద్వారా నిత్యమూ పరీక్షించి,గ్రహించాలి.

గ్రామే దోషాన్ సముత్పన్నాన్ గ్రామేశః ప్రశమం నయేత్ ।
అశక్యో దశపాలస్య స తు గత్వా నివేదయేత్ ॥3॥

గ్రామానికి అధికారి అయినవాడు తనగ్రామంలో ఏర్పడిన తప్పులను సరిగ్గా పరిష్కరించాలి. వాటిని పరిష్కరించడం తనకు చేతకాకపోతే, పదిగ్రామాలకు అధిపతి అయినవాడివద్దకు వెళ్లి, అతడికి తెలియజేయాలి.

శ్రుత్వాపి దశపాలో௨పి తత్ర యుక్తి ముపాచరేత్ ।
విత్తా ద్యాప్నోతి రాజా వై విషయాత్తు సురక్షితాత్ ॥4॥

పదిగ్రామాలఅధిపతి జాగ్రత్తగా గ్రహించి, వివేకంతో దానిని చక్కగా పరిష్కరించాలి. రాజ్యంలోని ప్రజలను ఏకష్టమూ లేకుండా, రక్షించినపుడే రాజుకు (పన్నులరూపంలో) ధనం మొదలైనవి బాగా లభిస్తాయి.

ధనవాన్ ధర్మ మాప్నోతి ధనవాన్ కామమశ్నుతే ।
ఉచ్ఛిద్యన్తే వినా హ్యర్థైః క్రియా గ్రీష్మే సరిద్యథా ॥5॥

తగినంత ధనం ఉన్నపుడే రాజు ధర్మం చక్కగా నిలబెట్టగలుగుతాడు. రాజువద్ద ధనం లేకపోతే, ఎండాకాలంలో నదులలో నీళ్లు లేకుండాపోయినట్లుగా, రాజు ప్రజలహితంకోసం చేయవలసినపనులు జరగకుండాపోతాయి.

విశేషో నాస్తి లోకేషు పతితస్యాధనస్య చ ।
పతితాన్న తు గృహ్ణంతి దరిద్రో న ప్రయచ్ఛతి ॥6॥

జనులదృష్టిలో ధర్మం నుండి భ్రష్టుడైనవాడికీ, దరిద్రుడికీ భేదం లేదు. ధర్మభ్రష్టుడినుండి ఎవరూ ఏమీ స్వీకరించరు. దరిద్రుడు ఎవరికీ ఏమీ ఇవ్వలేడు.

ధనహీనస్య భార్యాపి నైవ స్యాద్వశవర్తినీ ।
రాష్ట్రపీడాకరో రాజా నరకే వసతే చిరమ్ ॥7॥

డబ్బు లేకపోతే భార్య కూడా చెప్పినమాట వినదు. రాజ్యాన్ని కష్టపెట్టే(రాజ్యంలోనిప్రజలకు మేలు చేయని)రాజు చాలకాలం నరకంలో పడి వుంటాడు.

నిత్యం రాజ్ఞా తథా భావ్యం గర్భిణీ సహధర్మిణీ ।
యథా స్వం సుఖ ముత్సృజ్య గర్భస్య సుఖమావహేత్ ॥8॥

గర్భం ధరించిన స్త్రీ తన సుఖాన్ని విడిచిపెట్టి, కడుపులోనిబిడ్డ సుఖంగా ఉండేవిధంగా ప్రవర్తిస్తుంది. రాజు కూడ అదే విధంగా ప్రజల సుఖం కోసమే ప్రయత్నించాలి. అందుకోసం తన సుఖం విడిచిపెట్టాలి.

కిం యజ్ఞై స్తపసా తస్య ప్రజా యస్య న రక్షితాః ।
సురక్షితాః ప్రజా యస్య స్వర్గస్తస్య గృహోపమః ॥
అరక్షితాః ప్రజా యస్య నరకం తస్య మన్దిరమ్ ॥9॥

ప్రజలను రక్షింపని రాజు ఎన్ని యజ్ఞాలు చేసినా, ఎంత తపస్సు చేసినా ప్రయోజనం లేదు. ప్రజలను చక్కగా కాపాడిన రాజుకు తనఇల్లే స్వర్గం. ప్రజలను కాపాడనివాడికి ఆ ఇల్లే నరకం అవుతుంది.

రాజా షడ్భాగ మాదత్తే సుకృతా ద్దుష్కృతాదపి ।
ధర్మాగమో రక్షణాచ్చ పాపమాప్నోత్యరక్షణాత్ ॥10॥

ప్రజలు పుణ్యం చేసినా, పాపం చేసినా, అందులో ఆరవవంతు ఫలితాన్ని రాజు పొందుతాడు. అందువలన ప్రజలను రక్షిస్తే, వాళ్లు ధర్మపరులవుతారు కాబట్టి పుణ్యఫలం పొందుతాడు. ప్రజలను కాపాడకపోతే, వాళ్లు అధర్మకార్యాలు చేస్తారు. కాబట్టి పాపఫలం పొందుతాడు.

సుభగా విటభీతేవ రాజవల్లభతస్కరైః ।
భక్ష్యమాణాః ప్రజా రక్ష్యాః కాయస్థైశ్చ విశేషతః ॥11॥

ఇతరస్త్రీలను పొందగోరేవాళ్లవలన భయపడే పతివ్రతలను రాజు రక్షించాలి. అదే విధంగా, ప్రజలను పీక్కుతినే రాజ బంధువులు, దొంగలు, రాజాధికారుల (ప్రభుత్వం వారి లెక్కలను వ్రాసే కరణాలవంటి ఉద్యోగులు) నుండి ప్రజలను రాజే రక్షించాలి.

రక్షితా తద్భయేభ్యస్తు రాజ్ఞో భవతి సా ప్రజా ।
అరక్షితా సా భవతి తేషామేవేహ భోజనమ్ ॥12॥

వారినుండి ప్రజలను రక్షిస్తే, ఆ ప్రజలు రాజుకు సంబంధించినవారు (రాజుపై అభిమానం కలిగినవారు) అవుతారు. వారిని రక్షించకపోతే, ఆ ప్రజలను రాజబంధువులు మొదలైనవారు మింగేస్తారు.

దుష్టసమ్మర్దనం కుర్యా చ్ఛాస్త్రోక్తం కర మాదదేత్ ।
కోశే ప్రవేశయే దర్ధం నిత్యం చార్ధం ద్విజే దదేత్ ॥13॥

ప్రజలను పీడించే దుర్మార్గులను రాజు శిక్షించాలి. ప్రజలనుండి రాజనీతిప్రకారం పన్నును న్యాయంగా వసూలు చేయాలి. అలా సంపాదించిన ధనంలో సగం కోశంలో ఉంచాలి. మిగిలిన సగం బ్రాహ్మణులకు ఇవ్వాలి.

నిధిం ద్విజోత్తమః ప్రాప్య గృహ్ణీయా త్సకలం తథా ।
చతుర్థ మష్టమం భాగం తథా షోడశకం ద్విజః ॥
వర్ణక్రమేణ దద్యాచ్చ నిధిం పాత్రే తు ధర్మతః ॥14॥

ఉత్తము డైన బ్రాహ్మణుడు రాజు ఇచ్చిన సంపద మొత్తం స్వీకరించాలి. బ్రాహ్మణుడు తాను స్వీకరించిన ఆ ధనంలో నాలుగవభాగాన్ని క్షత్రియులకు, ఎనిమిదవవంతు వైశ్యులకు, పదహారవవంతు భాగాన్ని శూద్రుడికి వర్ణక్రమంలో ఇచ్చివేయాలి. ధర్మబద్ధంగా ధనాన్ని యోగ్యులకు దానం చేయాలి.

అనృతం తు వదన్దణ్డ్యః స్సువిత్తస్యాంశ మష్టమమ్ ॥15॥

అబద్ధం చెప్పేవాడిని రాజు శిక్షించాలి. వాడు సంపాదించినధనంలో ఎనిమిదవవంతు అపరాధశుల్కంగా తీసుకోవాలి.

ప్రణష్టస్వామిక మృక్థం రాజా త్ర్యబ్దం నిధాపయేత్ ।
అర్వాక్ త్ర్యబ్దా ద్ధరేత్ స్వామీ పరేణ నృపతి ర్హరేత్ ॥16॥

రాజు స్వాధీనం చేసుకున్నధనానికి నిజమైన యజమాని ఎవడో తెలియకపోతే, ఆధనాన్ని మూడుసంవత్సరాలపాటు తనవద్దనే దాచిఉంచాలి. మూడు సంవత్సరాలలోపుగా దానియజమాని వస్తే, ఆధనం అతడికి ఇచ్చివేయాలి. మూడు సంవత్సరాలు దాటితే, ఆధనాన్ని రాజు స్వాధీనం చేసుకోవాలి.

మమేద మితి యో బ్రూయాత్ సోఽర్థయుక్తో యథావిధి ।
సమ్పాద్య రూపసఙ్ఖ్యాదీన్ స్వామీ తద్ద్రవ్యమర్హతి ॥17॥

మూడుసంవత్సరాలలోపుగా వచ్చి, ఈధనం నాదే అని చెప్పినవాడు, దానిస్వరూపాన్ని, పరిమాణాన్ని ఉన్న దున్నట్లుగా చెప్తే, అతడు ఆ ధనం పొందడానికి అర్హుడవుతాడు.

బాలదాయాదిక మృక్థం తావద్రాజానుపాలయేత్ ।
యావత్ స్యాత్ స సమావృత్తో యావద్వాతీతశైశవః ॥18॥

అందులో పిల్లలకు భాగంగా వచ్చినధనాన్ని, ఆపిల్లవాడు సమావర్తనం అనే (వేదాధ్యయనం పూర్తి చేసి, గృహస్థాశ్రమం స్వీకరించడానికి ముందు చేసే) సంస్కారం అయిన తరువాత, లేదా బాల్యదశ పూర్తి అయిన తరువాత అతడికి తిరిగిఇవ్వాలి.

బాలపుత్రాసు చైవ స్యాద్రక్షణం నిష్కులాసు చ ।
పతివ్రతాసు చ స్త్రీషు విధవా స్వాతురాసు చ ॥19॥

కొడుకులు పసివారు అయిన స్త్రీలధనాన్ని రాజు రక్షించాలి. భర్త మరణించిన పతివ్రతలైన స్త్రీలను రక్షించేవారు ఆ కులంలో ఎవరూ లేనపుడు ఆస్త్రీలసంపదలను రాజే కాపాడాలి. అనారోగ్యం మొదలైన కష్టాలలో ఉన్న స్త్రీల సంపదలనూ రాజే రక్షించాలి. (రక్షణలేని స్త్రీలను రాజు పోషించాలి.)

జీవన్తీనాం తు తాసాం యే సంహరేయు శ్చ బాన్ధవాః ।
తా ఞ్ఛిష్యా ఞ్చౌరదణ్డేన ధార్మికః పృథివీపతిః ॥20॥

స్త్రీల బ్రతుకుకు ఆధారమైన సంపదలను బంధువులు కాజేసినపుడు ధర్మపరాయణుడైన రాజు ఆ బంధువులను కూడ సాధారణమైన దొంగలతో సమానంగా శిక్షించాలి.

సామాన్యతో హృతం చౌరై స్త ద్వై దద్యాత్ స్వయం నృపః ।
చౌరరక్షాధికారిభ్యో రాజాపి హృత మాప్నుయాత్ ॥21॥

సాధారణమైన దొంగతనాలవలన ప్రజలసొమ్ము అపహరింపబడినపుడు, రాజు కోశాగారంనుండి ఆ సొమ్మును ప్రజలకు ఇవ్వాలి. దొంగిలించబడిన సొమ్మును దొంగలనుండి, లేదా ప్రజలను కాపాడవలసిన రక్షకభటుల నుండి తిరిగి రాబట్టాలి.

అహృతే యో హృతం బ్రూయాన్నిస్సార్యో దణ్డ్య ఏవ సః ।
న తద్రాజ్ఞా ప్రదాతవ్యం గృహే య ద్గృహగైర్హృతమ్ ॥22॥

రాజు సొమ్ము ఇస్తున్నాడు గదా అని ఎవడయినా, దొంగిలించకపోయినా, సొమ్ము పోయిందని చెప్తే, అతడిని రాజ్యం నుండి వెళ్లగొట్టాలి. అబద్ధమాడినవాడిని తగినవిధంగా తప్పకుండా శిక్షించాలి. ఇంటిలోని సొమ్మును ఆఇంటివాళ్లే అపహరిస్తే, ఆ సొమ్మును రాజు ఇవ్వవలసిన అవసరం లేదు.

స్వరాష్ట్రపణ్యాదాదద్యాద్ రాజా వింశతిగం ద్విజ ।
శుల్కాంశం పరదేశా చ్చ క్షయవ్యయప్రకాశకమ్ ॥
జ్ఞాత్వా సఙ్కల్పయే చ్ఛుల్కం లాభం వణిగ్యథాప్నుయాత్ ॥23॥

బ్రాహ్మణోత్తమా! పరశురామా! రాజు తనరాజ్యంలోని అంగళ్లలో ఆదాయంగా వచ్చినసొమ్ములో ఇరవైభాగాలు (అయిదవ వంతు) పన్నుగా వసూలు చేయాలి. ఇతరరాజ్యాలనుండి తీసుకునివచ్చినవస్తువుల విషయంలో సరుకుతగ్గుదల, ఖర్చులెక్కలను పరిశీలించి, వ్యాపారం చేసేవాడికి తగినంత లాభం ఉండేవిధంగా, పన్నును నిర్ణయించాలి.

వింశాంశం లాభమాదద్యాద్దణ్డనీయ స్తతోఽన్యథా ॥24॥

వ్యాపారికి వచ్చినలాభంలో అయిదవవంతు మాత్రమే పన్నుగా తీసుకోవాలి. రాజాధికారులు దానికి విరుద్ధంగా తక్కువ గానీ, ఎక్కువ గానీ నిర్ణయిస్తే, వారిని శిక్షించాలి.

స్త్రీణాం ప్రవ్రజితానాం చ తరశుల్కం వివర్జయేత్ ।
తరేషు దాసదోషేణ నష్టం దాసస్తు దాపయేత్ ॥25॥

ఆడవారినీ, సన్న్యాసులనూ నదులు మొదలైన ప్రవాహాలను దాటించడానికి మూల్యం తీసుకోగూడదు. అలా దాటించేటపుడు వారికి, లేదా వారివస్తువులకు ఏదయినా నష్టం జరిగితే, నావ దాటించినవాడిచేత ఆ నష్టానికి పరిహారం ఇప్పించాలి.

శూకధాన్యేషు షడ్భాగం శిమ్బిధాన్యే తథాష్టమమ్ ।
రాజా వన్యార్థ మాదద్యాద్దేశకాలానురూపకమ్ ॥26॥

ముల్లు గలిగిన వరి మొదలైన ధాన్యాలకు ఆరవవంతు, పెసర మొదలైన కాయధాన్యాలకు ఎనిమిదవవంతు పన్ను తీసుకోవాలి. అడవులలో పండే పండ్లు, దుంపలు మొదలయినవాటికి కూడా రాజు దేశాన్నీ, కాలాన్నీ అనుసరించి తగినపన్ను తీసుకోవాలి.

పఞ్చషడ్భాగ మాదద్యా ద్రాజా పశుహిరణ్యయోః ॥27॥

పశువులపైన వచ్చే ఆదాయంనుండి ఐదవభాగాన్నీ, బంగారంమీద వచ్చే ఆదాయంలో ఆరవభాగాన్నీ పన్నుగా తీసుకోవాలి.

గన్ధౌషధిరసానాం చ పుష్పమూలఫలస్య చ ।
పత్రశాకతృణానాం చ వంశవైణవచర్మణామ్ ॥28॥

వైదలానాం చ భాణ్డానాం సర్వస్యాశ్మమయస్య చ ।
షడ్భాగ మేవ చాదద్యాన్మధుమాంసస్య సర్పిషః ॥29॥

సుగంధద్రవ్యాలు, ఓషధులు, త్రాగేపదార్థాలు, పూలు, దుంపలు, పండ్లు, ఆకులు, కూరలు, తృణవిశేషాలు, వెదురు, వెదురుతో చేసినవస్తువు, చర్మం(తో చేసినవస్తువులు), పేముతో చేసినపాత్రలు, రాతిపాత్రలు, మద్యం, మాంసం, నెయ్యి – వీటిపై ఆరవవంతు పన్నుగా తీసుకోవాలి.

మ్రియమాణోఽపి నాదద్యాద్ బ్రాహ్మణేభ్య స్తథాకరమ్ ।
యస్య రాజ్ఞస్తు విషయే శ్రోత్రియ స్సీదతి క్షుధా ॥
తస్య సీదతి తద్రాష్ట్రం వ్యాధిదుర్భిక్షతస్కరైః ॥30॥

ప్రాణం పోతున్నా, రాజు బ్రాహ్మణులనుండి ఏవిధమైన పన్ను కూడా తీసుకోగూడదు. ఏరాజు రాజ్యంలో వేదవేత్త అయిన బ్రాహ్మణుడు ఆకలితో అలమటిస్తాడో, ఆరాజుగారిరాజ్యం రోగాలతో, కరువులతో, దొంగలతో కష్టాలపాలవుతుంది.

శ్రుతం విత్తం చ విజ్ఞాయ వృత్తిం తస్య ప్రకల్పయేత్ ।
రక్షేచ్చ సర్వత స్త్వేనం పితా పుత్ర మివౌరసమ్ ॥31॥

ఆ బ్రాహ్మణుడి వేదవిజ్ఞానాన్ని(పాండిత్యాన్ని), సంపదనూ గ్రహించి, అతడికి తగినజీవికను ఏర్పాటు చేయాలి. అతడిని తండ్రి తనకన్నకొడుకును కాపాడినట్లుగా అన్నివిధాలుగానూ కాపాడాలి.

సంరక్ష్యమాణో రాజ్ఞా యః కురుతే ధర్మ మన్వహమ్ ।
తేనాయుర్వర్ధతే రాజ్ఞో ద్రవిణం రాష్ట్రమేవ చ ॥32॥

రాజు రక్షణలో బ్రాహ్మణుడు ధర్మాన్ని ఆచరిస్తుండగా, ఆ ధర్మం వలన రాజుకు ఆయువు, సంపదలు, రాజ్యం అంతా వృద్ధి చెందుతుంది.

కర్మ కుర్యు ర్నరేన్ద్రస్య మాసే నైకం చ శిల్పినః ।
భుక్తమాత్రేణ యే చాన్యే స్వశరీరోపజీవినః ॥33॥

శిల్పులు మొదలుగా కాయకష్టం చేసి, బ్రతికేవారందరూ, ప్రతినెలలో ఒకరోజు మాత్రం జీతం తీసుకోకుండా, కేవలం భోజనం మాత్రమే స్వీకరించి, తమతమపనులను చేయాలి.

ఇత్యాది మహాపురాణే ఆగ్నేయే రాజధర్మకథనం నామ త్రయోవింశత్యధికద్విశతతమో ఽధ్యాయః ॥223॥

అగ్నిమహాపురాణంలో రాజధర్మకథనం అనే రెండువందల ఇరవైమూడవ అధ్యాయం సమాప్తం.



చతుర్వింశత్యధికద్విశతతమో உధ్యాయః - రెండువందల ఇరవైనాల్గవ అధ్యాయం

రాజధర్మకథనమ్ - రాజధర్మకథనం

పుష్కర ఉవాచ - పరశురాముడితో పుష్కరుడు ఈవిధంగా చెప్తున్నాడు.

వక్ష్యేஉన్తఃపురచిన్తాఞ్చ ధర్మాద్యాః పురుషార్థకాః ।
అన్యోన్యరక్షయా తేషాం సేవా కార్యా స్త్రియా నృపైః ॥1॥

పరశురామా! ఇపుడు అంతఃపురానికి సంబంధించిన విషయాలను గురించి చెప్తాను. ధర్మం మొదలైనవి నాలుగు పురుషార్థాలు. రాజులు వీనిలో ధర్మం, అర్థం, కామం అనే మూడుపురుషార్థాలను ఒకదానితో ఒకటి రక్షించుకుంటూ, తమస్త్రీలతో కలిసి, సేవించాలి.

ధర్మమూలోஉర్థవిటప స్తథా కామఫలో మహాన్ ।
త్రివర్గపాదప స్తత్ర రక్షయా ఫలభాగ్ భవేత్ ॥2॥

ధర్మం, అర్థం, కామం అనే ఈమూడుపురుషార్థాలను త్రివర్గం అంటారు. ఈ త్రివర్గం అనేది ఒకవృక్షం. ఆచెట్టుకు అంటే త్రివర్గానికి మూలాధారమయిన వేళ్లు ధర్మం అనే పురుషార్థం. కొమ్మలు అర్థం అనే పురుషార్థం. పండ్లు కామం అనే పురుషార్థం. ఈ త్రివర్గవృక్షాన్ని జాగ్రత్తగా కాపాడితే, దానిఫలితాన్ని పొందవచ్చు.

కామాధీనా స్త్రియో రామ తదర్థం రత్నసఙ్గ్రహః ।
సేవ్యా స్తా నాతిసేవ్యాశ్చ భూభుజా విషయైషిణా ॥3॥

పరశురామా! స్త్రీలు కామం అనే పురుషార్థానికి వశమై ఉంటారు. వారికోసం రాజు రత్నాలను (సంపదలను) సమకూర్చుకోవాలి. ఇంద్రియసుఖాలను కోరుకునేరాజు స్త్రీలను సేవించవలసిందే. కాని అతిగా సేవించగూడదు.

ఆహారో మైథునం నిద్రా సేవ్యా నాతి హి రుగ్ భవేత్
మఞ్చాధికారే కర్తవ్యా స్త్రియ స్సేవ్యా స్స్వరామికాః ॥4॥

తిండి, సంభోగం, నిద్ర అనే మూడింటినీ ప్రతివాడూ సేవించాల్సిందే. కాని, హద్దులు మీరితే వాటివల్ల రోగాలు వస్తాయి. పురుషుడు తనపై అనురాగం ఉన్న స్త్రీని మాత్రమే దగ్గరకు రానీయాలి.

దుష్టా న్యాచరతే యా తు నాభినన్దతి తత్కథామ్ ।
ఐక్యం ద్విషద్భి ర్వ్రజతి గర్వం వహతి చోద్ధతా ॥5॥

(పురుషుడు తనపై అనురాగం లేని స్త్రీలక్షణాలను ఈవిధంగా గ్రహించాలి.) ఇష్టం లేనిస్త్రీ భర్తకు కీడు కలిగేపనులు చేస్తుంది. భర్తకు సంబంధించిన అంశాలు చెప్తుండగా విని ఆనందపడదు. భర్తశత్రువులతో కలిసిపోతుంది. మిక్కిలిగా అహంకరిస్తుంది.

చుమ్బితా మార్ష్టి వదనం దత్తం న బహు మన్యతే ।
స్వపిత్యాదౌ ప్రసుప్తాపి తథా పశ్చాద్ విబుధ్యతే ॥6॥

భర్త ముద్దు పెట్టుకుంటే ముఖం తుడిచేసుకుంటుంది. (కడిగివేసుకుంటుంది.) భర్త ఇచ్చిన కానుకలను ఆదరించదు. తనకంటె ముందే నిద్రపోతుంది. భర్త నిద్రలేచిన తరువాత తాను లేస్తుంది.

స్పృష్టా ధునోతి గాత్రాణి గాత్రం చ విరుణద్ధి యా ।
ఈష చ్ఛృణోతి వాక్యాని ప్రియాణ్యపి పరాఙ్ముఖీ ॥7॥

భర్త ముట్టుకుంటే, ఒళ్లు కంపరం ఎత్తినట్లుగా అయిపోతుంది. ముట్టుకోకుండా అడ్డగిస్తుంది. తనకు ఇష్ట మైన మాటలు చెప్పినా (ప్రేమగా చెప్పేమాటలు) పూర్తిగా వినదు. ముఖం ప్రక్కకు తిప్పుకుంటుంది.

న పశ్య త్యగ్రదత్తం తు జఘనం చ నిగూహతి ।
దృష్టే వివర్ణవదనా మిత్రేష్వథ పరాఙ్ముఖీ ॥8॥

భర్త ఆమెకు ఎదురుగా వెళ్లి, ఏది ఇచ్చినప్పటికీ దానివైపు చూడను గూడా చూడదు. జఘనప్రదేశం కనబడకుండా దాచుకుంటుంది. చూస్తే ముఖం మాడ్చుకుంటుంది. భర్త స్నేహితులను తిరస్కారంగా చూస్తుంది.

తత్కామితాసు చ స్త్రీషు మధ్యస్థేవ చ లక్ష్యతే ।
జ్ఞాతమణ్డనకాలాపి న కరోతి చ మణ్డనమ్ ॥9॥

భర్తకు ఇష్టమైన స్త్రీలను ఉదాసీనంగా చూస్తుంది. అలంకరించుకోవలసిన సమయంలో కూడా అలంకరించుకోదు.

యా సా విరక్తా తాం త్యక్త్వా సానురాగాం స్త్రియం భజేత్ ॥10॥

ఈలక్షణాలు కలిగినస్త్రీకి తనపై ఇష్టం లేదని గ్రహించి, పురుషుడు ఆమెను విడిచిపెట్టాలి. ఇంక తనపై అనురాగం ఉన్నదానిని సేవించాలి. (స్త్రీకి అనురాగం ఉన్నదని తెలిపే లక్షణాలను ఈవిధంగా గుర్తించాలి.)

దృష్ట్వైవ హృష్టా భవతి వీక్షతే చ పరాఙ్ముఖీ ।
దృశ్యమానా తథాన్యత్ర దృష్టిం క్షిపతి చఞ్చలామ్ ॥
తథాప్యపావర్తయితుం నైవ శక్నోత్యశేషతః ॥11॥

తనను చూడగానే ఆనందిస్తుంది. సిగ్గుగా తల ప్రక్కకు తిప్పుకుని, కంటిచివరినుండి చూస్తుంటుంది. భర్త తనను చూస్తున్నపుడు, సిగ్గుతో కదులాడేకన్నులతో చూపు మళ్లిస్తుంది. అయినా, భర్తనుండి మరొకవైపు చూపు తిప్పుకోవడం ఆమెకు సాధ్యం కాదు.

వివృణోతి తథాఙ్గాని స్వస్యా గుహ్యాని భార్గవ ।
గర్హితం చ తథైవాఙ్గం ప్రయత్నేన నిగూహతి ॥12॥

పరశురామా! రహస్యమైన అవయవాలను కూడ తనకు దాచకుండా, చూపుతుంది. నింద్యమైన అవయవాన్ని ప్రయత్నపూర్వకంగా దాచిపెడుతుంది.

తద్దర్శనే చ కురుతే బాలాలిఙ్గనచుమ్బనమ్ ।
ఆభాష్యమాణా భవతి సత్యవాక్యా తథైవ చ ॥13॥

భర్తను చూడగానే బిడ్డను కౌగిలించుకుని ముద్దుపెట్టుకుంటుంది. తనతో మనసునిండా ప్రియంగా మాట్లాడుతుంది. అది కూడ యథార్థమే పలుకుతుంది.

స్పృష్టా పులకితై రఙ్గై స్స్వేదే నైవ చ భజ్యతే ।
కరోతి చ తథా రామ సులభద్రవ్యయాచనమ్ ॥14॥

పరశురామా! భర్త తనను స్పృశించగానే ఆమెకు ఒళ్లంతా పులకరిస్తుంది. చెమట పడుతుంది. ఆ ప్రియురాలు సులువుగా లభించే వస్తువులనే కోరుకుంటుంది.

తత స్స్వల్పమపి ప్రాప్య కరోతి పరమాం ముదమ్ ।
నామసఙ్కీర్తనాదేవ ముదితా బహు మన్యతే ॥15॥

ఎంతో కొద్దిగా ఇచ్చినప్పటికీ, అంతులేని సంతోషాన్ని పొందుతుంది. తనపేరు విన్నమాత్రం చేతనే ఆనందంతో ఆదరిస్తుంది.

కరజాఙ్కాఙ్కితా న్యస్య ఫలాని ప్రేషయత్యపి ।
తత్ప్రేషితం చ హృదయే విన్యసత్యపి చాదరాత్ ॥16॥

ఆమె వేలిముద్రలు పడిన పండ్లను (వస్తువులను) కానుకలుగా పంపుతుంది. భర్త పంపిన వస్తువులను ప్రేమగా హృదయానికి హత్తుకుంటుంది.

ఆలిఙ్గనైశ్చ గాత్రాణి లిమ్పతీ వామృతేన యా ।
సుప్తే స్వపిత్యథాదౌ చ తథా తస్య విబుధ్యతే ॥
ఊరూ స్పృశతి చాత్యర్థం సుప్తం చైనం విబుధ్యతే ॥17॥

దృఢమైన కౌగిలింతలతో ఒళ్లంతా అమృతం పూస్తున్నవిధంగా ఆనందపెడుతుంది. భర్త నిద్రించిన తరువాతనే ఆమె నిద్రిస్తుంది. భర్తకంటె ముందుగానే ఆమె నిద్ర లేస్తుంది. గాఢంగా నిద్ర పోతున్న భర్తను నిద్ర లేపడానికి అతడితొడలను స్పృశిస్తుంది.

కపిత్థచూర్ణయోగేన తథా దధ్న స్రజా తథా ।
ఘృతం సుగన్ధి భవతి దుగ్ధైః క్షిప్తై స్తథా యవైః ॥
భోజ్యస్య కల్ప నైవం స్యాద్గన్ధయుక్తిః ప్రదర్శ్యతే ॥18॥

(స్త్రీపురుషులనడుమ కోరికలను కలిగించి, పెంచేభోజ్యాలను కొన్నింటిని పేర్కొంటున్నాడు.) వెలగపండుచూర్ణంతో గట్టిపెరుగు మీది మీగడను కలిపితే, నేయివలె మంచిపరిమళం వస్తుంది. పెరుగు, మీగడ మొదలైనవాటితో యవలు, కలపడంవలన రుచికరమైన భోజ్యపదార్థం సిద్ధం చేయవచ్చు. ఇక సుగంధాన్ని ఇచ్చే ద్రవ్యాలను గురించి చెప్తాను.

శౌచ మాచమనం రామ తథైవ చ విరేచనమ్ ।
భావనా చైవ పాకశ్చ బోధనం ధూపనం తథా ॥
వాసనం చైవ నిర్దిష్టం కర్మాష్టక మిదం స్మృతమ్ ॥19॥

పరశురామా! 1. శౌచం, 2. ఆచమనం, 3. విరేచనం, 4. భావన, 5. పాకం, 6. బోధనం, 7. ధూపనం, 8. వాసనం, అనేవి కర్మలుగా నిర్దేశించారు. వీటిని కర్మాష్టకం అంటారు.

కపిత్థబిల్వజమ్బ్వామ్ర కరవీరకపల్లవైః ।
కృత్వోదకం తు యద్ద్రవ్యం శౌచితం శౌచనం తు తత్ ॥20॥

వెలగ, మారేడు, నేరేడు, మామిడి, గన్నేరు వీటి చిగురాకులను నీళ్లలో వేసి, ఆనీళ్లతో ద్రవ్యాన్ని కడిగి, శుద్ధిచేసే విధానాన్ని శౌచనం అంటారు.

ఏషా మభావే శౌచం తు మృగదర్పామ్భసా భవేత్ ॥21॥

ఈచిగురాకులు దొరకకపోతే, కస్తూరిని కలిపిననీళ్లతో శుద్ధి చేయవచ్చు. (దానిని శౌచనం అంటారు.)

నఖం కుష్ఠం ఘనం మాంసీ స్పృక్కశైలేయజఙ్జలమ్ ।
తథైవ కుఙ్కుమం లాక్షా చన్దనాగురునీరదమ్ ॥22॥

సరలం దేవకాష్ఠం చ కర్పూరం కాన్తయా సహ ।
వాలః కున్దురుక శ్చైవ గుగ్గులు శ్శ్రీనివాసకః ॥
సహసర్జరసే నైవం ధూపం ద్రవ్యైకవింశతిః ॥23॥

1. నఖం, 2. కుష్ఠం (చెంగల్వకోష్టు అనేచెట్టు), 3. ఘనం (తుంగముస్తె), 4. మాంసి (జటామాంసి - కక్కోలం), 5. స్పృక్కం, 6. శైలేయం, 7. జంజలం, 8. కుంకుమం, 9. లాక్ష, 10. చందనం, 11. అగురు, 12. నీరదం, 13. సరలం, 14. దేవకాష్ఠం (దేవదారువృక్షవిశేషాలు), 15. కర్పూరం, 16. కాంతం (ఎఱ్ఱగన్నేరు), 17. వాలం, 18. కుందురుకం(కుందురువు), 19. గుగ్గులు, 20. శ్రీనివాసం, 21. సర్జరసం (యక్షధూపం) ఈఇరవై యొక్క ద్రవ్యాలతో ధూపం తయారు అవుతుంది.

ధూపద్రవ్యగణా దస్మా దేకవింశాద్యథేచ్ఛయా ।
ద్వే ద్వే ద్రవ్యే సమాదాయ సర్జభాగై ర్నియోజయేత్ ॥24॥

ధూపం తయారు చేయడానికి ఉపయోగించే పై 21 ధూపద్రవ్యాలసముదాయంనుండి ఇష్టం వచ్చిన వస్తువులను రెండేసి తీసుకుని సర్జరసంలో కలపాలి.

నఖపిణ్యాకమలయై స్సంయోజ్య మధునా తథా ।
ధూపయోగా భవన్తీహ యథావత్ స్వేచ్ఛయా కృతాః ॥25॥

నఖం అనేపేరు గలిగినచెట్టు రసం, కుంకుమపువ్వు, మలయం అనేచందనం, అనేవాటితోనూ, తేనెతోనూ పై 21 ద్రవ్యాలను ఇష్టంవచ్చినవిధంగా కలపడంవలన ధూపం మిశ్రపదార్థాలు ఏర్పడతాయి.

త్వచం నాడీం ఫలం తైలం కుఙ్కుమం గ్రన్థిపర్వకమ్ ।
శైలేయం తగరం క్రాన్తాం చోలం కర్పూరమేవ చ
మాంసీం సురాం చ కుష్ఠం చ స్నానద్రవ్యాణి నిర్దిశేత్ ॥26॥

త్వక్కు, నాడి, ఫలం, తైలం, కుంకుమం, గ్రంథిపర్వం, శైలేయం, తగరం, క్రాంతం, చోలం, కర్పూరం, జటామాంసి, సుర, కుష్ఠ ఇవి స్నానానికి ఉపయోగించే ద్రవ్యాలు అని నిర్దేశించడం జరిగింది.

ఏతేభ్య స్తు సమాదాయ ద్రవ్యత్రయ మథేచ్ఛయా ।
మృగదర్పయుతం స్నానం కార్యం కన్దర్పవర్ధనమ్ ॥27॥

ఈ ద్రవ్యాలలో తన కిష్టమైన మూడింటిని తీసుకుని, కస్తూరితో కలిపి, స్నానం చేయవచ్చును. దానివలన కోరిక పెరుగుతుంది.

త్వఙ్మురానలదై స్తుల్యై ర్బాలకార్ధసమాయుతైః ।
స్నాన ముత్పలగన్ధి స్స్యాత్ సతైలం కుఙ్కుమాయతే ॥28॥

త్వక్కు, ముర, నలదం అనే వాటిని సమానమైన పరిమాణంలో తీసుకుని, దానిలో సగం పరిమాణంలో బాలం కలిపి, స్నానం చేస్తే, ఒళ్లు కలువపూలపరిమళం వెదజల్లుతుంది. దానికి ముందు నువ్వులనూనె పట్టించి, స్నానం చేస్తే, శరీరం కుంకుమపువ్వులాగా మంచిరంగు కలిగినదవుతుంది.

జాతీపుష్పసుగన్ధి స్స్యాత్తగరార్ధేన యోజితమ్ ।
సద్వ్యామకం స్యాద్ వకులై స్తుల్యగన్ధిమనోహరమ్ ॥29॥

జాజిపువ్వుచూర్ణంలో అర్ధపరిమాణం కలిగిన తగరుతో కలిపి, స్నానం చేస్తే, శరీరానికి జాజిపూవువంటి పరిమళం కలుగుతుంది. అదే పద్ధతిలో ద్వ్యామకం అనేద్రవ్యం కలిపి, స్నానం చేస్తే, శరీరానికి వకులపూవులపరిమళం కలుగుతుంది.

మఞ్జిష్ఠా తగరం చోలం త్వచం వ్యాఘ్రనఖం నఖమ్ ।
గన్ధపత్రం చ విన్యస్య గన్ధతైలం భవే చ్ఛుభమ్ ॥30॥

నువ్వులనూనెలో మంజిష్ఠ, తగరం, చోలం, త్వక్కు, వ్యాఘ్రనఖం, నఖం (నఖాకృతిగల సుగన్ధద్రవ్యం), గంధపత్రం అనేవాటిని కలిపితే, పరిమళవంతమైన మంచినూనె తయారవుతుంది.

తైలం నిపీడితం రామ తిలైః పుష్పాధివాసితైః ।
వాసనా త్పుష్పసదృశం గన్ధేన తు భవే ద్ధ్రువమ్ ॥31॥

పరశురామా! నువ్వులను పరిమళభరితమైన పూవులతో కలిపి పిండితే (గానుగాడిస్తే), ఆ నువ్వులనూనె ఏపూవుతో కలిపారో ఆ పూవుపరిమళం నిశ్చయంగా కలుగుతుంది.

ఏలాలవఙ్గకక్కోలజాతీఫలనిశాకరాః ।
జాతీపత్రికయా సార్ధం స్వతన్త్రా ముఖవాసకాః ॥32॥

ఏలకులు, లవంగాలు. కక్కోలం, జాజికాయ, కర్పూరం, జాజిపత్రి అనే వస్తువులు దేని కదే (మరొకవస్తువుతో కలపకుండానే) నోటికి మంచిపరిమళాన్ని ఇస్తాయి.

కర్పూరం కుఙ్కుమం కాన్తా మృగదర్పం హరేణుకమ్ ।
కక్కోలైలాలవఙ్గం చ జాతీకోశక మేవ చ ॥33॥

త్వక్పత్రం త్రుటిముస్తౌ చ లతాం కస్తూరికాం తథా ।
కణ్టకాని లవఙ్గస్య ఫలపత్రే చ జాతితః ॥
కటకం చ ఫలం రామ కార్షికా న్యుపకల్పయేత్ ॥34॥

కర్పూరం, కుంకుమ, కాంత (పెద్దఏలకి), కస్తూరి, కంకోలం, ఏలకులు, లవంగాలు, జాజికాయబెరడు, త్వక్కు అనే దానిఆకులు, త్రుటి (చిట్టేలకి), ముస్తగడ్డి, లతాకస్తూరి, లవంగపుముళ్ళు, జాజికాయ, జాపత్రి, కటకఫలం అనేఈవస్తువులను 14మినపగింజలపరిమాణం(కర్షం)లో తీసుకోవాలి.

తచ్చూర్ణే ఖదిరం సారం దద్యాత్తుర్యం తు వాసితమ్ ।
సహకారరసేనాస్య కర్తవ్యా గుటికా శ్శుభాః ॥
ముఖన్యస్తా స్సుగన్ధాస్తా ముఖరోగవినాశనాః ॥35॥

పై వస్తువులను పొడి చేసి, దానిలో నాలుగవవంతు పరిమాణంలో అత్తిపత్తిచూర్ణాన్ని కలిపితే, మంచిసుగంధం ఏర్పడుతుంది. ఆ పొడిని మామిడిపండురసంతో కలిపి, అందంగా ఉండలను తయారు చేయాలి. ఆ ఉండలను నోటిలో వేసుకుంటే నోరు పరిమళవంతం అవుతుంది. నోటిరోగాలు నశించిపోతాయి.

పూగం ప్రక్షాళితం సమ్యక్ పఞ్చపల్లవవారిణా ।
శక్త్యా తు గుటికాద్రవ్యై ర్వాసితం ముఖవాసకమ్ ॥36॥

పంచపల్లవాలతో (20శ్లోకం) కూడిననీళ్లతో పోకకాయను కడిగి, ఉండలుగా చేయడానికి ఉపయోగించిన ద్రవ్యాలతో కలిపి నోటిలో ఉంచుకుంటే నోటికి పరిమళం ఇనుమడిస్తుంది.

కటుకం దన్తకాష్ఠం చ గోమూత్రే వాసితం త్ర్యహమ్ ।
కృతం చ పూగవద్ రామ ముఖసౌగన్ధికారకమ్ ॥37॥

కటుకం అనే సుగంధితృణవిశేషాన్ని, పలుదోముపుల్లనూ ఆవుమూత్రంలో మూడురోజులు ఉంచి ఉపయోగిస్తే, పోకలాగా నోటికి మంచిపరిమళాన్ని ఇస్తుంది.

త్వక్పథ్యయో స్సమా వంశౌ శశిభాగార్ధసంయుతౌ ।
నాగవల్లీసమో భాతి ముఖవాసో మనోహరః ॥38॥

త్వక్కు, పథ్య (హరీతకి) అనే ద్రవ్యాలను సమానమైన భాగాలుగా తీసుకుని, దానిలో సగంభాగం కర్పూరం కలిపితే, అది తాంబూలంతో సమానంగా నోటికి మనోహరమైన పరిమళాన్ని ఇస్తుంది.

ఏవం కుర్యాత్సదా స్త్రీణాం రక్షణం పృథివీపతిః ॥39॥


రాజు ఈవిధంగా స్త్రీలను ఆకర్షిస్తూ, నిరంతరం జాగ్రత్తగా రక్షించుకుంటూ ఉండాలి.

న చాసాం విశ్వసే జ్జాతు పుత్రమాతు ర్విశేషతః ।
న స్వపేత్ స్త్రీగృహే రాత్రౌ విశ్వాసః కృత్రిమో భవేత్ ॥40॥

ఆడవాళ్లను ఎప్పటికీ నమ్మగూడదు. అందులోనూ కొడుకులు కలిగిన స్త్రీలను అసలు నమ్మగూడదు. స్త్రీ తనపై ప్రదర్శించే నమ్మకం తెచ్చిపెట్టుకున్నది కావచ్చు. కాబట్టి, రాజు ఆడదాని ఇంట్లో రాత్రిపూట ఆదమరిచి నిద్రపోగూడదు.

ఇత్యాది మహాపురాణే ఆగ్నేయే రాజధర్మకథనం నామ చతుర్వింశత్యధికద్విశతతమో ఉధ్యాయః॥224॥

అగ్నిమహాపురాణంలో రాజధర్మకథనం అనే రెండువందల ఇరవైనాల్గవ అధ్యాయం సమాప్తం.



పఞ్చవింశత్యధికద్విశతతమోఽధ్యాయః – రెండువందల ఇరవైఐదవ అధ్యాయం

రాజధర్మకథనమ్– రాజధర్మకథనం

పుష్కర ఉవాచ – పరశురాముడితో పుష్కరుడు ఈవిధంగా చెప్తున్నాడు.

రాజపుత్రస్య రక్షా చ కర్తవ్యా పృథివీభృతా ।
ధర్మార్థకామశాస్త్రాణి ధనుర్వేదం చ శిక్షయేత్ ॥1॥

భూపాలకుడు రాజకుమారుడిని జాగ్రత్తగా రక్షించాలి. అతడికి, ధర్మశాస్త్రం, అర్థశాస్త్రం, కామశాస్త్రం, ధనుర్వేదం నేర్పించాలి.

శిల్పాని శిక్షయే చ్చైనమాప్తైర్మిథ్యా ప్రియంవదైః ।
శరీరరక్షావ్యాజేన రక్షిణోఽస్య నియోజయేత్ ॥2॥

హితవచనాలను నచ్చచెప్పగల చెప్పగలిగిన ఆత్మీయులచేత శిల్పం మొదలుగా వివిధమైన కళలను కూడ రాజకుమారుడికి నేర్పించాలి. రాజకుమారుడి శరీరాన్ని రక్షించడంకోసం ప్రత్యేకంగా నమ్మకమైన రక్షకభటులను ఏర్పాటు చేయాలి.

న చాస్య సఙ్గో దాతవ్యః క్రుద్ధలుబ్ధవిమానితైః ।
అశక్యం తు గుణాధానం కర్తుం తం బన్ధయేత్ సుఖైః ॥3॥

మిక్కిలికోపం కలిగినవారితోనూ, దురాశాపరులతోనూ, అవమానింపబడినవారితోనూ రాజకుమారుడికి సంబంధం లేకుండా చేయాలి. మంచిగుణాలను అలవరించడం సులువుగా సాధ్యం కాదు. అందుచేత రాజకుమారుడికి సుఖాలు అలవాటు చేయగూడదు.

అధికారేషు సర్వేషు వినీతం వినియోజయేత్ ।
మృగయాం పాన మక్షాంశ్చ రాజ్యనాశాం స్త్యజేన్నృపః ॥4॥

అన్నివిధములైన అధికారపదవులలోనూ గొప్పనీతిమంతులను మాత్రమే నియోగించాలి. రాజ్యాన్ని నాశం చేసే వేట, మద్యపానం, జూదం అనే అలవాట్లను రాజు విడిచిపెట్టాలి.

దివా స్వప్నం వృథాట్యాం చ వాక్పారుష్యం వివర్జయేత్ ।
నిన్దాం చ దణ్డపారుష్య మర్థదూషణ ముత్సృజేత్ ॥5॥

పగటికలలు కనగూడదు (పగలు నిద్రపోగూడదు). ప్రయోజనం లేకుండా తిరగగూడదు. కఠినంగా మాట్లాడగూడదు. ఇతరులను నిందించగూడదు. తప్పు చేసినవారిని తప్పుకు తగినవిధంగా శిక్షించాలి. క్రూరంగా బాధించగూడదు. అర్థదూషణం అంటే ధనాన్ని తిరస్కారభావంతో చూడడం తగదు.

ఆకారాణాం సముచ్ఛేదో దుర్గాదీనా మసత్క్రియా ।
అర్థానాం దూషణం ప్రోక్తం విప్రకీర్ణత్వమేవ చ ॥6॥

బంగారం మొదలైన నిధులను నశించిపోయేవిధంగా వాడడం, రాజ్యాన్ని రక్షించేదుర్గం మొదలైనవాటిని చక్కగా కాపాడుకోకపోవడం, సంపదలను (సమయానికి ఉపయోగపడకుండా) అనేకస్థలాలలో ఉంచడం, వీటిని అర్థదూషణం అంటారు.

అదేశకాలే యద్దాన మపాత్రే దాన మేవ చ ।
అర్థేషు దూషణం ప్రోక్తమసత్కర్మప్రవర్తనమ్ ॥7॥

ప్రదేశాలలోనూ, తగని సమయాలలోనూ దానం చేయడం, అలాగే అయోగ్యులకు దానం చేయడం, ప్రయోజనం లేని పనులను చేయడం (ధనం వృధాగా వ్యయం చేయడం) దీనిని కూడ అర్థదూషణం అంటారు.

కామం క్రోధం మదం మానం లోభం దర్పం చ వర్జయేత్ ।
తతో భృత్యజయం కృత్వా పౌరజానపదం జయేత్ ॥8॥

కామం, కోపం, గర్వం, దురభిమానం, దురాశ, ఆడంబరం అనే గుణాలను విడిచిపెట్టాలి. మంచితనంతో సేవకుల మనసులు గెలుచుకోవాలి. తరువాత నగరప్రజలను, పల్లె ప్రజలమనసు గెలుచుకోవాలి. (సేవకులు, ప్రజలు రాజు హితంకోసం ఏమైనా చేసేవారు కావాలి).

జయేద్బాహ్యా నరీన్పశ్చాద్బాహ్యా శ్చ త్రివిధారయః ।
గురవస్తే యథాపూర్వం కుల్యానన్తరకృత్రిమాః ॥9॥

ఆతరువాత బాహ్యశత్రువులను జయించాలి. బాహ్యశత్రువులు మూడువిధాలుగా ఉంటారు. 1. వంశపారంపర్యంగా తమతో విరోధం కలిగినవారు. 2. తరువాతికాలంలో శత్రువు లయినవారు. 3. తాత్కాలిక మైన ప్రయోజనం ఉద్దేశించి క్రొత్తగా విరోధం తెచ్చుకున్నవారు. వీరిలో తరువాతివారికంటె ముందరివారు అంటే కృత్రిములకంటె అనంతరులు, వారికంటె కుల్యులు పెద్దశత్రువులు.

పితృపైతామహం మిత్రం సామన్తశ్చ తథా రిపోః ।
కృత్రిమం చ మహాభాగ మిత్రం త్రివిధముచ్యతే ॥10॥

మహాత్మా! పరశురామా! అదే విధంగా మిత్రులు కూడ మూడువిధాలుగా ఉంటారు. 1. తాతముత్తాతలనుండి అంటే వంశపారంపర్యంగా మైత్రి కలిగినవారు. 2. శత్రువుకు సామంతులుగా ఉండేవాడు, అంటే శత్రువుకు శత్రువు అయినవాడు తనకు మిత్రుడవుతాడు. 3. తాత్కాలికమైన ప్రయోజనంకోసం మైత్రి చేసేవాడు కృత్రిము డయిన మిత్రుడు.

స్వామ్యమాత్యో జనపదా దుర్గం దణ్డ స్తథైవ చ ।
కోశో మిత్రం చ ధర్మజ్ఞ సప్తాఙ్గం రాజ్యముచ్యతే ॥11॥

ధర్మం చక్కగా తెలిసిన పరశురామా! రాజ్యానికి అంగాలు ఏడు. అవి 1. స్వామి, 2. మంత్రి, 3.జనపదం, 4. దుర్గం, 5. దండం, 6. కోశం, 7. మిత్రుడు.

మూలం స్వామీ స వై రక్ష్య స్తస్మా ద్రాజ్యం విశేషతః ।
రాజ్యాఙ్గద్రోహిణం హన్యాత్ కాలే తీక్ష్ణో మృదు ర్భవేత్ ॥12॥

వీని అన్నింటిలోనూ రాజు అనేవాడు ప్రధానం. అందుచేత రాజును తప్పకుండా కాపాడుకోవాలి. అతడికంటె ముఖ్యంగా రాజ్యాన్ని కాపాడాలి. రాజ్యాంగానికి ద్రోహం చేసినవాడిని చంపివేయాలి. సమయానుసారంగా కఠినంగా ఉండవలసినచోట కఠినంగానూ, మృదువుగా వ్యవహరించవలసినచోట మృదువుగానూ ఉండాలి.

ఏవం లోకద్వయం రాజ్ఞో భృత్యైర్హాసం వివర్జయేత్ ।
భృత్యాః పరిభవన్తీహ నృపం హర్షణసత్కథమ్ ॥13॥

ఈవిధంగా వ్యవహరించిన రాజుకు ఈలోకంలోనూ, పరలోకంలోనూ మేలు కలుగుతుంది. రాజు సేవకులతో అతిగా నవ్వగూడదు. సేవకులతో ఎగతాళిగా మాట్లాడేరాజుకు సేవకులు ఇవ్వవలసిన గౌరవం ఇవ్వరు. అవమానిస్తారు.

లోకసఙ్గ్రహణార్థాయ కృతకవ్యసనో భవేత్ ।
స్మితపూర్వాభిభాషీ స్యాల్లోకానాం రఞ్జనం చరేత్ ॥14॥

రాజ్యం సుఖంగా ఉంచడంకోసం రాజు లేని దౌష్ట్యం ఉన్నట్లు ప్రవర్తించాలి. అందరితో ముందుగా చిరునవ్వుతో చక్కగా మాట్లాడాలి. దానివల్ల లోకాలను అలరించగలుగుతాడు.

దీర్ఘసూత్రస్య నృపతేః కర్మహాని ర్ధ్రువం భవేత్ ॥15॥

ఏపని చేయాలన్నా, చాలాకాలంపాటు ఆలోచించే రాజు చేసేపనులన్నీ నిశ్చయంగా నాశనమైపోతాయి.

రాగే దర్పే చ మానే చ ద్రోహే పాపే చ కర్మణి ।
అప్రియే చైవ వక్తవ్యే దీర్ఘసూత్రః ప్రశస్యతే ॥16॥

అయితే, అనురక్తి, అహంకారం, ఆత్మాభిమానం, ద్రోహం, పాపం, అనిష్టం అనేవాటికి సంబంధించినపనులను గూర్చి దీర్ఘకాలం ఆలోచించడాన్ని అందరూ ప్రశంసిస్తారు.

గుప్తమన్త్రో భవేద్రాజా నాపదో గుప్తమన్త్రతః ।
జ్ఞాయతే హి కృతం కర్మ నారబ్ధం తస్య రాజ్యకమ్ ॥17॥

రాజు తనమంత్రాంగాన్ని ఎప్పుడూ రహస్యంగా ఉంచాలి. తనఆలోచనలను రహస్యంగా ఉంచడంవలన రాజుకు ఎప్పటికీ ఆపదలు కలుగవు. పనులు పూర్తి అయిన తరువాత తెలియవచ్చును. కాని ప్రారంభించకముందు రాజకార్యాలు ఎవ్వరికీ తెలియగూడదు.

ఆకారై రిఙ్గితై ర్గత్యా చేష్టయా భాషితేన చ ।
నేత్రవక్త్రవికారాభ్యాం గృహ్యతేఽన్తర్గతం మనః ॥18॥

ఆకారం, సంజ్ఞలు, ప్రవర్తన, చేష్టలు, మాటలు; కన్ను, ముఖంలో మార్పులతోనూ రాజుమనస్సును ఇతరులు తెలుసుకుంటారు.

నైకస్తు మన్త్రయే న్మన్త్రం న రాజా బహుభి స్సహ ।
బహుభి ర్మన్త్రయేత్ కామం రాజా మన్త్రాన్ పృథక్ పృథక్ ॥19॥

ముఖ్యమైన రాజకార్యాలను గురించి, రాజు ఒంటరిగా ఆలోచించగూడదు. అలాగని మరీ ఎక్కువమందితో కలిసి కూడ ఆలోచించగూడదు. ఒకవేళ పెక్కుమందితో ఆలోచన చేయవలసివస్తే, వారిలో ఒక్కొక్కరితో ఆలోచన చేయాలి.

మన్త్రిణామపి నో కుర్యాన్మన్త్రీ మన్త్రప్రకాశనమ్ ।
క్వాపి కస్యాపి విశ్వాసో భవతీహ సదా నృణామ్ ॥
నిశ్చయశ్చ తథా మన్త్రే కార్య ఏకేన సూరిణా ॥20॥

రాజు తనతో చేసిన ఆలోచనలను మంత్రి ఇతరమంత్రులకు వెల్లడించగూడదు. మానవులలో ప్రతిఒక్కడికీ, ఎక్కడో ఎవరిపైననో నమ్మకం ఉంటుంది. (కాబట్టి ఎవరికైనా ఒక్కరికే కదా అని చెప్తే, అతడు తనకు నమ్మక మైనవాడికి మరొక్కడికి చెప్తాడు. ఈవిధంగా రాజుమంత్రాంగం క్రమంగ అందరికీ తెలిసిపోతుంది. అందువల్ల మంత్రి రాజుఆలోచనలను ఏఒక్కరికి కూడ తెలియనీయగూడదు.) అందుచేత రాజు పండితుడైన ఒక్కవ్యక్తితో మాత్రమే కార్యనిశ్చయం చేయాలి.

నశ్యేదవినయాద్రాజా రాజ్యం చ వినయాల్లభేత్ ॥21॥

వినయం లేని రాజు నశించిపోతాడు. వినయం ఉన్నవాడికి రాజ్యం లభిస్తుంది.

త్రైవిద్యేభ్య స్త్రయీం విద్యాం దణ్డనీతిం చ శాశ్వతీమ్ ।
ఆన్వీక్షికీం చార్థవిద్యాం వార్తారమ్భాంశ్చ లోకతః ॥22॥

వేదపండితులనుండి మూడువేదాలను తెలుసుకోవాలి. యథార్థమైన దండనీతి, తర్కశాస్త్రం, అర్థశాస్త్రం, ఆయాశాస్త్రపండితులనుండి గ్రహించాలి. కృషివాణిజ్యాదివిషయాలను లోకంనుండి గ్రహించాలి.

జితేన్ద్రియో హి శక్నోతి వశే స్థాపయితుం ప్రజాః ॥23॥

ఇంద్రియాలను అదుపులో పెట్టుకున్నరాజు మాత్రమే ప్రజలను తనవశంలో నిలుపుకోగలడు.

పూజ్యా దేవా ద్విజా స్సర్వే దద్యా ద్దానాని తేషు చ ।
ద్విజే దానం చాక్షయోఽయం నిధిః కైశ్చిన్న నాశ్యతే ॥24॥

దేవతలు పూజింపదగినవారు. బ్రాహ్మణులు అందరూ పూజ్యులు. అందుచేత రాజు బ్రాహ్మణులకు దానాలు చేయాలి. బ్రాహ్మణులకు చేసినదానం శాశ్వతమైననిధి. దానిని ఎవ్వడూ నాశనం చేయలేడు.

సఙ్గ్రామేష్వనివర్తిత్వం ప్రజానాం పరిపాలనమ్ ।
దానాని బ్రాహ్మణానాం చ రాజ్ఞో నిశ్శ్రేయసం పరమ్ ॥25॥

యుద్ధంనుండి వెనుదిరగకుండా ఉండడం, ప్రజలను చక్కగా పరిపాలించడం, బ్రాహ్మణులకు దానాలు చేయడం, రాజుకు ఉత్తమోత్తమమైన శ్రేయస్సు కలిగిస్తుంది.

కృపణానాథవృద్ధానాం విధవానాం చ యోషితామ్ ।
యోగక్షేమం చ వృత్తిం చ తథైవ పరికల్పయేత్ ॥26॥

దీనులు, దిక్కు లేనివారు, ముసలివారు, భర్త లేని స్త్రీలు వీరి యోగక్షేమాలను చూడాలి. వారిజీవనానికి తగినవృత్తిని ఏర్పాటు చేయాలి.

వర్ణాశ్రమవ్యవస్థానం కార్యం తాపసపూజనమ్ ।
న విశ్వసేచ్చ సర్వత్ర తాపసేషు చ విశ్వసేత్ ॥
విశ్వాసయేచ్చాపి పరం తత్త్వభూతేన హేతునా ॥27॥

బ్రాహ్మణులు మొదలయిన వర్ణవ్యవస్థను, బ్రహ్మచర్యం మొదలైన నాలుగుఆశ్రమాల వ్యవస్థనూ రాజు చక్కగా నడిపించాలి. తపస్వులను పూజించాలి. రాజు ఎవ్వరినీ నమ్మగూడదు. తపస్సు చేసుకునేవారిని మాత్రం తప్పక నమ్మాలి. సరియైనదీ, సారభూతమైనదీ అయిన కారణంతో ఇతరులు తనను తప్పకుండా నమ్మేటట్లు చేసుకోవాలి.

బకవచ్చిన్తయే దర్థం సింహవచ్చ పరాక్రమేత్ ।
వృకవచ్చావలుమ్పేత శశవచ్చ వినిష్పతేత్ ॥28॥

రాజకార్యాలను గురించి రాజు కొంగలాగా ఓపికతో ఆలోచించాలి. శత్రువులవిషయంలో సింహంలాగా పరాక్రమించాలి. శత్రువులను తోడేలులాగా ఆక్రమించుకోవాలి. కుందేలులాగా వేగంగా దూకాలి.

దృఢప్రహారీ చ భవేత్ తథా శూ(సూ)కరవ న్నృపః ।
చిత్రాకారశ్చ శిఖివ ద్దృఢభక్తి స్తథాశ్వవత్ ॥29॥

పందిలాగా గట్టిదెబ్బ కొట్టాలి. నెమలిలాగా అందమైన ఆకారం కలిగిఉండాలి. గుఱ్ఱంలాగా సుస్థిరమైన భక్తిభావం కలిగి ఉండాలి.

భవేచ్చ మధురాభాషీ తథా కోకిలవన్నృపః ।
కాకశఙ్కీ భవే న్నిత్యమజ్ఞాతాం వసతిం వసేత్ ॥30॥

కోకిలలాగా చెవి కింపుగా మాట్లాడాలి. కాకిలాగా నిరంతరమూ అప్రమత్తంగా ఉండాలి. ఎవరికీ తెలియని రహస్యప్రదేశంలో నివసించాలి.

నాపరీక్షితపూర్వం చ భోజనం శయనం స్పృశేత్ ।
నావిజ్ఞాతాం స్త్రియం గచ్ఛే న్నాజ్ఞాతాం నావ మారుహేత్ ॥
రాష్ట్రకర్షీ భ్రశ్యతే చ రాజ్యార్థాచ్చైవ జీవితాత్ ॥31॥

పరీక్షించకుండా భోజనం చేయగూడదు. అదే విధంగా నిద్రించగూడదు. తెలియని స్త్రీని పొందగూడదు. తెలియని నావ ఎక్కగూడదు. రాజ్యంలోని ప్రజలను బాధించేవాడు రాజ్యంనుండి భ్రష్టుడవుతాడు. అలాగే ప్రజలను పీడించినరాజు తన జీవితాన్ని కూడా కోల్పోతాడు.

భృతో వత్సో జాతబలః కర్మయోగ్యో యథా భవేత్ ।
తథా రాష్ట్రం మహాభాగ భృతం కర్మసహం భవేత్ ॥32॥

మహాత్మా! పరశురామా! చక్కగా పోషణచేస్తేనే దూడ బాగా శక్తిమంతమై, తరువాత వ్యవసాయం మొదలైన పనులు చేయడానికి ఉపయోగపడుతుంది. అదే విధంగా రాజ్యంలో ప్రజలను కూడ రాజు ముందుగా చక్కగా రక్షిస్తేనే, వారు తమతమపనులు చేయగలుగుతారు.

సర్వం కర్మేద మాయత్తం విధానే దైవపౌరుషే ।
తయోర్దైవ మచిన్త్యం హి పౌరుషే విద్యతే క్రియా ॥
జనానురాగప్రభవా రాజ్ఞో రాజమహీశ్రియః ॥33॥

ఏకార్య మయినా, దైవాన్నీ, పురుషప్రయత్నాన్నీ అనుసరించే ఫలితాన్ని ఇస్తుంది. ఆ రెండింటిలో దైవబలం అనేది ముందుగా ఊహించడానికి అవకాశం లేనిది. మనచేతిలో లేనిది. కాగా పురుషప్రయత్నం మాత్రం ఫలానుగుణంగా చేయాలి. ప్రజలకు రాజుమీద అభిమానం ఉంటేనే రాజుకు రాజ్యం కానీ, సంపదలు కాని ఏర్పడతాయి.

ఇత్యాది మహాపురాణే ఆగ్నేయే రాజధర్మకథనం నామ పఞ్చవింశత్యధికద్విశతతమో ఽధ్యాయః॥225॥

అగ్నిమహాపురాణంలో రాజధర్మకథనం అనే రెండువందల ఇరవైఐదవ అధ్యాయం సమాప్తం.



షడ్వింశత్యధికద్విశతతమో உధ్యాయః– రెండువందల ఇరవైఆరవ అధ్యాయం

సామాద్యుపాయకథనమ్ – సామం మొదలైన ఉపాయాలు చెప్పుట

పుష్కర ఉవాచ – పరశురాముడితో పుష్కరుడు ఈవిధంగా చెప్తున్నాడు.

స్వయమేవ కర్మ దైవాఖ్యం విద్ధి దేహాన్తరార్జితమ్ ।
తస్మాత్ పౌరుషమేవేహ శ్రేష్ఠమాహుర్మనీషిణః ॥1॥

పూర్వజన్మలలో తాను చేసుకున్న కర్మమే దైవం అని గ్రహించాలి. అందుచేతనే బుద్ధిమంతులు పురుషకారమే ఉత్తమం అంటారు.

ప్రతికూలం తథా దైవం పౌరుషేణ విహన్యతే ।
సాత్త్వికాత్ కర్మణః పూర్వాత్ సిద్ధి స్స్యాత్ పౌరుషం వినా ॥2॥

ఉత్తమమైన పురుషప్రయత్నం దైవం ప్రతికూలమయినా, దానిని దాటి, మంచిఫలితాన్ని ఇస్తుంది. పూర్వజన్మలలో సాధుకర్మలు ఉంటే, ఇప్పుడు పురుషప్రయత్నం లేకుండానే ఫలితం సిద్ధిస్తుంది.

పౌరుషం దైవసమ్పత్త్యా కాలే ఫలతి భార్గవ ।
దైవం పురుషకారశ్చ ద్వయం పుంసః ఫలావహమ్ ॥3॥

పరశురామా! పురుషప్రయత్నం దైవబలంతో ఆతరువాతికాలంలో మంచిఫలితం ఇస్తుంది. అందుచేత జీవులపనులకు ఫలితం సిద్ధించడానికి దైవం, పురుషకారం అనేవి రెండూ కారణాలే.

కృషే ర్వృష్టిసమాయోగాత్ కాలే స్యుః ఫలసిద్ధయః ।
సధర్మం పౌరుషం కుర్యా న్నాలసో న చ దైవవాన్ ॥4॥

పురుషయత్నంగా వ్యవసాయం చేయగా, వర్షంరూపంలో దైవం దానికి తోడయినపుడు పంటలు అనేఫలితం చక్కగా సిద్ధిస్తుంది. అదే విధంగా ముందుగా పురుషకారాన్ని చేయాలి. ప్రయత్నం విషయంలో అలసట పనికి రాదు. కేవలం దైవాన్ని నమ్ముకుని ఉండగూడదు. అంటే ఏపని అయినా దైవికంగా జరగవలసినప్పుడు జరుగుతుందని దానికై చేయవలసిన ప్రయత్నం చేయకుండా ఉండగూడదు.

సామాదిభిరుపాయైస్తు సర్వే సిద్ధ్యన్త్యుపక్రమాః ।
సామ చోపప్రదానం చ భేదదణ్డౌ తథాపరౌ ॥
మాయోపేక్షేన్ద్రజాలం చ హ్యుపాయా స్సప్త తా ఇఞ్ఛృణు ॥5॥

ప్రారంభించిన పనులన్నీ సామం మొదలైన ఉపాయాలచేత ఫలిస్తాయి. 1. సామం, 2. దానం, 3. భేదం, 4. దండం, 5. మాయ, 6. ఉపేక్ష, 7. ఇంద్రజాలం అని ఉపాయాలు ఏడువిధాలుగా ఉంటాయి. వాటిని వివరిస్తాను, విను.

ద్వివిధం కథితం సామ తథ్యం చాతథ్యమేవ చ ।
తత్రాప్యతథ్యం సాధూనా మాక్రోశా యైవ జాయతే ॥6॥

అందులో సామం అనే ఉపాయం రెండువిధాలు అని చెప్తారు. 1. తథ్యం, 2. అతథ్యం. వీటిలో అతథ్యం అనే సామం సజ్జనులకు బాధ కలిగిస్తుంది.

మహాకులీనా హ్యృజవో ధర్మనిత్యా జితేన్ద్రియాః ।
సామసాధ్యా అతథ్యైశ్చ గృహ్యన్తే రాక్షసా అపి ॥
తథా తదుపకారాణాం కృతానాం చైవ వర్ణనమ్ ॥7॥

ఉత్తమమైనవంశంలో జన్మించినవారు, సూటిగా వ్యవహరించేవారు, ధర్మబద్ధంగా ప్రవర్తించేవారు, ఇంద్రియాలను తమ అధీనంలో పెట్టుకున్నవారు, అయినవారు సామం (తథ్యం) అనేఉపాయంతో స్వాధీనం అవుతారు. రాక్షసులు మొదలయిన అసాధుజనులు అతథ్యం అనే ఉపాయంతో స్వాధీనం అవుతారు. వారు చేసిన ఉపకారాలను పెద్దవి చేసి, ప్రశంసిస్తే, లోబడతారు.

పరస్పరం తు యే ద్విష్టాః క్రుద్ధభీతావమానితాః ।
తేషాం భేదం ప్రయుఞ్జీత పరమం దర్శయేద్భయమ్ ॥8॥

ఒకరినొకరు ద్వేషించుకునేవారు, కోపంతో ఉన్నవారు, భయపడేవారు, అవమానం పొందినవారు, వీళ్లవిషయంలో భేదం అనే ఉపాయాన్ని ప్రయోగించాలి. వారిని అత్యంతం భయపడేవిధంగా చేయాలి.

ఆత్మీయాం దర్శయే దాశాం యేన దోషేణ బిభ్యతి ।
పరాస్తే నైవ తే భేద్యా రక్ష్యో వై జ్ఞాతిభేదకః ॥9॥

తనపక్షంనుంచి, వారికి మేలు కలిగేవిధంగా ఆశచూపాలి. శత్రువులు ఏదోషంవలన భయపడుతున్నారో, గ్రహించి దానితోనే వారిని ఇంకా భయపెట్టి భేదాన్ని కలిగించాలి. తనకు శత్రువులైన దాయాదులలో విరోధం పెట్టేవాడిని, తాను రక్షించాలి.

సామన్తకోపో బాహ్యస్తు మన్త్రామాత్యాత్మజాదికః ।
అన్తఃకోపం చోపశామ్యం కుర్వఞ్ఛత్రోశ్చ తం జయేత్ ॥10॥

తనపై సామంతులకోపం బహిరంగ మైనది. ఆలోచనలు చెప్పే మంత్రులు, కుమారులు మొదలుగా తనతో కలిసి ఉన్న వాళ్లకోపం ఆంతరంగికం. ఈరెండువిధములైన కోపాలను తొలగించాలి. ఆవిధంగా బయటా, లోపలా తనను విరోధించేవారిని జయించాలి.

ఉపాయశ్రేష్ఠం దానం స్యా ద్దానాదుభయలోకభాక్ ।
న సోఽస్తి నామ దానేన వశగో యో న జాయతే ॥11॥

ఉపాయాలన్నిటిలోనూ దానం అనే ఉపాయం ఉత్తమం. దానంవలన ఇహపరలోకాలు రెండింటిలోనూ సుఖం పొందవచ్చు. దానానికి లోబడనివాడు ఎవ్వడూ లేదు.

దానవానేవ శక్నోతి సంహతాన్ భేదితుం పరాన్ ।
త్రయాసాధ్యం సాధయే త్తం దణ్డేన చ కృతేన చ ॥12॥

దానం చేసేవాడు మాత్రమే కలిసిఉన్న శత్రువులను విడదీయగలుగుతాడు. సామం, భేదం, దానం అనే ఈమూడు ఉపాయాలతోనూ లొంగనివాడిని దండం (అనేనాలుగో ఉపాయం) ప్రయోగించి లొంగదీసుకోవాలి.

దణ్డే సర్వం స్థితం దణ్డో నాశయే ద్దుష్ప్రణీకృతః ।
అదణ్డ్యాన్ దణ్డయన్నశ్యే ద్దణ్డ్యాన్ రాజాప్యదణ్డయన్ ॥13॥

సమస్తం దండంలోనే ఉన్నది. (దండోపాయంతో దేనినయినా సాధించవచ్చు.) అయితే, దండం అనుచితంగా ప్రయోగిస్తే, అది ప్రయోగించినవాడినే నాశనం చేస్తుంది. దండింపదగనివారిని దండించినా, దండించవలసినవారిని దండించకపోయినా, రాజు నశిస్తాడు.

దైవదైత్యోరగనరా స్సిద్ధా భూతాః పతత్రిణః ।
ఉత్క్రమేయు స్స్వమర్యాదాం యది దణ్డాన్న పాలయేత్ ॥14॥

రాజు దండం అనే ఉపాయాన్ని సముచితంగా ప్రయోగించకపోతే, దేవతలు, రాక్షసులు, నాగులు, మానవులు, సిద్ధులు, భూతాలు, పక్షులు, అందరూ హద్దులు దాటి, స్వేచ్ఛగా ప్రవర్తిస్తారు.

యస్మా దదాన్తాన్దమయ త్యాదణ్డ్యాన్ దణ్డయ త్యపి ।
దమనా ద్దణ్డనా చ్చైవ తస్మాద్దణ్డం విదు ర్బుధాః ॥15॥

దండం అనేఉపాయం రాజ్యంలో పెట్రేగిపోయేవారిని అణచివేస్తుంది. తప్పుడుపనులు చేసినవారిని శిక్షిస్తుంది. దమనం (అణచివేయడం), దండనం (శిక్షించడం) అనే లక్షణాలు కలిగినది కావడంచేతనే, పండితులు దీనిని దండం అని పేర్కొంటారు.

తేజసా దుర్నిరీక్ష్యో హి రాజా భాస్కరవత్తతః ।
లోకప్రసాదం గచ్ఛేత దర్శనా చ్చన్ద్రవత్తతః ॥16॥

రాజు దుష్టులకు తేజస్సుచేత (కఠినంగా శిక్షిస్తాడనే భయంతో) కన్నెత్తిచూడడానికి వీలులేకుండా సూర్యుడివంటివాడు అవుతాడు. అదే విధంగా సాధుజనులకు ప్రసాదగుణంతో ఆహ్లాదకరంగా దర్శనం ఇస్తూ, చంద్రుడివంటివాడు అవుతాడు.

జగద్ వ్యాప్నోతి వై చారై రతో రాజా సమీరణః ।
దోషనిగ్రహకారిత్వా ద్రాజా వైవస్వతః ప్రభుః ॥17॥

గూఢచారులరూపంలో లోకం అంతటా నిండిఉండడంచేత, రాజు వాయువువంటివాడు. పాపకృత్యాలను నివారించడంచేత రాజు యముడివంటివాడు.

యదా దహతి దుర్బుద్ధిం తదా భవతి పావకః ।
యదా దానం ద్విజాతిభ్యో దద్యాత్తస్మా ద్ధనేశ్వరః ॥18॥

ప్రజలలో తప్పుపని చేయాలనే ఆలోచనను కాల్చివేయడంలో రాజు అగ్నిదేవుడు అవుతాడు. బ్రాహ్మణులకు దానం చేయడంలో రాజు కుబేరుడు అవుతాడు.

ధనధారాప్రవర్షిత్వాద్దేవాదౌ వరుణ స్మృతః ।
క్షమయా ధారయంల్లోకాన్ పార్థివః పార్థివో భవేత్ ॥19॥

రాజ్యంలో (పేదవారికి) ధనాన్ని వర్షంలాగా కురిపించడంచేత దేవతలు మొదలయినవారిలో వరుణదేవుడివంటివాడు. ఓర్పుతో ప్రజలను భరించి, పోషించడంలో రాజు భూమివంటివాడు.

ఉత్సాహమన్త్రశక్త్యాద్యై రక్షేద్యస్మాద్ధరిస్తతః ॥20॥

ఉత్సాహ(కార్యనిర్వహణ)శక్తితోనూ, ఆలోచనా(కార్యనిశ్చయ)శక్తితోనూ రాజ్యాన్ని చక్కగా రక్షిస్తాడు కాబట్టి, రాజు శ్రీమహావిష్ణువే.

ఇత్యాది మహాపురాణే ఆగ్నేయే సామాద్యుపాయకథనం నామ షడ్వింశత్యధికద్విశతతమోఽధ్యాయః॥226॥

అగ్నిమహాపురాణంలో సామం మొదలైన ఉపాయాలు చెప్పుట అనే రెండువందల ఇరవైఆరవ అధ్యాయం సమాప్తం.



సప్తవింశత్యధికద్విశతతమోఽధ్యాయః – రెండువందల ఇరవైఏడవ అధ్యాయం

దండప్రణయనకథనమ్ – శిక్షలను గూర్చి చెప్పుట

పుష్కర ఉవాచ – పరశురాముడితో పుష్కరుడు ఈవిధంగా చెప్తున్నాడు.

దణ్డప్రణయనం వక్ష్యే యేన రాజ్ఞః పరా గతిః ।
త్రియవం కృష్ణలం విద్ధి మాషస్తత్పఞ్చకం భవేత్ ॥1॥

పరశురామా! ఇంక దండనీతిని ప్రయోగించే విధానాన్ని గురించి చెప్తాను. దీనిని ప్రయోగించిన తీరును బట్టే రాజు ఉత్తమగతిని పొందుతాడు. కొలతలలో మూడు యవల పరిమాణం ఒక కృష్ణలం. ఐదు కృష్ణలాలు ఒక మాషం.

కృష్ణలానాం తథా షష్ట్యా కర్షార్ధం రామ కీర్తితమ్ ।
సువర్ణశ్చ వినిర్దిష్టో రామ షోడశమాషకః ॥2॥

పరశురామా! అరవై కృష్ణలాలు (12 మాషాలు) అర్ధకర్షం. పదహారు మాషాలు అయితే అది ఒక సువర్ణం.

నిష్కస్సువర్ణాశ్చత్వారో ధరణం దశభిస్తు తైః ।
తామ్రరూప్యసువర్ణానాం మానమేతత్ ప్రకీర్తితమ్ ॥
తామ్రికైః కార్షికో రామ ప్రోక్తః కార్షాపణో బుధైః ॥3॥

నాలుగు సువర్ణాలు నిష్కం. పది సువర్ణాలు (160 మాషాలు) ధరణం. రాగి, వెండి, బంగారం వీటి బరువును ఈ కొలతప్రకారం చెప్తారు. ఒక కార్షికం (కర్షం, కార్షం) అంటే 24 మాషాల పరిమాణం కలిగిన రాగిని విజ్ఞులు కార్షాపణం అని చెప్తారు. (నిఘంటువులలో ఈ కొలతలు భిన్నంగా ఉన్నాయి.)

పణానాం ద్వే శతే సార్ధం ప్రథమస్సాహసస్స్మృతః ।
మధ్యమః పఞ్చ విజ్ఞేయస్సహస్రమపి చోత్తమః ॥4॥

రెండువందల పణాలు ప్రథమసాహసం జరిమానా అవుతుంది. ఐదువందల పణాలు మధ్యమసాహసం, వెయ్యిపణాలు ఉత్తమసాహసం అని గ్రహించాలి.

చోరైరమూషితో యస్తు మూషితోఽస్మీతి భాషతే ।
తత్ప్రదాతరి భూపాలే స దణ్డ్యస్తావదేవ తు ॥5॥

దొంగలు అపహరించకపోయినప్పటికీ, రాజు ఇస్తాడు కదా అని తన ధనాన్ని దొంగిలించారు అని రాజుతో అబద్ధం చెప్పినవాడిని రాజు అంత ధనాన్ని తీసుకుని శిక్షించాలి.

యో యావద్విపరీతార్థం మిథ్యా వా యో వదేత్తు తమ్ ।
తౌ నృపేణ హ్యధర్మజ్ఞౌ దాప్యౌ తద్ద్విగుణం దమమ్ ॥6॥

చోరులు దొంగిలించినదానిని ఎక్కువ చేసి చెప్పేవాడు, అది నిజమే అని అబద్ధపు సాక్ష్యం చెప్పినవాడు, ఇద్దరూ తప్పు చేసినవాళ్లే. కాబట్టి పోయినదానికి అధికంగా చెప్పిన ధనానికి రెట్టింపు ధనం వారినుండి శిక్షగా రాజు గ్రహించాలి.

కూటసాక్ష్యం తు కుర్వాణాంస్త్రీన్ వర్ణాంశ్చ ప్రదాపయేత్ ।
వివాసయేద్ బ్రాహ్మణం తు భోజ్యో విధిర్నహీరితః ॥7॥

అబద్ధపు సాక్ష్యం చెప్పిన క్షత్రియులు, వైశ్యులు, శూద్రులు అనే మూడు వర్ణాల వారిని శిక్షించాలి. బ్రాహ్మణులను మాత్రం రాజ్యంనుండి వెళ్లగొట్టాలి. ధర్మశాస్త్రాలలో బ్రాహ్మణుడికి మరొకశిక్ష చెప్పబడలేదు.

నిక్షేపస్య సమం మూల్యం దణ్ద్యో నిక్షేపభుక్తథా ।
వస్త్రాదికస్య ధర్మజ్ఞ తథా ధర్మో న హీయతే ॥8॥

ధర్మం తెలిసిన పరశురామా! వస్త్రాలు మొదలయినవాటిని దాచి ఉంచమని ఇచ్చిన సొమ్మును కాజేసినవాడి దగ్గర వాటివిలువ మొత్తం శిక్షగా స్వీకరించాలి. దానివల్ల ధర్మహాని లేదు. (అదే ధర్మం)

యో నిక్షేపం ఘాతయతి యశ్చానిక్షిప్య యాచతే ।
తావుభౌ చోరవచ్ఛాస్యౌ దణ్ద్యౌ వా ద్విగుణం దమమ్ ॥9॥

దాచిపెట్టమని ఇచ్చిన దానిని నాశనం చేసినవాడు, దాచకుండానే దాచమని ఇచ్చింది తిరిగి ఇమ్మని అడిగేవాడు, ఇద్దరూ దొంగలే. వారిని దొంగలతో సమానంగా శిక్షించాలి. లేదా ఆ సొమ్ముకు రెట్టింపును అపరాధ శుల్కంగా తీసుకోవాలి.

అజ్ఞానాద్యః పుమాన్ కుర్యాత్ పరద్రవ్యస్య విక్రయమ్ ।
నిర్దోషో జ్ఞానపూర్వం తు చోరవద్దణ్డమర్హతి ॥10॥

ఇతరులు తనవద్ద ఉంచిన వస్తువును తెలియక అమ్మినవాడు నిర్దోషి. కాని తెలిసి, బుద్ధిపూర్వకంగా అమ్మితే మాత్రం దొంగతో సమానంగా శిక్షించాలి.

మూల్యమాదాయ యశ్శిల్పం న దద్యాద్దణ్డ్య ఏవ సః ।
ప్రతిశ్రుత్యా ప్రదాతారం సువర్ణం దణ్డయేన్నృపః ॥11॥

శిల్పం మొదలైన వస్తువు విలువ తీసుకుని, ఆ వస్తువును ఇవ్వనివాడిని రాజు తప్పకుండా శిక్షించాలి. ఇస్తానని వాగ్దానం చేసి ఇవ్వనివాడికి ఒక సువర్ణం (16 మాషాలు 2శ్లో) అపరాధశుల్కంతో దండించాలి.

భృతిం గృహ్య న కుర్యాద్యః కర్మాష్టౌ కృష్ణలా దమః ।
అకాలే తు త్యజన్ భృత్యం దణ్డ్యస్స్యాత్తావదేవ తు ॥12॥

కూలి తీసుకుని పనిచేయనివాడికి ఎనిమిది కృష్ణలములను (మూడు యవలు ఒకకృష్ణలం. 1శ్లో) శుల్కం వేసి దండించాలి. అనుచితమయిన సమయంలో సేవకుడిని పనిలోనుండి తీసివేసినవాడిని కూడ ఎనిమిది కృష్ణలములతో దండించాలి.

క్రీత్వా విక్రీయ వా కిఞ్చిద్యస్యేహానుశయో భవేత్ ।
సో౽న్తర్దశాహాత్తత్ స్వామీ దద్యాచ్చైవాదదీత చ ॥13॥

కొన్న తరువాత కాని, అమ్మిన తరువాత కాని, ఆ విధంగా చేసినందుకు బాధ కలిగితే, అమ్మినవాడు పదిరోజులలోపుగా ఆ వస్తువును తిరిగి తీసుకుని దానివిలువ ఇచ్చివేయవచ్చును. అలాగే కొన్నవాడు వస్తువును ఇచ్చివేసి తన ధనం తిరిగి తీసుకోవచ్చు.

పరేణ తు దశాహస్య నాదద్యాన్నైవ దాపయేత్ ।
ఆదదద్ధి దదచ్చైవ రాజ్ఞా దణ్డ్యశ్శతాని షట్ ॥14॥

పది రోజులు దాటిపోతే తిరిగి ఇవ్వడానికి కాని తీసుకోవడానికి కాని వీలు లేదు. దీనికి విరుద్ధంగా తీసుకున్నా ఇచ్చినా వాడికి రాజు ఆరువందలు శిక్ష విధించాలి.

వరదోషానవిఖ్యాప్య యః కన్యాం వరయేదిహ ।
దత్తాప్యదత్తా సా తస్య రాజ్ఞా దణ్డ్యశ్శతద్వయమ్ ॥15॥

వరుడిలోని లోటుపాట్లను దాచిపెట్టి కన్యను వరించినవాడికి కన్యను ఇచ్చినా ఇవ్వనట్లే అవుతుంది. అలా చేసినవాడిని, ఇంకా అలా వివాహం చేసుకున్నవాడిని రాజు రెండువందలు జరిమానాతో శిక్షించాలి.

ప్రదాయ కన్యాం యో౽న్యస్మై పునస్తాం సమ్ప్రయచ్ఛతి ।
దణ్డః కార్యో నరేన్ద్రేణ తస్యాప్యుత్తమసాహసః ॥16॥

కన్యను ఒకరికి ఇస్తానని వాగ్దానం చేసి, తరువాత అదే కన్యను వేరొకడికి ఇచ్చినవాడిని రాజు ఉత్తమసాహసం(వెయ్యిపణాలు4శ్లో)తో శిక్షించాలి.

సత్యఙ్కారేణ వాచా చ యుక్తం పుణ్యమసంశయమ్ ।
లుబ్ధో౽న్యత్ర చ విక్రేతా షట్శతం దణ్డమర్హతి ॥17॥

తాను అన్నమాటను నిజం చేయడం అంటే అన్నమాట నిలబెట్టుకోవడం న్యాయ్యం. దానివల్ల నిస్సందేహంగా పుణ్యం వస్తుంది. కాని ఒకరికి అమ్ముతానని మాట ఇచ్చి దురాశతో మరొకరికి అమ్మినవాడిని రాజు ఆరువందలు అపరాధ శుల్కంతో దండించాలి.

దద్యాద్ధేనుం న యః పాలో గృహీత్వా భక్తవేతనమ్ ।
స తు దణ్డ్యశ్శతం రాజ్ఞా సువర్ణం వాప్యరక్షితా ॥18॥

ఆవులను కాచేవాడు అందుకోసం యజమానినుండి తిండిఖర్చును, జీతాన్ని తీసుకుని కూడ ఆవును అతడికి అప్పగించక పోయినా (తాను కాజేసినా) లేదా ఆవును సరిగా కాపాడకపోయినా వందసువర్ణాల జరిమానాతో రాజు అతడిని శిక్షించాలి.

ధనుశ్శతం పరీణాహో గ్రామస్య తు సమన్తతః ।
ద్విగుణం త్రిగుణం వాపి నగరస్య చ కల్పయేత్ ॥19॥

గ్రామానికి చుట్టూ నూరుధనుస్సుల పరిమాణంలోనూ(ధనుస్సు అంటే నాలుగుమూరలు), నగరానికి దానికి రెట్టింపు (రెండువందల ధనుస్సులు) లేదా మూడు రెట్ల (మూడువందల ధనుస్సులు) పరిమాణంలో కాని భూమిని వ్యవసాయానికై ఏర్పాటు చేయాలి.

వృత్తిం తత్ర ప్రకుర్వీత యాముష్ట్రో నావలోకయేత్ ।
తత్రాపరివృతే ధాన్యే హింసితే నైవ దణ్డనమ్ ॥20॥

ఆ వ్యవసాయభూమికి చుట్టూ కంచెను నిలుచున్న ఒంటె (పొలంలోనిపైరును) చూడలేనంత ఎత్తుగా నిర్మించాలి. ఈవిధంగా కంచె లేని పొలంలోని పంటను పాడుచేసినవారిని ఎంతమాత్రమూ శిక్షించగూడదు.

గృహం తటాకమారామం క్షేత్రం వా భీషయా హరన్ ।
శతాని పఞ్చ దణ్డ్యస్స్యాదజ్ఞానాద్ద్విశతో దమః ॥21॥

ఇతరులను భయపెట్టి వారిఇల్లు గాని, చెరువు గాని, తోట గాని, పొలం గాని కాజేసినవాడికి ఐదువందలు దండన విధించాలి. తెలియక కాజేసినట్లయితే రెండువందలు దండన విధించాలి.

మర్యాదాభేదకాస్సర్వే దణ్డ్యాః ప్రథమసాహసమ్ ॥22॥

ఇళ్లు, పొలాలు మొదలైనవాటి హద్దులను మీరి ప్రక్కవారి స్థలం ఆక్రమించుకున్నవారినందరినీ ప్రథమసాహసం (రెండువందలపణాలు 4శ్లో.) అపరాధశుల్కంగా విధించి దండించాలి.

శతం బ్రాహ్మణమాక్రుశ్య క్షత్రియో దణ్డమర్హతి ।
వైశ్యశ్చ ద్విశతం రామ శూద్రశ్చ వధమర్హతి ॥23॥

పరశురామా! బ్రాహ్మణుడిని నిందించిన క్షత్రియుడికి వంద, వైశ్యుడికి రెండువందలు దండన విధించాలి. శూద్రుడిని సంహరించాలి.

పఞ్చాశద్ బ్రాహ్మణో దమ్యః క్షత్రియస్యాభిశంసనే ।
వైశ్యే వాప్యర్ధపఞ్చాశచ్ఛూద్రే ద్వాదశకో దమః ॥24॥

బ్రాహ్మణుడు క్షత్రియుడిని నిందిస్తే యాభై, వైశ్యుడిని నిందిస్తే, పాతిక, శూద్రుడిని నిందిస్తే పన్నెండు చొప్పున ఆ బ్రాహ్మణుడికి దండన విధించాలి.

క్షత్రియస్యాప్నుయాద్వైశ్యస్సాహసం పూర్వమేవ తు ।
శూద్రః క్షత్రియమాక్రుశ్య జిహ్వాచ్ఛేదనమాప్నుయాత్ ॥25॥

క్షత్రియుడిని నిందించిన వైశ్యుడికి ప్రథమసాహసం దండన విధించాలి. క్షత్రియుడిని బాధపెట్టిన శూద్రుడికి నాలుక కోయాలి.

ధర్మోపదేశం విప్రాణాం శూద్రః కుర్వంశ్చ దణ్డభాక్ ।
శ్రుతదేశాది వితథీ దాప్యో ద్విగుణసాహసమ్ ॥26॥

బ్రాహ్మణులకు ధర్మాన్ని ఉపదేశించిన శూద్రుడిని దండించాలి. పాండిత్యాన్ని గురించి, దేశాన్ని గురించి, అబద్ధమాడినవాడిని దానికి రెట్టింపు (మధ్యమసాహసం) దండన విధించాలి.

ఉత్తమస్సాహసస్తస్య యః పాపైరుత్తమాన్ క్షిపేత్ ।
ప్రమాదాద్యైర్మయా ప్రోక్తం ప్రీత్యా దణ్డార్ధమర్హతి ॥27॥

ఉత్తములైన వ్యక్తులను పాపపు మాటలతో ఆక్షేపించినవాడికి ఉత్తమసాహసం దండనగా విధించాలి. ముందుగా నిందించినా తరువాత 'నేను పొరపాటు చేశాను' అన్నవాడికి (పశ్చాత్తపించినవాడికి) పైన చెప్పినదానిలో సగం దండన సరిపోతుంది

మాతరం పితరం జ్యేష్ఠం భ్రాతరం శ్వశురం గురుమ్ ।
ఆక్షారయఞ్ఛతం దణ్ద్యః పన్థానం చాదదద్గురోః ॥28॥

తల్లినీ, తండ్రినీ, అన్నగారినీ, మామగారినీ, నిందించినవాడికీ, పెద్దలకు దారి(గౌరవం) ఇవ్వని వాడికి వంద దండన విధించాలి.

అన్త్యజాతిర్ద్విజాతిస్తు యేనాఙ్గేనాపరాధ్నుయాత్ ।
తదేవ ఛేదయేత్తస్య క్షిప్రమేవావిచారయన్ ॥29॥

శూద్రుడు బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్యుల విషయంలో ఏ అవయవంతో అపరాధం చేస్తే ఏమాత్రం ఆలోచించకుండా వెంటనే ఆ అవయవాన్ని నరికివేయాలి.

అవనిష్ఠీవతో దర్పాద్ద్వావోష్ఠౌ ఛేదయేన్నృపః ।
అపమూత్రయతో మేఢ్రమపశబ్దయతో గుదమ్ ॥30॥

అహంకారంతో అయోగ్యంగా అంటే పెద్దలవిషయంలో అవమానకరంగా ఉమ్మివేసినవాడికి రెండు పెదవులూ నరికివేయాలి. అనుచితంగా అంటే పెద్దలను అవమానిస్తూ వారికి ఎదురుగా మూత్రించినవాడికి మూత్రావయవం కోసివేయాలి. అలాగే పెద్దలకు ఎదురుగా అపానవాయువు విడిచినవాడికి పృష్టం కోసివేయాలి.

ఉత్కృష్టాసనసంస్థస్య నీచస్యాధో నికృన్తనమ్ ।
యో యదఙ్గం చ రుజయేత్తదఙ్గం తస్య కర్తయేత్ ॥31॥

పెద్దలఎదుట వారికంటె ఎత్తయిన ఆసనంమీద కూర్చున్నవాడికి శరీరంలో క్రిందిభాగాన్ని నరకాలి. ఇతరుల ఏ అవయవాన్ని గాయపరిస్తే తప్పు చేసినవాడి ఆ అవయవాన్ని నరికివేయాలి.

అర్ధపాదకరాః కార్యా గోగజాశ్వోష్ట్రఘాతకాః ।
వృక్షం తు విఫలం కృత్వా సువర్ణం దణ్డమర్హతి ॥32॥

ఆవులకు, ఏనుగులకు, గుఱ్ఱాలకు, ఒంటెలకు హాని చేసినవారికి ఒక కాలు, చేయీ నరికివేయాలి. చెట్టుకు ఉన్నపండ్లు అన్నీ కోసుకుని చెట్టు ఖాళీ చేసినవారికి ఒక సువర్ణం దండంగా విధించాలి.

ద్విగుణం దాపయేచ్ఛిన్నే పథి సీమ్ని జలాశయే ॥33॥

పదిమంది నడిచే దారినీ, ఇళ్లు, పొలాలు మొదలయినవాటి హద్దులనూ, జనానికి ఉపయోగించే చెరువులనూ పాడుచేసినవారికి రెండుసువర్ణాలు దండన విధించాలి.

ద్రవ్యాణి యో హరేద్యస్య జ్ఞానతోఽజ్ఞానతోఽపి వా ।
స తస్యోత్పాద్య తుష్టిం తు రాజ్ఞే దద్యాత్తతో దమమ్ ॥34॥

తెలిసి కాని, తెలియక కాని ఇతరుల సంపదలను అపహరించినవాడు ముందుగా వారి సొమ్ము తిరిగి ఇచ్చి వారిని సంతోషపెట్టాలి. చేసిన తప్పుకు రాజుకు అపరాధశుల్కం కూడ చెల్లించాలి.

యస్తు రజ్జుం ఘటం కూపాద్ధరేచ్ఛిన్ద్యాచ్చ తాం ప్రపామ్ ।
స దణ్డం ప్రాప్నుయాన్మాసం దణ్డ్యస్స్యాత్ ప్రాణితాడనే ॥35॥

బావివద్దనుండి నీళ్లు తోడేతాడును, కుండను కాజేసినవాడికీ, చలివేంద్రం(పదిమందికీ మంచినీళ్లను ఇచ్చేది) పాడుచేసినవాడికీ ఒకనెల జైలుశిక్ష విధించాలి. జీవులను తన్నినా(హింసించినా) ఇదే శిక్ష.

ధాన్యం దశభ్యః కుమ్భేభ్యో హరతోఽభ్యధికం వధః,
శేషేఽప్యేకాదశగుణం తస్య దణ్డం ప్రకల్పయేత్. 36

పది కుంభాలకంటె (నాలుగుమానికలు ఒక కుంచం. నాలుగు కుంచాలు ఒకద్రోణం. ఇరవైద్రోణాలు ఒక కుంభం.) అధికమైన పరిమాణంలో ధాన్యం దొంగిలించినవాడికి ప్రాణాలు తీయడమే శిక్ష. అంతకంటె తక్కువ పరిమాణంలో దొంగిలించినవాడికి వాడు దొంగిలించినదానికి పదకొండురెట్లు తిరిగి ఇవ్వడం దండనగా విధించాలి.

సువర్ణరజతాదీనాం నృస్త్రీణాం హరణే వధః ॥37॥

బంగారం, వెండి, మొదలైనవాటిని, అలాగే పురుషుడిని గానీ, స్త్రీని గానీ అపహరించినవాడికి మరణశిక్ష విధించాలి.

యేన యేన యథాఙ్గేన స్తేనో నృషు విచేష్టతే ।
తత్తదేవ హరేదస్య ప్రత్యాదేశాయ పార్థివః ॥38॥

మనిషిశరీరంలో ఏ అవయవానికి హాని చేస్తాడో, ఆ దొంగ శరీరంలో ఆ అవయవాన్ని నరికివేయడమే శిక్షగా రాజు విధించాలి. అప్పుడే ఆ దొంగకు బుద్ధి వస్తుంది. (ఇక మళ్లీ జీవితంలో అటువంటిపని చేయలేడు)

బ్రాహ్మణశ్శాకధాన్యాది హ్యల్పం గృహ్ణన్న దోషభాక్ ।
గోదేవార్థం హరంశ్చాపి హన్యాద్దుష్టం వధోద్యతమ్ ॥39॥

కూరలు, ధాన్యం మొదలైనవి స్వల్పంగా స్వీకరిస్తే బ్రాహ్మణుడికి తప్పు లేదు. ఆవులకోసం గాని, లేదా దేవతలకోసం గాని బ్రాహ్మణుడు ఏదయినా అపహరిస్తే అందులో తప్పు లేదు. చంపడానికి పూనుకున్న దుర్మార్గుడిని సంహరించాలి.

గృహక్షేత్రాపహర్తారం తథా పత్న్యభిగామినమ్ ।
అగ్నిదం గరదం హన్యాత్తథా చాభ్యుద్యతాయుధమ్ ॥
రాజా గవాభిచారేభ్యో హన్యాచ్చైవాతతాయినః ॥40॥

1. ఇళ్లు, పొలాలు అపహరించినవాడినీ, 2. ఇతరులభార్యను పొందినవాడినీ, 3. ఇంటికి నిప్పు పెట్టినవాడినీ, 4. విషమిచ్చినవాడినీ, 5. చంపడానికి ఆయుధమెత్తినవాడినీ 6. ఇతరులసంపదలు అపహరించినవారు – ఈ ఆరుగురిని ఆతతాయులు అంటారు. వీరిని చంపివేయాలి. ఆవును (సాధువులను) హింసించినవారినీ, చంపడానికి పూనుకున్నవారినీ చంపివేయాలి.

పరస్త్రియం న భాషేత ప్రతిషిద్ధో విశేన్న హి ॥41॥

ఇతరస్త్రీలతో మాట్లాడగూడదు. రావద్దని నిషేధించినచోట్లకు వెళ్లగూడదు. (అలా చేసినవారు శిక్షార్హులు అవుతారు)

అదణ్డ్యా స్త్రీ భవేద్రాజ్ఞా వరయన్తీ పతిం స్వయమ్ ।
ఉత్తమాం సేవమానః స్త్రీం జఘన్యో వధమర్హతి ॥42॥

భర్తను తనయిష్టంప్రకారం (తనకంటె తక్కువజాతిపురుషుడినయినా, ఎక్కువజాతిపురుషుడినయినా) వరించిన స్త్రీని రాజు శిక్షించగూడదు. ఎక్కువజాతిలో పుట్టిన స్త్రీని పొందిన తక్కువజాతి పురుషుడికి మాత్రం మరణశిక్ష విధించాలి.

భర్తారం లఙ్ఘయేద్యా తాం శ్వభిస్సఙ్ఘాతయేత్ స్త్రియమ్ ।
సవర్ణదూషితాం కుర్యాత్ పిణ్డమాత్రోపజీవినీమ్ ॥
జ్యాయసా దూషితా నారీ ముణ్డనం సమవాప్నుయాత్ ॥43॥

భర్తను కాదని, ఇతరపురుషుడిని పొందిన స్త్రీని కుక్కలతో కరిపించాలి. తనకులంవాడిని పొంది తప్పు చేసిన స్త్రీకి బ్రతికి ఉండడానికి అవసరమైన ఆహారం మాత్రం ఇవ్వాలి. భర్త అన్నతో సంబంధం పెట్టుకున్న స్త్రీకి గుండు చేయించాలి.

వైశ్యాగమే తు విప్రస్య క్షత్రియస్యాన్త్యజాగమే ।
క్షత్రియః ప్రథమం వైశ్యో దణ్డ్యశ్శూద్రాగమే భవేత్ ॥44॥

వైశ్యస్త్రీని పొందిన బ్రాహ్మణుడికి, క్షత్రియుడికీ అదే శిక్ష విధించాలి. శూద్రస్త్రీని పొందిన క్షత్రియుడికి ప్రథమసాహసం దండనగా విధించాలి. శూద్రస్త్రీని పొందిన వైశ్యుడికీ అదే (ప్రథమసాహసం) దండనగా విధించాలి.

గృహీత్వా వేతనం వేశ్యా లోభాదన్యత్ర గచ్ఛతి ।
వేతనం ద్విగుణం దద్యాద్దణ్డం చ ద్విగుణం తథా ॥45॥

ఒకడివద్ద డబ్బు తీసుకుని మరొకడిదగ్గరకు వెళ్లిన వేశ్య, తాను తీసుకున్నధనానికి రెట్టింపుధనం (అతడికి) చెల్లించి, ఆ తరువాత అదే రెట్టింపుసొమ్ము జరిమానాగా (రాజుకు) చెల్లించాలి.

భార్యా పుత్రాశ్చ దాసాశ్చ శిష్యో భ్రాతా చ సోదరః ।
కృతాపరాధాస్తాడ్యా స్యు రజ్జ్వా వేణుదలేన వా ॥
పృష్ఠే న మస్తకే హన్యాచ్చౌరస్యాప్నోతి కిల్బిషమ్ ॥ 46॥

పెండ్లాము, కొడుకులు, పనివాళ్లు, శిష్యుడు, తోడబుట్టినవాడు తప్పు చేస్తే తాడుతో గాని, వెదురుబెత్తంతో కాని వీపుమీద కొట్టాలి. తలపై కొట్టగూడదు. అలా తలపై కొట్టినవాడికి దొంగతనం చేసినంతటి దోషం కలుగుతుంది. (వాడిని దొంగతో సమానంగా శిక్షించాలి.)

రక్షార్థాధికృతైర్యస్తు ప్రజాభ్యోఽర్థో విలుప్యతే ।
తేషాం సర్వస్వమాదాయ రాజా కుర్యాత్ ప్రవాసనమ్ ॥47॥

ప్రజలను రక్షించడంకోసం నియమింపబడిన అధికారులు, వారిని రక్షించకుండా, ప్రజలధనాన్ని తామే కాజేసినట్లయితే, రాజు ఆ అధికారుల ఆస్తులన్నీ స్వాధీనం చేసుకుని, వారిని రాజ్యంనుండి వెళ్లగొట్టాలి.

యే నియుక్తాస్స్వకార్యేషు హన్యుః కార్యాణి కర్మిణామ్ ।
నిర్ఘృణాః క్రూరమనసస్తాన్నిస్స్వాన్ కారయేన్నృపః ॥48॥

పని చేయడంకోసం నియమింపబడినవాళ్లు తమను నియోగించిన యజమానులపనులను పాడుచేస్తే, వారు దయలేనివారు, క్రూరబుద్ధి కలిగినవారు. అటువంటివారి సంపద మొత్తం రాజు స్వాధీనం చేసుకోవాలి.

అమాత్యః ప్రాడ్వివాకో వా యః కుర్యాత్ కార్యమన్యథా ।
తస్య సర్వస్వమాదాయ తం రాజా విప్రవాసయేత్ ॥49॥

మంత్రి గానీ, న్యాయాధిపతి గానీ తమ ధర్మానికి విరుద్ధంగా పని చేస్తే రాజు వారి సంపదలు సమస్తమూ స్వాధీనపరచుకుని వారిని రాజ్యంనుండి వెళ్లగొట్టాలి.

గురుతల్పే భగః కార్యస్సురాపానే సురాధ్వజః ।
స్తేయేషు శ్వపదం విద్యాద్ బ్రహ్మహత్యా శిరః పుమాన్ ॥50॥

గురువుగారి భార్యను పొందినవాడి ముఖం మీద భగం బొమ్మను వాత పెట్టాలి. కల్లు త్రాగేవాడి ముఖంమీద కల్లుగుర్తు వాతపెట్టాలి. దొంగతనం చేసినవారి శరీరంమీద కుక్కకాలిబొమ్మ వాత వేయాలి. బ్రాహ్మణుడిని చంపినవాడి శరీరం మీద శిరస్సుబొమ్మ వాత వేయాలి.

శూద్రాదీన్ ఘాతయేద్ రాజా పాపాన్ విప్రాన్ ప్రవాసయేత్ ।
మహాపాతకినాం విత్తం వరుణాయోపపాదయేత్ ॥51॥

మరణశిక్షకు తగినపాపం చేసిన శూద్రులు మొదలయినవారిని రాజు సంహరించాలి. బ్రాహ్మణులను రాజ్యంనుండి వెళ్లగొట్టాలి. దారుణమైన పాపాలు చేసినవారి సొమ్ము వరుణుడికి సమర్పించాలి (నీటిపాలు చేయాలి).

గ్రామేష్వపి చ యే కేచిచ్చౌరాణాం భక్తదాయకాః ।
భాణ్డారకోశదాశ్చైవ సర్వాంస్తానపి ఘాతయేత్ ॥52॥

దొంగలకు అన్నం పెట్టి, దొంగిలించినసొమ్ము దాచడానికి రహస్యప్రదేశం ఇచ్చి ఆదరించిన గ్రామాలలోని ప్రజలను కూడా అందరినీ చంపివేయాలి.

రాష్ట్రేషు రాష్ట్రాధికృతాన్ సామన్తాన్ పాపినో హరేత్ ॥53॥

రాజు తనసామ్రాజ్యంలో ఆయా చిన్నరాజ్యాలకు అధిపతులుగా ఉండి, తనకు కప్పం చెల్లిస్తూ ఉండే సామంతులు తప్పు చేస్తే వారిని సంహరించాలి.

సన్ధిం కృత్వా తు యే చౌర్యం రాత్రౌ కుర్వన్తి తస్కరాః ।
తేషాం ఛిత్త్వా నృపో హస్తౌ తీక్ష్ణే శూలే నివేశయేత్ ॥54॥

రాత్రిపూట ఇంటికి కన్నంవేసి, దొంగతనం చేసిన పెద్దదొంగలకు చేతులు నరికివేయాలి. తరువాత వారిని పదునయిన శూలం మీద దిగవేయాలి.

తటాకదేవతాగార భేదకాన్ ఘాతయేన్నృపః ॥55 ॥

ప్రజలు నిత్యం ఉపయోగించే చెరువులు, దేవాలయాలు (మొదలయినవాటిని) నాశనం చేసినవారిని రాజు సంహరించాలి.

సముత్సృజేద్రాజమార్గే య స్త్వమేధ్యమనాపది ।
స హి కార్షాపణం దణ్డ్య స్తమమేధ్యం చ శోధయేత్ ॥56 ॥

అనారోగ్యం మొదలయిన ఆపదలలో కదలలేని స్థితిలో లేకపోయి కూడా అంటే బుద్ధిపూర్వకంగా రాజవీధిలో మలమూత్రాదులను విసర్జించినవాడికి ఒక కార్షాపణం అపరాధశుల్కంతో దండించాలి. వాడిచేతనే ఆ మలమూత్రాదులను తీయించి ఆప్రదేశం శుభ్రం చేయించాలి.

ప్రతిమాసఙ్క్రమభిదో దద్యుః పఞ్చశతాని తే ।
సమైశ్చ విషమం యో వా చరతే మూల్యతోఽపి వా ॥
సమాప్నుయాన్నరః పూర్వం దమం మధ్యమమేవ వా ॥57॥

విగ్రహాలనూ, మెట్లనూ పగలగొట్టినవాడికి ఐదువందల కార్షాపణాలను దండన విధించాలి. తనతో సాధువుగా ప్రవర్తించేవాళ్లతో అసాధువుగా ప్రవర్తించినవాడికి, వస్తువులమూల్యాలను అధికంగా పెంచి, అనుచితంగా వ్యాపారం చేసేవాడికీ మధ్యమసాహసం దండనగా విధించాలి.

ద్రవ్యమాదాయ వణిజామనర్ఘేణావరున్ధతామ్ ।
రాజా పృథక్ పృథక్ కుర్యాద్దణ్డముత్తమసాహసమ్ ॥58॥

వ్యాపారినుండి చాల విలువయిన వస్తువులను తీసుకుని వాటివిలువను చెల్లించకుండా బిగబట్టినవారి కందరికీ ఎవరికి వారికి ప్రత్యేకంగా రాజు ఉత్తమసాహసం దండనగా విధించాలి.

ద్రవ్యాణాం దూషకో యశ్చ ప్రతిచ్ఛన్దక విక్రయీ ।
మధ్యమం ప్రాప్నుయాద్దణ్డం కూటకర్తా తథోత్తమమ్ ॥59॥

నాణ్యమైన వస్తువులలో చెడ్డవాటిని చేర్చి కల్తీగా అమ్మేవాడికి, అసలు మూల్యాన్ని దాచి అధికధరకు అమ్మేవాడికి మధ్యమసాహసం దండనగా విధించాలి. ఇంకా రకరకాలుగా మోసం చేసినవాడికి ఉత్తమసాహసం దండన.

కలహాపకృతం దేయం దణ్డశ్చ ద్విగుణస్తతః ।
అభక్ష్యభక్ష్యే విప్రే వా శూద్రే వా కృష్ణలో దమః ॥60॥

పోట్లాడి మరీ పైవిధంగా అపకారం చేసేవాడికి పైదండన రెండురెట్లు అధికంగా విధించాలి. తినగూడని పదార్థాన్ని తింటే బ్రాహ్మణుడికయినా, శూద్రుడికయినా ఒక కృష్ణలం దండనగా విధించాలి.

తులాశాసనకర్తా చ కూటకృన్నాశకస్య చ ।
ఏభిశ్చ వ్యవహర్తా యస్స దాప్యో దమముత్తమమ్ ॥61॥

తన ఇష్టం ప్రకారం తప్పుడుతూకం తూచేవాడికీ, ఇతరవిధాలుగా మోసం చేసేవాడికీ, వారితో కలిసి పనిచేసేవాడికీ ఉత్తమసాహసం దండన విధించాలి.

విషాగ్నిదాం పతిగురువిప్రాపత్యప్రమాపిణీమ్ ।
వికర్ణకరనాసోష్ఠీం కృత్వా గోభిః ప్రవాసయేత్ ॥62॥

విషం పెట్టేదానినీ, ఇల్లు తగులబెట్టేదానినీ, యజమానిసంతానాన్నీ, గురువుసంతానాన్నీ, బ్రాహ్మణుడి సంతానాన్నీ చంపినదానినీ చెవులు, చేతులూ, ముక్కు, నరికి ఎద్దుమీద ఊరేగిస్తూ ఊరినుండి వెళ్లగొట్టాలి.

క్షేత్రవేశ్మగ్రామవనవిదారకాస్తథా నరాః ।
రాజపత్న్యభిగామీ చ దగ్ధవ్యాస్తు కటాగ్నినా ॥63॥

పొలం, ఇల్లు, ఊరు, అడవి వీటిని నాశనం చేసిన మానవులను, రాజుగారి భార్యను పొందినవాడినీ ఎండుగడ్డిమంటలో కాల్చేయాలి.

ఊనం వాప్యధికం వాపి లిఖేద్ యో రాజశాసనమ్ ।
పారజాయికచౌరౌ చ ముఞ్చతో దణ్డ ఉత్తమః ॥64॥

రాజాజ్ఞను తగ్గించి కాని లేదా పెంచి కానీ వ్రాసినవాడిని ఉత్తమసాహసంతో దండించాలి. ఇతరుల భార్యలను పొందినవాడికి, దొంగతనం చేసినవాడికి, శిక్షనుండి తప్పించి పంపినవాడికి కూడ ఉత్తమసాహసం దండన.

రాజయానాసనారోధుర్దణ్డ ఉత్తమసాహసః ॥65॥

రాజుగారి వాహనంమీద గాని, ఆసనం మీద కూర్చున్నవాడికి ఉత్తమసాహసం దండనగా విధించాలి.

యో మన్యేతాజితోఽస్మీతి న్యాయేనాపి పరాజితః ।
తమాయాన్తం పరాజిత్య దణ్డయే ద్విగుణం దమమ్ ॥66॥

న్యాయంగా ఓడిపోయినప్పటికీ తానే జయించానని భావించేవాడు ఎదుటికి వచ్చినపుడు వాడిని తిరిగి ఓడించి, రెట్టింపు దండన విధించాలి.

ఆహ్వానకారీ వధ్యస్స్యాదనాహూతమథాహ్వాయన్ ।
దణ్డికస్య చ యో హస్తాదభిముక్తః పలాయతే ॥
హీనః పురుషకారేణ తం దణ్యాద్దణ్డికో ధనమ్ ॥67॥

రాజు ఆహ్వానించనివాడిని తానై ఆహ్వానించినవాడికి మరణమే శిక్ష. శిక్షించవలసిన అధికారిహస్తాలనుండి విడిపించుకుని పారిపోయినవాడు పురుషకారి కాడు. శిక్షించవలసినవాడు అతడిని ధనంతో శిక్షించాలి.

ఇత్యాది మహాపురాణే ఆగ్నేయే దణ్డప్రణయనకథనం నామ సప్తవింశత్యధికద్విశతతమోఽధ్యాయః ॥227॥

అగ్నిమహాపురాణంలో శిక్షలను గూర్చి చెప్పుట అనే రెండువందల ఇరవైఏడవ అధ్యాయం సమాప్తం.



అష్టావింశత్యధికద్విశతతమోऽధ్యాయః - రెండువందల ఇరవైఎనిమిదవ అధ్యాయం

యుద్ధయాత్రావర్ణనమ్ - యుద్ధము చేయుటకు వెళ్ళుటను వర్ణించుట

పుష్కర ఉవాచ - పరశురాముడితో పుష్కరుడు ఈవిధంగా చెప్తున్నాడు.

యదా మన్యేత నృపతిరాక్రన్దేన బలీయసా ।
పార్ష్ణిగ్రాహోऽభిభూతో మే తదా యాత్రాం ప్రయోజయేత్ ॥1॥

రాజ్యానికి వెనుకదిక్కులో మొట్టమొదట ఉండేరాజు పార్ష్ణిగ్రాహుడు. అతడివెనుక రాజ్యానికి అధిపతి ఆక్రందుడు. బలవంతుడైన ఆక్రందుడు పార్ష్ణిగ్రాహుడిని జయించాడు అని తెలుసుకున్నరాజు అతడితో యుద్ధయాత్రకు సిద్ధపడాలి.

పుష్టా యోధా భృతా భృత్యాః ప్రభూతం చ బలం మమ ।
మూలరక్షాసమర్థోऽస్మి తైర్వృత్వా శిబిరే వ్రజేత్ ॥2॥

నా యోధులు బలంగా ఉన్నారు. సేవకులను చక్కగా పోషించాను. నా వద్ద సైన్యం అత్యధికంగా వృద్ధిచెంది ఉన్నది. మూలబలాన్ని రక్షించుకోగలిగిన సామర్థ్యం నాకు చక్కగా ఉన్నది అని రాజు ముందుగా నిర్ధారణ చేసుకుని, తనసైన్యంతో యుద్ధశిబిరంలో ప్రవేశించాలి.

శత్రోర్వా వ్యసనే యాయాద్దైవాద్యైః పీడితం పరమ్ ।
భూకమ్పో యాం దిశాం యాతి యాం చ కేతు ర్వ్యదూషయత్ ॥3॥

శత్రువు బాగా కష్టాలలో ఉన్నపుడు, దైవంవలన, గ్రహాదులవలన కలిగినపీడలతో బాధలు పడుతున్నపుడు, శత్రురాజ్యంలో ఏ ప్రాంతంలో భూకంపం వచ్చిందో, కేతుగ్రహం ఏ దిక్కులో రాజ్యాన్ని పీడిస్తున్నదో ఆ వైపునుండి శత్రురాజ్యంపై యుద్ధానికి పూనుకోవాలి.

విద్విష్టనాశకం సైన్యం సమ్భూతాన్తఃప్రకోపనమ్ ।
శరీరస్ఫురణే ధన్యే తథా సుస్వప్నదర్శనే ॥
నిమిత్తే శకునే ధన్యే జాతే శత్రుపురం వ్రజేత్ ॥4॥

తనసైన్యం శత్రువులను నాశనం చేయాలనే ఉత్సాహంతో ఉన్నపుడు, శత్రువులపై వారందరూ చాల కోపంతో ఉన్నపుడు, తనశరీరంలో విజయాన్ని సూచించే శుభశకునాలు కనబడినపుడు, శుభప్రదమయిన మంచికలలు వస్తున్నపుడు, వెలుపల కూడ మంచిశకునాలు కనబడినపుడు, శత్రునగరంమీదికి దండయాత్ర చేయాలి.

పదాతినాగబహులాం సేనాం ప్రావృషి యోజయేత్ ।
హేమన్తే శిశిరే చైవ రథవాజిసమాకులామ్ ॥5॥

వర్షఋతువులో యుద్ధం చేయవలసివచ్చినపుడు యుద్ధంలో బంటులను, ఏనుగులను అధికసంఖ్యలో శత్రువులపై ప్రయోగించాలి. హేమంతఋతువు గాని, శిశిరఋతువు గాని అయితే అప్పటియుద్ధంలో రథాలను, గుఱ్ఱాలను దండిగా ప్రయోగించాలి.

చతురఙ్గబలోపేతాం వసన్తే వా శరన్ముఖే ।
సేనాపదాతిబహులా శత్రుఞ్జయతి సర్వదా ॥6॥

వసంతఋతువులో గాని, శరదృతువులో కాని వచ్చినయుద్ధంలో రథ, గజ, తురగ, పదాతి బలాలు నాలుగింటిని ప్రయోగించాలి. కాల్బలం అత్యధికంగా ఉన్నసైన్యమే అన్నికాలాలలోనూ శత్రువులను జయిస్తుంది.

అఙ్గదక్షిణభాగే తు శస్తం ప్రస్ఫురణం భవేత్ ।
న శస్తం తు తథా వామే పృష్ఠస్య హృదయస్య చ ॥7॥

శరీరంలో కుడివైపున ఉన్న అవయవాలు అదరడం మంచిది. దానివలన శుభం జరుగుతుంది. ఎడమవైపు గాని, వెనకవైపు గాని, హృదయం కాని అదరడం దుశ్శకునం. అది అశుభాన్ని సూచిస్తుంది.

లాఞ్ఛనం పిటకం చైవ విజ్ఞేయం స్ఫురణం తథా ।
విపర్యయేణాభిహితం సవ్యే స్త్రీణాం శుభం భవేత్ ॥8॥

శరీరం మీద సహజంగా కనిపించే ఇటువంటిచిహ్నాలు, బొబ్బలు (మొదలైనవి) జరగబోయే మంచిచెడులను సూచిస్తుంటాయి. పురుషులకు విరుద్ధంగా ఈ లక్షణాలు స్త్రీలలో ఎడమవైపు కలిగితే శుభప్రదాలు అవుతాయి. కుడివైపు అయితే ఇవి స్త్రీలకు అశుభాన్ని సూచిస్తాయి.

ఇత్యాది మహాపురాణే ఆగ్నేయే యుద్ధయాత్రావర్ణనం నామాష్టావింశత్యధికద్విశతతమోఽధ్యాయః ॥228॥

అగ్నిమహాపురాణంలో యుద్ధము చేయుటకు వెళ్ళుటను వర్ణించుట అనే
రెండువందల ఇరవైఎనిమిదవ అధ్యాయం సమాప్తం.



ఏకోనవింశత్యధికద్విశతతమోஉధ్యాయః - రెండువందల ఇరవైతొమ్మిదవ అధ్యాయం

స్వప్నశుభాశుభదుస్స్వప్నహరణకథనమ్

స్వప్నమందలి వివిధములైన కలలను గురించి వర్ణించుట

పుష్కర ఉవాచ - పరశురామునితో పుష్కరుడు ఈవిధంగా చెప్తున్నాడు.

స్వప్నం శుభాశుభం వక్ష్యే దుస్స్వప్నహరణం తథా ।
నాభిం వినాన్యత్ర గాత్రే తృణవృక్షసముద్భవః ॥1॥

చూర్ణనం మూర్ధ్ని కాంస్యానాం ముణ్డనం నగ్నతా తథా ।
మలినామ్బరధారిత్వమభ్యఙ్గః పఙ్కదిగ్ధతా ॥2॥

ఉచ్చాత్ ప్రపతనం చైవ వివాహో గీతమేవ చ ।
తన్త్రీవాద్యవినోదశ్చ దోలారోహణమేవ చ ॥3॥

అర్జనం పద్మలోహానాం సర్పాణామథ మారణమ్ ।
రక్తపుష్పద్రుమాణాం చ చణ్డాలస్య తథైవ చ ॥4॥

వరాహ శ్వ ఖరోష్ట్రాణాం తథా చారోహణక్రియా ।
భక్షణం పక్షిమాంసానాం తైలస్య కృశరస్య చ ॥5॥

మాతుః ప్రవేశో జఠరే చితారోహణమేవ చ ।
శక్రధ్వజాభిపతనం పతనం శశిసూర్యయోః ॥6॥

దివ్యాన్తరిక్షభౌమానాముత్పాతానాం చ దర్శనమ్ ।
దేవద్విజాతిభూపానాం గురూణాం కోప ఏవ చ ॥7॥

నర్తనం హసనం చైవ వివాహో గీత మేవ చ ।
తన్త్రీవాద్యవిహీనానాం వాద్యానామపి వాదనమ్ ॥8॥

స్రోతోవహాధోగమనం స్నానం గోమయవారిణా ।
పఙ్కోదకేన చ తథా మషీతోయేన వాప్యథ ॥9॥

ఆలిఙ్గనం కుమారీణాం పురుషాణాం చ మైథునమ్ ।
హానిశ్చైవ స్వగాత్రాణాం విరేకో వమనక్రియా ॥10॥

దక్షిణాశా ప్రగమనం వ్యాధినాభిభవస్తథా ।
ఫలానాముపహానిశ్చ ధాతూనాం భేదనం తథా ॥11॥

గృహాణాం చైవ పతనం గృహసమ్మార్జనం తథా ।
క్రీడా పిశాచ క్రవ్యాద వానరాన్త్యనరైరపి ॥12॥

పరాదభిభవశ్చైవ తస్మాచ్చ వ్యసనోద్భవః ।
కాషాయవస్త్రధారిత్వం తద్వస్త్రైః క్రీడనం తథా ॥13॥

స్నేహపానావగాహీ చ రక్తమాల్యానులేపనమ్ ।
ఇత్యధన్యాని స్వప్నాని తేషా మకథనం శుభమ్ ॥14॥

మంచికలలు, చెడుకలలను గురించి చెప్తాను. చెడుకలలు ఇచ్చే దుష్టమైన ఫలితాలను నివారించుకునే విధానం కూడా చెప్తాను. బొడ్డుదగ్గర తప్ప శరీరంలో ఇతరప్రదేశాలలో గడ్డి, చెట్లు, మొలవడం, తలపై ఉన్నకంచుపాత్రలు పగిలి ముక్కలైపోవడం, తల గుండుగా ఉండటం, ఒంటిపై గుడ్డలు లేకుండా ఉండటం, మట్టికొట్టుకున్న బట్టలు కట్టుకునిఉండటం, ఒంటినిండా నూనె పూసుకుని ఉండటం, బురద పూసుకుని ఉండటం, పైనుండి క్రిందికి పడిపోవడం, పెండ్లి జరుగుతుండడం, పాటలు పాడుతుండడం, వీణ మొదలైన వాద్యాలు వాయిస్తుండడం, ఉయ్యాల ఊగడం, తామరపూలనూ వివిధలోహాలనూ సంపాదించడం, పాములను చంపడం, ఎఱ్ఱని పూలతో నిండిన చెట్లు, చండాలుడు, పంది, గుఱ్ఱం, గాడిద, ఒంటె ఈ జంతువులను ఎక్కి కూర్చోవడం, పక్షుల మాంసం తినడం, నూనె త్రాగడం, నువ్వులు బియ్యం కలిపి వండినఅన్నం తినడం, తల్లిగర్భంలో ప్రవేశించినట్లు, చితిని ఎక్కికూర్చున్నట్లు, ఇంద్రధనుస్సు, సూర్యుడు, చంద్రుడు నేలపై పడుతున్నట్లు, దేవలోకానికీ, అంతరిక్షానికీ, భూలోకానికీ సంబంధించిన ఉత్పాతాలను చూడడం, దేవతలకూ, బ్రాహ్మణులకూ, రాజుకూ, గురువులకూ కోపం రావడం, నాట్యం, నవ్వు, పెండ్లి, పాట(3శ్లో), వీణ తప్ప మిగిలినవాద్యాలను వాయించడం, నీటిప్రవాహంలో క్రిందికి జారిపోతుండడం, ఆవుపేడ కలిపిననీళ్లలో స్నానం చేయడం, బురదనీళ్లలో స్నానం చేయడం, సిరా కలిపిననీళ్లలో స్నానం చేయడం, చిన్నవయసులో ఉన్నకన్యలను కౌగిలించుకోవడం, కేవలం పురుషులు మిథునకర్మ చేసుకోవడం, తన అవయవాలకు కీడు కలగడం, విరేచనం కావడం, వాంతిచేసుకోవడం, (యముడు పాలించే) దక్షిణం దిక్కుగా ప్రయాణిస్తుండడం, రోగంతో బాధపడుతుండడం, చేసిన కర్మలకు రావలసినఫలితం నష్టమైపోవడం, బంగారం వెండి మొదలైన లోహాలు పగిలిపోవడం, ఇల్లు కూలిపోవడం, ఇల్లు తుడవడం, కడగడం మొదలైనవి, పిశాచాలతోనూ, రాక్షసులతోనూ, కోతులతోనూ, చండాలురతోనూ కలిసి ఆడడం, శత్రువులచేతిలో అవమానపడడం, శత్రువులవలన కష్టాలు పడడం, కాషాయవస్త్రాలు ధరించడం, కాషాయవస్త్రాలతో ఆడుకోవడం, నూనె త్రాగడం, నూనెలో స్నానం చేయడం, ఎఱ్ఱపూలదండలు ధరించడం, ఒంటికి ఎఱ్ఱనిపూతలు పూసుకోవడం, ఇవి కలలో కనబడితే అవి చెడుకలలు. (ఇటువంటి కలలవలన చెడుఫలితాలు వస్తాయి). ఈ చెడ్డకలలను ఇతరులకు చెప్పకుండా ఉండడం మంచిది.

భూయశ్చ స్వపనం తద్వత్ కార్యం స్నానం ద్విజార్చనమ్ ।
తిలైర్హోమో హరిబ్రహ్మశివార్కగణపూజనమ్ ॥
తథా స్తుతిప్రపఠనం పుంసూక్తాది జపస్తథా ॥15॥

చెడుకలలు వచ్చిన తరువాత మెలకువ వస్తే తిరిగి నిద్ర పోవాలి. లేదా స్నానం చేయాలి. బ్రాహ్మణులను పూజించాలి. నువ్వులతో హోమం చేయాలి. విష్ణువు, బ్రహ్మ, శివుడు, సూర్యుడు, అనే దేవగణాన్ని పూజించాలి. దేవతాస్తోత్రాలను పఠించాలి. పురుషసూక్తం మొదలయినవాటిని జపించాలి.

స్వప్నాస్తు ప్రథమే యామే సంవత్సరవిపాకినః ।
షడ్భిర్మాసైర్ద్వితీయే తు త్రిభిర్మాసైస్త్రియామికాః ॥
చతుర్థే త్వర్ధమాసేన దశాహాదరుణోదయే ॥16॥

రాత్రి మొదటిజాములో వచ్చినకలలు ఒకసంవత్సరంలోగా ఫలితాన్ని ఇస్తాయి. రాత్రి రెండవజాములో వచ్చిన కలలు ఆరునెలల్లో ఫలిస్తాయి. రాత్రి మూడవయామంలో కన్నకలలు మూడునెలల్లో ఫలితం ఇస్తాయి. రాత్రి నాలుగవజాములో వచ్చినకలలు పక్షంరోజులలో ఫలితం ఇస్తాయి.

ఏకస్యా మథ చేద్రాత్రౌ శుభం వా యది వాఽశుభమ్ ।
పశ్చాద్దృష్టస్తు యస్తత్ర తస్య పాకం వినిర్దిశేత్ ॥
తస్మాత్తు శోభనే స్వప్నే పశ్చాత్ స్వాపో న శస్యతే ॥17॥

ఒకేరాత్రి మంచికలలు కాని, చెడ్డకలలు కానీ ఒకటికంటె ఎక్కువ వస్తే, వాటిలో తరువాత (చివర) కన్నకల మాత్రమే ఫలిస్తుంది. అందుచేత శుభస్వప్నం వచ్చిన తరువాత మళ్లీ నిద్రపోవడం మంచిది కాదు.

శైలప్రాసాదనాగాశ్వవృషభారోహణం హితమ్ ।
ద్రుమాణాం శ్వేతపుష్పాణాం గగనే చ తథా ద్విజ ॥18॥

పరశురామా! (ఇక శుభస్వప్నాలు చెప్తాను.) కొండ, ఎత్తయినభవనం, ఏనుగు, గుఱ్ఱం, ఎద్దు వీటిని ఎక్కినట్లుగా వచ్చినకల శుభం కలిగిస్తుంది. ఆకాశంలో తెల్లనిపూలతో నిండినచెట్లు కనబడడం కూడ మంచికల.

ద్రుమే తృణోద్భవో నాభౌ తథా చ బహుబాహుతా ।
తథా చ బహుశీర్షత్వం పలితోద్భవ ఏవ చ ॥19॥

సుశుక్లమాల్యధారిత్వం సుశుక్లామ్బరధారితా ।
చన్ద్రార్కతారాగ్రహణం పరిమార్జనమేవ చ ॥20॥

శక్రధ్వజాలిఙ్గనం చ ధ్వజోచ్ఛ్రాయక్రియా తథా ।
భూమ్యమ్బుధారాగ్రహణం శత్రూణాం చైవ విక్రియా ॥21॥

జయో వివాదే ద్యూతే చ సఙ్గ్రామే చ తథా ద్విజ ।
భక్షణం చార్ద్రమాంసానాం పాయసస్య చ భక్షణమ్ ॥22॥

దర్శనం రుధిరస్యాపి స్నానం వా రుధిరేణ చ
సురారుధిరమద్యానాం పానం క్షీరస్య వాప్యథ ॥23॥

అస్త్రై ర్విచేష్టనం భూమౌ నిర్మలం గగనం తథా ।
ముఖేన దోహనం శస్తం మహిషీణాం తథా గవామ్ ॥
సింహీనాం హస్తినీనాం చ బడవానాం తథైవ చ ॥24॥

తనబొడ్డునుండి చెట్టు, దానినుండి గడ్డి మొలవడం, తనకు చాలా చేతులు, చాలా తలలు ఉండడం, తలవెంట్రుకలు నెరియడం, మిక్కిలి తెల్లని పూలమాలలను, వస్త్రాలను ధరించడం, చంద్రుడిని, సూర్యుడిని, నక్షత్రాలను పట్టుకోవడం, వాటిని శుభ్రం చేయడం, ఇంద్రధనుస్సును కౌగిలించుకోవడం, జెండాకఱ్ఱను పైకి ఎత్తడం, భూమిపై పడుతున్న వర్షధారలను పట్టుకోవడం, శత్రువును కష్టాలపాలు జేయడం, బ్రాహ్మణోత్తమా! పరశురామా! తగవులాటలోనూ, జూదంలోనూ, యుద్ధంలోనూ తాను గెలవడం, తడి ఆరని మాంసం తినడం, పాయసం తినడం, రక్తం చూడడం, రక్తంలో స్నానం చేయడం, కల్లు, రక్తం, మద్యం, పాలు తాగడం, ఆయుధం దెబ్బలచేత చేష్టలుడిగి నేలపై పడి ఉండటం, ఆకాశం స్వచ్ఛంగా ఉండడం, గేదెలు, ఆవులు, ఆడు సింహాలు, ఆడు ఏనుగులు, ఆడు గుఱ్ఱం, ఈ జంతువుల పాలను నోటితో తాగడం ఇవి కలలో కనిపిస్తే అవి శుభస్వప్నాలు.

ప్రసాదో దేవ విప్రేభ్యో గురుభ్యశ్చ తథా ద్విజ ।
అమ్భసా చాభిషేకస్తు గవాం శృఙ్గచ్యుతేన చ ॥
చన్ద్రాద్ భ్రష్టేన వా రామ జ్ఞేయం రాజ్యప్రదం హి తత్ ॥25॥

బ్రాహ్మణోత్తమా! పరశురామా! దేవతలప్రసాదం, బ్రాహ్మణులప్రసాదం, గురువులప్రసాదం, ఆవుకొమ్ము నుండి, చంద్రుడినుండి జారిన నీటితో అభిషేకం జరగడం కనిపించిన కలలు రాజ్యాధికారాన్ని ఇస్తాయి.

రాజ్యాభిషేకశ్చ తథా ఛేదనం శిరసోఽ పృథ ।
మరణం వహ్నిలాభశ్చ వహ్నిదాహో గృహాదిషు ॥
లబ్ధిశ్చ రాజలిఙ్గానాం తన్త్రీవాద్యాభివాదనమ్ ॥26॥

తనకు రాజ్యాభిషేకం జరగడం, తనతల నరకడం, తాను మరణించడం, అగ్నిలో పడిపోవడం, ఇళ్లు మొదలయినవి తగులబడిపోతున్నపుడు అందులో ఉండి కాలిపోవడం, రాజలాంఛనాలు లభించడం, వీణ మొదలయినవి వాయించడం, కనబడినవి మంచికలలు.

యస్తు పశ్యతి స్వప్నాన్తే రాజానం కుఞ్జరం హయమ్ ।
హిరణ్యం వృషభం గాం చ కుటుమ్బస్తస్య వర్ధతే ॥27॥

కలచివరలో రాజు, ఏనుగు, గుఱ్ఱం, బంగారం, ఎద్దు, ఆవు కనబడితే, కుటుంబం వృద్ధి చెందుతుంది.

వృషేభగృహశైలాగ్రవృక్షారోహణరోదనమ్ ।
ఘృతవిష్టానులేపో వా హ్యగమ్యాగమనం తథా ॥
సితవస్త్రం ప్రసన్నామ్భః ఫలీవృక్షో నభోఽ మలమ్ ॥28॥

ఎద్దు, ఏనుగు, ఇల్లు, పర్వతశిఖరం, వృక్షం వీటిపైకి ఎక్కడం, ఏడవడం, నెయ్యి, మలం కలిపి ఒంటికి పూసుకోవడం, ఇతరస్త్రీలను పొందడం, తెల్లని వస్త్రం, నిర్మలమైన నీళ్లతో బాగా పండినచెట్టు, స్వచ్ఛమైన ఆకాశం కనిపించినవి మంచికలలు.

ఇత్యాది మహాపురాణే ఆగ్నేయే స్వప్నశుభాశుభదుస్స్వప్నహరణకథనం నామైకోనవింశత్యధికద్విశతతమో உధ్యాయః ॥229॥

అగ్నిమహాపురాణంలో స్వప్నమందలి వివిధములైన కలలను గురించి వర్ణించుట అనే రెండువందల ఇరవైతొమ్మిదవ అధ్యాయం సమాప్తం.



త్రింశదధికద్విశతతమో உధ్యాయః - రెండువందల ముప్పైయవ అధ్యాయం

శకునవర్ణనమ్ - శకునముల వర్ణనం

పుష్కర ఉవాచ - పరశురాముడితో పుష్కరుడు ఈ విధంగా చెబుతున్నాడు.

ఔషధాని చ యుక్తాని ధాన్యం కృష్ణమశోభనమ్ ।
కార్పాసం తృణశుష్కఞ్చ గోమయం వై ధనాని చ ॥1॥

అఙ్గారం గుడసర్జౌ చ ముణ్డాభ్యక్తం చ నగ్నకమ్ ।
అయః పఙ్కం చర్మ కేశావున్మత్తం చ నపుంసకమ్ ॥2॥

చణ్డాలశ్వపచాద్యాశ్చ నరా బన్ధనపాలకాః ।
గర్భిణీ స్త్రీ చ విధవాః పిణ్యాకాదీని వై మృతమ్ ॥3॥

ప్రయాణానికి బయలుదేరగా ఎదుట యుక్తమైన మందులు, నల్లని ధాన్యం, దూది, గడ్డితో కలిసి ఎండిన ఆవుపేడ కనిపిస్తే అశుభం. నిప్పు, బెల్లం, ఎద్దు, గుండు చేసుకుని నూనె పూసుకున్నవాడు, నగ్నంగా ఉన్నవాడు, ఇనుము, బురద, చర్మం, జుట్టు, పిచ్చివాడు, నపుంసకుడు, చండాలుడు, మాలవాడు మొదలయినవారు, కారాగారాన్ని రక్షించే అధికారులు, గర్భవతి, భర్త లేని స్త్రీలు, తెలకపిండి మరణం,

తుషభస్మకపాలాస్థి భిన్నభాణ్డమశస్తకమ్ ।
అశస్తో వాద్యశబ్దశ్చ భిన్నభైరవఝుర్ఝురః ॥4॥

ఊక, బూడిద, పుర్రె, ఎముక, పగిలినకుండ ఇవి కనిపించడం మంచిది కాదు. పగిలిన వాద్యాల నుండి వెలువడే విచిత్రధ్వని మంచిది కాదు.

ఏహీతి పురతశ్శబ్దశ్శస్యతే న తు పృష్ఠతః ।
గచ్ఛేతి పశ్చాచ్ఛబ్దో உగ్ర్యః పురస్తాత్తు విగర్హితః ॥5॥

ప్రయాణానికి బయలుదేరే సమయంలో ముందునుండి 'రా' అనేశబ్దం మంచిది. వెనక నుంచి 'రా' అనడం మంచిది కాదు. 'వెళ్లు' అనేమాట వెనకనుండి వినిపిస్తే ముందుకు పోవడానికి మంచిది. ముందునుండి 'వెళ్ళు' అనేమాట మంచిది కాదు.

క్వ యాసి తిష్ఠ మా గచ్ఛ కిం తే తత్ర గతస్య చ ।
అనిష్టశబ్దా మృత్యర్థం క్రవ్యాదశ్చ ధ్వజాదిగః ॥6॥

ఎక్కడికి వెళ్తున్నావు? ఉండు. వెళ్లవద్దు. అక్కడికి వెళ్లినందువలన లాభం ఏముంది? ఇటువంటి మాటల వలన కార్యభంగం అవుతుంది. ధ్వజం మొదలైన వాటిమీద ఉన్న మాంసం తినే పక్షులు మరణాన్ని సూచిస్తాయి.

స్ఖలనం వాహనానాం చ శస్త్రభఙ్గస్తథైవ చ ।
శిరోఘాతశ్చ ద్వారాద్యైశ్ఛత్రవాసాదిపాతనమ్ ॥7॥

ఏనుగు, గుఱ్ఱం మొదలైన వాహనాలు తడబడడం, ఆయుధాలు విరిగిపోవడం, ద్వారబంధం మొదలైనవి తలకు తగలడం, గొడుగు, వస్త్రం మొదలైన వాటిని పడేయడం అశుభసూచకాలు.

హరిమభ్యర్చ్య సంస్తుత్య స్యాదమఙ్గల్యనాశనమ్ ।
ద్వితీయం తు తతో దృష్ట్వా విరుద్ధం ప్రవిశేద్ గృహమ్ ॥8॥

ఇటువంటి అశుభశకునం కనబడితే శ్రీమహావిష్ణువును స్తుతించాలి. పూజించాలి. దానివలన రాబోయే అశుభం నశిస్తుంది. ఇలా చేసిన తరువాత మళ్లీ అపశకునం కనబడితే ఇంటికి తిరిగివచ్చేయడం మంచిది.

శ్వేతాస్సుమనసశ్శ్రేష్ఠాః పూర్ణకుమ్భో మహోత్తమః ।
మాంసం మత్స్యా దూరశబ్దాః వృద్ధ ఏకః పశుస్త్వజః ॥9॥

తెల్లటిపూలు ఎదురురావడం శుభం. పూర్ణకుంభం ఎదురు వస్తే చాలా మంచిది. మాంసం, చేపలు, దూరంగా పెద్దపెద్ద శబ్దాలు, ఒక ముసలివాడు, మేక కనిపిస్తే శుభం.

గావస్తురఙ్గమా నాగా దేవాశ్చ జ్వలితోఽనలః ।
దూర్వార్ద్రగోమయం వేశ్యా స్వర్ణం రూప్యం చ రత్నకమ్ ॥10॥

ఆవులు, గుఱ్ఱాలు, ఏనుగులు, దేవతామూర్తులు, మండుతున్న అగ్ని, పచ్చగడ్డి, తడిగా ఉన్న ఆవుపేడ, వేశ్య, బంగారం, వెండి, రత్నం కనిపిస్తే శుభం.

వచాసిద్ధార్థకౌషధ్యో ముద్గ ఆయుధ ఖడ్గకమ్ ।
ఛత్రం పీఠం రాజలిఙ్గం శవం రుదితవర్జితమ్ ॥11॥

తెల్లని ఆవాలు మొదలైన ఓషధులు; ఇనపగుదియ, కత్తి, అనే ఆయుధాలు; గొడుగు, పీట, రాజలాంఛనం, చుట్టూ ఏడ్చేవాళ్లు లేకుండా శవం కనిపిస్తే శుభం.

ఫలం ఘృతం దధి పయోహ్యక్షతాదర్శమాక్షికమ్ ।
శఙ్ఖ ఇక్షుశ్శుభం వాక్యం భక్తవాదిత్రగీతకమ్ ॥12॥

పండు, నేయి, పెరుగు, పాలు, అక్షతలు, అద్దం, తేనె, శంఖం, చెఱకు, శుభాన్ని తెలిపేమాటలు, భక్తులు వాద్యాలు వాయించడం, పాటలు పాడడం, కనిపిస్తే శుభం.

గమ్భీరమేఘస్తనితం తడిత్తుష్టిశ్చ మానసీ ।
ఏకతస్సర్వలిఙ్గాని మనసస్తుష్టిరేకతః ॥13॥

గంభీరమైన మేఘాల ధ్వని, మెరుపు, మనసునిండా సంతోషం, ఇవి శుభశకునాలు. ఈ శుభశకునాలు అన్నీ ఒకవైపు, మనసు నిండా సంతోషం ఒక్కటి ఒకవైపు ఉంచితే రెండూ సమానం అవుతాయి.

ఇత్యాది మహాపురాణే ఆగ్నేయే శకునవర్ణనం నామ త్రింశదధికద్విశతతమో ఽధ్యాయః ॥230॥

అగ్నిమహాపురాణంలో శకునముల వర్ణనం అనే రెండువందల ముప్పైయవ అధ్యాయం సమాప్తం.

త్రింశదధికద్విశతతమో உధ్యాయః - రెండువందల ముప్పైఒకటవ అధ్యాయం

శకునవర్ణనమ్ - శకునముల వర్ణనం

పుష్కర ఉవాచ - పరశురాముడితో పుష్కరుడు ఈవిధంగా చెప్తున్నాడు.

తిష్ఠతో గమనే ప్రశ్నే పురుషస్య శుభాశుభమ్ ।
నివేదయన్తి శకునా దేశస్య నగరస్య చ ॥1॥

పురుషుడు కూర్చున్నపుడు, ఎక్కడికయినా వెళ్లేటప్పుడు, దేనిని గురించి అయినా ప్రశ్నించేటపుడు, కనబడే శకునాలు ఆ దేశానికి, ఆ నగరానికి జరగబోయే మంచినీ, చెడునూ తెలియజేస్తాయి.

సర్వః పాపఫలో దీప్తో నిర్దిష్టో దైవచిన్తకైః ।
శాన్తశ్శుభఫలశ్చైవ దైవజ్ఞైస్సముదాహృతః ॥2॥

శకునాలు దీప్తాలు, శాంతాలు అని ముందుగా రెండు రకాలు. శకునశాస్త్రం తెలిసిన పెద్దలు దీప్తాలైన శకునాలు పాపఫలితాన్ని (కష్టాన్ని అనిష్టాన్ని) సూచిస్తాయి అని చెప్తారు. శాంత శకునాలు శుభఫలితాన్ని (అనుకున్నపని అవడంవంటివి) తెలియజేస్తాయి అని పేర్కొంటారు.

షట్ప్రకారా వినిర్దిష్టాశ్శకునానాం చ దీప్తయః ।
వేలాదిగ్దేశకరణరుతజాతివిభేదతః ॥
పూర్వాపూర్వా చ విజ్ఞేయా సా తేషాం బలవత్తరా ॥3॥

అందులో దీప్తాలైన శకునాలు ఆరువిధాలుగా నిర్దేశింపబడినాయి. అవి 1. వేల 2. దిక్కు 3. దేశం, 4. కరణం, 5. రుతం, 6. జాతి. ఈ శకునాలలో తరువాతి దానికంటె ముందరిది బలమైనది.

దివాచరో రాత్రిచర స్తథా రాత్రౌ దివాచరః ।
క్రూరేషు దీప్తా విజ్ఞేయా ఋక్షలగ్నగ్రహాదిషు ॥4॥

పగలు తిరగవలసిన ప్రాణులు రాత్రిసమయంలోనూ, రాత్రిపూట తిరగవలసినవి పగటికాలంలోనూ సంచరించడం (1)దీప్తవేళాశకునం. (ఏ సమయంలో తిరగవలసినవి ఆ సమయంలోనే తిరగడం శాంతవేళాశకునం) నక్షత్రం, లగ్నం, గ్రహం, మొదలయినవాటిలో క్రూరస్థితిలో ఉండడం కూడ దీప్తవేలాశకునం. (శాంతస్థితిలో ఉంటే శాంతవేళాశకునం.)

ధూమితా సా తు విజ్ఞేయా యాం గమిష్యతి భాస్కరః ।
యస్యాం స్థితస్సా జ్వలితా ముక్తా చాఙ్గారిణీ మతా ॥5॥

సూర్యుడు వెళ్లే దిక్కు ధూమిత. సూర్యుడు ఉన్న దిక్కు జ్వలిత. సూర్యుడు విడిచిన దిక్కు అంగారిణి.

ఏతాస్త్రిస్సృతా దీప్తాః పఞ్చ శాన్తాస్తథా పరాః ।
దీప్తాయాం దిశి దిగ్దీప్తం శకునం పరికీర్తితమ్ ॥6॥

ఇవి మూడు దీప్తాలు. అష్టదిక్కులలోనూ మిగిలిన అయిదు దిక్కులు శాంతాలు. దీప్తమయిన దిక్కులో ఉన్న శకునం (2)దిగ్దీప్తశకునం. ఇలాగే శాంతదిక్కుకు సంబంధించినది దిక్‌శాంతశకునం.

గ్రామేఽరణ్యా వనే గ్రామాస్తథా నిన్దితపాదపః ।
దేశే చైవాశుభే జ్ఞేయో దేశదీప్తో ద్విజోత్తమ ॥7॥

బ్రాహ్మణోత్తమా! పరశురామా! అరణ్యంలో ఉండవలసిన జంతువులు మొదలైనవి గ్రామంలోనూ, గ్రామంలో ఉండవలసిన జంతువులు మొదలైనవి అరణ్యంలోనూ ఉండడమూ, అలాగే మంచిప్రదేశంలో చెడ్డచెట్లు ఉండడం, (3)దేశదీప్తశకునం. (ఏ ప్రదేశంలో ఉండవలసినవి ఆ ప్రదేశంలోనే ఉండడం దేశశాంతశకునం.)

క్రియాదీప్తో వినిర్దిష్టస్స్వజాత్యనుచితక్రియః ।
రుతదీప్తశ్చ కథితో భిన్నభైరవనిస్స్వనః ॥8॥

ఆయా ప్రాణులు తమజాతికి తగనిపని చేస్తుండడం (4)క్రియాదీప్తశకునం. (తగినపని చేయడం క్రియాశాంతశకునం.) ఆయా ప్రాణుల అరుపులు మొదలైనవి భయంకరంగా వినబడడం (5)రుతదీప్తశకునం. (శాంతమైన ధ్వని వినబడడం రుతశాంతశకునం.)

జాతిదీప్తస్తథా జ్ఞేయః కేవలం మాంసభోజనః ।
దీప్తాచ్ఛాన్తో వినిర్దిష్టస్సర్వైర్భేదైః ప్రయత్నతః ॥9॥

మాంసం మాత్రమే తినే జీవులశకునం (6)జాతిదీప్తశకునం. దీప్తశకునాలలో ఉండే ఈ ఆరుభేదాలు శాంతశకునాలలో కూడ ఉంటాయి. దీప్తమయిన శకునాలకు విరుద్ధంగా ఉండే ఆ శకునమే శాంతశకునం అని జాగరూకతతో గ్రహించాలి.

మిశ్రైర్మిశ్రో వినిర్దిష్టస్తస్య వాచ్యం ఫలాఫలమ్ ॥10॥

దీప్తశకునమూ, శాంతశకునమూ రెండు కలిసిఉంటే అది మిశ్రశకునం అవుతుంది. దానికి ఫలితం కూడ అశుభమూ, శుభమూ కలిసి ఉంటుంది.

గోశ్వోష్ట్రగర్దభశ్వానస్సారికా గృహగోధికా ।
చటకా భాసకూర్మాద్యాః కథితా గ్రామవాసినః ॥11॥

ఆవు, గుఱ్ఱం, ఒంటె, గాడిద, కుక్క, గోరువంక, ఇళ్లలో ఉండే బల్లి, పిచ్చుకలు, కోడి, తాబేలు మొదలైనవి గ్రామాలలో నివసించే ప్రాణులు.

అజావిశుకనాగేన్ద్రాః కోలో మహిషవాయసౌ ।
గ్రామ్యారణ్యా వినిర్దిష్టాస్సర్వేఽన్యే వనగోచరాః ॥12॥

మేక, గొఱ్ఱె, చిలుక, పాము, పంది, దున్న, కాకి మొదలైన ప్రాణులు గ్రామాలలోనూ, అరణ్యాలలోనూ నివసిస్తాయి. మిగిలినవి అన్నీ అడవులలో మాత్రమే ఉంటాయి.

మార్జారకుక్కుటౌ గ్రామ్యౌ తౌ చైవ వనగోచరౌ ।
తయోర్భవతి విజ్ఞానం నిత్యం వై రూపభేదతః ॥13॥

పిల్లి, కోడి కూడ గ్రామాలలో ఉంటాయి. అడవులలోనూ ఉంటాయి. అయితే వాటికి ఆకారంలో ఉండే తేడాలను బట్టి ఊరిపిల్లి - అడవిపిల్లి, ఊరికోడి - అడవికోడి ఏది ఏదో తెలుసుకోవచ్చును.

గోకర్ణశిఖిచక్రాహ్వ ఖరహారీతవాయసాః ।
కులాహకుక్కుభశ్యేనఫేరుఖఞ్జనవానరాః ॥14॥

కంచరగాడిద, నెమలి, చక్రవాకం, గాడిద, ఒకవిధమైన పావురం, కాకి, ఒకానొకవిధమైన గుఱ్ఱం, అడవికోడి, డేగ, నక్క, కాటుకపిట్ట, కోతి,

శతఘ్నచటకశ్యామచాషశ్యేనకపిఞ్జలాః ।
తిత్తిరిశ్శతపత్రశ్చ కపోతశ్చ తథా త్రయః ॥15॥

శతఘ్నం, పిచ్చుక, కోకిల, పాలపిట్ట, డేగ, కౌజుపిట్ట, (1)తీతువుపిట్ట, (2)నెమలి, (3)పావురం అనే మూడుపక్షులు,

ఖఞ్జరీటకదాత్యూహశుకరాజీవకుక్కుటాః ।
భారద్వాజశ్చ సారఙ్గ ఇతి జ్ఞేయా దివాచరాః ॥16॥

కాటుకపిట్ట (ఇది విశేషం), నీరుకాకి, చిలుక, సారసపక్షి, కోడి, భరద్వాజపక్షి, కొక్కెరపక్షి ఇవి పగటిపూట సంచరించే ప్రాణులు.

వాగుర్యులూకశరభక్రౌఞ్చాశ్శశకకచ్ఛపాః ।
లోమాసికాః పిఙ్గలికాః కథితా రాత్రిగోచరాః ॥17॥

వాగురి, గుడ్లగూబ, సింహంకంటె బలమైన ఎనిమిదికాళ్ల జంతువు, ఒకవిధమైన కొంగ, కుందేలు, తాబేలు, పొట్టేళ్లు, బలాకాలు (ఒకజాతి కొంగలు) ఇవి రాత్రిసమయంలో సంచరిస్తాయి.

హంసాశ్చ మృగమార్జారనకులర్క్షభుజఙ్గమాః ।
వృకారిసింహవ్యాఘ్రోష్ట్రగ్రామసూకరమానుషాః ॥18॥
శ్వావిద్వృషభగోమాయువృకకోకిలసారసాః ।
తురఙ్గకౌపీననరాగోధా హ్యుభయచారిణః ॥19॥

హంసలు, జింకలు, పిల్లులు, ముంగిసలు, ఎలుగులు, పాములు, కుక్కలు, సింహాలు, పెద్దపులులు, ఒంటెలు, ఊరబందులు, మానవులు, ముళ్లపంది, ఎద్దు, నక్క, తోడేలు, కోయిల, బెగ్గురుపక్షి, సారసపక్షి, గుఱ్ఱాలజంట, బక్కచిక్కిన మనుషులు, బల్లి, - ఇవి పగలూ, రాత్రి రెండుసమయాలలోనూ సంచరించేవి.

బల(ప్రస్థానయో స్సర్వే పురస్తాత్ సఙ్ఘచారిణః ।
జయావహా వినిర్దిష్టాః పశ్చాన్నిధనకారిణః ॥20॥

సైన్యానికి గాని, యుద్ధయాత్రకు గాని ముందుగా ఈ పక్షులు గుంపులుగా సంచరిస్తే, రాజుకు విజయం కలుగుతుందని చెప్పబడింది. వెనకగా సంచరిస్తే మరణం సంభవిస్తుంది.

గృహోద్గమ్య యదా చాషో వ్యాహరేత్ పురతః స్థితః ।
నృపావమానం వదతి వామః కలహభోజనే ॥21॥

నెమలి గూడు విడిచి వెలుపలికి వచ్చి, ఎదుటకు వచ్చి అరుస్తుంటే రాజుకు అవమానం కలుగుతుంది. ఎడమవైపుగా వస్తే పోట్లాటలు, భోజనం సంభవిస్తాయి.

యానే తద్దర్శనం శస్తం సవ్యమఙ్గస్య వాప్యథ ।
చౌరైర్మోషమథాఖ్యాతి మయూరో భిన్ననిస్స్వనః ॥22॥

ప్రయాణసమయంలో అది నెమలి కనబడడం మంచిది. దాని శరీరంలో ఎడమభాగం కనబడినా మంచిదే. నెమలి విచిత్రంగా అరిస్తే దొంగలవలన ఆపదను తెలియజేస్తుంది.

ప్రయాతస్యాగ్రతో రామ మృగః ప్రాణహరో భవేత్ ।
ఋక్షాఖుజమ్బుకవ్యాఘ్రసింహమార్జారగర్దభాః ॥
ప్రతిలోమాస్తథా రామ ఖరశ్చ వికృతస్వనః ॥23॥

పరశురామా! ప్రయాణారంభంలో జింక ఎదురుగుండా వస్తే మరణం కలుగుతుంది. ఎలుగు, ఎలుక, నక్క, పెద్దపులి, సింహం, పిల్లి, గాడిద తనకు ఎదురుగా వ్యతిరేకదిశలో వెళ్లినా, గాడిద వికారంగా ఓండ్ర పెట్టుకుంటూ వెళ్లినా ప్రాణానికి హాని సంభవిస్తుంది.

వామః కపిఞ్జలశ్రేష్ఠ స్తథా దక్షిణసంస్థితః ।
పృష్ఠతో నిన్దితఫలస్తిత్తిరిస్తు న శస్యతే ॥24॥

ప్రయాణసమయంలో ఎదురుగా కపింజలపక్షి ఎడమవైపున గాని, కుడివైపున గాని ఎటు ఉన్నా, చాల మంచిది. వెనకవైపు ఉంటే మాత్రం కీడు కలుగుతుంది. ఎటువైపు అయినా తీతువుపక్షి కనబడటం మంచిదికాదు.

ఏణా వరాహాః పృషతా వామా భూత్వా తు దక్షిణాః ।
భవన్త్యర్థకరా నిత్యం విపరీతం విగర్హితాః ॥25॥

జింకలు, పందులు, రంగురంగులజింకలు ఎడమవైపునుండి కుడివైపుకు వెళ్లడంవలన ఎప్పుడయినా, అనేక ప్రయోజనాలు కలుగుతాయి. అలా కాక, కుడినుండి ఎడమవైపుకు వెళ్తే కష్టాలు కలుగుతాయి.

వృషాశ్వజమ్బుకవ్యాఘ్రాస్సింహమార్జారగర్దభాః ।
వాఞ్ఛితార్థకరా జ్ఞేయా దక్షిణాద్ వామతో గతాః ॥26॥

ఎద్దు, గుఱ్ఱం, నక్క, పెద్దపులి, సింహం, పిల్లి, గాడిద ఈజంతువులు కుడినుండి ఎడమవైపుగా వెళ్తే, కోరికలు నెరవేరతాయి.

శివా శ్యామాననాచ్చుచ్ఛూః పిఙ్గలా గృహగోధికా ।
సూకరీ పరపుష్టా చ పున్నామానశ్చ వామతః ॥27॥

నక్క, నల్లనిమూతి కలిగినది (కొండముచ్చు), చుంచు, చిన్నగుడ్లగూబ, బల్లి, ఆడుపంది, కోకిల, పురుషుడిని తెలియజేసే పేర్లు గలిగిన జంతువులు ఎడమవైపున ఉంటే అన్నికోరికలూ నెరవేరతాయి.

స్త్రీసంజ్ఞా భాసకారూషకపిశ్రీకర్ణచ్ఛిత్కరాః ।
కపిశ్రీకర్ణపిప్పీకారురుశ్యేనాశ్చ దక్షిణాః ॥28॥

స్త్రీలను తెలియజేసేపేర్లు గలిగినవి, గ్రద్ద, కారూషం, కోతి, శ్రీకర్ణం, ఛిత్కరం, కపిశ్రీకర్ణాలు, పిప్పీకం అనే పేరు గలిగినపక్షి, రురువు అనే ఒకజాతిలేడి, డేగ – ఇవి కుడివైపున ఉంటే కోరికలు నెరవేరతాయి.

జాతోక్షాహిశశక్రోడగోధానాం కీర్తనం శుభమ్ ।
తతస్సన్దర్శనం నేష్టం ప్రతీపం వానరర్క్షయోః ॥29॥

అప్పుడే పుట్టినఎద్దు, పాము, కుందేలు, బల్లి వీటిని గురించి పేర్కొనడం మంచిది. అయితే వాటిని చూడడం మంచిది కాదు. అలాగే కోతులు, ఎలుగుబంట్లు వ్యతిరేకదిశలో ఉండడం మంచిది కాదు.

కార్యకృద్బలీ శకునః ప్రస్థితస్య హి యో౽న్వహమ్ ।
భవేత్తస్య ఫలం వాచ్యం తదేవ దివసం బుధైః ॥30॥

ప్రతిరోజూ ప్రయాణానికి బయలుదేరేసమయంలో బలమైన శకునం ఏది గోచరిస్తే అది ఆ రోజే ఫలితాన్ని ఇస్తుందని పండితులు పేర్కొంటారు.

మత్తా భక్ష్యార్థినో బాలా వైరసక్తాస్తథైవ చ ।
సీమాన్తమభ్యన్తరితా విజ్ఞేయా నిష్ఫలా ద్విజ ॥31॥

బ్రాహ్మణవర్యా! పరశురామా! పరవశస్థితిలో ఉన్నవారు, ఆకలిగొన్నవారు, పసివాళ్లు, శత్రువులు, వీరు ఊరిపొలిమేరలో కనిపిస్తే ఏవిధమయిన ఫలితం ఉండదు.

ఏకద్విత్రిచతుర్భిస్తు శివా ధన్యా రుతైర్భవేత్ ।
పఞ్చభిశ్చ తథా షడ్భిరధన్యా పరికీర్తితా ॥
సప్తభిశ్చ తథా ధన్యా నిష్ఫలా పరతో భవేత్ ॥32॥

ఆడనక్క ఒకసారి లేదా రెండుసార్లు లేదా మూడుసార్లు లేదా నాలుగుసార్లు కూస్తే మంచిది. అయిదుసార్లు, లేదా ఆరుసార్లు కూస్తే మంచిది కాదని చెప్పబడింది. మళ్లీ ఏడుసార్లు కూస్తే మంచిది. ఏడుకు మించి ఎన్నిసార్లు కూసినా ఫలితం ఉండదు.

నృణాం రోమాఞ్చ జననీ వాహనానాం భయప్రదా ।
జ్వాలానలా సూర్యముఖీ విజ్ఞేయా భయవర్ధనీ ॥33॥

సూర్యుడికి అభిముఖంగా అంటే పైకి జ్వలిస్తున్న అగ్ని ఎదురుగా ఉండడంవలన, మానవులకు భయం కలుగుతుంది. దానివలన వెంట్రుకలు నిక్కబొడుచుకుంటాయి. వాహనాలకు ఆపదభయం ఏర్పడుతుంది. అన్నిరకాలుగాను భయం పెంచుతుంది.

ప్రథమం సారఙ్గే దృష్టే శుభే దేశే శుభం వదే(భవే)త్ ।
సంవత్సరం మనుష్యస్య హ్యశుభే చ శుభం తథా ॥34॥

ప్రయాణప్రారంభంలో మొట్టమొదట మంచిప్రదేశంలో లేడి కనబడితే అప్పటినుండి ఒకసంవత్సరంపాటు మంచి జరుగుతుంది. ఒకవేళ లేడి అశుభప్రదేశంలో కనబడినా అదే విధంగా మంచే జరుగుతుంది.

తథావిధం నరః పశ్యేత్ సారఙ్గం ప్రథమేఽహని ।
ఆత్మనశ్చ తథాత్వేన జ్ఞాతవ్యం వత్సరం ఫలమ్ ॥35॥

అందుచేత మానవుడు ప్రయాణం ప్రారంభంలో మొదటిరోజున లేడినే చూడాలి. అందువలన తనకు సంవత్సరం పొడుగునా శుభఫలితాలు కలుగుతాయని తెలుసుకోవాలి.

ఇత్యాది మహాపురాణే ఆగ్నేయే శకునవర్ణనం నామైకత్రింశదధికద్విశతతమోఽధ్యాయః ॥231॥

అగ్నిమహాపురాణంలో శకునముల వర్ణనం అనే రెండువందల ముప్పైఒకటవ అధ్యాయం సమాప్తం.



ద్వాత్రింశదధికద్విశతతమోఽధ్యాయః - రెండువందల ముప్పైరెండవ అధ్యాయం

శకునవర్ణనమ్ - శకునముల వర్ణనం

పుష్కర ఉవాచ - పరశురాముడితో పుష్కరుడు ఈవిధంగా చెప్తున్నాడు.

విశన్తి యేన మార్గేణ వాయసా బహవః పురమ్ ।
తేన మార్గేణ రుద్ధస్య పురస్య గ్రహణం భవేత్ ॥1॥

కాకులు గుంపులుగా ఏ మార్గంగుండా శత్రునగరంలో ప్రవేశిస్తాయో, ఆ మార్గంద్వారా ఆ నగరాన్ని చుట్టుముడితే దానిని ఆక్రమించుకోవడం సులభం.

సేనాయాం యది వాసార్థే నివిష్టో వాయసో రుదన్ ।
వామో భయాతురస్త్రస్తో భయం వదతి దుస్తరమ్ ॥2॥

భయంతో ఏడుస్తూ కాకి సైన్యంలో గానీ, జనసమూహంలో గాని ఎడమవైపుగా ప్రవేశిస్తే అది వారికి చాల భయం కలగబోతున్నదని తెలుపుతుంది.

ఛాయాఙ్గవాహనోపానచ్ఛత్రవస్త్రాదికుట్టనే ।
మృత్యుస్తత్పూజనే పూజా తదిష్టకరణే శుభమ్ ॥3॥

తననీడ, అవయవాలు, వాహనం, చెప్పులు, గొడుగు, బట్టలు మొదలైనవాటిని కాకి ముక్కుతో పొడిస్తే మరణం సంభవిస్తుంది. వాటికి మేలు చేస్తే శుభం కలుగుతుంది.

ప్రోషితాగమకృత్కాకః కుర్వన్ ద్వారి గతాగతమ్ ।
రక్తం దగ్ధం గృహే ద్రవ్యం క్షిపన్ వహ్నినివేదకః ॥4॥

గుమ్మం నుండి కాకి లోపలికి వస్తూ, పోతూ ఉంటే ఇతరప్రాంతాలవారు వస్తున్నారని తెలియజేస్తుంది. ఎఱ్ఱగా ఉన్న వస్తువును గాని, కాలిపోయినవస్తువును గాని ఇంట్లో పడేస్తే ఆ ఇంటికి నిప్పంటుకుంటుందని సూచిస్తుంది.

న్యసేద్రక్తం పురస్తాచ్చ నివేదయతి బన్ధనమ్ ।
పీతం ద్రవ్యం తథా రుక్మ రూప్యమేవ తు భార్గవ ॥5॥

పరశురామా! కాకి తన యెదురుగా ఏదయినా ఎఱ్ఱటి వస్తువును పడేస్తే దానివలన బంధనం కలుగుతుందని తెలుస్తుంది. పసుపుపచ్చని వస్తువును పడేస్తే బంగారం, లేదా వెండి లభిస్తాయని సూచన.

యచ్చైవోపనయేద్ద్రవ్యం తస్య లబ్ధిం వినిర్దిశేత్ ।
ద్రవ్యం వాపనయేద్యత్తు తస్య హానిం వినిర్దిశేత్ ॥6॥

కాకి తనయెదుట ఏ వస్తువు పడేస్తే ఆ వస్తువు లభిస్తుందని సూచన. ఏ వస్తువును తీసుకునివెళ్తే ఆ వస్తువు పోతుందని సూచన.

పురతో ధనలబ్ధిస్స్యాదామమాంసస్య ఛర్దనే ।
భూలబ్ధిస్స్యాన్మృదః క్షేపే రాజ్యం రత్నార్పణే మహత్ ॥7॥

కాకి తనయెదురుగా పచ్చిమాంసాన్ని పడేస్తే ధనం లభిస్తుంది. మట్టి తెచ్చి పడేస్తే, భూలాభం కలుగుతుంది. రత్నం తెచ్చి పడేస్తే రాజ్యం లభిస్తుంది.

యాతుః కాకోఽనుకూలస్తు క్షేమః కర్మక్షమో భవేత్ ।
న త్వర్థసాధకో జ్ఞేయః ప్రతికూలో భయావహః ॥8॥

ప్రయాణం ప్రారంభించినవాడికి అనుకూలమైన దిక్కులో కాకి సంచరిస్తే, వాడికి క్షేమం కలుగుతుంది. వెళ్లబోయేపని అవుతుంది. వ్యతిరేకమయిన దిక్కులో వెళ్తే ఆ పని కాదు. వాడికి భయం కూడ కలుగుతుంది.

సమ్ముఖేఽభ్యేతి విరుదన్ యాత్రా ఘాతకరో భవేత్ ।
వామః కాకస్స్మృతో ధన్యో దక్షిణోఽర్థవినాశకృత్ ॥9॥

ప్రయాణించేవాడికి కాకి వికృతంగా అరుస్తూ ఎదురుగా వస్తే ఆ ప్రయాణం వ్యర్థం అవుతుంది. కాకి ఎడమవైపు ఉంటే అనుకున్న పనులన్నీ నెరవేరతాయి. కుడివైపు ఉంటే పనులన్నీ వ్యర్థమవుతాయి.

వామోఽనులోమగశ్శ్రేష్ఠో మధ్యమో దక్షిణస్స్మృతః ।
ప్రతిలోమగతిర్వామో గమనప్రతిషేధకృత్ ॥10॥

ప్రయాణం చేసేవాడికి కాకి ఎడమవైపునుండి అనుకూలమైన దిక్కుగా వెళ్తే, ఆ ప్రయాణంవలన ఉత్తమమైనఫలితం కలగుతుంది. కుడివైపునుండి అనుకూలదిశగా వెళ్తే ఫలితం మధ్యమంగా ఉంటుంది. కాకి ఎడమవైపునుండి ప్రతికూలమైనదిక్కులో ప్రయాణిస్తే, ఆ ప్రయాణం మానుకోమని తెలియజేస్తుంది.

నివేదయతి యాత్రార్థమభిప్రేతం గృహే గతః ।
ఏకాక్షిచరణస్త్వర్కం వీక్షమాణో భయావహః ॥11॥

ప్రయాణం చేయబోయేవాడి ఇంటిమీదికి కాకి వచ్చి వాలితే అనుకున్నపని అవుతుంది. కాకి ఒంటికాలిమీద నిలబడి ఒంటికంటితో సూర్యుడివైపు చూస్తుంటే కష్టం రాబోతున్నదని సూచన.

కోటరే వాసమానశ్చ మహానర్థకరో భవేత్ ।
న శుభస్తూషరే కాకః పఙ్కాఙ్కస్స తు శస్యతే ॥12॥

కాకి తనయింటిలోని చెట్టుతొఱ్ఱలో నివాసం చేస్తుంటే దానివలన చాల అనర్థం సంభవిస్తుంది. కాకి చవిటినేలపైన ఉంటే నష్టం. కాని దాని ఒంటికి బురద అంటుకుని ఉంటే మాత్రం మంచిది.

అమేధ్యపూర్ణవదనః కాకస్సర్వార్థసాధకః ।
జ్ఞేయాః పతత్రిణోఽ_న్యేఽ_పి కాకవద్ భృగునన్దన ॥13॥

భృగుకుమారా! నోటినిండా మలం ఉన్న కాకి కనబడితే సమస్తమయిన పనులు సఫలం అవుతాయి. ఇంకా ఇతరమైన పక్షుల శకునాలు కూడ కాకికి చెప్పిన విధంగానే ఉంటాయని తెలుసుకోవాలి.

స్కన్ధావారాపసవ్యస్థాశ్వానో విప్రవినాశకాః ।
ఇన్ద్రస్థానే నరేన్ద్రస్య పురేశస్య తు గోపురే ॥14॥

సైన్యసముదాయానికి కుడివైపుగా కుక్కలు వస్తే బ్రాహ్మణులకు నష్టం కలుగుతుంది. కుక్కలు ఇంద్రధ్వజం (వర్షాలకోసం ఇంద్రుడిని ఉద్దేశించి రాజు ఎగురవేసినపతాకం) ఉన్నచోటికి వస్తే రాజుకు నష్టం. నగరం ప్రవేశద్వారం వద్దకు వస్తే ఆ నగరనాయకుడికి నష్టం.

అన్తర్గృహే గృహేశస్య మరణాయ భవేద్ భషన్ ।
యస్య జిఘ్రతి వామాఙ్గం తస్య స్యాదర్థసిద్ధయే ॥
భయాయ దక్షిణం చాఙ్గం తథా భుజమదక్షిణమ్ ॥15॥

పెద్దగా అరుచుకుంటూ కుక్క లోపలిఇంట్లోకి వస్తే ఆ ఇంటియజమానికి మరణం సంభవిస్తుంది. శరీరంలో ఎడమవైపు నాకితే అతడికి కోరికలు (లాభాలు) సిద్ధిస్తాయి. కుడివైపు ఉన్న అవయవాలను, ఎడమభుజాన్ని గాని నాకితే భయం పుడుతుంది.

యాత్రాఘాతకరో యాతుర్భవేత్ ప్రతిముఖాగతః ।
మార్గావరోధకో మార్గే చౌరాన్వదతి భార్గవ ॥16॥

భృగుకుమారా! పరశురామా! ప్రయాణానికి బయలుదేరేవాడికి కుక్క ఎదురుగా వస్తే ఆ ప్రయాణానికి అవరోధం కలుగుతుంది (ఆ పని జరగదు). దారికి అడ్డంగా వచ్చి నిలబడితే ఆ దారిలో దొంగలు ఎదురు వస్తారని తెలియజేస్తుంది.

అలాభోఽ_స్థిముఖః పాపో రజ్జుక్షీరముఖస్తథా ।
సోపానత్కముఖో ధన్యో మాంసపూర్ణముఖోఽ_పి చ ॥
అమఙ్గల్యముఖద్రవ్యం కేశం చైవాశుభం తథా ॥17॥

కుక్క నోటిలో ఎముకను పెట్టుకుని ఎదురయితే నష్టం కలుగుతుంది. అలాగే నోటిలో తాడుతో గాని, నోటినుండి నీరు (చొంగ) కారుతూ కాని ఎదురయినా నష్టమే. నోట్లో చెప్పుతో గానీ, నోటినిండా మాంసంతో కాని కనబడితే మేలు జరుగుతుంది. నోట్లో అశుభమైన వస్తువుతో గాని, లేదా వెంట్రుకలతో గాని కుక్క కనబడితే కీడు కలుగుతుంది.

అవమూత్ర్యాగ్రతో యాతి యస్య తస్య భయం భవేత్ ।
యస్యావమూత్ర్య వ్రజతి శుభం దేశం తథా ధ్రువమ్ ॥
మఙ్గలం చ తథా ద్రవ్యం తస్య స్యాదర్థసిద్ధయే ॥18॥

ఎవరియెదుట కుక్క మూత్రం పోసి వెళ్లిపోతుందో వాడికి భయం కలుగుతుంది. మూత్రం విసర్జించిన తరువాత ఆ కుక్క శుభమైన ప్రదేశానికి వెళ్తే అతడికి నిశ్చయంగా అంతటి శుభం కలుగుతుంది. మంగళకరమయిన వస్తువులవద్దకు వెళ్తే అతడికి గొప్ప లాభాలు కలుగుతాయి.

శ్వవచ్చ రామ విజ్ఞేయాస్తథా వై జమ్బుకాదయః ॥19॥

పరశురామా! నక్క మొదలయిన ఇతర జంతువులవిషయంలోనూ ఇక్కడ కుక్కవిషయంలో చెప్పినవిధంగానే ఆయా శుభాశుభాలు జరుగుతాయని తెలుసుకోవాలి.

భయాయ స్వామినో జ్ఞేయమనిమిత్తం రుతం గవామ్ ।
నిశి చౌరభయాయ స్యాద్ వికృతం మృత్యవే తథా ॥20॥

ఆవులు కారణం లేకుండా అరిస్తే వాటి యజమానికి భయం కలుగుతుంది. రాత్రిపూట అరిస్తే దొంగల భయం ఏర్పడుతుంది. వికారంగా అరిస్తే త్వరలో మరణం సంభవిస్తుంది.

శివాయ స్వామినో రాత్రౌ బలీవర్దో నదన్ భవేత్ ।
ఉత్సృష్టవృషభో రాజ్ఞో విజయం సమ్ప్రయచ్ఛతి ॥21॥

ఎద్దు రాత్రిసమయంలో అరిస్తే యజమానికి శుభం కలుగుతుంది. ఊరిమీదికి విడిచిపెట్టిన ఆబోతు ఱంకె వేస్తే రాజుకు విజయం కలుగుతుంది.

అభక్ష్యం భక్షయన్త్యశ్చ గావో దత్తాస్తథా స్వకాః ।
త్యక్తస్నేహాస్స్వవత్సేషు గర్భక్షయకరా మతాః ॥22॥

తనకు ఇతరులు దానం చేసిన ఆవులు కాని, సొంతఆవులు కాని తినగూడనిపదార్థాన్ని తింటున్నా, వాటిదూడలమీద ప్రేమ లేకుండా ఉన్నా ఆ ఇంటిలో వారికి గర్భస్రావం జరుగుతుంది.

భూమిం పాదైర్వినిఘ్నన్త్యో దీనా భీతా భయావహాః ।
ఆర్ద్రాఙ్గ్యో హృష్టరోమాశ్చ శృఙ్గలగ్నమృదశ్శుభాః ॥23॥

ఆవులు కాళ్లతో నేలను రాస్తున్నా, దీనంగా ఉన్నా, భయపడుతూ ఉన్నా ఆ ఇంటిలోనివారికి భయం కలుగుతుంది. ఒళ్లు బాగా తడిగా ఉన్నవీ, ఆనందంతో వెంట్రుకలు నిక్కబొడుచుకునిఉన్నవీ, కొమ్ములకు మట్టి అంటుకున్నవీ అయిన ఆవులు శుభం కలిగిస్తాయి.

మహిష్యాదిషు చా ప్యేతత్ సర్వం వాచ్యం విజానతా ॥24॥

బఱ్ఱె, దున్న మొదలయినవాటి విషయంలోనూ శుభాశుభాలు ఆవు, ఎద్దులకు చెప్పినప్రకారంగా ఉంటుందని తద్‌జ్ఞులు చెప్తారు.

ఆరోహణం తథాన్యేన సపర్యాణస్య వాజినః ।
జలోపవేశనం నేష్టం భూమౌ చ పరివర్తనమ్ ॥25॥

జీను వేసిన (తాను ఎక్కడానికి సిద్ధపరచుకున్న) గుఱ్ఱాన్ని వేరేవాడు ఎక్కడం తనకు మంచిది కాదు. ఆ గుఱ్ఱం నీళ్లలో ప్రవేశించడం, నేలమీద గుండ్రంగా తిరగడం శుభప్రదం కాదు.

విపత్కరం తురఙ్గస్య సుప్తం వా ప్యనిమిత్తతః ।
యవమోదకయోర్ద్వేషస్త్వకస్మాచ్చ న శస్యతే ॥26॥

అనారోగ్యంవంటి కారణం ఏమీ లేకుండా గుఱ్ఱం నిద్రపోవడం ఆపదలను కలిగిస్తుంది. గుఱ్ఱానికి హఠాత్తుగా యవధాన్యం మీద, బెల్లంమీద ద్వేషం కలగడం కూడ మంచిది కాదు.

వదనాద్రుధిరోత్పత్తిర్వేపనం న చ శస్యతే ।
క్రీడన్ బకైః కపోతైశ్చ సారికాభిర్మృతిం వదేత్ ॥27॥

గుఱ్ఱం నోటినుండి రక్తం కారుతుండడం, ఒళ్లు వణుకుతుండడం మంచిది కాదు. కొంగలతోనూ, పావురాలతోనూ, సారికలు అనే పక్షులతోనూ ఆడడంవల్ల మరణం సంభవిస్తుంది.

సాశ్రునేత్రో జిహ్వయా చ పాదలేహీ వినష్టయే ।
వామపాదేన చ తథా విలిఖంశ్చ వసున్ధరామ్ ॥
స్వపేద్వా వామపార్శ్వేన దివా వా న శుభప్రదః ॥ 28॥

గుఱ్ఱం కళ్లలో నీళ్లు తిరుగుతున్నా, అది నాలుకతో పాదాలను నాకుతున్నా నష్టం కలుగుతుంది. ఎడమకాలితో నేలపై రాస్తున్నా, ఎడమవైపు తిరిగి నిద్రపోయినా, పగలు నిద్రించినా శుభం జరగదు.

భయాయ స్యాత్ సకృన్మూత్రీ తథా నిద్రావిలాననః ॥29॥

ఒక్కసారిగా మూత్రం విడిచినా, ముఖం నిద్రతో మలినపడినా భయం కలుగుతుంది.

ఆరోహణం న చేద్దద్యాత్ ప్రతీపం వా గృహం వ్రజేత్ ।
యాత్రావిఘాతమాచష్టే వామపార్శ్వం తథా స్పృశన్ ॥30॥

గుఱ్ఱం తనపైకి ఎక్కనీయక పోయినా, తిరిగి తననివాసస్థలానికి (అశ్వశాలకు) వెళ్లిపోయినా, యజమాని శరీరంలో ఎడమ ప్రక్కను తాకినా ప్రయాణానికి అవరోధం కలుగుతుంది.

హేషమాణశ్శత్రుయోధం పాదస్పర్శో జయావహః ॥31॥

శత్రువీరులను చూసి సకిలించినా, యజమాని పాదాలను తాకినా విజయం కలుగుతుంది.

గ్రామే వ్రజతి నాగశ్చేన్మైథునం దేశహా భవేత్ ।
ప్రసూతా నాగవనితా మత్తా చాన్తాయ భూపతేః ॥32॥

ఊళ్లో ఏనుగు సంభోగిస్తే రాజ్యానికి హాని కలుగుతుంది. ఆడఏనుగు గ్రామంలో ప్రసవించినా, దానికి పిచ్చి ఎక్కినా రాజు నశిస్తాడు.

ఆరోహణం న చేద్దద్యాత్ ప్రతీపం వా గృహం వ్రజేత్ ।
మదం వా వారణో జహ్యాద్రాజఘాతకరో భవేత్ ॥33॥

ఏనుగు తనపైకి ఎక్కనీయక పోయినా, తిరిగి దాని నివాసస్థలానికి (గజశాల) వెళ్లిపోయినా, మదద్రవాన్ని కారుస్తున్నా, రాజు నశిస్తాడు.

వామం దక్షిణపాదేన పాదమాక్రమతే శుభః ।
దక్షిణం చ తథా దన్తం పరిమార్ష్టి కరేణ చ ॥34॥

ఏనుగు తనకుడిపాదంతో ఎడమపాదాన్ని ఆక్రమించుకుంటే శుభం కలుగుతుంది. తొండంతో కుడిదంతాన్ని తుడిస్తే శుభం కలుగుతుంది.

వృషోఽశ్వః కుఞ్జరో వాపి రిపుసైన్యగతోఽశుభః ।
ఖణ్డమేఘాతివృష్ట్యా తు సేనానాశమవాప్నుయాత్ ॥35॥

ఎద్దు గాని, గుఱ్ఱం గాని, ఏనుగు కాని శత్రువులసైన్యంలో ప్రవేశిస్తే రాజుకు కీడు కలుగుతుంది. చిన్నచిన్న మబ్బుల తునుకలు భయంకరంగా వర్షిస్తే సైన్యం నశించిపోతుంది.

ప్రతికూలగ్రహర్క్షాత్తు తథా సమ్ముఖమారుతాత్ ।
యాత్రాకాలే రణే వాపి ఛత్రాదిపతనం భయమ్ ॥
హృష్టా నరా శ్చానులోమా గ్రహా వై జయలక్షణమ్ ॥36॥

ప్రయాణసమయంలోనైనా, యుద్ధంలోనైనా గ్రహాలు, నక్షత్రాలు ప్రతికూలంగా ఉన్నా, గాలి ఎదురై వీచినా, ఛత్రం మొదలైన(రాజ)చిహ్నాలు పడిపోయినా భయం కలుగుతుంది. మానవులు ఆనందంగా ఉండడమూ, గ్రహాలు నక్షత్రాలు మొదలైనవీ అనుకూలంగా ఉండడమూ విజయాన్ని సూచిస్తాయి.

కాకైర్యోధాభిభవనం క్రవాద్భిర్మణ్డలక్షయః ।
ప్రాచీపశ్చిమకైశానీ సౌమ్యా ప్రేష్ఠా శుభా చ దిక్ ॥37॥

మాంసం తినే కాకులు యోధులను పరాభవిస్తే దేశం నశిస్తుంది. తూర్పు, పడమర, ఈశాన్యదిక్కులు ఎటువంటి గందరగోళాలు లేకుండా ప్రశాంతంగా ఉంటే శుభం కలుగుతుంది. మనసుకు బాగా ఇష్టమైనవి లభిస్తాయి.

ఇత్యాది మహాపురాణే ఆగ్నేయే శకునవర్ణనం నామ ద్వాత్రింశదధికద్విశతతమోఽధ్యాయః ॥232॥

అగ్నిమహాపురాణంలో శకునవర్ణనం అనే రెండువందల ముప్పైరెండవ అధ్యాయం సమాప్తం.



త్రయస్త్రింశదధికద్విశతతమోऽధ్యాయః - రెండువందల ముప్పైమూడవ అధ్యాయం

యాత్రామండలచిన్తాకథనమ్ - యాత్రామండలవిచారం

పుష్కర ఉవాచ - పరశురాముడితో పుష్కరుడు ఈవిధంగా చెప్తున్నాడు.

సర్వయాత్రాం ప్రవక్ష్యామి రాజధర్మసమాశ్రయాత్ ।
అస్తఙ్గతే నీచగతే వికలే రిపురాశిగే ॥
ప్రతిలోమే చ విధ్వస్తే శుక్రే యాత్రాం విసర్జయేత్ ॥1॥

పరశురామా! రాజధర్మాన్ని అనుసరించి సమస్తమయిన యాత్రలను గురించి చెప్తాను. శుక్రుడు అస్తమించినపుడు, నీచస్థానంలో ఉన్నపుడు, బలహీనుడయినపుడు, శత్రురాశిలో ఉన్నపుడు, ప్రతికూలంగా ఉన్నపుడు, నాశనం అయినపుడు (కనబడనపుడు) యుద్ధయాత్ర చేయగూడదు.

ప్రతిలోమే బుధే యాత్రాం దిక్పతౌ చ తథా గ్రహే ॥2॥

బుధుడు తాను ఏ దిక్కుకు ప్రయాణం చేయాలో ఆ దిక్కుకు అధిపతి అయినవాడు, అదే విధంగా అప్పటి గ్రహస్థితి ప్రతికూలంగా ఉన్నపుడు యాత్రకు బయలుదేరగూడదు.

వైధృతౌ చ వ్యతీపాతే నాగే చ శకునౌ తథా ।
చతుష్పాదే చ కింస్తుఘ్నే తథా యాత్రాం వివర్జయేత్ ॥3॥

వైధృతి, వ్యతీపాతం, అనే యోగాల సమయంలోనూ, నాగం, శకునం, చతుష్పాత్తు, కింస్తుఘ్నం అనే కరణాల సమయంలోనూ యాత్రకు బయలుదేరగూడదు.

విపత్తారే నైధనే చ ప్రత్యరౌ చాథ జన్మని ।
గణ్డే వివర్జయేద్ యాత్రాం రిక్తాయాం చ తిథావపి ॥4॥

తారాబలాన్ని అనుసరించి తనకు విపత్తార గాని, నైధనతార గాని, ప్రత్యక్తార గాని, జన్మతార కాని అయిన సమయంలో ప్రయాణం చేయగూడదు. అలాగే గండకాలంలోనూ, రిక్తతిథులలోనూ ప్రయాణం పనికిరాదు.

ఉదీచీ చ తథా ప్రాచీ తయోరైక్యం ప్రకీర్తితమ్ ।
పశ్చిమా దక్షిణా యా దిక్ తయోరైక్యం తథైవ చ ॥5॥

ఉత్తరం - తూర్పు దిక్కులు రెండూ ఒకటే అని చెప్పబడింది. అలాగే పడమర - దక్షిణం దిక్కులు సమానం అని చెప్పబడింది. సమానమైన ఫలితాన్ని ఇస్తాయి అని తాత్పర్యం.

వాయ్వగ్నిదిక్సముద్భూతం పరిఘం న తు లఙ్ఘయేత్ ।
ఆదిత్యచన్ద్రసౌరాస్తు దివసాశ్చ న శోభనాః ॥6॥

వాయవ్యం, ఆగ్నేయం ఈ విదిక్కులలో ఏర్పడిన పరిధిని దాటి ప్రయాణం చేయగూడదు. రవివారం, ఇందువారం, శనివారం ప్రయాణానికి మంచివి కావు.

కృత్తికాద్యాని పూర్వేణ మఘాద్యాని చ యామ్యతః ।
మైత్రాద్యాన్యపరే చాథ వాసవాద్యాని వాప్యుదక్ ॥
సర్వద్వారాణి శస్తాని చ్ఛాయామానం వదామి తే ॥7॥

కృత్తిక మొదలుగా ఆశ్లేషవరకు ఏడునక్షత్రాలు తూర్పుదిక్కులోనూ, మఘ మొదలుగా విశాఖవరకు ఏడునక్షత్రాలు దక్షిణదిక్కులోనూ, అనూరాధ మొదలుగా ఏడు నక్షత్రాలు పడమటిదిక్కులోనూ, ధనిష్ఠ మొదలుగా భరణివరకు ఏడునక్షత్రాలు ఉత్తరదిక్కులోనూ ఉంటాయి. ఈనక్షత్రాలు ఆయా దిక్కులకు ద్వారాలు. ఇంక నీకు ఛాయామానం గురించి చెప్తాను. (వారంరోజులలో నీడలపరిమాణం ఈవిధంగా ఉంటుంది)

ఆదిత్యే వింశతిర్ జ్ఞేయా చన్ద్రే షోడశ కీర్తితాః ।
భౌమే పఞ్చదశైవోక్తాశ్చతుర్దశ తథా బుధే ॥8॥

త్రయోదశ తథా జీవే శుక్రే ద్వాదశ కీర్తితాః ।
ఏకాదశ తథా సౌరే సర్వకర్మసు కీర్తితాః ॥9॥

ప్రామాణికమైన కొలతలననుసరించి నీడ సూర్య(ఆది)వారంనాడు ఇరవైఅంగుళాలు, చంద్ర(సోమ)వారం పదహారంగుళాలు, భౌమ(మంగళ)వారం పదిహేనంగుళాలు, బుధవారం పద్నాలుగంగుళాలు, బృహస్పతి(గురు) వారం పదమూడంగుళాలు, శుక్రవారం పన్నెండంగుళాలు, సౌర(శని)వారం పదకొండంగుళాలు పరిమాణంలో ఉంటుంది. అన్నికర్మలలోనూ ఈ పరిమాణంలోనే ఉంటుందని చెప్పబడింది.

జన్మలగ్నే శక్రచాపే సమ్ముఖే న వ్రజేన్నరః ।
శకునాదౌ శుభే యాయాజ్జయాయ హరిమాస్మరన్ ॥10॥

జన్మలగ్నంలోనూ, ఎదుట ఇంద్రధనుస్సు కనబడినసమయంలోనూ మానవుడు ప్రయాణం చేయగూడదు. మంచిశకునం మొదలయినవి కలిగినపుడు, శ్రీమహావిష్ణువును చక్కగా స్మరించి విజయయాత్ర ప్రారంభించాలి.

వక్ష్యే మణ్డలచిన్తాం తే కర్తవ్యం రాజరక్షణమ్ ॥11॥

పరశురామా! నీకు ఇపుడు మండలవిచారం గురించి చెప్తాను. అందరూ అన్నివిధాలుగానూ ముందుగా రాజును రక్షించుకోవాలి.

స్వామ్యమాత్యస్తథా దుర్గః కోశో దణ్డస్తథైవ చ ।
మిత్రం జనపదశ్చైవ రాజ్యం సప్తాఙ్గముచ్యతే ॥12॥

1. రాజు, 2. మంత్రి, 3. దుర్గం, 4. కోశం, 5. దండనం, 6. మిత్రుడు, 7. జనపదం అని రాజ్యం ఏడు భాగాలు కలిగి ఉంటుంది.

సప్తాఙ్గస్య తు రాజ్యస్య విఘ్నకర్తౄన్ వినాశయేత్ ।
మణ్డలేషు చ సర్వేషు వృద్ధిః కార్యా మహీక్షితా ॥13॥

ఈవిధంగా ఏడు అంగాలు కలిగి రాజ్యానికి అవరోధాలు కలిగించేవారిని నిర్మూలించాలి. రాజు తనరాజ్యంలోని అన్నిమండలాలలోనూ అభివృద్ధిని సాధించాలి.

ఆత్మమణ్డలమేవాత్ర ప్రథమం మణ్డలం భవేత్ ।
సామన్తాస్తస్య విజ్ఞేయా రిపవో మణ్డలస్య తు ॥14॥

మండలాలన్నిటిలోనూ తన మండలమే మొదటిది అంటే ప్రధానం. ఆ మండలానికి సామంతులే శత్రువులు.

ఉపేతస్తు సుహృద్ జ్ఞేయశ్శత్రుమిత్రమతః పరమ్ ।
మిత్రమిత్రం తతో జ్ఞేయం మిత్రమిత్రరిపుస్తతః ॥15॥

రాజుకు తన మండలానికి సమీపంలో ఉన్నవాడు మిత్రుడు. ఆతరువాత తన శత్రువుకు మిత్రుడైనవాడు తనకు మిత్రుడు అవుతాడు. తన మిత్రుడికి మిత్రుడయినవాడు కూడ తనకు మిత్రుడే. తనమిత్రుడికి మిత్రుడయిన శత్రువు కూడ తనకు మిత్రుడే.

ఏతత్ పురస్తాత్ కథితం పశ్చాదపి నిబోధ మే ।
పార్ష్ణిగ్రాహస్తతః పశ్చాత్ తతస్త్వాక్రన్ద ఉచ్యతే ॥16॥

రాజుగారి సొంత మండలానికి ముందు ఉన్నవారి విషయం చెప్పడం అయింది. ఇక తన మండలానికి వెనకగా ఉన్న వారిని గూర్చి చెప్తాను తెలుసుకో. తనమండలానికి సరిగా వెనకఉన్నవాడు పార్ష్ణిగ్రాహుడు. ఆతడి వెనక ఉన్నమండలానికి అధిపతి ఆక్రందుడు.

ఆసారస్తు తతోఽన్యస్స్యాదాక్రన్దాసార ఉచ్యతే ।
జిగీషోశ్శత్రుయుక్తస్య విముక్తస్య తథా ద్విజ ॥17॥

బ్రాహ్మణోత్తమా! పరశురామా! వారికి వెనక ఉన్నవాడు ఆసారుడు. (పార్ష్ణిగ్రాహుడి వెనకవాడు పార్ష్ణిగ్రాహాసారుడు) ఆక్రందుడి వెనకవాడు ఆక్రందాసారుడు.

నాత్రాపి నిశ్చయశ్శక్యో వక్తుం మనుజపుఙ్గవ ।
నిగ్రహానుగ్రహే శక్తో మధ్యస్థః పరికీర్తితః ॥18॥

మహాత్మా! ఏది ఎలా ఉన్నప్పటికీ రాజు విజయం నిశ్చయించి చెప్పడం సాధ్యం కాదు. శత్రువును ఎదిరించి విజయం సాధించడంలోనూ, యుద్ధం లేకుండా అతడిని అనుగ్రహించి తనవాడిని చేసుకోవడంలోనూ సమర్థుడైనవాడు మధ్యస్థుడు.

నిగ్రహానుగ్రహేఽశక్తస్సర్వేషామపి యో భవేత్ ।
ఉదాసీనస్స కథితో బలవాన్ పృథివీపతిః ॥19॥

ఎవ్వరికి కూడా తనను ఎదిరించడానికి కాని, అనుగ్రహించడానికి గాని శక్తి లేకపోతే అతడిని ఉదాసీనుడు అంటారు. (ఇతడికి ఎవరితోనూ విరోధమూ ఉండదు. మైత్రీ ఉండదు). అటువంటి రాజు మిక్కిలి బలవంతుడు.

న కస్యచిద్రిపుర్మిత్రం కారణాచ్ఛత్రుమిత్రకే ।
మణ్డలం తవ సమ్ప్రోక్తమేతద్ద్వాదశరాజకమ్ ॥20॥

ఎవడికీ ఎవడూ శత్రువూ కాడు. మిత్రుడూ కాడు. ఏదైనా ప్రయోజనాన్ని అనుసరించే శత్రువు కావడమో మిత్రుడు కావడమో జరుగుతుంది. పరశురామా! ఈవిధంగా నీకు పన్నెండు విధాలయిన రాజమండలంగురించి చెప్పడం అయింది.

త్రివిధా రిపవో జ్ఞేయాః కుల్యానన్తరకృత్రిమాః ।
పూర్వపూర్వో గురుస్తేషాం దుశ్చికిత్స్యతమో మతః ॥21॥

కుల్యుడు, అనంతరుడు, కృత్రిముడు అని శత్రువు ముందుగా మూడువిధాలు. వీరిలో తరువాతి వారికంటె ముందటి వారు బలవంతులు.(225అధ్యాయం.9శ్లో) వారిలోని శత్రుత్వం వైద్యం చేయడానికి అవకాశం లేని(వైద్యం చేసినా తగ్గని)రోగం.

అనన్తరోఽపి యశ్శత్రుస్సోఽపి మే కృత్రిమో మతః ।
పార్ష్ణిగ్రాహో భవేచ్ఛత్రోర్మిత్రాణి రిపవస్తథా ॥22॥

అనంతరుడు కూడ కృత్రిముడైనశత్రువే అని నా అభిప్రాయం. తనకు అనంతరమే ఉండి, శత్రువయిన పార్ష్ణిగ్రాహుడు కృత్రిముడు. శత్రురాజుమిత్రులు తనకు శత్రువులు అవుతారు.

పార్ష్ణిగ్రాహ ముపాయైశ్చ శమయేచ్చ తథా స్వకమ్ ।
మిత్రేణ శత్రోరుచ్ఛేదం ప్రశంసన్తి పురాతనాః ॥23॥

తనకు పార్ష్ణిగ్రాహుడయిన శత్రువును రాజు వివిధమైన ఉపాయాలతో అణచివేయవచ్చును. ప్రాచీనులు తనమిత్రులతో శత్రువులను నిర్మూలించడం ఉత్తమంగా ప్రశంసిస్తారు.

మిత్రం చ శత్రుతా మేతి సామన్తత్వాదనన్తరమ్ ।
శత్రుం జిగీషురుచ్ఛిన్ద్యాత్ స్వయం శక్నోతి చేద్యది ॥24॥

సామంతుడైన రాజు మిత్రుడయినా ఆ తరువాత తనతో వైరం తెచ్చుకుంటాడు. శత్రువును జయించాలని కోరుకునే రాజు తనకు చేతనయితే తనశత్రువును తానే నిర్మూలించాలి.

ప్రతాపవృద్ధౌ తేనాపి నామిత్రాజ్జాయతే భయమ్ ॥25॥

(మిత్రుడు) బలం పెంచుకున్నట్లయితే మిత్రుడివలన కూడ భయం కలుగుతుంది. బలహీనుడయితే శత్రువువలన కూడ భయం లేదు.

యథాస్య నోద్విజేల్లోకో విశ్వాసశ్చ యథా భవేత్ ।
జిగీషుర్ధర్మవిజయీ తథా లోకం వశం నయేత్ ॥ 26॥

లోకాన్ని జయించాలని కోరుకునే రాజు తన రాజ్యంలోని ప్రజలకు తనపై అభిమానం ఉండేటట్లు చేసుకోవాలి. తానంటే అనవసరంగా భయపడకుండా చేసుకోవాలి. తనపై నమ్మకం కలిగించుకోవాలి. ధర్మబద్ధంగా పరిపాలిస్తూ ప్రజలు తనవశంలో ఉండేవిధంగా చేసుకోవాలి.

ఇత్యాది మహాపురాణే ఆగ్నేయే యాత్రామణ్డలచిన్తాకథనం నామ త్రయస్త్రింశదధికద్విశతతమోఽధ్యాయః ॥233॥

అగ్నిమహాపురాణంలో యాత్రామండలవిచారం అనే రెండువందల ముప్పైమూడవ అధ్యాయం సమాప్తం.

చతుస్త్రింశదధికద్విశతతమోఽధ్యాయః - రెండువందల ముప్పైనాల్గవ అధ్యాయం

షాడ్గుణ్యవర్ణనమ్ - షాడ్గుణ్యవర్ణనం

పుష్కర ఉవాచ - పరశురాముడితో పుష్కరుడు ఈ విధంగా చెప్తున్నాడు.

సామభేదౌ మయా ప్రోక్తౌ దానదణ్డౌ తథైవ చ ।
దణ్డస్స్వదేశే కథితః పరదేశే బ్రవీమి తే ॥1॥

రామా! సామం, భేదం, దానం, దండం అనే ఉపాయాలను గురించి ఇంతకుముందు నీకు చెప్పాను (226 అధ్యాయం). అందులో దండం రాజు తన రాజ్యంలో ఎలా ఉపయోగించాలో కూడ చెప్పాను. ఇక ఇతరరాజ్యాలలో అది ఎలా ఉపయోగించాలో ఇపుడు నీకు చెప్తాను.

ప్రకాశశ్చాప్రకాశశ్చ ద్వివిధో దణ్డ ఉచ్యతే ।
లుణ్ఠనం గ్రామఘాతశ్చ సస్యఘాతోఽగ్నిదీపనమ్ ॥2॥

ప్రకాశం, అప్రకాశం (రహస్యం) అని దండం రెండువిధాలు. గ్రామాలను దోచుకోవడం, గ్రామాలను నాశనం చేయడం, పంటను పాడు చేయడం, తగలబెట్టడం ఇవి ప్రకాశదండాలు. (దండానికి తగిననేరాలు.)

ప్రకాశోఽథ విషం వహ్నిర్వివిధైః పురుషైర్వధః ।
దూషణం చైవ సాధూనాముదకానాం చ దూషణమ్ ॥3॥

విషం ప్రయోగించడం, నిప్పు పెట్టడం, రకరకాలుగా మనుషులచేత చంపించడం, సజ్జనులను నిందించడం, నీటిని ఉపయోగించడానికి పనికిరాకుండా చేయడం - ఇవి రహస్యదండాలు.

దణ్డప్రణయనం ప్రోక్తముపేక్షాం శృణు భార్గవ ॥4॥

ఈ విధంగా పరదేశంలో దండనవిధానం చెప్పడం జరిగింది. పరశురామా! ఇక ఉపేక్ష అనే ఉపాయాన్ని గురించి చెప్తాను విను.

యదా మన్యేత నృపతీ రణే న మమ విగ్రహః ।
అనర్థాయానుబన్ధస్స్యాత్ సన్ధినా చ తథా భవేత్ ॥5॥

ఎదుటివారితో యుద్ధం చేయడానికి నాకు వారితో విరోధం లేదు. యుద్ధం లేదా విరోధంవలన అనర్థమే కలుగుతుంది. ఒకవేళ సంధి చేసుకుందామన్నా దానివల్ల ప్రత్యేకమైన ప్రయోజనం లేదు.

సామలబ్ధాస్పదం చాత్ర దానం చార్థక్షయఙ్కరమ్ ।
భేదదణ్డానుబన్ధస్స్యాత్ తదోపేక్షాం సమాశ్రయేత్ ॥6॥

అలాగే సామంతో వ్యవహరించినా ప్రయోజనవిశేషం ఉండదు. దానం అనే ఉపాయంవలన డబ్బు దండగ. భేదం లేదా దండం అనే ఉపాయాలు ప్రయోగించవలసిన అవసరం లేదు అని భావిస్తే రాజు ఉపేక్ష అనే ఉపాయాన్ని ఆశ్రయించాలి.

న చాయం మమ శక్నోతి కిఞ్చిత్ కర్తుముపద్రవమ్ ।
న చాహమస్య శక్నోమి తత్రోపేక్షాం సమాశ్రయేత్ ॥7॥

శత్రువైనా నాకు ఏ కొంచెం కూడ అపకారం చేయలేడు నేను కూడ వీడిని ఏమీ చేయలేను అనుకున్నపుడు రాజు ఉపేక్షామార్గాన్ని ఆశ్రయించాలి.

అవజ్ఞోపహతస్తత్ర రాజ్ఞా కార్యో రిపుర్భవేత్ ॥8॥

పట్టించుకోకపోవడం అనే ఉపేక్షోపాయం ద్వారా రాజు శత్రువును దెబ్బతీయాలి.

మాయోపాయం ప్రవక్ష్యామి ఉత్పాతైరనృతైశ్చరన్ ।
శత్రోరుద్వేజనం శత్రోశ్శిబిరస్థస్య పక్షిణః ॥9॥

ఇంక మాయ అనే ఉపాయం గురించి చెప్తాను. ఉపద్రవాలనూ, అబద్ధాలనూ కల్పించి, శత్రువులకూ శత్రుశిబిరాలలో ఉన్న పక్షులకూ భయం పుట్టించాలి. (భయపడిన పక్షులు అశుభశకునాలు చూపుతాయి)

స్థూలస్య తస్య పుచ్ఛస్థాం కృత్వోల్కాం విపులాం ద్విజ ।
విసృజేచ్చ తతశ్చైవముల్కాపాతం ప్రదర్శయేత్ ॥10॥

బ్రాహ్మణోత్తమా! పరశురామా! బాగా దృఢంగా ఉన్న ఆ పక్షితోకకు మండుతున్న పెద్దపుల్లను కట్టి, దానిని శత్రుసైన్యంలో విడిచిపెట్టాలి. ఈవిధంగా అక్కడ తోకచుక్క రాలిన దృశ్యాన్ని ప్రదర్శించాలి.

ఏవమన్యే దర్శనీయా ఉత్పాతా బహవోఽపి చ ।
ఉద్వేజనం తథా కుర్యాత్ కుహకైర్వివిధైర్ద్విషామ్ ॥11॥

ఈ విధంగా ఇంకా రకరకాల ఉపద్రవాలను అనేకంగా శత్రుసైన్యంలో ప్రదర్శించాలి. అలా వివిధములైన మాయలతో శత్రువులలో భయం పుట్టించాలి.

సాంవత్సరాస్తాపసాశ్చ నాశం బ్రూయుః పరస్య చ ।
జిగీషుః పృథివీం రాజా తేన చోద్వేజయేత్ పరాన్ ॥12॥

జ్యోతిష్కులచేత, తాపసులచేత శత్రువులకు త్వరలో వినాశం కలగబోతున్నదని చెప్పించాలి. రాజ్యాన్ని జయించాలనే కోరిక కలిగిన రాజు ఆ విధంగా శత్రువులను భయంతో వణికిపోయేటట్లు చేయాలి.

దేవతానాం ప్రసాదశ్చ కీర్తనీయః పరస్య తు ॥13॥

తనకు దేవతల అనుగ్రహం ఉన్నదనీ, దాని వలన తనకు శత్రుజయం కలుగుతుందని శత్రువులలో ప్రచారం చేయాలి.

ఆగతం నోఽమిత్రబలం ప్రహరధ్వమభీతవత్ ।
ఏవం బ్రూయాద్రణే ప్రాప్తే భగ్నాస్సర్వే పరే ఇతి ॥14॥

యుద్ధం చేయవలసివచ్చినపుడు 'మన శత్రువులు వచ్చేశారు. వారిని చావగొట్టండి. ఏ మాత్రం భయపడకండి. శత్రువులంతా చచ్చారు' అని చెప్పి సైన్యాన్ని యుద్ధానికి ఉత్సాహపరచాలి.

క్ష్వేడాః కిలకిలాః కార్యా వాచ్యశ్శత్రుర్హతస్తథా ।
దేవాజ్ఞాబృంహితో రాజా సన్నద్ధస్సమరం ప్రతి ॥15॥

దైవానుగ్రహంతో వృద్ధి పొంది, యుద్ధానికి సిద్ధమైన రాజు అట్టహాసాలు చేయాలి. నడుమ నడుమ ఆనందం ప్రతిధ్వనించే విధంగా విజయహాసాలు చేస్తుండాలి. 'శత్రువు మరణించాడు' అని అరుస్తూ ఉండాలి. దేవతలను పూజించి, వారిఆజ్ఞ(అనుమతి)తో రాజు యుద్ధానికి సిద్ధపడాలి.

ఇన్ద్రజాలం ప్రవక్ష్యామి ఇన్ద్రం కాలేన దర్శయేత్ ।
చతురఙ్గం బలం రాజా సహాయార్థం దివౌకసామ్ ॥16॥

తరువాత ఇంద్రజాలాన్ని గురించి చెప్తాను. రాజు సమయానుగుణంగా శత్రువులకు ఇంద్రజాలాన్ని ప్రదర్శించాలి. దానితో యుద్ధంలో తనకు సహాయంగా దేవతలసైన్యం గజ, రథ, అశ్వ, పదాతిగా చతురంగంగా వచ్చినట్లు చూపాలి.

బలం తు దర్శయేత్ ప్రాప్తం రక్తవృష్టిం చరేద్ రిపౌ ।
ఛిన్నాని రిపుశీర్షాణి ప్రాసాదాగ్రేషు దర్శయేత్ ॥17॥

తనసైన్యాన్ని సమస్తాన్నీ శత్రువులు భయపడేవిధంగా అధికంగా ఉన్నట్లు ప్రదర్శించాలి. శత్రువులలో రక్తం వర్షంలాగా కురిసినట్లు భ్రాంతి కలిగించాలి. శత్రువులతలలు నరికి, వాటిని ఎత్తయినమేడలమీద ఉంచి అందరికీ ప్రదర్శించాలి.

షాడ్గుణ్యం సమ్ప్రవక్ష్యామి తద్వరౌ సన్ధివిగ్రహౌ ।
సన్ధిశ్చ విగ్రహశ్చైవ యానమాసనమేవ చ ॥
ద్వైధీభావస్సంశ్రయశ్చ షడ్గుణాః పరికీర్తితాః ॥18॥

ఇంక షాడ్గుణ్యాన్ని (ఆరు గుణాల సముదాయాన్ని) వివరిస్తాను. ఆ ఆరుగుణాలలోనూ సంధి, విగ్రహం అనేవి రెండు శ్రేష్ఠమైనవి. 1. సంధి, 2. విగ్రహం, 3. యానం, 4. ఆసనం, 5. ద్వైధీభావం, 6. సంశ్రయం. ఈ ఆరుగుణాలను షడ్గుణాలు అని పేర్కొంటారు.

పణబన్ధస్స్మృతస్సన్ధిరపకారస్తు విగ్రహః ।
జిగీషోశ్శత్రువిషయే యానం యాత్రాభిధీయతే ॥19॥

పరస్పరం కొన్ని ఒప్పందాలు చేసుకుని కలిసిపోవడం సంధి. శత్రువుకు కీడు చేయడం విగ్రహం. జయించాలనే కోరికతో శత్రువు మీదికి సైన్యంతో దండయాత్రకు వెళ్లడం యానం.

విగ్రహేణ స్వకే దేశే స్థితిరాసనముచ్యతే ।
బలార్ధేన ప్రయాణం తు ద్వైధీభావస్స ఉచ్యతే ॥
ఉదాసీనో మధ్యమో వా సంశ్రయాత్ సంశ్రయస్స్మృతః ॥20॥

విరోధంతో శత్రువుకు అపకారం చేస్తూ, తనదేశంలోనే కదలకుండా ఉండడం ఆసనం. తనసైన్యంలో సగభాగం మాత్రం తీసుకుని శత్రువుపై యుద్ధానికి వెళ్ళడం ద్వైధీభావం. ఉదాసీనుడిని గాని, మధ్యస్థుడిని గాని (233 అ. 19, 18శ్లో) ఆశ్రయించడం సంశ్రయం.

సమేన సన్ధి రన్వేష్యో ఽహీనేన చ బలీయసా ।
హీనేన విగ్రహః కార్యస్స్వయం రాజ్ఞా బలీయసా ॥
తత్రాపి శుద్ధపార్ష్ణిస్తు బలీయాంసం సమాశ్రయేత్ ॥21॥

తనతో సమానమయిన బలం కలిగినవాడితోనూ, తనకంటె ఎక్కువ బలం కలిగినవాడితోనూ సంధి చేసుకోవాలి. తనకంటె బలవంతుడైనరాజు తనకంటె తక్కువ బలం కలిగినవాడితో తానే స్వయంగా విగ్రహం చేయాలి. బలహీనుడై, తనరాజ్యానికి ముందుండే రాజ్యం పరిపాలించే రాజుతో విరోధం కలిగిన శుద్ధుడైన పార్ష్ణిగ్రాహుడు బలవంతుడైన రాజును ఆశ్రయించాలి. అంటే సంశ్రయం చేయాలి.

ఆసీనః కర్మ విచ్ఛేదం శక్తః కర్తుం రిపోర్యదా ।
అశుద్ధపార్ష్ణిశ్చాసీత విగృహ్య వసుధాధిపః ॥22॥

అసాధువైన పార్ష్ణిగ్రాహరాజు శత్రువు కార్యకలాపాలను నాశనం చేయగలిగిన సామర్థ్యం కలిగినపుడు అతడితో విగ్రహం పెట్టుకుని, ఆ రాజును ఇబ్బందిపెడుతూ తన రాజ్యంలోనే ఆసీనుడై ఉండాలి.

అశుద్ధపార్ష్ణిర్బలవాన్ ద్వైధీభావం సమాశ్రయేత్ ॥23॥

మిక్కిలిసాధువయిన పార్ష్ణిగ్రాహరాజు బలవంతుడయితే ద్వైధీభావాన్ని ఆచరించాలి.

బలినా విగృహీతస్తు యోఽసన్దేహేన పార్థివః ।
సంశ్రయస్తేన వక్తవ్యో గుణానామధమో గుణః ॥24॥

బలవంతుడైన రాజుతో విరోధం ఏర్పడిన రాజు ఏమాత్రం సందేహించకుండా, బలవంతుడైన వేరొక రాజును ఆశ్రయించాలి. నిజానికి సంశ్రయం అనేది సంధి, విగ్రహం మొదలయిన గుణాలన్నిటిలోనూ అధమమైనది.

బహుక్షయవ్యయాయాసం తేషాం యానం ప్రకీర్తితమ్ ।
బహులాభకరం పశ్చాత్ తదా రాజా సమాశ్రయేత్ ॥25॥

సంధి విగ్రహాదులైన ఆరు గుణాలలోనూ యానం అనే దానిలో సైన్యం అధికంగా నశించిపోతుంది. ధనం అధికంగా వ్యయం అయిపోతుంది. శారీరకాది బాధలు కూడ అధికంగా కలుగుతాయి. జయం నిశ్చయం అయినపుడే యుద్ధయాత్రకు వెళ్తారు. కాబట్టి యానం వలన తరువాత చాల లాభాలు కలుగుతాయి. దానికి తగిన సామర్థ్యం ఉన్నపుడు రాజు యానం అనే దాన్ని ఆశ్రయించాలి.

సర్వశక్తివిహీనస్తు తదా కుర్యాత్తు సంశ్రయమ్ ॥26॥

అన్నివిధాలుగానూ శక్తి లేని సమయంలో అంటే గత్యంతరం లేకపోయినపుడు మాత్రమే సంశ్రయం అనే గుణాన్ని ఆశ్రయించాలి.

ఇత్యాది మహాపురాణే ఆగ్నేయే షాడ్గుణ్యవర్ణనం నామ చతుస్త్రింశదధికద్విశతతమోఽధ్యాయః ॥234॥

అగ్నిమహాపురాణంలో షాడ్గుణ్యవర్ణనం అనే రెండువందల ముప్పైనాల్గవ అధ్యాయం సమాప్తం.

పఞ్చత్రింశాధికద్విశతతమోఽధ్యాయః - రెండువందల ముప్పైఐదవ అధ్యాయం

ప్రాత్యాహ్నికరాజకర్మకథనమ్ - రాజుగారి దినచర్య

పుష్కర ఉవాచ - పరశురాముడితో పుష్కరుడు ఈ విధంగా చెప్తున్నాడు.

అజస్రం కర్మ వక్ష్యామి దినం ప్రతి యదాచరేత్ ।
ద్విముహూర్తావశేషాయాం రాత్రౌ నిద్రాం త్యజేన్నృపః ॥1॥

పరశురామా! రాజు ప్రతిరోజూ చేయవలసిన పనులను గురించి చెప్తాను. రాత్రి ఇంకా రెండు ముహూర్తాలు అంటే నాలుగు గడియలు (96నిమిషాలు) మిగిలిఉండగా రాజు నిద్ర మేలుకోవాలి.

వాద్యవన్దిస్వనైర్గీతైః పశ్యేద్గూఢాంస్తతో నరాన్ ।
విజ్ఞాయతే న యే లోకాస్తదీయా ఇతి కేనచిత్ ॥2॥

వందిమాగధులు వివిధమైన మంగళవాద్యాలు వాయిస్తూ, స్తుతిగీతాలు పాడుతుండగా మేలుకోవాలి. తరువాత గూఢచారులను కలవాలి. ఈ గూఢచారులు రాజుగారిమనుషులు అనే విషయం ఇతరులకు ఎవరికీ తెలియగూడదు.

ఆయవ్యయస్య శ్రవణం తతః కార్యం యథావిధి ।
వేగోత్సర్గం తతః కృత్వా రాజా స్నానగృహం వ్రజేత్ ॥3॥

ఆ తరువాత రాజు యథావిధిగా రాజకోశానికి వచ్చిన ఆదాయం, దానినుండి అయిన ఖర్చు వివరాలు వినాలి. ఆ తరువాత కాలకృత్యాలు తీర్చుకోవాలి. ఆ పిదప స్నానభవనానికి వెళ్లాలి.

స్నానం కుర్యాన్నృపః పశ్చాద్దన్తధావనపూర్వకమ్ ।
కృత్వా సన్ధ్యాం తతో జప్యం వాసుదేవం ప్రపూజయేత్ ॥4॥

అక్కడ ముందుగా పళ్లు తోముకుని, ఆ తరువాత స్నానం చేయాలి. పిదప ప్రాతస్సంధ్యావందనం చేయాలి. ఆ పిదప శ్రీమహావిష్ణువును పూజించాలి.

వహ్నౌ పవిత్రాన్ జుహుయాత్తర్పయేదుదకైః పితౄన్ ।
దద్యాత్ సకాఞ్చనీం ధేనుం ద్విజాశీర్వాదసంయుతః ॥5॥

ఆ తరువాత దర్భలు మొదలైన పవిత్రద్రవ్యాలను అగ్నిలో హోమం చేయాలి. ఆ పిదప పితృదేవతలను ఉద్దేశించి నీళ్లతో తర్పణం చేయాలి. పిదప బ్రాహ్మణులకు బంగారంతో అలంకరించిన పాడిఆవును దానం చేసి, వారి ఆశీర్వచనాలు పొందాలి.

అనులిప్తోఽలఙ్కృతశ్చ ముఖం పశ్యేచ్చ దర్పణే ।
ససువర్ణే ఘృతే రాజా శృణుయాద్దివసాదికమ్ ॥6॥

ఆ పిదప ఒంటికి చందనం మొదలైన సుగంధద్రవ్యాలు పూసుకుని, వివిధమైన ఆభరణాలను చక్కగా అలంకరించుకుని, అద్దంలో ముఖం చూసుకోవాలి. ఆ తరువాత బంగారుగిన్నెలోని ఆవునేతిలో ముఖం చూసుకోవాలి. తరువాత ఆరోజు తిథివారనక్షత్రాదివివరాలను ఆరోజు చేయవలసిన రాజకార్యాలను గురించి వినాలి.

ఔషధం భిషజోక్తం చ మఙ్గలాలమ్భనం చరేత్ ।
పశ్యేద్గురుం తేన దత్తాశీర్వాదోఽథ వ్రజేత్ సభామ్ ॥7॥

పిదప వైద్యుడు చెప్పిన మందును సేవించాలి. శుభంకరమయిన వస్తువులను స్పృశించాలి. ఆచార్యులను దర్శనం చేసుకోవాలి. వారి ఆశీర్వచనం పొందాలి. ఆ తరువాత కొలువుకూటానికి వెళ్లాలి.

తత్రస్థో బ్రాహ్మణాన్ పశ్యేదమాత్యాన్ మన్త్రిణ స్తథా ।
ప్రకృతీశ్చ మహాభాగ ప్రతీహారనివేదితాః ॥8॥

రాజసభలో ఉండి బ్రాహ్మణులను, అమాత్యులను, మంత్రులను కనుగొనాలి. ద్వారపాలకులు రాజదర్శనంకోసం వచ్చిన ప్రజలను గూర్చి విన్నవించగా, ఆ ప్రజలను చూడాలి.

శ్రుత్వేతిహాసం కార్యాణి కార్యాణాం కార్యనిర్ణయమ్ ।
వ్యవహారం తతః పశ్యేన్మన్త్రం కుర్యాత్తు మన్త్రిభిః ॥9॥

తరువాత ఇతిహాసం విని, చేయవలసిన రాజకార్యాలను గూర్చి ఆలోచించి నిర్ణయం చేయాలి. ఆ తరువాత దానిని అమలు చేసే విధానం చూడాలి. మంత్రులతో కలిసి రాజ్యవిషయాలను గురించి ఆలోచన చేయాలి.

నైకేన సహితః కుర్యాన్న కుర్యాద్బహుభిస్సహ ।
న చ మూర్ఖైర్న చానాప్తైర్గుప్తం న ప్రకటం చరేత్ ॥10॥

ఏ విషయాన్ని గూడ ఒక్కడితో ఆలోచించగూడదు. అలాగని చాలమందితో కూర్చుని ఆలోచించగూడదు. మూర్ఖులతోనూ, ఆత్మీయులు కానివారితోనూ ఆలోచించగూడదు. రహస్యాలు ఎవరికీ తెలియనీయగూడదు.

మన్త్రం స్వాధిష్ఠితం కుర్యాద్యేన రాష్ట్రం న బాధతే ॥11॥

రహస్యమైన ఆలోచనలు తన ఒక్కడి అధీనంలో మాత్రమే ఉంచుకోవాలి. అవి ఇతరులకు తెలియకుండా ఉంటేనే రాజ్యానికి బాధ కలగకుండా ఉంటుంది.

ఆకారగ్రహణే రాజ్ఞో మన్త్రరక్షా పరా మతా ।
ఆకారైరిఙ్గితైః ప్రాజ్ఞా మన్త్రం గృహ్ణన్తి పణ్డితాః ॥12॥

ఆలోచనలను రహస్యంగా ఉంచడంలో రాజు ఆకారం నిర్వికారంగా ఉంచుకోవడం ప్రధానం. బుద్ధిమంతులు ఆకారంచేతను, చేష్టలతోనూ రాజు ఆలోచనలు గ్రహిస్తారు. (అందువలన రాజు తనమనసు ఎవరికీ తెలియకుండా ఎప్పుడూ గంభీరంగా ఉండాలి.)

సాంవత్సరాణాం వైద్యానాం మన్త్రిణాం వచనే రతః ।
రాజా విభూతిమాప్నోతి ధారయన్తి నృపం హితే ॥13॥

జ్యోతిష్కులు, వైద్యులు, మంత్రులు చెప్పిన మాటలమీద రాజుకు శ్రద్ధాసక్తులు ఉండాలి. వారిమాటలు వినడంవలన రాజుకు సంపదలు కలుగుతాయి. వారు రాజును మేలు కలిగే దారిలో నడుపుతారు.

మన్త్రం కృత్వాథ వ్యాయామం చక్రే యానే చ శస్త్రకే ॥14॥

మంత్రాంగం పూర్తి అయిన తరువాత రాజు సైన్యాన్ని సిద్ధపరచడంతోనూ, రథగజాదివాహనాలు నడపడంతోనూ, ఆయుధాలు ప్రయోగించడంతోనూ వ్యాయామం చేయాలి.

నియుద్ధాదౌ నృపస్స్నాతః పశ్యేద్విష్ణుం సుపూజితమ్ ।
హుతం చ పావకం పశ్యేద్ విప్రాన్ పశ్యేత్ సుపూజితాన్ ॥15॥

యుద్ధం మొదలైన సందర్భాలలో రాజు ఉదయమే స్నానం చేసి, చక్కగా పూజింపబడిన శ్రీమహావిష్ణువును దర్శించుకోవాలి. తరువాత హెూమం చేసిన అగ్నిహెూత్రాన్ని, చక్కగా పూజించిన బ్రాహ్మణులను దర్శించుకోవాలి.

భూషితో భోజనం కుర్యాద్ దానాద్యైస్సుపరీక్షితమ్ ।
భుక్త్వా గృహీతతామ్బూలో వామపార్శ్వేన సంస్థితః ॥16॥

శాస్త్రాణి చిన్తయేద్దృష్ట్వా యోధాన్ కోష్ఠాయుధం గృహమ్ ।
అన్వాస్య పశ్చిమాం సన్ధ్యాం కార్యాణి చ విచిన్త్య తు ॥17॥

ఆ తరువాత చక్కగా అలంకరించుకుని, చక్కగా పరీక్షించి ఇబ్బంది లేదని నిర్ణయించిన భోజనం చేయాలి. భోజనం చేసినతరువాత తాంబూలం వేసుకోవాలి. తరువాత ఎడమవైపుగా ఉండి – వివిధశాస్త్రాలను గూర్చి విచారించాలి. ఆ పిదప యోధులను, ఆయుధాగారాన్ని పరిశీలించాలి. ఆ పిదప సాయంసంధ్యను ఉపాసించి, ఆ తరువాత చేయవలసిన కార్యాలను గూర్చి చింతించాలి.

చరాన్ సమ్ప్రేష్య భుక్త్వాన్నమన్తఃపురచరో భవేత్ ।
వాద్యగీతై రక్షితోఽన్యైరేవం నిత్యం చరేన్నృపః ॥18॥

తరువాత గూఢచారులను వారి వారి కార్యక్రమాలపై పంపి, రాత్రిభోజనం చేయాలి. అనంతరం అంతఃపురంలోకి వెళ్లాలి. వాద్యాలతోనూ, గీతాలతోనూ ఆనందించి, అంగరక్షకులరక్షణలో నిద్రించాలి. రాజు ప్రతిరోజూ తన దినచర్యను ఈక్రమంలో నడిపించాలి.

ఇత్యాది మహాపురాణే ఆగ్నేయే ప్రాత్యాహ్నికరాజకర్మకథనం నామ పఞ్చత్రింశాధికద్విశతతమోఽధ్యాయః॥235॥

అగ్నిమహాపురాణంలో రాజుగారి దినచర్య అనే రెండువందల ముప్పైఐదవ అధ్యాయం సమాప్తం.

షట్‌త్రింశదధికద్విశతతమోఽధ్యాయః - రెండువందల ముప్పైఆరవ అధ్యాయం

రణదీక్షావర్ణనమ్ - యుద్ధదీక్షావర్ణనం

పుష్కర ఉవాచ - పరశురాముడితో పుష్కరుడు ఈ విధంగా చెప్తున్నాడు.

యాత్రావిధానపూర్వం తు వక్ష్యే సాఙ్గ్రామికం విధిమ్ ।
సప్తాహేన యదా యాత్రా భవిష్యతి మహీపతేః ॥
పూజనీయో హరిశ్శమ్భుర్మోదకాద్యైర్వినాయకః ॥1॥

పరశురామా! ఇపుడు యుద్ధయాత్రకు వెళ్ళేవిధానాన్ని, తరువాత యుద్ధం చేసే విధానాన్ని చెప్తాను. ఇంక వారం రోజులలో యుద్ధానికి వెళ్లాలి అన్నసమయంలో అంటే యుద్ధయాత్రకు ఏడురోజులు ముందటిరోజున మహారాజు శ్రీమహావిష్ణువును, పరమేశ్వరుడినీ పూజించాలి. కుడుములు మొదలయినవాటితో విఘ్నేశ్వరుడిని పూజించాలి.

ద్వితీయేఽహని దిక్పాలాన్ సమ్పూజ్య శయనం చరేత్ ।
శయ్యాయాం వా తదగ్రేఽథ దేవాన్ ప్రార్చ్య మనుం స్మరేత్ ॥2॥

ఆ మరునాడు పగటిసమయంలో దిక్పాలకులను పూజించాలి. రాత్రి నిద్రించాలి. నిద్రకు వెళ్లే ముందు కాని, లేదా మంచం మీద కూర్చున్న తరువాత కాని దేవతలను చక్కగా ప్రార్థించాలి. ఆతరువాత పడుకోబోయే ముందు ఈ క్రింది మంత్రాన్ని స్మరించుకోవాలి.

నమశ్శమ్భో త్రినేత్రాయ రుద్రాయ వరదాయ చ ।
వామనాయ విరూపాయ స్వప్నాధిపతయే నమః ॥3॥

పరమేశ్వరా! నీకు నమస్కారం. మూడు కన్నులు కలిగినవాడు, ఇష్టమైన వరాలను ప్రసాదించేవాడు, పొట్టి ఆకారంలో ఉన్నవాడు, విశిష్టమైన రూపంలో ఉన్నవాడు, కలలకు అధిష్ఠానదేవత అయిన రుద్రుడికి నమస్కారం.

భగవన్ దేవదేవేశ శూలభృద్ వృషవాహన ।
ఇష్టానిష్టే మమాచక్ష్వ స్వప్నే సుప్తస్య శాశ్వత ॥4॥

భగవంతుడా! దేవతలకు, దేవతల నాయకులకు కూడ ప్రభువైనవాడా! త్రిశూలం ధరించినవాడా! ఎద్దును వాహనంగా కలిగినవాడా! భూతభవిష్యద్వర్తమానకాలాలన్నింటిలోనూ ఉండేవాడా! నిద్రించిన నాకు కలలో కనిపించి ఈ యుద్ధంలో నాకు విజయం కలుగుతుందో, అపజయం కలుగుతుందో చెప్పు.

యజ్జాగ్రతో దూరమితి పురోధా మన్త్రముచ్చరేత్ ॥5॥

అపుడు పురోహితుడు 'యజ్జాగ్రతో దూరముపైతి లోకాన్' అనే మంత్రాన్ని ఉచ్చరిస్తాడు.

తృతీయేఽహని దిక్పాలాన్ రుద్రాంస్తాన్ దిక్పతీన్ యజేత్ ।
గ్రహాన్ యజేచ్చతుర్థేఽహ్ని పఞ్చమే చాశ్వినౌ యజేత్ ॥6॥

ఇంక ఆ పైన మూడవరోజు సమస్తదిక్కులలోనుండి లోకాలను రక్షించే ఏకాదశరుద్రులను, అష్టదిక్పాలకులను పూజించాలి. నాలుగవరోజున నవగ్రహాలను అర్చించాలి. అయిదవరోజున అశ్వినీదేవతలిద్దరినీ పూజించాలి.

మార్గే యా దేవతాస్తాసాం నద్యాదీనాం చ పూజనమ్ ।
దివ్యాన్తరిక్షభౌమస్థదేవానాం చ తథా బలిః ॥7॥

యుద్ధయాత్రాసమయంలో దారిలో ఉన్నదేవతలను, నదులు మొదలైనవాటినీ పూజించాలి. దేవలోకంలోనూ, అంతరిక్షంలోనూ, భూమిమీదనూ (భూర్ భువ స్సుర్లోకాలలో) ఉన్న దేవతలకు బలి ఇవ్వాలి.

రాత్రౌ భూతగణానాం చ వాసుదేవాది పూజనమ్ ।
భద్రకాల్యాశ్శ్రియః కుర్యాత్ ప్రార్థయేత్ సర్వదేవతాః ॥8॥

రాత్రిసమయంలో భూర్భువస్సుర్లోకాలలో ఉన్న భూతగణాలకు కూడ బలి ఇవ్వాలి. వాసుదేవుడు మొదలైన వ్యూహదేవతలను పూజించాలి. భద్రకాళికనూ, లక్ష్మీదేవినీ పూజించాలి. యుద్ధంలో తనకు విజయాన్ని ఇవ్వమని సమస్తదేవతలను (ఈ విధంగా) ప్రార్థించాలి.

వాసుదేవస్సఙ్కర్షణః ప్రద్యుమ్నశ్చానిరుద్ధకః ।
నారాయణోఽబ్జజో విష్ణుర్నారసింహో వరాహకః ॥9॥

వాసుదేవుడు, సంకర్షణుడు, ప్రద్యుమ్నుడు, అనిరుద్ధుడు (చతుర్వ్యూహాలు), నారాయణుడు, బ్రహ్మ, విష్ణువు, నారసింహుడు, వరాహస్వామి,

శివ ఈశస్తత్పురుషో హ్యఘోరో రామ సద్యజః ।
సూర్యస్సోమః కుజశ్చాన్ద్రిర్జీవశ్శుక్రశ్శనైశ్చరః ॥10॥

పరశురామా! ఆ తరువాత శివుడు, ఈశానుడు, తత్పురుషుడు, అఘోరుడు, సద్యోజాతుడు (పంచబ్రహ్మలు), సూర్యుడు, చంద్రుడు, కుజుడు, బుధుడు, గురువు, శుక్రుడు, శనైశ్చరుడు,

రాహుః కేతుర్గణపతిస్సేనానీశ్చణ్డికా హ్యుమా ।
లక్ష్మీస్సరస్వతీ దుర్గా బ్రహ్మాణీ ప్రముఖా గణాః ॥11॥

రాహువు, కేతువు (నవగ్రహదేవతలు), గణనాయకుడు, కుమారస్వామి, చండి, ఉమ, లక్ష్మి, సరస్వతి, వాణి మొదలయిన దేవగణాలు,

రుద్రా ఇన్ద్రాదయో వహ్నిర్నాగాస్తార్క్ష్యోఽపరే సురాః ।
దివ్యాన్తరిక్షభూమిష్ఠా విజయాయ భవన్తు మే ॥12॥

ఏకాదశరుద్రులు, ఇంద్రుడు మొదలయిన అష్టదిక్పాలకులు, అగ్నిదేవుడు, నాగదేవతలు, గరుత్మంతుడు, ఇంకా భూర్భువస్స్వర్లోకాలలో ఉన్నదేవతలు అందరూ నాకు విజయాన్ని కలిగింతురు గాక!

మర్దయన్తు రణే శత్రూన్ సమ్ప్రగృహ్యోపకారకమ్ ।
సపుత్రమాతృభృత్యోఽహం దేవా వశ్శరణం గతః ॥13॥

ఈ దేవతలందరూ నా పూజలను, బలులను స్వీకరించి, యుద్ధరంగంలో నాశత్రువులను నశింపజేయుదురు గాక! కుమారులతోనూ, తల్లులతోనూ, పరివారంతోనూ, నేను దేవతలయిన మీ అందరిని శరణు వేడుకుంటున్నాను.

చమూనాం పృష్ఠతో గత్వా రిపునాశో నమోఽస్తు వః ।
వినివృత్తః ప్రదాస్యామి దత్తాదభ్యధికం బలిమ్ ॥14॥

మీరందరూ నా శత్రువులసైన్యం వెనకగా వచ్చి, వారిని నాశనం చేయండి. మీకు నమస్కారం. యుద్ధంలో విజయం సాధించి, ఇంటికి తిరిగి వచ్చిన తరువాత మీకు ఇప్పుడు ఇచ్చిన దానికంటె ఇంకా అధికంగా బలులను సమర్పిస్తాను. (అని ప్రార్థించాలి)

షష్ఠేఽహ్ని విజయస్నానం కర్తవ్యం చాభిషేకవత్ ।
యాత్రాదినే సప్తమే చ పూజయేచ్చ త్రివిక్రమమ్ ॥15॥

ఆఱవ రోజున అభిషేకం చేసిన విధానంగా విజయస్నానం చేయాలి. యుద్ధయాత్ర చేయవలసిన ఏడవ రోజున త్రివిక్రముడిని పూజించాలి.

నీరాజనోక్తమన్త్రైశ్చ హ్యాయుధం వాహనం యజేత్ ।
పుణ్యాహజయశబ్దేన మన్త్రమేతన్నిశామయేత్ ॥16॥

నీరాజనానికి ఉద్దేశించిన మంత్రాలతో యుద్ధంలో ఉపయోగించే ఆయుధాలనూ, ఏనుగులు మొదలైన వాహనాలను పూజించాలి. పుణ్యాహవాచనాలతోనూ, జయజయధ్వానాలతోనూ రాజుకు ఈ క్రింది మంత్రాన్ని పురోహితులు వినిపించాలి.

దివ్యాన్తరిక్షభూమిష్ఠాస్సన్త్వాయుర్దాస్సురాశ్చ తే ।
దేవసిద్ధిం ప్రాప్నుహి త్వం దేవయాత్రాస్తు సా తవ ॥17॥

స్వర్గలోకంలోనూ, అంతరిక్షలోకంలోనూ, భూలోకంలోనూ ఉన్నదేవతలందరూ నీకు ఉత్తమమైన ఆయుర్దాయాన్ని ఇచ్చెదరు గాక! దేవతల అనుగ్రహంతో నీకు విజయం సిద్ధించును గాక! ఈ యుద్ధయాత్రలో దేవతలు నీతో కలిసిరాగా ఇది దేవయాత్ర అగును గాక!

రక్షన్తు దేవతాస్సర్వా ఇతి శ్రుత్వా నృపో వ్రజేత్ ।
గృహీత్వా సశరం చాపం ధనుర్నాగేతి మన్త్రతః ॥18॥

దేవతలందరూ నిన్ను రక్షింతురు గాక! బ్రాహ్మణులు చేసిన ఈ ఆశీర్వచనమంత్రాలు విని మహారాజు 'ధనుర్నాగా (ధన్వనాగా)' అనే మంత్రంతో బాణమూ, ధనుస్సూ పట్టుకుని యుద్ధయాత్రకు బయలుదేరాలి.

తద్విష్ణోరితి జప్త్వాథ దద్యాద్ రిపుముఖే పదమ్ ।
దక్షిణం పదం ద్వాత్రింశద్దిక్షు ప్రాచ్యాదిక్రమాత్ ॥19॥

'తద్విష్ణోః పరమం పదమ్' అనే మంత్రం జపించి, శత్రువుల ముఖం మీద అంటే శత్రుసైన్యం వైపుగా కాలుమోపాలి. శత్రువులకు ముప్పైరెండు అడుగులదూరంలో ఉండేవిధంగా కుడికాలు ముందుకు ఉంచి నిలవాలి. తూర్పు, దక్షిణం, పడమర, ఉత్తరం అనే క్రమంలో నాలుగుదిక్కులలోనూ –

నాగం రథం హయం చైవ ధుర్యాంశ్చైవారుహేత్ క్రమాత్ ।
ఆరుహ్య వాద్యైర్గచ్ఛేత్తు పృష్ఠతో నావలోకయేత్ ॥20॥

ఏనుగులు, రథాలు, గుఱ్ఱాలు, ఆయుధాలు మొదలయిన బరువులను మోసే జంతువులను ఉంచి, వాటిపై అధిరోహించాలి. వాహనాలను ఎక్కిన తరువాత మంగళవాద్యాలు మోగుతుండగా ముందుకు వెళ్లాలి. బయలుదేరిన తరువాత వెనకకు తిరిగి చూడగూడదు.

క్రోశమాత్రం గతస్తిష్ఠేత్ పూజయేద్దేవతా ద్విజాన్ ।
పరదేశం వ్రజేత్ పశ్చాదాత్మసైన్యం హి పాలయన్ ॥21॥

యుద్ధానికి బయలుదేరిన మహారాజు నాలుగుమైళ్లదూరం వెళ్లిన తరువాత ఆగాలి. అక్కడ దేవతలనూ, బ్రాహ్మణులనూ పూజించాలి. ఆ తరువాత శత్రుదేశం మీదికి వెళ్లాలి. తన సైన్యానికి ఏవిధమైన నష్టం కలగకుండా రక్షించుకుంటూ ఉండాలి.

రాజా ప్రాప్య విదేశం తు దేశపాలం తు పాలయేత్ ।
దేవానాం పూజనం కుర్యాన్న ఛిన్ద్యాదాయమత్ర తు ॥22॥

శత్రువును జయించి, వారి దేశంలో ప్రవేశించిన తరువాత మహారాజు ఆ దేశాన్ని పరిపాలించే వాడిని కాపాడాలి. (ఓడిపోయినాడు కదా అని శత్రురాజును అవమానించడం మొదలైనవి చేయరాదు) విజయం కలగడానికి కారణమైన దేవతలను పూజించాలి. ఆ దేశంలోనివారికి ఆదాయం నష్టం వచ్చేపని చేయగూడదు.

నావమానయేత్తద్దేశ్యానాగత్య స్వపురం పునః ।
జయం ప్రాప్యార్చయేద్దేవాన్ దద్యాద్దానాని పార్థివః ॥23॥

తాను జయించిన రాజ్యంలోని ప్రజలను కూడ అవమానించగూడదు. యుద్ధంలో విజయం సాధించి, తిరిగి స్వదేశానికి వచ్చిన రాజు తన దేశంలో దేవతలను పూజించాలి. అర్థులందరికీ కావలసినవి దానం చేయాలి.

ద్వితీయేஉహని సఙ్గ్రామో భవిష్యతి యదా తదా ।
స్నాపయేద్ గజమశ్వాది యజేద్దేవం నృసింహకమ్ ॥24॥

రేపు యుద్ధం ప్రారంభమవుతుందనగా ముందరిరోజున తనసైన్యంలోని ఏనుగులు, గుఱ్ఱాలు, మొదలైన వాహనాలకు శుభ్రంగా స్నానం చేయించాలి. ఆతరువాత నరసింహస్వామిని పూజించాలి.

ఛత్రాదిరాజలిఙ్గాని శస్త్రాణి నిశి వై గణాన్ ।
ప్రాతర్నృసింహకం పూజ్య వాహనాద్యమశేషతః ॥25॥

యుద్ధానికి ముందురోజు రాత్రి ఛత్రం, చామరం మొదలైన రాజలాంఛనాలనూ, ఆయుధాలనూ, భూతగణాలనూ పూజించాలి. ఆ మర్నాడు ఉదయమే నరసింహస్వామినీ, వాహనాలను అన్నింటినీ శ్రద్ధగా పూజించాలి.

పురోధసా హుతం పశ్యేద్ వహ్నిం హుత్వా ద్విజాన్ యజేత్ ।
గృహీత్వా సశరం చాపం గజాద్యారుహ్య వై వ్రజేత్ ॥26॥

తన పురోహితుడు హోమం చేసిన అగ్నిని దర్శించుకోవాలి. ఆ తరువాత తాను కూడా ఆ అగ్నిలో హోమం చేయాలి. పిదప బ్రాహ్మణులను పూజించాలి. బాణం, ధనుస్సు తీసుకుని, ఏనుగు మొదలైన వాహనాలపై ఎక్కి యుద్ధానికి బయలుదేరాలి.

దేశే త్వదృశ్యశ్శత్రూణాం కుర్యాత్ ప్రకృతికల్పనామ్ ।
సంహతాన్యోధయేదల్పాన్ కామం విస్తారయేద్ బహూన్ ॥27॥

శత్రుదేశంలోని శత్రువులకు ఎవరికీ కనబడకుండా (తెలియరాకుండా) తనసైన్యాన్ని యుద్ధం చేయడానికి వీలుగా ఏర్పాటుచేసుకోవాలి. తనసైన్యం కొద్దిసంఖ్యలో ఉంటే అందరినీ ఒకచోట చేర్చి వారితో యుద్ధం చేయించాలి. సైన్యం అధికంగా ఉన్నపుడు వారిని యుద్ధరంగం అంతటా పరుచుకున్నట్లుగా నిలపాలి.

సూచీముఖమనీకం స్యాదల్పానాం బహుభిస్సహ ।
వ్యూహాః ప్రాణ్యఙ్గరూపాశ్చ ద్రవ్యరూపాశ్చ కీర్తితాః ॥28॥

కొద్దిమందిసైన్యంతో చాల ఎక్కువసంఖ్యలో ఉన్న శత్రువులసైన్యాన్ని గెలవాలంటే సూచీముఖం అనే(యుద్ధ)వ్యూహాన్ని అనుసరించాలి. యుద్ధవ్యూహాలు ప్రాణ్యంగరూపాలు (ప్రాణుల అవయవాల రూపంలో ఉండేవి), ద్రవ్యరూపాలు (వస్తురూపంలో ఉండేవి) అని రెండురకాలుగా ప్రసిద్ధమై ఉన్నాయి.

గరుడో మకరవ్యూహశ్చక్రశ్శ్యేనస్తథైవ చ ।
అర్ధచన్ద్రశ్చ వజ్రశ్చ శకటవ్యూహ ఏవ చ ॥29॥

గరుడవ్యూహం, మకరవ్యూహం, చక్రవ్యూహం, శ్యేనవ్యూహం, అర్ధచంద్రవ్యూహం, వజ్రవ్యూహం, శకటవ్యూహం,

మణ్డలస్సర్వతోభద్రస్సూచీవ్యూహాశ్చ తే నవ ।
వ్యూహానామథ సర్వేషాం పఞ్చధా సైన్యకల్పనా ॥30॥

సర్వతోభద్రమండలవ్యూహం, సూచీముఖవ్యూహం అని సైన్యవ్యూహాలు తొమ్మిది విధాలుగా ఉంటాయి. ఈ వ్యూహాలన్నింటిలోనూ సైన్యాన్ని నిలిపే విధం మాత్రం అయిదువిధాలుగా ఉంటుంది.

ద్వౌ పక్షావనుపక్షౌ ద్వావవశ్యం పఞ్చమం భవేత్ ।
ఏకేన యది వా ద్వాభ్యాం భాగాభ్యాం యుద్ధమాచరేత్ ॥31॥

సైన్యాన్ని పక్షాలు రెండుగా, అనుపక్షాలు రెండుగా, ఐదవభాగంగా మరొకటి ఇలా అయిదుభాగాలు చేయాలి. అందులో ఒకటి, లేదా రెండుభాగాలసైన్యంతో యుద్ధం చేయాలి.

భాగత్రయం స్థాపయేత్తు తేషాం రక్షార్థమేవ చ ।
న వ్యూహకల్పనా కార్యా రాజ్ఞో భవతి కర్హిచిత్ ॥32॥

మిగిలిన మూడుభాగాలసైన్యాన్ని యుద్ధం చేస్తున్న సైనికులకు రక్షణగా ప్రత్యేకంగా ఉంచాలి. ఎట్టి పరిస్థితులలో కూడ రాజును సైన్యవ్యూహాలలో చేర్చగూడదు.

మూలచ్ఛేదే వినాశస్స్యాన్న యుధ్యేచ్చ స్వయం నృపః ।
సైన్యస్య పశ్చాత్తిష్ఠేత్తు క్రోశమాత్రే మహీపతిః ॥33॥

సైన్యానికి (రాజ్యానికీ) రాజే ఆధారం. మూలమయినరాజు నశిస్తే మొత్తం సైన్యం (రాజ్యం) నశించిపోతుంది. అందుచేత రాజు స్వయంగా యుద్ధం చేయగూడదు. సైన్యానికి వెనకవైపున నాలుగు మైళ్లదూరంలో స్థిరంగా ఉండాలి.

భగ్నసన్ధారణం తత్ర యోధానాం పరికీర్తితమ్ ।
ప్రధానభఙ్గే సైన్యస్య నావస్థానం విధీయతే ॥34॥

అందరికంటె వెనకగా ఉన్న రాజు యుద్ధంలో ప్రాణభయంతో పారిపోతున్న సైనికులను ఉత్సాహపరిచి, తిరిగి యుద్ధానికి సిద్ధం చేసి పంపాలి. సైన్యానికి ప్రధానాధ్యక్షుడయిన రాజుకు అపాయం జరిగితే సైన్యం ఎంత ఉన్నా యుద్ధంలో నిలవలేదు.

న సంహతాన్న విరలాన్ యోధాన్ వ్యూహే ప్రకల్పయేత్ ।
ఆయుధానాం తు సమ్మర్దో యథా న స్యాత్ పరస్పరమ్ ॥35॥

యుద్ధవ్యూహంలో సైనికులను మరీ దగ్గర దగ్గరగా ఉంచగూడదు. అలాగని చాలా దూరం దూరంగా అక్కడ ఒకళ్ళు, అక్కడ ఒకళ్లు అనేవిధంగా కూడ ఉంచగూడదు. తమసైనికులు ప్రయోగించిన ఆయుధాలు గుంపులై ఒకదానికి ఒకటి తగిలేవిధంగా ఉండనంతదూరంలో నిలపాలి.

భేత్తుకామః పరానీకం సంహతైరేవ భేదయేత్ ।
భేదరక్ష్యాః పరేణాపి కర్తవ్యా సంహతాస్తథా ॥36॥

శత్రువుల సైన్యాన్ని నిర్మూలించగోరినవాడు తనసైన్యాన్ని సంఘటితం చేసి మాత్రమే నాశనం చేయాలి. అదే విధంగా శత్రువులు తనసైన్యాన్ని నిర్మూలించడానికి ప్రయత్నించినపుడు కూడ తన సైన్యాన్ని సంఘటితం చేసే ఎదుర్కోవాలి.

వ్యూహం భేదావహం కుర్యాత్ పరవ్యూహేషు చేచ్ఛయా ।
గజస్య పాదరక్షార్థాశ్చత్వారస్తు తథా ద్విజ ॥37॥

బ్రాహ్మణోత్తమా! పరశురామా! శత్రువుల యుద్ధవ్యూహాలలో గందరగోళం కలిగించే విధంగా తన యుద్ధవ్యూహాన్ని రాజు బుద్ధిపూర్వకంగా ఏర్పాటు చేసుకోవాలి. సైన్యంలోని ఏనుగుల భాగాన్ని రక్షించడానికి నాలుగు రథాలను ఏర్పాటు చేయాలి. (ఒక్కొక్క ఏనుగు రక్షణకు దానివెనుక నాలుగు రథాలు ఉండాలి)

రథస్య చాశ్వాశ్చత్వారస్సమాస్తస్య చ చర్మిణః ।
ధన్వినశ్చర్మిభిస్తుల్యాః పురస్తాచ్చర్మిణో రణే ॥38॥

అదే విధంగా ఒకరథాన్ని (రథికుడిని) కాపాడడానికి దానివెనుక నాలుగు గుఱ్ఱాలను ఉంచాలి. అలాగే ఒక గుఱ్ఱాన్ని రక్షించడానికి దాని వెనుక నలుగురు బంటులను ఉంచాలి. వారు కత్తి, డాలు ధరించి ఉండాలి. చర్మాయుధాన్ని ధరించిన వారికి ముందుగా నలుగురు ధనుస్సును ధరించినవారు-ధనుర్విద్యావేత్తలు ఉండాలి. వీరిద్దరూ సమానంగా అశ్వబలాన్ని రక్షిస్తారు.

పృష్ఠతో ధన్వినః పశ్చాద్ధన్వినాం తురగా రథాః ।
రథానాం కుఞ్జరాః పశ్చాద్దాతవ్యాః పృథివీక్షితా ॥39॥

విల్లు ధరించినవారు (ధానుష్కులు) వెనకగా ఉండాలి. వారివెనుక గుఱ్ఱాలు, వారివెనుక రథాలు, రథాలకు వెనుక ఏనుగులు ఈ విధంగా సైన్యాన్ని యుద్ధంలో రాజు ఏర్పాటుచేయాలి.

పదాతికుఞ్జరాశ్వానాం ధర్మకార్యం ప్రయత్నతః ।
శూరాః ప్రముఖతో దేయాః స్కన్ధమాత్రప్రదర్శనమ్ ॥40॥

ధర్మబద్ధంగా కాల్బలాన్ని, ఏనుగులు, గుఱ్ఱాలమీద ఎక్కి యుద్ధం చేసేవాళ్లను శ్రద్ధతో క్రమంలో ఉంచాలి. సైన్యసామర్థ్యం శత్రువులకు అర్థమయ్యే విధంగా సైన్యానికి అంతటికీ అగ్రభాగంలో పరాక్రమవంతులైన సైనికులను నిలపాలి.

కర్తవ్యం భీరుసఙ్ఘేన శత్రువిద్రావకారకమ్ ।
దారయన్తి పురస్తాత్తు న దేయా భీరవః పురా ॥41॥

పిరికివాళ్లను కూడ ఒకసంఘంగా కూర్చి వారితోనే శత్రువులను నశింపజేసే యుద్ధవ్యూహం నడిపించాలి. పిరికివాళ్లను సైన్యంలో మొదటిభాగంలో ఉంచగూడదు. అలా ఉంచితే వారు యుద్ధవ్యూహాన్ని (విజయాన్ని) చెడగొడతారు. (ముందున్నపిరికివాళ్లు యుద్ధం చేయలేక పారిపోవడం మూలంగా మిగిలినవారు కూడ యుద్ధపరాఙ్ముఖులవుతారు. దానివలన విజయం అసాధ్యం అవుతుంది)

ప్రోత్సాహయన్త్యేవ రణే భీరూన్ శూరాః పురఃస్థితాః ।
ప్రాంశవశ్శుకనాసాశ్చ యే చాజిహ్మేక్షణా నరాః ॥42॥

యుద్ధరంగంలో అగ్రభాగాన పరాక్రమవంతులయిన మహావీరులను ఉంచాలి. వారు తమకు వెనుక ఉన్న పిరికివారిని యుద్ధం చేయడానికి ప్రోత్సహిస్తారు. శూరులు గొప్పతేజస్సుతో ఉన్నతులై ఉంటారు. వారు యుద్ధవిద్యలో నిపుణులు. వారిచూపు ఋజువుగా ఉంటుంది.

సంహతభ్రూయుగాశ్చైవ క్రోధనాః కలహప్రియాః ।
నిత్యహృష్టాః ప్రహృష్టాశ్చ శూరా జ్ఞేయాశ్చ కామినః ॥43॥

వారికనుబొమ్మలు ముడిపడి ఉంటాయి. కోపం ఎక్కువ. తగవులాటలంటే ఇష్టపడతారు. ఎప్పుడు తృప్తిగా, చాల సంతోషంగా ఉంటారు. ఉన్నతమైన కోరికలు కలిగిఉంటారు. ఈ లక్షణాలు కలిగినవారిని శూరులని తెలుసుకోవాలి.

సంహతానాం హతానాం చ రణాపనయనక్రియా ।
ప్రతియుద్ధం గజానాం చ తోయదానాదికం చ యత్ ॥
ఆయుధానయనం చైవ పత్తికర్మ విధీయతే ॥44॥

యుద్ధంలో గాయపడినవారినీ, మరణించినవారినీ, యుద్ధరంగంనుండి ఆవలకు తీసుకునివెళ్లడం, యుద్ధరంగంలో ఉన్న ఏనుగులు మొదలయినవాటికి నీరు ఆహారం మొదలయినవి ఇవ్వడం, ఆయుధాలను తెచ్చిఇవ్వడం, ఇవి పదాతులయిన యోధులు చేయవలసినపని అని శాస్త్రం నిర్ణయించింది.

రిపూణాం భేత్తుకామానాం స్వసైన్యస్య తు రక్షణమ్ ।
భేదనం సంహతానాం చ చర్మిణాం కర్మ కీర్తితమ్ ॥45॥

తమ సైన్యాన్ని నిర్మూలించాలని కోరుకునే శత్రువులనుండి తమసైన్యాన్ని రక్షించడం, గుంపులుగా కూడి ఉన్న శత్రుసైనికులను విడదీసి, (శత్రుసైన్యాన్ని) దెబ్బతీయడం, కత్తి(డాలు)పట్టిన వీరులు చేయవలసినపని అని చెప్పబడింది.

విముఖీకరణం యుద్ధే ధన్వినాం చ తథోచ్యతే ॥46॥

శత్రుసైనికులను భయపెట్టి, యుద్ధంనుండి పారిపోయేటట్లు చేయడం విల్లుపట్టినవారు చేయవలసినపని అని చెప్పబడింది.

దూరాపసరణం యానం సుహతస్య తథోచ్యతే ।
త్రాసనం రిపుసైన్యానాం రథకర్మ తథోచ్యతే ॥47॥

గాయపడినవారి వాహనాన్ని యుద్ధరంగానికి దూరంగా తీసుకునివెళ్లడం, శత్రుసైనికులను భయపెట్టడం రథికులు చేయవలసినపని అని చెప్పబడింది.

భేదనం సంహతానాం చ భేదానామపి సంహతిః ।
ప్రాకారతోరణాట్టాలద్రుమభఙ్గశ్చ సద్గజే ॥48॥

గుంపులుగా కూడి ఉన్న శత్రుసైన్యాన్ని చెదరగొట్టడం, అక్కడక్కడ ఉన్నవారిని భయంతో ఒకచోటకు చేరేటట్లు చేయడం, శత్రువుల కోటల ప్రాకారాలను, ప్రవేశద్వారాలను, పైకప్పులను, చెట్లను విరగగొట్టడం ఏనుగులపని అని చెప్పబడింది.

పత్తిభూర్విషమా జ్ఞేయా రథాశ్వానాం తథా సమా ।
సకర్దమా చ నాగానాం యుద్ధభూమిరుదాహృతా ॥49॥

యుద్ధరంగంలో కాల్బలానికి నేల ఎగుడుదిగుడుగా ఉండటం మంచిది. రథాలకు, గుఱ్ఱాలకు నేల సమతలంగా ఉంటే మంచిది. ఏనుగులకు బురదగా ఉండడం మంచిది.

ఏవం విరచితవ్యూహః కృతపృష్ఠదివాకరః ।
తథానులోమశుక్రార్కిదిక్పాలమృదుమారుతః ॥
యోధానుత్తేజయేత్ సర్వాన్నామగోత్రావదానతః ॥50॥

యుద్ధం చేయడానికి వ్యూహాన్ని ఈ విధంగా ఏర్పాటుచేయాలి. సూర్యుడు వెనకగా ఉండగా, శుక్రుడు, శనైశ్చరుడు, దిక్పాలకులు అనుకూలంగా ఉండగా, గాలి మృదువుగా వీస్తుండగా యుద్ధం చేయాలి. అప్పుడు యోధులందరిని వారివారిపేర్లతోనూ, గోత్రాలతోనూ పేర్కొంటూ యుద్ధానికి ప్రోత్సహించాలి.

భోగప్రాప్త్యా చ విజయే స్వర్గప్రాప్త్యా మృతస్య చ ।
జిత్వారీన్ భోగసమ్ప్రాప్తిర్మృతస్య చ పరా గతిః ॥ 51॥

ఇలా జరిగినయుద్ధంలో రాజు విజయం సాధిస్తే (సైనికులకు) ఉత్తమమైన భోగాలు కలుగుతాయి. మరణిస్తే స్వర్గం వస్తుంది. శత్రువులను జయించడంవల్ల గొప్పసుఖాలు కలుగుతాయి. యుద్ధంలో మరణిస్తే ఉత్తమగతులు కలుగుతాయి.

నిష్కృతి స్వామిపిణ్డస్య నాస్తి యుద్ధసమా గతిః ।
శూరాణాం రక్తమాయాతి తేన పాపం త్యజన్తి తే ॥52॥

యుద్ధంలో రాజుకు విజయం సాధించిపెట్టినా, లేదా మరణించినా, సైనికుడు రాజుసొమ్ము తిన్న ఋణాన్ని తీర్చుకున్నవాడు అవుతాడు. అందుచేత స్వామిఋణం తీర్చుకోడానికి యుద్ధంకంటె ఉత్తమమైన సాధనం లేదు. యుద్ధంలో గాయాలవలన వీరులకు ఒంటినుండి రక్తం స్రవిస్తుంది. దానితో అతడు చేసిన పాపం నశిస్తుంది.

ఘాతాదిదుఃఖసహనం రణే తత్పరమం తపః ।
వారాప్సరస్సహస్రాణి యాన్తి శూరం రణే మృతమ్ ॥53॥

యుద్ధంలో తగిలినగాయాలవలన బాధలను సహించడం ఉత్తమమయిన తపస్సు. యుద్ధంలో మరణించిన వానిని అప్సరసలు వేలసంఖ్యలో పొందుతారు.

స్వామీ సుకృతమాదత్తే భగ్నానాం వినివర్తినామ్ ।
బ్రహ్మహత్యాఫలం తేషాం తథా ప్రోక్తం పదే పదే ॥54॥

యుద్ధంలో భయపడి పారిపోయినవాడు అంతకు పూర్వం చేసుకున్నపుణ్యం అంతా రాజును చేరుతుంది. పారిపోయే సమయంలో వాడు వేసే ప్రతిఅడుగులోనూ వాడికి బ్రహ్మహత్యాపాతకం వచ్చి అంటుకుంటుంది.

త్యక్త్వా సహాయాన్ యో గచ్ఛేద్దేవాస్తస్య వినష్టయే ।
అశ్వమేధఫలం ప్రోక్తం శూరాణామనివర్తినామ్ ॥ 55॥

యుద్ధంలో తనకు తోడుగా ఉన్నవారిని విడిచి పారిపోయేవాడిని దేవతలు నాశనం చేస్తారు. విజయమయినా, మరణమయినా, యుద్ధరంగాన్ని విడిచి వెళ్లనివాడికి అశ్వమేధయాగం చేసిన పుణ్యఫలం లభిస్తుంది.

ధర్మనిష్ఠే జయో రాజ్ఞి యోద్ధవ్యాశ్చ సమాస్సమైః ।
గజాద్యైశ్చ గజాద్యాశ్చ న హన్తవ్యాః పలాయినః ॥56॥

ధర్మపరాయణుడయిన రాజుకు యుద్ధంలో తప్పక విజయం కలుగుతుంది. యోధులు తమతో సమానమైన పరాక్రమం కలిగినవీరులతోనే యుద్ధం చేయాలి. ఏనుగులు ఏనుగులతోనూ, గుఱ్ఱాలు గుఱ్ఱాలతోనూ (ఏనుగు నెక్కినవారు ఏనుగెక్కిన వారితోనూ, రథికులు రథికులతోనూ, కాల్బలం కాల్బలంతోనూ) అనే విధంగా యుద్ధం చేయాలి. పారిపోయేవారిని చంపగూడదు.

న ప్రేక్షకాః ప్రవిష్టాశ్చ హ్యశస్త్రాః పతితాదయః ।
శాన్తే నిద్రాభిభూతే చ అర్ధోత్తీర్ణే నదీవనే ॥57॥

యుద్ధం చూడడానికి వచ్చినవారినీ, అనుకోకుండా యుద్ధరంగంలో ప్రవేశించినవారినీ, ఆయుధాలు లేనివారినీ, క్రిందపడినవారు మొదలయినవారిని చంపగూడదు. యుద్ధంతో సంబంధం లేకుండా ప్రశాంతంగా ఉన్నవాడినీ, నిద్రకు లోనయినవాడినీ, సగం లేచినవాడినీ, నదిలోనూ అడవిలోనూ ఉన్నవాడినీ సంహరించగూడదు.

దుర్దినే కూటయుద్ధాని శత్రునాశార్థ మాచరేత్ ॥58॥

ఆకాశం మేఘాలతో నిండిఉన్న సమయంలో కూటయుద్ధాలు అనగా సమూహంగా ఏర్పడిగాని లేదా ధర్మవిరుద్ధం కానట్టి మాయోపాయములతోగాని శత్రుసంహారం చేయవచ్చు.

బాహూ ప్రగృహ్య విక్రోశేద్ భగ్నా భగ్నాః పరే ఇతి ।
ప్రాప్తం మిత్రం బలం భూరి నాయకోఽత్ర నిపాతితః ॥59॥

రెండు చేతులూ పైకెత్తి ఇలా పెద్దగా అరవాలి. 'శత్రువులు నశించిపోయారు. మనకు మిత్రులయిన రాజుల గొప్పసైన్యం వచ్చింది. ఇదిగో, శత్రుసైన్యం నాయకుడు చచ్చిపడిఉన్నాడు.

సేనానీర్నిహతశ్చాయం భూపతిశ్చాపి విప్లుతః ।
విద్రుతానాం తు యోధానాం సుఖం ఘాతౌ విధీయతే ॥60॥

వీడు, శత్రువులసర్వసేనాధిపతి మరణించాడు. శత్రురాజు ఎక్కడికో పారిపోయాడు. దిక్కు లేక పారిపోతున్నయోధులను సులువుగా చావగొట్టవచ్చును.

ధూపాశ్చ దేయా ధర్మజ్ఞ తథా చ పరమోహనాః ।
పతాకాశ్చైవ సమ్భారో వాదిత్రాణాం భయావహః ॥61॥

ధర్మం చక్కగా తెలిసినవాడా! పరశురామా! శత్రువులను మోహింపజేయడానికి సుగంధద్రవ్యాలతో ధూపాలు వేయాలి. తాము జయించినట్లు తెలియజేసే విజయపతాకలను ఎగురవేయాలి. శత్రువులు భయపడిపోయే విధంగా వివిధవాద్యాలు భయంకరంగా మోగించాలి.

సమ్ప్రాప్య విజయం యుద్ధే దేవాన్ విప్రాంశ్చ సంయజేత్ ।
రత్నాని రాజగామీని అమాత్యేన కృతే రణే ॥62॥

యుద్ధంలో విజయం సాధించిన తరువాత మహారాజు దేవతలనూ, బ్రాహ్మణులనూ చక్కగా పూజించాలి. అమాత్యులు కూడ యుద్ధం చేస్తారు. యుద్ధంలో జయించిన రత్నాలు రాజుకే చెందుతాయి.

తస్య స్త్రియో న కస్యాపి రక్ష్యాస్తాశ్చ పరస్య చ ।
శత్రుం ప్రాప్య రణే ముక్తం పుత్రవత్ పరిపాలయేత్ ॥63॥

ఓడిపోయిన శత్రువులకు సంబంధించిన స్త్రీలు ఇతరులకు ఎవ్వరికీ సంబంధించరు. జయించిన రాజు శత్రుకాంతలను జాగ్రత్తగా కాపాడాలి. యుద్ధంలో ఒంటరిగా దొరికిన శత్రువును కన్నకొడుకులాగా పోషించాలి.

పునస్తేన న యోద్ధవ్యం దేశాచారాది పాలయేత్ ।
తతశ్చ స్వపురం ప్రాప్య ధ్రువే భే ప్రవిశేద్ గృహమ్ ॥64॥

తిరిగి అతడితో యుద్ధం చేయగూడదు. అతడిదేశాచారాలను కాపాడాలి. ఆ తరువాత గెలిచిన రాజు తన రాజ్యానికి వెళ్ళి, ధ్రువనక్షత్రాలు ఉన్నసమయంలో తనభవనంలో ప్రవేశించాలి.

దేవాదిపూజనం కుర్యాద్ రక్షేద్ యోధకుటుమ్బకమ్ ।
సంవిభాగం పరావాప్తైః కుర్యాద్ భృత్యజనస్య చ ॥
రణదీక్షా మయోక్తా తే జయాయ నృపతే ధ్రువా ॥65॥

పరశురామా! విజయంతో ఇంటికి వచ్చిన తరువాత రాజు దేవతలు, బ్రాహ్మణులు మొదలైనవారిని పూజించాలి. యుద్ధంలో పాల్గొన్న వారి కుటుంబాలను చక్కగా కాపాడాలి. శత్రురాజ్యంనుండి పొందిన సంపదను తగిన విధంగా విభాగించి సేవకజనులకు పంచిపెట్టాలి. రణదీక్షను గురించి నీకు వివరించాను. ఈ విధానం అనుసరించడంవలన రాజుకు యుద్ధంలో విజయం నిశ్చయంగా సిద్ధిస్తుంది.

ఇత్యాది మహాపురాణే ఆగ్నేయే రణదీక్షావర్ణనం నామ షట్త్రింశదధికద్విశతతమోఽధ్యాయః॥236॥

అగ్నిమహాపురాణంలో యుద్ధదీక్షావర్ణనం అనే రెండువందల ముప్పైఆఱవ అధ్యాయం సమాప్తం.

సప్తత్రింశదధికద్విశతతమోఽధ్యాయః – రెండువందల ముప్పైఏడవ అధ్యాయం

శ్రీస్తోత్రకథనమ్ – శ్రీదేవీస్తోత్రకథనం

పుష్కర ఉవాచ – పరశురాముడితో పుష్కరుడు ఈ విధంగా చెప్తున్నాడు.

రాజ్యలక్ష్మీస్థిరత్వాయ యథేన్ద్రేణ పురా శ్రియః ।
స్తుతిః కృతా తథా రాజా జయార్థం స్తుతిమాచరేత్ ॥1॥

పూర్వం దేవేంద్రుడు స్వర్గరాజ్యాధిపత్యం సుస్థిరంగా తనకే ఉండేవిధంగా చేసుకోవడానికి లక్ష్మీదేవిని గూర్చి స్తోత్రం చేశాడు. భూలోకంలో రాజు ఎవరయినా, యుద్ధంలో విజయం సాధించాలంటే, (తన రాజ్యాధిపత్యాన్ని స్థిరం చేసుకోవాలంటే) ఆ సోత్రంతో లక్ష్మీదేవిని స్తుతించాలి.

ఇన్ద్ర ఉవాచ – ఇంద్రుడు లక్ష్మీదేవిని ఈవిధంగా స్తుతిస్తున్నాడు.

నమస్యే సర్వలోకానాం జననీమబ్ధిసమ్భవామ్ ।
శ్రియమున్నిద్రపద్మాక్షీం విష్ణువక్షఃస్థలస్థితామ్ ॥2॥

లోకాలన్నింటికీ తల్లి అయినదీ, పాలసముద్రంలో నుండి పుట్టినదీ, చక్కగా వికసించిన తామరలవంటి కన్నులు కలిగినదీ, శ్రీమహావిష్ణువు వక్షఃస్థలంమీద స్థిరంగా ఉండేదీ అయిన శ్రీదేవికి నమస్కరిస్తున్నాను.

త్వం సిద్ధిస్త్వం స్వధా స్వాహా సుధా త్వం లోకపావని ।
సన్ధ్యా రాత్రిః ప్రభా భూతిర్మేధా శ్రద్ధా సరస్వతీ ॥3॥

అన్ని లోకాలను పవిత్రం చేసే దేవీ! నీవే సిద్ధివి. నీవే స్వధా, స్వాహాదేవివి. సంధ్య, రాత్రి, ప్రభ, భూతి, మేధ, శ్రద్ధ, సరస్వతి నీవే.

యజ్ఞవిద్యా మహావిద్యా గుహ్యవిద్యా చ శోభనే ।
ఆత్మవిద్యా చ దేవి త్వం విముక్తిఫలదాయినీ ॥4॥

కల్యాణీ! యజ్ఞవిద్య, మహావిద్య, గుహ్యవిద్య, ఆత్మవిద్య, నీవే. శ్రీదేవీ! మోక్షఫలాన్ని ఇచ్చేదానివి నీవే.

ఆన్వీక్షికీ త్రయీ వార్తా దణ్డనీతిస్త్వమేవ చ ।
సౌమ్యాసౌమ్యం జగద్రూపం త్వయైతద్దేవి పూరితమ్ ॥5॥

ఆన్వీక్షికి(న్యాయవైశేషికరూపమైన తర్కవిద్య), ఋగ్యజుస్సామవేదాలు మూడు నీవే. వార్త, (వాణిజ్యం, పశుపాలనం మొదలైనది), దండనీతి (అపరాధులను శిక్షించేవిధానం), నీవే. నీతోనే ఈ జగత్తు శాంతమూ, తీక్ష్ణమూ అయిన ద్వివిధరూపాన్ని పొంది ఉన్నది.

కా త్వన్యా త్వామృతే దేవి సర్వయజ్ఞమయం వపుః ।
అధ్యాస్తే దేవదేవస్య యోగిచిన్త్యం గదాభృతః ॥6॥

దేవీ! గదను ధరించినవాడు, యోగులు నిత్యమూ ధ్యానించేవాడూ అయిన శ్రీమహావిష్ణువుయొక్క సమస్త మయిన యజ్ఞాలు స్వరూపమైన శరీరాన్ని నీవు తప్ప ఇంక ఎవరు అధిష్ఠించగలరు?

త్వయా దేవి పరిత్యక్తం సకలం భువనత్రయమ్ ।
వినష్టప్రాయమభవత్ త్వయేదానీం సమేధితమ్ ॥7॥

శ్రీదేవీ! నీవు విడిచిపెట్టినందువలన ఈమూడులోకాలు నశించిపోయాయి. తిరిగి నీవే ఇపుడు ఈ లోకాలను సృష్టించి పోషిస్తున్నావు.

దారాః పుత్రా స్తథాగారం సుహృద్ధాన్యధనాదికమ్ ।
భవత్యేతన్మహాభాగే నిత్యం త్వద్వీక్షణా న్నృణామ్ ॥8॥

మహాత్మురాలా! నీ కృపాకటాక్షంచేతనే మానవులకు భార్య, కుమారులు, ఇల్లు, స్నేహితులు, ధాన్యం, సంపదలు, మొదలైనవి అన్నీ కలుగుతున్నాయి.

శరీరారోగ్యమైశ్వర్యమరిపక్షక్షయస్సుఖమ్ ।
దేవి త్వద్దృష్టిదృష్టానాం పురుషాణాం న దుర్లభమ్ ॥9॥

శ్రీదేవీ! నీ చూపు పడినమానవులకు ఒంటికి ఆరోగ్యం, ప్రభుత్వం, శత్రువులు అందరూ నశించిపోవడమూ, అఖండమైన సుఖమూ అన్నీ సులువుగా లభిస్తాయి.

త్వమమ్బా సర్వభూతానాం దేవదేవో హరిః పితా ।
త్వయైతద్విష్ణునా చామ్బ జగద్ వ్యాప్తం చరాచరమ్ ॥10॥

అమ్మా! సృష్టిలోని అన్ని పదార్థాలకు నీవే తల్లివి. దేవతలకే దేవుడయిన శ్రీమహావిష్ణువు తండ్రి. స్థావరమూ జంగమమూ అయిన ఈ జగత్తు అంతటా నీవూ, విష్ణుదేవుడూ నిండి ఉన్నారు.

మానం కోశం తథా కోష్ఠం మా గృహం మా పరిచ్ఛదమ్ ।
మా శరీరం కలత్రం చ త్యజేథాస్సర్వపావని ॥11॥

సమస్తమయిన దానిని పవిత్రం చేసే తల్లీ! నాకు సంబంధించిన సమ్మానం, ధనాగారం, ధాన్యాగారం, నివాసభవనం, వస్త్రం, శరీరం, భార్య వీటిని విడిచివెళ్లవద్దు.

మా పుత్రాన్ మా సుహృద్వర్గాన్ పశూన్ మా విభూషణమ్ ।
త్యజేథా మమ దేవస్య విష్ణోర్వక్షఃస్థలాలయే ॥12॥

విష్ణుదేవుడి వక్షఃస్థలంమీద నివసించే తల్లీ! మాకుమారులనూ, హితులనూ, పశువులనూ, ఆభరణాలనూ, విడిచిపోవద్దు.

సత్త్వేన సత్యశౌచాభ్యాం తథా శీలాదిభిర్గుణైః ।
త్యజన్తే తే నరాస్సద్యస్సన్త్యక్తా యే త్వయామలే ॥13॥

నిర్మలమైన దేవీ! నీవు తమను విడిచిపెట్టిన వెంటనే మానవులు తమలోని సత్త్వం, సత్యం, శుచి, ఉత్తమ మైన శీలం మొదలైన సద్గుణాలను అన్నిటినీ విడిచిపెడతారు.

త్వయావలోకితాస్సద్యశ్శీలాద్యైరఖిలైర్గుణైః ।
కులైశ్వర్యైశ్చ యుజ్యన్తే పురుషా నిర్గుణా అపి ॥14॥

నీవు దయతో చూస్తే, మానవులు ఎంతగా గుణహీనులయినప్పటికీ మరుక్షణంలోనే మంచిశీలం మొదలైన ఉత్తమగుణాలను, ఉత్తమమైన వంశాన్ని, ఐశ్వర్యాన్ని పొందుతారు.

స శ్లాఘ్యస్సగుణీ ధన్యస్స కులీనస్స బుద్ధిమాన్ ।
స శూరస్స చ విక్రాన్తో యస్త్వయా దేవి వీక్షితః ॥15॥

శ్రీదేవీ! నీ చూపు పడినవాడే ఉత్తముడు. ప్రశంసింపదగినవాడు. గుణవంతుడు. ధన్యుడు. గొప్పకులంలో పుట్టినవాడు. బుద్ధిమంతుడు. శూరుడు. వీర్యవంతుడు.

సద్యో వైగుణ్యమాయాన్తి శీలాద్యాస్సకలా గుణాః ।
పరాఙ్ముఖీ జగద్ధాత్రీ యస్య త్వం విష్ణువల్లభే ॥16॥

లోకాలన్నిటినీ కాపాడే తల్లీ! విష్ణుదేవుడి ఇల్లాలా! నీవు ఎవరిని దయచూడవో వాడు ఎంత గుణవంతుడయినా వెంటనే గుణహీనుడవుతాడు. అతడికి శీలం మొదలైన సద్గుణాలు అన్నీ నశించిపోతాయి.

న తే వర్ణయితుం శక్తా గుణాన్ జిహ్వాపి వేధసః ।
ప్రసీద దేవి పద్మాక్షి మాస్మాంస్త్యాక్షీః కదాచన ॥17॥

శ్రీదేవీ! నీగొప్పగుణాలను బ్రహ్మదేవుడి నాలుక కూడ సరిగా వర్ణించలేదు. నన్ను రక్షించు. ఎప్పటికీ నన్ను విడిచివెళ్లకు.

పుష్కర ఉవాచ – పరశురాముడితో పుష్కరుడు ఇలా చెప్తున్నాడు.

ఏవం స్తుతా దదౌ శ్రీశ్చ వరమిన్ద్రాయ చేప్సితమ్ ।
సుస్థిరత్వం చ రాజ్యస్య సఙ్గ్రామవిజయాదికమ్ ॥18॥

దేవేంద్రుడు ఈవిధంగా స్తుతించగా లక్ష్మీదేవి ఇంద్రుడు కోరుకున్న వరాన్ని ప్రసాదించింది. స్వర్గసామ్రాజ్యం అతడికి స్థిరంగా ఉండే విధంగానూ, యుద్ధాలలో అన్నివేళలలోనూ విజయమే కలిగే విధంగానూ, ఇంకా అనేకమైన కోరికలు అనుగ్రహించింది.

స్వస్తోత్రపాఠశ్రవణకర్తౄణాం భుక్తిముక్తిదమ్ ।
శ్రీస్తోత్రం సతతం తస్మాత్ పఠేచ్చ శృణుయాన్నరః ॥19॥

శ్రీదేవికి సంబంధించిన ఈ స్తోత్రం పఠించినవారికీ, విన్నవారికీ, భోగం, మోక్షం ఇస్తుంది. అందుచేత ప్రతిమానవుడు ఈ శ్రీస్తోత్రాన్ని నిత్యం చదవాలి. వినాలి.

ఇత్యాది మహాపురాణే ఆగ్నేయే శ్రీస్తోత్రకథనం నామ సప్తత్రింశదధికద్విశతతమోఽధ్యాయః ॥237॥

అగ్నిమహాపురాణంలో శ్రీదేవీస్తోత్రకథనం అనే రెండువందల ముప్పైఏడవ అధ్యాయం సమాప్తం.

అష్టత్రింశదధికద్విశతతమోఽధ్యాయః – రెండువందల ముప్పైఎనిమిదవ అధ్యాయం

రామోక్తనీతికథనమ్ – రాముడు చెప్పిన నీతి కథనం

అగ్నిరువాచ – వశిష్ఠుడికి అగ్నిదేవుడు ఈవిధంగా చెప్తున్నాడు.

నీతిస్తే పుష్కరోక్తా తు రామోక్తా లక్ష్మణాయ చ ।
జయాయ తాం ప్రవక్ష్యామి శృణు ధర్మాదివర్ధినీమ్ ॥1॥

వశిష్ఠమహర్షీ! ఇంతవరకు పరశురాముడికి పుష్కరుడు చెప్పిన రాజనీతిని గురించి చెప్పాను. ఇప్పుడు లక్ష్మణుడికి శ్రీరాముడు చెప్పిన రాజనీతిని గురించి చెప్తాను. దీనివలన రాజుకు విజయం కలుగుతుంది. ఇంకా ధర్మం మొదలైనవి వృద్ధి చెందుతాయి.

రామ ఉవాచ – దశరథరాముడు లక్ష్మణుడితో ఇలా అంటున్నాడు.

న్యాయేనార్జనమర్థస్య వర్ధనం రక్షణం చరేత్ ।
సత్పాత్రప్రతిపత్తిశ్చ రాజవృత్తం చతుర్విధమ్ ॥2॥

డబ్బును న్యాయమైనమార్గంలో సంపాదించాలి. దానిని తగువిధంగా వృద్ధిపొందించాలి. ఆ సొమ్మును ఇతరులు కాజేయకుండా జాగ్రత్తగా కాపాడాలి. ఆ ధనాన్ని ప్రజలకు ఉపయోగించే అంశాలలో వినియోగించాలి. ఈ విధంగా రాజు ఆర్థికవిషయంలో నాలుగువిధాలుగా ప్రవర్తించాలి.

నయస్య వినయో మూలం వినయశ్శాస్త్రనిశ్చయాత్ ।
వినయో హీన్ద్రియజయస్తైర్యుక్తః పాలయేన్మహీమ్ ॥3॥

నీతికి మూలం వినయం. ఆ వినయం శాస్త్రజ్ఞానంతో స్పష్టమైన నిశ్చయం ఉండడం వలన కలుగుతుంది. అసలు వినయం అంటే ఇంద్రియాలన్నీ తాను చెప్పినట్లుగా నడుచుకునేటట్లు చేయడమే. కాబట్టి ఇంద్రియాలను తన అధీనంలో పెట్టుకుని, శాస్త్రవిజ్ఞానం, రాజనీతిజ్ఞత కలిగి రాజ్యాన్ని పరిపాలించాలి.

శాస్త్రం ప్రజ్ఞా ధృతిర్దాక్ష్యం ప్రాగల్భ్యం ధారయిష్ణుతా ।
ఉత్సాహో వాగ్మితౌదార్యమాపత్కాలసహిష్ణుతా ॥4॥

శాస్త్రజ్ఞానం, బుద్ధివైభవం, ధైర్యం, సామర్థ్యం, నైపుణ్యం, ధరించగలిగి ఉండడం, ఉత్సాహం, మాటనేర్పు, ఉదారత, కష్టాలను ఓర్చుకోగలగడం,

ప్రభావశ్శుచితా మైత్రీ త్యాగస్సత్యం కృతజ్ఞతా ।
కులం శీలం దమశ్చేతి గుణాస్సమ్పత్తిహేతవః ॥5॥

ఇతరులను తన యిష్టప్రకారం మార్చగలిగిన శక్తి, నిష్కల్మషత్వం, స్నేహభావం, తనకున్నదానిని ఇతరులకోసం విడిచిపెట్టగలగడం, సత్యం, చేసినదానిని గుర్తుపెట్టుకోవడం, ఉత్తమవంశం, మంచినడత, ఇంద్రియనిగ్రహం అనేవి మంచిగుణాలు. వీటివలన సంపదలు కలుగుతాయి.

ప్రకీర్ణవిషయారణ్యే ధావన్తం విప్రమాథినమ్ ।
జ్ఞానాఙ్కుశేన కుర్వీత వశ్యమిన్ద్రియదన్తినమ్ ॥6॥

విషయాలు (శబ్దస్పర్శరూపరసగంధాలు) అనే దట్టమైన అరణ్యంలో స్వేచ్ఛగా పరుగులు తీస్తున్న ఇంద్రియాలు అనే ఏనుగును, జ్ఞానం అనే అంకుశంతో లొంగదీసుకుని తాను చెప్పినట్టు వినేవిధంగా చేసుకోవాలి.

కామః క్రోధస్తథా లోభో హర్షో మానో మదస్తథా ।
షడ్వర్గముత్సృజేదేనమస్మింస్త్యక్తే సుఖీ నృపః ॥7॥

మానవుడికి లోపలే సహజంగా ఉండి శత్రువులైన – కామం, క్రోధం, లోభం, మోహం, మానం, మదం(మాత్సర్యం) అనే ఆరింటిని విడిచిపెట్టాలి. ఈ అరిషడ్వర్గాన్ని వదిలించుకున్నరాజు అన్నివిధాలుగానూ సుఖపడతాడు.

ఆన్వీక్షికీం త్రయీం వార్తాం దణ్డనీతిం చ పార్థివః ।
తద్విద్యై స్తత్క్రియోపేతైశ్చిన్తయేద్ వినయాన్వితః ॥8॥

రాజు ఆన్వీక్షికి, త్రయి, వార్త, దండనీతి అనే నాల్గింటిని ఆయా అంశాలు చక్కగా తెలిసినవారు, ఆచరించినవారు అయిన పెద్దలవద్ద వినయంతో విచారించాలి.

ఆన్వీక్షిక్యార్థవిజ్ఞానం ధర్మాధర్మౌ త్రయీస్థితౌ ।
అర్థానర్థౌ తు వార్తాయాం దణ్డనీత్యాం నయానయౌ ॥9॥

తర్కశాస్త్రంవలన ఆర్థికం మొదలైన విషయాలలో యథార్థజ్ఞానం కలుగుతుంది. మూడు వేదాలను తెలుసుకోవడంవలన ధర్మం ఏమిటో, అధర్మం ఏమిటో తెలుస్తాయి. వార్తవలన మంచిచెడులు తెలుస్తాయి. దండనీతివలన ఏది న్యాయమో, ఏది అన్యాయమో తెలుస్తుంది.

అహింసా సూనృతా వాణీ సత్యం శౌచం దయా క్షమా ।
వర్ణినాం లిఙ్గినాం చైవ సామాన్యో ధర్మ ఉచ్యతే ॥10 ॥

ఇతరులను ఏవిధంగానూ బాధించకుండా ఉండడం, నిజమే మాట్లాడటమూ, సూటిగా ప్రవర్తించడం, నిర్మలమైన భావమూ, ప్రాణులయందు దయ కలిగి ఉండడమూ, ఇతరుల అపరాధాలను క్షమించగలగడమూ, అనేవి నాలుగు వర్ణాలవారికీ, నాలుగు ఆశ్రమాలవారికీ అందరికీ సమానమైన ధర్మాలు.

ప్రజాస్సమనుగృహ్ణీయాత్ కుర్యాదాచారసంస్థితిమ్ ।
వాక్సూనృతా దయా దానం హీనోపగతరక్షణమ్ ॥
ఇతివృత్తం సతాం సాధుహితం సత్పురుషవ్రతమ్ ॥11॥

రాజు ప్రజలను దయతో పరిపాలించాలి. కులాచారాన్ని పాటిస్తూ ధర్మం తప్పకుండా నడుచుకోవాలి. మాటలు యథార్థంగా ఉండాలి. దీనులపై దయ చూపాలి. అర్థులకు దానం చేయాలి, ఆపదలలో ఉన్నవారిని

రక్షించాలి. సజ్జనులతో కలిసి ఉండడం, సాధుజనులకు మేలు చేయడం ఇవి సత్పురుషులు నియమంగా పాటించే ధర్మాలు.

ఆధివ్యాధిపరీతాయ అద్య శ్వో వా వినాశినే ।
కో హి రాజా శరీరాయ ధర్మాపేతం సమాచరేత్ ॥12॥

ఈ జన్మ అంతా శరీరానికి వచ్చే రోగాలతోనూ, మనసుకు కలిగే బాధలతోనూ నిండిపోయి ఉంది. ఈ శరీరం ఈరోజో రేపో నశించిపోతుంది. అటువంటితుచ్ఛమైన ఈ శరీరంకోసం ఉత్తముడైన ఏ రాజు మాత్రం ధర్మవిరుద్ధమైన పనులు చేస్తాడు?

న హి సుఖమన్విచ్ఛన్ పీడయేత్ కృపణం జనమ్ ।
కృపణః పీడ్యమానో హి మన్యునా హన్తి పార్థివమ్ ॥13॥

తన సుఖంకోసం ప్రయత్నిస్తూ దిక్కు లేని ప్రజలను కష్టపెట్టగూడదు. రక్షించవలసిన ప్రజలను రాజు కష్టపెడితే, కోపంతో వారు దుర్మార్గుడయిన రాజునే చంపేస్తారు.

క్రియతేఽభ్యర్హణీయాయ స్వజనాయ యథాఞ్జలిః ।
తతస్సాధుతరః కార్యో దుర్జనాయ శివార్థినా ॥14॥

తనకూ, తనరాజ్యానికీ మేలు కలగాలని కోరుకునే రాజు, పూజ్యులైన ఉత్తమవ్యక్తులనూ, తనవారినీ చేతులు జోడించి వినయంగా ఏవిధంగా గౌరవిస్తాడో, దుర్మార్గులను అంతకంటె అధికంగా మంచితనంతో ఆదరించాలి.

ప్రియమేవాభిధాతవ్యం సత్సు నిత్యం ద్విషత్సు చ ।
దేవాస్తే ప్రియవక్తారః పశవః క్రూరవాదినః ॥15॥

సాధుజనుల విషయంలోనూ, దుర్మార్గులైన శత్రువుల విషయంలోనూ రాజు ఎప్పుడూ వారికి ప్రియమైన మాటలే చెప్పాలి. వారికి ఇష్టమైన పనులే చేయాలి. మనసుకు ఇష్టమైన మాటలు చెప్పేవాళ్లు దేవతలు. కఠినంగా మాట్లాడేవాళ్లు జంతువులు.

శుచిరాస్తిక్యపూతాత్మా పూజయేద్దేవతాస్సదా ।
దేవతావద్ గురుజనమాత్మవచ్చ సుహృజ్జనమ్ ॥16॥

నిష్కల్మషమైన ప్రవర్తన కలిగి, మనసు నిండా దేవుడి ఉనికిపై నమ్మకంతో నిత్యమూ దేవతలను పూజించాలి. గురువులను కూడ దేవతలతో సమానమైన బుద్ధితో పూజించాలి. స్నేహితులను తనతో సమానంగా చూసుకోవాలి.

ప్రణిపాతేన హి గురుం సతోఽమృషానుచేష్టితైః ।
కుర్వీతాభిముఖాన్ భృత్యైర్దేవాన్ సుకృతకర్మణా ॥17॥

పాదాభివందనాలతో గురువులను, ఋజువయిన నడవడితో సజ్జనులనూ, సేవలతో, పుణ్యకార్యాలతో దేవతలనూ రాజు తనపై అభిమానం కలిగేవిధంగా చేసుకోవాలి.

సద్భావేన హరేన్మిత్రం సమ్భ్రమేణ చ బాన్ధవాన్ ।
స్త్రీభృత్యాన్ ప్రేమదానాభ్యాం దాక్షిణ్యేనేతరం జనమ్ ॥18॥

మంచిమనసుతో స్నేహితుల మనసు గెలుచుకోవాలి. చక్కగా ఆదరం చూపిస్తూ బంధువులను, ప్రేమతో స్త్రీలను, దానాలతో సేవకులనూ, దయతో ఇతరజనాలను తనకు అనుకూలం చేసుకోవాలి.

అనిన్దా పరకృత్యేషు స్వధర్మపరిపాలనమ్ ।
కృపణేషు దయాలుత్వం సర్వత్ర మధురా గిరః ॥19॥

ఇతరులు చేసినపనులను నిందించగూడదు (పని చేసినవారిని మెచ్చుకోవాలి). తాను ఆచరించవలసిన ధర్మాన్ని చక్కగా ఆచరించాలి. దిక్కులేని వారిమీద దయ కలిగిఉండాలి. అందరితోనూ తీయగా మాట్లాడాలి.

ప్రాణైరప్యుపకారిత్వం మిత్రాయావ్యభిచారిణే ।
గృహాగతే పరిష్వఙ్గశ్శక్త్యా దానం సహిష్ణుతా ॥20॥

నిరంతరం తనకు తోడుగా ఉన్నమిత్రుడికి ప్రాణమిచ్చి అయినా మేలు చేయాలి. తనయింటికి వచ్చినవారిని కౌగిలించుకుని మిక్కిలిగా ఆదరించాలి. వారికి అవసరమైన దానిని దానం చేయాలి. తనకు ఇష్టం కాని విధంగా ప్రవర్తించినవారిని కూడ ఓర్పుతో భరించాలి.

స్వసమృద్ధిష్వనుత్సేకః పరవృద్ధిష్వమత్సరః ।
అపరోపతాపి వచనం మౌనవ్రతచరిష్ణుతా ॥21॥

తనకు అభివృద్ధి కలిగినపుడు పొంగిపోగూడదు. ఇతరులకు గొప్పమేలు జరిగినపుడు బాధపడగూడదు. ఇతరుల మనసు కష్టపడే మాట పలుకగూడదు. అనవసరంగానూ, అధికంగానూ మాట్లాడగూడదు. అప్పుడు నియమంగా మౌనం పాటించాలి.

బన్ధుభిర్బద్ధసంయోగస్స్వజనే చతురస్రతా ।
ఉచితానువిధాయిత్వమితి వృత్తం మహాత్మనామ్ ॥22॥

బంధువులతో సంబంధం చెడిపోకుండా నిత్యమూ కలిసిఉండాలి. తనవారి నందరినీ సమానబుద్ధితో చూడాలి. వారికి అవసరమైన పనులు చేయాలి. మహాత్ముల నడవడి ఈ ప్రకారంగా ఉంటుంది.

ఇత్యాది మహాపురాణే ఆగ్నేయే రామోక్తనీతికథనం నామాష్టత్రింశదధికద్విశతతమోఽధ్యాయః ॥238॥

అగ్నిమహాపురాణంలో రాముడు చెప్పిన నీతికథనం అనే రెండువందల ముప్పైఎనిమిదవ అధ్యాయం సమాప్తం.



ఏకోనచత్వారింశదధికద్విశతతమోஉధ్యాయః - రెండువందల ముప్పైతొమ్మిదవ అధ్యాయం

రాజధర్మ కథనమ్ - రాజధర్మ కథనం

రామ ఉవాచ - దశరథరాముడు లక్ష్మణుడితో ఇలా అంటున్నాడు.

స్వామ్యమాత్యం చ రాష్ట్రం చ దుర్గం కోశో బలం సుహృత్ ।
పరస్పరోపకారీదం సప్తాఙ్గం రాజ్యముచ్యతే ॥1॥

లక్ష్మణా! రాజ్యానికి ఏడు అంగాలు. 1. రాజు, 2. అమాత్యులు, 3. రాష్ట్రం, 4. దుర్గం, 5. కోశం, 6. బలం, 7. సుహృత్తులు. ఇవి పరస్పరం ఒకదాని కొకటి మేలు చేస్తుంటాయి.

రాజ్యాఙ్గానాం వరం రాష్ట్రం సాధనం పాలయేత్సదా ॥2॥

రాజ్యాంగాలయిన ఈ ఏడింటిలోనూ రాష్ట్రం అనేది ప్రధానమైనది. ఇది రాజ్యాన్ని సాధించేది. అందుచేత రాజు ఎప్పుడూ రాష్ట్రాన్ని చక్కగా పాలించాలి.

కులం శీలం వయస్సత్త్వం దాక్షిణ్యం క్షిప్రకారితా ।
అవిసంవాదితా సత్యం వృద్ధసేవా కృతజ్ఞతా ॥3॥

ఉత్తమవంశంలో జన్మించడం, ఉత్తమమైన నడవడి, శక్తి, దయ కలిగిఉండడం, ఏ పని అయినా వేగంగా చేయగలగడం, ముందు చెప్పినమాటకు తర్వాత విరుద్ధంగా మాట్లాడకుండడం, యథార్థమే మాట్లాడడం, పెద్దలను సేవించడం,

దైవసమ్పన్నతా బుద్ధిరక్షుద్రపరివారితా ।
శక్యసామన్తతా చైవ తథా చ దృఢభక్తితా ॥4॥

దీర్ఘదర్శిత్వముత్సాహశ్శుచితా స్థూలలక్షతా ।
వినీతత్వం ధార్మికతా సాధోశ్చ నృపతేర్గుణాః ॥5॥

దైవం అనుగ్రహాన్ని సంపాదించడం, వివేకం, నీచులను చేరదీయకపోవడం, సామంతులు సమర్థులై ఉండడం, స్థిరమైన భక్తిభావం కలిగి ఉండడం, ముందుచూపు, ఉత్సాహం కలిగిఉండడం, మనసు నిర్మలంగా ఉండడం, కృతజ్ఞత కలిగిఉండడం, నీతిమంతుడై ఉండడం, ధర్మపరాయణుడై ఉండడం, అనేవి మంచిరాజుకు ఉండవలసిన లక్షణాలు.

ప్రఖ్యాతవంశమక్రూరం లోకసఙ్గ్రాహిణం శుచిమ్ ।
కుర్వీతాత్మహితాకాంక్షీ పరివారం మహీపతిః ॥6॥

తనకు (రాజ్యానికి) మేలు కలగాలని కోరుకునేరాజు - ఉత్తమమైన కులంలో పుట్టినవాడు, మృదువైన స్వభావం కలిగినవాడు, అందరిని కలుపుకునిపోయేవాడు, నిర్మలమైన మనసు కలిగినవాడు, అయినవ్యక్తిని తన పరివారంలోకి తీసుకోవాలి.

వాగ్మీ ప్రగల్భస్స్మృతిమానుదగ్రో బలవాన్వశీ ।
నేతా దణ్డస్య నిపుణః కృతశిల్పపరిగ్రహః ॥ 7॥

రాజు – నిపుణంగా మాట్లాడగలగాలి. ప్రతిభ కలిగిఉండాలి. మరపు ఉండగూడదు. ఉన్నతంగా ఉండాలి. బలం కలిగిఉండాలి. ఇంద్రియాలను అదుపులో ఉంచుకోవాలి. ఇతరపరివారాన్ని ముందుండి నడపగలగాలి. దండనీతిలో నేర్పు ఉండాలి. సమర్థులను చేరదీయాలి.

పరాభియోగప్రసహ స్సర్వదుష్టప్రతిక్రియా ।
పరవృత్తాన్తవేత్తా చ సన్ధివిగ్రహతత్త్వవిత్ ॥ 8॥

ఎదిరించిన శత్రువులను సులువుగా జయించగలగాలి. దుర్మార్గులందరినీ నిరోధించగలగాలి. ఇతరుల చరిత్రను తెలుసుకొనగలగాలి. సంధి, విగ్రహం అనే ఉపాయాల రహస్యం (ఎవరితో ఎప్పుడు సంధి చేసుకోవాలో, విరోధించాలో లోతుగా) తెలిసి ఉండాలి.

గూఢమన్త్రప్రచారజ్ఞో దేశకాలవిభాగవిత్ ।
ఆదాతా సమ్యగర్థానాం వినియోక్తా చ పాత్రవిత్ ॥ 9॥

మంత్రాంగాన్ని రహస్యంగా నడిపించాలి. దేశం, కాలం అనే వాటితత్త్వం (ఏ పనికి ఏ ప్రదేశం, ఏ సమయం అయితే విజయం కలుగుతుందో) తెలిసిఉండాలి. రాజకోశానికి ధనాన్ని తగినమార్గంలో రాబట్టగలగాలి. సంపాదించిన ధనాన్ని రాజ్యంలో ఎలా వినియోగించాలో తెలిసిఉండాలి. ఎదుటివారి సామర్థ్యాన్ని గ్రహించాలి.

క్రోధలోభభయద్రోహదమ్భచాపలవర్జితః ।
పరోపతాపపైశున్యమాత్సర్యేర్ష్యానృతాతిగః ॥10॥

కోపం, ఆశ, భయం, ద్రోహం, గర్వం, బుద్ధి అస్థిరంగా ఉండడం, అనే దుర్గుణాలు ఉండగూడదు. ఇతరులను బాధించగూడదు. చాడీలు చెప్పగూడదు. ఇతరులను ద్వేషించగూడదు. ఇతరుల గొప్పతనాన్ని ఓర్చుకోలేకపోవడం పనికిరాదు. అసత్యమాడగూడదు. (దుర్గుణాలకు దూరంగా ఉండాలి)

వృద్ధోపదేశసమ్పన్నశ్శక్తో మధురదర్శనః ।
గుణానురాగస్థితిమానాత్మసమ్పద్గుణాస్స్మృతాః ॥11॥

పెద్దల ఉపదేశాలు సమృద్ధిగా కలిగి, ఆ ప్రకారం నడుచుకోవాలి. సామర్థ్యం కలిగిఉండాలి. మళ్లీ మళ్లీ చూడాలనిపించే విధంగా ఉండాలి. మంచిగుణాలను (గుణవంతులను) అభిమానించాలి. ఇవి రాజుకు ఉండవలసిన ఆంతరమైన గుణాలు.

కులీనాశ్శుచయశ్శూరాశ్శ్రుతవన్తోఽనురాగిణః ।
దణ్డనీతేః ప్రయోక్తారస్సచివాస్స్యుర్మహీపతేః ॥12॥

గొప్పకులంలో పుట్టినవాళ్లు, నిర్మలమైన మనసు కలిగినవాళ్లు, పరాక్రమం కలిగినవారు, రాజవిద్యను చక్కగా తెలిసినవారు, రాజును (ప్రజలను) అభిమానించేవాళ్లు, దండనీతిని తగువిధంగా ప్రయోగించగలిగిన వాళ్లు, అయిన వ్యక్తులను రాజు తనకు సచివులుగా తీసుకోవాలి.

సవిగ్రహో జనపదః కులశీలకలాన్వితః ।
వాగ్మీ ప్రగల్భశ్చక్షుష్మానుత్సాహీ ప్రతిపత్తిమాన్ ॥13॥

స్తమ్భశ్చాపలహీనశ్చ మైత్రః క్లేశసహశ్శుచిః ।
సత్యసత్త్వధృతిస్థైర్యప్రభావారోగ్యసంయుతః ॥14॥

కృతశిల్పశ్చ దక్షశ్చ ప్రజ్ఞావాన్ ధారణాన్వితః ।
దృఢభక్తిరకర్తా చ వైరాణాం సచివో భవేత్ ॥15॥

సచివుడు ఇంకా మంచిశరీరసౌష్ఠవం కలిగినవాడు, జనసమూహంతో సంబంధం కలిగినవాడు, గొప్పవంశంలో పుట్టినవాడు, ఉత్తమమైన నడవడి కలవాడు, విద్యలలో నిపుణుడు, నిపుణంగా మాట్లాడగలిగినవాడు, ప్రతిభ, దూరదృష్టి కలవాడు, ఉత్సాహవంతుడు, జ్ఞానవంతుడు, దృఢమైన అభిప్రాయం కలిగినవాడు, బుద్ధి స్థిరంగా ఉండేవాడు, స్నేహస్వభావం కలవాడు, కష్టాలను ఓర్చుకొనగలిగినవాడు, నిజమే పలికేవాడు, శక్తిమంతుడు, ధైర్యవంతుడు, స్థిరంగా ఉండేవాడు, ఆరోగ్యవంతుడు, శిల్పవిద్యలో నిపుణుడు, సమర్థుడు, మిక్కిలి బుద్ధివైభవం కలిగినవాడు, సర్వవిషయాలను బుద్ధిలో నిలుపుకొనగలిగినవాడు, స్థిరమైనభక్తి కలిగినవాడు, ఎవరితోనూ శత్రుత్వం తెచ్చుకోనివాడు కావాలి. ఇటువంటివాడిని రాజు సచివుడుగా నియమించుకోవాలి.

స్మృతిస్తత్పరతార్థేషు చిత్తజ్ఞో జ్ఞాననిశ్చయః ।
దృఢతా మన్త్రగుప్తిశ్చ మన్త్రిసమ్పత్ప్రకీర్తితాః ॥16॥

మరపులేనివాడు, రాజకార్యనిర్వహణలో ఏకాగ్రత కలిగినవాడు, రాజు మనసు తెలిసినవాడు, రాజకార్యాలను వివేకంతో నిశ్చయించగలిగినవాడు, నిశ్చయించిన అంశంలో స్థిరంగా ఉండేవాడు, మంత్రాంగాన్ని రహస్యంగా ఉంచగలిగినవాడు ఇవి మంత్రికి తప్పక ఉండవలసిన లక్షణాలు. (ఇటువంటివాడినే మంత్రిగా రాజు నియమించాలి)

త్రయ్యాం చ దణ్డనీత్యాం చ కుశలస్స్యాత్ పురోహితః ।
అథర్వవేదవిహితం కుర్యాచ్ఛాన్తికపౌష్టికమ్ ॥17॥

రాజు ఋగ్యజుస్సామవేదాలు మూడింటిలోనూ, దండనీతిలోనూ నైపుణ్యం కలిగినవాడిని పురోహితుడుగా స్వీకరించాలి. ఆ పురోహితుడు రాజుకోసం, రాజ్యంకోసం అథర్వవేదంలో చెప్పబడిన శాంతికర్మలు, పుష్టికర్మలు చక్కగా చేయించాలి.

సాధుతైషామమాత్యానాం తద్విద్యైస్సహ బుద్ధిమాన్ ।
చక్షుష్మత్తాం చ శిల్పం చ పరీక్షేత గుణద్వయమ్ ॥18॥

వివేకం కలిగినరాజు ఆయావిద్యలలో ఉత్తమపాండిత్యం కలిగినవారిచేత అమాత్యులవిద్యాపాటవం, సద్గుణస్థితి, బుద్ధివైభవం, కార్యకుశలత – వీనిలో మంచిచెడులు రెండింటినీ చక్కగా పరీక్షింపజేయాలి.

స్వజనేభ్యో విజానీయాత్ కులం స్థానమవగ్రహమ్ ॥19॥

అమాత్యులవంశం, వాళ్లు పుట్టి, పెరిగినచోటు, వారిస్వభావం అనే అంశాలను వారి బంధువులు మొదలైనవారినుండి తెలుసుకోవాలి.

పరికర్మసు దక్షం చ విజ్ఞానం ధారయిష్ణుతామ్ ।
గుణత్రయం పరీక్షేత ప్రాగల్భ్యం ప్రీతతాం తథా ॥
కథాయోగేషు బుధ్యేత వాగ్మిత్వం సత్యవాదితామ్ ॥20॥

అమాత్యులతో తాను సంభాషించే సమయంలో వారికి దుర్గనిర్మాణం మొదలైన కర్మలలో కల సామర్థ్యం, తెలివితేటలు, అప్రమత్తత అనే మూడు గుణాలను, అలాగే వారి ప్రతిభ, వారికి తనవిషయంలో సంతృప్తి ఉండడం, వాక్చాతుర్యం, నిజం మాట్లాడడం అనే అంశాలను కూడ రాజు స్వయంగా పరీక్షించాలి.

ఉత్సాహం చ ప్రభావం చ తథా క్లేశసహిష్ణుతామ్ ।
ధృతిం చైవానురాగం చ స్థైర్యం చాపది లక్షయేత్ ॥21॥

అమాత్యులలో ఉత్సాహం, గొప్పతనం, కష్టాలను ఓర్చుకునే లక్షణం, ధైర్యం, అభిమానం, బుద్ధి స్థిరంగా ఉండడం, అనే లక్షణాలను ఆపద కలిగిన సందర్భంలో గ్రహించాలి.

భక్తిం మైత్రీం చ శౌచం చ జానీయాద్ వ్యవహారతః ।
సంవాసిభ్యో బలం సత్త్వమారోగ్యం శీలమేవ చ ॥22॥

రాజుఎడల సేవాభావం, స్నేహభావం, నిష్కల్మషమైన వర్తనం అనే అంశాలు అతడిప్రవర్తననుబట్టి తెలుసుకోవాలి. అమాత్యుడిబలాన్నీ, శక్తినీ, ఆరోగ్యాన్నీ, స్వభావాన్నీ అతడితో కలిసి ఉండేవాళ్లనుండి తెలుసుకోవాలి.

అస్తబ్ధతామచాపల్యం వైరాణాం చాప్యకీర్తనమ్ ।
ప్రత్యక్షతో విజానీయాద్భద్రతాం క్షుద్రతామపి ॥23॥

ఉత్సాహంగా ఆలోచించగలగడం, బుద్ధి నిలకడగా ఉండడం, శత్రువులను పొగడకుండా ఉండడం, దేనికీ భయపడకుండా నెమ్మదిగా ఉండడం, నీచంగా ప్రవర్తించడం ఈ అంశాలను రాజు అమాత్యుడిని ప్రత్యక్షంగా గమనించి తెలుసుకోవాలి.

ఫలానుమేయాస్సర్వత్ర పరోక్షగుణవృత్తయః ॥24॥

ప్రత్యక్షంగా తెలియరానిగుణాలను నడతలనూ ఇతరవిషయాలలో అమాత్యుడిస్థితిగతులననుసరించి ఊహించి గ్రహించాలి.

సస్యాకరవతీ పుణ్యా ఖనిద్రవ్యసమన్వితా ।
గోహితా భూరిసలిలా పుణ్యై ర్జనపదై ర్యుతా ॥25॥

రమ్యా సకుఞ్జరబలా వారిస్థలపదాన్వితా ।
అదేవమాతృకా చేతి శస్యతే భూరిభూతయే ॥26॥

(ఇంక భూమివిషయానికి వస్తే) పంటలు సమృద్ధిగా పండేది, పుణ్యప్రదమైనది, వివిధఖనిజద్రవ్యాలు నిండుగా కలిగినది, ఆవుల ఉనికికి మేలయినది, నీళ్లు పుష్కలంగా కలిగినది, పవిత్రమైన జనావాసాలతో కూడినది, మనోహరంగా ఉన్నది, ఏనుగులబలం అధికంగా కలిగినది, జలమార్గాలు స్థలమార్గాలు ఉన్నది, పంటలు పండడానికి

కేవలం వర్షంపై ఆధారపడకుండా, సహజమైన నీటివసతులు కలిగినది అయిన నేల సంపదలు సమృద్ధిగా కలగడానికి ప్రశస్తమైనది.

శూద్రకారువణిక్ప్రాయో మహారమ్భః కృషీవలః ।
సానురాగో రిపుద్వేషీ పీడాసహకరః పృథుః ॥27॥

శూద్రులు, శిల్పకారులు, వైశ్యులు అధికంగా ఉన్ననేల మంచిది. ఘనకార్యాలు చేయడానికి పూనుకునేవారు, శ్రద్ధగా పనులు చేసేవారు, రాజుమీద అభిమానం కలిగినవారు, తమ రాజ్యానికి శత్రువులను ద్వేషించేవారు, రాజ్యం వలన కష్టాలు కలిగినా సహించగలిగినవారు, గొప్పవ్యక్తిత్వం గలిగినవారు అయిన ప్రజలు కలిగిన నేల ఉత్తమమైనది.

నానాదేశ్యైస్సమాకీర్ణో ధార్మికః పశుమాన్ బలీ ।
ఈదృగ్జనపదశ్శస్తోఽ మూర్ఖవ్యసనినాయకః ॥28॥

పెక్కు దేశాలకు సంబంధించినప్రజలతో నిండినదీ, ధర్మపరులు, పశుసంపద అధికంగా కలిగినవారు, బలవంతులు, మూర్ఖత లేనివారు(సాధుస్వభావులు), ఏ విధమైన వ్యసనం లేని నాయకులు కలిగిన జనావాసం ఉత్తమం.

పృథుసీమం మహాఖాత ముచ్చప్రాకారతోరణమ్ ।
పురం సమావసేచ్ఛైలసరిన్మరువనాశ్రయమ్ ॥29॥

పెద్దపొలిమేర కలిగినది (చాల విశాలమైనది), చుట్టూ బాగా లోతైన అగడ్తలు కలిగినది, చాలా ఎత్తయిన ప్రాకారాలు, గోపురాలు కలిగినది, కొండలు, నదులు, ఇసుకదిబ్బలు, అడవులను ఆశ్రయించుకుని ఉన్నది అయిన నగరంలో రాజు నివసించాలి.

బలవద్ధాన్యధనవద్దుర్గం కాలసహమ్మహత్ ।
ఔదకం పార్వతం వార్క్షమైరిణం ధన్వినం చ షట్ ॥30॥

దుర్గం చాల బలంగా ఉండాలి. అందులో ధనమూ ధాన్యమూ పుష్కలంగా ఉండాలి. ఎంతకాలమయినా చెడిపోకుండా దృఢంగా ఉండాలి. 1. ఔదకం (నదులు మొదలుగా జలాశయాలను ఆశ్రయించుకుని ఉన్నది), 2. పార్వతం (కొండలను ఆశ్రయించి నిర్మించినది), 3. వార్క్షం (వృక్షాలను అంటే అడవులను ఆశ్రయించుకుని నిర్మించినది), 4, ఐరిణం, (జనం లేనిప్రాంతంలో నిర్మించినది), 5. ధన్వినం (ఎడారిప్రాంతంలో నిర్మింపబడినది) అని దుర్గం ఐదు(ఆరు?)విధాలుగా ఉంటుంది.

ఈప్సితద్రవ్యసమ్పూర్ణః పితృపైతామహోచితః ।
ధర్మార్జితో వ్యయసహః కోశో ధర్మాదివృద్ధయే ॥31॥

రాజ్యంలో ధర్మం మొదలైనవి వృద్ధిచెందాలంటే, రాజధనాగారం కావలసినంత ద్రవ్యంతో నిండినది, తండ్రితాతల తరాలనుండి క్రమంగా వస్తున్నది, ధర్మమార్గంలో సంపాదించినది, అవసరమైన వ్యయానికి తగినంత ధనం కలిగినది కావాలి.

పితృపైతామహో వశ్యస్సంహతో దత్తవేతనః ।
విఖ్యాతపౌరుషో జన్యః కుశల శ్శకునై ర్వృతః ॥32॥

నానాప్రహరణోపేతో నానాయుద్ధవిశారదః ।
నానాయోధసమాకీర్ణో నీరాజితహయద్విపః ॥33॥

ప్రవాసాయాసదుఃఖేషు యుద్ధేషు చ కృతశ్రమః ।
అద్వైధక్షత్రియప్రాయో దణ్డో దణ్డవతా మ్మతః ॥34॥

తండ్రితాతలవరుసలో పరంపరగా వచ్చినవాడు, తనఅదుపులో ఉండేవాడు, ఇతరులతో విరోధం లేకుండా కలిసిఉండే వాడు, జీతం పుచ్చుకున్నవాడు, పదుగురిలో ప్రసిద్ధమైన పరాక్రమం కలిగినవాడు, జనాలతోడు ఉన్నవాడు, చేసే పనులలో నేర్పు కలిగినవాడు, శుభశకునాలతో కూడి ఉన్నవాడు, అనేకవిధాలైన ఆయుధాలను ప్రయోగించడం తెలిసినవాడు, రకరకాల యుద్ధాలలో నైపుణ్యం కలిగినవాడు, అనేకులైన వీరులతో కూడినవాడు, తనసైన్యంలోని ఏనుగులకు, గుఱ్ఱాలకు హారతిపట్టేవాడు(వాటిపై ఉండి యుద్ధం చేయగలిగినవాడు), ఇతరప్రదేశాలకు వెళ్లడం, అక్కడ ఉండడంలో కలిగే బాధలలోను, యుద్ధాలలోను మిక్కిలిగా శ్రమించేవాడు, రెండురకాల అభిప్రాయాలు లేనివాడు, ప్రధానంగా క్షత్రియజాతికి చెందినవాడు, అయిన సైనికుడు గలిగిన సైన్యం ఉత్తమం.

యోగవిజ్ఞానసత్త్వాఢ్యం మహాపక్షం ప్రియంవదమ్ ।
ఆయతిక్షమమద్వైధం మిత్రం కుర్వీత సత్కులమ్ ॥35॥

దృఢమైన యోగం, వివేకం, శక్తి కలిగినవాడు, తనపక్షంలో చాల ఎక్కువమంది కలవారు, అందరితోనూ ప్రియంగా మాట్లాడేవారు, రాజు ఆదాయాన్ని రక్షించడంలో సమర్థుడు, రెండురకాల అభిప్రాయాలు లేనివాడు (నిశ్చయబుద్ధి కలవాడు), ఉన్నతమైనవంశంలో పుట్టినవాడు అయిన వాడిని మిత్రుడుగా చేసుకోవాలి.

దూరాదేవాభిగమనం స్పష్టార్థహృదయానుగా ।
వాక్సత్కృత్యప్రదానం చ త్రివిధో మిత్రసఙ్గ్రహః ॥36॥

దూరంనుంచే ఎదురువెళ్లి ఆహ్వానించడం, ఏమాత్రం కల్మషం లేకుండా, మనసుకు నచ్చేవిధంగా మాట్లాడడం, మాటలతో గౌరవిస్తూ, కావలసినది ఇవ్వడం, ఇలా మిత్రులను మూడురకాలుగా సంపాదించుకోవాలి.

ధర్మకామార్థసంయోగో మిత్రాత్తు త్రివిధం ఫలమ్ ॥37॥

మిత్రుడివలన ధర్మం, అర్థం, కామం అనే మూడు విధాలయిన ఫలితాలు కలుగుతాయి.

ఔరసం తత్ర సన్నద్ధం తథా వంశక్రమాగతమ్ ।
రక్షితం వ్యసనేభ్యశ్చ మిత్రం జ్ఞేయం చతుర్విధమ్ ॥38॥

మిత్రుడు నాలుగువిధాలు. 1. ఔరసుడు (భార్యవలన పుట్టినవాడు), 2. సన్నద్ధుడు (సన్నిహితమైన సంబంధం కలిగినవాడు), 3. వంశక్రమంలో వచ్చినవాడు (తండ్రి తాతల నుండి మైత్రి కలిగినవారు), 4. కష్టాలనుండి కాపాడేవాడు.

మిత్రే గుణాస్సత్యతాద్యాస్సమానసుఖదుఃఖతా ॥39॥

సత్యవర్తనం, సుఖదుఃఖాలను తనతో సమానంగా అనుభవించడం అనేవి మిత్రుడి లక్షణాలు.

వక్ష్యేఽనుజీవినాం వృత్తం సేవీ సేవేత భూపతిమ్ ।
దక్షతా భద్రతా దార్ఢ్యం క్షాన్తిః క్లేశసహిష్ణుతా ॥
సన్తోషశ్శీలముత్సాహో మణ్డయత్యనుజీవినమ్ ॥ 40॥

ఇక రాజసేవకుల ధర్మాలను గురించి చెప్తాను. సేవకుడు రాజును సేవించాలి. (రాజును సేవించడం సేవకుడిప్రధానధర్మం). పనులు చేయడంలో నేర్పు, అప్రమత్తత, పట్టుదల, ఓర్పు, కష్టాలను సహించగలిగిన శక్తి, ఎప్పుడూ సంతోషంగా ఉండడం, మంచినడవడి కలిగిఉండడం, ఉత్సాహం, అనే ఈ గుణాలు సేవకుడికి అలంకారాలు.

యథాకాలముపాసీత రాజానం సేవకో నయాత్ ।
పరస్థానగమం క్రౌర్యమౌద్ధత్యం మత్సరం త్యజేత్ ॥41॥

రాజసేవకుడు సమయానుకూలంగా నీతిమంతంగా రాజును సేవించుకోవాలి. రాజుకు శత్రువులైన వారివద్దకు వెళ్ళగూడదు. కఠినంగా ఉండగూడదు, గర్వం తగదు. అసూయను విడిచిపెట్టాలి.

విగృహ్య కథనం భృత్యో న కుర్యా జ్జ్యాయసా సహ ।
గుహ్యం మర్మ చ మన్త్రం చ న చ భర్తుః ప్రకాశయేత్ ॥
రక్తా ద్వృత్తిం సమీహేత విరక్తం సన్త్యజేన్నృపమ్ ॥42॥

తనకంటె పై ఉద్యోగి చెప్పిన మాటలను విరోధించగూడదు. దానిని గురించి ఎక్కడా మాట్లాడగూడదు. రాజుకు సంబంధించిన రహస్యాలను, ఆయువుపట్లనూ, మంత్రాంగాలనూ ఎక్కడా బయటపెట్టగూడదు. సేవకుడు తనపై అభిమానం కలిగినరాజువద్దనే కొలువు చేయాలి. తనను ద్వేషించేరాజును విడిచిపెట్టాలి.

అకార్యే ప్రతిషేధశ్చ కార్యే చాపి ప్రవర్తనమ్ ।
సంక్షేపాదితి సద్వృత్తిం బన్ధుమిత్రానుజీవినామ్ ॥44॥

రాజు చేయగూడనిపనులు చేస్తుంటే నివారించాలి. చేయవలసినపనులు చేయించాలి. ఇది ప్రధానంగా రాజుగారి బంధువులు, మిత్రులు, సేవకులు చేయవలసిన మంచిపని.

ఆజీవ్యస్సర్వసత్త్వానాం రాజా పర్జన్యవద్భవేత్ ॥45॥

మేఘం సర్వత్రా వర్షించిన విధంగా రాజు రాజ్యంలోని వారికందరికీ జీవనవృత్తిని కల్పించాలి.

ఆయద్వారేషు చాప్త్యర్థం ధనం చాదదతీతి చ ।
కుర్యాద్దుర్యోగసమ్పన్నానధ్యక్షాన్ సర్వకర్మసు ॥46॥

కోశానికి ఆదాయం వచ్చేమార్గాలలో, ఆదాయాన్ని పొందడానికి, ధనం రాబట్టడం మొదలుగా అన్నిపద్ధతులలోనూ కఠినమైన ఉపాయాలు సమృద్ధిగా తెలిసినవారిని అధ్యక్షులుగా నియమించాలి.

కృషిర్వణిక్పథో దుర్గం సేతుః కుఞ్జరబన్ధనమ్ ।
ఖన్యాకరబలాదానం శూన్యానాం చ నివేశనమ్ ॥
అష్టవర్గమిమం రాజా సాధువృత్తోఽనుపాలయేత్ ॥47॥

మంచినడవడి కలిగిన మహారాజు 1. వ్యవసాయం, 2. వ్యాపారమార్గాలు, 3. దుర్గం, 4. వంతెన, 5. ఏనుగులను బంధించడం, 6. బంగారం మొదలైన నిధులు, 7. రక్షణం ఏర్పాటుచేయడం, 8. శూన్యప్రదేశాలలో నివాసాలు ఏర్పాటుచేయడం అనే ఎనిమిది మార్గాలను (అష్టవర్గం) శ్రద్ధగా కాపాడాలి.

ఆముక్తికేభ్య శ్చౌరేభ్యః పౌరేభ్యో రాజవల్లభాత్ ।
పృథివీపతిలోభాచ్చ ప్రజానాం పఞ్చధా భయమ్ ॥48॥

రాజ్యంలో ప్రజలకు 1. అధికారులు, 2. దొంగలు, 3. ఇతర(నగర)జనులు, 4. రాజబంధువులు, 5. రాజుగారి దురాశ అని భయం అయిదు విధాలుగా ఉంటుంది.

అవేక్ష్యైతద్భయం కాల ఆదదీత కరం నృపః ।
అభ్యన్తరం శరీరం స్వం బాహ్యం రాష్ట్రం చ రక్షయేత్ ॥49॥


ఈ భయాలు ఏవీ కలగకుండా, ప్రజలను రక్షించడానికి రాజు వారినుండి తగిన విధంగా పన్నులు తీసుకోవాలి. రాజ్యం ఆభ్యంతరం, బాహ్యం అని రెండువిధాలు. రాజుగారి శరీరమే ఆభ్యంతరం. రాజ్యమే బాహ్యం. రాజు ఈ రెంటిని రక్షించాలి.

దణ్డ్యాంస్తాన్దణ్డయేద్రాజా స్వం రక్షేచ్చ విషాదితః ।
స్త్రియః పుత్రాంశ్చ శత్రుభ్యో విశ్వసేన్న కదాచన ॥50॥

అపరాధం చేసిన కారణంగా, దండింపదగినవారిని రాజు తప్పక శిక్షించాలి. దుఃఖపెడుతున్నవారినుండి తనను కాపాడుకోవాలి. శత్రువులనుండి తనస్త్రీలనూ, కుమారులనూ రక్షించుకోవాలి. ఎవ్వరినీ ఎప్పటికీ నమ్మగూడదు.

ఇత్యాది మహాపురాణే ఆగ్నేయే రాజధర్మకథనం నామైకోనచత్వారింశదధికద్విశతతమోఽధ్యాయః ॥239॥

అగ్నిమహాపురాణంలో రాజధర్మకథనం అనే రెండువందల ముప్పైతొమ్మిదవ అధ్యాయం సమాప్తం.



చత్వారింశదధికద్విశతతమోఽధ్యాయః - రెండువందల నలబయ్యవ అధ్యాయం

షాడ్గుణ్యకథనమ్ - షాడ్గుణ్యకథనం

రామ ఉవాచ - దశరథరాముడు లక్ష్మణుడితో ఇలా అంటున్నాడు.

మణ్డలం చిన్తయేన్ముఖ్యం రాజా ద్వాదశరాజకమ్ ।
అరిర్మిత్రమరేర్మిత్రం మిత్రమిత్రమతఃపరమ్ ॥
తథారిమిత్రమిత్రం చ విజిగీషోః పురస్స్మృతాః ॥1॥

రాజు ప్రధానంగా పన్నెండుమందిరాజులతో కూడిన రాజమండలాన్ని గురించి ఆలోచించాలి. 1. శత్రురాజు, 2. మిత్రరాజు, 3. శత్రువునకు మిత్రుడు, ఆతరువాత 4. మిత్రుడికి మిత్రుడు, 5. శత్రువుకు మిత్రుడైన రాజుకు మిత్రుడు, అనేఅయిదుగురు రాజులు రాజునకు ముందుభాగంలో ఉంటారు.

పార్ష్ణిగ్రాహస్స్మృతః పశ్చా దాక్రన్ద స్తదనన్తరమ్ ।
ఆసారావనయోశ్చైవం విజిగీషోశ్చ మణ్డలమ్ ॥2॥

జయశీలుడైన రాజుకు వెనుకవైపు మండలానికి రాజు 6. పార్ష్ణిగ్రాహుడు. అతడికి వెనుక ఉండేమండలానికి రాజు 7. ఆక్రందుడు. ఆక్రమంలో వారికి వెనుక ఉండేమండలాలకు రాజులు 8. (పార్ష్ణిగ్రాహుడికి వెనుక) పార్ష్ణిగ్రాహాసారుడు, 9. (ఆక్రందుడికి వెనుక) ఆక్రందాసారుడు.

అరేశ్చ విజిగీషోశ్చ మధ్యమో భూమ్యనన్తరః ।
అనుగ్రహే సంహతయోర్నిగ్రహే వ్యస్తయోః ప్రభుః ॥3॥

జయశీలుడైన ఈరాజుకు అతడిశత్రువుకు నడుమ ఉన్న సంధిప్రాంతానికి సంబంధించినవాడు 10. మధ్యముడు. శత్రురాజు, విజిగీషువు ఇద్దరూ కలిస్తే మధ్యముడు వారిద్దరికీ అన్నివిధాలుగా సాయంగా ఉంటాడు. ఒకవేళ వారిద్దరూ విరోధంతో వేరు అయితే మధ్యముడు వారిద్దరినీ విరోధించి వారిని సంహరించగలుగుతాడు.

మణ్డలాద్బహిరేతేషాముదాసీనో బలాధికః ।
అనుగ్రహే సంహతానాం వ్యస్తానాం చ వధే ప్రభుః ॥4॥

ఈ అందరు రాజులమండలాలకు వెలుపలగా ఉన్నమండలానికి అధిపతి అయినవాడు, మిక్కిలిబలవంతుడు అయినరాజు 11. ఉదాసీనుడు. తనకు ముందున్న, శత్రురాజు, మధ్యముడు, విజిగీషుడు అనేముగ్గురు కలిసి ఉంటే ఉదాసీనుడు వారితో స్నేహంతో సాయంగా ఉంటాడు. వారు ముగ్గురు విరోధంతో వేరయితే, వారిని చంపడానికి సమర్థుడవుతాడు. (వీరితో (12. విజిగీషువు అయినరాజు తనమండలాన్ని గూర్చి కూడ ఆలోచించాలి. కాబట్టి 12 మండలాలు)

సన్ధిం చ విగ్రహం యానమాసనాది వదామి తే ।
బలవద్విగృహీతేన సన్ధిం కుర్యాచ్ఛివాయ చ ॥5॥

లక్ష్మణా! ఆతరువాత నీకు 1. సంధి, 2. విగ్రహం, 3. యానం, 4. ఆసనం మొదలైనవాటినిగురించి చెప్తాను. తనకంటె బలవంతుడయిన రాజుతో విరోధం వచ్చినపుడు తనకు మేలు జరగాలంటే అతడితో సంధి చేసుకోవాలి.

కపాల ఉపహారశ్చ సన్తానస్సఙ్గతస్తథా ।
ఉపన్యాసః ప్రతీకారస్సంయోగః పురుషాన్తరః ॥6॥

అదృష్టనర ఆదిష్ట ఆత్మాపి స (మిష) ఉపగ్రహః ।
పరి(శ్రయ)క్రమస్తథా(థో)చ్ఛిన్నస్తథా చ పరదూషణమ్ ॥
స్సన్ధోపధేయస్సన్ధిశ్చ సన్ధయష్షోడశేరితాః ॥7॥

1. కపాలం, 2. ఉపహారం, 3. సంతానం, 4. సంగతం, 5. ఉపన్యాసం, 6. ప్రతీకారం, 7. సంయోగం, 8. పురుషాంతరం, 9. అదృష్టనరం, 10. ఆత్మ (ఆత్మామిషం), 11. ఉపగ్రహం, 12. పరిక్రమం (పరిశ్రయం), 13. ఛిన్నం (ఉచ్ఛిన్నం), 14. పరదూషణం, 15. సంధోపదేయం, 26. సంధి అని సంధులు పదహారువిధాలుగా ఉంటాయి.

పరస్పరోపకారశ్చ మైత్రస్సమ్బన్ధకస్తథా ।
ఉపహారాశ్చ చత్వారస్తేషు ముఖ్యాశ్చ సన్ధయః ॥8॥

సంధులలో 1. పరస్పరోపకారం, 2. మైత్రి, 3. సంబంధం, 4. ఉపహారం అనేవి నాలుగు ప్రధానమైనవి (అని కొందరిమతం).

బాలో వృద్ధో దీర్ఘరోగస్తథా బన్ధుబహిష్కృతః ।
భీరుకో భీరుకజనో లుబ్ధో లుబ్ధజన స్తథా ॥9॥

1. బాలుడు, 2. ముసలివాడు, 3. చాలకాలంగా రోగంతో బాధపడేవాడు, 4. బంధువులు వెలివేసినవాడు, 5. పిరికివాడు, 6. పిరికిసైన్యం కలిగినవాడు, 7. అత్యాశ కలిగినవాడు, 8. అత్యాశాపరులైన సైన్యం కలిగినవాడు,

విరక్తప్రకృతి శ్చైవ విషయేష్వతి శక్తిమాన్ ।
అనేకచిత్తమన్త్రశ్చ దేవబ్రాహ్మణనిన్దకః ॥10॥

9.మంత్రులు మొదలైన తనవారి అభిమానం పోగొట్టుకొన్నవాడు, 10.ఇంద్రియలోలుడు, 11.చపలచిత్తుడై, బహువిధాలుగా ఆలోచనలు చేసేవాడు, 12.దేవతలనూ బ్రాహ్మణులనూ నిందించేవాడు,

దైవోపహతకశ్చైవ దైవనిన్దక ఏవ చ ।
దుర్భిక్షవ్యసనోపేతో బలవ్యసనసఙ్కులః ॥11॥

13. దైవానుగ్రహం లేనివాడు (అవసరమైన పురుషప్రయత్నం చేయనివాడు), 14. వైఫల్యానికి దైవాన్ని నిందించేవాడు, 15.దుర్భిక్షం మొదలైన కష్టాలలో ఉన్నవాడు, 16. సైన్యం మూలంగా రకరకాల బాధలు పడేవాడు,

స్వదేశస్థో బహురిపుర్ముక్తః కాలేన యశ్చ హ ।
సత్యధర్మవ్యపేతశ్చ వింశతిః పురుషా అమీ ॥
ఏతైస్సన్ధిం న కుర్వీత విగృహ్ణీయాత్తు కేవలమ్ ॥ 12॥

17. స్వస్థానంనుండి కదలనివాడు, 18. పెక్కుమంది శత్రువులు కలిగినవాడు, 19. తగనిసమయంలో పనులకు పూనుకునేవాడు, 20, సత్యం ధర్మం విడిచిపెట్టినవాడు అనే ఈ ఇరవైరకాల మనుషులతోనూ సంధి చేసుకోగూడదు. వీళ్లతో విరోధం ఒక్కటే కర్తవ్యం.

పరస్పరాపకారేణ పుంసాం భవతి విగ్రహః ॥13॥

పరస్పరం ఒకరికి మరొకరు అపకారం చేసుకోవడంవలన వ్యక్తులకు విగ్రహం (విరోధం) సంభవిస్తుంది.

ఆత్మనోఽభ్యుదయాకాంక్షీ పీడ్యమానః పరేణ వా ।
దేశకాలబలోపేతః ప్రారభేతేహ విగ్రహమ్ ॥14॥

తనకు మేలు కలగాలని కోరుకునేవాడు, ఇతరులచేత బాధింపబడేవాడూ, దేశం, కాలం, అనుకూలంగా ఉండి, సైన్యం దృఢంగా ఉన్నపుడు విగ్రహం ప్రారంభిస్తాడు.

రాజ్యస్త్రీస్థానదేశానాం జ్ఞానస్య చ బలస్య చ ।
అపహారో మదో మానః పీడా వైషయికీ తథా ॥15

రాజ్యం, స్త్రీలు, తనస్థానం, దేశంలో భాగం, వివేకం, సైన్యం, వీటిని అపహరించడంవల్ల విగ్రహం ఏర్పడుతుంది. అలాగే, గర్వం, అభిమానం, తనప్రదేశానికి పీడ కలిగించడంవలన 'విగ్రహం' కలుగుతుంది.

జ్ఞానాత్మశక్తిధర్మాణాం విఘాతో దైవమేవ చ ।
మిత్రార్థం చాపమానం చ తథా బన్ధువినాశనమ్ ॥16॥

తన వివేకానికి, శక్తికి, ధర్మానికి, విఘాతం కలిగినపుడు దైవికంగానూ, మిత్రులకోసమూ, అవమానం కలిగినపుడు, బంధువులకు నష్టం వాటిల్లినపుడు 'విరోధం' ఏర్పడుతుంది.

భూతానుగ్రహవిచ్ఛేదస్తథా మణ్డలదూషణమ్ ।
ఏకార్థాభినివేశిత్వమితి విగ్రహయోనయః ॥17॥

జీవులకు తాను దయతో ఇచ్చినదానిని అడ్డగించడం, మండలాన్ని నిందించడం, తాను శత్రురాజూ ఇద్దరూ ఒకే ప్రయోజనం గురించి ఆసక్తి కలిగిఉండడం, ఇవి 'విగ్రహం' కలగడానికి కారణాలు.

సాపత్న్యజం వాస్తుజం స్త్రీజం వాగ్జాత మపరాధజమ్ ।
వైరం పఞ్చవిధం ప్రోక్తం సాధనైః ప్రశమం నయేత్ ॥18॥

1. సవతిబిడ్డలు కావడం వలన ఏర్పడినది, 2. భూమి, బంగారం మొదలైన వస్తువుల కారణంగా ఏర్పడినది, 3. స్త్రీల మూలంగా కలిగేది, 4. కఠినమైన వాక్కులవలన పుట్టేది, 5. అపకారం చేయడంవలన ఏర్పడేది అని వైరం అయిదు రకాలుగా ఉంటుంది. ఈ శత్రుత్వాలను తగినసాధనాలతో అణచివేయాలి.

కిఞ్చిత్ఫలం నిష్ఫలం వా సన్దిగ్ధఫలమేవ చ ।
తదాత్వే దోషజననమాయత్యాం చైవ నిష్ఫలమ్ ॥19॥

ఆయత్యాం చ తదాత్వే చ దోషసఞ్జననం తథా ।
అపరిజ్ఞాతవీర్యేణ పరేణ స్తోభితోఽపి వా ॥20॥

పరార్థం స్త్రీనిమిత్తం చ దీర్ఘకాలం ద్విజైస్సహ ।
అకాలదైవయుక్తేన బలోద్ధతసఖేన చ ॥21॥

తదాత్వే ఫలసంయుక్తమాయత్యాం ఫలవర్జితమ్ ।
ఆయత్యాం ఫలసంయుక్తం తదాత్వే నిష్ఫలం తథా ॥
ఇతీమం షోడశవిధం న కుర్యాదేవ విగ్రహమ్ ॥22॥

1. ఫలితం తక్కువ ఐనదీ, 2. ఫలితం అసలు లేనిదీ, 3. ఫలితం ఉంటుందో లేదో సందేహం అయినదీ, 4. అప్పటికప్పుడే దోషాలు కలిగించేదీ, 5. దూరకాలంలో ఫలితం లేకుండా పోయేదీ, 6. అప్పటికప్పుడూ, ఆ తరువాత కాలంలోనూ దోషాలు కలిగించేదీ, 7.ఎంతటి పరాక్రమం కలిగినవాడో తెలియని శత్రువు వలన కలిగినదీ, 8.ఇతరులు అవమానించడంవలన గలిగినదీ, 9.ఇతరుల ప్రయోజనం కోసం ఏర్పడినదీ, 10. ఆడువారి కారణంగా కలిగినదీ, 11. బ్రాహ్మణులతో చాలకాలంగా కొనసాగుతున్నదీ, 12. తనకు అనుకూలం కానిసమయంలో 13. దైవబలం కలిసివచ్చినవాడితో ఏర్పడినదీ, 14. మిక్కిలి పరాక్రమం, గర్వం కలిగిన మిత్రుడితో ఏర్పడినదీ, 15.అప్పటికప్పుడు ఫలితం ఇచ్చి, ఆ తరువాతి కాలంలో నిష్ఫలం అయ్యేదీ, 16.అప్పటికప్పుడు నిష్ఫలం అయి, ఆ తరువాతికాలంలో ఫలవంతమైనదీ అనే విధంగా పదహారువిధాలయిన సందర్భాలలో 'విగ్రహం' చేయగూడదు.

తదాత్వాయతిసంశుద్ధం కర్మ రాజా సదా చరేత్ ।
హృష్టం పుష్టం బలం మత్వా గృహ్ణీయాద్విపరీతకమ్ ॥23॥

రాజు ఎప్పుడయినా అప్పటి కప్పుడు, ఆ తరువాత చాలకాలం వరకూ మంచిఫలితాన్ని ఇచ్చే పనులను ఆచరించాలి. తనసైన్యం ఉత్సాహంగానూ దృఢంగానూ ఉండడమూ, శత్రువులు నిరుత్సాహంగా, బలహీనంగా ఉండడమూ గ్రహించి అప్పుడు శత్రువులతో యుద్ధానికి సిద్ధపడాలి.

మిత్రమాక్రన్ద ఆసారో యదా స్యుర్దృఢభక్తయః ।
పరస్య విపరీతం చ తదా విగ్రహమాచరేత్ ॥24॥

మిత్రుడు, ఆక్రందుడు, ఆసారుడు, వీరికి తనపై స్థిరమైన భక్తి ఉన్నపుడు, శత్రువుకు తనపై విరోధభావం అధికంగా ఉన్నపుడు విగ్రహం (యుద్ధం) చేయాలి.

విగృహ్య సన్ధాయ తథా సమ్భూయాథ ప్రసఙ్గతః ।
ఉపేక్షయా చ నిపుణైర్యానం పఞ్చవిధం స్మృతమ్ ॥25॥

విగృహ్యయానం (విరోధంతో వెళ్లడం), సంధాయయానం (సంధిగా కలుపుకుని వెళ్లడం), ప్రసంగయానం (కలవడంకోసం వెళ్లడం, (ప్రసంగానుసారంగా వెళ్లడం), ఉపేక్షాయానం (ఉపేక్షతో వెళ్లడం) అని యానం అయిదు విధాలుగా చెప్పబడింది.

పరస్పరస్య సామర్థ్యవిఘాతాదాసనం స్మృతమ్ ।
అరేశ్చ విజిగీషోశ్చ యానవత్పఞ్చధా స్మృతమ్ ॥27॥

శత్రువు, విజిగీషువు అయిన రాజులు ఇద్దరూ ఒకరినొకరు ఏమీ చేయలేని స్థితిలో విగ్రహాదులకు సిద్ధపడక అలాగే ఉండిపోవడం ఆసనం. ఆసనం కూడ యానంలాగా విగృహ్యాసనం, సంధాయాసనం, ప్రసంగాసనం, ఉపేక్షాసనం అని అయిదు విధాలుగా చెప్పబడింది.

బలినోర్ద్విషతోర్మధ్యే వా చాత్మానం సమర్పయన్ ।
ద్వైధీభావేన తిష్ఠేత కాకాక్షివ దలక్షితః ॥28॥

బలవంతులైన శత్రువులు ఇద్దరు యుద్ధానికి పూనుకున్నపుడు వారిద్దరితోనూ తాను వారికి మిత్రుడినని చెప్పి, తనను సమర్పించుకుని, కాకి కన్నులాగా రెండువైపుల ఉన్నట్లుగా రహస్యంగా ఉండిపోవాలి.

ఉభయోరపి సమ్ప్రాతే సేవేత బలవత్తరమ్ ॥29॥

బలవంతులైన శత్రువులిద్దరు కలిసి తనపైకి యుద్ధానికి వచ్చినపుడు వారిలో అధికబలవంతుడిని ఆశ్రయించాలి.

యదా ద్వావపి నేచ్ఛేతాం సంశ్లేషం జాతసంవిదౌ ।
తదోపసర్పేత్తచ్ఛత్రుమధికం వా స్వయం వ్రజేత్ ॥30॥

ఒకవేళ యుద్ధానికి వచ్చిన ఆ రాజులిద్దరూ తమతో కలవడానికి (సంధి చేసుకోవడానికి) ఒప్పుకోకపోతే, వాళ్లిద్దరికి శత్రువయినరాజును ఆశ్రయించాలి. లేదా వాళ్లిద్దరికంటె బలవంతుడయిన వేరొకరాజును స్వయంగా వెళ్లి ఆశ్రయించాలి.

ఉచ్ఛిద్యమానో బలినా నిరుపాయప్రతిక్రియః ।
కులోద్ధతం సత్యమార్యమాసేవేత బలోత్కటమ్ ॥31॥

బలవంతుడయిన రాజు తనను ఆక్రమించుకుంటున్నపుడు రక్షించుకోవడానికి ఏ ఉపాయం లేనపుడు, గొప్పకులంలో పుట్టినవాడు, సత్యశీలుడు, వినీతుడు, మిక్కిలి బలవంతుడు అయిన వేరొక రాజును ఆశ్రయించాలి.

తద్దర్శనోపాస్తికతా నిత్యం తద్భావభావితా ।
తత్కారితప్రశ్రయితా వృత్తం సంశ్రయిణశ్స్మృతమ్ ॥32॥

అటువంటిరాజును ఆశ్రయించవలసినపుడు ఆ రాజు దర్శనంకోసం దర్శనం ఇప్పించేవారిని సేవించాలి. ఆ రాజు ఆలోచనలకు అనుగుణంగా నడుచుకోవాలి. అతడిపనులు చేసిపెట్టేవాళ్లను సేవించుకోవాలి. ఒకరిని ఆశ్రయించేవాళ్లు తప్పకుండా ఆచరింపవలసిన ధర్మం ఇది.

ఇత్యాది మహాపురాణే ఆగ్నేయే షాడ్గుణ్యకథనం నామ చత్వారింశదధికద్విశతతమోఽధ్యాయః ॥240॥

అగ్నిమహాపురాణంలో షాడ్గుణ్యకథనం అనే రెండువందల నలబయ్యవ అధ్యాయం సమాప్తం.

ఏకచత్వారింశదధికద్విశతతమోఽధ్యాయః – రెండువందల నలభైఒకటవ అధ్యాయం

సామాదికథనమ్ – సామాదికథనం

రామ ఉవాచ – దశరథరాముడు లక్ష్మణుడితో ఇలా అంటున్నాడు.

ప్రభావోత్సాహశక్తిభ్యాం మన్త్రశక్తిః ప్రశస్యతే ।
ప్రభావోత్సాహవాన్ కావ్యో జితో దేవపురోధసా ॥1॥

ప్రభుశక్తి, ఉత్సాహశక్తి అనే వాటికంటె మంత్రశక్తి శ్రేష్ఠం. ప్రభుశక్తి, ఉత్సాహశక్తి రెండూ కలిగిన శుక్రాచార్యుడిని దేవతల గురువైన బృహస్పతి మంత్రశక్తితో జయించాడు.

మన్త్రయేతేహ కార్యాణి నానాప్తైర్నావిపశ్చితా ।
అశక్యారమ్భవృత్తీనాం కుతః క్లేశా దృతే ఫలమ్ ॥2॥

రాజు తనకు ఆప్తులైనవారితోనూ, రాజనీతిశాస్త్రంలో పండితుడైనవాడితోనూ మాత్రమే ఆలోచనలు చేయాలి. సాధ్యం కాని పనులను ప్రారంభించినవాడికి కష్టాలు తప్ప ప్రయోజనం ఏమీ ఉండదు.

అవిజ్ఞాతస్య విజ్ఞానం విజ్ఞాతస్య చ నిశ్చయః ।
అర్థద్వైధస్య సన్దేహచ్ఛేదనం శేషదర్శనమ్ ॥3॥

తెలియని దానిని తెలుసుకోవాలి. తెలిసిన విషయంలో చక్కగా విచారణ చేసి, కర్తవ్యాన్ని నిర్ణయించుకోవాలి. రెండురకాల అభిప్రాయాలు (సందేహం) కలిగినపుడు ఆసందేహాన్ని నివారించుకొని, మిగిలిన అంశాలను పరిశీలించి, నిశ్చయజ్ఞానానికి రావాలి.

సహాయా స్సాధనోపాయా విభాగో దేశకాలయోః ।
విపత్తేశ్చ ప్రతీకారః పఞ్చాఙ్గో మన్త్ర ఇష్యతే ॥4॥

కార్యనిర్వహణలో 1. తోడుగా ఉండేవాళ్లు 2. కార్యం సాధించడానికి తగిన మార్గాలు 3. దేశం 4. కాలం అనే వాటికి సంబంధించిన విచక్షణ, 5. నిర్వహణలో వచ్చే ఆపదలను నివారించుకోవడం, అనేవి మంత్రం ఐదుభాగాలుగా చెబుతారు.

మనఃప్రసాదం శ్రద్ధా చ తథా కారణపాటవమ్ ।
సహాయోత్థానసమ్పచ్చ కర్మణాం సిద్ధిలక్షణమ్ ॥5॥

మనస్సు ప్రసన్నంగా ఉండడం, శ్రద్ధ, కార్యం సిద్ధించడానికి కారణమైన ఇంద్రియాదులు సమర్థంగా ఉండడం, ఇతరులసహాయం, అప్రమత్తంగా కార్యం నిర్వహించగలిగిన ఉత్సాహం అనేవి మంత్రాంగం నిర్ణయించిన కర్మలు మంచిఫలితాలు సిద్ధింపజేస్తాయి.

మదః ప్రమాదః కామశ్చ సుప్తప్రలపితాని చ ।
భిన్దన్తి మన్త్రం ప్రచ్ఛన్నాః కామిన్యో రమతాం తథా ॥6॥

అహంకారం, పొరపాటు, మితిమీరినకోరిక, నిద్రలో కలవరించడం, రహస్యంగా ఉండి అన్నివిషయాలు గమనించే వాళ్లు, తనతో కలిసిఉండే స్త్రీలు - వీటివలన మంత్రాంగం వెల్లడి అయి, కార్యం చెడుతుంది.

ప్రగల్భస్స్మృతివాన్వాగ్మీ శస్త్రే శాస్త్రే చ నిష్ఠితః ।
అభ్యస్తకర్మా నృపతేర్దూతో భవితుమర్హతి ॥7॥

ప్రతిభ కలవాడు, మరపు లేనివాడు, మాటనేర్పు కలిగినవాడు, ఆయుధప్రయోగంలోనూ, వివిధ శాస్త్రాలలోనూ శ్రద్ధ, నైపుణ్యం, రాజకార్యనిర్వహణలో అనుభవం కలిగినవాడు-రాజుకు దూత కావడానికి అర్హు డవుతాడు.

నిసృష్టార్థో మితార్థశ్చ తథా శాసనహారకః ।
సామర్థ్యాత్ పాదతో హీనో దూతస్తు త్రివిధ స్స్మృతః ॥8॥

నిసృష్టార్థుడు (అన్ని బాధ్యతలు తీసుకున్నవాడు), మితార్థుడు (కొద్ది బాధ్యతలు మాత్రమే తీసుకున్నవాడు), శాసనహారి (రాజుగారివార్తలను తీసుకునిపోయేవాడు), అని దూత మూడువిధాలుగా ఉంటాడు. దూత ఉన్నత వ్యక్తులలోని పూర్తిసామర్థ్యంలో నాలుగవవంతు తక్కువగా కలిగి ఉంటాడు.

నావిజ్ఞాతం పురం శత్రోః ప్రవిశేచ్చ న సంసదమ్ ।
కాలమీక్షేత కార్యార్థ మనుజ్ఞాతశ్చ నిష్పతేత్ ॥9॥

పూర్తిగా తెలుసుకోకుండా దూత శత్రువు నగరంలో కాని, అతడి సభలో కాని ప్రవేశించగూడదు. పని నెరవేరడానికి తగిన సమయం వచ్చేంతవరకు ఎదురుచూడాలి. శత్రురాజు అనుమతి ఇచ్చిన తరువాత మాత్రమే ఆ రాజ్యంనుండి తిరిగివెళ్లాలి.

ఛిద్రం చ శత్రోర్జానీయాత్ కోశమిత్రబలాని చ ।
రాగాపరాగౌ జానీయాద్దృష్టిగాత్రవిచేష్టితైః ॥10॥

శత్రువు బలహీనతలు, అతడి ధనాగారం, అతడికి మిత్రులైనరాజులు, సైన్యం సామర్థ్యం గురించి దూత తెలుసుకోవాలి. అతడిచూపులను బట్టి, శరీరస్థితిని బట్టి, చేష్టలను బట్టి శత్రువుకు తమపై ఉన్న రాగం, ద్వేషం అనే భావాలను గ్రహించాలి.

కుర్యాచ్చతుర్విధం స్తోత్రం పక్షయోరుభయోరపి ।
తపస్వివ్యఞ్జనోపేతైస్సుచరైస్సహ సంవసేత్ ॥11॥

దూత తన రాజు, శత్రురాజు ఉభయపక్షాలకు సంబంధించిన కులశీలాద్యంశాలను గురించి నాలుగు విధాలుగా ప్రశంసించాలి. తాపసులు మొదలుగా రకరకాల మారువేషాలలో ఉన్న తన రాజ్యపు గూఢచారులతో కలిసి ఉండాలి.

చరః ప్రకాశో దూతస్స్యాదప్రకాశశ్చరో ద్విధా ।
వణిక్కృషీవలో లిఙ్గీ భిక్షుకాద్యాత్మకాశ్చరాః ॥12॥

చారులు రెండువిధాలు. అందరికీ తెలిసినవాడు. ఇతడు దూత. ఎవరికీ తెలియకుండా గూఢంగా ఉండేవాడు. ఇతడు గూఢచారి. వ్యాపారులు, వ్యవసాయదారులు, సన్న్యాసులు, భిక్షుకులు, మొదలైనవారు చారులు.

యాయాదరిం వ్యసనినం నిష్ఫలే దూతచేష్టితే ।
ప్రకృతివ్యసనం యత్స్యా త్తత్సమీక్ష్య సముత్పతేత్ ॥13॥

దూతకృత్యం వ్యర్థం అయినపుడు, శత్రురాజు కష్టాలలో ఉన్నపుడు శత్రువుపై యుద్ధానికి వెళ్లాలి. విజిగీషువు అయినరాజు శత్రువుపై విజయం సాధించడానికి తనకు ఉన్న అవరోధాలను కూడా పరిశీలించుకుని, విజయం నిశ్చయం అయిన తరువాత శత్రువుపై దండెత్తాలి.

అనయా ద్వ్యస్యతి శ్రేయస్తస్మాత్తద్వ్యసనం స్మృతమ్ ॥14॥

రాజనీతిని పాటించకపోవడంచేత శ్రేయస్సు నశిస్తుంది. శ్రేయస్సును పాడుచేసేది కావడంచేత దానిని వ్యసనం అంటారు.

హుతాశనో జలం వ్యాధిర్దుర్భిక్షం మరకం తథా ।
ఇతి పఞ్చవిధం దైవం వ్యసనం మానుషం వరమ్ ॥15॥

వ్యసనం దైవికం, మానుషం అని రెండు విధాలు. అందులో 1. అగ్ని, 2. నీరు, 3. రోగం, 4. కరువు, 5. అంటువ్యాధులు, అని దైవంవలన కలిగే వ్యసనాలు (దైవికాలు) అయిదువిధాలు. దైవిక వ్యసనాలకంటె మానవులవలన కలిగే వ్యసనాలు మేలైనవి.

దైవం పురుషకారేణ శాన్త్యా చ ప్రశమం నయేత్ ।
ఉత్థాపితేన నీత్యా చ మానుషం వ్యసనం హరేత్ ॥16॥

పురుషప్రయత్నంచేతనూ, శాంతికర్మలచేతనూ దైవంవలన ఏర్పడిన వ్యసనాలను తొలగించుకోవచ్చు. మానవసంబంధమైన వ్యసనాలను రాజనీతిని చక్కగా అనుసరించడం ద్వారా తొలగించుకోవచ్చు.

మన్త్రో మన్త్రఫలావాప్తిః కార్యానుష్ఠానమాయతిః ।
ఆయవ్యయౌ దణ్డనీతిరమిత్రప్రతిషేధనమ్ ॥17॥

మేలు కలిగించే ఆలోచన, ఆ ఆలోచనానికి తగినఫలితం వచ్చేవిధంగా చేయడం, రాజకార్యాలను సమర్థంగా అనుష్ఠించడం, భవిష్యత్కాలంలో మేలు జరిగేవిధంగా ఇప్పుడే ఏర్పాటు చేయడం, అపరాధులను శాస్త్రానికి అనుగుణంగా దండించడం, శత్రువులను అడ్డగించడం,

వ్యసనస్య ప్రతీకారో రాజ్యరాజాభిరక్షణమ్
ఇత్యమాత్యస్య కర్మేదం హన్తి స వ్యసనాన్వితః ॥18॥

ఆపదలు కలిగినపుడు వాటిని అడ్డగించడానికి తగిన ప్రతిక్రియ చేయడం, రాజ్యాన్నీ, రాజునూ రక్షించడం, –ఇవి అమాత్యుడు చేయవలసిన పనులు. కాని ఆ అమాత్యుడే వ్యసనపరుడయితే రాజకార్యాలు నాశనం చేస్తాడు.

హిరణ్యధాన్యవస్త్రాణి వాహనం ప్రజయా భవేత్ ।
తథాఽన్యే ద్రవ్యని చ యా హన్తి సవ్యసనాః ప్రజాః ॥19॥

బంగారం, ధాన్యం, వస్త్రాలు, వాహనం, అలాగే ఇతర వస్తువులసముదాయాలు అన్నీ రాజుకు ప్రజలవలన లభిస్తాయి. ప్రజలు వ్యసనపరులు అయితే, అవి నశిస్తాయి.

ప్రజానామాపదిస్థానాం రక్షణం కోశదణ్డయోః ।
పౌరాద్యాశ్చోపకుర్వన్తి సంశ్రయాదిహ దుర్దినమ్ ॥20॥

ఆపదలలో ఉన్న ప్రజలకోసం రాజు ధనాగారాన్ని, సైన్యాన్ని రక్షించాలి. రక్షించి, ఆశ్రయం కల్పించడంవలన పౌరులు, జానపదులు మొదలైనవారు రాజుకు ఉపకరిస్తారు. వారికి వ్యసనం కలిగితే, రాజుకూ, రాజ్యానికీ కష్టం సంభవిస్తుంది.

తూష్ణీం యుద్ధం జనత్రాణం మిత్రామిత్రపరిగ్రహః ।
సామన్తాదికృతే దోషే నశ్యే త్తద్వ్యసనాచ్చ తత్ ॥21॥

నిజంగా యుద్ధం వచ్చినపుడు ఎలా ప్రవర్తించాలో గ్రహించడానికి ఊరికే యుద్ధం చేయడం, ఆ సమయంలో ప్రజలను కాపాడడం, మిత్రులను మిత్రులు కానివారిని కూడ చేరదీయడం, రాజుకు కర్తవ్యాలు. సామంతరాజులు మొదలైనవాళ్లు చేసిన తప్పిదాలవల్లనూ, వారికి కలిగిన వ్యసనాలవల్లనూ రాజ్యం నశిస్తుంది.

భృత్యానాం భరణం దానం ప్రజామిత్రపరిగ్రహః ।
ధర్మకామాదిభేదశ్చ దుర్గసంస్కారభూషణమ్ ॥
కోశాత్తద్వ్యసనాద్ధన్తి కోశమూలో హి భూపతిః ॥22॥

సేవకులను పోషించడం, అర్థులకు దానం చేయడం, ప్రజలను మిత్రులను తన వారినిగా చేసుకోవడం, ధర్మం, కామం మొదలైన విశేషాలు, దుర్గాన్ని సిద్ధం చేయడం, దానికి మెరుగులుపెట్టడం - ఇవి కోశంవలన సిద్ధిస్తాయి. రాజుకు మూలాధారం కోశమే. అందుచేత ఆ కోశం విషయంలో కష్టం కలిగితే అది రాజును, రాజ్యాన్ని నశింపజేస్తుంది.

మిత్రామిత్రవనీహేమసాధనం రిపుమర్దనమ్ ।
దూరకార్యాశుకారిత్వం దణ్డాత్తద్వ్యసనాద్ధరేత్ ॥23॥

మిత్రులను, మిత్రులు కానివారిని, భూమినీ, బంగారాన్ని (సంపదలను) సాధించడం, శత్రువులను నిర్మూలించడం, భవిష్యత్తులో కూడా రాజ్యానికి మేలుచేసే పనులను వెంటనే చేయగలగడం, అనేవి సైన్యంవలన సిద్ధిస్తాయి. ఆ సైన్యానికి కష్టం కలిగితే ఇవన్నీ నశించిపోతాయి.

సంస్తమ్భయతి మిత్రాణి హ్యమిత్రం నాశయత్యపి ।
ధనాద్యై రుపకారిత్వం మిత్రా త్తద్వ్యసనాద్ధరేత్ ॥24॥

మిత్రరాజులను ఎల్లకాలం తనతో మైత్రి కలిగిఉండేటట్లు చేయడం, శత్రువులను నాశనం చేయడం, ధనం మొదలైనవి సమకూర్చి పరిపాలనలో ఉపకారం చేయడం – ఇవి మిత్రుడివలన సిద్ధిస్తాయి. ఆ మిత్రుడికి కష్టం కలిగితే ఇవన్నీ నశించిపోతాయి.

రాజా సవ్యసనీ హన్యాద్రాజకార్యాణి యాని చ ।
వాగ్దణ్డయోశ్చ పారుష్యమర్థదూషణమేవ చ ॥
పానం స్త్రీ మృగయా ద్యూతం వ్యసనాని మహీపతేః ॥25॥

వ్యసనపరుడైన రాజు రాజకార్యాలన్నిటినీ నాశనం చేస్తాడు. కఠినంగా మాట్లాడడం, క్రూరంగా శిక్షించడం, ధనాన్ని నిందించడం, మద్యం తాగడం, స్త్రీలోలత్వం, వేట, జూదం అనేవి రాజుకు కలిగే వ్యసనాలు.

ఆలస్యం స్తబ్ధతా దర్పః ప్రమాదో ద్వైధకారితా ।
ఇతి పూర్వోపదిష్టం చ సచివవ్యసనం స్మృతమ్ ॥26॥

సోమరితనం, ఏమీ చేయలేకపోవడం, అహంకారం, పొరపడడం, రెండురకాల అభిప్రాయాలతో నిశ్చయానికి రాలేకపోవడం, అనేవీ, వీటితోపాటు పూర్వం చెప్పినవీ (రాజువ్యసనాలు) మంత్రికి కలిగే వ్యసనాలు.

అనావృష్టిశ్చ పీడాదీ రాష్ట్రవ్యసనముచ్యతే ॥27॥

వర్షాలు లేకపోవడం, రోగాలు మొదలైన బాధలు రాజ్యానికి కలిగే వ్యసనాలు.

విశీర్ణయన్త్రప్రాకారపరిఖాత్వమశస్త్రతా ।
క్షీణయా సేనయా నద్ధం దుర్గవ్యసనముచ్యతే ॥28॥

యుద్ధయంత్రాలు, చుట్టూఉండే ప్రాకారం, అగడ్త ఇవి పాడైపోవడం, ఆయుధాలు లేకపోవడం, సైన్యం తగ్గిపోవడం (రక్షించడానికి తగినంతసైన్యం లేకపోవడం), ఇవి దుర్గానికి కలిగే వ్యసనాలు.

వ్యయీకృతః పరిక్షిప్తో ఽ ప్రజితోఽ సఞ్చితస్తథా ।
దూషితో దూరసంస్థశ్చ కోశవ్యసనముచ్యతే ॥29॥

వ్యర్థంగా వ్యయమైపోవడం, అనేకప్రదేశాలలో కొద్ది కొద్దిగా ఉండడం, తన అదుపులో లేకపోవడం, అవసరానికి తగినంతగా కూడబెట్టబడకపోవడం, దొంగతనం, అధికారులు అపహరించడం మొదలైన కారణాలచేత భగ్నం కావడం, అందుబాటులో లేక చాల దూరంగా ఉండడం అనేవి కోశానికి కలిగే వ్యసనాలు.

ఉపరుద్ధం పరిక్షిప్తమమానితవిమానితమ్ ।
అభూతం వ్యాధితం శ్రాన్తం దూరాయాతం నవాగతమ్ ॥30॥

పరిక్షీణం ప్రతిహతం ప్రహతాగ్రతరం తథా ।
ఆశానిర్వేదభూయిష్ఠమనృతప్రాప్తమేవ చ ॥31॥

కలత్రగర్భం నిక్షిప్తమన్తశ్శల్యం తథైవ చ ।
విచ్ఛిన్నవివిధాసారం శూన్యమూలం తథైవ చ ॥32॥

అస్వామ్యసంహతం వాపి భిన్నకూటం తథైవ చ ।
దుష్పార్ష్ణిగ్రాహమర్ధం చ బలవ్యసన ముచ్యతే ॥33॥

(సైన్యానికి సంబంధించిన వ్యసనాలు) శత్రువులచే ముట్టడింపబడడం, అనేకప్రదేశాలలో కొద్దికొద్దిగా ఉండడం, పైఅధికారులచే అవమానింపబడడం, సరిగా గౌరవింపబడకపోవడం, సరిగా ఉండకపోవడం, రోగాల పాలు కావడం, అలసిపోవడం, దూరం నుండి రావడం, క్రొత్తగా ఏర్పడి ఉండడం, బాగా తగ్గిపోవడం, ఎదురుదెబ్బ తినడం, ముందుకు వెళ్లలేకపోవడం, నిరాశలోనూ, విరక్తిలోనూ ఉండడం, అబద్ధాలతో నడిపింపబడడం, కోటలో ఉండిపోవడం, రాజుచేత విడిచిపెట్టబడడం, మానసికమైన బాధలు కలిగిఉండడం, అనేక మిత్రరాజులసైన్యం తమతో విడిపోవడం, మూలబలం లేకపోవడం,నాయకుడు లేకుండా గుంపులుగా నడుస్తుండడం, వేర్వేరు సమూహాలుగా విడిపోయిఉండడం, దుర్మార్గుడైన పార్ష్ణిగ్రాహ రాజుచేత కష్టాలపాలు కావడం - ఇవి సైన్యానికి కలిగే వ్యసనాలు.

దైవోపపీడితం మిత్రం గ్రస్తం శత్రుబలేన చ ।
కామక్రోధాదిసంయుక్తముత్సాహాదరిభిర్భవేత్ ॥ 34॥

దైవికమైన కారణాలవలన బాధపడేవాడు, శత్రువులసైన్యం వచ్చి ఆక్రమించుకున్నవాడు, కోరికలు, కోపాలు మొదలైనవాటితో కూడినవాడూ అయిన మిత్రరాజును ఉత్సాహపరిచి తన శత్రువులతో యుద్ధానికి సిద్ధం చేయవచ్చు.

అర్థస్య దూషణం క్రోధాత్పారుష్యం వాక్యదణ్డయోః ।
కామజం మృగయా ద్యూతం వ్యసనం పానకం స్త్రియః ॥35॥

ధనాన్ని హీనంగా చూడడం, కఠినంగా మాట్లాడడం, క్రూరంగా దండించడం, అనేవి క్రోధం వలన కలిగే వ్యసనాలు. వేట, జూదం, మద్యపానం, స్త్రీసంభోగం - ఇవి కామం వలన కలిగే వ్యసనాలు.

వాక్పారుష్యం పరం లోకే ఉద్వేజనమనర్థకమ్ ।
అసిద్ధిసాధనం దణ్డస్తం యుక్త్యాఽవనయేన్నృపః ॥36॥

కఠినంగా మాట్లాడడం అనేది లోకాన్ని భయపెడుతుంది. దానివలన మిక్కిలి కీడు కలుగుతుంది. అదే విధంగా కఠినమైన దండనం వలన కార్యం సిద్ధించదు. అందుచేత రాజు యుక్తితో కఠినంగా దండించడం మానుకోవాలి. (కార్యం చెడకుండా దండించాలి.)

ఉద్వేజయతి భూతాని దణ్డపారుష్యవాన్నృపః ।
భూతాన్యుద్వేజ్యమానాని ద్విషతాం యాన్తి సంశ్రయమ్ ॥
వివృద్ధాశ్శత్రవశ్చైవ వినాశాయ భవన్తి తే ॥37॥

కఠినంగా దండించేరాజు ప్రజలను భయపెడతాడు. భయపడినప్రజలు ఆరాజుశత్రువును ఆశ్రయిస్తారు. అధికమైన శత్రువులు ఆరాజును నాశనం చేస్తారు.

దూష్యస్య దూషణార్థం చ పరిత్యాగో మహీయసః ।
అర్థస్య నీతితత్త్వజ్ఞైరర్థదూషణముచ్యతే ॥38॥

రాజద్రోహిని చెడగొట్టడానికి అతడివలన కలిగే గొప్పప్రయోజనాన్ని వదులుకోవడాన్ని నీతిశాస్త్రరహస్యం తెలిసినవారు అర్థదూషణం అని చెప్తారు.

పానాత్కార్యాదితోఽజ్ఞానం మృగయాతోఽరితః క్షయాః ।
జితశ్రమార్థం మృగయాం విచరేద్రక్షితే వనే ॥39॥

మద్యపానం వలన కర్తవ్యాదులను గూర్చి తెలుసుకోలేకపోవడం, వేటవలన శత్రువులవలన ప్రాణభయం మొదలైనవి కలుగుతాయి. అలసటను పోగొట్టుకోవడానికి ఎటువంటి ప్రమాదానికి అవకాశం లేని సురక్షితమైన అరణ్యంలో వేటాడాలి.

ధర్మార్థప్రాణనాశాది ద్యూతే స్యాత్కలహాదికమ్ ।
కాలాతిపాతో ధర్మార్థపీడా స్త్రీవ్యసనాద్భవేత్ ॥40॥

జూదం వలన ధర్మం, అర్థం, ప్రాణం వీటికి హాని సంభవించడం, తగవులాటలు మొదలైనవి కలుగుతాయి. స్త్రీలోలత వలన ఏ పనులు సకాలంలో జరగవు. ధర్మానికీ, అర్థానికీ హాని కలుగుతుంది.

పానదోషాత్ ప్రాణనాశః కార్యాకార్యవినిశ్చయః ॥ 41॥

మద్యపానం వలన ప్రాణాలకే ముప్పు ఏర్పడుతుంది. చేయదగినపని ఏదో, చేయదగనిపని ఏదో తెలుసుకునే విజ్ఞానం నశిస్తుంది.

స్కన్ధావారనివేశజ్ఞో నిమిత్తజ్ఞో రిపుం జయేత్ ।
స్కన్ధావారస్య మధ్యే తు సకోశం నృపతే ర్గృహమ్ ॥42॥

సైన్యాన్ని ఎక్కడ ఉంచాలో, జరగబోయే శుభాన్నీ, అశుభాన్నీ సూచించే శకునాలను గురించి తెలిసినవాడూ శత్రువును సులువుగా జయిస్తాడు. సేనకు మధ్యలో ధనకోశంసహా, రాజునివాసం ఉండాలి.

మౌలీభూతం శ్రేణిసుహృద్ద్విషదాటవికం బలమ్ ।
రాజహర్మ్యం సమావృత్య క్రమేణ వినివేశయేత్ ॥43॥

పితృపితామహక్రమంలో వస్తున్న మూలసైన్యం, వర్తకులు, శిల్పులసమూహం, మిత్రరాజులసేన, తనకు లొంగిపోయిన శత్రువులసేన, ఆటవికసైన్యం, అనేవి క్రమంగా రాజభవనానికి చుట్టూ నిలపాలి.

సైన్యైకదేశస్సన్నద్ధస్సేనాపతిపురస్సరః ।
పరిభ్రమేచ్ఛత్వరాంశ్చ మణ్డలేన బహిర్నిశి ॥44॥

సైన్యంలో ఒక(నాల్గవ)భాగం సేనాధిపతిని ముందుంచుకుని, పోరుకు సిద్ధమై, రాజభవనానికి చుట్టూ మండలంగా ఏర్పడి, రాత్రిసమయమంతా తిరుగుతూ ఉండాలి.

వార్తాస్స్వకా విజానీయా ద్దూరసీమాన్తచారిణః ।
నిర్గచ్ఛేత్ ప్రవిశేచ్చైవ సర్వ ఏవోపలక్షితః ॥45॥

రాజ్యానికి సరిహద్దులలో సంచరించే, ఆంతరంగికులైన ఆత్మీయులు శత్రురాజుల వార్తలను తెలుసుకోవాలి. శత్రురాజ్య విషయాలు అన్నిటినీ గ్రహించి, రాజధానికి వస్తూ, సరిహద్దులకు తిరిగి వెళ్తూ ఉండాలి. (శత్రుసమాచారం రాజుకు ఎప్పటి కప్పుడు తెలియజేస్తూ ఉండాలి).

సామ దానం చ భేదశ్చ దణ్డోపేక్షేన్ద్రజాలకమ్ ।
మాయోపాయాస్సప్త పరే నిక్షిపేత్సాధనాయ తాన్ ॥46॥

ఆ శత్రువులను జయించడానికి 1. సామం, 2. దానం, 3. భేదం, 4. దండం, 5. ఉపేక్ష, 6. ఇంద్రజాలం, 7. మాయ అనే ఏడు ఉపాయాలను వారిపై ప్రయోగించాలి.

చతుర్విధం స్మృతం సామ ఉపకారానుకీర్తనమ్ ।
మిథ స్సమ్బన్ధకథనం మృదుపూర్వం చ భాషణమ్ ॥
ఆయాతే దర్శనం వాచా తవాహమితి చార్పణమ్ ॥47॥

సామం నాలుగువిధాలు. 1. ఎదుటివాడు తనకు చేసిన ఉపకారాన్ని ప్రశంసించడం. 2. తనకు వారితో పరస్పరం కల సన్నిహితసంబంధం గురించి చెప్తుండడం, 3. వారి మనస్సు నొచ్చుకోకుండా మృదువుగా మాట్లాడడం, 4. భవిష్యత్తులో వారికి కలుగబోయే మేలును వివరించడం. దీనితోపాటు నేను నీవాడనే అని తనను తాను అతడికి సమర్పించుకోవడం అనే ఇంకొకటి కూడ సామభేదమే.

య స్సమ్ప్రాప్తధనోత్సర్గ ఉత్తమాధమమధ్యమః ।
ప్రతిదానం తదా తస్య గృహీతస్యానుమోదనమ్ ॥48॥

ద్రవ్యదానమపూర్వం చ స్వయంగ్రాహప్రవర్తనమ్ ।
దేయశ్చ ప్రతిమోక్షశ్చ దానం పఞ్చవిధం స్మృతమ్ ॥49॥

(దానం 5 విధాలు.) 1. తనకు కలిగిన సంపదను త్యాగం చేయడం ఒకటి. ఇది ఉత్తమమూ, మధ్యమమూ, అధమమూ, అని మూడువిధాలు. 2. వస్తువుల మార్పిడిలో తాను ఇవ్వకుండగనే శత్రురాజు తీసుకున్న దానిని ఆమోదించడం, 3. అద్భుతమయినవస్తువును ఇవ్వడం, 4. వేరొకరినుండి తీసుకొమ్మని పురికొల్పడం, 5. ఇవ్వదగిన దానిని విడిచిపెట్టడం అని దానం అయిదు విధాలుగా చెప్పబడింది.

స్నేహరాగాపనయనం సంహర్షోత్పాదనం తథా ।
మిథో భేదశ్చ భేదజ్ఞైర్భేదశ్చ త్రివిధ స్స్మృతః ॥50॥

భేదం గురించి తెలిసినవారు భేదం మూడు విధాలని చెప్తారు. అవి 1. ఇద్దరిమధ్య ఉన్నమైత్రినీ, అనురక్తినీ తొలగించడం, 2. కలిసిఉన్న ఇద్దరిలో ఒకరిపై ఒకరికి అసూయ పుట్టించడం, 3. కలిసిఉన్న ఇద్దరిమధ్య తగవు పెట్టడం.

వధోఽర్థహరణం చైవ పరిక్లేశస్త్రిధా దమః ।
ప్రకాశశ్చాప్రకాశశ్చ లోకద్విష్టాన్ ప్రకాశతః ॥51॥

దమం అంటే శత్రువులను అణచివేయడం. ఇది కూడ మూడువిధాలు. 1. శత్రువును చంపివేయడం, 2. అతడి సంపదలు సమస్తం లాగివేసుకోవడం, 3. బంధించడం మొదలైనవిధంగా కష్టపెట్టడం. ఇందులో వధ అనేది అందరికీ తెలిసేవిధంగా చంపడం, ఎవరికీ తెలియకుండా రహస్యంగా చంపడం అని రెండువిధాలు. ప్రజలు ద్వేషించేరాజును అందరికీ తెలిసే విధంగా చంపవచ్చు.

ఉద్విజేత హతైర్లోకస్తేషు పిణ్డః ప్రశస్యతే ।
విశేషేణోపనిషద్యోగైర్వన్యాచ్ఛస్త్రాదినా ద్విషః ॥52॥

రాజును చంపినందువలన అతడిని ఆశ్రయించుకుని జీవించే జనులు కష్టాలపాలవుతారు. కాబట్టి వారికి బ్రదుకుతెరువు చూపించడం ఉత్తమం. శత్రురాజును అతడికి బాగా దగ్గరగా కలిసిఉండే వాళ్లచేత ఆయుధాలు మొదలైన వాటితో రహస్యంగా చంపించాలి.

జాతిమాత్రం ద్విజం నైవ హన్యాత్సామోత్తరం వశే ॥53॥

జాతిమాత్రం చేతనే క్షత్రియుడైనవాడిని, అంటే పుట్టుకనుబట్టి క్షత్రియుడే కాని, బలపరాక్రమాదులచేత క్షత్రియుడుకాని వాడిని చంపగూడదు. సామోపాయంతో మంచిగా మాటలు చెప్పి వశం చేసుకోవాలి.

ప్రలిమ్పన్నివ చేతాంసి దృష్ట్వా సాధు పిబన్నివ ।
గ్రసన్నివామృతం సామ ప్రయుఞ్జీత ప్రియం వచః ॥54॥

ప్రేమగా చూస్తూ, అతడి హృదయానికి అమృతం పూస్తున్నట్లుగా, అమృతం తాగుతున్నట్లు, అమృతం తింటున్నట్లుగా అనిపించే ఇష్టమైన మాటలతో శత్రువుపై సామం ప్రయోగించి అతడిని వశం చేసుకోవాలి.

మిథ్యాభిశస్తశ్శ్రీకామ ఆహూయాత్ ప్రతిమానితః ।
రాజద్వేషీ చాతికర ఆత్మసమ్భావితస్తథా ॥55॥

అసత్యమైన నిందలు మోసేవాడు, సంపదలపై దురాశ కలిగినవాడు, అవమానింపబడినవాడు, రాజును ద్వేషించేవాడు, అధికంగా పన్ను వేయబడినవాడు, లోకంలో అందరికంటె తానే గొప్పవాడినని భావించేవాడు,మరియు

విచ్ఛిన్నధర్మకామార్థః క్రుద్ధో మానీ విమానితః ।
అకారణాత్పరిత్యక్తః కృతవైరోఽపి సాన్త్వితః ॥56॥
హృతద్రవ్యకలత్రశ్చ పూజార్హోఽప్రతిపూజితః ।
ఏతాంస్తు భేదయేచ్ఛత్రౌ స్థితాన్నిత్యాన్సుశఙ్కితాన్ ॥57॥

అగతాన్పూజయేత్కామైర్నిజాంశ్చ ప్రశమం నయేత్ ॥58॥

ధర్మ, అర్థ, కామాలను చెడగొట్టినవాడు, రాజుపై కోపించినవాడు, దురహంకారం కలిగినవాడు, తగిన విధంగా గౌరవం పొందనివాడు, ఏ తప్పు చేయకుండానే రాజుచేత విడిచిపెట్టబడినవాడు, విరోధం తెచ్చుకున్నా సమాధానపరుపబడినవాడు, భార్యనూ, సంపదలనూ పోగొట్టుకున్నవాడు, పూజింపదగినవాడైనప్పటికీ

గౌరవింపబడనివాడు, ప్రతివిషయంలోనూ అనుమానించేవాడు - వీరు తనతో వైరం తెచ్చుకున్నపుడు వారిలో వారికి తగవులుపెట్టాలి.

ఇటువంటివారు శత్రుపక్షం నుండి తన వద్దకు వస్తే, వారికి కావలసినవి ఇచ్చి తనవారిని చేసుకోవాలి. ఇటువంటివారు స్వపక్షంలోనే ఉంటే మంచిమాటలతో వారిలోని శత్రుభావాన్ని పోగొట్టాలి.

సామదృష్టానుసన్ధానమత్యుగ్రభయదర్శనమ్ ।
ప్రధానదానమానం చ భేదోపాయాః ప్రకీర్తితాః ॥59॥

శత్రువులైన ఇరువురిలో ఒకరిని సామోపాయంతో మంచిమాటలతో తనతో కలుపుకోవడానికి ప్రయత్నించడం, మిక్కిలి తీక్ష్ణంగా భయపెట్టడం, ఇరువురిలో ఒకరికి ప్రాధాన్యం ఇచ్చి దానం, సమ్మానం చేయడం, అనేవి భేదం సాధించే ఉపాయాలుగా చెప్పబడ్డాయి.

మిత్రం హతం కాష్ఠమివ ఘుణజగ్ధం విశీర్యతే ॥ 60॥

చెదపురుగు లోపలనుంచి తొలిచినకట్టెలాగా భేదోపాయం శత్రురాజులలో ఒకడికి మిత్రుడయిన రెండవవాడిని నిర్మూలించి, వారి మైత్రిని చెల్లాచెదురు చేస్తుంది.

త్రిశక్తి ర్దేశకాలజ్ఞో దణ్డే నాస్తం నయేదరీన్ ।
మైత్రీప్రధానం కల్యాణబుద్ధిం సాన్త్వేన సాధయేత్ ॥61॥

ప్రభుశక్తి, మంత్రశక్తి, ఉత్సాహశక్తి అనే మూడుశక్తులు గలిగినవాడు విజయం సాధించడానికి తగినసమయం, ప్రదేశం చూసుకుని దండయాత్ర చేసి, దండోపాయంతో శత్రువును నిర్మూలించాలి. గాఢంగా స్నేహం చేసేలక్షణం, మంచిబుద్ధి కలిగిన రాజును సామోపాయంతో వశపరచుకోవాలి.

లుబ్ధం క్షీణం చ దానేన మిత్రా నన్యోన్యశఙ్కయా ।
దణ్డస్య దర్శనా ద్దుష్టా న్పుత్రభ్రాత్రాది సామతః ॥62॥

దురాశాపరుడు, లేదా కావలసినంత సంపద లేనివాడు అయిన శత్రువును దానోపాయంతో వశపరచుకోవాలి. శత్రురాజులు ఇద్దరు పరస్పరం మిత్రులైనా, ఒకరు ఒకరిని అనుమానించేవారయితే వారిని దండోపాయంతో సాధించాలి. పుత్రులు, సోదరులు మొదలైన బంధువులను సామోపాయంతో వశం చేసుకోవాలి.

దానభేదైశ్చమూముఖ్యాన్యోధాం జనపదాదికాన్ ।
సామన్తాటవికాన్భేదదణ్డాభ్యామపరాద్ధకాన్ ॥63॥

శత్రుసైన్యంలో ప్రధానులైనవారిని దానం, భేదం అనే ఉపాయాలతో స్వాధీనం చేసుకోవాలి. యుద్ధంలో నైపుణ్యం కలిగిన జానపదులు, సామంతులు, ఆటవికులు నేరం చేసినవారు మొదలైనవారిని భేదం, దండం అనే ఉపాయాలతో లోబరచుకోవాలి.

దేవతాప్రతిమానాం తు పూజయాన్తర్గతైర్నరైః ।
పుమాన్ స్త్రీవస్త్రసంవీతో నిశి చాద్భుతదర్శనః ॥
వేతాలోల్కాపిశాచానాం శివానాం చ స్వరూపికా ॥64॥

దేవతలవిగ్రహాలకు పూజచేస్తుండడం అనే నెపంతో లోపల దాగిఉన్న పురుషులతోనూ, స్త్రీలు ధరించేవస్త్రాలు చుట్టుకున్న పురుషుడు, రాత్రిసమయంలో అద్భుతంగా కనిపించేవాడు, బేతాళం, నిప్పులు కక్కుతున్న పిశాచాలు, అలాగే శుభప్రదమైన ఆకారాలను ధరించేవాడు – ఈవిధంగా రకరకాలరూపాలు ధరించడం మానుషమాయ.

కామతో రూపధారిత్వం శస్త్రాగ్న్యశ్మామ్బువర్షణమ్ ।
తమోఽనిలోఽనలో మేఘ ఇతి మాయా హ్యమానుషీ ॥65॥

అప్పటికప్పుడు కోరినరూపాన్ని ధరించడం, ఆయుధాలూ, నిప్పూ, నీళ్లూ వర్షిస్తున్నట్లు ప్రదర్శించడం, చీకటి, గాలి, నిప్పు, మేఘం, వీటిని ప్రదర్శించడం అమానుషమాయ. (ఈ శక్తి లోకంలో సహజం కాదు కాబట్టి మానవాతీతం)

జఘాన కీచకం భీమ ఆస్థిత స్త్రీస్వరూపతామ్ ॥66॥

భీముడు ఆడుదాని రూపాన్ని ధరించి, కీచకుడిని సంహరించాడు. (మారువేషాలు ధరించి శత్రువును సంహరించడం అనేది ద్వాపరయుగం నాటికే ఉన్నది.)

అన్యాయే వ్యసనే యుద్ధే ప్రవృత్తస్యానివారణమ్ ।
ఉపేక్షేయం స్మృతా భ్రాత్రోపేక్షితశ్చ హిడిమ్బయా ॥67॥

అన్యాయం చేస్తున్నవాడినీ, కష్టంలో ఉన్నవాడినీ, యుద్ధం చేయాలనుకున్నవాడిని అడ్డగించకపోవడం ఉపేక్ష. భీముడితో యుద్ధానికి వచ్చినపుడు హిడింబి తన సోదరుడైన హిడింబాసురుడిని యుద్ధంనుండి నివారించలేదు. (భీముడిని పొందడం కోసం ఉపేక్షించింది).

మేఘాన్ధకారవృష్ట్యగ్నిపర్వతాద్భుతదర్శనమ్ ।
దూరస్థానాం చ సైన్యానాం దర్శనం ధ్వజశాలినామ్ ॥68॥

దూరంగా ఉన్న సైనికులకు, జెండాలు పెట్టుకున్న గొప్పయోధులకు – కారుమబ్బులు, కటికచీకటి, పెద్దవాన, మహాగ్నిజ్వాలలు, పెద్దపెద్దకొండలు మొదలైనవాటిని ప్రదర్శించడం మరియు

ఛిన్నపాటితభిన్నానాం సంస్రుతానాం చ దర్శనమ్ ।
ఇతీన్ద్రజాలం ద్విషతాం భీత్యర్థముపకల్పయేత్ ॥69॥

శత్రుసైన్యాన్ని కత్తులతో నరకబడినవారుగానూ, చేతులతో చీల్చబడినవారుగానూ, గద మొదలైన ఆయుధాలతో తలలు మొదలైన అవయవాలు పగులగొట్టబడినవారుగానూ, గుంపులుగా పారిపోయేవారుగానూ ప్రదర్శించడం ఇంద్రజాలం. శత్రువులకు భయపెట్టడానికి ఈ విధమైన ఇంద్రజాలాన్ని ప్రయోగించాలి.

ఇత్యాది మహాపురాణే ఆగ్నేయే సామాదికథనం నామైకచత్వారింశదధికద్విశతతమోఽధ్యాయః ॥241॥

అగ్నిమహాపురాణంలో సామాదికథనం అనే రెండువందల నలభైఒకటవ అధ్యాయం సమాప్తం.

ద్వాచత్వారింశదధికద్విశతతమోఽధ్యాయః – రెండువందల నలభైరెండవ అధ్యాయం

రాజనీతి కథనమ్ – రాజనీతి కథనం

రామ ఉవాచ – దశరథరాముడు లక్ష్మణుడితో ఇలా అంటున్నాడు.

షడ్విధం తు బలం వ్యూహ్య దేవాన్ ప్రార్చ్య రిపుం వ్రజేత్ ।
మౌలం భూతం శ్రేణిసుహృద్ద్విషదాటవికం బలమ్ ॥1॥

ఆరువిధాలైన సైన్యాలను యుద్ధానికి తగిన వ్యూహంగా ఏర్పరచి, ఇష్టదేవతలను పూజించి, ఆ పిదప శత్రువుపై దండయాత్రకు బయలుదేరాలి. 1. మూలబలం, 2. భూతబలం 3. శ్రేణిబలం, 4. మిత్రబలం, 5. శత్రుబలం, 6.ఆటవికబలం అని బలం ఆరువిధాలు.

పూర్వం పూర్వం గరీయస్తు బలానాం వ్యసనం తథా ।
షడఙ్గం మన్త్రకోశాభ్యాం పదాత్యశ్వరథద్విపైః ॥2॥

ఈ ఆరువిధాలసైన్యాలలోనూ తరువాతి దానికంటె ముందరిది శ్రేష్ఠమైనది. వీటికి కలిగే బాధలు కూడ అదే క్రమంలో అధికంగా ఉంటాయి. కాల్బలం, అశ్వబలం, రథబలం, గజబలం అనే చతురంగబలాలతో మంత్రబలం, కోశబలం అనేవి కలిసి సైన్యానికి మొత్తం ఆరు అంగాలు ఉంటాయి.

నద్యద్రివనదుర్గేషు యత్ర యత్ర భయం భవేత్ ।
సేనాపతి స్తత్ర తత్ర గచ్ఛేద్వ్యూహీకృతై ర్బలైః ॥3॥

నదులు, పర్వతాలు, అరణ్యాలు, కోటలు వీటిలో ఎక్కడెక్కడ యుద్ధభయం ఏర్పడుతుందో సేనాపతి అక్కడక్కడికి సైన్యాన్ని సిద్ధం చేసుకుని వ్యూహంగా వెళ్లాలి.

నాయకః పురతో యాయాత్ ప్రవీరపురుషావృతః ।
మధ్యే కళత్రం స్వామీ చ కోశః ఫల్గు చ యద్బలమ్ ॥4॥

గొప్పవీరులతో కూడి, సేనానాయకుడు ముందు వెళ్లాలి. మధ్యలో రాజుగారిభార్య, రాజు, కోశం, దుర్బలమైన సైన్యం ఉండాలి.

పార్శ్వయోరుభయోరశ్వా వాజినాం పార్శ్వయో రథాః ।
రథానాం పార్శ్వయోర్నాగా నాగానాం చాటవీబలమ్ ॥5॥

ఆ రాజుకు రెండుప్రక్కల గుఱ్ఱాలబలం ఉండాలి. అశ్వబలానికి రెండుప్రక్కల రథబలం ఉండాలి. రథబలానికి రెండువైపుల గజబలం ఉండాలి. గజబలానికి రెండువైపుల ఆటవికసైన్యం ఉండాలి.

పశ్చాత్సేనాపతిస్సర్వం పురస్కృత్య కృతీ స్వయమ్ ।
యాయాత్సన్నద్ధసైన్యౌఘః ఖిన్నానాశ్వాసయన్ఛనైః ॥6॥

సమర్థుడైన సేనాధిపతి రాజుకు వెనకగా ఉండి, సమస్తసైన్యం బాధ్యతను స్వయంగా వహిస్తూ ముందుకు వెళ్లాలి. సైన్యాన్ని అంతటినీ యుద్ధానికి సర్వసన్నద్ధం చేయాలి. యుద్ధం చేయడానికి భయపడే సైనికులకు మెల్లగా భయం పోగొట్టి, ఉత్సాహపరచాలి.

యాయాద్వ్యూహేన మహతా మకరేణ పురో భయే ।
శ్యేనేనోద్ధృతపక్షేణ సూచ్యా వా వీరవక్త్రయా ॥7॥

ముందువైపునుండి శత్రువులవలన భయం ఏర్పడితే శ్రేష్ఠమైన మకరం అనే వ్యూహంతో యుద్ధానికి వెళ్లాలి. లేదా విస్తారంగా రెక్కలు చాచినట్లున్న శ్యేనవ్యూహం గాని, సైన్యానికి ముఖభాగంలో గొప్పవీరులను నిలిపి, సూచీ అనేవ్యూహం గాని ఏర్పాటు చేసుకోవాలి.

పశ్చాద్భయే తు శకటం పార్శ్వయోర్వజ్రసంజ్ఞితమ్ ।
సర్వతస్సర్వతోభద్రం భయే వ్యూహం ప్రకల్పయేత్ ॥8॥

శత్రువువలన వెనుకనుండి భయం ఏర్పడితే శకటవ్యూహం, శత్రుభయం ప్రక్కలనుండి ఉన్నపుడు వజ్రవ్యూహం, అన్నివైపులనుండి శత్రుభయం ఉన్నపుడు, సర్వతోభద్రవ్యూహం ఏర్పాటు చేసుకోవాలి.

కన్దరే శైలగహనే నిమ్నగా వనసఙ్కటే ।
దీర్ఘాధ్వని పరిశ్రాన్తం క్షుత్పిపాసాహితక్లమమ్ ॥9॥

వ్యాధిదుర్భిక్షమారకపీడితం దస్యువిద్రుతమ్ ।
పఙ్కపాంసుజలస్కన్ధం వ్యస్తం పుఞ్జీకృతం పథి ॥10॥

ప్రసుప్తం భోజనవ్యగ్రమభూమిష్ఠమసుస్థితమ్ ।
చౌరాగ్నిభయవిత్రస్తం వృష్టివాతసమాహతమ్ ॥
ఇత్యాదౌ స్వచమూం రక్షేత్ పరసైన్యం చ ఘాతయేత్ ॥11॥

కొండలగుహలలోనూ, నడవడానికి వీలులేని పర్వతాలమార్గంలోనూ, నదులప్రాంతంలో, అడవులలో, చాల పొడవైన మార్గంలో నడిచి అలసిపోయినదీ, ఆకలి, దప్పికలతో మిక్కిలి పీడింపబడినదీ, రోగం, కరువు, ప్రాణాలు తీసే అంటురోగాలతో బాధపడుతున్నదీ, దోపిడిదొంగలు వెంటబడి తరుముతున్నదీ, బురద, దుమ్ము, నీరు వీటితో చిక్కుకున్నదీ, ఒక్కరు మాత్రమే వెళ్లడానికి వీలయిన ఇరుకుమార్గంలో నడుస్తున్నదీ, ముందుకు పోవడానికి వీలులేని దారిలో సైనికులు గుంపులుగా కూడి ఉన్నదీ, గాఢంగా నిద్రపోతున్నదీ, భోజనం చేయడంలో నిమగ్నమైనదీ, ఉండడానికి కష్ట మైన ప్రదేశంలో ఉన్నదీ, సరియైనస్థితిలో లేనిదీ, దొంగలభయంతో, అగ్నిభయంతో కలవరపడుతున్నదీ, పెద్దవర్షంవలన, సుడిగాలివలన దెబ్బతిన్నదీ, ఈ మొదలయిన స్థితులలో ఉన్న తన సైన్యాన్ని కాపాడుకోవాలి. ఆ విధంగా ఉన్న శత్రుసైన్యాన్ని నిర్మూలించాలి.

విశిష్టో దేశకాలాభ్యాం భిన్నవిప్రకృతిర్బలీ ।
కుర్యాత్ ప్రకాశయుద్ధం హి కూటయుద్ధం విపర్యయే ॥12॥

దేశం, కాలం యుద్ధానికి బాగా అనుకూలంగా ఉన్నపుడూ, శత్రువులలో విరోధాలు ఏర్పడిఉన్నపుడూ, బలవంతుడైనరాజు ప్రత్యక్ష మైన యుద్ధం చేయాలి. దీనికి విపరీత మైనపుడు (తనకు దేశకాలాలు ప్రతికూలంగా ఉండి, శత్రువు బలవంతుడై, తాను బలహీనుడైనపుడు) మాయాయుద్ధం చేయాలి.

తే ష్వవస్కన్దకాలేషు పరం హన్యాత్సమాకులమ్ ।
అభూమిష్ఠం స్వభూమిష్ఠః స్వభూమౌ చోపజాయత ॥13॥

పై సందర్భాలలో కలతచెందుతున్నపుడు శిబిరంలో ఉన్న శత్రుసైన్యాన్ని సంహరించాలి. తనకు బలమైనప్రదేశంలో ఉన్న రాజు శత్రువు యుద్ధానికి యోగ్యం కాని ప్రదేశంలో ఉన్నపుడు నిర్మూలించాలి.

ప్రకృతిప్రగ్రహాకృష్టం పాశైర్వనచరాదిభిః ।
హన్యాత్ ప్రవీరపురుషైర్భఙ్గదానాపకర్షణైః ॥14॥

ఆటవికులు మొదలైన సైనికులు శత్రురాజు, అతడి అమాత్యులు, అతడి మిత్రులు (కోశం, రాష్ట్రం, దుర్గం, బలం) అనే(సప్త)ప్రకృతులను పట్టుకుని, పాశాలతో బంధించి తీసుకునిరాగా, వారిని తన వారిలోని పరాక్రమవంతు లైనవీరులచేత చంపించాలి. భయపెట్టడం, ధనాదులు ఇవ్వడం, శత్రుపక్షంనుండి తన పక్షంలోకి లాక్కోవడం చేయవచ్చును.

పురస్తాద్దర్శనం దత్త్వా తల్లక్షకృతనిశ్చయాన్ ।
హన్యాత్పశ్చాత్ ప్రవీరేణ బలేనోపేత్య వేగినా ॥15॥

ముందుగా వారికి అనుగ్రహదర్శనం ఇచ్చి, వారు తెలిపిన గుర్తులనుబట్టి శత్రువుల ఉనికిని నిశ్చయించుకుని, ఆతరువాత వేగవంతులైన సైనికులతో వెళ్లి, వీరులతో వారిని చంపివేయాలి.

పశ్చాద్వా సఙ్కులీకృత్య హన్యాచ్ఛూరేణ పూర్వతః ।
ఆభ్యాం పార్శ్వాభిఘాతీ తు వ్యాఖ్యాతౌ కూటయోధనే ॥16॥

తన సైనికులను వెనుక వైపున సమీకరించి యుద్ధం అక్కడ జరుగుతుందనే అభిప్రాయం కలిగించి, పరాక్రమవంతులతో ముందునుండి, శత్రువులను నిర్మూలించాలి. అలాగే సైన్యాలసముదాయంతో ప్రక్కలనుండి శత్రువులను దెబ్బతీయాలి. ఇది కూట(మోసపూరిత)యుద్ధం.

పురస్తాద్విషమే దేశే పశ్చాద్ధన్యాస్తు వేగవాన్ ।
పురః పశ్చాత్తు విషమ ఏవమేవ తు పార్శ్వయోః ॥17॥

ఎదుటిప్రదేశం యుద్ధానికి తగినవిధంగా లేనపుడు వెనకనుండి వేగంగా శత్రువులను సంహరించాలి. ముందు, వెనుక కూడ సరిగా లేని సందర్భంలో ప్రక్కలనుండి శత్రువులను నిర్మూలించాలి.

ప్రథమం యోధయిత్వా తు దూష్యామిత్రాటవీబలైః ।
శ్రాన్తం మన్దం నిరాక్రన్దం హన్యాదశ్రాన్తవాహనమ్ ॥18॥

మొదట అయోగ్యులు, మిత్రులు కానివారు, ఆటవికులు అయిన సైనికులతో యుద్ధం చేయాలి. అలసిపోయినదీ, నిరుత్సాహంగా కదలుతున్నదీ, అయిన శత్రుసైన్యాన్ని తనసైన్యం అలసిపోకమునుపే, వాహనాలు ఉత్సాహంగా ఉన్నపుడే నిశ్శబ్దంగా నాశనం చేయాలి.

దూష్యామిత్రబలైర్వాపి భఙ్గం దత్త్వా ప్రయత్నవాన్ ।
జితమిత్యేవ విశ్వస్తం హన్యాన్మన్త్రవ్యపాశ్రయః ॥19॥

అయోగ్యులు, మిత్రులు కానివారైన సైనికులతో ప్రయత్నపూర్వకంగా శత్రువులను దెబ్బదీసి, మంత్రబలంతో శత్రువులకు తాము ఓడిపోయామని నమ్మకం కలిగించి, నీరసపడిపోయిన శత్రుసైన్యాన్ని సంహరించాలి.

స్కన్ధావారపురగ్రామసస్యస్వామిప్రజాదిషు ।
విశ్రభ్యన్తం పరానీక మప్రమత్తో వినాశయేత్ ॥20॥

శత్రువులకు తన సైన్యశిబిరం, నగరం, గ్రామం, పైరు, యజమాని, ప్రజలు మొదలయిన వాటిని దోచుకునే అవకాశం కలిగించి, ఏమాత్రం ఆలస్యం చేయకుండా వెంటనే శత్రుసైన్యాన్ని నాశనం చేయాలి.

అథవా గోగ్రహాకృష్టం తల్లక్ష్యం మార్గబన్ధనాత్ ॥21॥

లేదా శత్రువుల ఆవులను అపహరించి, వారిబుద్ధిని వేరువైపు ఆకర్షించి, వారిని దారిలోనే అడ్డగించి, సంహరించాలి.

అవస్కన్దభయాద్రాత్రిప్రజాగరకృతశ్రమమ్ ।
దివాసుప్తం సమాహన్యా న్నిద్రావ్యాకులసైనికమ్ ॥22॥

తమపై దాడి జరుగుతుందనే భయంతో రాత్రి అంతా మేలుకుని, అలసిపోయి, పగలు నిద్రిస్తున్నదీ, నిద్రలేమితో కలవరపడుతున్నదీ అయిన శత్రువులసైన్యాన్ని చంపివేయాలి.

నిశి విస్రబ్ధసంసుప్తం నాగైర్వా ఖడ్గపాణిభిః ।
ప్రయాణే పూర్వయాయిత్వం వనదుర్గప్రవేశనమ్ ॥23॥

అలాగే రాత్రిసమయంలో స్వేచ్ఛగా నిద్రిస్తున్న శత్రుసైన్యాన్ని చంపాలి. కత్తిని ధరించిన వీరులు ఏనుగులపై ఎక్కి యుద్ధంలో ముందుగా వెళ్లాలి. అరణ్యాలలోనూ, కోటలలోనూ ప్రవేశించాలి.

అభిన్నానామనీకానాం భేదనం భిన్నసఙ్గ్రహః ।
విభీషికా ద్వారఘాతం కోశరక్షేభకర్మ చ ॥24॥

గుంపులుగా కూడిఉన్న సైనికులను చెల్లాచెదరు చేయాలి. చెల్లాచెదురుగా ఉన్నవారిని ఒకచోట కూడేవిధంగా చేయాలి. శత్రువులను భయపెట్టాలి. కోటద్వారాలను విరగగొట్టాలి. కోశాన్ని రక్షించాలి. ఇవి గజబలం చేయవలసిన పనులు.

అభిన్నభేదనం మిత్రసన్ధానం రథకర్మ చ ॥25॥

కలిసిఉన్న మిత్రులను విడదీయడం, విడిపోయిన మిత్రులను కలపడం అనేవి రథబలం కూడ చేయవలసిన పనులు.

వనదిఙ్మార్గవిచయే వీవధాసారలక్షణమ్ ।
అనుయానాపసరణే శీఘ్రకార్యోపవాదనమ్ ॥
దీనానుసరణం ఘాతః కోటీనాం జఘనస్య చ ॥26॥

అరణ్యాలలో వెళ్లవలసిన దిక్కును, మార్గాన్ని పరిశీలించి నిశ్చయించడం, పెద్దపెద్ద నదులు, వర్షాలలో దారి చూపడం, శత్రువులను వెంబడించడం, అవసరాన్ని గ్రహించి, యుద్ధరంగంనుండి తొలగిపోవడం, ఏపని అయినా వేగంగా చేయడం, కష్టంలో దిక్కులేని స్థితిలో ఉన్నవారిని తప్పించడం, శత్రువులను దెబ్బతీయడం, ఇవి సైన్యంలో ముందు ఉన్నా, లేదా వెనుకగా వస్తున్నా, అశ్వబలం చేయవలసిన పనులు.

అశ్వకర్మాథ పత్తేశ్చ సర్వదా శస్త్రధారణమ్ ।
శిబిరస్య చ మార్గాదేశ్శోధనం వస్తికర్మ చ ॥27॥

నిరంతరం ఆయుధాలను ధరించిఉండడం, సైన్యం విడిది చేయడానికి తగినచోటును, వారు సంచరించవలసిన బాటను పరిశీలించి, తగినది నిర్ణయించడం, నివసించడానికి తగిన ఏర్పాట్లు చేయడం – ఇవి కాల్బలం చేయవలసిన పనులు.

సంస్థూలస్థాణువల్మీకవృక్షగుల్మాపకణ్టకమ్ ।
సాపసారా పదాతీనాం భూర్నాతివిషమా సమా ॥ 28॥

పెద్దపెద్ద చెదలపుట్టలు, పాముపుట్టలు, చెట్లు, గుబురుపొదలు, ముళ్లు లేనిది, అవసరమైతే పారిపోవడానికి వీలు కలిగినదీ, చదునుగా ఉన్నదీ, మరీ ఎగుడుదిగుడుగా లేనిదీ అయిన నేల పదాతిసైన్యం నడవడానికి తగినది.

స్వల్పవృక్షోపలా క్షిప్రలఙ్ఘనీయనగా స్థిరా ।
నిశ్శర్కరా విపఙ్కా చ సాపసారా చ వాజిభూః ॥29॥

చెట్లు, రాళ్లు తక్కువగా ఉన్నదీ, వేగంగా దాటిపోవడానికి వీలైనకొండలు గలిగినదీ, గులకరాళ్లు లేనిదీ, బురద లేనిదీ, అవసరమైతే పారిపోవడానికి తగిన దారి కలిగినదీ అయిన నేల అశ్వబలం సంచరించడానికి తగినది.

నిఃస్థాణువృక్షకేదారా రథభూమిరకర్దమా ॥30॥

రాళ్లూ, పెద్దపెద్దచెట్లూ, వరి (మొద లైన) పొలాలూ, బురద లేని నేల రథబలం సంచరించడానికి తగినది.

మర్దనీయతరుచ్ఛేద్యవ్రతతీ పఙ్కవర్జితా ।
నిర్ఝరా గమ్యశైలా చ విషమా గజమేదినీ ॥31॥

కాళ్లతో తొక్కి అణచివేయదగిన చెట్లు, తెగగొట్టడానికి వీలయిన తీగలు కలిగినదీ, బురద లేనిదీ, జలప్రవాహాలు కలిగినదీ, దాటడానికి వీలయిన చిన్నచిన్నకొండలు కలిగినదీ, ఎగుడుదిగుడుగా ఉన్నదీ ఐన నేల గజబలం సంచరించడానికి తగినది.

ఉరస్యాదీని భిన్నాని ప్రతిగృహ్ణన్ బలాని హి ।
ప్రతిగ్రహ ఇతి ఖ్యాతో రాజకార్యాన్తరక్షమః ॥32॥

యుద్ధవ్యూహంలో ఉరస్యం మొదలుగా వేరువేరు అంగాలైన సైన్యబలాలను (41శ్లో) ప్రయోగించాలి. ప్రతిగ్రహం అనే వ్యూహాంగం చాలా ప్రసిద్ధం. ఇది రాజకార్యాలను అన్నింటినీ నిర్వహించడానికి సమర్థమై ఉంటుంది.

తేన శూన్యస్తు యో వ్యూహః స భిన్న ఇవ లక్ష్యతే ।
జయార్థీ న చ యుధ్యేత మతిమానప్రతిగ్రహః ॥33॥

అటువంటి ప్రతిగ్రహం అనే విధానం లేకపోతే, యుద్ధవ్యూహం విఫలం అవుతుంది. అందుచేత బుద్ధిమంతుడైనరాజు విజయం సాధించాలని కోరుకుంటున్నపుడు ప్రతిగ్రహసైన్యం లేకుండా యుద్ధం చేయగూడదు.

యత్ర రాజా తత్ర కోశః కోశాధీనా హి రాజతా ।
యోధేభ్యస్తు తతో దద్యాత్కిఞ్చిద్దాతుం న యుజ్యతే ॥34॥

రాజు ఎక్కడ ఉంటే కోశం అక్కడే ఉండాలి. కోశం ఉంటేనే రాజత్వం ఉంటుంది. యుద్ధంలో విజయం సాధించిన తరువాత రాజు యుద్ధం చేసిన వీరులకు కోశంనుండి కానుకగా ధనం పుష్కలంగా ఇవ్వాలి. సైనికులు తృప్తిగా ఉండాలంటే, పారితోషికంగా కొంచెం ధనం ఇవ్వడం తగదు.

ద్రవ్యలక్షం రాజఘాతే తదర్థం తత్సుతార్దనే ।
సేనాపతివధే తద్వద్దద్యాద్ధస్త్యాదిమర్దనే ॥35॥

శత్రురాజును చంపిన యోధుడికి ధనం లక్షముద్రలు ఇవ్వాలి. రాజుకుమారుడిని చంపినవాడికి అందులో సగం ఇవ్వాలి. సేనాపతిని చంపినవాడికి కూడ అంతే ధనం ఇవ్వాలి. ఏనుగు మొదలైనవాటిని చంపినవాడికి కూడ తగినవిధంగా కానుకలు ఇవ్వాలి.

అథ వా ఖలు యుధ్యేరన్ పత్త్యశ్వరథదన్తినః ।
యథా భవే దసమ్బాధో వ్యాయామవినివర్తనే ॥36॥

పదాతులు, అశ్వబలం, రథబలం, గజబలం తమకు గలిగిన శరీరశ్రమ తీర్చుకుని యుద్ధానికి తిరిగి రావడంలో బాధ లేనంతదూరంలో ఉండి, యుద్ధం చేయాలి.

అసఙ్కరేణ యుధ్యేరన్ సఙ్కర స్సఙ్కులావహః ।
మహాసఙ్కులయుద్ధేషు సంశ్రయేరన్మతఙ్గజమ్ ॥37॥

యోధులు విడివిడిగా ఉండి, శత్రువుతో యుద్ధం చేయాలి. అందరూ కలిసి యుద్ధం చేస్తే, అది సంకులసమరం అవుతుంది. పెద్ద సంకులసమరాలలో యోధులు ఏనుగులను సహాయంగా తీసుకోవాలి.

అశ్వస్య ప్రతియోద్ధారో భవేయుః పురుషాస్త్రయః ।
ఇతి కల్ప్యాస్త్రయశ్చాశ్వా విధేయాః కుఞ్జరస్య తు ॥
పాదగోపా భవేయుశ్చ పురుషా దశ పఞ్చ చ ॥38॥

గుఱ్ఱం మీద ఉన్నవాడితో యుద్ధం చేయడానికి కాలిబంట్లు ముగ్గురు ఉండాలి. ఏనుగుపై నున్నవాడితో యుద్ధం చేయడానికి ఆశ్వికులు ముగ్గురిని ఏర్పాటు చేయాలి. వారికి రక్షణనిమిత్తంగా బంటులను పదిహేనుమందిని ఏర్పాటుచేయాలి.

విధానమితి నాగస్య విహితం స్యన్దనస్య చ ।
అనీకమితి విజ్ఞేయమితి కల్ప్యాః నవ ద్విపాః ॥39॥

ఏనుగువిషయంలో చెప్పిన ఈ విధానమే రథికులవిషయంలోను ఉంటుంది. అంటే ఒక్కొక్క రథికుడితో యుద్ధం చేయడానికి ముగ్గురు ఆశ్వికులు, పదిహేనుమంది కాలిబంటులు ఉండాలి. ఇలా ఏర్పడిఉన్న సైన్యాన్ని 'అనీకం' అంటారు. ఈ విధంగా తొమ్మిది ఏనుగులతో వ్యూహం కల్పించాలి.

తథానీకస్య రన్ధ్రం తు పఞ్చధా సమ్ప్రచక్షతే ।
ఇత్యనీకవిభాగేన స్థాపయేద్వ్యూహసమ్పదః ॥40॥

ఆ ప్రకారంగా అనీకాల ఏర్పాటు అయిదువిధాలుగా చెప్పబడి ఉన్నది. ఈరకమైన అనీక విభాగంతో సైన్యాన్ని వ్యూహంగా దృఢంగా ఏర్పాటు చేయాలి.

ఉరస్య కక్షపక్షాంస్తు కల్ప్యానేతాన్ ప్రచక్షతే ।
ఉరః కక్షౌ చ పక్షౌ చ మధ్యం పృష్ఠం ప్రతిగ్రహః ॥
కోటీ చ వ్యూహశాస్త్రజ్ఞైస్సప్తాఙ్గో వ్యూహ ఉచ్యతే ॥ 41॥

వ్యూహంలో ఉరస్యం, కక్షం, పక్షం అని మూడు అంగాలు ఏర్పాటు చేయవలసినవి అని చెప్పబడింది. 1. ఉరస్సు 2. కక్షం 3. పక్షం 4. ప్రతిగ్రహం 5. మధ్యం 6. పృష్ఠం 7. కోటి అని వ్యూహం ఏడు అంగాలు కలిగినది అని అది తెలిసినవారు చెప్తారు.

ఉరస్యకక్షపక్షాస్తు వ్యూహోఽయం సప్రతిగ్రహః ।
గురోరేష చ శుక్రస్య కక్షాభ్యాం పరివర్జితః ॥42॥

ప్రతిగ్రహంతో కూడిన ఉరస్యం, కక్షం, పక్షం అనేవి మూడు వ్యూహానికి అంగాలని బృహస్పతి అభిప్రాయం. శుక్రాచార్యుడి మతంలో కక్ష పక్షాలు లేనిది అంటే ప్రతిగ్రహంతో కూడిన ఉరస్యం మాత్రమే వ్యూహాంగం అవుతుంది.

తిష్ఠేయుస్సేనాపతయః ప్రవీరైః పురుషైర్వృతాః ।
అభేదేన చ యుధ్యేరన్ రక్షేయుశ్చ పరస్పరమ్ ॥43॥

సేనానాయకులు వ్యూహంలో శ్రేష్ఠులైన వీరులతో కలిసి నిలబడాలి. అందరూ కలిసికట్టుగా యుద్ధం చేయాలి. అవసరసమయంలో ఒకరిని ఒకరు కాపాడుకుంటుండాలి.

మధ్యవ్యూహే ఫల్గుసైన్యం యుద్ధవస్తు జఘన్యతః ।
యుద్ధం హి నాయకప్రాణం హన్యతే తదనాయకమ్ ॥44॥

సైన్యంలో బలహీనమైన భాగాన్ని వ్యూహంలో మధ్యలో నిలపాలి. యుద్ధానికి సంబంధించిన ఆయుధాలు మొదలైన సామగ్రిని వ్యూహానికి వెనకభాగంలో ఉంచాలి. యుద్ధానికి రాజే ప్రాణంవంటివాడు. ప్రధాననాయకుడైనరాజు లేకపోతే సైన్యం సులువుగా నశించిపోతుంది.

ఉరసి స్థాపయేన్నాగాన్ ప్రచణ్డాన్ కక్షయో రథాన్ ।
హయాంశ్చ పక్షయోర్వ్యూహో మధ్యభేదీ ప్రకీర్తితః ॥45॥

యుద్ధవ్యూహంలో ఉరస్(హృదయంలాగా ప్రధానమైన)స్థానంలో తీక్ష్ణమైన ఏనుగులబలం ఉంచాలి. దానికి చుట్టూ నడుమస్థానంలో రథబలం ఉంచాలి. పార్శ్వభాగాలలో అశ్వబలం ఉంచాలి. ఇలా నిర్మించిన వ్యూహాన్ని మధ్యభేది అంటారు.

మధ్యదేశే హయానీకం రథానీకం చ కక్షయోః ।
పక్షయోశ్చ గజానీకం వ్యూహోఽన్తర్భేద్యయం స్మృతః ॥46॥

వ్యూహంలో హృదయస్థానంలో అశ్వబలం, దానిచుట్టూ రథబలం, పార్శ్వాలలో గజబలం ఉంచితే, దానిని అంతర్భేది అంటారు.

రథస్థానే హయాన్దద్యాత్ పదాతీంశ్చ హయాశ్రయే ।
రథాభావే తు ద్విరదాన్ వ్యూహే సర్వత్ర దాపయేత్ ॥47॥

(అంతర్భేదివ్యూహంలో) రథబలం లేనిపక్షంలో రథాలకు బదులుగా వాటి(కక్ష)స్థానంలో అశ్వబలాన్నీ, అశ్వబలానికి బదులుగా హృదయస్థానంలో కాల్బలాన్నీ ఉంచాలి. (ఇది మరొకవిధమైన అంతర్భేదివ్యూహం.) ఇంక గజబలాన్ని వ్యూహం అంతటా ఉంచాలి.

యది స్యాద్దణ్డబాహుల్యమాబాధః సమ్ప్రకీర్తితః ।
మణ్డలాసంహతో భోగో దణ్డస్తే బహుధా శృణు ॥48॥

సైన్యం అధికసంఖ్యలో ఉన్నదానిని ఆబాధం అంటారు. అది మండలం, అసంహతం, భోగం, దండం అని ఇంకా అనేక రకాలుగా ఉంటుంది. దానిని గురించి చెప్తాను విను.

తిర్యగ్వృత్తిస్తు దణ్డస్స్యాద్భోగోఽన్యా వృత్తిరేవ చ ।
మణ్డలస్సర్వతో వృత్తిః పృథగ్వృత్తిరసంహతః ॥49॥

సైన్యాన్ని అడ్డంగా నిలబెట్టడం దండవ్యూహం. పాముపడగలాగా విస్తారంగా నిలబెట్టడం భోగవ్యూహం. సైనికులను గుండ్రంగా అంతటా ఏర్పాటుచేయడం మండలవృత్తి. సైనికులను వేర్వేరుగా అక్కడక్కడా ఉంచడం అసంహతవ్యూహం.

ప్రదరో దృఢకోఽసహ్యశ్చాపో వై కుక్షిరేవ చ ।
ప్రతిష్ఠ స్సుప్రతిష్ఠశ్చ శ్యేనో విజయసఞ్జయౌ ॥50॥

విశాలో విజయస్సూచీ స్థూణా కర్ణచమూముఖౌ ।
సర్పాస్యో వలయశ్చైవ దణ్డభేదాశ్చ దుర్జయాః ॥51॥

1. ప్రదరం, 2. దృఢకం, 3. అసహ్యం, 4. చాపం, 5. కుక్షి, 6. ప్రతిష్ఠం, 7. సుప్రతిష్ఠం, 8. శ్యేనం, 9. విజయం, 10. సంజయం, 11. విశాలవిజయం, 12. సూచి, 13. స్థూణాకర్ణం, 14. చమూముఖం, 15. సర్పాస్యం, 16. వలయం, 17. దుర్జయం. (అని దండంలో పదిహేడు భేదాలు ఉన్నాయి.) ఇవి దండం భేదాలు

అతిక్రాన్తః ప్రతిక్రాన్తః కక్షాభ్యాం చైకపక్షతః ।
అతిక్రాన్తస్తు పక్షాభ్యాం త్రయోఽన్యే తద్విపర్యయే ॥52॥

ఉరస్యం, కక్షం, పక్షం అనే మూడుస్థానాలలో ఉండే సైనికులు తమస్థానం దాటి ముందుకు వస్తే అది ప్రదరం అనే వ్యూహం. కక్షస్థానాలు రెండింటిలోనూ, ఒకవైపునుండి సైన్యం కొంత ముందుకు దాటివెళ్లి, కొంత మిగిలిన (ఉరస్య, పక్ష) స్థానాలలో నిలిచి ఉంటే, అది దృఢకం అనే వ్యూహం. కొంతసైన్యం పక్షస్థానాలు రెంటిని దాటి ముందుకువెళ్లి, కొంత మిగిలి (ఉరస్య, కక్ష) స్థానాలలో నిలిచి ఉంటే, అది అసహ్యం అనే వ్యూహం. వీటికి విరుద్ధమైన పద్ధతిలో సైన్యం నిలిస్తే, క్రమంగా చాపం, కుక్షి, ప్రతిష్ఠం అనే మూడువ్యూహాలు ఏర్పడతాయి.

పక్షోరస్యైరతిక్రాన్తః ప్రతిష్ఠోఽన్యో విపర్యయః ।
స్థూణాపక్షో ధనుఃపక్షో ద్విస్థూణో దణ్డ ఊర్ధ్వగః ॥53॥

పక్షం, ఉరస్యం అనే స్థానాలలో ఉండేవారు తమస్థానాలు దాటి ముందుకు వెళ్తే, అది సుప్రతిష్ఠం. దానికి వ్యతిరేకమార్గంలో ఉన్నది శ్యేనం అనే వ్యూహం. దృఢమైన సైన్యాన్ని స్తంభం ఆకారంలో నిలిపినది విజయవ్యూహం. సైన్యాన్ని ధనుస్సు ఆకారంలో నిలిపినది సంజయవ్యూహం), రెండుస్థూణాలు అంటే విజయవ్యూహాలు రెండు కలిసి ఉన్నది విశాలవిజయం. ఉరస్య, కక్ష, పక్షాలను ఊర్ధ్వముఖంగా ఉంచినట్లయితే అది 'సూచి' అనే వ్యూహం.

ద్విగుణోఽన్త స్త్వతిక్రాన్తపక్షోఽన్యస్య విపర్యయః ।
ద్విచతుర్దణ్డ ఇత్యేతే జ్ఞేయాః లక్షణతః క్రమాత్ ॥54॥

చివరలో దండానికి రెట్టింపుసైన్యం కలిగినది స్థూణాకర్ణం. పక్షస్థానం దాటి ముందుకు వచ్చిన సైన్యవ్యూహానికి చమూముఖం అని పేరు. చమూముఖానికి విపరీతంగా ఉన్నది సర్పాస్యం. రెండు దండవ్యూహాలతో కూడినది వలయం అనే వ్యూహం. నాలుగు దండవ్యూహాలతో కూడినది 'దుర్జయ'వ్యూహం. ఈవిధంగా దండవ్యూహాలలోని వివిధభేదాల లక్షణం క్రమంగా గ్రహించాలి.

గోమూత్రికా హి సఞ్చారీ శకటో మకరస్తథా ।
భోగభేదాస్సమాఖ్యాతాస్తథా పారిప్లవఙ్గకః ॥55॥

గోమూత్రిక, అహిసంచారి, శకటం, మకరం, పారిప్లవంగం అనే అయిదు 'భోగం' అనే వ్యూహంలో భేదాలు(70శ్లో).

దణ్డపక్షౌ యుగోరస్యః శకట స్తద్విపర్యయే ।
మకరో వ్యతికీర్ణశ్చ శేషః కుఞ్జరరాజిభిః ॥56॥

దండం, పక్షం, రెండు ఉరస్యసైన్యాలు కలిసినది శకటవ్యూహం అవుతుంది(70శ్లో). దీనికి వ్యతిరిక్త మైనది మకరవ్యూహం. ఏనుగులసమూహం కూడ మిశ్రం అయితే అది పారిప్లవంగం.

మణ్డలవ్యూహభేదౌ తు సర్వతోభద్రదుర్జయౌ ।
అష్టానీకో ద్వితీయస్తు ప్రథమస్సర్వతోముఖః ॥57॥

మండలవ్యూహంలో సర్వతోభద్రం, దుర్జయం అని రెండు భేదాలు ఉన్నాయి. వీటిలో రెండవదానికి అంటే దుర్జయానికి ఎనిమిది అనీకాలసైన్యం ఉంటుంది. మొదటిదైన సర్వతోభద్రానికి సైన్యం అంతటా నిండి (సర్వతోముఖంగా) ఉంటుంది.

అర్ధచన్ద్రక ఊర్ధ్వాఙ్గో వజ్రభేదా స్త్వసంహతేః ॥58॥

అర్ధచంద్రం, ఊర్ధ్వాంగం, వజ్రం అని 'అసంహతి'(అసంఘాతం) అనే వ్యూహంలో మూడు భేదాలు.

తథా కర్కటశృఙ్గీ చ కాకపాదీ చ గోధికా ।
త్రిచతుష్పఞ్చసైన్యానాం జ్ఞేయాః ఆకారభేదతః ॥59॥

అదే విధంగా కర్కటశృంగి, కాకపాది, గోధిక అని ఆకారంలో ఉండే భేదాన్ని బట్టి ఇది ఇంకా మూడుభేదాలు. మూడు అనీకాలు కలిగినది కర్కటశృంగి. నాలుగు అనీకాలు కలిగినది కాకపాది. ఐదు అనీకాలు గలిగినది గోధిక. (ఇలా అసంహతి లేదా అసంఘాతం మొత్తం ఆరుభేదాలు కలిగినదవుతున్నది.)

దణ్డస్య స్యుస్సప్తదశ వ్యూహా ద్వౌ మణ్డలస్య చ ।
అసఙ్ఘాతస్య షట్ పఞ్చ భోగస్యైవ తు సఙ్గరే ॥60॥

యుద్ధంలో దండవ్యూహంలో పదిహేడు, మండలవ్యూహంలో రెండు, అసంఘాతవ్యూహంలో ఆరు, భోగవ్యూహంలో అయిదు చొప్పున భేదాలు ఉన్నాయి.

పక్షాదీనామథైకేన హత్వా శేషైః పరిక్షిపేత్ ।
ఉరసా వా సమాహృత్య కోటిభ్యాం పరివేష్టయేత్ ॥61॥

పక్షం, మొదలయిన వాటిలో ఒకదానితో శత్రుసైన్యాన్ని సంహరించి, మిగిలినవాటితో శత్రువులను చుట్టుముట్టాలి. లేదా ఉరస్యస్థానంలోని సైనికులతో కలుపుకుని, పక్షకక్షాలతో అన్నివైపులనుండి శత్రువులను చుట్టుముట్టాలి.

పరే కోటీ సమాక్రమ్య పక్షాభ్యామప్రతిగ్రహాత్ ।
కోటిభ్యాం జఘనం హన్యాదురసా చ ప్రపీడయేత్ ॥62॥

తన సేనలోని ముందటిబలంనుండి రెండుపక్షాల స్థానంలోని సైనికులతోనూ శత్రుసైన్యంలోని రెండుకోటిభాగాలనూ ఆక్రమించాలి. తన సైన్యంలోని రెండుకోటిభాగాలతోనూ శత్రుసైన్యం వెనకభాగాన్ని నిర్మూలించాలి. ఉరస్యస్థానంలోని సైన్యంతో శత్రుసైన్యాన్ని బాధించాలి.

యతః ఫల్గు యతో భిన్నం యతశ్చాన్యైరధిష్ఠితమ్ ।
తతశ్చారిబలం హన్యాదాత్మనశ్చోపబృంహయేత్ ॥63॥

శత్రుసైన్యం బలహీనంగా ఉన్నచోట్లలోనూ, శత్రుసైన్యం తమలో తాము కలహించుకుంటూ విడిపోయి ఉన్నచోట్లలోనూ, శత్రుబలం ఇతరులచేత నడిపింపబడుతున్న చోట్లలోనూ ముందుగా దాడిచేసి, సంహరించాలి. తనసైన్యంలో ఆ స్థితిని చక్కబరచుకుని, బలిష్ఠంగా చేసుకోవాలి.

సారం ద్విగుణసారేణ ఫల్గుసారేణ పీడయేత్ ।
సంహతం చ గజానీకైః ప్రచణ్డైర్దారయేద్బలమ్ ॥ 64॥

శత్రుసైన్యం బాగా బలిష్ఠంగా ఉన్నపుడు దానికి రెట్టింపుబలం గలిగిన సైన్యంతో శత్రుసైన్యాన్ని సంహరించాలి. దుర్బలమైన శత్రుసైన్యాన్ని బలవంతమైన తనసైన్యంతో బాధించాలి. శత్రుసైన్యం ఒక్కటిగా మీదికి వచ్చినపుడు భయంకరమైన ఏనుగులబలంతో సంహరించాలి.

స్యాత్కక్షపక్షైరన్యైశ్చ వర్తమానస్తు దణ్డకః ।
తత్ర ప్రయోగో దణ్డస్య స్థానం తుర్యేణ దర్శయేత్ ॥65॥

కక్షం, పక్షం, ఉరస్యం అనేవి మూడు సమానంగా ఉంటే, అది దండం అనే వ్యూహం. దండవ్యూహం ప్రయోగస్థానాన్ని నాల్గవభాగంలో ప్రదర్శించాలి.

స్యాద్దణ్డసమపక్షాభ్యామతిక్రాన్తః ప్రదారకః ।
భవేత్స పక్షకక్షాభ్యామతిక్రాన్తో దృఢస్స్మృతః ॥66॥

దండంతో సమానంగా రెండుపక్షాలనుండి ముందుకు దాటివస్తే, అది ప్రదారం (ప్రదరం – 50 శ్లో) అనే వ్యూహం. పక్షం, కక్షం అనే రెండుస్థానాలను దాటి ముందుకు వస్తే, అది దృఢం. (50 శ్లో)

కక్షాభ్యాం చ ప్రతిక్రాన్తవ్యూహోఽసహ్యస్స్మృతో యథా ।
కక్షపక్షావధఃస్థాప్యోరస్యై క్రాన్తశ్చ ఖాతకః ॥67॥

రెండుకక్షాలనుండి దాటి ముందుకు వచ్చిన పక్షంలో అది అసహ్యం అనే వ్యూహం. కక్షమూ, పక్షమూ రెండింటిని క్రింద పెట్టి, ఉరస్యం దాటి ముందుకు వస్తే అది ఖాతకం (చాపం 50 శ్లో).

ద్వౌ దణ్డౌ వలయః ప్రోక్తో వ్యూహో రిపువిదారణః ।
దుర్జయశ్చతుర్వలయశ్శత్రోర్బలవిమర్దనః ॥68॥

దండాలు రెండు కలిస్తే అది వలయం అనే వ్యూహం. ఇది శత్రువులను చీల్చిచెండాడుతుంది. నాలుగు వలయాలు కలిస్తే అది దుర్జయం(50శ్లో). ఇది శత్రుసైన్యాన్ని మర్దిస్తుంది.

కక్షపక్షోరస్యైర్భోగో విషమం పరివర్తయన్ ॥69॥

కక్షం, పక్షం, ఉరస్యం అనేవి మూడు సమానంగా లేకుండా ప్రయోగిస్తే, అది భోగవ్యూహం.

సర్పచారీ గోమూత్రికా శకటశ్శకటాకృతిః ।
విపర్యయోఽమరః ప్రోక్త స్సర్వశత్రువిమర్దకః ॥70॥

ఇందులో గోమూత్రిక మొదలైనవి ఐదుభేదాలు ఉన్నాయి (54శ్లో). (పాము వెళ్లినపుడు ఏర్పడే గీత ఆకారంలో సైన్యాన్ని నిలిపితే అది 'సర్ప(అహి)సంచారి'. ఎద్దు మూత్రం పోసినపుడు ఏర్పడిన గీత ఆకారంలో సైన్యాన్ని నిలిపితే అది 'గోమూత్రిక' అనే వ్యూహం. సైన్యాన్ని రథం ఆకారంలో నిలిపితే అది శకటం అనే వ్యూహం. దీనికి వ్యతిరేకమైన ఆకారంలో ఉన్నది 'అమరం' అనేవ్యూహం. ఇది శత్రువుల నందరినీ నిశ్శేషంగా నిర్మూలిస్తుంది. (సైన్యాన్ని మొసలి ఆకారంలో నిలిపితే మకరవ్యూహం. కోతి ఆకారంలో నిలిపితే పారిప్లవంగం. 54శ్లో.)

స్యాత్కక్షపక్షోరస్యానామేకీభావస్తు మణ్డలః ।
చక్రపద్మాదయో భేదా మణ్డలస్య ప్రభేదకాః ॥71॥

కక్షం, పక్షం, ఉరస్యం అనేవి మూడు ఒక్కటిగా ఏర్పాటుచేయడం మండలవ్యూహం. చక్రవ్యూహం, పద్మవ్యూహం, మొదలైనవి 'మండలవ్యూహం'లోని భేదాలు.

ఏవం చ సర్వతోభద్రో వజ్రాక్షవరకాకవత్ ।
అర్ధచన్ద్రశ్చ శృఙ్గాటో హ్యచలో నామరూపతః ॥
వ్యూహా యథాసుఖం కార్యాశ్శత్రూణాం బలవారణాః ॥72॥

ఇదే విధంగా సర్వతోభద్రం, వజ్రం, అక్షవరం, కాకం, లాగే – అర్ధచంద్రం, శృంగాటం, అచలం, అనేవి పేరునుబట్టి, ఆకారాన్నిబట్టి ఏర్పడిన వ్యూహాలు. వీటిని తమ ప్రయోజనానికి అనుగుణంగా ప్రయోగించాలి. ఈ యుద్ధవ్యూహాలు అన్నీ శత్రువులబలాన్ని నిరోధించడానికి ఉపయోగించేవే.


అగ్నిరువాచ – వశిష్ఠమహర్షితో అగ్నిదేవుడు ఇలా చెప్తున్నాడు.

రామస్తు రావణం హత్వా హ్యయోధ్యాం ప్రాప్తవాన్ ద్విజ ।
రామోక్తనీత్యేన్ద్రజితం హతవాంల్లక్ష్మణః పురా ॥73॥

బ్రాహ్మణవర్యా! వశిష్ఠమహర్షీ! శ్రీరామచంద్రుడు రావణాసురుడిని సంహరించిన తరువాత అయోధ్యానగరానికి వెళ్లాడు (అయోధ్యాధిపతి అయినాడు). పూర్వం శ్రీరాముడు ఉపదేశించిన ఈ యుద్ధనీతిని అనుసరించే, లక్ష్మణుడు ఇంద్రజిత్తును జయించాడు.

ఇత్యాది మహాపురాణే ఆగ్నేయే రాజనీతికథనం నామ ద్విచత్వారింశదధికద్విశతతమోఽధ్యాయః ॥242॥

అగ్నిమహాపురాణంలో రాజనీతికథనం అనే రెండువందల నలభైరెండవ అధ్యాయం సమాప్తం.



త్రిచత్వారింశదధికద్విశతతమోஉధ్యాయః – రెండువందల నలభైమూడవ అధ్యాయం

పురుషలక్షణ కథనమ్ – పురుషలక్షణ కథనం

అగ్నిరువాచ – వశిష్ఠమహర్షితో అగ్నిదేవుడు ఇలా చెప్తున్నాడు.

రామాయోక్తా మయా నీతిః స్త్రీణాం రాజన్ నృణాం వదే ।
లక్షణం యత్సముద్రేణ గర్గాయోక్తం యథా పురా ॥1॥

రాజా! (వశిష్ఠమహర్షీ!) పూర్వం నేను శ్రీరామచంద్రుడికి రాజనీతిని చెప్పాను. ఇక సముద్రుడు గర్గుడికి చెప్పిన స్త్రీపురుషలక్షణాలను అదే ప్రకారంగా ఇపుడు చెప్తాను.

సముద్ర ఉవాచ – సముద్రుడు గర్గుడితో ఇలా చెప్తున్నాడు.

పుంసాం చ లక్షణం వక్ష్యే స్త్రీణాం చైవ శుభాశుభమ్ ।
ఏకాధికో ద్విశుక్లశ్చ త్రిగమ్భీరస్తథైవ చ ॥2॥

దృఢమైన వ్రతనియమాలు పాటించే గర్గమునీ! మంచివీ, చెడ్డవీ అయిన పురుషుల లక్షణాలను, అదే విధంగా స్త్రీలక్షణాలను చెప్తాను. ఒకటి ఎక్కువ ఉన్నవాడు, రెండు శుక్లాలు కలవాడు, మూడు గంభీరాలు కలవాడు,

త్రిత్రికస్త్రిప్రలమ్బశ్చ త్రిభిర్వ్యాప్నోతి యస్తథా ।
త్రివలీమాం స్త్రివినత స్త్రికాలజ్ఞశ్చ సువ్రత ॥3॥

మూడు త్రికాలు (మూడుమూళ్లు తొమ్మిది గుణాలు) కలిగినవాడు, మూడు ప్రలంబాలు కలవాడు, మూడు విస్తరించిన గుణాలు కలిగినవాడు, మూడువళులు కలవాడు, మూడు వినతస్థితులు కలవాడు, మూడు కాలాలు తెలిసినవాడు,

పురుష స్స్యాత్సులక్షణ్యో విపులశ్చ తథా త్రిషు ।
చతుర్లేఖస్తథా యశ్చ తథైవ చ చతుస్సమః ॥4॥

అయిన పురుషుడు మంచిలక్షణాలు కలిగినవాడు. ఇంకా, మూడింటిలో విశాలత కలిగినవాడు, నాలుగు రేఖలు కలిగినవాడు, నాలుగు సమానంగా ఉన్నవాడు మరియు

చతుష్కిష్కుశ్చతుర్దంష్ట్రశ్చతుష్కృష్ణస్తథైవ చ ।
చతుర్గన్ధశ్చతుర్హ్రస్వస్సూక్ష్మదీర్ఘశ్చ పఞ్చసు ॥5॥

తొంభైఆరు అంగుళాల ఎత్తు కలవాడు, నాలుగు ప్రముఖదంతాలు కలిగినవాడు, నాలుగు నల్లగా ఉన్నవాడు, నాలుగింటిలో సువాసన కలిగినవాడు, నాలుగు పొట్టిగా ఉన్నవాడు, ఐదు సూక్ష్మంగానూ, ఐదు స్థూలంగానూ ఉన్నవాడు మరియు

షడున్నతోஉష్టవంశశ్చ సప్తస్నేహో నవామలః ।
దశపద్మో దశవ్యూహో న్యగ్రోధపరిమణ్డలః ॥6॥

ఆరు ఎత్తుగా కలిగినవాడు, ఎనిమిది చక్కగా ఉన్నవాడు, ఏడు కాంతిమంతంగా ఉన్నవాడు, తొమ్మిది నిర్మలంగా ఉన్నవాడు, పది అవయవాలు పద్మంతో సమానమైనకాంతితో ఉన్నవాడు, పది అవయవాలు పెద్దవిగా ఉన్నవాడు, న్యగ్రోధపరిమండలుడు,

చతుర్దశసమద్వన్ద్వష్షోడశాక్షశ్చ శస్యతే ॥7॥

జంటఅవయవాలు పద్నాలుగూ పరస్పరం రెండూ సమానంగా ఉన్నవాడు, పదహారు కన్నులు (చతుర్దశ విద్యలు, వాటిని చక్కగా దర్శించేకన్నులు రెండు) కలవాడు – ఈ లక్షణాలు కలిగిన పురుషుడు ఉత్తముడు. పైన చెప్పిన లక్షణాలను వివరిస్తున్నాడు).

ధర్మార్థకామసంయుక్తో ధర్మో హ్యేకాధికో మతః ।
తారకాభ్యాం వినా నేత్రే శుక్లదన్తీ ద్విశుక్లకః ॥8॥

ధర్మం, అర్థం, కామం అనే వాటిలో ధర్మం ఒక్కటి అధికంగా ఉన్నవాడు – ఏకాధికుడు. నల్లగ్రుడ్డు తప్ప మిగిలిన కనుగ్రుడ్డు భాగం, దంతాలు అనేవి రెండు తెల్లవిగా ఉన్నవాడు – ద్విశుక్లుడు.

గమ్భీర స్త్రిశ్రవో నాభిస్సత్త్వం చైకం త్రికం స్మృతమ్ ।
అనసూయా దయా క్షాన్తిర్మఙ్గలాచారయుక్తతా ॥
శౌచం స్పృహా త్వకార్పణ్యమనాయాసశ్చ శూరతా ॥9॥

స్వరం, నాభి, సత్త్వం అనే మూడు గంభీరంగా ఉన్నవాడు త్రిగంభీరుడు. 1. మాత్సర్యం లేకపోవడం, 2. దయ, 3. క్షమ, 4. ఉత్తమమైన ఆచారం, 5. శౌచం, 6. కోరిక లేకపోవడం, 7. ఉదారబుద్ధి, 8. ఆయాసం లేకపోవడం, 9. శౌర్యం అనే తొమ్మిదిగుణాలు కలిగినవాడు – త్రిత్రికుడు.

త్రిత్రిక స్త్రిప్రలమ్బ స్స్యాద్వృషణే భుజయోర్నరః ।
దిగ్దేశజాతివర్గాంశ్చ తేజసా యశసా శ్రియా ॥10॥
వ్యాప్నోతి యస్త్రికవ్యాపీ త్రివలీమాన్నరస్త్వసౌ ।
ఉదరే వలయస్తిస్రో నరం త్రివినతం శృణు ॥
దేవతానాం ద్విజానాం చ గురూణాం ప్రణతస్తు యః ॥11॥

వృషణాలు, భుజాలు రెండు వ్రేలాడుతుండేవాడు – త్రిప్రలంబుడు. దిక్కులన్నింటిలోనూ, దేశంలోనూ, జాతి, వర్గాలలోనూ తేజస్సు, కీర్తి, కాంతి అనేవి మూడు విస్తరించినవాడు. బొడ్డువద్ద మూడు ముడతలు కలిగినవాడు – త్రివలిమంతుడు. దైవం, బ్రాహ్మణులు, గురువులు అనే ముగ్గురికి వినతుడై ఉండేవాడు – త్రివినతుడు.

ధర్మార్థకామకాలజ్ఞ స్త్రికాలజ్ఞోఽభిధీయతే ।
ఉరో లలాటం వక్త్రం చ త్రివిస్తీర్ణో విలేఖవాన్ ॥12॥

ధర్మం, అర్థ, కామం అనే వాటిని సాధించడానికి తగిన సమయం తెలిసినవాడు – త్రికాలజ్ఞుడు. వక్షస్స్థలం, నుదురు, ముఖం అనే మూడు అవయవాలు విశాలంగా ఉన్నవాడు – త్రివిస్తీర్ణుడు.

ద్వౌ పాణీ ద్వౌ తథా పాదౌ ధ్వజచ్ఛత్రాదిభిర్యుతౌ ।
అఙ్గుల్యో హృదయం పృష్ఠం కటిశ్శస్తం చతుస్సమమ్ ॥13॥

రెండుచేతులలోనూ, రెండుపాదాలలోనూ ధ్వజం, ఛత్రం, చక్రం, మొదలైనటువంటి శుభప్రదమైన గీతలు గలిగినవాడు - చతుర్లేఖుడు. వ్రేళ్లు, రొమ్ము, కటి, పృష్ఠం అనే నాలుగు సమానంగా ఉన్నవాడు - చతుస్సముడు.

షణ్ణవత్యఙ్గులోత్సేధ శ్చతుష్కిష్కుప్రమాణతః ॥14॥

తొంబైఆరు అంగుళాల(కిష్కువు అంటే మూర, మూర అంటే రెండు జేనలు, జేన అంటే పన్నెండు అంగుళాలు) ఎత్తు కలిగినవాడు - చతుష్కిష్కువు.

దంష్ట్రాశ్చతస్ర శ్చన్ద్రాభా శ్చతుష్కృష్ణం వదామి తే ।
నేత్రతారౌ భ్రువౌ శ్మశ్రుః కృష్ణాః కేశాస్తథైవ చ ॥ 15॥

చంద్రుడివంటికాంతి కలిగిన నాలుగుదంతాలు కలిగినవాడు - చతుర్దంష్ట్రుడు. కంటిలోని నల్లగ్రుడ్లు, కనుబొమ్మలు, మీసాలు, జుట్టు అనే నాలుగు నల్లగా ఉన్నవాడు - చతుష్కృష్ణుడు.

నాసాయాం వదనే స్వేదే కక్షయోర్విదగన్ధకః ।
హ్రస్వం లిఙ్గం తథా గ్రీవా జఙ్ఘే స్యాద్వేద హ్రస్వకః ॥16॥

ముక్కు, నోరు, రెండుచంకలు అనే నాలుగింటిలోనూ సువాసన కలిగినవాడు (దుర్వాసన లేనివాడు) - చతుర్గంధుడు. లింగం, కంఠం, రెండు పిక్కలు అనే నాలుగు అవయవాలు పొట్టిగా ఉన్నవాడు - చతుర్హ్రస్వుడు.

సూక్ష్మా ణ్యఙ్గులిపర్వాణి నఖకేశద్విజత్వచః ।
హనూ నేత్రే లలాటం చ నాసా దీర్ఘా స్తనాన్తరమ్ ॥17॥

వేళ్లకణుపులు, గోళ్లు, కేశాలు, దంతాలు, చర్మం అనే అయిదు సూక్ష్మంగానూ, దవడలు, కన్నులు, నుదురు, ముక్కు, రొమ్ము అనే అయిదు స్థూలంగానూ ఉన్నవాడు - పంచసూక్ష్మదీర్ఘుడు.

వక్షః కక్షౌ నఖా నాసోన్నతం వక్త్రం కృకాటికా ।
స్నిగ్ధా స్త్వక్కేశదన్తాశ్చ లోమదృష్టిర్నఖాశ్చ వాక్ ॥18॥

రొమ్ము, చంకలు, గోళ్లు, ముక్కు, ముఖం, మెడ వెనుకభాగం అనే ఆరు ఎత్తుగా ఉన్నవాడు షడున్నతుడు. చర్మం, జుట్టు, వెంట్రుకలు, దంతాలు, చూపు, గోళ్లు, మాట, అనేవి ఏడు స్నిగ్ధంగా ఉన్నవాడు - సప్తస్నేహుడు.

జాన్వోరూర్వోశ్చ పృష్ఠస్థవంశో ద్వౌ కరనాసయోః ।
నేత్రే నాసాపుటౌ కర్ణౌ మేఢ్రం పాయుముఖేఽమలమ్ ॥19॥

రెండుమోకాళ్లు, రెండుతొడలు, పృష్ఠప్రదేశం, రెండుచేతులు, ముక్కు అనే ఎనిమిదిఅంగాలు కాంతిమంతంగా ఉన్నవాడు - అష్టవంశుడు. రెండుకన్నులు, రెండుముక్కురంధ్రాలు, రెండుచెవులు, ముఖం, మేఢ్రం, గుదం అనేవి తొమ్మిది నిర్మలంగా ఉన్నవాడు - నవామలుడు.

జిహ్వోష్ఠే తాలునేత్రే తు హస్తపాదౌ నఖా స్తథా ।
శిశ్నాగ్రవక్త్రం శస్యన్తే పద్మాభా దశ దేహినామ్ ॥20॥

నాలుక, పెదవి, తాలువు, కన్నులు, చేతులు, పాదాలు, గోళ్లు, శిశ్నం చివరిభాగం, ముఖం అనే పదిఅవయవాలు ప్రశంసింపదగిఉన్నవాడు – దశపద్ముడు.

పాణిపాదం ముఖం గ్రీవా శ్రవణే హృదయం శిరః ।
లలాట ముదరం పృష్ఠం బృహన్తః పూజితా దశ ॥21॥

చేతులు, పాదాలు, ముఖం, కంఠం, చెవులు, హృదయం, శిరస్సు, నుదురు, పొట్ట, పృష్ఠం అనే పదిఅవయవాలు పెద్దవిగానూ ప్రశస్తంగానూ ఉన్నవాడు – దశవ్యూహుడు.

ప్రసారితభుజస్యేహ మధ్యమాగ్రద్వయాన్తరమ్ ।
ఉచ్ఛ్రాయేణ సమం యస్య న్యగ్రోధపరిమణ్డలః ॥22॥

రెండు చేతులను బారగా చాచినపుడు ఒకచేతి నడిమివ్రేలినుండి రెండవచేతి నడిమివ్రేలివరకు ఎంత పొడవు ఉంటుందో అంత ఎత్తయినవాడు (ఆజానుబాహుడు, ఉన్నతుడు) – న్యగ్రోధపరిమండలుడు.

పాదౌ గుల్ఫౌ స్ఫిచౌ పార్శ్వౌ వఙ్క్షణౌ వృషణౌ కుచౌ ।
కర్ణౌష్ఠే సక్థినీ జఙ్ఘే హస్తౌ బాహూ తథాఽక్షిణీ ॥
చతుర్దశసమద్వన్ద్వ ఏతత్సామాన్యతో నరః ॥23॥

పాదాలు, చీలమండలు, నితంబాలు, ప్రక్కలు, గజ్జలు, వృషణాలు, స్తనాలు, చెవులు, పెదవులు, తొడలు, పిక్కలు, చేతులు, భుజాలు, కన్నులు, అనే జంటఅవయవాలు పద్నాలుగు పరస్పరం ఒకదానికంటె ఒకటి ఎక్కువతక్కువలు లేకుండా రెండూ సమానంగా ఉన్నవాడు – చతుర్దశ సమద్వంద్వుడు.

విద్యాశ్చతుర్దశ ద్వ్యక్షైః పశ్యేద్యష్షోడశాక్షకః ॥24॥

పద్నాలుగువిద్యలు, రెండుకన్నులు కలిసి పదహారు కన్నులతో చూసేవాడు షోడశాక్షుడు. (చతుర్దశవిద్యామయమైన విజ్ఞానదృష్టితో పరిశీలించేవాడు)

రూక్షం శిరాతతం గాత్రమశుభం మాంసవర్జితమ్ ।
దుర్గన్ధివిపరీతం యచ్ఛస్తం దృష్ట్వా ప్రసన్నయా ॥25॥

కరుకుగా ఉన్నదీ, నరాలు వెలుపలికి వచ్చినదీ, మాంసం లేనిదీ, చెడువాసన వచ్చేదీ, అయిన శరీరం మంచిది కాదు. దీనికి విపరీతంగా అంటే కోమలంగానూ, నరాలు బయటకు కనబడకుండా మాంసంతో నిండుగానూ, సువాసనలతోనూ, ఉన్న శరీరం ఉత్తమమైనది.

ధన్యస్య మధురా వాణీ గతిర్మత్తేభసన్నిభా ।
ఏకకూపభవం రోమభయే రక్షా సకృత్సకృత్ ॥26॥

ఉత్తముడైన పురుషుడికి మాట తీయగా వినసొంపుగా ఉంటుంది. నడక మదించినఏనుగు నడకలాగా ఉంటుంది. రోమాలు ఒక్కొక్కటి ఒక్కొక్కకూపం నుండి క్రమంగా ఉంటాయి. భయం కలిగించే ఆపదలనుండి ఎప్పటికప్పుడు రక్షించుకోగలిగిన సామర్థ్యం ఉంటుంది.

ఇత్యాది మహాపురాణే ఆగ్నేయే పురుషలక్షణకథనం నామ త్రిచత్వారింశదధికద్విశతతమో ఽధ్యాయః ॥243॥

అగ్నిమహాపురాణంలో పురుషలక్షణకథనం అనే రెండువందల నలభైమూడవ అధ్యాయం సమాప్తం.

చతుశ్చత్వారింశదధికద్విశతతమోஉధ్యాయః – రెండువందల నలభైనాల్గవ అధ్యాయం

స్త్రీలక్షణకథనమ్ – స్త్రీలక్షణకథనం

సముద్ర ఉవాచ – సముద్రుడు గర్గుడితో ఇలా చెప్తున్నాడు.

శస్తా స్త్రీ చారుసర్వాఙ్గీ మత్తమాతఙ్గగామినీ ।
గురూరుజఘనా యా చ మత్తపారావతేక్షణా ॥1॥

ఉత్తమజాతిస్త్రీకి శరీరంలో అన్నిఅవయవాలు మనోహరంగా ఉంటాయి. మదించిన ఏనుగులాగా మందమైన నడక కలిగి ఉంటుంది. తొడలు, పృష్ఠం పెద్దవిగా ఉంటాయి. కళ్లు మదించిన పావురం కళ్లలాగా ఉంటాయి.

సునీలకేశీ తన్వఙ్గీ విలోమాఙ్గీ మనోహరా ।
సమభూమిస్పృశౌ పాదౌ సంహతౌ చ తథా స్తనౌ ॥2॥

జుట్టు మిక్కిలి నల్లగా ఉంటుంది. శరీరం సన్నగా ఉంటుంది. శరీరంమీద రోమాలు ఉండవు. మనస్సును హరించే అందం కలిగి ఉంటుంది. పాదాలు రెండూ సమానంగా నేలకు ఆనుతాయి. కుచాలు ఒకదానితో ఒకటి క్రిక్కిరిసినట్లు ఉంటాయి.

నాభిః ప్రదక్షిణావర్తా గుహ్య మశ్వత్థపత్రవత్ ।
గుల్ఫౌ నిగూఢౌ మధ్యేన నాభి రఙ్గుష్ఠమానికా ॥3॥

బొడ్డు కుడివైపు తిరిగి సుడిలాగా ఉంటుంది. ఆడవారి గుహ్యస్థానం రావిఆకులాగా ఉంటుంది. మడమలు మధ్యభాగంలో పైకి కనబడకుండా ఉంటాయి. బొడ్డు బొటనవ్రేలి పరిమాణంలో ఉంటుంది.

జఠరం న ప్రలమ్బం చ రోమరూక్షా న శోభనా ।
నర్క్షవృక్షనదీనామ్నీ న సదా కలహప్రియా ॥4॥

పొట్ట వ్రేలాడకుండా (పలచగా) ఉంటుంది. కరుకైనవెంట్రుకలు కలిగినస్త్రీ అందంగా ఉండదు. నక్షత్రాలపేర్లు, చెట్లపేర్లు, నదులపేర్లు కలిగిన స్త్రీ శుభప్రదం కాదు. ఎప్పుడూ తగవులాడే స్త్రీ మంచిది కాదు.

న లోలుపా న దుర్భాషా శుభా దేవాదిపూజితా ।
గణ్డైర్మధూకపుష్పాభైర్న శిరాలా న లోమశా ॥5॥

మితిమీరిన ఆసక్తి కలిగినది మంచిది కాదు. కటువుగా నిందలతోనూ మాట్లాడేస్త్రీ మంచిది కాదు. అతిమధురం పూవులవంటిచెక్కిళ్లు కలిగినస్త్రీ ఉత్తమురాలు. అటువంటి స్త్రీని దేవతలు మొదలైనవారు కూడా గౌరవిస్తారు. నరాలు పైకి కనిపించేది, ఒంటినిండా వెంట్రుకలు కలిగినది మంచిది కాదు.

న సంహతభ్రుకుటిలా పతిప్రాణా పతిప్రియా ।

అలక్షణాऽపి లక్షణ్యా యత్రాऽऽకారస్తతో గుణాః ॥6॥

భువం కనిష్ఠికా యస్యా న స్పృశేన్మృత్యురేవ సా ॥7॥

కనుబొమ్మలు వంకర తిరిగి, బాగా కలిసిపోయిఉన్న స్త్రీ కూడా మంచిది కాదు. భర్తకు ప్రాణంతో సమానమైన స్త్రీ, భర్తకు చాల ఇష్టమైనస్త్రీ మంచిగుణాలు ఏవీ లేకపోయినప్పటికీ, అన్నిలక్షణాలు కలిగినది అవుతుంది. అందం ఉన్నచోట అన్ని గుణాలూ ఉంటాయి. కాలిచిటికెనవేలు నేలకు ఆనని స్త్రీ మృత్యువే.

ఇత్యాది మహాపురాణే ఆగ్నేయే స్త్రీలక్షణకథనం నామ చతుశ్చత్వారింశదధికద్విశతతమోऽధ్యాయః ॥244॥

అగ్నిమహాపురాణంలో స్త్రీలక్షణకథనం అనే రెండువందల నలభైనాల్గవ అధ్యాయం సమాప్తం.



పఞ్చచత్వారింశదధికద్విశతతమోఽధ్యాయః – రెండువందల నలభైఐదవ అధ్యాయం

చామరాదిలక్షణమ్ – చామరాదిలక్షణ కథనం

అగ్నిరువాచ – వశిష్ఠమహర్షితో అగ్నిదేవుడు ఇలా చెప్తున్నాడు.

చామరో రుక్మదణ్డోఽగ్ర్య శ్ఛత్రం రాజ్ఞః ప్రశస్యతే ।
హంసపక్షై ర్విరచితం మయూరస్య శుకస్య చ ॥
పక్షైర్వాథ బలాకాయా న కార్యం మిశ్రపక్షకైః ॥1॥

బంగారంతో చేసిన దండం కలిగిన చామరం ఉత్తమం. హంసరెక్కలతో కాని, నెమలిరెక్కలతో కాని, చిలుకరెక్కలతో కాని, పెద్దకొంగలరెక్కలతో కాని నిర్మించిన గొడుగు ప్రశస్తం. కాని వేర్వేరు పక్షులరెక్కలు కలిపి, గొడుగును నిర్మింపగూడదు.

చతురస్రం బ్రాహ్మణస్య వృత్తం రాజ్ఞశ్చ శుక్లకమ్ ।
త్రిచతుః పఞ్చషట్ సప్తకాష్టపర్వాశ్చ దణ్డకః ॥2॥

బ్రాహ్మణుడు ఉపయోగించే గొడుగు చతురస్రం ఆకారంలో ఉండాలి. రాజు ఉపయోగించే గొడుగు గుండ్రంగానూ, తెలుపురంగులోనూ ఉండాలి. ఆ గొడుగుకు పట్టుకునే కఱ్ఱ మూడు, నాలుగు, ఐదు, ఆరు, ఏడు, ఎనిమిది కణుపులుండాలి.

భద్రాసనం క్షీరవృక్షైః పఞ్చాశదఙ్గులోచ్ఛ్రయైః ।
విస్తారేణ త్రిహస్తం స్యాత్ సువర్ణాద్యైశ్చ చిత్రితమ్ ॥3॥

రాజు కూర్చుండే సింహాసనం పాలుగారే చెట్టుకఱ్ఱతో యాభైఅంగుళాలు ఎత్తు ఉండే విధంగా నిర్మించాలి. ఇంక దాని వైశాల్యం మూడుమూరలు ఉండాలి. దానిని బంగారం మొదలయిన వాటితో అద్భుతంగా చిత్రించాలి.

ధనుర్ద్రవ్యత్రయం లోహం శృఙ్గం దారుద్విజోత్తమ ।
జ్యాద్రవ్యత్రితయం చైవ వంశభఙ్గత్వచస్తథా ॥4॥

బ్రాహ్మణోత్తమా! వశిష్ఠమహర్షీ! ధనుస్సును లోహం, శృంగం, కఱ్ఱ అనే మూడుద్రవ్యాలలో దేనితోనైనా, నిర్మించాలి. అదే విధంగా ఆ వింటికి కట్టేతాడును వెదురు, భంగం (అనే పేరు గలిగిన చెట్టు), లేదా చర్మం అనే మూడింటిలో ఏదో ఒకద్రవ్యంతో నిర్మించాలి.

దారుచాపప్రమాణం తు శ్రేష్ఠం హస్తచతుష్టయమ్ ।
తదేవ సమహీనం తు ప్రోక్తం మధ్యకనీయసీ ॥5॥

కఱ్ఱతో చేసిన విల్లు నాలుగుమూరల పరిమాణంలో ఉండడం ఉత్తమం. మూడున్నరమూరలు ఉంటే మధ్యమం. మూడుమూరలు ఉంటే కనిష్ఠం. (249 అధ్యాయం.35 శ్లో)

ముష్టిగ్రాహనిమిత్తాని మధ్యే ద్రవ్యాణి కారయేత్ ॥6॥

వింటికి నడుమ పిడికిలితో పట్టుకునే భాగాన్ని దృఢంగా పట్టుకోడానికి వీలైన విశేషద్రవ్యాలు ఉపయోగించాలి.

స్వల్పకోటిస్త్వచా శృఙ్గం శార్ఙ్గలోహమయే ద్విజ ।
కామినీభ్రూలతాకారా కోటిః కార్యా సుసంయతా ॥7॥

బ్రాహ్మణవర్యా! కొమ్ముతో గానీ, లోహంతో కాని చేసిన వింటికి చివరిభాగం సన్నగా ఉండాలి. ఆ చివరిభాగాన్ని చర్మంతో కప్పాలి. ధనుస్సు చివరిభాగాన్ని సుందరి అయినకాంత కనుబొమ్మ ఆకారంలో వక్రంగానూ, తీగలాగా సన్నగానూ చాల దృఢంగా నిర్మించాలి.

పృథగ్వా విప్రమిశ్రం వా లౌహం శార్ఙ్గం తు కారయేత్ ॥8॥

బ్రాహ్మణోత్తమా! ప్రత్యేకంగా లోహంతో గాని, లేదా శృంగంతో కాని, లేదా రెండూ కలిపి కాని విల్లు తయారుచేయాలి.

శార్ఙ్గం సముచితం కార్యం రుక్మబిన్దువిభూషితమ్ ।
కుటిలం స్ఫుటితం చాపం సచ్ఛిద్రం చ న శస్యతే ॥9॥

శృంగంతో చేసిన ధనుస్సును బంగారుచుక్కలతో అలంకరించి అందంగా నిర్మించాలి. వంకర తిరిగినదీ, బీటలువారినదీ, బెజ్జాలు పడినదీ అయిన ధనుస్సు మంచిది కాదు.

సువర్ణం రజతం తామ్రం కృష్ణాయో ధనుషి స్మృతమ్ ।
మాహిషం శారభం శార్ఙ్గం రౌహిషం వా ధనుశ్శుభమ్ ॥10॥

లోహాలలో బంగారం, వెండి, రాగి, నల్లనిఇనుము విల్లు నిర్మించడానికి యోగ్యమైనవి. శృంగాలలో దున్నపోతు, శరభం, రోహిషం అనే మృగాలకొమ్ములు శ్రేష్ఠం.

చన్దనం వైతసం సాలం ధావలం కాకుభం తథా ।
సర్వశ్రేష్ఠం ధనుర్వంశై ర్గృహీతైశ్శరది శ్రితైః ॥11॥

కఱ్ఱలలో మంచిగంధంచెట్టు, వేతసవృక్షం, (నీటి ప్రబలి చెట్టు) మద్దిచెట్టు, ధనవృక్షం, ఏరుమద్దిచెట్టు కఱ్ఱలు మంచివి. ధనుస్సు లన్నింటిలోనూ శరత్కాలంలో పాకానికి వచ్చిన వెదురుతో నిర్మించినది ఉత్తమం.

పూజయేత్తు ధనుః ఖడ్గం మన్త్రై స్త్రైలోక్యమోహనైః ॥12॥

ధనుస్సునూ, ఖడ్గాన్నీ త్రైలోక్యమోహనమంత్రాలతో పూజించాలి.

ఆయసశ్చాథ వంశస్య శరస్యాప్యశరస్య చ ।
ఋజవో హేమవర్ణాభా స్స్నాయుశ్లిష్టా స్సుపత్రకాః ॥
రుక్మపుఙ్ఖాస్సుపుఙ్ఖాస్తే తైలధౌతా స్సువర్ణకాః ॥13॥

బాణం గాని లేదా మరొక ఆయుధం కాని, ఇనుము (లోహం) లేదా వెదురుతో నిర్మించినా, వంకర లేకుండా ఉండాలి. బంగారురంగులో ఉండాలి. వింటినారితో చక్కగా అతికే విధంగా ఉండాలి. బాణానికి కట్టే రెక్కలు ఉత్తమమైనవి కావాలి. ఆ బాణాలు బంగారుతోకలు కలిగినవీ, దృఢమైన తోక కలిగినవీ, నూనెతో శుభ్రం చేసినవీ, శక్తిమంతమైనవీ కావాలి.

యాత్రాయా మభిషేకాదౌ యజేద్బాణధనుర్ముఖాన్ ।
సపతాకాస్త్రసన్నాహ సాంవత్సరకరాన్నృపః ॥14॥

పతాకాలు, అస్త్రాలు, మొదలైనవాటిని చేకూర్చుకునే రాజు యుద్ధానికి వెళ్ళిన సమయంలోనూ, రాజ్యాభిషేక సమయంలోనూ బాణాలు, ధనుస్సులు మొదలయిన ఆయుధాలనూ, జ్యోతిశ్శాస్త్రవేత్తలనూ, పూజించాలి.

బ్రహ్మా వై మేరుశిఖరే స్వర్గగఙ్గాతటేఽ యజత్ ।
లోహదైత్యం స దదృశే విఘ్నం యజ్ఞే తు చిన్తయన్ ॥15॥

బ్రహ్మదేవుడు పూర్వం ఒకసారి మేరుపర్వతశిఖరంమీద, దేవతలగంగానదిఒడ్డున యజ్ఞం చేశాడు. ఆ సమయంలో లోహుడు అనే రాక్షసుడిని చూశాడు. వాడు తన యజ్ఞానికి విఘ్నం కలిగిస్తాడని చింతించాడు.

తస్య చిన్తయతో వహ్నేః పురుషోఽ భూద్బలీ మహాన్ ।
వవన్దేఽ జం చ తం దేవా అభ్యనన్దన్త హర్షితాః ॥16॥

బ్రహ్మదేవుడు ఇలా ఆలోచిస్తుండగా హోమాగ్నిలోనుండి గొప్ప బలవంతుడైన పురుషుడు ఉద్భవించాడు. ఆ పురుషుడు బ్రహ్మదేవుడికి నమస్కారం చేశాడు. దేవతలు సంతోషించి, ఆ పురుషుడిని అభినందించారు.

తస్మాత్స నన్దకః ఖడ్గో దేవోక్తో హరిరగ్రహీత్ ।
తం జగ్రాహ శనైర్దేవో వికోశ స్సోఽ భ్యపద్యత ॥
ఖడ్గో నీలో రత్నముష్టి స్తతోఽ భూచ్ఛతబాహుకః ॥17॥

దేవతలఅభినందనంచేత ఆపురుషుడు నందకం అనేపేరు కలిగిన ఖడ్గం అయినాడు. దేవతల కోరికమీద శ్రీమహావిష్ణువు ఆ ఖడ్గాన్ని స్వీకరించాడు. విష్ణువు స్వీకరించగానే ఆ కత్తి ఒరలోనుండి మెల్లగా బయటకు వచ్చింది. అది నల్లనిరంగులో ఉంది. దాని పిడి రత్నమయమై ఉంది. అప్పుడా కత్తి నూరుభుజాలు(అంచులు) కలిగినది అయింది.

దైత్య స్స గదయా దేవాన్ ద్రావయామాస వై రణే ॥18॥

'లోహుడు' అనే ఆ రాక్షసుడు గదతో దేవతలను అక్కడినుండి తరిమివేశాడు.

విష్ణునా ఖడ్గచ్ఛిన్నాని దైత్యగాత్రాణి భూతలే ।
పతితాని తు సంస్పర్శాన్నన్దకస్య చ తాని హి ॥19॥

విష్ణువు 'నందకం' అనే ఆకత్తితో ఆ రాక్షసుడిని నరికాడు. దానివలన ఆ రాక్షసుడిశరీరంలోని అవయవాలు అన్నీ ముక్కలు ముక్కలై నేలమీద పడిపోయాయి. నందకఖడ్గం స్పర్శకారణంగా ఆ ముక్కలు –

లోహభూతాని సర్వాణి హత్వా తస్మై హరిర్వరమ్ ।
దదౌ పవిత్రమఙ్గం త ఆయుధాయ భవేద్భువి ॥20॥

అన్నీ లోహాలుగా అయినాయి. సంహరించిన తరువాత విష్ణువు 'నీ అవయవాలు పవిత్రాలయి, భూలోకంలో ఆయుధాలు అవుతాయి' అని ఆ రాక్షసుడికి వరమిచ్చాడు.

హరిప్రసాదాద్ బ్రహ్మాపి వినా విఘ్నం హరిం ప్రభుమ్ ।
పూజయామాస యజ్ఞేన వక్ష్యేఽథో ఖడ్గలక్షణమ్ ॥21॥

శ్రీమహావిష్ణువు అనుగ్రహంతో బ్రహ్మదేవుడు తాను ప్రారంభించిన యజ్ఞాన్ని ఎటువంటి ఆటంకం లేకుండా కొనసాగించి, యజ్ఞంలో విష్ణుదేవుడిని చక్కగా పూజించాడు. ఇక ఖడ్గం లక్షణం చెప్తాను.(విను.)

ఖటీఖట్టరజాతా యే దర్శనీయాస్తు తే స్మృతాః ।
కాయచ్ఛిదస్త్వార్షికా స్స్యు ర్దృఢా స్సూర్పారకోద్భవాః ॥
తీక్ష్ణాశ్ఛేదసహా వఙ్గా స్తీక్ష్ణా స్స్యుశ్చాఙ్గదేశజాః ॥22॥

ఖటీఖట్టరం అనే దేశంలో నిర్మించిన కత్తులు చూడ ముచ్చటగా ఉంటాయి. ఋషీకదేశంలో తయారయిన కత్తులు శరీరాన్ని నరికివేస్తాయి. సూర్పారదేశపు కత్తులు చాల గట్టిగా ఉంటాయి. వంగదేశపు కత్తులు పదునుగా ఉండి, సులువుగా ఖండిస్తాయి. అంగదేశపు కత్తులు కూడ బాగా పదునుగా ఉంటాయి.

శతార్ధమఙ్గులానాం చ శ్రేష్ఠం ఖడ్గం ప్రకీర్తితమ్ ।
తదర్ధం మధ్యమం జ్ఞేయం తతో హీనం న ధారయేత్ ॥23॥

యాభై అంగుళాల పొడవు ఉన్న కత్తి శ్రేష్ఠం అని చెప్పబడింది. దానిలో సగం ఇరవైఅయిదు అంగుళాలపొడవు ఉన్న కత్తి మధ్యమం. అంతకంటె తక్కువ పొడవు ఉన్న కత్తిని ధరించగూడదు.

దీర్ఘస్సుమధురశ్శబ్దో యస్య ఖడ్గస్య సత్తమ ।
కిఙ్కిణీసదృశ స్తస్య ధారణం శ్రేష్ఠముచ్యతే ॥24॥

వశిష్ఠా! చిరుమువ్వలలాగా, చెవికి ఇంపుగా చాలాసేపు ధ్వనిచేసే కత్తిని ధరించడం ఉత్తమం అని చెప్పబడింది.

ఖడ్గః పద్మపలాశాగ్రో మణ్డలాగ్రశ్చ శస్యతే ।
కరవీరదలాగ్రాభో ఘృతగన్ధో వియత్ప్రభః ॥25॥

ఖడ్గం చివరిభాగం తామరపూవులాగా, మోదుగపూవులాగా గుండ్రనిఆకారంలోనూ, గన్నేరుఆకులాగానూ, నేతి పరిమళంతోనూ ఆకాశంలాగా నీలపురంగులోనూ ఉంటే ప్రశస్తం.

సమాఙ్గులస్థా శ్శస్యన్తే వ్రణాః ఖడ్గేషు లిఙ్గవత్ ।
కాకోలూకసవర్ణాభా విషమాస్తే న శోభనాః ॥26॥

కత్తులకు పైన మచ్చలు శివలింగం ఆకారంలో సమానమైన అంగుళాలలో ఉంటే ఉత్తమం. కాకి, గుడ్లగూబలతో సమానమైన రంగు కలిగి, మచ్చలు విషమంగా ఉన్న కత్తులు మంచివి కావు.

ఖడ్గే న పశ్యే ద్వదన ముచ్ఛిష్టో న స్పృశే దసిమ్ ।
మూల్యం జాతిం న కథయేన్నిశి కుర్యాన్న శీర్షకే ॥27॥

కత్తిలో తన ముఖం ప్రతిబింబాన్ని చూసుకోగూడదు. పాతబడిపోయిన కత్తిని ముట్టుకోగూడదు. కత్తివెలనూ, జాతినీ గురించి ఎవరికీ చెప్పగూడదు. రాత్రిసమయంలో కత్తిని తలవైపు ఉంచుకుని నిద్రపోగూడదు.

ఇత్యాది మహాపురాణే ఆగ్నేయే చామరాదిలక్షణకథనం నామ పఞ్చచత్వారింశదధికద్విశతతమో௨ధ్యాయః ॥245॥

అగ్నిమహాపురాణంలో చామరాదిలక్షణకథనం అనే రెండువందల నలభైఐదవ అధ్యాయం సమాప్తం.



షట్చత్వారింశదధికద్విశతతమోఽధ్యాయః – రెండువందల నలబైఆరవ అధ్యాయం

రత్నపరీక్షాకథనమ్ – రత్నపరీక్షాకథనం

అగ్నిరువాచ – వశిష్ఠమహర్షితో అగ్నిదేవుడు ఇలా చెప్తున్నాడు.

రత్నానాం లక్షణం వక్ష్యే రత్నం ధార్యమిదం నృపైః ।
వజ్రం మరకతం రత్నం పద్మరాగం చ మౌక్తికమ్ ॥1॥

ఇన్ద్రనీలం మహానీలం వైదూర్యం గన్ధశస్యకమ్ ।
చన్ద్రకాన్తం సూర్యకాన్తం స్ఫటికం పులకం తథా ॥2॥

కర్కేతనం పుష్యరాగం తథా జ్యోతీరసం ద్విజ ।
స్ఫటికం రాజపట్టం చ తథా రాజమయం శుభమ్ ॥3॥

సౌగన్ధికం తథా గఞ్జం శఙ్ఖం బ్రహ్మమయం తథా ।
గోమేధం రుధిరాక్షం చ తథా భల్లాతకం ద్విజ ॥4॥

ధూలీం మరకతం చైవ తుత్థకం సీసమేవ చ ।
పీలుం ప్రవాలకం చైవ గిరివజ్రం ద్విజోత్తమ ॥5॥

భుజఙ్గమమణిం చైవ తథా వజ్రమణిం శుభమ్ ।
టిట్టిభం చ తథా పిణ్డం భ్రామరం చ తథోత్పలమ్ ॥6॥

సువర్ణప్రతిబద్ధాని రత్నాని శ్రీజయాదికే ॥7॥

బ్రాహ్మణోత్తమా! వశిష్ఠమహర్షీ! ఇపుడు రత్నాల లక్షణం చెప్తాను. మహారాజు ఈ(చెప్పే)రత్నాలను ధరించాలి. 1. వజ్రం 2. మరకతం 3. పద్మరాగం 4. ముత్యం 5. ఇంద్రనీలం 6. మహానీలం 7. వైదూర్యం 8. గంధశస్యం 9. చంద్రకాంతం 10. సూర్యకాంతం 11. స్ఫటికం 12. పులకం 13. కర్కేతనం 14. పుష్యరాగం 15. జ్యోతీరసం 16. స్ఫటికం (విశేషం) 17. రాజపట్టం 18.శుభప్రదమైన రాజమయం 19. సౌగంధికం 20. గంజం 21. శంఖం 22. బ్రహ్మమయం 23. గోమేధం 24. రుధిరాక్షం 25. భల్లాతకం 26. ధూళి 27. మరకతం 28. తుత్థకం 29. సీసం 30. పీలువు 31. ప్రవాళం 32. గిరివజ్రం 33. భుజంగమణి 34. వజ్రమణి 35. టిట్టిభం 36. పిండం 37. భ్రామరం 38. ఉత్పలం ఈ రత్నాలను సంపదలు, విజయం సిద్ధించడానికి బంగారంతో కూర్చి ధరించాలి.

అన్తః ప్రభత్వం వైమల్యం సుసంస్థానత్వ మేవ చ ।
సుధార్యా నైవ ధార్యాస్తు నిష్ప్రభా మలినాస్తథా ॥
ఖణ్డాస్సశర్కరా యే చ ప్రశస్తం వజ్రధారణమ్ ॥8॥

లోపల కాంతి కలిగినవీ, మలినాలు లేనివీ, చక్కని ఆకారం కలిగినవీ అయిన రత్నాలను మాత్రమే ధరించాలి. అసలు కాంతిలేనివీ, మలినాలు కలిగినవీ, ముక్కలయినవీ, పగుళ్లు ఏర్పడినవీ అయిన రత్నాలను ఎంతమాత్రం ధరించగూడదు. ఇతర రత్నాలకంటె వజ్రాన్ని ధరించడం ఉత్తమం.

అమ్భస్తరతి యద్వజ్రమభేద్యం విమలం చ యత్ ।
షట్కోణం శక్రచాపాభం లఘుచార్కనిభం శుభమ్ ।
శుకపక్షనిభ స్స్నిగ్ధః కాన్తిమాన్విమల స్తథా ॥9॥

వజ్రాలలో – నీటిలో తేలేదీ, పగలగొట్టడం సాధ్యం కానిదీ, మలినాలు లేనిదీ, ఆరు అంచులు గలిగినదీ, ఇంద్రధనుస్సువంటి కాంతి కలిగినదీ, బరువు తక్కువగా ఉన్నదీ, సూర్యుడివంటికాంతి కలిగినదీ, చిలుకరెక్కలవంటిరంగు కలిగినదీ, నిగనిగలాడుతున్నదీ, కాంతితో మెరిసేదీ, స్వచ్ఛంగా ఉన్నదీ ఉత్తమం.

స్వర్ణచూర్ణనిభై స్సూక్ష్మైర్మరకతశ్చ బిన్దుభిః ।
స్ఫటికాః పద్మరాగా స్స్యు రాగవన్తో౽తినిర్మలాః ॥10॥

బంగారం పొడిలాగా మిక్కిలి చిన్నచుక్కలు కలిగిన మరకతమణి ఉత్తమం. కర్పూరం లాగా తెల్లగా ఉన్న స్ఫటికం మంచిది. మంచిఎరుపురంగు కలిగిన పద్మరాగమణులు శ్రేష్ఠం.

జాతరఙ్గా భవన్తీహ కురువిన్దసముద్భవాః ।
సౌగన్ధికోత్థాః కాషాయా ముక్తాఫలాస్తు శుక్తిజాః ॥11॥

తుంగముపైనుండి ఏర్పడిన పద్మరాగమణులు నూతనమైన ఎరుపురంగు కలిగి ఉంటాయి. ఎఱ్ఱదామరల నుండి పుట్టిన పద్మరాగాలు కాషాయవర్ణంలో ఉంటాయి. ముత్యపుచిప్పనుండి ఏర్పడిన ముత్యాలు స్వచ్ఛంగా ఉంటాయి.

విమలాస్తేభ్య ఉత్కృష్టా యే చ శఙ్ఖోద్భవా మునే ।
నాగదన్తభవాశ్చాగ్ర్యాః కుమ్భసూకరమత్స్యజాః ॥
వేణునాగభవా శ్శ్రేష్ఠా మౌక్తికం మేఘజం వరమ్ ॥12॥

వశిష్ఠమహర్షీ! ముత్యపుచిప్పలనుండి పుట్టిన వాటికంటె శంఖంనుండి పుట్టిన ముత్యాలు ఇంకా శ్రేష్ఠ మైనవి. వాటికంటె ఏనుగుదంతాలనుండి ఏర్పడిన ముత్యాలు ఉత్తమమైనవి. ఏనుగుకుంభస్థలంనుండి, అడవిపందులనుండి, చేపలనుండి, వెదురుపొదలనుండి, కొండచరియలనుండి పుట్టిన ముత్యాలు శ్రేష్ఠం. మేఘంనుండి పుట్టినముత్యం అన్నింటికంటె ఉత్తమం.

వృత్తత్వం శుక్లతా స్వాచ్ఛ్యం మహత్త్వం మౌక్తికే గుణాః ॥13॥

గుండ్రంగా ఉండడం, తెల్లగా ఉండడం, స్వచ్ఛంగా ఉండడం, మహిమ కలిగి ఉండడం అనేవి ముత్యాలలో ఉన్న విశేషగుణాలు.

ఇన్ద్రనీలం శుభం క్షీరే రాజతే భ్రాజతేఽధికమ్ ।
రఞ్జయేత్ స్వప్రభావేణ తమమూల్యం వినిర్దిశేత్ ॥14॥

పాలలో ఉంచినపుడు బాగా ప్రకాశించే ఇంద్రనీలమణి శ్రేష్ఠమైనది. తన కాంతితో జనులమనసును రంజించే ఇంద్రనీలమణి వెలకట్టడానికి సాధ్యం కానంత గొప్పది అని చెప్పాలి.

నీలరక్తం తు వైదూర్యం శ్రేష్ఠం హారాదికం భజేత్ ॥15॥

నలుపుతో కూడిన ఎఱుపురంగులో ఉన్న వైదూర్యమణి ఉత్తమమైనది. అటువంటి వైదూర్యమణులు హారాలు మొదలైన ఆభరణాలలో కూర్చుకోవడానికి యోగ్యమైనవి.

ఇత్యాది మహాపురాణే ఆగ్నేయే రత్నపరీక్షాకథనం నామ షట్చత్వారింశదధికద్విశతతమోఽధ్యాయః ॥246॥

అగ్నిమహాపురాణంలో రత్నపరీక్షాకథనం అనే రెండువందల నలభైఆరవ అధ్యాయం సమాప్తం.



సప్తచత్వారింశదధికద్విశతతమోఽధ్యాయః - రెండువందల నలభైఏడవ అధ్యాయం

వాస్తులక్షణ కథనమ్ - వాస్తులక్షణ కథనం

అగ్నిరువాచ - వశిష్ఠమహర్షితో అగ్నిదేవుడు ఇలా చెప్తున్నాడు.

వాస్తులక్ష్మ ప్రవక్ష్యామి విప్రాదీనాం చ భూరిహ ।
శ్వేతా రక్తా తథా పీతా కృష్ణా చైవ యథాక్రమమ్ ॥1॥

వశిష్ఠమహర్షీ! ఇక వాస్తులక్షణాలను చెప్తాను. బ్రాహ్మణులు మొదలైన నాలుగు వర్ణాలవారికి క్రమంగా (బ్రాహ్మణులకు) తెల్లనిది, (క్షత్రియులకు) ఎఱ్ఱనిది, (వైశ్యులకు) పచ్చనిది, (శూద్రులకు) నల్లనిది అయిన భూమి నివాసయోగ్యం.

ఘృతరక్తాన్నమద్యానాం గన్ధాఢ్యా రసతశ్చ భూః ।
మధురా చ కషాయా చ అమ్లాద్యుపరసా క్రమాత్ ॥2॥

అదేవిధంగా బ్రాహ్మణులకు నేతివాసన, క్షత్రియులకు నెత్తురువాసన, వైశ్యులకు అన్నంవాసన, శూద్రులకు మద్యంవాసన కలిగిన భూమి యోగ్యం. దానితోపాటుగా క్రమంగా తీపి, ఒగరు, పులుపు, మొదలయిన రసాలు కలిగిన భూమి యుక్తం.

కుశై శ్శరైస్తథాకాశైర్దూర్వాభిర్యా చ సంశ్రితా ॥3॥

అదేవిధంగా బ్రాహ్మణులకు దర్భలు, క్షత్రియులకు తెల్లరెల్లు, వైశ్యులకు రెల్లు, శూద్రులకు గరిక కలిగిన భూమి నివసించడానికి తగినది.

ప్రార్చ్య విప్రాం శ్చ నిశ్శల్యాం ఖాతపూర్వం తు కల్పయేత్ ।
చతుష్షష్టిపదం కృత్వా మధ్యే బ్రహ్మా చతుష్పదః ॥4॥

మొట్టమొదట బ్రాహ్మణులకు పూజచేయాలి. తరువాత ఆ భూమిని త్రవ్వి లోపలి ఎముకలు తొలగించాలి. అరవైనాలుగు అడుగులలో వేదిక ఏర్పాటు చేయాలి. దాని మధ్యలో నాలుగుఅడుగుల వైశాల్యంలో బ్రహ్మను స్థాపించాలి.

ప్రాక్తేషాం వై గృహస్వామీ కథితస్తు తథాఽర్యమా ।
దక్షిణేన వివస్వాంశ్చ మిత్రః పశ్చిమతస్తథా ॥5॥

తూరుపువైపున అర్యముడిని గృహస్వామిగా ఉంచాలి. దక్షిణంలో వివస్వంతుడు, పశ్చిమంలో మిత్రుడు ఉండాలి.

ఉదఙ్మహీధర శ్చైవ ఆపవత్సౌ చ వహ్నిగే ।
సావిత్రశ్చైవ సవితా జయేన్ద్రౌ నైరృతేఽమ్బుధౌ ॥6॥

ఉత్తరంవైపున పర్వతం, ఆగ్నేయదిక్కులో ఆపస్సు, వత్సుడు, నైరృతిదిక్కులో పడమరగా, సావిత్రుడు, సవితృడు, జయుడు, ఇంద్రుడు అనే దేవతలు ఉండాలి.

రుద్రవ్యాధీ చ వాయవ్యే పూర్వాదౌ కోణగాద్బహిః ।
మహేన్ద్రశ్చ రవి స్సత్యో భృశః పూర్వేఽథ దక్షిణే ॥7॥

వాయవ్యంలో రుద్రుడు, వ్యాధి, ఉండాలి. తూర్పు మొదలైన దిక్కులకూ ఆగ్నేయం మొదలైన విదిక్కులకూ వెలుపలగా ఇంకా ఈ దేవతలు కూడా ఉండాలి. తూర్పులో మహేంద్రుడు, రవి, సత్యుడు, భృశుడు, దక్షిణంలో-

గృహక్షతోఽర్యమధృతీ గన్ధర్వాశ్చాథ వారుణే ।
పుష్పదన్తోఽసురాశ్చైవ వరుణో యక్ష్మ ఏవ చ ॥8॥

సౌమ్యే భల్లాటసోమౌ చాప్యదితిర్ధనదస్తథా ।
నాగః కరగ్రహశ్చైశ్యాం హ్యష్టౌ దిశి దిశి స్మృతాః ॥9॥

గృహక్షతుడు, అర్యముడు, ధృతి, గంధర్వులు, పశ్చిమంలో పుష్పదంతుడు, అసురులు. వరుణుడు, యక్ష్ముడు, ఉత్తరంలో భల్లాటుడు, సోముడు, అదితి, కుబేరుడు ఉండాలి. ఈశాన్యంలో నాగం, కరగ్రహం, ఉండాలి. ఈ విధంగా ఒక్కొక్కదిక్కులో ఎనిమిదిమంది దేవతలు ఉంటారు.

ఆద్యన్తౌ తు తయోర్దేవౌ ప్రోక్తావత్ర గృహేశ్వరౌ ।
పర్జన్యః ప్రథమో దేవో ద్వితీయశ్చ కరగ్రహః ॥
మహేన్ద్రరవిసత్యాశ్చ భృశోఽథ గగనం తథా ॥10॥

ఈ దేవతలలో మొదటివాడు, చివరివాడు ఇద్దరూ ఈ గృహానికి అధిపతులుగా చెప్పబడ్డారు. వీరిలో పర్జన్యుడు మొదటిదేవత. కరగ్రహుడు రెండవవాడు. ఆ తరువాతి స్థానాలలో మహేంద్రుడు, రవి, సత్యుడు, భృశుడు, గగనం, పవనుడు ఉంటారు.

పవనః పూర్వత శ్చైవ అన్తరిక్షధనేశ్వరౌ ।
ఆగ్నేయే చాథ నైరృత్యే మృగసుగ్రీవకౌ సురౌ ॥11॥

తూర్పున పవనుడు, ఆగ్నేయంలో అంతరిక్షం, కుబేరుడు, నైరృతిలో మృగుడు, సుగ్రీవుడు అనే దేవతలు ఉంటారు.

రోగో ముఖ్యశ్చ వాయవ్యే దక్షిణే పుష్పవిత్తదౌ ।
గృహక్షతో యమభృశౌ గన్ధర్వో నాగపైతృకః ॥12॥

వాయవ్యంలో రోగం, ముఖ్యుడు, ఉంటారు. దక్షిణదిక్కులో పుష్పుడు, విత్తదుడు, గృహక్షతుడు, యముడు, భృశుడు, గంధర్వుడు, నాగపైతృకుడు ఉంటారు.

ఆప్యే దౌవారికసుగ్రీవౌ పుష్పదన్తోఽసురో జలమ్ ।
యక్ష్మరోగశ్చ శోషశ్చ హ్యుత్తరే నాగరాజకః ॥13॥

ముఖ్యో భల్లాటశశినౌ హ్యదితిశ్చ కుబేరకః ।
నాగో హుతాశ శ్రేష్ఠో వై శక్రసూర్యౌ చ పూర్వతః ॥14॥

పశ్చిమంలో దౌవారికుడు, సుగ్రీవుడు, పుష్పదంతుడు, జలదేవత, యక్ష్మరోగం, క్షయరోగం ఉంటారు. ఉత్తరంలో నాగరాజు, ముఖ్యుడు, భల్లాటుడు, చంద్రుడు, అదితి, కుబేరుడు, నాగుడు, శ్రేష్ఠుడైన హుతాశనుడు ఉంటారు. తూర్పుదిక్కున ఇంద్రుడు, సూర్యుడు ప్రధానులు.

దక్షే గృహక్షతః పుష్ప ఆప్యే సుగ్రీవ ఉత్తమః ।
పుష్పదన్తో హ్యుదగ్ద్వారి భల్లాటః పుష్పదన్తకః ॥15॥

దక్షిణంలో గృహక్షతుడు, పుష్పుడు ఉత్తములు. పశ్చిమంలో సుగ్రీవుడు ఉత్తముడు. ఉత్తరద్వారంలో పుష్పదంతుడు ఉత్తముడు. ఇక్కడ పుష్పదంతుడు అంటే భల్లాటుడే అని గ్రహించాలి.

శిలేష్టకాదివిన్యాసం మన్త్రైః ప్రార్చ్య సురాంశ్చరేత్ ॥16॥

ఆయా మంత్రాలతో ఆయా దేవతలను చక్కగా పూజించి, శిల, ఇటుక, మొదలైనవాటిని (పునాదిరాయిగా) ఉంచాలి.

నన్దే నన్దయ వాశిష్ఠే వసుభిః ప్రజయా సహ ।
జయే భార్గవదాయాదే ప్రజానాం జయ మావహ ॥17॥

వశిష్ఠమహర్షికుమార్తెవైన నందా! బంగారం మొదలైన సంపదలు, సంతానమూ ఇచ్చి నన్ను సంతోషపెట్టు. భార్గవుడికూతురివైన జయా! మా సంతానానికి విజయం కలిగించు.

పూర్ణేఽఙ్గిరసదాయాదే పూర్ణకామం కురుష్వ మామ్ ।
భద్రే కాశ్యపదాయాదే కురు భద్రాం మతిం మమ ॥18॥

అంగిరసుడికూతురివైన పూర్ణా! నా కోరికలన్నీ నిశ్శేషంగా సిద్ధింపజేయి. కాశ్యపుడికూతురివైన భద్రా! నాకు శుభప్రదమైన బుద్ధిని ప్రసాదించు.

సర్వబీజసమాయుక్తే సర్వరత్నౌషధైర్వృతే ।
రుచిరే నన్దనే నన్దే వాశిష్ఠే రమ్యతా మిహ ॥19॥

వశిష్ఠుడికూతురివైన నందా! సమస్తమైన బీజాలతో కూడినదీ, సమస్తమైన రత్నాలతోనూ, ఓషధులతోనూ నిండినదీ, మనోహరమైనదీ అయిన ఈ నందనవనంలో క్రీడించు.

ప్రజాపతిసుతే దేవి చతురస్రే మహీమయే ।
సుభగే సువ్రతే భద్రే గృహే కాశ్యపి రమ్యతామ్ ॥20॥

కశ్యపప్రజాపతికూతురివైన భూదేవీ! నాలుగుఅంచులు కలిగిన దానా! భూమిస్వరూపమైనదానా! సుందరమైన రూపు కలిగినదానా! ఉత్తమమైన వ్రతం కలిగినదానా! శుభం కలిగించేదానా! ఈ గృహంలో క్రీడించు.

పూజితే పరమాచార్యై ర్గన్ధమాల్యైరలఙ్కృతే ।
భవభూతికరే దేవి గృహే భార్గవి రమ్యతామ్ ॥21॥

భార్గవుడికూతురివైన దేవీ! ఉత్తములైన ఆచార్యులచే పూజింపబడేదానా! మంచిగంధంతోనూ పూలతోనూ అలంకరింపబడినదానా! ఉత్తమమైన జన్మనూ సుఖమయమైన జీవితాన్ని ఇచ్చేదానా! ఈ గృహంలో క్రీడించు.

అవ్యక్తే చాక్షతే పూర్ణే మునే రఙ్గిరసస్సుతే ॥22॥

అంగిరసమహర్షికి కూతురివైన పూర్ణాదేవీ! సూటిగా తెలియబడేదానా! శాశ్వతంగా ఉండేదానా! ఈ గృహంలో క్రీడించు.

ఇష్టకే త్వం ప్రయచ్ఛేష్టం ప్రతిష్ఠాం కారయామ్యహమ్ ।
దేశస్వామి పురస్వామి గృహస్వామి పరిగ్రహే ॥
మనుష్యధనహస్త్యశ్వపశువృద్ధికరీ భవ ॥23॥

ఇటుకా! నిన్ను ఇక్కడ ప్రతిష్ఠ చేస్తున్నాను. నీవు నాకు కావలసినవి అన్నీ అనుగ్రహించు. దేశనాయకులను, నగరాధిపతులను, గృహయజమానులను పరిగ్రహించే (దేశ, నగర, గృహాలనిర్మాణాన్ని చేసే) ఓ ఇటుకా! నాకు మనుష్యులను, సంపదలను, ఏనుగులను, గుఱ్ఱాలను, పశువులను పెంపొందించు.

గృహప్రవేశేఽపి తథా శిలాన్యాసం సమాచరేత్ ॥24॥

గృహప్రవేశ సమయంలో కూడ ఇదే ప్రకారంగా శిలాన్యాసం చేయాలి.

ఉత్తరేణ శుభః ప్లక్షో వటః ప్రాక్ స్యాద్గృహాదితః ।
ఉదుమ్బరశ్చ యామ్యేన పశ్చిమేఽశ్వత్థ ఉత్తమః ॥25॥

ఇంటికి ఉత్తరదిక్కులో జువ్విచెట్టు, తూర్పుదిక్కులో మఱ్ఱిచెట్టు, దక్షిణంలో మేడిచెట్టు, పడమరదిక్కులో రావిచెట్టు ఉండడం ఉత్తమం.

వామభాగే తథోద్యానం కుర్యాద్వాసం గృహే శుభమ్ ॥26॥

ఇంటికి ఎడమవైపున ఉద్యానవనం ఉండాలి. ఇటువంటి ఇంటిలో నివసించడం శుభప్రదం.

సాయం ప్రాతస్తు ఘర్మాప్తౌ శీతకాలే దినాన్తరే ।
వర్షాకాలే భువశ్శోషే సేక్తవ్యా రోపితద్రుమాః ॥27॥

నాటినచెట్లను వేసవికాలంలో ఉదయం సాయంకాలం రెండుపూటలు నీటితో తడపాలి. చలికాలంలో సాయంకాలం ఒకపూట మాత్రం నీళ్లతో తడపాలి. వానలకాలంలో నేల ఎండిపోయినచోట్ల మాత్రం నీళ్లతో తడపాలి.

విడఙ్గఘృతసంయుక్తాన్ సేచయేచ్ఛీతవారిణా ।
ఫలనాశే కులత్థైశ్చ మాషైర్ముద్గైస్తిలైర్యవైః ॥28॥

విడంగం (క్రిములను పోగొట్టే ఓషధి), ఘృతం కూడినచెట్లను చల్లనినీళ్లతో తడపాలి. పండ్లు నశించిపోయే చెట్లకు ఉలవలు, మినుములు, పెసలు, నువ్వులు, యవలు, కలిపిన నీళ్లు పోయాలి.

ఘృతశీతపయస్సేకః ఫలపుష్పాయ సర్వదా ।
మత్స్యామ్భసా తు సేకేన వృద్ధిర్భవతి శాఖినామ్ ॥29॥

సమృద్ధిగా పూలు పూయడానికీ, కాయలు కాయడానికీ చెట్లను నేయి కలిపిన చల్లనినీళ్లతో తడపాలి. చేపలు ఉండే నీళ్లతో తడిపితే చెట్లు తొందరగా బాగా పెరుగుతాయి.

అవికాజశకృచ్చూర్ణం యవచూర్ణం తిలాని చ ।
గోమాంసముదకం చేతి సప్తరాత్రం నిధాపయేత్ ॥
ఉత్సేకం సర్వవృక్షాణాం ఫలపుష్పాదివృద్ధిదమ్ ॥30॥

మేకపెంటికలపొడి, యవలపిండి, నువ్వుపిండి, ఆవుపేడ, నీళ్లు వీటి నన్నిటిని కలిపి ఏడురోజులు అలాగే ఉంచాలి. ఏడురోజుల తరువాత ఆ నీళ్లను దండిగా పోస్తే, అన్నిరకాల చెట్లకూ పండ్లు, పూలు, మొదలయినవి బాగా వృద్ధి చెందుతాయి.

మత్స్యోదకేన శీతేన హ్యామ్రాణాం సేక ఇష్యతే ।
ప్రశస్తం చా ప్యశోకానాం కామినీపాదతాడనమ్ ॥31॥

మామిడిచెట్లను చేపలు కలిపిన చల్లనినీళ్లతో తడపడం ఫలవృద్ధికి దోహదం చేస్తుంది. అలాగే అశోకవృక్షాలు వృద్ధిచెందడానికి అందమైన కాంతలు కాలితో తన్నడం శ్రేష్ఠం.

ఖర్జూరనారికేలాదేర్లవణాద్భిర్వివర్ధనమ్ ।
విడఙ్గమత్స్యమాంసాద్భి స్సర్వేషాం దోహదం శుభమ్ ॥32॥

ఖర్జూరం నారికేళం మొదలైనచెట్లు ఉప్పు కలిపిన నీళ్లతో తడిపితే, చక్కగా వృద్ధి చెందుతాయి. వాయువిడంగం, చేపలు, మాంసం కలిపిన నీళ్లతో తడపడం అన్ని రకాలచెట్లకు మంచిది.

ఇత్యాది మహాపురాణే ఆగ్నేయే వాస్తులక్షణకథనం నామ సప్తచత్వారింశదధికద్విశతతమోఽధ్యాయః ॥247॥

అగ్నిమహాపురాణంలో వాస్తులక్షణకథనం అనే రెండువందల నలభైఏడవ అధ్యాయం సమాప్తం.



అష్టచత్వారింశదధికద్విశతతమో உధ్యాయః - రెండువందల నలభైఎనిమిదవ అధ్యాయం

పుష్పాదిపూజాఫలకథనమ్ - పుష్పాదిపూజాఫలకథనం

అగ్నిరువాచ - వసిష్ఠమహర్షితో అగ్నిదేవుడు ఇలా చెప్తున్నాడు.

పుష్పైస్తు పూజనాద్విష్ణుస్సర్వకార్యేషు సిద్ధిదః ।
మాలతీ మల్లికా యూథీ పాటలా కరవీరకమ్ ॥1॥

పావన్తి రతిముక్తశ్చ కర్ణికారః కురణ్టకః ।
కుబ్జక స్తగరో నీపో బాణో బర్బరమల్లికా ॥
అశోకస్తిలకః కున్దః పూజాయై స్యాత్తమాలజమ్ ॥2॥

పూవులు మొదలయిన వాటితో పూజించడంవలన శ్రీమహావిష్ణువు అన్నికార్యాలనూ సిద్ధింపజేస్తాడు. జాజి, మల్లె, పెద్దగోరంట, కలిగొట్టుపూవు, గన్నేరు, పావంతి, తుమ్మికి, కొండగోగు, పచ్చపువ్వులగోరంట, తినిశం, తగరం, కదంబం, నల్లగోరింట, బర్బరదేశపు మల్లెపూవు, పొగడ, ఎఱ్ఱగోరంట, మొల్ల, చీకటిచెట్టుపూవు, - ఈపూలు పూజకు ఉపయోగింపదగినవి.

బిల్వపత్రం శమీపత్రం పత్రం భృఙ్గరజస్య తు ।
తులసీకాలతులసీపత్రం వాసకమర్చనే ॥3॥
కేతకీపత్రపుష్పం చ పద్మం రక్తోత్పలాదికమ్ ॥4॥

మారేడుదళం, జమ్మి ఆకు, గుంటగలిజేరు ఆకు, (విష్ణు)తులసీదళం, కృష్ణతులసి, అనేవి పరిమళవంతమై, పూజకు ఉపయోగిస్తాయి. మొగలిపూవు, ఆకు, తామరపూవు, ఎఱ్ఱగలువ మొదలయినవి పూజకు శ్రేష్ఠాలు.

నార్కం నోన్మత్తకం కాఞ్చీ పూజనే గిరిమల్లికా ।
కౌటజం శాల్మలీపుష్పం కణ్టకారీభవం న హి ॥5॥

జిల్లేడు, ఉమ్మెత్త, గురివెంద, కొండమల్లె, అవిసెపూవు, బూరుగుపూవు, వాకుడుపూవు పూజకు పనికిరావు.

ఘృతప్రస్థేన విష్ణోశ్చ స్నానం గోకోటిసత్ఫలమ్ ।
ఆఢకేన తు రాజా స్యాద్ ఘృతక్షీరైర్దివం వ్రజేత్ ॥6॥

శ్రీమహావిష్ణువుకు నాలుగుమానికల ఆవునేతితో స్నానం చేయిస్తే, కోటిఆవులను దానం చేసినంత పుణ్యం లభిస్తుంది. పదహారుమానికలనేతితో చేయిస్తే, మహారాజు అవుతాడు. ఆవునేతితోనూ, పాలతోనూ స్నానం చేయించినవాడు స్వర్గానికి వెళ్తాడు.

ఇత్యాది మహాపురాణే ఆగ్నేయే పుష్పాదిపూజాఫలకథనం నామాష్టచత్వారింశదధికద్విశతతమోஉధ్యాయః ॥248॥

అగ్నిమహాపురాణంలో పుష్పాదిపూజాఫలకథనం అనే రెండువందల నలభైఎనిమిదవ అధ్యాయం సమాప్తం.

ఏకోనపఞ్చాశదధికద్విశతతమోఽధ్యాయః - రెండువందల నలభైతొమ్మిదవ అధ్యాయం

ధనుర్వేదకథనమ్ - ధనుర్వేదకథనం

అగ్నిరువాచ - వశిష్ఠమహర్షితో అగ్నిదేవుడు ఇలా చెప్తున్నాడు.

చతుష్పాదం ధనుర్వేదం వదే పఞ్చవిధం ద్విజ ।
రథనాగాశ్వపత్తీనాం యోధాంశ్చాశ్రిత్య కీర్తితమ్ ॥1॥

విప్రవర్యా! వసిష్ఠమహర్షీ! ధనుర్వేదం నాలుగుపాదాలు కలిగినది. రథ, గజ, తురగ, పదాతి అనే యోధులను అనుసరించి ధనుర్వేదం ఐదువిధాలుగా చెప్పబడింది.

యన్త్రముక్తం పాణిముక్తం ముక్తసన్ధారితం తథా ।
అముక్తం బాహుయుద్ధం చ పఞ్చధా తత్ ప్రకీర్తితమ్ ॥2॥

1. యంత్రముక్తం, 2. పాణిముక్తం, 3. ముక్తసంధారితం, 4. అముక్తం, 5. బాహుయుద్ధం అని ధనుర్వేదం అయిదు విధాలుగా పేర్కొనబడింది.

తత్ర శస్త్రాస్త్రసమ్పత్త్యా ద్వివిధం పరికీర్తితమ్ ।
ఋజుమాయా విభేదేన భూయో ద్వివిధముచ్యతే ॥3॥

యుద్ధం శస్త్రసంపద, అస్త్రసంపద అని రెండువిధాలు. అది మళ్లీ ఋజుయుద్ధం, మాయాయుద్ధం అని రెండు విధాలు.

క్షేపణీచాపయన్త్రాద్యై ర్యన్త్రముక్తం ప్రకీర్తితమ్ ।
శిలాతోమరయన్త్రాద్యం పాణిముక్తం ప్రకీర్తితమ్ ॥4॥

క్షేపణి (విసరివేసేది), ధనుస్సు, యంత్రం మొదలయిన వాటి(యంత్రాల)ద్వారా శత్రువులపై విడిచిపెట్టే ఆయుధం యంత్రముక్తం. రాయి, ఇనపగద, యంత్రాలరూపంలో శత్రువుపైకి చేతితో విడిచిపెట్టే ఆయుధం పాణి ముక్తం.

ముక్తసన్ధారితం జ్ఞేయం ప్రాసాద్యమపి యద్భవేత్ ।
ఖడ్గాదికమముక్తం చ నియుద్ధం విగతాయుధమ్ ॥5॥

విసరివేయడం ద్వారా శత్రువులను నిరోధించే ఈటె మొదలైన ఆయుధం 'ముక్తసంధారితం'. చేతినుండి విడువకుండా యుద్ధం చేసే ఖడ్గం మొదలైనది 'అముక్తం'. ఏ విధమైన ఆయుధం లేకుండా, చేతులు మొదలుగా శరీరావయవాలతో చేసేయుద్ధం 'నియుద్ధం'.

కుర్యాద్యోగ్యాని పాత్రాణి యోద్ధుమిచ్ఛు ర్జితశ్రమః ।
ధనుశ్శ్రేష్ఠాని యుద్ధాని ప్రాసమధ్యాని తాని చ ॥

తాని ఖడ్గజఘన్యాని బాహుప్రత్యవరాణి చ ॥6॥

యుద్ధం చేయాలని కోరుకునేవాడు అలసతను విడిచిపెట్టాలి. యుద్ధం చేయడానికి తగిన సాధనాలను ఏర్పాటు చేసుకోవాలి. ధనుస్సుతో చేసేయుద్ధం (యంత్రముక్తం) శ్రేష్ఠం. ప్రాసం మొదలైన ఆయుధాలతో చేసే యుద్ధం (ముక్తసంధారితం) మధ్యమం. ఖడ్గం మొదలైన ఆయుధాలతో చేసే యుద్ధం (అముక్తం) అధమం. ఏ ఆయుధాలు లేకుండా బాహువులు మొదలైనవాటితో చేసే యుద్ధం అన్నింటికంటె తక్కువరకం.

ధనుర్వేదే గురుర్విప్రః ప్రోక్తో వర్ణద్వయస్య చ ।
యుద్ధాధికార శ్శూద్రస్య స్వయం చాపది శిక్షయా ॥7॥

ధనుర్వేదం నేర్పడానికి క్షత్రియులకూ, వైశ్యులకూ (రెండువర్ణాలవారికీ) గురువు బ్రాహ్మణుడే కావాలి. ఆపత్కాలంలో శూద్రుడు కూడ అప్పటికప్పుడు శిక్షణ తీసుకుని, యుద్ధం చేయాలి.

దేశస్థై శ్శఙ్కరై రాజ్ఞః కార్యా యుద్ధే సహాయతా ॥8॥

ఆ దేశానికి సంబంధించిన వర్ణసంకరులు కూడా యుద్ధంలో రాజుకు సహాయం చేయాలి.

అఙ్గుష్ఠగుల్ఫపాణ్యఙ్ఘ్య్ర శ్లిష్టాస్స్యుస్సహితా యది ।
దృష్టం సమపదం స్థానమేతల్లక్షణతస్తథా ॥9॥

(ఇక్కడ విలుకాడు నిలుచుండే విధాన్ని గురించి చెప్తున్నాడు) రెండుకాళ్ళ విషయంలోనూ బొటనవ్రేళ్లు, మడమలు, రెండు చేతులు, రెండు పాదాలు కలిసి ఉంటే అది 'సమపదం' అనే స్థానం అవుతుంది.

బాహ్యాఙ్గులిస్థితౌ పాదౌ స్తబ్ధజానుబలావుభౌ ।
త్రివితస్త్యన్తరాస్థానమేతద్వై శాణముచ్యతే ॥10॥

కాళ్లను ముందుకు చాచి, కాలివేళ్లను బలంగా నేలకానించి, మోకాళ్లను బిగియబట్టి ఆ బలంతో నిలిచి ఉండగా రెండుపాదాలకు నడుమ దూరం మూడుజానలు (జాన×12అంగుళములు) ఉంటే అది 'శాణస్థానం' అని చెప్తారు.

హంసపఙ్క్త్యాకృతిసమే దృశ్యేతే యత్ర జానునీ ।
చతుర్వితస్తివిచ్ఛిన్నే తదేతన్మణ్డలం స్మృతమ్ ॥11॥

మోకాళ్లు రెండూ హంసలవరుసలాగా కనబడుతుండగా, రెండుపాదాలనడుమ దూరం నాలుగుజానలు ఉంటే, దానిని 'మండలస్థానం' అంటారు.

హలాకృతిమయం యచ్చ స్తబ్ధజానూరుదక్షిణమ్ ।
వితస్త్యః పఞ్చవిస్తారే తదాలీఢం ప్రకీర్తితమ్ ॥
ఏతదేవ విపర్యస్తం ప్రత్యాలీఢమితి స్మృతమ్ ॥12॥

కుడికాలు ముందుకు చాచి, బిగబట్టిన కుడిమోకాళ్లు, తొడలు నాగలి ఆకారంలో ఉండి, రెండుపాదాలకు నడుమ దూరం ఐదుజానలు ఉంటే, దానిని 'ఆలీఢం' అంటారు. ఇదే వ్యతిరేకం అయితే అంటే ఎడమకాలు ముందుకు చాచి, మోకాళ్లు, తొడలు బిగబట్టగా అది నాగలిరూపంలో ఉంటే అది 'ప్రత్యాలీఢం' అవుతుంది.

తిర్యగ్భూతో భవేద్వామో దక్షిణోఽపి భవేదృజుః ।
గుల్ఫౌ పార్ష్ణిగృహౌ చైవ స్థితౌ పఞ్చాఙ్గులాన్తరౌ ॥
స్థానం జాతం భవేదేత ద్ద్వాదశాఙ్గుల మాయతమ్ ॥13॥

ఎడమకాలు వంకరగా పెట్టి, కుడికాలు వంకర లేకుండా సూటిగా ఉండాలి. మడమలు, మడమలకు కిందిభాగాలు రెండుపాదాలకు మధ్య ఉన్న అయిదు అంగుళాలదూరం, పన్నెండు అంగుళాలదీర్ఘం అయితే, అది 'స్థానం' అవుతుంది.

ఋజుజానుర్భవేద్వామో దక్షిణ స్సుప్రసారితః ।
అథవా దక్షిణం జాను కుబ్జం భవతి నిశ్చలమ్ ॥14॥

ఎడమమోకాలు వంకర లేకుండా సూటిగా ఉండాలి. కుడికాలు బాగా ముందుకు చాచాలి. లేదా కుడిమోకాలిని కొద్దిగా వంచి, స్థిరంగా ఉంచాలి.

దణ్డాయతో భవే దేష చరణస్సహ జానునా ।
ఏవం వికట ముద్దిష్టం ద్విహస్తాన్తరమాయతమ్ ॥15॥

లేదా కుడిమోకాలు, కుడిపాదం రెండూ దండంలాగా దీర్ఘంగా వంకర లేకుండా ఉంచాలి. కుడిఎడమ పాదాలనడుమ దూరం రెండుమూరలు ఉండాలి. ఇలా ఉన్న స్థితిని 'వికటం' అంటారు.

జానునీ ద్విగుణే స్యాతా ముత్తానౌ చరణావుభౌ ।
అనేన విధియోగేన సమ్పుటం పరికీర్తితమ్ ॥16॥

మోకాళ్లను రెట్టింపు స్థిరం చేసి, రెండుపాదాలను ముందుకు కొంచెం పైకి ఎత్తితే, ఈ విధానాన్ని 'సంపుటం' అంటారు.

కిఞ్చిద్వివర్తితౌ పాదౌ సమదణ్డాయతౌ స్థిరౌ ।
దృష్టమేవ యథా న్యాయం షోడశాఙ్గులమాయతమ్ ॥17॥

రెండుపాదాలను కొంచెం ప్రక్కకు తిప్పి, దండం లాగా దీర్ఘంగా సమానమైన స్థితిలో కదలకుండా స్థిరంగా ఉంచాలి. నడుమ దూరం పదహారంగుళాలు ఉండాలి. దీనిని 'యథాన్యాయం' అని గ్రహిస్తారు.

స్వస్తికే నాత్ర కుర్వీత ప్రణామం ప్రథమం ద్విజ ।
కార్ముకం గృహ్య వామేన బాణం దక్షిణకేన తు ॥18॥

విప్రోత్తమా! వసిష్ఠమహర్షీ! ఎడమచేతితో ధనుస్సునూ, కుడిచేతితో బాణాన్నీ తీసుకుని, స్వస్తికం ఆకారంలో ధనుస్సును బాణాన్ని కూర్చి విడిచి, ఆ రకంగా ఎదుటిపక్షంలోని పెద్దలకు నమస్కారం చేయాలి.

వైశాఖే యది వా జాతే స్థితౌ వాఽపృథవాయతౌ ।
గుణాన్తం తు తతః కృత్వా కార్ముకే ప్రియకార్ముకః ॥19॥

విలుకాడు జానెడు ఎడంగా వెళ్ళి నిలబడినస్థితి ఏర్పడినపుడు, లేదా అంతకంటె దూరంగా ఉండే స్థితి కలిగినా వింటినారిని ధనుస్సు చివరిదాకా లాగాలి. అది 'ప్రియకార్ముకం'.

అధఃకోటిం తు ధనుషః ఫలదేశం తు పత్త్రిణః ।
ధరణ్యాం స్థాపయిత్వా తు తోలయిత్వా తథైవ చ ॥
భుజాభ్యామత్ర కుబ్జాభ్యాం ప్రకోష్ఠాభ్యాం శుభవ్రత ॥20॥

శుభప్రదమైన నియమదీక్ష కలిగినవాడా! పరశురామా! ధనుస్సు చివరి భాగాన్నీ, బాణం చివరిములుకు భాగాన్నీ, నేలకు ఆనించి, ముంజేతినుండి మోచేయివరకు ఉన్న భుజభాగంతో పైకి లేపి, బాణాన్ని ప్రయోగించాలి.

తస్య బాణం ధనుశ్శ్రేష్ఠం పుఙ్ఖదేశే చ పత్త్రిణః ।
విన్యాసో ధనుష శ్చైవ ద్వాదశాఙ్గుల మన్తరమ్ ॥
జ్యయా విశిష్టః కర్తవ్యో నాతిహీనో న చాధికః ॥21॥

బాణంతోక భాగానికీ ధనుస్సుకూ మధ్య పన్నెండంగుళాల దూరం ఉండేవిధంగా నారిని లాగి, బాణాన్ని వింటినారికి అనుసంధించాలి. అలా ఉంటే ఆ బాణం, ధనుస్సు లక్ష్యభేదనంలో శ్రేష్ఠంగా ఉంటాయి. పన్నెండు అంగుళాలకంటె ఎక్కువ గానీ, తక్కువ గానీ వ్యవధానం పనికిరాదు.

నివేశ్య కార్ముకం నాభ్యాం నితమ్బే శరసఙ్కరమ్ ।
ఉత్క్షిపేదుత్థితం హస్తమన్తరేణాక్షికర్ణయోః ॥22॥

విల్లు బొడ్డుకు దగ్గరలో ఉండాలి. బాణం పృష్ఠభాగానికి సమీపంలో ఉండాలి. పైకి లేపినచేయి కన్నులకూ చెవులకూ మధ్యభాగంలో ఉండాలి. ఆ విధంగా ఉన్నస్థితిలో ధనుస్సునుండి బాణం విడిచిపెట్టాలి.

పూర్వేణ ముష్టినా గ్రాహ్యః స్తనాగ్రే దక్షిణే శరః ।
హరణం తు తతః కృత్వా శీఘ్రం పూర్వం ప్రసారయేత్ ॥23॥

బాణాన్ని ముందుగా కుడిచేయిపిడికిలితో పట్టుకోవాలి. తరువాత కుడివైపుతొమ్ముకు ఎదురుగా నిలపాలి. తరువాత (ఆబాణాన్ని అల్లెత్రాటిమీద ఉంచి) వింటినారిని పట్టుకుని లాగాలి. ఆ పిదప వెంటనే వేగంగా బాణాన్ని ముందుకు విడిచిపెట్టాలి.

నాభ్యన్తరానైవ బాహ్యా నోర్ధ్వకా నాధరా తథా ।
న చ కుబ్జా న చోత్తానా న చలా నాతివేష్టితా ॥24॥

బాణం లోపలికి ఉండగూడదు. వెలుపలికి ఉండగూడదు. పైకి ఉండగూడదు. కిందికి ఉండగూడదు. వంకరగా ఉండగూడదు. ఎత్తినట్లుగా ఉండగూడదు. కదులుతూ ఉండగూడదు. మిక్కిలి గట్టిగా నారిని అంటుకుని ఉండగూడదు.

సమా స్థైర్యగుణోపేతా పూర్వదణ్డమివ స్థితా ।
ఛాదయిత్వా తతో లక్ష్యం పూర్వేణానేన ముష్టినా ॥25॥

సమానంగా ఉండాలి. కదలకుండా స్థిరంగా కఱ్ఱలాగా ఉండాలి. పిడికిలితో బాణం వేయవలసిన లక్ష్యాన్ని కప్పివేసి, లక్ష్యం మీదికి బాణం విడిచిపెట్టాలి.

ఉరసా తూత్థితో యన్తా త్రికోణవినతస్థితః ।
స్రస్తాంశో నిశ్చలగ్రీవో మయూరాఞ్చితమస్తకః ॥26॥

విల్లును ఉపయోగించేవాడు ఱొమ్మును ఎత్తుగా ఉంచాలి. తాను మూడుఅంచుల ఆకారంలో నిలబడాలి. భుజాలను వదులుగా ఉంచాలి. మెడ దృఢంగా ఉంచాలి. తల నెమలితలలాగా పెట్టాలి.

లలాటనాసావక్త్రాంసాః కూర్పరేషు సమం భవేత్ ।
అన్తరం త్ర్యఙ్గులం జ్ఞేయం చిబుకస్యాంసకస్య చ ॥27॥

నుదురు, ముక్కు, నోరు, భుజాలు, మోచేయి, సమానమైన స్థితిలో ఉండాలి. భుజానికీ గడ్డానికీ మధ్యలో మూడంగుళాల దూరం ఉండాలి.

ప్రథమం త్ర్యఙ్గులం జ్ఞేయం ద్వితీయే ద్వ్యఙ్గులం స్మృతమ్ ।
తృతీయే ఽఙ్గుల ముద్దిష్టమాయతం చిబుకాంసయోః ॥28॥

భుజానికీ గడ్డానికీ నడుమ ఉండే ఈ వ్యవధానం మొదటిస్థితిలో మూడంగుళాలు, రెండవస్థితిలో రెండంగుళాలు, మూడవ స్థితిలో ఒక అంగుళం అని పేర్కొంటారు.

గృహీత్వా సాయకం పుఙ్ఖాత్తర్జన్యాఙ్గుష్ఠకేన తు ।
అనామయా పునర్ గృహ్య తథా మధ్యమయాపి చ ॥
తావదాకర్షయేద్వేగాద్యావద్బాణస్సుపూరితః ॥29॥

బొటనవ్రేలు, చూపుడువ్రేళ్ళతో బాణం తోకభాగం తీసుకుని, ఉంగరంవ్రేలితోనూ, నడిమివ్రేలితోనూ పట్టుకుని, వింటినారిమీద బాణం మొత్తం సూటిగా నిలిచేవిధంగా అల్లెత్రాటిని వేగంగా పూర్తిగా లాగాలి.

ఏవం విధముపక్రమ్య మోక్తవ్యం విధివత్ ఖగమ్ ।
దృష్టిముష్టిహతం లక్ష్యం భిన్ద్యాద్బాణేన సువ్రత ॥30॥

ఉత్తమదీక్షాపరుడా! వసిష్ఠా! ఈవిధంగా వింటిమీద బాణాన్ని సిద్ధం చేసుకుని, తరువాత విధివిధానంగా బాణం విడిచిపెట్టాలి. లక్ష్యం మీద ముందుగా చూపును, తరువాత ముష్టిని (బాణాసనాన్ని) నిలిపి, బాణంతో భేదించాలి.

ముక్త్వా తు పశ్చిమం హస్తం క్షిపేద్వేగేన పృష్ఠతః ।
ఏతదుచ్ఛేదమిచ్ఛన్తి జ్ఞాతవ్యం హి త్వయా ద్విజ ॥31॥

బ్రాహ్మణోత్తమా! వసిష్ఠమహర్షీ! బాణాన్ని ప్రయోగించినవెంటనే ఆ చేతిని వెనకవైపుకు తిప్పాలి. లేకుంటే శత్రువులు ఆచేతిని నరికివేయజూస్తారు. ఇది నీవు తప్పకుండా గ్రహించాలి.

కూర్పరం తదధః కార్యమాకృష్య తు ధనుష్మతా ।
ఊర్ధ్వం విముక్తకే కార్యే లక్ష్యశ్లిష్టం తు మధ్యమమ్ ॥32॥

విలుకాడు అల్లెత్రాటిని మోచేతికి కిందుగా లాగి, బాణాన్ని విడిచిపెట్టే సమయంలో చేయి పైకెత్తాలి. కేవలం లక్ష్యంపై దృష్టి నిలిపి, బాణం ప్రయోగించడం మధ్యమం.

శ్రేష్ఠం ప్రకృష్టం విజ్ఞేయం ధనుశ్శాస్త్రవిశారదైః ॥33॥

వింటినారిని బాగా లాగి ప్రయోగించడం శ్రేష్ఠం అని ధనుశ్శాస్త్రపండితులు గ్రహించాలి.

జ్యేష్ఠస్తు సాయకో జ్ఞేయో భవేద్ద్వాదశ ముష్టయః ।
ఏకాదశ తథా మధ్యః కనీయాన్దశ ముష్టయః ॥34॥

బాణం పన్నెండుబెత్తల పరిమాణం కలిగి ఉంటే ఉత్తమం అని తెలియాలి. పదకొండుబెత్తలు ఉంటే మధ్యమం. పదిబెత్తలు ఉంటే అధమం.

చతుర్హస్తం ధనుశ్శ్రేష్ఠం త్రయస్సార్ధం తు మధ్యమమ్ ।
కనీయ స్తు త్రయః ప్రోక్తం నిత్యమేవ పదాతినః ॥ 35॥

ధనుస్సు నాలుగుమూరల పొడుగు ఉంటే ఉత్తమం. మూడున్నర మూరలు ఉంటే మధ్యమం. మూడుమూరలు ఉంటే అధమం. (245 అధ్యాయం 4 శ్లో) నేలపై నిలిచి యుద్ధం చేసే కాల్బలం ఎప్పుడూ మూడుమూరల ధనుస్సే ఉపయోగించాలి.

అశ్వే రథే గజే శ్రేష్ఠం తదేవ పరికీర్తితమ్ ॥36॥

గుఱ్ఱంమీద, రథంమీద, ఏనుగుమీద ఉండి యుద్ధం చేసేవారికి శ్రేష్ఠమైన నాలుగుమూరల ధనుస్సునే ఉపయోగించాలి అని పేర్కొంటారు.

ఇత్యాది మహాపురాణే ఆగ్నేయే ధనుర్వేదకథనం నామైకోనపఞ్చాశదధికద్విశతతమోఽధ్యాయః ॥249॥

అగ్నిమహాపురాణంలో ధనుర్వేదకథనం అనే రెండువందల నలభైతొమ్మిదవ అధ్యాయం సమాప్తం.



పఞ్చాశదధికద్విశతతమో உధ్యాయః – రెండువందల యాబయ్యవ అధ్యాయం

ధనుర్వేదకథనమ్ – ధనుర్వేదకథనం

అగ్నిరువాచ – వసిష్ఠమహర్షితో అగ్నిదేవుడు ఇలా చెప్తున్నాడు.

పూర్ణాయతం ద్విజః కృత్వా తతో మాంసైర్గదాయుధాన్ ।
సునిర్ధౌతధనుః కృత్వా యజ్ఞభూమౌ నిధాపయేత్ ॥1॥

ద్విజుడు గద మొదలైన ఆయుధాలను తగినద్రవ్యాలతో పూర్తిగా పొడవుగా ఉండేవిధంగా నిర్మించాలి. ధనుస్సును బాగా స్వచ్ఛంగా సిద్ధం చేయాలి. ఈ ఆయుధాల నన్నింటినీ యజ్ఞప్రదేశంలో ఉంచాలి.

తతో బాణం సమాగృహ్య దంశితస్సుసమాహితః ।
తూణమాసాద్య బధ్నీయాద్ దృఢాం కక్షాం చ దక్షిణామ్ ॥2॥

తరువాత బాణం తీసుకోవాలి. కవచం ధరించాలి. బుద్ధిని ఏకాగ్రం చేసుకోవాలి. అమ్ములపొదిని తీసుకుని, కుడిచంకకు దగ్గర వీపుపై గట్టిగా బంధించాలి.

విలక్ష్యమపి తద్బాణం తత్ర చైవ సుసంస్థితమ్ ।
తతస్సముద్ధరేద్బాణం తూణాద్దక్షిణపాణినా ॥3॥

లక్ష్యం లేని ఆ బాణం తూణీరంలో చక్కగా అమరి ఉంటుంది. దానిని తగిన సమయంలో తూణీరంనుండి కుడిచేతితో బయటకు తీయాలి.

తేనైవ సహితం మధ్యే శరం సఙ్గృహ్య ధారయేత్ ।
వామహస్తేన వై కక్షాం ధనుస్తస్మాత్సముద్ధరేత్ ॥4॥

ఎడమచంకవైపు ఉన్న ధనుస్సును తీసుకుని, పైకెత్తి, ఆ వింటికి నడుమ ఇంతకు ముందు తీసినబాణాన్ని తగిలించాలి.

అవిషణ్ణమతిర్భూత్వా గుణే పుఙ్ఖం నివేశయేత్ ।
సమ్పీడ్య సింహకర్ణేన పుఙ్ఖేనాపి సమే దృఢమ్ ॥5॥

మనసులో ఏమాత్రం సందేహించకుండా, వింటినారిపై బాణంతోకను ఉంచాలి. 'సింహకర్ణం' అనేపేరు గలిగిన పిడికిలిలో అల్లెత్రాటిని, బాణపుంఖంతో కలిపి సమంగా గట్టిగా పట్టుకోవాలి.

వామకర్ణోపవిష్టం చ ఫలం వామస్య ధారయేత్ ।
వర్ణాన్మధ్యమయా తత్ర వామాఙ్గుల్యా చ ధారయేత్ ॥6॥

ఎడమచేతితో ప్రయోగించాలనుకున్నపుడు బాణపుంఖాన్ని ఎడమచెవి చివరిదాకా లాగాలి. అంతవరకు బాణపుంఖం వింటినారి మీద కదలకుండా ఉంచాలి. బాణాన్ని బొటనవ్రేలు, చూపుడువ్రేళ్లతోపాటు ఎడమచేతి నడిమి వ్రేలితో కూడ పట్టుకోవాలి.

మనో లక్ష్యగతం కృత్వా ముష్టినా చ విధానవిత్ ।
దక్షిణే గాత్రభాగే తు కృత్వా వర్ణం విమోక్షయేత్ ॥7॥

ధనుస్సును ప్రయోగించే పద్ధతి తెలిసినవాడు (కుడిచేతితో బాణం ప్రయోగించేటపుడు) మనస్సును లక్ష్యంపైన ఏకాగ్రంగా నిలిపి, శరీరంలో కుడివైపున నుంచి బాణాన్ని లక్ష్యంమీద విడిచిపెట్టాలి.

లలాటపుటసంస్థానం దణ్డం లక్ష్యే నివేశయేత్ ।
ఆకృష్య తాడయేత్తత్ర చన్ద్రకం షోడశాఙ్గులమ్ ॥8॥

నేల కానించి నిలిపిన ధనుస్సు దండం విలుకాడి నుదుటివరకు ఎత్తుగా ఉండాలి. దృష్టిని లక్ష్యంమీద ఉంచి, అల్లెత్రాటిని లాగి, పదహారు అంగుళాలపొడవు ఉన్న చంద్రకం అనే బాణంతో లక్ష్యాన్ని కొట్టాలి.

ముక్త్వా బాణం తతః పశ్చాద్వర్ణాశిక్యం తదా తయా ।
నిగృహ్ణీయాన్మధ్యమయా తతోఽఙ్గుల్యా పునః పునః ॥9॥

ఈ విధంగా లక్ష్యంపై విశిష్టమైన బాణాన్ని ప్రయోగించిన తరువాత, నడిమివ్రేలితో మళ్లీ మళ్లీ అల్లెత్రాటిని లాగాలి.

అక్షిలక్ష్యం క్షిపేత్తూణాచ్చతురస్రం చ దక్షిణమ్ ।
చతురస్రగతం వేద్యమభ్యసేచ్చాదితః స్థితః ॥10॥

లక్ష్యంపైన దృష్టి చెదరకుండా ఉంచి, తూణీరంనుండి బాణం తీసుకుని నాలుగువైపులలోనూ, కుడివైపుగా ప్రయోగించాలి. ఒకేసారిగా నాలుగుదిక్కులలోనూ లక్ష్యంపై దృష్టి పెట్టడం మొదటినుండి అభ్యాసం చేయాలి.

తస్మాదనన్తరం తీక్ష్ణం పరావృత్తం గతం చ యత్ ।
నిమ్నమున్నతవేధం చ హ్యభ్యసేత్ క్షిప్రకం తతః ॥11॥

ఆ తరువాత తీక్ష్ణం, పరావృత్తం, గతం, నిమ్నం, ఉన్నతం, క్షిప్రం అనే లక్ష్యస్థానాలను అభ్యసించాలి.

వేధ్యస్థానేష్వ థైతేషు సత్త్వస్య పుటకాద్ధనుః ।
హస్తావాపశతైశ్చిత్రైస్తర్జయేద్దుస్తరైరపి ॥12॥

ఈ లక్ష్యస్థానాలలో అధికమయిన సామర్థ్యంతో, చేతిలోని ధనుస్సునుండి అద్భుతమూ, తప్పించుకోడానికి సాధ్యం కానివీ అయిన అనేకబాణాలతో శత్రువులను భయపెట్టాలి.

తస్మిన్వేధ్యగతే విప్ర ద్వే వేధ్యే దృఢసంజ్ఞకే ।
ద్వే వేధ్యే దుష్కరే వేధ్యే ద్వే తథా చిత్రదుష్కరే ॥13॥

బ్రాహ్మణోత్తమా! వసిష్ఠమహర్షీ! ఆ వేధ్యాలలో 'దృఢం' అనేపేరు గలిగినవి రెండు, 'దుష్కరం' అనే పేరు కలిగినవి రెండు, 'చిత్రదుష్కరం' అనేవి రెండు ఉన్నాయి.

స తు నిమ్నం చ తీక్ష్ణం చ దృఢవేధ్యే ప్రకీర్తితే ।
నిమ్నం దుష్కరముద్దిష్టం వేధ్యమూర్ధ్వగతం చ యత్ ॥
మస్తకాయనమధ్యే తు చిత్రదుష్కరసంజ్ఞకే ॥14॥

నిమ్నం, తీక్ష్ణం అనే లక్ష్యాలు రెండు దృఢవేధ్యాలు. నిమ్నం, ఊర్ధ్వగతం అనేవి రెండు దుష్కరవేధ్యాలు. మస్తకాయనం, మధ్యం అనేవి చిత్రదుష్కరవేధ్యంలోని రెండుభేదాలు.

ఏవం వేధ్యగణం కృత్వా దక్షిణే నేతరేణ చ ।
ఆరోహేత్ ప్రథమం వీరో జితలక్ష స్తతో నరః ॥15॥

పరాక్రమవంతుడు ఈవిధమైన వేధ్యభేదాలను అనుసరిస్తూ కుడివైపునుండి, ఎడమవైపునుండి శత్రుబలాన్ని ముందుగా ఆక్రమించాలి. అపుడు అతడు లక్ష్యాన్ని సాధించి, విజయం పొందుతాడు.

ఏష ఏవ విధిః ప్రోక్తస్తత్ర దృష్టః ప్రయోక్తృభిః ॥16॥

వేధ్యం గురించి తెలుసుకొని, ప్రయోగించినవారు వేధ్యభేదప్రయోగంలో ఈ విధానాన్నే పేర్కొన్నారు.

అధికం భ్రమణం తస్య తస్మాద్వేధ్యాత్ ప్రకీర్తితమ్ ।
లక్ష్యం సంయోజయే త్తత్ర పత్రిపత్రగతం దృఢమ్ ॥17॥

వేధ్యం కంటె అధికంగా భ్రమించడమే ఉత్తమమని చెప్తారు. వింటిపై సంధించిన బాణాన్ని లక్ష్యంమీదికి చెదరకుండా ప్రయోగించాలి.

భ్రాన్తం ప్రచలితం చైవ స్థిరం యచ్చ భవేదితి ।
సమన్తాత్తాడయేద్భిన్ద్యా చ్ఛేదయేద్వ్యథయేదపి ॥18॥

గుండ్రంగా తిరుగుతూ ఉన్నా, చకచకా కదులుతూ ఉన్నా, స్థిరంగా ఉన్నా, ఎలా ఉన్నప్పటికీ లక్ష్యాన్ని అన్నివైపులనుండి కొట్టాలి. ఛేదించాలి బాధించాలి.

కర్మయోగవిధానజ్ఞో జ్ఞాత్వైవం విధిమాచరేత్ ।
మనసా చక్షుషా దృష్ట్వా యోగశిక్షుర్యమం జయేత్ ॥19॥

ఏ పనినయినా ఏకాగ్రతతో చేయడం తెలిసినవాడు బాణప్రయోగంలో ఈ విధానాన్ని చక్కగా గ్రహించి, మనస్సూ, కన్నులూ. చూపూ లక్ష్యంపై నిలుపగలిగినవాడు యముడిని (మృత్యువును) కూడా జయిస్తాడు.

ఇత్యాది మహాపురాణే ఆగ్నేయే ధనుర్వేదకథనం నామ పఞ్చాశదధికద్విశతతమోఽధ్యాయః ॥250॥

అగ్నిమహాపురాణంలో ధనుర్వేదకథనం అనే రెండువందల యాభైయవ అధ్యాయం సమాప్తం.

ఏకపఞ్చాశదధికద్విశతతమోऽధ్యాయః - రెండువందల యాభైఒకటవ అధ్యాయం

ధనుర్వేదకథనమ్ - ధనుర్వేదకథనం

అగ్నిరువాచ - వసిష్ఠమహర్షితో అగ్నిదేవుడు ఇలా చెప్తున్నాడు.

జితహస్తో జితమతిర్జితదృగ్లక్ష్యసాధకః ।
నియతాం సిద్ధిమాసాద్య తతో వాహనమారుహేత్ ॥1॥

వసిష్ఠమహర్షీ! చేతులనూ, బుద్ధినీ, దృష్టినీ జయించినవాడు (అధీనంలో ఉన్నవాడు) లక్ష్యాన్ని సాధిస్తాడు. అటువంటివాడు తప్పక విజయం పొందుతాడు. విజయం నిశ్చయం చేసుకున్న వీరుడు యుద్ధానికి వెళ్లడానికి వాహనాన్ని అధిరోహించాలి.

దశహస్తో భవేత్పాశో వృత్తః కరముఖస్తథా ।
గుణకార్పాసముఞ్జానాం భఙ్గస్నాయ్వర్కవర్మిణామ్ ॥
అన్యేషాం సుదృఢానాం చ సుకృతం పరివేష్టితమ్ ॥2॥

'పాశం' అనే ఆయుధం పదిమూరలపొడవు ఉండాలి. గుండ్రంగా ఉండాలి. అది హస్తాగ్రంలో ఇమడాలి. తాడు, నూలు, ముంజగడ్డి, తెగిన వింటి నారి, జిల్లేడుచెట్టుపట్ట, ఇంకా వేరేవి కాని చాల గట్టిగా ఉండే పదార్థాలను తీసుకుని, దానిని బిగువుగా పేని తయారుచేయాలి.

తథా త్రింశత్సమం పాశం బుధః కుర్యాత్సువర్తితమ్ ॥3॥

పాశం చేయడం నిర్మించడం చక్కగా తెలిసినవాడు పై వస్తువులను ముప్పై వరసలు తీసుకుని, గట్టిగాపేనాలి.

కర్తవ్యం శిక్షకైస్తస్య స్థానం కక్షాసు వై సదా ।
వామహస్తేన సఙ్గృహ్య దక్షిణేనోద్ధరేత్తతః ॥4॥

పాశప్రయోగాన్ని శిక్షించేవాళ్లు పాశాన్ని ఉంచడానికి చంకలవద్ద స్థానం ఏర్పాటుచేయాలి. పాశాన్ని ఎడమచేతితో తీసుకుని, కుడిచేతితో పైకెత్తాలి.

కుణ్డలస్యాకృతిం కృత్వా భ్రామ్యైకం మస్తకోపరి ।
క్షిపేత్తృణమయే తూర్ణం పురుషే చర్మవేష్టితే ॥5॥

దానిని గుండ్రమైన ఆకారంలో చుట్టి, గిరగిరా త్రిప్పి, గడ్డితో లేదా చర్మంతో చేసిన పురుషుడి విగ్రహం తలపైకి విసిరివేయాలి.

వల్గితే చ ప్లుతే చైవ తథా ప్రవ్రజితేషు చ ।
సమయోగవిధిం కృత్వా ప్రయుఞ్జీత సుశిక్షితమ్ ॥6॥

పాశప్రయోగంలో మెలకువలు నేర్పి, ఆ విధంగా చక్కగా శిక్షణ పొందిన వాడిచేత పరుగెత్తుతున్నవాడిపైన, దుముకుతున్నవాడిపైన, అన్నీ విడిచిపెట్టినవాడిపైన పాశం ప్రయోగింపజేయాలి.

విజిత్వా తు యథాన్యాయ్యం తతో బన్ధం సమాచరేత్ ॥7॥

శత్రువును జయించిన తర్వాతనే అతడిని న్యాయ్యమయిన పద్ధతిలో బంధించాలి.

కట్యాం బద్ధ్వా తతః ఖడ్గం వామపార్శ్వావలమ్బితమ్ ।
దృఢం విగృహ్య వామేన నిష్కర్షేద్ దక్షిణేన తు ॥8॥

ఖడ్గాన్ని నడుము వద్ద ఎడమ వైపుగా కట్టుకుని, వ్రేలాడదీయాలి. కత్తి ఒరను ఎడమచేతితో గట్టిగా పట్టుకుని కుడిచేతితో కత్తిని ఒరనుండి బయటకు లాగాలి.

షడఙ్గులపరీణాహం సప్తహస్తసముచ్ఛ్రితమ్ ॥9 ॥

ఆ కత్తి వెడల్పు ఆరు అంగుళాలు ఉండాలి. ఎత్తు ఏడుమూరలు ఉండాలి.

అయోమయ్య శ్శలాకాశ్చ వర్మాణి వివిధాని చ ।
అర్ధహస్తే సమే చైవ తిర్యగూర్ధ్వగతం తథా ॥
యోజయేద్విధినా యేన తథా త్వం గదత శ్శృణు ॥10 ॥

ఇనుము మొదలైన లోహాలతో తయారు చేసిన ఈటెలను, రకరకాలయిన కవచాలను ఒకచేతితోనూ, రెండుచేతులతోనూ, శరీరంమీద అడ్డంగానూ, నిలువుగానూ శత్రువుపై ప్రయోగించాలి. అది ఏ విధంగా చేయాలో చెప్తాను విను.

తూణచర్మావనద్ధాఙ్గం స్థాపయిత్వా నవం దృఢమ్ ।
కరేణాదాయ లగుడం దక్షిణాఙ్గులకం వనమ్ ॥11 ॥

క్రొత్తదీ, గట్టిగా ఉన్నదీ, అయిన కఱ్ఱను తీసుకోవాలి. ఆది అడవికఱ్ఱ కావాలి. కుడిచేతిబొటనవ్రేలి పరిమాణంలో ఉండాలి. దానిని అమ్ములపొదికి సంబంధించిన చర్మాన్ని చుట్టాలి.

ఉద్యమ్య ఘాతయేద్యస్య నాశస్తేన శిశోర్ధ్రుధమ్ ।
ఉభాభ్యామథ హస్తాభ్యాం కుర్యాత్తస్య నిపాతనమ్ ॥12 ॥

ఆ దుడ్డుకఱ్ఱను ఎత్తి శత్రువుపై దెబ్బకొట్టాలి. రెండుచేతులతోనూ శత్రువును పడగొట్టాలి. దానివలన అల్పుడైన ఆశత్రువు నాశనం కావడం నిశ్చయం.

అక్లేశేన తతః కుర్వన్వధే సిద్ధిః ప్రకీర్తితా ।
వాహానాం శ్రమకరణం ప్రచారార్థం పురా తవ ॥13 ॥

ఏమాత్రం శ్రమపడకుండా, శత్రువును చంపడం జరిగే విధానం చెప్పడం జరిగింది. గుఱ్ఱాలు, ఎద్దులు మొదలైన వాటిని ఆయా పనులు చేయిస్తూ శ్రమపెట్టాలనే అంశాన్ని ఇంతకు ముందే నీకు చెప్పాను.

ఇత్యాది మహాపురాణే ఆగ్నేయే ధనుర్వేదకథనం నా మైకపఞ్చాశదధికద్విశతతమోఽ ధ్యాయః ॥251॥

అగ్నిమహాపురాణంలో ధనుర్వేదకథనం అనే రెండువందల యాభైఒకటవ అధ్యాయం సమాప్తం.

ద్విపఞ్చాశదధికద్విశతతమోఽధ్యాయః - రెండువందల యాభైరెండవ అధ్యాయం

ధనుర్వేదకథనమ్ - ధనుర్వేదకథనం

అగ్ని రువాచ - వసిష్ఠమహర్షితో అగ్నిదేవుడు ఇలా చెప్తున్నాడు.

భ్రాన్తముద్భ్రాన్త మావిద్ధ మాప్లుతం విప్లుతం స్మృతమ్ ।
సమ్పాతం సముదీర్ణం చ శ్యేనపాతమథాకులమ్ ॥1॥

ఉద్ధూతమవధూతం చ సవ్యం దక్షిణమేవ చ ।
అనాలక్షితవిస్ఫోటౌ కరాలేన్ద్రమహాసఖౌ ॥2॥

వికరాలనిపాతౌ చ విభీషణభయానకౌ ।
సమగ్రార్ధతృతీయాంశపాదపాదార్ధవారిజాః ॥3॥

ప్రత్యాలీఢమథాలీఢం వరాహం లులితం తథా ।
ఇతి ద్వాత్రింశతో జ్ఞేయో ఖడ్గచర్మవిధీ రణే ॥4॥

వసిష్ఠమహర్షీ! 1. భ్రాంతం 2. ఉద్భ్రాంతం 3. ఆవిద్ధం 4. ఆప్లుతం 5. విప్లుతం 6. సంపాతం 7. సముదీర్ణం 8. శ్యేనపాతం 9. ఆకులం 10. ఉద్ధూతం 11. అవధూతం 12. సవ్యం 13. దక్షిణం 14. అనాలక్షితం 15. విస్ఫోటం 16. కరాళం 17. ఇంద్రం 18. మహాసఖం 19. వికరాలం 20. నిపాతం 21. విభీషణం 22. భయానకం 23. సమగ్రం 24. అర్ధం 25. తృతీయాంశం 26. పాదం 27. పాదార్ధం 28. వారిజం 29. ప్రత్యాలీఢం 30.ఆలీఢం 31. వరాహం 32. లులితం అనేవి ముప్పైరెండు యుద్ధంలో నిడుపైనకత్తి, డాలు (అనేఆయుధం) చేసేపనులు (కత్తిని ప్రయోగించేవిధాలు) అని తెలుసుకోవాలి.

పరావృత్తమపావృత్తం గృహీతం లఘుసంజ్ఞితమ్ ।
ఊర్ధ్వం క్షిప్తమధః క్షిప్తం సన్ధారితవిధారితమ్ ॥5॥

1. పరావృత్తం 2. అపావృత్తం 3. గృహీతం 4. లఘువు 5. ఊర్ధ్వక్షిప్తం 6. అధఃక్షిప్తం 7. సంధారితం 8. విధారితం.

శ్యేనపాతం గజాపాతం గ్రాహగ్రాహ్యం తథైవ చ ।
ఏవ మేకాదశవిధా జ్ఞేయాః పాశవిధారణాః ॥6॥

9. శ్యేనపాతం, 10. గజపాతం, 11. గ్రాహగ్రాహ్యం, అని పాశం చేసే యుద్ధకర్మలు (యుద్ధంలో పాశం ప్రయోగించే) పద్ధతులు) పదకొండు అని గ్రహించాలి.

ఋజ్వాయతం విశాలం చ తిర్యగ్భ్రామితమేవ చ ।
పఞ్చకర్మ వినిర్దిష్టం వ్యస్తే పాశే మహాత్మభిః ॥7॥

1. ఋజువు 2. ఆయతం 3. విశాలం 4. తిర్యక్కు 5. భ్రామితం అని విడిగా పాశం (ప్రయోగించే) కర్మలు అయిదు విధాలుగా మహాత్ములు చెప్తారు.

ఛేదనం భేదనం పాతో భ్రమణం శయనం తథా ।
వికర్తనం కర్తనం చ చక్రకర్మేదమేవ చ ॥8॥

1. ఛేదనం 2. భేదనం 3. పాతం 4. భ్రమణం 5. శయనం 6. వికర్తనం 7. కర్తనం అనేవిధంగా చక్రం అనే ఆయుధం చేసేపనులు (ప్రయోగించే పద్ధతులు) ఏడు ఉన్నాయి.

ఆస్ఫోటః క్ష్వేదనం భేదస్త్రాసాన్దోలితకౌ తథా ।
శూలకర్మాణి జానీహి షష్ఠ మాఘాతసంజ్ఞితమ్ ॥9॥

1. ఆస్ఫోటం, 2. క్ష్వేదనం, 3. భేదం, 4. త్రాసం, 5. ఆందోళితం, అనేవిధంగా శూలం చేసేపనులు ఐదు అని తెలుసుకోవాలి. ఆరవ భేదం కూడా ఉన్నది. దానిపేరు ఆఘాతం అని చెప్తారు.

దృష్టిఘాతం భుజాఘాతం పార్శ్వఘాతం ద్విజోత్తమ ।
ఋజుపక్షేషుణాపాప్తం తోమరస్య ప్రకీర్తితమ్ ॥10॥

బ్రాహ్మణోత్తమా! వసిష్ఠా! 1.దృష్టిఘాతం, 2. భుజాఘాతం, 3. పార్శ్వఘాతం, 4. ఋజుఘాతం, 5. పక్షఘాతం, అని తోమరం అనే ఆయుధం చేసేపనులు అయిదు చెప్పబడ్డాయి.

ఆహతం విప్ర గోమూత్రప్రభూతం కమలాసనమ్ ।
నతోర్ధ్వగాత్రం నమితం వామదక్షిణ మేవ చ ॥11॥

ఆవృత్తం చ పరావృత్తం పాదోద్ధూత మవప్లుతమ్ ।
హంసమర్దం విమర్దం చ గదాకర్మ ప్రకీర్తితమ్ ॥12॥

విప్రవర్యా! 1. ఆహతం 2. గోమూత్రప్రభూతం 3. కమలాసనం 4. నతోర్ధ్వగాత్రం 5. నమితం 6. వామదక్షిణం 7. ఆవృత్తం 8. పరావృత్తం 9. పాదోద్ధూతం 10. అవప్లుతం 11. హంసమర్దం 12. విమర్దం అనేవి పన్నెండు గద అనే ఆయుధం చేసేపనులు అని చెప్పబడింది.

కరాల మవఘాతం చ దంశోపప్లుత మేవ చ ।
క్షిప్తహస్తం స్థితం శూన్యం పరశోస్తు వినిర్దిశేత్ ॥13॥

1. కరాలం 2. అవఘాతం 3. దంశోపప్లుతం 4. క్షిప్తహస్తం 5. స్థితం 6. శూన్యం అనేవి పరశువు ప్రయోగించడంలోని భేదాలుగా నిర్ణయించారు.

తాడనం ఛేదనం విప్ర తథా చూర్ణన మేవ చ ।
ముద్గరస్య తు కర్మాణి తథా ప్లవనఘాతనమ్ ॥14॥

విప్రోత్తమా! వసిష్ఠమహర్షీ! 1. తాడనం, 2. భేదనం, 3. చూర్ణనం, 4. ప్లవనఘాతనం అనేవి ముద్గరం అనే ఆయుధం చేసేపనులు.

సంశ్రాన్తమథ విశ్రాన్తం గోవిసర్గం సుదుర్ధరమ్ ।
భిన్దిపాలస్య కర్మాణి లగుడస్య చ తాన్యపి ॥15॥

1. సంశ్రాంతం 2. విశ్రాంతం 3. గోవిసర్గం 4. సుదుర్ధరం అనేవి భిందిపాలం (వడిసెల లాగా ఉండే ఆయుధం), లగుడం (దుడ్డుకఱ్ఱ), అనే ఆయుధాలు చేసేపనులు.

అన్త్యం మధ్యం పరావృత్తం నిదేశాన్తం ద్విజోత్తమ ।
వజ్రస్యైతాని కర్మాణి పట్టిశస్య చ తాన్యపి ॥16॥

బ్రాహ్మణవరేణ్యా! వసిష్ఠా! 1. అంత్యం, 2. మధ్యం, 3. పరావృత్తం, 4. నిదేశాంతం అనేవి నాలుగు వజ్రం, పట్టిశం అనే ఆయుధాలు చేసేపనులు.

హరణం ఛేదనం ఘాతో భేదనం మ్రక్షణం తథా ।
కృపాణకర్మ నిర్దిష్టం పాతనం స్ఫోటనం తథా ॥17॥

1. హరణం 2. ఛేదనం 3. ఘాతం 4. భేదనం 5. మ్రక్షణం (పోగుచేయడం) 6. పాతనం, 7. స్ఫోటనం అనేవి కత్తి చేసేపనులుగా చెప్పబడ్డాయి.

త్రాసనం రక్షణం ఘాతో బలోద్ధరణ మాయతమ్ ।
క్షేపణీకర్మ నిర్దిష్టం యన్త్రకర్మైతదేవ తు ॥18॥

1. త్రాసనం, 2. రక్షణం, 3. ఘాతం, 4. బలోద్ధరణం, 5. ఆయతం, అనేవి క్షేపణి (ఒడిసెల) అనే ఆయుధం చేసేపనులు. "యంత్రం" అనే ఆయుధం కూడ ఇవే పనులు చేస్తుంది.

సన్త్యాగమవదంశశ్చ వరాహోద్ధూతకం తథా ।
హస్తావహస్తమాలీనమేకహస్తావహస్తకే ॥19॥

ద్విహస్తబాహుపాశే చ కటిరేచితకోద్గతే ।
ఉరోలలాటఘాతే చ భుజా చ విధమనం తథా ॥20॥

కరోద్ధూతం విమానం చ పాదాహతివిపాదికమ్ ।
గాత్రసంశ్లేషణం శాన్తం తథా గాత్రవిపర్యయః ॥21॥

ఊర్ధ్వప్రహారం ఘాతం చ గోమూత్రం సవ్యదక్షిణే ।
పారకం తారకం దణ్డం కబరీబన్ధమాకులమ్ ॥22॥

తిర్యగ్బన్ధమపామార్గం భీమవేగం సుదర్శనమ్ ।
సింహాక్రాన్తం గజాక్రాన్తం గర్దభాక్రాన్తమేవ చ ॥23॥

గదాకర్మాణి జానీయాన్నియుద్ధస్యాథ కర్మ చ ॥24॥

1. సంత్యాగం 2. అవదంశం 3. వరాహెూద్ధూతం 4. హస్తావహస్తం 5. ఆలీనం, 6. ఏకహస్తం 7. అవహస్తం 8. ద్విహస్తం 9. బాహుపాశం 10. కటిరోచితం 11. ఉద్గతం 12. ఉరోఘాతం 13. లలాటఘాతం 14. భుజావిధమనం 15. కరోద్ధూతం 16. విమానం 17. పాదాహతివిపాదికం 18. గాత్రసంశ్లేషణం 19. శాంతం 20. గాత్రవిపర్యయం 21. ఊర్ధ్వప్రహారం 22. ఘాతం 23. గోమూత్రం 24. సవ్యం 25. దక్షిణం 26. పారకం 27. తారకం 28. దండం 29. కబరీబంధం 30. ఆకులం 31. తిర్యగ్బంధం 32. అపామార్గం 33. భీమవేగం 34. సుదర్శనం 35. సింహాక్రాంతం 36. గజాక్రాంతం 37. గర్దభాక్రాంతం

ఇవి గదతో చేసే పనులని (గదాయుధం ప్రయోగించే విధానాలు) అని తెలుసుకోవాలి. ఇక ఏ ఆయుధం లేకుండా చేసే యుద్ధకర్మలను చెప్తాను.

ఆకర్షణం వికర్షం చ బాహూనాం మూలమేవ చ ।
గ్రీవావిపరివర్తం చ పృష్ఠభఙ్గం సుదారుణమ్ ॥25॥

పర్యాసనవిపర్యాసౌ పశుమారమజావికమ్ ।
పాదప్రహారమాస్ఫోటం కటిరేచితకం తథా ॥26॥

గాత్రాశ్లేషం స్కన్ధగతం మహీవ్యాజనమేవ చ ।
ఉరోలలాటఖాతం చ విస్పష్టకరణం తథా ॥27॥

ఉద్ధూతమవధూతం చ తిర్యఙ్మార్గగతం తథా ।
గజస్కన్ధమవక్షేపమపరాఙ్ముఖమేవ చ ॥28॥

దేవమార్గమధోమార్గమమార్గగమనాకులమ్ ।
యష్టిమాతమవక్షేపో వసుధాధారణం తథా ॥29॥

జానుబన్ధం భుజాబన్ధం గాత్రబన్ధం సుదారుణమ్ ।
విపృష్టం సోదకం శుభ్రం భుజావేష్టితమేవ చ ॥30॥

1.ఆకర్షణం 2.వికర్షణం 3.బాహుమూలం 4.గ్రీవావిపరివర్తనం 5.పృష్ఠభంగం ఇది చాల భయంకరం. 6.పర్యాసనం 7.విపర్యాసం 8.పశుమారం 9.అజావికం 10.పాదప్రహారం 11.ఆస్ఫోటం 12.కటిరేచితం 13.గాత్రాశ్లేషం 14.స్కంధగతం 15.మహీవ్యాజనం 16.ఉరోలలాటఖాతం 17.విస్పష్టకరణం 18.ఉద్ధూతం 19.అవధూతం 20.తిరఙ్మార్గగతం 21.గజస్కంధం 22.అవక్షేపం 23.అపరాఙ్ముఖం 24.దేవమార్గం 25.అపామార్గం 26.అమార్గగమనాకులం 27.యష్టిఘాతం 28.అవక్షేపం 29.వసుధాధారణం 30. జానుబంధం 31.భుజాబంధం 32. దారుణగాత్రబంధం 33.విపృష్టం 34.శుభ్రసోదకం 35. భుజావేష్టితం ఇవి నియుద్ధంలోని భేదాలు.

సన్నద్ధైస్సంయుగే భావ్యం సశస్త్రైస్త్రైర్గజాదిభిః ।
వరాఙ్కుశధరౌ చోభౌ ఏకో గ్రీవాగతోఽపరః ॥31॥

యోధుడు ఆయుధాలతో సిద్ధమై, ఏనుగులు మొదలైన వాహనాలను అధిరోహించి, యుద్ధరంగంలో ప్రవేశించాలి. అంకుశం ధరించిన మావటివాళ్లు ఇద్దరు ఏనుగుమీద ఉండాలి. ఒకడు ఏనుగు మెడమీద, రెండవవాడు మొదటివాడికి సమీపంలో వెనక ఉండాలి.

స్కన్ధగౌ ద్వౌ చ ధానుష్కౌ ద్వౌ చ ఖడ్గధరౌ గజే ।
రథే రణే గజేచైవ తురఙ్గాణాం త్రయం భవేత్ ॥32॥

ధనుస్సు ధరించిన యోధులు ఇద్దరూ, బారుకత్తులను ధరించిన యోధులు ఇద్దరూ ఏనుగు భుజాలప్రాంతంలో ఉండాలి. యుద్ధరంగంలో ఒక్కొక్కరథం, ఒక్కొక్కగజం విషయంలో యోధులరక్షణ నిమిత్తంగా మూడుగుఱ్ఱాలు (ఆశ్వికులు ముగ్గురు) ఉండాలి.

ధనుష్కాణాం త్రయం ప్రోక్తం రక్షార్థే తురగస్య చ ।
ధన్వినో రక్షణార్థాయ చర్మిణం తు నియోజయేత్ ॥33॥

గుఱ్ఱాన్ని (ఒక్కొక్కఆశ్వికుడిని) రక్షించడానికి ముగ్గురు విలుకాళ్లు ఉండాలి. ఒక్కొక్కవిలుకాడిని రక్షించడానికి కత్తి, డాలు ధరించిన ఒకయోధుడిని (కాలిబంటును) ఏర్పాటు చేయాలి.

స్వమన్త్రైశ్శస్త్రమభ్యర్చ్య శాస్త్రం త్రైలోక్యమోహనమ్ ।
యో యుద్ధే యాతి స జయేదరీన్ సమ్పాలయేద్ధ్రువమ్ ॥34॥

(శత్రువులను పీడించడానికి) ఒక్కొక్కఆయుధాన్ని దానికి సంబంధించిన మంత్రాలతో శ్రద్ధగా పూజించాలి. (తనను రక్షించుకోవడానికి) త్రైలోక్యమోహనం అనే కవచాన్ని పఠించాలి. ఇలా చేసి, యుద్ధానికి వెళ్లినవాడు శత్రువులను జయిస్తాడు. రాజ్యాన్ని చక్కగా పాలిస్తాడు. ఇది నిశ్చయం.

ఇత్యాది మహాపురాణే ఆగ్నేయే ధనుర్వేదకథనం నామ ద్విపఞ్చాశదధికద్విశతతమోఽధ్యాయః ॥252॥

అగ్నిమహాపురాణంలో ధనుర్వేదకథనం అనే రెండువందల యాభైరెండవ అధ్యాయం సమాప్తం.



త్రిపఞ్చాశదధికద్విశతతమోఽధ్యాయః – రెండువందల యాభైమూడవ అధ్యాయం

వ్యవహారకథనమ్ – వ్యవహారకథనం

అగ్నిరువాచ – వసిష్ఠమహర్షితో అగ్నిదేవుడు ఇలా చెప్తున్నాడు.

వ్యవహారం ప్రవక్ష్యామి నయానయవివేకదమ్ ।
స చతుష్పాచ్చతుః స్థానశ్చతుస్సాధన ఉచ్యతే ॥
చతుర్హితశ్చతుర్వ్యాపీ చతుష్కారీ చ కీర్త్యతే ॥1॥

వసిష్ఠమహర్షీ! న్యాయం, అన్యాయం అనేవాటి తెలివిని ఇచ్చే వ్యవహారాన్ని గురించి చెప్తాను. దానికి నాలుగు పాదాలు. నాలుగు స్థానాలు. నాలుగు సాధనాలు. అది నాలుగువిధాలుగా మేలు చేస్తుంది. నాలుగుదిక్కులలోనూ విస్తరించి ఉంటుంది. నాలుగురకాలవారికి ప్రయోజనం కలిగిస్తుంది.

అష్టాఙ్గోఽష్టాదశపదశ్శతశాఖస్తథైవ చ ।
త్రియోనిర్ద్వ్యభియోగశ్చ ద్విద్వారో ద్విగతిస్తథా ॥2॥

దీనికి ఎనిమిది అంగాలు. పద్దెనిమిది పదాలు. నూరు శాఖలు. జన్మస్థానాలు మూడు. అలాగే దీని అభియోగాలు రెండు. ద్వారాలు రెండు. గతులు రెండు.

ధర్మశ్చ వ్యవహారశ్చ చరిత్రం రాజశాసనమ్ ।
చతుష్పాద్వ్యవహారాణాముత్తరః పూర్వసాధకః ॥3॥

1. ధర్మం, 2. వ్యవహారం, 3. చరిత్రం, 4. రాజశాసనం, అనేవి వ్యవహారానికి నాలుగుపాదాలు. వీటిలో తరువాతిది ప్రతిదీ దానికి ముందరిదానిని సాధిస్తుంది.

తత్ర సత్యే స్థితో ధర్మో వ్యవహారస్తు సాక్షిషు ।
చరిత్రం సఙ్గ్రహే పుంసాం రాజాజ్ఞాయాం తు శాసనమ్ ॥4॥

వాటిలో ధర్మం అనేది సత్యంలో ఉంటుంది. వ్యవహారం సాక్షులలో ఉంటుంది. చరిత్ర పురుషసంగ్రహంలో ఉంటుంది. (రాజ)శాసనం రాజుగారి ఆజ్ఞలో ఉంటుంది.

సామాద్యుపాయసాధ్యత్వా చ్చతుస్సాధన ఉచ్యతే ।
చతుర్ణామాశ్రమాణాం చ రక్షణాత్స చతుర్హితః ॥5॥

1. సామం, 2. దానం, 3. భేదం, 4. దండం అనే నాలుగుఉపాయాల ద్వారా సాధింపబడేది కాబట్టి సాధనం నాలుగువిధాలు అని చెప్పబడింది. 1. బ్రహ్మచర్యం, 2. గార్హస్థ్యం, 3. వానప్రస్థం, 4. సన్న్యాసం అనే నాలుగు ఆశ్రమాలను రక్షించేది కావడంచేత ఇది చతుర్హితం.

కర్తారం సాక్షిణశ్చైవ సభ్యాన్ రాజానమేవ చ ।
వ్యాప్నోతి పాదశో యస్మాచ్చతుర్వ్యాపీ తత స్స్మృతః ॥6॥

1.కర్త 2. సాక్షులు 3. సభ్యులు 4. రాజు అనే నలుగురియందు నాలుగుపాదాలుగా విస్తరించి ఉంటుంది కాబట్టి ఇది చతుర్వ్యాపి అని గ్రహించాలి.

ధర్మస్యార్థస్య యశసో లోకపజ్క్తే స్తథైవ చ ।
చతుర్ణాం కరణాదేష చతుష్కారీ ప్రకీర్తితః ॥7॥

1. ధర్మం 2. అర్థం 3. యశస్సు 4. ఉత్తమలోకాల వరుస అనే నాలుగింటినీ కలిగించేది కావడంచేత చతుష్కారి అని కీర్తింపబడింది.

రాజా సపురుషస్సభ్య శ్శాస్త్రం గణకలేఖకౌ ।
హిరణ్యమగ్నిరుదకమష్టాఙ్గ స్సముదాహృతః ॥8॥

1. రాజపురుషుడు 2.సభ్యుడు, 3.శాస్త్రం 4.గణకుడు 5.లేఖకుడు 6.సువర్ణం 7.అగ్ని 8.జలం ఈ ఎనిమిది అంగాలుగా కలిగినది కాబట్టి అష్టాంగం అని చెప్పబడింది.

కామాత్ క్రోధాచ్చ లోభాచ్చ త్రిభ్యో యస్మాత్ ప్రవర్తతే ।
త్రియోనిః కీర్త్యతే తేన త్రయమేతద్వివాదకృత్ ॥9॥

1. కామం 2. క్రోధం 3. లోభం అనే మూడింటినుండి ఏర్పడుతుంది కాబట్టి ఇది త్రియోని అని పేర్కొంటారు. ఈ మూడు త్రియోని అనే అంశం నిశ్చయం.

ద్వ్యభియోగస్తు విజ్ఞేయశ్శఙ్కాతత్త్వాభియోగతః ।
శఙ్కా సద్భిస్తు సంసర్గా త్తత్త్వం షోఢాభిదర్శనాత్ ॥10॥

1.శంకాభియోగం, 2.తత్త్వాభియోగం అనే రెండు అభియోగాలు కలిగినది కాబట్టి ద్వ్యభియోగం. అసాధువులతో కలిసి ఉండడం అనేది శంకాభియోగం. చక్కగా దర్శనం చేయడం తత్త్వాభిదర్శనం. ఈ దర్శనంలోని భేదాలనుబట్టి ఇది ఆరువిధాలుగా ఉంటుంది.

పక్షద్వయాభిసమ్బన్ధా ద్విద్వార స్సముదాహృతః ।
పూర్వవాదస్తయోః పక్షః ప్రతిపక్ష స్త్వనన్తరః ॥11॥

1.పూర్వపక్షం 2. ప్రతిపక్షం అనే రెండుపక్షాల సంబంధాన్ని అనుసరించి రెండుపక్షాలు కలిగినది కాబట్టి ద్విద్వారం అని చెప్పబడింది. నేరాన్ని ఆరోపించడం అనే మొదటిపక్షం పూర్వవాదం. దానికి సమాధానం చెప్పడం అనే ఎదుటి(రెండవ) పక్షం ప్రతిపక్షం.

భూతశ్ఛలానుసారిత్వా ద్విగతిస్సముదాహృతా ॥12॥

1.భూతం (నిజంగా జరిగినది) 2.ఛలం (జరగనిది జరిగినట్లుగా మోసం చేసి చూపడం) అనే రెండు గతులు కలిగినది కాబట్టి ఇది ద్విగతి అని చెప్పబడింది.

ఋణం దేయమదేయం చ యేన యత్ర యథా చ యత్ ।
దానగ్రహణధర్మశ్చ ఋణాదానమితి స్మృతమ్ ॥13॥

ఋణం దేయం అదేయం అని రెండువిధాలు. 1.ఎవడు ఇవ్వాలి? ఎవడు ఇవ్వగూడదు. 2.ఎక్కడ ఇవ్వాలి? ఎక్కడ ఇవ్వగూడదు? 3. ఎలా ఇవ్వాలి? ఎలా ఇవ్వగూడదు? 4. దేనిని ఇవ్వాలి? దేనిని ఇవ్వగూడదు? 5. ఇచ్చినఅప్పును ఎలా తీసుకోవాలి? ఈ విషయాలను ఋణాదానం అంటారు.

స్వద్రవ్యం యత్ర విశ్రమ్భాన్నిక్షిపత్యవిశఙ్కితః ।
నిక్షేపం నామ తత్ ప్రోక్తం వ్యవహారపదం బుధైః ॥14॥

తన ధనాన్ని సందేహించకుండా స్వేచ్ఛగా ఇంకొకడివద్ద దాచిఉంచడాన్ని (1)నిక్షేపం అనేపేరు గల వ్యవహార విషయంగా పండితులు పేర్కొంటారు.

వణిక్ప్రభృతయో యత్ర కర్మ సమ్భూయ కుర్వతే ।
తత్ సమ్భూయసముత్థానం వ్యవహారపదం విదుః ॥15॥

వర్తకులు మొదలైనవాళ్లు సంఘటితమై చేసిన(వ్యాపారాది)కార్యం (2)సంభూయసముత్థానం అనే పేరుతో వ్యవహారవిషయంగా గ్రహిస్తారు.

దత్త్వా ద్రవ్యం చ సమ్యగ్ యః పునరాదాతుమిచ్ఛతి ।
దత్తాప్రదానికం నామ తద్వివాదపదం స్మృతమ్ ॥16॥

యథావిధిగా ఇతరులకు దానం చేసిన ద్రవ్యాన్ని వారికి ఇవ్వకుండా, తానే తీసుకోవాలనుకోవడానికి (3)దత్తాప్రదానికం (దానం చేసినది ఇవ్వకపోవడం) అని పేరు. అది వివాదానికి స్థానం అవుతుంది.

అభ్యుపేత్య చ శుశ్రూషాం యస్తాం న ప్రతిపద్యతే ।
అశుశ్రూషాముపేత్యైతద్వివాదపద ముచ్యతే ॥17॥

సేవ చేస్తానని చెప్పి వచ్చి, సేవ చేయకుండా ఉండడం, (4)ఉపేత్య అశుశ్రూష అవుతుంది. ఇది వివాదానికి స్థానం.

భృత్యానాం వేతనస్యోక్తః దానాదానవిధిశ్చ యః ।
వేతనస్యానపాకర్మ తద్వివాదపదం స్మృతమ్ ॥18॥

(సేవకులకు ఇవ్వవలసిన ద్రవ్యాన్ని ఇవ్వకపోవడం (5)వేతన అనపాకర్మ అనేదోషం. ఇది వివాదానికి స్థానం అవుతుంది.

నిక్షిప్తం వా పరద్రవ్యం నష్టం లబ్ధ్వాపహృత్య వా ।
విక్రీయతే పరోక్షం యత్స జ్ఞేయోஉస్వామివిక్రయః ॥19॥

తనవద్ద తాకట్టు పెట్టిన ఇతరులవస్తువులను, లేదా ఇతరులు నష్టపోయిన ద్రవ్యాన్ని సంపాదించి కాజేసి, యజమానికి తెలియకుండా దానిని అమ్ముకోవడాన్ని (6)అస్వామివిక్రయం అంటారు.

విక్రీయ (పణ్యం మూల్యేన క్షేత్రే యచ్చ న దీయతే ।
విక్రీయాసమ్ప్రదానం తద్వివాదపదముచ్యతే ॥20॥

వెల తీసుకుని అమ్మినవస్తువును కొన్నవాడికి ఇవ్వకపోతే, అది (7)విక్రీయ అసంప్రదానం అవుతుంది. అది వివాదానికి స్థానం.)

క్రీత్వా మూల్యేన యః పణ్యం క్రేతా న బహు మన్యతే ।
కృత్వా మూల్యం తు యః పణ్యం దుష్క్రీతం మన్యతే క్రయీ ॥
క్రీతానుశయ ఇత్యేతద్వివాదపదముచ్యతే ॥21॥

ఒక వస్తువును కొన్న తరువాత కొన్నవాడు ఆ వస్తువు మంచిది కాదని భావించినా, లేదా వెలను ఇచ్చి కొని, ఆ తరువాత ఆ వస్తువుకు అధికమైన విలువ ఇచ్చానని భావించినా, అది (8)క్రీతానుశయం. అది వివాదానికి స్థానం అవుతుంది.

పాషణ్డనైగమాదీనాం స్థితిస్సమయ ఉచ్యతే ।
సమయ స్యానపాకర్మ తద్వివాదపదం స్మృతమ్ ॥ 22॥

వేదధర్మాలను ఆచరించనివాళ్లు, వేదార్థాన్ని చక్కగా తెలిసి ఆచరించేవాళ్లు వీరిద్దరిస్థితిని సమయం అంటారు. వీరికి సంబంధించిన విరుద్ధమయిన కర్మను (9)సమయ అనపాకర్మ అంటారు. అది వివాదానికి స్థానం.

సేతుకేదారమర్యాదా వికృష్టాకృష్టనిశ్చయః ।
క్షేత్రాధికారే యత్ర స్యుర్వివాదః క్షేత్రజస్తు సః ॥23॥

పొలాలవద్ద వంతెనలు, వరిమడులు, పొలం సరిహద్దులను విడిచిపెట్టడాలు, కలుపుకోవడాలు, పొలంపై అధికారం యాజమాన్యానికి సంబంధించిన భేదాలను (10) క్షేత్రజవివాదం అంటారు.

వైవాహికో విధిః స్త్రీణాం యత్ర పుంసాం చ కీర్త్యతే ।
స్త్రీపుంసయోగసంజ్ఞం తు తద్వివాదపదం స్మృతమ్ ॥24॥

స్త్రీలకూ పురుషులకూ జరిగినపెండ్లికి సంబంధించినది (వివాదం-11) స్త్రీపుంసయోగం అనేపేరు గలిగినది. ఇది వివాదానికి స్థానం అవుతుంది.

విభాగోఽర్థస్య పైత్రస్య పుత్రైర్యస్తు ప్రకల్ప్యతే ।
దాయభాగ ఇతి ప్రోక్తం తద్వివాదపదం బుధైః ॥25॥

తండ్రికి చెందిన ఆస్తులను కొడుకులు పంచుకోవడాన్ని (12)దాయభాగం అంటారు. ఇది వివాదానికి స్థానం అని పండితులు పేర్కొంటారు.

సహసా క్రియతే కర్మ యత్కిఞ్చిద్బలదర్పితైః ।
తత్సాహసమితి ప్రోక్తం వివాదపదముచ్యతే ॥26॥

'బలవంతులం' అని ఆలోచించకుండా తొందరపడిచేసే నేరాన్ని (13)సాహసం అంటారు. అది వివాదానికి స్థానం అవుతుంది.

దేశజాతికులాదీనామాక్రోశాద్వ్యఙ్గ్యసంయుతమ్ ।
యద్వచః ప్రతికూలార్థం వాక్పారుష్యం తదుచ్యతే ॥27॥

దేశం, జాతి, కులం మొదలైనవాటిని బట్టి నిందిస్తూను, వ్యంగ్యంగాను, వ్యతిరేకంగానూ మాట్లాడే మాటలను (14) వాక్పారుష్యం అంటారు. ఇది వివాదానికి స్థానం అవుతుంది.

పరగాత్రేష్వభిద్రోహో హస్తపాదాయుధాదిభిః ।
అగ్న్యాదిభిశ్చోపఘాతైర్దణ్డపారుష్యముచ్యతే ॥28॥

చేతులతో గాని, కాళ్లతో గాని, ఆయుధాలు మొదలైనవాటితో గాని, నిప్పు మొదలైనవాటితో గాని, ఒంటిపై దెబ్బలు కొట్టడం, మనసుకు కష్టం కలిగించడం అనేవిధంగా ఇతరులను బాధించడం (15)దండపారుష్యం అవుతుంది. ఇది వివాదానికి కారణం.

అక్షవజ్రశలాకాద్యైర్దేవనం ద్యూతముచ్యతే ।
పశుక్రీడావయోభిశ్చ ప్రాణిద్యూతం సమాదిశేత్ ॥29॥

పాచికలు, వజ్రాలు (రత్నాలు), జూదం ఆడడానికి ఉపయోగించే శారి అనే సాధనాలు మొదలైనవాటితో ధనాదులను గెలుచుకోవాలని చేసే ప్రయత్నానికి (ఆడేఆటకు) (16)జూదం అనిపేరు. ఇది వివాదానికి కారణం. పశువులతోనూ పక్షులతోనూ ఆడే జూదాన్ని (17)ప్రాణిద్యూతం అంటారు.

ప్రకీర్ణకః పునర్ జ్ఞేయో వ్యవహారో నిరాశ్రయః ।
రాజ్ఞామాజ్ఞాప్రతీఘాత స్తత్కర్మాకరణం తథా ॥30॥

రాజుగారి ఆజ్ఞకు వ్యతిరేకంగా చేయడాన్ని, రాజు చేయమన్నపని చేయకపోవడాన్ని, (18)ప్రకీర్ణం అంటారు. ఇది సరాసరిగా రాజునే ఎదిరించేది కావడంచేత ఈ వివాదంలో చిక్కుకున్నవాడికి అండ ఉండదు.

వ్యవహారోఽష్టాదశపద స్తేషాం భేదోఽథ వై శతమ్ ।
క్రియాభేదాన్మనుష్యాణాం శతశాఖో నిగద్యతే ॥31॥

ఈవిధంగా వ్యవహారం పద్దెనిమిది విధాలుగా ఉంటుంది. అందులో అవాంతరభేదాలు వందవిధాలు. మానవులు చేసే ఆయా పనులలోని భేదాలనుబట్టి అది నూరు రకాలుగా చెప్పబడింది.

వ్యవహారాన్నృపః పశ్యేద్ జ్ఞానివిప్రైరకోపనః ।
శత్రుమిత్రసమాస్స్పృహ్యా అలోభాశ్రుతివేదినః ॥32॥

వివేకవంతులయిన బ్రాహ్మణులతో కలిసి, ఆలోచించి, కోపం లేకుండా రాజు ఈ వ్యవహారాలను చక్కబెట్టాలి. వ్యవహారాన్ని విచారించేసభలో ఉన్నవాళ్లు శత్రువులను మిత్రులనూ సమానంగా చూడాలి. వారికి దురాశ ఉండగూడదు. వేదధర్మం (ధర్మశాస్త్రం) తెలిసినవాళ్లు కావాలి.

అపశ్యం స్తాన్ కార్యవశాత్ సభ్యై ర్విప్రం నియోజయేత్ ॥33॥

రాజకార్యాలఒత్తిడి కారణంగా వ్యవహారాలను చూడడానికి అవకాశం లేని సందర్భంలో వ్యవహార పరిశీలనకోసం రాజు కొంతమంది సభ్యులనూ, వారితోపాటు ఒకబ్రాహ్మణుడిని నియోగించాలి.

రాగాల్లోభాద్భయాద్వాపి స్మృత్యపేతాదికారిణః ।
సభ్యాః పృథక్ పృథగ్దణ్డ్యా వివాదాద్ద్విగుణో దమః ॥34॥

అభిమానంవలన గానీ, దురాశవలన గానీ, భయంచేత గానీ, ధర్మశాస్త్రానికి విరుద్ధంగా ప్రవర్తించిన సభ్యులను రాజు వేరువేరుగా దండించాలి. ఆ సభ్యులనుండి శిక్షగా ఆ వివాదం విలువకు రెట్టింపు స్వీకరించాలి.

స్మృత్యాచారవ్యపేతేన మార్గేణాధర్షితః పరైః ।
ఆవేదయతి యద్రాజ్ఞే వ్యవహారపదం హి తత్ ॥35॥

ధర్మశాస్త్రానికి విరుద్ధమైన మార్గంలో ఇతరులచేత మిక్కిలిగా భయపెట్టబడినవాడు, ఆ విషయాన్ని రాజుగారికి (1)విన్నవించుకోవడం వ్యవహారం అనే పదంతో వ్యవహరింపబడుతుంది.

ప్రత్యర్థినోఽగ్రతో లేఖ్యం యథావేదిత మర్థినా ।
సమామాస తదర్ధాహర్నామజాత్యాదిచిహ్నితమ్ ॥36॥

అన్యాయంగా బాధింపబడినవాడు తనను బాధించినవాడిని గురించి పేర్కొన్నవిధంగా సంవత్సరం, నెల, పక్షం, రోజు, పేరు, జాతి, మొదలైన వివరాలన్నీ ముందుగా (2)వ్రాసుకోవాలి.

శ్రుతార్థస్యోత్తరం లేఖ్యం పూర్వావేదకసన్నిధౌ ।
తతోఽర్థం లేఖయేత్సద్యః ప్రతిజ్ఞాతార్థసాధనమ్ ॥37॥

మొదట నివేదించిన వాడిసమక్షంలో అతడి ఆరోపణలకు సమాధానాన్ని (3)వ్రాయాలి. వెంటనే నేరం ఆరోపించిన వాడిచేత అతడు నివేదించిన విషయం యథార్థం అని ప్రమాణపత్రం (4)వ్రాయించుకోవాలి.

తత్సిద్ధౌ సిద్ధిమాప్నోతి విపరీతమతోఽన్యథా ।
చతుష్పాద్వ్యవహారోఽయం వివాదేషూపదర్శితః ॥38॥

మొదటివాడు చెప్పినది యథార్థం అని నిరూపింపబడితే అతడు జయిస్తాడు. నిరూపింపబడకపోతే రెండవవాడు జయిస్తాడు. ఈవిధంగా వ్యవహారంలో నాలుగుభాగాలు ప్రదర్శింపబడినాయి.

అభియోగమనిస్తార్య నైనం ప్రత్యభియోజయేత్ ।
అభియుక్తం చ నాన్యేన త్యక్తం విప్రకృతిం నయేత్ ॥
కుర్యాత్ ప్రత్యభియోగం తు కలహే సాహసేషు చ ॥39॥

ప్రతివాదిపై మోపబడిన అభియోగం నిరూపింపబడనంతవరకు అతడిపై దానికి సంబంధించిన ఇతర అభియోగాలు చేయగూడదు. ఇతరులచేత అభియోగం మోపబడినవాడిపైనా, విడువబడిన వాడిపైనా ప్రతీకారం

తీర్చుకోగూడదు. తగవులాటలలోనూ, తొందరపడిచేసిన అపరాధాలలోనూ మాత్రం తిరిగి అభియోగాలు చేయవచ్చును.

ఉభయోః ప్రతిభూర్గ్రాహ్య స్సమర్థః కామ్యనిర్ణయే ।
నిహ్నవే భావితో దద్యాద్ధనం రాజ్ఞే తు తత్సమమ్ ॥40॥

వాది, ప్రతివాదులవివాదాన్ని పరిష్కరించడానికి ప్రతిభువును (రక్షకనిధి) ఏర్పాటు చేయాలి. ప్రతివాదిపై తాను చేసిన ఆరోపణను వాది నిరూపించగలిగితే, సత్యం దాచి, అబద్ధమాడిన ప్రతివాది వాదికి ఇవ్వవలసినధనం మొత్తం ఇవ్వాలి. అంతే మొత్తం ధనాన్ని రాజుకు కూడా ఇవ్వాలి.

మిథ్యాభియోగాద్ద్విగుణ మభియోగాద్ధనం హరేత్ ॥41॥

ప్రతివాదిపై అసత్యమైన ఆరోపణం చేస్తే (తాను చేసిన ఆరోపణను నిరూపించ లేకపోతే), ఆరోపించినదానికి రెట్టింపుధనాన్ని వాదినుండి అపరాధశుల్కంగా రాజు స్వీకరించాలి.

సాహసస్తేయపారుష్యేష్వభిశాపాత్యయే స్త్రియః ।
విచారయేత్ సద్య ఏవ కాలో౽న్యత్రేచ్ఛయా స్మృతః ॥42॥

సాహసం (26శ్లో), దొంగతనం, వాక్కు, దండం మొదలైన పారుష్యములు, మహాపాతకం చేసిన అభియోగం, ప్రాణాలు తీయడం, స్త్రీకి సంబంధించిన నేరారోపణం వచ్చినపుడు వాటిని వెంటనే విచారించాలి. ఇతర విషయాలలో యథేచ్ఛగా తగిన సమయంలో విచారణ చేయవచ్చును.

దేశాద్దేశాన్తరం యాతి సృక్విణీ పరిలేఢి చ ।
లలాటం స్విద్యతే చాస్య ముఖవైవర్ణ్యమేవ చ ॥43॥

అభియోగం చేసే సమయంలోనూ, సాక్ష్యం ఇచ్చే సమయంలోనూ సాక్షి ఒకచోటినుండి మరొకచోటికి అటూ ఇటూ తిరుగుతున్నా, పెదవులచివరలను నాకుతున్నా (పెదవులు తడుపుకుంటున్నా), నుదురు చెమటతో తడిసినా, ముఖం రంగులు మారుతున్నా,

స్వభావాద్వికృతిం గచ్ఛేన్మనోవాక్కాయకర్మభిః ।
అభియోగే౽థ వా సాక్ష్యే వాగ్దుష్టః పరికీర్తితః ॥44॥

మనస్సు, మాట, చేష్ట స్వభావానికి విరుద్ధంగా అసహజంగా మారినా, అది దోషగ్రస్తమైన వాక్కు అని పేర్కొనబడింది.

సన్దిగ్ధార్థం స్వతన్త్రో యస్సాధయేద్యశ్చ నిష్పతేత్ ।
న చాహూతో వదేత్ కిఞ్చిద్దీనో దణ్డ్యశ్చ స స్మృతః ॥45॥

సందేహాస్పదమయిన విషయాన్ని యథార్థంగా నిరూపించాలని ప్రయత్నించేవాడు, రాజు తన వద్దకు పిలిచి అడిగినపుడు ఏమీ మాట్లాడనివాడు దీనుడు. వాడు తప్పకుండా దండించదగినవాడు.

సాక్షిషూభయతస్సత్సు సాక్షిణః పూర్వవాదినః ।
పూర్వపక్షేఽధరీభూతే భవన్త్యుత్తరవాదినః ॥46॥

వాదికీ ప్రతివాదికీ ఇద్దరికీ సాక్షులు ఉండగా, సాక్షులు పూర్వవాదులు అవుతారు. పూర్వపక్షం బలహీన మైనపుడు సాక్షులు ఉత్తరపక్షాన్ని పేర్కొంటారు.

సపణశ్చేద్వివాద స్స్యా త్తత్ర హీనస్తు దాపయేత్ ।
దత్తం పణం వసుం చైవ ధనినో ధనమేవ చ ॥47॥

పందెం వేసుకుని వివాదం చేసినపుడు, అందులో ఓడిపోయినవాడు పందెం వేసిన సొమ్ము మొత్తం రాజుకు ఇవ్వాలి. ధనవంతులు ధనాన్నే ఇవ్వాలి.

ఛలం నిరస్య దూతేన వ్యవహారాన్నయే న్నృపః ।
భూత మప్యనుపన్యస్తం హీయతే వ్యవహారతః ॥48॥

రాజు మోసం విడిచిపెట్టి, దూతద్వారా వ్యవహారాన్ని న్యాయమైన పద్ధతిలో నడిపించాలి. యథార్థంగా జరిగినదే అయినా, చక్కగా నిరూపింపబడనపుడు వ్యవహారంలో పరాజయం కలుగుతుంది.

నిహ్నుతే నిఖిలానేకమేకదేశవిభావితమ్ ।
దాప్య స్సర్వాన్నృపేణార్థాన్న గ్రాహ్య స్త్వనివేదితః ॥49॥

వాది తన అభియోగంలో అనేకమైన వస్తువులను పేర్కొనగా, ప్రతివాది వాని నన్నిటినీ దాచిపెట్టి, ఒకదానిని మాత్రమే కాజేసినట్లు అంగీకరించినప్పటికీ, ఒప్పుకోని మిగిలినవాటిని అన్నిటిని కూడా రాజు రాబట్టాలి. అభియోగపత్రంలో లేని వస్తువును తరువాత చేర్చినా, ప్రతివాదినుండి దానిని తీసుకోవలసిన అవసరం లేదు.

స్మృత్యో ర్విరోధే న్యాయస్తు బలవాన్ వ్యవహారతః ।
అర్థశాస్త్రాద్ధి బలవద్ధర్మశాస్త్రమితి స్థితిః ॥50॥

వ్యవహారాన్ని పరిష్కరించేసందర్భంలో స్మృతివాక్యాలు రెండు పరస్పరం విరుద్ధంగా ఉన్నపుడు, న్యాయం బలీయమైనది. అర్థశాస్త్రంకంటె ధర్మశాస్త్రం బలవత్తరం అనే న్యాయాన్ని అనుసరించి, న్యాయశాస్త్రానుగుణంగా పరిష్కారం చేయాలి.

ప్రమాణం లిఖితం భుక్తి స్సాక్షిణశ్చేతి కీర్తితమ్ ।
ఏషామన్యతమాభావే దివ్యాన్యతమ ముచ్యతే ॥51॥

లిఖితం, భుక్తి, సాక్షి అనేవి మూడు (వివాదపరిష్కారంలో) ప్రమాణాలుగా చెప్పబడ్డాయి. వీటిలో ఏ ఒక్కటి కూడా లేనపుడు దివ్యమైన ప్రమాణాలలో ఏదో ఒకదానిని గ్రహించాలి.

సర్వేష్వేవ వివాదేషు బలవత్యుత్తరా క్రియా ।
ఆధౌ ప్రతిగ్రహే క్రీతే పూర్వా తు బలవత్తరా ॥52॥

అన్నిరకాల వివాదాలలోనూ ఉత్తరక్రియే బలవత్తరమైనది. తాకట్టు, తీసుకోవడం, అమ్మకం అనే విషయాలలో ముందరిది బలవత్తరం.

పశ్యతోఽబ్రువతో భూమేర్హాని ర్వింశతివార్షికీ ।
పరేణ భుజ్యమానాయా ధనస్య దశవార్షికీ ॥53॥

యజమాని చూస్తుండగా భూమిని ఇంకొకడు అనుభవిస్తున్నపుడు, యజమాని ఏమీ మాట్లాడకపోతే యజమానికి ఇరవై సంవత్సరాల తరువాత ఆ భూమిమీద హక్కు పోతుంది. ఆ భూమి అనుభవించేవాడికి సొంతం అవుతుంది. ధనమయితే, పదిసంవత్సరాలకే యజమానికి హక్కు నశిస్తుంది (అనుభవించేవాడికి సొంతం అవుతుంది).

అధిసీమోపనిక్షేపజడబాలధనై ర్వినా ।
తథోపనిధిరాజస్త్రీశ్రోత్రియాణాం ధనైరపి ॥54॥

తాకట్టు, సరిహద్దు, వస్తుధనస్వరూపాన్ని చెప్పి దాచిపెట్టమని ఇచ్చినది, అవివేకులసొమ్ము, పసివాళ్లసొమ్ము, వస్తుధనస్వరూపాన్ని చెప్పకుండా దాచిపెట్టమని ఇచ్చినది, రాజుగారిధనం, ఆడవాళ్లధనం, వేదవేత్తలధనం, వీటివిషయంలో పైనియమం లేదు.

ఆధ్యాదీనాం విహర్తారం ధనినే దాపయేద్ధనమ్ ।
దణ్డం చ తత్సమం రాజ్ఞే శక్త్యపేక్ష్యమథాపి వా ॥55॥

తాకట్టు పెట్టినదీ మొదలైనవాటిని అనుభవించేవాడు దానిని అపహరించాలనుకున్నపుడు ఆ సొత్తును వెంటనే రాజు యజమానికి ఇప్పించాలి. అపరాధశుల్కంగా అంతే సొమ్మును రాజు తీసుకోవాలి. లేదా అతడి శక్తిమేరకు దండనగా రాజు తీసుకోవాలి.

ఆగమోఽభ్యధికో భుక్తిం వినా పూర్వక్రమాగతామ్ ।
ఆగమోఽపి బలం నైవ భుక్తిస్తోకాపి యత్ర నో ॥56॥

ఆగమం అంటే భూమి మొదలైనవాటిని కొనడమూ, అమ్మడమూ. తాతలతండ్రులనుండి పరంపరగా వచ్చినదానిని అనుభవించడంకంటె ఈ ఆగమం అధికమైనది. కొంచెం కూడా భోగం లేనపుడు ఆగమానికి బలం ఉండదు.

ఆగమేన విశుద్ధేన భోగో యాతి ప్రమాణతామ్ ।
అవిశుద్ధాగమో భోగః ప్రామాణ్యం నాధిగచ్ఛతి ॥57॥

స్వచ్ఛమైన ఆగమం వలన భోగం ప్రామాణికమవుతుంది. మోసం మొదలుగా అక్రమంగా వచ్చిన ఆగమంతో భోగం ప్రామాణికతను పొందదు.

ఆగమస్తు కృతో యేన సోఽభియుక్తస్తముద్ధరేత్ ।
న తత్సుతస్తత్సుతో వా భుక్తిస్తత్ర గరీయసీ ॥58॥

భూమి మొదలైనవాటిని కొన్నా, అమ్మినా ఆ ఆగమంలోని క్రమాన్ని గురించి ఆరోపణలు వచ్చినపుడు ఆ ఆగమం న్యాయ్యమైనదని అతడు నిరూపించుకుని అనుభవించాలి. కాని అతడి పుత్రులు, మనుమళ్లు మాత్రం అలా నిరూపించకుండా, దానిని అనుభవించడం దోషం కాదు.

యోఽభియుక్తః పరేత స్స్యా త్తస్య రిక్థాత్తముద్ధరేత్ ।
న తత్ర కారణం భుక్తిరాగమేన వినా కృతా ॥59॥

ఆగమాన్ని గురించి అభియోగం ఏర్పడినపుడు దానిని సక్రమంగా నిరూపించుకోకముందే అతడు మరణిస్తే, ఆ ఆస్తికి వారసుడు దానిని నిరూపించాలి. ఆగమం సక్రమం అని నిరూపించుకోకపోతే, దానిని అనుభవించడం యోగ్యం కాదు.

బలోపాధివినిర్వృత్తాన్ వ్యవహారాన్నివర్తయేత్ ॥60॥

బలవంతంగానూ, మోసంతోనూ వెళ్లగొట్టబడినవాడిని వ్యవహారంనుండి తొలగించాలి.

స్త్రీనక్తమన్తరాగారబహిశ్శత్రుకృత స్తథా ।
మత్తోన్మత్తార్తవ్యసనిబాలభీతప్రయోజితః ॥
అసమ్బద్ధకృతశ్చైవ వ్యవహారో న సిద్ధ్యతి ॥61॥

స్త్రీలు చేసిన అభియోగం, రాత్రిపూట జరిగిన సంఘటనం, ఇంట్లోని శత్రువులు చేసినది, బయటి శత్రువులు చేసినది, మత్తులో ఉన్నవాళ్లు, పిచ్చివాళ్లు, రోగాలు మొదలైన బాధలలో ఉన్నవాళ్లు, చిన్నపిల్లలు, భయపడిన వాళ్లు చేసిన అభియోగం సరియైనది కాదు. ఆ వ్యవహారం సిద్ధించదు.

ప్రనష్టాధిశతం దేయం నృపేణ ధనినే ధనమ్ ।
విభావయేన్న చేల్లిఙ్గై స్తత్సమం దాతుమర్హతి ॥
దేయం చౌరహృతం ద్రవ్యం రాజ్ఞా జనపదాయ తు ॥62॥

దొంగలు మొదలైన వారివలన కోల్పోయిన ధనాన్ని దానియజమానికి రాజే ఇవ్వాలి. ఎంత పోయిందో గుర్తించలేకపోతే, అతడు ఎంత పోయిందని చెప్పాడో అంత సొమ్ము ఇవ్వాలి. దొంగలు అపహరించిన ధనాన్ని (యజమానిని గుర్తింపని సందర్భంలో) రాజు దేశానికి ఇవ్వాలి.

అశీతిభాగో వృద్ధిస్స్యాన్మాసి మాసి సబన్ధకే ।
వర్ణక్రమాచ్ఛతం ద్విత్రిచతుష్పఞ్చకమన్యథా ॥63॥

తాకట్టుమీద తీసుకున్న వస్తువుపై ఎనభైయవవంతు వడ్డి నెల నెలా తీసుకోవాలి. బ్రాహ్మణులు మొదలైన వర్ణాల వరుసను బట్టి క్రమంగా బ్రాహ్మణులకు రెండు, క్షత్రియులకు మూడు, వైశ్యులకు నాలుగు, శూద్రులకు అయిదు చొప్పున వడ్డీ అధికంగా తీసుకోవాలి.

సప్తతిస్తు పశుస్త్రీణాం ధనస్యాష్టగుణా పరా ।
వస్త్రధాన్యహిరణ్యానాం చతుస్త్రిద్విగుణా తథా ॥64॥

పశువులకు, స్త్రీలకు డెబ్బైయవవంతు, నూనె మొదలైన రసద్రవ్యాలకు ఎనిమిదిరెట్లు, వస్త్రాలకు నాలుగు, ధాన్యానికి మూడు, బంగారానికి రెండురెట్లు వడ్డి అవుతుంది.

గ్రామాన్తరాత్తు దశకం సముద్రాదపి వింశతిమ్ ।
దద్యుర్వా స్వకృతాం వృద్ధిం సర్వే సర్వాసు జాతిషు ॥65॥

ఇతరగ్రామాలనుండి వచ్చినవారు పది, సముద్రంమీది (దూరప్రాంతాల)నుండి వచ్చినవారు ఇరవై, వంతులచొప్పున వడ్డీ ఇవ్వాలి. లేదా అందరూ అన్నిజాతులవారికీ సమానంగా తాము ముందు నిర్ణయించుకున్న పద్ధతిలో వడ్డీ ఇవ్వాలి.

ప్రపన్నం సాధయన్నర్థం న వాచ్యో నృపతిర్భవేత్ ।
సాధ్యమానో నృపం గచ్ఛేద్దణ్ద్యో దాప్యశ్చ తద్ధనమ్ ॥66॥

అప్పు ఇచ్చినవాడు తీసుకున్న వాడినుండి తన ధనాన్ని వసూలు చేసుకుంటుంటే రాజు అతడిని ఏమీ అనగూడదు (అడ్డుపెట్టగూడదు). అప్పు వసూలు చేసుకునేవాడు (తీసుకున్నవాడు ఆధనం ఇవ్వని సందర్భంలో) రాజును ఆశ్రయించాలి. రాజు అప్పు తిరిగి ఇవ్వనివాడిని దండించాలి. ఆ ధనాన్ని (అప్పు ఇచ్చినవాడికి) ఇప్పించాలి.

ఇత్యాది మహాపురాణే ఆగ్నేయే వ్యవహారకథనం నామ త్రిపఞ్చాశదధికద్విశతతమోఽధ్యాయః ॥253॥

అగ్నిమహాపురాణంలో వ్యవహారకథనం అనే రెండువందల యాభైమూడవ అధ్యాయం సమాప్తం.



చతుఃపఞ్చాశదధికద్విశతతమోఽధ్యాయః - రెండువందల యాభైనాల్గవ అధ్యాయం

వ్యవహారకథనమ్ - వ్యవహారకథనం

అగ్నిరువాచ - వసిష్ఠమహర్షితో అగ్నిదేవుడు ఇలా చెప్తున్నాడు.

గృహీతార్థః క్రమాద్దాప్యో ధనినామధమర్ణికః ।
దత్త్వా తు బ్రాహ్మణాయాదౌ నృపతేస్తదనన్తరమ్ ॥1॥

పెక్కుమందివద్ద అప్పు తీసుకున్నవాడు అప్పు ఇచ్చినధనవంతులకు ఒకవరుసలో అప్పు తీర్చేటట్లు రాజు చేయాలి. అంటే ముందుగా బ్రాహ్మణుడికి, తరువాత క్షత్రియుడికీ అనే క్రమంలో రాజు ఆ అప్పు తీర్పించాలి.

రాజ్ఞాధమర్ణికో దాప్యస్సాధితాద్దశకం స్మృతమ్ ।
పఞ్చకం తు శతం దాప్యః ప్రాప్తార్థో హ్యుత్తమర్ణికః ॥2॥

అప్పు తీసుకున్నవాడిచేత నూటికి పదిచొప్పున వడ్డీ ఇప్పించాలి. అప్పు ఇచ్చినవాడు తన అప్పు తీరిన తరువాత వడ్డీగా వచ్చిన పదిలో అయిదు రాజుకు ఇవ్వాలి.

హీనజాతిం పరిక్షీణమృణార్థం కర్మ కారయేత్ ।
బ్రాహ్మణస్తు పరిక్షీణశ్శనైర్దాప్యో యథోదయమ్ ॥3॥

అప్పు తీర్చడానికి ధనం లేని తక్కువజాతివాడిచేత అప్పు తీర్పించడానికి ధనానికి బదులుగా అప్పు ఇచ్చినవాడికి పనులు చేయించాలి. అప్పు తీర్చడానికి తగిన ధనంలేనివాడు బ్రాహ్మణుడయితే, అతడికి ధనం సమకూరినపుడు లభించినంత మేరగా మెల్లగా అప్పు తీర్పించాలి.

దీయమానం న గృహ్ణాతి ప్రయుక్తం యస్స్వకం ధనమ్ ।
మధ్యస్థస్థాపితం తత్ స్యాద్వర్ధతే న తతః పరమ్ ॥4॥

అప్పు తీసుకున్నవాడు తిరిగి ఇచ్చినపుడు అప్పు ఇచ్చినవాడు ఆ ధనాన్ని తీసుకోని పక్షంలో దానిని మధ్యవర్తివద్ద ఉంచాలి. ఆ రోజునుండి ఆ సొమ్ముకు వడ్డీ ఇవ్వ నవసరం లేదు. (ఋణదాత అడిగినపుడు మధ్యవర్తినుండి ఆ ధనం ఇప్పించాలి. లేకపోతే అప్పటినుండి మళ్లీ వడ్డి ఇవ్వాలి.)

ఋక్థగ్రాహ ఋణం దాప్యో యోషిద్గ్రాహ స్తథైవ చ ।
పుత్రోఽనన్యాశ్రితద్రవ్యః పుత్రహీనస్య ఋక్థినః ॥5॥

తండ్రిఆస్తిని తీసుకున్నవాడు అతడిఅప్పును కూడా తనదిగా గ్రహించి, తీర్చాలి. అలాగే ఒకడిభార్యను తీసుకున్నవాడు అతడిఅప్పును కూడా తీసుకుని తీర్చాలి. కొడుకులు లేనివాడి ఆస్తిని అనుభవించే వారసులు ఎవరూ లేకపోవడంచేత, అతడి ఆస్తిని తీసుకున్న వేరొకడు అతడి అప్పును కూడ తీర్చాలి.

అవిభక్తైః కుటుమ్బార్థం యదృణం తు కృతం భవేత్ ।
దద్యుస్తదృక్థినః ప్రేతే ప్రోషితే వా కుటుమ్బిని ॥6॥

ఉమ్మడికుటుంబంలో ఉండి, కుటుంబంకోసం అప్పు చేసినవాడు మరణించినా, లేదా ఇతరదేశాలకు వెళ్లిపోయినా ఆ కుటుంబంలోని వారందరూ కలిసి ఆ అప్పు తీర్చాలి.

న యోషిత్ పతిపుత్రాభ్యాం న పుత్రేణ కృతం పితా ।
దద్యాదృతే కుటుమ్బార్థాన్న పతిః స్త్రీకృతం తథా ॥7॥

భర్త గాని, కొడుకు గాని చేసిన అప్పును స్త్రీ తీర్చవలసిన అవసరం లేదు. కొడుకు చేసిన అప్పును తండ్రి తీర్చనక్కర లేదు. భార్య చేసిన అప్పును భర్త తీర్చనవసరం లేదు. కాని కుటుంబం కోసం అప్పు చేస్తే మాత్రం కుటుంబంలోనివారు ఎవరు చేసినా ఆ కుటుంబంలోని ఇతరులు తీర్చాలి.

గోపశౌణ్డికశైలూషరజకవ్యాధయోషితామ్ ।
ఋణం దద్యాత్పతిస్తాసాం యస్మాద్వృత్తి స్తదాశ్రయా ॥8॥

గొల్లవాళ్లు, మద్యం అమ్మేవాళ్లు, నటులు, చాకలివాళ్లు, వేటగాళ్లు, మొదలైనవారు తమ భార్యల సహకారంతోనే తమ వృత్తి చేయగలుగుతున్నారు. కాబట్టి భార్య చేసిన అప్పును వీళ్లు తప్పకుండా తీర్చాలి.

ప్రతిపన్నం స్త్రియా దేయం పత్యా వా సహ యత్కృతమ్ ।
స్వయం కృతం వా యదృణం నాన్యత్ స్త్రీ దాతుమర్హతి ॥9॥

భర్త అప్పుచేసి తెచ్చిన ధనం తీసుకున్న భార్య (కొడుకులు లేనపుడు) ఆ అప్పు తీర్చాలి. భర్తతో కలిసి చేసిన అప్పు భార్య తీర్చాలి. అలాగే స్వయంగా తానై చేసినఅప్పునూ (కొడుకులు లేని) స్త్రీ తీర్చాలి. ఇతరవిధమైన అప్పు స్త్రీ తీర్చనక్కర లేదు.

పితరి ప్రోషితే ప్రేతే వ్యసనాభిప్లుతేఽథవా ।
పుత్రపౌత్రైరృణం దేయం నిహ్నవే సాక్షిభావితమ్ ॥10॥

అప్పు చేసిన తండ్రి ఇతరదేశాలకు వెళ్లినా, మరణించినా, కష్టాలలో ఉన్నా, (అప్పు తీర్చలేనపుడు) కొడుకులు, లేదా కొడుకుకుమారులు ఆ అప్పు తీర్చాలి. వాళ్లు ఆ విషయాన్ని దాచిపెట్టి, అప్పు తిరిగి ఇవ్వనపుడు సాక్షులద్వారా నిరూపించి అప్పు వసూలు చేసుకోవాలి.

సురాకామద్యూతకృతం దణ్డశుల్కావశిష్టకమ్ ।
వృథాదానం తథైవేహ పుత్రో దద్యాన్న పైతృకమ్ ॥11॥

తండ్రి మద్యంకోసం, స్త్రీకోసం, జూదంకోసం చేసిన అప్పునూ, అతడు చేసిన నేరానికి దండనగా విధించిన ద్రవ్యంలో మిగిలిన భాగాన్నీ, ప్రయోజనహీనంగా చేసిన దానాన్నీ కొడుకు తీర్చనవసరం లేదు.

భ్రాతౄణామథ దమ్పత్యోః పితుః పుత్రస్య చైవ హి ।
ప్రతిభావ్యమృణం గ్రాహ్యమవిభక్తేన చ స్మృతమ్ ॥12॥

సోదరులకు, భార్యాభర్తలకు, తండ్రీకొడుకులకు సంబంధించిన ఉమ్మడిసొత్తులో చేసిన అప్పును ఆ ఒక్కరు మాత్రమే తీర్చ నవసరం లేదు.

దర్శనే ప్రత్యయే దానే ప్రాతిభావ్యం విధీయతే ।
ఆధౌ తు వితథే దాప్యా వితథస్య సుతా అపి ॥13॥

దర్శనం (అప్పు తీసుకున్నవాడిని ఎప్పుడు కావాలంటే అప్పుడు అప్పు ఇచ్చినవాడికి చూపడం), ప్రత్యయం (అప్పు తీసుకున్నవాడు తీరుస్తాడనే నమ్మకం), దానం (అప్పు తీర్చడం) అనేవాటిలో హామీ ఉండవచ్చును. తాకట్టు పెట్టి ధనం అప్పు తీసుకున్నవాడు ఆ అప్పు తీర్చకపోతే, దానిని కొడుకులు తీర్చి తాకట్టు విడిపించుకోవచ్చును.

దర్శనప్రతిభూర్యత్ర, మృతః ప్రాత్యయికోఽపి వా ।
న తత్పుత్రా ధనం దద్యుర్దద్యు ర్దానాయ యే స్థితాః ॥
బహవ స్స్యుర్యది స్వాంశైర్దద్యుః ప్రతిమనోరథమ్ ॥14॥

కావలసినపుడు ప్రతివాదిని చూపిస్తాను అని దర్శనానికి హామీ ఉన్నవాడు గాని, ప్రతివాదిని నమ్మవచ్చు ననడానికి హామీ ఉన్నవాడు గాని మరణిస్తే, వారి కొడుకులు వాదిఅప్పును తీర్చనవసరం లేదు. అప్పు చేసినవాడు ఆ అప్పు తీర్చకపోతే మేము తీరుస్తాము అని హామీగా చాలమంది ఉన్నపుడు వాళ్లందరూ ఆ సొమ్మును సమానభాగాలుగా చేసుకుని తీర్చాలి.

ఏకచ్ఛాయాశ్రితేష్వేషు ధనికస్య యథారుచి ॥15॥

అందరూ ఎవరికి వారు పూర్తి అప్పుకు హామీ ఉన్నప్పుడు, అప్పు ఇచ్చినవాడు వారందరిలో తన ఇష్టం వచ్చినవాడి ఒక్కడిదగ్గరే మొత్తం అప్పు వసూలు చేసుకోవచ్చును.

ప్రతిభూర్దాపితో యత్ర ప్రకాశం ధనినో ధనమ్ ।
ద్విగుణం ప్రతిదాతవ్య మృణికైస్తస్య తద్భవేత్ ॥16॥

అప్పుకు హామీగా ఉన్నవాడు అందరియెదుట అప్పు ఇచ్చినవాడు చెల్లించినసొమ్ముకు రెట్టింపు సొమ్ము అప్పుతీసుకున్న వాడిచేత అతడికి (హామీ ఉండి చెల్లించినవాడికి) ఇప్పించాలి.

స సన్తతిస్త్రీపశవ్యం ధాన్యం ద్విగుణమేవ చ ।
వస్త్రం చతుర్గుణం ప్రోక్తం రసశ్చాష్టగుణ స్తథా ॥17॥

ఆడపశువును అప్పుగా తీసుకున్నవాడు, దానిసంతానాన్ని వడ్డీగా ఇవ్వాలి. ధాన్యం అప్పు తీసుకున్నవాడు తీసుకున్నదానికి రెట్టింపు వడ్డీ ఇవ్వాలి. వస్త్రం తీసుకున్నవాడు తీసుకున్నదానికి నాలుగురెట్లు వడ్డీ ఇవ్వాలి. నూనె మొదలైనరసాలు తీసుకున్నవాటికి ఎనిమిదిరెట్లు వడ్డీగా ఇవ్వాలి.

ఆధిః ప్రణశ్యేద్ద్విగుణే ధనే యది న మోక్ష్యతే ।
కాలే కాలకృత్యం నశ్యేత్ ఫలభోగ్యో న నశ్యతి ॥18॥

తాకట్టు పెట్టి తీసుకున్న అప్పుపైన వడ్డీ రెట్టింపు అయినప్పటికీ అప్పు తీర్చకపోతే, ఆ తాకట్టువస్తువు అప్పు ఇచ్చినవాడికి సొంతం అవుతుంది. ఇంతకాలంలో విడిపించుకుంటానని చెప్పి, తీసుకున్న అప్పు ఆ కాలంలో

తీర్చకపోతే, వడ్డీతో నిమిత్తం లేకుండా, ఆ తాకట్టువస్తువు అప్పిచ్చినవాడికి సొంతం అవుతుంది. కాని తాకట్టు పెట్టినవస్తువు తోట, పొలంవంటిది అయితే, దానిఫలాన్ని అప్పిచ్చినవాడు అనుభవిస్తూ ఉంటే మాత్రం ఆ తాకట్టువస్తువు యజమానికే చెందుతుంది.

గోప్యాధిభోగ్యే నా వృద్ధి స్సోపకారేఽథ భావితే ।
నష్టో దేయో వినష్టశ్చ దైవరాజకృతాదృతే ॥19॥

అప్పు ఇచ్చినవాడు ఉపయోగించుకునే, దాచి ఉంచదగిన ఆభరణంవంటి వస్తువును తాకట్టు పెట్టినపుడు వడ్డీ ఇవ్వనవసరం లేదు. అలాగే అప్పిచ్చినవాడు అనుభవించే పాలు మొదలైన లాభాలు చేకూర్చే పశువులు మొదలైనవాటిని తాకట్టు పెట్టినపుడు వడ్డీ ఇవ్వనక్కర లేదు.

ఆధేస్స్వీకరణాత్ సిద్ధీ రక్షమాణోఽ ప్యసారతామ్ ।
యాతశ్చేదన్య ఆధేయో ధనభాగ్వా ధనీ భవేత్ ॥20॥

తాకట్టు పెట్టినవస్తువు రక్షించవలసినది అయినపుడు ఆ వస్తువు పాడైపోయినా, నష్టమై పోయినా అప్పు ఇచ్చినవాడు అప్పు తీసుకున్నవాడికి తిరిగి అటువంటిదే ఇంకొకటి ఇవ్వాలి. లేదా దానివిలువకు సరిపడిన ధనం ఇవ్వాలి.

చరిత్రబన్ధకకృతం సవృద్ధ్యా దాపయేద్ధనమ్ ।
సత్యంకారకృతం ద్రవ్యం ద్విగుణం ప్రతి దాపయేత్ ॥21॥

కేవలం నమ్మకం మీద తీసుకున్నఅప్పును వడ్డీతో సహా తీర్పించాలి. ఒడబడికతో తీసుకున్నసొమ్మును రెట్టింపు ఇప్పించాలి.

ఉపస్థితస్య భోక్తస్య ఆధిర్దణ్డోఽ న్యథా భవేత్ ।
ప్రయోజకే సతి ధనం కులేఽ న్య స్యాధి మాప్నుయాత్ ॥22॥

తాకట్టు విడిపించుకోవలసిన సమయం వచ్చినపుడు విడిపించుకోవడానికి వస్తే, తాకట్టువస్తువు ఇచ్చేయాలి. లేనిపక్షంలో అతడు దండనకు అర్హు డవుతాడు. ఒకవేళ ఆ సమయంలో అప్పు ఇచ్చినవాడు సన్నిహితంగా లేకపోతే అతడి కుటుంబంలో తగినవాడు ఉన్నపుడు వాడికి అప్పు తీర్చి తాకట్టువస్తువు విడిపించుకోవాలి.

తత్కాలకృతమూల్యో వా తత్ర తిష్ఠేదవృద్ధికః ।
వినా ధారణకాద్వాపి విక్రీణీతే సమాక్షికమ్ ॥23॥

లేకపోతే ఆ రోజువరకు వడ్డీ ఎంత అయిందో నిర్ణయించుకోవాలి. తాకట్టువస్తువును అక్కడే ఉంచాలి. కాని ఆ తరువాత వడ్డీ ఇవ్వనవసరం లేదు. అప్పు ఇచ్చినవాడు వచ్చినతరువాత అప్పుసొమ్ము ఇచ్చి, తాకట్టువస్తువు విడిపించుకోవాలి. అప్పు తీర్చలేకపోతే సాక్షులసమక్షంలో తాకట్టువస్తువు అమ్మి, అప్పు పోగా మిగిలినసొమ్ము తాను తీసుకోవాలి.

యదా తు ద్విగుణీభూత మృణమాధౌ తదా ఖలు ।
మోచ్యశ్చాధి స్తదుత్పాద్య ప్రవిష్టే ద్విగుణే ధనే ॥24॥

వడ్డీ పెరిగి అసలుకు రెట్టింపు అయినపక్షంలో ఆ మొత్తం ధనమూ ఇచ్చి తాకట్టు విడిపించుకోవాలి.

వ్యసనస్థమనాఖ్యాయహస్తేఽ న్యస్య యదర్పయేత్ ।
ద్రవ్యం తదౌపనిధికం ప్రతిదేయం తథైవ తత్ ॥25॥

పెట్టె మొదలయిన వాటిలో ఉంచి, తెరవడానికి అవకాశం లేకుండా చేసి, అందులో ఏమున్నదో చెప్పకుండా, ఇతరులచేతిలో ఉంచి, జాగ్రత్తగా ఉంచమని ఇచ్చిన ద్రవ్యాన్ని ఔపనిధికం (ఉపనిధి) అంటారు. దానిని అలాగే తిరిగి ఇచ్చివేయాలి.

న దాప్యోఽ పహృతం తత్తు రాజదైవతతస్కరైః ।
ప్రేషశ్చేన్మార్గితే దత్తే దాప్యో దణ్డశ్చ తత్సమమ్ ॥26॥

ఆ ఉపనిధి రాజు తీసుకున్నా, దైవికంగా పోయినా, దొంగలు అపహరించినా తిరిగి ఇవ్వనవసరం లేదు. కాని ఉపనిధిని దాచినవాడు తిరిగిఇమ్మని అడిగినపుడు ఇవ్వకపోతే, వాడిచేత ఆ సొమ్మును ఇప్పించాలి. ఇంకా దానితో సమానమైనసొమ్ము దండనగా విధించాలి.

ఆజీవన్ స్వేచ్ఛయా దణ్డ్యో దాప్యస్తచ్చాపి సోదయమ్ ।
యాచితాన్వాహితన్యాసనిక్షేపాదిష్వయం విధిః ॥27॥

ఉపనిధిని సొంతసొమ్ములాగా వాడుకున్నా, అది పెట్టుబడిగా దానిపై వడ్డి మొదలుగా అధికాన్ని సంపాదించినా, అతడినుండి ఆ సొమ్మును వడ్డీతో సహా వసూలు చేయాలి. ఇంకా అదనంగా శిక్షించాలి. యాచించి సంపాదించినదీ, హక్కు కలిగినవారికి ఇవ్వమని ఇంకొకరి దగ్గర ఉంచినదీ, దాచిపెట్టి, తరువాత ఇమ్మని ఇచ్చినదీ, పాతిపెట్టి ఉంచినదీ అయిన సొమ్మువిషయంలో కూడా ఉపనిధిలాగానే విధినియమాలను పాటించాలి.

ఇత్యాది మహాపురాణే ఆగ్నేయే వ్యవహారకథనం నామ చతుఃపఞ్చాశదధికద్విశతతమోఽ ధ్యాయః ॥254॥

అగ్నిమహాపురాణంలో వ్యవహారకథనం అనే రెండువందల యాభైనాల్గవ అధ్యాయం సమాప్తం.



పఞ్చపఞ్చాశదధికద్విశతతమోఽధ్యాయః – రెండువందల యాభైఐదవ అధ్యాయం

దివ్యప్రమాణకథనమ్ – దివ్యప్రమాణకథనం

అగ్నిరువాచ – వసిష్ఠమహర్షితో అగ్నిదేవుడు ఇలా చెప్తున్నాడు.

తపస్వినో దానశీలాః కులీనాస్సత్యవాదినః ।
ధర్మప్రధానా ఋజవః పుత్రవన్తో ధనాన్వితాః ॥1॥

తాపసులు, దానం చేసే స్వభావం ఉన్నవాళ్ళు, గొప్పకులంలో పుట్టినవాళ్లు, సత్యమే మాట్లాడేవాళ్లు, ధర్మమే ముఖ్యంగా ప్రవర్తించేవాళ్లు, వంకరబుద్ధి లేనివాళ్లు, కొడుకులు కలిగినవాళ్లు ధనవంతులు.

పఞ్చయజ్ఞక్రియాయుక్తాస్సాక్షిణః పఞ్చ వా త్రయః ।
యథాజాతి యథావర్ణం సర్వే సర్వేషు వా స్మృతాః ॥2॥

పంచ(దేవ, భూత, పితృ, బ్రహ్మ, మనుష్య)యజ్ఞాలు ఆచరించేవాళ్లు, వ్యవహారంలో ఇటువంటివాళ్లు అయిదుగురు, లేదా ముగ్గురు సాక్షులుగా ఉండాలి. సాక్షులు వాదిప్రతివాదులజాతికీ, వర్ణానికీ, అనుగుణమైనవారు కావాలి. లేదా అందరికీ అందరూ ఉండవచ్చు.

స్త్రీవృద్ధబాలకితవమత్తోన్మత్తాభిశస్తకాః ।
రఙ్గావతారిపాషణ్డికూటకృద్వికలేన్ద్రియాః ॥
పతితాప్తార్థసమ్బన్ధిసహాయరిపుతస్కరాః ॥3॥

స్త్రీలు, ముసలివారు, పిల్లలు, జూదరులు, మద్యం మత్తులో ఉన్నవాళ్లు, పాపాలు చేసినవాళ్లు, నటులు, వేదమార్గాన్ని నిందించేవాళ్లు, మోసం చేసేవాళ్లు, ఇంద్రియాలు సరిగా పనిచేయనివాళ్లు, ధర్మభ్రష్టులు, ఆత్మీయులు, ప్రయోజనం ఉద్దేశించి ఉన్నవాళ్లు, సహాయం చేసేవాళ్లు, శత్రువులు, దొంగలు,

అసాక్షిణస్సర్వసాక్ష్యే చౌర్యపారుష్యసాహసే ।
ఉభయానుమతస్సాక్షీ భవత్యేకోఽపి ధర్మవిత్ ॥4॥

వీళ్లు – దొంగతనం, వాక్పారుష్యం దండపారుష్యం, సాహసం అనే దోషాలవిషయంలోనూ, అలాగే అన్నివ్యవహారాలలోనూ సాక్షులుగా పనికిరారు. వాది ప్రతివాదులిద్దరూ అంగీకరించినపుడు ధర్మం తెలిసినవాడు ఒక్కడైనా సరే, సాక్షిగా ఉండవచ్చు.

అబ్రువన్ హి నరస్సాక్ష్యమృణం స దశబన్ధకమ్ ।
రాజ్ఞా సర్వం ప్రదాప్యస్స్యాత్ షట్చత్వారింశకేఽహని ॥5॥

సాక్షిగా వచ్చినవాడు సాక్ష్యం చెప్పకపోతే, అప్పుసొమ్మును పదవవంతు అధికంగా కలిపి, మొత్తం నలభైఆరవరోజు లోపుగా అప్పు ఇచ్చినవాడికి రాజు ఇప్పించాలి.

న దదాతి హి యస్సాక్ష్యం జానన్నపి నరాధమః ।
స కూటసాక్షిణాం పాపైస్తుల్యో దణ్డేన చైవ హి ॥6॥

యథార్థం తెలిసి కూడా సాక్ష్యం చెప్పని నీచమానవుడు అబద్ధపు సాక్ష్యం చెప్పినవాడితో సమానమైన పాపాన్ని పొందుతాడు. ఇటువంటివాడిని అబద్ధపు సాక్ష్యం చెప్పినవాడితో సమానంగా శిక్షించాలి.

సాక్షిణ శ్శ్రావయే ద్వాదిప్రతివాదిసమీపగాన్ ॥7॥

వాది, ప్రతివాదుల దగ్గర ఉన్న సాక్షులకు ఈవిధంగా వినిపించాలి.

యే పాతకకృతాం లోకా మహాపాతకినాం తథా ।
అగ్నిదానాం చ యే లోకా యే చ స్త్రీబాలఘాతినామ్ ॥
తాన్సర్వాన్సమవాప్నోతి యస్సాక్ష్యమనృతం వదేత్ ॥8॥

సాక్షులారా! పాపాలు చేసినవారూ, మహాపాతకాలు చేసినవారూ, ఇళ్లు మొదలైనవాటికి నిప్పుపెట్టినవారూ, ఆడవాళ్లనూ, పిల్లలనూ చంపినవారూ, – తాము చేసినపాపానికి ఫలితంగా ఏ(నరక)లోకాలను పొందుతారో, ఆ లోకాలు అన్నీ అబద్ధపుసాక్ష్యం చెప్పినవాడికి కలుగుతాయి.

సుకృతం యత్త్వయా కిఞ్చిజ్జన్మాన్తరశతైః కృతమ్ ।
తత్సర్వం తస్య జానీహి యం పరాజయసే మృషా ॥9॥

నీవు పూర్వం నూరుజన్మలలో చేసుకున్న పుణ్యం సమస్తమూ, అబద్ధపు సాక్ష్యం చెప్పి, నీవు ఓడించినవాడికి చెందుతుంది అని తెలుసుకో.

ద్వైధే బహూనాం వచనం సమేషు గుణినాం తథా ।
గుణిద్వైధే తు వచనం గ్రాహ్యం యే గుణవత్తరాః ॥10॥

చాలమంది సాక్షులు ఉండి, వారు చెప్పిన సాక్ష్యం రెండురకాలు(అనేకవిధాలు)గా ఉన్నపుడు ఎక్కువమంది చెప్పినమాటను ప్రమాణంగా (సాక్ష్యంగా) తీసుకోవాలి. సాక్ష్యం రెండురకాలుగానూ, అలా చెప్పినవారి సంఖ్య రెండుపక్షాలలోనూ సమానంగా ఉన్నపుడు – వారిలో గుణవంతులు చెప్పినదానిని ప్రమాణంగా తీసుకోవాలి. గుణవంతులు ఇద్దరు రెండు రకాలుగా సాక్ష్యం చెప్తే, వారిలో అధికగుణవంతుల మాటను ప్రమాణంగా తీసుకోవాలి.

యస్యోచుస్సాక్షిణ స్సత్యాం ప్రతిజ్ఞాం స జయీ భవేత్ ।
అన్యథా వాదినో యస్య ధ్రువస్తస్య పరాజయః ॥11॥

వాది ప్రతివాదులలో ఎవరి వాదాన్ని యథార్థంగా చెప్తారో, అతడు గెలుస్తాడు. సాక్షులు ఎవరిమాటను సరికాదని మరొకవిధంగా చెప్తారో, అతడు ఓడిపోతాడు. ఇది నిశ్చయం.

ఉక్తేఽపి సాక్షిభిస్సాక్ష్యే యద్యన్యే గుణవత్తరాః ।
ద్విగుణావన్యథా బ్రూయుః కూటాస్స్యుః పూర్వసాక్షిణః ॥12॥

వాది ప్రతివాదులలలో ఒకరివాదాన్ని మొదట సాక్షులు యథార్థంగా చెప్పినప్పటికీ, తరువాత వారికి రెట్టింపు సంఖ్యలో మంచిగుణవంతులైనవారు ముందటివారు చెప్పిన సాక్ష్యం అబద్ధం అని చెప్తే, ఆ మొదటిసాక్ష్యం నిలవదు. మొదటివారు అందరూ కూట(అబద్ధపు)సాక్షులు అవుతారు.

పృథక్ పృథగ్దణ్డనీయాః కూటకృత్సాక్షిణ స్తథా ।
వివాదాద్ద్విగుణం దణ్డం వివాస్యో బ్రాహ్మణస్స్మృతః ॥13॥

అబద్ధపుసాక్ష్యం చెప్పినవాళ్ళ నందరినీ, వేరు వేరుగా శిక్షించాలి. ఆ వివాదానికి కారణమైన సొమ్ముకు రెట్టింపు దండనగా విధించాలి. వాడు బ్రాహ్మణుడయితే దేశం నుండి వెళ్లగొట్టాలి.

యస్సాక్ష్యం శ్రావితోఽన్యేభ్యో నిహ్నుతే తత్తమోవృతః ।
స దాప్యోఽష్టగుణం దణ్డం బ్రాహ్మణం తు వివాసయేత్ ॥ 14॥

ఇతరులకు వినిపించిన సాక్ష్యాన్ని ఎవరికీ తెలియకుండా దాచిపెట్టినవాడికి, వివాదానికి ఎనిమిది రెట్లధనం దండనగా విధించాలి. అతడు బ్రాహ్మణుడయితే దేశంనుండి వెళ్లగొట్టాలి.

వర్ణినాం హి వధో యత్ర తత్ర సాక్ష్యేఽనృతం వదేత్ ॥15॥

బ్రహ్మచారులను (బ్రాహ్మణాది వర్ణాలవారిని) చంపే సందర్భంలో (వధను ఆపడంకోసం) సాక్షి అబద్ధం చెప్పవచ్చును.

యః కశ్చిదర్థోఽభిమతస్స్వరుచ్యా తు పరస్పరమ్ ।
లేఖ్యం తు సాక్షిమత్కార్యం తస్మిన్ ధనికపూర్వకమ్ ॥16॥

అప్పు ఇచ్చేవాడూ, అప్పు పుచ్చుకునేవాడు ఇద్దరూ పరస్పరం అంగీకారంతో ధనం ఇచ్చిపుచ్చుకోవడాలు చేసుకుంటున్నపుడు, ఆ ధనాన్ని గురించి మొదట అప్పు ఇచ్చేవాడు,(తరువాత అప్పుతీసుకున్నవాడు తమ అంగీకారాన్ని సంతకాలతో,) ఒకపత్రంమీద వ్రాసుకోవాలి. ఆ పత్రం సాక్షులతో (సాక్షిసంతకాలతో) కూడి ఉండాలి.

సమామాసతదర్ధాహర్నామజాతిస్వగోత్రకైః ।
సబ్రహ్మచారికాత్మీయపితృనామాదిచిహ్నితమ్ ॥17॥

సంవత్సరం, నెల, పక్షం, రోజు, పేరు, జాతి, వారిగోత్రంలో పుట్టినవాళ్లు, స్నేహితులు, చుట్టాలు, తండ్రి మొదలైన వాళ్లపేర్లు అక్కడ ఉండాలి.

సమాప్తేఽర్థే ఋణీ నామ స్వహస్తేన నివేశయేత్ ।
మతం మేఽముకపుత్రస్య యదత్రోపరి లేఖితమ్ ॥18॥

పత్రం వ్రాయడం పూర్తి అయిన తరువాత అప్పు తీసుకున్నవాడు 'పైన వ్రాసినది ఫలానావారి పుత్రుడి నయిన నాకు అంగీకారం' అని తన చేతులతో వ్రాసి, సంతకం చేయాలి.

సాక్షిణశ్చ స్వహస్తేన పితృనామకపూర్వకమ్ ।
అత్రాహమముకస్సాక్షీ లిఖేయురితి తే సమాః ॥19॥

సాక్షులు కూడ అందరూ ఫలానా వారి పుత్రుడనయిన నేను దీనికి (పైన వ్రాసిన దానికి ప్రత్యక్ష) సాక్షిని అని తమ తండ్రిపేరు కూడ కలిపి, స్వహస్తాలతో వ్రాసి, సంతకం చేయాలి.

అలిపిజ్ఞ ఋణీ యస్స్యాల్లేఖయేత్ స్వమతం తు సః ।
సాక్షీ వా సాక్షిణాన్యేన సర్వసాక్షిసమీపతః ॥20॥

అప్పు తీసుకున్నవాడు అక్షరజ్ఞానం లేనివాడు (వ్రాయడం చేతకానివాడు) అయితే, అతడు సాక్షులందరిముందు తన అభిప్రాయాన్ని సాక్షిచేత గాని, ఇతరులచేత గాని ఇలా వ్రాయించాలి.

ఉభయాభ్యర్థితేనైతన్మయా హ్యముకసూనునా ।
లిఖితంహ్యాముకేనేతి లేఖకోఽన్తే తతో లిఖేత్ ॥21॥

పత్రం వ్రాసేవాడు 'ఫలానా వారి పుత్రుడినయిన నేను అప్పు ఇచ్చినవాడూ, పుచ్చుకున్నవాడూ ఇద్దరూ కోరినందుచేత ఈ లేఖ వ్రాస్తున్నాను' అని ఆ లేఖ చివర వ్రాయాలి.

వినాపి సాక్షిభిర్లేఖ్యం స్వహస్తలిఖితం చ యత్ ।
తత్ ప్రమాణం స్మృతం సర్వం బలోపాధికృతాదృతే ॥22॥

అప్పు తీసుకున్నవాడు స్వహస్తాలతో ఋణపత్రాన్ని వ్రాసినపక్షంలో దానికి సాక్షులు లేకపోయినప్పటికీ ఆ పత్రం ప్రామాణికమే అవుతుంది. కాని బలవంతంగా కాని, వంచనతో కాని అలా వ్రాయిస్తే ఆ పత్రం చెల్లుబాటు కాదు.

ఋణం లేఖ్యకృతం దేయం పురుషైస్త్రిభిరేవ తు ।
ఆధిస్తు భుజ్యతే తావద్ యావత్తన్న ప్రదీయతే ॥23॥

ఋణపత్రం వ్రాసి తీసుకున్నఅప్పును తీసుకున్నవాడినుండి ఆ వంశంలో మూడుతరాలవారివరకు తీర్చవలసిఉంటుంది. తాకట్టు పెట్టినవస్తువును మాత్రం అప్పు తీర్చేంతవరకు తాకట్టు పెట్టుకున్నవాడు అనుభవింపవచ్చు.

దేశాన్తరస్థే దుర్లేఖ్యే నష్టోన్మృష్టే హృతే తథా ।
భిన్నే ఛిన్నే తథా దగ్ధే లేఖ్యమన్యత్తు కారయేత్ ॥ 24॥

పత్రం వ్రాసినవాడు ఇతర దేశాలలో ఉన్నపుడు, తప్పుగా వ్రాసినపుడు, ఆ పత్రం నష్టమైపోయినపుడు, చెరిపివేసినపుడు, దొంగిలింపబడినపుడు, చిరిగినపుడు, ముక్కలైనపుడు, తగలబడిపోయినపుడు, ఇంకొకపత్రాన్ని వ్రాయాలి.

సన్దిగ్ధార్థవిశుద్ధ్యర్థం స్వహస్తలిఖితం తు యత్ ।
యుక్తిప్రాప్తిక్రియాచిహ్నసమ్బన్ధాగమహేతుభిః ॥25॥

తీసుకున్నఋణం తిరిగిరావడం గురించిన సందేహాలను తొలగించడానికి, అప్పును తిరిగి సంపాదించడంలో ఉన్న మార్గం, అప్పుసొత్తు తిరిగి వచ్చేవిధం, అప్పును తిరిగి సంపాదించడంలో చేయదగిన

క్రియ, ఋణం తీసుకున్నవాడికి సంబంధించిన గుర్తులు, అప్పు ఇచ్చినవాడికీ తీసుకున్నవాడికీ నడుమ ఉన్న సంబంధం, ధనం తిరిగివచ్చే సమయ సందర్భాలు, దానికి తగిన కారణం అనేవిషయాలను ఋణగ్రహీత స్వహస్తంతో వ్రాయాలి.

లేఖ్యస్య పృష్ఠేఽభిలిఖేత్ ప్రవిష్ట మధమర్ణినః ।
ధనీ చోపగతం దద్యాత్ స్వహస్తపరిచిహ్నితమ్ ॥26॥

అప్పు తీసుకున్నవాడు అప్పులో కొంతభాగం తిరిగి ఇచ్చినపుడు, దానిని ఋణపత్రం వెనకవైపు వివరంగా వ్రాయాలి. దానిక్రింద స్వహస్తంతో నిర్ధారిస్తూ, సంతకం చేయాలి.

దత్త్వార్ణం పాటయేల్లేఖ్యం శుద్ధ్యై చాన్యత్తు కారయేత్ ।
సాక్షిమచ్చ భవేద్యస్తు తద్దాతవ్యం ససాక్షికమ్ ॥27॥

అప్పు పూర్తిగా తీర్చివేసిన తరువాత ఋణపత్రాన్ని చించివేయాలి. బాకీ తీరినట్లుగా అప్పు ఇచ్చినవాడు కొత్తగా ఒకపత్రం ఋణగ్రహీతకు వ్రాసి ఇవ్వాలి. సాక్షుల సమక్షంలో తీసుకున్న అప్పును సాక్షుల సమక్షంలోనే తీర్చాలి.

తులాగ్న్యాపో విషం కోశో దివ్యానీహ విశుద్ధయే ।
మహాభియోగేష్వేతాని శీర్షకస్థేఽభియోక్తరి ॥28॥

సందేహాలను తొలగించడానికి తుల, నిప్పు, నీళ్లు, విషం, కోశం అనే అయిదు దివ్యమైన ప్రమాణాలు. అభియోగాలు చాల తీవ్రంగా ఉన్నపుడు, అభియోగం చేసినవాడు ప్రధానమైన స్థానంలో ఉన్నపుడు ఈ ప్రమాణాలను వినియోగించాలి.

రుచ్యా వాఽన్యతరః కుర్యాదితరో వర్తయేచ్ఛిరః ।
వినాపి శీర్షకాత్ కుర్యాన్నృపద్రోహేఽథ పాతకే ॥29॥

వాది ప్రతివాదులు ఇద్దరూ అంగీకారంతో దివ్యప్రమాణాలను ప్రయోగించాలి. లేకపోతే ఇతరప్రమాణాలను ప్రధానం చేసుకోవాలి. రాజద్రోహంలోనూ, పాతకం జరిగిన సందర్భంలోనూ వివాదం పూర్తి అయ్యేస్థితికి రాకముందే ఈ ప్రమాణాలను అనుసరించాలి.

నాసహస్రాద్ధరేత్ఫాలం న తులాం న విషం తథా ।
నృపార్థేష్వభియోగేషు వహేయుశ్శుచయస్సదా ॥30॥

వెయ్యిపణాలకంటె తక్కువ అయిన అభియోగాల విషయంలో తుల లేదా విషం అనే ప్రమాణాలను వాడరాదు. రాజద్రోహానికి సంబంధించిన అభియోగాల విషయంలో సజ్జనులెప్పుడూ ఈ ప్రమాణాలను వినియోగించవచ్చు.

సహస్రార్ధే తులాదీని కోశమల్పేఽపి దాపయేత్ ।
శతార్ధం దాపయేచ్ఛుద్ధమశుద్ధో దణ్డభాగ్భవేత్ ॥31॥

వెయ్యి పణాల ఋణం విషయంలో తుల మొదలైన ప్రమాణాలను ప్రయోగించాలి. అంతకంటె తక్కువ ఋణం విషయంలోనూ కోశం ప్రయోగించవచ్చు. దోషం లేనివాడికి రెండవవాడిచేత యాభై పణాలు అధికంగా ఇప్పించాలి. దోషం చేసినవాడు అయితే, శిక్షకు అర్హుడవుతాడు.

సచేలస్నాతమాహూయ సూర్యోదయ ఉపోషితమ్ ।
కారయేత్ సర్వదివ్యాని నృపబ్రాహ్మణసన్నిధౌ ॥32॥

ముందరిరోజు ఉపవాసం చేసి, మర్నాడు సూర్యుడు ఉదయించే సమయానికి వస్త్రాలతో సహా స్నానం చేసిన వాడిని ఆహ్వానించి, రాజు, బ్రాహ్మణుల సమక్షంలో దివ్యప్రమాణాలు చేయించాలి.

తులా స్త్రీబాలవృద్ధాన్ధపఙ్గుబ్రాహ్మణరోగిణామ్ ।
అగ్నిర్జలం వా శూద్రస్య యవాస్సప్తవిషస్య వా ॥33॥

అపరాధం చేసినవాళ్లు స్త్రీలు, పిల్లలు, ముసలివాళ్లు, గ్రుడ్డివాళ్లు, బ్రాహ్మణులు, రోగులు అయితే వారిచేత తుల అనే ప్రమాణం చేయించాలి. అపరాధులయిన శూద్రులకు అగ్ని, జలం, లేదా విషానికి సంబంధించిన ఏడు యవలు గాని ప్రమాణాలుగా చెప్పబడ్డాయి.

తులాధారణవిద్వద్భిరభియుక్తస్తులాశ్రితః ।
ప్రతిమానసమీభూతో రేఖాం కృత్వావతారితః ॥34॥

త్రాసుతో తూచడం అనే విషయంలో నిపుణులై, అపరాధం చేసినవాళ్లను, తులలో ఉంచి, దానితో సమానమైన ఆ పదార్థాన్ని (దేనిని తూచడంలో అపరాధం చేశాడో ఆవస్తువును) ఉంచి, అక్కడ ఒకరేఖ గీసి, దానిని తులనుండి క్రిందికి దించాలి. తరువాత ఆ అపరాధిచేత క్రిందిమంత్రం చెప్పించాలి.

ఆదిత్యచన్ద్రావనిలోఽనలశ్చ ద్యౌర్భూమిరాపో హృదయం యమశ్చ ।
అహశ్చ రాత్రిశ్చ ఉభే చ సన్ధ్యే ధర్మశ్చ జానాతి నరస్య వృత్తమ్ ॥35॥

సూర్యుడు, చంద్రుడు, గాలి, నిప్పు, నింగి, నేల, నీళ్లు, హృదయం, యముడు, పగలు, రాత్రి, ప్రాతస్సాయం సంధ్యలు రెండు, ధర్మం – ఇవి జీవుడి నడవడిని తెలిసి ఉంటాయి.

త్వం తులే సత్యధామాసి పురా దేవైర్వినిర్మితా ।
సత్యం వదస్వ కల్యాణి సంశయాన్మాం విమోచయ ॥36॥

ఓ తులా! నీవు సత్యానికి స్థానానివి. నిన్ను పూర్వం దేవతలు నిర్మించారు. భద్రా! నిజం చెప్పు. నా సందేహం తొలగించు.

యద్యస్మి పాపకృన్మాతస్తతో మాం త్వమధో నయ ।
శుద్ధశ్చేద్గమయోర్ధ్వం మాం తులామిత్యభిమన్త్రయేత్ ॥37॥

తల్లీ! నేను కనుక తప్పు చేసిఉంటే, నన్ను క్రిందికి దించు. ఏ తప్పూ చేయనివాడినయితే, నన్ను పైకి తీసుకునివెళ్లు. అనే మంత్రంతో తులను అభిమంత్రించాలి.

కరౌ విమృదితవ్రీహేర్లక్షయిత్వా తతో న్యసేత్ ।
సప్తాశ్వత్థస్య పత్రాణి తావత్సూత్రేణ వేష్టయేత్ ॥38॥

అపరాధిచేతిలో వడ్లు పోసి, బాగా నలిపి, (రంగుపూసి?) పరిశీలించి, పిదప ఆ చేతులలో ఏడు రావిఆకులను ఉంచి, దారంతో చుట్టాలి. తరువాత అతడిచేత ఈ మంత్రం చెప్పించాలి.

త్వమేవ సర్వభూతానామన్తశ్చరసి పావక ।
సాక్షివత్పుణ్యపాపేభ్యో బ్రూహి సత్యం కరే మమ ॥39॥

ఓ అగ్నిదేవా! చరాచరపదార్థాలన్నింటిలోనూ నీవు అంతర్యామిగా సంచరిస్తుంటావు. కాబట్టి సాక్షిలాగా నేను చేసిన పాపపుణ్యాలను యథార్థంగా చెప్పు.

తస్యేత్యుక్తవతో లౌహం పఞ్చాశత్పలికం సమమ్ ।
అగ్నివర్ణం న్యసేత్పిణ్డం హస్తయోరుభయోరపి ॥40॥

ఆ అపరాధి ఈవిధంగా చెప్పిన తరువాత, యాభైపలాల బరువు కలిగిన లోహపు ముద్దను నిప్పులాగా ఎఱ్ఱగా కాల్చి, అతడి రెండుచేతులలో (దోసిట్లో) ఉంచాలి.

స తమాదాయ సప్తైవ మణ్డలాని శనైర్ వ్రజేత్ ।
షోడశాఙ్గులకం జ్ఞేయం మణ్డలం తావదన్తరమ్ ॥41॥

ఆ అపరాధి ఆ కాల్చిన లోహపు ముద్దను దోసిలిలో ఉంచుకుని మెల్లగా ఏడు మండలాల దూరం నడవాలి. మండలం అంటే, పదహారుఅంగుళాల దూరం అని తెలుసుకోవాలి.

ముక్త్వాగ్నిం మృదితవ్రీహి రదగ్ధ శ్శుద్ధిమాప్నుయాత్ ।
అన్తరాపతితే పిణ్డే సన్దేహే వా పునర్హరేత్ ॥42॥

ఆ తరువాత చేతిలోనికాల్చిన లోహపుముద్దను విడిచిపెట్టి, చేతులలో మళ్లీ వరిధాన్యం పోసుకుని, బాగా నలిపివేయాలి. అప్పటికీ అతడిచేతులు కాలకుండా ఉంటే, అతడు అపరాధం చేయలేదనీ, పరిశుద్ధుడనీ నిర్ణయించాలి. లోహపుముద్దను తీసుకుని వెళ్తుండగా అది మధ్యలో పడిపోయినా, లేదా ఇంక ఏవిధమైన సందేహం కలిగినా, మళ్లీ కాల్చినలోహపు ముద్దను అతడు తీసుకువెళ్లవలసి ఉంటుంది.

పవిత్రాణాం పవిత్రస్త్వం శోధ్యం శోధయ పావన ।
సత్యేన మా భిరక్షస్వ వరుణేత్యభిశస్తకమ్ ॥43॥

(నీటిని ప్రమాణంగా తీసుకున్నపుడు జలాధిదేవత అయిన వరుణుడిని గురించి ఇలా చేయాలి) ఓ వరుణదేవా! అన్నింటినీ పావనం చేసేవాడా! పవిత్రమైన పదార్థాలన్నింటిలోనూ నీవు చాల మిక్కిలి పవిత్రమైనవాడివి. నాలో పరిశోధింపదగిన దోషాన్ని గురించి పరిశోధించు. సత్యం నిరూపించి నన్ను రక్షించు.(అని నీళ్లను మంత్రించి)

నాభిదఘ్నోదకస్థస్య గృహీత్వోరూ జలం విశేత్ ।
సమకాలమిషుం ముక్తమానీయాద్యో జవాన్నరః ॥
యది తస్మిన్నిమగ్నాఙ్గం పశ్యేచ్చేచ్ఛుద్ధిమాప్నుయాత్ ॥44॥

బొడ్డులోతు నీటిలో నిలబడిఉన్నవాడి ఊరువులు పట్టుకుని, అపరాధి నీటిలో ప్రవేశించాలి. అదే సమయంలో ఒకడు బాణాన్ని ప్రయోగించి, అది పడినచోటికి వెళ్లి దానిని తిరిగి తీసుకుని వచ్చి, నీటిలో ఉన్న అపరాధిని చూడాలి. అంటే అతడు వచ్చేంతవరకు అపరాధి నీటిలోనే ఉండాలి. అలా ఉండగలిగితే అతడు తప్పు చేయనివాడు, పరిశుద్ధుడు అవుతాడు.

త్వం విష బ్రహ్మణః పుత్రస్సత్యేధర్మే వ్యవస్థితః ।
త్రాయస్వాస్మాదభిశాపాత్ సత్యేన భవ మే ऽమృతమ్ ॥45॥

(విషం మీద ప్రమాణం చేసేవాడు ఈ విధంగా చేయాలి) ఓ విషమా! నీవు బ్రహ్మకుమారుడివి. సత్యంలోనూ ధర్మంలోనూ నిలిచి ఉంటావు. నాపై మోపబడిన ఈ అభియోగం నుండి నన్ను రక్షించు. నేను అపరాధం చేయకపోవడం నిజమని నిరూపిస్తూ నా విషయంలో నీవు అమృతం.

ఏవముక్త్వా విషం సాఙ్గం భక్షయేద్ధిమశైలజమ్ ।
యస్య వేగైర్వినా జీర్ణం శుద్ధిం తస్య వినిర్దిశేత్ ॥46॥

అని చెప్పి విషాన్ని అభిమంత్రించి, హిమాలయపర్వతంలో పుట్టినవిషం అంతా తినాలి. ఆ విషం అతడికి ఏవిధమైన కలవరం కలిగించకుండా, అరిగిపోతే, ఆ విషం అతడు అపరాధం చేయలేదని అతడి పరిశుద్ధతను నిశ్చయించి చెప్తుంది.

దేవానుగ్రాన్ సమభ్యర్చ్య తత్స్నానోదకమాహరేత్ ।
సంశ్రావ్య పాయయే త్తస్మాజ్జలాత్తు ప్రసృతిత్రయమ్ ॥47॥

న్యాయాధికారి ఉగ్రమైన దేవతలను శ్రద్ధగా పూజించి, వారికి స్నానం చేయించిన నీటిని తీసుకుని రావాలి. ఆ నీటిని గురించి అపరాధికి వివరించాలి. అందులో మూడుపుడిసెళ్ల నీటిని అపరాధిచేత త్రాగించాలి.

ఆచతుర్దశకాదహ్నో యస్య నో రాజదైవికమ్ ।
వ్యసనం జాయతే ఘోరం స శుద్ధస్స్యాదసంశయమ్ ॥48॥

ఉగ్రదేవతా స్నానజలం పానం చేసిన నాటినుండి పద్నాలుగురోజులలో అతడికి రాజువలన గానీ లేదా దైవంవలన గానీ భయంకరమైన కష్టం ఏదీ రానిపక్షంలో అతడు నిరపరాధి అవుతాడు. ఇందులో సందేహంలేదు.

సత్యవాహనశస్త్రాణి గోబీజకనకాని చ ।
దేవతాగురుపాదాశ్చ ఇష్టాపూర్తకృతాని చ ॥
ఇత్యేతే సుకరాః ప్రోక్తాశ్శపథా స్స్వల్పసంశయే ॥49॥

ఏ విషయంలోనయినా చిన్నచిన్న సందేహాలు ఏర్పడినపుడు, దోషం ఆరోపింపబడినవాడు సత్యం, వాహనం, ఆయుధం, ఆవు, బీజం, బంగారం, దేవతలు, గురువులపాదాలు, తాను చేసిన అగ్నికార్యాలు, బావులు తవ్వించడం వంటిపనులు, మొదలయిన సౌలభ్యవిషయాలపైన ప్రమాణం చేయాలి.

ఇత్యాది మహాపురాణే ఆగ్నేయే దివ్యప్రమాణకథనం నామ పఞ్చపఞ్చాశదధికద్విశతతమోऽధ్యాయః ॥255॥

అగ్నిమహాపురాణంలో దివ్యప్రమాణకథనం అనే రెండువందల యాభైఐదవ అధ్యాయం సమాప్తం.

షట్పఞ్చాశదధికద్విశతతమోఽధ్యాయః – రెండువందల యాభైఆరవ అధ్యాయం

దాయవిభాగకథనమ్ – దాయవిభాగకథనం

అగ్నిరువాచ – వసిష్ఠమహర్షితో అగ్నిదేవుడు ఇలా చెప్తున్నాడు.

> **విభాగం చేత్పితా కుర్యాదిచ్ఛయా విభజేత్సుతాన్ ।**
> **జ్యేష్ఠం వా శ్రేష్ఠభాగేన సర్వే వా స్యుస్సమాంశినః ॥1॥**

తండ్రి తన ఆస్తిని కొడుకులకు పంచి ఇచ్చేటపుడు పెద్దకుమారుడికి పెద్ద(ఎక్కువ)భాగం ఇవ్వవచ్చును. లేదా కొడుకు లందరికీ సమానంగా పంచి ఇవ్వవచ్చును.

> **యది దద్యాత్ సమానాంశాన్ కార్యాః పత్న్యస్సమాంశితాః ।**
> **న దత్తం స్త్రీధనం యాసాం భర్త్రా వా శ్వశురేణ వా ॥2॥**

ఆస్తిని సమానంగా పంచేపక్షంలో భార్య(ల)కు కూడా కొడుకులతోపాటు సమానభాగం ఇవ్వాలి. భర్త గాని, ఆమె మామగారు కాని స్త్రీధనంగా ఏమీ ఇవ్వనపుడు కూతుళ్లకు కూడా కొడుకులతో సమానంగా భాగం ఇవ్వాలి.

> **శక్తస్యానీహమానస్య కిఞ్చిద్దత్త్వా పృథక్ క్రియా ।**
> **న్యూనాధికవిభక్తానాం ధర్మ్యశ్చ పితృణా కృతః ॥3॥**

స్వయంగా సంపాదించుకో గలిగిన సామర్థ్యం ఉన్నవాడు, తండ్రిఆస్తిలో భాగం కోరనివాడికి కూడ కొంచెం ధనం ఇచ్చి, అతడిని (ఉమ్మడికుటుంబంనుండి) వేరుచేయాలి. తండ్రి చేసిన పంపకంలో ఎక్కువతక్కువలు ఉన్నా అది ధర్మబద్ధమే అవుతుంది.

> **విభజేయుస్సుతాః పిత్రోరూర్ధ్వమృక్థమృణం సమమ్ ।**
> **మాతుర్దుహితరశ్శేషమృణాత్తాభ్య ఋతేఽన్వయః ॥4॥**

తల్లిదండ్రులు మరణించిన తరువాత కొడుకులే ఆస్తిని పంచుకునే సమయంలో వారి ఆస్తితోపాటు అప్పును కూడా సమానంగా పంచుకోవాలి. తల్లి ప్రత్యేకంగా చేసిన అప్పును కుమార్తెలు తీర్చాలి. తీర్చగా మిగిలిన దానిని వారు సమానంగా పంచుకోవాలి. వారికి కూతుళ్లు లేకపోతే తల్లిఅప్పును కూడా కొడుకులే తీర్చాలి.

> **పితృద్రవ్యవినాశేన యదన్యత్ స్వయమర్జయేత్ ।**
> **మైత్రమౌద్వాహికం చైవ దాయాదానాం న తద్భవేత్ ॥5॥**

తండ్రి సంపాదించినది నశించినపుడు (లేదా అసలు లేకపోయినా), మరొకవిధంగా తనకు వచ్చిన ఆస్తిని అంటే తాను స్వయంగా సంపాదించుకున్నది, తన స్నేహితులవలన లభించినది, పెండ్లివలన భార్యద్వారా సంక్రమించినది అయిన ధనంలో దాయాదులకు భాగం ఉండదు.

సామాన్యార్థసముత్థానే విభాగస్తు సమస్స్మృతః ।
అనేక పితృకాణాం తు పితృతో భాగకల్పనా ॥6॥

సోదరులందరూ కలిసి సంపాదించినధనాన్ని వారు అందరూ సమానంగా పంచుకోవాలి. తండ్రులు చాలమంది (పెదనాన్నలు, చిన్ననాన్నలు) ఉన్నపుడు (పితామహుడి ఆస్తిని) తండ్రిభాగం నుండి పంచుకోవాలి.

భూర్యా పితామహెూపాత్తా నిబన్ధో ద్రవ్యమేవ వా ।
తత్ర స్యాత్సదృశం స్వామ్యం పితుః పుత్రస్య చోభయోః ॥7॥

పితామహుడు సంపాదించిన భూమి, ఇళ్లు మొదలైన కట్టడాలు, ధనం వీటిపై తండ్రికి, పుత్రులకు ఇద్దరికీ సమానమైన హక్కు ఉంటుంది.

విభక్తేషు సుతో జాతస్సవర్ణాయాం విభాగభాక్ ।
దృశ్యాద్వా తద్విభాగస్స్యాదాయవ్యయవిశోధితాత్ ॥8॥

తండ్రి తన ఆస్తిని కుమారులకు పంచిన తరువాత సజాతీయ అయిన స్త్రీవలన కుమారుడు కలిగితే, అతడికి కూడ ఆస్తిలో భాగం ఇవ్వాలి. లేదా ఆ తరువాతి ఆదాయాన్నీ వ్యయాన్నీ పరిశీలించి, స్పష్టంగా ఉన్న ధనంలోనుండి భాగం ఇవ్వాలి.

క్రమాదభ్యాగతం ద్రవ్యం హృతమభ్యుద్ధరేచ్చ యః ।
దాయాదేభ్యో న తద్దద్యాద్విద్యయా లబ్ధమేవ చ ॥9॥

తాతలతరంనుండి వస్తున్న సంపద ఏ కారణంచేతనయినా, నష్టపోయినపుడు దానిని దాయాదులలో ఒక్కడు తిరిగి సంపాదించినవాడు ఆ ఆస్తి ఆ ఒక్కడికి మాత్రమే చెందుతుంది. దానిలో దాయాదులకు భాగం ఇవ్వ నవసరం లేదు. అదే విధంగా తన పాండిత్యంతో సంపాదించిన ధనాన్ని కూడ దాయాదులకు పంచనవసరం లేదు.

పితృభ్యాం యస్య యద్దత్తం తత్తస్యైవ ధనం భవేత్ ।
పితురూర్ధ్వం విభజతాం మాతాప్యంశం సమం హరేత్ ॥10॥

తల్లిదండ్రులు సంతానంలో ఎవరికయినా, ప్రత్యేకంగా ఒకవస్తువును ఇస్తే, అది వారికి మాత్రమే చెందుతుంది. (ఇతరులకు దానిపై అధికారం ఉండదు.) తండ్రి మరణించిన తరువాత పిత్రార్జితాన్ని కుమారులు పంచుకునే సమయంలో తల్లికి కూడా సమానభాగం ఇవ్వాలి.

అసంస్కృతాస్తు సంస్కార్యా భ్రాతృభిః పూర్వసంస్కృతైః ।
భగిన్యశ్చ నిజాదంశాద్దత్వాంశం తు తురీయకమ్ ॥11॥

ఉపనయనవివాహాది సంస్కారాలు జరిగిన పెద్దవాడు, ఆ సంస్కారాలు జరగని తోబుట్టువులకు (తండ్రి మరణానంతరం) చేయాలి. అక్కచెల్లెళ్లకు కూడా తన ఆస్తిలో నాల్గవభాగం ఇచ్చి, వివాహాది సంస్కారాలు జరిపించాలి.

చతుస్త్రిద్వ్యేకభాగా స్స్యుర్వర్ణశో బ్రాహ్మణాత్మజాః ।
క్షత్రజా స్త్రిద్వ్యేకభాగా విడ్జాస్తు ద్వ్యేకభాగినః ॥12॥

బ్రాహ్మణుడి కుమారులు తండ్రికి బ్రాహ్మణాది వర్ణక్రమంలో పుట్టిన సంతానానికి (బ్రాహ్మణస్త్రీయందు పుట్టినవాడికి) నాలుగు, (క్షత్రియస్త్రీకి పుట్టినవాడికి) మూడు, (వైశ్యస్త్రీకి పుట్టినవాడికి) రెండు, (శూద్రస్త్రీకి పుట్టినవాడికి) ఒకటి అనేక్రమంలో భాగం ఇవ్వాలి. అదే విధంగా క్షత్రియుడు (క్షత్రియస్త్రీకి పుట్టినవాడికి) మూడు, (వైశ్యస్త్రీకి పుట్టినవాడికి) రెండు, (శూద్రస్త్రీకి పుట్టినవాడికి) ఒకటి అనే క్రమంలో భాగం ఇవ్వాలి. అదే విధంగా వైశ్యుడు (వైశ్యస్త్రీకి పుట్టినవాడికి) రెండు, (శూద్రస్త్రీకి పుట్టినవాడికి) ఒకటి అనేక్రమంలో భాగం ఇవ్వాలి.

అన్యోన్యాపహృతం ద్రవ్యం విభక్తే యత్తు దృశ్యతే ।
తత్పునస్తే సమైరంశై ర్విభజేరన్నితిస్థితిః॥13॥

తండ్రి ఆస్తిని పంచుకున్న తరువాత కొడుకులలో ఎవరయినా అధికంగా అపహరించినట్లు కనబడితే, ఆ సొమ్మును తిరిగి అందరూ సమానంగా పంచుకోవాలి అని నియమం.

అపుత్రేణ పరక్షేత్రే నియోగోత్పాదితస్సుతః ।
ఉభయోరప్యసావృక్థీ పిణ్డదాతా చ ధర్మతః ॥14॥

భార్యవలన సంతానం కలగక పోవడంచేత పుత్రుడికోసం నియోగింపబడిన ఇతర స్త్రీవలన కలిగిన కుమారుడు, (తండ్రులు) ఇద్దరి ఆస్తిపైనా హక్కు కలిగి ఉంటాడు. ఇద్దరికీ పిండప్రదానం కూడా చేయవలసి ఉంటుంది. ఇది ధర్మం.

ఔరసో ధర్మపత్నీజస్తత్సమః పుత్రికాసుతః ।
క్షేత్రజః క్షేత్రజాతస్తు సగోత్రేణేతరేణ వా ॥15॥

(కుమారులలో భేదాలను గురించి చెప్తున్నాడు) ధర్మపత్నియందు పుట్టిన కుమారుడిని (1)ఔరసుడు అంటారు. కూతురి కుమారుడు (దౌహిత్రుడు) ఔరసుడితో సమానం. తన గోత్రంలో పుట్టినవాడివలన కానీ, వేరే గోత్రంలో పుట్టినవాడివలన గానీ, తన భార్యయందు జన్మించినవాడిని (2) క్షేత్రజుడు అంటారు.

గృహే ప్రచ్ఛన్న ఉత్పన్నో గూఢజస్తు సుతస్స్మృతః ।
కానీనః కన్యకాజాతో మాతామహసుతో మతః ॥16॥

తన ఇంట్లో రహస్యంగా పుట్టినవాడు (3)గూఢజుడు. కన్యకు పుట్టినవాడు (4)కానీనుడు. ఇతడు వాడి మాతామహుడికి (తల్లిగారి తండ్రికి) కొడుకు అవుతాడు.

అక్షతాయాం క్షతాయాం వా జాతః పౌనర్భవ స్సుతః ।
దద్యాన్మాతా పితా వా యం స పుత్రో దత్తకో భవేత్ ॥17॥

మొదటిభర్తతో సంసారం చేసినది కానీ, చేయనిది కానీ అయిన స్త్రీ మారుమనువు చేసుకున్నపుడు దానికి పుట్టినవాడు (5) పౌనర్భవుడు. తల్లి గానీ, తండ్రి గాని ఇతరులకు పుత్రుడుగా ఇచ్చినవాడు (6)దత్తుడు (దత్తకుడు) అవుతాడు.

క్రీతశ్చ తాభ్యాం విక్రీతః కృత్రిమస్స్యాత్ స్వయం కృతః ।
దత్తాత్మా తు స్వయం దత్తో గర్భే విన్నస్సహోఢజః ॥18॥

తల్లిదండ్రులు విక్రయించగా ఇతరులు కొనుక్కున్నవాడు (7)విక్రీతుడు. స్వయంగా కుమారుడుగా స్వీకరింపబడినవాడు (8)కృత్రిముడు. తనను తాను కుమారుడుగా ఇచ్చుకున్నవాడు (9)దత్తాత్ముడు. గర్భంతో ఉన్న దానిని వివాహమాడగా పుట్టినవాడు (10)సహోఢజుడు.

ఉత్సృష్టో గృహ్యతే యస్తు సోఽపవిద్ధో భవేత్సుతః ।
పిణ్డదోఽంశహర శ్చైషాం పూర్వాభావే పరః పరః ॥19॥

తల్లిదండ్రులు విడిచిపెట్టగా, పుత్రుడుగా స్వీకరింపబడినవాడు (11)అపవిద్ధుడు అవుతాడు. (వీరిలో దౌహిత్రుడు ఔరసుడుగా గ్రహింపబడతాడు) ఈవిధంగా పదకొండు రకాలుగా ఉన్న పుత్రులలో ముందరివాడు లేకపోతే తరువాతివాడు అనే క్రమంలో తలిదండ్రులకు పిండం పెట్టడం, ఆస్తిని తీసుకోవడం చేయాలి.

సజాతీయేష్వయం ప్రోక్త స్తనయేషు మయా విధిః ॥20॥

సజాతీయులయిన వారి విషయంలోనే పుత్రులను గూర్చిన ఈవిధానం అంతా చెప్పబడింది.

జాతోఽపి దాస్యాం శూద్రస్య కామతోఽంశహరో భవేత్ ।
మృతే పితరి కుర్యుస్తం భ్రాతరస్త్వర్ధభాగికమ్ ॥
అభ్రాతృకో హరేత్సర్వం దుహితౄణాం సుతాదృతే ॥21॥

శూద్రుడికి దాసివలన పుట్టినవాడు కూడా తండ్రి సమ్మతిస్తే, ఆస్తిలో భాగాన్ని తీసుకోవచ్చు. తండ్రి మరణించిన తరువాత ఆ దాసీపుత్రుడి సోదరులు అతడికి (వాడికి రావలసిన)ఆస్తిలో సగభాగం ఇవ్వాలి. అతడికి సోదరులు లేక, మరణించినవాడి కుమార్తెలకు కూడ పుత్రులు లేనపుడు, ఆస్తి అంతా దాసీపుత్రుడే తీసుకోవచ్చు.

పత్నీ దుహితరశ్చైవ పితరౌ భ్రాతరస్తథా ।
తత్సుతో గోత్రజో బన్ధుశ్శిష్యస్సబ్రహ్మచారిణః ॥22॥

పై పదకొండురకాల పుత్రులు లేనపుడు, మరణించినవాడి ఆస్తికి భార్య, కూతుళ్లు, తల్లిదండ్రులు, సోదరులు, సోదరుల కుమారుడు, అతడి గోత్రంలో పుట్టినవాడు, బంధువు, అతడిశిష్యుడు, అతడితో కలిసి చదువుకున్నవారు-

ఏషామభావే పూర్వేషాం ధనభాగుత్తరోత్తరః ।
స్వర్యాతస్య హ్యపుత్రస్య సర్వవర్ణేష్వయం విధిః ॥23॥

వీరిలో ముందరివారు లేనపుడు తర్వాతివారుగా అందరూ - ఇంతకు మునుపు చెప్పిన పదకొండు రకాలపుత్రులు లేనపుడు మరణించినవాడి ఆస్తిని పొందడానికి అర్హులవుతారు. పుత్రులు లేనివాడు మరణించినపుడు అతడి ఆస్తిని పంచుకోవడంలో అన్ని వర్ణాలవారిలోనూ ఇదే విధానం.

వానప్రస్థయతిబ్రహ్మచారిణామృక్థభాగినః ।
క్రమేణాచార్యసచ్ఛిష్యధర్మభ్రాత్రేకతీర్థినః ॥24॥

వానప్రస్థులు, యతులు, బ్రహ్మచారుల ధనంమీద క్రమంగా ఆచార్యుడు, ఉత్తముడైన శిష్యుడు, ధర్మభ్రాత, కలిసి చదువుకున్నవాడు, అనే వారికి హక్కు ఉంటుంది.

సంసృష్టినస్తు సంసృష్టీ సోదరస్య తు సోదరః ।
దద్యాచ్చాపహరేచ్చాంశం జాతస్య చ మృతస్య చ ॥25॥

మొదట విడిపోయి తరువాత కలిసినవాడు సంసృష్టి. అటువంటి సోదరుడి భాగాన్ని అతడికి ఇచ్చివేయాలి. ఆ సోదరుడు మరణించినపుడు ఆ భాగాన్ని పుచ్చుకోవాలి.

అన్యోదర్యస్తు సంసృష్టీ నాన్యోదర్యధనం హరేత్ ।
అసంసృష్ట్యపి చాదద్యా, త్సోదర్యో నాన్యమాతృజః ॥26॥

విడిపోయి కలిసిన సవతిసోదరుడిభాగాన్ని అపహరించగూడదు. సవతిసోదరుడు తనతో కలిసి ఉండకపోయినా, లేదా మరణించినా అతడి భాగాన్ని తీసుకోవచ్చును.

పతితస్తత్సుతః క్లీబః పఙ్గురున్మత్తకో జడః ।
అన్ధో౭ చికిత్స్యరోగాద్యా భర్తవ్యాస్తు నిరంశకాః ॥ 27॥

పతితుడు, వాడికొడుకు, నపుంసకుడు, కుంటివాడు, పిచ్చివాడు, తెలివి లేనివాడు, గ్రుడ్డివాడు, వైద్యం లేని రోగం కలిగినవాడు–వీరికి ఆస్తిలో భాగం ఉండదు. కాని (ఆస్తి తీసుకున్నవాడు) వాళ్లను జీవితాంతం పోషించాలి.

ఔరసాః క్షేత్రజా స్త్వేషాం నిర్దోషా భాగహారిణః ।
సుతాశ్చైషాం ప్రభర్తవ్యా యావద్వై భర్తృసాత్కృతాః ॥28॥

పుత్రులలో ఔరసులు, క్షేత్రజులు, ఇటువంటి దోషం లేకపోతే ఆస్తిలో భాగం తీసుకోవచ్చు. వీరికుమార్తెలను కూడ పెండ్లి అయ్యేంతవరకు పోషించాలి.

అపుత్రా యోషిత శ్చైషాం భర్తవ్యాస్సాధువృత్తయః ।
నిర్వాస్యా వ్యభిచారిణ్యః ప్రతికూలా స్తథైవ చ ॥29॥

వీరిభార్యలకు కొడుకులు లేకపోతే, మంచినడవడి కలిగిన ఆ స్త్రీలను కూడా పోషించాలి. కాని ఆ స్త్రీలు వ్యభిచారిణులు అయినా, మంచిప్రవర్తన లేనివారయినా, వారిని ఇంట్లోనుంచి వెళ్లగొట్టాలి.

పితృమాతృపతిభ్రాతృదత్తమధ్యగ్న్యుపాగతమ్ ।
ఆధివేదనికం చైవ స్త్రీధనం పరికీర్తితమ్ ॥30॥

తండ్రి, తల్లి, భర్త, సోదరుడు ఇచ్చినది, పెండ్లిసమయంలో అగ్ని సన్నిధానంలో ఇచ్చినది, రెండవపెండ్లి చేసుకునేవాడు (మొదటిపెండ్లామునకు) స్త్రీలకు ఇచ్చినసొమ్మును స్త్రీధనం అంటారు.

బన్ధుదత్తం తథా శుల్కమన్వాధేయకమేవ చ ।
అప్రజాయామతీతాయాం బాన్ధవాస్తదవాప్నుయుః ॥31॥

కొడుకులు లేకుండానే స్త్రీ మరణించినపుడు – ఆమెకు బంధువులిచ్చిన సొమ్ము, స్త్రీధనం, పెండ్లి అయిన తరువాత భర్త, తల్లి, తండ్రులవలన ఆమెకు లభించిన సొమ్ము, ఆమె బంధువులకు చెందుతుంది.

అప్రజాస్త్రీధనం భర్తుర్ బ్రాహ్మ్యాదిషు చతుర్ష్వపి ।
దుహితౄణాం ప్రసూతా చేచ్ఛేషేషు పితృగామి తత్ ॥32॥

బ్రాహ్మ్యం మొదలైన నాలుగువిధాలలో వివాహం చేసుకున్నస్త్రీ సంతానం లేకుండా మరణించినపుడు ఆమెధనం ఆమెభర్తకు చెందుతుంది. ఆమెకు కూతుళ్లు ఉంటే, ఆ ధనం వారికి చెందుతుంది. మిగిలిన పద్ధతులలో పెండ్లి చేసుకున్న దానిసొమ్ము ఆమెతండ్రికి చెందుతుంది.

దత్త్వా కన్యాం హరన్దణ్డ్యో వ్యయం దద్యాచ్చ సోదయమ్ ।
మృతాయాం దత్తమాదద్యాత్పరిశోధ్యోభయవ్యయమ్ ॥33॥

కన్యను ఇతరులకు దానం చేసి, తరువాత ఆమెను తిరిగి తీసుకున్నవాడిని శిక్షించాలి. ఆ వివాహానికి అయిన వ్యయం మొత్తం వడ్డీతో సహా, వసూలు చేయాలి. ఆ కన్య మరణిస్తే, ఉభయపక్షాలలో అయిన వ్యయాన్ని పరిశీలించి, ఆమెకు ఇచ్చినధనాన్ని తిరిగి ఆమెతండ్రినుండి వసూలు చేయాలి.

దుర్భిక్షే ధర్మకార్యే చ వ్యాధౌ సమ్ప్రతిరోధకే ।
గృహీతం స్త్రీధనం భర్తా న స్త్రియై దాతుమర్హతి ॥34॥

కరువుకాలంలోనూ, ధర్మకార్యాలు చేసిన సందర్భంలోనూ, రోగం వచ్చిన సమయంలోనూ, రాజ్యంలో కష్టాలు వచ్చినపుడు భార్యనుండి తీసుకున్న స్త్రీధనాన్ని భర్త తిరిగి ఇవ్వనవసరం లేదు.

అధివిన్నస్త్రియై దద్యాదాధివేదనికం సమమ్ ।
న దత్తం స్త్రీధనం యస్యై దత్తే త్వర్థం ప్రకీర్తితమ్ ॥35॥

భార్యకు స్త్రీధనం ఇవ్వకుండా భర్త రెండవవివాహం చేసుకునే సందర్భంలో, రెండవసారి వివాహానికి వ్యయమయిన సొమ్మును మొదటిభార్యకు ఇవ్వాలి. మొదటిభార్యకు స్త్రీధనం ఇచ్చిఉంటే, రెండవపెండ్లికి అయిన వ్యయంలో సగం ఇవ్వాలి.

విభాగనిహ్నవే జ్ఞాతిబన్ధుసాక్ష్యభిలేఖితైః ।
విభాగభావనా జ్ఞేయా గృహక్షేత్రైశ్చ యౌతకైః ॥36॥

ఆస్తిని పంచే సందర్భంలో సందేహం ఏర్పడితే, దాయాదులు, బంధువులు, సాక్షులు, పత్రాలు, ఇళ్లు, పొలాలు, కట్నం అనే అంశాలనుబట్టి పంపకం చేయవలసిన విధానాన్ని గ్రహించాలి.

ఇత్యాది మహాపురాణే ఆగ్నేయే దాయవిభాగకథనం నామ షట్పఞ్చాశదధికద్విశతతమోఽధ్యాయః ॥256॥

అగ్నిమహాపురాణంలో దాయవిభాగకథనం అనే రెండువందల యాభైఆరవ అధ్యాయం సమాప్తం.

సప్తపఞ్చాశదధికద్విశతతమోऽధ్యాయః - రెండువందల యాభైఏడవ అధ్యాయం

సీమావివాదాదినిర్ణయకథనమ్ - సరిహద్దుల వివాదములలో నిర్ణయము చెప్పుట

అగ్నిరువాచ - వసిష్ఠమహర్షితో అగ్నిదేవుడు ఇలా చెప్తున్నాడు.

సీమ్నో వివాదే క్షేత్రస్య సామన్తాః స్థవిరాదయః ।
గోపాస్సీమాకర్షిణో యే సర్వే చ వనగోచరాః ॥1॥

రెండు క్షేత్రాలకు సంబంధించిన హద్దులవిషయంలో వివాదం ఏర్పడినపుడు - ఆ క్షేత్రానికి ఇరుగుపొరుగున ఉండేవాళ్లు, ఊరిపెద్దలు మొదలైనవాళ్లు, గోపాలకులు, సరిహద్దులను సరిచేసేవాళ్లు, అరణ్యాలలో తిరిగే వాళ్లు,

ప్రణేయురేతే సీమానం స్థూలాఙ్గారతుషద్రుమైః ।
సేతువల్మీకనిమ్నాస్థిచైత్యాద్యై రుపలక్షితామ్ ॥2॥

ఆ సరిహద్దులను నిర్ణయించాలి. వాళ్లు ఆ ప్రదేశంలోని పెద్దపెద్దబొగ్గులు, ఊక, చెట్లు, వంతెనలు, పుట్టలు, పల్లప్రదేశాలు, ఎముకలు, సరిహద్దుగా ఏర్పరచిన చెట్టు మొదలయినవాటిని ఆధారంగా చేసుకుని సరిహద్దుల వివాదాన్ని పరిష్కరించాలి.

సామన్తా వా సమం గ్రామా చత్వారోऽష్టాదశాऽపి వా ।
రక్తస్రగ్వసనాస్సీమాం నయేయుః క్షితిధారిణః ॥3॥

వివాదం ఏర్పడిన స్థలానికి ఇరుగుపొరుగున ఉండేవారు, లేదా ఆ గ్రామానికి చెందినవారు నలుగురు గాని, ఎనిమిదిమంది గాని, పదిమంది గాని పెద్దలు - ఎఱ్ఱనిపూలమాలలు, ఎఱ్ఱనివస్త్రాలు ధరించి, తలపై మట్టి ఉంచుకుని, సరిహద్దును నిర్ణయించాలి.

అనృతే తు పృథగ్దణ్ద్యా రాజ్ఞా మధ్యమసాహసమ్ ।
అభావే జ్ఞాతృచిహ్నానాం రాజా సీమ్నః ప్రవర్తకః ॥4॥

సరిహద్దును నిర్ణయించేవారు అబద్ధ మాడితే రాజు వారిని విడివిడిగా మధ్యమసాహసంతో (ఐదువందల పణాలు 227 అధ్యాయం.5.శ్లో) దండించాలి. సరిహద్దును నిర్ణయించడానికి తగినగుర్తులు లేనపుడు స్వయంగా రాజే హద్దులను నిర్ణయించాలి.

ఆరామాయతనగ్రామనిపానోద్యానవేశ్మసు ।
ఏష ఏవ విధిర్ జ్ఞేయో వర్షామ్బుప్రవహేషు చ ॥5॥

తోటలు, దేవాలయాలు, గ్రామాలు, చెరువులు మొదలైన 'జలాశయాలు, ఉద్యానవనాలు, ఇళ్లు, వర్షం నీళ్లుప్రవహించే తావులు మొదలైన ప్రదేశాలు - వీటి సరిహద్దుల వివాదాలను పరిష్కరించే' సందర్భంలో కూడా ఇదే విధానాన్ని అనుసరించాలి.

మర్యాదాయాః ప్రభేదేషు క్షేత్రస్య హరణే తథా ।
నిర్మర్యాదాశ్చ దణ్డ్యాస్స్యురధమోత్తమమధ్యమాః ॥6॥

సరిహద్దులను మార్పుచేసిన (తమ స్థలం సరిహద్దు దాటి ప్రక్కవారిస్థలంలోకి వెళ్లిన) వాళ్లను అధమ (ప్రథమ)సాహసంతోనూ ఇతరుల స్థలాన్ని అపహరించినవాళ్లను ఉత్తమసాహసంతోనూ, సరిహద్దులను తీసివేసిన వాళ్లను మధ్యమసాహసంతోనూ రాజు శిక్షించాలి.

న నిషేధ్యోఽల్పబాధ స్తు సేతుః కల్యాణకారకః ।
పరభూమిం హరన్కూపస్స్వల్పక్షేత్రో బహూదకః ॥7॥

చెరువు కొద్దిమందికి ఇబ్బంది కలిగించినా, చాలమందికి మేలు చేస్తుంది. ఇది ఇతరుల భూమిలోకి కూడా విస్తరించి ఉంటుంది. కూపం కొద్దినేలలో ఉంటుంది. ఇందులో నీళ్లు ఎక్కువగా ఉంటాయి. వీటి నిర్మాణాన్ని ఎవరూ అడ్డగించగూడదు.

స్వామినో యోఽనివేద్యైవ క్షేత్రే సేతుం ప్రకల్పయేత్ ।
ఉత్పన్నే స్వామినో భోగస్తదభావే మహీపతేః ॥8॥

యజమానికి చెప్పకుండా అతడి భూమిలో చెరువు తవ్విస్తే, దానిని ఆ భూమియజమానే అనుభవించాలి. దానికి యజమాని లేకపోతే అది రాజుకు చెందుతుంది.

ఫలాహతమపి క్షేత్రం యోనకుర్యాన్న కారయేత్ ।
స ప్రదాప్యః కృష్టఫలం క్షేత్రమన్యేన కారయేత్ ॥9॥

తాను దున్నిన ఇతరులపొలంలో (తాను) పంట పండించకున్నా, ఇతరులను పండించకుండా అడ్డుపడినా, ఆ దున్నినపొలం మీద రావలసిన ఫలసాయాన్ని రాజు యజమానికి ఇప్పించాలి. ఆ పొలాన్ని కూడా ఇతరులకు ఇప్పించాలి.

మాషానష్టౌ తు మహిషీ సస్యఘాతస్య కారిణీ ।
దణ్డనీయా తదర్ధం తు గౌస్తదర్ధమజావికమ్ ॥10॥

పైరుకు గేదె నష్టం కలిగిస్తే ఎనిమిదిమాషాలు (15 యవలపరిమాణం 227 అధ్యాయం. 2శ్లో), ఆవు పాడుచేస్తే నాలుగుమాషాలు, మేకలు, గొఱ్ఱెలు మొదలైనవి పాడుచేస్తే రెండుమాషాలు వాటి యజమానికి దండన విధించాలి.

భక్షయిత్వోపవిష్టానాం యథోక్తాద్ద్విగుణో దమః ।
సమమేషాం వివీతేఽపి ఖరోష్ట్రం మహిషీసమమ్ ॥11॥

గేదెలు మొదలైన ఆయా జంతువులు పైరును తిని అక్కడే ఉండి పోయినపక్షంలో ఇంతకు ముందు చెప్పినదానికి రెట్టింపు దండన విధించాలి. చుట్టూ కంచె వేసిన చేలలోనయినా పైరును ఆయా జంతువులు పాడుచేసినపుడు పైవిధంగానే దండన విధించాలి. గాడిద, ఒంటెలు పాడుచేసినపుడు దండన గేదెలతో సమానంగా ఉంటుంది.

యావత్సస్యం వినష్టం తు తావత్ క్షేత్రీ ఫలం లభేత్ ।
పాలస్తాడ్యోఽథ గోస్వామీ పూర్వోక్తం దణ్డమర్హతి ॥12॥

ఆయాజంతువులు పొలంలో పైరుకు కలిగించిన నష్టం విలువ ఆ పొలం యజమానికి ఇప్పించాలి. ఆ పశువులను కాచేవాడికి (పశువులకాపరికి) కొట్టడమే దండన. ఆ పశువులకు యజమానికి పైన పేర్కొన్న దండన విధించాలి.

పథిగ్రామవివీతాన్తే క్షేత్రే దోషో న విద్యతే ।
అకామతః కామచారే చౌరవద్దణ్డమర్హతి ॥13॥

దారిలోనూ, ఊరిలోనూ, పచ్చికబయళ్లలోనూ ఉన్న పొలాలలో పైరును తెలియక పాడుచేస్తే తప్పు లేదు. బుద్ధిపూర్వకంగా చేస్తే మాత్రం దొంగతనం చేసినవాడితో సమానంగా దండించాలి.

మహోక్షోత్సృష్టపశవ స్సూతికా గన్తుకా చ గౌః ।
పాలో యేషాం తు తే మోచ్యా దైవరాజపరిప్లుతాః ॥14॥

ఆబోతు, దేవతలను ఉద్దేశించి విడిచిపెట్టిన పశువులు, క్రొత్తగా ఈనినఆవు, దైవికంగానూ, రాజశాసనం వల్లనూ దెబ్బతిన్నవారు కాపలాగా ఉన్న పశువులు - పైరును పాడుచేస్తే, వాటిని విడిచిపెట్టేయాలి.

యథార్పితాన్ పశూన్గోప స్సాయం ప్రత్యర్పయేత్తథా ।
ప్రమాదమృతనష్టాంశ్చ ప్రదాప్యః కృతవేతసః ॥15॥

పశువులకాపరి పశువులను ఏవిధంగా తీసకునివెళ్లాడో, సాయంకాలం మళ్లీ వాటిని అదే విధంగా తిరిగి తీసుకువచ్చి యజమానికి అప్పగించాలి. జీతం తీసుకునేవాడు అయితే, తాను కాచే పశువులు ప్రమాదవశాత్తు ఏ కారణంచేత నయినా, మరణించినా, లేదా ఏ కారణంచేతనయినా, నష్టపోయినా, అటువంటివాటిని రాజు యజమానికి తిరిగి ఇప్పించాలి.

పాలదోషవినాశే తు పాలే దణ్డో విధీయతే ।
అర్ధత్రయోదశపణస్స్వామినో ద్రవ్యమేవ చ ॥16॥

గోవులను పాలించేవాడి తప్పువల్ల ఆ పశువులకు నష్టం సంభవిస్తే, ఆ గోపాలుడికి పదమూడున్నర పణాలు దండన విధించాలి. నష్టపోయిన ద్రవ్యాన్ని యజమానికి ఇప్పించాలి.

గ్రామేచ్ఛయా గోప్రచారో భూమిరాజవశేన వా ।
ద్విజస్తృణైధఃపుష్పాణి సర్వత స్స్వవదాహరేత్ ॥17॥

గ్రామస్థులకోరిక ప్రకారం కాని, రాజాజ్ఞప్రకారం గాని, గోవులు సంచరించడానికి అంటే వాటిమేతకు తగిన భూమిని విడిచిపెట్టాలి. బ్రాహ్మణుడు మాత్రం గడ్డి, కట్టెలు, పూలు, అన్ని ప్రదేశాలనుండి సొంతవస్తువులలాగా తీసుకోవచ్చు.

ధనుశ్శతం పరీణాహో గ్రామక్షేత్రాన్తరం భవేత్ ।
ద్వే శతే ఖర్వటస్య స్యా న్నగరస్య చతుశ్శతమ్ ॥18॥

గ్రామానికీ, పొలాలకూ మధ్య దూరం నూరుధనువుల(నూరుబారలు)పరిమాణంగా ఉండాలి. గ్రామం పెద్దది అయితే, దానికీ పొలాలకూ మధ్య రెండువందల ధనుస్సులదూరం ఉండాలి. నగరానికీ పొలాలకూ మధ్య దూరం నాలుగువందల ధనుస్సులు ఉండాలి.

స్వం లభేతాన్యవిక్రీతం క్రేతుర్దోషోఽప్రకాశితే ।
హీనాద్రహో హీనమూల్యే వేలాహీనే చ తస్కరః ॥19॥

తన వస్తువును ఎవరయినా అపహరించి వారు ఇతరులకు అమ్మివేసినపుడు ఆ వస్తువు యజమానికి కనబడితే, దానిని యజమాని తీసుకోవడంలో దోషం లేదు. ఒకానొక నీచుడినుండి రహస్యంగా, సమయం కాని సమయంలో, తక్కువధరకు తీసుకున్నవాడు దొంగే అవుతాడు.

నష్టాపహృతమాసాద్య హర్తారం గ్రాహయేన్నరమ్ ।
దేశకాలాతిపత్తౌ వా గృహీత్వా స్వయమర్పయేత్ ॥20॥

తాను పోగొట్టుకున్నదీ, ఇతరులు అపహరించినదీ అయిన వస్తువును తిరిగి పొందినవాడు ఆ వస్తువును కాజేసినవాడిని రాజపురుషులకు పట్టించాలి. ఆ దేశంలో, ఆ సమయంలో రాజుకు అప్పగించడానికి అవకాశం లేనపుడు వాడిని తానే పట్టుకుని రాజపురుషులకు అప్పగించాలి.

విక్రేతుర్దర్శనాచ్ఛుద్ధి స్స్వామీ ద్రవ్యం నృపో దమమ్ ।
క్రేతా మూల్యం సమాప్నోతి తస్మాద్యస్తత్ర విక్రయీ ॥21॥

అపహరించిన వస్తువును కొన్నవాడు తనకు అమ్మినవాడిని చూపిస్తే అతడు పరిశుద్ధుడవుతాడు. రాజు కొన్నవాడిచేత ఆ వస్తువును యజమానికి ఇప్పించాలి. అమ్మినవాడిచేత తీసుకున్న ధనాన్ని కొన్నవాడికి తిరిగి ఇప్పించాలి. ఇంకా అమ్మినవాడిని దండించాలి.

ఆగమేనోపభోగేన నష్టం భావ్యమతోఽన్యథా ।
పఞ్చబన్ధో దమస్తస్య రాజ్ఞే తే నాప్యభావితే ॥22॥

యజమాని ఆ వస్తువుకు తానే యజమాని అయినవిధానాన్ని నిరూపించుకోవాలి. తాను పోగొట్టుకున్న ఆ వస్తువు తనకు ఎలా లభించిందో, దానిని తాను ఎలా అనుభవించేవాడో వివరించాలి. అలా నిరూపించుకోలేకపోతే, అతడికి అయిదోవంతు దండన విధించాలి.

హృతం ప్రనష్టం యో ద్రవ్యం పరహస్తాదవాప్నుయాత్ ।
అనివేద్య నృపే దణ్డ్యస్స తు షణ్ణవతిం పణాన్ ॥23॥

ఇతరులు అపహరించినవస్తువు, లేదా పోగొట్టుకున్నవస్తువు వారినుండి తిరిగి పొందినవాడు, ఆ విషయాన్ని రాజుకు తెలియజేయాలి. అలా తెలియజేయకపోతే, అతడు తొంబైఆరు పణాలను (227 అధ్యాయం.2శ్లో) అపరాధశుల్కంగా దండించాలి.

శౌల్కికైః స్థానపాలైర్వా నష్టాపహృతమాహృతమ్ ।
అర్వాక్సంవత్సరాత్ స్వామీ లభతే పరతో నృపః ॥24॥

ఆ వస్తువు శుల్కం వసూలుచేసే అధికారులకు గాని, ఆ ప్రాంతపరిపాలకులకు గాని లభిస్తే, వారు దానిని తెచ్చి రాజుగారికి అప్పగించాలి. ఒకసంవత్సరంలోపుగా దాని యజమాని ఆ వస్తువు తనదేనని నిరూపించి, తీసుకునివెళ్లాలి. సంవత్సరం దాటితే ఆ వస్తువు రాజుకు చెందుతుంది.

పణానేకశఫే దద్యాచ్చతురః పఞ్చ మానుషే ।
మహిషోష్ట్రగవాం ద్వౌ ద్వౌ పాదం పాదమజావికే ॥25॥

ఒకే గిట్ట కలిగిన(రెండుగా చీలకుండా) గాడిద, గుఱ్ఱం వంటి జంతువు పోయి, దొరికితే యజమాని రాజుకు నాలుగుపణాలు చెల్లించాలి. మనుష్యుడికి సంబంధించినవాటికి అయిదుపణాలు, గేదె, ఒంటె, ఆవులకు రెండుపణాలు, మేకలు గొఱ్ఱెలకు పణంలో నాలుగవవంతు రాజుకు చెల్లించాలి.

స్వకుటుమ్బావిరోధేన దేయం దారసుతాదృతే ।
నాన్వయే సతి సర్వస్వం దేయం యచ్చాన్యసంశ్రుతమ్ ॥26॥

తన కుటుంబానికి నష్టం జరగకుండా ఉండేవిధంగా దానాలు చేయవచ్చును. భార్యకు, కొడుకులకు తగినంత ఇవ్వవచ్చును. వంశంలో వారసులు లేకపోతే తనకున్న మొత్తం దానం చేయవచ్చును. ఒకరికి ఇచ్చినదానిని తిరిగి వేరొకరికి ఇవ్వగూడదు.

ప్రతిగ్రహః ప్రకాశస్స్యాత్ స్థావరస్య విశేషతః ।
దేయం ప్రతిశ్రుతం చైవ దత్త్వా నాపహరేత్ పునః ॥27॥

దానం అందరికీ తెలిసేవిధంగా తీసుకోవాలి. ముఖ్యంగా స్థిరమైన ఆస్తులను మాత్రం రహస్యంగా తీసుకోగూడదు. ఇస్తానని వాగ్దానం చేసిన దానిని తప్పకుండా ఇవ్వాలి. ఇచ్చిన దానిని తిరిగి తీసుకోగూడదు.

దశైకపఞ్చసప్తాహమాసత్ర్యహార్ధమాసికమ్ ।
బీజాయోవాహ్యరత్నస్త్రీదోహ్యపుంసాం ప్రతీక్షణమ్ ॥28॥

ఇస్తానని చెప్పిన తరువాత తీసుకోవడానికి విత్తనాలకు పదిరోజులు, ఇనుముకు ఒకరోజు, వాహనాలకు ఐదురోజులు, రత్నాలకు ఏడురోజులు, స్త్రీలకు నెల, పాడిఆవులకు మూడురోజులు, సేవకులకు పదిహేనురోజులు ఎదురుచూడవచ్చును.

అగ్నౌ సువర్ణమక్షీణం ద్విపలం రజతే శతే ।
అష్టౌ త్రపుషి సీసే చ తామ్రే పఞ్చదశాయసి ॥29॥

నిప్పులో వేసినపుడు బంగారం బరువు తగ్గదు. వెండి నూటికి రెండుపలాలబరువు తగ్గుతుంది. తగరమూ, సీసమూ నూటికి ఎనిమిదిపలాలు, రాగి నూటికి అయిదుపలాలు, ఇనుము పదిపలాలు బరువు తగ్గుతాయి.

శతే దశపలా వృద్ధిరౌర్ణే కార్పాసికే తథా ।
మధ్యే పఞ్చపలా జ్ఞేయా సూక్ష్మే తు త్రిపలా మతా ॥30॥

ఉన్ని నీటితో తడిపినపుడు నూటికి పదిపలాల బరువు పెరుగుతుంది. నూలు కూడ అంతే పెరుగుతుంది. మందం మధ్యరకంగా ఉంటే, అయిదుపలాలు పెరుగుతుంది. సన్నగా ఉంటే మూడుపలాలు పెరుగుతుంది.

కార్మికే రోమబద్ధే చ త్రింశద్భాగః క్షయో మతః ।
న క్షయో న చ వృద్ధిస్తు కౌశేయ వల్కలేషు చ ॥31॥

అద్దకం వేసిన బట్టలలోనూ, వెంట్రుకలతో కూర్చినవాటిలోనూ నూటికి ముప్పైవంతులు తగ్గిపోతుంది. పట్టుబట్టలలోనూ, నారబట్టలలోనూ పెరుగుదల గానీ తరుగుదల కానీ ఉండదు.

దేశం కాలం చ భోగం చ జ్ఞాత్వా నష్టే బలాబలమ్ ।
ద్రవ్యాణాం కుశలా బ్రూయుర్యత్తద్దాప్యమసంశయమ్ ॥32॥

నిపుణులు దేశాన్నీ, కాలాన్నీ, అనుభవాన్నీ అనుసరించి ఆయా వస్తువులలో పెరుగుదలలు, తరుగుదలలను తెలుసుకుని, వస్తువుల నాణ్యతను నిర్ణయించిన ప్రకారం రాజు లాభనష్టాలను ఇప్పించాలి.

బలాద్దాసీకృతశ్చోరైర్విక్రీతశ్చాపి ముచ్యతే ।
స్వామిప్రాణప్రదో భక్తత్యాగాత్తన్నిష్క్రయాదపి ॥33॥

బలవంతంగా సేవకుడుగా చేయబడినవాడినీ, దొంగలు సేవకుడిగా అమ్మినవాడినీ, యజమానిప్రాణాలు కాపాడినవాడినీ, తన కోసం వ్యయం చేసిన సొమ్మును తిరిగి ఇచ్చినవాడినీ, సేవావృత్తినుండి విడిపించి, స్వేచ్ఛను ఇవ్వాలి.

ప్రవ్రజ్యావసితో రాజ్ఞో దాస ఆమరణాన్తికః ।
వర్ణానామానులోమ్యేన దాస్యం న ప్రతిలోమతః ॥ 34॥

సన్యాసం తీసుకుని భ్రష్టుడైనవాడు జీవితాంతం రాజుకు దాస్యం చేయాలి. బ్రాహ్మణాది వర్ణాలలో క్రిందివర్ణంవారు పైవర్ణం వారికి దాస్యం చేయాలి. పైవర్ణంవారు తమకంటె క్రిందివర్ణం వారికి దాస్యం చేయగూడదు.

కృతశిల్పోఽపి నివసేత్ కృతకాలం గురోర్గృహే ।
అన్తేవాసీ గురుప్రాప్తభోజనస్తత్ఫలప్రదః ॥ 35॥

విద్యలో నైపుణ్యం సంపాదించిన శిష్యుడు నియమితకాలం గురువుగారి ఇంట్లోనే ఉండాలి. గురువువద్ద ఉండి, అతడు పెట్టినతిండి తిని చదువుకున్నవాడు గురువు చెప్పిన విద్యవలన కలిగిన ఫలితాన్ని ఆ కాలంలో గురువుగారికి ఇవ్వాలి.

రాజా కృత్వా పురే స్థానం బ్రాహ్మణాన్న్యస్య తత్ర తు ।
త్రైవిద్యం వృత్తిమద్ బ్రూయాత్ స్వధర్మః పాల్యతామితి ॥36॥

రాజధానిలో రాజు బ్రాహ్మణులకోసం ఒక ప్రత్యేకప్రాంతం ఏర్పాటు చేసి, అందులో బ్రాహ్మణులను నివసింపజేయాలి. వేదవేత్తలయిన ఆ బ్రాహ్మణులకు అక్కడ వృత్తిని ఏర్పాటుచేయాలి. 'మీరు మీ ధర్మాన్ని చక్కగా పాటించండి' అని వారికి తమ అనుష్ఠానంలో అవకాశం కలిగించాలి.

నిజధర్మావిరోధేన యస్తు సామయికో భవేత్ ।
సోఽపి యత్నేన సంరక్ష్యో ధర్మో రాజకృతశ్చ యః ॥37॥

స్వధర్మాచారపరాయణుడైన ఆ బ్రాహ్మణుడు కూడ తన ధర్మానికి విరుద్ధం కాకుండా, రాజు చేసిన ధర్మాన్ని ప్రయత్నపూర్వకంగా రక్షించాలి.

గణద్రవ్యం హరేద్యస్తు సంవిదం లఙ్ఘయేచ్చ యః ।
సర్వస్య హరణం కృత్వా తం రాష్ట్రాద్విప్రవాసయేత్ ॥38॥

సంఘాలద్రవ్యాన్ని అపహరించినవాడికి, తన హద్దులు దాటి వ్యవహరించేవాడికి సంబంధించిన సర్వస్వాన్ని రాజు తీసుకోవాలి. అతడిని రాజ్యంనుంచి వెళ్లగొట్టాలి.

కర్తవ్యం వచనం సర్వైః స్సమూహహితవాదినామ్ ।
యస్తత్ర విపరీత స్స్యాత్ స దాప్యః ప్రథమం దమమ్ ॥39॥

పదిమందికి మేలుచేసేవారు చెప్పినమాటను అందరూ తప్పకుండా ఆచరించాలి. ఆ ప్రకారం చేయనివాడిని రాజు ప్రథమసాహసం (రెండువందలయాభై పణాలు 227అ.4శ్లో) దండన విధించాలి.

సమూహకార్యప్రహితో యల్లభేత్తత్తదర్పయేత్ ।
ఏకాదశగుణం దాప్యో యద్యసౌ నార్పయేత్ స్వయమ్ ॥40॥

రాజు జనసమూహానికి సంబంధించిన పనిపైన పంపినవాడు, ఆ సందర్భంలో తనకు లభించినది మొత్తం ఆ ప్రజలకే ఇవ్వాలి. అలా ఇవ్వకుండా తాను తీసుకున్నవాడివద్ద వాడు తీసుకున్నదానికి పదకొండురెట్లు అధికంగా జనానికి ఇప్పించాలి.

వేదజ్ఞాశ్శుచయోఽలుబ్ధా భవేయుః కార్యచిన్తకాః ।
కర్తవ్యం వచనం తేషాం సమూహహితవాదినామ్ ॥41॥

వేదవేత్తలు, పవిత్రంగా ఉండాలి. వారికి దురాశ ఉండగూడదు. నిత్యం జనహితమైన కార్యాలను గూర్చి ఆలోచిస్తుండాలి. జనసమూహానికి మేలు కలిగించేవారు చెప్పిన దానిని ప్రజలు తప్పక ఆచరించాలి.

శ్రేణినైగమపాషణ్డిగణానామప్యయం విధిః ।
భేదం చైషాం నృపో రక్షేత్ పూర్వవృత్తిం చ పాలయేత్ ॥42॥

వర్తకులు శిల్పులు మొదలైనవాళ్లసమూహం, వేదార్థం తెలిసినవాళ్ల సముదాయం, వేదవిరుద్ధంగా నడుచుకునేవాళ్లకు కూడ ఇదే విధానం చెల్లుతుంది. ఈ ధర్మాలలోని భేదాలను రాజు రక్షించాలి. వీరు పూర్వం చేసిన వృత్తిని కూడ రాజు కాపాడాలి.

గృహీతవేతనః కర్మ త్యజన్ ద్విగుణమావహేత్ ।
అగృహీతే సమం దాప్యో భృత్యై రక్ష్య ఉపస్కరః ॥43॥

జీతం తీసుకుని పని మానుకున్నవాడు తాను తీసుకున్న జీతానికి రెట్టింపుసొమ్ము యజమానికి ఇవ్వాలి. జీతం తీసుకోకుండా పని మానివేసినవాడు జీతంతో సమానమైన సొమ్ము ఇవ్వాలి. కర్మ సాధనాలను (వాటిని ఉపయోగించే)జీతగాళ్లే కాపాడాలి.

దాప్యస్తు దశమం భాగం వాణిజ్యపశుసస్యతః ।
అనిశ్చిత్య భృతిం యస్తు కారయేత్స మహీక్షితా ॥44॥

జీతం నిర్ణయించకుండా పని చేయించుకున్నపుడు వ్యాపారంలోనూ, పశువులలోనూ, పంటలోనూ పదవవంతు ఆదాయాన్ని యజమానిచేత భృత్యుడికి రాజు ఇప్పించాలి.

దేశం కాలం చ యోఽతీయాత్ కర్మ కుర్యాచ్చ యోఽన్యథా ।
తత్ర తు స్వామినశ్ఛన్దో ఽధికం దేయం కృతేఽధికే ॥45॥

భృత్యుడు చేయవలసినపని తగిన దేశంలో చేయకపోయినా, తగిన కాలంలో చేయకపోయినా, అలాగే చెప్పినవిధంగా కాకుండా ఆ పనిని మరొకవిధంగా చేసినా, యజమాని తన ఇష్టం వచ్చినంత జీతం ఇవ్వవచ్చు. చెప్పినదానికంటె అధికంగా, బాగా పని చేసినపుడు, జీతం కూడా అధికంగానే ఇవ్వాలి.

యో యావత్కురుతే కర్మ తావత్తస్య తు వేతనమ్ ।
ఉభయోరప్యసాధ్యం చేత్ సాధ్యే కుర్యాద్యథాశ్రుతమ్ ॥46॥

చేసినపనికి తగినంత వేతనం భృత్యుడికి ఇవ్వాలి. పని చేయించుకునేవాడు, పని చేసేవాడు ఇద్దరికీ దానికి భృతి ఎంత తగినదో గుర్తించడం సాధ్యం కానపుడు, దానిని నిర్ణయించ గలిగినవాడు చెప్పిన ప్రకారం చేయాలి.

అరాజదైవికం నష్టం భాణ్డం దాప్యస్తు వాహకః ।
ప్రస్థానవిఘ్నకృచ్చైవ ప్రదాప్యో ద్విగుణాం భృతిమ్ ॥47॥

రాజశాసనంవలన గానీ, దైవికం గానీ కాకుండా (బుద్ధిపూర్వకంగా) వర్తకుడి సరుకులు పాడయిపోయినపుడు, వాటిని మోసేవాడే యజమానికి నష్టపోయిన సొమ్ము ఇవ్వాలి. ప్రయాణానికి విఘ్నం కలిగించినవాడు ఆ పనికి తీసుకునే కూలీకి రెట్టింపు సొమ్ము యజమానికి ఇవ్వాలి.

ప్రక్రాన్తే సప్తమం భాగం చతుర్థం పథి సన్త్యజన్ ।
భృతిమర్ధపథే సర్వాం ప్రదాప్యస్త్యాజకోఽపి చ ॥48॥

పని మానివేసేవాడు యాత్ర ప్రారంభంలో మానివేస్తే జీతంలో ఏడవవంతు యజమానికి ఇవ్వాలి. యాత్ర జరుగుతుండగా దారిలో మానేస్తే జీతంలో నాలుగవవంతు ఇవ్వాలి. దారిమధ్యలో మానేస్తే జీతం మొత్తం ఇవ్వాలి.

గ్లహే శతకవృద్ధేస్తు సభికః పఞ్చకం శతమ్ ।
గృహ్ణీయాద్ధూర్తకితవాదితరాద్దశకం శతమ్ ॥49॥

జూదంలో పందెం వేసి నూరు, అంతకంటె అధికంగా లాభం పొందినవాడినుండి నూరునాణాలకు ఐదు నాణాలు జూదం ఆడించేవాడు వసూలు చేయాలి. జూదంలో మోసం చేసి లాభం సంపాదించిన వాడినుండి నూటికి పది వసూలు చేయాలి.

స సమ్యక్పాలితో దద్యాద్ రాజ్ఞే భాగం యథాకృతమ్ ।
జితముద్గ్రాహయేజ్జేత్రే దద్యాత్సత్యం వచః క్షమీ ॥50॥

రాజు చక్కగా పరిపాలిస్తుండగా జూదశాలను ఎటువంటి అడ్డంకులు లేకుండా నడిపించేవాడు జూదంవలన తనకు వచ్చిన ఆదాయంలో రాజుకు నిర్ణయింపబడిన భాగం ఇవ్వాలి. జూదశాలను నడిపేవాడు జూదంలో గెలిచినవాడి సొమ్మును వాడినే తీసుకోనివ్వాలి. ఆ విషయంలో ఓర్పుతో నిజం చెప్పాలి.

ప్రాప్తే నృపతినా భాగే ప్రసిద్ధే ధూర్తమణ్డలే ।
జితం స సభికే స్థానే దాపయేదన్యథా న తు ॥51॥

రాజుకు ఇవ్వవలసిన భాగాన్ని ఇచ్చిన తరువాతనే, జూదంలో గెలిచినవాడికి వాడు గెలిచినసొమ్మును జూదరులందరి సమక్షంలో జూదశాలను నడిపేవాడు ఇప్పించాలి. రాజు భాగం ఇవ్వనివాడికి గెలిచినసొమ్ము ఇవ్వరాదు.

ద్రష్టారో వ్యవహారాణాం సాక్షిణశ్చ త ఏవ హి ।
రాజ్ఞా సచిహ్నా నిర్వాస్యాః కూటాక్షోపధిదేవినః ॥52॥

జూదంలో ఏర్పడిన తగాదాలను పరిశీలించేవాళ్లు, దానికి సాక్షులు కూడా జూదరులే. దొంగపాచికలతో మోసం చేసేవాళ్ల శరీరంమీద వారిమోసానికి గుర్తుగా ముద్రలు వేయించి, రాజు రాజ్యంనుండి బహిష్కరించాలి.

ద్యూతమేకముఖం కార్యం తస్కరజ్ఞానకారణాత్ ।
ఏష ఏవ విధిర్ జ్ఞేయః ప్రాణిద్యూతే సమాహ్వయే ॥53॥

జూదంలో దొంగలను తెలుసుకుని ఉంటారు కాబట్టి జూదకార్యం ఎప్పుడూ ఒక్కడి ద్వారానే నడిపించాలి. పశువులు మొదలైన జీవులతో ఆడే జూదానికి గూడా విధానం ఇదే అని గ్రహించాలి.

ఇత్యాది మహాపురాణే ఆగ్నేయే సీమావివాదాదినిర్ణయకథనం నామ సప్తపఞ్చాశదధికద్విశతతమో ఽధ్యాయః ॥257॥

అగ్నిమహాపురాణంలో సరిహద్దుల వివాదములలో నిర్ణయము చెప్పుట అనే రెండువందల యాభైఏడవ అధ్యాయం సమాప్తం.



అష్టపఞ్చాశదధికద్విశతతమోఽధ్యాయః – రెండువందల యాభైఎనిమిదవ అధ్యాయం

వాక్పారుష్యాదిప్రకరణకథనమ్ – వాక్పారుష్యాదిప్రకరణకథనం

అగ్నిరువాచ – వసిష్ఠమహర్షితో అగ్నిదేవుడు ఇలా చెప్తున్నాడు.

సత్యాసత్యాన్యథాస్తోత్రైర్న్యూనాఙ్గేన్ద్రియరోగిణామ్ ।
క్షేపం కరోతి చేద్దణ్డ్యః పణానర్ధత్రయోదశ ॥1॥

అవయవలోపం కలిగినవారినీ, ఇంద్రియలోపం కలిగినవారినీ, రోగంతో బాధపడేవారినీ, నిజమైనమాటలతో గానీ, అబద్ధపుమాటలతో గానీ ఎగతాళి చేసినవాడికి పదమూడున్నర పణాల దండన విధించాలి.

అభిగన్తాస్మి భగినీం మాతరం వా తవేతి చ ।
శపన్తం దాపయేద్రాజా పఞ్చవింశతికం దమమ్ ॥2॥

నీతల్లిని, లేదా చెల్లిని పొందుతాను అని నిందావచనాలు పలికేవాడికి రాజు ఇరవైఅయిదుపణాలు దండన విధించాలి.

అర్ధోఽధమేషు ద్విగుణః పరస్త్రీషూత్తమేషు చ ।
దణ్డప్రణయనం కార్యం వర్ణజాత్యుత్తరాధరైః ॥3॥

నీచవ్యక్తులను నిందించినపుడు దండనలో సగం విధించాలి. ఇతరుల భార్యలను గాని, ఉత్తమవ్యక్తులను గాని నిందించినపుడు దండన రెట్టింపు విధించాలి. తిట్టబడిన వారివర్ణం, జాతి, ఎక్కువ తక్కువలను బట్టి దండనం విధించాలి.

ప్రాతిలోమ్యాపవాదేషు ద్విగుణత్రిగుణా దమాః ।
వర్ణానామానులోమ్యేన తస్మాదేవార్ధహానితః ॥4॥

తక్కువవర్ణంవాడు వాడికంటె పైవర్ణంవారిని నిందిస్తే ఆ భేదాన్నిబట్టి దండన రెండురెట్లు, మూడురెట్లుగా విధించాలి. పైవర్ణం వాడు తనకంటె కిందివర్ణం వారిని నిందించినపుడు దండనం దానిలో సగం చొప్పున విధించాలి.

బాహుగ్రీవానేత్రసక్థివినాశే వాచికే దమః ।
శస్తస్తతోఽధికః పాదనాసాకర్ణకరాదిషు ॥5॥

నీభుజాలు నరుకుతాను, మెడ విరుస్తాను. కళ్లు పీకుతాను. తొడలు విరగగొడతాను అనేవిధంగా మాటలతో అవమానించినవాడిని దండించాలి. కాళ్లు విరుస్తాను, ముక్కు, చెవులు కోస్తాను. చేతులు నరుకుతాను అనేవిధంగా తిట్టినవాడిని అంతకంటె కఠినంగా దండించాలి.

అశక్తస్తు వదన్నేవం దణ్డనీయః పణాన్దశ ।
తథా శక్తః ప్రతిభువం దద్యాత్ క్షేమాయ తస్య తు ॥6॥

చేతకానివాడు పైవిధంగా తిడితే వాడికి పదిపణాలు దండన విధించాలి. చెప్పినట్లు చేయగలిగిన సామర్థ్యం ఉన్నవాడు అలా తిడితే, దండన శుల్కం చెల్లించి, తాను తిట్టినవాడి క్షేమానికి (కావలసిన సొమ్ము ఇస్తానని) హామీ ఇవ్వాలి.

పతనీయకృతే క్షేపే దణ్డో మధ్యమసాహసః ।
ఉపపాతకయుక్తే తు దాప్యః ప్రథమసాహసమ్ ॥7॥

పతనాన్ని గురించి చేసిన ఆక్షేపానికి అంటే నీవు పతితుడివి అని తిడితే, మధ్యమసాహసం దండనం. నీవు ఉపపాతకం చేశావు అని తిడితే, తిట్టినవాడినుండి ప్రథమసాహసం దండనగా ఇప్పించాలి.

త్రైవిద్యనృపదేవానాం క్షేప ఉత్తమసాహసః ।
మధ్యమో జ్ఞాతిపూగానాం ప్రథమో గ్రామదేశయోః ॥8॥

వేదపండితులను, రాజును, దేవతలను తిట్టినవాడికి ఉత్తమసాహసం దండన విధించాలి. దాయాదులను జనసమూహాన్ని తిట్టినవాడికి మధ్యమసాహసం దండన. గ్రామాన్నీ దేశాన్నీ తిట్టినవాడికి ప్రథమసాహసం దండన.

సాశీతిపలసాహస్రో దండ ఉత్తమసాహసః ।
తదర్తం మధ్యమ ప్రోక్తః తదర్ధం అధమః స్మృతః ॥ (యాజ్ఞవల్క్యయ)

(ఎనుబదివేల పలములు దండన ఉత్తమసాహసము గాను, దానిలో సగము మధ్యమ మరియు (40 వేల పలములు) దానిలో సగము (20వేల పలములు) అధమసాహసమని యాజ్ఞవల్క్యం చెప్పినది.)

అసాక్షికహతే చిహ్నైర్యుక్తిభిశ్చాగమేన చ ।
ద్రష్టవ్యో వ్యవహారస్తు కూటచిహ్నకృతాద్భయాత్ ॥9॥

సాక్షులు లేకుండా కొట్టినపుడు, రాజు ఆ వ్యవహారాన్ని దెబ్బలగుర్తులు, యుక్తి, శాస్త్రం వీటిని అనుసరించి దోషిని పరిశీలించాలి. అసత్యంగా ఆరోపించినవాడు భయంతో దెబ్బలగుర్తులను మోసంతో చేసుకున్నాడా అనే అంశాన్ని పరిశీలించాలి.

భస్మపఙ్కరజస్స్పర్శే దణ్డో దశపణస్స్మృతః ।
అమేధ్యపార్ష్ణినిష్ఠ్యూతస్పర్శనే ద్విగుణ స్స్మృతః ॥10॥

బూడిద, బురద, దుమ్మును ఇతరులమీద చల్లినవాడికి పదిపణాలు దండన. మలం, కాలిమడమకిందిభాగం, ఉమ్మి తగిలించినవాడికి ఇరవై పణాలు దండన.

సమేష్వేవం పరస్త్రీషు ద్విగుణస్తూత్తమేషు చ ।
హీనేష్వర్ధం దమో మోహమదాదిభిరదణ్డనమ్ ॥11॥

ఈ చెప్పినవిధానం సమానుల విషయంలో మాత్రమే. ఇతరుల స్త్రీలవిషయంలోనూ, ఉత్తములయిన పురుషుల విషయంలోనూ ఆ దండన రెట్టింపుగా విధించాలి. తక్కువవారిలో ఈదండన సగం విధించాలి. అజ్ఞానంచేత గాని, మత్తు, ఉన్మాదం మొదలయిన వాటిచేత గాని చేస్తే దండన ఉండదు.

విప్రపీడాకరం ఛేద్యమఙ్గమబ్రాహ్మణస్య తు ।
ఉద్గూర్ణే ప్రథమో దణ్డ స్సంస్పర్శే తు తదర్ధకః ॥12॥

బ్రాహ్మణుడు కానివాడు బ్రాహ్మణుడిని బాధిస్తే, అతడు ఏ అవయవంతో బాధించాడో ఆ అవయవాన్ని నరికివేయాలి. బ్రాహ్మణుడిపైకి ఆయుధం ఎత్తినవాడికి ప్రథమసాహసం దండనం. బాధించడానికి ఆయుధం తాకినవాడికి ప్రథమసాహసంలో సగం దండనం.

ఉద్గూర్ణే హస్తపాదే తు దశవింశతికౌ దమౌ ।
పరస్పరం తు సర్వేషాం శాస్త్రే మధ్యమసాహసః ॥13॥

కొట్టడానికి చేయి ఎత్తితే పదిపణాలు దండనం. తన్నాలని కాలెత్తితే ఇరవైపణాలు దండనం. ఒకరి నొకరు కొట్టుకోవడానికి సిద్ధపడినపుడు వారందరికీ మధ్యమసాహసం దండన విధించాలని శాస్త్రం చెప్తున్నది.

పాదకేశాంశుకకరోల్లుఞ్చనేషు పణాన్దశ ।
పీడాకర్షాంశుకావేష్టపాదాధ్యాసే శతం దమః ॥14॥

కాళ్లు, జుట్టు, వస్త్రం, చేతులు, పట్టుకుని లాగితే, పదిపణాలు దండనం. బాధపెట్టినా, పట్టుకుని లాగినా, వస్త్రంలో చుట్టివేసినా, కాలితో తన్నినా నూరుపణాలు దండన.

శోణితేన వినా దుఃఖం కుర్వన్కాష్ఠాదిభిర్నరః ।
ద్వాత్రింశతం పణాన్దాప్యో ద్విగుణం దర్శనేఽసృజః ॥15॥

కట్టెలు మొదలైన వాటితో కొట్టినపుడు బాధ కలిగినా, రక్తం కారకపోతే, కొట్టినవాడికి ముప్పైరెండు పణాలు దండన. రక్తం కనబడితే దానికి రెట్టింపు (అరవైనాలుగు పణాలు) దండన విధించాలి.

కరపాదదతో భఙ్గే ఛేదనే కర్ణనాసయోః ।
మధ్యో దణ్డో వ్రణోద్భేదే మృతకల్పహతే తథా ॥16॥

చేతులతో గాని, కాళ్లతో గాని, దంతాలతో గాని గాయం చేసినా, చెవులు, ముక్కు కోసినా, గాయాలు కలిగేవిధంగా కొట్టినా, దాదాపుగా చచ్చేవిధంగా కొట్టినా, మధ్యమసాహసం దండన విధించాలి.

చేష్టాభోజనవాగ్రోధే నేత్రాదిప్రతిభేదనే ।
కన్ధరాబాహుసక్థ్నాం చ భఙ్గే మధ్యమసాహసః ॥17॥

ఇతరులచేతలను, భోజనాన్ని, మాటలను అడ్డగించినవాడికి, కన్నులు మొదలైనవాటిని బాధించినవాడికి, మెడ, భుజాలు, తొడలు విరిచినవాడికి మధ్యమసాహసం దండనగా విధించాలి.

ఏకం ఘ్నతాం బహూనాం చ యథోక్తాద్ద్విగుణా దమాః ।
కలహాపహృతం దేయం దణ్డస్తు ద్విగుణ స్స్మృతః ॥18॥

ఒక్కడిని చాలమంది కలిసి హింసిస్తే, వారికి ఇంతకు ముందు చెప్పినదానికి రెట్టింపు (మధ్యమసాహసానికి రెట్టింపు) దండన విధించాలి. తగాదాలలో అపహరించిన ధనాన్ని తిరిగి యజమానికి ఇప్పించి, దానికి రెట్టింపు దండన విధించాలి.

దుఃఖముత్పాదయేద్యస్తు స సముత్థానజం వ్యయమ్ ।
దాప్యో దణ్డం చ యో యస్మిన్ కలహే సముదాహృతః ॥19॥

ఇతరులను బాధించినవాడు, బాధింపబడినవాడి బాధ తొలగి, స్వస్థత చేకూరడానికి అయ్యే వ్యయం మొత్తం భరించాలి. ఏ కలహానికి ఎంత దండం విధించాలని చెప్పబడిందో, ఆ దండం కూడా విధించాలి.

తరికస్స్థలజం శుల్కం గృహ్ణన్ దణ్డ్యః పణాన్ దశ ।
బ్రాహ్మణప్రాతివేశ్యానామేతదేవ నిమన్త్రణే ॥20॥

నావతో నీటిని దాటించేవాడు భూమిపై ప్రయాణానికి కూడ శుల్కం తీసుకుంటే, అతడికి పదిపణాలు దండన విధించాలి. యజ్ఞాదిక్రతువులలో సమర్థులున్నప్పటికీ, తన ఇరుగుపొరుగు బ్రాహ్మణులను నిమంత్రించిన వాడికి కూడ ఇదే విధంగా పదిపణాలు దండన విధించాలి.

అభిఘాతే తథా భేదే ఛేదే కుడ్యావపాతనే ।
పణాన్ దాప్యః పఞ్చదశ వింశతిం తద్వ్యయం తథా ॥21॥

ఇతరుల ఇంటిగోడపై దెబ్బ గొడితే అయిదుపణాలు, పగలగొడితే పదిపణాలు, నరికితే ఇరవైపణాలు, పడగొడితే ఆ మూడు కలిపి ముప్పైఅయిదుపణాలు దండన విధించాలి.

దుఃఖోత్పాది గృహే ద్రవ్యం క్షిపన్ ప్రాణహరం తథా ।
షోడశాద్యః పణాన్ దాప్యో ద్వితీయో మధ్యమం దమమ్ ॥22॥

ఇతరుల ఇండ్లలో బాధలు కలిగించే వస్తువులను పడవేసినవాడికి పదహారుపణాలు దండన విధించాలి. ప్రాణం తీసే వస్తువులను పడేసినవాడికి మధ్యమసాహసం దండన విధించాలి.

దుఃఖే చ శోణితోత్పాదే శాఖాఙ్గచ్ఛేదనే తథా ।
దణ్డః క్షుద్రపశూనాం స్యాద్ద్విపణప్రభృతిః క్రమాత్ ॥23॥

తక్కువజాతి పశువులకు కష్టం కలిగించినవాడికి రెండు పణాలు, రక్తం వచ్చేవిధంగా బాధించినవాడికి నాలుగు పణాలు, చేతులు (కాళ్లు) మొదలైన అవయవాలను నరికితే ఎనిమిదిపణాలు దండన విధించాలి.

లిఙ్గస్య ఛేదనే మృత్యౌ మధ్యమో మూల్యమేవ చ ।
మహాపశూనామేతేషు స్థానేషు ద్విగుణా దమాః ॥ 24॥

ఆ జంతువు లింగాన్ని నరికివేయడంవలన అది మరణిస్తే, వాడికి మధ్యమసాహసం దండన విధించాలి. పెద్దపెద్దజంతువుల విషయంలో ఈ స్థానాలలో ఆ దండనం రెట్టింపుగా ఉంటాయి.

ప్రరోహిశాఖినాం శాఖాస్కన్ధసర్వవిదారణే ।
ఉపజీవ్య ద్రుమాణాం తు వింశతేర్ద్విగుణో దమః ॥25॥

కొమ్మ విరిచి నేలలో పాతగా మొలకెత్తు చెట్లకొమ్మలను గాని, మానులను గాని, వేళ్లతో సహా మొత్తం చెట్టును గాని నరికినవాడికి ఇరవైపణాలు దండన. పండ్లు, పూలు కలిగిన చెట్లను నరికితే దానికి రెట్టింపు దండనను విధించాలి.

యస్సాహసం కారయతి స దాప్యో ద్విగుణం దమమ్ ।
యస్త్వేవ ముక్త్వాహం దాతా కారయేత్ స చతుర్గుణమ్ ॥26॥

ఇటువంటి దుర్మార్గాన్ని చేయించినవాడికి, చేసినవాడికి వేసేదండనకు రెట్టింపు దండన విధించాలి. దోషం చేసినవాడిని నువ్వు ఈ పని చెయ్యి. నీకు ధనం ఇస్తాను అన్నవాడికి నాలుగురెట్లు అధికంగా దండన విధించాలి.

ఆర్యాక్రోశాతిక్రమకృద్ భ్రాతృభార్యాప్రహారకః ।
సన్దిష్ట స్యాప్రదాతా చ సముద్రగృహభేదకః ॥27॥

పూజ్యులను నిందించినవాడికి, వారిమాటను మీరినవాడికి, సోదరుడి భార్యను అపహరించినవాడికి, ఇస్తానని చెప్పి ఇవ్వనివాడికి, నీళ్లమధ్యలో కట్టిన ఇంటిని పడగొట్టినవాడికి,

సామన్తకులికాదీనా మపకారస్య కారకః ।
పఞ్చాశత్పణికో దణ్డ ఏషా మితి వినిశ్చయః ॥28॥

ఇరుగుపొరుగువారికి, గొప్పవంశంలో పుట్టినవారికి, అపకారం చేసినవాడు యాభై పణాలు దండనం చెల్లించాలి అని శాస్త్రనిర్ణయం.

స్వచ్ఛన్దవిధవాగామీ విక్రుష్టే నాభిధావకః ।
అకారణే చ విక్రోష్టా చాణ్డాలశ్చోత్తమాన్ స్పృశన్ ॥29॥

శూద్రప్రవ్రజితానాం చ దైవే పైత్ర్యే చ భోజకః ।
అయుక్తం శపథం కుర్వన్నయోగ్యో యోగ్యకర్మకృత్ ॥30॥

వృషక్షుద్రపశూనాం చ పుంస్త్వస్య ప్రతిఘాతకృత్ ।
సాధారణస్యాపలాపీ దాసీగర్భవినాశకృత్ ॥31॥

పితాపుత్రస్వసృభ్రాతృదమ్పత్యాచార్యశిష్యకాః ।
ఏషామపతితాన్ యోఽన్యత్యాగీ చ శతదణ్డభాక్ ॥32॥

తనకు తానుగా విధవను పొందినవాడు, కష్టాలలో ఆక్రోశించేవారిని రక్షించడానికి వెళ్లనివాడు, తగిన కారణం లేకుండా ఆక్రోశించేవాడు, ఉత్తమజాతివారిని తాకిన చండాలుడు, దైవకార్యాలలోనూ, పితృకార్యాలలోనూ శూద్రులకు, సన్న్యాసులకు భోజనం పెట్టేవాడు, అయోగ్యమైన ప్రమాణాలు చేసేవాడు, తనకు తగనిపని చేసేవాడు, ఆబోతులకు, అధమజాతికి చెందిన జంతువులకు, పుంస్త్వాన్ని తొలగించినవాడు, సాధారణమైన విషయాలలో గూడా అనుచితంగా ప్రవర్తించేవాడు, దాసికడుపు చెడగొట్టినవాడు, తండ్రీకొడుకులు, అక్కచెల్లెళ్ళు, అన్నదమ్ములు, భార్యాభర్తలు, గురుశిష్యులు, వీరు పతితులు కాకపోయినప్పటికీ విడిచిపెట్టినవాడు – వీరందరికీ నూరుపణాలు దండన విధించాలి.

వసానస్త్రీన్ పణాన్ దణ్డ్యో నేజకస్తు పరాంశుకమ్ ।
విక్రయాపక్రియాధానయాచితేషు పణాన్ దశ ॥33॥

ఉతకమని ఇచ్చిన ఇతరులవస్త్రాన్ని ధరించిన చాకలివాడికి మూడుపణాలు దండనం. ఇతరుల వస్త్రాలను అమ్మినా, అద్దెకు ఇచ్చినా, తాకట్టు పెట్టినా, యాచించినా, అతడికి పదిపణాలు దండన విధించాలి.

తులాశాసనమానానాం కూటకృన్నాణకస్య చ ।
ఏభిశ్చ వ్యవహర్తా య స్స దాప్యో దణ్డముత్తమమ్ ॥34॥

త్రాసు, శాసనం, కొలతలలోనూ, నాణ్యతను నిర్ణయించడంలోనూ మోసంచేసేవాడికి, వీరితో వ్యవహరించే వాడికి ఉత్తమసాహసం దండన విధించాలి.

అకూటం కూటకం బ్రూతే కూటం యశ్చాప్యకూటకమ్ ।
స నాణకపరీక్షాయాం దాప్యః ప్రథమసాహసమ్ ॥35॥

వస్తువు నాణ్యతను పరీక్షించడంలో మంచివస్తువును చెడ్డదనీ, చెడ్డవస్తువును మంచిదనీ చెప్పినవాడికి ప్రథమసాహసం దండన విధించాలి.

భిషజ్ మిథ్యాచరన్ దాప్యస్తిర్యక్షు ప్రథమం దమమ్ ।
మానుషే మధ్యమం రాజమానుషేషూత్తమం తథా ॥36॥

పశువులు పక్షులు మొదలైన తిర్యక్కులకు అబద్ధపు వైద్యం చేసిన వైద్యుడికి ప్రథమసాహసం దండన. మనుష్యులకు తప్పుడు వైద్యం చేసినవాడికి మధ్యమసాహసం, రాజుకు తప్పువైద్యం చేసినవాడికి ఉత్తమసాహసం దండన.

అబధ్యం యశ్చ బధ్నాతి బధ్యం యశ్చ ప్రముఞ్చతి ।
అప్రాప్తవ్యవహారం చ స దాప్యో దమముత్తమమ్ ॥37॥

బంధింపగూడనివాడిని బంధించినవాడికీ, బంధింపవలసినవాడిని విడిచిపెట్టినవాడికీ, వివాదాన్ని సరిగా గ్రహించనివాడికీ, ఉత్తమసాహసం దండన.

మానేన తులయా వాఽపి యోఽంశమష్టమకం హరేత్ ।
ద్వావింశతిపణాన్ దాప్యో వృద్ధౌ హానౌ చ కల్పితమ్ ॥38॥

కొలతలోనూ, తూకంలోనూ ఎనిమిదవవంతు కాజేసిన వాడిచేత ఇరవైరెండు పణాలు అపరాధశుల్కంగా ఇప్పించాలి. ఇంతకంటె ఎక్కువ గాని లేదా తక్కువ గానీ మోసం చేసినపుడు శుల్కం దానికి తగినవిధంగా ఇప్పించాలి.

భేషజస్నేహలవణగన్ధధాన్యగుడాదిషు ।
పణ్యేషు ప్రక్షిపన్ హీనం పణాన్ దాప్యస్తు షోడశ ॥39॥

ఔషధాలు, నూనె, ఉప్పు, గంధం, ధాన్యం, బెల్లం మొదలైన వాటిలో తక్కువజాతి వస్తువు కలిపినపుడు (కల్తీ చేస్తే) పదహారు పణాలు ఇప్పించాలి.

సమ్భూయ కుర్వతామర్ఘం సబాధం కారుశిల్పినామ్ ।
అర్ఘస్య హ్రాసం వృద్ధిం వా సహస్రో దణ్డ ఉచ్యతే ॥ 40॥

చెక్కతో శిల్పాలు చెక్కేవాళ్లు కొంతమంది కలిసి సంఘంగా ఏర్పడి చేసిన శిల్పానికి మూల్యాన్ని అధికం చేస్తే అతడికి వేయిపణాలు దండనం.

రాజని స్థాప్యతే యోఽర్ఘః ప్రత్యహం తేన విక్రయః ।
క్రయో వా విక్రయ స్తస్మాద్వణిజాం లాభకృత్ స్మృతః ॥41॥

ప్రతిరోజూ రాజు నిర్ణయించిన ధరకే సరకులు అమ్మకాలు, కొనుగోళ్లు చేయాలి. విక్రయించాలి. దానివలననే వ్యాపారులకు లాభం కలుగుతుంది.

స్వదేశపణ్యే తు శతం వణిగ్ గృహ్ణీత పఞ్చకమ్ ।
దశకం పారదేశ్యే తు య స్సద్యః క్రయవిక్రయీ ॥ 42॥

తాను పుట్టినదేశంలో జరిపిన వ్యాపారంలో నూటికి అయిదుభాగాలు లాభం తీసుకోవాలి. ఇతర దేశాలలో చేసే వ్యాపారంలో నయితే నూటికి పదిభాగాలు పుచ్చుకోవాలి. అప్పటికప్పుడు చేసే వ్యాపారంలో లాభం పద్ధతి ఇది.

పణ్యస్యోపరి సంస్థాప్య వ్యయం పణ్యసముద్భవమ్ ।
అర్ఘోఽనుగ్రహకృత్కార్యః క్రేతుర్విక్రేతురేవ చ ॥43॥

వ్యాపారం చేయడంలో వివిధావస్థలలో అయ్యే వ్యయాన్ని ఆ వస్తువుపై వేసి, అమ్మేవాడికీ కొనేవాడికి కూడా లాభం వచ్చేవిధంగా వస్తువు విలువను నిర్ణయించాలి.

గృహీతమూల్యం యః పణ్యం క్రేతుర్నైవ ప్రయచ్ఛతి ।
సోదయం తస్య దాప్యోఽసౌ దిగ్లాభం వా దిగాగతే ॥44॥

వస్తువుమూల్యం తీసుకుని ఆ వస్తువును కొన్నవాడికి ఇవ్వనివాడికి వడ్డీతో సహా ఆ ధర ఇప్పించాలి. అతడు వేరేదేశం నుండి వచ్చిఉంటే, ఆ దేశంలో ఆ వస్తువుకు ఎంత లాభం వస్తుందో అది కూడా కలిపి ఇవ్వాలి.

విక్రీతమపి విక్రేయం పూర్వే క్రేతర్యగృహ్యతి ।
హానిశ్చేత్ క్రేతృదోషేణ క్రేతురేవ హి సా భవేత్ ॥45॥

కొనుక్కున్నవాడు తాను కొన్నవస్తువును తీసుకోకపోతే, దానిని వేరొకరికి అమ్ముకోవచ్చును. కాని అమ్మినవాడికి కొనుక్కున్న వాడివలన రెండోసారి అమ్మేటపుడు నష్టం వస్తే, ఆ నష్టాన్ని మొదట కొన్నవాడే భరించాలి.

రాజదైవోపఘాతేన పణ్యే దోషముపాగతే ।
హానిర్విక్రేతు రేవాసౌ యాచిత స్యాప్రయచ్ఛతః ॥46॥

కొన్నవాడు అడిగినప్పటికీ వాడు కొన్నవస్తువును అతడికి ఇవ్వకుండా అమ్మినవాడు తన దగ్గరే ఉంచుకొనగా రాజశాసనంవలన గాని, దైవంవలన గాని ఆ వస్తువు పాడయిపోతే ఆ నష్టాన్ని అమ్మినవాడే భరించాలి.

అన్యహస్తే చ విక్రీతం దుష్టం వాదుష్టవద్యది ।
విక్రీణీతే దమస్తత్ర తన్మూల్యాద్ద్విగుణో భవేత్ ॥47॥

ఒకడికి అమ్మినవస్తువును తిరిగి ఇంకొకడికి అమ్మినా, మంచిదని చెప్పి చెడ్డవస్తువును అమ్మినా, ఆ అమ్మినవాడికి ఆ వస్తువుమూల్యానికి రెట్టింపు దండన విధించాలి.

క్షయం వృద్ధిం చ వణిజా పణ్యానామవిజానతా ।
క్రీత్వా నానుశయః కార్యః కుర్వన్ షడ్భాగదణ్డభాక్ ॥48॥

కొన్నవస్తువుకు సంబంధించిన వృద్ధిని గాని, నష్టం గాని తెలియని వ్యాపారి కొన్నతరువాత దానిని గురించి విచారించగూడదు. ఆ విధంగా బాధపడి ఆ వస్తువును తిరస్కరిస్తే ఆ వస్తువువిలువలో ఆరవభాగం దండనగా చెల్లించాలి.

సమవాయేన వణిజాం లాభార్థం కర్మ కుర్వతామ్ ।
లాభాలాభౌ యథా ద్రవ్యం యథా వా సంవిదా కృతౌ ॥49॥

లాభంకోసం కలిసి వ్యాపారం చేసిన వ్యాపారులు ఆ వస్తువునుబట్టి గాని, లేదా ముందుగా అనుకున్న ప్రకారంగా గాని, వచ్చిన లాభనష్టాలను పంచుకోవాలి.

ప్రతిషిద్ధమనాదిష్టం ప్రమాదాద్యచ్చ నాశితమ్ ।
స తద్దద్యాద్విప్లవాచ్చ రక్షితాద్దశమాంశభాక్ ॥50॥

ఇతరులు వద్దని వారించినా, ఆ పని చేయమని చెప్పకపోయినా, పొరపాటుపడి అయినా, ఆ వ్యాపారుల సమూహంలో ఎవరయినా, ఏదయినా వస్తువును పాడుచేస్తే, దానివలన కలిగిన నష్టాన్ని అతడొక్కడే భరించాలి. దానిని ఎవడయినా కాపాడితే, ఆ వస్తువుమూల్యంలో పదవవంతు రక్షించినవాడికి చెందుతుంది.

అర్ఘప్రక్షేపణాద్వింశం భాగం శుల్కం నృపో హరేత్ ।
వ్యాసిద్ధం రాజయోగ్యం చ విక్రీతం రాజగామి తత్ ॥51॥

అమ్మినవస్తువు మూల్యంలో ఇరవైయవభాగం శుల్కంగా రాజు తీసుకుంటాడు. రాజు నిషేధించిన వస్తువును గాని, రాజు అనుభవించవలసిన వస్తువును గాని అమ్మితే అది (కొన్నవాడికి కాక) రాజుకే చెందుతుంది.

మిథ్యా వదన్ పరీమాణం శుల్కస్థానాదపక్రమన్ ।
దాప్య స్త్వష్టగుణం యశ్చ సవ్యాజక్రయవిక్రయీ ॥52॥

పన్ను చెల్లింపవలసినచోట వస్తువు పరిమాణాన్ని తప్పుగా చెప్పి తప్పించుకుని పోయినా, లేదా మోసంతో అమ్మకాలు, కొనుగోళ్లు చేసినా, వాళ్లు ఆ వస్తువుమూల్యానికి ఎనిమిదిరెట్లు అధికంగా చెల్లించాలి.

దేశాన్తరగతే ప్రేతే ద్రవ్యం దాయాదబాన్ధవాః ।
జ్ఞాతయో వా హరేయుస్తదాగతాస్తైర్వినా నృపః ॥53॥

కలిసి వ్యాపారం చేసినవాళ్లలో ఎవడయినా ఇతరదేశాలకు వెళ్లిపోయినా, లేదా మరణించినా, ఆతడి ద్రవ్యాన్ని అతడి దాయాదులు, లేదా బంధువులు, లేదా జ్ఞాతులు తీసుకోవాలి. వారెవరూ లేకపోతే ఆ సొమ్ము రాజుకు చెందుతుంది.

జిహ్మం త్యజేయుర్నిర్లాభమశక్తోఽన్యేన కారయేత్ ।
అనేన విధిరాఖ్యాత ఋత్విక్కర్షకకర్మిణామ్ ॥54॥

కలిసి వ్యాపారం చేసినవాళ్లలో ఇతరులను మోసం చేసినవాడికి లాభం పంచకుండా, అతడిని సంఘంనుండి బయటకు పంపివేయాలి. వ్యాపారం చేయటం చేతకానివాడు ఇతరులచేత చేయించాలి. ఋత్విక్కులు, కర్షకులు, కర్మకారులకు కూడా ఇదే విధానం చెప్పబడింది.

గ్రాహకై ర్గృహ్యతే చౌరో లోప్త్రేణాథ పదేన వా ।
పూర్వకర్మాపరాధీ వా తథైవాశుద్ధవాసకః ॥
అన్యే ఽపి శఙ్కయా గ్రాహ్యా జాతినామాదినిహ్నవైః ॥55॥

దొంగిలించబడిన సొమ్మునుబట్టి గాని, పాదముద్రలనుబట్టి కాని రాజభటులు దొంగను పట్టుకోవాలి. అతడు అంతకు ముందు చేసిన తప్పుడుపనులనుబట్టి కాని, అతడు నివసించే అపరిశుద్ధమైన స్థలాన్నిబట్టి కాని, అతడి జాతి, పేరు, మొదలైన వానిని దాచి, అబద్ధం చెప్పడాన్నిబట్టి కాని సందేహంతోనూ దొంగలను పట్టుకోవచ్చును.

ద్యూతస్త్రీపానసక్తాశ్చ శుష్కభిన్నముఖస్వరాః ।
పరద్రవ్యగృహాణాం చ పృచ్ఛకా గూఢచారిణః ॥
నిరాయా వ్యయవన్తశ్చ వినష్టద్రవ్యవిక్రయాః ॥56॥

జూదం, స్త్రీలు, మద్యపానం వీటిలో మిక్కిలిగా ఆసక్తి కలిగినవారినీ, నిజాన్ని గురించి అడిగినపుడు ముఖమూ కంఠస్వరమూ రెండూ ఎండిపోయినవిధంగానూ, మార్పులు చెందినట్లుగానూ ఉన్నవారినీ, ఇతరులధనాన్ని గురించి, ఇండ్లను గురించి అడిగే వారినీ, ఎవ్వరికీ తెలియకుండా రహస్యంగా తిరిగేవారినీ, ఆదాయం లేకుండానే అధికంగా వ్యయం చేసేవారినీ, ఇతరులు పోగొట్టుకున్న వస్తువులను అమ్మేవారినీ దొంగలుగా సందేహించి పట్టుకోవచ్చును.

గృహీతశ్శఙ్కయా చౌర్యే నాత్మానం చేద్ విశోధయేత్ ।
దాపయిత్వా హృతం ద్రవ్యం చౌరదణ్డేన దణ్డయేత్ ॥57॥

దొంగతనం చేశాడనే సందేహంతో పట్టుకున్నవాడు తాను దొంగకాదని నిరూపించుకోలేకపోతే, దొంగిలించిన సొమ్మును తిరిగి రాబట్టుకుని, అతడిని దొంగకు తగినవిధంగా శిక్షించాలి.

చౌరం ప్రదాప్యాపహృతం ఘాతయేద్ వివిధైర్వధైః ।
సచిహ్నం బ్రాహ్మణం కృత్వా స్వరాష్ట్రాద్ విప్రవాసయేత్ ॥58॥

అపహరించినసొత్తును యజమానికి ఇప్పించిన తరువాత రకరకాలుగా ఆ దొంగను కొట్టించాలి. ఆ దొంగ బ్రాహ్మణుడయితే అతడికి దొంగ అని గుర్తులు వేసి, రాజ్యంనుంచి వెళ్లగొట్టాలి.

ఘాతితేఽపహృతే దోషో గ్రామభర్తురనిర్గతే ।
స్వసీమ్ని దద్యాద్ గ్రామస్తు పదం వా యత్ర గచ్ఛతి ॥59॥

గ్రామంలోనివాళ్లను కొట్టినా, వారిసొమ్ము దొంగిలించినా, అతడిని శిక్షింపకపోతే అది గ్రామాధికారి తప్పు అవుతుంది. పారిపోయిన అపరాధి ఆ గ్రామం సరిహద్దులు దాటిపోకుండా, అందులోపల ఎక్కడికి వెళ్లినా, అతడిని ఆ గ్రామమే పట్టి అధికారులకు అప్పగించాలి.

పఞ్చగ్రామీ బహిః క్రోశాద్ దశగ్రామ్యథ వా పునః ॥60॥

దొంగ ఆ గ్రామం దాటి క్రోసెడు దూరంవరకు బయటికి వెళ్లినపుడు అయిదుగ్రామాల అధికారి గాని, లేదా పదిగ్రామాల అధికారి గాని ఆ దొంగను పట్టి శిక్షించాలి.

బన్దిగ్రాహాంస్తథా వాజికుఞ్జరాణాం చ హారిణః ।
ప్రసహ్య ఘాతినశ్చైవ శూలమారోపయేన్నరాన్ ॥61॥

బంధింపబడినవారినీ, గుఱ్ఱాలను, ఏనుగులను అపహరించినవాడినీ, ఇతరులను ఎదిరించి చంపినవాడినీ పదునైన శూలంమీద నిలపడం అనే శిక్ష వేయాలి.

ఉత్క్షేపకగ్రన్థిభేదౌ కరసన్దంశహీనకౌ ।
కార్యౌ ద్వితీయాపరాధే, కరపాదైకహీనకౌ ॥62॥

పెట్టెలు మొదలైన వస్తువులను ఎత్తుకొనిపోయి, తాళాలు, గడియలు మొదలైనవి పగలగొట్టినవారికి (చేతిలో) పట్టుకోవడానికి సాధనమైన బొటనవ్రేళ్లు, చూపుడువ్రేళ్లు నరికివేయాలి. అదే తప్పు మళ్లీ చేసినవాడికి ఒక చేయి, ఒకకాలు నరికివేయాలి.

భక్తావదంశాగ్న్యుదకమన్త్రోపకరణవ్యయాన్ ।
దత్త్వా చౌరస్య హన్తుర్వా జ్ఞానతో దమ ఉత్తమః ॥ 63॥

దొంగతనం చేసినవాడు, చంపినవాడు అని తెలిసి కూడా అతడికి అన్నం పెట్టినవాడు, నంజుళ్లు ఇచ్చినవాడు, నిప్పు, నీళ్లు, అటువంటి అపరాధాలను చేయాలనే ఆలోచనలు, దానికి అవసరమైన సాధనాలు, దారి ఖర్చులు ఇచ్చినవాడు – వీరికి ఉత్తమసాహసం దండనం విధించాలి.

శస్త్రావపాతే గర్భస్య పాతనే చోత్తమో దమః ।
ఉత్తమో వాఽధమో వాపి పురుషస్త్రీప్రమాపణే ॥64॥

ఇతరులపై ఆయుధం ప్రయోగించినా, గర్భం పోగొట్టినా ఉత్తమసాహసం దండన విధించాలి. పురుషుడిని గాని, స్త్రీని గాని చంపినవాడికి సందర్భాన్ని అనుసరించి ఉత్తమసాహసం లేదా అధమసాహసం దండన విధించాలి.

శిలాం బద్ధ్వా క్షిపేదప్సు నరఘ్నీం విషదాం స్త్రియమ్ ॥65॥

మనుష్యులకు విషం పెట్టి చంపిన ఆడదానిని ఒంటికి బండరాయి కట్టి నీళ్లలో పడవేయాలి.

విషాగ్నిదాం నిజగురునిజాపత్యప్రమాపణీమ్ ।
వికర్ణకరనాసోష్ఠీం కృత్వా గోభిః ప్రమాపయేత్ ॥66॥

ఇతరులకు విషం పెట్టి చంపినదానినీ, నిప్పులలో కాల్చిచంపిన దానినీ, తన తండ్రిని, (గురువునూ) సంతానాన్ని రూపుమాపిన దానినీ, చెవులూ, చేతులూ, ముక్కూ, పెదవులూ నరికి, ఎద్దులతో తొక్కించి చంపాలి.

క్షేత్రవేశ్మవనగ్రామవివీతఖలదాహకాః ।
రాజపత్న్యభిగామీ చ దగ్ధవ్యాస్తు కటాగ్నినా ॥67॥

పంటపొలాలనూ, ఇళ్లనూ, అడవులనూ, ఊళ్లనూ, పచ్చికపట్టులనూ, ధాన్యం నూర్చే ప్రదేశాలనూ తగులబెట్టినవారినీ, రాజుగారి భార్యను పొందినవాడినీ ఊకనిప్పులో వేసి కాల్చాలి.

పుమాన్ సంగ్రహణే గ్రాహ్యః కేశాకేశి పరస్త్రియాః ।
స్వజాతా వుత్తమో దణ్డ ఆనులోమ్యే తు మధ్యమః ॥
ప్రాతిలోమ్యే వధః పుంసాం నార్యాః కర్ణావకర్తనమ్ ॥68॥

తన జాతికి చెందినస్త్రీని జుట్టు పట్టుకుని లాగిన పురుషుడికి ఉత్తమసాహసం దండన. అనుకూలంగా ఉన్న స్త్రీని జుట్టుపట్టి లాగినవాడికి మధ్యమసాహసం దండనం. ప్రతికూలంగా ఉన్న స్త్రీని జుట్టుపట్టుకుని లాగిన పురుషుడిని చంపివేయాలి. పురుషుడిని ఆ విధంగా చేసినస్త్రీకి చెవులు కోయాలి.

నీవీస్తనప్రావరణనాభికేశావమర్దనమ్ ।
అదేశకాలసమ్భాషం సహావస్థానమేవ చ ॥69॥

ఆడదాని కోకముడి, స్తనాలు, స్తనాలపై ఉండేవస్త్రం, బొడ్డు, జుట్టుముడి – వీటిని గట్టిగా ముట్టుకున్నవాడిని, కూడనిప్రదేశంలో అనుచితమైన సమయంలో స్త్రీతో సంభాషించేవాడిని, ఒకే ఆసనంమీద స్త్రీతో కలిసి కూర్చున్నవాడిని వ్యభిచారదోషం క్రింద దండించాలి.

స్త్రీనిషేధే శతం దద్యాద్ ద్విశతం తు దమం పుమాన్ ।
ప్రతిషేధే తయోర్దణ్డో యథా సంగ్రహణే తథా ॥70॥

ఇష్టం లేదని చెప్పినా, సంభాషణాదులు చేసినస్త్రీకి నూరుపణాలు దండన విధించాలి. పురుషుడి కయితే రెండువందలపణాలు దండనం. వ్యతిరేకించిన సందర్భంలో ఆవిధంగా ప్రవర్తించిన స్త్రీపురుషులకు ఇద్దరికీ సమానంగా వ్యభిచారదోషానికి విధించే దండన విధించాలి.

పశూన్ గచ్ఛన్ శతం దాప్యో హీనాం స్త్రీం గాశ్చ మధ్యమమ్ ॥71॥

పశువులతో సంగమించినవాడు నూరుపణాలు శుల్కం ఇవ్వాలి. నీచజాతికి చెందినస్త్రీని పొందినవాడికి, గోవుతో సంగమించినవాడికి మధ్యమసాహసం (500 పణాలు) దండనం.

అవరుద్ధాసు దాసీషు భుజిష్యాసు తథైవ చ ।
గమ్యాస్వపి పుమాన్ దాప్యః పఞ్చాశత్ పణికం దమమ్ ॥72॥

తిరస్కరించిన స్త్రీలను, కొనుగోలు చేసి తెచ్చిన పనికత్తెలను, జీతానికి పనిచేసే సేవకురాళ్లను, పొందదగిన స్త్రీలను పొందినవాడికి యాభైపణాలు దండన విధించాలి.

ప్రసహ్య దాస్యభిగమే దణ్డో దశపణ స్స్మృతః ।
కుబన్ధేనాఙ్క్య గమయేదన్త్యా ప్రవ్రజితాగమే ॥73॥

బలవంతంగా దాసిని పొందినవాడికి పదిపణాలు దండనం. నీచజాతికి చెందిన స్త్రీని గాని, సన్న్యసించిన స్త్రీని గాని పొందినవాడికి, శరీరంమీద వాడిదుర్మార్గపు సంబంధాన్ని తెలియజేసే గుర్తులు పెట్టి వెళ్లగొట్టాలి.

న్యూనం వా హ్యధికం వాపి లిఖేద్యో రాజశాసనమ్
పారదారికచౌరం వా ముఞ్చతో దణ్డ ఉత్తమః ॥74॥

రాజశాసనాన్ని రాజు చెప్పినదానికంటె ఎక్కువగా గాని, తక్కువగాగాని వ్రాసినవాడికి ఉత్తమసాహసం దండన విధించాలి. ఇతరుల భార్యను పొందినవాడిని, దొంగతనం చేసినవాడిని (శిక్ష పడకుండా) విడిచిపెట్టినవాడికి కూడా ఉత్తమసాహసం (1000 పణాలు) దండనం విధించాలి.

అభక్ష్యైర్దూషయ న్విప్రం దణ్డ ఉత్తమసాహసః ॥75॥

బ్రాహ్మణుడిచేత తినగూడని పదార్థాలను తినిపించి, పాపం చేయించినవాడికి ఉత్తమసాహసం (1000 పణాలు) దండనం.

కూటవాదీ స్వర్ణహారీ విమాంసస్య చ విక్రయీ ।
అఙ్గహీనశ్చ కర్తవ్యో దాప్యశ్చోత్తమసాహసమ్ ॥76॥

అసత్యాలు చెప్పేవాడికీ, బంగారం దొంగిలించినవాడికీ, దుష్టమాంసాన్ని అమ్మేవాడికీ, అవయవం నరికి, ఉత్తమసాహసం (1000 పణాలు) దండన విధించాలి.

శక్తో హ్యమోక్షయన్ స్వామీ దంష్ట్రిణశ్శృఙ్గిణ స్తథా ।
ప్రథమం సాహసం దద్యాద్ విక్రుష్టే ద్విగుణం తథా ॥77॥

కోరలు, కొమ్ములు గలిగిన పశువులు ఇతరులను బాధిస్తుండగా, ఆ పశువులయజమాని విడిపించగలిగి ఉండి కూడా విడిపించకపోతే అతడికి ప్రథమసాహసం (250 పణాలు) దండన విధించాలి. వాళ్లు విడిపించమని మొఱపెట్టుకున్నా, విడిపించకపోతే, దానికి రెట్టింపు (500 పణాలు)దండన విధించాలి.

అచౌర్యం చౌర్యేఽభివదన్, దాప్యః పఞ్చశతం దమమ్ ॥78॥

దొంగిలించకపోయినా, దొంగిలించినట్లుగా చెప్పినవాడికి అయిదువందలపణాలు దండన విధించాలి.

రాజ్ఞోఽ నిష్టప్రవక్తారం తస్యై వాక్రోశకం తథా ।
మృతాఙ్గలగ్నవిక్రేతుర్గురోస్తాడయితు స్తథా ॥
తన్మన్త్రస్య చ భేత్తారం ఛిత్వా జిహ్వాం ప్రవాసయేత్ ॥79॥

రాజుకు ఇష్టం లేని మాటలు చెప్పేవాడిని, రాజును నిందించేవాడిని, చనిపోయినవాడి ఒంటిమీద ఉన్న బంగారం మొదలైనవాటిని అమ్ముకునేవాడిని, గురువును కొట్టినవాడిని, గురువుగారు చేసిన రాజ్యానికి సంబంధించిన మంత్రాంగాన్ని చెడగొట్టినవాడిని, నాలుక కోసి, రాజ్యంనుంచి వెళ్లగొట్టాలి.

రాజయానాసనారోఢుర్దణ్డో మధ్యమసాహసః ॥80॥

రాజుగారివాహనాన్ని గాని, సింహాసనాన్ని గాని ఎక్కి కూర్చున్నవాడికి మధ్యమసాహసం దండన విధించాలి.

ద్వినేత్రభేదినో రాజద్విష్టాదేశకృత స్తథా ।
విప్రత్వేన చ శూద్రస్య జీవితోఽ ష్టశతో దమః ॥81॥

రెండుకన్నులను పీకివేసినవాడికీ, రాజద్రోహుల ఆజ్ఞను పాటించేవాడికీ, బ్రాహ్మణుడివేషం వేసుకుని జీవించే శూద్రుడికీ ఎనిమిదివందలపణాలు దండన విధించాలి.

యో మన్యే తాజితోఽ స్మీతి న్యాయే నాభిపరాజితః ।
తమాయాన్తం పునర్జిత్వా దణ్డయే ద్ద్విగుణం దమమ్ ॥82॥

న్యాయంగా ఓడిపోయినవాడు నేను ఓడిపోలేదు అని భావించి, తిరిగి పోటీకి వచ్చినపుడు వాడిని మరొకసారి జయించి, (పందెం వేసుకున్న సొమ్ముకు) రెట్టింపు ధనం శుల్కంగా దండించాలి.

రాజ్ఞాన్యాయేన యో దణ్డో గృహీతో వరుణాయ తమ్ ।
నివేద్య దద్యాద్విప్రేభ్యస్స్వయం త్రింశద్గుణీకృతమ్ ॥83॥

తప్పు చేయనివాడి వద్ద అన్యాయంగా అపరాధశుల్కం తీసుకుంటే, దానిని వరుణదేవుడికి నివేదించి, ఆ సొమ్ముకు ముప్పైరెట్ల ధనాన్ని రాజు స్వయంగా బ్రాహ్మణులకు ఇవ్వాలి.

ధర్మశ్చార్థశ్చ కీర్తిశ్చ లోకపఙ్క్తిరుపగ్రహః ।
ప్రజాభ్యో బహుమానం చ స్వర్గస్థానం చ శాశ్వతమ్ ॥
పశ్యతో వ్యవహారాంశ్చ గుణాస్స్యుస్సప్త భూపతేః ॥84॥

రాజవ్యవహారాలను స్వయంగా పర్యవేక్షించే రాజుకు 1. ధర్మం 2. అర్థం 3. కీర్తి 4. తాను పరిపాలించే ప్రజలు (ప్రజలను కాపాడడం) 5. శత్రువులను నిరోధించడం 6. ప్రజలను గౌరవించడం 7. శాశ్వతంగా స్వర్గంలో ఉండిపోవడం అనే ఏడు గొప్పగుణాలు ఏర్పడతాయి.

ఇత్యాది మహాపురాణే ఆగ్నేయే వాక్పారుష్యాదిప్రకరణకథనం నామాష్టపఞ్చాశదధికద్విశతతమోఽ ధ్యాయః ॥258॥

అగ్నిమహాపురాణంలో వాక్పారుష్యాదిప్రకరణకథనం అనే రెండువందల యాభైఎనిమిదవ అధ్యాయం సమాప్తం.

ఏకోనషష్ట్యధికద్విశతతమోఽధ్యాయః - రెండువందల యాభైతొమ్మిదవ అధ్యాయం

ఋగ్విధానకథనమ్ - ఋగ్విధానకథనం

అగ్నిరువాచ - వసిష్ఠమహర్షితో అగ్నిదేవుడు ఇలా చెప్తున్నాడు.

ఋగ్యజుస్సామాథర్వవిధానం పుష్కరోదితమ్ ।
భుక్తిముక్తికరం జప్యాద్ధోమాద్రామాయ తద్ వదే ॥1॥

వసిష్ఠమహర్షీ! పూర్వం పుష్కరుడు పరశురాముడికి చెప్పిన ప్రకారంగా ఋగ్, యజుస్, సామ, అథర్వవేదాలకు సంబంధించిన విధానాలను ఇపుడు నీకు చెప్తాను. ఆ ప్రకారంగా ఋక్కులు మొదలైనవాటిని జపించడంవలననూ, హోమం చేయడంవలననూ భోగాలూ, మోక్షమూ కలుగుతాయి.

పుష్కర ఉవాచ - పుష్కరుడు పరశురాముడితో ఇలా చెప్తున్నాడు.

ప్రతివేదం తు కర్మాణి కార్యాణి ప్రవదామి తే ।
ప్రథమం ఋగ్విధానం వై శృణు త్వం భుక్తిముక్తిదమ్ ॥2॥

ఋక్, యజుస్, సామ, అథర్వవేదాలు అన్నింటికి సంబంధించి చేయవలసిన కర్మలు నీకు చెప్తాను. వాటిలో ముందుగా ఋగ్వేద విధానం గురించి విను. ఇది భోగమోక్షాలను ఇస్తుంది.

అన్తర్జలే తథా హోమే జపతో మనసేప్సితమ్ ।
కామం కరోతి గాయత్రీ ప్రాణాయామాద్విశేషతః ॥3॥

నీళ్లమధ్యలో నిలిచి కాని, హోమకాలంలో కాని, గాయత్రీమంత్రాన్ని జపిస్తే మనసులో కోరుకున్నకోరికలన్నీ నెరవేరతాయి. ప్రాణయామంతో జపించడం వలన ఇంకా అధికమైన ఫలితం వస్తుంది.

గాయత్ర్యా దశసాహస్రో జపో నక్తాశినో ద్విజ ।
బహుస్నాతస్య తత్రైవ సర్వకల్మషనాశనః ॥4॥

విప్రవరేణ్యా! పరశురామా! అనేక పర్యాయాలు (ముమ్మారు) స్నానం చేసి, రాత్రిపూట మాత్రమే భోజనం చేస్తూ, గాయత్రీమంత్రాన్ని పదివేలపర్యాయాలు జపిస్తే, అన్నిపాపాలూ నశించిపోతాయి.

దశాయుతాని జప్త్వా యో హవిష్యాశీ స ముక్తిభాక్ ।
ప్రణవో హి పరం బ్రహ్మ తజ్జపస్సర్వపాపహా ॥5॥

హవిస్సును ఆహారంగా తీసుకుని, గాయత్రీమంత్రాన్ని లక్షసార్లు జపించేవాడు మోక్షాన్ని పొందుతాడు. ఓంకారం పరబ్రహ్మస్వరూపం. ఓంకారజపం సమస్తమైన పాపాలను పోగొడుతుంది.

ఓంకారం శతజప్తం తు నాభిమాత్రోదకస్థితః ।
జలం పిబేత్ స సర్వైస్తు పాపైర్వై విప్రముచ్యతే ॥6॥

బొడ్డులోతు నీళ్లలో నిలబడి, ఓంకారాన్ని వందసార్లు జపించి, ఓంకారంతో మంత్రించిన ఆ నీళ్లను త్రాగినవాడి పాపాలన్నీ దూరంగా వెళ్లిపోతాయి.

మాత్రాత్రయం త్రయో వేదాస్త్రయో దేవాస్త్రయోఽగ్నయః ।
మహావ్యాహృతయస్సప్త లోకా హోమోఽఖిలాఘహా ॥7॥

ఓంకారంలోని 'అ – ఉ – మ్' అనే మూడు మాత్రలు మూడు వేదాలు. బ్రహ్మవిష్ణురుద్రు లనే ముగ్గురు దేవతలు. మూడు (గార్హపత్యం, ఆహవనీయం, దక్షిణాగ్ని) అగ్నులు. గొప్పవైన వ్యాహృతులు ఏడు (భూః, భువః, సువః, మహః, జనః, తపః, సత్యం) సప్తమహాలోకాలు. ఓంకారంతోనూ, సప్తవ్యాహృతులతోనూ కూడిన గాయత్రీమంత్రంతో హోమం చేయడంవలన సమస్తమైన పాపాలు నశించిపోతాయి.

గాయత్రీ పరమా జప్యా మహావ్యాహృతయస్తథా ।
అన్తర్జలే తథా రామ ప్రోక్తశ్చైవాఘమర్షణః ॥8॥

పరశురామా! జపించదగిన వాటిలో గాయత్రి ఉత్తమమైన మంత్రం. అలాగే మహావ్యాహృతులు కూడా జపించాలి. నీళ్లలో ఉండి అఘమర్షణమంత్రాన్ని జపించడంవలన కూడా (గాయత్రీమంత్రజపంవలెనే) పాపాలన్నీ నశిస్తాయి.

అగ్నిమీలే పురోహితం సూక్తోఽయం వహ్నిదైవతః ।
శిరసా ధారయన్వహ్నిం యో జపేత్ పరివత్సరమ్ ॥
హోమం త్రిషవణం భైక్ష్యమనగ్నిజ్వలనం చరేత్ ॥9॥

'అగ్నిమీలే పురోహితం' (1–1–1) అనే సూక్తానికి దేవత అగ్ని. అగ్నిని శిరస్సుపై పెట్టుకుని ఒక సంవత్సర కాలం ఈ మంత్రాన్ని జపించాలి. ఈ మంత్రంతో హోమం చేయాలి. మూడుసంధ్యలలో స్నానం చేయాలి. భిక్షాన్నం తినాలి. అగ్ని జ్వలింపకుండా చరించాలి.

అతః పరమృచస్సప్త వాయ్వాద్యా యాః ప్రకీర్తితాః ।
తా జపన్ ప్రయతో నిత్యమిష్టాన్ కామాన్ సమశ్నుతే ॥10॥

దాని తరువాత ఉన్న, వాయువు మొదలైనవారు దేవతలుగా కలిగిన మంత్రాలు ఏడింటిని నిత్యమూ శ్రద్ధగా జపించినవాడు కావలసిన కోరికలను పొందుతాడు.

మేధాకామో జపేన్నిత్యం సదస్పమితి తృచమ్ ।
అన్వయో య న్నిమాః ప్రోక్తానవర్చో మృత్యునాశనః ॥11॥

బుద్ధి నిపుణతను కోరుకునేవాడు సదసస్పమితి (1–18–6) అనే ఋక్కును నిత్యం జపించాలి. 'అన్వయో యం' (1–23–18) అని మొదలుగా ఉన్న తొమ్మిది ఋక్కులు జపిస్తే (అకాల)మరణభయం ఉండదు.

శునశ్శేఫ మృషిం బద్ధ స్సన్నిరుద్ధోఽథ వా జపేత్ ।
ముచ్యతే సర్వపాపేభ్యో గదీ వాప్యగదో భవేత్ ॥12॥

శునశ్శేఫోఽ_యం (1-24-12) మొదలైన మూడుఋక్కులను జపిస్తే సమస్తమైన పాపాలు తొలగిపోతాయి. రోగగ్రస్తుడికి ఆరోగం పోయి, ఆరోగ్యం కలుగుతుంది.

య ఇచ్ఛేచ్ఛాశ్వతం కామం మిత్రం ప్రాజ్ఞం పురన్దరమ్ ।
ఋగ్భిష్షోడశభిః కుర్యాదిన్ద్రస్యేతి దినే దినే ॥13॥

నిరంతరం తన కోరికలు తీరుతుండాలన్నా, వివేకవంతుడయిన మిత్రుడు లభించాలన్నా, దేవేంద్రుడిని ఉద్దేశించి ప్రతిరోజూ 'ఇన్ద్రస్య' మొదలయిన పదహారుమంత్రాలను జపించాలి.

హిరణ్య స్తూపమిత్యేత జ్జపన్ శత్రూన్ ప్రబాధతే ।
క్షేమీ భవతి చాధ్వని యే తే పన్థా జపన్నరః ॥14॥

హిరణ్య స్తూపః (10-149-5) అనే మంత్రాన్ని జపించినవాడు శత్రువులను బాధి(జయి)స్తాడు. యే తే పన్థాః (1-35-11) అనే మంత్రాన్ని జపించినవాడు (ప్రయాణాదులలో) దారిలో క్షేమంగా ఉంటాడు.

రౌద్రీభిష్షడ్భి రీశానం స్తుయాద్యో వై దినే దినే ।
చరుం వా కల్పయేద్రౌద్రం తస్య శాన్తిః పరా భవేత్ ॥15॥

రుద్రుడికి సంబంధించిన ఆరు మంత్రాలతో పరమేశ్వరుడిని ప్రతిరోజూ స్తుతించినవాడు, రుద్రుడికి సంబంధించిన చరువును ఏర్పాటుచేసినవాడు ఉత్తమమైన శాంతిని పొందుతాడు.

ఉదిత్యుద్యన్తమాదిత్యముపదిష్ఠన్ దినే దినే ।
క్షిపేజ్జలాఞ్జలీన్ సప్త మనోదుఃఖవినాశనమ్ ॥16॥

ఉదయిస్తున్న సూర్యుడిని 'ఉద్యన్త' (1-50-1) అనే మంత్రంతో ఉపాసించినవాడికీ, దోసిలితో నీళ్లు తీసుకుని, ఏడు దోసిళ్లు ఉదయిస్తున్న సూర్యుడికి సమర్పించినవాడికీ మానసికమైన వేదనలు నశిస్తాయి.

ద్విషన్తమిత్యథార్ధర్చం యద్విప్రాన్తం జపన్ స్మరేత్ ।
ఆగస్కృత్ సప్తరాత్రేణ విద్వేషమధిగచ్ఛతి ॥17॥

'ద్విషన్తం' అనే సగం ఋక్కు మొదలుకొని, 'యద్విప్రాః' అనేంతవరకు ఉన్న ఋక్కు జపించి, ధ్యానం చేస్తే, తన విషయంలో అపరాధం చేసినవాడు ఏడురాత్రులలో ద్వేషాన్ని విడిచిపెడతాడు.

ఆరోగ్యకామో రోగీ వా ప్రస్కన్నస్యోత్తమం జపేత్ ।
ఉత్తమ స్తస్య చార్ధర్చో జపే ద్వైరివినాశనే ॥18॥

నిరంతరం ఆరోగ్యంగా ఉండాలని కోరుకునేవాడు, రోగగ్రస్తు డయినవాడు (రోగం తగ్గా లని), 'ప్రస్కన్న స్యోత్తమం' అనే ఋక్కు జపించాలి. శత్రువులను నిర్మూలించాలనుకున్నవాడు ఆ ఋక్కులో సగం జపించడం మంచిది.

ఉదయత్యాయురక్షయ్యం తేజో మధ్యన్దినే జపేత్ ।
అస్తం ప్రతి గతే సూర్యే ద్విషన్తం ప్రతిబాధతే ॥19॥

ఈ ఋక్కును సూర్యుడు ఉదయించే సమయంలో జపిస్తే, దీర్ఘాయువు కలుగుతుంది. మధ్యాహ్నసమయంలో జపిస్తే తేజస్సు కలుగుతుంది. సూర్యుడు అస్తమించే సమయంలో జపిస్తే శత్రునాశనం కలుగుతుంది.

న వయశ్చేతి సూక్తాని జపన్ శత్రూన్నియచ్ఛతి ।
ఏకాదశసుపర్ణస్య సర్వకామాన్వినిర్దిశేత్ ॥20॥

'న వయః' (8-93-2) మొదలైన సూక్తాలను జపించినవాడు శత్రువులను జయిస్తాడు. పదకొండు సుపర్ణసూక్తాలను జపించినవాడు సమస్తమైన కోరికలను పొందుతాడు.

అధ్యాత్మికీః క ఇ త్యేతా జపన్మోక్షమవాప్నుయాత్ ।
ఆ నో భద్రా ఇత్యనేన దీర్ఘమాయురవాప్నుయాత్ ॥21॥

ఆధ్యాత్మికము లైన 'కః' అని మొదలైన ఋక్కులను జపించినవాడు మోక్షం పొందుతాడు. 'ఆ నో భద్రాః' (1-89-1) అనే ఋక్కును జపించినవాడు దీర్ఘమైన ఆయువును పొందుతాడు.

త్వం సోమేతి చ సూక్తేన నవం పశ్యేన్నిశాకరమ్ ।
ఉపతిష్ఠేత్సమిత్పాణి ర్వాసాంస్యాప్నో త్యసంశయమ్ ॥22॥

చేతులలో దర్భలు పుచ్చుకొని, శుక్లపక్షంలో విదియ నాటి చంద్రుడిని చూస్తూ 'త్వం సోమ' (9-86-24) అనే ఋక్కును జపించాలి. అలా చేసినవాడికి నూతనవస్త్రాలు లభిస్తాయి. ఇందులో సందేహం లేదు.

ఆయురీప్సన్నిమమితి కౌత్సం సూక్తం సదా జపేత్ ॥23॥

దీర్ఘాయుర్దాయం కోరుకునేవాడు 'ఇమం' (1-94) అనే కౌత్ససూక్తాన్ని నిరంతరం జపించాలి.

అప నశ్శోశుచదితి స్తుత్వా మధ్యే దివాకరమ్ ।
యథా ముఞ్చతి చేషీకాం తథా పాపం ప్రముఞ్చతి ॥24॥

మిట్ట మధ్యాహ్నంలో 'అప న శ్శోశుచత్' (1-97-1) అనే సూక్తంతో సూర్యుడిని స్తుతిస్తే, గడ్డినుండి రెల్లు వేరుపడినట్లుగా పాపం వాడిని విడిచి వెళ్లిపోతుంది.

జాతవేదస ఇత్యేత జ్జపేత్ స్వస్త్యయనం పథి ।
భయైర్విముచ్యతే సర్వైస్స్వస్తిమానాప్నుయాద్ గృహాన్ ॥
వ్యుష్టాయాం చ తథా రాత్ర్యామేతద్దుస్స్వప్ననాశనమ్ ॥25॥

(ప్రయాణం చేసేటపుడు) మార్గంలో 'జాతవేదసే' (1-19-1) అనే ఋక్కును జపించాలి. దానివలన అన్నిరకాల భయాలు తొలగిపోయి, క్షేమంగా ఇంటికి చేరుకుంటాడు. ప్రొద్దున గాని, రాత్రి గాని ఈ ఋక్కును జపిస్తే చెడుకలలు రావు.

ప్రమన్దినేతి సూయన్త్యా జపేద్గర్భవిమోచనమ్ ॥26॥

ప్రసవ సమయంలో 'ప్రమన్దినే' (1-101-1) అనే ఋక్కును జపిస్తే ప్రసవం సుఖంగా జరుగుతుంది.

ఉపన్నిన్ద్రమితి స్నాతో వైశ్వదేవం తు సప్తకమ్ ।
ముఞ్చత్యాజ్యం తథా జుహ్వాత్ సకలం కిల్బిషం నరః ॥27॥

స్నానం చేసి, 'ఉప న్నిన్ద్రమ్' (1-106-1) అనే ఋక్కు జపించి, ఏడుసార్లు వైశ్వదేవం చేసి, ఆవునేతితో హోమం చేసినవాడికి సమస్తమైన పాపాలు నశించిపోతాయి.

ఇమా మితి జపన్ శశ్వత్ కామానాప్నోత్యభీప్సితాన్ ॥28॥

'ఇమామ్' (10-85-45) అనే ఋక్కును జపించినవాడు ఇష్టమైన కోరికలన్నీ వెంటనే పొందుతాడు.

మానస్తోక ఇతి ద్వాభ్యాం త్రిరాత్రోపోషిత శ్శుచిః ।
ఔదుమ్బరీశ్చ జుహుయాత్ సమిధ శ్చాజ్యసంస్కృతాః ॥
ఛిత్వా సర్వాన్ మృత్యుపాశాన్ జీవేద్రోగవివర్జితః ॥29॥

మూడు రాత్రులు ఉపవాసం ఉండి, శుచిగా 'మా న స్తోకే' (1-114-8,9) మొదలయిన రెండుఋక్కులను జపించి, నేతితో సంస్కరించిన మేడికఱ్ఱల సమిధలతో హోమం చేయాలి. దీనివలన మృత్యుపాశాలన్నీ తెగిపోయి, ఏరోగం లేకుండా సుఖంగా బ్రదుకుతాడు.

ఊర్ధ్వబాహురనేనైవ స్తుత్వా శమ్భుం తథైవ చ ।
మానస్తోకేతి చ ఋచా శిఖాబన్ధే కృతే నరః ॥
అధృష్య స్సర్వభూతానాం జాయతే సంశయం వినా ॥30॥

రెండుచేతులు పైకెత్తి, 'మా న స్తోకే' అనే ఋక్కుతో పరమశివుడిని స్తుతిస్తూ, శిఖ ముడివేసుకున్నవాడు సమస్తమైన జీవకోటిని జయించేవాడు అవుతాడు. ఇందులో ఏమాత్రం సందేహం లేదు.

చిత్రమిత్యుపతిష్ఠేత త్రిసన్ధ్యం భాస్కరం తథా ।
సమిత్పాణిర్నరో నిత్యమీప్సితం ధనమాప్నుయాత్ ॥31॥

చేతిలో దర్భలు పుచ్చుకుని, ప్రతిరోజూ మూడుసంధ్యలలోనూ 'చిత్రం దేవానాం' (1-133-1) అనే ఋక్కుతో సూర్యుడిని ఉపాసిస్తే కోరుకున్నంత సంపద పొందుతాడు.

అథ స్వప్నేతి చ జపన్ ప్రాతర్మధ్యన్దినే దినే ।
దుస్స్వప్నం చార్దయేత్ కృత్స్నం భోజనం చాప్నుయాచ్ఛుభమ్ ॥32॥

ప్రాతఃకాలంలోనూ, మధ్యాహ్నకాలంలోనూ, అపరాహ్ణంలోనూ 'స్వప్నే' (2-15-9) అనే ఋక్కును జపిస్తే, చెడ్డకలలు రావు (నిష్ఫలమవుతాయి). మంచిభోజనం లభిస్తుంది.

ఉభే పుమానితి తథా రక్షోఘ్నః పరికీర్తితః ॥33॥

'ఉభే పుమాన్' (1-13-1) అనే ఋక్కులో రాక్షసులను నశింపజేస్తుందనే భావం చెప్పబడింది.

ఉభే వాసా ఇతి ఋచో జపన్ కామానవాప్నుయాత్ ।
తమాగన్నితి చ జపన్ ముచ్యతే చాతతాయినః ॥34॥

'ఉభే వాసా' (2-2-12,13) అనే ఋక్కును జపిస్తే కోరికలు నెరవేరుతాయి. 'త మాగన్' (8-19-32) అనే ఋక్కును జపించినవాడు ఆతతాయులనుండి విముక్తిని పొందుతాడు.

కయా శుభేతి చ జపన్ జాతిశ్రైష్ఠ్యమవాప్నుయాత్ ।
ఇమం ను సోమమిత్యేతత్ సర్వాన్ కామానవాప్నుయాత్ ॥35॥

'కయా శుభ' (1-165-1) అనే ఋక్కును జపించినవాడు తన జాతిలో ఉత్తముడవుతాడు. 'ఇమం ను సోమమ్' (1-179-5) అనే ఋక్కును జపించినవాడికి కోరికలన్నీ సిద్ధిస్తాయి.

పితరిత్యుపతిష్ఠేత నిత్యమర్థముపస్థితమ్ ।
అగ్నే నయేతి సూక్తేన ఘృతహోమశ్చ మార్గదః ॥36॥

'పితః' (1-187-1) అనే ఋక్కుతో ఉపాసించినవాడికి సంపదలు నిరంతరంగా దక్కుతాయి. 'అగ్నే నయ' (1-189-1) అనే ఋక్కుతో నేతితో హోమం చేస్తే ముక్తికి మార్గం లభిస్తుంది.

వీరాన్నయ మవాప్నోతి సుశ్లోకం యో జపేత్సదా ।
కఙ్కతో నేతి సూక్తేన విషాన్ సర్వాన్ వ్యపోహతి ॥37॥

'వీరాన్నయ' అనే ఋక్కును జపించినవాడు గొప్పకీర్తిప్రతిష్ఠలను పొందుతాడు. 'కఙ్కతో న' (1-191-1) అనే సూక్తం జపించినవాడు అన్ని రకాలయిన విషాలనుండి బయటపడతాడు.

యో జాత ఇతి సూక్తేన సర్వాన్ కామానవాప్నుయాత్ ।
గణానామితి సూక్తేన స్నిగ్ధ మాప్నోత్యనుత్తమమ్ ॥38॥

'యో జాతః' (2-12) అనే సూక్తం జపించినవాడికి అన్ని కోరికలూ నెరవేరుతాయి. 'గణానాం త్వా' (2-23-1) అనే సూక్తం జపించినవాడు ఉత్తమమైన కాంతిని పొందుతాడు.

యో మే రాజన్నితీమాం తు దుస్స్వప్నశమనీ మృచమ్ ॥39॥

'యో మే రాజన్' (2-28-10) అనే ఋక్కును జపించినవాడికి చెడుకలలు రావు.

అధ్వని ప్రస్థితో యస్తు పశ్యేచ్ఛత్రుం సముత్థితమ్ ।
అప్రశస్తం ప్రశస్తం వా కువిదఙ్గ ఇమం జపేత్ ॥40॥

దారివెంట వెళ్తూ మధ్యలో తనకంటె గొప్పవాడు కాని, తక్కువవాడు కాని ఎవడయినా శత్రువును చూసి, 'కువిదఙ్గం' అనే ఋక్కును జపించినవాడు ఆ శత్రువును లోబరుచుకుంటాడు.

ద్వావింశకం జపన్ సూక్తమాధ్యాత్మికమనుత్తమమ్ ।
పర్వసు ప్రయతో నిత్యమిష్టాన్ కామాన్ సమశ్నుతే ॥41॥

ఇరవైరెండు ఋక్కులు కలిగిన ఆధ్యాత్మికసూక్తం చాల ఉత్తమమైనది. దానిని ప్రయత్నపూర్వకంగా కుడిచేతివ్రేళ్లకణుపులలో లెక్కించి, పర్వదినాలలో జపించినవాడు తనకు కావలసిన కోరికలను పొందుతాడు.

కృణుష్వేతి జపన్ సూక్తం జుహ్వాదాజ్యం సమాహితః ।
అరాతీనాం హరేత్ ప్రాణాన్ రక్షాంస్యపి వినాశయేత్ ॥42॥

'కృణుష్వ' (4-4-1) అనే సూక్తాన్ని జపిస్తూ, శ్రద్ధగా నేతితో హోమం చేసినవాడు తన శత్రువుల ప్రాణాలను హరిస్తాడు. రాక్షసులను (రాక్షసశక్తులను) కూడా నశింపజేస్తాడు.

ఉపతిష్ఠేత్ స్వయం వహ్నిం పరిత్ర్యుచా దినే దినే ।
తం రక్షతి స్వయం వహ్నిర్విశ్వతో విశ్వతోముఖః ॥43॥

'పరి' అనే ఋక్కుతో ప్రతిరోజు అగ్నిని ఉపాసించేవాడిని సర్వత్ర నిండిఉన్న అగ్ని అన్ని విధాలుగానూ స్వయంగా రక్షిస్తుంది.

హంసశ్శుచిషదిత్యేతచ్ఛుచిరీక్షేద్దివాకరమ్ ॥44॥

సూర్యుడిని చూస్తూ 'హగ్ంస శ్శుచి షద్' (4-40-5) అనే ఋక్కును పఠించేవాడు పరిశుద్ధుడౌతాడు.

కృషిం ప్రపద్యమానస్తు స్థాలీపాకం యథావిధి ।
జుహుయాత్ క్షేత్రమధ్యే తు ముని స్స్వాహాన్తపఞ్చభిః ॥
ఇన్ద్రాయ చ మరుద్భ్యస్తు పర్జన్యాయ భగాయ చ ॥45॥

వ్యవసాయం ప్రారంభించినవాడు పొలం మధ్యలో విధివిధానంగా స్థాలీపాకం హోమం చేయాలి. మునియై, ఇంద్రుడికి, మరుత్తులకు, పర్జన్యుడికి, భగుడు అనే సూర్యుడికి చివర స్వాహా అనే శబ్దంతో (ఇంద్రాయ స్వాహా మొ.) అయిదు ఆహుతులను హోమాగ్నిలో హుతం చేయాలి.

యథాలిఙ్గం తు విహరేల్లాఙ్గలం తు కృషీవలః ।
యుక్తో ధాన్యాయ సీతాయై సునాసీరమథోత్తరమ్ ॥
గన్ధమాల్యైర్నమస్కారై ర్యజే దేతాశ్చ దేవతాః ॥46॥

వ్యవసాయం చేసేవాడు ధాన్యం పండించడానికి నాగేటిచాళ్లు ఏర్పడడంకోసం పొలంలో నాగలిని లింగంలాగా విహరింప జేయాలి. ఆ సమయంలో 'సునాసీరమ్' (4-58-1) అనేఋక్కును జపించాలి. గంధం, పుష్పం, నమస్కారం, మొదలైన వాటితో క్షేత్రదేవతలను పూజించాలి.

ప్రవాపనే ప్రలపనే ఖలసీతాపహారయోః ।
అమోఘం కర్మ భవతి వర్ధతే సర్వదా కృషిః ॥47॥

దీనివలన విత్తనాలు చల్లడం, పంటకోయడం, కళ్ళంలోకి, దున్నినభూమిలోకి, తీసుకురావడం అనే పనులు మిక్కిలిగా ఫలవంతం అవుతాయి. వ్యవసాయం నిరంతరం చక్కగా అభివృద్ధి చెందుతుంది.

సముద్రాదితి సూక్తేన కామానాప్నోతి పావకాత్ ॥48॥

'సముద్రాత్' (4-58-1) అనే సూక్తం జపించినవాడు అగ్నిదేవుడివలన కోరికలను పొందుతాడు.

విశ్వాని న ఇతి ద్వాభ్యాం య ఋగ్భ్యాం వహ్నిమర్చతి ।
స తరత్యాపద స్సర్వా యశః ప్రాప్నోతి చాక్షయమ్ ॥
విపులాం శ్రియమాప్నోతి జయం ప్రాప్నో త్యనుత్తమమ్ ॥ 49॥

'విశ్వాని నః' (5-4-9, 10) అనే రెండు ఋక్కులను జపిస్తూ అగ్నిని పూజించేవాడు అన్ని కష్టాలను దాటుతాడు. శాశ్వతమైన కీర్తిని పొందుతాడు. విస్తారమైన సంపదలను పొందుతాడు. అత్యుత్తమమైన విజయం పొందుతాడు.

అగ్నే త్వమితి చ స్తుత్వా ధనమాప్నోతి వాఞ్ఛితమ్ ।
ప్రజాకామో జపేన్నిత్యం వరుణదైవతత్రయమ్ ॥50॥

'అగ్నే త్వం' (5-24-1) అనే ఋక్కుతో అగ్నిదేవుడిని స్తుతించినవాడు కోరినంత ధనం పొందుతాడు. సంతానం కావాలని కోరుకునేవాడు వరుణుడు దేవతగా కలిగిన మూడు ఋక్కులను నిత్యం జపించాలి.

స్వస్త్యా త్రయం జపేత్ ప్రాతస్సదా స్వస్త్యయనం మహత్ ।
స్వస్తి పన్థా ఇతి ప్రోచ్య స్వస్తిమాన్ వ్రజతేఽధ్వని ॥51॥

'స్వస్తి నః' (1-89-6,7,8) అనునది మొదలుగా మూడు ఋక్కులను నిత్యమూ ప్రొద్దునపూట జపించడంవలన అత్యంతమైన క్షేమం నెలకొంటుంది. 'స్వస్తి పన్థాః' (5-51-15) అనే ఋక్కును ఉచ్చరించడంవలన ప్రయాణసమయంలో శుభాలను పొందుతాడు.

విజిగీషుర్వనస్పతే శత్రూణాం వ్యాధితం భవేత్ ।
స్త్రియా గర్భప్రమూఢాయా గర్భమోక్షణముత్తమమ్ ॥52॥

'విజిగీషు ర్వనస్పతే' (5-78-5) అనే ఋక్కును జపించడంవలన శత్రువులకు రోగం కలుగుతుంది. ఈ ఋక్కుజపంవలన గర్భవేదన అనుభవిస్తున్న స్త్రీకి సుఖంగా ప్రసవం అవుతుంది.

అచ్ఛావదేతి సూక్తం చ వృష్టికామః ప్రయోజయేత్ ।
నిరాహారః క్లిన్నవాసా న చిరేణ ప్రవర్షతి ॥53॥

వర్షం కురవాలని కోరుకునేవాడు ఆహారం తీసుకోకుండా, తడిబట్టలను ధరించి, 'అచ్ఛా వద' (5-83) అనే సూక్తం జపిస్తే, చాల తొందరగా వర్షం కురుస్తుంది.

మనసః కామ ఇత్యేతాం పశుకామో నరో జపేత్ ।
కర్దమేన ఇతి స్నాయాత్ ప్రజాకామశ్శుచివ్రతః ॥54॥

పశువులు కావాలని కోరుకునేవాడు 'మనసః కామమ్' (శ్రీసూక్తం. 10) అనే సూక్తాన్ని జపించాలి. సంతానం కావాలని కోరుకునేవాడు శుచిగా నియమాలను పాటిస్తూ, 'కర్దమేన' (శ్రీసూక్తం. 11) అనే మంత్రాన్ని జపిస్తూ స్నానం చేయాలి.

అశ్వపూర్వామితి స్నాయాద్రాజ్యకామస్తు మానవః ॥55॥

రాజ్యానికి అధిపతి కావాలని కోరుకునే మానవుడు 'అశ్వపూర్వామ్' (శ్రీసూక్తం. 3) అనే మంత్రాన్ని జపిస్తూ స్నానం చేయాలి.

రోహితే చర్మణి స్నాయాద్ బ్రాహ్మణస్తు యథావిధి ।
రాజా చర్మణి వైయాఘ్రే ఛాగే వైశ్య స్తథైవ చ ॥
దశసాహస్రికో హోమః ప్రత్యేకం పరికీర్తితః ॥56॥

బ్రాహ్మణుడు సింహంచర్మంమీద, క్షత్రియుడు పులిచర్మంమీద, వైశ్యుడు మేకతోలుమీద, యథావిధిగా స్నానం చేయాలి. ఈ మంత్రాలు ఒక్కొక్కదానిని పదివేలసంఖ్యలో హోమం చేయాలి.

ఆగావ ఇతి సూక్తేన గోష్ఠే గాం లోకమాతరమ్ ।
ఉపతిష్ఠేద్ వ్రజేచ్చైవ యదీచ్ఛేత్తాస్సదాక్షయాః ॥57॥

ఆవులు నిరంతరం వృద్ధిచెందుతూ ఉండాలని కోరుకునేవాడు 'ఆ గావః' (6-28-21) అనే ఋక్కును జపిస్తూ, జగన్మాత అయిన ఆవును గోశాలలో ఉపాసించాలి. దానితో కలిసి తిరగాలి.

ఉపేతి తిసృభీ రాజ్ఞో దున్దుభీనభిమన్త్రయేత్ ।
తేజో బలం చ ప్రాప్నోతి శత్రుం చైవ నియచ్ఛతి ॥58॥

'ఉపేతి' మొదలైన మూడుఋక్కులతో తన దుందుభులను అభిమంత్రించాలి. దానివలన తేజస్సు, బలం కలుగుతుంది. శత్రువులను జయించగలుగుతారు.

తృణపాణిర్జపేత్సూక్తం రక్షోఘ్నం దస్యుభిర్వృతః ।
యే కే చ జ్మేత్యృచం జప్త్వా దీర్ఘమాయురవాప్నుయాత్ ॥59॥

శత్రువులు చుట్టుముట్టినపుడు చేతిలో గరిక పట్టుకుని, 'రక్షోఘ్న' సూక్తం (10-87) జపించాలి. 'యే కే చ జ్మా' (6-52-15) అనే ఋక్కును జపిస్తే, దీర్ఘమైన ఆయుర్దాయం లభిస్తుంది.

జీమూతసూక్తేన తథా సేనాఙ్గాన్యభిమన్త్రయేత్ ।
యథాలిఙ్గం తతో రాజా వినిహన్తి రణే రిపూన్ ॥60॥

రాజు జీమూతసూక్తంతో గజాశ్వాదిసేనాంగాలను వాటివాటి చిహ్నాలను అనుసరించి, అభిమంత్రిస్తే, యుద్ధంలో శత్రువులను చంపగలుగుతాడు.

ప్రాగ్నయేతి త్రిభిస్సూక్తై ర్ధనమాప్నోతి చాక్షయమ్ ।
అమీవ హేతి సూక్తేన భూతాని స్థాపయేన్నిశి ॥61॥

'ప్రాగ్నయే' (7-5) మొదలయిన మూడుసూక్తాలను జపిస్తే, ఎప్పటికీ నశించిపోని ధనం పొందుతాడు. 'ఆమీవహా' (7-55) అనే సూక్తాన్ని జపించి తనకు అపకారులైన భూతాలను రాత్రివేళ భూస్థాపితం చేయాలి. (ఇలా చేస్తే భూతబాధ నశిస్తుంది)

సమ్బాధే విషమే దుర్గే బద్ధో వా నిర్గతః క్వచిత్ ।
పలాయన్ వా గృహీతో వా సూక్తమేతత్తథా జపేత్ ॥62॥

ఆటంకాలు గలిగినపుడు, కష్టాలు కలిగిన సమయంలోనూ, ప్రవేశించడానికి వీలులేని ప్రదేశాలలోనూ, బంధింపబడిన సందర్భంలోనూ, భయపడి పారిపోయే సమయంలోనూ, పారిపోతూ పట్టుబడినపుడూ ఈ సూక్తాన్ని జపించాలి.

త్రిరాత్రం నియతోపోష్య శ్రపయేత్ పాయసం చరుమ్ ।
తే నాహుతిశతం పూర్ణం జుహుయాత్ త్ర్యమ్బకే త్యృచా ॥
సముద్దిశ్య మహాదేవం జీవేదబ్దశతం సుఖమ్ ॥63॥

మూడు రాత్రులు (రోజులు) నియమంగా ఉపవాసం చేసి, ఆ మరునాడు హోమం చేయడానికి చరువుగా పాయసం వండించాలి. మహాదేవుని ఉద్దేశించి, 'త్ర్యంబకం' (7-59-12) అనే ఋక్కుతో ఆ చరువును నూరుసార్లు హోమం చేయాలి. దానితోనే పూర్ణాహుతి చేయాలి. దానివలన అతడు నూరేళ్లు సుఖంగా బ్రదుకుతాడు.

తచ్చక్షురిత్యృచా స్నాత ఉపతిష్ఠేద్దివాకరమ్ ।
ఉద్యన్తం మధ్యగం చైవ దీర్ఘమాయుర్జిజీవిషుః ॥ 64॥

చాలాకాలం సుఖంగా జీవించాలని కోరుకునేవాడు, స్నానం చేసిన తరువాత సూర్యుడు ఉదయిస్తున్నపుడు గాని, ఆకాశంలో నడినెత్తిన ఉన్నపుడు (మిట్టమధ్యాహ్నం) కాని, 'త చ్చక్షు ర్దేవహితం' (7-66-16) అనే ఋక్కుతో సూర్యుడిని ఉపాసించాలి.

న హీతి చ చతుష్కేణ ముచ్యతే మహతో భయాత్ ।
సూక్తాభ్యాం పర ఏవాభ్యాం హుతాభ్యాం భూతిమాప్నుయాత్ ॥65॥

'న హి' మొదలైన నాలుగుసూక్తాలను జపిస్తే, ఎంత గొప్పభయం అయినా వదిలిపోతుంది. దీనికి తరువాతి రెండుసూక్తాలతో హోమం చేస్తే, మిక్కుటమయిన సంపదలు లభిస్తాయి.

ఇన్ద్రాసోమేతి సూక్తం తు కథితం శత్రునాశనమ్ ॥66॥

'ఇంద్రా సోమ' (7-104) అనే సూక్తం శత్రునాశనసూక్తమని చెప్పబడింది.

యస్య లుప్తం వ్రతం మోహాద్ వ్రాత్యై ర్వా సంస్పృజేత్సహ ।
ఉపోష్యాజ్యం న జుహుయాత్ త్వమగ్నే వ్రతపా ఇతి ॥67॥

జపహోమాదులలో ఎవరికయినా అజ్ఞానంచేత నియమం తప్పినా, నీచులతో సంపర్కం పొందినా, ఆ దోషం పోవడానికి, ఉపవాసం చేసి, 'త్వ మగ్నే వ్రతపా' (8-11-1) అనే ఋక్కుతో హోమం చేయాలి.

ఆదిత్యేత్యృక్ చ సమ్రాజం జప్త్వా వాదే జయీ భవేత్ ।
మహీతి చ చతుష్కేణ ముచ్యతే మహతో భయాత్ ॥68॥

'ఆదిత్య, సమ్రాజం' అనే ఋక్కులను జపిస్తే, వాదంలో విజయం కలుగుతుంది. 'మహీ' మొదలైన నాలుగుఋక్కులను జపిస్తే, మిక్కుటమైన భయంనుండి విముక్తి కలుగుతుంది.

ఋచం జప్త్వా యది హ్యేతత్ సర్వకామానవాప్నుయాత్ ।
ద్వాచత్వారింశతం చైన్ద్రం జప్త్వా నాశయతే రిపూన్ ॥69॥

'యది' మొదలైన ఋక్కును జపించినవాడికి కోరికలన్నీ నెరవేరతాయి. ఇంద్రుడికి సంబంధించిన (ఇంద్రుడు దేవతగా కలిగిన) నలభైరెండు ఋక్కులను జపించినవాడు శత్రువులను జయిస్తాడు.

వాచం మహీతి జప్త్వా తు ప్రాప్నోత్యారోగ్య మేవ చ ॥70॥

'వాచం మహి' అనే ఋక్కును జపిస్తే, ఆరోగ్యం కలుగుతుంది.

శం నో భవేతి ద్వాభ్యాం తు భుక్త్వాన్నం ప్రయతశ్శుచిః ।
హృదయం పాణినా స్పృష్ట్వా వ్యాధిభిర్నాభిభూయతే ॥71॥

'శం నో భవ' (8-48-4,5) అనుమొదలైన రెండుఋక్కులను జపిస్తూ, శుచిగా నియమంగా అన్నం తిని, చేతితో హృదయాన్ని తాకితే రోగాలు రావు.

ఉత్తమేదమితి స్నాతో హుత్వా శత్రుం ప్రమాపయేత్ ।
శం నోఽగ్న ఇతి సూక్తేన హుతేనార్థమవాప్నుయాత్ ॥72॥

'ఉత్త మేదం' అనే ఋక్కుతో హోమం చేస్తే శత్రువులు నశిస్తారు. 'శం నో ఽగ్నే' (7-35) (అనే సూక్తంతో హోమం చేస్తే, సంపదలు కలుగుతాయి.

కన్యా వారితి సూక్తేన దిగ్దోషాద్విప్రముచ్యతే ।
యదద్య కచ్చేత్యుదితే జప్తే వశ్యం జగద్భవేత్ ॥73॥

'కన్యా వాః' (8-91) అనే సూక్తం జపించడంవలన దిక్కులవలన కలిగినదోషాలు తొలగిపోతాయి. 'యదద్య కచ్చ' (8-94-4) అనే సూక్తాన్ని సూర్యుడు ఉదయించే సమయంలో జపిస్తే లోకం తనకు తప్పకుండా వశ మవుతుంది.

యద్వాగితి చ జప్తేన వాణీ భవతి సంస్కృతా ।
వాచో విదమితి త్వేతాం జపన్ వాచం సమశ్నుతే ॥74॥

'య ద్వాక్' (8–100–10) అనే ఋక్కును జపిస్తే వాక్కు ఉత్తమమైన సంస్కారం పొందుతుంది. 'వాచో విదమ్' (8–101–16) అనే ఋక్కును జపించడంవలన మంచి వాక్సిద్ధి కలుగుతుంది.

పవిత్రాణాం పవిత్రం తు పావమాన్యో హ్యృచో మతాః ।
వైఖానసా ఋచ స్త్రింశత్ పవిత్రాః పరమా మతాః ॥
ఋచో ద్విషష్టిః ప్రోక్తాశ్చ పరస్యేత్యృషిసత్తమ ॥75॥

మహర్షివరేణ్యా! వశిష్ఠా! పవమాన సంబంధమైన ఋక్కులు (పవమానసూక్తం) పవిత్రమైన అన్నింటిలోనూ పవిత్రమైనవి. వైఖానసఋక్కులు ముప్పై మిక్కిలి పవిత్రమైనవి. 'పరస్య' మొదలైన అరవైరెండుఋక్కులు కూడా మిక్కిలి పవిత్రమైనవి.

సర్వకల్మషనాశాయ పావనాయ శివాయ చ ।
స్వాదిష్ఠయేతి సూక్తానాం సప్తషష్టి రుదాహృతా ॥76॥

'స్వాదిష్ఠయా' అనే అరవైఏడు సూక్తాలను జపించడంవలన సమస్తమైన పాపాలు నశిస్తాయి. జపించినవాడు పవిత్రుడవుతాడు. శుభం కలుగుతుంది.

దశోత్తరాణ్యృచశ్చైతాః పావమాన్యశ్శతాని షట్ ।
ఏతజ్జపంశ్చ జుహ్వంశ్చ ఘోరం మృత్యుభయం జయేత్ ॥77॥

పావమాని సూక్తాలు ఆరువందలపది ఉన్నాయి. వీటిని జపించినా, ఈ ఋక్కులతో హోమం చేసినా ఘోరమయిన మరణభయాన్ని జయిస్తాడు. (మరణం ఉండదు. అంటే మరణిస్తామనే భయం ఉండదు)

ఆపో హి ష్ఠేతి వారిస్థో జపేత్ పాపభయార్దనే ।
ప్రదేవన్నేతి నియతో జపేచ్చ మరుధన్వసు ॥78॥

పాపంవలన కలిగే భయం పోవాలంటే (పాపం పోవాలంటే), నీళ్లలో నిలిచి 'ఆపో హి ష్ఠా' (10–9–1–3) అనే ఋక్కును జపించాలి. ఎడారిలో ప్రాణభయం ఏర్పడినపుడు 'ప్రదేవన్' (10–30–1) అనే ఋక్కును నియమంగా జపించాలి.

ప్రాణాన్తికే భయే ప్రాప్తే క్షిప్రమాయుస్తు విన్దతి ।
ప్రావేపామిత్యృచమేకాం జపేచ్చ మనసా నిశి ॥
వ్యుష్టాయాముదితే సూర్యే ద్యూతే జయమవాప్నుయాత్ ॥79॥

ప్రాణం పోయేంతటి భయం ఏర్పడినపుడు రాత్రిసమయంలో మనసులో 'ప్రావేపామ్' (10–34–1) అనే ఋక్కును జపించాలి. దానివలన ప్రాణభయం వెంటనే తొలగి ఆయువు పెరుగుతుంది. ప్రభాతసమయంలో, సూర్యుడు ఉదయించినపుడు, ఈ ఋక్కును జపించినవాడు విజయం పొందుతాడు.

మా ప్రగామేతి మూఢశ్చ పన్థానం పథి విన్దతి ॥ 80॥

దారి తప్పినవాడు 'మా ప్రగామ' (10–57–1) అనే ఋక్కును జపిస్తే, సరియైన దారిని పొందగలుగుతాడు.

క్షీణాయురితి మన్యేత యం కఞ్చిత్ సుహృదం ప్రియమ్ ।
యత్తే యమమితి స్నాతస్తస్య మూర్ధానమాలభేత్ ॥
సహస్రకృత్వః పఞ్చాహం తేనాయుర్విన్దతే మహత్ ॥81॥

తనకిష్టమైనస్నేహితుడికి ఆయువు తీరిపోతున్నదని తెలుసుకున్నవాడు అతడికి ఆయువు పెరగడానికి (మరణం తప్పడానికి) స్నానం చేసి, ఆ మిత్రుడితలను స్పృశిస్తూ, 'య త్తే యమమ్' (10-58-1) అనే ఋక్కును వెయ్యిసార్లు జపించాలి. ఇలా అయిదు రోజులు చేస్తే ఆ మిత్రుడికి ఆయువు అధికంగా వృద్ధి అవుతుంది.

ఇదం మేధ్యేతి జుహుయాద్ ఘృతం ప్రాజ్ఞస్సహస్రశః ।
పశుకామో గవాం గోష్ఠే అర్థకామశ్చతుష్పథే ॥82॥

'ఇదం మేధ్య' (10-61-1) అనే ఋక్కుతో వెయ్యిసార్లు అగ్నిలో ఆవునేయితో హోమం చేసినా, ఆయువు పెరుగుతుంది. పశుసంపదను కోరుకునేవాడు గోశాలలోనూ, ధనసంపదలు కోరుకునేవాడు నాలుగువీథుల కూడలిలోనూ ఈహోమం చేయాలి.

వయస్సుపర్ణా ఇత్యేతాం జపన్ వై విన్దతే శ్రియమ్ ॥83॥

'వయస్సుపర్ణే' (10-73-11) అనే ఋక్కును జపించినవాడు సంపదలను పొందుతాడు.

హవిష్యన్తీయమభ్యస్య సర్వపాపైః ప్రముచ్యతే ।
తస్య రోగా వినశ్యన్తి కాయాగ్నిర్వర్ధతే తథా ॥84॥

'హవిష్యంతి' (10-88-1) అనే ఋక్కును జపించినవానిని చేసిన పాపాలు విడిచి వెళ్లిపోతాయి. అతడి రోగాలు పూర్తిగా నశిస్తాయి. శరీరంలో జఠరాగ్ని పెరుగుతుంది.

యా ఓషధయస్స్వస్త్యయనం సర్వవ్యాధివినాశనమ్ ।
బృహస్పతే అతీత్యేతద్ వృష్టికామః ప్రయోజయేత్ ॥85॥

'యా ఓషధయః' అనే ఋక్కును జపిస్తే, సమస్తమైన రోగాలు నశిస్తాయి. మేలు కలుగుతుంది. వర్షాలు కురవాలని కోరుకునేవాడు 'బృహస్పతే అతి' (2-23-15) అనే ఋక్కును జపించాలి.

సర్వత్రేతి పరాశాన్తిర్ జ్ఞేయా ప్రతిరథస్తథా ।
సూక్తం సాఙ్కాశ్యపం నిత్యం ప్రజాకామస్య కీర్తితమ్ ॥86॥

'సర్వత్ర' అనే ఋక్కును జపిస్తే, ఉత్తమమైన శాంతి లభిస్తుంది. అదే విధంగా 'అప్రతిరథ' సూక్తం కూడ పరమశాంతిని ఇస్తుంది. సంతానం కావాలని కోరుకునేవాడు సాంకాశ్యప సూక్తాన్ని నిత్యమూ జపించాలి.

అహం రుద్రేభిరిత్యేతద్ వాగ్మీ భవతి మానవః ।
న యోనౌ జాయతే విద్వాన్ జపన్ రాత్రీతి రాత్రిషు ॥87॥

'అహం రుద్రేభిః' (10-125-1) అనే ఋక్కును జపించినవాడు నిపుణంగా మాట్లాడగలుగుతాడు. 'రాత్రీ' (10-127-1) అనే ఋక్కును రాత్రిసమయంలో జపించినవాడు తిరిగి భూమిమీద పుట్టడు. (మోక్షం పొందుతాడు)

రాత్రిసూక్తం జపన్ రాత్రౌ రాత్రిం క్షేమీ నయేన్నరః ।
కల్పయన్తీతి చ జపన్ నిత్యం కృత్వాఽరినాశనమ్ ॥88॥

రాత్రిసమయంలో రాత్రిసూక్తాన్ని జపించినవాడు రాత్రి అంతా ఏ కష్టం లేకుండా సుఖంగా గడుపుతాడు. 'కల్పయంతి' అనే ఋక్కును నిత్యం జపించినవాడికి శత్రువులు నశిస్తారు.

ఆయుష్యం చైవ వర్చస్యం సూక్తం దాక్షాయణం మహత్ ।
ఉత దేవా ఇతి జపేదామయఘ్నం ధృతవ్రతః ॥89॥

దాక్షాయణసూక్తాన్ని జపించినవాడికి దీర్ఘమైన ఆయువు, గొప్పతేజస్సు కలుగుతాయి. వ్రతంగా స్వీకరించి నియమంగా 'ఉత దేవాః' (10-137-1) అనే ఋక్కును జపించినవాడికి రోగాలు నశిస్తాయి.

అయమగ్నే జరీత్యేతజ్జపేదగ్నిభయే సతి ।
అరణ్యానీత్యరణ్యేషు జపేత్తద్భయనాశనమ్ ॥90॥

అగ్నిభయం ఏర్పడినపుడు 'అయ మగ్నే జరి' (10-142-1) అనే ఋక్కును జపించాలి. అడవులలో (క్రూరమృగాదులవలన కలిగే)భయం తొలగిపోవడానికి 'అరణ్యాని' (10-146-1) అనే ఋక్కును జపించాలి.

బ్రాహ్మీమాసాద్య సూక్తే ద్వే ఋచం బ్రాహ్మీం శతావరీమ్ ।
పృథగద్భిర్ఘృతైర్వాథ మేధాం లక్ష్మీం చ విన్దతి ॥91॥

బ్రాహ్మీసూక్తంలో రెండు ఋక్కులతో, బ్రాహ్మి అనే లతను, శతావరి అనే ఓషధిని, స్వీకరించి వాటిని నీళ్లలోనూ, ఆవునేతిలోనూ వేరువేరుగా ఉంచి, ఆ జలాన్ని పుచ్చుకున్నవాడు (బ్రాహ్మీలతవలన)బుద్ధి, (శతావరివలన) సంపద పొందుతాడు.

శాస ఇత్థా సపత్నఘ్నం సఙ్గ్రామం విజిగీషతః ।
బ్రహ్మణాగ్నిస్సంవిదానం గర్భమృత్యునివారణమ్ ॥92॥

'శాస ఇత్థా' (10-152-1) అనే ఋక్కును జపిస్తే, శత్రువులు నశిస్తారు. యుద్ధంలో విజయం కోరుకునేవారు కూడ ఈ ఋక్కును జపించాలి. 'బ్రహ్మ ణాగ్నిః' (10-162-1) అనే ఋక్కును జపించడంవలన తల్లిగర్భంలో ఉండగా కలిగే మరణాన్ని నివారిస్తుంది.

అపైహీతి జపేత్సూక్తం శుచిర్దుస్స్వప్ననాశనమ్ ।
యేనేదమితి వై జప్త్వా సమాధిం విన్దతే పరమ్ ॥93॥

శుచిగా 'అ పైహి' (10-164) అనే సూక్తాన్ని జపించడంవలన చెడుకలలు రావు (చెడుకలలవలన కలిగే దుష్ఫలితాలు ఉండవు.) 'యే నేదమ్' అనే ఋక్కును జపించడంవలన ఉత్తమమైన సమాధిస్థితిని పొందుతాడు.

మయోభూర్వాత ఇత్యేతద్ గవాం స్వస్త్యయనం పరమ్ ।
శామ్బరీమిన్ద్రజాలం వా మాయామేతేన వారయేత్ ॥94॥

'మయో భూ ర్వాత' (10-169-1) అనే ఋక్కును జపించడంవలన ఆవులకు మేలు జరుగుతుంది. ఈ జపం శాంబరి, ఇంద్రజాలం అనే మాయలను నివారిస్తుంది.

మహిత్రీణామవరోస్త్వితి పథి స్వస్త్యయనం జపేత్ ।
అగ్నయే విద్విషన్ద్వేష్యం జపేచ్చ రిపునాశనమ్ ॥95॥

ప్రయాణం చేసే సమయంలో దారిలో మంగళప్రదమైన 'మహిత్రీణామ్, అవోఽస్తు' (10–185–1) అనే ఋక్కులను జపించడంవలన ప్రయాణం క్షేమంగా సాగుతుంది. శత్రువులను ఉద్దేశించి 'అగ్నయే విద్విషన్' (10–187–1) అనే మంత్రాన్ని జపిస్తే శత్రువులందరూ నశిస్తారు.

వాస్తోష్పతేన మన్త్రేణ యజేత గృహదేవతాః ।
జపస్యైష విధిః ప్రోక్తో హుతే జ్ఞేయో విశేషతః ॥96॥

'వాస్తోష్పతే' అనే మంత్రంతో ఇలవేలుపులను అర్చించాలి. ఈ విధంగా జపవిధానం చెప్పడం అయింది. ఇక హోమవిధానం గురించి విశేషంగా తెలుసుకోవలసి ఉంది.

హోమాన్తే దక్షిణా దేయా పాపశాన్తిర్హుతేన తు ।
హుతం శామ్యతి చాన్నేన అన్నం హేమప్రదానతః ॥97॥

హోమం పూర్తి అయిన తరువాత దక్షిణ ఇవ్వాలి. హోమం చేయడంవలన పాపం శాంతిస్తుంది. అన్నం హుతం చేయడంవలన హోమం శాంతిస్తుంది. బంగారం దానం చేయడంవలన అన్నం శాంతిస్తుంది.

విప్రాశిషస్త్వమోఘాస్స్యు ర్బహిస్స్నానం తు సర్వతః ॥98॥

బ్రాహ్మణుల ఆశీస్సులు అత్యంత మహిమ కలిగినవి. ఎప్పుడూ వ్యర్థం కావు. అన్నివిధాలుగాను స్నానం వెలుపలనే చేయాలి.

సిద్ధార్థకా యవా ధాన్యం పయో దధి ఘృతం తథా ।
క్షీరవృక్షాస్తథేధ్మం తు హోమే వై సర్వకామదాః ॥99॥

హోమంలో తెల్లఆవాలు, యవలు, ఆవుపాలు, పెరుగు, నెయ్యి, పాలుగారే చెట్లు, సమిధలు హుతం చేస్తే కోరికలన్నీ నెరవేరతాయి.

సమిధః కణ్టకిన్యశ్చ రాజికా రుధిరం విషమ్ ।
అభిచారే తథా శైలమశనం సక్తవః పయః ॥
దధి భైక్ష్యం ఫలం మూలమృగ్విధానముదాహృతమ్ ॥100॥

శత్రువులను హింసించడానికి చేసే హోమకర్మలలో ముళ్లు కలిగిన సమిధలు, నల్లఆవాలు, నెత్తురు, విషం, కొండలమీద పుట్టిన వస్తువులు హోమం చేయాలి. హోమకాలంలో పేలపిండి, ఆవుపాలు, ఆవుపెరుగు, బిచ్చమెత్తి సంపాదించిన పదార్థం, పండ్లు, దుంపలు, ఆహారంగా తీసుకోవాలి. ఈవిధంగా (ఋగ్వేదానికి సంబంధించిన)ఋక్కులప్రయోగ విషయం చెప్పబడింది.

ఇత్యాది మహాపురాణే ఆగ్నేయే ఋగ్విధానకథనం నామైకోనషష్ట్యధికద్విశతతమోఽధ్యాయః ॥259॥

అగ్నిమహాపురాణంలో ఋగ్విధానకథనం అనే రెండువందల యాభైతొమ్మిదవ అధ్యాయం సమాప్తం.

షష్ఠ్యధికద్విశతతమోऽధ్యాయః – రెండువందల అరవైయవ అధ్యాయం

యజుర్విధానకథనమ్ – యజుర్విధానకథనం

పుష్కర ఉవాచ – పరశురాముడితో పుష్కరుడు ఇలా చెప్తున్నాడు.

యజుర్విధానం వక్ష్యామి భుక్తిముక్తిప్రదం శృణు ।
ఓఙ్కారపూర్వికా రామ మహావ్యాహృతయో మతాః ॥
సర్వకల్మషనాశిన్య స్సర్వకామప్రదా స్తథా ॥1॥

పరశురామా! భోగమోక్షాలను ఇచ్చే యజుర్వేదవిధానం గురించి చెప్తాను, విను. ఓంకారం మొదట కలిగిన మహావ్యాహృతులు సమస్తమైన పాపాలను పోగొడతాయి. సమస్తమైన కోరికలను తీరుస్తాయి.

ఆజ్యాహుతిసహస్రేణ దేవానారాధయేద్బుధః ।
మనసః కాంక్షితం రామ మనసేప్సితకామదమ్ ॥ 2॥

పరశురామా! బుద్ధిమంతుడు సప్తమహావ్యాహృతులతో వేయిపర్యాయాలు ఆవునేయిని అగ్నిలో ఆహుతి చేసి, దేవతలను ఆరాధించాలి. దానివలన మనసులో కోరుకున్నవీ, మనసుతో ఇష్టపడినవీ అయిన కోరికలు సిద్ధిస్తాయి.

శాన్తికామో యవైః కుర్యాత్ తిలైః పాపాపనుత్తయే ।
ధాన్యైస్సిద్ధార్థకై శ్చైవ సర్వకామకరైస్తథా ॥3॥

శాంతిని కోరుకునేవాడు యవధాన్యంతో హోమం చేయాలి. పాపాలు పోగొట్టుకోవాలనుకున్నవాడు నువ్వులతో హోమం చేయాలి. అన్నిరకాల కోరికలు తీరడానికి ధనియాలతోనూ, తెల్లఆవాలతోనూ హోమం చేయాలి.

ఔదుమ్బరీభిరిధ్మాభిః పశుకామస్య శస్యతే ।
దధ్నా చైవాన్నకామస్య పయసా శాన్తిమిచ్ఛతః ॥4॥

పశుసంపదను కోరుకునేవాడు మేడిసమిధలతో హోమం చేయడం ఉత్తమం. అన్నం కోరుకునేవాడు ఆవుపెరుగుతోనూ, శాంతిని కోరుకునేవాడు ఆవుపాలతోనూ హోమం చేయాలి.

అపామార్గసమిద్భిస్తు కామయన్ కనకం బహు ॥ 5॥

బంగారం సమృద్ధిగా కావాలని కోరేవాడు ఉత్తరేణు సమిధలతో హోమం చేయాలి.

కన్యాకామో ఘృతాక్తాని యుగ్మశో గ్రథితాని తు ।
జాతీపుష్పాణి జుహుయాద్ గ్రామార్థీ తిలతణ్డులాన్ ॥6॥

కన్యను కోరుకునేవాడు నేతితో తడిపినవీ, జంటలుగా కూర్చినవీ అయిన జాజిపూలతో హోమం చేయాలి. గ్రామం (గ్రామాధికారం) కోరుకునేవాడు నువ్వులు, బియ్యం హోమం చేయాలి.

వశ్యకర్మణి శాఖోటవాసాపామార్గమేవ చ ।
విషాసృఙ్మిశ్రసమిధో వ్యాధిఘాతస్య భార్గవ ॥7॥

భార్గవరామా! ఇతరులను వశం చేసుకోవాలనుకునేవాడు శాఖోటం, వస, ఉత్తరేణు సమిధలతో హోమం చేయాలి. రోగంతో బాధపడేవాడిని గురించి, (అతడివ్యాధి తగ్గిపోవడానికి) విషమూ, నెత్తురూ కలిసిన సమిధలతో హోమం చేయాలి.

క్రుద్ధస్తు జుహుయాత్సమ్యక్ శత్రూణాం వధకామ్యయా ।
సర్వవ్రీహిమయీం కృత్వా రాజ్ఞః ప్రతికృతిం ద్విజ ॥
సహస్రశస్తు జుహుయాద్ రాజా వశగతో భవేత్ ॥8॥

పరశురామా! కోపంతో శత్రువులను సంహరించాలని కోరుకునేవాడు అన్నిరకాల ధాన్యాలు కలిపి, ఆ శత్రురాజుప్రతిమను నిర్మించి, దానిని అగ్నిలో పూర్తిగా హుతమయ్యేంతవరకు హోమం చేయాలి. అన్ని ధాన్యాలను కలిపి వెయ్యిసార్లు హోమం చేస్తే ఆ శత్రురాజు తనకు వశమవుతాడు.

వస్త్రకామస్య పుష్పాణి దూర్వా వ్యాధివినాశినీ ।
బ్రహ్మవర్చసకామస్య వాసోఽగ్రం చ విధీయతే ॥9॥

వస్త్రాలను కోరుకునేవాడు పూవులనూ, రోగం పోవాలనుకునేవాడు గరికనూ, బ్రహ్మవర్చస్సు కోరుకునేవాడు ఉత్తమమైన వస్త్రమూ హోమం చేయాలని చెప్పబడింది.

ప్రత్యఙ్గిరేషు జుహుయాత్తుషకణ్టకభస్మభిః ।
విద్వేషణే చ పక్ష్మాణి కాకకౌశికయోస్తథా ॥10॥

బ్రాహ్మణోత్తమా! పరశురామా! శత్రువులకు హాని చేసే కర్మలలో ఊక, ముళ్లు, బూడిద హోమం చేయాలి. శత్రువులను ఉద్దేశించి చేసే కర్మలలో కాకిఈకలను, గుడ్లగూబ ఈకలను హోమం చేయాలి.

కాపిలం చ ఘృతం హుత్వా తథా చన్ద్రగ్రహే ద్విజ ।
వచాచూర్ణేన సమ్పాతాత్ సమానీయ చ తాం వచామ్ ॥
సహస్రమన్త్రితాం భుక్త్వా మేధావీ జాయతే నరః ॥11॥

బ్రాహ్మణవర్యా! పరశురామా! చంద్రగ్రహణసమయంలో కపిలగోవు నెయ్యిని హోమం చేయాలి. వసదుంపపొడిని తెచ్చి, ఆ వసను వెయ్యిసార్లు మంత్రించి, తిన్న మానవుడు గొప్ప తెలివి గలిగినవాడు అవుతాడు.

ఏకాదశాఙ్గులం శఙ్కుం లౌహం ఖాదిరమేవ చ ।
ద్విషతో వధోఽసీతి జపన్నిఖనేద్రిపువేశ్మని ॥
ఉచ్చాటనమిదం కర్మ, శత్రూణాం కథితం తవ ॥12॥

పదకొండు అంగుళాలు నిడివి కలిగిన శంకువును లోహంతో గాని, చంద్రకఱ్ఱతో కాని, నిర్మించాలి. 'ద్విషతో వధోఽసి' (1–28) అనే మంత్రం జపిస్తూ దానిని శత్రువు ఇంటిలో పాతిపెట్టాలి. నీకు తెలియజేసిన ఇది శత్రువులను నశింపజేసే (ఉచ్చాటనం) అనే కర్మ.

చక్షుష్యా ఇతి జప్త్వా చ వినష్టం చక్షురాప్నుయాత్ ।
ఉపయుఞ్జత ఇత్యేతదనువాకం తథాన్నదమ్ ॥13॥

'చక్షుష్యా' (2–16) అనే మంత్రాన్ని జపిస్తే, పోయిన కన్ను తిరిగి వస్తుంది. అదే విధంగా 'ఉపయుఞ్జత' అనే మంత్రం జపించడంవలన అన్నం లభిస్తుంది.

తనూనపాగ్నే సదితి దూర్వాహుత్వార్తివర్జితః ।
భేషజమసీతి దధ్యాజ్యైర్హోమః పశూపసర్గనుత్ ॥14॥

'తనూనపాగ్నే సద్' (3–17) అనే మంత్రంతో గరికను హోమం చేస్తే, కష్టాలు తొలగిపోతాయి. 'భేషజ మసి' (3–59) అనే మంత్రంతో ఆవునెయ్యి, ఆవుపెరుగులను హోమం చేస్తే, పశువులకు వచ్చే(రోగాది)బాధలు తొలగిపోతాయి.

త్ర్యంబకం యజామహే హోమస్సౌభాగ్యవర్ధనః ।
కన్యానామ గృహీత్వా తు కన్యాలాభకరః పరః ॥15॥

'త్రియంబకం యజామహే' (3–60) అనే మంత్రంతో హోమం చేస్తే సకల సౌభాగ్యాలు వృద్ధిచెందుతాయి. కోరుకున్న కన్యను పొందాలంటే, ఆ కన్యపేరు చెప్పి ఈ హోమం చేయడం ఉత్తమసాధనం.

భయేషు తు జపన్నిత్యం భయేభ్యో విప్రముచ్యతే ॥16॥

ఏవిధమైన భయం కలిగినా, ఎల్లప్పుడు ఈ మంత్రాన్ని జపిస్తే, ఆ భయాలన్నీ తొలగిపోతాయి.

ధుత్తూరపుష్పం సఘృతం హుత్వా స్యాత్సర్వకామభాక్ ।
హుత్వా తు గుగ్గులం రామ స్వప్నే పశ్యతి శఙ్కరమ్ ॥17॥

పరశురామా! ఉమ్మెత్తపూవును ఆవునేతితో కలిపి ఈ మంత్రంతో హోమం చేస్తే, సమస్తమైన కోరికలు సిద్ధిస్తాయి. గుగ్గులంతో హోమం చేస్తే, కలలో పరమశివుడు ప్రత్యక్ష మవుతాడు.

యుఞ్జతే మనోఽనువాకం జప్త్వా దీర్ఘాయురాప్నుయాత్ ॥18॥

'యుంజతే మనః' (5–14) అనే మంత్రం జపిస్తే, దీర్ఘమైన ఆయువు కలుగుతుంది.

విష్ణోరరాటమిత్యేతత్ సర్వబాధావినాశనమ్ ।
రక్షోఘ్నం చ యశస్యం చ తథైవ విజయప్రదమ్ ॥19॥

'విష్ణో రరాటమ్' అనే మంత్రాన్ని జపించడంవలన అన్నిరకాల బాధలు నశించిపోతాయి. ఈ మంత్రజపం రాక్షసబాధలు నశింపజేస్తుంది. కీర్తినీ, విజయాన్నీ కలిగిస్తుంది.

అయం నో అగ్నిరిత్యేతత్ సఙ్గ్రామే విజయప్రదమ్ ।
ఇదమాపః ప్రవహతస్నానే పాపాపనోదనమ్ ॥20॥

'అయం నో అగ్నిః' (5–37) అనే మంత్రం జపించడంవలన యుద్ధంలో విజయం లభిస్తుంది. 'ఇద మాపః ప్రవహతః' (6–17) అనే మంత్రం జపిస్తూ స్నానం చేస్తే సర్వపాపాలు తొలగిపోతాయి.

విశ్వకర్మన్ను హవిషా సూచీం లౌహీం దశాఙ్గులామ్ ।
కన్యాయా నిఖనేద్ద్వారి సాన్యస్మై న ప్రదీయతే ॥21॥

పదిఅంగుళాలనిడివి కలిగిన ఇనుపకడ్డీని 'విశ్వకర్మ న్ను హవిషా' (17–22) అనే మంత్రంతో అభిమంత్రించి, తనకు కావలసిన కన్య ఇంటిగుమ్మంలో నాటితే, ఆ కన్యను ఇతరులకు ఇవ్వడం సాధ్యం కాదు. (తనకే దక్కుతుంది).

దేవ సవిత రేతేన హుతే నైతేన చాన్నవాన్ ॥22॥

'దేవ సవితః' (11–7) అనే మంత్రంతో హోమం చేస్తే, అన్నం లభిస్తుంది.

అగ్నౌ స్వాహేతి జుహుయాద్ బలకామో ద్విజోత్తమ ।
తిలైర్యవైశ్చ ధర్మజ్ఞ తథాపామార్గతణ్డులైః ॥23॥

బ్రాహ్మణోత్తమా! ధర్మం చక్కగా తెలిసినవాడా! పరశురామా! బలం కావాలని కోరుకునేవాడు 'అగ్నౌ స్వాహా' అనే మంత్రంతో నువ్వులు, యవలు, ఉత్తరేణుసమిధలు, బియ్యం హోమం చేయాలి.

సహస్రమన్త్రితాం కృత్వా తథా గోరోచనాం ద్విజ ।
తిలకం చ తథా కృత్వా జనస్య ప్రియతామియాత్ ॥24॥

విప్రవర్యా! పరశురామా! గోరోచనాన్ని 'అగ్నౌ స్వాహా' అనే మంత్రంతో వెయ్యిసార్లు అభిమంత్రించి, దానిని బొట్టుగా పెట్టుకుంటే, అతడిని జనమంతా ఇష్టపడతారు.

రుద్రాణాం చ తథా జప్యం సర్వాఘవినిషూదనమ్ ।
సర్వకర్మకరో హోమస్తథా సర్వత్ర శాన్తిదః ॥25॥

రుద్రమంత్రాలను జపించడంవలన పాపాలన్నీ నశించిపోతాయి. రుద్రమంత్రాలతో హోమం చేస్తే, అన్నిపనులూ నెరవేరతాయి. అంతటా శాంతి నెలకొంటుంది.

అజావికానామశ్వానాం కుఞ్జరాణాం తథా గవామ్ ।
మనుష్యాణాం నరేన్ద్రాణాం బాలానాం యోషితామపి ॥26॥

ధర్మం తెలిసినవాడా! పరశురామా! మేకలు, గొఱ్ఱెలు, గుఱ్ఱాలు, ఏనుగులు, ఆవులు, మానవులు, మహారాజులు, బాలురు, స్త్రీలు,

గ్రామాణాం నగరాణాం చ దేశానామపి భార్గవ ।
ఉపద్రుతానాం ధర్మజ్ఞ వ్యాధితానాం తథైవ చ ॥27॥

గ్రామాలు, నగరాలు, దేశాలు, రకరకాల ఉపద్రవాలు పొందినా, రోగగ్రస్త మయినా,

మరణే సమనుప్రాప్తే రిపుజే తథా భయే ।
రుద్రహోమః పరాశాన్తిః పాయసేన ఘృతేన చ ॥28॥

చావు దగ్గరపడినా, శత్రువులవలన భయం ఏర్పడినా, రుద్రుడిని ఉద్దేశించి (రుద్రమంత్రంతో), పాయసమూ, నెయ్యి హోమం చేస్తే, అత్యుత్తమమైన శాంతి కలుగుతుంది.

కూష్మాణ్డఘృతహోమేన సర్వాన్ పాపాన్ వ్యపోహతి ।
సక్తుయావకభైక్షాశీ నక్తం మనుజసత్తమ ॥ 29॥

మానవోత్తమా! పరశురామా! రాత్రిపూట మాత్రమే పేలపిండి, యవలఅన్నం, బిచ్చమెత్తి తెచ్చిన ఆహారం తింటూ, కూష్మాండమూ, నేయీ హోమం చేస్తే, సమస్తమైన పాపాలు తొలగిపోతాయి.

బహిస్స్నానరతో మాసాన్ముచ్యతే బ్రహ్మహత్యయా ॥30॥

ఇంటికి వెలుపల అంటే నదులు, చెరువులు మొదలైనవాటిలో నెలరోజులపాటు స్నానం చేసినవాడు బ్రహ్మహత్య అనే మహాపాతకంనుండి బయటపడతాడు.

మధువాతేతి మన్త్రేణ హోమాదితోఽఖిలం లభేత్ ।
దధిక్రాణ్ణేతి హుత్వా తు పుత్రాన్ ప్రాప్నోత్యసంశయమ్ ॥ 31॥

'మధు వాతా' (13-17) అనే మంత్రంతో హోమం మొదలైనవి చేస్తే, కావలసినవన్నీ లభిస్తాయి. 'దధి క్రావ్ ణ్ణో' (23-32) అనే మంత్రంతో హోమం చేస్తే, కొడుకులు పుడతారు. సందేహం లేదు.

తథా ఘృతవతీత్యేతదాయుష్యం స్యాద్ ఘృతేన తు ।
స్వస్తి న ఇన్ద్ర ఇత్యేతత్ సర్వబాధావినాశనమ్ ॥32॥

'ఘృతవతీ' (34-45) అనే మంత్రంతో నేతితో హోమం చేస్తే, దీర్ఘమైన ఆయుర్దాయం కలుగుతుంది. 'స్వస్తి న ఇన్ద్రః' (25-19) అనే మంత్రంవలన సమస్తమైన బాధలు తొలగిపోతాయి.

ఇహ గావః ప్రజాయధ్వమితి పుష్టివివర్ధనమ్ ।
ఘృతాహుతిసహస్రేణ తథా లక్ష్మీవినాశనమ్ ॥33॥

'ఇహ గావః ప్రజాయధ్వమ్' అనేది పుష్టిని వృద్ధి చేసేమంత్రం. దీనితో వెయ్యిసార్లు నేతిని హోమం చేస్తే, దారిద్ర్యం నశించిపోతుంది (సంపదలు కలుగుతాయి).

స్రువేణ దేవస్యత్వేతి హుత్వాపామార్గతణ్డులమ్ ।
ముచ్యతే వికృతాచ్ఛీఘ్రమభిచారాన్న సంశయః ॥34॥

'దేవస్య త్వా' అనే మంత్రంతో ఉత్తరేణు సమిధలు, బియ్యం హోమం చేస్తే, తనకు కీడు కలగడంకోసం చేసిన భయంకరమైన అభిచారకర్మలనుండి విముక్తిని పొందుతాడు. సందేహం లేదు.

రుద్ర యత్తే పలాశస్య సమిద్భిః కనకం లభేత్ ।
శివో భవే త్యగ్న్యుత్పాతే వ్రీహిభిర్జుహుయాన్నరః ॥35॥

'రుద్ర య త్తే' (10-20) అనే మంత్రంతో మోదుగసమిధలను హోమం చేస్తే, బంగారం లభిస్తుంది. అగ్నిప్రమాదం సంభవించినపుడు 'శివో భవ' (11-45) అనే మంత్రంతో వరిధాన్యాన్ని హోమం చేయాలి.

యాస్సేనా ఇతిచైత చ్చ తస్కరేభ్యో భయాపహమ్ ॥36॥

'యా స్సేనాః' అనే మంత్రంతో హోమం చేస్తే దొంగలవలన కలిగినభయం పోతుంది.

యో అస్మభ్యమరాతీయాద్ధుత్వా కృష్ణతిలాన్నరః ।
సహస్రశోఽభిచారా చ్చ ముచ్యతే వికృతాద్ ద్విజ ॥37॥

బ్రాహ్మణోత్తమా! పరశురామా! 'యో అస్మభ్య మరాతీయాత్' (11–80) అనే మంత్రంతో నల్లనువ్వులను వెయ్యిసార్లు హోమం చేసినవాడు, భయంకరమైన అభిచారకర్మలనుండి విముక్తిని పొందుతాడు.

అన్నేనాన్నపతేత్యేవం హుత్వా చాన్నమవాప్నుయాత్ ।
హంసశ్శుచిషదిత్యేతజ్జప్తం తోయేఽఘనాశనమ్ ॥38॥

'అన్నపతే' (11–83) అనే మంత్రంతో అన్నం హోమం చేసినవాడు అన్నాన్ని సమృద్ధిగా పొందుతాడు. నీటిలో నిలబడి 'హగ్ంస శ్శుచిషద్' (11–24) అనే మంత్రాన్ని జపిస్తే, పాపాలు నశిస్తాయి.

చత్వారి శృఙ్గ ఇత్యేతత్ సర్వపాపహరం జలే ।
దేవా యజ్ఞేతి జప్త్వా తు బ్రహ్మలోకే మహీయతే ॥39॥

'చత్వారి శృఙ్గా' (17–91) అనే మంత్రాన్ని నీళ్లలో ఉండి జపిస్తే, సమస్త పాపాలు నశిస్తాయి. 'దేవా యజ్ఞమ్' (19–12) అనే మంత్రాన్ని జపించడంవలన బ్రహ్మలోకంలో గౌరవం పొందుతాడు.

వసన్తేతి చ హుత్వాజ్యమాదిత్యాద్వరమాప్నుయాత్ ।
సుపర్ణోసీతి చేత్యస్య కర్మవ్యాహృతివ ద్భవేత్ ॥40॥

'వసంతః' (31–14) అనే మంత్రంతో నేతిని హోమం చేసినవాడు సూర్యుడినుండి వరం పొందుతాడు. 'సుపర్ణోఽసి' (17–22) అనే మంత్రాన్ని జపహోమాదులలో వినియోగిస్తే, సప్తవ్యాహృతులతో సమానమైన ఫలితం కలుగుతుంది.

నమస్స్వాహేతి త్రిర్జప్త్వా బన్ధనాన్మోక్షమాప్నుయాత్ ।
అన్తర్జలే త్రిరావర్త్య ద్రుపదా సర్వపాపముక్ ॥41॥

'నమస్స్వాహా' అని మూడు పర్యాయాలు జపిస్తే, బంధనంనుండి విముక్తి పొందుతాడు. నీళ్లలో ఉండి 'ద్రుపదాత్' (20–20) అనే మంత్రాన్ని మూడుపర్యాయాలు జపిస్తే, సమస్తపాపాలు తొలగిపోతాయి.

ఇహ గావః ప్రజాయధ్వం మన్త్రోఽయం బుద్ధివర్ధనః ।
హుతం తు సర్పిషా దధ్నా పయసా పాయసేన వా ॥42॥

'ఇహ గావః ప్రజాయధ్వమ్' అనే మంత్రంతో నేయి, పెరుగు, పాలు, పాయసం హోమం చేస్తే, బుద్ధి వృద్ధిచెందుతుంది.

శం నో దేవీతి చైతేన హుత్వా పూర్ణఫలాని చ ।
ఆరోగ్యం శ్రియమాప్నోతి జీవితం చ చిరం తథా ॥43॥

'శం నో దేవీ' అనే మంత్రంతో పూర్ణఫలాలను హోమం చేస్తే, ఆరోగ్యం, సంపద, కలుగుతాయి. చాలాకాలం జీవిస్తాడు.

ఓషధీః ప్రతిమోదధ్వం వపనే లపనేఽర్థకృత్ ।
అశ్వావతీ పాయసేన హోమాచ్ఛాన్తి మవాప్నుయాత్ ॥44॥

పొలంలో విత్తనాలు చల్లే సమయంలోనూ, పంట కోసే సమయంలోనూ 'ఓషధీః ప్రతిమోదధ్వమ్' (12–17) అనే మంత్రాన్ని జపిస్తే, సంపదలు కలుగుతాయి. 'అశ్వావతీః' (34–40) అనే మంత్రంతో పాయసాన్ని హోమం చేస్తే, శాంతి కలుగుతుంది.

తస్మా ఇతి చ మన్త్రేణ బన్ధనస్థో విముచ్యతే ।
యువా సువాసా ఇత్యేవ వాసాంస్యాప్నోతి చోత్తమమ్ ॥45॥

'తస్మా అరం గమామ' (36–16) అనే మంత్రంతో హోమం చేస్తే, బంధనాలనుండి విడుదల పొందుతాడు. 'యువా సువాసా' (తై.బ్రా. 3–6–13) అనే మంత్రంతో హోమం చేస్తే, ఉత్తమమైన వస్త్రాలను పొందుతాడు.

ముఞ్చన్తు మా శపథ్యాని సర్వాన్తకవినాశనమ్ ।
మా మా హింసీస్తిలాజ్యేన హుతం రిపువినాశనమ్ ॥46॥

'ముంచంతు మా శపథ్యా' (12–90) అనే మంత్రాలతో హోమం చేస్తే, సమస్తమైన హద్దులు తొలగిపోతాయి. 'మా మా హిగ్ంసీః' (12–102) అనే మంత్రంతో నువ్వులను నేతితో కలిపి హోమం చేస్తే, శత్రువులు నశిస్తారు.

నమోఽస్తు సర్పేభ్యో హుత్వా ఘృతేన పాయసేన తు ।
కృణుష్వ రాజ ఇత్యేతదభిచారవినాశనమ్ ॥47॥

'నమోఽస్తు సర్పేభ్యః' (13–6) అనే మంత్రంతో నేయీ, 'కృణుష్వ రాజ' అనే మంత్రంతో పాయసమూ హోమం చేస్తే, అభిచారకర్మలు నిష్ఫలమై, నశించిపోతాయి.

దూర్వాకాణ్డాయుతం హుత్వా కాణ్డాత్ కాణ్డేతి మానవః ।
గ్రామే జనపదే వాపి మరకం తు శమం నయేత్ ॥
రోగార్తో ముచ్యతే రోగాత్ తథా దుఃఖాత్తు దుఃఖితః ॥48॥

'కాండాత్ కాండాత్' (13–20) అనే మంత్రంతో గరికకాడలను హోమం చేసినవాడు ఉన్న గ్రామంలోనూ ఇతర జనావాసాలలోనూ మరణం కలిగించేవన్నీ నశించిపోతాయి. రోగంతో బాధపడేవాడికి రోగం తగ్గిపోతుంది. దుఃఖపడేవాడికి దుఃఖం నశించిపోతుంది.

ఔదుమ్బరీశ్చ సమిధో మధుమాన్నో వనస్పతిః ।
హుత్వా సహస్రశో రామ ధనమాప్నోతి మానవః ॥
సౌభాగ్యం మహదాప్నోతి వ్యవహారే తథా జయమ్ ॥49॥

పరశురామా! 'మధుమాన్నో వనస్పతిః' (13–29) అనే మంత్రంతో మేడిసమిధలను హోమం చేసినవాడు ధనం పుష్కలంగా పొందుతాడు. గొప్ప సౌభాగ్యం కలుగుతుంది. అన్ని వ్యవహారాలలోనూ విజయం కలుగుతుంది.

అపాం గర్భమితి హుత్వా దేవం వర్షాపయేద్ధ్రువమ్ ।
అపః పిబేతి చ తథా హుత్వా దధి ఘృతం మధు ॥
ప్రవర్తయతి ధర్మజ్ఞ మహావృష్టిమనన్తరమ్ ॥50॥

ధర్మం చక్కగా తెలిసిన పరశురామా! 'అపాం గర్భమ్' (వా. 13–30) అనే మంత్రంతో హోమం చేసినవాడు పర్జన్యదేవుడిచేత వర్షం కురిపింపజేస్తాడు. అదే విధంగా 'అపః పిబన్' (14–8) అనే మంత్రంతో పెరుగు, నెయ్యి, తేనె హోమం చేసినవాడు హోమం పూర్తి అయిన వెంటనే పెద్దవర్షాన్ని కురిపిస్తాడు.

నమస్తే రుద్ర ఇత్యేతత్సర్వోపద్రవనాశనమ్ ।
సర్వశాన్తికరం ప్రోక్తం మహాపాతకనాశనమ్ ॥51॥

'నమస్తే రుద్ర మన్యవ' (16–1) అనే మంత్రంతో హోమం చేస్తే, సమస్తమైన ఉపద్రవాలు నశిస్తాయి. సమస్తవిధమైన శాంతులు కలుగుతాయి. మహాపాతకాలు నాశనమౌతాయి.

అధ్యవోచదిత్యనేన రక్షణం వ్యాధితస్య తు ।
రక్షోఘ్నం చ యశస్యం చ చిరాయుః పుష్టివర్ధనమ్ ॥
సిద్ధార్థకానాం క్షేపేణ పథి చైతజ్జపన్ సుఖీ ॥52॥

'అధ్యవోచత్' (16–5) అనే మంత్రంతో హోమం చేస్తే, రోగాలనుండి రక్షణ కలుగుతుంది. రాక్షసులు నశిస్తారు. కీర్తి కలుగుతుంది. ఆయుర్దాయం పెరుగుతుంది. పుష్టి వర్ధిల్లుతుంది. ప్రయాణసమయంలో ఈమంత్రం జపిస్తూ దారివెంట తెల్లఆవాలు చల్లేవాడు ఏకష్టం ఎదురుకాకుండా, సుఖపడతాడు.

అసౌ యస్తామ్ర ఇత్యేతత్ పఠన్నిత్యం దివాకరమ్ ।
ఉపతిష్ఠేత ధర్మజ్ఞ సాయం ప్రాతరతన్ద్రితః ॥
అన్నమక్షయమాప్నోతి దీర్ఘమాయుశ్చ విన్దతి ॥53॥

'అసౌ య స్తామ్రః' (16–6) అనే మంత్రాన్ని పఠిస్తూ నిత్యమూ ఉదయమూ, సాయంకాలమూ ఏమరుపాటు లేకుండా, సూర్యభగవానుడిని ఉపాసించాలి. దీనివలన శాశ్వతంగా అన్నం పొందుతాడు. దీర్ఘమయిన ఆయువును పొందుతాడు.

ప్రముఞ్చ ధన్వన్నిత్యేతత్ షడ్భిరాయుధమన్త్రణమ్ ।
రిపూణాం భయదం యుద్ధే నాత్ర కార్యా విచారణా ॥54॥

'ప్రముంచ ధన్వనః' (16-9) అనేది మొదలుకొని, ఆరుమంత్రాలు ఆయుధాలను మంత్రిస్తే, యుద్ధంలో ఆ ఆయుధాలు శత్రువులకు భయం పుట్టిస్తాయి. ఇందులో వేరే ఆలోచనకు తావు లేదు.

మా నో మహాన్త ఇత్యేవం బాలానాం శాన్తికారకమ్ ॥55॥

'మా నో మహాంతమ్' (16-15) అనే మంత్రం పిల్లలకు శాంతిని కలిగిస్తుంది.

నమో హిరణ్యబాహవే ఇత్యనువాకసప్తకమ్ ।
రాజికాం కటుతైలాక్తాం జుహుయా చ్ఛత్రునాశనీమ్ ॥56॥

'నమో హిరణ్యబాహవే' (16-9) అనేది మొదలుకొని ఏడు మంత్రాలతో పరిమళభరితమైన తైలంతో రాజికలను కలిపి, హెూమం చేస్తే, శత్రువులు నశిస్తారు.

నమో వః కిరికేభ్యశ్చ పద్మలక్షైర్ఘృతైర్నరః ।
రాజలక్ష్మీమవాప్నోతి తథా బిల్వైస్సువర్ణకమ్ ॥57॥

'నమో వః కిరికేభ్యః' (16-46) అనే మంత్రంతో లక్ష తామరపూలను హెూమం చేసినవాడు, రాజ్యసంపదను పొందుతాడు. అలాగే అదే మంత్రంతో మారేడుదళాలతో హెూమం చేసినవాడు బంగారం పొందుతాడు.

ఇమా రుద్రాయేతి తిలైర్హోమాచ్చ ధనమాప్యతే ।
దూర్వాహెూమేన చాన్యేన సర్వవ్యాధివివర్జితః ॥58॥

'ఇమా రుద్రాయ' (16-48) అనే మంత్రంతో నువ్వులను హెూమం చేస్తే, ధనం లభిస్తుంది. అదే మంత్రంతో గరికలను హెూమం చేస్తే, సమస్తవ్యాధులు నశిస్తాయి.

ఆశుశ్శిశాన ఇత్యేతదాయుధానాం చ రక్షణే ।
(స)ఙ్గ్రామే కథితం రామ సర్వశత్రునిబర్హణమ్ ॥59॥

పరశురామా! 'ఆశు శ్శిశాన' (17-33) అనే మంత్రంతో ఆయుధాలను అభిమంత్రిస్తే, ఆ ఆయుధాలకు రక్షణ కలుగుతుంది. యుద్ధంలో శత్రువులందరూ నశించిపోతారు.

వాజశ్చమేతి జుహుయాత్ సహస్రం పఞ్చభిర్ద్విజ ।
ఆజ్యాహుతీనాం ధర్మజ్ఞ చక్షూరోగాద్విముచ్యతే ॥ 60॥

విప్రవర్యా! ధర్మం చక్కగా తెలిసినవాడా! 'వాజ శ్చ మే' (18-15-19) అనే మంత్రంతో అయిదువేలసార్లు నేతితో హెూమం చేస్తే, కంటిరోగాలు వదిలిపోతాయి.

శం నో వనస్పతే గేహే హెూమస్స్యాద్వాస్తుదోషనుత్ ।
అగ్న ఆయూంషి హుత్వాజ్యం ద్వేషం నాప్నోతి కేనచిత్ ॥ 61॥

'శం నో వనస్పతే' (19-38) అనే మంత్రంతో ఇంట్లో హెూమం చేస్తే, ఆ యింటిలోని వాస్తుదోషాలు పోతాయి. 'అగ్న ఆయూంషి' (19-39) అనే మంత్రంతో నేతిని హెూమం చేస్తే, అతడికి విరోధులు ఎవ్వరూ ఉండరు.

అపాం ఫేనేతి లాజాభిర్హుత్వా జయమవాప్నుయాత్ ।
భద్రా ఇతీన్ద్రియై ర్హీనో జపన్ స్యాత్ సకలేన్ద్రియః ॥62॥

'అపాం ఫేనేన' (19–71) అనే మంత్రంతో పేలాలను హోమం చేస్తే, విజయం కలుగుతుంది. ఆయా ఇంద్రియాలు లేనివాడు 'భద్రాః' (14–39) అనే మంత్రం జపిస్తే, సమస్తమైన ఇంద్రియాలు ఏర్పడతాయి.

అగ్నిశ్చ పృథివీచేతి వశీకరణముత్తమమ్ ।
అధ్వనేతి జపన్మన్త్రం వ్యవహారే జయీ భవేత్ ॥ 63॥

'అగ్నిశ్చ పృథివీ చ' (26–1) అనే మంత్రం జపిస్తే, అందరూ వశం అవుతారు. 'అధ్వనా' (5–33) అనే మంత్రం జపించినవాడు వ్యవహారాలలో విజయం పొందుతాడు.

బ్రహ్మరాజన్యమితి చ కర్మారమ్భే తు సిద్ధికృత్ ।
సంవత్సరోఽసీతి ఘృతైర్లక్షహోమాదరోగవాన్ ॥64॥

ఏ పని నయినా ప్రారంభించేటపుడు 'బ్రహ్మరాజన్యమ్' (19–5) అనే మంత్రం జపించినవాడికి ప్రారంభించిన పనులన్నీ సఫలమౌతాయి. 'సంవత్సరోఽసి' అనే మంత్రంతో లక్ష పర్యాయాలు నెయ్యి హోమం చేసినవాడికి రోగా లన్నీ తగ్గిపోతాయి.

కేతుం కృణ్వన్నిత్యేతత్ సఙ్గ్రామే జయవర్ధనమ్ ।
ఇన్ద్రోఽగ్ని ర్ధర్మ ఇత్యేతద్ రణే ధర్మనిబన్ధనమ్ ॥65॥

'కేతుం కృణ్వన్' (29–37) అనే మంత్రాన్ని జపించడంవలన యుద్ధంలో విజయం వర్ధిల్లుతుంది. 'ఇంద్రోఽగ్ని ర్ధర్మః' అనే మంత్రం జపిస్తే, యుద్ధంలో ధర్మం తప్పకుండా ప్రవర్తించగలుగుతాడు.

ధన్వనాగేతి మన్త్రశ్చ ధనుర్గ్రాహణికః పరః ।
యుఞ్జీతేతి తథా మన్త్రో విజ్ఞేయో హ్యభిమన్త్రణే ॥66॥

'ధన్వనా గా' (29–39) అనే మంత్రం ధనుస్సుని గ్రహించడానికి (ధానుష్కుడు యుద్ధం చేయడానికి ధనుస్సును స్వీకరించేటపుడు ఉత్తమంగా యుద్ధం చేయడానికి) ఉత్తమమైనది. ధనుస్సును 'యుంజీత' అనే మంత్రంతో అభిమంత్రించాలి.

మన్త్రశ్చాహిరివేత్యేతచ్ఛరాణాం మన్త్రణే భవేత్ ।
వహ్నీనాం పితరిత్యేతత్ తూణమన్త్రః ప్రకీర్తితః ॥67॥

బాణాలను 'అహిరివ' (29–51) అనే మంత్రంతో అభిమంత్రించాలి. అమ్ములపొదిని 'వహ్నీనాం పితః' (29–42) అనే మంత్రంతో మంత్రించాలి.

యుఞ్జన్తీతి తథాశ్వానాం యోజనే మన్త్ర ఉచ్యతే ।
ఆశుశ్శిశాన ఇత్యేతద్ యాత్రారమ్భణముచ్యతే ॥68॥

గుఱ్ఱాలను రథానికి కట్టే సందర్భంలో 'యుంజంతి' (23-6) అనే మంత్రం పఠించాలి. యుద్ధయాత్రకు బయలుదేరే సమయంలో 'ఆశుశ్శిశానః' (17-35) అనే మంత్రం చదవాలి.

విష్ణోః కర్మేతి మన్త్రశ్చ రథారోహణికః పరః ।
ఆజఙ్ఘ్యేతీతి చాశ్వానాం తాడనీయముదాహృతమ్ ॥69॥

రథం అధిరోహించే సమయంలో 'విష్ణోః కర్మ' (12-5) అనే మంత్రం ఉచ్చరించాలి. గుఱ్ఱాలను మొదటిసారిగా తోలే సమయంలో 'ఆజంఘ్య' (29-50) అనే మంత్రం పఠించాలి.

యా స్సేనా అభిత్వరీతి పరసైన్యముఖే జపేత్ ।
దున్దుభ్య ఇతి చాప్యేతద్ దున్దుభీతాడనం భవేత్ ॥70॥

శత్రుసైన్యం ఎదురుపడినపుడు 'యా స్సేనా అభిత్వరీః' (11-77) అనే మంత్రం చదవాలి. దుందుభులను మ్రోగించే సమయంలో 'దుందుభ్యః' అనే మంత్రం ఉచ్చరించాలి.

ఏతైః పూర్వహితైర్మన్త్రైః కృత్వైవం విజయీ భవేత్ ॥71॥

ఈవిధంగా చెప్పబడిన ఆయా మంత్రాలను ప్రయోగించినవాడు యుద్ధంలో విజయం పొందుతాడు.

యమేన దత్తమిత్యస్య కోటిహోమాద్ విచక్షణః ।
రథముత్పాదయేచ్ఛీఘ్రం సఙ్గ్రామే విజయప్రదమ్ ॥72॥

వివేకవంతుడు 'యమేన దత్తమ్' అనే మంత్రంతో కోటిసంఖ్యలో హోమం చేసి, రథం నిర్మించాలి. అలా నిర్మించిన రథం యుద్ధంలో విజయం సంపాదించి పెడుతుంది.

ఆ కృష్ణేతి తథైతస్య కర్మ వ్యాహృతివద్భవేత్ ।
శివసఙ్కల్పజాపేన సమాధిం మనసో లభేత్ ॥73॥

'ఆ కృష్ణేన' అనే మంత్రం ఉపయోగించి చేసిన పనులు సప్తవ్యాహృతులతో చేసిన పనులతో సమానమైన ఫలితాన్ని ఇస్తాయి. శివసంకల్ప మంత్రాలను (34-1 మొ.) జపించినవాడికి మనస్సు సమాధిస్థితిని పొందుతుంది.

పఞ్చనద్యః పఞ్చలక్షం హుత్వా లక్ష్మీమవాప్నుయాత్ ॥74॥

'పంచనద్యః' (34-11) అనే మంత్రంతో అయిదులక్షల సంఖ్యలో హోమం చేసినందువలన సంపదలు కలుగుతాయి.

యదా బధ్నన్ దాక్షాయణాం మన్త్రేణానేన మన్త్రితమ్ ।
సహస్రకృత్వః కనకం ధారయేద్రిపువారణమ్ ॥75॥

'యదా బధ్నన్ దాక్షాయణాః' (34-52) అనే మంత్రంతో వెయ్యిసార్లు అభిమంత్రించిన బంగారాన్ని ధరించడంవలన శత్రువులు నివారింపబడతారు.

ఇమం జీవేభ్య ఇతి చ శిలాం లోష్టం చతుర్దిశమ్ ।
క్షిపేద్ గృహే తదా తస్య న స్యాచ్చోరభయం నిశి ॥76॥

'ఇమం జీవేభ్యః' (35-15) అనే మంత్రంతో రాళ్లను గాని లేదా మట్టిని గాని అభిమంత్రించి, దానిని ఇంటిచుట్టూ చల్లితే, ఇక ఆ యింట్లో రాత్రిపూట గూడా దొంగలభయం ఉండదు.

పరి మే గామనేనేతి వశీకరణ ముత్తమమ్ ।
హన్తుమభ్యాగతస్తత్ర వశీభవతి మానవః ॥77॥

'పరి మే గా మనేన' (35-18) అనే మంత్రం ఇతరులను తన అధీనంలో ఉండేవిధంగా చేసుకోవడంలో ఉత్తమమైనది. చంపడానికి వచ్చినవాడు కూడా ఈ మంత్రాన్ని జపించినవాడి ఎదుట లొంగిపోయి, చెప్పినట్లు వింటాడు.

భక్ష్యతామ్బూలపుష్పాద్యం మన్త్రితం తు ప్రయచ్ఛతి ।
యస్య ధర్మజ్ఞ వశగస్సో ఽస్య శీఘ్రం భవిష్యతి ॥78॥

ధర్మం తెలిసినవాడా! ఈ మంత్రంతో తినేపదార్థాలను, తాంబూలాన్ని, పూలు మొదలైన వాటిని మంత్రించి ఇస్తే, అతడు వెంటనే వశ మవుతాడు.

శం నో మిత్ర ఇతీత్యేతత్ సదా సర్వత్ర శాన్తిదమ్ ॥79॥

'శం నో మిత్రః' (36-9) అనే మంత్రం అన్ని సందర్భాలలోనూ శాంతిని ఇస్తుంది.

గణానాం త్వా గణపతిం కృత్వా హోమం చతుష్పథే ।
వశీకుర్యాజ్జగత్సర్వం సర్వధాన్యైరసంశయమ్ ॥80॥

నాలుగువీధుల కూడలిలో 'గణానాం త్వా గణపతిగ్ం' (23-19) అనే మంత్రంతో అన్నిరకాల ధాన్యాలను హోమం చేస్తే, లోకం అంతా అతడికి వశమవుతుంది.

హిరణ్యవర్ణాశ్శుచయో మన్త్రోఽయమభిషేచనే ।
శం నో దేవీరభీష్టయే తథా శాన్తికరః పరః ॥81॥

'హిరణ్యవర్ణాశ్శుచయః' అనే మంత్రానికి స్నానం సమయంలో వినియోగం. 'శం నో దేవీః' అనేది ఉత్తమ మైన శాంతిమంత్రం.

ఏకచక్రేతి మన్త్రేణ హుతేనాజ్యేన భాగశః ।
గృహేభ్యశ్శాన్తిమాప్నోతి ప్రసాదం చ న సంశయః ॥82॥

'ఏకచక్ర' అనే మంత్రంతో భాగాలుగా చేసి, నెయ్యిని హోమం చేస్తే, ఇళ్లకు అన్నిరకాల ఉపద్రవాలనుండి శాంతి కలుగుతుంది. దేవతల అనుగ్రహం కూడ కలుగుతుంది. అనుమానం లేదు.

గావో భగ ఇతి ద్వాభ్యాం హుత్వాజ్యం గా అవాప్నుయాత్ ।
ప్రవాదాంశ స్సోవ దితి గ్రహయజ్ఞే విధీయతే ॥
దేవేభ్యో వనస్పత ఇతి ద్రుమయజ్ఞే విధీయతే ॥83॥


'గావః, (33-29) 'భగః' (34-36-37) అనే రెండుమంత్రాలతోనూ నెయ్యిని హోమం చేస్తే, ఆవులు లభిస్తాయి. 'ప్రవాదాంశ స్సోఽవత్' అనే మంత్రానికి గ్రహయజ్ఞాలలో వినియోగం చెప్పబడింది. 'దేవేభ్యో వనస్పతయః' అనే మంత్రానికి చెట్లకు సంబంధించిన యజ్ఞాలలో వినియోగం చెప్పబడింది.

గాయత్రీ వైష్ణవీ జ్ఞేయా తద్విష్ణోః పరమం పదమ్ ।
సర్వపాపప్రశమనం సర్వకామకరం తథా ॥84॥

గాయత్రి విష్ణుస్వరూపిణి అని గ్రహించాలి. ఆ మంత్రం విష్ణువుకు సంబంధించిన ఉత్తమమైన స్థానం. సమస్తమైన పాపాలను పోగొడుతుంది. సమస్తమైన కోరికలను తీరుస్తుంది.

ఇత్యాది మహాపురాణే ఆగ్నేయే యజుర్విధానకథనం నామ షష్ట్యధికద్విశతతమోఽధ్యాయః ॥260॥

అగ్నిమహాపురాణంలో యజుర్విధానకథనం అనే రెండువందల అరవైయవ అధ్యాయం సమాప్తం.



ఏకషష్ట్యధికద్విశతతమోఽధ్యాయః – రెండువందల అరవైఒకటవ అధ్యాయం

సామవిధానకథనమ్ – సామవిధానకథనం

పుష్కర ఉవాచ – పరశురాముడితో పుష్కరుడు ఇలా చెప్తున్నాడు.

యజుర్విధానం కథితం వక్ష్యే సామ్నాం విధానకమ్ ॥1॥

యజుర్వేదమంత్ర ప్రయోగవిధానం చెప్పాను. ఇక సామవిధానం చెప్తాను.

సంహితాం వైష్ణవీం జప్త్వా హుత్వా స్యాత్ సర్వకామభాక్ ।
సంహితాం ఛాన్దసీం సాధు జప్త్వా ప్రీణాతి శఙ్కరమ్ ॥2॥

వైష్ణవీసంహితను జపించినా, హోమం చేసినా సమస్తమైన కోరికలూ నెరవేరతాయి. ఛాందసీసంహితను విధివిధానంగా జపిస్తే, పరమేశ్వరుడు సంతోషిస్తాడు.

స్కాన్దీం పైత్ర్యాం సంహితాం జప్త్వా స్యాత్తు ప్రసాదవాన్ ।
యత ఇన్ద్రం భజామహే హింసాదోషవినాశనమ్ ॥3॥

స్కందుడికి సంబంధించిన సంహితను, పితరులకు సంబంధించిన సంహితను జపించినవాడికి ప్రసాదగుణం కలుగుతుంది. 'యత ఇన్ద్రం యజామహే' (1321) అనే మంత్రాన్ని జపించినందువలన జీవహింస చేసినపాపం నశిస్తుంది.

అవకీర్ణీ ముచ్యతే చ అగ్నిస్తిగ్మేతి వై జపన్ ।
సర్వపాపహరం జ్ఞేయం పరితోషం చ తాసు చ ॥4॥

స్త్రీతో సంగమించడం మొదలైన వాటివలన బ్రహ్మచర్యవ్రతంనుండి భ్రష్టుడైన బ్రహ్మచారి 'అగ్ని స్తిగ్మేన' (22) అనే మంత్రాన్ని జపిస్తే, ఆ పాపాలనుండి విముక్తిని పొందుతాడు. 'పరితోషం చ తాసు' (512) అనే మంత్రాన్ని జపిస్తే సమస్తమైన పాపాలు నశించిపోతాయి.

అవిక్రేయం చ విక్రీయ జపేద్ ఘృతవతీతి చ ।
అద్యా నో దేవ సవితర్ జ్ఞేయం దుస్స్వప్ననాశనమ్ ॥5॥

అమ్మకూడని వస్తువును అమ్మినవాడు ఆ దోషం తొలగడానికి 'ఘృతవతీ' అనే మంత్రాన్ని జపించాలి. 'అద్యా నో దేవ సవితః' (141) అనే మంత్రాన్ని జపిస్తే, చెడుకలలు నశిస్తాయి.

అబోధ్యగ్నిరితి మన్త్రేణ ఘృతం రామ యథావిధి ।
ఆభ్యుక్ష్య ఘృతశేషేణ మేఖలా బన్ధ ఇష్యతే ॥
స్త్రీణాం యాసాం తు గర్భాణి పతన్తి భృగుసత్తమ ॥6॥

భృగువంశవరేణ్యా! పరశురామా! 'అబో ధ్యగ్నిః' (1746) అనే మంత్రంతో ఆవునెయ్యిని విధివిధానంగా హోమం చేసి, మిగిలిన నెయ్యితో మొలనూలిని తడిపి, దానిని గర్భం జారిపోయే స్త్రీకి కట్టాలి. (అందువలన ఆస్త్రీ సుఖంగా ప్రసవిస్తుంది.)

మణిం జాతస్య బాలస్య బధ్నీయాత్తదనన్తరమ్ ॥7॥

ఆ తరువాత అదే మంత్రంతో అభిమంత్రించిన మణిని, పుట్టిన బాలుడికి కట్టాలి.

సోమం రాజానమేతేన వ్యాధిభిర్విప్రముచ్యతే ।
సర్పసామ ప్రయుఞ్జానో నాప్నుయాత్ సర్పజం భయమ్ ॥8॥

'సోమం రాజానమ్' (91) అనే మంత్రం జపించడంవలన రోగాలనుండి విముక్తి కలుగుతుంది. సర్పసామను ప్రయోగించినవాడికి పాములవలన భయం కలగదు.

మా౽ఘుత్వా వాద్యతేత్యేతద్ధుత్వా విప్రస్సహస్రశః ।
శతావరిమణిం బద్ధ్వా నాప్నుయాచ్ఛస్త్రతో భయమ్ ॥9॥

'మా౽ఘుత్వా వాద్యత' (918) అనే మంత్రంతో నూరుసార్లు హోమం చేసి, శతావరీ మంత్రంతో అభిమంత్రించిన మణిని కడితే, శస్త్రాలవలన భయం ఉండదు.

దీర్ఘతమసో౽ర్క ఇతి హుత్వాన్నం ప్రాప్నుయాద్ బహు ।
సమధ్యాయన్తీతి జపన్ న మ్రియతే పిపాసయా ॥10॥

'దీర్ఘతమసో౽ర్కః' అనే మంత్రంతో హోమం చేస్తే, అన్నం సమృద్ధిగా కలుగుతుంది. 'సమధ్యాయంతి' (607) అనే మంత్రం జపిస్తే, దాహంతో మరణించడు.

త్వమిమాహ్యోషధీ హ్యేతజ్జప్త్వా వ్యాధిం న చాప్నుయాత్ ।
పథి దేవవ్రతం జప్త్వా భయేభ్యో విప్రముచ్యతే ॥11॥

'త్వమిమా ఓషధీః' (604) అనే మంత్రాన్ని జపిస్తే, వ్యాధి కలగదు. ప్రయాణంలో దారిలో 'దేవవ్రతమ్' అనే మంత్రాన్ని జపిస్తే, అన్నిరకాల భయాలనుండి విముక్తి కలుగుతుంది.

య దిన్ద్రో మునయేత్వేతి హుతం సౌభాగ్యవర్ధనమ్ ॥12॥

'య దింద్రో మునయే తు' (148) _అనే మంత్రంతో హోమం చేస్తే, సౌభాగ్యం వర్ధిల్లుతుంది.

భగో న చిత్ర ఇత్యేవం నేత్రయోరఞ్జనం హితమ్ ।
సౌభాగ్యవర్ధనం రామ నాత్ర కార్యా విచారణా ॥13॥

పరశురామా! 'భగో న చిత్రమ్' (449) అనే మంత్రంతో కాటుకను మంత్రించి, కన్నులకు పెడితే, కన్నులకు మేలు కలుగుతుంది. ఇంకా సౌభాగ్యం వృద్ధిచెందుతుంది. ఇందులో సందేహం లేదు.

జపేదిన్ద్రేతి వర్గం చ తథా సౌభాగ్యవర్ధనమ్ ॥14॥

'ఇంద్ర' అనే శబ్దంతో ప్రారంభమయ్యే మంత్రాల సముదాయాన్ని జపిస్తే, సౌభాగ్యం వృద్ధిచెందుతుంది.

పరిప్రియా హి యః కారిః కామ్యాం సంస్రావయేత్ స్త్రియమ్ ।
సా తం కామయతే రామ నాత్ర కార్యా విచారణా ॥15॥

పరశురామా! 'పరిప్రియా హి యః' అనే మంత్రాన్ని కోరుకున్న స్త్రీకి వినిపిస్తే, ఆ స్త్రీ అతడిని కోరుకుంటుంది. ఈ విషయం గురించి విచారించవలసిన పని లేదు.

రథన్తరం వామదేవ్యం బ్రహ్మవర్చసవర్ధనమ్ ॥16॥

రథంతరసామ, వామదేవ్యసామ మంత్రాలను జపిస్తే, బ్రహ్మతేజస్సు వృద్ధిచెందుతుంది.

ప్రాసయేద్బాలకం నిత్యం వచాచూర్ణం ఘృతప్లుతమ్ ।
ఇన్ద్రమిద్గాథినం జప్త్వా భవేచ్ఛ్రుతిధరస్త్వసౌ ॥17॥

'ఇంద్రమిద్గాథినమ్' (98) అనే మంత్రాన్ని జపిస్తూ, వసదుంపపొడిని నేతితో కలిపి పసిపిల్లవాడికి తినిపించాలి. దానివలన అతడికి దేనినైనా, ఒకసారి విన్నవెంటనే గ్రహించగలిగిన సామర్థ్యం సిద్ధిస్తుంది.

హుత్వా రథన్తరం జప్త్వా పుత్రమాప్నోత్యసంశయమ్ ।
మయి శ్రీరితి మన్త్రోఽయం జప్తవ్యశ్శ్రీవివర్ధనః ॥18॥

రథంతరసామను జపించి, హోమం చేస్తే, నిశ్చయంగా కొడుకు పుడతాడు. సందేహం లేదు. 'మయి శ్రీః' (602) అనే మంత్రాన్ని జపిస్తే, సంపదలు వృద్ధి చెందుతాయి.

వైరూప్యస్యాష్టకం నిత్యం ప్రయుఞ్జానశ్శ్రియం లభేత్ ।
సప్తాష్టకం ప్రయుఞ్జానస్సర్వాన్ కామానవాప్నుయాత్ ॥19॥

వైరూప్యాష్టకాన్ని నిత్యం పఠించేవాడికి సంపదలు కలుగుతాయి. సప్తాష్టకం పఠించేవాడికి కోరికలన్నీ నెరవేరతాయి.

గవ్యేషునేతి యో నిత్యం సాయం ప్రాతరతన్ద్రితః ।
ఉపస్థానం గవాం కుర్యాత్ తస్యస్యుస్తాస్సదా గృహే ॥20॥

'గవ్యేషు నః' (186) అనే మంత్రంతో ప్రతిరోజూ ఉదయం, సాయంకాలం శ్రద్ధగా ఆవులను ఉపాసించేవాడి ఇంట్లో ఆవులు ఎల్లకాలమూ సమృద్ధిగా ఉంటాయి.

ఘృతాక్తం తు యవద్రోణం వాత ఆవాతు భేషజమ్ ।
అనేన హుత్వా విధివత్ సర్వాం మాయాం వ్యపోహతి ॥21॥

'వాత ఆవాతు భేషజమ్' (184) అనే మంత్రంతో ద్రోణం పరిమాణం కలిగిన యవలను నేతితో తడిపి, అదే మంత్రంతో హోమం చేస్తే, అన్నిరకాలైన మాయలు తొలగిపోతాయి.

ప్రదేవో దాసేన తిలాన్ హుత్వా కార్మణకృన్తనమ్ ॥22॥

'ప్రదేవో దాసః' (51) అనే మంత్రంతో నువ్వులను హోమం చేస్తే, హింసను ఉద్దేశించిన అభిచారకర్మలు నశిస్తాయి.

అభి త్వాపూర్వపీతయే వషట్కారసమన్వితమ్ ।
వాసకేధ్మసహస్రం తు హుతం యుద్ధే జయప్రదమ్ ॥23॥

'అభి త్వా' (232) అనే మంత్రానికి చివర వషట్ అనే పదం కలిపి, ఆ మంత్రంతో వాసక సమిధలను వెయ్యిసార్లు హోమం చేస్తే, యుద్ధంలో విజయం కలుగుతుంది.

హస్త్యశ్వపురుషాన్ కుర్యాద్బుధః పిష్టమయాఞ్ఛుభాన్ ।
పరకీయానథోద్దిశ్య ప్రధానపురుషాం స్తథా ॥
సుస్విన్నాన్ పిష్టకవరాన్ క్షురేణోత్కృత్య భాగశః ॥24॥

ఇతరులకు సంబంధించిన – ఏనుగులను, గుఱ్ఱాలను, పురుషులను, పిండితో అందంగా తయారు చేయాలి. అదే విధంగా ప్రధానమైన శత్రుపురుషుల ప్రతిమలను కూడా నిర్మించాలి. ఆ పిండిబొమ్మలను నేతితో చక్కగా తడిపి, కత్తితో ముక్కలు ముక్కలుగా నరకాలి.

అభి త్వా శూరణో నమో మన్త్రేణానేన మన్త్రవిత్ ।
కృత్వా సర్షపతైలాక్తాన్ క్రోధేన జుహుయాత్తతః ॥
ఏతత్కృత్వా బుధః కర్మ, సఙ్గ్రామే జయమాప్నుయాత్ ॥25॥

తరువాత మంత్రవేత్త అయినవాడు 'అభి త్వా శూరణో నమః' (232) అనే మంత్రంతో ఆ ముక్కలను ఆవనూనెతో కలిపి, కోపంగా హోమం చేయాలి. ఈవిధంగా హోమకర్మను చేసిన విద్వాంసుడికి యుద్ధంలో విజయం లభిస్తుంది.

గారుడం వామదేవ్యం చ రథన్తరబృహద్రథౌ ।
సర్వపాపప్రశమనాః కథితా స్సంశయం వినా ॥26॥

గారుడం, వామదేవ్యం, రథంతరం, బృహద్రథం అనే సామలు నిస్సందేహంగా సమస్తమైన పాపాలను నిర్మూలిస్తాయి.

ఇత్యాది మహాపురాణే ఆగ్నేయే సామవిధానకథనం నామైకషష్ట్యధికద్విశతతమోఽధ్యాయః ॥261॥

అగ్నిమహాపురాణంలో సామవిధానకథనం అనే రెండువందల అరవైఒకటవ అధ్యాయం సమాప్తం.

ద్విషష్ట్యధికద్విశతతమోఽధ్యాయః – రెండువందల అరవైరెండవ అధ్యాయం

అథర్వవిధానకథనమ్ – అథర్వవిధానకథనం

పుష్కర ఉవాచ – పరశురాముడితో పుష్కరుడు ఇలా చెప్తున్నాడు.

సామ్నాం విధానం కథితం వక్ష్యే చాథర్వణా మథ ।
శాన్తాతీయం గణం హుత్వా శాన్తిమాప్నోతి మానవః ॥1॥

సామవిధానం నీకు వివరించాను, ఇక అథర్వవిధానం చెప్తాను. (1) శాంతాతీయం అనే గణాన్ని ఉద్దేశించి హోమం చేసినవాడు శాంతిని పొందుతాడు.

భైషజ్యం చ గణం హుత్వా సర్వాన్ రోగాన్ వ్యపోహతి ।
త్రిసప్తీయం గణం హుత్వా సర్వపాపైః ప్రముచ్యతే ॥2॥

(2) భైషజ్య గణాన్ని ఉద్దేశించి హోమం చేస్తే, సమస్తమైన రోగాలు వదిలిపోతాయి. (3) త్రిసప్తీయ గణాన్ని ఉద్దేశించి హోమం చేస్తే, సమస్తమైన పాపాలనుండి విముక్తి కలుగుతుంది.

క్వచిన్నాప్నోతి చ భయం హుత్వా చైవాభయం గణమ్ ।
న క్వచిజ్జాయతే రామ గణం హుత్వాపరాజితమ్ ॥3॥

పరశురామా! (4) అభయగణాన్ని ఉద్దేశించి హోమం చేస్తే ఎప్పటికీ భయం కలగనే కలగదు. (5) అపరాజితగణాన్ని ఉద్దేశించి హోమం చేస్తే, పరాజయం కలగదు.

ఆయుష్యం చ గణం హుత్వా హ్యపమృత్యుభయం వ్యపోహతి ।
స్వస్తిమాప్నోతి సర్వత్ర హుత్వా స్వస్త్యయనం గణమ్ ॥4॥

(6) ఆయుష్యగణాన్ని ఉద్దేశించి హోమం చేస్తే, అపమృత్యువు కలుగుతుందేమో అనే భయం (అపమృత్యువు) తొలగిపోతుంది. (7) స్వస్త్యయనగణాన్ని ఉద్దేశించి హోమం చేస్తే, అన్నిచోట్లా శుభం కలుగుతుంది.

శ్రేయసా యోగమాప్నోతి శర్మవర్మగణం తథా ।
వాస్తోష్పత్యగణం హుత్వా వాస్తుదోషాన్ వ్యపోహతి ॥5॥

(8) శర్మవర్మగణాన్ని ఉద్దేశించి హోమం చేస్తే, శ్రేయస్సు కలుగుతుంది. (9) వాస్తోష్పత్యగణాన్ని ఉద్దేశించి హోమం చేస్తే, వాస్తుదోషాలు పోతాయి.

తథా రౌద్రగణం హుత్వా సర్వాన్ దోషాన్ వ్యపోహతి ।
ఏతైర్దశగణైర్హోమో హ్యష్టాదశసు శాన్తిషు ॥6॥

అదే విధంగా (10) రౌద్రగణాన్ని ఉద్దేశించి హోమం చేస్తే, సమస్తమైన దోషాలు తొలగిపోతాయి. పద్దెనిమిది విధాలైన శాంతికర్మలలో ఈవిధంగా పదివిధాలైన గణాలకు హోమం చేయాలి.

వైష్ణవీ శాన్తిరైన్ద్రీ చ బ్రాహ్మీ రౌద్రీ తథైవ చ ।
వాయవ్యా వారుణీ చైవ కౌబేరీ భార్గవీ తథా ॥7॥

ఆ పద్దెనిమిది శాంతులు ఇవి. 1.వైష్ణవి 2. ఐంద్రి 3. బ్రాహ్మి 4. రౌద్రి 5. వాయవ్య 6. వారుణి 7.కౌబేరి 8. భార్గవి.

ప్రాజాపత్యా తథా త్వాష్ట్రీ కౌమారీ వహ్నిదేవతా ।
మారుద్గణా చ గాన్ధారీ శాన్తిర్నైరృతకీ తథా ॥
శాన్తిరాఙ్గిరసీ యామ్యా పార్థివీ సర్వకామదా ॥8॥

9.ప్రాజాపత్య, 10.త్వాష్ట్రి, 11. కౌమారి, 12. ఆగ్నేయి, 13. మారుద్గణ, 14. గాంధారి, 15. నైరృతకి, 16. ఆంగిరసి, 17. యామ్య, 18. పార్థివి. ఇవి సమస్తమైన కోరికలను తీరుస్తాయి.

యస్త్వాం మృత్యురితిహ్యేత జ్జప్తం మృత్యువినాశనమ్ ।
సుపర్ణస్త్వేతి హుత్వా చ భుజగైర్నైవ బాధ్యతే ॥9॥

'య స్త్వాం మృత్యుః' అనే మంత్రాన్ని జపిస్తే అపమృత్యువు రాదు. 'సుపర్ణ స్త్వా' (4-63) అనే మంత్రం జపిస్తే పాములవలన బాధ ఉండదు.

ఇన్ద్రేణ దత్తమిత్యేతత్ సర్వకామకరం భవేత్ ।
ఇన్ద్రేణ దణ్డమిత్యేతత్ సర్వబాధావినాశనమ్ ॥10॥

'ఇంద్రేణ దత్తమ్' 92-2-94) అనే మంత్రం జపిస్తే, కోరికలన్నీ తీరుతాయి. 'ఇంద్రేణ దండమ్' అనే మంత్రం జపిస్తే, సమస్తమైన బాధలు నశించిపోతాయి.

ఇమా దేవీతి మన్త్రశ్చ సర్వశాన్తికరః పరః ।
దేవా మరుత ఇత్యేతత్ సర్వకామకరం భవేత్ ॥11॥

'ఇమా యా దేవీ' (2-10-4) అనే మంత్రం జపిస్తే, అన్నిరకాలైన బాధలనుండి ఉత్తమమైన శాంతి లభిస్తుంది. 'దేవా మరుతః' అనే మంత్రం జపిస్తే, అన్ని కోరికలూ నెరవేరతాయి.

యమస్య లోకాదిత్యేతద్దుస్స్వప్నశమనం పరమ్ ।
ఇన్ద్రశ్చ పఞ్చవణిజః పుణ్యలాభకరం పరమ్ ॥12॥

చెడుకలలు రాకుండా ఉండడానికి 'యమస్య లోకాత్' (19-56-1) అనే మంత్రాన్ని జపించడం ఉత్తమం. ఉత్తమమైన పుణ్యం కలిగింపజేయడంలో 'ఇంద్రశ్చ పంచవణిజః' అనే మంత్రజపం శ్రేష్ఠం.

కామో మే వా జీతి హుతం స్త్రీణాం సౌభాగ్యవర్ధనమ్ ।
తుభ్యమేవ జపన్నిత్యమయుతం తు హుతం భవేత్ ॥13॥

'కామో మే వాజి' అనే మంత్రం జపించడంవలన స్త్రీలకు సౌభాగ్యం వృద్ధిచెందుతుంది. 'తుభ్య మేవ' (2-28-1) అనే మంత్రాన్ని నిత్యమూ జపిస్తూ, పదివేల సంఖ్యలో హోమం చేయడంవలన కూడ స్త్రీలకు సౌభాగ్యం వృద్ధిచెందుతుంది.

అగ్నే గోభిర్న ఇత్యేతన్మేధావృద్ధికరం పరమ్ ।
ధ్రువం ధ్రువేణేతి హుతం స్థానలాభకరం భవేత్ ॥14॥

బుద్ధి పెంపొందడానికి 'అగ్నే గోభి ర్నః' అనే మంత్రంతో హోమం చేయడం ఉత్తమం. 'ధ్రువం ధ్రువేణ' (7-84-1) అనే మంత్రంతో హోమం చేస్తే, ఉత్తమమైన స్థానం కలుగుతుంది.

అలక్తజీవేతి శునా కృషిలాభకరం భవేత్ ।
అహం తే భగ్న ఇత్యేతద్ భవే త్సౌభాగ్యవర్ధనమ్ ॥15॥

'అలక్తజీవః' అనే మంత్రం జపిస్తూ, కుక్కలతో వ్యవసాయం చేస్తే లాభం కలుగుతుంది. 'అహం తే భగ్నః' అనే మంత్రం జపిస్తే, సౌభాగ్యం వృద్ధిచెందుతుంది.

యే మే పాశాస్తథా హ్యేతద్ బన్ధనాన్మోక్షకారణమ్ ।
శప త్వహన్నితి రిపూన్నాశయేద్ధోమజాప్యతః ॥16॥

'యే మే పాశా స్తథా' అనే మంత్రం జపిస్తే, బందీ అయినవాడు బంధనాలనుండి విముక్తిని పొందుతాడు. 'శప త్వహన్' అనే మంత్రం జపించినా, ఆ మంత్రంతో హోమం చేసినా, శత్రువులు నాశనం అవుతారు.

త్వముత్తమమితీత్యేత ద్యశోబుద్ధివివర్ధనమ్ ।
యథా మృగమతీత్యేతత్ స్త్రీణాం సౌభాగ్యవర్ధనమ్ ॥17॥

'త్వ ముత్తమమ్' అనే మంత్రం జపించడంవలన కీర్తి, బుద్ధి పెంపొందుతాయి. 'యథామృగ మతీత్య' అనే మంత్రం జపిస్తే, స్త్రీలకు సౌభాగ్యం వృద్ధిచెందుతుంది.

యేన చేహ దిశం చైవ గర్భలాభకరం భవేత్ ।
అయం తే యోనిరిత్యేతత్ పుత్రలాభకరం భవేత్ ॥18॥

'యేన చేహ దిశమ్' అనే మంత్రం జపించడంవలన స్త్రీకి గర్భం కలుగుతుంది. 'అయం తే యోనిః' (3-20-1) అనే మంత్రం జపిస్తే పుత్రసంతానం కలుగుతుంది.

శివశ్శివాభిరిత్యేతద్ భవేత్సౌభాగ్యవర్ధనమ్ ।
బృహస్పతిర్నః పరిపాతు పథి స్వస్త్యయనం భవేత్ ॥19॥

'శివశ్శివాభిః' అనే మంత్రం జపిస్తే, స్త్రీలకు సౌభాగ్యం వృద్ధిచెందుతుంది. 'బృహస్పతిర్నః పరిపాతు' (7-51-1) అనే మంత్రం జపిస్తే, ప్రయాణాలలో మార్గమధ్యంలో శుభపరంపరలు కలుగుతాయి.

ముఞ్చామిత్వేతి కథితమపమృత్యునివారణమ్ ।
అథర్వశిరసోఽధ్యేతా సర్వపాపైః ప్రముచ్యతే ॥20॥

'ముంచామి త్వా' అనే మంత్రం జపిస్తే, అపమృత్యువు రాదు. అథర్వశీర్షం అధ్యయనం చేసినవాడికి పాపాలన్నీ నశించిపోతాయి.

ప్రాధాన్యేన తు మన్త్రాణాం కిఞ్చిత్కర్మ తవేరితమ్ ॥21॥

పరశురామా! ప్రాధాన్యాన్ని అనుసరించి ఆయా మంత్రాలతో చేయదగిన ఆయా కర్మలవిషయం కొద్దిగా నీకు వివరించాను.

వృక్షాణాం యజ్ఞియానాం తు సమిధః ప్రథమం హవిః ॥22॥

హోమం చేయదగిన హవిస్సు లన్నింటిలోనూ యజ్ఞానికి ఉపయోగించే చెట్లసమిధలు ప్రథమస్థానంలో ఉన్నాయి.

ఆజ్యం చ వ్రీహయ శ్చైవ తథా వై గౌరసర్షపాః ।
అక్షతాని తిలా శ్చైవ దధిక్షీరే చ భార్గవ ॥23॥

పరశురామా! ఆవునెయ్యి, వడ్లు మొదలైన ధాన్యం, తెల్లని ఆవాలు, అక్షతలు, నువ్వులు, పెరుగు, పాలు,-

దర్భాస్తథైవ దుర్వాశ్చ బిల్వాని కమలాని చ ।
శాన్తిపుష్టికరాణ్యాహుర్ ద్రవ్యాణ్యేతాని సర్వశః ॥24॥

దర్భలు, గరికలు, మారేడుదళాలు, తామరపూలు, ఈద్రవ్యాలు అన్నివిధాలుగానూ హోమంలో శాంతినీ పుష్టినీ కలిగిస్తాయి అని తెలిసినవారు చెప్తారు.

తైలం కణాని ధర్మజ్ఞ రాజికా రుధిరం విషమ్ ।
సమిధః కణ్టకోపేతా అభిచారేషు యోజయేత్ ॥25॥

ధర్మం చక్కగా తెలిసినవాడా! పరశురామా! నువ్వులనూనె, కణాలు, రాజికలు, నెత్తురు, ముళ్లు కలిగిన సమిధలు, వీటిని ఇతరులను హింసించడానికి చేసే హోమాలలో ఉపయోగించాలి.

ఆర్షం వై దైవతం ఛన్దో వినియోగజ్ఞ ఆచరేత్ ॥26॥

మంత్రాన్ని దర్శించిన ఋషి, మంత్రానికి అధిష్ఠానదేవత, మంత్రం ఉన్న ఛందస్సు అనే అంశాలు తెలుసుకుని మాత్రమే ఆయా మంత్రాల జపహోమాదికర్మలను ఆచరించాలి.

ఇత్యాది మహాపురాణే ఆగ్నేయే అథర్వవిధానకథనం నామ ద్విషష్ట్యధికద్విశతతమోఽధ్యాయః ॥262॥

అగ్నిమహాపురాణంలో అథర్వవిధానకథనం అనే రెండువందల అరవైరెండవ అధ్యాయం సమాప్తం.

త్రిషష్ట్యధికద్విశతతమోఽధ్యాయః - రెండువందల అరవైమూడవ అధ్యాయం

ఉత్పాతశాన్తికథనమ్ - ఉత్పాతశాన్తికథనం

పుష్కర ఉవాచ - వశిష్ఠమహర్షితో అగ్నిదేవుడు ఇలా చెప్తున్నాడు.

శ్రీసూక్తం చ ప్రతివేదం జ్ఞేయం లక్ష్మీవివర్ధనమ్ ॥1॥

శ్రీసూక్తం లక్ష్మిని పెంపొందిస్తుంది. ప్రతివేదంలోనూ ఉన్న ఆ శ్రీసూక్తాన్ని తెలుసుకోవాలి.

హిరణ్యవర్ణాం హరిణీమృచః పఞ్చదశ శ్రియః ।
రథేష్వక్షేషు వా జేతి చతస్రో యజుషి శ్రియః ॥2॥

'హిరణ్యవర్ణాం హరిణీమ్' అనేది మొదలుపెట్టి పదిహేను ఋక్కులు గలిగినది ఋగ్వేదంలోని శ్రీసూక్తం. 1. రథేషు (29-43), 2. అక్షేషు (అక్షయరాజాయ 30-18), 3. వాజః (18-84), 4. చతస్రః (18-32)- అనే నాలుగుమంత్రాలు కలిగినది యజుర్వేదానికి సంబంధించిన శ్రీసూక్తం.

స్రావన్తీయం తథా సామ శ్రీసూక్తం సామవేదకే ।
శ్రియం ధాతర్మయి ధేహి ప్రోక్తమాథర్వణే తథా ॥3॥

'స్రావన్తీయం' అనే సామం సామవేదానికి సంబంధించిన శ్రీసూక్తం.'శ్రియం ధాతర్మయి ధేహి' అనేది అథర్వవేదానికి సంబంధించిన శ్రీసూక్తం.

శ్రీసూక్తం యో జపేద్ భక్త్యా హుత్వా శ్రీస్తస్య వై భవేత్ ।
పద్మాని చాథ బిల్వాని హుత్వాజ్యం వా తిలాం చ్ఛ్రియః ॥4॥

శ్రీసూక్తాన్ని భక్తిగా జపించినా, హోమం చేసినా అతడికి సంపదలు తప్పకుండా లభిస్తాయి. లక్ష్మీదేవి అనుగ్రహం సిద్ధించడానికి శ్రీసూక్తంతో తామరపూలు, మారేడుదళాలు, ఆవునెయ్యి, నువ్వులు, హోమం చేయాలి.

ఏకం తు పౌరుషం సూక్తం ప్రతివేదం తు సర్వదమ్ ।
సూక్తేన దద్యాన్నిష్నాపో హ్యేకైకయా జలాఞ్జలిమ్ ॥5॥

పురుషసూక్తం సమస్తమైన కోరికలనూ తీరుస్తుంది. ప్రతివేదంలోనూ ఉన్న పురుషసూక్తాన్ని తెలుసుకోవాలి. (స్నానం చేసినతరువాత) పురుషసూక్తంలోని ఒక్కొక్కమంత్రంతో ఒక్కొక్కటిగా విష్ణుమూర్తికి నీటితో అంజలి ఇచ్చిన వాని పాపాలు అన్నీ తొలగిపోతాయి.

స్నాత ఏకైకయా పుష్పం విష్ణోర్దత్త్వాఘహా భవేత్ ।
స్నాత ఏకైకయా దత్త్వా ఫలం స్యాత్సర్వకామభాక్ ॥5॥

స్నానం చేసిన తరువాత పురుషసూక్తంలోని ఒక్కొక్కమంత్రంతో ఒక్కొక్కటిగా విష్ణుమూర్తికి పూవును సమర్పించినవాడు ఇతరులపాపాలను కూడా పోగొడతాడు. ఒక్కొక్కమంత్రంతో ఒక్కొక్కపండును సమర్పించినవాడికి సమస్తమైన కోరికలు సిద్ధిస్తాయి.

మహాపాపోపపాపాన్తో భవేజ్జప్త్వా తు పౌరుషమ్ ।
కృచ్ఛ్రైర్విశుద్ధో జప్త్వా చ హుత్వా స్నాత్వాథ సర్వభాక్ ॥6॥

పురుషసూక్తం జపించినవాడికి మహాపాతకాలు, ఉపపాతకాలు నశిస్తాయి. స్నానం చేసిన తరువాత కృచ్ఛ్ర వ్రతంతో పరిశుద్ధుడైనవాడు పురుషసూక్తాన్ని జపించినా, హోమం చేసినా, సమస్తాన్నీ పొందుతాడు.

అష్టాదశభ్యశ్శాన్తిభ్యస్త్రిస్రోఽన్యాశ్శాన్తయో వరాః ।
అమృతాచాభయా సౌమ్యా సర్వోత్పాతవిమర్దనాః ॥7॥

పద్దెనిమిది విధాలయిన శాంతులలోనూ మూడు శాంతులు చాల శ్రేష్ఠమైనవి. 1. అమృతశాంతి, 2. అభయశాంతి, 3. సౌమ్యశాంతి అనే ఈ మూడు శాంతులు సమస్తమైన ఉపద్రవాలను నాశనం చేస్తాయి.

అమృతా సర్వదైవత్యా హ్యభయా బ్రహ్మదైవతా ।
సౌమ్యా చ సర్వదైవత్యా ఏకా స్యాత్సర్వకామదా ॥8॥

అమృతశాంతికి అధిదేవత సమస్తదేవతలు. అభయశాంతికి అధిదేవత బ్రహ్మ. సౌమ్యశాంతికి కూడ అధిదేవత సమస్తదేవతలు. వీటిలో ప్రతిఒక్కటి అన్ని కోరికలనూ నెరవేరుస్తుంది.

అభయా యా మణిః కార్యో వరుణస్య భృగూత్తమ ।
శతకాణ్డోఽమృతాయాశ్చ సౌమ్యాయా శ్శఙ్ఖజో మణిః ॥9॥

భృగువంశవరేణ్యా! పరశురామా! అభయశాంతికోసం వరుణవృక్షం కఱ్ఱతో మణిని నిర్మించాలి. అమృతశాంతికి శతకాండ వృక్షంకఱ్ఱతోనూ, సౌమ్యశాంతికి శంఖంనుండి మణిని నిర్మించాలి.

తద్దైవత్యాస్తథా మన్త్రాస్సిద్ధ్యై స్యాన్మణిబన్ధనమ్ ।
దివ్యాన్తరిక్షభౌమాదిసముత్పాతార్దనా ఇమాః ॥10॥

ఈవిధంగా నిర్మించిన మణులను ఆయా శాంతుల అధిదేవతలకు సంబంధించిన మంత్రాలతో అభిమంత్రించి శాంతిప్రదంగా తయారుచేసి, చేతికి కట్టాలి. ఈ మణులు దేవ, అంతరిక్ష, భూలోకాలకు సంబంధించిన ఉపద్రవాలను నిర్మూలిస్తాయి.

దివ్యాన్తరిక్షభౌమం తు అద్భుతం త్రివిధం శృణు ।
అహర్క్షవైకృతం దివ్యమాన్తరిక్షం నిబోధ మే ॥11॥

దివ్యం, అంతరిక్షం, భౌమం అనే మూడురకాల ఉపద్రవాలు ఆశ్చర్యకరమైనవి. వాటిస్వరూపం గురించి విను. గ్రహాలు, నక్షత్రాలు అపకారం కలిగించే స్థితిలో ఉన్నపుడు కలిగే ఉపద్రవం దివ్యం. అంతరిక్షానికి సంబంధించిన ఉపద్రవాలను చెప్తాను. తెలుసుకో.

ఉల్కాపాతశ్చ దిగ్దాహః పరివేష స్తథైవ చ ।
గన్ధర్వనగరంచైవ వృష్టిశ్చ వికృతా చ యా ॥12॥

ఉల్కలు రాలడం, దిక్కులలో తగులబడడం, సూర్యచంద్రులకు చుట్టూ గుడి ఏర్పడడం, గంధర్వనగరం కనిపించడం, అసహజమైనవర్షం, ఇవి అంతరిక్ష సంబంధులయిన ఉపద్రవాలు.

చరస్థిరభవం భూమౌ భూకమ్పమపి భూమిజమ్ ॥13॥

ఈ భూమిమీద ఉండే జంగమాలు, స్థావరాలు అయిన పదార్థాలలో ఏర్పడే అసహజమైన మార్పులు, భూమి కంపించడం అనేవి భూమివలన ఏర్పడే ఉపద్రవాలు.

సప్తాహాభ్యన్తరే వృష్టావద్భుతం నిష్ఫలం భవేత్ ।
శాన్తిం వినా త్రిభిర్వర్షైరద్భుతం భయకృద్భవేత్ ॥14॥

ఈ అద్భుతాలు కనబడిన తరువాత వారంరోజులలోపుగా వర్షం కురిస్తే, వాటికి ఫలితం ఉండదు. ఈ విచిత్రాలు కనబడిన తరువాత మూడుసంవత్సరాలలోగా శాంతికర్మలు చేయకపోతే, ఇవి మిక్కిలి భయంకరమైన ఫలితాలను ఇస్తాయి.

దేవతార్చాః ప్రనృత్యన్తి వేపన్తే ప్రజ్వలన్తి చ ।
ఆరటంతి చ రోదన్తి ప్రస్విద్యన్తే హసన్తి చ ॥
అర్చావికారోపశమోఽభ్యర్చ్య హుత్వా ప్రజాపతేః ॥15॥

దేవతలవిగ్రహాలు నాట్యమాడడం, కదలడం, తగులబడడం, శబ్దం చేయడం, ఏడ్వడం, చెమటలు పోయడం, నవ్వడం, జరిగినపుడు ఆ దేవతలను విశేషంగా పూజించాలి. ప్రజాపతి నుద్దేశించి హోమాలు చేయాలి. దానివలన ఆ అర్చామూర్తులకు దోషం తొలగిపోతుంది.

అనగ్నిర్దీప్యతే యత్ర రాష్ట్రే చ భృశనిస్స్వనమ్ ।
న దీప్యతే చేన్ధనవాంస్తద్రాష్ట్రం పీడ్యతే నృపైః ॥16॥

నిప్పు లేకుండానే భయంకరమైన శబ్దాలతో, మంటలు రేగినా, కట్టెలు మొదలైనవి ఉన్నా, నిప్పు ప్రజ్వరిల్లకపోయినా, ఆ రాజ్యాన్ని రాజు పీడిస్తాడని గ్రహించాలి.

అగ్నివైకృత్యశమనమగ్నిమన్త్రైశ్చ భార్గవ ॥17॥

భృగువంశజా! పరశురామా! అసహజమైన అగ్నిప్రజ్వలనాలను వారించడానికి అగ్నిమంత్రాలతో హోమం చేయాలి.

అకాలే ఫలితా వృక్షాః క్షీరం రక్తం స్రవన్తి చ ।
వృక్షోత్పాతప్రశమనం శివం పూజ్య చ కారయేత్ ॥18॥

చెట్లకు కాలం కాని కాలంలో పండినా, పాలు లేదా నెత్తురు కారుతున్నా అటువంటి ఉత్పాతాలను పోగొట్టడానికి ముందుగా శివుడిని పూజించి, తర్వాత శాంతికర్మలను ఆచరించాలి.

అతివృష్టిరనావృష్టిర్దుర్భిక్షాయోభయం మతమ్ ।
అనృతౌ త్రిదినారబ్ధవృష్టిర్ జ్ఞేయా భయాయ హి ॥19॥

వర్షాలు అధికంగా కురవడం, అసలు కురవకపోవడం అనేవి రెండూ కరువుకు కారణం. వర్షఋతువు కాని సమయంలో మూడురోజులపాటు ఆగకుండా వర్షం కురిస్తే, అది మిక్కిలి భయం కలిగిస్తుంది.

వృష్టివైకృత్యనాశ స్స్యాత్పర్జన్యేన్ద్వర్కపూజనాత్ ॥20॥

పర్జన్యదేవతను, చంద్రుడినీ, సూర్యుడినీ పూజిస్తే, వర్షం కురవడంలోని ఈవిధమైన వికారాలు పోతాయి.

నగరాదపసర్పన్తే సమీపముపయాన్తి చ ।
నద్యో హ్రదప్రస్రవణా విరసాశ్చ భవన్తి చ ॥
సలిలాశయవైకృత్యే జప్తవ్యో వారుణో మనుః ॥21॥

నదులప్రవాహం నగరంనుండి దూరంగా జరిగినా, నగరానికి మరీ దగ్గరకు వచ్చినా, జలప్రవాహాలు, చెరువులు ఎండిపోయినా, ఇలాంటి జలవికారాలు సంభవించినపుడు వరుణుడు దేవతగా కలిగిన మంత్రాన్ని జపించాలి.

అకాలప్రసవా నార్యః కాలతో వా ప్రజా స్తథా ।
వికృతప్రసవాశ్చైవ యుగ్మప్రసవనాదికమ్ ॥
స్త్రీణాం ప్రసవవైకృత్యే స్త్రీవిప్రాదిం ప్రపూజయేత్ ॥22॥

స్త్రీలు ప్రసవించగూడని సమయంలో ప్రసవించినా, లేక ప్రసవించవలసిన సమయంలో ప్రసవించకపోయినా, వికారంగా ఉన్న బిడ్డలను కన్నా, కవలపిల్లలు మొదలుగా రకరకాలుగా కన్నా, ప్రసవంలో ఇటువంటి వికారాలు కలగకుండా ఉండడానికి ముత్తయిదువులయిన సంతానవతులనూ, బ్రాహ్మణులనూ పూజించాలి.

బడబా హస్తినీ గౌర్వా యది యుగ్మం ప్రసూయతే ।
విజాత్యం వికృతం వాపి షడ్భిర్మాసైర్ మ్రియేత వై ॥
వికృతం వా ప్రసూయన్తే పరచక్రభయం భవేత్ ॥23॥

ఆడుగుఱ్ఱం గాని, ఆడుఏనుగు కాని, ఆవు కానీ, జంటబిడ్డలను కన్నా, లేదా వేరొకజాతికి చెందిన పశువును కన్నా, వికృతమైన బిడ్డను కన్నా, అది ఆరునెలలోగా మరణించినా, వికారపుప్రసవాలవలన ఆ రాజ్యానికి శత్రువులవలన భయం కలుగుతుందని గ్రహించాలి.

హోమః ప్రసూతివైకృత్యే జపో విప్రాదిపూజనమ్ ॥24॥

పశుజాతికి సంబంధించిన ఈ వికృతప్రసవదోషాలు తొలగడానికి ఆయా మంత్రాలతో హోమం చేయాలి. ఆ మంత్రాలను జపించాలి. బ్రాహ్మణులనూ, దేవతలనూ పూజించాలి.

యాని యానాన్యయుక్తాని యుక్తాని న వహన్తి చ ।
ఆకాశే తూర్యనాదాశ్చ మహద్భయముపస్థితమ్ ॥25॥

అయోగ్యమైన జంతువులు బండిని లాగినా, యోగ్యమైన జంతువులు బండిని లాగకపోయినా, ఆకాశంలో భేరీధ్వనులు మోగినా, మహాభయం కలుగుతుందని తెలుసుకోవాలి.

ప్రవిశన్తి యదా గ్రామమారణ్యా మృగపక్షిణః ।
అరణ్యం యాన్తి వా గ్రామ్యా జలం యాన్తి స్థలోద్భవాః ॥26॥

అడవిలో ఉండవలసిన జంతువులు, పక్షులు గ్రామంలో ప్రవేశించినా, గ్రామంలో ఉండవలసినవి అడవులలోకి వెళ్లినా, నేలమీద ఉండవలసినవి నీటిలోకి వెళ్లినా,

స్థలం వా జలజా యాన్తి రాజద్వారాదికే శివాః ।
ప్రదోషే కుక్కుటో వాసే శివా చార్కోదయే భవేత్ ॥27॥

గృహం కపోతః ప్రవిశేత్ క్రవ్యాద్వా మూర్ధ్ని లీయతే ।
మధు వా మక్షికా కుర్యాత్ కాకో మైథునగో దృశి ॥28॥

ప్రాసాదతోరణోద్యానద్వారప్రాకారవేశ్మనామ్ ।
అనిమిత్తం తు పతనం దృఢానాం రాజమృత్యవే ॥29॥

నీటిలో ఉండవలసినవి నేలమీద ఉన్నా, రాజద్వారంవద్ద నక్కలు సంచరించినా, ప్రదోషకాలంలో కోడి కూసినా, సూర్యుడు ఉదయించే సమయంలో నక్కలు అరిచినా, పావురం ఇంట్లో ప్రవేశించినా, మాంసం తినేపక్షులు తలపై తిరిగినా, మామూలు ఈగ తేనెను పోగుచేసినా, కాకులు సంభోగం చేస్తూ కంటబడినా, ఎటువంటి కారణం లేకుండానే బాగా గట్టిగా ఉన్న పెద్దపెద్ద భవనాలు, ప్రవేశద్వారాలు, తోటలు, ద్వారాలు, ప్రహరీగోడలు, ఇళ్లు కూలిపోయినా – రాజుకు మరణం సంభవిస్తుందని సూచన.

రజసా వాథ ధూమేన దిశో యత్ర సమాకులాః ।
కేతూదయోపరాగౌ చ ఛిద్రతా శశిసూర్యయోః ॥
గ్రహర్క్షవికృతిర్యత్ర తత్రాపి భయమాదిశేత్ ॥30॥

దిక్కు లన్నీ దుమ్ముతో గానీ, పొగతో గానీ నిండిపోయినా, కేతువు ఉదయించినా, గ్రహణం సంభవించినా, సూర్యచంద్రులలో రంధ్రాలు కనబడినా, గ్రహాలు నక్షత్రాలు వికారపులక్షణాలు కలిగిఉన్నా, ఈలక్షణాలు కలిగిన ప్రదేశంలో మిక్కిలిభయం కలగబోతుందని సూచన.

అగ్నిర్యత్ర న దీప్యేత స్రవన్తే చోదకుమ్భకాః ।
మృతిర్భయం శూన్యతాదిరుత్పాతానాం ఫలం భవేత్ ॥31॥

నిప్పు మండకపోవడం, బాగా ఉన్న నీటికుండలనుండి నీరు కారడం, మొదలైన ఉత్పాతాలవలన అక్కడ మరణం గాని, మహాభయం గాని, సమస్తం నశించిపోవడంవంటి ఫలితాలు కలుగుతాయి.

ద్విజదేవాదిపూజాభ్యశ్శాన్తిర్జపైస్తు హోమతః ॥32॥

బ్రాహ్మణులను దేవతలను పూజించడంచేతనూ, జపాలు, హోమాలు చేయడంచేతనూ ఇటువంటి ఉత్పాతాలకు శాంతి కలుగుతుంది.

ఇత్యాది మహాపురాణే ఆగ్నేయే ఉత్పాతశాన్తికథనం నామ త్రిషష్ట్యధికద్విశతతమోఽధ్యాయః ॥263॥
అగ్నిమహాపురాణంలో ఉత్పాతశాంతికథనం అనే రెండువందల అరవైమూడవ అధ్యాయం సమాప్తం.

చతుష్షష్ట్యధికద్విశతతమోఽధ్యాయః – రెండువందల అరవైనాల్గవ అధ్యాయం

దేవపూజావైశ్వదేవబలికథనమ్ – దేవపూజా వైశ్వదేవబలికథనం

పుష్కర ఉవాచ – పరశురాముడితో పుష్కరుడు ఇలా చెప్తున్నాడు.

దేవపూజాదికం కర్మ వక్ష్యే చోత్పాతమర్దనమ్ ।
ఆపో హి ష్ఠేతి తిసృభిస్స్నాతోఽర్ఘ్యం విష్ణవేఽర్పయేత్ ॥1॥

పరశురామా! ఉత్పాతాలను శాంతింపజేయడానికి అవసరమైన – దేవతలను పూజించడం మొదలయిన కర్మలను గురించి చెప్తాను. 'ఆపో హి ష్ఠా' (యజు.36-14,15,16) మొదలైన మూడుమంత్రాలతోనూ స్నానం చేసి, శ్రీమహావిష్ణువుకు అర్ఘ్యం సమర్పించాలి.

హిరణ్యవర్ణామితి చ పాద్యం చ తిసృభిర్ద్విజ ।
శన్న ఆపో హ్యాచమనమిదమాపోఽభిషేచనమ్ ॥2॥

బ్రాహ్మణోత్తమా! పరశురామా! 'హిరణ్యవర్ణా శ్శుచయః' (ఋక్.11-11-1,2,3) మొదలైన మూడు మంత్రాలతో విష్ణుదేవుడికి పాద్యం సమర్పించాలి. 'శం న ఆపః' అనే మంత్రంతో ఆచమనం ఇవ్వాలి. 'ఇద మాపః' (యజు.6-17) అనే మంత్రంతో స్నానం చేయించాలి.

రథే అక్షే చ తిసృభిర్గన్ధం యువేతి వస్త్రకమ్ ।
పుష్పం పుష్పవతీత్యేవం ధూపం ధూరసి వాప్యథ ॥3॥

'రథే' 'అక్షేమ' 'చతస్రః' అనే మూడుమంత్రాలతో విష్ణువుకు గంధం ఇవ్వాలి. 'యువా సువాసాః' (ఋక్.3-8-4) అనే మంత్రంతో వస్త్రం ఇవ్వాలి. 'పుష్పవతీ' (అథర్వ.8-7-27) అనే మంత్రంతో స్వామికి పుష్పం ఇవ్వాలి. 'ధూరసి' (యజు.1-8) అనే మంత్రంతో ధూపం ఇవ్వాలి.

తేజోఽసి శుక్రం దీపే స్యాన్మధుపర్కం దధీతి చ ।
హిరణ్యగర్భ ఇత్యష్టావృచః ప్రోక్తా నివేదనే ॥4॥

'తేజోఽసి' శుక్రమసి' అనే మంత్రంతో దీపం ఇవ్వాలి. 'దధి క్రావ్ ణ్ణో' అనే మంత్రంతో మధుపర్కం ఇవ్వాలి. హిరణ్యగర్భః' మొదలయిన ఎనిమిదిఋక్కులతో భగవంతుడికి నివేదనం చేయాలి.

అన్నస్య మనుజశ్రేష్ఠ పానస్య చ సుగన్ధినః ।
చామరవ్యజనోపానచ్ఛత్రం యానాసనే తథా ॥
యత్కిఞ్చిదేవమాదిస్స్యాత్ సావిత్రేణ నివేదయేత్ ॥5॥

మానవోత్తమా! పరశురామా! అన్నం, పానీయం, పరిమళద్రవ్యాలు, చామరం, వ్యజనం, పాదుకలు, గొడుగు, వాహనం, ఆసనం, ఇంకా ఇటువంటి ఉపచారాలు ఏవయినా సావిత్రీమంత్రంతో స్వామికి సమర్పించాలి.

పౌరుషం తు జపేత్సూక్తం తదేవ జుహుయాత్తథా ॥6॥

పురుషసూక్తాన్ని జపించాలి. పురుషసూక్తంతోనే హోమం చేయాలి.

అర్చాభావే తథా వేద్యాం జలే పూర్ణఘటే తథా ।
నదీతీరేఽథ కమలే శాన్తిస్స్యాద్విష్ణుపూజనాత్ ॥7॥

పూజించడానికి తగిన విగ్రహం లభించనిపక్షంలో ఒకవేదికను నిర్మించి, దానిపైన కలశాన్ని స్థాపించి, నీటితో నింపాలి. ఆకలశంలో గాని, నదిఒడ్డున గాని, తామరపూవులో గాని విష్ణువును పూజించాలి. దీనివలన సమస్త ఉత్పాతాలకు శాంతి కలుగుతుంది.

తతో హోమః ప్రకర్తవ్యో దీప్యమానే విభావసౌ ।

ఆ తరువాత చక్కగా మండుతున్న అగ్నిహోత్రంలో హోమం చేయాలి.

పరిసమ్మృజ్య పర్యుక్ష్య పరిస్తీర్య పరిస్తరైః ।
సర్వాన్నాగ్రం సముద్ధృత్య జుహుయాత్ ప్రయతస్తతః ॥9॥

(హోమం చేయదలచిన ప్రదేశంలో) నేలను శుభ్రంగా తుడిచి, నీళ్లు చల్లి, దర్భలను పరిచి, అగ్నిని ఏర్పరిచి, దానిని బాగా జ్వలింపజేసి, ఇంద్రియాలను నిగ్రహించుకుని, సమస్తమైన అన్నపదార్థాలలోను ప్రథమభాగాన్ని తీసుకుని, ఆ అగ్నిజ్వాలలో ఇలా హోమం చేయాలి.

వాసుదేవాయ దేవాయ ప్రభవే చావ్యయాయ చ ।
అగ్నయే చైవ సోమాయ మిత్రాయ వరుణాయ చ ॥10॥

మహానుభావా! పరశురామా! వాసుదేవుడికీ, దేవుడికీ, ప్రభువుకూ, అవ్యయుడికీ, అగ్నికీ, సోముడికీ, మిత్రుడికీ, వరుణుడికీ నమస్కారం.

ఇన్ద్రాయ చ మహాభాగ ఇన్ద్రాగ్నిభ్యాం తథైవ చ ।
విశ్వేభ్య శ్చైవ దేవేభ్యః ప్రజానాం పతయే నమః ॥11॥

మహాత్మా! ఇంద్రుడికీ, ఇంద్రాగ్నిదేవతకూ, విశ్వేదేవతలకూ, ప్రజాపతికీ నమస్కారం.

అనుమత్యై తథా రామ ధన్వన్తరాయ ఏవ చ ।
వాస్తోష్పత్యై తతో దేవ్యై తతస్స్విష్టకృతేఽగ్నయే ॥
సచతుర్థ్యన్తనామ్నా తు హుత్వైతేభ్యో బలిం హరేత్ ॥12॥

అనుమతికి, ధన్వంతరికి, వాస్తోష్పతికి, దేవికి, స్విష్టకృత్ అయిన అగ్నికి నమస్కారం. ఈ దేవతలపేర్లకు చివర చతుర్థీవిభక్తి చేర్చి, ఆశబ్దాలతో హోమం చేసి, ఇలా బలి ఇవ్వాలి.

తక్షోపతక్షమభితః పూర్వేణాగ్నిమతః పరమ్ ।
అశ్వానామపి ధర్మజ్ఞ ఊర్జానామాని చాప్యథ ॥13॥

నిరున్ధీ ధూమ్రిణీకా చ అశ్వపత్నీ తథైవ చ ।
మేఘపత్నీ చ నామాని సర్వేషామేవభార్గవ ॥14॥

ధర్మం చక్కగా తెలిసినవాడా! భార్గవరామా! ఆగ్నేయదిక్కుతో ప్రారంభించి, వరుసగా – తక్ష, ఉపతక్ష, (అశ్వ, ఊర్జ –) నిరుంధి, ధూమ్రిణిక, అశ్వపత్ని, మేఘపత్ని, అనేపేర్లు గలిగినదేవతలందరికీ బలి ఇవ్వాలి.

ఆగ్నేయాద్యాః క్రమేణాథ తతశ్శక్తిషు నిక్షిపేత్ ।
నన్దిన్యై చ సుభాగ్యై చ సుమఙ్గల్యై చ భార్గవ ॥15॥

భద్రకాళ్యై తతో దత్త్వా స్థూణాయాం చ తథా శ్రియే ।
హిరణ్యకేశ్యై చ తథా వనస్పతయ ఏవ చ ॥16॥

పరశురామా! ఆగ్నేయం మొదలుపెట్టి వరుసగా నందిని, సుభాగి, సుమంగళి, భద్రకాళి అనే నాలుగుశక్తుల నుంచాలి. తరువాత ఆ శక్తులకు బలి ఇవ్వాలి. ఆ తరువాత శంఖంమీద కాని, లేదా స్తంభంమీద కాని హిరణ్యకేశికి, వనస్పతికి బలి ఇవ్వాలి.

ధర్మాధర్మమయౌ ద్వారే గృహమధ్యే ధ్రువాయ చ ।
మృత్యవే చ బహిర్దద్యాద్వరుణాయోదకాశయే ॥17॥

ద్వారానికి రెండుప్రక్కలలోనూ ధర్మమయ, అధర్మమయులకు, ఇంటిమధ్యలో ధ్రువుడికి, ఇంటికి వెలుపల మృత్యువుకు, నీరు నిలవఉండేప్రదేశంలో వరుణుడికి బలి ఇవ్వాలి.

భూతేభ్యశ్చ బహిర్దద్యాచ్చరణే ధనదాయ చ ।
ఇన్ద్రాయేన్ద్రపురుషేభ్యో దద్యాత్ పూర్వేణ మానవః ॥18॥

ఇంటికి బయటవైపున భూతాలకు బలి ఇవ్వాలి. అడుగున కుబేరుడికి, తూర్పుదిక్కులో ఇంద్రుడికీ, ఇంద్రపురుషులకూ బలి ఇవ్వాలి.

యమాయ తత్పురుషేభ్యో దద్యాద్దక్షిణతస్తథా ।
వరుణాయ తత్పురుషేభ్యో దద్యాత్ పశ్చిమత స్తథా ॥19॥

దక్షిణదిక్కులో యముడికీ, యమపురుషులకూ, పడమటిదిక్కున వరుణుడికీ, వరుణపురుషులకూ బలి ఇవ్వాలి.

సోమాయ సోమపురుషేభ్యో ఉదగ్దద్యాదనన్తరమ్ ।
బ్రహ్మణే బ్రహ్మపురుషేభ్యో మధ్యే దద్యాత్తథైవ చ ॥20॥

ఆ తరువాత ఉత్తరదిక్కులో సోముడికీ, సోమపురుషులకూ బలి ఇవ్వాలి. ఇంటికి నడుమ బ్రహ్మకూ, బ్రహ్మపురుషులకూ బలి ఇవ్వాలి.

ఆకాశే చ తథాచోర్ధ్వే స్థణ్డిలాయ క్షితౌ తథా ।
దివా దివాచరేభ్యశ్చ రాత్రౌ రాత్రిచరేషు చ ॥21॥

ఆకాశంలో ఊర్ధ్వదేవతలకు, భూమిమీద స్థండిలదేవతలకు బలి ఇవ్వాలి. పగటిపూట పగలు సంచరించే దేవతలకు, రాత్రివేళ రాత్రి సంచరించే దేవతలకు బలి ఇవ్వాలి.

బలిం బహిస్తథా దద్యాత్ సాయం ప్రాతస్తు ప్రత్యహమ్ ।
పిణ్డనిర్వపనం కుర్యాత్ ప్రాతస్సాయం న కారయేత్ ॥22॥

ప్రతిరోజూ ఉదయమూ సాయంకాలమూ ఇంటికి వెలుపల బలులు ఇవ్వాలి. పిండప్రదానం (శ్రాద్ధం) జరిగినరోజున సాయంకాలం బలి ఇవ్వగూడదు.

పిత్రే తు ప్రథమం దద్యాత్ తత్పిత్రే తదనన్తరమ్ ।
ప్రపితామహాయ తన్మాత్రే పితృమాత్రే తతోఽర్పయేత్ ॥
తన్మాత్రే దక్షిణాగ్రేషు కుశేష్వేవం యజేత్పితౄన్ ॥23॥

మొట్టమొదట తండ్రికి పిండం ఇవ్వాలి. తరువాత అతడితండ్రికి (పితామహుడికి) ఇవ్వాలి. పిదప పితామహుడితండ్రికి ఇవ్వాలి. పిదప తనతల్లికీ, తరువాత తండ్రిగారితల్లి(నాయనమ్మ)కీ ఇవ్వాలి. ఈవిధంగా పితృయజ్ఞం ఆచరించాలి.

ఇన్ద్రవారుణవాయవ్యా యామ్యా వా నైరృతాశ్చ యే ।
తే కాకాః ప్రతిగృహ్ణన్తు ఇమం పిణ్డమ్మయోద్ధృతమ్ ॥
కాకపిణ్డం తు మన్త్రేణ శునః పిణ్డం ప్రదాపయేత్ ॥24॥

'ఇంద్ర(తూర్పు), వరుణ(పశ్చిమ), వాయవ్య, దక్షిణ, నైరృతిదిక్కులలో ఉండే కాకులు నేను ఇస్తున్న ఈ పిండాన్ని స్వీకరించును గాక'! అనే మంత్రంతో కాకికి బలి ఇవ్వాలి. పిదప కుక్కలకు ఈక్రిందిమంత్రంతో బలి ఇవ్వాలి.

వివస్వతః కులే జాతౌ ద్వౌ శ్యామశబలౌ శునౌ ।
తేషాం పిణ్డం ప్రదాస్యామి పథి రక్షన్తు మే సదా ॥25॥

'వివస్వంతుడివంశంలో నలుపు, చిత్రమైన రంగులు గలిగిన రెండు కుక్కలు పుట్టాయి. వాటికి ఈ పిండం ఇస్తున్నాను. అవి దారిలో నన్ను ఎల్లప్పుడూ రక్షించును గాక'! (అనే మంత్రం చెప్తూ బలి ఇవ్వాలి)

సౌరభేయ్యస్సర్వహితాః పవిత్రాః పాపనాశనాః ।
ప్రతిగృహ్ణన్తు యే గ్రాసం గావస్త్రైలోక్యమాతరః ॥27॥

'సౌరభేయికి పుట్టిన ఆవులు అందరికీ మేలు చేస్తాయి. అవి పావనమైనవి. పాపాలను నశింపజేస్తాయి. మూడులోకాలకు తల్లులయిన ఆ ఆవులు నేను ఇస్తున్న ఈ గ్రాసాన్ని స్వీకరించును గాక'!

గోగ్రాసం చ స్వస్త్యయనం కృత్వా భిక్షాం ప్రదాపయేత్ ।
అతిథీన్ దీనాన్ పూజయిత్వా గృహీ భుఞ్జీత చ స్వయమ్ ॥28॥

ఈ మంత్రంతో ఆవులకు ఆహారం ఇచ్చి, స్వస్తివచనాలు పలకాలి. ఆ తరువాత అతిథులకు, దీనులకు భోజనం పెట్టి, వారిని పూజించాలి. గృహస్థుడు తాను ఆ తరువాత భుజించాలి.

ఓం భూస్స్వాహా ఓం భువస్స్వాహా ఓం స్వస్స్వాహా ఓం భూర్భువస్సుస్స్వాహా ।

ఓమ్. భూలోకానికి ఈ ఆహుతిని ఇస్తున్నాను. ఓమ్. భువర్లోకానికి ఈ ఆహుతిని ఇస్తున్నాను. ఓమ్. స్వర్లోకానికి ఈ ఆహుతిని ఇస్తున్నాను. ఓమ్. భూ, భువర్, స్వర్ లోకాలు మూడింటికి కలిపి ఈ ఆహుతిని ఇస్తున్నాను.

ఓం దేవకృతస్యైనసోఽ వయజనమసి స్వాహా ।

ఓమ్. దేవతల విషయంలో చేసిన పాపాలకు ప్రాయశ్చిత్తం అగును గాక! ఈ ఆహుతిని ఇస్తున్నాను.

ఓం పితృకృతస్యైనసోఽ వయజనమసి స్వాహా ।

ఓమ్. పితరులవిషయంలో చేసిన పాపాలకు నివృత్తి కలిగించే నీకు ఈ ఆహుతిని ఇస్తున్నాను.

ఓం ఆత్మకృత స్యైనసోఽ వయజనమసి స్వాహా ।

ఓమ్. ఆత్మవిషయంలో చేసిన పాపాలకు నివృత్తి కలిగించే నీకు ఈ ఆహుతిని ఇస్తున్నాను.

ఓం మనుష్యకృతస్యైనసోఽ వయజనమసి స్వాహా ।

ఓమ్. మానవుల విషయంలో చేసిన పాపాలకు నివృత్తి కలిగించే నీకు ఈ ఆహుతిని ఇస్తున్నాను.

ఓం ఏనస ఏనసోఽ వయజనమసి స్వాహా ।

ఓమ్. పాపాల విషయంలో చేసిన పాపాలకు నివృత్తి కలిగించే నీకు ఈ ఆహుతిని ఇస్తున్నాను.

యచ్చాహమేనో విద్వాంశ్చకార యచ్చావిద్వాం
స్తస్య సర్వస్యైనసోఽ వయజనమసి స్వాహా ॥

ఓమ్. విద్వాంసుల విషయంలో కాని, విద్వాంసులు కాని వారి విషయంలో కాని చేసినపాపాల కన్నింటికీ నివృత్తి కలిగించే నీకు ఈ ఆహుతిని ఇస్తున్నాను.

అగ్నయే స్విష్టకృతే స్వాహా ।

యజ్ఞాలను నడిపించే అగ్నికి ఈ ఆహుతి ఇస్తున్నాను.

ఓం ప్రజాపతయే స్వాహా ।

ఓమ్. ప్రజాపతిని ఉద్దేశించి ఈ ఆహుతి ఇస్తున్నాను.

విష్ణుపూజావైశ్వదేవబలిస్తే కీర్తితా మయా ॥28॥

ఈవిధంగా విష్ణుపూజ, వైశ్వదేవం, బలివిధానాలను వివరించడం పూర్తి అయింది.

ఇత్యాది మహాపురాణే ఆగ్నేయే దేవపూజావైశ్వదేవబలికథనం నామ చతుష్షష్ట్యధికద్విశతతమోఽ ధ్యాయః ॥264॥

అగ్నిమహాపురాణంలో దేవపూజావైశ్వదేవబలికథనం అనే రెండువందల అరవైనాల్గవ అధ్యాయం సమాప్తం.

పఞ్చషష్ట్యధికద్విశతతమోఽధ్యాయః – రెండువందల అరవైఐదవ అధ్యాయం

దిక్పాలాదిస్నానవిధానకథనమ్ – దిక్పాలాదిస్నానవిధానకథనం

పుష్కర ఉవాచ – పరశురాముడితో పుష్కరుడు ఇలా చెప్తున్నాడు.

సర్వార్థసాధనం స్నానం వక్ష్యే శాన్తికరం శృణు ।
స్నాపయేచ్చ సరిత్తీరే గ్రహాన్విష్ణుం విచక్షణః ॥1॥

స్నానం సమస్తమైన ప్రయోజనాలను చేకూరుస్తుంది. శాంతిని కలిగిస్తుంది. ఆ స్నానం గురించి చెప్తాను. విను. వివేకం కలిగినవాడు నదీతీరంలో గ్రహాలకూ, శ్రీమహావిష్ణువునకూ స్నానం చేయించాలి.

దేవాలయే జ్వరార్త్యాదౌ వినాయకగ్రహార్దితే ।
విద్యార్థినో హ్రదే గేహే జయకామస్య తీర్థకే ॥2॥

జ్వరబాధలు మొదలైనవి సంభవించినపుడు, విఘ్నేశ్వరుడివలననూ, గ్రహాలవలననూ బాధ కలిగినపుడు వాటి నివారణకు అట్టివారు దేవాలయంలో స్నానం చేయించాలి. విద్యను కోరుకునే జలాశయంలో గానీ, ఇంట్లో గానీ స్నానం చేయించాలి. విజయం కోరుకునేవాడికి పుణ్యతీర్థంలో స్నానం చేయించాలి.

పద్మిన్యాం స్నాపయేన్నారీం గర్భో యస్యాస్స్రవేత్తథా ।
అశోకసన్నిధౌ స్నాయాజ్జాతో యస్యా వినశ్యతి ॥3॥

ప్రసవించకుండానే గర్భం జారిపోయే స్త్రీకి తామరకొలనులో స్నానం చేయించాలి. పుట్టిన బిడ్డలు మరణించే స్త్రీకి అశోకవృక్షం దగ్గర స్నానం చేయించాలి.

పుష్పార్థిన్యాం చ పుష్పాఢ్యే పుత్రార్థిన్యాం చ సాగరే ।
గృహే సౌభాగ్యకామానాం సర్వేషాం విష్ణుసన్నిధౌ ॥4॥

పుష్పవతి కావాలని కోరుకునే స్త్రీకి పూలతో నిండిఉన్న తోటలు మొదలైన ప్రదేశాలలో స్నానం చేయించాలి. కొడుకులు కావాలనుకునే స్త్రీకి సముద్రంలో స్నానం చేయించాలి. సౌభాగ్యం కోరుకునే స్త్రీకి ఇంటిలో స్నానం చేయించాలి. అన్నిరకాల కోరికలకూ విష్ణువు సన్నిధానంలో స్నానం చేయించాలి.

వైష్ణవే రేవతీ పుష్యే సర్వేషాం స్నానముత్తమమ్ ।
స్నానకామస్య సప్తాహం పూర్వముత్సాదనం స్మృతమ్ ॥5॥

విష్ణువుకు సంబంధించిన శ్రవణానక్షత్రంలోనూ, రేవతి, పుష్యమి నక్షత్రాలలోనూ స్నానం చేయడం అందరికీ ఉత్తమం. స్నానం చేయాలని కోరుకునేవాడు ఏడురోజులు ముందునుండి ఒంటికి నలుగు పెట్టుకోవాలి.

పునర్నవాం రోచనాం చ శతాఙ్గాం గురుణా త్వచమ్ ।
మధూకం రజనీ ద్వే చ తగరం నాగకేసరమ్ ॥6॥

అమ్బరీం చైవ మఞ్జిష్ఠాం మాంసీయాసకకర్దమైః ।
ప్రియఙ్గుసర్షపం కుష్ఠం బలాం బ్రాహ్మీం చ కుఙ్కుమమ్ ॥
పఞ్చగవ్యం సక్తుమిశ్రముద్వర్త్య స్నానమాచరేత్ ॥7॥

గలిజేరు, ఒకజాతిగోరోచనం, తినిశం, గురిణిచెట్టుతోలు, ఇప్ప, కుంకుమపువ్వు, కోరింద, తగరం, నాగకేసరం, అంబరి, మంజిష్ఠ, ముద్దగా కలిపిన జటామాంసి, యాస(క)ం, అనే వస్తువులు, రాజిక, ఆవాలు, చెంగల్వకోస్టు, చిట్టాముదం, బ్రహ్మదండి, కుంకుమం, పేలపిండితో కలిపిన పంచగవ్యం - ఈ పదార్థాలతో నలుగు పెట్టుకుని స్నానం చేయాలి.

మణ్డలే కర్ణికాయాం చ విష్ణుం బ్రహ్మాణమర్చయేత్ ।
దక్షే వామే హరం పూర్వం పత్రే పూర్వాదికే క్రమాత్ ॥
లిఖేదిన్ద్రాదికాన్ దేవాన్ సాయుధాన్ సహబాన్ధవాన్ ॥8॥

తరువాత తామరపూవును గీసి, అందులో కర్ణికప్రదేశంలో విష్ణువును, విష్ణువుకు కుడివైపున బ్రహ్మను, విష్ణువుకు ఎడమవైపున పరమేశ్వరుడిని, చిత్రించి వారిని ముందుగా పూజించాలి. తరువాత ఆకుపై తూర్పు మొదలయిన దిక్కులలో క్రమంగా ఇంద్రుడు మొదలైన దేవతలను వారివారి ఆయుధాలతోనూ, వారివారి బంధువులతోనూ వ్రాయాలి.

స్నానమణ్డలకాన్ దిక్షు కుర్యాచ్చైవ విదిక్షు చ ॥9॥

తూర్పు మొదలయిన దిక్కులలోనూ, ఆగ్నేయం మొదలైన విదిక్కులలోనూ స్నానమండలాలను వ్రాయాలి.

విష్ణుబ్రహ్మేశశక్రాదీంస్తదస్త్రాణ్యర్చ్య హోమయేత్ ।
ఏకైకస్య త్వష్టశతం సమిధస్తు తిలాన్ ఘృతమ్ ॥10॥

పిదప ఆ మండలాలమీద విష్ణువు, బ్రహ్మ, శివుడు, ఇంద్రుడు మొదలైన దేవతలనూ, వారి ఆయుధాలనూ వ్రాసి పూజించాలి. ఆ తరువాత వారిని ఒక్కొక్కరిని ఉద్దేశించి నూటయెనిమిది సమిధలనూ, నువ్వులనూ, నేతినీ హోమం చేయాలి.

భద్రస్సుభద్రస్సిద్ధార్థః కలశాః పుష్టివర్ధనాః ।
అమోఘశ్చిత్రభానుశ్చ పర్జన్యోఽథ సుదర్శనః ॥ 11॥

1. భద్రం, 2. సుభద్రం, 3. సిద్ధార్థం, 4. అమోఘం, 5. చిత్రభానువు, 6. పర్జన్యం, 7. సుదర్శనం అనే కలశాలు పుష్టిని వృద్ధిచేస్తాయి.

స్థాపయేత్తు ఘటానేతాన్ సాశ్విరుద్రమరుద్గణమ్ ॥12॥

అశ్వినీదేవతలు, రుద్రులు, మరుద్గణాలతో ఈ కలశాలను (వారిని కలశాలలో ఆవాహనం చేసి) స్థాపించాలి.

విశ్వేదేవాస్తథా దైత్యా వసవో మునయస్తథా ।
ఆవేశయన్తు సుప్రీతాస్తథాన్యా అపి దేవతాః ॥13॥

'విశ్వేదేవతలు, దైత్యులు, వసువులు, మునులు, ఇంకా ఇతర దేవతలు కూడా సంతుష్టులై, ఈ కలశాలలో ప్రవేశింతురు గాక'! అని చెప్పాలి.

ఔషధీర్నిక్షిపేత్కుమ్భే జయన్తీం విజయాం జయామ్ ।
శతావరీం శతపుష్పాం విష్ణుక్రాన్తాపరాజితామ్ ॥14॥

ఆ ఘటాలలో జయంతి, విజయ, జయ, శతావరి, శతపుష్ప, విష్ణుక్రాంత, అపరాజిత, అనే ఓషధులను ఉంచాలి.

జ్యోతిష్మతీమతిబలాం చన్దనోశీరకేసరమ్ ।
కస్తూరికాం చ కర్పూరం బాలకం పత్రకం త్వచమ్ ॥
జాతీఫలం లవఙ్గం చ మృత్తికాం పఞ్చగవ్యకమ్ ॥15॥

ఇంకా మానేరుతీగ, చిట్టాముదం, చందనం, వట్టివేరు, కేసరం, కస్తూరి, కర్పూరం, కురువేరు ఆకు, తొక్క, జాజికాయ, లవంగం, మృత్తిక, పంచగవ్యం, అనే వాటిని కూడా ఆ కలశాలలో ఉంచాలి.

భద్రపీఠే స్థితం సాధ్యం స్నాపయేయుర్ద్విజా బలాత్ ॥16॥

ఆ తరువాత బ్రాహ్మణులు భద్రపీఠంపై ఆసీనుడైన సాధ్యుడికి ప్రయత్నపూర్వకంగా స్నానం చేయించాలి.

రాజాభిషేకమన్త్రోక్తదేవానాం హోమకాః పృథక్ ।
పూర్ణాహుతిం తతో దత్వా గురవే దక్షిణాం దదేత్ ॥17॥

రాజును అభిషేకించే సందర్భంలో పేర్కొన్న దేవతలొక్కొక్కరిని గురించి ప్రత్యేకంగా హోమం చేయాలి. ఆ పిదప పూర్ణాహుతి చేసి గురువుగారికి దక్షిణ ఇవ్వాలి.

ఇన్ద్రోఽభిషిక్తో గురుణా పురా దైత్యాన్ జఘాన హ ॥
దిక్పాలస్నానం కథితం సఙ్గ్రామాదౌ జయాదికమ్ ॥18॥

పూర్వం బృహస్పతి ఇంద్రుడిని ఈవిధంగానే దేవతలకు రాజుగా అభిషేకించాడు. అందువలన ఇంద్రుడు రాక్షసులను సంహరించాడు. ఈవిధంగా యుద్ధాలు మొదలైనవాటిలో విజయం మొదలైనవాటిని ఇచ్చే దిక్పాలస్నానం చెప్పడమయ్యింది.

ఇత్యాది మహాపురాణే ఆగ్నేయే దిక్పాలాదిస్నానవిధికథనం నామ పఞ్చషష్ట్యధికద్విశతతమోఽధ్యాయః ॥265॥

అగ్నిమహాపురాణంలో దిక్పాలాదిస్నానవిధానకథనం అనే రెండువందల అరవైఐదవ అధ్యాయం సమాప్తం.



షట్షష్ట్యధికద్విశతతమోఽధ్యాయః - రెండువందల అరవైఆరవ అధ్యాయం

వినాయకస్నానకథనమ్ - వినాయకస్నానకథనం

పుష్కర ఉవాచ - పరశురాముడితో పుష్కరుడు ఇలా చెప్తున్నాడు.

వినాయకోపసృష్టానాం స్నానం సర్వకరం వదే ॥1॥

వినాయకుడు కల్పించిన విఘ్నాలతో ఆక్రమింపబడినవారికి ఆ బాధలను తొలగించి సమస్తవిధమైన ప్రయోజనాలను చేకూర్చే స్నానం గురించి ఇపుడు చెప్తాను.

వినాయకః కర్మవిఘ్నసిద్ధ్యర్థం వినియోజితః ।
గణానామాధిపత్యే చ కేశవేశపితామహైః ॥2॥

దేవపతులైన విష్ణువు, ఈశ్వరుడు, బ్రహ్మ - జీవులు చేసే ఆయా కర్మలకు విఘ్నాలను కలిగించడంకోసం వినాయకుడిని నియోగించారు. ఇంకా వినాయకుడికి గణాలకు ఆధిపత్యం కూడా ఇచ్చారు.

స్వప్నేఽవగాహతేఽత్యర్థం జలం ముణ్డాం శ్చ పశ్యతి ।
వినాయకోపసృష్టస్తు క్రవ్యాదానధిరోహతి ॥3॥

వినాయకుడిచేత విఘ్నాలు కల్పింపబడినవాడు కలలో బాగా లోతైననీటిలో మునిగిపోతాడు. గుండు చేయించుకున్నవారిని చూస్తాడు. మాంసం తినే జంతువులమీద ఎక్కి కూర్చుంటాడు.

వ్రజమానస్తథాత్మానం మన్యతేఽనుగతం పరైః ।
విమనా వికలారమ్భస్సంసీదత్యనిమిత్తతః ॥4॥

ముందుకు వెళ్తున్నవాడు ఇతరులు తన వెన్నంటి వస్తున్నట్లుగా భావిస్తాడు. మనస్సు చెదిరిపోతుంది. ఏ పనినీ సక్రమంగా చేయలేడు. ఏకారణం లేకుండానే దిగులుపడుతుంటాడు.

కన్యావరం న చాప్నోతి న చాపత్యం వరాఙ్గనా ।
ఆచార్యత్వం శ్రోత్రియశ్చ న శిష్యోఽధ్యయనం లభేత్ ॥5॥

కన్యకు భర్త లభించదు. ఉత్తమస్త్రీకి కూడ సంతానం కలగదు. వేదవేత్తకు వేదం నేర్పే అవకాశం లభించదు. శిష్యుడికి చదువుకోవడం సాధ్యం కాదు.

ధనీ న లాభమాప్నోతి న కృషిం చ కృషీవలః ।
రాజా రాజ్యం న చాప్నోతి స్నపనం తస్య కారయేత్ ॥6॥

ధనవంతుడికి లాభం కలగదు. వ్యవసాయదారుడికి వ్యవసాయం ఉండదు. రాజుకు రాజ్యం నిలవదు. అటువంటి వారి బాధలు తొలగడానికి స్నానం చేయించాలి.

హస్తపుష్యాశ్వయుక్ సౌమ్యే వైష్ణవే భద్రపీఠకే ॥7॥

వారిని భద్రపీఠం మీద కూర్చుండబెట్టి, హస్త, పుష్యమి, అశ్విని, మృగశిర, శ్రవణ నక్షత్రాలలో స్నానం చేయించాలి.

గౌరసర్షపకల్కేన సాజ్యేనోత్పాదితస్య చ ।
సర్వౌషధైస్సర్వగన్ధైః ప్రలిప్తశిరస స్తథా ॥8॥

పసుపురంగులో ఉన్న ఆవాలను పొడిగా చేసి, దానిని నేతితో కలిపి తయారు చేసిన పదార్థంలో సమస్త మైన ఓషధులు, సుగంధద్రవ్యాలు కలపాలి. దానితో శిరసుతో సహా శరీరమంతా పూయాలి.

చతుర్భిః కలశైస్స్నానం తేషు సర్వౌషధీః క్షిపేత్ ॥9॥

నాలుగు కలశాలలో సమస్తమైన ఓషధులు కలిపి, ఆ నీటితో స్నానం చేయించాలి.

అశ్వస్థానాద్గజస్థానాద్ వల్మీకాత్ సఙ్గమాద్ధ్రదాత్ ।
మృత్తికాం రోచనాం గన్ధం గుగ్గులుం తేషు నిక్షిపేత్ ॥10॥

గుఱ్ఱాలు ఉండేచోటు, ఏనుగులు ఉండేచోటు, పుట్టలు, రెండు నదులు కలిసినచోటు, చెరువులు మొద లైనవి, ఈ అయిదు ప్రదేశాలనుండి తెచ్చిన మట్టి, గోరోచనం, సుగంధద్రవ్యాలు, గుగ్గులు ఈ వస్తువులను ఆ కలశజలంలో కలపాలి.

సహస్రాక్షం శతధారమృషిభిః పావనం కృతమ్ ।
తేన త్వామభిషిఞ్చామి పావమాన్యః పునన్తు తే ॥11॥

ఆ తరువాత పురోహితుడు 'వేయి కన్నులు కలిగినదీ, మహర్షులు పవిత్రం చేసినదీ, నూరు ధారలు కలిగినదీ అయిన ఈ నీటితో నిన్ను అభిషేకిస్తున్నాను. పవిత్రమైన ఈ జలం నిన్ను పవిత్రుడిని చేయును గాక'!

భగం తే వరుణో రాజా భగం సూర్యో బృహస్పతిః ।
భగమిన్ద్రశ్చ వాయుశ్చ భగం సప్తర్షయో దదుః ॥12॥

'రాజు అయిన వరుణుడు, సూర్యుడు, బృహస్పతి, ఇంద్రుడు, వాయువు, సప్తర్షులు నీకు ఐశ్వర్యం మొద లైన సమస్త సౌఖ్యాలను ఇచ్చుదురు గాక'!

యత్తే కేశేషు దౌర్భాగ్యం సీమన్తే యచ్చ మూర్ధని ।
లలాటే కర్ణయోరక్ష్ణోరాపస్తద్ ఘ్నన్తు సర్వదా ॥13॥

'నీ కేశాలలోనూ, పాపిడిలోనూ, శిరస్సుమీదా, నుదుటిపైనా, చెవులలోనూ, కన్నులలోనూ, ఉన్న దురదృష్టాన్ని ఎల్లప్పుడూ ఈ పవిత్రజలం నాశనం చేయును గాక'! అని చెప్తూ స్నానం చేయించాలి.

దర్భపిఞ్జులిమాదాయ వామహస్తే తతో గురుః ।
స్నాతస్య సర్షపం తైలం స్రువేణౌదుమ్బరేణ చ ॥
జుహుయాన్మూర్ధని కుశాన్ సవ్యేన పరిగృహ్య చ ॥14॥

ఆ తరువాత గురువుగారు దర్భతో చుట్టిన గుప్పెడు దర్భలను ఎడమచేత పుచ్చుకుని, వాటిని స్నానం చేసిన వాడితలమీద ఉంచి, కుడిచేతిలోని మేడికఱ్ఱతో చేసిన స్రువంతో ఆవాలనూనెను హెూమం చేయాలి.

మితశ్చ సమ్మితశ్చైవ తథా శాలకకణ్టకౌ ।
కూష్మాణ్డేం రాజపుత్రశ్చ ఏతైస్స్వాహాసమన్వితైః ॥15॥

మిత, సమ్మిత, శాలక, కంటక, కూష్మాండ, రాజపుత్ర అనే శబ్దాలను (చతుర్థీవిభక్తి చివర చేర్చి) స్వాహా అనే పదంతో కలిపి ఉచ్చరిస్తూ హోమం చేయాలి.

నామభిర్బలిమన్త్రైశ్చ నమస్కారసమన్వితైః ।
దద్యాచ్చతుష్పథే శూర్పే కుశానాస్తీర్య సర్వతః ॥16॥

నాలుగుదారులు కలిసేచోట, చేటలో అంతటా దర్భలను పరిచి, నమః అనే శబ్దం చివర గలిగిన నామాలను ఉచ్చరిస్తూ ఆయా బలిమంత్రాలతో ఆయా దేవతలకు బలి ఇవ్వాలి.

కృతాకృతాంస్తణ్డులాంశ్చ పలలౌదనమేవ చ ।
మత్స్యాన్ పఙ్కాంస్తథైవామాన్ పుష్పం చిత్రం సురాం తథా ॥17॥

మూలకం పూరికాపూపాంస్తథైవైణ్డవికాస్రజః ।
దధ్యన్నం పాయసం పిష్టం మోదకం గుడమర్పయేత్ ॥18॥

ఉడికీ ఉడకనిబియ్యం, నువ్వుపిండితో వండిన అన్నం, ముడిచేపలు, వండిన చేపలు, రకరకాలపూలు, కల్లు, స్నానం మరియు ముల్లంగి, బూరెలు, అప్పాలు, ఏండవమాలలు, పెరుగన్నం, పాయసం, పిండి, కుడుము, బెల్లం నివేదించాలి.

వినాయకస్య జననీముపతిష్ఠే త్తతోఽమ్బికామ్ ।
దూర్వాసర్షపపుష్పాణాం దత్త్వార్ఘ్యం పూర్ణమఞ్జలిమ్ ॥19॥

పిదప వినాయకుడికి తల్లి అయిన పార్వతిని ఆవాహనం చేయాలి. ఆమెకు దోసిలి నిండుగా గరిక, తెల్లఆవాలు, పూవులు కలిపిన నీటితో అర్ఘ్యం సమర్పించాలి.

రూపం దేహి యశో దేహి సౌభాగ్యం సుభగే మమ ।
పుత్రం దేహి ధనం దేహి సర్వాన్ కామాంశ్చ దేహి మే ॥20॥

'కల్యాణీ! నాకు సుందరమైన రూపాన్ని ఇవ్వు. మంచికీర్తిని ఇవ్వు. సౌభాగ్యం ఇవ్వు. పుత్రసంతానాన్ని ఇవ్వు. సంపదలు ఇవ్వు. సమస్తమైన కోరికలను సిద్ధింపజేయి'. అని అంబికను ప్రార్థించాలి.

భోజయేద్ బ్రాహ్మణాన్ దద్యాద్వస్త్రయుగ్మం గురోరపి ।
వినాయకం గ్రహాన్ ప్రార్చ్య శ్రియం కర్మఫలం లభేత్ ॥21॥

ఆ తరువాత బ్రాహ్మణులకు తృప్తిగా భోజనం పెట్టాలి. గురువుగారికి వస్త్రాలు జత ఇవ్వాలి. వినాయకుడినీ, గ్రహాలనూ చక్కగా పూజించినవాడు, సంపదలను ఉత్తమమైన కర్మఫలాన్నీ పొందుతాడు.

ఇత్యాది మహాపురాణే ఆగ్నేయే వినాయకస్నానకథనం నామ షట్షష్ట్యధికద్విశతతమోఽధ్యాయః ॥266॥

అగ్నిమహాపురాణంలో వినాయకస్నానకథనం అనే రెండువందల అరవైఆరవ అధ్యాయం సమాప్తం.

సప్తషష్ట్యధికద్విశతతమోఽధ్యాయః – రెండువందల అరవైఏడవ అధ్యాయం
మాహేశ్వరస్నానలక్షకోటిహోమాదికథనమ్ – మాహేశ్వరస్నానలక్షకోటిహోమాదికథనం

పుష్కర ఉవాచ – పరశురాముడితో పుష్కరుడు ఇలా చెప్తున్నాడు.

స్నానం మాహేశ్వరం వక్ష్యే రాజాదేర్జయవర్ధనమ్ ।
దానవేన్ద్రాయ బలయే యజ్ఞగాదోశనాః పురా ॥1॥

ఇక మహేశ్వరుడికి సంబంధించిన స్నానం గురించి చెప్తాను. దీనివలన రాజులు మొదలైన వారికి విజయం వృద్ధి చెందుతుంది. పూర్వం శుక్రాచార్యుడు దీనిని రాక్షసరాజయిన బలిచక్రవర్తికి చెప్పాడు.

భాస్కరేఽనుదితే పీఠే ప్రాతస్సంస్నాపయేద్ ఘటైః ।

సూర్యుడు ఉదయించక పూర్వమే రాజును భద్రపీఠంమీద కూర్చుండబెట్టి ఆచార్యుడు క్రిందిమంత్రాలు చెప్తూ కలశజలాలతో స్నానం చేయించాలి.

ఓం నమో భగవతే రుద్రాయ చ బలాయ చ పాణ్డరోచితభస్మానులిప్తగాత్రాయ ॥

ప్రణవస్వరూపుడైన భగవానుడు శ్రీరుద్రస్వామికి నమస్కారం. తెల్లగా ప్రకాశిస్తున్న విభూతిని ఒంటినిండా పూసుకున్నవాడికి నమస్కారం.

(తద్యథా) జయ జయ సర్వాన్ శత్రూన్ మూకయ ।

రుద్రా నీకు జయమగు గాక! నా శత్రువులందరినోళ్లూ మూయించు.

కలహవిగ్రహవివాదేషు భఞ్జయ భఞ్జయ. ఓం మథ మథ ॥

తగవులాటలలోనూ, విరోధాలలోనూ వారిని చావగొట్టు. పిండి పిండిగా చేయి.

సర్వప్రత్యర్థికాన్ యోఽసౌ యుగాన్తకాలే దిధక్షతి ।
ఇమాం పూజాం రౌద్రమూర్తిస్సహస్రాంశుశ్శుక్లస్స తే రక్షతు జీవితమ్ ॥2॥

యుగం ముగిసే సమయంలో ప్రత్యర్థులందరినీ దహించివేయాలని కోరుకునేవాడూ, సహస్రకిరణుడై, తెల్లగా ప్రకాశిస్తున్నవాడూ అయిన ఆరుద్రమూర్తి ఈ పూజతో ప్రీతుడై, నీజీవితాన్ని రక్షించును గాక!

సంవర్తకాగ్నితుల్యశ్చ త్రిపురాన్తకరశ్శివః ।
సర్వదేవమయస్సోఽపి, తవ రక్షతు జీవితమ్ ॥3॥

ప్రళయకాలపు అగ్నితో సమానుడూ, త్రిపురాలను అంతం చేసినవాడూ, సమస్తదేవమయుడైనవాడూ అయిన పరమేశ్వరుడు కూడా నీజీవితాన్ని రక్షించును గాక!

లిఖి లిఖి ఖిలి స్వాహా ॥4॥

అంటూ స్నానం చేయించాలి.

రెండువందల అరవైఏడవ అధ్యాయం

ఏవం స్నాతస్తు మన్త్రేణ జుహుయాత్తిలతణ్డులమ్ ।
పఞ్చామృతైస్తు సంస్నాప్య పూజయేచ్ఛూలపాణినమ్ ॥5॥

ఈవిధంగా స్నానం చేసిన తరువాత ఆయామంత్రాలతో నువ్వులను, బియ్యాన్నీ హెూమం చేయాలి. శూలం ధరించి ఉన్న పరమేశ్వరుడికి పంచామృతాలతో స్నానం చేయించి, పూజ చేయాలి.

స్నానాన్యన్యాని వక్ష్యామి సర్వదా విజయాయ తే ।
స్నానం ఘృతేన కథితమాయుషో వర్ధనం పరమ్ ॥6॥

ఇక ఎల్లప్పుడూ విజయం చేకూర్చే ఇతర స్నానాలను గురించి చెప్తాను. ఆవునేతితో స్నానం చేస్తే, ఆయువు అత్యధికంగా వృద్ధిచెందుతుంది.

గోమయేన చ లక్ష్మీస్స్యాద్గోమూత్రేణాఘమర్దనమ్ ।
క్షీరేణ బలవృద్ధిస్స్యాద్దధ్నా లక్ష్మీవివర్ధనమ్ ॥7॥

ఆవుపేడ కలిపిన నీళ్లతో స్నానం చేస్తే సంపదలు కలుగుతాయి. ఆవుమూత్రంతో స్నానం చేస్తే పాపాలు నశిస్తాయి. ఆవుపాలతో చేస్తే బలం అభివృద్ధి చెందుతుంది. ఆవుపెరుగుతో చేస్తే లక్ష్మి వృద్ధి చెందుతుంది.

కుశోదకేన పాపాన్తః పఞ్చగవ్యేన సర్వభాక్ ।
శతమూలేన సర్వాప్తిర్గోశృఙ్గోదకతోఽఘజిత్ ॥8॥

దర్భలచివరలనుండి జారిననీటితో స్నానం చేస్తే పాపాలు పోతాయి. పంచగవ్యాలతో స్నానం చేస్తే కావలసిన వన్నీ లభిస్తాయి. గరికలు కలిసిన నీళ్లతో చేస్తే సమస్తమూ సిద్ధిస్తాయి. ఆవుకొమ్మునుండి జారిననీళ్లతో చేస్తే పాపాలు నశించిపోతాయి.

పలాశబిల్వకమలకుశస్నానం తు సర్వదమ్ ।
వచాహరిద్రే ద్వే ముస్తం స్నానం రక్షోహణం పరమ్ ॥
ఆయుష్యం చ యశస్యం చ ధర్మమేధావివర్ధనమ్ ॥9॥

మోదుగ, మారేడు, తామరపూవు, దర్భలు ఇవి కలిగిననీళ్లతో స్నానం చేస్తే సమస్తమూ లభిస్తాయి. వస, పసుపు, అనే రెండింటినీ తుంగనూ కలిసిననీళ్లతో స్నానం చేస్తే రాక్షసబాధలు పూర్తిగా నశిస్తాయి. దీనివలన ఇంకా ఆయువు పెరుగుతుంది. కీర్తి కలుగుతుంది. ధర్మం, బుద్ధి వృద్ధి చెందుతాయి.

హైమాద్భిశ్చైవ మాఙ్గల్యం రూప్యతామ్రోదకైస్తథా ।
రత్నోదకైస్తు విజయస్సౌభాగ్యం సర్వగన్ధకైః ॥10॥

బంగారపునీళ్లతో స్నానం చేస్తే శుభం కలుగుతుంది. అదే విధంగా వెండి, రాగినీళ్లతో స్నానం చేసినా శుభం కలుగుతుంది. రత్నాలు కలిసిననీళ్లతో స్నానం చేస్తే విజయం కలుగుతుంది. సమస్తమైన సుగంధద్రవ్యాలు కలిసిన నీళ్లతో స్నానం చేస్తే సౌభాగ్యం కలుగుతుంది.

ఫలాద్భిశ్చ తథాఽఽరోగ్యం ధాత్ర్యద్భిః పరమాం శ్రియమ్ ।
తిలసిద్ధార్థకైర్లక్ష్మీః సౌభాగ్యం చ ప్రియఙ్గుణా ॥11॥

పండ్లరసం కలిసిననీళ్లతో స్నానం చేస్తే ఆరోగ్యం సిద్ధిస్తుంది. ఉసిరికనీళ్లతో స్నానం చేస్తే ఉత్తమమైన సంపదలు కలుగుతాయి. నువ్వులు, తెల్లఆవాలు కలిసిననీళ్లతో చేస్తే లక్ష్మి వర్ధిల్లుతుంది. నల్లఆవాలు కలిసిననీళ్లతో చేస్తే సౌభాగ్యం కలుగుతుంది.

పద్మోత్పలకదమ్బైశ్చ్రీర్బలం బలాద్రుమోదకైః ।
విష్ణుపాదోదకస్నానం సర్వస్నానేభ్య ఉత్తమమ్ ॥12॥

తామరలు, కలువలు, కడిమిపూలు కలిసిననీళ్లతో స్నానం చేస్తే శోభ కలుగుతుంది. చిట్టాముదంచెట్టునీళ్లతో స్నానం చేస్తే బలం కలుగుతుంది. ఈ అన్ని స్నానాలకంటె శ్రీమహావిష్ణువు పాదాలమీదనుండి వచ్చిననీళ్లతో స్నానం చేయడం మిక్కిలిశ్రేష్ఠం.

ఏకాక్యేకైకకామో యో హ్యేకైకం విధివచ్చరేత్ ॥13॥

ఒంటరి అయినవాడు ఒక్కొక్కకోరిక తీరడానికి ఒక్కొక్కవిధమైన స్నానాన్ని విధివిధానంగా ఆచరించాలి.

అక్రన్దయతి సూక్తేన ప్రబధ్నీయాన్మణిం కరే ।
కుష్ఠపాఠావచాశుణ్ఠీశఙ్ఖలోహాదికో మణిః ॥14॥

'అక్రందయతి' అనే సూక్తంతో ముంజేతికి మణిని కట్టుకోవాలి. ఆ ఆభరణాన్ని చెంగల్వకోస్టు, చిఱుబొద్ది, వస, సొంటి, శంఖం, లేదా రాగి, బంగారం మొదలైన లోహంతో చేసినది కావచ్చు.

సర్వేషామేవ కామానామీశ్వరో భగవాన్ హరిః ।
తస్య సమ్పూజనాదేవ సర్వాన్ కామాన్ సమశ్నుతే ॥15॥

సమస్తమైన కోరికలకు అధిపతి (తీర్చేవాడు) ప్రభువైన శ్రీమహావిష్ణువే. ఆ దేవుడిని చక్కగా పూజించడంవలననే మానవుడు అన్నికోరికలూ పొందుతాడు.

స్నాపయిత్వా ఘృతక్షీరైః పూజయిత్వా చ పిత్తహా ।
పఞ్చముద్గబలిం దత్త్వా హ్యతిసారాత్ ప్రముచ్యతే ॥16॥

ఆవునేతితోనూ, పాలతోనూ స్నానం చేయించడంవలననూ, పూజించడంవలననూ పిత్తదోషాలు తొలగిపోతాయి. అయిదు రకాలయిన పెసరధాన్యాలను బలి ఇస్తే, అతిసారవ్యాధినుండి విముక్తి కలుగుతుంది.

పఞ్చగవ్యేన సంస్నాప్య వాతవ్యాధిం వినాశయేత్ ।
ద్విస్నేహస్నపనాచ్ఛ్లేష్మరోగహా వాతిపూజయా ॥17॥

పంచగవ్యాలతో స్నానం చేయడంవలన వాతదోషంవలన కలిగిన వ్యాధులు నశిస్తాయి. నేయి, నీళ్లు రెండింటితో స్నానం చేయడంవలన శ్లేష్మరోగం పోతుంది. శ్రద్ధగా పూజ చేయడంవలన కూడ శ్లేష్మరోగం పోతుంది.

ఘృతం తైలం తథా క్షౌద్రం స్నానం తు త్రిరసం పరమ్ ।
స్నానం ఘృతామ్బు ద్విస్నేహం సమలం ఘృతతైలకమ్ ॥18॥

నేయి, నూనె, తేనె, ఈమూడు త్రిరసాలు. త్రిరసాలతో స్నానం చేయడం ఉత్తమం. నేయి, నీళ్లు, ఈరెండింటిని ద్విస్నేహం అంటారు. నేయి, నూనె అనేరెండింటితో చేసినస్నానం సమలం.

క్షౌద్రమిక్షురసం క్షీరం స్నానం త్రిమధురం స్మృతమ్ ।
ఘృత మిక్షురసం తైలం క్షౌద్రం చ త్రిరసం శ్రియే ॥
అనులేపస్త్రిశుక్లస్తు కర్పూరోశీరచన్దనైః ॥ 19॥

తేనె, చెరుకురసం, ఆవుపాలు ఈమూడింటిని త్రిమధురం అంటారు. వీటితో చేసినస్నానం త్రిమధురస్నానం. నేయి, చెరుకురసం, నూనెలతోపాటుగా తేనెను కూడ కలిపి స్నానం చేసినా, అది త్రిరసస్నానం అవుతుంది. దానివలన సంపదలు కలుగుతాయి. కర్పూరం, వట్టివేరు, చందనం ఈ మూడుద్రవ్యాలను పూయడాన్ని త్రిశుక్లం అంటారు.

చన్దనాగురుకర్పూరమృగదర్పైస్సకుఙ్కుమైః ।
పఞ్చానులేపనం విష్ణోస్సర్వకామఫలప్రదమ్ ॥20॥

చందనం, అగురు, కర్పూరం, కస్తూరి, కుంకుమం ఈ అయిదింటితో శ్రీమహావిష్ణువు శరీరానికి పూత పూయడంవలన సమస్తమైన కోరికలు నెరవేరతాయి.

త్రిసుగన్ధం చ కర్పూరం తథా చన్దనకుఙ్కుమైః ।
మృగదర్పం సకర్పూరం మలయం సర్వకామదమ్ ॥21॥

కర్పూరం, చందనం, కుంకుమం అనే మూడింటితో చేసినపూతకు త్రిసుగంధం అని పేరు. అలాగే కస్తూరి, కర్పూరం, చందనం మూడు పూసినా, అది త్రిసుగంధం. విష్ణువుకు త్రిసుగంధాన్ని పూయడంవలన అన్ని కోరికలు సిద్ధిస్తాయి.

జాతీఫలం సకర్పూరం చన్దనం చ త్రిశీతకమ్ ॥22॥

జాజికాయ, కర్పూరం, చందనం ఈ మూడింటిని త్రిశీతకం అంటారు. (విష్ణువుకు ఈ మూడు కలిపి పూయవచ్చును.)

పీతాని శుక్లవర్ణాని తథా శుక్లాని భార్గవ ।
కృష్ణాని చైవ రక్తాని పఞ్చవర్ణాని నిర్దిశేత్ ॥23॥

పరశురామా! పసుపు, ముత్యపుతెలుపు, స్వచ్ఛమైన తెలుపు, నలుపు, ఎఱుపు, అని రంగులు అయిదు.

ఉత్పలం పద్మజాతీ చ త్రిశీతం హరిపూజనే ॥24॥

విష్ణువును పూజించడానికి కలువలు, తామరపూవులు, జాజిపూలు వీటిని త్రిశీతం అంటారు. ఇవి విష్ణుపుజకు శ్రేష్ఠమైనవి.

కుఙ్కుమం రక్తపద్మాని త్రిరక్తం రక్తముత్పలమ్ ।
ధూపదీపాదిభిః ప్రార్చ్య విష్ణుం శాన్తిర్భవేన్నృణామ్ ॥25॥

కుంకుమం, ఎఱ్ఱదామరలు, ఎఱ్ఱగలువ ఇవి త్రిరక్తం అని చెప్పబడ్డాయి. శ్రీమహావిష్ణువును ఈ త్రిరక్తంతోనూ, ధూపం, దీపం, నైవేద్యం మొదలైన ఉపచారాలతోనూ పూజించడంవలన మానవులకు మనశ్శాంతి కలుగుతుంది.

చతురస్రకరే కుణ్డే బ్రాహ్మణాశ్చాష్ట షోడశ ।
లక్షహోమం కోటిహోమం తిలాజ్యయవధాన్యకైః ॥
గ్రహానభ్యర్చ్య గాయత్ర్యా సర్వశాన్తిః క్రమాద్భవేత్ ॥26॥

గ్రహాలను పూజించి, ఎనిమిది లేదా పదహారుమంది బ్రాహ్మణులు నాలుగుమూలలు సమానంగా (చదరంగా) ఏర్పాటుచేసిన కుండంలో నువ్వులు, నేయి, యవధాన్యాలను లక్షసంఖ్యలోనూ, లేదా కోటిసంఖ్యలోనూ గాయత్రీ మంత్రంతో ఈవిధంగా హోమం చేస్తే, అందరికీ క్రమంగా అన్నివిధాలుగానూ శాంతి లభిస్తుంది.

ఇత్యాది మహాపురాణే ఆగ్నేయే మాహేశ్వరస్నానలక్షకోటిహోమాదికథనం నామ
సప్తషష్ట్యధికద్విశతతమోఽధ్యాయః ॥267॥

అగ్నిమహాపురాణంలో మహేశ్వరస్నానలక్షకోటిహోమాదికథనం అనే
రెండువందల అరవైయేడవ అధ్యాయం సమాప్తం.



అష్టషష్ట్యధికద్విశతతమోఽధ్యాయః - రెండువందల అరవైఎనిమిదవ అధ్యాయం

నీరాజనవిధికథనమ్ - నీరాజనవిధికథనం

పుష్కర ఉవాచ - పరశురాముడితో పుష్కరుడు ఇలా చెప్తున్నాడు.

కర్మ సాంవత్సరం రాజ్ఞాం జన్మర్క్షే పూజయేచ్చ తమ్ ।
మాసి మాసి చ సఙ్క్రాన్తౌ సూర్యసోమాదిదేవతాః ॥
అగస్త్యోదయేఽగస్త్యం చాతుర్మాస్యం హరిం యజేత్ ॥1॥

రాజు సంవత్సరం పొడుగునా చేయవలసిన కర్మలను గురించి చెప్తాను. రాజుగారి జన్మనక్షత్రం సమయంలో ఆ నక్షత్రాన్ని పూజించాలి. నెల నెలా సంక్రమణసమయంలో సూర్యుడు చంద్రుడు మొదలైన దేవతలను, భాద్రపదమాసంలో అగస్త్యనక్షత్రం ఉదయించే సమయంలో అగస్త్యుడినీ, ఆషాఢపూర్ణిమనుండి కార్తికపూర్ణిమవరకు శ్రీమహావిష్ణువునూ పూజించాలి.

శయనోత్థాపనే పఞ్చదినం కుర్యాత్సముత్సవమ్ ॥2॥

శ్రీమహావిష్ణువు శయనించే ఏకాదశి (నుండి పూర్ణిమ), యోగనిద్రనుండి మేలుకునే ఏకాదశి (నుండి పూర్ణిమ) సమయాలలో అయిదురోజులపాటు ఉత్సవాలు చేయాలి.

ప్రోష్ఠపాదే సితే పక్షే ప్రతిపత్ప్రభృతిక్రమాత్ ।
శిబిరాత్పూర్వదిగ్భాగే శక్రార్థం భవనం చరేత్ ॥3॥

భాద్రపదమాసంలో శుక్లపక్షంలో పాడ్యమి మొదలుకొని క్రమంగా రాజు ఉండే శిబిరానికి తూర్పుదిక్కులో ఇంద్రుడికోసం ఒక భవనం నిర్మించాలి.

తత్ర శక్రధ్వజం స్థాప్య శచీం శక్రం చ పూజయేత్ ।
అష్టమ్యాం వాద్యఘోషేణ తాం తు యష్టిం ప్రవేశయేత్ ॥4॥

అక్కడ ఇంద్రపతాకను ప్రతిష్ఠించి, శచీదేవినీ ఇంద్రుడినీ, (పాడ్యమినుండి అష్టమివరకూ) పూజించాలి. అష్టమినాడు వాద్యాలు మారుమోగుతుండగా ఆ ఇంద్రధ్వజాన్ని ధ్వజస్తంభంలో ప్రవేశపెట్టాలి.

ఏకాదశ్యాం సోపవాసో ద్వాదశ్యాం కేతుముత్థితమ్ ।
యజేద్వస్త్రాదిసంవీతం ఘటస్థం సురపం శచీమ్ ॥5॥

భాద్రపదశుద్ధ ఏకాదశినాడు ఉపవాసం ఉండాలి. ద్వాదశినాడు ఇంద్రధ్వజాన్ని పైకి లేపాలి. ఒక కలశంలో ఇంద్రుడినీ శచీదేవినీ స్థాపించాలి. వారికి వస్త్రాలు మొదలైనవి చుట్టాలి. పిదప ఆ కలశంలో ఉన్న ఇంద్రుడినీ శచీదేవినీ పూజించాలి.

వర్ధస్వేన్ద్ర జితామిత్ర వృత్రహన్పాకశాసన ।
దేవదేవ మహాభాగ త్వం హి భూమిష్ఠతాం గతః ॥6॥

శత్రువులను జయించినవాడా! వృత్రుడు అనే రాక్షసుడిని సంహరించినవాడా! పాకుడు అనే రాక్షసుడిని చంపినవాడా! దేవతలకు దేవుడి వైనవాడా! మహాత్మా! దేవేంద్రా! వర్ధిల్లు. నీవు ఇపుడు దేవలోకంనుండి భూమిమీదకు వచ్చియున్నావు.

త్వం ప్రభుశ్శాశ్వతశ్చైవ సర్వభూతహితే రతః ।
అనన్తతేజా వైరాజో యశోజయవివర్ధనః ॥7॥

అందరికీ నీవే ప్రభుడవు. శాశ్వతంగా ఉండేవాడివి. సమస్తమైన భూతాలకు మేలు చేయడంలో శ్రద్ధ కలిగినవాడివి. అంతులేని తేజస్సు కలిగినవాడివి. విరాట్పురుషుడవు. కీర్తినీ, విజయాన్నీ వృద్ధిపొందించేవాడివి.

తేజస్తే వర్ధయన్త్వేతే దేవాశ్శక్రస్సువృష్టికృత్ ।
బ్రహ్మవిష్ణుమహేశాశ్చ కార్తికేయో వినాయకః ॥8॥

మంచివర్షాన్ని కురిపించే దేవేంద్రా! ఈ దేవతలందరూ నీ తేజస్సును వృద్ధిచెందించెదరు గాక! బ్రహ్మ, విష్ణువు, మహేశ్వరుడు, కుమారస్వామి, విఘ్నేశ్వరుడు,

ఆదిత్యా వసవో రుద్రా స్సాధ్యాశ్చ భృగవో దిశః ।
మరుద్గణా లోకపాలా గ్రహా యక్షాద్రినిమ్నగాః ॥9॥

ద్వాదశాదిత్యులు, అష్టవసువులు, ఏకాదశరుద్రులు, సాధ్యులు, భృగువులు, దిక్కులు, మరుద్గణాలు, లోకపాలకులు, గ్రహాలు, యక్షులు, పర్వతాలు, నదులు,

సముద్రాశ్శ్రీర్మహీ గౌరీ చణ్డికా చ సరస్వతీ ।
ప్రవర్తయన్తు తే తేజో జయ శక్ర శచీపతే ॥10॥

సప్తసముద్రాలు, శ్రీ, భూమి, గౌరి, చండీదేవి, సరస్వతీదేవి, వీరందరూ నీ తేజస్సును వృద్ధి చెందించెదరు గాక! శచీదేవినాథా! దేవేంద్రా! నీకు జయమగుగాక!

తవ చాపి జయాన్నిత్యం మమ సమ్పద్యతాం శుభమ్ ।
ప్రసీద రాజ్ఞాం విప్రాణాం ప్రజానామపి సర్వశః ॥11॥

ఇంద్రా! నీకు కలిగిన విజయంవలన మాకు శుభం కలుగును గాక! రాజులనూ, బ్రాహ్మణులనూ, ప్రజలనూ అన్నివిధాలుగా అనుగ్రహించు.

భవత్ప్రసాదాత్ పృథివీ నిత్యం సస్యవతీ భవేత్ ।
శివం భవతి నిర్విఘ్నం శామ్యన్తామీతయో భృశమ్ ॥12॥

నీ దయవలన ఈభూమి ఎల్లకాలమూ పంటలతో నిండియుండును గాక! ఎటువంటి ఆటంకమూ లేకుండా అందరికీ శుభం కలుగును గాక! ఈతిబాధలు పూర్తిగా నశించిపోవును గాక!

మన్త్రేణేన్ద్రం సమభ్యర్చ్య జితభూస్స్వర్గమాప్నుయాత్ ॥13॥

ఈ మంత్రంతో ఇంద్రుడిని పూజిస్తే, రాజ్యాన్ని జయిస్తాడు. స్వర్గానికి వెళ్తాడు.

భద్రకాలీం పటే లిఖ్య పూజయేదాశ్వినే జయే ॥14॥

విజయం కోరుకునేవాడు ఆశ్వీయుజమాసంలో వస్త్రంమీద భద్రకాళిబొమ్మను గీసి, పూజించాలి.

శుక్లపక్షే తథాష్టమ్యామాయుధం కార్ముకం ధ్వజమ్ ।
ఛత్రం చ రాజలిఙ్గాని శస్త్రాద్యం కుసుమాదిభిః ॥15॥

ఆశ్వీయుజమాసంలో శుక్లపక్షంలో అష్టమినాడు కత్తి మొదలైన ఆయుధాలు, ధనుస్సు, జెండా, గొడుగు, ఇంకా ఇతరమైన రాజలాంఛనాలు, ఇతర సాధనాలు మొదలైనవాటిని పూలు, గంధం, మొదలైనవాటితో పూజించాలి.

జాగ్రన్నిశి బలిం దద్యాద్ద్వితీయేఽహ్ని పునర్యజేత్ ॥16॥

రాత్రి జాగరణ చేసి, బలి ఇవ్వాలి. రెండవరోజు పగటిపూట మళ్లీ పూజ చేయాలి.

భద్రకాళి మహాకాళి దుర్గే దుర్గార్తిహారిణి ।
త్రైలోక్యవిజయే చణ్డి మమ శాన్తౌ జయే భవ ॥17॥

భద్రకాళీ! మహాకాళీ! దుర్గాదేవీ! తీరనిబాధలను తీర్చేదానా! ముల్లోకాలను జయించినదానా! చండీదేవీ! నాకు శాంతినీ విజయాన్నీ ప్రసాదించు. (అనే మంత్రంతో కాళికను ప్రార్థించాలి.)

నీరాజనావిధిం వక్ష్యే హ్యైశాన్యాం మన్దిరం చరేత్ ।
తోరణత్రితయం తత్ర గృహే దేవాన్యజేత్సదా ॥18॥

ఇక నీరాజనవిధిని చెప్తాను. ఇంట్లో ఈశాన్యందిక్కులో దేవతామందిరాన్ని నిర్మించాలి. దానికి మూడుదిక్కులలో ద్వారాలు ఏర్పాటు చేయాలి. అక్కడ నిత్యమూ దేవతలను పూజిస్తుండాలి.

చిత్రాం త్యక్త్వా యదా స్వాతిం సవితా ప్రతిపద్యతే ।
తతః ప్రభృతి కర్తవ్యం యావత్ స్వాతౌ రవిః స్థితః ॥19॥

సూర్యుడు చిత్రానక్షత్రాన్ని విడిచిపెట్టి, స్వాతినక్షత్రంలో ప్రవేశిస్తున్నపుడు మొదలుపెట్టి, సూర్యుడు స్వాతిలో స్థిరంగా ఉండేవరకు ఆ దేవమందిరంలో దేవతలను పూజించాలి.

బ్రహ్మా విష్ణుశ్చ శమ్భుశ్చ శక్రశ్చైవానలానిలౌ ।
వినాయకః కుమారశ్చ వరుణో ధనదో యమః ॥
విశ్వేదేవా వైశ్రవసో గజాశ్చాష్టౌ చ తాన్యజేత్ ॥20॥

బ్రహ్మ, విష్ణువు, పరమేశ్వరుడు, ఇంద్రుడు, వాయువు, అగ్ని, వినాయకుడు, కుమారస్వామి, వరుణుడు, కుబేరుడు, యముడు, విశ్వేదేవతలు, వైశ్రవసుడు, అష్టదిగ్గజాలు, వీరందరినీ పూజించాలి.

కుముదైరావణౌ పద్మః పుష్పదన్తశ్చ వామనః ।
సుప్రతీకో౽ఞ్జనో నీలః పూజా కార్యా గృహాదికే ॥ 21॥

1. కుముదం, 2. ఐరావణం, 3. పద్మం, 4. పుష్పదంతం, 5. వామనం, 6. సుప్రతీకం, 7. అంజనం, 8. నీలం అనేవి ఎనిమిది అష్టదిగ్గజాలు. పైన చెప్పిన వారందరికీ ఇంట్లోనూ ఇతర ప్రదేశాలలోనూ పూజ చేయాలి.

పురోధా జుహుయాదాజ్యం సమిత్సిద్ధార్థకం తిలాః ।
కుమ్భా అష్టౌ పూజితాశ్చ తైస్స్నాప్యాశ్చ గజోత్తమాః ॥22॥

ఆ తరువాత పురోహితుడు నెయ్యి, సమిధలు, తెల్లఆవాలు, నువ్వులు హోమం చేయాలి. ఎనిమిది కలశాలను స్థాపించి, వాటిని పూజించాలి. ఆ తరువాత ఆ కలశాలలోని జలంతో అష్టదిగ్గజాలకు స్నానం చేయించాలి.

అధస్స్వాత్యాం దదేత్పిణ్డాంస్తతో హి ప్రథమం గజాన్ ।
నిష్క్రామయేత్తోరణైస్తు గోపురాది చ లఙ్ఘయేత్ ॥23॥

పిదప సూర్యుడు స్వాతినక్షత్రంలో ఉన్నపుడే (అశ్వా స్స్నాప్యాః అనే పాఠాంతరం ప్రకారం గుఱ్ఱాలకు స్నానం చేయించాలి. కాని గుఱ్ఱాలప్రస్తావన ముందు వెనుకల కనబడదు.) నైవేద్యాలు సమర్పించాలి. ఆ తరువాత మొదటగా ద్వారాలగుండా ఏనుగులను బయటకు పంపాలి. ఆ ఏనుగులచేత గోపురాలు మొదలయినవాటిని దాటించాలి.

నిష్క్రమేయుస్తతస్సర్వే రాజలిఙ్గం గృహే యజేత్ ।
వారుణే వరుణం ప్రార్చ్య రాత్రౌ భూతబలిం దదేత్ ॥24॥

ఆ తరువాత క్రమంగా అందరూ బయటకు వెళ్లిపోవాలి. రాజలాంఛనాలను ఇంట్లోనే పూజించాలి. నీళ్లలో వరుణుడిని పూజించి, రాత్రిసమయంలో భూతాలకు బలి ఇవ్వాలి.

విశాఖాయాం గతే సూర్యే ఆశ్రమే నివసేన్నృపః ।
అలఙ్కుర్యాద్దినే తస్మిన్వాహనం తు విశేషతః ॥25॥

సూర్యుడు (స్వాతినక్షత్రంనుండి వెళ్లి) విశాఖానక్షత్రంలో ఉన్నపుడు రాజు ఆశ్రమంలో నివసించాలి. ఆనాడు వాహనాలను విశేషంగా అలంకరించాలి.

పూజితా రాజలిఙ్గాశ్చ కర్తవ్యా నరహస్తగాః ॥26॥

రాజలాంఛనాలను పూజించిన తరువాత వాటిని ధరించే ఆయా భటులచేతి కివ్వాలి.

హస్తినం తురగం ఛత్రం ఖడ్గం చాపం చ దున్దుభిమ్ ।
ధ్వజం పతాకాం ధర్మజ్ఞ కాలజ్ఞస్త్వభిమన్త్రయేత్ ॥ 27॥

ధర్మం తెలిసినవాడా! పరశురామా! పూజానంతరం ఏనుగు, గుఱ్ఱం, గొడుగు, కత్తి, విల్లు, దుందుభి, ధ్వజం, పతాకం, వీటిని జ్యోతిశ్శాస్త్రజ్ఞుడు ఆయా మంత్రాలతో అభిమంత్రించాలి.

అభిమన్త్ర్య తతస్సర్వాన్ కుర్యాత్కుఞ్జరధూర్గతాన్ ।
కుఞ్జరోపరిగౌ స్యాతాం సాంవత్సరపురోహితౌ ॥
మన్త్రితాంశ్చ సమారుహ్య తోరణేన వినిర్గమేత్ ॥28॥

అభిమంత్రించిన తరువాత ఛత్రాదులన్నిటినీ ఏనుగుపై అగ్రభాగంలో ఉంచాలి. జ్యోతిర్విదుడు, పురోహితుడు కూడ ఏనుగుపై ఎక్కి కూర్చోవాలి. అభిమంత్రించిన వాటిపై ఎక్కినవారు ప్రధానద్వారంగుండా బయటకు వెళ్లిపోవాలి.

నిష్క్రమ్య నాగమారుహ్య తోరణేనాథ నిర్గమేత్ ।
బలిం విభజ్య విధివద్రాజా కుఞ్జరధూర్గతః ॥29॥

అలా వారు వెళ్ళిన తరువాత రాజు కూడ మరొక ఏనుగునెక్కి, ప్రధానద్వారంగుండా బయటకు వెళ్లాలి. ఆ ఏనుగుపై ఉండేరాజు బలిని యథాభాగంగా విభాగం చేసి, విధివిధానంగా బలి యివ్వాలి.

ఉల్కానాం తు నిచయమాదీపితదిగన్తరమ్ ।
రాజా ప్రదక్షిణం కుర్యాత్ త్రీన్వారాన్సుసమాహితః ॥30॥

అన్నిదిక్కులను వెలుగులతో నింపుతున్న కాగడాల సముదాయాలకు రాజు ఏకాగ్రచిత్తంతో మూడుసార్లు ప్రదక్షిణం చేయాలి.

చతురఙ్గబలోపేతస్సర్వసైన్యేన నాదయన్ ।
ఏవం కృత్వా గృహం గచ్ఛేద్ విసర్జితజనస్తతః ॥31॥

ఈవిధంగా చేసిన తరువాత, సైన్యం అంతా జయజయధ్వానాలు చేస్తుండగా, రాజు రథ, గజ, తురగ, పదాతులనే చతురంగబలాలతో కలిసి, అక్కడిజనాల నందరినీ విడిచిపెట్టి తన ఇంటికి వెళ్లాలి.

శాన్తినీరాజనాఖ్యేయం వృద్ధయే రిపుమర్దినీ ॥32॥

శాంతినీరాజనం అనే పేరు గలిగిన ఈవిధిని ఆచరించడంవలన ఆచరించినవాడికి వృద్ధి కలుగుతుంది. ఇది శత్రువులను నిర్మూలిస్తుంది.

ఇత్యాది మహాపురాణే ఆగ్నేయే నీరాజనవిధికథనం నామాష్టషష్ట్యధికద్విశతతమోఽధ్యాయః ॥268॥

అగ్నిమహాపురాణంలో నీరాజనవిధికథనం అనే రెండువందల అరవైఎనిమిదవ అధ్యాయం సమాప్తం.



ఏకోనసప్తత్యధికద్విశతతమోఽధ్యాయః - రెండువందల అరవైతొమ్మిదవ అధ్యాయం

ఛత్రాదిమంత్రకథనమ్ - ఛత్రాదిమంత్రకథనం

పుష్కర ఉవాచ - పరశురాముడితో పుష్కరుడు ఇలా చెప్తున్నాడు.

ఛత్రాదిమన్త్రాన్ వక్ష్యామి యైస్తత్పూజ్య జయాదికమ్ ॥1॥

ఛత్రం మొదలైన రాజలాంఛనాలకు సంబంధించిన మంత్రాలను చెప్తాను. వాటివలన విజయం మొదలైనవి కలుగుతాయి.

బ్రహ్మణస్సత్యవాక్యేన సోమస్య వరుణస్య చ ।
సూర్యస్య చ ప్రభావేణ వర్ధస్వ త్వం మహామతే ॥2॥

గొప్పబుద్ధి కలిగిన ఛత్రమా! బ్రహ్మ, చంద్రుడు, వరుణుడు పలికిన సత్యవచనాలచేతనూ, సూర్యుడి ప్రభావంచేతనూ, నీవు చక్కగా వర్ధిల్లు.

పాణ్డరాభప్రతీకాశ హిమకున్దేన్దుసుప్రభ ।
యథామ్బుదశ్ఛాదయతే శివాయైనాం వసున్ధరామ్ ॥
తథాచ్ఛాదయ రాజానం విజయారోగ్యవృద్ధయే ॥3॥

తెల్లనికాంతులతో ప్రకాశించేవాడా! మంచు, మొల్లలు, చంద్రుడివంటి స్వచ్ఛమైనకాంతి కలిగినవాడా! లోకానికి మేలు చేయడంకోసం మేఘం భూమిని కప్పివేసినట్లుగా విజయం, ఆరోగ్యం పెంపొందడంకోసం నీవు ఈరాజును కప్పుకొని ఉండుము.

గన్ధర్వకులజాతస్త్వం మా భూయాః కులదూషకః ।
బ్రహ్మణస్సత్యవాక్యేన సోమస్య వరుణస్య చ ॥
ప్రభావాచ్చ హుతాశస్య వర్ధస్వ త్వం తురఙ్గమ ॥ 4॥

ఓ గుఱ్ఱమా! నీవు గంధర్వులవంశంలో జన్మించావు. వంశం నిందింపబడే విధంగా ప్రవర్తించవద్దు. బ్రహ్మ, చంద్రుడు, వరుణుడు పలికిన సత్యవచనాలచేతనూ, అగ్నిదేవుడి ప్రభావంచేతనూ, నీవు చక్కగా వర్ధిల్లు.

తేజసా చైవ సూర్యస్య మునీనాం తపసా తథా ।
రుద్రస్య బ్రహ్మచర్యేణ పవనస్య బలేన చ ॥5॥

సూర్యుడితేజస్సుచేతనూ, మహర్షులతపోబలంచేతనూ, రుద్రుడిబ్రహ్మచర్యశక్తితోనూ, వాయుదేవుడి బలంతోనూ నీవు వర్ధిల్లుము.

స్మర త్వం రాజపుత్రోఽసి కౌస్తుభం తు మణిం స్మర ॥6॥

ఓ గుఱ్ఱమా! నీవు అశ్వరాజుకుమారుడివని మరచిపోకు. కౌస్తుభమణిని ఒకసారి స్మరించుము.

యాం గతిం బ్రహ్మహా గచ్ఛేత్ పితృహా మాతృహా తథా ।
భూమ్యర్థేఽనృతవాదీ చ క్షత్రియశ్చ పరాఙ్ముఖః ॥
వ్రజేస్త్వం తాం గతిం క్షిప్రం మా తత్పాపం భవేత్తవ ॥7॥

బ్రాహ్మణుడిని చంపినవాడు, తండ్రిని చంపినవాడు, తల్లిని చంపినవాడు, భూమికోసం అబద్ధ మాడినవాడు, యుద్ధంలో భయంతో వెనుదిరిగి పారిపోయినవాడు, వెంటనే ఘోరమయిన పాపపుగతులను పొందుతారు. నీకు అటువంటి నీచపుగతులు కలుగకూడదు. బ్రహ్మహత్యాదులతో సమానమైన పాపం నీకు కలుగకూడదు.

వికృతిం మాపగచ్ఛేస్త్వం యుద్ధేఽధ్వని తురఙ్గమ ।
రిపూన్వినిఘ్నన్ సమరే సహ భర్త్రా సుఖీ భవ ॥8॥

ఓ గుఱ్ఱమా! అందుకోసం నీవు యుద్ధంలో భయపడి, వెన్నుదారిపట్టి పారిపోకూడదు. యుద్ధంలో శత్రువులను సంహరించి, నీరాజుతో కలిసి విజయసుఖాలను పొందుము.

శక్రకేతో మహావీర్య సుపర్ణస్త్వాముపాశ్రితః ।
పతత్రిరాడ్వైనతేయస్తథా నారాయణధ్వజః ॥9॥

మిక్కిలి పరాక్రమం కలిగిన ఓ ఇంద్రధ్వజమా! గరుత్మంతుడు నిన్ను ఆశ్రయించి ఉన్నాడు. ఆ గరుడుడు పక్షులకు అధిపతి. వినత కుమారుడు. శ్రీమహావిష్ణువు పతాకంపై నెలకొని ఉంటాడు.

కాశ్యపేయోఽమృతాహర్తా నాగారిర్విష్ణువాహనః ।
అప్రమేయో దురాధర్షో రణే దేవారిసూదనః ॥10॥

కశ్యపప్రజాపతి కుమారుడు. అమృతాన్ని దేవలోకం నుండి భూలోకానికి తెచ్చినవాడు. పాములకు విరోధి. విష్ణుమూర్తికి వాహనం. అపరిమితమైన శక్తి కలవాడు. యుద్ధంలో అతడిని ఎవరూ ఎదుర్కొనలేరు. రాక్షసులను సంహరించినవాడు.

మహాబలో మహావేగో మహాకాయోఽమృతాశనః ।
గరుత్మాన్మారుతగతిస్త్వయి సన్నిహితః స్థితః ॥11॥

గరుత్మంతుడు మిక్కిలి బలవంతుడు. గొప్పవేగం కలిగినవాడు. శరీరం చాలా పెద్దది. దేవతలతో సమానంగా అమృతం తీసుకున్నవాడు. వాయువువంటివేగం కలిగినవాడు. అటువంటి గరుత్మంతుడు నీకు సన్నిహితుడై ఉన్నాడు.

విష్ణునా దేవదేవేన శక్రార్థం స్థాపితో హ్యసి ।
జయాయ భవ మే నిత్యం వృద్ధయేఽథ బలస్య చ ॥
సాశ్వవర్మాయుధాన్యోధాన్ రక్షాస్మాకం రిపూన్ దహ ॥12॥

దేవతలకు దేవుడయిన శ్రీమహావిష్ణువు దేవేంద్రుడికోసం నిన్ను ఈధ్వజంమీద ప్రతిష్ఠించాడు. అటువంటినీవు నాకు యుద్ధాదులలో విజయం కలిగించు. నా బలాన్ని పెంపొందించు. నా గుఱ్ఱాలనూ, కవచాలనూ, ఆయుధాలనూ, యోధులనూ కాపాడు. మాశత్రువులను కాల్చివేయుము.

కుముదైరావణౌ పద్మః పుష్పదన్తోఽథ వామనః ।
సుప్రతీకోఽఞ్జనో నీల ఏతేఽష్టౌ దేవయోనయః ॥13॥

కుముదం, ఐరావణం, పద్మం, పుష్పదంతం, వామనం, సుప్రతీకం, అంజనం, నీలం అనే ఈ ఎనిమిది (దిగ్గజాలు) దేవజాతిలో పుట్టాయి.

తేషాం పుత్రాశ్చ పౌత్రాశ్చ వనాన్యష్టౌ సమాశ్రితాః ।
భద్రో మన్ద్రో మృగశ్చైవ గజస్సఙ్కీర్ణ ఏవ చ ॥
వనే వనే ప్రసూతాస్తే స్మర యోనిం మహాగజాః ॥ 14॥

ఆ అష్టదిగ్గజాలకుమారులు, ఆ కుమారులకుమారులు అయిన ఏనుగులన్నీ ఎనిమిదిమహారణ్యాలలో ఉంటున్నాయి. భద్రం, మందం, మృగం, సంకీర్ణం అనేజాతులకు చెందిన ఏనుగులు ప్రతిఅరణ్యంలోనూ పుడుతున్నాయి. ఓ ఏనుగులారా! మీజన్మలకు మూలాలను ఒకసారి గుర్తు చేసుకోండి.

పాన్తు త్వాం వసవో రుద్రా ఆదిత్యాస్సమరుద్గణాః ।
భర్తారం రక్ష నాగేన్ద్ర సమయః పరిపాల్యతామ్ ॥15॥

ఓ మహాగజమా! అష్టవసువులు, ఏకాదశరుద్రులు, ద్వాదశాదిత్యులు, మరుద్గణాలు, మిమ్ము రక్షించు గాక! మీరు కూడ మీనియమాన్ని పాటించండి. మీకు నాయకుడైన రాజును రక్షించండి.

ఐరావతాధిరూఢస్తు వజ్రహస్తశ్శతక్రతుః ।
పృష్ఠతోఽనుగతస్త్వేష రక్షతు త్వాం స దేవరాట్ ॥16॥

దేవేంద్రుడు చేతిలో వజ్రాయుధాన్ని ధరించి, ఐరావతం అనే ఏనుగుమీద ఎక్కి, ఇదిగో, మీవెన్నంటి వస్తున్నాడు. ఆదేవతలరాజు మిమ్మల్ని (గజబలాన్ని) రక్షించును గాక!

అవాప్నుహి జయం యుద్ధే సుస్థశ్చైవ సదా వ్రజ ।
అవాప్నుహి బలం చైవ చైరావతసమం యుధి ॥17॥

యుద్ధంలో విజయం పొంది, సుఖంగా ముందుకు నడువుము. యుద్ధంలో దేవతల ఏనుగైన ఐరావతంతో సమానమైన బలాన్ని పొందుదువు గాక!

శ్రీస్తే సోమాద్బలం విష్ణోస్తేజస్సూర్యాజ్జవోఽనిలాత్ ।
స్థైర్యం గిరేర్జయం రుద్రాద్యశో దేవాత్పురన్దరాత్ ॥18॥

చంద్రుడివలన కాంతినీ, విష్ణువునుండి బలాన్నీ, సూర్యుడినుండి తేజస్సునూ, వాయువునుండి వేగాన్నీ, పర్వతంనుండి స్థిరత్వాన్నీ, రుద్రుడివలన విజయాన్నీ, దేవేంద్రుడివలన కీర్తినీ పొందుదువు గాక!

యుద్ధే రక్షన్తు నాగాస్త్వాం దిశశ్చ సహ దైవతైః ।
అశ్వినౌ సహ గన్ధర్వైః పాన్తు త్వాం సర్వతో దిశః ॥19॥

యుద్ధంలో మిమ్మల్ని అష్టదిగ్గజాలు, దిక్కులు, దిక్పాలకులైన దేవతలు, నిన్ను కాపాడుదురు గాక! అశ్వినీదేవతలు, గంధర్వులతో కలిసి అన్నిదిక్కులనుండి మిమ్ము రక్షింతురు గాక!

మనవో వసవో రుద్రా వాయుస్సోమో మహర్షయః ।
నాగకిన్నరగన్ధర్వయక్షభూతగణా గ్రహాః ॥ 20॥

ప్రమథాస్తు సహాదిత్యైర్భూతేశో మాతృభిస్సహ ।
శక్రస్సేనాపతిస్స్కన్దో వరుణశ్చాశ్రితస్త్వయి ॥21॥

మనువులు, వసువులు, రుద్రులు, వాయువు, చంద్రుడు, మహర్షులు, నాగులు, కిన్నరులు, గంధర్వులు, యక్షులు, సమస్తభూతగణాలు, గ్రహాలు, ఆదిత్యులతో సహా ప్రమథులు, మాతృదేవతలతో కూడి ఉన్న భూతనాథుడయిన పరమేశ్వరుడు, ఇంద్రుడు, దేవసేనానాయకుడైన కుమారస్వామి, వరుణుడు – వీరందరు నిన్ను ఆశ్రయించుకుని ఉన్నారు.

ప్రదహన్తు రిపూన్సర్వాన్ రాజా విజయమృచ్ఛతు ॥22॥

వీరందరూ శత్రువులను భస్మం చేయుదురు గాక! యుద్ధంలో రాజు విజయం పొందును గాక!

యాని ప్రయుక్తాన్యరిభిర్దూషణాని సమన్తతః ।
పతన్తు తవ శత్రూణాం హతాని తవ తేజసా ॥23॥

ఓ పతాకమా! నిన్ను పడగొట్టడానికి శత్రువులు అన్నివైపులనుండి నీమీద ప్రయోగించిన నీచపుకార్యాలన్నీ నీపరాక్రమంచేత వ్యర్థమై పోవును గాక!

కాలనేమివధే యద్వద్యుద్ధే త్రిపురఘాతనే ।
హిరణ్యకశిపోర్యుద్ధే వధే సర్వాసురేషు చ ॥
శోభితాసి తథైవాద్య శోభస్వ సమయం స్మర ॥24॥

కాలనేమి అనే రాక్షసుడిని చంపే సమయంలోనూ, త్రిపురాసురులతో యుద్ధం చేసే సమయంలోనూ, హిరణ్యకశిపునితో యుద్ధం చేసేటపుడు, ఇంకా ఇతరరాక్షసులను సంహరించేటపుడు, నీవు చాల చక్కగా వెలిగావు. ఇపుడు కూడ అదే విధంగా ప్రకాశించు. నీవు చేసుకున్న నియమాన్ని గుర్తు చేసుకో.

నీలశ్వేతామిమాం దృష్ట్వా నశ్యన్త్వాశు నృపారయః ।
వ్యాధిభిర్వివిధైర్ఘోరైశ్శస్త్రైశ్చ యుధి నిర్జితాః ॥25॥

నలుపు, తెలుపు రంగులలో ఉన్న ఈపతాకను చూచి ఈరాజు యొక్క శత్రువులు వెంటనే నశించిపోవుదురు గాక! యుద్ధంలో రకరకాలయిన వ్యాధులచేతనూ, భయంకరమైన ఆయుధాలచేతనూ ఓడిపోవుదురు గాక!

పూతనా రేవతీ లేఖా కాలరాత్రీతి పఠ్యతే ।
దహన్త్వాశు రిపూన్ సర్వాన్ పతాకే త్వాముపాశ్రితాః ॥26॥

ఓ పతాకమా! పూతన, రేవతి, లేఖ, కాళరాత్రి అని స్తుతింపబడేవారు నిన్ను ఆశ్రయించుకుని ఉంటారు. వాళ్లు మాశత్రువులందరినీ బూడిద చేయుదురు గాక!

సర్వమేధే మహాయజ్ఞే దేవదేవేన శూలినా ।
శర్వేణ జగతశ్చైవ సారేణ త్వం వినిర్మితః ॥27॥

దేవతలకు దేవుడైన పరమేశ్వరుడు సర్వమేధం అనే మహాయజ్ఞంలో నిన్ను ఈజగత్తు మొత్తానికి సారం అయిన దానినిగా నిర్మించాడు.

నన్దకస్యాపరాం మూర్తిం స్మర శత్రునిబర్హణ ।
నీలోత్పలదలశ్యామ కృష్ణ దుస్స్వప్ననాశన ॥28॥

శత్రువులను నిర్మూలించే ఓ ఖడ్గమా! నల్లకలువరేకులవలె చామనచాయ గలిగినదానా! నల్లనిదానా! చెడుకలలను నాశనం చేసేదానా! నువ్వు నందకం అనే శ్రీమహావిష్ణువు కత్తితో భేదం లేనిదానివిగా గ్రహించు.

అసిర్విశసనః ఖడ్గస్తీక్ష్ణధారో దురాసదః ।
శ్రీగర్భో విజయశ్చైవ ధర్మపాలస్తథైవ చ ॥
ఇత్యష్టౌ తవ నామాని పురోక్తాని స్వయమ్భువా ॥29॥

పూర్వం బ్రహ్మదేవుడు 1. అసి, 2. విశసనం, 3. ఖడ్గం, 4. తీక్ష్ణధారం, 5. దురాసదం, 6. శ్రీగర్భం, 7. విజయం, 8. ధర్మపాలం, అనే ఎనిమిది నీకు పేర్లుగా పేర్కొన్నాడు.

నక్షత్రం కృత్తికా తుభ్యం గురుర్దేవో మహేశ్వరః ।
హిరణ్యం చ శరీరం తే దైవతం తే జనార్దనః ॥30॥

నీ నక్షత్రం కృత్తిక. మహాదేవుడయిన మహేశ్వరుడు నీకు గురువు. నీశరీరం బంగారం. నీకు అధిష్ఠానదైవం జనార్దనుడు.

రాజానం రక్ష నిస్త్రింశ సబలం సపురం తథా ।
పితా పితామహో దేవస్స త్వం పాలయ సర్వదా ॥31॥

ఓ ఖడ్గమా! బ్రహ్మదేవుడు నీకు తండ్రి. అటువంటి నీవు, సైన్యంతోనూ, రాజధానితోనూ సహా రాజునూ రక్షించు. ఎల్లప్పుడూ మమ్మల్ని కాపాడు.

శర్మప్రదస్త్వం సమరే వర్మన్ సైన్యే యశోఽద్య మే ।
రక్ష మాం రక్షణీయోఽహం తవానఘ నమోఽస్తు తే ॥32॥

పాపరహితమా! ఓ కవచమా! నీవు యుద్ధంలో సైన్యానికి మేలు చేస్తావు. ఇపుడు నాకు కీర్తిని గలిగించు. నేను నీచేత రక్షింపబడవలసినవాడను. నన్ను రక్షించు. నీకు నమస్కారం.

దున్దుభే త్వం సపత్నానాం ఘోషాద్ధృదయకమ్పనః ।
భవ భూమిపసైన్యానాం యథా విజయవర్ధనః ॥33॥

ఓ దుందుభీ! నీమోతతో శత్రువులగుండెలను అదరగొడతావు. రాజసైన్యానికి విజయం పెంపొందే విధంగా చేయి.

యథా జీమూతఘోషేణ హృష్యన్తి వరవారణాః ।
తథాస్తు తవ శబ్దేన హర్షోఽస్మాకం ముదావహ ॥34॥

అందరికీ సంతోషం కలిగించే దుందుభీ! మేఘగర్జనలతో మదించిన ఏనుగులు ఎంతో సంతోషించే విధంగా, నీధ్వనితో మాకు ఆనందం కలిగించు.

యథా జీమూతశబ్దేన స్త్రీణాం త్రాసోఽభిజాయతే ।
తథా తు తవ శబ్దేన త్రస్యన్త్వస్మద్విషో రణే ॥35॥

మేఘగర్జనలవలన ఆడువారికి భయం కలిగిన విధంగా మాశత్రువులు నా శబ్దం వలన యుద్ధరంగంలో భయపడిపోదురుగాక!

మన్త్రైస్సదార్చనీయాస్తే యోజనీయా జయాదిషు ॥36॥

ఈవిధంగా ఆయా మంత్రాలతో రాజు ఉపకరణాలను పూజించాలి. విజయం సిద్ధించడానికి ఆవిధంగా మంత్రించిన సాధనాలను ప్రయోగించాలి.

కృతరక్షశ్చ విష్ణ్వాదేస్త్వభిషేకశ్చ వత్సరే ।
రాజ్ఞోఽభిషేకః కర్తవ్యో దైవజ్ఞేన పురోధసా ॥37॥

జ్యోతిశ్శాస్త్రం తెలిసిన పురోహితుడు రాజుకు రక్ష కట్టి, ప్రతిసంవత్సరం విష్ణువు మొదలైన దేవతలకు అభిషేకం చేయాలి. రాజుకు కూడ ప్రతిసంవత్సరం అభిషేకం చేయాలి.

ఇత్యాది మహాపురాణే ఆగ్నేయే ఛత్రాదిమన్త్రకథనం నామైకోనసప్తత్యధికద్విశతతమోఽధ్యాయః ॥269॥

అగ్నిమహాపురాణంలో ఛత్రాదిమంత్రకథనం అనే రెండువందల అరవైతొమ్మిదవ అధ్యాయం సమాప్తం.



సప్తత్యధికద్విశతతమోఽధ్యాయః – రెండువందల డెబ్బైయవ అధ్యాయం

విష్ణుపంజరకథనమ్ – విష్ణుపంజరకథనం

పుష్కర ఉవాచ – పరశురాముడితో పుష్కరుడు ఇలా చెప్తున్నాడు.

త్రిపురం జఘ్నుషః పూర్వం బ్రహ్మణా విష్ణుపఞ్జరమ్ ।
శఙ్కరస్య ద్విజశ్రేష్ఠ రక్షణాయ నిరూపితమ్ ॥1॥

బ్రాహ్మణోత్తమా! పరశురామా! పూర్వం త్రిపురాసురుడిని సంహరించదలచుకున్న శివుడిరక్షణకోసం బ్రహ్మదేవుడు విష్ణుపంజరం అనే స్తోత్రాన్ని శివుడికి ఉపదేశించాడు.

వాగీశేన చ శక్రస్య బలం హన్తుం ప్రయాస్యతః ।
తస్య స్వరూపం వక్ష్యామి తత్త్వం శృణు జయాదిమత్ ॥2॥

బలుడు అనే రాక్షసుడిని సంహరించడానికి బయలుదేరుతుండగా, బృహస్పతి ఇంద్రుడికి ఈ స్తోత్రాన్ని చెప్పాడు. విజయాదులను కలిగించే ఆ స్తోత్రస్వరూపమూ, దాని ఆంతర్యమూ చెప్తాను. విను.

విష్ణుః ప్రాచ్యాం స్థితశ్చక్రీ హరిర్దక్షిణతో గదీ ।
ప్రతీచ్యాం శార్ఙ్గధృగ్ విష్ణుర్జిష్ణుః ఖడ్గీ మమోత్తరే ॥3॥

నాకు తూర్పున చక్రం ధరించిన విష్ణువు, దక్షిణంలో గదను ధరించిన శ్రీహరి, పడమటిదిక్కున శార్ఙ్గం అనే ధనుస్సు ధరించిన విష్ణువు, ఉత్తరదిక్కున నందకం అనే ఖడ్గం ధరించిన జిష్ణువు – నన్ను రక్షించు గాక!

హృషీకేశో వికోణేషు తచ్ఛిద్రేషు జనార్దనః ।
క్రోడరూపీ హరిర్భూమౌ నరసింహోఽమ్బరే మమ ॥4॥

ఆగ్నేయం మొదలైన విదిక్కులలో హృషీకేశుడు, వాటికి మధ్యలో జనార్దనుడు, నేలమీద వరాహరూపం ధరించిన శ్రీహరి, ఆకాశంలో నరసింహుడు నన్ను రక్షింతురు గాక!

క్షురాన్తమమలం చక్రం భ్రమత్యేతత్సుదర్శనమ్ ।
అస్యాంశుమాలా దుష్ప్రేక్ష్యా హన్తుం ప్రేతనిశాచరాన్ ॥5॥

పదునయిన అంచులు కలిగినదీ, నిర్మలమైనదీ అయిన సుదర్శనం అనే ఈచక్రం వేగంగా తిరుగుతున్నది. ప్రేతాలనూ, రాత్రిచరులనూ చంపడానికి వెళ్లే సమయంలో దీని కాంతివలయాలను చూడడం ఎవరికీ సాధ్యంకాదు.

గదా చేయం సహస్రార్చిః ప్రదీప్తపావకోజ్జ్వలా ।
రక్షోభూతపిశాచానాం డాకినీనాం చ నాశినీ ॥6॥

ఈ గద అనంతమైన కాంతులు కలిగినది. ప్రజ్వలిస్తున్న అగ్నిలాగా మిక్కిలిగా ప్రకాశిస్తున్నది. ఇది రాక్షసులనూ, భూతాలనూ, పిశాచాలనూ, చూపులతోటే హాని చేసే డాకినులనే పిశాచకాంతలనూ సర్వనాశనం చేస్తుంది.

శార్ఙ్గవిస్ఫూర్జితం చైవ వాసుదేవస్య మద్రిపూన్ ।
తిర్యఙ్మనుష్యకూష్మాణ్డప్రేతాదీన్ హన్త్వశేషతః ॥7॥

ఈ శార్ఙ్గం అనే శ్రీమహావిష్ణువుధనుస్సు బాణం ప్రయోగించేటపుడు చేసే టంకార ధ్వని నా శత్రువులైన పశుపక్ష్యాదుప్రేతాదులనన్నింటినీ, మానవులనూ, కూష్మాండం అనే పేరు కలిగిన పిశాచవిశేషాలనూ, తిర్యక్కులను ఏమాత్రం మిగలకుండా సంహరించు గాక!

ఖడ్గధారోజ్జ్వలజ్యోత్స్నానిర్ధూతా యే సమాహితాః ।
తే యాన్తు శామ్యతాం సద్యో గరుడేనేవ పన్నగాః ॥8॥

శ్రీమహావిష్ణువునకు ఆయుధమైన నందకమనే ఈ కత్తిపదును మిక్కిలి తెల్లగా దట్టమైన వెన్నెలలాగా ప్రకాశిస్తున్నది. ఆ వెన్నెలవెలుగులో మునిగిపోయిన నా శత్రువులు, గరుత్మంతుడివలన పాములు నశించినట్లుగా నశించిపోదురు గాక!

యే కూష్మాణ్డాస్తథా యక్షా యే దైత్యా యే నిశాచరాః ।
ప్రేతా వినాయకాః క్రూరా మనుష్యా జమ్భగాః ఖగాః ॥9॥

సింహాదయశ్చ పశవో దన్దశూకాశ్చ పన్నగాః ।
సర్వే భవన్తు తే సౌమ్యాః కృష్ణశఙ్ఖరవాహతాః ॥10॥

కూష్మాండాలు, యక్షులు, దైత్యులు, రాత్రించరులు, ప్రేతాలు, విఘ్నాలు కల్పించేవాళ్లు, కఠినాత్ములైన మానవులు, కోరలు కలిగిన పక్షులు, సింహాలు మొదలైన పశువులు, విషసర్పాలు, పాములు, మొదలైనవన్నీ కూడా శ్రీకృష్ణునిపాంచజన్యమనే శంఖధ్వనులతో దెబ్బతిని, సాధువులగును గాక!

చిత్తవృత్తిహరా యే మే యే జనాస్స్మృతిహారకాః ।
బలౌజసాం చ హర్తారశ్ఛాయావిభ్రంశకాశ్చ యే ॥11॥

యే చోపభోగహర్తారో యే చ లక్షణనాశకాః ।
కూష్మాణ్డాస్తే ప్రణశ్యన్తు విష్ణుచక్రరవాహతాః ॥12॥

నామనసును సరిగా ప్రవర్తించకుండా నిరోధించేవాళ్లు, నాస్మరణశక్తిని పోగొట్టేవాళ్లు, నాబలాన్నీ పరాక్రమాన్నీ నాశనం చేసేవాళ్లు, నా తేజస్సును పోగొట్టేవాళ్లు, నా సుఖానుభవాలను పాడుచేసేవాళ్లు, నా శుభలక్షణాలను నాశనం చేసేవాళ్ళైన కూష్మాండులనే పిశాచాలు సుదర్శనచక్రం ధ్వనితో దిమ్మతిరిగి, నాశనం అయిపోవాలి.

బుద్ధిస్వాస్థ్యం మనస్స్వాస్థ్యం స్వాస్థ్యమైన్ద్రియకం తథా ।
మమాస్తు దేవదేవస్య వాసుదేవస్య కీర్తనాత్ ॥13॥

దేవతలకు దేవుడైన వాసుదేవుడిని కీర్తించడంచేత నాబుద్ధికీ, మనస్సుకూ, ఇంద్రియాలకూ స్వస్థత కలుగును గాక!

పృష్ఠే పురస్తాన్మమ దక్షిణోత్తరే వికోణతశ్చాస్తు జనార్దనో హరిః ।
తమీడ్యమీశానమనన్తమచ్యుతం జనార్దనం ప్రణిపతితో న సీదతి ॥14॥

జనార్దనుడు నాకు వెనుక, ముందు, ఎడమవైపున, కుడివైపున, మూలదిక్కులలోనూ సన్నిహితుడై యుండుగాక! స్తుతింపదగినవాడు, అందరికీ ప్రభువు, అంతం లేనివాడు, ఎప్పటికీ ఒకేవిధంగా ఉండేవాడు, అయిన జనార్దనుని శరణువేడినవాడు ఎప్పటికీ కష్టపడదు. (నిత్యమూ సుఖసంతోషాలతో ఉంటాడు)

యథా పరం బ్రహ్మ హరిస్తథా పరో జగత్స్వరూపశ్చ స ఏవ కేశవః ।
సత్యేన తేనాచ్యుతనామకీర్తనాత్ ప్రణాశయేత్తు త్రివిధం మమాశుభమ్ ॥15॥

శ్రీహరి పరబ్రహ్మ అట్లే సర్వోత్తముడైన ఆ కేశవుడే ఈ జగత్తురూపంలోనూ ఉన్నాడు. ఆ సత్స్వరూపుని వలననూ, ఆ అచ్యుతుని నామసంకీర్తనంచేతనూ మనోవాక్కాయాలతో నేను చేసిన మూడువిధాలయిన పాపాలు నశించిపోవును గాక!

ఇత్యాది మహాపురాణే ఆగ్నేయే విష్ణుపఞ్జరకథనం నామ సప్తత్యధికద్విశతతమోఽధ్యాయః ॥270॥

అగ్నిమహాపురాణంలో విష్ణుపంజరకథనం అనే రెండువందల డెబ్బైయవ అధ్యాయం సమాప్తం.



ఏకసప్తత్యధికద్విశతతమోఽధ్యాయః – రెండువందల డెబ్బైఒకటవ అధ్యాయం

వేదశాఖాదికథనమ్ – వేదశాఖాదికథనం

పుష్కర ఉవాచ – పరశురాముడితో పుష్కరుడు ఇలా చెప్తున్నాడు.

సర్వానుగ్రాహకా మన్త్రాశ్చతుర్వర్గప్రసాధకాః ।
ఋగథర్వ తథా సామ యజుస్సఙ్ఖ్యా తు లక్షకమ్ ॥1॥

అందరినీ అనుగ్రహించే వేదమంత్రాలు ధర్మ,అర్థ,కామ,మోక్షాలనే నాలుగుపురుషార్థాలను సాధించిపెడ్తాయి. ఋగ్వేదం, అథర్వవేదం, సామవేదం, యజుర్వేదం అనేవి నాలుగు వేదాలు. వీటిలోని మంత్రాలసంఖ్య లక్ష.

భేదస్సాఙ్ఖ్యాయనశ్చైక ఆశ్వలాయనో ద్వితీయకః ।
శతాని దశ మన్త్రాణాం బ్రాహ్మణా ద్విసహస్రకమ్ ॥
ఋగ్వేదో హి ప్రమాణేన స్మృతో ద్వైపాయనాదిభిః ॥2॥

ఋగ్వేదంలో సాంఖ్యాయనం, ఆశ్వలాయనం అని రెండు భేదాలు. మొత్తం వెయ్యి మంత్రాలలో బ్రాహ్మణాలలోని మంత్రాలు రెండువేలు. ద్వైపాయనుడు మొదలైన మహర్షులు ఋగ్వేదాన్ని ప్రమాణంగా స్వీకరించారు.

ఏకోనద్విసహస్రం తు మన్త్రాణాం యజుషస్తథా ।
శతాని దశ విప్రాణాం షడశీతిశ్చ శాఖికాః ॥3॥

యజుర్వేదంలో ఒకటి తక్కువగా రెండువేల(1999)మంత్రాలు ఉన్నాయి. యజుర్వేదబ్రాహ్మణాలలో వెయ్యిమంత్రాలు ఉన్నాయి. యజుర్వేదానికి ఎనభైఆరు శాఖలు ఉన్నాయి.

కాణ్వీ మాధ్యన్దినీ సంజ్ఞా కఠీ మాధ్యకఠీ తథా ।
మైత్రాయణీ చ సంజ్ఞా చ తైత్తిరీయాభిధానికా ॥
వైశమ్పాయనికేత్యాద్యాశ్శాఖా యజుషి సంస్థితాః ॥4॥

యజుర్వేదానికి కాణ్వి, మాధ్యందిని, కఠి, మాధ్యకఠి, మైత్రాయణి, తైత్తిరీయం, వైశంపాయనికం, మొదలైన శాఖలున్నాయి.

సామ్నః కౌథుమసంజ్ఞైకా ద్వితీయాథర్వణాయనీ ।
గానాన్యపి చ చత్వారి వేద ఆరణ్యకం తథా ॥5॥

ఉక్థా ఊహ చతుర్థం చ మన్త్రా నవసహస్రకాః ।
స చతుశ్శతకాశ్చైవ బ్రహ్మసఙ్ఘటకా స్స్మృతాః ॥
పఞ్చవింశతిరేవాత్ర సామమానం ప్రకీర్తితమ్ ॥6॥

సామవేదంలో కౌథుమం, ఆథర్వణాయని అని రెండు శాఖలు ఉన్నాయి. సామంలో గానాలు నాలుగు. అవి 1. వేదం, 2. ఆరణ్యకం, 3. ఉక్థం, 4. ఊహం. సామవేదంలో మంత్రాలు తొమ్మిదివేల, నాలుగువందల, ఇరవై అయిదు (9425). ఈవిధంగా సామవేదం పరిమాణం వివరింపబడింది.

సుమన్తుర్జాబలిశ్చైవ శ్లోకాయనిరథర్వకే ।
శౌనకః పిప్పలాదశ్చ ముఞ్జకేశాదయోఽపరే॥7॥

సుమంతుడు, జాబలి, శ్లోకాయని, శౌనకుడు, పిప్పలాదుడు, ముంజకేశుడు మొదలైనవారు అథర్వవేదానికి సంబంధించిన ఋషులు.

మన్త్రాణామయుతం షష్టిశతం చోపనిషచ్ఛతమ్ ॥8॥

అథర్వవేదంలో మంత్రాలు పదహారువందలు **(16000)**. ఉపనిషత్తులు వంద.

వ్యాసరూపీ స భగవాఞ్ఛాఖాభేదాద్యకారయత్ ।
శాఖాభేదాదయో విష్ణురితిహాసః పురాణకమ్ ॥9॥

వ్యాసరూపంలో శ్రీమహావిష్ణువు వేదశాఖలను ఏర్పరిచాడు. ఆ శాఖలభేదాలు, ఇతిహాసం, పురాణం మొదలైనవి విష్ణుస్వరూపాలు.

ప్రాప్య వ్యాసాత్పురాణాది సూతో వై లోమహర్షణః ॥10॥

సూతుడయిన లోమహర్షణుడు వ్యాసభగవానుడినుండి పురాణాదులను పొంది, లోకంలో ప్రచారం చేశాడు.

సుమతిశ్చాగ్నివర్చాశ్చ మిత్రయుశ్శింశపాయనః ।
కృతవ్రతోఽథ సావర్ణిష్షట్ శిష్యాస్తస్య చాభవన్ ॥11॥

లోమహర్షణుడికి సుమతి, అగ్నివర్చసుడు, మిత్రయుడు, శింశపాయనుడు, కృతవ్రతుడు, సావర్ణి, అని ఆరుగురు శిష్యులున్నారు.

శింశపాయనాదయశ్చక్రుః పురాణానాం తు సంహితాః ॥12॥

శింశపాయనుడు మొదలైనవారు పురాణాలకు సంహితలను నిర్మించారు.

బ్రహ్మాదీని పురాణాని హరివిద్యా దశాష్ట చ ।

బ్రాహ్మం మొదలైనవి పురాణాలు. ఈ పురాణాలు శ్రీహరివిద్యలు. ఇటువంటి పురాణాలు పద్దెనిమిది.

మహాపురాణే హ్యాగ్నేయే విద్యారూపో హరిః స్థితః ॥
సప్రపఞ్చో నిష్ప్రపఞ్చో మూర్తామూర్తస్వరూపధృక్ ॥13॥

మహాపురాణమైన ఆగ్నేయం (అగ్నిపురాణం) లో విద్యారూపుడైన శ్రీహరి సప్రపంచమూ, నిష్ప్రపంచమూ, అలాగే మూర్తమూ అమూర్తమూ అయిన రూపం ధరించి ఉన్నాడు.

తం జ్ఞాత్వాభ్యర్చ్య సంస్తూయ, భుక్తిముక్తిమవాప్నుయాత్ ॥14॥

ఆ పురాణంలోని శ్రీమహావిష్ణువును తెలుసుకుని చక్కగా పూజించి, స్తుతించినవాడు భోగాలనూ, మోక్షాన్నీ పొందుతాడు.

విష్ణుర్జిష్ణుర్భవిష్ణుశ్చ అగ్నిసూర్యాదిరూపవాన్ ।
అగ్నిరూపేణ దేవాదేర్ముఖం విష్ణుః పరా గతిః ॥15॥

విష్ణువున కెప్పుడూ విజయాలే. అతడు సృష్టి చేసేవాడు. అగ్ని, సూర్యుడు మొదలైన రూపాలు కలిగి ఉంటాడు. విష్ణువు అగ్నిరూపంలో దేవతలు మొదలైన వారిముఖంలో ఉంటాడు (అగ్నిముఖా వై దేవాః). ఆ విష్ణువే అందరూ పొందవలసిన ఉత్తమస్థానం.

వేదేషు స పురాణేషు యజ్ఞమూర్తిశ్చ గీయతే ।
ఆగ్నేయాఖ్యం పురాణం తు రూపం విష్ణోర్మహత్తరమ్ ॥16॥

ఆ విష్ణువే వేదాలలోనూ, పురాణాలలోనూ యజ్ఞమూర్తిగా స్తుతించబడ్డాడు. ఆగ్నేయం అనేపేరు గలిగిన పురాణం (అగ్నిపురాణం) మాత్రం మిక్కిలి మహిమాన్వితమైన శ్రీమహావిష్ణువురూపమే.

ఆగ్నేయాఖ్యపురాణస్య కర్తా శ్రోతా జనార్దనః ।
తస్మాత్పురాణ మాగ్నేయం సర్వవేదమయం మహత్ ॥17॥

అగ్నిమహాపురాణాన్ని చెప్పినవాడూ, విన్నవాడూ కూడా జనార్దనుడే. అందుచేత ఈ అగ్నిపురాణం సమస్తమైన వేదాల స్వరూపం. మహిమాన్వితం.

సర్వవిద్యామయం పుణ్యం సర్వజ్ఞానమయం వరమ్ ।
సర్వాత్మహరిరూపం హి పఠతాం శృణ్వతాం నృణామ్ ॥18॥

సమస్తమైన విద్యలూ అగ్నిపురాణమే. పుణ్యప్రదం. సమస్తమైన జ్ఞానాలు ఆగ్నిపురాణమే. ఇది శ్రేష్ఠం. ఈ అగ్నిపురాణం చదివినా, లేదా విన్నా, మానవులకూ, సర్వమూ తన స్వరూపమే అయిన శ్రీహరిని గ్రహించినట్లే.

విద్యార్థినాం చ విద్యాదమర్థినాం శ్రీధనప్రదమ్ ।
రాజ్యార్థినాం రాజ్యదం చ ధర్మదం ధర్మకామినామ్ ॥19॥

చదివినా, విన్నా, ఈ అగ్నిపురాణం విద్యార్థులకు విద్య నిస్తుంది. ధనం కోరుకున్నవారికి ధనం ఇస్తుంది. రాజ్యం కోరుకున్నవారికి రాజ్యం ఇస్తుంది. ధర్మం కోరుకున్నవారికి ధర్మం ఇస్తుంది.

స్వర్గార్థినాం స్వర్గదం తు పుత్రదం పుత్రకామినామ్ ।
గవాదికామినాం గోదం గ్రామదం గ్రామకామినామ్ ॥20॥

స్వర్గం కోరుకున్నవారికి స్వర్గాన్ని ఇస్తుంది. పుత్రులను కోరుకున్నవారికి పుత్రుల నిస్తుంది. ఆవులు మొదలైన వాటిని కోరుకున్నవారికి ఆవుల నిస్తుంది. గ్రామం కోరుకున్నవారికి గ్రామాన్ని ఇస్తుంది.

కామార్థినాం కామదం చ సర్వసౌభాగ్యసమ్ప్రదమ్ ।
గుణకీర్తిప్రదం నృణాం జయదం జయకామినామ్ ॥21॥

కామం కావలసినవారికి కామం ఇస్తుంది. మానవులందరికీ (కోరుకున్నా, కోరుకోకపోయినా) సమస్తమైన సౌభాగ్యాలనూ సమగ్రంగా ఇస్తుంది. మంచిగుణాలనూ, గొప్పకీర్తినీ ఇస్తుంది. విజయం కావలసినవారికి విజయం ఇస్తుంది.

సర్వేప్సూనాం సర్వదం తు ముక్తిదం ముక్తికామినామ్ ।
పాపఘ్నం పాపకర్తౄణామాగ్నేయం హి పురాణకమ్ ॥22॥

సమస్తమూ కావాలనుకున్న వారికి సమస్తమూ ఇస్తుంది. మోక్షం కోరుకున్నవారికి మోక్షం ఇస్తుంది. ఈ అగ్నిపురాణం చదివినవారికీ, విన్నవారికీ వారివారి పాపాల నన్నింటినీ నాశనం చేస్తుంది.

ఇత్యాది మహాపురాణే ఆగ్నేయే వేదశాఖాదికథనం నా మైకసప్తత్యధికద్విశతతమోఽధ్యాయః ॥271॥

అగ్నిమహాపురాణంలో వేదశాఖాదికథనం అనే రెండువందల డెబ్బైఒకటవ అధ్యాయం సమాప్తం.



ద్విసప్తత్యధికద్విశతతమోఽధ్యాయః - రెండువందల డెబ్బైరెండవ అధ్యాయం

పురాణదానాదిమాహాత్మ్యకథనమ్ - పురాణదానాదిమాహాత్మ్యకథనం

పుష్కర ఉవాచ - పరశురాముడితో పుష్కరుడు ఇలా చెప్తున్నాడు.

బ్రహ్మణాభిహితం పూర్వం యావన్మాత్రం మరీచయే ।
లక్షార్ధార్ధంతు తద్ బ్రాహ్మం లిఖిత్వా సమ్ప్రదాపయేత్ ॥
వైశాఖ్యాం పౌర్ణమాస్యాఞ్చ స్వర్గార్థీ జలధేనుమత్ ॥1॥

పూర్వం బ్రహ్మదేవుడు మరీచిమహర్షికి (1) బ్రహ్మపురాణాన్ని చెప్పాడు. అందులో యాభైవేల శ్లోకాలు ఉన్నాయి. స్వర్గలోకానికి పోవాలని కోరుకునేవాడు బ్రహ్మపురాణం ప్రతిని చక్కగా వ్రాసి, వైశాఖమాసంలో పూర్ణిమనాడు జలధేనువుతో కలిపి బ్రాహ్మణుడికి దానం చేయాలి.

పాద్మం ద్వాదశసాహస్రం జ్యేష్ఠే దద్యాచ్చ ధేనుమత్ ॥2॥

(2) పద్మపురాణంలో పన్నెండువేలశ్లోకా లున్నాయి. పద్మపురాణం ప్రతిని వ్రాసి, ఆవుతో సహా, జ్యేష్ఠమాసంలో పూర్ణిమనాడు దానం చేయాలి.

వరాహకల్పవృత్తాన్తమధికృత్య పరాశరః ।
త్రయోవింశతిసాహస్రం వైష్ణవం ప్రాహ చార్పయేత్ ॥
జలధేనుమథాషాఢ్యాం విష్ణోః పదమవాప్నుయాత్ ॥3॥

పరాశరమహర్షి వరాహకల్పానికి సంబంధించిన వృత్తాంతాన్ని పదమూడువేల శ్లోకాలలో (3) విష్ణుపురాణంగా రచించాడు. ఆ విష్ణుపురాణం ప్రతిని వ్రాసి, జలధేనువుతో కలిపి, ఆషాఢమాసంలో పూర్ణిమనాడు బ్రాహ్మణుడికి దానం చేయాలి. అలా దానం చేసినవాడు వైకుంఠానికి వెళ్తాడు.

చతుర్దశ సహస్రాణి వాయవీయం హరిప్రియమ్ ।
శ్వేతకల్పప్రసఙ్గేన ధర్మాన్వాయురిహాబ్రవీత్ ॥4॥

(4) వాయుపురాణంలో పద్నాలుగువేల శ్లోకాలు ఉన్నాయి. ఇది విష్ణుమూర్తికి చాల ఇష్టమైన పురాణం. శ్వేతకల్పం గురించి ప్రసంగించే సందర్భంలో వాయువు ఇందులో వివిధధర్మాలను వివరించాడు.

దద్యాల్లిఖిత్వా తద్విప్రే శ్రావణ్యాం గుడధేనుమత్ ॥5॥

వాయుపురాణం ప్రతిని వ్రాసి, బెల్లంతో నిర్మించిన ధేనువుతో కలిపి, శ్రావణమాసంలో పూర్ణిమనాడు బ్రాహ్మణుడికి దానం చేయాలి.

యత్రాధికృత్య గాయత్రీం కీర్త్యతే ధర్మవిస్తరః ।
వృత్రాసురవధోపేతం తద్భాగవతముచ్యతే ॥6॥

గాయత్రీమంత్రాన్ని ఆధారంగా చేసుకుని, వివిధధర్మాలను విస్తారంగా వర్ణించినదీ, వృత్రుడు అనే రాక్షసుడిని ఇంద్రుడు సంహరించడం అనే వృత్తాంతంతో కూడినదీ అయిన పురాణాన్ని భాగవతం అంటారు.

సారస్వతస్య కల్పస్య ప్రౌష్ఠపద్యాం తు తద్దదేత్ ।
అష్టాదశ సహస్రాణి హేమసింహాసమన్వితమ్ ॥7॥

సారస్వతకల్పానికి సంబంధించిన ధర్మాలు చెప్పబడిన ఈ భాగవతపురాణంలో పద్దెనిమిదివేల శ్లోకాలున్నాయి. (5) భాగవతపురాణం ప్రతిని చక్కగా వ్రాసి, బంగారుసింహాసనంపై ఉంచి, ఆ సింహాసనంతో సహా భాద్రపదమాసంలో పూర్ణిమనాడు బ్రాహ్మణుడికి దానం చేయాలి.

యత్రాహ నారదో ధర్మాన్ బృహత్కల్పాశ్రితానిహ ।
పఞ్చవింశసహస్రాణి నారదీయం తదుచ్యతే ॥8॥

బృహత్కల్పానికి సంబంధించిన ధర్మాలను నారదమహర్షి ఇరవైఅయిదువేల శ్లోకాలలో వర్ణించాడు. దానిని (6) నారదీయ పురాణం అంటారు.

స ధేనుం చాశ్వినే దద్యాత్ సిద్ధిమాత్యన్తికీం లభేత్ ॥9॥

నారదీయపురాణం ప్రతిని వ్రాసి, ఆశ్వియుజమాసంలో పూర్ణిమనాడు ఆవుతో కలిపి బ్రాహ్మణుడికి దానం చేయాలి. ఇలా చేసినవాడు అత్యుత్తమమైన(మోక్ష)ఫలాన్ని పొందుతాడు.

యత్రాధికృత్య శత్రూణాం ధర్మాధర్మవిచారణా ।
కార్తిక్యాం నవసాహస్రం మార్కణ్డేయమథార్పయేత్ ॥10॥

(7) మార్కండేయపురాణంలో తొమ్మిదివేల శ్లోకాలు ఉన్నాయి. అందులో శత్రువులకు సంబంధించిన ధర్మం అధర్మం అనేవాటిని గురించి విస్తారంగా విచారణ చేయడం జరిగింది. ఆ మార్కండేయపురాణం ప్రతిని వ్రాసి, కార్తికమాసంలో పూర్ణిమనాడు బ్రాహ్మణుడికి దానం చేయాలి.

అగ్నినా యద్వసిష్ఠాయ ప్రోక్తం చాగ్నేయమేవ తత్ ।
*** Ï Ô Ç| Ŭ Ÿ£ < š ‘ ‹ఉ_న్మార్గశీర్ష్యాం స సర్వదః ॥11॥**

వసిష్ఠమహర్షికి అగ్నిదేవుడు చెప్పినపురాణం (8) ఆగ్నేయం (అగ్నిపురాణం). అగ్నిపురాణం ప్రతిని వ్రాసి, మార్గశీర్షమాసంలో పూర్ణిమనాడు బ్రాహ్మణుడికి దానం చేయాలి. అలా దానం చేయడంవలన సమస్తమూ సిద్ధిస్తాయి.

ద్వాదశైవ సహస్రాణి సర్వవిద్యావబోధనమ్ ॥12॥

అగ్నిపురాణంలో పన్నెండువేలశ్లోకాలు ఉన్నాయి. ఇవి సమస్తవిద్యలను గూర్చి సమగ్రంగా తెలియజేస్తాయి.

చతుర్దశ సహస్రాణి భవిష్యం సూర్యసమ్భవమ్ ।
భవస్తు మనవే ప్రాహ దద్యాత్ పౌష్యాం గుడాదిమత్ ॥13॥

(9) భవిష్యపురాణం సూర్యుడివలన ఏర్పడింది. ఇందులో పద్నాలుగువేలశ్లోకాలు ఉన్నాయి. ఈ పురాణాన్ని పరమేశ్వరుడు మనువుకు చెప్పాడు. దీనిని వ్రాసి, బెల్లం మొదలైన వాటితో సహా, పుష్యమాసంలో పూర్ణిమనాడు బ్రాహ్మణుడికి దానం చేయాలి.

సావర్ణినా నారదాయ బ్రహ్మవైవర్తమీరితమ్ ।
రథన్తరస్య వృత్తాన్తమష్టాదశసహస్రకమ్ ॥
మాఘ్యాం దద్యాద్వరాహస్య చరితం బ్రహ్మలోకభాక్ ॥14॥

నారదుడికి సావర్ణి చెప్పినది (10) బ్రహ్మవైవర్తం అనే పురాణం. ఇందులో రథంతర కల్పానికి సంబంధించిన వృత్తాంతం చెప్పబడింది. ఇందులో పద్దెనిమిదివేలశ్లోకాలు ఉన్నాయి. బ్రహ్మవైవర్తపురాణం ప్రతిని వ్రాసి, మాఘపూర్ణిమనాడు బ్రాహ్మణుడికి దానం చేయాలి. ఈ పురాణంలో వరాహానికి సంబంధించిన చరిత్ర ఉన్నది. దీనివలన బ్రహ్మలోకం చేరడానికి అర్హత వస్తుంది.

యత్రాగ్నిలిఙ్గమధ్యస్థో ధర్మాన్ ప్రాహ మహేశ్వరః ।
ఆగ్నేయకల్పే తల్లిఙ్గమేకాదశసహస్రకమ్ ॥
తద్దత్వా శివమాప్నోతి ఫాల్గున్యాం తిలధేనుమత్ ॥15॥

అగ్నిలింగంలో ఉన్న పరమేశ్వరుడు వివిధధర్మాలను వివరించాడు. ఇందులో ఆగ్నేయకల్పానికి సంబంధించిన ధర్మాలు వివరింపబడ్డాయి. ఆ ధర్మాలతో కూడినదే (11) లింగమహాపురాణం. ఇందులో పదకొండువేల శ్లోకాలు ఉన్నాయి. దీనిప్రతిని వ్రాసి, నువ్వులతో చేసిన ఆవుప్రతిమతో సహా, ఫాల్గునమాసంలో పూర్ణిమనాడు బ్రాహ్మణుడికి దానం చేయాలి. అలా దానం చేయడంవలన శుభం కలుగుతుంది.

చతుర్దశ సహస్రాణి వారాహం విష్ణునేరితమ్ ।
భూమౌ వరాహచరితం మానవస్య ప్రవృత్తితః ॥
సహేమ గారుడం చైత్ర్యాం పదమాప్నోతి వైష్ణవమ్ ॥16॥

(12) వరాహపురాణంలో పద్నాలుగువేల శ్లోకాలు ఉన్నాయి. వరాహపురాణాన్ని శ్రీమహావిష్ణువు భూదేవికి చెప్పాడు. దీనిలో మానవుడి స్వభావాదులతో సహా వరాహానికి సంబంధించినచరిత్ర ఉన్నది. వరాహపురాణం ప్రతిని వ్రాసి, బంగారపు గరుత్మంతుడి ప్రతిమతో సహా చైత్రమాసంలో పూర్ణిమనాడు బ్రాహ్మణుడికి దానం చేయాలి. అలా చేసినవాడు వైకుంఠానికి వెళ్తాడు.

చతురశీతిసాహస్రం స్కాన్దం స్కన్దేరితం మహత్ ।
అధికృత్య స ధర్మాంశ్చ కల్పే తత్పురుషేఽర్పయేత్ ॥17॥

స్కందుడు చెప్పినది (13) స్కాందపురాణం. ఇందులో ఎనభైనాలుగువేలశ్లోకాలు ఉన్నాయి. ఇందులో వివిధధర్మాలను గురించి వివరించడం జరిగింది. తత్పురుషకల్పంలోని వృత్తాంతాలనూ ధర్మాలనూ వివరించిన స్కాందపురాణం ప్రతిని వ్రాసి బ్రాహ్మణుడికి దానం చేయాలి.

వామనం దశసాహస్రం భౌమకల్పే హరేః కథామ్ ।
దద్యాచ్ఛరది విషువే ధర్మార్థాదినిబోధనమ్ ॥18॥

(14) వామనపురాణంలో పదివేలశ్లోకాలు ఉన్నాయి. ఇది భౌమం అనే కల్పానికి సంబంధించినది. శ్రీమహావిష్ణువు కథలతో కూడి ఉంటుంది. ధర్మం అర్థం మొదలైన పురుషార్థాలను చక్కగా తెలియజేస్తుంది. దీనిని శరదృతువులోనూ, విషువం (మేషతులారాశులప్రథమాంశసమయం) బ్రాహ్మణుడికి దానం చేయాలి.

కూర్మం చాష్టసహస్రం చ కూర్మోక్తం చ రసాతలే ।
ఇన్ద్రద్యుమ్నప్రసఙ్గేన దద్యాత్తద్ధేమకూర్మవత్ ॥19॥

(15) కూర్మపురాణంలో ఎనిమిదివేలశ్లోకాలు ఉన్నాయి. దీనిని కూర్మరూపంలో ఉన్నవిష్ణువు ఇంద్రద్యుమ్నుడిని గురించి చెప్పేసందర్భంలో పాతాళలోకంలో చెప్పాడు. కూర్మపురాణం ప్రతిని వ్రాసి, బంగారుతాబేలుప్రతిమతో కలిపి, బ్రాహ్మణుడికి దానం చేయాలి.

త్రయోదశ సహస్రాణి మాత్స్యం కల్పాదితోఽబ్రవీత్ ।
మత్స్యో హి మనవే దద్యాద్విషువే హేమమత్స్యవత్ ॥20॥

(16) మత్స్యపురాణంలో పదమూడువేలశ్లోకాలు ఉన్నాయి. దీనిని సృష్టిప్రారంభంలో మత్స్యరూపంలో ఉన్న శ్రీమహావిష్ణువు మనువుకు చెప్పాడు. మత్స్యపురాణం ప్రతిని వ్రాసి, బంగారుచేపప్రతిమతో కలిపి, విషువ సమయంలో బ్రాహ్మణుడికి దానం చేయాలి.

గారుడం చాష్టసాహస్రం విష్ణూక్తం తార్క్ష్యకల్పకే ।
విశ్వాణ్డాద్గరుడోత్పత్తిం త ద్దద్యాద్ధేమహంసవత్ ॥21॥

(17) గరుడపురాణంలో ఎనిమిదివేలశ్లోకాలు ఉన్నాయి. గరుడపురాణాన్ని గరుత్మత్కల్పంలో శ్రీమహావిష్ణువు చెప్పాడు. బ్రహ్మాండంనుండి గరుడుడు పుట్టినవిధానం మొదలైన అంశాలు ఇందులో ఉన్నాయి. గరుడపురాణం ప్రతిని వ్రాసి, బంగారుహంస ప్రతిమతో కలిపి, బ్రాహ్మణుడికి దానం చేయాలి.

బ్రహ్మా బ్రహ్మాణ్డమాహాత్మ్యమధికృత్యాబ్రవీత్తు యత్ ।
తచ్చ ద్వాదశసాహస్రం బ్రహ్మాణ్డం త ద్ద్విజేఽర్పయేత్ ॥22॥

(18) బ్రహ్మాండపురాణాన్ని బ్రహ్మదేవుడు బ్రహ్మాండమహిమలను గురించి చెప్పాడు. బ్రహ్మాండపురాణంలో పన్నెండువేల శ్లోకాలు ఉన్నాయి. బ్రహ్మాండపురాణం ప్రతిని వ్రాసి, బ్రాహ్మణుడికి దానం చేయాలి. (ఈవిధంగా పద్దెనిమిదిపురాణాలను వ్రాసి దానం చేసేవిధానం చెప్పడం జరిగింది)

భారతే పర్వసమాప్తౌ వస్త్రగన్ధస్రగాదిభిః ।
వాచకం పూజయేదాదౌ భోజయేత్పాయసైర్ద్విజాన్ ॥23॥

భారతం వినేసమయంలో పర్వం పూర్తి అయిన ప్రతిసారీ నూతనవస్త్రాలు, సుగంధాలు, పూలమాలలు మొదలైన వాటితో భారతం వినిపించే పౌరాణికుడిని (తరువాతిపర్వం ప్రారంభించడానికి) ముందుగా పూజించాలి. ఆ తరువాత పాయసాలు మొదలైనవాటితో బ్రాహ్మణులకు తృప్తిగా భోజనం పెట్టాలి.

గోభూగ్రామసువర్ణాది దద్యాత్పర్వణి పర్వణి ॥24॥

ప్రతిపర్వానికీ ఆ పర్వం పూర్తి అయిన తరువాత ఆవులు, భూమి, గ్రామాలు, బంగారం మొదలైన వాటిని దానం చేయాలి.

సమాప్తే భారతే విప్రం సంహితాపుస్తకం యజేత్ ।
శుభే దేశే నివేశ్యాథ క్షౌమవస్త్రాదినా వృతమ్ ॥25॥

భారతం మొత్తం చెప్పడం పూర్తి అయిన తరువాత ఆ చెప్పిన బ్రాహ్మణుడినీ, భారతగ్రంథాన్ని పూజించాలి. భారతగ్రంథాన్ని శుభ్రమైన తెల్లనివస్త్రంతో చుట్టి, పవిత్రమైన ప్రదేశంలో ఉంచి పూజించాలి.

నరనారాయణౌ పూజ్యౌ పుస్తకం కుసుమాదిభిః ।
గోఽన్నభూహేమ దత్త్వాథ భోజయిత్వా క్షమాపయేత్ ॥26॥

నరుడినీ, నారాయణుడినీ, పుష్పం, ధూపం మొదలైనవాటితో పూజించాలి. అలాగే భారతగ్రంథాన్ని కూడా పూజించాలి. ఆపిదప ఆవులు, భూమి, బంగారం దానం చేయాలి. అందరికీ భోజనాలు పెట్టాలి. కార్యక్రమంలోని లోటుపాట్లను మన్నించమని ప్రార్థించాలి.

మహాదానాని దేయాని రత్నాని వివిధాని చ ।
మాషకౌ ద్వౌ త్రయశ్చైవ మాసే మాసే ప్రదాపయేత్ ॥27॥

పురాణం చెప్పినవారికి కోరుకున్నదానిని దానం చేయాలి. రకరకాలయిన రత్నాలను కూడా దానం చేయాలి. నెలనెలా అతడికి రెండు లేదా మూడు మినపగింజలఎత్తు బంగారం ఇవ్వాలి.

అయనాదౌ శ్రావకస్య దానమాదౌ విధీయతే ।
శ్రోతృభిస్సకలైః కార్యం శ్రావకే పూజనం ద్విజ ॥28॥

బ్రాహ్మణోత్తమా! పరశురామా! అయనం మొదలైనవి ప్రారంభం అయిన సమయంలో కూడ ముందుగా పురాణం వినిపించినవాడికి తప్పకుండా దానం చేయాలని చెప్పబడింది. పురాణం విన్నవాళ్లందరూ పురాణం చెప్పినవాడిని తప్పకుండా పూజించాలి.

ఇతిహాసపురాణానాం పుస్తకాని ప్రయచ్ఛతి ।
పూజయిత్వాయురారోగ్యం స్వర్గమోక్షమవాప్నుయాత్ ॥29॥

ఇతిహాసగ్రంథాలనూ, పురాణగ్రంథాలనూ ప్రతులు వ్రాసి, బ్రాహ్మణులను పూజించి, వారికి దానం చేస్తే, ఆయువు, పెరుగుతుంది. ఆరోగ్యం కలుగుతుంది. తరువాత స్వర్గమూ, ఆ తరువాత మోక్షమూ కలుగుతాయి.

ఇత్యాది మహాపురాణే ఆగ్నేయే పురాణదానాదిమాహాత్మ్యకథనం నామ ద్విసప్తత్యధికద్విశతతమోఽధ్యాయః ॥272॥

అగ్నిమహాపురాణంలో పురాణదానాదిమాహాత్మ్యకథనం అనే రెండువందల డెబ్బైరెండవ అధ్యాయం సమాప్తం.



త్రిసప్తత్యధికద్విశతతమోఽధ్యాయః - రెండువందల డెబ్బైమూడవ అధ్యాయం

సూర్యవంశకథనమ్ - సూర్యవంశకథనం

అగ్నిరువాచ - వసిష్ఠమహర్షితో అగ్నిదేవుడు ఇలా చెప్తున్నాడు.

సూర్యవంశం సోమవంశం రాజ్ఞాం వంశం వదామి తే ।
హరేర్బ్రహ్మా పద్మగోఽభూన్మరీచిర్బ్రహ్మణ స్సుతః ॥1॥

వశిష్ఠమహర్షీ! రాజులకు సంబంధించిన సూర్యవంశం, సోమవంశాలలో ముందుగా సూర్యవంశం రాజులను గురించి నీకు చెప్తాను. శ్రీమహావిష్ణువు నాభినుండి వెలువడిన తామరపూవునుండి బ్రహ్మ జన్మించాడు. బ్రహ్మ కుమారుడు మరీచి.

మరీచేః కశ్యపస్తస్మాద్వివస్వాంస్తస్య పత్న్యపి ।
సంజ్ఞా రాజ్ఞీ ప్రభా తిస్రో రాజ్ఞీ రైవతపుత్రికా ॥2॥

మరీచికి కశ్యపుడు జన్మించాడు. కశ్యపుడికి వివస్వంతుడు పుట్టాడు. ఆ వివస్వంతుడికి సంజ్ఞ, రాజ్ఞి, ప్రభ అని ముగ్గురు భార్యలు. వారిలో రాజ్ఞి అనే ఆమె రైవతుడికూతురు.

రేవన్తం సుషువే పుత్రం ప్రభాతంచ ప్రభా రవేః ।
త్వాష్ట్రీ సంజ్ఞా మనుం పుత్రం యమలౌ యమునాం యమమ్ ॥3॥

రాజ్ఞి రేవంతుడు అనే కుమారుడిని ప్రసవించింది. వివస్వంతుడిభార్య అయిన ప్రభ ప్రభాతుడు అనేవాడిని కన్నది. త్వష్ట కుమార్తె అయిన సంజ్ఞ మనువు అనే కుమారుడిని, యముడు, యమున అనే కవలపిల్లలను కన్నది.

ఛాయా సంజ్ఞా చ సావర్ణిం మనుం వైవస్వతం సుతమ్ ।
శనించ తపతీం విష్టిం సంజ్ఞాయాంచాశ్వినౌ పునః ॥4॥

ఛాయ అనే రూపంలో సంజ్ఞ వివస్వంతుడివలన సావర్ణి అనే మనువును కన్నది. తరువాత శని, తపతి అనేవారిని కూడా కన్నది. సంజ్ఞకు తిరిగి అశ్వినీకుమారులు కలిగారు.

మనో ర్వైవస్వతస్యాసన్ పుత్రా వై నవ తత్సమాః ।
ఇక్ష్వాకుశ్చైవ నాభాగో ధృష్టశ్శర్యాతిరేవ(ః) చ ॥5॥

వైవస్వతుడు అనే మనువుకు తొమ్మిదిమంది కుమారులు. వీరందరూ వైవస్వంతుడితో సమానమైనవారు. వైవస్వతుడి కుమారులు 1.ఇక్ష్వాకువు, 2. నాభాగుడు, 3. ధృష్టుడు, 4. శర్యాతి, 5. రేవుడు,

నరిష్యన్తస్తథా ప్రాంశుర్నాభాగాద్యష్టసత్తమాః ।
కరూషశ్చ పృషధ్రశ్చ అయోధ్యాయాం మహాబలాః ॥6॥

6. నరిష్యంతుడు, 7. ప్రాంశువు, 8. కరూషుడు, 9. పృషధ్రుడు. నాభాగుడు మొదలైన ఎనిమిదిమంది శ్రేష్ఠులు. వీరందరూ అయోధ్యనుండి పాలించేవారు. మిక్కిలి బలవంతులు.

కన్యేలా చ మనోరాసీద్బుధాత్తస్యాం పురూరవాః ।
పురూరవసముత్పాద్య సేలా సుద్యుమ్నతాం గతా ॥7॥

ఇల అనే కన్య వైవస్వతమనువుకు కుమార్తె. ఆమెకు బుధుడివలన పురూరవుడు పుట్టాడు. పురూరవుడిని ప్రసవించిన తరువాత ఇలా సుద్యుమ్నుడు అనే మగవాడుగా మారింది.

సుద్యుమ్నాదుత్కలగయౌ వినతాశ్వ స్త్రయో నృపాః ।
ఉత్కలస్యోత్కలం రాష్ట్రం వినతాశ్వస్య పశ్చిమాః ॥
దిక్పూర్వా రాజవర్యస్య గయస్య తు గయా పురీ ॥8॥

సుద్యుమ్నుడికి ఉత్కలుడు, గయుడు, వినతాశ్వుడు అనే ముగ్గురు రాజకుమారులు కలిగారు. ఉత్కలుడు ఉత్కలం అనే రాజ్యాన్ని పాలించేవాడు. వినతాశ్వుడు పశ్చిమదిక్కులోని దేశాలను పరిపాలించేవాడు. రాజవరేణ్యుడైన గయుడు తూర్పుదిక్కులోని రాజ్యాలను పాలించేవాడు. గయమహారాజు గయ అనే నగరంలో (రాజధాని) ఉండేవాడు.

వశిష్ఠవాక్యాత్సుద్యుమ్నః ప్రతిష్ఠానమవాప హ ।
తత్పురూరవసే ప్రాదాత్ సుద్యుమ్నో రాజ్యమాప్య తు ॥9॥

వశిష్ఠుడి మాటమేరకు సుద్యుమ్నుడు ప్రతిష్ఠానం అనే నగరం వెళ్లాడు. సుద్యుమ్నుడు అక్కడ తాను సంపాదించిన (ప్రతిష్ఠానపురం రాజధాని అయిన) రాజ్యాన్ని పురూరవుడికి ఇచ్చాడు.

నరిష్యతశ్శకాః పుత్రా నాభాగస్య చ వైష్ణవః ।
అమ్బరీషః ప్రజాపాలో ధార్ష్టకం ధృష్టతః కులమ్ ॥10॥

నరిష్యంతుడికుమారులు శకులు. నాభాగుడికి గొప్పవిష్ణుభక్తుడైన అంబరీషుడు జన్మించాడు. అతడు ప్రజలను చక్కగా పాలించాడు. వైవస్వతుడి కుమారుడైన ధృష్టుడివలన ధార్ష్టకం అనే రాజవంశం ఏర్పడింది.

సుకన్యానర్తౌ శర్యాతే ర్వైరోహ్యా నర్తతో నృపః ।
ఆనర్తవిషయ శ్చాసీత్ పురీ చాసీత్కుశస్థలీ ॥11॥

వైవస్వతుడికుమారు డైన(4)శర్యాతికి సుకన్య, ఆనర్తుడు అనే సంతానం కలిగింది. ఆనర్తుడికి వైరోహ్యుడు అనే రాజకుమారుడు పుట్టాడు. ఆనర్తుడు పరిపాలించే రాజ్యానికి ఆనర్తదేశం అని పేరు. దానికి కుశస్థలి అనే నగరం రాజధాని.

రేవస్య రైవతః పుత్రః కకుద్మీ నామధార్మికః ।
జ్యేష్ఠఃపుత్రశతస్యాసీద్రాజ్యం ప్రాప్య కుశస్థలీమ్ ॥12॥

(వైవస్వతుడికుమారుడైన) (5) రేవుడికుమారుడు రైవతుడు. అతడికి కకుద్మి అని మరొకపేరు. అతడు మిక్కిలి ధర్మపరాయణుడు. రేవుడికుమారులు నూరుగురిలోనూ రైవతుడు పెద్దవాడు. అందుచేత కుశస్థలినగరం (ఆనర్తరాజ్యం) రైవతుడికి లభించింది.

స కన్యాసహితశ్శ్రుత్వా గాన్ధర్వం బ్రహ్మణోఽన్తికే ।
ముహూర్తభూతం దేవస్య మర్త్యే బహుయుగం గతమ్ ॥13॥

రైవతుడు ఒకసారి తన స్త్రీలతో కలిసి, బ్రహ్మలోకానికి వెళ్లాడు. అక్కడ గంధర్వగానం విన్నాడు. బ్రహ్మలోకంలో ఉన్న ఒక్కముహూర్తకాలం మానవలోకంలో అనేక యుగాలుగా గడిచిపోయింది.

ఆజగామ జవేనాథ స్వాం పురీం యాదవైర్వృతామ్ ॥14॥

అక్కడినుండి మిక్కిలివేగంగా తన కుశస్థలీనగరానికి (భూలోకానికి) తిరిగివచ్చాడు. ఆ నగరం యాదవులతో నిండిఉంది.

కృతాం ద్వారవతీం నామ బహుద్వారాం మనోరమామ్ ।
భోజవృష్ణ్యన్ధకైర్గుప్తాం వాసుదేవపురోగమైః ॥15॥

ఇప్పుడానగరం అనేకమైన ద్వారాలతో ద్వారవతి అనే పేరుతో మనోహరంగా ఉన్నది. వాసుదేవుడి నాయకత్వంలో నడుస్తున్న భోజ, వృష్ణి, అంధక వంశాలకు చెందినవాళ్లు ఆ నగరాన్ని రక్షిస్తున్నారు.

రేవతీం బలదేవాయ దదౌ జ్ఞాత్వా హ్యనిన్దితామ్ ।
తపస్సుమేరుశిఖరే తప్త్వా విష్ణ్వాలయం గతః ॥16॥

రేవతి ఉత్తమురాలు. ఆమెకు తగినవాడని గ్రహించి, ఆమెను బలరాముడికి ఇచ్చాడు. పిదప అతడు సుమేరుపర్వతం శిఖరంమీద తీవ్రమైన తపస్సు చేసి, వైకుంఠం చేరుకున్నాడు.

నాభాగస్య చ పుత్రౌ ద్వౌ వైశ్యౌ బ్రాహ్మణతాం గతౌ ।
కరూషస్య తు కారూషాః క్షత్రియా యుద్ధదుర్మదాః ॥17॥

(2) నాభాగుడికి ఇద్దరు కుమారులు. వారిద్దరూ వైశ్యులు. వారు బ్రాహ్మణధర్మాన్ని పొందారు.(8) కరూషిడి కుమారులు కారూషులు. వారు క్షత్రియులు. యుద్ధంలో అందర్నీ ఓడిస్తామనే దురహంకారం కలిగినవారు.

శూద్రత్వం చ పృషధ్రోఽగాద్ధింసయిత్వా గురోశ్చ గామ్ ।
మనుపుత్రాదథేక్ష్వాకోర్వికుక్షి ర్దేవరాడభూత్ ॥18॥

(9) పృషధ్రుడు తన గురువుగారి ఆవును హింసించి, దానికి ఫలితంగా శూద్రుడయినాడు. వైవస్వతమనువు కుమారుడైన(1) ఇక్ష్వాకుడికుమారుడు వికుక్షి. అతడు దేవతలకు రాజు అయినాడు.

వికుక్షేస్తు కకుత్‌స్థోఽభూత్ తస్య పుత్రస్సుయోధనః ।
తస్య పుత్రః పృథుర్నామ విశ్వగాశ్వః పృథోస్సుతః ॥19॥

వికుక్షికి కకుత్‌స్థుడు పుట్టాడు. కకుత్‌స్థుడికుమారుడు సుయోధనుడు. సుయోధనుడి కుమారుడిపేరు పృథువు. పృథువు కుమారుడు విశ్వగాశ్వుడు.

ఆయు స్తస్య చ పుత్రోఽభూద్యువనాశ్వ స్తథా సుతః ।
యువనాశ్వాచ్చ శ్రావస్తః పూర్వే శ్రావన్తికా పురీ ॥20॥

విశ్వగాశ్వుడికుమారుడు ఆయువు. ఆయువు కుమారుడు యువనాశ్వుడు. యువనాశ్వుడికుమారుడు శ్రావంతుడు. అతడు తూర్పుదిక్కున శ్రావంతిక అనే నగరం నిర్మించాడు.

శ్రావన్తాద్ బృహదశ్వోఽభూత్ కువలాశ్వ స్తతో నృపః ।
ధున్ధుమారత్వమగమద్ధున్ధో ర్నామ్నా చ వై పురా ॥21॥

శ్రావంతుడికి బృహదశ్వుడు పుట్టాడు. బృహదశ్వుడికి కువలాశ్వుడు జన్మించాడు. పూర్వం ధుంధువు అనే రాక్షసుడిని సంహరించడంచేత కువలాశ్వుడు ధుంధుమారుడు అని పేరు పొందాడు.

ధున్ధుమారాత్త్రయో భూపా దృఢాశ్వో దణ్డ ఏవ చ ।
కపిలోఽథ దృఢాశ్వాత్తు హర్యశ్వశ్చ ప్రమోదకః ॥22॥

ధుంధుమారుడికి దృఢాశ్వుడు, దండుడు, కపిలుడు అని ముగ్గురు రాజకుమారులు కలిగారు. వారిలో దృఢాశ్వుడికి హర్యశ్వుడు, ప్రమోదకుడు అనే కుమారులు జన్మించారు.

హర్యశ్వా చ్చ నికుమ్భోఽభూత్ సంహతాశ్వో నికుమ్భతః ।
అకృశాశ్వో రణాశ్వశ్చ సంహతాశ్వసుతావుభౌ ॥23॥

హర్యశ్వుడికి నికుంభుడు పుట్టాడు. నికుంభుడికి సంహతాశ్వుడు జన్మించాడు. సంహతాశ్వుడికి అకృశాశ్వుడు, రణాశ్వుడు అని ఇద్దరు కుమారులు.

యువనాశ్వో రణాశ్వస్య మాన్ధాతా యువనాశ్వతః ।
మాన్ధాతుః పురుకుత్సోఽభూన్ముచుకున్దో ద్వితీయకః ॥24॥

వారిలో రణాశ్వుడికి యువనాశ్వుడు పుట్టాడు. యువనాశ్వుడికి మాంధాత జన్మించాడు. మాంధాతకు మొదట పురుకుత్సుడు, తరువాత రెండవవాడుగా ముచుకుందుడు ఇద్దరు కుమారులు కలిగారు.

పురుకుత్సాత్త్రసద్దస్యుస్సమ్భూతో నర్మదాభవః ।
సమ్భూతస్య సుధన్వాభూత్ త్రిధన్వాథ సుధన్వనః ॥25॥

పురుకుత్సుడికి నర్మద అనే స్త్రీవలన సంభూతుడు అనేకుమారుడు కలిగాడు. అతడు శత్రువులను భయపెట్టేవాడు. సంభూతుడికి సుధన్వుడు పుట్టాడు. సుధన్వుడికి త్రిధన్వుడు పుట్టాడు.

త్రిధన్వనస్తు తరుణస్తస్య సత్యవ్రత స్సుతః ।
సత్యవ్రతాత్ సత్యరథో హరిశ్చన్ద్రశ్చ తత్సుతః ॥26॥

త్రిధన్వుడికి తరుణుడు పుట్టాడు. తరుణుడికుమారుడు సత్యవ్రతుడు. సత్యవ్రతుడికి సత్యరథుడు జన్మించాడు. సత్యరథుడి కుమారుడు హరిశ్చంద్రుడు.

హరిశ్చన్ద్రాద్రోహితాశ్వో రోహితాశ్వాద్ వృకోఽభవత్ ।
వృకాద్బాహుశ్చ బాహోశ్చ సగరస్తస్య చ ప్రియా ॥27॥

ప్రభా షష్టిసహస్రాణాం సుతానాం జననీ హ్యభూత్ ।
తుష్టాదౌర్వ్వాన్నృపా దేకం భానుమత్యసమఞ్జసమ్ ॥28॥

హరిశ్చంద్రుడికి రోహితాశ్వుడు పుట్టాడు. రోహితాశ్వుడికి వృకుడు జన్మించాడు. వృకుడికి బాహువు కలిగాడు. బాహువుకు సగరుడు పుట్టాడు. సగరుడికి ప్రియురాలయిన – ప్రభ, ఔర్వుడు అనే మహర్షిని సంతోషపెట్టి, అతడి అనుగ్రహంతో అరవైవేలమంది కుమారులకు తల్లి అయింది. సగరుడికి రెండవభార్య అయిన భానుమతి అసమంజసుడు అనే కుమారుడిని కన్నది.

ఖనన్తః పృథివీం దగ్ధాః కపిలేనాథ సాగరాః ।
అసమఞ్జసోఽంశుమాంశ్చ దిలీపోఽంశుమతోఽభవత్ ॥29॥

సగరుడికుమారులు అరవైవేలమంది భూమిని తవ్వుతూ, కపిలమహర్షివలన భస్మం అయినారు. అసమంజసుడికి అంశుమంతుడు జన్మించాడు. అంశుమంతుడికి దిలీపుడు కలిగాడు.

భగీరథో దిలీపాత్తు యేన గఙ్గావతారితా ।
భగీరథాత్తు నాభాగో నాభాగాదమ్బరీషకః ॥30॥

దిలీపుడికి భగీరథుడు పుట్టాడు. ఆ భగీరథుడు దేవతలగంగానదిని భూమిపైకి తెచ్చాడు. భగీరథుడికి నాభాగుడు జన్మించాడు. నాభాగుడికి అంబరీషుడు కలిగాడు.

సిన్ధుద్వీపోఽమ్బరీషాత్తు శ్రుతాయుస్తత్సుతస్స్మృతః ।
శ్రుతాయోర్ఋతపర్ణోఽభూత్ తస్య కల్మాషపాదకః ॥31॥

అంబరీషుడికి సింధుద్వీపుడు జన్మించాడు. సింధుద్వీపుడికుమారుడు శ్రుతాయువు. శ్రుతాయువుకు ఋతుపర్ణుడు కలిగాడు. ఋతుపర్ణుడికి కల్మాషపాదుడు జన్మించాడు.

కల్మాషాఙ్ఘేస్సర్వకర్మాహ్యనరణ్య స్తతోఽభవత్ ।
అనరణ్యా త్తు నిఘ్నోఽథ దిలీపస్తత్సుతోఽభవత్ ॥
తస్య రాజ్ఞో రఘుర్జజ్ఞే తత్సుతోఽపి హ్యజోఽభవత్ ॥32॥

కల్మాషపాదుడికి సర్వకర్ముడు పుట్టాడు. సర్వకర్ముడికి అనరణ్యుడు జన్మించాడు. అనరణ్యుడికి నిఘ్నుడు కలిగాడు. నిఘ్నుడికుమారుడు దిలీపుడు. ఆ దిలీపమహారాజుకు రఘువు జన్మించాడు. రఘుమహారాజుకు అజుడు కలిగాడు.

తస్మాద్దశరథోజాతస్తస్య పుత్రచతుష్టయమ్ ।
నారాయణాత్మకాస్సర్వే రామస్తస్యాగ్రజోఽభవత్ ॥33॥

అజుడికి దశరథుడు జన్మించాడు. ఆ దశరథమహారాజుకు నలుగురు కుమారులు కలిగారు. వారందరూ శ్రీమన్నారాయణాంశతో జన్మించారు. వారందరిలోనూ శ్రీరాముడు పెద్దవాడు.

రావణాన్తకరో రాజా హ్యయోధ్యాయాం రఘూత్తమః ।
వాల్మీకిర్యస్య చరితం చక్రే తన్నారదశ్రవాత్ ॥34॥

రఘువంశంలో శ్రేష్ఠుడైన శ్రీరాముడు రావణాసురుడిని సంహరించాడు. ఆ రాజు అయోధ్యలో ఉండి, రాజ్యమేలాడు. శ్రీరామచరిత్రను నారదుడివలన విని, వాల్మీకిమహర్షి దానిని శ్రీమద్రామాయణంగా కూర్చాడు.

రామపుత్రౌ కుశలవౌ సీతాయాం కులవర్ధనౌ ।
అతిథిశ్చ కుశాజ్జజ్ఞే నిషధస్తస్యచాత్మజః ॥35॥

శ్రీరాముడికి సీతాదేవియందు కుశుడు, లవుడు అనే కుమారులు కలిగారు. వారు వంశాన్ని చక్కగా వృద్ధిచేశారు. వారిలో కుశుడికి అతిథి పుట్టాడు. అతిథికి నిషధుడు జన్మించాడు.

నిషధాత్తు నలో జజ్ఞే నభోఽజాయత వై నలాత్ ।
నభసః పుణ్డరీకోఽభూత్ సుధన్వా తతోఽభవత్ ॥36॥

నిషధుడికి నలమహారాజు పుట్టాడు. నలుడికి నభుడు జన్మించాడు. నభుడికి పుండరీకుడు కలిగాడు. పుండరీకుడికి సుధన్వుడు జనించాడు.

సుధన్వనో దేవానీకో హ్యహీనాశ్వశ్చ తత్సుతః ।
అహీనాశ్వాత్సహస్రాశ్వశ్చన్ద్రాలోక స్తతో భవత్ ॥37॥

సుధన్వుడికి దేవానీకుడు జన్మించాడు. దేవానీకుడికుమారుడు అహీనాశ్వుడు. ఆ అహీనాశ్వుడికి సహస్రాశ్వుడు కలిగాడు. సహస్రాశ్వుడికి చంద్రాలోకుడు పుట్టాడు.

చన్ద్రావలోకత స్తారాపీడోఽస్మా చ్చన్ద్రపర్వతః ।
చన్ద్రగిరేర్భానురథశ్శ్రుతాయు స్తస్య చాత్మజః ॥38॥

చంద్రాలోకుడికి తారాపీడుడు కలిగాడు. తారాపీడుడికి చంద్రపర్వతుడు పుట్టాడు. చంద్రపర్వతుడికి భానురథుడు జన్మించాడు. భానురథుడికుమారుడు శ్రుతాయువు.

ఇక్ష్వాకువంశప్రభవాస్సూర్యవంశధరా స్స్మృతాః ॥39॥

ఇక్ష్వాకువంశంలో పుట్టినవారందరూ సూర్యవంశాన్ని నిలిపినవారుగా చెప్పబడుతారు.

ఇత్యాది మహాపురాణే ఆగ్నేయే సూర్యవంశకథనం నామ త్రిసప్తత్యధికద్విశతతమోఽధ్యాయః ॥273॥

అగ్నిమహాపురాణంలో సూర్యవంశకథనం అనే రెండువందల డెబ్బైమూడవ అధ్యాయం సమాప్తం.



చతుస్సప్తత్యధికద్విశతతమోఽధ్యాయః - రెండువందల డెబ్బైనాలుగవ అధ్యాయం

సోమవంశకథనమ్ - సోమవంశకథనం

అగ్ని రువాచ - వశిష్ఠమహర్షితో అగ్నిదేవుడు ఇలా చెప్తున్నాడు.

సోమవంశం ప్రవక్ష్యామి పఠితం పాపనాశనమ్ ॥ 1॥

ఇపుడు చంద్రవంశాన్ని గురించి చెప్తాను. దీనిని చదివిన మాత్రం చేతనే సమస్తపాపాలు నశించిపోతాయి.

విష్ణునాభ్యబ్జజో బ్రహ్మా బ్రహ్మపుత్రోఽత్రిరత్రితః ।
సోమశ్చక్రే రాజసూయం త్రైలోక్యం దక్షిణాం దదౌ ॥ 2॥

శ్రీమహావిష్ణుమూర్తి నాభినుండి పుట్టిన తామరపూవునుండి బ్రహ్మదేవుడు పుట్టాడు. ఆ బ్రహ్మకు అత్రిమహర్షి జన్మించాడు. అత్రిమహామునికి చంద్రుడు పుట్టాడు. చంద్రుడు రాజసూయయాగం చేశాడు. ఆ యాగంలో ముల్లోకాలను విప్రులకు దక్షిణగా ఇచ్చాడు.

సమాప్తేఽవభృథే సోమం తద్రూపాలోకనేచ్ఛవః ।
కామబాణాభితప్తాఙ్గ్యో నవ దేవ్యస్సిషేవిరే ॥ 2॥

రాజసూయయాగం చివర అవభృథస్నానం పూర్తి అయిన తరువాత, చంద్రుడిని చూడాలనే కోరికతో తొమ్మిదిమంది దేవకాంతలు అక్కడికి వచ్చారు. మన్మథబాణాల దెబ్బలతో తపించిపోతున్న శరీరాలతో వారు చంద్రుడిని సేవించారు.

లక్ష్మీర్నారాయణం త్యక్త్వా సినీవాలీ చ కర్దమమ్ ।
ద్యుతి ర్విభావసుం త్యక్త్వా పుష్టిర్ధాతారమవ్యయమ్ ॥ 3॥

శ్రీమన్నారాయణుడిని విడిచిపెట్టి (1) లక్ష్మీదేవి అక్కడికి వచ్చింది. అలాగే కర్దమమహామునిని విడిచి (2) సినీవాలి వచ్చింది. విభావసుడిని వదిలిపెట్టి (3) ద్యుతి వచ్చింది. శాశ్వతుడైన ధాతను విడిచిపెట్టి (4) పుష్టి వచ్చింది.

ప్రభా ప్రభాకరం త్యక్త్వా హవిష్మన్తం కుహూస్స్వయమ్ ।
కీర్తిర్జయన్తం భర్తారం వసుర్మారీచకశ్యపమ్ ॥ 4॥

ప్రభాకరుడిని వదిలిపెట్టి (5) ప్రభ వచ్చింది. హవిష్మంతుడిని విడిచి (6) కుహూదేవి స్వయంగా వచ్చింది. భర్త అయిన జయంతుడిని వదిలిపెట్టి (7) కీర్తి వచ్చింది. మరీచిమహర్షి కుమారుడైన కశ్యపమహర్షిని విడిచిపెట్టి (8) వసువు వచ్చింది.

ధృతి స్త్యక్త్వా పతిం నన్దీం సోమ మే వాభజత్తదా ।
స్వకీయా ఇవ సోమోఽపి కామయామాస తాస్తదా ॥ 5॥

భర్త అయిననందిని విడిచిపెట్టి (9) ధృతి వచ్చింది. ఈ తొమ్మిదిమంది దేవకాంతలు కూడ ఆ సమయంలో చంద్రుడిని సేవించారు. చంద్రుడు కూడా వారినందరినీ, సొంతకాంతల లాగానే కోరుకున్నాడు.

ఏవం కృతాపచారస్య తాసాం భర్తృగణస్తదా ।
న శశాకాపచారాయ శాపైశ్శస్త్రాదిభిః పునః ॥6॥

ఈవిధంగా తమ విషయంలో తప్పు చేసిన చంద్రుణ్ణి శపించడానికి కాని, ఆయుధాలతో శిక్షించడానికి గాని వారి భర్తలకు సాధ్యం కాలేదు.

సప్తలోకైకనాథత్వ మవాప్త స్తపసా హ్యుత ।
విబభ్రామ మతిస్తస్య వినయాదనయాహతా ॥8॥

తపశ్శక్తితో చంద్రుడు ఏడులోకాలకూ తానొక్కడే సర్వాధిపతి అయినాడు. అయినా దేవకాంతలను కామించడం అనే అవినీతి వలన అతడి వినయగుణం అంతా సర్వనాశనం అయింది.

బృహస్పతేస్స వై భార్యాం తారాం నామ యశస్వినీమ్ ।
జహార తరసా సోమో హ్యవమాన్యాఙ్గిరస్సుతమ్ ॥8॥

బృహస్పతిభార్య అయిన తార అనేఆమె చాల ఉత్తమురాలు. చంద్రుడు అంగిరసుడి కుమారుడైనబృహస్పతిని అవమానించి, తారను బలవంతంగా అపహరించాడు.

తతస్తద్యుద్ధమభవత్ ప్రఖ్యాతం తారకామయమ్ ।
దేవానాం దానవానాం చ లోకక్షయకరం మహత్ ॥9॥

అప్పుడు కేవలం తారకోసం దేవతలకూ దానవులకూ నడుమ తారకామయం అనే జగత్ప్రసిద్ధమైన మహాయుద్ధం జరిగింది. దానివలన లోకాలకు విస్తారమైన నష్టం సంభవించింది.

బ్రహ్మా నివార్యోశనసం తారామఙ్గిరసే దదౌ ॥10॥

ఆ సమయంలో బ్రహ్మదేవుడు రాక్షసపురోహితుడైన శుక్రాచార్యుడికి చెప్పి, ఆ యుద్ధాన్ని నివారించాడు. చంద్రుడినుండి తారను బృహస్పతికి ఇప్పించాడు.

తామన్తఃప్రసవాం దృష్ట్వా గర్భం త్యజాబ్రవీద్గురుః ।
గర్భస్త్యక్తః ప్రదీప్తోఽథ ప్రాహాహం సోమసమ్భవః ॥11॥

అప్పుడు తార గర్భవతి అయి ఉండడం బృహస్పతి గ్రహించాడు. తారతో 'ఆ గర్భాన్ని వదిలిపెట్టు' అన్నాడు. తార గర్భాన్ని జారవిడిచింది. అందులోనుండి మిక్కిలి తేజోవంతుడయిన బాలుడు వెలుపలికి వచ్చి, 'నేను చంద్రుడికుమారుడిని' అన్నాడు.

ఏవం సోమాద్బుధః ప్రాప్తః పుత్రస్తస్య పురూరవాః ।
స్వర్గం త్యక్త్వోర్వశీ సా తం వరయామాస చాప్సరాః ॥12॥

ఈవిధంగా చంద్రుడికి బుధుడు కలిగాడు. బుధుడికుమారుడు పురూరవుడు. ఊర్వశి అనే అప్సరః కాంత స్వర్గాన్ని విడిచిపెట్టి భూలోకానికి వచ్చి, ఆ పురూరవుడిని వరించింది.

తయా సహావసద్రాజా దశ వర్షాణి పఞ్చ చ ।
పఞ్చ షట్ సప్త చాష్టౌ చ దశ చాష్టౌ మహామునే ॥13॥

వసిష్ఠమహర్షీ! పురూరవమహారాజు ఊర్వశితో కలిసి, (పది + అయిదు + అయిదు + ఆరు + ఏడు + ఎనిమిది + పది + ఎనిమిది) యాభైతొమ్మిది సంవత్సరాలపాటు ఊర్వశితో కలిసి జీవించాడు.

ఏకోఽగ్నిరభవత్పూర్వం తేన త్రేతా ప్రవర్తితా ।
పురూరవా యోగశీలో గాన్ధర్వం లోకమీయివాన్ ॥14॥

పురూరవుడికి పూర్వం అగ్ని ఒక్కటే ఉండేది. పురూరవుడే లోకంలో మూడగ్నులను ప్రవర్తింపజేశాడు. గొప్పయోగి అయిన పురూరవుడు యోగబలంతో గంధర్వలోకానికి వెళ్లాడు.

ఆయుర్దృఢాయురశ్వాయుర్ధనాయుర్ధృతిమాన్వసుః ।
దివిజాతశ్శతాయుశ్చ సుషువే చోర్వశీ నృపాత్ ॥15॥

ఊర్వశి పురూరవ మహారాజువలన ఆయువు, దృఢాయువు, అశ్వాయువు, ధనాయువు, ధృతిమంతుడు, వసువు, దివిజాతుడు, శతాయువు, అనే కుమారులను కన్నది.

ఆయుషో నహుషః పుత్రో వృద్ధశర్మా రజి స్తథా ।
దమ్భో విపాప్మా పఞ్చాగ్న్యం రజేః పుత్రశతం హ్యభూత్ ॥ 16॥

వారిలో ఆయువుకు పంచాగ్నులలాగా నహుషుడు, వృద్ధశర్మ, రజి, దంభుడు, విపాప్మ అనే అయిదుగురు కుమారులు కలిగారు. వారిలో రజికి నూరుగురు కుమారులు పుట్టారు.

రాజేయా ఇతి విఖ్యాతా విష్ణుదత్తవరో రజిః ।
దేవాసురే రణే దైత్యానవధీత్సురయాచితః ॥17॥

రజి కుమారులు రాజేయులు అని ప్రసిద్ధులైనారు. రజి శ్రీమహావిష్ణువువలన వరం పొందాడు. దేవతలు ప్రార్థించగా, రజి దేవదానవులకు జరిగిన యుద్ధంలో దేవతలపక్షాన ఉండి, రాక్షసులను సంహరించాడు.

గతాయేన్ద్రాయ పుత్రత్వం దత్వా రాజ్యం దివం గతః ।
రజేః పుత్రైర్హృతం రాజ్యం శక్రస్యాథ సుదుర్మనాః ॥18॥

తనకు కుమారు డయిన (ఇంద్రుడికోరికపై అతడిని తనపుత్రుడుగా స్వీకరించి) ఇంద్రుడికి రాజ్యం అప్పగించి, రజి స్వర్గానికి వెళ్లిపోయాడు. కాని తరువాత రజిమహారాజుకుమారులు తండ్రి ఇంద్రుడికి ఇచ్చినరాజ్యాన్ని అపహరించారు. రాజ్యం పోగొట్టుకున్న ఇంద్రుడు దుఃఖపడ్డాడు.

గ్రహశాన్త్యాదివిధినా గురురిన్ద్రాయ తద్దదౌ ।
మోహయిత్వా రజిసుతా నాసంస్తే నిజధర్మతః ॥19॥

అప్పుడు దేవతలగురువైన బృహస్పతి గ్రహశాంతి మొదలైన శాంతికర్మలను చేయించి, వాటితో రజికుమారులను మోహంలో పడవేసి, ఆ రాజ్యాన్ని తిరిగి ఇంద్రుడికి అప్పగించాడు. అప్పటినుండి రజికుమారులు ధర్మంనుండి భ్రష్టులైనారు.

నహుషస్య సుతాస్సప్త యతిర్యయాతిరుత్తమః ।
ఉద్భవః పఞ్చకశ్చైవ శర్యాతిమేఘపాలకౌ ॥20॥

నహుషుడికి ఏడుగురు కొడుకులు కలిగారు. వారు 1. యతి, 2. యయాతి, 3. ఉత్తముడు, 4. ఉద్భవుడు, 5. పంచకుడు, 6. శర్యాతి, 7. మేఘపాలుడు.

యతిః కుమారభావేఽపి విష్ణుం ధ్యాత్వా హరిం గతః ।
దేవయానీ శుక్రకన్యా యయాతేః పత్న్యభూత్తదా ॥21॥

వారిలో యతి అనేవాడు చిన్న తనంలోనే శ్రీమహావిష్ణువును ధ్యానించి, విష్ణువులో చేరిపోయాడు. తరువాతి వాడయిన యయాతికి శుక్రాచార్యుల కూతురయిన దేవయాని భార్య అయింది.

వృషపర్వజా శర్మిష్ఠా యయాతేః పఞ్చ తత్సుతాః ।
యదుం చ తుర్వసుం చైవ దేవయానీ వ్యజాయత ॥22॥

పిదప వృషపర్వుడికుమార్తె అయిన శర్మిష్ఠ కూడ యయాతికి భార్య అయింది. యయాతికి అయిదుగురు కుమారులు. వారిలో యదుడు, తుర్వసుడు, అనే ఇద్దరు దేవయానికి పుట్టారు.

ద్రుహ్యుఞ్చానుఞ్చ పురుఞ్చ శర్మిష్ఠా వార్షపర్వణీ ।
యదుః పురు శ్చాభవతాం తేషాం వంశవివర్ధనౌ ॥23॥

వృషపర్వుడికుమార్తె అయినశర్మిష్ఠకు ద్రుహ్యుడు, అనువు, పురుడు, అనేముగ్గురు కుమారులు కలిగారు. ఆ అయిదుగురిలో దేవయాని కుమారుడైన యదుడు, శర్మిష్ఠకుమారుడైనపురుడు అనే వారివలన చంద్ర (యయాతి)వంశం వృద్ధిచెందింది.

ఇత్యాదిమహాపురాణే ఆగ్నేయే సోమవంశకథనం నామ చతుస్సప్తత్యధికద్విశతతమోఽధ్యాయః ॥274॥

అగ్నిమహాపురాణంలో సోమవంశకథనం అనే రెండువందల డెబ్బైనాల్గవ అధ్యాయం సమాప్తం.



పఞ్చసప్తత్యధికద్విశతతమోऽధ్యాయః - రెండువందల డెబ్బైఐదవ అధ్యాయం

యదువంశకథనమ్ - యదువంశకథనం

అగ్ని రువాచ - వశిష్ఠమహర్షితో అగ్నిదేవుడు ఇలా చెప్తున్నాడు.

యదోరాసన్ పఞ్చ పుత్రా జ్యేష్ఠస్తే తు సహస్రజిత్ ।
నీలాఞ్జికో రఘుః క్రోష్టుశ్శతజిచ్చ సహస్రజిత్ ॥1॥

యదువుకు అయిదుగురు కుమారులు కలిగారు. వారిలో సహస్రజిత్తు అనేవాడు పెద్దవాడు. 1. సహస్రజిత్తు, 2. నీలాంజికుడు, 3. రఘువు, 4. క్రోష్టువు, 5. శతజిత్తు (అనే అయిదుగురు యదువుకుమారులు).

శతజిద్ధైహయో రేణుహయో హయ ఇతి త్రయః ।
ధర్మనేత్రో హైహయస్య ధర్మనేత్రస్య సంహతః ॥2॥

శతజిత్తుకు హైహయుడు, రేణుహయుడు, హయుడు అనేవారు ముగ్గురు కుమారులు. వారిలో హైహయుడికి ధర్మనేత్రుడు పుట్టాడు. ధర్మనేత్రుడికి సంహతుడు కలిగాడు.

మహిమా సంహతస్యాసీన్మహిమ్నో భద్రసేనకః ।
భద్రసేనాద్దుర్గమోऽభూద్దుర్గమాత్ కనకోऽభవత్ ॥3॥

సంహతుడికి మహిముడు జన్మించాడు. మహిముడికి భద్రసేనుడు పుట్టాడు. భద్రసేనుడికి దుర్గముడు కలిగాడు. దుర్గముడికి కనకుడు కలిగాడు.

కనకాత్ కృతవీర్యస్తు కృతాగ్నిః కరవీరకః ।
కృతౌజాశ్చ చతుర్థోऽభూత్ కృతవీర్యాత్తు సోऽర్జునః ॥4॥

కనకుడికి కృతవీర్యుడు, కృతాగ్ని, కరవీరకుడు, కృతౌజుడు, అనేనలుగురు కుమారులు కలిగారు. వీరిలో కృతవీర్యుడికి అర్జునుడు జన్మించాడు.

దత్తోऽర్జునాయ తపతే సప్త ద్వీపమహీశతమ్ ।
దదౌ బాహుసహస్రం చ హ్యజేయత్వం రణే తథా ॥5॥

తపస్సు చేసిన అర్జునుడికి దత్తాత్రేయుడు ఏడు ద్వీపాలతో కూడిన మొత్తం భూమండలం మీద ఆధిపత్యాన్ని ప్రసాదించాడు. ఇంకా అర్జునుడికి వెయ్యి చేతులు, యుద్ధంలో నిరంతరం విజయం అనే వాటిని వరాలుగా ఇచ్చాడు.

అధర్మే వర్తమానస్య విష్ణుహస్తాన్మృతిర్ ధ్రువా ॥6॥

ఆ తరువాత దత్తాత్రేయుడు అర్జునుడితో 'నీవు అధర్మం చేస్తే శ్రీమహావిష్ణువుచేతిలో నీకు మరణం నిశ్చయం' అన్నాడు.

దశ యజ్ఞసహస్రాణి సోఽర్జునః కృతవాన్ నృపః ।
అనష్టద్రవ్యతా రాష్ట్రే తస్య సంస్మరణా దభూత్ ॥7॥

మహారాజయిన ఆ అర్జునుడు పదివేలయజ్ఞాలు చేశాడు. అతడిరాజ్యంలో అర్జునమహారాజును తలుచుకుంటే చాలు ధనం నశించకుండా ఉండేది. (దొంగతనాలు లేవు. దొంగతనం జరిగితే, ఆ రాజును స్మరించినమాత్రంచేతనే దొంగ ఆ సొమ్మును తిరిగి తెచ్చిఇస్తాడు)

న నూనం కార్తవీర్యస్య గతిం యాస్యన్తి వై నృపాః ।
యజ్ఞైర్దానైస్తపోభిశ్చ విక్రమేణ శ్రుతేన చ ॥8॥

యజ్ఞాలు, దానాలు, తపస్సులు, చేయడంలోనూ, పరాక్రమంలోనూ, పాండిత్యంలోనూ కృతవీర్యుడికుమారుడైన(కార్తవీర్య) అర్జునమహారాజుకు ఎవరూ సాటి రారు.

కార్తవీర్యస్య చ శతం పుత్రాణాం పఞ్చ వై పరమ్ ।
శూరసేనశ్చ శూరశ్చ ధృష్టోక్తః కృష్ణ ఏవ చ ॥
జయధ్వజశ్చ నా మ్నాసీదావన్త్యో నృపతిర్మహాన్ ॥9॥

కార్తవీర్యుడికి వందమంది కుమారులు కలిగారు. వారిలో శూరసేనుడు, శూరుడు, ధృష్టోక్తుడు, కృష్ణుడు, జయధ్వజుడు అనేవారు అయిదుగురు ఉత్తములు. వీరిలో జయధ్వజుడు అవంతీదేశానికి మహారాజు అయినాడు.

జయధ్వజాత్తాలజఙ్ఘస్తాలజఙ్ఘ్యా త్తతస్సుతాః ॥10॥

జయధ్వజుడికి తాలజంఘుడు పుట్టాడు. తాలజంఘుడికుమారులు తాలజంఘ్యులు అనే పేరుతో ప్రసిద్ధులైనారు.

హైహయానాం కులాః పఞ్చ భోజాశ్చావన్తయస్తథా ।
వీతిహోత్రాస్స్వయం జాతాశ్శౌణ్డికేయాస్తథైవ చ ॥11॥

హైహయులలో అయిదువంశాలు ఏర్పడ్డాయి. 1. భోజులు, 2. అవంతులు, 3. వీతిహోత్రులు, 4. స్వయంజాతులు, 5, శౌండికేయులు.

వీతిహోత్రాదనన్తోఽభూదనన్తాద్దుర్జయో నృపః ॥12॥

వీతిహోత్రుడికి అనంతుడు పుట్టాడు. అనంతుడికి దుర్జయుడు అనేమహారాజు కలిగాడు.

క్రోష్టోర్వంశం ప్రవక్ష్యామి యత్ర జాతో హరిస్స్వయమ్ ।
క్రోష్టోస్తు వృజినీవాంశ్చ స్వాహోభూద్ వృజినీవతః ॥13॥

వసిష్ఠమహర్షీ! ఇక క్రోష్టువంశం గురించి చెప్తాను అన్నాడు అగ్నిదేవుడు. స్వయంగా శ్రీమహావిష్ణువే క్రోష్టువంశంలో జన్మించాడు. క్రోష్టువుకు వృజినీవంతుడు జన్మించాడు. వృజినీవంతుడికి స్వాహ కలిగాడు.

స్వాహాపుత్రోరుషద్గుశ్చ తస్య చిత్రరథస్సుతః ।
శశబిన్దుశ్చిత్రరథాచ్చక్రవర్తీ హరౌ రతః ॥14॥

స్వాహకు రుషద్గుడు కలిగాడు. రుషద్గుడికి చిత్రరథుడు పుట్టాడు. చిత్రరథుడికి శశబిందువు జన్మించాడు. అతడు గొప్ప చక్రవర్తి అయినాడు. శ్రీమహావిష్ణువుపైన మిక్కిలి భక్తి కలిగి ఉండేవాడు.

శశబిన్దోశ్చ పుత్రాణాం శతానామభవచ్ఛతమ్ ।
ధీమతాం చారురూపాణాం భూరిద్రవిణతేజసామ్ ॥
పృథుశ్రవాః ప్రధానోఽభూత్తస్య పుత్రస్సుయజ్ఞకః ॥15॥

శశబిందువుకు పదివేలమంది కుమారులు కలిగారు. వారందరూ బుద్ధిమంతులు. అందమైన రూపం కలిగినవాళ్లు. మిక్కిలి గొప్పసంపదలు, పరాక్రమం కలిగినవాళ్లు. వారిలో పృథుశ్రవుడు అనేవాడు ముఖ్యమైనవాడు. పృథుశ్రవుడికుమారుడు సుయజ్ఞకుడు.

సుయజ్ఞస్యోశనాః పుత్రస్తితిక్షురుశనస్సుతః ।
తితిక్షోస్తు మరుత్తోఽభూత్తస్మాత్ కమ్బలబర్హిషః ॥16॥

సుయజ్ఞుడికుమారుడు ఉశనసుడు. ఉశనుడికుమారుడు తితిక్షువు. తితిక్షువుకు మరుత్తుడు పుట్టాడు. మరుత్తుకు కంబలబర్హిషుడు జన్మించాడు.

పఞ్చాశద్రుక్మకవచాద్రుక్మేషుః పృథురుక్మకః ।
హవిర్జ్యామఘః పాపఘ్నో జ్యామఘః స్త్రీజితోఽభవత్ ॥17॥

కంబలబర్హిషుడికి రుక్మకవచుడు అని కూడ మరొకపేరు. రుక్మకవచుడికి రుక్మేషువు, పృథురుక్ముడు, హవి, జ్యామఘుడు, పాపఘ్నుడు అనేవాళ్లు జన్మించారు. వారిలో జ్యామఘుడు స్త్రీలకు లొంగిపోయాడు (కామపరాయణుడు).

శైబ్యాయాం జ్యామఘాదాసీద్విదర్భస్తస్య కౌశికః ।
లోమపాదః క్రథ శ్రైష్ఠాత్కృతిస్స్యాల్లోమపాదతః ॥18॥

జ్యామఘుడికి శైబ్య అనేస్త్రీయందు విదర్భుడు అనే కుమారుడు పుట్టాడు. విదర్భుడికి కౌశికుడు, లోమపాదుడు, క్రథుడు అనే కుమారులు కలిగారు. వీరిలో లోమపాదుడు మిక్కిలి ఉత్తముడు. లోమపాదుడికి కృతి అనే కుమారుడు పుట్టాడు.

కౌశికస్య చిదిః పుత్రస్తస్మా చ్చైద్యా నృపా స్స్మృతాః ।
క్రథా ద్విదర్భపుత్రాచ్చ కున్తిః కున్తేస్తు ధృష్టకః ॥19॥

కౌశికుడికి చిది అనే కుమారుడు కలిగాడు. చైద్యులు అనే రాజులు చిది అనేవాడివలన కలిగినవారే. విదర్భుడికుమారుడయిన క్రథుడికి కుంతి అనేవాడు పుట్టాడు. కుంతికి ధృష్టుడు జన్మించాడు.

ధృష్టకస్య ధృతిస్తస్య ఉదర్కాఖ్యో విదూరథః ।
దశార్హపుత్రో వ్యోమస్తు వ్యోమాజ్జీమూత ఉచ్యతే ॥20॥

ధృష్టుడికి ధృతి అనే కుమారుడు కలిగాడు. ధృతికి విదూరథుడు పుట్టాడు. విదూరథుడినే ఉదర్కుడు, దశార్హుడు అని కూడ అంటారు. దశార్హుడికి వ్యోముడు పుట్టాడు. వ్యోముడికి జీమూతుడు జన్మించాడు.

జీమూతపుత్రో వికలస్తస్య భీమరథస్సుతః ।
భీమరథాన్నవరథ స్తతో దృఢరథోఽభవత్ ॥21॥

జీమూతుడికుమారుడు వికలుడు. వికలుడికుమారుడు భీమరథుడు. భీమరథుడికి నవరథుడు పుట్టాడు. నవరథుడికి దృఢరథుడు జన్మించాడు.

శకున్తిశ్చ దృఢరథాచ్ఛకున్తేశ్చ కరమ్భకః ।
కరమ్భాద్దేవరాతోఽభూద్దేవక్షేత్రశ్చ తత్సుతః ॥22॥

దృఢరథుడికి శకుంతి పుట్టాడు. శకుంతికి కరంభుడు జన్మించాడు. కరంభుడికి దేవరాతుడు కలిగాడు. దేవరాతుడికుమారుడు దేవక్షేత్రుడు.

దేవక్షేత్రాన్మధుర్నామ మధోర్ద్రవరసోఽభవత్ ।
ద్రవరసాత్పురుహూతోఽభూజ్జన్తురాసీత్తు తత్సుతః ॥23॥

దేవక్షేత్రుడికి మధువు కలిగాడు. మధువుకు ద్రవరసుడు జన్మించాడు. ద్రవరసుడికి పురుహూతుడు పుట్టాడు. పురుహూతుడి కుమారుడు జంతువు.

గుణీ తు యాదవో రాజా జన్తుపుత్రస్తు సాత్వతః ।
సాత్వతాద్భజమానస్తు వృష్ణిరన్ధక ఏవ చ ॥
దేవావృధశ్చ చత్వారస్తేషాం వంశాస్తు విశ్రుతాః ॥24॥

జంతువు కుమారుడు సాత్వతుడు. ఇతడు యాదవులందరిలోనూ మిక్కిలి గుణవంతుడు. సాత్వతుడికి భజమానుడు, వృష్ణి, అంధకుడు, దేవావృధుడు అనే కుమారులు నలుగురు కలిగారు. వారివంశాలు లోకంలో మిక్కిలి ప్రసిద్ధమైనాయి.

భజమానస్య బాహ్యోఽభూద్వృష్టిః కృమిర్నిమిస్తథా ।
దేవావృధాద్బభ్రురాసీత్తస్య శ్లోకోఽత్ర గీయతే ॥25॥

భజమానుడికి బాహ్యుడు, వృష్టి, కృమి, నిమి, అనే కుమారులు కలిగారు. దేవావృధుడికి బభ్రువు పుట్టాడు. బభ్రువును గురించి ఈశ్లోకం ప్రసిద్ధంగా వినబడుతున్నది.

యథైవ శృణుమో దూరాద్గుణాం స్తద్వత్సమన్తికాత్ ।
బభ్రుశ్శ్రేష్ఠో మనుష్యాణాం దేవైర్దేవావృధస్సమః ॥26॥

బభ్రువు దూరంలో ఉండగా ఆయన ఉత్తమ గుణాలని ఎలా వింటామో అలాగే దగ్గరగా ఉన్నప్పుడు కూడా ఆయన మంచిగుణాలని వింటాం. మానవులలో బభ్రువు చాల గొప్పవాడు. దేవావృధుడు దేవతలతో సమానమైనవాడు'.

చత్వారశ్చ సుతా బభ్రోర్వాసుదేవపరా నృపాః ।
కుకురో భజమానస్తు శినిః కమ్బలబర్హిషః ॥27॥

బభ్రువుకు 1. కుకురుడు, 2. భజమానుడు, 3. శిని, 4. కంబలబర్హి, అనేకుమారులు నలుగురు కలిగారు. వీరందరూ వాసుదేవుడిపై మిక్కిలి భక్తి కలిగినవారు.

కుకురస్య సుతో ధృష్టుర్ధృష్టోస్తు తనయో ధృతిః ।
ధృతేః కపోతరోమాభూ త్తస్య పుత్రస్తు తిత్తిరిః ॥28॥

కుకురుడికి ధృష్టుడు అనే కుమారుడు పుట్టాడు. ధృష్టుడికుమారుడు ధృతి. ధృతికి కపోతరోముడు అనే కుమారుడు కలిగాడు. కపోతరోముడి కుమారుడు తిత్తిరి.

తిత్తిరేస్తు నరః పుత్రస్తస్య చానకదున్దుభిః ।
పునర్వసుస్తస్య పుత్ర ఆహుకశ్చాహుకీసుతః ॥29॥

తిత్తిరి కుమారుడు నరుడు. నరుడి కుమారుడు ఆనకదుందుభి. ఆనకదుందుభి కుమారుడు పునర్వసుడు. పునర్వసుడికి ఆహుకివలన ఆహుకుడు అనే కుమారుడు కలిగాడు.

ఆహుకాద్దేవకో జజ్ఞే ఉగ్రసేన స్తతోఽభవత్ ।
దేవవానుపదేవశ్చ దేవకస్య సుతాస్స్మృతాః ॥30॥

ఆహుకుడికి దేవకుడు పుట్టాడు. వారిలో దేవకుడికి ఉగ్రసేనుడు, దేవవంతుడు, ఉపదేవుడు అనే కుమారులు గలిగారు.

తేషాం స్వసార స్సప్తాసన్ వసుదేవాయ తా దదౌ ॥31॥

వారికి ఏడుగురు అక్కచెల్లెళ్లు ఉన్నారు. దేవకుడు వారిని వసుదేవుడికి ఇచ్చి వివాహం చేశాడు.

దేవకీ శ్రుతదేవీ చ మిత్రదేవీ యశోధరా ।
శ్రీదేవీ సత్యదేవీ చ సురాపీ చేతి సప్తమీ ॥32॥

వారు 1. దేవకి, 2. శ్రుతదేవి, 3. మిత్రదేవి, 4. యశోధర, 5. శ్రీదేవి, 6. సత్యదేవి, 7. సురాపి. ఏడవసోదరి.

నవోగ్రసేనస్య సుతాః కంసస్తాసాం చ పూర్వజః ।
న్యగ్రోధశ్చ సునామా చ కఙ్కశ్శఙ్కుశ్చ భూమిపః ॥
సుతనూ రాష్ట్రపాలశ్చ యుద్ధముష్టిస్సుముష్టికః ॥33॥

ఉగ్రసేనుడికి కుమారులు తొమ్మిదిమంది. అందరిలోనూ 1. కంసుడు పెద్దవాడు. తరువాత 2. న్యగ్రోధుడు, 3. సునాముడు, 4. కంకుడు, 5. శంకుడు, 6. సుతనువు, 7. రాష్ట్రపాలుడు, 8. యుద్ధముష్టి, 9. సుముష్టి అనేవారు ఉగ్ర సేనుడికుమారులు.

భజమానస్య పుత్రోఽథ రథముఖ్యో విదూరథః ।
రాజాధిదేవశ్శూరశ్చ విదూరథసుతోఽభవత్ ॥34॥

భజమానుడికి విదూరథుడు అనే కుమారుడు కలిగాడు. అతడు రథికులలో ఉత్తముడు. విదూరథుడికి రాజాధిదేవుడు, అనేకుమారుడు కలిగాడు. ఇతడు గొప్పశూరుడు.

రాజాధిదేవపుత్రౌ ద్వౌ శోణాశ్వశ్శ్వేతవాహనః ।
శోణాశ్వస్య సుతాః పఞ్చ శమీశత్రుజిదాదయః ॥35॥

రాజాధిదేవుడికి ఇద్దరు కుమారులు కలిగారు. వారు శోణాశ్వుడు, శ్వేతవాహనుడు. వీరిలో శోణాశ్వుడికి శమి, శత్రుజిత్తు, మొదలైన కుమారులు అయిదుగురు జన్మించారు.

శమీపుత్రః ప్రతిక్షేత్రః ప్రతిక్షేత్రస్య భోజకః ।
భోజస్య హృదికః పుత్రో హృదికస్య దశాత్మజాః ॥
కృతవర్మా శతధన్వా దేవార్హో భీషణాదయః ॥36॥

వారిలో శమికి ప్రతిక్షేత్రుడు అనే కుమారుడు కలిగాడు. ప్రతిక్షేత్రుడికుమారుడు భోజుడు. భోజుడికుమారుడు హృదికుడు. హృదికుడి కుమారులు 1. కృతవర్మ, 2. శతధన్వుడు, 3. దేవార్హుడు, 4. భీషణుడు మొదలైనవారు పదిమంది.

దేవార్హాత్కమ్బలబర్హి రసమౌజాస్తతోఽభవత్ ।
సుదంష్ట్రశ్చ సువాసశ్చ ధృష్టోఽభూదసమౌజసః ॥37॥

దేవార్హుడికి కంబలబర్హి పుట్టాడు. ఈ కంబలబర్హికి అసమౌజుడు కలిగాడు. అసమౌజసుడికి సుదంష్ట్రుడు, సువాసుడు, ధృష్టుడు అనే కుమారులు కలిగారు.

గాన్ధారీ చైవ మాద్రీ చ ధృష్టభార్యే బభూవతుః ।
సుమిత్రోఽభూచ్చ గాన్ధార్యాం మాద్రీ జజ్ఞే యుధాజితమ్ ॥38॥

ధృష్టుడికి గాంధారి, మాద్రి అనేవారు ఇద్దరు భార్యలు. వారిలో గాంధారికి సుమిత్రుడు పుట్టాడు. మాద్రికి యుధాజిత్తు పుట్టాడు.

అనమిత్రశ్శినిర్ధృష్టాత్తతో వై దేవమీఢుషః ।
అనమిత్రసుతో నిఘ్నో నిఘ్నస్యాపి ప్రసేనకః ॥39॥

ధృష్టుడికి ఇంకా అనమిత్రుడు, శిని అనే కుమారులు కలిగారు. వారిలో శినికి దేవమీఢుషుడు పుట్టాడు. అనమిత్రుడి కుమారుడు నిఘ్నుడు. నిఘ్నుడికుమారుడు ప్రసేనుడు.

సత్రాజితః ప్రసేనోఽథ మణిం సూర్యాత్ స్యమన్తకమ్ ।
ప్రాప్యారణ్యే చరన్తం తు సింహో హత్వాగ్రహీన్మణిమ్ ॥40॥

ప్రసేనుడిసోదరుడైన సత్రాజిత్తు తపస్సు చేసి, సూర్యుడినుండి స్యమంతకం అనే మణిని పొందాడు. సత్రాజిత్తునుండి ఆ మణిని తీసుకుని ప్రసేనుడు అడవిలో సంచరిస్తుండగా, ఒక సింహం అతడిని చంపి మణిని స్వీకరించింది.

హతో జామ్బవతా సింహో జామ్బవాన్ హరిణా జితః ।
తస్మాన్మణిం జామ్బవతీం ప్రాప్యాగాద్ద్వారకాం పురీమ్ ॥41॥

జాంబవంతుడు ఆ సింహాన్ని సంహరించాడు. జాంబవంతుడిని శ్రీకృష్ణుడు ఓడించాడు. శ్రీకృష్ణుడు జాంబవంతుడిచ్చిన స్యమంతకమణినీ, అతడి కుమార్తె అయిన జాంబవతిని కూడ తీసుకుని, ద్వారకానగరానికి వెళ్లాడు.

సత్రాజితాయ ప్రదదౌ శతధన్వా జఘాన తమ్ ।
హత్వా శతధనుం కృష్ణో మణిమాదాయ కీర్తిభాక్ ॥42॥

శ్రీకృష్ణుడు స్యమంతకమణిని సత్రాజిత్తుకు తిరిగి ఇచ్చాడు. శతధన్వుడు అనేవాడు సత్రాజిత్తును సంహరించాడు. శ్రీకృష్ణుడు శతధన్వుడిని చంపి, స్యమంతకమణిని స్వీకరించి గొప్పకీర్తిని పొందాడు.

బలయాదవముఖ్యాగ్రే హ్యక్రూరే మణిమార్పయత్ ।
మిథ్యాభిశస్తిం కృష్ణస్య త్యక్త్వా స్వర్గీ చ సమ్పఠన్ ॥43॥

బలరాముడు మొదలైన యాదవవీరుల సమక్షంలో శ్రీకృష్ణుడు ఆస్య మంతకమణిని అక్రూరుడికి ఇచ్చాడు. దీనితో శ్రీకృష్ణుడు స్యమంతకమణిని కాజేశాడనే అపవాదు తొలగిపోయింది. ఈ స్యమంతకమణివృత్తాంతాన్ని శ్రద్ధగా చదివినవారు స్వర్గానికి వెళ్తారు.

సత్రాజితో భఙ్గకారస్సత్యభామా హరేః ప్రియా ।
అనమిత్రాచ్ఛినిర్జజ్ఞే సత్యకస్తు శినేస్సుతః ॥44॥

సత్రాజిత్తుకు భంగకారుడు అనే కుమారుడు, సత్యభామ అనే కూతురు జన్మించారు. సత్యభామ శ్రీకృష్ణుడికి భార్య అయింది. అనమిత్రుడికి శిని అనే కుమారుడు పుట్టాడు. శిని కుమారుడు సత్యకుడు.

సత్యకాత్ సాత్యకిర్జజ్ఞే యుయుధానా ద్ధుని ర్హ్యభూత్ ।
ధునే ర్యుగన్ధరః పుత్ర స్స్వాహ్యోఽభూత్ స యుధాజితః ॥45॥

సత్యకుడికి సాత్యకి జనించాడు. సాత్యకికే యుయుధానుడు అని మరొపేరు ఉన్నది. సాత్యకికి ధుని పుట్టాడు. ధుని కుమారుడు యుగంధరుడు. యుధాజిత్తుకు (38 శ్లో) స్వాహ్యుడు పుట్టాడు.

ఋషభక్షేత్రకౌ తస్య హ్యృషభాచ్చ శ్వఫల్కకః ।
శ్వఫల్కపుత్రో హ్యక్రూరో హ్యక్రూరాచ్చ సుధన్వకః ॥46॥

స్వాహ్యుడికి ఋషభుడు, క్షేత్రకుడు అనే కుమారులు కలిగారు. ఋషభుడికి శ్వఫల్కుడు పుట్టాడు. శ్వఫల్కుడి కుమారుడు అక్రూరుడు. అక్రూరుడికి సుధన్వుడు జన్మించాడు.

శూరాత్తు వసుదేవాద్యాః పృథా పాణ్డోః ప్రియాభవత్ ॥47॥

శూరుడికి (34శ్లో) వసుదేవుడు మొదలైనవారు పుట్టారు. శూరుడికూతురు పృథ. ఆమె పాండురాజుకు భార్య అయింది. (పృథకే కుంతి అని పేరు.)

ధర్మాద్యుధిష్ఠిరః పాణ్డోర్వాయోః కున్త్యాం వృకోదరః ।
ఇన్ద్రాద్ధనఞ్జయో మాద్ర్యాం నకుల స్సహదేవకః ॥48॥

పాండురాజుకు కుంతీదేవియందు ధర్ముడి(యముడు)వలన యుధిష్ఠిరుడు, వాయుదేవుడివలన భీముడు, ఇంద్రుడివలన అర్జునుడు జన్మించారు. పాండురాజుకు మాద్రియందు నకులుడు, సహదేవుడు పుట్టారు.

వసుదేవాచ్చ రోహిణ్యాం రామస్సారణదుర్గమౌ ॥49॥

వసుదేవుడికి రోహిణియందు బలరాముడు, సారణుడు, దుర్గముడు అనే కుమారులు కలిగారు.

వసుదేవాచ్చ దేవక్యామాదౌ జాతస్సుషేణకః ।
కీర్తిమాన్ భద్రసేనశ్చ జారుఖ్యో విష్ణుదాసకః ॥
భద్రదేహః కంస ఏతాన్ షడ్గర్భా న్నిజఘాన హ ॥50॥

వసుదేవుడికే దేవకియందు మొదట 1. సుషేణుడు, తరువాత 2. కీర్తిమంతుడు, 3. భద్రసేనుడు, 4. జారుఖ్యుడు, 5. విష్ణుదాసుడు, 6. భద్రదేహుడు, అనే కుమారులు కలిగారు. ఈ ఆరుగురుసంతానాన్ని కంసుడు సంహరించాడు.

తతో బలస్తతః కృష్ణ స్సుభద్రా భద్రభాషిణీ ।
చారదేష్ణశ్చ సామ్బాద్యాః కృష్ణాజ్జామ్బవతీసుతాః ॥51॥

తరువాత బలరాముడు, ఆ తరువాత కృష్ణుడు జన్మించారు. ఆ తరువాత శుభంకరమైన మాటలాడే సుభద్ర జన్మించింది. కృష్ణుడికి జాంబవతివలన చారుదేష్ణుడు, సాంబుడు మొదలైన కుమారులు పుట్టారు.

ఇత్యాది మహాపురాణే ఆగ్నేయే యదువంశకథనంనామ పఞ్చసప్తత్యధికద్విశతతమోఽధ్యాయః ॥275॥

అగ్నిమహాపురాణంలో యదువంశకథనం అనే రెండువందల డెబ్బైఐదవ అధ్యాయం సమాప్తం.



షట్సప్తత్యధికద్విశతతమోఽధ్యాయః - రెండువందల డెబ్బైఆరవ అధ్యాయం

ద్వాదశ సంఖ్యాకసంగ్రామకథనమ్ - ద్వాదశ సంఖ్యాకసంగ్రామకథనం

అగ్నిరువాచ - వసిష్ఠమహర్షితో అగ్నిదేవుడు ఇలా చెప్తున్నాడు.

కశ్యపో వసుదేవోఽభూ ద్దేవకీ చాదితిర్వరా ।
దేవక్యాం వసుదేవాత్తు కృష్ణోఽభూత్తపసాన్వితః ॥1॥

కశ్యపమహర్షి వసుదేవుడుగానూ, ఉత్తమురాలయిన అదితి దేవకిగానూ అవతరించారు. వసుదేవుడి వలన దేవకికి శ్రీకృష్ణుడు జన్మించాడు. అతడు మిక్కిలి తపస్వి.

ధర్మసంరక్షణార్థాయ హ్యధర్మహరణాయ చ ।
సురాదేః పాలనార్థం చ దైత్యాదేర్మర్దనాయ చ ॥2॥

ధర్మాన్ని స్థాపించడానికీ, అధర్మాన్ని నిర్మూలించడానికీ, దేవతలను కాపాడడానికీ, రాక్షసులు మొదలైన దుర్మార్గులను శిక్షించడానికి శ్రీకృష్ణుడు భూమిమీద అవతరించాడు.

రుక్మిణీ సత్యభామా చ సత్యా నాగ్నజితీ ప్రియా ।
సత్యభామా హరేస్సేవ్యా గాన్ధారీ లక్ష్మణా తథా ॥3॥

రుక్మిణి, సత్యభామ, సత్య, నాగ్నజిత్తు కూతురయిన సత్య వీరు శ్రీకృష్ణుడికి ఇష్టమైన భార్యలు. వీరిలో కూడ శ్రీకృష్ణుడు సత్యభామను ఇంకా అధికంగా సేవిస్తాడు. అలాగే, గాంధారి, లక్ష్మణ, ఇంకా -

మిత్రవిన్దా చ కాలిన్దీ దేవీ జామ్బవతీ తథా ।
సుశీలా చ తథా మాద్రీ కౌశల్యా విజయా జయా ॥
ఏవమాదీని దేవీనాం సహస్రాణి తు షోడశ ॥4॥

మిత్రవింద, కాళింది, జాంబవతీదేవి, సుశీల, మాద్రి, కౌశల్య, విజయ, జయ, మొదలుగా శ్రీకృష్ణుడికి పదహారువేలమంది దేవేరులు ఉన్నారు.

ప్రద్యుమ్నాద్యాశ్చ రుక్మిణ్యాం భీమాద్యాస్సత్యభామయా ।
జామ్బవత్యాం చ సామ్బాద్యాః కృష్ణస్యాసంస్తథాపరే ॥5॥

శ్రీకృష్ణుడికి రుక్మిణియందు ప్రద్యుమ్నుడు మొదలైన పుత్రులు కలిగారు. సత్యభామతో భీముడు మొదలైనవారు, జాంబవతియందు సాంబుడు మొదలైనవారు పుట్టారు. ఇతరస్త్రీలవలన ఇంకా కుమారులు కలిగారు.

శతం శతసహస్రాణాం పుత్రాణాం తస్య ధీమతః ।
అశీతిశ్చ సహస్రాణి యాదవాః కృష్ణరక్షితాః ॥6॥

బుద్ధిమంతుడైన శ్రీకృష్ణుడికి మొత్తం ఒకకోటి, ఎనభైవేలమంది కుమారులు పుట్టారు. యాదవులందరినీ శ్రీకృష్ణుడు పాలించేవాడు.

ప్రద్యుమ్నస్య తు వైదర్భ్యామనిరుద్ధో రణప్రియః ।
అనిరుద్ధస్య వజ్రాద్యా యాదవా స్సుమహాబలాః ॥7॥

ప్రద్యుమ్నుడికి విదర్భరాజు కూతురియందు అనిరుద్ధుడు పుట్టాడు. అతడికి యుద్ధాలంటే చాల ఇష్టం. అనిరుద్ధుడికి వజ్రుడు మొదలైన కుమారులు కలిగారు. యాదవులందరూ మిక్కిలి బలవంతులు.

తిస్రః కోట్యో యాదవానాం షష్టి ర్లక్షాణి దానవాః ।
మనుష్యే బాధకా యే తు తన్నాశాయ బభూవ సః ॥8॥

యాదవులు మూడుకోట్లమంది కాగా, దానవులు అరవైలక్షలమంది ఉన్నారు. ఈదానవులు మానవులను బాధిస్తుండేవారు. లోకకంటకులైన ఆ దానవులను నాశనం చేయడానికే శ్రీకృష్ణుడు భూమిపై అవతరించాడు.

కర్తుం కర్మవ్యవస్థానం మనుష్యో జాయతే హరిః ॥9॥

వర్ణాశ్రమాదులకు సంబంధించిన ఆ యా కర్మలను నియమబద్ధంగా నడిపించడానికే (ధర్మసంస్థాపనకే) శ్రీమహావిష్ణువు మానవుడుగా జన్మిస్తాడు.

దేవాసురాణాం సఙ్గ్రామా దాయార్థం ద్వాదశాభవన్ ।
ప్రథమో నారసింహ స్తు ద్వితీయో వామనో రణః ॥10॥

దేవతలకూ, రాక్షసులకూ దాయభాగంకోసమే పన్నాలుగు(సార్లు)యుద్ధాలు జరిగాయి. మొట్టమొదటి దేవదానవసంగ్రామం నారసింహం. రెండవది వామనయుద్ధం.

సఙ్గ్రామస్త్వథ వారాహశ్చతుర్థోఽమృతమన్థనః ।
తారకామయసఙ్గ్రామష్షష్ఠోహ్యాజీవకో రణః ॥11॥

మూడవది వారాహయుద్ధం. నాల్గవది అమృతమంథనయుద్ధం. అయిదవది తారకామయయుద్ధం. ఆరవది ఆజీవకయుద్ధం.

త్రైపురశ్చాన్ధకవధో నవమో వృత్రఘాతకః ।
జితో హాలాహలశ్చాథ ఘోరః కోలాహలో రణః ॥ 12॥

ఏడవది త్రైపురయుద్ధం. ఎనిమిదవది అంధకవధయుద్ధం. తొమ్మిదవది వృత్రఘాతనయుద్ధం. పదవది జితయుద్ధం, పదకొండవది హాలాహలయుద్ధం. పన్నెండవది ఘోరమైన కోలాహలయుద్ధం.

హిరణ్యకశిపోశ్చోరో విదార్య చ నఖైః పురా ।
నారసింహో దేవపాలః ప్రహ్లాదం కృతవాన్ నృపమ్ ॥13॥

పూర్వం దేవతలకు పాలకుడైన నారసింహుడు గోళ్లతో హిరణ్యకశిపుని గుండెలు చీల్చి తండ్రిరాజ్యానికి ప్రహ్లాదుడిని రాజు చేశాడు. (ఇది నారసింహం అనే మొదటి దేవాసురయుద్ధం)

దేవాసురే వామనశ్చ ఛ్ఛలిత్వా బలిమూర్జితమ్ ।
మహేన్ద్రాయ దదౌ రాజ్యం కాశ్యపోఽదితిసమ్భవః ॥14॥

తరువాత దేవతలకు రాక్షసులకు యుద్ధం జరిగినపుడు శ్రీమహావిష్ణువు కశ్యపమహర్షికి అదితికి కుమారుడుగా వామనుడుగా పుట్టాడు. ఆరూపంలో బలిచక్రవర్తిని మోసగించి, అతడివద్ద ఉన్నరాజ్యాన్ని దేవేంద్రుడికి తిరిగి ఇప్పించాడు. (ఇది వామనం అనే దేవాసురయుద్ధం రెండవది)

వరాహ స్తు హిరణ్యాక్షం హత్వా దేవానపాలయత్ ।
ఉజ్జహార భువం మగ్నాం దేవదేవై రభిష్టుతః ॥15॥

శ్రీమహావిష్ణువు వరాహరూపంలో హిరణ్యాక్షుడు అనే రాక్షసుడిని సంహరించి, దేవతలను రక్షించాడు. నీటిలో మునిగిపోయి ఉన్న భూమిని ఉద్ధరించాడు. అపుడు దేవనాయకులు మిక్కిలిగా స్తుతించారు. (ఇది వారాహం అనే దేవాసురయుద్ధం మూడవది)

మన్థానం మన్దరం కృత్వా వేత్రం కృత్వా తు వాసుకిమ్ ।
సురాసురైశ్చ మథితం దేవేభ్య శ్చామృతం దదౌ ॥16॥

మందరపర్వతాన్ని కవ్వంగా చేసుకుని, వాసుకి సర్పాన్ని కవ్వపుతాడుగా చేసుకుని, దేవతలూ, రాక్షసులూ పాలసముద్రాన్ని చిలికారు. ఆసమయంలో శ్రీమహావిష్ణువు దేవతలకు అమృతాన్ని ఇచ్చాడు. (ఇది అమృతమంథనం అనే యుద్ధం నాల్గవది)

తారకామయసఙ్గ్రామే తదా దేవాశ్చ పాలితాః ।
నివార్యేన్ద్రం గురూన్ దేవాన్ దానవాన్ సోమవంశకృత్ ॥17॥

తారకామయం అనే దేవాసురయుద్ధంలో బ్రహ్మదేవుడు దేవతలను రక్షించాడు. దానవులను యుద్ధంనుండి నివారించి, ఇంద్రుడిని, బృహస్పతిని, దేవతలనూ కాపాడి, భూలోకంలో సోమవంశం స్థాపించడం జరిగింది.

విశ్వామిత్రవసిష్ఠాత్రికవయశ్చ రణే సురాన్ ।
అపాలయం స్తే నిర్వార్య రాగద్వేషాదిదానవాన్ ॥18॥

విశ్వామిత్రుడు, వసిష్ఠుడు, అత్రి, శుక్రుడు అనేవారు యుద్ధంలో రాగం ద్వేషం మొదలైన దానవులను నివారించి, దేవతలను కాపాడారు. (ఇది ఆజీవకం అనే దేవాసురయుద్ధం ఆరవది)

పృథ్వీరథే బ్రహ్మయన్తు రీశస్య శరణో హరిః ।
దదాహ త్రిపురం దేవపాలకో దైత్యమర్దనః ॥19॥

పరమేశ్వరుడు భూమిని రథంగానూ, బ్రహ్మను సారథిగానూ చేసుకుని త్రిపురాసురులపై యుద్ధానికి వెళ్లినపుడు శ్రీమహావిష్ణువు శివుడికి సహాయంగా తాను బాణమై, త్రిపురాలను భస్మం చేశాడు. రాక్షసులను సంహరించి, దేవతలను కాపాడాడు. (ఇది త్రైపురం అనే దేవదానవయుద్ధం ఏడవది)

గౌరీం జిహీర్షుణా రుద్ర మన్ధకే నార్దితం హరిః ।
అనురక్తశ్చ రేవత్యాం చక్రే చాన్ధాసురార్దనమ్ ॥20॥

పూర్వం అంధకుడు అనే రాక్షసుడు గౌరిని అపహరించడానికి ప్రయత్నించాడు. ఆసందర్భంలో అంధకుడు పరమేశ్వరుడిని బాధించాడు. అపుడు రేవతియందు అనురాగం కలిగిన శ్రీమహావిష్ణువు అంధకాసురుడిని సంహరించాడు. (ఇది అంధకవధం అనే దేవాసురయుద్ధం ఎనిమిదవది)

అపాం ఫేనమయో భూత్వా దేవాసురరణే హరన్ ।
వృత్రం దేవహరం విష్ణు ర్దేవధర్మా నపాలయత్ ॥21॥

ఒకసారి దేవతలకు దానవులకు జరిగినయుద్ధంలో శ్రీమహావిష్ణువు నీళ్లలో నురుగుగా అయినాడు. దేవతలను బాధిస్తున్న వృత్రుడు అనే రాక్షసుడిని సంహరించి, దేవతలధర్మాలను రక్షించాడు. (ఇది వృత్రఘాతనం అనే దేవదానవయుద్ధం తొమ్మిదివది)

శాల్వాదీన్ దానవాన్ జిత్వా హరిః పరశురామకః ।
అపాలయ త్సురాదీంశ్చ దుష్టక్షత్రం నిహత్య చ ॥22॥

శ్రీమహావిష్ణువు పరశురాముడుగా అవతరించి, శాల్వుడు మొదలైన రాక్షసులను జయించాడు. దుర్మార్గులయిన క్షత్రియులను సంహరించి, దేవతలు మొదలైనవారిని కాపాడాడు. (ఇది జితం అనే దేవదానవ యుద్ధం పదవది)

హాలాహలం విషం దైత్యం నిరాకృత్య మహేశ్వరాత్ ।
భయం నిర్ణాశయామాస దేవానాం మధుసూదనః ॥23॥

శ్రీమహావిష్ణువు హాలాహలం అనే రాక్షసుడిని పరమేశ్వరుడి ద్వారా నిరోధించి, దేవతలకు గలిగిన ప్రాణభయం పోగొట్టాడు. (ఇది హాలాహలం అనే దేవదానవయుద్ధం పదకొండవది)

దేవాసురే రణే యశ్చ దైత్యః కోలాహలో జితః ।
పాలితాశ్చ సురా స్సర్వే విష్ణునా ధర్మపాలనాత్ ॥ 24॥

ఒకసారి దేవతలకూ రాక్షసులకూ జరిగిన యుద్ధంలో శ్రీమహావిష్ణువు కోలాహలుడు అనే రాక్షసుడిని జయించాడు. ఈవిధంగా అధర్మాన్ని నిర్మూలించి, ధర్మాన్ని నెలకొల్పడంచేత దేవతలందరికీ రక్షణ లభించింది. (ఇది ఘోరకోలాహలం అనే దేవదానవయుద్ధం పండ్రెండవది)

రాజానో రాజపుత్రాశ్చ మునయో దేవతా హరిః ।
యదుక్తం యశ్చ నైవోక్తమవతారా హరే రిమే ॥25॥

మహారాజులు, రాజకుమారులు, మహర్షులు, దేవతలు అందరూ శ్రీహరిస్వరూపులే. ఇంతవరకు చెప్పినవీ, చెప్పనివీ ఇవన్నీ శ్రీహరి అవతారాలే.

ఇత్యాది మహాపురాణే ఆగ్నేయే ద్వాదశసంఖ్యాకసఙ్గ్రామకథనం నామ షట్సప్తత్యధికద్విశతతమోఽధ్యాయః ॥276॥

అగ్నిమహాపురాణంలో ద్వాదశసంఖ్యాకసంగ్రామకథనం అనే రెండువందల డెబ్బైఆఱవ అధ్యాయం సమాప్తం.

సప్తసప్తత్యధికద్విశతతమోఽధ్యాయః - రెండువందల డెబ్బైఏడవ అధ్యాయం

రాజవంశవర్ణనమ్ - రాజవంశవర్ణనం

అగ్నిరువాచ - వసిష్ఠమహర్షితో అగ్నిదేవుడు ఇలా చెప్తున్నాడు.

తుర్వసోశ్చ సుతో వర్గో గోభానుస్తస్య చాత్మజః
గోభానోరాసీత్త్రైశానిస్త్రైశానేస్తు కరన్ధమః ॥1॥

యదువు సోదరుడైన తుర్వసుడి కుమారుడు వర్గుడు. వర్గుడికుమారుడు గోభానువు. గోభానువు కుమారుడు త్రైశాని. త్రైశాని కుమారుడు కరంధముడు.

కరన్ధమాన్మరుత్తోఽభూద్దుష్యన్త స్తస్య చాత్మజః ।
దుష్యన్తస్య వరూథోఽభూద్గాణ్డీరస్తు వరూథతః ॥2॥

కరంధముడికి మరుత్తుడు జన్మించాడు. మరుత్తుడికుమారుడు దుష్యంతుడు. దుష్యంతుడికి వరూథుడు పుట్టాడు. వరూథుడికి గాండీరుడు పుట్టాడు.

గాణ్డీరాచ్చైవ గాన్ధారః పఞ్చ జానపదాస్తతః ।
గాన్ధారాః కేరళాశ్చోలాః పాణ్డ్యాః కోలా మహాబలాః ॥3॥

గాండీరుడికి గాంధారుడు జన్మించాడు. గాంధారుడికి అయిదుగురు కుమారులు కలిగారు. వీరి పేరు మీదుగానే గాంధారం, కేరళ, మొదలుగా ఆయారాజ్యాలు ఏర్పడ్డాయి. వారి వారి దేశాలలో ఉండే జనం 1. గాంధారులు, 2. కేరళులు, 3. చోళులు, 4. పాండ్యులు, 5. కోలులు. వీరందరు మిక్కిలి బలవంతులు.

ద్రుహ్యస్తు బభ్రుసేతుశ్చ బభ్రుసేతోః పురోవసుః ।
తతో గాన్ధారా గాన్ధారై ర్ఘర్మో ఘర్మాద్ ఘృతోఽభవత్ ॥4॥

శర్మిష్ఠ కుమారుడైన ద్రుహ్యుడికి బభ్రుసేతువు జన్మించాడు. బభ్రుసేతువుకు పురోవసుడు కలిగాడు. పురోవసుడికి గాంధారుడు కలిగాడు. గాంధారుడికి ఘర్ముడు పుట్టాడు. ఘర్ముడికి ఘృతుడు జన్మించాడు.

ఘృతాత్తు విదుషస్తస్మాత్ ప్రచేతాస్తస్య వై శతమ్ ।
అనదుశ్చ సుభానుశ్చ చాక్షుషః పరమేషుకః ॥5॥

ఘృతుడికి విదుషుడు పుట్టాడు. విదుషుడికి ప్రచేతసుడు కలిగాడు. ప్రచేతసుడికి నూరుగురు కుమారులు. అనదువు, సుభానుడు (అనద్రశ్చ సభానరశ్చ అని పాఠాంతరం), చాక్షుషుడు, పరమేషుడు, అనేవాళ్లు ప్రధానులు.

సుభానోశ్చ కాలానలః కాలానలజస్సృఞ్జయః ।
పురఞ్జయస్సృఞ్జయస్య తత్పుత్రో జనమేజయః ॥6॥

సుభానుడికి కాలానలుడు కలిగాడు. కాలానలుడికి సృంజయుడు పుట్టాడు. సృంజయుడికి పురంజయుడు పుట్టాడు. పురంజయుడికుమారుడు జనమేజయుడు.

తత్పుత్రస్తు మహాశాలస్తత్పుత్రోఽభూన్మహామనాః ।
తస్మాదుశీనరో బ్రహ్మన్ నృగాయాం తు నృగస్తతః ॥7॥

బ్రాహ్మణోత్తమా! వసిష్ఠా! జనమేజయుడికుమారుడు మహాశాలుడు. మహాశాలుడికుమారుడు మహామనుడు. మహామనుడికి ఉశీనరుడు పుట్టాడు. నృగ అనే భార్యయందు మహామనుడికి నృగుడు అనే కుమారుడు కలిగాడు.

నరాయాం తు నరశ్చాసీత్ కృమిస్తు కృమితస్సుతః ।
దశాయాం సువ్రతో జజ్ఞే దృషద్వత్యాం శిబి స్తథా ॥8॥

నర అనే భార్యయందు నరుడు అనే కుమారుడు కలిగాడు. కృమి అనే భార్యయందు కృమి అనేవాడు పుట్టాడు. దశ అనే భార్యయందు సువ్రతుడు పుట్టాడు. దృషద్వతి అనే భార్యయందు శిబి జన్మించాడు.

శిబేః పుత్రాస్తు చత్వారః పృథుదర్భశ్చ వీరకః ।
కైకేయో భద్రకస్తేషాం నామ్నా జనపదాశ్శుభాః ॥9॥

శిబికి పృథుదర్భుడు, వీరకుడు, కైకేయుడు, భద్రకుడు అనేవారు నలుగురు కుమారులు. వారిపేర్లతో ఆయా దేశాలు మంచిలక్షణాలతో ఏర్పడ్డాయి.

తితిక్షురుశీనరజస్తితిక్షోశ్చ రుషద్రథః ।
రుషద్రథా దభూత్ పైలః పైలాచ్చ సుతపాస్సుతః ॥10॥

ఉశీనరుడి (7 శ్లో) కుమారుడు తితిక్షువు. తితిక్షువుకు రుషద్రథుడు పుట్టాడు. రుషద్రథుడికి పైలుడు జన్మించాడు. పైలుడికి సుతపుడు అనే కుమారుడు కలిగాడు.

మహాయోగీ బలిస్తస్మాదఙ్గో వఙ్గశ్చ ముఖ్యకః ।
పుణ్డ్రః కలిఙ్గో బాలేయో బలిర్యోగీ బలాన్వితః ॥11॥

సుతపుడికి గొప్పయోగి అయిన బలి జన్మించాడు. బలికి అంగుడు, వంగుడు, ముఖ్యకుడు, పుండ్రుడు, కలింగుడు, బాలేయుడు అనేవారు కుమారులు. బలవంతుడైన బలి గొప్పయోగి.

అఙ్గాద్దధివాహనోఽభూత్తస్మా ద్దివిరథో నృపః ।
దివిరథాద్ధర్మరథస్తస్య చిత్రరథస్సుతః ॥12॥

వీరిలో అంగుడికి దధివాహనుడు జన్మించాడు. దధివాహనుడికి దివిరథుడు కలిగాడు. దివిరథుడికి ధర్మరథుడు పుట్టాడు. ధర్మరథుడికి చిత్రరథుడు కలిగాడు.

చిత్రరథాత్సత్యరథో లోమపాదశ్చ తత్సుతః ।
లోమపాదాచ్చతురఙ్గః పృథులాక్షశ్చ తత్సుతః ॥13॥

చిత్రరథుడికి సత్యరథుడు జన్మించాడు. సత్యరథుడికుమారుడు లోమపాదుడు. లోమపాదుడికి చతురంగుడు కలిగాడు. చతురంగుడికుమారుడు పృథులాక్షుడు.

పృథులాక్షాచ్చ చమ్పో౽భూ చ్చమ్పాద్ధర్యఙ్గకో౽భవత్ ।
హర్యఙ్గాచ్చ భద్రరథో బృహత్కర్మా చ తత్సుతః ॥14॥

పృథులాక్షుడికి చంపుడు పుట్టాడు. చంపుడికి హర్యంగుడు కలిగాడు. హర్యంగుడికి భద్రరథుడు జన్మించాడు. భద్రరథుడి కుమారుడు బృహత్కర్మ.

తస్మాదభూద్ బృహద్భానుః బృహద్భానోర్బృహాత్మవాన్ ।
తస్మాజ్జయద్రథో హ్యాసీజ్జయద్రథాద్ బృహద్రథః ॥15॥

బృహత్కర్మకు బృహద్భానుడు పుట్టాడు. బృహద్భానుడికి బృహాత్మవంతుడు జన్మించాడు. బృహాత్మవంతుడికి జయద్రథుడు కలిగాడు. జయద్రథుడికి బృహద్రథుడు కలిగాడు.

బృహద్రథాద్విశ్వజిచ్చ కర్ణో విశ్వజితో౽భవత్ ।
కర్ణస్య వృషసేనస్తు పృథుసేనస్తదాత్మజః ॥16॥


బృహద్రథుడికి విశ్వజిత్తు పుట్టాడు. విశ్వజిత్తుకు కర్ణుడు కలిగాడు. కర్ణుడికి వృషసేనుడు జన్మించాడు. వృషసేనుడి కుమారుడు పృథుసేనుడు.

ఏతే౽ఙ్గవంశజా భూపాః పురో ర్వంశం నిబోధ మే ॥17॥

వీరందరూ అంగవంశంలో జన్మించినవారు. ఇక పురువంశం గురించి చెప్తాను. తెలుసుకో.

ఇత్యాది మహాపురాణే ఆగ్నేయే రాజవంశవర్ణనం నామ సప్తసప్తత్యధికద్విశతతమో౽ధ్యాయః ॥277॥

అగ్నిమహాపురాణంలో రాజవంశవర్ణనం అనే రెండువందల డెబ్బైఏడవ అధ్యాయం సమాప్తం.



అష్టసప్తత్యధికద్విశతతమోఽధ్యాయః - రెండువందల డెబ్బైఎనిమిదవ అధ్యాయం

పురువంశవర్ణనమ్ - పురువంశవర్ణనం

అగ్నిరువాచ - వసిష్ఠమహర్షితో అగ్నిదేవుడు ఇలా చెప్తున్నాడు.

పురోర్జనమేజయోఽభూత్ ప్రాచీవాన్నామ తత్సుతః ।
ప్రాచీవతో మనస్యుస్తు తస్మాద్వీతమయో నృపః ॥1॥

శర్మిష్ఠ రెండవకుమారుడైన(274.23శ్లో) పురువుకు జనమేజయుడు జన్మించాడు. జనమేజయుడి కుమారుడు ప్రాచీవంతుడు. ప్రాచీవంతుడికి మనస్యుడు పుట్టాడు. మనస్యుడికి రాజయిన వీతమయుడు కలిగాడు.

శున్ధు ర్వీతమయాచ్చాభూచ్ఛున్ధో ర్బహువిధస్సుతః ।
బహువిధాచ్చ సంయాతీ రహోవాదీ చ తత్సుతః ॥2॥

వీతమయుడికి శుంధువు పుట్టాడు. శుంధుడికి బహువిధుడు అనే కుమారుడు కలిగాడు. బహువిధుడికి సంయాతి జన్మించాడు. సంయాతికుమారుడు రహోవాది.

తస్య పుత్రోఽథ భద్రాశ్వో భద్రాశ్వస్య దశాత్మజాః ।
ఋక్షేయుశ్చ కృషేయుశ్చ సన్నతేయు స్తథాత్మజః ॥3॥

రహోవాది కుమారుడు భద్రాశ్వుడు. భద్రాశ్వుడికి కుమారులు పదిమంది. 1. ఋక్షేయువు, 2. కృషేయువు, 3. సన్నతేయువు, -

ఘృతేయుశ్చ చితేయుశ్చ స్థణ్డిలేయుశ్చ సత్తమః ।
ధర్మేయుస్సన్నతేయుశ్చకృతేయుర్మతినారకః ॥4॥

4. ఘృతేయువు, 5. చితేయువు, 6. ఉత్తముడైన స్థండిలేయువు, 7. ధర్మేయువు, 8. సన్నతేయువు, 9. కృతేయువు, 10. మతినారుడు.

తంసురోధః ప్రతిరథః పురస్తో మతినారజాః ।
ఆసీత్ ప్రతిరథాత్ కణ్వః కణ్వా న్మేధాతిథి స్త్వభూత్ ॥5॥

ప్రతినారుడికి తంసురోధుడు, ప్రతిరథుడు, పురస్తుడు అనే కుమారులు కలిగారు. వారిలో ప్రతిరథుడికి కణ్వుడు పుట్టాడు. కణ్వుడికి మేధాతిథి కలిగాడు.

తంసురోధాచ్చ చత్వారో దుష్యన్తోఽథ ప్రవీరకః ।
సుమన్తశ్చానయో వీరో దుష్యన్తాద్భరతోఽభవత్ ॥
శకున్తలాయాం తు బలీ యస్య నామ్నా తు భారతాః ॥6॥

వారిలో తంసురోధుడికి దుష్యంతుడు, ప్రవీరుడు, సుమంతుడు, వీరుడైన అనయుడు అనే నలుగురు కుమారులు కలిగారు. వీరిలో దుష్యంతుడికి శకుంతల అనే భార్యయందు భరతుడు పుట్టాడు. భరతుడు మిక్కిలి బలవంతుడు. అతడి పేరు మీదుగానే అతడి వంశం వారికి భారతులు అనే పేరు వచ్చింది.

సుతేషు మాతృకోపేన నష్టేషు భరతస్య చ ।
తతో మరుద్భిరానీయ పుత్ర స్స తు బృహస్పతేః ॥
సఙ్క్రామితో భరద్వాజః క్రతుభిర్వితథోఽభవత్ ॥ 7॥

తల్లికోపం కారణంగా భరతుడికుమారులు నశించిపోయారు. అప్పుడు భరతుడు యజ్ఞాలు చేశాడు. ఆ యజ్ఞాలలో మరుత్తులు బృహస్పతి కుమారుడైన భరద్వాజుడిని రప్పించి, అతడిని భరతుడికి కుమారుడినిగా సంక్రమింపజేశారు. అతడే తరువాత వితథుడు అనే పేరుతో ప్రసిద్ధుడైనాడు.

స చాపి వితథః పుత్రాన్ జనయామాస పఞ్చ వై ।
సుహోత్రం చ సుహోతారం గయం గర్భం తథైవ చ ॥
కపిలశ్చ మహాత్మానం సుకేతుం చ సుతద్వయమ్ ॥8॥

వితథుడు అయిదుగురు కుమారులను కన్నాడు. వారు 1. సుహోత్రుడు, 2. సుహోత, 3. గయుడు, 4. గర్భుడు, 5. కపిలుడు. వీరు కాక వితథుడికి మహాత్ముడు, సుకేతుడు అనేఇద్దరు కుమారులున్నారు.

కౌశికం చ గృత్సపతిం తథా గృత్సపతేస్సుతాః ।
బ్రాహ్మణాః క్షత్రియా వైశ్యాః కాశా దీర్ఘతమాస్సుతాః ॥9॥

వితథుడికి ఇంకా కౌశికుడు, గృత్సపతి అనే కుమారులు కూడ ఉన్నారు. వీరిలో గృత్సపతికి పుట్టిన కుమారులు – బ్రాహ్మణులు, క్షత్రియులు, వైశ్యులు, అయి ఉన్నారు. కాశులు, దీర్ఘతములు అనేవారు కూడ గృత్సపతికుమారులే.

తతో ధన్వన్తరిశ్చాసీత్ తత్సుతోఽభూచ్చ కేతుమాన్ ।
కేతుమతో హేమరథో దివోదాస ఇతి శ్రుతః ॥10॥

దీర్ఘతముడికి ధన్వంతరి అనే కుమారుడు కలిగాడు. ధన్వంతరి కుమారుడు కేతుమంతుడు. కేతుమంతుడికి హేమరథుడు జన్మించాడు. హేమరథుడే దివోదాసు అనే పేరుతో ప్రసిద్ధుడైనాడు.

ప్రతర్దనో దివోదాసాద్ భర్గవత్సౌ ప్రతర్దనాత్ ।
వత్సా దనర్క ఆసీచ్చ హ్యనర్కాత్ క్షేమకోఽభవత్ ॥11॥

దివోదాసుడికి ప్రతర్దనుడు పుట్టాడు. ప్రతర్దనుడికి భర్గుడు, వత్సుడు అనే కుమారులు కలిగారు. వారిలో వత్సుడికి అనర్కుడు జన్మించాడు. అనర్కుడికి క్షేమకుడు పుట్టాడు.

క్షేమకాద్ వర్షకేతుశ్చ వర్షకేతోర్విభుస్స్మృతః ।
విభోరానర్తః పుత్రోఽభూద్ విభోశ్చ సుకుమారకః ॥12॥

క్షేమకుడికి వర్షకేతువు కలిగాడు. వర్షకేతువుకు విభువు అనే కుమారుడు కలిగాడు. విభుడికి ఆనర్తుడు పుట్టాడు. విభుడికే సుకుమారుడు అనే కుమారుడు జన్మించాడు.

సుకుమారాత్ సత్యకేతుర్వత్సభూమిస్తు వత్సకాత్ ॥13॥

సుకుమారుడికి సత్యకేతువు జన్మించాడు. (ప్రతర్దనుడికుమారుడైన 11 శ్లో.) వత్సుడికి వత్సభూమి అనే కుమారుడు కలిగాడు.

సుహోత్రస్య బృహ త్పుత్రో బృహత స్తనయా స్త్రయః ।
అజమీఢో ద్విమీఢశ్చ పురుమీఢశ్చ వీర్యవాన్ ॥14॥

వితథుడికుమారుడైన సుహోత్రుడికి(8శ్లో) బృహతుడు అనే కుమారుడు పుట్టాడు. బృహతుడికి అజమీఢుడు, ద్విమీఢుడు, పురుమీఢుడు, అనే ముగ్గురు కుమారులు. పురుమీఢుడు మిక్కిలి పరాక్రమవంతుడు.

అజమీఢస్య కేశిన్యాం జజ్ఞే జహ్నుః ప్రతాపవాన్ ।
జహ్నో రభూదజకాశ్వో బలాకాశ్వ స్తదాత్మజః ॥15॥

అజమీఢుడికి కేశిని అనే భార్యయందు జహ్నువు పుట్టాడు. ఇతడు పరాక్రమవంతుడు. జహ్నువుకు అజకాశ్వుడు జన్మించాడు. అజకాశ్వుడికుమారుడు బలాకాశ్వుడు.

బలాకాశ్వస్య కుశికః కుశికాద్ గాధిరిన్ద్రకః ।
గాధే స్సత్యవతీ కన్యా విశ్వామిత్రస్సుతోత్తమః ॥16॥

బలాకాశ్వుడికుమారుడు కుశికుడు. కుశికుడికి గాధి అనే కుమారుడు కలిగాడు. ఇతడు ఇంద్రుడితో సమాన మైనవాడు. గాధికి సత్యవతి అనే కూతురు, ఉత్తముడైన విశ్వామిత్రుడు అనే కుమారుడు కలిగారు.

దేవరాతః కతిముఖో విశ్వామిత్రస్య తే సుతాః ।
శునశ్శేఫోఽష్టక శ్చాన్యో హ్యజమీఢాత్ సుతోఽభవత్ ॥17॥

విశ్వామిత్రుడికి దేవరాతుడు, కతిముఖుడు మొదలైన కుమారులు కలిగారు. అజమీఢుడికి (13శ్లో) శునశ్శేఫుడు, అష్టకుడు అనే ఇంకొకకుమారుడు కూడ జన్మించారు.

నీలిన్యాం శాన్తిరపరః పురుజాతిస్సుశాన్తితః ।
పురుజాతేస్తు బాహ్యాశ్వో బాహ్యాశ్వాత్ పఞ్చ పార్థివాః ॥18॥

నీలిని అనే భార్యయందు శాంతి అనే కుమారుడింకొకడు పుట్టాడు, శాంతికి పురుజాతి అనేవాడు కలిగాడు. పురుజాతికి బాహ్యాశ్వుడు పుట్టాడు. బాహ్యాశ్వుడికి అయిదుగురు మహారాజులు పుట్టారు.

ముకులస్సృఞ్జయశ్చైవ రాజా బృహదిషుస్తథా ।
యవీనరశ్చ కృమిలః పాఞ్చాలా ఇతి విశ్రుతాః ॥19॥

వారు, 1. ముకులుడు, 2. సృంజయుడు, 3. బృహదిషువు, 4. యవీనరుడు, 5. కృమిలుడు. వీరందరూ పాంచాలురు అని ప్రసిద్ధి పొందారు.

ముకులస్య తు మౌకుల్యాః క్షాత్రోపేతాద్విజాతయః ।
చఞ్చాశ్వో ముకులాజ్జజ్ఞే చఞ్చాశ్వా న్మిథునం హ్యభూత్ ॥ 20॥

ముకులుడివంశం వారు మౌకుల్యులు అయినారు. వీరు బ్రాహ్మణులే. కాని క్షత్రియధర్మాన్ని అనుసరిస్తారు. ముకులుడికి చంచాశ్వుడు పుట్టాడు. చంచాశ్వుడికి కవలపిల్లలు కలిగారు.

దివోదాసో హ్యహల్యా చ త్వహల్యాయాం శరద్వతాత్ ।
శతానన్దశ్శతానన్దాత్ సత్యధృజ్ మిథునం తతః ॥
కృపః కృపీ దివోదాసాన్మైత్రేయస్సోమపస్తతః ॥21॥

వారు దివోదాసు అనే కుమారుడు, అహల్య అనే కుమార్తె. వీరిలో అహల్యకు శరద్వతుడి (గౌతమమహర్షి)వలన శతానందుడు పుట్టాడు. శతానందుడికి సత్యధృక్కు జన్మించాడు. సత్యధృక్కుకు కృపుడు అనే కుమారుడు, కృపి అనే కుమార్తె కవలలుగా పుట్టారు. దివోదాసుకు మైత్రేయుడు కలిగాడు. మైత్రేయుడికి సోమపుడు పుట్టాడు.

సృఞ్జయాత్ పఞ్చధనుష స్సోమదత్తశ్చ తత్సుతః ।
సహదేవస్సోమదత్తాత్ సహదేవాత్తు సోమకః ॥22॥

(ముకులుడి తమ్ము డైన) సృంజయుడికి పంచధనుషుడు పుట్టాడు. పంచధనుషుడికి సోమదత్తుడు జనించాడు. సోమదత్తుడికి సహదేవుడు పుట్టాడు. సహదేవుడికి సోమకుడు కలిగాడు.

ఆసీచ్చ సోమకా జ్జన్తు ర్జన్తోశ్చ పృషతస్సుతః ॥23॥

సోమకుడికి జంతుడు అనే కుమారుడు కలిగాడు. జంతుడికుమారుడు పృషతుడు.

పృషతా ద్ద్రుపద స్తస్మా ద్ధృష్టద్యుమ్నోఽథ తత్సుతః ।
ధృష్టకేతుశ్చ ధూమిన్యామృక్షోఽభూదజమీఢతః ॥24॥

పృషతుడికి ద్రుపదుడు పుట్టాడు. ద్రపదుడికుమారుడు ధృష్టద్యుమ్నుడు. ధృష్టద్యుమ్నుడికుమారుడు ధృష్టకేతువు. అజమీఢుడికి ధూమిని అనే భార్యయందు ఋక్షుడు అనే కుమారుడు పుట్టాడు.

ఋక్షాత్సంవరణో జజ్ఞే కురుస్సంవరణాత్తతః ।
యః ప్రయాగాదపాక్రమ్య కురుక్షేత్రం చకార హ ॥25॥

ఋక్షుడికి సంవరణుడు పుట్టాడు. సంవరణుడికి కురువు పుట్టాడు. ఆ కురుమహారాజు ప్రయాగను దాటి వెళ్ళి, కురుక్షేత్రాన్ని నెలకొల్పాడు.

కురో స్సుధన్వా సుధనుః పరీక్షి చ్చారిమేజయః ।
సుధన్వన స్సుహోత్రోఽభూత్ సుహోత్రా చ్చ్యవనో హ్యభూత్ ॥26॥

కురుమహారాజుకు సుధన్వుడు, సుధనుడు, పరీక్షిత్తు, అరిమేజయుడు (రిపుఞ్జయః అని పాఠాంతరం). సుధన్వునుడికి సుహోత్రుడు కలిగాడు. సుహోత్రుడికి చ్యవనుడు పుట్టాడు.

వసు(శ్రేష్ఠోపరిచరాస్సప్తాసన్ గిరికాసుతాః ।
బృహద్రథః కుశో వీరో యదుః ప్రత్యగ్రహో బలః ॥
మత్స్యకాలీ కుశాగ్రోఽతో హ్యాసీ ద్రాజ్ఞో బృహద్రథాత్ ॥27॥

చ్యవనుడికి గిరిక అనే భార్యయందు శ్రేష్ఠులైన ఉపరిచరవసువులు 1. బృహద్రథుడు, 2. కుశుడు, 3. వీరుడు, 4. యదువు, 5. ప్రత్యగ్రహుడు, 6. బలుడు, 7. మత్స్యకాళి అనేకుమారులు ఏడుగురు పుట్టారు. బృహద్రథమహారాజుకు కుశాగ్రుడు జనించాడు.

కుశాగ్రా ద్వృషభో జజ్ఞే తస్య సత్యహితస్సుతః ॥28॥

కుశాగ్రుడికి వృషభుడు జన్మించాడు. వృషభుడికుమారుడు సత్యహితుడు.

సుధన్వా తత్సుత శ్చోర్జ ఊర్జాదాసీచ్చ సమ్భవః ।
సమ్భవాచ్చ జరాసన్ధ స్సహదేవశ్చ తత్సుతః ॥29॥

(కురుకుమారుడైన26శ్లో)సుధన్వుడికుమారుడు ఊర్జుడు. ఊర్జుడికి సంభవుడు కలిగాడు. సంభవుడికి జరాసంధుడు పుట్టాడు. జరాసంధుడికుమారుడు సహదేవుడు.

సహదేవాదుదాపిశ్చాప్యుదాపే(శ్శుతకర్మకః ॥30॥

సహదేవుడికి ఉదాపి అనే కుమారుడు కలిగాడు. ఉదాపికి శ్రుతకర్మ పుట్టాడు.

పరీక్షితస్య దాయాదో ధార్మికో జనమేజయః ।
జనమేజయా త్త్రసద్దస్యుర్జహ్నో స్తు సురథస్సుతః ॥
శ్రుతసేనోగ్రసేనౌ చ భీమసేనశ్చ నామతః ॥31॥

(కురుకుమారు డైన26శ్లో) పరీక్షిత్తుకు ధర్మపరాయణుడైన జనమేజయుడు జన్మించాడు. జనమేజయుడికి త్రసద్దస్యుడు పుట్టాడు. అజమీఢుడికుమారు డైన జహ్నువుకు సురథుడు, శ్రుతసేనుడు, ఉగ్రసేనుడు, భీమసేనుడు, అనే నలుగురు కుమారులు కలిగారు.

జనమేజయస్య పుత్రౌ తు సురథో మహిమాం స్తథా ।
సురథాద్విదూరథోఽభూదృక్ష ఆసీద్విదూరథాత్ ॥32॥

జనమేజయుడికి సురథుడు మహిముడు అనే కుమారులు ఇద్దరు కలిగారు. వారిలో సురథుడికి విదూరథుడు పుట్టాడు. విదూరథుడికి ఋక్షుడు జన్మించాడు.

ఋక్షస్య తు ద్వితీయస్య భీమసేనోఽభవత్సుతః ।
ప్రతీపో భీమసేనాత్తు ప్రతీపస్య తు శన్తనుః ॥33॥

ఈ ఋక్షుడు ఈవంశంలో రెండవవాడు. ఇతడికుమారుడు భీమసేనుడు. భీమసేనుడికి ప్రతీపుడు జన్మించాడు. ప్రతీపుడికి శంతనుడు కలిగాడు.

దేవాపిర్బాహ్లికశ్చైవ సోమదత్తస్తు శన్తనోః ।
బాహ్లికాత్ సోమదత్తోఽభూద్భూరి ర్భూరి(శవాశ్శలః ॥34॥

శంతనుడికి దేవాపి, బాహ్లికుడు, సోమదత్తుడు అనే కుమారులు కలిగారు. బాహ్లికుడికి సోమదత్తుడు పుట్టాడు. అతడికి భూరి, భూరిశ్రవుడు, శలుడు పుట్టారు.

గఙ్గాయాం శన్తనో ర్భీష్మః కాల్యాయాం విచిత్రవీర్యకః ॥35॥

శంతనుడికి గంగవలన భీష్ముడు పుట్టాడు. కాల్య (సత్యవతి) అనే భార్యయందు విచిత్రవీర్యుడు జన్మించాడు.

కృష్ణద్వైపాయనశ్చైవ క్షేత్రే వైచిత్రవీర్యకే ।
ధృతరాష్ట్రం చ పాణ్డుం చ విదురం చాప్యజీజనత్ ॥36॥

విచిత్రవీర్యుడిభార్యలయందు కృష్ణద్వైపాయనుడివలన ధృతరాష్ట్రుడు, పాండురాజు, విదురుడు జన్మించారు.

పాణ్డో ర్యుధిష్ఠిరః కున్త్యాం భీమ శ్చైవార్జునస్త్రయః ।
నకులస్సహదేవశ్చ పాణ్డోర్మాద్ర్యాం చ దైవతః ॥37॥

వారిలో పాండురాజుకు కుంతియందు యుధిష్ఠిరుడు, భీముడు, అర్జునుడు అనే ముగ్గురు కుమారులు పుట్టారు. పాండురాజుకు మాద్రి అనే భార్యయందు నకులుడు, సహదేవుడు అనే కుమారులు ఇద్దరు పుట్టారు. వీరందరూ దైవాంశలతో జన్మించారు.

అర్జునస్య చ సౌభద్రః పరీక్షిదభిమన్యుతః ॥38॥

వారిలో అర్జునుడికి సుభద్రయందు అభిమన్యుడు కలిగాడు. అభిమన్యుడికి పరీక్షిత్తు జన్మించాడు.

ద్రౌపదీ పాణ్డవానాం చ ప్రియా తస్యాం యుధిష్ఠిరాత్ ।
ప్రతివిన్ధ్యో భీమసేనా చ్ఛ్రుతకీర్తి ర్ధనఞ్జయాత్ ॥
సహదేవా చ్ఛ్రుతకర్మా శతానీకస్తు నాకులిః ॥39॥

పాండుకుమారులు అయిదుగురికీ ద్రౌపది భార్య. ఆమెకు యుధిష్ఠిరుడివలన ప్రతివింధ్యుడు, భీమసేనుడివలన శ్రుతసోముడు, అర్జునుడివలన శ్రుతకీర్తి, సహదేవుడివలన శ్రుతకర్మ, నకులుడివలన శతానీకుడు,పుట్టారు.

భీమసేనాద్ధిడిమ్బాయామన్య ఆసీద్ఘటోత్కచః ॥40॥

భీమసేనుడికి విశేషంగా హిడింబయందు ఘటోత్కచుడు అనే కుమారుడు కలిగాడు.

ఏతే భూతా భవిష్యాశ్చ నృపాస్సఙ్ఖ్యా న విద్యతే ।
గతాః కాలేన కాలో హి హరిస్తం పూజయేద్ద్విజ ॥
హోమమగ్నౌ సముద్దిశ్య కురు సర్వప్రదో యతః ॥41॥

వసిష్ఠమహర్షీ! వీరందరూ జరిగిపోయినకాలంలో ఉన్నరాజులు. ఇంక భవిష్యత్తులో పుట్టబోయే రాజులసంఖ్య తెలియరాదు. గతంలోని రాజులందరూ కాలంతోపాటే వెళ్లిపోయారు. కాలం సాక్షాత్తుగా శ్రీమహావిష్ణుస్వరూపం. అందుచేత కాలస్వరూపుడైన ఆవిష్ణుదేవుడిని గురించి అగ్నిలో హోమాలు చెయ్యి. ఆవిష్ణుదేవుడు అందరికీ అన్నీ ఇస్తాడు (కాబట్టి విష్ణువు నుద్దేశించి హోమపూజాదులు చేయాలి).

ఇత్యాది మహాపురాణే ఆగ్నేయే పురువంశవర్ణనం నామాష్టసప్తత్యధికద్విశతతమోఽధ్యాయః ॥278॥

అగ్ని మహాపురాణంలో పురువంశవర్ణనం అనే రెండువందల డెబ్బైఎనిమిదవ అధ్యాయం సమాప్తం.

ఏకోనాశీత్యధికద్విశతతమోఽధ్యాయః - రెండువందల డెబ్బైతొమ్మిదవ అధ్యాయం

సిద్ధౌషధాదికథనమ్ - సిద్ధౌషధాదికథనం

అగ్నిరువాచ - వసిష్ఠమహర్షితో అగ్నిదేవుడు ఇలా చెప్తున్నాడు.

ఆయుర్వేదం ప్రవక్ష్యామి సుశ్రుతాయ యమబ్రవీత్ ।
దేవో ధన్వన్తరిస్సారం మృతసఞ్జీవనీకరమ్ ॥1॥

వసిష్ఠమహర్షీ! ఇపుడు ఆయుర్వేదం గురించి చెప్తాను. పూర్వం దీనిని దేవుడైన ధన్వంతరి సుశ్రుతుడికి చెప్పాడు. ఆయుర్వేదం చచ్చినవాడిని కూడ బ్రతికించే ఉత్తమవిషయం.

సుశ్రుత ఉవాచ - సుశ్రుతుడు ధన్వంతరిని ఇలా అడుగుతున్నాడు.

ఆయుర్వేదం మమ బ్రూహి నరాశ్వేభరుగర్దనమ్ ।
సిద్ధయోగాన్ సిద్ధమన్త్రాన్ మృతసఞ్జీవనీకరాన్ ॥2॥

దేవా! మానవులకు, గుఱ్ఱాలు, ఏనుగులు మొదలైన జంతువులకు రోగాలు పోగొట్టే ఆయుర్వేదాన్ని నాకు చెప్పవలసినది. ఇంకా చచ్చినవాడిని కూడ బ్రతికింపగలిగిన సిద్ధయోగాలనూ, సిద్ధమంత్రాలనూ కూడ చెప్పు.

ధన్వన్తరి రువాచ - సుశ్రుతుడితో ధన్వంతరి ఇలా చెప్తున్నాడు.

రక్షన్ బలం హి జ్వరితం లఙ్ఘితం భోజయేద్భిషక్ ।
సవిశ్వం లాజమణ్డం తు తృడ్జ్వరాన్తం శృతం జలమ్ ॥3॥

జ్వరం వచ్చినవాడిశరీరబలం చూసుకుని, వైద్యుడు అతడిచేత లంఘనమూ (ఉపవాసం), భోజనమూ చేయించాలి. తరువాత దాహాన్నీ జ్వరాన్నీ తగ్గించేటటువంటి పేలాలతో కాచినగంజి(మండం)ని, కాగబెట్టిన(శృతం)నీళ్లనూ సొంటి(విశ్వం) పొడి కలిపి రోగికి ఇవ్వాలి.

ముస్తపర్పటకోశీరచన్దనోదీచ్యనాగరైః ।
షడహే చ వ్యతిక్రాన్తే తిక్తకం పాయయే ద్ధ్రువమ్ ॥4॥

ఆనీళ్లలో నిడుముస్తెగడ్డి, పర్పాటకం అనేగడ్డి, వట్టివేరు (ఉశీరం), చందనం, కురువేరు (ఉదీచ్యం), గోరంట (నాగరం), అనేవస్తువులు వేసి కాగబెట్టాలి. ఆరురోజులతరువాత రోగిచేత తిక్తకషాయాన్ని తప్పకుండా తాగించాలి.

స్నేహయే త్త్యక్తదోషం తు తత స్తం చ విరేచయేత్ ॥5॥

జ్వరదోషం తొలగిపోయినతరువాత అతడికి నువ్వులనూనెతో నలుగుపెట్టి తలంటుపోయాలి. ఆ తరువాత అతడికి తగినమందు ఇచ్చి, విరేచనం (కడుపు శుద్ధి) జరిగే విధంగా చేయాలి.

జీర్ణా షష్టికనీవారరక్తశాలిప్రమోదకాః ।
తద్విధా స్తే జరేష్విష్టా యవానాం వికృతి స్తథా ॥6॥

జ్వరంగా ఉన్నసమయంలో ఎండిన షష్టికధాన్యం, నివ్వరిధాన్యం, ఎఱ్ఱగా ఉండే ధాన్యవిశేషం మేలు చేస్తాయి. ఇంకా ఈవిధమైనవి పాతధాన్యం మంచివి. అలాగే యవలతో చేసిననూక, పిండి మొదలైనవి మంచివి.

ముద్గా మసూరా శ్చణకాః కులత్థాశ్చ సుకుష్ఠకాః ।
ఆఢక్యో లావకాద్యా శ్చ కర్కోటకకటోలకమ్ ॥
పటోలం సుఫలం నిమ్బం పర్పటం దాడిమం జ్వరే ॥7॥

జ్వరసమయంలో పెసలు(ముద్గం), చిరుసెనగలు(మసూరం), (పెద్ద)సెనగలు(చణకం), ఉలవలు(కులత్థం), మంచికోష్టులు (కుష్ఠం), కందులు (ఆఢకి), లావకం (నారకం అని పాఠాంతరం) మొద లైనవి, మారేడు (కర్కోటం), కటోలం, పొట్ల (పటోలం), రేగు (సుఫలం), వేప (నింబం), పర్పాటకం అనేగడ్డి, దానిమ్మ – ఇవి మేలు చేస్తాయి.

అధోగే వమనం శస్త మూర్ధ్వగే చ విరేచనమ్ ।
రక్తపిత్తే తథా పానం షడఙ్గం శుణ్ఠివర్జితమ్ ॥8॥

రక్తపిత్తం అనే రోగంలో పిత్తంలో బయలుదేరిన రక్తం క్రమం తప్పి క్రిందుగా సంచరించేటపుడు వాంతి మేలయినది. అది ఊర్ధ్వంగా సంచరిస్తే విరేచనం ఉత్తమం. సొంటి కలపకుండా, గోమూత్రం, గోమయం, గోక్షీరం, గోదధి, గోఘృతం, గోరోచనం అనే ఆరు ద్రవ్యాలను త్రాగడం ఉత్తమం.

సక్తుగోధూమలాజాశ్చ యవశాలిమసూరకాః ।
సకుష్ఠచణకా ముద్గా భక్ష్యా గోధూమకా హితాః ॥9॥

పేలపిండి (సక్తువు), గోధుమలు, పేలాలు, యవలు, వడ్లు, చిరుసెనగలు, కోష్ఠులు, సెనగలు, పెసలు తినవచ్చును. వీటిలో కూడ గోధుమలు ఎక్కువ మేలు చేస్తాయి.

సాధితా ఘృతదుగ్ధాభ్యాం క్షౌద్రం వృషరసో మధు ।
అతిసారే పురాణానాం శాలీనాం భక్షణం హితమ్ ॥10॥

ఆవునేతితోనూ, ఆవుపాలతోనూ సాధన చేసిన తేనె, ఋషభం అనే మూలికరసం మంచివి. అతిసారవ్యాధిలో పాతవరిధాన్యం తినడంవలన బాగా మేలు జరుగుతుంది.

అనభిష్యన్ది య చ్చాన్నం లోధ్రవల్కలసంయుతమ్ ।
మారుతం వర్జయే ద్యత్నః కార్యో గుల్మేషు సర్వథా ॥11॥

గుల్మరోగం కలిగినపుడు నెయ్యి, నూనె మొదలైన జిడ్డుపదార్థాలు స్రవించనిదీ, లొద్దుగచెట్టుబెరడుతో కూడినదీ అయినఅన్నం తీసుకోవడం మంచిది. వాతదోషాన్ని కలిగించే ఆహారాన్ని ప్రయత్నపూర్వకంగా విడిచిపెట్టాలి.

వాట్యం క్షీరేణ చాశ్నీయా ద్వాస్తూకం ఘృతసాధితమ్ ।
గోధూమశాలయ స్తిక్తా హితా జఠరిణా మథ ॥12॥

పొట్టకు సంబంధించిన రోగం వచ్చినవాడు, ఆవుపాలతో కలిసిన వాట్యం (తోటలో ఏర్పడినది), నేతితో కలిపిన వాస్తూకాన్ని తీసుకోవాలి. ఇంకా గోధుమలు, వరిధాన్యం, చేదుగా ఉండే ఔషధాలతో కూడినవీ తీసుకోవాలి.

గోధూమశాలయో ముద్గా బ్రహ్మార్క్షఖదిరోఽభయా ।
పఞ్చకోలం జాఙ్గలాశ్చ నిమ్బధాత్ర్యః పటోలకాః ॥13॥

గోధుమలు, వరిధాన్యం, పెసలు, మోదుగ (బ్రహ్మార్క్షం), అత్తపత్తి (ఖదిరం), కరక్కాయ (అభయం), పంచకోలం (పిప్పలి, పిప్పలిమూలం, చవ్యం, శొంఠి, చిత్రమూలం) జాంగలం, వేప, ఉసిరిక, పొట్ల (పటోలకం), మంచివి.

మాతులుఙ్గరసా జాజిశుష్కమూలకసైన్ధవాః ।
కుష్ఠినాం చ తథా శస్తం పానార్థే ఖదిరోదకమ్ ॥14॥

మాదీఫలపురసం, జాజి, ఎండుముల్లంగి, సముద్రపుటుప్పు, – ఇవి కుష్ఠరోగులకు పథ్యాలు. తాగడానికి అత్తపత్తినీరు మంచిది.

మసూరముద్గౌ పేయార్థే భోజ్యా జీర్ణాశ్చ శాలయః ।
నిమ్బపర్పటకౌ శాకౌ జాఙ్గలానాం తథా రసః ॥15॥

తాగడానికి ఇంకా మసూరం అనే కాయధాన్యం, పెసలు, వీటితో కాచిన గంజి కూడ మంచిది. వండుకుని తినడానికి పాతబియ్యం మంచివి. మందారం, పర్పాటకం అనే గడ్డి, వీటితో చేసిన కూరలు మంచివి. అదేవిధంగా జాంగలాలరసం మంచిది.

విడఙ్గం మరిచం ముస్తం కుష్ఠం లోధ్రం సువర్చికా ।
మనశ్శిలా వచాలేపః కుష్ఠహా మూత్రపేషితః ॥16॥

విడంగం (కడుపులోని క్రిములను పోగొట్టే ఒకానొక ఓషధి), మిరియం (మరీచం), తుంగముస్తె, చెంగల్వకోష్ఠు, లొద్దుగ, లవణం (సువర్చిక), మనశ్శిల, వసదుంప గంధం, ఆవుమూత్రంతో నూరినవి – ఇవి కుష్ఠవ్యాధిని పోగొడతాయి.

అపూపకుష్ఠకుల్మాషయవాద్యా మేహినాం హితాః ॥17॥

అతిమూత్రవ్యాధి ఉన్నవారికి బూరెలు, చెంగల్వకోష్టు, బొబ్బర్లు మొదలైనవాటి గుగ్గిళ్లు, యవధాన్యం, మొదలైనవి మేలు చేస్తాయి.

యవాన్నవికృతి ర్ముద్గా కులత్థా జీర్ణశాలయః ।
తిక్తరూక్షాణి శాకాని తిక్తాని హరితాని చ ॥
తైలాని తిలశిగ్రుకవిభీతకేఙ్గుదాని చ ॥18॥

యవలతో వండిన అన్నంతో చేసినవి, పెసలు, ఉలవలు (కులత్థాలు), బాగా పాతబడిన వరిధాన్యం, చేదు, ఒగరు కలిసినరుచిలో ఉండేవీ, చేదుగా ఉండేవి, హరితంగా ఉండేవి అయినకూరలు, నువ్వులనూనె, మునగ(శిగ్రుక)నూనె, తాండ్ర(విభీతక)నూనె, గార(ఇంగుద)నూనె, ఇవి కూడ (అతిమూత్రవ్యాధిగ్రస్తులకు) మంచివి.

ముద్గా స్సయవగోధూమా ధాన్యం వర్షస్థితం చ యత్ ।
జాఙ్గలస్య రస శ్శస్తో భోజనే రాజయక్ష్మిణామ్ ॥19॥

క్షయ(రాజయక్ష్మ)రోగులకు ఒక సంవత్సరంపాటు నిలవ ఉన్న పెసలు, యవలు, గోధుమలు, జాంగలరసం, వీటిని భోజనంలో ఉపయోగించడం మంచిది.

కులుత్థముద్గకోలాద్యై శ్శుష్కమూలకజాఙ్గలైః ।
పూపై ర్వా విష్కిరై స్సిద్ధై ర్దధిదాడిమసాధితైః ॥20॥

ఉలవలు, పెసలు, పిప్పళ్లు (కోల) మొద లైనవి, బాగా ఎండిన ముల్లంగి, జాంగలాలు, అప్పాలు, అలాగే పెరుగు, దానిమ్మరసాలతో కలిపిన విష్కిరాలు,

మాతులుఙ్గరసక్షౌద్రద్రాక్షావ్యో(వో)షాదిసంస్కృతైః ।
యవగోధూమశాల్యన్నై ర్భోజయే చ్ఛ్వాసకాసినామ్ ॥21॥

ఉబ్బసం(శ్వాసకాస)రోగం కలిగినవారికి మాదీఫలరసం, తేనె, ద్రాక్ష, ఇంకా – సొంటి, పిప్పలి, మిరియం అనేత్రికటుకాలతోనూ (వ్యోష) సంస్కరింపబడిన యవలు, గోధుమలు, వరిఅన్నం, తినిపించాలి.

దశమూలబలారాస్నాకులుత్థై రుపసాధితాః ।
పేయాః పూపరస(సాః) క్వాథా శ్శ్వాసహిక్కా నివారణాః ॥22॥

దశమూలం (పల్లేరు, ముయ్యాకు, పొన్న, ములక, వాకుడు, మారేడు, తక్కిలి, గుమ్ముడు, దుండిగం, కలిగొట్టు, వెల్లి అనే పదిమూలాలతో చేసిన ఔషధం), చిట్టాముదం (బల), రాస్న అనే ఔషధం, ఉలవలు అను వీటిని కలిపి తయారుచేసిన ద్రవ పదార్థాలు, పోకగంజి, కషాయాలు (క్వాథం), – ఇవి శ్వాసకు సంబంధించిన రోగాలనూ, ఎక్కిళ్లనూ తగ్గిస్తాయి.

శుష్కమూలకకౌలత్థమూలజాఙ్గలజై రసైః ।
యవగోధూమశాల్యన్నం జీర్ణం సోశీర మాచరేత్ ॥23॥

బాగా ఎండిన ముల్లంగి, ఉలవలు, దుంపలు, జాంగలాలు, వీటితో తయారుచేసిన రసాలతోనూ, పాతబడిన యవలు, గోధుమలు, వరిధాన్యం, వీటిని వట్టివేళ్లతో(ఉశీరం) కలిపి తీసుకుంటే శ్వాసవ్యాధులు తగ్గుతాయి.

శోథవాన్ సగుడాం పథ్యాం ఖాదే ద్వా గుడనాగరమ్ ।
తక్రం చ చిత్రకం చోభౌ గ్రహణీరోగనాశనౌ ॥24॥

వాపు రోగం ఉన్నవాడు కరక్కాయను(పథ్య) బెల్లంతో కలిపి నూరి తినాలి. లేదా సొంటిని బెల్లంతో కలిపి తినాలి. పాతికపాళ్లు నీళ్లు కలిపినమజ్జిగ, గుమ్మడి (చిత్రకం) ఇవి అతిసారం (గ్రహణి) అనేరోగాన్ని నిర్మూలిస్తాయి.

పురాణయవగోధూమశాలయో జాఙ్గలో రసః ।
ముద్గామలకఖర్జూరమృద్వీకా బదరాణి చ ॥25॥

బాగా పాతబడినయవలు, గోధుమలు, వరిధాన్యం, జాంగలరసం, పెసలు, ఉసిరిక, ఖర్జూరం, ద్రాక్ష (మృద్వీకం), రేగుబండ్లు,

మధు సర్పిః పయ శ్శృక్రం నిమ్బపర్పటకౌ వృషమ్ ।
తక్రారిష్టాశ్చ శస్యన్తే సతతం వాతరోగిణామ్ ॥26॥

తేనె, నెయ్యి, పాలు, అవిసె, వేప, పర్పాటకం అనే గడ్డి, ఋషభం అనే మూలిక, మజ్జిగ, వెల్లుల్లి – ఈవస్తువులు వాతరోగులకు ఎప్పుడూ శ్రేష్ఠమైనవి.

హృద్రోగిణో విరేచ్యాస్తు పిప్పల్యో హిక్కినాం హితాః ।
తక్రారనాలసీధూని యుక్తాని శిశిరామ్భసా ॥27॥

గుండెజబ్బు కలిగినవాళ్లకు విరేచనం అయ్యేటట్లు చేయాలి. ఎక్కిళ్లు వచ్చేవాడికి పిప్పళ్లు మంచివి. అలాగే ఎక్కిళ్లు తగ్గడానికి మజ్జిగ, ఆరనాలం, మద్యం, వీటిని చల్లనినీళ్లతో తీసుకోవడం మంచిది.

ముక్తా స్సౌవర్చ లాజాజీమద్యం శస్తం మదాత్యయే ।
సక్షౌద్రపయసా లాక్షాం, పిబేచ్ఛ క్షతవాన్నరః ॥28॥

అతిగా మద్యం తాగడం వలన వచ్చినరోగం పోవడానికి ముత్యాలు, మోదుగచెట్టునుండి తీసినలవణం (సౌవర్చలం), తెల్లజీలకఱ్ఱ (అజాజి), అనువీటితో చేసిన మద్యం ఉత్తమమైనది. గాయాలు తగిలినవాడు తేనె, పాలు కలిపిన లక్కను తాగాలి.

క్షయం మాంస రసాహారో వహ్నిసంరక్షణాజ్జయేత్ ।
శాలయో భోజనే రక్తా నీవార కలమాదయః ॥29॥

జఠరాగ్నిని కాపాడుకోవడం వలననూ, మాంసరసంతో కూడిన ఆహారం తీసుకోవడం వలననూ క్షయరోగం తగ్గుతుంది. ఇంకా భోజనంలో ఎఱ్ఱని బియ్యం, నివ్వరి ధాన్యం, కలమం అనే(జ్యేష్ఠమాసంలో విత్తి, మార్గశీర్షపుష్యమాసాలలో కోసే) ధాన్యం ఉపయోగిస్తే, మంచిది.

యవాన్నవికృతి ర్మాంసం శాకం సౌవర్చలం శటీ ।
పద్యా తథైవార్శసాం యన్మణ్డ స్తక్రం చ వారిణా ॥30॥

మూలవ్యాధివచ్చినవారికి యవలతో వండిన అన్నంతో తయారయినది, మాంసం, తోటకూర,(శాకం), మోదుగచెట్టునుండి తీసినఉప్పు (సౌవర్చలం), కచ్చూరం, చక్కెర (పద్య), మీగడ (మండం), మజ్జిగ, వీటిని నీటితో కలిపి తీసుకోవాలి.

ముస్తాభ్యాస స్తథా లేప శ్చిత్రకేణ హరిద్రయా ।
యవాన్నవికృతి శ్శాలి ర్వాస్తూకం ససువర్చలమ్ ॥ 31॥

తుంగముస్తెను దగ్గర ఉంచుకోవడం, తిలకం, పసుపు పూసుకోవడమూ, యవల అన్నంతో చేసిన పదార్థాలు, వరిధాన్యం, అవిసెతో కూడినవాస్తూకం,

త్రపుషై ర్వారుగోధూమాః క్షీరేక్షుఘృతసంయుతాః ।
మూత్రకృచ్ఛ్రే చ శస్తా స్స్యు పానే మణ్డసురాదయః ॥32॥

మూత్రం విడిచేటపుడు నొప్పిగా ఉండడం అనే రోగం తగ్గడానికి – తగరం(త్రపుషం)తో కూడిన వారువులు, పాలతోనూ, చెరకురసంతోనూ, ఆవునెయ్యితోనూ కలిపినగోధుమలు, చక్కగా ఉపయోగిస్తాయి. గంజి(మండం), కల్లు మొదలైనవి తాగడం ఉత్తమం.

లాజా స్సక్తు స్తథా క్షౌద్రం శూన్యం మాంసం పరూషకమ్ ।
వార్తాకులావశిఖిన శ్ఛర్దిఘ్నాః పానకాని చ ॥33॥

పేలాలు, పేలపిండి, తేనె, రసశూన్యమైనమాంసం, ఖర్జూరం (పరూషకం), వంగ, పానకాలు ఇవి కడుపుమంటను పోగొడతాయి.

శాల్యన్నం తోయపయసీ కేవలోష్ణే శృతేఽపి వా ।
తృష్ణాఘ్నే ముస్తగుడయో ర్గుటికా వా ముఖే ధృతా ॥34॥

వరి అన్నం, చక్కగా కాచిననీళ్లు, పాలు, గ్రహిస్తే దాహం పోతుంది. తుంగముస్తె బెల్లం కలిపి ఉండలుగా (మాత్రలుగా) చేసి, నోట్లో వేసుకున్నా దాహం తగ్గుతుంది.

యవాన్నవికృతిః పూపం శుష్కమూలకజం తథా ।
శాకం పటోలవేత్రాగ్ర మూరుస్తమ్భవినాశనమ్ ॥35॥

తొడలు (మోకాళ్లు) బిగుసుకున్నపుడు యవధాన్యంతో వండిన అన్నపదార్థాలు, అప్పాలు, ఎండిన ముల్లంగి, తోటకూర, పొట్ల, పేముచిగుళ్లు, ఉపయోగిస్తాయి.

ముద్గాఢకమసూరాణాం సతిలై ర్జాఙ్గలై రసైః ।
ససైన్ధవఘృతద్రాక్షాశుణ్ఠ్యామలకకోలజైః ॥
యూషైః పురాణగోధూమయవశాల్యన్న మభ్యసేత్ ॥36॥

విసర్పి అనే చర్మరోగం ఉన్నవాడు పెసలు, కందులు, మసూరాలు అనే కాయ ధాన్యం, వీటిని నువ్వులతోనూ జాంగలాలతోనూ, పుష్పాదులరసాలతోనూ, సైంధవలవణం, నెయ్యి, ద్రాక్ష, సొంటి, ఉసిరిక, రేగు, ఉడుకుతున్నపప్పు మీది తేట (పప్పుకట్టె – యూషం), పాతగోధుమలు, యవలు, బియ్యం వీటి అన్నం పుచ్చుకోవాలి.

విసర్పీ ససితాక్షౌద్రమృద్వీకాదాడిమోదకమ్ ॥37॥

విసర్పి అనే చర్మరోగం వచ్చినవాడు తేనె, ద్రాక్ష, దానిమ్మ నీళ్లలో పంచదార కలుపుకుని తాగాలి.

రక్తయష్టికగోధూమయవముద్గాదికం లఘు ।
కాకమాచీ చ వేత్రాగ్రం వాస్తుకం చ సువర్చలా ॥
వాతశోణితనాశాయ తోయం శస్తం సితం మధు ॥38॥

వాతరక్తం అనే రోగం పోవడానికి, మంజిష్టం (రక్తయష్టి), గోధుమలు, యవలు, పెసలు, వీటితో వండినఅన్నం కొద్దికొద్దిగా తినాలి. కాచి అనే ఔషధం, పేముకొనలు, వాస్తుకం, అవిసె అనేకూరలు, చక్కెర, తేనె కలిపిననీళ్లు పుచ్చుకోవడం మంచిది.

నాసారోగేషు చ హితం ఘృతం దూర్వా ప్రసాధితమ్ ॥39॥

ముక్కుకు సంబంధించినరోగానికి గరికతో సాధన చేసిన ఆవునేతిని తీసుకోవడం మంచిది.

భృఙ్గరాజరసే సిద్ధం తైలం ధాత్రీరసేఽపి వా ।
నస్యం సర్వామయేష్విష్టం మూర్ధజన్తూర్ధ్వవేషు చ ॥40॥

తలభాగంలో ఏర్పడినబాధలకు అన్నింటికీ గలిజేరురసంతో గాని, ఉసిరికరసంతో కాని కలిపిన నువ్వులనూనెను నస్యంగా పీల్చుకోవడం మంచిది

శీతతోయాన్నపానం చ తిలానాం విప్రభక్షణమ్ ।
ద్విజదార్ఢ్యకరం ప్రోక్తం తథా తుష్టికరం పరమ్ ॥
గణ్డూషం తిలతైలేన ద్విజదార్ఢ్యకరం పరమ్ ॥41॥

బ్రాహ్మణోత్తమా! వశిష్ఠమహర్షీ! చల్లనినీళ్లతో కూడిన అన్నం పానం చేయడంవలన, నువ్వులను తినడంవలన దంతాలు గట్టిపడతాయి. అది ఇంకా గొప్పతృప్తిని కలిగిస్తుంది అని తెలిసినవాళ్ళు చెప్పారు. నువ్వులనూనెతో పుక్కిలించడంవలన కూడ దంతాలు బాగా గట్టిపడతాయి.

విడఙ్గచూర్ణం గోమూత్రం సర్వత్ర కృమినాశనే ॥42॥

కడుపులోని క్రిములను నాశనం చేయడానికి విడంగం అనే ఔషధం, ఆవు మూత్రం చక్కగా ఉపయోగిస్తాయి.

ధాత్రీఫలాన్యథాజ్యం చ శిరోలేపనముత్తమమ్ ।
శిరోరోగవినాశాయ స్నిగ్ధముష్ణం చ భోజనమ్ ॥43॥

తలకు సంబంధించిన రోగాలు పోవడానికి ఉసిరికకాయ పొడిని ఆవునేతిలో కలిపి, తలకు పూసుకోవడం శ్రేష్ఠం. నేతిజిడ్డుతో కూడిన వేడిఅన్నం తినడంవల్ల కూడ తలనొప్పులు పోతాయి.

తైలం వా బస్తమూత్రం చ కర్ణపూరణముత్తమమ్ ।
కర్ణశూలవినాశాయ సర్వశుక్తాని వా ద్విజ ॥44॥

విప్రవర్యా! వసిష్ఠా! చెవిపోటు తగ్గడానికి నువ్వులనూనెను గాని, మేక మూత్రం గాని, లేదా పులిసిన ద్రవ్యం ఏదయినా కాని, చెవిలో వేసుకుంటే మంచిది.

గిరిమృచ్చన్దనం లాక్షా మాలతీ కాలికా తథా ।
సంయోజ్య యా కృతా వర్తిః క్షతశ్విత్రహరీ తు సా ॥45॥

కొండలపై ఉండే మట్టి, చందనం, లక్క, జాజి, కరక్కాయ వీటిని కలిపి చేసిన పట్టీ (పూతమందు) గాయాలనూ, బొల్లిమచ్చలనూ పోగొడుతుంది.

వ్యోషం త్రిఫలయా యుక్తం తుత్థకం చ తథా జలమ్ ।
సర్వాక్షిరోగశమనం తథా చైవ రసాఞ్జనమ్ ॥46॥

సొంటి, పిప్పలి, మిరియాలు అనేత్రికటుకాలనూ, కరక్కాయ, తాడి, ఉసిరిక అనే మూడుకాయలు కలిసినచూర్ణం, మైలతుత్తం, వీటిని నీళ్లతో కలిపి కంట్లో వేసుకుంటే కంటిరోగాలన్నీ పోతాయి. రసాంజనం అనే పేరు కలిగినకాటుకను పెట్టుకున్నా కంటిరోగాలు పోతాయి.

ఆజ్యభృష్టం శిలాపిష్టం లోధ్రకాజ్జికసైన్ధవైః ।
ఆశ్చ్యోతనవినాశాయ సర్వనేత్రామయే హితమ్ ॥47॥

లొద్దుగ, తాంఁడ్ర, సైంధవలవణం ఈవస్తువులను ఆవునేతిలో వేయించి, రాతిపై నూరి, కంటికి పూసుకుంటే కంటినుండి నీరు కారడం తగ్గిపోతుంది. ఇంకా అన్నిరకాలకంటిరోగాలు కూడ తగ్గిపోతాయి.

గిరిమృచ్చన్దనై ర్లేపో బహి ర్నేత్రస్య శస్యతే ।
నేత్రామయవిఘాతార్థం త్రిఫలాం శీలయే త్సదా ॥48॥

కంటికి వెలుపల కొండమన్ను, చందనం పూసుకోవడం కంటికి చాల మంచిది. కంటిరోగాలు తగ్గడానికి త్రిఫలాలను (కరకం, తాడి, ఉసిరిక) తీసుకోవాలి.

రాత్రౌ తు మధుసర్పిభ్యాం దీర్ఘమాయుర్జిజీవిషుః ।
శతావరీరసే సిద్ధౌ వృష్యౌ క్షీరఘృతౌ స్మృతౌ ॥49॥

దీర్ఘకాలం జీవించాలని కోరుకునేవాడు రాత్రిపూట భోజనంలో తేనె, నేయి తీసుకోవాలి. శతావరి అనే ఔషధంతో పాలు, నేయి కలిపి తీసుకుంటే బలం వృద్ధి చెందుతుంది.

కలవిఙ్కాని మాషాశ్చ వృష్యౌ క్షీరఘృతౌ తథా ।
ఆయుష్యా త్రిఫలా జ్ఞేయా పూర్వవన్మధుకాన్వితా ॥50॥

కళింగాలు, మినుములు, పాలు, నేయి, ఇవి బలాన్ని వృద్ధిచేస్తాయి. త్రిఫలాలు అతిమధురంతో కలిపి తీసుకుంటే ఆయువు పెరుగుతుంది.

మధుకాదిర సోపేతా వలీపలితనాశినీ ।
వచాసిద్ధఘృతం విప్ర భూతదోషవినాశనమ్ ॥51॥

బ్రాహ్మణవర్యా! వసిష్ఠా! అతిమధురం మొదలైన రసాలతో కూడిన త్రిఫల ముసలితనంవలన చర్మంమీద వచ్చినముడతలనూ, జుట్టు నెరవడాన్నీ పోగొడుతుంది. వసతో కలిపిననెయ్యి భూతాలవలన కలిగినదోషాన్ని పోగొడుతుంది.

కవ్యం బుద్ధిప్రదం చైవ తథా సర్వార్థసాధనమ్ ।
బలాకల్కకషాయేణ సిద్ధ మభ్యఙ్గనే హితమ్ ॥52॥

పితృదేవతల కిచ్చేఅన్నం బుద్ధిని కలిగిస్తుంది. ఇంకా సమస్తమైన ప్రయోజనాలను సాధిస్తుంది. బలనుండి ఏర్పడినగసితో కూడిన అది తలంటులో మేలు చేస్తుంది.

రాస్నాసహచరై ర్వాపి తైలం వాతవికారిణామ్ ।
అనభిష్యన్ది య చ్చాన్నం తద్ వ్రణేషు ప్రశస్యతే ॥53॥

రాస్న అనే ఔషధంతో కాని, పచ్చపూల ముళ్లగోరింటతో కాని సిద్ధమైన నూనె వాతం కారణంగా కలిగే వికారాలను పోగొడుతుంది. గాయాలు మొదలైనవి తగ్గడానికి నూనె మొదలైనవాటి జిడ్డులేని అన్నం తినడం మంచిది.

సక్తుపిణ్డీ తథైవామ్లా పాచనాయ ప్రశస్యతే ।
పక్వస్య చ తథా భేదే నిమ్బచూర్ణం చ రోపణే ॥54॥

తిన్నది తొందరగా అరగడానికి పేలపిండి, ఉసిరికపొడి శ్రేష్ఠ మైనవి. పక్వానికి వచ్చినగాయం పగలడానికి, మానిపోవడానికి వేపపిండి ఉత్తమం.

తథా సూచ్యుపచారశ్చ బలికర్మ విశేషతః ।
సూతికా చ తథా రక్షా ప్రాణినాం తు సదా హితా ॥55॥

గాయాలకు సూదితో ఉపచారం చేయడం కూడ మంచిదే. కఫం తొలగించేపనిలోను ఉపయోగిస్తుంది. ప్రసవస్థితిలో సూదిని ప్రయోగించడంవలన జీవులకు ఎల్లప్పుడు రక్షణగా చక్కగా మేలు జరుగుతుంది.

భక్షణం నిమ్బపత్రాణాం సర్పదష్టస్య భేషజమ్ ।
తాలనిమ్బదలం కేశ్యం జీర్ణం తైలం యవా ఘృతమ్ ॥56॥

పాముకాటుకు వేపఆకులు తినడం మంచిమందు. జుట్టును సంరక్షించుకోవడానికి తాటిఆకు, వేపాకు, పాతబడిన నువ్వులనూనె, యవలు, ఆవునెయ్యి మంచివి.

ధూపో వృశ్చికదష్టస్య శిఖిపత్రఘృతేన వా ।
అర్కక్షీరేణ సమ్పిష్టం లేపో బీజం పలాశజమ్ ॥
వృశ్చికార్తస్య కృష్ణా వా శివా చ ఫలసంయుతా ॥57॥

తేలు కుట్టిన వాడికి నెమలిపింఛాన్ని నేతితో తడిపి, దానిని కాల్చి పొగ వేయడం మందు. మోదుగగింజలను జిల్లేడుపాలతో కలిపి నూరి, దానిని తేలు కరిచినచోట పూస్తే ఆవిషం పోతుంది. తేలుకాటుతో బాధపడేవాడికి గుజ్జుతో కూడిన కారుగచ్చకాయ (కృష్ణాఫలం), కరక్కాయ (శివాఫలం) తినడంవలన కూడ తేలువిషం తగ్గుతుంది.

అర్కక్షీరం తిలం తైలం పలలం చ గుడం సమమ్ ।
పానా జ్జయతి దుర్వారం శ్వవిషం శీఘ్రమేవ చ ॥58॥

జిల్లేడుపాలు, నువ్వులు, నువ్వులనూనె, నువ్వుపిండి (పలలం), బెల్లం వీటిని సమానంగా కూర్చుకుని తాగితే ఎదురులేని భయంకరమైన కుక్కవిషం వెంటనే నశిస్తుంది.

పీత్వా మూలం త్రివృత్తుల్యం తణ్డులీయస్య సర్పిషా ।
సర్పకీటవిషా ణ్యాశు జయత్యతిబలాన్యపి ॥59॥

పిప్పలివేరు, చిట్టికూర (తండులీయం), నెయ్యి (సర్పి), ఈమూడు సమానభాగాలుగా తీసుకుని తాగితే, పాములు, విషకీటకాలకు సంబంధించిన తీవ్రమైనవిషాలు కూడ వెంటనే నశించిపోతాయి.

చన్దనం పద్మకం కుష్ఠం లతామ్బ్వాశీరపాటలాః ।
నిర్గుణ్డీ సారివా సేలు ర్లూతావిషహరోஉగదః ॥60॥

చందనం, పద్మం, చెంగల్వకోష్టు, మాధవీలతపైనుండి జారిననీళ్లు, వట్టివేరు, కలిగొట్టు (పాటలం), వావిలి(నిర్గుండి), సారివ, సేలువు, ఇవి సాలెపురుగువలన కలిగినవిషాన్ని పోగొడతాయి. ఇంకా ఏరోగమూ లేకుండా చేస్తాయి.

శిరోవిరేచనం శస్తం గుడనాగరకం ద్విజ ॥61॥

బ్రాహ్మణోత్తమా! వసిష్టా! సొంటిలో బెల్లం కలిపి పూసుకుంటే తలకు సంబంధించిన దోషాలు తొలగిపోతాయి.

స్నేహపానే తథా వస్తౌ తైలం ఘృతమనుత్తమమ్ ।
స్వేదనీయః పరో వహ్ని శ్శీతామ్బుః స్తమ్భనం పరమ్ ॥62॥

నూనె తాగవలసిన సందర్భంలోనూ, శరీరతత్త్వం కాపాడడంలోనూ నూనె, నెయ్యి, శ్రేష్ఠమైనవి. శరీరంలో వేడి పెరగడానికి చెమట పట్టించాలి. శరీరం బిగించడానికి చల్లటినీరు శ్రేష్ఠం.

త్రివృద్ధి రేచనే శ్రేష్ఠా వమనే మదనం తథా ॥63॥

విరేచనాలు ఆగడానికి త్రివృద్ధి, వాంతులు ఆగడానికి ఉమ్మెత్త ఔషధాలు.

బస్తి ర్విరేకో వమనం తైలం సర్పి స్తథా మధు ।
వాతపిత్తబలాశానాం క్రమేణ పరమౌషధమ్ ॥64॥

వాతం వల్ల కలిగే బస్తికి, తైలం, పిత్తదోషంవలన కలిగే విరేచనానికి నెయ్యి, కఫం వలన కలిగేవాంతికి తేనె, క్రమంగా ఉత్తమమైన మందులు.

ఇత్యాది మహాపురాణే ఆగ్నేయే సిద్ధౌషధాదికథనం నా మైకోనాశీత్యధికద్విశతతమోஉధ్యాయః ॥279॥

అగ్ని మహాపురాణంలో సిద్ధౌషధాదికథనం అనే రెండువందల డెబ్బైతొమ్మిదవ అధ్యాయం సమాప్తం.

అశీత్యధికద్విశతతమోऽధ్యాయః - రెండువందల ఎనభైయవ అధ్యాయం

సర్వరోగహరౌషధకథనమ్ - సర్వరోగహరౌషధకథనం

ధన్వన్తరి రువాచ - సుశ్రుతుడితో ధన్వంతరి ఇలా చెప్తున్నాడు.

శారీరమానసాగన్తుసహజా వ్యాధయో మతాః ।
శారీరా జ్వరకుష్ఠాద్యాః క్రోధాద్యా మానసా మతాః ।
ఆగన్తవో విఘాతోత్థాస్సహజాః క్షుజ్జరాదయః ॥1॥

రోగాలు 1. శారీరం, 2. మానసం, 3. ఆగంతుకం, 4. సహజం అని నాలుగువిధాలు. జ్వరం, కుష్ఠం మొదలైనవి శరీరానికి సంబంధించిన(శారీర)రోగాలు. కోపం మొదలైనవి మనసుకు సంబంధించిన (మానస)రోగాలు. దెబ్బలు తగలడం మొదలైనవి ఆగంతుకరోగాలు. ఆకలి, ముసలితనం మొదలైనవి సహజ మైనరోగాలు.

శారీరాగన్తునాశాయ సూర్యవారే ఘృతం గుడమ్ ।
లవణం సహిరణ్యం చ విప్రాయార్చ్య సమర్పయేత్ ॥2॥

శారీరాలు, ఆగంతుకాలు అయిన రోగాలు తగ్గడానికి, రవి(ఆది)వారంనాడు బ్రాహ్మణుడిని పూజించి, నెయ్యి, బెల్లం, ఉప్పు, బంగారం, దానం చేయాలి.

చన్ద్రే చాభ్యఙ్గదో విప్రే సర్వరోగైః ప్రముచ్యతే ॥3॥

సోమవారంనాడు బ్రాహ్మణుడికి అభ్యంగనస్నానం చేయించినవాడికి అన్నిరోగాలనుండి విముక్తి లభిస్తుంది.

తైలం శనైశ్చరే దద్యా దాశ్వినే గోరసాన్నదః ।
ఘృతేన పయసా లిఙ్గం సంస్నాప్య స్యా ద్రుగుజ్ఝితః ॥4॥

శనివారం నువ్వులనూనె దానం చేయాలి. ఆశ్వియుజమాసంలో ఆవుపాలఅన్నం దానం చేయాలి. శివలింగాన్ని ఆవునేతితో గాని, ఆవుపాలతో గాని స్నానం చేయించినవాడికి రోగాలు తగ్గిపోతాయి.

గాయత్ర్యా జుహుయా ద్వహ్నౌ దూర్వాం త్రిమధురాప్లుతామ్ ।
యస్మి న్భే వ్యాధి మాప్నోతి తస్మిన్ స్నానం బలి శ్శుభే ॥5॥

గరికను త్రిమధురాలతో (పాలు, తేనె, చక్కెర) తడిపి, గాయత్రీమంత్రంతో అగ్నిలో హోమం చేయాలి. రోగం ఏనక్షత్రంలో వచ్చిందో ఆ నక్షత్రం సమయంలో స్నానం చేయడం, బలిఇవ్వడంవల్ల మేలు జరుగుతుంది.

మానసానాం రుజాదీనాం విష్ణోః స్తోత్రం హరం భవేత్ ॥6॥

మనసుకు సంబంధించినరోగాలు శ్రీమహావిష్ణువును స్తుతిస్తే తగ్గిపోతాయి.

వాతపిత్తకఫా దోషా ధాతవశ్చ తథా శృణు ।
భుక్తం పక్వాశయా దన్నం ద్విధా యాతి చ సుశ్రుత ॥7॥

సుశ్రుతా, వాతం, పిత్తం, కఫం అనే దోషాలను గురించి, ధాతువులను గురించి చెప్తాను. విను. భుజించిన అన్నం జీర్ణాశయంనుండి రెండువిధాలుగా ప్రయాణిస్తుంది.

అంశేనైకేన కిట్టత్వం రసతాం చాపరేణ చ ।
కిట్టభాగో మల స్తత్ర విణ్మూత్రస్వేదరూపవాన్ ॥
నాసామలం కర్ణమలం తథా దేహమలం చ యత్ ॥8॥

వాటిలో ఒకభాగం పనికిరానిమలినం అవుతుంది. రెండవభాగం సారమైనరసం అవుతుంది. కిట్టమే మలం, మూత్రం, చెమట, చీమిడి, గుబిలి, ఇంకా శరీరంనుండి వెలువడేరకరకాలయిన మలాలరూపాలలో దేహమలంగా ఏర్పడుతుంది.

సారభాగాద్రసస్తత్ర సమాచ్ఛోణితతాం వ్రజేత్ ।
మాంసం రక్తా త్తతో మేదో మేదసోఽ_స్థ్న శ్చ సమ్భవః ॥
అస్థ్నో మజ్జా తత శ్శుక్రం శుక్రా ద్రాగ స్తథౌజసః ॥9॥

రసంగా మారిన రెండవభాగం మొత్తం రక్తంగా ఏర్పడుతుంది. రక్తంనుండి మాంసం ఏర్పడుతుంది. మాంసంనుండి మేదస్సు(వప), మేదస్సునుండి ఎముకలు, ఎముకలనుండి మజ్జ(ఎముకలసారం), మజ్జనుండి వీర్యం, వీర్యంనుండి రాగం, ఇంద్రియశక్తులు ఏర్పడతాయి.

దేశమార్తిం బలం శక్తిం కాలం ప్రకృతిమేవ చ ।
జ్ఞాత్వా చికిత్సితం కుర్యాద్ భేషజస్య తథా బలమ్ ॥10॥

రోగి ఉన్నప్రదేశం, అతడికి కలిగినబాధ, రోగిబలం, శక్తి, సమయం, స్వభావం అనే అంశాలనూ, అతడికి ఇచ్చేమందుకు ఉన్నశక్తినీ గ్రహించి వైద్యుడు అతడికి వైద్యం చేయాలి.

తిథిం రిక్తాం త్యజే ద్భౌమం మన్దభం దారుణోగ్రకమ్ ॥11॥

రిక్త(చాంద్రమానంలో చతుర్థి, నవమి, చతుర్దశి)తిథులు, మంగళవారం, మందనక్షత్రాలు, ఉగ్ర(పూర్వఫల్గుని, పూర్వాషాఢ, పూర్వాభాద్ర, మఘ, భరణి) నక్షత్రాలను తప్పించి మిగిలినసమయంలో వైద్యం ప్రారంభించాలి.

హరిగోద్విజచన్ద్రార్కసురాదీన్ ప్రతిపూజ్య చ ।
శృణు మన్త్ర మిమం విద్వ న్భేషజారమ్భమాచరేత్ ॥12॥

శ్రీమహావిష్ణువును, ఆవులను, బ్రాహ్మణులను, చంద్రుడిని, సూర్యుడిని, దేవతలు మొదలైనవారిని పూజించి, రోగితో ఈమంత్రాన్ని విను అని చెప్పి, ఆమంత్రాన్ని చెప్పి వైద్యం ప్రారంభించాలి.

బ్రహ్మదక్షాశ్విరుద్రేన్ద్రభూచన్ద్రార్కానిలానలాః ।
ఋషయ శ్చౌషధిగ్రామా భూతసఙ్ఘాశ్చ పాన్తు తే ॥13॥

బ్రహ్మదక్షుడు, అశ్వినీదేవతలు, రుద్రుడు, ఇంద్రుడు, భూమి, చంద్రుడు, సూర్యుడు, వాయువు, అగ్ని, మహర్షులు, ఓషధులసముదాయం, భూతసంఘాలు నిన్ను రక్షించును గాక!

రసాయన మివర్షీణాం దేవానామమృతం యథా ।
సుధేవోత్తమనాగానాం భైషజ్యమిదమస్తు తే ॥14॥

ఋషులకు రసాయనంలాగా, దేవతలకు అమృతంలాగా, ఉత్తమమైన నాగులకు సుధలాగా ఈఔషధం నీకు ఆరోగ్యం కలిగించును గాక!

వాతశ్లేష్మాత్మకో దేశో బహువృక్షో బహూదకః ।
అనూప ఇతి విఖ్యాతో జాఙ్గల స్తద్వివర్జితః ॥15॥

అనూపం అనేదేశం అనేకమైన చెట్లతోనూ, సమృద్ధిగా ఉన్న నీళ్లతోనూ ప్రసిద్ధం. అది వాతం, శ్లేష్మం పెంచుతుంది. చెట్లు, నీళ్లు లేనిదేశం జాంగలం.

కిఞ్చిద్వృక్షోదకో దేశ స్తథా సాధారణస్స్మృతః ।
జాఙ్గలః పిత్తబహులో మధ్యస్సాధారణస్స్మృతః ॥16॥

కొద్దిగా చెట్లు, కొద్దిగా నీళ్లు కలిగినదేశం సాధారణం. జాంగలదేశంలో పిత్తం అధికం చేస్తుంది. సాధారణదేశం (వాతపిత్తాలను) మధ్యవిధంగా ఉంచుతుంది.

రూక్ష శ్శీత శ్చలో వాయుః పిత్తముష్ణం కటుత్రయమ్ ।
స్థిరామ్లస్నిగ్ధమధురం బలాసం చ ప్రచక్షతే ॥
వృద్ధి స్సమానై రేతేషాం విపరీతై ర్విపర్యయః ॥17॥

వాతం - రూక్షం(కాఠిన్యం), శీతం(చల్లదనం), చలం(కదలిక), అయినగుణాలు కలిగి ఉంటుంది. పిత్తం - ఉష్ణం(వేడి), త్రికటువులలక్షణం(కారం, ఒగరు) కలిగినది. శ్లేష్మం - స్థిరమైన ఆమ్ల(పులుపు), స్నిగ్ధ(జిడ్డు), మధుర(తీపి) లక్షణాలు కలిగి ఉంటుంది. ఇదే లక్షణాలు కలిగిన వస్తువులను తీసుకోవడంవలన ఈగుణాలు పెరుగుతాయి. వీటికి వ్యతిరేకలక్షణం కలిగిన వస్తువును తీసుకుంటే శరీరంలోని ఈగుణాలు తగ్గుతాయి.

రసాస్స్వాద్వామ్లలవణాః శ్లేష్మలా వాయునాశనాః ।
కటుతిక్తకషాయాశ్చ వాతలా శ్లేష్మనాశనాః ॥18॥

తీపి, పులుపు, ఉప్పు రసాలు శ్లేష్మం కలిగిస్తాయి. ఇవి వాతాన్ని పోగొడతాయి. కారం, చేదు, ఒగరు(కషాయం) రసాలు వాతం కలిగిస్తాయి. శ్లేష్మం పోగొడతాయి.

కట్వామ్లలవణా జ్ఞేయాస్తథా పిత్తవివర్ధనాః ।
తిక్తస్వాదుకషాయాశ్చ తథా పిత్తవినాశనాః ॥19॥

అలాగే కారం, పులుపు, ఉప్పు రసాలు పిత్తం పెంచుతాయి. చేదు, మధురం, కషాయం రసాలు పిత్తం పోగొడతాయి.

ప్రభావత స్తథా కర్మ తే కుర్వన్తి చ సుశ్రుత ॥20॥

సుశ్రుతా! ఆయా వస్తువులు తమప్రభావంతో ఆయాకర్మలను చేస్తాయి.

వీర్యోష్ణాః కఫవాతఘ్నాశ్శీతాః పిత్తవినాశనాః ।
రస స్యైష గుణో నాస్తి విపాకస్యైష ఇష్యతే ॥21॥

సమర్థమైన ఉష్ణశక్తి కలిగినవి కఫాన్నీ వాతాన్నీ పోగొడతాయి. శీతమైనవి పిత్తం పోగొడతాయి. రసానికి ఈగుణం లేదు. జీర్ణం కావడం(విపాకం)వలన ఇది ఏర్పడుతున్నది.

శిశిరే చ వసన్తే చ నిదాఘే చ తథా క్రమాత్ ।
చయప్రకోపప్రశమాః కఫస్య తు ప్రకీర్తితాః ॥22॥

కఫం శిశిరఋతువులో ఒకచోటికి చేరుతుంది (చయం), వసంతఋతువులో ప్రకోపిస్తుంది. గ్రీష్మఋతువులో అణగిపోతుంది. చయ ప్రకోప ప్రశమాలు కఫలక్షణాలుగా చెప్పబడినాయి.

నిదాఘవర్షారాత్రౌ చ తథా శరది సుశ్రుత ।
చయప్రకోపప్రశమాః పవనస్య ప్రకీర్తితాః ॥23॥

సుశ్రుతా! వాతం గ్రీష్మఋతువులో చయం పొందుతుంది. వర్షాకాలం రాత్రివేళలలో ప్రకోపిస్తుంది. శరత్కాలంలో అణగిపోతుంది.

మేఘకాలే చ శరది హేమన్తే చ తథా క్రమాత్ ।
చయప్రకోపప్రశమా స్తథా పిత్తస్య కీర్తితాః ॥24॥

పిత్తం వర్షాకాలంలో చేరుతుంది, శరదృతువులో ప్రకోపిస్తుంది. హేమంతఋతువులో అణగిపోతుంది.

వర్షాదయో విసర్గా స్తు హేమన్తాద్యా స్తథా త్రయః ।
శిశిరాద్యా స్తథాదానే గ్రీష్మాన్తా ఋతవ స్త్రయః ॥
సౌమ్యో విసర్గ స్త్వాదాన మాగ్నేయం పరికీర్తితమ్ ॥25॥

వర్షఋతువునుండి, హేమంతఋతువువరకు (వర్ష, శరత్, హేమంత) ఉన్న మూడుఋతువులు విసర్గ(విడిచిపెట్టే)కాలం అలాగే, శిశిరఋతువు మొదలుకొని గ్రీష్మఋతువువరకు (శిశిరం, వసంతం, గ్రీష్మం) మూడుఋతువులు ఆదాన(తీసుకునే) కాలం. విసర్గకాలం సౌమ్యం. ఆదానకాలం ఆగ్నేయం అని చెప్పబడింది.

వర్షాదీం స్త్రీన్ ఋతూన్ సోమ శ్చరన్ పర్యాయశో రసాన్ ।
జనయ త్యమ్లలవణమధురాం స్త్రీన్ యథాక్రమమ్ ॥26॥

వర్షఋతువు మొదలుకొని మూడు ఋతువులలో సంచరించే చంద్రుడు క్రమంగా వర్ష ఋతువులో అమ్ల(పులుపు)రసాన్ని, శరదృతువులో లవణరసాన్ని, హేమంతఋతువులో మధుర(తీపి)రసాన్ని పుట్టిస్తున్నాడు.

శిశిరాదీ నృతూనర్కశ్చరన్ పర్యాయశో రసాన్ ।
వివర్ధయే త్తథా తిక్తకషాయకటుకాన్ క్రమాత్ ॥27॥

శిశిరఋతువు మొదలుకొని మూడు ఋతువులలో సంచరించే సూర్యుడు క్రమంగా శిశిరఋతువులో తిక్త(చేదు)రసాన్ని, వసంతఋతువులో కషాయ(ఒగరు)రసాన్ని, గ్రీష్మఋతువులో కటు(కారం)రసాన్ని పుట్టిస్తున్నాడు.

యథా రజన్యో వర్ధన్తే బల మేవం హి వర్ధతే ।
క్రమశోఽథ మనుష్యాణాం హీయమానాసు హీయతే ॥28॥

రాత్రిసమయం పెరుగుతున్నకొద్దీ మానవులకు బలం పెరుగుతుంది. రాత్రిసమయం తగ్గుతున్నకొద్దీ మానవులకు కూడ బలం క్రమంగా తగ్గుతుంది.

రాత్రిభుక్తదినానాం చ వయసశ్చ తథైవ చ ।
ఆదిమధ్యావసానేషు కఫపిత్తసమీరణాః ॥
ప్రకోపం యాన్తి కోపాదౌ కాలే తేషాం చయ స్మృతః ॥29॥

రాత్రికాలంలోనూ, పగటికాలంలోనూ, వయస్సులోనూ మొదట కఫం, మధ్యలో పిత్తం, చివర వాతం ప్రకోపిస్తాయి. అదే విధంగా కోపం మొదలయిన సందర్భాలలోనూ ఆదిమధ్యఅవసానకాలాలలో కూడుకోవడం జరుగుతుంది.

ప్రకోపోత్తరకే కాలే శమ స్తేషాం ప్రకీర్తితః ॥30॥

ప్రకోపించిన తరువాత దానికి చివర ఆయాగుణాలు క్రమంగా అణగిపోతాయి.

అతిభోజనతో విప్ర తథా చాభోజనేన చ ।
రోగా హి సర్వే జాయన్తే వేగోదీరణధారణైః ॥31॥

బ్రాహ్మణోత్తమా! వసిష్ఠమహర్షీ! అవసరానికి మించి, అధికంగా తిన్నా, లేదా అసలు తినకపోయినా, రోగాలన్నీ వచ్చిపడతాయి. అలాగే తుమ్ము, దగ్గు మొదలైన వేగాలను అడ్డగించినా ఆపినా, ఆపినా సమస్తరోగాలు వస్తాయి.

అన్నేన కుక్షే ర్ద్వా వంశా వేకం పానేన పూరయేత్ ।
ఆశ్రయం పవనాదీనాం తథైకమవశేషయేత్ ॥32॥

పొట్టలో రెండుభాగాలను అన్నంతో నింపాలి. ఒక భాగాన్ని నీళ్లతో నింపాలి. గాలి మొదలైనవి సంచరించడానికి కడుపులో ఒక భాగాన్ని ఖాళీగా విడిచిపెట్టాలి.

వ్యాధే ర్నిదానస్య తథా విపరీతమథౌషధమ్ ।
కర్తవ్యమేతదేవాత్ర మయా సారం ప్రకీర్తితమ్ ॥33॥

వ్యాధి రావడానికి మూలమైనకారణానికి వ్యతిరేకమైనది ఔషధం. దానివలననే రోగం తగ్గుతుంది. అటువంటి (వ్యాధికారణానికి విరుద్ధమై, వ్యాధిని తగ్గించే) ఔషధం ఇవ్వాలి. వైద్యవిధానంలో సారం ఈవిధంగా నీకు నేను వివరించాను.

నాభే రూర్ధ్వ మధశ్చైవ గుదశ్రోణ్యోస్తథైవ చ ।
బలాశపిత్తవాతానాం దేహే స్థానం ప్రకీర్తితమ్ ॥
తథాపి సర్వగా శ్చైతే దేహే వాయుర్విశేషతః ॥34॥

శరీరంలో కఫం ఉండేస్థానం నాభికి పైభాగం. పిత్తం ఉండేచోటు నాభికి కిందిభాగం. వాతం ఉండేప్రదేశం గుదానికి పృష్ఠానికి నడుమఉండేభాగం. అయినా, ఇవి శరీరంలో అంతటా సంచరిస్తూ ఉంటాయి. వాయువు (ప్రాణాది రూపంగా శరీరం అంతటా) విశేషంగా సంచరిస్తుంది.

దేహస్య మధ్యే హృదయం స్థానం తన్మనసః స్మృతమ్ ॥35॥

హృదయం శరీరానికి మధ్యలో ఉంటుంది. అది మనస్సు ఉండేచోటు.

కృశోఽల్పకేశశ్చపలో బహువాగ్విషమానలః ।
వ్యోమగశ్చ తథా స్వప్నే వాతప్రకృతి రుచ్యతే ॥36॥

శరీరం చిక్కిపోయినవాడు, జుట్టు కొద్దిగా మాత్రమే ఉన్నవాడు, అతిగా మాట్లాడేవాడు, జఠరాగ్ని సమంగా లేనివాడు, ఆకాశంలో తిరుగుతున్నట్లుగా కలలు కనేవాడు, – వాతస్వభావం కలిగినవాడు అని చెప్తారు.

అకాలపలితః క్రోధీ ప్రస్వేదీ మధురప్రియః ।
స్వప్నే చ దీప్తిమత్ ప్రేక్షీ పిత్తప్రకృతి రుచ్యతే ॥37॥

చిన్నప్పుడే జుట్టు నెరిసినవాడు, ఎప్పుడూ కోపంగా ఉండేవాడు, చెమట అధికంగా పట్టేవాడు, తీపివస్తువులను ఇష్టపడేవాడు, కలలలో అగ్నిని చూచేవాడు, పిత్తస్వభావం కలిగినవాడని చెప్తారు.

దృఢాఙ్గః స్థిరచిత్తశ్చ సుప్రభ స్స్నిగ్ధమూర్ధజః ।
శుద్ధామ్బుదర్శీ స్వప్నే చ కఫప్రకృతికో నరః ॥38॥

బలమైన గట్టివైన అవయవాలు కలిగినవాడు, మనస్సు చలించనివాడు, మంచి కాంతి కలిగినవాడు, నున్నని తలవెంట్రుకలు కలిగినవాడు, కలలలో స్వచ్ఛమైన నీటిని చూసేవాడు – కఫస్వభావం కలిగినవాడు.

తామసా రాజసాశ్చైవ సాత్త్వికాశ్చ తథా స్మృతాః ।
మనుష్యా మునిశార్దూల వాతపిత్తకఫాత్మకాః ॥39॥

ఋషివరేణ్యా! వాతం స్వభావగుణంగా కలిగినమానవులు తామసులు. పిత్తస్వభావులు రాజసులు. కఫస్వభావులు సాత్త్వికులు.

రక్తం పిత్తం వ్యవాయాచ్చ గురుకర్మప్రవర్తనైః ।
కదన్నభోజనాద్వాయు ర్దేహే శోకాచ్చ కుప్యతి ॥40॥

బరువైనపనులు చేయడంవల్లనూ, సంభోగంచేతను, రక్తపిత్తగుణం ఏర్పడుతుంది. తినగూడనిఅన్నం తినడంవల్లనూ, దుఃఖపడడంవల్లనూ శరీరంలో వాతగుణం ప్రకోపిస్తుంది.

విదాహినాం తథోల్కానాముష్ణాన్నాధ్వనిషేవిణామ్ ।
పిత్తం ప్రకోపమాయాతి భయేన చ తథా ద్విజ ॥41॥

విప్రవర్యా! వసిష్ఠమహర్షీ! విశేషంగా దాహం కలిగించేదీ, కడుపులో మంట పుట్టించేదీ, వేడిగా ఉన్నదీ, అయిన అన్నాన్ని తినడంవలన, మార్గంలో (ప్రయాణసమయంలో అనవధానంగా) తినడంవలన, భయంవలన పిత్తగుణం ప్రకోపిస్తుంది.

అత్యమ్బుపానగుర్వన్నభోజినాం భుక్తశాయినామ్ ।
శ్లేష్మా ప్రకోప మాయాతి తథా యే చాలసా జనాః ॥42॥

అతిగా నీళ్లు తాగినా, అన్నం అతిగా తిన్నా, తిన్నవెంటనే నిద్రపోయినా, సోమరిగా ఉన్నా శ్లేష్మగుణం ప్రకోపిస్తుంది.

వాతాద్యుత్థాని రోగాణి జ్ఞాత్వా శామ్యాని లక్షణైః ॥ 43॥

వాతం మొదలైన ఆయా గుణాలచేత పొడచూపిన రోగాలను ఆయాలక్షణాలనుబట్టి గ్రహించి, ఆరోగాలను పోగొట్టాలి.

అస్థిభఙ్గః కషాయత్వమాస్యే శుష్కాస్యతా తథా ।
జృమ్భణం లోమహర్షశ్చ వాతికవ్యాధిలక్షణమ్ ॥44॥

ఎముకలు విరగడం, నోరు చేదుగా ఉండడం, నోరు తడిఆరిపోవడం, ఆవులించడం, వెంట్రుకలు నిక్కబొడుచుకోవడం – ఇవి వాతప్రకోపంవలన వచ్చినరోగం లక్షణాలు.

నఖనేత్రశిరాణాం తు పీతత్వం కటుతా ముఖే ।
తృష్ణా దాహోష్ణతా చైవ పిత్తవ్యాధినిదర్శనమ్ ॥45॥

గోళ్లు, కళ్లు, నాడులు పచ్చబడడం, నోరు చేదుగా ఉండడం, దాహంగా ఉండడం, ఒళ్లు వెచ్చబడడం – ఇవి పిత్తప్రకోపంవలన వచ్చినరోగం లక్షణాలు.

ఆలస్యం చ ప్రసేకశ్చ గురుతా మధురాస్యతా ।
ఉష్ణాభిలాషితా చేతి శ్లైష్మికవ్యాధిలక్షణమ్ ॥46॥

సోమరితనం, నోటినుండి నీళ్లు కారడం, బరువు పెరగడం, నోరు తియ్యగా అనిపించడం, వేడిగా ఉన్నవాటిని కోరుకోవడం – ఇవి శ్లేష్మం ప్రకోపించడంవలన వచ్చిన రోగం లక్షణాలు.

స్నిగ్ధోష్ణ మన్న మభ్యఙ్గస్తైలపానాది వాతనుత్ ।
ఆజ్యం క్షీరం సితాద్యం చ చన్ద్రరశ్మ్యాది పిత్తనుత్ ॥
సక్షౌద్రం త్రిఫలాతైలం వ్యాయామాది కఫాపహమ్ ॥47॥

స్నేహగుణంతో వేడిగా ఉన్న అన్నం తినడం, తలంటుస్నానం, నువ్వులనూనె తాగడం – ఇవి వాతరోగాన్ని పోగొడతాయి. నెయ్యి, పాలు, పటికబెల్లం, చంద్రకిరణాలు (వెన్నెల) మొదలైనవి పిత్తరోగాన్ని పోగొడతాయి. త్రిఫలతైలాన్ని తేనెతో కలిపి తీసుకోవడం, వ్యాయామం చేయడం మొదలైనవి కఫరోగాన్ని పోగొడతాయి.

సర్వరోగప్రశాన్త్యై స్యా ద్విష్ణో ర్ధ్యానం చ పూజనమ్ ॥48॥

శ్రీమహావిష్ణువును ధ్యానించినా, పూజించినా, అన్నిరోగాలు నశించిపోతాయి.

ఇత్యాది మహాపురాణే ఆగ్నేయే సర్వరోగహరౌషధాదికథనం నామాశీత్యధికద్విశతతమోఽధ్యాయః ॥280॥

అగ్ని మహాపురాణంలో సర్వరోగహరౌషధాదికథనం అనే రెండువందల ఎనభైయవ అధ్యాయం సమాప్తం.



ఏకాశీత్యధికద్విశతతమోఽధ్యాయః – రెండువందల ఎనభైఒకటవ అధ్యాయం

రసాదిలక్షణకథనమ్ – రసాదిలక్షణకథనం

ధన్వన్తరి రువాచ – సుశ్రుతుడితో ధన్వంతరి ఇలా చెప్తున్నాడు.

రసాదిలక్షణం వక్ష్యే భేషజానాం గుణం శృణు ।
రసవీర్యవిపాకజ్ఞో నృపాదీన్ రక్షయేన్నరః ॥1॥

ఇక రసాదుల లక్షణాలను చెప్తాను. ఓషధుల గుణాలను గురించి విను. ఓషధులరసం, వీర్యం, విపాకం అనేవిషయాలను తెలిసినవాడే రాజు మొదలయినవారిని (అనారోగ్యంనుండి) రక్షించగలుగుతాడు.

రసా స్స్వాద్వమ్లలవణా స్సోమజాః పరికీర్తితాః ।
కటుతిక్తకషాయాశ్చ తథాగ్నేయా మహాభుజ ॥2॥

దృఢదీర్ఘమైన బాహువులు కలిగినవాడా! తీపి, పులుపు, ఉప్పదనం అనే రసాలు చంద్రుడివలన ఏర్పడిన వని చెప్పబడ్డాయి. కారం, చేదు, ఒగరు అనే రసాలు అగ్నినుండి పుట్టాయి.

త్రిధా విపాకో ద్రవ్యస్య కట్వమ్లలవణాత్మకః ।
ద్విధా వీర్యం సముద్దిష్టముష్ణం శీతం తథైవ చ ॥3॥

ద్రవ్యానికి సంబంధించిన విపాకం కారం, పులుపు, లవణాలరూపంలో మూడు విధాలుగా ఉంటుంది. ఉష్ణం, శీతం అని వీర్యం రెండువిధాలు.

అనిర్దేశ్యప్రభావశ్చ ఓషధీనాం ద్విజోత్తమ ।
మధురశ్చ కషాయశ్చ తిక్త శ్చైవ తథా రసః ॥
శీతవీర్యా స్సముద్దిష్టాశ్శేషాస్తూష్ణాః ప్రకీర్తితాః ॥4॥

విప్రవర్యా! ఓషధుల ప్రభావం ఇంత అని నిశ్చయించి చెప్పడానికి వీలు లేదు. తీపి, ఒగరు, చేదు అనేరసాలు శీతవీర్యాలు అనీ, మిగిలినవి ఉష్ణవీర్యాలు అనీ చెప్తారు.

గుడూచీ తత్ర తిక్తాపి భవత్యుష్ణాతివీర్యతః ।
ఉష్ణా కషాయాపి తథా పథ్యా భవతి మానద ॥
మధురోఽపి తథా మాంస ఉష్ణ ఏవ ప్రకీర్తితః ॥5॥

తిప్పతీగ (గుడూచి) చేదు అయినప్పటికీ మిక్కిలిశక్తిమంతమైనది కావడంచేత ఉష్ణవీర్యం అవుతుంది. అలాగే కరకం (కరక్కాయ) చేదు అయినప్పటికీ ఉష్ణవీర్యం. అలాగే జటామాంసి తీయని దయినా, ఉష్ణవీర్యమే.

లవణో మధురశ్చైవ విపాకమధురౌ స్మృతౌ ।
అమ్లోష్ణశ్చ తథా ప్రోక్త శ్శేషాః కటువిపాకినః ॥6॥

ఉప్పు, తీపి అనేరసాలు విపాక (పరిణామ) స్థితిలో మధురాలుగా చెప్పబడ్డాయి. గాటు(ఘాటు) అయినపులుపు కూడ అలాగే పరిణామస్థితిలో మధురం అని చెప్పబడింది. మిగిలినవి విపాకస్థితిలో కటు(కారం)రసాలు అవుతాయి.

వీర్యపాకే విపర్యస్తప్రభావా త్తత్ర నిశ్చయః ।
మధురోఽపి కటుః పాకే యచ్చ క్షౌద్రం ప్రకీర్తితమ్ ॥7॥

శక్తిమంతమైన వస్తువు పరిపాకస్థితిలో విపరీత (వ్యతిరేక) మైన ప్రభావం కలిగినవి అవుతాయి. దానికి ప్రమాణం – తేనె మధురరసం అయినా, పరిపాకదశలో కటువు అవుతుంది అని నిర్ణయింపబడింది.

క్వాథయేత్ షోడశగుణం పిబే ద్ద్రవ్యా చ్చతుర్గుణమ్ ।
కల్ప నైషా కషాయస్య యత్ర నోక్తో విధి ర్భవేత్ ॥8॥

ఏదయినా కషాయం చేయవలసినపుడు ఆ ద్రవ్యానికి పదహారు రెట్ల పరిమాణంలో నీళ్లు కలిపాలి. అందులో నాలుగురెట్ల నీళ్ళు మాత్రమే మిగిలేవిధంగా కాచాలి. తరువాత దానిని తాగాలి. ఇదీ కషాయం తయారుచేసేవిధానం. విశేషమైన విధానం చెప్పనిచోట్ల సాధారణంగా ఈపద్ధతిలోనే కషాయం తయారు చేయాలి.

కషాయం తు భవేత్తోయం స్నేహపాకే చతుర్గుణమ్ ।
ద్రవ్యతుల్యం సముద్ధృత్య ద్రవ్యే స్నేహం క్షిపే ద్బుధః ॥
తావత్ప్రమాణం ద్రవ్యస్య స్నేహపాదం తతః క్షిపేత్ ॥9॥

కషాయం సాధారణంగా నీటితోనే చేయాలి. నూనెతో కషాయం తయారుచేసే సందర్భంలో కషాయం చేయవలసిన ద్రవ్యానికి నాలుగురెట్లు తైలం తీసుకుని దానిని ద్రవ్యంలో కలపాలి. లేదా ద్రవ్యం ఎంతపరిమాణంలో ఉన్నదో అంత పరిమాణంలో తైలభాగం కలపాలి.

తోయవర్జం తు యద్ద్రవ్యం స్నేహద్రవ్యం తథా భవేత్ ।
సంవర్తితౌషధః పాక స్స్నేహానాం పరికీర్తితః ॥10॥

కషాయం కాచేవస్తువులో నీటిభాగం తొలగిపోయి, అంతా తైలవస్తువుగా అయ్యేవరకు కాచి, (నూనె)కషాయం చేయాలి. ఓషధులను నూనెలో వేసి వండినపుడు ఆ ఓషధులు వత్తులకువలె అయితే, అపుడు ఆ నూనె ఓషధిరసంతో పక్వమయినట్లు గ్రహించాలి.

తత్తుల్యతా తు లేహ్యస్య తథా భవతి సుశ్రుత ॥11॥

సుశ్రుతా, లేహ్యాలు కూడ ఇదే విధంగా ఓషధులను ఇతరపదార్థాలను పూర్వంలాగా చేసుకోవాలి.

స్వచ్ఛమల్పౌషధం క్వాథం కషాయం చోక్తవ ద్భవేత్ ।
అక్షం చూర్ణస్య నిర్దిష్టం కషాయస్య చతుష్పలమ్ ॥ 12॥

ఇంతకు ముందు చెప్పినవిధంగా ఓషధి తక్కువగా చేసినకషాయం స్వచ్ఛమైనది. పొడికి ఒకఅక్షం పరిమాణంగా నిర్ణయింపబడింది. కషాయానికి నాలుగుపలాలు ఉండాలి.

మధ్య మైషా స్మృతా మాత్రా నాస్తి మాత్రావికల్పనా ॥13॥

మాత్రను తయారుచేయడంలో ఇది మధ్యమ (ఎక్కువతక్కువలు లేకుండా సాధారణ) మైన విధానం. మాత్రను నిర్మించడంలో పరిమాణాదులు ఇంత అనే నిశ్చయం లేదు.

వయః కాలం బలం వహ్నిం దేశం ద్రవ్యం రుజం తథా ।
సమవేక్ష్య మహాభాగ మాత్రాయాః కల్పనా భవేత్ ॥14॥

మహాత్మా! సుశ్రుతా! రోగివయస్సు, రోగం బాధిస్తున్నకాలం, రోగిబలం, రోగిఆకలి, అతడు ఉంటున్నప్రదేశం, ద్రవ్యం, రోగం అనేఅంశాలను చక్కగా పరిశీలించి, మాత్రను వాటికి తగినప్రమాణంలో సిద్ధం చేయాలి.

సౌమ్యా స్తత్ర రసాః ప్రాయో విజ్ఞేయా ధాతువర్ధనాః ।
మధురా స్తు విశేషేణ విజ్ఞేయా ధాతువర్ధనాః ॥15॥

సౌమ్యగుణం గలిగినరసాలు సాధారణంగా ధాతువులను వృద్ధిచేస్తాయి. మధురగుణం కలిగినవి ఇంకా అధికంగా ధాతువులను పెంపొందిస్తాయి.

దోషాణాం చైవ ధాతూనాం ద్రవ్యం సమగుణం తు యత్ ।
తదేవ వృద్ధయే జ్ఞేయం విపరీతం క్షయావహమ్ ॥16॥

ధాతువులలోనూ, ద్రవ్యాలలోనూ దోషగుణాలు సమంగా ఉంటే, అది వృద్ధిని కలిగిస్తుంది. ఆగుణాలు విరుద్ధంగా ఉంటే శరీరం నీరసిస్తుంది.

ఉపక్రమత్రయం ప్రోక్తం దేహేఽస్మిన్ మనుజోత్తమ ।
ఆహారో మైథునం నిద్రా తేషు యత్న స్సదా భవేత్ ॥17॥

మానవోత్తమా! ఈ శరీరానికి ఆహారం, మైథునం, నిద్ర అని ప్రారంభావసరాలు మూడు ఉన్నాయి. వాటిని గురించి నిరంతరం ప్రయత్నిస్తుండాలి.

అసేవనాత్ సేవనాచ్చ అత్యన్తం నాశ మాప్నుయాత్ ॥18॥

ఈ మూడింటిని అసలు సేవింపకపోయినా, అతిగా సేవించినా మానవశరీరం క్షీణించిపోతుంది.

క్షయస్య బృంహణం కార్యం స్థూలదేహస్య కర్షణమ్ ।
రక్షణం మధ్యకాయస్య దేహభేదా స్త్రయో మతాః ॥19॥

క్షీణించేశరీరాన్ని తిరిగి వృద్ధి చేసుకోవాలి. బాగా పెరిగినశరీరాన్ని తగ్గించుకోవాలి. మధ్యవిధంగా ఉన్నశరీరాన్ని అటు క్షీణించకుండా, ఇటు పెరిగి పోకుండా కాపాడుకోవాలి. శరీరంలో మూడు భేదాలు ఉన్నాయి.

ఉపక్రమద్వయం ప్రోక్తం తర్పణం వా ప్యతర్పణమ్ ।
హితాశీ చ మితాశీ చ జీర్ణాశీ చ తథా భవేత్ ॥20॥

ఆహారం, మైథునం అనేరెండు ఉపక్రమాలు తర్పణం, అతర్పణం అని రెండు విధాలు. శరీరానికి మేలు చేసేది, ఆరోగ్యానికి మేలుచేసే దానిని పరిమితంగానే తినాలి. తేలికగా అరిగేదానినే తినాలి.

ఓషధీనాం పఞ్చవిధా తథా భవతి కల్పనా ।
రసః కల్క శ్రృత శ్శీతః ఫాణ్టశ్చ మనుజోత్తమ ॥21॥

మానవోత్తమా! రసం, కల్కం, శ్రుతం, శీతం, ఫాంటం అని ఓషధులను తయారుచేసేవిధానం అయిదువిధాలుగా ప్రసిద్ధమైఉంది.

రసశ్చ పీడకో జ్ఞేయః కల్క ఆలోడితా ద్భవేత్ ।
క్వథితశ్చ శృతో జ్ఞేయ శ్శీతః పర్యుషితో నిశి ॥
సద్యోఽభిశ్రుతపూతం యత్తత్ఫాణ్టమభిధీయతే ॥22॥

ఔషధద్రవ్యాన్ని పిండడంవలన రసం ఏర్పడుతుంది. చిలకడంవలన కల్కం తయారవుతుంది. మరిగించడం వలన శృతం ఏర్పడుతుంది. రాత్రి అంతా నీటిలో ఉంచడంవలన శీతం ఏర్పడుతుంది. అప్పటి కప్పుడు నీటిలో వేసి కాగబెట్టడంవలన శుద్ధం అయి ఫాంటం ఏర్పడుతుంది.

కరణానాం శతం చైవ షష్టి శ్చైవాధికా స్మృతా ।
యో వేత్తి స హ్యజేయ స్స్యాత్ సమ్బన్ధే బాహుశౌణ్డికః ॥23॥

వైద్యానికి నూటఅరవై సాధనాలు ఉన్నాయి. వీటిని చక్కగా తెలుసుకున్నవైద్యుడికి ఎదురు లేదు. సమర్థతవిషయంలో అతడు బాహుశౌండికుడు అని కీర్తింపబడతాడు.

ఆహారశుద్ధి రగ్న్యర్థ మగ్నిమూలం బలం నృణామ్ ।
ససిన్ధుత్రిఫలాం చాద్యాత్ సుష్ఠు రాజ్యాభివర్ణదామ్ ॥24॥

జఠరాగ్ని దీపించడానికి ఆహారం శుద్ధమైనది కావాలి. ఎందుకంటే మానవులకు శక్తి అగ్నివలననే కలుగుతుంది. జఠరాగ్ని వృద్ధి చెందడానికి శరీరానికి చక్కని ఉత్తమమైన కాంతిని ఇచ్చే సైంధవలవణంతో కూడిన త్రిఫలను తినాలి.

జాఙ్గలం చ రసం సిన్ధుయుక్తం దధిపయఃకణామ్ ।
రసాధికం సమం కుర్యా న్నరో వాతాధికోఽపి వా ॥25॥

ఆవడ బీరకాయరసం సైంధవలవణం కలిపినపెరుగు, పాలు, ఆహారంగా తీసుకోవాలి. వాతం అధికంగా ఉన్న శరీరతత్త్వం కలిగినవాడు కూడ శరీరంలో అధికంగా ఉన్నరసాన్ని సమస్థితికి తీసుకురావాలి.

నిదాఘే మర్దనం ప్రోక్తం శిశిరే చ సమం బహు ।
వసన్తే మధ్యమం జ్ఞేయం నిదాఘే మర్దనోల్బణమ్ ॥26॥

గ్రీష్మఋతువులో శరీరానికి మర్దనం ధాతువర్ధకం. శిశిరఋతువులో సమస్థాయిలో లేదా అధికంగా నయినా మర్దనం చేసుకోవాలి. వసంతఋతువులో మధ్యమంగా మర్దనం చేసుకోవాలి. గ్రీష్మఋతువులో మాత్రం మర్దనం అధికంగా చేసుకోవాలి.

త్వచం తు ప్రథమం మర్ద్యం మజ్జాం చ తదనన్తరమ్ ।
స్నాయురుధిరదేహేషు అస్థి చాతీవ మాంసలమ్ ॥27॥

శరీరంలో ముందుగా చర్మాన్ని, తరువాత మజ్జను మర్దనం చేసుకోవాలి. నరాలు, నెత్తురు, ఎముకలతో కూడిన శరీరం మాంసంతో నిండుగా ఉంటుంది.

స్కన్ధౌ బాహూ తథైవేహ తథా జఙ్ఘే సజానునీ ।
అరివన్మర్దయేత్ ప్రాజ్ఞో జత్రు వక్షశ్చ పూర్వవత్ ॥28॥

బుద్ధిమంతుడు భుజాలు, బాహువులు, మోకాళ్లు, పిక్కలు, ఈఅవయవాలను శత్రువును మర్దించినట్లుగా గట్టిగా మర్దించాలి. మడమలు, వక్షం వీటిని సాధారణంగా మర్దించాలి.

అఙ్గసన్ధిషు సర్వేషు నిష్పీడ్య బహులం తథా ।
ప్రసారయే దఙ్గసన్ధీ న్న చ క్షేపేణ చాక్రమాత్ ॥29॥

రెండు అవయవాలు కలిసిన సంధిప్రదేశాలన్నింటినీ గట్టిగా మర్దించాలి. ఆ అవయవాలను సాగదీయాలి. కాని, హఠాత్తుగా గాని, ఎలా పడితే అలా గాని చాచకూడదు. (మెల్లగా క్రమపద్ధతిలో సాగదీయాలి.)

నాజీర్ణే తు శ్రమం కుర్యాన్న భుక్త్వా పీతవా న్నరః ॥30॥

తిన్నది అరగనపుడు (అజీర్ణస్థితిలో) వ్యాయామం చేయగూడదు. భోజనం చేసినవెంటనే కాని, నీళ్లు మొద లైనవి తాగినవెంటనే కాని వ్యాయామం చేయగూడదు.

దినస్య తు చతుర్భాగ ఊర్ధ్వం తు ప్రహరార్ధకే ।
వ్యాయామం నైవ కర్తవ్యం స్నానా చ్ఛీతామ్బునా సకృత్ ॥31॥

పగటిసమయంలో నాలుగుభాగాలు ఉన్నాయి. అందులో మొదటిజాములో సగం దాటినతరువాత వ్యాయామం చేయగూడదు. ఒకసారి (రోజులో మొదటిసారి) చన్నీళ్లతో స్నానం చేయాలి.

వార్యుష్ణం చ శ్రమం జహ్యాద్భుదా శ్వాసం న ధారయేత్ ।
వ్యాయామశ్చ కఫం హన్యా ద్వాతం హన్యాచ్చ మర్దనమ్ ॥32॥

వేడినీళ్లు శ్రమను పోగొడతాయి. ఊపిరి (ఎక్కువసేపు) బిగబట్టగూడదు. వ్యాయామం కఫాన్ని పోగొడుతుంది. మర్దనం వాతాన్ని పోగొడుతుంది.

స్నానం పిత్తాధికం హన్యాత్ తస్యాన్తే చాతపాః ప్రియాః ।
ఆతపక్లేశకర్మాదౌ క్షేమ వ్యాయామ ఉత్తరః ॥33॥

స్నానం అధిక మైనపిత్తదోషాన్ని పోగొడుతుంది. స్నానం చేసినతరువాత కొంచెంసేపు ఎండలో ఉండాలి. ఎండ మొద లైన బాధలలోనూ, కష్టం కలిగించే ఇతరకర్మలలోనూ వ్యాయామం ఆకష్టం తొలగించి, ఉత్తమ మైనక్షేమం కలిగిస్తుంది.

ఇత్యాది మహాపురాణే ఆగ్నేయే రసాదిలక్షణకథనం నామైకాశీత్యధికద్విశతతమోఽధ్యాయః ॥281॥

అగ్నిమహాపురాణంలో రసాదిలక్షణకథనం అనే రెండువందల ఎనబైఒకటవ అధ్యాయం సమాప్తం.

ద్వ్యశీత్యధికద్విశతతమోऽధ్యాయః - రెండువందల ఎనభైరెండవ అధ్యాయం

వృక్షాయుర్వేదకథనమ్ - వృక్షాయుర్వేదకథనం

ధన్వన్తరిరువాచ - సుశ్రుతుడితో ధన్వంతరి ఇలా చెప్తున్నాడు.

వృక్షాయుర్వేద మాఖ్యాస్యే ప్లక్షస్యోత్తరత శ్శుభః ।
ప్రాగ్వటో యామ్యత స్త్వామ్ర ఆప్యేऽశ్వత్థః క్రమేణ తు ॥1॥

సుశ్రుతా! ఇక వృక్షాయుర్వేదం గురించి చెప్తాను. ఇంటికి ఉత్తరదిక్కులో జువ్విచెట్టు ఉంటే మంచి జరుగుతుంది. తూర్పుదిక్కులో మఱ్ఱిచెట్టు, దక్షిణదిక్కులో మామిడిచెట్టు, పడమటి దిక్కులో రావిచెట్టు ఉండడం మంచిది.

దక్షిణాం దిశ ముత్పన్నా స్సమీపే కణ్టకద్రుమాః ।
ఉద్యానం గృహవాసే, స్యా త్తిలా న్వా పృథ పుష్పితాన్ ॥2॥

ఇంటికి దక్షిణదిక్కుకు దగ్గరలో వాటంతట అవిగా మొలిచిన ముళ్లచెట్లు మంచివి. నివసిస్తున్న ఇంటికి దగ్గరలో తోట ఉంటే మంచిది. లేదా పూవులతో నిండిన నువ్వుమొక్కలను ఏర్పాటు చేసుకోవాలి.

గృహ్ణీయా ద్రోపయే ద్వృక్షాన్ ద్విజం చన్ద్రం ప్రపూజ్య చ ।
ధ్రువాణి పఞ్చ వాయవ్యం హస్తం ప్రాజేశవైష్ణవమ్ ॥
నక్షత్రాణి తథా మూలం శస్యన్తే ద్రుమరోపణే ॥3॥

బ్రాహ్మణుడిని, చంద్రుడిని పూజించి, చెట్లను స్వీకరించి, నాటాలి. చెట్లు నాటడానికి ఉత్తరఫల్గుని, ఉత్తరాషాఢ, ఉత్తరాభాద్ర, అనేధ్రువనక్షత్రాలు, స్వాతి(వాయువు దేవతగా కలిగినది), హస్తానక్షత్రం, రోహిణి (ప్రాజేశం-ప్రజాపతిదేవతగా కలిగినది), శ్రవణ(విష్ణు) నక్షత్రం, మూలానక్షత్రం శ్రేష్ఠమైనవి.

ప్రవేశయేన్నదీవాహాన్ పుష్కరిణ్యాం తు కారయేత్ ॥4॥

చెట్లకు కావలసిననీటికోసం దగ్గరలోనినదులనుండి కాలువలప్రవాహాలద్వారా జలాశయాలను ఏర్పాటు చేయాలి.

హస్తో మఘా తథా మైత్ర మాద్యం పుష్యం సవాసవమ్ ।
జలాశయసమారమ్భే వారుణం చోత్తరాత్రయమ్ ॥
సమ్పూజ్య వరుణం విష్ణుం పర్జన్యం త త్సమాచరేత్ ॥5॥

జలాశయాన్ని ప్రారంభించడానికి హస్త, మఘ, అనూరాధ (మిత్రుడు దేవతగా కలిగినది), జ్యేష్ఠ (ఆద్యం), పుష్యం (పుష్యం?), శతభిషక్ (వరుణుడు దేవతగా కలిగినది), ఉత్తరఫల్గుని, ఉత్తరాషాఢ, ఉత్తరాభాద్ర, అనే

ఉత్తరానక్షత్రాలు మూడు శ్రేష్ఠమైనవి. వరుణుడిని, శ్రీమహావిష్ణువును, పర్జన్యుడిని పూజించి, ఆ పిదప జలాశయం నిర్మించే పనిని ప్రారంభించాలి.

అరిష్టాశోకపున్నాగశిరీషా స్సప్రియఙ్గవః ।
అశోకః కదలీ జమ్బూ స్తథా వకులదాడిమాః ॥6॥

వేప (కుంకుడు – అరిష్టం), కంకేళి (అశోకం), పున్నాగం, దిరిసెన, ప్రేంకణం (ప్రియంగువు), విశేష మైనఅశోకం, అరటి, నేరేడు, పొగడ(వకులం), దానిమ్మ, చెట్లను నాటాలి.

సాయం ప్రాత స్తు ఘర్మర్తౌ శీతకాలే దినాన్తరే ।
వర్షారాత్రౌ భువ శ్శోషే సేక్తవ్యా రోపితా ద్రుమాః ॥7॥

నాటిన చెట్లకు తరువాత గ్రీష్మఋతువులో ఉదయం సాయంకాలం రెండుపర్యాయాలు, చలికాలం సాయంకాలం ఒక్క పర్యాయం, వానల కాలంలో నేల తడి తగ్గిన సమయంలో రాత్రివేళలలోనూ నీళ్లు పోసి తడపాలి.

ఉత్తమా వింశతి ర్హస్తా మధ్యమా షోడశాన్తరాః ।
స్థానాత్ స్థానాన్తరం కార్యం వృక్షాణాం ద్వాదశావరమ్ ॥8॥

చెట్లు నాటడంలో ఒకచెట్టుకూ రెండవచెట్టుకూ నడుమ ఇరవైమూరలు ఎడం ఉండడం శ్రేష్ఠం. పదహారు మూరలఎడంలో నాటడం మధ్యమం. చెట్టుకూ చెట్టుకూ మధ్య దూరం పన్నెండుమూరలు ఉండడం అధమం. ఆవిధంగా ఉండవలసివస్తే, వాటిని అక్కడనుండి వేరొకప్రదేశంలో నాటడం మంచిది.

విఫలా స్స్యు ర్ఘనా వృక్షా శ్శస్త్రేణాదౌ హి శోధనమ్ ।
విడఙ్గఘృతపఙ్కాక్తాన్ సేచయే చ్ఛీతవారిణా ॥9॥

దగ్గర దగ్గరగా నాటినచెట్లు పండ్లు ఈయవు. బాగా పెద్దవిగా పెరిగే చెట్లను నాటేసందర్భంలో వాటిని ముందే తగినసాధనాలతో కాయలు కాస్తాయో, లేదో పరిశోధించాలి. (కాయలు కాసేచెట్లనే నాటాలి.) క్రిములను చంపే విడంగం (వాయు విడంగం) అనే మందు, ఆవునేయి కలిపిన లేహ్యం, చల్లనినీళ్లతో కలిపి, బాగా తడపాలి.

ఫలనాశే కులత్థైశ్చ మాషై ర్ముద్గై ర్యవై స్తిలైః ।
ఘృతశీతపయస్సేకః ఫలపుష్పాయ సర్వదా ॥10॥

పండ్లు నశించిపోతున్నచెట్లకు పూవులు పండ్లు సమృద్ధిగా కలగడానికి, ఆచెట్లకు ఉలవలు, మినుములు, పెసలు, యవలు, నువ్వులు, ఆవునేయి, చల్లనినీళ్ళలో కలిపి, బాగా తడిసేవిధంగా పోయాలి.

ఆవికాజశకృచ్చూర్ణం యవచూర్ణం తిలాని చ ।
గోమాంస ముదకం చైవ సప్తరాత్రం నిధాపయేత్ ॥11॥

గొఱ్ఱెలు మేకలపెంటికలపొడి, యవధాన్యపు పొడి, నువ్వులు, ఆవునెయ్యి, చల్లనినీళ్లలో కలిపి, ఏడురాత్రులపాటు ఆచెట్లకు పోయాలి. (ఇలా చేస్తే కాయలు కాయనిచెట్లకు పూలు, పండ్లు సమృద్ధిగా కలుగుతాయి.)

ఉత్సేక స్సర్వవృక్షాణాం ఫలపుష్పాదివృద్ధిదః ।
మత్స్యామ్భసా తు సేకేన వృద్ధి ర్భవతి శాఖినః ॥12॥

నీళ్లతో తడపడంవలన అన్నిచెట్లూ పండ్లు, పూలు సమృద్ధిగా ఇస్తాయి. చేపలు కలిసిఉన్ననీళ్లను పోస్తే, చెట్లు బాగా పెరుగుతాయి.

విడఙ్గతణ్డులోపేతం మాత్స్యం మాంసం హి దోహదమ్ ।
సర్వేషా మవిశేషేణ వృక్షాణాం రోగమర్దనమ్ ॥13॥

(వాయు విడంగం) విడంగం అనేఎరువునూ, బియ్యాన్నీ కలిసినచేపమాంసంతో కలిపి చెట్లకు వేస్తే ఆచెట్లు మంచిఫలితం ఇస్తాయి. ఇది అన్నిరకాలచెట్లకు కూడా సమానంగా చక్కగా పనిచేస్తుంది. ఇది చెట్లకు వచ్చిన రోగాలన్నిటినీ పూర్తిగా నిర్మూలిస్తుంది.

ఇత్యాది మహాపురాణే ఆగ్నేయే వృక్షాయుర్వేదకథనం నామ ద్వ్యశీత్యధికద్విశతతమోఽధ్యాయః ॥282॥

అగ్నిమహాపురాణంలో వృక్షాయుర్వేదకథనం అనే రెండువందల ఎనభైరెండవ అధ్యాయం సమాప్తం.



త్ర్యశీత్యధికద్విశతతమోऽధ్యాయః – రెండువందల ఎనభైమూడవ అధ్యాయం

నానారోగహరౌషధకథనమ్ – నానారోగహరౌషధకథనం

ధన్వన్తరి రువాచ – సుశ్రుతుడితో ధన్వంతరి ఇలా చెప్తున్నాడు.

సింహీ శటీ నిశాయుగ్మం వత్సకం క్వాథసేవనమ్ ।
శిశో స్సర్వాతిసారేషు స్తన్యదోషేషు శస్యతే ॥1॥

పసిపిల్లలకు సంబంధించిన అన్నివిధాలైన అతిసారదోషాలకు, పాలుతాగడంవలన కలిగినదోషాలు అన్నీ తొలగిపోవడానికి అడ్డసరం (సింహి), కచ్చూరం(శటి), (1) పసుపు మ్రాని పసుపు అనే రెండు రకాలయిన పసుపు(నిశ), అన్నభేది – వీటికషాయం తీసుకోవాలి.

శృఙ్గీం సకృష్ణాతివిషాం చూర్ణితాం మధునా లిహేత్ ।
ఏకా చాతివిషా కాస శ్ఛర్దిజ్వరహరీ శిశోః ॥2॥

పసిపిల్లలకు దగ్గు(కాస), వాంతి, జ్వరం తగ్గడానికి శృంగి అనే ఒకానొకవిషం, (1) అతివగు నల్లజీలకఱ్ఱ, విషాన్ని విరిచే అతివిష, ఈమూడిటిని పొడి చేసి, తేనెతో రంగరించి నాకించాలి. లేదా అతివిషను ఒక్కదానినే తేనెతో కలిపి నాకించాలి.

బాలై స్సేవ్యా వచా సాజ్యా సుదుగ్ధా వాథ తైలయుక్ ।
యష్టికాం శఙ్ఖపుష్పీం వా బాలః క్షీరాన్వితం పిబేత్ ॥
వాగ్రూపసమ్పద్యుక్తాయు ర్మేధాశ్రీ ర్వర్ధతే శిశోః ॥3॥

పసిపిల్లలకు వసను నేతితో కలిపి ఇవ్వాలి. తైలంతో కూడినపాలను తాగించాలి. నేతిలో వసను కాని, మంచిపాలతో తైలం కాని కలిపి త్రాగించాలి. పాలలో అతిమధురం కాని, శంఖపుష్పి కాని కలిపి తాగించాలి. ఇలా చేయడంవలన పిల్లలకు మంచివాక్కు, రూపసంపద, ఆయువు, బుద్ధి, కాంతి వృద్ధిచెందుతాయి.

వచా హ్యగ్నిశిఖా వాసా శుణ్ఠీ కృష్ణా నిశాగదమ్ ।
సయష్టిసైన్ధవం బాలః ప్రాత ర్మేధాకరం పిబేత్ ॥4॥

వస, కుంకుమపువ్వు (అగ్నిశిఖ), వాస, శొంఠి, నల్లజీలకఱ్ఱ, పసుపు, విషాన్ని విరిచేమందు, అతిమధురం, సైంధవలవణం, వీటిని పొడిచేసి, ఇవ్వడంవలన పిల్లలకు బుద్ధి వృద్ధిచెందుతుంది.

దేవదారుమహాశిగ్రుఫలత్రయపయోముచామ్ ।
క్వాథ స్సకృష్ణా మృద్వీకా కల్క స్సర్వాన్ కృమీన్ హరేత్ ॥5॥

దేవదారుకఱ్ఱ, మహాశిగ్రువు, త్రిఫల, తుంగముస్తె (పయోముచం), వీటికషాయం, అతిమధురం, ద్రాక్ష వీటిపొడి ఇవి సమస్తమైన క్రిములను తొలగిస్తాయి.

త్రిఫలాభృఙ్గవిశ్వానాం రసేషు మధుసర్పిషోః ।
మేషీక్షీరే చ గోమూత్రే సిక్తం రోగే హితం శిశోః ॥6॥

త్రిఫల, గుంటగలిజేరు, సొంటి(విశ్వం), వీటిరసంలో గాని, తేనెలో గాని, నెయ్యిలో గాని, మేకపాలలో గాని, ఆవుమూత్రంలో గాని, తడిపితే, పిల్లలరోగాలు అన్నీ తగ్గిపోతాయి.

నాసారక్తహరో నస్యాద్దూర్వారసఇహోత్తమః ॥7॥

ముక్కునుండి రక్తం పడుతున్నపుడు గరికరసాన్ని నస్యంగా పీల్చడం ఉత్తమం.

లశునార్ద్రకశిగ్రూణాం రసః కర్ణస్య పూరణమ్ ।
తైల మార్ద్రకజాత్యం వా శూలనుచ్చోష్ఠరోగనుత్ ॥8॥

పెదవులరోగం గాని వచ్చినపుడు వెల్లుల్లి (లశునం), అల్లం (ఆర్ద్రకం), మునగ, వీటిరసాన్ని కాని నువ్వులనూనెను గాని, అల్లం జాతికి చెందిన వస్తువురసం కాని చెవిలో నిండుగా వేసుకుంటే చెవిపోటు తగ్గిపోతుంది. పెదవులకు వచ్చినరోగం కూడ తగ్గిపోతుంది.

జాతీపత్రం ఫలం వ్యోషం కవలం మూత్రకం నిశా ।
దుగ్ధక్వాథేఽభయాకల్కే సిద్ధం తైలం ద్విజార్తినుత్ ॥9॥

జాపత్రి, జాజికాయ, త్రికటుకం (సొంఠి, పిప్పలి, మిరియాలు), కపిలగోవుమూత్రం, పసుపు, మరగకాచినఆవుపాలు, కరక్కాయపొడి (అభయాకల్కం), శుద్ధమైన నువ్వులనూనె, – ఇవి దంతాలకు సంబంధించిన బాధలను పోగొడతాయి.

ధాన్యామ్బునారికేలం గోమూత్రం క్రముకవిశ్వయుక్ ।
క్వాథితం కవలం కార్యం జిహ్వావ్యాధిప్రశాన్తయే ॥10॥

నాలుకకు సంబంధించినరోగాలు పోవడానికి – ధనియాలు, కొబ్బరినీళ్లు, ఆవుమూత్రం, పోకనూ సొంటినీ కలిపి పొడిగా కాని, ముద్దగా గాని చేసుకుని తీసుకోవాలి.

సాధితం లాఙ్గలీకల్కే తైలం నిర్గుణ్డీకారసైః ।
గణ్డమాలాగలగణ్డౌ నాశయే న్నస్యకర్మణా ॥11॥

పిప్పళ్లపొడిలో వావిలిరసంతో కలిసిననూనెను కలిపి తయారుచేసిన ద్రవ్యాన్ని నస్యంలాగా ముక్కులోకి తీసుకుంటే, గండమాల (మెడచుట్టూ గడ్డలు లేవడం), గలగండం (మెడపై గడ్డలు), అనే రోగాలు తగ్గిపోతాయి.

పల్లవై రర్కపూతీకస్నుహీరుగ్ఘాతజాతికైః ।
ఉద్వర్తయేత్ సగోమూత్రై స్సర్వత్వగ్దోషనాశనః ॥12॥

జిల్లేడు, నెమిలడుగుచెట్టు (పూతి), జెముడు(స్నుహి), రుగ్ఘాతం, జాజి వీటిఆకులను ఆవుమూత్రంతో కలిపి నూరాలి. ఆ లేహ్యాన్ని ఒంటికి పూసుకుంటే, అన్నిరకాల చర్మవ్యాధులు తగ్గిపోతాయి.

వాకుచీ సతిలా భుక్తా వత్సరా త్కుష్ఠనాశినీ ।
పథ్యా భల్లాతకీ తైలగుడపిణ్డీ తు కుష్ఠజిత్ ॥13॥

వాకుచిని నువ్వులతో కలుపుకుని ఒకసంవత్సరకాలం తింటే, కుష్ఠరోగం పోతుంది. కరక్కాయ(పథ్య)ను, జీడి(భల్లాతకి), నూనె, బెల్లం, ఒకజాతిఖర్జూరం ఈమూడు కలిసినపదార్థం - ఇవి కుష్ఠరోగాన్ని పోగొడతాయి.

యూథికా వహ్ని రజనీ త్రిఫలా వ్యోషచూర్ణయుక్ ।
తక్రం గుదాఙ్కురే పేయం భక్ష్యా వా సగుడాభయా ॥14॥

మూలవ్యాధికి పెద్దగోరంట (యూథిక), నల్లజీడి(వహ్ని), పసుపు(రజని), త్రిఫల, త్రికటుకాలపొడితో కూడిన మజ్జిగను త్రాగాలి. లేదా కరక్కాయను బెల్లంతో కలిపి నూరుకుని తినాలి.

ఫలదార్వీవిషాణాం తు క్వాథౌ ధాత్రీరసోఽథవా ।
పాతవ్యో రజనీకల్కః క్షౌద్రాక్షౌద్రప్రమేహిణా ॥15॥

చక్కెరతో కూడినది కాని (మధుమేహం), కూడనిది కాని అయిన మూత్రవ్యాధి కలిగినవాడు త్రిఫల, పసుపు, వత్సనాభి(విషం) వీటికషాయం గాని, లేదా ఉసిరికరసం గాని త్రాగాలి. కుంకుమపువ్వుపొడిని తీసుకోవాలి.

నాసాగర్భో వ్యాధిఘాతః క్వాథ ఏరణ్డతైలయుక్ ।
వాతశోణితహృత్పానాత్ పిప్పలీ స్యాత్ ప్లీహాహరీ ॥16॥

నాసాగర్భాన్ని, వ్యాధిఘాతంకషాయం, ఆముదపునూనెతో కలిపి పుచ్చుకుంటే వాతరక్తవ్యాధి పోతుంది. పిప్పళ్లు మాంసం వ్యర్థంగా పెరగడం అనే రోగాన్ని పోగొడతాయి.

సేవ్యా జఠరిణా కృష్ణాస్నుక్ క్షీరబహుభావితా ।
పయో వాఽరుచిహన్త్ర్యగ్నివిడఙ్గవ్యోషకల్కయుక్ ॥17॥

కడుపుకు సంబంధించినరోగం కలిగినవాడు పాలలో నల్లజెముడును పలుమార్లు చక్కగా కలిపి తాగాలి. చిత్రమూలం, కడుపులోనిక్రిములను పోగొట్టే ఒకానొకఓషధి, త్రికటుకాలపొడి కలిపి తీసుకుంటే నోరు అరుచిగా ఉండడం తొలగిపోతుంది.

గ్రన్థికోగ్రాభయా కృష్ణా విడఙ్గాక్తా ఘృతం తథా ।
మాసం తక్రం గ్రహణ్యర్శః పాణ్డుగుల్మకృమీన్ హరేత్ ॥18॥

పిప్పలికట్టె (గ్రంథికం), వస (ఉగ్ర), కరకం (అభయ), కడుపులోనిక్రిములను చంపేమందుతో కలిపినపిప్పలి, నెయ్యి, మజ్జిగ - వీటిని ఒకనెలపాటు తీసుకుంటే, అతిసారవ్యాధి (గ్రహణి), మూలవ్యాధి (అర్శం), రక్తహీనతతో పాలిపోవడం (పాండురోగం), ప్లీహరోగం (గుల్మం), కడుపులో నులిపురుగులు వచ్చేరోగం, ఈరోగాలన్నీ తగ్గిపోతాయి.

ఫలత్రయామృతావాసాతిక్తభూనిమ్బజ స్తథా ।
క్వాథ స్సమాక్షికో హన్యాత్ పాణ్డురోగం సకామలమ్ ॥19॥

త్రిఫల, కరకం (అమృత), వాస, గుగ్గిలం (తిక్త), నేలవేము (భూనింబం) – వీటితో చేసిన కషాయాన్ని తేనెతో కలిపి తీసుకుంటే కామెర రోగం(కామలం), పాండురోగం తగ్గిపోతాయి.

రక్తపిత్తీ పిబే ద్వాసాసురసం ససితం మధు ।
వరీద్రాక్షాబలాశుణ్ఠీసాధితం వా పయః పృథక్ ॥20॥

వాస, తులసి, ఈరెంటిని పటికబెల్లంతోనూ, తేనెతోనూ కలిపి తీసుకుంటే రక్తపిత్తం(పిత్తంలో బయలుదేరినరక్తం క్రమం తప్పి సంచరించడం) అనేరోగం తగ్గిపోతుంది. శతావరి, ద్రాక్ష, చిట్టాముదం(బల), సొంటి, వీటిని వేరువేరుగా పాలలో చక్కగా కలిపి తాగినా, రక్తపిత్తవ్యాధి తగ్గుతుంది.

వరీ విదారీ పథ్యా చ బలాత్రయం సవాసకమ్ ।
శ్వదంష్ట్రామధుసర్పిర్భ్యా మాలిహేత్ క్షయరోగవాన్ ॥21॥

శతావరి, నేలగుమ్మడి, కరకం (పథ్య), మూడురకాల చిట్టాముదం, వాసకం, పల్లేరు, తేనె, నెయ్యి వీటితో కలిపి నాకితే క్షయరోగం తగ్గిపోతుంది.

పథ్యాశిగ్రుకరఞ్జార్కత్వక్సారం మధు సిన్ధుమత్ ।
సమూత్రం విద్రధిం హన్తి పరిపాకాయ తన్త్రజిత్ ॥22॥

కరకం, మునగ (శిగ్రువు), కానుగు (కరంజం), జిల్లేడు, దాల్చినచెక్క (త్వక్సారం), తేనె, సైంధవలవణం, వీటిని ఆవుమూత్రంతో కలిపి తీసుకుంటే, కడుపులో పుట్టినపుండు (విద్రధి) తగ్గిపోతుంది. కడుపులో పుండు పాకానికి రావడానికి తంత్రజిత్తు తీసుకోవాలి.

త్రివృతా జీవన్తీ దన్తీ మఞ్జిష్ఠా శర్వరీద్వయమ్ ।
తార్క్షజం నిమ్బపత్రం చ లేప శ్శస్తో భగన్దరే ॥23॥

గుహ్యస్థానంలో పుండు లేచినపుడు – తెగడ (త్రివృత), పచ్చకరకం (జీవంతి), నేపాళం (దంతి), మంజిడి (మంజిష్ఠ), రెండురకాలపసుపు, రసాంజనం, వేపాకులను కలిపి నూరినపదార్థం పూసుకోవడం ఉత్తమం.

రుగ్ఘాతరజనీలాక్షాచూర్ణాజక్షౌద్రసంయుతా ।
వాసోవర్తి ర్వ్రణే యోజ్యా శోధినీ గతినాశనీ ॥24॥

రుగ్ఘాతం, పసుపు, లత్తుకపొడి, అజం అనేధాన్యం, తేనె వీటిని కలిపి వస్త్రంతో వత్తిలాగా చేసి, పుండుమీద ఉంచాలి. అది పుండును శుభ్రం చేసి, మూలం నశింపజేస్తుంది.

శ్యామాయష్టినిశాలోధ్రపద్మకోత్పలచన్దనైః ।
సమరీచై శ్శృతం తైలం క్షీరే స్యా ద్వ్రణరోహణమ్ ॥25॥

నల్లతులసి (శ్యామ), అతిమధురం (యష్టి), పసుపు, లొద్దుగ, తామరపూవు, కలువపూవు, చందనం, మిరియాలను పాలలో కలిపి కాగబెడితే ఏర్పడిననూనెను పుండ్లపైన పూస్తే అవి తగ్గిపోతాయి.

శ్రీకార్పాసదలై ర్భస్మ ఫలోపలవణా నిశా ।
తత్పిణ్డీ స్వేదనం తామ్రే తత్తైలం స్యాత్ క్షతౌషధమ్ ॥26॥

మారేడు(శ్రీ)దళాలను, ప్రత్తిఆకులను కాల్చి చేసినబూడిద, త్రిఫల, ఉపలవణం, పసుపు, వీటిని పొడిచేసి, రాగిగిన్నెలో ఉంచి, బాగా ఉడికించి, అలా తయారైనతైలం గాయాలకు మంచిమందు.

కుమ్భీసారం పయోయుక్తం వహ్నిదగ్ధం వ్రణే లిపేత్ ।
తదేవ నాశయేత్సేకాన్నారికేలరజో ఘృతమ్ ॥27॥

కుంభీసారాన్ని పాలలో కలిపి, నిప్పులపై కాల్చి దానిని గాయాలమీద పూయాలి. దీనితో గాయాన్ని పూర్తిగా తడపితే గాయాలు మానిపోతాయి. లేదా కొబ్బరిపొడిని నేతితో కలిపి గాయాలపై రాయాలి.

విశ్వాజమోదసిన్ధూత్థచిఞ్చాత్వగ్భి స్సమాభయా ।
తక్రేణోష్ణామ్బునా వాథ పీతాతీసారనాశినీ ॥28॥

సొంటి (విశ్వం), వాము (అజమోదం), రాతిఉప్పు(సైంధవం), చింతతొక్కు (చించాత్వక్), వీటితో సమానమైనపరిమాణంలో కరకం తీసుకుని మజ్జిగతో గాని వేడినీళ్లతో గాని కలుపుకుని తాగితే, అతిసారవ్యాధి తగ్గిపోతుంది.

వత్సకాతివిషావిశ్వబిల్వముస్తశృతం జలమ్ ।
సామే పురాణేఽతిసారే సాసృక్శూలే చ పాయయేత్ ॥29॥

అన్నభేది(వత్సకం), అతివిషం, సొంటి, మారేడు, తుంగముస్తెలను నీళ్లలో కలిపి కాగబెట్టినకషాయం, ఆమం(అజీర్ణం)తో కూడి, చాలకాలంనుంచి బాధిస్తున్న అతిసారవ్యాధిని, రక్తంతో కూడిననొప్పిని పోగొడుతుంది.

అఙ్గారదగ్ధం సుగతం సిన్ధుముష్ణామ్బునా పిబేత్ ।
శూలవానథవా తద్ధి సిన్ధుహిఙ్గుకణాభయా ॥30॥

శూలరోగం కలిగినవాడు సుగతాన్నీ తెల్లఉప్పునూ నిప్పులలో వేసి కాల్చి, వేడినీళ్లతో కలిపి తాగాలి. లేదా తెల్లఉప్పును, ఇంగువ, పిప్పలి వీటిని వేడినీళ్లతో కలిపి తీసుకోవాలి.

కటురోహా త్కణాతఙ్కలాజచూర్ణం మధుప్లుతమ్ ।
వస్త్రచ్ఛిద్రగతం వక్త్రే న్యస్తం తృష్ణాం వినాశయేత్ ॥31॥

కటురోహంతో పిప్పలి (కణ), ఆతంకం, పేలాలను కలిపి పొడిచేసి, తేనెతో మెదిపి, సన్ననిరంధ్రాలు కలిగిన(పల్చని)వస్త్రంలో ఉంచి, నోటిలో ఉంచుకుంటే దాహబాధను తొలగిస్తుంది.

పాఠాదార్వీజాతిదలం ద్రాక్షామూలఫలత్రయైః ।
సాధితం సమధు క్వాథం కబలం ముఖపాకహృత్ ॥32॥

చిఱుబొద్ది (పాఠ), దేవదారు (దార్వి), జాజి ఆకులను, ద్రాక్ష, శతమూలి అనే ఓషధివిశేషం, త్రిఫల అనేవాటితో కలిపి, సిద్ధం చేసినదానితో తేనెను కలిపి తయారుచేసిన కషాయాన్ని చప్పరిస్తే నోటిలో లేచినపుండ్లు తగ్గిపోతాయి.

కృష్ణాతివిషతిక్తేన్ద్రదారుపాఠాపయోముచామ్ ।
క్వాథో మూత్రే శృతః క్షౌద్రో సర్వకణ్ఠగదాపహః ॥33॥

పిప్పలి (కృష్ణ), అతివిషం, తిక్తం, దేవదారువు, చిఱుబొద్ది (పాఠ), తుంగముస్తె (పయోముచం), వీటిని కషాయం చేసి, దానిని ఆవుమూత్రంలో వేసి కాగబెట్టి, తేనె కలిపితే ఏర్పడిన పదార్థం కంఠానికి వచ్చే రోగాలన్నిటినీ పోగొడుతుంది.

పథ్యా గోక్షురదుస్స్పర్శరాజవృక్షశిలాభిధామ్ ।
కషాయ స్సమధుః పీతో మూత్రకృచ్ఛ్రం వ్యపోహతి ॥34॥

కరకం (పథ్య), పల్లేరు (గోక్షురం), వాకుడు (దుస్స్పర్శ), ఱేల (రాజవృక్షం–ఆరగ్వధం), శిలాజిత్తు వీటిని కషాయం చేసి, దానిని తేనెలో కలిపి తాగితే, మూత్రకృఛ్ర (మూత్రం పడేటపుడు నొప్పికలిగే) రోగం తగ్గిపోతుంది.

వంశత్వగ్వరుణక్వాథ శ్శర్కరాశ్మవిఘాతనః ।
శాఖోటకక్వాథసక్షౌద్రక్షీరాశీ శ్లీపదీ భవేత్ ॥35॥

వెదురుబెరడు (వంశత్వక్), ఉలిమిరిచెట్టుపట్ట(వరుణ)తో చేసిన కషాయం, మూత్రకృఛ్ర(శర్కర)రోగాన్ని, మూత్రాశయంలో రాళ్లు ఏర్పడిన రోగాన్ని పోగొడుతుంది.

మాషార్కత్వక్పయస్తైలం మధుసిక్తం చ సైన్ధవమ్ ।
పాదరోగం హరేత్ సర్పిర్జలకుక్కుటజం తథా ॥36॥

మినుములు, జిల్లేడుతొక్క, జిల్లేడుపాలు, తైలం, తేనెలో తడిసిన రాతి ఉప్పు, పాదాలకు వచ్చేరోగాలను పోగొడతాయి. నెయ్యి, నీటికోడి నుండి ఏర్పడినది కూడ పాదరోగాన్ని పోగొడుతుంది. చిఱుబొది

శుణ్ఠీ సౌవర్చలో హిఙ్గుచూర్ణం శుణ్ఠీరసైర్ఘృతమ్ ।
రుజం హరే దథ క్వాథో విద్ధి బద్ధాగ్నిసాధనమ్ ॥37॥

శొంఠి, మద్దిచెట్టునుండి తీసినఉప్పు (సౌవర్చలం), ఇంగువపొడి, వీటిని శొంఠిరసంతో గాని, నేతితో గాని కలిపి తీసుకున్నా, లేదా వీటిని కషాయం చేసి తీసుకున్నా, మలబద్ధకం, ఆకలి లేకపోవడంఅనేదోషాలు పోతాయి.

సౌవర్చలాగ్నిహిఙ్గూనాం సదీప్యానాం రసై ర్యుతమ్ ।
విదదీప్యకయుక్తం వా తక్రం గుల్మాతురః పిబేత్ ॥38॥

గుల్మరోగంతో బాధపడేవాడు మద్దిచెట్టునుండి తీసినఉప్పు, నిమ్మ (అగ్ని), ఇంగువలరసం, జఠరాగ్నిని పెంచే పదార్థాలరసం, వీటితో కూడినమజ్జిగ, లేదా విశేషమయిన ఒకానొక ఉప్పు, ఆకలిని పెంచే వస్తువుతో కూడిన మజ్జిగ తాగాలి.

ధాత్రీపటోలముద్గానాం క్వాథ స్సాజ్యో విసర్పహా ।
శుణ్ఠీదారునవాక్షీరక్వాథో మూత్రాన్వితోఽపరః ॥39॥

ఉసిరిక, పొట్ల (పటోలం), పెసలు వీటి కషాయాన్ని నేతితో కలిపి తీసుకుంటే విసర్పం అనే చర్మరోగం తగ్గిపోతుంది. శొంఠి, దేవదారువు, ప్రత్తి (నవ), పాలు వీటితో చేసిన కషాయాన్ని ఆవుమూత్రంతో కలిపి తీసుకోవడం దీనికి మరొకమందు.

సవ్యో షాయోరజః క్షారః ఫలక్వాథశ్చ శోథహృత్ ।
గుడశిగ్రుత్రివృద్భి శ్చ సైన్ధవానాం రజోయుతః ॥40॥

త్రికటుకం, ఇనపపొడి, వెలిగారం (క్షారం), త్రిఫలకషాయం, ఇవి వాపురోగాన్ని పోగొడతాయి. బెల్లం, మునగ, తెగడ (త్రివృత్), రాతిఉప్పు, వీటితో కాచినకషాయం కూడ వాపును పోగొడుతుంది.

త్రివృతా ఫలజః క్వాథ స్సగుడ స్స్యా ద్విరేచనః ।
వచాఫలకషాయోత్థం పయో వమనకృద్ భవేత్ ॥41॥

త్రివృత్తుతో త్రిఫలను కాచినకషాయం, బెల్లంతో కలిపి తీసుకుంటే విరేచనాలు అవుతాయి. వస, త్రిఫలకషాయాలనుండి వచ్చిననీళ్లు వాంతులు కలిగిస్తాయి.

త్రిఫలాయాః పలశతం పృథగ్ భృఙ్గరజోఽన్వితమ్ ।
విడఙ్గం లోహచూర్ణం చ దశభాగసమన్వితమ్ ॥42॥

శతావరీగుడూచ్యగ్నిపలానాం పఞ్చవింశతిః ।
మధ్వాజ్యతిలజై ర్లిహ్యా ద్వలీపలితవర్జితః ॥
శత మబ్దం హి జీవేత సర్వరోగవివర్జితః ॥43॥

గుంటగలిజేరుతో నూరుపలాలపరిమాణం కలిగిన త్రిఫలను కలిపి, దానిలో పదవభాగం వాయువిడంగం, ఇనుపపొడి, ఆపదార్థంతో చేర్చాలి. శతావరి, తిప్పతీగ (గుడూచి), చిత్రమూలం ఇవి ఇరవైఅయిదుపలాల పరిమాణంలో తీసుకోవాలి. అన్నిటినీ పొడిచేసి, దానిలో తేనె, నెయ్యి, నూనెలను కలపాలి. ఈపదార్థాన్ని తీసుకుంటే, చర్మానికి ముడతలు రావు. ముసలితనం రాదు. ఏచిన్నరోగం కూడా లేకుండా, పూర్తి ఆరోగ్యంతో నిండు నూరేండ్లు జీవిస్తాడు.

త్రిఫలా సర్వరోగఘ్నీ సమధు శ్శర్కరాన్వితా ।
సితామధుఘృతై ర్యుక్తా సకృష్ణా త్రిఫలా తథా ॥44॥

తేనెతోనూ, పటికబెల్లంతోనూ కూడినత్రిఫల సమస్తరోగాలనూ నాశనం చేస్తుంది. అదే విధంగా పటికబెల్లం, తేనె, నేయి వీటితో నల్లగలిజేరు కలిపిన త్రిఫలను చేరిస్తే ఆ ఔషధం సర్వరోగాలను హరిస్తుంది.

పథ్యా చిత్రకశుణ్ఠ్యశ్చ గుడూచీ ముసలీరజః ।
సగుడం భక్షితం రోగహరం త్రిశతవర్షకృత్ ॥45॥

కరకం, చిత్రమూలం, తిప్పతీగ, ముసలిపొడి, వీటిని బెల్లంతో కలుపుకుని తింటే అన్నిరోగాలు పోతాయి. ఆయువును మూడువందలసంవత్సరాలు చేస్తుంది.

కిఞ్చి చ్చూర్ణం జపాపుష్పం పిణ్డితం విసృజే జ్జలే ।
తైలం భవేద్ ఘృతాకారం కిఞ్చి చ్చూర్ణం జలాన్వితమ్ ॥46॥

దాసన(జప)పువ్వును కొద్దిగా పొడిగా చేసి, దానిని నీళ్లలో విడిచిపెట్టాలి. జపాకుసుమచూర్ణంతో కూడినసీటిని నూనెలో కలిపితే అది నెయ్యి స్వరూపాన్ని పొందుతుంది.

ధూపార్థం దృశ్యతే చిత్రం పృషదంశజరాయునా ।
పున ర్మాక్షికధూపేన దృశ్యతే తద్యథా పురా ॥47॥

ధూపం కోసం పిల్లి(పృషదంశం)మావి(జరాయువు)తో ధూపం వేస్తే విచిత్రంగా కనబడుతుంది. తిరిగి తేనెతో ధూపం వేస్తే, పూర్వంలాగా మామూలుగా కనిపిస్తుంది.

కర్పూరజలకాభేకతైలం పాటలిమూలయుక్ ।
పిష్టాలిప్య పదే ద్వేచ చరే దఙ్గారకే నరః ॥
తృణోత్థానాదికం వ్యూహ్య దర్శయన్ వై కుతూహలమ్ ॥48॥

కర్పూరం, జలగ, భేకతైలం, వీటిని కలిగొట్టు, శతమూలలతో కలిపి నూరి ముద్దగా చేసి దానిని రెండుపాదాలకు పూసుకుంటే మానవుడు నిప్పులమీద ఏ బాధ లేకుండా నడుస్తాడు. గడ్డిపరకలాగా పైకి ఎగురుతాడు. ఇలాంటివి అనేకం ప్రదర్శిస్తూ, చూచేవారికి ఇంకా ఆ తరువాతి స్థితి చూడాలనే కుతూహలం కలిగే విధంగా నడువ గలుగుతాడు.

విషగ్రహరుజధ్వంసక్షుద్రం కర్మ చ కామికమ్ ।
తత్తే షట్కర్మకం ప్రోక్తం సిద్ధిద్వయసమాశ్రయమ్ ॥49॥

1. విషకర్మ, 2. గ్రహకర్మ, 3. రోగకర్మ, 4. ధ్వంసకర్మ, 5. క్షుద్రకర్మ, 6. కామకర్మ అనేవిధంగా ఆరువిధాలుగా ఉన్న కర్మలను గురించి నీకు వివరించాను. ఇవి ఈలోకంలో భోగాలనూ, పరలోకంలో సుఖాలనూ సిద్ధింపజేసే అంశాలు కలిగినవి.

మన్త్రధ్యానౌషధికథాముద్రేజ్యా యత్ర ముష్టయః ।
చతుర్వర్గఫలం ప్రోక్తం యః పఠేత్ స దివం వ్రజేత్ ॥50॥

1. (విషనివృత్తికి) మంత్రం, 2. (గ్రహదోషనివృత్తికి) ధ్యానం, 3. (రోగనివృత్తికి) ఓషధి, 4. కథ, 5. ముద్ర, 6. యజ్ఞం అనే ఆరుకర్మలను గురించి చెప్పిన ఈ భాగం ధర్మార్థకామమోక్షాలనే చతుర్వర్గాలను ఇస్తుంది. దీనిని చదివినవాడు స్వర్గానికి వెళ్తాడు.

ఇత్యాది మహాపురాణే ఆగ్నేయే నానారోగహరౌషధకథనం నామ త్ర్యశీత్యధికద్విశతతమోఽధ్యాయః ॥283॥

అగ్నిమహాపురాణంలో నానారోగహరౌషధకథనం అనే రెండువందల ఎనభైమూడవ అధ్యాయం సమాప్తం.



చతురశీత్యధికద్విశతతమోఽధ్యాయః - రెండువందల ఎనబైనాల్గవ అధ్యాయం

మంత్రరూపౌషధకథనమ్ - మంత్రరూపౌషధకథనం

ధన్వన్తరి రువాచ - సుశ్రుతుడితో ధన్వంతరి ఇలా చెప్తున్నాడు.

ఆయురారోగ్యకర్త్తార ఓంకారాద్యాశ్చ నాకదాః ।
ఓంకారః పరమో మన్త్రస్తం జప్త్వా చామరో భవేత్ ॥1॥

ఓంకారం మొదలైన మంత్రాలు ఆయువును పెంచుతాయి. ఆరోగ్యాన్ని ఇస్తాయి. స్వర్గాన్ని కలిగిస్తాయి. మంత్రాలన్నిటిలోనూ ఓంకారం ఉత్తమమైన మంత్రం. దానిని జపించినవాడికి మరణం ఉండదు.

గాయత్రీ పరమో మన్త్రస్తం జప్త్వా భుక్తిముక్తిభాక్ ।
ఓం నమో నారాయణాయ మన్త్రస్సర్వార్థసాధకః ॥2॥

గాయత్రీమంత్రం మిక్కిలి ఉత్తమ మైనది. గాయత్రీమంత్రాన్ని జపించినవాడు భోగాలనూ, మోక్షాన్నీ పొందగలుగుతాడు. 'ఓం నమో నారాయణాయ' అనేఅష్టాక్షరీమంత్రం సమస్తమైన ప్రయోజనాలను సాధించిపెడుతుంది.

ఓం నమో భగవతే వాసుదేవాయ సర్వదః ।
ఓం హ్రూం నమో విష్ణవే మన్త్రోఽయం చౌషధం పరమ్ ॥3॥

'ఓం నమో భగవతే వాసుదేవాయ' అనే ద్వాదశాక్షరమంత్రం కావలసిన వన్నీ ఇస్తుంది. 'ఓం హ్రూం నమో విష్ణవే' అనే మంత్రం ఉత్తమమైన ఔషధం.

అనేన దేవా హ్యసురాస్స్రశియో నీరుజోఽభవన్ ।
భూతానాముపకారశ్చ తథా ధర్మో మహౌషధమ్ ॥4॥

ఈ మంత్రాన్ని జపించడంవలననే దేవతలు, రాక్షసులు రోగాలను పోగొట్టుకున్నారు. ఇంకా సంపదలను కూడ పొందారు. ఈ మంత్రంవలన చరాచరసృష్టి మొత్తానికి మేలు కలుగుతుంది. అదే విధంగా ఉత్తమమైన ధర్మం సిద్ధిస్తుంది. ఈ మంత్రం అన్ని రోగాలకు గొప్పమందు.

ధర్మస్సద్ధర్మకృద్ధర్మీ ఏతైర్ధర్మశ్చ నిర్మలః ॥5॥

'ధర్మ, సద్ధర్మకృత్, ధర్మి' అనేవిష్ణునామాలను కీర్తించినవాడు ఉత్తమధర్మం ఆచరించ గలుగుతాడు. పాపరహితు డవుతాడు.

శ్రీద శ్రీశ శ్రీనివాసశ్రీధరశ్రీనికేతనః ।
శ్రియఃపతిశ్రీపరమో హ్యేతై శ్రియమవాప్నుయాత్ ॥6॥

'శ్రీద, శ్రీశ, శ్రీనివాస, శ్రీధర, శ్రీనికేతన, శ్రియఃపతి, శ్రీపరమ' అనే విష్ణునామాలను జపించినవాడు సంపదలను పొందుతాడు.

కామీ కామప్రదః కామః కామపాలస్తథా హరిః ।
ఆనన్దో మాధవశ్చైవ నామ కామాయ వై హరేః ॥ 7॥

'కామి, కామప్రద, కామ, కామపాల, హరి, ఆనంద, మాధవ' అనే విష్ణునామాలను కీర్తించినవాడికి కోరికలన్నీ నెరవేరతాయి.

రామః పరశురామశ్చ నృసింహో విష్ణురేవ చ ।
త్రివిక్రమశ్చ నామాని జప్తవ్యాని జిగీషుభిః ॥8॥

ప్రారంభించిన పనులలో విజయం కోరుకునేవాడు 'రామ, పరశురామ, నృసింహ, విష్ణు, త్రివిక్రమ', అనే విష్ణునామాలను జపించాలి.

విద్యా మభ్యస్యతాం నిత్యం జప్తవ్యః పురుషోత్తమః ।
దామోదరో బన్ధహరః పుష్కరాక్షోఽక్షిరోగనుత్ ॥9॥

విద్యను అభ్యసించేవాళ్లు 'పురుషోత్తమ' నామాన్ని నిత్యం జపించాలి. బంధింపబడినవాడు ఆ బంధనం తొలగడానికి 'దామోదర' నామాన్ని జపించాలి. 'పుష్కరాక్ష' నామాన్ని జపిస్తే కంటిరోగాలు పోతాయి.

హృషీకేశో భయహరో జపేదౌషధకర్మణి ।
అచ్యుతం చామృతం మన్త్రం సఙ్గ్రామే చాపరాజితః ॥10॥

'హృషీకేశ' నామాన్ని జపిస్తే, అన్నిరకాల భయాలు తొలగిపోతాయి. ఔషధం సేవించే సమయంలో 'అచ్యుత' నామాన్ని జపించాలి. ఇది అమృతమంత్రం. యుద్ధంలో విజయానికి 'అపరాజిత' నామాన్ని జపించాలి.

జలతారే నరసింహం పూర్వాదౌ క్షేమకామవాన్ ।
చక్రిణం గదినం చైవ శార్ఙ్గిణం ఖడ్గినం స్మరేత్ ॥11॥

నదులు మొదలైనచోట్ల నీటిని దాటేటపుడు 'నరసింహ' నామాన్ని జపించాలి. తూర్పుదిక్కులో క్షేమం కలగాలని కోరుకునేవాడు 'చక్రి' అనే నామాన్ని, దక్షిణంలో క్షేమానికి 'గది' అనే నామాన్ని, పడమటిదిక్కులో క్షేమానికి 'శార్ఙ్గి' అనే నామాన్ని, ఉత్తరదిక్కులో 'ఖడ్గి' అనేనామాన్ని (ఆయా ఆయుధాలు ధరించి ఉన్న విష్ణురూపాన్ని స్మరిస్తూ) జపించాలి.

సర్వేశమజితం భక్త్యా వ్యవహారేషు సంస్మరేత్ ।
నారాయణం సర్వకాలే నృసింహోఽఖిలభీతినుత్ ॥12॥

వ్యవహారాలలో విజయానికి విజయశీలుడైన శ్రీమహావిష్ణువును 'సర్వేశ' నామాన్ని జపించాలి. సకల సందర్భాలలోనూ 'నారాయణ' నామాన్ని జపించాలి. 'నృసింహ' నామం జపిస్తే అన్ని రకాలభయాలు తొలగిపోతాయి.

గరుడధ్వజశ్చ విషహృద్ వాసుదేవం సదా జపేత్ ।
ధాన్యాదిస్థాపనే స్వప్నే హ్యనన్తాచ్యుతమీరయేత్ ॥13॥

'గరుడధ్వజ' నామాన్ని జపించడంవలన విషం హరించుకుపోతుంది. 'వాసుదేవ' నామాన్ని అన్ని సమయాలలోనూ జపించాలి. ధాన్యం మొదలైనవాటిని నిలువ ఉంచే సమయంలో 'అనంత' నామాన్ని, మంచికలలు కన్నపుడు వాటివలన కలిగే మంచిఫలితం శాశ్వతంగా ఉండడానికీ, దుష్ఫలితం నివారించడానికీ 'అచ్యుత' నామాన్ని జపించాలి.

నారాయణం చ దుస్స్వప్నే దాహాదౌ జలశాయినమ్ ।
హయగ్రీవం చ విద్యార్థీ జగత్సూతిం సుతాప్తయే ॥
బలభద్రం శౌర్యకామ ఏకం నామార్థసాధకమ్ ॥14॥

చెడ్డకలలు వచ్చినపుడు వాటివలన కలిగే దుష్టఫలితం నివారించడానికి 'నారాయణ' నామాన్ని జపించాలి. దాహం కలగడం మొద లైన సందర్భాలలో 'జలశాయి' నామాన్ని జపించాలి. విద్యను కోరుకునేవాడు 'హయగ్రీవ' నామాన్ని, కొడుకు పుట్టాలని కోరుకునేవాడు 'జగత్సూతి' నామాన్ని, బలం కోరుకునేవాడు 'బలభద్ర' నామాన్ని జపించాలి. శ్రీమహావిష్ణువుకు సంబంధించిన నామాలు ఒక్కొక్కటి అనేకమైన ప్రయోజనాలను సాధిస్తుంది.

ఇత్యాది మహాపురాణే ఆగ్నేయే మన్త్రపౌషధకథనం నామ చతురశీత్యధికద్విశతతమోఽధ్యాయః ॥284॥

అగ్నిమహాపురాణంలో మంత్రరూపౌషధకథనం అనే రెండువందల ఎనభైనాల్గవ అధ్యాయం సమాప్తం.



పఞ్చాశీత్యధికద్విశతతమోఽధ్యాయః – రెండువందల ఎనబైఐదవ అధ్యాయం

మృతసంజీవనకరసిద్ధయోగకథనమ్ – మృతసంజీవనకరసిద్ధయోగకథనం

ధన్వన్తరి రువాచ – సుశ్రుతుడితో ధన్వంతరి ఇలా చెప్తున్నాడు.

సిద్ధయోగాన్ పునర్వక్ష్యే మృతసఞ్జీవనీకరాన్ ।
ఆత్రేయభాషితాన్ దివ్యాన్ సర్వవ్యాధివిమర్దనాన్ ॥1॥

సమస్తరోగాలను నాశనం చేసే మృతసంజీవనీకరాలయిన సిద్ధయోగాలు దివ్యమైనవి. వీటిని పూర్వం ఆత్రేయుడు చెప్పి ఉన్నాడు. ఇపుడు ఆ ప్రకారంగా తిరిగి నీకు చెప్తాను.

ఆత్రేయ ఉవాచ – ఆత్రేయమహర్షి ఇలా చెప్తున్నాడు.

బిల్వాదిపఞ్చమూలస్య క్వాథస్స్యాద్వాతికే జ్వరే ।
పావనం పిప్పలీమూలం గుడూచీ విశ్వజోఽథవా ॥
ఆమలక్యభయా కృష్ణా వహ్నిస్సర్వజ్వరాన్తకః ॥2॥

వాతంవలన కలిగిన జ్వరానికి బిల్వం, అగ్నిమంథం, శ్యోనాకం, కాశ్మరి, పాటల అనే అయిదింటివేళ్లు మొదలైనవి, (శాలపర్ణి, పృశ్నిపర్ణి, కంచకారిక, గోక్షురం, అనేవి పంచమూలాలు అని మతాంతరం) వీటిని మరగబెట్టి చేసిన కషాయం ఔషధం. పిప్పలివేరు, పచ్చగుంట గలిజేరు, తిప్పతీగ, సొంటి అనేవి కూడ జ్వరాన్ని పోగొడతాయి. ఉసిరిక, కరకం, పిప్పలి, చిత్రమూలం ఇవి సమస్తమైన జ్వరాలను పోగొడతాయి.

బిల్వాగ్నిమన్థస్యోనాకకాశ్మర్యః పాటలా స్థిరా ।
త్రికణ్టకం పృశ్నిపర్ణీ బృహతీ కణ్టకారికా ॥
జ్వరావిపాకపార్శ్వార్తికాశనుత్ కుశమూలకమ్ ॥3॥

1. మారేడు, 2. నెల్లి అనే కూరాకు చెట్టు (అగ్నిమంథం), 3. దుండుగచెట్టు (స్యోనాకం), 4. గుమ్ముడు (కాశ్మరి), 5. కలిగొట్టు, 6. ముయ్యాకుపొన్న (స్థిర), 7. ములుజెముడు (త్రికంటకం), 8. కోలపొన్న (పృశ్నిపర్ణి), 9. పిన్నములక (బృహతి), 10. వాకుడు (కంటకారిక), వీటిని దశమూలాలు అంటారు. వీటి కషాయం, దర్భదుంప కషాయం జ్వరాన్ని, అజీర్ణాన్ని, పార్శ్వపునొప్పినీ, దగ్గునూ పోగొడతాయి.

గుడూచీ పర్పటీ ముస్తం కిరాతం విశ్వభేషజమ్ ।
వాతపిత్తజ్వరే దేయం పఞ్చభద్రమిదం స్మృతమ్ ॥4॥

తిప్పతీగ, మ్రానిపసుపు(పర్పటి), తుంగముస్త, నేలవేము (కిరాతం), సొంటి – ఈ అయిదింటిని పంచభద్రం అంటారు. వాతంవలన గాని, పిత్తంవలన గాని వచ్చిన జ్వరానికి పంచభద్రంతో చేసిన కషాయాన్ని ఇవ్వాలి.

త్రివృద్విశాలాకటుకాత్రిఫలారగ్వధైః కృతః ।
సంస్కారో భేదనః క్వాథః పేయస్సర్వజ్వరాపహః ॥5॥

తెగడ, విశాల, వెల్లుల్లి (కటువు), త్రిఫల, ఱేల (ఆరగ్వధం), వీటిని సంస్కరించి చేసిన కషాయం తాగితే విరేచనాలు అయి, సమస్తమైన జ్వరాలు తగ్గిపోతాయి.

దేవదారు బలా వాసా త్రిఫలావ్యోషపద్మకైః ।
సవిడఙ్గైస్సితా తుల్యం తచ్చూర్ణం పఞ్చకాసజిత్ ॥6॥

దేవదారు, చిట్టాముదం, వాస, త్రిఫల, త్రికటుకం, పద్మకాష్ఠం అనే ఓషధి, వాయువిడంగం, చక్కెర – వీటిని సమానభాగాలుగా తీసుకుని పొడిచేసి తీసుకుంటే అయిదు విధాలయిన దగ్గు తగ్గిపోతుంది.

దశమూలీ శటీ రాస్నా పిప్పలీబిల్వపౌష్కరైః ।
శృఙ్గీ తామలకీ భార్గీ గుడూచీ నాగవల్లిభిః ॥7॥

దశమూలం (4శ్లో), కచ్చూరం (శటి), రాస్న, పిప్పలి, మారేడు, పద్మకాష్ఠం అనేఓషధి, శృంగి అనే వృక్షం, నేలఉసిరిక (తామలకి), చిఱుతేకు (భార్గి), తిప్పతీగ, తములపాకు (నాగవల్లి), వీటితో –

యవాగూం విధినా సిద్ధాం కషాయం వా పిబేన్నరః ।
కాసాహృద్గ్రహణీపార్శ్వహిక్కాశ్వాసప్రశాన్తయే ॥8॥

విధివిధానంగా సిద్ధం చేసిన గంజిని, లేదా కషాయాన్ని కాని తాగినవాడికి దగ్గు, గుండెపట్టుకు పోవడం, పార్శ్వపునొప్పి, ఎక్కిళ్లు, శ్వాసరోగాలు తగ్గిపోతాయి.

మధుకం మధునా యుక్తం పిప్పలీం శర్కరాన్వితామ్ ।
నాగరం గుడసంయుక్తం హిక్కాఘ్నం లవణత్రయమ్ ॥9॥

యష్టిమధుకాన్ని తేనెతో కలిపి కాని, పిప్పలిని చక్కెరతో కలిపి కాని, సొంటిని బెల్లంతో కలిపి కాని, మూడు విధాలయిన లవణాలను కాని తీసుకుంటే ఎక్కిళ్లు తగ్గుతాయి.

కారవ్యజాజీ మరిచం ద్రాక్షా వృక్షామ్లదాడిమమ్ ।
సౌవర్చలం గుడం క్షౌద్రం సర్వారోచననాశనమ్ ॥10॥

నల్లజీలకఱ్ఱ (కారవి), తెల్లజీలకఱ్ఱ (అజాజి), మిరియం, ద్రాక్ష, మారేడు (వృక్షామ్లం), దానిమ్మ, పర్ణవృక్షం నుండి తీసిన ఉప్పు (సౌవర్చలం), బెల్లం, వీటిని సమానభాగాలుగా తీసుకుని పొడిచేసి, దానిలో తేనె కలుపుకుని తీసుకుంటే, అన్ని రకాలయిన అరుచులు తగ్గిపోతాయి.

శృఙ్గవేరరసం చైవ మధునా సహ పాయయేత్ ।
అరుచిశ్వాసకాసఘ్నం ప్రతిశ్యాయకఫాన్తకమ్ ॥11॥

అల్లపురరసాన్ని తేనెతో కలిపి తాగిస్తే, అరుచి, శ్వాసబాధ, దగ్గు, జలుబు(ప్రతిశ్యాయం), కఫం తగ్గిపోతాయి.

వటం శృఙ్గీ శిలాలోధ్రదాడిమం మధుకం మధు ।
పిబేత్తణ్డులతోయేన ఛర్దితృష్ణానివారణమ్ ॥12॥

మఖ్టి, శృంగి, కర్పూరం (శిల), లొద్దుగ, దానిమ్మ, యష్టిమధుకం, వీటిని పొడిచేసి, దానిలో తేనె కలిపి, బియ్యపునీళ్లతో తాగితే, వాంతులు, దాహం తగ్గిపోతాయి.

గుడూచీ వాసకం లోధ్రం పిప్పలీ క్షౌద్రసంయుతమ్ ।
కఫాన్వితం జయేద్రక్తం తృష్ణాకాసజ్వరాపహమ్ ॥ 13॥

తిప్పతీగ, వాసకం, లొద్దుగ, పిప్పలి, వీటిని పొడిచేసి, తేనెతో కలిపి తీసుకుంటే, కఫంతో కలిసి రక్తం పడడాన్ని నయం చేస్తుంది. ఇంకా దాహం, దగ్గు, జ్వరాలను కూడా పోగొడుతుంది.

వాసకస్య రసస్తద్వత్ సమధుస్తామ్రజో రసః ।
శిరీషపుష్పసురసభావితం మరిచం హితమ్ ॥14॥

వాసకరసం, తేనెతో కలిపిన తామ్రరసం, దిరిసెనపువ్వు రసంతో భావన చేసిన మిరియాలపొడి – ఇవి ఆరోగ్యానికి మేలు చేస్తాయి.

సర్వార్తిను న్మసూరో౽థ పిత్తముక్ తణ్డులీయకమ్ ।
నిర్గుణ్డీ శారివా శేలురఙ్కోలశ్చ విషాపహః ॥15॥

మసూరం అనే కాయధాన్యం చిరుసెనగలు అన్నిరకాల బాధలను తొలగిస్తుంది. చిట్టికూర (తండులీయకం) పిత్తదోషాలను పోగొడుతుంది. సింధువారం, దావిలిచెట్టు శారివ, సుగంధిపాల విరిగి (శేలువు), ఊడుగు (అంకోలం), విషాలను విరిచేస్తాయి.

మహౌషధామృతా క్షుద్రా పుష్కర(ం) గ్రన్థికోద్భవమ్ ।
పిబేత్ కణాయుతం క్వాథం మూర్ఛాయాం చ మదేషు చ ॥16॥

మూర్ఛరోగంలోనూ, మత్తు ఎక్కువైనపుడూ – సొంటి (మహౌషధ), పిప్పలి (అమృత), వాకుడు (క్షుద్ర), మెట్టతామరదుంప (పుష్కరం), పిప్పలీమూలం (గ్రంథికం) వీటితో కాచి చేసిన, నూకలేని కషాయం తాగాలి.

హిఙ్గుసౌవర్చలవ్యోషైర్ ద్విపలాంశైర్ఘృతాఢకమ్ ।
చతుర్గుణే గవాం మూత్రే సిద్ధమున్మాదనాశనమ్ ॥17॥

ఇంగువ, పర్ణవృక్షంనుండి తీసినఉప్పు, త్రికటుకం ఇవి రెండుపలాలు, నెయ్యి తూమెడు, తీసుకుని, దానికి నాలుగురెట్లు గోమూత్రంతో కలిపి సిద్ధం చేసిన పదార్థం పిచ్చిని పోగొడుతుంది.

శఙ్ఖపుష్పీవచాకుష్ఠైస్సిద్ధం బ్రాహ్మీరసైర్యుతమ్ ।
పురాణం హన్త్యపస్మారం సోన్మాదం మేధ్యముత్తమమ్ ॥18॥

శంఖపుష్పి, వస, చెంగల్వకోష్టు, వీటిని కలిపి చేసిన పదార్థాన్ని ముల్లంగిరసంతో కలిపి, మాత్రలుగా చేసి ఇస్తే, ఎప్పటినుండో ఉన్న మూర్ఛరోగాన్ని పిచ్చినీ పోగొడుతుంది. ఇంకా ఉత్తమమైన మేధను కలిగిస్తుంది.

పఞ్చగవ్యం ఘృతం తద్వత్ కుష్ఠనుచ్చాభయాయుతమ్ ।
పటోలత్రిఫలానిమ్బగుడూచీధావనీవృషైః ॥
సకరఞ్జైర్ఘృతం సిద్ధం కుష్ఠనుద్వజ్రకం స్మృతమ్ ॥19॥

కరక్కాయచూర్ణాన్ని పంచగవ్యాలతో నెయ్యితో కలిపి తీసుకుంటే, కుష్ఠవ్యాధి తగ్గిపోతుంది. పొట్ల, త్రిఫల, వేప, తిప్పతీగ, వాకుడు, ఋషభం అనే ఓషధి, కానుగ వీటితో నేయి కలిపి, సిద్ధం చేసిన పదార్థం కుష్ఠవ్యాధికి వజ్రాయుధం లాగా పని చేసి నిర్మూలిస్తుంది.

నిమ్బం పటోలం వ్యాఘ్రీ చ గుడూచీ వాసకం తథా ।
కుర్యాద్దశపలాన్ భాగానేకైకస్య సుకుట్టితాన్ ॥20॥

1. వేప, 2. చేదుపొట్ల, 3. వాకుడు (వ్యాఘ్రి), 4. తిప్పతీగ, 5. వాసకం, (ఇవి పంచతిక్తాలు. 23శ్లో). వీటిని ఒక్కొక్క దానిని పదిపలాల పరిమాణంలో తీసుకుని మెత్తగా నూరాలి.

జలద్రోణే విపక్తవ్యం యావత్పాదావశేషితమ్ ।
ఘృతప్రస్థం పచేత్తేన త్రిఫలాదర్భసంయుతమ్ ॥21॥

దానిని తూముడు నీళ్లలో వేసి అందులో నాలుగవ వంతు మాత్రమే మిగిలేంతవరకు వండాలి. దానికి త్రిఫల, కస్తూరి(దర్భ)లను కలిపి నాలుగు మానికలనేతిలో వండాలి.

పఞ్చతిక్తమితి ఖ్యాతం సర్పిః కుష్ఠవినాశనమ్ ॥22॥

దీనిని పంచతిక్తఘృతం అంటారు. ఇది కుష్ఠరోగాన్ని నిర్మూలిస్తుంది.

అశీతిం వాతజాన్ రోగాం శ్చత్వారింశ చ్చ పైత్తికాన్ ।
వింశతిం శ్లైష్మికాన్ కాసపీనసార్శో వ్రణాదికాన్ ॥23॥

పంచతిక్తఘృతం ఎనభైరకాల వాతరోగాలనూ, నలభైరకాల పిత్తరోగాలనూ, ఇరవై కఫరోగాలనూ, ఇంకా దగ్గు, పడిసెం (పీనసం), మూల (అర్శం) వ్యాధులనూ గాయాలు మొదలైన వాటినీ పోగొడుతుంది.

హ న్త్యన్యాన్ యోగరాజోஉ యం య థార్క స్తిమిరం ఖలు ॥24॥

సూర్యుడు చీకట్లను నాశనం చేసినట్లుగా ఇది ఇంకా ఇతరమైన రోగాలను కూడా నిర్మూలిస్తుంది. పంచతిక్తఘృతం యోగరాజం.

త్రిఫలాయాః కషాయేణ భృఙ్గరాజరసేన చ ।
వ్రణప్రక్షాలనం కుర్యాదుపదంశప్రశాన్తయే ॥25॥

కొరుకుడుజబ్బు తగ్గిపోవడానికి త్రిఫలాకషాయంతో, గుంటగలిజేరురసంతో, గాయాలను శుద్ధి చేయాలి.

పటోలదలచూర్ణేన దాడిమత్వగ్గజోஉ థవా ।
గుణ్డయేచ్చ గజేనాపి త్రిఫలాచూర్ణకేన చ ॥26॥

పొట్లచెట్టుఆకులపొడితో గానీ, దానిమ్మతొక్కులపొడితో గానీ, గజచూర్ణంతో గానీ, త్రిఫలాచూర్ణంతో గానీ గాయాన్ని కప్పాలి. (ఇలా చేస్తే, గాయాలు తగ్గిపోతాయి.)

త్రిఫలాయోరజో యష్టిమార్కవోత్పలమారిచైః ।
ససైన్ధవైః పచేత్తైలమభ్యఙ్గాచ్ఛర్దికాపహమ్ ॥27॥

త్రిఫల, అయోరజం, అతిమధురం (యష్టి), గుంటగలిజేరు (మార్కవం), నల్లకలువ, మిరియపుపొడి, రాతిఉప్పు, వీటిని నువ్వులనూనెలో వేసి, వండాలి. ఆనూనెను ఒంటికి నలుగుపెట్టుకుంటే వాంతులు తగ్గిపోతాయి.

సక్షీరాన్ మార్కవరసాన్ ద్విప్రస్థమధుకోత్పలైః ।
పచేత్తు తైలకుడవం తన్నస్యం పలితాపహమ్ ॥28॥

పాలు, గుంటగలిజేరురసం, ఎనిమిదిమానికల యష్టిమధుకం, నల్లకలువలు వీటిని మానెడునూనెలో కలిపి వండాలి. దానిని నస్యంగా తీసుకుంటే, ముసలితనంలో వచ్చేనెరుపును (ముసలితనాన్ని) పోగొడుతుంది.

నిమ్బం పటోలం త్రిఫలా గుడూచీ ఖదిరం వృషమ్ ।
భూనిమ్బపాఠాత్రిఫలా గుడూచీరక్తచన్దనమ్ ॥
యోగద్వయం జ్వరం హన్తి కుష్ఠవిస్ఫోటకాదికమ్ ॥29॥

వేప, చేదుపొట్ల, త్రిఫల, తిప్పతీగ, చంద్ర, ఋషభం అనే ఓషధి, నేలవేము, చిఱుబొద్ది, ఎఱ్ఱచందనం, వీటిని పొడిగానూ లేదా కషాయంగానూ రెండువిధాలుగా ఉండే ఔషధాన్ని తీసుకుంటే జ్వరం తగ్గిపోతుంది. కుష్ఠవ్యాధినీ, కురుపులు మొదలైనవాటినీ పోగొడుతుంది.

పటోలామృతభూనిమ్బవాసారిష్టకపర్పటైః ।
ఖదిరాన్తయుతైః క్వాథో విస్ఫోటజ్వరశాన్తికృత్ ॥30॥

చేదుపొట్ల, వత్సనాభి (అమృత), నేలవేము, వాస, కుంకుడు(అరిష్టకం), పాపటచెట్టు (పర్పటం), చంద్ర, వీటితో చేసిన కషాయం కురుపులనూ, జ్వరాన్నీ తగ్గిస్తుంది.

దశమూలీ ఛిన్నరుహా పథ్యా దారు పునర్నవా ।
జ్వరవిద్రధిశోథేషు శిగ్రువిశ్వజితా హితాః ॥31॥

దశమూలం(4శ్లో), తిలకం (ఛిన్నరుహ), కరకం (పథ్య), దేవదారువు, గలిజేరు (పునర్నవ), మునగ, విశ్వజిత్తుల కషాయం జ్వరాన్నీ, కడుపులో పుట్టిన పుండ్లనూ, తగ్గించడానికి మంచి ఔషధాలు.

మధూకనిమ్బపత్రాణాం లేపస్స్యాద్ వ్రణశోధనః ॥32॥

యష్టిమధూకం, వేప ఆకులను నూరి, దానిని పూస్తే గాయాలు శుద్ధి అవుతాయి.

త్రిఫలా ఖదిరో దార్వీ న్యగ్రోధాతిబలాకుశాః ।
నిమ్బమూలకపత్రాణాం కషాయాశ్శోధనే హితాః ॥33॥

త్రిఫల, చంద్ర, దేవదారువు(దార్వి), మట్టి, చిట్టాముదం చెట్టు, దర్భ, వేప, ముల్లంగి ఆకులు, వీటి కషాయం శరీరశుద్ధికి మేలు చేస్తాయి.

కరఞ్జారిష్టనిర్గుణ్డీరసో హన్యాద్ వ్రణకృమీన్ ॥34॥

కానుగు, కుంకుడు, వావిలి, వీటి రసం గాయాలలోని క్రిములను చంపివేస్తాయి.

ధాతకీచన్దనబలాసమంగామధుకోత్పలైః ।
దార్వీమేదోఽన్వితై ర్లేపస్ససర్పిర్ వ్రణరోపణః ॥35॥

ఏఱుజాజి (ధాతకి), చందనం, చిట్టాముదంచెట్టు, మంజిష్ఠ (సమంగ), యష్టిమధుకం, నల్లకలువ, పసుపు(దార్వి), మేదస్సులను నేతితో కలిపి పూస్తే గాయాలు మానిపోతాయి.

గుగ్గులుత్రిఫలావ్యోషసమాంశైర్ ఘృతయోగతః ।
నాడీదుష్టవ్రణం శూలం భగన్దరముఖం హరేత్ ॥36॥

గుగ్గులు, త్రిఫల, త్రికటుకం, వీటిని సమానభాగాలుగా తీసుకుని నేతిని కలిపి పూస్తే సెలవేసే కురుపులను, కీళ్లనొప్పులను, గుహ్యస్థానంలో వేసిన కురుపులను తగ్గిస్తుంది.

హరీతకీం మూత్రసిద్ధాం సతైలలవణాన్వితామ్ ।
ప్రాతః ప్రాతశ్చ సేవేత కఫవాతామయాపహామ్ ॥37॥

కరకం (హరీతకి)తో నువ్వులనూనెను, ఉప్పునూ చేర్చి, గోమూత్రంలో కలిపి, ప్రతిరోజూ ఉదయం సేవిస్తే, కఫమూ, వాతరోగాలూ తగ్గిపోతాయి.

త్రికటుత్రిఫలాక్వాథం సక్షారలవణం పిబేత్ ।
కఫవాతాత్మకేష్వేవ విరేకః కఫవృద్ధినుత్ ॥38॥

కఫవాత ప్రకృతి కలిగినవారు త్రికటువులు, త్రిఫలాల కషాయాన్ని క్షారలవణాలతో కలిపి తాగితే విరేచనం కలుగుతుంది. కఫం పెరగడం అనే రోగాన్ని పోగొడుతుంది.

పిప్పలీ పిప్పలీమూలవచాచిత్రకనాగరైః ।
క్వాథితం వా పిబేత్ పేయ మామవాతవినాశనమ్ ॥39॥

పిప్పలి, పిప్పలివేరు, వస, చిత్రమూలం, సొంటి, వీటితో చేసిన కషాయం లేదా నీళ్లు తాగాలి. దీనివలన మలబద్ధకం (అజీర్ణం కారణంగా వచ్చిన వాయువువలన ప్రేగులు మందంగా ఉండడం) తగ్గిపోతుంది.

రాస్నాం గుడూచీ మేరణ్డదేవదారుమహౌషధమ్ ।
పిబేత్ సర్వాఙ్గికే వాతే సామే సన్ధ్యస్థిమజ్జగే ॥
దశమూలకషాయంవా పిబేద్వా నాగరామ్భసా ॥40॥

సమస్తమైన అవయవాలలోనూ వాతం కలిగినపుడు, కీళ్లలోనూ, ఎముకలలోనూ, మజ్జలోనూ వాతం ఏర్పడినపుడు, రాస్న, తిప్పతీగ, ఆముదంచెట్టు (ఏరండం), దేవదారువు, శొంఠి (మహౌషధం) తాగాలి. దానివలన అన్నిరకాల వాతం తగ్గిపోతుంది. దశమూలాల(4శ్లో)కషాయాన్ని శొంఠినీళ్లతో కలిపి తాగినా తగ్గుతుంది.

శుణ్ఠీ గోక్షురకక్వాథః ప్రాతః ప్రాతర్నిషేవితః ।
సామవాతకటీశూలపాణ్డురోగప్రణాశనః ॥
సమూలపత్రశాఖాయాః ప్రసారణ్యాశ్చ తైలకమ్ ॥41॥

ప్రతిరోజూ ఉదయమే శొంఠి, పల్లేరు (గోక్షురకం)ల కషాయం తీసుకుంటే, అజీర్ణంవలన ఏర్పడిన వాతం, నడుమునొప్పి, పాండురోగం తగ్గిపోతాయి. లంజెసవరం అనే వృక్షానికి సంబంధించిన వేళ్లు, ఆకులు, కొమ్మలనుండి ఏర్పడిన నూనెను తీసుకున్నా ఈ రోగాలు తగ్గుతాయి.

గుడూచ్యా స్సురసః కల్కశ్చూర్ణం వా క్వాథమేవ చ ।
ప్రభూతకాల మాసేవ్యముచ్యతే వాతశోణితాత్ ॥
పిప్పలీ వర్ధమానం వా సేవ్యం పథ్యా గుడేన వా ॥42॥

తిప్పతీగ, తులసి (సురసం), కుందురుష్కం అనే గంధద్రవ్యం, వీటిచూర్ణం గాని, కషాయం గాని చాలకాలం సేవిస్తే, వాతంవలన రక్తం పడడం అనే వ్యాధినుండి విముక్తి కలుగుతుంది. లేదా పిప్పలి, లేదా ఆముదం (వర్ధమానం)ఆకు పొడిని, కరకంతో గానీ, లేదా బెల్లంతో కాని కలిపి సేవించాలి.

పటోలత్రిఫలాతీవ్రకటుకామృతసాధితమ్ ।
పక్వం పీత్వా జయత్యాశు సదాహం వాతశోణితమ్ ॥43॥

చేదుపొట్ల, వేడిగా ఉన్నత్రికటుకాలు, వత్సనాభం, వీటితో కలిపి వండినపదార్థం తాగితే, దాహంతో కూడినదీ, వాతం వలన వచ్చినదీ అయిన రక్తం పడడం అనే రోగం తగ్గిపోతుంది.

గుగ్గులుం కోష్ణశీతేన గుడూచీ త్రిఫలామ్భసా ।
బలాపునర్నవైరణ్డబృహతీద్వయగోక్షురైః ॥
సహిఙ్గులవణైః పీతం సద్యో వాతరుజాపహమ్ ॥44॥

గుగ్గులును గోరువెచ్చటి నీటితో తీసుకుంటే వెంటనే వాతరోగం తగ్గిపోతుంది. అలాగే తిప్పతీగరసాన్ని త్రిఫలను నీళ్లలో కలుపుకుని తాగినా తగ్గుతుంది. చిట్టాముదం, గలిజేరు, ఆముదం, బృహతీద్వయం (వాకుడు, పిన్నములక), పల్లేరు, ఇంగువ, లవణం వీటితో తీసుకున్నా, వాతరోగం తగ్గుతుంది.

కార్షికం పిప్పలీమూలం పఞ్చైవ లవణాని చ ।
పిప్పలీ చిత్రకం శుణ్ఠీ త్రిఫలా త్రివృతా వచా ॥45॥

ఒకకర్షం పరిమాణంలో పిప్పలిదుంప, పంచలవణాలు (గాజుప్పు, ఇందుప్పు, సముద్రపుఉప్పు, బిడాలవణం, నల్ల ఉప్పు) పిప్పలి, చిత్రమూలం, సొంటి, త్రిఫల, తెగడ, వస,

ద్వౌ క్షారౌ శాద్వలా దన్తీ స్వర్ణక్షీరీ విషాణికా ।
కోలప్రమాణాం గుటికాం పిబేత్ సౌవీరకాయుతామ్ ॥46॥

రెండు రకాలయిన క్షారాలు, శాద్వల, నేపాళం, బలురక్కసి అనే ఒకానొక ముళ్లచెట్టు (స్వర్ణక్షీరి), చెంగల్వకోష్టు (విషాణిక) వీటిని రేగుపండంత పరిమాణంలో గోలీలు తయారు చేసి గంజిలో కలుపుకుని తాగాలి.

శోథావపాకే త్రివృతా ప్రవృద్ధేచోదరాదికే ।
క్షీరం శోథహరం దారువర్షాభూర్నాగరై శ్శుభమ్ ॥47॥

వాపులు స్వల్పంగా ఉన్నపుడు, కడుపు మొదలైన వాటిలో వాపు పెరిగినపుడు – తెగడ తీసుకుంటే తగ్గిపోతుంది. పాలు వాపును తగ్గిస్తాయి. దేవదారువు, గల్జేరుపల్లిక (వర్షాభువు), సొంటి – ఇవి కూడా వాపును తగ్గించడానికి మంచివి.

సేకస్త థార్కవర్షాభూనిమ్బక్వాథేన శోథజిత్ ॥48॥

జిల్లేడు, గల్జేరుపల్లిక, వేప – వీటితో చేసిన కషాయం కూడా వాపును తొలగిస్తుంది.

వ్యోషగర్భం పలాశస్య త్రిగుణే భస్మవారిణీ ।
సాధితం పిబతస్సర్పిః పతత్యర్శో న సంశయః ॥49॥

త్రికటుకాలతో కూడిన మోదుగభస్మాన్ని, దానికి మూడురెట్ల పరిమాణంలో ఉన్న నీళ్లలో కలిపి, దానిలో వేసి సాధనచేసిన నెయ్యి తీసుకుంటే మూలవ్యాధి తగ్గిపోతుంది. ఇందులో సందేహం లేదు.

విష్వక్సేనాబ్జనిర్గుణ్డీసాధితం చాపి లావణమ్ ॥50॥

విష్వక్సేనం, ప్రబ్బలి, వావిలి – వీటితో సాధన చేసిన లవణం కూడా అదేవిధంగా మూలవ్యాధిని తగ్గిస్తుంది.

విడఙ్గానలసిన్ధూత్థరాస్నాగ్రక్షీరదారుభిః ।
తైలం చతుర్గుణం సిద్ధం కటుద్రవ్యం జలేన వా ॥
గణ్డమాలాపహం తైల మభ్యఙ్గా ద్గలగణ్డనుత్ ॥51॥

వాయువిడంగం, చిత్రమూలం (అనలం), సైంధవలవణం, ఏలాపర్ణిచిగురులు (రాస్నాగ్రం), పాలు, దేవదారు – వీటికి నాలుగురెట్ల పరిమాణంలో తైలంతో కలిపి సిద్ధం చేసిన పదార్థాన్ని గాని, లేదా నీళ్లలో కలిపిన కటుద్రవ్యాలను గాని తీసుకుంటే మెడలో గడ్డలు రావడం అనే రోగం నయమవుతుంది. ఆ తైలాన్ని ఒంటికి నలుగుపెట్టుకుంటే మెడమీద గడ్డలు తగ్గిపోతాయి.

శటీకునాగవలయక్వాథః క్షీరరససంయుతమ్ ।
పయస్యాపిప్పలీవాసాకల్కం సిద్ధం క్షయే హితమ్ ॥52॥

కచ్చూరం (శటి), కునాగం, వలయం – వీటి కషాయం, నెయ్యి (పాలవికారం), పిప్పలి, వాస, వీటిచూర్ణాన్ని పాలరసంతో కలిపి సిద్ధం చేసిన పదార్థం ఇవి క్షయవ్యాధిని తగ్గించడంలో మేలయినవి.

వచావిడభయాశుణ్ఠీహిఙ్గుకుష్ఠాగ్నిదీప్యకాన్ ।
ద్విత్రిషట్చతురేకాంశసప్తపఞ్చాశికాః క్రమాత్ ॥
చూర్ణం పీతం హన్తి గుల్మ ముదరం శూలకాసనుత్ ॥53॥

1. వచ అనేపేరు గలిగిన పిట్ట రెట్ట (వచా విట్) రెండుపాళ్లు, కరకం మూడుపాళ్లు, శొంఠి ఆరుపాళ్లు, ఇంగువ నాలుగుపాళ్లు, చెంగల్వకోష్టు ఒకపాలు, చిత్రమూలం ఏడుపాళ్లు, జీలకఱ్ఱ యాభైపాళ్లు – ఈ క్రమంలో గ్రహించి పొడి చేసి తీసుకుంటే ప్లీహం (గుండెలో ఎడమవైపు ఉండే మాంసఖండం) పెద్దది కావడం (గుల్మరోగం), జలోదరం (కడుపులో నీరు చేరడం) మొదలైన ఉదరరోగాలు, కీళ్లనొప్పులు మొదలైన నొప్పులబాధలు, దగ్గు తగ్గిపోతాయి.

పాఠానికుమ్భత్రికటుత్రిఫలాగ్నిషు సాధితమ్ ।
మూత్రేణ చూర్ణగుటికా గుల్మప్లీహాదిమర్దనీ ॥54॥

చిఱుబొద్ది, నేపాలం, త్రికటువులు, త్రిఫల, చిత్రమూలం, వీటితో గోమూత్రాన్ని కలిపి చేసినచూర్ణం, గోలీలు చేసి, తీసుకుంటే గుల్మరోగం, ప్లీహ(మాంసం పెరగడంవలన కలిగిన)రోగం, మొదలైన రోగాలను నిర్మూలిస్తుంది.

వాసానిమ్బపటోలాని త్రిఫలా వాతపిత్తనుత్ ।
లిహ్యాత్ క్షౌద్రేణ విడఙ్గచూర్ణం కృమివినాశనమ్ ॥55॥

వాస, వేము, చేదుపొట్ల, త్రిఫల ఇవి వాతదోషాలనూ, పిత్తదోషాలనూ పోగొడతాయి. వాయువిడంగం చూర్ణాన్ని తేనెతో కలుపుకుని నాకితే క్రిములు నశిస్తాయి.

విడఙ్గసైన్ధవక్షారమూత్రేణాపి హరీతకీ ॥56॥

వాయువిడంగం, రాతిఉప్పు, క్షారం, గోమూత్రం వీటితో కలిపిన పసుపు కూడా క్రిములను నాశనం చేస్తుంది.

శల్లకీ బదరీ జమ్బూప్రియాలామ్రార్జునత్వచః ।
పీతాః క్షీరేణ మధ్వక్తాః పృథక్శోణితవారణాః ॥57॥

శల్లకి అనే చెట్టు, రేగు, నేరేడు, మోరటి (ప్రియాల), మామిడి, తెల్లమద్ది, ఈ చెట్లపట్టలను తేనెతో తడిపి, పాలతో సేవిస్తే రక్తం అతిగా స్రవించడం తగ్గిపోతుంది.

బిల్వామ్రధాతకీపాఠాశుణ్ఠీమోచరసాస్సమాః ।
పీతారున్ధత్యతీసారం, గుడతక్రేణ దుర్జయమ్ ॥58॥

మారేడు, మామిడి, ఏఱుజాజి, చిఱుబొద్ది, సొంటి, మునగ(మోచ), వెల్లుల్లి, వీటిని సమాన మైనభాగాలుగా తీసుకుని చూర్ణం చేసి, దానిని బెల్లం కలిపినమజ్జిగతో కలిపి, తాగితే, తీవ్రంగా ఉన్నఅతిసారవ్యాధి కూడ తగ్గిపోతుంది.

చాఙ్గేరీకోలదధ్యమ్బునాగరక్షారసంయుతమ్ ।
ఘృతయుక్క్వాథితం పేయం గుదభ్రంశరుజాపహమ్ ॥59॥

పిలిచింత (చాంగేరి), త్రికటుకం (కోలం), పెరుగునీళ్లు, సొంటి, క్షారం, వీటి కషాయాన్ని నేతితో కలిపి తాగితే, అతిసారం మొదలైన వ్యాధులవలన గుదం జారిపోవడం అనే జబ్బు తగ్గిపోతుంది.

విడఙ్గాతివిషాముస్తదారుపాఠాకలిఙ్గకమ్ ।
మరీచేన సమాయుక్తం శోథాతీసారనాశనమ్ ॥60॥

వాయువిడంగం, అతివస అనే ఓషధి, తుంగముస్త, దేవదారు, చిఱుబొద్ది, జువ్వి, వీటి కషాయాన్ని మిరియాలతో కలిపి తీసుకుంటే వాపులు, అతిసారవ్యాధి తగ్గిపోతాయి.

శర్కరాసిన్ధుశుణ్ఠీభిః కృష్ణా మధుగుడేన వా ।
ద్వే ద్వే ఖాదేద్ధరీతక్యౌ జీవేద్వర్షశతం సుఖీ ॥61॥

పటికబెల్లం, సైంధవలవణం, శొంఠి వీటితో గాని, తేనె, బెల్లంలతో గాని రెండేసి కరక్కాయలు తిన్నవాడు నూరేండ్లు ఏ రోగమూ లేకుండా సుఖంగా జీవిస్తాడు.

త్రిఫలా పిప్పలీయుక్తా సమధ్వాజ్యా త థైవ సా ॥62॥

పిప్పలితో కూడిన త్రిఫలను తేనె, నెయ్యిలతో కలిపి తీసుకుంటే కూడ అదేవిధంగా నూరేండ్లు సుఖంగా బ్రదుకుతాడు.

చూర్ణ మామలకం తేన సురసేన తు భావితమ్ ।
మధ్వాజ్యశర్కరాయుక్తం లీఢ్వా స్త్రీశః పయః పిబేత్ ॥63॥

ఉసిరికపొడిని తులసితో భావన చేసి, తేనె, నెయ్యి, చక్కెర కలిపి నాకి, పిదప పాలు తాగితే స్త్రీలను వశం చేసుకుంటాడు.

మాషపిప్పలిశాలీనాం యవగోధూమయో స్తథా ।
చూర్ణభాగై స్సమాంశై శ్చ పచేత్ పిప్పలికాం శుభామ్ ॥64॥

మినుము, పిప్పలి, వరి ధాన్యాలపొడి, యవలు, గోధుమలపొడిని సమానభాగాలుగా తీసుకుని, వెదురుబియ్యంతోనూ, పిప్పళ్లతోనూ కలిపి వండాలి.

తాం భక్షయిత్వా చ పిబేచ్ఛర్కరామధురం పయః ।
నవ శ్చటకవద్ గచ్ఛేద్దశవారాన్ స్త్రియం ధ్రువమ్ ॥65॥

ఆ పదార్థాన్ని తిని, పిదప చక్కెర కలిపిన మధురమైన పాలను తాగాలి. అలా చేసినవాడు నూతనమైన పిచ్చుకలాగా పదిపర్యాయాలు వెంట వెంటనే స్త్రీతో సంభోగిస్తాడు. ఇది నిశ్చయం.

సమఙ్గా ధాతకీపుష్పలోధ్రనీలోత్పలాని చ ।
ఏతత్ క్షీరేణ దాతవ్యం స్త్రీణాం ప్రదరనాశనమ్ ॥66॥

మంజిష్ఠ (సమంగ), ఏఱుజాజిపూవు, లొద్దుగ, నల్లకలువలను పాలతో కలిపి స్త్రీలకు ఇస్తే వారికి వచ్చేరక్తస్రావరోగం తగ్గిపోతుంది.

బీజం కౌరణ్టకం చాపి మధుకం శ్వేతచన్దనమ్ ।
పద్మోత్పలస్య మూలాని మధుకం శర్కరాతిలాన్ ॥
ద్రవమాణేషు గర్భేషు గర్భస్థాపన ముత్తమమ్ ॥67॥

పచ్చపువ్వుల గోరంటగింజలను యష్టిమధుకం, తెల్లచందనం, అలాగే పసుపు, తెలుపు, నలుపురంగులు కలిసిన రంగులో ఉన్న కలువపూవుగింజలు, యష్టిమధుకం, చక్కెర, నువ్వులు వీటి చూర్ణాన్ని గర్భస్రావం జరిగే స్త్రీలు తాగితే వారికి గర్భం నిలబడుతుంది.

దేవదారునభఃకుష్ఠం నలదం విశ్వభేషజమ్ ।
లేపః కాఞ్జికసమ్పిష్టస్తైలయుక్తశ్శిరోర్తినుత్ ॥68॥

దేవదారు, తామరతూటిదారం, చెంగల్వకోష్టు, వట్టివేరు (నలదం), సొంటి – వీటిని గంజిలో వేసి నూరి తైలంతో కలిపి పూస్తే తలపోటు మొదలైన శిరోరోగాలు తగ్గిపోతాయి.

వస్త్రపూతం క్షిపేత్ కోష్ణం సిన్ధూత్థం కర్ణశూలనుత్ ।
లశునార్ద్రకశిగ్రూణాం కదల్యా వా రసః పృథక్ ॥69॥

సైంధవలవణాన్ని పొడి చేసి, వస్త్రంలో జల్లించి, కొద్దిగా వెచ్చనినూనెలో కలిపి చెవిలో వేస్తే చెవిపోటు తగ్గిపోతుంది. వెల్లుల్లి, అల్లం (ఆర్ద్రకం), మునగ, అరటి వీటిరసాన్ని వేరు వేరుగా చెవిలో వేస్తే చెవిపోటు తగ్గుతుంది.

బలాశతావరీరాస్నామృతాస్సైరీయకైః పిబేత్ ।
త్రిఫలాసహితం సర్పిస్తిమిరఘ్నమనుత్తమమ్ ॥70॥

కన్నులు కనబడకుండా గుడ్డితనం వచ్చినపుడు చిట్టాముదం, శతావరి, రాస్న, తులసిరసం, సైరీయకం అనే మొక్క రసంతో కలిపి తాగాలి. లేదా త్రిఫలను నేతిలో కలుపుకుని తాగాలి. అంధత్వానికి ఇది ఉత్తమమైన మందు.

త్రిఫలావ్యోషసిన్ధూత్థైర్ఘృతం సిద్ధం పిబేన్నరః ।
చాక్షుష్యం భేదనం హృద్యం దీపనం కఫరోగనుత్ ॥71॥

త్రిఫల, త్రికటుకం, సైంధవలవణం, వీటితో కూర్చిన నేతిని తాగితే ఆ మానవుడికన్నులకు మేలు కలుగుతుంది. విరేచనం అవుతుంది. గుండెకు బలం ఇస్తుంది. ఆకలి పెరుగుతుంది. కఫరోగం తగ్గిపోతుంది.

నీలోత్పలస్య కిఞ్జల్కం గోశకృద్రససంయుతమ్ ।
గుటికాఞ్జనమేతత్ స్యాద్దినరాత్ర్యన్ధయోర్హితమ్ ॥72॥

నల్లకలువ పుప్పొడిని రసంతో కలిపి, ఉండలుగా చేసి, ఆ గోలీలను కాటుకగా ఉపయోగిస్తే రాత్రి కనబడకపోవడం (రేచీకటి) పగలు కనబడకపోవడం (పగటిచీకటి) అనే రోగాలు తగ్గిపోతాయి.

యష్టీమధువచాకృష్ణాబీజానాం కుటజస్య చ ।
కల్కే నాలోడ్య నిమ్బస్య కషాయో వమనాయ సః ॥73॥

యష్టిమధుకం, వస, పిప్పలివిత్తనాలు, అవిసెబెరడుపొడితో కలిపి నూరి, కాచిన కషాయం వాంతులు కలిగిస్తుంది.

స్నిగ్ధస్విన్నయవం తోయం ప్రదాతవ్యం విరేచనమ్ ।
అన్యథా యోజితం కుర్యాన్మన్దాగ్నిం గౌరవారుచిమ్ ॥74॥

విరేచనాలు కావడానికి తడిసిన నున్నని యవలనీరు ఇవ్వాలి. దీనిని ఇంకొకరకంగా ఉపయోగిస్తే, ఆకలి మందగిస్తుంది. కడుపుఉబ్బరం వస్తుంది. నోటికి అరుచి కలుగుతుంది.

పథ్యా సైన్ధవకృష్ణానాం చూర్ణముష్ణామ్బునా పిబేత్ ।
విరేకస్సర్వరోగఘ్నః శ్రేష్ఠో నారాచసంజ్ఞకః ॥75॥

కరకం, సైంధవలవణం, పిప్పలి వీటిచూర్ణాన్ని వేడినీళ్లతో కలిపితే ఏర్పడిన పదార్థానికి నారాచం అని పేరు. దీనిని తాగితే, విరేచనాలు అవుతాయి. సమస్తరోగాలు నశించిపోతాయి.

సిద్ధయోగా మునిభ్యో యే ఆత్రేయేణ ప్రదర్శితాః ।
సర్వరోగహరా స్సర్వయోగాగ్ర్యా స్సుశ్రుతేన హి ॥76॥

ఆత్రేయుడు మహర్షులకు వివరించిన సిద్ధయోగాలు సమస్తరోగాలను పోగొడతాయి. సమస్తమైన యోగాలలోనూ శ్రేష్ఠమైనవి. వీటిని ధన్వంతరివలన సుశ్రుతుడు గ్రహించాడు.

ఇత్యాది మహాపురాణే ఆగ్నేయే మృతసఞ్జీవనకరసిద్ధయోగకథనమ్ నామ పఞ్చాశీత్యధికద్విశతతమోఽధ్యాయః ॥285॥

అగ్నిమహాపురాణంలో మృతసంజీవనకర సిద్ధయోగకథనం అనే రెండువందల ఎనభైఐదవ అధ్యాయం సమాప్తం.



షడశీత్యధికద్విశతతమోఽధ్యాయః – రెండువందల ఎనబైఆరవ అధ్యాయం

మృత్యుంజయకల్పకథనమ్ – మృత్యుంజయకల్పకథనం

ధన్వన్తరి రువాచ – సుశ్రుతుడితో ధన్వంతరి ఇలా చెప్తున్నాడు.

కల్పాన్మృత్యుఞ్జయాన్ వక్ష్యే హ్యాయుర్దాన్ రోగమర్దనాన్ ।
త్రిశతీరోగహా సేవ్యా మధ్వాజ్యత్రిఫలామృతా ॥1॥

మరణాన్ని జయించే కొన్ని చికిత్సావిధానాలను నీకు చెప్తాను. ఇవి ఆయువును పెంచుతాయి. రోగాలను నాశనం చేస్తాయి. తేనె, నెయ్యి, త్రిఫల, ఉసిరిక వీటిని సేవిస్తే మూడువందల రోగాలు తగ్గిపోతాయి.

పలం పలార్ధం కర్షం వా త్రిఫలాం సకలాం తథా ।
బిల్వతైలస్య నస్యంచ మాసం పఞ్చశతీ కవిః ॥2॥

నాలుగు కర్షాలు, లేదా రెండు కర్షాలు, లేదా ఒకకర్షం (పద్నాలుగు మినపగింజలబరువు), పరిమాణంలో గాని లేదా ఎంతో కొంత త్రిఫలను ఒకనెలపాటు తీసుకున్నా, మారేడునూనెను నస్యంగా పుచ్చుకున్నా అయిదువందలసంవత్సరాలు వివేకిగా జీవిస్తాడు.

రోగాపమృత్యుబలిజిత్తిలం భల్లాతకం తథా ।
పఞ్చాఙ్గం వాకుచీచూర్ణం షణ్మాసం ఖదిరోదకైః ॥3॥

నువ్వులు, జీడి (భల్లాతకం) ఇవి అన్నిరోగాలనూ, అపమృత్యువునూ, ముసలితనంవలన చర్మంమీద కలిగేముడతలనూ పోగొడతాయి. వాకుచి ఆకు, పువ్వు, పట్ట, పండు, వేరు అనే పంచాంగాలను పొడిచేసి, అత్తపత్తి (ఖదిర)నీళ్లతో కలిపి కషాయం చేసి, ఆరునెలలపాటు –

క్వాథైః కుష్ఠం జయేత్సేవ్యం చూర్ణం నీలకురుణ్టకమ్ ।
క్షీరేణ మధునా వాపి శతాయుః ఖణ్డదుగ్ధభుక్ ॥4॥

తీసుకుంటే కుష్ఠవ్యాధి తగ్గిపోతుంది. నల్లగోరింటపొడిని పాలతో గాని, తేనెతో గాని కలిపి తీసుకున్నా, పాలలో కండచక్కెర వేసి పుచ్చుకున్నా, నూరేండ్లు రోగం లేకుండా జీవిస్తాడు.

మధ్వాజ్యశుణ్ఠీం సంసేవ్య పలం ప్రాతస్స మృత్యుజిత్ ।
వలీపలితజి జ్జీవే న్మాణ్డకీచూర్ణదుగ్ధపాః ॥5॥

రోజూ ఉదయమే ఒకపలం పరిమాణంలో తేనె, నెయ్యి, సొంటి తీసుకున్నవాడు మృత్యువును జయిస్తాడు. మాండకీచూర్ణాన్ని పాలల్లో కలుపుకుని తాగితే, ముసలితనంవల్ల వచ్చే ముడతలు రావు. వెంట్రుకలు నెరియవు.

ఉచ్చటా మధునా కర్షం పయసా మృత్యుజి న్నరః ।
మధ్వాజ్యైః పయసా వాపి నిర్గుణ్డీ రోగమృత్యుజిత్ ॥6॥

నేలఉసిరికను తేనెతోనూ, పాలతోనూ కలిపి ఒకకర్షం పరిమాణంలో తిన్నవాడు మృత్యువును జయిస్తాడు. తేనె, నెయ్యి, పాలు వీటిలో దేనితో నయినా వావిలిని కలిపి తీసుకుంటే రోగాలనూ మృత్యువునూ జయిస్తాడు.

పలాశతైలం కర్షైకం షణ్మాసం మధునా పిబేత్ ।
దుగ్ధభోజీ పఞ్చశతీ సహస్రాయు ర్భవే న్నరః ॥
జ్యోతిష్మతీపత్రరసం పయసా త్రిఫలాం పిబేత్ ॥7॥

మోదుగనూనెను ఒకకర్షం పరిమాణంలో ఆరునెలలపాటు ప్రతిరోజూ తేనెతో కలిపి తీసుకుని, పాలు తాగేవాడు అయిదువందలసంవత్సరాలు జీవిస్తాడు. మానేరుతీగ ఆకులరసాన్ని తాగినా, లేదా త్రిఫలను పాలతో కలిపి పుచ్చుకున్నా వెయ్యిసంవత్సరాలు జీవిస్తాడు.

మధునాऽऽజ్యం తతస్తద్వచ్ఛతావర్యా రజః పలమ్ ।
క్షౌద్రాజ్యైః పయసా వాऽపి నిర్గుణ్డీ రోగమృత్యుజిత్ ॥8॥

నెయ్యిని తేనెతో కలిపి తీసుకున్నా, లేదా శతావరి అనే ఔషధం పొడిని ఒకపలం పరిమాణంలో తీసుకున్నా, వెయ్యియేండ్లు బదుకుతాడు. వావిలిని తేనెతో గాని, నెయ్యితో గాని, పాలతో గాని తీసుకుంటే రోగాలూ, మృత్యువూ దగ్గరకు రావు.

పఞ్చాఙ్గం నిమ్బచూర్ణస్య ఖదిరక్వాథభావితమ్ ।
కర్షం భృఙ్గరసేనాపి రోగజిచ్చామరో భవేత్ ॥9॥

వేపకు సంబంధించిన ఆకులు, మొదలైన అయిదు అంగాలను పొడిచేసి, అత్తపత్తి కషాయంతో మెదిపి, ఒకకర్షం పరిమాణంలో ఉన్న గుంటగలిజేరు (భృంగరాజం)తో కలిపి తీసుకుంటే అన్నిరోగాలూ నశించిపోతాయి. వాడు అమరుడు అవుతాడు.

రుదన్తికాజ్యమధుభు గ్దుగ్ధభోజీ చ మృత్యుజిత్ ॥10॥

రుదంతిక, నెయ్యి, తేనె కలిపి తిని, పాలు తాగినవాడు మరణాన్ని జయిస్తాడు.

కర్షచూర్ణం హరీతక్యా భావితం భృఙ్గరాడ్రసైః ।
ఘృతేన మధునాసేవ్య త్రిశతాయుశ్చ రోగజిత్ ॥11॥

ఒకకర్షం పరిమాణంలో కరక్కాయచూర్ణం తీసుకుని, దాన్ని గుంటగలిజేరు రసంతో కలిపి, నెయ్యితో గాని, లేదా తేనెతో గాని తీసుకుంటే అన్నిరోగాలు పోతాయి. మూడువందల సంవత్సరాల ఆయుర్దాయం కలుగుతుంది.

వారాహికా భృఙ్గరసం లోహచూర్ణం శతావరీ ।
సాజ్యం కర్షం పఞ్చశతీ కార్తచూర్ణం శతావరీ ॥
భావితం భృఙ్గరాజేన మధ్వాజ్యం త్రిశతీ భవేత్ ॥12॥

పెండలం, గుంటగలిజేరురసం, లోహపుపొడి, శతావరి అనే ఓషధి, వీటిని నేతితో కలిపి ఒకకర్షం పరిమాణంలో తీసుకుంటే, ఏ రోగాలు లేకుండా ఐదువందలసంవత్సరాలు బ్రదుకుతాడు. కార్తచూర్ణం, శతావరి

అనేవాటిని గుంటగలిజేరుతో భావన చేసి, తేనెతోనూ, నెయ్యితోనూ తీసుకుంటే మూడువందలసంవత్సరాలు ఆరోగ్యంగా జీవిస్తాడు.

తామ్రామృతా త్రివృత్తుల్యం గన్ధకం చ కుమారికా ।
రసైర్విమృజ్య ద్వే గుఞ్జే సాజ్యం పఞ్చశతాబ్దవాన్ ॥13॥

తామ్రభస్మం, కరక్కాయపొడి, తెగడ ఈ మూడింటిని సమపాళ్లుగా తీసుకుని, గంధకం, కలబందరసంతో మెదిపి, రెండుగురివిందల పరిమాణంలో నేతితో తీసుకుంటే అయిదువందల సంవత్సరాలు ఆరోగ్యంగా బ్రదుకుతాడు.

అశ్వగన్ధాఫలం తైలం సాజ్యం ఖణ్డం శతాబ్దవాన్ ॥14॥

పెన్నేరు, త్రిఫల, నువ్వులనూనె, వీటిని నేతితో కలిపిన పులకండంతో తీసుకుంటే నూరేండ్లు జీవిస్తాడు.

పలం పునర్నవాచూర్ణం మధ్వాజ్యపయసా పిబన్ ।
అశోకచూర్ణస్య పలం మధ్వాజ్యం పయసాऽర్తినుత్ ॥15॥

గలిజేరు చూర్ణం లేదా అశోకవృక్షం ఆకుపొడి ఒకపలం పరిమాణంలో తీసుకుని, తేనె, నెయ్యి, పాలతో కలిపి తాగితే అన్నిబాధలు తొలగిపోతాయి.

నిమ్బస్య తైలం సమధు నస్యాత్ కృష్ణకచశ్శుతీ ।
కర్షమక్షం సమధ్వాజ్యం శతాయుః పయసా పిబన్ ॥16॥

వేపనూనెను తేనెతో కలిపి నస్యంగా తీసుకుంటే జుట్టు బాగా నల్లబడుతుంది. నూరేండ్లు ఆరోగ్యంగా జీవిస్తాడు. రుద్రాక్షచూర్ణం ఒకకర్షం పరిమాణంలో తీసుకుని తేనె, నెయ్యి, పాలతో కలిపి తాగినా నూరేండ్లు ఆరోగ్యంగా జీవిస్తాడు.

అభయాం సగుడాం జగ్ధ్వా ఘృతేన మధురాదిభిః ।
దుగ్ధాన్నభుక్కృష్ణకేశోऽరోగీ పఞ్చశతాబ్దవాన్ ॥17॥

కరక్కాయపొడిని బెల్లంతో కలిపి, నెయ్యి, చక్కెర మొదలైనవాటితో తిని, ఆ తరువాత పాలతో అన్నం తింటే జుట్టు నల్లబడుతుంది. అయిదువందలసంవత్సరాలు ఏ రోగం లేకుండా జీవిస్తాడు.

పలం కూష్మాణ్డికా చూర్ణం మధ్వాజ్యపయసా పిబన్ ।
మాసం దుగ్ధాన్నభోజీ చ సహస్రాయుర్విరోగవాన్ ॥18॥

గుమ్మడికాయపొడిని ఒకపలం పరిమాణంలో తీసుకుని, తేనె, నెయ్యి, పాలతో కలుపుకుని తాగాలి. ఆ Ôá Æy Ôâb Í\ n q•+ ÜH * . ‡ $<Š>±ÿ ¿Ðî sÆ \ T#ð¾y &ƒ@sÃ+ ýÅ£+&†yĵ Ÿk+&ƒ¢ <ŠÅÔ &ƒ.

శాలూకచూర్ణం భృఙ్గాజ్యం సమధ్వాజ్యం శతాబ్దకృత్ ।
కటుతుమ్బీతైలనస్యం కర్షం శతద్వయాబ్దవాన్ ॥19॥

జాజికాయపొడిని గుంటగలిజేరునూనెతో కలిపి, తేనెతోనూ, నెయ్యితోనూ తీసుకుంటే నూరేండ్లు ఆరోగ్యంగా జీవిస్తాడు. చేదుసొరకాయపొడిని నువ్వులనూనెతో కలిపి నస్యంలాగా తీసుకుంటే రెండువందలసంవత్సరాలు ఆరోగ్యంగా బ్రదుకుతాడు.

త్రిఫలా పిప్పలీ శుణ్ఠీ సేవితా త్రిశతాబ్దకృత్ ।
శతావర్యాః పూర్వయోగస్సహస్రాయుర్బలాతికృత్ ॥20॥

త్రిఫల, పిప్పలి, శొంఠి, వీటిని రోజూ తీసుకునేవాడు మూడువందలఏండ్లు ఆరోగ్యంగా జీవిస్తాడు. వీటిని శతావరితో కలిపి తీసుకుంటే అధికంగా బలం వస్తుంది. వేయేండ్లు ఆరోగ్యంగా బ్రదుకుతాడు.

చిత్రకేణ తథా పూర్వస్తథా శుణ్ఠీ విడఙ్గతః ॥21॥

చిత్రమూలం, సొంటి, వాయువిడంగం వీటిని సేవించినా పైవిధమైన ప్రయోజనమే కలుగుతుంది.

లోహేన భృఙ్గరాజేన బలయా నిమ్బపఞ్చకైః ।
ఖదిరేణ చ నిర్గుణ్ద్యా కణ్టకార్యథ వాసకాత్ ॥
వర్షాభువా తద్రసైర్వా భావితో వటికాకృతః ॥22॥

రాగి, గుంటగలిజేరు, చిట్టాముదం చెట్టు, వేపచెట్టుకు సంబంధించిన బెరడు, పువ్వు, పండు, వేరు, ఆకు అనే అయిదు పదార్థాలు (పంచనింబం), వీటిని చంద్ర, వావిలి, వాకుడు, వాసకం, గల్జేరుపల్లిక(వర్షాభువు), అనేవాటితో కాని, లేదా వాటి రసాలతో కాని భావన చేసి, మాత్రలు(ఉండలు)గా తయారు చేసుకోవాలి.

చూర్ణం ఘృతైర్వా మధునా గుడాద్యైర్వారిణా తథా ।
ఓం హ్రూం స ఇతి మన్త్రేణ మన్త్రితో యోగరాజకః ॥23॥

లేదా – పొడి చేసి, ఆ పొడిని నేతితో గాని, తేనెతో గాని, బెల్లం మొదలైనవాటితో గాని లేదా నీళ్లతో గాని, కలపాలి. దానిని 'ఓం హ్రూం సః' అనే మంత్రంతో మంత్రించాలి. ఈ ప్రకారంగా చేస్తే యోగరాజం సిద్ధం అవుతుంది.

మృతసఞ్జీవనీకల్పో రోగమృత్యుఞ్జయో భవేత్ ।
సురాసురైశ్చ మునిభి స్సేవితాః కల్పసాగరాః ॥24॥

ఇది మృతసంజీవని అనే ఔషధంతో సమానమైనది. దీనిని సేవించినవారికి రోగాలు రావు. మృత్యువు లేదు. దేవతలు, రాక్షసులు కూడా ఇటువంటి మృత్యుంజయకల్పాలను అనంతంగా సేవించారు.

గజాయుర్వేదం ప్రోవాచ పాలకాప్యోఽఙ్గరాజకమ్ ॥25॥

పూర్వం పాలకాప్యుడు అంగదేశాధిపతికి గజాయుర్వేదం వివరించాడు. (ఆ ప్రకారంగా గజాయుర్వేదం చెప్తాను, విను.)

ఇత్యాది మహాపురాణే ఆగ్నేయే మృత్యుఞ్జయకల్పకథనం నామ షడశీత్యధికద్విశతతమోఽధ్యాయః ॥286॥

అగ్నిమహాపురాణంలో మృత్యుంజయకల్పకథనం అనే రెండువందల ఎనభైఆరవ అధ్యాయం సమాప్తం.

సప్తాశీత్యధికద్విశతతమోఽధ్యాయః - రెండువందల ఎనభైఏడవ అధ్యాయం

గజచికిత్సాకథనమ్ - గజచికిత్సాకథనం

పాలకాప్య ఉవాచ - లోమపాదుడితో పాలకాప్యుడు ఇలా చెప్తున్నాడు.

గజలక్ష్మచికిత్సాం చ లోమపాద! వదామి తే ॥1॥

లోమపాదా! ఏనుగు లక్షణాలను, ఏనుగురోగాలకు చికిత్సను గురించి నీకు వివరిస్తాను.

దీర్ఘహస్తా మహోచ్ఛ్వాసాః ప్రశస్తాస్తే సహిష్ణవః ।
వింశత్యష్టాదశ నఖాశ్శీతకాలమదాశ్చ యే ॥2॥

పొడుగయిన తొండం కలిగినవీ, దీర్ఘమైన ఉచ్ఛ్వాసలు కలిగినవీ, సహనం కలిగినవీ, ఇరవై, లేదా పద్దెనిమిది గోళ్లు కలిగినవీ, శీతకాలంలో మదం కలిగి ఉండేవి అయిన ఏనుగులు శ్రేష్ఠమైనవి.

దక్షిణశ్చోన్నతో దన్తో బృంహితం జలదోపమమ్ ।
కర్ణౌ చ విపులౌ యేషాం సూక్ష్మబిన్ద్వన్వితాస్త్వచి ॥3॥

తే ధార్యా న తథా ధార్యా వామనా యే త్వలక్షణాః ।
హస్తిన్యః పార్శ్వగర్భిణ్యో యే చ మూఢమతం గతాః ॥4॥

కుడివైపు దంతం ఎత్తుగా ఉన్నవీ, ఘీంకారం మేఘంలాగా గంభీరంగా ఉన్నవీ, చెవులు బాగా విశాలంగా ఉన్నవీ, చర్మంమీద చిన్న చిన్న చుక్కలు కలిగినవీ అయిన ఏనుగులను సంగ్రహించాలి. పొట్టిగా ఉన్నవీ, ఉత్తమ లక్షణాలు లేనివీ, కడుపు ఒకప్రక్కగా ఉన్నవీ, తెలివితక్కువతనంతో మూర్ఖంగా ప్రవర్తించేవీ అయిన ఏనుగులను చేరనీయగూడదు.

వర్ణస్సత్త్వం బలం రూపం కాన్తిస్సంహననం జవః ।
సప్తస్థితో గజశ్చేద్యుక్సఙ్గ్రామేఽరీం జయేత్సదా ॥5॥

రంగు, శక్తి, బలం, అందం, తేజస్సు, అవయవాల రాపిడి, వేగం, అనే ఏడుగుణాలు కలిగిన ఏనుగు యుద్ధంలో శత్రువులను జయిస్తుంది.

కుఞ్జరాః పరమా శోభా శిబిరస్య బలస్య చ ।
ఆహతః కుఞ్జరైశ్చైవ విజయః పృథివీక్షితా ॥6॥

ఏనుగులు సైనికశిబిరానికి సైన్యానికి కూడా మిక్కిలి శోభను కలిగిస్తాయి. రాజులు ఏనుగులమూలంగానే యుద్ధంలో విజయం సంపాదిస్తారు.

పాకలేషు చ సర్వేషు కర్తవ్యమనువాసనమ్ ।
ఘృతతైలాభ్యఙ్గయుక్తం స్నానం వాతవివర్జితమ్ ॥7॥

(ఏనుగులకు వచ్చే) పిత్తజ్వరాలన్నింటిలోనూ వస్తికర్మ చేయాలి. వాతం వలన కలిగే జబ్బులకు నెయ్యి, నూనెలతో నలుగు పెట్టి స్నానం చేయించాలి.

స్కన్ధేషు చ క్రియా కార్యా తథా పాకలవన్నృపైః ।
గోమూత్రం పాణ్డురోగేషు రజనీభ్యాం ఘృతం ద్విజ ॥8॥

బ్రాహ్మణోత్తమా! లోమపాదా! ఏనుగులకు మూపుమీద వచ్చేరోగాలకు పాకల రోగానికి వలెనే చికిత్స చేయాలి. పాండురోగాలకు గోమూత్రం, ఆవునెయ్యి ఇవ్వాలి.

అ నాహే తైలసిక్తస్య నిషేకస్తస్య శస్యతే ।
లవణైః పఞ్చభిర్మిశ్రా ప్రతిపానాయ వారుణీ ॥9॥

గ్రహణి(మలాశయాన్ని వదులుచేసే)రోగానికి ఒంటికి నూనె పూసి, స్నానం చేయించడం మంచిది. మద్యంలో పంచలవణాలు (కాచకం–గాజుప్పు, సైంధవం–రాతిఉప్పు, సాముద్రం–సముద్రపుఉప్పు, బిడం–బిడాల లవణం, సౌవర్చలం–నల్లఉప్పు) కలిపి ప్రతిపానం చేయించాలి.

విడఙ్గత్రిఫలావ్యోషసైన్ధవైః కవలాన్ కృతాన్ ।
మూర్ఛాసు భోజయేన్నాగం క్షౌద్రం తోయం చ పాయయేత్ ॥10॥

మూర్ఛల రోగం వచ్చినపుడు ఏనుగుకు వాయువిడంగం, త్రిఫల, త్రికటువులు, రాతిఉప్పు వీటిని నూరి ముద్ద చేసి తినిపించాలి. తేనె, నీళ్లు కలిపి తాగించాలి.

అభ్యఙ్గశ్శిరసశ్శూలే నస్యం చైవ ప్రశస్యతే ।
నాగానాం స్నేహపుటకైః పాదరోగా నుపక్రమేత్ ॥
పశ్చాత్ కల్కకషాయేణ శోధనం చ విధీయతే ॥11॥

ఏనుగుకు తలపోటు వచ్చినపుడు ఒంటినిండా నూనె రాసి, స్నానం చేయించాలి. తైలాన్ని నస్యంగా ఇవ్వడం కూడ మంచిదే. ఏనుగులపాదాలకు జబ్బులు చేసినపుడు నూనె, తామరపూలతో చికిత్స ప్రారంభించాలి. తరువాత కల్కకషాయంతో శుద్ధి చేయాలి.

శిఖితిత్తిరలావానాం పిప్పలీమరిచాన్వితైః ।
రసైస్సమ్భోజయేన్నాగం వేపథుర్యస్య జాయతే ॥12॥

కంపనం అనేరోగం కలిగిన ఏనుగుకు నెమలి, తీతువు, పూరేడు(లావ)పిట్టలమాంసాన్ని, పిప్పలి, మిరియాలతో రసం తయారుచేసి తినిపించాలి.

బాలబిల్వం తథా లోధ్రం ధాతకీ సితయా సహ ।
అతిసారవినాశాయ పిణ్డీం భుఞ్జీత కుఞ్జరః ॥13॥

అతిసారవ్యాధి వచ్చిన ఏనుగుకు లేత మారేడుదళాలు, లొద్దుగ, ఏఱుజాజి(ధాతకి), వీటిని చక్కెరతో కలిపి చేసినపిండిని తినిపించాలి.

నస్యం కరగ్రహే దేయం ఘృతం లవణసంయుతమ్ ॥14॥

తొండం పట్టుకుపోవడం అనే రోగం వచ్చినపుడు ఏనుగుకు నెయ్యిని లవణంతో కలిపి నస్యంగా ఇవ్వాలి.

మాగధీ నాగరాజాజీ యవాగూర్ముస్తసాధితాః ।
ఉత్కర్ణకే తు దాతవ్యా వారాహం చ తథా రసమ్ ॥15॥

ఏనుగుకు చెవులు బిగుసుకుపోయి నిక్కబొడుచుకునిపోవడం అనే రోగం వచ్చినపుడు పిప్పలి, శొంఠి (నాగరం), జీలకఱ్ఱ (అజాజి), వీటిని గంజి(యవాగువు) తుంగముస్తెలతో సాధనచేసి ఇవ్వాలి. పెండలందుంప నుండి తీసిన(వారాహం) రసం కూడా ఇవ్వవచ్చు.

దశమూలకులుత్థామ్లకాకమాచీవిపాచితమ్ ।
తైలం శృఙ్ఖలసంయుక్తం గలగ్రహగదాపహమ్ ॥16॥

దశమూలం అనే(పల్లేరు, ముయ్యాకుపొన్న, ములక, వాకుడు, మారేడు, తక్కిలి, గుమ్ముడు, దుండిగం, కలిగొట్టు, వెల్లి అనే పదింటిమూలాలతో తయారుచేసిన)ఔషధం, ఉలవలు, ఉసిరిక, కాకమాచి అనేపేరు కలిగిన ఔషధం వీటిని కలిపి వండినతైలంలో శృంఖలంతో కలిపి ఇస్తే ఏనుగుకు గొంతు(మెడ)పట్టుకుపోవడం అనే రోగం తగ్గిపోతుంది.

అష్టభిర్లవణైః పిష్టైః ప్రసన్నాః పాయయే ద్ధ్రువమ్ ।
మూత్రభఙ్గేఽథవా బీజం కథితం త్రపుషస్య చ ॥17॥

మూత్రభంగం (మూత్రం విడిచేటపుడు నొప్పి, మూత్రం సరిగా రాకపోవడం) అనే రోగం వచ్చినపుడు ఎనిమిది విధాలయిన లవణాల పిండితో చేసిన కల్లును తాగించాలి. లేదా తగరపు గింజలతో చేసిన కషాయాన్ని ఇవ్వాలి.

త్వగ్దోషేషు పిబేన్నిమ్బం వృషం వా క్వథితం ద్విపః ।
గవాం మూత్రం విడఙ్గాని కృమికోష్ఠేషు శస్యతే ॥18॥

చర్మరోగాలు కలిగినపుడు ఏనుగుకు వేపరసాన్ని తాగించాలి. లేదా ఋషభం అనేమూలికతో చేసిన కషాయం ఇవ్వాలి. కడుపులో పురుగులను తొలగించడానికి గోమూత్రం, వాయువిడంగం ఇవ్వాలి.

శృఙ్గవేరకణాద్రాక్షాశర్కరాభి శ్శృతం పయః ।
క్షతక్షయకరం పానం తథా మాంసరసశ్శుభః ॥19॥

గుల్మానికి శొంఠి, జీలకఱ్ఱ (కణ), ద్రాక్ష, చక్కెర వీటిని నీళ్లలో కలిపి కాగబెట్టి తాగిస్తే గాయాలు మానిపోతాయి. అలాగే మాంసరసం కూడ మంచిది.

ముద్గౌదనం వ్యోషయుత మరుచౌ తు ప్రశస్యతే ॥20॥

ఏనుగుకు నోరు అరుచిగా ఉన్నపుడు (ఆహారం సరిగా తీసుకోనపుడు) పెసలు కలిపి వండిన అన్నంలో త్రికటుకాలు కలిపి తినిపించాలి.

త్రివృద్వ్యోషాగ్నిదన్త్యర్కశ్యామాక్షీరేభపిప్పలీ ।
ఏతైర్గుల్మహర స్స్నేహః కృతశ్చైవ తథా పరః ॥21॥

తెగడ (త్రివృత్తు), త్రికటుకం, చిత్రమూలం (అగ్ని), నేపాళవృక్షం (దంతి), పసుపు (శ్యామ), రావి(శ్యామ), గజపిప్పలి వీటితో సిద్ధం చేసిన తైలం గుల్మ (గుండెలో ఎడమవైపు మాంసం పెరగడం మొ.) రోగాలను పోగొడుతుంది.

భేదనద్రావణాభ్యఙ్గస్నేహపానానువాసనైః ।
సర్వానేవ సముత్పన్నాన్ విద్రధీన్సముపాహరేత్ ॥22॥

విరేచనాలు కలిగించడం, కరిగించడం, తలంటు, నెయ్యి లేదా నూనె తాగించడం, వస్తికర్మలు చేయడం అనే విధానాల ద్వారా వైద్యుడు కడుపులో పుండు ఏర్పడడం మొదలైన ఉదర సంబంధిత వ్యాధులను తొలగించాలి.

యష్టికం ముద్గసూపేన శారదేన తథా పిబేత్ ।
బాలబిల్వైస్తథా లేపః కటరోగేషు శస్యతే ॥23॥

మొలలయందు కలిగే జబ్బులకు పెసరపప్పుతోనూ, అలాగే పొగడతోనూ అతిమధురం కలిపి త్రాగించాలి. దానితో పాటు అక్కడ లేతమారేడుదళాలు నూరి పూయాలి.

విడఙ్గేన్ద్రయవౌ హిఙ్గుసరలం రజనీద్వయమ్ ।
పూర్వాహ్నే దాపయేత్ పిణ్డాన్ సర్వశూలోపశాన్తయే ॥24॥

అన్ని రకాలయిన నొప్పులకూ రోజూ ఉదయం వేళలలో వాయువిడంగం, కొండమల్లెవిత్తులు (ఇంద్రయవలు), ఇంగువ, దేవదారు, రెండురకాలయిన పసుపు, కలిపి ఉండలుగా చేసి, తినిపించాలి.

ప్రధానభోజనే తేషాం షష్టికవ్రీహిశాలయః ।
మధ్యమౌ యవగోధూమౌ శేషా దన్తిని చాధమాః ॥25॥

ఏనుగులకు భోజనంలో షష్టికలు, వడ్లు, శాలి అనే ఉత్తమమైన వరిధాన్యవిశేషం ప్రధానమైనవి. యవలు, గోధుమలు అనేవి మధ్యమాలు. మిగిలినవి అన్నీ అధమ మైనవి.

యవశ్చైవ తథైవేక్షుర్నాగానాం బలవర్ధనః ।
నాగానాం యవసంశుష్కం తథా ధాతుప్రకోపనమ్ ॥26॥

యవధాన్యం, చెరకు ఇవి రెండూ ఏనుగులకు బలాన్ని బాగా పెంచుతాయి. ఎండిన యవలు ఏనుగులకు ధాతువులను ప్రకోపింపజేస్తాయి.

మదక్షీణస్య నాగస్య పయఃపానం ప్రశస్యతే ।
దీపనీయైస్తథా ద్రవ్యైశ్శృతో మాంసరసశ్శుభః ॥27॥

మదం తగ్గిన ఏనుగుకు పాలు తాగించడం చాల మంచిది. జఠరాగ్నిని పెంచే వస్తువులు, వండిన మాంసరసం వీటివలన ఏనుగులకు మంచిబలంతో మేలు జరుగుతుంది.

వాయసః కుక్కురశ్చోభౌ కాకోలూకకులం హరిః ।
భవేత్ క్షౌద్రేణ సంయుక్తః పిణ్డో యుద్ధే మహాపది ॥28॥

కాకి, కుక్క, రెండూ, అలాగే కాకులు, గుడ్లగూబలగుంపు, కోతి, వీటిమాంసాన్ని తేనెతో కలిపి, ముద్దలుగా చేసి, యుద్ధంలోనూ, పెద్దపెద్ద ఆపదలు వచ్చినపుడు ఇస్తే, ఉద్రేకంవలన కలిగే రోగాలు తొలగిపోతాయి.

కటుమత్స్యవిడఙ్గాని క్షారః కోషాతకీపయః,
హరిద్రా చేతి ధూపోఽయం కుఞ్జరస్య జయావహః ॥29॥

వెల్లుల్లి, చేప, వాయువిడంగం, బెల్లం, పొట్ల, పాలు, పసుపు ఈ వస్తువులతో ఏనుగులకు ధూపం వేస్తే విజయం కలుగుతుంది.

పిప్పలీస్తణులాస్తైలం మాధ్వీకం మాక్షికం తథా ।
నేత్రయోః పరిషేకోఽయం దీపనీయః ప్రశస్యతే ॥ 30॥

పిప్పలి, బియ్యం, నువ్వులనూనె, నారికేళ విశేషం, తేనె వీటిని కంట్లో వేసి తడిపితే ఏనుగులకు చూపు చక్కగా స్పష్టంగా ఏర్పడుతుంది.

పురీషం చటకాయాశ్చ తథా పారావతస్య చ ।
క్షీరవృక్షః కరీషశ్చ ప్రసన్నాచేష్ట మఞ్జనమ్ ॥
అనేనాఞ్జితనేత్రస్తు కరోతి కదనం రణే ॥31॥

ఆడుపిచ్చుక, పావురాలరెట్టలు, మఱ్ఱిరసం, పేడ – వీటితో శుద్ధంగా తయారుచేసిన కాటుక ఏనుగులకు ఇష్టమైనది. ఈ కాటుకను ఏనుగుకళ్లకు పెడితే అది యుద్ధంలో శత్రువులను సంహరిస్తుంది.

ఉత్పలాని చ నీలాని ముస్తం తగరమేవ చ ।
తణ్డులోదకపిష్టాని నేత్రనిర్వాపణం పరమ్ ॥32॥

నల్లనికలువలు, తుంగముస్త, తగరం వీటిని బియ్యం కడిగిన నీళ్ళలో వేసి నూరి పిండిగా చేసి, దానిని ఏనుగుకన్నులకు పెట్టడం చాల మంచిది.

నఖవృద్ధౌ నఖచ్ఛేదస్తైలసేకశ్చ మాస్యపి ।
శయ్యాస్థానం భవేచ్చాస్య కరీషైః పాంసుభిస్తథా ॥
శరన్నిదాఘయోస్సేకస్సర్పిషాచ తథేష్యతే ॥33॥

ఏనుగులకు గోళ్లు పెరిగినపుడు వెంటనే కత్తిరించివేయాలి. నెలకు ఒకసారి నూనెతో నలుగుపెట్టి స్నానం చేయించాలి. ఏనుగులు నిద్రించడానికి, పేడ బాగా ఎండి, పొడిగా ఏర్పడిన ప్రదేశం కావాలి. శరదృతువులోనూ, గ్రీష్మఋతువులోనూ ఏనుగులను నేతితో తడపడం మంచిది.

ఇత్యాది మహాపురాణే ఆగ్నేయే గజచికిత్సాకథనం నామ సప్తాశీత్యధికద్విశతతమోఽధ్యాయః ॥287॥

అగ్నిమహాపురాణంలో గజచికిత్సాకథనం అనే రెండువందల ఎనబైఏడవ అధ్యాయం సమాప్తం.

అష్టాశీత్యధికద్విశతతమోऽధ్యాయః - రెండువందల ఎనభైఎనిమిదవ అధ్యాయం

అశ్వవాహనసారవర్ణనమ్ - అశ్వవాహనసారవర్ణనం

ధన్వన్తరి రువాచ - సుశ్రుతుడితో ధన్వంతరి ఇలా చెప్తున్నాడు

అశ్వవాహనసారం చ వక్ష్యే చాశ్వచికిత్సనమ్ ।
వాజినాం సఙ్గ్రహః కార్యో ధర్మకర్మార్థసిద్ధయే ॥1॥

సుశ్రుతా! అశ్వవాహనసారాన్ని, గుఱ్ఱాల రోగాలకు చికిత్సను చెప్తాను. ధర్మం, అర్థం, కామం అనేమూడు పురుషార్థాలు సిద్ధించడంకోసం గుఱ్ఱాలను సేకరించాలి.

అశ్వినీ శ్రవణం హస్తముత్తరాత్రితయం తథా ।
నక్షత్రాణి ప్రశస్తాని హయానామాదివాహనే ॥2॥

మొట్టమొదటిసారిగా గుఱ్ఱం ఎక్కడానికి అశ్విని, శ్రవణం, హస్త, ఉత్తరఫల్గుని, ఉత్తరాషాఢ, ఉత్తరాభాద్ర, అనే నక్షత్రాలు శ్రేష్ఠమైనవి.

హేమన్తశ్శిశిరశ్చైవ వసన్తశ్చాశ్వవాహనే ।
గ్రీష్మేశరదివర్షాసు నిషిద్ధం వాహనం హయే ॥3॥

మొదటిసారి గుఱ్ఱం ఎక్కడానికి హేమంతం, శిశిరం, వసంతం అనే ఋతువులు మంచివి. గ్రీష్మం, శరత్తు, వర్షఋతువులలో కూడదు.

తీవ్రైర్నచపలైర్దణ్డైరదేశే న చ తాడయేత్ ॥4॥

గుఱ్ఱాలను మిక్కిలి కఠిన మైనవీ, లేదా సన్నగా ఉండి వేగంగా కదిలేవీ అయిన దండాలతో కొట్టగూడదు. అలాగే ముఖంవంటి కొట్టగూడని ప్రదేశాలలో కొట్టగూడదు.

కీలాస్థిసఙ్కులే చైవ విషమే కణ్టకాన్వితే ।
వాలుకాపఙ్కసఞ్ఛన్నే గర్తాగర్తప్రదూషితే ॥5॥

కీళ్లు, ఎముకలతో నిండిఉన్నదీ, ఎగుడు దిగుడుగా ఉండేదీ, ముళ్లతో కూడినదీ, ఇసకతోనూ, బురదతోనూ దారి కనబడకుండా పోయినదీ, గుంటలతోనూ, మిట్టలతోనూ కూడినదీ అయిన దారిలో గుఱ్ఱాన్ని నడిపించగూడదు.

అచిత్తజ్ఞో వినోపాయైర్వాహనం కురుతే తు యః ।
స వాహ్యతే హయేనైవ పృష్ఠస్థః కటికాం వినా ॥6॥

గుఱ్ఱం మనసు తెలుసుకోకుండా, గుఱ్ఱాన్ని నడిపించే మెలకువలు తెలియకుండా, గుఱ్ఱంమీద జీను లేకుండా, గుఱ్ఱం ఎక్కి నడిపేవాడు, గుఱ్ఱానికే తాను వాహనం అయిపోతాడు. (పైవాడిని కింద పడేసి, వాడిమీదకు గుఱ్ఱం ఎక్కుతుంది.)

ఛన్దం విజ్ఞాపయేత్ కోఽపి సుకృతీ ధీమతాం వరః ।
అభ్యాసాదభియోగాచ్చ వినా శాస్త్రం స్వవాహకః ॥7॥

అశ్వశాస్త్రం తెలియకుండా, ఎవడో గొప్ప బుద్ధిమంతుడు, పుణ్యాత్ముడు మాత్రమే అభ్యాసం వలననూ, నిశ్చయించగల్గిన తెలివిచేతనూ తన అభిప్రాయాన్ని గుఱ్ఱానికి అర్థమయ్యేవిధంగా తెలియజేయగలుగుతాడు.

స్నాతస్య ప్రాఙ్ముఖస్యాథ దేవాన్వపుషి యోజయేత్ ।
ప్రణవాదినమోఽన్తేన స్వబీజేన యథాక్రమమ్ ॥8॥

గుఱ్ఱానికి స్నానం చేయించి, తూర్పుముఖంగా నిలబెట్టి, మొదట 'ఓం'కారం, చివర 'నమః' అనేపదాలు కలిగిన ఆయా దేవతలకు సంబంధించిన బీజాక్షరంతో కూడినమంత్రంతో ఆ గుఱ్ఱం శరీరంలో ఆయా అవయవాలలో క్రమంగా ఆయా దేవతలను ఆహ్వానించి నిలపాలి.

బ్రహ్మా చిత్తే బలే విష్ణుర్వైనతేయః పరాక్రమే ।
పార్శ్వే రుద్రా గురుర్బుద్ధౌ విశ్వేదేవాశ్చ మర్మసు ॥9॥

ఆ గుఱ్ఱం చిత్తంలో బ్రహ్మనూ, బలంలో విష్ణువునూ, పరాక్రమంలో గరుత్మంతుడినీ, ప్రక్కలలో రుద్రులనూ, బుద్ధియందు బృహస్పతినీ, మర్మావయవంలో విశ్వేదేవతలను న్యాసం చేయాలి.

దృగావర్తే దృశీన్ద్వర్కౌ కర్ణయోరశ్వినౌ తథా ।
జఠరేఽగ్నిస్స్వధా స్వేదే వాగ్జిహ్వాయాం జవేఽనిలః ॥10॥

ఆ గుఱ్ఱం శరీరంలో – కనుగ్రుడ్డులో చూపులో (నల్లగ్రుడ్లలో) చంద్రుడినీ, సూర్యుడినీ, చెవులలో అశ్వినీదేవతలనూ, కడుపులో అగ్నినీ, చెమటలో స్వధాదేవినీ, నాలుకపై వాగ్దేవినీ, వేగంలో వాయుదేవుడినీ నిలపాలి.

పృష్ఠతో నాకపృష్ఠస్తు ఖురాగ్రే సర్వపర్వతాః ।
తారాశ్చ రోమకూపేషు హృది చాన్ద్రమసీ కలా ॥11॥

వెనుకభాగంలో నాకపృష్ఠదేవతనూ, (గిట్టల చివరలలో సమస్తమైన పర్వతాలనూ, రోమకూపాలలో నక్షత్రాలనూ, హృదయంలో చంద్రకళనూ నిలపాలి.

తేజస్యగ్నీ రతిశ్శ్రోణ్యాం లలాటే చ జగత్పతిః ।
గ్రహాశ్చ హేషితే చైవ తథైవోరసి వాసుకిః ॥12॥

తేజస్సులో అగ్నినీ, పిరుదులలో రతీదేవిని, నుదుట జగత్పతినీ, సకిలింపులో గ్రహాలనూ, వక్షఃస్థలంలో వాసుకినీ నిలపాలి.,

ఉపోషితోఽర్చయేత్ సాదీ హయం దక్షశ్రుతౌ జపేత్ ॥13॥

ఆ గుఱ్ఱాన్ని నడిపే యోధుడు(సాది) ముందుగా ఉపవాసం ఉండి, గుఱ్ఱాన్ని పూజించి, ఆ గుఱ్ఱం కుడిచెవిలో ఈ క్రిందిమంత్రాన్ని జపించాలి.

హయ గన్ధర్వరాజస్త్వం శృణుష్వ వచనం మమ ।
గన్ధర్వకులజాతస్త్వం మా భూస్త్వం కులదూషకః ॥14॥

ఓ గుఱ్ఱమా! నీవు గంధర్వరాజువి. నామాట విను.) గంధర్వకులంలో పుట్టిన నీవు ఆ వంశానికి అపకీర్తి తెచ్చేవాడివి కావద్దు.

ద్విజానాం సత్యవాక్యేన సోమస్య గరుడస్య చ ।
రుద్రస్య వరుణస్యైవ పవనస్య బలేన చ ॥
హుతాశనస్య దీప్త్యా చ స్మరజాతిం తురఙ్గమ ॥15॥

బ్రాహ్మణుల సత్యవాక్యం ప్రభావంతోనూ, చంద్రుడు, గరుడుడు, రుద్రుడు, వరుణుడు, వాయువు, ఈ దేవతల బలంతోనూ, అగ్నిదేవుడికాంతితోనూ కూడిన గుఱ్ఱమా! నీజాతిని గుర్తుచేసుకో.

స్మర రాజేన్ద్రపుత్రస్త్వం సత్యవాక్యమనుస్మర ।
స్మర త్వం వారుణీం కన్యాం స్మర త్వం కౌస్తుభం మణిమ్ ॥16॥

నీవు మహారాజపుత్రుడివని గుర్తుచేసుకో. నీమాట నిలకడను జ్ఞాపకం చేసుకో. సముద్రమథనంలో (నీతో పాటు పుట్టిన) వారుణికన్యను స్మరించు. కౌస్తుభం అనే మణిని గుర్తుచేసుకో.

క్షీరోదసాగరే చైవ మథ్యమానే సురాసురైః ।
తత్ర దేవకులే జాతస్స్వవాక్యం పరిపాలయ ॥17॥

దేవతలూ రాక్షసులూ పాలసముద్రాన్ని చిలికినపుడు అందులోనుండి పుట్టిన దేవతలజాతిలో నీవు పుట్టావు. నీ మాట నిలబెట్టుకో.

కులే జాతస్త్వమశ్వానాం మిత్రం మే భవ శాశ్వతమ్ ।
శృణు మిత్ర త్వమేతచ్చ సిద్ధో మే భవ వాహన ॥
విజయం రక్ష మాం చైవ సమరే సిద్ధిమావహ ॥18॥

ఉత్తమమైన అశ్వజాతిలో పుట్టినవాడివి. శాశ్వతంగా నాకు మిత్రుడివికా. మిత్రమా! తురంగమా! నాకు సిద్ధిని కలిగించు. అన్ని కార్యాలలోనూ విజయం కలిగించు. నన్ను రక్షించు. యుద్ధరంగంలో నన్ను కృతార్థుడిని చెయ్యి.

తవ పృష్ఠం సమారుహ్య హతా దైత్యాస్సురైః పురా ।
అధునా త్వాం సమారుహ్య జేష్యామి రిపువాహినీమ్ ॥19॥

పూర్వం దేవతలు నీ వీపుమీద ఎక్కి యుద్ధంచేసి, రాక్షసులను సంహరించారు. ఇపుడు నేను నీమీద ఎక్కి, శత్రుసైన్యాన్ని జయిస్తాను.

కర్ణజాపం తతః కృత్వా విముహ్యా చ తథాఽప్యరీన్ ।
పర్యానయేద్ధయం సాదీ వాహయేద్యుద్ధగో జయమ్ ॥20॥

ఈ విధంగా గుఱ్ఱం చెవిలో ఈ మంత్రాన్ని జపించాలి. ఇలా చేయడం ద్వారా శత్రువులను మోహంలో పడేయాలి. అపుడు ఆశ్వికుడైన యోధుడు గుఱ్ఱాన్ని తీసుకునివచ్చి, దానిపైకి ఎక్కి యుద్ధానికి వెళ్లాలి. అలా చేయడం ద్వారా యుద్ధంలో విజయం తప్పకుండా చేకూరుతుంది.

సఞ్జాతాస్స్వశరీరేణ దోషాః ప్రాయేణ వాజినామ్ ।
హన్యన్తేఽతిప్రయత్నేన గుణాస్సాదివరైః పునః ॥21॥

ఉత్తములైన ఆశ్వికయోధులు గుఱ్ఱాలకు శరీరంలో ఏర్పడిన దోషాలను (రోగాదులను) తరచుగా మిక్కిలిగా ప్రయత్నం చేసి తొలగిస్తాడు.

సహజా ఇవ దృశ్యన్తే గుణాస్సాదివరోద్భవాః ।
నాశయన్తి గుణానన్యే సాదినస్సహజానపి ॥22॥

సమర్థుడైన ఆశ్వికుడు గుఱ్ఱానికి నేర్పి కలుగజేసిన లక్షణాలు గుఱ్ఱానికి సహజంగా ఉన్నట్లు కనబడతాయి. అసమర్థులైన వారివలన గుఱ్ఱానికి సహజంగా ఉన్న గుణాలు కూడా నశించిపోతాయి.

గుణానేకో విజానాతి వేత్తి దోషాంస్తథాఽపరః ।
ధన్యో ధీమాన్ హయం వేత్తి నోభయం వేత్తి మన్దధీః ॥23॥

ఒకడు అశ్వానికి సంబంధించిన ఉత్తమగుణాలను చక్కగా తెలుసుకుని ఉంటాడు. మరొకడు అశ్వానికి సంబంధించిన దోషాలను తెలుసుకుని ఉంటాడు. అశ్వానికి సంబంధించిన గుణదోషాలు అన్నీ తెలిసినవాడు ధన్యుడు. బుద్ధిహీనుడికి ఇవి రెండూ తెలియవు.

అకర్మజ్ఞోఽనుపాయజ్ఞో వేగాసక్తోఽతికోపనః ।
ఘనదణ్డరతిచ్ఛిద్రే యశ్శస్తోఽపి న శస్యతే ॥24॥

ఆశ్వికుడు గొప్పవాడే అయినా, అశ్వానికి సంబంధించిన పనులు తెలియనివాడు, నడిపించే ఉపాయాలు తెలియనివాడు, మిక్కిలివేగంగా నడపడంపై ఆసక్తి కలిగినవాడు, అధికమైనకోపం కలిగినవాడు, చిన్నతప్పుకు కూడా గుఱ్ఱాన్ని కఠినంగా శిక్షించేవాడు అయితే ఉత్తముడు కాడు.

ఉపాయజ్ఞోఽథ చిత్తజ్ఞో విశుద్ధో దోషనాశనః ।
గుణార్జనపరో నిత్యం సర్వకర్మవిశారదః ॥25॥

గుఱ్ఱాన్ని నడిపించడంలో మెలకువలు తెలిసినవాడు, గుఱ్ఱం మనస్సు తెలిసినవాడు, స్వచ్ఛమైన నడవడి కలిగినవాడు, దోషాలను తొలగించేవాడు, మంచిగుణాలను సంపాదింపగలిగినవాడు, అయిన ఆశ్వికుడు అశ్వకర్మలన్నింటినీ నేర్పుతో చేయగలుగుతాడు.

ప్రగ్రహేణ గృహీత్వాథ ప్రవిష్టో వాహభూతలమ్ ।
సవ్యాపసవ్యభేదేన వాహనీయస్సుసాదినా ॥26॥

సమర్థుడయిన ఆశ్వికుడు గుఱ్ఱాన్ని కళ్లేలతో పట్టుకుని, గుఱ్ఱం ఎక్కడానికి తగిన ప్రదేశానికి తీసుకుని వచ్చి, దానిని కుడి వైపు, ఎడమవైపు అటూ ఇటూ నడిపించాలి.

ఆరుహ్యా సహసానైవ తాడనీయో హయోత్తమః ।
తాడనాద్భయమాప్నోతి భయాన్మోహశ్చ జాయతే ॥27॥

ఉత్తమమైన గుఱ్ఱాన్ని ఎక్కినవెంటనే కొట్టగూడదు. కొడితే గుఱ్ఱానికి భయం కలుగుతుంది. భయంవలన అజ్ఞానం కలుగుతుంది.

ప్రాతస్సాదీ ప్లుతేనైవ వల్గాముద్ధృత్య చాలయేత్ ।
మన్దం మన్దం వినా నాలం ధృతవల్గో దినాన్తరే ॥28॥

అశ్వాన్ని అధిరోహించే యోధుడు ఉదయమే కళ్ళెం పట్టుకుని గుఱ్ఱాన్ని లేవదీసి, చురుకుగా నడిపించాలి. సాయం సమయంలో కళ్లెం పట్టుకుని, డెక్కలకు నాళం లేకుండా మెల్లమెల్లగా నడిపించాలి.

ప్రోక్తమాశ్వాసనం సామభేదోఽశ్వేన నియోజ్యతే ।
కశాదితాడనం దణ్డో దానం కాలసహిష్ణుతా ॥
పూర్వపూర్వవిశుద్ధౌ తు విదధ్యాదుత్తరోత్తరమ్ ॥29॥

ఈ విధానం గుఱ్ఱానికి ఆశ్వాసనం కలిగిస్తుంది. ఇది సామనీతి. ఒక గుఱ్ఱాన్ని మరొకగుఱ్ఱంతో కలిపి ఉంచడం భేదనీతి. కొరడా మొదలైనవాటితో కొట్టడం దండనీతి. తగినకాలం వరకు ఓరిమితో ఉండడం దాననీతి. ఈ నాలుగింటిలోనూ ముందరి ఉపాయం వ్యర్థమైనపుడు దానికి తరువాతి ఉపాయాన్ని అనుసరించాలి.

జిహ్వాతలే వినా యోగం విదధ్యాద్వాహనే హయే ।
గుణోత్తరశతాం వల్గాం సృక్కణ్యా సహ గాహయేత్ ॥30॥

వాహనం అయిన గుఱ్ఱాన్ని నాలుకకు తగలకుండా కళ్లెం కట్టాలి. కళ్లెం పురిపెట్టిన నూరు పేటల నూలుతాడుతో సిద్ధం చేయాలి. దానిని గుఱ్ఱానికి పెదవుల చివరలు కలుపుతూ కట్టాలి.

విస్మార్య వాహనం కుర్యాచ్ఛిథిలానాం శనైశ్శనైః ॥31॥

గుఱ్ఱం ఆ కట్టును మరిచేటట్లు చేసి, మరిచిన పిదప మెల్లమెల్లగా శిథిలం చేయాలి.

హయజిహ్వాఙ్గమాహీనే జిహ్వాగ్రన్థిం విమోచయేత్ ।
గాఢతాం మోచయేత్తావద్ యావత్ స్తోభం న ముఞ్చతి ॥32॥

ఆ గుఱ్ఱం నాలుక పూర్తిగా హీనస్థితికి వచ్చినపుడు జిహ్వాగ్రంథిని విప్పివేయాలి. అడ్డగించడాన్ని గుఱ్ఱం విడిచిపెట్టకుండా ఉన్నంతమేరకు జిహ్వాగ్రంథిని కొంచెం సడలించాలి.

కుర్యాచ్ఛతమురస్త్రాణ మవిలాలం చ ముఞ్చతి ।
ఊర్ధ్వాననస్స్వభావాద్య స్తస్యోరస్త్రాణమశ్లథమ్ ॥33॥

గుఱ్ఱం సహజంగా నోరు పైకి ఎత్తి ఉంచుతుంది. కాబట్టి గుండెలపైన కట్టే కవచం వదులైపోకుండా, నోటినుండి చొంగపడేంతవరకు ఉరస్త్రాణం (గుండెలపైన కవచం) బిగించికట్టాలి.

విధాయ వాహయేద్దృష్ట్వా లీలయా సాదిసత్తమః ॥34॥

ఈ విధంగా కళ్లెం, కవచం సరియైన పద్ధతిలో ఏర్పాటుచేసిన ఉత్తమ ఆశ్వికుడు చూపులతోనే అవలీలగా గుఱ్ఱాన్ని నడపగలుగుతాడు.

తస్య సవ్యేన పూర్వేణ సంయుక్తం సవ్యవల్గయా ।
యః కుర్యాత్పశ్చిమం పాదం గృహీతస్తేన దక్షిణః ॥35॥

ఆశ్వికుడైన యోధుడు గుఱ్ఱానికి ముందరి కుడికాలిని కుడివైపుకళ్లెంతో కలపాలి. దానివలన గుఱ్ఱం ఎడమపాదం అతడి అధీనంలో ఉంటుంది. అదే విధంగా వెనక ఉన్న కుడిపాదాన్ని కలిపితే ఆ కుడిపాదం అతడి అధీనంలోకి వస్తుంది.

క్రమేణానేన యో సేవాం కురుతే వామవల్గయా ।
పాదౌ తేనాపి పాదస్స్యాద్ గృహీతో వామ ఏవ హి ॥36॥

ఇదే విధంగా ఎడమవైపుకళ్లెంతో ముందుగా ఎడమవైపున్న ముందరికాలినీ, తరువాత వెనక ఉన్న ఎడమకాలినీ కళ్లెంతో కలపడం వలన ఎడమవైపు రెండుపాదాలూ అతడి అధీనంలో ఉంటాయి.

అగ్రే చేచ్చరణే త్యక్తే జాయతే సుదృఢాసనమ్ ॥37॥

ఇపుడు ముందరిపాదాలను సడలు విడిస్తే ఆసనం బాగా దృఢంగా ఉంటుంది.

యౌ హృతౌ దుష్కరే చైవ మోటకే నాటకాయనమ్ ।
సవ్యహీనం ఖలీకారో హననే గుణనే తథా ॥38॥

దుష్కరమైన మోటనం (41 శ్లో) అనే కర్మలో పాదాలు దెబ్బతిని, కుడికాలు పని చేయనిస్థితికి వస్తే దానిని (1) నాటకాయనం అంటారు. గుఱ్ఱం చంపడంలోనూ, రెట్టించి తెగబడడంలోనూ శత్రువులకు అపకారం జరుగుతుంది.

స్వభావం హి తురఙ్గస్య ముఖవ్యావర్తనం పునః ।
న చైవేత్థం తురఙ్గాణాం పాదగ్రహణహేతవః ॥39॥

గుఱ్ఱానికి ముఖం అడ్డదిడ్డంగా కదిలించడం సహజలక్షణం. గుఱ్ఱంపాదాలను అదుపుచేయడంలో ఇవి కారణాలు కావు.

విశ్వస్తం హయమాలోక్య గాఢమాపీడ్య చాసనమ్ ।
రోకయిత్వా ముఖే పాదం గ్రాహ్యతో లోకనం హితమ్ ॥40॥

గుఱ్ఱానికి తనపై పూర్తిగా నమ్మకం ఏర్పడిన తరువాత దానిపై కెక్కి, ఆసనాన్ని గట్టిగా నొక్కిపట్టి, గుఱ్ఱం ముఖంలో పాదాన్ని నొక్కితే అది స్వాధీనం అవుతుంది. గుఱ్ఱాన్ని అదుపులో ఉంచుకోవడం మేలైనది. దీనిని (2) లోకనం అంటారు.

గాఢమాపీడ్య రాగాభ్యాం వల్గామాకృష్య గృహ్యతే ।
తద్బన్ధనాద్యుగ్మపాదం తద్వద్వల్గనముచ్యతే ॥41॥

రాగాలతో కళ్లేన్ని గట్టిగా లాగి పట్టుకోవడంద్వారా, గుఱ్ఱం కాళ్లు రెండూ బంధించడం (3) వల్గనం అని చెప్పబడుతుంది.

సంయోజ్య వల్గయా పాదాన్ వల్గామామోక్ష్య వాఞ్ఛితమ్ ।
వాహ్య పార్ష్ణిప్రయోగాత్తు యత్ర తన్మోటనం మతమ్ ॥42॥

కళ్ళేన్ని పాదాలకు కలిపి, తరువాత కళ్ళేన్ని ఇష్టం వచ్చిన విధంగా విడిచిపెడుతూ (వదులు చేస్తూ), గుఱ్ఱంపై ఉండి, మడమలతో కొట్టడాన్ని (4) మోటనం అంటారు.

ప్రలయావిప్లవే జ్ఞాత్వా క్రమేణానేన బుద్ధిమాన్ ।
మోటనేన చతుర్థేన విధిరేష విధీయతే ॥43॥

బుద్ధిమంతుడు ఈవిధంగా నాల్గవది అయిన మోటనంతో క్రమంగా ప్రళయం, ఆ విప్లవం తెలుసుకుని ప్రవర్తించాలి. ఇది విధిగా చెప్పబడింది.

నాధత్తేఽధశ్చ యః పాదం యోఽశ్వో లఙ్ఘనమణ్డలే ।
మోటనోద్వక్కనాభ్యాం తు గ్రాహయేత్ పాదమీదృశమ్ ॥44॥

లంఘించేమండల ప్రదేశంలో మోటనం, ఉద్వక్కనం అనే విధానాలతో పాదం ఉంచని గుఱ్ఱానికి పాదాన్ని ఆవిధంగా ఉంచడాన్ని నేర్పాలి.

వణ్టయిత్వాసనే గాఢం మన్దమాదాయ యో వ్రజేత్ ।
గ్రాహ్యతే సఙ్గ్రహాద్యత్ర తత్సఙ్గ్రహణముచ్యతే ॥45॥

ఆసనంలో దృఢంగా నిలిపినా, మెల్లగా నడిచేగుఱ్ఱాన్ని సంగ్రహించి తగినవిధంగా నడవడాన్ని నేర్పడాన్ని (1) సంగ్రహణం అంటారు.

హత్వా పార్శ్వప్రహారేణ స్థానస్థో వ్యగ్రమానసమ్ ।
వల్గామాకృష్య పాదేన గ్రాహ్య కణ్టకపాయనమ్ ॥46॥

తగిన స్థానంలో ఉన్నప్పటికీ, బుద్ధి నిలకడ లేకుండా ఉన్నగుఱ్ఱాన్ని, రెండు ప్రక్కల దెబ్బకొట్టి, కళ్ళేన్ని బిగువుగా లాగి, గుఱ్ఱాన్ని నడిపించడాన్ని (2) కంటకపాయనం అంటారు.

ఉల్కేణాయోఽఙ్ఘిణానేన పార్ష్ణిపాదాం స్తురఙ్గమః ।
గృహ్యతే యత్ ఖలీకృత్య ఖలీకారస్సచేష్యతే ॥47॥

కళ్ళెంలోని ఇనపగొళ్ళేన్ని నోటితో నమిలే విధంగా చేస్తూ, కాలిదెబ్బలతో గుఱ్ఱాన్ని బాధించి నడిపించే విధానానికి (3) ఖలీకారం అని పేరు.

గతిత్రయేఽపి యః పాదమాదత్తేనైవ వాఞ్ఛితః ।
హత్వా తు యత్ర దణ్డేన గృహ్యతే గహనం హి తత్ ॥48॥

ఈ మూడువిధానాలలో దేనితో కూడ కోరుకున్నవిధంగా అడుగు కదపకపోతే ఆ గుఱ్ఱాన్ని దండంతో కొట్టి నడిపించాలి. దానిని (4) గహనం అంటారు.

ఖలీకృత్య చతుష్కేణ తురఙ్గో వల్గయాన్యయా ।
ఉచ్ఛ్వాస్య గ్రాహ్యతేఽన్యత్ర తత్స్యాదుచ్ఛ్వాసనం పునః ॥49॥

మరొక కళ్ళెంతో నాలుగుసార్లు లాగి, గుఱ్ఱాన్ని రొప్పు వచ్చేవిధంగా పీడించి నడిపిస్తే దానిని (5) ఉచ్ఛ్వాసనం అంటారు.

స్వభావం బహిరస్యన్తం తస్యాం దిశి తదాననమ్ ।
నియోజ్య గ్రాహయేత్తత్తు ముఖవ్యావర్తనం మతమ్ ॥50॥

ముఖం వెలుపలివైపుకు తిప్పటం గుఱ్ఱానికి స్వభావం. ముఖాన్ని ఆ వైపే ఉండేవిధంగా చేసి నడిపించడాన్ని (6) ముఖవ్యావర్తనం అంటారు.

గ్రాహయిత్వా తతః పాదం త్రివిధాసు యథాక్రమమ్ ।
సాధయేత్పఞ్చధారాసు క్రమశో మణ్డలాదిషు ॥51॥

గహనం మొదలైన మూడువిధానాలలోనూ క్రమంగా నడవడం నేర్పిన తరువాత మండలం మొదలైన పంచధారలలో నడవడం నేర్పాలి.

ఆజానూర్ధ్వాననం వాహం శిథిలం వాహయేత్సుధీః ।
అఙ్గేషు లాఘవం యావత్ తావత్తం వాహయేద్ధయమ్ ॥52॥

బుద్ధిమంతుడు ఎత్తినముఖం నుండి మోకాళ్లవరకు శిథిలమైనపుడు శరీరం మొత్తం తేలిక అయ్యేంతవరకు ఆ గుఱ్ఱం ఎక్కి దానిని పరుగులెత్తించాలి.

మృదుస్స్కన్ధే లఘుర్వక్త్రే శిథిలస్సర్వసన్ధిషు ।
యదా స సాదినో వశ్యస్సఙ్గృహ్ణీయాత్తదా హయమ్ ॥53॥

మెడ సుకుమారంగాను, ముఖం తేలికగానూ, సంధిస్థలాలు అన్నీ వదులుగానూ, ఉన్నపుడు గుఱ్ఱం వశమవుతుంది. అప్పుడు ఆశ్వికుడు ఆ గుఱ్ఱాన్ని వాహనంగా స్వీకరించాలి.

న త్యజేత్ పశ్చిమం పాదం యదా సాధు భవే త్తదా ।
త దాకృష్టిర్విధాతవ్యా పాణిభ్యామిహ వల్గయా ॥54॥

ఎంతవరకు ఉపయోగంగా ఉంటుందో అంతమేర వెనకవైపు పాదాన్ని విడువగూడదు. అలా ఉండేవిధంగా కళ్లేన్ని రెండుచేతులతోనూ లాగిపట్టుకోవాలి.

ఏకాఙ్ఘ్రికో యథా తిష్ఠేదుద్గ్రీవోఽశ్వస్సమాననః ।
ధరాయాం పశ్చిమౌ పాదావన్తరిక్షే యదాశ్రయౌ ॥
తదా సన్ధారణం కుర్యాద్గాఢవాహం చ ముష్టినా ॥55॥

నేలకు ఆనిఉన్న వెనకవైపు పాదాలు ముందరిపాదాలను ఆశ్రయించి, ఒకపాదంపై నిలిచినట్లుగా ఉండగా, మెడ పైకెత్తి, ముఖం సూటిగా పెట్టి, దృఢంగా నిలిచిఉన్న సమయంలో ఆ గుఱ్ఱాన్ని అపుడు పిడికిలితో అడ్డుపెట్టి నడిపించాలి.

సహసైవం సమాకృష్టో యస్తురఙ్గో న తిష్ఠతి ।
శరీరం విక్షిపన్తం చ సాధయేన్మణ్డలభ్రమైః ॥56॥

అలా వేగంగా లాగినపుడు గుఱ్ఱం స్థిరంగా ఉండక, శరీరాన్ని అటూ ఇటూ కదిలిస్తూ ఉంటే ఆ గుఱ్ఱాన్ని మండలాకారంలో పరుగెత్తించి, స్వాధీనం చేసుకోవాలి.

క్షిపేత్ స్కన్ధం చ యో వాహస్స చ స్థాప్యో హి వల్గయా ॥57॥

మెడను ఊపుతున్న గుఱ్ఱాన్ని కళ్ళెం లాగి స్థిరంగా ఉంచాలి.

గోమయం లవణం మూత్రం క్వథితం మృత్సమన్వితమ్ ।
అఙ్గలేపో మక్షికాదిదంశశ్రమవినాశనః ॥58॥

ఆవుపేడ, ఉప్పు, ఆవుమూత్రం, వీటిని కాచి కషాయం చేసి, దానిలో మట్టిని కలుపగా ఏర్పడిన పదార్థాన్ని గుఱ్ఱం శరీరం నిండా పూస్తే, ఈగలు, మొదలైనవి కరవడం వలన కలిగినబాధ నశిస్తుంది.

మధ్యే భద్రాదిజాతీనాం మణ్డో దేయో హి సాదినా ।
దంశనం సూక్ష్మకీటస్య నిరుత్సాహః క్షుధా హయః ॥59॥

ఆశ్వికుడు భద్రం మొదలైన జాతిగుఱ్ఱాలకు గంజి ఇవ్వాలి. దీనివలన వాటికి సూక్ష్మకీటకాలు కుట్టినబాధ, నిరుత్సాహం, ఆకలి అనేవి తొలగిపోతాయి.

యథా వశ్యస్తథా శిక్షా వినశ్యన్త్యతివాహితాః ।
అవాహితా న సిద్ధ్యన్తి తుఙ్గవక్త్రాంశ్చ వాహయేత్ ॥60॥

గుఱ్ఱం తనకు వశం కావడానికి ఎంత అవసరమో అంత శిక్షణ మాత్రమే ఇవ్వాలి. మితిమీరి నడిపిస్తే, గుఱ్ఱాలు నశించిపోతాయి. అసలు నడిపించకపోతే, పనికిరాకుండా పోతాయి. గుఱ్ఱాన్ని ముఖం పైకి ఎత్తేవిధంగా చేసి, అపుడు పై కెక్కి నడిపించాలి.

సమ్పీడ్య జానుయుగ్మేన స్థిరముష్టి స్తురఙ్గమమ్ ॥61॥

రెండు మోకాళ్లతోనూ గట్టిగా నొక్కిపట్టి, స్థిరమైన పిడికిలితో గుఱ్ఱాన్ని నడిపించాలి.

గోమూత్రాః కుటిలా వేణీ పద్మమణ్డలమాలికా ।
పఞ్చోలూఖలికాః కార్యా గర్వితాస్తే హి కీర్తితాః ॥ 62॥

గోమూత్రం, వంకరగా ఉన్న జుట్టు, తామరపూలమాల, పంచ ఉలూఖలికలు - ఈవిధంగా గుఱ్ఱాలను సిద్ధం చేయాలి. అప్పుడు అవి గర్వింపదగిన స్థితిలో ఉంటాయి అని చెప్తారు.

సంక్షిప్తం చైవ విక్షిప్తం కుఞ్చితం చ యథాచితమ్ ।
వల్గితావల్గితౌచైవ షోఢాచేత్థ ముదాహృతమ్ ॥63॥

1. సంక్షిప్తం, 2. విక్షిప్తం, 3. కుంచితం, 4. యథాచితం, 5. వల్గితం, 6. అవల్గితం అని అశ్వగమనం ఆరు విధాలుగా చెప్పబడింది.

వీథౌ ధనుశ్శతం యావ దశీతిర్నవతి స్తథా ।
భద్రస్సుసాధ్యో వాజీ స్యాన్మన్దో దణ్డైకమానసః ॥64॥

భద్రజాతికి చెందినగుఱ్ఱం మార్గంలో నూరువిండ్లదూరం నడిపిస్తే వశమవుతుంది. మందజాతి గుఱ్ఱం ఎనభైవిండ్లదూరం నడిపిస్తే వశమవుతుంది. దండైకమానసజాతిగుఱ్ఱం తొంభైవిండ్లదూరం నడిపిస్తే, వశ మవుతుంది.

మృగజఙ్ఘ్యో మృగో వాజీ సఙ్కీర్ణస్తత్సమన్వయాత్ ॥65॥

మృగజంఘ్యం అనే జాతిగుఱ్ఱం మృగలక్షణాలు, అశ్వలక్షణాలు కలిసినదై ఉంటుంది. ఇది ఎనభై నుండి నూరు వింఢ్లదూరం నడిపిస్తే వశమవుతుంది.

శర్కరామధులాజాదస్సుగన్ధోఽశ్వశ్శుచిర్ద్విజః ।
తేజస్వీ క్షత్రియశ్చాశ్వో వినీతో బుద్ధిమాం శ్చ యః ॥
శూద్రోఽశుచిశ్చలో మన్దో విరూపో విమతిః ఖలః ॥66॥

చక్కెర, తేనె, పేలాలు తినే గుఱ్ఱం బ్రాహ్మణజాతికి చెందినిది. ఇది పరిమళం కలిగి, పవిత్రమై ఉంటుంది. తేజస్సు కలిగినగుఱ్ఱం క్షత్రియజాతికి చెందినది. విశేషమైననీతి, మంచిబుద్ధి కలిగినది వైశ్యజాతికి చెందినగుఱ్ఱం. అపవిత్రంగానూ, చంచలంగానూ, మందబుద్ధిగానూ ఉన్నదీ, మంచిరూపం లేనిదీ, దుష్టబుద్ధి కలిగినదీ, నీచ మైనదీ అయినగుఱ్ఱం శూద్రజాతికి చెందినది.

వల్గయా ధార్యమాణోఽశ్వో లాలకం యశ్చ దర్శయేత్ ।
భారేషు యోజనీయోఽసౌ ప్రగ్రహగ్రహమోక్షణైః ॥67॥

కళ్ళెం వేసి పట్టుకోగానే నోటివెంట లాలాజలం కార్చే గుఱ్ఱాన్ని బరువులు మోయటం అనే పనిలో నియోగించాలి. ఆ సమయంలో గుఱ్ఱాన్ని నడిపించడానికి కళ్ళేన్ని గట్టిగా బిగించిపట్టుకోవడం, వదులుగా పట్టుకోవడం, విడిచిపెట్టడం అనే పద్ధతులను అనుసరించాలి.

అశ్వాదిలక్షణం వక్ష్యే శాలిహోత్రో యథాఽవదత్ ॥68॥

ఇక తరువాత గుఱ్ఱం మొదలైన వాటిలక్షణాన్ని పూర్వం శాలిహోత్రుడు చెప్పిన ప్రకారంగా చెప్తాను.

ఇత్యాది మహాపురాణే ఆగ్నేయే అశ్వవాహనసారవర్ణనం నామాష్టాశీత్యధికద్విశతతమోఽధ్యాయః॥288॥

అగ్నిమహాపురాణంలో అశ్వవాహనసారవర్ణనం అనే రెండువందల ఎనభైఎనిమిదవ అధ్యాయం సమాప్తం.



ఏకోననవత్యధికద్విశతతమోఽధ్యాయః - రెండువందల ఎనబైతొమ్మిదవ అధ్యాయం

అశ్వలక్షణచికిత్సాకథనమ్ - అశ్వలక్షణచికిత్సాకథనం

ధన్వన్తరి రువాచ - సుశ్రుతుడితో ధన్వంతరి ఇలా చెప్తున్నాడు

అశ్వానాం లక్షణం వక్ష్యే చికిత్సాం చైవ సుశ్రుత! ॥1॥

సుశ్రుతా! ఇక గుఱ్ఱాల లక్షణాలనూ, వాటికి వచ్చే రోగాలకు చికిత్సనూ చెప్తాను.

హీనదన్తో విదన్తశ్చ కరాలః కృష్ణతాలుకః ।
కృష్ణజిహ్వశ్చ యమజోఽజాతముష్కశ్చ యస్తథా ॥2॥

దంతాలు తక్కువగా ఉన్నది, దంతాలు అసలు లేనిది, ఎత్తయినదంతాలు కలిగినది, నల్లనిదౌడలు కలిగినది, నల్లనినాలుక కలిగినది, కవలపిల్లలుగా పుట్టినది, వృషణాలు లేనిది మరియు

ద్విశఫశ్చ తయా శృఙ్గీ త్రివర్ణో వ్యాఘ్రవర్ణకః ।
ఖరవర్ణో భస్మవర్ణో జాతవర్ణశ్చకాకుదీ ॥3॥

రెండు డెక్కలు కలిగినది, కొమ్ములు కలిగినది, మూడు రంగులు కలిగినది, పెద్దపులిరంగులో ఉన్నది, గాడిదరంగులో ఉన్నది, బూడిదరంగులో ఉన్నది, బాగా వ్యక్తమవుతున్నరంగు కలిగినది, మూపురం కలిగినది మరియు

శ్విత్రీ చ కాకసాదీ చ ఖరసారస్తథైవ చ ।
వానరాక్షః కృష్ణసటః కృష్ణగుహ్యస్తథైవ చ ॥4॥

బొల్లిమచ్చలు కలిగినది, కాకివంటి పుట్టుక కలిగినది, గాడిదవంటి శక్త్యుత్సాహాలు కలిగినది, కోతివంటి కన్నులు కలిగినది, నల్లనిజూలు కలిగినది, నల్లని గుహ్యావయవం కలిగినది మరియు

కృష్ణప్రోథశ్చ శూకశ్చ యశ్చ తిత్తిరిసన్నిభః ।
విషమశ్శ్వేతపాదశ్చ ధ్రువావర్తవివర్జితః ॥
అశుభావర్తసంయుక్తో వర్జనీయస్తురఙ్గమః ॥5॥

నల్లనిపిరుదులు కలిగినది, కఠినమైన (వెంట్రుకల)చివరలు కలిగినది, తీతువుపిట్టలాగా ఉన్నది, అవయవాలు సమంగా లేనిది, తెల్లనిపాదాలు కలిగినది, ఒంటిమీద స్పష్టంగా కనబడే సుడులు లేనిది, కీడు కలిగించే సుడులు కలిగినది - అయిన గుఱ్ఱాన్ని విడిచిపెట్టాలి.

రన్ధ్రోపరన్ధ్రయోర్ద్వౌ ద్వౌ ద్వౌ ద్వౌ మస్తకవక్షసోః ।
ప్రాయేణ చ లలాటే చ కణ్ఠావర్తాశ్శుభా దశ ॥6॥

వెనక ఉన్నకుడి, ఎడమకాళ్ల మూలానికి ప్రక్కకూ నడుమఉన్న ప్రదేశం (రంధ్రం, ఉపరంధ్రం)లో (కుడివైపు) రెండు (ఎడమవైపు) రెండు, తలపైన రెండు, గుండెలమీద రెండు, నుదుటికి దగ్గరలో ఒకటి, మెడమీద ఒకటి చొప్పున గుఱ్ఱానికి పదిసుడులు ఉండడం శుభప్రదం.

సృక్కణ్యాం చ లలాటే చ కర్ణమూలే నిగాలకే ।
బాహుమూలే గలే శ్రేష్ఠా ఆవర్తాస్త్వశుభాః పరే ॥7॥

పెదవుల మూలలోనూ, నుదుటిమీద, చెవిమొదట్లోను, మెడకు సమీపంలో ముందరికాళ్లకు మొదట్లోనూ, మెడపైనా, సుడులు ఉండడం మంచిది. ఇతర స్థలాలలో ఉన్న సుడులు కీడు కలిగిస్తాయి.

శుకేన్ద్రగోపచన్ద్రాభా యే చ వాయససన్నిభాః ।
సువర్ణవర్ణాస్స్నిగ్ధాశ్చ ప్రశస్తాస్తు స దైవ హి ॥8॥

చిలుక, ఆరుద్రపురుగు, చంద్రుడు, కాకి, వీటితో సమానమైనరంగు కలిగినవీ, బంగారురంగులో ఉన్నవీ, కాంతి కలిగినవీ, అయిన గుఱ్ఱాలు ఎప్పుడూ శ్రేష్ఠమైనవి.

దీర్ఘగ్రీవాక్షికూటాశ్చ హ్రస్వకర్ణాశ్చ శోభనాః ।
రాజ్ఞాం తురఙ్గమా యత్ర విజయం వర్జయేత్తతః ॥9॥

పొడవయినమెడ, లోపలికి చొచ్చుకొనిపోయిన కన్నులు, పొట్టిచెవులు, కలిగి అందంగా కనబడే గుఱ్ఱాలు కలిగినరాజు విజయంమీద ఆశ వదులుకోవాలి.

పాలితస్తు హయో దన్తీ శుభదో దుఃఖదోఽన్యథా ।
శ్రియః పుత్రాస్తు గన్ధర్వా వాజినో రత్నముత్తమమ్ ।
అశ్వమేధే తు తురగః పవిత్రత్వాత్తు హూయతే ॥ 10॥

జాగ్రత్తగా పోషించిన గుఱ్ఱమూ, ఏనుగూ శుభాలు కలిగిస్తాయి. సరిగా పోషించకపోతే అవి దుఃఖం కలిగిస్తాయి. గంధర్వజాతికి చెందినగుఱ్ఱాలు లక్ష్మీపుత్రులు. (సంపదలు కలిగిస్తాయి). ఉత్తమమైన గుఱ్ఱం రత్నమే. పవిత్రమైనది కావడంచేత అశ్వమేధ యాగంలో (రత్నంవంటి)గుఱ్ఱం హోమం చేయబడుతున్నది.

వృషో నిమ్బబృహత్యౌ చ గుడూచీ చ సమాక్షికా ।
సిఙ్ఘాణకహరీ పిణ్డీ స్వేదశ్చ శిరసస్తథా ॥11॥

ఋషభం అనే మూలిక, వేప, వాకుడు(బృహతి), తిప్పతీగ, వీటిని తేనెతో కలిపి ముద్దగా చేసి తినిపిస్తే, నాసామలం తగ్గుతుంది. అలాగే తలలో చెమట పట్టడం కూడ తగ్గుతుంది.

హిఙ్గుపుష్కరమూలం చ నాగరం సామ్లవేతసమ్ ।
పిప్పలీసైన్ధవయుతం శూలఘ్నం చోష్ణవారిణా ॥12॥

ఇంగువ, మెట్టతామరదుంప, నాగముస్తె, చింత, ప్రబ్బలి, పిప్పలి, రాతిఉప్పు వీటిని వేడినీళ్లతో కలిపి ఇస్తే కీళ్లు మొద లైనవాటినొప్పులు తగ్గుతాయి.

నాగరాతివిషాముస్తా సానన్తా బిల్వమాలికా ।
క్వాథమేషాం పిబేద్వాజీ సర్వాతీసారనాశనమ్ ॥13॥

సొంటి, అతివస అనే ఓషధి, తుంగముస్త, ఉసిరి (అనంత), మారేడు వీటిని కాచి కషాయం చేసి, గుఱ్ఱంచేత తాగిస్తే, అన్నిరకాల అతిసారవ్యాధులు తగ్గిపోతాయి.

ప్రియఙ్గుసారివాభ్యాం చ యుక్తమాజం శృతం పయః ।
పర్యాప్తశర్కరం పీత్వా శ్రమాద్వాజీ విముచ్యతే ॥14॥

పిప్పలి, సారివలను మేకపాలలో వేసి కాచి, తగినంత చక్కెర కలిపి, తాగిస్తే గుఱ్ఱానికి అలసట పోతుంది.

ద్రోణికాయాం తు దాతవ్యా తైలబస్తిస్తురఙ్గమే ।
కోష్ఠజా వా శిరా వేధ్యాస్తేన తస్య సుఖం భవేత్ ॥15॥

కడుపులో ఉన్న నరాలను లక్ష్యం చేసుకుని, తొట్టిలో తైలబస్తి వేసి, ఇస్తే గుఱ్ఱానికి సుఖంగా ఉంటుంది. (కడుపులోని నరాల బాధ తొలగిపోతుంది.)

దాడిమం త్రిఫలా వ్యోషం గుడం చ సమభావితః ।
పిణ్డమేతత్ ప్రదాతవ్యమశ్వానాం కార్శ్యనాశనమ్ ॥16॥

దానిమ్మ, త్రిఫల, త్రికటుకం, బెల్లం, వీటినన్నిటినీ సమానభాగాలుగా తీసుకుని, ఉండలుగా చేసి తినిపిస్తే గుఱ్ఱానికి కృశించిపోవడం అనే జబ్బు నయమవుతుంది.

ప్రియఙ్గులోధ్రమధుభిః పిబేద్వృషరసం హయః ।
క్షీరం వా పఞ్చకోలాద్యం కాసనాద్ధి ప్రముచ్యతే ॥17॥

గుఱ్ఱానికి ఉబ్బసరోగం తగ్గడానికి ప్రియంగువు, లొద్దుగ, తేనె వీటితో ఋషభం అనే ఓషధిరసాన్ని కలిపి తాగించాలి. 1. పిప్పలి, 2. పిప్పలిమూలం, 3. చవ్యం అనే ఒకానొక మందుదినుసు, 4. సొంటి, 5. చిత్రమూలం అనే ఓషధి వీటిని పంచకోలం అంటారు. వీటిని పాలలో కలిపి తాగించినా తగ్గుతుంది.

ప్రస్కన్దేషు చ సర్వేషు శ్రేయ ఆదౌ విశోధనమ్ ।
అభ్యఙ్గోద్వర్తనస్నేహనస్య వర్తిక్రమ స్స్మృతః ॥18॥

అన్నిరకాలైన విరేచనరోగాలకు ముందుగా శుద్ధి చేయడం మంచిది. తలంటడంలో వరుసగా ఒంటికి నూనె మొదలైనవి రాయడం, నలుగు పెట్టడం, అనేవి ఆచరించవలసినవి అని చెప్పబడింది.

జ్వరితానాం తురఙ్గాణాం పయసైవ క్రియాక్రమః ॥19॥

జ్వరం వచ్చినగుఱ్ఱాలకు పాలతోనే చికిత్సావిధానం నడిపించాలి.

లోధ్రకరఞ్జయోర్మూలం మాతులుఙ్గాగ్నినాగరాః ।
కుష్ఠహిఙ్గువచారాస్నాలేపోఽయం శోథనాశనః ॥20॥

లొద్దుగ, కానుగ, వేర్లు, మాదీఫలం, చిత్రమూలం (అగ్ని), సొంటి, చెంగల్వకోష్టు, ఇంగువ, రాస్న అనేఓషధి, వీటిని ముద్దగా చేసి, పూస్తే, వాపు(శోథ)లు పోతాయి.

మఞ్జిష్ఠా మధుకం ద్రాక్షాబృహత్యౌ రక్తచన్దనమ్ ।
త్రపుషీబీజమూలాని శృఙ్గాటకకశేరుకమ్ ॥21॥

గుఱ్ఱానికి ఆహారం పెట్టకుండా ఉంచి, మంజిడి, ఇప్ప, ద్రాక్ష, వాకుడు, రక్తచందనం, ములుదోస (త్రపుషి), మాదీఫలం (బీజం), పిప్పలీమూలం (మూలం), శృంగాటకం (వృక్షవిశేషం), కశేరుకం అనేజాతి గడ్డిదుంప,

అజాపయశ్శృతమిదం సుశీతం శర్కరాన్వితమ్ ।
పీత్వా నిరశనో వాజీ రక్తమేహాత్ ప్రముచ్యతే ॥22॥

వీటిని, మేకపాలతో కలిపి కాగబెట్టి, చల్లార్చి చక్కెర కలిపి ఇస్తే, మూత్రంలో రక్తం పడడం అనేరోగం తగ్గిపోతుంది.

మన్యాహనునిగాలస్థశిరాశోథో గలగ్రహః ।
అభ్యఙ్గః కటుతైలేన తత్ర తేష్వేవ శస్యతే ॥23॥

మెడఎముక(మన్య), దవడ (హనువు), మెడ (నిగాలం)లలో ఉన్ననాడులు వాచినా, గొంతు పట్టుకుపోయినా, ఆయా ప్రదేశాలలో నల్లఆవాలనూనెను మర్దించడం మంచిది.

గలగ్రహగదః శోథః ప్రాయశో గలదేశకే ।
ప్రత్యక్పుష్పీ తథా వహ్నిస్సైన్ధవం సౌరసో రసః ॥
కృష్ణాహిఙ్గుయుతైరేభిః కృత్వా నస్యం న సీదతి ॥24॥

(మెడ) పట్టుకుపోవడం అనే రోగమూ, వాపురోగమూ సాధారణంగా మెడదగ్గరే వస్తుంటుంది. అక్కడ ఉత్తరేను (ప్రత్యక్పుష్పి), చిత్రమూలం, రాతిఉప్పు, ఉప్పు వేసి కాచినద్రవాహారం(సౌరసం), పిప్పలి, ఇంగువలను కలిపి పొడి చేసి, నస్యంలాగా ఇస్తే గుఱ్ఱానికి బాధలు తగ్గుతాయి.

నిశే జ్యోతిష్మతీ పాఠా కృష్ణా కుష్ఠం వచా మధు ।
జిహ్వాస్తమ్భే చ లేపోఽయం గుడమూత్రయుతో హితః ॥25॥

గుఱ్ఱానికి నాలుక బండబారి పోయినపుడు రెండు రకాలయిన పసుపులు, మానేరుతీగ (జ్యోతిష్మతి), చిఱుబొద్ది, చెంగల్వకోష్టు, వస, తేనె, వీటిని బెల్లం గోమూత్రంతో కలిపి పూస్తే, తగ్గిపోతుంది.

తిలైర్యష్ట్యా రజన్యా చ నిమ్బపత్రైశ్చ యోజితా ।
క్షౌద్రేణ శోధనీ పిణ్డీ సర్పిషా వ్రణరోపణీ ॥26॥

నువ్వులు, అతిమధురం (యష్టి), పసుపు, వేపఆకులు, వీటిని తేనెతో కలిపి నూరి ముద్దగా చేసి, నేతితో కలిపి పూస్తే గాయాలు, కురుపులు తగ్గిపోతాయి.

అభిఘాతేన ఖఞ్జన్తి యే హ్యశ్వాస్తీవ్రవేదనాః ।
పరిషేకక్రియా తేషాం తైలేనాశు రుజాపహా ॥27॥

గట్టిదెబ్బ తగలడం వలన కుంటుతూ మిక్కిలిగా బాధపడుతున్న గుఱ్ఱానికి ఆ ప్రదేశంలో నువ్వులనూనె ఎక్కువ మోతాదులో పూస్తే, ఆ జబ్బు వెంటనే తగ్గిపోతుంది.

దోషకోపాభిఘాతాభ్యాం తలజేలిఙ్గితే తథా ।
శాన్తిర్మస్త్వణ్డివృద్ధాభ్యాం పక్వభిన్నవ్రణే క్రమః ॥28॥

వాతం మొదలైనదోషాలవలన గానీ, కోపంవలన గానీ తగిలిన దెబ్బలచేత శరీరంమీద మచ్చలు ఏర్పడినపుడు, అండి, సాంబ్రాణి (వృద్ధం) ఈ రెండింటితో మస్తి చేయడంవలన ఆ మచ్చలు పోతాయి. గాయాలు పాకానికి వచ్చి, పగిలినపుడు ఈ క్రిందివైద్యం చేయాలి.

అశ్వత్థోదుమ్బరప్లక్షమధూకవటబిల్వకైః ।
ప్రభూతసలిలక్వాథస్సుఖోష్ణో వ్రణశోధనః ॥29॥

రావి, మేడి, జువ్వి, ఇప్ప, మఱ్ఱి, మారేడు దళాలను నీళ్లతో కలిపి కాచి చేసిన కషాయం కొంచెం వేడిగా ఉండగా, పూస్తే గాయాలను, కురుపులనూ తగ్గిస్తుంది.

శతాహ్వా నాగరం రాస్నా మఞ్జిష్ఠాకుష్ఠసైన్ధవైః ।
దేవదారువచాయుగ్మరజనీరక్తచన్దనైః ॥30॥

శతాహ్వ, సొంటి, రాస్న, మంజిడి, చెంగల్వకోస్టు, రాతిఉప్పు, దేవదారువు, వస, రెండురకాలయిన పసుపు, రక్తచందనం–

తైలం సిద్ధం కషాయేణ గుడూచ్యాః పయసా సహ ।
మ్రక్షణే వస్తినస్యే చ యోజ్యం సర్వత్ర లిఙ్గితే ॥31॥

వీటితో సిద్ధం చేసిన నూనెను పూయాలి. రోగాలచిహ్నాలు కనిపించినపుడు గుఱ్ఱాలకు తిప్పతీగపాలతో చేసిన కషాయాన్ని బస్తిగానూ, నస్యంగానూ ఉపయోగించాలి.

రక్తస్రావో జలౌకాభిర్నేత్రాన్తే నేత్రరోగిణః ।
ఖదిరోదుమ్బరాశ్వత్థకషాయేణ చ సాధనమ్ ॥32॥

కంటిరోగం వచ్చిన గుఱ్ఱాలకు ఆ కంటికి చివర జలగలను నిలిపి, రక్తం కారేటట్లు చేయాలి. అత్తపత్తి (ఖదిరం), మేడి, రావి, వీటి కషాయంతో కన్నులను శోధించాలి.

ధాత్రీదురాలభాతిక్తాప్రియఙ్గుకుఙ్కుమైస్సమైః ।
గుడూచ్యా చ కృతః కల్కో హితో యుక్తావలమ్బినే ॥33॥

యుక్తావలంబి అయిన గుఱ్ఱానికి ఉసిరిక, తీటకసింద (దురాలభ), అత్తపత్తి (ఖదిరం), తిక్త, ప్రేంకణం, కుంకుమ, తిప్పతీగ, వీటిని సమభాగాలుగా తీసుకుని చేసిన కషాయం ఇవ్వాలి.

ఉత్పాతే చ శిలే శ్రావ్యే శుష్కశోఫే తథైవ చ ।
క్షిప్రకారిణి దోషే చ సద్యో వేధన(విదల) మిష్యతే ॥34॥

ఉత్పాతంలోనూ, శిలయందు, చెవికి సంబంధించిన బాధలోనూ, బాధ కలిగే వాపులలోనూ, ఇంకా త్వరగా హాని కలిగించే రోగాలవిషయంలోనూ వెంటనే సూదిని గ్రుచ్చడం మంచిది.

గోశకృన్మఞ్జికాకుష్ఠరజనీతిలసర్షపైః ।
గవాం మూత్రేణపిష్టైశ్చ మర్దనం కణ్డునాశనమ్ ॥35॥

ఆవుపేడ, మంజిక, చెంగల్వకోష్టు, పసుపు, నువ్వులు, ఆవాలు, వీటిని గోమూత్రంతో కలిపి నూరి పిండిగా చేసి, దానితో మర్దనం చేస్తే దురదలు తగ్గిపోతాయి.

శీతో మధుయుతః క్వాథో నాసికాయాం సశర్కరః ।
రక్తపిత్తహరః పానాదశ్వకర్ణే తథైవ చ ॥ 36॥

వేపాకు కషాయంలో తేనె, చక్కెర కలిపి, ముక్కులో వేసి పీల్పించినట్లయితే గుఱ్ఱానికి రక్తదోషాలు, పిత్తదోషాలు తొలగిపోతాయి.

సప్తమే సప్తమే దేయమశ్వానాం లవణం దినే ।
తథా భుక్తవతాం దేయా ప్రతిపానే చ వారుణీ ॥37॥

ప్రతిఏడవరోజున గుఱ్ఱానికి ఉప్పు తినిపించాలి. అతిగా తిన్నగుఱ్ఱాలకు మద్యం ప్రతిపానంగా ఇవ్వాలి.

జీవనీయైస్సమధురైర్మృద్వీకాశర్కరాయుతైః ।
సపిప్పలీకైశ్శరది ప్రతిపానం సపద్మకైః ॥38॥

శరదృతువులో గుఱ్ఱాల జీవనానికి ఆధారమైన మధురాలు అనే ధాన్యాన్ని ద్రాక్ష (మృద్వీకం), చక్కెర, పిప్పళ్లు, చెంగల్వ కోష్టులతో కలిపి ప్రతిపానంగా ఇవ్వాలి.

విడఙ్గపిప్పలీధాన్యశతాహ్వాలోధ్రసైన్ధవైః ।
సచిత్రకైస్తురఙ్గాణాం ప్రతిపానం హిమాగమే ॥39॥

హేమంతఋతువులో వాయువిడంగం అనే ఓషధి, పిప్పళ్లు, శతాహ్వా, లొద్దుగ, రాతిఉప్పు, చిత్రమూలం అనే ఔషధం కలిపి ప్రతిపానంగా ఇవ్వాలి.

లోధ్రం ప్రియఙ్గుకాముస్తాపిప్పలీవిశ్వభేషజైః ।
సక్షౌద్రైః ప్రతిపానం స్యాద్వసన్తే కఫనాశనమ్ ॥40॥

వసంతఋతువులో లొద్దుగ, ప్రేంకణం, తుంగముస్తె, పిప్పలి, సొంటి, వీటిని తేనెతో కలిపి, ప్రతిపానం చేయించాలి. దీనివలన కఫం తగ్గిపోతుంది.

ప్రియఙ్గుపిప్పలీలోధ్రయష్ట్యాహ్వైస్సమహౌషధైః ।
నిదాఘే సగుడా దేయా మదిరా ప్రతిపానకే ॥41॥

గ్రీష్మఋతువులో ప్రేంకణం, పిప్పలి, లొద్దుగ, అతిమధురం, సొంటి వీటిని బెల్లంతో కలిపిన మద్యాన్ని ప్రతిపానంగా ఇవ్వాలి.

లోధ్రకాష్ఠం సలవణం పిప్పల్యో విశ్వభేషజమ్ ।
భవేత్తైలయుతైరేభిః ప్రతిపానం ఘనాగమే ॥42॥

వర్షఋతువులో లొద్దుగకఱ్ఱ, లవణం, పిప్పలి, సొంటి, వీటిని, నువ్వులనూనెతో కలిపి ప్రతిపానం చేయించాలి.

నిదాఘోద్భుతపిత్తా యే శరత్సుపుష్టశోణితాః ।
ప్రావృడ్భిన్నపురీషాశ్చ పిబేయుర్వాజినో ఘృతమ్ ॥43॥

గ్రీష్మఋతువులో గుఱ్ఱాలకు పిత్తం ప్రకోపిస్తుంది. శరదృతువులో రక్తం పెరిగి ఉంటుంది. వర్ష ఋతువులో పురీషం భిన్నం అవుతుంది. అందుచేత ఈ ఋతువులలో గుఱ్ఱాలకు నెయ్యి తాగించాలి.

పిబేయుర్వాజినస్తైలం కఫవాయ్వధికాస్తు యే ।
స్నేహోత్తాపోద్భవో యేషాం కార్యం తేషాం విరూక్షణమ్ ॥44॥

కఫమూ, వాతమూ అధికంగా ఉన్న గుఱ్ఱాలకు నువ్వులనూనె త్రాగించాలి. నూనె వలన తాపం కలిగిన గుఱ్ఱాలకు విరూక్షణం (ఎండేటట్లు చేయడం) చేయాలి.

త్ర్యహం యవాగూ రూక్షా స్యాద్ భోజనం తక్రసంయుతమ్ ॥45॥

మూడురోజులకు ఒకసారి గంజిని మజ్జిగతో కలిపి ఇస్తే రూక్షణం కలుగుతుంది.

శరన్నిదాఘయోస్సర్పిస్తైలం శీతవసన్తయోః ।
వర్షాసు శిశిరేచైవ బస్తౌ యమకమిష్యతే ॥46॥

శరదృతువులోనూ, గ్రీష్మఋతువులోనూ నెయ్యినీ, హేమంతఋతువులోనూ, వసంతఋతువులోనూ నూనెనూ, ఇవ్వాలి. వర్షఋతువులోనూ, శిశిరఋతువులోనూ ఈరెండింటిని కలిపి ఇవ్వాలి.

గుర్వభిష్యన్దిభక్తాని వ్యాయామస్నానమాతపమ్ ।
వాయువర్జం చ వాహస్య స్నేహపీతస్య వర్జితమ్ ॥47॥

నేయి, లేదా నూనె తాగిన గుఱ్ఱానికి, అధిక మైనదీ, నూనె కారేదీ, అయిన ఆహారం పనికిరాదు. వ్యాయామం, స్నానం, ఎండ, మిక్కిలిగా గాలి ఉన్న ప్రదేశం పనికిరావు.

స్నానం పానం సకృత్కుర్యా దశ్వానాం సలిలాగమే ।
అత్యర్థం దుర్దినే కాలే పానమేకం ప్రశస్యతే ॥48॥

గుఱ్ఱాలకు వర్షఋతువులో స్నానం, పానం ఒక్కసారి మాత్రమే ఉండాలి. బాగా మబ్బులు పట్టినరోజులలో పానం ఒక్కటి శ్రేష్ఠం. (స్నానం అక్కర్లేదు).

యుక్తం శీతాతపే కాలే ద్విః పానం స్నపనం సకృత్ ।
గ్రీష్మే త్రిస్స్నానం పానం స్యాచ్చిరం తస్యావగాహనమ్ ॥49॥

చల్లదనమూ వేడీ సమానంగా ఉన్న కాలంలో పానం రెండుసార్లు, స్నానం ఒక్కసారి ఉండాలి. గ్రీష్మఋతువులో స్నానం, పానం మూడు సార్లు ఉండాలి. స్నానం చాలసేపు చేయించాలి.

నిస్తుషాణాం ప్రదాతవ్యా యవానాం చతురాఢకీ ।
చణకవ్రీహిమౌద్గాని కలాయం వాఽపి దాపయేత్ ॥50॥

ప్రతిరోజూ గుఱ్ఱానికి పొట్టు లేని యవలు నాలుగు ఆఢకాలు, (ఆఢకం అంటే నాలుగు కుంచాలు, కుంచం అంటే నాలుగు మానికలు). సెనగలు, వడ్లు, పెసలు, గుండ్రటిసెనగలు (బఠాణీలు), పెట్టాలి.

అహోరాత్రేణ చార్ద్రస్య యవసస్య తులా దశ ।
అష్టౌ శుష్కస్య దాతవ్యాశ్చతస్రోఽథ బుసస్య వా ॥51॥

గుఱ్ఱానికి రాత్రి, పగలు కలిపి రోజులో పచ్చిగడ్డి వెయ్యిపలాల పరిమాణంలో (తుల అంటే నూరు పలాలు) తినిపించాలి. ఎండుగడ్డి అయితే ఎనిమిదివందల పలాలపరిమాణంలో తినిపించాలి. పొల్లుగడ్డి అయితే నాలుగుతులాల పరిమాణంలో తినిపించాలి.

దూర్వాః పిత్తం యవః కాసం బుసశ్చ శ్లేష్మసఞ్చయమ్ ।
నాశయత్యర్జునశ్వాసం తథా వాలో బలక్షయమ్ ॥52॥

గరిక పిత్తాన్ని, యవలు దగ్గునూ, పొల్లు శ్లేష్మాన్నీ నశింపజేస్తాయి. తెల్లమద్ది శ్వాసకు సంబంధించిన దోషాలను పోగొడుతుంది. నారికేళం బలం తగ్గిపోవడాన్ని నివారిస్తుంది.

వాతికాః పైత్తికాశ్చైవ శ్లేష్మజా స్సాన్నిపాతకాః ।
న రోగాః పీడయిష్యన్తి దూర్వాహారం తురఙ్గమమ్ ॥53॥

గరిక తినేగుఱ్ఱాన్ని వాత, పిత్త, శ్లేష్మ, సన్నిపాతాలకు సంబంధించినరోగాలు ఏవీ బాధించవు.

ద్వౌరజ్జుబన్ధౌ దుష్టానాం పక్షయోరుభయోరపి ।
పశ్చాద్ధనుశ్చ కర్తవ్యో దూరకీలవ్యపాశ్రయః ॥54॥

దుర్మార్గంగా ప్రవర్తించే గుఱ్ఱాలను ముందూ వెనక రెండువైపుల రెండుతాళ్లతో గట్టిగా బంధించాలి.తరువాత దౌడలవద్ద కూడ బంధించాలి. దూరంగా ఉన్న కొయ్యకు కట్టి దాని నాశ్రయించుకుని తిరిగేవిధంగా ఉంచాలి.

వాసేయుస్సావృతే స్థానే కృతధూపనభూమయః ।
యత్రోపన్యస్తయవసా స్సప్రదీపాస్సురక్షితాః ॥
కృకవాక్వజకపయో ధార్యాశ్చాశ్వగృహే మృగాః ॥ 55॥

గుఱ్ఱాన్ని కింద ఆస్తరణం ఉన్న స్థానంలోనే ఉంచాలి. ఆ ప్రదేశానికి అపుడపుడూ ధూపం వేయాలి. గుఱ్ఱాలకు ఎదురుగా గడ్డి వేసి ఉంచాలి. వెలుతురుగా ఉండడానికి అక్కడ మంచి దీపాలు పెట్టాలి. వాటి రక్షణకుతగిన ఏర్పాట్లు చేయాలి. అందుకోసం అశ్వశాలలలో నెమళ్లు, మేకలు, కోతులు, మొదలైన జంతువులను ఉంచాలి.

ఇత్యాది మహాపురాణే ఆగ్నేయే అశ్వలక్షణంచికిత్సాకథనం నా మైకోననవత్యధికద్విశతతమోఽధ్యాయః ॥289॥

అగ్నిమహాపురాణంలో అశ్వలక్షణం చికిత్సాకథనం అనే రెండువందల ఎనభైతొమ్మిదవ అధ్యాయం సమాప్తం.

నవత్యధికద్విశతతమో ఽధ్యాయః - రెండువందల తొంబైయవ అధ్యాయం

అశ్వశాంతికథనమ్ - అశ్వశాంతికథనం

శాలిహోత్ర ఉవాచ - శాలిహోత్రుడు సుశ్రుతుడితో ఇలా చెప్తున్నాడు

అశ్వశాన్తిం ప్రవక్ష్యామి వాజిరోగవిమర్దనీమ్ ।
నిత్యాం నైమిత్తికీం కామ్యాం త్రివిధాం శృణు సుశ్రుత! ॥1॥

సుశ్రుతా! అశ్వశాంతిని గురించి చెప్తాను. ఇది గుఱ్ఱాలకు వచ్చే రోగాలన్నిటినీ నాశనం చేస్తుంది. అశ్వశాంతి నిత్యం, నైమిత్తికం, కామ్యం అని మూడువిధాలు. వాటిని గురించి విను.

శుభే దినే శ్రీధరం చ శ్రియ ముచ్చైశ్శ్రవాశ్చ తమ్ ।
హయరాజం సమభ్యర్చ్య సావిత్రైర్జుహుయాద్ ఘృతమ్ ॥
ద్విజేభ్యో దక్షిణాం దద్యా దశ్వవృద్ధి స్తతో భవేత్ ॥2॥

ఒకానొక మంచిరోజున శ్రీమహావిష్ణువును, లక్ష్మీదేవిని, ఉచ్చైశ్శ్రవం అనే దేవతల గుఱ్ఱాన్ని చక్కగా పూజించాలి. సావిత్రీ మంత్రాలతో నేతిని హోమం చేయాలి. బ్రాహ్మణులకు తృప్తిగా దక్షిణ ఇవ్వాలి. ఇలా చేయడంవలన అశ్వసంపద బాగా వృద్ధి చెందుతుంది.

అశ్వయుక్శుక్లపక్షస్య పఞ్చదశ్యాం చ శాన్తికమ్ ।
బహిఃకుర్యాద్విశేషేణ నాసత్యౌ వరుణం యజేత్ ॥3॥

ఆశ్వయుజ మాసంలో శుక్లపక్షంలో పూర్ణిమనాడు ఊరి బయట (అశ్వ)శాంతికర్మ ఆచరించాలి. అందులో అశ్వినీదేవతలనూ, వరుణుడినీ విశేషంగా పూజించాలి.

సముల్లిఖ్య తతో దేవీం శాఖాభిః పరివారయేత్ ।
ఘటాన్సర్వరసైః పూర్ణాన్దిక్షు దద్యాత్సవస్త్రకాన్ ॥4॥

తరువాత అక్కడ దేవి చిత్రాన్ని గీయాలి. దానిచుట్టూ చెట్టుకొమ్మలను ఏర్పాటుచేయాలి. దేవికి చుట్టూ అన్ని దిక్కులలోనూ కలశాలను స్థాపించాలి. ఆ కలశాలను సమస్త మైనరసాలతో నింపాలి. ఆ కలశాలకు నూతనవస్త్రాలను చుట్టాలి.

యవాజ్యం జుహుయాత్ ప్రార్చ్య యజేదశ్వాంశ్చ సాశ్వినాన్ ।
విప్రేభ్యో దక్షిణాం దద్యాన్నైమిత్తిక మత శృణు ॥ 5॥

తరువాత దేవిని పూజించాలి. ఆ పిదప నేతితో తడిపిన యవలను హోమం చేయాలి. ఆ తరువాత అశ్వినీదేవతలతో సహా గుఱ్ఱాలను పూజించాలి. బ్రాహ్మణులకు తృప్తిగా దక్షిణ ఇవ్వాలి. (ఇది నిత్య-అశ్వశాంతివిధానం) ఇక నైమిత్తికఅశ్వశాంతిని గురించి విను.

మకరాదౌ హయానాం చ పద్మైర్విష్ణుం శ్రియం యజేత్ ॥6॥

మకరసంక్రమణం మొదలైన సమయాలలో అశ్వశాంతి నిమిత్తంగా (పద్మం మధ్యలో) శ్రీమహావిష్ణువునూ, లక్ష్మీదేవినీ తామరపూలతో అర్చించాలి.

బ్రహ్మాణం శఙ్కరం సోమ మాదిత్యం చ తథాశ్వినౌ ।
రేవన్త ముచ్చైశ్శ్రవసం దిక్పాలాంశ్చ దలే ష్వపి ॥7॥

తామరపూరేకులమీద బ్రహ్మ, శివుడు, చంద్రుడు, సూర్యుడు, అశ్వినీదేవతలు, రేవంతుడు, ఉచ్చైశ్శ్రవం, దిక్పాలకులు – వీరిని పూజించాలి.

ప్రత్యేకం పూర్ణకుమ్భేషు వేద్యాం తత్ సౌమ్యతా హువేత్ ।
తిలాక్షతాజ్యసిద్ధార్థాన్ దేవతానాం శతం శతమ్ ॥8॥

ఈ దేవత లందరికీ ప్రత్యేకంగా కలశాలు స్థాపించి, ఆ కలశాలలో నీరు నింపి, అందులో ఆయా దేవతలను స్థాపించి పూజించాలి. ఉత్తరదిక్కులో వేదికపైన హోమాగ్నియందు ఒక్కొక్క దేవతకు వంద వంద చొప్పున నువ్వులు, అక్షతలు, నెయ్యి, తెల్లఆవాలు హోమం చేయాలి.

ఉపోషితేన కర్తవ్యం కర్మ చాశ్వరుజాపహమ్ ॥9॥

అశ్వరోగాలను శాంతింపజేసే ఈ అశ్వశాంతికర్మను ఉపవాసం ఉండి, ఆచరించాలి.

ఇత్యాది మహాపురాణే ఆగ్నేయే అశ్వశాన్తికథనం నామ నవత్యధికద్విశతతమోఽధ్యాయః ॥290॥

అగ్నిమహాపురాణంలో అశ్వశాంతికథనం అనే రెండువందల తొంబైయవ అధ్యాయం సమాప్తం



ఏక నవత్యధికద్విశతతమోఽధ్యాయః – రెండువందల తొంబైఒకటవ అధ్యాయం

గజశాంతికథనమ్ – గజశాంతికథనం

శాలిహోత్ర ఉవాచ – శాలిహోత్రుడు సుశ్రుతుడితో ఇలా చెప్తున్నాడు.

గజశాన్తిం ప్రవక్ష్యామి గజరోగవిమర్దనీమ్ ।
విష్ణుం శ్రియం చ పఞ్చమ్యాం నాగమైరావతం యజేత్ ॥1॥

ఇక ఏనుగులకు కలిగే రోగాలను నిర్మూలించే గజశాంతిని చెప్తాను. పంచమీతిథినాడు శ్రీమహావిష్ణువును, లక్ష్మీదేవిని, ఐరావతం అనే ఏనుగును పూజించాలి.

బ్రహ్మాణం శఙ్కరం విష్ణుం శక్రం వైశ్రవణం యమమ్ ।
చన్ద్రార్కౌ వరుణం వాయు మగ్నిం పృథ్వీం తథా చ ఖమ్ ॥2॥

బ్రహ్మ, శివుడు, విష్ణువు, ఇంద్రుడు, కుబేరుడు, యముడు, చంద్రుడు, సూర్యుడు, వాయువు, అగ్ని, భూమి, ఆకాశం,

శేషం శైలాన్కుఞ్జరాంశ్చ యే తేఽష్టౌ దేవయోనయః ।
విరూపాక్షం మహాపద్మం భద్రం సుమనసం తథా ॥3॥

ఆదిశేషుడు, సప్తకులపర్వతాలు, అష్టదిగ్గజాలు – ఈ ఏనుగులు దేవజాతిలో పుట్టాయి. విరూపాక్షం, మహాపద్మం, భద్రం, సుమనసం,

కుముదైరావణః పద్మః పుష్పదన్తోఽథ వామనః ।
సుప్రతీకోఽఞ్జనో నాగా అష్టౌ హోమోఽథ దక్షిణామ్ ॥4॥

కుముదైరావణం, పద్మం, పుష్పదంతం, వామనం, సుప్రతీకం, అంజనం. అనే ఏనుగులు ఎనిమిది?. వీటి నన్నిటిని పూజించి, హోమం చేసి, దక్షిణలు ఇవ్వాలి.

గజాశ్శాన్త్యుదకైస్సిక్తా వృద్ధౌ నైమిత్తికం శృణు ।
గజానాం మకరాదౌ చ ఐశాన్యాం నగరాద్బహిః ॥5॥

ఏనుగులు వృద్ధి చెందడానికి వాటిని శాంతికలశాలలోని ఉదకంతో తడపాలి. ఇంక నైమిత్తికమైన శాంతిని గురించి చెప్తాను, విను. మకరసంక్రమణం మొదలైన సంక్రమణ సమయాలలో ఊరికి వెలుపల ఈశాన్యదిక్కులో ఏనుగులను పూజించాలి.

స్థణ్డిలే కమలే మధ్యే విష్ణుం లక్ష్మీం చ కేసరే ।
బ్రహ్మాణం భాస్కరం పృథ్వీం యజేత్ స్కన్దం హ్యనన్తకమ్ ॥
ఖం శివం సోమమిన్ద్రాదీంస్తదస్త్రాణి దలే క్రమాత్ ॥6॥

నేలపై పద్మాన్ని లిఖించాలి. దానిమధ్యలో విష్ణువును, లక్ష్మిని, పూజించాలి. పద్మకేసరాలలో బ్రహ్మ, సూర్యుడు, భూమి, కుమారస్వామి, ఆదిశేషుడు, ఆకాశం, శివుడు, చంద్రుడు, ఇంద్రుడు మొదలైన దిక్పాలకులను పూజించాలి. పద్మదళాలలో క్రమంగా దిక్పాలకుల ఆయుధాలను పూజించాలి.

వజ్రం శక్తిం చ దణ్డం చ తోమరం పాశకం గదామ్ ।
శూలం పద్మం బహిర్వృన్తే చక్రే సూర్యం తథాశ్వినౌ ॥7॥

ఆ ఆయుధాలు - వజ్రం (తూర్పు - ఇంద్రుడిఆయుధం), శక్తి (ఆగ్నేయం-అగ్ని), దండం (దక్షిణం-యముడు), తోమరం (నైరృతి-నిరృతి), పాశం (పశ్చిమం-వరుణుడు), గద (వాయవ్యం-వాయువు), శూలం (ఉత్తరం-కుబేరుడు), పద్మం (ఈశాన్యం-ఈశానుడు). పద్మానికి వెలుపల వృంతంలో సూర్యుడిని, చక్రంలో అశ్వినీదేవతలను పూజించాలి.

వసూనష్టౌ తథా సాధ్యాన్యామ్యేఽథ నైరృతేదలే ।
దేవానాఙ్గిరసశ్చాన్యాన్ భృగూంశ్చ మరుతోఽనిలే ॥8॥

దక్షిణం దిక్కులోని పద్మదళంలో అష్టవసువులను, సాధ్యులను పూజించాలి. నైరృతమూలలోని పద్మదళంలో భృగువంశీయులైన ఆంగిరసదేవతలను, మరుత్తులను, వాయువును పూజించాలి.

విశ్వేదేవాం స్తథా దక్షే రుద్రాన్ రౌద్రేఽథ మణ్డలే ॥9॥

దక్షిణదిక్కులోని దళంలో విశ్వేదేవతలను కూడ పూజించాలి. పద్మంలో ఈశాన్యప్రదేశంలోని దళంలో ఏకాదశరుద్రులను పూజించాలి.

వృత్తయా రేఖయా తత్ర దేవాన్వైబాహ్యతో యజేత్ ।
సూత్రకారానృషీ న్వాణీం పూర్వాదౌ సరితో గిరీన్ ॥10॥

ఆ పద్మానికి వెలుపలగా వృత్తాకారంలో ఒకరేఖను ఏర్పరిచి అక్కడ దేవతలను, సూత్రకర్తలయిన మహర్షులను, సరస్వతీదేవిని పూజించాలి. తూర్పు మొదలైన దిక్కులలో నదులనూ, పర్వతాలనూ పూజించాలి.

మహాభూతాని కోణేషు ఐశాన్యాదిషు సంయజేత్ ॥11॥

ఈశాన్యం మొదలైన కోణాలలో పంచమహాభూతాలను పూజించాలి.

పద్మం చక్రం గదాం శఙ్ఖం చతురస్రం తు మణ్డలమ్ ।
చతుర్ద్వారం తతః కుమ్భా నగ్న్యాదౌ చ పతాకికాః ॥
చత్వారస్తోరణాన్ ద్వారి నాగా నైరావతాదికాన్ ॥12॥

నాలుగువైపుల ద్వారాలతో చతురస్రాకారంలో ఒకమండలం ఏర్పాటుచేయాలి. అందులో పద్మం, చక్రం, గద, శంఖం, ఏర్పాటు చేయాలి. తరువాత ఆగ్నేయం మొదలైన మూలలలో కలశాలను స్థాపించాలి. నాలుగువైపుల

పతాకాలనూ, తోరణాలనూ ఏర్పరచాలి. నాలుగుద్వారాలలోనూ ఐరావతం మొదలైనదిగ్గజాలను ఏర్పాటుచేసి పూజించాలి.

పూర్వాదౌ చౌషధీభిశ్చ దేవానాం భాజనం పృథక్ ।
పృథక్కృతాహుతీశ్చాజ్యైర్గజానర్చ్య ప్రదక్షిణమ్ ॥13॥

తూర్పు మొదలైన దిక్కులలో ఆయా దేవతలకోసం వేరువేరుగా పాత్రలను ఉంచాలి. వాటిలో ఓషధులను కలపాలి. దేవతలందరికీ ప్రత్యేకంగా ఒక్కొక్కరికి నూరు చొప్పున ఆహుతులు ఇచ్చి హోమం చేయాలి. ఏనుగులను పూజించి, వాటికి ప్రదక్షిణం చేయాలి.

నాగం వహ్నిం దేవతాదీన్ వాద్యైర్గచ్ఛేత్స్వకం గృహమ్ ।
ద్విజేభ్యో దక్షిణాం దద్యాద్ధస్తివైద్యాదికాం స్తథా ॥14॥

ఆ తరువాత ఏనుగునూ, అగ్నినీ, దేవతలు మొదలైనవారినీ తీసుకుని మంగళవాద్యాలతో తన యింటికి వెళ్లాలి. బ్రాహ్మణులకు ఏనుగు వైద్యులు మొదలైనవారిని దక్షిణగా ఇవ్వాలి.

కరిణం తు సమారుహ్య వదేత్ కర్ణే తు కాలవిత్ ।
నాగరాజే మృతే శాన్తిం కృత్వాన్యస్మిం జపేన్మనుమ్ ॥15॥

సమయజ్ఞుడైనవాడు ఏనుగుపై ఎక్కి కూర్చుని, ఆ ఏనుగుచెవిలో ఇలా చెప్పాలి. ఒకవేళ ఆ ఏనుగు మరణించినట్లయితే శాంతికర్మలు ఆచరించి, మరొక ఏనుగును తీసుకుని దాని చెవిలో ఈ క్రిందిమంత్రాన్ని జపించాలి.

శ్రీగజస్త్వం కృతో రాజ్ఞా భవానస్య గజాగ్రణీః ।
గన్ధమాల్యాగ్రభక్తైస్త్వాం పూజయిష్యతి పార్థివః ॥16॥

ఓ గజమా! రాజు నిన్ను ఈ ఏనుగులన్నిటికీ అగ్రస్థానం ఇచ్చి, శ్రీగజం చేశాడు. గంధాలతోనూ, పూలతోనూ, అక్షతలతోనూ రాజు నిన్ను పూజిస్తాడు.

లోకస్తదాజ్ఞయా పూజాం కరిష్యతి తదా తవ ।
పాలనీయస్త్వయా రాజా యుద్ధేఽధ్వని తథా గృహే ॥17॥

రాజుగారిఆజ్ఞను అనుసరించి లోకం అంతా నీకు పూజ చేస్తుంది. అందుచేత నీవు యుద్ధంలోనూ, మార్గంలోనూ, ఇంట్లోనూ (రాజ్యంలోనూ) ఈ రాజును రక్షించాలి.

తిర్యగ్భావం సముత్సృజ్య దివ్యం భావమనుస్మర ॥18॥

నీవు పశువువి అనే భావాన్ని వదిలిపెట్టి, దేవజాతికి చెందినదానివి అనే అంశాన్ని గుర్తుచేసుకో.

దేవాసురే పురాయుద్ధే శ్రీగజస్త్రిదశైః కృతః ।
ఐరావతసుతశ్శ్రీమానరిష్టో నామవారణః ॥
శ్రీగజానాం తు తత్తేజ స్సర్వమేవోపతిష్ఠతే ॥19॥

పూర్వం దేవతలకూ, రాక్షసులకూ జరిగినయుద్ధంలో దేవతలు ఐరావతం కుమారుడూ, శ్రీమంతుడూ ఐన అరిష్టుడు అనే గజరాజును శ్రీగజం చేశారు. శ్రీగజాలకు అన్నింటికీ ఆ తేజస్సు సమస్తం వచ్చి చేరుతుంది.

తత్తేజస్తవ నాగేన్ద్ర దివ్యభావసమన్వితమ్ ।
ఉపతిష్ఠతు భద్రం తే రక్ష రాజానమాహవే ॥20॥

గజరాజా! దేవతలకు సంబంధించిన లక్షణాలతో కూడిన ఆ తేజస్సు నీలో నిలిచిఉండును గాక! నీకు శుభమగు గాక! యుద్ధంలో ఈ రాజును రక్షించు.

ఇత్యేవమభిషిక్తం తమారోహేత్తు శుభే నృపః ।
తస్యానుగమనం కుర్యు స్సశస్త్రా నరపుఙ్గవాః ॥21॥

ఈ మంత్రాలతో అభిషేకించిన ఏనుగును శుభముహూర్తంలో రాజు అధిరోహించాలి. మానవోత్తములందరూ ఆయుధాలను ధరించి ఆ రాజును అనుసరించి వెళ్లాలి.

శాలాస్వసౌ స్థణ్డిలేఽబ్జే, దిక్పాలాదీ న్యజే ద్బహిః ।
కేసరేషు బలం నాగం భువం చైవ సరస్వతీమ్ ॥22॥

గజశాలలో నేలమీద పద్మాన్ని వ్రాసి, దానికి వెలుపలగా దిక్పాలకులు మొదలైనవారిని పూజించాలి. తామరపూవులోని కేసరాలలో బలవంతుడైన గజరాజును, భూమిని, సరస్వతిని పూజించాలి.

మధ్యమే డిణ్డిమం ప్రార్చ్య గన్ధమాల్యానులేపనైః ।
హుత్వా దేయస్తు కలశో రసపూర్ణో ద్విజాయ చ ॥23॥

పద్మం మధ్యలో డిండిమాన్ని గంధం, పూలు, లేపనాలతో పూజించాలి. తరువాత హోమం చేయాలి. నీటితో నిండినకలశాన్ని బ్రాహ్మణుడికి ఇవ్వాలి.

గజాధ్యక్షం హస్తిపంచ గణితజ్ఞం చ పూజయేత్ ।
గజాధ్యక్షాయ తం దద్యాత్ డిణ్డిమం సోఽపి వాదయేత్ ॥
శుభాగమ్భీరశబ్దైస్స్వోజ్జఘనస్థోఽభివాదయేత్ ॥24॥

తరువాత ఏనుగులబలానికి అధ్యక్షుడిని, ఏనుగులను రక్షించేవాడిని, జ్యోతిశ్శాస్త్రం తెలిసినవాడిని, పూజించాలి. ఆడిండిమాన్ని గజాధ్యక్షుడికి ఇవ్వాలి. అతడు ఆడిండిమం వెనకభాగంమీద కూర్చుండి, మంగళప్రదమూ, గంభీరమూ అయినధ్వనులతో డిండిమాన్ని మ్రోగించాలి.

ఇత్యాది మహాపురాణే ఆగ్నేయే గజశాన్తికథనం నా మైకనవత్యధికద్విశతతమోఽధ్యాయః ॥291॥

అగ్నిమహాపురాణంలో గజశాంతికథనం అనే రెండువందల తొంభై ఒకటవ అధ్యాయం సమాప్తం.

ద్వినవత్యధికద్విశతతమోఽధ్యాయః - రెండువందల తొంబైరెండవ అధ్యాయం
గవాయుర్వేదకథనమ్ - గవాయుర్వేదకథనం

ధన్వన్తరి రువాచ - సుశ్రుతుడితో ధన్వంతరి ఇలా చెప్తున్నాడు

గోవిప్రపాలనం కార్యం రాజ్ఞా గోశాన్తిమావదే ।
గావః పవిత్రా మాఙ్గల్యా గోషు లోకాః ప్రతిష్ఠితాః ॥1॥

రాజు ఆవులనూ, బ్రాహ్మణులనూ పోషించాలి. ఇపుడు గోవులశాంతిని గురించి చెప్తాను. ఆవులు పవిత్ర మైనవి. శుభ ప్రదమైనవి. ఆవులవలననే లోకాలు స్థిరంగా ఉండగలుగుతున్నాయి.

శకృన్మూత్రం పరం తాసామలక్ష్మీనాశనం పరమ్ ।
గవాం కణ్డూయనం వారిదానం శృఙ్గస్య మర్దనమ్ ॥2॥

అందులో కూడ ఆవుపేడ, ఆవుమూత్రం, అత్యంతం పవిత్రమైనవి. అవి దరిద్రాన్ని పూర్తిగా నాశనం చేస్తాయి. ఆవు శరీరాన్ని (గంగడోలు) గోకడం, ఆవులకు నీళ్లు పెట్టడం, ఆవు కొమ్ములను మర్దించడం ఉత్తమ మైనవి.

గోమూత్రం గోమయం క్షీరం దధి సర్పిశ్చరోచనా ।
షడఙ్గం పరమం పానే దుస్స్వప్నాదినివారణమ్ ॥3॥

ఆవుమూత్రం, ఆవుపేడ, ఆవుపాలు, ఆవుపెరుగు, ఆవునెయ్యి, ఆవురోచనం - గోవునుండి ఏర్పడుతున్న ఈ ఆరు తాగడానికి ఉత్తమమైనవి. చెడుకలలు మొదలైన ఆపదలను నివారిస్తాయి.

రోచనా విషరక్షోఘ్నీ గ్రాసదస్స్వర్గగో గవామ్ ।
యద్గృహే దుఃఖితా గావస్స యాతి నరకం నరః ॥4॥

రోచనం విషాన్ని, రాక్షసబాధలనూ నిర్మూలిస్తుంది. (తనఇంట్లో ఉన్న)ఆవుకు ఆహారం పెట్టినవాడు స్వర్గానికి వెళ్తాడు. ఎవరి ఇంట్లో ఆవులు బాధలు పడుతుంటాయో, ఆ మానవుడు నరకానికి వెళ్తాడు.

పరగోగ్రాసదస్స్వర్గీ గోహితో బ్రహ్మలోకభాక్ ।
గోదానాత్కీర్తనాద్రక్షాం కృత్వా చోద్ధరతే కులమ్ ॥5॥

ఇతరుల ఆవులకు ఆహారం పెట్టినవాడు స్వర్గానికి వెళ్తాడు. ఆవులకు మేలు చేసినవాడు బ్రహ్మలోకానికి వెళ్లడానికి యోగ్యుడవుతాడు. ఆవును దానం చేయడంచేతనూ, ఆవును కాపాడడంవలననూ తన వంశం మొత్తాన్ని నరకలోకాలనుండి ఉద్ధరిస్తాడు.

గవాం శ్వాసాత్పవిత్రాభూస్స్పర్శనాత్ కిల్బిషక్షయః ॥6॥

ఆవు శ్వాస తగిలిననేల పవిత్ర మవుతుంది. ఆవును తాకితే పాపాలు నశిస్తాయి.

గోమూత్రం గోమయం సర్పిః క్షీరం దధి కుశోదకమ్ ।
ఏకరాత్రోపవాసశ్చ శ్వపాకమపి శోధయేత్ ॥
సర్వాశుభవినాశాయ పురా చరితమీశ్వరైః ॥7॥

ఆవు మూత్రం, ఆవుపేడ, ఆవునెయ్యి, ఆవుపాలు, ఆవుపెరుగు, దర్భకొసలమీద నుండి జారిననీళ్లు, తీసుకుని రాత్రి ఉపవాసం చేస్తే చండాలుడు కూడా పవిత్రుడవుతాడు. సమస్తమైన అశుభాలను తొలగించుకోవడానికి పూర్వం దేవతలు కూడ ఇలాగే చేశారు.

ప్రత్యేకం చ త్ర్యహాభ్యస్తం మహాసాన్తపనం స్మృతమ్ ।
సర్వకామప్రదం చైతత్ సర్వాశుభవిమర్దనమ్ ॥8॥

పైన చెప్పినవిధంగా వరుసగా మూడురోజులు చేస్తే, దానిని మహాసాంతపనవ్రతం అంటారు. ఈ వ్రతం అన్నికోరికలనూ నెరవేరుస్తుంది. అన్నిరకాలయిన కీడులనూ నాశనం చేస్తుంది.

కృచ్ఛ్రాతికృచ్ఛ్రం పయసా దివసానేకవింశతిమ్ ।
నిర్మలాస్సర్వకామాప్త్యా స్వర్గగాస్స్యుర్నరోత్తమాః ॥9॥

ఇరవైఒక్కరోజులపాటు ఆవుపాలు మాత్రమే ఆహారంగా తీసుకుంటూ, కృచ్ఛ్రం, అతికృచ్ఛ్రం అనే వ్రతాలు ఆచరించిన మానవోత్తములు పాపాలు నశించి, సమస్తమైన కోరికలు నెరవేరి, చివరికి స్వర్గానికి వెళ్తారు.

త్ర్యహముష్ణం పిబేన్మూత్రం త్ర్యహముష్ణం ఘృతం పిబేత్ ।
త్ర్యహముష్ణం పయః పీత్వా వాయుభక్షః పరం త్ర్యహమ్ ॥
తప్తకృచ్ఛ్రవ్రతం సర్వపాపఘ్నం బ్రహ్మలోకదమ్ ॥10॥

మూడురోజులు వెచ్చగా ఉన్న ఆవుమూత్రం తాగాలి. మరొకమూడురోజులపాటు వెచ్చగా ఉన్న ఆవునెయ్యి తాగాలి. తరువాత మూడురోజులు వేడిగా ఉన్నపాలు తాగాలి. మూడురోజులు గాలి మాత్రమే ఆహారంగా పుచ్చుకోవాలి. ఇలా చేసిన దానిని తప్తకృచ్ఛ్రవ్రతం అంటారు. ఈ వ్రతం ఆచరించినవాడికి పాపాలన్నీ నశిస్తాయి. బ్రహ్మలోకనివాసం సిద్ధిస్తుంది.

శీతైస్తు శీతకృచ్ఛ్రం స్యాద్బ్రహ్మోక్తం బ్రహ్మలోకదమ్ ॥11॥

వేడిగా ఉన్న పైవస్తువులను చల్లబరిచి పుచ్చుకుంటే ఆవ్రతం శీతకృచ్ఛ్రం అవుతుంది. బ్రహ్మదేవుడు ఉపదేశించిన ఈవ్రతం బ్రహ్మలోకనివాసాన్ని కలిగిస్తుంది.

గోమూత్రేణాచరేత్ స్నానం వృత్తిం కుర్యాచ్చ గోరసైః ।
గోభిర్వ్రజేచ్చ భుక్తాసు భుఞ్జీతాథ చ గోవ్రతీ ॥
మాసేనైకేన నిష్పాపో గోలోకీ సగణో భవేత్ ॥12॥

ఆవు మూత్రంతో స్నానం చేయాలి. గోరసంతో జీవితం సాగించాలి. ఆవులతో కలిసి తిరగాలి. ఆవులతో పాటు భోజనం చేయాలి. ఇలా చేయడాన్ని గోవ్రతం అంటారు. గోవ్రతాన్ని నెలరోజులపాటు ఆచరించిన వాడి పాపాలన్నీ నశించిపోతాయి. అతడు తన వారందరితో కలిసి గోలోకానికి వెళ్తాడు.

విద్యాం చ గోమతీం జప్త్వా గోలోకం పరమం వ్రజేత్ ।
గీతైర్నృత్యైరప్సరోభిర్విమానే తత్ర మోదతే ॥13॥

గోమతి అనేవిద్యను జపించినవాడు సర్వోత్తమమైన గోలోకానికి వెళ్తాడు. అక్కడ విమానంలో గానాలతో, నాట్యాలతో ఆనందిస్తాడు.

గావస్సురభయో నిత్యం గావో గుగ్గులగన్ధికాః ।
గావః ప్రతిష్ఠా భూతానాం గావస్స్వస్త్యయనం పరమ్ ॥14॥

ఆవులు ఎల్లప్పుడూ సురభిలాగా కామధేనువులు. ఆవులు గుగ్గిలం వంటి పరిమళం కలిగి ఉంటాయి. ఆవులు సమస్తమైన భూతాలనూ స్థిరంగా నిలుపుతాయి.

అన్నమేవ పరం గావో దేవానాం హవిరుత్తమమ్ ।
పావనం సర్వభూతానాం క్షరన్తి చ వహన్తి చ ॥15॥

ఆవులే పాలు మొదలైనరూపంలో అందరికీ ఉత్తమమైన ఆహారం అవుతున్నాయి. ఉత్తమహవిస్సులై, దేవతలకు కూడా ఆహారం అవుతున్నాయి. ఆవులు అన్నిభూతాలనూ పవిత్రం చేసే పాలనూ, మూత్రాన్నీ స్రవిస్తాయి. పవిత్రద్రవ్యాలను వహిస్తాయి.

హవిషామన్త్రపూతేన తర్పయన్త్యమరాన్దివి ।
ఋషీణామగ్నిహోత్రేషు గావో హోమేషు యోజితాః ॥16॥

వేదమంత్రాలతో పవిత్రమైనహవిస్సుతో స్వర్గంలో ఉన్న దేవతలను (భూలోకంనుండే) ఆవులు తృప్తిపరుస్తాయి. మహర్షులు అగ్నిహోత్రాలలో గోవులనుండి లభించిన పదార్థాలనే హవిస్సులుగా హోమంలో ఉపయోగిస్తారు.

సర్వేషామేవ భూతానాం గావశ్శరణముత్తమమ్ ।
గావః పవిత్రం పరమం గావో మాఙ్గల్యముత్తమమ్ ॥17॥

చరాచరభూతాలన్నిటికీ ఆవులే శ్రేష్ఠమైన ఆధారం. ఆవులు మిక్కిలిపవిత్రమైనవి. ఆవులు అత్యంత శుభప్రదాలు.

గావస్స్వర్గస్య సోపానం గావో ధన్యాస్సనాతనాః ॥18॥

ఆవులు స్వర్గానికి మెట్లు. ఆవులు మిక్కిలి ధన్యమైనవి, సనాతనమైనవి.

నమో గోభ్యశ్శ్రీమతీభ్యస్సౌరభేయీభ్య ఏవ చ ।
నమో బ్రహ్మసుతాభ్యశ్చ పవిత్రాభ్యో నమో నమః ॥19॥

శ్రీమంతమైన ఆవులకు నమస్కారం. సురభి అనే కామధేనువు సంతానమైన ఆవులకు నమస్కారం. బ్రహ్మకుమారులైన ఆవులకు నమస్కారం. పవిత్రమైన ఆవులకు నమస్కారం.

బ్రాహ్మణాశ్చైవ గావశ్చ కులమేకం ద్విధాకృతమ్ ।
ఏకత్ర మన్త్రాస్తిష్ఠన్తి హవిరేకత్ర తిష్ఠతి ॥20॥

బ్రాహ్మణులు, ఆవులు ఇద్దరూ ఒకే కులానికి చెందినవాళ్లు. ఒకదానిలో (బ్రాహ్మణులలో) మంత్రాలు నిలిచి ఉన్నాయి. మరొకదానిలో (ఆవులలో) హవిస్సు ఉంది.

దేవబ్రాహ్మణగోసాధుసాధ్వీభిస్సకలం జగత్ ।
ధార్యతే వై సదా తస్మాత్ సర్వే పూజ్యతమా మతాః ॥21॥

ఈ లోకం అంతటినీ దేవతలు, బ్రాహ్మణులు, ఆవులు, సాధువులు, పతివ్రతలు నిరంతరం నిలిపి ఉంచుతున్నారు. అందుచేత ఇవి అన్నీ పూజింపదగిన అన్నింటిలోనూ శ్రేష్ఠమైనవి.

పిబన్తి యత్ర తత్తీర్థం గఙ్గాద్యా గావ ఏవ హి ।
గవాం మాహాత్మ్యముక్తం హి చికిత్సాం చ తథా శృణు ॥22॥

ఆవులు నీళ్లు తాగేస్థలాలు గంగ మొదలైన పుణ్యతీర్థాలు. ఆవులమహిమను చెప్పడం అయింది. ఇక ఆవులకు వచ్చే జబ్బులకు వైద్యం గురించి చెప్తాను. విను.

శృఙ్గామయేషు ధేనూనాం తైలం దద్యాత్ససైన్ధవమ్ ।
శృఙ్గవేరబలామాంసీకల్కసిద్ధం సమాక్షికమ్ ॥23॥

ఆవులకొమ్ములకు జబ్బు చేసినపుడు నువ్వులనూనెలో రాతిఉప్పు కలిపి ఇవ్వాలి. అల్లం (శృంగబేరం), చిట్టాముదం (బల), జటామాంసి, వీటితో చేసిన కషాయాన్ని తేనెతో కలిపి అయినా ఇవ్వవచ్చును.

కర్ణశూలేషు సర్వేషు మఞ్జిష్ఠా హిఙ్గుసైన్ధవైః ।
సిద్ధం తైలం ప్రదాతవ్యం రసేనైవానాథ వా పునః ॥24॥

అన్నిరకాలయిన చెవిపోటులకు మంజిడి, ఇంగువ, రాతిఉప్పు, వీటితో సిద్ధం చేసిన నువ్వులనూనెను ఇవ్వాలి. లేదా వెల్లుల్లి(రసం) కలిపిన నువ్వులనూనె అయినా ఇవ్వవచ్చు.

బిల్వమూలమపామార్గం ధాతకీ చ సపాటలా ।
కుటజం దన్తమూలేషు లేపా త్తచ్ఛూలనాశనమ్ ॥25॥

పన్నుపోటు తగ్గడానికి మారేడువేరు, ఉమ్మెత్త, ఏఋజాజి (ధాతకి), కలిగొట్టు (పాటల), అవిసె (కుటజం), వీటిలో ఏదయినా నూరి దంతాలమొదట్లో పూయాలి. వెంటనే ఆ నొప్పి తగ్గిపోతుంది.

దన్తశూలహరైర్ద్రవ్యైర్ఘృతం రామవిపాచితమ్ ।
ముఖరోగహరం జ్ఞేయం జిహ్వారోగేషు సైన్ధవమ్ ॥26॥

పన్నుపోటును పోగొట్టే పైవస్తువులను ఆవునేతిలో ఇంగువతో కలిపి ఉడికించి ఇస్తే నోటికి సంబంధించిన రోగాలు నయమవుతాయి. నాలుకకు సంబంధించిన రోగాలకు రాతిఉప్పు ఉపయోగించాలి.

శృఙ్గవేరం హరిద్రే ద్వే త్రిఫలా చ గలగ్రహే ॥27॥

గొంతు పట్టుకోవడం అనే రోగానికి శొంఠి, రెండురకాలయిన పసుపు, త్రిఫల ఉపయోగించాలి.

హృచ్ఛూలే బస్తిశూలే చ వాతరోగే క్షయే తథా ।
త్రిఫలా ఘృతమిశ్రా చ గవాం పానే ప్రశస్యతే ॥28॥

ఆవుల గుండెనొప్పికీ, మూత్రాశయానికి సంబంధించిన నొప్పికీ, వాతరోగానికీ, క్షయరోగానికీ త్రిఫలను ఆవునేతితో కలిపి ఇవ్వడం శ్రేష్ఠం.

అతీసారే హరిద్రే ద్వే పాఠాం చైవ ప్రదాపయేత్ ॥29॥

అతిసారం తగ్గడానికి రెండురకాలయినపసుపు, చిఱుబొద్ది ఇవ్వాలి.

సర్వేషు కోష్ఠరోగేషు తథా శాఖాగదేషు చ ।
శృఙ్గవేరం చ భార్గీం చ కాసే శ్వాసే ప్రదాపయేత్ ॥30॥

కడుపులోపలిభాగంలో వచ్చే అన్నిరోగాలకూ, బాహువులయందు వచ్చేరోగాలకూ శొంఠి, బారంగి ఇవ్వాలి. వీటిని ఉబ్బసానికీ, దగ్గుకూ కూడా ఇవ్వాలి.

దాతవ్యా భగ్నసన్ధానే ప్రియఙ్గుర్లవణాన్వితా ।
తైలం వాతహరం పిత్తే మధుయష్టీవిపాచితమ్ ॥31॥

విరిగిన ఎముకలు అతుక్కోవడానికి లవణంతో పిప్పళ్లు కలిపి నూరి పూయాలి. వాతరోగానికి (ఉబ్బసం) నువ్వులనూనె ఇవ్వాలి. పిత్తదోషం తగ్గడానికి చెరకురసాన్ని నూనెలో ఉడికించి ఇవ్వాలి.

కఫే వ్యోషం చ సమధు సపుష్టకరజోఽస్రజే ।
తైలాజ్యం హరితాలం చ భగ్నక్షతేశృతం దదేత్ ॥ 32॥

కఫానికి త్రికటుకాలను (సొంటి, పిప్పలి, మిరియాలు) తేనెతో కలిపి ఇవ్వాలి. రక్తానికి సంబంధించిన దోషాలు పోవడానికి అశ్వగంధ(పుష్టకం) పొడిని ఇవ్వాలి. పగుళ్లు, గాయాలు తగ్గడానికి నూనెలోనూ, నెయ్యిలోనూ వేయించిన హరిదళం ఇవ్వాలి.

మాషాస్తిలాస్సగోధూమాః పశుక్షీరం ఘృతం తథా ।
ఏషాం పిణ్డీ సలవణా వత్సానాం పుష్టిదా త్వియమ్ ॥33॥

మినుములు, నువ్వులు, గోధుమలు, ఆవు లేదా మేక మొదలైన జంతువులపాలు, నెయ్యి, వీటిని లవణంతో కలిపి ముద్దగా చేసి, దూడలకు పెడితే అవి బాగా పెరుగుతాయి.

బలప్రదా విషాణాం స్యాద్ గ్రహనాశాయ ధూపకః ॥34॥

కొన్ని రకాలయిన విషాలు తగుమాత్రంలో ఇవ్వడంవలన బలం కలుగుతుంది. బిగుసుకుపోవడం వంటిరోగాలకు ధూపం వేయాలి.

దేవదారు వచామాంసీ గుగ్గులు ర్హిఙ్గుసర్షపాః ।
గ్రహాదిగదనాశాయ ఏష ధూపో గవాం హితః ॥
ఘణ్టా చైవ గవాం కార్యా ధూపేనానేన ధూపితా ॥35॥

ఆవులకు గ్రహాలు మొదలైన వాటివలనవచ్చినజబ్బులు తగ్గడానికి దేవదారువు, వస, జటామాంసి, గుగ్గులు, ఇంగువ, ఆవాలు, – ఈ వస్తువులతో ధూపం వేస్తే, మేలు చేస్తుంది. ఈ వస్తువులతో ధూపం వేసిన గంటను కూడ ఆవులమెడలో కట్టాలి.

అశ్వగన్ధాతిలైశ్శుక్లం తేన గౌః క్షీరిణీ భవేత్ ।
రసాయనం చ పిణ్యాకం మత్తో యో ధార్యతే గృహే ॥36॥

అశ్వగంధను, నువ్వులను వెన్నలో కలిపి తినిపిస్తే, ఆవు సమృద్ధిగా పాలు ఇస్తుంది. ఇంట్లో బాగా మదించిన ఆబోతు ఉంటే, ఆవులకు ఇష్టమైన పదార్థాలతో తెలకపిండిని కలిపి పెట్టి పోషిస్తే బాగా మదిస్తుంది.

గవాం పురీషే పఞ్చమ్యాం నిత్యం శాన్త్యై శ్రియం యజేత్ ।
వాసుదేవం చ గన్ధాద్యైరపరా శాన్తిరుచ్యతే ॥37॥

గోశాంతి కోసం పంచమినాడు ఆవుపేడలో వాసుదేవుడిని, లక్ష్మీదేవిని స్థాపించి, గంధం మొదలైనవాటితో పూజించాలి.

అశ్వయుక్శుక్లపక్షస్య పఞ్చదశ్యాం యజేద్ధరిమ్ ।
హరిం రుద్రమజం సూర్యం శ్రియమగ్నిం ఘృతేన చ ॥38॥

ఆశ్వయుజమాసం శుక్లపక్షంలో పూర్ణిమనాడు శ్రీమహావిష్ణువును పూజించాలి. విష్ణువును, రుద్రుడిని, బ్రహ్మను, సూర్యుడిని, లక్ష్మిని, అగ్నిని, ఆవునేతితో పూజించాలి.

దధి సమ్ప్రాశ్య గాః పూజ్యాః కార్యా వహ్నిప్రదక్షిణాః ।
వృషాణాం యోజయేద్యుద్ధం గీతవాద్యరవైర్బహిః ॥39॥

పెరుగు తిని, ఆవులను పూజించాలి. అగ్నికి ప్రదక్షిణలు చేయాలి. ఎద్దులకు యుద్ధాలు (బలపరీక్షలు) పెట్టాలి. ఆ సమయంలో వెలుపల పాటలు, వివిధవాద్యాలు మిక్కుటంగా ధ్వనించాలి.

గవాం తు లవణం దేయం బ్రాహ్మణానాం చ దక్షిణాః ।
నైమిత్తికే మాకరాదౌ యజేద్విష్ణుం సహ శ్రియా ॥
స్థణ్డిలేఽబ్జే మధ్యగతే దిక్షు కేసరగాన్సురాన్ ॥40॥

ఆవులకు లవణం పెట్టాలి. బ్రాహ్మణులకు దక్షిణలు ఇవ్వాలి. మకరసంక్రమణం మొదలైన పర్వదినాలలో నేలమీద (స్థండిలంలో) తామరపూవును చిత్రించి, దానిమధ్యలో లక్ష్మీదేవితో సహా శ్రీమహావిష్ణువును స్థాపించి, పూజించాలి. తామరపూవులోని కేసరాలమీద అన్నిదిక్కులలోనూ దేవతలను స్థాపించి పూజించాలి.

సుభద్రాజో రవిః పూజ్యో బహురూపో బలిర్బహిః ।
ఖం విశ్వరూపా సిద్ధిశ్చ బుద్ధిశ్శాన్తిశ్చ రోహిణీ ॥
దిగ్ధేనవో హి పూర్వాద్యాః కేసరైశ్చన్ద్ర ఈశ్వరః ॥41॥

తామరపూవుకు వెలుపలి భాగంలో కేసరాల మీద మిక్కిలి శుభప్రదుడైన బ్రహ్మ, సూర్యుడు, బహురూపుడు, బలి, ఆకాశం, విశ్వరూపులు, సిద్ధి, బుద్ధి, శాంతి, రోహిణి, తూర్పు మొదలైన దిక్కులకు సంబంధించిన దిగ్ధేనువులు, చంద్రుడు, శివుడు – వీరిని పూజించాలి.

దిక్పాలాః పద్మపత్రేషు కుమ్భేష్వగ్నౌ చ హోమయేత్ ।
క్షీరవృక్షస్య సమిధస్సర్షపాక్షతతణ్డులాన్ ॥42॥

కలశంలోని తామరపూవు రేకులమీద దిక్పాలకులను పూజించాలి. పాలు గారే చెట్ల సమిధలు, ఆవాలు, అక్షతలు, బియ్యం హోమం చేయాలి.

శతం శతం సువర్ణం చ కాంస్యాదికం ద్విజే దదేత్ ।
గావః పూజ్యా విమోక్తవ్యా శ్శాన్త్యై క్షీరాదిసంయుతాః ॥43॥

బ్రాహ్మణులకు ఒక్కొక్కరికి వంద సువర్ణనాణాలు, కంచుపాత్రలు మొదలైనవి దానం చేయాలి. ఆ తరువాత పాలు మొదలైన వాటితో కూడిన ఆవులను పూజించాలి. పిదప శాంతికోసం ఆ ఆవులను విడిచిపెట్టాలి.

అగ్ని రువాచ – వశిష్ఠమహర్షితో అగ్నిదేవుడు ఇలా చెప్తున్నాడు.

శాలిహోత్రస్సుశ్రుతాయ హయాయుర్వేదముక్తవాన్ ।
పాలకాప్యోఽఙ్గరాజాయ గజాయుర్వేదమబ్రవీత్ ॥44॥

వసిష్ఠమహర్షీ! శాలిహోత్రుడు సుశ్రుతుడికి అశ్వాయుర్వేదం చెప్పాడు. పాలకాప్యుడు అంగరాజుకు గజాయుర్వేదం చెప్పాడు.

ఇత్యాది మహాపురాణే ఆగ్నేయే గవాయుర్వేదకథనం నామ ద్వినవత్యధికద్విశతతమోఽధ్యాయః ॥292॥

అగ్నిమహాపురాణంలో గవాయుర్వేదకథనం అనే రెండువందల తొంబైరెండవ అధ్యాయం సమాప్తం.



త్రినవత్యధికద్విశతతమోఽధ్యాయః – రెండువందల తొంబైమూడవ అధ్యాయం

మంత్రపరిభాషాకథనమ్ – మంత్రపరిభాషాకథనం

అగ్నిరువాచ – వసిష్ఠమహర్షితో అగ్నిదేవుడు ఇలా చెప్తున్నాడు.

మన్త్రవిద్యామహం వక్ష్యే భుక్తిముక్తిప్రదం శృణు ॥1॥

వసిష్ఠా! ఇపుడు నేను మంత్రవిద్యను గురించి చెప్తాను, విను. ఈ మంత్రవిద్య భోగాలనూ, మోక్షాన్నీ ఇస్తుంది.

వింశత్యర్ణాధికా మన్త్రా మాలామన్త్రా స్స్మృతా ద్విజ ।
దశాక్షరాధికా మన్త్రా స్తదర్వాగ్బీజసంజ్ఞితాః ॥2॥

విప్రోత్తమా! ఇరవైకంటె ఎక్కువ వర్ణాలు ఉన్నమంత్రాలు మాలామంత్రాలు అని చెప్పబడ్డాయి. పదికంటె ఎక్కువ (ఇరవైకంటె తక్కువ) అక్షరాలు ఉన్న దానిని మంత్రం అంటారు. పదికంటె తక్కువ అక్షరాలు ఉంటే దానిని బీజం అంటారు.

వార్ధక్యే సిద్ధిదా హ్యేతే మాలామన్త్రాస్తు యౌవనే ।
పఞ్చాక్షరాదికా మన్త్రాస్సిద్ధిదాస్సర్వదా పరమ్ ॥3॥

ఇవి (మంత్రాలు, బీజాలు) ముసలితనంలో సిద్ధిని ఇస్తాయి. మాలామంత్రాలు యౌవనకాలంలో సిద్ధి నిస్తాయి. పంచాక్షరి మొదలైన మంత్రాలు ఎప్పుడూ ఉత్తమమైన సిద్ధి నిస్తాయి.

స్త్రీపుంనపుంసకత్వేన త్రిధా స్యుర్మన్త్రజాతయః ।
స్త్రీమన్త్రా వహ్నిజాయాన్తా నమోఽన్తా శ్చ నపుంసకాః ॥4॥

స్త్రీమంత్రాలు, పురుషమంత్రాలు, నపుంసకమంత్రాలు అని మంత్రాలు మూడుజాతులుగా ఉన్నాయి. చివర 'స్వాహా' అనే శబ్దం కలిగినవి స్త్రీమంత్రాలు. చివర 'నమః' అనే శబ్దం కలిగినవి నపుంసకమంత్రాలు.

శేషాః పుమాంసస్తే శస్తా వశ్యోచ్చాటనకేషు చ ।
క్షుద్రక్రియామయధ్వంసే స్త్రియోఽన్యత్ర నపుంసకాః ॥5॥

మిగిలినవి పురుషమంత్రాలు. ఇవి ఇతరులను తనవశం చేసుకోవడంలోను, శత్రువులను దూరంగా తోసివేయడంలోనూ మిక్కిలి ప్రశస్త మైనవి. క్షుద్రకర్మలలోనూ, రోగాలను తగ్గించడంలోనూ స్త్రీమంత్రాలు శ్రేష్ఠం. నపుంసకమంత్రాలు ఇతరకార్యాలకు ఉపయోగిస్తాయి.

మన్త్రావాగ్నేయసౌమ్యాఖ్యౌ తారాద్యన్తార్ధయో ర్జపేత్ ।
తారాన్త్యాగ్నివియత్ప్రాయో మన్త్ర ఆగ్నేయ ఇష్యతే ॥
శిష్ట స్సౌమ్యాః ప్రశస్తా తే కర్మణోః క్రూరసౌమ్యయోః ॥6॥

ఆగ్నేయాలు, సౌమ్యాలు అని మంత్రాలు తిరిగి రెండువిధాలు. ఓంకారం మొదట కలిగినవి ఆగ్నేయమంత్రాలు. ఓంకారం చివర కలిగినవి సౌమ్యమంత్రాలు. ఇలా రెండువిధాలుగా ఉన్న ఆగ్నేయసౌమ్యమంత్రాలు జపించదగినవి. ఓంకారం (తారం), అంత్యం (క్షకారం), రేఫం (అగ్నిబీజం), హకారం (ఆకాశబీజం) కలిగినది ఆగ్నేయం అవుతుంది. దీనికి భిన్నమైనది సౌమ్యమంత్రం. ఆగ్నేయమంత్రాలు క్రూరకర్మలవిషయంలోనూ, సౌమ్యమంత్రాలు సౌమ్యకర్మలవిషయంలోనూ జపించడానికి శ్రేష్ఠమైనవి.

ఆగ్నేయమన్త్రస్సౌమ్య స్స్యాత్ ప్రాయశోఽన్తే నమోఽన్వితః ।
సౌమ్యమన్త్ర స్తథాగ్నేయః ఫట్కారేణాన్తతో యుతః ॥7॥

ఆగ్నేయమంత్రం చివర 'నమః' అనే శబ్దాన్ని చేర్చడంవలన, అది సాధారణంగా సౌమ్యమంత్రం అవుతుంది. అదే విధంగా సౌమ్యమంత్రానికి చివర 'ఫట్' అనే శబ్దం చేర్చడంవలన అది ఆగ్నేయమంత్రం అవుతుంది.

సుప్తః ప్రబుద్ధమాత్రో వా మన్త్ర స్సిద్ధిం న యచ్ఛతి ।
స్వాపకాలో మహాబాహో జాగరో దక్షిణావహః ॥
ఆగ్నేయస్య మనో స్సౌమ్యమన్త్రస్యైతద్విపర్యయాత్ ॥8॥

నిద్రావస్థలో ఉన్నా, అపుడే మేల్కాంచిన స్థితిలో ఉన్నా, ఆగ్నేయమంత్రం సిద్ధిని ఇవ్వదు. ఆగ్నేయమంత్రానికి వామనాడిలో సంచరించే స్థితి నిద్రాసమయం. దక్షిణనాడిలో సంచరించే సమయం మేలుకొనిఉన్న స్థితి. దీనికి వ్యతిరేక మయిన విధానంలో ఉండడం సౌమ్యమంత్రానికి నిద్రా, జాగరస్థితులు అవుతాయి.

ప్రబోధకాలం జానీయా దుభయో రుభయో రహః ॥9॥

వామదక్షిణనాడులు రెండు సంచలించే సమయం ఆగ్నేయ, సౌమ్యమంత్రాలు రెండింటికీ జాగరకాలం అని తెలుసుకోవాలి.

దుష్టర్క్షరాశివిద్వేషివర్ణాదీన్ వర్జయేన్మనూన్ ।
రాజ్యలాభోపకారాయ ప్రారభ్యారిస్స్వరః కురూన్ ॥10॥

చెడ్డనక్షత్రాలు, చెడ్డరాసులు, శత్రుజాతికి చెందినఅక్షరాలు కలిగినమంత్రాలను విడిచిపెట్టాలి (జపించరాదు). రాజ్యం లభించడానికి గాని, ఇతరులకు మేలు జరగడంకోసం కానీ, శత్రుజాతికి చెందిన అచ్చులతో ప్రారంభమైన మంత్రం జపం చేయవచ్చును.

గోపాలకకుటీం ప్రాయా త్పూర్ణామిత్యుదితా లిపిః ।
నక్షత్రేషు క్రమాద్యోజ్యౌ స్వరాన్త్యౌ రేవతీ యుజౌ ॥11॥

గోపాలకకుటీం ప్రాయాత్ పూర్ణాం అనేదానితో లిపి ఏర్పడింది. ఈవర్ణాలను క్రమంగా అశ్విని మొదలైన నక్షత్రాలతో కలపాలి. అం, అః అనే రెండుఅచ్చులు (అనుస్వారం, విసర్గ) మాత్రం రేవతీనక్షత్రంతో కలిసి ఉంటాయి.

వేలా గురుస్స్వరాశ్శోణః కర్మణైవేతి భేదితాః ।
లిప్యర్ణావశిషు జ్ఞేయా షష్ఠే శాదీంశ్చ యోజయేత్ ॥12॥

వేలా మొదలైన సంఖ్యలలో విభక్త మైన అచ్చులు మేషం మొద లైన రాశులలో ఉంటాయి అని గ్రహించాలి. శ మొదలైన అక్షరాలు ఆరవదైన కన్యారాశిలో కలపాలి. క్షకారం మీనరాశిలో చేర్చాలి. (దీనిఅర్థం తద్జ్ఞులు వివరించాలి)

లిపౌ చతుష్పథస్థాయా మాఖ్యా వర్ణపదాన్తరా ।
సిద్ధాస్సాధ్యా ద్వితీయస్థా స్సుసిద్ధా వైరిణః పరే ॥13॥

చతుష్కోణంలో ఉన్న ప్రథమకోష్ఠంలోని నాలుగు పంక్తులు సిద్ధాలు. రెండవ కోణంలో ఉన్న నాలుగు పంక్తులు సాధ్యాలు. మూడవ కోష్ఠంలో ఉన్న నాలుగు పంక్తులు సుసిద్ధాలు. మిగిలినవి – నాలుగవ కోష్ఠంలోని పంక్తులు వైరులు.

సిద్ధాదీన్ కల్పయేదేవం సిద్ధోఽ త్యన్తగుణైరపి ।
సిద్ధే సిద్ధో జపాత్సాధ్యో జపపూజా హుతాదినా ॥14॥

సిద్ధం మొదలైనవాటిని ఈమార్గంలో కల్పించుకోవాలి. వీటిలో సిద్ధం మిక్కిలి గుణవంతమైనది. జపించడం వలన మాత్రమే సిద్ధమంత్రం సిద్ధిస్తుంది. సాధ్యమైన మంత్రం జపం, పూజ, హోమం మొదలైన వాటిచేతసిద్ధిస్తుంది.

సుసిద్ధో ధ్యానమాత్రేణ సాధకం నాశయే దరిః ।
దుష్టార్ణప్రచురో యస్స్యాన్మన్త్రస్సర్వవిన్దితః ॥15॥

సుసిద్ధమైన మంత్రం ధ్యానం చేయడంచేత మాత్రమే సిద్ధిస్తుంది. అరిమంత్రం ఆ మంత్రాన్ని సాధన చేసేవాడిని నాశనం చేస్తుంది. దుష్టమైన వర్ణాలు అధికంగా కలిగిన మంత్రాన్ని అందరూ నిందిస్తారు.

ప్రవిశ్య విధివద్దీక్షా మభిషేకావసానికామ్ ।
శ్రుత్వా తన్త్రం గురోర్లబ్ధం సాధయేదీప్సితం మనుమ్ ॥16॥

అభిషేకంతో ముగిసే మంత్రదీక్షను శిష్యుడు యథావిధిగా గురువునుండి స్వీకరించాలి. గురువు చెప్పినవిధంగా మంత్రసాధన విధానాన్ని విని, మంత్రసాధన ప్రారంభించాలి. ఇలా చేయడంద్వారా శిష్యుడు ఇష్ట మైనమంత్రాన్ని సాధనతో సిద్ధింపజేసుకోవాలి.

ధీరో దక్ష శ్శుచి ర్భక్తో జపధ్యానాదితత్పరః ।
సిద్ధస్తపస్వీ కుశల స్తన్త్రజ్ఞస్సత్యభాషణః ॥
నిగ్రహానుగ్రహే శక్తో గురురిత్యభిధీయతే ॥17॥

అచంచలమైన దీక్ష, సాధనలో నేర్పు, భక్తి కలిగినవాడు, జపించడంలోనూ, ధ్యానించడంలోనూ ఏకాగ్రత కలిగినవాడు, మంత్రసిద్ధిని పొందినవాడు, తపోనిరతుడు, రహస్యాలు తెలిసినవాడు, విధానం గ్రహించినవాడు, సత్యమే పలికేవాడు, దుష్టులను నిగ్రహించడానికీ, యోగ్యులను అనుగ్రహించడానికీ తగినసామర్థ్యం కలిగినవాడు– ఇటువంటివాడిని గురువు అంటారు.

శాన్తో దాన్తః పటుశ్చీర్ణః బ్రహ్మచర్యో హవిష్యభుక్ ।
కుర్వన్నాచార్యశుశ్రూషాం సిద్ధోత్సాహీ స శిష్యకః ॥18॥

అంతరింద్రియాలనూ బాహ్యేంద్రియాలనూ అదుపులో ఉంచుకున్నవాడు, దృఢమైన పట్టుదల కలిగినవాడు, నేర్పు కలిగినవాడు, బ్రహ్మచర్యనియమం పాటించేవాడు, హవిష్యాన్ని మాత్రమే భుజించేవాడు, గురువు మాట వినేవాడు, మంత్రం సిద్ధింపజేసుకోవడంలో ఉత్సాహం కలిగినవాడు – ఇటువంటివాడు శిష్యుడు అవుతాడు.

స తూపదేశ్యః పుత్రశ్చ వినయీ వసుదస్తథా ।
మన్త్రం దద్యాత్సుసిద్ధో తు సహస్రం దేశికో జపేత్ ॥19॥

కన్నకొడుకయినా ఈ లక్షణాలు కలిగినవాడికి మాత్రమే గురువు మంత్రోపదేశం చేయాలి. పిదప శిష్యుడు వినయంతో గురువుకు దక్షిణ ఇవ్వాలి. తాను చక్కగా సిద్ధింపజేసుకున్న మంత్రాన్ని మాత్రమే గురువు శిష్యులకు ఉపదేశించాలి. మంత్రం ఉపదేశించడానికి ముందు గురువు ఆ మంత్రాన్ని వేయిమార్లు జపించాలి.

యదృచ్ఛయా శ్రుతం మన్త్రం ఛలేనాథ బలేన వా ।
పత్రే స్థితం చ గాథాం చ జనయే ద్యద్యనర్థకమ్ ॥20॥

యథాలాపంగా విన్నది కానీ, మోసం చేసి కానీ, బలవంతం చేసి కానీ పొందినదీ, ఆకులలో వ్రాసిఉన్నది చదివి కానీ, కథలలో ఉన్నది కానీ, అయిన మంత్రాన్ని జపిస్తే, నష్టం కలుగుతుంది. (మంత్రం సిద్ధించాలంటే గురువువద్ద తప్పక ఉపదేశం పొందాలి.)

మన్త్రం యస్సాధయే దేకం జపహోమార్చనాదిభిః ।
క్రియాభిర్భూరిభిస్తస్య సిధ్యన్తే స్వల్పసాధనాత్ ॥21॥

మంత్రాన్ని ప్రధానంగా జపించడంచేతనూ, హోమం చేయడంచేతనూ, అర్చించడంచేతనూ, ఇంకా పెద్ద పెద్ద కర్మలచేతనూ సాధన చేసేవాడికి, కొద్దిసాధనతోనే (కొద్దికాలంలోనే) ఆ మంత్రం సిద్ధిస్తుంది.

సమ్యక్సిద్ధైకమన్త్రస్య నాసాధ్యమిహ కిఞ్చన ।
బహుమన్త్రవతః పుంసః కా కథా శివ ఏవ సః ॥22॥

చక్కనిసాధనతో ఒక్కమంత్రమయినా, సిద్ధింపజేసుకున్నవాడికి ఈలోకంలో సాధ్యం కానిదంటూ, ఏమీ లేదు. ఇంక అనేకమంత్రాలను సిద్ధింపజేసుకున్నవాడిని గురించి చెప్పడానికి ఏముంటుంది? అతడు సాక్షాత్తుగా పరమశివుడే.

దశలక్షజపా దేకవర్ణో మన్త్రః ప్రసిధ్యతి ।
వర్ణవృద్ధ్యా జపహ్రాస స్తేనాన్యేషాం సమూహయేత్ ॥23॥

ఒకే అక్షరం కలిగినమంత్రాన్ని పదిలక్షలసార్లు జపిస్తే, ఆమంత్రం చక్కగా సిద్ధిస్తుంది. మంత్రంలో అక్షరాలు పెరిగినకొద్దీ, జపంచేసే సంఖ్య తగ్గిపోతుంది. అందుచేత మంత్రసిద్ధికై మంత్రంలో ఉండవలసిన అక్షరాలను గురించి ఈక్రమంలో ఊహించుకోవాలి.

బీజాద్విత్రిగుణాన్మన్త్రాన్ మాలామన్త్రే జపక్రియా ।
సంఖ్యానుక్తౌ శతం సాష్టం సహస్రం వా జపాదిషు ॥24॥

బీజమంత్రాలకంటె మాలామంత్రాలను రెండు లేదా మూడురెట్లు అధికంగా జపించాలి. జపసంఖ్య నిర్దేశించనపుడు నూటయెనిమిది సార్లు లేదా వేయిసార్లు జపించాలి. హోమతర్పణాదులలో కూడ ఇంతే.

జపాద్దశాంశం సర్వత్ర సాభిషేకం హుతం విదుః ।
ద్రవ్యానుక్తౌ ఘృతం హోమే జపేఽశక్తస్య సర్వతః ॥25॥

మంత్రాన్ని జపించిన సంఖ్యలో పదవవంతు సంఖ్యలో తర్పణం చేయాలి. ఆసంఖ్యలో పదవవంతు హోమం చేయాలి. హోమం చేయడానికి ఏద్రవ్యం ఉపయోగించాలో ప్రత్యేకంగా నిర్దేశించనపుడు ఆవునేతితో హోమం చేయాలి. హోమం చేయడానికి శక్తి లేనివాడు ఆసంఖ్యలో తిరిగి జపమే చేయాలి.

మూలమన్త్రాద్దశాంశస్స్యా దఙ్గాదీనాం జపాదికమ్ ।
జపాత్సశక్తిమన్త్రస్య కామదా మన్త్రదేవతాః ॥26॥

ప్రధానమంత్రంలో పదవవంతు సంఖ్యలో అంగమంత్రాలకు కూడ జపం హోమం మొద లైనవి చేయాలి. శక్తిమంతమైన మంత్రాలను జపించడంద్వారా ఆమంత్రానికి అధిష్ఠానదేవతలు జపించినవాడికి కోరికల నిస్తారు.

సాధకస్య భవేత్తృప్తా ధ్యానహోమార్చనాదినా ॥27॥

సాధకులు చేసిన జపం, హోమం, అర్చనం మొదలైన వాటివలన ఆమంత్రాధిష్ఠానదేవతలు సంతృప్తి చెందుతారు.

ఉచ్చైర్జపాద్విశిష్టస్స్యా దుపాంశుర్దశభి ర్గుణైః ।
జిహ్వాజపే శతగుణ స్సహస్రో మానసస్స్మృతః ॥28॥

పైకి పెద్దగా ఉచ్చరిస్తూ చేసినజపంకంటె పెదవులు కదిలిస్తూ, శబ్దం వినబడకుండా చేసినజపం పదిరెట్లు గొప్పది. (పదిరెట్లు ఎక్కువ ఫలితాన్ని ఇస్తుంది.) పెదవులు కూడ కదలకుండా నాలుక మాత్రమే కదులుతూ ఉండేవిధంగా చేసినజపం వందరెట్లు గొప్పది. ఏఅవయవమూ కదలకుండా, నిశ్చలంగా ఉండి, మనస్సుతో చేసినజపం వెయ్యిరెట్లు అధికమైన ఫలితాన్ని ఇస్తుంది.

ప్రాఙ్ముఖోఽ వాఙ్ముఖో వాఽ పి మన్త్రకర్మ సమారభేత్ ।
ప్రణవాద్యాస్సర్వమన్త్రా వాగ్యతో విహితాసనః ॥29॥

తూర్పుముఖంగా కాని, లేదా దక్షిణముఖంగా కాని కూర్చుండి మంత్రం జపించాలి. ఓంకారం మొదట కలిగిన మంత్రాలన్నింటినీ జపించాలి. జపసమయంలో మాటను నియమించుకోవాలి (మౌనంగా ఉండాలి). జపం సిద్ధించడానికి తగిన ఆసనంలో కూర్చోవాలి.

ఆసీనస్తు జపేన్మన్త్రాన్ దేవతాచార్యతుల్యదృక్ ।
కుటీ వివిక్తా దేశాస్స్యు ర్దేవాలయనదీహ్రదాః ॥30॥

(తగిన ఆసనంమీద) కూర్చుండి మాత్రమే మంత్రం జపించాలి. మంత్రాధిష్ఠానదేవతనూ, మంత్రం ఉపదేశించిన గురువునూ సమానదృష్టితో చూస్తూ జపం చేయాలి. మంత్రం జపించడానికి, పర్ణశాలలు, జనం సంచరించని ఏకాంతప్రదేశాలు, దేవాలయాలు, నదులు, జలాశయాలతీరాలు ఉత్తమమైనవి.

సిద్ధ్యై యవాగూ పూపైర్వా పయో భక్ష్యం హవిష్యకమ్ ।
మన్త్రస్య దేవతా తావత్ తిథివారేషు వై జపేత్ ॥31॥

మంత్రం సిద్ధించడానికి సాధకుడు యవధాన్యపుగంజి కాని, అప్పాలు గాని, పాలు గాని, హవిష్యాన్నం గాని ఆహారంగా తీసుకోవాలి. తాను జపించే మంత్రానికి అధిష్ఠానదేవతకు ప్రియమైన తిథివారాలలో జపంచేయాలి.

కృష్ణాష్టమీ చతుర్దశ్యో గ్రహణాదౌ చ సాధకః ।
దస్రౌ యమోఽనలో ధాతా శశీ రుద్రో గురుర్దితిః ॥32॥

కృష్ణపక్షంలో అష్టమి, చతుర్దశి తిథులలోనూ, గ్రహణం మొద లైన సందర్భాలలోనూ మంత్రం జపించాలి. అశ్విని మొద లైన నక్షత్రాలకు వరుసగా అధిదేవతలు ఇలా ఉన్నారు. అశ్వినీదేవతలు (అశ్వినీనక్షత్రం), యముడు (భరణి), అగ్ని (కృత్తిక), ధాత (రోహిణి), చంద్రుడు (మృగశిర), రుద్రుడు (ఆర్ద్ర), బృహస్పతి (పుష్యమి), (అ)దితి (పునర్వసు),

సర్పాః పితరోఽథ భగోఽర్యమా శీతేతరద్యుతిః ।
త్వష్టా మరుత ఇన్ద్రాగ్నీ మిత్రేన్ద్రౌ నిరృతి ర్జలమ్ ॥33॥

సర్పాలు (ఆశ్లేష), పితృదేవతలు (మఘ), భగుడు (పూర్వఫల్గుణి), అర్యముడు (ఉత్తరఫల్గుణి), సూర్యుడు (హస్త), త్వష్ట (చిత్ర), వాయువు (స్వాతి), ఇంద్రాగ్నులు (విశాఖ), మిత్రుడు (అనూరాధ), ఇంద్రుడు (జ్యేష్ఠ), నిరృతి (మూల), జలం (పూర్వాషాఢ),

విశ్వేదేవా హృషీకేశో వాసవ స్సలిలాధిపః ।
అజైకపా దహిర్బుధ్న్యః పూషాశ్విన్యాదిదేవతాః ॥34॥

విశ్వేదేవతలు (ఉత్తరాషాఢ), విష్ణువు (శ్రవణం), వసువులు (ధనిష్ఠ), వరుణుడు (శతభిషం), అజైకపాత్తు (పూర్వాభాద్ర), అహిర్బుధ్న్యుడు (ఉత్తరాభాద్ర), పూషుడు (రేవతి), వీళ్లు క్రమంగా అశ్విని మొదలైన నక్షత్రాలకు అధిదేవతలు.

అగ్నిర్దస్రావుమావిఘ్నౌ నాగశ్చన్ద్రో దివాకరః ।
మాతృదుర్గా దిశా మీశః కృష్ణో వైవస్వత శ్శివః ॥
పఞ్చదశ్యాశ్శశాఙ్కస్తు పితరస్తిథిదేవతాః ॥35॥

పాడ్యమినుండి చతుర్దశివరకు ఉన్న తిథులకు అగ్ని, అశ్వినీదేవతలు, ఉమ, గణపతి(చతుర్థి), నాగం, చంద్రుడు, సూర్యుడు (సప్తమి), దుర్గామాత, ఈశ్వరుడు, కృష్ణుడు, యముడు, శివుడు, అధిదేవతలు. పూర్ణిమకు చంద్రుడు, అమావాస్యకు పితరులు అధిదేవతలు.

హరో దుర్గా గురుర్విష్ణుర్ బ్రహ్మా లక్ష్మీర్ధనేశ్వరః ।
ఏతే సూర్యాదివారేశా లిపిన్యాసో౭థ కథ్యతే ॥36॥

శివుడు, దుర్గ, బృహస్పతి, విష్ణువు, బ్రహ్మ, లక్ష్మి, కుబేరుడు, వీరు రవి మొదలైన వారాలకు అధిదేవతలు. ఇక వర్ణన్యాసం గురించి చెప్తాను.

కేశాన్తేషు చ వృత్తేషు చక్షుషో(శ్రవణద్వయే ।
నాసాగణ్డౌష్ఠదన్తేషు ద్వే ద్వే మూర్ధాస్యయోః క్రమాత్ ॥37॥

అకారం మొదలైన ఆయావర్ణాలను క్రమంగా, జుట్టుకొసలు, ముఖం, రెండుకన్నులు, రెండుచెవులు, రెండు ముక్కురంధ్రాలు, రెండుచెక్కిళ్లు, రెండుపెదవులు, రెండు (పైవి, క్రిందివి) పంటివరుసలు, శిరస్సు, నోరు అనే అవయవాలలో (ఓం కేశేషు నమః' ఇత్యాదివిధానంగా) న్యాసం చేసుకోవాలి.

వర్ణా న్పఞ్చసు వర్గాణాం బాహుచరణసన్ధిషు ।
పార్శ్వయోః పృష్ఠతో నాభౌ హృదయే చ క్రమాన్న్యసేత్ ॥38॥

కచటతప అనే అయిదువర్గలలోని వర్ణాలను క్రమంగా రెండు ప్రక్కల కుడిఎడమబాహువులమూలప్రదేశంలో (చంకలలో), కుడిఎడమపాదాలసంధిదేశంలోనూ, వెనుక, బొడ్డుదగ్గర, హృదయంలోనూ (ఓం కం బాహుసంధౌ నమః మొదలైనవిధంగా) న్యాసం చేసుకోవాలి.

యాదీంశ్చ హృదయే న్యస్యే దేషాం స్యుస్సప్తధాతవః ।
త్వగసృఙ్మాంసమేదో౭స్థిమజ్జాశుక్రాణి ధాతవః ॥39॥

యరలవ మొదలైన వర్ణాలను హృదయంలోనూ, సప్తధాతువులలోనూ న్యాసం చేసుకోవాలి. 1. చర్మం, 2. రక్తం, 3. మాంసం, 4. మేదస్సు, 5. ఎముకలు, 6. మజ్జ, 7. శుక్రం అనేవి సప్తధాతువులు.

రసాద్యైశ్చ నమోన్తైశ్చ లిఖ్యన్తే చ లిపీశ్వరైః ॥40॥

వర్ణశాస్త్రవేత్తలు మొదట ఓంకారం, చివర 'నమః' అనేశబ్దమూ, నడుమ ఆయావర్ణాలనూ కూర్చి 'ఓం అం నమః' మొద లైనవిధంగా న్యాసం లిఖిస్తారు.

శ్రీకణ్ఠో౭నన్తసూక్ష్మౌ చ త్రిమూర్తిరమరేశ్వరః ।
అగ్నీశో భారభూతిశ్చ తిథీశః స్థాణుకో హరః ॥41॥

శ్రీకంఠుడు, అనంతుడు, సూక్ష్ముడు, త్రిమూర్తి, అమరేశ్వరుడు, అగ్నీశుడు, భారభూతి, తిథీశుడు, స్థాణువు, హరుడు,

దణ్డీశో భౌతికస్సద్యోజాతశ్చానుగ్రహేశ్వరః ।
అక్రూరశ్చ మహాసేన శ్శరణ్యా దేవతా అమూః ॥ 42॥

దండీశుడు, భౌతికుడు, సద్యోజాతుడు, అనుగ్రహేశ్వరుడు, అక్రూరుడు, మహాసేనుడు, శరణ్యుడు, – వీరు స్వరవర్ణాలకు అధిదేవతలు.

తతస్సూచీశచణ్డౌ చ పఞ్చాన్తకశివోత్తమౌ ।
తథైవ రుద్రకూర్మౌ చ త్రినేత్రశ్చతురాననః ॥43॥

సూచీశుడు, చండుడు, పంచాంతకుడు, శివోత్తముడు, రుద్రుడు, కూర్ముడు, త్రినేత్రుడు, చతురాననుడు,

అజేశశ్శర్మసోమేశౌ తథా లాఙ్గలిదారుకౌ ।
అర్ధనారీశ్వరశ్చోమాకాన్తశ్చాషాఢిదణ్డినౌ ॥44॥

అజేశుడు, శర్ముడు, సోమేశుడు, లాంగలి, దారుకుడు, అర్ధనారీశ్వరుడు, ఉమాకాంతుడు, ఆషాఢి, దండి,

అత్రిర్మీనశ్చ మేషశ్చ లోహితశ్చ శిఖీ తథా ।
శూలగణ్డద్విరణ్డౌ ద్వౌ సమహాకాలబాలినౌ ॥45॥

అత్రి, మీనుడు, మేషుడు, లోహితుడు, శిఖి, శూలగండుడు, ద్విరండుడు, మహాకాలుడు, బాలి,

భుజఙ్గశ్చ పినాకీ చ ఖడ్గీశశ్చ బకః పునః ।
శ్వేతో భృగుర్గుడాకాక్షః క్షయస్సంవర్తక స్స్మృతః ॥46॥

భుజంగుడు, పినాకి, ఖడ్గీశుడు, బకుడు, శ్వేతుడు, భృగువు, గుడాకాక్షుడు, క్షయుడు, సంవర్తకుడు, – వీరు హల్లులకు అధిదేవతలు.

రుద్రాన్ సశక్తాన్ విలిఖ్యే న్నమోఽన్తాన్ విన్యసేత్ క్రమాత్ ।
అఙ్గాని విన్యసేత్ సర్వే మన్త్రాస్సాఙ్గాస్తు సిద్ధిదాః ॥47॥

శ్రీకంఠుడు మొదలైన రుద్రదేవతలను శక్తితో సహా లిఖించాలి. ఈశబ్దాలకు చివర 'నమః' అనేశబ్దం చేర్చి క్రమంగా న్యాసం చేయాలి. షడంగాలను న్యాసం చేయాలి. అంగాలతో కూడినమంత్రాలు సిద్ధిని కలిగిస్తాయి.

హృల్లేఖావ్యోమసమ్పూర్ణా ణ్యేతాన్యఙ్గాని విన్యసేత్ ।
హృదాదీన్యఙ్గమన్త్రాన్తై ర్యోజయేద్ధృదయే నమః ॥ 48॥

హృల్లేఖకు వ్యోమబీజం చేర్చి సంపూర్ణం చేసి అంగన్యాసం చేయాలి. హృదయం మొద లైనవాటికి చివర అంగమంత్రం చేర్చి ఆయాఅంగాలలో న్యాసం చేసుకోవాలి. అంగన్యాసంలో హృదయానికి చివర 'నమః' అనేశబ్దం చేర్చాలి (హృదయాయ నమః).

స్వాహా శిరస్యథ వషట్ శిఖాయాం కవచే చ హుమ్ ।
వౌషణ్నేత్రేఽస్త్రాయ ఫట్ స్యాత్ పఞ్చాఙ్గం నేత్రవర్జితమ్ ॥49॥

శిరస్సుకు చివర స్వాహా శబ్దం చేర్చాలి (శిరసే స్వాహా). శిఖకు చివర వషట్ అనేశబ్దం చేర్చాలి (శిఖాయై వషట్). కవచానికి చివర హుమ్ అనేశబ్దం చేర్చాలి (కవచాయ హుమ్). నేత్రశబ్దానికి చివర వౌషట్ అనే శబ్దం

చేర్చాలి (నేత్రత్రయాయ వౌషట్). అస్త్రానికి చివర ఫట్ అనేశబ్దం చేర్చాలి (అస్త్రాయ ఫట్). (ఇవి మొత్తం షడంగాలు) వీటిలో నేత్రం అనే అంగం తగ్గినపుడు న్యాసం పంచాంగం అవుతుంది. (పంచాంగన్యాసంలో నేత్రం ఉండదు.)

నిరఙ్గస్యాత్మనా చాఙ్గం న్యస్య తం నియుతం జపేత్ ।
క్రమేణ దేవీం వాగీశాం యథోక్తాంస్తు తిలాన్ హువేత్ ॥50॥

మంత్రానికి అంగ(బీజ)ం ప్రత్యేకంగా లేనపుడు, మంత్రాన్నే అంగన్యాసం చేసుకుని, ఆమంత్రాన్ని లక్షసార్లు జపించాలి. వాగీశ్వరీదేవిని ఈవిధంగా లక్షసార్లు జపించి, (జపసంఖ్యలో పదవవంతు సంఖ్యలో) నువ్వులను హోమం చేయాలి.

లిపిదేవీ సాక్షసూత్రకుమ్భపుస్తకపద్మధృక్ ।
కవిత్వాది ప్రయచ్ఛేత కర్మాదౌ సిద్ధయే న్యసేత్ ॥
నిష్కవిర్నిర్మలస్సర్వే మన్త్రా స్సిధ్యన్తి మాతృభిః ॥51॥

లిపిదేవి నాలుగుచేతులలో అక్షమాల, కలశం, పుస్తకం, పద్మం ధరించి ఉంటుంది. కవిత్వం చెప్పగలగడం మొదలైన శక్తులను ప్రసాదిస్తుంది. అందుచేత ఆయాకర్మలు సిద్ధించడానికి, కర్మప్రారంభంలో సామాన్యుడు నిర్మలమైన బుద్ధితో ఆయావర్ణాలను న్యాసం చేసుకోవాలి. మాతృకాన్యాసంవలన మాతృకలఅనుగ్రహంతో అన్నిమంత్రాలు చక్కగా సిద్ధిస్తాయి.

ఇత్యాది మహాపురాణే ఆగ్నేయే మన్త్రపరిభాషాకథనం నామ త్రినవత్యధికద్విశతతమోఽధ్యాయః ॥293॥

అగ్నిమహాపురాణంలో మంత్రపరిభాషాకథనం అనే రెండువందల తొంబైమూడవ అధ్యాయం సమాప్తం.



చతుర్నవత్యధికద్విశతతమోఽధ్యాయః – రెండువందల తొంబైనాల్గవ అధ్యాయం

నాగలక్షణకథనమ్ – నాగలక్షణకథనం

అగ్నిరువాచ – వసిష్ఠమహర్షితో అగ్నిదేవుడు ఇలా చెప్తున్నాడు.

నాగాదయోఽథ భావాది దశ స్థానాని కర్మ చ ।
సూతకం దష్టచేష్టేతి సప్తలక్షణ ముచ్యతే ॥1॥

వసిష్ఠా! ఇపుడు 1. సర్పాలజాతులు మొదలైన అంశాలు, పాము 2. కాటువేసే సమయంలోని నక్షత్రాదుల భావం మొద లైన అంశాలు, 3. పాము కాటువేయడంలోని భేదాలు, 4. పాము కాటు వేసే స్థానాలు, 5. కర్మలు, 6. సూతకం, 7. పాము కాటు వేసినవాడిచేష్టలు అనే ఏడు అంశాలను చెప్తాను.

శేషవాసుకితక్షాఖ్యాః కర్కటోఽబ్జో మహామ్బుజః ।
శఙ్ఖపాలశ్చ కులిక ఇత్యష్టౌ నాగవర్యకాః ॥2॥

శేషుడు, వాసుకి, తక్షకుడు, కర్కటుడు(కర్కోటకుడు), పద్మడు, మహాపద్మడు, శంఖపాలుడు, కులికుడు, అనే ఎనిమిదిమంది సర్పాలలో శ్రేష్ఠులు.

దశాష్టపఞ్చత్రిగుణశతమూర్ధాన్వితౌ క్రమాత్ ।
విప్రౌ నృపౌ విశౌ శూద్రౌ ద్వౌ ద్వౌ నాగేషు కీర్తితాః ॥3॥

వీరిలో ఇద్దరు నాగులు బ్రాహ్మణులు. ఇద్దరు క్షత్రియులు. ఇద్దరు వైశ్యులు. ఇద్దరు శూద్రులు. ఇవి క్రమంగా (బాహ్మణజాతిసర్పాలు) పదివందలపడగలు, (క్షత్రియజాతిసర్పాలు) ఎనిమిదివందలపడగలు, (వైశ్యజాతిసర్పాలు) ఐదువందల పడగలు, (శూద్రజాతిసర్పాలు) మూడువందలపడగలు కలిగిఉంటాయి.

తదన్వయాః పఞ్చశతం తేభ్యో జాతా అసంఖ్యకాః ॥4॥

ఈనాగులలో అయిదువందలవంశాలు ఉన్నాయి. ఆయావంశాలలో లెక్క లేనన్ని పాములు పుట్టాయి.

ఫణిమణ్డలిరాజీలా వాతపిత్తకఫాత్మకాః ।
వ్యన్తరా దోషమిశ్రాస్తే సర్పా దర్వీకరా స్స్మృతాః ॥5॥

ఫణి, మండలి, రాజీలం అనేవిధంగా పాములు మూడురకాలు. ఇవి క్రమంగా వాతం (ఫణి), పిత్తం (మండలి), కఫం (రాజీలం) అనేగుణాలు ప్రధానంగా కలిగిఉంటాయి. వీటితోపాటుగా సర్పాలలో ఇంకా వ్యంతరాలు, దోషమిశ్రాలు, దర్వీకరాలు అనే జాతులు కూడ ఉన్నాయి.

రథాఙ్గలాఙ్గలచ్ఛత్రస్వస్తికాఙ్కుశధారిణః ।
గోనసా మన్దగా దీర్ఘా మణ్డలైర్వివిధైశ్చితాః ॥
రాజిలాశ్చిత్రితాస్స్నిగ్ధా స్తిర్యగూర్ధ్వవిరాజిభిః ॥6॥

ఫణిజాతిసర్పాలు పడగమీద చక్రం, నాగలి, గొడుగు, స్వస్తికం, అంకుశం అనే గుర్తులను ధరించి ఉంటాయి. కొండచిలువలు మెల్లగా నడుస్తాయి. చాల పొడుగుగా ఉంటాయి. వీటిశరీరంమీద రకరకాలైన మండలాలు ఉంటాయి. (ఇవి మండలిజాతి సర్పాలు.) రాజిలజాతికి చెందిన సర్పాలకు శరీరంమీద రకరకాలైన రేఖలు చిత్రింపబడి ఉంటాయి. ఇవి చాల స్నిగ్ధంగా ఉంటాయి. ఇవి నిలువుగానూ, అడ్డంగానూ చక్కగా ప్రకాశిస్తుంటాయి.

వ్యన్తరా మిశ్రచిహ్నాశ్చ భూవర్షాగ్నేయవాయవః ।
చతుర్విధాస్తే షడ్వింశభేదాష్షోడశ గోనసాః ॥7॥

వ్యంతరం అనేజాతికి చెందినపాములకు పైనచెప్పినచిహ్నాలు కలిసిఉంటాయి. ఇవి పార్థివాలు (పృథివి-భూమి), ఆప్యాలు (అప్-వర్ష), ఆగ్నేయాలు(అగ్ని), వాయవాలు(వాయు) అని నాలుగువిధాలుగా ఉంటాయి. ఈనాలుగింటిలోనూ ఇంకా అరవైనాలుగు విశేషభేదాలు ఉన్నాయి. మండలిజాతిసర్పాలు పదహారువిధాలు.

త్రయోదశ చ రాజీలా వ్యన్తరా ఏకవింశతిః ।
యేఽనుక్తకాలే జాయన్తే సర్పాస్తే వ్యన్తరాస్స్మృతాః ॥8॥

రాజీలజాతిసర్పాలు పదమూడువిధాలు. వ్యంతరజాతిసర్పాలు ఇరవైఒక్కవిధాలు. పుట్టవలసినకాలంలో కాక, ఇతరకాలంలో పుట్టినపాములను వ్యంతరాలు అంటారు.

ఆషాఢాదిత్రిమాసైస్స్యా ద్గర్భో మాసచతుష్టయే ।
అణ్డకానాం శతే ద్వే చ చత్వారింశత్ ప్రసూయతే ॥9॥

పాములు ఆషాఢం మొదలుకొని మూడుమాసాలసమయంలో గర్భం ధరిస్తాయి. గర్భం ధరించినతరువాత నాలుగు నెలలకు ఆడపాము రెండువందలనలభై గ్రుడ్లు పెడుతుంది.

సర్పా గ్రసన్తి సూతౌఘా న్వినా స్త్రీపున్నపుంసకాన్ ॥10॥

ఆ గ్రుడ్లలోనుండి పాముపిల్లలు బయటికి వచ్చినతరువాత అవి మగవో, ఆడవో, నపుంసకాలో తెలియకుండానే తల్లిపాము తనపిల్లలను సాధారణంగా తినివేస్తుంది.

ఉన్మీలితేఽక్షిణి సప్తాహాత్ కృష్ణో మాసాద్భవేద్బహిః ।
ద్వాదశాహాత్సుబోధస్స్యా ద్దన్తాస్స్యుస్సూర్యదర్శనాత్ ॥
ద్వాత్రింశద్దినవింశత్యా చతస్రస్తేషు దంష్ట్రికాః ॥11॥

పాము గ్రుడ్డు పెట్టినతరువాత ఏడురోజులకు కృష్ణసర్పం కన్నులు తెరుస్తుంది. ఒకనెల రోజులలో గ్రుడ్డునుండి వెలుపలకు వస్తుంది. పన్నెండు రోజులు దాటినతరువాత తెలివిలోకి వస్తుంది. ఇరవైరోజులు దాటినతరువాత సూర్యుడిని దర్శించుకోగానే ముప్పైరెండు దంతాలు ఏర్పడతాయి. ఆదంతాలలో నాలుగు కోరలు ఉంటాయి.

కరాలీ మకరీ కాలరాత్రిశ్చ యమదూతికా ।
ఏతాస్తాస్సవిషా దంష్ట్రా వామదక్షిణపార్శ్వగాః ॥12॥

కరాళి, మకరి, కాలరాత్రి, యమదూతిక, అనే పేర్లు కలిగిన ఆకోరలు నాలుగు విషంతో కూడినవి. ఇవి నోటికి ఎడమప్రక్కన, కుడిప్రక్కన ఉంటాయి.

షణ్మాసాన్ముచ్యతే కృత్తిం జీవేత్ షష్టిసమా ద్వయమ్ ।
నాగాస్సూర్యాదివారేశా స్సప్త ఉక్తా దివా నిశి ॥13॥

పాము ఆరునెలలకు ఒకసారి కుబుసం విడిచిపెడుతుంది. నూటఇరవై సంవత్సరాలు బ్రదుకుతుంది. ఇంతకు ముందు చెప్పిన శేషుడు మొదలైన సర్పాలు వరుసగా ఏడు వారాలకు అధిపతులు. వీరు తమతమవారాలలో పగలు, రాత్రి కూడ అధిపతులై ఉంటారు.

స్వేషాం షట్ ప్రతివారేషు కులికస్సర్వసన్ధిషు ।
శఙ్ఖేన వా మహాబ్జేన సహ తస్యోదయోఽథ వా ॥ 14॥

శేషుడు మొదలైన ఆరుగురు తమతమవారాలలో ఉదయిస్తారు. కులికుడు మాత్రం అన్నివారాలలోనూ రాత్రింబగళ్లసంధి కాలాలలో ఉదయిస్తాడు. లేదా శంఖపాలుడితో గాని, మహాపద్ముడితో గాని కలిసి ఉదయిస్తాడు.

ద్వయో ర్వా నాడికామాత్ర మన్తరం కులికోదయః ।
దుష్టస్సకాలస్సర్వత్ర సర్పదంశే విశేషతః ॥15॥

శంఖపాలుడు, మహాపద్ముడు వీరినడుమకాలంలో రెండునాడికలసమయం కులికోదయం అని చెప్తారు. అది అన్నివిషయాలలోనూ దోషకాలం. పాము కాటు వేసిన సమయం అయితే మరీ దోషం.

కృత్తికా భరణీ స్వాతీ మూలం పూర్వత్రయాశ్వినీ ।
విశాఖార్ద్రా మఘాశ్లేషా చిత్రా శ్రవణరోహిణీ ॥16॥

కృత్తిక, భరణి, స్వాతి, మూల, పూర్వఫల్గుణి, పూర్వాషాఢ, పూర్వాభాద్ర, అశ్విని, విశాఖ, ఆర్ద్ర, మఘ, ఆశ్లేష, చిత్ర, శ్రవణం, రోహిణి,

హస్తో మన్దకుజౌ వారౌ పఞ్చమీ చాష్టమీ తిథిః ।
షష్ఠీ రిక్తాశివా నిన్ద్యా పఞ్చమీ చ చతుర్దశీ ॥
సన్ధ్యాచతుష్టయం దుష్టం దగ్ధయోగాశ్చ రాశయః ॥17॥

హస్త అనే నక్షత్రాలు, శని, మంగళవారాలు, పంచమి, అష్టమి అనే తిథులు, రిక్తతిథులైన చతుర్థి, నవమి, చతుర్దశి, తిథులు పాముకాటుకు శుభప్రదమైనవి కావు. వీటిలో పంచమి, చతుర్దశి అనేవి ఇంకా నీచమైనవి. నాలుగు సంధ్యా కాలాలలోనూ, దగ్ధరాశులలోనూ పాము కాటువేస్తే అది మిక్కిలి కష్టం కలిగిస్తుంది.

ఏకద్విబహవో దంశా దష్టం విద్ధం చ ఖణ్డితమ్ ।
అదంశ మవగుప్తం స్యా ద్దంశమేవం చతుర్విధమ్ ॥18॥

ఒక కోరతో వేసినకాటుకు దష్టం అని పేరు, రెండు కోరలతో వేసినకాటు విద్ధం. అంతకంటె ఎక్కువకోరలతో వేసినకాటు ఖండితం. పాము ఊరికే తాకి, కాటువేయకపోతే అదంశం అంటారు. దీనివలన బాధ ఉండదు. ఈ విధంగా దంశం నాలుగువిధాలు.

త్రయో ద్వ్యేకక్షతా దంశా వేదనారుధిరోల్బణా ।
నక్తన్త్వేకాఙ్ఘ్రికూర్మాభా దంశాశ్చ యమచోదితాః ॥19॥

మూడు, రెండు, ఒకటి కోరలతో అయిన గాట్లు మిక్కిలి బాధను కలిగిస్తాయి. ఇంకా వీటివలన రక్తం అధికంగా స్రవిస్తుంది. ఒకపాదం కలిగి తాబేలు ఆకారంలో కనిపించే పాము రాత్రిపూట కాటు వేస్తే అది మరణాన్ని కలిగిస్తుంది.

దాహీపిపీలికాస్పర్శీ కణ్ఠశోథరుజాన్వితః ।
సతోదో గ్రన్థితో దంశ స్సవిషోఽన్య స్తు నిర్విషః ॥20॥

వేడిగా ఉన్నచీమలు ప్రాకుతున్నట్లు అనిపించడం, మెడవాపురోగం రావడం, బాగా నొప్పి కలగడం, లోతుగా దిగబడడం అనేలక్షణాలు కలిగినపాముకాటు విషంతో కూడిఉంటుంది. ఈ లక్షణాలు లేనిపాముకాటులో విషం ఉండదు.

దేవాలయే శూన్యగృహే వల్మీకోద్యానకోటరే ।
రథ్యాసన్ధౌ శ్మశానే చ నద్యాం చ సిన్ధుసఙ్గమే ॥21॥

దేవాలయాలు, జనం నివసించని ఇళ్లు, పాముపుట్టలు, తోటలు, చెట్లతొఱ్ఱలు, దారులు కలిసేచోట్లు, శ్మశానం, నదులు, నదులు సముద్రంతో కలిసేచోట్లు,

ద్వీపే చతుష్పథే సౌధే గృహేఽబ్జే పర్వతాగ్రతః ।
బిలద్వారే జీర్ణకూపే జీర్ణవేశ్మని కుడ్యకే ॥22॥

రెండువైపుల నీళ్లు కలిగినచోట్లు, నాలుగువీధులు కలిసినచోట్లు, పెద్దపెద్దభవనాలు, ఇళ్లు, తామరతోటలు, కొండలపైప్రదేశాలు, గుహలవాకిళ్లు, పాడుబడినబావులు, కూలుతున్నఇళ్లు, గోడలు,

శిగ్రుశ్లేష్మాతకాక్షేషు జమ్బూదుమ్బరవేణుషు ।
వటే చ జీర్ణప్రాకారే ఖాస్యహృత్కక్షజత్రుణి ॥23॥

తాలౌ శఙ్ఖే గలే మూర్ధ్ని చిబుకే నాభిపాదయోః ।
దంశోఽశుభ శ్శుభో దూతః పుష్పహస్తస్సువాక్సుధీః ॥
లిఙ్గవర్ణసమానశ్చ శుక్లవస్త్రోఽమల శ్శుచిః ॥24॥

మునగ, విరిగి (శ్లేష్మాతకం), తాండ్ర, నేరేడు, మేడి, వెదురు, మఱ్ఱి చెట్లు, కూలిపోతున్నప్రాకారాలు – ఈప్రదేశాలలో పాములు నివసిస్తాయి. ఇంద్రియాలు, ముఖం, హృదయం, చంకలు, మెడక్రింద, దవడ, నుదురు,

మెడ, తల, గడ్డం, బొడ్డు, పాదాలు, ఈప్రదేశాలలో పాము కాటువేయడం అశుభాన్ని సూచిస్తుంది. పాము కరిచినవార్తను వైద్యుడివద్దకు చేర్చేవాడు పూలు చేతబట్టుకుని వెళ్లడం శుభం. ఇంకా అతడు మాటనేర్పు కలిగినవాడు, వివేకవంతుడు కావాలి. పాము కరిచినవాడితో సమానమైన జాతి, వర్ణం కలిగినవాడు కావాలి. తెల్లనిబట్టలు ధరించాలి. బుద్ధి నిర్మలంగా ఉండాలి. పవిత్రుడు కావాలి. ఇలా ఉంటే పాము కరిచినవాడికి మేలు జరుగుతుంది.

అపద్వారగతశ్శస్త్రీ ప్రమాదీ భూగతేక్షణః ।
వివర్ణవాసాః పాశాదిహస్తో గద్గదవర్ణభాక్ ॥25॥

అతడు వైద్యుడిఇంట్లోకి ప్రధానద్వారం ద్వారా కాకుండా, దొడ్డిదారిలో ప్రవేశించినా, ఆయుధం ధరించి వచ్చినా, పొరపాట్లు చేసేవాడు అయినా, నేలచూపులు చూసేవాడయినా, మాసినబట్టలు ధరించిఉన్నా, తాడు మొదలైనవాటిని పట్టుకునిఉన్నా బొంగురుగొంతుతో మాట్లాడేవాడయినా,

శుష్కకాష్ఠాశ్రితః ఖిన్నస్తిలాలక్తకరాంశుకః ।
ఆర్ద్రవాసాః కృష్ణరక్తపుష్పయుక్తశిరోరుహః ॥26॥

కుచమర్దీ నఖచ్ఛేదీ గుదస్పృక్ పాదలేఖకః ।
కేశలుఞ్చీ తృణచ్ఛేదీ దుష్టా దూతా స్త థైకశః ॥27॥

ఎండినకట్టెమీద కూర్చునిఉన్నా, దుఃఖపడుతూ ఉన్నా, నువ్వులు చేతబట్టుకునిఉన్నా, ఎఱ్ఱనిమచ్చలు కలిగిన వస్త్రం ధరించిఉన్నా, తడివస్త్రం ధరించిఉన్నా, తలలో నలుపు, ఎఱుపురంగులపూలు ధరించిఉన్నా, గుండెలు బాదుకుంటున్నా, గోళ్లు కొరుక్కుంటున్నా, పృష్ఠంపై చేయి వేసుకున్నా, కాళ్లతో నేలపై వ్రాస్తున్నా, జుట్టు పీక్కుంటున్నా, గడ్డి తెంపుతున్నా, అటువంటిదూతలు దుర్మార్గులు. వారివలన కేవలం అశుభం కలుగుతుంది.

ఇడాన్యా వా వహేద్ద్వేధా యది దూతస్య చాత్మనః ।
ఆభ్యాం ద్వాభ్యాం పుష్టయాస్మా న్విద్యాత్ స్త్రీపున్నపుంసకాన్ ॥28॥

వైద్యుడు తనకూ, దూతకూ ఇడ, పింగళ అనేరెండునాడులు రెండువిధాలుగా కదులుతున్నదానినిబట్టి, ఆరెండునాడులపుష్టిని అనుసరించి, కరిచినపాము స్త్రీయా, పురుషుడా, లేక నపుంసకమా అని తెలియవచ్చును.

దూత స్స్పృశతి యద్గాత్రం తస్మి న్దంశ ముదాహరేత్ ।
దూతాఙ్ఘ్రిచలనం దుష్ట ముత్థితిర్నిశ్చలా శుభా ॥ 29॥

దూత శరీరంలో ఏఅవయవాన్ని స్పృశిస్తున్నాడో, అక్కడ పాము కరిచినట్లు తెలుసుకోవచ్చు. దూత నడక తత్తరపాటు కలిగిఉంటే అశుభం జరుగుతుంది. కదలిక దృఢంగా ఉంటే శుభం జరుగుతుంది.

జీవపార్శ్వే శుభో దూతో దుష్టోఽ న్యత్ర సమాగతః ।
జీవో గతాగతైర్దుష్ట శ్శుభో దూతనివేదనే ॥30॥

దూత జీవుడికి ప్రక్కగా ఉంటే శుభం. ఇతరస్థలాలలో ఉంటే అశుభం. ఆ జీవుడు వస్తూ పోతూ ఉంటే అశుభం. దూత సరియైనవిధంగా వార్తని నివేదిస్తే శుభం.

దూతస్య వాక్ ప్రదుష్టా సా పూర్వామజ్ఞార్థనిన్దితా ।
విభక్తైస్తస్య వాక్యాన్తైర్విషనిర్విషకాలతా ॥31॥

దూత మాటలు దోషంతో కూడిఉన్నా, లేదా అర్థం తెలియకుండా అస్పష్టంగా ఉన్నా, మేలు జరగదు. దూతవాక్యాలలో చివరివిభక్తులనుబట్టి, అంటే మాటలలోని స్పష్టతనుబట్టి పాము కరిచినకాలం విషం ఉండేదా, ఉండనిదా అనేవిషయం తెలుస్తుంది.

ఆద్యైస్స్వరైశ్చ కాద్యైశ్చ వర్ణైర్భిన్నలిపి ర్ద్విధా ।
స్వరజో వసుమా న్వర్గీ ఇతి జ్ఞేయా చ మాతృకా ॥32॥

అకారం మొదలైన స్వరాలచేతనూ, కకారం మొదలైన వ్యంజనాలచేతనూ వర్ణాలు రెండువిధాలు. దూతవాక్యాలలో స్వరాలు అధికంగా ఉంటే, పాము కరిచినవాడు ధనవంతుడూ, బంధువర్గం కలిగినవాడూ అవుతాడు. అంటే బ్రదికి వెలుగుతాడు. (వ్యంజనాలు అధికం అయితే ఇలా కాదు). ఈవిధంగా వర్ణాలప్రయోజనవిధానాన్ని గ్రహించాలి.

వాతాగ్నీన్ద్రజలాత్మానో వర్గేషు చ చతుష్టయమ్ ।
నపుంసకాః పఞ్చమాస్స్యుస్స్వరాశ్శక్రామ్బుయోనయః ॥33॥

కచటతప అనే అయిదువర్గలలోనూ మొదటినాలుగు అక్షరాలు క్రమంగా 1. వాయు, 2. అగ్ని, 3. ఇంద్ర, 4. జలములు దేవతలుగా ఉంటాయి. వర్గలలోని అయిదవఅక్షరాలు నపుంసకాలు. హ్రస్వమైన అచ్చులు ఇంద్రుడివలన, దీర్ఘమైనఅచ్చులు వరుణుడివలన ఏర్పడ్డాయి.

దుష్టౌ దూతస్య వాక్పాదౌ వాతాగ్నీ మధ్యమో హరిః ।
ప్రశస్తా వారుణా వర్ణా అతిదుష్టా నపుంసకాః ॥34॥

దూతవాక్యాలలో మొదట వాయు, అగ్నిదేవతాక మైన(వర్గలలో ప్రథమద్వితీయ)వర్ణాలు దోషం కలిగినవి. ఇంద్రదేవతాకమైన(వర్గలలోనితృతీయ)వర్ణాలు మధ్యమఫలితం ఇస్తాయి. వరుణదేవతాకమైన (వర్గలలోనిచతుర్థ) వర్ణాలు మిక్కిలి శుభప్రదాలు. నపుంసక(వర్గలలో అయిదవ)వర్ణాలు మిక్కిలిదోషం కలిగినవి.

ప్రస్థానే మఙ్గలం వాక్యం గర్జితం మేఘహస్తినోః ।
ప్రదక్షిణం ఫలే వృక్షే వామస్య చ రుతం జితమ్ ॥
శుభా గీతాదిశబ్దా స్స్యురీదృశం స్యాద్ధి సిద్ధయే ॥35॥

వైద్యుడు చికిత్సకు బయలుదేరేసమయంలో శుభప్రదమైన మాటలు, మేఘాల ఉరుములు, ఏనుగుల ఘీంకారాలు, కుడివైపున పండ్లతో నిండినచెట్లు, ఎడమవైపున పక్షులమధురమైన కూతలు, అలాగే పాటలు మొదలైన మధురశబ్దాలు, కూడ శుభప్రదాలు. ఇటువంటి శుభసూచనలు కార్యం సిద్ధిస్తుందని సూచిస్తాయి.

అనర్థగీరథాక్రన్దో దక్షిణే విరుతం క్షుతమ్ ॥36॥

ఇంక కుడివైపునుండి కీడు కలిగించే మాటలు, బాధతో కూడిన అరుపులు, పక్షుల వికృతపుకూతలు, తుమ్ము ఇవి అశుభసూచనలు.

వేశ్యా విప్రో నృపః కన్యా గౌర్దన్తీ మురజధ్వజౌ ।
క్షీరాజ్యదధిశఙ్ఖామ్బుచ్ఛత్రం భేరీ ఫలం సురాః ॥
తణ్డులా హేమ రూప్యం చ సిద్ధయేஉభిముఖా అమీ ॥37॥

వేశ్య, బ్రాహ్మణుడు, మహారాజు, కన్య, ఆవు, ఏనుగు, మద్దెల, జెండా, పాలు, నెయ్యి, పెరుగు, శంఖం, నీళ్లు, గొడుగు, భేరి, పండు, దేవతలు(ఊరేగింపు మొ), బియ్యం, బంగారం, వెండి, ఇవి ఎదురు వస్తే, కార్యం సిద్ధిస్తుంది.

సకాష్ఠస్సానలః కారుర్మలినామ్బరవాసభృత్ ।
గలస్థటఙ్కో గోమాయుగృధ్రోలూకకపర్దికాః ॥
తైలం కపాలకార్పాసే నిషిద్ధే భస్మ నష్టయే ॥38॥

నిప్పు ఉన్నకట్టె, వడ్రంగి, మురికిబట్టలు మోసేవాడు, మెడలో టంకం వేసుకున్నవాడు, నక్క, గ్రద్ద, గుడ్లగూబ, గవ్వలు, నూనె, పుఱ్ఱె, దూది, బూడిద – ఇవి నిషిద్ధవస్తువులు. ఇవి ఎదురువచ్చినపుడు నష్టం జరుగుతుంది.

విషరోగాశ్చ సప్త స్యుర్ధాతోర్ధాత్వన్తరాప్తితః ॥39॥

ఒకానొకధాతువు మరొకధాతువులో చేరడంవలన ఏడువిధాలయిన విషరోగాలు కలుగుతాయి.

విషదంశో లలాటం యాత్యతో నేత్రం తతో ముఖమ్ ।
ఆస్యాచ్చ వచనీ నాడ్యో ధాతూన్ ప్రాప్నోతి హి క్రమాత్ ॥40॥

పాముకాటువలన కలిగినవిషం ముందుగా నుదురు చేరుకుంటుంది. అక్కడినుండి కన్నులలోనికి, అక్కడినుండి ముఖంలోనికి, అక్కడినుండి నాడులలోనికి, నాడులనుండి ధాతువులలోనికి క్రమంగా ప్రవేశిస్తుంది.

ఇత్యాది మహాపురాణే ఆగ్నేయే నాగలక్షణకథనం నామ చతుర్నవత్యధికద్విశతతమోஉధ్యాయః ॥294॥

అగ్నిమహాపురాణంలో నాగలక్షణకథనం అనే రెండువందల తొంబైనాల్గవ అధ్యాయం సమాప్తం.



పఞ్చనవత్యధికద్విశతతమోఽధ్యాయః - రెండువందల తొంబైఐదవ అధ్యాయం

దష్టచికిత్సాకథనమ్ - దష్టచికిత్సాకథనం

అగ్నిరువాచ - వసిష్ఠమహర్షితో అగ్నిదేవుడు ఇలా చెప్తున్నాడు.

మన్త్రధ్యానౌషధైర్దష్టచికిత్సాం ప్రవదామి తే ॥1॥

ఇపుడు పాముకాటుకు మంత్రం, ధ్యానం, ఔషధం అనేవాటితో చికిత్స చేసే విధానం నీకు చెప్తాను.

ఓం నమో భగవతే నీలకణ్ఠాయేతి ।
జపనా ద్విషహాని స్స్యా దౌషధం జీవరక్షణమ్ ॥2॥

'ఓం నమో భగవతే నీలకంఠాయ' అనే మంత్రాన్ని జపించడంవలన విషం నశించిపోతుంది. ఔషధం పాము కరిచినవాడిప్రాణాన్ని కాపాడుతుంది.

సాజ్యం సకృద్రసం పేయం ద్వివిధం విషముచ్యతే ।
జఙ్గమం సర్పమూషాది శృఙ్గాది స్థావరం విషమ్ ॥3॥

విషానికి మందుగా గోమయరసాన్ని ఆవునెయ్యితో కలిపి త్రాగాలి. విషం రెండువిధాలు. పాములు, ఎలుకలు మొదలైనవాటికి సంబంధించిన విషం జంగమం. కొండకొన మొదలైన స్థానాలలో ఉండేవిషం స్థావరం.

శాన్తస్వరాన్వితో బ్రహ్మో లోహితస్తారకశ్శివః ।
వియతే ర్నామమన్త్రోఽయం తార్క్ష్య శ్శబ్దమయ స్స్మృతః ॥4॥

శాంతమైన స్వరాలతో కూడినది బ్రహ్మమంత్రం. లోహిత మైనది, తరింపజేసేది శివమంత్రం. పక్షిరాజుకు సంబంధించిన నామాలతో కూడిన ఈమంత్రం తార్క్ష్యం (గరుడమంత్రం). ఇది (విషహరమైన)వివిధశబ్దాలతో కూడిఉంటుంది.

ఓం జ్వల మహామతే హృదయాయ గరుడ విరాల శిరసే గరుడశిఖాయై ।
గరుడ విషభఞ్జన ప్రభేదన ప్రభేదన విత్రాసయ విత్రాసయ విమర్దయ విమర్దయ కవచాయ ॥
అప్రతిహతశాసన హూం ఫట్ అస్త్రాయ ।
ఉగ్రరూపధారక సర్వభయఙ్కర భీషయ సర్వం దహ దహ భస్మీకురు కురు స్వాహా నేత్రాయ ॥5॥

ఇది గరుడమంత్రం. ప్రణవస్వరూపా! గరుత్మంతా! మిక్కిలిబుద్ధిమంతుడా! హృదయం రూపంలో ఉన్న నీకు నమస్కారం. గరుడుడా! మనోహరమైనవాడా! శిరసురూపంలో ఉన్ననీకు నమస్కారం. గరుడుడా! శిఖరూపంలో ఉన్న నీకు నమస్కారం. గరుత్మంతుడా! విషాన్ని నిర్మూలించేవాడా! ఆవిషాన్ని ముక్కలు ముక్కలుగా చెయ్యి. బాగా భయపెట్టు. మరీ మరీ నలగగొట్టు. శరీరానికి ఆవరణ(చర్మ)ం రూపంలో ఉన్నవాడా! నీకు నమస్కారం. (గరుడా) నీఆజ్ఞకు ఎదురు లేదు. శరీరాన్ని రక్షించే అస్త్రం రూపంలో ఉన్న గరుడుడా! నీకు నమస్కారం. భయంకరమైన

రూపం ధరించిఉన్నవాడా! అందరినీ భయపెట్టేవాడా! అన్నిరకాలవిషాలకూ భయం కలిగించు. సమస్తవిషపదార్థాలనూ తగులబెట్టు. బూడిద చెయ్యి. నీకు నమస్కరిస్తున్నాను. కన్నులరూపంలో ఉన్నవాడా! నీకు నమస్కారం.

సప్తవర్గాన్తయుగ్మాష్టదిగ్దలస్వరకేసరాదివర్ణరుద్ధం ।
వహ్నిరాభూతకర్ణికం మాతృకామ్బుజమ్ ॥6॥

(విషహరణానికి ఈవిధంగా చేయాలి.) వర్ణాలతో నిండినపద్మాన్ని లిఖించాలి. ఆపద్మంలో ఎనిమిది దిక్కులలో ఎనిమిది రేకులు ఉండాలి. ఆఎనిమిదిరేకులలో 'అ' మొదలైన అచ్చులు వ్రాయాలి. క,చ,ట,త,ప,య,శ అనే ఏడువర్గలలోని చివరిరెండక్షరాలు కూడ వ్రాయాలి. ఆపద్మం కేసరాలలో పైఏడువర్గలలోనిమొదటిఅక్షరాలు వ్రాయాలి. కర్ణికస్థానంలో అగ్నిబీజమైన 'రం' అనే వర్ణాన్ని వ్రాయాలి.

కృత్వా హృదిస్థం తన్మన్త్రీ వామహస్తతలే స్మరేత్ ।
అఙ్గుష్ఠాదౌ న్యసే ద్వర్ణా న్వియతే ర్భేదితాః కలాః ॥ 7॥

మంత్రసాధన చేసేవాడు ఇటువంటి మాతృకారూపమైన పద్మాన్ని మనసులో నిలుపుకోవాలి. దానిని ఎడమఅరచేతిలో ఊహించుకోవాలి. తరువాత బొటనవేళ్లు మొదలైన అవయవాలలో వియతికి సంబంధించిన ఆయావర్ణాలను, వివిధమైన కళలను న్యాసం చేసుకోవాలి.

పీతం వజ్రచతుష్కోణం పార్థివం శక్రదైవతమ్ ।
వృత్తార్ధమాప్యం పద్మార్ధం శుక్లం వరుణదైవతమ్ ॥8॥

తరువాత పసుపుపచ్చనిరంగుతో నాలుగుకోణాలు కలిగినభూపురం వ్రాయాలి. దీనికి ఇంద్రుడు దేవత. నాలుగుకోణాలలో వజ్రచిహ్నాలను వ్రాయాలి. పద్మంలో సగం చంద్రుడి ఆకారం వ్రాయాలి. సగం పద్మం తెల్లగా ఉంటుంది. దానికి వరుణుడు దేవత.

త్ర్యస్రం స్వస్తికయుక్తం చ తైజసం వహ్నిదైవతమ్ ।
వృత్తం బిన్దువృతం వాయుదైవతం కృష్ణమాలినమ్ ॥9॥

ఆపద్మం మధ్యలో మూడుకోణాలు కలిగినరూపం వ్రాయాలి. దానిమధ్యలో స్వస్తికం గుర్తు గీయాలి. ఈత్రికోణమండలం తేజోమయమైనది. దీనికి అగ్ని దేవత. దానికి మధ్యలో వృత్తాకారం వ్రాయాలి. వృత్తం మధ్యలో బిందువు వ్రాయాలి. దీనికి వాయువు దేవత. ఇది నల్లనిమాలలు కలిగిఉంటుంది.

అఙ్గుష్ఠాద్యఙ్గులీమధ్యపరన్తేషు స్వవేశ్మసు ।
సువర్ణనాగవాహేన వేష్టితేషు న్యసేత్ క్రమాత్ ॥
వియతే శ్చతురో వర్ణాన్ సుమణ్డలసమత్విషః ॥10॥

బొటనవ్రేలు మొదలుగా అన్నివ్రేళ్లకు నడిమిప్రదేశాలలో బంగారపునాగవాహనం చుట్టుకున్నట్లుగా ఊహిస్తూ, వానిలో వియతికి సంబంధించిన నాలుగువర్ణాలను క్రమంగా న్యాసం చేసుకోవాలి. శ్రేష్ఠమైన మండలాలు ఉత్తమమైన కాంతులు కలిగిఉంటాయి.

అరూపే రవతన్మాత్రే ఆకాశే శివదైవతే ।
కనిష్ఠామధ్యపర్వస్థే న్యసేత్ తస్యాద్యమక్షరమ్ ॥11॥

రూపం లేనిదీ, శబ్దం తన్మాత్ర అయినదీ, శివుడు దేవతగా గలిగినదీ అయిన ఆకాశతత్త్వంలోని మొదటి అక్షరాన్ని చిటికెనవేలి నడిమికణుపువద్ద న్యాసం చేసుకోవాలి.

భూతాదివర్ణాన్ విన్యసేదఙ్గుష్ఠాద్యన్తపర్వసు ।
నాగనామాదివర్ణాంశ్చ స్వమణ్డలగతాన్ న్యసేత్ ॥ 12॥

పృథివి మొదలైన పంచభూతాలమొదటిఅక్షరాలను (లం, వం, రం, యం, హం) బొటనవేలు మొదలుగా అయిదు వేళ్లలో చివరికణుపులలో న్యాసం చేసుకోవాలి. సర్పాలపేరులోని మొదటిఅక్షరాలను తమతమమండలాలలో న్యాసం చేయాలి.

తన్మాత్రాదిగుణాఖ్యర్ణానఙ్గులీషు న్యసే ద్బుధః ।
స్పర్శనాదేవ తార్క్ష్యేణ హస్తే హన్యాద్విషద్వయమ్ ॥13॥

పంచతన్మాత్రలకు సంబంధించిన వర్ణాలను అయిదువేళ్లలో న్యాసం చేసుకోవాలి. ఈవిధంగా న్యాసం చేసుకుని, గరుడమంత్రం ఉచ్చరిస్తూ, పాము కరిచినవాడిని తాకినమాత్రంచేతనే రెండురకాలైన విషం నశించి పోతుంది.

మణ్డలాదిషు తాన్వర్ణాన్ వియతేః కవయోజితాన్ ।
శ్రేష్ఠం ద్వ్యఙ్గులిభిర్దేహనాభిస్థానేషు పర్వసు ॥14॥

సాధకులు ఉత్తమమైన వియతిమంత్రానికి సంబంధించినఆయామండలాలలోని ఆనాలుగువర్ణాలను రెండువేళ్లతో శరీరంలోనూ, బొడ్డువద్దనూ, వేళ్లకణుపులలోనూ న్యాసం చేసుకోవాలి.

ఆజానుతస్సువర్ణాభ మానాభేస్తుహినప్రభమ్ ।
కుఙ్కుమారుణమాకణ్ఠాదాకేశాన్తాత్సితేతరమ్ ॥15॥

గరుడుడు మోకాలివరకు బంగారపురంగులో ఉంటాడు. అక్కడినుండి బొడ్డువరకు మంచువంటితెల్లనికాంతి కలిగి ఉంటాడు. అక్కడినుండి మెడవరకు కుంకమంవంటి ఎఱుపురంగులో ఉంటాడు. అక్కడినుండి తలపై కేశాలవరకు నలుపురంగులో ఉంటాడు.

బ్రహ్మాణ్డవ్యాపినం తార్క్ష్యం చన్ద్రాఖ్యం నాగభూషణమ్ ।
నీలోగ్రనాస మాత్మానం మహాపక్షం స్మరే ద్బుధః ॥16॥

గరుడుడు బ్రహ్మాండం అంతటా నిండిఉంటాడు. అతడిపేరు చంద్రుడు. పాములను ఆభరణాలుగా ధరించి ఉంటాడు. అతడిముక్కు నల్లగానూ, తీక్ష్ణంగానూ ఉంటుంది. ఱెక్కలు చాలా పెద్దవి. విజ్ఞుడైన సాధకుడు గరుత్మంతుడిని ఈరూపంలో భావన చేయాలి.

ఏవం తార్‌క్ష్యాత్మనో వాక్యాన్మన్త్రస్యాన్మన్త్రిణోఽవిషే ॥17॥

సాధకుడు ఈవిధంగా ఆచరించినపుడు గరుడుడివాక్యంవలన ఆ గరుడమంత్రం పాము కరిచినవాడి ఒంటిలోని విషంపైన ప్రభావం చూపి, ఆ విషం తొలగిపోతుంది.

ముష్టి స్తార్‌క్ష్యకరస్యాన్తస్థితాఙ్గుష్ఠవిషాపహా ॥18॥

గరుడుడి పిడికిలి పాము కరిచినవాడిచేతిలో ఉంటే, అది వాడిబొటనవేలిలోని విషాన్ని పోగొడుతుంది.

తార్‌క్ష్యే హస్తం సముద్యమ్య తత్పఞ్చాఙ్గులిచాలనాత్ ।
కుర్యాద్విషస్య స్తమ్భాదీం స్తదుక్తమదవీక్షయా ॥19॥

గరుడమంత్రం సాధన చేసినవాడు గరుడమంత్రంచేత గరుడుడిస్వరూపం పొందినతనచేయి పైకి ఎత్తి, అయిదువేళ్లను కదిలించడంవలననూ, పాముకాటువలన కలిగినమదాన్ని చూడడంచేతనూ, ఆవిషం కదలకుండా ఆగిపోతుంది. ఇంక ఏవిధమైనబాధ కలిగించకుండానే ఆ విషం నశించిపోతుంది.

ఆకాశాదేష భూబీజః పఞ్చార్ణాధిపతిర్మనుః ।
సంస్తమ్భయేఽతివిషతో భాషయా స్తమ్భయేద్విషమ్ ॥20॥

ఆకాశబీజంనుండి భూబీజంవరకు ఉన్నఐదుబీజాక్షరాలు కలిసి (హం-ఆకాశం, యం-వాయు, రం-అగ్ని, వం-జలం, లం-పృథివి) పంచాక్షరమంత్రం అవుతుంది. ఇది ఉత్తమ మైనమంత్రం. ఈమంత్రాన్ని ఉచ్చరించినమాత్రంచేతనే ఎంత దారుణమైన విషమయినా, ఉన్నచోటినుండి శరీరంలో పాకకుండా స్తంభిస్తుంది.

వ్యత్యస్తభూషయా బీజో మన్త్రోఽయం సాధు సాధితః ।
సంప్లవ ప్లావయ యమ శ్శబ్దాద్య స్సంహరే ద్విషమ్ ॥21॥

ఈపంచాక్షరమంత్రంలోని బీజాక్షరాలను ముందు వెనుకలు మార్చి, చక్కగా సాధన చేసినవాడు వ్యత్యస్తభూషణం అనే ఈమంత్రానికి ముందుగా 'సంప్లవ, ప్లావయ, ప్లావయ' అనేశబ్దాలను చేర్చి చెప్తే, అది విషాన్ని హరిస్తుంది.

దణ్డముత్థాపయేదేష సుజప్తామ్భోఽభిషేకతః ।
సుజప్తశఙ్ఖభేర్యాదినిస్స్వనశ్రవణేన వా ॥22॥

ఈమంత్రాన్ని జపిస్తూ, నీటిని అభిమంత్రించి, ఆనీటితో అభిషేకం చేస్తే, విషం నశించి, పాము కరిచినవాడు కట్టెలాగా లేచి, నిలుచుంటాడు. అలాగే ఈమంత్రాన్ని జపిస్తూ, శంఖం, భేరి మొదలైనవాటిని మోగిస్తే, ఆ ధ్వని కూడా విషాన్ని హరిస్తుంది.

సన్దహత్యేవ సంయుక్తో భూతేజో వ్యత్యయాత్ స్థితః ।
భూవాయువ్యత్యయాన్మన్త్రో విషం సఙ్క్రామయత్యసౌ ॥23॥

భూబీజం (లం), తేజోబీజం (రం) ఈరెండింటిని తారుమారు చేసి, పంచాక్షరమంత్రాన్ని ప్రయోగించినా, విషం నశిస్తుంది. భూబీజం (లం), వాయుబీజం (యం) ఈరెండింటిని తారుమారు చేసి, పంచాక్షరమంత్రాన్ని ప్రయోగిస్తే, విషం ఒకడినుండి మరొకడికి సంక్రమిస్తుంది.

అన్తస్థో నిజవేశ్మస్థో బీజాగ్నీన్దుజలాత్మభిః ।
ఏతత్కర్మ నయే న్మన్త్రీ గరుడాకృతివిగ్రహః ॥24॥

గరుడమంత్రవేత్త పాము కరిచినవాడికి దగ్గరలో ఉండి కాని, లేదా తనఇంటిలోనే ఉండి కాని, గరుడమంత్రాన్ని జపించి, గరుడస్వరూపాన్ని భావన చేస్తూ, తానే గరుత్మంతుడైనట్లుగా భావించాలి. అగ్ని (రం), ఇందుజల(వం) బీజాలతో విషహరణకర్మను ఆచరించాలి.

తార్‌క్ష్యవరుణగేహస్థ స్తజ్జపాన్నాశయేద్విషమ్ ॥25॥

గరుత్మంతుడిఆలయంలో గాని, లేదా వరుణుడిఆలయంలో గాని, గరుడమంత్రాన్ని జపించడంవలన విషాన్ని వెంటనే తొలగింపవచ్చు.

శ్రీజానుదణ్డీముదితం స్వధాశ్రీబీజలాఞ్ఛితమ్ ।
స్నానపానాత్ సర్వవిషం జ్వరరోగాపమృత్యుజిత్ ॥26॥

ఈమంత్రాన్ని శ్రీజానువు, దండి వీటితో కలిపి, స్వధా, శ్రీ అనే బీజాక్షరాలను చేర్చి, మంత్రించినజలంతో స్నానం చేసినా, ఆజలాన్ని తాగినా, విషం నశిస్తుంది.

పక్షి పక్షి మహాపక్షి మహాపక్షి వి వి స్వాహా ।
పక్షి పక్షి మహాపక్షి మహాపక్షి క్షి క్షి స్వాహా ॥
ద్వా వేతౌ పక్షిరాణ్మన్త్రౌ విషఘ్నౌ వభిమన్త్రణాత్ ॥27॥

1. పక్షి పక్షి మహాపక్షి, మహాపక్షి వి వి స్వాహా. 2. పక్షి పక్షి మహాపక్షి, మహాపక్షి క్షి క్షి స్వాహా. ఇవి రెండు గరుడమంత్రాలు. వీటితో అభిమంత్రిస్తే విషం నశిస్తుంది.

పక్షిరాజాయ విద్మహే పక్షిదేవాయ ధీమహి ।
త న్నో గరుడః ప్రచోదయాత్ ॥28॥

ఇది గరుడగాయత్రీమంత్రం. పక్షులకు రాజయిన గరుత్మంతుడిని గురించి తెలుసుకుని, ఆదేవుడిని ధ్యానిస్తాం. ఆగరుడదేవుడు మమ్ము ఉత్సాహపరచి రక్షించును గాక!

వహ్నిస్థో పార్శ్వతత్పూర్వౌ దన్తశ్రీకౌ చ దణ్డినౌ ।
సకాలీ లాఙ్గలీ చేతి నీలకణ్ఠాద్యమీరితమ్ ॥
వక్షఃకణ్ఠశిఖాశ్వేతం న్యసేత్ స్తమ్భే సుసంస్కృతౌ ॥29॥

పైగరుడమంత్రాలకు మొదట, ప్రక్కన 'రం' అనే అగ్నిబీజాన్ని చేర్చాలి. ఆపిదప దంత, శ్రీ, సకాలి, లాంగలి, అనేవాటిని చేర్చాలి. ఈమొత్తానికి ముందుగా నీలకంఠమంత్రాన్ని చేర్చాలి. ఇలా ఏర్పడినమంత్రాన్ని

వక్షస్స్థలంమీద, కంఠంమీద, శిఖలోనూ శ్వేతంగా న్యాసం చేసుకోవాలి. ఇలా సంస్కరింపబడిన పైరెండుమంత్రాలను విషాన్ని స్తంభింపజేయడానికి వినియోగించాలి.

హర హర హృదయాయ నమః కపర్దినే చ శిరసి ।
నీలకణ్ఠాయ వై శిఖాం కాలకూటవిషభక్షణాయ స్వాహా ॥
అథ వర్మ చ కణ్ఠే నేత్రం కృత్తివాసాస్త్రినేత్రమ్ ॥30॥

'హర హర హృదయాయ నమః' అని హృదయంలో న్యాసం చేసుకోవాలి. 'కపర్దినే శిరసి నమః (కపర్దిన్ శిరసే స్వాహా)' అని శిరస్సులోనూ, 'నీలకంఠాయ శిఖాయాం నమః (నీలకంఠ శిఖాయై వషట్)' అని శిఖలోనూ, 'కాలకూటవిషభక్షణాయ కవచే కంఠే స్వాహా ('కాలకూటవిషభక్షణ కవచాయ హుమ్) అని శరీరంలోనూ, కంఠంలోనూ, కృత్తివాససే నేత్రే నమః (కృత్తివాసాః నేత్రత్రయాయ వౌషట్) అని మూడుకన్నులలోనూ న్యాసం చేసుకోవాలి.

పూర్వాద్యైరాననైర్యుక్తం శ్వేతపీతారుణాసితైః ।
అభయం వరదం చాపం వాసుకిం చ దధ ద్భుజైః ॥
యస్యోపవీతపార్శ్వస్థా గౌరీ రుద్రోఽస్య దేవతా ॥31॥

తూర్పు మొదలైన దిక్కులలో తెలుపు, పసుపు, ఎఱుపు, నలుపు ముఖాలు కలిగిఉంటాడు. నాలుగుచేతులలో క్రమంగా అభయముద్ర, వరదముద్ర, ధనుస్సు, వాసుకిసర్పం ధరించి ఉంటాడు. అతడు యజ్ఞోపవీతం ధరించి ఉంటాడు. ప్రక్కనే పార్వతీదేవి ఉంటుంది. ఈవిధంగా ఉన్నరుద్రుడు ఈమంత్రానికి అధిదేవత.

పాదజానుగుహ్యనాభిహృత్కణ్ఠాననమూర్ధసు ।
మన్త్రార్ణా న్న్యస్య కరయో రఙ్గుష్ఠాద్యఙ్గులీషు చ ॥32॥

మంత్రంలోని అక్షరాలను క్రమంగా పాదాలు, మోకాళ్లు, గుహ్యావయవం, బొడ్డు, హృదయం, కంఠం, ముఖం, శిరసు అనేఅవయవాలలోనూ, అదే విధంగా బొటనవ్రేలు మొదలైన వ్రేళ్లలోనూ, న్యాసం చేసుకోవాలి.

తర్జన్యాదితదన్తాసు సర్వమఙ్గుష్ఠయోర్న్యసేత్ ॥33॥

చూపుడువేలుతో ప్రారంభించి, తిరిగి చూపుడువేలివరకు మంత్రాక్షరాలను న్యాసం చేసుకుని, తరువాత మొత్తం మంత్రాన్ని బొటనవేలిలో న్యాసం చేసుకోవాలి.

ధ్యాత్వైవం సంహరేత్ క్షిప్రం బద్ధయా శూలముద్రయా ।
కనిష్ఠా జ్యేష్ఠయా బద్ధా తిస్రోఽన్యాః ప్రసృతే ర్జవాః ॥34॥

ఈవిధంగా న్యాసాదులతో ధ్యానం చేసినతరువాత శూలముద్రతో వేళ్లను బంధించి, విషాన్ని నిర్మూలించాలి. చిటికెనవేలిని బొటనవేలితో కలిపి, మిగిలినమూడువేళ్లను ముందుకు చాపితే, అది శూలముద్ర అవుతుంది.

విషనాశే వామహస్త మన్యస్మి న్దక్షిణం కరమ్ ॥35॥

విషాన్ని తొలగించడానికి ఎడమచేతిని ప్రయోగించాలి. ఇతరకార్యాలకు కుడిచేతిని ఉపయోగించాలి.

ఓం నమో భగవతే నీలకణ్ఠాయ చిః ।
అమలకణ్ఠాయ చిః సర్వజ్ఞకణ్ఠాయ చిః క్షిప ఓం నమ స్వాహా ॥36॥

రుద్రదేవతాకమైన మంత్రం ఇది. కాలకూటవిషంచేత నల్లనైన కంఠం కలిగిన శివభగవానుడికి నమస్కారం. స్వచ్ఛమైనకంఠం కలిగిన శివుడికి నమస్కారం. సమస్తమూ తెలిసిన కంఠం కలిగిన శివుడికి నమస్కారం. విషహరుడైన హరుడు ఈవిషాన్ని దూరంగా చిమ్మివేయును గాక! పరమేశ్వరుడికి మళ్ళీ మళ్ళీ నమస్కారం.

అమలనీలకణ్ఠాయ నైకసర్వవిషాపహాయ ।
నమస్తే రుద్ర మన్యవ ఇతి సమ్మార్జనాద్విషం ॥
వినశ్యతి న సన్దేహః కర్ణజాప్యా ఉపానహా వా ॥37॥

'అమలనీలకంఠాయ, నైకసర్వవిషాపహాయ, నమస్తే రుద్ర మన్యవే' (స్వచ్ఛమైన నల్లనికంఠం కలిగి, సమస్తమైన విషాలను నిర్మూలించే రుద్రుడిమన్యువుకు నమస్కారం.) అనే మంత్రాన్ని జపిస్తూ, తుడిస్తే, విషం నశించిపోతుంది. ఇందులో సందేహం లేదు. ఈమంత్రాన్ని చెవిలో జపించినా, మంత్రం జపిస్తూ చెప్పుతో కొట్టినా విషం పోతుంది.

యజే ద్రుద్రవిధానేన నీలగ్రీవం మహేశ్వరమ్ ।
విషవ్యాధివినాశ స్స్యాత్ కృత్వా రుద్రవిధానకమ్ ॥ 38॥

నీలకంఠుడైన పరమేశ్వరుడిని రుద్రవిధానంతో అర్చించాలి. రుద్రవిధానంగా పరమేశ్వరుడిని పూజించడం వలన, విషాలకు సంబంధించిన అన్నివ్యాధులు తగ్గిపోతాయి.

ఇత్యాది మహాపురాణే ఆగ్నేయే దష్టచికిత్సాకథనం నామ పఞ్చనవత్యధికద్విశతతమోఽధ్యాయః ॥295॥

అగ్ని మహాపురాణంలో దష్టచికిత్సాకథనం అనే రెండువందల తొంబైఐదవ అధ్యాయం సమాప్తం.



షణ్ణవత్యధికద్విశతతమోఽధ్యాయః - రెండువందల తొంబైఆరవ అధ్యాయం

పంచాంగరుద్రవిధానమ్ - పంచాంగరుద్రవిధానం

అగ్నిరువాచ - వసిష్ఠమహర్షితో అగ్నిదేవుడు ఇలా చెప్తున్నాడు.

వక్ష్యే రుద్రవిధానం తు పఞ్చాఙ్గం సర్వదం పరమ్ ।
హృదయం శివసఙ్కల్ప శ్శిరస్సూక్తం తు పౌరుషమ్ ॥1॥

వసిష్ఠమహర్షీ! ఇపుడు నీకు రుద్రవిధానం చెప్తాను. ఇందులో అయిదు అంగాలు ఉంటాయి. పంచాంగం అయిన రుద్రవిధానం శ్రేష్ఠమైనది. సమస్తాన్నీ అనుగ్రహిస్తుంది. దీనికి హృదయం శివసంకల్పం. శిరస్సు పురుషసూక్తం.

శిఖాద్భ్యస్సంభృతం సూక్త మాశుః కవచమేవ చ ।
శతరుద్రీయసంజ్ఞస్య రుద్రస్యాఙ్గాని పఞ్చ హి ॥
పఞ్చాఙ్గాన్న్యస్య తం ధ్యాత్వా జపేద్రుద్రాంస్తతః క్రమాత్ ॥2॥

శిఖ 'అద్భ్య స్సమ్భృతః' అనే(ఉత్తరనారాయణ)మంత్రం. కవచం 'ఆశు శ్శిశానః' అనే(అప్రతిరథ)సూక్తం. (నేత్రం ప్రతిపూరుషం అనే సూక్తం) శతరుద్రీయం అనేపేరు కలిగిన రుద్రానికి అయిదు అంగాలు. ఈపంచాంగాలను శరీరంలో న్యాసం చేసుకుని, పరమేశ్వరుడిని ధ్యానం చేయాలి. ఆతరువాత క్రమంగా ఏకాదశరుద్రులను జపించాలి.

యజ్జాగ్రత ఇతి సూక్తం షదృచం మానసం విదుః ।
ఋషిస్స్యాచ్ఛివసఙ్కల్పశ్ఛన్దస్త్రిష్టుబుదాహృతమ్ ॥3॥

'యజ్జాగ్రతః' అనేది మొదలుకొని ఆరు ఋక్కులు (యజు.34. 1నుండి 6) కలిగిన శివసంకల్పం శతరుద్రీయానికి హృదయం. ఈసూక్తాన్ని దర్శించినఋషి శివసంకల్పుడు. ఇది త్రిష్టుప్ అనే ఛందస్సులో ఉన్నది.

శిరస్సహస్రశీర్షేతి తస్య నారాయణోఽప్యృషిః ।
దేవతా పురుషోఽనుష్టు ప్ఛన్దో జ్ఞేయం చ త్రైష్టుభమ్ ॥4॥

'సహస్రశీర్షా' అనేది మొదలుగా కలిగిన పురుషసూక్తం శతరుద్రీయానికి శిరస్సు. దీనికి ఋషి నారాయణుడు. పురుషుడు (హృదయాంతర్వర్తి అయిన పరమాత్మ) దేవత. ఇది అనుష్టుప్, త్రిష్టుప్ అనేరెండుఛందస్సులలో ఉన్నది.

అద్భ్యస్సమ్భృతసూక్తస్య ఋషిరుత్తరగో నరః ।
ఆద్యానాం తిసృణాం త్రిష్టు ప్ఛన్దోఽనుష్టుబ్ద్వయో రపి ॥
ఛన్దస్త్రైష్టుభమన్త్యాయాః పురుషోఽస్యాపి దేవతా ॥5॥

'అద్భ్య స్సమ్భృతః' అనేది మొదలుగా కలిగిన ఉత్తరనారాయణసూక్తం (శతరుద్రీయానికి శిఖ.) దర్శించిన ఋషి ఉత్తరగామి అయిన నరుడు. ఈసూక్తంలోని మొదటిమూడు మంత్రాలు త్రిష్టుప్ అనేఛందస్సులో ఉన్నాయి.

ఆ తరువాత రెండు అనుష్టుప్ అనే ఛందస్సులో ఉన్నాయి. చివరిది మళ్లీ త్రిష్టుప్ ఛందస్సులో ఉన్నది. ఈ సూక్తానికి కూడ పురుషుడే దేవత.

ఆశు రిన్ద్రో ద్వాదశానాం ఛన్ద స్త్రిష్టు బుదాహృతమ్ ।
ఋషిః ప్రోక్తః ప్రతిరథ స్సూక్తే సప్తదశర్చకే ॥6॥

'ఆశు శ్శిశానః' అనేది మొదలుగా కలిగిన సూక్తం(శతరుద్రీయానికి కవచం)లోని పన్నెండుమంత్రాలకు ఇంద్రుడు దేవత. ఇవి త్రిష్టుప్ అనేఛందస్సులో ఉన్నాయి. పదిహేడు ఋక్కులు గలిగిన ఈసూక్తాన్ని దర్శించినఋషి ప్రతిరథుడు.

పృథక్ పృథ గ్దేవతాస్స్యుః పురువిదఙ్గదేవతా ।
అవశిష్టదైవతేషు చ్ఛన్దోఽనుష్టుబుదాహృతమ్ ॥7॥

ఈఋక్కులకు దేవతలు వేరువేరుగా ఉన్నారు. పురువిత్ అనేవాడు అంగదేవత. ఇంద్రుడికంటె ఇతరులు దేవతలుగా కలిగిన మంత్రాలు అనుష్టుప్ అనే ఛందస్సులో ఉన్నాయి.

అసౌ య స్తామ్రో భవతి పురులిఙ్గోక్తదేవతా ।
పఙ్క్తిచ్ఛన్దోఽథ మర్మాణి త్రిష్టుప్ లిఙ్గోక్తదేవతా ॥8॥

'అసౌ య స్తామ్రః' అనే(యజు-16-6)మంత్రానికి దేవత పురులింగోక్తుడు. పంక్తి అనే ఛందస్సులో ఉన్నది. 'మర్మాణి తే' అనే మంత్రం త్రిష్టుప్ ఛందస్సులో ఉన్నది. దీనికి దేవత లింగోక్తుడు.

రౌద్రాధ్యాయే చ సర్వస్మి న్నృషి స్స్యా త్పరమేష్ఠ్యథ ।
ప్రజాపతి ర్వా దేవానాం కుత్సశ్చ తిసృణాం పునః ॥9॥

రుద్రాధ్యాయం మొత్తానికి ఋషి పరమేష్ఠి. 'దేవానామ్' అనే మంత్రానికి ఋషి ప్రజాపతి. తరువాత మూడుమంత్రాలకు ఋషి కుత్సుడు.

మానోద్వయో రుమైకాస్యా ద్రుద్రో రుద్రాశ్చ దేవతాః ।
ఆద్యోఽనువాకోఽథ పూర్వ ఏక రుద్రాఖ్యదైవతః ॥10॥

'మా నో మహాన్తమ్' 'మా న స్తోకే' (యజు. 16-15,16) అనే రెండుమంత్రాలకు ఉమాదేవి ఒక్కరే దేవత. మిగిలినవానికి రుద్రుడు, రుద్రగణాలు దేవతలు. వీనిలో మొదటిఅనువాకానికి పురాతనుడైన రుద్రుడు అనేపేరు కలిగినవాడు ప్రధానదేవత.

ఛన్దో గాయత్ర మాద్యాయా అనుష్టుప్ తిస్సృణా మృచామ్ ।
తిసృణాం చ తథా పఙ్క్తి రనుష్టు బథ సంస్మృతమ్ ॥11॥

మొదటిమంత్రం గాయత్రీఛందస్సులో ఉన్నది. తరువాతిమూడుమంత్రాలు అనుష్టుప్ ఛందస్సు. తరువాతిమూడుమంత్రాలు పంక్తి ఛందస్సు. ఆతరువాతిది అనుష్టుప్ ఛందస్సు.

ద్వయో శ్చ జగతీచ్ఛన్దో రుద్రాణా మప్యశీతయః ।
హిరణ్యబాహవ స్త్రిస్రో నమో వః కిరికాయ చ ॥12॥

ఆ తరువాతి రెండు జగతి ఛందస్సులో ఉన్నాయి. 'నమో హిరణ్యబాహవే' అనేది మొదలుకొని, 'నమో వః కిరికేభ్యః' అనేదానివరకు ఉన్న(11అనువాకాలు) మంత్రాలలో రుద్రులు మూడు అశీతిసంఖ్యలో (అసంఖ్యాకంగా) ఉన్నారు.

పఞ్చర్చో రుద్రదేవతా స్స్యు ర్మన్త్రే రుద్రానువాకకే ।
వింశకే రుద్రదేవా స్తాః ప్రథమా బృహతీ స్మృతా ॥ 13॥

రుద్రానువాకంలో అయిదు ఋక్కులకు దేవత రుద్రుడు. తిరిగి ఇరవయ్యవ ఋక్కుకు రుద్రులు దేవతలు. వీనిలో మొదటిఋక్కు బృహతి అనే ఛందస్సులో ఉన్నది.

ఋగ్ద్వితీయా త్రిజగతీ తృతీయా త్రిష్టుబేవ చ ।
అనుష్టుభో యజు స్త్రిస్ర ఆర్యోఽభిజ్ఞస్సుసిద్ధిభాక్ ॥14॥

రెండవఋక్కు త్రిజగతి అనేఛందస్సులో ఉన్నది. మూడవది త్రిష్టుప్ ఛందస్సు. తరువాతిమూడు మంత్రాలు అనుష్టుప్ ఛందస్సు. వీటికి సంబంధించిన జ్ఞానం సమగ్రంగా కలిగినవాడు ఉత్తమమైన సిద్ధిని పొందుతాడు.

త్రైలోక్యమోహనేనాపి విషవ్యాధ్యాదిమర్దనమ్ ।
ఇం శ్రీం హ్రీం హ్రూం త్రైలోక్యమోహనాయ విష్ణవే నమః ॥15॥

త్రైలోక్యమోహనమంత్రం విషవ్యాధులు మొదలైనవాటిని నాశనం చేస్తుంది.

'ఇం శ్రీం హ్రీం హ్రూం త్రైలోక్యమోహనాయ విష్ణవే నమః' అనేది త్రైలోక్యమోహనమంత్రం.

అనుష్టుభం నృసింహేన విషవ్యాధివినాశనమ్ ॥16॥

నృసింహస్వామి దేవతగా కలిగిన ఈఅనుష్టుప్పు విషాలకు సంబంధించిన వ్యాధులను నాశనం చేస్తుంది.

ఓం హం ఇమ్.

ఉగ్రం వీరం మహావిష్ణుం జ్వలన్తం సర్వతోముఖమ్ ।
నృసింహం భీషణం భద్రం మృత్యుమృత్యుం నమామ్యహమ్ ॥17॥

ఆనృసింహమంత్రం ఇది. భయంకరమైన రూపం కలిగినవాడు, పరాక్రమవంతుడు, అంతటా నిండి ఉన్నవాడు, మిక్కిలిగా ప్రకాశిస్తున్నవాడు, అన్నివైపుల ముఖం కలిగినవాడు (ప్రత్యక్షంగా కనబడేవాడు), దుర్మార్గులకు భయం పుట్టించేవాడు, సాధువులకు మేలు కలిగించేవాడు, మృత్యువుకే మృత్యువైనవాడు – అయిన నృసింహస్వామికి నేను నమస్కరిస్తున్నాను.

అయమేవ తు పఞ్చాఙ్గో మన్త్రస్సర్వార్థసాధకః ।
ద్వాదశాష్టాక్షరౌ మన్త్రౌ విషవ్యాధివిమర్దనౌ ॥18॥

పంచాంగమైన రుద్రానువాకం సమస్తమైన కోరికలు సిద్ధింపజేస్తుంది. అలాగే ద్వాదశాక్షరి (ఓం నమో భగవతే వాసుదేవాయ), అష్టాక్షరి (ఓం నమో నారాయణాయ) మంత్రాలు కూడ విషవ్యాధులను నాశనంచేస్తాయి.

కుబ్జికా త్రిపురా గౌరీ చన్ద్రికా విషహారిణీ ।
ప్రసాదమన్త్రో విషహృ దాయురారోగ్యవర్ధనః ॥19॥

'కుబ్జికా, త్రిపురా, గౌరీ, చంద్రికా, విషహారిణీ' అనేది ప్రసాదమంత్రం. ఇది విషాన్ని హరిస్తుంది. ఆయువునూ, ఆరోగ్యాన్నీ పెంపొందిస్తుంది.

సౌరో వినాయకస్తద్వ ద్రుద్రమన్త్రాస్సదాఖిలాః ॥20॥

అలాగే సౌర(సూర్య)మంత్రాలు, వినాయకమంత్రాలు, సమస్తమైన రుద్రమంత్రాలు కూడ విషాన్ని నిర్మూలించి, ఆయురారోగ్యాలను పెంచుతాయి.

ఇత్యాది మహాపురాణే ఆగ్నేయే పఞ్చాఙ్గరుద్రవిధానం నామ షణ్ణవత్యధికద్విశతతమోఽ ధ్యాయః ॥296॥

అగ్నిమహాపురాణంలో పంచాంగరుద్రవిధానం అనే రెండువందల తొంభైఆఅవ అధ్యాయం సమాప్తం.



సప్తనవత్యధికద్విశతతమోऽధ్యాయః – రెండువందల తొంబైఏడవ అధ్యాయం

విషహృన్మంత్రౌషధకథనమ్ – విషహృన్మంత్రౌషధకథనం

అగ్నిరువాచ – వశిష్ఠమహర్షితో అగ్నిదేవుడు ఇలా చెప్తున్నాడు.

ఓం నమో భగవతే రుద్రాయ ఛిన్ద ఛిన్ద విషం జ్వలితపరశుపాణయే చ ।
నమో భగవతే పక్షిరుద్రాయ దష్టకముత్థాపయోత్థాపయ ॥
దష్టకం కమ్పయ కమ్పయ జల్పయ జల్పయ ।
సర్పదష్టముత్థాపయోత్థాపయ. లల లల. బన్ధ బన్ధ. మోచయ మోచయ ॥
వరరుద్ర గచ్ఛ గచ్ఛ. వధ వధ. త్రుట త్రుట. బుక బుక. భీషయ భీషయ ।
ముష్టినా విషం సంహర సంహర. ఠ ఠ ॥1॥

ఇది విషాన్ని హరించేమంత్రం – (శ్రీరుద్రభగవానుడికి నమస్కారం. ప్రజ్వరిల్లుతున్న పరశువు చేతబట్టినవాడికి నమస్కారం. విషాన్ని ముక్కలు ముక్కలుగా చెయ్యి. గరుత్మంతుడిరూపంలో ఉన్న రుద్రభగవానుడికి నమస్కారం. పాము కరిచిన వీడిని పైకి లేపు. కదిలించు. మాట్లాడించు. పాము కరిచినవాడిని పైకి లేపు. కదిలించు. విషాన్ని కదలకుండా కట్టడిచెయ్యి. విషంనుండి ఇతడిని విడిపించు. మహారుద్రా! వెళ్లు. విషాన్ని నిర్మూలించు. భయపెట్టు. పిడికిలితో విషాన్ని సంహరించు.)

పక్షిరుద్రేణ హ విషం నాశమాయాతి మన్త్రణాత్ ॥2॥

గరుత్మంతుడిరూపంలో ఉన్న రుద్రుడు దేవతగా కలిగిన ఈవిషహరమంత్రంతో మంత్రిస్తే, పాము కరిచినవాడి శరీరంలోని విషం నశించిపోతుంది.

ఓం నమో భగవతే రుద్ర నాశయ విషం స్థావరజఙ్గమమ్ ।
కృత్రిమాకృత్రిమవిషముపవిషం నాశయ ॥
నానావిషం, దష్టకవిషం నాశయ, ధమ ధమ. వమ వమ ।
మేఘాన్ధకారధారావర్ష నిర్విషీభవ. సంహర సంహర. గచ్ఛ గచ్ఛ. ఆవేశయావేశయ ॥3॥

విషాన్ని హరించేమంత్రం ఇది ఇంకొకటి. (శ్రీరుద్రభగవానుడికి నమస్కారం. రుద్రదేవా! కదిలేదీ, కదలకుండా స్థిరంగా ఉండేదీ అయినవిషాన్ని నాశనం చెయ్యి. కొత్తగా చేరినదీ, అంతకు ముందు చేరిఉన్నదీ ఐన మహావిషాన్నీ, చిన్నచిన్నవిషాలనూ నాశనం చెయ్యి. రకరకాలైన విషాలను పాముకాటువలన కలిగినవిషాన్నీ నాశనం చెయ్యి. నిర్మూలించు. వెళ్లగొట్టు. మబ్బులనుండి చీకట్లు కమ్ముకున్నట్లుగా ధారగా కురుస్తున్నవర్షంలాగా ఉన్నవిషమా విషం లేనిదానివి కా. మహారుద్రా! విషాన్ని సంహరించు. వెళ్లు. ఆవేశించు.

విషోత్థాపనరూపమన్త్రాన్తాద్విషధారణమ్ ॥4॥

పాము కరిచినవాడిశరీరంలోనుండి విషాన్ని ఎగరగొట్టే ఈమంత్రంవలన విషం కదలకుండా నిలిచిపోతుంది.

ఓం క్షిప. ఓం క్షిప స్వాహా. ఓం హ్రాం హ్రీం ఖీం సః. ఠం ద్రౌం హ్రీం ఠః ।
జపాదినా సాధిత స్తు, సర్పాన్ బధ్నాతి నిత్యశః ॥5॥

ఓం క్షిప. ఓం క్షిప స్వాహా. ఓం హ్రాం హ్రీం ఖీం సః. ఠం ద్రౌం హ్రీం ఠః. ఇది విషాన్ని హరించే మరొకమంత్రం. జపం మొదలైన మార్గాలలో ఈమంత్రాన్ని సాధిస్తే, ఇది పాములను కదలకుండా కట్టిపడేస్తుంది.

ఏకద్విత్రిచతుర్బీజః కృష్ణచక్రాఙ్గపఞ్చకః ।
గోపీజనవల్లభాయ స్వాహా సర్వార్థసాధకః ॥6॥

ఒకటి, రెండు,మూడు, నాలుగు బీజాక్షరాలు, కృష్ణచక్రం, పంచాంగాలు కలిగిన – 'గోపీజనవల్లభాయ స్వాహా' అనే మంత్రం సమస్తమైన ప్రయోజనాలను చేకూరుస్తుంది.

ఓం నమో భగవతే రుద్రాయ ప్రేతాధిపతయే ।
శృణు శృణు. గర్జ గర్జ. భ్రామయ భ్రామయ. ముఞ్చ ముఞ్చ ॥
ముహ్య ముహ్య. కట కట. ఆవిశ ఆవిశ ।
సువర్ణపతఙ్గరుద్రో జ్ఞాపయతి ఠఠ ॥7॥

విషాలను హరింపజేసే మరొకమంత్రం ఇది. (ప్రణవస్వరూపుడైన శ్రీరుద్రభగవానుడికి నమస్కారం. ప్రేతాలకు అధిపతి అయిన రుద్రుడికి నమస్కారం. మహారుద్రా! విన్నప మాలకించు. విషాలకు భయం పుట్టేవిధంగా గర్జించు. ఊపివేయి. విషాలమీద నీశక్తిని విడిచిపెట్టు. ఏమీ చేయలేనివిధంగా మోహింపజేయి. వానిని బాధించు. వానిని ఆక్రమించు. బంగారుఱెక్కలు కలిగిన గరుత్మంతుడిరూపంలో ఉన్న రుద్రదేవా! నీ కిదే మా విన్నపం.)

పాతాలక్షోభమన్త్రోఽయం మన్త్రణాద్విషనాశనః ॥8॥

ఈమంత్రానికి పాతాళక్షోభం అని పేరు. దీనితో మంత్రిస్తే విషం నశించిపోతుంది.

దంశకాహిదంశే సద్యో దష్టః కాష్ఠశిలాదినా ।
విషశాన్త్యై దహేద్దంశం జ్వాలకోకనదాదినా ॥9॥

విషం కలిగినపాము కాటువేసినపుడు వెంటనే మండుతున్నకట్టెతో గాని, కాలుతున్నరాయితో గాని, ఇతరమైన అగ్నిశిఖలతో గాని కోకనదం మొదలైన వాటితో పాము కరిచినచోట కాల్చితే ఆవిషం తొలగిపోతుంది.

శిరీషబీజపుష్పార్కక్షీరబీజకటుత్రయమ్ ।
విషం వినాశయేత్ పానలేపనేనాఞ్జనాదినా ॥10॥

దిరిసెనచెట్టువిత్తులు, దిరిసెనపూలు, జిల్లేడుపాలు, జిల్లేడుగింజలు, త్రికటుకాలు (సొంటి, పిప్పలి, మిరియం), వీటిని కషాయం చేసుకుని తాగినా, లేదా గంధంలాగా చేసి పూసినా, కాటుకలాగా కంటికి పెట్టుకున్నా విషం నశిస్తుంది.

శిరీషపుష్పస్య రసభావితం మరిచం సితమ్ ।
పానమస్యాఞ్జనాద్యైశ్చ విషం హన్యాన్న సంశయః ॥11॥

మిరియాలను దిరిసెనపూవురసంతో భావన చేసి తాగినా, నస్యంగా ముక్కుద్వారా పీల్చుకున్నా, కాటుకలాగా కంటికి పెట్టుకున్నా, విషం నశించిపోతుంది. ఇందుకు సందేహం లేదు.

కోశాతకీవచాహిఙ్గుశిరీషార్కపయోయుతమ్ ।
కటుత్రయం సమేషామ్బో హరేన్నస్యాదినా విషమ్ ॥12॥

పొట్ల, వస, ఇంగువ, దిరిసెన, జిల్లేడుపాలు, త్రికటువులు (సొంటి, పిప్పలి, మిరియం), మేకనీటితో కలిపి, నస్యం మొదలైన ఏదోఒకరూపంలో తీసుకుంటే, విషం నశిస్తుంది.

రామఠేక్ష్వాకుసర్వాఙ్గచూర్ణం నస్యాద్విషాపహమ్ ॥13॥

ఇంగువ (రామఠం), చేదుసొఱ (ఇక్ష్వాకువు), ఈ రెంటినీ మెత్తగా పొడి చేసి నస్యంగా స్వీకరిస్తే విషం నశిస్తుంది.

ఇన్ద్రబలాగ్నికం ద్రోణం తులసీ దేవికా సహా ।
తద్రసాసక్తం త్రికటుకం చూర్ణం భక్ష్యం విషాపహమ్ ॥14॥

కొండమల్లె (ఇంద్ర), చిట్టాముదం (బల), చిత్రమూలం అనేఓషధి (అగ్నికం), తులసి, ఉమ్మెత్త (దేవిక), పిన్నగోరంట (సహ) - వీటిరసంతో త్రికటువును కలిపి, పొడి చేసి, తింటే, విషం నశిస్తుంది,

పఞ్చాఙ్గం కృష్ణపఞ్చమ్యాం శిరీషస్య విషాపహమ్ ॥15॥

కృష్ణపక్షంలో పంచమినాడు దిరిసెనచెట్టుకు చెందిన ఆకు, పువ్వు, పండు, బెరడు, వేరు అనే పంచాంగాలను తీసుకుంటే, విషం నశిస్తుంది.

ఇత్యాది మహాపురాణే ఆగ్నేయే విషహృన్మన్త్రౌషధకథనం నామ సప్తనవత్యధికద్విశతతమోఽధ్యాయః ॥297॥

అగ్నిమహాపురాణంలో విషహృన్మంత్రౌషధకథనం అనే రెండువందల తొంబైఏడవ అధ్యాయం సమాప్తం.



అష్టనవత్యధికద్విశతతమోఽధ్యాయః – రెండువందల తొంబైఎనిమిదవ అధ్యాయం
గోనసాదిచికిత్సాకథనమ్ – గోనసాదిచికిత్సాకథనం

అగ్నిరువాచ – వసిష్ఠమహర్షితో అగ్నిదేవుడు ఇలా చెప్తున్నాడు.

గోనసాదిచికిత్సాం చ వశిష్ఠ శృణు వచ్మి తే ॥1॥

వసిష్ఠమహర్షీ! కొండచిలువలు మొదలైన సర్పజాతులవిషానికి సంబంధించిన వైద్యాన్ని గురించి చెప్తాను, విను.

ఓం హ్రాం హ్రీం అనలపక్షి స్వాహా ।
తామ్బూలఖాదనాన్మన్త్రీ హరేన్మణ్డలినో విషమ్ ॥2॥

'ఓం హ్రాం హ్రీం అనలపక్షి స్వాహా' అనే మంత్రంతో అభిమంత్రించిన తాంబూలాన్ని తినిపించడంవలన మంత్రవేత్త పాముల విషాన్ని తొలగిస్తాడు.

లశునం రామఠఫలం కుష్ఠాగ్నివ్యోషకం విషే ।
స్నుహీక్షీరం గవ్యఘృతం పక్షం పీత్వాహిజే విషే ॥3॥

విషం తొలగించడానికి వెల్లుల్లి, ఊడుగుకాయ, చెంగల్వకోష్ఠు, చిత్రమూలం, వ్యోషం (సొంటి, పిప్పలి, మిరియం అనే త్రికటుకం) పుచ్చుకోవాలి. పామువిషం తొలగడానికి పదహేనురోజులపాటు జెముడుపాలు, ఆవుపాలు, తాగాలి.

అథ రాజిలదష్టే చ పేయా కృష్ణా ససైన్ధవా ।
ఆజ్యం క్షౌద్రం శకృత్తోయం పురీతత్యా విషాపహమ్ ॥4॥

రెండుతలలపాము కరిచినపుడు పిప్పలిని సైంధవలవణంతో కలిపి తాగాలి. నెయ్యి, తేనె, ఆవుపేడ కలిపిననీళ్లు పురీతతి, వీటిని పుచ్చుకుంటే, విషం తొలగిపోతుంది.

సకృష్ణాఖణ్డదుగ్ధాజ్యం పాతవ్యం తేన మాక్షికమ్ ॥5॥

పిప్పలిముక్కలను పాలతోనూ, నేయితోనూ, తేనెతోనూ కలిపి తాగాలి.

వ్యోషం పిచ్ఛం బిడాలాస్థినకులాఙ్గరుహైః సమైః ।
చూర్ణితై ర్మేషదుగ్ధాక్తై ర్ధూపస్సర్వవిషాపహః ॥6॥

త్రికటుకం, నెమలిపింఛం, పిల్లిఎముక, ముంగిసవెంట్రుకలు, – వీటిని సమానమైన భాగాలుగా తీసుకుని, పొడిచేసి, దానిని మేకపాలతో తడిపి, ధూపం వేస్తే, అన్నిరకాలవిషాలు నశించిపోతాయి.

రోమనిర్గుణ్డికాఙ్కోలకాపట్టైర్వా లశునం సమమ్ ।
మునిపత్రైః కృతస్వేదం దష్టం కాఞ్జికపాచితైః ॥7॥

పక్షిఈక, వావిలి, ఊడుగుఆకులను సమానభాగాలుగా తీసుకుని, వాటితో సమానంగా వెల్లుల్లిని కలిపి, వేసినధూపం కూడ విషాన్ని తొలగిస్తుంది. అవిసెఆకులను గంజిలో ఉడికించి, పాము కరిచినచోట కాపడం పెడితే, విషం తొలగిపోతుంది.

మూషికాష్షోడశ ప్రోక్తా రసం కార్పాసజం పిబేత్ ।
సతైలం మూషికార్తిఘ్నం ఫలినీకుసుమం తథా ॥
సనాగరగుడం భక్ష్యం తద్విషారోచకాపహమ్ ॥8॥

ఎలుకలు పదహారు రకాలు. ప్రత్తిరసం తాగితే ఎలుకలవిషం తొలగిపోతుంది. ప్రేంకణంపూవును నూనెతో కలిపి తీసుకోవడంవలన కూడా ఎలుకలవిషం తొలగిపోతుంది. అలాగే సొంటి, బెల్లంతో కలిపి తిన్నా, ఆవిషం నశిస్తుంది.

చికిత్సా వింశతిః ప్రోక్తా లూతావిషహరో గణః ।
పద్మకం పాటలీ కుష్టం నతముశీరచందనమ్ ॥
నిర్గుణ్డీ సారివా శేలు లూతార్తం సేచయే జ్జలైః ॥9॥

సాలెపురుగులకు సంబంధించినవిషాన్ని తొలగించడానికి వైద్యం ఇరవైరకాలుగా ఉన్నది. సాలెపురుగు విషంచేత బాధపడుతున్నవాడిని పద్మకాష్ఠం, కలిగొట్టు, నందివర్ధనం, వట్టివేరు, మంచిగంధం, వావిలి, సారివ, విరిగి – వీటిని కలిపిననీళ్లతో తడపాలి. దానివలన ఆ విషం తొలగిపోతుంది.

గుఞ్జానిర్గుణ్డికజ్కోలపర్ణం శుణ్ఠీ నిశాద్వయమ్ ।
కరఞ్జాస్థి చ తత్పుష్పై ర్వృశ్చికార్తిహరం శృణు ॥10॥

గురివెంద, వావిలి, తక్కోలం, మోదుగ, సొంటి, రెండురకాలైన పసుపు, కానుగగింజలు – వీటిని నూరి ఆపంకాన్ని పూసినా, సాలెపురుగువిషం నశించిపోతుంది. ఇక తేలుకాటువలన కలిగినవిషం నశించే చికిత్సను చెప్తాను, విను.

మఞ్జిష్ఠా చన్దనం వ్యోషం పుష్పం శిరీషకౌముదమ్ ।
సంయోజ్యా శ్చతురో యోగా లేపాదౌ వృశ్చికాపహాః ॥11॥

మంజిడి, చందనం, త్రికటుకం, దిరిసెనపువ్వు, ఎఱ్ఱదామరపువ్వు – వీటిని కలిపి, నాలుగు పూతలుగా తేలు కరిచినచోట పూస్తే, తేలువిషం నశించిపోతుంది.

ఓం నమో భగవతే రుద్రాయ చివి చివి. ఛిన్ద ఛిన్ద. కిరి కిరి. భిన్ద భిన్ద ।
ఖడ్గేన చ్ఛేదయ చ్ఛేదయ. శూలేన భేదయ భేదయ ॥
చక్రేణ దారయ దారయ ఓం హ్రూం ఫట్ ।
మన్త్రేణ మన్త్రితో దేయో, గర్ధభాదీన్నికృన్తతి ॥12॥

'ఓం నమో భగవతే రుద్రాయ చివి చివి. ఛిన్ద ఛిన్ద. కిరి కిరి. భిన్ద భిన్ద. ఖడ్గేన చ్ఛేదయ చ్ఛేదయ. శూలేన భేదయ భేదయ. చక్రేణ దారయ దారయ ఓం హ్రూం ఫట్.' (ప్రణవస్వరూపుడవైన శ్రీరుద్రభగవానుడికి నమస్కారం. కత్తితో నరికివేయి. శూలంతో ముక్కలు చేయి. చక్రంతో చీల్చివేయి.) అనేమంత్రంతో అభిమంత్రించిన ఔషధాదులను ఇస్తే, గాడిదలు మొదలైనవాటివిషం తొలగిపోతుంది.

త్రిఫలోశీరముస్తామ్బుమాంసీపద్మకచన్దనమ్ ।
అజాక్షీరేణ పానాదేర్గర్ధభాదేర్విషం హరేత్ ॥13॥

త్రిఫల (కరకం, తాడి, ఉసిరిక) వట్టివేరు, తుంగముస్తెనీళ్లు, జటామాంసి, చెంగల్వకోష్టు, మంచిగంధం, – వీటిని మేకపాలతో కలిపి తాగితే, గాడిదలు మొదలైన వాటివిషం నశిస్తుంది.

హరేచ్ఛిరీషపఞ్చాఙ్గవ్యోషం శతపదీవిషమ్ ॥14॥

దిరిసెన – ఆకు, పూవు, పండు, బెరడు, వేరు అనే అయిదుఅంగాలు, త్రికటుకం – ఇవి జెఱ్ఱిపోతువిషాన్ని తొలగిస్తాయి.

సకన్ధరం శిరీషాస్థి హరేదున్దూరజం విషమ్ ।
వ్యోషం ససర్పిః పిణ్డీతమూల మస్య విషం హరేత్ ॥15॥

దిరిసెనచెట్టుబెరడును తుంగముస్తెతో కలిపి తీసుకుంటే, ఎలుక, పందికొక్కులవిషాన్ని తొలగిస్తుంది.

క్షారవ్యోషవచాహిఙ్గువిడఙ్గం సైన్ధవం నతమ్ ।
అమ్బష్ఠాతిబలా కుష్ఠం సర్వకీటవిషం హరేత్ ॥16॥

త్రికటుకం, తగరం మూలం ఇవి రెండు నేతితో కలిపి తీసుకున్నా ఈవిషం పోతుంది. క్షారం, త్రికటుకం, వస, ఇంగువ, వాయువిడంగం, రాతిఉప్పు, తగరం, చిఱుబొద్ది, చిట్టాముదం, చెంగల్వకోష్టు – ఇవి అన్నిరకాలవిషాలను పోగొడతాయి.

యష్టివ్యోషగుడక్షీరయోగ శ్శునో విషాపహః ॥17॥

అతిమధురం, త్రికటుకం, బెల్లం, పాలు – వీటిని కలిపి తీసుకుంటే, కుక్కకు సంబంధించినవిషం పోతుంది.

ఓం సుభద్రాయై నమః. ఓం సుప్రభాయై నమః ।
యాన్యౌషధాని గృహ్యన్తే, విధానేన వినా జనైః ॥
తేషాం బీజం త్వయా గ్రాహ్య మితి బ్రహ్మాஉబ్రవీచ్చ తామ్ ॥18॥

'ఓం సుభద్రాయై నమః (సుభద్రాదేవికి నమస్కారం) ఓం సుప్రభాయై నమః (సుప్రభాదేవికి నమస్కారం)' ఇవి ఔషధం పుచ్చుకొనేసమయంలో చెప్పవలసిన మంత్రాలు. పూర్వం బ్రహ్మదేవుడు జనులు విధివిధానాలను అనుసరించకుండా ఔషధాలు తీసుకున్నపుడు వాటిలోని సారాన్ని నీవు గ్రహించమని సుప్రభా (సుభద్ర) దేవికి చెప్పాడు.

తాం ప్రణమ్యౌషధీం పశ్చా ద్యవాన్ ప్రక్షిప్య ముష్టినా ।
దశ జప్త్వా మన్త్రమిమం నమస్కుర్యాత్తదౌషధమ్ ॥
త్వాముద్ధరామ్యూర్ధ్వనేత్రా మనే నైవ చ భక్షయేత్ ॥19॥

ఆ మంత్రాన్ని ఉచ్చరించి, ముందుగా తాను తీసుకుంటున్న ఔషధానికి ప్రణామం చేయాలి. తరువాత పిడికిలితో యవలు తీసుకొని, చల్లాలి. ఆ తరువాత పైమంత్రాన్ని పదిసార్లు జపించాలి. తిరిగి ఆ ఔషధానికి నమస్కారం చేయాలి. 'ఊర్ధ్వనేత్రవయిన నిన్ను ఉద్ధరిస్తున్నాను' అని చెప్పి, ఈక్రిందిమంత్రం చెప్తూ ఆ ఔషధాన్ని పైకి తీసి, తినాలి.

నమః పురుషసింహాయ నమో గోపాలకాయ చ ।
ఆత్మనైవాభిజానాతి రణే కృష్ణ పరాజయమ్ ॥
అనేన సత్యవాక్యేన అగదో మేఽస్తు సిధ్యతు ॥20॥

పురుషులలో ఉత్తముడైన గోపాలస్వామికి నమస్కారం. కృష్ణా! యుద్ధంలో పరాజయం గురించి శ్రీకృష్ణుడు తానే తెలియును. ఈ సత్యవాక్యం మహిమచేత ఈ ఔషధం విషాన్ని నిర్మూలించును గాక! ఔషధం చక్కగా పనిచేసి, ఇష్టాన్ని సిద్ధింపజేయును గాక! (ఈమంత్రం చెప్తూ, ఓషధిని పైకి తీసి, తినాలి.)

నమో వైదూర్యమాత్రే తత్ర రక్ష రక్ష మాం సర్వవిషేభ్యో ।
గౌరి గాన్ధారి చాణ్డాలి మాతఙ్గిని స్వాహా హరిమాయే ॥21॥

(ఇది ఇంకొకమంత్రం) వైదూర్యమాతకు నమస్కరిస్తున్నాను. గౌరీ! గాంధారీ! చాండాలీ! మాతంగినీ! హరిమాయా! మీకు నమస్కారం. సమస్తవిధమైన విషాలనుండి ఎక్కడి కక్కడ నన్ను రక్షించు.

ఔషధాదౌ ప్రయోక్తవ్యో మన్త్రోఽయం స్థావరే విషే ॥22॥

ఈమంత్రాన్ని స్థావరాలైన విషాలను పోగొట్టడానికి తీసుకొనే ఔషధాలు మొదలైన వాటివిషయంలో ప్రయోగించాలి.

భుక్తమాత్రే స్థితే జ్వాలే పద్మం శీతామ్బుసేవితమ్ ।
పాయయేత్ సఘృతం క్షౌద్రం విషిణ్చేత్తదనన్తరమ్ ॥23॥

విషం తిన్నవాడికి లోపల ఆ విషం జ్వలిస్తున్నపుడు పద్మకాష్ఠం అనే ఓషధిని చల్లనినీళ్లతో కలిపి తాగించాలి. పిదప నెయ్యి, తేనె తాగించాలి. ఆ తర్వాత విరేచనం చేయించాలి.

ఇత్యాది మహాపురాణే ఆగ్నేయే గోనసాదిచికిత్సాకథనం నామాష్టనవత్యధికద్విశతతమోఽధ్యాయః ॥298॥

అగ్నిమహాపురాణంలో గోనసాదిచికిత్సాకథనం అనే రెండువందల తొంబైఎనిమిదవ అధ్యాయం సమాప్తం.



నవనవత్యధికద్విశతతమోఽధ్యాయః – రెండువందల తొంబైతొమ్మిదవ అధ్యాయం

బాలగ్రహహరబాలతంత్రకథనమ్ – బాలగ్రహహరబాలతంత్రకథనం

అగ్నిరువాచ – వసిష్ఠమహర్షితో అగ్నిదేవుడు ఇలా చెప్తున్నాడు.

బాలతన్త్రం ప్రవక్ష్యామి బాలాదిగ్రహమర్దనమ్ ॥ 1॥

వసిష్ఠమహర్షీ! ఇపుడు బాలతంత్రం చెప్తాను. ఇది పిల్లలను ఆవేశించిన గ్రహాలబాధలను తొలగిస్తుంది.

అథ జాతదినే వత్సం గ్రహీ గృహ్ణాతి పాపినీ ।
గాత్రోద్వేగో నిరాహారో నానాగ్రీవావివర్తనమ్ ॥ 2॥

పుట్టినరోజున పాపిని అనే స్త్రీగ్రహం బిడ్డను ఆవేశిస్తుంది. దాని ప్రభావంవలన బిడ్డకు ఒళ్లు వణుకుతుంది. ఆహారం తీసుకోదు. మెడ గిరగిరా తిప్పుతుంది.

తచ్చేష్టితమిదం తస్యా న్మాతౄణాం చ బలిం హరేత్ ।
మత్స్యమాంససురాభక్ష్యగన్ధస్రగ్ధూపదీపకైః ॥ 3॥

గ్రహి సోకినపుడు పిల్లలచేష్టలు పైవిధంగా ఉంటాయి. చేపలు, మాంసం, కల్లు, భక్ష్యాలు, గంధం, పువ్వు, ధూపం, దీపం – వీటితో మాతృదేవతలకు బలి ఇవ్వాలి.

లిమ్పేచ్చ ధాతకీలోధ్రమఞ్జిష్ఠాతాలచన్దనైః ।
మహిషాక్షేణ ధూపశ్చ ద్విరాత్రే భీషణీ గ్రహీ ॥ 4॥

ఏఋజాజి, లొద్దుగ, మంజిడి, తగరం, చందనం – వీటిని ఒంటికి పూయాలి. పిదప గుగ్గులుతో ధూపం వేయాలి. రెండవరోజున భీషణి అనేగ్రహి ఆవేశిస్తుంది.

తచ్చేష్టా కాసనిశ్శ్వాసౌ గాత్రసఙ్కోచనం ముహుః ॥ 5॥

దీనిప్రభావంవలన జలుబు, దగ్గు, తేప తేపకు ఒళ్లు ముడుచుకుపోవడం, అనే చేష్టలు ఏర్పడతాయి.

అజామూత్రయుతా కృష్ణా సేవ్యాపామార్గచన్దనైః ।
గోశృఙ్గదన్తకేశైశ్చ ధూపయేత్పూర్వవద్బలిః ॥ 6॥

భీషణి అనేగ్రహి సోకినబిడ్డకు మేకమూత్రంతో పిప్పళ్లను కలిపి, దానికి ఉత్తరేణు, చందనం చేర్చి, తాగించాలి. ఆవుకొమ్ము, దంతాలు, కేశాలతో ధూపం వేయాలి. ఇంతకు ముందు చెప్పినవిధంగా బలి ఇవ్వాలి.

గ్రహీ త్రిరాత్రే ఘణ్టాలీ తచ్చేష్టా క్రన్దనం ముహుః ।
జృమ్భణం స్వనితం త్రాసో గాత్రోద్వేగ మరోచనమ్ ॥ 7॥

మూడవరోజు ఘంటాలి అనే గ్రహి సోకుతుంది. దీనిప్రభావంవలన కలిగే చేష్టలు – బిడ్డ మాటిమాటికీ ఏడుస్తుంది. ఆవులిస్తుంది. పెద్దగా అరుస్తుంది. భయపడుతుంది. ఒళ్లు కంపిస్తుంది. ఇష్టం లేకపోవడంవలన ఆహారం తీసుకోదు.

కేసరాఞ్జనగోహస్తిదన్తం సాజపయో లిపేత్ ।
నఖరాజీబిల్వదలై ర్ధూపయేచ్చ బలిం హరేత్ ॥8॥

ఈ గ్రహి సోకినబిడ్డకు నాగకేసరం, రసాంజనం, ఆవుదంతం, ఏనుగుదంతం వీటిని మేకపాలతో కలిపి ఒంటికి పూయాలి. నఖం అనే గంధద్రవ్యం, నల్లావాలు, మారేడుదళం వీటితో ధూపం వేయాలి. పూర్వంలాగా బలి ఇవ్వాలి.

గ్రహీ చతుర్థీ కాకోలీ గాత్రోద్వేగ మరోచనమ్ ।
ఫేనోద్గారో దిశో దృష్టిః కుల్మాషైస్సాసవైర్బలిః ॥9॥

నాల్గవరోజున కాకోలి అనే గ్రహి సోకుతుంది. దీనివలన బిడ్డకు శరీరం వణుకుతుంటుంది. ఏదీ తాగాలనిపించదు. నురుగు కక్కుతుంది. దిక్కులు చూస్తుంటుంది. ఇది తగ్గడానికి యవలపిండి, కల్లు బలి ఇవ్వాలి.

గజదన్తాహినిర్మోకవాజిమూత్రప్రలేపనమ్ ।
సరాజీనిమ్బపత్రేణ వృకకేశేన ధూపయేత్ ॥10॥

ఏనుగుదంతం, పాముకుబుసం, గుఱ్ఱంమూత్రం కలిపి ఒంటికి బాగా పూయాలి. నల్లావాలతో, నిమ్మఆకులతోనూ, తోడేలువెంట్రుకలతోనూ ధూపం వేయాలి.

హంసాధికా పఞ్చమీ స్యా జ్జృమ్భాశ్వాసోర్ధ్వధారిణీ ।
ముష్టిబన్ధశ్చ తచ్చేష్టా బలిం మత్స్యాదినా హరేత్ ॥
మేషశృఙ్గబలాలోధ్రశిలాతాలైశ్శిశుం లిపేత్ ॥11॥

ఐదవనాడు హంసాధిక అనేగ్రహి సోకుతుంది. దీనివలన ఆవులింతలు, ఎగశ్వాస, పిడికిళ్లు బిగించడం అనేచేష్టలు ఏర్పడతాయి. ఇది శాంతించడానికి చేపలు మొదలైనవి బలి ఇవ్వాలి. మేకకొమ్ము, అతిబల, లొద్దుగ, మణిశిల, తాడి కలిపి ఒంటికి పూయాలి.

ఫట్కారీ తు గ్రహీ షష్ఠీ భయమోహప్రరోదనమ్ ।
నిరాహారోఽఙ్గవిక్షేపో హరే న్మత్స్యాదినా బలిమ్ ॥
రాజీగుగ్గులుకుష్ఠేభదన్తాద్యైర్ధూపలేపనైః ॥12॥

పుట్టినతరువాత ఆరవరోజున సోకే గ్రహి పేరు ఫట్కారి. దీనివలన భయపడడం, మగతగా ఉండడం, ఎక్కువగా ఏడవడం, ఆహారం తీసుకోకపోవడం, అటూ ఇటూ కదులుతూ ఉండడం, అనే చేష్టలు ఏర్పడతాయి. ఇది తగ్గడానికి చేపలు మొద లైనవి బలి ఇవ్వాలి. రాజి, గుగ్గులు, చెంగల్వకోష్టు, ఏనుగుదంతం వీటితో ధూపం వేయాలి. వీటిని బిడ్డఒంటికి పూయాలి.

సప్తమే ముక్తకేశ్యార్తః పూతిగన్ధో విజృమ్భణమ్ ।
నాదః ప్రరోదనం కాసో ధూపో వ్యాఘ్రనఖై ర్లిపేత్ ॥13॥

ఏడవరోజున బిడ్డకు ముక్తకేశి అనేగ్రహి ఆవహిస్తుంది. దీనివలన బిడ్డ బాధపడతుంటుంది. శరీరం పీతివాసనకొడుతుంది. ఆవులింతలు వస్తాయి. అరుస్తుంది. పెద్దగా ఏడుస్తుంది. దగ్గు వస్తుంది. ఇది తగ్గడానికి బిడ్డకు పులిగోళ్లతో ధూపం వేయాలి.

వచాగోమయగోమూత్రై శ్శ్రీదణ్డీ చాష్టమే గ్రహీ ।
దిశో నిరీక్షణం జిహ్వాచాలనం కాసరోదనమ్ ॥14॥

వస, ఆవుపేడ, ఆవుమూత్రం కలిపి ఒంటికి పూయాలి. ఇక ఎనిమిదవనాడు బిడ్డకు శ్రీదండి అనేగ్రహం ఆవేశిస్తుంది. దీనివలన బిడ్డ దిక్కులు చూస్తుంటుంది. ఎప్పుడూ నాలుక కదిలిస్తుంది. దగ్గుతుంది, ఏడుస్తుంటుంది.

బలిః పూర్వై శ్చ మత్స్యాద్యైర్ధూపలేపే చ హిఙ్గునా ।
వచాసిద్ధార్థలశునైశ్చోర్ధ్వగ్రాహీ మహాగ్రహీ ॥15॥

ఇది తగ్గడానికి ఇంతకు ముందులాగా, చేపలు మొదలైన వాటిని బలి ఇవ్వాలి. ఇంగువ, వస, తెల్లఆవాలు, వెల్లుల్లి – వీటితో ధూపం వేయాలి. వీటిని బిడ్డఒంటికి పూయాలి. ఆతరువాతిది ఊర్ధ్వగ్రాహి. (ఇది తొమ్మిదవనాడు బిడ్డను ఆవేశిస్తుంది.) ఇది మహాగ్రహి.

ఉద్వేజనోర్ధ్వనిశ్వాసస్స్వముష్టిద్వయఖాదనమ్ ।
రక్తచన్దనకుష్ఠాద్యైర్ధూపయేల్లేపయేచ్ఛిశుమ్ ॥16॥

దీనివలన బిడ్డకు వణుకు, ఎగశ్వాస, రెండు చేతులను పిడికిళ్లుగా బిగించిపట్టకుని నమలడం, అనేచేష్టలు ఏర్పడతాయి. ఇది తగ్గడానికి ఎఱ్ఱచందనం, చెంగల్వకోష్టులతో ధూపం వేయాలి. వీటిని బిడ్డఒంటికి పూయాలి.

కపిరోమనఖై ర్ధూపో దశమీ రోదనీ గ్రహీ ।
తచ్చేష్టా రోదనం శశ్వత్సుగన్ధో నీలవర్ణతా ॥17॥

కోతిగోళ్లతో ధూపం వేయాలి. ఇక ఆతరువాత పదవరోజున రోదని అనేగ్రహి బిడ్డను ఆవేశిస్తుంది. దీనివలన బిడ్డ ఎప్పుడూ ఏడుస్తుంటుంది. ఒంటినుండి మంచివాసన వస్తుంది. ఒళ్లు నల్లబడుతుంది.

ధూపో నిమ్బేన భూతోగ్రరాజీసర్జరసై ర్లిపేత్ ।
బలిం బహి ర్ద్వారే ల్లాజకుల్మాషకరకౌదనమ్ ॥
యావత్త్రయోదశాహం స్యాదేవం ధూపాదికా క్రియా ॥18॥

ఇది తగ్గడానికి వేపాకుతో ధూపం వేయాలి. క్షేమకరమైన మునగ, నల్లావాలు, మద్ది వీటిరసం ఒంటికి పూయాలి. పేలాలు, యవలపిండి, కరక్కాయ, కలిపినఅన్నం బలి ఇవ్వాలి. పదమూడవరోజువరకు ధూపం వేయడం మొదలైన కర్మలను ఈవిధంగానే చేయాలి.

గృహ్ణాతి మాసికం వత్సం పూతనా శకునీ గ్రహీ ।
కాకవద్రోదనం శ్వాసో మూత్రగన్ధోఽక్షిమీలనమ్ ॥19॥

ఒకనెల వయస్సు కలిగినబిడ్డను పక్షిరూపంలో ఉండే పూతన అనేగ్రహి ఆవేశిస్తుంది. దీనిప్రభావంచేత బిడ్డ కాకిలాగా ఏడుస్తుంది. శ్వాస బలవంతంగా తీసుకుంటుంది. ఒళ్లు మూత్రంవాసన వస్తుంది. తేపతేపకు కన్నులు మూసుకుంటుంటుంది.

గోమూత్రస్నపనం తస్య గోదన్తేన చ ధూపనమ్ ।
పీతవస్త్రం దదేద్రక్తస్రగ్గన్ధైస్తైలదీపకః ॥20॥

పూతన గ్రహి ఆవేశించినబిడ్డకు ఆవుమూత్రంతో స్నానం చేయించాలి. ఆవుదంతాలతో ధూపం వేయాలి. ఆగ్రహికి పచ్చనివస్త్రమూ, ఎఱ్ఱనిపూలమాలలు, నువ్వులనూనెతో దీపమూ ఇవ్వాలి.

త్రివిధం పాయసం మద్యం తిలం మాంసం చతుర్విధమ్ ।
కరఞ్జాధో యమదిశి సప్తాహం తైర్బలిం హరేత్ ॥21॥

మూడురకాలైన పాయసాలు, కల్లు, నువ్వులు, నాలుగురకాలైన మాంసం, బలి ఇవ్వాలి. ఈక్రియ అంతా కానుగచెట్టు కింద చేయాలి. ఈవిధంగా ఏడురోజులు చేయాలి.

ద్విమాసికం చ ముకుటా వపుః పీతం చ శీతలమ్ ।
ఛర్దిస్స్యాన్ముఖశోషాది పుష్పగన్ధాంశుకాని చ ॥
అపూపమోదనం దీపః కృష్ణనీరాదిధూపకమ్ ॥22॥

రెండునెలలవయసు కలిగినబిడ్డను ముకుట అనే గ్రహి ఆవేశిస్తుంది. దీనిప్రభావంచేత బిడ్డకు ఒళ్లు పచ్చబడుతుంది. చల్లబడుతుంది. వాంతులు అవుతాయి. నోరు ఎండిపోతుంది. ఈగ్రహి శాంతించడానికి గ్రహికి పూలు, గంధం, వస్త్రం ఇవ్వాలి. అప్పాలు, అన్నం బలి ఇవ్వాలి. దీపమూ, నల్లని అగరురసం మొదలైన వాటితో ధూపమూ ఇవ్వాలి.

తృతీయే గోముఖీ నిద్రా సవిణ్మూత్రప్రరోదనమ్ ।
యవాః ప్రియఙ్గుః పలలం కుల్మాషం శాకమోదనమ్ ॥
క్షీరం పూర్వే దదేన్మధ్యేఽహని ధూపశ్చ సర్పిషా ॥23॥

మూడునెలలబిడ్డకు గోముఖి అనే గ్రహి ఆవహిస్తుంది. దీనిప్రభావంవలన బిడ్డ ఎపుడూ నిద్ర పోతుంటుంది. తఱుచుగా మలమూత్రాలు విసర్జిస్తుంది. పెద్దగా ఏడుస్తుంది. ఈగ్రహి శాంతించడానికి తూర్పుదిక్కున యవలు, నల్లావాలు, నువ్వుపిండి, బొబ్బర్లు, తోటకూర, అన్నం, పాలు – బలి ఇవ్వాలి. మధ్యాహ్నం సమయంలో నేతితో ధూపం వేయాలి.

పఞ్చభఙ్గేన తత్స్నానం చతుర్థే పిఙ్గలార్తికృత్ ।
తనుశ్శీతా పూతిగన్ధ శ్శోషస్స మ్రియతే ధ్రువమ్ ॥24॥

దానికి ముందుగా ఆ బిడ్డకు పంచభంగంతో స్నానం చేయించాలి. ఇక నాలుగునెలలబిడ్డను పింగళ అనే గ్రహి ఆవహిస్తుంది. ఈ గ్రహి మిక్కిలిగా బాధ కలిగిస్తుంది. దీనిప్రభావంవలన బిడ్డకు ఒళ్లు చల్లబడుతుంది. శరీరం పీతివాసన వస్తుంది. నీరసిస్తుంది. చివరికి తప్పకుండా మరణిస్తుంది.

పఞ్చమీ లలనా గాత్రసాదస్స్యాన్ముఖశోషణమ్ ।
అపానః పీతవర్ణశ్చ మత్స్యాద్యై ర్దక్షిణే బలిః ॥25॥

ఐదవనెలలో లలన అనే గ్రహి ఆవేశిస్తుంది. దీనిప్రభావంవలన బిడ్డకు శరీరం క్షీణిస్తుంది. నోరు ఎండిపోతుంది. అపానవాయువులు అధికంగా వెలువడుతాయి. ఒళ్లు పచ్చబడుతుంది. ఈ గ్రహి శాంతించడానికి దక్షిణదిక్కులో చేపలు మొదలైన వాటిని బలిగా ఇవ్వాలి.

షణ్మాసే పఙ్కజా చేష్టా రోదనం వికృతస్వరః ।
మత్స్యమాంససురాభక్తపుష్పగన్ధాదిభిర్బలిః ॥26॥

ఆఱవనెలలో బిడ్డకు పంకజ అనే గ్రహి ఆవహిస్తుంది. దీనిప్రభావంచేత బిడ్డ అధికంగా ఏడుస్తుంది. కంఠధ్వని వికారంగా ఉంటుంది. ఈ గ్రహి శాంతించడానికి చేపలు, మాంసం, కల్లు, అన్నం, పూలు, గంధం మొదలైనవాటితో బలి ఇవ్వాలి.

సప్తమే తు నిరాహారా పూతిగన్ధాది దన్తరుక్ ।
పిష్టమాంససురామాంసైర్బలిస్స్యాద్యమునాఽష్టమే ॥27॥

ఏడవనెలలో బిడ్డకు నిరాహార అనే గ్రహి ఆవహిస్తుంది. దీని ప్రభావంచేత బిడ్డకు శరీరం దుర్వాసన రావడం మొదలైన మార్పులు కలుగుతాయి. దంతాలకు జబ్బు చేస్తుంది. ఈ గ్రహి శాంతించడానికి యవలపిండి, మాంసం, కల్లు, నంజుడు బలి ఇవ్వాలి. ఎనిమిదవనెలలో బిడ్డకు యమున అనే గ్రహి ఆవహిస్తుంది.

విస్ఫోటశోషణాద్యం స్యా త్తచ్చికిత్సాం న కారయేత్ ॥28॥

యమున అనే గ్రహిప్రభావంవలన బిడ్డకు ఒంటిమీద పొంగు (నీటిదద్దుర్లు) వస్తుంది. శరీరం ఎండిపోతుంది. దీనికి చికిత్స చేయగూడదు.

నవమే కుమ్భకర్ణ్యార్తో జ్వరీ ఛర్దతి పాలకే ।
రోదనం మాంసకుల్మాషమద్యాద్యైరైశకే బలిః ॥29॥

తొమ్మిదవనెలలో బిడ్డను కుంభకర్ణి అనే గ్రహి ఆవహిస్తుంది. దీనివలన బిడ్డకు బాధలు కలుగుతాయి. జ్వరం వస్తుంది. వాంతులు అవుతాయి. ఎక్కువగా ఏడుస్తుంటుంది. ఈగ్రహిశాంతికి ఈశాన్యదిక్కులో మాంసం, యవలపిండి, కల్లు మొదలైనవాటిని బలి ఇవ్వాలి.

దశమే తాపసీ చేష్టా నిరాహారోఽక్షిమీలనమ్ ।
ఘణ్టా పతాకా పిష్టాక్తా సురామాంసబలి స్సమే ॥30॥

పదవనెలలో బిడ్డకు తాపసి అనే గ్రహి ఆవేశిస్తుంది. దీనివలన బిడ్డ ఆహారం తీసుకోదు. నీరసంతో కన్నులు మూసుకొని ఉంటుంది. ఈ గ్రహశాంతికి గంట, పతాక, పిండితో కూడినకల్లు, మాంసం బలి ఇవ్వాలి.

రాక్షస్యేకాదశీ పీడా నేత్రాదౌ న చికిత్సితమ్ ।।31।।

పదకొండవనెలలో బిడ్డకు రాక్షసి అనే గ్రహి ఆవహిస్తుంది. దీనివలన కన్నులు మొద లైన అవయవాలలో బాధలు కలుగుతాయి. దీనికి వైద్యం లేదు.

చఞ్చలా ద్వాదశే శ్వాసత్రాసాదికవిచేష్టితమ్ ।
బలిః పూర్వేఽథ మధ్యాహ్నే కుల్మాషాద్యైస్తిలాదిభిః ।।32।।

పన్నెండవనెలలో బిడ్డకు చంచల అనే గ్రహి ఆవేశిస్తుంది. దీనివలన బిడ్డకు గాలి పీల్చుకోవడం కష్టం అవుతుంది. భయం మొదలైనవాటివలన రకరకా లైనచేష్టలు ఏర్పడతాయి. ఈ గ్రహశాంతికి తూర్పుదిక్కులో మధ్యాహ్నసమయంలో యవలపిండి మొదలైన వాటితోనూ, నువ్వులు మొదలైన వాటితోనూ బలి ఇవ్వాలి.

యాతనా తు ద్వితీయేఽబ్దే యాతనం రోదనాదికమ్ ।
తిలమాంసమద్యమాంసై ర్బలిస్స్నానాది పూర్వవత్ ।।33।।

రెండవసంవత్సరంలో బిడ్డకు యాతన అనే గ్రహి ఆవహిస్తుంది. దీనివలన పిల్లలకు అధికమైన ఏడుపు మొదలైన బాధలు కలుగుతాయి. ఈ గ్రహి శాంతించడానికి మునుపటిలాగా, స్నానం చేయించడం మొద లైనవి చేసి, నువ్వుపిండి (తిలమాంసం), కల్లు, మాంసం, బలి ఇవ్వాలి.

తృతీయే రోదనీ కమ్పో రోదనం రక్తమూత్రకమ్ ।
గుడౌదనం తిలాపూపః ప్రతిమా తిలపిష్టజా ।।
తిలస్నానం పఞ్చపత్రై ర్ధూపో రాజఫలత్వచా ।।34।।

మూడవసంవత్సరంలో పిల్లలకు రోదని అనే గ్రహి ఆవహిస్తుంది. దీనివలన శరీరం వణుకుతుంది. ఎక్కువగా ఏడుస్తారు. మూత్రంలో నెత్తురు పడుతుంది. ఈ గ్రహి శాంతించడానికి బెల్లపుఅన్నం, నువ్వులబూరెలు, నువ్వులపిండితో చేసినప్రతిమ, బలి ఇవ్వాలి. నువ్వులతో స్నానం చేయించాలి. పంచపత్రాల(మామిడి, నేరేడు, వెలగ, మాదీఫలం, మారేడు అనే పంచపల్లవాలు)తోనూ, పొట్లకాయతొక్కతోనూ ధూపం వేయాలి.

చతుర్థే చటకా శోఫో జ్వర స్సర్వాఙ్గసాదనమ్ ।
మత్స్యమాంసతిలాద్యైశ్చ బలిస్స్నానం చ ధూపనమ్ ।।35।।

నాల్గవసంవత్సరంలో పిల్లలకు చటక అనే గ్రహి ఆవహిస్తుంది. దీనివలన పిల్లలకు వాపు, జ్వరమూ వస్తాయి. ఒళ్లంతా నొప్పులు వస్తాయి. ఈ గ్రహి శాంతించడానికి చేపలు, మాంసం, నువ్వులు మొదలైనవి బలి ఇవ్వాలి. ఆ పిల్లవాడికి స్నానం చేయించి, ధూపం వేయాలి.

చఞ్చలా పఞ్చమేఽబ్దే తు జ్వర స్త్రాసోఽఙ్గసాదనమ్ ।
మాంసౌదనాద్యైశ్చ బలి ర్మేషశృఙ్గేణ ధూపనమ్ ॥
పలాశోదుమ్బరాశ్వత్థవటబిల్వదలామ్బుధృక్ ॥36॥

ఐదవసంవత్సరంలో పిల్లలకు చంచల అనే గ్రహి ఆవహిస్తుంది. దీనివలన జ్వరం వస్తుంది. భయం కలుగుతుంది. ఒళ్లునొప్పులు వస్తాయి. ఇది శాంతించడానికి మాంసం, అన్నం మొదలైన వాటిని బలి ఇవ్వాలి. మేకకొమ్ముతో ధూపం వేయాలి. మోదుగ, మేడి, రావి, మఱ్ఱి, మారేడుదళాలు కలిపిననీటిని ధరింపజేయాలి.

షష్ఠేఽబ్దే ధావనీ శోషో వైరస్యం గాత్రసాదనమ్ ।
సప్తాహోభిర్బలిః పూర్వై ర్ధూపస్నానం చ భృఙ్గకైః ॥37॥

ఆఱవసంవత్సరంలో పిల్లలకు ధావని అనే గ్రహి ఆవహిస్తుంది. దీనివలన నీరసం కలుగుతుంది. శరీరం వాడిపోతుంది. ఒళ్లు చిక్కిపోతుంది. ఇది శాంతించడానికి ఏడురోజులపాటు భృంగరాజంతో స్నానం చేయించాలి ఇంతకుముందు చెప్పిన ప్రకారంగా, ధూపం వేయాలి. బలి ఇవ్వాలి.

సప్తమే యమునాచ్ఛర్ది రవచో హాసరోదనమ్ ।
మాంసపాయసమద్యాద్యై ర్బలిస్నానం చ ధూపనమ్ ॥38॥

ఏడవసంవత్సరంలో పిల్లలకు యమున అనే గ్రహి ఆవేశిస్తుంది. దీనివలన వాంతులు అవుతాయి. మాటలు ఆగిపోతాయి. అతిగా నవ్వుతారు. అతిగా ఏడుస్తారు. ఇది శాంతించడానికి మాంసం, పాయసం, కల్లు మొద లైనవి బలి ఇవ్వాలి. స్నానం చేయించాలి. ధూపం వేయాలి.

అష్టమే వా జాతవేదా నిరాహారం ప్రరోదనమ్ ।
కృసరాపూపదధ్యాద్యై ర్బలి స్నానం చ ధూపనమ్ ॥39॥

ఎనిమిదవసంవత్సరంలో పిల్లలకు జాతవేద అనే గ్రహి ఆవహిస్తుంది. దీనివలన పిల్లలు ఆహారం తీసుకోరు. అధికంగా ఏడుస్తారు. నువ్వులు బియ్యం కలిపి వండినఅన్నం, అప్పాలు, పెరుగు – వీటిని బలి ఇవ్వాలి. స్నానం చేయించాలి. ధూపం వేయాలి.

కాలాబ్దే నవమే బాహ్వో రాస్ఫోటో గర్జనం భయమ్ ।
బలిస్స్యాత్ కృసరాపూపసక్తుకుల్మాషపాయసైః ॥40॥

తొమ్మిదవసంవత్సరంలో పిల్లలకు కాల అనే గ్రహి ఆవహిస్తుంది. దీనివలన భుజాలను కొట్టుకోవడం, పెద్దగా అరవడం, భయపడడం, అనే చేష్టలు ఏర్పడతాయి. నువ్వులు బియ్యం కలిపి వండినఅన్నం, అప్పాలు, పేలపిండి, నువ్వుపిండి పాయసం బలి ఇవ్వాలి.

దశమేఽబ్దే కలహంసీ దాహోఽఙ్గకృశతా జ్వరః ।
పోలికాపూపదధ్యన్నైః పఞ్చరాత్రం బలిం హరేత్ ॥41॥

పదవసంవత్సరంలో పిల్లలకు కలహంసి అనే గ్రహి ఆవహిస్తుంది. దీనివలన దప్పిక కలుగుతుంది. శరీరం కృశిస్తుంది. జ్వరం వస్తుంది. ఇది శాంతించడానికి ఐదురోజులపాటు గోధుమలతో చేసిన పిండివంటకం, అప్పాలు, పెరుగన్నం బలి ఇవ్వాలి.

నిమ్బధూపకుష్ఠలేపా వేకాదశమకే గ్రహీ ।
దేవదూతీ నిష్ఠురవా గ్బలిలేపాది పూర్వవత్ ॥42॥

పదకొండవసంవత్సరంలో పిల్లలకు దేవదూతి అనే గ్రహి ఆవహిస్తుంది. దీనివలన పిల్లవాడు నిష్ఠురంగా మాట్లాడతాడు. దీనిశాంతికి వేపాకులతో ధూపం వేయాలి. చెంగల్వకోష్ఠు పూయాలి. బలి, పూతలు మొద లైనవి ఇంతకు మునుపు చెప్పినవిధంగా చేయాలి.

బలికా ద్వాదశే శ్వాసో బలిర్లేపాది పూర్వవత్ ॥43॥

పన్నెండవసంవత్సరంలో పిల్లలకు బలిక అనే గ్రహి ఆవహిస్తుంది. దీనివలన శ్వాసకు సంబంధించినబాధలు కలుగుతాయి. దీనిశాంతికి బలి, లేపనాలు మొదలైనవి ఇంతకు మునుపు చెప్పినవిధంగా చేయాలి.

త్రయోదశే వాయవీ చ ముఖరోగోఽఙ్గసాదనమ్ ।
రక్తాన్నగన్ధమాల్యాద్యై ర్బలిః పఞ్చదలైస్స్నపేత్ ॥44॥

పదమూడవసంవత్సరంలో పిల్లలకు వాయవి అనే గ్రహి ఆవహిస్తుంది. దీనివలన ముఖరోగాలు వస్తాయి. శరీరం క్షీణిస్తుంది. ఇది శాంతించడానికి ఎఱ్ఱని అన్నం, గంధం, పూలు మొదలైనవాటిని బలి ఇవ్వాలి. పిల్లవాడికి మామిడి మొదలైన పంచపల్లవాలతో స్నానం చేయించాలి.

రాజీనిమ్బదలైర్ధూపో యక్షిణీ చ చతుర్దశే ।
చేష్టా శూలో జ్వరో దాహో మాంసభక్షాదికైర్బలిః ॥
స్నానాది పూర్వవచ్ఛాన్త్యై ముణ్డికార్తిస్త్రిపఞ్చకే ॥45॥

పధ్నాల్గవసంవత్సరంలో పిల్లలకు యక్షిణి అనే గ్రహి ఆవహిస్తుంది. దీనివలన నొప్పులు, జ్వరం, దప్పిక అనేచేష్టలు కలుగుతాయి. ఇది శాంతించడానికి నల్లావాలతోనూ, వేపాకుతోనూ ధూపం వేయాలి. మాంసం, భక్ష్యం మొదలైనవి బలి ఇవ్వాలి. స్నానం మొదలైనవి మునుపటిలాగా చేయాలి. పదిహేనవసంవత్సరంలో పిల్లలకు ముండికార్తి అనేగ్రహి ఆవహిస్తుంది.

తచ్చేష్టాసృక్స్రవశ్శశ్వత్ కుర్యాన్మాతృచికిత్సనమ్ ॥46॥

దీనివలన రక్తం అధికంగా స్రవిస్తుంది. దీనిశాంతికి జటామాంసితో చికిత్స చేయాలి.

వానరీ షోడశీ భూమౌ పతేన్నిద్రా సదా జ్వరః ।
పాయసాద్యైస్త్రిరాత్రం చ బలిస్స్నానాది పూర్వవత్ ॥47॥

పదహారవసంవత్సరంలో పిల్లలకు వానరి అనే గ్రహి ఆవహిస్తుంది. దానివలన పిల్లవాడు నేలపై పడిపోతాడు. నిద్ర ఎక్కువ అవుతుంది. జ్వరం వస్తుంది. ఇది శాంతించడానికి మూడురోజులపాటు పాయసం మొదలైనవాటిని బలి ఇవ్వాలి. స్నానం మొదలైనవి మునుపటిలాగానే చేయాలి.

గన్ధవతీ సప్తదశే గాత్రోద్వేగః ప్రరోదనమ్ ।
కుల్మాషాద్యైర్బలిస్స్నానధూపలేపాది పూర్వవత్ ॥ 48॥

పదిహేడవసంత్సరంలో పిల్లలకు గంధవతి అనే గ్రహి ఆవహిస్తుంది. దీనివలన శరీరం వణుకుతుంది. ఏడుపు ఎక్కువ అవుతుంది. ఇది శాంతించడానికి యవలపిండి మొదలైనవాటిని బలి ఇవ్వాలి. స్నానం, ధూపం, లేపనం మొదలైనవి మునుపటిలాగానే చేయాలి.

దినేశాః పూతనా నామ వర్షేశాస్సుకుమారికాః ॥49॥

పూతన అంటే పగటికి అధిపతులు. వర్షానికి అధిపతులు సుకుమారికలు.

ఓం నమస్సర్వమాతృభ్యో బాలపీడాసంయోగం ।
భుఙ్క్ష భుఙ్క్ష చుట చుట స్ఫోటయ స్ఫోటయ ॥
స్ఫుర స్ఫుర గృహ్ణ గృహ్ణ ఆక్రన్దయాక్రన్దయ ।
ఏవం సిద్ధరూపో జ్ఞాపయతి ॥51॥

('ఓం నమః నుండి ఆక్రన్దయాక్రన్దయ' అనునంతవఱకు శాంతిమంత్రం.) ప్రణవస్వరూపలైన సమస్త మాతృదేవతలకు నమస్కరిస్తున్నాను. పసిబిడ్డలకు ఆయా గ్రహిరూపాల వలన కలిగినబాధలను నిర్మూలించు. .....ఈమంత్రం గ్రహిపీడలను తొలగిస్తుంది.

హర హర నిర్దోషం కురు కురు ।
బాలికాం బాలం స్త్రియం పురుషం వా సర్వగ్రహాణాముపక్రమాత్ ॥
చాముణ్డే నమో దేవ్యై హ్రూం హ్రూం హ్రీం ।
అపసరాపసర. దుష్టగ్రహాన్ హ్రూం తద్యథా గచ్ఛన్తు గృహ్యకాః ॥
అన్యత్ర పన్థానం రుద్రో జ్ఞాపయతి ॥52॥

(ఇది బాలగ్రహవిమోచనమంత్రం) ఈబాలికను, బాలుడిని, ఆడ అయినా, మగ అయినా, సమస్తమైన గ్రహాలపట్టునుండి విడిపించు. ఏవిధమైనదోషాలు లేకుండా చెయ్యి. చాముండాదేవికి నమస్కరిస్తున్నాను. దుష్టమైనగ్రహాలను తొలగించు. గృహ్యకులు విడిచివెళ్లుదురు గాక! వీటిబాధ లేని వేరొకమార్గాన్ని రుద్రదేవుడు చూపును గాక!

సర్వబాలగ్రహేషు స్యా న్మన్త్రోఽయం సర్వకామదః ॥53॥

సమస్తమైన బాలగ్రహాలవిషయంలోనూ ఈమంత్రం ఇష్టసిద్ధిని కలిగిస్తుంది. ఈమంత్రం అన్ని కోరికలను తీరుస్తుంది.

ఓం నమో భగవతి చాముణ్డే ముఞ్చ ముఞ్చ బాలం బాలికాం వా ।
బలిం గృహ్ణ గృహ్ణ జయ జయ వస వస ॥

(ఇది బలి ఇచ్చేమంత్రం) ప్రణవానికి నమస్కారం. భగవతీ, చాముండాదేవీ, ఈ బాలుడినీ, అలాగే ఈ బాలికనూ విడిచిపెట్టు. బలిని స్వీకరించు. నీకు జయమగు గాక! ఉండు.

సర్వత్ర బలిదానేఽయం రక్షాకృత్ పఠ్యతే మనుః ॥54॥

ఇది అన్నిగ్రహాలవిషయంలోనూ బలి ఇచ్చేటపుడు రక్షను గలిగించే మంత్రం.

బ్రహ్మా విష్ణుశ్శివస్స్కన్దో గౌరీ లక్ష్మీర్గణాదయః ।
రక్షన్తు జ్వరదాహార్తం ముఞ్చన్తు చ కుమారకమ్ ॥55॥

బ్రహ్మ, విష్ణువు, శివుడు, కుమారస్వామి, గౌరీదేవి, లక్ష్మీదేవి, గణదేవతలు మొదలైనవారందరు - జ్వరంతోనూ, దాహంతోనూ బాధపడుతున్న ఈ బాలుడిని (బాలికను) రక్షింతురు గాక! ఈ బాలకుడిని అన్నిపీడలు విడిచివెళ్లను గాక!

ఇత్యాది మహాపురాణే ఆగ్నేయే బాలగ్రహబాలతన్త్రకథనం నామ నవనవత్యధికద్విశతతమోఽధ్యాయః ॥299॥

అగ్నిమహాపురాణంలో బాలగ్రహణబాలతంత్రకథనం అనే రెండువందల తొంబైతొమ్మిదవ అధ్యాయం సమాప్తం.



త్రిశతతమోఽధ్యాయః – మూడువందలవ అధ్యాయం

గ్రహహృన్మంత్రాదికథనమ్ – గ్రహహృన్మంత్రాదికథనం

అగ్నిరువాచ – వసిష్ఠమహర్షితో అగ్నిదేవుడు ఇలా చెప్తున్నాడు.

గ్రహోపహారమన్త్రాదీన్ వక్ష్యే గ్రహవిమర్దనాన్ ॥1॥

వసిష్ఠమహర్షీ! ఇపుడు గ్రహోపహారమంత్రాలు మొదలైనవాటిని వివరిస్తాను. ఇవి గ్రహపీడలను తొలగిస్తాయి.

హర్షేచ్ఛాభయశోకాదివిరుద్ధాశుచిభోజనాత్ ।
గురుదేవాదికోపాచ్చ పఞ్చోన్మాదా భవన్త్యథ ॥2॥

ఆనందం, కోరిక, భయం, దుఃఖం మొదలైన భావాలకు విరుద్ధమైనదీ, అపవిత్రమైనదీ అయిన భోజనం చేయడంచేతనూ, గురువులు, దేవతల కోపంవలననూ మానవులకు ఉన్మాదం కలుగుతుంది. ఇది ఐదు విధాలుగా ఉంటుంది.

త్రిదోషజాస్సన్నిపాతా ఆగన్తవ ఇతి స్మృతాః ।
దేవాదయో గ్రహా జాతా రుద్రక్రోధాదనేకధా ॥3॥

అవి త్రిదోషజాలు, సన్నిపాతాలు, ఆగంతుకాలు అయి ఉంటాయి. రుద్రుడి కోపంనుండి దేవాదిగ్రహాలు నానావిధాలుగా పుట్టాయి.

సరిత్సరస్తడాగాదౌ శైలోపవనసేతుషు ।
నదీసఙ్గే శూన్యగృహే బిలద్వార్యేకవృక్షకే ॥4॥

ఈ గ్రహాలు నదులు, సరస్సులు, చెఱువులు మొదలైన జలాశయాలలో, కొండలలో, తోటలలో, సేతువులలో, నదులు సముద్రంలో కలిసే ప్రదేశాలలో, జనం నివసించని ఇళ్లలో, గుహలవాకిళ్లలో, ప్రధానమైన చెట్లలో ఉంటాయి.

గ్రహా గృహ్ణన్తి పుంసశ్చ స్త్రియం సుప్తాం చ గర్భిణీమ్ ।
ఆసన్నపుష్పాం నగ్నాం చ ఋతుస్నానం కరోతి యా ॥5॥

మానవులెవరైనా ఆ ప్రదేశాలకు వెళ్లినపుడు అక్కడిగ్రహాలు స్త్రీపురుషులను పట్టుకుంటాయి. అలాగే నిద్ర పోతున్నది, గర్భవతి, ఋతుకాలం సమీపించినది, దిగంబరంగా ఉన్నది, ఋతుస్నానం చేసినది అయినస్త్రీని పట్టుకుంటాయి.

అవమానం నృణాం వైరం విఘ్నం భాగ్యవిపర్యయః ॥6॥

ఇవి పట్టుకున్నవారికి అవమానం, విరోధం, పనులకు ఆటంకాలు, దురదృష్టం కలిగిస్తాయి.

దేవతాగురుధర్మాదిసదాచారాదిలఙ్ఘనమ్ ।
పతనం శైలవృక్షాదే ర్విధున్వ న్మూర్ధజా న్ముహుః ॥
రుదన్నృత్యతి రక్తాక్షో హ్రూంరూపోఽనుగ్రహీ నరః ॥6॥

దేవతలను, గురువులను, ధర్మం మొదలైనవాటిని, ఉత్తమమైన ఆచరణలను ఉల్లంఘించినవారినీ, కొండలు, చెట్లు మొదలైన వాటిమీదనుండి కింద పడేవారినీ, తేపతేపకూ జుట్టు విరబోసుకొని విదిలించుకొనేవారినీ, ఏడుస్తూ, ఎఱ్ఱబడ్డకన్నులతో నాట్యం చేసేవారినీ, హ్రూంరూపమైన గ్రహి ఆవేశించినవారని తెలుసుకోవాలి.

ఉద్విగ్నశ్శూలదాహార్తః క్షుత్తృష్ణార్తశ్శిరోర్తిమాన్ ।
దేహి దేహీతి యాచేత బలికామగ్రహీ నరః ॥7॥

వణుకు, నొప్పులు, మంటలతో బాధపడేవాడు, ఆకలి, దప్పికలతో వ్యథపడేవాడు, ఇవ్వు, ఇవ్వు అని యాచించేవాడు బలికామ అనేగ్రహి ఆవేశించినవాడని తెలుసుకోవాలి.

స్త్రీమాలాభోగస్నానేచ్ఛు రతికామగ్రహీ నరః ॥8॥

పెక్కుమంది స్త్రీలతో భోగించడం స్నానం చేయడం కోరుకొనేవాడిని రతికామ అనే గ్రహి ఆవేశించిందని గ్రహించాలి.

మహాసుదర్శనో వ్యోమవ్యాపీ విటపనాసికః ।
పాతాలనారసింహాద్యా శ్చణ్డీమన్త్రా గ్రహార్దనాః ॥9॥

మహాసుదర్శనం, వ్యోమవ్యాపి, విటపనాసికం, పాతాళనారసింహం మొద లైనవి, చండీమంత్రాలు మొద లైనవి గ్రహబాధలను పోగొడతాయి.

పృశ్నీహిఙ్గువచాచక్రశిరీషదయితం పరమ్ ।

కలిగొట్టు, ఇంగువ, వస, పులిచింత, దిరిసెన - ఇవి ఉత్తమమైనవి,?)

పాశాఙ్కుశధరం దేవ మక్షమాలాకపాలినమ్ ॥
ఖట్వాఙ్గాబ్జాదిశక్తిం చ దధానం చతురాననమ్ ॥10॥

(గ్రహబాధానివృత్తికి సూర్యుడిని ఇలా ఆరాధించాలి.) సూర్యుడు తనకుడి,ఎడమచేతులలో పాశం, అంకుశం, అక్షమాల, కపాలమాల, మంచంకోడువంటిఆయుధం, పద్మం(చక్రం), శక్తి మొదలైనవానిని ధరించి ఉంటాడు. నాలుగుముఖాలుంటాయి.

అన్తర్బాహ్యాదిఖట్వాఙ్గపద్మస్థం రవిమణ్డలే ।
ఆదిత్యాదియుతం ప్రార్చ్య ఉదితేఽర్కేఽర్ఘ్యకం దదేత్ ॥11॥

లోపల, వెలుపల ప్రకాశించే సూర్యమండలంలోని పద్మంలో ఆసీనుడై ఉంటాడు. చుట్టూ ఆదిత్యుడు మొదలైన దేవతలు పరివేష్ఠించి ఉంటారు. అటువంటిసూర్యుడిని చక్కగా పూజించాలి. ఉదయిస్తూ ఉన్న సూర్యుడికి అర్ఘ్యం ఇవ్వాలి.

శ్వాసవిషాగ్నివిప్రకుణ్డీహృల్లేఖా సకలో భృగుః ।
అర్కాయ భూర్భువస్స్వశ్చ జాలినీం కులముద్గరమ్ ।।12।।

య (శ్వాస), ఓం (విష), ర (అగ్ని), ఓం (విప్ర) ఐ (కుండి), హ్రీం (హృల్లేఖ) కల అనేదానితో కూడిన 'శ' (భృగు) ఈబీజాక్షరాలకు తరువాత 'అర్కాయ భూ ర్భువ స్స్వః, అనేది, దానికి పిదప జాలినీ అనేశబ్దం, తర్వాత 'కులముద్గర' అని సూర్యమంత్రం ఏర్పడిఉంటుంది. (దీనిని ' యోః రొం ఐం హ్రీం కలశార్కాయ భూ ర్భువ స్స్వ రోం జ్వాలినీ కుల ముద్ధర' అని తద్జ్ఞులు చూపారు.)

పద్మాసనోఽరుణో రక్తవస్త్రస్సద్యుతివిశ్వకః ।
ఉదారః పద్మధృగ్దోర్భ్యాం సౌమ్యస్సర్వాఙ్గభూషితః ।।13।।

(ఇది సూర్యుడి ధ్యానశ్లోకం) పద్మంలో ఆసీనుడైనవాడు, ఎఱ్ఱగా ఉన్నవాడు, ఎఱ్ఱని వస్త్రాలు ధరించేవాడు, సమస్తమైన జగత్తునూ ప్రకాశింపజేసేవాడు, దయాపరిపూర్ణమైన స్వభావం కలిగినవాడు, రెండుచేతులలోనూ పద్మాలు ధరించినవాడు, శాంతస్వభావుడు, శరీరమంతటా చక్కగా అలంకరించుకున్నవాడు – అయిన రూపంలో సూర్యుడిని ధ్యానించాలి.

రవ్యాదయో గ్రహా స్సౌమ్యా వరదాః పద్మధారిణః ।
విద్యుత్పుఞ్జనిభం వస్త్రం శ్వేత స్సోమోఽరుణః కుజః ।।14।।

సూర్యుడు మొదలైనగ్రహాలు అన్నీ సౌమ్యస్వభావం కలిగినవి. పద్మం ధరించి ఉంటాయి. అందరూ మెరుపులగుంపులవంటి వస్త్రాలు ధరిస్తారు. చంద్రుడు తెల్లగా ఉంటాడు. కుజుడు ఎఱ్ఱగా ఉంటాడు.

బుధస్తద్వద్గురుః పీత శ్శుక్లశ్శుక్రశ్శనైశ్చరః ।
కృష్ణాఙ్గారనిభో రాహు ర్ధూమ్రః కేతు రుదాహృతః ।।15।।

బుధుడు, అలాగే బృహస్పతి ఇద్దరూ పసుపుపచ్చని రంగులో ఉంటారు. శుక్రుడు స్వచ్ఛమైన రంగులో ఉంటాడు. శని నల్లని బొగ్గురంగులో ఉంటాడు. రాహువు, కేతువు పొగరంగులో ఉంటారు.

వామోరువామహస్తాస్తే దక్షహస్తోరుజానుషు ।।16।।

వీరు అందరూ ఎడమచేతిని ఎడమతొడమీద, కుడిచేతిని కుడితొడ, మోకాళ్ళమీద పెట్టుకొని ఉంటారు.

స్వనామాద్యైస్తు బీజాన్తై హస్తౌ సంశోధ్య చాస్త్రతః ।
అఙ్గుష్ఠాదౌ తలే నేత్రహృదాద్యం వ్యాపకం న్యసేత్ ।।17।।

ఈ గ్రహాలపేర్లలోని మొదటి అక్షరాలే బీజాక్షరాలు. ఆ అక్షరానికి చివర బిందువు చేర్చాలి. అస్త్రమంత్ర మైన 'ఫట్' అనేదానితో చేతులు తుడుచుకోవాలి. బొటనవేళ్ళు మొదలుకొని కరతలాలలోనూ (కరన్యాసం) నేత్రాలు, హృదయం మొదలైన అంగాలలోనూ (అంగన్యాస) వ్యాపకన్యాసం చేసుకోవాలి.

మూలబీజైస్త్రిభిః ప్రాణధ్యాయకం న్యస్య సాఙ్గకమ్ ।
ప్రక్షాల్య పాత్రమస్త్రేణ మూలేనాపూర్య వారిణా ॥18॥

సూర్యమంత్రానికి మూలబీజాలయిన 'హ్రాం, హ్రీం, సః' అనే అక్షరాలతో ప్రాణరూపంలో సూర్యభగవానుడిని అన్నిఅవయవాలనూ శరీరంలోని ఆయాఅవయవాలలో న్యాసం చేసుకోవాలి. తరువాత అస్త్రమంత్రం(ఫట్)తో అర్ఘ్యపాత్రను కడగాలి. మూల(సూర్య)మంత్రంతో ఆ పాత్రలో నీళ్లు నింపాలి.

గన్ధపుష్పాక్షతం న్యస్య దూర్వామర్ఘ్యం చ మన్త్రయేత్ ।
ఆత్మానం తేన సమ్ప్రోక్ష్య పూజాద్రవ్యం చ వై ధ్రువమ్ ॥19॥

ఆ తరువాత అర్ఘ్యపాత్రలో గంధం, పుష్పం, అక్షతలు, గరిక ఉంచి, ఆజలాన్ని అభిమంత్రించాలి. ఆ నీళ్లను తనపైన, పూజాద్రవ్యాలపైన చక్కగా చల్లాలి.

ప్రభూతం విమలం సార మారాధ్యం పరమం సుఖమ్ ।
పీఠాద్యాన్ కల్పయేదేతాన్ హృదా మధ్యే విదిక్షు చ ॥20॥

హృదయంతో మధ్యలోనూ, నాలుగుకోణాలలోనూ ప్రభూతం, విమలం, సారం, ఆరాధ్యం, పరమసుఖం అనేవి కాళ్లుగా పీఠం మొదలైనవి నిర్మించాలి.

పీఠోపరి హృదో మధ్యే దిక్షు చైవ విదిక్షు చ ।
పీఠోపరి హృదబ్జం చ కేసరే ష్వష్టశక్తయః ॥21॥

హృదయంమధ్యలో పీఠంమీద నాలుగుదిక్కులలోనూ, కోణాలలోనూ, అలాగే పీఠంమీద హృదయ కమలంలోని కేసరాలలో దీప్త, సూక్ష్మ మొదలైన ఎనిమిదిశక్తులను స్థాపించాలి.

వాం దీప్తాం వీం తథా సూక్ష్మాం వూం జయాం వృాం చ భద్రికామ్ ।
వేం విభూతీం వైం విమలాం వో మసిఘాతవిద్యుతామ్ ॥
వౌం సర్వతోముఖీం వం పీఠం వః ప్రార్చ్య రవిం యజేత్ ॥22॥

1. వాం – దీప్తామ్ అని దీప్త అనేశక్తిని, 2. వీం – సూక్ష్మామ్ అని సూక్ష్మశక్తిని, 3. వూం – జయామ్ అని జయశక్తిని, 5. వృాం – భద్రికామ్ అని భద్రికాశక్తిని, 6. వేం – విభూతీమ్ అని విభూతిశక్తిని, 7. వైం – విమలామ్ అని విమలశక్తిని, 8. వోం – అసిఘాతవిద్యుతామ్ అని అసిఘాతవిద్యుత్ శక్తిని, వౌం – సర్వతోముఖీమ్ అని సర్వతోముఖశక్తిని, వం – పీఠమ్ – అని పీఠశక్తిని, వః – రవిమ్ అని రవిని పూజించి, పిదప ప్రధానార్చన చేయాలి.

ఆవాహ్య దద్యాత్ పాద్యాది హృత్షడఙ్గేన సువ్రత ॥23॥

ఉత్తమవ్రత నియమాలు పాటించే వసిష్ఠమహర్షీ! పిదప హృదయాదిషడంగన్యాసంతో సూర్యుడిని ఆవాహనం చేసి, పాద్యం మొదలైనవానిని ఇచ్చి పూజించాలి.

ఖకారౌ దణ్డినౌ చణ్డౌ మజ్జాదశనసంయుతా ।
మాంసదీర్ఘా జరద్వాయు హృ దైతత్ సర్వదం రవేః ॥24॥

'ఖకారౌ దణ్డినౌ చణ్డౌ మజ్జాదశనసంయుతా మాంసదీర్ఘా జరద్వాయుహృత్' అనే దానిచేత సూచింపబడిన సూర్యమంత్రం సమస్తమైన కోరికలను తీరుస్తుంది.

వహ్నీశరక్షోమరుతాం దిక్షు పూజ్యా హృదాదయః ।
స్వమన్త్రైః కర్ణికాన్తస్థా దిక్ష్వస్త్రం పురతస్సదృక్ ॥
పూర్వాదిదిక్షు సమ్పూజ్యా శ్చన్ద్రజ్ఞగురుభార్గవాః ॥25॥

ఆగ్నేయం, ఈశాన్యం, నైరృతి, వాయవ్యదిక్కులలో హృదయం మొదలైనవాటిని ఆయామంత్రాలతో పూజించాలి. కర్ణిక మధ్యలోనూ, దిక్కులలోనూ, ఎదురుగానూ, ఒకసారి అస్త్రాన్ని పూజించాలి. తూర్పుమొదలైన దిక్కులలో చంద్రుడు, బుధుడు, గురువు, శుక్రుడు – వీరిని పూజించాలి.

పృశ్నిహిఙ్గువచాచుక్రశిరీషలశునామయైః ।
నస్యాఞ్జనాది కుర్వీత సాజమూత్రై ర్గ్రహాపహైః ॥26॥

కలిగొట్టు, ఇంగువ, వస, పులిచింత, దిరిసెన, వెల్లుల్లి – వీటితో చేసిన నస్యం, కాటుక మొదలైనవాటిని మేకమూత్రంతో కలిపి ఇవ్వాలి. ఇది గ్రహపీడలను నిర్మూలిస్తుంది.

పాఠాపథ్యావచాశిగ్రుసిన్ధువ్యోషైః పృథ క్పలైః ।
అజాక్షీరాఢకే పక్వసర్పి స్సర్వగ్రహాన్ హరేత్ ॥27॥

చిఱుబొద్ది, కరకం, వస, మునగ, కలిగొట్టు, తెల్లలవణం, త్రికటుకం, – వీటిని ఒక్కొక్కటి ఒకపలం పరిమాణంలో తీసుకొని, నాలుగుమానికల మేకపాలలో ఉడికించి, తీసిన నేతివలన అన్నిరకాల గ్రహపీడలు తొలగిపోతాయి.

వృశ్చికాలీ ఫలా కుష్ఠం లవణాని చ శార్ఙ్గకమ్ ।
అపస్మారవినాశాయ తజ్జలం త్వభిభోజయేత్ ॥28॥

గలిజేరుకంప, త్రిఫల, చెంగల్వకోష్టు, పంచలవణాలు, అల్లం నీళ్లలో ఉడికించి ఆనీళ్లు తాగితే పిచ్చి తగ్గుతుంది.

విదారీకుశకాశేక్షుక్వాథజం పాయయే త్పయః ।
ద్రోణేన యష్టికూష్మాణ్డరసే సర్పిశ్చ సంస్కృతమ్ ॥
పఞ్చగవ్యం ఘృతం తద్వద్యోగం జ్వరహరం శృణు ॥29॥

నేలగుమ్మడి, కురువేరు, తెల్లు, చెఱకు వీటితో చేసిన కషాయంతో కలిపినపాలు తాగించాలి. అతిమధురం, గుమ్మడిరసంలో తుమ్మిఆకుల రసం, సంస్కరించిన నెయ్యి, లేదా పంచగవ్యం, నెయ్యి కలిపి తీసుకోవాలి. ఇది జ్వరం పోగొడుతుంది.

ఓం భస్మాస్త్రాయ విద్మహే ఏకదంష్ట్రాయ ధీమహి తన్నో జ్వరః ప్రచోదయాత్ ॥30॥

ఇది జ్వరగాయత్రి మంత్రం. దీనిని జపిస్తే జ్వరం తగ్గిపోతుంది. (భస్మం ఆయుధం ఐన జ్వరదేవతను గురించి తెలుసుకుంటాం. ఒక్క దంష్ట్ర కలిగిన అతడిని ధ్యానిస్తాం. ఆ జ్వరదేవత మమ్మల్ని రక్షించును గాక!)

కృష్ణోషణనిశారాస్నాద్రాక్షాతైలం గుడం లిహేత్ ।
శ్వాసవా నథ వా భార్గీ సయష్టిమధుసర్పిషా ॥
పాఠా తిక్తా కణా భార్గీమథ వా మధునా లిహేత్ ॥31॥

దగ్గు వచ్చినపుడు పిప్పలి, మిరియం, పసుపు, సన్నరాష్ట్రం అనే ఓషధి, ద్రాక్ష, నువ్వులనూనె, బెల్లం కలిపి నాకాలి. లేదా, అతిమధురం, తేనె, నెయ్యి అనేవాటితో చిఱుతేకు కలిపి తీసుకోవాలి. లేదా, చిఱుబొద్ది, కటుకరోహిణి, చిఱుతేకులను తేనెతో కలిపి నాకాలి.

ధాత్రీ విశ్వా సితా కృష్ణా ముస్తా ఖర్జూరమాగధీ ।
పీవరా చేతి హిక్కాఘ్నం తత్త్రయం మధునా లిహేత్ ॥32॥

ఉసిరిక, సొంటి, తెల్లగరిక, పిప్పలి, తుంగముస్తె, ఖర్జూరం, తెల్లజీలకఱ్ఱ, పీవరం – ఇవి ఎక్కిళ్లను తగ్గిస్తాయి. పై మూడింటిని తేనెతో కలిపి నాకాలి.

కామలీ జీరమణ్డూకీనిశాధాత్రీరసం పిబేత్ ॥33॥

కామెర్లరోగం వచ్చినవాడు జీలకఱ్ఱ, మండూకపర్ణి, పసుపు, ఉసిరికలరసం తాగాలి.

వ్యోషపద్మకత్రిఫలావిడఙ్గదేవదారవః ।
రాస్నాచూర్ణం సమం ఖణ్డైర్జగ్ధ్వా కాసహరం ధ్రువమ్ ॥34॥

త్రికటుకం, పద్మకాష్ఠం అనే ఓషధి, త్రిఫల, వాయువిడంగం, దేవదారువు, సన్నరాష్ట్రం అనే ఓషధిపొడి – వీటిని సమానభాగాలుగా తీసుకొని, పటికబెల్లంతో కలిపి నూరి తీసుకుంటే, దగ్గు తగ్గిపోతుంది.

ఇత్యాది మహాపురాణే ఆగ్నేయే గ్రహహృన్మన్త్రాదికథనం నామ త్రిశతతమోऽధ్యాయః ॥300॥

అగ్నిమహాపురాణంలో గ్రహహృన్మంత్రాదికథనం అనే మూడువందలవ అధ్యాయం సమాప్తం.



ఏకాధికత్రిశతతమోఽధ్యాయః – మూడువందల ఒకటవ అధ్యాయం

సూర్యార్చనవిధానమ్ – సూర్యార్చనవిధానం

అగ్నిరువాచ – అగ్నిదేవుడు ఇలా వసిష్ఠునితో చెబుతున్నాడు.

శయ్యా తు దండీ సాజేశపావకశ్చతురాననః ।
సర్వార్థసాధకమిదం బీజం పిండార్థముచ్యతే ॥1॥

దండి, అజేశుడు, పావకుడు, చతురాననుడు అనే నలుగురు దేవతలతో, ఆ దేవతా బీజమంత్రాలతో దేవునిపీఠం అధిష్ఠితమై ఉంటుంది. ఇది సకలప్రయోజనాలను కలగజేస్తుంది.

స్వయం దీర్ఘస్వరాద్యం చ బీజేష్వంగాని సర్వశః ।
(ఖాతం) ఖాంతం సాధు విషం చైవ సబిందుం సకలం తథా ॥2॥

పైన చెప్పబడిన బీజానికి క్రమంగా మొదట దీర్ఘస్వరాలను చేర్చి అంగన్యాసం చేయాలి. ("గ్రాం హృదయాయ నమః; గ్రీం శిరసే స్వాహా; గ్రూం శిఖాయై వషట్; గ్రైం కవచాయ హుమ్; గ్రౌం నేత్రత్రయాయ వౌషట్, గ్రః అస్త్రాయ ఫట్" అని న్యాసం చేయాలి. లేదా 'గ' అనే ఏకాక్షరాన్ని బీజంగా గ్రహించి (గాం, గీం, గూం, గైం, గౌం, గః) అని అయినా న్యాసం చేయాలి. అంతం (విసర్గ), విషం(మకారం) ఖాంతం (గకారం) ఈ విధంగా కలిపితే 'గం, గః' అనే రెండు బీజమంత్రాలు ప్రకటితం అవుతాయి. ఔ కారం పై బిందువు కలిపితే 'గౌం' అనే మూడో బీజం వ్యక్తమవుతుంది. బిందువును కళను కలిపితే 'గం(ః)' అనే నాలుగో బీజం అవుతుంది. కేవల 'గ' కారం అయిదో బీజమవుతుంది.

గణస్య పంచ బీజాని పృథక్ దృష్టఫలం మహత్ ॥3॥

ఈవిధంగా గణపతికి పంచ బీజాక్షరాలు ఏర్పడతాయి. అవి వేరు వేరుగా గొప్పఫలితాలను ఇస్తాయి.

(విశేషం:– ఖాంతం సాంతవిషం సబిందు సకలం బింద్వాయుతం కేవలమ్ । పంచైతాని పృథక్ ఫలం విదధతే బీజాని విఘ్నేశితుః ॥ – నారాయణతంత్రం)

గణం జయాయ నమ ఏకదంష్ట్రాయ చలకర్ణినే ।
గజవక్త్రాయ మహోదరహస్తాయ ॥4॥

పంచాంగం సర్వసామాన్యం సిద్ధిః స్యాల్లక్షజాప్యతః ॥5॥

గణేశునికి సంబంధించిన మంత్రాలకు సామాన్యంగా పంచాంగన్యాసం ఈ విధంగా ఉంటుంది. "గణం జయాయ స్వాహా హృదయాయ నమః; ఏకదంష్ట్రాయ హుం ఫట్ శిరసే స్వాహా; అచలకర్ణినే నమో నమః శిఖాయై వషట్; గజవక్త్రాయ నమో నమః కవచాయ హుమ్; మహోదరహస్తాయ చండాయ హుంఫట్, అస్త్రాయఫట్ " ఇది

సర్వసామాన్యమైన పంచాంగలక్షణం. ఇందు ఒక్కొక్క బీజాక్షరాన్ని లక్షమార్లు జపించడం వల్ల మంత్రసిద్ధి కలుగుతుంది.

గణాధిపతయే గణేశ్వరాయ గణనాయకాయ గణక్రీడాయ ॥6॥

దిగ్దలే పూజయేన్మూర్తీః పురావచ్చాంగపంచకమ్ ॥7॥

అష్టదళకమలాన్ని ఏర్పరచి, దాని దిగ్దళములందు గణేశుని నాలుగు విగ్రహాలను (మూర్తులను) పూజించాలి. ఈ విధంగా క్రమంగా పంచాంగపూజ కావించాలి. నమః చివర చేర్చి "గణాధిపతయే నమః, గణేశ్వరాయ నమః, గణనాయకాయ నమః, గణక్రీడాయ నమః" అనే మంత్రాలతో "హృదయాది" నాలుగు అంగాలను, కోణాలలో ఉన్న నాలుగు దళాలలోను 'అస్త్రాది' బంధనం కావించి పూజించాలి.

వక్రతుండాయైకదంష్ట్రాయ మహోదరాయ గజవక్త్రాయ ।
వికటాయ విఘ్నరాజాయ ధూమ్రవర్ణాయ ॥8॥

దిగ్విదిక్షు యజేదేతాన్ లోకేశాశ్చైవ ముద్రయా ।
మధ్యమా తర్జనీ మధ్యగతాంగుష్ఠౌ సముష్టికౌ ॥9॥

'నమః' అనే పదాన్ని చివర చేర్చి "వక్రతుండాయ నమః, ఏకదంష్ట్రాయ నమః, మహోదరాయ నమః, గజవక్త్రాయ నమః, మంత్రం లేక పోయినా లంబోదరాయ నమః, వికటాయ నమః, విఘ్నరాజాయ నమః, ధూమ్ర వర్ణాయ నమః, అనే ఎనిమిది మూర్తులను కమలచక్రం యొక్క దిక్కులందు, కోణాలయందు పూజించాలి. పిమ్మట ఇంద్రాది లోకపాలురను మంత్రాలద్వారా అర్చించాలి. ముద్రాప్రదర్శన ద్వారా చేసే పూజశ్రేష్ఠం. మధ్యమా-తర్జనుల మధ్య బొటనవ్రేలు ఉంచి పిడికిలి బిగించి (ఇది గణేశముద్ర) రెండు చేతులతోను ప్రదర్శించి ధ్యానించాలి.

(**విశేషం:** 'మహోదరాయ' అనే పదం ' లంబోదరాయ' అనే పదానికి ఉపలక్షణం.)

చతుర్భుజం మోదకాఢ్యం దండపాశాంకుశాన్వితమ్।
దంతభక్ష్యధరం రక్తం సాబ్జం పాశాంకుశైర్వృతమ్ ॥10॥

ధ్యానం ఈ విధంగా చేయాలి. నాలుగు భుజాలు కలిగినవానిని, ఒక చేతితో మోదకాలను గ్రహించిన వానిని, మిగిలిన మూడు చేతులలో దండం, పాశం, అంకుశం కలిగినవానిని (లేదా) దంతాలలో భక్ష్యాలు (లడ్డులు) (దంతం పై భక్ష్యం) ధరించినవానిని, ఎర్రనికాంతి కలిగినవానిని, పద్మం, పాశం, అంకుశం కలిగిన వానిని ధ్యానించాలి (పూజించాలి).

పూజయేత్తం చతుర్థ్యాం చ విశేషేణాథ నిత్యశః ।
శ్వేతార్కమూలేన కృతం సర్వాప్తిః స్యాత్తిలైర్ఘృతైః (ఘృతైః) ॥
తండులైర్దధిమధ్వాజ్యైః స్సౌభాగ్యం వశ్యతామియాత్ ॥11॥

శ్వేతార్కమూలంతో (తెల్లజిల్లేడు వేరుతో) మూర్తిని నిర్మించి గణేశునికి నిత్యపూజ కావించాలి. చతుర్థినాడు విశేషపూజ చేయాలి. శ్వేతార్కమూర్తికి తిలలతో, నేతితో హోమాలు చేస్తే సమస్తములైన కోరికలు నెరవేరుతాయి. పెరుగుతోను, తేనెతోను, నేతితోను, తండులాలతోను (బియ్యం) హోమం చేస్తే సౌభాగ్యం, వశిత్వం చేకూరుతాయి.

ఘోషాసృక్ప్రాణధాత్వర్థీ దండీ మార్తాండభైరవః ।
ధర్మార్థకామమోక్షాణాం కర్తా విశ్వపుటీవృతః (బింబపుటావృతః) ॥12॥

ఘోష(హ), అసృక్(ర), ప్రాణ(య), ధాతు- శాంతి(జే), అర్థీ(ఉ), దండీ (అనుస్వారం) - వీటిని కలుపగా ఏర్పడిన "హ్ర్యౌం" అనేది సూర్యదేవుని మార్తాండభైరవమంత్రం. దీనిని బింబబీజంతో సంపుటీకరణం చేసి జపిస్తే సాధకునికి ధర్మార్థకామమోక్షాలనే నాలుగు విధాలయిన పురుషార్థాలు లభిస్తాయి.

హ్రస్వాః స్యుర్మూర్తయః పంచ దీర్ఘాణ్యంగాని తస్య చ ॥13॥

అయిదు హ్రస్వాక్షరాలను మొదట బీజం గా చేర్చి పంచమూర్తులను న్యాసం చేయాలి. "అం సూర్యాయ నమః, ఇం భాస్కరాయ నమః, ఉం భానవే నమః, ఏం రవయే నమః, ఓం దివాకరాయ నమః" అని పంచమూర్తి న్యాసం చేయాలి. ఇదేవిధంగా దీర్ఘస్వరబీజాలతో "హృదయాది" అంగన్యాసం చేయాలి. " ఆం హృదయాయ నమః" ఇత్యాదిగా న్యాసం చేయాలి.

(**విశేషం:** శ్రీ విద్యార్ణవతంత్రంలో మార్తాండభైరవబీజాన్ని దీర్ఘస్వరాలతో జోడించి "హ్ర్యాం హృదయాయ నమః, హ్ర్యీం శిరసే స్వాహా" ఇత్యాదిగా న్యాసం చేయాలని చెప్పబడింది.)

సిందూరారుణమీశాన వామార్ధదయితం రవిమ్ ।
పాశాంకుశధరం దేవం హ్యక్షమాలా కపాలినమ్॥14॥

సేంద్రవారుణమీశానవామార్ధదయితం రవిమ్ ।

ఖట్వాంగాదికశక్తిం చ దధానం చతురాననమ్।
అంతర్బాహ్యే విషద్భక్తం పద్మస్థం రవిమండలమ్॥15॥

సిందూరం లా ఎర్రగా ఉన్నవాడికి, ఈశాన్యదిక్కులో ఎడమవైపున భార్యాసహితుడై ఉండే సూర్యునికి నమస్కారమని ధ్యానం చేయాలి. పాశం, అంకుశం ధరించిన వానిని, అక్షమాల, కపాలం కలిగినవానిని, ఖట్వాంగం మున్నగు శక్తులను ధరించి నాలుగు ముఖాలతో కూడుకొన్నవానిని, అంతరంగాను, బాహ్యంగాను వేర్వేరుగా పద్మంలో ఉండే రవిమండలాన్ని ధ్యానించాలి.

ఆదిత్యాదియుతం ప్రార్చ్య ఉదితే ఽర్కే ఽర్ఘకం దదేత్ ।

శ్వాసం విషాగ్ని విప్రకుండీ హృల్లేఖా సకలో భృగుః ॥16॥

సూర్యుడు ఉదయించిన తరువాత ఆదిత్యాదులతో కూడుకొన్న రవిమండలాన్ని పూజించి అర్ఘ్యం ఈయాలి. అర్ఘ్యదానమంత్రం ఈ విధంగా ఉంటుంది. శ్వాస (య), విష(ఓం), అగ్ని (ర్), విప్రకుండీ (ఓం), హృల్లేఖా

(హ్రీం), ఇవి కలాసహితములైన సంకేతాక్షరాలు. భృగువు సూర్యునితో సమమైనవాడు. వీటిని జోడించాలి. (భృగుర్భానోః- శారదాతిలకం).

అర్ఘాయ భూర్భువః స్వశ్చం జ్వాలినీం కులముద్గరమ్।

పద్మాసనోఽరుణో రక్తవస్తు (స్త్రః) సద్యుతి విశ్వకః (బింబగః) ॥17॥

"యౌం రౌం ఐం హ్రీం కలశార్ఘాయ భూర్భువః స్వరోం జ్వాలినీ కులముద్ధర" ఇది ఉద్ధారమంత్రము. సూర్యుడు పద్మాసనగతుడై ఎర్రగా రక్తవస్త్రాలు ధరించి ఉంటాడు. ఆయన మండలం జ్యోతిర్మయమండలం.

ఉదారః (నః) పద్మదృగ్దోర్భ్యాం ధూమ్రకేతురుదాహృతః ।
రక్తా హృదాదయః సౌమ్యా వరదాః పద్మధారిణః ॥18॥

ఉదారస్వభావుడు. రెండు చేతులలోను పద్మాలు ధరించి, ఎర్రని అన్ని అవయవాలలోను దివ్యాభరణాలు ధరించి ఉంటాడు. పరమసౌమ్యుడు. పద్మధారియై ధూమ్రకేతువై ఉంటాడు. సూర్యాది గ్రహాలన్నీ సౌమ్యములై, వరదాయకాలై, కమలాలు ధరించి, ఎర్రని కాంతితో ఉంటాయి.

విద్యుత్పుంజనిభ స్వర్కః శ్వేతః సోమోఽరుణః కుజః ।
బుధ స్తద్వద్గురుః పీతః శుక్తిః శుక్లః శుక్రః శనైశ్చరః ॥
కృష్ణాంగారనిభో రాహుర్ధూమ్రకేతురుదాహృతః ॥19॥

అందు సూర్యుడు మెరుపుతీగల వంటి కాంతితో సమానంగా ఉంటాడు. చంద్రుడు తెలుపు. కుజుడు ఎరుపు. బుధుడు కూడ అలాగే ఎర్రగా ఉంటాడు. గురువు పచ్చన. శుక్రుడు శుక్ల (తెలుపు) వర్ణంతో ఉంటాడు. శని నల్లని బొగ్గులా ఉంటాడు. రాహుకేతువులు ధూమ(పొగ) సమానకాంతితో ఉంటారు.

వామోరువామహస్తాస్తే దక్షహస్తాభయప్రదాః ॥20॥

వీరందరు ఎడమ చేతులను ఎడమ తొడలపై ఉంచి, కుడి చేతులలో అభయముద్రను ధరించి ఉంటారు.

స్వనామాద్య స్తబీజాస్తే హస్తౌ సంశోధ్య చాస్త్రతః।
అంగుష్ఠాదౌ తలే నేత్రే హృదాద్యం వ్యాపకం న్యసేత్ ॥21॥

మూలబీజైస్త్రిభిః ప్రాణవ్యాపకం న్యస్య సాంగకమ్ ।
ప్రక్షాల్య పాత్రమస్త్రేణ మూలేనాఽఽపూర్య వారిణా ॥22॥

గ్రహాల యొక్క ఆయా పేర్ల ఆద్యక్షరాలకు బిందువులు చేరిస్తే బీజమంత్రాలవుతాయి. "ఫట్" అని ఉచ్చరిస్తూ రెండు చేతులను సంశోధన చేయాలి. అంగుష్ఠం మొదలుకొని కరతలపర్యంతం కరన్యాసం చేయాలి. నేత్రాలను వదలి హృదయాది పంచాంగన్యాసం చేసి, సూర్యుని మూలబీజస్వరూపాలైన మూడు అక్షరాలతో (హ్రాం, హ్రీ, సః) వ్యాపకన్యాసం చేయాలి. పిమ్మట దాని క్రమం ఇలా చేయాలి. మూలాధారచక్రం నుండి పాదాగ్రపర్యంతం ప్రథమ బీజాన్ని, కంఠం నుండి మూలాధార పర్యంతం ద్వితీయ బీజాన్ని, మూర్ధము నుండి కంఠపర్యంతం తృతీయ బీజాన్ని న్యాసం చేయాలి. తరువాత అర్ఘ్యపాత్రను అస్త్రమంత్రంతో ప్రక్షాళన చేసి, మూలమంత్రాన్ని ఉచ్చరిస్తూ నీటితో నింపాలి.

గంధపుష్పాక్షతం న్యస్య దూర్వామర్ఘ్యం చ మంత్రయేత్ ।
ఆత్మానం తేన సంప్రోక్ష్య పూజాద్రవ్యం చ వై ధ్రువమ్ (వైభవమ్) ॥23॥

గంధం, పువ్వులు, అక్షతలు, దూర్వలు వేసి, మళ్లీ అభిమంత్రించి, ఆ జలంతో తనను, పూజాద్రవ్యాలను తప్పని సరిగా ప్రోక్షణ చేసుకోవాలి.

ప్రభూతం విమలం సారమారాధ్యం పరమం సుఖమ్ ।
పీఠాద్యాన్ కల్పయేదేతాన్ హృదా మధ్యే విదిక్షు చ ॥24॥

తరువాత యోగపీఠాన్ని కల్పించి దాని పాదాలుగా ప్రభూత, విమల, సార, ఆరాధ్య, పరమసుఖాలను కల్పనం చేయాలి. ఆగ్నేయాదినాలుగు దిక్కులందును, మధ్య భాగమునందును.

పీఠోపరి హృదాద్యం చ కేసరేష్వస్త్రశక్తయః ।
(రాందీప్తాం) వాం దీప్తాం వీం తథా సూక్ష్మాం వుం జాయాం వ్రూం చ భద్రికామ్ భద్రయా ॥25॥

వేం విభూతిం వైం విమలాం వోమసిఘాతవిద్యుతామ్ ।
వౌం సర్వతోముఖీం వం చ పీఠం వః ప్రార్చ్య రవిం యజేత్ ॥26॥

వీటి పేర్లుకు చివర 'నమః' చేర్చి వాటికి ఆవాహన, పూజ కావించాలి. యోగపీఠం పైన హృదయకమలంలో దిక్కులందు, విదిక్కులందు "దీప్త" మున్నగు శక్తులను స్థాపించాలి. పీఠోపరిభాగంలో హృదయకమలకేసరాలలో ఎనిమిది శక్తులను పూజించాలి. "వాం దీప్తాయై నమః పూర్వస్యామ్, వీం సూక్ష్మాయై నమః ఆగ్నేయకేసరే, వూం జయాయై నమః దక్షిణకేసరే, వ్రూం భద్రాయైనమః నైరృత్యకేసరే, వేం విభూత్యై నమః పశ్చిమకేసరే, వైం విమలాయై నమః వాయవ్యకేసరే, వోం అసిఘాతవిద్యుతాయై నమః ఉత్తరకేసరే, వౌం సర్వతోముఖాయైనమః ఈశానకేసరే, వం పీఠాయనమః మధ్యే " ఈ విధంగా శక్తులను అర్చించి పిదప రవిని పూజించాలి. " ఓం బ్రహ్మ విష్ణు శివాత్మకాయ సౌరాయ యోగపీఠాయ నమః" అనే మంత్రంతో సమస్తపీఠాన్ని పూజించాలి. (రాం దీప్తాయై నమః–ఇత్యాది మంత్రం కూడ కలదు అదే సరైన పాఠంగా గ్రహించాలి)

ఆవాహ్య దద్యాత్పాద్యాది హృత్షడంగేన సువ్రత ।
ఖకారౌ దండినౌ చండౌ మజ్జా దశనసంయుతా ॥27॥

సువ్రతా! ఆ తరువాత రవి మున్నగు మూర్తులకు ఆవాహన చేసి, పాద్యాదులను సమర్పించి, క్రమంగా హృదాదిషడంగన్యాసపూర్వకంగా పూజ కావించాలి. "ఖం కాంతౌ" ఇత్యాది సంకేతంగా "ఖం ఖఖోల్కాయ నమః" అనే మంత్రం ప్రకటితమవుతుంది. (ఖం మంత్ర స్వరూపం ఇది. కాంతం (ఖ), దండినీ, (ఖ), చండ(ఉ), సంధి చేస్తే 'ఖో' అవుతుంది.)

మాంసాదీర్ఘా జలద్వాయుహృదైతత్ సర్వదం రవేః ।
వహ్నీశరక్షోమరుతాం దిక్షు పూజ్యా హృదాదయః॥28॥

మజ్జా దశన సంయుతా మాంసా (ల) దీర్ఘం. దీర్ఘస్వరమైన ఆకారంతో జల(క), దీర్ఘంతో (కా), అదేవిధంగా వాయు (యకారం) చివర 'హృద్ - నమః' ఇలా ఉచ్చరిస్తే " ఆదిత్యమూర్తిం పరికల్పయామి, రవి మూర్తిం పరికల్పయామి, భానుమూర్తిం పరికల్పయామి, భాస్కరమూర్తిం పరికల్పయామి, సూర్యమూర్తిం పరికల్పయామి" -ఇత్యాది పూజామంత్రం ఉంటుంది." ఓం ఆదిత్యాయ నమః, ఐం రవయే నమః, ఓం భానవే నమః, ఇం భాస్కరాయ నమః, అం సూర్యాయ నమః" - అనే సంకేతాలతో సూచింపబడిన రవిమంత్రం సర్వఫలప్రదం. ఆగ్నేయ, నైఋతి, వాయవ్య, ఈశాన దిక్కులందు, మధ్యయందు హృదాదిపంచాగాలతో, వాటి మంత్రాలతో పూజించాలి.

స్వమంత్రైః కర్ణికాంతస్థా దిక్షు తం పురతశ్చ ధృక్ ।
పూర్వాదిదిక్షు సంపూజ్యా శ్చంద్రజ్ఞగురు భార్గవాః ॥
ఆగ్నేయాదిషు కోణేషు కుజమందాహికేతవః ॥29॥

ఆయా మంత్రాలతో కర్ణికామధ్యంలో పూజించాలి. తన ఎదురుగా నున్న దిక్కునందు అస్త్రపూజ చేయాలి. పూర్వాది దిక్కులందు క్రమంగా చంద్ర, బుధ, గురు, శుక్రులను, ఆగ్నేయాది విదిక్కులందు (క్రమంగా) మంగళ, శనైశ్చర, రాహుకేతువులను పూజించాలి.

స్నాత్వా విధివదాదిత్యమారాధ్యార్ఘ్యపురః సరమ్ ॥30॥

స్నానం చేసి, యథాశాస్త్రం ఆదిత్యుని ఆరాధించి, మంత్రపురస్సరంగా అర్ఘ్యం ఈయాలి.

కృతాంతమైశే నిర్మాల్యం తేజశ్చండాయ దీపితమ్ ।
రోచనం కుంకుమం వారి రక్త గంధాక్షతాంకురాః ॥31॥
వేణుబీజయవాః శాలిశ్యామాకతిలరాజికాః ।
జపాపుష్పాన్వితాం దత్త్వా పాత్రైః శిరసి ధార్య తత్ ॥32॥

మళ్లీ ఈశాన్యంలో కృతాంతునకు నిర్మాల్యాన్ని, చండునికి దీపిత తేజస్సును (దీపజ్యోతిని) సమర్పించాలి. రోచనం, కుంకుమం, జలం, రక్తచందనం, అక్షతలు, అంకురములు, వేణు బీజములు, యవలు, శాలి ధాన్యాలు, శ్యామాకములు (చామలు), తిలలు, రాజికములు, జపాపుష్పాలు అర్ఘ్యపాత్రలో ఉంచి దానిని శిరస్సుపై ధరించాలి.

జానుభ్యామవనీం గత్వా సూర్యాయార్ఘ్యం నివేదయేత్ ।

తరువాత మోకాళ్ల పై కూర్చుండి సూర్యునికి అర్ఘ్యం ఈయాలి.

స్వవిద్యామంత్రితైః కుంభై ర్నవభిః ప్రార్చ్య వై గ్రహాన్ ।
గ్రహాదిశాంతయే స్నానం జప్త్వాఽ ర్కం సర్వమాప్నుయాత్ ॥33॥

ఆయా మంత్రాలతో అభిమంత్రితాలైన కలశాలతో తొమ్మిదింటిచే గ్రహాలను పూజించి, గ్రహాది శాంతికొరకై శాంతికలశజలంతో స్నానం చేసి, సూర్యమంత్రాన్ని జపించేవాడు సకల మనోరథాలను పొందుతాడు.

సంగ్రామవిజయం సాగ్నిం బీజపోషం సబిందుకమ్ ।
న్యస్య మూర్ధాదిపాదాంతం మూలం పూజ్యం చ ముద్రయా ॥34॥

సంగ్రామవిజయమంత్రము నందు బీజపోషకమైన, బిందు యుక్తమైన అగ్నిని (ర) చేర్చి, సంపూర్ణమంత్రంతో శిరస్సు నుండి పాదాల వరకు ముద్రా పూర్వకంగా ఆవాహన చేస్తూ సూర్యుని పూజించాలి.

స్వాంగాని చ యథా న్యాసమాత్మానం భావయేద్రవిమ్ ॥35॥

మూలమంత్రాన్ని ఉచ్చరిస్తూ, అంగన్యాసం చేస్తూ, తన ఆత్మను సూర్యస్వరూపంగా భావన చేయాలి. సూర్యుడే తాను, తానే సూర్యుడు అనే భావన కలిగి ఉండాలి.

ధ్యానం చ మారణస్తంభే పీతమాప్యాయనే సితమ్ ।
రిపుఘాతవిధౌ కృష్ణం మోహయేచ్చక్రచాపవత్ ॥36॥

మారణస్తంభనవిధిలో సూర్యుని పీతవర్ణుని గాను, ఆప్యాయనవిధిలో శ్వేతవర్ణుని గాను, శుతృసంహారవిధిలో కృష్ణవర్ణుని గాను, సమ్మోహనక్రియలో ఇంద్రధనుస్సు వంటి ఆకారం కలవానిగా భావన చేయాలి.

యోఽభిషేకజపధ్యానపూజాహోమపరస్సదా ।
తేజస్వీ హ్యజయః శ్రీమాన్స యుద్ధాదౌ జయం లభేత్ ॥37॥

ఎవడయితే సూర్యుని అభిషేక, జప, ధ్యాన, పూజా, హెూమములందు సర్వదా ఆసక్తి కలిగిఉంటాడో, అతడు తేజశ్శాలియై, అజేయుడై, శ్రీమంతుడై, యుద్ధాదులలో జయాన్ని పొందుతాడు.

తాంబూలాదావిదం న్యస్య జప్త్వా దద్యాదుశీరకమ్ ।
న్యస్తబీజేన హస్తేన స్పర్శనం తద్వశే స్మృతమ్ ॥38॥

తాంబూలాదులలో ఈ మంత్రన్యాసం చేసి, దాని యందు ఉశీరకం (వట్టివేరు) ఉంచి, తన చేతితో సంగ్రామ విజయమంత్రబీజం వ్రాసి ఎవరికైనా ఇస్తూ, హస్తంతో స్పృశిస్తే అతడు వశమవుతాడు.

ఇత్యాది మహాపురాణే ఆగ్నేయే సూర్యార్చనవిధానం నామ ఏకాధికత్రిశతతమోఽధ్యాయః ॥301॥

అగ్నిమహాపురాణంలో సూర్యార్చనవిధానం అనే మూడువందల ఒకటవ అధ్యాయం సమాప్తం.



ద్వ్యధికత్రిశతతమోఽధ్యాయః – మూడువందల రెండవ అధ్యాయం

నానామంత్రౌషధకథనమ్ – నానావిధమంత్రౌషధకథనం

అగ్నిరువాచ – అగ్నిదేవుడు ఇలా పలికాడు.

వాక్కర్మపార్శ్వయుక్ శుక్లతోక కృతే మతో ప్లవః ।
హుతాంతా దేశవర్ణేయం విద్యా ముఖ్యా సరస్వతీ ॥1॥

"వాక్, కర్మ, ఉభయపార్శ్వాలు, శుక్లం, తోకం, కృతం, మతం, ప్లవం, హుతం," హుతం అనే పదం అంతంగా కల పదకొండు బీజాక్షరాలు కల ముఖ్యమంత్రం సరస్వతీవిద్యాస్వరూపం. (ఇందు 'వాక్ ' మొదలు హుతం' వరకు పది పదాలు ఉన్నాయి. ఒక పదం ' ఐం' అనే రెండు బీజాక్షరాలను సూచిస్తుంది) " ఐం కులజే ఐం సరస్వతి స్వాహా" అనేది ముఖ్యమంత్రం.

అక్షారాశీ వర్ణలక్షం జపేత్స మతిమాన్భవేత్ ।

ఉప్పులేని ఆహారం తింటూ, అక్షరలక్షలు జపం చేసేవాడు ఈ మంత్రం ద్వారా బుద్ధిమంతుడవుతాడు.

అత్రిః సవహ్నిర్వామాక్షి బిందువిద్రావకృత్పరః ॥2॥

అత్రి (ద్), అగ్ని (ర్), వామనేత్ర – వామాక్షి (ఈ), బిందు(ం)– ఇవి కలుపగా ఏర్పడే "ద్రీం" అనే మంత్రం శత్రువులను పారద్రోలే మహామంత్రం.

వజ్రపద్మధరం శక్రం పీతమావాహ్య పూజయేత్
నియుతం హోమయేదాజ్యతిలాం స్తేనాభిషేచయేత్ ॥3॥

వజ్రం, కమలం ధరించిన పీత(పచ్చని)వర్ణంతో ప్రకాశించే ఇంద్రుని ఆవాహన చేసి పూజించి, నేతితోను, నువ్వులతోను లక్షమార్లు హోమం చేయాలి. తరువాత తిలమిశ్రజలంతో ఇంద్రునికి అభిషేకం చేయాలి.

నృపాదిర్భ్రష్టరాజ్యాదీన్ రాజ్యపుత్రాదిమాప్నుయాత్ ।

ఇలా చేయడం వల్ల రాజ్యాదులను కోల్పోయిన రాజు తిరిగి రాజ్యాన్ని, పుత్రాదులను పొందుతాడు. మనోవాంఛలు నెరవేరుతాయి.

హృల్లేఖా శక్తిదేవాఖ్యా ఘోషోఽగ్ని ర్దండి దండవాన్ ॥4॥

హృల్లేఖా (హ్రీం) అనునది "శక్తిదేవ" అనే పేరుతో ప్రసిద్ధమైనది. దీని ఉద్ధారం ఇలా ఉంటుంది. ఘోష (హ), అగ్ని (ర), దండీ (ఈ), దండ(ం) ఇవన్నీ కలిపితే " హ్రీం" అని ఏర్పడుతుంది.

శివమిష్ట్వా జపేచ్ఛక్తిమష్టమ్యాదిచతుర్దశీమ్ ।
చక్రపాశాంకుశధరాం సభాయాం వరదాయికామ్॥

హోమాదినా చ సౌభాగ్యం కవిత్వం పుత్రవాన్ భవేత్ ॥5॥

శివశక్తికి, శివునికి పూజలు చేసి ఈ శక్తిమంత్రాన్ని (హ్రీం) జపించాలి. అష్టమి నుండి చతుర్దశి వరకు ఈ పూజలో సంలగ్నచిత్తంతో ఉండాలి. మంటపంలో చక్రం, పాశం, అంకుశం, అభయముద్ర ధరించిన వరదాయిని అయిన దేవిని ఆరాధన చేసి, హోమాదులు చేయడం వల్ల సౌభాగ్యం చేకూరుతుంది. కవితాశక్తి కలుగుతుంది. పుత్రపుత్రికాదులను పొందడం జరుగుతుంది.

ఓం హ్రీం ఓం నమః కామాయ సర్వజనహితాయ
సర్వజనమోహనాయ ప్రజ్వలితాయ
సర్వజనహృదయం మమాత్మగతం కురు కురు ఓమ్, ఓమ్ ॥6॥

"ఓం హ్రీం ఓం నమః కామాయ సర్వజనహితాయ సర్వజనమోహనాయ ప్రజ్వలితాయ సర్వజనహృదయం మమాత్మగతం కురు కురు ఓం" అనే మంత్రాన్ని జపించాలి. కోరికలను తీర్చే, సర్వజనులకు మేలు చేకూర్చే, సర్వజనులను సమ్మోహపరచే, మిక్కిలి ప్రకాశించే, సర్వజనహృదయాలలో ప్రవేశించే శక్తిని నాకు ఆత్మగతమయ్యేలా చేయవలసింది" అని మంత్రార్థం.

ఏతజ్జపాదినా మంత్రో వశయేత్సకలం జగత్ ॥7॥

ఈ మంత్రాన్ని జపం, హోమం ఇత్యాదులు చేయడం ద్వారా సంపూర్ణజగత్తు వశమవుతుంది.

ఓం హ్రీం చాముండే ఉ ముకం దహ దహ పచ పచ
మమ వశమానయానయ ఠ ఠ ఉ (ఓమ్) ॥
వశీకరణకృన్మంత్ర శ్చాముండాయాః ప్రకీర్తితః ॥8॥

"ఓం హ్రీం చాముండే అముకం దహ దహ పచ పచ మమవశమానయ ఆనయ స్వాహా ఓం" అనేది చాముండాదేవీ వశీకరణమంత్రంగా ప్రసిద్ధికెక్కింది.

ఫలత్రయ కషాయేణ వరాంగం క్షాళయేద్వశే ॥9॥

ఈ వశీకరణప్రయోగసమయంలో స్త్రీ చల్లనైన త్రిఫలాజలంతో తన గుహ్యాంగాన్ని కడుగుకోవాలి.

అశ్వగంధాయవైః స్త్రీ తు నిశా కర్పూరకాదినా ।
పిప్పలీతండులాన్యష్టౌ మరిచాని చ వింశతిః ॥10॥

బృహతీరసలేపశ్చ వశే స్యాన్మరణాంతికమ్ ।
కటీరమూలత్రికటు క్షౌద్రలేపస్తథా భవేత్ ॥11॥

అశ్వగంధం, యవక్షారం, హరిద్రం, కర్పూరం మున్నగువాటిని స్త్రీ ఇందుకు ఉపయోగించవచ్చు. ఎనిమిది పిప్పలీ తండులములు, ఇరవై మిరియపు గింజలు, బృహతీరసం– వీటి లేపనచే శుద్ధిచేసుకోవడం వల్ల మరణాంతం వరకు (తన పతిని) వశం చేసుకోవచ్చు. కటీరమూలం, త్రికటు (శొంఠి, మిరియం, పిప్పిలి) మొక్క క్షౌద్రలేపం కూడ ఇందు ఉపయోగించవచ్చు.

హిమం కపిత్థకరసం మాగధీ మధుకం మధు ।
తేషాం లేపః ప్రయుక్తస్తు దంపత్యోః స్వస్తిమావహేత్॥12॥

హిమం, కపిత్థరసం, మాగధీ, మధుకం, మధు - వీటి లేపనప్రయోగం దంపతులకు సకల శుభదాయకం.

సశర్కరో యోనిలేపాత్ కదంబరసకో మధు ।
సహదేవీ మహాలక్ష్మీః పుత్రజీవీ కృతాంజలిః ॥13॥ః

శర్కర కలిపిన కదంబరసాన్ని, మధువును గుహ్యాంగంపై లేపనం చేసుకొంటే వశీకరణమవుతుంది. సహదేవి, మహాలక్ష్మి, పుత్రజీవి, కృతాంజలి (లజ్జావతి)అయినవారు.

ఏతచ్చూర్ణం శిరః క్షిప్తం లోకస్య వశముత్తమమ్ ।

వీటి చూర్ణాన్ని శిరస్సుపై వుంచితే అది ఉత్తమమైన వశీకరణ సాధనమవుతుంది.

త్రిఫలా చందనక్వాథ ప్రస్థాద్వికుడవం పృథక్ ।
భృంగ హేమరసం దోషా తావతీ ఛంబుకం (చుంబకం) మధు ॥14॥

ఘృతైః పక్వా నిశాఛాయాశుష్కా లేప్యా తు రంజనీ ॥15॥

విదారీ సజటామాంసచూర్ణీభూతాం సశర్కరామ్ ।
మథితాం యః పిబేత్ క్షీరైర్నిత్యం స్త్రీశతకం వ్రజేత్॥16॥

త్రిఫలా చందనముల క్వాథము ఒక ప్రస్థము వేరుగాను, రెండు కుడములు వేరుగాను ఉంచి, భృంగహిమ రసములు అంతే ప్రమాణం కల పసుపు, చుంబకం, తేనె, నేతితో ఉడికించిన పసుపు, ఎండినపసుపు-వీటి అన్నింటితో లేపం తయారు చేసి, విదారి జటామాంసచూర్ణము నందు శర్కర కలిపి, బాగుగా మర్దించి, పాలతో ప్రతిదినం సేవించే పురుషుడు స్త్రీశతంతో సంగమం చేయకలుగుతాడు.

గుల్మమాషతిలవ్రీహిచూర్ణం క్షీరసితాన్వితమ్ ।
అశ్వత్థవంశదర్భాణాం మూలం వై వైష్ణవీశ్రియోః ॥17॥

మూలం దూర్వాశ్వగంధోత్థం పిబేత్ క్షీరైః సుతార్థినీ ।

గుల్మ, మాష, తిల, వ్రీహి చూర్ణములతో పాలు, శర్కర కలిపి అశ్వత్థ, వంశ, దర్భమూల, వైష్ణవీ, శ్రీమూలములను దూర్వ, అశ్వగంధమూలములను కలిపి, పుత్రులను కోరుకొనేస్త్రీ పాలతో త్రాగాలి.

కౌంతీ లక్ష్మ్యాః శివా(ఫా)ధాత్రీబీజం లోధ్రవటాంకురమ్ ॥18॥

(ఆజ్య క్షీరమృతా పేయం పుత్రార్థం త్రిదివం స్త్రియా ।
పుత్రార్థినీ పిబేత్ క్షీరం శ్రీమూలం సవటాంకురమ్) ॥19॥

కౌంతి, లక్ష్మి, శివా(శిఫా), ధాత్రీ, బీజం, వజ్రం, లోధ్రం, వటాంకురం, అన్నీ కలిపి స్త్రీ ఋతుకాలంలో ఆజ్యక్షీరాలతో త్రాగాలి. ఇలా చేస్తే పుత్రుడు కలుగుతాడు. రోజుకు మూడు మార్లు సేవించాలి. పుత్రార్థిని అయిన స్త్రీ శ్రీమూలాన్ని, వటాంకురాలను క్షీరంతో కలిపి త్రాగాలి.

శ్రీవటాంకురదేవీనాం రసం నృస్య పిబేచ్ఛ సా ।
శ్రీపద్మమూలముక్షీర మశ్వత్థోత్తర మూలయుక్ ॥20॥

శ్రీమూలం, వటాంకురం, దేవీమూలం వీటిరసాన్ని సేవించాలి లేదా త్రాగాలి. శ్రీమూలం, పద్మమూలం, అశ్వత్థం, ఉత్తరమూలం, వీటిని కలిపి పాలతో త్రాగాలి.

తరలం (ణం) పయసా యుక్తం కార్పాసఫలపల్లవమ్ ।
అపామార్గస్య పుష్పాగ్రం నవం సమహిషీపయః ॥21॥

కార్పాసఫలాలను, పల్లవాలను పాలలో నూరి పలుచగా చేసి త్రాగాలి. అపామార్గ నూతన పుష్పాగ్రాలను గేదెపాలతో కలిపి త్రాగాలి.

పుత్రార్థం చార్ధషట్ శ్లోకై ర్యోగాశ్చత్వార ఈరితాః ।
శర్కరోత్పలపుష్పాక్ష లోధ్ర చందన సారివాః ॥22॥

స్రవమాణే స్త్రియా గర్భే దాతవ్యాస్తండులాంభసా ।
లాజాయష్టిసితాద్రాక్షా క్షౌద్రసర్పిషి వా లిహేత్ ॥23॥

పైన చెప్పిన ఆరున్నర శ్లోకాలలో నాలుగు పుత్రప్రాప్తియోగాలు వివరించబడ్డాయి. స్త్రీకి గర్భస్రావం అవుతూ ఉంటే శర్కర, ఉత్పలపుష్ప, అక్షలోధ్ర, చందన, సారిబాలతలను బియ్యపు కడుగులో నూరి కాని, లాజా, యష్ఠి, సితా, ద్రాక్ష, మధు, ఘృతములను కలిపి కాని స్త్రీ సేవించవలెను.

ఆటరూషకలాంగల్యోః కాకమాచ్యాః శిఫా పృథక్ ।
నాభేరధః సమాలిప్య ప్రసూతే ప్రమదా సుఖమ్ ॥24॥

ఆటరూష, కలాంగలి, కాకమాచి, శిఫ (జటామాంసి) వీటిని నూరి నాభిక్రింది భాగంలో మర్దనం చేసి పూస్తే స్త్రీకి సుఖప్రసవం అవుతుంది.

రక్తం శుక్లం జపాపుష్పం రక్తశుక్లేస్సృతౌ పిబేత్ ।
కేశరం బృహతీమూలం గోపీషష్ఠీతృణోత్పలమ్ ॥25॥

సాజక్షీరం సతైలం తద్భక్షణం రోమజన్మకృత్ ।
శీర్యమాణేషు కేశేషు స్థాపనం చ భవేదిదమ్ ॥26॥

రక్త, శుక్ల, జపాపుష్పాలు, రక్తశుక్ల –ఓషధులు కలిపి త్రాగాలి. కేసరం, బృహతీమూలం, గోపి, షష్ఠీ, తృణం, ఉత్పలం వీటిని మేకపాలతో నూరి, తైలంతో కలిపి తిన్నచో వెంట్రుకలు మొలుస్తాయి. జుట్టు ఊడిపోకుండ చేయడానికి కూడ ఇవి ఉపయోగిస్తాయి.

ధాత్రీభృంగరసప్రస్థం తైలం చ క్షీరమాఢకమ్ ।
షష్ట్యంజనపలం తైలం తత్కేశాక్షిశిరోహితమ్ ॥27॥

ధాత్రీ భృంగీరసాలు ఒక ప్రస్థం, తైలం, పాలు, ఒక ఆఢకం, షష్ఠి అంజనల ఒక పలం తైలం- ఇవన్నీ నేత్రాలకు, కేశాలకు, శిరస్సుకు హితాలను కలగజేస్తాయి.

హరిద్రారాజవృక్షత్వక్ చించా లవణలోధ్రకౌ ।
పీతా ఖారీ హరేదాశు గవాముదరబృంహణమ్ ॥28॥

హరిద్రం, రాజవృక్షం యొక్క బెరడు, చించా, లవణం, లోధ్రకం, పీతఖారి ఆవుల యొక్క పొట్టలోని ఉబ్బురోగాన్ని తొలగిస్తాయి.

ఓం నమో భగవతే త్ర్యంబకాయ ఉపశమయ ఉపశమయ ।
చులు చులు మిలి మిలి భిది భిది గోమానిని చక్రిణి హ్రూం ఫట్ ॥29॥

అస్మిన్ గ్రామే గోకులస్య చ రక్షాం కురు శాంతిం కురు కురు కురు ఠ ఠ ఠ ॥30॥

"ఓం నమో భగవతే - ఠఠఠ" ఇది మూలోక్తమంత్రమైన గోరక్షాసముదాయమంత్రం. ఈ గ్రామంలో గోకులాన్ని రక్షించి శాంతిని చేకూర్చమని ఈ మంత్ర ప్రార్థనార్థం.

ఘంటాకర్ణో మహాసేనో వీరః ప్రోక్తో మహాబల ః ।
మారీనిర్నాశనకరః స మాం పాతు జగత్పతిః ॥
శ్లోకౌ చైవ న్యసేదేతౌ మంత్రౌ గోరక్షకౌ పృథక్ ॥31॥

మహాసేనుడు, మహాబలుడు అయిన ఘంటాకర్ణుడు మహావీరుడుగా చెప్పబడ్డాడు. జగత్పతి అయిన అతడు మహామారిమున్నగు వాటిని వినాశం చేసే అతడు నన్ను రక్షించుగాక! ఈ రెండు మంత్రాలు వేర్వేరుగా గోరక్షకమంత్రాలు. వీటిని వ్రాసి ఇంటిలో ఉంచుకోవాలి.

ఇత్యాది మహాపురాణే ఆగ్నేయే నానావిధమంత్రౌషధికథనం నామ ద్వ్యధికత్రిశతతమోఽధ్యాయః ॥302॥

అగ్నిమహాపురాణంలో నానావిధమంత్రౌషధకథనం అనే మూడువందల రెండవ అధ్యాయం సమాప్తం.



త్ర్యధికత్రిశతతమోఽధ్యాయః – మూడువందల మూడవ అధ్యాయం

అంగాక్షరపూజావిధి వర్ణనమ్ – అంగాక్షరపూజావిధి వర్ణనం

అగ్నిరువాచ – అగ్ని ఇలా చెబుతున్నాడు.

యదా జన్మర్క్షగశ్చంద్రో భానుః సప్తమరాశిగః ।
పౌష్ణః కాలః సవిజ్ఞేయస్తదా శ్వాసం పరీక్షయేత్ ॥1॥

ఎప్పుడు చంద్రుడు జన్మనక్షత్రంలోను, సూర్యుడు సప్తమరాశిలోను ఉంటాడో, ఆ కాలాన్ని పౌష్ణకాలం అంటారు. అపుడు శ్వాసను పరీక్షించాలి.

కంఠోష్ఠౌ చలతః స్థానాద్యస్య వక్రా చ నాసికా ।
కృష్ణా జిహ్వా చ సప్తాహం జీవితం తస్య వై భవేత్ ॥2॥

ఎవని కంఠం, ఓష్ఠం తమ తమ స్థానాలనుంచి చలిస్తాయో, ఎవని నాసిక (ముక్కు) వంకర అయిపోతుందో, ఎవని నాలుక నల్లపడి పోతుందో అతడు ఏడు రోజులు మించి జీవించడు.

తారో మేషో విషం దన్తీ నరో దీర్ఘో ఘనారసః ।(యణారసః)
క్రుద్ధోల్కాయ మహోల్కాయ వీరోల్కాయ శిఖా భవేత్ ॥3॥

తార (ఓం), మేష(న), విష(మ), దంతీ(ఓం), నరో దీర్ఘో (దీర్ఘస్వరయుక్తాలయిన నా,రా), యణా (య,ణా), రస (య) ఇవి భగవంతుడైన విష్ణువు యొక్క అష్టాక్షరమంత్రసంకేతాలు. "ఓం నమో నారాయణాయ"అనేది మంత్రం. న్యాసం ఈ విధంగా ఉంటుంది.

(హ్య) ఉల్కాయ సహస్రోల్కాయ వైష్ణవో ఽ ష్టాక్షరో మనుః ।

"క్రుద్ధోల్కాయ స్వాహా హృదయాయ నమః, మహోల్కాయ స్వాహా శిరసే స్వాహా, వీరోల్కాయ స్వాహా, శిఖాయై వషట్, (హ్యు)ద్యుల్కాయ స్వాహా కవచాయ హుం, సహస్రోల్కాయ స్వాహా అస్త్రాయ ఫట్" అనే మంత్రాలతో హృదయం, శిరస్సు, శిఖ, భుజద్వయం, సకలదిగ్భాగాలలోను న్యాసం చేయాలి.

కనిష్ఠాదితదష్టానామంగులీనాం చ పర్వసు ॥4॥

జ్యేష్ఠాగ్రేణ క్రమాత్తారం మూర్ధన్యష్టాక్షరం న్యసేత్ ।
తర్జన్యాం తారమంగుష్ఠే లగ్నే మధ్యమయా చ తత్ ॥5॥

తలేఽం గుష్ఠే తదుత్తారం బీజోత్తారం తతో న్యసేత్ ।
రక్తగౌరధూమ్ర హరిజ్జాతరూపాః సితాస్త్రయః ॥6॥

కనిష్ఠ మొదలు కనిష్ఠ వరకు ఎనిమిది వ్రేళ్లపర్వములందును అష్టాక్షరమంత్రం యొక్క ఎనిమిది అక్షరాలను ఒక్కొక్క దానిని "ప్రణవం, నమః" అనే వాటితో సంపుటితం చేసి అంగుష్ఠాగ్రభాగంతో క్రమంగా న్యాసం చేయాలి.

తర్జనియందు, మధ్యమతో కూడుకొన్న అంగుష్ఠము నందు, కరతలము నందు, మళ్లీ అంగుష్ఠము నందు ప్రణవాన్ని న్యాసం చేయడానికి ఉత్తారమని పేరు. అందుచే ఇది వరకు చెప్పిన న్యాసం చేసిన పిమ్మట బీజోత్తరన్యాసం చేయాలి. ఈ మంత్రంలోని మొదటి ఐదు అక్షరాల రంగులు వరుసగా రక్త, గౌర, ధూమ్ర హరిత, సువర్ణరూపాలు. చివరి మూడు వర్ణాల రంగులు శ్వేతరూపాలు.

ఏవం రూపానిమాన్ వర్ణాన్ తావద్బుద్ధ్వా న్యసేత్క్రమాత్ ।
హృదాస్యనేత్రమూర్ధాంఘ్రితాలుగుహ్యకరాదిషు ॥ 7॥

అంగాని చ న్యసేద్బీజాన్ న్యస్యాథ కరదేహయోః ।
యథాఽత్మని తథా దేవే న్యాసః కార్యః కరం వినా॥8॥

వర్ణాలను ఈ రూపాలలో భావనచేసి క్రమంగా హృదయం, ముఖం, నేత్రాలు, శీర్షం, పాదాలు, తాలువులు, గుహ్యం, హస్తాదులు-వీటియందు న్యాసం చేయాలి. హస్తాలయందు, దేహమునందు బీజన్యాసం చేసి మళ్లీ అంగన్యాసం చేయాలి. తన శరీరంలో చేసిన విధంగానే, దేవతావిగ్రహమునందు కూడ కరన్యాసం తప్ప ఇతర న్యాసాలు చేయాలి.

హృదాదిస్థానగాన్ వర్ణాన్ గంధపుష్పైః సమర్చయేత్ ।
ధర్మాదగ్న్యాద్యధర్మాది గాత్రే పీఠే ఽంబుజం న్యసేత్ ॥9॥

దేవతావిగ్రహం యొక్క హృదయాద్యంగాలయందు న్యాసం చేసిన వర్ణాలను గంధపుష్పాలతో పూజించాలి. దేవతాపీఠంపై ధర్మాదులను, అగ్న్యాదులను, అధర్మాదులను వాటి వాటి స్థానంలో న్యాసం చేయాలి. పిదప దానిపై పద్మాన్నికూడ న్యాసం చేయాలి.

పత్రకేసరకింజల్క వ్యాపి సూర్యేందు దాహినామ్ ।
మండలం త్రితయం తావద్భేదైస్తత్ర న్యసేత్క్రమాత్॥10॥

ఆ పీఠంపైనే కమలదళాలు, కేసరాలు, కింజల్కాల సమూహాలు, సూర్యమండలం, చంద్రమండలం, అగ్నిమండలం వేరువేరుగా క్రమంగా న్యాసం చేయాలి.

గుణాశ్చ తత్ర సత్త్వాద్యాః కేసరస్థాశ్చ శక్తయః ।
విమలోత్క ర్షణీజ్ఞానక్రియాయోగాశ్చ వై క్రమాత్ ॥ 11॥

ప్రహ్వీ సత్యా తథేశానానుగ్రహా మధ్యతస్తతః ।

అక్కడ సత్త్వాది గుణత్రయాన్ని, కేసరాలపై విమల, ఉత్కర్షణి, జ్ఞానం, క్రియ, యోగం, ప్రహ్వీ, సత్య, ఈశాన అనే ఎనిమిది శక్తులను క్రమంగా, మధ్యలో అనుగ్రహశక్తిని భావన చేయాలి.

యోగపీఠం సమభ్యర్చ్య సమావాహ్య హరిం యజేత్ ॥12॥

పాద్యార్ఘ్యాచమనీయం చ పీతవస్త్రవిభూషణమ్ ।

ఏతత్పంచోపచారం చ సర్వం మూలేన దీయతే ॥13॥

యోగపీఠాన్ని చక్కగా అర్చించి, దానిపై శ్రీహరిని ఆవాహనచేసి పూజించాలి. పాద్యం అర్ఘ్యం, ఆచమనీయం, పీతాంబరం, అలంకారాలు - ఈ అయిదు పంచోపచారాలు. వీటిని అన్నింటిని అష్టాక్షర మూలమంత్రంతో సమర్పణ చేసి అర్చించాలి.

వాసుదేవాదయః పూజ్యాశ్చత్వారో దిక్షు మూర్తయః ।
విదిక్షు శ్రీసరస్వత్యౌ రతిశాంతీ చ పూజయేత్ ॥14॥

పీఠంయొక్క పూర్వాది దిక్కులందు వాసుదేవాది నాలుగు మూర్తులను (వాసుదేవ, ప్రద్యుమ్న, సంకర్షణ, అనిరుద్ధమూర్తులను) దిక్కులందు శ్రీ, సరస్వతి, రతి, శాంతులను క్రమంగా పూజించాలి.

శంఖం చక్రం గదాం పద్మం ముసలం ఖడ్గశార్ఙ్గకే ।
వనమాలాన్వితం దిక్షు విదిక్షు చ యజేత్క్రమాత్ ॥15॥

ఇట్లే దిక్కులందు శంఖ, చక్ర, గదా, పద్మాలను, విదిక్కులందు ముసల, ఖడ్గ, శార్ఙ్గ, వనమాలలను క్రమంగా పూజించాలి.

అభ్యర్చ్య చ బహిస్తార్క్ష్యం దేవస్య పురతోఽర్చయేత్ ।
విష్వక్సేనం చ సోమేశం మధ్యే ఆవరణాద్బహిః ॥16॥

ఇంద్రాది పరిచారేణ సంపూజ్య సమవాప్నుయాత్ ॥17॥

మండలం వెలుపల గరుత్మంతుని పూజించి, నారాయణుని ఎదుటనున్న విష్వక్సేనుని, మధ్యభాగంలో సోమేశ్వరుని, వెలుపల ఆవరణలో ఇంద్రాది పరిచారకవర్గంతో శ్రీమహావిష్ణువును పూజించిన సాధకునకు సర్వఫలాలు సిద్ధిస్తాయి.

ఇత్యాది మహాపురాణే ఆగ్నేయేఽంగాక్షరపూజావిధివర్ణనం నామ త్ర్యధికత్రిశతతమోఽధ్యాయః ॥303॥

అగ్నిమహాపురాణంలో అంగాక్షరపూజావిధి వర్ణనం అనే మూడువందల మూడవ అధ్యాయం సమాప్తం.



చతురధికత్రిశతతమోఽధ్యాయః – మూడువందల నాల్గవ అధ్యాయం
పంచాక్షరీ దీక్షావిధాన కథనమ్ – పంచాక్షర దీక్షావిధాన కథనం

అగ్నిరువాచ – అగ్ని ఇలా పలికాడు.

మేషః సంజ్ఞావిషం సాజ్యమస్తి దీర్ఘోదకం రసః ।
ఏతత్పంచాక్షరం మంత్రం శివదం చ శివాత్మకమ్ ॥1॥

మేషం (న), సంజ్ఞావిషం (విసర్గతో కూడుకొన్న మకారం–మః), (స) షకార పూర్వాక్షరంతో కలిసి అక్షి(ఇకారం–శి) దీర్ఘోదకం (వా), రసః (య), ఇది పంచాక్షర మంత్రం "నమః శివాయ" అని అవుతుంది. ఇది మంగళప్రదం,శివస్వరూపం.

తారకాది సమభ్యర్చ్య దేవత్వాది సమాప్నుయాత్ ।
జ్ఞానాత్మకం పరం బ్రహ్మ పరం బుద్ధిః శివో హృది ॥2॥

దీనికి 'ఓం' కారం చేర్చి బాగుగా జపిస్తే, దేవత్వాదులను సాధకుడు పొందుతాడు. జ్ఞానాత్మకమైన పరబ్రహ్మయే పరమ బుద్ధిరూపం. అదే శివరూపంలో హృదయంలో ఉంది.

తచ్ఛక్తిభూతః సర్వేశో భిన్నో బ్రహ్మాదిమూర్తిభిః ।
మంత్రార్ణాః పంచభూతాని తన్మాత్రా విషయాస్తథా ॥3॥

ప్రాణాదివాయవః పంచజ్ఞాన కర్మేంద్రియాణి చ ।
సర్వం పంచాక్షరం బ్రహ్మ తద్వదష్టాక్షరాత్మకమ్ ॥04॥

శక్తిరూపమైన ఆ సర్వేశ్వరుడే బ్రహ్మాదిమూర్తులలో వేరు వేరుగా ప్రతీతుడవుతున్నాడు. మంత్రములోని ఐదు అక్షరాలు ఐదు మహాభూతాలు, ఐదు తన్మాత్రలు, ఐదు విషయాలు, ఐదు ప్రాణాది వాయువులు, ఐదు జ్ఞానేంద్రియాలు, ఐదు కర్మేంద్రియాలు – ఇవన్నీ పంచాక్షర బ్రహ్మస్వరూపమైనట్టివి. ఈ విధంగానే అష్టాక్షరమంత్ర స్వరూపమైనట్టివి.

గవ్యేన ప్రోక్షయేద్దీక్షాస్థానం మంత్రేణ చోదితమ్ ।
తత్ర సంభూతసంభారః శివమిష్ట్వా విధానతః ॥5॥

మూలమూర్త్యంగవిద్యాభిస్తండులక్షేపణాదికమ్ ।
కృత్వా చరుం చ యక్షీరే పునస్తద్విభజే త్రిధా ॥06॥

దీక్షాస్థానాన్ని పంచగవ్యాలతో మంత్రోచ్చారణ చేస్తూ సంప్రోక్షించాలి. సంభారాలను సమకూర్చుకొని శివుని అర్చించి మూలమంత్రం, ఇష్టమూర్తికి సంబంధించిన మంత్రాలు, అంగమంత్రాలు పఠిస్తూ, అక్షతలు చల్లి, భూతాలను తొలగించుకొని, ఆత్మరక్షణ చేసుకోవాలి. పిదప పాలతో చరువు వండి, దానిని మూడు భాగాలుగా విభజించాలి.

నివేద్యైకం పరం హుత్వా సశిష్యోఽ న్యద్భజేద్గురుః ।
ఆచమ్య సకలీకృత్య దద్యాచ్ఛిష్యాయ దేశికః ॥7॥

దంతకాష్ఠం హృదా జప్తం క్షీరవృక్షాదిసంభవమ్ ।
సంశోధ్య దంతాన్ సంక్షిప్యా ప్రక్షాళ్యైతత్ క్షిపేద్భువి ॥08॥

ఒకభాగం ఇష్టదేవతకు నివేదన చేసి, రెండోభాగం ఆహుతి ఇచ్చి, మూడోభాగం శిష్యసహితుడై తాను భుజించాలి. తరువాత ఆచమనం, సకలీకరణం చేసి శిష్యుని హృదయమంత్రంతో అభిమంత్రించి పాలచెట్టుకు సంబంధించిన పుల్లను దంతధావనార్థమై ఇవ్వాలి. అతడు దానితో దంతాలు తోమి, దానిని చీరి నాలుక శుభ్రం చేసుకొని కడిగి నేలపై విసరివేయాలి.

పూర్వేణ సౌమ్యవారీశగతం శుభమతోఽ శుభమ్ ।
పునస్తం శిష్యమాయాంతం శిఖాబంధాదిరక్షితమ్ ॥9॥

కృత్వా వేద్యాం సహానేన స్వపేద్దర్భాస్తరే బుధః ।
(స్వసప్నం) సుషుప్తం వీక్ష్య తం శిష్యః ప్రభాతే శ్రావయేద్గురుమ్ ॥10॥

తూర్పువైపు విసిరిన ఆ తోముడుపుల్ల ఉత్తరం వైపుకాని, పడమట వైపుకాని పడితే శుభం. అలా కాకపోతే అశుభం. పిదప తన ఎదురుగా వస్తున్న శిష్యుని శిఖాబంధంచే రక్షణ కల్పించి జ్ఞానప్రబోధకుడైన గురుడు అతనితో కలిసి వేదికపైనున్న దర్భాసనంపై నిద్రపోవాలి. శిష్యుడు తాను చూచిన స్వప్నాన్ని ప్రాతఃకాలంలో గురువుతో చెప్పాలి.

శుభైః సిద్ధిపదైర్భక్తిస్తైః పునర్మండలార్చనమ్ ।
మండలం భద్రకాద్యుక్తం పూజయేత్సర్వసిద్ధిదమ్ ॥11॥

ఆ స్వప్నం శుభమై, సిద్ధిసూచకమయితే, మంత్రదేవతల విషయంలో భక్తి కలుగుతుంది. పిదప మండలార్చనం చేయాలి. సర్వతోభద్రకాది మండలాలలో పూజిస్తే సర్వసిద్ధులు కలుగుతాయి.

స్నాత్వాఽ ఽ చమ్య మృదా దేహం మంత్రైరాలిప్య కల్పితే ।
శివతీర్థే నరః స్నాయాదఘమర్షణపూర్వకమ్ ॥12॥

స్నానం, ఆచమనం చేసి, మంత్రోచ్చారణ పూర్వకంగా శరీరానికి మట్టి పూసుకొని, శివతీర్థంలో అఘమర్షణ పూర్వకంగా స్నానం చేయాలి.

హస్తాభిషేకం కృత్వాఽ థ ప్రాయాత్పూజా గృహం బుధః ।
మూలేనాబ్జాసనం కుర్యాత్తేన పూరకకుంభకాన్ ॥13॥

హస్తశుద్ధి చేసుకొని, పూజాగృహాన్ని ప్రవేశించి, ఆ విబుధుడు మూలమంత్రంతో పద్మాసనాన్ని భావన చేసి, అదే మూలమంత్రంతో పూరక, కుంభక, రేచకప్రాణాయామాలు చేయాలి.

ఆత్మానం యోజయిత్వోర్ధ్వం శిఖాంతే ద్వాదశాంగులే ।
సంశోష్య (ధ్య) దగ్ధ్వా స్వతనుం ప్లావయేదమృతేన చ ॥14॥

జీవాత్మను పైన బ్రహ్మరంధ్రంలో ఉన్న పరమాత్మతో కలపాలి. శిరస్సు మొదలు శిఖాంతం వరకు ఉన్న పన్నెండంగుళాల విస్తృతస్థానమే బ్రహ్మరంధ్రం. (య) వాయుబీజంతో శరీరాన్ని శుష్కింపజేసి, (ర) అగ్నిబీజంతో శరీరాన్ని భస్మం చేసి (వ) అమృతబీజంతో ఆ భస్మాన్ని ఆప్లావితం చేయాలి. (హంసః సోఽహమ్ అనే మంత్రం ద్వారా ఈ ప్రక్రియ అంతా జరగాలి)

ధ్యాత్వా దివ్యం వపుస్తస్మిన్నాత్మానం చ పునర్న్యయేత్ ।
కృత్వైవం చాత్మశుద్ధిః స్యాద్విన్యస్యార్చనమారభేత్ ॥15॥

దివ్యరూపధ్యానం చేస్తూ జీవాత్మను మళ్లీ తన శరీరంలో ఉంచుకోవాలి. ఇలా చేయడం వల్ల ఆత్మ శుద్ధి అవుతుంది. మళ్లీ న్యాసం చేసి పూజ ప్రారంభించాలి.

క్రమాత్కృష్ణాసితశ్యామరక్తపీతా నగాదయః ।
మంత్రార్ణా దండినాంగాని తేషు సర్వాస్తు మూర్తయః ॥16॥

పంచాక్షరిలోని అయిదు అక్షరాల వర్ణాలు క్రమంగా కృష్ణ, శ్వేత, శ్యామ, రక్త, పీతాలు. నకారం మున్నగు అక్షరాలలో వరుసగా అంగన్యాసం చేసి, ఆ అంగాల పైనే "తత్పురుష" మున్నగు మూర్తిపంచకాన్ని న్యాసం చేయాలి

(విశేషం: శారదాతిలకంలో న్యాసం ఈ విధంగా వివరించబడింది.

"నం తత్పురుషాయ నమః తర్జన్యోః, మం అఘోరాయ నమః మధ్యమయోః, శిం సద్యోజాతాయ నమః కనిష్ఠికయోః, వాం వామదేవాయ నమః అనామికయోః, యం ఈశానాయ నమః అంగుష్ఠయోః, నం తత్పురుషాయ హృదయాయ నమః, మం అఘోరాయ శిరసే స్వాహా, శిం సద్యోజాతాయ శిఖాయై వషట్, వాం వామదేవాయ కవచాయ హుమ్, యం ఈశానాయ అస్త్రాయ ఫట్")

(అంగుష్ఠాది కనిష్ఠాంతం విన్యస్యాంగాని సర్వతః ।
న్యసేన్మంత్రాక్షరం పాదగుహ్యహృద్వక్త్రమూర్ధసు॥17॥

పిదప అంగుష్ఠం మొదలు కనిష్ఠిక వరకు ఐదు వ్రేళ్లపై (క్రమంగా) అంగమంత్రాలను న్యాసం చేసి, పాదం, గుహ్యం, హృదయం, ముఖం, శిరస్సులందు మంత్రాక్షరన్యాసం చేయాలి.

వ్యాపకం న్యస్య మూర్ధాది మూలమంగాని విన్యసేత్ ।)
రక్తపీతశ్యామసితాన్ పీఠపాదాన్ స్వకోణజాన్ ॥18॥

పిదప శిరస్సు మొదలగు వాటియందు ఈ అంగముల వ్యాపకన్యాసం చేయాలి. పీఠపాదములందు, కోణాలయందు రక్త-పీత-శ్యామ-సిత వర్ణాలను భావనచేయాలి.

(సాధ్యాన్) స్వాంగాన్మంత్రై ర్న్యసేద్గాత్రాణ్యధర్మాదీని దిక్షు చ ।
తత్ర పద్మం చ సూర్యాదిమండల త్రితయం గుణాన్ ॥19॥

(పిదప) అగ్న్యాదికోణాలయందు ధర్మాదిపాదాలను, ఆయా వర్ణాలను భావన చేస్తూ, సాధ్యమంత్రవర్ణాలతో న్యాసం చేయాలి. పూర్వాది దిక్కులయందు అధర్మాదులను భావన చేస్తూ అంగన్యాసం చేయాలి. ఈ విధంగా యోగపీఠాన్ని భావన చేస్తూ, దానిపై అష్టదళపద్మాన్ని, సూర్యమండల, చంద్రమండల, అగ్నిమండలాలను, సత్త్వాదిగుణాలను భావన చేయాలి.

పూర్వాదిపత్రే వామాద్యా నవమీ కర్ణికోపరి ।
వామా జ్యేష్ఠా క్రమాద్రౌద్రీ కాలీ కలవికారిణీ ॥20॥

బలవికారిణీ చాథ బలప్రమథినీ తథా ।
సర్వభూతదమనీ చ నవమీ చ మనోన్మనీ ॥21॥

పూర్వాదిదళాలలో వామాదిశక్త్యష్టకాన్ని, కర్ణికపై తొమ్మిదోశక్తిని భావన చేయాలి. వామ, జ్యేష్ఠ, రౌద్రి, కాళి, కలవికారిణి, బలవికారిణి, బలప్రమథిని, సర్వభూతదమని, మనోన్మని అనేవి క్రమంగా ఆ తొమ్మిది శక్తులు.

శ్వేతా రక్తా సితా పీతా శ్యామా వహ్నినిభాఽసితా ।
కృష్ణారుణాశ్చ తాః శక్తీర్జ్వాలారూపాః స్మరేత్క్రమాత్ ॥22॥

వీటి వర్ణాలు క్రమంగా శ్వేత, రక్త, సిత, పీత, శ్యామ, అగ్నిసమాన, అసిత, కృష్ణ, అరుణ. ఈ వర్ణాలను జ్వాలాస్వరూపశక్తులుగా భావన చేయాలి.

అనంతయోగపీఠాయ ఆవాహ్యాథ హృదబ్జతః ।
స్ఫటికాభం చతుర్బాహుం ఫాలశూలధరం శివమ్ ॥(ఫల) 23॥

సాభయం వరదం పంచవదనం త్రిలోచనమ్ ।
పత్రేషు మూర్తయః పంచ స్థాప్యాస్తత్పురుషాదయః ॥24॥

అనంతయోగపీఠంపై తన హృదయపద్మంలోనున్న శివుని "స్ఫటికకాంతి కలవానిని, నాలుగు బాహువులు కలవానిని, వాటియందు ఫాల(ఫల),శూల, అభయ, వరద ముద్రలు ధరించిన వానిని, ఐదుముఖాలు, మూడు నేత్రాలు కలవానిని" గా ఆవాహన చేయాలి. పిదప కమలదళాలపై తత్పురుషాది పంచమూర్తులను స్థాపించాలి.

పూర్వే తత్పురుషః శ్వేతో హ్యఘోరోఽష్టభుజోఽసితః ।
చతుర్బాహుర్ముఖః పీతః సద్యోజాతశ్చ పశ్చిమే ॥25॥

వామదేవః స్త్రీవిలాసీ చతుర్వక్త్రభుజోఽరుణః ।
సౌమ్యే పంచాస్య ఈశాన ఈశానః సర్వదః సితః ॥26॥

చతుర్భుజుడైన తత్పురుషుడు తూర్పున శ్వేతవర్ణుడై ఉంటాడు. అష్టభుజుడైన అఘోరుడు నల్లనికాంతితో దక్షిణదిక్కున ఉంటాడు. సద్యోజాతుడు నాలుగుముఖాలతో, నాలుగు భుజాలతో పీతవర్ణంతో పశ్చిమదిక్కున ఉంటాడు. వామదేవరూపం స్త్రీతో కలసి (దేవి పార్వతితో కలసి) నాలుగు ముఖాలతో తెల్లని కాంతితో ఈశానుడు ఈశాన్యదిక్కున సర్వకామప్రదాతయై ఉంటాడు.

ఇష్టాంగాని యథాన్యాయమనంతం సూక్ష్మమర్చయేత్ ।
సిద్ధేశ్వరం త్వేకనేత్రం పూర్వాదౌ దిశి పూజయేత్ ॥27॥

పిదప అంగదేవతలను యథోచితంగా పూజించి, పూర్వాది దిక్కులందు అనంతుడు, సూక్ష్ముడు, సిద్ధేశ్వరుడు, ఏకనేత్రుడు వీరిని అర్చించాలి.

ఏకరుద్రం త్రినేత్రం చ శ్రీకంఠం చ శిఖండినమ్ ।
ఐశాన్యాదివిదిక్ష్వేతే విద్యేశాః కమలాసనాః ॥28॥

ఈశాన్యాది విదిక్కులలో ఏకరుద్రుని, త్రినేత్రుని, శ్రీకంఠుని, శిఖండిని పూజించాలి. వీరందరు విద్యేశ్వరులు. కమలాసనంపై కూర్చుని ఉంటారు.

శ్వేతః పీతః సితో రక్తో ధూమ్రో రక్తోఽరుణః సితః ।(అసితః)
శూలాశనిశరేష్వాస బాహవశ్చతురాననాః॥29॥

వీరి శరీరకాంతి శ్వేతం, పీతం, సితం, రక్తం, ధూమ్రం, రక్తం, అరుణం, నీలం-అనే రంగులతో ఉంటుంది. వీరందరు నాలుగుభుజాలు, నాలుగు ముఖాలు కలిగి ఉంటారు. చేతులలో శూలం, అశని (పిడుగు), శరం, చాపం ధరించి ఉంటారు.

ఉమా చండీశనందీశౌ మహాకాలో గణేశ్వరః ।
వృషో భృంగరిటిస్కందానుత్తరాదౌ ప్రపూజయేత్ ॥30॥

పిదప తృతీయమైన అష్టదళపద్మంలో ఉత్తరాదిదళాలపై ప్రదక్షిణక్రమంగా ఉమా, చండీశ, నందీశ, మహాకాల, గణేశ, వృషభేశ్వర, భృంగరిటి, స్కందులను చక్కగా పూజించాలి.

కులిశం శక్తిదండౌ చ ఖడ్గం పాశధ్వజౌ గదామ్ ।
శూలం చక్రం యజేత్పద్మం పూర్వాదౌ దేవమర్చ్య చ ॥31॥

పిదప పూర్వాది దిక్కులందు చతురస్రరేఖపై ఇంద్రాదిదిక్పాలకులను, వారి ఆయుధాలైన వజ్రం, శక్తి, దండం, ఖడ్గం, పాశం, ధ్వజం, గద, శూలం, చక్రం, పద్మం అనే వాటిని పూజించాలి.

తతోఽధివాసితం శిష్యం పాయయేద్గవ్యపంచకమ్।
ఆచాంతం ప్రోక్ష్య నేత్రాంతైర్నేత్రే నేత్రేణ బంధయేత్॥32॥

ఈ విధంగా గురువు ఆరు ఆవరణములలో అధివసించియున్న, ఇష్టదేవతాప్రార్థన చేసియున్న, అధివాసితుడైన శిష్యునిచే పంచగవ్యప్రాశనం చేయించాలి. ఆచమనం చేసిన తరువాత అతనిని సంప్రోక్షించాలి. పిదప నూతన వస్త్రంతో "వౌషట్" అనే నేత్రమంత్రాన్ని ఉచ్చరిస్తూ గురువు అతనికి నేత్రబంధనం చేయాలి.

ద్వారే ప్రవేశయేచ్ఛిష్యం మండపస్యాథ దక్షిణే ।
సాసనాదికుశాసీనం తత్ర సంశోధయేద్గురుః ॥33॥

పిదప శిష్యుని మండపం యొక్క దక్షిణద్వారం ద్వారా ప్రవేశం చేయించి, కుశాసనంపై కూర్చుండబెట్టి సంశోధన చేయాలి.

ఆదితత్త్వాని సంహృత్య పరమార్థే లయః క్రమాత్ ।
పునరుత్పాదయేచ్ఛిష్యం సృష్టిమార్గేణ దేశికః ॥34॥

గురువు పాంచభౌతికతత్త్వాల సంహారం చేసి క్రమంగా శిష్యుని పరమాత్మలో విలీనం చేసి, పిదప సృష్టిమార్గం ద్వారా మళ్లీ ఆతనిని పుట్టించాలి.

న్యాసం శిష్యే తతః కృత్వా తం ప్రదక్షిణమానయేత్ ।
పశ్చిమద్వారమానీయ క్షేపయేత్కుసుమాంజలిమ్ ॥35॥

పిదప శిష్యుని దివ్యశరీరంపై న్యాసం చేసి ప్రదక్షిణపూర్వకంగా పశ్చిమద్వారానికి తీసుకొని వచ్చి, వానిచే పుష్పాంజలిని విసరేటట్లు చేయించాలి.

యస్మిన్పతంతి పుష్పాణి తన్నామాద్యం వినిర్దిశేత్ ।
పార్శ్వే యాగభువః ఖాతే కుండే సన్నాభిమేఖలే ॥36॥

శివాగ్నిం జనయిత్వేష్ట్వా పునః శిష్యేణ చార్చయేత్ ।

ఆ పుష్పాలు ఏ దేవతాశిరస్సుపై పడతాయో, ఆ దేవతనామాన్ని మొదట ఉంచి శిష్యునికి పేరు పెట్టాలి. తరువాత నేత్రబంధాన్ని తొలగించి యజ్ఞభూమియొక్క పార్శ్వభాగంలో సుందరమైన నాభి, మేఖల ఉన్న అగ్ని కుండంలో శివాగ్నిని ఆవిర్భవింపజేసి తాను పూజించి, శిష్యుని చేత కూడా పూజ చేయించాలి.

ధ్యానేనాత్మని తం శిష్యం సంహృత్య ప్రలయః క్రమాత్ ॥37॥

పునరుత్పాద్య తత్పాణౌ దద్యాద్దర్భాంశ్చ మంత్రితాన్ ।
పృథివ్యాదీని తత్త్వాని జుహుయాద్ధృదయాదిభిః ॥38॥

ఏకైకస్య శతం హుత్వా వ్యోమమూలేన హోమయేత్॥

తరువాత ఆ శిష్యుని సంహారక్రమంలో తనలో విలీనం చేసుకొని, మళ్లీ సృష్టిక్రమంలో అతనిని ఉత్పాదన చేసి (పుట్టించి), అభిమంత్రితాలైన దర్భలను అతని చేతిలో ఉంచాలి. హృదయాది మంత్రాలతో పృథివ్యాది తత్త్వాలను ఉద్దేశించి వాటి మంత్రాలతో వందచొప్పున హోమం చేసి, ఆకాశతత్త్వాన్ని కూడ నూరు మార్లు హోమం చేయాలి.

హుత్వా పూర్ణాహుతిం కుర్యాదస్త్రేణాష్టాహుతీర్ద్విజేత్ ॥39॥

ప్రాయశ్చిత్తం విశుద్ధ్యర్థం తతః శేషం సమాపయేత్ ।

పిదప పూర్ణాహుతి హోమంచేసి, అస్త్రమంత్రాన్ని ఉచ్చరిస్తూ ఎనిమిది హెూమాలు చేయాలి. తరువాత విశుద్ధికొరకై ప్రాయశ్చిత్తం చేసి పరిసమాప్తి చేయించాలి.

కుంభం సమంత్రితం ప్రార్చ్య శిశుం పీఠేఽభిషేచయేత్ ॥40॥

శిష్యే తు సమయం దత్వా స్వర్ణా ద్యై : స్వగురుం యజేత్ ।
దీక్షా పంచాక్షరస్యోక్తా విష్ణ్వాదేరేవమేవ హి ॥41॥

పిదప అభిమంత్రితమైన కలశను పూజించి, పీఠంపై నున్న శిష్యునకు అభిషేకం చేసి, అతనికి సమయాచారాన్ని ఉపదేశించాలి. శిష్యుడు స్వర్ణముద్రాదికముల ద్వారా గురువును పూజించాలి. ఇది శివపంచాక్షరీ దీక్ష. ఇది ఈ విధంగా చెప్పబడింది. విష్ణువు మున్నగు దేవతల సంబంధమైన మంత్రదీక్షకూడ ఈ విధంగానే చేయాలి.

ఇత్యాది మహాపురాణే ఆగ్నేయే పంచాక్షరదీక్షావిధానకథనం నామ చతురధికత్రిశతతమోఽధ్యాయః ॥304॥

అగ్నిమహాపురాణంలో పంచాక్షర దీక్షావిధాన కథనమ్ అనే మూడువందల నాల్గవ అధ్యాయం సమాప్తం.



పంచాధికత్రిశతతమోఽధ్యాయః – మూడువందల అయిదవ అధ్యాయం

పంచపంచాశద్విష్ణునామాని – విష్ణువు యొక్క యాభైఐదు నామాలు

అగ్నిరువాచ – అగ్ని ఇలా చెబుతున్నాడు.

జపన్వై పంచపంచాశద్విష్ణునామాని యో నరః ।
మంత్రజప్యాదిఫలభాక్ తీర్థేష్వర్చాది చాక్షయమ్ ॥1॥

శ్రీమహావిష్ణువుయొక్క యాభై ఐదు నామాలను ఏ మానవుడు జపిస్తాడో, అతడు మంత్రజపాదులను చేసిన ఫలితాన్ని పొందుతాడు. పుణ్యతీర్థాలలో అర్చనాదులు కావించిన అక్షయఫలితాలను పొందుతాడు.

పుష్కరే పుండరీకాక్షం గయాయాం చ గదాధరమ్ ।
రాఘవం చిత్రకూటే తు ప్రభాసే దైత్యసూదనమ్॥2॥

పుష్కరతీర్థంలో పుండరీకాక్షుని, గయ యందు గదాధరుని, చిత్రకూటంలో రాఘవుని, ప్రభాసక్షేత్రంలో దైత్యసూదనుని,

జయం జయంత్యాం తద్వచ్చ జయంతం హస్తినాపురే ।
వారాహం వర్ధమానే చ కాశ్మీరే చక్రపాణినమ్ ॥3॥

జయంతి యందు జయుని, హస్తినాపురంలో జయంతుని, వర్ధమానక్షేత్రంలో వారాహుని, కాశ్మీరంలో చక్రపాణిని,

జనార్దనం చ కుబ్జాస్తే (మ్రే) మథురాయాం చ కేశవమ్ ।
కుబ్జామ్రకే హృషీకేశం గంగాద్వారే జటాధరమ్ ॥4॥

కుబ్జాస్తంలో (కుబ్జాభంలో) జనార్దనుని, మథురలో కేశవుని, కుబ్జామ్రకంలో హృషీకేశుని, గంగాద్వారంలో జటాధరుని,

శాలగ్రామే మహాయోగం హరిం గోవర్ధనాచలే ।
పిండారకే చతుర్బాహుం శంఖోద్ధారే చ శంఖినమ్ ॥5॥

శాలగ్రామంలో మహాయోగుని, గోవర్ధనపర్వతంపై హరిని, పిండారకక్షేత్రంలో చతుర్బాహుని, శంఖోద్ధారంలో శంఖిని,

వామనం చ కురుక్షేత్రే యమునాయాం త్రివిక్రమమ్ ।
విశ్వేశ్వరం తథా శోణే కపిలం పూర్వసాగరే॥6॥

కురుక్షేత్రంలో వామనుని, యమునలో త్రివిక్రముని, శోణంలో విశ్వేశ్వరుని, పూర్వసాగరంలో (తూర్పు సముద్రంలో) కపిలుని,

విష్ణుం మహోదధౌ విద్యాద్గంగాసాగరసంగమే ।
వనమాల్యం చ కిష్కింధ్యాం దేవం రేవతకం విదుః ॥7॥

మహోదధియందు విష్ణువును, గంగాసాగరసంగమంలో వనమాలిని, కిష్కింధలో రైవతకదేవుని,

కాశీతటే మహాయోగం విరజాయాం రిపుంజయమ్ ।
విశాఖయూపే హ్యజితం నేపాలే లోకభావనమ్॥8॥

కాశీతటంలో మహాయోగుని, విరజయందు రిపుంజయుని, విశాఖయూపంలో అజితుని, నేపాలంలో లోకభావనుని,

ద్వారకాయాం విద్ధి కృష్ణం మందరే మధూసూదనమ్ ।
లోకాకులే రిపుహరం శాలగ్రామే హరిం స్మరేత్ ॥9॥

ద్వారకానగరంలో కృష్ణుని, మందరంలో మధుసూదనుని, లోకాకులంలో రిపుహరుని, శాలగ్రామంలో హరిని స్మరించాలి.

పురుషం పురుషవటే విమలే చ జగత్ప్రభుమ్ ।
అనంతం సైంధవారణ్యే దండకే శార్ఙ్గధారిణమ్ ॥10॥

పురుషవటంలో పురుషుని, విమలక్షేత్రంలో జగత్ప్రభువును, సైంధవారణ్యంలో అనంతుని, దండకంలో శార్ఙ్గధారిని

ఉత్పలావర్తకే శౌరిం నర్మదాయాం శ్రియఃపతిమ్ ।
దామోదరం రైవతకే నందాయాం జలశాయినమ్॥11॥

ఉత్పలావర్తంలో శౌరిని, నర్మదలో శ్రీపతిని, రైవతకంలో దామోదరుని, నందయందు జలశయనుని

గోపీశ్వరం చ సింధ్వబ్ధౌ మాహేంద్రే చాచ్యుతం విదుః।
సహ్యాద్రౌ దేవదేవేశం వైకుంఠం మాగధే వనే॥12॥

సింధు సముద్రంలో గోపీశ్వరుని, మాహేంద్రపర్వతం పైన అచ్యుతుని, సహ్యపర్వతం పై దేవదేవేశుని, మాగధవనంలో వైకుంఠుని,

సర్వపాపహరం వింధ్య ఔడ్రే తు పురుషోత్తమమ్ ।
ఆత్మానం హృదయే విద్ధి జపతాం భుక్తిముక్తిదమ్ ॥13॥

వింధ్యపర్వతప్రదేశంలో సర్వపాపహరుని, ఓఢ్రదేశంలో పురుషోత్తముని, హృదయంలో అంతరాత్మను స్మరించవలెను. ఈ అంతరాత్మను జపించేవారికి భుక్తి ముక్తి కలుగుతాయి.

వటే వటే వైశ్రవణం చత్వరే చత్వరే శివమ్।
పర్వతే పర్వతే రామం సర్వత్ర మధుసూదనమ్ ॥14॥

ప్రతివటవృక్షంలో వైశ్రవణుని, ప్రతి చత్వరమునందు శివుని, ప్రతి పర్వతమునందు రాముని, అన్ని ప్రదేశములలో మధుసూదనుని,

నరం భూమౌ తథా వ్యోమ్ని వసిష్ఠే గరుడధ్వజమ్ ।
వాసుదేవం చ సర్వత్ర సంస్మరన్ భుక్తిముక్తిభాక్ ॥15॥

భూమ్యాకాశాలలో నరుని, వసిష్ఠతీర్థంలో గరుడధ్వజుని, అన్ని ప్రదేశాలలో వాసుదేవుని స్మరించాలి. వాసుదేవుని స్మరించేవాడు భుక్తిని, ముక్తిని పొందుతాడు.

నామాన్యేతాని విష్ణోశ్చ జప్త్వా సర్వమవాప్నుయాత్।
క్షేత్రేష్వేతేషు యః శ్రాద్ధం దానం జప్యం చ తర్పణమ్ ॥16॥

తత్సర్వం కోటిగుణితం మృతో బ్రహ్మమయో భవేత్ ।
యః పఠేచ్ఛృణుయాద్వాఽపి నిర్మలః స్వర్గమాప్నుయాత్ ॥17॥

ఈ విష్ణునామాలను జపించేవాడు సమస్తఫలితాలను పొందుతాడు. ఈ క్షేత్రాలలో ఎవడు శ్రాద్ధం, దానం, జపం, తర్పణం కోటి గుణితం అవుతుంది. అలా చేసేవాడు మరణానంతరం బ్రహ్మమయుడవుతాడు. ఇది చదివినవాడు, విన్నవాడు పాపరహితుడై స్వర్గాన్ని (మోక్షధామం) పొందుతాడు.

ఇత్యాది మహాపురాణే ఆగ్నేయే పంచపంచాశద్విష్ణుకథనం నామ పంచాధికత్రిశతతమోఽధ్యాయః ॥305॥

అగ్నిమహాపురాణంలో విష్ణువు యొక్క యాభైఐదు నామాలు అనే మూడువందల అయిదవ అధ్యాయం సమాప్తం.



షడధికత్రిశతతమోఽధ్యాయః - మూడువందల ఆరవ అధ్యాయం

నారసింహాది మంత్ర కథనం - నారసింహాది మంత్రాలు చెప్పుట

అగ్నిరువాచ - అగ్ని ఇలా చెబుతున్నాడు.

స్తంభో విద్వేషణోచ్చాట ఉత్సాదో భ్రమమారణే ।
వ్యాధిశ్చేతి స్మృతం క్షుద్రం తన్మోక్షో వక్ష్యతే శృణు ॥1॥

స్తంభనం, విద్వేషణం, ఉచ్చాటనం, ఉత్సాదనం, భ్రమణం, మారణం, వ్యాధి అనేవి క్షుద్రకర్మలు అనే పేర్లు కల్గిన ఆభిచారిక కృత్యాలు. వాటిని తొలగించే ఉపాయాలు చెబుతాను విను.

ఓం నమో భగవతే ఉన్మత్తరుద్రాయ భ్రమ భ్రమ
భ్రామయ భ్రామయ అముకం విత్రాసయ విత్రాసయ ఉద్భ్రామయ ఉద్భ్రామయ
రుద్ర (అ) రౌద్రేణ రూపేణ రుద్రారౌద్రరూపేణ హ్రూం హ్రూం ఫట్ ఠఠ ॥2॥

"ఓం నమో భగవతే" మొదలుకొని "హ్రూంఫట్ ఠఠ" వరకు ఉన్న మంత్రం మూలమంత్రం. దీనికి "స్వాహా" చేర్చి హోమం చేయాలి.

స్మశానే నిశి జప్తేన త్రిలక్షం మధునా హునేత్ ।
చితాగ్నౌ ధూర్తసమిద్భిర్భ్రామ్యతే సతతం రిపుః॥3॥

స్మశానంలో రాత్రి సమయంలో మూడు లక్షల మార్లు జపించి, చితాగ్నిలో ధూర్త సమిధలతో హోమం చేస్తే శత్రువు ఎప్పుడూ రాకుండా వెళ్లిపోతాడు. (సర్వదా భ్రాంతుడవుతాడు)

హేమగైరికయా కృష్ణా ప్రతిమా హేమసూచిభిః ।
జప్త్వా విధ్యేచ్చ తత్కంఠే హృది వా మ్రియతే రిపుః ॥4॥

హేమగైరికతో నల్లగా శత్రువుయొక్క ప్రతిమ చేసి మంత్రంతో అభిమంత్రించిన బంగారుసూదులతో కంఠమునందు గాని, హృదయమునందు గాని గ్రుచ్చితే శత్రువు మరణిస్తాడు.

ఖరవాలం చితాభస్మ బ్రహ్మదండీ చ మర్కటీ ।
గృహే వా మూర్ధ్ని తచ్చూర్ణం జప్తముత్సాదకృత్ క్షిపేత్ ॥5॥

గాడిద తోకలోని వెంట్రుకలు, చితాభస్మ, బ్రహ్మదండి, మర్కటి వీటిని బూడిదజేసి, దానిని మంత్రంతో అభిమంత్రించి ఉత్సాదన (నాశనం) ప్రయోగం చేసేవాడు శత్రువు ఇంటిపై గాని, శిరస్సుపై గాని చల్లాలి.

భృగ్వాకాశౌ సదీప్తాగ్ని ర్భృగు ర్వహ్నిశ్చ వర్మఫట్ ।
ఏవం సహస్రారే హుంఫట్ ॥6॥

భృగు(స), ఆకాశ(హ), దీప్త (దీర్ఘమైన ఆకార యుక్తం), అగ్ని(ర), భృగు(స). కలిపితే ,'సహస్రా', మళ్లీ 'ర' (వహ్నిశ్చ), వర్మ (హుమ్)ఫట్ – ఇవన్నీ కలిపితే "సహస్రారహుంఫట్" అని అవుతుంది.

ఆచక్రాయ స్వాహా హృదయం విచక్రాయ శిరః ।
శిఖాచక్రాయాథ కవచం విచక్రాయాథ నేత్రకమ్ ॥7॥

సుచక్రాయాస్త్రముద్దిష్టం జ్వాలాచక్రాయ పూర్వవత్ ।

దీని అంగన్యాసం ఈ విధంగా ఉంటుంది. "ఆ చక్రాయ స్వాహా హృదయాయ నమః, విచక్రాయ స్వాహా శిరసే స్వాహా, విచక్రాయ స్వాహా శిఖాయై వషట్, ధీచక్రాయ స్వాహా కవచాయ హుమ్, సుచక్రాయ స్వాహా నేత్రత్రయాయ వౌషట్, జ్వాలాచక్రాయ స్వాహా అస్త్రాయ ఫట్" – ఇలా పూర్వంలాగనే న్యాసం చేయాలి.

సాంగం సుదర్శనం క్షుద్రగ్రహహృత్సర్వసాధనమ్ ॥8॥

అంగన్యాస పూర్వకంగా జపించిన సుదర్శనచక్రమంత్రం ఇదివరలో చెప్పిన క్షుద్రసంజ్ఞకల్గిన అభిచార గ్రహబాధలని హరించి సకల మనోరథాలను నెరవేరుస్తుంది.

మూర్ధాక్షిముఖహృద్గుహ్యపాదే హ్యస్యా క్షరాన్న్యసేత్ ।

ఆ సుదర్శనమంత్రం యొక్క ఆరు అక్షరాలను క్రమంగా శిరస్సు, నేత్రం, ముఖం, హృదయం, గుహ్యం, పాదాలు–వీటియందు న్యాసం చేయాలి.

చక్రాబ్జాసనమగ్న్యాభం దంష్ట్రిణం చ చతుర్భుజమ్ ॥9॥

శంఖ చక్ర గదా పద్మ శలాకాంకుశ పాణినమ్ ।(పాశినమ్)
చాపినం పింగకేశాక్షమరవ్యాప్త త్రివిష్టపమ్ ॥10॥

చక్రస్వరూపుడైన విష్ణువును ఈ విధంగా ధ్యానం చేయాలి. చక్రాకారంలో ఉన్న కమలంలో కూర్చునవాడు, అగ్ని సమానమైన కాంతికలవాడు, కోరలు కలవాడు, నాలుగు చేతులుకలవాడు, మళ్లీ శంఖం, చక్రం, గద, పద్మం, ముసలం, అంకుశం, పాశం, చాపం అనే ఆయుధాలను ఎనిమిది చేతులలో ధరించినవాడు, పింగళ వర్ణం కలిగిన కేశాలు, నేత్రాలు కలవాడు, చక్రం యొక్క అంచులచే వ్యాపింపబడిన మూడులోకాలు కలవాడు.

నాభిస్తేనాగ్నినా విద్ధా న్యస్యంతే వ్యాధయో గ్రహాః ।
పీతం చక్రధరం రక్తా అరాః శ్యామమవాంతరమ్ ॥11॥

నేమిః శ్వేతా బహిః కృష్ణవర్ణరేఖా చ పార్థివీ ।
మధ్యే తారమయే వర్ణానేవం చక్రద్వయం లిఖేత్ ॥12॥

చక్రనాభి ఆ అగ్నిచే వ్యాపించి ఉంది. దీని భావనవల్ల వ్యాధిబాధలు, గ్రహబాధలు నశిస్తాయి. చక్రం పీత వర్ణంతో ఉంటుంది. అరలు రక్తవర్ణాలు. అరమధ్యభాగం శ్యామవర్ణం. చక్రనేమి శ్వేతవర్ణం. దాని యందు బయట

పార్థివమైన కృష్ణవర్ణరేఖ ఉంటుంది. అరయుక్త మధ్యభాగంలో అకారాది వర్ణాలు ఉంటాయి. ఈ విధంగా రెండు చక్రచిహ్నాలను వ్రాయాలి.

ఆదావానీయ కుంభోదం గోచరే సన్నిధాయ చ ।
ఇష్ట్వా సుదర్శనం తత్ర యామ్యే చక్రే హునేత్క్రమాత్ ॥13॥

ఆదిచక్రంపై కలశజలాన్ని తీసుకొని తన దగ్గరనే ఉంచి, దక్షిణాన ఉన్న రెండో చక్రంపై సుదర్శనాన్ని పూజించి అగ్నిలో క్రమంగా హోమం చేయాలి.

ఆజ్యాపామార్గసమిధో హ్యక్షతం తిలసర్షపౌ ।
పాయసం గవ్యమాజ్యం చ సహస్రాష్టకసంఖ్యయా ॥14॥

ఆజ్యం, అపామార్గ సమిధలు, అక్షతలు, తిలలు, ఆవాలు, పాయసం, గోఘృతంతో మూలమంత్రంతో హోమం చేయాలి. ఒక్కొక్క ద్రవ్యంతోను 1008 (ఒక వేయి ఎనిమిది సార్లు) హోమం చేయాలి.

హుతశేషం క్షిపేత్కుంభే ప్రతిద్రవ్యం విధానవిత్ ।
ప్రస్థానేన కృతం పిండం కుంభే తస్మిన్నివేశయేత్ ॥
విష్వ్వాది సర్వం తత్రైవ న్యసేత్తత్రైవ దక్షిణే ॥15॥

కర్త శాస్త్రజ్ఞానంతో ప్రత్యేక ద్రవ్యంయొక్క హోమం చేయగా మిగిలిన భాగాన్ని కలశంలో ఉంచి, ఒక ప్రస్థం అన్నంతో చేసిన పిండాన్ని ఆ కలశంలో వేయాలి. విష్వ్వాది దేవతలకు ఈయవలసిన ఆ వస్తువులన్నింటిని, అచ్చటనే దక్షిణంలో ఉంచాలి.

నమో విష్ణుజనేభ్యః సర్వశాంతికరేభ్యః ప్రతిగృహ్ణంతు శాంతయే నమః ॥16॥

దద్యాదనేన మంత్రేణ హుతశేషాంభసా బలిమ్ ।

పిదప "సకల శాంతులను కలగజేసే విష్ణుదేవతలకు నమస్కారం. వారు శాంతి కోసమై ఈ ఉపహారాన్ని గ్రహింతురు గాక ! వారికి నమస్కారం". అంటూ మంత్రం చదివి హుతశిష్టజలంతో బలి సమర్పించాలి.

ఫలకే కల్పితే పాత్రే పలాశక్షీరశాఖినః ॥17॥

గవ్యపూర్ణే నివేశ్యైవ దిక్ష్వేవం హోమయేద్ద్విజైః ।

ఏదైనా కాష్ఠఫలకంపై (పీటపై) గాని, కలశంలో కాని, పాలచెట్టు కర్రతో చేసిన దధిపూర్ణపాత్రలో కాని బలి వస్తువులను ఉంచి అన్ని దిక్కులందు సమర్పించాలి. పిదప ద్విజులచే దిక్కుల యందు హోమాలు చేయించాలి.

సదక్షిణమిదం హోమద్వయం భూతాదినాశనమ్ ॥18॥

గవ్యాక్తపత్రలిఖితైర్లిప్యర్ణైః క్షుద్రముద్ధృతమ్ ।
దూర్వాభిరాయుషే పద్మైః శ్రియే పుత్రా ఉదుంబరైః॥19॥

గోసిద్ధ్యై సర్పిషా గోష్ఠే మేధాయై సర్వశాఖినా ॥20॥

దక్షిణాసహితంగా ఇలా హోమద్వయం చేస్తే భూతప్రేతాదులు నశిస్తాయి. పెరుగు పూసిన ఆకులపై వ్రాసిన మంత్రాక్షరాలతో హోమం చేస్తే క్షుద్రరోగశక్తులు నశిస్తాయి. దూర్వలతో హోమం చేస్తే ఆయుర్దాయం, పద్మాలతో హోమం చేస్తే ఐశ్వర్యం, ఉదుంబరాలతో (మేడితో) హోమం చేస్తే పుత్రులు, గోష్ఠంలో గోఘృతంతో హోమం చేస్తే గోవృద్ధి, సకల వృక్షసమిధలతో హోమం చేస్తే మేధాసంపత్తి (బుద్ధి) కలుగుతాయి.

ఓం క్ష్రౌం నమో భగవతే నారసింహాయ జ్వాలామాలినే ।
దీప్తదంష్ట్రాయాగ్నినేత్రాయ సర్వరక్షోఘ్నాయ సర్వభూత ॥
వినాశాయ సర్వజ్వరవినాశాయ దహ దహ పచ పచ రక్ష రక్ష హ్రూం ఫట్ ॥21॥

మంత్రోఽయం నారసింహస్య సకలాఘనివారణః ।
జప్యాదినా హరేత్ క్షుద్రగ్రహమారీవిషామయాన్ ॥
చూర్ణమండూకవయసా (వసయా) జలాగ్ని స్తంభకృద్భవేత్ ॥22॥

"ఓం క్ష్రౌం" మొదలు "హ్రూం" (హూం) ఫట్" వరకు ఉండేది నారసింహమూలమంత్రం. ఇది సకల పాపాలను నివారిస్తుంది. జపాదులు చేస్తే క్షుద్రాభిచారాలు, గ్రహబాధలు, మారి, విషం, ఆమయం తొలగిపోతాయి. చూర్ణం చేసిన మండుకవసతో హోమం చేస్తే జలస్తంభనం, అగ్నిస్తంభనం చేకూరుతాయి.

ఇత్యాది మహాపురాణే ఆగ్నేయే నారసింహాదిమంత్రకథనం నామ షడధికత్రిశతతమోఽధ్యాయః ॥306॥

అగ్నిమహాపురాణంలో నారసింహాది మంత్రాలు చెప్పుట అనే మూడువందల ఆరవ అధ్యాయం సమాప్తం.



సప్తాధికత్రిశతతమోఽధ్యాయః – మూడువందల ఏడవ అధ్యాయం
త్రైలోక్యమోహనమంత్ర కథనమ్ – త్రైలోక్యమోహనమంత్ర కథనం

అగ్నిరువాచ – అగ్ని ఇలా చెబుతున్నాడు.

వక్ష్యే మంత్రం చతుర్వర్గసిద్ధ్యై త్రైలోక్యమోహనమ్ ॥1॥

చతుర్విధపురుషార్థసిద్ధికోసమై త్రైలోక్యమోహనం అనే మంత్రాన్ని చెబుతాను.

"ఓం శ్రీం హ్రీం హ్రూం, ఓం నమః పురుషోత్తమః పురుషోత్తమప్రతిరూపలక్ష్మీనివాస సకలజగత్క్షోభణ సర్వస్త్రీహృదయదారణ త్రిభువనమదోన్మాదకర సురమనుజసుందరీజనమనాంసి తాపయ తాపయ దీపయ దీపయ శోషయ శోషయ మారయ మారయ స్తంభయ స్తంభయ ద్రావయ ద్రావయ ఆకర్షయ ఆకర్షయ పరమసుభగ సర్వసౌభాగ్యకర కామప్రద అముకం హన హన చక్రేణ గదయా ఖడ్గేన సర్వబాణైర్భింద భింద పాశేన కట కట అంకుశేన తాడయ తాడయ త్వర త్వర కిం తిష్ఠసి యావత్తావత్ సమీహితం మే సిద్ధం భవతి హ్రూం ఫట్ నమః" (హుం ఫట్ నమః) ॥2॥

"ఓం శ్రీం హ్రీం" మొదలు "హ్రూం ఫట్ నమః" వరకు త్రైలోక్యమోహన మూలమంత్రం.

"ఓం పురుషోత్తమ త్రిభువనమనోన్మాదకర హ్రూం ఫట్ హృదయాయ నమః ।

కర్షయ మహాబల హ్రూం ఫట్ అస్త్రాయ, త్రిభువనేశ్వర సర్వజనమనాంసి హన హన దారయ దారయ మమ వశమానయ ఆనయ హ్రూం ఫట్ నేత్రత్రయాయ, త్రైలోక్యమోహన హృషీకేశాప్రతిరూప సర్వ స్త్రీహృదయాపకర్షణ ఆగచ్ఛ ఆగచ్ఛ నమః ॥3॥

సాంగాక్షి వ్యాపకే నైవ న్యాసం మూలవదీరితమ్ ।

"ఓం పురుషోత్తమ " మొదలు " ఆగచ్ఛ ఆగచ్ఛ నమః " అనే వరకు మూలమంత్రయుక్తమైన అంగన్యాసం, వ్యాపకన్యాసం చెప్పబడింది.

ఇష్ట్వా సంజప్య పంచాశత్సహస్రమభిషిచ్య చ ।
కుండేఽగ్నౌ దైవికే వహ్నౌ చరుం కృత్వా శతం హునేత్॥4॥

ముందు పూజచేసి, యాభైవేలసార్లు జపంచేసి, అభిషేకం కావించి, వైదికవిధానంగా స్థాపించిన అగ్నికుండంలో నూరుసార్లు హోమం చేయాలి. చరువు వండి నూరుసార్లు హోమం చేయాలి.

పృథగ్దధి ఘృతం క్షీరం చరుం సాజ్యం పయః శృతమ్ ॥5॥

ద్వాదశాహుతిమూలేన సహస్రం చాక్షతాంస్తిలాన్ ।
యవం మధుత్రయం పుష్పం ఫలం దధి సమిచ్ఛతమ్ ॥6॥

దధి, ఘృతం, క్షీరం, ఘృతయుక్త చరువు, శృతం, పయస్సులను వేర్వేరుగా మూలమంత్రంతో పండ్రెండు సార్లు హోమం చేసి, అక్షతలు, తిలలు, యవలు వీటితో వేయిసార్లు హోమం చేసి, త్రిమధు పుష్ప ఫల, దధి, సమిధలతో నూరుసార్లు హోమం చేయాలి.

హుత్వా పూర్ణాహుతిం శిష్టం ప్రాశయేత్సఘృతం చరుమ్ ।
సంభోజ్య విప్రానాచార్యం తోషయేత్సిధ్యతే మనుః ॥7॥

పిదప పూర్ణాహుతి చేసి మిగిలిన ఘృతసహితచరువును భక్షించాలి. బ్రాహ్మణులకు భోజనం పెట్టి ఆచార్యుని దక్షిణాదులతో సంతోషింపజేయాలి. ఇలా చేస్తే మంత్రం సిద్ధిస్తుంది.

స్నాత్వా యథావదాచమ్య వాగ్యతో యాగమందిరమ్ ।
గత్వా పద్మాసనం బద్ధ్వా శోషయేద్విధినా వపుః ॥8॥

స్నానం చేసి, ఆచమనం కావించి, మౌనంగా యాగమందిరంలో ప్రవేశించి పద్మాసనంలో కూర్చుండి తాంత్రికవిధానంతో శరీరశోషణం చేయాలి.

రక్షోఘ్నవిఘ్నకృద్దిక్షు న్యసేదాదౌ సుదర్శనమ్ ।
పంచబీజం నాభిమధ్యస్థం ధూమ్రం చండానిలాత్మకమ్ ॥9॥

అశేషకల్మషం దేహాద్విశ్లేషయదనుస్మరేత్ ।
రం బీజం హృదయాబ్జస్థం స్మృత్వా జ్వాలాభిరాదహేత్॥10॥

ముందు రాక్షసులను, విఘ్నాలను కలగజేసే భూతాలను అణచివేయడానికై అన్ని దిక్కులలోను సుదర్శన న్యాసం చేయాలి. ఈ సుదర్శనం పంచక్లేశాలకు బీజం. ధూమ్ర వర్ణయుక్తం. ప్రచండవాయురూపం. నాభి ప్రదేశం లో ఉండి సమస్తపాపాలను శరీరం నుంచి తొలగిస్తుందని భావన చేయాలి. పిదప హృదయపద్మంలో ఉన్న 'రం' బీజాన్ని స్మరిస్తూ జ్వాలల ద్వారా దహింపచేస్తున్నట్లు భావించాలి.

ఊర్ధ్వాధస్తిర్యగాభిస్తు మూర్ధ్ని సంప్లావయేద్వపుః।
ధ్యాత్వాఽమృతైర్బహిశ్చాంతః సుషుమ్నామార్గగామిభిః ॥11॥

పైన, క్రింద, పార్శ్వాలలో వ్యాపించి ఉన్న అగ్నిజ్వాలలచే పాపపుంజాన్ని భస్మం చేయాలి. పిదప శిరస్సు నందు అమృతభావన చేసి సుషుమ్నా నాడీమార్గంలో వచ్చే ఆ అమృతధారలచే తన శరీరాన్ని బయట, లోపల కూడ ఆప్లావితం చేయాలి.

ఏవం శుద్ధవపుః ప్రాణానాయమ్య మనునా త్రిధా ।
విన్యసేన్న్య స్త హస్తాంతః శక్తిం మస్తకవక్త్రయోః ॥12॥

గుహ్యే గలే దిక్షు హృది కుక్షౌ దేహే చ సర్వతః ।
ఆవాహ్య బ్రహ్మరంధ్రేణ హృత్పద్మే సూర్యమండలాత్ ॥13॥

తారేణైవం పలాత్మానం (తారేణ సంపరాత్మానం) స్మరేత్తం సర్వలక్షణమ్ ॥14॥

ఈ విధంగా పవిత్రశరీరుడై మూలమంత్రంతో మూడు ప్రాణాయామాలు చేసి శిరస్సు, ముఖం, గుహ్యం, కంఠం, సకల దిశలు, హృదయం, ఉదరం, సమస్త శరీరావయవాలు - వీటిపై హస్తం ఉంచి శక్తిన్యాసం చేయాలి. సూర్యమండలం నుంచి పరమాత్మను ఆవాహనం చేసి బ్రహ్మరంధ్రం గుండా హృదయకమలానికి తీసుకొని వచ్చి ప్రణవోచ్చారణ చేస్తూ సర్వలక్షణసంపన్నుడైన ఆ పరమాత్మను ధ్యానం చేయాలి.

త్రైలోక్యమోహనాయ విద్మహే స్మరాయ ధీమహి ।
తన్నో విష్ణుః ప్రచోదయాత్ ॥15॥

ఆత్మార్చనాత్క్రతుద్రవ్యం ప్రోక్షయేచ్ఛుద్ధపాత్రకమ్ ।
కృత్వా౽౽త్మపూజాం విధినా స్థండిలే తం సమర్చయేత్ ॥16॥

"త్రైలోక్యమోహనాయ విద్మహే, స్మరాయ ధీమహి, తన్నో విష్ణుః ప్రచోదయాత్" అనేది త్రైలోక్య మోహనగాయత్రీ మంత్రం. ఆత్మార్చనానంతరం యజ్ఞద్రవ్యాలను, శుద్ధములైన పాత్రలను సంప్రోక్షించి ఆత్మపూజచేసి వేదికపై అర్చించాలి.

కూర్మాదికల్పితే పీఠే పద్మస్థం గరుడోపరి ।
సర్వాంగసుందరం ప్రాప్తవయోలావణ్య యౌవనమ్ ॥17॥

మదాఘూర్ణితతామ్రాక్షముదారం స్మరవిహ్వలమ్ ।
దివ్యమాలాంబరాలేపభూషితం సస్మితాననమ్ ॥18॥

విష్ణుం నానావిధానేకపరివారపరిచ్ఛేదమ్ ।
లోకానుగ్రహణం సౌమ్యం సహస్రాదిత్యతేజసమ్ ॥19॥

పంచభాణధరం ప్రాప్తకామైక్షం ద్విచతుర్భుజమ్ ।
దేవీస్త్రీభిర్వృతం దేవీముఖాసక్తేక్షణం జపేత్ ॥20॥

కూర్మం మున్నగువాటితో కల్పింపబడిన పీఠంపై గరుత్మంతునిపై పద్మాసనంలో ఉన్న శ్రీమహావిష్ణువును సర్వాంగసుందరునిగా, వయస్సుకు తగిన లావణ్యం, యౌవనం కలవానిగా, మదాతిరేకంతో తిరుగుతున్న ఎర్రని నేత్రాలు కలవానినిగా, గొప్పవానినిగా (మహోదారునిగా), మన్మథునికే విభ్రాంతి కలగజేసేవానినిగా, దివ్యమాల్యాలు, దివ్యాంబారాలు, దివ్యలేపనాలు, దివ్యాలంకారాలు వీటిచే అలంకృతునిగా చిరునవ్వుతో కూడిన ముఖం కలవానిగా అనేక విధాలైన పరివారాలు, పరికరాలు కలవానిగా, లోకానుగ్రహకారకునిగా, పరమసౌమ్యునిగా, అనంత

సూర్యకాంతితో ప్రకాశించేవానిగా, ఐదుబాణాలు ధరించినవానినిగా, ఆయన సమస్తేంద్రియాలు ప్రాప్తకాములై ఉన్నవానిగా, ఎనిమిది భుజాలు కలవానిగా, చుట్టు దేవతాస్త్రీలు ఉన్నవానిగా, లక్ష్మీదేవిముఖంపై దృష్టి లగ్నమై ఉన్నవానిగా, ఆ భగవంతుని ధ్యానం చేయాలి.

చక్రం శంఖం ధనుః ఖడ్గం గదాం ముసలమంకుశమ్ ।
పాశం చ బిభ్రతం చార్చేదావాహాదివిసర్గతః ॥21॥

ఆయన ఎనిమిది హస్తాలలో చక్రం, శంఖం, శార్‌ఙ్గం, నందకం, కౌమోదకం, ముసలం, అంకుశం, పాశం ఉంటాయి. వాటిని ధరించిన విష్ణువును ఆవాహనాదుల ద్వారా పూజించి ఉద్వాసన చెప్పాలి.

శ్రియం వామోరుజంఘాస్థాం శ్లిష్యంతీం పాణినా పతిమ్ ।
సాబ్జవామకరాం పీనాం శ్రీవత్సకౌస్తుభాన్వితామ్ ॥22॥

మాలినం పీతవస్త్రం చ చక్రాద్యాఢ్యం హరిం యజేత్ ॥23॥

శ్రీమహావిష్ణువు తన వామోరు జంఘలపై (వామభాగంలో) చేతితో తనను ఆలింగనం చేసుకొన్న, ఎడమచేతిలో పద్మం ఉన్న, చక్కని శరీరసౌష్ఠవంతో ఉన్న, శ్రీవత్సకౌత్సుభాలను ధరించి ఉన్న లక్ష్మీదేవితో కూడుకొని వనమాలియై, పీతాంబరుడై, చక్రాద్యాయుధధారియైన శ్రీహరిని పూజించాలి.

"ఓం సుదర్శన మహాచక్రరాజ ధర్మశాంత దుష్టభయంకర ఛ్చిద ఛ్చిద విదారయ విదారయ పరమమంత్రాన్ గ్రస గ్రస భక్షయ భక్షయ భూతాని త్రాసయ త్రాసయ (చ్వాఌ ఌ శ చాఌ ఌ శయ) (నాశయ నాశయ) హ్రూం ఫట్ హ్రూం ఫట్" "ఓం జలచరాయ స్వాహా ఖడ్గ తీక్ష్ణ ఛ్చింద ఛ్చింద ఖడ్గాయ నమః శార్ఙ్గాయ సశరీరాయ హ్రూం ఫట్" ॥24॥

"ఓం సుదర్శనమహాచక్రరాజ" మొదలు "హ్రూంఫట్" వరకు ఉన్నది సుదర్శనమూలమంత్రం. ఈ సుదర్శనమంత్రంతో సుదర్శనాన్ని పూజించాలి. "ఓం జలచరాయ హ్రూంఫట్ స్వాహా పాంచజన్యాయ నమః" అనే మంత్రంతో శంఖ పూజచేయాలి. "ఓం మహా ఖడ్గ తీక్ష్ణ ఛింద ఛింద హ్రూంఫట్ స్వాహా ఖడ్గాయ నమః" అనే మంత్రంతో ఖడ్గ పూజచేయాలి. "ఓం శార్ఙ్గాయ సశరాయ హ్రూం ఫట్ స్వాహా" అనే మంత్రంతో ధనుస్సుకు, బాణానికి పూజచేయాలి.

"ఓం భూతగ్రామాయ విద్మహే చతుర్విధాయ ధీమహి తన్నో బ్రహ్మ ప్రచోదయాత్" ॥25॥

"ఓం భూత గ్రామాయ" మొదలు "ప్రచోదయాత్ " వరకు ఉన్నది భూతగాయత్రీమంత్రం.

"సంవర్తక శ్వసన (ముసల) పోథయ పోథయ హ్రూం ఫట్ స్వాహా, పాశ బంధ బంధ (ధమ ధమ) ఆకర్షయ ఆకర్షయ హ్రూం ఫట్, ఫట్ అంకుశేన కట్ట కట్ట హ్రూం ఫట్)" ॥26॥

"ఓం సంవర్తక శ్వసన (ముసల) పోథయ పోథయ హ్రూం ఫట్ స్వాహా" అనే మంత్రంతో ముసల పూజచేయాలి. "ఓం పాశ బంధ బంధ ఆకర్షయ ఆకర్షయ హ్రూం ఫట్ "అనే మంత్రంతో పాశ పూజచేయాలి. "ఓం అంకుశ కట్ట కట్ట హ్రూం ఫట్" ఈ మంత్రంతో అంకుశ పూజ చేయాలి.

"క్రమాద్భుజేషు మంత్రైః స్వైరేభిరస్త్రాణి పూజయేత్" ॥27॥

భగవంతుని భుజాలలో ఉన్న ఆయుధాలను ఆయా అస్త్రసంబంధమంత్రాలతో క్రమంగా పూజించాలి.

"ఓం పక్షిరాజాయ హ్రూం ఫట్" ॥28॥

"ఓం పక్షిరాజాయ హ్రూం ఫట్" అనే మంత్రంతో పక్షిరాజైన గరుత్మంతుని పూజించాలి.

(తార్క్ష్యం యజేత్) కర్ణికాయామంగదేవాన్యథావిధి ।
శక్తిరింద్రాదియంత్రేషు తార్క్ష్యాద్యా ధృతచామరాః ॥29॥

కర్ణిక యందు యథావిధిగ అంగదేవతలను పూజించాలి. మళ్లీ పూర్వాదిదళాలలో లక్ష్మి మున్నగు శక్తులను, చామరధారులైన తార్క్ష్యాదులను పూజించాలి.

శక్తయోఽంతే ప్రయోజ్యాదౌ సురేశాద్యాశ్చ దండినా ।
పీతే లక్ష్మీసరస్వత్యౌ రతిప్రీతిజయాసితాః ॥30॥

కీర్తికాంత్యౌ సితే శ్యామే తుష్టిపుష్ట్యౌ స్మరోదితే ।
లోకే శాంతం యజేద్దేవం విష్ణుమిష్టార్థసిద్ధయే ॥31॥

ధ్యాయేన్మంత్రం జపిత్వైనం జుహుయాత్త్వభిషేచయేత్ ॥32॥

శక్తిపూజ చివరలో చేయాలి. ముందుగా దండి సహితులైన ఇంద్రాదులను పూజించాలి. లక్ష్మి సరస్వతులు పీతవర్ణం కలవారు. రతి, ప్రీతి, జయలు శ్వేతవర్ణం (సిత) కలవారు. కీర్తి, కాంత, సిత (శ్యామమిశ్రిత) వర్ణం కలవారు. తుష్టి పుష్టి శ్యామవర్ణం కలవారు. వీరిలో స్మర (మన్మథ) భావం ఉంటుంది. బ్రహ్మమొదలు దిక్పాలుర వరకు ఉన్న దేవతలను పూజించి, అభీష్టసిద్ధికోసమై విష్ణువును ఆరాధించాలి. క్రింద చెప్పబడుతున్న మంత్రంతో ధ్యానం, జపం, హోమం, అభిషేకం చేయాలి.

"ఓం శ్రీం క్లీం (క్రీం) హ్రీం హ్రూం త్రైలోక్యమోహనాయ విష్ణవే నమః ॥33॥

ఏతత్పూజాదినా సర్వాన్ కామానాప్నోతి పూర్వవత్ ।
తోయైః సమ్మోహనీపుష్పైర్నిత్యం తేన చ తర్పయేత్ ॥34॥

"ఓం శ్రీం క్లీం హ్రీం హ్రూం త్రైలోక్యమోహనాయ విష్ణవే నమః" అనేది మంత్రం. ఈ విధంగా పూజాదుల చేస్తే సర్వకామనలు సిద్ధిస్తాయి. సమ్మోహనీవృక్షపుష్పాలతో పైమంత్రంతో జలాలతో నిత్యతర్పణం చేయాలి.

బ్రహ్మా సశక్రశ్రీదండీ బీజం త్రైలోక్యమోహనమ్ ।
జప్త్వా త్రిలక్షం హుత్వాఽబ్జైః లక్షం బిల్వైశ్చ సాజ్యకైః (కే) ॥35॥

తండులైః ఫలగంధాద్యైః దూర్వాభిస్త్వాయురాప్నుయాత్ ।
జపాభిషేకహోమాది క్రియాతుష్టో హ్యభీష్టదః ॥36॥

బ్రహ్మ, ఇంద్రుడు, దండి, శ్రీదేవి, బీజమంత్రం, త్రైలోక్యమోహనవిష్ణువులను పూజించి, పై మంత్రాన్ని మూడు లక్షలు జపించి, తరువాత కమల పుష్ప, బిల్వపత్రఘృతాలతో, తండుల ఫలసుగంధాది ద్రవ్యాలతో, దూర్వలతో ఒక లక్ష హోమం చేయాలి. ఇలా చేస్తే దీర్ఘాయుర్దాయం పొందుతాడు. జపం, అభిషేకం, హోమం ఇత్యాదిక్రియలచే విష్ణువు సంతుష్టుడై అభీష్టఫలాలను ఇస్తాడు.

ఓం (హ్రూం) నమో భగవతే వరాహాయ భూర్భువః
స్వః పతయే భూపతిత్వం మే దేహి దాపయ స్వాహా ॥37॥

పంచాంగం నిత్యమయుతం జప్త్వాఽఽయూ రాజ్యమాప్నుయాత్ ॥38॥

"ఓం (హ్రూం) నమో" మొదలు "దాపయ స్వాహా" వరకు వరాహమంత్రం. దీనికి ఐదు అంగాలు ఉంటాయి. అంగన్యాసం చేస్తూ ప్రతిదినం పదివేలు జపం చేసేవాడు ఆయుష్షు, రాజ్యం పొందుతాడు.

ఇత్యాది మహాపురాణే ఆగ్నేయే త్రైలోక్యమోహనమంత్రకథనం నామ సప్తాధికత్రిశతతమోఽధ్యాయః ॥307॥

అగ్నిమహాపురాణంలో త్రైలోక్యమోహనమంత్రకథనం అనే మూడువందల ఏడవ అధ్యాయం సమాప్తం.



అష్టాధికత్రిశతతమోఽధ్యాయః – మూడువందల ఎనిమిదవ అధ్యాయం

లక్ష్మ్యాపూజా వర్ణనమ్ – లక్ష్మీ మున్నగు దేవతల పూజా కథనం

అగ్నిరువాచ – అగ్ని ఇలా పలికాడు.

వక్షః సవహ్నిర్వామాక్షీ దండీ శ్రీః సర్వసిద్ధిదా ।
మహాశ్రియే మహాసిద్ధే మహావిద్యుత్ప్రభే నమః ॥1॥

వక్ష (వాంత) (శ్), వహ్ని(ర్), వామాక్షి (ఈకారం), దండీ (అనుస్వారం) – వీటి యోగం చే 'శ్రీం' బీజం ఏర్పడుతుంది. ఇది శ్రీదేవిమంత్రం. అన్ని సిద్ధులను ఇచ్చేది.

శ్రియే దేవి విజయే నమః గౌరి మహాబలే బంధ బంధ నమః

"హూం మహాకాయే పద్మహస్తే హ్రూం ఫట్ శ్రియై నమః । హ్రూం శ్రియే ఫట్, శ్రియే నమః శ్రియే శ్రీదే నమః స్వాహా శ్రీ ఫట్ " ॥2॥

ఈ విధంగా అంగన్యాస, కరన్యాసాలు చేయాలి. మహాశ్రియే మహాసిద్ధే మహావిద్యుత్ప్రభే స్వాహా హృదయాయ నమః, శ్రియై (యే) దేవివిజయే స్వాహా శిరసే స్వాహా, గౌరి మహాబలే బంధ బంధ స్వాహా, శిఖాయై వషట్, హూం మహాకాయే పద్మహస్తే హూం ఫట్ శ్రియై నమః, హ్రూం శ్రియే ఫట్ శ్రియై నమః, శ్రియే శ్రీదే నమః స్వాహా, శ్రీ ఫట్"

అస్యాంగాని నవోక్తాని తేష్వేకం చ సమాశ్రయేత్ ।
త్రిలక్షమేకలక్షం వా జప్త్వాఽక్షాబ్జైశ్చ భూతిదః ॥3॥

ఈ విధంగా శ్రీమంత్రానికి తొమ్మిది అంగన్యాసాలు చెప్పబడ్డాయి. వీటిలో ఒక దానిని గ్రహించాలి. పద్మాక్షమాలతో ఈ మంత్రాన్ని మూడు లక్షలు గాని, ఒక లక్ష గాని జపిస్తే ఐశ్వర్యం లభిస్తుంది.

శ్రీగేహే విష్ణు గేహే వా శ్రియం పూజ్య ధనం లభేత్ ।
ఆజ్యాక్తైస్తండులై ర్లక్షం జుహుయాత్ఖాదిరానలే ॥4॥

లక్ష్మీదేవి ఆలయంలోకాని, విష్ణుదేవుని ఆలయంలోకాని, శ్రీదేవిని పూజిస్తే ధనం లభిస్తుంది. ఖదిరకాష్ఠంతో ప్రజ్వలిస్తున్న అగ్నిలో ఘృతమిశ్రతండులాలతో ఒక లక్ష హోమం చేయాలి.

రాజా వశ్యో భవేద్వృద్ధిః శ్రీశ్చ స్యాదుత్తరోత్తరమ్ ।
సర్షపాంభోఽ భిషేకేణ నశ్యంతే సకలా గ్రహాః॥5॥

అలా చేస్తే రాజు వశుడై ఉంటాడు. లక్ష్మీ ఉత్తరోత్తరాభివృద్ధిగా కలుగుతుంది. శ్రీమంత్రంతో అభిమంత్రించి సర్షప (ఆవాలు) జలంతో స్నానం చేస్తే గ్రహబాధలన్నీ తొలగిపోతాయి.

బిల్వలక్ష హుతా లక్ష్మీర్విత్తవృద్ధిశ్చ జాయతే ।
శక్రవేశ్మ చతుర్ద్వారం హృదయే చింతయేదథ ॥6॥

బిల్వఫలాలతో లక్షసార్లు హెూమం చేస్తే లక్ష్మి లభిస్తుంది. విత్తవృద్ధి చేకూరుతుంది. నాలుగు ద్వారాలు కల్గిన శక్రయంత్రాన్ని హృదయంలో భావన చేయాలి.

బలాకీం వామనాం శ్యామాం శ్వేతపంకజధారిణీమ్ ।
ఊర్ధ్వబాహుద్వయం ధ్యాయేత్క్రీడంతీం ద్వారి పూర్వవత్ ॥7॥

రెండు భుజాలు పైకెత్తి, శ్వేతపద్మాన్ని ధరించి, శ్యామవర్ణంతో క్రీడిస్తున్న వామనాకృతి గల బలాకిని తూర్పుద్వారంలో ధ్యానం చేయాలి.

ఊర్ధ్వీకృతేన హస్తేన రక్తపంకజధారిణీమ్ ।
శ్వేతాంగీం దక్షిణే ద్వారి చింతయేద్వనమాలినీమ్ ॥8॥

దక్షిణద్వారంలో పైకెత్తి ఉన్న హస్తంతో రక్తకమలాన్ని ధరించి శ్వేతశరీర అయిన వనమాలినిని ధ్యానించాలి.

హరితాం దోర్ద్వయేనో ర్ధ్వ ముద్వహంతీం సితాంబుజమ్ ।
ధ్యాయే ద్విభీషికాం నామ శ్రీదూతీం ద్వారి పశ్చిమే ॥9॥

పశ్చిమద్వారంలో పైకెత్తి ఉన్న రెండు చేతులలో శ్వేతపద్మాలని ధరించి, హరితవర్ణం కలిగిన, విభీషిక అనే పేరు కల్గిన శ్రీదూతిని ధ్యానించాలి.

శాంకరీముత్తరే ద్వారి మధ్యేఽ ష్టదలపంకజమ్ ।
వాసుదేవః సంకర్షణః ప్రద్యుమ్నశ్చానిరుద్ధకః ॥10॥

ధ్యేయాస్తే పద్మపత్రేషు శంఖచక్రగదాధరాః ।
అంజనక్షీరకాశ్మీర హేమాభాస్తే సువాససః ॥11॥

ఉత్తరద్వారంలో శాంకరిని ధ్యానించాలి. శక్రయంత్రమధ్యలో అష్టదళపద్మాన్ని నిర్మించాలి. దాని దళాలలో శంఖం, చక్రం, గద, (పద్మం) ధరించిన వాసుదేవ, సంకర్షణ, ప్రద్యుమ్న, అనిరుద్ధ మూర్తులను ధ్యానించాలి. వారి శరీరకాంతి వరుసగా నీలం, తెలుపు, ఎరుపు, పచ్చగా ఉంటుంది. వీరు సుందరవస్త్రాలు ధరించి ఉంటారు.

ఆగ్నేయాదిషు పత్రేషు గుగ్గులుశ్చ కురంటకః ।
దమకః సలిలం చేతి హస్తినో రజతప్రభాః ॥12॥

ఆగ్నేయాది దళాలలో గుగ్గులు, కురంటక, దమక, సలిలులు అనే రజతకాంతి కల్గిన దిగ్గజాలను భావన చేయాలి.

హేమకుంభధరాశ్చైతే కర్ణికాయాం శ్రియం స్మరేత్।
చతుర్భుజాం సువర్ణాభాం సపద్మోర్ధ్వభుజద్వయామ్ ॥13॥

దక్షిణాభయహస్తాభ్యాం వామహస్తవరప్రదామ్ ।
శ్వేత గంధాంశుకామేకరౌప్య మాలాస్త్రధారిణీమ్ ॥14॥

ఈ దిగ్గజాలు స్వర్ణకలశాలను ధరించి ఉంటాయి. కమలకర్ణికాభాగంలో శ్రీదేవిని స్మరించాలి. ఆమె నాలుగు చేతులతో ఉంటుంది. ఆమె శరీరం సువర్ణకాంతితో ఉంటుంది. పైకెత్తిన రెండు చేతులలో పద్మాలను, దక్షిణహస్తంలో అభయముద్ర, వామహస్తంలో వరదముద్ర ధరించి ఉంటుంది. స్వచ్ఛములైన చక్కని పరిమళాలు వెదజల్లే వస్త్రాలను, కంఠంలో తెల్లని మాలను ధరించి ఉంటుంది.

ధ్యాత్వా సపరివారాం తామభ్యర్చ్య సకలం లభేత్ ।
ద్రోణాబ్జపుష్పం శ్రీవృక్షపర్ణం మూర్ధ్ని న ధారయేత్ ॥15॥

అటువంటి శ్రీదేవిని ధ్యానించి సపరివారంగా ఆమెను పూజించేవాడు సకల ఫలితాలను పొందుతాడు. పూజాసమయంలో ద్రోణపుష్పాన్ని (తుమ్మి), అబ్జపుష్పాన్ని (తామరపూవును), బిల్వపత్రాన్ని (మారేడు) శిరస్సున ధరించరాదు.

లవణామలకం వర్జ్యం నాగాదిత్యతిథౌ క్రమాత్ ।
పాయసాశీ జపేత్సూక్తం శ్రియస్తేనాభిషేచయేత్ ॥16॥

పంచమి తిథి యందు లవణాన్ని, సప్తమి తిథియందు ఆమలకాన్ని (ఉసిరి) విడిచి పెట్టాలి. పాయసాన్నాన్ని మాత్రమే భుజిస్తూ శ్రీసూక్తం జపించి, ఆసూక్తంతోనే శ్రీదేవికి అభిషేకం చేయాలి.

ఆవాహాదివిసర్గాంతాం మూర్ధ్ని ధ్యాత్వాఽర్చయేచ్ఛ్రియమ్ ।
బిల్వాజ్యాబ్జైః పాయసేన పృథగ్యోగః శ్రియే భవేత్ ॥17॥

హి మజ్జా విషం మహిష కాలాగ్ని రత్రిరి ద్వయమ్ ॥18॥
(విషం న హంతి కాలగ్నిరద్రి జ్యోతిరితి ద్వయమ్॥ (పాఠాంతరం))

ఆవాహనం మొదలు ఉద్వాసన వరకు అన్ని ఉపచారాలను శ్రీసూక్తబుక్కులతో చేసి ధ్యానపూర్వకంగా శ్రీదేవిని సహస్రారంలో ధ్యానించాలి. బిల్వం, ఆజ్యం, పద్మం, పాయసం కలిపి కాని, వేర్వేరుగా కాని హోమం చేయవచ్చు. ఈ హోమం లక్ష్మీప్రాప్తికి చాలా మంచిది.

ఇక మహిషమర్దిని యొక్క అష్టాక్షరీమంత్రం వివరించడం జరుగుతోంది. విషం(మ), హి, మజ్జా(ష), కాల(మ), అగ్ని(ర), అత్రి(ద), ఇ, ని, స్వాహా, ఇవన్నీ కలిపితే “ఓం హ్రీం మహిషమర్దిని స్వాహా” అనే మూలమంత్రం అవుతుంది. (ఇదే మహాలక్ష్మీ మంత్రం).

“ఓం హ్రీం మహామహిషమర్దిని ఠం ఠః మూలమంత్రం మహిషహింసికే నమః, మహిషశత్రుం భ్రామయ, భ్రామయ. ఓం హ్రూం ఫట్ ఠ ఠ మహిషం హేషయ హేషయ, ఓం హ్రూం మహిషం హ్రేషయ హ్రేషయ, హ్రూం మహిషం హన హన దేవి హ్రూం మహిషనిషూదని ఫట్ ।

దుర్గాహృదయమిత్యుక్తం సాంగం సర్వార్థసాధకమ్ ।
యజేద్యథోక్తాం తాం దేవీం పీఠే చైవాంగమధ్యగామ్ ॥19,20॥

దీని పంచాంగన్యాసం ఈ విధంగా ఉంటుంది. "ఓం హ్రీం మహిషమర్దిని హ్రూం ఫట్ హృదయాయ నమః, మహిషశత్రూత్సాదిని హ్రూం ఫట్ శిరసే స్వాహా, మహిషశత్రుం భ్రామయ భ్రామయ ఓం హ్రూం ఫట్ శిఖాయై వషట్, మహిషం హేషయ హేషయ హ్రూం ఫట్ నేత్రత్రయాయ వౌషట్, మహిషం ప్రేషయ ప్రేషయ హ్రూం ఫట్ కవచాయ హుం, మహిషం హన హన దేవి హ్రూం మహిషనిషూదని ఫట్ – అస్త్రాయ ఫట్" ఇది అంగసహితమైన దుర్గాహృదయం. ఇది సర్వార్థసాధకం అవుతుంది. పీఠంపై అష్టదళపద్మంపై సమస్త పరిచారమధ్యలో దుర్గాదేవిని ఈ క్రింది విధంగా పూజించాలి.

"ఓం హ్రీం దుర్గే దుర్గే రక్షణి స్వాహా చేతి దుర్గాయై నమః,
వరవర్ణ్యై నమః ఆర్యాయై కనకప్రభాయై కృత్తికాయై అభయప్రదాయై కన్యకాయై స్వరూపాయై" (సురూపాయై)॥21॥

"ఓం హ్రీం దుర్గే దుర్గే రక్షణి స్వాహా" అనేది దుర్గామంత్రం. అష్టదళపద్మంపై దుర్గ, వరవర్ణిని, ఆర్య, కనకప్రభ, కృత్తిక, అభయప్రద, కన్యక, స్వరూప" అనే శక్తుల ఆద్యక్షరాలకు బిందువు చేర్చి, ఆ బీజమంత్రాలతో నామమంత్రాలతో పూజించాలి. " ఓం దుం దుర్గాయై నమః" ఈ విధంగానే మిగిలిన మంత్రాలు ఉంటాయి.

పత్రస్థాః పూజయేదేతా మూర్తీరాద్యైః స్వరైః క్రమాత్ ॥22॥

చక్రాయ శంఖాయ గదాయై ఖడ్గాయ ధనుషే బాణాయ ॥23॥

అష్టదళపద్మం పైదళాలలో వరుసగా ఈ మూర్తులను పూజించాలి. వీటితో బాటు చక్రం, శంఖం, గద, ఖడ్గం, బాణం, ధనుస్సు, అంకుశం, ఖేటం అనే అస్త్రాలను కూడ అర్చించాలి.

అష్టమ్యాద్యైరిమాం దుర్గాం లోకేశాం తాం యజేదితి ।
దుర్గాయోగః సమాయుః శ్రీస్వామిరక్తాజపాదికృత్ ॥24॥

అష్టమి మున్నగు తిథులందు లోకేశ్వరి అయిన దుర్గను పూజించాలి. ఈ దుర్గోపాసన పూర్ణాయుష్షును, లక్ష్మిని, ఆమె భర్తఅయిన విష్ణువుపై అనురక్తిని, యుద్ధమునందు విజయాన్ని ఇస్తుంది.

సుసాధ్యేశానమంత్రేణ తిలహోమో వశీకరః ।
జయః పద్మైస్తు దుర్వాభిః శాంతికామః పలాశజైః ॥25॥

పుష్టిః స్యాత్ కాకపక్షేణ మృతిర్ద్వేషాదికం భవేత్ ।
గ్రహక్షుద్ర భయాపత్తిం సర్వమేవ మనుర్హరేత్ ॥26॥

ఎవరినైనా వశం చేసుకోవాలనుకొంటే వాని పేరును చేర్చి ఈ మంత్రంతో తిలహోమం చేస్తే వాడు వశమౌతాడు. పద్మాలతో హోమం చేస్తే జయం లభిస్తుంది. శాంతిని కోరేవాడు దూర్వాలతో హోమం చేయాలి.

పలాశసమిధలతో హోమం చేస్తే పుష్టి కలుగుతుంది. కాకి రెక్కలతో హోమం చేస్తే మారణ, విద్వేషణకర్మలు సిద్ధిస్తాయి. ఈ మంత్రం సకల గ్రహ,క్షుద్ర, భయాలను, ఆపదలను నశింపజేస్తుంది.

"ఓం దుర్గే దుర్గే రక్షణి స్వాహా " ॥27॥

రక్షాకరీయముదితా జయదుర్గాంగసంయుతా ।
శ్యామాం త్రిలోచనాం దేవీం ధ్యాత్వా ఽ ఽ త్మానం చతుర్భుజామ్ ॥28॥

"ఓం దుర్గే దుర్గే రక్షణి స్వాహా " ఇది అంగసహితమైన రక్షను ఇచ్చే జయదుర్గామంత్రం. శ్యామాంగి, త్రిలోచన, చతుర్భుజ అయిన దేవిని నేనే అని ధ్యానం చేయాలి.

శంఖ చక్రాబ్జ శూలాసి త్రిశూలాం రౌద్రరూపిణీమ్ ।
యుద్ధాదౌ సంజయేదేతాం యజేత్ఖడ్గాదికే జయే ॥29॥

శంఖం, చక్రం, పద్మం, శూలం, ఖడ్గం, త్రిశూలం ధరించిన రౌద్రరూపిణి అయిన రణచండిని నేనే అని ధ్యానం చేయాలి. యుద్ధప్రారంభంలో ఈ దుర్గామంత్రాన్ని జపించాలి. ఖడ్గాదులపై దుర్గాపూజను చేస్తే విజయం లభిస్తుంది.

"ఓం నమో భగవతి జ్వాలామాలిని గృధ్రగణపరివృతే చ రక్షణి స్వాహా ॥30॥

యుద్ధార్థే చ జపేన్మంత్రం శత్రూన్జ(ం)యతి యోధకః ॥31॥

యుద్ధం కోసం "ఓం నమో భగవతి జ్వాలామాలిని । గృధ్రగణపరివృతే చరాచర రక్షణి స్వాహా" అనే మంత్రాన్ని జపించాలి. ఆ యోధుడు శత్రువులను జయిస్తాడు.

ఇత్యాది మహాపురాణే ఆగ్నేయే లక్ష్మ్యాదిపూజావర్ణనం నామ అష్టాధికత్రిశతతమోఽ ధ్యాయః ॥308॥

అగ్నిమహాపురాణంలో లక్ష్మీ మున్నగు దేవతల పూజా కథనం అనే మూడువందల ఎనిమిదవ అధ్యాయం సమాప్తం.



నవాధికత్రిశతతమోஉధ్యాయః – మూడువందల తొమ్మిదవ అధ్యాయం

త్వరితాపూజావిధికథనమ్ – త్వరితాపూజావిధికథనం

అగ్నిరువాచ – అగ్ని ఇలా చెబుతున్నాడు.

త్వరితాజ్ఞానమాఖ్యాస్యే భుక్తిముక్తిప్రదాయకమ్ ॥1॥

భుక్తిని, ముక్తిని పూర్తిగా ఇచ్చే త్వరితావిద్యకు సంబంధించిన జ్ఞానాన్ని వివరిస్తున్నాను.

ఓం ఆధారశక్త్యై నమః । ఓం (హ్రీం) హ్రాం పురు పురు మహాసింహాయ నమః, ఓం పద్మాయ నమః । (ఓం హ్రీం హ్రూం ఖే చ ఛ్చే క్షః స్త్రీం ఓం హ్రూం క్షేం హ్రీం ఫట్ త్వరితాయై నమః । ఖే చ హృదయాయ నమః । చ ఛ్చే శిరసే నమః ఛే క్షః శిఖాయై నమః । క్షః స్త్రీం కవచాయ నమః) స్త్రీం హ్రూ నేత్రాయ నమః । హ్రూం క్షేం అస్త్రాయ ఫట్ నమః ॥2॥

"ఓం ఆధారశక్త్యై నమః" అనే మంత్రంతో ఆధారపీఠధ్యానం, వందనం చేయాలి. తరువాత " ఓం హ్రీం హ్రాం పురు పురు మహాసింహాయ నమః" అనే మంత్రం ద్వారా ఆసనస్వరూపమైన కమలానికి "ఓం పద్మాయ నమః" అనే మంత్రంతో పూజ చేయాలి. తరువాత మూలమంత్రాన్ని ఉచ్చరిస్తూ త్వరితాదేవి పూజ చేయాలి.

"ఓం హ్రీం హ్రూం ఖే చ ఛే క్షః స్త్రీం ఓం హ్రూం క్షేం హ్రీం ఫట్ త్వరితాయై నమః" అనే మూలమంత్రం ద్వారా అంగన్యాసం చేయాలి. "ఖే చ హృదయాయ నమః, చ ఛ్చే శిరసే నమః (శిరసే స్వాహా), ఛే క్షః శిఖాయై నమః (శిఖాయై వషట్), క్షః స్త్రీం కవచాయ నమః (కవచాయ హుం) స్త్రీం హ్రూం నేత్రాయ నమః (నేత్రత్రయాయ వౌషట్) హ్రూం క్షేం అస్త్రాయ ఫట్ నమః (అస్త్రాయ ఫట్) అని న్యాసం చేయాలి.

"ఓం త్వరితావిద్యాం విద్మహే తూర్ణవిద్యాం చ ధీమహి తన్నో దేవీ ప్రచోదయాత్" ॥3॥

"ఓం త్వరితవిద్యాం విద్మహే, తూర్ణవిద్యాం చ ధీమహి, తన్నో దేవీ ప్రచోదయాత్" ఇది త్వరితావిద్యాగాయత్రీ మంత్రం.

"శ్రీ ప్రణీతాయై నమః, హ్రూం వామాయై(కారాయై) నమః, ఓంకారాయై నమః, ఓం ఖే చ హృదయాయ నమః । ఖేచర్యై నమః, చండాయై నమః, క్ష స్త్రీం కవచాయ నమః, ఛేదన్యై నమః, క్షేపణ్యై నమః, స్త్రియై హుంకార్యై నమః, క్షేమంకర్యై జయాయై విజయాయై కింకరాయ రక్ష । ఓం త్వరితాజ్ఞయా స్థిరో భవ వషట్ " ॥4॥

తరువాత పీఠంపైన కమలకర్ణికయొక్క కేసరాలలో ఈ క్రింది అంగదేవతలను పూజించాలి. "శ్రీప్రణీతాయై నమః" మొదలు "క్షేమంకర్యై నమః" వరకు మంత్రాలతో అన్ని కోణాల యందు అంగదేవతలను అర్చించాలి.

తోతలా త్వరితా తూర్ణేత్యేవం విద్యేయమీరితా ।
శిరోభ్రూమస్తకే కంఠే హృది నాభౌ చ గుహ్యకే ॥5॥

ఊర్వోశ్చ జానుజంఘోరుద్వయే చరణయోః క్రమాత్ ।
న్యస్తాంగో న్యస్తమంత్రస్తు సమస్తం వ్యాపకం న్యసేత్ ॥6॥

త్వరితావిద్య తోతల, త్వరిత, తూర్ణ అని మూడు విధాలుగా ఉంటుంది. దీని అక్షరాలను శిరస్సు, భ్రూస్థానం, లలాటం, కంఠం, హృదయం, నాభి, గుహ్యం, ఊరువులు, జానువులు, జంఘలు, చరణాలు వీటి యందు మంత్రాలతో న్యాసం చేసి సమస్తవిద్యతో వ్యాపకన్యాసం చేయాలి.

పార్వతీ శబరీ చేశా వరదాభయహస్తికా ।
మయూరవలయా పిచ్ఛమౌలిః కిసలయాంశుకా ॥7॥

సింహాసనస్థా మయూరబర్హచ్ఛత్రసమన్వితా ।
త్రినేత్రా శ్యామలా దేవీ వనమాలావిభూషణా ॥8॥

త్వరితాదేవి సాక్షాత్తు పర్వతరాజనందినియైన పార్వతీదేవి స్వరూపురాలు. శబరవేషధారిణి యైన కారణాన 'శబరి' అని పిలవబడింది. సమస్తాన్ని శాసించేది కావున " ఈశ" అని చెప్పబడింది. వరదముద్ర, అభయముద్ర ధరించిన హస్తాలతో, నెమలివెంద్రుకలతో చుట్టబడిన పింఛాన్ని శిరస్సుపై ధరించి, పుష్ప కిసలయకాంతితో కూడిన వస్త్రాలతో, సింహాసనంపై అధిష్ఠించియున్న, నెమలి వెంద్రుకలతో చేసిన ఛత్రంతో కూడుకొన్న, మూడు నేత్రాలు కల్గిన, శ్యామలవర్ణం కల, వనమాలను ధరించినది.

విప్రాహికర్ణాభరణా క్షత్రకేయూరభూషణా ।
వైశ్యనాగకటీబంధా వృషాహికృతనూపురా ॥9॥

ఏవం రూపాత్మికా భూత్వా తన్మంత్రం నియుతం జపేత్ ।

ఈమె బ్రాహ్మణజాతి ధరించే (అనంతనాగ, కులిక, నాగాకార) కుండలాలను, క్షత్రియజాతి ధరించే (వాసుకినాగ, శంఖపాల, నాగాకార) కేయూరాలను, వైశ్యజాతి ధరించే (తక్షకనాగ, మహాపద్మనాగాకార) కటిబంధాభరణాలను వృషలజాతి ధరించే (పద్మనాగ, కర్కోటక, నాగాకార) నూపురాలను ధరించియున్నది. అటువంటి దేవీ స్వరూపాన్ని ధ్యానం చేస్తూ త్వరితామంత్రాన్ని లక్షజపం చేయాలి.

ఈశః కిరాతరూపోఽభూత్పురా గౌరీ చ తాదృశీ ॥10॥

జపేద్ధ్యాయేత్ పూజయేత్తాం సర్వసిద్ధ్యై విషాదిహృత్ ।

ఈశ్వరుడు కిరాతరూపుడైన సమయంలో గౌరి ఆ రూపాన్ని ధరించింది. ఈ దేవిని జపించి, ధ్యానం చేసి, పూజిస్తే సర్వసిద్ధులు చేకూరుతాయి. విషాదులు తొలగిపోతాయి.

అష్టసింహాసనే పూజ్యా దలే పూర్వాదికే క్రమాత్ ॥11॥

పూర్వాది (తూర్పు మొదలుకొని) దళాలలోని, కర్ణికలోని ఎనిమిది సింహాసనాలపై ఈ దేవతలను క్రమంగా పూజించాలి.

అంగగాయత్రీ ప్రణీతా హూంకారాద్యా దలాగ్రకే ।
ఫట్‌కారీ చాగ్రతో దేవ్యాః శ్రీబీజేనార్చయేదిమాః ॥12॥

హృదయాది అంగషట్కంతో ప్రణీతను, గాయత్రిని పూజించాలి. పూర్వాది దళాలలో హుంకారి మున్నగు దేవతలను పూజించాలి. దళాగ్రభాగంలో త్వరితాదేవి అగ్రభాగంలో ఫట్కారిని పూజించాలి. వీరినందరిని శ్రీబీజంతో పూజించాలి.

లోకేశాయుధవర్ణాస్తాః ఫట్‌కారీ తు ధనుర్ధరా ।
జయా చ విజయా ద్వాః స్థే పూజ్యే సౌవర్ణయష్టికే ॥13॥

హూంకారి మున్నగువారి ఆయుధవర్ణాలు ఆయా దిక్కుల ఆయుధ వర్ణాదులతో (దిక్పాలకులతో) సమానాలు. ఫట్కారి మాత్రం ధనుర్బాణాలు ధరించి ఉంటుంది. మండపద్వారంలో సువర్ణయష్టి(దండం) ధరించి ఉన్న జయను, విజయను పూజించాలి.

కింకరా బర్బరీ ముండీ లగుడీ చ తయో ర్బహిః ।
ఇష్ట్వైవం సిద్ధయే ద్రవ్యైః కుండే యోన్యాకృతౌ హునేత్ ॥14॥

వారికి బయట బర్బరి అనే కింకరిని పూజించాలి. ఆమె ముండితమస్తకయై (బోడితలయై) ఉంటుంది. ఆమె కఱ్ఱ ధరించి ఉంటుంది. ఆమె స్థానం జయవిజయుల బాహ్యాభాగం. ఈ విధంగా పూజకావించి సిద్ధికోసమై హోమద్రవ్యాలతో యోన్యాకృతిలో ఉండే హోమకుండంలో హోమం చేయాలి.

హేమలాభోఽ ర్జునైర్ధాన్యైః గోధూమైః పుష్టిసంపదః ।
యవైర్ధాన్యైస్తిలైః సర్వసిద్ధిరీతివినాశనమ్ ॥15॥

తెల్లని ధాన్యంతో హోమం చేస్తే సువర్ణలాభం, గోధుమలతో హోమం చేస్తే పుష్టి సంపదలు, యవధాన్యంతోను, తిలలతోను హోమం చేస్తే సర్వసిద్ధి లభిస్తుంది. ఈతిబాధలు తొలగిపోతాయి.

(**విశేషం:** ఈతిబాధలు

అతివృష్టిరనావృష్టిః మూషికాశ్శలభాశ్శుకాః ।
అత్యాసన్నాశ్చ రాజానః షడేతే ఈతయః స్మృతాః ॥)

అక్షైరున్మత్తతా శత్రోః శాల్మలీభిశ్చ మారణమ్ ।
జంబూభిర్ధనధాన్యాప్తి స్తుష్టిర్నీలోత్పలైరపి ॥16॥

అక్షములతో(పాచికలు) హోమం చేస్తే శత్రువుకు ఉన్మాదం, శాల్మలీ బీజాలతో (బూరుగు) హోమం చేస్తే శత్రునాశనం, జంబూఫలాలతో హోమం చేస్తే ధనధాన్య ప్రాప్తి, నల్లకలువలతో హోమం చేస్తే తుష్టి కలుగుతుంది.

రక్తోత్పలైర్మహాపుష్టిః కుందపుష్పైర్మహోదయః ।
మల్లికాభిః పురక్షోభః కుముదైర్జనవల్లభః ॥17॥

ఎఱ్రకలువలతో హోమం చేస్తే మహాపుష్టి, కుందపుష్పాలతో చేస్తే అభ్యుదయం, మల్లికాపుష్పాలతో చేస్తే నగరంలో క్షోభ, తెల్లకలువలతో చేస్తే జనప్రియత్వం చేకూరుతుంది.

(**విశేషం:** పురక్షోభః అనే దానిని "పూరక్షోభః" అని మారిస్తే "పూః+అక్షోభః" అని విడదీస్తే పురానికి ఏ క్షోభ ఉండదనే భావం వస్తుంది. ఇది సమంజసమనిపిస్తోంది.)

అశోకైః పుత్రలాభః స్యాత్పాటలాభిః శుభాంగనా ।
ఆమ్రై రాయుస్తిలైర్లక్ష్మీ ర్బిల్వైః శ్రీశ్చంపకైర్ధనమ్ ॥18॥

అశోకపుష్పాలతో చేస్తే పుత్రప్రాప్తి, పాటలపుష్పాలతో చేస్తే ఉత్తమాంగనా ప్రాప్తి, ఆమ్రఫలాలతో చేస్తే ఆయుర్దాయం, తిలలతో చేస్తే లక్ష్మి, బిల్వాలతో చేస్తే ఐశ్వర్యం, చంపకాలతో చేస్తే ధనం కలుగుతుంది.

ఇష్టం మధుకపుష్పైశ్చ బిల్వైః సర్వజ్ఞతాం లభేత్ ।
త్రిలక్షజప్యాత్సర్వాప్తి ర్హోమాద్ధ్యానాత్తథేజ్యయా ॥19॥

మధుకపుష్పాలతో చేస్తే అభీష్టం నెరవేరుతుంది. బిల్వఫలాలతో చేస్తే సర్వజ్ఞత్వం సిద్ధిస్తుంది. త్వరితా మంత్రం మూడు లక్షలు జపం, హోమం, ధ్యానం, పూజచేస్తే అభిలషితఫలం లభిస్తుంది.

మండలేఽభ్యర్చ్య గాయత్ర్యా ఆహూతీః పంచవింశతిమ్ ।
దద్యాచ్ఛతత్రయం మూలాత్పల్లవై ర్దీక్షితో భవేత్॥
పంచగవ్యం పురా పీత్వా చరుకం ప్రాశయేత్సదా ॥20॥

మండలంపై త్వరితాదేవిని అర్చించి త్వరితాగాయత్రితో ఇరవై ఐదు హోమాలు ఈయాలి. తరువాత మూలమంత్రంతో పల్లవాలతో మూడువందల సారులు హోమం చేసి దీక్షాగ్రహణం చేయాలి. దీక్షకు పూర్వం పంచగవ్యప్రాశనం చేయాలి. దీక్షాసమయంలో చరువు మాత్రమే భుజించాలి.

ఇత్యాది మహాపురాణే ఆగ్నేయే త్వరితాపూజావిధికథనమ్ నామ నవాధికత్రిశతతమోఽధ్యాయః ॥309॥

అగ్నిమహాపురాణంలో త్వరితాపూజా విధి కథనం అనే మూడువందల తొమ్మిదవ అధ్యాయం సమాప్తం.



దశాధికత్రిశతతమోఽధ్యాయః – మూడువందల పదవ అధ్యాయం

త్వరితామంత్రాది కథనమ్ – త్వరితామంత్రాదుల కథనం

అగ్నిరువాచ – అగ్ని ఇలా చెబుతున్నాడు.

అపరాం త్వరితావిద్యాం వక్ష్యేఽహం భుక్తిముక్తిదామ్ ।
పురే వజ్రాకులే దేవీం రజోభిర్లిఖితే యజేత్ ॥1॥

నేను భుక్తిని, ముక్తిని ఇచ్చే మరో త్వరితావిద్యను (నీకు) చెబుతున్నాను. ధూళిచే నిర్మించబడిన, వజ్ర చిహ్నంచే ఆవరించబడిన భూపురమండలంలో త్వరితాదేవిని (లిఖించి) పూజించాలి.

పద్మగర్భే దిగ్విదిక్షు చాష్టౌ వజ్రాణి వీథికామ్ ।
ద్వారశోభోపశోభాం చ లిఖేచ్ఛీఘ్రం స్మరేన్నరః ॥2॥

ఆ మండలంలో యోగపీఠంపై కమలాన్ని నిర్మించి, మండలం యొక్క పూర్వాది దిక్కులందు, విదిక్కులందు ఎనిమిది వజ్రచిహ్నాలను, మండలం లోపల శోభను, ఉపశోభను రచించాలి. దానిలోపల సాధకుడు త్వరితాదేవిని భావన చేయాలి.

అష్టాదశభుజాం సింహే వామజంఘా ప్రతిష్ఠితా ।
దక్షిణా ద్విగుణా తస్యాః పాదపీఠే సమీప్సితా ॥3॥

ఆమెకు పద్దెనిమిది (పదునెనిమిది) భుజాలు ఉంటాయి. ఎడమకాలు సింహం వీపుపై, కుడికాలు దానికి రెట్టింపు ప్రమాణంతో పాదపీఠంపైన ఉంచి ఆమె ప్రకాశిస్తుంది.

నాగభూషాం వజ్రదండే ఖడ్గం చక్రం గదాం క్రమాత్।
శూలం శరం తథా శక్తిం వరదం దక్షిణైః కరైః ॥4॥

ధనుః పాశం శరం ఘంటాం తర్జనీం శంఖమంకుశమ్ ।
అభయం చ తథా వజ్రం వామపార్శ్వే ధృతాయుధమ్ ॥5॥

ఆమె నాగమణిమయాలంకారాలతో అలంకరించబడి ఉంటుంది. కుడివైపునున్న హస్తాలలో క్రమంగా వజ్రం, దండం, ఖడ్గం, చక్రం, గద, శూలం, బాణం, శక్తి, వరదముద్ర ధరించి ఉంటుంది. ఎడమ వైపునున్న చేతులలో ధనువు, పాశం, శరం, ఘంట, తర్జని, శంఖం, అంకుశం, వజ్రాయుధం, అభయముద్ర ధరించి ఉంటుంది.

పూజనాచ్ఛత్రునాశః స్యాద్రాష్ట్రం జయతి లీలయా ।
దీర్ఘాయూ రాష్ట్రభూతిః స్యాద్దివ్యదివ్రాది సిద్ధిభాక్ ॥6॥

ఆ దేవిని పూజించడం వల్ల శత్రువులు నశిస్తారు. అవలీలగా రాష్ట్రాన్ని జయించగలుగుతాడు. దీర్ఘాయువై జీవిస్తాడు. రాష్ట్రైశ్వర్యాన్ని పొందుతాడు. దివ్యసిద్ధులను, అదివ్య (మానవ) సిద్ధులను కూడ పొందుతాడు. (దివ్యములు, లౌకికములు పొందుతాడు)

తలేతి సప్తపాతాలాః కాలాగ్నిభువనాంతకాః ।
ఓంకారాదీశ్వరారభ్య యావద్బ్రహ్మాండవాచకమ్ ॥7॥

(ఓం) తకారాద్భ్రామయేత్తోయం తోతలా త్వరితా తతః ।
ప్రస్తావం సంప్రవక్ష్యామి స్వరవర్గం లిఖేద్భువి ॥8॥

త్వరిత "తోతలత్వరిత" అని కూడ చెప్పబడుతుంది. తల శబ్దంచే సప్తపాతాళాలు, కాలం, అగ్ని, సంపూర్ణ భువనం గ్రహించాలి. ఓంకారంచే పరమేశ్వరుని మొదలు యావద్బ్రహ్మాండం గ్రహించాలి. ఈ మంత్రం యొక్క ఆద్యక్షరం త (ఓం) కారం చే దేవి (తల) పర్యంతం తోయం వరకు పరిభ్రమిస్తుందని గ్రహించాలి. అందువల్ల ఆమె "తోతలా త్వరితా"గా వ్యవహరించబడుతుంది. ఇక మీద త్వరితామంత్ర ప్రస్తారాన్ని చెబుతాను. అనగా మంత్రోద్ధారం చెబుతాను. భూతలంపై స్వరవర్గం లిఖించాలి. (స్వరవర్గంలో 16 అచ్చులు, సమస్తవ్యంజన (హల్లులు) వర్ణాలు ఉంటాయి)

తాలువర్గః కవర్గః స్యాత్తృతీయో జిహ్వాతాలుకః ।
చతుర్థస్తాలుజిహ్వాగ్రో జిహ్వాదంతస్తు పంచమః ॥9॥

షష్ఠోష్ఠపుటసంపన్నో మిశ్రవర్గస్తు సప్తమః ।
ఊష్మాణః స్యాచ్ఛవర్గస్తు ఉద్ధరేచ్చ మనుం తతః॥10॥

కవర్గ యొక్క సాంకేతికనామం తాలు వర్గం. స్వరవర్గం మొదటిది. రెండోది తాలువర్గం, మూడోది జిహ్వాతాలుకవర్గం (ఇందు చ వర్గ సంయోజితం), నాలుగోది తాలుజిహ్వాగ్రవర్గం (ఇందు ట వర్గ సంయోజితం), ఐదోది జిహ్వాదంతకవర్గం,(ఇందు త వర్గ సంయోజితం), ఆరోది ఓష్ఠపుట సంపన్నం, (ఇందు ప వర్గ సంయోజితం), ఏడోది మిశ్రవర్గం (ఇందు య, ర, ల, వ, సంయోజితం), ఎనిమిదోది ఊష్మవర్గం లేదా శవర్గం(శ,ష,స,హ) ఈ వర్గాల అక్షరాల నుంచి మంత్రోద్ధారం చేయాలి.

షష్ఠస్వరసమారూఢ మూష్మణోంతం సబిందుకమ్ ।
తాలువర్గం ద్వితీయం తు స్వరైకాదశయోజితమ్ ॥11॥

ఆరో స్వరమైన "ఊ" కారంపై ఊష్మవర్గలోని చివరి అక్షరమైన 'హ'కారం బిందు సంయుక్తం చేయాలి. (హూం) తాలువర్గ ద్వితీయాక్షరమైన 'ఖ' కారాన్ని పదకొండో స్వరమైన 'ఏ' కారంతో సంయుక్తం చేయాలి. ('ఖే')

జిహ్వోతాలుసమాయోగే ప్రథమం కేవలం భవేత్।
తదేవ చ ద్వితీయం తు అధస్తాత్పునరేవ తు ॥12॥

ఏకదశస్స్వరైర్యుక్తం ప్రథమం తాలువర్గతః ।
ఊష్మణశ్చ ద్వితీయం తు అధస్తాద్దృశ్య యోజయేత్॥13॥

జిహ్వోతాలు వర్గం యొక్క మొదటి అక్షరమైన 'చ'కారాన్ని, అదే వర్గం యొక్క ద్వితీయాక్షరమైన 'ఛ' కారాన్ని, పదకొండో స్వరమైన 'ఏ' కారంతో కలపాలి. (చ్ఛే) తాలువర్గ ప్రథమాక్షరమైన 'క' కారాన్ని దాని క్రింద ఊష్మవర్గం యొక్క 'ష' కారాన్ని చేరిస్తే (క్+ష్=క్ష్)

షోడశస్వరసంయుక్త మూష్ణశ్చ ద్వితీయకమ్ ।
జిహ్వోదంతసమాయాగే ప్రథమం యోజయేదధః॥14॥

దానిని పదహారో స్వరమైన 'అ' కారంతో కలపాలి. అపుడు 'క్షః' అవుతుంది. ఊష్మవర్గం యొక్క తృతీయాక్షరమైన 'స' కారాన్ని క్రింద జిహ్వోదంతవర్గం యొక్క ప్రథమాక్షరంతో కలపాలి.(స్త్)

మిశ్రవర్గాద్ద్వితీయం తు అధస్తాత్పునరేవ తు ।
చతుర్థం స్వరసంభిన్నం తాలువర్గాది సంయుతమ్ ॥15॥

ఊష్మణశ్చ ద్వితీయం తు అధస్తాద్వినియోజయేత్ ।
స్వరైకాదశభిన్నం తు ఊష్మణాంతం సబిందుకమ్॥16॥

దాని క్రింద మిశ్రవర్గం ద్వితీయాక్షరమైన 'ర' కారాన్ని కలిపి, పిదప నాలుగో స్వరమైన 'ఈ' కారాన్ని చేర్చాలి. అపుడు 'స్త్రీ' అని అవుతుంది. తాలువర్గ ప్రథమాక్షరమైన 'క' కారానికి, క్రింద ఊష్మవర్గ ద్వితీయాక్షరమైన 'ష' కారం చేర్చి, పదకొండో స్వరమైన 'ఏ'కారం కలిపితే "క్షే" అవుతుంది.

పంచస్వరసమారూఢం షష్ఠం సంపుటయోగతః ।
ద్వితీయమక్షరం చాన్యజ్జిహ్వోగ్రే తాలుయోగతః॥17॥

పిదప ఊష్మవర్గంయొక్క చివరి అక్షరమైన 'హ'కారానికి అనుస్వారం చేర్చి, ఐదో స్వరాన్ని కలపాలి. (హుం) అవుతుంది. పిదప ఓష్ఠ సంపుటయోగంలోని రెండో అక్షరమైన "ఫ" కారానికి, జిహ్వోగ్రతాలు యోగంలోని

ప్రథమం పంచమే యోజ్యం స్వరార్ధేనోద్ధృతా ఇమే ॥
ఓంకారాద్యా నమోంతాశ్చ జపేత్స్వాహాగ్నికార్యకే ॥18॥

ప్రథమాక్షరమైన 'ట్' తో కలపాలి. 'ఫట్' అవుతుంది. (పంచమమైన 'న' కారాన్ని ప్రథమంగా మార్చి కలపాలి) ఇది స్వరార్ధవ్యంజనాలైన అక్షరాలతో సంపుటయైన తోతలాత్వరితా మంత్రం. దీనికి ఆదియందు

ఓంకారాన్ని, చివర, 'నమః' చేర్చి మంత్రాన్ని జపం చేయాలి. అపుడు మంత్రం "ఓం హూం ఖే ఛ్చేక్షః స్త్రీ క్షే హుం ఫట్ నమః" అనేది జపమంత్రం అవుతుంది. దీనికి (నమః బదులు) "స్వాహా" చేరిస్తే హోమమంత్రం అవుతుంది.

"ఓం హ్రీం హ్రూం హ్రః హృదయం హాం హశ్చేతి శిరః ।
శిఖాం హ్రీం జ్వల జ్వల శిఖా స్యాత్కవచం హులు ద్వయమ్॥19॥

హ్రీం శ్రీం క్షూం నేత్రత్రయాయ విద్యానేత్రం ప్రకీర్తితమ్ ।
క్షౌం హః ఖౌం హూం ఫడస్త్రాయ గుహ్యాంగాని పురా న్యసేత్ ॥20॥

దీని అంగన్యాసం ఈ విధంగా ఉంటుంది. "ఓం హ్రీం హ్రూం హ్రః హృదయాయ నమః, హాం హః శిరసే స్వాహా, హ్రీం జ్వల జ్వల శిఖాయై వషట్, హను హను (లేదా) హులు హులు కవచాయ హుం, హ్రీం, శ్రీం క్షూం నేత్రత్రయాయ వౌషట్, "ఫట్" అనేది తోతలా త్వరితావిద్య. అది ఆ దేవియొక్క నేత్రంగా చెప్పబడింది. 'క్షౌం హః ఖౌం హూం ఫట్' అస్త్రాయ ఫట్. ఇవి గుహ్యాంగమంత్రాలు. వీటికి ముందు న్యాసం చేయాలి.

త్వరితాంగాని వక్ష్యామి విద్యాంగాని శృణుష్వ మే ।
ఆదిద్విహృదయం ప్రోక్తం త్రిచతుః శిర ఇష్యతే ॥21॥

పంచషష్ఠః శిఖా ప్రోక్తా కవచం సప్తమాష్టమమ్।
తారకం తు భవేన్నేత్రం నవార్ధాక్షరలక్షణమ్ ॥22॥

త్వరితాదేవి అంగాలను తరువాత చెబుతాను. ముందు విద్యాంగాలను వినవలసింది. ప్రథమ ద్వితీయ బీజాక్షరాలు హృదయం. తృతీయ చతుర్థబీజాక్షరాలు శిరస్సు. ఐదు, ఆరు శిఖలు. ఏడు, ఎనిమిదిలు కవచమంత్రాలు. నవమం, అర్ధాక్షరం (ఫట్) నేత్రం. తారకమయితే

తోతలేతి సమాఖ్యాతా వజ్రతుండే తతో భవేత్ ।
ఖ ఖ హూం దశబీజా స్యాద్వజ్రతుండేంద్రదూతికా ॥23॥

"తోతలే వజ్రతుండే ఖ ఖ హూం" అనే పది అక్షరాలు కలది. ఇది వజ్రతుండికా నామకమైన ఇంద్రదూతికా విద్య.

ఖేచరీ జ్వాలినీ జ్వాలే ఖఖేతి జ్వాలినీ దశ ।
వర్ధశబరీ భీషణీ ఖఖేతి చ శబర్యపి ॥24॥

"ఖేచరి జ్వాలిని జ్వాలే ఖ ఖ" అనే పది అక్షరాలు గల మంత్రం జ్వాలినీ విద్య. "వర్ధశబరీ భీషణీ ఖఖ" అనేది పది అక్షరాలు కల్గిన శబరీ విద్య.

ఛే ఛేదని కరాళి(లి)ని ఖఖేతి హ కరాల్యపి ।
క్షః శ్రవద్రవప్లవంగీ ఖ ఖ దూతీ ప్లవంగ్యాపి ॥25॥

"ఛే ఛేదని కరాళిని ఖ ఖ" ఇది దశాక్షర కరాళినీ విద్య. "క్షః శ్రవ ద్రవ ప్లవంగీ" ఇది దశాక్షర ప్లవంగ దూతీవిద్య

స్త్రీబలే కాలధునని శాసీ శ్వసనవేగికా ।
క్షే పక్షే కపిలే హంస (హంస) కపిలా నామ దూతికా ॥26॥

"స్త్రీబలే కాలధునని శాసీ" ఇది దశాక్షర శ్వసన వేగికావిద్య. క్షే పక్షే కపిలే హంస హంస" ఇది దశాక్షర కపిలదూతికా నామ విద్య.

"హ్రూం తేజోవతీ రౌద్రీ చ మాతంగీ రౌద్రదూతికా ।
పుటే పుటే ఖ ఖ ఖడ్గే ఫట్ బ్రహ్మకదూతికా ॥27॥

"హ్రూం తేజోవతీ రౌద్రీమాతంగీ" ఇది దశాక్షర రౌద్రీ దూతికావిద్య. "పుటే పుటే ఖ ఖ ఖడ్గే" హ్రూం తో మొదలై, "ఫట్" తో అంతమయ్యేది దశాక్షర బ్రహ్మదూతికావిద్య.

వైతాలినీ దశార్ణాః స్యు స్త్యజాన్యహి పలాలవత్ ।
హృదాదికన్యాసాదౌ స్యాన్మధ్యే నేత్రే న్యసేత్సుధీః ॥28॥

"వైతాలి" లో చెప్పబడిన అన్ని మంత్రాలు దశాక్షరసంయుక్తాలు. ఇతరములన్నీ (మిగిలినవి) పొల్లు వలె సారహీనంగా భావించి విడిచి వేయాలి. న్యాసాదులలో హృదయాద్యంగాలను ఉపయోగించాలి. నేత్ర విషయంలో మధ్యలో న్యాసం చేయాలి.

పాదాదారభ్య మూర్ధాంతం శిర ఆరభ్య పాదయోః ।
అంఘ్రిజానూరుగుహ్యే చ నాభిహృత్కంఠదేశతః ॥29॥

వక్రమండలమూర్ధ్వం చ అధోర్ధ్వే చాదిబీజతః ।
సోమరూపం తతో ఉ కారం ధారామృత సువర్షిణమ్ (మూలసువాసినమ్-పాఠాంతరం) ॥30॥

పాదం నుంచి శిరస్సు వరకు, శిరస్సు నుంచి పాదాల వరకు చరణాలు, జానువులు, ఊరువులు, గుహ్యం నాభి, హృదయం, కంఠం నూంచి ముఖమండలం వరకు పైకి, క్రిందకు ఆదిబీజము నుంచి బయల్వెడలి అమృతధారను వర్షించే సోమరూపమైన ఆకారం.

విశంతం బ్రహ్మరంధ్రేణ సాధకస్తు విచింతయేత్ ।
మూర్ధాస్యకంఠహృన్నాభౌ గుహ్యోరుజానుపాదయోః ॥31॥

ఆదిబీజం న్యసేన్మంత్రీ తర్జన్యాది పునః పునః
ఊర్ధ్వం సోమమధః పద్మం శరీరం బీజవిగ్రహమ్॥32॥

యో జానాతి న మృత్యుః స్యాత్తస్య న వ్యాధయో జ్వరాః(జపాత్-పాఠాంతరం) ।
యజేజ్జపేత్తాం విన్యస్య ధ్యాయేద్దేవీం శతాష్టకమ్ ॥33॥

బ్రహ్మరంధ్రం నుంచి నాలో ప్రవేశిస్తోందని సాధకుడు భావన చేయాలి. మంత్రోపాసన చేసేవాడు. శిరస్సు, ముఖం, కంఠం, హృదయం, నాభి, గుహ్యం, ఊరువులు, జానువులు, పాదాలు - వీటి యందు, తర్జని మున్నగు వాటి యందు మాటిమాటికి ఆదిబీజాన్ని న్యాసం చేయాలి. బీజాక్షరరూపమైన శరీరకమలం క్రింద ఉందని తెలిసిన వానికి మృత్యుభయం కాని, వ్యాధులు కాని, జ్వరాదులు కాని ఉండవు. న్యాస, ధ్యానపూర్వకంగా ధ్యానం చేసి త్వరితాదేవిని ధ్యానిస్తూ మంత్రాన్ని నూట ఎనిమిది సార్లు జపించాలి.

ముద్రా వక్ష్యే ప్రణీతాద్యాః ప్రణీతాః పంచధా స్మృతా ః ।
గ్రథితౌ తు కరౌ కృత్వా మధ్యేంఽగుష్ఠౌ నిపాతయేత్ ॥34॥

ఇపుడు ప్రణీత మున్నగు ముద్రలు చెబుతాను. ప్రణీతా ముద్రలు ప్రణీత, సబీజాప్రణీత, భేదని, కరాలి, వజ్రతుండ అని అయిదు విధాలు. రెండు చేతులు కలిపి అంగుష్ఠాలను మధ్యయందు ఉంచాలి.

తర్జనీం మూర్ధ్ని సంలగ్నాం విన్యసేత్తాం శిరోపరి ।
ప్రణీతేయం సమాఖ్యాతా హృద్దేశే తాం సమానయేత్ ॥35॥

తర్జనిని శిరస్సు నందు ఉంచి, దానిని పైకి చాపితే ఇది ప్రణీతా ముద్ర. దీనిని హృదయదేశంలో చూపాలి.

ఊర్ధ్వం తు కన్యసామధ్యే సబీజాం తాం విదుర్ద్విజాః ।
నియోజ్య తర్జనీమధ్యే ఽనేకలగ్నాం పరస్పరమ్ ॥36॥

జ్యేష్ఠాగ్రం నిక్షిపేన్మధ్యే భేదనీ సా ప్రకీర్తితా ।
నాభిదేశే తు తాం బధ్వా అంగుష్ఠావు క్షిపేత్తతః ॥37॥

కరాలీ తు మహాముద్రా హృదయే యోజ్య మంత్రిణః ।
పునస్తు పూర్వవద్బద్ధ్వా లగ్నాం జ్యేష్ఠాం సముత్క్షిపేత్ ॥38॥

వజ్రతుండా సమాఖ్యాతా వజ్రదేశే తు బంధయేత్ ।
ఉభాభ్యాం చైవ హస్తాభ్యాం మణిబంధం తు బంధయేత్ ॥39॥

త్రీణి త్రీణి ప్రసార్యేతి వజ్ర ముద్రా ప్రకీర్తితా ।
దండః ఖడ్గం చక్రగదా ముద్రాచాకారతః స్మృతా ॥40॥

ఈ ముద్రలో కనిష్ఠికను మధ్యలో ఉంచి పైకి చాపినట్లు చేస్తే అది సబీజా ప్రణీత. తర్జనీ మధ్యలో అనామికను పరస్పర సంలంగ్నం చేసి అంగుష్ఠాగ్రభాగాన్ని మధ్యలో ఉంచితే అది భేదనీ ముద్ర. ఆ ముద్రను నాభిదేశంలో ఉంచి అంగుష్ఠాలు పైకి ఎత్తి, (అంగుష్ఠాంబు క్షిపేత్తతః - అని పాఠం ఉంది. అపుడు అంగుష్టం నుంచి జలం చల్లాలి

అని భావం.) దానినే మంత్రసాధకుని యొక్క హృదయంపై ఉంచితే కరాలి అనే మహాముద్ర అవుతుంది. మళ్లీ పూర్వం లాగే బ్రహ్మలగ్నా జ్యేష్ఠాను పైకి నిలబడునట్లు చేస్తే అది వజ్రతుండముద్ర. దానిని వజ్రదేశంలో (గుండె) ఉంచాలి. రెండు హస్తాలతో మణిబంధాన్ని బంధించి మూడు మూడు వ్రేళ్లు చాపితే వజ్రముద్ర అవుతుంది. వాటి వాటి ఆకారాలను అనుసరించి దండ, ఖడ్గ, చక్ర, గదాది ముద్రలు చెప్పబడ్డాయి.

అంగుష్ఠేనాఽఽక్రమేత్త్రీణి త్రిశూలం చోర్ధ్వతో భవేత్ ।
ఏకా తు మధ్యమోర్ధ్వా తు శక్తిరేవ విధీయతే ॥41॥

అంగుష్ఠంతో ఊర్ధ్వముఖాలుగా నున్న మూడు వ్రేళ్లను ఆక్రమిస్తే అది త్రిశూలముద్ర. ఒక్క మధ్యమాంగుళిని మాత్రం పైకి నిలిపితే శక్తిముద్ర అవుతుంది.

శరం చ వరదం చాపం పాశం భారం చ ఘంటయా ।
శంఖమంకుశమభయం పద్మమష్ట చ వింశతిః ॥42॥

శరం, వరదముద్ర, చాపం, పాశం, భారం, ఘంట, శంఖం, అంకుశం, అభయముద్ర, పద్మం – ఇవన్నీ పైన చెప్పిన ప్రణీత మున్నగు ముద్రలతో కలిపితే ఇరవై ఎనిమిది ముద్రలు అవుతాయి.

గ్రహణీ మోక్షణీ చైవ జ్వాలినీ చామృతాఽభయా ।
ప్రణీతాః పంచ ముద్రాస్తు పూజాహోమే చ యోజయేత్ ॥43॥

గ్రహణి– మోక్షణి– జ్వాలిని– అమృత – అభయ– ఈ అయిదూ ప్రణీతా ముద్రలు. వీటిని పూజాహోమాలలో ఉపయోగించాలి.

ఇత్యాది మహాపురాణే ఆగ్నేయే త్వరితామంత్రాది కథనం నామ దశాధికత్రిశతతమోఽధ్యాయః ॥310॥

అగ్నిమహాపురాణంలో త్వరితామంత్రాదుల కథనం అనే మూడువందల పదవ అధ్యాయం సమాప్తం.

ఔఔ

ఏకాదశాధికత్రిశతతమోఽధ్యాయః – మూడువందల పదకొండవ అధ్యాయం

త్వరితా మూలమంత్రాది – త్వరితా మూలమంత్రాదులు

అగ్నిరువాచ – అగ్ని ఇలా చెబుతున్నాడు.

దీక్షాది వక్ష్యే విన్యస్య సింహవజ్రాకులేఽబ్జకే ॥1॥

(త్తుత్తు) హే హే హుతి వజ్రదంతే పురు పురు లు లు గర్జ గర్జ
హ హ (ఇహ) సింహాసనాయ నమః ॥2॥

సింహాసనంపై ఉన్న వజ్రవ్యాప్తమైన పద్మంలో మంత్రన్యాసపూర్వకమైన దీక్షాది విధానాన్ని చెబుతున్నాను. "హే హే హుతి వజ్రదంత పురు పురు లు లు గర్జ గర్జ ఇహ సింహాసనాయ నమః" ఇది సింహాసన పూజామంత్రం.

(**విశేషం:**ప్రాచీన ప్రతిలో "త్తుత్తుహేతి వజ్రదంతే పురుపురులులు గర్జగర్జ హ హ సింహాయనమః" అని ఉంది.)

తిర్యగూర్ధ్వగతా రేఖా శ్చత్వారశ్చతురో భవేత్।
నవభాగవిభాగేన కోష్ఠకాన్కారయేద్బుధః ॥3॥

గ్రాహ్యా దిశాగతా : కోష్ఠా విదిశాసు వినాశయేత్ ।

నాలుగు నిలువు రేఖలు, నాలుగు అడ్డరేఖలు గీయగా తొమ్మిది కోష్ఠాలు ఏర్పడేటట్లుగా విద్వాంసుడు చేయాలి. నాలుగు దిక్కులందున్న కోష్ఠాలను ఉంచి, విదిక్కులందున్న కోష్ఠాలను చెరిపివేయాలి.

బాహ్యే వై కోష్ఠకోణేషు బాహ్యరేకాష్టకం స్మృతమ్ ॥4॥

మిగిలిన బాహ్యకోష్ఠాల కోణాల వరకు వచ్చురేఖలు ఎనిమిది ఉంటాయి.

బాహ్యకోష్ఠస్య బాహ్యే తు మధ్యే యావత్సమానయేత్ ।
వజ్రస్య మధ్యమం శృంగం బాహ్యరేఖా ద్విధార్ధతః ॥5॥

బాహ్యరేఖా భవేద్వక్రా ద్విభంగా కారయేద్బుధః ।

బాహ్యకోష్ఠం యొక్క బాహ్యభాగానికి సరిగా మధ్యలో వజ్రమధ్యశృంగం అవుతుంది. బాహ్యరేఖను రెండు భాగాలు చేయగా ఎంత రేఖార్ధం అవుతుందో, అంత శృంగం మాత్రమే ఉండాలి. బాహ్యరేఖ వక్రంగా ఉండేలా సాధకుడు దానిని రెండుగా విభజించాలి.

మధ్యకోష్ఠం భవేత్పద్మం పీతకర్ణికముజ్జ్వలమ్ ॥6॥

మధ్యకోష్ఠాన్ని కమలాకారంగా మార్చి పీతవర్ణంతో కర్ణికను ఏర్పరచాలి.

కృష్ణేన రజసాఽఽలిఖ్య కులిశాసి శిరోర్ధ్వతా । (పాఠాంతరం-శరార్ధతా)
బాహ్యతశ్చతురస్రం తు వజ్రసంపుటలాంఛితమ్ ॥7॥

నల్లటి పొడితో కులిశచక్రాన్ని ఏర్పరచి, దానిపై శృంగం ఆకారం ఖడ్గాకారంతో ఉండేటట్లు చేయాలి. చక్ర బాహ్యభాగాన్ని చతురస్రచక్రంగా చేసి వజ్రసంపుటచిహ్నితం కావించాలి.

ద్వారే ప్రదాపయేన్మంత్రీ చతురో వజ్రసంపుటాన్ ।
పద్మనాభ భవేద్వామ వీథీ చైవ సమా భవేత్ ॥8॥

సాధకుడు భూపురద్వారంలో నాలుగు వజ్రసంపుటాలు ఏర్పరచాలి. పద్మవీథి వామవీథి సమానంగా ఉండాలి.

గర్భం రక్తం కేసరాణి మండలే దీక్షితాః స్త్రియః ।
జయేచ్చ పరరాష్ట్రాణి క్షిప్రం రాజ్యమవాప్నుయాత్ ॥9॥

కమలం లోపలిభాగంలో కేసరాలు ఎర్రగా ఉండాలి. మండలంలో స్త్రీలకు దీక్ష ఇచ్చి మంత్రజపానుష్ఠానం చేయిస్తే రాజు శీఘ్రంగా ఇతరుల రాజ్యాలను జయిస్తాడు. తాను రాజ్యాన్ని కోల్పోయి ఉంటే దానిని మళ్లీ తిరిగి పొందుతాడు.

మూర్తిం ప్రణవ సందీప్తాం హుంకారేణ నియోజయేత్ ।
మూలవిద్యాం సముచ్చార్య మరుద్వ్యోమగతాం ద్విజ॥10॥

ద్విజోత్తమా! ఓంకారంచే సందీప్తమైన మూర్తిని హుంకారంతో నియుక్తం చేసి వాయువు, ఆకాశబీజాలతో సంపుటితం చేసి మూలవిద్యను ఉచ్చరిస్తూ ఆద్యంతాలలో కర్ణికయందు పూజించాలి.

(వాయుబీజం (యం), ఆకాశబీజం(హం))

ప్రథమేన పునశ్చైవ కర్ణికాయాం ప్రపూజయేత్ ।
ఏవం ప్రదక్షిణం పూజ్య ఏకైకం బీజమాదితః ॥11॥

ఈ విధంగా ప్రదక్షిణక్రమంలో ఒక్కొక్క అక్షరరూపమైన బీజాలను ఉచ్చరిస్తూ ఆద్యంతాలలో కమలదళాలపైన పూజచేయాలి.(కర్ణికయందు కూడ చేయాలి)

దలమధ్యే తు విద్యాం గాం ఆగ్నేయ్యాం పంచ నైరృతమ్ ।
మధ్యే నేత్రం దిశాస్త్రం చ గుహ్యకాంగే తు రక్షణమ్॥12॥

దళాల విద్యాంగాలను పూజించాలి. ఆగ్నేయం నుంచి వామక్రమంలో నైరృతి దిక్కువరకు హృదయం, శిరస్సు, శిఖ, కవచం, నేత్రం అనువాటితో పంచాంగపూజ కావించాలి. మధ్యభాగంలో మళ్లీ నేత్ర న్యాసం, అన్ని దిక్కుల యందు అస్త్రపూజ కావించాలి. గుహ్యాంగంలో రక్షాపూజను కావించాలి.

హుతయః కేసరస్థాస్తు వామదక్షిణపార్శ్వతః ।
పంచ పంచ ప్రపూజ్యాస్తు స్వైః స్వైర్మంత్రైః ప్రపూజయేత్ ॥13॥

కేసరాలపై నున్న హుతులను దక్షిణ, వామపార్శ్వాలలో ఐదేసి ఐదేసి చొప్పున, వాటి వాటి నామమంత్రాలతో పూజచేయాలి.

లోకపాలాన్ న్యసేదష్టౌ బాహ్యతో గర్భమండలే ।
వర్ణాంతమగ్నిమారూఢం షష్ఠస్వరవిభేదితమ్ ॥14॥

పంచదశేన చాక్రాంతం స్వైః స్వైర్నామభిర్యోజయేత్।
శీఘ్రం సింహే కర్ణికాయాం యజేద్గంధాదిభిః శ్రియే ॥15॥

గర్భమండలం యొక్క బాహ్యభాగంలో ఎనమండుగురు లోకపాలకుల న్యాసం చేయాలి. వర్ణాంతం (క్ష లేదా హ) అగ్ని (ర్) దానిపైన ఆరో అచ్చు(ఊ), పిమ్మట పదిహేనో అచ్చు(ం) కలిపితే క్ష్రూం లేదా హ్రూం అవుతుంది. ఆ బీజాన్ని ఆదిలో ఉంచి దిక్పాలకులను తమ తమ నామమంత్రాలతో పూజించాలి. మళ్లీ వెంటనే సింహాసనంపై కమల కర్ణికయందు గంధం మున్నగు ఉపచారాలతో పూజించాలి. దీని వల్ల ఐశ్వర్యం లభిస్తుంది.

అష్టాభిర్వేష్టయేత్కుంభైర్మంత్రాష్టశతమంత్రితైః ।
మంత్రమష్టసహస్రం తు జప్త్వాంగానాం దశాంశకమ్ ॥16॥

హోమం కుర్యాదగ్నికుండే వహ్నిమంత్రేణ చాలయేత్ ।
నిక్షిపేద్ధృదయేనాగ్నిం శక్తిం మధ్యేఽగ్నిగాం స్మరేత్ ॥17॥

తరువాత నూట ఎనిమిది మంత్రాలతో అభిమంత్రితం చేసి ఎనిమిది కలశాలను కమలం చుట్టూ ఉంచి, వేయిసార్లు (వేయి ఎనిమిది) జపం చేసి, దశాంశం హోమం చేయాలి. ముందు అగ్నిమంత్రంతో (రం) కుండం దగ్గరకు అగ్నిని తీసుకొని వెళ్లి, హృదయమంత్రంతో (నమః) దానిని అచ్చట స్థాపించాలి. కుండమధ్యలో అగ్నియుక్తమైన శక్తిని భావన చేయాలి.

గర్భాధానం పుంసవనం జాతకర్మ చ హోమయేత్ ।
హృదయేన శతం హ్యేకం గుహ్యాంగే జనయేచ్ఛిఖిమ్ ॥18॥

ఆ శక్తియందు గర్భాధాన, పుంసవన, జాతకర్మ సంస్కారాలను ఉద్దేశించి హృదయమంత్రంతో నూట ఎనిమిదిసార్లు హోమం చేయాలి. గుహ్యాంగం నుంచి నూతనాగ్ని పుట్టినట్లు భావన చేయాలి.

పూర్ణాహుతిం తు విద్యాయాః శివాగ్ని ర్జనితో భవేత్ ।
హోమయేన్మూలమంత్రేణ శతం చాంగం దశాంశతః ॥19॥

పిదప మూలమంత్రాన్ని ఉచ్చరిస్తూ పూర్ణాహుతి ఈయాలి. దీని వల్ల శివాగ్ని ప్రజ్జ్వరిల్లుతుంది. మళ్లీ మూలమంత్రాన్ని ఉచ్చరిస్తూ వంద ఆహుతులు ఈయాలి. తరువాత దశాంశం హోమం చేయాలి.

నివేదయేత్తతో దేవ్యా స్తతః శిష్యం ప్రవేశయేత్ ।
అస్త్రేణ తాడనం కృత్వా గుహ్యాంగాని తతో న్యసేత్॥20॥

పిదప శిష్యుని దేవి చేతిలో సమర్పించి, శిష్యుని మండపంలో ప్రవేశపెట్టాలి. అస్త్రమంత్రంతో తాడనం చేసి గుహ్యాంగాల న్యాసం చేయాలి.

విద్యాంగైశ్చైవ సన్నద్ధం విద్యాంగేషు నియోజయేత్ ।
పుష్పం క్షిపాయయేచ్ఛిష్యమానయేదగ్నికుండకమ్ ॥21॥

(మంత్ర) విద్యాంగాలచే సన్నద్ధుడైన శిష్యుని మంత్రాంగాల యందు నియోగించాలి. వానిచే ఒక పుష్పాన్ని విసరేటట్లు చేసి వానిని అగ్నికుండ సమీపానికి తీసుకొని వెళ్లాలి.

యవైర్ధాన్యై స్తిలైరాజ్యైర్మూలవిద్యాశతం హునేత్ ।
స్థావరత్వం పురా హెూమం సరీసృపమతః పరమ్ ॥22॥

మూలవిద్యను ఉచ్చరిస్తూ యవలు, ధాన్యాలు, తిలలు, నేయితో నూరుహెూమాలు చేయాలి. మొదటి హెూమం స్థావరత్వం నుంచి విముక్తిని కలిగిస్తుంది. రెండోది సరీసృపత్వం నుంచి విముక్తిని కలిగిస్తుంది.

పక్షిమృగపశుత్వం చ మానుషం బ్రాహ్మమేవ చ ।
విష్ణుత్వం చైవ రుద్రత్వమంతే పూర్ణాహుతి ర్భవేత్ ॥23॥

ఏకయా చైవ హ్యాహుత్యా శిష్యః స్యాద్దీక్షితో భవేత్ ।
అధికారో భవేదేవం శృణు మోక్షమత ః పరమ్ ॥24॥

తరువాత వరుసగా పక్షి, మృగ, పశు, మానవజన్మ నుంచి విమోచనం కలిగిస్తుంది. తరువాత క్రమంగా బ్రహ్మపదం, విష్ణుపదం, రుద్రపదం లభిస్తుంది. ఇలా పూర్ణాహుతి నిర్వహించాలి. చివరగా ఒక్క పూర్ణాహుతి ఈయాలి. దానితో దీక్షితుడై శిష్యుడు మోక్షాధికారి అవుతాడు. ఇకమీద మోక్షమంటే ఏమిటో (చెబుతాను) విను.

సుమేరుస్థో యదా మంత్రీ సదాశివపదే స్థితః ।
పరే చ హోమయేత్ స్వస్థోఽ కర్మకర్మశతాన్ దశ ॥25॥

మంత్రోపాసకుడు సుమేరువుపై సదాశివపదము నందు ఉన్నవాడై రెండో రోజున స్వస్థచిత్తుడై కర్మాకర్మ క్షయనిమిత్తం ఒక వేయి హెూమాలు చేయాలి.

పూర్ణాహుత్యా తు తద్యోగీ ధర్మాధర్మైర్న లిప్యతే ।
మోక్షం యాతి పరం స్థానం యద్గత్వా న నివర్తతే ॥26॥

పిదప పూర్ణాహుతి సమర్పించిన మంత్రయోగి ధర్మాధర్మ సంబంధం లేనివాడవుతాడు. అతడు పరమపదమైన మోక్షాన్ని పొందుతాడు. దానిని పొంది మళ్లీ తిరిగిరాడు.

యథా జలే జలం క్షిప్తం జలం దేహీ శివ స్తథా ।
కుంభైః కుర్యాచ్చాభిషేకం జయరాజ్యాదిసర్వభాక్ ॥27॥

జలంలో పోసిన జలం దానితో కలసి జలరూపమై పోయినట్లుగా, జీవుడు శివునితో కలసి శివరూపుడవుతాడు. కలశాలతో అభిషేకం చేసినవాడు విజయం, రాజ్యం మున్నగు సర్వఫలితాలు పొందుతాడు.

కుమారీ బ్రాహ్మణీ పూజ్యా గుర్వాదేర్దక్షిణాం దదేత్ ।
యజేత్సహస్రమేకం తు పూజాం కృత్వా దినే దినే ॥28॥

బ్రాహ్మణకన్యకను పూజించి గురువు మున్నగువారికి దక్షిణ ఈయాలి. ప్రతిదినం పూజచేసి వేయి హోమాలు చేయాలి.

తిలాజ్యపూర్ణ(ర) హోమేన దేవీ శ్రీః కామదా భవేత్ ।
దదాతి విపులాన్భోగాన్ యదన్యచ్చ సమీహతే ॥29॥

తిలలతోను, నేతితోను పూర్ణాహుతి హోమపర్యంతం చేస్తే త్వరితాదేవి లక్ష్మిని, అభీష్టవస్తువులను సమకూరుస్తుంది. సమస్తకామములను ఇస్తుంది. అనేకములైన భోగాలను ఇచ్చి కోరిన కోరికలన్నీ తీరుస్తుంది.

జప్త్వా హ్యక్షరలక్షం తు నిధానాధిపతిర్భవేత్ ।
ద్విగుణేన భవేద్రాజ్యం త్రిగుణేన చ యక్షిణీ ॥30॥

మంత్రంలో ఎన్ని అక్షరాలు ఉన్నాయో, అన్ని లక్షల జపం చేస్తే నిధులకు అధిపతి అవుతాడు. రెట్టింపు జపం చేస్తే రాజ్యం పొందుతాడు. మూడు లక్షల జపం చేస్తే యక్షిణి సిద్ధిస్తుంది.

చతుర్గుణేన బ్రహ్మత్వం తతో విష్ణుపదం భవేత్।
షడ్గుణేన మహాసిద్ధి ర్లక్షేణైకేన పాపహా ॥31॥

నాలుగురెట్లు జపం చేస్తే బ్రహ్మపదం, ఐదురెట్లు చేస్త విష్ణుపదం, ఆరురెట్లు జపం చేస్తే మహాసిద్ధి లభిస్తాయి. ఈ మంత్రాన్ని ఒక లక్షసార్లు జపిస్తే పాపం నశిస్తుంది.

దశ జప్త్వా దేహశుద్ధ్యై తీర్థస్నానఫలం శతాత్ ।
పటే వా ప్రతిమాయాం వా శీఘ్రం వై స్థండిలే యజేత్ ॥32॥
శతం సహస్రమయుతం జపే హోమే ప్రకీర్తితమ్ ।
ఏవం విధానతో జప్త్వా లక్షమేకం తు హోమయేత్ ॥33॥

పది పర్యాయాలు జపిస్తే దేహ(చిత్త)శుద్ధికలుగుతుంది. నూరు పర్యాయాలు జపిస్తే తీర్థస్నానఫలం లభిస్తుంది. వేదికపై పటం కాని, ప్రతిమను కాని ఉంచి దాని సమక్షంలో వంద కాని, వేయి కాని, పదివేలు కాని జపం చేసి హోమం చేయాలి. ఈ విధంగా జపం చేసి లక్షహోమాలు చేయాలి.

మహిషాజమేష మాంసేన నరజేన పురేణ వా ।
తిలైర్యవైస్తథా లాజైః వ్రీహి గోధూమకాంబుజైః ॥34॥

శ్రీఫలైరాజ్యసంయుక్తైర్హోమయిత్వా వ్రతం చరేత్ ।
అర్ధరాత్రేషు సన్నద్ధః ఖడ్గచాపశరాదిమాన్ ॥35॥

ఏకవాసావిచిత్రేణ రక్తపీతాసితేన వా ।
నీలేన వాఽథ వస్త్రేణ దేవీం తైరేవ చార్చయేత్ ॥36॥

దున్న, మేక, మేకపోతుమాంసంతో కాని, నరమాంసంతో కాని, (రక్తంతో కాని), శరీరంతో కాని, తిలలు, యవలు, లాజలు, వ్రీహిధాన్యాలు, గోధుమలు, ఆమ్రఫలాలు (పాఠాంతరంలో పద్మాలు), బిల్వఫలాలు. వీటితో నేతిని కలిపి వాటితో హెూమం చేసి వ్రతం ఆచరించాలి. అర్ధరాత్రులలో కవచం ధరించి, ఖడ్గ చాప, ధనుర్బాణాదులు గ్రహించి, ఏక వస్త్రధారియై, రక్త-పీత-కృష్ణనీల వస్త్రధారియై, విచిత్రవేషధారియై దేవిని పైన చెప్పిన వస్తువులతో పూజించాలి.

వ్రజేద్దక్షిణదిగ్భాగం ద్వారే దద్యాద్బలిం బుధః ।
దూతీమంత్రేణ ద్వారాదావేకవృక్షే స్మశానకే ॥37॥
(ఏవం చ సర్వకామాప్తిం భుంక్తే సర్వా మహీం నృపః ।)

సాధకుడు దక్షిణదిశకు వెళ్లి మండపద్వారంపై దూతీమంత్రంతో బలిని సమర్పించాలి. ఈ బలిని ద్వారాదులందు గాని, స్మశానంలో ఉన్న ఒక చెట్టువద్ద కాని ఈయవచ్చు. ఇలా చేసిన సాధకుడు రాజ్యాన్ని పొంది సర్వకామనలను అనుభవిస్తాడు. రాజై సకలపృథ్విని ఏలుతాడు.

ఇత్యాది మహాపురాణే ఆగ్నేయే త్వరితామూలమంత్రాదికథనం నామ ఏకాదశాధికత్రిశతతమోఽధ్యాయః ॥311॥

అగ్నిమహాపురాణంలో త్వరితామూలమంత్రాదులు అనే మూడువందల పదకొండవ అధ్యాయం సమాప్తం.



ద్వాదశాధికత్రిశతతమోऽధ్యాయః – మూడువందల పన్నెండవ అధ్యాయం

త్వరితావిద్యాసిద్ధికథనమ్ – త్వరితావిద్యాసిద్ధికథనం

అగ్నిరువాచ – అగ్ని ఇలా పలికాడు.

విద్యా ప్రస్తావమాఖ్యాస్యే ధర్మకామాది సిద్ధిదమ్ ।
నవకోష్ఠవిభాగేన విద్యాభేదం చ విందతి ॥1॥

ఇపుడు ధర్మం, కామం మున్నగు సిద్ధులను ఇచ్చే విద్యా ప్రస్తావాన్ని (ప్రస్తారాన్ని) చెబుతాను.నవకోష్ఠ విభాగంచే విద్యాభేదం లభిస్తుంది.

అనులోమవిలోమేన సమస్తవ్యస్తయోగతః ।
కర్ణావికర్ణయోగేన అత ఊర్ధ్వం విభాగశః ॥2॥

త్రిత్రికేణ చ యోగేన దేవ్యా సన్నద్ధవిగ్రహః ।
జానాతి సిద్ధిదాన్మంత్రాన్ ప్రస్తావాన్నిర్గతాన్ బహూన్॥3 ॥

అనులోమ విలోమయోగం, సమస్త వ్యస్తయోగం, కర్ణావికర్ణయోగం, ఊర్ధ్వ విభాగయోగం, త్రిత్రికయోగం – వీటిచే ఎవని శరీరానికి దేవీ సమనుగ్రహం ద్వారా రక్షణ ఏర్పరచబడుతుందో, అతడు సిద్ధిదాయకాలైన మంత్రాలను, అనేకములగు ప్రస్తావనలను తెలుసుకొనగలుగుతాడు.

శాస్త్రే శాస్త్రే స్మృతా మంత్రాః ప్రయోగాస్తత్ర దుర్లభా ః ।
గురుః స్యాత్ప్రథమో వర్ణః ఫుల్లపల్లవవర్ణవత్ (పూర్వేద్యుర్న చ వర్ణ్యతే) ॥4॥

ప్రతి శాస్త్రంలోను మంత్రాలు చెప్పబడ్డాయి. కాని వాటి ప్రయోగాలు మాత్రం దుర్లభాలు. మొదటి వర్ణం గురువు అవుతుంది. పూర్వం దాని వర్ణనం చెప్పబడలేదు.

ప్రస్తావే తత్ర చైకార్ణద్వ్యర్ణత్ర్యర్ణాదయోऽభవన్ ।
తిర్యగూర్ధ్వగతారేఖా శ్చతురశ్చతురో భవేత్ ॥5॥

దాని ప్రస్తావంచే ఏకాక్షర, ద్వ్యక్షర, త్ర్యక్షరమంత్రాలు ఏర్పడతాయి. నిలువుగాను, అడ్డంగాను నాలుగేసి నాలుగేసి రేఖలు గీయాలి.

నవ కోష్ఠా భవంత్యేవం మధ్య దేశే తథాదిమాన్ ।
ప్రదక్షిణేన సంస్థాప్య ప్రస్తావం భేదయేత్తతః ॥6॥

ఇలా చేస్తే తొమ్మిది కోష్ఠాలు ఏర్పడతాయి. మధ్య కోష్ఠంతో ప్రారంభించి ప్రదక్షిణక్రమంలో వాటిపై అక్షర న్యాసం చేయాలి. అనంతరం ప్రస్తావ(ర) భేదనం చేయాలి.

ప్రస్తావక్రమయోగేన ప్రస్తావం యస్తు విందతి ।
కరముష్టిస్థితాస్తస్య సాధకస్య హి సిద్ధయః ॥7॥

ప్రస్తావక్రమయోగంచే ప్రస్తావం ఎవడు పొందగలుగుతాడో, అటువంటి సాధకుని చేతిపిడికిలిలో సర్వ సిద్ధులు ఉంటాయి.

త్రైలోక్యం పాదమూలే స్యాన్నవఖండాం భువం లభేత్ ।
కపాలే తు సమాలిఖ్య శివతత్త్వం సమంతతః ॥8॥

మూడులోకాలు అతని పాదంపై వంగి ఉంటాయి. అతడు నవఖండాలుగా విభజింపబడియున్న భూమిని అంతా పొందుతాడు. కపాలంపై అన్ని వైపుల శివతత్త్వాలను వ్రాయాలి.

శ్మశానకర్పటే వాఽథ బాహ్యే నిష్క్రమ్య మంత్రివిత్ ।
తస్య మధ్యే లిఖేన్నామ కర్ణికోపరి సంస్థితమ్ ॥9॥

తాపయేత్ఖాదిరాంగారై ర్భూర్జమాక్రమ్య పాదయోః ।
సప్తాహాదానయేత్సర్వం త్రైలోక్యం సచరాచరమ్ ॥10॥

శ్మశానంలో ఉంచే (శవం పైన కప్పి ఉంచే) వస్త్రంపై శివతత్త్వాలను అన్ని వైపుల మంత్రవేత్త వ్రాయాలి. దానిని మధ్యభాగంలోని కర్ణికపై తాను తలచుకొన్న వ్యక్తి పేరును భూర్జపత్రం పై వ్రాసి ఉంచాలి. ఖదిరవక్షం యొక్క బొగ్గులతో భూర్జపత్రాన్ని వెచ్చగా చేసి దానిని రెండుపాదాలతోను త్రొక్కి ఉంచాలి. ఈ ప్రయోగం ద్వారా ఒకే సప్తాహంలో చరాచరాలతో కూడుకొన్న మూడులోకాలు తన పాదాక్రాంతం అవుతాయి.

వజ్రసంపుటగర్భే తే ద్వాదశారే తు లేఖయేత్ ।
మధ్యే తు గర్భగం నామ సదాశివవిదర్భితమ్ ॥11॥

వజ్రసంపుట గర్భయుక్తమైన ద్వాదశారచక్రం యొక్క మధ్యలో శత్రువు పేరువ్రాసి, దానిని సదాశివమంత్రం చెబుతూ దర్భలతో మార్జనం చేయాలి.

కుడ్యే ఫలకకే వాఽథ శిలాపట్టే హరిద్రయా ।
ముఖస్తంభం గతిస్తంభం సైన్యస్తంభం తు జాయతే ॥12॥

పైన చెప్పిన ద్వాదశారచక్రాన్ని, నామాధికరణాన్ని పసుపుతో గోడపైగాని, పీటపై గాని, శిలాపట్టం పై గాని వ్రాయాలి. ఇలా చేస్తే శత్రువుకు ముఖస్తంభం, గమనస్తంభం, సైన్యాధిపత్య స్తంభం కలుగుతుంది.

విషరక్తేన సంలిఖ్య శ్మశానే కర్పటే బుధః ।
షట్కోణం దండమాక్రాంతం సమంతాచ్ఛక్తియోజితమ్ ॥13॥

శ్మశానవస్త్రంపై విషంతో కలిపిన రక్తంతో సాధకుడు షట్కోణచక్రం వ్రాసి దాని మధ్య శత్రువు పేరు వ్రాయాలి. చక్రం నలువైపుల శక్తిబీజాలు వ్రాసి దానిపై దండం ఉంచాలి.

మారయేదచిరాదేష శ్మశానే నిహతం రిపుమ్ ।
ఛేదం కరోతి రాష్ట్రస్య చక్రమధ్యే న్యసేద్రిపుమ్॥14॥

శ్మశానభూమిపై ఉంచిన ఆ శత్రుస్వరూపంపై శీఘ్రంగా దండప్రహారం చేస్తే శత్రురాజు యొక్క రాజ్యం ధ్వంసమైపోతుంది. చక్రాకారమండలం వ్రాసి దాని మధ్యభాగంలో శత్రువు పేరు లిఖించాలి.

చక్రధారాం గతాం శక్తిం రిపునామ్నా రిపుం హరేత్ ।
తార్క్ష్యేణైవ తు బీజేన ఖడ్గమధ్యే తు లేఖయేత్ ॥15॥

చక్రధారలయందు శక్తిబీజన్యాసం చేసి శత్రువు పేరు ఉచ్చరిస్తూ చక్రధారతో వాటిని కొట్టినట్లు భావిస్తే శత్రువు నశిస్తాడు. ఖడ్గ మధ్యభాగంలో గరుడ మంత్రబీజంతో శత్రువు పేరు వ్రాయాలి.

విదర్భరిపునామాథ శ్మశానాంగారలేఖితమ్ ।
సప్తాహాత్సాధయేద్దేశం తాడయేత్ప్రేతభస్మనా ॥16॥

దానిని దర్భలతో మార్జనం చేయాలి. పేరు వ్రాయడానికి శ్మశానంలోని బొగ్గును ఉపయోగించాలి. దానిని చితాభస్మంతో ప్రహారం చేయాలి. ఇలా చేసిన సాధకుడు ఏడురోజులలో శత్రువుయొక్క దేశాన్ని జయిస్తాడు.

భేదనే ఛేదనే చైవ మారణేషు శివో భవేత్ ।
తారకం నేత్రముద్దిష్టం శాంతిపుష్టౌ నియోజయేత్ ॥17॥

భేదన, ఛేదన, మారణ క్రియలలో అతడు శివునిలా శక్తిమంతుడవుతాడు. తారకానికి (ఫట్) నేత్రం అని పేరు. దీనిని శాంతి, పుష్టికర్మలలో వినియోగించాలి.

దహనాదిప్రయోగోఽయం శాకినీం చైవ కర్షయేత్ ।
మేధ్యాదివారుణీం యావద్వక్రతుండసమన్వితః ॥18॥

కుష్ఠాద్యా వ్యాధయో యే తు నాశయేత్తాన్న సంశయః ।
మధ్యాది ఉత్తరాంతం తు కరాలీబంధనాజ్జపేత్ ॥19॥

ఈ దహనాది ప్రయోగం శాకినిని కూడా ఆకర్షిస్తుంది. పైన చెప్పిన తొమ్మిది చక్రాలలో మధ్యన ఉన్న మంత్రాక్షరం మొదలు పశ్చిమ దిక్కున ఉన్న రెండక్షరాలను " వక్రతుండ" మంత్రాలతో జపించడం వల్ల కుష్ఠాది చర్మరోగాలన్నీ నశిస్తాయి. ఇందు సందేహం లేదు. మధ్యకోష్ఠం నుంచి ఉత్తరకోష్ఠం వరకు ఉన్న రెండక్షరాల మంత్రాలను కరాలీబంధంతో జపించాలి.

రక్షయేదాత్మనో విద్యాం ప్రతివాదీ సదాశివ ః ।
వారుణ్యాది తతో న్యస్య జ్వరక్లేశవినాశనమ్ ॥20॥

అప్పుడు ఆ ద్వ్యక్షరీవిద్య సాక్షాత్తు శివుడే ప్రతివాదిగా ఉన్నా, రక్షణను ఇస్తుంది. పశ్చిమంలో ఉన్న మంత్రాక్షరాన్ని మొదట ఉంచి, ఉత్తరకోష్ఠం వరకు ఉన్న మంత్రాక్షరాలతో 'వక్రతుండ' మంత్రాలతో జపిస్తే జ్వరం, క్లేశం నశిస్తాయి.

సౌమ్యాది మధ్యమాంతం తు గురుత్వం జాయతే వటే ।
పూర్వాది మధ్యమాంతం తు లఘుత్వం కురుతే క్షణాత్ ॥21॥

ఉత్తరకోష్ఠం మొదలు మధ్యకోష్ఠం వరకు ఉన్న మంత్రాక్షరాలను జపిస్తే, వటబీజంలో కూడా గురుత్వాన్ని కలిగించవచ్చు. పూర్వ(తూర్పు) కోష్ఠం మొదలు మధ్యకోష్ఠం వరకు ఉన్న మంత్రాక్షరాలను జపిస్తే వెంటనే లఘుత్వాన్ని కలిగించవచ్చు.

భూర్జే రోచనయాఽలిఖ్య ఏతద్వజ్రాకులం పురమ్ ।
క్రమస్థైర్మంత్రబీజైస్తు రక్షాం దేహేషు కారయేత్ ॥22॥

భూర్జపత్రంపై గోరోచనంతో వజ్రవ్యాప్తమైన భూపురచక్రాన్ని నిర్మించి, మంత్రబీజాలతో క్రమంగా వ్రాసి దానిని ధరిస్తే శరీరరక్ష కలుగుతుంది.

వేష్టితాం భావహేమ్నా చ రక్షేయం మృత్యునాశినీ ।
విఘ్నపాపారిదమనీ సౌభాగ్యాయుఃప్రదా ధృతా ॥23॥

దానిని సువర్ణం చుట్టి ధరిస్తే ఆ రక్షాయంత్రం మృత్యువును రానీకుండా చేస్తుంది. విఘ్నాలను, పాపాలను శత్రువులను అణచివేసి సౌభాగ్యాన్ని, దీర్ఘమైన ఆయుష్షును ప్రసాదిస్తుంది.

ద్యూతే రణే చ జయదా శక్రసైన్యే న సంశయః ।
వంధ్యానాం పుత్ర దాహ్యేషా చింతామణిరివాపరా ॥24॥

జూదమునందు, రణమునందు జయాన్ని చేకూరుస్తుంది. ఇంద్రునిసేనతో యుద్ధం చేయవలసి వచ్చినా విజయాన్ని సమకూరుస్తుంది. సందేహించవలసిన అవసరం లేదు. వంధ్య స్త్రీలకు దోషం తొలగించి పుత్రులను ఇస్తుంది. ఇది మరో చింతామణి వంటిది.

సాధయేత్పరరాష్ట్రాణి రాజ్యం చ పృథివీం జయేత్ ।
ఫట్ స్త్రీం క్షేం హ్రూం లక్షజప్యాద్యక్షాదిర్వశగో భవేత్ ॥25॥

పరరాష్ట్రాలపై అధికారాన్ని పొందుతాడు. రాజ్యాన్ని, భూమిని, జయిస్తాడు. "ఫట్, స్త్రీం, క్షేం, హ్రూం అను మంత్రాన్ని లక్షసార్లు జపిస్తే యక్షులు మున్నగువారు కూడ వశమవుతారు.

ఇత్యాది మహాపురాణే ఆగ్నేయే త్వరితావిద్యాసిద్ధికథనం నామ ద్వాదశాధికత్రిశతతమోఽధ్యాయః ॥312॥

అగ్నిమహాపురాణంలో త్వరితావిద్యాసిద్ధికథనం అనే మూడువందల పన్నెండవ అధ్యాయం సమాప్తం.

త్రయోదశాధికత్రిశతతమోఽధ్యాయః – మూడువందల పదమూడవ అధ్యాయం

నానామంత్రాః – అనేకవిధాలైన మంత్రాలు

అగ్నిరువాచ – అగ్ని ఇలా పలికాడు.

ఓం వినాయకార్చనం వక్ష్యే యజేదాధారశక్తికమ్ ।
ధర్మాద్యష్టకకందం చ నాలం పద్మం చ కర్ణికామ్ ॥1॥

కేసరం త్రిగుణం పద్మం తీవ్రం చ జ్వలినీం యజేత్ ।
నందాం చ సుయశాం చోగ్రాం జీవంతీం వింధ్యవాసినీమ్ ॥2॥

('జీవంతీం – తేజోవతీం' అనేది పాఠాంతరం. అలాగే విఘ్ననాశినీమ్" అని పాఠాంతరం.)

ఇపుడు వినాయకుని అర్చనను చెబుతాను. ముందుగా ఆధారశక్తిని పూజించాలి. పిదప యోగపీఠంపై ఆగ్నేయాది విదిక్కులందు, పూర్వాది దిక్కులందు ధర్మం, జ్ఞానం, వైరాగ్యం, ఐశ్వర్యం, అధర్మం, అజ్ఞానం, అవైరాగ్యం, అనైశ్వర్యం అనే వాటిని పూజించాలి. తరువాత కందం, నాలం, పద్మం, కర్ణిక, కేసరాలను, సత్త్వాది మూడు గుణాలను, పద్మాసనాన్ని పూజించాలి. ఆ తరువాత తీవ్రా, జ్వాలిని, నంద, సుయశ(భోగద), (చకారంవల్ల) కామరూపిణి, ఉగ్ర, తేజోవతి, సత్య, విఘ్ననాశిని అనే తొమ్మిది శక్తులను పూజించాలి.

గణమూర్తిం గణపతిం హృదయం స్యాద్గణంజయః ।
ఏకదంతోత్కటశిరః శిఖాయాచలకర్ణినే ॥3॥

గజవక్త్రాయ కవచం హ్రూం (హ్రుం) ఫడంతం తథాఽష్టకమ్ ।
మహోదరో దండహస్తః పూర్వాదౌ మధ్యతో యజేత్ ॥4॥

ఆ తరువాత గణేశమూర్తిని, మూర్తి లభించనిచో ధ్యానంలో చెప్పబడే రీతిలో గణపతిమూర్తిని పూజించి, హృదయాద్యంగన్యాసాలు చేయాలి. ఆ అంగన్యాస ప్రయోగవాక్యాలు ఇలా ఉంటాయి. "గణం జయాయ హృదయాయ నమః, ఏకదంతాయ ఉత్కటాయ శిరసే స్వాహా, అచలకర్ణినే శిఖాయై వషట్, గజవక్త్రాయ హుం ఫట్, కవచాయ హుం, మహోదరాయ దండహస్తాయ అస్త్రాయ ఫట్" అను ఈ అయిదు అంగాలలో నాలుగింటిని నాలుగు దిక్కులందు, అయిదో దానిని మధ్యభాగమునందు పూజించాలి.

జయో గణాధిపో గణనాయకోఽథ గణేశ్వరః ।
వక్రతుండ ఏకదంతోత్కటలంబోదరో గజః ॥5॥

వక్త్రో వికటనామాఽథ హ్రూం పూర్వో విఘ్ననాశనః ।
ధూమ్రవర్ణో మహేంద్రాద్యో బాహ్యే విఘ్నేశపూజనమ్ ॥6॥

పిదప గణంజయ, గణాధిప, గణనాయక, గణేశ్వర, వక్రతుండ, ఏకదంత, ఉత్కట, లంబోదర, గజవక్త్ర, వికటాననులను పద్మదళాలపై పూజించాలి. తరువాత మధ్యభాగంలో "హ్రూం (హూం) విఘ్ననాశనాయ నమః, మహేంద్రాయ ధూమ్రవర్ణాయ నమః" అని ఉచ్చరిస్తూ విఘ్ననాశన ధూమ్రవర్ణులను, మహేంద్రాదులను పూజించాలి. (లేదా తూర్పు మున్నగు దిక్కుల యందు వాటిని పూజించాలి. బాహ్యప్రదేశంలో విఘ్నేశ్వరుని పూజించాలి.

త్రిపురాయజనం వక్ష్యే అసితాంగో రురుస్తథా ।
చండః క్రోధస్తథోన్మత్తః కపాలీ భీషణః క్రమాత్ ॥7॥

సంహారో భైరవో బ్రాహ్మీ ముఖ్యా హ్రస్వాస్తు భైరవా ః ।
బ్రహ్మాణీ షణ్ముఖా దీర్ఘా అగ్న్యాదౌ వటుకాః క్రమాత్ ॥8॥

ఇపుడు త్రిపురాభైర(వ)వీ పూజనవిధిని చెబుతాను. అసితాంగ భైరవ, రురు, చండ, క్రోధ, ఉన్మత్త, కపాలి, భీషణ సంహారభైరవులు అని వారి పేర్లు. బ్రాహ్మి మున్నగు మాతృకలను కూడ పూజించాలి. అకారాది హ్రస్వస్వరాల బీజాన్ని ఆదిలో ఉంచి భైరవుల పూజచేయాలి. బ్రాహ్మ్యాది మ్యాతృకలను ఆకారాది దీర్ఘస్వరాల బీజాన్ని ఆదిలో ఉంచి పూజచేయాలి. ఆగ్నేయాది దిక్కులందు వటుకులను పూజించాలి.

(వి ॥ బ్రాహ్మి, మాహేశ్వరి, కౌమారి, వైష్ణవి, వారాహి, ఇంద్రాణి, చాముండ, మహాలక్ష్మి అనే వారు మాతృకలు.)

సమయపుత్రో బటుకో యోగినీపుత్రకస్తథా ।
సిద్ధిపుత్రశ్చ బటుకః కులపుత్రశ్చతుర్థక ః ॥9॥

సమయపుత్రవటుక, యోగినీపుత్రవటుక, సిద్ధిపుత్రవటుక, కులపుత్రవటుక – అని నలుగురు వటుకులు (బటుకులు).

హేతుకః క్షేత్రపాలశ్చ త్రిపురాంతో ద్వితీయకః ।
అగ్నివేతాలోఽగ్నిజిహ్వః కరాలీకాలలోచనః ॥10॥

ఏకపాదశ్చ భీమాక్ష ఐం క్షేం ప్రేతస్తథాఽఽసనమ్ ।
ఓం ఐం హ్రీం ద్యౌశ్చ త్రిపురా పద్మాసనసమాస్థితా ॥11॥

తరువాత హేతుక , త్రిపురాంత, అగ్నివేతాల, అగ్నిజిహ్వ, కరాల, కాలలోచన, ఏకపాద, భీమాక్షులనే ఎనమండుగురు క్షేత్రపాలకులను పూజించాలి. పిదప త్రిపురాదేవి యొక్క ప్రేతరూప పద్మాసనాన్ని పూజించాలి. ఐం క్లేం (క్లేం) ప్రేతపద్మాసనాయ నమః, ఓం ఐం హ్రీం ద్యౌః త్రిపురాయై ప్రేతపద్మాసనస్థితాయై నమః, అనే మంత్రంతో ప్రేతపద్మాసనం పై ఉన్న త్రిపురాభైరవిని పూజించాలి.

బిభ్రత్యభయపుస్తం చ వామే వరద మాలికామ్ ।
మూలేన హృదయాది స్యాజ్జాలపూర్ణం చ కార్ముకమ్ ॥12॥

త్రిపురాదేవి వామహస్తములందు అభయముద్ర, పుస్తకములను, దక్షిణహస్తములందు వరదముద్ర, జపమాలను ధరించి ఉంటుంది. బాణసమూహంతో నిండిన అంబుల పొదిని, ధనుస్సును ధరించి ఉంటుంది. మూలమంత్రంతో హృదయాదిన్యాసం చేయాలి.

గోమధ్యే నామ సంలిఖ్య చాష్టపత్రే చ మధ్యతః ।
శ్మశానాదిపటే శ్మశానంగారేణ విలేఖయేత్ ॥13॥

చితాంగారపిష్టకేన మూర్తిం ధ్యాత్వా తు తస్య చ ।
క్షిప్త్వోదరే నీలసూత్రైర్వేష్ట్య చోచ్చాటనం భవేత్ ॥14॥

గోగణం యొక్క మధ్యలో నిలిచి శ్మశానంలో ఉపయోగించే వస్త్రంపై చితిలోనే, శ్మశానంలోని బొగ్గుతోనే మధ్యలో అష్టదళకమలచక్రాన్ని వ్రాయించాలి. శత్రువుపేరును వ్రాసి మడతపెట్టి చితాభస్మంతో శత్రుమూర్తిని నిర్మించి, అతడు దానియందు ఉన్నట్లు భావన చేసి పైన చెప్పిన యంత్రాన్ని నల్లటి దారంతో చుట్టి, ఆ మూర్తి పొట్టలో దూర్చాలి. అపుడు ఆవ్యక్తి నశిస్తాడు.

"ఓం నమో భగవతి జ్వాలామాలిని గృధ్రగణపరివృతే స్వాహా ॥15॥

యుద్ధే గచ్ఛన్ జపన్మంత్రం పుమాన్ సాక్షాజ్జయో భవేత్ ॥16॥

"ఓం నమో భగవతి జ్వాలామాలిని గృధ్రగణపరివృతే స్వాహా" అనే జ్వాలామాలినీ మంత్రాన్ని జపిస్తూ యద్ధభూమికి వెళ్లేవానికి జయం చేకూరుతుంది.

"ఓం శ్రీం హ్రీం క్లీం శ్రియై నమః" ॥17॥

ఉత్తరాదౌ చ ఘృణినీ సూర్యా పూజ్యా చతుర్దలే ।
ఆదిత్యా ప్రభావతీ చ సోమాత్రి మధురాచ్ఛ్రియః ॥18॥

"ఓం శ్రీం హ్రీం క్లీం శ్రియైనమః" అనే శ్రీమంత్రంతో నాలుగు దళాలున్న పద్మంపై ఉత్తరదిక్కునుండి మొదలుకొని క్రమంగా ఘృణిని, సూర్య, ఆదిత్య, ప్రభావతి అనే నలుగురు శ్రీదేవులను పూజించి, మంత్రాన్ని జపిస్తే పర్వతమంత సంపదను పొందుతారు.

"ఓం హ్రీం గౌర్యై నమః" ॥19॥

గౌరీమంత్రః సర్వకరో హోమాద్ధ్యానాజ్జపార్చనాత్ ।
రక్తా చతుర్భుజా పాశవరదా దక్షిణే కరే(పరే) ॥20॥

అంకుశాభయయుక్తాం తాం ప్రార్థ్య సిద్ధాత్మనా పుమాన్ ।
జీవేద్వర్షశతం ధీమాన్న చౌరారిభయం భవేత్ ॥21॥

"ఓం హ్రీం గౌర్యై నమః" అనేది గౌరీ మంత్రం. ఈ మంత్రంతో జపం, హోమం, ధ్యానం, అర్చనం చేసేవానికి సమస్తం లభిస్తుంది. గౌరీదేవి శరీరకాంతి అరుణం. నాలుగు భుజాలతో ఉంటుంది. కుడివైపు చేతులలో పాశం, వరదముద్ర ఉంటాయి. ఎడమవైపు చేతులలో అంకుశం, అభయముద్ర ఉంటాయి. శుద్ధచిత్తంతో గౌరీదేవిని ప్రార్థించే సాధకుడు నూరు సంవత్సరాలు జీవిస్తాడు. చక్కని బుద్ధిమంతుడవుతాడు. వానికి దొంగలవల్ల శత్రువుల వల్ల భయం ఉండదు.

క్రుద్ధః ప్రసాదీ భవతి యుధి మంత్రాంబుపానతః ।
అంజనం తిలకం వశ్యే (వశ్యో) జిహ్వాగ్రే కవితా భవేత్ ॥22॥

ఈ మంత్రంతో అభిమంత్రించిన ఉదకాన్ని త్రాగితే, వానిపై ఎక్కువ కోపం కలవాడు కూడ ప్రసన్నుడయిపోతాడు. ఈ మంత్రంతో కాటుక, తిలకం ధరిస్తే వశీకరణసిద్ధి లభిస్తుంది. జిహ్వపై ఈ మంత్రాన్ని వ్రాస్తే కవితాశక్తి లభిస్తుంది.

తజ్జపాన్మైథునం వశ్యే తజ్జపాద్యోనివీక్షణమ్ ।
స్పర్శాద్వశీ తిలహోమాత్సర్వం చైవ తు సిద్ధ్యతి ॥23॥

ఈ మంత్రాన్ని జపించడం వల్ల స్త్రీ పురుషులు పరస్పరం వశులవుతారు. ఈ మంత్రజపం వల్ల సూక్ష్మయోనులను కూడ చూడవచ్చు. స్పర్శచేసినంత మాత్రంచేతనే మనుష్యులు వశులవుతారు. ఈ మంత్రంతో తిలహోమం చేస్తే సర్వమనోరథాలు సిద్ధిస్తాయి.

సప్తాభిమంత్రితం చాన్నం భుంజంస్తస్య శ్రియః సదా ।
అర్ధనారీశరూపోఽయం లక్ష్మ్యాదివైష్ణవాదికః ॥24॥

ఈ మంత్రంతో ఏడు పర్యాయాలు అభిమంత్రించి అన్నాన్ని భుజిస్తే వాని వద్ద సమస్తసంపదలు ఉంటాయి. దీని ప్రారంభంలో లక్ష్మీ బీజమైన "శ్రీం" ని, వైష్ణవ బీజమైన "క్లీం" ని చేరిస్తే అర్ధనారీశ్వరమంత్రం అవుతుంది.

అనంగరూపా శక్తిశ్చ ద్వితీయా మదనాతురా ।
పవన వేగా భువనపాలా వై సర్వసిద్ధిదా ॥25॥

అనంగమదనానంగమేఖలాం తం జపేచ్ఛ్రియే॥

అనంగరూప, మదనాతుర (రెండోది), పవనవేగ, భువనపాల, సర్వసిద్ధిద, అనంగమదన, అనంగమేఖల – ఇవి శక్తులు. ఈ నామమంత్రాలు జపించడం వల్ల లక్ష్మి సిద్ధిస్తుంది.

పద్మమధ్యదలేషు హ్రీం స్వరాన్ కాదీంస్తతః స్త్రియాః ॥26॥

షట్కోణే వా ఘటే వాఽథ లిఖిత్వా స్యాద్వశీకరమ్ ।

కమలదళాలపై 'హ్రీం' ని, స్వరాలను, క మున్నగుహల్లులను వ్రాసి, వాటి మధ్య అభీష్ట స్త్రీనామాన్ని వ్రాయాలి. షట్కోణచక్రంపై గాని, కలశంపైన కూడ వ్రాయవచ్చు. ఆ స్త్రీని ఉద్దేశించి జపం చేస్తే ఆమె వశీకరణ అవుతుంది.

ఓం హ్రీం ఘూం (ఐం) నిత్యక్లిన్నే మదద్రవే । ఓం ఓమ్ ॥27॥

మూలమంత్రః షడంగోఽయం రక్తవర్ణే త్రికోణకే ।
ద్రావణీ హ్లాదకారిణీ క్షోభిణీ గురుశక్తికా ॥28॥

ఓం హ్రీం ఘూం (ఐం) నిత్య క్లిన్నే మదద్రవే ఓం ఓం " అనేది ఆరు అంగాల నిత్యక్లిన్నా మూలమంత్రం. ఎర్రని త్రికోణచక్రంపై అష్టదళపద్మాన్ని భావించి దానిపై పూర్వాది దిక్కులందు ద్రావిణి, హ్లాదకారిణి, క్షోభిణి, గురుశక్తిని పూజించాలి.

ఈశానాదౌ చ మధ్యే తాం నిత్యాం పాశాంకుశౌ తథా ।
కపాలకల్పకతరుం వీణా రక్తా చ తద్వతీ ॥29॥

ఈశానాది కోణములందు వామ, జ్యేష్ఠ, అపర, రౌద్రి అనే శక్తులను పూజించాలి. ఇవి మొత్తం ఎనిమిది శక్తులు. వాటిని ఈశానాది దిక్కులందు పూజించాలి. మధ్యలో దేవీధ్యానం ఈ విధంగా చేయాలి. రక్తవర్ణ వస్త్రాభరణాలు ధరించిన, తన రెండు చేతులలో పాశం, అంకుశం ధరించి, మరో రెండు చేతులలో కపాలం, కల్పతరువు ధరించిన, వీణాధారి అయిన దేవిని ధ్యానించాలి.

నిత్యాఽభయా మంగళా చ నవవీరా చ మంగలా ।
దుర్భగా మనోన్మనీ పూజ్యా ద్రావా పూర్వాదితః స్థితా ॥30॥

నిత్య, అభయ, మంగళ, నవవీర, సుమంగళ, దుర్భగ, మనోన్మని, ద్రావ అనే ఎనమండుగురు దేవతలను తూర్పు మొదలు దిక్కులందు కమలదళాలపై పూజించాలి.

ఓం హ్రీం అనంగాయ నమః । ఓం హ్రీం స్మరాయ నమః ॥31॥

మన్మథాయ చ మారాయ కామాయైవం చ పంచధా ।
కామాః పాశాంకుశౌ చాపబాణా ధ్యేయాశ్చ బిభ్రతః॥32॥

ఓం హ్రీం అనంగాయ నమః, ఓం హ్రీం స్మరాయ నమః, ఓం హ్రీం మన్మథాయ నమః, ఓం హ్రీం మారాయ నమః, ఓం హ్రీం కామాయ నమః అనే అయిదుగురు కామదేవులను బాహ్యభాగంలో ఐదు దళాలపై పూజించాలి. కామదేవుల చేతులలో పాశం, అంకుశం, చాపం, బాణాలు ఉన్నట్లు ధ్యానించాలి.

రతిశ్చ విరతిః ప్రీతి ర్విప్రీతిశ్చ మతిర్ధృతిః ।
విధృతిః పుష్టిరేభిశ్చ క్రమాత్కామాదికైర్యుతాః ॥33॥

వీటి బాహ్యాభాగంలో పదిదళాలపై క్రమంగా రతి, విరతి, ప్రీతి, విప్రీతి, మతి, దుర్మతి, ధృతి, విధృతి, తుష్టి(పుష్టి), విపుష్టి, అనే ఐదు కామవల్లభలను పూజించాలి.

ఓం ఛం నిత్యక్లిన్నే మదద్రవే ఓం ఓం అ ఆ ఇ ఈ ఉ ఊ ఋ ౠ ఌ ౡ ఎ ఐ ఓ ఔ అం అః క ఖ గ ఘ ఙ చ ఛ జ ఝ ఞ ట ఠ డ ఢ ణ త థ ద ధ న ప ఫ బ భ మ య ర ల వ శ ష స హ క్ష ఓం ఛం నిత్య క్లిన్నే మదద్రవే స్వాహా ॥34॥

"ఓం ఛం నిత్య క్లిన్నే మదద్రవే ఓం ఓం "మొదలు" ఓం ఛం నిత్యక్లిన్నే మదద్రవే స్వాహా" అనే వరకు మూలోక్తమైన నిత్యక్లిన్నా విద్య. ఇందు " ఓం ఛూం" అని "ఓం ఐం" అని పాఠాంతరాలు ఉన్నాయి.

ఆధారశక్తిం పద్మం చ సింహే దేవీం హృదాదిషు ।
ఓం హ్రీం గౌరి రుద్రదయితే యోగేశ్వరి హ్రూం ఫట్ స్వాహా ॥35॥

సింహాసనం పై ఆధారశక్తిని, పద్మాన్ని పూజించి దాని దళాలపై హృదయాద్యంగన్యాసం చేసి పూజించి, అనంతరం మధ్యకర్ణికలో దేవీపూజ చేయాలి. "ఓం హ్రీం గౌరి రుద్రదయితే యోగేశ్వరి హూం ఫట్ స్వాహా" అనేది గౌరీమంత్రం.

ఇత్యాది మహాపురాణే ఆగ్నేయే నానామంత్రకథనం నామ త్రయోదశాధిక త్రిశతతమోఽధ్యాయః ॥313॥

అగ్నిమహాపురాణంలో అనేక విధాలైన మంత్రాలు అనే మూడువందల పదమూడవ అధ్యాయం సమాప్తం.



చతుర్దశాధికత్రిశతతమోऽధ్యాయః – మూడువందల పదునాల్గవ అధ్యాయం

త్వరితామంత్రకథనమ్ – త్వరితామంత్రకథనం

అగ్నిరువాచ – అగ్ని ఇలా వచించాడు.

"ఓం హ్రీం హ్రూం ఖే ఛే క్షః స్త్రీం హ్రూం క్షేం హ్రీం ఫట్ త్వరితాయై నమః ॥1॥

త్వరితాం పూజయే న్న్య స్య ద్విభుజాం చాష్టబాహుకామ్ ।
ఆధారశక్తిం పద్మం చ సింహే దేవీం హృదాదికమ్ ॥2॥

"ఓం హ్రీం హ్రూం ఖే ఛే (చచ్ఛే) క్షః స్త్రీం హ్రూం క్షే హ్రీం ఫట్ త్వరితాయై నమః" అనే మంత్రంతో న్యాసపూర్వకంగా ద్విభుజ లేదా అష్టభుజ అయిన త్వరితాదేవిని పూజించాలి. ఆధారశక్తిని, అష్టదళకమలాన్ని, సింహాసనంపై విరాజిల్లుతున్న త్వరితాదేవిని, హృదయాద్యంగాలను పూజించాలి.

పూర్వాదౌ గాయత్రీం యజేన్మండలే వై ప్రణీతయా ।
హుంకారాం ఖేచరీం చండాం ఛేదనీం క్షేపణీం స్త్రియాః ॥3॥

హూంకారీం క్షేమకారీం చ ఫట్కారీం మధ్యతో యజేత్ ।
జయాం చ విజయాం ద్వారి కింకరం చ తదగ్రతః ॥4॥

పూర్వాది దిక్కులయందు హృదయాద్యంగాలను పూజించి, మండలంలో ప్రణీతావిద్య ద్వారా (ప్రణీతను) గాయత్రీదేవిని పూజించాలి. ఎనిమిది దళాలపై హుంకారి, ఖేచరి, చండ, ఛేదని, క్షేపణి, స్త్రీలను, హూంకారిని, క్షేమంకరిని పూజించి, మధ్యలో ఫట్కారిని ఆరాధించాలి. దక్షిణ వామపార్శ్వాలలో జయ విజయలను, ద్వారాగ్రభాగంలో కింకరుని పూజించాలి.

తిలై ర్హోమైశ్చ సర్వాప్త్యై నామవ్యాహృతిభిస్తథా ।
అనంతాయ నమః స్వాహా కులికాయ నమః స్వాహా (స్వధా) ॥5॥

స్వాహా వాసుకిరాజాయ శంఖపాలాయ వౌషట్ ।
తక్షకాయ వషణ్నిత్యం మహాపద్మాయ వై నమః ॥6॥

స్వాహా కర్కోటనాగాయ ఫట్ పద్మాయ చ వై నమః ।

తిలలతో హోమాలు చేస్తే సకలాభీష్టాలు సిద్ధిస్తాయి. దేవికి అలంకారాలుగా వున్న ఎనిమిది నాగులను "అనంతాయ నమః స్వాహా, కులికాయ నమః స్వధా, వాసుకి రాజాయ స్వాహా, శంఖపాలాయ వౌషట్, తక్షకాయ వషట్, మహాపద్మాయ నమః, కర్కోటనాగాయ స్వాహా, పద్మాయ నమః ఫట్" అనే మంత్రాలతో పూజించాలి.

లిఖేన్నిగ్రహచక్రం తు ఏకాశీతిపదైర్నరః ॥7॥

వస్త్రే పదే తనౌ భూర్జే శిలాయాం యష్టికాసు చ ।
మధ్యే కోష్ఠే సాధ్యనామ పూర్వాదౌ పట్టికాసు చ ॥8॥

పది నిలువురేఖలు, పది అడ్డరేఖలు గీస్తే ఎనభైయొక్క పదాలు ఏర్పడతాయి. ఇది నిగ్రహచక్రం. సాధకుడు దానిని వస్త్రంపై కాని, వేదికపై కాని, భూర్జవృక్షంయొక్క త్వక్కుపై కాని, శిలాపట్టంపై కాని, యష్టికలపై కాని వ్రాయవచ్చు. మధ్యలో నున్న కోష్ఠంపై తాను సాధించదలచుకొన్న (శత్రువు) పేరు వ్రాయాలి. దాని పార్శ్వభాగంలో పూర్వాది దిక్కులయందు నాలుగు పట్టికలపైన

(ఓం) భ్రూం క్రూం ఛ్రూం ప్రూం ఛంద చ్ఛంద చతురః కంఠకాం కాలరాత్రికామ్ ।
ఐశాదావంబు (వశు) పాదౌ చ యమరాజ్యం చ బాహ్యతః ॥9॥

"భ్రూం క్రూం ఛ్రూం ప్రూం అనే నాలుగు బీజాలు వ్రాసి "ఛంద ఛంద" అని లిఖించి ఈశానాది కోణాలలో లోపలివైపున కాలరాత్రిమంత్రాన్ని వ్రాసి, బయట వైపున యమరాజమంత్రాన్ని వ్రాయాలి.

కాలీ మార రమాలీకా లీనమోక్ష క్షమోనలీ ।
మామోదేత తదేమోమా రక్షతత్వ త్వతక్షర ॥10॥
యమావాట టవామాయ మోట మోట టమోటమా ।
వామో భూరి రిభూమోవా ట ట రీత్వ త్వరీ టట॥11॥

"కాలీ"....మొదలు " క్షర" వరకు ఉన్న మంత్రం మూలోక్తమైన కాలీమంత్రం. " యమా" మొదలుకొని "టట" వరకు ఉన్న మూలోక్తమంత్రం యమమంత్రం.

(ఈ మంత్రక్షరాలలో చాలా పాఠభేదాలు ఉన్నాయి. అటు నుంచి ఇటు చదివినా, ఇటు నుంచి అటు చదివినా అక్షరాలు సమానంగా ఉన్నాయి. కావున ఈ మంత్రాక్షరాలనే ప్రమాణంగా స్వీకరించడం జరిగింది.)

యమరాజ్యాద్బాహ్యతో రం తం తోయం మారణాత్మకమ్ ।
కజ్జలం నింబనిర్యాస మజ్జాసృగ్విషసంయుతమ్ ॥12॥
అంగారేణ సమాయుక్తం పింగలాధారసంయుతమ్ ।
కాకపక్షస్య లేఖాన్యా శ్మశానే వా చరుష్పథే ॥13॥
నిధాపయేత్కుండాదధస్తా ద్వల్మీకే వాఽథ నిక్షిపేత్ ।
విభీతద్రుమశాఖాధో యంత్రం సర్వారిమర్దనమ్ ॥14॥

యమమంత్రం బయట నాలుగువైపుల వ్రాసి, దానిక్రింద యం వ్రాయాలి. ఇది మారణాత్మక నిగ్రహమంత్రం అవుతుంది. కాటుక వేపచిగురు, మజ్జ, రక్తం, విషం కలిపిన సిరాలో(మసితో)కొంచెం చితికి సంబంధించినబొగ్గును నూరి, కలిపి, దానిని పింగళవర్ణమైన సిరాబుడ్డితో ఉంచి, కాకి ఈక కలంతో నిగ్రహమంత్రం వ్రాసి, దానిని శ్మశానంలో కాని, చతుష్పథంలో కాని(నాలుగు కుడలుల మధ్యభాగంలో కాని.)గోతిలో క్రింద పాతాలి.లేదా పుట్ట యందు ఉంచాలి. లేదా విభీతికద్రుమశాఖక్రింద యంత్రాన్ని పాతాలి. అలా చేయడం వల్ల శత్రువులందరునశిస్తారు.

లిఖేచ్చానుగ్రహం చక్రం శుక్లపక్షేఽథ భూర్జకే
లాక్షయా కుంకుమేనాథ ఖటికాచందనేన వా ॥15॥

శుక్లపక్షంలో భూర్జపత్రంపై లాక్షారసంతోకాని, కుంకుమతో కాని ఖటికాచందనంతో కాని అనుగ్రహచక్రం వ్రాయాలి.

భువి భిత్తౌ చ పూర్వాది నామ మధ్యమకోష్ఠకే ॥
ఖండేందు (తు) వారిమధ్యస్థమో జూంనో వాపి షట్టిశమ్ (ఘట్టిగమ్) ॥16॥

లక్ష్మీ శ్లోకం శివాదౌ చ రక్షాసాది క్రమాల్లిఖేత్॥

దీనిని నేలపై కాని, గోడపై కాని వ్రాయవచ్చు. మధ్యకోష్ఠంలో సాధ్యవ్యక్తి పేరు "ఠం ఠం " అనే అక్షరాల మధ్య వ్రాయాలి. పూర్వాది వీథియందు "జూం సః వషట్" అని వ్రాయాలి. ఈశానాది కోణాల నుంచి ప్రారంభించి వీథులను విడిచివేస్తూ, ఆగ్నేయకోణపర్యంతం లక్ష్మీమంత్రం వ్రాయాలి. ఇది పై నాలుగు పంక్తులలో పూర్తి అవుతుంది. క్రింది నాలుగు వరుసలలో, అన్నింటికంటె క్రింద నున్న నైరృతికోణంలో ఉన్న కోష్ఠంలో ప్రారంభించి, కుడిపంక్తి తరువాత పై పంక్తి కూడ ఎడమ నుంచి కుడికి వ్రాయాలి. ఈ విధంగా నాలుగుపంక్తులలో లక్ష్మీమంత్రం పూర్తి అవుతుంది.

శ్రీః సా మా యా యా మా సా శ్రీః సా నో యా జ్ఞే జ్ఞేయా నౌ సా ॥17॥

మాయా లీలా లా లీ యా మా యజ్ఞేలాలీ లాలీ జ్ఞేయా ।

ఆ మంత్రం ఈ ప్రకారంగా ఉంటుంది. "శ్రీః సా" మొదలుకొని "జ్ఞేయా" వరకు ఉన్న ఈ మంత్రం మూలోక్తమైన అనుగ్రహమంత్రం.

యత్ర జ్ఞేయా బహిః శీఘ్రా దిక్షురం కలశం బహి ః ॥
(లీలా యత్ర షడుక్తా బహిః శీఘ్రాం దిక్షు చల కలశం వహ్నిః ॥18॥

పద్మస్థం పద్మచక్రం చ మృత్యుజిత్స్వర్గగం ధృతిమ్ ।
శాంతీనాం పరమా శాంతిః సౌభాగ్యాదిప్రదాయకమ్ ॥19॥

చక్రం యొక్క వెలుపలివైపు నాలుగువైపుల త్వరితామంత్రాన్ని ప్రతిదిక్కు నందు వ్రాయాలి. ఈ చతురస్రచక్రాన్ని గోళ్ల రేఖతో, ఆది కలశంలోకి వెళ్లేటట్లు చుట్టి, కలశం క్రింద ఒక కమలం ఏర్పరచి దానిపై కమలాన్ని స్థాపించాలి. కమలం పై స్థాపించిన పద్మచక్రాన్ని ధరిస్తే మృత్యువు తొలగుతుంది. స్వర్గం లభిస్తుంది. ధైర్యం లభిస్తుంది. శాంతులలో ఉత్తమమైన పరమశాంతి చేకూరుతుంది. సౌభాగ్యం సమకూరుతుంది.

రుద్రే రుద్రసమాః కార్యాః కోష్ఠకాస్తత్ర తాం లిఖేత్ ।
ఓమాద్యాం హ్రూం ఫడంతాం చ ఆదివర్ణమథాన్తతః ॥20॥

విద్యావర్ణక్రమేణైవ సంజ్ఞాం చ వషడంతికామ్ ।
అధస్తాత్ప్రత్యంగిరైషా సర్వకామార్థసాధికా ॥21॥

పదకొండు నిలువురేఖలు పదకొండు అడ్డరేఖలు ఏర్పరచి, ఇరవై ఒక్క కోష్ఠాలు వ్రాసి మధ్యకోష్ఠంలో సాధ్యవ్యక్తి పేరు వ్రాయాలి. ఈశాన్యకోణంతో ప్రారంభించి ప్రదక్షిణక్రమంలో పన్నెండుసార్లు మాయాబీజమైన 'హ్రీం' విడిచి పెట్టి త్వరితా విద్యాక్షరాలను వ్రాయాలి. రేఖాగ్రభాగాలలో త్రిశూలచిహ్నాలు ఉంచాలి. సాధ్యవ్యక్తి పేరు ముందు 'ఓం' ను, చివర "హూం ఫట్ " వ్రాసి, త్వరితా విద్యాక్షరాలను క్రమంగా వ్రాయాలి. చివర "వషట్" వ్రాయాలి. ఇది "ప్రత్యంగిరావిద్యామంత్రం" ఇది సర్వకామార్థసాధకం.

ఏకాశీతిపదే సర్వామాదివర్ణక్రమేణ తు ।
ఆదిమం యావదంతం స్యాద్వషడంతం చ నామ వై ॥22॥

ఏషా ప్రత్యంగిరా చాన్యా సర్వకార్యాదిసాధనీ ।
నిగ్రహానుగ్రహశ్చక్రం చతుః షష్ఠి పదై ర్లిఖేత్ ॥23॥

ఏనభై ఒక్క కోష్ఠాలు గల చక్రంపై త్వరితా విద్యాక్షరాలను మొదటి అక్షరంతో ప్రారంభించి వ్రాయాలి. ఆరు పర్యాయాలు మంత్రాలు వ్రాసిన తరువాత, అంతములందు మిగిలిన కోష్ఠాలపై (సాధ్యవ్యక్తి) పేరు వ్రాసి, చివర "వషట్" అనే దానిని చేర్చాలి. ఇది ప్రత్యంగిరావిద్య యొక్క రెండో విధానమైన మంత్రం. ఇది కూడ సర్వకార్యాలను సిద్ధింపజేస్తుంది. అరవై నాలుగు కోష్ఠాలు గల చక్రంపై కూడ నిగ్రహచక్రాన్ని, అనుగ్రహచక్రాన్ని కూడ వ్రాయవచ్చు. (ఈ విధానమంతా శ్రీవిద్యార్ణవతంత్రంలోను, శారదాతిలకం లోను ఉపలబ్ధమవుతోంది.)

అనృతీ (అమృతీ) సా చ విద్యా క్రీం సః హూం నామాథ మధ్యతః ।
షట్కారాద్యాఽన్యత్రగతాం త్రిహ్రీంకారేణ వేష్టయేత్ ॥24॥

కుంభవద్ధారితా సర్వ శత్రుహృత్సర్వదాయికా ।
విషం నశ్యేత్క ర్ణ జపాదక్షరాద్యైశ్చ దండకైః ॥25॥

ఇది అమృతావిద్య. దీని మధ్యకోష్ఠంలో క్రీం సః హూం అని సాధ్యవ్యక్తి పేరు వ్రాయాలి. (పాఠాంతరంలో సాధ్యవ్యక్తి పేరుకు ఇరువైపుల హ్రీం వ్రాయాలి.) బాహ్యభాగంలో కమలం ఏర్పరచి, దాని దళాలపై విలోమక్రమంలో త్వరితావిద్యను వ్రాయాలి. దానిని హ్రీంకార యుక్తంగా మూడు వృత్తాకార పంక్తులతో వేష్టించి కుంభాకారయంత్రంగా ఏర్పాటు చేయాలి. ఈ విద్యను ధరించడం వల్ల సర్వశత్రువులు నశిస్తారు. సర్వమూ లభిస్తుంది. రోగి చెవిలో దీనిని జపిస్తే సర్పాదివిషాలు శాంతిస్తాయి. దీని మంత్రాక్షరాలతో చిహ్నితములైన దండాలతో శరీరంపై కొడితే విషం శమిస్తుంది.

ఇత్యాది మహాపురాణే ఆగ్నేయే త్వరితామంత్రకథనం నామ చతుర్దశాధికత్రిశతతమోఽధ్యాయః ॥314॥

అగ్నిమహాపురాణంలో త్వరితామంత్రకథనం అనే మూడువందల పదునాల్గవ అధ్యాయం సమాప్తం.

పంచదశాధిక త్రిశతతమోఽధ్యాయః - మూడువందల పదిహేనవ అధ్యాయం
స్తంభనాది మంత్ర కథనమ్ - స్తంభనాది మంత్రకథనం

అగ్నిరువాచ - అగ్ని ఇలా వచించాడు.

స్తంభనం మోహనం వశ్యం విద్వేషోచ్చాటనం వదే ।
విషవ్యాధిమరోగం చ మారణం శమనం పునః ॥1॥

ఇపుడు స్తంభనం, మోహనం, వశీకరణం, విద్వేషణం, ఉచ్చాటనం అనే ప్రయోగాలను, విషం, వ్యాధి, ఆరోగ్యం, మారణం, శమనం అనే ప్రయోగాలను మళ్లీ చెబుతున్నాను.

భూర్జే కూర్మం సమాలిఖ్య తాడనేన షడంగులమ్ ।
ముఖపాదచతుష్కేషు తతో మంత్రం న్యసేద్ద్విజః ॥2॥

భూర్జపత్రంపై ఆరు అంగుళాల కూర్మచక్రాన్ని వ్రాసి తాడనం చేయాలి. దాని ముఖము నందు, నాలుగు పాదాలయందు సాధకుడు మంత్రన్యాసం చేయాలి.

చతుష్పాదేషు క్రీంకారం హ్రీంకారం ముఖమధ్యతః ।
గర్భే విద్యాం తతో లిఖ్య సాధకం పృష్ఠతో లిఖేత్ ॥3॥

నాలుగు పాదాల యందు క్రీంకారాన్ని, ముఖము నందు హ్రీంకారాన్ని, మధ్యభాగంలో త్వరితామంత్రాన్ని వ్రాసి పృష్ఠభాగంలో సాధ్యవ్యక్తి పేరు వ్రాయాలి.

మాలామంత్రైస్తు సంవేష్ట్య ఇష్టకోపరి సంన్యసేత్ ।
పిధాయ కూర్మపృష్ఠేన కరాలేనాభిసంపఠేత్ ॥4॥

మాలామంత్రంతో వేష్టితం చేసి, ఆ యంత్రాన్ని ఇటుకపై స్థాపించి, దానిని కప్పి, కూర్మపీఠంతో కరాళమంత్రంతో అభిమంత్రించాలి.

మహాకూర్మం పూజయిత్వా పాదప్రోక్షం తు నిక్షిపేత్ ।
తాడయేద్వామపాదేన స్మృత్వా శత్రుం చ సప్తధా ॥5॥

తతః సంజాయతే శత్రోః స్తంభనం ముఖరాగతః ।

మహాకూర్మాన్ని పూజించి, శత్రువును ఉద్దేశించి, పాదోదకాన్ని చిమ్మి, వానిని ఏడుసార్లు ఎడమపాదంతో తన్నాలి. అపుడు ఆ శత్రువుకు ముఖభాగంలో స్తంభనం కలుగుతుంది.

కృత్వా తు భైరవం రూపం మాలామంత్రం సమాలిఖేత్ ॥6॥

ఓం శత్రుముఖస్తంభనీ కామరూపా ఆలీఢకరీ
హ్రీం ఫేం ఫేత్కారిణీ మమ శత్రూణాం దేవదత్తానాం ముఖం
స్తంభయ స్తంభయ మమ సర్వవిద్వేషిణాం ముఖస్తంభనం
కురు కురు ఓం హ్రూం ఫేం ఫేత్కారిణీ స్వాహా॥ 7॥

భైరవమూర్తి రూపాన్ని వ్రాసి దాని నలువైపుల " ఓం శత్రుముఖస్తంభనీ" నుండి "ఫేత్కారిణీ స్వాహా" వరకు ఉండే మూలమంత్రాన్ని వ్రాయాలి.

ఫట్ హేతుం చ సమాలిఖ్య తజ్జపస్తం మహాబలమ్ ।
వామేనైవ నగం శూలం సంలిఖేద్దక్షిణే కరే ॥8॥

లిఖేన్మంత్రమఘోరస్య సంగ్రామే స్తంభయేదరీన్ ॥9॥

తరువాత "ఫట్" అని వ్రాసి హేతువును ఉద్దేశించి (ప్రయోగం యొక్క ఉద్దేశ్యాన్ని వ్రాసి), ఆ మంత్రాన్ని జపిస్తూ, మహాబలుడైన భైరవుని వామహస్తంలో నగాన్ని, దక్షిణహస్తంలో శూలం వ్రాసి అఘోరమంత్రాన్ని లిఖించాలి. దీని వల్ల యుద్ధంలో శత్రువులు స్తంభితులవుతారు.

"ఓం నమో భగవత్యై భగమాలిని విస్ఫుర విస్ఫుర (నిరస్ఫుర నిరస్ఫుర)
స్పంద స్పంద నిత్యక్లిన్నే ద్రవ ద్రవ హ్రూం (హూం) సః
(హ్రీం) క్రీంకారాక్షరే స్వాహా" ॥10॥

ఏతేన రోచనాద్యైస్తు తిలకాన్మోహయేజ్జగత్ ॥11॥

"ఓం నమో భగవత్యై" మొదలు "స్వాహా" వరకు ఉండే మూలోక్తమంత్రాన్ని జపిస్తూ, గోరోచనాదికంతో తిలకం ధరిస్తే మానవుడు సమస్త జగత్తును మోహింపజేస్తాడు.

"ఓం ఫేం (ఫం) హ్రూం (హూం) ఫట్ ఫేత్కారిణీ (ఫటత్కారిణీ)
హ్రీం జ్వల జ్వల త్రైలోక్యం మోహయ మోహయ
ఓం గుహ్యకాలికే స్వాహా" ॥12॥

అనేన తిలకం కృత్వా రాజాదీనాం వశీకరమ్ ।

"ఓం ఫేం" మొదలు "ఓం గుహ్యకాలికే స్వాహా" వరకు ఉండే మూలోక్తమంత్రాన్ని జపిస్తూ తిలకం ధరించేవాడు రాజాదులను వశం చేసుకొంటాడు.

గర్దభస్య రజో గృహ్య కుసుమం మృతకస్య చ ॥13॥

నారీరజః క్షిపేద్రాత్రౌ శయ్యాదౌ ద్వేషకృద్భవేత్ ।

గాడిద యొక్క ధూళి, శవంపై వేసిన పువ్వులు, స్త్రీరజస్వలా సమయంలో ఉపయోగించే వస్త్రం తీసుకొని, రాత్రి శత్రువు శయ్యాదులపై విసరితే స్వజనవిద్వేషం కలుగుతుంది.

గోఖురం చ తథా శృంగమశ్వస్య చ ఖురం తథా ॥14॥

శిరః సర్పస్య సంక్షిప్తం గృహేషూచ్చాటనం భవేత్ ।

ఆవుడెక్క, ఆవుకొమ్ము, గుర్రపు డెక్క, సర్పశిరస్సు వీటిని నూరి కలిపి శత్రువు ఇంటిపై వేస్తే వారికి ఉచ్చాటనం కలుగుతుంది.

కరవీరశిఫా పీతా సంసిద్ధార్థా చ మారణే ॥15॥

వ్యాలచ్ఛుచ్ఛుందరీరక్తం కరవీరం తదర్థకృత్ ।

పచ్చని కరవీరశిఫ(చిగురు) లేదా (మూలం), మారణప్రయోగంలో మిక్కిలిగా ఉపయోగపడుతుంది. సర్పం, రక్తం, చుంచురక్తం, కరవీరబీజం మారణక్రియలో ఎక్కువ ప్రయోజనాన్ని కలిగిస్తాయి.

సరటం షట్పదం చాపి తథా కర్కటవృశ్చికమ్ ।
చూర్ణీకృత్య క్షిపేత్తైలే తదభ్యంగశ్చ కుష్ఠకృత్ ॥16॥

(చచ్చిన)తొండ, తుమ్మెద, పీత, తేలు వీటిని చూర్ణం చేసి తైలంలో వేసి ఆ తైలాన్ని శరీరానికి పూస్తే కుష్ఠరోగం కలుగుతుంది.

ఓం నవగ్రహాయ సర్వశత్రూన్ మమ సాధయ సాధయ
మారయ మారయ ఆం సోం మం బుం గుం (చుం) శుం, శం, రాం కోం (కేం) అం స్వాహా ॥17॥

అనేనార్కశతైరర్చ్య శ్మశానే తు నిధాపయేత్ ।
భూర్జే వా ప్రతిమాయాం వా మారణాయ రిపోర్గ్రహాః ॥18॥

"ఓం నవగ్రహాయ" మొదలు "స్వాహా" వరకు ఉండే మూలోక్తమంత్రాన్ని భూర్జపత్రంపై కాని, నవగ్రహ ప్రతిమపై కాని వ్రాసి, నూరు జిల్లేడు పూవులతో పూజించి, ఆ యంత్రాన్ని శ్మశానంలో పాతితే, గ్రహాలు శత్రువును నశింపజేస్తాయి.

ఓం కుంజరీ బ్రహ్మాణీ । ఓం మంజరీ మాహేశ్వరీ । ఓం వైతాలీ కౌమారీ । ఓం కాలీ వైష్ణవీ । ఓం ఘోరా (అఘోరా వారాహీ) । ఓం వేతాలీ ఇంద్రాణీ । ఓం ఊర్వశీ చాముండా । ఓం వేతాలీ చండికా । ఓం జయాలీ యక్షిణీ । నవమాతరో హే మమ శత్రుం గృహ్ణత గృహ్ణత । భూర్జే నామ రిపోర్లిఖ్య శ్మశానే పూజితే మ్రియేత్॥19॥

"ఓం కుంజరీ" మొదలు "ఓం జయాలీ యక్షిణీ" వరకు ఉన్న మూలోక్తమంత్రాలను భూర్జపత్రంపై వ్రాసి, శత్రుపదస్థానంలో శత్రువు పేరు వ్రాసి శ్మశానంలో ఆ యంత్రాన్ని పూజిస్తే శత్రువు నశిస్తాడు.

ఇత్యాది మహాపురాణే ఆగ్నేయే స్తంభనాదిమంత్రకథనం నామ పంచదశాధిక త్రిశతతమోఽధ్యాయః ॥315॥
అగ్నిమహాపురాణంలో స్తంభనాదిమంత్రకథనం అనే మూడువందల పదిహేనవ అధ్యాయం సమాప్తం.

షోడశాధిక త్రిశతతమోఽధ్యాయః - మూడువందల పదహారవ అధ్యాయం

నానామంత్రాః - నానామంత్రాలు

అగ్నిరువాచ - అగ్నిదేవుడు ఇలా పలికాడు.

ఆదౌ హూంకారసంయుక్తా ఖేచచ్ఛేపదభూషితా ।
వర్ణాతీతవిసర్గేణ స్త్రీం హ్రూం క్షేపఫడంతికా ॥1॥

ముందు హూం (హూం) వ్రాసి, తరువాత "ఖే చ ఛ్ఛే"అను మూడు పదాలను జోడించి, పిదప "క్షః స్త్రీం హూం క్షే" వ్రాసి, చివర "ఫట్" చేర్చాలి. అపుడు మంత్రం "హు ం ఖే చ ఛ్ఛే క్షః స్త్రీం హ్రూం హ్రూం క్షే (హ్రీం) ఫట్" అవుతుంది.

సర్వమర్థకరీ విద్యా విష సర్పాది మర్దనీ ।
(ఓం) ఖే చచ్ఛేతి ప్రయోగశ్చ కాలదష్టస్య జీవనే ॥2॥

ఇది అన్ని పనులను సిద్ధింపజేస్తుంది. విషబాధలను, సర్పాది బాధలను తొలగిస్తుంది. "ఖే చచ్ఛే" అనే త్ర్యక్షర ప్రయోగం కాలదష్టునకు జీవనం ఇచ్చే మంత్రం.

ఓం హూం కే క్షః ప్రయోగోఽయం విషదష్టప్రమర్దనః ।
స్త్రీం హూం ఫడితి యోగో ఽ యం పాపరోగాదికం జయేత్॥3॥

"ఓం హూం కే క్షః " అనే చతురక్షర ప్రయోగం విషబాధలు, పాము కరవడం వల్ల వచ్చే బాధలను తొలగిస్తుంది. "స్త్రీం హూం ఫట్ " అనే ప్రయోగం పాపాలను రోగాలను నశింపజేస్తుంది.

ఖే చేతి చ ప్రయోగోఽయం రిపు (విఘ్న) దుష్టాది వారయేత్ ।
హూం స్త్రీం ఓమితి యోగోఽయం యోషిదాది వశీకరః ॥4॥

"ఖే చ" అనే ప్రయోగం విఘ్నాలను దుష్టులను శమింపజేస్తుంది. "హూం స్త్రీం ఓం" అనే ప్రయోగం స్త్రీ మున్నగు వారిని వశం చేస్తుంది.

ఖే స్త్రీం ఖే చ ప్రయోగోఽయం కాలదష్టరిపుం జయేత్ ।
క్షః స్త్రీం క్షః సంప్రయోగోఽయం వశాయ విజయాయ చ ॥5॥

"ఖే స్త్రీం ఖే" అనే ప్రయోగం కాలసర్పదోషం ఉన్న మనుష్యులను రక్షిస్తుంది. శత్రవుల వల్ల వచ్చే బాధలను తొలగిస్తుంది. (శత్రువులను జయిస్తుంది) "క్షః స్త్రీం క్షః" అనే ప్రయోగం వశీకరణసాధకం అవుతుంది. అంతేకాక విజయసాధకం కూడ అవుతుంది.

"ఐం హ్రీం శ్రీం స్ఫ్రేం క్షైం క్షౌం భగవతి అంబికే కుబ్జికే ।
స్ఫ్రేం ఓం భం తం వశ అఘోరాయ ముఖే వ్రాం
వ్రీం కిలి కిలి విచ్చా స్ఫ్రౌం హేం స్ఫ్రం శ్రౌం హ్రీం ఐం
శ్రీమితి కుబ్జికా విద్యా సర్వకరా స్మృతా ॥6॥

భూయః స్కందాయ యానాహ మంత్రానీశశ్చ తాన్వదే ॥7॥

"ఐం హ్రీం" మొదలు "హ్రీం ఐం శ్రీం" వరకు ఉన్న మంత్రం కుబ్జికావిద్య. ఇది సర్వార్థాలను కలిగిస్తుంది. ఇపుడు ఇంక శివుడు స్కందునకు ఉపదేశించిన మంత్రాలను వివరిస్తాను.

ఇత్యాది మహాపురాణే ఆగ్నేయే నానామంత్రకథనం నామ షోడశాధిక త్రిశతతమోఽధ్యాయః ॥316॥

అగ్నిమహాపురాణంలో నానామంత్రాలు అనే మూడువందల పదహారవ అధ్యాయం సమాప్తం.



సప్తదశాధికత్రిశతతమో௨ధ్యాయః- మూడువందల పదిహేడవ అధ్యాయం

సకలాదిమంత్రోద్ధారః - సకలాది మంత్రోద్ధారణం

ఈశ్వర ఉవాచ - ఈశ్వరుడు ఇలా వచించాడు.

సకలం నిష్కలం శూన్యం కాలాఢ్యం స్వమలంకృతమ్ ।
క్షపణం క్షయమన్తఃస్థం కంఠోష్ఠం చాష్టమం శివమ్ ॥1॥

ప్రాసాదస్య పరాఖ్యస్య స్మృతరూపం గుహాష్టధా ।
సదాశివస్య శబ్దస్య రూపస్యాఖిలసిద్ధయే ॥2॥

స్కందా! (సకలం, నిష్కలం), శూన్యం, కాలాఢ్యం, సమలంకృతం, క్షపణం, క్షయం, అంతస్థం, కంఠోష్ఠం శివం అనునవి ఎనిమిది శివస్వరూపాలు. ప్రసాద పరాసంజ్ఞకమైన మంత్రం యొక్క ఎనిమిది స్వరూపాలు. (ఇందు కాలాఢ్యం అనేది 'సకలం' యొక్క, శూన్యం అనేది 'నిష్కలం' యొక్క అంతర్భాగాలే) ఈ శబ్దమయమైన మంత్రం సాక్షాత్తుగా 'సదాశివస్వరూపం' ఇది సకల సిద్ధులను ఇస్తుంది.

అమృతశ్చాంశుమాంశ్చే న్ద్ర శ్చేశ్వర శ్చోగ్ర ఊహకః ।
ఏకపాదైల ఓజాఖ్య ఔషధశ్చాంశుమాన్వశీ ॥3॥

అకారాదేః వాచకాశ్చ కకారాదేః క్రమాదిమే ।
కామదేవః శిఖండీ చ గణేశః కాలశంకరా ॥4॥

అమృత, అంశుమాన్, ఇంద్ర, ఈశ్వర, ఉగ్ర, ఊహక, ఏకపాద, ఐల, బీజ, ఔషధ, అంశుమాన్, వశీ - అనేవి వరుసగా అకారాది ద్వాదశ స్వరాలకు వాచకాలు (అ, ఆ, ఇ, ఈ, ఉ, ఊ, ఏ, ఐ, ఓ, ఔ, అం, అః). చెప్పబోయేవి కకారాద్యక్షరాలకు సూచకాలు. కామదేవ, శిఖండి, గణేశుడు, కాలుడు, శంకరుడు,

ఏకనేత్రో ద్వినేత్రశ్చ త్రిశిఖో దీర్ఘబాహుకః ।
ఏకపాదర్ధచంద్రశ్చ వలయో యోగినీప్రియః ॥5॥

శక్తీశ్వరో మహాగ్రంధిస్తర్పకః స్థాణుదంతురౌ ।
నిధీశో నందిపద్మశ్చ తథా௨న్యః శాకినీప్రియః ॥6॥

ముఖబింబో భీషణశ్చ కృతాంత ః ప్రాణసంజ్ఞకః ।
తేజస్వీ శక్ర ఉదధిః శ్రీకంఠః సింహ ఏవ చ ॥7॥

శశాంకో విశ్వరూపశ్చ క్షశ్చ స్యాన్నరసింహకః ।
సూర్యమాత్రసమాక్రాంతం విశ్వరూపం తు కారయేత్ ॥8॥

ఏకనేత్రుడు, ద్వినేత్రుడు, త్రిశిఖుడు, దీర్ఘబాహుడు, ఏకపాదుడు, అర్ధచంద్రుడు, వలయుడు, యోగినీ ప్రియుడు, శక్తీశ్వరుడు, మహాగ్రంధి, తర్పకుడు, స్థాణువు, దంతురుడు, నిధీశుడు, నంది, పద్ముడు అలాగే శాకినీ ప్రియుడు ముఖబింబుడు, భీషణుడు, కృతాంతుడు, ప్రాణుడు, తేజస్వి, శక్రుడు, ఉదధి, శ్రీకంఠుడు, సింహుడు, శశాంకుడు, విశ్వరూపుడు, నరసింహుడు అనేవి "క" మొదలు "క్ష" వరకు ఉండే (కకారాది పంచవర్గము, అంతఃస్థములు, ఊష్మములు, క్ష) హల్లుల స్వరూపాలు. విశ్వరూపం (హకారం) సూర్య మాత్రలు (పన్నెండు మాత్రలు) కలిపి వ్రాయాలి. (ఇవి అంగన్యాస కరన్యాసాలలో ఉపయోగిస్తాయి.)

అంశుమత్సంయుతం కృత్వా శశి బీజం వినా యుతమ్ ।
ఈశానమోజసాఽ ఽ క్రాంతం ప్రథమం తు సముద్ధరేత్॥9॥

విశ్వరూపమును (హ), అంశముతో(ం)తోను, ఓజస్(ఓ) తోను కలిపి వ్రాయాలి. అపుడు "హోం" అని అవుతుంది. ఇది ఈశాన సంబద్ధమైనది. ఇందు శశిబీజాన్ని (సకారాన్ని) విడిచి పెట్టాలి. ఇది ప్రథమ బీజమవుతుంది.

తృతీయం పురుషం విద్ధి దక్షిణం పంచమం తథా ।
సప్తమం వామదేవం తు సద్యోజాతం తతః పరమ్ ॥10॥

పైన చెప్పిన పన్నెండు బీజాలలో ఐదు హ్రస్వయుక్తబీజాలు. ఆరు దీర్ఘయుక్తబీజాలు. మొదటి చివరి బీజాలలో ఒకటే "హం" గా వ్యవహరించబడుతుంది. హం, హిం, హుం, హేం, హౌం - ఇవి ఐదు హ్రస్వయుక్తబీజాలు. మిగిలినవి దీర్ఘయుక్తబీజాలు. హ్రస్వబీజాలలో విలోమగణనంలో "హోం" ప్రథమబీజం. మిగిలినవి వరుసగా తృతీయ, పంచమ, సప్తమ, నవమ బీజాలు. ద్వితీయాదులు దీర్ఘబీజాలు. ఇందు తృతీయ బీజం"హేం" ఇది తత్పురుష సంబంధి బీజం. ఐదో బీజం "హుం". ఇది దక్షిణదిశలో ఉండే అఘోరసంబంధి బీజం. ఏడో బీజం "హి". ఇది వామదేవసంబంధి బీజం.

రసయుక్తం తు నవమం బ్రహ్మపంచకమీరితమ్ ।
ఓంకారాద్యాశ్చతుర్థ్యన్తాః నమోఽ న్తాః సర్వమంత్రకాః ॥11॥

దాని తరువాతిదయిన తొమ్మిదోది రసస్వరూప (అమృతరూప) సంజ్ఞకమైన (అ) కారయుక్త సానుస్వారమై "హం" బీజమవుతుంది. ఇది సద్యోజాతసంబంధిబీజం. ఈ విధంగా చెప్పబడిన పంచబీజయుక్తమైన ఈశానాది పంచకం బ్రహ్మపంచకంగా వ్యవహరింపబడుతుంది. ఇందు మొదట "ఓం" కారం, చివర "నమః" చేర్చి ఈశానాది నామాలు చతుర్థాంతంగా మార్చితే పూజోపయుక్తమంత్రాలై "ఓం హోం ఈశానాయ నమః" ఇత్యాదిగా పేర్కొన బడుతాయి.

సద్యోదేవా ద్వితీయం తు హృదయం చాంగసంయుతమ్ ।
చతుర్థం తు శిరో విద్ధి ఈశ్వరన్నామ నామతః॥12॥

ఊహకంతు శిఖా జ్ఞేయా విశ్వరూపసమన్వితా ।
తన్మంత్ర మష్టమం ఖ్యాతం నేత్రం తు దశమం మతమ్॥13॥

ఈ విధంగానే "ఓం హం సద్యోజాతాయ నమః" ఇత్యాది. ఈ మంత్రం సద్యోజాతదేవతామంత్రం. ద్వితీయచతుర్థ మాత్రలు దీర్ఘాలు. వాటిని హృదయాంగన్యాసంలో ఉపయోగించాలి. "హాం హృదయాయ నమః హృది" ఇత్యాది. ఇది ద్వితీయబీజం. చతుర్థబీజం శిరో మంత్రం. ఇది ఈశ్వర నామకం. "హ్రీం శిరసే స్వాహా శిరసి" అనేది చతుర్థబీజం. హకారానికి ఊకారం, అనుస్వారం చేర్చగా శిఖామంత్రం అవుతుంది. "హూం శిఖాయై వషట్ శిఖాయాం హః" అని దీని ప్రయోగం. ఎనిమిదోది విశ్వరూపసమన్వితం. "హైం కవచాయ హుం బాహుమూలయోః" అని దీని ప్రయోగం. పదో బీజం నేత్రమంత్రం. "హౌం నేత్ర త్రయాయ వౌషట్ నేత్రయోః" అని దీని ప్రయోగం.

అస్త్రం (వ) శశీ సమాఖ్యాతం శివసంజ్ఞం శిఖిధ్వజ ।
నమః స్వాహా తథా వౌషట్ హుం చ ఫట్ షట్క్రమేణ తు ॥14॥

జాతిషట్కం హృదాదీనాం ప్రాసాదం మంత్రమావదే ।
ఈశానాద్రుద్రసంఖ్యాతం ప్రోద్ధరేచ్చాంశు రంజితమ్ ॥15॥

శిఖిధ్వజా! అస్త్రమంత్రం విసర్గయుక్తం. ఇది శివసంజ్ఞకం. "నమః, స్వాహా, వషట్, హుం, వౌషట్, ఫట్" అని ఆరు క్రమంగా హృదయాది ఆరు జాతులుగా చెప్పబడ్డాయి. ఇపుడు ప్రాసాదమంత్రాన్ని చెబుతాను. ఈశానము (ఈ)తో, రుద్ర (అనుస్వారము) అంశు (రేఫ) లతో కూడి 'హ్రీం' అను బీజమంత్రము ఏర్పడును. "హీం హౌం హూం" అనేవి ప్రాసాదమంత్రబీజాలు.

ఔషధాక్రాంతశిరసమూహకస్యోపరి స్థితమ్ ।
అర్ధచంద్రోర్ధ్వనాదం చ బిందుద్వితయమధ్యగమ్ ॥16॥

తదంతే విశ్వరూపం తు కుటిలం తు త్రిధా తతః ।
ఏవం ప్రాసాదమంత్రశ్చ సర్వకర్మకరో మనుః॥17॥

(ఔషధ) ఔకార, అనుస్వారలతో కూడినది 'హౌం'. అర్ధచంద్ర అనుస్వారము, ఊర్ధ్వనాదము, బిందువులతో కూడినవి ప్రాసాదమంత్రాలు. దీనికి కుటిలమనే పేరు ఉంది. ఈ ప్రకారంగా ఉన్న సంజ్ఞల ద్వారా ఏర్పడే ప్రాసాదమంత్రం సమస్తకార్యాలను సిద్ధింపజేస్తుంది.

శిఖాబీజం సముద్ధృత్య ఫట్కారాన్తం తు చైవ ఫట్ ।
అర్ధచంద్రాననం జ్ఞేయం కామదేవం ససర్పకమ్ ॥18॥

మహాపాశుపతాస్త్రం తు సర్వదుష్టప్రమర్దనమ్ ।
ప్రాసాదః సకలః ప్రోక్తో నిష్కలః ప్రోచ్యతే ఽధునా ॥19॥

హృదయ శిఖాది బీజాలను ఇదివరకు చెప్పినవిధంగా ఉద్ధారం చేసి ఫట్కారం వరకు సకలాంగాలను న్యాసం చేయాలి. ఆసనం అర్ధచక్రాకారంగా ఉండాలి. భగవంతుడైన పశుపతి కామదేవుడు. సర్వాలంకార భూషితుడు. ఈ ప్రకారంగా ధ్యానం చేస్తూ మహాపాశుపతాస్త్రమంత్రాన్ని జపించాలి. ఇది సమస్త దుష్టశత్రువులను నశింపజేస్తుంది. ఈ విధంగా సకలప్రాసాదమంత్రం చెప్పబడింది. ఇపుడు నిష్కలప్రాసాదమంత్రాన్ని చెబుతాను.

సౌషధం విశ్వరూపం తు రుద్రాఖ్యం సూర్యమండలమ్ ।
చంద్రార్ధనాదసంయోగం విసంజ్ఞం కుటిలం తతః ॥20॥

నిష్కలో భుక్తిముక్తౌ స్యాత్పంచాంగోఽయం సదాశివః ।
అంశుమాన్విశ్వరూపం చ ఆవృతం శూన్యరంజితమ్ ॥21(అమృతం)

ఔషధం (ఔ), విశ్వరూపం(హ), రుద్రం (ఏకాదశమాత్ర), సూర్యమండలం, (అనుస్వారం), అర్ధచంద్రం (అనునాసికం), నాదయుక్తమైన మంత్రం కలిపితే " హౌం" ఇది నిష్కలప్రాసాదమంత్రం. ఇది సంజ్ఞావిహీనం, కుటిలం అని కూడ చెప్పబడుతుంది. ఇది భుక్తిని ముక్తిని ప్రసాదిస్తుంది. ఈ ప్రాసాదమంత్రం ఈశానాది పంచ బ్రహ్మమూర్తులతో కూడి ఉంటుంది. అందువల్ల దీనిని పంచాంగం, సాంగం అని అంటారు. అంశుమాన్(అనుస్వారం) విశ్వరూపం(హ) అమృతం(అ) వీటి కలయిక వల్ల "హం" బీజం ఏర్పడుతుంది. ఇది శూన్యమని కూడ చెప్పబడుతుంది. ఇది సదాశివస్వరూపం.

బ్రహ్మాంగరహితం శూన్యస్తస్య మూర్తిరసస్తరుః ।
విఘ్ననాశాయ భవతి పూజితో బాలబాలిశైః ॥22॥

ఈశానాది బ్రహ్మాత్మకాంగాలతో రహితం కావడం వల్ల దీనికి శూన్యమని పేరు. ఈశానాది మూర్తులు ఈ బీజాల అమృత తరువులు, వీటి పూజనం సకల విఘ్నాలను తొలగిస్తుంది. అందువల్ల బాలురు, పామరులు కూడ వీటిని పూజిస్తారు.

అంశుమాన్విశ్వరూపాఖ్య మూహకస్యోపరి స్థితమ్ ।
కలాఢ్యం సకలస్యైవ పూజాంగాది చ సర్వత ః ॥23॥

అంశుమాన్ (ం) చేర్చిన విశ్వరూపం(హ) ఊ హకం (ఊ) పైన అధిష్ఠితమయితే ఏర్పడిన "హూం" బీజానికి కలాఢ్యమని పేరు. ఇది సకలంలో అంతర్గతం. పూజాంగాదికాలు సకలానికే ఉంటాయి.

నరసింహం కృతాంతస్థం తేజస్వీ ప్రాణ మూర్ధ్వగమ్ ।
అంశమానూహకాక్రాంతమధోర్ధ్వం (స) ఖమలంకృతమ్ ॥24॥

చంద్రార్ధనాదనాదాంతం బ్రహ్మవిష్ణువిభూషితమ్ ।
ఉదధిం నరసింహం చ సూర్యమాత్రావిభేదితమ్ ॥25॥

యదా కృతం తదా తస్య బ్రహ్మాణ్యంగాని పూర్వవత్ ।

నరసింహుడు యమునిపై ఉండును. అనగా "క్ష" కారం "మ" కారంపై ఉంటుంది. తేజస్వి (ర), ప్రాణం (య) కూడ కలుస్తాయి. పైన అంశుమాన్ (ం), క్రింద (ఊ) హకం (ఊకారం) ఉన్నచో "క్ష్మ్ర్యూం" అనే బీజం ఏర్పడుతుంది. ఇది పైన, క్రింద మాత్రలచే అలంకరింపబడి ఉంటుంది. కాబట్టి సమలంకృతమని చెప్పబడింది. చంద్రర్ధాకార బిందునాదాలతో కూడిన, బ్రహ్మవిష్ణునామ విభూషితాలయిన, ఉదధి(వ), నరసింహ(క్ష) అనే పన్నెండు మాత్రలతో క్రమంగా విభేదితాలు చేయాలి. హ్రస్వస్వరాలతో కూడిన బీజాలు ఈశానాది బ్రహ్మాత్మకాద్యంగాలు అవుతాయి. దీర్ఘస్వరయుక్తబీజాలు ఉన్న మంత్రాలు హృదయాంగాది విన్యాసానికి ఉపయోగిస్తాయి.

ఓజాఖ్య మంశుమద్యుక్తం ప్రథమం వర్ణముద్ధరేత్ ॥26॥

అంశుమచ్చాంశునాఽఽక్రాంతం ద్వితీయం వర్ణనాయకమ్ ।
అంశుమానీశ్వరం తద్వత్తృతీయం ముక్తిదాయకమ్ ॥27॥

ఇంక దశబీజరూప ప్రణవాలను చెబుతున్నాను. బీజం (ఓ) అనుస్వారయుక్తమై (ం) కలిపి "ఓం" అని ప్రథమవర్ణాన్ని ఉద్ధారం చేయాలి. అంశుమత్ అంశువుల సంయోగం చే "ఆం" అనే నాయకస్వరూప ద్వితీయ వర్ణం ఏర్పడుతుంది. అంశుమాన్, ఈశ్వరుల కలయికచే "ఈం" అనే ముక్తిప్రదమైన తృతీయవర్ణం ఏర్పడుతుంది.

ఊహకం చాంశునాఽఽక్రాంతం వరుణం ప్రాణతైజసమ్ ।
పంచమం తు సమాఖ్యాతం కృతాంతం తు తతఃపరమ్॥28॥

అంశుమత్ ఆక్రాంతమైన ఊహకం (ఊం) చతుర్థవర్ణం అవుతుంది. సానుస్వారమైన వరుణ(వ్), ప్రాణ(య్), తేజస్(ర్) కలిపి "వ్ర్యం) ఇది పంచమబీజాక్షరమవుతుంది. ఆ తరువాత అనుస్వార యుక్తమైన కృతాంతుడు (మకారం) కలిపి "మం" షష్ఠబీజమవుతుంది.

అంశుమానుదకప్రాణః సప్తమం వర్ణముద్ధృతమ్ ।
పద్మమిందుసమాక్రాన్తం నందీశమేకపాదధృక్ ॥29॥

అనుస్వారంతో కూడిన ఉదకప్రాణాలు (వ్యం) సప్తమబీజం అవుతుంది. ఇందు యుక్తమైన పద్మం (పం) అష్టమబీజం. ఏకపాదయుక్తుడైన నందీశుడు (నేం) నవమబీజం.

ప్రథమం చాన్తతో యోజ్యం క్షపణం దశబీజకమ్।
అస్యాఽఽద్యం చ తృతీయం చ పంచమం సప్తమం తథా ॥30॥

సద్యోజాతం తు నవమం ద్వితీయం హృదయాదికమ్ ।
దశార్ణ (దశ తు) ప్రణవం యత్తు షడస్త్రం చాస్త్రముద్ధరేత్ ॥31॥

అంతంలో ప్రథమబీజమైన "ఓం"చేర్చాలి. ఈ విధంగా ఏర్పడిన దశబీజాత్మక మంత్రానికి క్షపణం అని పేరు. దీని ప్రథమ, తృతీయ, పంచమ, సప్తమ, నవమ బీజాలు క్రమంగా ఈశాన, తత్పురుష, అఘోర, వామదేవ, సద్యోజాత స్వరూపాలు. ద్వితీయాది బీజాలు హృదయాద్యంగన్యాసాలలో ఉపయోగించాలి. ఈ పది ప్రణవాత్మక బీజాలను ఒకేసారి ఉచ్చరిస్తూ "అస్త్రాయ ఫట్" అని అస్త్రన్యాసం చేయాలి.

నమస్కారయుతాన్యత్ర బ్రహ్మాంగాని తు నాన్యథా ।
ద్వితీయాదష్టమం యావదష్టౌ విద్యేశ్వరా మతాః ॥32॥

ఈశానాది మూర్తుల చివర "నమః" అని చేర్చి చెప్పాలి. కాని మరోవిధంగా చెప్పరాదు. ద్వితీయబీజం మొదలు నవమబీజం వరకు ఉండేవి విద్యేశ్వరరూపాలు.

అనన్తేశశ్చ సూక్ష్మశ్చ తృతీయశ్చ శివోత్తమః ।
ఏకమూర్త్యేకరూపస్తు త్రిమూర్తి రపరస్తథా ॥33॥

శ్రీకంఠశ్చ శిఖండీ చ అష్టౌ విద్యేశ్వరాః స్మృతాః ।
శిఖండినోఽ ప్యనంతాంతం మంత్రాంతం మూర్తిరీరితా ॥34॥

అనంతేశ, సూక్ష్మ, శివోత్తమ, ఏకమూర్తి, ఏకరూప, త్రిమూర్తి, శ్రీకంఠ, శిఖండి అని ఎనిమిది విద్యేశ్వరుల పేర్లు. శిఖండి మొదలు అనంతేశుని వరకు విలోమక్రమంచే బీజమంత్రాలను చేర్చాలి.

ఇత్యాది మహాపురాణే ఆగ్నేయే సకలాదిమంత్రోద్ధారవర్ణనం నామ సప్తదశాధిక త్రిశతతమోఽ ధ్యాయః ॥317॥

అగ్నిమహాపురాణంలో సకలాదిమంత్రోద్ధారమనే మూడువందల పదిహేడవ అధ్యాయం సమాప్తం.



అష్టాదశాధికత్రిశతతమోఽధ్యాయః – మూడువందల పద్దెనిమిదవ అధ్యాయం

గణపూజాది విధానకథనమ్ – గణపూజాది విధానకథనం

ఈశ్వర ఉవాచ – ఈశ్వరుడు ఇలా వచించాడు.

విశ్వరూపం తముద్ధృత్య తేజస్యుపరి సంస్థితమ్ ।
నరసింహం తతోఽధస్తాత్కృతాన్తం తదధో న్యసేత్ ॥1॥

పైన తేజస్సు (ర్)కల, విశ్వరూపమును (హ్) ఉద్ధృతం చేసి, పిదప నరసింహుమును (క్ష్) క్రింద కృతాంతుడు (మ్) కారమును ఉంచాలి.

ప్రణవం తదధః కృత్వా ఊహకం తదధః పునః ।
అంశుమాన్విశ్వ మూర్తి స్థం కంఠోష్ఠ ప్రణవాదికమ్ ॥2॥

దాని చివర ప్రణవం (ఓం) చేర్చాలి. అపుడు "ర్, హ్, క్ష్, మోం" అని అవుతుంది. దాని తరువాత ఊహకం (ఊ) అంశుమత్ (ం) విశ్వమూర్తి (హ) కలపాలి. అపుడు "హూ" అని అవుతుంది. ఈ రెండునూ వరుసగా, అంతస్థము, కంఠోష్ఠం అని చెప్పబడతాయి. రకారం (అంతఃస్థవర్ణం) ఆదిని ఉన్న కారణం వల్ల ఈ మంత్రానికి అంతఃస్థసంజ్ఞ ఏర్పడింది. రెండో మంత్రంలో "హ" కారం కంఠస్థానీయం, "ఊ" కారం ఓష్ఠస్థానీయం కావడం వల్ల దానికి కంఠోష్ఠం అని పేరు వచ్చింది.

నమోన్తః స్యాచ్చతుర్వర్ణో విశ్వరూపం చ కారణమ్ ।
సూర్యమాత్రాహతం బ్రహ్మణ్యంగానీహ తు పూర్వవత్ ॥3॥

వీని చివర 'నమః' చేర్చడం వల్ల నాలుగుక్షరాల మంత్రం అవుతుంది. "ఓం ర్ హ్ క్ష్ మోం నమః", "ఓం హూం నమః" అని అవుతాయి. విశ్వరూపం (హ కారం) కారణమని చెప్పబడుతుంది. దానిని పన్నెండు మాత్రలలోను లెక్కించాలి. అందు ఐదు హ్రస్వబీజాలు పూర్వంలా ఈశానాది పంచబ్రహ్మమూర్తులను పూజించాలి. దీర్ఘస్వరాల ద్వారా ఆరు బీజాలతోను వెనుకటిలాగా అంగన్యాసం చేయాలి.

ఉద్ధరేత్ప్రణవం పూర్వం ప్రస్ఫురద్ద్వయముచ్చరేత్ ।
ఘోరఘోరతరం పశ్చాదనురూపమతః స్మరేత్ ॥4॥

చటశబ్దం ద్విధా కృత్వా తతః ప్రణవముచ్చరేత్ ।
(క) దహేతి చ ద్విధా కార్యం (ధ) వమేతి చ ద్విధా మతమ్॥5॥

ఘాతయేతి ద్విధా కృత్వా హూం ఫడంతం సముచ్చరేత్ ।

ఇపుడు అఘోరాస్త్ర మంత్రోద్ధారం చెప్పబడుతోంది. ముందు "హ్రీ" వ్రాసి పిదప "స్ఫుర స్ఫుర" అని వ్రాయాలి. దాని ముందు "ప్ర" చేర్చాలి. అపుడు "ప్రస్ఫుర ప్రస్ఫుర" అని అవుతుంది. ఆ తరువాత "కహ, వమ, బంధ" అనే మూడు పదాలను రెండు సార్లు వ్రాయాలి. పిదప రెండు సార్లు "ఘాతయ ఘాతయ" అని వ్రాసి చివర " హూం(హుం) ఫట్" అని చేర్చాలి. అపుడు మంత్రం "హ్రీం స్ఫుర స్ఫుర ప్రస్ఫుర ప్రస్ఫుర ఘోర ఘోర తరతనురూప చట చట ప్రచట ప్రచట కహ కహ వమ వమ బంధ బంధ ఘాతయ ఘాతయ హూం (హుం) ఫట్" అని అవుతుంది.

అఘోరాస్త్రం తు నేత్రం స్యాద్గాయత్రీ చోచ్యతేఽధునా ॥6॥

ఇది అఘోరాస్త్రమంత్రం. ఇపుడు శివగాయత్రి చెప్పబడుతోంది.

తన్మహేశాయ విద్మహే మహాదేవాయ ధీమహి ।
తన్నః శివః ప్రచోదయాద్గాయత్రీ సర్వసాధనీ ॥7॥

"తత్ మహేశాయ విద్మహే మహాదేవాయ ధీమహి, తన్నః శివః ప్రచోదయాత్" అనేది శివగాయత్రీమంత్రం. ఇది సకలమనోరథాలను నెరవేరుస్తుంది.

యాత్రాయాం విజయాదౌ చ యజేత్పూర్వం గణం శ్రియే ।
(తుర్యాంశే) తుర్యాస్త్రే తు పురా క్షేత్రే సమంతాదర్కభాజితే ॥8॥

యాత్రయందు, విజయాదులందు, సంపద సంపాదనయందు ముందు గణపూజ చేయాలి. చతురస్ర క్షేత్రాన్ని అన్నివైపుల పన్నెండు చొప్పున కోష్ఠాలుగా విభజించాలి.

చతుష్పదం త్రికోణే తు త్రిదలం కమలం లిఖేత్ ।
తత్పృష్ఠే పదికావీథీ భాగి త్రిదలమశ్వయుక్ ॥9॥

అట్టి చతురస్రక్షేత్రం మధ్యనున్న నాలుగు పదాలలో త్రికోణం ఏర్పరచి, దాని మధ్య త్రిదలకమలం వ్రాయాలి. దాని పృష్ఠభాగంలో పథిక (పదిక) వీథిభాగాలలో మూడు దళాలతో అశ్వయుక్తకమలం ఏర్పరచాలి.

వసుదేవసుతైః సాబ్జై స్త్రిదలైః పాదపట్టికా ।
తదూర్ధ్వే వేదికా దేయా భాగమాత్రప్రమాణతః॥10॥

ఆ తరువాత వసుదేవపుత్రులతో (వాసుదేవ సంకర్షణ గదులతో) ప్రకాశిస్తున్న త్రిదలకమలంతో పాదపట్టికను నిర్మించాలి. దానిపైన ఊర్ధ్వభాగంలో భాగమాత్ర ప్రమాణంలో ఒక వేదికను ఏర్పరచాలి.

ద్వారం పద్మమితం కోష్ఠా దుపద్వారం వివర్జితమ్ ।
ద్వారోపద్వారరచితం మండలం విఘ్నసూదనమ్ ॥11॥

పూర్వాది దిశలందు ద్వారకోణభాగాలలో ఉపద్వారాలు ఏర్పాటు చేయాలి. ఆ ఉపద్వారరచితమండలం విఘ్నాలను నశింపజేస్తుంది.

ఆరక్తం కమలం మధ్యే బాహ్యపద్మాని తద్బహిః ।
సితా తు వీథికా కార్యా ద్వారాణి తు యథేచ్ఛయా ॥12॥

మధ్యలో ఉండే కమలం, వెలుపల ఉండే బాహ్యపద్మాలు అన్నీ రక్తవర్ణాలై ఉండాలి. వీథి శ్వేతవర్ణంతో ఉండాలి. ద్వారాల రంగు ఇష్టం వచ్చినట్లు ఉండవచ్చు.

కర్ణికా పీతవర్ణా స్యాత్ కేసరాణి తథా పునః ।
మండలం విఘ్నమర్దాఖ్యం మధ్యే గణపతిం యజేత్ ॥13॥

కర్ణిక పీతవర్ణంతో ఉండాలి. కేసరాలు కూడ అదే రంగులో ఉండాలి. దీనికి విఘ్నమర్ద మండలం అని పేరు. దీని మధ్యభాగంలో గణపతిని పూజించాలి.

నామాద్యం సవరాకం స్యాద్దేవాచ్చక్ర సమన్వితమ్ ।
శిరోహతం తత్పురుషేణ ఓమాద్యం చ నమోఽన్తకమ్ ॥14॥

గజాస్యం గజశీర్షం చ గాంగేయం గణనాయకమ్ ।
త్రిరావర్తం గగనగం గోపతిం పూర్వపంక్తిగమ్ ॥15॥

నామం యొక్క మొదటి అక్షరాన్ని అనుస్వారసహితంగా పలుకుతూ ఆది యందు "ఓం", అంతంలో "నమః" అని చేర్చాలి. అపుడు "ఓం గం గణపతయే నమః" అని అవుతుంది. హ్రస్వాంత బీజాలతో, ఈశాన తత్పురుషాది మంత్రాలతో బ్రహ్మమూర్తులను పూజించాలి. దీర్ఘాంతబీజాలతో హృదయం, శిరస్సు ఇత్యాదిగా అంగన్యాసం చేయాలి. పైన చెప్పిన మండలంలో పూర్వదిక్కున ఉన్న వరుసలో (గజుని), గజాస్యుని, గజశీర్షుని, గాంగేయుని, గణనాయకుని, గగనగుని, గోపతిని వారు పేరు వ్రాయాలి. త్రిరావర్తుని అని చెప్పడం వల్ల గగనగుని గోపతిని మూడు సార్లు ఆవృత్తి చేయాలి. పదికోష్ఠాలలో ఈ పదిపేర్లు వ్రాయాలి.

విచిత్రాంసం మహాకాయం లంబోష్ఠం లంబకర్ణకమ్ ।
లంబోదరం మహాభాగం వికృతం పార్వతీప్రియమ్ ॥16॥

భయావహం చ (భయాపహం) భద్రం చ భగణం భయసూదనమ్ ।
ద్వాదశైతే దశ పంక్తౌ దేవత్రాసం చ పశ్చిమే ॥17॥

మహానాదం భాస్వరం చ విఘ్నరాజం గణాధిపమ్ ।
ఉద్భట స్వనోద్భశుండౌ మహాశుండంచ భీమకమ్ ॥18॥

మన్మథం మధుసూదం చ సుందరం భావపుష్పకమ్ ।
సౌమ్యే బ్రహ్మేశ్వరం బ్రాహ్మం మనోవృత్తిం చ సంలయమ్ ॥19॥

లయం నృత్యప్రియం లౌల్యం వికర్ణం వత్సలం తథా ।
కృతాంతం కాలదండం చ యజేత్కుంభం చ పూర్వవత్ ॥20॥

విచిత్రాంసుని, మహాకాయుని, లంబోష్ఠుని, లంబకర్ణుని, లంబోదరుని, మహాభాగుని, వికృతుని, పార్వతీ ప్రియుని, భయాప(వ)హుని, భద్రుని, భగణుని, భయసూదనుని ఈ పన్నెండు నామాలను దక్షిణ దిశనున్న వరుసలో వ్రాయాలి. పశ్చిమంలో దేవత్రాసుని, మహానాదుని, భాస్వరుని, విఘ్నరాజును, గణాధిపుని, ఉద్భటస్వనుని, ఉద్భ(ట) శుండుని, మహాశుండుని, భీమకుని, మన్మథుని, మధుసూదనుని, సుందరుని, భావపుష్టకుని, వీరి పేర్లను వ్రాయాలి. అలాగే బ్రహ్మేశ్వరుని, బ్రాహ్మమనోవృత్తిని, సంలయుని లయుని, నృత్యప్రియుని, లౌల్యుని, వికర్ణుని, వత్సలుని, కృతాంతుని, కాలదండుని, కుంభుని – వీరి పేర్లను ఉత్తరదిశ యందున్న వరుసలో వ్రాసి పూర్వంలా పూజించాలి.

అయుతం చ జపేన్మంత్రం హోమయేత్తు దశాంశతః ।
శేషాణాం తు దశాహుత్యా జపాద్ధోమం తు కారయేత్ ॥21॥

మంత్రాన్ని పదివేలు జపం చేసి, అందు దశాంశం హోమం చేయాలి. మిగిలిన మంత్రాలను పదేసి సార్లు జపించి, ఒక్కొక్క పర్యాయం హోమం చేయాలి.

పూర్ణాం దత్త్వాఽభిషేకం తు కుర్యాత్సర్వం తు సిద్ధ్యతి ।
భూగోఽశ్వగజవస్త్రాద్యైర్గురుపూజాం చరేన్నర ః ॥22॥

ఆ తరువాత పూర్ణాహుతిని ఇచ్చి అభిషేకం చేయాలి. ఇలా చేస్తే సకల మనోరథాలు సిద్ధిస్తాయి. గురువుకు భూమి, గోవు, అశ్వం, గజం, వస్త్రం మున్నగువాటిని ఇచ్చి పూజించాలి.

ఇత్యాది మహాపురాణే ఆగ్నేయే గణపూజాది విధానకథనం నామ అష్టాదశాధిక త్రిశతతమోఽధ్యాయః ॥318॥

ఆగ్నేయమహాపురాణంలో గణపూజాదివిధానకథనం అనే మూడువందల పద్దెనిమిదవ అధ్యాయం సమాప్తం.



ఏకోనవింశత్యధికత్రిశతతమోఽధ్యాయః - మూడువందల పందొమ్మిదవ అధ్యాయం

వాగీశ్వరీ పూజావిధానకథనమ్ - వాగీశ్వరీ పూజావిధానకథనం

ఈశ్వర ఉవాచ - ఈశ్వరుడు ఇలా వచించాడు.

వాగీశ్వరీపూజనం చ ప్రవదామి సమండలమ్ ।
ఊహకం (ఈశ్వరం) కాలసంయుక్తం మనుం వర్ణ సమాయుతమ్ ॥1॥

ఇపుడు మండలసహిత వాగీశ్వరీ పూజావిధానాన్ని చెబుతాను. ఊహకం (ఊకారాన్ని) కాల (ఘ్) తో కలిపి దానికి అనుస్వారం (చంద్ర) చేరిస్తే "ఘూం" అనే ఏకాక్షరమంత్రం ఏర్పడుతుంది.

నిషాద ఈశ్వరం కార్యం మనునా చంద్రసూర్యవత్ ।
అక్షరం న హి దేయం స్యాద్ధ్యాయేత్కుందేందుసన్నిభామ్ ॥2॥

నిషాదం పై ఈశ్వరుని (ఈ) చేర్చి దానిని బిందు విసర్గయుక్తం చేయాలి. ఈ ఏకాక్షరమంత్రాన్ని అందరికీ ఉపదేశించరాదు. వాగీశ్వరీదేవిని ఈ విధంగా ధ్యానించాలి. దేవి శరీరకాంతి చంద్ర, కుందకుసుమాలలాగా ఉంటుంది.

పంచాశద్వర్ణమాలాం తు ముక్తాస్రగ్దామభూషితామ్ ।
వరదాభయాక్షసూత్రపుస్తకాఢ్యాం త్రిలోచనామ్ ॥3॥

ఆమె ఏభై అక్షరాల మాలామయమైన రూపం ధరించి ఉంటుంది. ముత్యాలదండలు, తెల్లని పూలదండలు ధరించి ఉంటుంది. మూడు కన్నులతో ప్రకాశిస్తూ, హస్తాలలో వరుసగా వరదముద్ర, అభయముద్ర, అక్షమాల, పుస్తకం ధరించి శోభిల్లుతూ ఉంటుంది.

లక్షం జపేన్మస్తకాంతం స్కంధాంతం వర్ణమాలికామ్ ।
అకారాది క్షకారాంతాం విశంతీం మానవః స్మరేత్ ॥4॥

ఇలా ధ్యానించి పైన చెప్పిన ఏకాక్షరమంత్రాన్ని ఒక లక్ష జపించాలి. పాదాలనుంచి శిరస్సు వరకు లేదా స్కంధం వరకు అకారాదిక్షకారాంతమైన వర్ణమాలను ఆమె ధరించి ఉన్నట్లు సాధకుడు భావన చేయాలి.

కుర్యాద్గురుశ్చ దీక్షార్థం మంత్రగ్రాహే తు మండలమ్ ।
సూర్యాగ్రమిందుభక్తం తు భాగాభ్యాం కమలం హితమ్ ॥5॥

గురువు మంత్రోపదేశం చేయడానికి దీక్షార్థమై ఒక మండలాన్ని ఏర్పరచాలి. అది సూర్యాగ్రమై ఇందు విభక్తమై ఉండాలి. రెండు భాగాలతో కమలాన్ని ఏర్పరచాలి. అది సాధకునికి హితం చేకూరుస్తుంది.

వీథికా పదికా కార్యా పద్మాన్యష్టౌ చతుష్పదే ।
వీథికా పట్టికా బాహ్యే ద్వారాణి ద్విపదాని తు ॥6॥

తరువాత వీథిపాదిక ఏర్పరచిన, నాలుగు పదములలో ఎనిమిది కమలాలను, వాటి బాహ్యాభాగంలో వీథీ పథికలను నిర్మించాలి.

ఉపద్వారాణి తద్వచ్చ కోణబాధంహ్యాంద్విపట్టికమ్ ।
సితాని నవపద్మాని కర్ణికా కనకప్రభా ॥7॥

కేసరాణి విచిత్రాణి కోణాన్ రక్తేన పూరయేత్ ।
వ్యోమరేఖాంతరం కృష్ణం ద్వారాణీంద్రేభమానతః ॥8॥

రెండేసి పదాలతో ఒక్కొక్క దిక్కులోను ద్వారాలను, ఉపద్వారాలను ఏర్పరచాలి. కోణాలలో రెండేసి పట్టికలు నిర్మించాలి. తొమ్మిది కమలాలను శ్వేతవర్ణంగా చేసి, కర్ణికపై బంగారురంగు గల చూర్ణం చల్లి పచ్చగాను, కేసరాలను వివిధ వర్ణాలతోను, కోణాలను రక్తవర్ణాలుగాను అలంకరించాలి. వ్యోమరేఖాంతరం కృష్ణ వర్ణంగా చేసి ద్వారాల మానం ఇంద్రగజప్రమాణాన్ని అనుసరించి ఉండేటట్లు నిర్మించాలి.

మధ్యే సరస్వతీం పద్మే వాగీశీం పూర్వపద్మకే ।
హృల్లేఖా చిత్రవాగీశీ గాయత్రీ విశ్వరూపయా ॥9॥

శాంకరీ మతిర్ధృతిశ్చ పూర్వాద్యా హ్రీం స్వబీజకాః ।
ధ్యేయా సరస్వతీవచ్చ కపిలాజ్యేన హోమకః ॥10॥

సంస్కృతప్రాకృతకవిః కావ్యశాస్త్రాదివిద్భవేత్ ॥11॥

మధ్యకమలంలో సరస్వతిని, పూర్వకమలంలో వాగీశిని, ఆగ్నేయాది విదిక్కులలో క్రమంగా హృల్లేఖ, చిత్రవాగీశి, గాయత్రి, విశ్వరూప, శాంకరి, మతి, ధృతులను స్థాపించి పూజించాలి. నామ ప్రారంభంలో "హ్రీం" చేర్చి, నామాద్య క్షరాలను బీజరూపంతో ఉచ్చరించి పూజించాలి. "హ్రీం వాం వాగీశ్యై నమః" ఇత్యాదిగా ఉచ్చరించాలి. సరస్వతినే వాగీశ్వరీ రూపంలో ధ్యానించాలి. కపిలధేను ఘృతంతో హోమం చేయాలి. ఇలా చేసేవాడు సంస్కృత ప్రాకృతభాషలలో కావ్యరచనచేసే కవి అవుతాడు. కావ్య శాస్త్ర విద్వాంసుడవుతాడు.

ఇత్యాది మహాపురాణే ఆగ్నేయే వాగీశ్వరీపూజావిధానకథనం నామ ఏకోనవింశత్యధిక త్రిశతతమోఽధ్యాయః ॥319॥

ఆగ్నేయ మహాపురాణంలో వాగీశ్వరీ పూజావిధానకథనం అనే మూడువందల పందొమ్మిదవ అధ్యాయం సమాప్తం.



వింశత్యధికత్రిశతతమోఽధ్యాయః – మూడువందల ఇరవైయ్యవ అధ్యాయం

మండలవిధానకథనమ్ – మండల విధానకథనం

ఈశ్వర ఉవాచ – ఈశ్వరుడు ఇలా వచించాడు.

సర్వతోభద్రకాన్యష్ట మండలాని వదే గుహ ।
శంకునా సాధయేత్ప్రాచీమిష్టాయాం విషువే సుధీః ॥1॥

చిత్రాస్వాత్య న్తరేణాథ దృష్టసూత్రేణ వా పునః ।
పూర్వాపరాయతం సూత్రమాస్ఫాల్య మధ్యతో ఽంకయేత్ ॥2॥

ఓ గుహా! ఇపుడు 'సర్వతోభద్రం' అను పేరు కలిగిన ఎనిమిది మండలాల గురించి చెబుతున్నాను. శంకువుతో తూర్పుదిక్కును పండితుడు సాధించాలి. అనంతరం విషువకాలంలో (పగలు, రాత్రి సమానంగా ఉండే కాలంలో) చిత్ర, స్వాతినక్షత్రాల మధ్యసమయంలో లేదా సూత్రాన్ని (దారాన్ని) గ్రహించి తూర్పు నుంచి పశ్చిమం వరకు లాగి మధ్యలో రెండు కోటులను (అంచులను) గుర్తించాలి.

కోటిద్వయం తు తన్మధ్యాదంకయే ద్దక్షిణోత్తరమ్ ।
మత్స్యద్వలను మధ్యేద్వయం ప్రకర్తవ్యం స్ఫాలయేద్దక్షిణోత్తరమ్ ॥3॥

వాటి మధ్య నుంచి ఒక పొడవైన ఉత్తరదక్షిణరేఖ గీయాలి. రెండు మత్స్యాలను నిర్మించి వాటిని దక్షిణోత్తరాలపై ఆస్ఫాలన చేయాలి.

(క్షత) శతక్షేత్రార్ధమానేన కోణసంపాతమాదిశేత్ ।
ఏవం సూత్రచతుష్కస్య స్ఫాలనాచ్చతురస్రకమ్ ॥4॥

క్షతపదక్షేత్రంయొక్క అర్ధమానంచే కోణసంపాతం చేయాలి. ఈ విధంగా నాలుగుసార్లు సూత్రాన్ని క్షేత్రమునందు ఆస్ఫాలన చేయగా ఒక చతురస్రం ఏర్పడుతుంది.

జాయతే తత్ర కర్తవ్యం భద్రం వేదకరం శుభమ్ ।
వసుభక్తేందుద్విపదే క్షేత్రే వీథీ చ భాగికా ॥5॥

దానిలో నాలుగు హస్తాల కొలతతో శుభకరమైన భద్రమండలాన్ని ఏర్పాటు చేయాలి. ఎనిమిది పదాలచే అన్నివైపులా విభక్తములైన అరవై నాలుగు పదాలనుంచి ఇరవై పదాలుగల క్షేత్రంలో ఒక వీథిని నిర్మించాలి. ఈ వీథి ఒక మంత్రానికి సంబంధించింది.

ద్వారం ద్విపాదికం పద్మమానాద్వై సకపోలకమ్ ।
కోణబంధవిచిత్రం తు ద్విపదం తత్ర వర్తయేత్ ॥6॥

పద్మమానం చే రెండుపదాల ద్వారం నిర్మించి, దానిని కపోలయుక్తంగా చేయాలి. కోణబంధంచే అది అందంగా ఉండేటట్లు చేయాలి. ఈ ద్వారనిర్మాణంలో ఈ విధంగా ద్విపదాన్ని ఉపయోగించాలి.

శుక్లం పద్మం కర్ణికా తు పీతా చిత్రం తు కేసరమ్ ।
రక్తా వీథీ తత్ర కల్ప్యా ద్వారం లోకేశరూపకమ్ ॥7॥

కమలాన్ని శుక్లవర్ణం గాను, కర్ణికను పీత వర్ణం గాను, కేసరాలను చిత్ర వర్ణాలుగాను, వీధిని రక్తవర్ణం గాను చేయాలి. ద్వారం లోకపాలస్వరూపంగా ఉండాలి.

రక్తకోణం విధౌ నిత్యే నైమిత్తికేఽబ్జకం శృణు ।
అసంసక్తం తు సంసక్తం ద్విధాఽబ్జం భుక్తిముక్తికృత్ ॥8॥

నిత్య, నైమిత్తికవీథులందు కోణం ఎర్రగా ఉండాలి. ఇపుడు పద్మాన్ని గురించి చెబుతాను వినుము. అది అసంసక్తం, సంసక్తం అని రెండు విధాలు. అసంసక్తం ముక్తిప్రదం. సంసక్తం భుక్తిప్రదం.

అసంసక్తం ముముక్షూణాం సంసక్తం తత్త్రిధా పృథక్ ।
బాలో యువా చ వృద్ధశ్చ నామతః ఫలసిద్ధిదాః ॥9॥

అసంసక్తకమలం ముముక్షువులకు ఉపయోగించేది. సంసక్తకమలం మూడు భేదాలతో ఉంటుంది. బాల, యువ, వృద్ధ అని వాటి పేర్లు. అవి తమ పేర్లను అనుసరించి ఫలసిద్ధిని ఇస్తాయి.

పద్మక్షేత్రే తు సూత్రాణి దిగ్విదిక్షు వినిక్షిపేత్ ।
వృత్తాని పంచకల్ప్యాని పద్మక్షేత్రసమాని తు ॥10॥

పద్మక్షేత్రంలో దిక్కులయందు, విదిక్కులందు సూత్రవిన్యాసం చేసి, పదక్షేత్ర సమంగా ఐదువృత్తాలు నిర్మించాలి.

ప్రథమే కర్ణికా తత్ర పుష్కరైర్నవభిర్యుతా ।
కేసరాణి చతుర్వింశ ద్వితీయేఽథ తృతీయకే ॥11॥

దలసంధిర్గజకుంభ నిభాన్తర్యద్దలాగ్రకమ్ ।
పంచమే వ్యోమరూపం తు సంసక్తం కమలం స్మృతమ్ ॥12॥

ప్రథమవృత్తంలో తొమ్మిది పుష్కరాలు గల కర్ణికను, రెండోవృత్తంలో ఇరవైనాలుగు కేసరాలను, మూడోవృత్తంలో గజకుంభసమానములైన దలసంధిని, నాలుగోవృత్తంలో దలాగ్రభాగాలను, ఐదోవృత్తంలో ఆకాశమాత్రంగా శూన్యంగా ఉండేటట్లు ఏర్పాటు చేయాలి. ఇది సంసక్తకమలం అవుతుంది.

అసంసక్తే దలాగ్రే తు దిగ్భాగై ర్విస్తరాద్భజేత్ ।
భాగద్వయపరిత్యాగా ద్వష్టంశైర్వర్తయేద్దలమ్ ॥13॥

అసంసక్తకమలంలో దళాగ్రభాగాలతో, అవి దిక్కుల భాగాలు కాబట్టి, వాటి విస్తారాన్ని అనుసరించి, రెండు భాగాలు విడిచి పెట్టి, ఎనిమిది భాగాలతో దళాలు ఏర్పరచాలి.

సంధివిస్తారసూత్రేణ తన్మూలాదంజయేద్దలమ్ ।
సవ్యాపసవ్యక్రమేణైవ వృద్ధమేతద్భవేత్తథా ॥14॥

సంధి విస్తారసూత్రంతో దాని మానాన్ని అనుసరించి దలాలను రచించాలి. దీనియందు ఎడమ నుండి కుడికి ఏర్పరచాలి. ఇది వృద్ధసంసక్తకమలం అవుతుంది.

అథ వా సంధి మధ్యాత్తు భ్రామయేదర్ధచంద్రవత్ ।
సంధిద్వయాగ్రసూత్రం వా బాలపద్మం తథా భవేత్॥15॥

లేదా సంధిమధ్య నుండి అర్ధచంద్రాకారంగా త్రిప్పాలి. లేదా రెండు సంధుల అగ్రమునందున్న సూత్రాన్ని పైవిధంగా త్రిప్పాలి. ఇది బాలపద్మం అనబడుతుంది.

సంధి సూత్రార్ధమానేన పృష్ఠతః పరివర్తయేత్ ।
తీక్ష్ణాగ్రం తంతునాఽనేన కమలం భుక్తిముక్తిదమ్ ॥16॥

సంధిసూత్రంయొక్క అగ్రభాగం నుంచి పృష్ఠభాగం వైపు మాత్రం త్రిప్పాలి. అది తీక్ష్ణాగ్రభాగమైన సూత్రంచే ఏర్పడుతుంది. కమలం భుక్తి మరియు ముక్తిదాయకమైనది.

ముక్తౌ వృద్ధం చ వశ్యాదౌ బాలం పద్మం సమానకమ్ ।
నవనాభం నవహస్తం భాగైర్మంత్రాత్మకైశ్చ తత్ ॥17॥

ముక్తిని ఉద్దేశించి చేసే ఆరాధనలో వృద్ధకమలాన్ని, వశీకరణాదులందు బాలపద్మాన్ని ఉపయోగించాలి. నవనాభకమలచక్రం తొమ్మిది హస్తాల ప్రమాణం కలదై ఉంటుంది. దానిలో మంత్రాత్మకములైన తొమ్మిది భాగాలు ఉంటాయి.

మధ్యేఽబ్జం పట్టికా బీజం ద్వారేణాబ్జస్య మానతః ।
కంఠోపకంఠముక్తాని తద్బాహ్యే వీథికా మతా ॥18॥

దాని మధ్యభాగంలో కమలం ఉంటుంది. కమలమానానుసారం పట్టిక, వీథి, ద్వారంయొక్క (ఏడు) కంఠాలు, ఉపకంఠాలు నిర్మించాలి. ఇది బాహ్యభాగవీథి అవుతుంది.

పంచభాగాన్వితా సా తు సమంతాద్దశభాగికా ।
దిగ్విదిక్ష్వష్ట పద్మాని ద్వారపద్మం సవీథికమ్ ॥19॥

అది ఐదు భాగాలతో కూడి ఉంటుంది. దానికి నలువైపుల పదిభాగాల స్థానం ఉంటుంది. దాని దిక్కులందు, విదిక్కులందు ఎనిమిది కమలాలు ఉండే వీథితోకూడిన ద్వారపద్మం ఉంటుంది.

తద్బాహ్యా పంచపదికా వీథికా యత్ర భూషితా ।
పద్మవద్ద్వారకంఠం తు పదికం చౌష్ఠకంఠకమ్ ॥20॥

ఆ బాహ్యంలో ఉండే పంచపదికాదులతో వీథి అలంకరించబడి ఉంటుంది. ద్వారకంఠం పద్మంలా ఉండాలి. దాని ఓష్ఠ, కంఠ భాగాలలో ఒక్కొక్క పదం ఉంటుంది.

కపోలం పదికం కార్యం దిక్షు ద్వారత్రయం స్ఫుటమ్ ।
కోణబంధం త్రిపట్టం తు ద్విపదం వజ్రవద్భవేత్ ॥21॥

కపోలభాగం ఒక పదంతో ఉంటుంది. మూడు దిక్కులలోను మూడు ద్వారాలు స్పష్టంగా ఉంటాయి. కోణబంధంలో మూడు పట్టములు, రెండు పదములు, వజ్రచిహ్నం ఉంటాయి.

మధ్యం తు కమలం శుక్లం పీతం రక్తం చ నీలకమ్ ।
పీతం శుక్లం చ ధూమ్రం చ రక్తం పీతం చ ముక్తిదమ్ ॥22॥

మధ్యకమలం శుక్లవర్ణం. మిగిలిన దిక్కుల కమలాలు పూర్వాది క్రమంలో పీతం, రక్తం, నీలం, పీతం, శుక్లం, ధూమ్రం, రక్తం, పీతం – రంగులలో ఉంటాయి. ఈ కమలచక్రం ముక్తిదాయకం.

పూర్వాదౌ కమలాన్యష్ట శివవిష్ణ్వాదికం జపేత్ ।
ప్రాసాదమధ్యతోఽభ్యర్చ్య శక్రాదీనబ్జకాదిషు ॥23॥

పూర్వాది దిక్కులందు ఎనిమిది కమలాలను, శివుడు, విష్ణువు మున్నగు దేవతలను పూజించాలి. ఆ దేవతలను ప్రాసాదమధ్యకమలంలో పూజించి, పూర్వాది కమలాలలో ఇంద్రాది దేవతలను పూజించాలి.

అస్త్రాణి బాహ్యవిథ్యాం తు విష్ణ్వాదీనశ్వమేధభాక్ ।
పవిత్రారోహణాదౌ చ మహామండలమాలిఖేత్ ॥24॥

బాహ్యవీథిలో పూర్వాది దిశలలో ఇంద్రాది దేవతల వజ్రాద్యాయుధాలను పూజించాలి. అక్కడ విష్ణ్వాది దేవతలను పూజించే సాధకుడు అశ్వమేధయాగం చేసిన ఫలం పొందుతాడు. పవిత్రారోపణాదులలో మహామండలాన్ని ఏర్పరచాలి.

అష్ట హస్తం పురా క్షేత్రం రసపక్షైర్వివర్తయేత్।
ద్విపదం కమలం మధ్యే వీథికా పదికా తతః ॥25॥

దిగ్విదిక్షు తతోఽష్టౌ చ నీలాఽబ్జాని వివర్తయేత్ ।
మధ్యపద్మ ప్రమాణేన త్రింశత్పద్మాని తాని తు ॥26॥

ఎనిమిది హస్తాల పొడవైన క్షేత్రాన్ని ఇరువదిఆరుగా విభజించాలి. మధ్యలో నున్న పదద్వయమునందు కమలాన్ని నిర్మించాలి. తరువాత ఒక పదవీథిలో దిక్కులందు, విదిక్కులందు ఎనిమిది నీల కమలములను నిర్మించాలి. మధ్యనున్న కమలప్రమాణంతో మొత్తం ముప్పై పద్మాలు నిర్మించాలి.

దలసంధివిహీనాని నీలేందీవరకాణి చ ।
తత్పృష్ఠే పదికా వీథీ స్వస్తికాని తదూర్ధ్వతః ॥27॥

వాటికి దళసంధులు ఉండరాదు. అవి నీలవర్ణకమలాలై ఉండాలి. దాని పృష్ఠభాగంలో ఒక పదవీథి, పైన స్వస్తికచిహ్నాలను ఏర్పరచాలి.

ద్విపదాని తథా చాష్టౌ కృతభాగకృతాని తు ।
వర్తయేత్ స్వస్తికాం స్తత్ర వీథికా పూర్వవద్బహిః ॥28॥

ద్వారాణి కమలం యద్వదుపకంఠయుతాని తు ।
రక్తం కోణం పీతవీథీ నీలం పద్మం చ మండలే ॥29॥

పిదప బాహ్యభాగంలో వీథి, ద్వారాలు, ఉపకంఠాలు ఉండాలి. పృష్ఠభాగంలో పదవీథి, దానిపైన స్వస్తిక చిహ్నాలు ఉన్న వీథి పైభాగంలో బాహ్యభాగంలో రెండేసి పదాలలో ఎనిమిది స్వస్తికాలను ఏర్పరచాలి. బాహ్యభాగవీథిలో కోణాలు రక్తవర్ణాలు, వీథి పీతవర్ణం, మండలమధ్యకమలం నీలవర్ణం అయ్యుండాలి.

స్వస్తికాది విచిత్రం చ సర్వకామప్రదం గుహ! ।

కార్తికేయా! విచిత్రవర్ణాలతో ఉండే స్వస్తికాదిమండలాలు అన్ని కోరికలను నెరవేరుస్తాయి.

పంచాబ్జం పంచహస్తం స్యాత్సమంతాద్దశభాజితమ్ ॥30॥

ద్విపదం కమలం వీథి పట్టికా దిక్షు పంకజమ్ ।
చతుష్కం పృష్ఠతో వీథీ పదికా ద్విపదాఽన్యథా ॥31॥

పంచాబ్జమండలాన్ని ఐదు హస్తాల క్షేత్రాన్ని అన్ని వైపుల నుంచి పదిభాగాలు గా విభజించి నిర్మించాలి. రెండు పదాలు, కమలం, బాహ్యభాగంలో వీథి, మళ్లీ పట్టిక, మళ్లీ నాలుగు దిక్కులందు నాలుగు కమలాలు, వాటి పృష్ఠభాగంలో వీథి ఉండాలి. వాటిని ఏకపదంలో కాని, పదద్వయంలో కాని నిర్మించాలి.

కంఠోపకంఠయుక్తాని ద్వారాణ్యబ్జం తు మధ్యతః ।
పంచాబ్జమండలే హ్యస్మిన్ సితం పీతం చ పూర్వకమ్ (వత్)॥32॥

వైడూర్యాభం దక్షిణాబ్జం కుందాభం వారుణం కజమ్ ।
ఉత్తరాబ్జం తు శంఖాభమన్యత్సర్వం విచిత్రకమ్ ॥33॥

కంఠోపకంఠాలు గల ద్వారాలు, వాటి మధ్యభాగంలో కమలాలు ఉండాలి. ఈ పంచాబ్జమండలంలో పూర్వదిక్కునందు ఉండే కమలం శ్వేతవర్ణం, పీతవర్ణం అయి ఉండాలి. దక్షిణదిక్కులో ఉండే కమలం వైడూర్యవర్ణం, పశ్చిమదిశలో ఉండే కమలం కుందసమానవర్ణం, ఉత్తరదిశలో ఉండే కమలం శంఖసమానవర్ణం, మిగిలినవన్నీ విచిత్రవర్ణాలు అయి ఉండాలి.

సర్వకామప్రదం వక్ష్యే దశహస్తం తు మండలమ్ ।
వికారభక్తం తుర్యాస్రంద్వారం తు ద్విపదం భవేత్ ॥34॥

సర్వకామదాయకమైన దశహస్త మండలాన్ని గురించి చెబుతున్నాను. దానిని వికారసంఖ్యచే (24చే) అన్ని వైపుల విభజించి చతురస్రక్షేత్రం ఏర్పరచాలి. అందు రెండేసి పదాల ద్వారం ఉండాలి.

మధ్యే పద్మం పూర్వవచ్చ విఘ్నధ్వంసం వదామ్యథ ।
చతుర్హస్తం పురం కృత్వా వృత్తం చైవ కరద్వయమ్ ॥35॥

పూర్వంలో చెప్పిన చక్రంలో లాగా దీని మధ్యభాగంలో కమలం ఉంటుంది. ఇపుడు విఘ్నధ్వంసచక్రం గురించి చెబుతాను. నాలుగుహస్తాల పురం ఏర్పరచి దాని మధ్య, రెండు హస్తాల గోళాకారచక్రం ఏర్పరచాలి.

వీథికా హస్తమాత్రా తు స్వస్తికైర్బహుభిర్వృతా ।
హస్తమాత్రాణి ద్వారాణి దిక్షువృత్తం సపద్మకమ్ ॥36॥

దానికి అన్నివైపుల స్వస్తికచిహ్నావృతమైన హస్తప్రమాణం గల వీథి ఉంటుంది. ఒక్కొక్కహస్తంలో నాలుగు వైపుల ద్వారాలు ఏర్పరచాలి. నాల్గు దిక్కులలోను కమలాంకితములైన వృత్తాలు ఉంటాయి.

పద్మాని పంచ శుక్లాని మధ్యే పూజ్యశ్చ నిష్కలః ।
హృదయాదీని పూర్వాదౌ విదిక్ష్వస్త్రాణి వై యజేత్ ॥37॥

ఈ చక్రంలో శ్వేతవర్ణములైన ఐదు కమలాలు ఉంటాయి. మధ్యవర్తికమలంలో నిరాకారుడైన పరమాత్మను పూజించాలి. పూర్వాది దిక్కులలో హృదయాది అంగాలను, విదిక్కులలో అస్త్రాలను పూజించాలి.

ప్రాగ్వచ్చ పంచ బ్రహ్మాణి బుద్ధ్యాధారమతో వదే ।
శతభాగే తిథిభాగే పద్మం లింగాష్టకం దిశి ॥38॥

సద్యోజాతాది పంచబ్రహ్మమయ ముఖాలను కూడా పూజించాలి. ఇపుడు బుద్ధ్యాధారచక్రాన్ని చెబుతున్నాను. నూరు పదాలక్షేత్రంలో మధ్యనున్న పదాలలో ఒక కమలం అంకితం చేసి, ఎనిమిది దిక్కులలోను ఎనిమిది శివలింగాలను ఏర్పరచాలి.

మేఖలాభాగసంయుక్తం కంఠం ద్విపదికం భవేత్ ।
ఆచార్యో బుద్ధిమాశ్రిత్య కల్పయేచ్చ లతాదికమ్ ॥39॥

రెండు పదాలలో మేఖలా భాగసహితమైన కంఠాన్ని ఏర్పరచాలి. ఆచార్యుడు తన బుద్ధిసహాయంతో లతాదులను ఏర్పరచాలి.

చతుః షట్పంచమాష్టాది ఖాక్షిఖాద్యాది మండలమ్ ।
ఖాక్షీందుసూర్యగం సర్వం ఖాక్షి చైవేందు వర్ణనాత్ ॥40॥

(చత్వారింశ) చతుర్వింశదధికాని చతుర్దశ శతాని హి ।
మండలాని హరేః శంభో ర్దేవ్యాః సూర్యస్య సన్తి చ ॥41॥

నాలుగు, ఆరు, ఐదు, ఎనిమిది ఇత్యాది సంఖ్యలలో ఉన్న కమలాలలో మండలాలు ఏర్పడతాయి. ఇరవై, ముప్పై కమలాలున్నవి కూడ ఉంటాయి. 12120 కమలాలు ఉన్న సంపూర్ణమండలం కూడ ఉంటుంది. 120 కమలాలున్న మండపం కూడ కనబడుతుంది. విష్ణువుకు, శివునికి, దేవికి, సూర్యునకు 1440 మండలాలు ఉంటాయి.

దశ సప్త విభక్తే తు లతా లింగోద్భవం శృణు ।
దిక్షు పంచ త్రయం చైకం త్రయం పంచ చ లోమయేత్ ॥42॥

పదిహేడు పదాలతో పదిహేడు పదాలను విభజిస్తే 2 8 9 పదాలు అవుతాయి. ఈ మండపంలో లతాలింగం ఎలా ఉద్భవిస్తుందో చెబుతాను. ఒక్కొక్క దిక్కునందు ఐదు, మూడు, ఒకటి, మూడు ఐదు పదాలను తుడిచివేయాలి.

ఊర్ధ్వగే ద్విపదే లింగం మందిరం పార్శ్వకోష్ఠయోః ।
మధ్యే చ ద్విపదం పద్మమథ చైకం చ పంకజమ్ ॥43॥

పైన నున్న రెండు పదాలలో లింగం, పార్శ్వము నందున్న రెండేసి కోష్ఠాలలో మందిరం ఏర్పడుతుంది. మధ్యనున్న రెండు పదాలలో ఒక కమలం, మళ్లీ మరో కమలం ఏర్పడతాయి.

లింగస్య పార్శ్వయోర్భద్రే పదద్వారమలోపనాత్ ।
తత్పార్శ్వశోభాః షడ్లోప్య లతాః శేషాస్తథా హరేః ॥44॥

లింగపార్శ్వ భాగాలలో రెండు భద్రాలు ఏర్పడతాయి. ఒక పదంలో ద్వారం ఉంటుంది. దానిని తుడిచి వేయరాదు. ఆ ద్వారపార్శ్వాలలో ఆరేసి పదాలు తుడిచివేయగా ద్వారశోభ ఏర్పడుతుంది. మిగిలిన పదాలలో శ్రీహరికి లతలు ఏర్పడతాయి.

ఊర్ధ్వం ద్విపదికం లోప్య హరేర్భద్రాష్టకం స్మృతమ్ ।
రశ్మిమాలాసమాయుక్తం వేదలోపాచ్చ శోభితమ్ ॥45॥

పై నున్న రెండు పదాలను తుడిచి వేయగా విష్ణువుకు భద్రాష్టకం ఏర్పడుతుంది. మళ్లీ నాలుగుపదాలను తుడిచి వేయగా, రశ్మిమాలాయుక్తమైన శోభాస్థానం ఏర్పడుతుంది.

పంచవింశతికం పద్మం తతః పీఠమపీఠకమ్ ।
ద్వయం ద్వయం రక్షయిత్వా ఉపశోభాస్తథాష్ట చ ॥46॥

ఇరవై ఐదు పదాలచే పద్మం, పిదప పీఠం, అపీఠం, రెండేసి పదాలను ఉంచగా ఎనిమిది ఉపశోభలు ఏర్పడుతాయి.

దేవ్యాదిఖ్యాపకం భద్రం బృహన్మధ్యే పరం లఘు ।
మధ్యే నవపదం పద్మం కోణే భద్రచతుష్టయమ్ ॥47॥

దేవ్యాది సూచకమైన భద్రమండలం మధ్య విస్తృతంగాను, ప్రాంతభాగంలో లఘువుగాను ఉంటుంది. మధ్య తొమ్మిదిపదాల కమలం ఏర్పడుతుంది. నాల్గు కోణాలలో నాల్గు భద్రమండలాలు ఏర్పడతాయి.

త్రయోదశపదం శేషం బుద్ధ్యాధారస్తు మండలమ్ ।
శతపత్రం షష్ట్యధికం బుద్ధ్యాధారం హరాదిషు ॥48॥

మిగిలిన పదమూడు పదాలలో బుద్ధ్యాధారమండలం ఏర్పడుతుంది. దీనిలో నూట అరవై పదాలు ఉంటాయి. బుద్ధ్యాధారమండలం శివాది దేవతారాధనకు ప్రశస్తం.

ఇత్యాది మహాపురాణే ఆగ్నేయే మండలవిధానకథనం నామ వింశత్యధిక త్రిశతతమోఽధ్యాయః ॥320॥

అగ్నిమహాపురాణంలో మండలవిధానకథనం అనే మూడువందల ఇరవైయ్యవ అధ్యాయం సమాప్తం.



ఏకవింశత్యధిక త్రిశతతమోఽధ్యాయః - మూడువందల ఇరవైఒకటవ అధ్యాయం

అఘోరాస్త్రాది శాంతికల్పవిధానమ్ - అఘోరాస్త్రాది శాంతికల్పవిధానం

ఈశ్వర ఉవాచ - ఈశ్వరుడు ఇలా పలికాడు.

అస్త్రయాగః పురా కార్యః సర్వకర్మసు సిద్ధిదః ।
మధ్యే పూజ్యం శివాద్యస్త్రం వజ్రాదీన్ పూర్వతః క్రమాత్ ॥1॥

సర్వకర్మలయందు ముందుగా సకలసిద్ధిప్రదమైన అస్త్రపూజ కావించాలి. మధ్యభాగంలో శివపరమాత్మ మున్నగు వారి అస్త్రాలను, పూర్వాది దిక్కులలో క్రమంగా ఇంద్రాది దిక్పాలకుల వజ్రాద్యాయుధాలను పూజించాలి.

పంచవక్త్రం దశకరం రణాదౌ పూజితం జయే ।
గ్రహపూజా రవిర్మధ్యే పూర్వాద్యాః సోమకాదయః ॥2॥

సర్వ ఏకాదశస్థాస్తు గ్రహాః స్యుర్గ్రహ పూజనాత్ ।

ఐదుముఖాలు, పదిచేతులు ఉన్న శంకరుని యుద్ధప్రారంభంలో పూజిస్తే జయం కలుగుతుంది. మధ్యలో రవిని, పూర్వాది దిక్కులయందు చంద్రాదులను ఉంచి గ్రహపూజ చేయాలి. గ్రహపూజ చేయడం వల్ల గ్రహాలన్నీ ఏకాదశస్థానంలో ఉన్న లాభరూప ఫలాన్ని ఇస్తాయి.

అస్త్రశాంతిం ప్రవక్ష్యామి సర్వోత్పాతవినాశినీమ్ ॥3॥

ఇపుడు సమస్త ఉత్పాతాలను నశింపజేసే అస్త్రశాంతిని చెబుతాను.

గ్రహరోగాదిశమనీం మారీశత్రువిమర్దనీమ్ ।
వినాయకోపతాపఘ్నీమఘోరాస్త్రం జపేన్నరః ॥4॥

ఇది గ్రహరోగాది బాధలను, మారి దోషాలను, శత్రుభయాలను తొలగిస్తుంది. వినాయకుల వల్ల కలిగే బాధలను, ఉపతాపాలను పోగొడుతుంది. అఘోరాస్త్రాన్ని జపిస్తే నరునకు ఇన్ని లాభాలు కలుగుతాయి.

లక్షం గ్రహాదినాశః స్యాదుత్పాతే తిలహోమతః ।
దివ్యే లక్షం తదర్ధేన వ్యోమజోత్పాతనాశనమ్ ॥5॥

నరుడు లక్ష పర్యాయాలు జపిస్తే గ్రహబాధలు నశిస్తాయి. తిలలతో దశాంశం హోమం చేస్తే ఉత్పాతాలు నశిస్తాయి. ఒక లక్ష జపహోమం వల్ల దివ్యోత్పాతాలు నశిస్తాయి. అర్ధలక్షజపహోమం వల్ల వ్యోమోత్పాతాలు నశిస్తాయి.

ఘృతేన లక్షపాతేన ఉత్పాతే భూమిజే హితమ్ ।
ఘృతగుగ్గులుహోమే చ సర్వోత్పాతాదిమర్దనమ్ ॥6॥

లక్ష ఆజ్యాహుతులు చేస్తే భూమిసంబంధమైన ఉత్పాతాలు నశిస్తాయి. గుగ్గులు మిశ్రితమైన ఘృతం హెూమం చేస్తే అన్ని ఉత్పాతాలు నశిస్తాయి.

దూర్వాక్షతాజ్యహెూమేన వ్యాధయోఽథ ఘృతేన చ ।
సహస్రేణ తు దుఃస్వప్నా వినశ్యంతి న సంశయః ॥7॥

దూర్వలు, అక్షతలు, ఆజ్యం, హోమం చేస్తే సర్వరోగాలు నశిస్తాయి. ఘృతంతో సహస్రహెూమం చేస్తే దుస్స్వప్నాలు నశిస్తాయి. ఇందు సందేహం లేదు.

అయుతాద్గ్రహదోషఘ్నో యవాద్ఘృతవిమిశ్రితాత్ ।
వినాయకార్తిశమనమయుతేన ఘృతస్య చ ॥8॥

భూతవేతాళశాంతిస్తు గుగ్గులో రయుతేన చ ।
మహావృక్షస్య భంగే తు వ్యాలకంకే గృహే స్థితే ॥9॥

పదివేలు హోమం చేస్తే గ్రహదోషాలు తొలగిపోతాయి. యవలతో, నేతితో హెూమం చేస్తే వినాయకబాధలు తొలగుతాయి. పదివేల ఆజ్యహెూమాలు చేస్తే, పదివేల గుగ్గులు హోమాలు చేస్తే, భూతవేతాళ శాంతి కలుగుతుంది. ఏదైనా మహావృక్షం పడిపోయినా, ఇంటిలో సర్పశవం ఉన్నా, ఘృతాక్షతహెూమంచే విఘ్నశాంతి కలుగుతుంది.

అరణ్యానాం ప్రవేశే చ దూర్వాజ్యాక్షతహోవనాత్ ।
ఉల్కాపాతే భూమికంపే తిలాజ్యేనాహుతాచ్ఛివమ్ ॥10॥

అరణ్యప్రవేశం చేయవలసిన సమయంలో కూడా దూర్వలతోను, నేతితోను, అక్షతలతోను హెూమం చేయాలి. ఉల్కాపాతం గాని, భూకంపం గాని కలిగినపుడు తిలఘృతహెూమం చేస్తే మంగళం కలుగుతుంది.

రక్తస్రావే తు వృక్షాణామయుతాద్గుగ్గులోః శివమ్ ।
అకాలే ఫలపుష్పాణాం రాష్ట్రభంగే చ మారణే ॥11॥

వృక్షాల నుంచి రక్తం కారినా, అకాలంలో ఫలపుష్పాలు పుట్టినా, రాష్ట్రభంగం కలిగినా, మారకయోగం కలిగినా, పదివేల గుగ్గులు హెూమం చేస్తే మంగళం కలుగుతుంది.

ద్విపదాదేర్యదా మారీ లక్షార్ధాచ్చ తిలాజ్యతః ।
హస్తిమారీప్రశాంత్యర్థం కరిణీదంతవర్ధతే ॥12॥

హస్తిన్యాం మదదృష్టౌ చ అయుతాచ్ఛాన్తిరిష్యతే ।
అకాలే గర్భ పాతే తు జాతం యత్ర వినశ్యతి॥13॥

ద్విపాత్తులకు, చతుష్పాత్తులకు మహామారి సంభవిస్తే అర్ధలక్ష ఆహుతులు తిలమిశ్రఘృతంతో హెూమం చేయాలి. ఏనుగులకు మహామారి వచ్చినప్పుడు, ఆడ ఏనుగులకు దంతాలు వచ్చినా, వాటికి గండస్థలం నుంచి

మదం కారినా, పదివేల హోమం చేస్తే శాంతి కలుగుతుంది. అకాలంలో గర్భపాతమయినా, పుట్టిన శిశువు వెంటనే మరణించినా, (ఈ హోమం చేయాలి).

వికృతా యత్ర జాయన్తే యాత్రాకాలేఽ యుతం హువేత్ ।
తిలాజ్య లక్షహోమంతు ఉత్తమా సిద్ధిసాధనే ॥14

వికృతాంగాలు కల శిశువు జన్మించినా, పుట్టవలసిన సమయానికి పూర్వమే శిశువు జన్మించినా, పదివేల హోమాలు చేస్తే దోషం శమిస్తుంది. సిద్ధులను సాధించడానికై తిలమిశ్రఘృతంతో లక్షహోమాలు చేయడం ఉత్తమం.


మధ్యమాయాం తదర్ధేన తత్పాదాదధమాసు చ ।
యథా జపస్తథా హోమః సంగ్రామే విజయో భవేత్ ॥15॥

అఘోరాస్త్రం జపేన్న్యస్య ధ్యాత్వా పంచాస్యమూర్జితమ్ ॥16॥

అర్ధలక్షహోమాలు చేస్తే మధ్యమసిద్ధి, ఇరవై ఐదువేల హోమాలు చేస్తే అధమసిద్ధి కలుగుతుంది. జపాను సారంగా హోమం చేస్తే యుద్ధంలో విజయం లభిస్తుంది. పరమతేజశ్శాలి అయిన పంచముఖుడైన శివుని ధ్యానిస్తూ, న్యాసపూర్వకంగా అఘోరాస్త్రజపం చేయాలి.

ఇత్యాది మహాపురాణే ఆగ్నేయే అఘోరాస్త్రాదిశాంతికల్ప విధానం నామ
ఏకవింశత్యధిక త్రిశతతమోఽ ధ్యాయః ॥321॥

అగ్నిమహాపురాణంలో అఘోరాస్త్రాది శాంతి కల్ప విధానం అనే
మూడువందల ఇరవైఒకటవ అధ్యాయం సమాప్తం.



ద్వావింశత్యధిక త్రిశతతమోఽధ్యాయః – మూడువందల ఇరవైరెండవ అధ్యాయం

పాశుపతశాంతిః – పాశుపతశాంతి

ఈశ్వర ఉవాచ – ఈశ్వరుడు ఇలా వచించాడు.

వక్ష్యే పాశుపతాస్త్రేణ శాంతిజాపాది పూర్వతః ।
పాదతః పూర్వనాశో హి ఫడంతం చాఽపదాదినుత్ ॥1॥

ఇపుడు పాశుపతాస్త్రమంత్రంతో చేసే శాంతి పూజాదులను తెలియజేస్తున్నాను. ఇవి వెనుక చెప్పినట్లు చేయాలి. ఈ మంత్రాన్ని ఆంశిక పాఠము గాని, జపము గాని చేస్తే పూర్వకృతపుణ్యం నశిస్తుంది. కాబట్టి ఫడంత సంపూర్ణమంత్రాన్ని జపించాలి. ఆపదలు మున్నగునవి తొలగిపోతాయి.

"ఓం నమో భగవతే మహాపాశుపతాయ అతులబల వీర్య పరాక్రమాయ
త్రిపంచనయనాయ నానారూపాయ నానాప్రహరణోద్యతాయ
సర్వాంగరక్తాయ భిన్నాంజనచయప్రఖ్యాయ శ్మశానవేతాళప్రియాయ
సర్వవిఘ్ననికృంతనరతాయ సర్వసిద్ధిప్రదాయ భక్తానుకంపినే
అసంఖ్యవక్త్రభుజపాదాయ తస్మై సిద్ధాయ వేతాలవిత్రాసినే
శాకినీక్షోభజనకాయ వ్యాధినిగ్రహకారిణే పాపభంజనాయ
సూర్యసోమాగ్నినేత్రాయ విష్ణుకవచాయ ఖడ్గవజ్రహస్తాయ
యమదండవరుణపాశాయ రుద్రశూలాయ జ్వలజ్జిహ్వాయ
సర్వరోగవిద్రావణాయ గ్రహనిగ్రహకారిణే దుష్టనాగక్షయకారిణే
ఓం కృష్ణ పింగలాయ ఫట్ క్రూరాయ ఫట్ హుంకారాయ అస్త్రాయ ఫట్, వజ్రహస్తాయ ఫట్,
శక్తయే ఫట్, దండాయ ఫట్, యమాయ ఫట్, ఖడ్గాయ ఫట్,
నైర్ఋతాయ ఫట్, వరుణాయ ఫట్, వజ్రాయ ఫట్, పాశాయ ఫట్,
ధ్వజాయ ఫట్, అంకుశాయ ఫట్, గదాయై ఫట్, కుబేరాయ ఫట్,
త్రిశూలాయ ఫట్, ముద్గరాయ ఫట్, చక్రాయ ఫట్, పద్మాయ ఫట్,
నాగాస్త్రాయ ఫట్, ఈశానాయ ఫట్, ఖేటకాస్త్రాయ ఫట్, ముండాయ ఫట్,
ముండాస్త్రాయ ఫట్, కంకాలస్త్రాయ ఫట్, పిచ్ఛికాస్త్రాయ ఫట్,
క్షురికాస్త్రాయ ఫట్, బ్రహ్మాస్త్రాయ ఫట్, శక్త్యస్త్రాయ ఫట్, గణాస్త్రాయ ఫట్,
సిద్ధాస్త్రాయ ఫట్, పిలిపిచ్ఛాస్త్రాయ ఫట్, గంధర్వాస్త్రాయ ఫట్, పూర్వాస్త్రాయ ఫట్,
దక్షిణాస్త్రాయ ఫట్, వామాస్త్రాయ ఫట్, పశ్చిమాస్త్రాయ ఫట్,
మంత్రాస్త్రాయ ఫట్, శాకిన్యస్త్రాయ ఫట్, యోగిన్యస్త్రాయ ఫట్,

దండాస్త్రాయ ఫట్, నమోஉస్త్రాయ ఫట్, శివాస్త్రాయ ఫట్, ఈశానాస్త్రాయ ఫట్,
పురుషాస్త్రాయ ఫట్, అఘోరాస్త్రాయ ఫట్, వామదేవాస్త్రాయ ఫట్,
సద్యోజాతాస్త్రాయ ఫట్, హృదయాస్త్రాయ ఫట్, మహాస్త్రాయ ఫట్,
గరుడాస్త్రాయ ఫట్, రాక్షసాస్త్రాయ ఫట్, దానవాస్త్రాయ ఫట్,
క్షౌం నరసింహాస్త్రాయ ఫట్, త్వష్టస్త్రాయ ఫట్, సర్వాస్త్రాయ ఫట్,
నః ఫట్, వః ఫట్, పః ఫట్, ఫః ఫట్, మః ఫట్, శ్రీః ఫట్, ఫేః ఫట్,
భూఃఫట్, భువఃఫట్, స్వఃఫట్, మహఃఫట్, జనఃఫట్, తపఃఫట్,
సత్యంఫట్, సర్వలోక ఫట్, సర్వకారణఫట్, సర్వతత్త్వఫట్,
సర్వప్రాణఫట్, సర్వనాడీ ఫట్, సర్వకారణఫట్ (సర్వపాతాల ఫట్), సర్వదేవఫట్,
హ్రీం ఫట్, శ్రీం ఫట్, హ్రూం ఫట్, స్రుం ఫట్, (ఆం ఫట్) స్వాం ఫట్,
లాం ఫట్, వైరాగ్యాయ ఫట్, మాయాస్త్రాయ ఫట్, కామాస్త్రాయ ఫట్,
క్షేత్రపాలాస్త్రాయ ఫట్, హుంకారాస్త్రాయ ఫట్, భాస్కరాస్త్రాయ ఫట్,
చంద్రాస్త్రాయ ఫట్, విఘ్నేశ్వరాస్త్రాయ ఫట్, గౌః గాం ఫట్, ఖ్రోం ఖ్రౌం ఫట్,
హ్రీం హ్రోం ఫట్, భ్రామయ భ్రామయ ఫట్, సంతాపయ సంతాపయ ఫట్,
ఛాదయ ఛాదయ ఫట్, ఉన్మూలయ ఉన్మూలయ ఫట్, త్రాసయ త్రాసయ ఫట్,
సంజీవయ సంజీవయ ఫట్, విద్రావయ విద్రావయ ఫట్, సర్వదురితం నాశయ నాశయ ఫట్"

సకృదావర్తనాదేవ సర్వవిఘ్నాన్ వినాశయేత్ ।
శతావర్తేన చోత్పాతాన్ రణాదౌ విజయో భవేత్ ॥2॥

"ఓం నమో భగవతే" మొదలు "సర్వదురితం నాశయ నాశయ ఫట్" వరకు మూలోక్తమైన పాశుపతమంత్రం. దీనిని ఒక్క పర్యాయం ఆవృత్తి చేస్తే సమస్తవిఘ్నాలు నశిస్తాయి. నూరు ఆవృత్తులు చేస్తే సమస్తమైన ఉత్పాతాలు నశిస్తాయి. యుద్ధాదులందు విజయం లభిస్తుంది.

ఘృతగుగ్గులుహోమాచ్చ అసాధ్యానపి సాధయేత్ ।
పఠనాత్సర్వశాంతిః స్యాచ్ఛస్త్ర పాశుపతస్య చ ॥3॥

ఆజ్యంతో గుగ్గులు ద్రవ్యం కలిపి హోమం చేస్తే ఈ మంత్రంతో అసాధ్యకార్యాలు కూడా సాధించవచ్చు. ఈ పాశుమంత్ర పఠనంచే శీఘ్రంగా సమస్తక్లేశాలు నశించి శాంతి లభిస్తుంది.

ఇత్యాది మహాపురాణే ఆగ్నేయే పాశుపతశాంతికథనం నామ ద్వావింశత్యధిక త్రిశతతమోஉధ్యాయః ॥322॥

అగ్నిమహాపురాణంలో పాశుపతశాంతి కథనం అనే మూడువందల ఇరవైరెండవ అధ్యాయం సమాప్తం.

త్రయోవింశత్యధిక త్రిశతతమోఽధ్యాయః - మూడువందల ఇరవైమూడవ అధ్యాయం

షడంగాన్యఘోరాస్త్రకథనమ్ - షడంగయుక్తమైన అఘోరాస్త్రకథనం

ఈశ్వర ఉవాచ - ఈశ్వరుడు ఇలా వచించాడు.

ఓం హ్రూం (హం) స ఇతి మంత్రేణ మృత్యురోగాది శామ్యతి ।
లక్షాహుతిభిర్దూర్వాభిః శాంతిం పుష్టిం ప్రసాధయేత్ ॥1॥

"ఓం హ్రూం (హం) సః" అనే మంత్రంచే మృత్యురోగాదులు శమిస్తాయి. ఈ మంత్రంతో ఒక లక్ష దూర్వా హోమాలు చేస్తే శాంతి, పుష్టి లభిస్తాయి.

అథవా ప్రణవేనైవ మాయయా వా షడానన! ।
దివ్యాన్తరిక్షభౌమానాం శాంతిరుత్పాతవృక్షకే ॥2॥

షణ్ముఖా! లేదా కేవలం ప్రణవంతో కాని, మాయాబీజాన్ని "హ్రీం" కాని జపిస్తే దివ్యాంతరిక్షభౌమ మహోత్పాతాలు శమిస్తాయి. ఉత్పాతవృక్షం కూడా శమిస్తుంది.

ఓం నమో భగవతి గంగే కాలికాలి మహాకాలి మహాకాలి
మాంసశోణితభోజనే రక్తకృష్ణముఖి వశమానయ మానుషాన్ స్వాహా" ॥3॥

(ఓం) లక్షం జప్త్వా దశాంశేన హుత్వా స్యాత్సర్వకర్మకృత్ ।
వశం నయతి శక్రాదీన్మానుషేష్వేషు కా కథా ॥4॥

"ఓం నమో భగవతి" మొదలు "మానుషాన్ స్వాహా" వరకు ఉండే మూలోక్తమంత్రాన్ని లక్షజపం చేసి దశాంశం హోమం చేసేవాడు సర్వకార్యాలను సాధిస్తాడు. ఇంద్రాదులను కూడా వశం చేసుకొంటాడు. ఇక మనుష్యుల విషయం చెప్పాలా?

అంతర్ధానకరీ విద్యా మోహనీ జృంభనీ తథా ।
వశం నయతి శత్రూణాం శత్రుబుద్ధిప్రమోహినీ ॥5॥

ఈ విద్య అంతర్ధానకరి, మోహని, జృంభని, శత్రువుల బుద్ధిని మోహింపజేసేది, శత్రువులను వశం చేసుకొనేది కూడ.

కామధేనురియం విద్యా సప్తధా పరికీర్తితా ।
మంత్రరాజం ప్రవక్ష్యామి శత్రుచౌరాదిమోహనమ్ ॥6॥

ఈ కామధేను విద్య ఏడు విధాలుగా ప్రస్తుతి చేయబడుతోంది. ఇపుడు శత్రువులను, చోరులను మున్నగువారిని మోహింపజేసే మంత్రరాజాన్ని గురించి చెబుతున్నాను.

మహాభయేషు సర్వేషు స్మర్తవ్యం హరపూజితమ్ ।
లక్షం జప్త్వా తిలైర్హోమః సిద్ధ్యేదుద్ధారకం శృణు ॥7॥

ఇది సాక్షాత్తు శివుని (నామం) ద్వారా ఆదరించబడేది. ఈ మంత్రాన్ని మహాభయాలు కలిగే సమయంలో స్మరించవలసినది. ఒక లక్ష జపించి తిలలతో హోమం చేస్తే మంత్రం సిద్ధిస్తుంది. దీని ఉద్ధారం వినవలసింది.

ఓం హలే శూలే ఏహి బ్రహ్మసత్యేన విష్ణుసత్యేన రుద్రసత్యేన ।
రక్ష మాం వాచేశ్వరాయ స్వాహా ॥8॥

దుర్గాత్తారయతే యస్మాత్తేన దుర్గా శివా మతా ॥9॥

"ఓం హలే " మొదలు "స్వాహా" వరకు ఉన్నది మూలోక్తదుర్గామంత్రం.

భగవతి, మంగళస్వరూపురాలయిన, దుర్గ, దుర్గమమైన సంకటము నుండి తరింపజేస్తుంది కాన ఆమెకు ఆ పేరు సార్థకమయింది.

ఓం హ్రీం చండకపాలిని దంతాన్ కిట కిట క్షిట క్షిట గుహ్యే ఫట్ హ్రీం ॥10॥

అనేన మంత్రరాజేన క్షాలయిత్వా తు తండులాన్ ।
త్రింశద్వారాణి జప్తాని తచ్చోరేషు ప్రదాపయేత్ ॥11॥

దంతైశ్చూర్ణాని శుక్లాని పతితాని హి శుద్ధయే ॥12॥

"ఓం హ్రీం చండకపాలిని" మొదలు "ఫట్" వరకు ఉన్న మూలోక్తమంత్రాన్ని జపించి, బియ్యం కడిగి వాటిని ఈ మంత్రంతో ముప్పైసార్లు అభిమంత్రించి, వాటిని దొంగలకు పంచి పెట్టాలి. ఆ బియ్యం నమలగానే వారి తెల్లనిదంతాలు రాలిపోతాయి. అపుడు వారు చౌర్యపాపం నుంచి విముక్తులౌతారు.

ఓం జ్వలల్లోచన కపిలజటాభారభాస్వర విద్రావణ
త్రైలోక్య డామర డామర దర దర భ్రమ భ్రమ ఆకట్ట ఆకట్ట ।
తోటయ తోటయ మోటయ మోటయ దహ దహ పచ పచ
ఏవం సిద్ధిరుద్రో జ్ఞాపయతి యది గ్రహోపగతః స్వర్గలోకం ।

దేవలోకం వా ఆరామ విహారాచలం తథాఽపి తమావర్తయిష్యామి
బలిం గృహ్ణ గృహ్ణ దదామి తే స్వాహేతి ॥13॥

క్షేత్రపాలబలిం దత్వా గ్రహో న్యాసాద్వశం వ్రజేత్ ।
శత్రవో నాశమాయాంతి రణే వైరిగణ క్షయః ॥14॥

"ఓం జ్వలల్లోచన" మొదలు "తే స్వాహా" వరకు ఉండే క్షేత్రపాల బలిని మూలోక్తమంత్రంతో క్షేత్రపాలునికి బలి ఇచ్చి న్యాసం చేస్తే గ్రహం వశం అవుతుంది. శత్రువులు నశిస్తారు. రణభూమిలో శత్రుగణాలు హతమవుతాయి.

హంసబీజం తు విన్యస్య విషం తు త్రివిధం హరేత్ ।
అగరుం చందనం కుష్ఠం కుంకుమం నాగకేసరమ్ ॥15॥

నఖం వై దేవదారుం చ సమం కృత్వాఽథ ధూపకః ।

హంసబీజన్యాసంచే మూడు విధాలైన విషాలను లేదా విఘ్నాలను హరించవచ్చు. అగరు, చందన, కుష్ఠ (కూట), కుంకుమ, నాగకేసర, నఖ, దేవదారులను సమప్రమాణములో గ్రహించి, నూరి, ధూపం వేయాలి.

మాక్షికేణ సమాయుక్తో దేహవస్త్రాదిధూపనాత్ ॥16॥

వివాదే మోహనే స్త్రీణాం మండనే కలహే శుభమ్ ।

దీనిలో తేనె కలిపి, దానిని సుగంధంతో శరీరాన్ని, వస్త్రాదులను ధూపవాసనతో పరిమళింపజేస్తే వివాదం, స్త్రీ మోహనం, శృంగారం, కలహం మున్నగు సమయాలలో శుభఫలం లభిస్తుంది.

కన్యాయా వరణే భాగ్యే మాయామంత్రేణ మంత్రితః ॥17॥

హ్రీం రోచనా నాగపుష్పాణి కుంకుమం చ మనఃశిలా ।
లలాటే తిలకం కృత్వా యం పశ్యేత్స వశీ భవేత్ ॥18॥

కన్యావరణం, భాగ్యోదయ సంబంధికార్యములందు కూడ సాఫల్యం సిద్ధిస్తుంది. మాయామంత్రం (హ్రీ) చే అభిమంత్రించిన, రోచన, నాగకేసర, కుంకుమ, మనశ్శిలలతో తిలకాన్ని ధరించి, ఎవరిని చూస్తే వాడు వశమవుతాడు.

శతావర్యాస్తు చూర్ణం తు దుగ్ధపీతం చ పుత్రకృత్ ।
నాగకేసరచూర్ణం తు ఘృతపక్వం తు పుత్రకృత్ ॥19॥

పాలాశబీజపానేన లభతే పుత్రకం తథా ॥20॥

శతావరిచూర్ణాన్ని పాలతో కలిపి త్రాగితే పుత్రులను పుట్టించగలిగే వాడవుతాడు. నాగకేసరచూర్ణాన్ని నేతిలో కలిపి భక్షించినా, పలాశబీజాలను నూరి, త్రాగినా పుత్రోత్పాదకుడు అవుతాడు.

ఓం ఉత్తిష్ఠ చాముండే జంభయ జంభయ మోహయ మోహయ అముకం ।
వశమానయ వశమానయ స్వాహా ॥21॥

షడ్వింశా సిద్ధవిద్యా సా నదీతీరమృదా స్త్రియమ్ ।
కృత్వోన్మత్తరసేనైవ నామాఽఽలిఖ్యార్కపత్రకే ॥22॥

మూత్రోత్సర్గం తతఃకృత్వా జపేత్తామానయేత్ స్త్రియమ్ ॥23॥

"ఓం ఉత్తిష్ఠ" మొదలు "స్వాహా" వరకు ఉండే మూలోక్తమైన ఇరవై ఆరు అక్షరాలమంత్రం సిద్ధవిద్యామంత్రం. నదీతీరంలో ఉండే మట్టితో లక్ష్మీమూర్తిని చేసి, ఉన్మత్తరసంతో జిల్లేడు (అర్క) పత్రంపై ఇష్టమగు స్త్రీనామాన్ని వ్రాయాలి. పిమ్మట మూత్రోత్సర్గం చేసి ఈ మంత్రాన్ని జపిస్తే అభీష్టస్త్రీ వశమవుతుంది.

ఓం క్షుం సః వషట్ (ఓం జాం సః వషట్) ॥24॥

మహామృత్యుంజయో మంత్రో జప్యాద్ధోమాచ్చ పుష్టికృత్ ॥25॥

"ఓం క్షుం (జాం) సః వషట్ " అనేది మహామృత్యుంజయ మంత్రం. దీని జపహోమాలు పుష్టికారకాలు అవుతాయి.

ఓం హంసః, హ్రూం హ్రూం మః, హ్రః సౌం స్కైః
మృతసంజీవనీ విద్యా అష్టార్ణా జయకృద్రణే ॥26॥

"ఓం హం సః, హ్రూం హ్రూం మః, హ్రః సౌం స్కైః" అనేది ఎనిమిది అక్షరాలు కల్గిన మృతసంజీవనీవిద్య" దీనిని జపిస్తే రణమునందు జయాన్ని ఇస్తుంది.

మంత్రా ఈశానముఖ్యాశ్చ ధర్మకామాదిదాయకాః ॥27॥

ఈశానః సర్వవిద్యానామీశ్వరః సర్వభూతానామ్ ।
బ్రహ్మణశ్చాధిపతిర్బ్రహ్మా శివో మేఽస్తు సదాశివోమ్ ॥28॥

ఈశానాదిమంత్రాలు కూడ ధర్మకామాది దాయకాలు. అందు(ఓం) ఈశానః సర్వవిద్యానామీశ్వరః సర్వభూతానాం బ్రహ్మాధిపతిర్బ్రహ్మణోఽధిపతి ర్బ్రహ్మా శివో మే అస్తు సదా శివోమ్"అనేది మొదటిది.

ఓం తత్పురుషాయ విద్మహే మహాదేవాయ ధీమహి తన్నో రుద్రః ప్రచోదయాత్ ॥29॥

ఓం అఘోరేభ్యో ఽథ ఘోరేభ్యో ఘోరఘోరతరేభ్యస్తు సర్వతః ।
సర్వేభ్యః సర్వశర్వేభ్యో నమస్తేఽస్తు రుద్రరూపేభ్యః ॥30॥

ఓం వామదేవాయ నమో జ్యేష్ఠాయ నమః శ్రేష్ఠాయ నమః రుద్రాయ నమః కాలాయ నమః
కలవికరణాయ నమో బలవికరణాయ నమో బలాయ నమో బలప్రమథనాయ నమః ।
సర్వభూతదమనాయ నమో మనోన్మనాయ నమః ॥31॥

ఓం సద్యోజాతం ప్రపద్యామి సద్యోజాతాయ వై నమః ।
భవే భవే నాతిభవే భవస్వ మాం భవోద్భవాయ నమః ॥32॥

ఇవి మిగిలిన నాలుగు మంత్రాలు "ఈశానః" మొదలు "భవోద్భవాయ నమః" వరకు ఉండే మూలోక్త మంత్రాలు ఐదు ఈశానాది మంత్రాలు.

పంచబ్రహ్మాంగషట్కం చ వక్ష్యేఽహం భుక్తిముక్తిదమ్ ॥33॥

ఇపుడు భుక్తిముక్తి ప్రదాయకాలైన పంచబ్రహ్మ ఆరు అంగాలను చెబుతాను.

ఓం నమః పరమాత్మనే పరాయ కామదాయ పరమేశ్వరాయ
యోగాయ యోగసంభవాయ సర్వకరాయ కురు కురు సద్య సద్య ।

భవ భవ భవోద్భవ వామదేవ సర్వకార్యకర పాపప్రశమన సదాశివ
ప్రసన్న నమోఽస్తుతే స్వాహా ॥34॥

హృదయం సర్వార్థదం తు సప్తత్యక్షరసంయుతమ్ ॥35॥

"ఓం నమః పరమాత్మనే" మొదలు "నమోఽస్తుతే స్వాహా" వరకు ఉండే డెబ్బై ఏడు అక్షరాల హృదయ మంత్రం సకల మనోరథాలను నెరవేరుస్తుంది.

"ఓం శివ శివాయ నమః శిరః, ఓం శివ హృదయే జ్వాలినీ స్వాహా శిఖా, ఓం శివాత్మక మహాతేజః సర్వజ్ఞ ప్రభు సంవర్తయ మహాఘోర కవచ పింగల నమః, మహాకవచ శివాజ్ఞయా హృదయం బంధ బంధపూర్ణయ పూర్ణయ చూర్ణయ చూర్ణయ సూక్ష్మాసూక్ష్మవజ్రధర వజ్రపాశధర వజ్రశరీర మచ్ఛరీరమనుప్రవిశ్య సర్వదుష్టాన్ స్తంభయ స్తంభయ హూమ్" ॥

అక్షరాణాం తు కవచం శతం పంచాక్షరాధికమ్ ॥36॥

"ఓం శివ శివాయనమః" అనేది శిరోమంత్రం "ఓం శివహృదయే జ్వాలినీ స్వాహా శిఖాయై వషట్" అనేది శిఖా మంత్రం. "ఓం శివాత్మక " మొదలు "సంభయహూమ్" వరకు ఉండే నూట ఐదు అక్షరాలమంత్రం కవచ మంత్రం.

"ఓం ఓజసే నేత్రం, ఓం ప్రస్ఫుర ప్రస్ఫుర (ఘోర ఘోరతర) తనురూప తనురూప చట చట ప్రచట ప్రచట కట కట వమ వమ ఘాతయ ఘాతయ హ్రూ (హుం) ఫట్" అఘోరాస్త్రమ్ ॥37॥

"ఓం ఓజసే నేత్రత్రయాయ వౌషట్" అనేది నేత్రమంత్రం. "ఓం ప్రస్ఫుర" మొదలు "హుం ఫట్" వరకు ఉండేది అఘోరాస్త్రమంత్రం.

ఇత్యాది మహాపురాణే ఆగ్నేయే షడంగాన్యఘోరాస్త్రకథనం నామ త్రయోవింశత్యధిక త్రిశతతమోఽధ్యాయః ॥323॥

అగ్నిమహాపురాణంలో షడంగయుక్తమైన అఘోరాస్త్ర కథనం అనే మూడువందల ఇరవైమూడవ అధ్యాయం సమాప్తం.



చతుర్వింశత్యధిక త్రిశతతమోఽధ్యాయః – మూడువందల ఇరవైనాల్గవ అధ్యాయం

రుద్రశాంతిః – రుద్రశాంతి

ఈశ్వర ఉవాచ – ఈశ్వరుడు ఇలా వచించాడు.

శివశాంతిం ప్రవక్ష్యామి కల్పాఘోరప్రపూర్వకమ్ ।
సప్తకోట్యధిపోఽఘోరో బ్రహ్మహత్యాద్యఘార్దనః ॥1॥

ఇపుడు కల్పాఘోరపూర్వకమైన శివశాంతిని చెబుతాను. అఘోరశివుడు ఏడు కోట్ల గణాలకు అధిపతి. బ్రహ్మహత్య మున్నగు పాపాలను నశింపజేస్తాడు.

ఉత్తమాధమసిద్ధీనామాలయోఽఖిలరోగనుత్ ।
దివ్యాంతరిక్ష భౌమానాముత్పాతానాం విమర్దనః ॥2॥

ఉత్తమాధమసిద్ధులను అనుగ్రహించే ఆయన సమస్తరోగాలను తొలగిస్తాడు. భూమిలోని, దివిలోని, అంతరిక్షంలోని ఉత్పాతాలను మర్దిస్తాడు.

విషగ్రహపిశాచానాం గ్రసనః సర్వకామకృత్ ।
ప్రాయశ్చిత్తమఘౌఘార్తి దౌర్భాగ్యార్తివినాశనమ్ ॥3॥

విషగ్రహ పిశాచాలను మ్రింగివేసి సకల కామాలను నెరవేర్చేవాడు. పాపపీడలను తొలగించడానికి, దౌర్భాగ్యదుఃఖాన్ని నాశనం చేయడానికి ప్రబలుడైన ప్రాయశ్చిత్త స్వరూపుడు.

ఏకవీరం తు విన్యస్య ధ్యేయః పంచముఖః సదా ।
శాంతికే పౌష్టికే శుక్లో రక్తో వశ్యేఽథ పీతకః ॥4॥

స్తంభనే ధూమ్ర ఉచ్చాట మారణే కృష్ణవర్ణకః ।
కర్షణే కపిలో మోహే ద్వాత్రింశద్వర్ణమర్చయేత్ ॥5॥

"ఏకవీరము" ను సర్వాంగన్యాసం చేసి సర్వదా పంచముఖ ధ్యానం చేయాలి. శాంతిక పౌష్టికక్రియలందు శుక్లవర్ణుడు. వశీకరణంలో రక్తవర్ణుడు, స్తంభనకర్మయందు పీతవర్ణుడు. ఉచ్చాటన మారణ కర్మలందు ధూమ్ర వర్ణుడు. ఆకర్షణక్రియలో కృష్ణవర్ణుడు. మోహనకర్మయందు కపిలవర్ణుడు. ముప్పదిరెండు అక్షరాలతో వేదోక్తంగా అఘోరశివుని రూపం ఉంటుంది. ఆ శివుని పూజించాలి.

త్రింశల్లక్షం జపేన్మంత్రం హోమం కుర్యాద్దశాంశతః ।
గుగ్గులఘృతయుక్తేన సిద్ధే సిద్ధార్థసర్వకృత్ ॥6॥

ఈ మంత్రాన్ని ముప్పై లక్షల జపం చేసి, గుగ్గులు మిశ్రఘృతంతో దశాంశహోమం చేస్తే సాధకుడు మంత్రసిద్ధి పొంది సిద్ధార్థుడవుతాడు. అతడు అన్నీ సాధిస్తాడు.

అఘోరాన్నాపరో మంత్రో విద్యతే భుక్తిముక్తికృత్ ।
అబ్రహ్మచారీ బ్రహ్మచారీ అస్నాతః స్నాతకో భవేత్ ॥7॥

అఘోరమంత్రాన్ని మించి భుక్తి, ముక్తిపదమైన మరో మంత్రం లేదు. దీనిని జపించడం వల్ల అబ్రహ్మచారి బ్రహ్మచారి అవుతాడు. అస్నాతకుడు స్నాతకుడు అవుతాడు.

అఘోరాస్త్రమఘోరస్తు ద్వావిమౌ మంత్రరాజకౌ ।
జపహోమార్చనాద్యుద్ధే శత్రుసైన్యం విమర్దయేత్ ॥8॥

అఘోరాస్త్రం, అఘోరమంత్రం ఈ రెండు మంత్రరాజాలు. వీటిని జపహోమార్చనలందు వినియోగిస్తే యుద్ధంలో శత్రుసైన్యాన్ని నశింపజేయవచ్చు.

రుద్రశాంతిం ప్రవక్ష్యామి శివాం సర్వార్థసాధనీమ్ ।
పుత్రార్థం గ్రహనాశార్థం విషవ్యాధివినష్టయే ॥9॥

ఇపుడు సకలప్రయోజనాలను సమకూర్చే మంగళకరమైన రుద్రశాంతిని చెబుతాను. పుత్రప్రాప్తి, దుష్ట గ్రహబాధా నివారణం, విషవ్యాధుల వినాశనం చేకూరుతాయి.

దుర్భిక్షమారీశాంత్యర్థం దుఃస్వప్నహరణాయ చ ।
బలాదిరాజ్యప్రాప్త్యర్థం రిపూణాం నాశనాయ చ ॥10॥

దుర్భిక్షం పోవడం, మహామారి శాంతించడం, చెడ్డకలలు రాకుండ ఉండడం, బలం, రాజ్యం పొందడం, శత్రువినాశనం వీటి కోసమై రుద్రశాంతి చేయాలి.

అకాలం ఫలితే వృక్షే సర్వగ్రహవిమర్దనే ।
పూజనే తు నమస్కారః స్వాహాంతే హవనం తథా ॥11॥
ఆప్యాయనే వషట్కారం పుష్టౌ వౌషణ్నియోజయేత్ ।
చకారద్వితయస్థానే జాతియోగం తు కారయేత్ ॥12॥

వృక్షం కాలం కాని కాలంలో ఫలించినా, సమస్త గ్రహబాధలు తొలగించడానికి కూడ దీనిని ఉపయోగించాలి. పూజనంలో మంత్రాంతమున "నమః" చేర్చాలి. హోమంలో " స్వాహా" చేర్చాలి. ఆప్యాయనంలో (తృప్తిలో) వషట్కారాన్ని, పుష్టికర్మలో "వౌషట్ " ను చేర్చాలి. మంత్రంలో రెండు చోట్ల 'చ' ఉన్నచోట, "నమః, స్వాహా" ఇత్యాదిగా జాతియోగాలు చేయాలి.

ఓం రుద్రాయ నమః । ఓం వృషభాయ నమః అవిముక్తాయ అసంభవాయ
పురుషాయ చ (పంచ) పూజ్యాయ ఈశానాయ పౌరుషాయ పంచపంచోత్తరే
విశ్వరూపాయ కరాలాయ వికృతరూపాయ అవికృతరూపాయ ॥13॥

(నియతౌ) నికృతౌ చాపరే కాలే అప్పుమాయా చ నైర్ృతే ॥14॥

"ఓం రుద్రాయ" మొదలు "అవికృతరూపాయ" వరకు మూలోక్తమైన రుద్రశాంతిమంత్రం. ఉత్తర వర్తి కమలదలంలో నియతితత్త్వం, పశ్చిమ కమలదలంలో కాలతత్త్వం, నైర్ృతిదలంలో మాయాతత్త్వం ఉంటాయి. వీటి యందు దేవతలను పూజించాలి.

ఏకపింగలాయ శ్వేతపింగలాయ కృష్ణపింగలాయ నమః ॥15॥

మధుపింగలాయ నమః । మధుపింగలాయ నియతౌ అనంతాయ ఆర్ద్రాయ
శుష్కా య పయోగణాయ కాలతత్త్వే కరాలాయ వికరాలాయ । ద్వౌ
మాయాతత్త్వే సహస్రశీర్షాయ సహస్రవక్త్రాయ సహస్రకరచరణాయ
సహస్రలింగాయ ॥16॥

విద్యాతత్త్వే సహస్రాక్షా ద్వ్యన్యసేద్దక్షిణే దలే ॥17॥

"ఏకపింగలా శ్వేతపింగలాయ కృష్ణ పింగలాయ నమః, మధు పింగలాయ నమః, మధు పింగలాయ నమః" అని నియతితత్త్వంలో పూజించాలి. "అనంతాయ ఆర్ద్రాయ శుష్కాయ పయోగణాయ" అని కాల తత్త్వంలో పూజించాలి. "కరాలాయ వికరాలాయ" అని మాయాతత్త్వంలో పూజించాలి. దక్షిణదలంలో ఉన్న విద్యాతత్త్వంలో "సహస్ర శీర్షాయ" మొదలు "సహస్ర లింగాయ" వరకు చెప్పి పూజించాలి.

ఏకజటాయ ద్విజటాయ త్రిజటాయ స్వాహాకారాయ ।
స్వధాకారాయ వషట్కారాయ షడ్రుద్రాయ ॥18॥

ఈశతత్త్వే తు వహ్నిపత్రే స్థితా గుహ ॥19॥

భూతపతయే పశుపతయే ఉమాపతయే కాలాధిపతయే ॥20॥

సదాశివాఖ్యతత్త్వే షట్ పూజ్యాః పూర్వదలే స్థితాః ॥21॥

అక్కడ "ఏకజటాయ" మొదలు " షడ్రుద్రాయ" వరకు షడ్విధ రుద్రుల పూజ చేయాలి. స్కందా! ఆగ్నేయదలంలో ఉన్న ఈశతత్త్వంలో "భూతపతయే" నుంచి "కాలాధిపతయే" వరకు చెప్పి పూజ చేయాలి. పూర్వదలంలో ఉన్న సదాశివతత్త్వంలో ఉన్న ఆరుగురిని పూజించాలి.

ఉమాయైకరూపధారిణి, ఓం కురు కురు రూహిణి రూహిణి
రుద్రోఽసి దేవానాం దేవదేవ విశాఖ హన హన దహ దహ పచ పచ
మథ మథ తురు తురు అరు అరు మురు మురు రుద్రశాంతిమనుస్మర
కృష్ణపింగల అకాలపిశాచాధిపతి విశ్వేశ్వరాయ నమః ॥22॥

శివతత్త్వే కర్ణికాయాం పూజ్యౌ హ్యుమామహేశ్వరౌ ॥23॥

"ఉమాయై "మొదలు "విశ్వేశ్వరాయ నమః" వరకు ఉన్న మంత్రాలతో అర్చించాలి. కమల కర్ణికయందున్న శివతత్త్వంపై ఉమామహేశ్వరులను పూజించాలి.

ఓం వ్యోమవ్యాపినే వ్యోమరూపాయ సర్వవ్యాపినే శివాయ
అనంతాయ నాథాయ అనాశ్రితాయ శివాయ శివతత్త్వే నవ
పదాని వ్యోమవ్యాప్యభిధాస్య హి ॥24॥

శివతత్త్వంలో "ఓం వ్యోమవ్యాపినే" మొదలు "శివాయ" వరకు ఉండే మూలోక్తమంత్రంతో పూజించాలి. శివతత్త్వంలో వ్యోమవ్యాపి అను పేరు గల శివుని తొమ్మిది పదాలతో (ఓంకారంతో కలిపి) నామాలు చెబుతూ పూజించాలి.

శాశ్వతాయ యోగపీఠసంస్థితాయ నిత్యయోగినే ధ్యానాహారాయ నమః ।
ఓం నమః శివాయ సర్వప్రభవే శివాయ ఈశానమూర్ధాయ తత్పురుషాయ పంచవక్త్రాయ ॥25॥

నవపదం పూర్వదలే సదాఖ్యే పూజయేద్గుహ ॥26॥

ఆ తరువాత యోగపీఠంలో విరాజిల్లే శివుని నవపదయుక్తనామాలు చెబుతూ "శాశ్వతాయ" మొదలు "పంచవక్త్రాయ" వరకు ఉండే మూలోక్తమంత్రాన్ని చెబుతూ పూజించాలి. స్కందా! ఆ పిదప "సత్" అనే పేరుగల పూర్వదలంలో తొమ్మిది పదాలతో కూడిన శివనామం చెబుతూ పూజించాలి.

అఘోరహృదయాయ వామదేవగుహ్యాయ సద్యోజాతమూర్తయే ।
ఓం నమో నమః । గుహ్యాతిగుహ్యాయ గోప్త్రే అనిధనాయ సర్వయోగాధికృతాయ జ్యోతీరూపాయ

అగ్నిపత్రే హీశతత్త్వే విద్యాతత్త్వే తు గమ్యతే
పరమేశ్వరాయ చేతనాచేతనవ్యోమన్ వ్యాపిన్ అరూపిన్ ।
ప్రథమతేజస్తేజః ॥27॥

"అఘోర హృదయాయ" మొదలు "జ్యోతీరూపాయ" వరకు ఉండే మంత్రం. మూలోక్త మంత్రం చెబుతూ శివపూజ చేయాలి. ఆగ్నేయంలో ఉండే ఈశతత్త్వంలోనూ, దక్షిణంలో ఉండే విద్యాతత్త్వంలోనూ "పరమేశ్వరాయ" మొదలు "తేజః" వరకు ఉండే మంత్రాన్ని రెండుసార్లు చెబుతూ పరమేశ్వరుని పూజించాలి.

మాయాతత్త్వే నైరృతే తు కాలతత్త్వేఽథ వారుణే ॥28॥

ఓం ధృ ధృ(నానా) వాం వాం అనిధన నిధనోద్భవ శివసర్వపరమాత్మన్ ।

మహాదేవ సద్భావేశ్వర మహాతేజ యోగాధిపతే ముంచ ముంచ, ప్రథమ ప్రథమ, ఓం సర్వ సర్వ, ఓం భవ భవ, ఓం భవోద్భవ సర్వభూతసుఖప్రద । వాయుపుత్రేఽథ నియతౌ పురుషే చోత్తరే నవ ॥29॥

నైరృతి యందున్న మాయాతత్త్వంలోను, పశ్చిమ దిక్కునందున్నకాల తత్త్వంలోను "ఓంధృ" మొదలు "సుఖప్రద" వరకు ఉండే మూలోక్త మంత్రంతో శివుని పూజించాలి.

సర్వసాన్నిధ్యకర బ్రహ్మవిష్ణురుద్రపరా నర్చితాస్తుతస్తుత సాక్షిణ
సాక్షిణ తురు తురు పతంగ పతంగ పింగ పింగ జ్ఞాన జ్ఞాన శబ్ద శబ్ద
సూక్ష్మ సూక్ష్మ శివ శివ సర్వప్రద సర్వప్రద ఓం నమః శివాయ ఓం నమో
నమఃశివాయ ఓం నమో నమః ॥30॥

వాయుదలంలో ఉన్న నియతి యందు, ఉత్తరదలంలో ఉన్న పురుషుని యందు ఈ తత్త్వాలలో "సర్వసాన్నిధ్యకర" మొదలు "నమోనమః" వరకు ఉండే మూలోక్త నవపదయుక్తమంత్రంతో శివుని పూజించాలి.

ఈశానే ప్రాకృతే తత్త్వే పూజయేజ్జుహుయాజ్జపేత్ ।
గ్రహరోగాది మాయార్తి శమనీ సర్వసిద్ధికృత్ ॥31॥

ఈశాన్యంలో ఉన్న ప్రాకృతతత్త్వంలో పూజా జపహోమాదులు కావించాలి. ఈ రుద్రశాంతి గ్రహబాధలను, త్రివిధరోగపీడలను, మాయాపీడలను తొలగిస్తుంది. సకల మనోరథాలను నెరవేరుస్తుంది.

ఇత్యాది మహాపురాణే ఆగ్నేయే రుద్రశాంతి విధానకథనం నామ చతుర్వింశత్యధిక త్రిశతతమోఽధ్యాయః ॥324॥

అగ్ని మహాపురాణంలో రుద్రశాంతి విధానకథనం అనే మూడువందల ఇరవైనాల్గవ అధ్యాయం సమాప్తం.



పంచవింశత్యధికత్రిశతతమోఽధ్యాయః - మూడువందల ఇరవైఅయిదవ అధ్యాయం

అంశకాదికథనమ్ - అంశకాదికథనం

ఈశ్వర ఉవాచ - ఈశ్వరుడు ఇలా వచించాడు.

రుద్రాక్షకటకం ధార్యం విషమం సుసమం దృఢమ్।
ఏకత్రిపంచవదనం యథాలాభం తు ధారయేత్ ॥1॥

రుద్రాక్ష కటకాన్ని ధరించాలి. రుద్రాక్షల సంఖ్య విషమంగా (బేసిగా) ఉండాలి. అవి సమంగాను, దృఢంగాను ఉండాలి. ఏకముఖంకాని, త్రిముఖం కాని, పంచముఖం కాని యథాలాభంగా ధరించాలి.

ద్వి చతుః షణ్ముఖం శస్తమవ్రణం తీవ్రకంటకమ్ ।
దక్షబాహౌ శిఖాదౌ చ ధారయేచ్చతురాననమ్ ॥2॥

ద్విముఖ, చతుర్ముఖ, షణ్ముఖ రుద్రాక్షలు కూడా ప్రశస్తాలే. బ్రద్దలు కావడం గాని, పురుగులు దొలవడం గాని కావడం వల్ల క్షతములు కాకూడదు. వాటిపై కంటకాలు ఉండాలి. దక్షిణ భుజ శిఖాదులపై చతుర్ముఖ రుద్రాక్షలను ధరించాలి.

అబ్రహ్మచారీ బ్రహ్మచారీ అస్నాతః స్నాతకో భవేత్ ।
హైమీ వా ముద్రికా ధార్యా శివమంత్రేణ చార్చ్య తు ॥3॥

అలా ధరించడం వల్ల అబ్రహ్మచారి బ్రహ్మచారి అవుతాడు. అస్నాతకుడు స్నాతకుడవుతాడు. లేదా శివ మంత్రంతో పూజించి సువర్ణాంగులీయకాన్ని కుడిచేత ధరించాలి.

శివః శిఖా తథా జ్యోతిః సావిత్రశ్చేతి గోచరాః।
గోచరం తు కులం జ్ఞేయం తేన లక్ష్యస్తు దీక్షితః ॥4॥

శివ, శిఖా, జ్యోతి, సావిత్రములు అనే నాలుగు గోచరాలు. గోచరాన్ని "కులము"గా తెలుసుకోవాలి. దీక్షితుడు దానిని లక్ష్యంగా తీసుకోవాలి.

ప్రాజాపత్యో మహీపాలః కపోతో గ్రంథికః శివే ।
కుటిలాశ్చైవ వేతాలాః పద్మహంసాః శిఖాకులే ॥5॥

ప్రాజాపత్య మహీపాల కపోత గ్రంథకులు శివ కులానికి చెందినవారు కుటిల వేతాల పద్మహంసలు శిఖాకులానికి చెందినవారు.

ధృతరాష్ట్రా బకాః కాకా గోపాలా జ్యోతిసంజ్ఞకే ।
కుటికా సారఠాశ్చైవ గుటికా దండినోఽపరే ॥6॥

సావిత్రీ గోచరే చైవ మేకైకస్తు చతుర్విధః ।

ధృతరాష్ట్ర బకకాక గోపాలులు జ్యోతి కులానికి చెందినవారు. కుటికా సారరగుటి కాదండులు సావిత్రీ కులానికి చెందినవారు. ఈ విధంగా ఒక్కొక్క కులంలో నాలుగేసి భేదాలు ఉన్నాయి.

సిద్ధాద్యంశక మాఖ్యాస్యే యేన మంత్రః సుసిద్ధిదః ॥7॥

భూమౌ తు మాతృకా లేఖ్యాః కూటయంత్ర వివర్జితాః
మంత్రాక్షరాణి విశ్లేష్య అనుస్వారం నయేత్పృథక్ ॥8॥

ఉత్తమమంత్ర సిద్ధిని ఇచ్చే సిద్ధాది అంశాలను చెబుతాను. కూటయంత్ర రహితాలైన మాతృకాక్షరాలను నేలపై వ్రాయాలి. మంత్రాక్షరాలను వేరుచేసి, అనుస్వారాన్ని వేరు చేయాలి.

సాధకస్య తు యా సంజ్ఞా తస్యా విశ్లేషణం చరేత్ ।
మంత్రస్యాదౌ తథా చాన్తే సాధకార్ణాణి యోజయేత్ ॥9॥

సాధకుని నామం లోని అక్షరాలను కూడా జోడించాలి. మంత్రం యొక్క ఆద్యంత్యాక్షరాలయందు సాధకుని నామాక్షరాలను చేర్చాలి.

సిద్ధః సాధ్యః సుసిద్ధోఽరిః సంజ్ఞాతో గణయేత్క్రమాత్ ।
మంత్రస్యాదౌ తథా చాన్తే సిద్ధిదః స్యాచ్ఛతాంశతః ॥10॥

సిద్ధము, సాధ్యము, సుసిద్ధము, అరిః అను సంజ్ఞలను అనుసరించి అక్షరాలను క్రమంగా లెక్కపెట్టాలి. మంత్రం యొక్క ఆద్యంతము లందు సిద్ధము ఉన్నచో అది నూటికి నూరుపాళ్లు సిద్ధిదాయకం.

సిద్ధాదిశ్చాన్త సిద్ధిశ్చ తత్క్షణా దేవ సిధ్యతి ।
సుసిద్ధాదిః సుసిద్ధాంతః సిద్ధవత్పరికల్పయేత్ ॥11॥

ఆద్యాంతాలలో సిద్ధి కలది వెంటనే సిద్ధి నిస్తుంది.ఆద్యంతాలలో సుసిద్ధము ఉన్నచో ఆ మంత్రాన్ని కూడా సిద్ధముగా గ్రహించాలి.

అరిమాదౌ తథాఽన్తే చ దూరతః పరివర్జయేత్ ।
సిద్ధః సుసిద్ధ శ్చైకార్థే అరిః సాధ్య స్తథైవ చ ॥12॥

ఆద్యంతాలలో అరి ఉన్నచో ఆ మంత్రాన్ని దూరంగా పరిత్యజించాలి. సిద్ధము, సుసిద్ధము, ఏకార్థకములే. అరి, సాధ్యము కూడ అలాగే ఏకార్థకములు.

ఆదౌ సిద్ధః స్థితో మంత్రస్తదన్తే తద్వదేవ హి ।
మధ్యే రిపు సహస్రాణి న దోషాయ భవన్తి హి ॥13॥

మంత్రం యొక్క ఆద్యంత్యాక్షరములందు సిద్ధము ఉన్నచో, మధ్య వేలకొలది 'అరి' అక్షరాలు ఉన్నా, దోషకారకం కాదు.

మాయా ప్రసాద ప్రణవేనాంశకః ఖ్యాతమంత్రకే ।
బ్రహ్మాంశకో బ్రహ్మ విద్యా విష్ణ్వంశో వైష్ణవః స్మృతః ॥14॥

మాయాబీజం, ప్రసాదబీజం, ప్రణవం వీటి యోగంచే ఏర్పడిన విఖ్యాతమంత్రంలో బ్రహ్మవిష్ణు రుద్రాంశకములు ఏర్పడతాయి. బ్రహ్మాంశకం బ్రహ్మవిద్య అని, విష్ణువు అంశకం వైష్ణవమని చెప్పబడతాయి.

రుద్రాంశకో భవేద్వీర ఇంద్రాంశశ్చేశ్వర ప్రియః ।
నాగాంశో నాగస్తబ్ధాక్షో యక్షాంశో భూషణప్రియః ॥15॥

రుద్రాంశకం వీరమని చెప్పబడుతుంది. ఇంద్రాంశకమంత్రం ఈశ్వర ప్రియం. నాగాంశమంత్రం నాగం వలె స్తబ్ధనేత్రం కలది. యక్షాంశ మంత్రం భూషణ ప్రియం.

గంధర్వాంశోஉతి గీతాది ర్భీమాంశో రాక్షసాంశకః ।
దైత్యాంశః స్యాద్యుద్ధక శ్రీర్మానీ విద్యాధరాంశకః ॥16॥

గంధర్వాంశ మంత్రం అతిగీతాది ప్రియం. భీమాంశ, రాక్షసాంశ, దైత్యాంశమంత్రాలు యుద్ధకారకాలు. విద్యాధరాంశమంత్రం అభిమానం ఇచ్చేది.

పిశాచాంశో మలాక్రాంతో మంత్రం దద్యాన్నిరీక్ష్య చ ।
మంత్ర ఏకాత్ ఫడన్తః స్యాద్విద్యా పంచశతావధి॥17॥

పిశాచమంత్రం మలాక్రాంతం మంత్రాన్ని పూర్తిగా పరీక్షించి ఉపదేశం చేయాలి. ఏకాక్షర మంత్రం మొదలు అనేకాక్షర మంత్రాల వరకు చివర 'ఫట్' చేరిస్తే అది మంత్రం అవుతుంది. యాభై అక్షరాల వరకు ఉండే మంత్రం"విద్య"

బాలా వింశాక్షరాంతా చ రుద్రా ద్వావింశగాయుధా ।
తత ఊర్ధ్వంతు యే మంత్రా వృద్ధా యావచ్ఛతత్రయమ్॥18॥

ఇరవై అక్షరాల వరకు ఉండేది బాలావిద్య. ఇరవై రెండు అక్షరాల వరకు ఉండే అస్త్రాంతమంత్రం రుద్ర. అంతకు మించి మూడు వందల అక్షరాల వరకు ఉండే మంత్రానికి వృద్ధి అని పేరు.

అకారాది హకారాంతాః క్రమాత్పక్షౌ సితా సితే ।
అనుస్వారవిసర్గేణ వినా చైవ స్వరా దశ ॥19॥

హ్రస్వాశుక్లా దీర్ఘాః శ్యామాస్తిథయః ప్రతిపన్ముఖాః ।
ఉదితే శాంతి కాదీని భ్రమితే వశ్యకాదికమ్ ॥20॥

మంత్రాలలో 'అ' కారం మొదలు 'హ' కారం వరకు అక్షరాలు ఉంటాయి. మంత్రాలలో క్రమంగా శుక్ల కృష్ణపక్షాలు ఉంటాయి. అనుస్వార విసర్గలు విడిచి స్వరాలు పది. హ్రస్వస్వరాలు శుక్లపక్షం. దీర్ఘస్వరం కృష్ణపక్షం ఇవే ప్రతి పదాది తిథులు. శాంతి కార్యాలను ఉదయకాలంలోను, వశీకరణ కర్మలను భ్రమితకాలం లోను చేయాలి.

భ్రామితే సంధయో ద్వేషోచ్చాటనే స్తంభనేఽస్తకమ్ ।
ఇడా వాహే శాంతికాద్యం పింగలే కర్షణాదికమ్ ॥21॥

భ్రామిత కాలంలోను, సంధ్యాద్వయంలోను ద్వేషణం, ఉచ్చాటనం అనే కర్మలను, స్తంభన కార్యాలను సూర్యాస్తమయ కాలంలోను చేయాలి. ఇడానాడి చరించేటప్పుడు శాంతి కర్మలను, పింగళా నాడి చలించేటప్పుడు ఆకర్షణ కర్మలు చేయాలి.

మారణోచ్చాటనాదీని విషువే పంచధా పృథక్ ।
అధరస్య గృహే పృథ్వీ ఊర్ధ్వే తేజోఽన్తరా ద్రవః ॥22॥

విషువకాలంలో మారణం, ఉచ్చాటనం మున్నగు పంచకర్మలు వేరువేరుగా చేయాలి. అధర గృహంలో పృథివి, ఊర్ధ్వ గృహంలో తేజస్సు, మధ్య గృహంలో జలం చెప్పబడ్డాయి.

రంధ్ర పార్శ్వే బహిర్వాయుః సర్వవ్యాప్య మహేశ్వరః ।
స్తంభనం పార్థివే శాంతిర్జలే వశ్యాది తేజసే ॥
వాయౌ స్యాద్భ్రమణం శూన్యే పుణ్యకాలే సమభ్యసేత్ ॥23॥

రంధ్రాలు ఉన్నచోట, బాహ్యపార్శ్వములందు, వాయువులోపలి పార్శ్వములందు ఆకాశం ఉంటుంది. పార్థివాంశంలో స్తంభనం, జలాంశంలో శాంతికర్మ, తైజసాంశంలో వశీకరణ కర్మ, వాయువు అంశంలో భ్రమణం, ఆకాశాంశంలో పుణ్యకర్మ చేయాలి.

ఇత్యాది మహాపురాణే ఆగ్నేయే అంశకాది కథనం నామ పంచవింశత్యధిక త్రిశతతమోఽధ్యాయః ॥325॥

అగ్నిమహాపురాణంలో అంశకాది కథనం అనే మూడువందల ఇరవైఅయిదవ అధ్యాయం సమాప్తం.



షడ్వింశత్యధిక త్రిశతతమోఽధ్యాయః – మూడువందల ఇరవైఆరవ అధ్యాయం

గౌర్యాది పూజావర్ణనమ్ – గౌర్యాది పూజావర్ణనం

ఈశ్వర ఉవాచ – ఈశ్వరుడు ఇలా వచించాడు.

సాభాగ్యాదే రుమాపూజాం వక్ష్యేఽహం భుక్తిముక్తిదామ్ ।
మంత్రధ్యానం మండలం చ ముద్రాం హెూమాది సాధనమ్॥1॥

భుక్తి ముక్తి ప్రదమైన సౌభాగ్య దాయకమగు ఉమాపూజను చెబుతున్నాను. మంత్రం, ధ్యానం, మండలం, ముద్ర, హోమం మున్నగు సాధనాలను కూడ వివరిస్తున్నాను.

చిత్రభానుం శివం కాలం మహాశక్తి సమన్వితమ్ ।
ఇడాద్యం పరతోద్ధృత్య స దేవం సవికారణమ్ ॥2॥

ద్వితీయం ద్వారకాక్రాంతం గౌరీ ప్రీతి ప్రదాన్వితమ్ ।
చతుర్థ్యన్తం ప్రకర్తవ్యం గౌర్యా వై మూలవాచకమ్ ॥3॥

ఈ మంత్రం బీజాక్షరాలు మూర్తి రూపంలో ఇలా చెప్పబడతాయి. చిత్రభానుడు, శివుడు, కాలుడు, మహాశక్తి తోను, ఇడాద్యం, తరువాత దేవునితో కూడిన కారణయుక్తమైన ద్వితీయం ద్వారకాక్రాంతమై, గౌరీప్రీతిదాయకమై ఉంటుంది. చివర చతుర్థ్యంతంగా ప్రయోగించాలి. " గౌం గౌరీ మూర్తయే నమః" ఇది గౌరీ వాచకమైన మూలమంత్రం.

"ఓం హ్రీం సః శౌం గౌర్యై నమః"
తత్రార్ణత్రితయే నైవ జాతియుక్తం షడంగకమ్ ।4॥

"ఓం హ్రీం సః శౌం గౌర్యై నమః" వీటిలో మూడో అక్షరం నుండి "నమః" మున్నగు వాటిని చేర్చి షడంగన్యాసం చేయాలి.

ఆసనం ప్రణవేనైవ మూర్తిం వై హృదయేన తు ॥5॥

ఉదకం చ తథా కాలం శివబీజం సముద్ధరేత్ ।
ప్రాణం దీర్ఘ స్వరాక్రాంతం షడంగం జాతి సంయుతమ్ ॥6॥

ప్రణవం చేత ఆసనాన్ని, హృదయమంత్రంచే మూర్తిని కల్పించాలి. (ఊ) కాల బీజాన్ని, అలాగే శివ బీజాన్ని ఉద్ధారం చేయాలి. దీర్ఘ స్వరాక్రాంత ప్రాణంతో (యాం, యీం ఇత్యాదిగా) జాతి యుక్త షడంగన్యాసం చేయాలి.

ఆసనం ప్రణవేనాత్ర మూర్తిన్యాసం హృదాచరేత్ ।
యామలం కథితం వత్స ఏకవీరం వదామ్యథ ॥7॥

ఇక్కడ కూడా ప్రణవంతో ఆసనన్యాసం, హృదయమంత్రంతో మూర్తిన్యాసం చేయాలి. ఇంతవరకు యామలమంత్రం చెప్పాను. నాయనా! స్కందా! ఇపుడు ఏకవీరమంత్రం గురించి చెబుతాను.

వ్యాపకం సృష్టి సంయుక్తం వహ్ని మాయా కృశానుభిః ।
శివశక్తిమయం బీజం హృదయాది వివర్జితమ్ ॥8॥

వహ్నిమాయా కృశాను బీజాలతో సృష్టిన్యాసంతో కూడుకొన్న వ్యాపకన్యాసం చేయాలి. శివశక్తి మయం బీజాలను హృదయాది న్యాసంలో విడిచిపెట్టాలి.

గౌరీం యజేద్ధేమరూప్యాం కాష్ఠజాం శైలజాదికామ్।
పంచపిండాం తథాఽవ్యక్తాం కోణే మధ్యే తు పంచమమ్॥9॥

బంగారం, వెండి, శిల(కొయ్య) మొదలైన వాటితో గౌరీప్రతిమను చేసి పూజించాలి. లేదా పంచ పిండాలతో మట్టి బొమ్మ చేయాలి. నలువైపుల కోణాలలో అవ్యక్తప్రతిమను, మధ్యలో వ్యక్తప్రతిమను ఉంచాలి.

లలితా సుభగా గౌరీ క్షోభణీ చాగ్నితః క్రమాత్ ।
వామా జ్యేష్ఠా క్రియా జ్ఞానా వృత్తే పూర్వాదితో యజేత్ ॥10॥

ఆవరణ దేవతా రూపంలో క్రమంగా లలితాది శక్తులను పూజించాలి. మొదట వృత్తాకారంలో అష్టదలకమలాన్ని ఏర్పరచి, ఆగ్నేయాది దలాలలో క్రమంగా లలిత, సుభగ, గౌరి, క్షోభణి– అనే వారిని, పూర్వాది దలాలలో వరుసగా వామ, జ్యేష్ఠ, క్రియ, జ్ఞాన అనే వారిని పూజించాలి.

సపీఠే వామభాగే తు శివస్యావ్యక్తరూపకమ్ ।
వ్యక్తా ద్వినేత్రా త్ర్యక్షా వా శుద్ధా వా శంకరాన్వితా ॥11॥

పీఠంతో కలిసి ఉన్న వామభాగంలో శివుని అవ్యక్తరూపాన్ని పూజించాలి. దేవి వ్యక్తరూపంలో రెండు లేదా మూడు నేత్రాలు ఉంటాయి. ఆమెను శుద్ధస్వరూపురాలిగా శంకరునితో కలిసి పూజించాలి.

పీఠపద్మద్వయస్థా వా ద్విభుజా వా చతుర్భుజా ।
సింహస్థా వా వృకస్థా వా అష్టాష్టాదశ సత్కరాః ॥12॥

ఆ దేవి రెండు పీఠాలలో రెండు పద్మములందు కూర్చుండి ఉంటుంది. ఆమెకు రెండు లేదా నాలుగు లేదా ఎనిమిది లేదా పదునెనిమిది భుజాలు ఉంటాయి. సింహంపై గాని, తోడేలు పై గాని ఆమె కూర్చొని ఉంటుంది.

స్రగక్ష సూత్రకలికా గలకోత్పల పిండికా ।
శరం ధనుర్వా సవ్యేన పాణినాన్యతమం మహత్ ॥13॥

కుడి ప్రక్కన ఉన్న తొమ్మిది హస్తాలలో స్రజం, అక్షసూత్ర(పాశ), కలిక, ముండ, ఉత్పల, పిండిక, శరం, ధనుస్సు ఉంటాయి. వాటిలో ఒక్కొక్క మహావస్తువు ఒక్కొక్క చేతిలో ప్రకాశిస్తూ ఉంటాయి.

వామేన పుస్తతాంబూల దండాభయకమండలుమ్ ।
గణేశ దర్పణేష్వాసాన్ దద్యాదేకైకశః క్రమాత్ ॥14॥

వామ హస్తాలలో పుస్తకం, తాంబూలం, దండం, అభయముద్ర, కమండలువు, గణేశుడు, దర్పణం, శరం, శరాసనం ఒక్కొక్కటి క్రమంగా ఉంటాయి.

వ్యక్తా వ్యక్తాఽథ వా కార్యా పద్మముద్రా స్మృతాసనే ।
లింగముద్రా శివస్యోక్తా ముద్రా చావాహనీ ద్వయోః॥15॥

ఆమెకు వ్యక్తముద్రలు కాని, అవ్యక్త ముద్రలు కాని చూపాలి. ఆసన సమర్పణంలో పద్మముద్ర చూపాలి. శివుని పూజించేటప్పుడు లింగముద్ర చూపాలి. దీనికే శివముద్ర అని పేరు. ఇరువురికి ఆవాహనీ ముద్ర చూపాలి.

శక్తి ముద్రాతు యోన్యాఖ్యా చతురస్రం తు మండలమ్ ।
చతురస్రం త్రిపత్రాబ్జం మధ్య కోష్ఠ చతుష్టయే ॥16॥

శక్తి ముద్రకు యోని ముద్ర అని పేరు. చతురస్ర మండలం మధ్యనున్న నాలుగు కోష్ఠాలలో నాలుగు బారలకొలతతో త్రిదళ పద్మాలను వ్రాయాలి.

త్ర్యస్రోర్ధ్వే చార్ధ చంద్రస్తు ద్విపదం ద్విగుణం క్రమాత్ ।
ద్విపదం ద్వారకంఠం తు ద్విగుణాదుపకంఠతః ॥17॥

మూడుకోణాల ఊర్ధ్వభాగంలో రెండేసి పదాలలో అర్ధచంద్రుని వ్రాయాలి. మొదటిదాని కన్న రెండోది రెట్టింపు ఉండాలి. రెండేసి పదాల ద్వారకంఠ భాగం, దానికి రెట్టింపు ఉపకంఠం ఉండాలి.

ద్వారత్రయం త్రయం దిక్షు అథవా భద్రకే యజేత్ ।
స్థండిలే వాఽథ సంస్థాప్య పంచ గవ్యామృతాదినా ॥18॥

ఒక్కొక్క దిక్కులోను, మూడేసి ద్వారాలు ఉంచి, లేదా సర్వతోభద్ర మండలం ఏర్పరచి పూజించాలి. లేదా వేదిక పై దేవతను స్థాపించి పంచగవ్య పంచామృతాదులతో పూజించాలి.

రక్త పుష్పాణి దేయాని పూజయిత్వా హ్యుదఙ్ముఖః ।
శతం హుత్వా ఘృతాజ్యం చ పూర్ణాదః సర్వ సిద్ధిభాక్ ॥19॥

ఉత్తరాభిముఖుడై కూర్చుండి ఎఱ్ఱని (రక్త) పుష్పాలను సమర్పించాలి. ఆజ్యంతో నూరు హోమాలు చేసి పూర్ణాహుతిని ఇచ్చేవాడు సర్వ సిద్ధులు పొందుతాడు.

బలిం దత్త్వా కుమారీశ్చ తిస్రో వా చాష్ట భోజయేత్ ।
నైవేద్యం శివభక్తేషు దద్యాన్న స్వయమాచరేత్ ॥20॥

బలిని సమర్పించే (చి) ముగ్గురు లేదా ఎనమండుగురు కన్యకలకు భోజనం పెట్టాలి. పూజా నైవేద్యాన్ని శివభక్తులకు సమర్పించాలి. కాని తాను స్వీకరించరాదు.

కన్యార్థీ లభతే కన్యా మపుత్రః పుత్రమాప్నుయాత్ ।
దుర్భగా చైవ సౌభాగ్యం రాజా రాజ్యం జయం రణే ॥21॥

ఇలా చేయడం వల్ల కన్యను కోరుకొనేవానికి కన్య లభిస్తుంది. పుత్రులు లేనివానికి పుత్రుడు లభిస్తాడు. దౌర్భాగ్యరాలు సౌభాగ్యరాలు అవుతుంది. రాజు రణంలో జయాన్ని, రాజ్యాన్ని పొందుతాడు.

అష్టలక్షైశ్చ వాక్సిద్ధి ర్దేవాద్యా వశమాప్నుయుః ।
న నివేద్య న చాశ్నీయాద్వామహస్తేన చార్చయేత్॥22॥

ఎనిమిది లక్షలు జపించడం వల్ల వాక్సిద్ధి కలుగుతుంది. దేవతలు వశమవుతారు. ఇష్టదేవతకు నివేదించకుండా భోజనం చేయరాదు. వామ హస్తంతో కూడ పూజించవచ్చు.

అష్టమ్యాం చ చతుర్దశ్యాం తృతీయాయాం విశేషతః ।
మృత్యుంజయార్చనం వక్ష్యే పూజయేత్కలశోదరే ॥23॥

విశేషించి అష్టమి, చతుర్దశి, తదియలందు ఇలా పూజించాలి. ఇపుడు మృత్యుంజయ పూజను చెబుతాను. కలశంపై పూజ చేయాలి.

హూయమానం చ ప్రణవో మూర్తిరౌం జూం స ఈదృశమ్ ।
మూలం చ వౌషడంతేన కుంభముద్రాం ప్రదర్శయేత్ ॥24॥

హోమంలో ప్రణవం, మృత్యుంజయుని మూర్తి మూలమంత్రాన్ని చెబుతూ" ఓం జూం సవౌషట్" అనే మంత్రంతో కుంభముద్రను చూపాలి.

హోమయేత్ క్షీర దూర్వాజ్య మమృతాం చ పునర్నవామ్ ।
పాయసం చ పురోడాశ మయుతం చ జపేన్మనుమ్ ॥25॥

క్షీర, దూర్వా, ఆజ్య, అమృత, పునర్నవ, పాయస, పురోడాశాలతో హోమం చేయాలి. హోమానికి పూర్వం పదివేలు మంత్రజపం చేయాలి.

చతుర్ముఖం చతుర్బాహుం ద్వాభ్యాం చ కలశం దధత్ ।
వరదాభయకం ద్వాభ్యాం స్నాయాద్వై కుంభముద్రయా ॥26॥


మృత్యుంజయుని నాలుగు ముఖాలు, నాలుగు భుజాలు ఉండే రూపాన్ని ధ్యానించాలి. రెండు హస్తాలతో కలశాన్ని, రెండు హస్తాలలో వరదాభయ ముద్రలను ధరించి ఉంటాడు. కుంభముద్రచే మృత్యుంజయునికి స్నానం చేయించాలి.

ఆరోగ్యైశ్వర్య దీర్ఘాయురౌషధం మంత్రితం శుభమ్ ।
అపమృత్యుహరో ధ్యాతః పూజితోఽద్భుత ఏవ సః ॥27॥

ఆరోగ్యం, ఐశ్వర్యం, దీర్ఘాయువులు లభిస్తాయి. ఈ మంత్రంతో అభిమంత్రించిన ఔషధం శుభకరం. మృత్యుంజయుని ధ్యానించినా, పూజించినా అపమృత్యువు తొలగిపోతుంది. ఇది మహాద్భుతం.

ఇత్యాది మహాపురాణే ఆగ్నేయే గౌర్యాది పూజావర్ణనం నామ షడ్వింశదధిక త్రిశతతమోఽధ్యాయః ॥326॥

అగ్నిమహాపురాణంలో గౌర్యాది పూజావర్ణనం అనే మూడువందల ఇరవైఆరవ అధ్యాయం సమాప్తం.



సప్తవింశత్యధిక త్రిశతతమోఽధ్యాయః - మూడవందల ఇరవైఏడవ అధ్యాయం

దేవాలయ మాహాత్మ్యమ్ - దేవాలయ మాహాత్మ్యం

ఈశ్వర ఉవాచ - ఈశ్వరుడు ఇలా పచించాడు.

వ్రతేశ్వరాంశ్చ సత్యాదీనిష్ట్వా వ్రతసమర్పణమ్ ।
అరిష్టశమనే శస్తమరిష్టం సూత్రనాయకమ్ ॥1॥

వ్రతేశ్వరులను, సత్యాది దేవతలను పూజించి వారికి వ్రతం సమర్పించాలి. అరిష్టశాంతికి అరిష్టమూలమాల ఉత్తమం.

హేమరత్నమయం భూత్యై మహాశంఖం చ మారణే ।
ఆప్యాయనే శంఖ సూత్రం మౌక్తికం పుత్రవర్ధనమ్ ॥2॥

కల్యాణ ప్రాప్తికి సువర్ణరత్నమాల, మారణకర్మకు మహాశంఖమాల, శాంతిక్రియకు శంఖమాల, పుత్రప్రాప్తికి ముత్యాలమాల ఉపయోగించి జపం చేయాలి.

స్ఫాటికం భూతిదం కౌశం ముక్తిదం రుద్రనేత్రజమ్ ।
ధాత్రీఫల ప్రమాణేన రుద్రాక్షం చోత్తమం తతః ॥3॥

స్ఫటిక మాల ఐశ్వర్యప్రదం. రుద్రాక్షమాల ముక్తి ప్రదం. ఉసిరికాయ ప్రమాణం కల రుద్రాక్షం ఉత్తమం.

సమేరుం మేరుహీనం వా సూత్రం జప్యం తు మానసమ్ ।
అనామాంగుష్ఠమాక్రమ్య జపం భాష్యం తు కారయేత్ ॥4॥

మేరు సహితములు లేదా మేరు రహితములగు మాలను జపంలో ఉపయోగించవచ్చు. మానసిక జపం చేస్తున్నప్పుడు మాలయందలి పూసలను అనామిక, అంగుష్ఠములతో జరపాలి.

తర్జన్యంగుష్ఠమాక్రమ్య న మేరుం లంఘయేజ్జపే ।
ప్రమాదాత్పతితే సూత్రే జప్తవ్యం తు శతద్వయమ్ ॥5॥

తర్జని, అంగుష్ఠములను కలిపి గణన చేయాలి. జప సమయంలో ఎన్నడూ మేరువు దాటరాదు. ప్రమాదవశంలో మాల జారిపడితే రెండువందలసార్లు జపం చేయాలి.

సర్వ వాద్యమయీ ఘంటా తస్యా వాదన మర్థకృత్ ।
గోశకృన్మూత్ర వల్మీకమృత్తికా భస్మవారిభిః ॥6॥

వేశ్మాయతనలింగాదేః కార్యమేవం విశోధనమ్ ।

ఘంటానాదం సర్వవాద్యమయం. ఘంటావాదనం సకల ప్రయోజన ప్రదం. గృహం లోపల, మందిరం లోపల శివలింగాన్ని గోమయ, గోమూత్ర, వల్మీక, మృత్తికా, భస్మ జలాలతో శుద్ధిచేయాలి.

స్కందోం నమః శివాయేతి మంత్రః సర్వార్థసాధకః ॥7॥

స్కందా! "ఓం నమః శివాయ" అనే మంత్రం సకలాభీష్టాలను ప్రసాదిస్తుంది.

గీతః పంచాక్షరో వేదో లోకే గీతః షడక్షరః ।
ఓమిత్యన్తే స్థితః శంభుర్మహార్ణే వటబీజవత్ ॥8॥

ఇది వేదంలో పంచాక్షరమని, లోకంలో షడక్షరమని చెప్పబడింది. వటబీజంలో వటవృక్షం ఉన్నట్లు ఓంకారంలో శంభుడు ముద్రింపబడి ఉన్నాడు.(మహార్ణే –ముద్రార్థం– పాఠాంతరం)

క్రమాన్నమః శివాయేతి ఈశాన్యాద్యాని వై విదుః ।
షడక్షరస్య సూత్రస్య భాష్యం విద్యా కదంబకమ్ ॥9॥

యదోం నమఃశివాయేతి ఏతావత్పరమం పదమ్ ।
అనేన పూజయేల్లింగం లింగే యస్మాత్ స్థితః శివః ॥10॥

"ఓం నమః శివాయ" "ఈశానః సర్వవిద్యానామ్" మొదలైన మంత్రాలు. సమస్త విద్యాసముదాయం. ఈ షడక్షరమంత్రానికి భాష్యం అవుతుంది. 'ఓం నమః శివాయ' అను మంత్రమే పరమపదం. అందువల్ల శివుడు లింగంలో ఉన్నాడు కాబట్టి ఈ మంత్రంతో పూజించాలి.

అనుగ్రహాయ లోకానాం ధర్మకామార్థముక్తిదః ।
యో న పూజయతే లింగం న స ధర్మాది భాజనమ్ ॥11॥

ధర్మార్థకామ మోక్షాలను ఇచ్చే శివుడు లోకాలను అనుగ్రహించడం కోసమై లింగంలో ఉన్నాడు. ఎవడయితే శివలింగాన్ని పూజించకుండ ఉంటాడో అతడు ధర్మదూరుడు అవుతాడు. మిగిలిన అర్థాలు వానికి సిద్ధించవు.

లింగార్చనా ద్భుక్తి ముక్తి ర్యావజ్జీవమతో యజేత్ ॥
వరం ప్రాణ పరిత్యాగో భుంజీతా పూజ్యనైవ తమ్ ॥12॥

లింగార్చన భుక్తి ముక్తి ప్రదం కాబట్టి జీవించి ఉన్నంతవరకు శివలింగాన్ని పూజించాలి. ప్రాణాలు పోయినా శివలింగ పూజచేయకుండా భుజించరాదు. అంతకన్న ప్రాణత్యాగం శ్రేష్ఠం.

రుద్రస్య పూజనాద్రుద్రో విష్ణుః స్యాద్విష్ణుపూజనాత్ ।
సూర్యః స్యాత్ సూర్యపూజాతః శక్త్యాదిః శక్తి పూజనాత్ ॥13॥

రుద్ర పూజచే రుద్రుడు కాగలడు. విష్ణు పూజచే విష్ణు సారూప్యం, సూర్యపూజచే సూర్య సారూప్యం, శక్తి పూజచే శక్తి సారూప్యం కలుగుతాయి.

సర్వయజ్ఞ తపోదానే తీర్థే వేదేషు యత్ఫలమ్ ।
తత్ఫలం కోటి గుణితం స్థాప్యలింగం లభేన్నరః ॥14॥

సమస్త యజ్ఞ తపోదాన తీర్థ వేదాల వల్ల ఏ ఫలితం లభిస్తుందో, దానికి కోటి రెట్లు ఫలితం లింగస్థాపన చేసిన వానికి లభిస్తుంది.

త్రిసంధ్యం యోఽర్చయేల్లింగం కృత్వా బిల్వేన పార్థివమ్ ।
శతైకాదశికం యావత్కులముద్ధృత్య నాకభాక్ ॥15॥

ప్రతి దినం త్రికాలలోను (త్రిసంధ్యలలోను) ఎవడు పార్థివలింగాన్ని నిర్మించి దానిని బిల్వపత్రాలతో పూజిస్తాడో, వాని నూట పదకొండు తరాలవారు స్వర్గాన్ని పొందుతారు.

భక్త్యా విత్తానుసారేణ కుర్యాత్ప్రాసాద సంచయమ్ ।
అల్పే మహతి వా తుల్యఫలమాఢ్యదరిద్రయోః ॥16॥

విత్తానుసారంగా, భక్తిపూర్వకంగా దేవతామందిరాలు కట్టించాలి. దేవాలయనిర్మాణంలో యథాశక్తిగా అల్పంగా ఖర్చుపెట్టిన దరిద్రునికి, అధికంగా ఖర్చుపెట్టిన ధనికునికి సమానఫలం లభిస్తుంది.

భాగద్వయం చ ధర్మార్థం కల్పయే జ్జీవనాయ చ ।
ధనస్య భాగమేకం తు అనిత్యం జీవితం యతః ॥17॥

సంపాదించిన ధనంలోని రెండు భాగాలను ధర్మకార్యాలయందు వ్యయంచేసి, జీవనయాత్రకై రెండు భాగాలు ఉంచుకోవాలి. జీవితం అనిత్యం కదా!

త్రిసప్తకుల ముద్ధృత్య దేవాగార కృదర్థభాక్।
మృత్కాష్ఠేష్టక శైలాద్యైః క్రమాత్కోటిగుణం ఫలమ్ ॥18॥

దేవతామందిరాలను నిర్మించేవాడు ఇరవై ఒక్క తరాలవారిని ఉద్ధరించి అభీష్టములను పొందుతాడు. మట్టి, కర్ర, ఇటుక, శిల-వీటితో మందిర నిర్మాణం వరుసగా కోటి రెట్లు ఫలితాన్ని ఇస్తుంది.

అష్టేష్టక సురాగార కారీ స్వర్గమవాప్నుయాత్ ।
పాంసునా క్రీడమానోఽపి దేవాగార కృదర్థభాక్ ॥19॥

ఎనిమిది ఇటుకలతో నైనను మందిరం నిర్మించే వాడు స్వర్గలోకాన్ని పొందుతాడు. ఆడుకొంటూ ధూళితో మందిరం కట్టేవానికి కూడ అభీష్టమనోరథసిద్ధి కలుగుతుంది. ఈ విధంగా శివుడు స్కందునికి తెలియజేశాడు.

ఇత్యాది మహాపురాణే ఆగ్నేయే దేవాలయమాహాత్మ్యవర్ణనం నామ సప్తవింశత్యధిక త్రిశతతమోఽధ్యాయః ॥327॥

అగ్నిమహాపురాణంలో దేవాలయ మాహాత్మ్యవర్ణనం అనే మూడువందల ఇరవైఏడవ అధ్యాయం సమాప్తం.



అష్టావింశత్యధిక త్రిశతతమోఽధ్యాయః – మూడువందల ఇరవైఎనిమిదవ అధ్యాయం

ఛందఃసారకథనమ్ – ఛందస్సార కథనం

అగ్ని రువాచ – అగ్ని ఇలా పలికాడు.

ఛందో వక్ష్యే మూలజై స్తైః పింగలోక్తం యథాక్రమమ్ ।
సర్వాది మధ్యాంతగణోమ్నౌ భ్యౌజ్రౌస్తౌ త్రికా గణాః ॥1॥

ఇపుడే వేద మూల మంత్రానుసారంగా పింగలోక్త ఛందస్సులను క్రమంగా వర్ణిస్తాను. మ, న, భ, య, జ, ర, స, త – అని గణాలు ఎనిమిది. అన్ని గణాలలోను మూడేసి అక్షరాలు ఉంటాయి. ఆది, మధ్య, అంత్య – అక్షరాలు గురులఘువులుగా ఉంటాయి.

హ్రస్వో గురుర్వా పాదాంతే పూర్వయోగా ద్విసర్గతః ।
అనుస్వారాద్వ్యంజనాత్స్యాజ్జిహ్వా మూలీయతస్తథా ॥2॥

మగణంలో అన్ని అక్షరాలు గురువులు నగణంలో అన్ని అక్షరాలు లఘువులు. ఆది గురువు భగణం, ఆది లఘువు యగణం, అంత్యగురువు సగణం, అంత్య లఘువు తగణం, మధ్యగురువు జగణం, మధ్య లఘువు రగణం. పాదాంతంలో హ్రస్వం వికల్పంగా గురువవుతుంది. విసర్గం, అనుస్వారం, హల్లు, సంయుక్తాక్షరం, జిహ్వామూలీయం– వీటికి పూర్వంలో ఉన్న హ్రస్వం కూడా గురువవుతుంది.

ఉపధ్మానీయతో దీర్ఘో గురుర్ గ్లౌ నౌ గుణావిహ ।
వసవోఽష్టౌ చ చత్వారో వేదాదీత్యాది లోకతః ॥3॥

ఉపధ్మానీయానికి పూర్వంలో ఉన్న హ్రస్వం కూడా గురువవుతుంది. దీర్ఘం గురువు. హ్రస్వం లఘువు. గురువు కు 'గ', లఘువుకు 'ల' అని సంకేతం. గ, ల గణాలు కావు. వసు శబ్దం ఎనిమిదికి, వేద శబ్దం నాలుగుకు సంజ్ఞ అవుతుంది. ఈ విషయాలను లోకానుసారంగా తెలుసుకోవాలి.

ఇత్యాది మహాపురాణే ఆగ్నేయే ఛందఃసారకథనం నామ అష్టావింశత్యధిక త్రిశతతమోఽధ్యాయః ॥328॥

అగ్నిమహాపురాణంలో ఛందస్సార కథనమనే మూడువందల ఇరవైఎనిమిదవ అధ్యాయం సమాప్తం.



ఏకోన త్రింశదధికత్రిశతతమోఽధ్యాయః - మూడువందల ఇరవైతొమ్మిదవ అధ్యాయం

ఛందస్సారకథనమ్ - ఛందస్సారకథనం

అగ్నిరువాచ - అగ్ని ఇలా పలికాడు.

ఛందోఽధికారే గాయత్రీ దేవీ చైకాక్షరీ భవేత్ ।
పంచ దశాక్షరీ (రా) సా స్యాత్ ప్రాజాపత్యాష్టవర్ణికా ॥1॥

వసిష్ఠా! (గాయత్రీ ఛందస్సు ఎనిమిది భేదాలతో ఉంటుంది. ఆర్షి, దైవి, ఆసురి, ప్రాజాపత్య, యాజుషి, సామ్ని, ఆర్చి, బ్రాహ్మీ) ఛందశ్శబ్దం అధికారంలో ప్రయుక్తమయింది. అనగా ఈ ప్రకరణంలో అను వృత్తి చెందుతూ ఉంటుంది. దైవీగాయత్రి ఏకాక్షరి. ఆసురి పంచాదశాక్షరి. ప్రాజాపత్య అష్టాక్షరి.

యజుషాం షడర్ణా గాయత్రీ సామ్నాం స్యాద్ద్వాదశాక్షరా ।
ఋచామష్టా దశార్ణా స్యాత్సామ్నాం వర్ధేత చ ద్వయమ్॥2॥

ఋచాం తుర్యం చ వర్ధేత ప్రాజాపత్యా చతుష్టయమ్ ।
వర్ధేదేకైకకం శేషే ఆసుర్యా ఏకముత్సృజేత్ ॥3॥

యాజుషి షడక్షరి, సామ్ని ద్వాదశాక్షరి, ఆర్చి అష్టాదశాక్షరి, సామ్ని గాయత్రిలో క్రమంగా రెండేసి అక్షరాలు పెంచుతూ ఆరుకోష్ఠాలలో వ్రాయాలి. ఆర్చి గాయత్రిలో మూడేసి, ప్రాజాపత్యగాయత్రిలో నాలుగేసి, ఇతర గాయత్రులలో ఒక్కొక్క అక్షరాన్ని పెంచాలి. ఆసురి గాయత్రిని ఒక్కొక్క అక్షరం తగ్గిస్తూ ఆరు కోష్ఠాలలో వ్రాయాలి.

ఉష్ణిగనుష్టు బ్బృహతీ పంక్తి స్త్రిష్టుబ్జగత్యపి ।
తాని జ్ఞేయాని క్రమశో గాయత్ర్యో బ్రహ్మ ఏవ తాః ॥4॥

వాటిని సామ్న్యాది భేద సహితంగా ఉష్ణిక్, అనుష్టుప్, బృహతి, పంక్తి, త్రిష్టుప్, జగతీ, ఛందస్సులుగా తెలుసుకోవాలి. యాజుషి, సామ్ని, ఆర్చిగాయత్రుల అక్షరాలను వేరువేరు కూర్చడంచే బ్రాహ్మీగాయత్రీ, బ్రాహ్మీ ఉష్ణిక్ మున్నగునవి ఏర్పడతాయి.

తిస్రస్తిస్రః సనామ్న్యః స్యురేకైకా ఆర్ష్య ఏవ చ ।
ఋగ్యజుషాం సంజ్ఞాః స్యుశ్చతుః షష్టిపదే లిఖేత్ ॥5॥

యాజుషికి ముందున్న మూడు గాయత్రులు అక్షరాలను వేర్వేరుగా ఆరు కోష్ఠాలలో చేర్చడంచే ఎన్ని అక్షరాలవుతాయో, అవి ఆర్షీగాయత్రి, ఆర్షీ ఉష్ణిక్ ఇత్యాది భేదాలుగా ఏర్పడతాయి. వీటిని అరవై నాల్గుకోష్ఠాలలో వ్రాయాలి.

	ఛందస్సు	గాయత్రి	ఉష్ణిక్	అనుష్టుప్	బృహతి	పంక్తి	త్రిష్టుప్	జగతి
1	ఆర్షి	24	28	32	36	40	44	48
2	దైవి	1	2	3	4	5	6	7
3	ఆసురి	15	14	13	12	11	10	9
4	ప్రాజాపత్య	8	12	16	20	24	28	32
5	యాజుషి	6	7	8	9	10	11	12
6	సామ్ని	12	14	16	18	20	22	24
7	ఆర్చి	18	21	24	27	30	33	36
8	బ్రాహ్మీ	36	42	48	54	60	66	72

ఇత్యాది మహాపురాణే ఆగ్నేయే ఛందస్సారకథనం నామ ఏకోన త్రింశదధిక త్రిశతతమోఽధ్యాయః ॥329॥

అగ్నిమహాపురాణంలో ఛందస్సారకథనం అనే మూడువందల ఇరవైతొమ్మిదవ అధ్యాయం సమాప్తం.



త్రింశదధిక త్రిశతతమోஉధ్యాయః - మూడువందల ముప్పైయవ అధ్యాయం

ఛందఃసారకథనమ్ - ఛందస్సారకథనం

అగ్నిరువాచ - అగ్ని ఇలా వచించాడు.

పాద ఆపాద పూరణే గాయత్ర్యోవసవః స్మృతాః ।
జగత్యా ఆదిత్యాః పాదో విరాజో దశ ఈరితాః ॥1॥

ఈ ప్రకరణం చివరి వరకు 'పాదః' అనే పదము అనువృత్తి అవుతుంది. గాయత్రికి ఒకపాదంలో ఎనిమిది అక్షరాలు ఉంటాయి. జగతికి పండ్రెండు అక్షరాలు, విరాట్టుకు పది అక్షరాలు ఉంటాయి.

త్రిష్టుభో రుద్రాః పాదః స్యాచ్ఛంద ఏకాదిపాదకమ్ ।
ఆద్యం చతుష్పాచ్చతుర్భిస్త్రిపాత్ సప్తాక్షరైః క్వచిత్ ॥2॥

త్రిష్టుప్పునకు పదకొండు అక్షరాలు ఉంటాయి. ఛందస్సులలో కొన్ని ఏకపాదాలు, కొన్ని ద్విపాదాలు ఇత్యాదివిధంగా ఉంటాయి. గాయత్రి ఆరేసి అక్షరాలు నాలుగుపాదాలతో ఉంటుంది.

సా గాయత్రీ పదే నిచృత్త త్ప్రతిష్ఠా త్రిషట్ త్రిపాత్ ।
వర్ధమానా షడష్టాష్టా త్రిపాత్షడ్ వసుభూధరైః ॥3॥

కొన్ని చోట్ల ఏడక్షరాలతో మూడు పాదాలతో కూడ ఉంటుంది. దీనికి 'నిచృత్' అని పేరు. ప్రథమ పాదం ఎనిమిది అక్షరాలు, ద్వితీయ పాదం ఏడు అక్షరాలు, తృతీయపాదం ఆరు అక్షరాలు అయితే అది ప్రతిష్ఠా గాయత్రి. ఇందుకు విపరీతంగా మూడు పాదాలలో వరుసగా ఆరు, ఏడు, ఎనిమిది అక్షరాలు ఉంటే వర్ధమాన గాయత్రి. మొదటి పాదం ఆరు, రెండో పాదం ఎనిమిది, మూడోపాదం ఏడు అక్షరాలు ఉంటే

గాయత్ర్య తిపాద నిచృన్నాగీ నవ నవర్తుభిః ।

దానికి అతివాద నిచృత్ గాయత్రి అని పేరు. రెండు పాదాలలో తొమ్మిదేసి అక్షరాలు, తృతీయపాదంలో ఆరు అక్షరాలు ఉంటే "నాగీ గాయత్రి" అని పేరు.

వారాహీ రసద్వీరంధ్రైశ్చాథ తృతీయకమ్ ॥4॥

ప్రథమపాదంలో ఆరు అక్షరాలు, ద్వితీయ తృతీయపాదాలలో తొమ్మిది తొమ్మిది అక్షరాలు ఉంటే దానికి వారాహీ గాయత్రి అని పేరు. ఇపుడు మూడో భేదం చెబుతున్నాను.

ద్విపాద్ద్వాదశ వస్వర్ణై స్త్రిపాత్తు త్రైష్టుభైః స్మృతమ్ ।
ఉష్ణిక్ఛందోஉష్ట వసుకైః పాదైర్వేదే ప్రకీర్తితః ॥5॥

ద్విపాద ఛందస్సులో వరుసగా పండ్రెండు, ఎనిమిది అక్షరాలు ఉంటే అది ద్విపాదవిరాట్, పదకొండు అక్షరాల చొప్పున మూడు పాదాలు ఉంటే అది త్రిపాద విరాట్ గాయత్రి. రెండు పాదాలలో ఎనిమిదేసి అక్షరాలు, ఇంకో పాదంలో పన్నెండు అక్షరాలు ఉంటే వేదంలో ఉష్ణిక్ ఛందస్సుగా చెప్పబడింది.

కకుబుష్ణి గష్టసూర్య వస్వర్ణా స్త్రిభిరేవ సః ।
పుర ఉష్ణిక్సూర్య వసు వస్వర్ణైశ్చ త్రిపాద్భవేత్ ॥6॥

ప్రథమ తృతీయ చరణాలు ఎనిమిది అక్షరాలు, ద్వితీయ చరణం పన్నెండు అక్షరాలు ఉంటే " కకుబుష్ణిక్" ఛందస్సు అవుతుంది. అలా కాక ప్రథమ చరణం పన్నెండు అక్షరాలు, ద్వితీయ తృతీయ చరణాలు ఎనిమిదేసి అక్షరాలు ఉంటే "పురుఉష్ణిక్" అని మూడు పాతాలుగా ఉంటుంది.

పరోష్ణిక్ పరతస్తు స్యాచ్చతుష్పాదృషిభిర్భవేత్ ।
సాష్టాక్షరై రనుష్టుప్ స్యాచ్చతుష్పాచ్చ త్రిపాత్క్వచిత్ ॥7॥

ప్రథమ ద్వితీయపాదాలు ఎనిమిదేసి అక్షరాలు, తృతీయపాదం పన్నెండు అక్షరాలు ఉంటే "పరోష్ణిక్ ఛందస్సు" అవుతుంది. ఏడేసి అక్షరాలు చొప్పున నాలుగు పాదాలు ఉంటే "ఉష్ణిక్ ఛందస్సు" అవుతుంది. ఎనిమిదేసి అక్షరాలు చొప్పున నాలుగు పాదాలు ఉంటే "అనుష్టుప్ ఛందస్సు" అవుతుంది. అనుష్టుప్పు ఒక్కొక్కప్పుడు మూడు పాదాలుగా ఉంటుంది. అపుడు "త్రిపాత్ అనుష్టుప్" అవుతుంది.

అష్టార్క సూర్యవర్ణైః స్యాన్మధ్యేఽన్తే చ క్వచిద్భవేత్ ।
బృహతీ జగత స్త్రయో గాయత్ర్యాః పూర్వకో యది ॥8॥

దీనిలో మొదటిపాదంలో ఎనిమిది, రెండుపాదాలలో పండ్రెండేసి అక్షరాలు ఉంటే ఒక భేదం. మధ్యమ పాదం గాని, అంతిమపాదం కాని అష్టాక్షరమై, మిగిలిన రెండు పాదాలు ద్వాదశాక్షరాలు అయితే రెండో భేదం. ఒక పాదం జగతీఛందస్సు, మూడు పాదాలు గాయత్రీ ఛందస్సు అయితే అది బృహతీఛందస్సు.

తృతీయః పథ్యాభవతి ద్వితీయా న్యంకుసారిణీ ।
స్కంధో గ్రీవా క్రౌష్టుకే స్యాద్యాస్క స్యోరో బృహత్యపి ॥9॥

మూడో పాదం మొదటిపాదం వలె అయితే అది పథ్యా బృహతి. ప్రథమ జగతీ పాదము ద్వితీయపాదమై, మిగిలిన మూడు గాయత్రి పాదాలయితే అది న్యంకుసారిణీ బృహతి అవుతుంది. క్రోష్టుకి మతం ప్రకారం దీనికే స్కంధ లేక గ్రీవ అని పేరు. యాస్కాచార్యుని వచనం ప్రకారం అది ఉరో బృహతి.

ఉపరిష్టాద్బృహత్యన్తే పురస్తాద్ బృహతీ పునః ।
క్వచిన్నవకాశ్చత్వారో దిగ్విదిక్ష్వష్ట వర్ణికా ॥10॥

అంతిమపాదం జగతియై, మొదటి మూడు పాదాలు గాయత్రి అయితే అది "ఉపరిష్టాద్బృహతి". ప్రథమపాదం జగతియై మిగిలిన మూడు పాదాలు గాయత్రీ అయితే అది "పురస్తాద్బృహతి". తొమ్మిదేసి అక్షరాలతో నాలుగు పాదాలు ఉన్న ఛందస్సు కూడా ఉంది. అది బృహతీఛందస్సులోని అంతర్భాగమే.

మహాబృహతీ జాగతైః స్యాత్త్రిభిః సతో బృహత్యపి ।

పదేసి అక్షరాల రెండు పాదాలు, ఎనిమిదేసి అక్షరాల రెండు పాదాలు ఉన్నది కూడ బృహతియే. కేవలం జగతీ పాదాలు మూడు ఉంటే మహాబృహతి.

తాండినః పంక్తిచ్ఛందః స్యాత్ సూర్యార్కాష్టాష్టవర్ణకైః ॥11॥

తాండి నామకుడైన ఆచార్యుని మతంలో అది సతీబృహతి అనబడుతుంది. రెండు పాదాలు పన్నెండేసి అక్షరాలు, రెండేసి పాదాలు ఎనిమిది అక్షరాలు ఉంటే "పంక్తి ఛందస్సు" అవుతుంది.

పూర్వౌ చేదయుజౌ సతః పంక్తిశ్చ విపరీతకౌ ।
ప్రస్తారపంక్తిః పురతః పరాదాస్తార పంక్తికః ॥12॥

అది విషమ పాదమయితే అనగా మొదటి రెండుపాదాలు 12 అక్షరాలు, మిగిలిన రెండు 8 అక్షరాలు అయితే సతః పంక్తి ఛందస్సు. అది విపరీతావస్థలో ఉన్నా అదే ఛందస్సు. ఒకటి, రెండు పాదాలు 12 అక్షరాలు, మూడు, నాలుగు పాదాలు 8 అక్షరాలు అయితే ప్రస్తారపంక్తి అవుతుంది. మొదటి రెండుపాదాలు 8 అక్షరాలు, మూడు, నాలుగు పాదాలు 12 అక్షరాలు అయితే అది ఆస్తార పంక్తి.

విస్తారపంక్తి రంతశ్చేద్బహిః సంస్తార పంక్తికా ।
అక్షరపంక్తిః పంచకాశ్చ చత్వార శ్చాల్పసో ద్వయమ్ ॥13॥

పదపంక్తిః పంచ భవేచ్చతుష్కం షట్కకత్రయమ్ ।
షట్కం పంచభిర్గాయత్రైః షడ్భిశ్చ జగతీ భవేత్ ॥14॥

పంద్రెండేసి అక్షరాలు ఉన్న రెండు పాదాలు మధ్యఉండి, మిగిలిన పాదాల యందు ఎనిమిదేసి అక్షరాలు ఉంటే విస్తారపంక్తి. ప్రథమ చతుర్థాల యందు పంద్రెండు అక్షరాలు ద్వితీయ చతుర్థాలయందు ఎనిమిదేసి అక్షరాలు ఉంటే సంస్తారపంక్తి, ఐదేసి అక్షరాలు నాలుగు పాదాలు ఉంటే అక్షరపంక్తి. రెండు పాదాలు ఉన్నచో అల్పశః పంక్తి. అయిదేసి అక్షరాలు ఐదు పాదాలు ఉంటే పదపంక్తి. (ప్రథమం నాలుగు అక్షరాలు) మొదటి పాదం నాలుగు అక్షరాలు, రెండో పాదం ఆరు అక్షరాలు, మిగిలిన పాదాలు ఐదు అక్షరాలు ఉంటే అది కూడ పదపంక్తే అవుతుంది. ఎనిమిదేసి అక్షరాలు అయిదు పాదాలలో ఉంటే పథ్యాపంక్తి. ఎనిమిదేసి అక్షరాల ఆరుపాదాలు ఉన్నది జగతీపంక్తి.

ఏకేన త్రిష్టుబ్జ్యోతిష్మతీ తథైవ జగతీరితా ।
పురస్తా జ్జ్యోతిః ప్రథమే మధ్యే జ్యోతిశ్చ మధ్యతః ॥15॥

ఉపరిష్టా జ్జ్యోతి రన్యాదేకస్మిన్ పంచకే తథా ।
భవేచ్ఛందః శంకుమతీ షట్కే ఛందః కకుద్మతీ ॥16॥

ఒక పాదం త్రిష్టుప్ 11 అక్షరాలు, ఎనిమిదేసి అక్షరాలు నాలుగు పాదాలు ఉన్నది. త్రిష్టుబ్జ్యోతిష్మతి. ఒక పాదం జగతి 12 అక్షరాలు, నాలుగు పాదాలు 8 అక్షరాలు ఉన్నది. జగతీ జ్యోతిష్మతి. మొదటిపాదం 11 అక్షరాలు, మిగిలిన నాలుగుపాదాలు 8 అక్షరాలు ఉన్నది పురస్తాజ్జ్యోతి. మొదటి పాదం 12 అక్షరాలు, మిగిలిన నాలుగుపాదాలు 8 అక్షరాలు ఉన్నా పురస్తాజ్జ్యోతియే అవుతుంది. మధ్య చరణం 11అక్షరాలు, పై క్రింది చరణాలు 8 అక్షరాలు ఉంటే మధ్యేజ్యోతి అవుతుంది. అలాగే మధ్య చరణం 12 అక్షరాలు, పై క్రింది చరణాలు 8 అక్షరాలు ఉంటే మధ్యజ్యోతియే అవుతుంది. ప్రారంభంలో నాలుగుపాదాలు 8 అక్షరాలు, అంతిమ చరణం 11అక్షరాలు ఉంటే ఉపరిష్టాజ్జ్యోతి అవుతుంది.అలాగే ప్రారంభంలో నాలుగుపాదాలు 8 అక్షరాలు, అంతిమపాదం 12 అక్షరాలు ఉంటే అది కూడ ఉపరిష్టాజ్జ్యోతియే అవుతుంది. గాయత్రి మున్నగు ఛందస్సులందు ఒక పాదంలో 5 అక్షరాలు, ఇతర పాదాలలో నియతాక్షరాలు ఉంటే శంకుమతి. ఒక పాదంలో 6 అక్షరాలు, ఇతర పాదాలలో నియతాక్షరాలు ఉంటే కకుద్మతి.

త్రిపాద శిశుమధ్యా స్యాత్సా పిపీలిక మధ్యమా ।
విపరీతా యవమధ్యా త్రివృదేకేన వర్జితా ॥17॥

భూరిజైకేనాధికేన విహీనా చ చిరాద్భవేత్ ।
స్వరాట్ స్యాద్వాభ్యామధికం సందిగ్ధో దైవతాదితః ॥18॥

మూడు పాదాల ఛందస్సులో 1,3 పాదాలలో ఎక్కువ అక్షరాలు, మధ్యపాదంలో తక్కువ అక్షరాలు ఉంటే అది పిపీలిక మధ్య. దీనికి విపరీతంగా ఉండేది యవ మధ్య గాయత్రి. ఉష్ణిక్ మున్నగు ఛందస్సులలో ఒక అక్షరం తగ్గితే నిచృత్ అనియు, ఒక అక్షరం పెరిగితే భూరిక్ అనియు, రెండు అక్షరాలు తగ్గితే విరాట్ అనియు, రెండు అక్షరాలు పెరిగితే స్వరాట్ అనియు పేరు. సందేహం కలిగినపుడు మొదటి పాదాన్ని బట్టి ఛందస్సును నిర్ణయించాలి.

ఆది పాదాన్నిశ్చయః స్యాచ్ఛందసాం దేవతాః క్రమాత్ ।
అగ్నిః సూర్యః శశీ జీవో వరుణశ్చేంద్ర ఏవ చ ॥19॥

విశ్వే దేవాః షడ్జగత్యాః స్వరాః షడ్జో వృషః క్రమాత్ ।

మొదటి పాదాన్ని బట్టి ఛందస్సు నిర్ణయించేటప్పుడు దేవతా, స్వర్ణ, వర్ణ, గోత్రాదుల ద్వారా నిశ్చయించాలి. దేవతాక్రమం ఈ విధంగా ఉంటుంది. అగ్ని, సూర్యుడు, చంద్రుడు, బృహస్పతి, మిత్రావరుణుడు, ఇంద్రుడు విశ్వేదేవతలు. షడ్జమున్నగు స్వరాలు వాటికి ఉంటాయి. షడ్జం, వృషభం,

గాంధారో మధ్యమశ్చైవ పంచమో ధైవత స్తథా ॥20॥

నిషాదో వర్ణః శ్వేతశ్చ సారంగశ్చ పిశంగకః ।
కృష్ణో నీలో లోహితశ్చ గౌరో గాయత్రి ముఖ్యకే ॥21॥

గాంధారం, మధ్యమం, పంచమం, ధైవతం, నిషాదం అని వాటిపేర్లు, వాటిరంగులు శ్వేత, సారంగ, పిశంగ, కృష్ణ, నీల, లోహిత, గౌర వర్ణాలు. ఇవి క్రమంగా గాయత్రి మున్నగు ఛందస్సుల వర్ణాలు.

గోరోచనాభాః కృతయో జ్యోతి చ్ఛందో హి శ్యామలమ్ ।
అగ్ని ర్వైశ్యః కాశ్యపశ్చ గౌతమాంగిరసౌ క్రమాత్ ॥22॥

కృతినామ ఛందస్సు గోరోచన వర్ణతుల్యం. జోతిచ్ఛందవర్ణం శ్యామలం. అగ్నివేశ్య, కాశ్యప, గౌతమ, అంగిరస్, భార్గవ, కౌశిక, వసిష్ఠ గోత్రాలు వాటికి క్రమంగా చెప్పబడ్డాయి.

ఇత్యాది మహాపురాణే ఆగ్నేయే ఛందః సారకథనం నామ త్రింశదధిక త్రిశతతమోఽధ్యాయః ॥330॥

అగ్నిమహాపురాణంలో ఛందస్సారకథనం అనే మూడువందల ముప్పైయవ అధ్యాయం సమాప్తం.



ఏకత్రింశదధిక త్రిశతతమోఽధ్యాయః – మూడువందల ముప్పైఒకటవ అధ్యాయం

ఛందోజాతి నిరూపణమ్– ఛందోజాతి నిరూపణం

అగ్నిరువాచ – అగ్ని ఇలా పలికాడు.

చతుః శత ముత్కృతిః స్యాదుత్కృతే శ్చతుర స్త్యజేత్ ।
అభిసంఖ్యా ప్రత్యకృతిస్తాని ఛందాంసి వై పృథక్॥1॥

ఉత్కృతి ఛందస్సునందు నూట నాలుగు అక్షరాలు ఉంటాయి. ఉత్కృతి నుంచి నాలుగేసి అక్షరాలు తగ్గిస్తూపోతే వేర్వేరు ఛందస్సులు ఏర్పడతాయి. అవి వైదిక ఛందస్సులు. గాయత్రి మొదలు త్రిష్టుప్ వరకు ఉండేవి. లౌకిక ఛందస్సులు. అవి అభికృతి, సంస్కృతి, వికృతి, ఆకృతి, ప్రకృతి, కృతి, అధికృతి, ధృతి ఇత్యాదులు.

కృతిశ్చాతి ధృతిర్ధాత్రీ అత్యష్టి శ్చాష్టి రిత్యతః ।
అతిశక్వరీ శక్వరీతి అతిజగతీ జగత్యపి ॥2॥

కృతి, అతిధృతి, ధాత్రి, అత్యష్టి, అష్టి, అతిశక్వరి, శక్వరి, అతిజగతి, జగతి ఇత్యాదులు.

ఛందోఽత్ర లౌకికం స్యాచ్చ ఆర్షమాత్రైష్టుభాత్ స్మృతమ్ ।
త్రిష్టుప్పంక్తి ర్బృహతీ అనుష్టు బుష్ణి గీరితమ్ ॥3॥

వైదిక ఛందస్సులు, లౌకిక ఛందస్సులు అని రెండు విధాలు. త్రిష్టుప్ పంక్తి, బృహతి, అనుష్టుప్, ఉష్ణిక్ అనేవి ఆర్ష మాత్రములు.

గాయత్రీ స్యాత్సుప్రతిష్ఠా ప్రతిష్ఠా మధ్యయా సహ ।
అత్యుక్తాత్యుక్త ఆదిశ్చ ఏకైకాక్షర వర్జితమ్ ॥4॥

గాయత్రిలో ఒక్కొక్క అక్షరం తగ్గిస్తే సుప్రతిష్ఠా, ప్రతిష్ఠా, మధ్యా, అత్యుక్తా, ఉత్యుక్తా మొదలగు ఛందస్సు లేర్పడతాయి.

చతుర్భాగో భవేత్పాదో గుణచ్ఛందః ప్రదర్శ్యతే ।
తావన్తః సముద్రా గణా హ్యాది మధ్యాంత సర్వగాః ॥5॥

ఛందస్సులో నాలుగో భాగానికి పాదం అని పేరు. ముందుగణ ఛందస్సు చెప్పబడుతోంది. నాలుగు లఘు అక్షరాలు ఒక గణం. ఇవి ఐదుగా కొన్నిచోట్ల ఉంటుంది. ఆది గురువు, మధ్యగురువు, అంత్యగురువు, సర్వ గురువు గాను అదే విధంగా లఘువు గాను ఉంటాయి.

చతుర్వర్ణాః పంచ గణా ఆర్యాలక్షణ ముచ్యతే ।
స్వరార్ధం చార్యార్ధం స్యాదార్యాయాం విషమేణజః ॥6॥

ఇపుడు ఆర్యాలక్షణం చెప్పబడుతోంది. ఏడున్నర గణాలతో ఆర్య ఏర్పడుతుంది. విషమగణం జగణం కారాదు.

షష్ఠో జో నలపూర్వా స్యాద్ద్వితీయాదిపదం నలే ।
సప్తమేఽన్తే ప్రథమా చ ద్వితీయే పంచమే నలే ॥7॥

ఆరోగణం జగణం కావాలి. లేదా (న) సర్వ లఘువుకావాలి. సర్వలఘువు అయినపుడు ద్వితీయాక్షరం నుండి పద సంజ్ఞ ఏర్పడుతుంది. ఆరోగణం జగణమై లేదా సర్వలఘువు అయితే ఏడో గణం కూడ సర్వలఘువయితే, దాని ప్రథమాక్షరం నుంచి పదసంజ్ఞ పరివర్తిస్తుంది.

అర్ధే పదం ప్రథమాది షష్ఠ ఏకో లఘుర్భవేత్ ।
త్రిషు గణేషు పాదః స్యాదార్యాపంచార్ధకే స్మృతా ॥(పథ్యార్ధకే) 8॥

ఉత్తరార్ధంలో ఐదోగణం సర్వలఘువయితే, దాని ప్రథమాక్షరం నుంచి పదసంజ్ఞ ప్రవర్తిస్తుంది. ఆరోగణం ఉత్తరార్ధం ఏకమాత్ర లఘువు అవుతుంది. పూర్వార్ధం, ఉత్తరార్ధములందు మూడేసి గణాలు ఉండి వాటి తరువాత పాద విరామమయితే ఆ ఆర్యకు పథ్యా అని పేరు.

విపులాన్యథ చపలా గురుమధ్య గతౌ చ జౌ ।
ద్వితీయ చతుర్థౌ పూర్వే చ చపలా ముఖపూర్వికా ॥9॥

ద్వితీయే జఘనపూర్వా చపలార్యా ప్రకీర్తితా ।
ఉభయో ర్మహా చపలా గీతావాద్యార్ధ తుల్యకా ॥10॥

పూర్వార్ధంలో కాని, ఉత్తరార్ధంలో కాని, రెండింటియందు కాని, మూడు గణాల తరువాత పాద విరామం లేకుంటే దానికి 'విపుల' అని పేరు. ద్వితీయ చతుర్థ గణాలు గుర్వక్షరాల మధ్య నుండి జగణం కూడా ఉంటే దానికి "చపల" అని పేరు. పూర్వార్ధంలో చపలాలక్షణం ఉన్నది ముఖచపల. ఉత్తరార్ధంలో చపలా లక్షణం ఉన్నది, జఘన చపల. రెండింటి యందు చపలాలక్షణం ఉన్నది మహాచపల.

అంత్యేనార్ధేనోపగీతి రుద్గీతి శ్చోత్క్రమాత్ స్మృతా ।
అర్ధే రక్షగణా ఆర్యాగీతి చ్ఛందో ఽథ మాత్రయా ॥11॥

పూర్వార్ధం వలె ఉత్తరార్ధం ఉన్నచో గీతి. ఉత్తరార్ధం లా పూర్వార్ధం ఉంటే ఉపగీతి. పూర్వోక్త క్రమానికి విపరీతంగా ఉంటే ఉద్గీతి. పూర్వార్ధం ఉత్తరార్ధంలోను, ఉత్తరార్ధం పూర్వార్ధంలోను ఉంటూ, పూర్వార్ధంలో ఎనిమిది గణాలు ఉంటే ఆర్యాగీతి. ఇపుడు మాత్రా ఛందస్సు వివరింపబడుతోంది.

వైతాలీయం ద్విస్వరా స్యాదాయుష్పాదే సమే నలః॥(చతుష్పాదే)
వసవో౽న్తే వనగాశ్చ గోపుచ్ఛం దశకం భవేత్ ॥12॥

భగణాన్తా పాతలికా శేషే పరే చ పూర్వవత్ ।
సాకం షడ్వా మిశ్రయుజి ప్రాచ్యవృత్తిః ప్రదర్శ్యతే ॥13॥

ప్రథమ తృతీయ పాదాలలో 14 మాత్రలు, ద్వితీయ, చతుర్థపాదాలలో 16 మాత్రలు, అన్ని పాదాల చివర రగణ లఘువు, లేదా గురువు ఉన్నచో 'వైతాలీయ ఛందస్సు. చివర ఒక గురువు అధికంగా ఉంటే ఔపచ్ఛందసికం అవుతుంది. దీని చరణాల చివర భగణం, రెండు గురువులు ఉంటే "పాతలికా" ఛందస్సు. వైతాలీఛందస్సులో చెప్పబడిన రగణాదులతో ఒక్కో పాదం చివర ఎనిమిది లకారములు చెప్పబడ్డాయి. వాటిని విడిచి ప్రత్యేక పాదంలో మిగిలిన లకారలములలో సమ 'ల' కారములు విషమ 'ల' కారములతో కలవకూడదు. రెండు, నాలుగుపాదాలలో ఆరు లఘువులను వరుసగా ఉపయోగించరాదు. తృతీయ చతుర్థపాదాలలో చతుర్థ లకారం, పంచమ లకారంతో సంయుక్తమయితే అది ప్రాచ్యవృత్తి అవుతుంది.

పంచమేన పూర్వసాకం తృతీయేన సహస్రయుక్ ।
ఉదీచ్యవృత్తి రాద్యా స్యాద్యుగపచ్చ ప్రవర్తకమ్ ॥14॥

అయుక్ చారుహాసినీ స్యాద్యుగపచ్చాన్తికా భవేత్ ।
సప్తార్చి ర్వసవశ్చైవ మాత్రా సమకమీరితమ్ ॥15॥

ప్రథమ తృతీయపాదాలలో ద్వితీయ తృతీయ లకారాలు మిశ్రితాలయితే ఉదీచ్యవృత్తి. రెండు లక్షణాలు ఒకే పర్యాయం ప్రవర్తిస్తే అది ప్రవర్తిక. నాల్గు పాదాలు విషమపాదాలను అనుసరించి ఉంటే అది చారుహాసిని. సమపాదలక్షణాలు ఉంటే అపరాంతిక. ఒక్కొక్క పాదంలో పదహారు లకారాలు ఉండి, పాదాలలోని చివరి అక్షరాలు గురువులయితే అది మాత్రా సమకము.

భవేన్నల రమౌ లశ్చ ద్వాదశో వనవాసికా ।
విశ్లోకః పంచమాష్టౌమో చిత్రా నవమకశ్చలః ॥16॥

దీనిలో పన్నెండో లకార స్వరూపంలోనే ఉంటే అది వనవాసిక. పంచమ, అష్టమ లకారాలు, లఘువులయితే విశ్లోకం. తొమ్మిదోది కూడ లఘువయితే అది చిత్ర.

పరయుక్తేనోపచిత్రా పాదాకులకమిత్యతః ।
గీత్యార్యా లోపశ్చేత్ సౌమ్యా లపూర్వా జ్యోతిరీరితా ॥17॥

నవమ దశమాలు కలిస్తే ఉపచిత్ర, మాత్రా సమకాది పంచ ఛందస్సులలో ఒక్కొక్క పాదంతో నాలుగు పాదాల ఛందస్సు ఏర్పరిస్తే దానికి పాదాకులకం అని పేరు. ఒక్కొక్క పాదంలో పదహారు లఘువులుండి, దేనితోను కలిసి గురువు కాకపోతే, అది గీత్యార్య.

స్యాచ్ఛిఖా విపర్యస్తార్ధా తూలికా సముదాహృతా ।
ఏకోనత్రింశదంతే గః స్యాజ్జే జన సమావలా ॥18॥

గు ఇత్యేక గురుం సంఖ్యా వర్ణాదేశ్చ విపర్యయాత్ ॥19॥

దీనిలో అర్ధభాగంలో అన్ని మాత్రలు గురువులు, రెండోభాగంలో అన్నీలఘువులు అయితే అది శిఖ. దీనికి విపర్య స్తార్ధమైనచో తూలిక. పూర్వార్ధంలో ఇరవై తొమ్మిది లకారాలు, ఉత్తరార్ధంలో ముప్పై ఒక్కలకారాలు, చివరి రెండు లఘువుల స్థానంలో ఒక గురువు ఉంటే అది సమావల. "గు" అనేది ఒక గురువును చెబుతుంది. అక్షర సంఖ్యలో గురుసంఖ్యను తగ్గించగా మిగిలింది లఘు సంఖ్య అవుతుంది.

ఇత్యాది మహాపురాణే ఆగ్నేయే ఛందో జాతినిరూపణం నామ ఏకత్రింశదధిక త్రిశతతమోఽధ్యాయః ॥331॥

ఆగ్నిమహాపురాణంలో ఛందోజాతినిరూపణం అనే మూడువందల ముప్పైఒకటవ అధ్యాయం సమాప్తం.



ద్వాత్రింశదధిక త్రిశతతమోఽధ్యాయః - మూడువందల ముప్పైరెండవ అధ్యాయం
విషమవృత్తకథనమ్ - విషమవృత్తకథనం

అగ్నిరువాచ - అగ్ని ఇలా పలికాడు.

వృత్తం సమం చార్ధసమం విషమం చ త్రిధా వదే ।
సమం తావత్కృతాకృత మర్ధం సమం చ కారయేత్ ॥1॥

సమ, అర్ధసమ, విషమములు అనే మూడువిధాలైన వృత్తాలను చెబుతాను. సమవృత్తసంఖ్యలో అదే సంఖ్యతో గుణించాలి. దాని గుణన ఫలం అర్ధ సమవృత్తసంఖ్య అవుతుంది.

విషమం చైవ వా న్యూన మతివృత్తం సమాన్యపి ।
గ్లౌ చతుష్ప్రమాణీ స్యాదాభ్యామన్యద్వితానకమ్ ॥2॥

అర్ధ సమవృత్త సంఖ్యలలో కూడ ఆ సంఖ్యతో గుణించగా ఎంత వచ్చునో అన్ని విషమవృత్తాలు అవుతాయి. విషమవృత్త, అర్ధసమవృత్త సంఖ్యలలో మూలరాశిని తీసివేయగా శుద్ధ విషమ, శుద్ధ అర్ధ సమవృత్తముల సంఖ్య తెలుస్తుంది. ఒక్కొక్క పాదంలో గురువులతో సమాప్తిపొందిన అనుష్టుప్పునకు "సమాని' అని పేరు. అంతిమ వర్ణాలు వరుసగా లఘువు, గురువులయితే అది ప్రమాణి. ఈ రెండింటి కన్న భిన్నమైనది వితానకం.

పాదస్యాద్యం తు వక్త్రం స్యాత్సనౌ న ప్రథమా స్మృతౌ ।
వాన్యము శ్చతుర్థా ద్వర్ణాత్పథ్యావక్త్రం యుజో యతః ॥3॥

ఇటుపైన మూడు అధ్యాయాల వరకు 'పాదస్య' అను పదం, పదచతురూర్ధ్వ ఛందస్సు వరకు 'అనుష్టుప్ వక్త్రము' అనేవి అధికారపదాలు. వక్త్రజాతి ఛందస్సులో పాదంలో ప్రథమాక్షరం తరువాత సగణ, నగణాలను ప్రయోగించరాదు. చతుర్థాక్షరం తరువాత భగణం ప్రయోగించాలి. ద్వితీయ, చతుర్థపాదాల నాలుగుఅక్షరాల తరువాత జగణం వచ్చినది పథ్యావక్త్ర.

విపరీతపథ్యా న్యా సా చ్చపలా వాయుజస్వనః ।
విపులా యుగ్మ సప్తమః సర్వం తస్యైవ తస్య చ ॥4॥

కొందరి మతం ప్రకారం ఇందుకు విపరీతంగా చేస్తే అది విపరీతపథ్య. విషమపాద చతుర్థాక్షరానంతరం నగణం. సమపాద చతుర్థాక్షరానంతరం యగణం ఉన్నది చపల. సమపాదాలలో ఏడవ అక్షరం లఘువయితే అది విపుల. ప్రథమ తృతీయపాదములు చతుర్థాక్షరం తరువాత యగణానికి బదులు భగణాదులు ఉంటే అది విపుల.

తౌ తౌ విపులానేకా వక్త్రజాతిః సమీరితా ।
భవేత్పదం చతురూర్ధ్వం చతుర్వృద్ధ్యా పదేషు చ ॥5॥

ఈ విధంగా విపుల అనేక విధాలుగా ఉంటుంది. ఇంతవరకు వక్త్రజాతి ఛందస్సులు చెప్పబడ్డాయి. అనుష్టుప్పు మొదటి పాదం తరువాత పాదములందు క్రమగా నాల్గేసి అక్షరాలు ఉన్న పదాలు ఉంటే చతురూర్ధ్వం అని పేరు.

గురుద్వయాన్త ఆపీడః ప్రత్యాపీడో గణాదికః ।
ప్రథమస్య విపర్యాసే మంజరీ లవణీ క్రమాత్ ॥6॥

దీనిలో చివరి రెండు అక్షరాలు గురువులయితే ఆపీడం. మొదటి రెండు అక్షరాలు గురువులయి, మిగిలిన వన్నీ లఘువులయితే ప్రత్యాపీడం. పదచతురూర్ధ్వ ఛందస్సులో ప్రథమ పాదానికి, ఇతర పాదానికి పరివర్తన ఉంటే క్రమంగా మంజరి, లవలి, అమృతధార అనే ఛందస్సులు ఏర్పడతాయి.

భవేదమృత ధారాఖ్యా ఉద్ధతే త్యుచ్యతేఽధునా ।
ఏకతః ససజసా నః స్యుర్నసౌ జో గోఽథ భౌ న జౌ ॥7॥

ఇపుడు ఉద్ధతా(ఉద్గతా) ఛందస్సు చెప్పబడుతోంది. ప్రథమపాదంలో స, జ, స, గణాలు ఉండి, ఒక లఘువు ఉంటే 10అక్షరాలు. రెండో పాదంలో న, స, జగణాలు ఉండి, ఒక గురువు ఉంటే 10అక్షరాలు. మూడో పాదంలో భ, న, జ గణాలు ఉండి, ఒక లఘువు, గురువు ఉంటే 11అక్షరాలు. నాలుగోపాదంలో స, జ, స, జ, గణాలు ఉండి, ఒక గురువు ఉంటే 13 అక్షరాలు. ఇది ఉద్గతాఛందస్సు.

నో గోఽథ సజసా గో గస్తృతీయ చరణస్య చ ।
సౌరభే కేచన భగా లలితం చ నమౌ జసౌ ॥8॥

దీని తృతీయచరణంలో ర,న, భ, గణాలు, ఒక గురువు ఉంటే 10 అక్షరాలు. దానికి సౌరభం అని పేరు. ఉద్గత తృతీయపాదంలో న, న, స, స, అనే గణాలు ఉంటే అది లలిత.

ఉపస్థితం ప్రచుపితం ప్రథమాద్యౌ సమౌ జసౌ ।
గో గథో మలజా రో గః సమౌ చ రజయాః పదే ॥9॥

ప్రథమపాదంలో య, స, జ, భ, గణాలు, రెండు గురువులు, రెండో పాదంలో స, న, జ, ర, గణాలు ఒక గురువు, మూడో పాదంలో న, న, స గణాలు, నాలుగో పాదంలో న, న, న, జ, భ గణాలు ఉంటే అది ప్రచుపితఛందస్సు,

వర్ధమానం మలౌ స్వోన సౌ అథో తో జో ర ఈరితా ।
శుద్ధ విరాధర్షభాఖ్యం వక్ష్యే చార్ధ సమం తతః ॥10॥

దాని తృతీయపాదంలో న, న, స, న, న, స, గణాలు (మొత్తం 18 అక్షరాలు) ఉంటే అది వర్ధమాన ఛందస్సు, తృతీయపాదంలో త, జ, ర, గణాలు(మొత్తం) 9 అక్షరాలు ఉంటే అది శుద్ధవిరాడర్షభం అవుతుంది. ఇపుడు అర్ధసమవృత్తాలు చెబుతాను.

ఇత్యాది మహాపురాణే ఆగ్నేయే విషమవృత్త కథనం నామ ద్వాత్రింశ దధిక త్రిశతతమోఽధ్యాయః ॥332॥

అగ్నిమహాపురాణంలో విషమవృత్తకథనం అనే మూడువందల ముప్పైరెండవ అధ్యాయం సమాప్తం.

త్రయస్త్రింశదధిక త్రిశతతమోఽధ్యాయః - మూడువందల ముప్పైమూడవ అధ్యాయం
అర్ధసమవృత్తనిరూపణమ్ - అర్ధసమవృత్తవృత్తనిరూపణం

అగ్నిరువాచ - అగ్ని ఇలా పలికాడు.

ఉపచిత్రకం ససమనామథ భోజ భగా మథ ।
ద్రుతమధ్యా తత భగా గథోనన జయాః స్మృతాః ॥1॥

మొదటి పాదంలో మూడు సగణాలు, ఒక లఘువు, ఒక గురువు (11) అక్షరాలు, రెండో పాదంలో మూడు భగణాలు, రెండు గురువులు, ఉండి, ఉత్తరార్ధం పూర్వార్ధం వలె ఉంటే ఉపచిత్రకం. మొదటి పాదంలో మూడు భగణాలు, రెండు గురువులు, రెండో పాదంలో ఒక నగణం, రెండు జగణాలు, మరోజగణం ఉంటే ద్రుత మధ్య అవుతుంది.

వేగవతీ ససమగా భభ భగో గథో స్మృతా ।
రుద్ర విస్తార స్తో సభగా సమజాగో గథా స్మృతా ॥2॥

ప్రథమ పాదంలో మూడు సగణాలు, ఒక గురువు, రెండో పాదంలో మూడు భగణాలు, రెండు గురువులు ఉంటే వేగవతి. మొదటి పాదంలో త, జ, ర, గణాలు, ఒక గురువు, రెండో పాదంలో మ, స, జ, గణాలు, రెండు గురువులు, ఉంటే రుద్ర విస్తారం అవుతుంది.

రజసా గో గథో ద్రోణౌ గో గౌ వై కేతుమత్యపి ।
ఆఖ్యానికీ తత జగా గథో తత జగా గథ ॥3॥

మొదటి పాదంలో స, జ, స గణాలు, ఒక గురువు, రెండో పాదంలో భ, ర, న, గణాలు, రెండు గురువులు ఉంటే అది కేతుమతి. మొదటి పాదంలో త, త, జ, గణాలు, రెండు గురువులు, రెండో పాదంలో జ, త, జ, గణాలు, రెండు గురువులు ఉంటే అది ఆఖ్యానికి.

విపరీతాఖ్యానికీ తౌ జయాగా తౌ జగౌగథ ।
సౌమలౌ గథ లభ భారో భవేద్ధరిణవల్లభా ॥4॥

మొదటి పాదంలో జ, త, జ గణాలు, రెండు గురువులు ఉండి, రెండో పాదంలో త, త, జ, గణాలు రెండు గురువులు ఉంటే దానికి విపరీతాఖ్యానికి అని పేరు. మొదటి పాదంలో స, స, స, గణాలు, ఒక లఘువు, ఒక గురువు, ఉండి, రెండో పాదంలో న, భ, భ, ర, గణాలు, ఉంటే అది హరిణవల్లభ అవుతుంది.

లో వనౌ గథా న జజా యః స్యాదపరవక్త్రకమ్ ।
పుష్పితాగ్రా నలవయా న జజా రో గథో రజౌ ॥5॥

ప్రథమ పాదంలో న, న, ర, గణాలు, ఒక లఘువు, ఒక గురువు ఉండి, రెండో పాదంలో న, జ, జ, ర గణాలు ఉన్నది అపరవక్త్ర నామక ఛందస్సు అవుతుంది. మొదటి పాదంలో న, న, ర, య గణాలు ఉండి, రెండో పాదంలో న, జ, జ, ర గణాలు, ఒక గురువు ఉన్నది పుష్పితాగ్ర అవుతుంది.

వో జథో జవ జవాగో మూలే యవమతీ శిఖా ।
అష్టావింశతి నాగాభా త్రింశన్నాగం తతో యుజి ॥
ఖంజా తద్విపరీతా స్యాత్సమ వృత్తం ప్రదర్శ్యతే ॥6॥

మొదటి పాదంలో ర, జ, జ, గణాలు రెండో పాదంలో జ, ర, జ, ర గణాలు, ఒక గురువు ఉన్నది యవమతి అనబడుతుంది. ప్రథమ తృతీయ చరణాలలో 28 లఘువులు, చివర ఒక గురువు ఉండి, రెండు నాలుగు పాదాలలో 30లఘువులు ఉంటే అది "శిఖ" అనబడుతుంది. దానికి విపరీతంగా ప్రథమ, తృతీయ పాదాలలో 30 లఘువులు, ఒక గురువు, రెండు నాలుగుపాదాలలో 28లఘువులు, ఒక గురువు ఉంటే అది "ఖంజ" అవుతుంది. ఇప్పుడు సమవృత్తం గురించి చెప్పబడుతున్నది.

ఇత్యాది మహాపురాణే ఆగ్నేయే అర్ధసమవృత్తనిరూపణం నామ త్రయ స్త్రింశదధిక త్రిశతతమోఽధ్యాయః॥333॥

అగ్నిమహాపురాణంలో అర్ధసమవృత్తనిరూపణం అనే మూడువందల ముప్పైమూడవ అధ్యాయం సమాప్తం.



చతుస్త్రింశ దధికత్రిశతతమోऽధ్యాయః - మూడువందల ముప్పైనాల్గవ అధ్యాయం

సమవృత్తనిరూపణమ్ - సమవృత్తనిరూపణం

అగ్నిరువాచ - అగ్ని ఇలా పలికాడు.

యతి ర్విచ్ఛేద ఇత్యుక్త స్తత్తన్మధ్యాన్తయౌ గణౌ ।
యౌ సః కుమారలలితా భౌగౌ చిత్రపదా స్మృతా ॥1॥

పదవిచ్ఛేదం యతి అనబడుతుంది. ఒక్కొక్క పాదంలో తగణం, యగణం ఉంటే అది తనుమధ్య. ఒక్కొక్క పాదంలో జ, స, గణాలు, గురువు ఉన్నది కుమారలలిత. రెండు భగణాలు, రెండు గురువులు ఉన్నది చిత్రపద.

విద్యున్మాలా సభాగస్య గణౌ రతలగై ర్భవేత్ ।
మాణవకా క్రీడితకం రనౌ హలముఖీ నసః ॥2 ॥

ఒక్కో పాదంలో రెండు మగణాలు, రెండు గురువులు ఉన్నది విద్యున్మాల. భగణం, తగణం, ఒక లఘువు, గురువు ఉంటే మాణవకా క్రీడితకం అవుతుంది. రగణం, నగణం, సగణం ఉంటే "హలముఖి" అవుతుంది.

స్యాద్భుజంగ శిశు భృతా నౌ మో హంసరుతం ననౌ ।
భవే చ్ఛుద్ధ విరాడ్వృత్తం ప్రతిపాదం సమౌ జగౌ ॥3॥

రెండు నగణాలు, ఒక మగణం ఉంటే "భుజంగ శిశుభృతి" అవుతుంది. మగణం, నగణం, రెండు గురువులు ఉంటే 'హంసరుతం' అవుతుంది. మ గణం, స గణం, జ గణం ఒక గురువు ఉంటే శుద్ధవిరాట్ అవుతుంది.

ప్రణవో నతయామః స్యాజ్జౌ గౌ మయూరసారిణీ ।
సత్తామభసగా వృత్తం భజతాద్యుపరి స్థితా ॥4॥

మగణం, నగణం, యగణం, ఒక గురువు ఉంటే ప్రణవం (పనవం) అనే ఛందస్సు అవుతుంది. రగణం, జగణం, ఒక గురువు ఉంటే మయూరసారిణి అవుతుంది. మగణం, భగణం, సగణం, ఒక గురువు ఉంటే "మత్త" అవుతుంది. తగణం, రెండు జగణాలు, ఒక గురువు ఉంటే దానికి "ఉపస్థిత" అని పేరు.

రుక్మవతీ భససగా వింద్రవజ్రా తజౌ జగౌ ।
జతౌ జగౌ తూప పూర్వా వాద్యన్తా ద్యుపజాతయః ॥5॥

భగణం, మగణం, సగణం, ఒక గురువు ఉంటే రుక్మవతి. రెండుతగణాలు, ఒక జగణం, రెండు గురువులు ఉంటే 'ఇంద్రవజ్ర' అవుతుంది. ఒక జగణం, ఒక తగణం, ఒక జగణం రెండు గురువులు ఉంటే 'ఉపేంద్రవజ్ర' అవుతుంది. ఇంద్రవజ్ర, ఉపేంద్రవజ్ర లక్షణాలు రెండూ ఒకే ఛందస్సులో ఉంటే ఉపజాతి.

దోధకం భభాభాగౌ స్యాచ్ఛాలినీ మత భాగగౌ ।
యతిః సముద్రా ఋషయో వాతోర్మీ మభతా గగౌ ॥6॥

మూడు భగణాలు, రెండు గురువులు ఉంటే "దోధకం" అవుతుంది. భగణం, రెండు తగణాలు, రెండు గురువులు ఉంటే శాలిని. నాలుగు, ఏడు అక్షరాల పై యతి, మగణం, భగణం, తగణం, రెండు గురువులు ఉంటే వాతోర్మి చతుర్థసప్తమాక్షరయతి.

చతుః స్వరా స్యా ద్భ్రమరీ విలసితా మభౌ నలౌ ।
సముద్రా అథ ఋషయో వనౌ లౌ గౌ రథోద్ధతా ॥7॥

ఒక్కోపాదంలో మగణం, భగణం, తగణం, నగణం, ఒక్క లఘువు ఉంటే, ఒక గురువు కూడా ఉంటే భ్రమరీవిలసిత. చతుర్థసప్తమాక్షరయతి ర, న, ర, ఒక లఘువు, ఒక లఘువు ఉంటే రథోద్ధత చతుర్థ సప్తమాక్షరయతి.

స్వాగతా ధన భాగో గో వృత్తానన సమాశ్చ సః ।
శ్యేనీవ జవనా గః స్యాద్రమ్యా నపరగాగగః ॥8॥

ర, న, భ, గణాలు, రెండు గురువులు ఒక పాదానికి ఉంటే అది స్వాగత. రెండు నగణాలు, సగణం, రెండు గురువులు ఉంటే అది వృత్త. రగణం, జగణం, రగణం, ఒక లఘువు, ఒక గురువు ఉంటే అది శ్యేని. జగణం, రగణం, జగణం, రెండు గురువులు ఉంటే రమ్య.

జగతీ వంశస్థవృత్తం జతౌ జావథ తౌ జవౌ ।
ఇంద్రవంశా తోటకం సైశ్చతుర్భిః ప్రతిపాదితమ్ ॥9॥

ఇక్కడ నుంచి జగతీఛందస్సు ఆరంభం అవుతోంది. జ, త, జ, ర గణాలు వంశస్థవృత్తం. త, త, జ, ర గణాలు ఇంద్రవంశ. నాలుగేసి 'స' గణాలు ఉన్నది తోటకం.

భవేద్ద్రుత విలంబితా నభౌ భరావథో నలౌ ।
స్యా ఛ్రీపుటో వసువేదా జ్జలో (ద్ధత) గతిర్జలౌజసౌ ॥10॥

నగణం, భగణం, భగణం, రగణం ఒక్కొక్క పాదంలో ఉంటే అది ద్రుతవిలంబితం. రెండు నగణాలు, ఒక మగణం ఉంటే అది శ్రీపుటం. ఎనిమిది, నాలుగు అక్షరాలపై నయతి. జగణం, సగణం, జగణం, సగణం ఉంటే జలోద్ధతగతి. ఆరు అక్షరాలపై యతి.

జసౌ వ సర్వ వశ్చాథ తతం ననమరాః స్మృతమ్ ।
కుసుమవిచిత్రా న్యౌ ద్యౌ నౌ నౌ రౌ స్యాచ్చలాంబికా ॥11॥

రెండు నగణాలు, ఒక మగణం, ఒక రగణం ఉంటే అది 'తత' ఛందస్సు. నగణం, యగణం, నగణం, యగణం ఉంటే కుసుమ విచిత్ర. ఆరు అక్షరాలపై యతి. రెండు నగణాలు, రెండు రగణాలు ఉంటే "చలాక్షిక"

భుజంగ ప్రయాతం యై స్స్యా చ్చతుర్భిః స్రగ్విణీ తు రైః ।
ప్రమితాక్షరా సజౌ సౌ కాంతోత్పీడా భయౌ సమౌ ॥12॥

నాలుగు యగణాలు ఉంటే ఒక్కో పాదంలో అది "భుజంగప్రయాతం". నాలుగు రగణాలు ఉంటే అది స్రగ్విణి. స, జ, స, స గణాలు ఉంటే అది ప్రమితాక్షర. భ, య, స, మ లు ఉంటే అది కాంతోత్పీడ.

వైశ్వదేవౌ మమ యయాః పంచాంగా నవమాలినీ ।
నజౌ భయౌ ప్రతిపాదం గణా యది జగత్యపి ॥13॥

రెండు మగణాలు, రెండు యగణాలు ఉంటే వైశ్వదేవీ ఛందస్సు. పంచ సప్తమాక్షరయతి. న, జ, భ, య గణాలు నవమాలిని. ఇకపై జగతీ ఛందస్సు అధికారంగా ఉంటుంది.

ప్రహర్షిణీ మనజరా గోపతి ర్వహ్ని దిక్షు చ ।
రుచిరా జభసజగా ఛిన్నా వేదైః గ్రహైః స్మృతా ॥14॥

మగణం, నగణం, జగణం, రగణం, ఒక గురువు ఉంటే ప్రహర్షిణి. మూడు, పది అక్షరాలపై యతి. జ, భ, స, జ, గణాలు, ఒక గురువు ఉంటే రుచిర. నాలుగు, తొమ్మిది అక్షరాలపై యతి.

మత్తమయూరం మతయాసతౌ వేదగ్రహేర్యతిః ।
గౌరీన లన సాగః స్యాదసంబాధా మతౌ న గౌ ॥15॥

మ, త, య, స గణాలు, ఒక గురువు ఉంటే మత్తమయూరం. నాలుగు, తొమ్మిది అక్షరాలపై యతి. మూడు నగణాలు, ఒక సగణం, ఒక గురువు ఉంటే గౌరీ ఛందస్సు. మగణం, తగణం, నగణం, సగణం, రెండు గురువులు ఉంటే "అసంబాధ" ఐదు, తొమ్మిది అక్షరాలపై యతి.

గో గ ఇంద్రియ నవకౌ ననౌ రసల గాః స్వరాః ।
స్వరాశ్చాపరాజితా స్యాన్ననభా నలగాః స్వరాః ॥16॥

ద్విః ప్రహరణ కలితా వసంతతిలకా నభౌ ।
జౌగౌ సింహోన్నతా సా స్యా న్మునే రుద్ధర్షిణీ చ సా ॥17॥

రెండు నగణాలు, రగణం, సగణం, ఒక లఘువు, ఒక గురువు ఉంటే అపరాజిత. ఏడు ఏడు అక్షరాల యతి. న, న, భ, న గణాలు, ఒక లఘువు, ఒక గురువు ఉంటే అది ప్రహరణ కలిత. ఏడు, ఏడు అక్షరాలపైయతి.

త, భ, జ, జ గణాలు, రెండు గురువులు ఉంటే వసంత తిలక అవుతుంది. మునీశ్వరా ! దీనికి సింహోన్నత, ఉద్ధర్షిణి అని నామాంతరాలు.

చంద్రావర్తా ననౌ సోమావర్తర్తు నవకః స్మృతః ।
మణిగుణనికరాసౌ మాలినీ నౌ మయౌ యయః ॥18॥

ఒకొక్కపాదంలో నాలుగు నగణాలు, ఒక సగణం ఉంటే అది చంద్రావతి. షష్ఠ నవమాక్షరాలపై యతి ఉంటే దానికి మూల అని పేరు. అష్టమ సప్తమాక్షరాలపై యతి ఉంటే మణి గుణనికర అని పేరు. న, న, మ, య, య గణాలు ఉంటే అది మాలినీ వృత్తం అష్టమ సప్తమాక్షరాలపై యతి.

యతి ర్వసుస్వరా, భౌవౌ నతల మిత్ర స్రగ్రహాః ।
ఋష భగ జవిలసితం జ్ఞేయా శిఖరిణీ జగౌ ॥19॥

భ, ర, న, న, న, గణాలు, ఒక గురువు ఉంటే ఋషభగజ విలసితం. ఏడు, తొమ్మిది అక్షరాలపై యతి. య, మ, న, స, భ, గణాలు, ఒక లఘువు, ఒక గురువు శిఖరిణి.

రసభాల భృగురుద్రాః పృథ్వీ జసజసా జనౌ ।
గావ సుగ్రహవిచ్ఛిన్నా పింగలే నేరితా పురా ॥20॥

షష్ఠ, ఏకాదశ అక్షరాలపై యతి. జ,స,జ,స,య లఘువు. గురువు పృథ్వీ అష్టమ నవమాక్షరాలపై యతి. దీనిని పూర్వంలో పింగళుడు చెప్పి ఉన్నాడు.

వంశ పత్ర పతితం స్యాద్భావనా భౌ నగౌ సదిక్ ।
హరిణీ నవమా రః సో నగౌ రస చతుః స్వరాః ॥21॥

భ, ర, న, భ, న, ఒక లఘువు, ఒక గురువు కలిపి వంశపత్రపతితం అవుతుంది. దశమ సప్తమాక్షరాలపై యతి. న, స, మ, ర, స, ఒక లఘువు, ఒక గురువు కలిపి హరిణి అవుతుంది. చతుర్థ సప్తమాక్షరాలపై యతి.

మందాక్రాంతా మభన తం తగౌ గచ్ఛిర స్వరాః ।
కుసుమితలతా వేల్లితా మతనాయయయాః స్వరాః ॥22॥

మ, భ, న, త, త, గణాలు రెండు గురువులు మందాక్రాంత. చతుర్థ షష్ఠ సప్తమాక్షరాలపై యతి. మ, త, య, య, య గణాలు కుసుమిత లతా వేల్లిత. పంచమ, షష్ఠ, సప్తమాక్షరాలపై యతి.

రథాః స్వరాః ప్రతి రథ మసజాః సతతాశ్చ గః ।
శార్దూల విక్రీడితం స్యాదిత్య మునయో యతిః ॥23॥

మ, స, జ, స, త, త, గణాలు ఒక గురువు కలిపి ఉంటే శార్దూలవిక్రీడితం. ద్వాదశ సప్తమాక్షరాలపై యతి.

కృతిః సువదనా మో రో భనయా భలగాః సురాః ।
యతిర్మని రసాశ్చాథ ఇతివృత్తం క్రమాత్ స్మృతమ్ ॥24॥

సువదనా ఛందస్సు కృతి ఛందస్సులో అంతర్గతం. మ, ర, భ, న, య, భ, లఘువు, గురువు కలిపితే కృతి ఛందస్సు. ప్రతిపాదంలో సప్తమ షష్ఠాక్షరాలపై యతి. కృతి యొక్క ప్రతిపాదంలోను గురు, లఘువులు ఉంటే దానికి వృత్తం అని పేరు.

స్రగ్ధరా మరతా నో మో యపౌ త్రిః సప్త కాయతిః ।
సముద్రకం భరజానో వనగా దశభాస్కరాః ॥25॥

మ, ర, భ, న, య, య, య గణాలు స్రగ్ధర. సప్తమాక్షరాలపై యతి భ, ర, న, ర, న, ర, న, గణాలు ఒక గురువు ఉంటే సుభద్రకం. పది, పన్నెండు అక్షరాలపై యతి.

అశ్వలలితం నజభా జభజా భనమీశతః ।
మత్తా క్రీడా మమతనా నౌ నగ్నౌ గోష్ఠ మాతిథిః ॥26॥

న, జ, భ, జ, భ, జ, భ, గణాలు, ఒక లఘువు, ఒక గురువు, కలిస్తే అశ్వలలిత, ఏకాదశ, ద్వాదశాలపై యతి. మ, మ, త, న, న, న, న, గణాలు, ఒక లఘువు, ఒక గురువు కలిపిన పాదం కలిగిఉన్న వృత్తం మత్తక్రీడ అవుతుంది. ఎనిమిది మరియు పదిహేను అక్షరాలపై యతి.

తన్వీ భతన సా భో భో నయో బాణ సురార్కకాః ।
క్రౌంచ పదాభమ సభా నౌ నౌ బాణ శరాష్టతః ॥27॥

భ, త, న, స, భ, భ, న, య, గణాలు తన్వీవృత్తం. ఐదు, ఏడు, పన్నెండు అక్షరాలపై యతి. భ, మ, స, భ, న, న, న, న గణాలు, ఒక గురువు కలిస్తే క్రౌంచ పద ఐదు ఐదు, ఎనిమిది, ఏడు అక్షరాలపై యతి.

భుజంగ విజృంభితం మమతనా నన వాసనౌ ।
గష్టేశ ముని భిశ్ఛేదో హ్యుపహోవాఖ్య మీదృశమ్ ॥28॥

మ, మ, త, న, న, న, ర, స, గణాలు, ఒక లఘువు, ఒక గురువు కలిస్తే భుజంగ విజృంభితం. ఎనిమిది, పదకొండు, ఏడు అక్షరాలపై యతి. ఒక మగణం, ఆరుగణాలు, ఒక సగణం, రెండు గురువులు ఉండి తొమ్మిది, ఆరు, ఆరు, ఐదు యతి ఉంటే అపహోవం కాని, ఉపహోవం కాని అవుతుంది.

మన నా నవతానః సో గణై ర్గహ రసౌ రసాత్ ।
నౌ సప్తరోదండదః స్యాచ్ఛండ వృష్టి ప్రపాతకమ్ ॥29॥

రెండు నగణాలు, ఏడు రగణాలు ఒక పాదంలో ఉంటే అది దండకం. దీనికే చండవృష్టి ప్రపాతకం అనిపేరు.

రేఫ వృద్ధ్యా నన వాస్యు ర్వ్యాల జీమూత ముఖ్యకాః ।
శేషే వై ప్రచితో జ్ఞేయో గాథా ప్రస్తార ఉచ్యతే ॥30॥

దీనిలో రెండు నగణాలు కాక, రగణ వృద్ధి అయితే వ్యాల, జీమూతాది దండకాలు ఏర్పడతాయి. చండ ప్రపాతం యొక్క ఇతర భేదాలు అన్నీ దండక ప్రస్తార ప్రచితాలని చెప్పబడతాయి. ఇపుడు గాథా ప్రస్తారం చెబుతాను.

ఇత్యాది మహాపురాణే ఆగ్నేయే సమవృత్తనిరూపణం నామ చతుస్త్రింశదధిక త్రిశతతమోஉధ్యాయః ॥334॥

అగ్నిమహాపురాణంలో సమవృత్త నిరూపణం అనే మూడువందల ముప్పైనాల్గవ అధ్యాయం సమాప్తం.

పంచ త్రింశదధిక త్రిశతతమోఽధ్యాయః – మూడువందల ముప్పైఐదవ అధ్యాయం

ప్రస్తారనిరూపణమ్ – ప్రస్తారనిరూపణం

అగ్నిరువాచ – అగ్ని ఇలా పలికాడు.

ఛందోఽత్ర సిద్ధం గాథా స్యాత్పాదే సర్వగురౌ తథా ।
ప్రస్తార ఆద్య గాథో నః పరతుల్యోఽథ పూర్వగః ॥1॥

పేరు చెప్పని ఛందస్సులన్నీ గాథా ఛందస్సులో అంతర్గతాలు కాని ప్రయోగంలో ఇవి కనబడతాయి. ఇపుడు ప్రస్తారం చెప్పబడుతోంది. అన్ని అక్షరాలు గురువైనపాదంలో ఆది గురువు క్రింద లఘువు వ్రాయాలి. దాని తరువాత అదే క్రమంలో వర్ణాలను కూర్చాలి.

నష్టమధ్యే సమేఽంకే నః సమోర్ధ విషమే గురుః ।
ప్రతిలోమగుణం నాద్యం ద్విరుద్దిష్టక ఏకనుత్ ॥2॥

నష్టసంఖ్యను సగం చేయగా ఒక లఘువు వ్రాయాలి. సగం చేసినపుడు అది విషమమైతే దానికి ఒకటి చేర్చి సమం చేసి మళ్లీ దానిని సగం చేయాలి. ఇపుడు ఒక గుర్వక్షరం లభిస్తుంది. ఎన్ని అక్షరాల ఛందస్సు యొక్క భేదం తెలియాలో, అన్ని అక్షరాలు పూర్తి అయ్యేవరకు గురు లఘువులను వ్రాస్తూ వెళ్లాలి.

సంఖ్యా ద్విరర్ధే రూపేతు శూన్యం శూన్యే ద్విరీ రితమ్ ।
తావదర్ధే తద్గుణితం ద్విద్వ్యూనం చ తదన్తతః ॥3॥

ఉద్దిష్ట సంఖ్యను చెప్పడానికి, గురులఘు వర్ణాలను క్రమంగా, ఒక పంక్తిలో వ్రాసి, వాటిపైన క్రమంగా ఒకటి నుండి రెట్టిస్తూ, అంకాలు ఉంచాలి. ఎన్ని అక్షరాల ఛందస్సు తెలియాలో, దాని అర్ధభాగం తీసి వేయాలి. అపుడు రెండు వస్తుంది. దానిని వేరుగా ఉంచాలి. విషమ సంఖ్య నుంచి ఒకటి తగ్గిస్తే శూన్యం లభిస్తుంది. దానిని రెండు క్రిందకు వ్రాయాలి. శూన్యస్థానంలో రెట్టింపు చేయాలి. అలా చేయగా వచ్చిన అంకాన్ని పై నున్న అర్ధస్థానంలో ఉంచి దాని చేత గుణించాలి.

పరే పూర్ణం పరే పూర్ణం మేరు ప్రస్తారతో భవేత్ ।
నగ సంఖ్యా వృత్త సంఖ్యా చార్ధాంగుల మధోర్ధతః ॥4॥

సంఖ్యేవ ద్విగుణైకోనా ఛందః సారోఽయ మీరితః ॥5॥

మేరు ప్రస్తారంచే ఒక ఛందస్సులో ఎన్ని లఘువులు, ఎన్ని గురువులు ఉంటాయో, ఎన్ని వృత్తాలు ఏర్పడుతాయో తెలుస్తుంది. మేరు ప్రస్తారంలో క్రింది నుండి పైకి, అర్ధాంగుళం చొప్పున విస్తారం తగ్గుతుంది. ఛందస్సంఖ్యను రెట్టించి, ఒక్కొక్కటి తగ్గిస్తే అన్ని అంగుళాల ప్రస్తార దేశం ఏర్పడుతుంది. ఈ విధంగా ఛందస్సారం చెప్పబడింది.

ఛందః ప్రస్తారం

ఏకాక్షర ప్రస్తారం (2)

U	1
I	2

ద్వ్యక్షర ప్రస్తారం (4)

U U	1
I U	2
V I	3
I I	4

త్ర్యక్షర ప్రస్తారం (8)

U U U	1
I V V	2
V I V	3
I I U	4
V V I	5
I V I	6
V I I	7
I I I	8

చతురక్షర ప్రస్తారం(16)

V UUU	1
I UUU	2
U I U U	3
I I U U	4
U U I U	5
I U I U	6
V I I U	7
I I I U	8
U U U I	9
I V V I	10
V I V I	11
I I V I	12
V U I I	13
I U I I	14
V I I I	15
I I I I	16

వర్ణ మేరువు

1
1 1
1 2 1
1 3 3 1
1 4 6 4 1
1 5 10 10 5 1
1 6 15 20 15 6 1
1 7 21 35 35 21 7 1
1 8 28 56 70 56 28 8 1

1. మొదటి గురువు క్రింద లఘువు వ్రాయాలి.
2. కుడి వైపున గురులఘువులు ఏవి ఉంటే అవే క్రింద వేయాలి.
3. ఎడమ వైపు లఘువు ఉంటే క్రింద గురువు వేయాలి.
4. అన్నీ లఘువులు వచ్చే దాకా ప్రస్తారం చేయాలి.

ఇత్యాది మహాపురాణే ఆగ్నేయే ప్రస్తారనిరూపణం నామ పంచత్రింశదధిక త్రిశతతమోఽధ్యాయః ॥335॥

అగ్నిమహాపురాణంలో ప్రస్తారనిరూపణం అనే మూడువందల ముప్పైఅయిదవ అధ్యాయం సమాప్తం.



షట్త్రింశదధికత్రిశతతమోఽధ్యాయః - మూడువందల ముప్పైఆరవ అధ్యాయం

శిక్షానిరూపణమ్ - శిక్షానిరూపణం

అగ్నిరువాచ - అగ్ని ఇలా పలికాడు.

వక్ష్యే శిక్షాం త్రిషష్టిః స్యుర్వర్ణా వా చతురధికాః ।
స్వరా వింశతి రేకశ్చ స్పర్శానాం పంచవింశతిః ॥1॥

యాదయశ్చ స్మృతాహ్యష్టౌ చత్వారశ్చ యమాః స్మృతాః ।
అనుస్వారో విసర్గశ్చ కపౌ చాపి పరాశ్రితౌ ॥ 2 ॥

దుఃస్పృష్టశ్చేతి విజ్ఞేయో లు కారః ప్లుత ఏవ చ ।

ఇపుడు శిక్షను గూర్చి చెబుతాను. మొత్తం వర్ణాలు అరవై మూడు లేదా అరవై నాలుగు వీటిలో ఇరవై ఒకటి స్వరాలు. ఇరవై ఐదు స్పర్శలు. ఎనిమిది యాదులు. నాలుగు యమములు అని చెప్పబడ్డాయి. అనుస్వార, విసర్గ, పరాశ్రితాలైన జిహ్వామూలీయ, ఉపధ్మానీయములు, దుస్పృష్టలకారము, ఇవి అరవై మూడు వర్ణాలు. ప్లుత లు కారం చేరిస్తే అరవైనాలుగు.

వి॥ అ, ఇ, ఉ, ఋ, ఈనాలుగు అక్షరాలు హ్రస్వ దీర్ఘ, ప్లుత భేదంచే 12 అక్షరాలు

ఏ, ఐ, ఓ, ఔ - ఈ నాలుగు అక్షరాలు దీర్ఘ, ప్లుత భేదంచే 8 అక్షరాలు.

దుః స్పృష్టలకారం - ఐ - మొత్తం 21 స్వరాలు రెండు స్వరాల మధ్య ఉండే లకారం క, చ, ట, త, ప -ఐదు వర్గలు 25 వర్ణాలు స్పర్శలు

య, ర, ల, వ, శ, ష, స, హ- 8 యాదులు

యమములు - 4. వర్ణేషు ఆద్యానాం చతుర్ణాం పంచమే పరే మధ్యే యమో నామా పూర్వ సదృశో వర్ణః ప్రాతి శాఖ్యే ప్రసిద్ధః పలిక్ క్నీః - చఖ్ ఖ్నతుః - ఇత్యాది.

అనుస్వార, విసర్గ (4), జిహ్వామూలీయ, ఉపధ్మానీయ (4) క, ఖ, ప, ఫలకు ముందున్న విసర్గలు మొత్తం 64. లు వర్ణం ఋవర్ణంలో అంతర్భావమయితే 63 వర్ణాలు.

రంగశ్చఖే అరం ప్రోక్తం హకారః పంచమైర్యుతః ॥3॥

అనుస్వారోచ్చారణం (ఖే) 'అరా' వలె ఉండును. హకారం ఒకారాది పంచమాక్షరాలతో కలిసినప్పుడున్ను,

వి ॥ నకారస్థానంలో 'ర్' కలిసినప్పుడు "అత్రానునాసికః పూర్వస్యతువా" అను సూత్రం చే వచ్చే ఉచ్చారణ 'రంగం' అవుతుంది.

అంతః స్థాభిః సమాయుక్త ఔరస్యః కంఠ్య ఏవ సః ।
ఆత్మబుధ్యా సమేత్యార్థాన్మనో యుంక్తే వివక్షయా ॥4॥

య, ర, ల, లు వీటితో కలిసినప్పుడున్ను 'ఉరస్యం' అవుతుంది. వీటిలో సంయుక్తం కాకుండా సమాయుక్తమయితే కంఠ్యం అవుతుంది. ఆత్మబుద్ధితో పదార్థాలను ఆలోచించి, చెప్పవలెనను ఇచ్ఛతో మనస్సుతో కలుస్తుంది.

మనః కాయాగ్ని మాహంతి సప్రేరయతి మారుతమ్ ।
మారుత స్తూరసి చరన్మంద్రం జనయతి స్వరమ్ ॥5॥

ఆ మనస్సు జఠరాగ్నిని కొడుతుంది. అది వాయువును ప్రేరేపిస్తుంది. ప్రాణవాయువు హృదయంలో మంద్రస్థాయిలో చరిస్తూ స్వరాన్ని పుట్టిస్తుంది.

ప్రాతః సవనయోగంతు ఛందో గాయత్ర మాశ్రితమ్ ।
కంఠే మాధ్యందినయుతం మధ్యమం త్రైష్టుభానుగమ్ ॥6॥

అది ప్రాత స్సవన కర్మకు సాధనమైన, గాయత్రీ ఛంద స్సమాశ్రితమైన మంద్రస్వరాన్ని పుట్టిస్తుంది. పిదప అది కంఠంలో తిరుగుతూ మాధ్యందినయుతమైన "త్రిష్టుప్" ఛందస్సుకు తగిన మధ్యమ స్వరాన్ని పుట్టిస్తుంది.

తారం తార్తీయ సవనం శీర్షణ్యం జాగతానుగమ్ ।
సోదీర్ణో మూర్ధ్న్యభిహితో వక్త్రమాపాద్యమారుతః ॥7॥

తరువాత ఆ వాయువు శిరోదేశాన్ని చేరి, ఉచ్చ ధ్వనియుక్తమై జగతీచ్ఛంద సమాశ్రితమైన, సాయం సవనకర్మ సాధనమైన స్వరాన్ని పుట్టిస్తుంది. పైకి వెళ్లిన ఆ ప్రాణవాయువు మూర్ధస్థానంలో ఆఘాతం చెంది, ముఖంలోని కంఠాది స్థానానికి చేరుతుంది.

వర్ణాన్ జనయతే తేషాం విభాగః పంచధా స్మృతః ।
స్వరతః కాలతః స్థానాత్ ప్రయత్నార్థ ప్రధానతః ॥8॥

అది అక్కడ వర్ణాలను పుట్టిస్తుంది. స్వరం, కాలం, స్థానం, ఆభ్యంతర ప్రయత్నం, బాహ్యప్రయత్నం వీటిని బట్టి వర్ణాలలో ఐదు విభాగాలు ఉంటాయి.

అష్టౌ స్థానాని వర్ణానా మురః కంఠః శిరస్తథా ।
జిహ్వామూలశ్చ దంతాశ్చ నాసికాష్ఠౌ చ తాలు చ ॥9॥

వక్షము, కంఠము, మూర్ధ, జిహ్వామూలం, దంతాలు, నాసిక, ఓష్ఠములు, తాలువు అనే ఎనిమిది వర్ణోచ్చారణ స్థానాలు.

స్వభావశ్చ వివృత్తిశ్చ శషసారేఫ ఏవ చ ।
జిహ్వామూల ముపధ్మా చ గతిరష్టవిధోష్మణః ॥10॥

ఊష్మవర్ణాలకు (సు+అభావశ్చ) విసర్గాభావం, వివర్తనం, (సంధిలేక పోవడం), శకార, షకార, సకార, రేఫాదేశాలు, జిహ్వామూలీయం, ఉపధ్మానీయం అని ఎనిమిది విధాలైన గతులు ఉంటాయి.

యద్యోభావ ప్రసస్థాన ముకారాది పరం పదమ్ ।
స్వరాంతం తాదృశం విద్యాద్యదన్యద్వ్య క్త మూష్మణః ॥11॥

ఉకారం పరమైనపుడు ఓకారం ప్రసంధానమయితే, ఆ ఓకారం స్వరాంతమని తెలియాలి. దీనికి భిన్నంగా సంధి స్థలంలో ఏర్పడే ఓకారం ఊష్మయొక్క గతి విశేషం. (ఉ:– గంగోదకమ్, శివోవంద్యః) ఇత్యాదులు.

కుతీర్థాదాగతం దగ్ధమపవర్ణం చ భక్షితమ్ ।
ఏవముచ్చారణం పాపమేవముచ్చారణం శుభమ్ ॥12॥

చెడ్డగురువు నుంచి లభించిన వేదాధ్యయనం దగ్ధమై నీరసంగా ఉంటుంది. అక్షరాలను అటు ఇటు లాగి అర్థం చెబితే అది భక్షితం. ఉత్తమ గురువు నుంచి అధ్యయనం చేస్తే శుభం. లేకపోతే పాపం, అశుభం.

సుతీర్థాదాగతం ద్రవ్యం సామ్నాయం సువ్యవస్థితమ్ ।
సుస్వరేణ సువక్త్రేణ ప్రయుక్తం బ్రహ్మ రాజతే ॥13॥

మంచి గురువు నుంచి వచ్చిన ఆమ్నాయం చక్కగా కూర్చబడిందవుతుంది. సుస్వరంతో, మంచి నోటినుంచి బయటకు వచ్చే వేదపఠనం చక్కగా ప్రకాశించేదవుతుంది.

న కరాలో న లంబోష్ఠో నావ్యక్తో నానునాసికః ।
గద్గదో బహుజిహ్వశ్చ న వర్ణాన్ వక్తు మర్హతి ॥14॥

వికృతమైన ఆకారంలేనివాడు, లంభోష్ఠుదు కానివాడు, వ్యక్తం అయ్యేలా ఉచ్చారణ చేయగలవాడు, ముక్కుతో పలకనివాడు, గద్గద కంఠం లేనివాడు, జిహ్వాబంధం లేనివాడు అట్టివాడే వర్ణాలను సరిగా పలకగలడు.

ఏవం వర్ణాః ప్రయోక్తవ్యా నావ్యక్తా న చ పీడితాః ।
యథా వ్యాఘ్రీ హరేత్పుత్రాన్ దంష్ట్రాభ్యాం న చ పీడయేత్ ॥15॥
సమ్యగ్వర్ణ ప్రయోగేణ బ్రహ్మలోకే మహీయతే ।

ఆడపెద్దపులి తన పిల్లలను దంతములతో పీడించకుండా తీసుకుపోవునట్లు. వర్ణాలను అవ్యక్తంగా కాని, పీడింపబడేటట్లుకాని ఉచ్చరించరాదు. వర్ణప్రయోగం చక్కగా చేస్తే బ్రహ్మలోకంలో పూజించబడతాడు.

ఉదాత్తశ్చానుదాత్తశ్చ స్వరితశ్చ స్వరా స్త్రయః ॥16॥
హ్రస్వో దీర్ఘః ప్లుత ఇతి కాలతో నియమావధి ।

ఉదాత్తం, అనుదాత్తం, స్వరితం అని స్వరాలు మూడు విధాలు. ఉచ్చారణ కాలాన్ని బట్టి హ్రస్వం, దీర్ఘం, ప్లుతం అని మూడు విధాలు.

కంఠ్యావహావిచు యశాస్తాలవ్యా ఓష్ఠజావుపూ॥17॥

స్యుర్మూర్ధన్యా ఋటురషా దంత్యాః లుతు లసాః స్మృతాః ।

అకారహకారాలు కంఠ్యాలు. ఇకారం, చవర్గం, యకారం, శకారం, తాలవ్యాలు. ఉకారం, పవర్గం, ఓష్ఠ్యాలు, ఋకారం, టవర్గం, రేఫ, షకారం మూర్ధన్యాలు లుకారం, తవర్గం, లకారం, సకారం దంత్యాలు.

జిహ్వామూలే తు కుః ప్రోక్తో దంత్యోష్ఠో వః స్మృతో బుధైః ॥18॥

ఏదైతు కంఠతాలవ్యౌ ఓఔ కంఠ్యోష్ఠజౌ స్మృతౌ ।

కవర్గం జిహ్వా మూలీయం. వకారం దంత్యోష్ఠ్యం. ఏకారం, ఐకారం కంఠతాలవ్యాలు. ఓకారం, ఔకారం కంఠోష్ఠ్యజాలు.

అర్ధమాత్రాతు కంఠస్య ఏకారైకారయోర్భవేత్ ॥19॥

అయోగ వాహా విజ్ఞేయా ఆశ్రయస్థాన భాగినః ।

ఏకార, ఐకారాలలో, ఓకార, ఔకారాలలో కంఠ స్థానీయమైన 'అ' కారం యొక్క అర్ధమాత్ర ఉంటుంది. అయోగవాహాలు (అనుస్వార, విసర్గ, జిహ్వామూలీయ, ఉపధ్మానీయాలు, యమాలు) తమ ఆశ్రయానికి ఏవి స్థానాలో, ఆ స్థానం కలిగి ఉంటాయి.

అచోఽస్పృష్టాయణ స్త్వీష న్నేమాః స్పృష్టాః శలః స్మృతాః॥20॥

శేషాః స్పృష్టా హలః ప్రోక్తా నిబోధాత్ర ప్రధానతః ।

అచ్చులు అస్పృష్టములు. యణ్‌లు ఈషత్స్పృష్టములు. "శల్" లు అర్ధ స్పృష్టములు. మిగిలిన హల్లులు స్పృష్టములు. ఇవి ప్రధానంగా తెలుసుకోవాలి.

అమోఽను నాసికా నహ్రౌ నాదినో హ ఝషః స్మృతాః ।

ఙ, ఞ, ణ, న, మ – అను నాసికాలు. హ కారం, రకారం అనునాసికాలు కావు. హ, ఝ, ష లకు ఈ మూడింటికి నాదం ప్రయత్నం. సంవారం, ఝషం కూడ.

ఈషన్నాదా యణ శ్చైవ శ్వాసినశ్చ ఖపాదయః ।

ఈషచ్ఛ్వాసం చరం విద్యాద్గోర్ధమైతత్ప్రచక్షతే ॥22॥

యణ్, జశ్‌లకు ఈషన్నాదప్రయత్నం. ఖ, ఫ, మున్నగువాటికి వివార, అఘోష ప్రయత్నాలు. 'చర్' లకు ఈషచ్ఛ్వాస ప్రయత్నం. ఇదంతా వ్యాకరణ శాస్త్రంలో ఎక్కువగా చెప్పబడింది.

ఇత్యాది మహాపురాణే ఆగ్నేయే శిక్షానిరూపణం నామ షట్త్రింశదధిక త్రిశతతమోఽధ్యాయః ॥336॥

అగ్నిమహాపురాణంలో శిక్షానిరూపణం అనే మూడువందల ముప్పైఆరవ అధ్యాయం సమాప్తం.



సప్తత్రింశదధిక త్రిశతతమోఽధ్యాయః - మూడువందల ముప్పైఏడవ అధ్యాయం

కావ్యాది లక్షణమ్ - కావ్యాది లక్షణం

అగ్నిరువాచ - అగ్ని ఇలా వచించాడు.

కావ్యస్య నాటకాదేశ్చ అలంకారాన్ వదామ్యథ ।
ధ్వని ర్వర్ణాః పదం వాక్యమిత్యేత ద్వాఙ్మయం మతమ్ ॥1॥

కావ్యం, నాటకాదులు, అలంకారాదులు - వీటి స్వరూపాన్ని ఇకపైన చెబుతాను. ధ్వని, వర్ణాలు, పదం, వాక్యం - ఇవియే సకలవాఙ్మయం.

శాస్త్రేతిహాసకావ్యానాం త్రయం యత్ర సమాప్యతే ।
శాస్త్రే శబ్ద ప్రధానత్వమితిహాసేషు నిష్ఠతా ॥2॥

శాస్త్రం, ఇతిహాసం, కావ్యం ఈ వాఙ్మయంలో అంతర్గతాలు. శాస్త్రంలో శబ్దానికి ప్రాధాన్యం. ఇతిహాసాదులందు అర్థానికి ప్రాధాన్యం.

అభిధాయాః ప్రధానత్వాత్కావ్యం తాభ్యాం విభిద్యతే ।
నరత్వం దుర్లభం లోకే విద్యా తత్ర సుదుర్లభా ॥3॥

కవిత్వం దుర్లభం తత్ర శక్తి స్తత్ర చ దుర్లభా ।
వ్యుత్పత్తిర్దుర్లభా తత్ర వివేక స్తత్ర దుర్లభః ॥4॥

ఈ రెండింటి యందు అభిధాశక్తి (వాచ్యార్థం) ప్రధానం. అందువల్ల కావ్యం ఈ రెండింటి కన్న భిన్నమైనది. లోకంలో నరత్వం దుర్లభం. విద్య ఇంకా సుదుర్లభం.

కవిత్వం ఇంకా దుర్లభం. శక్తి ఇంకా దుర్లభం. వ్యుత్పత్తి ఇంకనూ దుర్లభం. వివేకం అన్నింటి కన్న దుర్లభం.

సర్వం శాస్త్రమవిద్వద్భి ర్మృగ్యమాణం న సిద్ధ్యతి ।
(శా) ఆది వర్ణా ద్వితీయాశ్చ మహాప్రాణాస్తురీయకాః ॥5॥

అవిద్వాంసులు ఎంత ప్రయత్నం చేసినా శాస్త్రసర్వస్వం సిద్ధించదు. ఆది వర్ణాలు(శాది వర్ణాలు) శ, ష, స, హ వర్ణాలు, వర్గద్వితీయ చతుర్థాక్షరాలు, మహాప్రాణాలు అనబడతాయి.

వర్గేషు వర్ణ బృందం స్యాత్పదం సుప్తిఙ్ప్రభేదతః ।
సంక్షేపాద్వాక్య మిష్టా ర్థవ్యవచ్ఛిన్నా పదావలీ ॥6॥

వర్ణ సముదాయం పదం అవుతుంది. అది సుబంతము, తిఙంతము అని రెండు విధాలు. ఇష్టార్థాన్ని బోధించే సంక్షేపంగా ఉండే, పదాల పంక్తియే వాక్యం.

కావ్యం స్ఫురదలంకారం గుణవద్దోషవర్జితమ్ ।
యోనిర్వేదశ్చ లోకశ్చ సిద్ధమర్థా దయోనిజమ్ ॥7॥

స్పష్టమైన అలంకారం కలది, గుణాలు కలది, దోషాలు లేనిది, అయిన వాక్యసముదాయం కావ్యం. వేదాలు, లోకజ్ఞత కావ్యహేతువులు అవుతాయి. సిద్ధమంత్రంచే నిర్మించబడే కావ్యం అయోనిజం.

దేవాదీనాం సంస్కృతం స్యాత్ ప్రాకృతం త్రివిధం నృణామ్ ।
గద్యం పద్యం చ మిశ్రం చ కావ్యాది త్రివిధం స్మృతమ్ ॥8॥

దేవతలు మున్నగువారికి సంస్కృత భాషను, మనుష్యులకు మూడు విధాలగు ప్రాకృత భాషను ఉపయోగించాలి. గద్యం, పద్యం, మిశ్రం (చంపువు) అని కావ్యం మూడు విధాలు.

అపదః పదసన్తానో గద్యం తదపి గద్యతే ।
చూర్ణకోత్కలికా వృత్తగంధి భేదాత్త్రిరూపకమ్ ॥9॥

పాదాలు లేని పద సముదాయం గద్యం. చూర్ణకం, ఉత్కలిక, వృత్తగంధి అని గద్యం మూడు విధాలు.

అల్పాల్ప విగ్రహం నాతి మృదు సందర్భ నిర్భరమ్ ।
చూర్ణకం నామతో దీర్ఘ సమాసోత్కలికా భవేత్ ॥10॥

చిన్న చిన్న మృదువైన మాటలు ఉండేది చూర్ణకం. సందర్భానుసారంగా, మృదుపదాలు కాకుండా , దీర్ఘసమాసాలు కలది ఉత్కలిక.

భవేన్మధ్య మసందర్భం నాతికుత్సిత విగ్రహమ్ ।
వృత్త చ్ఛాయాహరం వృత్త గంధి (సంధి) నైతత్కిలోత్కటమ్ ॥11॥

ఈ రెండింటికి మధ్యగా ఉండేది, అత్యంత క్లిష్టం కాని విగ్రహంతో కూడుకొన్నది. పద్యచ్ఛాయ కొద్దిగా కలది అయిన గద్యం వృత్తగంధి. ఇది వినడానికి అంత ఉత్కటంగా ఉండదు.

ఆఖ్యాయికా కథా ఖండకథా పరికథా తథా ।
కథానికేతి మన్యన్తే గద్య కావ్యం చ పంచధా ॥12॥

ఆఖ్యాయిక, కథ, ఖండకథ, పరికథ, కథానిక అని గద్యకావ్యం ఐదు విధాలుగా చెప్పబడుతుంది.

కర్తృవంశ ప్రశంసా స్యాద్యత్ర గద్యేన విస్తరాత్ ।
కన్యా హరణ సంగ్రామ విప్రలంభ విపత్తయః ॥13॥

గ్రంథ కర్త యొక్క వంశప్రశస్తి అధికంగా కలది, కన్యాహరణం, సంగ్రామం, విప్రలంభం, విపత్తులు ఇత్యాది వర్ణనలు కలది ఏదో,

భవన్తి యత్ర దీప్తాశ్చ రీతి వృత్తి ప్రవృత్తయః ।
ఉచ్ఛ్వాసైశ్చ పరిచ్ఛేదో యత్ర యా చూర్ణకోత్తరా ॥14॥

ఎక్కడయితే వైదర్భిమున్నగురీతులు, భారతి మున్నగు వృత్తులు, వివిధ ప్రవృత్తులు, విశేషంగా ప్రకటింపబడుతూ ఉంటాయో, ఉచ్ఛ్వాసాలు అనే పేర్లతో పరిచ్ఛేదాలు కలది, చూర్ణకం ప్రధానంగా కలది.

వక్త్రం వాఽపరవక్త్రం వా యత్ర సాఽఖ్యాయికా స్మృతా ।

వక్త్రం కాని, అపరవక్త్రం కాని ఛందస్సు ఎచ్చట ప్రయోగింపబడుతుందో అది "ఆఖ్యాయిక" అనబడుతుంది.

శ్లోకైః స్వవంశం సంక్షేపాత్కవిర్యత్ర ప్రశంసతి ॥15॥

ముఖ్య స్యార్థావతారాయ భవేద్యత్ర కథాఽన్తరమ్ ।
పరిచ్ఛేదో న యత్ర స్యాద్భవేద్వా లంబకైః క్వచిత్ ॥16॥

సా కథా నామ తద్గర్భే నిబధ్నీయాచ్చతుష్పదీమ్ ।

కవి దేనిలో తన వంశాన్ని శ్లోకాలలో సంక్షిప్తంగా చెబుతాడో, ముఖ్యార్థాన్ని ప్రవేశపెట్టడానికి, మరోకథ అవాంతరంగా చేర్చబడుతుందో, ఎక్కడ పరిచ్ఛేదాలు ఉండవో, ఉన్నా లంబకాలు అనే పేర్లతో ఉంటాయో, అది కథ. దాని మధ్యభాగంలో చతుష్పదితో బంధరచన చేయాలి.

భవేత్ఖండ కథా యాఽసౌ కథా పరికథా తయోః ॥17॥

అమాత్యం సార్థకం వాపి ద్విజం వా నాయకం విదుః ।

కథా ఖండం మాత్రమే ఉన్నది ఖండకథ. ఖండకథ, పరికథలలో మంత్రి లేదా వైశ్యుడు లేదా బ్రాహ్మణుడు నాయకుడుగా ఉండాలి.

స్యాత్తయోః కరుణం విద్ధి విప్రలంభశ్చతుర్విధః ॥18॥

సమాప్యతే తయోర్నాతద్యా కథా మనుధావతి ।
కథాఖ్యాయిక యోర్మిశ్రభావాత్పరి కథా స్మృతా ॥19॥

కరుణరసం ప్రధానంగా వుండాలి. నాలుగు విధాలైన విప్రలంభం వర్ణించబడుతుంది. ఈ రెండింటిలో కథా శైలి అనుసరించబడదు. కథ పూర్తిగా పరిసమాప్తి పొందదు. కథ, ఆఖ్యాయికల లక్షణాలు కలిసి ఉండేది పరికథ.

వి॥ ప్రవాసం, శాపం, మానం, కరుణ అనేవి చతుర్విధవిప్రలంభాలు.

భయానకం సుఖపరం గర్భే చ కరుణో రసః ।
అద్భుతేఽన్తే సుక్లు ప్తార్థో నో దాత్తా సా కథానికా ॥20॥

ప్రారంభంలో భయానకం, మధ్యలో కరుణం, చివరలో అద్భుతం, మిక్కిలి సుఖకరం, సంక్షిప్తార్థం, ఉదాత్తంగా ఉండనిది అయిన కథ కథానిక అవుతుంది.

పద్యం చతుష్పదీ తచ్చ వృత్తం జాతి రితి ద్విధా ।
వృత్తమక్షర సంఖ్యే యముక్థం తత్కృతి శేషజమ్ ॥21॥

పద్యం నాలుగు పాదాలతో ఉంటుంది. అది వృత్తం, జాతి అని రెండు విధాలు. అక్షర సంఖ్యా నియమం ఉండేది వృత్తం. అది ఉక్థం, కృతిశేషజం అని రెండు విధాలు.

మాత్రాభిర్గణ నాయత్ర సా జాతిరితి కాశ్యపః ।
సమమర్ధసమం వృత్తం విషమం పైంగలం త్రిధా ॥22॥

మాత్రాగణన ఉండేది జాతి అని కాశ్యపుడు వచించాడు. పింగళుని మతం ప్రకారం సమం, అర్ధసమం, విషమం అని వృత్తం మూడు విధాలు.

సా విద్యా నౌ స్తితీర్షూణాం గభీరం కావ్యసాగరమ్ ।
మహాకావ్యం కలాపశ్చ పర్యాబంధో విశేషకమ్ ॥23॥

కులకం ముక్తకం కోశ ఇతి పద్య కుటుంబకమ్ ।
సర్గ బంధో మహాకావ్య మారబ్ధం సంస్కృతేన యత్ ॥24॥

గభీరమైన కావ్యసాగరాన్ని దాటగోరేవారికి ఛందో విద్య నౌకవంటిది. మహాకావ్యం, కలాపం, పర్యాబంధం, విశేషకం, కులకం, ముక్తకం, కోశం ఇవన్నీ పద్య సముదాయాలే. సర్గలుగా విభజించబడి, సంస్కరించబడి సంస్కృతంలో రచించబడినది ఏదయితే ఉందో, అది మహాకావ్యం.

తాదాత్మ్య మజహత్తత్ర తత్సమం నాతిదుష్యతి ।
ఇతిహాస కథోద్భూత మితరద్వా సదాశ్రయమ్ ॥25॥

మహాకావ్య స్వరూపాన్ని విడిచి పెట్టకుండా, దానిలా మరోవిధమైన రచన చేసినా అందు దోషం లేదు. ఇతిహాస కథను గ్రహించి గాని, మరో ఉత్తమకథను గ్రహించి గాని మహాకావ్యం రచింపబడుతుంది.

మంత్రదూత ప్రయాణాజి నియతం నాతి విస్తరమ్ ।
శక్వర్యాఽతి జగత్యాఽతి శక్వర్యా త్రిష్టుభా తథా ॥26॥

పుష్పితాగ్రాదిభి ర్వక్త్రాభిజనైశ్చారుభిః సమైః ।
ముక్తాతు భిన్న వృత్తాన్తా నాతి సంక్షిప్త సర్గకమ్ ॥27॥

మంత్రం, దూత ప్రేషణం, అభియానం (ప్రయాణం), యుద్ధం యథా యోగ్యంగా నియతంగా వర్ణింపబడాలి. అధిక విస్తృతం కారాదు. శక్వరి, అతి జగతి, అతి శక్వరి, త్రిష్టుప్.

పుష్పితాగ్ర, వక్త్రం మున్నగు ప్రశస్తమైన, మనోహరములైన సమవృత్త ఛందస్సులను ఉపయోగించి మహాకావ్య రచన చేయాలి. సర్గముల అంతంలో ఛందస్సు మార్చాలి. సర్గలు చాలా సంక్షిప్తంగా ఉండరాదు.

అతి శక్వారి కాష్టిభ్యామేక సంకీర్ణకైః పరః ।
మాత్రయాఽ ప్యపరః సర్గః ప్రాశస్త్యేషు చ పశ్చిమః ॥28॥

ఒక సర్గ అతిశక్వరి, అష్టి ఛందస్సులతోను, మరియొక సర్గమాత్రాఛందస్సులతోను సంకీర్ణమై ఉండాలి. రాబోవు సర్గ పూర్వసర్గ కన్న ఉత్తమంగా ఉండాలి.

కల్పోఽ తి నిందితస్తస్మిన్విశేషానాదరః సతామ్ ।
నగరార్ణవ శైలర్తు చంద్రార్కాశ్రమ పాదపైః ॥29॥

ఉద్యాన సలిల క్రీడా మధుపానరతోత్సవైః ।
దూతీ వచన విన్యాసైరసతీ చరితాద్భుతైః ॥30॥

కల్పన చాలా నింద్యము. సత్పురుషులకు దాని యందు పెద్దగా ఆదరం ఉండదు. నగర, సముద్ర, పర్వత, ఋతు, చంద్ర, సూర్య, ఆశ్రమ, వృక్షవర్ణనలు. ఉద్యాన విహారం, జలక్రీడ, మధుపానం, రతోత్సవం, దూతీవచనవిన్యాసం, కులటాచరిత్ర, అద్భుత చరిత్రలతో మహాకావ్యం నిండి ఉంటుంది.

తమసా మరుతాప్యన్యై ర్విభావైరతినిర్భరైః ।
సర్వవృత్తి ప్రవృత్తం చ సర్వభావప్రభావితమ్ ॥31॥

సర్వరీతి రసైః స్పృష్టం పుష్టం గుణ విభూషణైః ।
అత ఏవ మహాకావ్యం తత్కర్తా చ మహాకవిః ॥32॥

అంధకారం, వాయువు, రతి ప్రదీపకారకములైన ఉద్దీపనవిభావములు వర్ణించబడాలి. అన్ని విధాలైన వృత్తులు ప్రయోగించబడాలి. అన్ని భావాలచే ప్రభావితమై ఉండాలి. సకల రీతులు, సర్వరసాలు, గుణాలు, అలంకారాలు వీటిచే పరిపుష్టమై ఉండాలి. ఈ విశేషాలన్నీ ఉండుట వల్లనే అది మహాకావ్యం అవుతుంది. అట్టి కావ్య నిర్మాతయే మహాకవి.

వాగ్వైదగ్ధ్య ప్రధానేఽ పి రస ఏవాత్ర జీవితమ్ ।
పృథక్ప్రయత్నం నిర్వర్త్య వాగ్వక్రిమ్ణి రసాద్వపుః ॥33॥

మహాకావ్యంలో ఉక్తివైచిత్ర్యానికి ప్రాధాన్యం ఉన్నా, రసమే దాని జీవనం. కావ్యం యొక్క స్వరూపసిద్ధి పృథక్ ప్రయత్నాన్ని విడిచి (అనగా సహజస్వభావంగా) వచో వక్రోక్తి ఉన్నా, ప్రయత్నపూర్వకంగా రసమును పోషించుటచే సిద్ధిస్తుంది.

చతుర్వర్గ ఫలం విష్వగ్వ్యాఖ్యాతం నాయకాఖ్యయా ।
సమాన వృత్తి ర్నిర్వ్యూఢః కౌశికీ వృత్తికోమలః ॥34॥

మహాకావ్యఫలం చతుర్వర్గఫలప్రాప్తి. దీనికి నాయకుని పేరుతో పేరుపెట్టాలి. సమానమైన వృత్తులు కూర్చాలి. కైశికీవృత్తిచే కావ్యం కోమలంగా ఉంటుంది.

కలాపోఽత్ర ప్రవాసః ప్రాగనురాగాహ్వయో రసః ।
స విశేషకం చ ప్రాప్త్యాది సంస్కృతే నేతరేణ చ ॥35॥

ప్రవాస వర్ణనం ఉన్న కావ్యం కలాపం. దానిలో పూర్వానురాగం అనే శృంగారం ఉంటుంది. సంస్కృతంతో లేదా ప్రాకృతంతో ప్రాప్త్యాదులను వర్ణిస్తే విశేషకం.

శ్లోకై రనేకైః కులకం స్యాత్సందానితకాని తత్ ।
ముక్తకం శ్లోక ఏకైకశ్చమత్కారక్షమః సతామ్ ॥36॥

అనేక శ్లోకాలకు ఒకే అన్వయం ఉంటే అది కులకం. దానికే 'సందానితకం' అని పేరు. ఒక్కొక్క శ్లోకం స్వతంత్రార్థకమయితే అది 'ముక్తకం'. అది సత్పురుషులకు చమత్కారాన్ని కల్గించాలి.

సూక్తిభిః కవిసింహానాం సుందరీభిః సమన్వితః ।
కోశో బ్రహ్మ పరిచ్ఛిన్నః స విదగ్ధాయ రోచతే ॥37॥

కవిసింహులైన వారు ఉత్తమములైన సూక్తులతో కూర్చినది కోశకము. అది బ్రహ్మానందం వలె అపరిచ్ఛిన్న రసభరితమై సహృదయులకు మానసోల్లాసకరమై ఉంటుంది.

ఆభాసోపమ శక్తిశ్చ సర్గే యద్భిన్న వృత్తయా ।
మిశ్రం వపురితి ఖ్యాతం ప్రకీర్ణమితి చ ద్విధా ॥38॥

శ్రవ్యం చైవాభినేయం చ ప్రకీర్ణం సకలోక్తిభిః ॥39॥

సర్గలో వేరు వేరు వృత్తాలను ఉపయోగించడం ఆభాసోపమ శక్తి. అది రెండు విధాలు. మిశ్రము, ప్రకీర్ణము అని. శ్రవ్యము, అభినేయము అనే రెండు లక్షణాలతో కలిసిఉన్నది మిశ్రము. సకలోక్తులతో కూడుకొన్నది ప్రకీర్ణం.

ఇత్యాది మహాపురాణే ఆగ్నేయే కావ్యాది లక్షణం కథనం నామ సప్తత్రింశదధిక త్రిశతతమోఽధ్యాయః ॥337॥

అగ్నిమహాపురాణంలో కావ్యాది లక్షణ వర్ణనమనే మూడువందల ముప్పైఏడవ అధ్యాయం సమాప్తం.



అష్టత్రింశ దధికత్రిశతతమోఽధ్యాయః - మూడువందల ముప్పైఎనిమిదవ అధ్యాయం

నాటకనిరూపణమ్ - నాటకనిరూపణం

అగ్నిరువాచ - అగ్ని ఇలా వచించాడు.

నాటకం సప్రకరణం డిమ ఈహామృగోఽపి వా ।
జ్ఞేయః సమవకారశ్చ భవేత్ప్రహసనం తథా ॥1॥

వ్యాయోగ భాణ వీథ్యంక త్రోటకాన్యథ నాటికా ।
సట్టకం శిల్పకః కర్ణా ఏకో దుర్మల్లికా తథా ॥2॥

ప్రస్థానం భాణికా భాణీ గోష్ఠీ హల్లీశకాని చ ।
కావ్యం శ్రీగదితం నాట్యరాసకం రాసకం తథా ॥3॥

ఉల్లాప్యకం ప్రేంక్షణం చ సప్తవింశతిరేవ తత్ ।
సామాన్యం చ విశేషం చ లక్షణస్య ద్వయీ గతిః ॥4॥

నాటకం, ప్రకరణం, డిమం, ఈహామృగం, సమవకారం, ప్రహసనం, వ్యాయోగం, భాణం, వీథి, అంకం, త్రోటకం, నాటిక, సట్టకం, శిల్పకం, కర్ణ, దుర్మల్లిక, ప్రస్థానం, భాణిక, భాణి, గోష్ఠి, హల్లీశకం, కావ్యం, శ్రీగదితం, నాట్యరాసకం, రాసకం, ఉల్లాప్యకం, ప్రేంక్షణం అని రూపకాలు ఇరవై ఏడు విధాలు. లక్షణం సామాన్యం, విశేషం అని రెండు విధాలు.

సామాన్యం సర్వ విషయం విశేషః క్వాపి వర్తతే ।
పూర్వరంగే నివృత్తే ద్వౌ దేశ కాలావుభావపి ॥5॥

రస భావ విభావానుభావా అభినయా స్తథా ।
అంకః స్థితిశ్చ సామాన్యం సర్వత్రైవో పసర్పణాత్ ॥6॥

అన్ని రూపకాలకు వర్తించేది సామాన్యలక్షణం. ఏదో ఒక దానికి వర్తించేది విశేష లక్షణం. అన్ని రూపకాలలోను పూర్వరంగం జరిగిన పిదప దేశకాలాలు. రసభావాలు, విభావానుభావాలు, అభినయం, అంకం, స్థితి సామాన్యలక్షణం. విశేషలక్షణం సమయాను సారంగా చెప్పబడుతుంది. పైవి అన్నింటికి ప్రసరించే లక్షణం.

విశేషోఽవసరే వాచ్యః సామాన్యం పూర్వముచ్యతే ।
త్రివర్గ సాధనం నాట్యమిత్యాహుః కరణం చ యత్ ॥7॥

అవసర సమయంలో విశేషలక్షణం వివరించబడుతుంది. ముందు ఇప్పుడు సామాన్యలక్షణం చెప్పబడుతోంది. ధర్మార్థ కామాలను నాటకం సాధించాలి. ఎందువల్లనంటే అదే కరణం కాబట్టి.

ఇతి కర్తవ్యతా తస్య పూర్వరంగో యథా విధి ।
నాందీముఖాని ద్వాత్రింశదంగాని పూర్వరంగకే ॥8॥

ముందుగా పూర్వరంగాన్ని యథావిధిగా నిర్వహించాలి. దీనికి నాంది మున్నగు ముప్పైరెండు (ఇరవై రెండు) అంగాలు పూర్వరంగంలో ఉంటాయి.

దేవతానాం నమస్కారో గురూణామపి చ స్తుతిః ।
గోబ్రాహ్మణ నృపాదీనా మాశీర్వాదాది గీయతే ॥9॥

దేవతా నమస్కారం, గురుస్తుతి, గోబ్రాహ్మణ రాజాదుల ఆశీర్వాదం ఇందు చేయబడుతుంది.

నాంద్యంతే సూత్రధారోఽసౌ రూపకేషు నిబధ్యతే ।
గురుపూర్వక్రమం వంశ ప్రశంసా పౌరుషం కవేః ॥10॥
సంబంధార్థౌ చ కావ్యస్య పంచైతానేష నిర్దిశేత్ ।
నటీ విదూషకో వాఽపి పారి పార్శ్వక ఏవ వా ॥11॥

నాంది తరువాత "నాంద్యంతే సూత్రధారః " అని రూపకాలలో వ్రాయబడును. కవి యొక్క గురుపరంపర, వంశప్రశంస, కవి యొక్క ప్రతిష్ఠ, కావ్యం యొక్క సంబంధ ప్రయోజనాలు. ఈ అయిదింటిని సూత్రధారుడు చెప్పాలి. నటికాని, విదూషకుడు కాని, పార్శ్వికుడు కాని,

సహితాః సూత్రధారేణ సంలాపం యత్ర కుర్వతే ।
చిత్రైర్వాక్యైః స్వకార్యార్థే ప్రస్తుతాక్షేపిభిర్మిథః ॥12॥

సూత్రధారునితో కలిసి సల్లాపం కావించాలి. స్వకార్యంతో సంబంధించేవి, ప్రస్తుత విషయాన్ని స్ఫురింపజేసేవి, అయిన చిత్రమైన వాక్యాలతో పరస్పరం సంభాషించుకోవాలి.

ఆముఖం తత్తు విజ్ఞేయం బుధైః ప్రస్తావనాఽపి సా ।
ప్రవృత్తకం కథోద్ఘాతః ప్రయోగాతిశయస్తథా ॥13॥
ఆముఖస్య త్రయో భేదా బీజాంశేషూపజాయతే ।
కాలం ప్రవృత్త మాశ్రిత్య సూత్ర ధృగ్యత్ర వర్ణయేత్ ॥14॥

పండితజనం దానిని 'ఆముఖం' గా పరిగణిస్తుంది. దీనికి ప్రస్తావన అని కూడ పేరు. ప్రవృత్తకం, కథోద్ఘాతం, ప్రయోగాతిశయం అని. ఆముఖానికి మూడు భేదాలు. ఇందు బీజాంశాలు ప్రాదుర్భావం కావాలి. సూత్రధారుడు వచ్చే కాలాన్ని గురించి వర్ణించేటప్పుడు,

తదాశ్రయస్య పాత్రస్య ప్రవేశ స్తత్ప్రవృత్తకమ్ ।
సూత్రధారస్య వాక్యం వా యత్ర వాక్యార్థమేవ వా ॥15॥

గృహీత్వా ప్రవిశేత్పాత్రం కథోద్ఘాతః స ఉచ్యతే ।
ప్రయోగేషు ప్రయోగం తు సూత్ర ధృగ్యత్ర వర్ణయేత్ ॥16॥

ఆ వర్ణనను ఆశ్రయించి పాత్ర ప్రవేశిస్తే, దానికి ప్రవృత్తకం అని పేరు. సూత్రధారుని వాక్యం గాని, వాక్యార్థం గ్రహించి గాని పాత్ర ప్రవేశిస్తే అది కథోద్ఘాతమని చెప్పబడుతుంది. సూత్రధారుడు ఒక ప్రయోగంలో మరో ప్రయోగం వర్ణించేటప్పుడు.

తతశ్చ ప్రవిశేత్పాత్రం ప్రయోగాతిశయో హి సః ।
శరీరం నాటకాదీనా మితివృత్తం ప్రచక్షతే ॥17॥

ఆ సమయంలో పాత్ర ప్రవేశిస్తే అది ప్రయోగాతిశయం. నాటకాదులకు ఇతివృత్తం శరీరం వంటిదని చెప్పబడుతోంది.

సిద్ధముత్ప్రేక్షితం చేతి తస్య భేదా వుభౌ స్మృతౌ ।
సిద్ధమాగమదృష్టం చ సృష్టముత్ప్రేక్షితం కవేః ॥18 ॥

సిద్ధము, ఉత్ప్రేక్షితము అని దాని భేదాలు రెండని చెప్పబడ్డాయి. ఆగమ ప్రసిద్ధమైనది సిద్ధము. కవి కల్పించి సృష్టించినది ఉత్ప్రేక్షితం.

బీజం బిందుః పతాకా చ ప్రకరీ కార్యమేవ చ ।
అర్థ ప్రకృతయః పంచ పంచ చేష్టా అపి క్రమాత్ ॥19॥

బీజము, బిందువు, పతాక, ప్రకరీ, కార్యం అని అర్థప్రకృతులు అయిదు. చేష్టలు కూడ అయిదే. ప్రయోజన సిద్ధి అర్థప్రకృతి. కార్యావస్థ చేష్ట.

ప్రారంభశ్చ ప్రయత్నశ్చ ప్రాప్తిః సద్భావ ఏవ చ ।
నియతా చ ఫలప్రాప్తిః ఫలయోగశ్చ పంచమః ॥20॥

అవి వరుసగా ప్రారంభం, ప్రయత్నం, ప్రాప్తి(సద్భావం),నియతఫలప్రాప్తి, ఐదోది ఫలయోగం అనేవి.

ముఖం ప్రతిముఖం గర్భో విమర్శశ్చ తథైవ చ ।
తథా నిర్వహణం చేతి క్రమాత్పంచైవ సంధయః ॥21॥

ముఖం, ప్రతిముఖం, గర్భం, విమర్శం, నిర్వహణం అని క్రమంగా సంధులు ఐదు.

అల్పమాత్రం సముద్దిష్టం బహుధా యత్ప్రసర్పతి ।
ఫలావసానం యచ్చైవ బీజం తదభిధీయతే ॥22॥

అల్పమాత్రంగా ఉద్దేశించబడి, బహుధా విస్తరించి ఫలాన్ని కలిగించేది ఏదయితే ఉందో అది బీజం అనబడుతుంది.

యత్ర బీజ సముత్పత్తి ర్నానార్థరససంభణ ।
కావ్యే శరీరానుగతం తన్ముఖం పరికీర్తితమ్ ॥23॥

అనేక విధాలైన ప్రయోజనాలను కలిగించే రసనిష్పత్తికి కారణమైన బీజోత్పత్తి కావ్యమునందు కలిగితే, అది శరీరానుగతమైన ముఖం అని కీర్తించబడుతుంది.

ఇష్టస్యార్థస్య రచనా వృత్తాంతస్యానుపక్షయః ।
రాగప్రాప్తిః ప్రయోగశ్చ గుహ్యానాం చైవ గూహనమ్ ॥24॥

ఆశ్చర్యవదభిఖ్యాతం ప్రకాశ్యానాం ప్రకాశనమ్ ।
అంగహీనో నరో యద్వన్న శ్రేష్ఠం కావ్యమేవ చ ॥25॥

ఇష్టమైన ప్రయోజనాన్ని ఆశించే రచన, కథా వృత్తాంతం అఖండంగా ఉండుట, ప్రయోగము నందు అనురాగం, గోపనీయ విషయాల రహస్య స్థితి అద్భుత విషయాల వర్ణనం, ప్రకాశం చేయదగిన విషయాలను ప్రకాశింపజేయడం ఇవి కావ్యాంగాల ఆరు ఫలాలు. అంగహీనుడైన మనుష్యునిలా అంగహీనమైన కావ్యం కూడ శ్రేష్ఠం కాజాలదు.

దేశ కాలై ర్వినా కించి న్నేతివృత్తం ప్రవర్తతే ।
అతస్తయోరుపాదానం నియమాత్పదముచ్యతే ॥26॥

దేశ కాలాలు లేకుండా ఇతి వృత్తం ఏదీ ప్రవర్తించదు. అందుచే వాటిని నియమపూర్వకంగా స్వీకరించడమే పదం అని చెప్పబడుతుంది.

దేశేషు భారతం వర్షం కాలే కృతయుగత్రయమ్ ।
నర్తే తాభ్యాం ప్రాణభృతాం సుఖం దుఃఖోదయః క్వచిత్ ।
సర్గే సర్గాతి వార్తా చ ప్రసజ్జన్తీ న దుష్యతి ॥27॥

దేశాలలో భారతవర్షాన్ని, కాలంలో కృతాది యుగత్రయాన్ని గ్రహించాలి. దేశ కాలాలు లేకుండా ప్రాణాలకు ఎచ్చటా సుఖదుఃఖోదయం కలుగదు. సర్గలో సృష్ట్యాది వార్త ప్రసంగవశాన వర్ణించవలసి వచ్చినా దోషం లేదు.

ఇత్యాది మహాపురాణే ఆగ్నేయే నాటకనిరూపణం నామ అష్టాత్రింశదధిక త్రిశతతమోఽధ్యాయః ॥338॥

అగ్నిమహాపురాణంలో నాటకనిరూపణం అనే మూడువందల ముప్పైఎనిమిదవ అధ్యాయం సమాప్తం.



ఏకోన చత్వారింశదధిక త్రిశతతమోఽధ్యాయః - మూడువందల ముప్పైతొమ్మిదవ అధ్యాయం

శృంగారాది రసనిరూపణమ్ - శృంగారాది రసములనిరూపణం

అగ్నిరువాచ - అగ్ని ఇలా వచించాడు.

అక్షరం పరమం బ్రహ్మ సనాతనమజం విభుమ్ ।
వేదాంతేషు వదంత్యేకం చైతన్యం జ్యోతిరీశ్వరమ్ ॥1॥

ఆనందః సహజస్తస్య వ్యజ్యతే చ కదాచన ।
వ్యక్తిః సా తస్య చైతన్య చమత్కారరసాహ్వయా ॥2॥

వసిష్ఠ మునీంద్రా! వేదాంతశాస్త్రంలో అక్షరము, సనాతనము, జన్మరహితము, సర్వవ్యాప్తము, పరబ్రహ్మ స్వరూపము, అద్వితీయము, జ్యోతీరూపము అగు ఏ చైతన్యస్వరూపం చెప్పబడుతున్నదో దానికి ఆనందం సహజ సిద్ధం. ఆ ఆనందం అప్పుడప్పుడు అభివ్యక్తం అవుతుంది. ఆ ఆనందాభివ్యక్తియే చైతన్యమని, చమత్కారమని, రసమని పేర్లతో వర్ణింపబడుతూ ఉంటుంది.

ఆద్యస్తస్య వికారో యః సోఽహంకార ఇతి స్మృతః ।
తతోఽభిమాన స్తత్రేదం సమాప్తం భువనత్రయమ్ ॥3॥

దాని ప్రథమవికారానికి అహంకారమని పేరు. దాని నుంచి అభిమానం పుట్టింది. ఈ భువనత్రయమూ ఆ అభిమానము నందే అంతర్గతమై ఉంది.

అభిమానాద్రతిః సా చ పరిపోషముపేయుషీ ।
వ్యభిచారాది సామాన్యా చ్ఛృంగార ఇతి గీయతే ॥4॥

అభిమానం నుంచి రతి పుడుతుంది. అది వ్యభిచారాది భావ సామాన్యంచే పరిపుష్టి పొందినదై శృంగారమని చెప్పబడుతుంది.

తద్భేదాః కామమితరే హాస్యాద్యా అప్యనేకశః ।
స్వస్వ స్థాయి విశేషోఽథ పరి పోష స్వలక్షణాః ॥5॥

శృంగారం యొక్క ఇచ్ఛానుసారంగా హాస్యాదులు అనేకములుగాదాని భేదాలయ్యాయి. వాటికి వాటి వాటి స్థాయీ భావములు ఉన్నాయి. వాటి పరిపోషమే ఆ రసముల లక్షణం.

సత్త్వాది గుణ సంతానా జాయతే పరమాత్మనః ।
రాగా ద్భవతి శృంగారో రౌద్రస్తైక్ష్ణ్యాత్ప్రజాయతే ॥6॥

సత్త్వాది గుణ సముదాయాలు పరమాత్మనుంచి సంభవిస్తాయి. రాగం నుంచి శృంగారం, తీక్ష్ణత్వము నుంచి రౌద్రం జనించాయి.

వీరోఽవష్టమ్భజః సంకోచ భూర్బీభత్స ఇష్యతే ।
శృంగారా జ్జాయతే హాసో రౌద్రాత్తు కరుణో రసః ॥7॥

ఉత్సాహం నుంచి వీరం, సంకోచం నుంచి బీభత్సం, శృంగారం నుంచి హాస్యం, రౌద్రం నుంచి కరుణరసం పుట్టాయి(కలిగాయి).

వీరా చ్చాద్భుత నిష్పత్తిః స్యాద్బీభత్సా ద్భయానకః ।
శృంగర హాస్య కరుణా రౌద్ర వీర భయానకాః ॥8॥

బీభత్సాద్భుత శాంతాఖ్యాః స్వభావాచ్చతురో రసాః ।
లక్ష్మీ రివ వినాత్యాగా న్న వాణీ భాతి నీరసా ॥9॥

వీరం నుంచి అద్భుత రసం పుట్టింది. బీభత్సం నుంచి భయానక రసం జనించింది. శృంగార, హాస్య, కరుణ, రౌద్ర, వీర, భయానక, బీభత్స, అద్భుత, శాంతములని తొమ్మిది రసములు. సహజములైనవి నాలుగు రసములు. అవి శృంగార రౌద్ర వీర బీభత్సములు. త్యాగం లేని ధనం వలె, రసములేని వాక్కు ప్రకాశించదు.

అపారే కావ్య సంసారే కవిరేవ ప్రజాపతిః ।
యథా వై రోచతే విశ్వం తథేదం పరివర్తతే ॥10॥

అపారమైన కావ్యసంసారంలో కవియే ప్రజాపతి. అతనికి ఈ సంసారం ఎలా ఇష్టమవుతుందో, అలా మార్పు చెందుతుంది.

శృంగారీ చేత్కవిః కావ్యే జాతం రసమయం జగత్ ।
సచేత్కవిర్వీతరాగో నీరసం వ్యక్తమేవ తత్ ॥11

కవిశృంగారి ఐనచో కావ్య ప్రపంచ మంతా రసమయంగా ఉంటుంది. కవి రాగ రహితుడైనచో ఆ కావ్యము రసహీనముగా ఉంటుంది.

న భావ హీనోఽస్తి రసో న భావో రసవర్జితః ।
భావయంతి రసానేభి ర్భావ్యంతే చ రసా ఇతి ॥12

భావహీనమగు రసమూ ఉండదు. రసవర్జితమైన భావమూ ఉండదు. భావములు రసాలను అభివ్యక్తం చేస్తాయి. “భావ్యంతే రసాః ఏభిః” అనే వ్యుత్పత్తి చే భావాలు చెప్పబడతాయి.

స్థాయినోఽష్టౌ రతి ముఖాః స్తంభాద్యా వ్యభిచారిణః ।
మనోఽను కూలేఽనుభవః సుఖస్య రతి రిష్యతే ॥13॥

రతి మున్నగు స్థాయీ భావాలు ఎనిమిది. స్తంభాదులు ఎనిమిది వ్యభిచారి భావాలు. మనస్సుకు అనుకూలమైన సుఖానుభవం రతి.

హర్షాదిభిశ్చ మనసో వికాసో హాస ఉచ్యతే ।
మనో వైక్లబ్యమిచ్ఛన్తి శోకమిష్ట క్షయాదిభిః ॥14॥

హర్షాదులచే కలిగే మనో వికాసం హాసం. అభీష్టవస్తువు యొక్క వినాశం వల్ల కలిగే మనో వైక్లబ్యం శోకం.

క్రోధస్తైక్ష్ణ్యం ప్రబోధశ్చ ప్రతికూలానుకారిణీ ।
పురుషాను సమోఽ_ప్యర్థో యః స ఉత్సాహ ఉచ్యతే ॥15॥

ప్రతికూలమైన ఆచరణ చేసేవానిపై కఠోరత చూపించడం క్రోధం. పురుషార్థాలకు అనుకూలమైన మనోభావం ఉత్సాహం అనబడుతుంది.

చిత్రాది దర్శనాచ్చేతో వైక్లబ్యం బ్రువతే భయమ్ ।
జుగుప్సా చ పదార్థానాం నిందా దౌర్భాగ్యవాహినామ్ ॥16॥

చిత్రవిచిత్ర వస్తువులను చూడడంవల్ల కల్గిన మానసిక వికలత్వం భయం. దౌర్భాగ్యాన్ని మోసుకువచ్చే పదార్థాలపై ప్రకటించే నింద జుగుప్స.

విస్మయోఽ_తి శయేనార్థ దర్శనాచ్చిత్త విస్తృతిః ।
అష్టౌ స్తంభాదయః సత్త్వా ద్రజసః తమసః పరమ్ ॥17॥

ఉత్కృష్టమైన వస్తువులను చూడడం వల్ల కలిగే చిత్తం యొక్క అతిశయ పూర్వకమైన ఆశ్చర్యం విస్మయం. స్తంభాదులను ఎనిమిది భావాలు సత్త్వం వల్ల కలుగుతాయి. అవి రజోగుణానికి, తమోగుణానికి అతీతాలు.

స్తంభశ్చేష్టా ప్రతీఘాతో భయరాగాద్యుపాహితః ।
శమరాగాద్యుపేతాంతః క్షోభ జన్మ వపుర్జలమ్ ॥18॥

భయరాగాదులచే కలిగే చేష్టా విఘాతం స్తంభం. శ్రమరాగాదులతో కూడిన ఆంతరక్షోభంచే కలిగే శరీర జలం స్వేదం.

స్వేదో హర్షాదిభి ర్దేహో చ్ఛ్వాశాసోఽ_న్తః పులకోద్గమః ।
హర్షాది జన్మ వాక్సంగః స్వరభేదో భయాదిభిః ॥19॥

హర్షాదులచే దేహం పులకరించడం పులకోద్గమం. హర్షాది జన్యమైన వాక్కులోని అస్పష్టత్వం, భయాదులవల్ల కలిగే అస్పష్టత్వం స్వరభేదం అవుతుంది.

చిత్త క్షోభ భవః స్తంభో వేపథుః పరికీర్తితః ।
వైవర్ణ్యం చ విషాదాది జన్మాకాంతి విపర్యయః ॥20॥

చిత్తం యొక్క క్షోభవల్ల ఉత్పన్నమయ్యే కంపనం "వేపథువు" అని కీర్తించబడుతుంది. విషాదాదుల వల్ల కలిగే శరీరకాంతి పరివర్తనం "వైవర్ణ్యం" అనబడుతుంది.

దుఃఖానందాదిజం నేత్ర జలమశ్రుచ విశ్రుతమ్ ।
ఇంద్రియాణా మస్తమయః ప్రలయో లంఘనాదిభిః ॥21॥

దుఃఖం వల్ల, ఆనందం వల్ల కలిగే నేత్ర జలం "అశ్రువు" అనబడుతుంది. లంఘనాదులవల్ల ఇంద్రియాలు పనిచేయక పోవడం ప్రళయం.

వైరాగ్యాది ర్మనః ఖేదో నిర్వేద ఇతి కథ్యతే ।
మనః పీడాది జన్మా చ సాదో గ్లానిః శరీరగా ॥22 ॥

వైరాగ్యాదులవల్ల మానసిక ఖేదం నిర్వేదం. మానసిక పీడాదుల వల్ల కలిగే శరీర దౌర్బల్యం గ్లాని.

శంకా నిష్టాగమోత్ప్రేక్షా స్యాదసూయా చ మత్సరః।
మది రాద్యుపయోగోత్థం మనః సంమోహనం మదః ॥23॥

అనిష్ట ప్రాప్తిని ఊహించడం శంక. మత్సరమే అసూయ. మదిరాదులను ఉపయోగించడం వల్ల మానసిక మోహం మదం.

క్రియాతి శయ జన్మాంతః శరీరోత్థ క్లమః శ్రమః ।
శృంగారాది క్రియాద్వేషశ్చిత్తస్యాలస్యముచ్యతే ॥24॥

ఎక్కువ పనిచేయడంచే కల్గిన, శరీరంలో పుట్టిన, క్లాంతిశ్రమం. చిత్తమునకు శృంగారాది క్రియలయందు ద్వేషం ఆలస్యం.

దైన్యం సత్త్వాదపభ్రంశశ్చింతార్థ పరిభావనమ్ ।
ఇతి కర్తవ్యతోపాయాదర్శనం మోహ ఉచ్యతే ॥25॥

సత్త్వం నుంచి తొలగడం దైన్యం. విషయాలను గూర్చి ఆలోచించడం చింతచేయదగిన ఉపాయం తెలుసుకోకపోవడం మోహం.

స్మృతిః స్యాదనుభూతస్య వస్తునః ప్రతిబింబనమ్ ।
మతిరర్థ పరిచ్ఛేద స్తత్త్వ జ్ఞానోపనాయితః ॥26॥

అనుభవించిన వస్తువును మళ్లీ ప్రతిబింబింపజేసుకోవడం స్మృతి. యథార్థ జ్ఞానోపార్జనవల్ల విషయ నిర్ణయం చేసుకోవడం మతి.

వ్రీడానురాగాది భవః సంకోచః కోఽపి చేతసః ।
భవేచ్చపలతాఽస్థైర్యం హర్షశ్చిత్త ప్రసన్నతా ॥27॥

అనురాగాదుల వల్ల కలిగిన ఒకానొకవిధమైన చేత స్సంకోచం వ్రీడ. అస్థిరత్వం చపలత. చిత్త ప్రసన్నత హర్షం.

ఆవేశశ్చ ప్రతీకారాశయ వైధుర్యమాత్మనః ।
కర్తవ్యే ప్రతిభా భ్రంశో జడతేత్యభిధీయతే ॥28॥

ప్రతీకారవాంఛచే కలిగిన అంతఃకరణ వైకల్యం ఆవేశం.కర్తవ్యం విషయంలో తనకు ఏవిధమైన బుద్ధి తోచక పోవడం జడత.

ఇష్టప్రాప్తేరుపచితః సంపదాభ్యుదయోధృతిః ।
గర్వః పరేష్వవజ్ఞాన మాత్మన్యుత్కర్షభావనా ॥29॥

కోరుకొన్న వస్తువు లభించడంవల్ల కలిగే ఆనందాభ్యుదయం ధృతి. ఇతరుల పట్ల అనాదరం చూపించడం, తనయందు ఉత్కర్షభావన గర్వము.

భవేద్విషాదో దైవాదే ర్విఘాతోఽభీష్ట వస్తుని ।
ఔత్సుక్యమీప్సితా ప్రాప్తే ర్వాంఛయా తరలా స్థితిః ॥30॥

అభీష్టవస్తు ప్రాప్తియందు దైవాదులవల్ల విఘాతం కల్గడం విషాదం. ఈప్సితసిద్ధి కోసమై చంచలమైన మానసిక స్థితి ఔత్సుక్యం.

చిత్తేంద్రియాణాం స్తైమిత్యమపచారోఽచలా స్థితిః ।
యుద్ధే బాధాదిభిస్త్రాసో వీప్సా చిత్త చమత్కృతిః ॥31॥

చిత్తం, ఇంద్రియాలు మున్నగునవి పనిచేయకపోవడం అపస్మారం. యుద్ధంలో బాధాదుల వల్ల స్థిరంగా ఉండలేకపోవడం త్రాసం. చిత్త చమత్కారం వీప్స.

క్రోధస్యాప్రశమోఽమర్షః ప్రబోధ శ్చేతనోదయః ।
అవహిత్థం భవేద్గుప్తిరింగితాకార గోచరా ॥32॥

క్రోధం శాంతించకపోవడం అమర్షం. చేతనోదయం ప్రబోధం లేదా జాగరణం. చేష్ట మున్నగు ఇంగితాకారాలను దాచుకోవడం అవహిత్థం.

రోషతో గురువాగ్దండ పారుష్యం విదురుగ్రతామ్ ।
ఊహో వితర్కః స్యాద్వ్యాధిర్మనో వపురవగ్రహః ॥33॥

గురువుల విషయంలో రోషంతో వాక్పారుష్యం, దండ పారుష్యం ప్రకటించడం ఉగ్రత. ఊహవితర్కం. వ్యాధి అనగా మనస్సు, శరీరం సరిగా ఉండకపోవడం.

అనిబద్ధ ప్రలాపాది రున్మాదో మదనాదిభిః ।
తత్త్వజ్ఞానాదినా చేతః కషాయోపరమః శమః ॥34॥

కామం మున్నగు వాటిచే అసంబద్ధ ప్రలాపం చేయడం ఉన్మాదం. తత్త్వజ్ఞానాదులచే చిత్తమాలిన్యం తొలగడం శమం.

కవిభిర్యోజనీయా వై భావాః కావ్యాదికే రసాః ।
విభావ్యతే హి రత్యాదిర్యత్ర యేన విభావ్యతే ॥35॥

కావ్యాదులందు కవులు భావాలను, రసాలను కూర్చాలి. దేనిచే రత్యాదులు విభావితాలు అవుతాయో, అది విభావం అవుతుంది. "విభావ్యతే యేన" అని విగ్రహం.

విభావో నామ సద్వేధాஉ உలంబనోద్దీపనాత్మకః ।
రత్యాది భావ వర్గోஉయం యమాజీవ్యోపజాయతే ॥36॥

ఆలంబన విభావోஉసౌ నాయకాదిభవస్తథా ।
ధీరోదాత్తో ధీరోద్ధతః స్యాద్ధీరలలితస్తథా ॥37॥

ధీర ప్రశాంత ఇత్యేవం చతుర్ధా నాయక స్మృతః ।
అనుకూలో దక్షిణశ్చ శఠో ధృష్టః ప్రవర్తితః ॥38॥

ఆలంబనము, ఉద్దీపనము అని విభావము రెండు విధాలు. ఈ రత్యాది భావ వర్గము దేనిని ఆధారంగా చేసుకొని పుడుతుందో అది ఆలంబన విభావం అవుతుంది. ఇది నాయకాదులను ఆధారంగా చేసుకొని పుడుతుంది. ధీరోదాత్తుడు, ధీరోద్ధతుడు, ధీరలలితుడు, ధీర ప్రశాంతుడు అని నాయకులు నాలుగు విధాలుగా ఉంటారు. అనుకూలుడు, దక్షిణుడు, శఠుడు, ధృష్టుడు అని మరో నాలుగు విధాలుగా కూడ ఉంటారు.

పీఠ మర్ద్రో విటశ్చైవ విదూషక ఇతి త్రయః ।
శృంగారే నర్మసచివా నాయకస్యానునాయకాః ॥39॥

శృంగారరసంలో నాయకులను పీఠమర్దుడు, విటుడు, విదూషకుడు అని ముగ్గురు నర్మసచివులు ఉంటారు. వీరు నాయకుని అనుసరించి ఉంటారు కావున అనునాయకులు.

పీఠమర్దః సంబలకః శ్రీమాంస్తద్దేశజో విటః ।
విదూషకో వై హసిక స్త్వష్టనాయకనాయికాః ॥40॥

పీఠమర్దుడు శ్రీమంతుడై నాయకునిలా బలవంతుడై ఉంటాడు. విటుడు నాయకుని దేశానికి చెందినవాడై ఉంటాడు. నవ్వించేవాడు విదూషకుడు. అష్ట నాయకుల నాయికలు కూడ మూడు విధాలుగా ఉంటారు.

స్వకీయా పరకీయా చ పునర్భూరితి కౌశికాః ।
సామాన్యా న పునర్భూరి ఇత్యాద్యా బహు భేదతః ॥41॥

వారు "స్వకీయ, పరకీయ, పునర్భూ" అని కౌశికుడు చెబుతాడు. మరి కొందరు పునర్భూరికి బదులుగా ఆమెను కాదని సామాన్యను అంగీకరిస్తారు. ఈ నాయికలలో చాలా భేదాలు ఉన్నాయి.

ఉద్దీపనవిభావాస్తే సంస్కారై ర్వివిధైః స్థితైః ।
ఆలంబన విభావేషు భావానుద్దీపయన్తి యే ॥42॥

ఉద్దీపన విభావాలు వివిధ సంస్కారరూపాలలో ఉండి, ఆలంబన విభావములో భావోద్దీపన చేస్తాయి.

చతుః షష్టి కలా ద్వేధా కర్మాద్యైర్గీతికాదిభిః ।
కుహకం స్మృతి రప్యేషా ప్రాయో హాసోపకారకః ॥43॥

కర్మాదుల చేతను, గీతికాదుల చేతను అరవై నాలుగు కళలు రెండు విధాలు. కుహకం, స్మృతి అనేవి సాధారణంగా హాసోపకారకాలు అవుతాయి.

ఆలంబన విభావస్య భావైరుద్బుద్ధ సంస్కృతైః ।
మనో వాగ్బుద్ధి వపుషాం స్మృతీచ్ఛా ద్వేషయత్నతః ॥44॥

ఉద్బుద్ధములు, సంస్కృతములు అగు భావాలచే, ఇచ్ఛాద్వేషస్మృతి ప్రయత్నాల సంయోగంవల్ల కలిగే, మనోవాగ్బుద్ధి శరీర కార్యాలను అనుభావాలు అంటారు. ఇవి ఆలంబన విభావానికి సంబంధించి ఉంటాయి.

ఆరంభ ఏవ విదుషా మనుభావ ఇతి స్మృతః ।
స చానుభూయతే చాత్ర భవత్యుత నిరుచ్యతే ॥45॥

విద్వ జ్జనులు దీనిని ఆరంభానుభవంగా కీర్తిస్తారు. "సః అనుభూయతే అత్ర" అని కాని, "సః అనుభవతి" అని కాని దీని నిర్వచనం.

మనో వ్యాపార భూయిష్ఠో మన ఆరంభ ఉచ్యతే ।
ద్వివిధః పౌరుష స్త్రైణ ఈదృశోఽపి ప్రసిద్ధ్యతి ॥46॥

మానసిక వ్యాపారం ఎక్కువగా ఉండేది మానసికారంభము. అది పౌరుషం (పురుషసంబంధి), స్త్రైణం (స్త్రీ సంబంధి) అది రెండు విధాలుగా ప్రసిద్ధమై ఉంది.

శోభా విలాసో మాధుర్యం స్థైర్యం గాంభీర్యమేవ చ ।
లలితం చ తథౌదార్యం తేజోఽష్టావితి పౌరుషాః ॥47॥

శోభ, విలాసం, మాధుర్యం, స్థైర్యం, గాంభీర్యం, లలితం, ఔదార్యం, తేజస్సు – అని పౌరుషాలు ఎనిమిది విధాలు.

నీచనిందోత్తమ స్పర్ధా శౌర్యం దాక్ష్యాది కారణమ్ ।
మనోధర్మే భవేచ్ఛోభా శోభతే భవనం యథా ॥48॥

నీచ విషయాల పట్ల నింద, ఉత్తములతో స్పర్ధ, శౌర్యం, చాతుర్యం, మున్నగు వాటిచే మనో ధర్మము నందు శోభ కలుగుతుంది. ఇది భవనం శోభచే కళ కళ లాడుతూ ఉండడం వంటిది.

భావో హావశ్చ హేలా చ శోభాకాంతి స్తథైవ చ ।
దీప్తి ర్మాధుర్య శౌర్యే చ ప్రాగల్భ్యం స్యాదుదారతా ॥49॥

స్థైర్యం గంభీరతా స్త్రీణాం విభావాద్వాదశేరితాః ।
భావో విలాసో హావః స్యాద్భావః కించిచ్చ హర్షజః ॥50॥

భావం, హావం, హేల, శోభ, కాంతి, దీప్తి, మాధుర్యం, శౌర్యం, ప్రాగల్భ్యం, ఉదారత, స్థైర్యం, గంభీరత అనే పన్నెండు స్త్రీల విభావాలు. హావభావాలను విలాసం అంటారు. ఇది కొంచెం హర్షంచే పుడుతుంది.

వాచో యుక్తిర్భవేద్వాగారంభో ద్వాదశ ఏవ సః ।
తత్ర భాషణ మాలాపః ప్రలాపో వచనం బహు ॥51॥

విలాపో దుఃఖవచనమనులాపోఽసకృద్వచః ।
సంలాప ఉక్తప్రత్యుక్తమపలాపోఽన్యథా వచః ॥52॥

యుక్తిగా మాట్లాడడం, వాగారంభం – ఇందులో పన్నెండు భేదాలు ఉన్నాయి. మాటలాడడం ఆలాపం. ఎక్కువగా మాటలాడడం ప్రలాపం. దుఃఖవచనం విలాపం. మాటి మాటికి చెప్పడం అనులాపం. ఉక్తి ప్రత్యుక్తులు సల్లాపం మరో విధంగా చెప్పడం అపలాపం.

వార్తా ప్రయాణం సందేశో నిర్దేశః ప్రతిపాదనమ్ ।
తత్త్వాదేశోఽతిదేశోఽయమపదేశోఽన్య వర్ణనమ్ ॥53॥

ఉపదేశశ్చ శిక్షా వాగ్వ్యాజోక్తిర్వ్యపదేశకః ।
బోధాయ ఏష వ్యాపారః సుబుద్ధ్యారంభ ఇష్యతే ।
తస్య భేదా స్త్రయస్తే చ రీతివృత్తి ప్రవృత్తయః ॥54॥

వార్తను మోసుకొని పోవడం సందేశం. ఒక విషయాన్ని ప్రతిపాదించడం నిర్దేశం. తత్త్వం చెప్పడం అతిదేశం. అన్య వర్ణనం అపదేశం. శిక్షాపూర్వకమైన వచనం ఉపదేశం. వ్యాజోక్తి వ్యపదేశం. ఇతరులకు విషయాన్ని బోధించడానికై ఉత్తమ బుద్ధినాశ్రయించి వాగారంభం చేయాలి. దాని భేదాలు మూడు. అవి రీతి, వృత్తి, ప్రవృత్తి అని త్రివిధాలు.

ఇత్యాది మహాపురాణే ఆగ్నేయే శృంగారాదిరసనిరూపణం నామ ఏకోన చత్వారింశ త్రిశతతమోఽధ్యాయః॥339॥

అగ్నిమహాపురాణంలో శృంగారాదిరసనిరూపణమనే మూడువందల ముప్పైతొమ్మిదవ అధ్యాయం సమాప్తం.



చత్వారింశదధిక త్రిశతతమోఽధ్యాయః – మూడవందల నలబైయవ అధ్యాయం

రీతి నిరూపణమ్ – రీతి నిరూపణం

అగ్నిరువాచ – అగ్ని ఇలా పలికాడు.

వాగ్విద్యా సంప్రతి జ్ఞానే రీతిః సాఽపి చతుర్విధా ।
పాంచాలీ గౌడదేశీయా వైదర్భీ లాటజా తథా ॥1॥

వసిష్ఠా! ఇపుడు వాగ్విద్యను (కావ్యశాస్త్రమును) చక్కగా తెలుసుకోవడం కోసమై "రీతి" ని వర్ణించి చెబుతాను. అది కూడ నాలుగువిధాలు. పాంచాలి. గౌడదేశీయ, వైదర్భి, లాటజ అని నాలుగుభేదాలతో ఉంటుంది.

ఉపచారయుతా మృద్వీ పాంచాలీ హ్రస్వవిగ్రహా ।
అనవస్థిత సందర్భా గౌడీయా దీర్ఘవిగ్రహా ॥2॥

ఉపచారయుతమైనది, మృదువైనది, చిన్నచిన్న సమాసాలు కలది పాంచాలి. అనవస్థిత సందర్భం కలది, అధికోపచారయుక్తమైనది, దీర్ఘ సమాసాలు కలది గౌడి.

ఉపచారై ర్న బహుభి రుపచారై ర్వివర్జితా ।
నాతి కోమల సందర్భా వైదర్భీ ముక్తవిగ్రహా ॥3॥

ఉపచారరహితం, ఉపచారాలు ఎక్కువగా లేనిది, మిక్కిలి కోమలం కాని కూర్పుకలది, సమాసాలు లేనిది అయినది వైదర్భి.

లాటీయా స్ఫుట సందర్భా నాతి విస్ఫుర విగ్రహా ।
పరిత్యక్తాపి భూయోభిరుపచారైరుదాహృతా ॥4॥

ప్రస్ఫుటమైన సందర్భం కలది. దీర్ఘసమాసాలు లేనిది, అయిన రీతి లాటి. చాలమంది విద్వాంసులు పరిత్యజించినా, అధికోపచారయుక్తమైన ఈ లాటీ ప్రశస్తి వహిస్తోంది.

క్రియా స్వవిషమా వృత్తి భారత్యారభటీ తథా ।
కౌశికీ సాత్వతీ చేతి సా చతుర్థా ప్రతిష్ఠితా ॥5॥

క్రియలలో వైషమ్యాన్ని పొందని వాక్యరచనకు వృత్తి అని పేరు. భారతి, ఆరభటి, కైశికి, సాత్వతి అని వృత్తి నాలుగువిధాలు.

వాక్ప్రధానా నరప్రాయా స్త్రీయుక్తా ప్రాకృతోక్తితా ।
భరతేన ప్రణీతత్వా ద్భారతీ రీతి రుచ్యతే ॥6॥

వాక్ప్రధానమైనది, ఎక్కువగా పురుషులను ఆశ్రయించేది, స్త్రీలచేత కూడ ప్రాకృతము నందు ఉపయోగించబడేది, భరతమునిచే రచింపబడినది కావడం వల్ల ఆ రీతికి భారతి అని పేరు.

చత్వార్యంగాని భారత్యా వీథీ ప్రహసనం తథా ।
ప్రస్తావనా నాటకాదేర్వీథ్యంగాశ్చ త్రయోదశ ॥7॥

వీథి, ప్రహసనం, ప్రస్తావన, నాటకాది ప్రరోచన అని భారతీవృత్తికి నాలుగుఅంగాలు. వీథికి అంగాలు పదమూడు.

ఉద్ఘాతకం తథైవ స్యాల్లపితం స్యాద్ద్వితీయకమ్ ।
అసత్ప్రలాపో వాక్శ్రేణీ నాలికా విపణం తథా ॥8॥

వ్యాహార స్త్రిగతం చైవ చ్ఛలా వస్కందితే తథా ।
గండోఽథ మృదవశ్చైవ త్రయోదశ మథోచితమ్ ॥9॥

ఉద్ఘాతకం, లపితం, అసత్ప్రలాపం, వాక్శ్రేణి, నాలిక, విపణం, వ్యాహారం, త్రిగతం, ఛలం, అవస్కందితం, గండం, మృదవం, ఉచితం అని వీథికి పదమూడు అంగాలు

ఉపదేశశ్చ శిక్షా వాగ్వ్యాజోక్తి ర్వ్యపదేశకః ।
బోధాయ ఏష వ్యాపారః సుబుద్ధ్యారంభ ఇష్యతే ॥
తస్య భేదా స్త్రయస్తే చ రీతివృత్తి ప్రవృత్తయః ॥10॥

పరిహాసయుక్తమైన ఉత్తముల వచనం ప్రహసనం. అది ఉపదేశం కోసమే. మాయ, ఇంద్రజాలం, యుద్ధారంభం మున్నగునవి ఉంటాయి. ఆరభటీవృత్తికి మూడుభేదాలు. అవి రీతివృత్తి ప్రవృత్తులను అనుసరించి ఉంటాయి. (సంక్షిప్తకరం, పాతం, వస్తూత్థాపనం) అని ఆరభటి భేదాలు.

ఇత్యాది మహాపురాణే ఆగ్నేయే రీతి నిరూపణం నామ చత్వారింశదధిక త్రిశత తమోఽధ్యాయః ॥340॥

అగ్నిమహాపురాణంలో రీతినిరూపణం అనే మూడువందల నలభైయవ అధ్యాయం సమాప్తం.



ఏకచత్వారింశదధిక త్రిశతతమోఽధ్యాయః - మూడువందల నలబైఒకటవ అధ్యాయం

నృత్యాద్యాంగకర్మనిరూపణమ్ - నృత్యాద్యంగకర్మ నిరూపణం

అగ్నిరువాచ - అగ్ని ఇలా చెప్పాడు.

చేష్టా విశేష మప్యంగ ప్రత్యంగే కర్మచానయోః ।
శరీరారంభ మిచ్ఛన్తి ప్రాయః పూర్వోఽబలాశ్రయః ॥1॥

వసిష్ఠా! ఇపుడు చేష్టాది విశేషాలను, అంగప్రత్యంగాలను, ఆరెండింటి కృత్యాలను చెబుతాను. ఇది శరీరాభినయంలో జరిగే ఆంగిక కర్మ. ఇది సాధారణంగా స్త్రీజనాన్ని ఆశ్రయించి ఉంటుంది.

లీలా విలాసో విచ్ఛిత్తి ర్విభ్రమం కిలకించితమ్ ।
మోట్టాయితం కుట్టమితం బిబ్బోకో లలితం తథా ॥2॥

వికృతం క్రీడితం కేళిరితి ద్వాదశధైవ సః ।
లీలేష్ట జనచేష్టాను కరణం సంవృతక్షయే ॥3॥

లీల, విలాసం, విచ్ఛిత్తి, విభ్రమం, కిలికించితం, మోట్టాయితం, కుట్టమితం, బిబ్బోకం, లలితం, వికృతం, క్రీడితం, కేళి అని పండ్రెండు విధాలు. ఆవృత ప్రదేశంలో ఇష్టజనచేష్టను అనుకరించడం లీల.

విశేషం దర్శయన్ కించి ద్విలాసః సద్భిరిష్యతే ।
హసిత క్రందితాదీనాం సంకరః కిలకించితమ్ ॥4॥

కొంచెం విశేషాన్ని చూపించేది విలాసం అని సత్పురుషులు చెబుతారు. హాసరోదనాదుల సంకరం కిలకించితం.

వికారః కోఽపి బిబ్బోకో లలితం సౌకుమార్యతః ।
శిరఃపాణిరురః పార్శ్వం కటిరంఘ్రిరితి క్రమాత్ ॥5॥

వికారం బిబ్బోకం. సుకుమారచేష్ట లలితం. శిరస్సు, హస్తాలు, వక్షం, పార్శ్వం, కటి, పాదం అని ఇవి క్రమంగా అంగాలు.

అంగాని భ్రూలతాదీని ప్రత్యంగా న్యభిజాయతే ।
అంగప్రత్యంగయోః కర్మ ప్రయత్నజనితం వినా ॥6॥

కనుబొమలు మున్నగునవి ప్రత్యంగాలు. అంగ ప్రత్యంగాల ప్రయత్నజనితమైన చేష్టలేకుండ ప్రయోగం ఎక్కడా కలగదు.

న ప్రయోగం క్వచిన్ముఖ్యం తిరశ్చీనం చ తత్ క్వచిత్ ।
ఆకంపితం కంపితం చ ధుతం విధుతమేవ చ ॥7॥

పరివాహిత మాధూత మవధూత మథాఽఽచితమ్ ।
నికుంచితం పరావృత్తముత్క్షిప్తం చాప్యధోగతమ్ ॥8॥

లలితం చేతి విజ్ఞేయం త్రయోదశ విధం శిరః ।

కొన్నిచోట్ల ముఖ్యంగా, కొన్ని చోట్ల వక్రరూపంగా అది సాధించబడుతుంది. ఆకంపితం, కంపితం, ధుతం(ధూతం), విధుతం (విధూతం), పరివాహితం, ఆధూతం, అవధూతం, ఆచితం, నికుంచితం, పరావృత్తం, ఉత్క్షిప్తం, అధోగతం, లలితం అని శిరఃకృత్యాలు పదమూడు విధాలు.

భ్రూకర్మ సప్తధా జ్ఞేయం పాతనం భ్రుకుటీ ముఖమ్ ॥9॥

కనుబొమ్మల చేష్టలు ఏడు విధాలు. వీటిలో భ్రుకుటి పాతనం మున్నగునవి ప్రధానం.

ధృష్టి స్త్రిధా రసస్థాయి సంచారి ప్రతిబంధనా ।
షట్ త్రింశద్భేద విధురా రసజా తత్ర చాష్టధా ॥10॥

రస, స్థాయి, సంచారి భావాల సంబంధాన్ని బట్టి ధృష్టి మూడు విధాలు. దీనికి ముప్పై ఆరు భేదాలు కూడ ఉంటాయి. అందు రసజా ధృష్టి ఎనిమిదివిధాలు (పదిభేదాలు అని పాఠాంతరం).

నవధా తారకా కర్మ భ్రమణం చలనాదికమ్ ।
షోఢా చ నాసికా జ్ఞేయా నిఃశ్వాసో నవధామతః ॥11॥

భ్రమణం, చలనం మున్నగు తారకాకర్మ తొమ్మిది విధాలు. నాసికాకర్మ ఆరువిధాలు. నిఃశ్వాసం తొమ్మిది విధాలు.

షోఢౌష్ఠ కర్మకం పాద్యం సప్తధా చిబుక క్రియా ।
కలుషాది ముఖం షోఢా గ్రీవా నవవిధా స్మృతా ॥12॥

ఓష్ఠ కర్మ ఆరువిధాలు, పాదకర్మ ఆరువిధాలు, చిబుక కర్మ ఏడువిధాలు, కలుషం మున్నగు ముఖకర్మ ఆరువిధాలు. గ్రీవాకర్మ తొమ్మిది విధాలు.

అసంయుతః సంయుతశ్చ భూమ్నా హస్తః ప్రయుజ్యతే ।
పతాక స్త్రిపతాకశ్చ తథా వై కర్తరీముఖః ॥13॥

అర్ధచంద్రోత్కరాలశ్చ కుశతుండస్తథైవ చ ।
ముష్టిశ్చ శిఖరశ్చైవ కపిత్థః ఖే (క) టకా ముఖః ॥14॥

సూచ్యాస్యః పద్మకోశో హి శిరః సమృగశీర్షకః ।
కామూలకాలపద్మౌ చ చతురభ్రమరౌ తథా ॥15॥

హస్తకర్మ సాధారణంగా అసంయుతం, సంయుతం అని రెండు విధాలుగా ఉంటుంది. పతాక, త్రిపతాక, కర్తరీముఖ, అర్ధచంద్ర, ఉత్కరాల, శుకతుండ, ముష్టి, శిఖర, కపిత్థ, కటకాముఖ, సూచ్యాస్య, పద్మకోశ, శిర, మృగశీర్ష, కామూల, కాలపద్మ, చతుర, భ్రమర.

హంసాస్య హంసపక్షౌ చ సందంశముకులౌ తథా ।
ఊర్ణనాభస్తామ్రచూడశ్చతుర్వింశతిరిత్యమీ ॥16॥

హంసాస్య, హంసపక్ష, సందంశ, ముకుల, ఊర్ణనాభ, తామ్రచూడ– అని అసంయుత హస్తానికి ఇరవైనాలుగు భేదాలు.

అసంయుతకరాః ప్రోక్తా సంయుతాస్తు త్రయోదశ ।
అంజలిశ్చ కపోతశ్చ కర్కటః స్వస్తిక స్తథా ॥17॥
కటకో వర్ధమానశ్చాప్యసంగో నిషధ స్తథా ।
దోలః పుష్పపుటశ్చైవ తథా మకర ఏవ చ ॥18॥
గజదంతో బహిః స్తంభో వర్ధమానోఽపరేకరాః ।
ఉరః పంచవిధం స్యాత్తు ఆభుగ్న నర్తనాదికమ్ ॥19॥

సంయుతం హస్తానికి పదమూడు భేదాలు. అవి అంజలి, కపోత, కర్కట, స్వస్తిక, కటక, వర్ధమాన, అసంగ, నిషధ, దోల, పుష్పపుట, మకర, అలాగే గజదంత, బహిః స్తంభ– అని సంయుత హస్త భేదాలుగా ఉన్నాయి. సంయుత హస్తానికి పరివర్ధనం మున్నగు అన్యభేదాలు కూడ ఉన్నాయి. వక్షఃస్థలకర్మ ఆభుగ్ననర్తనాది భేదంచే ఐదు విధాలు.

ఉదరం త్వనతిక్షామం ఖండం పూర్ణమితి త్రిధా ।
పార్శ్వయోః పంచకర్మాణి జంఘా కర్మ చ పంచధా ॥20॥
అనేకధా పాదకర్మ నృత్యాదౌ నాటకే స్మృతమ్ ॥21॥

'ఉదరకర్మ' – అనతి క్షామ, ఖండం, పూర్ణం అని మూడు విధాలు. పార్శ్వకర్మలు ఐదు విధాలు. జంఘాకర్మలు కూడ అయిదు విధాలు. నాట్య నృత్యాదులందు పాదకర్మ అనేకవిధాలుగా ఉంటుంది.

ఇత్యాది మహాపురాణే ఆగ్నేయే నృత్యాదౌ అంగకర్మ నిరూపణం నామ
ఏక చత్వారింశదధిక త్రిశతతమోఽధ్యాయః ॥341॥

అగ్నిమహాపురాణంలో నృత్యాద్యంగకర్మ నిరూపణం అనే మూడవందల నలభైఒకటవ అధ్యాయం సమాప్తం.



ద్వాచత్వారింశ దధిక త్రిశతతమోఽధ్యాయః – మూడువందల నలబై రెండవ అధ్యాయం

అభినయాది నిరూపణమ్ – అభినయాది నిరూపణం

అగ్నిరువాచ – అగ్ని ఇలా పలికాడు.

ఆభిముఖ్యం నయన్నర్థాన్వి జ్ఞేయోఽభినయో బుధైః ।
చతుర్ధా సంభవః సత్త్వవాగంగాహరణాశ్రయః ॥1॥

వసిష్ఠా! నాటకాదులలోని విషయాన్ని మూర్తరూపంలో పాత్రల ద్వారా అభిముఖం కావించి ప్రత్యక్షంగా కన్నులతో చూచేటట్లు చేయడం అభినయమని విద్వాంసులు చెబుతారు. అది సాత్త్వికం, వాచికం, ఆంగికం, ఆహార్యం అని నాలుగు విధాలు.

స్తంభాదిః సాత్త్వికో వాగారంభో వాచిక ఆంగికః ।
శరీరారంభ ఆహార్యో బుద్ధ్యారంభ ప్రవృత్తయః ॥2॥

స్తంభం, స్వేదం ఇత్యాది సాత్త్వికాభినయం. వాక్ప్రవృత్తి వాచికాభినయం. శారీరక చేష్ట ఆంగికాభినయం. బుద్ధిని ఉపయోగించి చేసేది ఆహార్యం.

రసాది వినియోగోఽథ కథ్యతే హ్యభిమానతః ।
తమంతరేణ సర్వేషా మపార్థైవ స్వతంత్రతా ॥3॥

అభిమాన స్థితిచే రసాది వినియోగం చెప్పబడుతుంది. రసం లేకుండా మిగిలినవి స్వతంత్రములుగా ఉండడం వ్యర్థం అవుతుంది.

సంభోగో విప్రలంభశ్చ శృంగారో ద్వివిధః స్మృతః ।
ప్రచ్ఛన్నశ్చ ప్రకాశశ్చ తావపి ద్వివిధౌ పునః ॥4॥

సంభోగము, విప్రలంభము అని శృంగారం రెండు విధాలు. ప్రచ్ఛన్నము, ప్రకాశము అని అవి మళ్లీ రెండేసి విధాలు.

విప్రలంభాభిధానో యః శృంగారః స చతుర్విధః ।
పూర్వానురాగ మానాఖ్యః ప్రవాస కరుణాత్మకః ॥5॥

విప్రలంభ శృంగారమనేది నాలుగుభేదాలుగా ఉంటుంది. పూర్వానురాగం, మానం, ప్రవాసం, కరుణాత్మకం అని.

ఏతేభ్యోన్యతరం జాయమానం సంభోగలక్షణమ్ ।
వివర్తతే చతుర్ధైవ న చ ప్రాగతివర్తతే ॥6॥

వీటిలో ఒక దానివల్ల సంభోగశృంగారం ఉత్పన్నమవుతుంది. అది కూడ నాలుగు విధాలుగా విభజింపబడుతుంది. పూర్వవిషయాన్ని మాత్రం అతిక్రమించదు.

స్త్రీపుంసయోస్తదుదయ స్తస్య నిర్వర్తికారతిః ।
నిఖిలాః సాత్త్వికా స్తత్ర వైవర్ణ్యప్రలయౌ వినా ॥7॥

అది స్త్రీ పురుషులను ఆశ్రయించి ఉదయిస్తుంది. శృంగారాభివ్యక్తియే రతి. వైవర్ణ్యం, ప్రలయం తప్ప అన్ని సాత్త్వికభావాలు దీనియందు ఉంటాయి.

ధర్మార్థ కామమోక్షైశ్చ శృంగార ఉపచీయతే ।
ఆలంబన విశేషైశ్చ తద్విశేషై ర్నిరంతరః ॥8

ధర్మార్థకామమోక్షాల చేత, ఆలంబన విశేషాలచేత, వాటి అవాంతర విశేషాలచేత శృంగారం నిరంతరం పరిపుష్టి పొందుతుంది.

శృంగారం ద్వివిధం విద్యాద్వాఙ్నేపథ్య క్రియాత్మకమ్ ।
హాసశ్చతుర్విధోఽలక్ష్యదన్తః స్మిత ఇతీరితః ॥9॥

శృంగారం వాక్క్రియ, నేపథ్యక్రియ అని రెండు విధాలు. హాసం నాలుగు విధాలు. దంతాలు పైకి కనబడనిది స్మితం.

కించిల్లక్షిత దంతాగ్రం హసితం ఫుల్లలోచనమ్।
విహసితం సస్వనం స్యాజ్జిహ్మోపహసితం తు తత్ ॥10॥

కొంచెం దంతాగ్రాలు కనబడి, నేత్రాలు వికసిస్తే అది హసితం. ధ్వనితో కూడినది విహసితం. కుటిలత్వంతో కూడినది ఉపహసితం.

సశబ్దం చాపహసితమశబ్దమతిహాసితమ్ ।
యశ్చాసౌ కరుణో నామ సరసస్త్రివిధో భవేత్ ॥11॥

ధ్వనితో కూడుకొన్నది సశబ్దంగా ఉండేది అపహసితమని, ఎక్కువ శబ్దంతో ఉండేది అతిహసితమని మళ్లీ రెండు విధాలు. ఇలా హాసం ఆరువిధాలు. కరుణ అనే పేరు గల రసం కూడ మూడు విధాలు.

ధర్మోపఘాతజశ్చిత్త విలాస జనిత స్తథా ।
శోకః శోకా ద్భవేత్స్థాయీ కః స్థాయీ పూర్వజో మతః ॥12॥

ధర్మోపఘాతజం, చిత్త విలాస(ప) జనితం, శోకజనితం అని మూడువిధాలు. దీనికి శోకం స్థాయీభావం. ఇది పూర్వవర్తికోశం నుండి పుడుతుంది.

అంగనే పథ్యవాక్యైశ్చ రౌద్రోఽపి త్రివిధో రసః ।
తస్య నిర్వర్తకః క్రోధః స్వేదో రోమాంచవేపథూ ॥13॥

రౌద్రరసం కూడ అంగనేపథ్య వాక్యాలచే మూడు విధాలు. దీని స్థాయీ భావం క్రోధం. స్వేదం, రోమాంచం, వేపథువులు కూడా ఉంటాయి.

దానవీరో ధర్మవీరో యుద్ధవీర ఇతి త్రయమ్।
వీరస్తస్య చ నిష్పత్తి ర్హేతు రుత్సాహ ఇష్యతే ॥14॥

దానవీరము, ధర్మవీరము, యుద్ధవీరము అని వీరరసం మూడు విధాలు. దీని స్థాయీభావం ఉత్సాహం.

ఆరంభేషు భవేద్యత్ర వీరమేవానువర్తతే ।
భయానకో నామ రసస్తస్య నిర్వర్తకం భయమ్॥15॥

ప్రారంభంలో వీరం ఉండి, చివరకు భయాన్ని కలిగించేది. భయానక రసం. దాని స్థాయీభావం భయం.

ఉద్వేజనః క్షోభణశ్చ బీభత్సో ద్వివిధఃస్మృతః ।
ఉద్వేజనః స్యాత్పుత్యాద్యైః క్షోభణో రుధిరాదిభిః ॥16॥

జుగుప్సారంభికా తస్య సాత్త్వికాంశో నివర్తతే ।

ఉద్వేజనము, క్షోభణము అని బీభత్సరసం రెండు విధాలు. పూతి (దుర్గంధం మున్నగునవి) వస్తువులచే ఉద్వేజనం కలుగుతుంది. రుధిరాదులవల్ల క్షోభణం కలుగుతుంది. దీని స్థాయీభావం జుగుప్స. దీనియందు సాత్త్వికభావాలు ఉండవు.

కావ్య శోభాకరాన్ధర్మా నలంకారాన్ప్రచక్షతే ॥17॥

కావ్యసౌందర్యాన్ని అభివృద్ధి చేసే ధర్మాలను అలంకారాలు అంటారు.

అలంకరిష్ణవస్తే చ శబ్దమర్థముభౌ త్రిధా ।
యే వ్యుత్పత్త్యాదినా శబ్దమలంకర్తుమిహక్షమాః ॥18॥
శబ్దాలంకార మాహుస్తాన్కావ్యమీమాంసకా విదః ।

అవి శబ్దాన్ని, అర్థాన్ని, రెండిటిని అలంకరిస్తాయి. వ్యుత్పత్తి మున్నగువాటిచే శబ్దాన్ని అలంకరించేవి. శబ్దాలం కారాలు అవుతాయని కావ్యమీమాంసకులు చెబుతారు.

ఛాయా ముద్రా తథోక్తిశ్చ యుక్తి ర్గుంఫనయా సహ ॥19॥

వాకోవాక్యమనుప్రాసశ్చిత్తం దుష్కరమేవ చ ।
జ్ఞేయా నవాలంకృతయః శబ్దానామిత్యసంకరాత్ ॥20॥

ఛాయ, ముద్ర, ఉక్తి, యుక్తి, గుంఫన, వాకోవాక్యం, అనుప్రాసం, చిత్రం, దుష్కరం అనేవి తొమ్మిది శబ్దాలంకారాలుగా చెబుతారు. ఇందు శబ్దసంకరాన్ని విడిచి పెట్టాలి.

తత్రాన్యోక్తే రనుకృతి శ్ఛాయా సా౽పి చతుర్విధా ।
లోకచ్ఛేకార్భకోక్తీనా మేకోక్తే రనుకారతః ॥21॥

ఇతరుల ఉక్తిని అనుకరించడానికి ఛాయ అని పేరు. అది కూడ లోకోక్తి, ఛేకోక్తి, అర్భకోక్తి, మత్తోక్తి – వీటిని అనుకరించడం ద్వారా నాలుగువిధాలు.

ఆభాణకోక్తిర్లోకోక్తిః సర్వ సామాన్య ఏవ తాః ।
యానుధావతి లోకోక్తి శ్ఛాయా మిచ్ఛన్తి తాం బుధాః ॥22॥

ఆభాణకం లోకోక్తి. ఇది సర్వ సామాన్యం. లోకోక్తిని అనుసరించే రచనను లోకోక్తి ఛాయ అని పండితులు అంటారు.

ఛేకా విదగ్ధా వైదగ్ధ్యం కలాసు కుశలా మతిః ।
తాముల్లిఖంతీ ఛేకోక్తి శ్ఛాయా కవిభిరిష్యతే ॥23॥

నాగరికుల (చతురుల)కు ఛేకులు అని పేరు. వారి కళా కుశలతయే వైదగ్ధ్యం. దానిని ప్రదర్శించేది ఛేకోక్తి ఛాయ అని కవులు చెబుతారు.

అవ్యుత్పన్నోక్తి రఖిలై రర్భకోక్త్యోపలక్ష్యతే ।
తేనా ర్భకోక్తిశ్ఛాయా తన్మాత్రోక్తి మనుకుర్వతీ ॥24॥

అందరిచేత అవ్యుత్పన్నుల ఉక్తి అర్భకోక్తిగా చెప్పబడుతుంది. దానిని అనుకరించడమే అర్భకోక్తి ఛాయ అనబడుతుంది.

విప్లుతా క్షర మశ్లీలం వచో మత్తస్య తాదృశీ ।
యాసా భవతి మత్తోక్తి శ్ఛాయోక్తాప్యతిశోభతే ॥25॥

మత్తుల (ప్రగల్భుల) వాక్యం అశ్లీలంతో కూడుకొని లుప్తాక్షరాలు కలిగి ఉంటుంది. దాని ఛాయ కలది మత్తోక్తి చ్ఛాయ. ఇది సమయానుసారంగా ఉపయోగిస్తే శోభాకరంగా ఉంటుంది..

అభిప్రాయ విశేషేణ కవిశక్తిం వివృణ్వతీ ।
ముత్ప్రదాయినీతి సా ముద్రా సైవ శయ్యాపి నో మతే ॥26॥

అభిప్రాయ విశేషం చే కవి శక్తిని స్పష్టీకరిస్తూ, ఆనందాన్ని కలిగించేది ముద్ర అవుతుంది. అదే మా మతంలో "శయ్య" అనబడుతుంది.

ఉక్తిః సా కథ్యతే యస్యామర్థ కోప్యుపపత్తిమాన్ ।
లోకయాత్రార్థవిధినా ధినోతి హృదయం సతామ్ ॥27॥

యుక్తి యుక్తమైన అర్థాన్ని బోధిస్తూ, లోకయాత్రానుసారంగా ఉంటూ, సహృదయుల హృదయాన్ని ఆనందింపజేసేది ఉక్తి.

ఉభౌ విధినిషేధౌ చ నియమానియమావపి ।
వికల్ప పరిసంఖ్యే చ తదీయాః షడథోక్తయః ॥28॥

విధి, నిషేధము అని, నియమము, అనియమము అని, వికల్పము, పరిసంఖ్య అని, ఉక్తులు ఆరు విధాలు.

అయుక్తయోరివ మిథో వాచ్యవాచకయోర్ద్వయోః ।
యోజనాయై కల్ప్యమానా యుక్తిరుక్తా మనీషిభిః ॥29॥

వేర్వేరుగా ఉన్న వాచ్య వాచకాలను రెండింటిని కలపడానికి సమర్థమైన ఉక్తినే యుక్తి అంటారని మనీషులు పేర్కొన్నారు.

పదం చైవ పదార్థం చ వాక్యం వాక్యార్థమేవ చ ।
విషయోఽస్యాః ప్రకరణం ప్రపంచశ్చేతి షడ్విధః ॥30॥

పదము, పదార్థము, వాక్యము, వాక్యార్థము, ప్రకరణము, ప్రపంచము అని యుక్తి ఆరువిధాలు.

గుంఫనా రచనా చర్యా శబ్దార్థ క్రమగోచరా ।
శబ్దానుకారాదర్థానుపూర్వార్థేయం క్రమాత్త్రిధా ॥31॥

రచనా చర్యకు గుంఫన అని పేరు. అది శబ్దార్థక్రమగోచర, శబ్దానుకార, అర్థానుపూర్వార్థ అని మూడు విధాలు.

ఉక్తి ప్రత్యుక్తిమద్వాక్యం వాకోవాక్యం ద్విధైవ తత్ ।
ఋజువక్రోక్తి భేదేన తత్రాద్యం సహజం వచః ॥32॥

ఉక్తి ప్రత్యుక్తులు కలవాక్యం వాకో వాక్యం. అది మళ్లీ రెండు విధాలు. ఋజు ఉక్తి, వక్రోక్తి అని దాని భేదాలు. అందు మొదటిది స్వాభావికవచన రూపం.

సాఽపూర్వ ప్రశ్నికా ప్రశ్నపూర్వికేతి ద్విధా భవేత్ ।
వక్రోక్తిస్తు భవేద్భంగ్యా కాకుస్తేన కృతా ద్విధా ॥33॥

అది అప్రశ్న పూర్విక, ప్రశ్నపూర్విక అని రెండు విధాలు. భంగవక్రోక్తి, కాకు - వక్రోక్తి అని వక్రోక్తి కూడ రెండు విధాలు.

ఇత్యాది మహాపురాణే ఆగ్నేయే అభినయాది నిరూపణం నామ ద్వాచత్వారింశదధిక త్రిశతతమోఽధ్యాయః ॥342॥

అగ్నిమహాపురాణంలో అభినయాది నిరూపణం అనే మూడువందల నలభైరెండవ అధ్యాయం సమాప్తం.

త్రిచత్వారింశదధిక త్రిశతతమోఽధ్యాయః – మూడువందల నలభైమూడవ అధ్యాయం

శబ్దాలంకారాః – శబ్దాలంకారాలు

అగ్నిరువాచ – అగ్నిదేవుడు ఇలా చెప్పాడు.

స్యాదావృత్తిరనుప్రాసో వర్ణానాం పదవాక్యయోః ।
ఏకవర్ణాఽనేకవర్ణా వృత్తే ర్వర్ణగుణో ద్విధా ॥1॥

వసిష్ఠా! పదవాక్యాలయందు వర్ణాల ఆవృత్తికి అనుప్రాస అని పేరు. ఏకవర్ణము, అనేకవర్ణము అని వృత్త్యనుప్రాసకు సంబంధించిన వర్ణసముదాయం రెండు విధాలు.

ఏకవర్ణగతావృత్తే ర్జాయన్తే పంచవృత్తయః ।
మధురా లలితా ప్రౌఢా భద్రా పరుషయా సహ ॥2॥

ఏకవర్ణగతావృత్తి నుండి అయిదు విధాలవృత్తులు ఏర్పడతాయి. అవి మధుర, లలిత, ప్రౌఢ, భద్ర, పరుష అని అయిదు భేదాలతో ఉంటుంది.

మధురాయాశ్చ వర్గాన్తాదధోవర్గ్యారణౌ స్వనౌ ।
హ్రస్వస్వరేణాన్తరితౌ సంయుక్తత్వం నకారయోః ॥3॥

నకార్యావర్గ్య వర్ణానామావృత్తిః పంచమాధికా ।
మహాప్రాణోష్మసంయోగ ప్రవిముక్త లఘూత్తరా ॥4॥

మధుర వృత్తి యందు వర్గ పంచమవర్ణం క్రింద అదే వర్గకు చెందిన అక్షరాలు, హ్రస్వస్వరాంతరితములైన ర, ణ, మ, న, లు, నకార ద్వయసంయోగం కూడ ఉంటుంది. వర్గ్యవర్ణాలను అయిదు పర్యాయాలు మించి ఆవృత్తి చేయరాదు. మహాప్రాణములు (వర్గ ద్వితీయ చతుర్థాక్షరాలు), ఊష్మములు (శ,ష,స,హ) వీటి సంయోగంతో కూడిన ఉత్తరోత్తర లఘ్వక్షరాలు కల రచన మధుర అని చెప్పబడును.

లలితా వలభూయిష్ఠా ప్రౌఢా యా పణవర్గజా ।
ఊర్ధ్వం రేఫేణ యుజ్యన్తే నటవర్గో న పంచమాః ॥5॥

లలిత రచనలో వకార లకారాలు అధికంగా ప్రయోగించబడతాయి. రేఫంతో కూడుకొన్న పకార, ణ(న)కారాలు, వర్గ్యవర్ణాలు దేనియందు ప్రయోగించబడతాయో ట వర్గ, పంచమాక్షరాల ఆవృత్తి దేనియందు ఉండదో అది ప్రౌఢావృత్తి.

భద్రాయాం పరిశిష్టాః స్యుః పరుషాసాఽభిధీయతే ।
భవంతి యస్యామూష్మాణః సంయుక్తా స్తత్తదక్షరైః ॥6॥

మిగిలిన అసంయుక్తరేఫ, న (ణ) కారాది కోమలవర్ణాలు దేనియందు ప్రయోగింపబడతాయో అది భద్రావృత్తి లేదా కోమలావృత్తి అనబడుతుంది. ఊష్మాక్షరాలు భిన్నాక్షరాలతో సంయుక్తంగా ప్రయోగింపబడితే అది పరుషావృత్తి.

అకారవర్జమావృత్తిః స్వరాణామతి భూయసీ ।
అనుస్వారవిసర్గౌ చ పారుష్యాయ నిరంతరౌ ॥7॥

ఈ పరుషావృత్తిలో అకారంకన్న వేరైన స్వరాలు మిక్కిలి ఎక్కువగా ఆవృత్తి చెందుతాయి. అనుస్వార, విసర్గలు కూడ నిరంతరం ఇందు ప్రయోగించబడతాయి.

శషసారేఫ సంయుక్తా శ్చాకారశ్చాపి భూయసా ।
అంతః స్థాభిన్నమాభ్యాం చ హః పారుష్యాయ సంయుతః ॥8॥

రేఫతో కూడుకొన్న శ,ష,స,ల ప్రయోగం, ఎక్కువగా ఆకార ప్రయోగం, అధికంగా అంతఃస్థ వర్ణ ప్రయోగం, రేఫాంతఃస్థలచే భిన్నమైన సంయుక్తమైన హకార వర్ణప్రయోగం కూడ పరుషత్వాన్ని కలిగిస్తుంది.

అన్యథాపి గురుర్వర్ణః సంయుక్తే పరిపంథిని ।
పారుష్యాయాదిమాంస్తత్ర పూజితా న తు పంచమీ ॥9॥

గురువర్ణాలు మాధుర్యవిరుద్ధాలైన వర్ణాలతో సంయుక్తాలయితే పరుషత్వం కలుగుతుంది. పరుషరచనలో వర్గాద్యక్షరమే సంయుక్తం. గురువు, అయితే శ్రేష్ఠం. పంచమవర్ణం సంయుక్తమయితే ప్రశస్తం కాదు.

క్షేపే శబ్దానుకారే చ పరుషా ఽపి ప్రయుజ్యతే ।
కర్ణాటీ కౌన్తలీ కౌన్తీకౌంకణీ వామనాసికా ॥
ద్రావణీ మాధవీ పంచవర్ణాంతః స్థోష్మభిః క్రమాత్ ॥10॥

ఎవరినైనా ఆక్షేపించుటలోను, కఠోరశబ్దానుకరణంలోను పరుషవృత్తిని ప్రయోగించాలి. క,చ,ట,త,ప అనే అయిదు వర్గలను, అంతఃస్థములను,ఊష్మములను క్రమంగా ఆవర్తన చేయడం వల్ల ఏర్పడే వృత్తికి కర్ణాటి, కౌన్తలి,కౌంతి, కౌంకణి, వాణవాసిక, ద్రావణి, మాధవి (మాత్సి, మాగధి, తామ్రలిప్తిక, ఔండ్రి, పౌండ్రి) అనే భేదాలు ఉంటాయి.

అనేక వర్ణావృత్తిర్వా భిన్నార్థప్రతిపాదికా ।
యమకం సాఽవ్యపేతం చ వ్యపేతం చేతి తద్ద్విధా ॥11॥

ఆనంతర్యాదవ్యపేతం వ్యపేతం వ్యవధానతః ॥12॥

భిన్నార్థప్రతిపాదకమైన అనేక వర్ణావృత్తికి యమకం అని పేరు. అది అవ్యపేతం, వ్యపేతం అని రెండు విధాలు. నిరంతరావృత్తి ఉండేది అవ్యపేతం. వ్యవధానంతో ఆవృత్తి ఉండేది వ్యపేతం.

ద్వైవిధ్యేనానయోః స్థానపాదభేదాచ్చతుర్విధమ్ ।
ఆది పాదాది మధ్యాన్తేష్వేకద్విత్రినియోగతః ॥13॥

స్థానపాదభేదాలచే ఈ రెండింటికి రెండేసి భేదాలు ఏర్పడి మొత్తం పై నాలుగు విధాలవుతుంది. మొదటి పాదం యొక్క ఆది, మధ్య, అంతములందు ఒకటి, రెండు, మూడు వర్ణాల ఆవృత్తాలయితే మొత్తం ఏడు భేదాలవుతుంది.

సప్తధా సప్తపూర్వేణ చేత్పాదేనోత్తరోత్తరః ।
ఏకద్విత్రిపదారంభస్తుల్యః షోఢా తదా పరమ్ ॥14॥

ఏడు పాదాలలో ఉత్తరోత్తర పాదాలను, ఒకటి, రెండు, మూడు పదాలతో ప్రారంభిస్తే అంతిమపాదం ఆరు విధాలవుతుంది.

తృతీయం త్రివిధం పాదస్యాదిమధ్యాన్త గోచరమ్ ।
పాదాంతయమకం చైవ కాంచీయమకమేవ చ ॥15॥

తృతీయపాదంలో పాదం యొక్క ఆది, మధ్య, అంతములందు ఆవృత్తి చేస్తే అది మూడు విధాలవుతుంది. శ్రేష్ఠయమకం అనేది పదిభేదాలతో ఉంటుంది. అవి పాదాంతయమకం, కాంచీయమకం.

సంసర్గయమకం చైవ విక్రాంతయమకం తథా ।
పాదాది యమకం చైవ తథాஉమ్రేడితమేవ చ ॥16॥

చతుర్వ్యవసితం చైవ మాలాయమకమేవ చ ।
దశధా యమకం శ్రేష్ఠం తద్భేదా బహవోஉపరే ॥17॥

సంసర్గ (సముద్గ) యమకం, విక్రాంత యమకం, అని ముఖ్యమైనవి ఎనిమిది దీనికి వక్రవాలయమకం అని రెండూ కలిపితే 10 అవుతాయి. సందష్ట యమకం, పాదాదియమకం, ఆమ్రేడిత యమకం, చతుర్వ్యవసిత యమకం, మాలాయమకం అని పది విధాలుగా ఉంటుంది. వీటిలో కూడా అనేక భేదాలు ఉన్నాయి.

స్వతంత్రస్యాన్యతంత్రస్య పదస్యావర్తనా ద్విధా ।
భిన్నప్రయోజన పదస్యావృత్తిం మనుజా విదుః ॥8॥

భిన్నార్థవాచకపదాన్ని ఆవృత్తి చేస్తే అది స్వతంత్రం, అస్వతంత్రం. అని రెండు విధాలుగా అవుతుందని ఆలంకారికులు చెబుతారు.

ద్వయోరావృత్తపదయోః సమస్తాః స్యాత్సమాసతః ।
అసమాసాత్తయోర్వ్యస్తా పాదే త్వేకత్ర విగ్రహాత్ ॥19॥

రెండు ఆవృత్తపదాలకు సమాసం ఉంటే అది సమస్తం. సమాసం లేకపోతే వ్యస్తం. ఒకపాదంలో విగ్రహం ఉంటే అది వ్యస్తం అవుతుంది.

వాక్యస్యావృత్తిరప్యేవం యథా సంభవమిష్యతే ।
అలంకారాద్యనుప్రాసో లఘుమధ్యేవమర్థణాత్ ॥20॥

వాక్యావృత్తి కూడ ఈవిధంగా యథాసంభవంగా జరుగుతుంది. అనుప్రాస యమకాద్యలంకారాలు లఘువుగా ఉంటే పండితశిరోధార్యాలు.

యయా కయాచిద్వృత్త్యా యత్సమాన మనుభూయతే ।
తద్రూపాదిపదాసత్తిః సానుప్రా సారసావహా ॥21॥

పదావృత్తి అయినా, వాక్యావృత్తి అయినా, ఏవర్ణ సమూహం సమానంగా కనబడుతుందో, దానిని మొదట ఉంచి సానుప్రాసపదరచన చేస్తే అది రసావహమై ఉంటుంది.

గోష్ఠ్యాం కుతూహలాధ్యాయీ వాగ్బంధశ్చిత్రముచ్యతే ।
ప్రశ్నః ప్రహేలికా గుప్తం చ్యుతం దత్తే తథోభయమ్ ॥22॥

కవి గోష్ఠిలో కుతూహలపూర్వకంగా చదువబడే వాగ్బంధం చిత్రం. ప్రశ్నము, ప్రహేలిక, గుప్తము, చ్యుతాక్షరము, దత్తాక్షరము, చ్యుతదత్తాక్షరము.

సమస్యాసప్త తద్భేదా నానార్థస్యానుయోగతః ।
యత్ర ప్రదీయతే తుల్యావర్ణవిన్యాసముత్తరమ్ ॥23॥

సమస్య అని అది ఏడు భేదాలు. సమానాంతర విన్యాస పూర్వకంగా నానార్థ ప్రయోగానికి ఉత్తరమిస్తే అది ప్రశ్నము అవుతుంది.

సప్రశ్నః స్యాదేక పృష్ట ద్విపృష్టోత్తర భేదతః ।
ద్విధైకపృష్టో ద్వివిధః సమస్తో వ్యస్త ఏవ చ ॥24॥

ఆ ప్రశ్న ఏకపృష్టోత్తరం, ద్విపృష్టోత్తరం అని రెండు విధాలు. అందు ఏకపృష్టోత్తరం సమస్తము, వ్యస్తము అని రెండు విధాలు.

ద్వయోరప్యర్థయోర్గుహ్యమానశబ్దా ప్రహేలికా ।
సా ద్విధాఽర్థీచశాబ్దీ చ తత్రార్థీ చార్థబోధతః ॥25॥

రెండు అర్థాలను చెప్పే గుహ్యమాన శబ్దాలు ఉన్నదానిని ప్రహేలిక అంటారు. అది అర్థి, శాబ్ది అని రెండు విధాలు. అర్థబోధతో సంబంధించినది అర్థి.

శబ్దావబోధతః శాబ్దీ ప్రాహుః షోఢా ప్రహేలికామ్ ।
యస్మిన్గుప్తేఽపి వాక్యాంగీ భావ్యర్థోఽపారమార్థికః ॥26॥

శబ్దబోధతో సంబంధించినది శాబ్ది. ఈవిధంగా ప్రహేలిక ఆరువిధాలుగా ఉంటుంది. వాక్యాంగం గుప్తమై, సంభావ్యమైన ఒక అపారమార్థికమైన అర్థం దేని అంగమునందు ఆకాంక్షాయుతమై ఉంటుందో అది గుప్తం.

తదంగవిహితాకాంక్ష స్తద్గుప్తం గూఢమప్యదః ।
యత్రార్థాంతర నిర్భాసో వాక్యాంగ చ్యవనాదిభిః ॥
తదంగవిహితాకాంక్ష స్తచ్చ్యుతం స్యాచ్చతుర్విధమ్ ॥27॥

దీనికే గూఢమని కూడా పేరు. వాక్యాంగ వైకల్యంచే అర్థాంతర ప్రతీతి వికలితాంగమునందు సాకాంక్షమై ఉంటుందో అది చ్యుతం. అది నాలుగు విధాలు.

స్వర వ్యంజన బిందూనాం విసర్గస్య చ విచ్యుతేః ॥28॥

అవి స్వరచ్యుతి, వ్యంజనచ్యుతి, బిందుచ్యుతి, విసర్గచ్యుతి అని నాలుగు విధాలుగా ఉంటుంది.

దత్తేఽపి యత్ర వాక్యాంగే ద్వితీయోఽర్థః ప్రతీయతే ।
దత్తం తదాహుస్తద్భేదాః స్వరాద్యైః పూర్వవన్మతాః ॥29॥

వాక్యాంగం యొక్క వికలాంశం పూర్తి చేసిన పిమ్మట కూడ ద్వితీయార్థప్రతీతి కలిగించేది దత్తాక్షరం. పూర్వం దానివలె దీనికి కూడ స్వరాదులను బట్టి నాలుగు భేదాలు ఉంటాయి.

అపనీతాక్షరస్థానే న్యస్తే వర్ణాంతరేఽపి చ ।
భాసతేఽర్థాంతరం యత్ర చ్యుతదత్తం తదుచ్యతే ॥30॥

లుప్తమైన వర్ణము స్థానంలో మరో అక్షరాన్ని ఉంచినా, అర్థాంతరా భాసాన్ని కలిగించేది చ్యుతదత్తాక్షర.

సుశ్లిష్టపద్యమేకం యన్నానాశ్లోకాంశనిర్మితమ్ ।
సా సమస్యాపరస్యాత్మపరయోః కృతిసంకరాత్ ॥31॥

ఒక పద్యాంశంతో నిర్మితమై, అనేక పద్యాంశాలకు సంబంధించినది సమస్య. ఆ సమస్య పరులది అగును. దానిపూర్తి తనది అగును. ఈవిధంగా స్వపర, కృతిసాంకర్యంచే సమస్య పూర్తి అవుతుంది.

దుఃఖేన కృతమత్యర్థం కవిసామర్థ్య సూచకమ్ ।
దుష్కరం నీరసత్వేపి విదగ్ధానాం మహోత్సవః ॥32॥

చిత్రకావ్యం అతిక్లేశంచే సాధించదగినది. అది కవియొక్క కవితా సామర్థ్యాన్ని సూచిస్తుంది. అది రసహీనమైనా, విద్వాంసులైన వారికి మహోత్సవం.

నియమాచ్చ విదర్భాచ్చ బంధాచ్చ భవతి త్రిధా ।
కవేః ప్రతిజ్ఞా నిర్మాణరమ్యస్య నియమః స్మృతః ॥33॥

నియమం, విదర్భం, బంధం అనే వాటిని బట్టి అది మూడు విధాలు. రమణీయమైన కవిత్వాన్ని చెప్పే కవి యొక్క ప్రతిజ్ఞ నియమం అవుతుంది.

స్థానేనాపి స్వరేణాపి వ్యంజనేనాపి సా త్రిధా ।
వికల్పః ప్రాతిలోమ్యాను లోమ్యాదేవాభిధీయతే ॥34॥

ప్రాతిలోమ్యానులోమ్యం చ శబ్దేనార్థేన జాయతే ।
అనేకధా వృత్తవర్ణ విన్యాసైః శిల్ప కల్పనా ॥35॥

తత్తత్ప్రసిద్ధవస్తూనాం బంధ ఇత్యభిధీయతే ।
గోమూత్రికార్ధ భ్రమణే సర్వతోభద్రమంబుజమ్ ॥36॥

చక్రం చక్రాబ్జకం దండో మురజాశ్చేతి చాష్టధా ।
ప్రత్యర్ధం ప్రతిపాదం స్యాదేకాన్తం సమాక్షరా ॥37॥

ద్విధా గోమూత్రికాం పూర్వామాహురశ్వపదాం పరే ।
అంత్యాం గోమూత్రికాం ధేనుం జాలబంధం వదంతి హి ॥38॥

అది స్థానస్వర వ్యంజనములను బట్టి మూడు విధాలు. ప్రతిలోమ్యాను లోమ్యములచే వికల్పము చేయబడును. ప్రాతిలోమ్యానులోమ్యములు శబ్దాన్ని బట్టి, అర్థాన్ని బట్టి ఏర్పడతాయి. అనేక వృత్తాల వర్ణాలను ఆయా ప్రసిద్ధవస్తువుల ఆకారంతో చిత్రంగా కూర్చడమే బంధం అవుతుంది. బంధం ఎనిమిది భేదాలతో ఉంటుంది. అవి గోమూత్రిక, అర్ధభ్రమకం, సర్వతోభద్రం, కమలం, చక్రం, చక్రాబ్జకం, దండం, మురజం అనే ఎనిమిది విధాలుగా ఉంటుంది. రెండు శ్లోకపాదాలలోను ప్రతిపాదమునందు ఏకైకాక్షరవ్యవధానంచే అక్షరసామ్యం ఉంటే అది గోమూత్రికాబంధం. అది రెండు విధాలు. అందుమొదటిది పూర్వగోమూత్రిక. రెండోది అంత్యగోమూత్రిక. మొదటిదానికి అశ్వపద బంధమని, రెండో దానికి ధేనుజాల బంధమని పేర్లు కూడ చెబుతారు.

అర్థాభ్యామర్ధపాదైశ్చ కుర్యాద్విన్యాసమేతయోః ।
న్యస్తానామిహ వర్ణానామధోఽధః క్రమభాగినామ్ ॥39॥

అర్ధభాగాలు రెండింటియందు ఏకైకాక్షర వ్యవధానమున అక్షరసామ్యం ఉండేది మొదటిది. ఒక్కొక్క పదమునందు ఉండేది రెండోది. వాటిని అర్ధభాగములందు, అర్ధపాదమునందు విన్యాసం చేయాలి.

అధోఽధః స్థితవర్ణానాం యావత్తుర్యపదం నయేత్ ।
తుర్యపాదాన్నయేదూర్ధ్వం పాదార్ధం ప్రాతిలోమ్యతః ॥40॥

క్రమంగా క్రిందక్రిందగా వ్రాసిన వర్ణాలతో, క్రింద క్రింద వ్రాసిన వర్ణాలతో కలుపగా చతుర్థపాదం పూర్తి అయ్యే వరకు నడిపించాలి. చతుర్థపాదం పూర్తి అయిన పిదప అక్షరాలను ప్రతిలోమ క్రమంలో పాదార్ధపర్యంతం పైకి తీసుకొని పోవాలి.

తదేవ సర్వతోభద్రం త్రివిధం సరసీరుహమ్ ।
చతుష్పత్రం తతో విఘ్నం చతుష్పత్రే ఉభే అపి ॥41॥

ఈవిధంగా మూడు విధాలైన సర్వతోభద్రము ఏర్పడుతుంది. ఆ కమలబంధం చతుర్దళం, అష్టదళం, షోడశ దళం అని మూడు విధాలు. చతుర్దళపద్మాన్ని ఈవిధంగా నిర్మించుకోవలసి ఉంటుంది.

అథ ప్రథమపాదస్య మూర్ధన్యం త్రిపదాక్షరమ్ ।
సర్వేషామేవ పాదానామంతే తదుపజాయతే ॥42॥

ప్రథమపాదం యొక్క పై మూడు పదాల అక్షరాలను అన్ని పాదాల చివరను ఉంచాలి.

ప్రాక్పదస్యాంతిమం ప్రత్యక్పాదాదౌ ప్రాతిలోమ్యతః ।
అంత్యపాదాంతిమం చాద్యపాదాదావక్షరద్వయమ్ ॥43॥

పూర్వపాద అంతిమ వర్ణాన్ని ప్రత్యక్పాదాది యందు ప్రాతిలోమ్యక్రమంలో ఉంచాలి. అంతిమపాదం యొక్క అంతిమాక్షర ద్వయాన్ని ప్రథమపాదాదిలో ఉంచాలి. ఈ విధంగా చతుర్దళ కమలం ఏర్పడుతుంది.

చతుశ్ఛదే భవేదష్టచ్ఛదే వర్ణత్రయం పునః ।
స్యాత్షోడశచ్ఛదే త్వేకాంతరం చేదేక మక్షరమ్ ॥44॥

అష్టదళ కమలంలో అంత్యపాదంలోని అంత్యాక్షరత్రయాన్ని ప్రథమపాదం యొక్క ఆదియందు ఉంచాలి. షోడశదళ కమలంలో రెండు అక్షరాల మధ్య కర్ణిక మధ్యలో ఒక అక్షరం,

కర్ణికాంతే లిఖేదూర్ధ్వం పత్రాకారాక్షరావలిమ్ ।
ప్రవేశయేత్కర్ణికాయాం చతుష్పత్ర సరోరుహే ॥45॥

కర్ణిక దాని మధ్య యందు ఒక అక్షరం వ్రాసి, కర్ణికాంతంలో పైభాగంలో పత్రాకారాక్షర పంక్తివ్రాసి దానిని కర్ణికలో చేర్చాలి. ఈ విషయం చతుర్దళ కమల సందర్భంలో చెప్పబడింది.

కర్ణికాయాం లిఖేదేకం ద్వే ద్వే దిక్షు విదిక్షు చ ।
ప్రవేశ నిర్గమౌ దిక్షు కుర్యాదష్టచ్ఛదేఽమ్బుజే ॥46॥

కర్ణిక యందు ఒక అక్షరం వ్రాసి, దిక్కుల యందు, విదిక్కులయందు రెండేసి అక్షరాలు వ్రాసి, ప్రత్యేక దిక్కులందు ప్రవేశనిర్గమ మార్గాలు వ్రాయాలి. ఇది అష్టదళకమల సందర్భంలో చెప్పబడింది.

విష్వగ్విషమవర్ణానాం తావత్పాత్రావలీజుషామ్ ।
మధ్యే సమాక్షరన్యాసః సరోజే షోడశచ్ఛదే ॥47॥

నాలుగు వైపుల ఎన్ని విషమవర్ణాలు ఉన్నాయో, అన్ని పత్రాలు ఏర్పరచి న్యాసం చేసి మధ్య కర్ణిక యందు సమాక్షరాలను ఏకాక్షరరూపంలో న్యాసం చేయాలి. ఇది షోడశదళకమలానికి సంబంధించిన విషయం.

ద్విధా చక్రం చతురరం షడరం తత్ర చాదిమమ్ ।
పూర్వార్ధే సదృశా వర్ణాః పాదప్రథమపంచమాః ॥48॥

అయుజోఽ శ్వయుజైశ్చైవ తుర్యావప్యష్టమావపి ।
తస్యోపపాదప్రాక్ప్రత్యగరేషు చ యథా క్రమమ్ ॥49॥

చతురరము, షడరము అని చక్రబంధం రెండు విధాలు. చతురరమునందు పూర్వార్ధంలో సమవర్ణాన్ని, ప్రతిపాదం యొక్క ప్రథమ పంచమాది విషమవర్ణాలను, చతుర్థ, అష్టమ వర్ణాలను క్రమంగా ఉత్తర, పూర్వ, దక్షిణ, పశ్చిమ అరములందు ఉంచాలి.

స్యాత్పాదార్ధ చతుష్కంతు నాభౌ తస్యాద్యమక్షరమ్ ।
పశ్చిమారావధి నయేన్నేమౌ శేషే పదద్వయీ ॥50॥

ఉత్తర పాదార్ధంలోని అక్షర చతుష్టయాన్ని నాభియందు, దాని ఆద్యక్షరాన్ని వెనుకటి రెండు అరములందును, మిగిలిన రెండు పదములను నేమియందు ఉంచాలి.

తృతీయం తుర్యపాదాంతే ప్రథమౌ సదృశావుభౌ ।
వర్ణౌ పాదత్రయస్యాపి దశమః సదృశో యది ॥51॥

తృతీయాక్షరాన్ని చతుర్థపాదాంతంలోను, ప్రథమ సమవర్ణద్వయాన్ని మూడు పాదాల చివర ఉంచాలి. దశ మాక్షరం సమమయితే,

ప్రథమే చరమే తస్య షడ్వర్ణాః పశ్చిమే యది ।
భవంతి ద్వ్యంతరం తర్హి బృహచ్చక్రముదాహృతమ్ ॥52॥

దానిని ప్రథమారంలోను, ఆరు అక్షరాలను పశ్చిమారంలోను ఉంచాలి. వాటిని రెండేసి అక్షరాల వ్యవధానంతో ఉంచాలి. ఇలా బృహచ్చక్రం ఏర్పడుతుంది.

సమ్ముఖారద్వయే పాదమేకైకం క్రమశో లిఖేత్ ।
నాభౌ తు వర్ణం దశమం నేమౌ తుర్యపదం నయేత్ ॥53॥

ఎదుటనున్న రెండు అరములపై క్రమంగా ఒక్కొక్క పాదాన్ని వ్రాయాలి. నాభిలో దశమాక్షరాన్ని వ్రాసి చతుర్థపాదాన్ని నేమి వద్దకు తీసుకొని వెళ్లాలి.

శ్లోకస్యాద్యన్త దశమాః సమా ఆద్యన్తిమౌ యుజౌ ।
ఆదౌ వర్ణః సమౌ తుర్యపంచమావాద్యతుర్యయో ॥54॥

ద్వితీయ ప్రాతిలోమ్యేన తృతీయం జాయతే యది ।
పదం విదధ్యాత్పత్రస్య దండచక్రాబ్జకం కృతేః ॥55॥

శ్లోకం యొక్క ఆద్యన్తదశ మాక్షరాలూ, ప్రథమ చతుర్థచరణాల ప్రథమ చతుర్థపంచమ వర్ణాలూ సమములుగా ఉండాలి. ద్వితీయ పాదాన్ని విలోమ క్రమంలో చదివితే, తృతీయపాదం ఏర్పడినచో, దానిని పత్రసాధనంలో ఉంచగా దండచక్రాబ్జబంధం ఏర్పడుతుంది.

ద్వితీయౌ ప్రాగ్దలే తుల్యౌ సప్తమౌ చ తథాఽపరౌ ।
సదృశావుత్తరదలౌ ద్వితీయాభ్యా మథార్ధయోః ॥56॥

పూర్వార్ధంలో రెండు పాదాల ద్వితీయాక్షరాలను, ఉత్తరార్ధంలో రెండు పాదాల సప్తమాక్షరాలను సమానంగా ఉంచాలి. ద్వితీయాక్షరాలను బట్టి పూర్వార్ధం, ఉత్తరార్ధం తుల్యములై ఉండాలి.

ద్వితీయషష్ఠాః సదృశాశ్చతుర్థౌ పంచమావపి ।
ఆద్యంతపాదయోస్తుల్యౌ పరార్ధసప్తమావపి ॥57॥

సమౌ తుర్యం పంచమం తు క్రమేణ వినియోజయేత్ ।
తుర్యౌ యోజ్యౌ తు తద్వచ్ఛదలాంతాః క్రమపాదయోః ॥58॥

ద్వితీయ, షష్ఠ, చతుర్థ, పంచమాక్షరాలు తుల్యములై ఉండాలి. ఉత్తరార్ధంలో సప్తమాక్షరం, ప్రథమ చతుర్థపాదాలలో సమానంగా చతుర్థపంచమాక్షరాలను క్రమంగా కూర్చాలి. క్రమపాదాలలో ఉన్న చతుర్థాక్షరాలను, దళాంతవర్ణాలను వెనుకటి వలె స్థాపించాలి.

అర్ధయోరంతిమాద్యౌ తు మురజే సదృశావుభౌ ।
పాదార్ధపతితో వర్ణః ప్రాతిలోమ్యానులోమతః ॥59॥
అంతిమం పరిబధ్నీయాద్యావత్తుర్యమిహాఽదిమత్ ।
పాదాత్తుర్యాద్యదేవాఽఽద్యం నవమాత్ షోడశాదపి ॥60॥

అక్షరాత్పుటకే మధ్యే మధ్యేఽక్షర చతుష్టయమ్ ।
కృత్వాకుర్యాద్యథైతస్య మురజాకారతా భవేత్ ॥61॥

మురజ బంధంలో రెండు శ్లోకార్ధముల అంతిమాద్యక్షరాలు సమానములై ఉండాలి. పాదార్ధమునందున్న వర్ణాలను ప్రాతిలోమ్యానులోమ్యక్రమంలో ఉంచి అంతిమాక్షరం చతుర్థపాదం ఆద్యక్షరమగునట్లు కూర్చాలి. చతుర్థపాద ఆద్యక్షరాన్ని దాని నుంచి నవమషోడశాక్షరాలను పుటకం మధ్య, మధ్య నుంచి నాలుగేసి అక్షరాలను కూర్చాలి. ఈవిధంగా కూరిస్తే మురజాబంధం ఏర్పడుతుంది.

ద్వితీయం చక్రశార్దూల విక్రీడితక సమ్పదమ్ ।
గోమూత్రికా సర్వవృత్తైరన్యేబంధాస్త్వనుష్టుభా ॥62॥

ద్వితీయచక్రం శార్దూలవిక్రీడితంతో చేయవచ్చు. గోమూత్రికా బంధాన్ని అన్ని ఛందస్సులలోను నిర్మించవచ్చు. మిగిలిన బంధాలన్నింటిని అనుష్టుప్ ఛందస్సుచే నిర్మాణం చేయవచ్చు.

నామధేయం యది న చేదమీషు కవికావ్యయోః ।
మిత్రధేయాని తుష్యన్తి నామిత్రః ఖిద్యతే తథా ॥63॥

ఈ బంధాలలో కవి, కావ్యముల నామ ధేయాలు లేకుండా ఉంటే మిత్రులు సంతోషిస్తారు. శత్రువైనవాడు కూడ బాధపడడు.

బాణబాణాసన వ్యోమఖడ్గముద్గర శక్తయః ।
ద్విచతుర్థత్రిశృంగాటా దంభోళిముసలాంకుశాః ॥64॥

పదం రథస్య నాగస్య పుష్కరిణ్యాసి పుత్రికా ।
ఏతే బంధాస్తథా చాన్యే ఏవం జ్ఞేయాః స్వయం బుధైః ॥65॥

బాణం, ధనుస్సు, వ్యోమం, ఖడ్గం, ముద్గరం, శక్తి, ద్విశృంగాటం, త్రిశృంగాటం, చతుఃశృంగాటం, వజ్రం, ముసలం, అంకుశం, రథపదం, నాగపదం, పుష్కరిణి, అసిపుత్రికం ఇత్యాది ఆకారాలలో కూడ చిత్రబంధాలు వ్రాయబడుతూ ఉంటాయి. వీటికన్న అధికంగా ఉన్న చిత్రబంధాలను విద్వాంసులు స్వీయబుద్ధిచే తెలుసుకోవాలి.

ఇత్యాది మహాపురాణే ఆగ్నేయే శబ్దాలంకార కథనం నామ త్రిచత్వారింశదధిక త్రిశతతమోఽధ్యాయః ॥343॥

అగ్నిమహాపురాణంలో శబ్దాలంకార నిరూపణమనే మూడువందల నలభైమూడవ అధ్యాయం సమాప్తం.



చతుశ్చత్వారింశదధిక త్రిశతతమోఽధ్యాయః - మూడువందల నలభైనాల్గవ అధ్యాయం

అర్థాలంకారాః - అర్థాలంకారాలు

అగ్నిరువాచ - అగ్నిదేవుడు ఇలా పలికాడు.

అలంకరణమర్థానా మర్థాలంకార ఇష్యతే ।
తం వినా శబ్దసౌందర్యమపి నాస్తి మనోహరమ్ ॥1॥

వసిష్ఠా! అర్థాలను అలంకరించడం అర్థాలంకారమవుతుంది. అదిలేకుండ శబ్దసౌందర్యం కూడ మనోహరంగా ఉండదు.

అర్థాలంకార రహితా విధవేవ సరస్వతీ ।
స్వరూపమథ సాదృశ్యముత్ప్రేక్షాతిశయావపి ॥2॥

విభావనా విరోధశ్చ హేతుశ్చ సమమష్టధా ।
స్వభావ ఏవ భావానాం స్వరూపమభిధీయతే ॥3॥

అర్థాలంకారహీనమైన వాక్కు నాథుడులేని స్త్రీ వంటిది. స్వరూపం, సాదృశ్యం, ఉత్ప్రేక్ష, అతిశయం, విభావన, విరోధం, హేతువు, సమం అని అర్థాలంకారాలు ఎనిమిది విధాలు. పదార్థాల స్వభావానికి స్వరూపం అని పేరు.

నిజమాగంతుకం చేతి ద్వివిధం తదుదాహృతమ్ ।
సాంసిద్ధికం నిజం నైమిత్తికమాగంతుకం తథా ॥4॥

నిజము, ఆగంతుకము అని స్వరూపం రెండు విధాలు. పుట్టుకతో వచ్చింది నిజం. నిమిత్తాన్ని బట్టి వచ్చేది ఆగంతుకం.

సాదృశ్యం ధర్మసామాన్య ముపమా రూపకం తథా ।
సహోక్త్యర్థాంతరన్యాసావితి స్యాత్తు చతుర్విధమ్ ॥5॥

ధర్మసామ్యమునకు సాదృశ్యం అనిపేరు. అది ఉపమ, రూపకం, సహోక్తి, అర్థాంతరన్యాసం అని నాలుగు విధాలు.

ఉపమా నామ సా యస్యాముపమానోపమేయయోః ।
సత్తా చాంతరసామాన్యయోగిత్వేఽపి వివక్షితమ్ ॥6॥

దేనియందు ఉపమానోపమేయములకు భేదం, సత్త, సామాన్యధర్మబంధం ఉంటుందో అది ఉపమ.

కించిదాదాయ సారూప్యం లోకయాత్రా ప్రవర్తతే ।
సమాసేనాసమాసేన సా ద్విధా ప్రతియోగినః ॥7॥

ఏదో కొంత సాదృశ్యాన్ని ఆధారంగా చేసుకొని లోకయాత్ర నడుస్తూ ఉంటుంది. ససమాస, అసమాస అని అది రెండువిధాలుగా ప్రయోగింపబడుతూ ఉంటుంది.

విగ్రహాదభిధానస్య ససమాసాఽన్యథోత్తరా ।
ఉపమా ద్యోతకపదేనోపమేయపదేన చ ॥8॥

తాభ్యాం చ విగ్రహా త్రేధా ససమాసాన్తిమా త్రిధా ।
విశిష్యమాణా ఉపమా భవన్త్యష్టాదశస్ఫుటాః ॥9॥

ఉపమానం సమస్తమయితే ససమాస. అలాకాకపోతే అసమాస. ఉపమాద్యోతక పదంకాని, ఉపమేయవాచకపదం కాని, లేదా రెండునూ గాని లోపించగా ససమాస మూడు విధాలు అవుతుంది. అసమాసకూడ మూడు విధాలు. విశేషణాలతో ప్రయుక్తమైనపుడు ఉపమ పద్దెనిమిది విధాలు అవుతుంది.

యత్ర సాధారణో ధర్మః కథ్యతే గమ్యతేఽపి వా ।
తే ధర్మవస్తుప్రాధాన్యాద్ధర్మవస్తూపమే ఉభే ॥10॥

తుల్యమేవోపమీయేతే యత్రాన్యోన్యేన ధర్మిణౌ ।
పరస్పరోపమా సా స్యాత్ప్రసిద్ధేరన్యథా తయోః ॥11॥

విపరీతోపమా సా స్యాద్వ్యావృత్తే ర్నియమోపమా ।
అన్యత్రాప్యనువృత్తేస్తు భవేదనియమోపమా ॥12॥

సాధారణ ధర్మాన్ని చెప్పే ఉపమలో ఆ ధర్మానికి ఉన్న ప్రాధాన్యాన్ని బట్టి ధర్మోపమ, వస్తుప్రాధాన్యాన్ని బట్టి వస్తూపమ, ఉపమానోపమేయముల ప్రసిద్ధిని అనుసరించి రెండింటికి సామ్యం చెబితే అది పరస్పరోపమ, ప్రసిద్ధికి విరుద్ధంగా ఉపమానోపమేయాలలో వైషమ్యం ఉంటే అది విపరీతోపమ అవుతుంది. ఒక వస్తువుతో మాత్రమే సామ్యం చెప్పి ఇతరోపమానాలను నిషేధిస్తే నియమోపమ, ఉపమేయం యొక్క గుణాదులు ఉపమానాంతరమునందు కూడ అనువృత్తమయితే అది అనియమోపమ అవుతుంది.

సముచ్చయోపమాతోఽన్య ధర్మబాహుల్యకీర్తనాత్ ।
బహోర్ధర్మస్య సామ్యేఽపి వైలక్షణ్యం వివక్షితమ్ ॥13॥

యదుచ్యతేఽతిరిక్తత్వం వ్యతిరేకోపమా తు సా ।
యత్రోపమాస్యాద్బహుభిః సదృశైః సా బహూపమా ॥14॥

ఒకటికి మించిన ధర్మాలను చెబితే అది సముచ్చయోపమ అనేక ధర్మాలలో సామ్యమున్నప్పటికి ఉపమానము కన్న ఉపమేయము నందు వైలక్షణ్యం ఉన్నట్లు చెబితే అది వ్యతిరేకోపమ. అనేకములుగా ఉపమానాలు చెబితే అది బహూపమ.

ధర్మాః ప్రత్యుపమానం చేదన్యా మాలోపమైవ సా ।
ఉపమానవికారేణ తులనా విక్రియోపమా ॥15॥

ఆ ఉపమానాలలో వేర్వేరు సాధారణ ధర్మాలు ఉన్నచో మాలోపమ. ఉపమేయమును ఉపమాన వికారముగా చెప్పి పోలిక వర్ణిస్తే విక్రియోపమ.

త్రైలోక్యాసంభవి కిమప్యారోప్య ప్రతియోగిని ।
కవినోపమీయతే యా ప్రథతే సాఽద్భుతోపమా ॥16॥

ఉపమానమునందు లోకత్రయమునందును అసంభావ్యమైన ఒక వైశిష్ట్యాన్ని ఆరోపించి కవి వర్ణించి చెబితే అది అద్భుతోపమ.

ప్రతియోగిన మారోప్య తదభేదేన కీర్తనమ్ ।
ఉపమేయస్య సా మోహోపమాఽసౌ భ్రాంతిమద్వచః ॥17॥

ఉపమానమును ఆరోపించి ఉపమేయము దానికన్న భిన్నం కాదని చెప్పి తద్వారా భ్రమ కలిగేటట్లు వర్ణించడం మోహోపమ.

ఉభయోర్ధర్మిణో స్తథ్యానిశ్చయోత్సంశయోపమా ।
ఉపమేయస్య సంశయ్య నిశ్చయాన్నిశ్చయోపమా ॥18॥

రెండు వస్తువుల మధ్య వాటి స్వరూపాన్ని గుర్తించడానికి శక్యం కాకపోతే సంశయోపమ. మొదట సంశయం కలిగి పిదప నిశ్చయం కలిగితే నిశ్చయోపమ.

వాక్యార్థేనైవ వాక్యార్థోపమా స్యాదుపమానతః ।
ఆత్మోపమానాదుపమా సాధారణ్యతిశాయినీ ॥19॥

ఒక వాక్యార్థాన్ని మరోవాక్యార్థానికి ఉపమగా వర్ణిస్తే అది వాక్యార్థోపమ. ఉపమానాన్ని బట్టి సాధారణి, అతిశాయిని అని ఉపమ రెండు విధాలు.

ఉపమేయం యదన్యస్య తదన్యస్యోపమా మతా ।
యద్యుత్తరోత్తరం యాతి తదాఽసౌ గమనోపమా ॥20॥

ఉపమేయమే ఉపమానమయితే అది అన్యోన్యోపమ. ఈవిధంగా ఉత్తరోత్తరం కొనసాగితే అది గమనోపమ.

ప్రశంసా చైవ నిందా చ కల్పితా సదృశీ తథా ।
కించిచ్చ సదృశీ జ్ఞేయా ఉపమా పంచధా పునః ॥21॥

ప్రశంసా, నింద, కల్పితం, సదృశి, కించిత్సదృశి అని మళ్లీ ఉపమలో అయిదు భేదాలు ఉంటాయి.

ఉపమానేన యత్తత్త్వముపమేయస్య రూప్యతే ।
గుణానాం సమతాం దృష్ట్వా రూపకం నామ తద్విదుః ॥22॥

గుణసామ్యంచే ఉపమేయ స్వరూపానికి, ఉపమాన స్వరూపానికి అభేదాన్ని ప్రతిపాదిస్తే రూపకాలంకారం.

ఉపమైవ తిరోభూతభేదా రూపకమేవ వా ।
సహోక్తిః సహభావేన కథనం తుల్య ధర్మిణామ్ ॥23॥

లేదా భేదం తిరోహితమైనపుడు ఉపమేయరూపకం అవుతుంది. తుల్యధర్మాలు ఉన్న రెండు పదార్థాలు కలిసి ఉన్నట్లు వర్ణిస్తే సహోక్తి.

భవేదర్థాంతరన్యాసః సాదృశ్యేనోత్తరేణ సః ।
అన్యథోపస్థితా వృత్తి శ్చేతనస్యేతరస్య చ ॥24॥

పూర్వవర్ణితమైన వస్తువును సమర్థించడానికై సాధర్మ్యమునుగాని, వైధర్మ్యమునుగాని పురస్కరించుకొని మరో అర్థాన్ని ఉపన్యసించడం అర్థాంతరన్యాసం అవుతుంది.

అన్యథా మన్యతే యత్ర తాముత్ప్రేక్షాం ప్రచక్షతే ।
లోక సీమానివృత్తస్య వస్తుధర్మస్య కీర్తనమ్ ॥25॥

సచేతనమయిన పదార్థాన్ని కాని, లేదా అచేతన పదార్థాన్ని కాని ఒక విధంగా ఉండడాన్ని, మరోవిధంగా ఉన్నట్లు ఊహిస్తే ఉత్ప్రేక్షాలంకార మవుతుంది. లోకాతీతంగా వర్ణించడం అతిశయోక్తి అలంకారమవుతుంది.

భవేదతిశయో నామ సంభవాసంభవాద్ద్విధా ।
గుణజాతిక్రియాదీనాం యత్ర వైకల్యదర్శనమ్ ॥26॥

విశేషదర్శనాయైవ సా విశేషోక్తి రుచ్యతే ।
ప్రసిద్ధహేతు వ్యావృత్త్యా యత్కించిత్కారణాంతరమ్ ॥
యత్ర స్వాభావికత్వం వా విభావ్యం సా విభావనా ॥27॥

ఆ అతిశయోక్తి - సంభవం, అసంభవం అని రెండు విధాలు. గుణం, జాతి, క్రియ - ఇత్యాదుల వైకల్యాన్ని (లోపం) చెప్పడం ద్వారా ఒక వస్తువునందలి విశేషాన్ని వర్ణిస్తే అది విశేషోక్తి. ప్రసిద్ధమైన కారణాన్ని నిరాకరించి మరో కారణాన్ని కాని, స్వాభావిక రూపంలో కార్యోత్పత్తినికాని ఊహిస్తే అది విభావనాలంకారం అవుతుంది.

సంగతీ కరణం యుక్త్యాయదసంగచ్ఛమానయోః ।
విరోధ పూర్వకత్వేన తద్విరోధ ఇతి స్మృతమ్ ॥28॥

పరస్పర విరుద్ధాలైన పదార్థములను కలిసియున్నట్లు విరోధపూర్వకమైనా యుక్తపూర్వకంగా వర్ణించడం విరోధాలంకారం.

సిసాధయిషితార్థస్య హేతుర్భవతి సాధకః ॥29॥

కారకో జ్ఞాపక ఇతి ద్విధా సోఽప్యుపజాయతే ।
ప్రవర్తతే కారకాఖ్యః ప్రాక్పశ్చాత్కార్యజన్మనః ॥30॥

అభిలషితార్థసాధకమైన నిమిత్త వర్ణనం హేత్వలంకారం. కారకం, జ్ఞాపకం అని అది రెండు విధాలుగా ఉంటుంది. కారకహేతువు ఏదయితే ఉందో, అది కార్యం యొక్క పుట్టుకకు పూర్వమునందును ఉంటుంది. తరువాత కూడ ఉంటుంది.

పూర్వశేష ఇతిఖ్యాతస్తయోరేవ విశేషయోః ।
కార్యకారణభావాద్వా స్వభావాద్వా నియామకాత్ ॥31॥

జ్ఞాపకాఖ్యస్య భేదోఽస్తి నదీ పూరాది దర్శనమ్ ।
అవినాభావ నియమో హ్యవినాభావదర్శనాత్ ॥32॥

దీనికి పూర్వశేషం అని పేరు. ఆ విశేషములందే కార్యకారణ భావంచే కాని, నియామకమైన స్వభావం చే గాని, అవినాభావదర్శనం చేకాని, అవినాభావనియమం కాని ఉంటే అది జ్ఞాపకహేతువు. నదీ పూరాది దర్శనం జ్ఞాపకానికి ఉదాహరణం.

ఇత్యాది మహాపురాణే ఆగ్నేయే అర్థాలంకార నిరూపణం నామ చతుశ్చత్వారింశదధిక త్రిశతతమోఽధ్యాయః॥344॥

అగ్నిమహాపురాణంలో అర్థాలంకారాలు అనే మూడువందల నలబైనాల్గవ అధ్యాయం సమాప్తం.



పంచచత్వారింశదధిక త్రిశతతమోఽధ్యాయః - మూడువందల నలభైఐదవ అధ్యాయం

శబార్థాలంకారకథనమ్ - శబ్దార్థాలంకారకథనం

అగ్నిరువాచ - అగ్ని ఇలా చెప్పాడు.

శబ్దార్థయోరలంకారో ద్వావలంకురుతే సమమ్ ।
ఏకత్ర నిహితో హారః స్తనం గ్రీవామివ స్త్రియః ॥1॥

ఒక చోట ఉంచిన హారం స్త్రీయొక్క స్తనాన్ని, కంఠాన్ని కూడ అలంకరించినట్లు శబ్దార్థాలంకారం శబ్దార్థములను రెండింటిని అలంకరిస్తుంది.

ప్రశస్తిః కాంతిరౌచిత్యం సంక్షేపో యావదర్థతా ।
అభివ్యక్తిరితి వ్యక్తం షడ్భేదాస్తస్య జాగ్రతి ॥2॥

ప్రశస్తి, కాంతి, ఔచిత్యం, సంక్షేపం, యావదర్థత, అభివ్యక్తి అని అది ఆరువిధాలుగా ఉంటుంది.

ప్రశస్తిః పరవన్మర్మ ద్రవీకరణ కర్మణః ।
వాచో యుక్తిర్ద్విధా సా చ ప్రేమోక్తిస్తుతిభేదతః ॥3॥

ఇతరుల మార్మికతను ద్రవింపజేసేటట్లు ఉండే వాక్కౌశలం ప్రశస్తి. ఆ వచనప్రయోగయుక్తి రెండు విధాలు. అవి ప్రేమోక్తి, స్తుతి అనేవి.

ప్రేమోక్తిస్తుతి పర్యాయౌ ప్రియోక్తి గుణకీర్తనే ।
కాంతిః సర్వమనోరుచ్య వాచ్యవాచక సంగతిః ॥4॥

ఆ ప్రేమోక్తి, స్తుతి అనే వాటికి ప్రియోక్తి, గుణకీర్తనం అని నామాంతరాలు. వాచ్యవాచకాలు చక్కగా కలసి సర్వత్ర మనోరమ్యంగా ఉంటే కాంతి.

యథా వస్తు తథా రీతి ర్యథావృత్తిస్తథా రసః ।
ఊర్జస్విమృదుసందర్భాదౌచిత్యముపజాయతే ॥5॥

ఓజస్సు, మాధుర్యం కలిసిన సందర్భంలో వస్తువును అనుసరించి రీతి, అలాగే వృత్తిని అనుసరించి రసప్రయోగం ఉంటే ఔచిత్యం ప్రాదుర్భావం అవుతుంది.

సంక్షేపో వాచకైరల్పైర్బహోరర్థస్య సంగ్రహః ।
అన్యూనాధికతా శబ్దవస్తునోర్యావదర్థతా ॥6॥

తక్కువ శబ్దాలతో ఎక్కువగా అర్థం వివరించడం సంక్షేపం. శబ్దార్థాల యొక్క అన్యూనాధిక్యం యావదర్థత అనబడుతుంది.

ప్రకటత్వ మభివ్యక్తిః శ్రుతిరాక్షేప ఇత్యపి ।
తస్యా భేదౌ శ్రుతిస్తత్ర శబ్దం స్వార్థసమర్పణమ్ ॥7॥

అర్థప్రకటత్వానికి అభివ్యక్తి అని పేరు. శ్రుతి, ఆక్షేపం అని అది రెండు విధాలు. శబ్దంచే అర్థాన్ని ప్రత్యక్షంగా బోధించడం శ్రుతి.

భవేన్నైమిత్తికీ పారిభాషికీ ద్వివిధైవ సా ।
సంకేతః పరిభాషేతి తతః స్యాత్పారిభాషికీ ॥8॥

అది నైమిత్తికి, పారిభాషికి అని రెండు విధాలు. పరిభాష అనగా సంకేతం. అది కలది పారిభాషికి.

ముఖ్యౌపచారికీచేతి సా చ సా చ ద్విధా ద్విధా ।
స్వాభిధేయస్ఖలద్వృత్తి రముఖ్యార్థస్య వాచకః ॥9॥

పారిభాషికికి ముఖ్య అని, నైమిత్తికికి ఔపచారికి అని పేరు. అది మళ్లీ రెండేసి విధాలు. నైమిత్తికి కూడ మళ్లీ రెండు విధాలు. అభిధేయార్థం చెప్పజాలని శబ్దం ఏదైనా ఒక నిమిత్తంచే

యయా శబ్దో నిమిత్తేన కేనచిత్సౌపచారికీ ।
సా చ లాక్షణికీ గౌణీలక్షణా గుణయోగతః ॥10॥

అముఖ్యమైన అర్థాన్ని బోధిస్తే అది ఔపచారికీ వృత్తి అవుతుంది. అది లక్షణాయోగంచే లాక్షణికి అని, గుణయోగంచే గౌణి అని చెప్పబడతాయి.

అభిధేయా వినా భూతా ప్రతీతి ర్లక్షణోచ్యతే ।
అభిధేయేన సంబంధాత్సామీప్యాత్సమవాయతః ॥11॥

వైపరీత్యాత్క్రియాయోగాల్లక్షణా పంచధా మతా ।
గౌణీ గుణానామానంత్యాదనన్తా తద్వివక్షయా ॥12॥

ఎక్కడ అభిధేయార్థంతో సంబద్ధమైన అన్యార్థం ప్రతీతమవుతుందో అచ్చట లక్షణావృత్తి ఉంటుంది. అభిధేయంతో సంబంధం, సామీప్యం, సమవాయం, వైపరీత్యం, క్రియాయోగం అనే వాటిచే లక్షణ ఐదు విధాలుగా ఉంటుంది. అనంతములైన గుణాల వివక్షను బట్టి గౌణీవృత్తిలో కూడ అనంతభేదాలు ఉంటాయి.

అన్యధర్మస్తతోఽన్యత్ర లోకసీమానురోధినా ।
సమ్యగాధీయతే యత్ర సా సమాధిరిహస్మృతః ॥13॥

లోకవ్యవహారం లెస్సగా తెలుసున్న కవి ప్రస్తుత వస్తువుపై, అప్రస్తుతవస్తు ధర్మాలను పూర్తిగా ఆరోపించి చెబితే దానికి సమాధి అని పేరు.

శ్రుతే రలభ్యమానోఽర్థో యస్మాద్భాతి సచేతనః ।
స ఆక్షేపో ధ్వనిః స్యాచ్చ ధ్వనినా వ్యజ్యతే యతః ॥14॥

శ్రవణ మాత్రంచే తెలియని అర్థం బుద్ధి గోచరమయితే అది ఆక్షేపం. అది ధ్వనిచే వ్యజింపజేయబడుతుంది. కాన దానికి ధ్వని అని పేరు.

శబ్దేనార్థేన యత్రార్థః కృత్వా స్వయముపార్జనమ్ ।
ప్రతిషేధ ఇవేష్టస్య యో విశేషోఽభిధిత్సయా ॥15॥

ధ్వని సంబంధంచే శబ్దార్థాలు మరియొక అర్థాన్ని వ్యంజింపజేస్తాయి. ఒక వస్తువునందు ఉత్కర్షను సూచించడానికిచేసే నిషేధానికిచేసే ఆక్షేపం అనిపేరు.

తమాక్షేపం బ్రువన్త్యత్ర స్తుతం స్తోత్రమిదం పునః ।
అధికారాదపేతస్య వస్తునోఽన్యస్య యా స్తుతిః ॥16॥

యత్రోక్తం గమ్యతేఽన్యోర్థస్తత్సమానవిశేషణః ।
సా సమాసోక్తిరుదితా సంక్షేపార్థతయా బుధైః ॥17॥

అప్రకృతవస్తువును స్తుతించడం, సంబంధవిషయానికి వేరుగా అప్రస్తుతవస్తువును స్తుతించడం అప్రస్తుత ప్రశంస అవుతుంది. ఆ అప్రస్తుతప్రశంస ద్వారా దానిలోని సమానమైన విశేషణాల ద్వారా రెండో అర్థం ప్రతీతమయితే దానిని విద్వాంసులు అర్థసంక్షిప్తతాకారణంచే సమాసోక్తి అంటారు.

అపహ్నుతి రపహ్నుత్య కించిదన్యార్థసూచనమ్ ।
పర్యాయోక్తం యదన్యేన ప్రకారేణాభిధీయతే ॥
ఏషామేకతమస్యేవ సమాఖ్యా ధ్వనిరిత్యతః ॥18॥

వాస్తవిక పదార్థాలు కప్పి పుచ్చి అన్యపదార్థాలను సూచించడం అపహ్నుతి. ఒక విషయాన్ని నేరుగా చెప్పకుండా, మరోవిధంగా త్రిప్పి చెప్పడం పర్యాయోక్తి. వీటిలో ఒకటి ధ్వని అని చెప్పబడుతుంది.

ఇత్యాది మహాపురాణే ఆగ్నేయే శబ్దార్థాలంకార కథనం అనే పంచ చత్వారింశదధికత్రిశతతమోఽధ్యాయః ॥345॥

అగ్నిమహాపురాణంలో శబ్దార్థాలంకార కథనమనే మూడువందల నలభైఐదవ అధ్యాయం సమాప్తం.



షట్చత్వారింశదధిక త్రిశతతమోఽధ్యాయః – మూడువందల నలభైఆరవ అధ్యాయం

కావ్యగుణవివేకః – కావ్యగుణవివేకం

అగ్నిరువాచ – అగ్ని ఇలా పలికాడు.

అలంకృతమపి ప్రీత్యై న కావ్యం నిర్గుణం భవేత్ ।
వపుష్యలలితే స్త్రీణాం హారో భారాయతే పరమ్ ॥1॥

ద్విజశ్రేష్ఠా! గుణరహితమైన కావ్యం అలంకారసహితమైనా ప్రీతిజనకం కాదు. లలితమనోహరం కాని స్త్రీ శరీరంపై హారం మిక్కిలి భారమే అవుతుంది.

న చ వాచ్యం గుణోదోషో భావ ఏవ భవిష్యతి ।
గుణాః శ్లేషాదయో దోషా గూఢార్థాద్యాః పృథక్కృతాః ॥2॥

దోషం లేకపోవటమే గుణముకదా! గుణాలను ఇంక ఎందుకు చెప్పడం అని అనకూడదు. ఎందువల్లనంటే శ్లేషాదిగుణాలు, గూఢార్థాదిదోషాలు వేరువేరుగా చెప్పబడ్డాయి.

యః కావ్యే మహతీం ఛాయామానుగృహ్ణాత్యసౌ గుణః ।
సంభవత్యేష సామాన్యో వైశేషిక ఇతి ద్విధా ॥3॥

ఏది కావ్యంలో శోభాతిశయాన్ని కలగజేస్తుందో అదే గుణం. గుణం – సామాన్యం వైశేషికం అని రెండు విధాలు.

సర్వసాధారణీభూతః సామాన్య ఇతి మన్యతే ।
శబ్దమర్థముభౌ ప్రాప్తః సామాన్యో భవతి త్రిధా ॥4॥

సర్వసాధారణమైన విషయం సామాన్యం అనబడుతుంది. అది శబ్దం, అర్థం, శబ్దార్థసంబంధం అని మూడు విధాలుగా ఉంటుంది.

శబ్దమాశ్రయతే కావ్యం శరీరం యః స తద్గుణః ।
శ్లేషోలాలిత్యగాంభీర్యౌ సౌకుమార్యముదారతా ॥5॥

సత్యేవ యౌగికీ చేతి గుణాః శబ్దస్య సప్తధా ।
సుశ్లిష్టసన్నివేశత్వం శబ్దానాం శ్లేష ఉచ్యతే ॥6॥

కావ్య శరీరమైన శబ్దాన్ని ఆశ్రయించేది శబ్ద గుణం. అది శ్లేష, లాలిత్యం, గాంభీర్యం, సౌకుమార్యం, ఉదారత, ఓజస్సు, యౌగికి అని ఏడు విధాలు. శబ్దముల సమ్మేళన సన్నివేశం (చక్కగా చిక్కగా కూర్చడం) శ్లేష అవుతుంది.

గుణాదేశాదినా పూర్వం పదసంబద్ధమక్షరమ్ ।
యత్ర సంధీయతే నైవ తల్లాలిత్యముదాహృతమ్ ॥7॥

గుణం, ఆదేశం, వృద్ధి ఇత్యాదుల ద్వారా పూర్వపదాక్షర సంబంధి సంధి అక్షరాలకు లేకుండా ఉంటే అది లాలిత్యం అవుతుంది.

విశిష్ట లక్షణోల్లేఖలేఖ్యముత్తాన శబ్దకమ్ ।
గాంభీర్యం కథయన్త్యార్యాస్తదేవాన్యేషు శబ్దతామ్ ॥8॥

ఉత్తమభావవ్యంజకరమైన శబ్దసమూహం విశిష్టలక్షణాలతో కూడుకొన్నదైతే, దానిని ఆర్యులు గాంభీర్యమని అంటారు. దానికే శబ్దత అని పేరు.

అనిష్ఠురాక్షరప్రాయ శబ్దతా సుకుమారతా ।
ఉత్తాన పదతౌదార్యయుతం శ్లాఘ్యై ర్విశేషణైః ॥9॥

నిష్ఠురాక్షరాలులేని శబ్దాలు అధికంగా ఉంటే అది సౌకుమార్యం. శ్లాఘ్యమైన విశేషణాలతో కూడిన ఉత్కృష్టపదముల ప్రయోగం ఔదార్యం అవుతుంది. దానికే ఉత్తానపదత అని పేరు.

ఓజః సమాస భూయస్త్వమేతత్పద్యాది జీవితమ్ ।
ఆబ్రహ్మస్తంబపర్యన్తామోజసైకేన పౌరుషమ్ ॥10॥

సమాస బాహుల్యం ఓజస్సు. ఇది పద్యాదులకు జీవితం. బ్రహ్మ మొదలు తృణపర్యంతం ఉన్న జీవుల పౌరుషాన్ని ఓజోగుణవిశిష్టశబ్దాలతోనే వర్ణించడం వీలవుతుంది.

ఉచ్యమానస్య శబ్దేన యేనకేనాపి వస్తునః ।
ఉత్కర్షమావహన్నర్థో గుణ ఇత్యభిధీయతే ॥11॥

ఏ శబ్దములైనా ప్రయోగించి, ఆయా వర్ణింపబడే వస్తువుల ఉత్కర్షను సూచించేది అర్థగుణం అనబడుతుంది.

మాధుర్యం సంవిధానం చ కోమలత్వముదారతా ।
ప్రౌఢిః సామయికత్వం చ తద్భేదాః షట్ చకాసతి ॥12॥

మాధుర్యం, సంవిధానం, కోమలత్వం, ఉదారత, ప్రౌఢి, సామయికత అని అర్థగుణభేదాలు ఆరు.

క్రోధేర్ష్యాకార గాంభీర్యం మాధుర్యం ధైర్యగాహితా ।
సంవిధానం పరికరః స్యాదపేక్షిత సిద్ధయే ॥13॥

క్రోధం, ఈర్ష్యమున్నగు వాటియందు కూడ ఆకారగాంభీర్యం, ధైర్యం ఉండుట మాధుర్యం. అపేక్షించే కార్యసిద్ధికోసమై చేసే ప్రయత్నం పరికరం.

యత్కాఠిన్యాది నిర్ముక్త సన్నివేశ విశిష్టతా ।
తిరస్కృత్యైవ మృదుతా భాతి కోమలతేతి సా ॥14॥

కాఠిన్యం మున్నగు దోషాలు లేని మృదువైన సన్నివేశంలా ఆ కఠిన సన్నివేశం గురించి తిరస్కరించి వర్ణిస్తే ఆ గుణం కోమలత అనే గుణం అవుతుంది.

లక్ష్యతే స్థూలలక్ష్యత్వప్రవృత్తే ర్యత్ర లక్షణమ్ ।
గుణస్య తదుదారత్వ మాశయస్యాతి సౌష్ఠవమ్ ॥15॥

ఎక్కడ స్థూలలక్ష్యం యొక్క ప్రవృత్తి లక్షణ లక్షితమవుతుందో, ఔదార్యాన్ని సూచిస్తూ ఆశయాన్ని అతిసుందరంగా ప్రకటిస్తే అది ఉదారత.

అభిప్రేతం ప్రతియతో నిర్వాహస్యోపపాదికాః ।
యుక్తయో హేతు గర్భిణ్యః ప్రౌఢాప్రౌఢిరుదాహృతా ॥16॥

అభీష్టమైన విషయాన్ని ప్రతిపాదిస్తూ, తన్నిర్వాహమును సమర్థిస్తూ చెప్పే హేతుగర్భయుక్తులకు ప్రౌఢి అని పేరు.

స్వతంత్రస్యాన్యతంత్రస్య బాహ్యాంతః సమయోగతః ।
తత్ర వ్యుత్పత్తిరర్థస్య యా సామయికతేతి సా ॥17॥

స్వతంత్రం కాని, పరతంత్రం కాని అయిన కార్యం యొక్క బాహ్యాంతర సంయోగంచే కలిగే అర్థవ్యుత్పత్తికి సామయికత అని పేరు.

శబ్దార్థావుపకుర్వాణో నామ్నోభయగుణః స్మృతః ।
తస్య ప్రసాదః సౌభాగ్యం యథాసంఖ్యప్రశస్తతా ॥18॥

శబ్దార్థాలు రెండింటికి ఉపయోగంగా ఉండేది ఉభయగుణం అనబడుతుంది. అది ప్రసాదం, సౌభాగ్యం, యథాసంఖ్యం, ప్రశస్తత,

పాకోరాగ ఇతిప్రాజ్ఞైః షట్ ప్రపంచవిపంచితాః ।
సుప్రసిద్ధార్థ పదతాప్రసాద ఇతి గీయతే ॥19॥

పాకం, రాగం అని ప్రాజ్ఞుల ద్వారా లోకాన్ని తరచి చూచేవారిచే ఆరు విధాలుగా చెప్పబడుతుంది. సుప్రసిద్ధార్థములైన పదాల ప్రయోగం ప్రసాదం.

ఉత్కర్షవాన్గుణః కశ్చిద్యస్మిన్నుక్తే ప్రతీయతే ।
తత్సౌభాగ్యముదారత్వం ప్రవదంతి మనీషిణః ॥20॥

దేనిని వర్ణించగా ఉత్కర్షసూచితమవుతుందో అట్టి వర్ణనం సౌభాగ్యం. గొప్పదైనదని బుద్ధిమంతులు చెపుతారు. దీనినే ఉదారత్వమని మనీషులంటారు.

యథాసంఖ్యమనుద్దేశః సామాన్యమతిదిశ్యతే ।
సమయే వర్ణనీయస్య దారుణస్యాపి వస్తునః ॥21॥

అదారుణేన శబ్దేన ప్రాశస్త్యముపవర్ణనమ్ ।
ఉచ్చైః పరిణతిః కాఽపి పాక ఇత్యభిధీయతే ॥22॥

తుల్యవస్తువులను క్రమంగా చెప్పడం యథాసంఖ్యం. వర్ణించదగిన దారుణవస్తువును సమయానుసారంగా అదారుణ శబ్దాలచే వర్ణించడం ప్రాశస్త్యం. పదార్థం యొక్క ఉన్నత పరిణతి పాకం అనబడుతుంది.

మృద్వీకానారికేలామ్బుపాక భేదాచ్చతుర్విధః । (ద్వివిధః)
ఆదావన్తే చ సౌరస్యం మృద్వీకా పాక ఏవ సః ॥23॥

అది మృద్వీకా (ద్రాక్షా) పాకం, నారికేలాంబుపాకం అని రెండు విధాలు. ఆది నుంచి అంతం వరకు రసభరితమైనది మృద్వీకా పాకం.

కావ్యేచ్ఛయా విశేషా యః సరాగ ఇతి గీయతే ।
అభ్యాసోపహితః కాంతిం సహజామపి వర్తతే ॥24॥

కావ్యంలోని ఛాయా విశేషానికి రాగం అని పేరు. అభ్యాసవశంచే ఇది సహజ కాంతిని కూడ అతిశయించి ఉంటుంది.

హారిద్రశ్చైవ కౌసుంభో నీలీరాగశ్చ స త్రిధా ।

వైశేషిక పరిజ్ఞేయో యః స్వలక్షణ గోచరః ॥25॥

ఒకానొక విశేషలక్షణంచే అనుభవానికి వచ్చే దానిని వైశేషిక గుణమందురు. హరిద్రారాగం, కౌసుంభరాగం, నీలిరాగం అని రాగం మూడు విధాలు. స్వలక్షణ గోచరమైనది అనగా అనన్యసాధారణమైన ధర్మం వైశేషికం.

ఇత్యాది మహాపురాణే ఆగ్నేయే కావ్యగుణవివేక కథనమ్ నామ షట్చత్వారింశదధిక త్రిశతతమోఽధ్యాయః ॥346॥

అగ్నిమహాపురాణంలో కావ్యగుణవివేక కథనమనే మూడువందల నలభైఆరవ అధ్యాయం సమాప్తం.



సప్తచత్వారింశదధిక త్రిశతతమోఽధ్యాయః - మూడువందల నలభైఏడవ అధ్యాయం

కావ్యదోషవివేకః - కావ్యదోషవివేకం

అగ్నిరువాచ - అగ్ని ఇలా చెప్పాడు.

ఉద్వేగజనకో దోషః సభ్యానాం స చ సప్తధా ।
వక్తృవాచకవాచ్యానామేక ద్వి త్రి నియోగతః ॥1॥

దోషం సభ్యులకు ఉద్వేగాన్ని కలిగిస్తుంది. వక్తృ, వాచక, వాచ్యాలలో ఏక, ద్వి, త్రియోగంచే ఇది ఏడువిధాలు.

తత్ర వక్తా కవిర్నామ ప్రథతే స చ భేదతః ।
సందిహానోఽవినీతః సన్నజ్ఞో జ్ఞాతా చతుర్విధః ॥2॥

అక్కడ వక్త అనగా కవి చెప్పబడతాడు. సందిహానుడు, అవినీతుడు, అజ్ఞుడు, జ్ఞాత అని వక్త నాలుగు విధాలు.

నిమిత్తపరిభాషాయామర్థసంస్పర్శివాచకమ్ ।
తద్భేదౌ పదవాక్యే ద్వే కథితం లక్షణం ద్వయోః ॥3॥

నిమిత్తాన్ని సంకేతాన్ని అనుసరించి అర్థాన్ని బోధించే శబ్దం వాచకం. పదం, వాక్యం అని దీని రెండు భేదాలు ఇది వరకే చెప్పబడ్డాయి.

అసాధుత్వాప్రయుక్తత్వే ద్వావేవ పదనిగ్రహౌ ।
శబ్దశాస్త్రవిరుద్ధత్వమసాధుత్వం విదుర్బుధాః ॥4॥

అసాధుత్వం, అప్రయుక్తత్వం అని పదదోషాలు రెండు. వ్యాకరణశాస్త్రానికి విరుద్ధంగా చెప్పడం అసాధుత్వం అని విద్వాంసులు చెబుతారు.

వ్యుత్పన్నైరనిబద్ధత్వమప్రయుక్తత్వముచ్యతే ।

ఛాందసత్వమవిస్పష్టత్వం చ కష్టత్వమేవ చ ॥
తదసామయికత్వం చ గ్రామ్యత్వం చేతి పంచధా ॥5॥

అప్రసిద్ధమైన పదాన్ని ప్రయోగించడం అప్రయుక్తత్వమని వ్యుత్పన్నులు చెబుతారు. అది ఛాందసత్వం, అవి స్పష్టత్వం, కష్టత్వం, అసామయికత్వం, గ్రామ్యత్వం అని ఐదు విధాలుగా ఉంటుంది.

ఛాందసత్వం న భాషాయామవిస్పష్టత్వమబోధతః ॥6॥

గూఢార్థతా విపర్యస్తార్థతా సంశయితార్థతా ।
అవిస్పష్టార్థతా భేదాస్తత్ర గూఢార్థతేతి సా ॥7॥

లోకంలో ప్రయోగించని వైదిక శబ్దాలు ప్రయోగించడం ఛాందసత్వం. అర్థం స్పష్టం కాకుండా ఉండడం అవిస్పష్టత్వం. దీనిలో గూఢార్థత, విపర్యస్తార్థత, సంశయితార్థత అని అవిస్పష్టార్థత మూడు విధాలుగా ఉంటుంది. అందు గూడార్థత అనగా –

యత్రార్థో దుఃఖసంవేద్యే విపర్యస్తార్థతా పునః ।
వివక్షితాన్యశబ్దార్థప్రతిపత్తిర్మలీమసా ॥8॥

అర్థం మిక్కిలి శ్రమవల్ల కాని తెలియరానిది. వివక్షితార్థానికి విపరీతమైన అర్థాన్ని బోధించడం విపర్యస్తార్థత.

అన్యార్థత్వాసమర్థత్వే ఏతామేవోపసర్పతః ।
సందిహ్యమానవాచ్యత్వమాహుః సంశయితార్థతామ్ ॥9॥

అన్యార్థత్వం, అసమర్థత్వం అనే దోషాలు కూడ విపర్యస్తార్థత్వంలో అంతర్గతమవుతాయి. అర్థం సందిగ్ధంగా ఉంటే అది సంశయితార్థత్వం అవుతుంది.

దోషత్వమనుబధ్నాతి సజ్జనోద్వేజనాదృతే ।
అసుఖోచ్చార్యమాణత్వం కష్టత్వం సమయాచ్యుతిః ॥10॥

అసామయికతా నేయామేతాం చ మునయో జగుః ।
గ్రామ్యతా తు జఘన్యార్థప్రతిపత్తిః ఖలీకృతా ॥11॥

ఇది సహృదయులకు ఉద్వేగకరం కానిచో దోషం కాదు. ఉచ్చారణకు కష్టంగా ఉండడం కష్టత్వం. కవి సమయవిరుద్ధత్వం అసామయికత్వం. దీనికే నేయ అని కూడ పేరు. నీచార్థాన్ని బోధించడం గ్రామ్యతాదోషం.

వక్తవ్య గ్రామ్యవాచ్యస్య వచనాత్స్మరణాదపి ।
తద్వాచక పదేనాభిసామ్యాద్భవతి సా త్రిధా ॥12॥

నింద్యమైన గ్రామ్యార్థాన్ని చెప్పడం, దానిని స్మరించడం, తద్వాచక పదసామ్యాన్ని గ్రహించడం అని గ్రామ్యతాదోషంలో మూడు భేదాలు ఉన్నాయి.

దోషః సాధారణః ప్రాతిస్వికోఽర్థస్య స తు ద్విధా ।
అనేక భాగుపాలంభః సాధారణ ఇతి స్మృతః ॥13॥

సాధారణం, ప్రాతిస్వికం అని అర్థదోషం రెండు విధాలు. అనేక గతదోషం సాధారణంగా చెప్పబడుతుంది.

క్రియాకారకయోర్భ్రంశో విసంధిః పునరుక్తతా ।
వ్యస్తసంబంధతా చేతి పంచసాధారణా మతాః ॥14॥

క్రియాభ్రంశం, కారకభ్రంశం, విసంధి, పునరుక్తత, వ్యక్తసంబంధత అని సాధారణ దోషం అయిదు విధాలుగా ఉంటుంది.

అక్రియత్వం క్రియాభ్రంశో భ్రష్టకారకతా పునః ।
కర్త్రాది కారకాభావో విసంధిః సంధిదూషణమ్ ॥15॥

క్రియ లేకపోవడం క్రియాభ్రంశం. కర్త్రాది కారకాలు లేకపోవడం కారకభ్రంశం. సంధిదోషం విసంధి.

విగతో వా విరుద్ధోవా సంధిః సభవతి ద్విధా ।
సంధేర్విరుద్ధతా కష్టమపదార్థాంతరాగమాత్ ॥16॥

సంధిలేకపోవడం, విరుద్ధసంధి అని విసంధి రెండు విధాలు. విరుద్ధములగు పదాలచే అర్థాంతరం బోధింపబడడంవల్ల విరుద్ధసంధి దుష్టమైనది.

పునరుక్తత్వమాభీక్ష్ణ్యాదభిమానం ద్విధైవ తత్ ।
అర్థావృత్తిః పదావృత్తి రర్థావృత్తిరపి ద్విధా ॥17॥

ఏదైనా ఒక విషయాన్ని అభిమానంతో మాటిమాటికి చెప్పడం పునరుక్తత్వం అవుతుంది. అర్థావృత్తి, పదావృత్తి అని అది రెండు విధాలు. అర్థావృత్తి కూడ మళ్లీ రెండు విధాలు.

ప్రయుక్తవరశబ్దేన తథా శబ్దాంతరేణ చ ।
నాఽఽవర్తతే పదావృత్తౌ వాచ్యమావర్తతే పదమ్ ॥18॥

కావ్యప్రయుక్తమైన శ్రేష్ఠమైన శబ్దంచేత, శబ్దాంతరంచేత ఏర్పడు పదావృత్తిచే అర్థావృత్తి కలుగదు. పదమాత్రానికే ఆవృత్తి ఏర్పడుతుంది.

వ్యస్తసంబంధతా సుష్ఠుసంబంధో వ్యవధానతః ।
సంబంధాంతర నిర్భాసాత్సంబంధాంతర జన్మనః ॥19॥

అభావేఽపి తయోరంత ర్వ్యవధానా త్రిధైవ సా ।
అంతరా పదవాక్యాభ్యాం ప్రతిభేదం పునర్ద్విధా ॥20॥

దూరంగా ఉన్న పదాల అన్వయం వ్యస్త సంబంధత, సంబంధాంతర ప్రతీతి, సంబంధాంతర జన్యత్వం, ఏతదుభయాల యొక్క అభావం అనే వాటిచే వ్యస్త సంబంధిత్వానికి మూడు భేదాలు ఉంటాయి. (పద వాక్యాలయందు అర్థ, అర్థ్య మానభేదంచే వాచ్యార్థం రెండు విధాలు). పై మూడింటియందు పదవ్యవధాన, వాక్యవ్యవధానాలచే మూడేసి భేదాలు ఏర్పడతాయి.

వాచ్యమర్థార్థ్యమానత్వాత్తద్ద్విధా పదవాక్యయోః ।
వ్యుత్పాదితం పూర్వవాచ్యం వ్యుత్పాద్యం చేతి భిద్యతే ॥21॥

పదవాక్యాలయందు అర్థ, అర్థ్యమానభేదంచే వాచ్యార్థం రెండు విధాలుగా ఉంటుంది. వ్యుత్పాదితం, వ్యుత్పాద్యం అని పదవాచ్యార్థం రెండు విధాలు.

ఇష్ట వ్యాఘాతకారిత్వం హేతోః స్యాదసమర్థతా ।
అసిద్ధత్వం విరుద్ధత్వమనైకాంతికతా తథా ॥22॥

హేతువు అభీష్టసిద్ధికి వ్యాఘాతమయితే అది దుష్టం అవుతుంది. అసమర్థత, అసిద్ధత, విరుద్ధత్వం, అనైకాంతికత,

ఏవం సత్ప్రతిపక్షత్వం కాలాతీతత్వ సంకరః ।
పక్షే సపక్షే నాస్తిత్వం విపక్షేఽస్తిత్వమేవ తత్ ॥23॥

కావ్యేషు పారిషద్యానాం న భవేదప్యరుంతుదమ్ ।
ఏకాదశ నిరర్థత్వం దుష్కరాదౌ న దుష్యతి ॥24॥

సత్ప్రతిపక్షత్వం, కాలాతీతత్వం, సంకరం, పక్షాభావం, సపక్షాభావం, విపక్షాస్థిత్వం, నిరర్థత్వం అనేవి పదకొండు హేతుదోషాలుగా ఉంటాయి. ఇష్టవ్యాఘాతకారిత్వం అనే దోషం కావ్యనాటకాలలో సహృదయ సభాసదులకు మార్మిక పీడ కలిగిస్తుంది. దోషజ్ఞులకు దుఃఖం కలిగిస్తుంది.

దుఃఖీకరోతి దోషజ్ఞాన్గూఢార్థత్వం న దుష్కరే ।
నగ్రామ్యతోద్వేగకారీ ప్రసిద్ధేర్లోకశాస్త్రయోః ॥25॥

దుష్కరములైన చిత్రబంధాది కావ్యాలలో నిరర్థత్వం దోషం కాదు. గూఢార్థత్వం కూడ దోషం కాదు. లోకశాస్త్రాలలో ప్రసిద్ధమైనచో గ్రామ్యత్వం దోషం కాదు.

క్రియాభ్రంశేన లక్ష్మాస్తి క్రియాధ్యాహార యోగతః ।
భ్రష్టకారకతాక్షేప బలాధ్యాహృతకారకే ॥26॥

క్రియను అధ్యాహారం చేసుకోవడానికి అవకాశం ఉంటే క్రియాభ్రంశం దోషం కాదు. కారకాన్ని అధ్యాహారం చేసుకోవడానికి వీలున్నచో కారకభ్రంశం దోషం కాదు.

ప్రగృహ్యే గృహ్యతే నైవం క్షతం విగత సంధినా ।
కష్టపాఠా ద్విసంధిత్వం దుర్వచాదౌ న దుర్భగమ్ ॥27॥

ప్రగృహ్యసంజ్ఞను బట్టి ప్రకృతిభావం వచ్చిన చోట విసంధిత్వం దోషం కాదు. సంధి చేస్తే ఉచ్చరించడం కష్టమయితే విసంధిత్వం దోషం కాదు.

అనుప్రాసే పదావృత్తి ర్వ్యస్తసంబంధతా శుభా ।
నార్థసంగ్రహణే దోషో వ్యుత్క్రమాద్యైర్నలిప్యతే ॥28॥

అనుప్రాసలో పదావృత్తి ఉన్నప్పుడు వ్యస్తసంబంధత్వం దోషం కాదు. అర్థసంగ్రహంలో అర్థావృత్తి దోషం కాదు. కాని వ్యుత్క్రమాదులు మాత్రం దోషం.

విభక్తి సంజ్ఞాలింగానాం యత్రోద్వేగో న ధీమతామ్ ।
సంఖ్యాయాస్తత్ర భిన్నత్వముపమానోపమేయయోః ॥29॥

ఉపమానోపమేయములలో విభక్తి సంజ్ఞాలింగవచనాలలో భేదం ఉన్నప్పటికి, బుద్ధిమంతులకు ఉద్వేగం కలిగించనంతవరకు అవి దోషాలు కావు. ఉద్వేగాన్ని కలిగించని దోషాలు దోషకరములు కావు.

అనేకస్య తథైకేన బహూనాం బహుభిః శుభా ।
కవీనాం సముదాచారః సమయో నామ గీయతే ॥30॥

అనేక వస్తువులకు ఒక వస్తువుతోను, అనేక వస్తువులకు అనేక వస్తువులతోను ఔపమ్యం చెప్పినా దోషం లేదు. కవి జనపరంపరచే అంగీకృతమైన సదాచారానికి సమయం అని పేరు.

సామాన్యశ్చ విశిష్టశ్చ ధర్మవద్భవతి ద్విధా ।
సిద్ధసైద్ధాంతికానాం చ కవీనాం వా వివాదతః ॥31॥

యః ప్రసిధ్యతి సామాన్య ఇత్యసౌ సమయో మతః ।
సర్వే సైద్ధాంతికా యేన సంచరంతి నిరత్యయమ్ ॥32॥

దేని ఆధారంగా సమస్త సిద్ధాంతవాదులు నిర్వివాదంగా సంచరిస్తారో, కొందరు మాత్రమే ఆ సమయాలను అనుసరిస్తారో ఈ పక్షద్వయమునందు కూడా కారణసమయం రెండు భేదాలతో ఉంటుంది. అవే సామాన్యం, విశిష్టం అని రెండు విధాలు.

కియన్త ఏవ వాయేన సామాన్యస్తేన సద్విధా ।
భేద సిద్ధాంతతోఽన్యః స్యాత్కేషాంచిద్భ్రాంతితో యథా ॥33॥

తర్కజ్ఞానం మునేః కస్య కస్యచిత్ క్షణభంగికా ।
భూతచైతన్యతా కస్య జ్ఞానస్య సుప్రకాశతా ॥34॥

ఏదైనా ఒక సిద్ధాంతాన్ని అనుసరించడం చేతను, భ్రాంతిచేతను ఈ మతభేదం ఏర్పడుతుంది. కొంత మంది మునుల సిద్ధాంతానికి తర్కం ఆధారం. కొంతమందికి క్షణభంగం ఆధారం. పంచభూత సంఘాతం వల్ల శరీరంలో చైతన్యం వస్తుందని కొందరంటారు. ప్రకాశమగు జ్ఞానమే చైతన్యమని కొందరు అంటారు.

ప్రజ్ఞాత స్థూలతా శబ్దానేకాంతత్వం తథార్థతః ।
శైవ వైష్ణవ శాక్తేయ సౌరసిద్ధాంతినాం మతిః ॥35॥

కొందరు ప్రజ్ఞాత స్థూలతావాదులు, కొందరు శబ్దానేకాంతతావాదులు ఈ జగత్తుకు బ్రహ్మకారణమని, శైవ, వైష్ణవ, శాక్తేయ, సౌర సిద్ధాంతవాదులు అంగీకరిస్తారు.

జగతః కారణం బ్రహ్మ సాంఖ్యానాం సప్రధానకమ్ ।
అస్మిన్ సరస్వతీలోకే సంచరంతః పరస్పరమ్ ॥36॥

కాని సాంఖ్యులు దృశ్య జగత్తుకు బ్రహ్మ ప్రధాన కారణమని చెబుతారు. ఈవిధంగా సరస్వతీలోకంలో సంచరించేవారు పరస్పరం వాదం చేసుకొంటారు.

బధ్నంతి వ్యతిపశ్యన్తో యద్విశిష్టః స ఉచ్యతే ।
పరిగ్రహాదపృసతాం సతామేవాపరిగ్రహాత్ ॥37॥

వీరు చెప్పే విభిన్న మార్గాలు విశిష్ట సమయాలు. అసత్తును గ్రహించడం, సత్తును పరిత్యజించడం అనే విధంగా అవి యుక్తివాదాలు.

భిద్యమానస్య తస్యాయం ద్వైవిధ్యముపగీయతే ।
ప్రత్యక్షాది ప్రమాణైర్యద్బాధితం తదసద్విదుః ॥38॥

ఈ విధమైన భిన్నవాదంవల్ల విశిష్టసమయం రెండు విధాలుగా ఉంటుంది. ప్రత్యక్షాది ప్రమాణాలచే బాధితమైనది అసత్తు.

కవిభిస్తత్ప్రతిగ్రాహ్యం జ్ఞానస్య ద్యోతమానతా ।
యదేవార్థక్రియాకారి తదేవ పరమార్థసత్ ॥39॥

దేనియందు జ్ఞానప్రకాశం ఉండునో, ఆ మతాన్నే కవులు గ్రహించాలి. ఏది అర్థక్రియాకారియో అదే పరమార్థసత్.

అజ్ఞానాత్ జ్ఞానతస్త్వేకం బ్రహ్మైవ పరమార్థసత్ ।
విష్ణుః స్వర్గాదిహేతుః సశబ్దాలంకార రూపవాన్ ।
అపరా చ పరా విద్యా తాం జ్ఞాత్వా ముచ్యతే భవాత్ ॥40॥

అజ్ఞానానికి, జ్ఞానానికి అతీతంగా ఏకమాత్రమైన బ్రహ్మ ఉంటుంది. ఆ పరమార్థసత్ తెలుసుకోదగినది. అదియే సృష్టి పాలన సంహారహేతువగు విష్ణువు అవుతుంది. అదే శబ్దం, అలంకారం స్వరూపంగా ఉంటుంది. అదియే పరాపరవిద్య. దానిని తెలిసినవాడే సంసారబంధం నుంచి విముక్తుడు అవుతాడు.

ఇత్యాది మహాపురాణే ఆగ్నేయే కావ్యదోష వివేకకథనం నామ సప్తచత్వారింశదధిక త్రిశతతమోఽధ్యాయః ॥347॥

అగ్నిమహాపురాణంలో కావ్యదోష వివేకమనే మూడువందల నలభైఏడవ అధ్యాయం సమాప్తం.



అష్టచత్వారింశదధిక త్రిశతతమోఽధ్యాయః – మూడువందల నలభైఎనిమిదవ అధ్యాయం

ఏకాక్షరాభిధానమ్ – ఏకాక్షరకోశ నిరూపణం

అగ్నిరువాచ – అగ్ని ఇలా అన్నాడు.

ఏకాక్షరాభిధానం చ మాతృకాన్తం వదామి తే ।
అవిష్ణుః ప్రతిషేధః స్యాదాపితామహవాక్యయోః ॥1॥

వసిష్ఠా! ఏకాక్షరకోశాన్ని, మాతృకానామాలు, ఆ మంత్రాలు ఇపుడు చెబుతాను. అ=విష్ణువు, నిషేధము, ఆ=బ్రహ్మ, వాక్యమునందు కూడ ఇది ఉపయోగపడుతుంది.

సీమాయామవ్యయం వాఽథ భవేత్సంక్రోధపీడయోః ।
ఇః కామే రతిలక్ష్మ్యోరీ ఉఃశివే రక్షకాద్య ఊః ॥2॥

ఆ కారం 'సీమా' అనే అర్థంలో అవ్యయం. క్రోధం, పీడ అని కూడ దీనికి అర్థం కలదు. ఇ=మన్మథుడు, ఈ=రతి, లక్ష్మి, ఉ=శివుడు, ఊ=రక్షకాదులు.

ఋ శబ్దే చాదితీ ౠ స్యాత్ ఌ ౡ తే వై దితౌ గుహే ।
ఏ దేవీ ఐ యోగినీ స్యాదో బ్రహ్మా ఔ మహేశ్వరః ॥3॥

ఋ=శబ్దము, ౠ=అదితి, ఌ ౡ=దితి, కుమారస్వామి, ఏ=దేవి, ఐ=యోగిని, ఓ=బ్రహ్మ, ఔ=మహేశ్వరుడు.

అం కామః అః ప్రశస్తః స్యాత్కో బ్రహ్మాదౌ కు కుత్సితే ।
ఖం శూన్యేంద్రియముఖం గోగంధర్వే చ వినాయకే ॥4॥

అం=మన్మథుడు, అః=ప్రశస్తము, కః=బ్రహ్మాదులు, కు=కుత్సితము, ఖ=శూన్యము, ఇంద్రియము, గ=గంధర్వుడు, వినాయకుడు.

గం గీతే గో గాయనే స్యాద్ఘోఘంటా కింకిణీ ముఖే ।
తాడనే ఙశ్చ విషయే స్పృహాయాం చైవ భైరవే ॥5॥

గం=గీతము (న॥లిం) గ= గాయకుడు, ఘ=గంట, కింకిణి మున్నగునవి, తాడనం, ఙ=విషయము, స్పృహ, భైరవుడు.

చో దుర్జనే నిర్మలే ఛశ్ఛేదే జిర్జయనే తథా ।
జం గీతే ఝః ప్రశస్తే స్యాద్బలే ఞో గాయనే చ టః ॥6॥

చ=దుర్జనుడు, నిర్మలము, ఛ=ఛేదనము, జి=విజయము, జం=గీతము, ఝ=ప్రశస్తము, ఞ=బలము, ట=గానము.

ఠశ్చంద్రమండలే శూన్యే శివే చోద్బంధనే మతః ।
డశ్చరుద్రేధ్వనౌ త్రాసే ఢక్కాయాం ఢోధ్వనౌమతః ॥7॥

ఠ=చంద్రమండలం, శూన్యం, శివుడు, ఉరిపోసుకొనుట, డ=రుద్రుడు, ధ్వని, త్రాసము, ఢ=ఢక్క, ఢక్కాధ్వని.

ణో నిష్కర్షే నిశ్చయే చ తశ్చౌరే క్రోఢపుచ్ఛకే ।
భక్షణే థశ్ఛేదనే దోధారణే శోభనే మతః ॥8॥

ణ–నిష్కర్షము, నిశ్చయము; త=తస్కరుడు, వరాహపుచ్ఛము, థ=భక్షణము, ద=ఛేదనము, ధారణము, శోభనము.

ధో ధాతరించ ధూస్తూరే నోన్నందే సుగతే తథా ।
ప ఉపవనే విఖ్యాతః ఫశ్చ ఝంఝానిలే మతః ॥9॥

ధ=ధాత (బ్రహ్మ), ధుత్తూరము, న=సమూహము, బుద్ధుడు, ప= ఉపవనము, పూ=ఝంఝావాతము (ఫ)

ఫుః ఫుత్కారే నిష్ఫలే చ విః(బిః) పక్షీభం చ తారకే ।
మాశ్రీర్మానం చ మాతాస్యాద్యాగే యో యాతృవీరణే ॥10॥

ఫు(పు)=ఘూత్కారము, నిష్ఫలము, బి(వి)=పక్షి, భ=నక్షత్రము, మా=లక్ష్మి, మానము, మాత, య=యాగము, యాత, ఈరిణ వృక్షము.

రోవహ్నౌ బలశక్రే చ లోవిధాతరి ఈరితః ।
విశ్లేషణే వో వరుణే శయనే శశ్చ శం సుఖే ॥11॥

ర=అగ్ని, బలము, ఇంద్రుడు, ల=విధాత, వ=విశ్లేషణము, వరుణుడు, శ=శయనము, శం=సుఖము.

షః శ్రేష్ఠే సః పరోక్షే చ సా లక్ష్మీః సంకచేమతః ।
ధారణే హస్తధా రుద్రే క్షఃక్షేత్రే చాక్షరే మతః ॥12॥

ష=శ్రేష్ఠము, స=పరోక్షము, సా=లక్ష్మి, స=కేశము, హ=ధారణము, రుద్రుడు, క్ష=క్షేత్రము, అక్షరము, మున్నగునది.

క్షో నృసింహే హరౌ తద్వత్ క్షేత్రపాలకయోరపి ।
మంత్రఏకాక్షరో దేవో భుక్తిముక్తి ప్రదాయకః ॥13॥

క్ష=నృసింహుడు, హరి, క్షేత్రము, పాలకుడు మున్నగునవి. (క్షత్రియుడు) ఏకాక్షరమంత్రం దేవతారూపం. భుక్తిముక్తిప్రదాయము.

క్షౌం హయ శిరసే నమః సర్వవిద్యాప్రదో మనుః ।
అకారాద్యాస్తథా మంత్రామాతృకామంత్ర ఉత్తమః ॥14॥

"క్షౌం హయశిరసే నమః" ఇది అన్ని విద్యలను ఇచ్చే మంత్రం. అకారాది అక్షరాలు తొమ్మిది మంత్రములే. వీటికి ఉత్తమ మాతృకామంత్రాలని పేరు.

ఏక పద్మేఽర్చయేదేతాన్నవదుర్గాశ్చ పూజయేత్ ।
భగవతీ కాత్యాయనీ కౌశికీ చాథ చండికా ॥15॥

ప్రచండా సురనాయికా ఉగ్రా పార్వతీ దుర్గయా ॥16॥

వీటిని ఒక కమలదళంలో స్థాపించి పూజించాలి. వీటిపై భగవతి, కాత్యాయని, కౌశికి, చండిక, ప్రచండ, సురనాయిక, ఉగ్ర, పార్వతి, దుర్గ అనే నవదుర్గలను పూజించాలి.

ఓం చండికాయై విద్మహే భగవత్యై ధీమహి తన్నో దుర్గా ప్రచోదయాత్ ॥
క్రమాది తు షడంగం స్యాద్గణో గురుర్గురుః క్రమాత్ ॥17॥

"ఓం చండికాయై.... ప్రచోదయాత్" ఇది దుర్గామంత్రం. దీనిని షడంగాది క్రమంలో పూజించాలి. (ఇది గురువులకే గురువైన గణమంత్రం).

అజితాఽపరాజితా చాథ జయా చ విజయా తతః ॥18॥

కాత్యాయనీ భద్రకాలీ మంగలా సిద్ధిరేవతీ ।
సిద్ధాదివటుకాః పూజ్యా హేతుకశ్చ కపాలికః ॥
ఏకపాదో భీమరూపో దిక్పాలాన్మధ్యతో నవ ॥19॥

అజిత, అపరాజిత, జయ, విజయ, కాత్యాయని, భద్రకాలి, మంగళ, సిద్ధి, రేవతి, సిద్ధాదివటుక, ఏకపాద, భీమరూప, హేతుక, కాపాలికలను పూజించాలి. మధ్య భాగంలో తొమ్మండుగురు దిక్పాలకులను పూజించాలి.

హ్రీం దుర్గే దుర్గే రక్షణి స్వాహా మంత్రార్థసిద్ధయే ॥20॥

మంత్రసిద్ధికోసమై "హ్రీం దుర్గే దుర్గే రక్షణి స్వాహా" అనే మంత్రాన్ని జపించాలి.

గౌరీ పూజ్యా చ ధర్మాద్యాః స్కందాద్యాః శక్తయో యజేత్ ।
ప్రజ్ఞాజ్ఞానాక్రియా వాచా వాగీశీ జ్వాలినీ తథా ॥21॥

వామాజ్యేష్ఠా చ రౌద్రీ చ గౌరీ హ్రీం చ పురః సరా ।
హ్రీం సః మహాగౌరీ రుద్రద్రియతే స్వాహేతి వా ॥22॥

గౌరీ పూజ చేసి ధర్మాదులను, స్కందాదులను, శక్తులను పూజించాలి. ప్రజ్ఞా, జ్ఞానక్రియావాచా, వాగీశీ, జ్వాలినీ, వామా, జ్యేష్ఠా, రౌద్రా, గౌరీ, హ్రీదేవతలను పూజించి పురస్సరాదేవిని "హ్రీం సః మహాగౌరీ రుద్రద్రియతే స్వాహా" అనే మంత్రంతో పూజించాలి.

జ్ఞానశక్తిః క్రియాశక్తిః సుభగా లలితా తథా ।
కామినీ కామమాలా చ ఇంద్రాద్యాః శక్తిపూజనమ్ ॥23॥

మహాగౌరిని, జ్ఞానశక్తి, క్రియాశక్తి, సుభగ, లలిత, కామిని, కామమాల, ఇంద్రాది శక్తులను కూడ పూజించాలి. వీటిని ఏకాక్షర మంత్రంతో చేయాలి.

ఓం గం స్వాహా మూలమంత్రోఽయం గం వా గణపతయే నమః ।
షడంగో రక్తశుక్లశ్చ దంతాక్షపరశూత్కటః ॥24॥

"ఓం గం స్వాహా" ఇది గణపతి మూలమంత్రం. లేదా "గం గణపతయే నమః" అను మంత్రంతో కూడ పూజ చేయవచ్చు. రక్త, శుక్ల, దంత, నేత్ర, పరశూత్కట, మోదక – ఇవి షడంగములు అని చెప్పబడతాయి.

సమోదకోఽథ గంధాది గంధోల్కా యేతి చ క్రమాత్ ।
గజోమహాగణపతి ర్మహోల్కః పూజ్య ఏవ చ ॥25॥

"గంధోల్కాయ నమః" ఇత్యాది క్రమంలో గంధాదులను నివేదించాలి. గజమహాగణపతి, మహోల్కపూజ కూడ చేయాలి.

కూష్మాండాయ, ఏకదంతాయ, త్రిపురాంతకాయ, శ్యామదంతవికట హరహాసాయ, లంబనాసాననాయ, పద్మదంష్ట్రాయ, మేఘోల్కాయ, ధూమోల్కాయ, వక్రతుండాయ, విఘ్నేశ్వరాయ, వికటోత్కటాయ, గజేంద్రగమనాయ భుజగేంద్రహారాయ శశాంకధరాయ గణాధిపతయే స్వాహా ॥26॥

ఏతైర్మనుభిః స్వాహాన్తైః పూజ్యః తిలహోమాదినార్థభాక్ ।
కాద్యైరాబీజ సంయుక్తైస్తైరాద్యైశ్చ నమోఽన్త కైః ॥27॥

మంత్రాః పృథక్పృథగ్వాస్యుర్ద్విరేఫ ద్విర్ముఖాక్షిణః ।
కాత్యాయనం స్కంద ఆహ యత్తద్వ్యాకరణం వదే ॥28॥

"కూష్మాండాయ" మొదలు "గణాధిపతయే స్వాహా" వరకు ఉండే మూలోక్తమంత్రాలకు కకారాది, ఏకాక్షర బీజాలు ముందుచేర్చి, అంతంలో "నమః స్వాహా" శబ్దాలు ప్రయోగించి వినియోగించాలి. తిలహోమం చేసి దేవతా పూజ చేయాలి. ద్విరేఫ, ద్విర్ముఖ, ద్వ్యక్ష, ఆది మంత్రాలు వేరు వేరుగా ఉండవచ్చు. ఇపుడు స్కందుడు కాత్యాయనునకు చెప్పిన వ్యాకరణాన్ని చెబుతాను.

ఇత్యాది మహాపురాణే ఆగ్నేయే ఏకాక్షరాభిధానం నామ అష్టచత్వారింశదధిక త్రిశతతమోఽధ్యాయః ॥348॥

అగ్నిమహాపురాణంలో ఏకాక్షర కోశనిరూపణమనే మూడువందల నలభైఎనిమిదవ అధ్యాయం సమాప్తం.

ఏకోనపంచాశదధిక త్రిశతతమోऽధ్యాయః - మూడువందల నలభైతొమ్మిదవ అధ్యాయం

వ్యాకరణసారః - వ్యాకరణసారం

స్కంద ఉవాచ - స్కందుడు ఇలా పలికాడు.

వక్ష్యే వ్యాకరణం సారం సిద్ధశబ్ద స్వరూపకమ్ ।
కాత్యాయన నిబోధాయ బాలానాం బోధనాయ చ ॥1॥

కాత్యాయనా! బాలకుల జ్ఞానం కొరకై, వారికి బోధించుటకొరకై వ్యాకరణసారమైన సిద్ధశబ్ద స్వరూపం గురించి చెబుతాను.

ప్రత్యాహారాదికాః సంజ్ఞాః శాస్త్రసంవ్యవహారగాః ॥2॥

శాస్త్రవ్యవహారాలకు ఉపయోగించే ప్రత్యాహారాది సంజ్ఞలను గురించి చెబుతాను.

అఇఉణ్, ఋ్ఌ క్, ఏఓఙ్, ఐఔచ్, హయవరట్, లణ్,
ఞమఙణనమ్, ఝభఞ్, ఘఢధష్, జబగడదశ్ ॥3॥

ఖఫఛఠథ చటతవ్, కపయ్, శషసర్, హల్,
ఇతి ప్రత్యాహారః ॥4॥

"అ ఇ ఉ ణ్" మొదలు 'హల్' వరకు ఉండేవి మాహేశ్వర సూత్రాలు. ఇదే వర్ణసమామ్నాయం. "అణ్" మున్నగునవి ప్రత్యాహారం అని వ్యవహారం.

ఉపదేశ ఇద్ధలంత్యం భవేదజనునాసికః ।
ఆదివర్ణో గృహ్యమాణోऽప్యన్యైనేతా సహైవ తు ॥5॥
తయోర్మధ్యగతానాం స్యాద్గ్రాహకః స్వస్య తద్యథా ॥6॥

ఉపదేశావస్థయందు అంత్యమైన హల్లు, అనునాసికమైన అచ్చు ఇత్సంజ్ఞకాలు. అంతిమమైన ఇత్సంజ్ఞక వర్ణంతో కలిపి చెప్పబడిన ఆది వర్ణం తనకును, మధ్యనున్న వర్ణాలకు గ్రాహకం.

అణ్, ఏఙ్, అట్, యఞ్, (యయ్), యఞ్, ఛవ్, (ఛబ్) ఝమ్ (ఝష్), భష్, అక్, ఇక్, ఉక్, అణ్, ఇణ్, యణ్, పరేణ ణకారేణ. అమ్, యమ్, ఙమ్, అచ్, ఇచ్, ఏచ్, ఐచ్, అయ్, మయ్, ఝమ్, ఖయ్, జవ్, జశ్, ఝవ్, ఝర్, ఖవ్, ఖర్, చవ్ (చర్), యర్, శవ్, శర్, అస్, అశ్, హస్, హశ్, బస్, బశ్, భస్, భశ్, ఝశ్, హల్, హల్, బల్, వల్, రల్, ఝల్, శల్, ఇతి ప్రత్యాహారాః ॥ 7 ॥

"అణ్" మొదలు "శల్" వరకు ఉండేవి ప్రత్యాహార సంజ్ఞలు కలవి. ఇవి కొన్ని ఉదాహరణములు.

ఇత్యాది మహాపురాణే ఆగ్నేయే వ్యాకరణ సారవర్ణనం నామ ఏకోన పంచాశదధిక త్రిశతతమోऽధ్యాయః ॥349॥

అగ్నిమహాపురాణంలో వ్యాకరణ సారమనే మూడువందల నలభైతొమ్మిదవ అధ్యాయం సమాప్తం.

పంచాశదధిక త్రిశతతమోఽధ్యాయః - మూడువందల యాభైయవ అధ్యాయం

సంధిసిద్ధరూపకథనమ్ - సంధిసిద్ధరూపకథనం

స్కంద ఉవాచ - స్కందుడు ఇలా చెప్పాడు.

వక్ష్యే సంధిం సిద్ధరూపం స్వరసంధిమథాఽఽదితః ।
దండాగ్రం సాఽఽగతా దధీదం నదీహతే మధూదకమ్ ॥1॥

సంధి యొక్క సిద్ధరూపాలను ముందు చెబుతాను. ముందు స్వరసంధి గురించి చెబుతాను. దండ+అగ్రం, సా+ఆగతా, దధి+ఇదమ్, నదీ+ఈహతే, మధు+ఉదకమ్.

పితౄషభః, ౡకారశ్చ తవేదం సకలోదకమ్ ।
అర్ధర్చోఽయం తవల్కారః సైషా సైంద్రీ తవౌదనమ్ ॥2॥

పితృ+ఋషభః, (సవర్ణంచే ౡకారం కూడ గ్రాహ్యం), తవ+ఇదం, సకల+ఉదకమ్, అర్ధ+ఋచః+అయం, తవ+కారః, సా+ఏషా, సా+ఐంద్రీ, తవ+ఓదనమ్,

ఖట్వౌఘోఽభవదిత్యేవం వ్యసుధీర్వస్వలంకృతమ్ ।
పిత్రర్థోపవనం దాత్రీ నాయకో లావకో నయః ॥3॥

ఖట్వా+ఔఘః, ఇతి+ఏవం, వి+అసుధీః, వసు+అలంకృతమ్, పితృ+అర్థ+ఉపవనం, దాతృ+ఈ, నై+అకః, లౌ+అకః, నే+అః,

దండాగ్రమ్....పితౄషభః, వరకు సవర్ణ దీర్ఘసంధులు
తవేదమ్...... తవల్కారః వరకు గుణసంధులు
సైషా....ఖట్వౌఘః వరకు వృద్ధి సంధులు
ఇత్యేవం...దాత్రీ వరకు యణాదేశ సంధులు
నాయకః.....నయః వరకు అయవాయావావ సంధులు

త ఇహ తయి హేత్యాది తేఽత్రయోఽత్రజలేఽర్కజమ్ ।
ప్రకృతిం నో అహో ఏహి అ అవేహి ఇ ఇంద్రకమ్ ॥4॥

ఉ ఉత్తిష్ఠ కవీ ఏతౌ వాయూఏతౌ వనే ఇమే ।
అమీ ఏతే యజ్ఞభూతే ఏహి దేవ ఇమం నయ ॥5॥

తే+ఇహ=తయ్+ఇహ=త ఇహ (లోపః శాకల్యస్య), యకారము లోపిస్తే త ఇహ, తయిహ, తే+అత్ర, యో+అత్ర, జలే+అర్కజమ్- వీటిలో అకారం లోపం వస్తుంది. (ఏఙః పదాన్తాదతి).

అహెూ+ఏహి, అ+అవేహి, ఇ+ఇంద్రకమ్, ఉ+ఉత్తిష్ఠ, కవీ+ఏతౌ, వాయూ+ఏతౌ, వనే+ఇమే, అమీ+ఏతే, యజ్ఞ భూతే ఏహిదేవ ఇమం నయ (ఇవి ప్రకృతి భావసంధులు. వీటిలో సంధి రాదు).

వక్ష్యే సంధిం వ్యంజనానాం వాగ్యతోஉజేక మాతృకః ।
షడేతే తదిమే బాది వాఙ్నీతిః షణ్ముఖాదికమ్ ॥6॥

ఇపుడు వ్యంజన సంధిని గురించి చెబుతాను. వాక్+యతః, అచ్+ఏకమాతృకః, అప్+ఆది, షట్+ఏతే, తత్+ఇమే, వాక్+నీతిః, షట్+ముఖః ఇవన్నీ హల్సంధులు.

వాఙ్ మనసం వాగ్భవాదిర్వాక్ఛ్ క్ష్ణం తచ్ఛరీరకమ్ ।
తల్లునాతి తచ్చరేచ్చ కుఙ్ఙాస్తే సుగణ్ణిహ ॥7॥

వాక్+మనసం, వాక్+భవాది, వాక్+శ్లక్ష్ణం, తత్+శరీరకమ్, తత్+లునాతి, తత్+చరేత్, కుఙ్+ఆస్తే, సుగణ్+ఇహ.

భవాంశ్చరన్ భవాంశ్ఛాత్రో భవాంష్టీకా భవాంష్ఠకః ।
భవాంస్తీర్థం భవాంస్థేయాన్ భవా ల్లేఖా భవాంజయః ॥8॥

భవాన్+చరన్, భవాన్+ఛాత్రః, భవాన్+టీకా, భవాన్+ఠకః, భవాన్+తీర్థమ్, భవాన్+స్థేయాన్, భవాన్+లేఖా, భవాన్+జయః,

భవాంఛేతే భవాఞ్శేతే భవాం ఞ శేతే భవాణ్డీనః ।
త్వం భర్తా, త్వఙ్కరిష్యాదిః సంధిర్జ్ఞేయో విసర్గతః ॥9॥

భవాన్+శేతే=భవాఞ్ ఛేతే, భవాఞ్ఛ్ఛేతే, భవాఞ శేతే, భవాన్+డీనః, త్వమ్+భర్తా, త్వమ్+కరిష్యసి ఇవన్నీ హల్సంధులకు ఉదాహరణములు ఇక విసర్గసంధులు.

కశ్ఛింద్యాత్ కశ్చరేత్ కష్టఃకష్ఠః కఃస్థశ్చ కశ్చలేత్ ।
కఃఖనేత్ కఃకరోతి స్మ కఃపఠేత్ కఃఫలేత వా ॥10॥

కః+ఛింద్యాత్, కః+చరేత్, కః+టః, కః+ఠః, కః+స్థః, కః+చలేత్ కః+ఖనేత్, కః+కరోతి, కః+పఠేత్, కః+ఫలేత,

కశ్శ్వశురః క్వఃశ్వశురః కస్సావరః కఃసావరః ।
కఃఫలేత కఃశయితా కోஉత్రయోధః క ఉత్తమః ॥11॥

క్వః+శ్వశురః=క్వశ్శశురః, క్వఃశ్వశురః, కః+సావరః=కస్యావరః, కఃస్వరః, కః+ఫలేత, కః+శయితా, కః+అత్ర, కః+ఉత్తమః

దేవాఏతే భో ఇహ సాదరా యాంతి భగో[వ్రజ ।
సుపూః సుదూరా[త్రిర[త్ర వాయుర్యాతి పునర్నహి ॥12॥


దేవాః+ఏతే, భోః+ఇహ, సాదరాః+యాంతి,భగోః+[వ్రజ, సుపూః+సు, సుదుర్+రా[త్రిః, రా[త్రిః+అ[త్ర, వాయుః+యాతి, పునః+నహి, పునః+రా[త్రి.

పునరేతి సయాతీహ ఏషయాతి క ఈశ్వరః ।
జ్యోతీరూపం తవచ్ఛ[త్రం మ్లేచ్ఛధీశ్ఛి[ద్రమాచ్ఛిదత్ ॥13॥

పునః+ఏతి, సః+యాతి, ఇహ ఏషః+యాతి, కః+ఈశ్వరః, జ్యోతిః+రూపమ్, తవ+ఛ[త్రం, ఇత్యాదులన్నీ విసర్గ సంధులు. మ్లేచ్ఛధీః+ఛి[ద్రమ్.

ఇత్యాది మహాపురాణే ఆగ్నేయే సంధి సిద్ధరూపకథనం నామ పంచాశదధిక [త్రిశతతమోఽధ్యాయః ॥350॥

అగ్నిమహాపురాణంలో సంధి సిద్ధరూపకథనమనే మూడువందల యాభైయవ అధ్యాయం సమాప్తం.



ఏక పంచాశదధిక త్రిశతతమోऽధ్యాయః - మూడువందల యాభైఒకటవ అధ్యాయం

సుబ్విభక్తి సిద్ధరూపమ్ - సుబ్విభక్తి సిద్ధరూపం

స్కంద ఉవాచ - స్కందుడు ఇలా చెప్పాడు.

విభక్తి సిద్ధరూపం చ కాత్యాయన వదామి తే ।
ద్వే విభక్తీ సుప్తిఙశ్చ సుపః సప్త విభక్తయః ॥1॥

కాత్యాయనా! ఇప్పుడు నీకు విభక్తి యొక్క సిద్ధరూపాలను చెబుతాను. సుప్పులు, తిఙ్లులు అని విభక్తులు రెండు విధాలు. సుప్పులలో ఏడు విభక్తులు ఉంటాయి.

సుఔజసితి ప్రథమా అమౌట్ శసోద్వితీయా ।
టాభ్యాం భిసితి తృతీయా ఙేభ్యాం భ్యసశ్చతుర్థ్యపి ॥2॥

ఙసిభ్యాం భ్యసః పంచమీస్యాత్ ఙసోసామితి షష్ఠ్యపి ।
ఙిఓత్యుబితి సప్తమీస్యాత్ స్యుఃప్రాతిపదికాత్పరాః ॥3॥

సు, ఔ, జస్ - ప్రథమ, అమ్, ఔట్, శస్-ద్వితీయ, టాభ్యాంభిస్ - తృతీయ, ఙేభ్యాంభ్యస్ - చతుర్థి ఙసిభ్యాంభ్యస్ - పంచమి, ఙస్, ఓస్, ఆమ్ -షష్ఠి, ఙి, ఓ, సప్-సప్తమీ, ఇవి ప్రాతిపదికములకు పరంగా వస్తాయి.

ద్వివిధం ప్రాతిపదికం హ్యజన్తం చ హలంతకమ్ ।
ప్రత్యేకం త్రివిధం తత్ స్యాత్ పుమాన్ స్త్రీ చ నపుంసకమ్ ॥4॥

అజంతములు, హలంతములు అని ప్రాతిపదికములు రెండు విధాలు. అవి మళ్లీ పుంలింగ, స్త్రీలింగ, నపుంసక లింగములని మూడేసి విధాలు.

దృశ్యంతే నాయకా స్తేషామనుక్తానాం చ వీర్యతః ।
వృక్షః సర్వోऽథ పూర్వశ్చ ప్రథమశ్చ ద్వితీయకః ॥5॥

పుంలింగాది శబ్దాలలో నాయకుల దిగ్దర్శనం ఇందు చెప్పబడుతుంది. ఇక్కడ చెప్పబడని వాటికి వృక్షాది శబ్దాలకు సమానమైనది నాయకములు. వీటిలో వృక్షః, సర్వః, పూర్వః, ప్రథమః, ద్వితీయః

తృతీయః ఖండపా వహ్నిః సఖాపతి రహర్పతిః ।
పటుర్గ్రామణీంద్రశ్చ ఖలపూర్మిత్రభూః స్వభూః ॥6॥

తృతీయః, ఖండపాః, వహ్నిః, సఖా, పతిః, అహర్పతిః, పటుః, గ్రామణీః, ఇంద్రః, ఖలపూః, మిత్రభూః, స్వభూః,

సుశ్రీః సుధీః పితా భ్రాతా నాకర్తా క్రోష్టునప్తృకౌ ।
సురారాగౌస్తథాద్యౌర్గ్లౌః స్వరాన్తాః పుంసినాయకాః ॥7॥

సుశ్రీః, సుధీః, పితా,భ్రాతా, నా (నృశబ్దం), కర్తా, క్రోష్టా, నప్తా, సురాః, రాః, గౌః, ద్యౌః, గ్లౌః - ఈ అజంతశబ్దాలు పుంలింగంలో నాయకశబ్దాలు.

సువాక్ త్వక్ పృషత్సమ్రాట్ జన్మభాక్చ సురాడపి ।
ఆపో మరుద్భవన్దీవ్యన్ భవాంశ్చ మఘవాన్ పిబన్ ॥8॥

సువాక్, త్వక్, పృషత్, సమ్రాట్, జన్మభాక్, సురాట్, ఆపః, (అయమ్), మరుత్, భవన్, దీవ్యన్, భవాన్, మఘవాన్, పిబన్,

భగవానఘవానర్వా వహ్నిమత్సర్వ విత్సుపృత్ ।
సుసీమా కుండీరాజా చ శ్వాయువామఘవా తథా ॥9॥

భగవాన్, అఘవాన్, అర్వా, వహ్నిమాన్, సర్వవిత్, సుపృత్, సుసీమా, కుండీ, రాజా, శ్వా, యువా, మఘవా,

పూషా సుకర్మా యజ్వా చ సువర్మా చ సుధర్మణా ।
అర్యమావృత్రహా పంథాః సుకకుదాది పంచ చ ॥10॥

పూషా, సుకర్మా, యజ్వా, సువర్మా, సుధర్మ, అర్యమా, వృత్రహా, పంథాః, సుకకుప్ (అష్ట), పంచ,

ప్రశాన్ సుతాంశ్చ పంచాద్యాః సుద్యౌః సుభ్రాట్ సుపూరపి ।
చంద్రమాః సువచాః శ్రేయాన్ విద్వాంశ్చోశనసా సహ ॥11॥

ప్రశాన్, సుత్వాన్, ప్రాజ్, సుద్యౌః (సుగౌః), సుభ్రాట్ (సురాః), సుపూః, చంద్రమాః, సువచాః, శ్రేయాన్, విద్వాన్, ఉశనా,

పేచివాన్గౌరనడ్వాన్ గోధుఙ్మిత్రధ్రుహౌ ఉ_శ్వలిట్ ।
స్త్రియాం జాయా జరాబాలా ఏడకా సహవృద్ధయా ॥12॥

పేచివాన్, అనడ్వాన్, గోధుక్, మిత్రధ్రుక్, ముక్, లిట్- ఇటువంటివన్నీ హలంత పుంలింగ నాయక శబ్దాలు. ఇప్పుడు స్త్రీలింగనాయక స్వరూప శబ్దాలు చెబుతాను. జాయా, జరా, బాలా, ఏడకా, వృద్ధా,

క్షత్రియా బహురాజా చ బహుదామాఽథ బాలికా ।
మాయా కౌముదగంధా చ సర్వా పూర్వా సహాన్యయా ॥13॥

క్షత్రియా, బహురాజా, బహుదా, మా, (బహుదామా), బాలికా, మాయా, కౌముదగంధా, సర్వా, పూర్వా, అన్యా,

ద్వితీయా చ తృతీయా చ బుద్ధిః స్త్రీశ్రీర్నదీ సుధీః ।
భవన్తీ చైవ దీవ్యన్తీ భాతీ భాంతీ చ యాన్త్యపి ॥14॥

ద్వితీయా, తృతీయా, బుద్ధి, స్త్రీ, శ్రీః, నదీ, సుధీః, భవన్తీ, దీవ్యన్తీ, భాతీ, భాంతీ, యాంతీ,

శృణ్వతీ తుదతీ కర్త్రీ తుదంతీ కుర్వతీ మహీ ।
రుంధతీ క్రీడతీ దాంతీ పాలయంతీ సురాణ్యపి ॥15॥

శృణ్వతీ, తుదతీ, కర్త్రీ, తుదంతీ, కుర్వతీ, మహీ, రుంధతీ, క్రీడతీ, క్రీడంతీ, దాంతీ, పాలయంతీ, సురాణీ,

గౌరీ పుత్రవతీ నౌశ్చ వధూర్దేవతయా భువా ।
తిస్రోద్వే కతివర్షాభూః స్వసామాతా వరా చ గౌః ॥16॥

గౌరీ, పుత్రవతీ, నౌః, వధూః, దేవతా, భూః, తిస్రః, ద్వే, కతి, వర్షాభూః, స్వసా, మాతా, అవరా, గౌః,

ద్యౌర్వాక్త్వక్ప్రా చ్యావాచీతి తిరశ్చీ సముదీచ్యపి ।
శరద్విద్యుత్సరిద్యోషి దగ్నివిత్సస్యదా దృషత్ ॥17॥

ద్యౌః, వాక్, త్వక్, ప్రాచీ, అవాచీ, తిరశ్చీ, ఉదీచీ, శరద్, విద్యుత్, సరిత్, యోషిత్, అగ్నివిత్, సస్యదా, (సంపద్) దృషత్,

యైషా సా వేదవిత్సంవిద్బహ్వీ రాజ్ఞీ త్వయా మయా ।
సీమా పంచాదయో రాకా ధూఃపూశ్చైవ దిశా గిరా ॥18॥

చతస్రో విదుషీ చైవ కేయందిక్ దృక్చ తాదృశీ ।
అసౌ స్త్రియాం నాయకాశ్చ నాయకాశ్చ నపుంసకే ॥19॥

యా, ఏషా, సా, వేదవిత్, సంవిత్, (ద్), బహ్వీ, రాజ్ఞీ, త్వయా, మయా (యుష్మద్, అస్మద్, శబ్దాలు మూడు లింగాలలోను సమాన రూపాలు – ఇవి తృతీయైక వచన రూపాలు), సీమా, పంచ, ఆది, (సంఖ్యావాచక నాంతశబ్దం), రాకా, ధూః, పూః, దిశా, గిరా, చతస్రః, విదుషీ, కా, ఇయం, దిక్, దృక్, తాదృక్, తాదృశీ, అసౌ ఇవన్నీ స్త్రీలింగనాయక శబ్దాలు. ఇపుడు నపుంసక లింగనాయక శబ్దాలను గురించి చెబుతాను.

కుండం సర్వం సోమపంచ దధివారి ఖలప్వథ ।
మధు త్రపుకర్తృభర్తృ అతిభర్తృపయః పురః ॥20॥

కుండం, సర్వం, సోమపం, దధి, వారి, ఖలపు, మధు, త్రపు, కర్తృ, భర్తృ, అతిభర్తృ, పయః, పురః,

ప్రాక్ప్రత్యక్చ తిర్యగుదగ్జగజ్జాగ్రత్తథా శకృత్ ।
సుసంపచ్చ సుదండీహ అహః కించేదమిత్యపి ॥21॥

ప్రాక్, ప్రత్యక్, తిర్యక్, ఉదక్, జగత్, జాగ్రత్, శకృత్, సుసంపత్, సుదండి, అహః, కిం, ఇదమ్,

షట్ సర్పిః శ్రేయ శ్చత్వారి అదోఽన్యేహీదృశాః పరే ।
ఏతేభ్యః ప్రథమాద్యశ్చ స్యుః ప్రాతిపాదికాత్పరాః ॥22॥

షట్, సర్పిః, శ్రేయః, చత్వారి, అదః - ఇవన్నీ నపుంసక లింగ నాయకశబ్దాలు. ఈ శబ్దాలకు ప్రథమాది విభక్తి ప్రత్యయాలు ప్రాతిపదికకు పరంగా వస్తాయి.

ధాతుప్రత్యయహీనం యత్స్యాత్ ప్రాతిపదికం తు తత్ ।
ప్రాతిపదికాత్ స్వలింగార్థవచనే ప్రథమా భవేత్ ॥23॥

ధాతుప్రత్యయభిన్నమైనది ప్రాతిపదికము. ప్రాతిపదికకు స్వార్థాన్ని, లింగాన్ని బోధించడానికి ప్రథమ వస్తుంది.

సంబోధనే చ ప్రథమా ఉక్తే కర్మణి కర్తరి ।
కర్మయత్క్రియతే తత్స్యాద్ద్వితీయా కర్మణి స్మృతా ॥24॥

సంబోధనము నందు కూడ ప్రథమ వస్తుంది. కర్మ, కర్త ఉక్తములైనప్పుడు కూడ ప్రథమవస్తుంది. కర్మ అనగా చేయబడేది. కర్మకు ద్వితీయ వస్తుంది.

క్రియతే యేన కరణం కర్తా యశ్చ కరోతి సః ।
అనుక్తే తిఙ్కృత్తద్ధితై స్తృతీయా కరణే భవేత్ ॥25॥

దేనిచే చేయబడుతుందో అది కరణం. చేసేవాడు కర్త. తిఙ్ కృత్తద్ధితప్రత్యయాలచే అనుక్తమైనప్పుడు తృతీయ వస్తుంది. కర్తృకారకానికి తృతీయ వస్తుంది.

కారకే కర్తరి చ సా సంప్రదానే చతుర్థ్యపి ।
యస్మైదిత్సాంధారయతే సంప్రదానం తదీరితమ్ ॥26॥

సంప్రదానానికి చతుర్థి. ఎవనికి ఇవ్వాలని ఇచ్ఛగిస్తారో, దానికి సంప్రదానం అని పేరు.

అపాదానం యతోఽపైతి ఆదత్తే చ భయం యతః ।
అపాదానే పంచమీ స్యాత్ స్వస్వామ్యాదౌ చ షష్ఠ్యపి ॥27॥

దేని నుంచి ఒకటి వేరగునో, దేని నుంచి ఒకటి గ్రహించబడునో, దేనివల్ల భయమో దానికి అపాదానం అనిపేరు. అపాదానకారకానికి పంచమి వస్తుంది. స్వస్వామ్యాది సంబంధము నందు షష్ఠి వస్తుంది.

ఆధారో యోఽధికరణం విభక్తి స్తత్ర సప్తమీ ।
ఏకార్థే చైకవచనం ద్వ్యర్థే ద్వివచనం భవేత్ ॥28॥

ఆధారానికి అధికరణమని పేరు. దానికి సప్తమీ విభక్తి వస్తుంది. ఒక వస్తువును బోధించడానికి ఏకవచనం, రెండు వస్తువులను బోధించడానికి ద్వివచనం వస్తుంది.

బహుషు బహువచనం సిద్ధరూపాణ్యథో వదే ।
వృక్షః సూర్యోమ్బువాహోఽర్కోహేరవే హేద్విజాతయః ॥29॥

అనేకములైన వస్తువులను బోధించడానికి బహువచనం వస్తుంది. ఇపుడు సిద్ధరూపాలను చెబుతాను. వృక్షః, సూర్యః, అంబువాహః, అర్కః, హేరవే, హేద్విజాతయః, (ప్రథమ, సం॥ప్రథమ)

విప్రౌ గజాన్మహేంద్రేణ యమాభ్యామనలైః కృతమ్ ।
రామాయ మునివర్యాభ్యాం కేభ్యో ధర్మాద్ధరౌ రతిః ॥30॥

విప్రౌ (ద్వి॥వ) గజాన్ (బహు॥వ) మహేంద్రేణ (తృ॥ఏ), యమాభ్యాం (తృ॥ద్వి), అనలైః (తృ॥బ),కృతమ్ (న॥ప్ర॥ఏ), రామాయ (చ॥ఏ॥), మునివర్యాభ్యాం (చ॥ద్వి), కేభ్యః (కిమ్॥చ॥బ), ధర్మాత్ (పం॥ఏ॥) హరౌ (స॥ఏ) రతిః (ప్ర॥ఏ॥)

శరాభ్యాం పుస్తకేభ్యశ్చ అర్థస్యేశ్వరయోర్గతిః ।
బాలానాం సజ్జనే ప్రీతిర్హంసయోః కమలేషు చ ॥31॥

శరాభ్యాం(పం॥ద్వి), గతిః (ప్ర॥ఏ), బాలానామ్ (ష॥బ), సజ్జనే (స॥ఏ), ప్రీతిః (ప్ర॥ఏ), హంసయోః (స॥ద్వి), కమలేషు (స॥బ),

ఏవం కామ మహేశాద్యాః శబ్దా జ్ఞేయాశ్చ వృక్షవత్ ।
సర్వే విశ్వే చ సర్వస్మై సర్వస్మాత్కతరో మతః ॥32॥

ఈ విధంగా కామ, మహేశాది శబ్దాలు వృక్షశబ్దంతో సమానంగా తెలుసుకోవాలి. సర్వే, విశ్వే (ప్ర॥బ) సర్వస్మై (చ॥ఏ), సర్వస్మాత్ (పం॥ఏ), కతరః (ప్ర॥ఏ),

సర్వేషాం స్వంచ విశ్వస్మిన్ శేషం రూపం చ వృక్షవత్ ।
ఏవం చోభయ కతర కతమాన్యతరాదయః ॥33॥

సర్వేషాం (ష॥బ) స్వం (ప్ర॥ఏ), విశ్వస్మిన్ (స॥ఏ), మిగిలిన వచన విభక్తులు వృక్షశబ్దం రూపం వలె ఉంటాయి. ఉభయ, కతర, కతమ, అన్యతరాదిశబ్దాలు కూడ అట్లే.

పూర్వే పూర్వాశ్చ పూర్వస్మై పూర్వస్మాత్సుసమాగతః ।
పూర్వే బుద్ధిశ్చ పూర్వస్మిన్ శేషరూపం తు సర్వవత్ ॥34॥

పూర్వే, పూర్వాః (ప్ర॥బ), పూర్వస్మై(చ॥ఏ), పూర్వస్మాత్ (ప॥ఏ) పూర్వే, పూర్వస్మిన్ (స॥ఏ॥) మిగిలిన రూపాలు సర్వశబ్దానికి ఉన్నట్లే.

ఏవం పరావరాద్యాశ్చ దక్షిణోత్తరకాంతరాః ।
అపరాశ్చాధరో నేమాః ప్రథమాః ప్రథమేఽర్కవత్ ॥35॥

ఈ విధంగా పర, అవర, దక్షిణ, ఉత్తర, అంతర, అపర, అధర, నేమ శబ్దాల రూపాలు ఉంటాయి. ప్రథమే, ప్రథమాః (ప్ర॥బ) మిగిలిన రూపాలు అర్కశబ్దానికి వలె ఉంటాయి.

ఏవం చరమాస్తయాన్తా అల్పార్థా నేమ ఆదయః ।
ద్వితీయస్మై ద్వితీయాయ ద్వితీయస్మాద్ద్వితీయకాత్ ॥36॥

ఈ విధంగా చరమ, తయప్ ప్రత్యయాంతశబ్దాలు, అల్ప, అర్థ, నేమశబ్దాదిరూపాలు ఉంటాయి. ద్వితీయస్మై, ద్వితీయాయ (ప్ర॥చ), ద్వితీయస్మాత్, ద్వితీయాత్ (ప్ర॥పం)

ద్వితీయస్మిన్ ద్వితీయే చ తృతీయశ్చ తథార్కవత్ ।
సోమపాః సోమపౌ జ్ఞేయౌ సోమపాః సోమపాం వ్రజ ॥37॥

ద్వితీయస్మిన్, ద్వితీయే (ప్ర॥స) ఈవిధంగానే తృతీయశబ్దం ఉంటుంది. మిగిలిన విభక్తిరూపాలు అర్కశబ్దానికి ఉన్నట్లే. సోమపాః సోమపౌ సోమపాః (ప్ర॥వి),

కీలాలపౌ సోమపశ్చ సోమపాత్సోమపే దద ।
సోమపాభ్యాం సోమపాభ్యః సోమపః సోమపౌ కులమ్ ॥38॥

ఏవం కీలాలపాద్యాః స్యుః కవిరగ్నిస్తథాఽరయః ।
హేకవే కవిమగ్నీ తాన్హరీన్ సాత్యకినా హృతమ్ ॥39॥

సోమపామ్, సోమపౌ, సోమపః (ద్వి॥వి), సోమపా, సోమపాభ్యాం, సోమపాభిః (తృ॥వి), సోమపే, సోమపాభ్యాం, సోమపాభ్యః (చ॥వి), సోమపః సోమపాభ్యాం, సోమపాభ్యః (ప॥వి), సోమపః, సోమపోః, సోమపామ్ (ష॥వి), సోమపి, సోమపోః, సోమపాసు (స॥వి), ఇక్కడ జ్ఞేయౌ, వ్రజ, దద, కులమ్, అనే పదాలు పాదపూరణశబ్దాలు. ఈవిధంగానే కీలాలప శబ్దం ఉంటుంది. కవిః (ప్ర॥ఏ), అగ్నిః (ప్ర॥ఏ), అరయః (ప్ర॥బ), హేకవే (సం॥ప్ర) కవిమ్ (ద్వి॥ఏ), అగ్నీ (ద్వి॥ద్వి), హరీన్ (ద్వి॥బ), సాత్యకినా (తృ॥ఏ)

రవిభ్యాం రవిభిర్దేహి వహ్నయే యః సమాగతః ।
అగ్నేరగ్న్యోస్తథాఽగ్నీనాం కవౌ కవ్యోః కవిష్వథ ॥40॥

రవిభ్యాం (తృ॥ద్వి), రవిభిః (తృ॥బ), వహ్నయే (చ॥ఏ), అగ్నేః (ష॥ఏ), అగ్న్యోః (ష॥ద్వి), అగ్నీనాం (ష॥బ), కవౌ (స॥ఏ), కవ్యోః (స॥) కవిషు (స॥బ).

ఏవం సుసృతి రభ్రాంతిః సుకీర్తిః సుధృతి స్తథా ।
సఖా సఖాయౌ సఖాయః హే సఖే వ్రజ సత్పతిమ్ ॥41॥

ఈవిధంగానే సుసృతి, అభ్రాంతి, సుకీర్తి, సుధృతి, ఇత్యాదిశబ్దాల రూపాలు ఉంటాయి. సఖా సఖాయౌః సఖాయః (సఖి–ప్ర–ఏ॥ద్వి॥బ) హేసఖే (స॥ప్ర) సత్పతిమ్ (ద్వి॥ఏ),

సఖాయం సఖాయౌ చ సఖీన్సఖ్యా గతో దద ।
సఖ్యే దఖ్యుశ్చ సఖ్యుశ్చ సఖ్యోః శేషః కవేరివ ॥42॥

సఖాయం, సఖాయౌ, సఖీన్ (ద్వి–ఏ॥ద్వి॥బ), సఖ్యా (తృ॥ఏ), సఖ్యే (చ॥ఏ), సఖ్యుః (ప॥ఏ), సఖ్యుః, సఖ్యోః, సఖీనామ్ (ష–ఏ॥ద్వి॥బ॥) సఖ్యౌ, సఖ్యోః, సఖిషు (స ఏ॥ద్వి॥బ) శేషించిన రూపాలు కవి శబ్దానికి ఉన్నట్లే.

పత్యాపత్యే చ పత్యుశ్చ పత్యుః పత్యోస్తథాఽగ్నివత్ ।
ద్వౌద్వౌద్వాభ్యాం ద్విత్వాద్యర్థే ద్వయోర్ద్వయోః ॥43॥

పత్యా (తృ॥ఏ), పత్యే (చ॥ఏ), పత్యుః (పం॥ఏ), పత్యుః, పత్యోః (ష–ఏ॥ద్వి), పత్యౌ (స॥ఏ), మిగిలిన రూపాలు అగ్ని శబ్దానికి ఉన్నట్లే. ద్విశబ్దం (పుంలింగం, నిత్యద్వివచనాంతం), ద్వౌ (ప్ర) ద్వౌ (ద్వి), ద్వాభ్యాం (తృ) ద్వాభ్యాం (చ), ద్వాభ్యాం (పం) ద్వయోః (ష), ద్వయోః (స), ఇది సంఖ్యా వాచకశబ్దం.

త్రయస్త్రీంశ్చ త్రిభిస్త్రిభ్యస్త్రయాణాం చ త్రిషుక్రమాత్ ।
కవివత్కతి కతీతి శేషం బహువచనం స్మృతమ్ ॥44॥

త్రిశబ్దం నిత్యబహువచనాంతం. పుంలింగం, త్రయః (ప), త్రీన్ (ద్వి), త్రిభిః (తృ), త్రిభ్యః (చ), త్రిభ్యః (పం), త్రయాణాం (ష), త్రిషు (స), కతిశబ్దం – కతి (ప), కతి (ద్వి), మిగిలిన రూపాలు కవి శబ్దానికి ఉన్నట్లే. ఇది నిత్యబహువచనాంత శబ్దం.

నీర్నియౌ చ నియోహేనీః నియం నియౌ నియో నియా ।
నీభ్యాం నీభిర్నియే నీభ్యో నియాం నియినియోస్తథా ॥45॥

'నేతా' అనే అర్థంలో ప్రయోగింపబడే 'నీః' శబ్దరూపాలు ఇవి. నీఃనియో నియః (ప్ర), హేనీః హేనియౌ, హేనియః (సం॥ప్ర) నియమ్–నియౌ, నియః (ద్వి), నియా నీభ్యాం, నీభిః (తృ) నియే – నీభ్యాం నీభ్యః (చ) నియః నీభ్యాం నీభ్యః (పం) నియః నియోః, నియామ్ (ష) నియి నియోః, నీషు (స).

సుశ్రీః సుధీః ప్రభృతయో గ్రామణీః పూజయేద్ధరిమ్ ।
గ్రామణ్యౌ గ్రామణ్యో గ్రామణ్యం గ్రామణ్యా గ్రామణీభిః ॥46॥

గ్రామణ్యోర్గ్రామణ్యామేవం సేనానీ ప్రముఖాః సుభూః ।
సుభువౌ చ స్వయంభువః స్వయంభువం స్వయంభువః ॥47॥

ఈవిధంగా సుశ్రీః, సుధీః మున్నగుశబ్దాలు ఉంటాయి. గ్రామణీ శబ్దరూపాలు ఈవిధంగా ఉంటాయి. గ్రామముఖ్యుడు హరిని పూజించాలి. గ్రామణీః గ్రామణ్యౌ, గ్రామణ్యః (ప్ర) గ్రామణ్యం, గ్రామణ్యౌ, గ్రామణ్యః,

(ద్వి), గ్రామణ్యా, గ్రామణీభ్యాం, గ్రామణీభ్యః (పం) గ్రామణ్యః, గ్రామణ్యోః, గ్రామణ్యామ్ (ష), గ్రామణ్యామ్, గ్రామణ్యోః, గ్రామణీషు (స) ఈవిధంగానే సేనాని మున్నగు శబ్దాలు ఉంటాయి. సుభూః - సుభువౌ-సుభువః(ప్ర) ఇత్యాదిరూపాలు. స్వయం భూశబ్దరూపాలు ఇలా ఉంటాయి. స్వయం భుః -స్వయంభువౌ - స్వయంభువః (ప), స్వయంభువం, స్వయంభువౌ, స్వయంభువః (ద్వి),

స్వయంభువా స్వయం భువి ఏవం ప్రతిభువాదయః ।
ఖలపూః ఖలప్వౌ శ్రేష్ఠౌ ఖలప్వం చ ఖలప్వి చ ॥48॥

స్వయంభువా (తృ॥ఏ), స్వయంభువి (స॥ఏ), మిగిలినవి 'సుభూః' శబ్దం వలెనే. ఈవిధంగానే 'ప్రతి భూః' శబ్దరూపాలు ఉంటాయి. ఖలపూః శబ్దరూపాలు. ఖలపూః-ఖలప్వౌ-ఖలప్వః (ప్ర), ఖలప్వం(ద్వి॥ఏ), ఖలప్వి (స॥ఏ),

ఏవం శరపూముఖాః స్యుః క్రోష్టాక్రోష్టార ఈరితాః ।
క్రోష్టూంశ్చ క్రోష్టునా క్రోష్ట్రా క్రోష్టూనాం క్రోష్టరీదృశమ్ ॥49॥

ఈవిధంగా "శరపూ" మున్నగు శబ్దాలు ఉంటాయి. క్రోష్టుశబ్దరూపాలు ఇలా ఉంటాయి. క్రోష్టా, క్రోష్టారౌ, క్రోష్టారః (ప్ర), క్రోష్టారమ్ (ద్వి॥ఏ) క్రోష్టూన్ (ద్వి-బ), క్రోష్టునా, క్రోష్ట్రా (తృ, ఏ), క్రోష్టవే, క్రోష్ట్రే (చ॥ఏ),క్రోష్టవే, క్రోష్టే (సం॥ఏ) క్రోష్టూనాం (ష॥బ) క్రోష్టం, క్రోష్టౌ(స॥ఏ)

పితాపితరౌ పితరః హే పితః పితరౌ శుభౌ ।
పితౄన్ పితుః పితుః పిత్రోః పితౄణాం పితరీ దృశమ్ ॥50॥

పితుః (పం॥ఏ), పితుః-పిత్రోః-పితౄణాం (ష), పితరి-పిత్రోః, పితృషు (స)-ఇవి పితృశబ్దరూపాలు. పితా, పితరౌ, పితరః (ప్ర) హే పితః, హే పితరౌ, హే పితరః (సం॥ప్ర) పితరం, పితరౌ పితౄన్ (ద్వి) పిత్రా (తృ॥ఏ) పిత్రే(చ॥ఏ)

ఏవం భ్రాతా చ జామాతృముఖా నృణాం నృణాం తథా ।
కర్తా కర్తారౌ కర్తౄంశ్చ కర్తౄణాం కర్తరీదృశమ్ ॥51॥

ఈవిధంగానే భ్రాతృ, జామాతృశబ్దాలు ఉంటాయి. నృశబ్దానికి షష్ఠీ బహువచనంలో నృణాం, నౄణాం అనే రెండు రూపాలు ఉంటాయి. కర్తౄశబ్దరూపాలు ఇలా ఉంటాయి. కర్తా, కర్తారౌ, కర్తారః (ప్ర), కర్తారమ్, కర్తారౌ, కర్తౄన్ (ద్వి) కర్తౄణాం (ష॥బ) కర్తరి (స॥ఏ)

పితృవచ్చైవ ముద్గాతా స్వసా నప్త్రాదయః స్మృతాః ।
సురాః సురాయౌ సురాయః సురాయాం చ సురాయ్యపి ॥52॥

మిగిలిన రూపాలు పితృశబ్దంతో సమానంగా ఉంటాయి. ఈవిధంగానే ఉద్గాతృ, స్వసృ, నప్తౄమున్నగు శబ్దరూపాలు ఉంటాయి. మిగిలిన రూపాలు అన్నీ కర్తృశబ్ద సమానరూపాలు స్వసృశబ్దం ద్వి॥బ॥లో స్వసౄః అని ఉంటుంది. సుర శబ్దరూపాలు ఇలా ఉంటాయి. సురాః-సురాయౌ-సురాయః (ప్ర), సురాయం (ష॥బ), సురాయి(స॥ఏ),

గౌః గావౌ గాం గా గవా చ గోర్గవోశ్చ గవాం గవి ।
ఏవం ద్యౌర్ గ్లౌశ్చాపి తథా స్వరాంతాః పుంసినాయకాః ॥53॥

గోశబ్దరూపాలు ఇలా ఉంటాయి. గౌః-గావౌ-గావః (ప్ర), గాం-గావౌ-గావః(ద్వి), గవా-గోభ్యాం, గోభిః(తృ), గోః-గవోః-గవామ్ (ష), గవి, గోః, గోషు (స), ఈవిధంగానే ద్యౌ గ్లౌ శబ్దరూపాలు ఉంటాయి. ఇవన్నీ స్వరాంతపుంలింగ నాయక ప్రధాన శబ్దాలు.

సువాక్సువాచౌ సువాచా సువాగ్భ్యాం సువాక్షుపి ।
ఏవం దిక్ప్రముఖాః ప్రాఙ్ ప్రాఞ్చౌ ప్రాఞ్చం చ భో వ్రజ ॥54॥

ప్రాగ్భ్యాం ప్రాగ్భిః ప్రాచాం చ ప్రాచి చ ప్రాఙ్క్షు ప్రాఙ్క్షుపి ।
ఏవం హ్యుదఙ్ఙుదీచీ వా సమ్యఙ్ ప్రత్యక్ సమీచ్యపి ॥55॥

ఇపుడు హలంత పుంలింగ శబ్దాల సిద్ధరూపాలను వివరించడం జరుగుతోంది. 'సువాచ్' శబ్దరూపాలు ఇలా ఉంటాయి. సువాక్, సువాగ్, సువాచౌ, సువాచః (ప్ర॥వి), సువాచమ్, సువాచౌ, సువాచః (ద్వి॥వి), సువాచా, సువాగ్భ్యామ్, సువాగ్భిః (తృ॥వి), సువాక్షు (స॥బ), ఇదే విధంగా 'దిశ్' ఆది శబ్దాల రూపాలు ఉంటాయి. "ప్రాంచ్" శబ్ద రూపాలు ఇలా ఉంటాయి. ప్రాఙ్, ప్రాఞ్చౌ, ప్రాఞ్చః (ప్ర॥వి), ప్రాఞ్చం (ద్వి॥ఏ), ప్రాచా, ప్రాగ్భ్యామ్, ప్రాగ్భిః (తృ॥వి) ప్రాచాం (ష॥బ), ప్రాచి-ప్రాచోః-ప్రాక్షు, ప్రాఙ్క్షు ప్రాఙ్క్షు(స॥వి), ఉదఙ్, ఉదఞ్చౌ, ఉదఞ్చః, (ప్ర॥వి), స్త్రీలింగ శబ్ద మయితే ఉదీచీ, సమ్యఙ్, సమ్యఞ్చౌ, సమ్యఞ్చః, (ప్ర॥వి), స్త్రీలింగశబ్ద మయితే సమీచీ, ప్రత్యఙ్, ప్రత్యఞ్చౌ, ప్రత్యఞ్చః (ప॥వి), స్త్రీలింగశబ్ద మయితే ప్రతీచీ,

తిర్యఙ్ తిరశ్చ సధ్ర్యఙ్ చ విశ్వద్ర్యఙ్ పూర్వవత్ స్మృతాః ।
అదద్యఙ్ దముయుగం స్యాత్తథా౽ముము యఙ్రితః ॥56॥

తిర్యఙ్, తిరశ్చః, సధ్ర్యఙ్, సధ్రీచః, విశ్వద్ర్యఙ్, విశ్వద్రీచః ఇత్యాదులు పూర్వరూపాల వలె ఉంటాయి. "అముమ్ అంచతి" అనే విగ్రహంతో అముముయఙ్, అదముయఙ్, అదద్ర్యఙ్ అనే మూడు రూపాలు ఉంటాయి. (ప్ర॥ఏ).

అదద్ర్యఞ్చో హ్యముద్రీ చః అదద్ర్యగ్భ్యాం చ పూర్వవత్ ।
తత్త్వతృట్ తత్త్వతృషౌ చ తత్త్వతృడ్భ్యాం సమాగతః ॥57॥

ప్రథమాబ॥వ॥లో "అదద్ర్యఞ్చః" అని ఉంటుంది. ద్వి॥బ॥వ॥లో అముముఞ్చః, అముద్రీచః అని ఉంటాయి. మిగిలిన రూపాలు పూర్వవిధంగానే "తత్త్వతృష్" శబ్దరూపాలు ఇలా ఉంటాయి. తత్త్వతృట్-తత్త్వతృడ్-తత్త్వతృషౌ-తత్త్వవృషః (ప్ర), తృ॥ద్వి॥వ॥లో తత్త్వతృడ్భ్యాం అని ఉంటుంది.

తత్త్వతృషి తత్త్వతృట్సు ఏవం కాష్ఠతదాదయః ।
భిషక్ భిషగ్భ్యాం భిషజి జన్మభాగాదయస్తథా ॥58॥

స॥ఏ॥వ॥లో తత్త్వతృషి అని, బ॥వ॥లో తత్త్వతృట్సు అనే రూపాలు ఉంటాయి. ఇదే విధంగా "కాష్ఠతృడ్" ఇత్యాదిరూపాలు ఉంటాయి. 'భిషజ్' శబ్దరూపాలు ఇలా ఉంటాయి. భిషక్, భిషగ్, భిషజౌ, భిషజః (ప్ర॥వి) ఇత్యాది. తృ॥ద్వి॥వ॥లో భిషగ్భ్యాం" అని, స॥ఏ॥వ॥లో॥భిషజి" అని రూపాలు ఉంటాయి. ఇదే విధంగా "జన్మభాక్" శబ్దరూపాలు ఉంటాయి.

మరుత్ మరుద్భ్యాం మరుతి ఏవం శత్రుజిదాదయః ।
భవాన్భవన్తౌ భవతాం భవంశ్చైవ భవంత్యపి ॥59॥

మరుత్ శబ్దరూపాలు కూడ ఇలా ఉంటాయి. మరుత్, మరుద్, మరుతౌ, మరుతః (ప్ర) మరుద్భ్యాం, (తృ॥ద్వి॥వ) మరుతి (స॥ఏ॥వ), ఇదే విధంగా శత్రుజిత్ శబ్దం ఉంటుంది. భవచ్ఛబ్దరూపాలు ఇలా ఉంటాయి. భవాన్-భవన్తౌ, భవంతః (ప్ర), భవతాం (ష॥బ), శతృప్రత్యయాంత భవచ్ఛబ్దరూపాలు. భవన్-భవన్తౌ భవంతః (ప్ర) ఇత్యాది స్త్రీలింగంలో "భవన్తీ" అనే రూపం ఉంటుంది.

మహాన్మహంతౌ మహతా మేవం భగవదాదయః ।
ఏవం మఘవాన్మఘవంతౌ అగ్ని చిచ్చాగ్ని చిత్యపి ॥60॥

"మహత్" శబ్దరూపాలు ఇలా ఉంటాయి. మహాన్-మహన్తౌ-మహాతః (ప్ర), మహతాం (ష॥బ), ఇదే విధంగా "భగవత్" శబ్దరూపాలు ఉంటాయి. "మఘవత్" శబ్దరూపాలు ఇలా ఉంటాయి. మఘవాన్-మఘవంతౌ, మఘవంతః (ప్ర॥వి) ఇత్యాది. అగ్నిచిత్ శబ్దరూపాలు ఇలా ఉంటాయి. అగ్నిచిత్, అగ్నిచిద్, అగ్నిచితౌ, అగ్నిచితః (ప్ర), అగ్నిచితి (స॥ఏ॥వ),

అగ్నిచిత్స్వేవమేవాన్యద్వేదవిత్తత్త్వవిత్స్వపి ।
వేదవిదామేవమన్యద్యః సమస్తేన సర్వవిత్ ॥61॥

అగ్నిచిత్సు (స॥బ॥వ), ఈ ప్రకారంగానే వేదవిత్, తత్త్వవిత్ శబ్దాలు వేదవిదాం (ష॥బ॥) సర్వవిత్ శబ్దం కూడ ఈవిధంగానే ఉంటుంది.

రాజా రాజానౌ రాజ్ఞః రాజ్ఞి రాజని రాజన్ ।
యజ్వా యజ్వానస్తద్వత్కరీ దండీ చ దండినౌ ॥62॥

"రాజన్" శబ్దరూపాలు ఇలా ఉంటాయి. రాజా-రాజానౌ-రాజానః (ప్ర), రాజానం, రాజానౌ-రాజ్ఞః (ద్వి), రాజ్ఞా-రాజభ్యాం, రాజభిః (తృ), రాజ్ఞి, రాజని (స॥వి), సంబోధనలో "హేరాజన్!" అని ఉంటుంది. యజ్వన్ శబ్దరూపాలు ఇలా ఉంటాయి. యజ్వా-యజ్వానౌ-యజ్వానః (ప్ర), కరిన్, దండిన్, ఇత్యాది ఇన్నంతశబ్దాలు కూడ ఇలాగే ఉంటాయి. కరీ-కరిణౌ-కరిణః(ప్ర), దండీ-దండినౌ-దండినః (ప్ర), ఇత్యాది

పంథాః పంథానౌ చ పథః పథిభ్యాం పథి చేదృశమ్ ।
మంథా బుభుక్షాః పథ్యాద్యాః పంచపంచ చ పంచభిః ॥63॥

"పథిన్" శబ్దరూపాలు ఇలా ఉంటాయి. పంథాః-పంథానౌ-పంథానః (ప్ర), పంథానమ్-పంథానౌ-పథః(ద్వి), పథా-పథిభ్యాం-పథిభిః (తృ), పథి (స॥ఏ), ఈ ప్రకారంగానే "మథిన్" శబ్దం ఉంటుంది. ఋభుక్షాః, ఋభుక్షాణౌ, ఋభుక్షాణః (ప్ర) ఇత్యాది. పథ్యాదులలో పథిన్, మథిన్, ఋభుక్షన్, అనే మూడు శబ్దాలు ఉంటాయి. సంఖ్యా వాచకమైన 'పంచన్' శబ్దం నిత్యబహువచనాంతం. పంచ (ప్ర), పంచ (ద్వి) పంచభిః (తృ), పంచభ్యః (చ), పంచభ్యః (పం), పంచానాం (ష) పంచసు (సప్తమీ).

ప్రతాన్ప్రతానౌ ప్రతాన్భ్యాంహే ప్రతాంశ్చ సుశర్మణః ।
ఆపోఽపః అద్భిరప్యేవం ప్రశాంశ్చైవ ప్రశామ్యపి ॥64॥

'ప్రతాన్' శబ్దరూపాలు. ప్రతాన్-ప్రతానౌ-ప్రతానః (ప్ర), ప్రతాన్భ్యాం (తృ॥ద్వి), సంబోధనలో "హేప్రతాన్" అని ఉంటుంది. సుశర్మన్ శబ్దానికి ఈ "శస్, జసి, జస్" మూడు విభక్తులలోను "సుశర్మణః" అనే రూపమే ఉంటుంది. 'అప్' శబ్దం నిత్యబహువచనాంతం. స్త్రీలింగం, ఆపః (ప్ర), అపః(ద్వి), అద్భిః (తృ), అద్భ్యః (చ), అద్భ్యః (పం), అపాం (ష), అప్సు (స), ప్రశామ్ శబ్దరూపాలు ఇలా ఉంటాయి. ప్రశాన్-ప్రశామౌ-ప్రశామః (ప్ర), ప్రశామి (స॥ఏ),

కః కేన సర్వవిత్కేషు అయం చేమే ఇమాన్నయః ।
అనేన చాభ్యామేభిశ్చ అస్మై చైభ్యః స్వమస్య చ ॥65॥

"కిం" శబ్దరూపాలు ఇలా ఉంటాయి. కః-కౌ-కే(పు), కం-కౌ-కాన్ (ద్వి), కేన-కాభ్యాం-కైః (తృ), కేషు (స॥బ), మిగిలినవి సర్వశబ్దం వలెనే, 'ఇదం' శబ్దరూపాలు ఇలా ఉంటాయి. అయం-ఇమౌ-ఇమే (ప్ర), ఇమం-ఇమౌ-ఇమాన్ (ద్వి), అనేన-ఆభ్యాం-ఏభిః (తృ),అస్మై-ఆభ్యాం-ఏభ్యః(చ), అస్మాత్-ఆభ్యాం -ఏభ్యః(పం), అస్య-అనయోః-ఏషామ్(ష) అస్మిన్-అనయోః-ఏషు (స)

అనయోరేషామేషు స్యాచ్చత్వార శ్చతురస్తథా ।
చతుర్ణాం చ చతుర్ష్వస్తి సుగీఃశ్రేష్ఠః సుగీర్ష్వపి ॥66॥

'చతుర్' శబ్దం నిత్యబహువచనాంతం. చత్వారః (ప్ర), చతురః(ద్వి), చతుర్భిః (తృ), చతుర్భ్యః (చ), చతుర్భ్యః (పం), చతుర్ణామ్ (ష), చతుర్షు (స), ఎవని వాక్కు మంచిదై ఉంటుందో అతడు శ్రేష్ఠుడు (సుగీః) అనబడతాడు. సుగీర్ శబ్దం ప్ర॥ఏ సుగీః సుగిరి (స॥ఏ),

సుద్యౌః సుదివౌ సుద్యుభ్యాం విడ్ విశౌ విట్సుయాదృశః ।
యాదృగ్భ్యాంచైవ విడ్భ్యాం చ షట్ షట్షణ్ణాం చ షట్స్వపి ॥67॥

'సుదివ్' శబ్దరూపాలు. సుద్యౌః-సుదివౌ-సుదివః(ప్ర), సుద్యుభ్యాం (తృ), 'విశ్' శబ్దరూపాలు. విట్ విడ్-విశౌ-విశః (ప్ర), విడ్భ్యాం (తృ॥ఏ) విట్సు (స॥బ), యాదృశ్ శబ్దరూపాలు. యాదృక్, యాదృగ్-యాదృశౌ-యాదృశః(ప్ర), యాదృశా-యాదృగ్భ్యాం-యాదృగ్భిః(ద్వి) షట్ శబ్దం నిత్యబహువచనాంతం. షట్, షడ్ (ప్ర), షట్, షడ్ (ద్వి), షడ్భిః (తృ), షడ్భ్యః (చ), షడ్భ్యః (పం), షణ్ణామ్ (ష), షట్సు (స).

సువచాః సువచసా చ సువచోభ్యామథేదృశమ్ ।
హే సువచో హే ఉషనన్నుశనా వౌశనస్యపి ॥68॥

"సువచస్" శబ్దరూపాలు ఇలా ఉంటాయి. సువచాః, సువచసౌ, సువచసః (ప్ర), సువచసం (ద్వి॥ఏ), సువచసా (తృ॥ఏ), సువచోభ్యాం (తృ॥ద్వి), హే సువచః (సం॥ప్ర), 'ఉశనస్' శబ్దరూపాలు ఇలా ఉంటాయి. ఉశ నాః-ఉశనసౌ - ఉశనసః(ప్ర), హే ఉశనః (సం॥ప), ఉశనసి (స॥ఏ),

పురుదంశా అనేహా హే విద్వన్ విద్వాంస ఉత్తమాః ।
విదుషే నమో విద్వద్భ్యాం విద్వత్సుచ బభూవివాన్ ॥69॥

పురుదంశస్, అనేహస్ శబ్దాలు ఈవిధంగానే ఉంటాయి. "విద్వస్" శబ్దరూపాలు ఈవిధంగా ఉంటాయి. విద్వాన్, విద్వాంసౌ, విద్వాంసః(ప్ర), హే విద్వన్ (సం॥ప్ర), విదుషే (చ॥ఏ), విద్వద్భ్యాం(చ॥ద్వి), విద్వత్సు (స॥ఏ),

ఏవం చ పేచివాన్ శ్రేయాన్ శ్రేయాంసౌ శ్రేయసస్తథా ।
అసౌ అమూ అమీ శ్రేష్ఠా అముమమూనిహాముసా ॥70॥

'బభూవివస్' శబ్దం కూడ, పేచివాన్ శబ్దం కూడ ఇలాగే ఉంటాయి. శ్రేయాన్-శ్రేయాంసౌ, శ్రేయాంసః(ప్ర), శ్రేయసః (ది॥బ॥)శ్రేయస్ శబ్దరూపాలు యథాప్రకారంగా ఉంటాయి. 'అదస్' శబ్దం పుంలింగం. అసౌ, అమూ, అమీ (ప్ర), అముమ్, అమూ-అమూన్ (ద్వి), అమునా-అమూభ్యాం-అమీభిః (తృ),

అమీభి రముష్మై మ్రవాముష్మాదముష్య వాఽ ముయోస్తథా ।
అమీషామముష్మిన్నిత్యేవం గోదుగ్భిరాగతః ॥71॥

అముష్మై, అమూభ్యాం, అమీభ్యః (చ), అముష్మాత్, అమూభ్యాం, అమీభ్యః (పం), అముష్య, అముయోః, అమీషామ్ (ష), అముష్మిన్, అముయోః, అమీషు (స॥), 'గోదుహ్' శబ్దరూపాలు ఇలా ఉంటాయి. గోధుక్, గోధుగ్-గోదుహౌ-గోదుహః (ప్ర),

గోధుక్ష్విత్యేవమన్యేఽ పి మిత్రద్రుహౌ మిత్రద్రుహో ।
మిత్రద్రుగ్భ్యాం మిత్రద్రుగ్భిరేవం చిత్తద్రుహాదయః ॥72॥

గోధుక్షు (స॥ఏ), మిత్రద్రుహ్ శబ్దరూపాలు ఇలా ఉంటాయి. మిత్రధ్రుక్ (గ్), మిత్రధ్రుట్ (డ్)-మిత్రద్రుహౌ, మిత్రద్రుహః (ప్ర), మిత్రద్రుహా-మిత్రద్రుగ్భ్యాం, మిత్రధ్రుడ్భ్యాం-మిత్రధృగ్భిః-మిత్రధృడ్భిః (తృ॥వి), ఇదేవిధంగా చిత్తద్రుహాది శబ్దాలు ఉంటాయి.

ఖలిట్ ఖలిడ్భ్యాం ఖలిహి అనడ్వాననడుత్సు చ ।
అజంతాశ్చ హలన్తాశ్చ పుంస్యథోఽ థస్త్రియాం వదే ॥73॥

'ఖలిహ్' శబ్దరూపాలు ఇలా ఉంటాయి. ఖలిట్, ఖలిడ్–ఖలిహౌ, ఖలిహః (ప్ర) ఖలిహా, ఖలిడ్భ్యాం, ఖలిడ్భిః (తృ), ఖలిహి (స॥ఏ), 'అనడుహ్' శబ్దరూపాలు ఇలా ఉంటాయి. అనడ్వాన్ అనడ్వాహౌ, అనడ్వాహః (ప్ర), అనడ్వాహమ్, అనడ్వాహౌ, అనడుహః (ద్వి), అనడుహా–అనడుద్భ్యాం–అనడుద్భిః (తృ), అనడుత్సు (స॥ఏ), హే అనడ్వన్ (సం॥ప్ర) ఆయా అజంతహలంతపుంలింగ శబ్దాలకు కొన్ని రూపాలలో విభక్తులతో సిద్ధరూపాలు చెప్పబడ్డాయి. ఇపుడు స్త్రీలింగరూపాలు చెబుతాను.

ఇత్యాది మహాపురాణే ఆగ్నేయే సుబ్విభక్తి సిద్ధరూప కథనం నామ ఏకపంచాశదధిక త్రిశతతమోఽధ్యాయః ॥351॥

అగ్నిమహాపురాణంలో సుబ్విభక్తి సిద్ధరూపకథనమనే మూడువందల యాభైఒకటవ అధ్యాయం సమాప్తం.



ద్విపంచాశదధిక త్రిశతతమోఽధ్యాయః - మూడువందల యాభైరెండవ అధ్యాయం

స్త్రీలింగశబ్దసిద్ధరూపకథనమ్ - స్త్రీ లింగ శబ్దాల సిద్ధరూప కథనం

స్కంద ఉవాచ - స్కందుడు ఇలా చెప్పాడు.

రమా రమే రమాః శుభా రమాం రమే రమాస్తథా ।
రమయా చ రమాభ్యాం చ రమాభిః కృతమవ్యయమ్ ॥1॥

రమాయై చ రమాభ్యాం చ రమాయాం రమయోః శుభమ్ ।
రమాణాం చ రమాయాం చ రమాస్వేవం కలాదయః ॥2॥

రమా శబ్దం ఆకారాన్త స్త్రీ లింగం. రమా-రమే-రమాః (ప్ర॥వి) రమ శుభస్వరూపురాలు. రమామ్-రమే-రమాః (ద్వి॥వి), రమయా-రమాభ్యాం-రమాభిః (తృ॥వి), రమ (లక్ష్మి) కోసమై అక్షయమైన పుణ్యం చేయాలి. రమాయై- రమాభ్యాం-రమాభ్యః (చ॥వి), రమాయాః-రమయోః-రమాభ్యః (పం॥వి), రమాయాః-రమయోః-రమాణాం (ష), రమ కల్యాణస్వరూపురాలు. రమాయాం-రమయోః-రమాసు (స), ఈ ప్రకారంగా "కలా"మున్నగు శబ్దాలు ఉంటాయి.

జరా జరసౌ జర ఇతి జరసశ్చ జరాజరామ్ ।
జరసంచ జరాస్వేవం సర్వాసర్వే చ సర్వయా ॥3॥

సర్వస్యై దేహి సర్వస్యాః సర్వస్యాః సర్వయోస్తథా ।
శేషం రమావద్రూపం స్యాద్ద్వేద్వేతిస్రశ్చ తిసృణామ్ ॥4॥

ఆకారాంత జరాశబ్దరూపాలు ఇలా ఉంటాయి. జరా-జరసౌ, జరే-జరసః, జరాః (ప్ర॥వి), జరసం, జరాం (ద్వి॥ఏ), జరాసు (స,బ) 'సర్వా' శబ్దరూపాలు ఇలా ఉంటాయి. సర్వా-సర్వే-సర్వాః (ప్ర॥వి), సర్వామ్-సర్వే-సర్వాః (ద్వి), సర్వయా-(తృ॥ఏ), సర్వస్యై (చ॥ఏ), సర్వస్యాః (పం॥ఏ), సర్వస్యాః (ష॥ఏ), సర్వయోః, (ష,స-ద్వి), మిగిలినవి రమాశబ్దరూపాల వలెనే. స్త్రీలింగనిత్య ద్వివచనాంతద్విశబ్దరూపాలు -ద్వే (ప్ర), ద్వే (ద్వి), "త్రి" శబ్దరూపాలు. తిస్రః (ప్ర, ద్వి), తిసృణామ్ (ష॥బ),

బుద్ధిర్బుద్ధ్యా బుద్ధయే చ బుద్ధ్యైబుద్ధేశ్చ హేమతే ।
కవివత్ స్యాన్మునీనాం చ నదీనద్యౌ నదీం నదీః ॥5॥

నద్యానదీభి ర్నద్యై చ నద్యాం చైవ నదీషు చ ।
కుమారీ జృంభణీత్యేవం శ్రీఃశ్రియౌ చ శ్రియః శ్రియా ॥6॥

బుద్ధిశబ్దరూపాలు బుద్ధిః (ప్ర॥ఏ), బుద్ధ్యా (తృ॥ఏ), బుద్ధయే బుద్ధ్యై (చ॥ఏ), బుద్ధేః (పం॥ష,ఏ), మతిశబ్దం సం॥ప్ర॥లో "హేమతే" అని ఉంటుంది. మునీనాం (ష॥బ), మిగిలినవి కవి శబ్దం వలెనే. నదీశబ్దరూపాలు ఇలా

ఉంటాయి. నదీ (ప్ర॥ఏ), నద్యౌ (ప్ర,ద్వి, ద్వి), నదీం (ద్వి,ఏ), నదీః (ద్వి॥బ), నద్యా (తృ॥ఏ), నదీభిః (తృ॥బ), నద్యై (చ॥ఏ), నద్యామ్ (స॥ఏ), నదీషు (స॥బ), ఈవిధంగానే కుమారీ, జృంభణీ శబ్దరూపాలు ఉంటాయి. శ్రీఃశబ్దరూపాలు, శ్రీః-శ్రియౌ-శ్రియః (ప్ర), శ్రియా (తృ॥ఏ),

శ్రియై శ్రియే స్త్రీం స్త్రియం చ స్త్రీశ్చ స్త్రియః స్త్రియాస్త్రియై ।
స్త్రియాః స్త్రీణాం స్త్రియాం చ గ్రామణ్యాం ధేన్వై చ ధేనవే ॥7॥

శ్రియై, శ్రియే (చ॥ఏ), స్త్రీ శబ్దరూపాలు ఇలా ఉంటాయి. స్త్రీం-స్త్రియం (ద్వి॥ఏ), స్త్రీః-స్త్రియః (ద్వి॥బ), స్త్రియా (తృ॥ఏ), స్త్రియై (చ॥ఏ), స్త్రియాః (పం, ష-ఏ), స్త్రీణాం (ష॥బ), స్త్రియాం (స॥ఏ), గ్రామణీ శబ్దానికి స॥ఏ॥లో గ్రామణ్యాం అని ఉంటుంది. ధేను శబ్దానికి చ॥ఏ॥లో "ధేన్వై, ధేనవే" అనే రూపాలు ఉంటాయి.

జంబూర్జంబ్వౌ చ జంబూశ్చ జంబూనాం ఫలం పిబ ।
వర్షాభ్వౌచ పునర్భ్వౌచ మాతౄర్వాఽపిచ గౌశ్చనౌః ॥8॥

జంబూ శబ్దరూపాలు ఇలా ఉంటాయి. జంబూః (ప్ర॥ఏ), జంబ్వౌ (ప్ర-ద్వి-ద్వి), జంబూః (ద్వి॥బ), జంబూనాం (ష॥బ), వర్షాభ్వౌ (ప్ర-ద్వి-ద్వి), పునర్భ్వౌ (ప్ర-ద్వి-ద్వి), మాతౄః (ద్వి॥బ), గౌః (ప్ర॥ఏ), నౌః (ప్ర॥ఏ),

వాగ్వాచా వాగ్భిశ్చ వాక్షు స్రగ్భ్యాం స్రజి స్రజోస్తథా ।
విద్వద్భ్యాం చైవ విద్వత్సు భవతీ స్యాద్భవంత్యపి ॥9॥

"వాచ్" శబ్దరూపాలు. వాక్, వాగ్ (ప్ర॥ఏ), వాచా (తృ॥ఏ), వాగ్భిః (తృ॥బ), వాక్షు (స॥బ), స్రజ్ శబ్దరూపాలు. స్రగ్భ్యాం (తృ, చ, పం - ద్వి), స్రజి (స॥ఏ), స్రజోః (ష-స-ద్వి), విద్వద్భ్యాం (తృ, చ, పం - ద్వి), విద్వత్సు (స॥బ), స్త్రీలింగ 'భవత్' శబ్దరూపాలు భవతీ, భవంతీ (ప్ర॥ఏ),

దీవ్యన్తీ భాతీ భాన్తీ చ తుదన్తీ చ తుదత్యపి ।
రుదతీ రుంధతీ దేవీ గృహ్ణతీ చోరయన్త్యపి ॥10॥

'దీవ్యత్' శబ్దం. దీవ్యన్తీ (ప్ర॥ఏ), 'భాత్'శబ్దం, భాతీ-భాన్తీ (ప్ర॥ఏ), రెండురూపాలు ఉంటాయి. 'తుదత్', శబ్దం. తుదతీ-తుదన్తీ (ప్ర॥ఏ), 'రుదత్'శబ్దం. రుదతీ (ప్ర॥ఏ), 'రుంధత్' శబ్దం, రుంధతీ (ప్ర॥ఏ), 'గృహ్ణత్' శబ్దం. గృహ్ణతీ (ప్ర॥ఏ), 'చోరయత్' శబ్దం చోరయన్తీ (ప్ర॥ఏ),

దృషద్ దృషద్భ్యాం దృషది విశేషవిదుషీ కృతిః ।
సమిత్ సమిద్భ్యాం సమిధి సీమా సీమ్ని చ సీమని ॥11॥

దృషద్ శబ్దరూపాలు. దృషద్ (ప్ర॥ఏ), దృషద్భ్యాం (తృ, చ, పం - ద్వి) దృషది (స॥ఏ), విశేషవిదుషీ (ప్ర॥ఏ), కృతిశబ్దం, కృతిః (ప్ర॥ఏ), సమిధ్ శబ్దం, సమిత్, సమిద్ (ప్ర॥ఏ), సమిద్భ్యాం (తృ, చ, పం-ద్వి), సమిధి (స॥ఏ), సీమన్ శబ్ద రూపాలు. సీమా (ప్ర॥ఏ), సీమ్ని, సీమని (స॥ఏ),

దామనీభ్యాం కకుద్భ్యాం చ కేయమాభ్యాం తథాసు చ ।
గీర్భ్యాంచైవ గిరాగీర్షు సుభూః సుపూః పురాపురి ॥12॥

దామనీశబ్దం. దామనీభ్యాం (తృ, చ, పం-ద్వి), ఈవిధంగానే కకుభ్ శబ్దం యొక్క కకుద్భ్యామ్ అనే రూపం. కింశబ్దం కా (ప్ర॥ఏ), ఇదమ్ శబ్దం. ఇయం (ప్ర॥ఏ), ఆభ్యాం (తృ, చ, పం -ద్వి), ఆసు (స॥బ), గిర్ శబ్దం గీర్భ్యాం (తృ, చ, పం -ద్వి) గిరా (తృ॥ఏ), గీర్షు (స॥బ), ప॥ఏ॥లో సుభూః, సుపూః అనే శబ్దాలు ఉంటాయి. పుర్ శబ్దానికి తృ॥ఏ॥పురా అని, స॥ఏ॥పురి అని ఉంటుంది.

ద్యౌర్ద్యుభ్యాం దివిద్యుషు తాదృశ్యా తాదృశీ దిశః ।
యాదృశ్యాం యాదృశీ తద్వత్సువచోభ్యాం సువచః స్వపి ॥13॥

దివ్ శబ్దరూపాలు. ద్యౌః (ప్ర॥ఏ), ద్యుభ్యాం (తృ, చ, పం -ద్వి), దివి (స॥ఏ), ద్యుషు (స॥బ), తాదృశ్యా (తృ॥ఏ), తాదృశీ (ప్ర॥ఏ), దిశ్ శబ్దం. దిక్-దిగ్, దిశౌ, దిశః (ప్ర॥వి), యాదృశ్యాం (స॥ఏ), యాదృశీ (ప్ర॥ఏ), సువచోభ్యాం (తృ, చ, పం -ద్వి), సవచస్సు (స॥బ),

అసౌ చాముమమూ చామూరమూభిరముయాఽముయోః ॥14॥

స్త్రీలింగ "అదస్" శబ్దరూపాలు ఇలా ఉంటాయి. అసౌ (ప్ర॥ఏ), అమూ (ప్ర,ద్వి-ద్వి), అముమ్ (ద్వి-ఏ), అమూః (ప్ర॥ద్వి-బ), అమూభిః (తృ॥బ), అముయా (తృ-ఏ), అముయోః (ష, స -ద్వి),

ఇత్యాది మహాపురాణే ఆగ్నేయే స్త్రీలింగశబ్ద సిద్ధరూపకథనం నామ ద్విపంచాశదధిక త్రిశతతమోఽధ్యాయః॥352॥

అగ్నిమహాపురాణంలో స్త్రీలింగశబ్ద సిద్ధరూపకథనం అనే మూడువందల యాభైరెండవ అధ్యాయం సమాప్తం.



త్రిపంచాశదధిక త్రిశతతమోఽధ్యాయః – మూడువందల యాభైమూడవ అధ్యాయం

నపుంసకశబ్దసిద్ధరూపకథనమ్ – నపుంసకశబ్దసిద్ధరూపకథనం

స్కంద ఉవాచ – స్కందుడు ఇలా చెప్పాడు.

నపుంసకే కిం కే కాని కిం కే కాని తతో జలమ్ ।
సర్వం సర్వే చ పూర్వాద్యాః సోమపం సోమపాని చ ॥1॥

నపుంసక లింగంతో 'కిమ్' శబ్దరూపాలు ఇలా ఉంటాయి. కిం-కే-కాని (ప్ర), కిం-కే-కాని (ద్వి), మిగిలిన రూపాలు పుంలింగ శబ్దానికి వలెనే. జలం (ప్ర॥ఏ), సర్వం (ప్ర॥ఏ), సర్వే (ప్ర॥బ)పూర్వ, పర, అవర, దక్షిణ, ఉత్తర, అపర, అధర, స్వ, అంతర మున్నగు శబ్దాల రూపాలు ఇలాగే ఉంటాయి. సోమపం (ప్ర-ద్వి-ఏ) సోమపాని (ప్ర-ద్వి-బ),

గ్రామణి గ్రామణినీ చ గ్రామాణి గ్రామణీన్యపి ।
వారి వారిణీ వారీణి వారీణాం వారిణీదృశమ్ ॥2॥

గ్రామణి (ప్ర-ద్వి-ఏ), గ్రామణీని (ప్ర-ద్వి-ద్వి), వారి (ప్ర-ద్వి-ఏ), వారిణీ (ప్ర-ద్వి-ద్వి), వారీణి (ప్ర-ద్వి-బ), వారీణాం (ష॥బ), వారిణి (స॥ఏ),

శుచయే శుచినే దేహి మృదునే మృదవే తథా ।
త్రపు త్రపుణి త్రపూణాం చ ఖలపూని ఖలప్వి చ ॥3॥

శుచయే, శుచినే (చ॥ఏ), మృదునే, మృదవే (చ॥ఏ), ఇవిశుచి, మృదు శబ్దరూపాలు. త్రపు (ప్ర-ద్వి-ఏ), త్రపుణీ (ప్ర-ద్వి-ద్వి), త్రపుణాం (ష॥బ), త్రపుశబ్దరూపాలు ఇవి. ఖలపూని, ఖలప్వి (స॥ఏ), ఇది ఖలపూశబ్దరూపాలు.

కర్త్రా చ కర్తృణే కర్త్రే అతిర్యతిరిణాం తథా ।
అభిన్యభినినీ చైవ సువచాంసి సువాక్షు చ ॥4॥

కర్త్రా, కర్తృణా (తృ॥ఏ), కర్తృణే-కర్త్రే (చ॥ఏ), ఇవి కర్తృ శబ్దరూపాలు. అతిరి (ప్ర-ద్వి-ఏ), అతిరిణీ (ప్ర॥ద్వి-ద్వి), ఇవి అతిరి శబ్దరూపాలు. అభిని (ప్ర॥ద్వి-ఏ), అభినినీ (ప్ర॥ద్వి-ద్వి), ఇవి అభిని శబ్దరూపాలు. సువచాంసి (ప్ర-ద్వి-బ) సువాక్షు (స॥బ), ఇవి "సువాక్" శబ్దరూపాలు.

యద్యత్త్విమే తత్కర్మాణి ఇదం చేమే త్విమాని చ ।
ఈదృక్ త్వదోఽమునీ అమూని అమునా స్యాదమీషు చ ॥5॥

'యత్' శబ్దానికి యత్, యద్ (ప్ర-ద్వి-ఏ), 'తత్' శబ్దానికి తత్, తద్ (ప్ర-ద్వి-ఏ) రూపాలు ఉంటాయి. 'కర్మ' శబ్దానికి కర్మాణి (ప్ర-ద్వి-బ), అని ఉంటుంది. ఇదం శబ్దానికి ఇదం (ప్ర॥ద్వి-ఏ), ఇమే (ప్ర॥ద్వి-ద్వి), ఇమాని (ప్ర॥ద్వి-బ) అని ఉంటాయి. ఈదృక్, ఈదృగ్ (ప్ర,ద్వి-ఏ), ఇవి ఈదృశ్ శబ్దరూపాలు. అదస్ శబ్దరూపాలు

ఇలా ఉంటాయి. అదః (ప్ర॥ద్వి-ఏ), అమునీ (ప్ర॥ద్వి-ద్వి), అమూని (ప్ర॥ద్వి-బ), అమునా (తృ॥ఏ), అమీషు (స॥బ),

అహమావాం వయం మాం వై ఆవామస్మాన్మయా కృతమ్ ।
ఆవాభ్యాం చ తథా స్మాభి ర్మహ్య మస్మభ్యమేవ చ ॥6॥

మదావాభ్యాం మదస్మచ్చ పుత్రో ఽ యం మమ చావయోః ।
అస్మాకమపి చాస్మాసు త్వం యువాం యూయమీజిరే ॥7॥

త్వాం యువాం చ యుష్మాంశ్చ త్వయా యుష్మా భిరీరితమ్ ।
తుభ్యం యువాభ్యాం యుష్మభ్యం త్వత్యువాభ్యాం చ యుష్మచ్చ ॥8॥

తవ యువయోర్యుష్మాకం త్వయి యుష్మాసు భారతీ ।
ఉపలక్షణమత్రై వ అజ్ఝలంతాశ్చ తే స్మృతాః ॥9॥

యుష్మద్, అస్మద్ శబ్దరూపాలు ఇలా ఉంటాయి. అహం-ఆవాం-వయం, (ప్ర), మాం (ద్వి॥ఏ), ఆవాం (ద్వి-ద్వి), అస్మాన్ (ద్వి॥బ), మయా (తృ॥ఏ), ఆవాభ్యాం (తృ॥చ-ద్వి), ఆస్మాభిః (తృ॥బ), మహ్యం (చ॥ఏ), అస్మభ్యం (చ॥బ) మత్ (పం-ఏ), ఆవాభ్యాం (పం-ద్వి), అస్మత్ (పం॥బ), మమ-ఆవయోః - అస్మాకం (షష్ఠీ) మయి-ఆవయోః-అస్మాసు (సప్తమీ), త్వం-యువాం-యూయం(ప్ర) ఇత్యాది. త్వా (త్వాం), యువాం (వాం) యుష్మాన్ (వః)-(ద్వి), త్వయా-యువాభ్యాం-యుష్మాభిః (తృ), తుభ్యం (తే)-యువాభ్యాం(వామ్) యుష్మభ్యం(వః)-(చ) త్వత్-యువాభ్యాం- యుష్మత్(పం), తవ (తే) యువయోః(వాం), యుష్మాకం (వః)-(షష్ఠీ), త్వయి-యువయోః- యుష్మాసు (సః), ఈవిధంగా ఇచ్చట అజంత, హలంత శబ్దాల రూపాలు దిగ్దర్శన మాత్రంగా వివరించడం జరిగింది.

ఇత్యాది మహాపురాణే ఆగ్నేయే నపుంసకశబ్దసిద్ధరూపకథనం నామ త్రిపంచాశదధిక త్రిశతతమోఽ ధ్యాయః॥353॥

అగ్నిమహాపురాణంలో నపుంసకశబ్దసిద్ధరూపకథనం అనే మూడువందల యాభైమూడవ అధ్యాయం సమాప్తం.



చతుష్పంచాశదధిక త్రిశతతమోఽధ్యాయః - మూడువందల యాభైనాల్గవ అధ్యాయం

కారకనిరూపణమ్ - కారకనిరూపణం

స్కంద ఉవాచ - స్కందుడు ఇలా పలికాడు.

కారకం సంప్రవక్ష్యామి విభక్త్యర్థసమన్వితమ్ ।
గ్రామోఽస్తి హేమహార్కేహ నౌమి విష్ణుం శ్రియాసహ ॥1॥

ఇపుడు విభక్త్యర్థ సమన్వితమైన కారకాన్ని చెబుతాను. గ్రామోఽస్తి, హేమహార్క ఇవి ప్రథమ, సంబోధనమునకు ఉదాహరణాలు. ప్రాతిపదికార్థ మాత్రంలో ప్రథమావిభక్తి వస్తుంది. "ఇహ నౌమి విష్ణుం శ్రియా సహ" ఇందు 'విష్ణుం' అను శబ్దం కర్మ కాబట్టి "ద్వితీయా కర్మణి స్మృతా" అనేదానివల్ల కర్మకు ద్వితీయ వచ్చింది. "శ్రియాసహ" అనుచోట 'శ్రియా' అనేది తృతీయ సహయోగంచే వచ్చింది.

స్వతంత్రః కర్తా విద్యాం తాం కృతినః సముపాసతే ।
హేతుకర్తా లంభయతే హితం వై కర్మకర్తరి ॥2॥

క్రియనిర్వహించడంలో స్వతంత్రుడు కర్త. వానిని ప్రేరేపించేవాడు హేతుకర్త. కర్మనే కర్తగా చెబితే కర్మకర్త. అభిహితుడు, అనభిహితుడు అని కర్త రెండు విధాలు. స్వతంత్రకర్తకు ఉదాహరణం. "కృతినః తాం విద్యాం సముపాసతే. విద్వాంసుడైన పురుషుడు తన విద్యను ఉపాసించుచున్నాడు. విద్వాంసుల స్వతంత్రత ఇందు వివక్షితము. కాబట్టి అది స్వతంత్రకర్తకు ఉదాహరణం. హేతుకర్తకు ఉదాహరణం "చైత్రోమైత్రం హితం లంభయతే". చైత్రుడు మైత్రుని హితప్రాప్తికోసమై చేయుచున్నాడు. ఇందు చైత్రుడు హేతుకర్త లేదా ప్రయోజక కర్త లేదా ప్రేరణ కర్త.

స్వయం భిద్యతే ప్రాకృతధీః స్వయం చ ఛిద్యతే తరుః ।
కర్తాఽభిహిత ఉత్తమః కర్తాఽనభిహితోఽధమః ॥3॥

కర్మనే కర్తగా చెప్పినచో కర్మకర్త. దీనికి ఉదాహరణము. "ప్రాకృతధీః స్వయం భిద్యతే" పామర బుద్ధి కలవాడు స్వయంగా భేదిస్తున్నాడు. "తరుఃస్వయం ఛిద్యతే" స్వయంగా చెట్టును నరుకుచున్నాడు. ఇక్కడ భేదించేవాని లేదా నరికేవాని కర్తృవ్యాపారం వివక్ష కానక్కరలేదు. అయినా కార్యం యొక్క అతిశయ సౌకర్యం కోసమై చెప్పబడింది. కాబట్టి ఇది కర్మకర్త. అభిహిత కర్త ఉత్తముడు. అనభిహిత కర్త అధముడు.

కర్తానభిహితో ధర్మః శిష్యే వ్యాఖ్యాయతే యథా ।
కర్తా పంచవిధః ప్రోక్తః కర్మసప్తవిధం శృణు ॥4॥

"శిష్యే ధర్మః వ్యాఖ్యాయతే' శిష్యునికోసమై ధర్మం వ్యాఖ్యానింపబడుతోంది. ఇత్యాదులతో కర్త అనభిహితం. ఈవిధంగా కర్త అయిదువిధాలు. కర్మఏడువిధాలు. దానిని వినవలసింది.

ఈప్సితం కర్మ చ యథా శ్రద్దధాతి హరిం యతిః ।
అనీప్సితం కర్మ యథా అహిం లంఘయతే భృశమ్ ॥5॥

ఈప్సితకర్మకు ఉదాహరణము. "యతిః హరిం శ్రద్ధధాతి" విరక్తుడైన సాధువు హరిని శ్రద్ధగా కొలుస్తున్నాడు. అందువల్ల హరికి ద్వితీయ వచ్చింది. అనీప్సిత కర్మకు ఉదాహరణం. "అహిం లంఘయతే భృశమ్" అతడు సర్పాన్ని ఎక్కువగా దాటుతున్నాడు. ఇందు దాటడం ప్రధానం కాని, పామును దాటడం కాదు. ఇది అనీప్సిత కర్మ. హఠయోగంలో ఇది ప్రధానం.

నైవేప్సితం నానీప్సితం దుగ్ధం సంభక్షయ న్రజః ।
భక్షయేదప్యకథితం గోపాలో దోగ్ధి గాం పయః ॥6॥

ఈప్సితానీప్సిత కర్మకు ఉదాహరణము. "దుగ్ధం సంభక్షయన్ రజః భక్షయేత్" మనుష్యుడు పాలను త్రాగి రజమును భక్షిస్తున్నాడు. దుగ్ధం ఈప్సితకర్మ రజఃఅనీప్సితకర్మ. అకథిత కర్మకు ఉదాహరణము. "గోపాలః గాం పయః దోగ్ధి" గోపాలుడు ఆవును పాలను పితుకుతున్నాడు. 'ఆవు నుండి' అనే పంచమికి బదులుగా 'ఆవును' అనే ద్వితీయ వచ్చింది.

కర్తృకర్మాథ గమయేచ్ఛిష్యం గ్రామం గురుర్యథా ।
కర్మచాభిహితం పూజా క్రియతే వై శ్రియై హరేః ॥7॥

కర్తృకర్మకు ఉదాహరణము. "గురుఃశిష్యం గ్రామం గమయేత్" గురువు శిష్యుని గ్రామమును గురించి పంపుతున్నాడు. ఇందు గురువు ప్రయోజక కర్త. శిష్యుడు కర్మభూతకర్త. అందువల్ల 'శిష్యం' ద్వితీయారూపం వచ్చింది. అభిహితకర్మకు ఉదాహరణము. "శ్రియై హరేః పూజా క్రియతే". లక్ష్మీ ప్రాప్తికోసమై శ్రీహరి పూజ చేయబడుతోంది. ఇందు పూజ ఉక్తకర్మ అభిహితకర్మ. అందువల్ల ప్రథమావిభక్తి వచ్చింది.

కర్మానభిహితం స్తోత్రం హరేః కుర్యాత్తు సర్వదమ్ ।
కరణం ద్వివిధం ప్రోక్తం బాహ్యమాభ్యంతరం తథా ॥8॥

అనభిహిత కర్మకు ఉదాహరణము "హరేః సర్వదం స్తోత్రం కుర్యాత్" శ్రీహరి యొక్క సర్వమనోరథాలను ఇచ్చే దానిని స్తోత్రం చేయుచున్నాడు. ఎక్కడ కర్తయందు ప్రత్యయం ఉంటుందో, అక్కడ కర్మ అనభిహితం. అప్పుడు దానికి ద్వితీయ వస్తుంది. బాహ్యం, ఆభ్యంతరం అని కరణం రెండు విధాలు.

చక్షుషా రూపం గృహ్ణాతి బాహ్యం దాత్రేణ తల్లునేత్ ।
సంప్రదానం త్రిధా ప్రోక్తం ప్రేరకం బ్రాహ్మణాయ గామ్ ॥9॥

"చక్షుషా రూపం గృహ్ణాతి" నేత్రం ద్వారా రూపాన్ని గ్రహిస్తున్నాడు. ఇక్కడ నేత్రం ఆభ్యంతరకరణం. అందువల్ల తృతీయ వచ్చింది. "దాత్రేణ తల్లునేత్" కొడవలి ద్వారా కోయుచున్నాడు. కొడవలి బాహ్యకరణం. అందువల్ల తృతీయ వచ్చింది. సంప్రదానం మూడు విధాలు. "బ్రాహ్మణాయ గాం దదాతి" బ్రాహ్మణుని కొరకు ఆవును ఇచ్చుచున్నాడు. ఇది ప్రేరక సంప్రదానం. అందువల్ల "సంప్రదానే చతుర్థీ" అనుదాని వల్ల బ్రాహ్మణ శబ్దానికి చతుర్థి వచ్చినది.

నరో దదాతి నృపతయే దాసం తదనుమంత్రకమ్ ।
అనిరాకర్తృకం భర్త్రే దద్యాత్పుష్పాణి సజ్జనః ॥10॥

"నరో నృపతయే దాసం దదాతి" మనుష్యుడు రాజు కొరకు దాసుని అర్పించుచున్నాడు. ఇక్కడ దాసార్పణంలో ప్రేరణ లేదు. గోదాన క్రియలో బ్రాహ్మణ ప్రేరణ ఉండవచ్చు. ఇది రాజు యొక్క దాసగ్రహణం అనుమోదన మాత్రమే. అందువల్ల ఇది అనుమంత్రక సంప్రదానం. కాబట్టి "నృపతయే" అనుచతుర్థి వచ్చింది. "సజ్జనః భర్త్రే పుష్పాణి దద్యాత్" సజ్జనుడైన పురుషుడు స్వామికోసమై పుష్పాలను సమర్పించాడు. స్వామి కోరకపోయినా పుష్పాలను ఇస్తే అంగీకారంతో స్వీకరించాడు. ఇది అనిరాకర్తృక సంప్రదానం. అందువల్ల భర్తృశబ్దానికి చతుర్థి వచ్చింది.

అపాదానం ద్విధా ప్రోక్తం చలమశ్వాత్తు ధావతః ।
పతితశ్చాచలం గ్రామాదాగచ్ఛతి సవైష్ణవః ॥11॥

అపాదానం రెండు విధాలుగా చెప్పబడింది. చలాపాదానం, అచలాపాదానం అని 'అపాదానే పంచమీస్యాత్' అని కారక సూత్రం. ధావతః అశ్వాత్ పతితః పరుగెత్తుచున్న గుఱ్ఱం నుండి పడిపోయాడు. గుఱ్ఱం పరుగుతీస్తోంది కాబట్టి ఇది చలాపాదానం. అందువల్ల 'అశ్వ' శబ్దానికి పంచమీవిభక్తి వచ్చింది. 'ధావతః' కూడ అంతే. "సః వైష్ణవః గ్రామాదాయాతి" ఆ వైష్ణవుడు గ్రామం నుండి వచ్చుచున్నాడు. ఇక్కడ గ్రామం అచలాపాదానం అందువల్ల గ్రామశబ్దానికి పంచమి వచ్చింది.

చతుర్ధా చాధికరణం వ్యాపకం దధ్ని వై ఘృతమ్ ।
తిలేషు తైలం దేవార్థమౌపశ్లేషికముచ్యతే ॥12॥

గృహే తిష్ఠేత్ కపిర్వృక్షే స్మృతం వైషయికం యథా ।
జలే మత్స్యోవనే సింహః స్మృతం సామీప్యకం యథా ॥13॥

గంగాయాం ఘోషో వసతి ఔపచారికమీదృశమ్ ।

అధికరణం నాలుగు విధాలు. అభివ్యాపకం, ఔపశ్లేషికం, వైషయికం, సామీప్యకం అని. దధ్నిఘృతమ్-పెరుగు నేయి ఉంది. తిలేషు తైలం-నువ్వులలో నూనె ఉంది-ఇవి వ్యాపకానికి ఉదాహరణాలు. కపిః గృహే తిష్ఠేత్-వృక్షే చ తిష్ఠేత్- కోతి ఇంటిలో ఉంది. చెట్టు పై కూడ ఉంది. ఇవి ఔపశ్లేషికానికి ఉదాహరణం. జలే మత్స్యః-నీటిలో చేప, వనే సింహః- అడవిలో సింహం ఇదివైషయికం. గంగాయాం ఘోషః-గంగయందు గొలపల్లె. ఇది సామీప్యకాధికరణం. దీనికే ఔపచారిక వాక్యం అని పేరు. "ఆధారోయోఽధికరణం విభక్తి స్తత్రసప్తమీ" అని మూలం.

తృతీయోఽథవా షష్ఠీ స్మృతాఽనభిహితే తథా ।
విష్ణుః సంపూజ్యతే లోకైర్గంతవ్యం తేన తస్య వా ॥14॥

కర్త అనభిహితమైనపుడు తృతీయకాని, షష్ఠికాని వస్తుంది. ఉదాహరణకు లోకైః విష్ణుః సంపూజ్యతే-లోకుల ద్వారా విష్ణువు పూజింపబడుచున్నాడు. ఇచట కర్త అనుక్తం. అందువల్ల లోకశబ్దానికి తృతీయ వచ్చింది.

'తేన తస్య వా గంతవ్యం'. అతనిచేత లేదా అతనికి వెళ్లదగినది. ఇచట కర్త అనభిహితం. అందువల్ల తృతీయ లేదా షష్ఠి వచ్చింది.

ప్రథమాఽభిహిత కర్తృకర్మణోః భక్తః ప్రణమేద్ధరిమ్ ॥15॥

కర్తృకర్మలు అభిహితమైనచో ప్రథమా విభక్తి వస్తుంది. భక్తః హరిం ప్రణమేత్. భక్తుడు భగవంతుని ప్రణమిల్లుతున్నాడు. ఇక్కడ అభిహితకర్త భక్తుడు. అందువల్ల ప్రథమ వచ్చింది. కర్మార్థమైన హరికి (అనుక్తకర్మ) ద్వితీయ వచ్చింది.

హేతౌ తృతీయా చాన్నేన వసేద్వృక్షాయ వై జలమ్ ।
చతుర్థీ తాదర్థ్యేఽభిహితా పంచమీ పర్యుపాఙ్ముఖైః ॥16॥

హేత్వర్థంలో తృతీయావిభక్తి వస్తుంది. ఉ:-అన్నేన వసేత్. అన్నం చేత ఉన్నాడు. ఉండుటకు కారణం అన్నం అందువల్ల దానికి తృతీయ వచ్చింది. తాదర్థ్యంలో చతుర్థి వస్తుంది. ఉ:-వృక్షాయజలమ్ వృక్షం కోసమై నీరు ఇందు తాదర్థ్యముందికాన (అనగా దానికోసమే అనిభావం) వృక్ష శబ్దానికి చతుర్థి వచ్చింది. పరి, ఉప, ఆఙ్, మున్నగు వాటి యోగంలో పంచమీ విభక్తి వస్తుంది.

యోగే వృష్టఃపరిగ్రామాద్దేవోఽయం బలవత్పురా ।
పూర్వో గ్రామాదృతే విష్ణో ర్నముక్తి రితరో హరేః ॥17॥

"పరిగ్రామాత్ పురా బలవత్ వృష్టోఽయం దేవః" గ్రామం నుండి కొంచెం దూరంలో దైవం పూర్వం మిక్కిలి ఎక్కువగా వర్షం కురియించింది. ఇక్కడ 'పరి' అనే దాని యోగం వల్ల "గ్రామ"శబ్దానికి పంచమీ విభక్తి వచ్చింది. పూర్వో గ్రామాత్, ఋతేవిష్ణోః, నముక్తిఃఇతరో హరేః దిగ్వాచక శబ్దం, అన్యార్థక శబ్దం, పృథక్ లేదా వినా మున్నగు శబ్దాల యోగంలో కూడ పంచమీ విభక్తి వస్తుంది. తృతీయ కూడ వస్తుంది.

పృథగ్వినాద్యైస్తృతీయా పంచమీ చ తథా భవేత్ ।
పృథగ్గ్రామాద్విహారేణ వినా శ్రీశ్చ శ్రియాశ్రియః ॥18॥

ఉ:-పృథక్ గ్రామాత్ (పంచమీ), వినా విహారేణ (తృతీయ), వినా శ్రియా (తృతీయ), వినా శ్రియః (ఇక్కడ శ్రీః శబ్దానికి పంచమీ విభక్తి 'శ్రియః') అని వచ్చాయి.

కర్మప్రవచనీయాఖ్యైర్ద్వితీయా యోగతో భవేత్ ।
అన్వర్జునం చ యోద్ధారో హ్యభితో గ్రామమీరితమ్ ॥19॥

కర్మ ప్రవచనీయాలతో సంబంధం ఉంటే ద్వితీయ వస్తుంది. "అన్వర్జునం యోద్ధారః" యోధులు అర్జునుని సమీపప్రదేశంలో ఉన్నారు. 'అను' అనేది కర్మప్రవచనీయ సంజ్ఞకం. ఆ యోగం వల్ల అర్జున శబ్దానికి ద్వితీయ వచ్చింది. అభితో గ్రామమీరితమ్ ఇక్కడ 'అభితః' అనేదాని యోగం వల్ల గ్రామశబ్దానికి ద్వితీయా విభక్తి వచ్చి "గ్రామం" అని అయింది.

నమః స్వాహా స్వధా స్వస్తి వషడాద్యై శ్చతుర్థ్యపి ।
నమోదేవాయ తే స్వస్తి తుమర్థాద్భావవాచినః ॥20॥

నమః, స్వాహా, స్వధా, స్వస్తి, వషట్ మున్నగునవి ప్రయోగించినపుడు చతుర్థి వస్తుంది. నమోదేవాయ, తే స్వస్తి ఉదాహరణములు. భావవాచకం కంటె తుమర్థంలో చతుర్థి వస్తుంది.

పాకాయ పక్తయే యాతి తృతీయా సహ యోగకే ।
హేత్వర్థే కుత్సితేఽంగే సా తృతీయా చ విశేషణే ॥21॥

"పాకాయ యాతి, పక్తయే యాతి", వంటకోసమై వెళ్ళుచున్నాడు. పాక, పక్తి శబ్దాలు తుమర్థక భావవాచక శబ్దాలు. అందువల్ల చతుర్థీ విభక్తి వచ్చింది. సహార్థక శబ్దాలతో సంబంధం ఉన్నప్పుడు, హేత్వర్థమునందు, కుత్సితాంగ వాచక శబ్దానికి తృతీయ వస్తుంది.

పితాఽగాత్సహ పుత్రేణ కాణోఽక్ష్ణాగదయా హరిః ।
అర్థేన నివసేద్భృత్యః కాలే భావే చ సప్తమీ ॥22॥

"పితా పుత్రేణ సహ అగాత్" తండ్రి కొడుకుతో కలసి వెళ్ళుచున్నాడు. ఇందు సహయోగంలో పుత్రశబ్దానికి తృతీయ వచ్చింది. "గదయా హరిః" హరి గదతో కూడి ఉన్నాడు. ఇక్కడ సహార్థక శబ్దం లేకపోయినా, విశేషణ వాచక గదా శబ్దానికి తృతీయ వచ్చింది. "కాణః అక్ష్ణా" కంటిచే ఒంటి కంటివాడు. కుత్సితవాచక 'అక్షి' శబ్దానికి తృతీయ వచ్చింది. "అర్థేన నివసేత్ భృత్యః" భృత్యుడు ధనకారణంచే ఉన్నాడు. ఇక్కడ హేత్వర్థమైన 'అర్థ' శబ్దానికి తృతీయ వచ్చింది. కాలవాచకమునందు, భావార్థమునందు సప్తమి వస్తుంది.

విష్ణౌ నతే భవేన్ముక్తిర్వసంతే స గతో హరిమ్ ।
నృణాం స్వామీ నృషు స్వామీ నృణామీశః సతాంపతిః ॥23॥

నృణాం సాక్షీ నృషు సాక్షీ గోషు నాథో గవాం పతిః ।
గోషు సూతో గవాం సూతో రాజ్ఞాం దాయాదకోఽస్త్విహ ॥24॥

అనగా ఒక వాక్యం యొక్క క్రియ యందు అన్యక్రియలక్షితమైతే, తద్వాచక శబ్దానికి సప్తమీవిభక్తి వస్తుంది. ఉ:– "విష్ణౌ నతే భవేన్ముక్తిః", భగవంతుడైన విష్ణువుకు నమస్కరిస్తే ముక్తి వస్తుంది. విష్ణువు యొక్క నమస్కారక్రియ ద్వారా ముక్తి లబ్ధక్రియ లక్షితమవుతోంది. అందువల్ల విష్ణునత శబ్దాలకు సప్తమి వచ్చింది. "వసంతే స గతోహరిమ్", వసంత ఋతువు నందు అతడు హరిని గూర్చి వెళ్లాడు. ఇక్కడ వసంత శబ్దం కాలవాచక శబ్దం. అందువల్ల "వసంతే" అని సప్తమి వచ్చింది. స్వామి, ఈశ, పతి, సాక్షి, నాథ, సూత, దాయాద, శబ్దాల యోగంలో షష్ఠీవిభక్తి, సప్తమీ, విభక్తి వస్తాయి. నృణాంస్వామీ, నృషు స్వామీ, నృణామీశః, సతాంపతిః నృణాంసాక్షీ, నృషుసాక్షీ, గోషునాథః, గవాంపతిః, గోషుసూతః, గవాంసూతః, రాజ్ఞాందాయాదకః – ఇత్యాదులు


అన్నస్య హేతోర్వసతి షష్ఠీ స్మృత్యర్థ కర్మణి ।
మాతుః స్మరతి గోప్తారో నిత్యం స్యాత్ కర్తృకర్మణోః ॥25॥

అపాం భేత్తా తవ కృతిర్న నిష్ఠాదిషు షష్ఠ్యపి ॥26॥

హేతువాచకం నుండి హేతువాచక శబ్ద ప్రయోగం జరిగితే షష్ఠీ విభక్తి వస్తుంది. ఉ:-అన్నస్య హేతోర్వసతి. అన్నం కారణంగా ఉన్నాడు. ఉండుటకు హేతువు అన్నం. అందువల్ల అన్నశబ్దానికి షష్ఠీవిభక్తి వచ్చింది. స్మరణార్థక ధాతుప్రయోగంలో దానికర్మకు షష్ఠీవిభక్తి వస్తుంది. ఉ:- మాతుఃస్మరతి. తల్లిని స్మరించుచున్నాడు. ఇక్కడ స్మరణార్థక ధాతుప్రయోగం వల్ల కర్మయైన 'మాతృ'శబ్దానికి షష్ఠీ విభక్తి వచ్చి "మాతుః" అని ప్రయోగింపబడింది. కృత్ప్రత్యయ యోగంలో కర్తృకర్మలకు షష్ఠీవిభక్తి వస్తుంది. ఉ:- అపాం భేత్తా- జలం యొక్క భేదన కర్త. ఇక్కడ భేతృశబ్దం కృత్ప్రత్యయాంతం. దానియోగంవల్ల కర్మభూతమైన 'అప్' శబ్దానికి షష్ఠీవిభక్తి వచ్చింది. ఉ:-తవ కృతిః నీ యొక్క కృతి. ఇక్కడ కృతిశబ్దం కృత్ప్రత్యయాంతం. దాని యోగంలో కర్మ భూతమైన "యుష్మద్" శబ్దానికి షష్ఠీ విభక్తి వచ్చింది. "నిష్ఠా" మున్నగు అర్థాలలో షష్ఠీవిభక్తి రాదు. 'గ్రామంగతః' ఇత్యాదులు. ఇక్కడ ద్వితీయయే ప్రయోగించబడింది.

ఇత్యాది మహాపురాణే ఆగ్నేయే కారకనిరూపణం నామ చతుష్పంచాశదధిక త్రిశతతమోఽధ్యాయః ॥354॥

అగ్నిమహాపురాణంలో కారకనిరూపణమనే మూడువందల యాభైనాల్గవ అధ్యాయం సమాప్తం.



పంచపంచాశదధిక త్రిశతతమోఽధ్యాయః – మూడువందల యాభైఅయిదవ అధ్యాయం

సమాసవిభాగకథనమ్ – సమాసవిభాగకథనం

స్కంద ఉవాచ – స్కందుడు ఇలా వచించాడు.

షోఢా సమాసం వక్ష్యామి అష్టావింశతిధా పునః ।
నిత్యానిత్యవిభాగేన లుగలోపేన చ ద్విధా ॥1॥

కాత్యాయనా! ఆరువిధాలుగా సమాసం గురించి చెబుతాను. అది మళ్లీ ఇరవై ఎనిమిది విధాలు. నిత్యం, అనిత్యం అని సమాసం రెండు విధాలు. అది లుక్, అలుక్ అనే భేదంచే మళ్లీ రెండు విధాలు.

కుంభకారశ్చ నిత్య స్స్యాద్ధేమకారాదికస్తథా ।
రాజ్ఞః పుమాన్రాజ పుమాన్న నిత్యోఽయం సమాసకః ॥2॥

కుంభకారః హేమకారః ఇత్యాదులు నిత్యసమాసాలు. ఇవి విగ్రహవాక్యాల ద్వారా జాతి విశేషాలను బోధించేవి కావు. రాజ్ఞఃపుమాన్, రాజపుమాన్ ఇత్యాదులు అనిత్యసమాసాలు. ఇక్కడ షష్ఠీతత్పురుష సమాస స్వపద విగ్రహ కారణంగా అనిత్యసమాసం అనబడుతుంది.

కష్టశ్రితో లుక్సమాసః కంఠేకాలాదికస్త్వలుక్ ।
స్యాదష్టధా తత్పురుషః ప్రథమాద్యాః సుపా సహ ॥3॥

కష్టశ్రితః (కష్టం శ్రితః) ఇందు ద్వితీయా విభక్తి ప్రత్యయం లోపించింది కాన లుక్సమాసం. కంఠే కాలః ఇందు సప్తమీవిభక్తిప్రత్యయం లోపించలేదు కావున అలుక్సమాసం. తత్పురుషసమాసం ఎనిమిది ప్రకారాలుగా ఉంటుంది. ప్రథమాంతాది శబ్దాలు సుబంత పదాలతో సమసిస్తాయి.

ప్రథమాతత్పురుషోఽయం పూర్వం కాయస్య విగ్రహే ।
పూర్వకాయోఽపరకాయో హ్యధరోత్తరకాయకః ॥
అర్ధం కణా యార్ధకణా భిక్షాతూర్యమథేదృశమ్ ॥4॥

పూర్వం కాయస్య పూర్వకాయః ఇది ప్రథమాతత్పురుష. ఇలాగే అపరం కాయస్య అపరకాయః, అధరం కాయస్య అధరకాయః ఉత్తరం కాయస్య ఉత్తరకాయః ఇత్యాదులు అలాగే అర్ధం కణాయాః అర్ధకణా, తుర్యం భిక్షాయాః తుర్యభిక్షా ఇత్యాదులు. పక్షాంతరంలో షష్ఠీతత్పురుష వచ్చి భిక్షాతుర్యం అని అవుతుంది.

ఆపన్నజీవికస్తద్వద్ద్వితీయా మాధవాశ్రితః ॥5॥

ఆపన్నః జీవికాం ప్రతి ఆపన్నజీవికః – ద్వితీయా తత్పురుష పక్షాంతరంలో జీవికాపన్నః అని అవుతుంది. అలాగే మాధవం ఆశ్రితః మాధవాశ్రితః (ద్వి॥త),

వర్షం భోగ్యో వర్షభోగ్యో ధాన్యార్థశ్చ తృతీయయా ।
చతుర్థీ స్యాద్విష్ణుబలిర్వృకభీతిశ్చ పంచమీ ॥6॥

వర్షం భోగ్యః వర్షభోగ్యః (ద్వి॥త), ధాన్యేన అర్థః-ధాన్యార్థః (తృ॥త), విష్ణవే బలిః-విష్ణుబలిః (చ॥త), వృకాత్ భీతిః - వృకభీతిః (పంచమీ ॥త॥)

రాజ్ఞః పుమాన్ రాజపుమాన్ షష్ఠీ వృక్షఫలం తథా ।
సప్తమి చాక్షశౌండో௨యమహితో నఞ్ సమాసకః ॥7॥

రాజ్ఞః పుమాన్- రాజపుమాన్ (ష॥త) అలాగే వృక్షస్యఫలం - వృక్ష ఫలం (ష॥త), అక్షేషు శౌండః-అక్షాశౌండః (స॥త), ద్యూతక్రీడానిపుణుడు అని అర్థం. అహితః-న హితః-నఞ్తత్పురుష

కర్మధారయః సప్తధా నీలోత్పలముఖాః స్మృతాః ।
విశేషణ పూర్వపదో విశేష్యోత్తర స్తథా ॥8॥

కర్మధారయము ఏడు విధాలు. అందు మొదటిది విశేషణపూర్వపదం. నీలోత్పలమ్-నీలం చ తదుత్పలమ్. నల్లని కలువ ఇందు విశేషణం పూర్వపదంగా ఉంది. విశేష్యం ఉత్తరపదంగా ఉంటుంది. రెండోది విశేష్యోత్తర విశేషణ పదం.

వైయాకరణఖసూచిః శీతోష్ణం ద్విపదం శుభమ్ ।
ఉపమానపూర్వపదః శంఖపాండుర ఇత్యపి ॥9॥

వైయాకరణఖసూచిః (ఏమి అడిగినా ఆకాశం వంక చూచే వైయాకరణుడు), ఇందు విశేషణం ఉత్తరపదంగా ఉంది. మూడోది విశేషణోభయపదం (లేదా) విశేషణ ద్విపదం. శోతోష్ణం-శీతంచ ఉష్ణంచ-రెండునూ విశేషణాలే. నాలుగోది ఉపమానపూర్వపదం. శంఖపాండురః- శంఖ ఇవ పాండురః-శంఖం వలె తెల్లనైనవాడు శంఖం అనే ఉపమానం పూర్వపదంలో ఉంది.

ఉపమానోత్తరపద పురుషవ్యాఘ్ర ఇత్యపి ।
సంభావనపూర్వపదో గుణవృద్ధిరితీదృశమ్ ॥10॥

వ్యాఘ్ర ఇవ పురుషః - పురుష వ్యాఘ్రః - ఇందు వ్యాఘ్రః అనే ఉపమానం ఉత్తర పదంలో ఉంది కాబట్టి ఉపమాన ఉత్తరపదం. తరువాతిది సంభావనాపూర్వపదం. గుణవృద్ధిః అనేది ఉదాహరణం.

గుణ ఇతి వృద్ధిర్వాచ్యా సుహృదేవ సుబంధుకః ।
అవధారణ పూర్వపదో బహువ్రీహిశ్చ సప్తధా ॥11॥

గుణ ఇతి వృద్ధిః ఇది సంభావనాపూర్వపదం. గుణశబ్దం ద్వారా వృద్ధి యొక్క సంభావన వ్యక్తమవుతోంది. అతని వృద్ధి గుణం ద్వారా అని భావం. సుహృదేవ సుబంధుకః ఇందు అవధారణార్థకమైన 'ఏవ' అనే పదసూచక

శబ్దం పూర్వపదంగా ఉంది. కాబట్టి అవధారణ పూర్వపదం అయింది. బహుబ్రీహి సమాసం ఏడు విధాలుగా ఉంటుంది.

ద్విపదశ్చ బహుబ్రీహి రారూఢభవనో నరః ।
అ్చరితాశేషపూర్వోయం బహ్వంఘ్రిః పరికీర్తితః ॥12॥

1. ద్విపద 2. బహుపద 3. సంఖ్యోత్తరపద 4. సంఖ్యోభయపద 5. సహపూర్వపద 6. వ్యతిహార లక్షణార్థ 7. దిగ్లక్షణార్థ. ద్విపదబహుబ్రీహిలో రెండు పదాలకు సమాసం ఉంటుంది. ఆరూఢభవనో నరః ఆరూఢం భవనం యేన సః భవనాన్ని అధిరోహించిన మనుష్యుని ఇది బోధిస్తుంది. బహుపదబహుబ్రీహిలో అధిక పదాలకు సమాసం ఉంటుంది. అయం అర్చితాశేషపూర్వః అర్చితాః అశేషాః పూర్వాః యస్యసోఽయమ్. పూర్వంలో ఎవరిచే అధికులు పూజింపడినారో, అతడు అర్చితాశేషపూర్వుడు. ఇందు అర్చిత, అశేష, పూర్వ-మూడు పదాలకు సమాసం ఉంది.

ఏతే విప్రాశ్చోపదశాః సంఖ్యోత్తర పదస్త్వయం ।
సంఖ్యోభయ పదోయద్వద్విత్రాద్వ్యేకత్రయో నరః ॥13॥

సంఖ్యోత్తర పదానికి ఉదాహరణం. ఏతే విప్రాః ఉపదశాః , ఇది పది బ్రాహ్మణులకు సంబంధించినది. ఈ బ్రాహ్మణులు పదిమంది, ఇందు 'దశ' సంఖ్య ఉత్తర పదంగా ఉంది. కాన సంఖ్యోత్తరపదం. సంఖ్యోభయపదానికి ఉదాహరణం "ద్విత్రాః ద్వ్యేకత్రయః", ఇత్యాదులందు రెండు పదాలు సంఖ్యలే కావున సంఖ్యోభయపదం.

సహపూర్వపదోఽయం స్యాత్ సమూలోద్ధృతకస్తరుః ।
వ్యతిహారలక్షణోఽర్థః కేశాకేశి నఖానఖి ॥14॥

సహపూర్వపద బహుబ్రీహికి ఉదాహరణం. సమూలోద్ధృతకః తరుః – సహమూలేన ఉద్ధృతం కం శిఖా యస్య సః మూలంతో సహా చెట్టును నాశనం ఎవడు చేశాడో అతడు సహమూలోద్ధృతకః. ఇందు పూర్వపదస్థానంలో సహ (స) శబ్ద ప్రయోగం ఉంది. కేశాకేశి, నఖానఖి ఇత్యాదులు వ్యతిహార లక్షణ బహుబ్రీహికి ఉదాహరణములు. కేశాలతోను, నఖాలతోను కలహం అని భావం.

దిగ్లక్ష్యా స్యాద్దక్షిణపూర్వా ద్విగురాభాషితో ద్విధా ।
ఏకవద్భావి ద్విశృంగం పంచమూలీ త్వనేకధా ॥15॥

దిగ్లక్షణార్థానికి ఉదాహరణం. దక్షిణపూర్వా, దక్షిణపూర్వదిక్కులందున్న మధ్యప్రదేశం. ఆ దిక్కును సూచించేది. అలాగే ఉత్తరపూర్వా ఉత్తరపూర్వదిక్కుల మధ్యను సూచించేది. ద్విగుసమాసం రెండు విధాలుగా ఉంటుంది. 1. ఏకవద్భావి 2. అనేకవద్భావి. సంఖ్యావాచకం పూర్వపదంగా ఉంటే ద్విగుసమాసం అవుతుంది. ఏకవద్భావానికి ఉదాహరణ. ద్విశృంగమ్ రెండు శృంగాల సమాహారం. ఏకవద్భావానికి మరో ఉదాహరణ పంచమూలి. అయిదు మూలాల సమాహారం. అనేకవద్భావానికి సప్తర్షయః ఇత్యాదులు. పంచబ్రాహ్మణాః ఇత్యాదులలో సమాసం ఉండదు. సంజ్ఞాప్రసిద్ధి లేదు కాబట్టి

ద్వంద్వః సమాసో ద్వివిధో హీతరేతరయోగకః ।
రుద్రవిష్ణూసమాహారో భేరీపటహమీదృశమ్ ॥16॥

ద్వంద్వసమాసం రెండు విధాలు. ఇతరేతరయోగద్వంద్వ, సమాహారద్వంద్వం అని. రుద్రశ్చ విష్ణుశ్చ రుద్రవిష్ణూ-ఇది ఇతరేతర యోగద్వంద్వం. భేరీ చ పటహశ్చ అనయోః సమాహారః భేరీపటహమ్-ఇది సమాహారద్వంద్వం.

ద్విధాఖ్యాతోఽ వ్యయీభావో నామపూర్వపదో యథా ।
శాకస్యమాత్రా శాకప్రతి యథావ్యయపూర్వకః ॥17॥

అవ్యయీభావం రెండు విధాలు. 1. నామ పూర్వపదం 2. అవ్యయ పూర్వపదం. శాకస్యమాత్రా శాకప్రతి. ఇక్కడ శాకం పూర్వపదం. మాత్రార్థక ప్రతిపదం అవ్యయం ఉత్తర పదం. ఇక్కడ నామం పూర్వపదం కాబట్టి నామపూర్వపదం అవుతుంది.

ఉపకుంభం చోపరథ్యం ప్రాధాన్యేన చతుర్విధః ।
ఉత్తరపదార్థముఖ్యోఽయం ద్వంద్వశ్చోభయ ముఖ్యకః ॥18॥

పూర్వార్థే సోఽవ్యయీభావో బహువ్రీహిశ్చ బాహ్యగః ॥19॥

ఉపకుంభం, ఉపరథ్యం ఇత్యాదులు అవ్యయపూర్వకాలు. ఇందు 'ఉప' అనే అవ్యయం పూర్వపదంగా ఉంది. సమాసం ప్రాధాన్యాన్ని బట్టి నాలుగు విధాలు. ఉత్తరపదార్థప్రధానం తత్పురుష, ఉభయపదార్థప్రధానం ద్వంద్వం పూర్వపదార్థప్రధానం అవ్యయీభావం. అన్యార్థప్రధానం బహువ్రీహి.

ఇత్యాది మహాపురాణే ఆగ్నేయే సమాసవిభాగకథనం నామ పంచపంచాశదధిక త్రిశతతమోఽధ్యాయః ॥355॥

అగ్నిమహాపురాణంలో సమాసవిభాగకథనం అనే మూడువందల యాభైఐదవ అధ్యాయం సమాప్తం.



షట్పంచాశదధికత్రిశతతమోఽధ్యాయః - మూడువందల యాభైఆరవ అధ్యాయం
తద్ధితరూపకథనమ్ - తద్ధితరూపకథనం

స్కంద ఉవాచ - స్కందుడు ఇలా వచించాడు.

తద్ధితం త్రివిధం వక్ష్యే సామాన్యా వృత్తిరీదృశీ ।
లచ్యంసలో వత్సలః స్యాదిలచి స్యాత్తుఫేనిలమ్ ॥1॥

ఇపుడు మూడు విధాలుగా నున్న తద్ధితను చెబుతాను. సామాన్య తద్ధితవృత్తి ఈవిధంగా ఉంటుంది. 'లచ్' ప్రత్యయం చేర్చగా 'అంస' శబ్దం పై 'అంసలః' అని అవుతుంది. వత్స శబ్దానికి 'లచ్' ప్రత్యయం చేరడం వల్ల 'వత్సలః' అని అవుతుంది. 'ఇలచ్' ప్రత్యయం చేరగా 'ఫేనిలమ్' అని అవుతుంది. సామాన్య వృత్తి, అవ్యయవృత్తి, భావవాచకవృత్తి అని మూడు విధాలు.

రోమశః శే పామనో నే ఇలచిస్యాత్తు పిచ్ఛిలమ్ ।
అణిప్రాజ్ఞ ఆర్చకః స్యాద్దన్తా దురచి దంతురః ॥2॥

శ-రోమశః, పామనః-న, ఇలచ్-పిచ్ఛిలమ్, అణ్-ప్రాజ్ఞః, (ణ-ప్రజ్ఞా, అర్చా-ఆర్చః), అణ్-ఆర్చకః, దంత శబ్దానికి 'ఉరచ్' వస్తుంది. దంతురః

రేస్యాన్మధురం సుషిరం వే స్యాత్కేశవ ఈదృశః ।
హిరణ్యం యే మాలవో వే వలచి స్యాద్రజస్వలా ॥3॥

ర-మధురం, సుషిరం, వ-కేశవః, హిరణ్య-య, హిరణ్యవ-వ, మాలవ-వ, వలచ్ ప్రత్యయం వస్తే - రజస్వల.

ఇనౌ ధనీ కరీ హస్తీ ధనికం టికనీరితమ్ ।(ఠిక)
పయస్వీ విని మాయావీ ఊర్ణాయుర్యుచి ఈరితమ్ ॥4॥

ఇన్ ప్రత్యయం-ధనీ, కరీ, హస్తీ, ఠన్-ఇక-ధనికం, ధనికః, విన్-పయస్వీ, మాయావీ, యుచ్-ఊర్ణాయుః.

వాగ్మీ మిని ఆలచి స్యాద్వాచాలశ్చాటచీరితమ్ ।
ఫలినో బర్హిణః కేకీ వృందారక స్తథా కని ॥5॥

వాగ్మీ-వాచ్-మిని, ఆలచ్-వాచాలః, ఆటచ్-వాచాటః, ఇనచ్ ప్రత్యయం-ఫలినః, బర్హిణః వృంద శబ్దం కన్న 'ఆరకన్ ప్రత్యయం వస్తే వృందారకః, 'క' అనే ప్రత్యయం వృందారశబ్దం కన్న వచ్చిన రూపం,

ఆలుచి శీతం న సహతే శీతాలుశ్చాలురీదృశః ।
హిమాలురాలుచి స్యాచ్చ హిమం న సహతే యథా ॥6॥

శీతం న సహతే, హిమం న సహతే అనే విగ్రహంలో శీత, హిమ శబ్దాల కన్న 'ఆలుచ్' ప్రత్యయం రాగా శీతాలుః, హిమాలుః అనే రూపాలు అవుతాయి.

రూపం వాతాదులచి స్యాద్వాతులశ్చానపత్యకే ।
వాసిష్ఠః కౌరవో వాసః పాంచాలః సోఽస్య వాసకః ॥7॥

వాత శబ్దం కన్న 'ఉలచ్' ప్రత్యయం రాగా "వాతులః" అనే రూపం వస్తుంది. వసిష్ఠస్య అపత్యం పుమాన్ వాసిష్ఠః, కురోరపత్యం పుమాన్ కౌరవః అపత్యార్థంలో వసిష్ఠ, కురుశబ్దాల కన్న అణ్ ప్రత్యయం వచ్చింది. ఇది వాని నివాసం అనే అర్థంలో కూడ 'అణ్' వస్తుంది. పాంచాలః

తత్ర వాసో మాథురః స్యాద్వేత్త్యధీతే చ చాంద్రకః ।
వ్యుత్క్రమం వేత్తి క్రమకః నరశ్చ క్రామకౌశకః ॥8॥

మధురాయాం వాసః అస్యేతి మాధురః తెలుసుకొనుచున్నాడు. చదువుచున్నాడు అనే అర్థంలో కూడ అణ్ వస్తుంది. చాంద్రం వ్యాకరణం అధీతే తద్వేద వా ఇతి చాంద్రః, చాంద్ర ఏవ చాంద్రకః - స్వార్థే క ప్రత్యయః క్రమాదిశబ్దాల కన్న 'వున్' ప్రత్యయం వస్తే క్రమంవేత్తి ఇతి క్రమకః- వుస్థానంలో 'అక' వస్తుంది. ఇలాగే పదకః, శిక్షకః, మీమాంసకః ఇత్యాదులు కోశం అధీతే వేద వా కౌశకః.

ప్రియంగూణాం భవం క్షేత్రం ప్రైయంగవీనకం ఖఞి ।
మౌద్గీనం కౌద్రవీణం చ వైదేహశ్చానపత్యకే ॥9॥

ప్రియంగోర్భవనం క్షేత్రం - ప్రైయంగవీనం -ధాన్యానాం భవనే క్షేత్రే ఖఞ్, మౌద్గీనం -ముద్గశబ్దం. కౌద్రవీణం -కోద్రవ శబ్దం, ఖప్రత్యయానికి 'ఈన' ఆదేశంగా వస్తుంది. - వైదేహః- విదేహ శబ్దం- అపత్యభిన్నమైన అర్థంలో అణ్ ప్రత్యయం.

ఇఞి దాక్షిర్దాశరథిః ఫకి నాడాయనాదికమ్ ।
ఆశ్వాయనః స్యాచ్చ ఫఞి యఞి గార్గ్యశ్చ వాత్స్యకః ॥10॥

దక్షస్య అపత్యం దాక్షిః, దశరథస్య అపత్యం దాశరథిః - అపత్యార్థంలో ఇఞ్ వస్తుంది. నడాదిభ్యః ఫక్, ఫక్ ప్రత్యయానికి ఆయనాదేశం. నడస్య గోత్రాపత్యం-నడాయనః అశ్వస్య గోత్రాపత్యం ఆశ్వాయనః ఇత్యాదులు (ఫఞ్), యఞ్-గార్గ్యః, వాత్స్యః

ఢకి స్యాద్వైనతేయాది శ్చాటకైరస్తథైరకి ।
ద్రకి గౌధేరకో రూపం గౌధారశ్చారకీరితమ్ ॥11॥

ఢక్ - ఏయాదేశః - వినతాయాః పుత్రః వైనతేయః అని అవుతుంది. "చటకాయా ఐరక్" చటకాయాః అపత్యం పుమాన్-చటక శబ్దం కన్న ఐరక్ ప్రత్యయం వచ్చి "చాటకైరః" అని అవుతుంది. "గోధాయా ఢ్రక్" గోధాయా అపత్యం గౌధేరః అని అవుతుంది. ఆరక్ ప్రత్యయం వస్తే గౌధారః అని అవుతుంది.

క్షత్రియో ఘే కులీనః ఖే ణ్యే కౌరవ్యాదయః స్మృతాః ।
యతి మూర్ధన్యముఖ్యాదిః సుగంధిరితి రూపకమ్ ॥12॥

క్షత్రశబ్దం-ఘప్రత్యయం-ఇయాదేశం-క్షత్రియః, కులశబ్దం-ఖప్రత్యయం-ఈనాదేశం- కులీనః, కురుశబ్దం, ణ్యప్రత్యయం-కౌరవ్యః, యత్ ప్రత్యయం వస్తే మూర్ధన్య, ముఖ్యాదిశబ్దాలు వస్తాయి. "శోభనో గంధో యస్య సః" సుగంధిః - సుగంధః - ఇప్రత్యయం.

తారకాదిభ్య ఇతచి నభస్తారకితాదయః ।
అనఙి న్యాచ్చ కుండోధ్నీ పుష్పధన్వ సుధన్వనౌ ॥13॥

తారకాది శబ్దాలకు ఇతచ్ ప్రత్యయం వస్తే "తారకాః సంజాతా అస్య" 'తారకితం' అని అవుతుంది. "కుండమివ ఊధః యస్యాః సా", అనే విగ్రహంతో "ఊధసోఽనఙ్" అనే సూత్రం ద్వారా అనఙ్ రాగా "ఙీష్" ప్రత్యయం వచ్చి "కుండోధ్నీ" అని రూపం ఏర్పడుతుంది. "పుష్పం ధనుర్యస్య స పుష్పధన్వా", "సుష్ఠు ధనుర్యస్య స సుధన్వా" ఈ విధంగా బహువ్రీహిలో "ధనుషశ్చ" అనే సూత్రం ద్వారా "అనఙ్" వచ్చి సుబాదికార్యాలు వచ్చి పుష్పధన్వా, సుధన్వా అనే రూపాలు ఏర్పడతాయి.

చుంచుపి విత్తచుంచుః స్యాద్విత్తమస్య చ శబ్దకే ।
చణపి స్యాత్కేశచణో రూపే స్యాత్పటురూపకమ్ ॥14॥

"విత్తేన విత్తః" ఇతి "విత్తచుంచుః" ధనవైభవం ద్వారా ప్రసిద్ధుడు. శబ్దశాస్త్రంలో ప్రసిద్ధుడు "శబ్దచుంచుః" ఈ శబ్దాల కన్న"చుంచుప్" అనే ప్రత్యయం వస్తుంది. "చణప్" ప్రత్యయం వస్తే 'కేశచణః' అనే రూపం ఏర్పడుతుంది. ప్రశస్తః పటుః - పటురూపః - ఇక్కడ రూపప్రత్యయం వచ్చింది.

ఈయసౌ చ పటీయాన్ స్యాత్ తరప్యక్షతరాదికమ్ ।
పచతితరాం చ తరపి తమప్యటతి తమామపి ॥15॥

ఈయస్ - పటీయాన్, తరప్ - అక్షతరః, పచతితరాం, తమప్ - అటతితమాం, తిఙంతాల కన్న వచ్చే తరప్, తమప్ ప్రత్యయాలకు అంతంలో 'ఆమ్' వస్తుంది.

మృదుకల్పః కల్పపి స్యాదింద్రకల్పోఽర్క కల్పకః ।
రాజదేశీయో దేశీయే దేశ్యే దేశ్యాదిరూపకమ్ ॥16॥

మృదుశబ్దం కన్న 'కల్పప్' ప్రత్యయం వస్తే మృదుకల్పః అనే రూపం ఏర్పడుతుంది. ఇంద్రకల్పః, అర్కకల్పః, ఇత్యాదులు. "ఈషదూనః రాజా" అనే అర్థంలో 'రాజన్' శబ్దం కన్న 'దేశీయర్' ప్రత్యయం వస్తే రాజదేశీయః అని రూపం ఏర్పడుతుంది. 'దేశ్య' ప్రత్యయం వస్తే 'రాజదేశ్యః' అని అవుతుంది.

పటుజాతీయో జాతీయే జానుమాత్రం చ మాత్రచి ।
ఊరుద్వయసో ద్వయసచ్యూరుదఘ్నం చ దఘ్నచి ॥17॥

'పటు' శబ్దం కన్న జాతీయ ప్రత్యయం రాగా "పటు జాతీయః" అని అవుతుంది. జాను శబ్దం కన్న మాత్రచ్ ప్రత్యయం రాగా "జానుమాత్రం" అనే రూపం ఏర్పడుతుంది. ద్వయసచ్ – ఊరుద్వయసం, దఘ్నచ్ – ఊరుదఘ్నమ్.

తయపి స్యాత్పంచతయో దౌవారికష్ఠకీరితమ్ ।
సామాన్యవృత్తిరుక్తాథ అవ్యయాఖ్యశ్చ తద్ధితః ॥18॥

"సంఖ్యాయా అవయవే తయప్" అని వ్యా॥సూ॥తయప్ – పంచతయః, ద్వారం రక్షతి. దౌవారికః – ద్వారశబ్దం – ఠక్– ప్రత్యయం. ఇకా దేశం – దౌవారికిః, ఇంత వరకు తద్ధితసామాన్యవృత్తి చెప్పబడింది. ఇపుడు అవ్యయతద్ధిత వృత్తి వివరించబడుతోంది.

యస్మాద్యతస్తసిలి చ యత్ర తత్ర త్రలీరితమ్ ।
అస్మిన్ కాలేహ్యధునా స్యాదిదానీం చైవదాన్యపి ॥19॥

యస్మాత్ అనే అర్థంలో 'తసిల్' ప్రత్యయం చేరగా "యతః" అని అవుతుంది. "త్రల్" ప్రత్యయం వస్తే యత్ర, తత్ర అని "సప్తమ్యాస్త్రల్" అనే సూత్రం ద్వారా నిష్పన్నమవుతాయి. అస్మిన్ కాలే అనే అర్థంలో ఇదం శబ్దం "అధునా" అని ప్రయోగింపబడుతుంది. ఈ అర్థంలోనే "దానం" ప్రత్యయం రాగా "ఇదానీం" అని అవుతుంది.

సర్వస్మిన్ సర్వదా దా స్యాత్ తస్మిన్ కాలే ర్హిలీరితమ్ ।
తర్హి హ్యోఽస్మిన్ కాల ఇహ కర్హి కస్మింశ్చ కాలకే ॥20॥

'దా' అనే ప్రత్యయం చేరగా 'సర్వస్మిన్' అనే అర్థంలో సర్వశబ్దం "సర్వదా" గా మారుతుంది. తస్మిన్ కాలే – తర్హి, కస్మిన్ కాలే – కర్హి, అస్మిన్ కాలే – ఇహ అని అవుతుంది.

యథా థాలి థామి కథం పూర్వస్యాం దిశి సంచయేత్ ।
అస్తాతి చైవ పూర్వస్యాః పూర్వాదిగ్రామణీయకాః ॥21॥

థాల్ – యథా, థం – కథం, 'పూర్వస్యాం దిశి' అర్థంలో అస్తాతి ప్రత్యయం ఉ:-పూర్వస్యాం, పూర్వస్యాః, పూర్వశబ్దం కన్న ఈ రూపాలు ఏర్పడ్డాయి. పూర్వ, అధర, అవర శబ్దాల కన్న అస్తాతి ప్రత్యయం వస్తే పురస్తాత్, అధస్తాత్, అవస్తాత్ (పుర, అధ, అవ – ఆదేశాలు)

పురస్తాత్సంచరేద్గచ్ఛేత్ సద్యస్తుల్యేహనీరితమ్ ।
యతిపూర్వాబ్దే చ పరుత్ పూర్వతరే పరార్యపి ॥22॥

తుల్యే అహని – సద్యః, పూర్వాబ్దే – పరుత్, పూర్వతరాబ్దే – పరారి, అనే రూపాలు ప్రత్యయాలురాగా ఏర్పడతాయి.

ఐషమోఽ స్మిన్సంవత్సరే రూపం సమసణీరితమ్ ।
ఏద్యవౌ పరేద్యవి స్సాత్పరస్మిన్నహనీరితమ్ ॥23॥

అస్మిన్ సంవత్సరే – ఐషమః, పరస్మిన్నహని అనే అర్థంలో పరశబ్దంపై ఏద్యవి ప్రత్యయం చేరగా 'పరేద్యవి' అని అవుతుంది.

అద్యాస్మిన్నహని ద్యే స్యాత్పూర్వేద్యుశ్చ తథేద్యుసి ।
దక్షిణస్యాం దిశి వసేద్దక్షిణాద్యుభౌ ॥24॥

అస్మిన్నహని అనే అర్థంలో 'ద్య' చేరగా అద్య అని అవుతుంది. పూర్వ శబ్దానికి 'ఏద్యుస్ ' ప్రత్యయం చేరగా పూర్వేద్యుః, అలాగే పరేద్యుః, అన్యేద్యుః అనే రూపాలు వస్తాయి. "దక్షిణస్యాం దిశి వసేత్" అనే అర్థంలో "ఆచ్, ఆహి" అనే ప్రత్యయాలు చేరగా, దక్షిణా, దక్షిణాహి అనే రూపాలు ఏర్పడతాయి.

ఉత్తరస్యాం దిశి వసేదుత్తరా దుత్తరాద్యుభౌ ।
ఉపరి వసేదుపరిష్టాద్భవేద్రిష్టాతి ఊర్ధ్వకాత్ ॥25॥

"ఉత్తరస్యాం దిశి వసేత్" అనే అర్థంలో ఉత్తరా, ఉత్తరాహి అనే రూపాలు వస్తాయి. ఉపరి అను దానికి 'ఇష్టాతి' చేర్చగా "ఉపరిష్టాత్" అని అవుతుంది. ఊర్ధ్వశబ్దం పై 'ఉపరి' అనే రూపం ఏర్పడుతుంది.

ఉత్తరేణ చ పిత్రోక్తమాచి చ స్యాచ్చ దక్షిణా ।
ఆహౌ దక్షిణా హి వసేద్ద్విప్రకారం ద్విధా చ ధా ॥26॥

ఉత్తర శబ్దానికి 'ఏనచ్' చేర్చగా 'ఉత్తరేణ' అని అవుతుంది. ఆచ్–దక్షిణా, ఆహి–దక్షిణాహి, ధా–ద్విధా అనే రూపాలు ఏర్పడతాయి.

ధ్యముఞి చైకధ్యం కురు త్వం ద్వైధం ధముఞిచేదృశమ్ ।
ద్వౌప్రకారౌ ద్విధా ధాచి ఆసుసురతరం యథా ॥27॥

ధ్యముఞ్ – ఐకధ్యమ్, ధముఞ్–ద్వైధం, త్రైధం, ఆచ్ – ద్విధా, త్రిధా మొదలగునవి ఏర్పడతాయి.

నిపాతాస్తద్ధితాః ప్రోక్తా స్తద్ధితో భావవాచకః ।
పటోర్భావః పటుత్వం త్వే పటుతా తలి చేరితమ్ ॥28॥

ఇంతవరకు నిపాత తద్ధితలు చెప్పబడ్డాయి. ఇపుడు భావవాచకాలు చెప్పబడుతున్నాయి. పటోర్భావః – అనే అర్థంలో త్వప్రత్యయం చేర్చగా పటుత్వం అని అవుతుంది. తల్ ప్రత్యయం చేర్చగా "పటుతా" అని అవుతుంది.

ప్రథిమా చేమని పృథోః సౌఖ్యం సుఖాత్ ష్యఞీరితమ్ ।
స్తేయం యాతి చ స్తేనస్య యే సఖ్యుః సఖ్యమీరితమ్ ॥29॥

పృథు శబ్దానికి 'ఇమనిచ్' రాగా ప్రథిమా అనే రూపం, సుఖ శబ్దానికి ష్యఞ్ రాగా 'సౌఖ్యం' అనే రూపం అవుతాయి. స్తేన శబ్దానికి 'యత్' చేర్చగా స్తేయం అని అవుతుంది. 'సఖ్యుర్యః' అనే సూత్రం ద్వారా సఖ్యుఃభావః కర్మవా అనే విగ్రహంలో 'యత్' వచ్చి సఖ్యం అని అవుతుంది.

కపేర్భావశ్చ కాపేయం సైన్యం పథ్యం యకీరితమ్ ।
ఆశ్వం కౌమారకం చాణి రూపం చాణి చ యవనమ్ ॥
ఆచార్యకం కని ప్రోక్తమేవమన్యేఽపి తద్ధితాః ॥30॥

(ఢక్) కపేర్భావః 'కాపేయమ్', యక్ ప్రత్యయం వస్తే 'పథ్యమ్' అణ్ ప్రత్యయం, వస్తే ఆశ్వం కౌమారకం, యౌవనం, కన్ ప్రత్యయం వస్తే ఆచార్యకం అనే రూపాలు సిద్ధిస్తాయి. ఈవిధంగా మిగిలిన తద్ధితాలను గ్రహించాలి.

ఇత్యాది మహాపురాణే ఆగ్నేయే తద్ధితరూపకథనం నామ షట్పంచాశదధిక త్రిశతతమోఽధ్యాయః ॥356॥

అగ్నిమహాపురాణంలో తద్ధితరూపకథనమనే మూడువందల యాభైఆరవ అధ్యాయం సమాప్తం.



సప్తపంచాశదధిక త్రిశతతమోఽధ్యాయః - మూడువందల యాభైఏడవ అధ్యాయం

ఉణాది సిద్ధరూపమ్ - ఉణాది సిద్ధరూపం

కుమార ఉవాచ - కుమారుడైన స్కందుడు ఇలా చెప్పాడు.

ఉణాదయోఽభిధాస్యంతే ప్రత్యయా ధాతుతః పరే ।
ఉణి కారుశ్చ శిల్పీ స్యాజ్జాయుర్మాయుశ్చ పిత్తకమ్ ॥1॥

ఇపుడు ధాతువుకన్న పరంగా వచ్చే ఉణాది ప్రత్యయాలను గురించి చెబుతాను. ఉణ్ ప్రత్యయం వస్తే కారుః = శిల్పి, (కృధాతువు), కరోతీతి కారుః అని రూపం. జిధాతువు+ఉణ్ ప్రత్యయం. జయతి రోగాన్ ఇతి జాయుః, = ఔషధం, మిధాతువు+ఉణ్ ప్రత్యయం = మాయుః - మినోతి దేహే ఊష్మాణమ్ = పిత్తం అని అర్థం.

గోమాయురాయుర్వేదేషు బహులం స్యురుణాదయః ।
ఆయుః స్వాదుశ్చ హేత్వాద్యాః కింశారుర్ధాన్యశూకకః ॥2॥

ఇట్లే గోమాయువు, ఆయువు మున్నగునవి. 'ఆయుః' శబ్దం ఆయుర్వేదంలో బహుధా ప్రయుక్తం. "ఉణాదయో బహులమ్" అనే సూత్రం ప్రకారం ఉణాదులు బహులంగా వస్తాయి. ఆయుః, స్వాదుః, హేతుః మున్నగు శబ్దాలు ఉణాది సిద్ధాలు. కింశారుః - కింశృణాతీతి కింశారుః - కిం పూర్వక శృధాతువునకు 'ఞుణ్' ప్రత్యయం వచ్చి "కింశారు" అని అవుతుంది. ధాన్యశూకకం (వరిముల్లు) అని అర్థం.

కృకవాకుః కుక్కుటః స్యాద్గురుర్భర్తా మరుస్తథా ।
శయుశ్చాజగరో జ్ఞేయః త్సరురాయుధముచ్యతే ॥3॥

కృకవాకుః - కుక్కుటః (కోడి), కృకేన గలేన వక్తీతి కృకవాకుః - ''కృకేవచః కశ్చ'' కృక+వచ్+ఞుణ్=కృకవాకుః, భర్తా=గురువు, భరతి బిభర్తివా భరుః, గురుః, మరుః=జలహీన ప్రదేశం, శయువు=అజగరం, (శ్రీధాతువు+ఉప్రత్యయం), త్సరుః=ఆయుధం.

స్వరుర్వజ్రం త్రపు సీసమసారం ఫల్గురీరితమ్ ।
గృధ్రశ్చ క్రని కిరచి మందిరం తిమిరం తమః ॥4॥

స్వరుః=వజ్రం, స్వర్యంతే ప్రాణా అనేన విగ్రహంలో ఉప్రత్యయం, త్రప్+ఉ=త్రపు=సీసం, ఫల్గు=సారరహితం (ఫల్గ్+ఉ), గృధ్ శబ్దం - క్రన్ ప్రత్యయం - గృధ్రః (పక్షి), మది+కిరచ్=మందిరమ్, తిమి+కిరచ్=తిమిరమ్.

ఇలచి సలిలం వారి కల్యాణం భండిలం స్మృతమ్ ।
బుధో విద్వాన్క్వసౌ స్యాచ్చ శివిరం గుప్తసంస్థితిః ॥5॥

షల్ ధాతువు ఇలచ్ ప్రత్యయం=సలిలం=జలం, "భండి" ధాతువు+ఇలచ్ ప్రత్యయం= భండిలం= కల్యాణం, విద్ ధాతువు+క్వస్ ప్రత్యయం. విద్వాన్=బుధుడు, శీఙ్ ధాతువు+కిరణ్ ప్రత్యయం=శివిరం (శిబిరం) శేరతేఽస్మిన్ రాజబలాని ఇతి శివిరమ్.

ఓతుర్బిడాలశ్చ తుని అభిధానాదుణాదయః ।
కర్ణః కామీ చ గృహభూర్వాస్తు జైవాతృకః స్మృతః ॥6॥

ఓతుః=పిల్లి, అవ్ ధాతువు 'తున్' ప్రత్యయము. వకార స్థానంలో ఉకారం రాగా అ+ఉ+తు=ఓతుః అనే రూపం అవుతుంది. ఉణాదులు అభిధానాన్ని బట్టి వస్తాయి. కర్ణః=చెవి, కాముడు, కృధాతువు+న ప్రత్యయము గుణము, ణత్వము వచ్చి 'కర్ణః' అని అవుతుంది. వస్ ధాతువు+తున్ ప్రత్యయం. వృద్ధి వచ్చి 'వాస్తు' అని అవుతుంది. గృహభూమి అని అర్థం. జీవశబ్దధాతువు. ఆతృకన్ ప్రత్యయం. వృద్ధి వచ్చి జైవాతృకః అనే రూపం ఏర్పడుతుంది. చంద్రుడు అని అర్థం.

అనడ్వాన్వహతేర్వ్నిః స్యాజ్జాతౌ జీవార్ణవౌషధమ్ ।
నౌవహ్నిరినని హరిణో మృగః కామీ చ భాజనమ్ ॥7॥

అనః శకటం వహతి అనే విగ్రహంలో 'అనస్' సకారానికి 'ద' కారం ఆదేశం. వహ ధాతువు, క్విప్ ప్రత్యయం. వకారానికి సంప్రసారణం వచ్చి 'ఉ' కారం అవుతుంది. అనడ్+ఉ+హ్= అనడుహ్ శబ్దం ఏర్పడుతుంది. ప్రథమా విభక్తి అనడ్వాన్ అని అవుతుంది. జీవధాతువు కన్న "జీవేరాతుః" అనే సూత్రం ద్వారా ఆతుప్రత్యయం. జీవాతుః-శబ్దం- సంజీవనౌషధమని అర్థం. ప్రాపణార్థక వహ్ ధాతువు కన్న 'నిత్' ప్రత్యయం వచ్చి 'వహ్ని' అనే రూపం వస్తుంది. హృ+ఇనచ్ ప్రత్యయం+గుణం=హరిణః శబ్దం మృగం, కాముకుడు, పాత్రము ఇత్యాదులర్థాలు.

కరండో భాజనం భాండం సరండశ్చ చతుష్పదః ।
తరుర్హేరండః సంఘాతో వరండః సామ నిర్భరమ్ ॥8॥

కరండః, సరండః, హేరండః, వరండః, ఇత్యాదులు 'అండన్' ప్రత్యయం ద్వారా వస్తాయి. కృ, సృ, భృ,వృధాతువుల ద్వారా ఏర్పడతాయి. కరండః=భాండము, సరండః= చతుష్పదము, హేరండః= వృక్షం, వరండః=సామవేదం.

స్ఫారం ప్రభూతం స్యాన్నప్నంత ప్రత్యయే చీరవల్కలమ్ ।
కాతరో భీరురుగ్రస్తు ప్రచండో యావసం తృణమ్ ॥9॥

స్ఫారం=అత్యధికం అని అర్థం. వృద్ధ్యర్థకమైన "స్ఫాయి" ధాతువు కన్న రక్ ప్రత్యయం చేరగా 'స్ఫార' శబ్దం నిష్పన్నమవుతుంది. చీరశబ్దం 'క్రన్' ప్రత్యయం చేరగా ఈ శబ్దం వస్తుంది. వల్కల మని అర్థం. భీరుకః-భీధాతువు కన్న "భియఃక్రుకన్" ప్రత్యయం రాగా 'భీరుకః' అని అవుతుంది. కాతరుడని అర్థం, ఉచ్ధాతువు కన్న 'రన్' ప్రత్యయం రాగా "ఉగ్రః" అని అవుతుంది. ప్రచండుడని అర్థం. "వహియుూభ్యాం ణిత్" అనే సూత్రం ద్వారా ణిత్, అగుచ్ ప్రత్యయాలు వచ్చి వాహసః యావసః అనే శబ్దాలు వస్తాయి. యావసమనగా తృణసమూహమని అర్థం.

జగచ్చైవ తు భూర్లోకో కృశానుర్జ్యోతిరర్కకః ।
పర్వరః కుటిలో ధూర్తశ్చత్వరం చ చతుష్పథమ్ ॥10॥

గమ్ ధాతువు-జగ్ ఆదేశం-అత్ ప్రత్యయం-జగత్ శబ్దం-భూలోకమని అర్థం. కృశ్ ధాతువు+ఆనుక్ ప్రత్యయం -కృశానుః అని రూపం. అగ్ని అని అర్థం. ద్యుత్ ధాతువు+ఇసిన్ ప్రత్యయం-ద కారానికి జకారాదేశం. గుణం, "జ్యోతిః" అని శబ్దం. అగ్ని, సూర్యుడు అని అర్థాలు. అర్చ్ ధాతువు-క ప్రత్యయం-అర్కః అని శబ్దం. వృధాతువు+ష్వరచ్ ప్రత్యయం-వర్వరః, కుటిలుడు, ధూర్తుడు అని అర్థం. చత్ ధాతువు+ష్వరచ్ ప్రత్యయం-చత్వరం అని శబ్దం చతుష్పథ మని అర్థం.

చీవరం భిక్షు ప్రావృతిరాదిత్యో మిత్ర ఈరితః ।
పుత్రః సూనుః పితా తాతః పృదాకుర్వ్యాఘ్ర వృశ్చికే ॥11॥

గర్తోఽ వటోఽ థ భరతో నటోఽ పరేప్యుణాదయః ॥12॥

చీవరం=భిక్షులు కప్పుకునే వస్త్రం, మిద్ ధాతువు - క్త్రప్రత్యయం, మిత్ర శబ్దం - ఆదిత్యుడని అర్థం. నపుంసక లింగంలో 'సుహృత్' అని అర్థం. పూధాతువు - క్త్రప్రత్యయం - హ్రస్వం - పుత్ర శబ్దం - సూనుడని అర్థం. ప్రాణిప్రసవార్థకమైన షూజ్ధాతువు+ను ప్రత్యయం - సకారా దేశం సూనుః శబ్దం పుత్రుడు, సూర్యుడు అని అర్థాలు. పాతీతి పితా పాధాతువు+తృచ్ ప్రత్యయం - ఆకారానికి ఇకారాదేశం - పితా అని రూపం. తండ్రి అని అర్థం. కుత్సితం శబ్దం కరోతీతి - పృదాకుః, పర్దధాతువు + కాకుప్రత్యయం - రేఫకు సంప్రసారణం - కకార లోపం పృదాకుః అని రూపం. సర్పం, పులి, తేలు ఇత్యాదులు, తన్ ధాతువు - తన్ ప్రత్యయం - హ్రస్వానికి దీర్ఘం - అనునాసిక లోపం - తాతః అని రూపం. కృపాపాత్రుడైన పిత అని అర్థం. గృధాతువు + తన్ ప్రత్యయం - గుణం - భరతశబ్దం నిష్పన్నమయింది. "నమతీతి నటః" అనే వ్యుత్పత్తిలో నమధాతువు - డట్ ప్రత్యయం - టిలోపం. నటః అనే శబ్దం వేషధారి అనే అర్థం. ఇంకనూ అనేక ఉణాది ప్రత్యయాలు ఉన్నాయి.

ఇత్యాది మహాపురాణే ఆగ్నేయే ఉణాదిసిద్ధరూపం నామ సప్తపంచాశదధిక త్రిశతతమోఽ ధ్యాయః ॥357॥

అగ్నిమహాపురాణంలో ఉణాదిసిద్ధరూపమనే మూడువందల యాభైఏడవ అధ్యాయం సమాప్తం.



అష్టపంచాశదధిక త్రిశతతమోఽధ్యాయః – మూడువందల యాభైఎనిమిదవ అధ్యాయం

తిఙ్విభక్తిసిద్ధరూపకథనమ్ – తిఙ్విభక్తి సిద్ధరూపకథనం

కుమార ఉవాచ – కుమారస్వామి ఇలా చెప్పాడు.

తిఙ్విభక్తిం ప్రవక్ష్యామి తథాదేశం సమాసతః ।
తిఙస్త్రిష్వపి వర్తన్తే భావే కర్మణి కర్తరి ॥1॥

తిఙ్విభక్తిని గూర్చి, వాటి ఆదేశాలను గూర్చి సంక్షేపంగా చెబుతాను. తిఙ్ ప్రత్యయాలు భావ, కర్మ, కర్త్రర్థములందు వస్తాయి.

సకర్మకాకర్మకాచ్చ కర్తరి ద్విపదే స్మృతాః ।
సకర్మకాకర్మణి చ తదాదేశస్తథేరితః ॥2॥

సకర్మక, అకర్మకధాతువులకు కర్త్రర్థంలో ఆత్మనేపద, పరస్మైపదాలలో తిఙ్ ప్రత్యయాలు వస్తాయి. సకర్మక ధాతువులకు కర్తృకర్మార్థములలోను, అకర్మకధాతువులకు భావ కర్త్రర్థాలలోను వస్తాయి. తిఙాదేశం సకర్మకధాతువులకు కర్తృకర్మార్థములలో వస్తాయి.

వర్తమానే లడాఖ్యాతో విధ్యాద్యర్థే లిఙీరితః ।
విధ్యాదౌ లోడాశిషి చ భూతానద్యతనే లఙ్ ॥3॥

వర్తమాన కాలంలో 'లట్' వస్తుంది. విధ్యాద్యర్థములందు 'లిఙ్', విధ్యాద్యర్థములందును, ఆశీస్సునందును 'లోట్' అనద్యతనభూతంలో 'లఙ్' వస్తుంది. (విధి, నిమంత్రణ, ఆమంత్రణ, అధీష్ట, సంప్రశ్న, ప్రార్థనాదులు విధ్యాదులు).

భూతే లుఙ్ లిట్ పరోక్షేఽథ భావిన్యద్యతనే చ లుట్ ।
లిఙాశిషి చ శేషేఽర్థే ల్పృడ్ భవిష్యతి ల్పృఙ్ భవేత్ ॥4॥

భూతంలో లుఙ్, పరోక్షభూతంలో లిట్, అద్యతన భవిష్యత్తులోలుట్, ఆశీరర్థంలో లిఙ్, శేషభవిష్యదర్థంలో ల్పృట్, లిఙ్నిమిత్త క్రియాతిపత్తియందు ల్పృఙ్ వస్తాయి.

లిఙ్నిమిత్తే క్రియతిపత్తౌ తఙానావాత్మనేపదమ్ ।
పూర్వం నవ పరస్మైపదం తిప్తసన్తీతి ప్రథమః పుమాన్ ॥5॥

లిఙ్క్రియ అసిద్ధంగా గమ్యమానమయితే ల్పృఙ్ వస్తుంది. తఙ్ ప్రత్యయం, శానచ్, కానచ్ ప్రత్యయాలు ఆత్మనేపదంగా వ్యవహరింపబడతాయి. మొదటి తొమ్మిది విభక్తులు పరస్మైపదాలు. (మొత్తం 18 తిఙ్ ప్రత్యయాలు) తిప్, తస్, అంతి–ప్రథమ పురుష.

సిప్ థస్ థ మధ్యమనరో మిబ్వస్ మశ్చోత్తమః పుమాన్ ।
త ఆతామన్తాఽ త్మనే ముఖ్యస్థాసాథాం ధ్వం చ మధ్యమః ॥6॥

సిప్, థస్, థ-మధ్యమ పురుష, మిప్-వస్-మస్-ఉత్తమ పురుష, త, ఆతామ్ ఝ(అన్త) ఇవి ఆత్మనే పద ప్రథమపురుషప్రత్యయాలు. థాస్-ఆథామ్-ధ్వం (మధ్యమ పురుష ప్రత్యయాలు).

ఉత్తమ ఇ, వహి, మహి భూవాద్యా ధాతవః స్మృతాః ।
భువి రేధిః పచిర్నందిర్ధ్వంసిః స్రంసిః పదిస్త్వదిః ॥7॥

ఇ, వహి, మహి- ఉత్తమ పురుష ప్రత్యయాలు, భూవాదులకు "భూ, వా" మున్నగు వాటికి ధాతువులని పేరు.

"భూ, ఏథ్, పచ్, నంద్, ధ్వంస్, స్రంస్, పద్, అద్" - అనేవి

శీజి క్రీడి ర్జుహోతిశ్చ జహాతిశ్చ దధాత్యపి ।
దీవ్యతిః స్వపితి ర్నహిః సునోతి ర్వసిరేవ చ ॥8॥

"శీజ్, క్రీడ్, హు, హా, ధా, దివ్, స్వప్, నహ, ఘూజ్, వస్, అనేవి

తుది ర్మృశతి ర్ముంచతీ రుధిర్భుజి స్త్యజిస్తనిః ।
శబాదికే వికరణే మనిశ్చైవ కరోత్యపి ॥9॥

"తుద్, మృశ్, ముచ్, రుధ్, భుజ్, త్యజ్, మన్, కృ" అనేవి మున్నగునవి 'శప్' ఆది వికరణములు. ప్రత్యయములు చేరిస్తే క్రియాబోధకాలు అవుతాయి.

క్రీడతి ర్వృజ్ గ్రహిశ్చోరిః పానీ రర్చిశ్చ నాయకాః ।
భువిస్యాత్తిజ్ భవతి సః భవతస్తౌ భవన్తి తే ॥10॥

"క్రీడ్, వృజ్, గ్రహ, చుర్, పా, నీ, అచ్" - ఇవి పైన చెప్పబడిన ధాతువులలో ప్రధానమైనవి. వీటికి సమానంగా మిగిలిన ధాతురూపాలు ఉంటాయి. భూధాతువుకు క్రమంగా తిజ్ ప్రత్యయాలు చేరగా, భవతి, భవతః, భవన్తి (సః, తౌ, తే)కర్తలుగా క్రియారూపాలు ఏర్పడతాయి.

భవసి త్వం యువాం భవథో యూయం భవథ చాప్యహమ్ ।
భవామ్యావాం భవావశ్చ భవామో హ్యేధతే కులమ్ ॥11॥

భవసి, భవథః, భవథ (త్వం, యువాం, యూయం కర్తలుగా) భవామి, భవావః, భవామః (అహం, ఆవాం, వయం కర్తలుగా) క్రియా రూపాలు ఏర్పడతాయి. ఇవి భూధాతువుకు "లట్" లో వచ్చే పరస్మైపద రూపాలు 'ఏధ్' ధాతువుకు వృద్ధి అర్థం. ఇది ఆత్మనేపదధాతువు.

ఏధేతే ద్వే తథైధన్తే ఏధసే త్వం హి మేధయా ।
ఏధేథే చ సమేధధ్వే హ్యేధే హ్యేధావహే ధియా ॥12॥

ఏధామహే హరేర్భక్త్యా పచతీత్యాది పూర్వవత్ ।
భూతయేఽనుభూయతేఽసౌ భావే కర్మణి వై యకి ॥13॥

ఏధ ధాతువుకు "లట్" లో ఏధతే, ఏధేతే, ఏధన్తే (ప), ఏధసే, ఏధేథే, ఏధధ్వే, (మ), ఏధే, ఏధావహే, ఏధామహే (ఉ), రూపాలు ఉంటాయి. పచ్ ధాతువుకు "పచతి" ఇత్యాదిరూపాలు భూధాతువుకు వలె ఉంటాయి. భూధాతువుకు భావార్థంలో "అను+భూ" అని ఉండగా కర్మార్థంలో "యక్" ప్రత్యయం చేరగా భూయతే, అను భూయతే ఇత్యాది (భావార్థం-భూయతే, కర్మార్థం- అను భూయతే) రూపాలు ఏర్పడతాయి.

బుభూషతి సనీత్యేవం ణిచి భావయతీశ్వరమ్ ।
యఙి బోభూయతే వాద్యం బోభోతి స్యాచ్చ యఙ్ లుకి ॥14॥

'సన్' చేర్చగా బుభూషతి, 'ణిచ్' చేరగా "ఈశ్వరం భావయతి", 'యఙ్' చేరగా బోభూయతే, యఙ్ లుగంతంలో బోభోతి అనే రూపనిష్పత్తి అవుతుంది. భవితుమ్ ఇచ్ఛతి - బుభూషతి, పునఃపునః అతిశయేన వా భవతి - బోభూయతే,

పుత్రీయతి పుత్రకామ్యత్యేవం పటపటాయతే ।
ఘటయత్యథ సని ణిచి బుభూషయతి రూపకమ్ ॥15॥

కొన్ని నామములకు (సుబంతములకు) క్యచ్ ఇత్యాదిప్రత్యయాలు చేరగా ధాతుసంజ్ఞ ఏర్పడి నామధాతువులుగా మారుతాయి. ఆత్మనః పుత్రమ్ ఇచ్ఛతి - పుత్రీయతి (క్యచ్), పుత్రకామ్యతి (కామ్యచ్), పటత్ భవతి ఇతి పటపటాయతే (డాచ్ ప్రత్యయం, నిత్యమామ్రేడితం డాచి, క్యష్ ప్రత్యయం) ఘటం కరోతి (తత్కరోతి తదాచష్టే) ఘటయతి, సన్ప్రత్యయం చేయగా బుభూషతి, సన్నంతంపై 'ణిచ్' చేరగా భూధాతువుపై బుభూషయతి అనే రూపాలు ఏర్పడతాయి.

భవేద్భవేతాం చ లిఙి భవేయుశ్చ భవేః పరే ।
భవేతం చ భవేతైవం భవేయం చ భవేవ చ భవేమ చ ॥16॥

భూధాతువుకు "విధిలిఙ్" లో భవేత్-భవేతాం-భవేయుః, భవేః-భవేతం-భవేత, భవేయమ్-భవేవ-భవేమ" అని అవుతాయి.

ఏధేత ఏధేయాతామేధేరన్ మనసా శ్రియా ।
ఏధేథాశ్చ ఏధేయాథామేధేధ్వమేధేయ ఏధేవహి ఏధేమహి ॥17॥

ఏధ ధాతువుకు విధిలిఙ్ లో ఇలా రూపాలు ఉంటాయి. "ఏధేత, ఏధేయాతామ్, ఏధేరన్, ఏధేథాః, ఏధేయాథామ్, ఏధేధ్వమ్, ఏధేయ, ఏధేవహి, ఏధేమహి" అని రూపాలు.

అస్తు తావద్భవతాం లోటి భవన్తు భవతాద్భవ ।
భవతం భవత భవాని భవావ చ భవామ చ ॥18॥

భూధాతువుకు 'లోట్' లో భవతు, భవతాత్, భవతాం, భవన్తు (ప్ర), భవ-భవతాత్, భవతం, భవత (మ) భవాని, భవావ భవామ (ఉ) రూపాలు ఏర్పడతాయి.

ఏధతామేధేతామేధన్తామేధై పచావహై పచామహై ।
అభ్యనంద దపచతా మపచన్నపచస్తథా ॥19॥

ఏధ్ ధాతువుకు 'లోట్' లో "ఏధతామ్, ఏధేతాం, ఏధన్తాం (ప్ర), ఏధస్వ, ఏధేథామ్, ఏధధ్వమ్ (మ), ఏధై, ఏధావహై, ఏధామహై (ఉ), అనే రూపాలు ఏర్పడతాయి. అదే విధంగా 'పచ్' ధాతువుకు ఆత్మనే పదిలో ఉత్తమ పురుషలో "పచై, పచావహై, పచామహై" అని అవుతాయి. భూధాతువుకు లజ్‌లో అభవత్, అభవతాం, అభవన్, అని పచ్ ధాతువుకు అపచం, అపచావ, అపచామ అని (ఉ), అభిపూరక 'నది' ధాతువుకు 'లజ్' లో అభ్యనందత్ (ప్ర॥ఏ), అని అవుతాయి.

అభవత మభవతా పచమ పచావ పచామ చ ।
ఏధతైధేతామైధధ్వమైధే చైధామహీరితమ్ ॥20॥

ఏధధాతువుకు లజ్‌లో ఐధత, ఐధేతామ్, ఐధన్త (ప్ర), ఐధథాః, ఐధేథామ్, ఐధధ్వం (మ), ఐధే, ఐధావహి, ఐధామహి (ఉ) అనే రూపాలు ఏర్పడతాయి.

అభూదభూతామభూవన్నభూశ్చా భూవమేవ లుజ్ ।
ఐధిష్టై ధిషాతాం నరా వైధిష్ఠా ఐధిషీదృశమ్ ॥21॥

భూధాతువుకు లుజ్‌లో అభూత్, అభూతామ్, అభూవన్ (ప్ర), అభూః, అభూతమ్, అభూత (మ), అభూవమ్, అభూవ, అభూమ (ఉ) అనే రూపాలు, ఏధ్‌ధాతువుకు 'లుజ్' లో ఐధిష్ట, ఐధిషాతామ్, ఐధిషత (ప), ఐధిష్ఠాః, ఐధిషాధామ్, ఐధిధ్వమ్ (మ), ఐధిషి, ఐధిష్వహి, ఐధిష్మహి అనే రూపాలు ఏర్పడతాయి.

లిటి బభూవ బభూవతుర్బభూవుశ్చ బభూవిథ ।
బభూవథు ర్బభూవ చ బభూవివ బభూవిమ ॥22॥

భూధాతువుకు పరోక్షలిట్‌లో బభూవ, బభూవతుః, బభూవుః (ప్ర), బభూవిథ, బభూవథుః, బభూవ (మ), బభూవ, బభూవివ, బభూవిమ (ఉ) అనే రూపాలు ఏర్పడతాయి.

పేచే పేచాతే పేచిరే త్వమేధాంచకృషే తథా ।
ఏధాంచక్రాథే పేచిధ్వే పేచే పేచిమహే తథా ॥23॥

'పచ్' ధాతువుకు ఆత్మనే పదిలిట్‌లో పేచే-పేచాతే-పేచిరే (ప్ర), అనే రూపాలు, ఏధధాతువుకు లిట్‌లో, ఏధాంచక్రే, ఏధాంచక్రాతే, ఏధాంచక్రిరే (ప్ర), ఏధాంచకృషే, ఏధాంచక్రాథే, ఏధాంచకృధ్వే, (మ), ఏధాంచక్రే, ఏధాంచకృవహే, ఏధాంచకృమహే (ఉ) అనే రూపాలు, పచ్ ధాతువుకు పరోక్షలిట్‌లో, పేచిషే-పేచాథే, పేచిధ్వే (మ),పేచే, పేచివహే, పేచిమహే (ఉ) అనే రూపాలు ఏర్పడతాయి.

లుటి భవితా భవితారౌ భవితారో హరాదయః ।
భవితాసి భవితాస్థో భవితాస్మ స్తథా వయమ్ ॥24॥

భూధాతువుకు అనద్యతన భవిష్య "లుట్"లో భవితా, భవితారౌ, భవితారః (ప్ర), భవితాసి, భవితాస్థః, భవితాస్థ (మ) భవితాస్మి, భవితాస్వః, భవితాస్మః (ఉ), అనే రూపాలు అవుతాయి. "హరాదయో భవితారః", వయం భవితాస్మః- ఇవి వాక్యప్రయోగాలు.

పక్తా పక్తారౌ పక్తారః పక్తాసి త్వం శుభౌదనమ్ ।
పక్తాధ్వే పక్తాహే చాహం పక్తాస్మహే హరేశ్చరుమ్ ॥25॥

పచధాతువుకు "లుట్" లో పరస్మైపదిలో "పక్తా, పక్తారౌ, పక్తారః" (ప), అనే రూపాలు ఏర్పడతాయి. త్వం 'శుభౌదనం పక్తాసి' అని వాక్యప్రయోగము. ఆత్మనేపదిలో ప్రథమపురుషలో ఇలాగే రూపాలు ఉంటాయి. పక్తాసే, పక్తాసాథే, పక్తాధ్వే (మ), పక్తాహే, పక్తాస్వహే, పక్తాస్మహే (ఉ) అనే రూపాలు మిగిలిన రూపాలుగా ఉంటాయి. "అహం పక్తాహే, వయం హరేశ్చరుం పక్తాస్వహే" ఇత్యాదులు వాక్యప్రయోగాలు.

లిజాశిషి సుఖం భూయాద్ భూయాస్తాం హరి శంకరౌ ।
భూయాసుస్తే చ భూయాస్త్వం యువాం భూయాస్తమీశ్వరౌ ॥26॥

ఆశీర్లిజ్ లో భూధాతువుకు భూయాత్, భూయాస్తాం, భూయాసుః (ప), భూయాః, భూయస్తం, భూయాస్త (మ), భూయాసం, భూయాస్వ, భూయాస్మ (ఉ) అనే రూపాలు ఏర్పడతాయి. సుఖం భూయాత్, హరిశంకరౌ భూయాస్తామ్, త్వం భూయాః, యువాం ఈశ్వరౌ భూయాస్తమ్ ఇత్యాదులు వాక్యప్రయోగాలు.

భూయాస్త యూయం భూయాసమహం భూయాస్మ సర్వదా ।
యక్షీష్ట హ్యేధిషీయాస్తాం యక్షీరన్నేధిషీయ చ ॥27॥

యక్షీవహ్యేధిషీమహి లిజి చాయక్ష్యతేతి లృజ్ ।
అయక్ష్యేతామయక్ష్యంతాయక్ష్యేథా యక్ష్యేథాం యువామ్ ॥28॥

అయక్ష్యధ్వమైధిష్యావహ్యైధిష్యామహ్యరే ర్వయమ్ ।
లృటిస్యాధ్భవిష్యతీతి ఐధిష్యామహ ఈదృశమ్ ॥29॥

"యూయం భూయాస్త, అహం భూయాసమ్, వయం సర్వదా భూయాస్మ" ఇత్యాదులు వాక్యప్రయోగాలు యక్షధాతువుకు ఆత్మనే పదియందు ఆశీర్లిజ్‌లో యక్షీష్ట - యక్షీయాస్తామ్, యక్షీరన్, (ప), యక్షీష్ఠాః, యక్షీయాస్థామ్, యక్షీధ్వమ్ (మ), యక్షీయ, యక్షీవహి, యక్షీమహి (ఉ) ఇత్యాదిరూపాలు ఏర్పడతాయి. ఏధధాతువుకు ఆశీర్లిజ్‌లో ఏధిషీష్ట - ఏధిషీయాస్తామ్, ఏధిషీరన్ (ప్ర), ఏధిషీష్ఠాః, ఏధిషీయాస్థామ్, ఏధిషీధ్వం (మ), ఏధిషీయ, ఏధిషీవహి, ఏధిషీమహి (ఉ) అనే రూపాలు ఏర్పడతాయి. యక్షధాతువుకు 'లృజ్' లో అయక్ష్యత, అయక్ష్యేతామ్ అయక్ష్యంత (ప్ర), అయక్ష్యథాః, అయక్ష్యేథామ్, అయక్ష్యధ్వమ్ (దు), అయక్ష్యే, అయక్ష్యావహి, అక్ష్యామహి (ఉ), అనే రూపాలు ఏర్పడతాయి. ఏధధాతువుకు లృజ్ లో ఐధిష్యత, ఐధిష్యేతామ్, ఐధిష్యంత (ప్ర), ఐధిష్యథాః, ఐధిష్యేథామ్,

ఐధిష్యధ్వం (మ), ఐధిష్యే, ఐధిష్యావహి, ఐధిష్యామహి (ఉ) అనే రూపాలు ఏర్పడతాయి. భూధాతువుకు లృట్‌లో "భవిష్యతి, భవిష్యతః, భవిష్యంతి" (ప్ర) అనే రూపాలు ఏర్పడతాయి. ఏధధాతువుకు లృట్‌లో "ఏధిష్యతే, ఏధిష్యేతే, ఏధిష్యన్తే (ప్ర), ఏధిష్యసే, ఏధిష్యేథే, ఏధిష్యధ్వే (మ) ఏధిష్యే, ఏధిష్యావహే, ఏధిష్యామహే (ఉ) అనే రూపాలు ఏర్పడతాయి.

ఏవం విభావయిష్యన్తి బోభవిష్యతి రూపకమ్ ।
ఘటయే త్పటయేత్తద్వత్పుత్రీ యతి చ కామ్యతి ॥30॥

ఈవిధంగా ణిజంతంలో 'వి' పూర్వక భూధాతువుకు 'లృట్' లకారంతో విభావయిష్యతి, విభావయిష్యతః, విభావయిష్యంతి (ప) ఇత్యాదిరూపాలు ఏర్పడతాయి. యఙ్‌లుగంత భూధాతువుకు లృట్‌లో "బోభవిష్యతి" ఇత్యాది రూపాలు ఏర్పడతాయి. నామధాతువులపై ఘటం కరోతి, పటం కరోతి ఇత్యాద్యర్థాలలో ఘటయతి, పటయతి ఇత్యాది రూపాలు ఏర్పడి విధిలిఙ్ లో ఘటయేత్, పటయేత్ ఇత్యాదులు ఏర్పడతాయి. ఈవిధంగానే పుత్రీయతి, పుత్రకామ్యతి ఇత్యాది నామధాతువులు ఏర్పడతాయి.

ఇత్యాది మహాపురాణే ఆగ్నేయే తిఙ్విభక్తి సిద్ధరూపకథనం నామ అష్టపంచాశదధిక త్రిశతతమోఽధ్యాయః ॥358॥

అగ్నిమహాపురాణంలో తిఙ్విభక్తిసిద్ధరూపకథనమనే మూడువందల యాభైఎనిమిదవ అధ్యాయం సమాప్తం.



ఏకోనషష్ట్యధికత్రిశతతమోఽధ్యాయః – మూడువందల యాభైతొమ్మిదవ అధ్యాయం

కృత్సిద్ధరూపమ్ – కృదంతనిరూపణం

కుమార ఉవాచ – కుమారుడు ఇలా చెప్పాడు.

కృతస్త్రిష్వపి విజ్ఞేయా భావే కర్మణి కర్తరి ।
అజ్, ల్యుట్ క్తిన్ ఘఞో భావే యుజకారత ఏవ చ ॥1॥

కాత్యాయనా! ఇప్పుడు చెబుతున్న కృత్ప్రత్యయాలు భావ, కర్మ, కర్త్రర్థములందు మూడింటియందును వస్తాయి. అవి అచ్, ల్యుట్, (అప్) క్తిన్, భావార్థకఘఞ్, కరణార్థక ఘఞ్, యుచ్, అ, తవ్య, మున్నగునవి కృత్ప్రత్యయాలు.

అచి ధర్మస్య వినయ ఉత్కరః ప్రకరస్తథా ।
దేవో భద్రః శ్రీకరశ్చ ల్యుటి రూపం తు శోభనమ్ ॥2॥

'అచ్' ప్రత్యయంరాగా వినీ+అచ్ (గుణః, అయాదేశః, విభక్తికార్యమ్) వినయః అని అవుతుంది. 'అప్' ప్రత్యయంరాగా ఉత్కౄ+అప్=ఉత్కరః, ప్రకౄ+అప్=ప్రకరః, (ఋదోరప్ అని సూత్రం), దివ్+అచ్=దేవః, భద్ర్+అచ్= భద్రః, శ్రీకృ+అప్=శ్రీకరః, ల్యుట్ ప్రత్యయం రాగా శుభ్+ల్యుట్ (ల,ట కారాలు ఇత్సంజ్ఞలు, లఘూపధగుణం – అనాదేశం) శోభనమ్ అని అవుతుంది.

క్తిని వృద్ధిః స్తుతిమతీ ఘఞి భావోఽథ యుచ్యపి ।
కారణా భావనేత్యాది అకారే చ చికిత్సయా ॥3॥

వృధ్ ధాతువు+క్తిన్ ప్రత్యయం (కకారం ఇత్సంజ్ఞ, ధకారాదేశం, పూర్వ ధకారానికి జశ్త్వం వచ్చి దకారం) = వృద్ధిః, స్తు+క్తిన్=స్తుతిః, మన్+క్తిన్=మతిః, భూధాతువు కన్న ఘఞ్ రాగా=భావః అని అవుతుంది. కృ+యుచ్ కారి+యు, అనాదేశం, ణత్వం, 'కారణా' అని అవుతుంది. అలాగే 'భావనా' అనే రూపం, చికిత్స+అ=చికిత్సా.

తథా తవ్యో హ్యనీయశ్చ కర్తవ్యం కరణీయకమ్ ।
దేయం ధ్యేయం చైవ యతి ణ్యతి కార్యం చ కృత్యకాః ॥4॥

అలాగా తవ్య, అనీయర్ ప్రత్యయాలు, కృ+తవ్య (గుణం) = కర్తవ్యం. కృ+అనీయర్ (గుణం) కరణీయం, 'అచోయత్' అనే సూత్రం ద్వారా అజంత ధాతువులకు యత్ ప్రత్యయంరాగా, దా+య (ఈకారాదేశం)=దేయం, ధ్యై+య=ఐకార స్థానంలో ఆకారం, ఈకారాదేశం ధ్యేయం, అని అవుతుంది. కృ+ణ్యత్=(వృద్ధికార్యం) =కార్యం, ఇవన్నీ కృత్యసంజ్ఞక ప్రత్యయాలు.

కర్తరి క్తాదయో జ్ఞేయా భావే కర్మణి చ క్వచిత్ ।
గతో(గ్రామం గతో(గ్రామ ఆశ్లిష్టశ్చ గురుస్త్వయా ॥5॥

క్తాదులు కర్త్రర్థ మునందు, కొన్ని చోట్ల భావకర్మార్థములందు వస్తాయి. గమ్ ధాతువు 'క్త' ప్రత్యయం మకారలోపం 'గతః' అని రూపం. గ్రామం గతః, గ్రామే గతః ఇత్యాదులు "త్వయా గురుః ఆశ్లిష్టః" ఆశ్లిష్‌ధాతువు+క్త ప్రత్యయం ఆశ్లిష్+క్త–త–ట కారాదేశం=ఆశ్లిష్టః అని రూపం.

శతృశానచౌ భవన్నేధమానో భవన్త్యపి ।
ణ్వుల్తృచౌ సర్వధాతుభ్యో భావకో భవితా తథా ॥6॥

భూధాతువు+శతృప్రత్యయం, భూధాతువు+అన్=భవన్ అని అవుతుంది. ఏధ్ ధాతువు+శానచ్ ప్రత్యయం=ఏధ్+ఆన ఆకారమకారాగమం= ఏధమానః అని రూపం, స్త్రీలింగంలో 'భవన్తీ' అని అవుతుంది. అన్ని ధాతువులకు ణ్వుల్, తృచ్ ప్రత్యయాలు వస్తాయి. భూ+ణ్వుల్ (ఇత్సంజ్ఞలు–వు+అక ఆదేశం, వృద్ధి) భావుకః, భూధాతువు+తృచ్= భవితా అని అవుతుంది.

క్విబంతశ్చ స్వయంభూశ్చ భూతే లిటః క్వసుః కానచ్ ।
బభూవివాన్పేచివాంశ్చ పేచానః శ్రద్ధధానకః ॥7॥

స్వయంభూ+క్విప్= స్వయంభూః, భూతార్థలిట్‌కు క్వసు, కానచ్ ప్రత్యయాలు చేరగా బభూవివాన్, పేచివాన్ అని అవుతాయి. ఆత్మనేపదంలో పేచానః శ్రద్ధధానకః అని అవుతాయి.

అణి స్యుః కుంభకారాద్యాః భూతేఽప్యుణాదయః స్మృతాః ।
వాయుఃపాయుశ్చ కారుః స్యాద్బహులం ఛందసీరితమ్ ॥8॥

అణ్ ప్రత్యయం వస్తే కుంభకారః ఇత్యాది రూపాలు సిద్ధిస్తాయి. ఉణాదులు భూతార్థంలో కూడ వస్తాయి. ఉదా:– వా+ఉణ్=వాయుః, పా+ఉణ్=పాయుః (యుగాగమం), కృ+ఉణ్=కారుః, ఇత్యాదులు. "బహులం ఛందసి" అనే నియమానుసారం కృత్ప్రత్యయాలు వేదంలో అనేకంగా ఉన్నాయి.

ఇత్యాది మహాపురాణే ఆగ్నేయే కృత్సిద్ధరూపకథనం నామ ఏకోన షష్ట్యధిక త్రిశతతమోఽధ్యాయః ॥359॥

ఆగ్నేయమహాపురాణంలో కృదంతనిరూపణమనే మూడువందల యాభైతొమ్మిదవ అధ్యాయం సమాప్తం.



షష్ట్యధిక త్రిశతతమోఽధ్యాయః - మూడువందల అరవయ్యవ అధ్యాయం

స్వర్గపాతాలాదివర్గాకథనమ్ - స్వర్గపాతాలాదివర్గకథనం

అగ్నిరువాచ - అగ్ని ఇలా వచించాడు.

స్వర్గాది నామలింగో యో హరిస్తం ప్రవదామి తే ।
స్వః స్వర్గనాకత్రిదివా ద్యోదివౌ ద్వే త్రివిష్టపమ్ ॥1॥

ఇపుడు స్వర్గాది నామలింగ ప్రకరణాన్ని చెబుతాను. ఇది శ్రీహరి యొక్క శుద్ధస్వరూపవర్ణనం. స్వః (అవ్యయం), స్వర్గం, నాకం, త్రిదివం, ద్యో, దివ్, త్రివిష్టపమ్ (పుం, స్త్రీ) ఇవి స్వర్గ శబ్ద పర్యాయపదాలు.

దేవా బృందారకా లేఖా రుద్రాద్యా గణదేవతాః ।
విద్యాధరోఽప్సరో యక్షరక్షో గంధర్వ కిన్నరాః ॥2॥

దేవతలు, బృందారకులు, లేఖాశబ్దాలు (పుంలింగం) దేవతావాచకాలు. రుద్రులు మున్నగు వారు గణదేవతలు. విద్యాధరులు, అప్సరలు, యక్షులు, రక్షస్సులు, గంధర్వులు, కిన్నరులు,

పిశాచో గుహ్యకః సిద్ధో భూతోఽమీ దేవయోనయః ।
దేవద్విషోఽసురా దైత్యాః సుగతః స్యాత్తథాగతః ॥3॥

పిశాచులు, గుహ్యకులు, సిద్ధులు, భూతాలు - వీరందరూ దేవయోనులు, అలాగే దేవద్వేషులు, అసురులు, దైత్యులు - వీరు దైత్యగణాలు, తథాగతః, సుగతః - బుద్ధశబ్ద పర్యాయాలు.

బ్రహ్మాత్మభూః సురజ్యేష్ఠో విష్ణుర్నారాయణో హరిః ।
రేవతీశో హలీ రామః కామః పంచశరః స్మృతః (స్మరః) ॥4॥

ఆత్మభూః, సురజ్యేష్ఠః, బ్రహ్మా-బ్రహ్మ శబ్దపర్యాయాలు, నారాయణః, హరిః, విష్ణుశబ్దపర్యాయాలు, రేవతీ నాథుడు, హలి, రాముడు - బలరామ శబ్దపర్యాయాలు. కామః, పంచశరః, స్మరః - మన్మథ శబ్దపర్యాయాలు.

లక్ష్మీః పద్మాలయా పద్మా సర్వః (శర్వః) సర్వేశ్వరః శివః ।
కపర్దోఽస్య జటాజూటః పినాకోఽజగవం ధనుః ॥5॥

లక్ష్మీః, పద్మాలయా, పద్మా=లక్ష్మి, సర్వః (శర్వః), సర్వేశ్వరః, శివః, = శివుడు, ఆయన జటాజూటానికి కపర్దం అని పేరు. అది కలవాడు కపర్ది. పినాకః, అజగవం ఈ రెండును ఆయన ధనుస్సుకు పేర్లు.

ప్రమథాః స్యుః పారిషదా మృడానీ చండికాఽమ్బికా ।
ద్వైమాతురో గజాస్యశ్చ సేనానీరగ్నిభూర్గుహః ॥6॥

ఆయన పారిషదులకు "ప్రమథాః" అని పేరు. మృడాని, చండికా, అంబిక – పార్వతి పేర్లు. ద్వైమాతురః, గజాస్యుడు – గణపతి పేర్లు. సేనానీః, అగ్నిభూః, గుహః=కుమారస్వామి పేర్లు.

ఆఖండలః శు (సు) నాసీరః సుత్రామా చ దివస్పతిః ।
పులోమజా శచీంద్రాణీ దేవీ తస్య తు వల్లభా ॥7॥

ఆఖండలః, సునాసీరః, సుత్రామా, దివస్పతిః – ఇంద్రుని నామాలు, ఆయన భార్యకు పులోమజ, శచి, ఇంద్రాణి – అని పేర్లు.

స్యాత్ప్రాసాదో వైజయన్తో జయన్తః పాకశాసనిః ।
ఐరావతోఽ భ్రమాతంగై రావణాభ్రమువల్లభాః ॥8॥

ఆయన ప్రాసాదం వైజయంతం, ఆ పాకశాసనుని కుమారుడు జయంతుడు. ఐరావతం, అభ్రమాతంగం, ఐరావణం, అభ్రమువల్లభం – ఆయన ఏనుగు పేర్లు.

హ్రాదినీ వజ్రమస్త్రీ స్యాత్ కులిశం భిదురం పవిః ।
వ్యోమయానం విమానోఽస్త్రీ పీయూషమమృతం సుధా ॥9॥

హ్రాదినీ (స్త్రీలింగం), వజ్రం (పుం, నంపుసక లింగ ప్రయుక్తం), కులిశం, భిదురం, పవిః – ఆయన వజ్రాయుధం పేర్లు. వ్యోమయానం (న) విమానః (పుం) విమానం పేర్లు. పీయూషం, అమృతం, సుధా – అమృతం పేర్లు.

స్యాత్సుధర్మా దేవసభా స్వర్గంగా సురదీర్ఘికా ।
స్త్రియాం బహుష్వప్సరసః స్వర్వేశ్యా ఊర్వశీముఖాః ॥10॥

సుధర్మా=దేవసభ, స్వర్గంగా, సురదీర్ఘికా=స్వర్గలోకగంగ, అప్సరసః శబ్దం స్త్రీలింగంలో బహువచనంలో ఉంటుంది. అప్సరసః, ఊర్వశిమున్నగు వారు స్వర్గలోకవేశ్యలు.

హాహాహూహూశ్చ గంధర్వా అగ్నిర్వహ్నిర్ధనంజయః ।
జాతవేదాః కృష్ణవర్మా ఆశ్రయాశశ్చ పావకః ॥11॥

హిరణ్యరేతాః సప్తార్చిః శుక్రశ్చైవాశుశుక్షణిః ।
శుచిరప్పిత్తమౌర్వస్తు వాడవో వడవానలః ॥12॥

హాహా, హూహూ, లు–వీరు గంధర్వులు, అగ్నిః, వహ్నిః, ధనంజయః, జాతవేదాః, కృష్ణవర్మా, ఆశ్రయాశః, పావకః, హిరణ్యరేతాః, శుక్రః (శుక్లః), ఆశుశుక్షణిః, శుచిః, అప్పిత్తమ్, ఔర్వః, బాడబః (వాడవః), బడబానలః (వడవానలః), ఇవన్నీ అగ్ని యొక్క పేర్లు.

వహ్నేర్ద్వయోర్జ్వాల కీలా వర్చిర్హేతిః శిఖాస్త్రియామ్ ।
త్రిషు స్ఫులింగోఽగ్నికణో ధర్మరాజః పరేతరాట్ ॥ 13 ॥

అగ్ని యొక్క జ్వాలలు బోధించు జ్వాల, కీల శబ్దాలు రెండు లింగములందును ఉంటాయి. అర్చిః, హేతిః, శిఖా (స్త్రీ)=జ్వాలలు, అర్చిష్ నపుంసకలింగ శబ్దం. శిఖా=స్త్రీలింగ శబ్దం. స్ఫులింగ, అగ్నికణ శబ్దాలు మూడు లింగాలలోను ఉంటాయి. ధర్మరాజః, పరేతరాట్,

కాలోఽన్తకో దండధరః శ్రాద్ధదేవోఽథ రాక్షసః ।
కోణపాస్రప క్రవ్యాదాః యాతుధానశ్చ నైరృతిః ॥14॥

కాలః, అంతకః, దండధరః, శ్రాద్ధదేవః - యముని నామాలు, రాక్షసః, కోణపః (కౌణపః), అస్రపః, క్రవ్యాదః, యాతుధానః, నైరృతిః, రాక్షస నామధేయాలు.

ప్రచేతా వరుణః పాశీ శ్వసనః స్పర్శనోఽనిలః ।
సదాగతిర్మాతరిశ్వా ప్రాణో మరుత్సమీరణః ॥15॥

ప్రచేతస్, వరుణ, పాశీ - వరుణుని పేర్లు. శ్వసనః, స్పర్శనః, అనిలః, సదాగతిః, మాతరిష్వన్, ప్రాణః, మరుత్, సమీరణః, వాయువు పేర్లు.

జవోరంహ స్తరసీ తు లఘుక్షిప్రమరం ద్రుతమ్ ।
సత్వరం చపలం తూర్ణమవిలంబిత మాశు చ ॥16॥

జవః, రంహస్, తరస్ వేగవాచకాలు. మొదటిది పుంలింగం. మిగిలినవి నపుంసక లింగాలు. లఘు, క్షిప్రం, అరం, ద్రుతం, సత్వరం, చపలం, తూర్ణం, అవిలంబితం, ఆశు - శీఘ్రవాచక శబ్దాలు ఇవి.

సతతాఽనారతా శ్రాంత సంతతావిరతానిశమ్ ।
నిత్యానవరతాజస్రమప్యథాతిశయో భరః ॥17॥

సతతం, అనారతం, అశ్రాంతం, సంతతం, అవిరతం, అనిశం, నిత్యం, అనవరతం, అజస్రం - ఎల్లప్పుడు అనే అర్థాన్ని సూచించేవి భరః= అతిశయం,

అతివేలభృశాత్యర్థాతిమాత్రోద్గాఢనిర్భరమ్ ।
తీవ్రైకాంతనితాంతాని గాఢబాఢదృఢాని చ ॥18॥

అతివేల, భృశ, అత్యర్థ, అతిమాత్ర, ఉద్గాఢ, నిర్భర, తీవ్ర, ఏకాంత, నితాంత, గాఢ, బాఢ, దృఢ అనే శబ్దాలు మిక్కిలి అనే అర్థాన్ని సూచించేవి.

గుహ్యకేశో యక్షరాజో రాజరాజో ధనాధిపః ।
స్యాత్కిన్నరః కింపురుషస్తురంగవదనో మయుః ॥19॥

గుహ్యకేశః, యక్షరాజః, రాజరాజః, ధనాధిపః – కుబేరుని పేర్లు కిన్నర, కింపురుష, తురంగవదన, మయుశబ్దాలు సమానార్థకాలు.

నిధిర్నా శేవధిర్వ్యోమ త్వభ్రం పుష్కర మంబరమ్ ।
ద్యో దివౌ చాంతరిక్షం ఖం కాష్ఠాశా కకుభో దిశః ॥20॥

నిధి, శేవధి పర్యాయపదాలు. వ్యోమ, అభ్ర, పుష్కర, అంబర, ద్యో, దివ్, అంతరిక్ష, ఖ శబ్దాలు, ఆకాశ శబ్ద పర్యాయపదాలు. కాష్ఠా, ఆశా, కకుభ్, దిశ్ – ఇవి దిగ్వాచక శబ్దాలు.

అభ్యంతరంత్వన్తరాళం చక్రవాలం తు మండలమ్ ।
తడిత్వాన్వారి మేఘస్తనయిత్ను ర్బలాహకః ॥21॥

అభ్యంతరం, అంతరాళం, చక్రవాళం, మండలం మధ్య శబ్దాన్ని, గోళాకార మండలాన్ని సూచిస్తాయి. తడిత్వాన్, వారిద, మేఘ, స్తనయిత్ను బలాహక శబ్దాలు మేఘవాచకాలు.

కాదంబినీ మేఘమాలా స్తనితం గర్జితం తథా ।
శంపా శతహ్రదా హ్రాదిన్యైరావత్యః క్షణప్రభా ॥
తడిత్సౌదామినీ విద్యుచ్చంచలా చపలాపి చ ॥22॥

కాదంబిని, మేఘమాల=మేఘపంక్తి, స్తనితం, గర్జితం=ఉరుము, శంపా, శతహ్రదా, హ్రాదినీ, ఐరావతీ, క్షణప్రభా, తడిత్, సౌదామిని, విద్యుత్ చంచలా, చపలా (సౌదామని) మెరుపు పేర్లు.

స్ఫూర్జథుర్వజ్రనిర్ఘోషో వృష్టిఘాతస్త్వవగ్రహః ॥23॥

స్ఫూర్జథుః, వజ్రనిర్ఘోషః, మెరుపుతో కూడిన ఉరుము యొక్క ధ్వని, వృష్టిఘాతః, అవగ్రహః=వర్షాభావం (వర్షం లేకపోవడం),

ధారాసంపాత ఆసారః శీకరోఽంబు కణాఃస్మృతాః ।
వర్షోపలస్తు కరకా మేఘచ్ఛన్నేఽహ్ని దుర్దినమ్ ॥24॥

ధారావర్షానికి ఆసారమని పేరు. శీకరః=నీటి బిందువులు, వర్షోపలః, కరకా=వడగళ్లు, మేఘాలు కప్పిన రోజుకు దుర్దినం అని పేరు.

అంతర్ధా వ్యవధా పుంసి త్వన్తర్ధిరపవారణమ్ ।
అపిధానతిరోధానపిధానాచ్ఛాదనాని చ ॥25॥

అంతర్ధా, వ్యవధా, (స్త్రీ) అంత్వర్ధి (పుం), అపవారణం, అపిధానం, తిరోధానం, పిధానం, ఆచ్ఛాదనం – అంతర్ధానశబ్దపర్యాయాలు.

అబ్జో జైవాతృకః సోమో గ్లౌర్మృగాంకః కలానిధిః ।
విధుః, కుముదబంధుశ్చ, బింబోఽస్త్రీ మండలం త్రిషు ॥26॥

(పుం), అబ్జ, జైవాతృక, సోమ, గ్లౌ, మృగాంక, కలానిధి, విధు, కుముదబంధు ఇవి చంద్రశబ్దపర్యాయాలు. చంద్రసూర్యమండలాలకు బింబం అని పేరు. బింబశబ్దం (పుం,న), మండల శబ్దం (మూడు లింగాలు),

కలాతు షోడశో భాగో భిత్తం శకలఖండకే ।
చంద్రికా కౌముదీ జ్యోత్స్నా ప్రసాదస్తు ప్రసన్నతా ॥27॥

చంద్రుని పదహారోభాగానికి 'కళ' అని పేరు. భిత్త, శకల, ఖండక శబ్దాలు ఖండ శబ్దార్థవాచకాలు. చంద్రికా, కౌముదీ, జ్యోత్స్నా=వెన్నెల, ప్రసాదః=ప్రసన్నత్వం,

లక్షణం లక్ష్మకం చిహ్నం శోభా కాంతిర్ద్యుతిశ్ఛవిః ।
సుషమా పరమా శోభా తుషారస్తుహినం హిమమ్ ॥28॥

లక్షణం, లక్ష్మకం, చిహ్నం-గుర్తు అనే అర్థాన్ని ఇచ్చే పదాలు. శోభా, కాంతి, ద్యుతి, ఛవి - ఇవి శోభా శబ్దపర్యాయాలు పరమ శోభకు సుషమ అని పేరు. తుషార, తుహిన, హిమశబ్దాలు 'మంచు' అనే అర్థాన్ని ఇచ్చేవి.

అవశ్యాయస్తు నీహారః ప్రాలేయః శిశిరో హిమః ।
నక్షత్ర మృక్షం భం తారా తారకాప్యుడు వా స్త్రియామ్ ॥29॥

సన్నని మంచుకు అవశ్యాయః, నీహారః అని పేర్లు. ప్రాలేయః, శిశిరః, హిమః - ఇవి కూడ నీహార శబ్ద పర్యాయాలు. నక్షత్రం, ఋక్షం, భం, తారా, - తారకా, ఉడు - నక్షత్రం చెప్పే శబ్దాలు. ఉడు శబ్దం వికల్పంగా స్త్రీ లింగంలో ఉంటుంది.

గురుర్జీవ ఆంగిరస ఉశనా భార్గవః కవిః ।
విధుంతుదస్తమోరాహు ర్లగ్నం రాశ్యుదయః స్మృతః ॥30॥

గురుః, జీవః, ఆంగిరసుడు=బృహస్పతి, ఉశనాః, భార్గవః, కవిః=శుక్రుడు, విధుంతుదః, తమః=రాహువు, లగ్నం అనగా రాశుల ఉదయం,

సప్తర్షయో మరీచ్యత్రిముఖా శ్చిత్ర శిఖండినః ।
హరిదశ్వ బ్రధ్నపూషద్యుమణిర్మిహిరో రవిః ॥31॥

మరీచి, అత్రిమున్నగు వారు సప్తర్షులు అని చెప్పబడతారు. సప్తర్షులకు 'చిత్రశిఖండినః' అని పేరు. హరిదశ్వ, బ్రధ్న, పూషా, ద్యుమణి, మిహిర, రవి శబ్దాలు సూర్యవాచకాలు.

పరివేషస్తు పరిధిరుపసూర్యకమండలే ।
కిరణోఽస్రమయూఖాంశు గభస్తి ఘృణి ధృష్ణయః ॥32॥

భానుః కరో మరీచిః స్త్రీపుంసయోర్దీధితిః స్త్రియామ్ ।
స్యుః ప్రభా రుగ్రుచిస్త్విడ్భాభాశ్ఛవిద్యుతి దీప్తయః ॥33॥

రోచిః శోచిరుభే క్లీబే ప్రకాశో ద్యోత ఆతపః ।
కోష్ణం కవోష్ణం మందోష్ణం కదుష్ణం త్రిషు తద్వతి ॥34॥

పరివేషః, పరిధిః=సూర్యుని చుట్టూ కట్టిన మండలం, కిరణ, అస్త్ర (ఉస్ర), మయూఖ, అంశు, గభస్తి, ఘృణి, ధృష్ణి – అనేవి (వి॥) భానుః, కరః, మరీచిః, (పుం, స్త్రీ), దీధితిః (స్త్రీ), ప్రభా, రుచి, రుక్, త్విట్, భా, ఆభా, ఛవి, ద్యుతి, దీప్తి అనేవి (న॥) రోచిస్, శోచిస్ (న॥), ఇవన్నీ కాంతివాచక శబ్దాలు. ప్రకాశః, ద్యోతః, ఆతపః – ఎండను తెలియజేసేవి. కోష్ణం, కవోష్ణం, మందోష్ణం, కదుష్ణం, కొంచెం ఎండను సూచించేవి. ఇవి మూడు విశేష్యానుసారంగా మూడు లింగాలలోను ఉంటాయి.

తిగ్మం తీక్ష్ణం ఖరం తద్వద్దిష్టోఽనేహా చ కాలకః ।
ఘస్రో దినాహనీ చైవ సాయం సంధ్యా పితృప్రసూః ॥35॥

తిగ్మ, తీక్ష్ణ, ఖర శబ్దాలు మిక్కిలి వేడిని సూచించేవి. దిష్ట, అనేహా, కాల శబ్దాలు సమయవాచకాలు. ఘస్ర, దిన, అహన్ – ఇవి దిన శబ్ద పర్యాయాలు, సాయం శబ్దం, సంధ్యా, పితృప్రసూః – సాయంకాల సంధ్యా బోధకాలు.

ప్రత్యూషోఽహర్ముఖం కల్యముషః ప్రత్యూషసీ అపి ।
ప్రాహ్ణాపరాహ్ణ మధ్యాహ్నాస్త్రిసంధ్యమథ శర్వరీ ॥36॥

యామీ తమీ తమిస్రా చ జ్యోత్స్నీ చంద్రికయాన్వితా ।
ఆగామివర్తమానాహర్యుక్తాయాం నిశిపక్షిణీ ॥37॥

ప్రత్యూషః, అహర్ముఖం, కల్యః, ఉషః, ప్రత్యుషస్ – ప్రాతః, కాలాన్ని బోధించేవి ప్రాహ్ణ, అపరాహ్ణ, మధ్యాహ్నాలకు త్రిసంధ్యలని పేరు. శర్వరీ అనేవి, యామీ, తమీ, తమిస్రా, అనేవి రాత్రిని సూచించేవి, తమిస్రా (చీకటి రాత్రి), జ్యోత్స్నీ=వెన్నెల రాత్రి, రాబోవు పగలు, జరుగుతున్న పగలు కలిసిన రాత్రికి పక్షిణి అని పేరు. (ఆ రాత్రికి పక్షిణి అని పేరు).

అర్ధరాత్ర నిశీథౌ ద్వౌ ప్రదోషో రజనీ ముఖమ్ ।
సపర్వసంధిః ప్రతిపత్పంచదశ్యోర్యదంతరమ్ ॥38॥

అర్ధరాత్ర, నిశీథ శబ్దాలు రెండు రాత్రి మధ్య భాగాన్ని సూచించేవి. ప్రదోషమనగా సాయంకాల ప్రారంభం. ప్రతిపత్తుకు, (పాడ్యమి) పూర్ణిమ, అమావాస్యలకు మధ్య ఉండేది పర్వసంధి.

పక్షాంతౌ పంచదశ్యౌ ద్వే పౌర్ణమాసీ తు పూర్ణిమా ।
కలాహీనే సానుమతిః పూర్ణే రాకా నిశాకరే ॥39॥

రెండు పక్షాంత తిథులకు పంచదశి అని పేరు. పౌర్ణమాసీ, పూర్ణిమా, సమానపదాలు. పూర్ణిమనాడు చంద్రోదయ సమయంలో ప్రతిపద్యోగంలో ఒక కళ తక్కువయితే ఆ పూర్ణిమకు సానుమతి అని పేరు. పూర్ణ చంద్రుడు ఉన్నది రాకాతిథి.

అమావాస్యా త్వమావస్యా దర్శః సూర్యేందుసంగమః ।
సా దృష్టేందుః సినీవాలీ సానష్టేందుకలా కుహూః ॥40॥

అమావాస్యా, అమావస్యా, దర్శ, సూర్యేందు సంగమ శబ్దాలు అమావాస్యను సూచించేవి. చతుర్దశీయోగంలో అమావాస్యనాడు ప్రాతఃకాలంలో చంద్రుని దర్శనమయితే ఆ అమావాస్యకు 'సినీవాలీ' అని పేరు. అమావాస్య యోగంలో చంద్రకళ కనబడకపోతే దానికి "కుహూ" అని పేరు.

సంవర్తః ప్రలయః కల్పః క్షయః కల్పాంత ఇత్యపి ।
కలుషం వృజినైనోఽఘమంహోదురితదుష్కృతమ్ ॥41॥

సంవర్త, ప్రలయ, కల్ప, క్షయ, కల్పాంత శబ్దాలు ప్రలయవాచకాలు. కలుష, వృజిన, ఏనస్, అఘ, అంహస్, దురిత, దుష్కృత శబ్దాలు పాపవాచకాలు.

స్యాద్ధర్మమస్త్రియాం పుణ్యశ్రేయసీ సుకృతం వృషః ।
ముత్ప్రీతిః ప్రమదో హర్షః ప్రమదామోదసమ్మదాః ॥42॥

స్యాదానన్దథురానన్దః శర్మశాతసుఖాని చ ।
శ్వఃశ్రేయసం శివం భద్రం కల్యాణం మంగళం శుభమ్ ॥43॥

భావుకం భవికం భవ్యం కుశలం క్షేమమస్త్రియామ్ ।
దైవం దిష్టం భాగధేయం భాగ్యం స్త్రీ నియతిర్విధిః ॥44॥

ధర్మశబ్దం పుంలింగ నపుంసక లింగాలలో ఉంటుంది. పుణ్యం, శ్రేయస్, సుకృతం, వృషశబ్దాలు పుణ్యవాచకాలు. (ముందు మూడు శబ్దాలు నపుంసకాలు, వృషశబ్దం పుంలింగం), ముత్, ప్రీతి, ప్రమద, హర్ష, ప్రమోద, ఆమోద, సమ్మద శబ్దాలు. ఆనందథు, ఆనంద, శర్మ, శాత, సుఖ శబ్దాలు సుఖవాచకాలు. స్వఃశ్రేయసం, శివం, భద్రం, కల్యాణం, మంగళం, శుభమ్ అనేవి, భావుకం, భవికం, భవ్యం, కుశలం, క్షేమం అనేవి క్షేమశబ్దవాచకాలు. ఇవి పుంలింగ నపుంసక లింగాలలో ఉంటాయి. దైవం, దిష్టం, భాగధేయం, భాగ్యం, నియతిః (స్త్రీ) విధిః (పుం), ఇవి భాగ్యశబ్ద వాచకాలు.

క్షేత్రజ్ఞ ఆత్మా పురుషః ప్రధానం ప్రకృతిః స్త్రియామ్ ।
హేతుర్నాకారణం బీజం నిదానం త్వాదికారణమ్ ॥45॥

క్షేత్రజ్ఞుడు, ఆత్మా, పురుషుడు, ఆత్మ శబ్దపర్యాయాలు. ప్రకృతిః, మాయాశబ్దాలు సమానాలు. అవే ప్రధానం, ప్రకృతి అనేవి, ప్రకృతి (స్త్రీ) ప్రధానం (న) హేతు, కారణ, బీజాలు కారణవాచకాలు. హేతుః (పుం), కారణం, బీజం (న), కార్యోత్పత్తితో ప్రధాన హేతువుకు రెండు నామాలు ఉన్నాయి. అవే నిదానం, ఆదికారణం అనేవి. నిదానమన్నా ఆది కారణమే.

చిత్తం తు చేతో హృదయం స్వాంతం హృన్మానసం మనః ।
బుద్ధి ర్మనీషా ధిషణా ధీః ప్రజ్ఞా శేముషీ మతిః ॥46॥

ప్రేక్షోపలబ్ధిశ్చిత్సంవిత్ ప్రతిపజ్జ్ఞప్తి చేతనాః ।
ధీర్ధారణావతీ మేధా సంకల్పః కర్మ మానసమ్ ॥47॥

చిత్తం, చేతస్, హృదయం, స్వాంతం, హృత్, మానసం, మనః ఇవి మనస్సును చెప్పే శబ్దాలు. బుద్ధి, మనీష, ధిషణ, ధీః, ప్రజ్ఞా, శేముషీ, మతిః ప్రేక్షా, ఉపలబ్ధి, చిత్, సంవిత్, ప్రతిపత్, జ్ఞప్తి, చేతనాశబ్దాలు బుద్ధి శబ్దపర్యాయాలు ధారణాశక్తితో కూడుకొన్న బుద్ధికి మేధ అని పేరు. మానసిక వ్యాపారానికి సంకల్పమని పేరు.

సంఖ్యావిచారణా చర్చా విచికిత్సా తు సంశయః ।
అధ్యాహారస్తర్క ఊహః సమౌ నిర్ణయనిశ్చయౌ ॥48॥

సంఖ్యా, విచారణా, చర్చా–ఇవి విచారణా శబ్ద పర్యాయాలు. విచికిత్స, సంశయ పదాలు సందేహ శబ్ద పర్యాయాలు. అధ్యాహార, తర్క, ఊహ శబ్దాలు తర్క వితర్కాలకు పేర్లు. నిశ్చిత విచారణానికి నిర్ణయం, నిశ్చయం,అని పేర్లు.

మిథ్యాదృష్టి ర్నాస్తికతా భ్రాంతిర్మిథ్యా మతిర్భ్రమః ।
అంగీకారాభ్యుపగమ ప్రతిశ్రవ సమాధయః ॥49॥

మిథ్యాదృష్టి, నాస్తికత = నాస్తికత్వం, భ్రాంతి, మిథ్యామతి = భ్రమ, అంగీకారం, అభ్యుపగమం, ప్రతిశ్రవసమాధులు – స్వీకరణ పర్యాయాలు.

మోక్షే ధీర్జ్ఞాన మన్యత్ర విజ్ఞానం శిల్పశాస్త్రయోః ।
ముక్తిః కైవల్యనిర్వాణ శ్రేయో నిఃశ్రేయసామృతమ్ ॥50॥

మోక్షోఽపవర్గోఽథాజ్ఞాన మవిద్యాఽహమ్మతిః స్త్రియామ్ ।
విమర్దోత్థేపరిమలో గంధే జనమనోహరే ॥51॥

జ్ఞానమనగా మోక్షబుద్ధి, శిల్పశాస్త్రజ్ఞానం విజ్ఞానం, ముక్తి, కైవల్య, నిర్వాణ, శ్రేయస్, నిఃశ్రేయస్, అమృతమ్, మోక్షః, అపవర్గః, శబ్దాలు మోక్షాన్ని సూచించేవి. అజ్ఞానం, అవిద్య, అహంమతి – అజ్ఞాన శబ్ద పర్యాయాలు. విమర్దనం వల్ల కల్గి సర్వజన మనోహరంగా ఉంటే ఆ సువాసనకు పరిమళమని పేరు.

ఆమోదః సోఽతినిర్హారీ సురభిర్ఘ్రాణతత్పరః ।
శుక్లశుభ్రశుచిశ్వేతవిశదశ్వేత పాండ(డు)రాః ॥52॥

అవదాతః సితో గౌరో వలక్షో ధవలోఽర్జునః ।
హరిణః పాండురః పాండురీషత్పాండుస్తు ధూసరః ॥53॥

ఎక్కువ ఆనందాన్ని కలిగించేది ఆమోదం. ఘ్రాణానికి తృప్తినిచ్చేది సురభి. శుక్ల, శుభ్ర, శుచి, శ్వేత, విశద, శ్వేత, పాండర అనేవి. అవదాత, సిత, గౌర, వలక్ష, ధవల, అర్జున, హరిణ, పాండుర, పాండు అనే శబ్దాలు తెలుపు అనే అర్థాన్ని ఇచ్చేవి. ధూసరః=కొంచెం తెల్లగా ఉండేది.

కృష్ణే నీలా஽సితశ్యామకాలశ్యామలమేచకాః ।
పీతో గౌరో హరిద్రాభః పాలాశో హరితో హరిత్ ॥54॥

కృష్ణ, నీల, అసిత, శ్యామ, కాల, శ్యామల, మేచక శబ్దాలు నలుపు అనే అర్థాన్ని ఇచ్చేవి. పీత, గౌర, హరిద్రాభ శబ్దాలు పసుపు పచ్చ అనే అర్థాన్ని ఇచ్చేవి. పాలాశ, హరిత, హరిత్ - శబ్దాలు ఆకుపచ్చ అనే అర్థాన్ని ఇచ్చేవి.

రోహితో లోహితో రక్తః శోణః కోకనదచ్ఛవిః ।
అవ్యక్తరాగస్త్వరుణః శ్వేతరక్తస్తు పాటలః ॥55॥

రోహిత, లోహిత, రక్త, శోణ, కోకనదచ్ఛవి అనే శబ్దాలు ఎరుపు అనే అర్థాన్ని ఇచ్చేవి. అరుణః=అంతగా ఎరుపు కానిది, పాటలః=తెలుపు, ఎరుపు రంగులు కలసినది,

శ్యావః స్యాత్కపిశో ధూమ్రధూమలౌ కృష్ణలోహితే ।
కడారః కపిలః పింగపిశంగౌ కద్రుపింగలౌ ॥56॥

శ్యావఃకపిశ - కోతిరంగు, ధూమ్ర - ధూమల - కృష్ణ లోహిత శబ్దాలు సమానార్థకాలు. తేపు రంగును తెలియజేస్తాయి. కడార, కపిల, పింగ, పిశంగ, కద్రు, పింగల శబ్దాలు గోరోజనవర్ణానికి పేర్లు.

చిత్రం కిర్మీరకల్మాషశబలైతాశ్చ కర్బురే ।
వ్యాహార ఉక్తిర్లపిత మపభ్రంశో஽పశబ్దకః ॥57॥

చిత్ర, కిర్మీర, కల్మాష, శబల, ఏత, కర్బుర, శబ్దాలు చిత్రాతి చిత్రమైన వర్ణాన్ని తెలియజేసేవి. వ్యాహారః, ఉక్తిః, లపితం=సంభాషణం, అపభ్రంశః= అపశబ్దకం.

తిఙ్సుబంతచయో వాక్యం క్రియా వా కారకాన్వితా ।
ఇతిహాసః పురావృత్తం పురాణం పంచలక్షణమ్ ॥58॥

తిఙన్త సుబంతాల సముదాయం లేదా కారకాన్వితమైన క్రియ వాక్యం అనబడుతుంది. ఇతిహాసం, పురావృత్తం, పురాణం, పంచలక్షణమ్ - పురాణ శబ్ద పర్యాయాలు.

ఆఖ్యాయికోపలబ్దార్థా ప్రబంధః కల్పనా కథా ।
సమాహారః సంగ్రహస్తు ప్రవహ్లికా ప్రహేలికా ॥59॥

సత్యమైన కథ కలది ఆఖ్యాయిక. కల్పితకథ ప్రబంధం. సమాహారః, సంగ్రహః=సేకరించిన సముదాయం. ప్రవహ్లికా, ప్రహేలికా సమానార్థకాలు.

సమస్యా తు సమాసార్థా స్మృతిస్తు ధర్మసంహితా ।
ఆఖ్యాహ్వే చాభిధానం చ వార్తా వృత్తాంత ఈరితః ॥60॥

సమస్యా సమాసార్థా – ఈ రెండును సమానార్థకాలు. స్మృతి, ధర్మ సంహిత ధర్మ శాస్త్రపర్యాయాలు. ఆఖ్యా, ఆహ్వా, అభిధానం = పేరు, వార్తా వృత్తాంత శబ్దాలు సమానార్థకాలు.

హూతిరాకారణాహ్వానముపన్యాసస్తు వాఙ్ముఖమ్ ।
వివాదో వ్యవహారః స్యాత్ప్రతివాక్యోత్తరే సమే ॥61॥

హూతిః ఆకారణం, ఆహ్వానం సమానార్థకాలు (పిలుచుట అని అర్థం) ఉపన్యాసః, వాఙ్ముఖమ్=వాక్ప్రారంభము, వివాదః, వ్యవహారః=వివాదము, ప్రతివాక్యం, ఉత్తరం సమానార్థకాలు.

ఉపోద్ఘాత ఉదాహారోహ్యథ మిథ్యాభిశంసనమ్ ।
అభిశాపో యశః కీర్తిః ప్రశ్నః పృచ్ఛానుయోగకః ॥62॥

ఉపోద్ఘాతం, ఉదాహారం, సమానార్థకాలు. మిథ్యాభిశంసనము, అభిశాపం సమానార్థకాలు. యశః, కీర్తిః, పర్యాయపదాలు. ప్రశ్నః, పృచ్ఛా, అనుయోగకః పర్యాయపదాలు.

ఆమ్రేడితం ద్విస్త్రిరుక్తం కుత్సా నిందే చ గర్హణే ।
స్యాదాభాషణమాలాపః ప్రలాపోఽనర్థకం వచః ॥63॥

రెండు మార్లు, మూడు మార్లు చెప్పినది ఆమ్రేడితం అనబడుతుంది. కుత్సా, నిందా, గర్హణ శబ్దాలు నిందార్థక శబ్దాలు. ఆలాపః, ఆభాషణం, సమానార్థకాలు, ప్రలాపః=అనర్థవచనం,

అనులాపో ముహుర్భాషా విలాపః పరిదేవనమ్ ।
విప్రలాపో విరోధోక్తిః సంలాపో భాషణం మిథః ॥64॥

అనులాపః=మాటిమాటికి చెప్పడం, విలాపః, పరిదేవనమ్=శోకంతో కూడిన రోదనం, విప్రలాపః, విరోధోక్తిః=పరస్పర విరుద్ధవచనం, సంలాపం= పరస్పర సంభాషణం.

సుప్రలాపః సువచనమపలాపస్తు నిహ్నవః ।
రుశతీ వాగకల్యాణీ సంగతం హృదయం గమమ్ ॥65॥

సుప్రలాపః, సువచనమ్=మంచిమాట, అపలాపః, నిహ్నవః=కప్పి పుచ్చుట, రుశతీ, అకల్యాణీవాక్= అమంగళకరమైన వాక్కు, సంగతం=హృదయంగమమైనది.

అత్యర్థమధురం సాన్త్వమబద్ధం స్యాదనర్థకమ్ ।
నిష్ఠురాశ్లీలపరుషం గ్రామ్యం వై సూనృతం ప్రియే ॥66॥

మిక్కిలి మధురమైన మాటకు సాంత్వం (లేదా) సాంత్వన అని పేరు. అర్థంలేని మాటకు అబద్ధమని పేరు. నిష్ఠురం, అశ్లీలం, పరుషం, గ్రామ్యం ఇవి పర్యాయపదాలు. ప్రియమైన వాక్కుకు సూనృతం అని పేరు.

సత్యం తథ్యమృతం సమ్యక్ నాదనిస్వాన నిస్వనాః ।
ఆరవారావ సంరావ విరావా అథ మర్మరః ॥67॥

సత్యం, తథ్యమ్, ఋతం, సమ్యక్-యథార్థవచన బోధకాలు నాదం, నిఃస్వానం, నిఃస్వనం, ఆరవం, ఆరావం, సంరావం,విరావం - ధ్వని వాచకాలు, మర్మరః=వస్త్రపర్ణాదుల ధ్వని.

స్వనితే వస్త్రపర్ణానాం భూషణానాం తు శింజితమ్ ।
వీణాయా నిక్వణః క్వాణస్తిరశ్చాం వాశితం రుతమ్ ॥68॥

శింజితమ్=భూషణాదుల ధ్వని, నిక్వణః, క్వాణః=వీణాధ్వని, పక్షుల యొక్క (తిర్యగ్జంతువుల) కూతకు 'వాశితం' అని పేరు.

కోలాహలః కలకలో గీతం గానమిమే సమే ।
స్త్రీ ప్రతిశ్రుత్ప్రతిధ్వానే తంత్రీకంఠాన్నిషాదకః ॥69॥
కాకలీ తు కలే సూక్ష్మే ధ్వనౌ తు మధురా స్ఫుటే ।
కలో మంద్రస్తు గంభీరే తారోఽత్యుచ్చైః స్త్రియాస్త్రిషు ॥70॥

కోలాహలః కలకలః - పర్యాయపదాలు. గీతం, గానం - ఈ రెండునూ సమానార్థక పదాలు. ప్రతిశ్రుత్ (స్త్రీ) ప్రతిధ్వానం=ప్రతి ధ్వని అని అర్థం. నిషాదకః=తంత్రీ కంఠధ్వని, కాకలీ=సూక్ష్మమైన మధురమైన ధ్వని, కలః=మధురమైన అస్ఫుటమైన ధ్వని, మంద్రః=గంభీర ధ్వని, తారః=అత్యుచ్చైః స్వరం, కల, మంద్ర, తార శబ్దాలు మూడు మూడు లింగాలలోను ఉంటాయి.

సమన్వితలయస్త్వేకతాలో వీణా తు వల్లకీ ।
విపంచీ సా తు తంత్రీభిః సప్తభిః పరివాదినీ ॥71॥

ఏకతాలః=పాటతో కలిసిన లయ, వీణా, వల్లకీ, విపంచీ - వీణా శబ్ద పర్యాయాలు. పరివాదినీ=ఏడు తీగలతో కూడుకొన్నవీణ

తతం వీణాదికం వాద్యమానద్ధం మురజాదికమ్ ।
వంశాదికం తు సుషిరం కాంస్యతాలాదికం ఘనమ్ ॥72॥

తతం=వీణాదిక వాద్యం, ఆనద్ధం-మురజాదివాద్యం, సుషిరం=వంశాదివాద్యం, ఘనం=కాంస్యతాలాది వాద్యం.

చతుర్విధ మిదం వాద్యం వాదిత్రాతోద్యనామకమ్ ।
మృదంగా మురజా భేదా స్త్వజ్ క్యాలింగ్యోఽ ర్థకాస్త్రయః ॥73॥

ఈ నాలుగు విధాలైన వాద్యాలకు వాదిత్రం, అతోద్యం, వాద్యం అని పేర్లు మృదంగం, మురజం ఇవి డోలక వాచకాలు. మురజం మూడు భేదాలు. ఆంక్యం, ఆలింగ్యం, ఊర్ధ్వం అని అది మూడు విధాలు.

స్యాద్యశః పటహో ఢక్కా భేర్యామానక దుందుభిః ।
ఆనకః పటహో భేదా ఝర్ఝరీ డిండిమాదయః ॥74॥

యశః, పటహః, ఢక్కా అనే మూడు పర్యాయపదాలు. ఆనక దుందుభిః=భేరి, ఆనకః, పటహః పర్యాయపదాలు. ఝర్ఝరీ డిండిమాదులు పటహభేదాలు.

మర్దలః పణవస్తుల్యో క్రియమానం తు తాలకః ।
లయః సామ్యం తాండవం తు నాట్యం లాస్యం చ నర్తనమ్ ॥75॥

మర్దలః, పణవః, పర్యాయపదాలు సంగీత క్రియమానమునకు "తాలకము" అని పేరు. క్రియాకాలగతికి తాలం, గీతవాద్య సమానావస్థ"లయ", తాండవం, నాట్యం, లాస్యం, నర్తనం-నృత్యవాచకాలు.

తౌర్యత్రికం నృత్యగీతవాద్యం నాట్యమిదం త్రయమ్ ।
రాజా భట్టారకో దేవః సాభిషేకా చ దేవ్యపి ॥76॥

నృత్యగీత వాద్యాలు మూడింటికి తౌర్యత్రికం. నాట్యం అని పేరు (నాటకంలో) రాజుకు భట్టారకుడు, దేవుడు అని పేరు. అతనితో పట్టాభిషిక్తురాలైన మహారాజ్ఞికి "దేవి" అనిపేరు.

శృంగార వీరకరుణాద్భుతహాస్యభయానకాః ।
బీభత్సరౌద్రౌ చ రసాః శృంగారః శుచిరుజ్జ్వలః ॥77॥

శృంగార, వీర, కరుణ, అద్భుత, హాస్య, భయానక, బీభత్స, రౌద్రములు రసాలు. శృంగారః, పవిత్రమైనదీ ఆహ్లాదరమైనది.

ఉత్సాహవర్ధనో వీరః కారుణ్యం కరుణా ఘృణా ।
కృపా దయా చానుకంపాప్యనుక్రోశోఽ ప్యథో హసః ॥78॥

హాసో హాస్యంచ బీభత్సం వికృతం త్రిష్విదం ద్వయమ్ ।
విస్మయోఽ ద్భుత మాశ్చర్యం చిత్రమప్యథ భైరవమ్ ॥79॥

దారుణం భీషణం భీష్మం ఘోరం భీమం భయానకమ్ ।
భయంకరం ప్రతిభయం రౌద్రం తూగ్రమమీ త్రిషు ॥80॥

ఉత్సాహవర్ధనః, వీరః సమానార్థకాలు. కారుణ్యం, కరుణా, ఘృణా, కృపా, దయా, అనుకంపా, అనుక్రోశ, శబ్దాలు దయావాచకాలు. హాసః, హాస్యం పర్యాయపదాలు. బీభత్స, వికృత శబ్దాలు బీభత్సరస పర్యాయాలు. ఈ రెండు శబ్దాలు మూడు లింగాలలోను ఉంటాయి. విస్మయః, అద్భుతమ్, ఆశ్చర్యమ్, చిత్రమ్ - ఈ నాలుగు అద్భుతశబ్దవాచకాలు. భైరవ, దారుణ, భీషణ, భీష్మ, ఘోర, భీమ, భయానక, భయంకర, ప్రతిభయశబ్దాలు భయానక శబ్దార్థ వాచకాలు. రౌద్రం, ఉగ్రం పర్యాయపదాలు. అద్భుతం మొదలు ఉగ్రం వరకు ఉండే శబ్దాలు అన్నీ మూడు లింగాలలోను ఉంటాయి (ఇవి పదునాల్గు శబ్దాలు).

చతుర్దశ దరత్రాసౌ భీతిర్భీః సాధ్వసం భయమ్ ।
వికారో మానసో భావోఽనుభావో భావబోధనః ॥81॥

దర, త్రాస, భీతి, భీ, సాధ్వస, భయ శబ్దాలు పర్యాయపదాలు. మానస వికారానికి భావమని పేరు. భావాన్ని బోధించేది అను భావం.

గర్వోఽభిమానోఽహంకారో మానశ్చిత్త సమున్నతిః ।
అనాదరః పరిభవః పరిభావస్తిరస్క్రియా ॥82॥

గర్వ, అభిమాన, అహంకార శబ్దాలు పర్యాయపదాలు. నాతో సమానుడు రెండో వాడు లేడనే భావం మానం, చిత్తసమున్నతి అనబడుతుంది. అనాదర, పరిభవ, పరిభావ, తిరస్క్రియా శబ్దాలు అవమానవాచకాలు.

వ్రీడాలజ్జా త్రపా హ్రీః స్యాదభిధ్యానం ధనే స్పృహా ।
కౌతూహలం కౌతుకం చ కుతుకం చ కుతూహలమ్ ॥83॥

వ్రీడా, లజ్జా, త్రపా, హ్రీ శబ్దాలు సిగ్గును తెలిపేవి. ఎదుటి వారి ధనాన్ని కోరుకోవడం అభిధ్యానం, కౌతూహల, కౌతుక, కుతుక, కుతూహల శబ్దాలు పర్యాయవాచకాలు.

స్త్రీణాం విలాసబిబ్బోకవిభ్రమా లలితం తథా ।
హేలాలీలేత్యమీ హావాః క్రియాః శృంగారభావజాః ॥84॥

విలాస, బిబ్బోక (వివ్వోక), విభ్రమ, లలిత, హేలా, లీలా శబ్దాలు శృంగార భావం వల్ల కలిగే స్త్రీల చేష్టలు. వీటికి హావములు అని పేరు.

ద్రవకేలిపరీహాసాః లీలాక్రీడాచ కూర్దనమ్ ।
స్యాదాచ్ఛురితకం హాసః సోత్ప్రాసః సమనాక్స్మితమ్ ॥85॥

ద్రవ, కేలి, పరిహాస, క్రీడా, లీలా, కూర్దన శబ్దాలు క్రీడాపరిహాస పర్యాయవాచకాలు. ఇతరులను పరిహసించడం ఆచ్ఛురితకం. (మంద) స్మితం, చిరునవ్వు.

అధోభువన పాతాలం ఛిద్రం శ్వభ్రం వపా సుషిః ।
గర్తావటౌ భువిశ్వభ్రే తమిస్రం (శ్రం) తిమిరం తమః ॥86॥

అధోభువనం=పాతాలం, ఛిద్ర, శ్వభ్ర, వపా, సుషి శబ్దాలు ఛిద్ర వాచకాలు గర్తం, అవటం, భువిశ్వభ్రం, భూమి లోని గొయ్యి, తమిస్ర, తిమిర, తమస్ శబ్దాలు అంధకార వాచకాలు.

సర్పః పృదాకుర్భుజగో దందశూకో బిలేశయః ।
విషం క్ష్వేడశ్చ గరళం నిరయో దుర్గతిః స్త్రియామ్ ॥87॥

సర్ప, పృదాకు, భుజగ, దందశూక, బిలేశయ శబ్దాలు సర్పవాచకాలు. విషం, క్ష్వేడః, గరళం – విషవాచకాలు. నిరయః, దుర్గతిః – నరకాల పేర్లు. 'దుర్గతిః' అనే శబ్దం స్త్రీలింగంలో ఉంటుంది.

పయః కీలాలమమృతముదకం భువనం వనమ్ ।
భంగస్తరంగ ఊర్మిర్వా కల్లోలోల్లోలకౌ చ తౌ ॥88॥

పయః, కీలాలమ్, అమృతమ్, ఉదకం, భువనం, వనమ్ – జలశబ్ద పర్యాయాలు. భంగః, తరంగః, ఊర్మిః, కల్లోలః, ఉల్లోలః – తరంగ శబ్ద పర్యాయాలు.

పృషన్తి బిందు పృషతాః కూలం రోధశ్చ తీరకమ్ ।
తోయోత్థితం తత్పులినం జంబాలం పంకకర్దమౌ ॥89॥

పృషత్, బిందు – జల బిందువులు, కూలం, రోధః, తీరకమ్ – ఒడ్డు (దరి) ని సూచించేవి. నీటి నుంచి బయట పడినది పులినం. జంబాల, పంక, కర్దమ శబ్దాలు బురదను తెలిపేవి.

జలోచ్ఛ్వాసాః పరీవాహాః కూపకాస్తు విదారకాః ।
ఆతరస్తరపణ్యం స్యాద్ద్రోణీ కాష్ఠాంబువాహినీ ॥90॥

పొరలుచున్న నీళ్లకు పరీవాహాలు అని పేరు. కూపక, విదారక శబ్దాలు జలాశయాలలో నిలిచి ఉండే 'నీరు' ను తెలియజేసేవి. ఆతరః=నదిని దాటించడానికి ఇచ్చే ధనం, కర్రతో చేసిన నీటి తొట్టెకు 'ద్రోణి' అని పేరు.

కలుషశ్చావిలోఽచ్ఛస్తు ప్రసన్నోఽథ గభీరకమ్ ।
అగాధం దాశకైవర్తౌ శంబూకా జలశుక్తయః ॥91॥

కలుషః=ఆవిలః (కల్మషమైనది), అచ్ఛః=ప్రసన్నః (స్వచ్ఛమైనది), గభీరకమ్=అగాధం (లోతైనది)దాశః, కైవర్తః = పల్లెవాడు, శంబూకాః=నత్తగుల్లలు.

సౌగంధికం తు కల్హారం నీలమిందీవరం పంకజమ్ ।
స్యాదుత్పలం కువలయం సితే కుముదకైరవే ॥92॥

సౌగంధికం, కల్హారం= (ఎర్ర), తెల్లతామర పూవు, ఇందీవరం= నల్లతామరపూవు, ఉత్పలం, కువలయం = కలువపూవు, కుముదం, కైరవం= తెల్లకలువ,

శాలూకమేషాం కందః స్యాత్పద్మం తామరసం కజమ్ ।
నీలోత్పలం కువలయం రక్తం కోకనదం స్మృతమ్ ॥93॥

వీటి కందమునకు శాలూకం అని పేరు. పద్మం, తామరసం, కజం=తామరపూవు, కువలయం, నీలోత్పలం, పర్యాయపదాలు. కోకనదం=ఎర్రకలువ.

కరహాటః శిఫా కందః కింజల్కః కేసరోఽస్త్రియామ్ ।
ఖనిః స్త్రియామాకరః స్యాత్పాదాః ప్రత్యన్తపర్వతాః ॥94॥

కరహాటశిఫా కంద శబ్దాలు పద్మలత యొక్క దుంపకు పేర్లు. కింజల్కః కేసరః (పుం,న) పర్యాయపదాలు. ఖనిః (స్త్రీ), ఆకర శబ్దాలు పర్యాయపదాలు. పాదాః = పర్వతానికి దగ్గరగానున్న చిన్న పర్వతాలు.

ఉపత్యకాద్రేరాసన్నా భూమిరూర్ధ్వమధిత్యకా ।
స్వర్గపాతాలవర్గాద్యా ఉక్తా నానార్థకాంచ్ఛృణు ॥95॥

ఉపత్యకా=పర్వతానికి దగ్గరగా ఉండే భూమి, అధిత్యకా= పర్వతానికి పైనున్న భూమి. ఈవిధంగా స్వర్గ పాతాలాది వర్గాలు చెప్పబడ్డాయి. ఇంక నానార్థకాలను గురించి వినుము.

ఇత్యాది మహాపురాణే ఆగ్నేయే స్వర్గపాతాలాదివర్గకథనం నామ షష్ట్యధిక త్రిశతతమోఽధ్యాయః ॥360॥

అగ్నిమహాపురాణంలో స్వర్గపాతాలాదివర్గకథనం అనే మూడువందల అరవైయవ అధ్యాయం సమాప్తం.



ఏకషష్ట్యధిక త్రిశతతమోఽధ్యాయః - మూడువందల అరవైఒకటవ అధ్యాయం

అవ్యయవర్గ కథనమ్ - అవ్యయవర్గ కథనం

అగ్నిరువాచ - అగ్ని ఇలా చెప్పాడు.

ఆజీషదర్థేఽభివ్యాప్తౌ సీమార్థే ధాతుయోగజే ।
ఆ ప్రగృహ్యః స్మృతౌ వాక్యేఽప్యాస్తు స్యాత్కోపపీడయోః ॥1॥

వసిష్ఠా! "ఆఙ్" అనే అవ్యయం కొంచెం అనే అర్థమునందు, అభివ్యాప్తియందు, హద్దు (సీమ) అనే అర్థంలోను ప్రయోగింపబడును. దానిని ధాతువుతో చేరిస్తే విభిన్నములైన అర్థాలు ఉంటాయి. 'ఆ' ప్రగృహ్య సంజ్ఞ కలిగిన అవ్యయం. స్మృతివాక్యం అనే అర్థంలో కూడ ప్రయోగింపబడుతుంది. ఆః=కోపం, పీడ అనే అర్థాలు కూడ ఉన్నాయి.

పాపకుత్సేషదర్థే కు ధిఙ్ నిర్భర్త్సన నిందయోః ।
చాన్వాచయసమాహారేతరేతరసముచ్చయే ॥2॥

కు=పాపం, కుత్స, కొంచెం అనే అర్థం, ధిక్= అసహ్యించుకొనుట, నింద, చకారం సముచ్చయం, సమాహారం, అన్వాచయం, ఇతరేతరయోగములందు ప్రయోగింపబడును.

స్వస్త్యాశీః క్షేమపుణ్యాదౌ ప్రకర్షే లంఘనేప్యతి ।
స్విత్ప్రశ్నే చ వితర్కే చ తు స్యాద్భేదేఽవధారణే ॥3॥

స్వస్తి=ఆశీర్వాదము, క్షేమము, పుణ్యం ఇత్యాదులు, అతి=ప్రకర్ష (ఆధిక్యం), లంఘించుట, స్విత్=ప్రశ్న, వితర్కము, తు=భేదం, అవధారణం (నిశ్చయం),

సకృత్సహైకవారే స్యాదారాద్దూరసమీపయోః ।
ప్రతీచ్యాం చరమే పశ్చాదుతాప్యర్థవికల్పయోః ॥4॥

సకృత్=కలిపి, ఒకసారి, ఆరాత్=దూరం, సమీపం, పశ్చాత్, పడమట దిక్కు, వెనుకటిది, ఉత='అపి' అనేదాని అర్థాన్ని, వికల్పార్థాన్ని సూచిస్తుంది.

పునః సదార్థయోః శశ్వత్సాక్షాత్ప్రత్యక్షతుల్యయోః ।
ఖేదానుకంపాసంతోషవిస్మయామంత్రణే బత ॥5॥

పునః, సదా అనే పదాలకు ఉన్న అర్థాన్ని "శశ్వత్" అనే పదం సూచిస్తుంది. సాక్షాత్=ప్రత్యక్షం, తుల్యం, బత=ఖేదం, అనుకంప (దయ), సంతోషం, విస్మయం, ఆమంత్రణం (సంబోధన) అనే అర్థాలను సూచిస్తుంది.

హన్త హర్షేఽనుకంపాయాం వాక్యారంభ విషాదయోః ।
ప్రతి ప్రతినిధౌ వీప్సాలక్షణాదౌ ప్రయోగతః ॥6॥

హంత=హర్షం, అనుకంప, వాక్యారంభం, విషాదం, అనే అర్థాలను సూచిస్తుంది. ప్రతి= ప్రతినిధి, వీప్స, లక్షణం మున్నగు వాటిని ప్రయోగానుసారంగా సూచిస్తుంది.

ఇతి హేతౌ ప్రకరణే ప్రకాశాదిసమాప్తిషు ।
ప్రాచ్యాం పురస్తాత్ప్రథమే పురార్థేఽగ్రత ఇత్యపి ॥7॥

ఇతి=హేతువు, ప్రకరణం, ప్రకాశాదికం, సమాప్తి, పురస్తాత్=పూర్వదిక్కు, ప్రథమం, పూర్వం, అగ్రతః అనే అర్థాన్ని కూడ సూచిస్తుంది.

యావత్తావచ్చ సాకల్యేఽవధౌ మానేఽవధారణే ।
మంగళానంతరారంభ ప్రశ్న కార్త్స్న్యేష్వథో అథ ॥8॥

యావత్, తావత్ అనే పదాలు సాకల్యం సమగ్రం, అవధి, మానం, అవధారణం అనే అర్థాలను చెబుతుంది అథో, అథ శబ్దాలు మంగళం, అనంతరం, ఆరంభం, ప్రశ్న, సమగ్రత అనే అర్థాలను సూచిస్తాయి.

వృథా నిరర్థకా విధ్యోర్నానాఽనేకోభయార్థయోః ।
ను పృచ్ఛాయాం వికల్పే చ పశ్చాత్సాదృశ్యయోరను ॥9॥

వృథా=నిరర్థకం, యథావిధిగలేనిది, నానా=అనేకం, ఉభయం, ను= ప్రశ్న, వికల్పం, అను=వెనుక, సాదృశ్యం.

ప్రశ్నావధారణానుజ్ఞానునయామంత్రణే నను ।
గర్హాసముచ్చయప్రశ్నశంకాసంభావనాస్వపి ॥10॥

నను=ప్రశ్న, అవధారణం, అనుజ్ఞ, అనునయం, ఆమంత్రణం, అపి=గర్హ, సముచ్చయం, ప్రశ్న, శంక, సంభావన, గర్హ (నింద), అనే అర్థాలను ఇస్తుంది.

ఉపమాయాం వికల్పేవా సామి త్వర్థే జుగుప్సితే ।
అమా సహ సమీపే చ కం వారిణి చ మూర్ధని ॥11॥

వా=ఉపమ, వికల్పం, సామి=సగము, జుగుప్సితం, అమా=కూడ, సమీపం, కం=నీరు, శిరస్సు,

ఇవేత్థమర్థయోరేవం నూనం తర్కేఽర్థనిశ్చయే ।
తూష్ణీమర్థే సుఖే జోషం కిం పృచ్ఛాయాం జుగుప్సనే ॥12॥

'ఏవం' అనేది ఇవ, ఇత్థం అనే పదాల అర్థాన్ని (ఇలా) సూచిస్తుంది. నూనం=తర్కము, అర్థనిశ్చయము, జోషం=తూష్ణీం అనే పదం యొక్క అర్థం (మౌనంగా ఉండుట) సుఖం, కిం=ప్రశ్న, నింద,

నామ ప్రాకాశ్యసంభావ్యక్రోధోపగమకుత్సనే ।
అలం భూషణ పర్యాప్తి శక్తి వారణవాచకమ్ ॥13॥

నామ=ప్రాకాశ్యం, సంభావ్యం, క్రోధం, స్వీకారం, నింద అనే అర్థాలను ఇస్తుంది. అలం=భూషణం, పర్యాప్తి, సామర్థ్యం, వారణం అనే వాటికి వాచకం.

హుం వితర్కే పరిప్రశ్నే సమయాన్తిక మధ్యయోః ।
పునరప్రథమే భేదే నిర్నిశ్చయ నిషేధయోః ॥14॥

హుం=వితర్కం, పరిప్రశ్న, సమయా=సమీపం, మధ్యలో, పునః=మొదటిది కానిది, భేదం, నిః=నిశ్చయము, నిషేధము.

స్యాత్ప్రబంధే చిరాతీతే నికటాగామికే పురా ।
ఉరర్యురీ చోరరీ చ విస్తారేంగీకృతౌ త్రయమ్ ॥15॥

పురాశబ్దం బహుకాలానికి పూర్వమునందు, సమీపభవిష్యత్తునందు, ప్రబంధ శబ్ద వాచకమునందు వర్తిస్తుంది. ఉరరి, ఉరీ, ఉరరీ ఈ మూడు అవ్యయాలు విస్తారార్థాన్ని, అంగీకారార్థాన్ని సూచిస్తాయి.

స్వర్గే పరే చ లోకే స్వర్వార్తాసంభావయోః కిల ।
నిషేధవాక్యాలంకారే జిజ్ఞాసావసరే ఖలు ॥16॥

'స్వర్' అనే అవ్యయం స్వర్గలోక, పరలోక వాచకం, కిల=వార్త, సంభావన, ఖలు=నిషేధం, వాక్యాలంకారం, జిజ్ఞాసావసరం,

సమీపోభయతః శీఘ్రసాకల్యాభిముఖేఽభితః ।
నామప్రకాశయోః ప్రాదుర్మిథోన్యోన్యం రహస్యపి ॥17॥

అభితః=సమీపం, రెండు వైపుల, శీఘ్రం, సాకల్యం, అభిముఖం, "ప్రాదుః" అనే అవ్యయం వ్యక్తా వ్యక్తముల ప్రకాశమునందు, నామమునందు వర్తిస్తుంది. మిథః=అన్యోన్యం, రహస్యం.

తిరోఽం తర్ధౌ తిర్యగర్థే హా విషాదశుగార్తిషు ।
అహహేత్యద్భుతే ఖేదే హి హేతావవధారణే ॥18॥

తిరస్=అంతర్ధానము, అడ్డము అనే అర్థాలను ఇస్తుంది. హా=విషాదం, శోకం, ఆర్తి, అహహ, అహహా=అద్భుతం, ఖేదం, హి=హేతువు, అవధారణం,

చిరాయ చిరరాత్రాయ చిరస్యాద్యాశ్చిరార్థకాః ।
ముహుః పునః పునః శశ్వదభీక్ష్ణమసకృత్సమాః ॥19॥

చిరాయ, చిరరాత్రాయ, చిరస్య మున్నగునవి చిరార్థకాలు. ముహుః, పునఃపునః శశ్వత్, అభీక్ష్ణం, అసకృత్=మాటిమాటికి అనే అర్థాన్ని సూచిస్తాయి.

స్రాజ్ఝటిత్యంజసాహ్నాయ సపది ద్రాఙ్మంక్షుచద్రుతే ।
బలవత్సుష్ఠు కిముత వికల్పే కిం కిమూత చ ॥20॥

స్రాక్, ఝటితి, అంజసా, అహ్నాయ, సపది, ద్రాక్, మంక్షు - ఇవన్నీ శీఘ్రవాచక శబ్దాలు. బలవత్, సుష్ఠుశబ్దాలు అతిశయ శోభన వాచకాలు. కిముత=వికల్పం, కిం, కిమూత శబ్దాలు కూడ వికల్పవాచకాలు.

తు హి చ స్మ హ వై పాదపూరణే పూజనేఽప్యతి ।
దివాహ్నీత్యథ దోషా చ నక్తం చ రజనావితి ॥21॥

తు, హి, చ, స్మ, హ, వై - అనేవి పాదపూర్తికై ఉపయోగించబడును. పూజనార్థంలో 'అతి' శబ్దం ప్రయోగింపబడుతుంది. దివాశబ్దం 'పగలు' ను సూచిస్తుంది. దోషా, నక్తం, రజనీ శబ్దాలు రాత్రిని సూచిస్తాయి.

తిర్యగర్థే సాచి తిరోఽప్యథ సంబోధనార్థకాః ।
స్యుఃప్యాట్ పాడఙ్గ హే హై భోః సమయా నికషా హిరుక్ ॥22॥

సాచి, తిరస్=అడ్డముగా అని అర్థం, ప్యాట్, పాట్, అఙ్గ, హే, హై, భోః, ఈ శబ్దాలు సంబోధనార్థకాలు. సమయా, నికషా, హిరుక్, సమీపవాచకాలు.

అతర్కితే తు సహసా స్యాత్పురః పురతోఽగ్రతః ।
స్వాహా దేవహవిర్దానే శ్రౌషడ్ వౌషడ్ వషట్ స్వధా ॥23॥

సహసా=అతర్కితే (ఏ ఆలోచన లేకుండా వెంటనే అని అర్థం). పురః పురతః, అగ్రతః=ఎదుట, దేవతలకు హవిస్సులను ఇచ్చినపుడు స్వాహా శబ్దాన్ని ప్రయోగించాలి. శ్రౌషట్, వౌషట్, వషట్, స్వధా శబ్దాలను ఇంద్రాది దేవలతలను, పితృదేవతలనూ ఉద్దేశించి ప్రయోగించాలి.

కించిదీషన్మనాగల్పే ప్రేత్యాముత్ర భవాన్తరే ।
యథా తథా చైవ సామ్యే అహెూ హెూ ఇతి విస్మయే ॥24॥

కించిత్, ఈషత్, మనాక్, అల్పం=కొంచెం, ప్రేత్య, అముత్ర, భవాన్తరే=జన్మాంతరమునందు, యథా, తథా,=సామ్యం, అహెూ, హెూ=ఆశ్చర్యం,

మౌనే తు తూష్ణీం తూష్ణీకం సద్యః సపది తత్క్షణే ।
దిష్ట్యా సముపజోషం చేత్యానందేఽథాన్తరేఽన్తరా ॥25॥

అంతరేణ చ మధ్యే స్యుః ప్రసహ్య తు హఠార్థకమ్ ।
యుక్తే ద్వే సాంప్రతం స్థానేఽభీక్ష్ణం శశ్వదనారతే ॥26॥

తూష్ణీం, తూష్ణీకం=మౌనము, సద్యః, సపది, తత్క్షణమ్=వెంటనే, దిష్ట్యా, సముపజోషం అనే శబ్దాలు ఆనంద సూచకాలు, అంతరా, అంతరే, అంతరేణ, అనేవి మధ్యయందు అనే అర్థాన్ని సూచించేవి. ప్రసహ్య=హఠాత్తుగా, సాంప్రతం, స్థానం అనే శబ్దాలు యుక్తం అనే అర్థంలోను, అభీక్ష్ణు, శశ్వత్, అనారత శబ్దాలు నిరంతరం అనే అర్థంలోను ప్రయుక్తాలు.

అభావే నహ్యనో నాపి మా స్మ మాఽలం చ వారణే ।
పక్షాంతరే చేద్యది చ తత్త్వే త్వద్ధాఽఞ్జసా ద్వయమ్ ॥27॥

న హి, అ, నో, న – ఈ శబ్దాలు అభావవాచకాలు. మాస్మ, మా, అలం – ఈ శబ్దాలు నిషేధ వాచకాలు. చేత్, యది శబ్దాలు పక్షాంతర పదవాక్య ప్రయోగ సూచితాలు. అద్ధా, అంజసా పదాలు వాస్తవార్థ బోధకాలు.

ప్రాకాశ్యే ప్రాదురావిః స్యాదోమేవం పరమం మతే ।
సమంతతస్తు పరితః సర్వతో విష్వగిత్యపి ॥28॥

ప్రాదుః, ఆవిః అనే పదాలు ప్రకటం కావడం అనే అర్థంలోను, ఓం, ఏవం, పరమమ్ – అనే పదాలు స్వీకృతి, అనుమతి, అంగీకారం, అనే అర్థంలోను, సమంతతః, పరితః, సర్వతః, విష్వక్ అనే పదాలు నాలుగు ప్రక్కల అనే అర్థంలోను ప్రయోగింపబడతాయి.

అకామానుమతౌ కామమసూయోపగమేఽస్తు చ ।
నను చ స్యాద్విరోధోక్తౌ కచ్చిత్కామప్రవేదనే ॥29॥

కామమ్=ఇష్టం లేని అనుమతిని సూచిస్తుంది. అస్తు=కోపంతో, కూడిన అనుమతిని సూచిస్తుంది. నను=విరోధోక్తిని సూచిస్తుంది. కచ్చిత్=కోరికను తెలుపుటను సూచిస్తుంది.

నిఃసమం దుఃషమం గర్హ్యేయథాస్వం తు యథాయథమ్ ।
మృషా మిథ్యా చ వితథే యథార్థం తు యథాతథమ్ ॥30॥

నిఃసమ, దుఃషమ శబ్దాలు రెండు నింద్యార్థాన్ని సూచిస్తాయి. యథాస్వం, యథాయథం, యథాయోగ్య శబ్దావాచకాలు. మృషా, మిథ్యాశబ్దాలు అసత్యశబ్దార్థవాచకాలు. యథార్థం, యథాతథం, సత్యం తెలిపే పదాలు.

స్యురేవం తు పునర్వైవేత్యవధారణవాచకాః ।
ప్రాగతీతార్థకం నూనమవశ్యం నిశ్చయే ద్వయమ్ ॥31॥

ఏవం, తు, పునః, వై, వా = ఇవి నిశ్చయార్థ వాచకాలు. ప్రాక్ = గడచి పోయినదనే అర్థం, నూనం, అవశ్యం=నిశ్చయం,

సంవద్వర్షేఽవరేత్వర్వానామేవం స్వయమాత్మనా ।
అల్పే నీచైర్మహత్యుచ్చైః ప్రాయో భూమ్న్యద్రుతే శనైః ॥32॥

సంవత్=సంవత్సరము, అర్వాక్=వెనుకటి కాలం, ఆం, ఏవం=అట్లే, స్వయం=తానుగా, నీచైః=అల్పం, ఉచ్చైః=అధికం, ప్రాయః=తరచుగా, శనైః=మందముగా,

సనా నిత్యే బహిర్బాహ్యే స్మాతీతేఽస్తమదర్శనే ।
అస్తి సత్త్వే రుషోక్తావూముం ప్రశ్నేఽనునయే త్వయి ॥33॥

సనా=నిత్యం, బహిః, బాహ్యం (వెలుపల), స్మ=భూతకాలార్థము, అస్తమ్=అదృశ్యం, అస్తి=సత్త్వం (ఉన్నది) ఊః=రుషోక్తి, ఉం=ప్రశ్న, అయి=అనునయం, ప్రశ్నయందు కూడ,

హూం తర్కే స్యాదుషా రాత్రేరవసానే నమోనతౌ ।
పునరర్థేஉఙ్గనిందాయాం దుష్ఠు సుష్ఠు ప్రశంసనే ॥34॥

హూం (హుం)=తర్కం, ఉషా=రాత్రియొక్క అవసాన సమయం (ప్రాతఃకాలం), నమస్=నమస్కారం, అంగ=పునరర్థకం (మరల), దుష్ఠు=నింద, సుష్ఠు=ప్రశంస,

సాయం సాయే ప్రగే ప్రాతః ప్రభాతే నికషాஉన్తికే ।
పరుత్పరార్యైషమోஉబ్దే పూర్వే పూర్వతరేషయతి ॥35॥

సాయం=సంధ్యా (సాయంకాల) వాచకం, ప్రగే=ప్రాతఃకాల వాచకం, నికషా= అన్తికం (సమీపం) ఐషమః=గడుచుచున్న సంవత్సరం, పరుత్=నిరుడు ఏడు, పరారి=ముందటి ఏడు,

అద్యాత్రాహన్యథ పూర్వేஉ హ్నీత్యాదౌ పూర్వోత్తరాపరాత్ ।
తథాஉధరాన్యాన్యతరేతరాత్ పూర్వేద్యురాదయః ॥36॥

అద్య=అత్ర=నేడు, పూర్వ, ఉత్తర, అధర, అపర, అన్య, అన్యతర, ఇతర శబ్దములకును పూర్వే అహ్ని అనే అర్థమునందు "పూర్వేద్యుః" ఇత్యాది పదములు నిష్పన్నములవుతాయి.

ఉభయద్యుశ్చోభయేద్యుః పరే త్వహ్ని పరేద్యవి ।
హ్యో గతేஉనాగతేஉహ్ని శ్వః పరశ్వః శ్వః పరేஉహని ॥37॥

ఉభయద్యుః, ఉభయేద్యుః=రెండు దినములందును, పరేత్వహ్ని, పరేద్యవి=మరుసటి రోజున, హ్యః=నిన్న, (గడచిపోయిన రోజు), శ్వః=రేపు (రాబోయేరోజు), పరశ్వః=ఎల్లుండి (దానికి రాబోయే రోజు),

తదా తదానీం యుగపదేకదా సర్వదా సదా ।
ఏతర్హి సంప్రతీదానీమధునా సాంప్రతం తథా ॥38॥

తదా, తదానీం=అప్పుడు, యుగపత్, ఏకదా=ఒక్క మాటుగా, సర్వదా, సదా=ఎల్లప్పుడు, ఏతర్హి, సంప్రతి, ఇదానీం, అధునా, సాంప్రతం=ఇప్పుడు.

ఇత్యాది మహాపురాణే ఆగ్నేయే అవ్యయవర్గకథనం నామైకషష్ట్యధిక త్రిశతతమోஉధ్యాయః ॥361॥

అగ్నిమహాపురాణంలో అవ్యయవర్గకథనం అనే మూడువందల అరవైఒకటవ అధ్యాయం సమాప్తం.



ద్విషష్ట్యధిక త్రిశతతమోఽధ్యాయః - మూడువందల అరవైరెండవ అధ్యాయం

నానార్థవర్గాః - నానార్థవర్గములు

అగ్నిరువాచ - అగ్ని ఇలా వచించాడు.

ఆకాశే త్రిదివే నాకో లోకస్తు భువనే జనే ।
పద్యే యశసి చ శ్లోకః శరే ఖడ్గే చ సాయకః ॥1॥

నాకః=ఆకాశము, త్రిదివము (స్వర్గము), లోకః=భువనం, జనులు, శ్లోకః=పద్యం, కీర్తి, సాయకః=శరము, ఖడ్గము.

ఆనకః పటహో భేరీ కలంకోఽంకాపవాదయోః ।
మారుతే వేధసి బ్రధ్నే పుంసికః కం శిరోఽంబునోః ॥2॥

ఆనకః= పటహము, భేరి, కలంకః=మచ్చ, అపవాదము, కః (పుంలింగం)=వాయువు, బ్రహ్మ, సూర్యుడు, కం (నపుంసకలింగం)=శిరస్సు, జలము,

స్యాత్పులాకస్తుచ్ఛధాన్యే సంక్షేపే భక్తిసిక్థకే ।
మహేంద్ర గుగ్గులూలూక వ్యాలగ్రాహిషు కౌశికః ॥3॥

పులాకః=తుచ్ఛధాన్యం, సంక్షేపం, అన్నపు మెతుకు, కౌశికః=మహేంద్రుడు, గుగ్గులు, గుడ్లగూబ, పాముల వాడు,

శాలావృకౌ కపిశ్వానౌ మానం స్యాన్మితిసాధనమ్ ।
సర్గః స్వభావనిర్మోక్షనిశ్చయాధ్యాయసృష్టిషు ॥4॥

శాలావృకః=వానరము, కుక్క, మానం=కొలిచే సాధనం, మానః=(పుం)=చిత్తసమున్నతి, సర్గః=స్వభావము, నిర్మోక్షము, నిశ్చయము, అధ్యాయము, సృష్టి,

యోగః సన్నహనోపాయధ్యానసంగతియుక్తిషు ।
భోగః సుఖే స్త్ర్యాదిభృతావబ్జౌ శంఖనిశాకరౌ ॥5॥

యోగః=కట్టుట, ఉపాయము, ధ్యానము, సంగతి, యుక్తిః, భోగః=సుఖము, వేశ్యాస్త్రీలకు మున్నగువారికి ఇచ్చే భృతి, అబ్జము=శంఖము, చంద్రుడు.

కాకే భగండౌ కరటౌ దుశ్చర్మా శిపివిష్టకః ।
రిష్టం క్షేమాశుభాభావేష్వరిష్టే తు శుభాఽశుభే ॥6॥

కరటః=కాకి, ఏనుగు గండస్థలము, శిపివిష్టకః= దుష్టమైన చర్మం కలవాడు, రిష్టం=క్షేమం, అశుభం, అభావం, అరిష్టం= శుభం, అశుభం,

వృష్టిః కాలే సమృద్ధౌ చ దృష్టిర్జ్ఞానేఽక్ష్ణి దర్శనే ।
నిష్ఠానిష్పత్తినాశాంతాః కాష్ఠోత్కర్షే స్థితౌ దిశి ॥7॥

వృష్టిః=ప్రభాతము, సమృద్ధి, దృష్టిః=జ్ఞానము, నేత్రము, దర్శనము, నిష్ఠా=నిష్పత్తి, నాశము, అంతము, కాష్ఠా=ఉత్కర్షము, స్థితి, దిక్కు,

భూగోవాచస్త్విడా ఇలాః ప్రగాఢం భృశకృచ్ఛ్రయోః ।
భృశప్రతిజ్ఞయోర్బాఢం శక్తస్థూలౌ దృఢౌ త్రిషు ॥8॥

ఇలా ఇడా=భూమి, గోవు, ప్రగాఢం=అత్యంతం, కఠినం, బాఢం=మిక్కిలి, ప్రతిజ్ఞ, దృఢః=సమర్థుడు, స్థూలమైనది. ఈ శబ్దం మూడు లింగాలలోను ఉంటుంది.

విన్యస్తసంహతౌ వ్యూఢౌ కృష్ణో వ్యాసేఽర్జునే హరౌ ।
పణో ద్యూతాదిషూత్సృష్టే భృతౌ మూల్యే ధనేఽపి చ ॥9॥

వ్యూఢః=ఏర్పరుపబడినది, కలిసియున్నది, కృష్ణః=వ్యాసుడు, అర్జునుడు, హరి. పణః= జూదం మున్నగు వాటియందు పందెము, భృతి, మూల్యము, ధనము.

మౌర్వ్యాం ద్రవ్యాశ్రితే సత్త్వశుక్లసంధ్యాదికే గుణః ।
శ్రేష్ఠేఽధిపే గ్రామణీః స్యాజ్జుగుప్సాకరుణే ఘృణే ॥10॥

గుణః=నారి (వింటిత్రాడు), ద్రవ్యాశ్రయం, సత్త్వాదులు, శుక్లాదులు, సంధి మున్నగునవి. గ్రామణీః=శ్రేష్ఠుడు, గ్రామాధిపతి, ఘృణా=జుగుప్సా, కరుణా.

తృషా స్పృహా పిపాసే ద్వే విపణిః స్యాద్వణిక్పథే ।
విషాభిమరలోహేషు తీక్ష్ణం క్లీబే ఖరే త్రిషు ॥11॥

తృషా=ఆసక్తి, దాహం, విపణిః=వర్తకుల వీధి, తీక్ష్ణం=విషము, యుద్ధము, లోహం, తీక్ష్ణమైనది అను అర్థాలలో నపుంసకలింగం. ఇది ప్రఖరం, ప్రచండం అను అర్థాలలో మూడు లింగాలలోను ఉంటుంది.

ప్రమాణం హేతుమర్యాదా శాస్త్రేయత్తాప్రమాతృషు ।
కరణం క్షేత్రగాత్రాదావీరిణం శూన్యమూషరమ్ ॥12॥

ప్రమాణం=హేతువు, మర్యాద, శాస్త్రము, ఇయత్తా, ప్రామాణిక పురుషుడు, కరణం=క్షేత్రం, గాత్రం (శరీరము) మున్నగునవి, ఈరిణం= శూన్యం, ఊషరక్షేత్రం,

యన్తా హస్తిపకే సూతే వహ్నిజ్వాలా చ హేతయః ।
శ్రుతం శాస్త్రావభృతయోర్యుగపర్యాప్తయోః కృతమ్ ॥13॥

యన్తా=మావటివాడు, సారథి. హేతి=అగ్నిజ్వాల. శ్రుతం=శాస్త్రనిర్ణయం, శాస్త్రం, కృత్తం=కృతాది యుగాలు, పర్యాప్తము.

ఖ్యాతే హృష్టే ప్రతీతోఽభిజాతస్తు కులజే బుధే ।
వివిక్తౌ పూతవిజనౌ మూర్ఛితౌ మూఢసోచ్ఛ్రయౌ ॥14॥

ప్రతీత=శబ్దం ప్రసిద్ధ సంతుష్టఅర్థాలుకలది. అభిజాతః=సత్కులీనుడు, పండితుడు, వివిక్తం= పవిత్రమైనది, ఏకాంతప్రదేశం, మూర్ఛితః=మూర్ఛపొందినవాడు, అంతటా వ్యాపించినది.

అర్థోఽభిధేయరైవస్తు ప్రయోజననివృత్తిషు ।
నిదా నాగమయోఽస్తీర్థమృషిజుష్టజలే గురౌ ॥15॥

అర్థః=అభిధేయము, ధనము, వస్తువు, ప్రయోజనము, నివృత్తి, తీర్థం=మూలకారణం, ఆగమం, మహర్షులు సేవించిన జలం, గురువు.

ప్రాధాన్యే రాజలింగే చ వృషాంగే కకుదోఽస్త్రియామ్ ।
స్త్రీ సంవిజ్జ్ఞాన సంభాషాక్రియాకారాజినామసు ॥16॥

కకుద్=ప్రాధాన్యము, రాజచిహ్నము, ఎద్దు మూపురము, ఈ శబ్దం స్త్రీలింగంలో తప్ప మిగిలిన లింగాలలో ఉంటుంది. 'సంవిద్' శబ్దం స్త్రీలింగం. దానికి జ్ఞానం, సంభాషణం, క్రియా నియమం, యుద్ధం, నామం అనే అర్థాలు ఉన్నాయి.

ధర్మే రహస్యుపనిషత్ స్యాదృతౌ వత్సరే శరత్ ।
పదం వ్యవసితిత్రాణస్థానలక్ష్మాంఘ్రివస్తుషు ॥17॥

ఉపనిషత్= ధర్మము, రహస్యము, శరత్=శరదృతువు, సంవత్సరము, పదం=నిశ్చయము, రక్షణము, స్థానము, చిహ్నము, పాదము, వస్తువు,

త్రిష్విష్టమధురౌ స్వాదూ మృదూ చాతీక్ష్ణకోమలౌ ।
సత్యే సాధౌ విద్యమానే ప్రశస్తేఽభ్యర్హితే చ సత్ ॥18॥

స్వాదు=ఇష్టము, మధురము, మృదు=తీక్ష్ణ కానిది, కోమలము, స్వాదు, మృదు శబ్దాలు మూడు లింగాల లోను ఉంటాయి. సత్=సత్యము, సాధువు, ఉన్నది, ప్రశస్తము, పూజ్యము,

విధిర్విధానే దైవేఽపి ప్రణిధిః ప్రార్థనే చరే ।
వధూర్జాయా స్నుషా స్త్రీ చ సుధాలేపోఽమృతం స్నుహీ ॥19॥

విధిః=విధానము, దైవము, ప్రణిధిః=ప్రార్థనము, గూఢచారి. వధూః=భార్య, కోడలు, స్త్రీ, సుధా=సున్నము, అమృతము, స్నుహి (జెముడు) వృక్ష వాచకము.

స్పృహా సంప్రత్యయః శ్రద్ధా పండితమ్మన్యగర్వితౌ ।
బ్రహ్మబంధురధిక్షేపే భానూ రశ్మిదివాకరౌ ॥20॥

శ్రద్ధా=ఆసక్తి, విశ్వాసము, పండితమ్మన్య, గర్విత, బ్రహ్మబంధు శబ్దాలు నిందావాచకాలు. భానుః=సూర్యుడు, కిరణము.

గ్రావాణౌ శైలపాషాణౌ మూర్ఖనీచౌ పృథగ్జనౌ ।
తరుశైలౌ శిఖరిణౌ తనుస్త్వగ్దేహయోరపి ॥21॥

గ్రావా (గ్రావన్ శబ్దం)= పర్వతము, శిల, పృథగ్జనః=మూర్ఖుడు, నీచుడు, శిఖరీ= వృక్షము, శైలము, తనుః= చర్మము, దేహము.

ఆత్మా యత్నో ధృతిర్బుద్ధిః స్వభావో బ్రహ్మవర్ష్మ చ ।
ఉత్థానం పౌరుషే తంత్రే వ్యుత్థానం ప్రతిరోధనే ॥22॥

ఆత్మా=యత్నము, ధృతి, బుద్ధి, స్వభావము, బ్రహ్మ, శరీరము, ఉత్థానము=పౌరుషము, తంత్రము, వ్యుత్థానం= ఎదిరించుట,

నిర్యాతనం వైరశుద్ధౌ దానే న్యాసార్పణేఽపి చ ।
వ్యసనం విపది భ్రంశే దోషే కామజకోపజే ॥23॥

నిర్యాతనం=వైరము తీర్చుకొనుట, దానము న్యాసముతిరిగి ఇచ్చుట, వ్యసనం=ఆపద, క్రింద పడుట, కామక్రోధముల వల్ల కలిగే దోషము.

మృగయాఽక్షో దివాస్వప్నః పరివాదః స్త్రియో మదః ।
తౌర్యత్రికం వృథాట్యా చ కామజో దశకో గణః ॥24॥

మృగయా=వేట, జూదము, పగటినిద్ర, ఇతరులను నిందించుట, స్త్రీరక్తి (సక్తి), మద్యపానం, నాట్యం, గానం, వాద్యం, వ్యర్థముగా తిరుగుట - ఇవి కామం వల్ల కలిగే పది వ్యసనాలు.

పైశున్యం సాహసం ద్రోహ ఈర్ష్యాసూయార్థదూషణమ్ ।
వాగ్దండశ్చైవ పారుష్యం క్రోధజోఽపి గణోఽష్టకః ॥25॥

చాడీలు చెప్పుట, సాహసం, ద్రోహము, ఈర్ష్య, అసూయ, అర్థదూషణము, పరుషదండము, పరుషవాక్కు- ఇవి క్రోధం వల్ల కలిగే ఎనిమిది వ్యసనములు.

అకర్మగుహ్యే కౌపీనం మైథునం సంగతౌ రతౌ ।
ప్రధానం పరమార్థా ధీః ప్రజ్ఞానం బుద్ధిచిహ్నయోః ॥26॥

కౌపీనం=చెడ్డపని, గుహ్యావయవం, మైథునం=సంగతి, రతి, ప్రధానం=పరమార్థ బుద్ధి, ప్రజ్ఞానం=బుద్ధి, చిహ్నము,

క్రందనే రోదనాహ్వానే వర్ష్మ దేహ ప్రమాణయోః ।
ఆరాధనం సాధనే స్యాదవాప్తౌ తోషణేఽపి చ ॥27॥

క్రందనం=ఏడ్పు, పిలుచుట, వర్ష్మ=దేహము, ప్రమాణము, ఆరాధనం=సాధనము, ప్రాప్తి, సంతోషపెట్టుట,

రత్నం స్వజాతిశ్రేష్ఠేఽపి లక్ష్మచిహ్నప్రధానయోః ।
కలాపో భూషణే బర్హే తూణీరౌ సంహతేఽపి చ ॥28॥

రత్నం=స్వజాతి శ్రేష్ఠము, లక్ష్మ=చిహ్నము, ప్రధానము, కలాపః=భూషణము, నెమలి పింఛము, అంబులపొది, సంఘటితము.

తల్పం శయ్యాట్టదారేషు డింభౌ తు శిశుబాలిశౌ ।
స్తంభౌ స్థూణా జడీభావౌ సభ్యే సంసది వై సభా ॥29॥

తల్పం =శయ్య, అట్టాలిక, భార్య, డింభః=శిశువు, మూర్ఖుడు, స్తంభః=స్తంభము, కొయ్యబారుట, సభా=సభ్యులు, సదస్సు.

కిరణప్రగ్రహౌ రశ్మీ ధర్మాః పుణ్యయమాదయః ।
లలామం పుచ్ఛపుండ్రాశ్వ భూషాప్రాధాన్యకేతుషు ॥30॥

రశ్మిః=కిరణము, కళ్లెము, ధర్మః=పుణ్యము, యముడు మున్నగునవి. లలామం=పుచ్ఛం, పుండ్రం, అశ్వము, అలంకారము, ప్రాధాన్యము, ధ్వజము,

ప్రత్యయోఽధీన శపథ జ్ఞానవిశ్వాసహేతుషు ।
సమయో శపథాచార కాలసిద్ధాంత సంవిదః ॥31॥

ప్రత్యయః=అధీనము, శపథము, జ్ఞానము, విశ్వాసము, హేతువు, సమయః=శపథము, ఆచారము, కాలము, సిద్ధాంతము, ఒడబాటు,

అత్యయోఽతిక్రమే కృచ్ఛ్రే సత్యం శపథ తథ్యయోః ।
వీర్యం బలప్రభావౌ చ రూప్యం రూపే ప్రశస్తకే ॥32॥

అత్యయః=అతిక్రమణము (ఉల్లంఘనము), కాఠిన్యము, సత్యం=శపథము, తథ్యము, వీర్యం=బలము, ప్రభావము, రూప్యం=రూపము, ప్రశస్తము.

దురోదరో ద్యూతకారే పణే ద్యూతే దురోదరమ్ ।
మహారణ్యే దుర్గపథే కాంతారః పున్నపుంసకమ్ ॥33॥

దురోదరః (పుం)=జూదరి, (న) పందెము, జూదము, దురోదరం (న), కాంతారః=మహారణ్యం, దుర్గమార్గము (పుంలింగనపుంసక లింగములలో ఉంటుంది).

యమానిలేంద్ర చంద్రార్కవిష్ణు సింహాదికే హరిః ।
దరోఽస్త్రియాం భయే శ్వభ్రే జఠరః కఠినేఽపి చ ॥34॥

హరిః=యముడు, వాయువు, ఇంద్రుడు, చంద్రుడు, సూర్యుడు, విష్ణువు, సింహం మున్నగునవి, దరః(పుం,న)=భయము, గొయ్యి, జఠరః=ఉదరం, కఠినం.

ఉదారో దాతృమహతోరితరస్త్వన్యనీచయోః ।
చూడాకిరీటం కేశాశ్చ సంయతా మౌలయస్త్రయః ।।35।।

ఉదారః=దాత, మహాపురుషుడు, ఇతరః=అన్యుడు, నీచుడు, మౌలిః=శిఖ, కిరీటము, ముడివేసిన జుట్టు,

బలిః కరోపహారాదౌ సైన్యస్థైర్యాదికే బలమ్ ।
స్త్రీకటీవస్త్రబంధోఽపి నీవీ పరిపణేఽపి చ ।।36।।

బలిః=పన్ను, ఉపహారము, బలమ్=సైన్యము, స్థైర్యము ము।। నీవీ=స్త్రీకటివస్త్రబంధము, పరిపణం=మూలధనం,

శుకలే మూషికే శ్రేష్ఠే సుకృతే వృషభే వృషః ।
ద్యూతాక్షే సారిఫలకేఽప్యాకర్షోఽథాక్షమింద్రియే ।।37।।

నాద్యూతాంగే చ కర్షే చ వ్యవహారే కలిద్రుమే ।
ఉష్ణీషః స్యాత్కిరీటాదౌ కర్షూః కుల్యాభిధాయినీ ।।38।।

వృషః=శుకలః (అధికవీర్యవంతుడు), ఎలుక, శ్రేష్ఠము, పుణ్యము, వృషభము, ఆకర్షః=జూదము నందు ఉపయోగించు పాచిక, సారిఫలకము, అక్షం=ఇంద్రియము. అక్షః=పాచిక, కర్షము, వ్యవహారము, కలిద్రుమము, ఉష్ణీషః=కిరీటము మున్నగునవి, కర్షూః=చిన్ననది (కాలువ వంటిది).

ప్రత్యక్షేఽధికృతేఽధ్యక్షః సూర్యవహ్నీ విభావసూ ।
శృంగారాదౌ విషే వీర్యే గుణే రాగే ద్రవే రసః ।।39।।

అధ్యక్షః=ప్రత్యక్షము, అధికారి, విభావసుః=సూర్యుడు, అగ్ని, రసః=శృంగారాది రసము, విషము, వీర్యము, గుణము, రాగము, ద్రవము.

తేజఃపురీషయోర్వర్చ ఆగఃపాపాపరాధయోః ।
ఛందః పద్యేఽభిలాషే చ సాధీయాన్సాధుబాధయోః ।।40।।

వర్చస్=తేజస్సు, పురీషము, ఆగః=పాపము, అపరాధము, ఛందస్=పద్యము, అభిలాష, సాధీయస్ = ఉత్తమము, నిశ్చితము,

వ్యూహోవృందేఽప్యహిర్వృత్రేఽప్యగ్నీందర్వ్కాస్తమోనుదః ।।41।।

వ్యూహః=సమూహము, అహిః=వృత్రాసురుడు, తమోనుదః=అగ్ని, చంద్రుడు, సూర్యుడు.

ఇత్యాదిమహాపురాణే ఆగ్నేయే నానార్థవర్గాః నామ ద్విషష్ట్యధిక త్రిశతతమోఽధ్యాయః ।।362।।

అగ్నిమహాపురాణంలో నానార్థవర్గములు అనే మూడువందల అరవైరెండవ అధ్యాయం సమాప్తం.

త్రిషష్ట్యధిక త్రిశతతమోஉధ్యాయః - మూడువందల అరవైమూడవ అధ్యాయం

భూమివనౌషధ్యాది వర్గాః - భూమి, వనం, ఓషధి, మున్నగు వర్గాలు

అగ్నిరువాచ - అగ్ని ఇలా వచించాడు.

వక్ష్యే భూపురాద్రివనౌషధిసింహాదివర్గకాన్ ।
భూరనన్తా క్షమా ధాత్రీ క్ష్మా జ్యా కుః స్యాద్ధరిత్ర్యపి ॥1॥

భూ, పుర, అద్రి, వన, ఓషధి, సింహాది వర్గాలను గురించి ఇక చెబుతాను. భూః, అనన్తా, క్షమా, ధాత్రీ, క్ష్మా, కుః, ధరిత్రీ=భూమి.

మృన్మృత్తికా ప్రశస్తా తు మృత్స్నా మృత్సా చ మృత్తికా ।
జగత్త్రివిష్టపం లోకం భువనం జగతీ సమా ॥2॥

మృత్, మృత్తికా=మట్టి, మృత్స్నా, ప్రశస్తమైనమట్టి, జగత్, త్రివిష్టపమ్, లోకమ్, భువనం, జగతీ- ఇవి సమానార్థక పదాలు.

అయనం వర్త్మ మార్గాధ్వపన్థానః పదవీ సృతిః ।
సరణిః పద్ధతిః పద్యా వర్తన్యేకపదీతి చ ॥3॥

అయనం, వర్త్మ, మార్గః, అధ్వా, పంథా (పథము), పదవీ, సృతిః, సరణిః, పద్ధతిః, పద్యా, వర్తనీ, ఏకపది - ఇవి మార్గవాచకాలు.

పూః స్త్రీ పురీనగర్యౌ వా పత్తనం పుటభేదనమ్ ।
స్థానీయం నిగమోஉన్యత్తు యన్మూలనగరాత్పురమ్ ॥4॥

పూః(స్త్రీలింగ పుర్ శబ్దం), పురీ, నగరీ, పత్తనం, పుటభేదనమ్, స్థానీయం, నిగమః, ఇవి నగరవాచకాలు.

తచ్ఛాఖా నగరం వేశో వేశ్యాజన సమాశ్రయః ।
ఆపణస్తు నిషద్యాయాం విపణిః పణ్యవీథికా ॥5॥

రాజధానికన్న భిన్నమైన నగరం శాఖా నగరము. వేశ్యాజనాశ్రయము వేశము, ఆపణః, నిషద్యా=దుకాణము, విపణిః=పణ్యవీథికా=అంగడి.

రథ్యా ప్రతోలీ విశిఖా స్యాచ్చయో వప్రమస్త్రియామ్ ।
ప్రాకారో వరణః శాలః ప్రాచీరం ప్రాంతతో వృతిః ॥6॥

రథ్యా, ప్రతోలీ, విశిఖా=నగరముఖ్య మార్గములు, వప్రం, చయః, ప్రాకారః, వరణః, శాలః, ప్రాచీరం=నగరం చుట్టూ ఉన్న ప్రాకారములు.

భిత్తిః స్త్రీకుడ్యమేడూకం యదన్తర్న్యస్తకీకసమ్ ।
వాసః కుటీద్వయోః శాలాసభా సంజవనం త్విదమ్ ॥7॥

చతుఃశాలం మునీనాం తు పర్ణశాలోటజోఽస్త్రియామ్ ।
చైత్యమాయతనం తుల్యే వాజిశాలా తు మందురా ॥8॥

భిత్తిః (స్త్రీ), కుడ్యమ్=గోడ, లోపల ఇనుప ఊసలు వేసిన కుడ్యానికి "ఏడూకం" అని పేరు. వాసః, కుటీ, కుటః=నివాసస్థానం, శాలా, సభా=శాల, నాలుగు శాలలు కల గృహం సంజవనం. మునుల నివాసానికి పర్ణశాలా, ఉటజం (పుం, న॥) అని పేరు. చైత్యం, ఆయతనం సమానార్థకాలు. మందురా=అశ్వశాల, ఆయతనం అనగా మందిరం అని అర్థం.

హర్మ్యాదిధనినాం వాసః ప్రాసాదో దేవ భూభుజామ్ ।
స్త్రీద్వార్ద్వారం ప్రతీహారః స్యాద్వితర్దిస్తు వేదికా ॥9॥

ధనికుల నివాసానికి హర్మ్యం మున్నగునవి పేర్లు. దేవతల, రాజుల నివాసానికి ప్రాసాదం అని పేరు. ద్వాః(స్త్రీ), ద్వారం, ప్రతీహారః=ద్వారము, వేదికా, వితర్ది=అరుగు.

కపోతపాలికాయాం తు విటంకం పుంనపుంసకమ్ ।
కవాటమరరం తుల్యే నిఃశ్రేణి స్త్వధిరోహిణీ ॥10॥

విటంక శబ్దం పుంలింగ నపుంసకలింగాలలో ఉంటుంది. పావురాల గూడు అని అర్థం. కవాటం, అరరం= తలుపు, నిఃశ్రేణిః, అధిరోహిణి=నిచ్చెన,

సమ్మార్జనీ శోధనీ స్యాత్సంకరోఽవకరస్తథా ।
అద్రి గోత్ర గిరి గ్రావా గహనం కాననం వనమ్ ॥11॥

సమ్మార్జనీ, శోధనీ=చీపురు, సంకరః, అవకరః=తుడిచిన తుక్కు, అద్రి, గోత్ర, గిరి, గ్రావా శబ్దాలు పర్వత వాచకాలు. గహనం, కాననం, వనమ్=అరణ్యము.

ఆరామః స్యాదుపవనం కృత్రిమం వనమేవ యత్ ।
స్యాదేతదేవ ప్రమదవనమన్తఃపురోచితమ్ ॥12॥

ఆరామః, ఉపవనమ్=కృత్రిమమైన ఉద్యానవనం, దీనికే అంతఃపురంలోని ఉద్యానమయితే ప్రమదవనమని పేరు.

వీథ్యాలిరావలిః పంక్తిశ్రేణీలేఖాస్తు రాజయః ।
వానస్పత్యః ఫలైఃపుష్పాత్తైరపుష్పాద్వనస్పతిః ॥13॥

వీథీ, ఆలిః, ఆవలిః పంక్తిః, శ్రేణీ, లేఖా, రాజిః=వరుస అని అర్థం. పూలు పూసి ఫలములు కాయు వృక్షం వానస్పత్యము. పూవులు లేకుండా కాయలు కాసేది వనస్పతి.

ఓషధ్యః ఫలపాకాన్తాః పలాశీ ద్రుద్రుమాగమాః ।
స్థాణుర్వా నా ధ్రువః శంకుః ప్రపుల్లోత్ఫుల్ల సంస్ఫుటాః ॥14॥

పండ్లు మ్రగ్గిన పిమ్మట ఎండి పోవు వాటిని ఓషధులు అంటారు. పలాశీ, ద్రు, ద్రుమ, ఆగమః=వృక్షము, స్థాణుః, ధ్రువః, శంకుః=మోడు వారిన చెట్టు, ప్రపుల్లః, ఉత్ఫుల్లః, సంపుటః (సంస్ఫుటః)=పూలతో నిండిన చెట్టు.

పలాశం ఛదనం పర్ణమిధ్మమేధః సమిత్ స్త్రియామ్ ।
బోధిద్రుమశ్చలదలో దధిత్థగ్రాహిమన్మథాః ॥15॥

తస్మిన్దధిఫలః పుష్పఫలదంతశఠావపి ।
ఉదుమ్బరే హేమదుగ్ధః కోవిదారే ద్విపత్రకః ॥16॥

పలాశం, ఛదనం, పర్ణం=ఆకు, ఇధ్మ, ఏధస్, సమిత్=సమిధ, సమిత్ శబ్దం స్త్రీలింగం. బోధిద్రుమః చలదలః=రావి చెట్టు, దధిత్థః, గ్రాహి, మన్మథః అనేవి దధిఫలః, పుష్పఫలః, దంతశఠః అనేవి వెలగ చెట్టు అనే అర్థాన్ని ఇచ్చేవి. హేమదుగ్ధః=ఉదుంబర వృక్షం (అత్తిచెట్టు) ద్విపత్రకః=కోవిదార వృక్షం (ఎర్రకాంచనపు చెట్టు).

సప్తపర్ణో విశాలత్వక్కృతమాలం సువర్ణకః ।
ఆరేవత వ్యాధిఘాతశమ్యాకచతురంగులాః ॥17॥

సప్తపర్ణః=విశాల త్వక్=ఏడాకుల అరటి చెట్టు, కృతమాలం, సువర్ణకః, ఆరేవతః, వ్యాధిఘాతః, శమ్యాకః, చతురంగులః–ఇవి పర్యాయపదాలు సోనాలీ వృక్షవాచకాలు – రేల చెట్టు పేర్లు.

స్యాజ్జంబీరే దంతశఠో వరుణే తిక్తశావకః ।
పున్నాగే పురుషస్తుంగః కేసరో దేవవల్లభః ॥18॥

జంబీరః, దంతశఠః=నిమ్మచెట్టు, తిక్తశావకః, వరుణః, పర్యాయపదాలు. వరణవృక్షం అని అర్థం (ఉలిమిరి చెట్టు), పురుషః, తుంగః,కేసర, దేవవల్లభః పున్నాగ వృక్షం – సురపొన్న చెట్టు.

పారిభద్రే నిమ్బతరుర్మందారః పారిజాతకః ।
వంజులశ్చిత్రకృచ్చాథ ద్వౌ పీతనకపీతనౌ ॥19॥

పారిభద్ర, నింబతరుః, మందారః, పారిజాతకః పర్యాయపదాలు. వంజులః, చిత్రకృత్ పర్యాయపదాలు. సిసమావృక్షం అని అర్థం (నెమ్మిమ్రాను) పీతన, కపీతన శబ్దాలు అంబాళపు చెట్టు వాచకాలు. ఆమ్రాతక వృక్షమన్నా అర్థం ఇదే.

ఆమ్రాతకే మధూకే తు గుడపుష్పమధుద్రుమౌ ।
పీలౌ గుడఫలః స్రంసీ నాదేయీ చాంబువేతసః ॥20॥

గుడపుష్ప, మధుద్రుమవృక్షాలు మధూక వృక్ష వాచకాలు (ఇప్పచెట్టు) గుడఫలః, స్రంసీ=పీలు చెట్టు, నాదేయీ, అంబువేతసః=ప్రేప చెట్టు, (నీరుప్రబ్బలి)

శోభాంజనే శిగ్రుతీక్ష్ణగంధకాక్షీర మోచకాః ।
రక్తోఽసౌ మధుశిగ్రుః స్యాదరిష్టః ఫేనిలః సమౌ ॥21॥

శిగ్రుః, తీక్ష్ణగంధః, కాక్షీరః, మోచకః-శోభాంజన వృక్షనామధేయాలు. (సహిజనవృక్షం-మునగ చెట్టు) తేనె ప్రధానంగా ఉండే ఎర్ర పూవుల మునగకు మధుశిగ్రుః - అని పేరు. అరిష్టః-ఫేనిలః=కుంకుడు చెట్టు పేర్లు.

గాలవః శాబరో లోధ్రస్తిరీటస్తిల్వమార్జనౌ ।
శేలుః శ్లేషాత్మకః శీత ఉద్దాలో బహువారకః ॥22॥

గాలవః, శాబరః, లోధ్రః, తిరీటః, తిల్వః, మార్జనః - తెల్ల లొద్దుగు చెట్టు పేర్లు. శేలుః, శ్లేష్మాతః, శీతః, ఉద్దాలః, బహువారకః, విరిగి చెట్టు పేర్లు.

వైకంకతః స్రువావృక్షో గ్రంథిలో వ్యాఘ్రపాదపి ।
తిందుకః స్ఫూర్జకః కాలో నాదేయీ భూమి జంబుకా ॥23॥

వైకంకతః, స్రువావృక్షః, గ్రంథిలః, వ్యాఘ్రపాత్ - పుల్ల వెలగ చెట్టు పేర్లు. తిందుకః - స్ఫూర్జకః, కాలః - తుమికి చెట్టు పేర్లు, నాదేయీ-భూమి జంబుకా = కాకి నేరేడు (నాగరంగపు చెట్టు).

కాకతిందౌ పీలుకః స్యాత్పాటలిర్మోక్షముష్కకౌ ।
క్రముకః పట్టికాఖ్యః స్యాత్కుంభీ కైదర్యకట్ఫలే ॥24॥

కాకతిందుః, పీలుకః=నల్లతుమికి చెట్టు, పాటలిః, మోక్షః ముష్కకః= మొక్కపు చెట్టు పేర్లు. క్రముకః, పట్టికా=ఎర్రలొద్దుగ పేర్లు, కుంభీ, కైదర్యః, కట్ఫలః=టేకుమ్రాను పేర్లు.

వీరవృక్షోఽరుష్కరోఽగ్నిముఖీ భల్లాతకీ త్రిషు ।
సర్జకాసన జీవాశ్చ పీతసాలేఽథమాలకే ॥25॥

వీరవృక్షః, అరుష్కరః, అగ్నిముఖీ, భల్లాతకీ - ఓడిమ్రాని పేర్లు (త్రి॥లి) ఆసనః, సర్జకః, జీవః, పీతసాలః, విజయసార వృక్షవాచకాలు, పర్యాయపదాలు.

సర్జాశ్వకర్ణౌ వీరేంద్రా వింద్రద్రుః కకుభోఽర్జునః ।
ఇంగుదీ తాపసతరుర్మోచా శాల్మలిరేవ చ ॥26॥

సర్జః, అశ్వకర్ణః=సాలవృక్షము, వీరేద్ర, ఇంద్రద్రు, కకుభః, అర్జునః=ఏరు మద్ది పేర్లు, ఇంగుదీ, తాపస తరుః=గారచెట్టు పేర్లు. మోచా, శాల్మలీ=బూరుగు చెట్టు.

చిరబిల్వో నక్తమాలః కరజశ్చ కరంజకే ।
ప్రకీర్యః పూతికరజో మర్కట్యంగారవల్లరీ ॥27॥

చిరబిల్వః, నక్తమాలః, కరజః, కరంజకః - కానుగు చెట్టు పేర్లు. ప్రకీర్యః, పూతికరజః=దుర్గంధం కల కానుగు చెట్టు, మర్కటీ, అంగారవల్లరీ=పూవు గుత్తులు గల కానుగు చెట్టు.

రోహీ రోహితకః ప్లీహశత్రుర్దాడిమపుష్పకః ।
గాయత్రీ బాలతనయః ఖదిరో దంతధావనః ॥28॥

రోహీ, రోహితకః, ప్లీహశత్రుః, దాడిమపుష్పకః=ముల్లుమోదుగ పేర్లు, గాయత్రీ, బాలతనయః, ఖదిరః, దన్తధావనః=చంద్రచెట్టు పేర్లు.

అరిమేదో విట్ఖదిరే కదరః ఖదిరే సితే ।
పంచాంగులో వర్ధమానశ్చంచుర్గంధర్వహస్తకః ॥29॥

అరిమేదః, విట్ఖదిరః=దుర్గంధం కలచంద్ర చెట్టు పేర్లు. కదిరః, ఖదిరః, సితః=వెలిచంద్ర చెట్టు పేర్లు. పంచాంగులః, వర్ధమానః, చంచుః, గంధర్వ హస్తకః=ఆముదపు చెట్టు పేర్లు.

పిండీతకో మరువకః పీతదారు చ దారు చ ।
దేవదారుః పూతికాష్ఠం శ్యామా తు మహిళాహ్వాయా ॥30॥

లతా గోవందినీ గుంద్రా ప్రియంగుః ఫలినీ ఫలీ ।
మండూక పర్ణపత్రోర్ణ నటకట్వంగటుంటుకాః ॥31॥

పిండీతకః మరువకః=విషపుష్పాలు గల చెట్టు పేర్లు. పీతదారు, దారు, దేవదారుః, పూతికాష్ఠం=దేవదారు వృక్షం పేర్లు. శ్యామా, మహిళాహ్వాయా అనేవి. లతా, గోవందినీ, గుంద్రా, ప్రియంగుః, ఫలినీ, ఫలీ – ప్రేంఖణపు చెట్టు పేర్లు. మండూకపర్ణః, పత్రోర్ణః, నటః, కట్వంగః, టుంటుకః అనేవి.

శ్యోనాక శుకనాసర్క్షదీర్ఘవృంత కుటన్నటాః ।
పీతద్రుః సరళశ్చాథ నిచులోఽమ్బుజ ఇజ్జలః ॥32॥

శ్యోనాకః, శుకనాసః, ఋక్షః అనేవి, దీర్ఘవృంతః, కుటన్నటః అనేవి, దుండిగపు చెట్టు పేర్లు. పీతద్రుః, సరలః – సరళపు చెట్టు పేర్లు. నిచులః, అంబుజః, ఇజ్జలః, (హిజ్జలః) – ఎర్రగన్నేరు పేర్లు.

కాకోదుంబరికా ఫల్గురరిష్టః పిచుమర్దకః ।
సర్వతోభద్రకో నింబే శిరీషస్తు కపీతనః ॥33॥

కాకోదుంబరికా, ఫల్గుః=కాకులకు ప్రియమైన నిస్సారమైన కుక్క మేడిపేర్లు. అరిష్టః, పిచుమర్దకః, సర్వతోభద్రకః, నింబః – వేప చెట్టు పేర్లు. శిరీషః, కపీతనః=దిరిసెన చెట్టు పేర్లు.

వకులో వంజులః ప్రోక్తః పిచ్ఛిలాఽగురుశింశపాః ।
జయా జయంతీ తర్కారీ కణికా గణికారికా ॥34॥

శ్రీపర్ణమగ్నిమంథః స్యాద్వత్సకో గిరిమల్లికా ।
కాలస్కందస్తమాలః స్యాత్తండులీయోఽల్పమారిషః ॥35॥

వకులః, వంజులః=అశోక వృక్షం పేర్లు, పిచ్ఛిలా, అగురు (అగరు), శింశపః-ఇరుగుడు చెట్టు పేర్లు. జయా, జయన్తీ, తర్కారీ, తక్కిలి చెట్టు పేర్లు, కణికా, గణికారికా అనేవి. శ్రీపర్ణం, అగ్నిమంథః అనేవి కూరనెల్లి చెట్టు పేర్లు. వత్సకః, గిరి మల్లికా=కొడిసె చెట్టు పేర్లు. కాలస్కందః (స్కంధః), తమాలః=తాపిచ్ఛ వృక్షం పేర్లు - చీకటి చెట్టు పేర్లు. తండులీయః - అల్పమారిషః - పర్యాయపదాలు (చిర్రికూర పేర్లు).

సింధువారస్తు నిర్గుణ్డీ సైవాస్ఫోటా వనోద్భవా ।
గణికా యూథికామ్బష్ఠా సప్తలా నవమల్లికా (మాలికా) ॥36॥

సింధువారః, నిర్గుణ్డీ=వావిలిచెట్టు పేర్లు, అస్ఫోటా=వనములో పుట్టిన సింధువారం, గణికా, యూథికా, అంబష్ఠా=అడవి మొల్లపేర్లు, సప్తలా, నవమల్లికా=విరజాజి పేర్లు.

అతిముక్తః పుండ్రకః స్యాత్కుమారీ తరణిః సహా ।
తత్ర శోణే కురవకస్తత్ర పీతే కురంటకః ॥37॥

అతిముక్తః, పుండ్రకః=నెమ్మిమ్రాను పేర్లు, కుమారీ, తరణిః, సహా=పిన్నగోరింట పేర్లు, రక్తకుమారీ వృక్షానికి కురవక మనియు, పచ్చని కుమారీ వృక్షానికి కురంటకమని పేర్లు.

నీలాఝింటీ ద్వయో ర్బాణా ఝింటీసైరీయక స్తథా ।
తస్మిన్రక్తే కురవకః పీతే సహచరీ ద్వయోః ॥38॥

నీలాఝింటి, బాణాః - నల్లగోరింట పేర్లు, ఝింటీ సైరీయకః= ములు గోరింటపేరు, రక్తకురవకః=ఎర్రములు గోరింట, సహచరీ=పచ్చపూవులములు గోరింట.

ధుస్తూరః కితవో ధూర్తో రుచకో మాతులుంగకే ।
సమీరణో మరువకః ప్రస్థపుష్పః ఫణిజ్జకః ॥39॥

ధుస్తూరః (ధత్తూరః), కితవః, ధూర్తః=ఉమ్మెత్త పేర్లు, రుచకః - మాతులుంగకః=మాదీఫలపు చెట్టు, సమీరణః, మరువకః, ప్రస్థపుష్పః, ఫణిజ్జకః, (ఫణిర్జకః) = మరువక వృక్షం పేర్లు.

కుఠేరకస్తు పర్ణాసేఽస్థాస్ఫీతో వసుకార్కకే ।
శివమల్లీ పాశుపతో వృందా వృక్షాదనీ తథా ॥40॥

జీవంతికా వృక్షరుహా గుడూచీ తంత్రికాఽమృతా ।
సోమవల్లీ మధుపర్ణీ మూర్వా తు మోరటీ తథా ॥41॥

కుఠేరకః పర్ణాసః=నల్లగగ్గెర పేర్లు, అస్ఫీత, వసుక, అర్కక శబ్దాలు జిల్లేడు చెట్టు పేర్లు, శివమల్లీ పాశుపత శబ్దాలు ఒక పుష్పం పేర్లు, వృందా, వృక్షాదనీ అనేవి. జీవంతికా, వృక్షరుహా అనేవి బదినిక చెట్టు పేర్లు. గుడూచీ, తంత్రికా, అమృతా (జీవంతికా), సోమవల్లీ, మధుపర్ణీ=తిప్పతీగ పేర్లు. మూర్వా, మోరటీ అనేవి.

మధూలికా మధుశ్రేణీ గోకర్ణీ పీలుపర్ణ్యపి ।
పాఠాఽమ్బష్ఠా విద్ధకర్ణీ ప్రాచీనా వనతిక్తికా ॥42॥

మధూలిక, మధుశ్రేణి, గోకర్ణి, పీలుపర్ణి అనేవి చాగచెట్టు పేర్లు. పాఠా, అంబష్ఠా, విద్ధకర్ణీ, ప్రాచీనా, వనతిక్తికా అనేవి అగురు సొంటి పేర్లు.

కటుః కటంభరా చాథ చక్రాంగీ శకులాదనీ ।
ఆత్మగుప్తా ప్రావృషాయీ కపికచ్ఛూశ్చ మర్కటీ ॥43॥

కటుః, కటంభరా (కటుంభర), చక్రాంగి, శకులాదని, ఆత్మగుప్త, ప్రావృషాయి, కపికచ్ఛూః, మర్కటీ=దురదగొండి పేర్లు.

అపామార్గః శైఖరికః ప్రత్యక్పర్ణీ మయూరకః ।
ఫంజికా బ్రాహ్మణీ భార్గీ ద్రవంతీ శంబరీ వృషా ॥44॥

అపామార్గః, శైఖరికః, ప్రత్యక్పర్ణీ, మయూరకః=ఉత్తరేణి పేర్లు. ఫంజికా (హంజికా), బ్రాహ్మణీ, భార్గీ=గంటుబారంగి పేర్లు. ద్రవంతీ, శంబరీ, వృషా=ఎలుక చెవి చెట్టు పేర్లు.

మండూకపర్ణీ భండీరీ సమంగా కాలమేషికా ।
రోదనీ కచ్ఛురానన్తా సముద్రాన్తా దురాలభా ॥45॥

మండూక పర్ణీ, భండీరీ, సమంగా, కాలమేషికా=నిడువైన తీగలుకల మంజిష్ఠపేర్లు. రోదనీ, కచ్ఛురా, అనంతా, సముద్రాంతా, దురాలభా= తీటక సిందపేర్లు (ప్రయాసచే తాకబడేది).

పృశ్నిపర్ణీ పృథక్పర్ణీ కలశిర్ధావనిర్గుహా ।
నిదిగ్ధికా స్పృశీ వ్యాఘ్రీ క్షుద్రా దుస్పర్శయా సహ ॥46॥

పృశ్నిపర్ణి, పృథక్పర్ణి, కలశి, ధావని, గుహా=నక్కతోక పొన్న పేర్లు. నిదిగ్ధికా, స్ప ృశీ, వ్యాఘ్రీ, క్షుద్రా, దుస్స్పర్శా - వాకుడు చెట్టు పేర్లు.

అవల్గుజః సోమరాజీ సువల్లిః సోమవల్లికా ।
కాలమేషీ కృష్ణఫలా వాకుచీ పూతిఫల్యపి ॥47॥

అవల్గుజః, సోమరాజీ, సువల్లిః, సోమవల్లికా, కాలమేషీ, కృష్ణఫలా, వాకుచీ, పూతిఫలీ-కారుగచ్చ పేర్లు.

కణోషణోపకుల్యా స్యాచ్ఛ్రేయసీ గజపిప్పలీ ।
చవ్యం తు చవికా కాకచించీ గుంజే తు కృష్ణలా ॥48॥

కణా, ఊషణా, ఉపకుల్యా-పిప్పలితీగ పేర్లు. శ్రేయసీ, గజపిప్పలీ=ఏనుగుకు యోగ్యమైన పిప్పలి, చవ్యం, చవికం=భక్షింపబడేది (చవ్యం పేర్లు), కాకచించీ, గుంజ, కృష్ణలా=పూసల గురివెంద పేర్లు.

విశ్వా విషా ప్రతివిషా వనశృంగాటగోక్షురౌ ।
నారాయణీ శతమూలీ కాలేయకహరిద్రవః ॥49॥

విశ్వా, విషా, ప్రతివిషా=మహౌషధం పేర్లు. వనశృంగాట, గోక్షుర శబ్దాలు, పల్లేరు పేర్లు. నారాయణీ, శతమూలీ శబ్దాలు పిల్లపిచ్చర పేర్లు. కాలేయక హరిద్రవ శబ్దాలు కుష్ఠాది రోగాలను హరించే మ్రానిపసుపు పేర్లు.

దార్వీ పచంపచా దారు శుక్లా హైమవతీ వచా ।
వచోగ్రగంధా షడ్గంథా గోలోమీ శతపర్వికా ॥50॥

దార్వీ, పచంపచా, దారుశబ్దాలు కూడ మ్రానిపసుపు నామాలే. శుక్లా, హైమవతీ శబ్దాలు తెల్లవస పేర్లు. వచా, ఉగ్రగంధా, షడ్గంథా, గోలోమీ, శతపర్వికా - వస యొక్క పేర్లు.

ఆస్ఫోతా గిరికర్ణీ స్యాత్సింహాస్యో వాసకో వృషః ।
మిశీ మధురికా ఛత్రా కోకిలాక్షేక్షురక్షురా ॥51॥

ఆస్ఫోతా (ఆస్ఫోటా), గిరికర్ణీ శబ్దాలు విష్ణుక్రాంతము పేర్లు. సింహాస్య, వాసక, వృషశబ్దాలు - అడ్డసరపు చెట్టు పేర్లు. మిశీ, మధురికా, ఛత్రాశబ్దాలు- ఔషధాలలో కూర్చుటకు యోగ్యమైన "సదాప" పేర్లు. కోకిలాక్ష, ఇక్షుర, క్షురః- అనే శబ్దాలు కత్తివలె ఉండే గొలిమిడి చెట్టు పేర్లు.

విడంగో௨స్త్రీ కృమిఘ్నః స్యాద్వజ్ర ద్రుస్నుక్స్నుహీ సుధా ।
మృద్వీకా గోస్తనీ ద్రాక్షా బలా వాట్యాలకస్తథా ॥52॥

విడంగ (పుం, న)కృమిఘ్నః - అనే శబ్దాలు వాయు విళంగము పేర్లు. వజ్రద్రుః, స్నుక్, స్నుహీ, సుధా శబ్దాలు జెముడు చెట్టు పేర్లు. మృద్వీకా, గోస్తనీ, ద్రాక్షా శబ్దాలు ద్రాక్ష యొక్క పేర్లు. బలా, వాట్యాలక శబ్దాలు చిట్టాముదం చెట్టు పేర్లు.

కాలా మసూరవిదలా త్రిపుటా త్రివృతా త్రివృత్ ।
మధుకం క్లీతకం యష్టిమధుకా మధుయష్టికా ॥53॥

కాలా, మసూర విదలా శబ్దాలు నల్లతెగడ చెట్టు పేర్లు. త్రిపుట, త్రివృతా, త్రివృత్ శబ్దాలు తెల్లతెగడ పేర్లు. మధుకం, క్లీతకం, యష్టిమధుకా, మధుయష్టికా శబ్దాలు అతిమధురత్వాన్ని ఇచ్చే వాటి పేర్లు.

విదారీ క్షీరశుక్లేక్షుగంధా క్రోష్టీ చ యాసితా ।
గోపీ శ్యామా శారివా స్యాదనంతోత్పలశారివా ॥54॥

విదారీ, క్షీరశుక్లా, ఇక్షుగంధా, క్రోష్టీ, యాసితా - నల్లనేల గుమ్ముడు పేర్లు. గోపీ, శ్యామా, శారిబా (వా), అనంతా (చందనా), ఉత్పలశారిబా (వా) - మామెన (సుగంధిపాల) పేర్లు.

మోచా రంభా చ కదలీ భంటాకీ దుష్ప్రధర్షిణీ ।
స్థిరా ధ్రువా సాలపర్ణీ శృంగీ తు వృషభో వృషః ॥55॥

మోచా, రంభా, కదలీ=అరటి చెట్టుపేర్లు. భంటాకీ, దుష్ప్రధర్షిణీ=ములక చెట్టు పేర్లు. స్థిరా, ధ్రువా, సాలపర్ణీ=ముయ్యాకు పొన్న పేర్లు. శృంగీ, వృషభః, వృషః=వృషభ మహౌషధం పేర్లు.

గాంగేరుకీ నాగబలా ముషలీ తాలమూలికా ।
జ్యోత్స్నీ పటోలికా జాలీ అజశృంగీ విషాణికా ॥56॥

గాంగేరుకీ, నాగబలా=బీరచెట్టు పేరు, ముషలీ, తాలమూలికా=నేలతాటి పేర్లు. జ్యోత్స్నీ, పటోలికా, జాలీ=పొట్లచెట్టు పేర్లు, అజశృంగీ, విషాణికా=దుష్టపు తీగ పేర్లు.

స్యాల్లాంగలిక్యగ్ని శిఖా తాంబూలీ నాగవల్ల్యపి ।
హరేణూ రేణుకా కౌంతీ హ్రీబేరీ దివ్యనాగరమ్ ॥57॥

లాంగలికీ, అగ్నిశిఖా=తరిగొట్టుచెట్టు (చిన్నచెరకు), తాంబూలీ, నాగవల్లీ=తమలపాకు తీగె పేర్లు, హరేణూ, రేణుకా, కౌన్తీ=రేణుక అనే సుగంధ ద్రవ్యం పేర్లు (తక్కోలపు చెట్టు), హ్రీబేరీ, దివ్యనాగరమ్, నేత్రబాల, సుగంధబాలపేర్లు.

కాలానుసార్యవృద్ధాశ్మపుష్పశీతశివాని తు ।
శైలేయం తాలపర్ణీ తు దైత్యా గంధకుటీ మురా ॥58॥

కాలానుసార్య, వృద్ధ, అశ్మపుష్ప, శీతశివం, శైలేయం=రాతిపూవుపేర్లు, తాలపర్ణీ, దైత్యా, గంధకుటీ, మురా=ముర అనే గంధద్రవ్యం పేర్లు.

గ్రంథిపర్ణం శుకం బర్హి బలా తు త్రిపుటా త్రుటిః ।
శివా తామలకీ చాథ హనుర్హట్టవిలాసినీ ॥59॥

గ్రంథిపర్ణ, శుక, బర్హి శబ్దాలు స్థౌణేయమనే గంధంపేర్లు (పచ్చాకు మాచిపత్రి), బలా, త్రిపుటా, త్రుటిః= సన్న ఏలకుల పేర్లు, శివా, తామలకీ=నేల ఉసిరిక పేర్లు, హనుః, హట్టవిలాసినీ=శంఖ మనే గంధద్రవ్యం పేర్లు.

కుటం నటం దశపురం వానేయం పరిపేలవమ్ ।
తపస్వినీ జటామాంసీ పృక్కా దేవీ లతా లశూః ॥60॥

కుటం, నటం, దశపురం, వానేయం, పరిపేలవమ్=తుంగముస్తెల పేర్లు, తపస్వినీ, జటా, మాంసీ=వెంద్రుకల వంటి పీచు గల దానిపేర్లు, పృక్కా, దేవీ, లతా, లఘు (లశు)=స్పృక్క అనే గంధద్రవ్యం పేర్లు.

కర్చూరకో ద్రావిడకో గంధమూలీ శఠీ స్మృతా ।
స్యాదృక్షగంధా ఛగలాంత్రా వేగీ వృద్ధదారకః ॥61॥

కర్చూరకః, ద్రావిడకః=గంధకచోరం పేర్లు. గంధమూలీ, శఠీ శబ్దాలు కూడ చోరం పేర్లే. ఋక్షగంధా, ఛగలాంత్రా, ఆవేగీ, వృద్ధదారకః, రోగాలను నివారించే బొద్దికూరపేర్లు.

తుండికేరీ రక్తఫలా బింబికా పీలుపర్ణ్యపి ।
చాంగేరీ చక్రికాంబష్ఠా స్వర్ణక్షీరీ హిమావతీ ॥62॥

తుండికేరీ, రక్తఫలా, బింబికా, పీలుపర్ణీ=దొండ చెట్టు పేర్లు. చాంగేరీ, చక్రికా, అంబష్ఠా=పులిచింతపేర్లు, స్వర్ణక్షీరీ, హిమావతీ=బంగారు వన్నె పాలు కలది, మంచు వంటి చలి కలది (కంకోష్టువు పేర్లు).

సహస్రవేధీ చుక్రో౽మ్లవేతసః శతవేధ్యపి ।
జీవన్తీ జీవనీ జీవా భూమినింబః కిరాతకః ॥63॥

సహస్ర వేధీ, చుక్రః, అమ్లవేతసః, శతవేధీ=పుల్లప్రబ్బలి పేర్లు. జీవన్తీ, జీవనీ, జీవా=పాలకూర పేర్లు. భూమినింబః, కిరాతకః=నేలవేము పేర్లు.

కూర్చశీర్షో మధుకరశ్చంద్రః కపివృకస్తథా ।
దద్రుఘ్నః స్యాదేడగజో వర్షాభూః శోథహారిణీ ॥64॥

కూర్చశీర్షః, మధుకరః=జీవకమనే గంధద్రవ్యం పేర్లు. చంద్రః, కపివృకః=కర్పూరం (లేదా) రోచని అనే ఔషధం, దద్రుఘ్నః, ఏడగజః=తగిరస చెట్టు పేర్లు, వర్షాభూః, శోథహారిణీ=గలిజేరు చెట్టు పేర్లు.

కునందతీ నికుంభస్త్రా యమానీ వార్షికా తథా ।
లశునం గృంజనారిష్ట మహాకన్దరసోనకాః ॥65॥

కునందతీ, నికుంభస్త్రా, యమానీ, వార్షికా=కలగానుగు పేర్లు, లశునం, గృంజనః, అరిష్టః, మహాకందః, రసోనః=వెల్లుల్లి, తెల్లఉల్లి పేర్లు.

వారాహీ వరదా గృష్టిః కాకమాచీ తు వాయసీ ।
శతపుష్పా సితచ్ఛత్రా౽తి చ్ఛత్రా మధురా మిసిః ॥66॥

వారాహీ, వరదా, గృష్టిః=పాచితీగ పేర్లు. కాకమాచీ, వాయసీ=కాకి చెట్టుపేర్లు, శతపుష్పా, సితచ్ఛత్రా, అతిచ్ఛత్రా, మధురా, మిసిః=పెద్ద సదాప పేర్లు.

అవాక్పుష్పీ కారవీ చ సరణా తు ప్రసారణీ ।
కటంభరా భద్రబలా కర్బురశ్చ శటీ హ్యథ ॥67॥

అవాక్పుష్పీ, కారవీ శబ్దాలు కూడ పెద్ద సదాప చెట్టు అర్థాన్ని ఇచ్చేవే. సరణా, ప్రసారణీ, కటంభరా, భద్రవలా(బలా)=గొంతెమ గోరు చెట్టుపేర్లు. కర్బురః, శటీ=గండ్లకచోరం పేర్లు.

పటోలః కులకస్తిక్తః కారవేలః కటిల్లకః ।
కూష్మాండకస్తు కర్కారురుర్వారుః కర్కటీ స్త్రియౌ ॥68॥

పటోలః, కులకః, తిక్తః పటుః=చేదు పొట్ల పేర్లు. కారవేలః, కటిల్లకః=కాకర పేర్లు. కూష్మాండకః, కర్కారుః=గుమ్మడి పేర్లు. ఉర్వారుః, కర్కటీ=దోస పేర్లు (ఈ రెండు శబ్దాలు స్త్రీలింగాలే).

ఇక్ష్వాకుః కటుతుంబీ స్యాద్విశాలాత్వింద్రవారుణీ ।
అర్శోఘ్నః సూరణః కందో ముస్తకః కురువిందకః ॥69॥

ఇక్ష్వాకుః, కటుతుంబీ=చేదు సొరపేర్లు. విశాలా, ఇంద్రవారుణీ=పెద్ద పాపర పేర్లు. అర్శోఘ్నః, సూరణః, కందః=కందపేర్లు. ముస్తకః, కురువిందకః=నిడువైన తుంగముస్తెల పేర్లు.

వంశే త్వక్సార కర్మారవేణుమస్కరతేజనాః ।
ఛత్రాతిచ్ఛత్రపాలఘ్నౌ మాలాతృణకభూస్తృణే ॥70॥

వంశ, త్వక్సార, కర్మార, వేణు, మస్కర, తేజనః=వెదురు పేర్లు. ఛత్రా+అతిచ్ఛత్రా, పాలఘ్నః=ఛత్రాకారమైన తృణముపేర్లు, మాలాతృణకం, భూస్తృణం=చిప్పకసువు పేర్లు.

తృణరాజాహ్వయస్తాలో ఘెంటా క్రముకపూగకౌ ।
శార్దూల ద్వీపినౌ వ్యాఘ్రే హర్యక్షః కేసరీ హరిః ॥71॥

తృణరాజః, తాలః=తాటి చెట్టు పేర్లు. ఘెంటా, క్రముకః, పూగకః=పోకచెట్టు పేర్లు. శార్దూలః, ద్వీపీ=పెద్దపులి పేర్లు (ద్వీపీ=చర్మం ఉనికి పట్టుగా కలది). హర్యక్షః, కేసరీ, హరిః=సింహము పేర్లు.

కోలః పోత్రీ వరాహః స్యాత్ కోక ఈహామృగో వృకః ।
లూతోర్ణనాభౌ తు సమౌ తంతువాయశ్చ మర్కటే ॥72॥

కోలః, పోత్రీ, వరాహః=అడవి పందిపేర్లు. కోకః, ఈహామృగః, వృకః=తోడేలు. లూతా, ఊర్ణనాభిః, తంతువాయః, మర్కటః=సాలెపురుగు.

వృశ్చికః శూకకీటః స్యాత్సారంగస్తోకకౌ సమౌ ।
కృకవాకుస్తామ్రచూడః పికః కోకిల ఇత్యపి ॥73॥

వృశ్చికః, శూకకీటః=తేలు, సారంగః, తోకకః=వానకోయిల పేర్లు. కృకవాకుః, తామ్రచూడః=కోడిపేర్లు. పికః, కోకిలః=కోయిల పేర్లు.

కాకే తు కరటారిష్టౌ బకః కహ్వ ఉదాహృతః ।
కోకశ్చక్రశ్చక్రవాకః కాదంబః కలహంసకః ॥74॥

కాకః, కరటః, అరిష్టః=కాకి. బకః, కహ్వః=కొంగ. కోకః, చక్రః, చక్రవాకః=చక్రవాక పక్షి. కాదంబః, కలహంసః=ధూమ్రవర్ణం కల కాళ్లు, రెక్కలు కల హంస,

పతంగికాపుత్తికా స్యాత్సరఘా మధుమక్షికా ।
ద్విరేఫపుష్పలిడ్భృంగ షట్పదభ్రమరాలయః ॥75॥

పతంగికా, పుత్తికా=గొప్ప (తెర) తేనెటీగ, సరఘా, మధుమక్షికా=తేనెటీగ. ద్విరేఫః, పుష్పలిట్, భృంగః, షట్పదః, భ్రమరః, అలిః=తుమ్మెద పేర్లు.

కేకీ శిఖ్యస్య వాక్కేకా శకుంతిశకునిద్విజాః ।
స్త్రీ పక్షతిః పక్షమూలం చంచుస్త్రోటిరుభే స్రియౌ ॥76॥

కేకీ, శిఖీ=నెమలి, దాని కూతకే (కేకా)=నెమలి కూత అని పేరు. శకుంతిః, శకునిః, ద్విజః=పక్షిపేర్లు. పక్షతిః (స్త్రీ), పక్షమూలమ్=రెక్కమొదలు, చంచుః (స్త్రీ) త్రోటిః (స్త్రీ)=పక్షిముక్కు పేర్లు.

గతి రుడ్డీన సండీనౌ కులాయో నీడమస్త్రియామ్ ।
పేశీకోశో ద్విహీనేఽండం పృథుకః శావకః శిశుః ॥77॥


ఉడ్డీనం, సండీన=పక్షిగతి విశేషం. కులాయః, నీడమ్ (న)=పక్షిగూడు పేర్లు. పేశీ, కోశః, (ఈ రెండును ఏకనామమని కొందరు) అండం=గ్రుడ్డుపేర్లు, పృథుకః, శాబకః (శావకః), శిశుః=పక్షిపిల్ల లేదా శిశువు పేర్లు.

పోతః పాకోఽర్భకో డింభః సందోహవ్యూహకౌ గణః ।
స్తోమౌఘనికరవ్రాతా నికురుంబం కదంబకమ్ ।
సంఘాతసంచయౌ వృంద పుంజరాశీ తు కూటకమ్ ॥78॥

పోతః, పాకః, అర్భకః, డింభః=ఇవి కూడ శిశువు నామాలే. సందోహ, వ్యూహక, గణ, స్తోమ, ఓఘ, నికర, వ్రాత, నికురుంబ, కదంబక, సంఘాత, సంచయ, బృంద, పుంజ, రాశి శబ్దాలు కూడ సముదాయము అనే అర్థాన్ని ఇచ్చేవి.

ఇత్యాది మహాపురాణే ఆగ్నేయే భూమివనౌషధ్యాది వర్గనిరూపణం నామ త్రిషష్ట్యధిక త్రిశతతమోఽధ్యాయః ॥363॥

అగ్నిమహాపురాణంలో భూమివనౌషధ్యాది వర్గనిరూపణ మనే మూడువందల అరవైమూడవ అధ్యాయం సమాప్తం.



చతుఃషష్ట్యధిక త్రిశతతమోఽధ్యాయః – మూడువందల అరవైనాల్గవ అధ్యాయం

మనుష్య వర్గవర్ణనమ్– మనుష్య వర్గవర్ణనం

అగ్నిరువాచ – అగ్ని ఇలా వచించాడు.

నృబ్రహ్మక్షత్రవిట్శూద్ర వర్గాన్వక్ష్యేఽథ నామతః ।
నరః పంచజనా మర్త్యా యోషిద్యోషాఽబలా వధూః ॥1॥

మనుష్య, బ్రహ్మ, క్షత్ర, వైశ్య, శూద్ర వర్గాలను క్రమంగా చెబుతాను. నర, పంచజన, మర్త్య శబ్దాలు నర (మనుష్య) వాచకాలు, యోషిత్, యోషా, అబలా, వధూః–స్త్రీ వాచకాలు.

కాంతార్థినీ తు యా యాతి సంకేతం సాఽభిసారికా ।
కులటా పుంశ్చల్యసతీ నగ్నికా స్త్రీ చ కోటవీ ॥2॥

ప్రియుని కోరుతూ సంకేతస్థానానికి వెళ్లేది అభిసారిక. కులట, పుంశ్చలి, అసతి కులటకు పేర్లు. నగ్నిక, కోటవి ఇవి నగ్న స్త్రీకి పేర్లు.

కాత్యాయన్యర్ధవృద్ధా యా సైరంధ్రీ పరవేశ్మగా ।
అసిక్నీ స్యాదవృద్ధాయా మాలినీ తు రజస్వలా ॥3॥

కాత్యాయని సగం ముసలిది, సైరంధ్రి పరగృహంలో సేవచేసేది. అసిక్ని ఇంకను ముసలితనం రానిది, మలినీ మాలినీ, రజస్వల ఇవి బహిష్ఠు అయిన స్త్రీ పేర్లు.

వారస్త్రీ గణికా వేశ్యా భ్రాతృజాయాస్తు యాతరః ।
ననందా తు స్వసా పత్యుః సపిండాస్తు సనాభయః ॥4॥

వారస్త్రీ, గణికా, వేశ్యా పదాలు పర్యాయవాచకాలు భోగందాని పేర్లు. యాత అంటే తోటి కోడలు. ననంద అంటే భర్త యొక్క సోదరి. సపిండులు, సనాభులు అన్నవి జ్ఞాతుల పేర్లు.

సమానోదర్య సోదర్య సగర్భ్య సహజాః సమాః ।
సగోత్రబాంధవజ్ఞాతి బంధుస్వస్వజనాః సమాః ॥5॥

సమానోదర్య, సోదర్య, సగర్భ్య, సహజ శబ్దాలు సమానార్థకాలు. తోడబుట్టిన వారు అని అర్థం. సగోత్ర, బాంధవ, జ్ఞాతి, బంధు, స్వ, స్వజన శబ్దాలు సమానార్థకాలు. ఇవి ఒకే గోత్రం కల జ్ఞాతుల పేర్లు.

దంపతీ జంపతీ భార్యాపతీ జాయాపతీ చ తౌ ।
గర్భాశయో జరాయుః స్యాదుల్బం చ కలలోఽస్త్రియామ్ ॥6॥

దంపతి, జంపతి, భార్యాపతి, జాయాపతి ఇవి పర్యాయపదాలు. అలు మగలని అర్థం. జరాయువు, కలలం, ఉల్బం ఇవి గర్భాశయం పేర్లు.

గర్భో భ్రూణ ఇమౌ తుల్యౌ క్లీబం శండో నపుంసకమ్ ।
స్యాదుత్తానశయా డింభా బాలో మాణవకః స్మృతః ॥7॥

గర్భం, భ్రూణం ఇవి రెండూ పర్యాయపదాలు. క్లీబుడు షండుడు నపుంసకుని పేర్లు. ఉత్తానశయుడు, డింభుడు ఇవి పసిబిడ్డపేర్లు. బాలుడు, మాణవకుడు ఇవి పదహారేండ్లలోపు వయస్సు గల పిల్లల పేర్లు.

పిచండిలో బృహత్కుక్షి రభ్రటో నతనాసికే ।
వికలాంగస్తు పౌగండ ఆరోగ్యం స్యాదనామయమ్ ॥8॥

పిచండిలుడు అంటే పెద్దపొట్టగలవాడు. వంగిన ముక్కు గలనాడు అభ్రేలుడు. వికలాంగుడు పౌగండుడు. అనామయమంటే ఆరోగ్యం.

స్యాదేడే బధిరః కుబ్జే గడులః కుకరే కుణిః ।
క్షయః శోషశ్చ యక్ష్మా చ ప్రతిశ్యాయస్తు పీనసః ॥9॥

ఏడుడు, బధిరుడు అంటే చెవిటివాడు. గూని వాడికి కుబ్జుడు, గడులుడు అనిపేర్లు. కుణి. కుకరుడు ఇవి వంకరచేతి వాడికి పేర్లు. శోషం, యక్ష్మ ఇవి క్షయకు పేర్లు. ప్రతిశ్యాయం, పీనాసం అంటే జలుబు.

స్త్రీ క్షుత్ క్షుతం క్షవః పుంసి కాసస్తు క్షవథుః పుమాన్ ।
శోథస్తు శ్వయథుః శోఫః పాదస్ఫోటో విపాదికా ॥10॥

క్షుత్తు, క్షుతం, క్షవం ఇవి తుమ్ముకు పేర్లు. కాసము, క్షవథు ఇవి దగ్గుకు పేర్లు. శోథము, శ్వయథువు, శోఫం ఇవి వాపునకు పేర్లు. విపాదిక అంటే కాలిపగులు.

కిలాస సిధ్మకచ్ఛ్వాస్తు పామ పామా విచర్చికా ।
కోఠో మండలకం కుష్ఠం శ్విత్రే దుర్నామకార్శశీ ॥11॥

కిలాసం, సిధ్మకం ఇవి సిబ్బెకు పేర్లు. కచ్ఛ్వం, పామం, పామ ఇవి గజ్జిపేర్లు, కోఠం, మండలకం, ఇవి చక్రాకారంలో వచ్చే కుష్ఠరోగానికి పేర్లు. శ్విత్రం తెల్లకుష్ఠు. దుర్నామకం, అర్శస్సు మూలవ్యాధిపేర్లు.

ఆనాహస్తు నిబంధః స్యాద్గ్రహణీ రుక్ప్రవాహికా ।
బీజవీర్యేంద్రియం శుక్రం పలలం క్రవ్యమామిషమ్ ॥12॥

అనాహం, నిబంధం ఈ రెండూ మలమూత్ర నిర్బంధానికి పేర్లు. గ్రహిణి, ప్రవాహిక అనేవి విరేచనాల పేర్లు, భీజం, వీర్యం, ఇంద్రియం ఇవి శుక్రవాచకాలు. పలలం, క్రవ్య. ఆమిషాలు మాంస వాచకాలు.

వృక్కాగ్రమాంసం హృదయం హృన్మేదస్తు వపా వసా ।
పశ్చాద్గ్రీవాసిరా మన్యా నాడీ తు ధమనిః సిరా ॥13॥

వృక్కా, అగ్రమాంసానికి పేరు. హృదయం, హృత్తు పర్యాయపదాలు. పెడతలనున్న బోలునరం మన్య. వస, వప, మేదస్సు ఇవి క్రొవ్వుపేర్లు. నాడి, ధమని, సిర ఇవి బోలునరాల పేర్లు.

తిలకం క్లోమ మస్తిష్కం దూషికా నేత్రయోర్మలమ్ ।
అంత్రం పురీతద్ గుల్మస్తు ప్లీహాపుంస్యథ వస్నసా ॥14॥

తిలకమంటే క్లోమం (నీటితిత్తి) మస్తిష్క మంటే మెదడు. దూషిక కంటిపుసి. అంత్రం, పురీతత్తు ఇవిపర్యాయపదాలు. గుల్మం, ప్లీహ మాంసగోళలు. వస్నస అంటే సన్ననినరం.

స్నాయుః స్త్రియాం కాలఖండయకృతీ తు సమే ఇమే ।
స్యాత్కర్పరః కపాలోఽ స్త్రీ కీకసం కుల్యమస్థి చ ॥15॥

స్నాయువు ఇది కూడ సన్ననినరం. కాలఖండం, యకృతి అంటే నల్లని మాంసఖండం, కుడి ప్రక్కన కడుపులో నల్లగా ఉండేది. కర్పరం. కపాలం. ఇవి శిరస్సును రక్షించే తల ఎముక పేర్లు. కీకసం, కుల్యం, అస్థి ఇవి ఎముక పేర్లు.

స్యాచ్ఛరీరాస్థ్ని కఙ్కాలః పృష్ఠాస్థ్ని తు కశేరుకా ।
శిరోస్థని కరోటిః స్త్రీ పార్శ్వాస్థని తు పర్శుకా ॥16॥

కంకాలం శరీరంలోని ఎముకల సముదాయం (అస్థిపంజరం) పృష్ఠాస్థ్ని, కశేరుక అంటే వెన్నెముక, శిరోస్థని, కరోటి అంటే తల పుర్రె, పార్శ్వాస్థని, పర్శుక అంటే ప్రక్కఎముక,

అంగం ప్రతీకోఽ వయవః శరీరం వర్ష్మవిగ్రహః ।
కటోనా శ్రోణిఫలకం కటిః శ్రోణిః కకుద్మతీ ॥17॥

అంగం, ప్రతీకం, అవయవం కరచరణాద్యవయముల పేర్లు. శరీరం, వర్ష్మ, విగ్రహం ఇవి శరీరం పేర్లు, కటః, శ్రోణిఫలకం ఇవి మొలపేర్లు, కటి, శ్రోణి, కకుద్మతి ఇవి పిరుదుల పేర్లు.

పశ్చాన్నితంబఃస్త్రీ కట్యాః క్లీబే తు జఘనం పురః ।
కూపకౌ తు నితంబస్థౌ ద్వయహీనే కుకుందరే ॥18॥

నితంబం స్త్రీ కటియొక్క పశ్చాద్భాగం, జఘనం కటియొక్క పురోభాగం, కూపకమంటే నితంబంలోని గుంటి. కుకుందరపదం కూడా ఆ అర్థంలోనే.

స్త్రియాం స్ఫిచౌ కటిప్రోథా వుపస్థో వక్ష్యమాణయోః ।
భగం యోనిర్ద్వయోః శిశ్నో మేఢ్రో మేహన శేఫసీ ॥19॥

కటి, ప్రోథ, స్ఫిచ ఇవి అడవారి పిరుదుల పైభాగానికి పేర్లు. ఉపస్థ, భగం, యోని ఇవి స్త్రీ రహస్యాంగానికి పేర్లు. శిశ్నం, మేఢ్రం, మేహనం, శేఫం – ఇవి పురుషుల రహస్యాంగానికి పేర్లు.

పిచండ కుక్షీ జఠరోదరం తుందం కుచౌ స్తనౌ ।
చూచుకంతు కుచాగ్రం స్యాన్న క్రోడం భుజాన్తరమ్ ॥20॥

పిచండం, కుక్షి, జఠరం, ఉదరం, తుందం ఇవి కడుపు పేర్లు. స్తనాలు, కుచములు ఇవి వక్షోజముల పేర్లు. కుచముల అగ్రభాగానికి చూచుకం అని పేరు. క్రోడం భుజముల మధ్య భాగం.

స్కంధో భుజశిరోంఽసోఽస్త్రీ సంధీతస్యైవ జత్రుణీ ।
పునర్భవః కరరుహో నఖోఽస్త్రీ నఖరోఽస్త్రియామ్ ॥21॥

స్కంధం, భుజశిరం, అంసం ఇవి మూపు పేర్లు. రొమ్ము, సంధులు జత్రువులు. పునర్భవము, కరరుహము, నఖరము, నఖము ఇవి గోటిపేర్లు.

ప్రాదేశ తాల గోకర్ణా స్తర్జన్యాది యుతే తతే ।
అంగుష్ఠే సకనిష్ఠే స్యాద్వితస్తిర్ద్వాదశాంగులః ॥22॥

చెయ్యి చాపగా అంగుష్ఠం మొదలు తర్జని చూపుడు వ్రేలు చివరి వరకు ఉన్న భాగమునూ ప్రాదేశమని పేరు. (గోకర్ణం మాదిరిగా మడవాలి). అంగుష్ఠం నుండి కనిష్ఠిక చివరి వరకు వున్నది వితస్తి (జాన), ఇది పండ్రెండు అంగుళాల పొడవు ఉండును.

పాణౌ చపేట ప్రతల ప్రహస్తా విస్తృతాంగులౌ ।
బద్ధముష్టికరో రత్ని రరత్నిః సకనిష్ఠవాన్ ॥23॥

అన్నివ్రేళ్లను చాపిన చెయ్యికి చపేటం, ప్రతలం, ప్రహస్తం అని పేర్లు. పిడికిలి బిగించినచో దానికి 'రత్ని' అని పేరు. రత్ని నుండి కనిష్ఠిక వరకు ఉన్న భాగానికి 'అరత్ని' అని పేరు.

కంబుగ్రీవా త్రిరేఖా సాఽవటుర్ఘాటా కృకాటికా ।
అధః స్యాచ్చిబుకం చోష్ఠాదథ గండౌ గలో హనుః ॥24॥

శంఖాకారం గల కంఠానికి 'త్రిరేఖా' అని పేరు. అవటువు, ఘాటా, కృకాటికా ఇవి శిరస్సును మెదడును పొంది యుండే గండం, గలం, హనువు ఇవి చెక్కిలి పేర్లు. పెదవుల క్రింది భాగానికి చిబుకం అని పేరు.

అపాంగౌ నేత్రయోరన్తౌ కటాక్షోఽపాంగదర్శనే ।
చికురః కుంతలో బాలః (వాలః) ప్రతికర్మ ప్రసాధనమ్ ॥25॥

నేత్రాల చివరి భాగం అపాంగం. నేత్రాంతముతో చూచుట కటాక్షం. చికురః, కుంతలం, బాలం ఇవి ముందు జుట్టుకు పేర్లు. ప్రతికర్మ, ప్రసాధనం ఇవి అలంకరణకు పేర్లు.

ఆకల్పవేషౌ నేపథ్యం ప్రత్యక్షం ఖేలయోగజమ్ ।
చూడామణిః శిరోరత్నం తరలో హారమధ్యగః ॥26॥

ఆకల్పం, వేషం, నేపథ్యం ఇవి నాటకాదులలో ప్రత్యక్షంగా వేషం ధరించుట, చూడామణిః, శిరోరత్నం తలలోని మాణిక్యానికి పేర్లు. తరలం హారమధ్యంలోని మాణిక్యం.

కర్ణికా తాలపత్రం స్యాల్లంబనం స్యాల్లలంతికా ।
మంజీరః నూపురః పాదే కింకిణీ క్షుద్రఘంటికా ॥27॥

కర్ణిక, తాలపత్రం చెవికమ్మలపేర్లు. మంజీరం, నూపురం కాలి అందె పేర్లు. కింకిణి, క్షుద్రఘంటిక ఇవి చిరుగంటలకును, గజ్జెలకునుపేర్లు.

దైర్ఘ్యమాయామ ఆరోహః పరిణాహో విశాలతా ।
పటచ్చరం జీర్ణవస్త్రం సంవ్యానం చోత్తరీయకమ్ ॥28॥

దైర్ఘ్యం, ఆయామం, ఆరోహం ఇవి (వస్త్రాల) పొడుగుకు పేర్లు. పరిణాహం, అంటే వైశాల్యం, చిరిగిన బట్ట పేర్లు. పటచ్చరం, జీర్ణవస్త్రం. పైపంచెకు సంవ్యానం, ఉత్తరీయక మని పేర్లు.

రచనాస్యాత్పరిస్పంద ఆభోగః పరిపూర్ణతా ।
సముద్గకః సంపుటకః ప్రతిగ్రాహః పతద్గ్రహః ॥29॥

కూర్పునకు రచన. పరిస్పందం అనిపేర్లు. ఆభోగం, పరిపూర్ణత ఇవి నిండుదనానికి పేర్లు. సముద్గకం, సంపుటకం అంటే చిన్నపెట్టె (భరణి). ప్రతిగ్రాహం, పతద్గ్రహం ఉమ్మితొట్టికి (పాత్రకు) పేర్లు.

ఇత్యాది మహాపురాణే ఆగ్నేయే నృబ్రహ్మక్షత్రవిట్ శూద్రవర్గనిరూపణమ్
నామ చతుఃషష్ట్యధిక త్రిశతతమోఽధ్యాయః ॥364॥

అగ్నిమహాపురాణంలో మనుష్యవర్గ వర్ణనమనే
మూడువందల అరవైనాల్గవ అధ్యాయం సమాప్తం.



పంచషష్ట్యధిక త్రిశతతమోఽధ్యాయః - మూడువందల అరవైఅయిదవ అధ్యాయం

బ్రహ్మవర్గః - బ్రహ్మవర్గం

అగ్నిరువాచ - అగ్ని ఇలా వచించాడు.

వంశోఽన్వవాయో గోత్రం స్యాత్కులాన్యభిజనాన్వయౌ ।
మంత్ర వ్యాఖ్యాకృదాచార్య ఆదేష్టా త్వధ్వరే వ్రతీ ॥1॥

వంశం, అన్వవాయం, గోత్రం, కులం, అభిజనం, అన్వయం ఇవి వంశం పేర్లు, మంత్ర (మంత) వ్యాఖ్యానం చేసేవాడు ఆచార్యుడు. యజ్ఞంలో వ్రతదీక్ష గ్రహించినవాడు ఆదేష్ట.

యష్టా చ యజమానః స్యాజ్ జ్ఞాత్వారంభ ఉపక్రమః ।
సతీర్థ్యాశ్చైక గురవః సభ్యాః సామాజికా స్తథా ॥2॥

సభాసదః సభాస్తారా ఋత్విజో యాజకాశ్చ తే ।
అర్ధ్వర్యూద్గాతృహోతారో యజుః సామర్గ్విదః క్రమాత్ ॥3॥

యష్ట, యజమానుడు (యాగం చేసేవాడు) పర్యాయపదాలు, ఈప్రకారంగా సిద్ధించునని యుపాయము నెరింగి ప్రారంభించడం ఉపక్రమం అనబడుతుంది. సతీర్థ్యులు ఒకే గురువు కలవారు. సభ్యాః, సామాజికులు అనే పదాలును. సభాసదులు, సభాస్తారులు ఇవి సభలోని సభ్యులపేర్లు. యాగం చేయించేవారు ఋత్విక్కులు. అధ్వర్యువు యజుర్వేదం తెలిసిన ఋత్విక్కు, ఉద్గాత సామవేదం తెలిసిన ఋత్విక్కు, హోత ఋగ్వేదం తెలిసిన ఋత్విక్కు.

చషాలో యూపకటకః సమే స్థండిల చత్వరే ।
ఆమిక్షా సా శృతోష్ణే యా క్షీరే స్యాద్దధియోగతః ॥4॥

చషాలం, యూపకటకం అంటే యూపస్తంభంలోని వలయాకారకటకం. స్థండిలం, చత్వరం అంటే అగ్నిహోత్రాన్ని ఉంచుటకు సంస్కరింపబడిన స్థానం పేర్లు. ఆమిక్ష, శృతోష్ణ కాచిన పాలుతోడు పెట్టగా దాని నుంచి వచ్చిన నీరు.

పృషదాజ్యం సదధ్యాజ్యే పరమాన్నం తు పాయసమ్ ।
ఉపాకృతః పశు రసౌ యోఽభిమంత్ర్య క్రతౌహతః ॥5॥

పృషదాజ్యం అంటే పెరుగు కలిపిన నెయ్యి, పాయసం పరమాన్నం, యజ్ఞంలో అభిమంత్రించి చంపబడిన పశువుకు "ఉపాకృతం" అని పేరు.

పరంపరాకం శమనం ప్రోక్షణం చ వధార్థకమ్ ।
పూజా నమస్యాఽపచితిః సపర్యార్చార్హణాః సమాః ॥6॥

పరంపరాకం, శసనం (శమనం), ప్రోక్షణం, వధార్థకం ఇవి యజ్ఞంలో పశువధకు పేర్లు. పూజ, నమస్య అపచితి, సపర్య, అర్హణ ఇవి పూజా పర్యాయపదాలు.

వరివస్యా తు శుశ్రూషా పరిచర్యాఽప్యుపాసనమ్ ।
నియమో వ్రతమస్త్రీ తచ్చోపవాసాది పుణ్యకమ్ ॥7॥

వరివస్య, శుశ్రూష, పరిచర్య, ఉపాసనం ఇవి సేవార్థకాలు. నియమవ్రతం అదే శాస్త్రనియమం, ఉపవాసాది వ్రతం పుణ్యకం.

ముఖ్యః స్యాత్ప్రథమః కల్పోఽనుకల్పస్తు తతోఽధమః ।
కల్పే విధిక్రమౌ జ్ఞేయౌ వివేకః పృథగాత్మతా ॥8॥

ప్రధానమైనది ప్రథమమైనది ముఖ్యకల్పం. అధమమైనది అనుకల్పం, కల్పం, విధిః, క్రమం ఇవి వేదోక్త విధానం పేర్లు. వివేకం ప్రకృతి పురుషులను ఏర్పరచే జ్ఞానం.

సంస్కార పూర్వం గ్రహణం స్యాదుపాకరణం శ్రుతేః ।
భిక్షుః పరివ్రాట్ కర్మన్దీ పారాశర్యపి మస్కరీ ॥9॥

ఉపాకరణమ్=సంస్కారపూర్వకంగా వేదమును గ్రహించుట ఉపాకరణం. భిక్షువు, పరివ్రాట్టు, కర్మన్ది, పారాశరి, మస్కరి ఇవి సన్యాసి పేర్లు.

ఋషయః సత్యవచసః స్నాతకశ్చాప్లుతవ్రతీ ।
యే నిర్జితేంద్రియ గ్రామా యతినో యతయశ్చ తే ॥10॥

సత్యవాక్కు కలవారు ఋషులు. స్నాతకః, ఆప్లుత, వ్రతీ=వేదాధ్యయనం చేసిన పిమ్మట ఆశ్రమాంతరానికి వెళ్ళి వ్రతయుక్తుడై ఉండే వాడు స్నాతకుడు. ఈయనకే ఆప్లుతుడు, వ్రతి అని కూడా పేర్లు. ఇంద్రియనియమంతో ఇంద్రియ సమూహాలను జయించిన వారు యతులు.

శరీర సాధనాపేక్షం నిత్యం యత్కర్మ తద్యమః ।
నియమస్తు సయత్కర్మానిత్యమాగం తు సాధనమ్ ॥
స్యాద్బ్రహ్మభూయం బ్రహ్మత్వం బ్రహ్మసాయుజ్యమిత్యపి ॥11॥

శరీరాన్ని మాత్రమే సాధనంగా అపేక్షిస్తూ యావజ్జీవితం చేయదగిన సత్యం, అహింస, సంధ్యాదులు యమం. దీనిచేత పురుషుడు నియమింపబడును కాన అది నియమం. నిత్యం చేయాలి అనే నిర్బంధం లేకుండా చేసే తపఃస్వాధ్యాయదేవతా నమస్కారాదులు అనిత్యకర్మలు నియమం. బ్రహ్మభూయం, బ్రహ్మత్వం, బ్రహ్మసాయుజ్యం బ్రహ్మభావం పొందుట అనే దానిపేర్లు.

ఇత్యాది మహాపురాణే ఆగ్నేయే బ్రహ్మవర్గవర్ణనం నామ పంచషష్ట్యధిక త్రిశతతమోఽధ్యాయః ॥365॥

అగ్నిమహాపురాణంలో బ్రహ్మవర్గవర్ణనం అనే మూడువందల అరవైఅయిదవ అధ్యాయం సమాప్తం.



షట్ షష్ట్యధిక త్రిశతతమోఽధ్యాయః – మూడువందల అరవైఆరవ అధ్యాయం
క్షత్ర విట్ శూద్రవర్గాః – క్షత్ర విట్ శూద్రవర్గ వర్ణనం

అగ్నిరువాచ – అగ్ని ఇలా వచించాడు.

మూర్ధాభిషిక్తో రాజన్యో బాహుజః క్షత్రియో విరాట్ ।
రాజా తు ప్రణతాశేష సామంతః స్యాదధీశ్వరః ॥1॥

మూర్ధాభిషిక్తుడు, రాజన్యుడు, బాహుజుడు, క్షత్రియుడు, విరాట్టు క్షత్రియుని పేర్లు. సర్వసామంతులచేత నమస్కరింపబడే రాజు (అందరూ ఆయనకు వంగి నమస్కరిస్తారు) అధీశ్వరుడు.

చక్రవర్తీ సార్వభౌమో నృపోఽన్యో మండలేశ్వరః ।
మంత్రీ ధీసచివోఽమాత్యో మహామాత్రాః ప్రధానకాః ॥2॥

చక్రవర్తి, ఇవి రాజవంశీయుల పేర్లు. ఎందరో సామంతులు చేత నమస్కరింపబడే రాజు అధీశ్వరుడు చిన్న చిన్న ప్రాంతాలను పరిపాలించేవారు మండలేశ్వరులు. మంత్రి, ధీసచివుడు, అమాత్యుడు ఇవి మంత్రుల పేర్లు. ప్రధానుడైన అమాత్యుడు మహామాత్యుడు.

ద్రష్టరివ్యవహారాణాం ప్రాడ్వివాకాఽక్షదర్శకౌ ।
భౌరికః కనకాధ్యక్షోఽథాధ్యక్షాధికృతౌ సమౌ ॥3॥

ప్రాడ్వివాకుడు, అక్షదర్శకుడు, ఋణం, ఆదానం, వ్యయం, వ్యవహారం పరిశీలించే ధర్మాధికారి పేర్లు. భౌరికుడు సువర్ణాధ్యక్షుడు, అధ్యక్షుడు, అధికృతుడు ఒకదాని యందు అధికారం గలవాని పేర్లు.

అంతఃపురే త్వధికృతః స్యాదంతర్వంశికే జనః ।
సౌవిదల్లాః కంచుకినః స్థాపత్యాః సౌవిదాశ్చ తే ॥4॥

సౌవిదల్లుడు, కంచుకి, స్థాపతుడు, సౌవిదుడు ఇవి అంతఃపుర రక్షకుల పేర్లు.

షండో వర్షవరస్తుల్యాః సేవకార్థ్యనుజీవినః ।
విషయానంతరో రాజా శత్రుర్మిత్రమతఃపరమ్ ॥5॥

షండుడు, వర్షవరుడు అంతఃపురసేవకులు. అర్థి, అనుజీవి రాజుకొలువులోనివారు. తనరాజ్యానికి సరిహద్దులలో వుండే రాజు శత్రువు. ఆ రాజ్యానికి ఆవల ఉన్నవాడు మిత్రుడు.

ఉదాసీనః పరతరః పార్ష్ణిగ్రాహస్తు పృష్ఠతః ।
చరఃస్పశః స్యాత్ప్రణిధి రుత్తరకాల ఆయతిః ॥6॥

వానికి అవతల ఉండేవాడు ఉదాసీనుడు, వెనుక ఉండేవాడు పార్ష్ణిగ్రాహుడు, చరుడు, స్పశుడు, ప్రణిధి ఇవి గూఢచారి పేర్లు. భవిష్యత్కాలానికి ఆయతి అని పేరు.

తత్కాలస్తు తదాత్వం స్యాదుదర్కః ఫలముత్తరమ్ ।
అదృష్టం వహ్నితోయాది దృష్టం స్వపరచక్రజమ్ ॥7॥

తత్కాలం, తదాత్వం ఇవి వర్తమానకాలం పేర్లు, ఉదర్కం – ఉత్తరం ఫలమ్ ఇవి ముందు రాగల ఫలం పేర్లు. అగ్ని జలాదుల వలన పుట్టే భయానికి అదృష్టభయమని పేరు. రాజులకు తన బలం వలన, పగ వారి బలం వలన పుట్టిన భయం దృష్టభయం.

భద్రకుంభః పూర్ణకుంభో భృంగారః కనకాలుకా ।
ప్రభిన్నో గర్జితో మత్తో వమథుః కరశీకరః ॥8॥

భద్రకుంభం, పూర్ణకుంభం ఇవి రాజద్వారాలలో ఉండే పూర్ణకలశం పేర్లు. భృంగారం, కనకాలుక ఇవి సువర్ణమయమైన పాత్ర. ప్రభిన్నం, గర్జితం, మత్తం ఇవి మదించిన ఏనుగు. వమథువు, కరణీకరం ఇవి ఏనుగు తొండం నుండి వచ్చే తుంపరలు.

స్త్రియాం సృణిస్త్వంకుశోఽస్త్రీపరిస్తోమః కుథద్వయోః ।
కర్ణీరథః ప్రవహణం దోలాప్రేంఖాదికాస్త్రియామ్ ॥9॥

సృణి, అంకుశం ఇవి పర్యాయపదాలు. పరిస్తోమం, కుథం ఇవి ఏనుగుపై పరిచే కంబళి పేర్లు. కర్ణీరవం, ప్రవహణం స్త్రీలు ప్రయాణించే రథం పేర్లు. ఊయల పేర్లు దోల, ప్రేంఖ.

ఆధోరణా హస్తిపకా హస్త్యారోహా నిషాదినః ।
భటా యోధాశ్చ యోద్ధారః కంచుకో వారణోఽస్త్రియామ్ ॥10॥

ఆధోరణుడు, హాస్తిపకుడు, హస్త్యారోహుడు, నిషాది ఇవి మావటీవాని పేర్లు. భటులు. యోధులు ఇవి సైనికుల పేర్లు. వారణం, కంచుకం సమానార్థకాలు.

శీర్షణ్యం చ శిరస్త్రేఽథ తనుత్రం వర్మదంశనమ్ ।
ఆముక్తః ప్రతిముక్తశ్చ పినద్ధశ్చాపినద్ధవత్ ॥11॥

తలను రక్షించేది శీర్షణ్యం, శిరస్త్రం. శరీరాన్ని రక్షించేది వర్మ, దంశనం, ఆముక్తం, ప్రతిముక్తం పినద్ధం, అపినద్ధం ఇవి కట్టబడిన కవచం పేర్లు.

వ్యూహస్తు బలవిన్యాస శ్చక్రం చానీక మస్త్రియామ్ ।
ఏకేభైకరథా త్ర్యశ్వాపత్తిః పంచపదాతికా ॥12॥

వ్యూహం, చతురంగ బలాలను వాటికి తగిన స్థానంలో ఉంచుట, చక్రం. అనీకమంటే సేన. ఒక ఏనుగు, ఒక రథం, మూడు గుర్రములు, ఐదుగురు కాలిబంట్లు ఉన్నది 'పత్తి' అనబడుతుంది.

పత్త్యంగై స్త్రిగుణైః సర్వైః క్రమాదాఖ్యా యథోత్తరమ్ ।
సేనాముఖం గుల్మగణౌ వాహినీ పృతనా చమూః ॥13॥

పత్తిలోని అంగాలను మూడు రెట్లు ఉత్తరోత్తరంగా లెక్కిస్తే మూడు సేనాముఖం, గుల్మం, గణం, వాహిని, పృతనా, చమూః - అనే పేర్లు కలిగిన సేన ఏర్పడుతుంది.

అనీకినీ దశానికి న్యోఽక్షౌహిణ్యో గజాదిభిః ।
ధనుఃకోదండ ఇష్వాసౌ కోటిరస్యాటనీ స్మృతా ॥14॥

అనీకినీ అన్నా అదే సేనావిభాగం, అనగ మూడు పత్తులు ఒకసేనా ముఖం, మూడు సేనాముఖాలు ఒక గుల్మం. మూడు గుల్మాలు ఒక గణం. మూడు గణాలు ఒక వాహిని. మూడు వాహినులు ఒక పృతన. మూడు పృతనలు ఒక చమువు. మూడు చమువులు ఒక అనీకిని. గజములు మొదలగు సకలాంగాలతో కూడిన పది అనీ- కులసేనను ఒక అక్షౌహిణి అంటారు. ఏనుగులు 1, 3, 9, 27, 81, 243, 729, 2187, 21870=ఏనుగులు అని అర్థం. ఈ విధంగా మిగిలినవి లెక్కించాలి. ధనుస్సు, కోదండం, ఇష్వాసం ఇవి వింటిపేర్లు. వింటికొప్పుకు అటని అనిపేరు.

లస్తకస్తు ధనుర్మధ్యం మౌర్వీ జ్యా సింజినీ గుణః ।
పృషత్కబాణవిశిఖా అజిహ్మగ ఖగాశుగాః ॥15॥

లస్తకమంటే ధనుర్మధ్యం. మౌర్వి, జ్యా, సింజిని, గుణం వింటినారి పేర్లు. పృషత్కం, బాణం, విశిఖం, అజిహ్మగం, ఖగం, ఆశుగం అమ్మునకు పేర్లు.

తూణోపాసంగతూణీర నిషంగా ఇషుధిర్ద్వయోః ।
అసిర్ ఋష్టిశ్చ నిస్త్రింశః కరవాలః కృపాణవత్ ॥16॥

తూణం, ఉపాసంగం, తూణీరం, నిషంగం, ఇషుధి ఇవి అంబులపొది పేర్లు, అసి, ఋష్టి, నిస్త్రింశం, కరవాలం, కృపాణం కత్తిపేర్లు.

త్సరుఃఖడ్గస్య ముష్టిః స్యాదీలీ తు కరపాలికా ।
ద్వయోః కుఠారః స్వధితిః ఛురికా చాసిపుత్రికా ॥17॥

త్సరువంటే కత్తి పిడి. ఈలి, కరపాలిక తులువకత్తి పేర్లు. కుఠారం స్వధితి గండ్రగొడ్డలి పేర్లు. ఛురిక, అసిపుత్రి ఇవి చురకత్తి పేర్లు.

ప్రాసస్తు కుంతో విజ్ఞేయః సర్వలా తోమరోఽస్త్రియామ్ ।
వైతాలికా బోధకరా మాగధా వన్దిన స్తుతౌ ॥18॥

ప్రాసం, కుంతం ఈటె (బల్లెం)పేర్లు. సర్వల, తోమరం, చిల్లకోలపేర్లు. వైతాలికులు, బోధకరులు ఇవి రాజులను మేలు కొలుపు పాఠకుల పేర్లు. మాగధులు వంశావలి చదువు వారి పేర్లు, పరాక్రమాలను స్తుతించేవారు వందులు.

సంశప్తకాస్తు సమయాత్సంగ్రామాదనివర్తినః ।
పతాకా వైజయంతీ స్యాత్కేతనం ధ్వజ మస్త్రియామ్ ॥19॥

ప్రతిజ్ఞ చేసి (రణరంగం ప్రవేశించి) ఎట్టి స్థితిలోనూ వెనుదిరగని వారు సంశప్తకులు. పతాక వైజయన్తి చిన్న జెండా పేర్లు. ధ్వజం పెద్దజెండా.

అహం పూర్వమహంపూర్వమిత్యహంపూర్వికాస్త్రియామ్ ।
అహమహమికా సా స్యాదోఽహంకారః పరస్పరమ్ ॥20॥

నేను ముందు, నేను ముందు అని చెప్పుట అహంపూర్విక. నేనే సమర్థుడును, నేనే సమర్థడను అనే అహంకారంతో పరస్పరం పలుకుట అహమహమిక.

శక్తిః పరాక్రమః ప్రాణః శౌర్యం స్థానసహోబలమ్ ।
మూర్ఛా తు కశ్మలం మోహోఽప్యవమర్దస్తు పీడనమ్ ॥21॥

శక్తిం. పరాక్రమం, ప్రాణం, శౌర్యం, స్థాన, సహం, బలం ఇవి బలిమి పేర్లు. మూర్ఛ, కశ్మలం, మోహం ఇవి సొమ్మసిల్లుటకు పేర్లు. అవమర్దం, పీడనం నొప్పించుటకు పేర్లు.

అభ్యవస్కందనం త్వభ్యాసాదనం విజయో జయః ।
నిర్వాసనం సంజ్ఞపనం మారణం ప్రతిఘాతనమ్ ॥22॥

అభ్యవస్కందనం, అభ్యాసాదనం అనగా శత్రువును ఆక్రమించుట. విజయం, జయం అంటే గెలుపు. నిర్వాసనం, సంజ్ఞపనం, మారణం, ప్రతిఘాతనం ఇవి చంపుటకు పేర్లు.

స్యాత్పంచతా కాలధర్మో దిష్టాంతః ప్రలయోఽత్యయః ।
విశో భూమిస్పృశో వైశ్యావృత్తిర్వర్తన జీవనే ॥23॥

పంచత్వం, కాలధర్మం, దిష్టాంతం, ప్రలయం, అత్యయం ఇవి మరణానికి పేర్లు. విట్టు, భూమిస్పృట్టు, వైశ్యుడు ఇవి వాణిజ్య జీవికి పేర్లు. వృత్తి, వర్తనం, జీవనం ఇవి బ్రతుకుతెరువు పేర్లు.

కృష్యాది వృత్తయో జ్ఞేయాః కుసీదం వృద్ధిజీవికా ।
ఉద్ధారోఽర్థప్రయోగః స్యాత్కణిశం సస్యమంజరీ ॥24॥

కృష్యాది వృత్తులు వైశ్యుల జీవనోపాయాల పేర్లు, (దున్నుట, పశుపాలనం, వాణిజ్యం). కుసీదమంటే వృద్ధి రూపమైన జీవనోపాయం (వడ్డీవ్యాపారం పేర్లు). ఉద్ధారం, అర్థప్రయోగం అంటే వడ్డీకి ధనమిచ్చుట, కణిశం సస్యముల పై వెన్ను కణిశం.

కింశారుః సస్యశూకం స్యాత్స్తంబగుచ్ఛస్తృణాదినః ।
ధాన్యం వ్రీహిః స్తంబకరిః కడఙ్గరో బుసం స్మృతమ్ ॥25॥

కింశారు వంటే సస్యముల ముల్లు. స్తంబం, గుచ్ఛం అంటే తృణాదుల గుచ్ఛం. వ్రీహి, స్తంబకరి ఇవి ధాన్యానికి పేర్లు. ధాన్యపుపొల్లును కడంగరం, బుసం అంటారు.

మాషాదయః శమీధాన్యే శూకధాన్యే యవాదయః ।
తృణధాన్యాని నీవారాః శూర్పం ప్రస్ఫోటనం స్మృతమ్ ॥26॥

మాషం మున్నగునవి శమీధాన్యమని, యవాదులు శూకధాన్యమని, నీవారములు తృణధాన్యమని చెప్పబడతాయి. చేటకు శూర్పం, ప్రస్ఫోటనమని పేర్లు.

స్యూతప్రసేకా కండోల పిటౌ కట కిలింజకౌ ।
సమానౌ రసవత్యాం తు పాకస్థానమహానసే ॥27॥

స్యూతం, ప్రసేకం ఇవి అల్లిన సెజ్జపేర్లు. కండోలకం, పిటం ఇవి గంపపేర్లు. కటం, కిలింజకం ఇవి చాప పేర్లు. రసవతి, మహానసం, పాకస్థానం ఇవి వంటయింటి పేర్లు.

పౌరోగవస్తదధ్యక్షః సూపకారాస్తు వల్లవాః ।
ఆరాలికా ఆంధసికాః సూదా ఔదనికా గుణాః ॥28॥

వంట ఇంటికి అధ్యక్షుడు పౌరోగవుడు. సూపకారుడు, వల్లవుడు, ఆరాలికుడు, ఆంధసికుడు, ఔదనికుడు, గుణుడు ఇవి వంటవాని పేర్లు.

క్లీబేఒమ్బరీషం భ్రాష్ట్రోనా కర్కర్యాలుర్గలంతికా ।
ఆలింజరః స్యాన్మణికం సుషవీ కృష్ణజీరకే ॥29॥

అంబరీషం భ్రాష్ట్రం ఇవి మంగలం పేర్లు, కర్కరి అంటే జలధారలను చల్లునది, ఆలువంటే నీళ్లు పట్టునది, గళంతిక కత్తిపీట, కర్కరీ, ఆలుః, గలంతికా మూడు సమానార్థాలు ఇచ్చేవని కొందరు, గళంతిక అంటే నీళ్లు కార్చే కుండ అని కొందరు, ఆలింజరం, మణికం ఇవి కాగు పేర్లు, సుషవి, కృష్ణజీరకం ఇవి నల్లజీలకర్ర పేర్లు.

ఆరనాలస్తు కుల్మాషం బాహ్లీకం హింగు రామఠమ్ ।
నిశాహరిద్రా పీతాస్త్రీ ఖండే మత్స్యండిఫాణితే ॥30॥

ఆరనాలం, కుల్మాషం అంటే పులియబెట్టిన కడుగు నీళ్లు (గంజి); బాహ్లీకం, హింగువ, రామఠం ఇవి ఇంగువ పేర్లు; నిశం, హరిద్ర, పీత ఇవి పసుపు పేర్లు; మత్స్యండి, ఫాణితం ఇవి ఖండశర్కర పేర్లు.

కూర్చికాక్షీరవికృతిః స్నిగ్ధం మసృణ చిక్కణమ్ ।
పృథుకః స్యాచ్చిపిటకో ధానా భృష్టయవాః స్త్రియామ్ ॥31॥

కూర్చిక అంటే మీగడ స్నిగ్ధం, మసృణం, చిక్కణం ఇవి మిసి దనానికి పేర్లు. పృథకం, చిపిటకం అంటే అటుకులు ధానాలు అంటే బొరుగులు.

జేమనం లేహ ఆహారో మాహేయీ సౌరభీ చ గౌః ।
యుగాదీనాం చ వోఢారో యుగ్యప్రాసంగ్య శాకటాః ॥32॥

జేమనం, లేహం ఇవి భోజనం పేర్లు. మాహేయి, సౌరభి ఇవి ఆవు పేర్లు. యుగ్యం, ప్రాసంగ్యం, శాకటం అనే పదాలు బండిలాగే ఎద్దులకు పేర్లు.

చిరప్రసూతా బష్కయణీ ధేనుః స్యాన్నవసూతికా ।
సంధినీ వృషభాక్రాన్తా వేహద్గర్భోపఘాతినీ ॥33॥

బష్కయణీ అంటే చాలాకాలం క్రితం ఈనిన ఆవు (తరపి యావు); ధేను వంటే క్రొత్తగా ఈనిన ఆవు; సంధిని అంటే వృషభంతో కలిసిన ఆవు; వేహత్ అంటే గర్భం పోయిన (ఈడ్చుకు పోయిన) ఆవు;

పణ్యాజీవో హ్యాపణికో న్యాసశ్చోపనిధిః పుమాన్ ।
విపణో విక్రయః సంఖ్యా సంఖ్యేయే హ్యాదశ త్రిషు ॥34॥

వ్యాపారికి పణ్యాజీవుడు, ఆపణికుడు అనిపేర్లు. ఎవరైనా దాచటానికై ఇచ్చినది న్యాసం, ఉపనిధి. ఒకటి నుండీ పద్దెనిమిది వరకు (ఆదశ) సంఖ్యావాచక పదాలు లెక్కపెట్ట దగిన వస్తువు లకు వర్తిస్తాయి. మూడులింగాలలోనూ ఉంటాయి.

వింశత్యాద్యాః సదైకత్వే సర్వాః సంఖ్యేయ సంఖ్యయోః ।
సంఖ్యార్థే ద్విబహుత్వే స్త స్తాసు చానవతేః స్త్రియః ॥35॥

వింశతి వరకు అన్ని సంఖ్యావాచకాలు సంఖ్యేయ సంఖ్యార్థాలలో నిత్యఏక వచనాంతములో ఉంటాయి. (ఏకోనవింశతి శబ్దాన్ని కూడ గ్రహించాలి). ఆ శబ్దాలు బహు వస్తువులు చెప్పేవి. అయినా ఏకవచనాంతంగానే ఉంటాయి. ఉదాహరణం:- వింశతిర్గావః, గవాం వింశతిః, అవి సంఖ్యాంతరానికి వాచ్యాలయితే ద్వివచన బహువచనాంతాలు అవుతాయి గవాం ద్వే వింశతీ, గవాం తిస్రో వింశతయః ఇత్యాదులు; వింశతి మొదలు నవతి వరకు విశేష్యాలయితే స్త్రీలింగాలే, వింశత్యా పురుషైః, వింశత్యా స్త్రీభిః, వింశత్యా బ్రాహ్మకులైః - ఇత్యాదులు;

పంక్తేః శతసహస్రాది క్రమాద్దశ గుణోత్తరమ్ ।
మానం తులాంగులి ప్రస్థైర్గుంజాః పంచాద్యమాషకః ॥36॥

పంక్తి (పది) మొదలు, శతం (వంద), సహస్రం (వేయి) మున్నగునవి క్రమంగా పదేసి రెట్లు ఉంటాయి. తులా, అంగులి, ప్రస్థములతో చేయబడే మానం మూడు విధాలుగా ఉంటుంది. (త్రాసు, అంగుళం, తూము), అయిదు గురిగింజలు ఎత్తు ఒక మాషం;

తే షోడశాక్షః కర్షో౽స్త్రీ పలం కర్షచతుష్టయమ్ ।
సువర్ణ బిస్తౌ హేమ్నో౽క్షే కురువిస్తస్తు తత్పలే ॥37॥

పదహారు మాషాలు ఒక అక్షం లేదా కర్షం. నాలుగు కర్షాలు ఒక పలం; ఒక అక్షం బంగారానికి సువర్ణం, బిస్తం అని పేరు; ఒక పలం సువర్ణం కురువిస్తం.

తులా స్త్రియాం పలశతం భారః స్యాద్వింశతిస్తులాః ।
కార్షాపణః కార్షికః స్యాత్కార్షికే తామ్రికే పణః ॥38॥

నూరు పలాలు ఒక తులం (స్త్రీ); ఇరవై తులలు ఒక భారం. వెండి రూపాయకు కార్షాపణం, కార్షికం అని పేర్లు. (కర్షం ఎత్తు గల వెండి చేత చేయబడిన టంకమందు ఈ శబ్దాలు వర్తిస్తాయి). రాగి పైసకు పణమని పేరు (కర్షమెత్తురాగి ముద్ర);

ద్రవ్యం విత్తం స్వాపతేయం రిక్థమృక్థం ధనం వసు ।
రీతిః స్త్రియామారకూటో న స్త్రియామథ తామ్రకమ్ ॥39॥

ద్రవ్య, విత్త, స్వాపతేయ, రిక్థ, ఋక్థ, ధన, వసు శబ్దాలు ధన వాచకాలు. రీతి, ఆరకూటం (పుం) ఇత్తడి పేర్లు. తామ్రకం అనేది (తర్వాతి శ్లోకంలో కొనసాగింపు).

శుల్బమౌదుంబరం లోహే తీక్ష్ణం కాలాయసాయసీ ।
క్షారః కాచోఽథ చపలో రసః సూతశ్చ పారదే ॥40॥

శుల్బం, ఔదుంబరం అనేవి రాగిపేర్లు; లోహం, తీక్ష్ణం, కాలాయసం, అయము ఇవి ఇనుము పేర్లు. క్షారం, కాచం ఇవి గాజు పేర్లు. చపలం, రసం, సూతం, పారదం ఇవి పాదరసం పేర్లు.

గరళం మాహిషం శృంగం త్రపు సీస కపిచ్చటమ్ ।
(హి) డిండీరోఽబ్ధికఫః ఫేనో మధూచ్ఛిష్టం తు సిక్థకమ్ ॥41॥

గరళం (గవలం), మాహిషం శృంగం,=ఇనుప కొమ్ముపేరు (ఆవులను అడ్డగించేది); త్రపు, సీసం, పిచ్చటం ఇవి సీసంపేర్లు. డిండీరం, అబ్ధికఫం, ఫేనం ఇవి నురుగు పేర్లు. మధూచ్ఛిష్టం, సిక్థకం ఇవి మైనం పేర్లు.

రంగవంగే పిచుస్తూలో కులటీ తు మనఃశిలా ।
యవక్షారశ్చ పాక్యః స్యాత్త్వక్ క్షీరా వంశలోచనా ॥42॥

రంగం, వంగం అనేవి తగరం పేర్లు. పిచు, తూలం అంటే దూది. మణిశిల, కులటి అంటే మనశ్శిల. యవక్షారం, పాక్యం ఇవి అంటంప్పు పేర్లు. త్వక్ క్షీర వంశలోచన ఇవి వెదురుపాలకు పేర్లు.

వృషలా జఘన్యజాః శూద్రాశ్చాండాలాన్త్యాశ్చ సంకరాః ।
కారుఃశిల్పీ సంహతైస్తైర్ద్వయోః శ్రేణిః సజాతిభిః ॥43॥

వృషలులు, జఘన్యజులు, శూద్రులు ఇవి శూద్రుల పేర్లు. చండాలురు, అంత్యజులు వర్ణసంకరులకు పేర్లు. కారువు, శిల్పి ఇవి శిల్పి కార్మికుని పేర్లు, శిల్పుల సంఘం శ్రేణి.

రంగాజీవశ్చిత్రకరస్త్వష్టా తక్షా చ వర్ధకిః ।
నాడింధమః స్వర్ణకారో నాపితాన్తావసాయినః ॥44॥

రంగాజీవుడు, చిత్రక ఇవి చిత్తరువు వ్రాయువాని పేర్లు. త్వష్ట, తక్ష, వర్ధకి ఇవి వడ్రంగి పేర్లు. నాడింధముడు, స్వర్ణకారుడు ఇవి కంసాలిపేర్లు, నాపితుడు, అన్తావసాయి ఇవి మంగలి పేర్లు.

జాబాలః స్యాదజాజీవో దేవాజీవస్తు దేవలః ।
జాయాజీవాస్తు శైలూషా భృతకో భృతిభుక్ తథా ॥45॥

జాబాలుడు, అజాజీవుడు ఇవి మేకల కాపరి పేర్లు. దేవాజీవుడు దేవలుడు, ఇవి అర్చకుల పేర్లు. భార్య(ల)తో కలిసి నాటకాలు ఆడేవాడు శైలూషుడు. రోజుకూలి పేరు భృతకుడు.

వివర్ణః పామరో నీచః ప్రాకృతశ్చ పృథగ్జనః ।
నిహీనోఽపసదో జల్మో భృత్యే దాసేరచేటకాః ॥46॥

వివర్ణుడు, పామరుడు, నీచుడు, ప్రాకృతుడు, పృథగ్జనుడు, నిహీనుడు, అపసదుడు, జల్ముడు ఇవి నీచ వాచకాలు. భృత్యుడు, దాసేరుడు, చేటకుడు ఇవి సేవకుల పేర్లు.

పటుస్తు పేశలో దక్షో మృగయుర్లుబ్ధకః స్మృతః ।
చాండాలస్తు దివాకీర్తిః పుస్తంలేప్యాది కర్మణి ॥47॥

పటువు, పేశలుడు, దక్షుడు ఇవి నేర్పరికి పేర్లు. మృగయుడు, లుబ్ధకుడు ఇవి వేటగాని పేర్లు. చాండాలుడు, ,దివాకీర్తి ఇవి సమానార్థంలో ప్రయోగింపబడతాయి. పుస్తమంటే మైపూతల పని.

పంచాలికా పుత్రికా స్యాద్వర్కర స్తరుణః పశుః ।
మంజూషా పేటకః పేటా తుల్యసాధారణౌ సమౌ ॥48॥

పంచాలిక, పుత్రిక ఇవి బొమ్మల పేర్లు. వయస్సులోనున్న పశువు (కోడె) వర్కరం. మంజూష, పేటకం, పేట ఇవి పెట్టెకు పేర్లు. తుల్యం, సాధారణం, సమం ఇవి పర్యాయపదాలు.

ప్రతిమా స్యాత్ప్రతికృతిర్వర్గాః బ్రహ్మాదయః స్మృతాః ॥49॥

ప్రతిమ అంటే ప్రతికృతి ఈ రీతిగా బ్రాహ్మణాది వర్గాలు వివరింపబడ్డాయి.

ఇత్యాది మహాపురాణే ఆగ్నేయే క్షత్రవిట్ శూద్రవర్గనిరూపణం నామ షట్ షష్ట్యధిక త్రిశతతమోఽధ్యాయః ॥366॥

అగ్నిమహాపురాణంలో క్షత్ర, విట్, శూద్ర, వర్గవర్ణనమనే మూడువందల అరవైఆరవ అధ్యాయం సమాప్తం.



సప్తషష్ట్యధిక త్రిశతతమోఽధ్యాయః – మూడువందల అరవైఏడవ అధ్యాయం

సామాన్య నామలింగాని – సామాన్య నామలింగ వర్ణనం

అగ్నిరువాచ – అగ్ని ఇలా చెప్పాడు.

సామాన్యాన్యథ వక్ష్యామి నామలింగాని తచ్ఛృణు ।
సుకృతీ పుణ్యవాన్ ధన్యో మహేచ్ఛస్తు మహాశయః ॥1॥

మునివరా! ఇపుడు సామాన్య నామలింగాలను చెబుతాను వినవలసింది. సుకృతి, పుణ్యవంతుడు, ధన్యుడు ఇవి పుణ్యాత్ముని పేర్లు. మహేచ్ఛుడు. మహశయుడు ఇవి సమానార్థకాలు.

ప్రవీణ నిపుణాభిజ్ఞ విజ్ఞనిష్ణాత శిక్షితాః ।
స్యుర్వదాన్యస్థూలలక్షదానశౌండా బహుప్రదే ॥2॥

ప్రవీణుడు, నిపుణుడు, అభిజ్ఞుడు, విజ్ఞుడు, నిష్ణాతుడు, శిక్షితుడు ఇవి నేర్పరి పేర్లు. వదాన్యుడు, స్థూలలక్షుడు, దానశౌండుడు, బహుప్రదుడు ఇవి మిక్కిలిగా దానం చేసేవారి పేర్లు.

కృతీ కృతజ్ఞః కుశల ఆసక్తోద్యుక్త ఉత్సుకః ।
ఇభ్యఆఢ్యః పరివృఢో హ్యధిభూర్నాయకోఽధిపః ॥3॥

కృతి, కృతజ్ఞుడు, కుశలుడు ఇవి నేర్పరి పేర్లు. ఆసక్తుడు, ఉద్యుక్తుడు, ఉత్సుకుడు ఇవి ఆసక్తిగలవాని పేర్లు. ధనవంతునికి ఇభ్యుడు, ఆఢ్యుడు అని పేర్లు. పరివృఢుడు, అధిభువు, నాయకుడు, అధిపుడు ఇవి ఏలిక పేర్లు.

లక్ష్మీవాంల్లక్ష్మణః శ్రీలః స్వతంత్రః స్వైర్యపావృతః ।
ఖలపూఃస్యాద్బహుకరో దీర్ఘసూత్రశ్చిరక్రియః ॥4॥

లక్ష్మీవంతుడు లక్ష్మణుడు, శ్రీలుడు ఇవి సంపన్నుని పేర్లు. స్వతంత్రుడు, స్వైరం, అపావృతుడు ఇవి స్వతంత్రుని పేర్లు. ఖలపువు, బహుకరుడు ఇవి కళ్ళెం శుభ్రం చేసేవాడి పేర్లు. దీర్ఘసూత్రుడు. చిరక్రియుడు ఆలస్యం చేసేవాడు.

జాల్మోఽసమీక్ష్యకారీ స్యాత్కుంఠో మందః క్రియాసు యః ।
కర్మశూరః కర్మఠః స్యాద్భక్షకో ఘస్మరోఽద్మరః ॥5॥

జాల్ముడు, అసమీక్ష్యకారి అంటే ఆలోచన లేకుండా పని చేసేవాడు. కుంఠుడు పనులలో తడబడేవాడు. కర్మఠుడు కర్మ శూరుడు. భక్షకుడు, ఘస్మరుడు, అద్మరుడు అంటే తిండిపోతు.

లోలుపో గర్ధలో గృధ్నుర్వినీత ప్రశ్రితౌ తథా ।
ధృష్టే ధృష్ణుర్వియాతశ్చ నిభృతః ప్రతిభాన్వితే ॥6॥

లోలుపుడు, గర్ధలుడు, గృధ్నువు ఇవి లోభిపేర్లు. వినయవంతుడు, వినీతుడు, ధృష్ణువు, ధృష్టుడు, వియాతుడు ఇవి దిట్టరి పేర్లు. ప్రతిభావంతుడు, విభృతుడు, ప్రగల్భుడు ఇవి సమానార్థక పదాలు.

ప్రగల్భో భీరుకో భీరుర్వందారురభివాదకే ।
భూష్ణుర్భవిష్ణుర్భవితా జ్ఞాతా విదుర విందుకౌ ॥7॥

భీరుడు, భీరుకుడు పిరికివాళ్ళు. మ్రొక్కేవాడు వందారువు. భూష్ణువు, భవిష్ణువు, భవిత ఇవి స్థితాశీలం కల వాడి పేర్లు. జ్ఞానికి విదురుడు విందుకుడని పేర్లు.

మత్తశౌండోత్కటక్షీబాశ్చండస్త్వ త్యంతకోపనః ।
దేవా నంచతి దేవద్రజ్ విష్వద్ర్యజ్ విష్వగంచతి ॥8॥

మత్తుడు, శౌండుడు, ఉత్కటుడు, క్షీబుడు ఇవి మత్తెక్కినవాని పేర్లు. కోపశీలుడు, చండుడు, కోపగించుకునే వాని పేర్లు. దేవద్రక్కు దేవతలను పూజించేవాడు, అంటా తిరిగేవాడు విష్వద్ర్యక్కు

యః సహాంచతి సధ్రజ్ స సతిర్యజ్ యస్తిరోంచతి ।
వాచోయుక్తి పటుర్వాగ్మీ వావదూకోఽ తివక్తరి ॥9॥

తోడనడిచేవాడు సధ్రక్కు. అడ్డంగా నడిచేవాడు తిర్యక్కు. మాటలు నేర్పుగలవాడు వాగ్మి. అతిగా మాట్లాడేవాడు వావదూకుడు.

స్యాజ్జల్పాకస్తు వాచాలో వాచాటో బహుగర్హ్యవాక్ ।
అపధ్వస్తో ధిక్కృతః స్యాద్బద్ధే కీలిత సంయతౌ ॥10॥

జల్పాకుడు, వాచాలుడు, వాచాటుడు ఇవి అడ్డదిడ్డంగా మాటాడే వాడి పేర్లు. ధిక్కరించినవాడు, అపధ్వస్తుడు. కీలితుడు, సంయతుడు ఇవి బద్ధుని పేర్లు.

(రవణః) వరణః శబ్దనో నాందీవాదీ నాందీకరః సమౌ!
వ్యసనార్తోపరక్తౌ ద్వౌ విహస్తవ్యాకులౌ సమౌ ॥11॥

రవణుడు, వరణుడు, ధ్వనిచేసే వాళ్ళు నాందీవాది, నాందీకరుడు ఇవి నాటకారంభంలో మంగళగీతం పాడేవాని పేర్లు. వ్యసనార్తుడు, ఉపరక్తుడు ఈ రెండూ అతిగా ఆసక్తి చూపేవానికి పేర్లు. విహస్తుడు, వ్యాకులుడు ఇవి కలతబడినవాని పేర్లు.

విహస్త వ్యాకులౌ తుల్యౌ నృశంసక్రూరఘాతుకాః ।
పాపో ధూర్తో వంచకః స్యాన్మూర్ఖే వైధేయ బాలిశౌ ॥12॥

విహస్తుడు, వ్యాకులుడు సమానార్థకాలు. నృశంసుడు, ఘాతుకుడు, పాపుడు ఇవి క్రూరుని పేర్లు, ధూర్తుడు వంచకుడు. వైధేయుడు, బాలిశుడు ఇవి మూర్ఖుని పేర్లు.

కదర్యే కృపణక్షుద్రౌ మార్గణో యాచకార్థినౌ ।
అహంకారవానహంయుః (స్యా) చ్ఛుభయుంస్తు శుభాన్వితః ॥13॥

కదర్యుడు, కృపణుడు, క్షుద్రుడు ఇవి లోభికి పేర్లు. మార్గణుడు, యాచకుడు, అర్థి భిక్షుకుని పేర్లు. అహంయువు అంటే అహంకారి శుభంయువు అంటే శుభాస్పదుడు.

కాంతం మనోరమం రుచ్యం హృద్యాభీష్టే హ్యభీప్సితే ।
అసారం ఫల్గుశూన్యం వై ముఖ్యవర్యవరేణ్యకాః ॥14॥

కాంతం, మనోరమం, రుచ్యం ఇవి సుందరమైన దానికి పేర్లు. ప్రియమైనది హృద్యం, అభీష్టం, అభీప్సితం. అసారం ఫల్గువు, శూన్యం ఇవి నిస్సారమైన వాని పేర్లు ముఖ్యుడు, వర్యుడు, వరేణ్యుడు ఇవి ముఖ్యుని పేర్లు.

శ్రేయాన్ శ్రేష్ఠః పుష్కలఃస్యాత్ ప్రాగ్ర్యాగ్ర్యాగ్రీయమగ్రియమ్ ।
వడ్రోరువిపులం పీనపీవ్నీ తు స్థూలపీవరే ॥15॥

శ్రేయాన్, శ్రేష్ఠవాచకాలు. ప్రాగ్ర్య, అగ్రీయ, అగ్రియ శబ్దాలు కూడా శ్రేష్ఠతావాచకాలే. వడ్రం, ఉరువు, విపులం ఇవి విశాలార్థకాలు. పీనం, పీవనం, స్థూలం, పీవరం శబ్దాలు బలిసి ఉన్న అనే అర్థాన్ని ఇచ్చేవి.

స్తోకాల్పక్షుల్లకాః సూక్ష్మం శ్లక్ష్ణం దభ్రం కృశం తను ।
మాత్రా కుటీ లవ కణా భూయిష్ఠం పురుహం పురు ॥16॥

స్తోకం, అల్పం, క్షుల్లకం, సూక్ష్మం, శ్లక్ష్ణం, దభ్రం, కృశం, తనువు, మాత్ర, కుటి, లవం, కణం ఈ శబ్దాలు అల్పమైన అనే అర్థాన్నిచ్చేవి. భూయిష్టం, పురుహం, పురువు ఇవి అధికార్థాన్ని ఇచ్చే పదాలు.

అఖండం పూర్ణసకలముపకంఠాన్తికాభితః ।
సమీపే సన్నిధ్యభ్యాశౌ నేదిష్ఠం సుసమీపకమ్ ॥17॥

అఖండం, పూర్ణం, సకలం ఇవి పర్యాయపదాలు, ఉపకంఠం, అన్తికం, అభితం, సన్నిధి, అభ్యాశం, నేదిష్ఠం, సుసమీపకమ్ ఇవి సమీపం అనే అర్థాన్ని ఇచ్చేపదాలు, నేదిష్ఠం అనగా మిక్కిలి సమీపం అని అర్థం.

సుదూరే తు దవిష్ఠం స్యాద్వృత్తం నిస్తలవర్తులే ।
ఉచ్చప్రాంశూన్నతోదగ్రా ధ్రువో నిత్యః సనాతనః ॥18॥

దవిష్ఠం బాగా దూరంగా ఉన్నవి. గుండ్రనిది వృత్తం, నిస్తలం, వర్తులం, ఉచ్చం, ప్రాంశువు, ఉన్నతం, ఉదగ్రం ఇవి పొడవైన అనే అర్థాన్నిచ్చేవి. ధ్రువ, సవాతన శబ్దాలునిత్యార్థకాలు

ఆవిద్ధం కుటిలం భుగ్నం వేల్లితం వక్రమిత్యపి ।
చంచలం తరలం చైవ కఠోరం జఠరం దృఢమ్ ॥19॥

ఆవిద్ధం, కుటిలం, భుగ్నం, వేల్లితం, వక్రం ఇవి వంకరయైన దానిపేర్లు. చంచలం, తరలం ఇవి కదిలే దానిపేర్లు. కఠోరం, జఠరం, దృఢం వీటికి గట్టిదనం అర్థం;

ప్రత్యగ్రోఽభినవో నవ్యో నవీనో నూతనో నవః ।
ఏకతానోఽనన్యవృత్తిరుచ్చండమవిలంబితమ్ ॥20॥

ప్రత్యగ్రం, అభినవం, నవ్యం, నవీనం, నూతనం, నవం ఇవి క్రొత్తదాని పేర్లు. ఏకతానుడు ఏకాగ్రత గలవాడు. ఉచ్చండం, అవిలంబితం అంటే తొందరగా అని అర్థం.

ఉచ్చావచం నైకభేదం సంబాధకలిలం తథా ।
తిమితం స్తిమితం క్లిన్నమభియోగస్త్వభిగ్రహః ॥21॥

అనేక భేదాలు గలది ఉచ్చావచం, సంబాధం, కలిలం ఇరుకు అని అర్థం. తడిసిన అనే అర్థంలో తిమితం, స్తిమితం, క్లిన్నం పదాలు. అభియోగం, అభిగ్రహం ఇవి ఆరోపించుటకు పేర్లు.

స్ఫాతిర్వృద్ధౌ ప్రథాఖ్యాతౌ సమాహారః సముచ్చయః ।
అపహారస్త్వపచయో విహారస్తు పరిక్రమః ॥22॥

స్ఫాతిః=వృద్ధి; ప్రథా, ఖ్యాతిః=ప్రసిద్ధి; సమాహారః, సముచ్చయః=సమూహం, అపహారః, అపచయః=తగ్గిపోవుట, విహారః, పరిక్రమః=విహరించుట; ఆయా పదాలు ఆయా అర్థాలలో వినియోగపడతాయి.

ప్రత్యాహార ఉపాదానం నిర్హారోఽభ్యవకర్షణమ్ ।
విఘ్నోఽంతరాయః ప్రత్యూహః స్యాదాస్యా త్వాసనాస్థితిః ॥23॥

ఇంద్రియాలను విషయాల నుండి మరలించటం ప్రత్యాహారం లేదా ఉపాదానం. నిర్హారం, అభ్యవకరణం ఇవి లాగివేయుట అనే అర్థంలో. అంతరాయం, ప్రత్యూహం విఘ్నానికి పేర్లు. అస్య, ఆసన, స్థితి, ఇవి కూర్చుండుటకు పేర్లు.

సన్నిధిః సన్నికర్షః స్యాత్సంక్రమో దుర్గసంచరః ।
ఉపలంభస్త్వనుభవః ప్రత్యాదేశో నిరాకృతిః ॥24॥

దగ్గరగా ఉండటానికి సన్నిధి, సన్నికర్షం అని పేర్లు. సంక్రమం, దుర్గసంచరం ఇవి కోటలో ప్రవేశించటానికి పేర్లు. ఉపలంభము, అనుభవం అనుభూతికి పేర్లు. నిరాకరించుటకు ప్రత్యాదేశమని పేరు.

పరిరంభః పరిష్వంగః సంశ్లేష ఉపగూహనమ్ ।
అనుమాపక్ష హేత్వాద్యైర్డింబే భ్రమరవిప్లవౌ ॥25॥

పరిరంభం, పరిష్వంగం, సంశ్లేషం, ఉపగూహనం ఇవి కౌగలింతకు పేర్లు. పక్షం, హేతువు మొదలైనవి గలది అనుమాన ప్రమాణం భయంతో జరిగే హడావుడి శబ్దాలకు డింబం, భ్రమరం, విప్లవం అని పేర్లు.

అసన్నికృష్టార్థజ్ఞానం శబ్దాద్ధి శాబ్దమీరితమ్ ।
సాదృశ్యదర్శనాత్తుల్యే బుద్ధిః స్యాదుపమానకమ్ ॥26॥

శబ్దం ద్వారా దూరంగా ఉన్న వస్తువుల జ్ఞానాన్ని పొందటం శాబ్దం. పోలికను బట్టి అటువంటి వస్తుజ్ఞానాన్ని పొందటం ఉపమానప్రమాణం.

కార్యం దృష్ట్వా వినా నస్యాదర్థాపత్తిః పరార్థధీః ।
ప్రతియోగి న్యగృహీతే భువి నాస్తీత్యభావకః ॥27॥

ఇత్యాది నామలింగో హి హరిరుక్తో నృబుద్ధయే ॥28॥

కార్యాన్ని బట్టి తాను చూడకపోయినా పరార్థజ్ఞానాన్ని పొందటం అర్థాపత్తి ప్రతియోగి లేనందువల్ల వస్తువు లేదన్న జ్ఞానాన్ని పొందటం అభావజ్ఞానం.

ఇత్యాది మహాపురాణే ఆగ్నేయే సామాన్యనామకథనం నామ సప్తషష్ట్యధిక త్రిశతతమోఽధ్యాయః ॥367॥

అగ్నిమహాపురాణంలో సామాన్యనామవర్ణనమనే మూడువందల అరవైఏడవ అధ్యాయం సమాప్తం.



అష్టషష్ట్యధిక త్రిశతతమోఽధ్యాయః - మూడువందల అరవైఎనిమిదవ అధ్యాయం

ప్రలయవర్ణనమ్ - నిత్య నైమిత్తికప్రాకృతప్రలయాలు

అగ్నిరువాచ - అగ్ని ఇలా వచించాడు.

చతుర్విధస్తు ప్రలయో నిత్యో యః ప్రాణినాం లయః ।
సదా వినాశో జాతానాం బ్రాహ్మో నైమిత్తికో లయః ॥1॥

ప్రలయం నాలుగు విధాలు. నిత్యం జరుగుచున్న ప్రాణుల మృత్యువు నిత్యప్రలయం. ప్రాణులందరూ పూర్తిగా నశించడం బ్రాహ్మలయం లేదా నైమిత్తికప్రలయం.

చతుర్యుగసహస్రాంతే ప్రాకృతః ప్రకృతౌ లయః ।
లయ ఆత్యంతికో జ్ఞానాదాత్మనః పరమాత్మని ॥2॥

వేయి చతుర్యుగాలు గడచిన పిమ్మట మహాప్రళయంలో పంచమహాభూతాది ప్రకృతి వికారాలు ప్రకృతిలో లీనం కావడం ప్రాకృతప్రలయం. జ్ఞానం వల్ల జీవాత్మ పరమాత్మలో లీనమైనపుడు అది ఆత్యంతిక ప్రలయం.

నైమిత్తికస్య కల్పాంతే వక్ష్యే రూపం లయస్య తే ।
చతుర్యుగసహస్రాంతే క్షీణప్రాయే మహీతలే ॥3॥

కల్పాంతంలో జరిగే నైమిత్తికప్రలయాన్ని గురించి వసిష్ఠా! నీకు చెబుతాను. చతుర్యుగ సహస్రాంతంలో భూమి అంతా చాలా వరకు క్షీణమైపోతుంది.

అనావృష్టిరతీవోగ్రా జాయతే శతవార్షికీ ।
తతః సత్త్వక్షయః స్యాచ్చ తతో విష్ణుర్జగత్పతిః ॥4॥

స్థితో జలాని పిబతి భానోః సప్తసు రశ్మిషు ।
భూపాతాలసముద్రాదితోయం నయతి సంక్షయమ్ ॥5॥

నూరు సంవత్సరాలు భయంకరమైన అనావృష్టి ఎంతగానో ఏర్పడుతుంది. సర్వప్రాణులు అప్పుడు నశించిపోతాయి. అపుడు జగత్పతియైన విష్ణువు సూర్యుని ఏడు కిరణాల ద్వారా భూ, పాతాల, సముద్రాలలో ఉన్న జలాల నన్నింటిని త్రాగివేసి సంక్షయాన్ని పొందిస్తాడు.

తతస్తస్యానుభావేన తోయాహారోపబృంహితాః ।
త ఏవ రశ్మయః సప్త జాయంతే సప్త భాస్కరాః ॥6॥

పిమ్మట ఆయన ప్రభావం వల్ల ఆ జలాలను పీల్చడం వల్ల పుష్టిచెందిన ఆ ఏడు రశ్ములు ఏడుగురు భాస్కరులుగా ఏర్పడతారు.

దహన్త్యశేషం త్రైలోక్యం సపాతాలతలం ద్విజ ।
కూర్మపృష్ఠసమా భూః స్యాత్తతః కాలాగ్నిరుద్రకః ॥7॥

శేషా హి శ్వాససంపాతః పాతాలాని దహత్యధః ।
పాతాలేభ్యో భువం విష్ణుర్భువః స్వర్గం దహత్యతః ॥8॥

వసిష్ఠా! అపుడు వారు పాతాలతలంతో బాటు త్రైలోక్యాన్ని అంతటిని భస్మంచేస్తారు. అపుడు భూమి తాబేలు పై భాగంవలె (చిప్పలా) కనబడుతుంది. అంత కాలాగ్నిరుద్రుడు ఆదిశేషుని శ్వాస నుంచి ఆవిర్భవించి క్రిందనున్న పాతాళాలను భస్మం చేస్తాడు. విష్ణువు పాతాళాల నుంచి వచ్చే వేడి ద్వారా భూలోక, భువర్లోక, స్వర్గ లోకాలను దగ్ధం చేస్తాడు.

అంబరీషమివాభాతి త్రైలోక్యమఖిలం తథా ।
తతస్తాపపరీతాస్తు లోకద్వయనివాసినః ॥9॥

గచ్ఛన్తి తే మహర్లోకం మహర్లోకాజ్జనం తతః ।
రుద్రరూపీ జగద్దగ్ధ్వా ముఖనిఃశ్వాసతో హరేః ॥10॥

ఆ సమయంలో త్రైలోక్యం ప్రజ్వలించుచున్న కుజగోళం వలె కనబడుతుంది. అపుడు తాపంతో బాధపడే భువర్లోక, స్వర్గలోక నివాసులు, మహర్లోకానికి వెళ్లిపోతారు. అక్కడ కూడ తాపం తట్టుకోలేక అచ్చట నుంచి జనలోకానికి చేరుతారు. ఈ విధంగా రుద్రరూపియైన భగవానుడు సమస్త జగత్తును కాల్చివేయగా, హరి యొక్క ముఖ నిఃశ్వాసవాయువుల నుంచి

ఉత్తిష్ఠంతి తతో మేఘా నానారూపాః సవిద్యుతః ।
శతం వర్షాణి వర్షన్తః శమయన్త్యగ్నిముత్థితమ్ ॥11॥

మెరుపులతో కూడిన నానా రూపాలు గల మేఘములు ఒక్కసారిగా ఆవిర్భవిస్తాయి. అవి నూరు సంవత్సరాలు వర్షించి ఆ అగ్నితాపాన్ని ఉపశమింపజేస్తాయి.

సప్తర్షిస్థానమాక్రమ్య స్థితేఽమ్భసి శతం మరుత్ ।
ముఖనిఃశ్వాసతో విష్ణోర్నాశం నయతి తాన్ఘనాన్ ॥12॥

ఆ జలం సప్తర్షిమండలస్థానం వరకు చేరిన పిమ్మట, విష్ణుముఖం నుంచి బయలుదేరిన నిఃశ్వాసం వాయురూపంలో వంద సంవత్సరాలు వీచి ఆ మేఘాలను చెదరగొడుతుంది.

వాయుం పీత్వా హరిః శేషే శేతే చైకార్ణవే ప్రభుః ।
బ్రహ్మరూపధరః సిద్ధై ర్జలగై ర్మునిభిః స్తుతః ॥13॥

ఆ తరువాత శ్రీహరి ఆ వాయువును త్రాగివేసి, ఏకార్ణవంలో ఆదిశేషునిపై శయనిస్తాడు. ఆ సమయంలో సిద్ధులు, మహర్షులు నీటిలోనే ఉన్నవారై బ్రహ్మరూపధరుడైన భగవానుని స్తుతిస్తారు.

ఆత్మమాయామయీం దివ్యాం యోగనిద్రాం సమాస్థితః ।
ఆత్మానం వాసుదేవాఖ్యం చిన్తయన్మధుసూదనః ॥14॥

మధుసూదనుడు ఆత్మమాయారూపమైన దివ్యమగు యోగనిద్రను అవలంబించి, తనదైన వాసుదేవ స్వరూపాన్ని ధ్యానిస్తూ ఉంటాడు.

కల్పం శేతే ప్రబుద్ధోఽథ బ్రహ్మరూపీ సృజత్యసౌ ।
ద్విపరార్ధం తతోఽవ్యక్తం ప్రకృతౌ లీయతే ద్విజ ॥15॥

అలా ఒక కల్పకాలం శయనిస్తాడు. పిదప మాయానిద్ర నుంచి లేచి బ్రహ్మరూపియై మళ్లీ త్రైలోక్యాన్ని సృజిస్తాడు. ఈ విధంగా బ్రహ్మయొక్క రెండు పరార్ధాల ఆయువు గడచిపోయిన పిమ్మట వసిష్ఠా! ఈ స్థూల ప్రపంచం ప్రకృతిలో లీనమవుతుంది.

స్థానాత్స్థానం దశగుణమేకస్మాద్గుణ్యతే స్థలే ।
తతో ఽష్టాదశకే భాగే పరార్ధమభిధీయతే ॥16॥

ఒకటి నుంచి పది చొప్పున గుణిస్తూ పోగా, పద్ధెనిమిదో స్థానం చేరే సరికి ఎంత సంఖ్య వస్తుందో అది పరార్ధమవుతుంది.

విశేషం:ఒకటి తరువాత పదిహేడు సున్నలు వేస్తే శంఖప్రమాణం అవుతుంది. ఒకటి తరువాత పద్ధెనిమిది సున్నలు వేస్తే మహాశంఖప్రమాణం అవుతుంది.

పరార్ధం ద్విగుణం యత్తు ప్రాకృతః ప్రలయః స్మృతః ।
అనావృష్ట్యాఽగ్నిసంపర్కాత్కృతే సంజ్వలనే ద్విజ ॥17॥

దానికి రెట్టింపు కాలం గడచిపోయిన పిమ్మట ప్రాకృతప్రలయం ఏర్పడుతుంది. ద్విజవర్యా! అప్పుడు వర్షాలు ఉండకపోవడం వల్ల అగ్నిబాగా ప్రజ్వరిల్లి అంతా భస్మమైపోతుంది.

మహదాదేర్వికారస్య విశేషాన్తస్య సంక్షయే ।
కృష్ణేచ్ఛాకారితే తస్మిన్సంప్రాప్తే ప్రతిసంచరే ॥18॥

మహత్తత్వం మొదలుకొని విశేషపర్యంతం ఉండే సమస్తవికారాలు (కార్యాలు) నశించిపోతాయి. భగవంతుని ఇచ్ఛననుసరించి ఆ ప్రతిసంచరం (ప్రాకృతప్రలయం) ఏర్పడగా–

ఆపో గ్రసన్తి వై పూర్వం భూమేర్గంధాదికం గుణం ।
ఆత్మగంధాత్తతో భూమిః ప్రలయత్వాయ కల్పతే ॥19॥

జలము భూమి యొక్క గంధాది గుణాలను తనలో లీనం చేసుకొంటుంది. అపుడు గంధహీనమైన పృథివి నీటిలో లీనమైపోయి ప్రలయత్వాన్ని పొందుతుంది.

రసాత్మికాశ్చ తిష్ఠన్తి హ్యాపస్తాసాం రసో గుణః ।
పీయతే జ్యోతిషా తాసు నష్టాస్వగ్నిశ్చ దీప్యతే ॥20॥

అపుడు రసమయమైన జలం మిగులుతుంది. రసము జలముల యొక్క గుణము. అగ్ని ఆ రసాన్ని త్రాగివేయగా జలం అందు లీనమైపోతుంది. అంత అగ్నితత్త్వం ప్రజ్వలిస్తుంది.

జ్యోతిషోఽపి గుణం రూపం వాయుర్గ్రహతి భాస్కరమ్ ।
నష్టే జ్యోతిషి వాయుశ్చ బలీ దోధూయతే మహాన్ ॥21॥

పిదప తేజస్సు యొక్క ప్రకాశగుణాన్ని (రూపం) వాయువు మ్రింగివేస్తుంది. అగ్నితత్త్వం లీనమైపోగా, గొప్పదైన ప్రచండవాయువు మహావేగంతో వీస్తుంది.

వాయోరపి గుణం స్పర్శమాకాశం గ్రసతే తతః ।
వాయౌ నష్టే తు చాకాశం నీరవం తిష్ఠతి ద్విజ ॥22॥

పిదప వాయువుయొక్క గుణమైన స్పర్శను ఆకాశం మ్రింగివేస్తుంది. వాయువు నశించిపోగా, వసిష్ఠా! ఆకాశం మాత్రం నిశ్శబ్దంగా మిగిలిపోతుంది.

ఆకాశస్యాథ వై శబ్దం భూతాదిర్గ్రసతే చ ఖమ్ ।
అభిమానాత్మకం ఖం చ భూతాదిర్గ్రసతే మహాన్ ॥23॥

భూతాలకు కారణమైన అహంకారం ఆకాశగుణకమైన శబ్దాన్ని మ్రింగివేస్తుంది. తైజసాహంకారం ఇంద్రియాలను తనలో లీనం చేసుకొంటుంది. తరువాత మహత్తత్త్వం అభిమానస్వరూపయైన భూతాది, తైజసాహంకారాలను తనలో లీనం చేసుకొంటుంది.

భూమిర్యాతి లయం చాప్సు ఆపో జ్యోతిషి తద్వ్రజేత్ ।
వాయౌ వాయుశ్చ ఖే ఖం చ, అహంకారే లయం స చ ॥24॥

మహత్తత్త్వే మహాంతం చ ప్రకృతి ర్గ్రసతే ద్విజ ।
వ్యక్తావ్యక్తా చ ప్రకృతిర్వ్యక్తస్యావ్యక్తకే లయః ॥25॥

ఈ విధంగా భూమి జలమునందు, జలము అగ్ని యందు, అగ్ని వాయువు నందు, వాయువు ఆకాశమునందు, ఆకాశము అహంకారము నందు, అహంకారం మహత్తత్త్వమునందు లీనమవుతాయి. ద్విజవర్యా! ఆ మహత్తత్త్వాన్ని ప్రకృతి తనలో లీనం చేసుకుంటుంది. వ్యక్తం, అవ్యక్తం అని ప్రకృతి రెండు విధాలు. వ్యక్తం అవ్యక్తంలో లీనమవుతుంది.

పుమానేకాక్షరః శుద్ధః సోఽప్యంశః పరమాత్మనః ।
ప్రకృతిః పురుషశ్చైతౌ లీయతే పరమాత్మని ॥26॥

అవినాశియు, శుద్ధస్వరూపుడు అగు ఏకైక పురుషుడు ఎవడైతే ఉన్నాడో అతడు పరమాత్మఅంశమే. చివరకు ప్రకృతియు, పురుషుడును పరమాత్మయందు లీనమవ్వడం జరుగుతుంది.

న సంతి యత్ర సర్వేశే నామజాత్యాదికల్పనాః ।
సత్తామాత్రాత్మకే జ్ఞేయే జ్ఞానాత్మన్యాత్మనః పరే ॥27॥

ఆ పరమాత్మ సత్స్వరూపము, సత్తామాత్రాత్మకము. జ్ఞేయము – జ్ఞానమయము. బుద్ధ్యాదుల కన్న పరము. ఆ సర్వేశుడైన పరమాత్మ యందు నామజాత్యాది కల్పనలు ఉండవు.

ఇత్యాది మహాపురాణే ఆగ్నేయే నిత్యనైమిత్తికప్రాకృతప్రలయవర్ణనం
నామ అష్టషష్ట్యధిక త్రిశతతమోஉధ్యాయః ॥368॥

అగ్నిమహాపురాణంలో నిత్యనైమిత్తికప్రాకృతప్రలయవర్ణనమనే
మూడువందల అరవైఎనిమిదవ అధ్యాయం సమాప్తం.



ఏకోనసప్తత్యధిక త్రిశతతమోऽధ్యాయః - మూడువందల అరవైతొమ్మిదవ అధ్యాయం

ఆత్యన్తికలయగర్భోత్పత్త్యోర్నిరూపణమ్ - ఆత్యన్తిక ప్రలయం, గర్భోత్పత్తివర్ణననిరూపణం

అగ్నిరువాచ - అగ్ని ఇలా వచించాడు.

ఆత్యన్తికం లయం వక్ష్యే జ్ఞానాదాత్యన్తికో లయః ।
ఆధ్యాత్మికాదిసంతాపం జ్ఞాత్వా స్వస్య విరాగతః ॥1॥

ఇక ఆత్యంతికప్రళయాన్ని గురించి చెబుతాను. ఈ లయం జ్ఞానం వల్ల కలుగుతుంది. ఆధ్యాత్మికాది సంతాపాన్ని తెలుసుకొని మానవుడు తనంతట తానే వైరాగ్యాన్ని పొందాలి. (దీని ద్వారా జీవాత్మ ముక్తి పొందుతుంది).

ఆధ్యాత్మికస్తు సంతాపః శారీరో మానసో ద్విధా ।
శారీరో బహుభిర్భేదై స్తాపోऽసౌ శ్రూయతాం ద్విజ ॥2॥

ఆధ్యాత్మిక సంతాపం శారీరం, మానసం అని రెండు విధాలు. వసిష్ఠా! అందు శారీరకతాపం అనేక భేదాలతో ఉంటుంది. వాటిని గూర్చి వినుము.

త్యక్త్వాజీవో భోగదేహం గర్భమాప్నోతి కర్మభిః ।
ఆతివాహికసంజ్ఞస్తు దేహో భవతి వై ద్విజ ॥3॥

జీవుడు భోగదేహాన్ని విడిచిపెట్టి కర్మానుసారంగా తదనుభవానికై తిరిగి గర్భంలో ప్రవేశిస్తాడు. ద్విజవర్యా! ఆతివాహికమనే పేరు గల ఒక దేహం అనేది ఉంటుంది.

కేవలం స మనుష్యాణాం మృత్యుకాల ఉపస్థితే ।
యామ్యైః పుమ్భిర్మనుష్యాణాం తచ్ఛరీరం ద్విజోత్తమ ॥4॥

నీయతే యామ్యమార్గేణ నాన్యేషాం ప్రాణినాం మునే ।
తతః స్వర్యాతి నరకం స భ్రమేద్ఘటయంత్రవత్ ॥5॥

ద్విజోత్తమా! మృత్యుకాలం వచ్చినపుడు మనుష్యులకు మాత్రమే ఆ దేహం లభిస్తుంది. యమధర్మరాజు దూతలు మనుష్యుల యొక్క ఆ అతివాహికశరీరాన్ని యమలోకమార్గంలో యమలోకానికి తీసుకొనిపోతారు. మునీశ్వరా! ఇతర ప్రాణులకు ఈ అతివాహికశరీరం ఉండదు. ఆ తరువాత యమలోకంలోకి వెళ్లిన జీవుడు కొంతకాలం స్వర్గం, కొంతకాలం నరకం పొందుతూ ఘటయంత్రంలా తిరుగుతూ ఉంటాడు.

కర్మభూమిరియం బ్రహ్మన్ ఫలభూమిరసౌ స్మృతా ।
యమో యోనిశ్చ నరకం నిరూపయతి కర్మణా ॥6॥

హే బ్రహ్మన్! ఇది కర్మభూమి. ఫలలోకం పరభూమి. యముడు ఆయా జీవుల కర్మానుసారం వివిధ యోనులను (జన్మలను), నరకాలను వారికి ఇస్తాడు (నిర్ణయిస్తాడు).

పూరణీయాశ్చ తేనైవ యమం చైవానుపశ్యతామ్ ।
వాయుభూతాః ప్రాణినశ్చ గర్భం తే ప్రాప్నువంతి హి ॥7॥

యమధర్మరాజు ద్వారా జీవుల నరకాలు నిర్ణయింపబడి పరిపూర్ణాలు అవుతాయి. యమరాజే వాటికి నియామకుడని గ్రహించు. ప్రాణులు (జీవులు) వాయురూపంలో మనుష్యగర్భంలో ప్రవేశిస్తారు.

యమదూతైర్మనుష్యస్తు నీయతే తం చ పశ్యతి ।
ధర్మీ చ పూజ్యతే తేన పాపిష్ఠస్తాడ్యతే గృహే ॥8॥

ఎప్పుడయితే యమదూతలు మనుష్యుని యముని సన్నిధికి తీసుకొని వెడతారో, వెంటనే యముడు అతనిని చూస్తాడు (ఆతని కర్మలను విచారిస్తాడు). ఆ జీవుడు ధర్మాత్ముడయితే యముడు ఆతనిని పూజిస్తాడు. పాపాత్ముడయితే ఆతనిని దండిస్తాడు.

శుభాశుభం కర్మ తస్య చిత్రగుప్తో నిరూపయేత్ ।
బాంధవానామశౌచే తు దేహే ఖల్వతివాహికే ॥9॥

తిష్ఠన్నయతి ధర్మజ్ఞ దత్తపిండాశనం తతః ।
తం త్యక్త్వా ప్రేతదేహం తు ప్రాప్యాన్యం ప్రేతలోకతః ॥10॥

వాని శుభాశుభకర్మలను గురించి యమునికి చిత్రగుప్తుడు వివరించి చెబుతాడు. బంధువులకు ఆశౌచం తీరేవరకు జీవుడు ఆ అతివాహికశరీరంలోనే ఉండి ధర్మజ్ఞా! వారిచ్చిన పిండభోజనాన్ని భుజిస్తాడు. ఆ తరువాత ప్రేతలోకంలోకి చేరుకుని ప్రేతశరీరాన్ని (అతివాహికశరీరాన్ని) విడిచివేస్తాడు.

వసేత్ క్షుధాతృషాయుక్త ఆమశ్రాద్ధాన్నభుజ్ నరః ।
అతివాహికదేహాత్తు ప్రేతపిండైర్వినా నరః ॥11॥

మరో భోగదేహాన్ని పొంది ఆకలి దప్పికలతో బాధపడుతూ అచట నివసిస్తాడు. శ్రాద్ధరూపంలో ఈయబడే ఆమద్రవ్యాన్ని అతడు భుజిస్తాడు. ప్రేతకు పిండప్రదానం లేకుండా చేస్తే, వానికి అతివాహికదేహం నుంచి విడుదల ఉండదు.

న హి మోక్షమవాప్నోతి పిండాంస్తత్రైవ సోఽశ్నుతే ।
కృతే సపిండీకరణే నరః సాంవత్సరాత్పరమ్ ॥12॥

ప్రేతదేహం సముత్సృజ్య భోగదేహం ప్రపద్యతే ।
భోగదేహావుభౌ ప్రోక్తావశుభాశుభసంజ్ఞితౌ ॥13॥

పిండ భోజనం లేకుండా అతనికి విడుదల ఉండదు కాబట్టి అతడు పిండాలను భుజిస్తాడు. సపిండీకరణ శ్రాద్ధం జరిగిన సంవత్సరానికి తరువాత అతడు ప్రేతదేహాన్ని విడిచి భోగదేహాన్ని పొందుతాడు. శుభదేహం, అశుభదేహం అని ఆ భోగశరీరం రెండు విధాలు.

భుక్త్వా తు భోగదేహేన కర్మబంధాన్నిపాత్యతే ।
తం దేహం పతతస్తస్మాద్భక్షయన్తి నిశాచరాః ॥14॥

ఆ దేహంతో కర్మబంధాలను అనుభవించిన పిమ్మట, అతడు మర్త్యలోకానికి గెంటివేయబడతాడు. అపుడు అతడు విడిచిన దేహాన్ని నిశాచరులు భక్షిస్తారు.

పాపే తిష్ఠతి చేత్స్వర్గం తేన భుక్తం తదా ద్విజాః ।
తదా ద్వితీయం గృహ్ణాతి భోగదేహం తు పాపినామ్ ॥15॥

భుక్త్వా తు పాపం వై పశ్చా ద్యేన భుక్తం త్రివిష్టపమ్ ।
శుచీనాం శ్రీమతాం గేహే స్వర్గభ్రష్టోఽభిజాయతే ॥16॥

బ్రహ్మన్! జీవుడు మొదటి భోగదేహం ద్వారా (మొదట) పుణ్యఫలరూపమైన స్వర్గాన్ని అనుభవిస్తే, పాపభోగం మిగిలి ఉంటే, మరో భోగశరీరాన్ని ధరిస్తాడు. కాని మొదటనే పాఫపలాన్ని అనుభవించిన వాడు, స్వర్గసుఖాన్ని అనుభవించిన తరువాత స్వర్గభ్రష్టుడై పవిత్రులైన శ్రీమంతుల గృహంలో జన్మిస్తాడు.

పుణ్యే తిష్ఠతి చేత్పాపం తేన భుక్తం తదా భవేత్ ।
తస్మిన్ సమ్భక్షితే దేహే శుభం గృహ్ణాతి విగ్రహమ్ ॥17॥

పుణ్యం ఉండగా ముందు పాపఫలం అనుభవించిన వాడు, ఫలభోగం పూర్తి అయిన పిమ్మట ఉత్తమదేహాన్ని ధరిస్తాడు.

కర్మణ్యల్పావశేషే తు నరకాదపి ముచ్యతే ।
ముక్తస్తు నరకాద్యాతి తిర్యగ్యోనిం న సంశయః ॥18॥

కర్మభోగం లేశమాత్రం మిగిలి ఉండగా, జీవునికి నరకం నుంచి కూడ విముక్తి లభిస్తుంది. ఆ విధంగా నరకం నుంచి ముక్తుడైనవాడు తిర్యగ్యోనిలో పుడతాడు, సందేహం లేదు.

జీవః ప్రవిష్టో గర్భం తు కలలేఽప్యత్ర తిష్ఠతి ।
ఘనీభూతం ద్వితీయే తు తృతీయేఽవయవాస్తతః ॥19॥

గర్భంలో ప్రవేశించిన జీవుడు కలలంలో ఉంటాడు. రెండవ మాసంలో గట్టిపడతాడు. మూడో మాసంలో అవయవాలు ప్రకటం అవుతాయి.

చతుర్థేఽస్థీని త్వఙ్మాంసం పంచమే రోమసంభవః ।
షష్ఠే చేతోఽథ జీవస్య దుఃఖం విందతి సప్తమే ॥20॥

నాలుగో మాసంలో ఎముకలు, చర్మం, మాంసం ఏర్పడుతాయి. ఐదో మాసంలో రోమాలు పుడతాయి. ఆరో మాసంలో చైతన్యం ఏర్పడుతుంది. ఏడో మాసం నుంచి దుఃఖం అనుభవించడం ప్రారంభిస్తాడు.

జరాయు వేష్టితే దేహే మూర్ధ్ని బద్ధాంజలి స్తథా ।
మధ్యే క్లీబస్తు వామే స్త్రీ దక్షిణే పురుషస్థితిః ॥21॥

మావితో చుట్టబడిన దేహంలో శిరస్సుపై దోసిలి పట్టి ఉంటాడు. గర్భమధ్యంలో ఉంటే నపుంసకుడు, వామభాగంలో ఉంటే స్త్రీ, కుడిప్రక్కన ఉంటే పురుషుడు అవుతాడు.

తిష్ఠత్యుదరభాగే తు పృష్ఠస్యాభిముఖస్తథా ।
యస్యాం తిష్ఠత్యసౌ యోనౌ తాం స వేత్తి న సంశయః ॥22॥

పృష్ఠభాగానికి అభిముఖుడుగా ఉదరభాగంలో ఉంటాడు. తాను ఏ యోని యందు ఉన్నాడో ఆ జీవునికి తెలుస్తూనే ఉంటుంది. సందేహం ఏ మాత్రం లేదు.

సర్వం చ వేత్తి వృత్తాంతమారభ్య నరజన్మనః ।
అంధకారం చ మహతీం పీడాం విన్దతి మానవః ॥23॥

తన నరజన్మ మొదలు సకల జన్మవృత్తాంతాలను స్మరించుకొంటూ ఉంటాడు. ఆ అంధకారంలో మానవుడు గొప్ప పీడను పొందుతాడు.

మాతురాహారపీతం తు సప్తమే మాస్యుపాశ్నుతే ।
అష్టమే నవమే మాసి భృశముద్విజతే తథా ॥24॥

ఏడో మాసంలో తల్లి భుజించిన ఆహారాన్ని, త్రాగిన పానీయాదులను ఆ శిశువు పొందుతాడు. అష్టమ నవమ మాసాలలో మిక్కిలి ఉద్విగ్నుడు అవుతాడు.

వ్యవాయపీడామాప్నోతి మాతుర్వ్యాయామకే తథా ।
వ్యాధిశ్చ వ్యాధితాయాం స్యాన్ముహూర్తం శతవర్షవత్ ॥25॥

మైథున సమయంలో (తల్లిదండ్రుల) మిక్కిలి పీడను పొందుతాడు. తల్లి అధిక వ్యాయామం చేసినా శిశువుకు అత్యంతం పీడ కలుగుతుంది. ఆమె వ్యాధిగ్రస్తురాలయితే తాను కూడ అనారోగ్యం యొక్క కష్టాన్ని అనుభవిస్తాడు. శిశువుకు ఒక ముహూర్తం నూరు సంవత్సరాల వలె కనబడుతుంది.

సంతప్యతే కర్మభిస్తు కురుతేఽథ మనోరథాన్ ।
గర్భాద్వినిర్గతో బ్రహ్మన్ మోక్షజ్ఞానం కరిష్యతి ॥26॥

బ్రహ్మన్! కర్మలతో బాధపడుతూ ఎన్నో కోరికలతో సతమతమవుతాడు. గర్భం నుంచి బయట పడగానే మోక్షజ్ఞానం గురించి ప్రయత్నం చేయాలని సంకల్పిస్తాడు.

సూతివాతైరధోభూతో నిఃసరేద్యోనియంత్రతః ।
పీడ్యమానో మాసమాత్రం కరస్పర్శేన దుఃఖితః ॥27॥

ప్రసూతివాయువుల ప్రేరణచే అధోముఖుడై, యోనియంత్రపీడితుడై బయట పడతాడు. ఒక మాసం వరకు చేతితో ముట్టుకొన్నా, శిశువుకు పీడ కలుగుతూనే ఉంటుంది.

ఖశబ్దాత్ క్షుద్రస్రోతాంసి దేహే శ్రోత్రం వివిక్తతా ।
శ్వాసోచ్ఛ్వాసౌ గతిర్వాయోర్వక్రసంస్పర్శనం తథా ॥28॥

ఖశబ్ద వాచ్యమయ్యే ఆకాశం ద్వారా వాని శరీరంలో చిన్న చిన్న రంధ్రాలు, చెవి, శూన్యత (అవకాశం), ఏర్పడతాయి. వాయువు వల్ల శ్వాసోచ్ఛ్వాసాలు కలగడం, గతి, అవయవాలు ఇటు అటూ త్రిపుడు స్పర్శ ఏర్పడతాయి.

అగ్నేరూపం దర్శనే స్యాదూష్మా పంక్తిశ్చ పిత్తకమ్ ।
మేధా వర్ణం బలం ఛాయా తేజః శౌర్యం శరీరకే ॥29॥

అగ్ని వల్ల రూపం, నేత్రాలు, వేడి, జీర్ణశక్తి, పిత్తం, మేధ, వర్ణం, బలం, ఛాయ, తేజస్సు, శౌర్యం అనేవి శరీరమందు ఏర్పడతాయి.

జలాత్ స్వేదః చ రసనం దేహే వై సంప్రజాయతే ।
క్లేదో వసా రసా రక్తం శుక్రమూత్రకఫాదికమ్ ॥30॥

జలం వల్ల చెమట, రసనం, ఆస్వాదం, తడి, వస, రస, శుక్రం, మూత్రం, కఫం, మున్నగునవి దేహమందు ప్రాదుర్భవిస్తాయి.

భూమేర్ఘ్రాణం కేశనఖం గౌరవం స్థిరతోఽస్థితః ।
మాతృజాని మృదూన్యత్ర త్వఙ్మాంసహృదయాని చ ॥31॥

భూమి వల్ల ఘ్రాణం, కేశం, నఖాలు, బరువు, నాడులు, రోమాలు, శిరస్సు మున్నగునవి ఏర్పడతాయి. శరీరంలో మృదుపదార్థాలైన త్వక్కు, మాంసం, హృదయం అనేవి, తల్లి నుంచి వస్తాయి.

నాభిర్మజ్జా శకృన్మేదః క్లేదాన్యామాశయాని చ ।
పితృజాని శిరా స్నాయుః శుక్రం చైవాత్మజాని తు ॥32॥

కామక్రోధౌ భయం హర్షో ధర్మాధర్మాత్మతా తథా ।
ఆకృతిః స్వరవర్ణౌ తు మేహనాద్యం తథా చ యత్ ॥33॥

నాభి, మజ్జ, మలం, మేదస్సు, క్లేదనం, ఆమాశయం అనేవి తల్లివల్ల ఏర్పడతాయి. శిరస్సు, స్నాయువు, శుక్రం తండ్రివల్ల పుట్టేవి. ఆత్మజన్యములయితే కామం, క్రోధం, భయం, హర్షం, ధర్మం, ధర్మాత్మతాప్రవృత్తి, అధర్మాత్మతాప్రవృత్తి, ఆకృతి, స్వరం, వర్ణం, మేహనం మున్నగునవి జీవుని శరీరంలో స్వతఃప్రకటం అవుతాయి.

తామసాని తథాజ్ఞానం ప్రమాదాలస్యతృట్క్షుధాః ।
మోహమాత్సర్యవైగుణ్య శోకాయాసభయాని చ ॥34॥

అజ్ఞానం, ప్రమాదం, ఆలస్యం, తృష, క్షుధ, మోహం, మాత్సర్యం, వైగుణ్యం, శోకం, ఆయాసం, భయం మున్నగునవి తమోగుణం వల్ల పుట్టేవి.

కామక్రోధౌ తథా శౌర్యం యజ్ఞేప్సా బహుభాషితా ।
అహంకారః పరావజ్ఞా రాజసాని మహామునే ॥35॥

కామం, క్రోధం, శౌర్యం, యజ్ఞాభిలాష, బహుభాషిత్వం, అహంకారం, అనాదరం (ఇతరులను అవమానించడం) మహామునీ! రజోగుణం వల్ల పుట్టేవి.

ధర్మేప్సా మోక్షకామిత్వం పరా భక్తిశ్చ కేశవే ।
దాక్షిణ్యం వ్యవసాయిత్వం సాత్త్వికాని వినిర్దిశేత్ ॥36॥

ధర్మాభిలాష, మోక్షకామిత్వం, కేశవుని యందు ఉత్కృష్టభక్తి, దాక్షిణ్యం (ఉదారత), నిరంతరోద్యోగ శీలత్వం సత్త్వగుణం వల్ల పుట్టేవి.

చపలః క్రోధనో భీరు ర్బహుభాషీ కలిప్రియః ।
స్వప్నే గగనశ్చైవ బహువాతో నరో భవేత్ ॥37॥

చపలుడు, క్రోధనుడు, భీరువు, బహుభాషి, కలహప్రియుడు, స్వప్నంలో ఆకాశసంచారం చేసేవాడు అయిన మనుష్యునిలో వాతం ప్రధానంగా ఉంటుంది.

అకాలపలితః క్రోధీ మహాప్రాజ్ఞో రణప్రియః ।
స్వప్నే చ దీప్తిమత్ప్రేక్షీ బహుపిత్తో నరో భవేత్ ॥38॥

అకాలంలో జుట్టు నెరసినవాడు, కోపశీలుడు, మహాబుద్ధిమంతుడు, రణప్రియుడు, స్వప్నంలో ప్రకాశించే వస్తువులను చూచేవాడు అయిన మనుష్యునిలో పిత్తం అధికంగా ఉంటుంది.

స్థిరమిత్రః స్థిరోత్సాహః స్థిరాంగో ద్రవిణాన్వితః ।
స్వప్నే జలసితాలోకీ బహుశ్లేష్మా నరో భవేత్ ॥39॥

స్థిరమైన మైత్రికలవాడు, స్థిరమైన ఉత్సాహం కలవాడు, స్థిరమైన అవయవాలు (మనస్సు) కలవాడు, ధనవంతుడు, స్వప్నంలో శ్వేతపదార్థాలను చూచేవాడు అయిన మనుష్యునిలో శ్లేష్మం అధికంగా ఉంటుంది.

రసస్తు ప్రాణినాం దేహే జీవనం రుధిరం తథా ।
లేపనం చ తథా మాంసం మేహస్నేహకరం తు తత్ ॥40॥

ప్రాణుల దేహంలో రసం జీవనాన్ని, రక్తం లేపనాన్ని, మాంసం మేహనస్నేహనాలను కలిగిస్తుంది.

ధారణం త్వస్థిమజ్జా స్యా త్పూరణం వీర్యవర్ధనమ్ ।
శుక్రవీర్యకరం హ్యోజః ప్రాణకృజ్జీవసంస్థితిః ॥41॥

అస్థులు, మజ్జ శరీరధారణలో నిలుస్తాయి. వీర్యవృద్ధి శరీరాన్ని పరిపూర్ణం కావిస్తుంది. ఓజస్సు శుక్రవీర్యాలను వృద్ధి చేస్తుంది. అది జీవుని స్థితిని, ప్రాణరక్షణను కలగజేస్తుంది.

ఓజః శుక్రాత్సారతర మాపీతం హృదయోపగమ్ ।
షడంగం సక్థినీ బాహూ ర్మూర్ధాజఠరమీరితమ్ ॥42॥

ఓజస్సు శుక్రం కన్న ఎక్కువ సారవంతమైనది. అది హృదయసమీపంలో ఉంటుంది. కొంచెం పసుపు పచ్చగా ఉంటుంది. కాళ్లు, బాహువులు, శిరస్సు, ఉదరం ఇవి షడంగాలు. (సక్థినీ-కాలు సంబంధమైన వాటికి ఉపలక్షణం).

షట్ త్వచా బాహ్యతో యద్వదన్యా రుధిరధారికా ।
కిలాసధారిణీ చాన్యా చతుర్థీ కుండధారిణీ ॥43॥

చర్మంలో ఆరుపొరలు ఉంటాయి. బయటకు కనబడేది బాహ్యం. రక్తాన్ని ధరించేది దానికన్న ఇతరమైనది, రెండోది మూడోది కిలాసాన్ని (ధాతువిశేషం), నాల్గోది కుండాన్ని (ధాతువిశేషం) ధరిస్తుంది.

పంచమీ విద్రధిస్థానం షష్ఠీ ప్రాణధరా మతా ।
కలా సప్తమీ మాంసధరా ద్వితీయా రక్తధారిణీ ॥44॥

ఐదోది ఇంద్రియాల స్థానం. ఆరోది ప్రాణధారణం చేసేది. 'కల' కూడ ఏడు ప్రకారాలుగా ఉంటుంది. మొదటిది మాంసాన్ని, రెండోది రక్తాన్ని ధరిస్తుంది.

యకృత్ ప్లీహాశ్రయా చాన్యా మేదోధరాఽస్థిధారిణీ ।
మజ్జా శ్లేష్మ పురీషాణాం ధరా పక్వాశయస్థితా ।
షష్ఠీ పిత్తధరా శుక్రధరా శుక్రాశయాఽపరా ॥45॥

మూడోది యకృత్ (క్లోమం కన్న వేరైనది), ప్లీహ (హృదయంలో ఎడమ దిక్కున పచ్చగా ఉండే మాంస విశేషం) లను, నాల్గోది మేదస్సును, అస్థులను ధరించి ఉంటుంది. ఐదోది మజ్జా శ్లేష్మ పురీషాలను ధరిస్తుంది. అయిదోది పక్వాశయమనందు ఉంటుంది. ఆరోది పిత్తాన్ని, ఏడోది శుక్రాన్ని ధరిస్తుంది. ఏడోది శుక్రాశయ మందు ఉంటుంది.

ఇత్యాది మహాపురాణే ఆగ్నేయే ఆత్యన్తికలయ గర్భోత్పత్తినిరూపణం
నామ ఏకోనసప్తత్యధిక త్రిశతతమోఽధ్యాయః ॥369॥

అగ్నిమహాపురాణంలో ఆత్యన్తికప్రలయ-గర్భోత్పత్తికథనమనే
మూడువందల అరవైతొమ్మిదవ అధ్యాయం సమాప్తం.

సప్తత్యధిక త్రిశతతమోఽధ్యాయః - మూడువందల డెబ్బైయవ అధ్యాయం

శరీరావయవాః - శరీరావయవ వర్ణనం

అగ్నిరువాచ - అగ్ని ఇలా వచించాడు.

శ్రోత్రం త్వక్చక్షుషీ జిహ్వా ఘ్రాణం ధీః ఖం చ భూతగమ్ ।
శబ్దస్పర్శరూపరసగంధాః ఖాదిషు తద్గుణాః ॥1॥

చెవులు, చర్మం, కళ్ళు, నాలుక, ముక్కు జ్ఞానేంద్రియాలు. ఆకాశం, సర్వభూతాలచే వ్యాపింపబడింది. శబ్ద, స్పర్శ, రూప, రస, గంధాలు ఆకాశాదుల గుణాలు.

పాయూపస్థౌ కరౌ పాదౌ వాగ్భవేత్కర్మ ఖం తథా ।
ఉత్సర్గానందకాదాన గతివాగాదికర్మ తత్ ॥2॥

పాయు, ఉపస్థ, కర,పాద, వాక్కులు కర్మేంద్రియాలు అనబడతాయి. ఉత్సర్గం (విడుచుట), ఆనందం, ఆదానం (గ్రహించడం), గమనం, పలుకుట మున్నగునవి కర్మేంద్రియాల పనులు.

పంచ కర్మేంద్రియాణ్యత్ర పంచ బుద్ధీంద్రియాణి చ ।
ఇంద్రియార్థాశ్చ పంచైవ మహాభూతా మనోధిపాః ॥3॥

ఆత్మాఽవ్యక్తశ్చతుర్వింశ తత్త్వాని పురుషః పరః ।
సంయుక్తశ్చ వియుక్తశ్చ యథామత్స్యోదకే ఉభే ॥4॥

పంచకర్మేంద్రియాలు, పంచజ్ఞానేంద్రియాలు, పంచేంద్రియాల విషయాలైన శబ్ద స్పర్శ రూప రస గంధాలు, పంచమహాభూతాలు. మనస్సు, బుద్ధి, మహత్తత్త్వం (ఆత్మా), అవ్యక్తం (మూలప్రకృతి), అనేవి ఇరవై నాలుగు తత్త్వాలు. ఈ తత్త్వాలకు అన్నింటికన్న పురుషుడు పరుడు . నీరు, చేపవలె ఈ రెండును పరస్పరం సంయుక్తములై, వియుక్తములై ఉంటాయి. (పురుషుడు, ప్రకృతి)

అవ్యక్తమాశ్రితానీహ రజః సత్త్వతమాంసి చ ।
ఆంతరః పురుషో జీవః స పరం బ్రహ్మ కారణమ్ ॥5॥

రజస్సత్త్వతమోగుణాలు అవ్యక్తాన్ని (మూలప్రకృతిని) ఆశ్రయించి ఉంటాయి. అంతఃకరణం అనే ఉపాధి కలవాడు పురుషుడు జీవుడు. ఉపాధి రహితుడగు ఆ జీవుడే సర్వకారణమగు బ్రహ్మ.

స యాతి పరమం స్థానం యో వేత్తి పురుషం పరమ్ ।
సప్తాఽశయాః స్మృతా దేహే రుధిరస్యైక ఆశయః ॥6॥

పరమపురుషుని తెలుసుకొనే వాడు పరమపదాన్ని పొందుతాడు. దేహంలో ఏడు ఆశయాలు ఉన్నాయి. అందు రుధిరం అనేది ఒక ఆశయం.

శ్లేష్మణశ్చాఽఽమపిత్తాభ్యాం పక్వాశయస్తు పంచమః ।
వాయుమూత్రాశయః సప్త స్త్రీణాం గర్భాశయోఽష్టమః ॥7॥

శ్లేష్మ, ఆమ, పిత్తాలు రెండు, మూడు, నాలుగు ఆశయాల పేర్లు. ఐదోది పక్వాశయం. వాయు, మూత్రాశయాలు ఆరోది, ఏడోది. స్త్రీలకు ఎనిమిదోదైన గర్భాశయం కూడ ఉంటుంది.

పిత్తాత్పక్వాశయోఽగ్నేః స్యాద్యోనిర్వికసితా ద్యుతౌ ।
పద్మవద్గర్భాశయః స్యాత్తత్ర ధత్తే సరక్తకమ్ ॥8॥

అగ్ని వల్ల పిత్తం, పిత్తం వల్ల పక్వాశయం ఏర్పడతాయి. ఋతుకాలంలో యోని వికసిస్తుంది. గర్భాశయం చేరుతుంది. (అది సరక్తకం)

శుక్రం స్వశుక్రతశ్చాంగం కుంతలాన్యత్ర కాలతః ।
న్యస్తం శుక్రమతో యోనౌ నైతి గర్భాశయం మునే ॥9॥

మునీంద్రా! ఆ గర్భాశయం రజోవీర్యాలను ధరిస్తుంది. వీర్యం వల్ల శరీరం, అందు కాలక్రమంలో కేశాలు ప్రకటం అవుతాయి. యోని యందు ఉంచబడే శుక్రం గర్భాశయాన్ని చేరుతుంది.

ఋతావపి చ యోనిశ్చే ద్వాతపిత్తకఫావృతా ।
భవేత్తదా వికాశిత్వం నైవ తస్యాం ప్రజాయతే ॥10॥

ఋతుకాలంలో యోని వాత, పిత్త, కఫాలచే ఆవృతమయితే, అది వికాసాన్ని పొందదు. ఆ దశలో గర్భధారణకు యోగ్యత లేదు.

బుక్కాత్పుక్క సకప్లీహకృత కోష్ఠాంగహృద్వ్రణాః ।
తండకశ్చ మహాభాగనిబద్ధాన్యాశయే మతః ॥11॥

బుక్కం వల్ల పుక్కసం, ప్లీహ, యకృత్ (కృత), కోష్ఠాంగ, హృదయ, వ్రణ, తండకాలు ఏర్పడతాయి. మహాభాగా! ఇవన్నీ ఆశయమందు నిబద్ధాలై ఉంటాయి.

రసస్య పచ్యమానస్య సారాద్భవతి దేహినామ్ ।
ప్లీహా యకృచ్చ ధర్మజ్ఞ రక్తఫేనాచ్చ పుక్కసః ॥12॥

ధర్మజ్ఞా! ప్రాణులకు పచ్యమానమగు రసంయొక్క సారం నుంచి ప్లీహ, యకృత్ పుట్టును. రక్తఫేనం నుంచి పుక్కసం పుట్టును.

రక్తం పిత్తం చ భవతి తథా తండకసంజ్ఞకః ।
మేదో రక్తప్రసారాచ్చ బుక్కాయాః సంభవః స్మృతః ॥13॥

రక్త, పిత్త, తండకాలు కూడ ఈ విధంగానే పుడతాయి. మేదం వల్ల, రక్త ప్రసారం వల్ల బుక్క యొక్క ఉత్పత్తి జరుగుతుందని తెలిసికోవలసినది.

రక్తమాంసప్రకారాచ్చ భవంత్యంత్రాణి దేహినామ్ ।
సార్ధత్రియామ (వ్యామ) సంఖ్యాని తాని నృణాం వినిర్దిశేత్ ॥14॥

రక్తమాంస ప్రసారం వల్ల ప్రాణులకు ప్రేగులు ఏర్పడతాయి. మానవుల ప్రేగులు మూడున్నర బారలు అని నిర్దేశింపబడింది.

త్రివ్యామాని తథాస్త్రీణాం ప్రాహుర్వేదవిదో జనాః ।
రక్తవాయుసమాయోగాత్కామే యస్యోద్భవః స్మృతః ॥15॥

వేదవేత్తలైన పురుషులు స్త్రీలయొక్క ప్రేగులు కూడా మూడు బారలని చెబుతారు. రక్త వాయు సంయోగంచే కామం ఉదయిస్తుంది.

కఫప్రసారాద్భవతి హృదయం పద్మసన్నిభమ్ ।
అధోముఖం తత్సుషిరం (తచ్ఛుషిరం) యత్ర జీవో వ్యవస్థితః ॥16॥

కఫప్రసారం వల్ల హృదయం ప్రకటమవుతుంది. అది పద్మంలా ఉంటుంది. దాని ముఖం క్రిందకు ఉంటుంది. దాని మధ్యనున్న ఆకాశంలో జీవుడు ఉంటాడు.

చైతన్యానుగతా భావాః సర్వే తత్ర వ్యవస్థితాః ।
తస్య వామే యథా ప్లీహా దక్షిణే చ తథా యకృత్ ॥17॥

చైతన్యానికి సంబంధించిన సర్వభావాలు దానియందే ఉంటాయి. దానికి ఎడమభాగంలో ప్లీహము, దక్షిణ భాగంలో యకృత్తు ఉంటాయి.

దక్షిణే చ తథా క్లోమ పద్మస్యైవం ప్రకీర్తితమ్ ।
శ్రోతాంసి యాని దేహేఽస్మిన్ కఫరక్తవహాని చ ॥18॥

తేషాం భూతానుమానాచ్చ భవతీంద్రియ సంభవః ।
నేత్రయోర్మండలం శుక్లం కఫాద్భవతి పైతృకమ్ ॥19॥

అలాగే ఆ హృదయపద్మానికి దక్షిణభాగంలో క్లోమం కూడ ఉంటుంది. ఈ శరీరంలో కఫరక్తాలను ప్రవహింపజేసే స్రోతస్సుల భూతానుమానం వల్ల ఇంద్రియాల ఉత్పత్తి జరుగుతుంది. నేత్రములందలి శుక్లమండలం కఫం వల్ల ఏర్పడుతుంది. ఇది తండ్రికి సంబంధించినది.

కృష్ణం చ మండలం వాతాత్తథా భవతి మాతృకమ్ ।
పిత్తాత్త్వఙ్మండలం జ్ఞేయం మాతాపితృసముద్భవమ్ ॥20॥

నేత్రాలలో కృష్ణమండలం వాతం వల్ల కలుగుతుంది. ఇది తల్లి అంశానికి సంబంధించినది. త్వఙ్మండలం పిత్తం వల్ల ఏర్పడుతుంది. ఇది తల్లిదండ్రుల అంశ వల్ల ఏర్పడుతుంది.

మాంసాసృక్కఫజా జిహ్వా మేదో ऽసృక్కఫమాంసజౌ ।
వృషా(ష)ణౌ దశ ప్రాణస్య జ్ఞేయాన్యాయతనాని తు ॥21॥

మాంస-రక్త-కఫముల వల్ల జిహ్వా, మేదస్సు, రక్తం, కఫం, మాంసాల, వల్ల అండకోశం ఉత్పత్తి అవుతాయి. ప్రాణానికి దశ (పది) ఆశ్రయ స్థానాలు ఉంటాయి. (ముష్కోऽణ్డకోవృషణః - అమరం)

మూర్ధా హృన్నాభికంఠాశ్చ జిహ్వా శుక్రం చ శోణితమ్ ।
గుదం బస్తిశ్చ గుల్ఫం చ కండరాః షోడశేరితాః ॥22॥

ప్రాణానికి శిరస్సు, హృదయం, నాభి, కంఠం, జిహ్వా, శుక్రం, రక్తం (శోణితం), గుదం, బస్తి (మూత్రాశయం), గుల్పం అనేవి ఆశ్రయంగా ఉంటాయి. అదేవిధంగా కండరాలు పదహారు స్థానాలుగా ఉంటాయి.

ద్వే కరే ద్వే చ చరణే చతస్రః పృష్ఠతో గలే ।
దేహే పాదాది శీర్షాంతే జాలాని చైవ షోడశ ॥23॥

రెండు చేతులలోను, రెండు పాదాలలోను, నాలుగు పీఠంలోను, నాలుగు కంఠమందు, నాలుగు పాదాది శిరఃపర్యంతం మొత్తం శరీరంలో పదహారు జాలాలు ఉంటాయి.

మాంసస్నాయుశిరాస్థిభ్యశ్చత్వారశ్చ పృథక్ పృథక్ ।
మణిబంధనగుల్ఫేషు నిబద్ధాని పరస్పరమ్ ॥24॥

మాంసజాలం, స్నాయుజాలం, శిరాజాలం, అస్తిజాలం అనే నాలుగు వేరువేరుగా రెండు మణిబంధనాలలోను, గుల్ఫంలోను పరస్పరాబద్ధాలై ఉంటాయి.

షట్ కూర్చాని స్మృతానీహ హస్తయోః పాదయోః పృథక్ ।
గ్రీవాయాం చ తథా మేఢ్రే కథితాని మనీషిభిః ॥25॥

శరీరంలో ఆరు కూర్చాలు ఉంటాయి. మనీషులైనవారు అవి రెండు హస్తాలయందు, రెండు పాదాల యందు, వేరువేరుగా కంఠమునందు, మేఢ్రమునందు ఉంటాయని చెబుతారు.

పృష్ఠవంశస్యోపగతాశ్చతస్రో మాంసరజ్జవః ।
తావంత్యశ్చ తథా పేశ్యస్తాసాం బంధనకారికాః ॥26॥

పృష్ఠమధ్యభాగంలో మేరుదండం, దానికి సమీపంలో నాలుగు మాంసరజ్జువులు, వాటిని బంధించి ఉంచే అన్నే పేశీలు ఉంటాయి.

సీరణ్యశ్చ తథా సప్త పంచ మూర్ధానమాశ్రితాః ।
ఏకైకా మేఢ్రజిహ్వాస్తా అస్థి షష్టిశతత్రయమ్ ॥27॥

ఏడు సీరణులు అలాగే ఉంటాయి. వాటిలో ఐదు శిరస్సును ఆశ్రయించి ఉంటాయి. ఒకటి మేఢ్రమునందు, మరొకటి జిహ్వయందు ఉంటాయి. అలాగే ఎముకలు పద్దెనిమిది వేలు ఉంటాయి.

సూక్ష్మైః సహ చతుష్షష్టిర్దశనా వింశతిర్నఖాః ।
పాణిపాదశలాకాశ్చ తాసాం స్థానచతుష్టయమ్ ॥28॥

సూక్ష్మాలు, స్థూలాలు కలసి అరవై నాలుగు దంతాలు. ఇరవై నఖాలు, హస్త, పాదాలలోని శలాకలు (ఎముకలు) నాలుగు స్థానాలలో ఉంటాయి.

షష్ట్యంగులీనాం ద్వేపార్ష్ణ్యోర్గుల్ఫేషు చ చతుష్టయమ్ ।
చత్వార్యరత్న్యోరస్థీని జంఘయోస్తద్వదేవ తు ॥29॥

వ్రేళ్లలో అరవై, పార్ష్ణులయందు రెండు, గుల్ఫాలయందు నాలుగు, అరత్నులయందు నాలుగు, జంఘలయందు నాలుగు ఎముకలు ఉంటాయి.

ద్వే ద్వే జానుకపోలోరు ఫలకాంశ సముద్భవమ్ ।
అక్షస్థానాంశకశ్రోణిఫలకే చైవమాదిశేత్ ॥30॥

జానువుల యందు రెండేసి, కపోలములందు రెండు, ఊరువులయందు రెండు, అలాగే ఫలకమూల భాగములందు రెండు ఎముకలు ఉంటాయి. అలాగే ఇంద్రియ స్థానాలయందు, శ్రోణిఫలకాలయందు రెండేసి ఎముకలు ఉంటాయి.

(భగాస్తోకం) భగేత్వేకం తథాపృష్ఠే చత్వారింశచ్చ పంచ చ ।
గ్రీవాయాం చ తథా స్థీని జత్రుకం చ తథా హనుః ॥31॥

భగంలో ఒక్కఎముక ఉంటుంది. (ఒక పక్షంలో ఎక్కువ అని ఉంది) వీపునందు నలభై ఐదు, కంఠమునందు నలభై ఐదు ఉంటాయి. గ్రీవము నందు, జత్రుకంలోను (మూపు లేక రొమ్ము), హనుప్రదేశంలోను రెండేసి ఉంటాయి.

తన్మూలం ద్వే లలాటాక్షి గండనాసాంఘ్ర్యవస్థితాః ।
పర్శుకాస్తాలుకైః సార్ధమర్బుదైశ్చ ద్విసప్తతిః ॥32॥

లలాట, నేత్ర, కపోల, నాసికా, చరణ, పర్శుకా (ప్రక్క ఎముకలు), తాలువు లందు, అర్ధార్బుద (సంఖ్యా సూక్ష్మరూపంగా) డెబ్బది రెండు ఎముకలు ఉంటాయి.

ద్వే శంఖకే కపాలాని చత్వార్యేవ శిరస్తథా ।
ఉరః సప్తదశాఽస్థీని సంధీనాం ద్వే శతే దశ ॥33॥

మస్తకంలో రెండు శంఖకాలు, నాలుగు కపాలాలు ఉంటాయి. వక్షఃస్థలంలో పదిహేడు అస్థులు ఉంటాయి. రెండు వందలపది సంధులు ఉంటాయి.

అష్టషష్టిస్తు శాఖాసు షష్టిశ్చైకవివర్జితా ।
అన్తరా వై త్ర్యశీతిశ్చ స్నాయోర్నవశతాని చ ॥34॥

వీటి శాఖలలో అరవై ఎనిమిది, ఏభైతొమ్మిది, మధ్యలో (ప్రేగులు) ఎనభై మూడు ఉంటాయి. తొమ్మిది వందల స్నాయువులు ఉంటాయి.

త్రింశాధికే ద్వే శతే తు అన్తరాధౌ తు సప్తతిః ।
ఊర్ధ్వగాః షట్ఛతాన్యేవ శాఖాస్తు కథితాని తు ॥35॥

వీటిలో అంతరాధియందు రెండు వందల ముప్పై ఉంటాయి. డెబ్బై ఊర్ధ్వగాములై ఉంటాయి. వీటి శాఖలలో ఆరు వందల స్నాయువులు ఉంటాయి.

పంచ పేశీశతాన్యేవ చత్వారింశత్తథోర్ధ్వగాః ।
చతుఃశతం తు శాఖాసు అంతరాధౌ చ షష్ఠికా ॥36॥

అందు పేశీలు ఐదు వందలు. వాటిలో నలభై ఊర్ధ్వగామినులు. శాఖలలో నాలుగు వందలు, అంతరాధియందు అరవై ఉంటాయి.

స్త్రీణాం చైకాధికా వై స్యాద్వింశతిశ్చతురుత్తరా ।
స్తనయోర్దశ యోనౌ చ త్రయోదశ తథాశయే ॥37॥

గర్భస్య చ చతస్రః స్యుః శిరాణాం చ శరీరిణామ్ ।
త్రింశచ్ఛతసహస్రాణి తథాన్యాని నవైవ తు ॥38॥

షట్ పంచాశత్ సహస్రాణి రసం దేహే వహంతి తాః ।
కేదార ఇవ కుల్యాశ్చ క్లేదలేపాదికం చ యత్ ॥39॥

స్త్రీలకు మాంసపేశీలు ఒక విషయంలో పురుషుల కన్న ఎక్కువగా (ఇరవై ఏడు) ఉంటాయి. వీటిలో పదిస్తనములందు, యోనియందు పదమూడు, గర్భాశయంలో నాలుగు ఉంటాయి. ప్రాణులకు నాడులు ముప్పైలక్షలు ఉంటాయి. అంతేకాక తొమ్మిదితో కూడుకొన్నవై, ఏబది ఆరు వేల నాడులు శరీరంలో ఉంటాయి. చిన్న చిన్న కాలువలు మడులలో నీరు ప్రవహింపజేసినట్లు ఈ నాడులు శరీరమంతా రసాన్ని ప్రవహింపజేస్తాయి. క్లేదలేపాలు వాటికార్యాలే.

ద్వాసప్తతిస్తథా కోట్యో వ్యోమ్నామిహ మహామునే ।
మజ్జాయా మేదసశ్చైవ వసాయాశ్చ తథా ద్విజ ॥40॥

మూత్రస్య చైవ పిత్తస్య శ్లేష్మణః శకృతస్తథా ।
రక్తస్య సరసస్యాత్ర క్రమశోఽంజలయో మతాః ॥41॥

మహామునీ! డెబ్బై రెండు కోట్ల రోమకూపాలు ఈ శరీరంలో ఉన్నాయి. ద్విజోత్తమా! మజ్జ, మేదస్సు, వస అనేవి, మూత్రం, పిత్తం, శ్లేష్మం, శకృత్ (మలం), రక్తం, రసం అనేవి దానియొక్క అంజలులుగా క్రమంగా చెప్పబడతాయి. ఇవన్నీ దేహంలో ఉంటాయి.

అర్ధార్ధాభ్యధికాః సర్వాః పూర్వపూర్వాంజలేర్మతాః ।
అర్ధాంజలిశ్చ శుక్రస్య తదర్ధం చ తథౌజసః ॥42॥

వీటియందు పూర్వ, పూర్వ, అంజలుల విషయంలో వాటికన్న ఉత్తరోత్తర అంజలులు ఒకటిన్నర రెట్లు అధికం. ఒక అంజలిలో సగం వీర్యం, సగం ఓజస్సు ఉంటాయి.

రజసస్తు తథా స్త్రీణాం చతస్రః కథితా బుధైః ।
శరీరం మలదోషాదిపిండం జ్ఞాత్వాఽఽత్మని త్యజేత్ ॥43॥

స్త్రీలలో రజస్సుకు సంబంధించిన నాలుగు అంజలులు ఉంటాయి. ఈ శరీరం మలదోషాదుల పిండమయం అని తెలుసుకొని దీనిపై ఆసక్తిని విడిచిపెట్టాలి.

ఇత్యాది మహాపురాణే ఆగ్నేయే శరీరావయవవిభాగవర్ణనం నామ సప్తత్యధికత్రిశతతమోఽధ్యాయః ॥370॥

అగ్నిమహాపురాణంలో శరీరావయవవిభాగవర్ణనం అనే మూడువందల డెబ్బైయవ అధ్యాయం సమాప్తం.



ఏకసప్తత్యధిక త్రిశతతమోఽధ్యాయః - మూడువందల డెబ్బైఒకటవ అధ్యాయం
నరకనిరూపణమ్ - నరకనిరూపణవర్ణనం

అగ్నిరువాచ - అగ్ని ఇలా వచించాడు.

ఉక్తాని యమమార్గాణి వక్ష్యేఽథ మరణే నృణామ్ ।
ఊష్మా ప్రకుపితః కాయే తీవ్రవాయుసమీరితః ॥1॥

మునీశ్వరా! యమలోకమార్గాలను గురించి ఇదివరకు చెప్పియున్నాను. ఇపుడు మనుష్యుల మరణాలను గురించి చెబుతాను. శరీరంలో వాయువేగం తీవ్రమైనపుడు ఊష్మ (పిత్తం) ప్రకోపితమవుతుంది.

శరీరముపరుధ్యాఽథ కృత్స్నాన్దోషాన్ రుణద్ధి వై ।
ఛినత్తి ప్రాణస్థానాని పునర్మర్మాణి చైవ హి ॥2॥

అది శరీరాన్ని అవరుద్ధం చేసి సకల దోషాలను ఆవరిస్తుంది. పిమ్మట ప్రాణస్థానాలను, మర్మస్థానాలను భేదిస్తుంది.

శైత్యాత్ప్రకుపితో వాయు శ్ఛిద్ర మన్విష్యతే తతః ।
ద్వే నేత్రే తథా కర్ణౌ ద్వౌ తు నాసాపుటౌ తథా ॥3॥

శైత్యంచే వాయువు ప్రకోపించి బయటకు పోవడానికి రంధ్రాలను అన్వేషించడం ఆరంభిస్తుంది. శరీరం పై భాగంలో రెండు నేత్రాలు, రెండు కర్ణాలు, రెండు నాసాపుటాలు ఉంటాయి.

ఊర్ధ్వం తు సప్తచ్ఛిద్రాణి అష్టమం వదనం తథా ।
ఏతైః ప్రాణో వినిర్యాతి ప్రాయశః శుభకర్మణామ్ ॥4॥

అలాగే ఊర్ధ్వభాగంలో బ్రహ్మరంధ్రం ఉంటుంది. దీనికి ఏడు ఛిద్రాలు. ఎనిమిదోది ముఖం. సాధారణంగా పుణ్యాత్ముల ప్రాణం ఈ ఎనిమిది రంధ్రాల ద్వారా బయటకు పోతుంది.

అధః పాయురుపస్థం చ అనేనాశుభకారిణామ్ ।
మూర్ధానం యోగినో భిత్వా జీవో యాత్యథ చేచ్ఛయా ॥5॥

అధోభాగంలో పాయువు, ఉపస్థ ఉంటాయి. పాపాత్ముల ప్రాణం వీటి ద్వారా పోతుంది. యోగుల ప్రాణం బ్రహ్మరంధ్రాన్ని భేదించి బయటకు పోతుంది. ఆ జీవుడు తన ఇచ్ఛానుసారంగా వెళ్లిపోతాడు.

అంతకాలే తు సంప్రాప్తే ప్రాణేఽపానముపస్థితే ।
తమసా సంవృతే జ్ఞానే సంవృతేషు చ మర్మసు ॥6॥

అంతకాలం వచ్చినపుడు ప్రాణం అపానంలో కలిసిపోతుంది. జ్ఞానం తమస్సుచే కప్పబడుతుంది. మర్మస్థానాలు మూసుకుపోతాయి.

స జీవో నాభ్యధిష్ఠానాచ్చాల్యతే మాతరిశ్వనా ।
బాధ్యమాన శ్చానయతే అష్టాంగాః ప్రాణవృత్తికాః ॥7॥

అపుడు జీవుడు వాయువుచే బాధితుడై నాభిస్థానం నుంచి చలించడం ఆరంభిస్తాడు. అష్టాంగాలలో కల ప్రాణవృత్తులను తీసుకొని శరీరం నుంచి బయటకు వస్తాడు.

చ్యవన్తం జాయమానం వా ప్రవిశన్తం చ యోనిషు ।
ప్రపశ్యన్తి చ తం సిద్ధా దేవా దివ్యేన చక్షుషా ॥8॥

జీవుడు దేహం నుంచి బయటకు రావడం, మరో జన్మ గ్రహించడం, వివిధ యోనులందు ప్రవేశించడం మున్నగు సమయాలలో ఆ జీవుని సిద్ధులు, దేవతలు తమ దివ్యదృష్టితో చూడగలుగుతారు.

గృహ్ణాతి తత్క్షణాద్యోగీ శరీరం చాతివాహికమ్ ।
ఆకాశవాయుతేజాంసి విగ్రహాదూర్ధ్వగామినః ॥9॥

జలం మహీ చ పంచత్వ మాపన్నః పురుషః స్మృతః ।
అతివాహికదేహం తు యమదూతా నయంతి తమ్ ॥10॥

మరణానంతరం జీవుడు వెంటనే అతివాహికశరీరాన్ని గ్రహిస్తాడు. అతడు త్యజించిన శరీరంలో ఉండే ఆకాశ, వాయు, తేజస్సులు పైనున్న మూడు తత్త్వాలలో కలసిపోతాయి. జలాంశమూ, పృథివి అంశమూ క్రింది తత్త్వాలలో కలసిపోతాయి. పురుషుడు పంచత్వం పొందడం అంటే ఇదే. యమదూతలు ఆ జీవుని అతివాహికదేహంలోనికి ప్రవేశపెడతారు.

యామ్యం మార్గం మహాఘోరం షడశీతి సహస్రకమ్ ।
అన్నోదకం నీయమానో బాంధవైర్దత్తమశ్నుతే ॥11॥

యమలోకమార్గం చాలా భయంకరమైనది. అది ఎనభై ఆరువేల యోజనాల దూరంలో ఉంది. ఆ మార్గంలో ప్రయాణించే జీవుడు తన బంధువులు ఇచ్చే అన్నోదకాలు అనుభవిస్తూ యమభటులచే తీసుకొని వెళ్లబడతాడు.

యమం దృష్ట్వా యమోక్తేన చిత్రగుప్తేన చేరితాన్ ।
ప్రాప్నోతి నరకాన్ రౌద్రాన్ ధర్మీ శుభపథైర్దివమ్ ॥12॥

యముని వీక్షించి, ఆయన ఆజ్ఞప్రకారం చిత్రగుప్తునిచే చెప్పబడిన మహాభయంకరములైన నరకాలను పొందుతాడు. ధర్మాత్ముడయితే శుభమార్గాల ద్వారా స్వర్గానికి చేరుకొంటాడు.

భుజ్యన్తే పాపిభిర్వక్ష్యే నరకాంస్తాశ్చ యాతనాః ।
అష్టావింశతిరేవాధః క్షితేః ర్నరకకోటయః ॥ 13 ॥

పాపాత్ములు అనుభవించే నరకాలను, వారి యాతలను ఇక చెబుతాను. భూమి క్రింద ఇరవై ఎనిమిది నరకశ్రేణులు ఉన్నాయి.

సప్తమస్య తలస్యాన్తే ఘోరే తమసి సంస్థితాః ।
ఘోరాఖ్యా ప్రథమా కోటిః సుఘోరా తదధః స్థితా ॥14॥

అవి సప్తమతలం క్రింద ఘోరాంధకారంలో ఉన్నాయి. అందు ప్రథమ కోటి (శ్రేణి) పేరు ఘోర. దాని క్రిందనుండేది సుఘోర, రెండోది.

అతిఘోరా మహాఘోరా ఘోరరూపా చ పంచమీ ।
షష్ఠీ తరలతారాఖ్యా సప్తమీ చ భయానకా ॥15॥

ఆ తరువాతివి అతిఘోర, మహాఘోర అనేవి. 'ఘోరరూప' అనేది ఐదోది. ఆరోది "తరలతార" అనేపేరు కలది. ఏడోది "భయానక" అని పేరు కలది.

భయోత్కటా కాలరాత్రీ మహాచండా చ చండయా ।
కోలాహలా ప్రచండాఖ్యా పద్మా నరకనాయికా ॥16॥

ఆ తరువాతివి భయోత్కట, కాలరాత్ర, మహాచండ, చండ, కోలాహల, ప్రచండ, పద్మ, నరకనాయిక అనేవి.

పద్మావతీ భీషణా చ భీమా చైవ కరాలికా ।
వికరాలా మహావజ్రా త్రికోణా పంచకోణికా ॥17॥

ఆ తరువాతివి పద్మావతి, భీషణ, భీమ, కరాలిక, వికరాల, మహావజ్ర, త్రికోణ, పంచకోణిక - అనేవి.

సుదీర్ఘా వర్తులా సప్తభూమా చైవ సుభూమికా ।
దీప్తమాయాఽష్టావింశతయః కోటయః పాపిదుఃఖదాః ॥18॥

ఆ తరువాతివి సుదీర్ఘ, వర్తుల, సప్తభూమ, సుభూమిక, దీప్తమాయ అనేవి. ఈ ఇరవై ఎనిమిది శ్రేణులు పాపాత్ములకు దుఃఖాలను ఇచ్చేవి.

అష్టావింశతికోటీనాం పంచ పంచ చ నాయకాః ।
రౌరవాద్యాః శతం చైకం చత్వారింశచ్చతుష్టయమ్ ॥19॥

ఈ ఇరవై ఎనిమిది నరకశ్రేణులకు ఒక్కొక్క దానియందు ఐదేసి చొప్పున స్థానాలు ఉంటాయి. అవి రౌరవం మున్నగు పేర్లతో ఉంటాయి. అవి నూట నలభై నాలుగు.

తామిస్రమంధతామిస్రం మహారౌరవ రౌరవౌ ।
అసిపత్రం వనం చైవ లోహభారం తథైవ చ ॥20॥

అవి తామిస్రం, అంధతామిస్రం, మహారౌరవం, రౌరవం, అసిపత్ర వనం, లోహభారం, అనేవి.

నరకం కాలసూత్రం చ మహానరకమేవ చ ।
సంజీవనం మహావీచి తపనం సంప్రతాపనమ్ ॥21॥

నరకం, కాలసూత్రనరకం, మహానరకం, సంజీవనం, మహావీచి, తపనం, సంప్రతాపనం అనేవి,

సంఘాతం చ సకాకోలం కుద్మలం పూతిమృత్తికమ్ ।
లోహశంకు మృజీషం చ ప్రధానం శాల్మలీం నదీమ్ ॥22॥

నరకాన్విద్ధి కోటీశనాగా న్వై ఘోరదర్శనాన్ ।
పాత్యన్తే పాపకర్మాణి ఏకైకస్మిన్ బహుష్వపి ॥23॥

సంఘాతం, కాకోలం, కుద్మలం, పూతిమృత్తికం, లోహశంకుం, ఋజీషం, ప్రధానం, శాల్మలీవృక్షం, వైతరణీనది అనేవి. మొదలైనవాటిని అన్ని నరకాలను కోటినాయకరకాలుగా తెలుసుకోవాలి. ఇవి చాలా భయంకరాలు. పాపాత్ములను వీటిలో ఒక్కొక్క దానియందు, లేదా చాలా వాటిలో పడవేయవచ్చు.

మార్జారోలూక గోమాయుగృధ్రాదివదనాశ్చ తే ।
తైలద్రోణ్యాం నరం క్షిప్త్వా జ్వాలయంతి హుతాశనమ్ ॥24॥

యమదూతల ముఖాలు మార్జారం (పిల్లి), గోమాయువు (నక్క), ఉలూకం (గుడ్లగూబ), గృధ్రం (గ్రద్ద) మున్నగు వాటి ముఖాల రూపంలో ఉంటాయి. నూనె తొట్టెలో మనుష్యుని పడవేసి అగ్నిని రగిలింపజేస్తారు.

అంబరీషేషు చైవాన్యాం స్తామ్రపాత్రేషు చాపరాన్ ।
అయః పాత్రేషు చైవాన్యాన్బహువహ్నికణేషు చ ॥25॥

కొంతమందిని మంటలలోను, కొంతమందిని తామ్రపాత్రములందు, మరికొంతమందిని ఇనుప పాత్రలందు, ఇంకొక కొంతమందిని (మండే) బొగ్గుల మీద పడవేస్తారు.

శూలాగ్రారోపితాంశ్చాన్యే ఛిద్యంతే నరకేఽ పరే ।
తాడ్యంతే కశాభిస్తు భోజ్యన్తే చాప్యయోగుడాన్ ॥26॥

కొంతమందిని శూలాలపై గ్రుచ్చుతారు. కొంతమందిని నరకంలో పడవేసి ఛేదిస్తారు. కొందరిని కొరడాలతో కొడతారు. కొందరిని కాలిన ఇనుప గుండ్లను మ్రింగేలా చేస్తారు.

యమదూతైర్నరాః పాంశూన్విష్ఠారక్త కఫాదికాన్ ।
తప్తం మద్యం పాయయంతి పాటయంతి పునర్నరాన్ ॥27॥

చాలా మంది యమదూతలు పాపాత్ములయినవారిచేత ధూళి, మలం, రక్తం, కఫం మున్నగువాటిని తినిపిస్తారు. కాచిన మద్యాన్ని త్రాగిస్తారు. కొందరిని రంపంతో కోస్తారు.

యంత్రేషు పీడయంతిస్మ భక్ష్యన్తే వాయసాదిభిః ।
తైలేనోష్ణేన సిచ్యన్తే భిద్యన్తేఽ కధా శిరః ॥28॥

కొందరిని యంత్రాలలో (గానుగల వంటివి) వేసి పీడిస్తారు. కొందరిని కాకులు మున్నగునవి పొడిచి పొడిచి భక్షిస్తాయి. కొందరిపై వేడివేడి నూనె చల్లబడుతుంది. కొందరి తలలను ముక్కలు ముక్కలుగా బ్రద్దలు చేస్తారు.

హా తాతేతి క్రందమానాః స్వకం నిందంతి కర్మ తే ।
మహాపాతకజాన్ ఘోరాన్నరకాన్ ప్రాప్య గర్హితాన్ ॥29॥

కర్మక్షయాత్ప్రజాయంతే మహాపాతకిన స్త్విహ ।
మృగశ్వశూకరోష్ట్రాణాం బ్రహ్మహా యోనిమృచ్ఛతి ॥30॥

ఆ సమయంలో పాపాత్ములు అయ్యో! అయ్యో! అంటూ ఏడుస్తూ, హాహాకారాలు చేస్తూ, తమ పాపకర్మలను నిందించుకొంటారు. ఈవిధంగా తమ మహాపాతకాలకు ఫలస్వరూపమైన, భయంకరమై, నిందింపదగిన నరక బాధలను అనుభవించి కర్మక్షయం కాగా మహాపాపాత్ములు తిరిగి మర్త్యలోకంలో జన్మిస్తారు. బ్రహ్మహత్య చేసిన వాడు, మృగం, కుక్క, పంది, ఒంటెగా పుడతాడు.

ఖరపుక్కశమ్లేచ్ఛానాం మద్యపః స్వర్ణహార్యపి ।
కృమికీటపతంగత్వం గురుగస్తృణగుల్మతామ్ ॥31॥

మద్యం త్రాగినవాడు గాడిద, చండాలుడు, మ్లేచ్ఛుడుగా జన్మిస్తాడు. సువర్ణాన్ని అపహరించినవాడు పురుగుగాను, మిడతగాను పుడతాడు. గురుతల్పం చేరినవాడు తృణంగాను, గుల్మంగాను (లతలుగాను) పుడతాడు.

బ్రహ్మహా క్షయరోగీ స్యాత్సురాపః శ్యావదంతకః ।
స్వర్ణహారీ తు కునఖీ దుశ్చర్మా గురుతల్పగః ॥32॥

బ్రహ్మహత్యచేసినవాడు క్షయరోగి అవుతాడు. సురాపానం చేసినవాని దంతాలు నల్లగా ఉంటాయి. స్వర్ణం దొంగిలించినవాని నఖాలు చెడిపోతాయి. గురుపత్నీగమనం చేసిన వాని చర్మం చెడిపోతుంది.

యో యేన సంస్పృశత్యేషాం స తల్లింగోఽభిజాయతే ।
అన్నహర్తా మాయావీ స్యాన్మూకో వాగపహారకః ॥33॥

ఎవడు ఏ పాపం చేశాడో వాడు ఆ పాపం యొక్క చిహ్నాలతో పుడతాడు. అన్నం అపహరించిన వాడు మాయావి అవుతాడు. వాణిని అపహరించినవాడు మూగవాడు అవుతాడు.

ధాన్యం హృత్వాఽతిరిక్తాంగః పిశునః పూతినాసికః ।
తైలహృత్తైలపాయీస్యాత్పూతివక్త్రస్తు సూచకః ॥34॥

ధాన్యం అపహరించినవానికి ఏదో ఒక లింగం అధికంగా ఉంటుంది. చాడీలు చెప్పినవాని ముక్కు నుంచి దుర్గంధం వస్తుంది. తైలం అపహరించినవాడు గబ్బిలం అవుతాడు. ఒకరిపై ఒకరికి చాడీలు చెప్పేవాడు దుర్గంధం ముఖం కలవాడవుతాడు.

పరస్య యోషితం హృత్వా బ్రహ్మస్వమపహృత్య చ ।
అరణ్యే నిర్జనే దేశే జాయతే బ్రహ్మరాక్షసః ॥35॥

పరుల భార్యలను అపహరించినవాడు, బ్రాహ్మణధనాన్ని దొంగలించినవాడు నిర్జనారణ్యంలో బ్రహ్మరాక్షసుడై పుడతాడు.

రత్నహారీ హీనజాతిర్గంధాం (న్) ఛ్ఛుచ్ఛుందరీ శుభాన్ ।
పత్రం శాకం శిఖీ హృత్వా ముఖరో ధాన్యహారకః ॥36॥

రత్నాలు అపహరించినవాడు హీనజాతిలో పుడతాడు. సుగంధద్రవ్యాలు హరించినవాడు చుంచువై పుడతాడు. పత్ర, శాకాలను (ఆకుకూరలను, కాయగూరలను) దొంగిలించేవాడు కోడిగా (నెమలిగా) పుడతాడు. ధాన్యాన్ని అపహరించేవాడు ఎలుకగా పుడతాడు. (ముఖరః=ఎలుక వంటిది) (చిట్టెలుక)

అజః పశుం పయః కాకో యానముష్ట్రః ఫలం కపిః ।
మధుదంశః ఫలం గృధ్రో గృహకాక ఉపస్కరమ్ ॥37॥

పశువులను హరించేవాడు మేకగాను, పాలను అపహరించేవాడు కాకిగాను, వాహనాన్ని దొంగిలించేవాడు ఒంటె గాను, ఫలాలను హరించేవాడు కోతిగాను, తేనెను హరించేవాడు ఈగగాను, మాంసాన్ని హరించేవాడు గ్రద్దగాను, ఇంటిలోని సామ్రగిని అపహరించేవాడు గృహకాకం గాను పుడతాడు. (గృహకాకం=ఇంటి చుట్టూ తిరిగే కాకి).

శ్విత్రీ వస్త్రం సారసం చ ఝిల్లీ లవణహారకః ।
ఉక్త ఆధ్యాత్మికస్తాపః శస్త్రాద్యైరాధిభౌతికః ॥38॥

వస్త్రాలు అపహరించేవాడు బొల్లికల వాడుగా, రసాన్ని, ఉప్పును అపహరించే వాడు ఈగగాను జన్మిస్తాడు. ఇది ఆధ్యాత్మికతాపవర్ణనం. శస్త్రాదుల వల్ల కలిగే తాపం ఆధిభౌతికం.

గ్రహాగ్నిదేవపీడాద్యై రాధిదైవిక ఈరితః ।
త్రిధా తాపం హి సంసారం జ్ఞానయోగాద్వినాశయేత్ ॥39॥

గ్రహబాధల వల్ల, అగ్నిదేవతాదుల వల్ల, పీడాదుల వల్ల కలిగేది ఆధిదైవికం. ఈ త్రివిధతాపాలతో కూడకొన్న సంసారాన్ని మానవుడు జ్ఞానయోగంతో నశింపజేసుకోవాలి.

కృచ్ఛ్రైర్వ్రతైశ్చ దానాద్యైర్విష్ణుపూజాదిభిర్నరః ॥40॥

కృచ్ఛ్రాదివ్రతాల ద్వారా, కఠినవ్రతాల ద్వారా, దానాదుల ద్వారా, విష్ణువును గురించి చేసే పూజాదుల ద్వారా కూడ నరుడు సంసారతాపాలను పరిహరించుకోవాలి (నశింపజేసుకోవాలి).

ఇత్యాది మహాపురాణే ఆగ్నేయే నరకనిరూపణం నామ ఏకసప్తత్యధిక త్రిశతతమోఽధ్యాయః ॥371॥

అగ్నిమహాపురాణంలో నరకాదినిరూపణమనే మూడువందల డెబ్బైఒకటవ అధ్యాయం సమాప్తం.



ద్విసప్తత్యధిక త్రిశతతమోఽధ్యాయః - మూడువందల డెబ్బైరెండవ అధ్యాయం

యమనియమాః - యమనియమవర్ణనం

అగ్నిరువాచ - అగ్ని ఇలా వచించాడు.

సంసారతాపముక్త్యర్థం వక్ష్యామ్యష్టాంగయోగకమ్ ।
బ్రహ్మప్రకాశకం జ్ఞేయం యోగస్త్వైకచిత్తతా ॥1॥

మునీశ్వరా! సంసారతాపాలు తొలగడానికి ఇపుడు అష్టాంగయోగాలు చెబుతాను. బ్రహ్మను సాక్షాత్కరింపజేసే ఏకాగ్రచిత్తత్వమే యోగం.

చిత్తవృత్తినిరోధశ్చ జీవబ్రహ్మాత్మనోః పరః ।
అహింసా సత్యమస్తేయం బ్రహ్మచర్యాపరిగ్రహౌ ॥2॥

యమాః పంచ స్మృతా విప్ర నియమా భుక్తిముక్తిదాః ।
శౌచం సంతోషతపసీ స్వాధ్యాయేశ్వరపూజనే ॥3॥

చిత్తవృత్తులను నిరోధించడం కూడ యోగమే. జీవాత్మయందు, పరమాత్మయందు అంతఃకరణవృత్తులను నిలబెట్టడం ఉత్తమయోగం. అహింసా, సత్యం, అస్తేయం (దొంగతనం చేయకుండుట) బ్రహ్మచర్యం, అపరిగ్రహం అనే ఐదు యమములుగా చెప్పబడ్డాయి. విప్రవర్యా! నియమాలు కూడ అయిదే. భుక్తిని, ముక్తిని కలిగించే అవి: శౌచం, సంతోషం, తపస్సు, స్వాధ్యాయం, ఈశ్వరపూజనం (ఈశ్వరప్రణిధానం).

భూతాపీడా హ్యహింసా స్యాదహింసా ధర్మ ఉత్తమః ।
యథా గజపదేఽన్యాని పదాని పథగామినామ్ ॥4॥

ఏవం సర్వమహింసాయాం ధర్మార్థమభిధీయతే ।
ఉద్వేగజననం హింసా సంతాపకరణం తథా ॥5॥

ప్రాణులకు పీడకలిగించక పోవడం అహింస, అహింసయే ఉత్తమధర్మం. మార్గంలో నడిచే అందరి అడుగులు ఏనుగు అడుగులో ఇమిడిపోయినట్లుగా సర్వధర్మాలు, వాటి ప్రయోజనాలు అహింసలో ఇమిడిపోతాయి. ఇతరులకు ఉద్వేగాన్ని పుట్టించడం, సంతాపాన్ని కలిగించడం హింస.

రుక్కృతిః శోణితకృతిః పైశున్యకరణం తథా ।
హితస్యాతినిషేధశ్చ మర్మోద్ఘాటనమేవ చ ॥6॥

సుఖాపహ్నుతిః సంరోధో వధో దశవిధా చ సా ।
యద్భూతహితమత్యన్తం వచః సత్యస్య లక్షణమ్ ॥7॥

రోగాన్ని కలిగించడం, శరీరం నుంచి రక్తం వచ్చేటట్లు చేయడం, కొండెములు చెప్పి పీడించుట, ఇతరుల హితానికి అడ్డుతగులుట, వారి రహస్యాలను బయట పెట్టుట, ఎదుటివారికి సుఖం లేకుండ చేయడం, అకారణంగా వారిని బంధించడం, వధించడం అన్నది హింస పదివిధాలు. అలా చేయకుండా ఉండడం అహింస. ప్రాణులకు అత్యంతప్రియమైన (హితమైన) వాక్కు ఏదయితే ఉందో, అది సత్యలక్షణం.

సత్యం బ్రూయాత్ప్రియం బ్రూయాన్నబ్రూయాత్సత్యమప్రియమ్ ।
ప్రియం చ నానృతం బ్రూయాదేష ధర్మః సనాతనః ॥8॥

సత్యము పలకాలి. అది ప్రియమైనదిగా వుండాలి. సత్యమైనా అప్రియమైనచో చెప్పరాదు. ప్రియాన్ని కలిగించే అసత్యం పలుకరాదు. ఇది సనాతనధర్మం.

మైథునస్య పరిత్యాగో బ్రహ్మచర్యం తదష్టధా ।
స్మరణం కీర్తనం కేలిః ప్రేక్షణం గుహ్యభాషణమ్ ॥9॥

సంకల్పోఽ ధ్యవసాయశ్చ క్రియానిర్వృతిరేవ చ ।
ఏతన్మైథునమష్టాంగం ప్రవదంతి మనీషిణః ॥10॥

మైథునాన్ని పూర్తిగా వదలిపెట్టడం బ్రహ్మచర్యం. అది ఎనిమిది విధాలు. స్త్రీ సంబంధమైన విషయాలను స్మరించడం, కీర్తించడం, విహరించడం, వీక్షించడం, రహస్యంగా మాటలాడడం. దానిని కోరుకోవడం, అందుకు తగిన ప్రయత్నం చేయడం, సాక్షాత్సమాగమం చెందడం అని మైథునం ఎనిమిది అంగాలుగా ఉంటుందని మనీషులు వక్కాణిస్తారు.

బ్రహ్మచర్యం క్రియామూలమన్యథా విఫలాః క్రియాః ।
వసిష్ఠశ్చంద్రమాః శుక్రో దేవాచార్యః పితామహః ॥
తపోవృద్ధా వయోవృద్ధాస్తేఽ పి స్త్రీభిర్విమోహితాః ॥11॥

బ్రహ్మచర్యమే సమస్తయోగప్రక్రియలకు మూలం. ఆ నియమం లేకపోతే సమస్తక్రియలు నిష్ఫలాలు అవుతాయి. వయోవృద్ధులు, తపోవృద్ధులు అయిన వసిష్ఠుడు, చంద్రుడు, శుక్రుడు, దేవతల గురువైన బృహస్పతి, పితామహుడైన బ్రహ్మ వంటివారే స్త్రీల వల్ల మోహం పొందారు.

గౌడీ పైష్టీ చ మాధ్వీ చ విజ్ఞేయాస్త్రివిధాసురాః ।
చతుర్థీ స్త్రీ సురా జ్ఞేయా యయేదం మోహితం జగత్ ॥12॥

మాద్యతి ప్రమదాం దృష్ట్వా సురాం పీత్వా తు మాద్యతి ॥13॥

సుర బెల్లంతో చేసినది, పిండితో చేసినది, మధువుతో చేసినది అని మూడు విధాలుగా తెలియాలి. ఈ జగత్తు నంతను మోహింపజేసే స్త్రీ అనే సుర నాలుగోది. సురను త్రాగిన తరువాతనే మత్తు పొందుతాడు. కాని స్త్రీని చూచినంతనే మత్తు పొందుతాడు.

యస్మాద్ధృష్టమదా నారీ తస్మాత్తాం నావలోకయేత్ ।
యద్వా తద్వా పరద్రవ్యమపహృత్య బలాన్నరః ॥14॥

అవశ్యం యాతి తిర్యక్త్వం జగ్ధ్వా చైవాహుతం హవిః ।
కౌపీనాచ్ఛాదనం వాసః కంథాం శీతనివారిణీమ్ ॥15॥

పాదుకే చాపి గృహ్ణీయాత్కుర్యాన్నాన్యస్య సంగ్రహమ్ ।
దేహస్థితినిమిత్తస్య వస్త్రాదేః స్యాత్పరిగ్రహః ॥16॥

అందువల్ల చూచినంతమాత్రంచేతనే మత్తునిచ్చే స్త్రీని చూడరాదు. ఏదోవిధంగానైనా పరద్రవ్యం బలాత్కారంగా అపహరించేవాడు, హోమం చేయవలసిన హవిస్సును తినివేసేవాడు తిర్యగ్జాతిలో పుడతారు. కౌపీనాన్ని ఆచ్ఛాదించుకోవడానికి, బొంతను చలిని నివారించుకోవడానికి పాదుకలను పాదరక్షణ కోసమై సంపాదించుకోవాలి. కాని మరి దేనిని సంగ్రహించరాదు. దేహస్థితినిమిత్తంగా వస్త్రాదులను పరిగ్రహించవచ్చు.

శరీరం ధర్మసంయుక్తం రక్షణీయం ప్రయత్నతః ।
శౌచం తు ద్వివిధం ప్రోక్తం బాహ్యమాభ్యంతరం తథా ॥17॥

శరీరం ఎల్లప్పుడూ ధర్మయుక్తంగా, ప్రయత్నపూర్వకంగా రక్షింపదగినది. బాహ్యం, ఆభ్యంతరం అని శౌచం రెండు విధాలుగా చెప్పబడుతుంది.

మృజ్జలాభ్యాం స్మృతం బాహ్యం భావశుద్ధిరథాంతరమ్ ।
ఉభయేన శుచిర్యస్తు స శుచిర్నేతరః శుచిః ॥18॥

మట్టితోను, నీటితోను చేసుకొనే శౌచం బాహ్యం. భావశుద్ధి కలిగించుకోవడం ఆంతరం. ఈ రెండు విధాలైన శౌచం పాటించేవాడే శుచియైనవాడు, ఇతరుడు కాడు.

యథాకథంచిత్ప్రాప్త్యా చ సంతోషస్తుష్టిరుచ్యతే ।
మనసశ్చేంద్రియాణాం చ ఐకాగ్ర్యం తప ఉచ్యతే ॥19॥

యథాలాభంగా లభించిన దానితో ఆనందించడం తుష్టి అనబడుతుంది. మనస్సును, ఇంద్రియాలను ఏకాగ్రంగా ఉంచడం తపస్సుగా చెప్పబడుతుంది.

తజ్జయః సర్వధర్మేభ్యః స ధర్మః పర ఉచ్యతే ।
వాచికం మంత్రజప్యాది మానసం రాగవర్జనమ్ ॥20॥

మనస్సును, ఇంద్రియాలను జయించడం అన్ని ధర్మాలకన్న పరమోత్కృష్టమైన ధర్మం. మంత్రం, జపం మున్నగునవి వాచిక తపస్సు, వైరాగ్యమనేది మానసిక తపస్సు.

శారీరం దేవపూజాది సర్వదం తు త్రిధా తపః ।
ప్రణవాద్యాస్తతో వేదాః ప్రణవే పర్యవస్థితాః ॥21॥

దైవపూజాదికం శారీరకమైన తపస్సు. ఈ మూడువిధాలైన తపస్సు సర్వఫలప్రదమైనది. వేదాలు ప్రణవంతో ప్రారంభమవుతాయి. ప్రణవము నందే అవి పర్యవిస్తాయి.

వాఙ్మయః ప్రణవం సర్వం తస్మాత్ప్రణవమభ్యసేత్ ।
అకారశ్చ తథోకారో మకార శ్చార్ధమాత్రయా ॥22॥

సమస్తవాఙ్మయము ప్రణవస్వరూపం. అందువల్ల ప్రణవాన్ని అభ్యసించాలి. ప్రణవంలో అకారం, ఉకారం, మకారం అర్ధమాత్ర ఉన్నాయి.

తిస్రో మాత్రాస్త్రయో వేదా లోకా భూరాదయో గుణాః ।
జాగ్రత్స్వప్నః సుషుప్తిశ్చ బ్రహ్మవిష్ణుమహేశ్వరాః ॥23॥

ఈ మూడు మాత్రలు మూడు వేదాలు. భూరాది లోకాలు మూడు. గుణాలు మూడు. మూడు జాగ్రత్స్వప్నసుషుప్తి అవస్థలు. బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులను మూడు మూర్తులు.

బ్రహ్మో విష్ణుశ్చ రుద్రశ్చ స్కందదేవీమహేశ్వరాః ।
ప్రద్యుమ్నః శ్రీర్వాసుదేవః సర్వమోంకారకః క్రమాత్ ॥24॥

బ్రహ్మ, విష్ణువు, రుద్రుడు, స్కందుడు, దేవి, మహేశ్వరుడు, ప్రద్యుమ్నుడు, లక్ష్మి, వాసుదేవుడు ఇలా అంతా ఓంకారస్వరూపమే.

అమాత్రో నష్టమాత్రశ్చ ద్వైతస్యాపగమః శివః ।
ఓంకారో విదితో యేన స మునిర్నేతరో మునిః ॥25॥

'ఓం'కారం అమాత్రం లేదా నష్టమాత్రం. ఇది ద్వైతవినాశరూపమైన శివస్వరూపం. ఓంకారస్వరూపం తెలిసిన వాడే ముని. ఇతడు ముని కాదు.

చతుర్థీ మాత్రా గాంధారీ ప్రయుక్తా మూర్ధ్ని లక్ష్యతే ।
తత్తురీయం పరం బ్రహ్మ జ్యోతిర్దీపో ఘటే యథా ॥26॥

తథాహృత్పద్మనిలయం ధ్యాయేన్నిత్యం జపేన్నరః ।
ప్రణవో ధనుః శరో హ్యాత్మా బ్రహ్మ తల్లక్ష్యముచ్యతే ॥27॥

ఓంకారం యొక్క నాలుగో మాత్ర గాంధారి. అది ప్రయుక్తమైనపుడు మూర్ధస్థానంలో స్పందన కలుగుతుంది. (లక్షింపబడుతుంది). అదియే తురీయమైన పరబ్రహ్మ. అదే జ్యోతిస్స్వరూపం. కుండ (ఘటం) లో ఉన్నదీపం ఎలా ప్రకాశాన్ని ఇస్తుందో, మూర్ధస్థానంలోని పరబ్రహ్మ కూడ జ్ఞానమయమైన జ్యోతిని ప్రసరింపజేస్తుంది. అందువల్ల సాధకుడు హృత్పద్మంలో ఉన్నజ్యోతిని (బ్రహ్మను) నిత్యము జపించాలి. ప్రణవమే ధనుస్సు. ఆత్మయే బాణము. బ్రహ్మయే దాని లక్ష్యమని చెప్పబడుతుంది.

అప్రమత్తేన వేద్ధవ్యం శరవత్తన్మయో భవేత్ ।
ఏతదేకాక్షరం బ్రహ్మ ఏతదేకాక్షరం పరమ్ ॥28॥

సాధకుడు సావధానుడై అప్రమత్తుడై దాని లక్ష్యాన్ని ఛేదించాలి. తాను శరంగా మారి తన్మయుడై దానిని సాధించాలి. ఈ ఏకాక్షరమే బ్రహ్మ. ఈ ఏకాక్షరమే పరతత్త్వము.

ఏతదేకాక్షరం జ్ఞాత్వా యో యదిచ్ఛతి తస్య తత్ ।
ఛన్దోఽస్య దేవీ గాయత్రీ అంతర్యామీ ఋషిః స్మృతః ॥29॥

ఈ ఏకాక్షరబ్రహ్మాన్ని తెలుసుకొన్నవాడు దేనిని కోరునో, అది లభిస్తుంది. ఈ ఓంకారానికి గాయత్రీదేవి ఛందస్సు. అంతర్యామి ఋషి అని చెప్పబడింది.

దేవతా పరమాత్మాఽస్య నియోగో భుక్తిముక్తయే ।
భూరగ్న్యాత్మనే హృదయం భువః ప్రాజాపత్యాత్మనే ॥30॥

పరమాత్మ దేవత. దీని వినియోగం భుక్తిముక్తులకు మాత్రమే. "ఓం భూః అగ్న్యాత్మనే హృదయాయ నమః" అని హృదయాన్ని స్పృశించాలి. "ఓం భువః ప్రాజాపత్యాత్మనే శిరసే స్వాహా" అని శిరస్సును స్పృశించాలి.

శిరః స్వః సూర్యాత్మనే చ శిఖా కవచముచ్యతే ।
ఓం భూర్ భువః స్వః కవచం సత్యాత్మనే తతోఽస్త్రకమ్ ॥31॥

"ఓం స్వః సర్వాత్మనే శిఖాయై వషట్" అనే మంత్రంతో శిఖను స్పృశించాలి. "ఓం భూర్భువః స్వః సత్యాత్మనే కవచాయ హుమ్" అనే కవచమంత్రంతో వ్రేళ్లతో స్పృశించాలి. ఆ తరువాత "ఓం భూర్భువః సత్యాత్మనే అస్త్రాయ ఫట్" అనే మంత్రంతో (అస్త్రంతో) అంగన్యాసం చేయాలి.

విన్యస్య పూజయేద్విష్ణుం జపేద్వై భుక్తిముక్తయే ।
జుహుయాచ్చ తిలాజ్యాది సర్వం సంపద్యతే నరే ॥32॥

న్యాసం పూర్తి అయిన తరువాత విష్ణువును పూజించి, భుక్తి ముక్తి కోసమై తన్నామజపం చేయాలి. తిల, ఆజ్యాదులను హోమం చేయాలి. సర్వం సాధకునికి లభిస్తుంది.

యస్తు ద్వాదశసాహస్రం జపమన్వహమాచరేత్ ।
తస్య ద్వాదశభిర్మాసైః పరం బ్రహ్మ ప్రకాశతే ॥33॥

ఎవడు ప్రతిదినం పండ్రెండు వేలు ప్రణవజపం చేస్తాడో వానికి పన్నెండు మాసాలలో పరబ్రహ్మ జ్ఞానోదయం కలుగుతుంది.

అణిమాది కోటిజప్యాల్లక్షాత్సారస్వతాదికమ్ ।
వైదికస్తాంత్రికో మిశ్రో విష్ణో ర్వై త్రివిధో మఖః ॥34॥

కోటి పర్యాయాలు జపం చేస్తే అణిమాదులు సిద్ధిస్తాయి. లక్ష జపం చేస్తే సరస్వతి మున్నగు వారి అనుగ్రహం లభిస్తుంది. వైదికం, తాంత్రికం, మిశ్రం అని విష్ణుపూజ మూడు విధాలు.

త్రయాణామీప్సితే నైకవిధినా హరిమర్చయేత్ ।
ప్రణమ్య దండవద్భూమౌ నమస్కారేణ యోఽర్చయేత్ ॥
స యాం గతిమవాప్నోతి న తాం క్రతుశతైరపి ॥35॥

వీటిలో ఇష్టమైన విధానాన్ని ఆశ్రయించి విష్ణువును పూజించాలి. భూమిపై దండంలా విష్ణువుకు చేసే సాష్టాంగ నమస్కారం వల్ల కలిగే సద్గతి నూరుక్రతువులు చేసినా కూడా కలగదు.

యస్య దేవే పరా భక్తి ర్యథా దేవే తథా గురౌ ।
తస్యైతే కథితా హ్యర్థాః ప్రకాశంతే మహాత్మనః ॥36॥

ఎవనికి తన ఆరాధ్యదైవమందు ఉత్తమభక్తి ఉంటుందో, తన గురువు పట్ల కూడ ఆరాధ్యదేవతయందున్న భక్తి ఉంటుందో, ఆ మహాత్మునికే ఈ చెప్పిన విషయాలన్నీ స్పష్టంగా అవగతమవుతాయి.

ఇత్యాది మహాపురాణే ఆగ్నేయే యమనియమనిరూపణం నామ ద్విసప్తత్యధిక త్రిశతతమోఽధ్యాయః ॥372॥

అగ్నిమహాపురాణంలో యమనియమనిరూపణం అనే మూడువందల డెబ్బైరెండవ అధ్యాయం సమాప్తం.



త్రిసప్తత్యధిక త్రిశతతమోఽధ్యాయః – మూడువందల డెబ్బైమూడవ అధ్యాయం

ఆసనప్రాణాయామప్రత్యాహారాః – ఆసన, ప్రాణాయామ, ప్రత్యాహారాలు

అగ్నిరువాచ – అగ్నిదేవుడు వచించాడు.

ఆసనం కమలాద్యుక్తం తద్బద్ధ్వా చింతయేత్పరమ్ ।
శుచౌ దేశే ప్రతిష్ఠాప్య స్థిరమాసనమాత్మనః ॥1॥

మునీశ్వరా! పద్మాసనం మున్నగునవి ఆసనాలని చెప్పబడినాయి. ఆ ఆసనాలలో ఏదో ఒక ఆసనం ద్వారా ఇంద్రియాలను బంధించి పరమాత్మధ్యానం చేయాలి. పవిత్రమైన ప్రదేశంలో కూర్చుండి, స్థిరమైన ఆసనంలో అధిష్ఠితుడు కావాలి.

నాత్యుచ్ఛ్రితం నాతినీచం చైలాజినకుశోత్తరమ్ ।
తత్రైకాగ్రం మనః కృత్వా యతచిత్తేన్ద్రియక్రియః ॥2॥

చాలా ఎత్తు కానిది, చాలా పల్లము కానిది అయిన పీఠంపై దర్భలను, వానిపై మృగచర్మం, దానిపై వస్త్రం పరచుకొని దానిపై కూర్చుండి చిత్తవృత్తులను, ఇంద్రియవృత్తులను అరికట్టి మనస్సును ఏకాగ్రం చేయాలి.

ఉపవిశ్యాఽఽసనే యుంజ్యాద్యోగమాత్మవిశుద్ధయే।
సమం కాయశిరోగ్రీవం ధారయన్నచలం స్థిరః॥3॥

తగిన ఆసనంలో కూర్చుని ఆత్మవిశుద్ధికోసమై యోగాభ్యాసం చేయాలి. శరీరాన్ని, శిరస్సును, కంఠాన్ని సమంగా ఉండేటట్లు కదలకుండా స్థిరంగా నిలపాలి.

సంప్రేక్ష్య నాసికాగ్రం స్వం దిశశ్చానవలోకయన్ ।
పార్ష్ణిభ్యాం వృషణౌ రక్షంస్తథా ప్రజననం పునః ॥4॥

ఊరుభ్యాముపరి స్థాప్య బాహూ తిర్యక్ప్రయత్నతః ।
దక్షిణం కరపృష్ఠం చ న్యసేద్వామతలోపరి ॥5॥

తనాసికాగ్రంపై దృష్టి నిలిపి, దిక్కులను చూడక, మడమలచే వృషణాలను, జననేంద్రియాలను రక్షించుకొంటూ తొడలపై బాహువులను అడ్డంగా ప్రయత్నపూర్వకంగా ఉంచి, (వాటిని వెనుకకు వంచి (త్రిప్పి) కుడి చేతిని వామోరుతలంపై ఉంచాలి. ఎడమ చేతిని దక్షిణోరుభాగంపై ఉంచాలి. ఇది యోగంలో ఒక ప్రక్రియ) (అలాకాకుండా) ఎడమ అరచేతిలో దక్షిణహస్తపృష్ఠభాగాన్ని ఉంచాలి.

ఉన్నమ్య శనకైర్వక్త్రం ముఖం విష్టభ్య చాగ్రతః ।
ప్రాణః స్వదేహజో వాయుస్తస్యాయామో నిరోధనమ్ ॥6॥

ముఖాన్ని నెమ్మదిగా కొంచెం పైకెత్తి ముందుకు చొచ్చుకొనేటట్లు చేసి, ధ్యానం చేయాలి. తన దేహంలో ఉన్న వాయువే ప్రాణం. దానిని నిరోధించడం ప్రాణాయామం.

నాసికాపుటమంగుల్యాఽఽపీడ్యైవ పరేణ చ ।
ఔదరం రేచయేద్వాయుం రేచనాద్రేచకః స్మృతః ॥7॥

ఒక నాసికాపుటాన్ని వ్రేలితో నొక్కిపట్టి, రెండో నాసికాపుటం నుంచి ఉదరంలోని వాయువును బయటకు (పైకి) పంపాలి. ఇట్లు రేచనం చేయడంచేత దీనికి రేచకప్రాణాయామమని పేరు.

బాహ్యేన వాయునా దేహం దృతివత్పూరయేద్యథా ।
తథా పూర్ణశ్చ సంతిష్ఠేత్పూరణాత్పూరకః స్మృతః ॥8॥

బాహ్యవాయువులతో దేహాన్ని తిత్తిని నింపినట్లు నింపి కొంత సేపు అలాగే ఉంచాలి. వాయువును పూరించడం వల్ల దీనికి పూరకమని పేరు.

న ముంచతి న గృహ్ణాతి వాయుమంతర్బహిః స్థితమ్ ।
సంపూర్ణకుంభవత్తిష్ఠేదచలః స తు కుంభకః ॥9॥

లోపల వాయువును విడిచి పెట్టకుండా, బయట వాయువును లోపలకు తీసుకొనకుండా సంపూర్ణకుంభంలా స్థిరుడై ఉండాలి. దానికి కుంభకమని పేరు.

కన్యకః సకృదుద్ఘాతః సవై ద్వాదశ మాత్రకః ।
మధ్యమశ్చ ద్విరుద్ఘాతశ్చతుర్వింశతిమాత్రికః ॥10॥

పండ్రెండు మాత్రల కాలం ఉద్ఘాతం. అంతకాలం ప్రాణాయామం చేయడం కన్యకం (కనిష్ఠం). రెండు ఉద్ఘాతాల కాలం అనగా ఇరవైనాలుగు మాత్రల కాలం ప్రాణాయామం చేయడం మధ్యమం.

ఉత్తమశ్చ త్రిరుద్ఘాతః షట్త్రింశత్తాలమాత్రికః ।
స్వేదకంపాభిఘూతానాం జననశ్చోత్తమోత్తమః ॥11॥

మూడు ఉద్ఘాతాల కాలం అనగా ముప్పై ఆరు మాత్రల కాలం ప్రాణాయామం చేయడం ఉత్తమము. స్వేదాన్ని, కంపాన్ని, అభిఘూతాన్ని (చెమట పట్టి ఉండిపోవడం) కల్గించే ప్రాణాయామం ఉత్తమోత్తమం.

అజితాం నాఽఽరుహేద్భూమిం హిక్కాశ్వాసాదయ స్తథా ।
జితే ప్రాణే స్వల్పదోషవిణ్మూత్రాది ప్రజాయతే ॥12॥

తనకు అధికారం లేని ప్రాణాయామభూమికలను అభ్యసించరాదు. ప్రాణాయామం చేసేవానికి హిక్కా (వెక్కిళ్ళు), శ్వాస (ఎగ ఊపిరి), ప్రాణం జయించినవానికి మలమూత్రాది దోషాలు స్వల్పంగానే ఉంటాయి.

ఆరోగ్యం శీఘ్రగామిత్వముత్సాహః స్వరసౌష్ఠవమ్ ।
బలవర్ణప్రసాదశ్చ సర్వదోషక్షయః ఫలమ్ ॥13॥

ఆరోగ్యం, చక చక నడవడం, ఉత్సాహం (చురుకుగా ఉండడం), స్వరమాధుర్యం, బలం, శరీరవర్ణం, స్వచ్ఛంగా ఉండడం, సకల దోషాలు క్షయమై పోవడం - ఇవి ప్రాణాయామం చేయడం వల్ల కలిగే లాభాలు.

జపధ్యానం వినాఽగర్భః సగర్భస్తత్సమన్వితః ।
ఇంద్రియాణాం జయార్థాయ సగర్భం ధారయేత్పరమ్॥14॥

జప, ధ్యానాలు లేని ప్రాణాయామం అగర్భం. వాటి తోకూడుకొన్నది సగర్భం. ఇంద్రియాలను జయించడం కోసమై సగర్భప్రాణాయామం చేయాలి.

జ్ఞానవైరాగ్యయుక్తాభ్యాం ప్రాణాయామవశేన చ।
ఇంద్రియాంశ్చ వినిర్జిత్య సర్వమేవ జితం భవేత్॥15॥

జ్ఞానవైరాగ్యసాధనాలచేత, ప్రాణాయామాభ్యాసం చేత, ఇంద్రియాలను జయించినవాడు సర్వమును జయించినవాడౌతాడు.

ఇంద్రియాణ్యేవ తత్సర్వం యత్స్వర్గనరకావుభౌ ।
నిగృహీతవిసృష్టాని స్వర్గాయ నరకాయ చ ॥16॥

స్వర్గం, నరకం అనే రెండూ కూడ ఇంద్రియసర్వస్వములే. ఇంద్రియాలను వశంలో ఉంచుకొంటే స్వర్గం. వశంలో ఉంచుకోకపోతే నరకం.

శరీరం రథమిత్యాహురింద్రియాణ్యస్య వాజినః ।
మనశ్చ సారథిః ప్రోక్తః ప్రాణాయామః కశః స్మృతః ॥17॥

ఈ శరీరమే రథమని చెబుతారు. దానికి గుఱ్ఱాలు ఇంద్రియాలు. మనస్సు సారథి. ప్రాణాయమం కొరడా వంటిది.

జ్ఞానవైరాగ్యరశ్మిభ్యాం మాయయా విధృతం మనః ।
శనైర్నిశ్చలతామేతి ప్రాణాయామైకసంహితమ్ ॥18॥

జ్ఞానం, వైరాగ్యం అనే కళ్లెములతో మాయతో కూడిన మనస్సును స్వాధీనంలో ఉంచుకోవాలి. ఈ విధంగా ప్రాణాయామంచే నిరోధింపబడే మనస్సు మెల్లగా నిశ్చలత్వాన్ని పొందుతుంది.

జలబిందుం కుశాగ్రేణ మాసే మాసే పిబేత్తు యః ।
సంవత్సరశతం సాగ్రం ప్రాణాయామశ్చ తత్సమః ॥19॥

మాసానికి ఒకసారి కుశాగ్రంతో జలబిందువును త్రాగుతూ నూరు సంవత్సరాలు తపస్సు చేస్తే ఎంత ఫలం లభిస్తుందో ప్రాణాయామం వల్ల అంత ఫలం లభిస్తుంది.

ఇంద్రియాణి ప్రసక్తాని ప్రవిశ్య విషయోదధౌ ।
ఆహృత్య యో నిగృహ్ణాతి ప్రత్యాహారః స ఉచ్యతే ॥20॥

విషయసముద్రంలో ప్రవర్తించే ఇంద్రియాలను వెనుకకు లాగి, నిగ్రహించుకొను సామర్థ్యమే ప్రత్యాహారం.

ఉద్ధరేదాత్మనాఽ ఽ త్మానం మజ్జమానం యథాఽ మ్భసి ।
భోగనద్యతివేగేన జ్ఞానవృక్షం సమాశ్రయేత్ ॥21॥

నీటిలో మునిగి పోతున్నట్లుగా, విషయాలలో మునిగిపోతున్న తనను తానే ఉద్ధరించుకోవాలి. భోగాలు అనెడు నదీవేగంలో కొట్టుకొనిపోయేవాడు జ్ఞానమనే వృక్షాన్ని ఆశ్రయించాలి.

ఇత్యాది మహాపురాణే ఆగ్నేయే ఆసనప్రాణాయామ ప్రత్యాహారనిరూపణం
నామ త్రిసప్తత్యధిక త్రిశతతమోఽ ధ్యాయః ॥373॥

అగ్నిమహాపురాణంలో ఆసనప్రాణాయామప్రత్యాహారనిరూపణమనే
మూడువందల డెబ్బైమూడవ అధ్యాయం సమాప్తం.



చతుఃసప్తత్యధిక త్రిశతతమోఽధ్యాయః – మూడువందల డెబ్బైనాల్గవ అధ్యాయం

ధ్యానమ్ – ధ్యానవిషయవర్ణనం

అగ్నిరువాచ – అగ్ని ఇలా వచించాడు.

ధ్యై చింతాయాం స్మృతో ధాతు ర్విష్ణుచింతా ముహుర్ముహుః ।
అనాక్షిప్తేన మనసా ధ్యానమిత్యభిధీయతే ॥1॥

మునీశ్వరా! ధ్యానం "ధ్యై చింతాయాం" అనే ధాతువు నుండి నిష్పన్నమయింది. విక్షేపం లేని మనస్సుతో, స్థిరచిత్తంతో మాటమాటికి విష్ణువును చింతించడం 'ధ్యానం' అని చెప్పబడుతుంది.

ఆత్మనః సమనస్కస్య ముక్తాశేషోపధస్య చ ।
బ్రహ్మచింతా సమా శక్తి ర్ధ్యానం నామ తదుచ్యతే ॥2॥

సమస్తములైన ఉపాధుల నుంచి విముక్తము, సమనస్కము అగు ఆత్మ, బ్రహ్మచింతాలగ్నమై ఉండడం ధ్యానమని చెప్పబడుతుంది.

ధ్యేయాలంబనసంస్థస్య సదృశప్రత్యయస్య చ ।
ప్రత్యయాన్తరనిర్ముక్తః ప్రత్యయో ధ్యానముచ్యతే ॥3॥

ధ్యేయంపై నిలిచి, సదృశప్రత్యయాలు కలిగిన మనస్సు ఇతర ప్రత్యయాలు లేకుండా ఉండడం అనే విశ్వాసం కూడ ధ్యానం అనబడుతుంది.

ధ్యేయావస్థితచిత్తస్య ప్రదేశే యత్ర కుత్రచిత్ ।
ధ్యానమేతత్సముద్దిష్టం ప్రత్యయస్యైకభావనా॥4॥

ఏదో ఒక ప్రదేశంలో ఎక్కడో అక్కడ మనస్సును ధ్యేయమందు నిలిపి, ఏకైకప్రత్యయం (జ్ఞానం) కలిగి ఉండడం కూడ ధ్యానమే అవుతుంది.

ఏవం ధ్యానసమాయుక్తః స్వదేహం యః పరిత్యజేత్ ।
కులం స్వజనమిత్రాణి సముద్ధృత్య హరిర్భవేత్ ॥5॥

ఈ విధంగా ధ్యానమందు లగ్నమై దేహాన్ని విడిచి పెట్టినవాడు తన కులాన్ని, స్వజనులను, మిత్రులను ఉద్ధరించి హరి సారూప్యాన్ని పొందుతాడు.

ఏవం మూహూర్తమర్ధం వా ధ్యాయేద్యః శ్రద్ధయా హరిమ్ ।
సోఽపి యాం గతిమాప్నోతి న తాం సర్వైర్మహామఖైః ॥6॥

ఈ విధంగా ముహూర్తకాలం గాని, అర్ధముహూర్తకాలం గాని (ఘటిక) శ్రద్ధాపూర్వకంగాచేసే హరినిధ్యానం వలన పొందే గతిని సకల మహాయజ్ఞాలచేత కూడ పొందడం శక్యం కాదు.

ధ్యాతా ధ్యానం తథా ధ్యేయం యచ్చ ధ్యానప్రయోజనమ్ ।
ఏత చ్చతుష్టయం జ్ఞాత్వా యోగం యుంజీత తత్త్వవిత్ ॥7॥

ధ్యాత, ధ్యానం, ధ్యేయం, ధ్యానప్రయోజనం అనే ఈ చతుష్టయాన్ని తెలుసుకొని తత్త్వవేత్త యోగాభ్యాసం చేయాలి.

యోగాభ్యాసాద్భవేన్ముక్తి రైశ్వర్యం చాష్టధా మహత్ ।
జ్ఞానవైరాగ్యసంపన్నః శ్రద్ధధానః క్షమాన్వితః ॥8॥

విష్ణుభక్తః సదోత్సాహీ ధ్యాతేత్థం పురుషః స్మృతః ।
మూర్తామూర్తం పరం బ్రహ్మ హరేర్ధ్యానం హి చింతనమ్ ॥9॥

యోగాభ్యాసం వల్ల ఎనిమిది విధాలైన ఐశ్వర్యం, ముక్తి చేకూరుతుంది. జ్ఞాన వైరాగ్యాలతో కూడుకొన్నవాడు, శ్రద్ధ కలిగి ఉండేవాడు, సహనశీలం కలిగినవాడు, విష్ణుభక్తుడైనవాడు, సర్వదా ఉత్సాహంతో ధ్యానం చేసే సాధకుడే ధ్యాత అనబడతాడు. పరబ్రహ్మ మూర్తం, అమూర్తం అని రెండు విధాలు. హరిని గూర్చిన ధ్యానమే చింతనం.

సకలో నిష్కలో జ్ఞేయః సర్వజ్ఞః పరమో హరిః ।
అణిమాదిగుణైశ్వర్యం ముక్తిర్ధ్యానప్రయోజనమ్॥10॥

సర్వజ్ఞుడైన, పరముడగు శ్రీమహావిష్ణువును సకలుడు(సగుణుడు) నిష్కలుడు (నిర్గుణుడు)గా తెలుసుకోవాలి. అణిమాది సిద్ధులు, ఐశ్వర్యం, ముక్తి లభించడం ధ్యానానికి ప్రయోజనం.

ఫలేన యోజకో విష్ణురతో ధ్యాయేత్పరేశ్వరమ్ ।
గచ్ఛన్ తిష్ఠన్ స్వపన్ జాగ్రదున్మిషన్నిమిషన్నపి॥11॥

శుచిర్వాప్యశుచిర్వాఽపి ధ్యాయేత్సతతమీశ్వరమ్ ।
స్వదేహాయతనస్యాన్తే మనసి స్థాప్య కేశవమ్॥12॥

హృత్పద్మపీఠికామధ్యే ధ్యానయోగేన పూజయేత్ ।
ధ్యానయజ్ఞః పరః శుద్ధః సర్వదోషవివర్జితః ॥13॥

కర్మఫలం ఇచ్చేవాడు విష్ణువు. అందుచే ఆ పరేశ్వరుని ధ్యానించాలి. నడుస్తున్నప్పుడు, నిలిచి ఉన్నప్పుడు, నిద్రపోతున్నప్పుడు, మేల్కొన్నప్పుడు, కన్నులు తెరచినప్పుడు, మూసినప్పుడు, శుచిగా ఉన్నా, అశుచిగా ఉన్నా సర్వదా పరమేశ్వరుని ధ్యానించాలి. తన దేహం అనే మందిరం మధ్య మనస్సులో కేశవుని స్థాపించి, హృదయమనే పీఠ మధ్యంలో ధ్యానయోగంతో పూజించాలి. ధ్యానయజ్ఞం చాలా శ్రేష్ఠమయినది. పరిశుద్ధమైనది. సకల దోషరహితమైనది.

తేనేష్ట్వా ముక్తిమాప్నోతి బాహ్యశుద్ధైశ్చ నాధ్వరైః ।
హింసాదోషవిముక్తిత్వాద్విశుద్ధిశ్చిత్తసాధనః ॥14॥

అటువంటి యజ్ఞం చేసి ముక్తి పొందాలి. బాహ్యశుద్ధిగల యజ్ఞాలచే మాత్రం ముక్తి లభించదు. ధ్యానం హింసాదోషం లేనిది కావడం వల్ల చిత్తశుద్ధికి ఉత్తమసాధనం.

ధ్యానయజ్ఞః పరస్తస్మాదపవర్గఫలప్రదః ।
తస్మాదశుద్ధం సంత్యజ్య హ్యనిత్యం బాహ్యసాధనమ్॥15॥

అందువల్ల ధ్యానయజ్ఞం ఉత్తమమైనది. మోక్షఫలితాన్ని ఇచ్చేది. కాబట్టి అశుద్ధం, అనిత్యం, బాహ్యసాధనం, అయినదానిని విడిచిపెట్టాలి.

యజ్ఞాద్యం కర్మ సంత్యజ్య యోగమత్యర్థమభ్యసేత్ ।
వికారముక్తమవ్యక్తం భోగ్యభోగసమన్వితమ్ ॥16॥

చింతయేద్ధృదయే పూర్వం క్రమాదాదౌ గుణత్రయమ్।
తమః ప్రచ్ఛాద్య రజసా సత్త్వేన ఛాదయేద్రజః ॥17॥

అటువంటి యజ్ఞాది కర్మలను త్యజించి యోగాభ్యాసం ఎక్కువగా చేయాలి. ప్రారంభంలో వికారయుక్తం, అవ్యక్తం, భోగ్యభోగసమన్వితం అయిన గుణత్రయాన్ని ముందు వరుసగా హృదయంలో ధ్యానించాలి. తమోగుణాన్ని రజోగుణంచేత, రజోగుణాన్ని సత్త్వగుణం చేత ఆచ్ఛాదించాలి.

ధ్యాయేత్త్రిమండలం పూర్వం కృష్ణం రక్తం సితం క్రమాత్ ।
సత్త్వోపాధిగుణాతీతః పురుషః పంచవింశకః ॥18॥

ప్రారంభంలో నలుపు, ఎరుపు, తెలుపు అనే రంగులతో కూడిన మూడు మండలాలను ధ్యానించాలి. సత్త్వం ఉపాధిగా కలిగి, గుణాతీతుడైన పురుషుడు ఇరువదియైదవ తత్త్వముగా పిలువబడినాడు.

ధ్యేయమేతదశుద్ధం చ త్యక్త్వాఽ శుద్ధం విచిన్తయేత్ ।
ఐశ్వర్యం పంకజం దివ్యం పురుషోపరి సంస్థితమ్ ॥19॥

అశుద్ధములైన గుణాదులను క్రమంగా విడిచిపెట్టి, శుద్ధమైన ఈ పురుషతత్త్వాన్ని ధ్యానించాలి. పురుషునిపైన, నాభినుండి ఒక దివ్యపంకజం ప్రకటమైఉంది. అది ఐశ్వర్యరూపం.

ద్వాదశాంగులవిస్తీర్ణం శుద్ధం వికసితం సితమ్ ।
నాలమష్టాంగులం తస్య నాభికందసముద్భవమ్॥20॥

అది పండ్రెండు అంగుళాల విస్తారంతో, పరిశుద్ధమై, వికసించి, శ్వేతవర్ణంతో ప్రకాశిస్తుంది. నాభికందం నుండి పుట్టిన దాని "నాలం" ఎనిమిది అంగులాల పొడవు కలిగి ఉంటుంది.

పద్మపత్రాష్టకం జ్ఞేయమణిమాదిగుణాష్టకమ్ ।
కర్ణికాకేసరం నాలం జ్ఞానవైరాగ్యముత్తమమ్ ॥21॥

దాని ఎనిమిది పత్రాలే "అణిమ" మున్నగు ఎనిమిది సిద్ధులు. దాని కర్ణికాకేసరం జ్ఞానం. దాని నాలమే ఉత్తమవైరాగ్యం.

విష్ణుధర్మశ్చ తత్కందమితి పద్మం విచింతయేత్ ।
తద్ధర్మజ్ఞానవైరాగ్యం శివైశ్వర్యమయం పరమ్॥22॥

విష్ణుధర్మమే దాని కందం. ఈవిధంగా పద్మాన్ని ధ్యానం చేయాలి. అది ధర్మజ్ఞానవైరాగ్యరూపం, శివం, ఐశ్వర్యమయం, పరమోత్కృష్టం.

జ్ఞాత్వా పద్మాసనం సర్వం సర్వదుఃఖాన్తమాప్నుయాత్ ।
తత్పద్మకర్ణికామధ్యే శుద్ధదీపశిఖాకృతిమ్ ॥23॥

అంగుష్ఠమాత్రమమలం ధ్యాయేదోంకారమీశ్వరమ్ ।
కదంబగోలకాకారం తారం రూపమివ స్థితమ్ ॥24॥

ఆ పద్మాసనమే సర్వం అని తెలుసుకొన్నవాడు సకల దుఃఖాలను దాటుతాడు. ఆ పద్మం యొక్క కర్ణికామధ్యంలో ప్రకాశించే శుద్ధమైన దీపశిఖవంటి ఆకారం కలవాడును, అంగుష్ఠమాత్రప్రమాణం కలవాడును, నిర్మలుడును, ఓంకార స్వరూపుడును, కదంబపుష్పంవలె గోళాకారంగల నక్షత్రం వంటి రూపం కలవాడును అయిన పరమేశ్వరుని ధ్యానించాలి.

ధ్యాయేద్వా రశ్మిజాలేన దీప్యమానం సమన్తతః ।
ప్రధానం పురుషాతీతం స్థితం పద్మస్థమీశ్వరమ్ ॥25॥

లేదా ఆ కమలం పైన ప్రకృతిపురుషుల కన్నా అతీతుడైన పరమాత్మ ఉన్నట్లు ధ్యానం చేయాలి. ఆ పరమాత్మ తన కిరణసముదాయంతో నలువైపుల ప్రకాశిస్తున్నట్లు భావిస్తూ ధ్యానం చేయాలి.

ధ్యాయేజ్జపేచ్చ సతతమోంకారం పరమక్షరమ్।
మనః స్థిత్యర్థమిచ్ఛన్తి స్థూలధ్యానమనుక్రమాత్ ॥26॥

పరమమైన, అక్షరమైన ఆ ఓంకారాన్ని నిత్యమూ ధ్యానించాలి. జపించాలి. మనస్సు స్థిరం చేసుకోవడానికి సాధకుడు ముందుగా స్థూలాన్ని క్రమంగా ధ్యానించాలి.

తద్భూతం నిశ్చలీభూతం లభేత్ సూక్ష్మేఽపి సంస్థితమ్ ।
నాభికందే స్థితం నాలం దశాంగులసమాయతమ్ ॥27॥

మనస్సు చలించకుండా స్తిరమైన పిమ్మట, దానిని సూక్ష్మంపై నిలపడం సాధ్యమవుతుంది. నాభికమలం లో పదిఅంగులాల పొడవైన నాలం ఉంది.

నాలేనాష్టదలం పద్మం ద్వాదశాంగులవిస్తృతమ్ ।
సకర్ణికే కేసరాలే సూర్యసోమాగ్నిమండలమ్ ॥28॥

ఆ నాలం పై పన్నెండు అంగుళాల విస్తారం కల్గిన అష్టదళపద్మం ఉంది. కర్ణికాకేసరాలు గల దానిపై సూర్య, సోమ, అగ్ని మండలాలు ఉన్నాయి.

అగ్నిమండలమధ్యస్థః శంఖచక్రగదాధరః ।
పద్మీ చతుర్భుజో విష్ణురథవాఽష్టభుజో హరిః ॥29॥

శార్ఙ్గాక్షవలయధరః పాశాంకుశధరః పరః ।
స్వర్ణవర్ణః శ్వేతవర్ణః సశ్రీవత్సః సకౌస్తుభః ॥30॥

వనమాలీ స్వర్ణహారీ స్ఫురన్మకరకుండలః ।
రత్నోజ్జ్వలకిరీటశ్చ పీతాంబరధరో మహాన్ ॥31॥

ఆ అగ్నిమండలం మధ్యలో శంఖ, చక్ర, గద, పద్మం ధరించిన, చతుర్భుజుడైన విష్ణువును కాని, (లేదా) ఎనిమిది చేతులతో ఉన్న హరిని గాని, శార్ఙం, అక్షవలయం, పాశం, అంకుశం అనే వాటిని ధరించినవానిని భావించాలి. ఆయన విగ్రహం సువర్ణ వర్ణమై లేదా శ్వేతవర్ణమై ఉంటుంది. పీతాంబరధారియైన ఆ హరి శ్రీవత్సం, కౌస్తుభం. వనమాల, స్వర్ణాభరణాలు, ప్రకాశించే మకరకుండలాలు, రత్నాలు పొదిగిన సువర్ణకిరీటం ధరించి గొప్పగా భాసిస్తాడు.

సర్వాభరణభూషాఢ్యో వితస్తిర్వా యథేచ్ఛయా ।
అహం బ్రహ్మ జ్యోతిరాత్మా వాసుదేవో విముక్త ఓమ్ ॥32॥

సర్వాభరణభూషితుడైన ఆయన ఆకారం 'జానెడు' ఉన్నట్లు గాని, ఇచ్ఛానుసారం అంతకన్న అధికంగా ఉన్నట్లు కాని భావన చేయాలి. నేను పరంజ్యోతిని, ఆత్మను, బ్రహ్మమును, వాసుదేవుడను, విముక్తుడను, ఓంకార స్వరూపుడను అని భావన చేయాలి.

ధ్యానాచ్ఛాన్తో జపేన్మంత్రం జపాచ్ఛాన్తశ్చ చింతయేత్।
జపధ్యానాదియుక్తస్య విష్ణుః శీఘ్రం ప్రసీదతి ॥33॥

ధ్యానం చేసి అలిసిపోయినవాడు మంత్రాన్ని జపించాలి. జపం వల్ల అలసినవాడు ధ్యానం చేయాలి. ఈ విధంగా జపధ్యానాదులు చేసేవానికి విష్ణువు శీఘ్రంగా ప్రసన్నుడు అవుతాడు.

జపయజ్ఞస్య వై యజ్ఞాః కలాం నార్హన్తి షోడశీమ్ ।
జపినం నోపసర్పన్తి వ్యాధయశ్చాధయో గ్రహాః ॥34॥
భుక్తిర్ముక్తిర్మృత్యుజయో జపేన ప్రాప్నుయాత్ఫలమ్ ॥35॥

సమస్తయజ్ఞాలు జపయజ్ఞానికి పదహారో వంతుకు కూడ సరితూగవు. జపం చేసే వానిని వ్యాధులు కాని, ఆధులు కాని, గ్రహాలు కాని పీడించవు. జపం వల్ల భుక్తిని, ముక్తిని, మృత్యుజయాన్ని ఉత్తమఫలంగా పొందుతాడు.

ఇత్యాది మహాపురాణే ఆగ్నేయే ధ్యాననిరూపణం నామ చతుఃసప్తత్యధిక త్రిశతతమోఽధ్యాయః ॥374॥

అగ్నిమహాపురాణంలో ధ్యాననిరూపణమనే మూడువందల డెబ్బైనాల్గవ అధ్యాయం సమాప్తం.

పంచసప్తత్యధిక త్రిశతతమోஉధ్యాయః – మూడువందల డెబ్బైఅయిదవ అధ్యాయం

ధారణానిరూపణమ్ – ధారణానిరూపణం

అగ్నిరువాచ – అగ్ని ఇలా వచించాడు.

ధారణా మనసో ధ్యేయే సంస్థితిర్ధ్యానవద్ద్విధా ।
మూర్తామూర్తహరిధ్యానమనోధారణతో హరిః ॥1॥

మునీశ్వరా! ధ్యేయవస్తువుపై మనస్సును నిల్పడం ధారణ అనబడుతుంది. ధ్యానంలో ధారణ కూడ రెండు విధాలు. మూర్తధారణ(సాకారధారణ) అమూర్తధారణ (నిరాకారధారణ). భగవంతుడైన హరియందు ధ్యానంలో మనస్సు నిలపడం ధారణ అవుతుంది. దీని వల్ల భగవత్ప్రాప్తి కలుగుతుంది.

యద్బాహ్యావస్థితం లక్ష్యం తస్మాన్న చలతే మనః ।
తావత్కాలం ప్రదేశేషు ధారణా మనసి స్థితిః ॥2॥

బాహ్యలక్ష్యంపై మనస్సు కదలకుండా ఎంతకాలం నిలిచి వుంటుందో, అంతకాలం ఏదో ఒక ప్రదేశంలో వుండే మానసిక స్థితికి ధారణ అని పేరు.

కాలావధిపరిచ్ఛిన్నం దేహే సంస్థాపితం మనః।
న ప్రచ్యవతి యల్లక్ష్యా ద్ధారణా సాஉభిధీయతే ॥3॥

దేహం లోపల కూడ నియమితసమయంవరకు మనస్సు లక్ష్యంపై నిలిపివుంచడం, అంతవరకు లక్ష్యం నుంచి మనస్సు జారిపోకుండ వుండడం ధారణ అనబడుతుంది.

ధారణా ద్వాదశాయామా ధ్యానం ద్వాదశధారణాః ।
ధ్యానం ద్వాదశకం యావత్సమాధిరభిధీయతే ॥4॥

పండ్రెండు ఆయామములు కలది ధారణ. పండ్రెండు ధారణలు కలది ధ్యానం. పండ్రెండు ధ్యానముల పాటు మనస్సు ఏకాగ్రమయితే దానికి సమాధి అని పేరు.

ధారణాభ్యాసయుక్తాత్మా యది ప్రాణైర్విముచ్యతే ।
కులైకవింశముత్తార్య స్వర్యాతి పరమం పదమ్॥5॥

ధారణాభ్యాస సమయంలో ప్రాణాలను విడిచేవాడు (ఒకవేళ ప్రాణాలు విడిస్తే) ఇరవైఒక్క తరాలవారిని ఉద్ధరించి, వాడు పరమపదమయిన స్వర్గాన్ని పొందుతాడు.

యస్మిన్యస్మిన్ భవేదంగే యోగినాం వ్యాధిసంభవః ।
తత్తదంగం ధియా వ్యాప్య ధారయేత్తత్త్వధారణమ్ ॥6॥

యోగులకు ఏ ఏ అవయవమునందు వ్యాధి కలుగుతుందో, ఆ అవయవాన్ని బుద్ధిచే వ్యాప్తంచేసి తత్త్వంతో ధారణ చేయాలి.

ఆగ్నేయీ వారుణీ చైవ ఐశానీ చామృతాత్మికా ।
సాగ్నిః శిఖా ఫడంతా చ విష్ణోః కార్యా ద్విజోత్తమ ॥7॥

ఆగ్నేయీ, వారుణీ, ఐశానీ, అమృతాత్మికా అని విష్ణువు యొక్క ధారణ నాలుగు విధాలుగా చేయాలి. ద్విజోత్తమా! ఆ సమయంలో అగ్నియుక్తమైన శిఖామంత్రానికి అంతంలో "ఫట్" చేర్చి జపం చేయాలి.

నాడీభిర్వికటం దివ్యం శూలాగ్రం వేధయేచ్ఛుభమ్
పాదాంగుష్ఠాత్కపోలాన్తం రశ్మిమండలమావృతమ్ ॥8॥

నాడుల ద్వారా వికటం, దివ్యం, శుభం అయిన శూలాగ్రాన్ని వేధ చేయాలి. పాదాంగుష్ఠం మొదలు కపోలం వరకు కిరణసముదాయం వ్యాప్తమై వుంటుంది.

తిర్యక్చాధోర్ధ్వభాగేభ్యః ప్రయాన్త్యుతీవ తేజసా ।
చిన్తయేత్సాధకేన్ద్రస్తం యావత్సర్వం మహామునే ॥9॥

భస్మీభూతం శరీరం స్వం తతశ్చైవోపసంహరేత్ ।
శీతశ్లేష్మాదయః పాపం వినశ్యంతి ద్విజాతయః ॥10॥

అది మిక్కిలి తేజస్సుతో, మహావేగంతో క్రింద నుంచి పైకి, పై నుంచి క్రిందికి, తిరుగుతున్నట్లు భావన చేయాలి. మహామునీ, సాధకోత్తముడు తన శరీరం పూర్తిగా, లోపల భస్మమయ్యేటట్లు కనబడేటంత వరకు రశ్మిమండలాన్ని ధ్యానించాలి. పిదప ఆ ధారణను ఉపసంహరించాలి. ఈ విధంగా చేయడం వల్ల ద్విజులు శీతశ్లేష్మాదిరోగాలను, పాపాలను నశింపజేసుకొంటారు.

శిరో ధీరం విచారం చ కంఠం చాధోముఖే స్మరేత్ ।
ధ్యాయేదచ్ఛిన్నచిత్తాత్మా భూయోభూతేన చాత్మనా ॥11॥

ఆ తరువాత ధీరత్వంతో విచారణచేస్తూ, శిరస్సు, ముఖం క్రిందనున్న కంఠాన్ని ధ్యానించాలి. చిత్తం నష్టం కాకూడదు. మళ్లీ మళ్లీ అంతఃకరణం ద్వారా ధ్యానం చేయాలి.

స్ఫురచ్ఛీకరసంస్పర్శప్రభూతే హిమగామిభిః ।
ధారాభిరఖిలం విశ్వమాపూర్య భువి చిన్తయేత్ ॥12॥

ఆ విధంగా ధ్యానంలో వున్నవాడు ఒకేసారి జలకణాలు ఆవిర్భవించి, ఒక దానితో ఒకటి కలసి హిమరాశిని పుట్టిస్తున్నట్లు, ఆ జలధారలు భూమిపై ప్రవహిస్తున్నట్లు, సకల విశ్వాన్ని ముంచెత్తుతున్నట్లు భావించాలి.

బ్రహ్మరంధ్రాచ్చ సంక్షోభాద్యావదాధారమండలమ్।
సుషుమ్నాంతర్గతో భూత్వా సంపూర్ణేందుకృతాలయమ్ ॥13॥

సంప్లావ్య హిమసంస్పర్శతో యేనామృతమూర్తినా ।

ఈ విధంగా హిమస్పర్శచే శీతలమైన అమృతస్వరూపజలంచే బ్రహ్మరంధ్రం మొదలు మూలాధారం వరకూ వుండే చక్రమండలాన్ని, ఆప్లావితం చేసుకొంటూ సుషుమ్నానాడి మధ్య ఇందుమండలాన్ని ధ్యానించాలి.

క్షుత్పిపాసాక్రమప్రాయ సంతాపపరిపీడితః ॥14॥

ధారయేద్వారుణీం మంత్రీ త్రితుష్ట్యర్థం చాప్యతంత్రితః ।
వారుణీ ధారణా ప్రోక్తా ఐశానీ ధారణాం శృణు ॥15॥

ఆకలి, దప్పికల వల్ల క్రమంగా వచ్చిన క్లేశాలచే మిక్కిలి పీడితుడవుతూ, తన సంతుష్టి కోసమై సాధకుడు వారుణీ ధారణా చింతనచేసి అలసత్వాన్ని విడిచి, విష్ణుమంత్ర జపం చేయాలి. ఈ విధంగా వారుణీధారణా చెప్పబడింది. ఐశానీ ధారణను చెబుతాను విను.

వ్యోమ్ని బ్రహ్మమయే పద్మే ప్రాణాపానే క్షయం గతే ।
ప్రసాదం చింతయేద్విష్ణోర్యావచ్చిన్తాక్షయం గతా ॥16॥

ప్రాణాపానాలు క్షయాన్ని పొందగా, హృదయాకాశంలో బ్రహ్మమయపద్మంలో విష్ణుప్రసాదం పొందేవరకు, చింత నశించే వరకు ధ్యానం చేయాలి.

మహాభావం జపేత్సర్వం తతో వ్యాపక ఈశ్వరః ।
అర్ధేందుం పరమం శాంతం నిరాభాసం నిరంజనమ్ ॥17॥

అటుపిమ్మట సర్వవ్యాపకమైన ఈశ్వరరూపంతో వుండి శాంతము, నిరంజనము, నిరాభాసము, అర్ధచంద్ర స్వరూపం, పరమము అయిన సంపూర్ణమహాభావాన్ని జపించాలి.

అసత్యం సత్యమాభాతి తావత్సర్వం చరాచరమ్ ।
యావత్ స్వస్యందరూపం తు న దృష్టం గురువక్త్రతః ॥18॥

గురుముఖతః జీవాత్మ పరమాత్మస్వరూపమే అని తెలియనంతవరకు అసత్యమయిన ఈ చరాచరజగత్తు అంతా సత్యముగా భాసిస్తుంది.

దృష్టే తస్మిన్ పరే తత్త్వే ఆబ్రహ్మ సచరాచరమ్ ।
ప్రమాతృమానమేయం చ ధ్యానహృత్పద్మకంపనమ్ ॥19॥

ఆ పరతత్త్వం తెలిసిన పిమ్మట బ్రహ్మ మొదలు సకల చరాచరజగత్తు వరకు ప్రమాత, మానము, మేయము, సర్వమూ హృదయకమలంలోనే లీనమైపోతాయి.

మాతృమోదకవత్సర్వం జపహోమార్చనాదికమ్।
విష్ణుమంత్రేణ వా కుర్యాదమృతాం ధారణాం వదే ॥20॥

జపం, హెూమం, అర్చన, మున్నగునవి తల్లి ఇచ్చిన మధురపదార్థాలవలె తియ్యనైనవని తెలుసుకొని విష్ణుమంత్రంతో అనుష్ఠించాలి. ఇపుడు అమృతమయీ ధారణను చెబుతాను.

సంపూర్ణేందునిభం ధ్యాయేత్కమలం తంత్రిముష్టిగమ్ ।
శిరఃస్థం చింతయేద్యత్నాచ్ఛశాంకాయుతవర్చసమ్ ॥21॥

శిరస్సు యొక్క నాడియందు కేంద్రస్థానంలో పూర్ణచంద్రసమానమగు కమలాన్ని ధ్యానించాలి. ఆకాశంలో పదివేల చంద్రులతో సమానమైన ఒక చంద్రమండలం ఉదయించినట్లు ధ్యానం చేయాలి.

సంపూర్ణమండలం వ్యోమ్ని శివకల్లోలపూర్ణితమ్ ।
తథా హృత్కమలే ధ్యాయేత్తన్మధ్యే స్వతనుం స్మరేత్ ।
సాధకో విగతక్లేశో జాయతే ధారణాదిభిః ॥22॥

ఆ మండలం కల్యాణమయములైన కల్లోలాలతో నిండియున్నదని భావన చేయాలి. అటువంటి భావన తన హృదయకమలమునందు కూడ చేసి దాని మధ్యభాగంలో తన శరీరం వున్నట్లు భావించాలి. ఈ ధారణాదుల ద్వారా సాధకుని క్లేశాలన్నీ నశిస్తాయి.

ఇత్యాది మహాపురాణే ఆగ్నేయే ధారణానిరూపణం నామ పంచసప్తత్యధిక త్రిశతతమోఽధ్యాయః ॥375॥

అగ్నిమహాపురాణంలో ధారణానిరూపణమనే మూడువందల డెబ్భైఅయిదవ అధ్యాయం సమాప్తం.



షట్సప్తత్యధిక త్రిశతతమోఽధ్యాయః– మూడువందల డెబ్బైఆరవ అధ్యాయం

సమాధినిరూపణమ్ – సమాధినిరూపణం

అగ్నిరువాచః – అగ్ని ఇలా వచించాడు.

యదాత్మమాత్రం నిర్భాసం స్తిమితోదధివత్స్థితమ్ ।
చైతన్యరూపవద్ధ్యానం తత్సమాధిరిహోచ్యతే ॥1॥

చైతన్యం ప్రశాంతసముద్రం వలె స్థిరంగా వుండి, ఆత్మభిన్నములైన పదార్థాలు ఏవీ భాసించకుండా వుండి, ఆత్మ మాత్రమే భాసించే ధ్యానం సమాధి.

ధ్యాయన్మనః సన్నివేశ్య యస్తిష్ఠేదచలః స్థిరః ।
నిర్వాతానలవద్యోగీ సమాధిస్థః ప్రకీర్తితః ॥2॥

ధ్యాన సమయంలో చిత్తాన్ని ధ్యేయమునందు నిలిపి, గాలిలేని ప్రదేశంలోని దీపంలా, కదలకుండా స్థిరంగా ఉండే యోగి "సమాధిస్థుడు" అని చెప్పబడతాడు.

న శృణోతి న చాఘ్రాతి న పశ్యతి న రస్యతి ।
న చ స్పర్శం విజానాతి న సంకల్పయతే మనః ॥3॥

ఆ సమయంలో అతడు ఏమీ వినడు. వాసన చూడడు. రుచి చూడడు. దేనిని దర్శించడు. స్పర్శజ్ఞానం కూడా తెలుసుకొనడు. మనస్సు నందు దేనిని సంకల్పించడు.

న చాభిమన్యతే కించన్న చ బుధ్యతి కాష్ఠవత్ ।
ఏవమీశ్వరసంలీనః సమాధిస్థః స గీయతే ॥4॥

దేనియందును అభిమానం కలిగి వుండడు. దేనిని తెలిసికొనకుండా కాష్ఠంలా వుంటాడు. ఈ విధంగా ఈశ్వరుని యందు లీనమైనవాడు "సమాధిస్థుడు" అని చెప్పబడతాడు.

యథా దీపో నివాతస్థో నేంగతే సోపమా స్మృతా ।
ధ్యాయతో విష్ణుమాత్మానం సమాధిస్తస్య యోగినః ॥5॥

ఉపసర్గాః ప్రవర్తన్తే దివ్యాః సిద్ధప్రసూచకాః ।
పాతితః శ్రావణో ధాతుర్దర్శనస్వాంగవేదనాః ॥6॥

వాయువు లేని ప్రదేశంలో ఉన్న దీపం కదలకుండా వుండడం అనేది ఉపమగా చెప్పబడింది. ఆత్మస్వరూపుడైన విష్ణువును ధ్యానం చేస్తున్న సమాధిస్థుడైన యోగికి ఎన్నో దివ్యములైన విఘ్నాలు ఎదురవుతాయి. అవి సిద్ధిప్రసూచకాలు. సాధకుడు పై నుంచి క్రిందకు పడిపోయినట్లు అయిపోతాడు. చెవిలో బాధ కలుగుతుంది. అనేక విధాలైన ధాతువులు కనబడతాయి. ఆ యోగిశరీరంలో అనేక బాధలు కలుగుతాయి.

ప్రార్థయంతి చ తం దేవా భోగైర్దివ్యైశ్చ యోగినమ్ ।
నృపాశ్చ పృథివీదానైర్ధనైశ్చ సుధనాధిపాః ॥7॥

అటువంటి యోగికి దివ్యభోగాలను కల్పిస్తామని దేవతలు ప్రలోభపెడతారు. రాజులు భూములను ఇస్తారు. ధనవంతులు ధనాలను ఇస్తారు.

వేదాదిసర్వశాస్త్రం చ స్వయమేవ ప్రవర్తతే ।
అభీష్టచ్ఛందో విషయం కావ్యం చాస్య ప్రవర్తతే ॥8॥

వేదాది శాస్త్రాలన్నీ స్వయంగానే స్ఫురిస్తాయి. తనకు ఇష్టమైన ఛందస్సులలో కావ్యరచన కూడా చేయగలిగినవాడవుతాడు.

రసాయనాని దివ్యాని దివ్యాశ్చౌషధయస్తథా ।
సమస్తాని చ శిల్పాని కలాః సర్వాశ్చ విన్దతి ॥9॥

దివ్యాలైన రసాయనాలు, దివ్యాలైన ఓషధులు, సకలశిల్పాలు, సకలకళలు ఆ యోగికి లభిస్తాయి.

సురేంద్ర కన్యా ఇత్యాద్యా గుణాశ్చ ప్రతిభాదయః ।
తృణవత్తాం త్యజేద్యస్తు తస్య విష్ణుః ప్రసీదతి ॥10॥

సురేంద్రకన్యకలు మొదలగు వారు ఆయన వెంటపడతారు. ప్రతిభ మున్నగు సర్వసుగుణాలు ఆయనకు లభిస్తాయి. వీటినన్నింటిని ఎవడు గడ్డిపోచవలె భావించి పరిత్యజిస్తాడో అటువంటి వానిని విష్ణువు అనుగ్రహిస్తాడు.

అణిమాదిగుణైశ్వర్యః శిష్యే జ్ఞానం ప్రకాశ్య చ ।
భుక్త్వా భోగాన్యథేచ్ఛాతస్తనుం త్యక్త్వా లయాత్తతః ॥11॥

తిష్ఠేత్స్వాత్మని విజ్ఞాన ఆనందే బ్రహ్మణీశ్వరే ।
మలినో హి యథాஉஉదర్శ ఆత్మజ్ఞానాయ న క్షమః ॥12॥

తథా విపక్షకరణ ఆత్మజ్ఞానాయ న క్షమః ॥

అణిమ మున్నగు గుణాలచేత ఐశ్వర్యవంతుడైన యోగి శిష్యునికి జ్ఞానాన్ని ప్రసాదించి, ఇచ్ఛానుసారంగా భోగాలను అనుభవించి, లయయోగం ద్వారా తనువును పరిత్యజించి, విజ్ఞానము, ఆనందము, బ్రహ్మస్వరూపము, ఐశ్వర్య సంపన్నము అయిన ఆత్మయందు తన స్థితిని పొందాలి. మలినమైన అద్దం ప్రతిబింబాన్ని గ్రహించలేనట్లుగా, అంతః కరణ పరిపాకం లేనివాడు ఆత్మజ్ఞానం పొందజాలడు.

సర్వాశ్రయాన్నిజే దేహే దేహీ విన్దతి వేదనామ్ ।
యోగయుక్తస్తు సర్వేషాం యోగాన్నాప్నోతి వేదనామ్ ॥13॥

దేహం సకలరోగాలకు, సమస్తదుఃఖాలను ఆశ్రయమైనటువంటిది. దానియందు అభిమానం కలవాడు వేదనలను పొందుతాడు. కాని యోగయుక్తుడైన యోగి యోగబలం వల్ల దుఃఖవేదనను పొందడు.

ఆకాశమేకం హి యథా ఘటాదిషు పృథగ్భవేత్ ।
తథాऽऽత్మైకో హ్యనేకేషు జలాధారేష్వివాంశుమాన్ ॥14॥

ఒకే ఆకాశం ఘటాదులయందు వేరు వేరుగా కనబడుతున్నట్లుగా, ఒకే సూర్యుడు అనేక జలాధారములందు (నూయి, కాలువ, నది, సముద్రం మున్నగు వాటియందు) అనేక రూపాలతో కనబడుతున్నట్లుగా ఒకే ఆత్మ పెక్కింటి వలె కనబడుతుంది.

బ్రహ్మ ఖానిలతేజాంసి జలభూ క్షితి ధాతవః ।
ఇమే లోకా ఏష చాऽऽత్మా తస్మాచ్చ సచరాచరమ్ ॥15॥

ఆకాశం, వాయువు, అగ్ని, జలం, భూమి, క్షితిలోని ధాతువులు, ఈ లోకాలు, చరాచరమైన జగత్తు, ఈ జీవాత్మ ఇవన్నీ బ్రహ్మస్వరూపాలే.

మృద్దండచక్రసంయోగాత్కుంభకారో యథా ఘటమ్ ।
కరోతి తృణమృత్కాష్ఠైర్గృహం వా గృహకారకః ॥16॥

కారణాన్యేవమాదాయ తాసు తాస్విహ యోనిషు ।
సృజత్యాత్మానమాత్మైవం సంభూయ కరణానిచ ॥17॥

కుమ్మరివాడు మట్టిముద్దను తీసుకొని చక్రం పై త్రిప్పి కుండను తయారుచేసినట్లు, ఇల్లు కట్టేవాడు తృణం, మృత్తిక, కాష్ఠం మున్నుగు వాటితో గృహాన్ని నిర్మించినట్లు. అదేవిధంగా జీవాత్మ, ఇంద్రియాల సహాయంతో కార్యకారణ సంఘాతాలను ఏకీకృతం కావించుకొని, ఇతర కరణాలను సమకూర్చుకొని ఆయా యోనులందు తనను తానే సృజించుకొంటుంది.

కర్మణా దోషమోహాభ్యామిచ్ఛయైవ స బధ్యతే ॥18॥

జ్ఞానాద్విముచ్యతే జీవో ధర్మాద్యోగీ న రోగభాక్ ।
వర్త్యాధారస్నేహయోగాద్యథా దీపస్య సంస్థితిః ॥19॥

కర్మచేతను, దోషమోహాలచేత తనంతటతానే బద్ధుడవుతాడు. జీవుడు జ్ఞానం వల్ల ముక్తుడవుతాడు. యోగి ధర్మాన్ని అనుష్ఠించడం వల్ల రోగ విముక్తుడవుతాడు. వత్తి, ఆధారం, తైలం వీటి కలయికచే దీపం నిలిచినట్లుగా

విక్రియాऽపి చ దృష్ట్వైవమకాలే ప్రాణసంక్షయః ।
అనన్తా రశ్మయస్తస్య దీపవద్యః స్థితో హృది ॥20॥

ఏ ఒక్కటి లేకపోయినా అది నిలువకున్నట్లుగా, యోగధర్మాలు లేకపోవడం వల్ల వికారం కలిగి అకాలంలో ప్రాణనాశనం కలుగుతుంది. హృదయంలోని దీపంలా వున్న ఆత్మయొక్క రశ్ములు అనంతాలుగా వ్యాపించి వున్నాయి.

సితాసితాః కద్రునీలాః కపిలాః పీతలోహితాః ।
ఊర్ధ్వమేకః స్థితస్తేషాం యో భిత్వా సూర్యమండలమ్ ॥21॥

సితములు, అసితములు, కద్రువర్ణములు, నీలవర్ణములు, కపిల వర్ణములు, పీతలోహితములు అయిన వాటిలో ఒకటి ఊర్ధ్వముఖమై సూర్యమండలాన్ని భేదించికుని పైకి వెళుతుంది.

బ్రహ్మలోకమతిక్రమ్య తేన యాతి పరాం గతిమ్।
యదస్యాన్యద్రశ్మిశతమూర్ధ్వమేవ వ్యవస్థితమ్ ॥22॥

బ్రహ్మలోకాన్ని అతిక్రమించి పైకి వెడుతుంది. ఆ మార్గంలో పయనించినవాడు ఉత్తమగతిని పొందుతాడు. ఇవికాక మరో నూరు రశ్ములు ఊర్ధ్వముఖాలై ఉన్నాయి.

తేన దేవనికాయాని ధామాని ప్రతిపద్యతే ।
యేనైకరూపాశ్చాధస్తాద్రశ్మయోఽస్య మృదుప్రభాః ॥23॥

ఇహ కర్మోపభోగాయ తైశ్చ సంచరతే హి సః।
బుద్ధీంద్రియాణి సర్వాణి మనః కర్మేంద్రియాణి చ ॥24॥

వాటిద్వారా పయనించినవాడు ఆయా దేవలోకాలను పొందుతాడు. క్రిందకు ప్రసరించే అల్పకాంతులు గల నానావిధ రశ్ముల ద్వారా పయనించేవాడు కర్మోపభోగం కోసమై ఈ లోకమునందే జన్మిస్తాడు. ఈ శరీరంలో బుద్ధి, పరజ్ఞానేంద్రియాలు, మనస్సు, కర్మేంద్రియాలును మరియు .....

అహంకారశ్చ బుద్ధిశ్చ పృథివ్యాదీని చైవ హి ।
అవ్యక్త ఆత్మా క్షేత్రజ్ఞః క్షేత్రస్యాస్య నిగద్యతే ॥25॥

అహంకారం, బుద్ధి, పంచభూతాలు, అవ్యక్తమైన ప్రకృతి, ఆత్మ అనేవి ఉన్నాయి. వీటికి 'క్షేత్రం' అని పేరు. ఈ క్షేత్రమునందు వున్నవాడు, 'ఆత్మ' అని తెలిసినవాడు "క్షేత్రజ్ఞుడు" అనబడతాడు.

ఈశ్వరః సర్వభూతస్య సదసన్సదసచ్చ సః ।
బుద్ధేరుత్పత్తిరవ్యక్తా తతోఽహంకారసంభవః ॥26॥

అతడే సర్వభూతాధీశ్వరుడు. అతడు సత్తు, అసత్తు, సదసద్రూపుడు. ప్రకృతి (అవ్యక్తం) నుంచి బుద్ధి (మహత్తత్త్వం), దాని నుంచి అహంకారం పుట్టింది.

తస్మాత్ఖాదీని జాయన్తే ఏకోత్తరగుణాని తు ।
శబ్దః స్పర్శరూపం చ రసో గంధశ్చ తద్గుణాః ॥27॥

దాని నుంచి పంచ మహాభూతాలు జనించాయి. వీటిలో ఉత్తరోత్తరానికి ఒక్కొక్క గుణం అధికంగా ఉంటుంది. శబ్దము, స్పర్శము, రూపము, రసము, గంధము అనేవి వాటి గుణాలు.

యో యస్మిన్నాశ్రితశ్చైషాం స తస్మిన్నేవ లీయతే ।
సత్త్వం రజస్తమశ్చైవ గుణాస్తస్యైవ కీర్తితాః ॥28॥

ఆ భూతగుణాలు ఏది దేనిని ఆశ్రయించి వుందో అది దానియందే లీనమవుతుంది. (అవుతాయి.) సత్త్వం, రజసు, తమస్సు అనేవి ఆ అవ్యక్తప్రకృతి గుణాలు.

రజస్తమోభ్యామావిష్టశ్చక్రవద్భ్రామ్యతే హి సః ।
అనాదిరాదిమాన్యశ్చ స ఏవ పురుషః పరః ॥29॥

రజస్తమోగుణాలచే ఆవిష్కృతుడైన జీవుడు చక్రం వలె తిరుగుతూవుంటాడు. అన్నింటికి ఆదియైనవాడు స్వయంగా "అనాది" అనబడతాడు. అతడే పరమపురుషుడు అనబడతాడు.

లింగేంద్రియైరుపగ్రాహ్యః స వికార ఉదాహృతః ।
యతో వేదాః పురాణాని విద్యోపనిషదస్తథా ॥30॥

శ్లోకాః సూత్రాణి భాష్యాణి యచ్చాన్యద్వాఙ్మయం భవేత్।
పితృయానోపవీథ్యాశ్చ యదగస్త్యస్య చాంతరమ్ ॥31॥

తేనాగ్నిహోత్రిణో యాంతి ప్రజాకామా దివం ప్రతి ।
యే చ దానపరాః సమ్యగష్టాభిశ్చ గుణైర్యుతాః ॥32॥

మనస్సుచేత, ఇంద్రియాలచేత గ్రహింపబడేది వికారం. (అదే వికృతమైన ప్రాకృతతత్త్వం అని చెప్పబడుతుంది.) దేని నుంచి వేదాలు, పురాణాలు, సకలవిద్యలు, ఉపనిషత్తులు. శ్లోకాలు, సూత్రాలు, భాష్యాలు మున్నగు వాఙ్మయం అంతా ఆవిర్భవించాయో అదే పరమాత్మ అనబడుతుంది. పితృయానమార్గంలోని ఉపవీథి మొదలు అగస్త్యనక్షత్రం వరకు వున్న మార్గం ద్వారా సంతానకాములైన అగ్నిహోత్రులు స్వర్గాన్ని చేరుకొంటారు. దానతత్పరులైనవారు, అష్టగుణ సంపన్నులైన వారు కూడా ఈ మార్గం లోనే పయనిస్తారు.

అష్టాశీతిసహస్రాణి మునయో గృహమేధినః ।
పునరావర్తనే బీజభూతా ధర్మప్రవర్తకాః ॥33॥

సప్తర్షి నాగవీథ్యాశ్చ దేవలోకం సమాశ్రితాః ।
తావన్త ఏవ మునయః సర్వారంభవివర్జితాః ॥34॥

ఎనభై ఎనిమది వేల, గృహస్థాశ్రమంలోని మునులు ధర్మప్రవర్తకులు. వారే పునరావృత్తికి కారణభూతులు. వారు సప్తర్షిమండలానికి, నాగవీథికి మధ్య వుండే మార్గం ద్వారా దేవలోకానికి వెళ్లారు. అంతే సంఖ్య గల మునీంద్రులు సర్వకర్మల నుంచి విముక్తులైనారు.

తపసా బ్రహ్మచర్యేణ సంగత్యాగేన మేధయా ।
యత్ర యత్రావతిష్ఠన్తే యావదాభూతసంప్లవమ్ ॥35॥

వారు తపస్సు, బ్రహ్మచర్యం, నిస్సంగత్వం, త్యాగం, మేధాశక్తి అనే వాటి ప్రభావంచే ఒక కల్పపర్యంతం ఆ యా దివ్యలోకాలలో నివసిస్తారు.

వేదానువచనం యజ్ఞా బ్రహ్మచర్యం తపో దమః ।
శ్రద్ధోపవాసః సత్యత్వమాత్మనో జ్ఞానహేతవః ॥36॥

వేదాధ్యయనం, యజ్ఞాలు, బ్రహ్మచర్యం, తపస్సు, దమం (ఇంద్రియనిగ్రహం), శ్రద్ధ, ఉపవాసం, సత్యం వీటివల్ల ఆత్మజ్ఞానం కలుగుతుంది.

సత్త్వాశ్రయైర్నిదిధ్యాస్యః సమస్తైరేవమేవ తు ।
ద్రష్టవ్యస్త్వథ మంతవ్యః శ్రోతవ్యశ్చ ద్విజాతిభిః ॥37॥

ద్విజాతులు సత్త్వగుణాన్ని ఆశ్రయించి ఆత్మను గూర్చి సర్వవిధాల నిత్యం నిదిధ్యాసన (శ్రవణ,మననాదులు) చేయాలి. ఆత్మయే దర్శింపదగినది. ఆత్మయే మననం చేయదగినది. ఆత్మయే శ్రవణం చేయదగినది.

య ఏవమేనం విందంతి యే చారణ్యకమాశ్రితాః ।
ఉపాసతే ద్విజాః సత్యం శ్రద్ధయా పరయా యుతాః ॥38॥

ఈ విధంగా తెలుసుకొన్న ద్విజులు వానప్రస్థులై, శ్రద్ధాయుక్తులై, సత్యోపాసనచేయడానికి సంసిద్ధులై యత్నం కావిస్తారు.

క్రమాత్తే సంభవన్త్యర్చిరహః శుక్లం తథోత్తరమ్ ।
అయనం దేవలోకం చ సవితారం సవిద్యుతమ్ ॥39॥

వారు క్రమంగా అగ్ని, దినం, (పగలు), శుక్లపక్షం, ఉత్తరాయణం, దేవలోకం, సూర్యమండలం, విద్యుదభిమాన దేవతల లోకాలకు చేరుతారు.

తతస్తాన్పురుషోఽభ్యేత్య మానసో బ్రహ్మ లౌకికాన్ ।
కరోతి పునరావృత్తిస్తేషామిహ న విద్యతే ॥40॥

ఆ తరువాత మానసపురుషుడు అక్కడకు వచ్చి ఆ యా లోకాలనుంచి వారిని బ్రహ్మలోకానికి చేరుస్తాడు. అలా చేరినవారికి పునరావృత్తి వుండదు.

యజ్ఞేన తపసా దానైర్యే హి స్వర్గజితో జనాః ।
ధూమం నిశాం కృష్ణపక్షం దక్షిణాయనమేవ చ ॥41॥

పితృలోకం చంద్రమసం నభో వాయు జలం మహీమ్ ।
క్రమాత్తే సంభవన్తీహ పునరేవ వ్రజంతి చ ॥42॥

యజ్ఞాలవల్ల, తపస్సువల్ల, దానాలవల్ల ఎవరు స్వర్గానికి చేరుకొంటారో, వారు క్రమంగా ధూమం, రాత్రి, కృష్ణపక్షం, దక్షిణాయనం, పితృలోకం, చంద్రలోకం అభిమానదేవతలలోకాలకు వెళ్లి, మళ్లీ ఆకాశం, వాయువు జలమార్గాల ద్వారా భూలోకానికి తిరిగి వస్తారు. ఈ లోకంలో జన్మించి మరణానంతరం మరల ఆ మార్గంలోనే ప్రయాణం చేస్తారు.

ఏతద్వో న విజానాతి మార్గద్వితయమాత్మనః ।
దందశూకః పతంగో వా భవేత్కీటోఽథవా కృమిః ॥43॥

జీవాత్మకు సంబంధించిన ఈ రెండుమార్గాలను తెలియనివాడు సర్పం గాను, పతంగం గాను, కీటకం గాను లేదా కృమి గాను పుడతాడు.

హృదయే దీపవద్బ్రహ్మ ధ్యానాజ్జీవోఽమృతో భవేత్ ।
న్యాయాగతధనస్తత్త్వజ్ఞాననిష్ఠోఽతిథిప్రియః ॥
శ్రాద్ధకృత్సత్యవాదీ చ గృహస్థోఽపి విముచ్యతే ॥44॥

హృదయాకాశంలో దీపంలా భాసిస్తున్న బ్రహ్మను ధ్యానిచండం వల్ల జీవుడు అమృతస్వరూపుడవుతాడు. న్యాయంగా ధనసంపాదన చేస్తూ, అతిథుల పట్ల ప్రీతికలవాడై తత్త్వజ్ఞాననిష్ఠుడై, శ్రాద్ధములు ఆచరిస్తూ, సత్యవాదియై ఉండే గృహస్థుడు కూడ విముక్తుడవుతాడు.

ఇత్యాది మహాపురాణే ఆగ్నేయే సమాధినిరూపణం నామ షట్సప్తత్యధిక త్రిశతతమోఽధ్యాయః ॥376॥

అగ్నిమహాపురాణంలో సమాధినిరూపణమనే మూడువందల డెబ్బైఆరవ అధ్యాయం సమాప్తం.



సప్తసప్తత్యధిక త్రిశతతమోఽధ్యాయః – మూడువందల డెబ్బైఏడవ అధ్యాయం

బ్రహ్మజ్ఞానమ్ – బ్రహ్మజ్ఞానం

అగ్నిరువాచ – అగ్ని ఇలా పలికాడు.

బ్రహ్మజ్ఞానం ప్రవక్ష్యామి సంసారాజ్ఞానముక్తయే ।
అయమాత్మా పరం బ్రహ్మ అహమస్మీతి ముచ్యతే ॥1॥

మునీశ్వరా! సంసారమనే అజ్ఞానాన్ని తొలగించుకోవటానికి సాధనమైన బ్రహ్మజ్ఞానాన్ని చెబుతాను. 'ఈ ఆత్మ పరబ్రహ్మమే', 'అది నేనే అయి వున్నాను' అని నిరంతరం భావించడం వల్ల సాధకుడు ముక్తుడు అవుతాడు.

దేహ ఆత్మా న భవతి దృశ్యత్వాచ్చ ఘటాదివత్ ।
ప్రసుప్తే మరణే దేహాదాత్మాఽన్యో జ్ఞాయతే ధ్రువమ్ ॥2॥

ఘటాదుల వలె దృశ్యం కావడం వల్ల, దేహం ఆత్మ కాజాలదు. నిద్ర పోయినప్పుడు, మరణమునందు దేహం కన్న ఆత్మ భిన్నమని నిశ్చయంగా తెలుస్తుంది.

దేహః స చేద్వ్యవహరేదవికార్యాదిసన్నిభః ।
చక్షురాదీనంద్రియాణి నాత్మా వై కరణం త్వతః ॥3॥

దేహమే నిత్యమైనచో నిద్రా సమయమునందు, మరణానంతరమునందుకూడ అది వ్యవహరించాలి. చక్షురాదికములైన ఇంద్రియాలు కూడా కరణములే కాని (సాధనములేకాని) ఆత్మకాదు.

మనో ధీరపి ఆత్మా న దీపవత్కరణం త్వతః ।
ప్రాణో ఽప్యాత్మా న భవతి సుషుప్తేఽచిత్ప్రభావతః ॥4॥

మనస్సు, బుద్ధియు కూడ దీపంవలె సాధనమే కాని ఆత్మకాదు. సుషుప్తావస్థలో జ్ఞానం(ఆత్మ) వున్నా, దానిపై జడప్రభావం ఉన్న కారణంచేత ప్రాణం గూడా ఆత్మకాదు.

జాగ్రత్స్వప్నే చ చైతన్యం సంకీర్ణత్వాన్న బుధ్యతే ।
విజ్ఞానరహితః ప్రాణః సుషుప్తే జ్ఞాయతే యతః ॥5॥

జాగ్రత్స్వప్నసమయములందు ప్రాణచైతన్యం కలిసిపోయినట్లు వుంటుంది. అందుచే వేరుగా తెలియదు సుషుప్తి అవస్థలో ప్రాణం విజ్ఞానరహితమై వుంటుంది. అందుచే ప్రాణం ఆత్మకాదు.

అతో నాత్మేంద్రియం తస్మాదింద్రియాదికమాత్మనః ।
అహంకారోఽపి నైవాత్మా దేహవద్వ్యభిచారతః ॥6॥

ఆ విధంగానే ఇంద్రియసంఘాతం కూడా ఆత్మ కాదు. ఇంద్రియాదులు ఆత్మకు కరణాలు మాత్రమే. అహంకారం కూడ ఆత్మకాదు. అది కూడ దేహం వలె వేరుగా కనబడుతోంది కదా!

ఉక్తేభ్యో వ్యతిరిక్తోఽ యమాత్మా సర్వహృదిస్థితః ।
సర్వద్రష్టా చ భోక్తా చ నక్తముజ్జ్వలదీపవత్ ॥7॥

పైన చెప్పినవానికన్నా భిన్నంగా, దేహంకన్నా వేరుగా, ఆత్మ అందరి హృదయాలలోను వున్నది. అదియే సర్వద్రష్ట, భోక్త కూడ. రాత్రియందు ప్రకాశించే దీపంలా అది వెలుగుతూ వుంటుంది.

సమాధ్యారంభకాలే చ 'ఏవం' సంచింతయేన్మునిః ।
యతో బ్రహ్మణ ఆకాశం ఖాద్వాయుర్వాయుతోఽ నలః ॥8॥

అగ్నేరాపో జలాత్పృథ్వీ తతః సూక్ష్మం శరీరకమ్ ।
అపంచీకృతభూతేభ్య ఆసన్పంచీకృతాన్యతః ॥9॥

యోగి సమాధి ఆరంభ సమయంలో ఈ విధంగా భావన చేయాలి. బ్రహ్మ నుండి ఆకాశం, ఆకాశం నుండి వాయువు. వాయువు నుండి అగ్ని, అగ్ని నుండి జలం, జలం నుండి పృథివి, దాని నుండి సూక్ష్మశరీరం ఆవిర్భవించింది. అపంచీకృతభూతాల నుండి పంచీకృతములైన స్థూలభూతాలు జనించాయి.

స్థూలం శరీరం ధ్యాత్వాఽ స్మాల్లయం బ్రహ్మణి చింతయేత్ ।
పంచీకృతాని భూతాని తత్కార్యం చ విరాట్ స్మృతమ్ ॥10॥

స్థూలశరీరం జనించిందని భావించి, అది బ్రహ్మయందు లీనమైనట్లు చింతనం చేయాలి. పంచీకృత భూతాలకు, వాటి కార్యాలకు "విరాట్ " అని పేరు.

ఏతత్స్థూలం శరీరం హి ఆత్మనోఽ జ్ఞానకల్పితమ్ ।
ఇంద్రియైరపి విజ్ఞానం ధీరా జాగరితం విదుః ॥11॥

ఈ స్థూలశరీరం ఆత్మకు అజ్ఞానం ద్వారా కల్పించబడినది. ఇంద్రియాల వల్ల కలిగే జ్ఞానసమయానికి 'జాగ్రదవస్థ' అని పేరు.

విశ్వ స్తదభిమానీ స్యాత్త్రయమేతదకారకమ్ ।
అపంచీకృతభూతాని తత్కార్యం లింగముచ్యతే ॥12॥

జాగ్రదవస్థ యొక్క అభిమానియైన ఆత్మకు 'విశ్వుడు' అని పేరు. ఇంద్రియవిజ్ఞానం, జాగ్రదవస్థ, అభిమాన దేవత, ఈ మూడింటికి ప్రణవం యొక్క ఆదిమాత్రయైన ఆకారస్వరూపం అవుతుంది. అపంచీకృతభూతాలు, వాటి కార్యము అనేదానికి 'లింగము' అని పేరు.

సంయుక్తం సప్తదశభిర్హిరణ్యగర్భసంజ్ఞితమ్ ।
శరీరమాత్మనః సూక్ష్మం లింగమిత్యభిధీయతే ॥13॥

పదిహేడు తత్త్వాలతో (దశేంద్రియాలు, పంచతన్మాత్రలు, మనస్సు, బుద్ధి) కూడిన శరీరానికి హిరణ్యగర్భుడని, సూక్ష్మమని, లింగమని పేరు.

జాగ్రత్సంస్కారజః స్వప్నః ప్రత్యయో విషయాత్మకః ।
ఆత్మా తదభిమానీ స్యాత్తైజసో హ్యప్రపంచతః ॥14॥

జాగ్రత్తు యొక్క సంస్కారం వల్ల ఉత్పన్నమైన వివిధవిషయాల జ్ఞానానికి 'స్వప్నం' అని పేరు. దానిని అభిమానించే ఆత్మకు తైజసుడు అని పేరు. ఈ తైజసం ప్రపంచం కన్న భిన్నమైనది.

స్థూలసూక్ష్మశరీరాఖ్యద్వయస్యైకం హి కారణమ్ ।
ఆత్మా జ్ఞానం చ సాభాసం తదధ్యాహృతముచ్యతే ॥15॥

ఇది ప్రణవం యొక్క రెండవ మాత్రయైన ఉకారస్వరూపం. స్థూల, సూక్ష్మశరీరాలు రెండింటికి ఆత్మ ఒకటే కారణము. ఆభాసరూపమైన జ్ఞానానికి 'అధ్యాహృతం' అని పేరు.

న సన్నాసన్న సదసదేతత్సావయవం న తత్ ।
నిర్గతావయవం నేతి నాభిన్నం భిన్నమేవ చ ॥16॥

ఈ అవస్థలకు సాక్షియైన బ్రహ్మ సత్తు కాదు, అసత్తు కాదు, సదసత్తు కాదు, అవయవము కాదు, నిరవయవము కాదు, భిన్నము కాదు, అభిన్నము కాదు.

భిన్నాభిన్నం హ్యనిర్వాచ్యం బంధసంసారకారకమ్ ।
ఏకం స బ్రహ్మవిజ్ఞానాత్ప్రాప్తం నైవ చ కర్మభిః ॥17॥

భిన్నాభిన్నము కాదు. అది నిర్వచింపశక్యం కానిది. సంసారబంధనానికి కారణమైనది. ఆ బ్రహ్మం. ఒక్కటియే. అది జ్ఞానంచే లభిస్తుంది. కర్మలచే లభ్యం కాదు.

సర్వాత్మనా హీంద్రియాణాం సంహారః కారణాత్మనామ్ ।
బుద్ధేః స్థానం సుషుప్తం స్యాత్తద్ద్వయస్యాభిమానవాన్ ॥18॥

ప్రాజ్ఞ ఆత్మా త్రయం చైతన్మకారః ప్రణవః స్మృతః ।
అకారశ్చ ఉకారోఽ సౌ మకారో హ్యయమేవ చ ॥19॥

బ్రహ్మజ్ఞానసాధనభూతాలైన ఇంద్రియాలు సర్వదా లీనములై, బుద్ధిమాత్రమే నిలిచి వుండే స్థితికి 'సుషుప్తి' అని పేరు. ఈ బుద్ధి సుషుప్తులకు అభిమానియైన ఆత్మ ప్రాజ్ఞుడు. ఈ మూడును మకారం గాను, ప్రణవం గాను చెప్పబడుతున్నాయి. ఈ ప్రాజ్ఞుడే అకార, ఉకార, మకారములు.

అహం సాక్షీ చ చిన్మాత్రో జాగ్రత్స్వప్నాదికస్య చ ।
నాజ్ఞానం చైవ తత్కార్యం సంసారాదికబంధనమ్ ॥20॥

'అహం' పదలక్ష్యభూతుడగు ఆత్మ జ్ఞానస్వరూపుడు. జాగ్రత్స్వప్నాద్యవస్థలకు సాక్షిభూతుడు. వానిలో అజ్ఞానం కాని, తత్కార్యమైన సంసారాదిబంధనం కాని ఉండవు.

నిత్యశుద్ధబుద్ధముక్తసత్యమానందమద్వయమ్ ।
బ్రహ్మేహమస్మ్యహం బ్రహ్మ పరం జ్యోతిర్విముక్త ఓమ్ ॥21॥

నిత్యము, శుద్ధము, బుద్ధము, ముక్తము, సత్యము, ఆనందము, అద్వయమగు బ్రహ్మమే నేను. జ్యోతి స్వరూపము, ముక్తము అగు పరబ్రహ్మను నేనే. ఓంకారరూప పరబ్రహ్మను నేనే.

అహం బ్రహ్మ పరం జ్ఞానం సమాధిర్బంధఘాతకః ।
చిరమానందకం బ్రహ్మ సత్యం జ్ఞాన మనంతకమ్ ॥22॥

నేనే పరబ్రహ్మమును. నేనే జ్ఞానరూపమును. సమాధిరూప బ్రహ్మను నేనే. బంధనాన్ని నశింపజేసేవాడను నేనే. చిరము, ఆనందమయము, సత్యము, జ్ఞానము, అనంతమగు బ్రహ్మను నేనే.

అయమాత్మా పరం బ్రహ్మ తద్బ్రహ్మ త్వమసీతి చ ।
గురుణా బోధితో జీవో హ్యహం బ్రహ్మాఽస్మి బాహ్యత ః ॥23॥

"అయమాత్మా పరం బ్రహ్మ" "తత్ బ్రహ్మ త్వం అసి" ఈ విధంగా గురువుచే బోధింపబడిన జీవుడు దేహం కన్న విలక్షణమైన బ్రహ్మను తెలుసుకొనును.

సోఽ సావాదిత్యపురుషః సో ఽసావహమఖండ ఓమ్ ।
ముచ్యతేఽసారసంసారాద్బ్రహ్మజ్ఞో బ్రహ్మ తద్భవేత్ ॥24॥

సూర్యమండలంలో ప్రకాశించే పురుషుడను నేనే. నేనే ఓంకారమును. నేనే అఖండపరమేశ్వరుడను. ఇటువంటి జ్ఞానం కలవాడు అసారమగు సంసారం నుంచి విముక్తుడై బ్రహ్మరూపుడు అవుతాడు.

ఇత్యాది మహాపురాణే ఆగ్నేయే బ్రహ్మజ్ఞాననిరూపణం నామ సప్తసప్తత్యధిక త్రిశతతమో ఽధ్యాయః ॥377॥

అగ్నిమహాపురాణంలో బ్రహ్మజ్ఞాననిరూపణం అనే మూడువందల డెబ్బైఏడవ అధ్యాయం సమాప్తం.



అష్టసప్తత్యధిక త్రిశతతమో౽ధ్యాయః – మూడువందల డెబ్బైఎనిమిదవ అధ్యాయం

బ్రహ్మజ్ఞానకథనమ్ – బ్రహ్మజ్ఞానకథనం

అగ్నిరువాచ – అగ్ని ఇలా వచించాడు.

అహం బ్రహ్మ పరం జ్యోతిః పృథివ్యనలోజ్ఝితమ్ ।
అహం బ్రహ్మ పరం జ్యోతి ర్వాయ్వాకాశవివర్జితమ్ ॥1॥

పరంజ్యోతి స్వరూపాన్ని, పృథివిజల, వహ్ని భిన్నమైన పరబ్రహ్మాన్ని నేనే. వాయువు కన్న, ఆకాశము కన్న భిన్నమైన జ్యోతిర్మయమైన పరబ్రహ్మను నేనే.

అహం బ్రహ్మ పరం జ్యోతిరాదికార్యవివర్జితమ్ ।
అహం బ్రహ్మ పరం జ్యోతిర్విరాడాత్మవివర్జితమ్ ॥2॥

ఆదికారణ, కార్యభిన్నమైన జ్యోతిర్మయ పరబ్రహ్మను నేనే. విరాట్స్వరూపం (స్థూలబ్రహ్మాండం) కన్న భిన్నమైన జ్యోతిస్స్వరూపపరమబ్రహ్మను నేనే.

అహం బ్రహ్మ పరం జ్యోతిర్జాగ్రత్స్థానవివర్జితమ్ ।
అహం బ్రహ్మ పరంజ్యోతిర్విశ్వభావవివర్జితమ్ ॥3॥

జాగ్రదవస్థ కన్న భిన్నమైన జ్యోతిస్స్వరూపపరబ్రహ్మను నేనే. విశ్వరూపం కన్నా విలక్షణమైన జ్యోతిస్స్వరూప పరబ్రహ్మను నేనే.

అహం బ్రహ్మ పరం జ్యోతిరాకారాక్షరవర్జితమ్।
అహం బ్రహ్మ పరం జ్యోతిర్వాక్పాణ్యంఘ్రివివర్జితమ్ ॥4॥

ఆకారశూన్యమైన, అక్షరవర్జితమైన (అకారాక్షరవర్జితమైన) పరబ్రహ్మమైన జ్యోతిని నేనే. వాక్కు, పాణి, పాద శూన్యమైన జ్యోతిస్స్వరూప పరబ్రహ్మను నేనే.

అహం బ్రహ్మ పరం జ్యోతిః పాయూపస్థవివర్జితమ్ ।
అహం బ్రహ్మ పరం జ్యోతిః శ్రోత్రత్వక్చక్షురుజ్ఝితమ్ ॥5॥

పాయూపస్థవివర్జితమైన జోతిర్మయ పరబ్రహ్మను నేనే. శ్రోత్రం, త్వక్కు, చక్షువుల కన్న భిన్నమైన జ్యోతి స్స్వరూప పరబ్రహ్మను నేనే.

అహం బ్రహ్మ పరం జ్యోతి రసరూపవివిర్జితమ్ ।
అహం బ్రహ్మ పరం జ్యోతిః సర్వగంధవివర్జితమ్ ॥6॥

రసరూప వివర్జితమైన జ్యోతీ రూప పరబ్రహ్మను నేనే. సర్వగంధశూన్యమైన జ్యోతిర్మయ పరబ్రహ్మను నేనే.

అహం బ్రహ్మ పరం జ్యోతిర్జిహ్వాఘ్రాణవివర్జితమ్ ।
అహం బ్రహ్మ పరం జ్యోతిః స్పర్శశబ్దవివర్జితమ్ ॥7॥

జిహ్వా, ఘ్రాణ శూన్యమైన జ్యోతిర్మయ పరబ్రహ్మను నేనే. స్పర్శ శబ్ద వివర్జితమైన జ్యోతిస్స్వరూప పరబ్రహ్మను నేనే.

అహం బ్రహ్మ పరం జ్యోతిర్మనోబుద్ధివివర్జితమ్ ।
అహం బ్రహ్మ పరం జ్యోతిశ్చిత్తాహంకారవర్జితమ్ ॥8॥

మనో బుద్ధి వివర్జితమైన పరంజ్యోతిస్స్వరూపమగు బ్రహ్మను నేనే. చిత్తం, అహంకారం కన్న భిన్నమైన జ్యోతిర్మయమైన బ్రహ్మను నేనే.

అహం బ్రహ్మ పరం జ్యోతిః ప్రాణాపానవివర్జితమ్ ।
అహం బ్రహ్మ పరం జ్యోతిర్వ్యానోదానవివర్జితమ్ ॥9॥

ప్రాణాపానవివర్జితమైన పరంజ్యోతిని నేనే అయి వున్నాను. వ్యానోదానాల కన్న భిన్నమైన జ్యోతిర్మయమైన బ్రహ్మను నేనే.

అహం బ్రహ్మ పరం జ్యోతిః సమానపరివర్జితమ్ ।
అహం బ్రహ్మ పరం జ్యోతిర్జరామరణవర్జితమ్ ॥10॥

సమాన పరివర్జితమైన పరంజ్యోతి అయిన బ్రహ్మను నేనే అయి ఉన్నాను. జరామరణవర్జితమై జ్యోతిస్స్వరూపమైన పరబ్రహ్మను నేనే అయి ఉన్నాను.

అహం బ్రహ్మ పరం జ్యోతిః శోకమోహవివర్జితమ్ ।
అహం బ్రహ్మ పరం జ్యోతిః క్షుత్పిపాసావివర్జితమ్॥11॥

శోకం, మోహం కన్న భిన్నమైన జ్యోతిస్స్వరూపమయిన పరబ్రహ్మను నేనే అయి ఉన్నాను. ఆకలి దప్పికలకన్న భిన్నమైన జ్యోతిస్వరూపమైన పరబ్రహ్మను నేనే అయి ఉన్నాను.

అహం బ్రహ్మ పరం జ్యోతిః శబ్దోద్భూతాదివర్జితమ్ ।
అహం బ్రహ్మ పరం జ్యోతిర్హిరణ్యగర్భవర్జితమ్ ॥12॥

శబ్దోత్పత్తి మున్నగు వానికన్న వేరైన జ్యోతిర్మయ పరబ్రహ్మను నేనే. హిరణ్యగర్భుని కన్న విలక్షణమైన పరంజ్యోతి స్వరూప పరబ్రహ్మమును నేనే.

అహం బ్రహ్మ పరం జ్యోతిః స్వప్నావస్థావివర్జితమ్ ।
అహం బ్రహ్మ పరం జ్యోతిస్తైజసాదివివర్జితమ్ ॥13॥

స్వప్నావస్థారహితమైన పరంజ్యోతి అయిన బ్రహ్మను నేనే. తైజసుని కన్న భిన్నమైన జ్యోతిస్స్వరూప పరబ్రహ్మను నేనే.

అహం బ్రహ్మ పరం జ్యోతిరపకారాదివర్జితమ్ ।
అహం బ్రహ్మ పరం జ్యోతిః సభాజ్ఞానవివర్జితమ్ ॥14॥

అపకారాదుల కన్న వేరైన పరంజ్యోతి అయిన బ్రహ్మను నేనే. సభాజ్ఞాన వివర్జితమైన జ్యోతిస్స్వరూప పరబ్రహ్మను నేనే.

అహం బ్రహ్మ పరం జ్యోతి రధ్యాహృతవివర్జితమ్ ।
అహం బ్రహ్మ పరం జ్యోతిః సత్త్వాదిగుణవర్జితమ్ ॥15॥

అధ్యాహారరహితమైన పరంజ్యోతి అయిన పరబ్రహ్మను నేనే. సత్త్వాదిగుణవివర్జితమైన పరంజ్యోతిస్స్వ రూపమైన బ్రహ్మను నేనే.

అహం బ్రహ్మ పరం జ్యోతిః సదసద్భావవర్జితమ్ ।
అహం బ్రహ్మ పరం జ్యోతిః సర్వావయవవర్జితమ్ ॥16॥

సత్ , అసత్, భావ వివర్జితమైన జ్యోతిర్మయమైన పరబ్రహ్మను నేనే. సర్వావయవ వర్జితమైన పరంజ్యోతి స్స్వరూపమైన బ్రహ్మను నేనే.

అహం బ్రహ్మ పరం జ్యోతిర్భేదాభేదవివర్జితమ్ ।
అహం బ్రహ్మ పరం జ్యోతి : సుషుప్తిస్థానవర్జితమ్ ॥17॥

భేదాభేద వివర్జితమైన జ్యోతిస్స్వరూపమైన పరబ్రహ్మను నేనే. సుఘుప్తిస్థానరహితమైన పరంజ్యోతి అయిన బ్రహ్మను నేనే.

అహం బ్రహ్మ పరం జ్యోతిః ప్రాజ్ఞభావవివర్జితమ్ ।
అహం బ్రహ్మ పరం జ్యోతిః మకారాదివివర్జితమ్ ॥18॥

ప్రాజ్ఞభావ విరహితమైన జ్యోతిర్మయ పరబ్రహ్మను నేనే. మకారది వివర్జితమైన పరంజ్యోతిస్స్వరూపమైన బ్రహ్మను నేనే.

అహం బ్రహ్మ పరం జ్యోతిర్మానమేయవివర్జితమ్ ।
అహం బ్రహ్మ పరం జ్యోతిర్మితిమాతృవివర్జితమ్ ॥19॥

మాన మేయరహిత జ్యోతిర్మయపరబ్రహ్మను నేనే. మితి మాతృ రహిత పరంజ్యోతి స్స్వరూపమైన బ్రహ్మను నేనే.

అహం బ్రహ్మ పరం జ్యోతిః సాక్షిత్వాదివివర్జితమ్ ।
అహం బ్రహ్మ పరం జ్యోతిః కార్యకారణవర్జితమ్ ॥20॥

సాక్షిత్వాదుల కన్న భిన్నమైన జ్యోతిర్మయమైన పరబ్రహ్మను నేనే. కార్యకారణాల కన్న వేరైన పరంజ్యోతి స్స్వరూపమైన బ్రహ్మను నేనే.

దేహేంద్రియమనోబుద్ధి ప్రాణాహంకారవర్జితమ్ ।
జాగ్రత్స్వప్నసుషుప్త్యాది ముక్తం బ్రహ్మ తురీయకమ్ ॥21॥

నిత్య శుద్ధ బుద్ధముక్తం సత్యమానందమద్వయమ్ ।
బ్రహ్మోఽహమస్మ్యహం బ్రహ్మ సవిజ్ఞానం విముక్త ఓమ్ ॥22॥

దేహ, ఇంద్రియ, మనో, బుద్ధి, ప్రాణ, అహంకారములకన్న వేరైన, జాగ్రత్, స్వప్న, సుషుప్తి అవస్థల కన్న వేరైన, ముక్తమైన, తురీయ బ్రహ్మమును నేనే. నిత్యం, శుద్ధం, బుద్ధం, ముక్తం, సత్యం, ఆనందం, అద్వయం, (అద్వైతం) అయిన, సవిజ్ఞానమైన, సర్వదా ముక్తమైన, ప్రణవరూపమైన బ్రహ్మను నేనే అయి వున్నాను.

అహం బ్రహ్మ పరం జ్యోతిః సమాధిర్మోక్షదః పరః ॥23॥

జ్యోతి స్స్వరూప పరబ్రహ్మను నేనే. సమాధిరూపము, మోక్షప్రదము అగు పరబ్రహ్మమును నేనే.

ఇత్యాది మహాపురాణే ఆగ్నేయే బ్రహ్మజ్ఞానకథనం నామ అష్టసప్తత్యధిక త్రిశతతమోఽధ్యాయః ॥378॥

అగ్నిమహాపురాణంలో బ్రహ్మజ్ఞాన కథనమనే మూడువందల డెబ్బైఎనిమిదవ అధ్యాయం సమాప్తం.



ఏకోనాశీత్యధిక త్రిశతతమోఽధ్యాయః - మూడువందల డెబ్బైతొమ్మిదవ అధ్యాయం

బ్రహ్మజ్ఞాననిరూపణమ్ - బ్రహ్మజ్ఞాననిరూపణం

అగ్నిరువాచ - అగ్ని ఇలా పలికాడు.

యజ్ఞైశ్చ దేవానాప్నోతి వైరాజం తపసా పదమ్ ।
బ్రహ్మణః కర్మసంన్యాసాద్వైరాగ్యాత్ప్రకృతౌ లయమ్ ॥1॥

యజ్ఞాలచేత దేవలోకాలను, తపస్సు చేత విరాట్పదాన్ని, కర్మ సంన్యాసం చేత బ్రహ్మ పదాన్ని, వైరాగ్యం చేత ప్రకృతిలయాన్ని మానవుడు పొందుతాడు (సాధకుడు).

జ్ఞానాత్ప్రాప్నోతి కైవల్యం పంచైతా గతయః స్మృతాః ।
ప్రీతి తాప విషాదాదేర్వినివృత్తిర్విరక్తతా ॥2॥

జ్ఞానం చేత మోక్షాన్ని పొందుతాడు. ఈ విధంగా ఐదుగతులు చెప్పబడ్డాయి. ప్రీతి, సంతాపం, విషాదం మున్నగు వాటి నుంచి విడివడి ఉండడం వైరాగ్యం అనబడుతుంది.

సంన్యాసః కర్మణాం త్యాగః కృతానామకృతైః సహ ।
అవ్యక్తాదౌ విశేషాన్తే వికారోఽస్మిన్నివర్తతే ॥3॥

చేసిన కర్మల యొక్క, అంతవరకు చేయని కర్మల యొక్క ఆసక్తిని, ఫలేచ్ఛను, సంకల్పాన్ని పరిత్యజించడం సంన్యాసం. ఇలా చేయడం వల్ల అవ్యక్తం మొదలు విశేషం వరకు వున్న వికారాలు తొలగిపోతాయి.

చేతనా చేతనాన్యత్వజ్ఞానేన జ్ఞానముచ్యతే ।
పరమాత్మా చ సర్వేషామాధారః పరమేశ్వరః ॥4॥

అచేతనం (జడం), చేతనం, వీటి యొక్క భిన్నత్వ వివేకజ్ఞానానికి జ్ఞానం అని పేరు. ఈ జ్ఞానం వల్ల పరమాత్మజ్ఞానం కలుగుతుంది. పరమాత్మయే అన్నింటికి ఆధారము. పరమేశ్వరుడు ఆయనే.

విష్ణునామ్నా చ దేవేషు వేదాన్తేషు చ గీయతే ।
యజ్ఞేశ్వరో యజ్ఞపుమాన్ ప్రవృత్తైరిజ్యతే హ్యసౌ ॥5॥

ఆయనే వేదాలలో, వేదాంతాలలో విష్ణునామంలో కీర్తింపబడుతున్నాడు. అతడే యజ్ఞేశ్వరుడు. ప్రవృత్తి మార్గంలో ఉన్నవారు ఆ యజ్ఞపురుషుని పూజిస్తారు.

నివృత్తైర్జ్ఞానయోగేన జ్ఞానమూర్తిః స చేక్ష్యతే ।
హ్రస్వదీర్ఘప్లుతాద్యం తు వచస్తత్పురుషోత్తమః ॥6॥

నివృత్తిమార్గంలో ఉన్నవారు జ్ఞానయోగం ద్వారా జ్ఞానస్వరూపుడైన పరమాత్మను సాక్షాత్కరించుకొంటారు. హ్రస్వదీర్ఘ ప్లుతాదివాక్కు పురుషోత్తమస్వరూపమే అవుతుంది.

తత్ప్రాప్తిహేతుర్జ్ఞానం చ కర్మ చోక్తం మహామునే ।
ఆగమోక్తం వివేకాచ్చ ద్విధా జ్ఞానం తథోచ్యతే ॥7॥

మహామునీ! ఆ పరమాత్మప్రాప్తికి జ్ఞానం, కర్మ అనేవి రెండునూ సాధనాలే. వివేకజన్యం, ఆగమోక్త జన్యం అని జ్ఞానం రెండు విధాలు.

శబ్ద బ్రహ్మాఽఽగమమయం పరం బ్రహ్మ వివేకజమ్ ।
ద్వే బ్రహ్మణీ వేదితవ్యే బ్రహ్మశబ్దపరం చ యత్ ॥8॥

శబ్దబ్రహ్మ జ్ఞానం ఆగమమయం (వేదశాస్త్ర ప్రణవ జన్యం). పరబ్రహ్మజ్ఞానం వివేకజం (ఆత్మానాత్మవివేకజన్యం).

వేదాది విద్యా హ్యపరమక్షరం బ్రహ్మ సత్పరమ్ ।
తదేతద్భగవద్వాచ్యముపచారేఽర్చనేఽన్యతః ॥9॥

వేదాది విద్య అపరబ్రహ్మ. అక్షరతత్త్వం పరబ్రహ్మ. 'భగవత్' అనే శబ్దంచే చెప్పబడేది ఈ పరబ్రహ్మయే. పూజాద్యర్థములందు ఈ శబ్దాల యొక్క ప్రయోగం ఔపచారికం.

సంభర్తేతి తథా భర్తా భకారోఽర్థద్వయాన్వితః ।
నేతా గమయితా స్రష్టా గకారోఽయం మహామునే ॥10॥

మహామునీ! భగవచ్ఛబ్దంలోని భకారానికి పోషించేవాడు, సర్వాధారభూతుడు అనే రెండు అర్థాలు వున్నాయి. గకారానికి నేత, గమయిత, స్రష్ట అని అర్థాలు. (కర్మ ఫలప్రాప్తిని ఇచ్చేవాడు, ప్రేరకుడు, సృష్టికర్త)

ఐశ్వర్యస్య సమగ్రస్య వీర్యస్య యశసః శ్రియః ।
జ్ఞాన వైరాగ్యయోశ్చైవ షణ్ణాం భగ ఇతీరణా(తీంగణా) ॥11॥

సమగ్రమైన ఐశ్వర్యం, వీర్యం(ధర్మ), యశస్సు, లక్ష్మి, జ్ఞానం, వైరాగ్యం – ఈ ఆరింటికి భగమని పేరు.

వసంతి విష్ణౌ భూతాని స చ ధాతుస్త్రిధాత్మకః ।
ఏవం హరౌ హి భగవాన్ శబ్దోఽన్యత్రోపచారతః ॥12॥

సర్వభూతాలు విష్ణువునందు వసిస్తాయి. ఆ ధాతువు త్రిధాత్మకము. బ్రహ్మ విష్ణు శివ స్వరూపము. (లేదా) మూడు విధాలుగా సర్వధారకుడు. అందువల్ల భగవచ్ఛబ్దానికి హరియందే ముఖ్య ప్రయోగము. ఇతరార్థముల యందు దాని ప్రయోగం గౌణం.

ఉత్పత్తిం ప్రలయం చైవ భూతానామగతిం గతిమ్ ।
వేత్తి విద్యామవిద్యాం చ స వాచ్యో భగవానితి ॥13॥

సకలభూతాల ఉత్పత్తిని, ప్రళయాన్ని, అగమనాన్ని, గమనాన్ని, విద్యను, అవిద్యను ఎరింగినవానిని భగవంతుడు అంటారు.

జ్ఞానశక్తిః బలైశ్వర్యః వీర్యం తేజాంస్యశేషతః ।
భగవచ్ఛబ్దవాచ్యాని వినా హేయైర్గుణాదిభి ః ॥14॥

హేయగుణాలు లేకుండా, జ్ఞానం, శక్తి, బలం, ఐశ్వర్యం, వీర్యం, తేజస్సు ఎవనియందు పరిపూర్ణంగా ఉంటాయో, ఆయనే "భగవత్" అనే శబ్దంచే చెప్పబడతాడు. ఇవన్నీ భగవచ్ఛబ్దవాచ్యాలు.

ఖాండిక్య (క్యో) జనకాయాహ యోగం కేశిధ్వజః పురా ।
అనాత్మన్యాత్మబుద్ధిర్యా ఆత్మస్వమితి యా మతిః ॥15॥

పూర్వం కేశిధ్వజుడు ఖాండిక్యజనకునకు ఈ విధంగా ఉపదేశించాడు. అనాత్మయందు ఆత్మబుద్ధి ఏదయితే ఉందో లేని దానియందు ఉన్నబుద్ధి చూపుట అనునది సంసారబంధానికి కారణం.

అవిద్యాభవసంభూతిర్బీజమేతద్ద్విధా స్థితమ్ ।
పంచభూతాత్మకే దేహే దేహీ మోహతమాశ్రితః ॥16॥

అహమేతదితీత్యుచ్చైః కురుతే కుమతిర్మతిమ్ ।
ఇత్థం చ పుత్రపౌత్రేషు తద్దేహోత్పాతితేషు చ ॥17॥

ఈ అవిద్యాభవమైన అజ్ఞానబీజం అహంకారం, మమకారం అని రెండు విధాలుగా ఉంటుంది. దేహాభిమానియైన జీవుడు మిక్కిలి మోహంచే కప్పబడి పంచభూతాత్మకమైన దేహాన్ని, నేనే ఇది అనే గాఢమైన బుద్ధిని కుమతి కలిగి ఉంటాడు. ఈ విధంగానే కుమారులయందు, మనుమలయందు, వారి శరీరాల ద్వారా పుట్టిన వారి యందు మమకారం కలిగి ఉంటాడు.

కరోతి పండితః సామ్యమనాత్మని కలేవరే ।
సర్వదేహోపకారాయ కురుతే కర్మ మానవః ॥18॥

విద్వాంసుడు అనాత్మయైన కళేబరమునందు సామ్యబుద్ధిని (రాగద్వేష బుద్ధి రాహిత్యాన్ని) కలిగి ఉంటాడు. మానవుడు (ఉత్తమ సాధకుడు) సర్వజీవుల ఉపకారం కోసం మాత్రమే కర్మను చేస్తాడు.

దేహశ్చాన్యో యదా పుంసస్తదా బంధాయ తత్పరమ్ ।
నిర్వాణమయ ఏవాయమాత్మా జ్ఞానమయోఽమలః ॥19॥

దేహము పురుషుని కన్న (ఆత్మకన్న) భిన్నమైనది. కావున దేహసంబంధకర్మ అంతయు బంధ హేతువవుతుంది. వాస్తవానికి ఆత్మ నిర్వాణమయము. జ్ఞానమయము. అమలము.

దుఃఖజ్ఞానమయోఽధర్మః ప్రకృతేః స తు నాత్మనః ।
జలస్య నాగ్నినా సంగః స్థాలీసంగాత్తథాపి హి ॥20॥

దుఃఖజ్ఞానం అనేది ప్రకృతియొక్క ధర్మం కాని ఆత్మకు సంబంధించిన ధర్మం కాదు. జలానికి అగ్నితో సాక్షాత్సంబంధం లేక పోయినా పాత్ర ద్వారా అగ్నిసంపర్కం కలగడం ఎలా సంభవమో ఇది కూడ అటువంటిదే.

శబ్దాస్తే కాదికా ధర్మాస్తత్కృత్వా వై మహామునే ।
తథాఽఽత్మా ప్రకృతౌ సంగాదహం మానాదిభూషితః ॥21॥

మహామునీ! ఆత్మ ప్రకృతిసంగంచే అహంకార, మమకారాది ప్రకృతి ధర్మాలను పొందుతోంది. పాత్రలోని నీరు అగ్ని ద్వారా వేడికావడం వల్ల అనేకమైన "క,ఖ, ల, ఖల,ఖల" ఇత్యాదులైన కుత కుత సవ్వడుల ద్వారా మరగడం జరుగుతుంది. ఈ విధంగా ప్రకృతి సంసర్గంచేత అహంకారమమకారాలు మొదలగు దోషాలు సంస్కృక్తమవుతాయి.

భజతే ప్రాకృతాన్ధర్మానన్యస్తేభ్యో హి సోఽవ్యయః ।
బంధాయ విషయాసంగం మనో నిర్విషయం ధియే ॥22॥

వాస్తవానికి అది వాటి కన్న భిన్నమైనది. ప్రకృతి ధర్మాలు వినాశమైనవి. ఆత్మ అవినాశి. విషయాసక్తమైన మనస్సు బంధహేతువు. విషయదూరమైన మనస్సు జ్ఞానహేతువు.

విషయాత్తత్సమాకృష్య బ్రహ్మభూతం హరిం స్మరేత్ ।
ఆత్మభావం నయత్యేనం తద్బ్రహ్మధ్యాయినం మునే ॥23॥

మునీశ్వరా! మనస్సును విషయాల నుంచి వేరుచేసి హరిని స్మరించాలి. తనను ధ్యానించేవానికి హరి బ్రహ్మభావాన్ని కలుగజేస్తాడు.

విచార్య స్వాత్మనః శక్త్యా లౌహమాకర్షకో యథా ।
ఆత్మప్రయత్నసాపేక్షా విశిష్టా యా మనోగతిః ॥24॥

సూదంటురాయి లోహాన్ని ఆకర్షించినట్లు తనను ధ్యానించేవానిని బ్రహ్మ తనవైపు లాగుకొంటాడు. ఆత్మప్రయత్నంచే మనస్సు బ్రహ్మతో విశిష్టసంయోగం పొందడమే యోగం.

తస్యా బ్రహ్మణి సంయోగో యోగ ఇత్యభిధీయతే ।
వినిష్పందః సమాధిస్థః పరం బ్రహ్మాధిగచ్ఛతి ॥25॥

మనస్సును బ్రహ్మయందు సంయోగం కావించడమే యోగం అనబడుతుంది. వినిష్పందుడై (నిశ్చలుడై) సమాధిలో ఉన్నవాడు పరబ్రహ్మను పొందినవాడవుతాడు.

యమైః సనియమైః స్థిత్వా ప్రత్యాహృత్యా మరుజ్జయైః ।
ప్రాణాయామేన పవనైః ప్రత్యాహారేణ చేంద్రియైః ॥26॥
వశీకృతైస్తతః కుర్యాత్ స్థితం చేత ః శుభాశ్రయే ।
ఆశ్రయశ్చేతసో బ్రహ్మ మూర్తం చామూర్తకం ద్విధా ॥27॥

యమముల చేత, నియమముల చేత, ఆసనం చేత, ప్రాణాయామం చేత, ప్రత్యాహారం చేత, ప్రాణజయం చేత (వాయుప్రసారజయం చేత) ఇంద్రియనిగ్రహాలచేత (విషయాలనుంచి మళ్లించడం ద్వారా) వశం కావించుకొని

చిత్తాన్ని శుభమైన ఆశ్రయమునందు నిలిచి ఉండేటట్లు చేసుకోవాలి. ఈ శుభాశ్రయమైన బ్రహ్మ మూర్తం, అమూర్తం అని రెండు విధాలు.

సనందనాదయో బ్రహ్మభావభావనయా యుతాః ।
కర్మభావనయా చాన్యే దేవాద్యాః స్థావరాంతకాః ॥28॥

సనందనుడు మున్నగువారు బ్రహ్మభావనతో కూడుకొన్నవారు. దేవతలు మొదలుకొని స్థావరాలవరకు ఉన్న ప్రాణులన్నీ కర్మభావనతో కూడుకొన్నవి.

హిరణ్యగర్భాదిషు చ జ్ఞానకర్మాత్మికా ద్విధా ।
త్రివిధా భావనా ప్రోక్తా విశ్వం బ్రహ్మ ఉపాస్యతే ॥29॥

హిరణ్యగర్భాదులందు జ్ఞానభావన, కర్మభావన రెండునూ ఉంటాయి. ఈవిధంగా భావన మూడు విధాలుగా చెప్పారు. ఈ విశ్వమంతా బ్రహ్మయే అని ఉపాసించడం బ్రహ్మభావన.

ప్రత్యస్తమితభేదం యత్సత్తామాత్రమగోచరమ్ ।
వచసామాత్మసంవేద్యం తత్జ్ఞానం బ్రహ్మసంజ్ఞితమ్ ॥30॥

సమస్త భేదాలు తొలగించేది, సత్తామాత్రవిషయమైనది, వాక్కులను గోచరించనిది, ఆత్మమాత్ర సంవేద్యమైన తత్త్వం యొక్క జ్ఞానం బ్రహ్మజ్ఞానం (బ్రహ్మ అనే పేరుగల జ్ఞానం).

తచ్చ విష్ణోః పరం రూపమరూపస్యాజమక్షరమ్ ।
అశక్యం ప్రథమం ధ్యాతుమతో మూర్తాది చింతయేత్ ॥31॥

అదియే రూపరహితుడైన విష్ణువు యొక్క జన్మరహితము, అక్షరము అయిన ఉత్కృష్టస్వరూపం. అమూర్తరూపధ్యానం కష్టం గావున ముందు మూర్తరూపం ధ్యానం చేయాలి.

(భగవ) మద్భావభావమాపన్న స్తతో ఽసౌ వశ(పర)మాత్మనా ।
భవత్యభేదో భేదశ్చ తస్యాజ్ఞానకృతో భవేత్ ॥32॥

ఇలా చేసేవాడు భగవద్భావాన్ని పొంది పరమాత్మతో ఐక్యాన్ని పొందుతాడు. అభేదభావం జ్ఞానస్వరూపం. భేదభావం అజ్ఞానకృతం .

ఇత్యాది మహాపురాణే ఆగ్నేయే బ్రహ్మజ్ఞాననిరూపణం నామ ఏకోనాశీత్యధిక త్రిశతతమోఽధ్యాయః ॥379॥

అగ్నిమహాపురాణంలో బ్రహ్మజ్ఞాననిరూపణ మనే మూడువందల డెబ్బైతొమ్మిదవ అధ్యాయం సమాప్తం.

అశీత్యధిక త్రిశతతమోఽధ్యాయః - మూడువందల ఎనబయ్యవ అధ్యాయం

అద్వైతబ్రహ్మవిజ్ఞానమ్ - అద్వైతబ్రహ్మవిజ్ఞానం

అగ్నిరువాచ - అగ్ని ఇలా పలికాడు.

అద్వైతబ్రహ్మవిజ్ఞానం వక్ష్యే యద్భరతోఽగదత్ ।
శాలగ్రామే తపశ్చక్రే వాసుదేవార్చనాదికృత్ ॥1॥

మునీశ్వరా! భరతుడు చెప్పిన అద్వైతబ్రహ్మవిజ్ఞానం గురించి చెబుతాను. పూర్వం భరతుడనే రాజు శాల (సాల) గ్రామక్షేత్రంలో వాసుదేవార్చనాదులను కావిస్తూ తపస్సు చేశాడు.

మృగసంగాన్మృగో భూత్వా హ్యన్తకాలే స్మరన్మృగమ్ ।
జాతిస్మరో మృగం త్యక్త్వా దేహం యోగాత్స్వతోఽభవత్ ॥2॥

ఒకమృగము పట్ల అతిప్రీతి కలిగినవాడై మరణసమయంలో ఆ మృగాన్నే స్మరిస్తూ మరుజన్మలో మృగంగా పుట్టాడు. కాని ఆ జన్మలో పూర్వజన్మ స్మృతి కలిగియున్నాడు. అందువల్ల స్వయంగా ఆ దేహం విడిచి మరోజన్మను పొందాడు.

అద్వైతబ్రహ్మభూతశ్చ జడవల్లోకమాచరత్ ।
క్షత్తాఽసౌ వీరరాజ్యస్య విష్టియోగమమన్యత ॥3॥

అద్వైతబ్రహ్మజ్ఞానం కలవాడై (మృగసాంగత్యం వలన) జడునివలె లోకంలో సంచరించసాగాడు. సావీరరాజు (ఆ దేశాన్ని పాలించేరాజు) ఒకప్పుడు అతనిని విష్టి కర్మకు వినియోగించాడు. (జీతం ఈయకుండా కొలువు చేయించు వృత్తిని విష్టి అంటారు)

ఉవాహ శిబికామస్య క్షత్తుర్వచనచోదితః ।
గృహీతో విష్టినా జ్ఞానీ ఉవాహాత్మక్షయాయ తమ్ ॥4॥

అతని ఆజ్ఞప్రకారం భరతుడు ఆ రాజు పల్లకీని మోయసాగాడు. అతడు జ్ఞాని అయినప్పటికిని, ప్రారబ్ధకర్మక్షయం కోసమై విష్టిగా పల్లకీని మోశాడు.

యయౌ జడగతిః పశ్చాద్యేత్వన్యే త్వరితం యయుః ।
శీఘ్రాన్ శీఘ్రగతీన్ దృష్ట్వా అశీఘ్రం తం నృపోఽబ్రవీత్ ॥5॥

భరతుడు నెమ్మదిగా నడువసాగాడు. ఇతరులు శీఘ్రంగా నడుస్తున్నారు. వారు శీఘ్రంగా నడవడం, ఇతడు నెమ్మదిగా నడవడం వీక్షించి రాజు ఇలా పలికాడు.

రాజోవాచ - రాజు ఇలా ప్రశ్నించాడు.

కిం శ్రాంతోఽస్యల్పమధ్వానం త్వయోఢా శిబికా మమ ।
కిమాయాససహో న త్వం పీవానాసి నిరీక్ష్యసే ॥6॥

"ఓయీ! నీవు నా పల్లకీ కొంచెం దూరం మాత్రమే మోశావు. ఇంతలోనే, అలసిపోయావా? నీవు చూడడానికి బాగా బలిసి ఉన్నావు. ఈ మాత్రం శ్రమకు ఓర్వజాలవా?" అని రాజు ప్రశ్నించాడు.

బ్రాహ్మణ ఉవాచ – బ్రాహ్మణుడు ఇలా బదులిచ్చాడు.

నాహం పీవా న వై వోఢా శిబికా భవతో మయా ।
న శ్రాంతోఽస్మి న వా ఽ ఽయాసో వోఢవ్యోఽస్మి మహీపతే ॥7॥

నేను బలిసి లేను, నేను నీ పల్లకీని మోయడం లేదు. నేను కూడా అలసిపోలేదు. ఓ మహీపతీ! నాపైన భారం ఏమీ లేదు.

భూమౌ పాదయుగం తస్థౌ జంఘే పాదద్వయే స్థితే ।
ఊరూ జంఘాద్వయావస్థౌ తదాధారం తథోదరమ్ ॥8॥

నేలపై రెండు పాదాలు ఉన్నాయి. వాటిపై రెండు పిక్కలు ఉన్నాయి. వాటిపై రెండు తొడలు ఉన్నాయి. వాటి ఆధారంగా వాటిపై ఉదరం వుంది.

వక్షః స్థలం తథాబాహూ స్కంధౌ చోదరసంస్థితౌ ।
స్కందస్థితేయం శిబికా మమ భారోఽత్ర కిం కృతః ॥9॥

దానిపై వక్షఃస్థలం, దానిపై భుజాలు ఉన్నాయి. ఆ భుజాలపై ఈ పల్లకీ ఉంచబడింది. ఇట్టి స్థితిలో ఈ భారంతో నాకేమి సంబంధం వుంది?

శిబికాయాం స్థితం చేదం దేహం త్వదుపలక్షితమ్ ।
తత్ర త్వమహమప్యత్ర ప్రోచ్యతే చేదమన్యథా ॥10॥

నీది అని చెప్పబడే ఈ శరీరం పల్లకీలో వుంది. నీవు అక్కడ ఉన్నావని, నేను ఇక్కడ ఉన్నానని చెప్పడం ఇదంతా మిథ్య.

అహం త్వం చ తథాఽన్యే చ భూతైరుహ్యామ పార్థివ ।
గుణప్రవాహపతితో గుణవర్గో హి యాత్యయమ్ ॥11॥

మహారాజా! నిన్ను, నన్ను, అందరిని కూడా పంచభూతాలు మోస్తున్నాయి. పంచమహాభూతాలు, గుణత్రయం, గుణప్రవాహంలో పడికొట్టుకొని పోతున్నాయి.

కర్మవశ్యా గుణాశ్చైతే సత్త్వాద్యాః పృథివీపతే ।
అవిద్యాసంచితం కర్మ తచ్చాశేషేషు జన్తుషు ॥12॥

పృథివీపతీ! సత్త్వాది గుణాలు అనేవి కర్మజన్యాలు. కర్మ అనేది అవిద్య వల్ల సంభవించి జరిగేది. ఇది అన్ని జీవులలోనూ వుంది.

ఆత్మా శుద్ధోఽక్షరః శాన్తో నిర్గుణః ప్రకృతేః పరః ।
ప్రవృద్ధ్యపచయౌ నాస్య ఏకస్యాఖిలజన్తుషు ॥13॥

ఆత్మ శుద్ధము, అక్షరము, శాంతము, నిర్గుణము, ప్రకృతి కన్న పరమైనది, అన్ని ప్రాణుల యందు ఒకే ఆత్మ వుంది. దానికి వృద్ధికాని, తరుగుదలకాని లేదు.

యదా నోపచయస్తస్య యదా నాపచయో నృప ।
తదా పీవానసీతి త్వం కయా యుక్త్యా త్వయేరితమ్ ॥14॥

రాజా! ఆత్మకు ఎప్పుడయితే వృద్ధి అన్నది లేదో, దానికి తరుగు అన్నది కూడా వుండదు కదా! అటువంటి పరిస్థితులలో "నేను బలిసి ఉన్నానని" ఏ యుక్తిని బట్టి నన్ను ప్రశ్నించావు?

భూజంఘాపాదకట్యూరుజఠరాదిషు సంస్థితా ।
శిబికేయం తథా స్కంధే తదా భారః సమస్త్వయా ॥15॥

భూమి, జంఘులు, పాదాలు, కటి, ఊరువులు, ఉదరం మున్నగు వాటిపైన, స్కంధంపైన నీ పల్లకీ నాకు భారమైనచో, అది నీకు కూడా భారమే.

తదన్యజంతుభిర్భూప శిబికోత్థానకర్మణా ।
శైలద్రవ్యగృహోత్థాపి పృథివీసంభవోఽపి వా ॥16॥

రాజా! అది ఇతర ప్రాణుల విషయంలో కూడ సమానమే. కేవలం పల్లకీని మాత్రమే కాక జీవులు పర్వతాలను, వృక్షాలను, ద్రవ్యాలను, గృహాదులను, పృథివి మున్నగు వాటిని, వాటి భారాన్ని కూడ తమనెత్తిన మోస్తున్నాయి.

యథా పుంసః పృథగ్భావః ప్రాకృతైః కరణైర్నృప ।
సోఢవ్యః స మహాభారః కతరో నృపతే మయా ॥17॥

నృపాలా! ప్రకృతిజన్యములైన సాధనాల కన్న పురుషుడు సర్వదా భిన్నుడైనపుడు నేను భరించవలసిన భారం ఏముంది కనుక?

యద్ద్రవ్యా శిబికా చేయం తద్ద్రవ్యో భూతసంగ్రహః ।
భవతో మేఽఖిలస్యాస్య సమత్వేనోపబృంహితః ॥18॥

ఏ పదార్థంతో ఈ పల్లకీ తయారుచేయబడిందో, ఆ పదార్థంతోనే నీయొక్క, నా యొక్క, సకల ప్రాణుల యొక్క శరీరాలు నిర్మింపబడ్డాయి. ఆ ద్రవ్యాలచేతనే అందరికీ వృద్ధి ఏర్పడుతుంది.

తచ్ఛ్రుత్వోవాచ రాజా తం గృహీత్వాఽంఘ్రీ క్షమాప్య చ ।
ప్రసాదం కురు త్యక్త్వేమాం శిబికాం బ్రూహి శృణ్వతే ॥
యో భవాన్యన్నిమిత్తం వా యదాగమనకారణమ్ ॥19॥

ఆ మాటలు విని రాజు పల్లకీ దిగి అతని పాదాలపై పడి క్షమార్పణ కోరి, వినమ్రుడవుతూ తరువాత పలికాడు. "నన్ను అనుగ్రహించు, ఈ పల్లకీని విడిచిపెట్టు. నీవు ఎవరివో చెప్పు, నీవు ఇలా ఎందుకు వచ్చావో వివరించు" అని వేడుకొన్నాడు.

బ్రాహ్మణ ఉవాచ - బ్రాహ్మణుడు ఇలా అన్నాడు.

శ్రూయతాం కోఽహమిత్యేతద్వక్తుం నైవ చ శక్యతే ।
ఉపభోగనిమిత్తం చ సర్వత్రాగమనక్రియా ॥20॥

సుఖదుఃఖోపభోగౌ తు తౌ దేశాద్యుపపాదకౌ ।
ధర్మాధర్మోద్భవౌ భోక్తుం జంతుర్దేశాదిమృచ్ఛతి ॥21॥

"రాజా! విను. నీవు ఎవడవని అడిగితే నేను ఫలానావాడిని అని చెప్పడం అశక్యం. కర్మఫలాన్ని అనుభవించడానికే అందరూ ఎప్పుడూ వస్తూ ఉంటారు. (పుడుతూ ఉంటారు). సుఖదుఃఖాల ఉపభోగం కొరకే అందరూ విభిన్న కాల దేశ వృత్తులు మున్నగువాటిని పొందుతారు. ధర్మాధర్మాలను చేసి, వాటి ఫలాలను అనుభవించడానికే జీవుడు ఆయా స్థానాలను పొందుతూ ఉంటాడు" అని ఆ బ్రాహ్మణుడు పలికాడు.

రాజోవాచ :- మళ్లీ రాజు ఇలా అడిగాడు.

యోఽగస్తిసోఽహమితి బ్రహ్మన్ కథం వక్తుం న శక్యతే ।
ఆత్మన్యేష న దోషాయ శబ్దోఽహమితి యో ద్విజ ॥22॥

"ఏది ఉన్నదో అది నేను అని చెప్పడంలో బ్రాహ్మణోత్తమా! దోషం ఏమి ఉంటుంది? 'అహం' అనే శబ్దాన్ని తన విషయంలో ప్రయోగించడం దోషం కాదు కదా! ద్విజా!" అన్నాడు.

శబ్దోఽహమితి దోషాయ నాత్మన్యేష తథైవ తత్ ।
అనాత్మన్యాత్మవిజ్ఞానం శబ్దో వా భ్రాంతిలక్షణః ॥23॥

రాజా! నీవు చెప్పినది సత్యమే. తన విషయంలో "అహం" అనే శబ్దాన్ని ప్రయోగించడంలో దోషం ఏమీ లేదు. కాని అనాత్మవిషయంలో "అహం" శబ్దాన్ని ప్రయోగించి దానిని ఆత్మగా భావించడం భ్రాంతియే.

యదా సమస్తదేహేషు పుమానేకో వ్యవస్థితః ।
తదా హి కో భవాన్కోహమిత్యేతద్విఫలం వచః ॥24॥

సమస్త దేహాల యందు ఉన్న ఆత్మ ఒక్కటే కాదా! అటువంటి స్థితిలో నీవు ఎవ్వరు? మున్నగు మాటలకు అర్థం లేదు. ఆ ప్రశ్న విఫలమైనదే అవుతుంది.

త్వం రాజా శిబికా చేయం వయం వాహాః పురః సరాః ।
అయం చ భవతో లోకో న సదేతన్నృపోచ్యతే ॥25॥

నృపాలా! నీవు రాజువు. ఇది పల్లకీ. మేము దీనిని మోసేవారము. ఎదుట నడిచేవారు నీ పరివారం. ఈ లోకం నీది. ఈ విధంగా చెప్పడం సత్యం కాదు.

వృక్షాద్దారు తతశ్చేయం శిబికా త్వదధిష్ఠితా ।
కా వృక్షసంజ్ఞా జాతాఽస్య దారుసంజ్ఞాఽథ వా నృప ॥26॥

చెట్టు నుండి వచ్చిన కఱ్ఱతో చేసిన ఈ పల్లకీని నీవు ప్రస్తుతం అధిరోహించావు. రాజా! ఈ పల్లకీకి ఆ వృక్షం పేరు ఇప్పుడు ఏదైనా ఉందా? అలాగే దానికి ఉపయోగించిన కఱ్ఱ పేరు అయినా ఉందా? ఆలోచించి చెప్పు.

వృక్షారూఢో మహారాజో నాయం వదతి చేతనః ।
న చ దారుణి సర్వస్త్వాం బ్రవీతి శిబికాగతమ్ ॥27॥

ఇక్కడున్న వారెవరూ "మహారాజు చెట్టుపై ఎక్కి ఉన్నాడు" అని అనరుకదా! అలాగే "కట్టెపై ఎక్కి ఉన్నాడు" అని కూడా అనరు కదా! అందరూ రాజు పల్లకీని ఎక్కి ఉన్నాడనే చెబుతున్నారు కదా!

శిబికా దారుసంఘాతో రచనాస్థితిసంస్థితః ।
అన్విష్యతాం నృపశ్రేష్ఠ తద్భేదే శిబికా త్వయా ॥28॥

నృపశేఖరా! ఒకవిధంగా కూర్చి అతికిన కఱ్ఱల సముదాయానికే "శిబికా" అని పేరు. కఱ్ఱ కన్న వేరుగా పల్లకీ ఎక్కడ ఉందో వెతికి చూడు.

పుమాన్ స్త్రీ గౌరయం వాజీ కుంజరో విహగస్తరుః ।
దేహేషు లోకసంజ్ఞేయం విజ్ఞేయా కర్మహేతుషు ॥29॥

ఇతడు పురుషుడు. ఈమె స్త్రీ. ఇది ఎద్దు. ఇది గుఱ్ఱం. ఇది ఏనుగు. ఇది చెట్టు. ఇది పక్షి అని ఈ విధంగా కర్మజన్యాలైన వేర్వేరు శరీరాలకు వేరు వేరు నామాలు ఆరోపింపబడుతున్నాయి. ఇవన్నీ లోకం కల్పించిన పేర్లు.

జిహ్వా బ్రవీత్యహమితి దంతోష్ఠౌ తాలుకం నృప ।
ఏతేనాహం యతః పూర్వే వాఙ్నిష్పాదనహేతవః ॥30॥

నృపాలా! నాలుక "అహం" అని పలుకుతుంది. దంతాలు, ఓష్ఠములు, తాలువు, కంఠం మున్నగునవి కూడ అదే శబ్దాన్ని ఉచ్చరిస్తున్నాయి. కాని అవి ఏవీ అహం కాదు. అవన్నీ కేవలం శబ్దోచ్చారణ సాధనమాత్రాలు అయి ఉన్నాయి.

కిం హేతుభిర్వదత్యేషా వాగేవాహమితి స్వయమ్ ।
తథాఽపి వాఙ్నాహమేతదుక్తం మిథ్యా న యుజ్యతే ॥31॥

జిహ్వా 'అహం' అని పలుకుతూ "నేను అహం కాదు" అని అనదు. "నేను అహం" అని కూడ అనదు. మరి ఏ హేతువుచే అది అలా అంటోంది? అని అంటే అది మిథ్యా కూడా కాదు.

పిండః పృథగ్యతః పుంసః శిరః పాయ్వాదిలక్షణః ।
తతోఽహమితి కుత్రైతాం సంజ్ఞాం రాజన్కరోమ్యహమ్ ॥32॥

శిరస్సు, పాయువు మున్నగు అవయవాలరూపంలో ఉన్న శరీరం పురుషుని కన్న సర్వథా భిన్నం. ఓ రాజా! అందువల్ల ఏ అవయవాన్ని నిర్దేశించడానికి నేను "అహం" అనే శబ్దాన్ని ప్రయోగిస్తాను?

యదన్యోఽస్తి పరః కోఽపి మత్తః పార్థివసత్తమ ।
తదేషోఽహమయం చాన్యో వక్తుమేవమపీష్యతే ॥33॥

పార్థివోత్తమా! నాకన్న భిన్నమైన మరోతత్త్వం ఉన్నచో ఇది 'నేను', అది 'ఇతరం' (అన్యం) అని చెప్పడానికి వీలు ఉంటుంది.

పరమార్థభేదో న నగో న పశుర్న చ పాదపః ।
శరీరాచ్చ విభేదాచ్చ య ఏతే కర్మయోనయః ॥34॥

వాస్తవానికి పర్వతం, పశువు, వృక్షం అనే భేదం సత్యం కాదు. శరీరదృష్టిచే (రూపదృష్టిచే) కనబడే భేదాలన్నీ కర్మజన్యాలు. (కర్మవల్ల ఈ ప్రకృతిలో పదార్థాలు రూపాన్ని అనగా ఉపాధిని పొందుతాయి)

యస్తు రాజేతి యల్లోకే యచ్చ రాజభటాత్మకమ్ ।
తచ్చాన్యచ్చ నృపేత్థం తు న సత్సమ్యగనామయమ్ ॥35॥

లోకంలో 'ఇతడు రాజు. ఇతడు రాజభటుడు' మున్నగు రీతిగా చెప్పే భేదాలన్నీ రాజా! నిజంగా సత్యాలు కావు. ఇవన్నీ లోకవికారరూపాలు.

త్వం రాజా సర్వలోకస్య పితుః పుత్రో రిపో రిపుః ।
పత్న్యాః పతిః పితా సూనోః కస్త్వాం భూప వదామ్యహమ్ ॥36॥

భూపాలా! నీవు సకలలోకాలకు రాజువు. నీ తండ్రికి నీవు కుమారుడవు. నీ శత్రువుకు నీవు శత్రువు. నీ భార్యకు భర్తవు. నీ కుమారునకు నీవు తండ్రివి. ఇన్నిపేర్లు ఉన్న నిన్ను ఏ పేరుతో పిలవాలి?

త్వం కిమేతచ్ఛిరః కిం తు శిరస్తవ తథోదరమ్ ।
కిము పాదాదికం త్వం వై తవైతత్కిం మహీపతే ॥37॥

ఈ శిరస్సు నీవా? కాదు కదా! ఈ శిరస్సు నీది మాత్రమే. అలాగే ఈ ఉదరం కూడ నీదే. అందుచే ఉదరం నీవు అవుతావా? మహీపతీ! ఇప్పుడు నీవు ఏమి అవుతావు?

కోఽహమిత్యత్ర నిపుణం భూత్వా చింతయ పార్థివ ।
సమస్తావయవేభ్యస్త్వం పృథగ్భూతో వ్యవస్థితః ॥
తచ్ఛ్రుత్వోవాచ రాజా తమవధూతం ద్విజం హరిమ్ ॥38॥

ఈ పాదాద్యవయవాలలో ఏదైన ఒకటి నువ్వా? కాకపోతే ఇవన్నీ నీవు అవుతావా? మహారాజా! నీవు ఈ అవయవాల కన్న భిన్నుడవు. కావున వీటి నుండి వేరుబడి వాస్తవానికి నేను ఎవరినని చక్కగా ఆలోచించు అన్నాడు. ఆ మాటలు విని రాజు భగవత్స్వరూపుడు, అవధూత అయిన ఆ బ్రాహ్మణునితో ఇలా అన్నాడు.

రాజోవాచ :-రాజు ఇలా అన్నాడు.

శ్రేయోఽర్థముద్యతః ప్రష్టుం కపిలర్షిమహం ద్విజ ।
తస్యాంశః కపిలర్షేస్త్వం మత్కృతే జ్ఞానదో భువి ॥39॥

జ్ఞానవీచ్యుదధేర్యస్మాద్యచ్ఛ్రేయస్తచ్చ మే వద ॥40॥

బ్రాహ్మణోత్తమా! నేను శ్రేయస్సును కోరి కపిలమహర్షి వద్ద ఉపదేశం పొందడానికై వెళుతున్నాను. నీవు కూడా ఆ కపిలమహర్షియొక్క అంశమే. కాబట్టి నాకు ఈ భూమిపై జ్ఞానాన్ని ప్రసాదించు. జ్ఞానరూపమైన మనోహరమైన తరంగాలతో కూడుకొన్న సాగరాన్ని చేరడానికి శ్రేయస్సును కలిగించే ఉపాయాన్ని వివరించు – అని కోరాడు.

బ్రాహ్మణ ఉవాచ :– బ్రాహ్మణుడు ఇలా బదులు ఇచ్చాడు.

భూయః పృచ్ఛసి కిం శ్రేయః పరమార్థం న పృచ్ఛసి ।
శ్రేయాంసి పరమార్థాని అశేషాణ్యేవ భూపతే ॥41॥

భూపాలా! ఇంకా శ్రేయస్సు కావాలనే అడుగుతున్నావు. కాని పరమార్థతత్త్వం ఏమిటని మాత్రం అడగడం లేదు. నీవు అనుకొన్న సమస్త శ్రేయస్సులు పరమార్థాలే.

దేవతారాధనం కృత్వా ధనసంపత్తిమిచ్ఛతి ।
పుత్రానిచ్ఛతి రాజ్యం చ శ్రేయస్తస్యైవ కిం నృప ॥42॥

మానవుడు దేవతారాధన చేసి ధనసంపత్తిని, పుత్రులను, రాజ్యాన్ని పొందగోరుతున్నాడు. అదే అతనికి శ్రేయస్సు. నృపాలా! నీవే ఆలోచించు.

వివేకినస్తు సంయోగః శ్రేయో యః పరమాత్మనః ।
యజ్ఞాదికా క్రియా న స్యాన్నాస్తి ద్రవ్యోపపత్తితా ॥43॥

వివేకవంతునకు పరమాత్మయొక్క సంయోగప్రాప్తియే శ్రేయస్సు. యజ్ఞాది క్రియ కాని, ద్రవ్యసిద్ధి కాని ఆ వివేకికి శ్రేయస్సు కాదు.

పరమార్థాత్మనోర్యోగః పరమార్థ ఇతీష్యతే ।
ఏకో వ్యాపీ సమః శుద్ధో నిర్గుణః ప్రకృతేః పరః ॥44॥

పరమాత్మజీవాత్మల ఏకత్వమే యోగం. అదే 'పరమార్థం' అని చెప్పబడుతుంది. ఏకమైనది, అంతట వ్యాపించి ఉండేది, సమమైనది, శుద్ధమైనది, ఏ గుణాలు తాకనిది, ప్రకృతి కన్న అతీతమైనది.

జన్మవృద్ధ్యాదిరహిత ఆత్మా సర్వగతోఽవ్యయః ।
పరం జ్ఞానమయోఽసంగీ గుణజాత్యాదిభిర్విభుః ॥45॥

జన్మవృద్ధ్యాది రహితమైనది, సర్వగతమైనది, అవ్యయమైనది, అసంగమైనది, గుణజాత్యాదులతో సంబంధం లేకుండా ఉండేది, సర్వశక్తిమంతమైనది అయిన ఆత్మయొక్క జ్ఞానమే పరమార్థము అని వచించాడు.

నిదాఘఋతుసంవాదం వదామి ద్విజ తం శృణు ।
ఋతుర్బ్రహ్మసుతో జ్ఞానీ తచ్ఛిష్యోఽభూత్పులస్త్యజః ॥46॥

ద్విజా! నీకు ఇప్పుడు నిదాఘునకు, ఋభువునకు జరిగిన సంవాదాన్ని చెబుతాను. విను. ఋతువు అనేవాడు మహాజ్ఞాని. బ్రహ్మ యొక్క సుతుడు, పులస్త్యుని కుమారుడైన నిదాఘుడు అతనికి శిష్యుడు.

నిదాఘః ప్రాప్తవిద్యోఽస్మాన్నగరే వై పురే స్థితః ।
దేవికాయాస్తటే తం చ తర్కయామాస వై ఋతుః ॥47॥

నిదాఘుడు విద్యలన్నీ నేర్చిన తరువాత దేవికానదీ తీరంలోని ఒక నగరంలోని పురప్రదేశంలో నివసించసాగాడు. ఋతువు తన శిష్యుని నివాసస్థలం తెలుసుకొన్నాడు.

దివ్యే వర్షసహస్రేఽగాన్నిదాఘమవలోకితుమ్ ।
నిదాఘో వైశ్వదేవాన్తే భుక్త్వాన్నం శిష్యమబ్రవీత్ ।
భుక్త్యంతే తృప్తిరుత్పన్నా తుష్టిదా సాఽక్షయా యతః ॥48॥

వేయి దివ్యసంవత్సరాలు దాటిన పిదప ఋతువు నిదాఘుని చూడడానికై వెళ్లాడు. ఆ సమయంలో నిదాఘుడు వైశ్వదేవం పూర్తి చేసి తన శిష్యునితో ఇలా అన్నాడు. "భోజనానంతరం నాకు తృప్తి కలిగింది. అక్షయతృప్తిని ఇచ్చేది భోజనమే కదా!" అన్నాడు (ఆ సమయంలో అతిథిగా వచ్చి భుజించినవారిని ఇలాగే ప్రశ్నించాడు).

ఋతురువాచ :-ఋభువు ఇలా అన్నాడు.

క్షుదస్తి యస్య భుక్తేఽన్నే తుష్టిర్బ్రాహ్మణ జాయతే ।
న మే క్షుదభవత్తృప్తిం కస్మాత్త్వం పరిపృచ్ఛసి ॥49॥

"బ్రాహ్మణా! ఆకలితో ఉన్నవారికి భోజనం అయిన తరువాత తృప్తి అనేది కలుగుతుంది. నాకు ఎప్పుడూ ఆకలి అన్నదే కలగలేదు. నన్ను తృప్తిని గురించి ఎందుకు అడుగుతున్నావు?

క్షుత్తృష్ణే దేహధర్మాఖ్యే న మమైతే యతో ద్విజ ।
పృష్టోఽహం యత్త్వయా బ్రూయాం తృప్తిరస్త్యేవ మే సదా ॥50॥

ఆకలి, దప్పికలు దేహధర్మాలు. నాకు సంబంధించినవి కావు. ద్విజా! నీవు అడుగుతున్నావు కాబట్టి చెబుతున్నాను. నాకు సర్వదా తృప్తి అనేది ఉంది.

పుమాన్ సర్వగతో వ్యాపీ ఆకాశవదయం యతః ।
అతోఽహం ప్రత్యగాత్మాస్మీత్యేదర్థే భవేత్కథమ్ ॥51॥

(పురుషుడు) ఆత్మ ఆకాశం వలె సర్వవ్యాప్తమైనది. అందువల్ల నేనే ప్రత్యగాత్మ స్వరూపుడను అయి వున్నాను. ఈ విషయంలో నీ ప్రశ్నకు విషయం ఎక్కడ వుంది?

సోఽహం గంతా నచాగంతా నైకదేశనికేతనః ।
త్వం చాన్యో న భవేన్నాపి నాన్యస్త్వత్తోఽస్మి వాప్యహమ్ ॥52॥

అందువల్ల నీవు ఎక్కడ నుండి వస్తున్నావు? అన్న ప్రశ్నకు అవకాశం ఎక్కడ వుంది? నేను వెళ్లే వాడను కాను. వచ్చేవాడను కాను. ఒక ప్రదేశంలో ఉన్నవాడను కాను. నీవు నాకన్న భిన్నుడవు కావు. నేను నీకన్న భిన్నుడను కాను.

మృణ్మయం హి గృహం యద్వన్మృదా లిప్తం స్థిరీభవేత్ ।
పార్థివో ఽయం తథా దేహః పార్థివైః పరమాణుభిః ॥53॥

మట్టితో కట్టిన ఇల్లు మట్టి పూయడం వల్ల గట్టిపడుతున్నట్లుగా, పార్థివమైన ఈ దేహం కూడ పార్థివ పరమాణువులతోనే గట్టిపడుతూ ఉంటుంది.

ఋతురస్మి తవాచార్యః ప్రజ్ఞాదానాయ తే ద్విజ ।
ఇహాగతోఽహం యాస్యామి పరమార్థస్తవోదితః ॥54॥

ఓ బ్రాహ్మణోత్తమా! నేను నీ ఆచార్యుడనైన ఋతువును. నీకు జ్ఞానోపదేశం చేయడానికై ఇలా వచ్చాను. ఇంక వెళతాను. నీకు పరమార్థతత్త్వాన్ని ఉపదేశించాను.

ఏకమేవమిదం విద్ధి న భేదః సకలం జగత్ ।
వాసుదేవాభిధేయస్య స్వరూపం పరమాత్మనః ॥55॥

ఇదంతా ఈ ప్రపంచం సర్వం ఏకమని తెలుసుకో. దీనిని ఏకైక వాసుదేవనామక పరమాత్మస్వరూపంగా గ్రహించు. దీనిలో వాస్తవానికి ఏ భేదం లేదు అని వెళ్లిపోయాడు.

ఋతుర్వర్షసహస్రాన్తే పునస్తన్నగరం యయౌ ।
నిదాఘం నగరప్రాంతే ఏకాంతే స్థితమబ్రవీత్ ॥
ఏకాంతే స్థీయతే కస్మాన్నిదాఘం ఋతురబ్రవీత్ ॥56॥

పిదప వేయి సంవత్సరాల తరువాత మళ్లీ ఆ నగరానికి వెళ్లిన ఋతువు నగరప్రాంతంలో ఏకాంత ప్రదేశంలో వున్న నిదాఘుని చూచి 'ఇలా ఏకాంతప్రదేశంలో నిలబడి ఉన్నావెందులకు?' అని అడిగాడు. నిదాఘుడు ఋతువును చూచి ఇలా అన్నాడు.

నిదాఘ ఉవాచ :- నిదాఘుడు ఇలా అన్నాడు.

భో విప్ర జనసంవాదో మహానేష నరేశ్వరః ।
ప్రవివీక్ష పురం రమ్యం తేనాత్ర స్థీయతే మయా ॥57॥

"ఓ బ్రాహ్మణా! మార్గంలో జనసమ్మర్దం ఎక్కువగా వుంది. గొప్పవాడైన ఈ నరేశ్వరుడు సుందరమైన నగర సందర్శనార్థమై ప్రవేశిస్తున్నాడు. అందువల్ల నేనిక్కడ నిలిచి ఉన్నాను" అన్నాడు.

ఋతురువాచ - ఋతువు ఇలా అన్నాడు.

నరాధిపోఽత్ర కతమః కతమశ్చేతరో జనః ।
కథ్యతాం మే ద్విజశ్రేష్ఠ త్వమభిజ్ఞో ద్విజోత్తమ ॥58॥

"వీరిలో రాజు ఎవ్వడు? మిగిలిన సామాన్య జనులు ఎవ్వరు? ద్విజశ్రేష్ఠా! నీవు బాగా తెలిసి ఉన్నవాడవు. ద్విజోత్తమ! కాబట్టి నాకు తెలిసేలా చెప్పు" అని అన్నాడు.

నిదాఘ ఉవాచ – నిదాఘుడు ఇలా అన్నాడు.

యోఽయం గజేంద్రమున్మత్తమద్రిశృంగసముత్థితమ్ ।
అధిరూఢో నరేంద్రోఽయం పరివారస్తథేతరః ॥59॥

మదించిన గజేంద్రాన్ని పర్వతశిఖరసదృశమైన దానిని అధిష్ఠించి ఉన్న అతడే నరేంద్రుడు. అతని చుట్టూ ఉన్నవారు ఇతర పరివారం.

గజో యోఽయమధో బ్రహ్మన్నుపర్యేష స భూపతిః ।
ఋతురాహ గజః కోఽత్ర రాజా చాహ నిదాఘకః ॥60॥

'హే బ్రహ్మన్! క్రిందనున్నది గజం. దానిపైన ఉన్నవాడే మహీపతి' అన్నాడు. ఋభువు "వీరిలో గజం ఏది? రాజు ఎవడు?" అని అడిగాడు. అపుడు నిదాఘుడు ఇలా అన్నాడు.

ఋతుర్నిదాఘ ఆరూఢో దృష్టాన్తం పశ్య వాహనమ్ ।
ఉపర్యహం యథా రాజా త్వమధః కుంజరో యథా ॥61॥

నిదాఘుడు సరే చెబుతానంటూ ఋతువుపైకి ఎక్కి "ఈ దృష్టాంతం ద్వారా తెలుసుకొమ్మని, ఈ వాహనాన్ని చూడమని, పైనున్న నేను రాజు వంటివాడను, నాక్రింద నున్న నీవు ఏనుగు వంటి వాడవు" అని అన్నాడు.

ఋతుః ప్రాహ నిదాఘం తం కతమస్త్వామహం వదే ।
ఉక్తో నిదాఘస్తన్నత్వా ప్రాహ మే త్వం గురుర్ధ్రువమ్ ॥62॥

అంత ఋతువు ఆ నిదాఘుని ఉద్దేశించి "నేనెవ్వడిని? నీవు ఎవ్వడవు? అని అంటాను" అని అన్నాడు. ఈ విధంగా అనగానే నిదాఘుడు వెంటనే నమస్కరించి "నిజంగా నీవు నా గురువైన ఋతువువు" అని అన్నాడు.

నాన్యస్యాద్వైతసంస్కారసంస్కృతం మానసం తథా ।
ఋభుః ప్రాహ నిదాఘం తం బ్రహ్మజ్ఞానాయ చాఽగతః ॥63॥

పరమార్థం సారభూతమద్వైతం దర్శితం మయా ॥64॥

ఎందువల్లనంటే అందరూ ద్వైతబుద్ధి కలవారే. ఈ విధమైన అద్వైతసంస్కారసంస్కృతమైన మనస్సు కలవారు ఎవ్వరూ లేరు అన్నాడు. "అంత ఋతువు ఇలా పలికాడు" నీకు బ్రహ్మజ్ఞానం ఉపదేశించడానికై వచ్చాను. పరమార్థం, సారభూతం అయిన అద్వైతాన్ని ఈ విధంగా బోధించాను అన్నాడు.

బ్రాహ్మణ ఉవాచ – బ్రాహ్మణుడు (జడభరతుడు) ఇలా అన్నాడు.

నిదాఘోఽప్యుపదేశేన తేనాద్వైతపరోఽభవత్ ।
సర్వభూతాన్యభేదేన దదృశే స తదాఽత్మని ॥65॥

రాజా! ఈ ఉపదేశాన్ని స్వీకరించి నిదాఘుడు కూడ అద్వైతజ్ఞాని అయ్యాడు. సమస్తప్రాణులకు తన యందు తన కన్న భిన్నం కాని వానిగా చూశాడు.

అవాప ముక్తిం జ్ఞానాత్స తథా త్వం ముక్తిమాప్స్యసి ।
ఏకః సమస్తం త్వం చాహం విష్ణుః సర్వగతో యతః ॥66॥

ఆ జ్ఞానం వల్ల అతడు ముక్తిని పొందాడు. నీవు కూడా అలాగే ముక్తిని పొందుతావు. నీవు, నేను, ఈ సమస్తమైన జగత్తు అంతా ఏకమాత్రము, వ్యాపకము అయిన విష్ణుస్వరూపం.

పీతనీలాది భేదేన యథైకం దృశ్యతే నభః ।
భ్రాంతిదృష్టిభిరాత్మాஉపి తథైకః స పృథక్ పృథక్ ॥67॥

ఒకే ఆకాశం పీతనీలాది భేదాలతో వేరు వేరుగా కనబడునట్లు, భ్రాంతిదృష్టి గల వారికి ఒకే ఆత్మ వేర్వేరుగా కనబడుతుంది.

అగ్నిరువాచ – అగ్ని ఇలా అన్నాడు.

ముక్తిం హ్యవాప భవతో జ్ఞానసారేణ భూపతిః ।
సంసారాజ్ఞానవృక్షారి జ్ఞానం బ్రహ్మేతి చింతయ ॥68॥

ఆ రాజు ఈ జ్ఞానసారాన్ని పొంది సంసారం నుంచి ముక్తి పొందాడు. మునీశ్వరా! అజ్ఞానమయమైన సంసారవృక్షానికి బ్రహ్మజ్ఞానమే ఖడ్గమని నిరంతరం చింతనం చేయుము.

ఇత్యాది మహాపురాణే ఆగ్నేయే అద్వైతబ్రహ్మజ్ఞాననిరూపణం నామ అశీత్యధిక త్రిశతతమోஉధ్యాయః ॥380॥

అగ్నిమహాపురాణంలో అద్వైతబ్రహ్మవిజ్ఞాననిరూపణమనే మూడువందల ఎనబయ్యవ అధ్యాయం సమాప్తం.



ఏకాశీత్యధిక త్రిశతతమోఽధ్యాయః – మూడువందల ఎనబైఒకటవ అధ్యాయం

గీతాసారనిరూపణమ్ – గీతాసారనిరూపణం

అగ్నిరువాచ – అగ్ని ఇలా వచించాడు.

గీతాసారం ప్రవక్ష్యామి సర్వగీతోత్తమోత్తమమ్ ।
కృష్ణో యమర్జునాయాహ పురా వై భుక్తిముక్తిదామ్ ॥1॥

సర్వగీతాలలో ఉత్తమోత్తమమైన గీతాసారాన్ని ఇపుడు చెబుతాను. పూర్వం శ్రీకృష్ణుడు భుక్తి ముక్తి ప్రదమైన ఈ గీతను అర్జునునికి బోధించాడు.

శ్రీభగవానువాచ – భగవంతుడు ఇలా చెప్పాడు.

గతాసురగతాసుర్వా న శోచ్యో దేహవానజః ।
ఆత్మాఽజరోఽమరోఽభేద్యస్తస్మాచ్ఛోకాదికం త్యజేత్ ॥2॥

జీవుడు జన్మరహితుడు. కాబట్టి మరణించినవానిని గూర్చి గాని, జీవించి ఉన్నవానిని గూర్చి గాని శోకం చెందరాదు. ఆత్మకు జరామరణాలు లేవు. అది భేద్యం కానిది. అందువల్ల శోకాదికాన్ని విడిచివేయాలి.

ధ్యాయతో విషయాన్ పుంసః సంగస్తేషూపజాయతే ।
సంగాత్కామస్తతః క్రోధః క్రోధాత్సమ్మోహ ఏవ చ ॥3॥

విషయాలను గూర్చి ఆలోచించే వానికి వాటిపై సంగం (బంధం) ఏర్పడుతుంది. సంగం వల్ల కామం, దాని వల్ల క్రోధం, దానివల్ల సమ్మోహం ఏర్పడతాయి.

సమ్మోహాత్ స్మృతివిభ్రంశో బుద్ధినాశాత్ప్రణశ్యతి ।
దుఃసంగహానిః సత్సంగాన్మోక్షకామీ చ కామనుత్ ॥4॥

సమ్మోహం వల్ల స్మృతిభ్రంశం, దానివల్ల బుద్ధినాశం కలుగుతుంది. బుద్ధినాశం వల్ల మానవుడు నశిస్తాడు. సత్సంగం వల్ల దుస్సంగహాని కలుగుతుంది. మోక్షమందు కోరిక కలవాడు ఇతర కామా(కోరిక)లను తొలగించుకుంటాడు.

కామత్యాగాదాత్మనిష్ఠః స్థిరప్రజ్ఞస్తదోచ్యతే ।
యా నిశా సర్వభూతానాం తస్యాం జాగర్తి సంయమీ ॥5॥

కామాన్ని త్యజించినవాడు ఆత్మనిష్ఠుడవుతాడు. అప్పుడు ఆతడు స్థిరప్రజ్ఞుడని చెప్పబడతాడు. సర్వభూతాలకు ఏది రాత్రియో, ఆ రాత్రి యోగి మేలుకొని ఉంటాడు.

యస్యాం జాగ్రతి భూతాని సా నిశా పశ్యతో మునేః ।
ఆత్మన్యేవ చ సంతుష్టస్తస్య కార్యం న విద్యతే ॥6॥

చూస్తున్న మునికి ఏది రాత్రియో, ఆ రాత్రితో ఇతర భూతాలు మేలుకొని ఉంటాయి. ఆత్మసంతుష్టుడైన వానికి మరి కర్తవ్యాలు ఇంకేమీ ఉండవు.

నైవ తస్య కృతేనార్థో నాకృతేనేహ కశ్చన ।
తత్త్వవిత్తు మహాబాహో గుణకర్మవిభాగయోః ॥7॥

కర్మ చేసినా, కర్మచేయకున్నా అతనికి ప్రయోజనం ఏమీ లేదు. ఓ మహాబాహూ! తత్త్వవిదుడైనవాడు గుణకర్మల జ్ఞానం తెలుసుకొని ఉంటాడు.

గుణాగుణేషు వర్తన్తే ఇతి మత్వా న సజ్జతే ।
సర్వం జ్ఞానప్లవేనైవ వృజినం సంతరిష్యతి ॥8॥

గుణాలు గుణాలయందు ప్రవర్తిస్తున్నాయని తెలుసుకొని, వాటిపై సక్తుడు మాత్రం కాడు. జ్ఞాని పాపాన్ని అంతటిని 'జ్ఞానం' అనే నావతో దాటగలడు.

జ్ఞానాగ్నిః సర్వకర్మాణి భస్మసాత్ కురుతేఽర్జున ।
బ్రహ్మణ్యాధాయ కర్మాణి సంగం త్యక్త్వా కరోతి యః ॥9॥

లిప్యతే న స పాపేన పద్మపత్రమివాంభసా ।
సర్వభూతేషు చాత్మానం సర్వభూతాని చాత్మని ॥10॥

అర్జునా! జ్ఞానాగ్ని సర్వకర్మలను భస్మం చేస్తుంది. సంగం (ఆసక్తి) విడిచి బ్రహ్మార్పణబుద్ధితో కర్మలు చేసే, వాడు తామరాకును నీరు అంటనట్లుగా, చేసే కర్మ శాస్త్రవిధికి దూరమై పాపం వచ్చినా దాని చేత లిప్తుడు కాడు. సర్వభూతాల యందు తనను, తనలో సర్వభూతాలను చూడగల్గుతాడు.

ఈక్షతే యోగయుక్తాత్మా సర్వత్ర సమదర్శనః ।
శుచీనాం శ్రీమతాం గేహే యోగభ్రష్టోఽభిజాయతే ॥11॥

యోగయుక్తాత్ముడైన యోగి అంతటినీ సమానంగా దర్శిస్తూ ఉంటాడు. యోగం పరిపూర్ణతను సాధించకుండా మరణించిన యోగభ్రష్టుడు పవిత్రులైన శ్రీమంతుల గృహాలలో జన్మిస్తాడు.

న హి కల్యాణకృత్ కశ్చిద్దుర్గతిం తాత గచ్ఛతి ।
దైవీ హ్యేషా గుణమయీ మమ మాయా దురత్యయా ॥12॥

శుభదాయకమైన కర్మ ఆచరించేవాడు ఎన్నడూ నాయనా! అర్జునా! దుర్గతిని పొందడు. గుణమయమైన, దివ్యమైన నా మాయ ఎవ్వరికి దాటశక్యం కాదు.

మామేవ యే ప్రపద్యంతే మాయామేతాం తరంతి తే ।
ఆర్తో జిజ్ఞాసురర్థార్థీ జ్ఞానీ చ భరతర్షభ ॥13॥

చతుర్విధా భజన్తే మాం జ్ఞానీ చైకత్వమాస్థితః ।
అక్షరం బ్రహ్మ పరమం స్వభావోఽధ్యాత్మముచ్యతే ॥14॥

నన్ను ఆశ్రయించిన వారు మాత్రమే ఈ మాయను దాటగలరు. ఓ భరతవంశోత్తమా! ఆర్తుడు (కష్టాలలో ఉన్నవాడు), జిజ్ఞాసువు (జ్ఞానేచ్ఛకలవాడు), అర్థార్థి (ప్రయోజనాపేక్ష కలవాడు), జ్ఞాని (అద్వైతదృష్టి కలవాడు) ఈ నాలుగువిధాలైన వారు నన్ను సేవిస్తారు. అక్షరమైన బ్రహ్మ అత్యుత్తమమైనది. తన యొక్క భావమే అధ్యాత్మమని చెప్పబడుతుంది. (అవినాశియైన తత్త్వం సచ్చిదానందమయమైన పరమాత్మ. స్వభావం అనగా జీవాత్మస్వరూపం అధ్యాత్మం అనబడుతుంది.)

భూతభావోద్భవకరో విసర్గః కర్మసంజ్ఞితః ।
అధిభూతం క్షరో భావః పురుషశ్చాధిదైవతమ్ ॥15॥

భూతాల ఉత్పత్తి, వృద్ధి కారకం విసర్గ అనబడుతుంది. యజ్ఞదాన క్రియాదికర్మ తెలిసి ద్రవ్యాదులను త్యాగం చేయడం కర్మ. వినాశశీలపదార్థము అధిభూతము. హిరణ్యగర్భపురుషుడు అధిదైవతము.

అధియజ్ఞోఽహమేవాత్ర దేహే దేహభృతాం వర ।
అంతకాలే స్మరన్మాం చ మద్భావం యాత్యసంశయః ॥16॥

దేహధారులలో శ్రేష్ఠుడవైన అర్జునా! ఈ దేహంతో ఉండే నేనే అధియజ్ఞమును. మరణకాలంలో నన్ను స్మరించేవాడు నన్నే పొందుతాడు. సంశయం లేదు.

యం యం భావం స్మరన్నన్తే త్యజేద్దేహం తమాప్నుయాత్ ।
ప్రాణం న్యస్య భ్రువోర్మధ్యే అంతే ప్రాప్నోతి మత్పరమ్ ॥17॥

అంత్యకాలంలో ఏఏ భావాన్ని స్మరిస్తూ దేహాన్ని విడుస్తాడో, దానినే పొందుతాడు. అంతంలో ప్రాణాన్ని భ్రూమధ్యంలో ఉంచి పరమాత్మనగు నన్నే పొందుతాడు.

ఓమిత్యేకాక్షరం బ్రహ్మ వదన్ దేహం త్యజన్తథా ।
బ్రహ్మాదిస్తంబపర్యన్తాః సర్వా మమ విభూతయః ॥18॥

"ఓం" అనే ఏకాక్షరరూపమైన బ్రహ్మను ఉచ్చరిస్తూ, దేహం త్యజించేవాడు నన్నే పొందుతాడు. బ్రహ్మ మొదలు స్తంబం (తృణం) వరకు ఉన్నవన్నీ నా విభూతులే.

శ్రీమంతశ్చోర్జితాః సర్వే మమాంశాః ప్రాణినః స్మృతాః ।
అహమేకో విశ్వరూప ఇతి జ్ఞాత్వా విముచ్యతే ॥19॥

శ్రీమంతములు తేజోవంతములు అగు ప్రాణులన్నియు నా అంశములే. నేనే విశ్వరూపుడను. ఈ విధంగా తెలుసుకొన్నవాడు ముక్తుడవుతాడు.

క్షేత్రం శరీరం యో వేత్తి క్షేత్రజ్ఞః స ప్రకీర్తితః ।
క్షేత్రక్షేత్రజ్ఞయోర్జ్ఞానం యత్తద్జ్ఞానం మతం మమ ॥20॥

క్షేత్రమనే పేరుగల ఈ శరీరమును తెలుసుకొన్నవాడు క్షేత్రజ్ఞుడు. క్షేత్ర, క్షేత్రజ్ఞుల జ్ఞానం ఏదయితే ఉందో అది నా జ్ఞానమే అవుతుంది.

మహాభూతాన్యహంకారో బుద్ధిరవ్యక్తమేవ చ ।
ఇంద్రియాణి దశైకం చ పంచ చేంద్రియగోచరాః ॥21॥

ఇచ్ఛా ద్వేషః సుఖం దుఃఖం సంఘాతశ్చేతనా ధృతిః ।
ఏతత్ క్షేత్రం సమాసేన సవికారముదాహృతమ్ ॥22॥

మహాభూతాలు, అహంకారం, బుద్ధి, అవ్యక్తం, ఏకాదశేంద్రియాలు, ఐదు (పంచ) ఇంద్రియవిషయాలు – ఇచ్ఛ, ద్వేషం, సుఖం, దుఃఖం, స్థూలశరీరం, చేతన, ధృతి – అనేవి సంక్షిప్తంగా వికారసహితమైన క్షేత్రంగా వ్యవహరించబడతాయి.

అమానిత్వమదంభిత్వమహింసా క్షాన్తిరార్జవమ్ ।
ఆచార్యోపాసనం శౌచం స్థైర్యమాత్మవినిగ్రహః ॥23॥

ఇంద్రియార్థేషు వైరాగ్యమనహంకార ఏవ చ ।
జన్మమృత్యుజరావ్యాధిదుఃఖదోషానుదర్శనమ్ ॥24॥

అసక్తిరనభిష్వంగః పుత్రదారగృహాదిషు ।
నిత్యం చ సమచిత్తత్వమిష్టానిష్టోపపత్తిషు ॥25॥

మయి చానన్యయోగేన భక్తిరవ్యభిచారిణీ ।
వివిక్తదేశసేవిత్వమరతిర్జనసంసది ॥26॥

అధ్యాత్మజ్ఞాననిష్ఠత్వం తత్త్వజ్ఞానానుదర్శనమ్ ।
ఏతజ్జ్ఞానమితిప్రోక్తమజ్ఞానం యదతోఽన్యథా ॥27॥

అభిమానం లేకపోవడం, దంభం లేకపోవడం, అహింస, ఓర్పు, ఆర్జవం (ఋజుప్రవర్తనం), ఆచార్యోపాసనం, శౌచం, స్థైర్యం, ఆత్మనిగ్రహం, ఇంద్రియార్థములందు వైరాగ్యం, అహంకారం లేకపోవడం, జన్మ, మృత్యు, జరా, వ్యాధి, దుఃఖరూపాలైన దోషాల పరిశీలనం, అనాసక్తి, పుత్రదారగృహాదులలో ఏ మాత్రం సంగం లేకపోవడం, ఇష్టం అనిష్టం కలిగినపుడు నిత్యం సమచిత్తంకలిగి ఉండడం, ఇతర సంబంధం లేక నా యందు చలించని భక్తి కలిగి ఉండడం, నిర్జనప్రదేశాన్ని సేవించడం, జనసమూహంలో ఉండడానికి అనాసక్తి చూపడం, అధ్యాత్మజ్ఞానం పట్ల స్థిరత్వం, తత్త్వజ్ఞానాన్ని నిరంతరం దర్శించడం, ఇదంతా జ్ఞానమని చెప్పబడుతుంది. దీనికి విరుద్ధమైనది అజ్ఞానం అనబడుతుంది.

జ్ఞేయం యత్తత్ప్రవక్ష్యామి యం జ్ఞాత్వాఽమృతమశ్నుతే ।
అనాది పరమం బ్రహ్మ సత్త్వం నామ తదుచ్యతే ॥28॥

దేనిని తెలుసుకోవడం వల్ల మానవుడు అమృతత్వాన్ని పొందుతాడో దానిని చెబుతాను. పరబ్రహ్మం అనాది అని చెప్పబడుతుంది. అది శుద్ధసత్త్వస్వరూపం.

సర్వతః పాణిపాదాన్తం సర్వతోఽక్షిశిరోముఖమ్ ।
సర్వతః శ్రుతిమల్లోకే సర్వమావృత్య తిష్ఠతి ॥29॥

అది అంతటను పాణిపాదాలు కలది. అన్నివైపుల నేత్రాలు, శిరస్సు, ముఖాలు కలది. అన్ని వైపుల కర్ణాలు కలది. అది సర్వాన్ని ఆవరించి వుంటుంది.

సర్వేంద్రియగుణాభాసం సర్వేంద్రియవివర్జితమ్ ।
అసక్తం సర్వభృచ్చైవ నిర్గుణం గుణభోక్తృ చ ॥30॥

అది సకలేంద్రియాలను, సమస్త గుణాలను భాసింపజేస్తుంది. అది సకలేంద్రియ శూన్యమైనది. సంగరహితమైనది. సర్వమును భరించేది. నిర్గుణాలను, గుణాలను అనుభవించేది.

బహిరన్తశ్చ భూతానామచరం చరమేవ చ ।
సూక్ష్మత్వాత్తదవిజ్ఞేయం దూరస్థం చాన్తికేఽపి తత్ ॥31॥

అది భూతాల బయట, లోపల ఉండేది. అది అచరం, చరం కూడ అయి వుంటుంది. సూక్ష్మం కావడం వల్ల అది అవిజ్ఞేయం. అది దూరమునందు ఉన్నది. సమీపమునందు ఉన్నది.

అవిభక్తంచ భూతేషు విభక్తమివ చ స్థితమ్ ।
భూతభర్తృ చ విజ్ఞేయం గ్రసిష్ణు ప్రభవిష్ణు చ ॥32॥

అది అవిభక్తమయినా, భూతాలలో విభక్తం వలె ఉండేది. భూతాలను భరించేది. వాటిని మ్రింగివేసేది. వాటిని తిరిగి పుట్టించేది - అని గ్రహించాలి.

జ్యోతిషామపి తజ్జ్యోతిస్తమసః పరముచ్యతే ।
జ్ఞానం జ్ఞేయం జ్ఞానగమ్యం హృది సర్వస్య సంస్థితమ్ ॥33॥

అది జ్యోతిస్సులకు జ్యోతిస్సు, తమస్సుకన్న అతీతమైనది, అది జ్ఞానస్వరూపం. తెలిసికోవడానికి అదే యోగ్యమైనది. అదే జ్ఞానానికి పరమగమ్యమైనది. తత్త్వజ్ఞానుల హృదయంలో స్థిరంగా ఉటుంది.

ధ్యానేనాత్మని పశ్యన్తి కేచిదాత్మానమాత్మనా ।
అన్యే సాంఖ్యేన యోగేన కర్మయోగేన చాపరే ॥34॥

కొందరు ఈ ఆత్మను ధ్యానం ద్వారా తమ అంతఃకరణంలోనే వీక్షిస్తారు. కొందరు సాంఖ్యయోగం చేత, మరికొందరు కర్మయోగం చేత దర్శిస్తారు.

అన్యే త్వేవమజానంతః శ్రుత్వాఽన్యేభ్య ఉపాసతే ।
తేఽపి చాశు తరంత్యేవ మృత్యుం శ్రుతిపరాయణాః ॥35॥

ఈ విధంగా తెలియజాలనివారు ఇతరుల నుంచి దానిని గురించి శ్రవణం చేసి ఉపాసిస్తారు. శ్రుతి పరాయణులైనవారు కూడా మృత్యువును తప్పక తరిస్తారు.

సత్త్వాత్సంజాయతే జ్ఞానం రజసో లోభ ఏవ చ ।
ప్రమాదమోహౌ తమసో భవతోఽజ్ఞానమేవ చ ॥36॥

సత్త్వం వల్ల జ్ఞానం ఉద్భవిస్తుంది. రజస్సు వల్ల లోభం జనిస్తుంది. తమస్సు వల్ల ప్రమాదము, మోహము, అజ్ఞానం కలుగుతాయి.

గుణా వర్తన్త ఇత్యేవ యోఽవతిష్ఠతి నేంగతే ।
మానావమానమిత్రారితుల్యస్త్యాగీ స నిర్గుణః ॥37॥

గుణాలు వాటి వాటి పనులను చేస్తున్నాయని తెలుసుకొని జ్ఞాని అయినవాడు చలించకుండా ఉంటాడు. మానావమానాలయందు, మిత్రశత్రువుల యందు సమానంగా ఉండే ఆ త్యాగి గుణాలకు అతీతుడు.

ఊర్ధ్వమూలమధః శాఖమశ్వత్థం ప్రాహురవ్యయమ్ ।
ఛందాంసి యస్య పర్ణాని యస్తం వేద స వేదవిత్ ॥38॥

ఈ అశ్వత్థము ఊర్ధ్వమూలము, అధశ్శాఖము, వినాశరహితము అని చెబుతారు. దీనికి పర్ణాలు ఛందస్సులు అని ఎవ్వడు తెలుసుకొంటాడో అతడే వేదవేత్త.

ద్వౌ భూతసర్గౌ లోకేఽస్మిన్దైవ ఆసుర ఏవ చ ।
అహింసాదిః క్షమా చైవ దైవీ సంపత్తతో నృణామ్ ॥39॥

ఈ లోకంలో 'దైవము, ఆసురము' అని రెండు భూతసర్గాలు ఉన్నాయి. దైవీ సంపత్తు వల్ల మానవులకు అహింసాదులు, క్షమ ఏర్పడతాయి.

న శౌచం నాపి చాచారో హ్యాసురీ సంపదోద్భవః ।
నరకత్వాత్క్రోధలోభకామాస్తస్మాత్త్రయం త్యజేత్ ॥40॥

ఆసురీసంపద వల్ల శౌచం గాని, ఆచారం గాని ఉండవు. క్రోధము, లోభము, కామములే నరకాలు. అందుచే ఆ త్రయాన్ని త్యజించాలి.

యజ్ఞస్తపస్తథా దానం సత్త్వాద్యైస్త్రివిధం స్మృతమ్ ।
ఆయుః సత్త్వం బలారోగ్యసుఖాయాన్నం తు సాత్త్వికమ్ ॥41॥

సత్త్వాదిగుణాలనుబట్టి యజ్ఞం, తపస్సు, దానం మూడు విధాలుగా ఉంటాయి. ఆయువునిచ్చేది, సత్త్వాన్ని కలిగించేది, బలం, సుఖం, ఆరోగ్యం ఇచ్చే అన్నం సాత్త్వికం అవుతుంది.

దుఃఖశోకామయాయాన్నం తీక్ష్ణరూక్షం తు రాజసమ్ ।
అమేధ్యోచ్ఛిష్టపూత్యన్నం తామసం నీరసాదికమ్ ॥42॥

దుఃఖము, శోకము, ఆమయము (రోగం) కల్గించే తీక్ష్ణమైన రూక్షాన్నం రాజసాన్నం అవుతుంది. అమేధ్యము, ఉచ్ఛిష్టము, పూతి, నీరసం కలిగి యున్న అన్నం తామసం.

యష్టవ్యో విధినా యజ్ఞో నిష్కామాయ స సాత్త్వికః ।
యజ్ఞః ఫలాయ దంభాయ రాజసస్తామసః క్రతుః ॥43॥

నిష్కామంగా, విధిపూర్వకంగా చేసే యజ్ఞం సాత్త్వికమవుతుంది. ఫలాపేక్షతో (దంభంగా) చేసే యజ్ఞం రాజసమవుతుంది. కేవలం దంభంగా చేసే యజ్ఞం తామసమవుతుంది.

శ్రద్ధామంత్రాది విధ్యుక్తం తపః శారీరముచ్యతే ।
దేవాదిపూజాऽహింసాది వాఙ్మయం తప ఉచ్యతే ॥44॥

శ్రద్ధతోను, మంత్రంతోను, శాస్త్రాదులలో చెప్పిన రీతిగా చేసేది శారీర తపస్సు అవుతుంది. దేవాది పూజాదికము, అహింసాదికము అయినది వాఙ్మయ తపస్సు.

అనుద్వేగకరం వాక్యం సత్యం స్వాధ్యాయసజ్జపః ।
మానసం చిత్తసంశుద్ధిర్మౌనమాత్మవినిగ్రహః ॥45॥

ఇతరులకు ఉద్వేగం కలిగించని వాక్యం సత్యమవుతుంది. స్వాధ్యాయమే జపము. ఇది కూడా వాఙ్మయ తపస్సే. చిత్తసంశుద్ధికోసమై మౌనాన్ని అవలంబించడం మానసిక తపస్సు. దీనికే ఆత్మవినిగ్రహమని పేరు.

సాత్త్వికం చ తపోऽకామం ఫలాద్యర్థం తు రాజసమ్ ।
తామసం పరపీడాయై సాత్త్వికం దానముచ్యతే ॥46॥

దేశాదౌ చైవ దాతవ్య ముపకారాయ రాజసమ్ ।
అదేశాదావవజ్ఞాతం తామసం దానమీరితమ్ ॥47॥

ఫలితం కోరకుండా చేసే తపస్సు సాత్త్వికం అవుతుంది. ఫలాపేక్షతో చేసే తపస్సు రాజసం. పరపీడకై చేసే తపస్సు తామసం. సాత్త్వికదానమంటే యుక్తదేశాదులందు చేసేది. ప్రయోజనాన్ని ఉద్దేశించి ఉపకారం కోసమై చేసేది రాజస దానం. దేశకాలాదులు లేకుండా అయుక్తంగా చేసేది, అనాదరపూర్వకంగా చేసే దానం తామసం.

ఓం తత్సదితినిర్దేశో బ్రహ్మణస్త్రివిధః స్మృతః ।
యజ్ఞదానాదికం కర్మ భుక్తిముక్తిప్రదం నృణామ్ ॥48॥

బ్రహ్మ యొక్క నిర్దేశం ఓం, తత్, సత్ అని త్రివిధంగా ఉంటుంది. మానవులకు యజ్ఞదానాదికర్మలు భుక్తి ముక్తి ప్రదాలవుతాయి.

అనిష్టమిష్టం మిశ్రం చ త్రివిధం కర్మణః ఫలమ్ ।
భవత్యత్యాగినాం ప్రేత్య న తు సంన్యాసినాం క్వచిత్ ॥49॥

అనిష్టము, ఇష్టము, మిశ్రము అని కర్మఫలం మూడు విధాలుగా ఉంటుంది. ఇది త్యాగబుద్ధి లేనివారికి మరణానంతరం కలుగుతుంది. సంన్యాసులైనవారికి కర్మఫలం ఎన్నటికి కలుగదు.

తామసః కర్మసంయోగాన్మోహాత్ క్లేశభయాదికాత్ ।
రాజసః సాత్త్వికోఽకామాత్ పంచైతే కర్మహేతవః ॥50॥

కర్మసంయోగం, మోహం, క్లేశం, భయం మున్నగువానివల్ల చేసే కర్మ తామసం. కామం లేకుండా చేసేది సాత్త్వికకర్మ. దానికన్న భిన్నమైనది రాజసం, కర్మహేతువులు ఐదు.

అధిష్ఠానం తథా కర్తా కరణం చ పృథగ్విధమ్ ।
త్రివిధాశ్చ పృథక్చేష్టా దైవం చైవాత్ర పంచమమ్ ॥51॥

అధిష్ఠానము, కర్త, భిన్న భిన్నములైన కరణాలు, నానావిధములైన చేష్టలు, దైవం (ఇదే ఐదో ప్రధానమైనది). ఈ ఐదూ కర్మహేతువులు.

ఏకం జ్ఞానం సాత్త్వికం స్యాత్ పృథక్ జ్ఞానం తు రాజసమ్ ।
అతత్త్వార్థం తామసం స్యాత్ కర్మాకామాయ సాత్త్వికమ్ ॥52॥

ఏకత్వజ్ఞానం సాత్త్వికం. భేదజ్ఞానం రాజసం. తాత్త్వికజ్ఞానం లేనిది తామసం. కామరహితమైన, ఫలాపేక్ష లేని కర్మ సాత్త్వికం.

కామాయ రాజసం కర్మ మోహాత్ కర్మ తు తామసమ్ ।
సిద్ధ్యసిద్ధ్యోః సమః కర్తా సాత్త్వికో రాజసో హ్యపి ॥53॥

ఫలాపేక్ష కలిగిన కర్మ రాజసం. మోహకృతమైన కర్మ తామసం. సిద్ధి కలిగినప్పుడు సిద్ధి కలగనప్పుడు సమంగా ఉండే కర్త సాత్త్వికుడు. దానికి భిన్నంగా ఉండేవాడు రాజసుడు.

శఠోఽలసస్తామసః స్యాత్కార్యాదిధీశ్చ సాత్త్వికీ ।
కార్యార్థం సా రాజసీ స్యాద్విపరీతా తు తామసీ ॥54॥

శఠుడైనవాడు, అలసుడైనవాడు తామసుడు అనబడతాడు. కార్యాదులయందు నిశ్చితమైన బుద్ధి సాత్త్వికము. కార్యార్థం ఉపయోగించే బుద్ధి రాజసం. దానికన్న విపరీతమైనది తామసం.

మనోధృతిః సాత్త్వికీ స్యాత్ ప్రీతికామేతి రాజసీ ।
తామసీ తు ప్రశోకాదౌ సుఖం సత్త్వాత్తదన్తగమ్ ॥55॥

మనోధైర్యం (స్థైర్యం) సాత్త్వికం. ప్రీతికామమైనది రాజసం. దుఃఖాదికం తామసం. ప్రారంభంలో దుఃఖంగా ఉన్నా, చివర సుఖం కలిగించేది సాత్త్వికం.

సుఖం తద్రాజసం చాగ్రే అంతే దుఃఖం తు తామసమ్ ।
అతః ప్రవృత్తిర్భూతానాం యేన సర్వమిదం తతమ్ ॥56॥

ప్రారంభంలో సుఖం, అంతంలో దుఃఖం అయ్యేది రాజసం. ప్రారంభంలోను, అంతంలోను దుఃఖహేతువయినది తామసం. ఏ విష్ణువు ఈ ప్రపంచం అంతా వ్యాపించి ఉన్నాడో, అతడే ఈ భూతాల ప్రవృత్తికి హేతువు.

స్వకర్మణా తమభ్యర్చ్య విష్ణుం సిద్ధిం చ విందతి ।
కర్మణా మనసా వాచా సర్వావస్థాసు సర్వదా ॥57॥
బ్రహ్మాదిస్తంబపర్యంతం జగద్విష్ణుం చ వేత్తి యః ।
సిద్ధిమాప్నోతి భగవద్భక్తో భాగవతో ధ్రువమ్ ॥58॥

అటువంటి విష్ణువును స్వకర్మచే అర్చించి సిద్ధిని పొందుతాడు. సర్వావస్థలయందు, సర్వకాలములందు మనస్సు చేత, కర్మచేత, వాక్కుచేత బ్రహ్మ మొదలు స్తంబం (తృణం) వరకు ఉండే ఈ జగత్తు విష్ణు స్వరూపమని భావన చేస్తూ ఉండే భగవద్భక్తుడైన భాగవతుడు తప్పక సిద్ధిని పొందుతాడు.

ఇత్యాది మహాపురాణే ఆగ్నేయే గీతాసారనిరూపణం నామ ఏకాశీత్యధిక త్రిశతతమోఽధ్యాయః ॥381॥

అగ్నిమహాపురాణంలో గీతాసారనిరూపణమనే మూడువందల ఎనభైఒకటవ అధ్యాయం సమాప్తం.



ద్వ్యశీత్యధిక త్రిశతతమోऽధ్యాయః - మూడువందల ఎనభైరెండవ అధ్యాయం

యమగీతా - యమగీత

అగ్నిరువాచ - అగ్ని ఇలా అన్నాడు.

> **యమగీతాం ప్రవక్ష్యామి ఉక్తా యా నాచికేతసే ।**
> **పఠతాం శృణ్వతాం భుక్త్యై ముక్త్యై మోక్షార్థినాం సతామ్ ॥1॥**

యముడు నచికేతసునికి చెప్పిన యమగీతను చెబుతాను. ఇది మోక్షార్థులై పఠించే వారికి, వినేవారికి, సత్పురుషులకు భుక్తిని, ముక్తిని కూడా ప్రసాదిస్తుంది.

యమ ఉవాచ - యముడు ఇలా అన్నాడు.

> **ఆసనం శయనం యానం పరిధానగృహాదికమ్ ।**
> **వాంఛత్యహోऽతిమోహేన సుస్థిరం స్వయమస్థిరః ॥2॥**

మానవుడు తాను సుస్థిరుడైనా, అస్థిరుడైనా అతిమోహావిష్టుడై ఆసనం, శయనం, యానం, వస్త్రం, గృహం మున్నగువాటిని స్థిరంగా ఉండాలని కోరుకొంటాడు.

> **భోగేష్వసక్తిః సతతం తథైవాత్మావలోకనమ్ ।**
> **శ్రేయః పరం మనుష్యాణాం కపిలోద్గీతమేవ హి ॥3॥**

భోగాల యందు ఆసక్తిలేకపోవడం, సర్వదా ఆత్మావలోకనం చేయడం అనేది మనుష్యులకు పరమశ్రేయస్సు అని కపిలుడు చెప్పినాడు.

> **సర్వత్ర సమదర్శిత్వం నిర్మమత్వమసంగతా ।**
> **శ్రేయః పరం మనుష్యాణాం గీతం పంచశిఖేన హి ॥4॥**

అంతటినీ సమంగా దర్శించడం, మమకారం లేకపోవడం, దేనియందు సంగం లేకుండా ఉండడం మనుష్యులకు పరమశ్రేయస్సు అని పంచశిఖుడు చెప్పాడు.

> **ఆగర్భజన్మబాల్యాది వయోऽవస్థాదివేదనమ్ ।**
> **శ్రేయః పరం మనుష్యాణాం గంగావిష్ణుప్రగీతకమ్ ॥5॥**

గర్భవాసం మొదలు బాల్యాది వయస్సులకు సంబంధించిన అవస్థలను తెలుసుకోవడం మనుష్యులకు పరమశ్రేయస్సు అని గంగావిష్ణువులు గానం చేశారు.

> **ఆధ్యాత్మికాదిదుఃఖానామాద్యన్తాదిప్రతిక్రియా ।**
> **శ్రేయః పరం మనుష్యాణాం జనకోద్గీతమేవ చ ॥6॥**

ఆధ్యాత్మికం మున్నగు దుఃఖాలకు ఆద్యం, అంతం తెలుసుకొని తగిన ప్రతిక్రియ చేయడం మానవులకు పరమశ్రేయస్సు అని జనకుడు ప్రబోధించాడు.

అభిన్నయోర్భేదకరః ప్రత్యయో యః పరాత్మనః ।
తచ్ఛాంతిః పరమం శ్రేయో బ్రహ్మోద్గీతముదాహృతమ్ ॥7॥

భేదంలేని తత్త్వమునందు భేదాన్ని చూస్తూ ఉన్నా ఆ భావాన్ని శమింపజేయడం మనుష్యులకు ఉత్తమ శ్రేయస్సు అని బ్రహ్మ ఉపదేశించాడు.

కర్తవ్యమితి యత్కర్మ ఋగ్యజుః సామసంజ్ఞితమ్ ।
కురుతే శ్రేయసేఽసంగాజ్జైగీషవ్యేణ గీయతే ॥8॥

ఋగ్యజుస్సామ విహితమైన కర్మను కర్తవ్యబుద్ధితో సంగం లేకుండా చేస్తే శ్రేయస్కరమని జైగీషవ్యుడు బోధించాడు.

హానిః సర్వవిధిత్సానామాత్మనః సుఖహేతుకీ ।
శ్రేయః పరం మనుష్యాణాం దేవలోద్గీతమీరితమ్ ॥9॥

సర్వకార్యారంభాలను (కర్మారంభాలపై ఆకాంక్ష) పరిత్యజించడమే తనకు సుఖసాధనమని, అదియే మనుష్యులకు పరమశ్రేయస్సు అని దేవలుడు బోధించాడు.

కామత్యాగాత్తువిజ్ఞానం సుఖం బ్రహ్మ పరం పదమ్ ।
కామినాం నహి విజ్ఞానం సనకోద్గీతమేవ తత్ ॥10॥

కామాలను త్యజిస్తే విజ్ఞానం, సుఖం, పరమపదప్రాప్తి కలుతాయని, కామవంతులైన వారికి ఎన్నటికి విజ్ఞానం కలుగదని సనకుడు బోధించాడు.

ప్రవృత్తిం చ నివృత్తిం చ కార్యం కర్మపరోఽబ్రవీత్ ।
శ్రేయసాం శ్రేయ ఏతద్ధి నైష్కర్మ్యం బ్రహ్మ తద్ధరిః ॥11॥

కర్మపరుడైన వాడు ప్రవృత్తిరూపమైన కర్మను, నివృత్తిరూపమైన కర్మను చేయాలి. కాని నైష్కర్మ్యమే శ్రేయస్సులలో పరమశ్రేయోదాయకం. అదియే హరిస్వరూపం. అదే బ్రహ్మము.

పుమాంశ్చాధిగతజ్ఞానో భేదం నాప్నోతి సత్తమః ।
బ్రహ్మణా విష్ణుసంజ్ఞేన పరమేణావ్యయేన చ ॥12॥

జ్ఞానాన్ని పొందిన పురుషుడే జ్ఞాని. అతడే పరమము. ఆ సత్పదార్థజ్ఞానాన్ని గ్రహించినవాడు అవ్యయము, విష్ణుసంజ్ఞకము అయిన బ్రహ్మతో ఎన్నడును భేదాన్ని పొందడు.

జ్ఞానం విజ్ఞానమాస్తిక్యం సౌభాగ్యం రూపముత్తమమ్ ।
తపసా లభ్యతే సర్వం మనసా యద్యదిచ్ఛతి ॥13॥

తపస్సువల్ల జ్ఞానం, విజ్ఞానం, ఆస్తిక్యం, సౌభాగ్యం, ఉత్తమమైన రూపం లభిస్తాయి. తపస్వికి మనస్సులో కోరుకొన్నదంతా లభిస్తుంది.

నాస్తి విష్ణుసమం ధ్యేయం తపో నానశనాత్పరమ్ ।
నాస్త్యారోగ్యసమం ధన్యం నాస్తి గంగాసమా సరిత్ ॥14॥

విష్ణువుతో సమానమైన ధ్యేయం లేదు. ఉపవాసాన్ని మించిన తపస్సు లేదు. ఆరోగ్యంతో సమానమైన ఉత్తమ వస్తువు లేదు. గంగతో సమానమైన నది లేదు.

న సోఽస్తి బాంధవః కశ్చిద్విష్ణుం ముక్త్వా జగద్గురుమ్ ।
అధశ్చోర్ధ్వం హరిశ్చాగ్రే దేహేంద్రియమనోముఖే ॥15॥

ఇత్యేవం సంస్మరన్ ప్రాణాన్ యస్త్యజేత్స హరిర్భవేత్ ।
యత్తద్బ్రహ్మ యతః సర్వం యత్సర్వం తస్య సంస్థితమ్ ॥16॥

జగద్గురువైన విష్ణువును విడిచి వేరొక బంధువు లేదు. క్రింద, పైన, ముందు, వెనుక, దేహేంద్రియమనోముఖములందు, హరియే ఉన్నాడని స్మరిస్తూ ఎవడైతే ప్రాణాలను విడిచి పెడతాడో వాడు హరి అవుతాడు. దేని నుండి సర్వం పుట్టినదో, దేనియందే అది నిలిచి ఉన్నదో అదే పరబ్రహ్మ.

అగ్రాహ్యకమనిర్దేశ్యం సుప్రతిష్ఠం చ యత్పరమ్ ।
పరాపరస్వరూపేణ విష్ణుః సర్వహృది స్థితః ॥17॥

గ్రహింపశక్యం కానిది, నిర్దేశించడానికి వీలులేనిది, సుప్రతిష్ఠమైనది ఏది ఉందో అదే పరబ్రహ్మ. విష్ణువు పరాపరస్వరూపాలతో అందరి హృదయాలయందు ఉన్నాడు.

యజ్ఞేశం యజ్ఞపురుషం కేచిదిచ్ఛన్తి తత్పరమ్ ।
కేచిద్విష్ణుం హరం కేచిత్కేచిద్బ్రహ్మాణమీశ్వరమ్ ॥18॥

కొందరు ఆ పరబ్రహ్మనే యజ్ఞేశుడు, యజ్ఞపురుషుడు అని చెబుతారు. కొందరు విష్ణువని, కొందరు హరుడని, కొందరు బ్రహ్మ అని ఆ పరమేశ్వరునే చెబుతారు.

ఇంద్రాదినామభిః కేచిత్ సూర్యం సోమం చ కాలకమ్ ।
బ్రహ్మాదిస్తంబపర్యన్తం జగద్విష్ణుం వదన్తి చ ॥19॥

కొందరు ఇంద్రాది నామాలతో వ్యవహరిస్తారు. కొందరు సూర్యుడు, సోముడు, కాలపురుషుడు అని చెబుతారు. బ్రహ్మాదిస్తంబపర్యంతమైన ఈ జగత్తు విష్ణురూపమని చెబుతారు.

స విష్ణుః పరమం బ్రహ్మ యతో నావర్తతే పునః ।
సువర్ణాదిమహాదానపుణ్యతీర్థావగాహనైః ॥20॥

దానైః (ధ్యానైః) వ్రతైః పూజయా చ ధర్మశ్రుత్యా తదాప్నుయాత్ ।
ఆత్మానం రథినం విద్ధి శరీరం రథమేవ తు ॥21॥

ఆ విష్ణువే పరబ్రహ్మ. ఆ స్థానాన్ని చేరినవారు పునరావృత్తి పొందరు. సువర్ణాది మహాదానాల చేత, పుణ్యతీర్థస్నానాల చేత, దాన (ధ్యాన) వ్రత, పూజా, ధర్మశ్రుతుల చేత ఆ స్థానాన్ని పొందాలి. ఆత్మను రథిగా (రథంపై ఉన్న వానిగా) శరీరాన్నే రథంగా భావించాలి.

బుద్ధిం తు సారథిం విద్ధి మనః ప్రగ్రహమేవ చ ।
ఇంద్రియాణి హయానాహుర్విషయాంస్తేషు గోచరాన్ ॥22॥

బుద్ధిని సారథిగా, మనస్సును కళ్లెంగా, ఇంద్రియాలను అశ్వాలుగా, విషయాలను వాటి గమ్యాలుగా తెలుసుకోవాలి.

ఆత్మేంద్రియమనోయుక్తం భోక్తేత్యాహుర్మనీషిణః ।
యస్త్వవిజ్ఞానవాన్ భవత్యయుక్తేనమనసా సదా ॥23॥

న సత్పదమవాప్నోతి సంసారం చాధిగచ్ఛతి ।
యస్తు విజ్ఞానవాన్భవతి యుక్తేన మనసా సదా ॥24॥

స తత్పదమవాప్నోతి యస్మాద్భూయో న జాయతే ।
విజ్ఞానసారథిర్యస్తు మనః ప్రగహవాన్నరః ॥25॥

సోఽధ్వానం పారమాప్నోతి తద్విష్ణోః పరమం పదమ్ ।
ఇంద్రియేభ్యః పరాహ్యర్థా అర్థేభ్యశ్చ పరం మనః ॥26॥

ఆత్మ, ఇంద్రియాలు, మనస్సు వీటి సముదాయాన్ని భోక్త అని పండితులు అంటారు. ఎవడు గ్రహింపబడని మనస్సు కలవాడై, విజ్ఞానం సంపాదించుకోకుండా ఉంటాడో వాడు ఆ పరమపదాన్ని పొందజాలడు. వాడు సంసారాన్నే పొందుతాడు. మనోనిగ్రహాన్ని పొంది విజ్ఞానాన్ని సంపాదించిన వాడు ఆ పరమపదాన్ని పొందుతాడు. మళ్లీ దాని నుంచి వెనుకకు రాడు (తిరిగి పుట్టడు). విజ్ఞానసారథియైన నరుడు మనస్సు అనే కళ్లెమును గట్టిగా పట్టుకొన్నవాడై, మార్గమును దాటగలిగి ఆ పరమవిష్ణుపదాన్ని చేరుతాడు. ఇంద్రియాల కన్న అర్థములు పరములు. వాటి కన్న మనస్సు పరమైనది.

మనసస్తు పరా బుద్ధిర్బుద్ధేరాత్మా మహాన్పరః ।
మహతః పరమవ్యక్తమవ్యక్తాత్పురుషః పరః ॥27॥

మనస్సు కన్న బుద్ధి పరమైనది. బుద్ధికన్న మహత్తత్త్వం పరమైనది. మహత్తు కన్న పరమైనది అవ్యక్తం. అవ్యక్తం కన్న పరుడు పురుషుడు.

పురుషాన్న పరం కించిత్ సా కాష్ఠా సా పరా గతిః ।
ఏష సర్వేషు భూతేషు గూఢాత్మా న ప్రకాశతే ॥28॥

పురుషుని కన్న పరమైనది ఏదీ లేదు. పురుషుడే పరాకాష్ఠ. పురుషుడే పరాగతి. సర్వభూతములందు గూఢంగా ఉన్న ఆత్మ పైకి కనబడడం లేదు.

దృశ్యతే త్వగ్రయా బుద్ధ్యా సూక్ష్మయా సూక్ష్మదర్శిభిః ।
యచ్ఛేద్వాఙ్మనసి ప్రాజ్ఞస్తద్యచ్ఛేత్ జ్ఞానమాత్మని ॥29॥

కాని సూక్ష్మదర్శులచే శ్రేష్ఠమైన సూక్ష్మమగుబుద్ధితో అది చూడబడుతోంది. పండితుడు వాక్కును మనస్సు నందు నిలపాలి. మనస్సును జ్ఞానమునందు నిలపాలి.

జ్ఞానమాత్మని మహతి నియచ్ఛేచ్ఛాంత ఆత్మని ।
జ్ఞాత్వా బ్రహ్మాత్మనోర్యోగం యమాద్యైర్బ్రహ్మ సద్భవేత్ ॥30॥

జ్ఞానాన్ని మహత్తు అయిన ఆత్మయందు నిలపాలి. దానిని శాంతమైన ఆత్మయందు నిలపాలి. బ్రహ్మాత్మల యోగాన్ని యమాదుల ద్వారా తెలుసుకొని సాధకుడు బ్రహ్మస్వరూపుడు అవుతాడు.

అహింసా సత్యమస్తేయం బ్రహ్మచర్యాపరిగ్రహౌ ।
యమాశ్చ నియమాః పంచ శౌచం సంతోషసత్తపః ॥31॥

స్వాధ్యాయేశ్వరపూజా చ ఆసనం పద్మకాదికమ్ ।
ప్రాణాయామో వాయుజయః ప్రత్యాహారః స్వనిగ్రహః ॥32॥

అహింస, సత్యము, అస్తేయము, బ్రహ్మచర్యము, అపరిగ్రహము అనే ఐదు యమములు. నియమములు కూడ అయిదే. అవి శౌచము, సంతోషము, సత్తపము, స్వాధ్యాయము, ఈశ్వరపూజ. పద్మాసనం మున్నగునవి ఆసనాలు. (ప్రాణ) వాయువును జయించుట ప్రాణాయామం. ఇంద్రియనిగ్రహం ప్రత్యాహారం.

శుభే హ్యేకత్ర విషయే చేతసో యత్ప్రధారణమ్ ।
నిశ్చలత్వాత్తు ధీమద్భిర్ధారణా ద్విజ కథ్యతే ॥33॥

ద్విజోత్తమా! శుభమైన ఒక విషయముపై చిత్తమును నిలపడం ధారణ. కదలకుండా ఉండు దానిని విద్వాంసులు 'ధారణ' అని వ్యవహరిస్తారు.

పౌనః పున్యేన తత్రైవ విషయేష్వేవధారణా ।
ధ్యానం స్మృతం సమాధిస్తు అహం బ్రహ్మాత్మసంస్థితిః ॥34॥

ఒకే విషయంపై మాటిమాటికీ ధారణ నిలపడం ధ్యానం. నేనే బ్రహ్మను అనే స్థితిలో ఆత్మను ఉంచడం సమాధి.

ఘటధ్వంసాద్యథాకాశమభిన్నం నభసా భవేత్ ।
ముక్తో జీవో బ్రహ్మణైవం సద్బ్రహ్మ బ్రహ్మ వై భవేత్ ॥35॥

ఘటం నశించగానే, ఘటాకాశం మహాకాశంతో అభిన్నమైనట్లుగా ముక్తుడగు జీవుడు బ్రహ్మతో ఐక్యం పొందుతాడు. సద్బ్రహ్మస్వరూపుడవుతాడు.

ఆత్మానం మన్యతే బ్రహ్మ జీవో జ్ఞానేన నాన్యథా ।
జీవో హ్యజ్ఞానతత్కార్యముక్తః స్యాదజరామరః ॥36॥

జీవుడు అజ్ఞానవశం వల్ల తాను బ్రహ్మ కన్న భిన్నుడనని అనుకొంటున్నాడు. అజ్ఞానం, దాని కార్యాలు తొలగి పోయిన తరువాత అజరామరుడవుతాడు.

అగ్నిరువాచ - అగ్ని ఇలా వచించాడు.

వసిష్ఠ యమగీతోక్తా పఠతాం భుక్తిముక్తిదా ।
ఆత్యన్తికో లయః ప్రోక్తో వేదాంత బ్రహ్మధీమయః ॥37॥

వశిష్ఠమహర్షీ! చదివేవారికి భుక్తి ముక్తి ప్రదమైన యమగీతను చెప్పాను. వేదాంతజ్ఞానంచే సర్వత్ర బ్రహ్మబుద్ధి కలగడమే ఆత్యంతిక ప్రళయం.

ఇత్యాది మహాపురాణే ఆగ్నేయే యమగీతాకథనం నామ ద్వ్యశీతి త్రిశతతమోఽధ్యాయః ॥382॥

అగ్నిమహాపురాణంలో యమగీతాకథనమనే మూడువందల ఎనభైరెండవ అధ్యాయం సమాప్తం.



త్ర్యశీత్యధిక త్రిశతతమోऽధ్యాయః – మూడువందల ఎనభైమూడవ అధ్యాయం

ఆగ్నేయమహాపురాణమాహాత్మ్యమ్ – ఆగ్నేయమహాపురాణ మాహాత్మ్యం

అగ్నిరువాచ – అగ్ని ఇలా వచించాడు.

ఆగ్నేయం బ్రహ్మరూపం తే పురాణం కథితం మయా ।
సప్రపంచం నిష్ప్రపంచం విద్యాద్వయమయం మహత్ ॥1॥

వసిష్ఠా! నీకు బ్రహ్మరూపమగు అగ్నిపురాణాన్ని నేను వివరించి చెప్పాను. విద్య విస్తృతమైనది, సంక్షిప్తమైనది అని రెండు విధాలుగా ఉంటుంది.

ఋగ్యజుః సామాథర్వాఖ్యా విద్యా విష్ణుర్జగజ్జనిః ।
ఛందః శిక్షావ్యాకరణం నిఘంటుర్జ్యోతిరాఖ్యకాః ॥2॥

నిరుక్త ధర్మశాస్త్రాదిమీమాంసా న్యాయవిస్తరాః ।
ఆయుర్వేద పురాణాఖ్యా ధనుర్గంధర్వవిస్తరాః ॥3॥

విద్యా సైవార్థశాస్త్రాఖ్యా వేదాన్తాన్యా హరిర్మహాన్ ।
ఇత్యేషా చాపరా విద్యా పరావిద్యాऽక్షరం పరమ్ ॥4॥

ఋగ్యజుః సామాథర్వరూపమగు విద్య, జగత్కారణభూతుడైన విష్ణువు, ఛందస్సు, శిక్ష, వ్యాకరణం, నిఘంటువు, జ్యోతిషం, నిరుక్తం, ధర్మశాస్త్రం మున్నగునవి, మీమాంస, న్యాయం, ఆయుర్వేదం, పురాణం మున్నగునవి, ధనుర్వేదం, గాంధర్వం అనేవి, అర్థశాస్త్రం, వేదాన్తాది విద్యలు అన్నీ, మిగిలినవి కూడా హరిస్వరూపాలు. ఈ విద్య అంతా అపరవిద్య. పరమైన ఆత్మతత్వాన్ని బోధించే విద్య పరవిద్య.

యస్యభావోऽఖిలం విష్ణు స్తస్య నో బాధతే కలిః ।
అనిష్ట్వా తు మహాయజ్ఞానకృత్వాऽపి పితృస్వధామ్ ॥5॥

కృష్ణమభ్యర్చయన్ భక్త్యా నైనసో భాజనం భవేత్ ।
సర్వకారణమత్యంతం విష్ణుం ధ్యాయన్న సీదతి ॥6॥

ఈ ప్రపంచమంతా విష్ణుస్వరూపం అనే భావించేవానిని కలి కూడా బాధించదు. మహాయజ్ఞాలు చేయక పోయినా, పితృస్వధచేయకున్నా, భక్తిపూర్వకంగా కృష్ణుని పూజించేవాడు పాపాలను పొందదు. సర్వకారణభూతుడైన విష్ణువును సర్వదా ధ్యానించేవాడు ఎన్నటికినీ నశించడు.

అన్యతంత్రాదిదోషోత్థో విషయాకృష్టమానసః ।
కృత్వాऽపి పాపం గోవిందం ధ్యాయన్పాపైః ప్రముచ్యతే ॥7॥

పారతంత్ర్యాది దోషాలు కలవాడు, విషయాల వల్ల ఆకర్షింపబడిన మనస్సు కలవాడు, పాపాలు చేసినా గోవిందుని ధ్యానించడంచేత ఆ పాపాలనుంచి విముక్తుడవుతాడు.

తద్ధ్యానం యత్ర గోవిన్దః సా కథా యత్ర కేశవః ।
తత్కర్మ యత్తదర్థీయం కిమన్యైర్బహుభాషితైః ॥8॥

గోవిందుడన్నదే ధ్యానం. (గోవిందా! అనడం); కేశవుడు అన్నదే కథ (పవిత్ర కథ), వానికోసం చేసేదే కర్మ (సత్కర్మ). ఇక మిగిలిన పలుమాటలేల?

న తత్పితా తు పుత్రాయ న శిష్యాయ గురుర్ద్విజః ।
పరమార్థం పరం బ్రూయాద్యదేతత్తే మయోదితమ్ ॥9॥

ద్విజోత్తమా! నేను నీకు చెప్పిన ఈ ఉత్తమపరమార్థాన్ని తండ్రి కుమారునకు చెప్పజాలడు. గురువు శిష్యునకు చెప్పజాలడు.

సంసారే భ్రమతా లభ్యం పుత్రదారధనం వసు ।
సుహృదశ్చ తథైవాన్యే నోపదేశో ద్విజేదృశః ॥10॥

ద్విజశ్రేష్ఠా! సంసారంతో భ్రమించేవాడు పుత్రదారాదులను, అధికధనాన్ని, బంగారాన్ని, మంచి హృదయం ఉన్న మిత్రులను, ఇతరులను కూడా పొందవచ్చును. కాని ఇటువంటి ఉపదేశాన్ని మాత్రం పొందజాలడు.

కిం పుత్రదారైర్మిత్రైర్వా కిం మిత్రక్షేత్రబాంధవైః ।
ఉపదేశః పరో బంధురీదృశో యో విముక్తయే ॥11॥

పుత్రదారాదుల వల్ల, మిత్రాదుల వల్ల, హితుల వల్ల, క్షేత్రాల వల్ల, బాంధవుల వల్ల ఏమి ప్రయోజనము? ఇటువంటి ఉపదేశమే విముక్తహేతువు. అదే పరమబంధువు.

ద్వివిధో భూతసర్గోఽయం దైవ ఆసుర ఏవ చ ।
విష్ణుభక్తిపరో దైవో విపరీతస్తథాఽసురః ॥12॥

ప్రాణి సృష్టి దైవీసృష్టి, ఆసురీసృష్టి అని రెండు విధాలు. విష్ణు భక్తి పరాయణుడైనవాడు దైవంతో సమానము, అందుకు భిన్నమైనవాడు అసురునితో సమానము.

ఏతత్పవిత్రమారోగ్యం ధన్యం దుఃస్వప్ననాశనమ్ ।
సుఖప్రీతికరం నృణాం మోక్షకృద్యత్తవేరితమ్ ॥13॥

నేను నీకు బోధించిన ఈ పురాణం పవిత్రమైనది. ఆరోగ్యకరమైనది. ధన్యమైనది, దుఃస్వప్నాలను నాశనం చేసేది, సుఖప్రీతికరమైనది, నరులకు మోక్షాన్ని కలుగజేసేది. అటువంటి దానిని నీకు వివరించాను.

యేషాం గృహేషు లిఖితమాగ్నేయం హి పురాణకమ్ ।
పుస్తకం స్థాస్యతి సదా తత్ర నేశురుపద్రవాః ॥14॥

వ్రాయబడిన ఈ అగ్నిపురాణగ్రంథం ఎవరి ఇంట్లో ఉంటుందో, ఆ పుస్తకం ఉన్నచోట ఎప్పటికీ ఏ ఉపద్రవాలు ఉండవు.

కిం తీర్థైర్గోప్రదానైర్వా కిం యజ్ఞైః కిముపోషితైః ।
ఆగ్నేయం యే హి శృణ్వంతి అహన్యహని మానవాః ॥15॥

ప్రతిదినం అగ్నిపురాణం వినే మానవులకు తీర్థస్నానాలు ఎందుకు? గోదానాలు ఎందుకు? యజ్ఞాలు ఎందుకు? ఉపవాసాలు ఎందుకు?

యో దదాతి తిలప్రస్థం సువర్ణస్య చ మాషకమ్ ।
శృణోతి శ్లోకమేకం చ ఆగ్నేయస్య తదాప్నుయాత్ ॥16॥

అగ్నిపురాణంలోని ఒక శ్లోకం విన్నవారికి, ఒక తిలప్రస్థం కాని, ఒక మాషకం (ఇవి తూచే ప్రమాణాలు) కాని సువర్ణం దానం చేసేవానికి వచ్చే పుణ్యం లభిస్తుంది.

అధ్యాయపఠనం చాస్య గోప్రదానాద్విశిష్యతే ।
అహోరాత్రకృతం పాపం శ్రోతుమిచ్ఛోః ప్రణశ్యతి ॥17॥

ఒక అధ్యాయం చదవడం గోప్రదానం కన్న విశిష్టమైనది. దీనిని చదవాలని (వినాలని) కోరుకొనేవానికి ఒక రేయి పగలులో నందు చేసిన పాపాలు నశిస్తాయి.

కపిలానాం శతే దత్తే యద్భవేజ్జ్యేష్ఠపుష్కరే ।
తదాగ్నేయం పురాణం హి పఠిత్వా ఫలమాప్నుయాత్ ॥18॥

అగ్నిపురాణాన్ని పఠించేవాడు జ్యేష్ఠపుష్కరమునందు నూరు కపిలగోవులను దానం చేసిన పుణ్యాన్ని పొందుతాడు. ఇది అగ్నిపురాణపఠనఫలితం.

ప్రవృత్తిం చ నివృత్తిం చ ధర్మం విద్యాద్వయాత్మకమ్ ।
ఆగ్నేయస్య పురాణస్య శాస్త్రస్యాస్య సమం న హి ॥19॥

ప్రవృత్తిధర్మం, నివృత్తిధర్మం, ఈ రెండు విద్యల ధర్మం కలిగి ఉన్న ఆగ్నేయమహాపురాణంతో సమానమైన శాస్త్రం లేదు.

పఠన్నాగ్నేయకం నిత్యం శృణ్వన్వాఽపి పురాణకమ్ ।
భక్తో వసిష్ఠ మనుజః సర్వపాపైః ప్రముచ్యతే ॥20॥

వసిష్ఠా! నిత్యం అగ్నిపురాణాన్ని పఠించిన, విన్న భక్తుడైన మానవుడు సర్వపాపాల నుంచి విముక్తుడవుతాడు.

నోపసర్గా న చానర్థా న చౌరాది(రి) భయం గృహే ।
తస్మిన్ స్యాద్యత్ర చాగ్నేయపురాణస్య హి పుస్తకమ్ ॥21॥

అగ్నిపురాణపుస్తకం ఏ గృహంలో ఉంటుందో అక్కడ గ్రహోపద్రవాలు కాని, అనర్థాలు కాని చోరశత్రుభయం కాని ఉండవు.

న గర్భహారిణీ భీతిర్న చ బాలగ్రహో గృహే ।
యత్రాగ్నేయం పురాణం స్యాన్న పిశాచాదికం భయమ్ ॥22॥

ఆ గృహంలో గర్భస్రావభీతి కాని, బాలగ్రహదుష్టపీడాదులు కాని ఉండవు. ఎక్కడ ఆగ్నేయపురాణం ఉంటుందో అక్కడ పిశాచాది భయం ఉండదు.

శృణన్విప్రో వేదవిత్స్యాత్ క్షత్రియః పృథివీపతిః ।
ఋద్ధిం ప్రాప్నోతి వైశ్యశ్చ శూద్రశ్చారోగ్యమృచ్ఛతి ॥23॥

విప్రుడు దీనిని విన్నచో వేదవేత్త అవుతాడు. క్షత్రియుడు పృథివీపతి అవుతాడు. వైశ్యుడు ఐశ్వర్యాన్ని పొందుతాడు. శూద్రుడు ఆరోగ్యాన్ని పొందుతాడు.

యః పఠేచ్ఛృణుయాన్నిత్యం సమదృగ్విష్ణుమానసః ।
బ్రహ్మాఽఽగ్నేయం పురాణం సత్తత్ర నశ్యన్త్యుపద్రవాః ॥24॥

ఎవడు సమదృష్టితో విష్ణువు నందు మనస్సు నిలిపి, పరమాత్మజ్ఞానప్రదమైన అగ్నిపురాణాన్ని నిత్యం వింటాడో, అక్కడ ఉపద్రవాలు అన్నీ నశిస్తాయి.

దివ్యాంతరిక్షభౌమాద్యా దుఃస్వప్నాద్యభిచారకాః ।
యచ్చాన్యద్దురితం కించిత్తత్సర్వం హన్తి కేశవః ॥25॥

దివ్యాలు, అంతరిక్షగాలు, భౌమాలు మున్నగు ఉపద్రవాలు, దుఃస్వప్నాలు, ఆభిచారకాలు, ఇతర పాపాలు మున్నగువాటిని అన్నింటిని కేశవుడు నశింపజేస్తాడు.

పఠతః శృణ్వతః పుంసః పుస్తకం యజతో మహత్ ।
ఆగ్నేయం శ్రీపురాణం హి హేమంతే యః శృణోతి వై ॥26॥

ప్రపూజ్య గంధపుష్పాద్యైరగ్నిష్టోమఫలం లభేత్ ।
శిశిరే పుండరీకస్య వసంతే చాశ్వమేధజమ్ ॥27॥

ఈ పురాణాన్ని చదివేవానికి, వినేవానికి, దీనిని పూజించేవానికి పూర్వోక్తమైన గొప్పఫలం లభిస్తుంది. శ్రీమంతమైన ఈ అగ్నిపురాణాన్ని హేమంతంలో ఎవడు వింటాడో, గంధపుష్పాదులలో పూజించి ఎవడు శ్రవణం చేస్తాడో, వానికి అగ్నిష్టోమఫలం లభిస్తుంది. శిశిర ఋతువులో వింటే పుండరీకయాగాన్ని చేసిన ఫలం, వసంతంలో వింటే అశ్వమేధఫలం లభిస్తుంది.

గ్రీష్మే తు వాజపేయస్య రాజసూయస్య వర్షతి ।
గోసహస్రస్య శరది ఫలం తత్పఠతో హ్యృతౌ ॥28॥

గ్రీష్మంలో వింటే వాజపేయఫలాన్ని, వర్షాకాలంలో వింటే రాజసూయఫలాన్ని, శరత్కాలంలో వింటే లేదా చదివితే గోసహస్రదానఫలాన్ని పొందుతాడు.

ఆగ్నేయం హి పురాణం యో భక్త్యాఽగ్రే చ పఠేద్ధరేః ।
సో ఽర్చయేచ్చ వశిష్ఠేహ జ్ఞానయజ్ఞేన కేశవమ్ ॥29॥

భక్తిపూర్వకంగా విష్ణుసమ్ముఖంలో ఈ అగ్నిపురాణాన్ని పఠించినవాడు, పూజించినవాడు వసిష్ఠా! జ్ఞానయజ్ఞంచే కేశవుని పూజించినవాడవుతాడు.

యస్యాగ్నేయపురాణస్య పుస్తకం తస్య వై జయః ।
లిఖితం పూజితం గేహే భక్తిర్ముక్తిః కరేఽస్తి హి ॥30॥

ఆగ్నేయపురాణానికి సంబంధించిన లిఖితపుస్తకం ఎవని గృహంలో పూజింపబడుతూ ఉంటుందో వానికి జయం కలుగుతుంది. భుక్తి, ముక్తి అతనిచేతిలో ఉంటాయి.

ఇతి కాలాగ్నిరూపేణ గీతం మే హరిణా పురా ।
ఆగ్నేయం హి పురాణం వై బ్రహ్మవిద్యాద్వయాస్పదమ్ ॥
విద్యాద్వయం వసిష్ఠేదం భక్తేభ్యః కథయిష్యసి ॥31॥

ఈ విధంగా కాలాగ్నిరూపుడైన హరి పూర్వం బ్రహ్మవిద్యాద్వయరూపమైన ఈ అగ్నిపురాణాన్ని నాకు బోధించినాడు. వసిష్ఠా! ఈ విద్యాద్వయప్రదాయకపురాణాన్ని భక్తులకు మాత్రమే వివరించగలవు.

వసిష్ఠ ఉవాచ – వసిష్ఠుడు ఇలా పలికాడు.

వ్యాసాఽఽ గ్నేయ పురాణం తే రూపం విద్యాద్వయాత్మకమ్ ।
కథితం బ్రహ్మణో విష్ణోరగ్నినా కథితం యథా ॥32॥

సార్ధం దేవైశ్చ మునిభిర్మహ్యం సర్వార్థదర్శకమ్ ।
పురాణమునినా గీతమాగ్నేయం బ్రహ్మసమ్మితమ్ ॥33॥

వ్యాసా! విద్యాద్వయాత్మకరూపమైన సర్వసిద్ధిప్రదాయకమైన ఆగ్నేయపురాణాన్ని (పరా, అపరా విద్యాద్వయం) అగ్నిదేవుని (ద్వారా) విష్ణువు బ్రహ్మకు, మునులతోను, దేవతలతోను కూడి ఉన్న నాకు చెప్పి ఉన్నాడు. వేద సమ్మతమైన ఆ పురాణం నీకు వివరించబడింది.

యః పఠేచ్ఛృణుయాద్వ్యాస లిఖేద్వా లేఖయేదపి ।
శ్రావయేత్పాఠయేద్వాఽపి పూజయేద్ధారయేదపి ॥34॥

సర్వపాపవినిర్ముక్తః ప్రాప్తకామో దివం వ్రజేత్ ।
లేఖయిత్వా పురాణం యో దద్యాద్విప్రేభ్య ఉత్తమమ్ ॥35॥

స బ్రహ్మలోకమాప్నోతి కులానాం శతముద్ధరేత్ ।
ఏకం శ్లోకం పఠేద్యస్తు పాపపంకాద్విముచ్యతే ॥36॥

వ్యాసా! అగ్నిచే ఉపదేశించబడిన, వేదతుల్యమైన ఈ అగ్నిపురాణాన్ని ఎవడు చదువుతాడో, వింటాడో, వ్రాస్తాడో, వ్రాయిస్తాడో, చేస్తాడో అతడు సర్వపాపవినిర్ముక్తుడవుతాడు ప్రాప్తకాముడై స్వర్గాన్ని పొందుతాడు. ఈ ఉత్తమమైన పురాణాన్ని వ్రాయించి బ్రాహ్మణులకు దానం చేసినవాడు నూరుతరాలను ఉద్ధరించినవాడై బ్రహ్మలోకాన్ని పొందుతాడు. ఒక్కశ్లోకం చదివినా, వాడు పాపపంకిలంనుండి విముక్తుడవుతాడు.

తస్మాద్వ్యాస సదా శ్రావ్యం శిష్యేభ్యః సర్వదర్శనమ్ ।
శుకాద్యైర్మునిభిః సార్ధం శ్రోతుకామైః పురాణకమ్ ॥37॥

వ్యాసమునీంద్రా! అందువల్ల సర్వదర్శన సంగ్రహరూపమైన ఈ పురాణాన్ని వినాలని కోరుకొన్న శుకాదిమునులతో కూడుకొన్న శిష్యులకు సర్వదా వినిపించాలి.

ఆగ్నేయం పఠితం ధ్యాతం శుభం స్యాద్భుక్తిముక్తిదమ్ ।
అగ్నయే తు నమస్తస్మైయేన గీతం పురాణకమ్ ॥38॥

అగ్నిపురాణం చదివినా, చింతనం చేసినా శుభాన్ని, భుక్తిని, ముక్తిని ప్రసాదిస్తుంది. ఈ అగ్నిపురాణాన్ని గానం చేసిన (చెప్పిన) అగ్నిదేవునికి నమస్కారం.

వ్యాస ఉవాచ – వ్యాసుడు ఇలా అన్నాడు.

వసిష్ఠేన పురా గీతం సూతైతత్తే మయోదితమ్ ।
పరా విద్యాఽపరా విద్యా స్వరూపం పరమం పదమ్ ॥39॥

సూతా! పూర్వం వసిష్ఠుడు చెప్పిన ఈ పురాణాన్ని నేను నీకు వచించాను. ఇది పరావిద్య, అపరావిద్య స్వరూపమైనది, పరమపదస్థానమైనది.

ఆగ్నేయం దుర్లభం రూపం ప్రాప్యతే భాగ్యసంయుతైః ।
ధ్యాయన్తో బ్రహ్మ చాగ్నేయం పురాణం హరిమాగతాః ॥40॥

దీనిని చదివే భాగ్యవంతులు పొందశక్యం కాని ఆగ్నేయమగు రూపాన్ని పొందుతారు. అగ్నిపురాణాన్ని ధ్యానించి (బుద్ధిపూర్వకధారణ చేసి) పరమాత్మడైన హరిని చేరుతారు.

విద్యార్థినస్తథా విద్యాం రాజ్యం రాజ్యార్థినో గతాః ।
అపుత్రాః పుత్రిణః సన్తి నాశ్రయా ఆశ్రయం గతాః ॥41॥

విద్యార్థులు విద్యను, రాజ్యార్థులు రాజ్యాన్ని పొందుతారు. పుత్రులు లేని వారు పుత్రవంతులవుతారు. ఆశ్రయంలేని వారు ఆశ్రయాన్ని పొందుతారు. (పొందారు).

సౌభాగ్యార్థీ చ సౌభాగ్యం మోక్షం మోక్షార్థినో గతాః ।
లిఖన్తో లేఖయన్తశ్చ నిష్పాపాశ్చ శ్రియం గతాః ॥42॥

సౌభాగ్యాన్ని కోరేవారు సౌభాగ్యాన్ని, మోక్షం కోరేవారు మోక్షంపొందిన వారయ్యారు. దీనిని వ్రాసినవారు వ్రాయించినవారు పాపముక్తులై సంపన్నులవుతారు.

శుకపైలముఖైః సూత ఆగ్నేయం తు పురాణకమ్ ।
రూపం చిన్తయ యాతాఽసి భుక్తిం ముక్తిం న సంశయః ॥43॥

శ్రావయ త్వం చ శిష్యేభ్యో భక్తేభ్యశ్చ పురాణకమ్ ॥44॥

సూతా! ఈ అగ్నిపురాణాన్ని శుకుడు, పైలుడు మున్నగువారితో కలసి చింతన చేయుము. నీవు నిస్సందేహముగా భుక్తిని, ముక్తిని, పొందుతావు. సంశయం ఏమాత్రం లేదు. నీవు కూడా శిష్యులకు, భక్తులకు ఈ పురాణాన్ని వినిపించు.

సూత ఉవాచ – సూతుడు ఇలా అన్నాడు.

వ్యాసప్రసాదాదాగ్నేయం పురాణం శ్రుతమాదరాత్ ।
ఆగ్నేయం బ్రహ్మరూపం హి మునయః శౌనకాదయః ॥45॥

శౌనకాదిమునీశ్వరులారా! వ్యాసుని అనుగ్రహం వల్ల బ్రహ్మరూపమగు ఈ ఆగ్నేయపురాణం పరమ విశ్వాసంతో మీకు వినిపించాను.

భవన్తో నైమిశారణ్యే యజన్తో హరిమీశ్వరమ్ ।
తిష్ఠన్తః శ్రద్ధయా యుక్తాస్తస్మాద్వః సముదీరితమ్ ॥46॥

మీరు నైమిశారణ్యంలో శ్రద్ధతో కూడుకొని ఉన్నవారై, స్థిరంగా ఉన్నవారై పరమేశ్వరుడైన శ్రీహరిని పూజించేవారు కాన ఈ పురాణాన్ని మీకు బోధించాను.

అగ్నినా ప్రోక్తమాగ్నేయం పురాణం వేదసమ్మితమ్ ।
బ్రహ్మవిద్యాద్వయోపేతం భుక్తిదం ముక్తిదం మహత్ ॥47॥

ఈ వేదసమ్మతం అయిన ఆగ్నేయపురాణం అగ్నిద్వారా ఉపదేశించబడింది. రెండు విధాలైన (పరాపర విద్యలతో కూడుకొన్న) బ్రహ్మవిద్యను బోధించేది. (లేదా బ్రహ్మమును, పరాపరవిద్యాద్వయాన్ని బోధించేది.) ఇది భోగానికి, మోక్షానికి శ్రేష్ఠమైన సాధనం.

నాస్మాత్పరతరః సారో నాస్మాత్పరతరః సుహృత్ ।
నాస్మాత్పరతరో గ్రంథో నాస్మాత్పరతరా గతిః ॥48॥

దీనిని మించిన సారం, దీనిని మించిన సుహృత్తు (మంచిమిత్రుడు), దీనిని మించిన గ్రంథం, దీనిని మించిన పరాగతి వేరొకటి లేదు.

నాస్మాత్పరతరం శాస్త్రం నాస్మాత్పరతరా శ్రుతిః ।
నాస్మాత్పరతరం జ్ఞానం నాస్మాత్పరతరా స్మృతిః ॥49॥

దీనిని మించిన శాస్త్రం గాని, దీనిని మించిన శ్రుతి గాని, దీనిని మించిన జ్ఞానం గాని, దీనిని మించిన స్మృతి గాని లేదు.

నాస్మాత్పరో హ్యాగమోఽస్తి నాస్మాద్విద్యా పరాఽస్తి హి ।
నాస్మాత్పరః స్యాత్సిద్ధాన్తో నాస్మాత్పరమమంగలమ్ ॥50॥

దీనిని మించిన ఆగమం, దీనిని మించిన పరావిద్య, దీనిని మించిన సిద్ధాంతం, దీనిని మించిన (శుభం) మంగలం వేరొకటి లేదు.

నాస్మాత్పరోఽస్తి వేదాన్తః పురాణం పరమం త్విదమ్ ।
నాస్మాత్పరతరం భూమౌ విద్యతే వస్తు దుర్లభమ్ ॥51॥

దీనిని మించిన వేదాంతం లేదు. ఈ పురాణం అత్యుత్తమమైనది. దీనిని మించినది ఈ భూలోకంలో లేదు. ఇటువంటి వస్తువు మరోచోట లభింపదు.

ఆగ్నేయే హి పురాణేఽస్మిన్ సర్వవిద్యాః ప్రదర్శితాః ।
సర్వే మత్స్యావతారాద్యా గీతా రామాయణం త్విహ ॥52॥

హరివంశో భారతం చ నవసర్గాః ప్రదర్శితాః ।
ఆగమో వైష్ణవో గీతః పూజా దీక్షా ప్రతిష్ఠయా ॥53॥

పవిత్రారోహణాదీని ప్రతిమాలక్షణాదికమ్ ।
ప్రాసాదలక్షణాద్యం చ మంత్రా వై భుక్తిముక్తిదాః ॥54॥

శైవాగమస్తదర్థశ్చ శాక్తేయః సౌర ఏవ చ ।
మండలాని చ వాస్తుశ్చ మంత్రాణి వివిధాని చ ॥55॥

ప్రతిసర్గశ్చానుగీతో బ్రహ్మాండపరిమండలమ్ ।
ద్వీపో భువనకోశశ్చ ద్వీపవర్షాదినిమ్నగాః ॥56॥

ఈ అగ్నిపురాణంలో సర్వవిద్యలు ప్రదర్శింపబడ్డాయి. సమస్తమైన మత్స్యాద్యవతారాలు, రామాయణం, హరివంశము, భారతము, నవవిధసర్గలు వర్ణించబడ్డాయి. వైష్ణవం, ఆగమం (వైష్ణవాగమం) గానం చేయబడింది. పూజ, దీక్ష, ప్రతిష్ఠ, పవిత్రారోహణాదికం, ప్రతిమాలక్షణాదికం, ప్రాసాదలక్షణాదికం, భుక్తిముక్తి దాయకములైన మంత్రాలు, శైవాగమం, దాని అర్థం, శాక్తేయం, సౌరాగమం, మండలాలు, వాస్తువిషయాలు, వివిధ మంత్రాలు, ప్రతిసర్గ యొక్క పరిచయం, బ్రహ్మాండమండలం, భువనకోశం, సమస్తద్వీపాలు, వర్షాలు, నదులు వివరించ బడ్డాయి.

గయాగంగాప్రయాగాది తీర్థమాహాత్మ్యమీరితమ్ ।
జ్యోతిశ్చక్రం జ్యోతిషాది గీతో యుద్ధజయార్ణవః ॥57॥

గయ, గంగ, ప్రయాగ మున్నగు తీర్థాల మాహాత్మ్యం వర్ణించబడింది. జ్యోతిశ్చక్రం (నక్షత్రమండలం), జ్యోతిషాదివిద్యలు, యుద్ధజయార్ణవం నిరూపించడం జరిగింది.

మన్వంతరాదయో గీతాం ధర్మా వర్ణాదికస్య చ ।
అశౌచం ద్రవ్యశుద్ధిశ్చ ప్రాయశ్చిత్తం ప్రదర్శితమ్ ॥58॥

మన్వంతరం మున్నగునవి, వివిధ వర్ణాశ్రమ ధర్మాలు ప్రతిపాదించబడ్డాయి. ఆశౌచం, ద్రవ్యశుద్ధి, ప్రాయశ్చిత్త విధుల ప్రతిపాదన ఇందు వివరించడం జరిగింది.

రాజధర్మా దానధర్మా వ్రతాని వివిధాని చ ।
వ్యవహారాః శాంతయశ్చ ఋగ్వేదాదివిధానకమ్ ॥59॥

రాజధర్మాలు, దానధర్మాలు, నానావిధవ్రతాలు, వ్యవహారాలు, శాంతులు, ఋగ్వేదాది విధానాలు వర్ణింపబడ్డాయి.

సూర్యవంశః సోమవంశో ధనుర్వేదశ్చ వైద్యకమ్ ।
గాంధర్వవేదోఽర్థశాస్త్రం మీమాంసా న్యాయవిస్తరః ॥60॥

పురాణసంఖ్యామాహాత్మ్యం ఛందో వ్యాకరణం స్మృతమ్ ।
అలంకారో నిఘణ్టుశ్చ శిక్షాకల్ప ఇహోదితః ॥61॥

సూర్యవంశం, సోమవంశం, ధనుర్వేదం, వైద్యం, గాంధర్వవేదం, అర్థశాస్త్రం, మీమాంసాశాస్త్రం, న్యాయవిస్తరము, పురాణసంఖ్యామాహాత్మ్యం, ఛందస్సు, వ్యాకరణం, అలంకారం, నిఘంటువు, శిక్ష, కల్పం ఇందు వర్ణించబడ్డాయి.

నైమిత్తికః ప్రాకృతికో లయ ఆత్యన్తికః స్మృతః ।
వేదాన్తం బ్రహ్మవిజ్ఞానం యోగో హ్యష్టాంగ ఈరితః ॥62॥

నైమిత్తిక ప్రళయం, ప్రాకృతిక ప్రలయం, ఆత్యన్తిక ప్రలయం, వేదాంతసారం, బ్రహ్మవిజ్ఞానం, అష్టాంగయోగం ఇందు వివరించబడినాయి.

స్తోత్రం పురాణమాహాత్మ్యం విద్యా హ్యష్టాదశ స్మృతాః ।
ఋగ్వేదాద్యాః పరాహ్యత్ర పరావిద్యాఽక్షరం పరమ్ ॥63॥

సప్రపంచం నిష్ప్రపంచం బ్రహ్మణో రూపమీరితమ్ ।
ఇదం పంచదశసాహస్రం శతకోటిప్రవిస్తరమ్ ॥64॥

స్తోత్రం, పురాణమాహాత్మ్యం, పద్దెనిమిది విద్యలు దీనియందు చెప్పబడ్డాయి. ఋగ్వేదాదివిద్యలు, (అ), పరావిద్య, అక్షరమైన పరావిద్య, బ్రహ్మ యొక్క సప్రపంచ, నిష్ప్రపంచ స్వరూపం ఇందు చెప్పబడింది. ఇది పదిహేను వేల శ్లోక సంఖ్యకలది. నూరు కోట్ల శ్లోకప్రవిస్తరమై యున్నది.

దేవలోకే దైవతైశ్చ పురాణం పఠ్యతే సదా ।
లోకానాం హితకామేన సంక్షిప్యోద్గీతమగ్నినా ॥65॥

ఈ పురాణం దేవలోకంలో దేవతలచే సర్వదా పఠింపబడుతూ ఉంటుంది. లోకానికి మేలు కూర్చడం కోసమై అగ్ని దీనిని సంక్షిప్తంగా బోధించాడు.

సర్వం బ్రహ్మేతి జానీధ్వం మునయః శౌనకాదయః ।
శృణుయాచ్ఛ్రావయేద్వాఽపి యః పఠేత్పాఠయేదపి ॥66॥

లిఖేల్లేఖాపయేద్వాపి (ల్లిఖాపయేద్వాపి) పూజయేత్కీర్తయేదపి ।
పురాణ పాఠకం చైవ పూజయేత్ప్రయతో నృపః ॥67॥

శౌనకాది మహామునులారా! సర్వం బ్రహ్మస్వరూపమని తెలుసుకొనుడు. ఎవడు దీనిని వినునో, వినిపించునో, చదువునో, చదివించునో, వ్రాయునో, వ్రాయించునో, పూజించునో, కీర్తించునో వాడు (శ్లో॥నిర్మలః ప్రాప్తసర్వార్థః సకులః స్వర్గమాప్నుయాత్ – వాడు పరమశుద్ధుడై, సంపూర్ణమనోరథ ప్రాప్తి పొందినవాడై కులంతో సహితంగా స్వర్గాన్ని పొందుతాడు) రాజునియమవంతుడై పురాణప్రపాఠకుని పూజించాలి.

గోభూహిరణ్యదానాద్యైర్వస్త్రాలంకారతర్పణైః ।
తం సంపూజ్య లభేచ్చైవ పురాణశ్రవణాత్ఫలమ్ ॥68॥

గో, భూ, హిరణ్య దానాదులచేతను, వస్త్రాలంకారాల చేతను, సంతర్పణల చేతను పురాణం చేప్పేవానిని పూజించాలి. అలా ఆ పురాణపాఠకుని పూజిస్తే పురాణశ్రవణఫలాన్ని పొందుతాడు.

పురాణాంతే చ వై కుర్యాదవశ్యం ద్విజభోజనమ్ ।
నిర్మలః ప్రాప్తసర్వార్థః సకులః స్వర్గమాప్నుయాత్ ॥69॥

పురాణపఠనం అంతంలో తప్పకుండా ద్విజులకు భోజనం పెట్టాలి. ఈ పురాణాన్ని యజించేవాడు నిర్మలుడు, ప్రాప్తసకలమనోరథుడు, కులంతో బాటు స్వర్గాన్ని పొందుతాడు.

శరయంత్రం పుస్తకాయ సూత్రం వై పత్రసంచయమ్ ।
పట్టికాబంధవస్త్రాది దద్యాద్యః స్వర్గమాప్నుయాత్ ॥70॥

పుస్తకం కోసమై శరయంత్రం (పేటిక), దారం, పత్రసముదాయమును, పట్టికాబంధమును, వస్త్రాదులను ఇచ్చేవాడు స్వర్గాన్ని పొందుతాడు.

యో దద్యాద్బ్రహ్మలోకీ స్యాత్పుస్తకం యస్య వై గృహే ।
తస్యోత్పాతభయం నాస్తి భుక్తిముక్తిమవాప్నుయాత్ ॥71॥

పుస్తకం దానం చేసినవాడు బ్రహ్మలోకానికి చేరుతాడు. ఈ పుస్తకం ఎవని ఇంటిలో ఉండునో, వానికి ఉత్పాత భయం ఉండదు. అతడు భుక్తి, ముక్తులను పొందుతాడు.

యూయం స్మరత ఆగ్నేయం పురాణం రూపమైశ్వరమ్ ।
సూతో గతః పూజితస్తైః శౌనకాద్యా హరిం యయుః ॥72॥

అక్కడ నుండి ఈ అగ్నిపురాణమును ఈశ్వరరూపమైనదిగా మీరు భావింపుడు. ఇలా పలికి వారి పూజల నందుకున్న సూతుడు వెళ్లిపోయాడు. శౌనకాదులు కూడ విష్ణువును పొందారు.

ఇత్యాది మహాపురాణే ఆగ్నేయే అగ్నిమహాపురాణమాహాత్మ్యకథనం నామ
త్ర్యశీత్యధిక త్రిశతతమోఽధ్యాయః ॥383॥

అగ్నిమహాపురాణంలో అగ్నిపురాణమాహాత్మ్యకథనమనే
మూడువందల ఎనబైమూడవ అధ్యాయం సమాప్తం.

అగ్నిమహాపురాణం సమాప్తం.

